ఈనాడు
అల్లూరి సీతారామరాజు
సోమవారం 16 ఫిబ్రవరి 2026

మత్స్యగుండం.. జనసంద్రం!

మత్స్యలింగం, దర్శనానికి బారులుదీరిన భక్తులు

ఆలయం వెలుపల శివలింగానికి పూజలు

హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ భక్తుల నినాదాలతో శివాలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో మత్స్యగుండం జనసంద్రంగా మారింది. మఠం పంచాయతీలో మత్స్యలింగేశ్వర స్వామి ఆలయంతోపాటు మత్స్యకన్యలను దర్శించుకునేందుకు పోటెత్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడిపించింది. నడిమివీధి, అడ్డుమండ, గడ్డికించుమండ, రాళ్లగెడ్డ, కొట్నాపల్లి శివాలయాలూ భక్తులతో కిక్కిరిశాయి. - న్యూస్‌టుడే, హుకుంపేట

మన్యంలో తేనెలూరేలా!

గిరి రైతులకు పంపిణీ చేసిన తేనెపెట్టెలు

చింతపల్లి, న్యూస్‌టుడే

మన్యం పేరుచెప్పగానే ఒకప్పుడు అటవీ ఉత్పత్తి అయిన తేనె గుర్తుకు వచ్చేది. అడవుల్లో సహజసిద్ధంగా తేనేపట్లు ఉండేవి. కాలక్రమంలో మారుతున్న వాతావరణం, కాలుష్యం, అడవుల విస్తీర్ణం తగ్గడం, తేనెటీగలకు అనువైన ఆవాసాలు లేకపోవడం, సెల్ టవర్లతో రేడియేషన్ వంటి అనేక కారణాలతో తేనె దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయం, ఉద్యాన పంటలతోపాటు వ్యవసాయానుబంధ పరిశ్రమలకూ ప్రోత్సాహం అందిస్తున్నాయి. ప్రధానంగా చేపలు, కోళ్ల పెంపకం, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు, పెట్టె తేనె నిర్వహణ వంటి వాటికి సహకారం అందిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో..

ఇటీవల చింతపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 40 మంది గిరిజన రైతులకు పెట్టెతేనె నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన గ్రామోద్యోగ వికాస్ యోజన విభాగం అధికారులు పది రోజులపాటు శిక్షణ ఇచ్చారు. పెట్టె తేనె అభివృద్ధి, తేనెటీగల సంరక్షణపై నిపుణులతో శిక్షణలు, మెలకువలు నేర్పించారు. శిక్షణ పొందిన వారందరికీ ధ్రువపత్రాలతోపాటు రూ.40 వేల విలువ కలిగిన పది తేనెపెట్టెలు.. తేనెటీగలతో సహా అందించారు. రైతులు పొలాల వద్ద ఈ పెట్టెలను ఉంచడం, వాటి ఆహారానికి అవసరమైన విధంగా ఉద్యాన, పూలతోటలు పండిస్తే చాలు. రైతులకు అదనంగా ఆదాయం వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది.

★ ఒకప్పుడు గిరిజన సహకార సంస్థ (జీసీసీ).. తమ మొత్తం వ్యాపారంలో 30 శాతం తేనెపైనే ఆధారపడి ఉండేది. గిరిజనులు అడవుల్లో సేకరించిన తేనెను సేకరించి దాన్ని చిత్తూరు, రాజమహేంద్రవరం కేంద్రాలకు పంపించి.. అక్కడ శుద్ధి చేసి రిటైల్ మార్కెట్‌లో గిరిజన హనీ పేరిట విక్రయించేవారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో ఒకప్పుడు 500 నుంచి 1000 టన్నుల వరకూ తేనె దిగుబడులు ఉండేవి. ఇప్పుడు పాడేరు, చింతపల్లి డివిజన్ల పరిధిలో కేవలం 70 టన్నులకు మించి దిగుబడులు రావడం లేదు. రైతులు పెట్టెతేనె నిర్వహణపై దృష్టిసారిస్తే ఆదాయంతోపాటు మన్యానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.

కరివేపాకని తీసిపారేయొద్దు
మార్కెట్‌లో కేజీ రూ.100

శాకాహారమైనా.. మాంసాహారమైనా కరివేపాకు ఉండాల్సిందే. ఈ నెల ప్రారంభంలో కేజీ రూ.30 ఉన్న కరివేపాకు ధర ప్రస్తుతం రూ.100కి చేరింది. గతంలో కూరగాయలు కొంటే కొసరుగా కరివేపాకు ఇచ్చే వారు. ఇప్పుడు రూ.10 ఇచ్చినా ఇవ్వడం లేదు. పెరట్లో పెంచుకునే కరివేపాకు మొక్కలకు చలికాలంలో పెద్దగా ఆకులు రావు. వచ్చినవి కాస్తా మంచుకు రంగుమారి వంటల్లో వాడేందుకు పనికి రావు. గుంటూరు జిల్లా మంగళగిరి, అనంతపురం జిల్లాలో వాణిజ్య సరళిలో కరివేపాకు తోటలను పెంచుతున్నారు. అక్కడి నుంచి అనకాపల్లి మార్కెట్‌కు దిగుమతి అవుతోంది. ఇక్కడి నుంచి జిల్లాలోని ఇతర ప్రాంతాలకు వెళ్తోంది. హోల్‌సేల్ మార్కెట్‌లో టన్ను ధర రూ.55 వేలకు పెరిగింది. రవాణా ఛార్జీలతో అనకాపల్లి చేరే సరికి కేజీకి రూ.60 పడుతోంది. వ్యాపారులు లాభం కలుపుకొని కేజీ రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. కరివేపాకు లాభదాయకమైన పంట. జిల్లాలో చాలా తక్కువ విస్తీర్ణంలో సాగవుతోంది. ఒకసారి పంట వేస్తే 15 నుంచి 20 ఏళ్లపాటు దిగుబడి వస్తుంది. మొదటి ఏడాది దిగుబడి తక్కువ వచ్చినా.. రెండో ఏడాది నుంచి నాలుగు నెలలకు ఒకసారి చొప్పున ఏడాదికి నాలుగు కోతలు వస్తాయి. ఎకరాకు ఏడాదికి 24 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. చీడపీడల సమస్య అధికంగా ఉండటం వల్ల జిల్లాలో రైతుకు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు.
- న్యూస్‌టుడే, ఎలమంచిలి

ఆరాధనోత్సవం... నేత్ర శోభితం!

దామరాజు వెంకట యోగీంద్రులు (పాకలపాడు గురుదేవులు) 56వ ఆరాధనోత్సవం నర్సీపట్నంలో ఆదివారం వైభవంగా జరిగింది. జిల్లా నలుమూల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గురుదేవుల విగ్రహంతో గిరిజన భక్తులు పురవీధుల్లో రథయాత్ర నిర్వహించారు. ఆశ్రమం నుంచి బలిఘట్టం, నర్సీపట్నం తదితర ప్రాంతాల మీదుగా రథయాత్ర సాగింది. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఆశ్రమం తరపున ఏర్పాటు చేశారు. కోలాటాలు, భజనలతో ఆశ్రమంలో సందడి నెలకొంది.
- న్యూస్‌టుడే. నర్సీపట్నం అర్బన్


పుష్పాలంకరణలో పాకలపాడు గురుదేవుల విగ్రహం

దాతలూ రండి.. భవిత మార్చండి!
ప్రజా భాగస్వామ్యంతో పాఠశాలల్లో విద్యాంజలి 2.0

పాడేరు, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి దిశగా నడిపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతున్నాయి. ప్రభుత్వ బడులో అవసరాలను మెరుగుపర్చే దిశగా 'విద్యాంజలి 2.0' కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చాయి. దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలల సంరక్షణతోపాటు విద్యాలయాలను అభివృద్ధి చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. దాతలు నగదు కాకుండా వస్తువులు, సేవల రూపంలో పాఠశాలలు, విద్యార్థులకు సహకారం అందించవచ్చు.

ఏం చేయొచ్చంటే.. : ★ నర్సరీ నుంచి ఇంటర్ వరకు బోధించవచ్చు ★ కథలు చెప్పడం తోపాటు పిల్లల్లో సృజనాత్మకత, చదవడం, రాయడంలో నైపుణ్యాలు పెంపొందించడం.

★ కళలు, వృత్తి నైపుణ్యాలు నేర్పడం ద్వారా సృజనాత్మకతను వెలికి తీసి, జీవనోపాధికి మార్గం చూపడం, అదనంగా పౌష్టికాహారం అందిచొచ్చు.

★ ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశానికి సలహాలు, సూచనలు అందించడం.

★ సామాజిక బాధ్యత కింద దివ్యాంగులకు సేవలు, వయోజన విద్య, పాఠశాలల్లో పరిశుభ్రతకు సహకారం.

★ అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్తు సౌకర్యాలు, పాడైన వాటికి మరమ్మతులు, నిర్వహణకు సహాయం.

★ పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, సాంకేతిక విద్యకు అవసరమైన స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, క్రీడా పరికరాలు ఇవ్వొచ్చు.

★ http://vidyanjali.education.gov.in వెబ్‌సైట్‌లో వాలంటీర్‌గా నమోదు చేసుకోవాలి. వివరాలు నమోదుచేసుకుంటే అందులో వివిధ రకాల సేవలు అందుబాటులో ఉంటాయి. సమీపంలోని పాఠశాల, ఆసక్తి ఉన్న సేవారంగాన్ని ఎంచుకోవచ్చు.

బడులు బలోపేతం

ఉమ్మడి అల్లూరి జిల్లాలో 2904 పాఠశాలలు ఉన్నాయి. 1.69 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యాంజలి 2.0 వెబ్‌సైట్‌లో దాతలు వివరాలు నమోదు చేసుకుని.. తమకు నచ్చిన పాఠశాలకు సహకారం అందించవచ్చు. చాలాచోట్ల అదనపు గదులు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, ప్రహరీ తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అక్కడ ఏ సేవలు వారు సమకూర్చగలరో ముందుగా తెలియజేయాలి. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు చేయూత అందిస్తే పాఠశాలలు మరింత బలోతపేతం అవుతాయి. - డాక్టర్ రామ కృష్ణారావు, జిల్లా విద్యాశాఖాధికారి

వనం.. జ్ఞాపకాలు పదిలం!

అరకులోయ, న్యూస్‌టుడే

పచ్చని చెట్లు.. పొగమంచు సోయగాలు.. మనసుని ఇట్టే కట్టిపడేసే రమణీయ దృశ్యాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. అరకులోయ సమీపంలోని అరకు వీసీకి.. ఉడెన్ బ్రిడ్జి ఫొటో షూట్‌లకు నెలవయ్యాయి. అంజోడాలోని అరకు పీనరీలో.. పైన్ వృక్షాల మధ్య అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఉడెన్ కాటేజీలు, ఉడెన్ ఫొటోఫ్రేమ్‌లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అరకు సమీపంలోని సుంకరమెట్ట కాఫీ తోటల నడుమ ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఉడెన్ బ్రిడ్జి పర్యాటకుల మదిని దోచుకుంటోంది. ప్రీ వెడ్డింగ్, ఫొటో షూట్‌లకు నిలయంగా మారింది. పలు డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిల్మ్‌ల చిత్రీకరణలకు వేదికైంది.


సుంకరమెట్ట సమీపంలో కాఫీ తోటలు

పీనరీలో రుసుములిలా..

★ **వెడ్డింగ్ షూట్:** 10 మంది 4 గంటలకు రూ.2 వేలు
★ **సినిమా షూటింగ్:** ఒక రోజుకు రూ.20 వేలు
★ **సినిమా షూటింగ్:** ఒకరోజు, ఒక రాత్రికి రూ.30 వేలు
★ **పిక్నిక్ :** 50 మందికి రూ.5 వేలు
★ **ప్రవేశ రుసుము :** పెద్దలకు రూ.40, చిన్నారులకు రూ.20

విత్తనాలిస్తారు.. పెట్టుబడి రుణమిస్తారు!
'వెలుగు' ఆధ్వర్యంలో కూరగాయల సాగు

పొలంలో నారు నాటుతున్న రైతు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

నిరుపేద రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. వెలుగు పథకం ఆధ్వర్యంలో పొలాన్ని లీజుకు తీసుకుని రైతులకు అప్పగించనుంది. మార్కెట్‌లో డిమాండు ఉన్న కూరగాయలతోపాటు పూల సాగు చేసే రైతులకు ప్రోత్సాహం అందించనుంది. జిల్లాలో ప్రతి మండలం నుంచి తొలి దశలో ఐదు ఎకరాలు సమీకరించి సాగుకు సన్నద్ధమవుతోంది.

★ కూరగాయలు, పూల సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులను గుర్తిస్తున్నారు. రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య (ఎఫ్‌పీవో) ప్రతి మండలంలో లీజుకు తీసుకున్న పొలాన్ని ఎంపిక చేసిన రైతులకు అప్పగిస్తుంది. మార్కెట్‌లో డిమాండు ఉన్న కూరగాయల, పూల తోటల సాగుకు విత్తనాలు అందజేస్తుంది. సాగునీటి వసతితోపాటు యంత్ర పరికరాలను సమకూరుస్తారు. పెట్టుబడి రుణాలు మంజూరు చేస్తారు. పంట దిగుబడులను వసతిగృహాలతోపాటు విశాఖ, అనకాపల్లిలోని రైతుబజార్లు, కూరగాయల మార్కెట్లకు తరలిస్తామని వెలుగు ఏపీఎం ప్రసాదరావు పేర్కొన్నారు.

తొలి దశలో సేకరించనున్న భూమి : 55 ఎకరాలు
సాగు చేసే పంటలు : క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యాప్సికం, బీర, వంకాయ, బంతిపూలు
పర్యవేక్షణ : రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య

పనులు పూర్తి చేయాల్సిందే!

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో మార్పులు చేస్తోంది. గ్రామాల్లో చేపట్టిన పనులు పెండింగ్ లేకుండా పూర్తయ్యేలా కేంద్ర ప్రభుత్వం గత నెల 29న సర్క్యులర్ జారీ చేసింది. 2014 నుంచి ఇప్పటి వరకు మంజూరై.. పెండింగ్‌లో ఉన్న పనులను ఈ ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని ఉత్తర్వులిచ్చింది. ఇప్పటివరకు ప్రతి పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి 20 నుంచి 25 పనులకు అనుమతులు తీసుకోవడం, వాటిలో సగమే చేయడం జరుగుతోంది. అత్యవసరంగా కొత్త పనులు చేపట్టాలంటే జిల్లా ప్రోగ్రాం అధికారి (డీపీవో) ఉన్న ఖర్చులో మంజూరు చేసేవారు. కొత్త జీవో ప్రకారం ఈ అధికారాన్ని వినియోగించకుండా లాగిన్‌ను నిలిపివేయనున్నట్లు సమాచారం. కాలనీల నిర్మాణాలకు ఉపాధి హామీ నిధులు మంజూరైతే 90 రోజుల్లో ఖర్చు చేయాలి. పండ్ల తోటల పెంపకానికి మూడేళ్ల వరకు అనుమతి ఉంది. రహదారులు, భవనాల నిర్మాణాలకు కాలపరిమితి ఉంటుంది.

జాతీయ రహదారిపై రయ్‌రయ్

చింతపల్లి మండలం లంబసింగి నుంచి జి.మాడుగుల మీదుగా పాడేరు వరకు జాతీయ రహదారి-516ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. లంబసింగి, తాజంగి, జి.మాడుగుల, పాడేరు వరకు రహదారి అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుంది. లంబసింగి నుంచి పాడేరు వరకు మట్టి పనులు పూర్తయిన ప్రాంతాల్లో బీటీ(బ్లాక్ టాప్) వేసే పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు రహదారి పనులతో గోతులు, దుమ్ము, ధూళి కారణంగా ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. బీటీ రహదారి వేయడం ప్రారంభం కావడంతో ప్రయాణికులకు కాస్త ఉపశమనం లభించనుంది. త్వరితగతిన ఈ పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు జాతీయ రహదారి అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, జి.మాడుగుల

కె.కోడాపల్లి సమీపంలో జాతీయ రహదారిలో వేసిన బీటీ

తారుపోసి జారుకున్నారు!

ముంచంగిపుట్టు మండలం పోలీపుట్టు నుంచి దుడుమ మార్గంలో లబ్బూరు వద్ద రహదారి కోతకు గురై రెండేళ్లవుతోంది. పోలీపుట్టు నుంచి అసరాడ మధ్య శుక్రవారం మరమ్మతు పనులు చేపట్టారు. లబ్బూరు వద్ద కోతకు గురైన రహదారి పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు గ్రామీణం

క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

కశింకోట, న్యూస్‌టుడే: క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అలవడతాయని, బాలికలను క్రీడల్లో ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల దేనని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. కశింకోటలో ద్వారపురెడ్డి నూకరాజు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలికలకు ఆదివారం కబడ్డీ పోటీలు జరిగాయి. విజేతలుగా నిలిచిన జట్లకు ఎంపీ రూ.10 వేల ప్రోత్సాహకంగా ప్రకటించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పోటీలను పర్యవేక్షించారు. ఉత్తమ ఉపాధ్యాయులు పీఎం అప్పారావు, ధవళ శకుంతలను సన్మానించారు. నీట్, ఐఐటీ, ఎన్ఐటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ట్రస్టు ప్రతినిధులు శ్రీనివాసబాబు, హరినాథరావు, రమేష్, నూకేశ్వరరావు పాల్గొన్నారు.

విజేతలు: కశింకోట, వెదురుపర్తి, మాకవరపాలెం, తామరం పాఠశాలల జట్లు వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

భీముని కొండ.. కిలగాడకు అండ

మైదానంలా కొండ పైభాగం

ముంచంగిపుట్టు మండలం కిలగాడ గ్రామానికి భీముని కొండే అండని అక్కడి గిరిజనులు చెబుతున్నారు. గ్రామానికి సమీపంలో 1600 అడుగుల ఎత్తయిన కొండ ఉంది. చుట్టూ అటవీ ప్రాంతం, కొండపై చెరువు ఉంది. ఈ చెరువు నుంచి గ్రామానికి నీరు ప్రవహిస్తోంది. ఆ నీటినే గ్రామస్థులు వినియోగించుకుంటున్నారు. సమీపంలో ప్రదేశం క్రీడామైదానంలా దర్శనమిస్తోంది. మహాభారతంలో పాండవులు సంచరించిన ప్రాంతమని, భీముడు నడయాడిన ఆనవాళ్లు ఉండటంతో పూర్వీకులు దీన్ని భీమునికొండగా పిలిచేవారని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కొండ పైనుంచి చూస్తే.. కిలగాడతోపాటు చుట్టుపక్కల గ్రామాలు, 12 కి.మీ.ల దూరంలోని ముంచంగిపుట్టు కనిపిస్తాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు

విశాఖ డెయిరీ పాల ధరల పెంపు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ పాల ధరలను స్వల్పంగా పెంచినట్లు యాజమాన్యం ఆదివారం ప్రకటించింది. ఈ ధరలు సోమవారం అమల్లోకి రానున్నట్లు పేర్కొంది. అన్నిరకాల పాల ప్యాకెట్లు అర లీటరుకు రూ.1 చొప్పున, లీటరుకు రూ.2 చొప్పున పెంచారు. కూలీల ధరలు, నిర్వహణ, ప్యాకింగ్, రవాణా ఛార్జీలు పెరగడంతో ధరలు పెంచాల్సి వచ్చిందని యాజమాన్యం తెలిపింది.

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త
డాక్టర్ రెడ్డి టోటల్ బాడీ చెకప్ సెంటర్
కలెక్టర్ ఆఫీస్ జంక్షన్, కోస్టల్ బేటరీ రోడ్డు, కెనరా బ్యాంక్ ప్రక్కనున్న LUCID బిల్డింగ్, 4వ అంతస్తు, విశాఖపట్నం
శరీరంలో సైలెంట్‌గా దాగిఉన్న గుండెపోటును మరియు కేన్సర్‌ను 6 నెలల ముందుగానే గుర్తించే టోటల్ బాడీ చెకప్
రూ. 7,500/- విలువచేయు పరీక్షలు కేవలం 3,500/- కే
ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా॥ జి. శివప్రసాద్‌రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.
9393752255, 9393122525
ఈ పథకం 10 రోజులు మాత్రమే ప్రతీ ఆదివారం శెలవు

నులిమేద్దాం..
17 నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

చింతపల్లి గ్రామీణం, పాడేరు, న్యూస్‌టుడే

కడుపులో నులి పురుగుల కారణంగా పిల్లలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతారు. వీటి బారిన పడితే రక్తహీనతకు గురయ్యే పరిస్థితి ఉండటంతో చిన్నారులు, యువత ఆరోగ్యాన్ని కాపాడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 17న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. 'నులిపురుగులను నులిమేద్దాం' నినాదంతో వైద్యారోగ్య శాఖ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనుంది.

★ బహిరంగ మలవిసర్జన ద్వారా వచ్చే అనేక రకాల నట్టల గుడ్లు మట్టిలో చేరి వివిధ మార్గాల ద్వారా ఇతరుల జీర్ణాశయంలోకి చేరతాయి. అందులోని ఆహారాన్ని తింటూ మనుగడ సాగిస్తూ అనారోగ్యానికి గురయ్యేలా చేస్తాయి. దైనందిన జీవితంలో బాధితులు అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పాదరక్షలు లేకుండా మట్టిలో నడిచినప్పుడు అవి శరీరంలోకి ప్రవేశించి జీర్ణకోశంలో నివాసం ఏర్పరుచుకుంటాయి.

తలెత్తే సమస్యలు..: నులిపురుగులతో కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, కడుపు ఉబ్బరం, చర్మంపై దద్దుర్లు, న్యూమోనియా, రక్తహీనత, ఆయాసం, నిస్సత్తువ, గుండె పరిమాణం పెరగడం, కాళ్ల వాపులు, ముఖం ఉబ్బడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

నివారణ చర్యలు: ఆల్బెండజోల్ 400 మి.గ్రామ మాత్ర ఏడాదిలో రెండుసార్లు వేసుకుంటే నులిపురుగుల్ని నిర్మూలించొచ్చు. 2 నుంచి 5 ఏళ్ల వయసున్న పిల్లలు అర మాత్ర, 6 నుంచి 19 ఏళ్లలోపు వారు మాత్ర వేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులందరికీ మాత్రలు పంపిణీ చేయాలని వైద్యఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

★ ఆరోగ్య కేంద్రాల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 3.76 లక్షల మాత్రలు సిద్ధం చేశాం. ప్రతి పాఠశాలకు ఆరోగ్య సిబ్బందిని నియమించాం. గ్రామాల్లో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది మాత్రలు వేస్తారని డీఎంహెచ్‌వో కృష్ణమూర్తినాయక్ చెప్పారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నీలి సంద్రంలో 'మిలాన్' బంధం
● తొలిగా 1995లో పోర్ట్‌బ్లెయిర్‌లో నిర్వహణ ● ఈసారి 65 దేశాల భాగస్వామ్యం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నీలి సంద్రంలో దేశ నావికా బలాన్ని చాటేలా.. మిత్ర దేశాలతో బంధం పెంచేలా మిలాన్(మల్టీలేటరల్ నేవీ ఎక్సర్‌సైజ్) నిలుస్తోంది. పలు దేశాల నౌకాదళాలు పాల్గొనే ఈ అద్భుత కార్యక్రమానికి విశాఖ నగరం ఆతిథ్యం ఇస్తోంది. సాంస్కృతిక, సామాజిక మమేకం వంటి అంశాలు కూడా ఇందులో మిళితమై ఉన్నాయి. గత కొద్దిరోజులుగా నగరవాసులు మిలాన్‌పై ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. బహుళజాతి దేశాల నౌకాదళ బహుముఖ విన్యాసాలను సాగించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తూర్పు నావికాదళ అధికారులు తెలిపారు. ప్రతి రెండేళ్లకోసారి మారిటైం సహకారాన్ని అందించే లక్ష్యంతో దీనికి రూపకల్పన చేశారు.

ప్రారంభం ఇలా..: తొలిసారిగా 1995లో అండమాన్ నికోబార్ రాజధాని పోర్ట్ బ్లెయిర్‌లో కేవలం నాలుగు దేశాలతో 'మిలాన్' ప్రారంభమైంది. నాడు 'లుక్ ఈస్ట్ పాలసీ' లో భాగంగా ఇండోనేసియా, సింగపూర్, శ్రీలంక, థాయిలాండ్ దేశాలు భారత్ ఆధ్వర్యంలో సంయుక్త విన్యాసాలు చేపట్టాయి. తర్వాత 2022లో విశాఖ తీరాన జరిగిన మిలాన్‌లో మొత్తం 39 దేశాలు పాల్గొన్నాయి.

★ 2024లో అతిపెద్ద ఎడిషన్‌గా 51 దేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ విన్యాసాల్లో భారత ప్రతిష్ఠాత్మక యుద్ధ విమాన వాహక నౌకలైన ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య పాల్గొనడం విశేషం. ★ 2026లో ఏకంగా మిలాన్‌తోపాటు అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్), భారత సముద్ర నౌకాదళ చర్చాగోష్ఠి (ఐవోఎన్ఎస్) కూడా జరుగుతోంది. ఇందులో 65 దేశాలు పాల్గొననుండటం మరింత ప్రాముఖ్యతను తెచ్చి పెడుతోంది.

బహుళ జాతీయ సముద్ర విన్యాసాల్లో వివిధ దేశాల యుద్ధనౌకలు

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా.. ఈనాడును చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్ర బడ్జెట్

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్ స్వర్ణాంధ్ర సాధన లక్ష్య సాధనకు దోహదపడేలా ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పేర్కొన్నారు. అనకాపల్లిలోని పీఆర్‌టీయూ కార్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలపై వినతులు అందజేశారు. ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో దశల వారీగా అన్ని సమస్యలను పరిష్కారం లభిస్తుందన్నారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారులు ఎదురుచూస్తున్నారన్నారు. వైకాపా సర్కారు రివర్స్ పీఆర్సీ చేసిందని మోసం చేసిందన్నారు. పీఆర్సీ కమిటీ వేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలని కోరారు. విశ్రాంత ఉపాధ్యాయుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వేశ్వరరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, ఆనందరావు, సత్యనారాయణ, అప్పలనాయుడు, అర్జున్, అప్పారావు, జనార్దన్, రామచంద్రరావు, నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

బీసీలకు అగ్ర తాంబూలం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చారని గవర సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర తెలిపారు. వైకాపా హయాంలో బీసీలకు రూ.26 వేల కోట్లు కేటాయించగా కూటమి ప్రభుత్వం రూ.51 వేల కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. వైకాపా స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో 16,500 మంది బీసీలు పదవులకు దూరం అయ్యారన్నారు. బీసీలకు వైకాపా తీరని అన్యాయం చేసిందన్నారు. బడ్జెట్‌పై వైకాపా నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బీసీలకు వెన్నుదన్నుగా ఉండేది కూటమి ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

భవిష్యత్తు విశాఖ.. మెచ్చేలా 'ప్రణాళిక'!

భూ వినియోగం ఆధారంగా వ్యాపాలు
వీఎంఆర్‌డీఏ ముసాయిదా 'మాస్టర్‌ప్లాన్' సిద్ధం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) బృహత్తర ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్) పునఃపరిశీలనలో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాల మేరకు పలు సవరణలు చేపట్టారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) లక్ష్యాలకు అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు. అటవీ, నివాస, ఇతర సున్నిత ప్రాంతాల విస్తీర్ణాన్ని ఖరారు చేసి పొందుపరిచారు. దీంతో భూవినియోగం శాతాల్లో మార్పులొచ్చాయి. ఈ నివేదిక ఆధారంగా భవిష్యత్తు విశాఖను నిర్మించనున్నారు. ప్రభుత్వం ఆమోదించిన తర్వాత ఈ ముసాయిదా ప్లాన్ అమల్లోకి వస్తుంది.

ప్రణాళికాయుత అభివృద్ధికి అవకాశం: మహానగరాల అభివృద్ధిలో భూవినియోగం కీలకమైంది. నిర్దేశిత ప్రాంతాల్లోనే నివాస, పారిశ్రామిక, రవాణా సంబంధించిన నిర్మాణాలు చేపట్టాలి. ఉదాహరణకు నివాస జోన్‌లో గృహ నిర్మాణాలే ఉండాలి. పారిశ్రామిక జోన్‌లో పరిశ్రమలే ఏర్పాటు చేయాలి. మిశ్రమ జోన్‌లో అయితే నివాస, వాణిజ్య నిర్మాణాలు ఏవైనా ఉండొచ్చు. తద్వారా నగరంలో ప్రణాళికాయుత అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది. గత ప్రభుత్వం 2021లో ఆమోదించిన మాస్టర్‌ప్లాన్‌తో పోలిస్తే సవరించిన ప్లాన్‌లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. నివాస ప్రాంతం, అటవీ విస్తీర్ణం, రోడ్ల జోన్ విస్తీర్ణం కొంత పెరిగింది.

ప్రాంతాలవారీగా గుర్తించిన జోన్లు..
తగరపువలస: వాణిజ్య నివాస, వివిధ సంస్థలు ★ ఆనందపురం: సంస్థాగత కేంద్రాల అభివృద్ధి, డేటా సెంటర్లు ★ మేఘాద్రిగెడ్డ: జలాశయం ఆధునికీకరణ, ఉల్లాస సౌకర్యాలు ★ దాకమర్రి: నివాస ప్రాంతాలు ★ భోగాపురం: ఆర్థిక, వర్తక, వాణిజ్య, ఐటీ, పర్యాటకం, ఏరో సిటీ ★ మధురవాడ: ఆర్థిక ఆవాస ప్రాంతం, వివిధ ఆవాస రాలు, ఐటీ సెంటర్లు ★ పాయకరావుపేట: మెడ్ సిటీ ★ నర్వ: బహుళ వినియోగ రవాణా కేంద్రం ★ వైజాగ్ బేసిటీ: కైలాసగిరి నుంచి భీమిలి

2041-సవరించిన మాస్టర్‌ప్లాన్ ఇలా..

అంశం	శాతం
వ్యవసాయ భూమి	41
నివాస ప్రాంతం	17.3
అటవీ భూములు	15.9
మిశ్రమ జోన్	8.5
గ్రీన్ జోన్	6.30
రోడ్ల నిర్మాణం	5.8
పర్యాటకం, పార్కులు	3.2
పారిశ్రామిక ప్రదేశం	1.1
పబ్లిక్, సెమీ పబ్లిక్ స్థలం	0.70
వాణిజ్య ప్రాంతం	0.20

వీఎంఆర్‌డీఏ మొత్తం విస్తీర్ణం: 6836.15 చ.కి.మీ.	జిల్లాలు: విజయనగరం, విశాఖ, అనకాపల్లి
2041సవరించిన ముసాయిదా బృహత్తర ప్రణాళిక విస్తీర్ణం: 4380.67 చ.కి.మీ.	మండలాలు: 52
ప్రస్తుతం సిద్ధమైన బృహత్తర ప్రణాళిక పరిధి: 4380.67 చ.కి.మీ.	గ్రామాలు: 1457

పురావస్తు శాఖ స్థలంలో తవ్వకాల నిలిపివేత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: రాంబిల్లి మండలం కొత్తూరు సమీపాన పురావస్తుశాఖ స్థలంలో యంత్రాలతో చేపడుతున్న తవ్వకాలను ఆదివారం నిలిపివేశారు. దీనిపై ఆదివారం 'ఈనాడు'లో 'పురావస్తు స్థలంపై పర్యవేక్షణ ఏదీ' శీర్షికన ప్రచురితమైన కథనం అధికారులను కదిలించింది. అధికారులు వచ్చి తవ్వకాలు చేపట్టకూడదని ఆదేశించారు. ✦ పోలవరం కాలువ సమీపంలో కంకర తవ్వకాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ ప్రాంతం నుంచి వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

మతమార్పిడి నిరోధక చట్టాలపై సదస్సు నేటినుంచి

అనకాపల్లి పట్టణం: 'మతమార్పిడి నిరోధక చట్టం రాజ్యాంగ బద్ధమా' అంశంపై అనకాపల్లిలో ఈ నెల 16, 17 తేదీల్లో సదస్సు నిర్వహిస్తున్నట్లు క్రిస్టియన్ డెమొక్రటిక్ మూమెంట్ సమన్వయకర్త జె.శివకుమార్ చెప్పారు. పట్టణంలోని వివేకానంద హాలులో ఏపీ, తెలంగాణకు చెందిన ప్రొఫెసర్లు, నాయకులు పాల్గొంటారన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోటలో శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవం ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. శనివారం రాత్రంతా గౌరీపరమేశ్వరులను గ్రామంలో ఊరేగించి ఆదివారం శారదానదిలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో రహదారులు కిక్కిరిసిపోయాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోవిందు, కాండ్రేగుల సతీష్, వేగి దొరబాబు, పెంటకోట రాము, వేగి రామకోటి తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ శ్రావణి పర్యవేక్షణలో సీఐ స్వామినాయుడు, ఎస్సైలు మనోజ్‌కుమార్, లక్ష్మణరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శారదానదిలో గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

గొల్లల కొండపై దీపాలు

ఆకట్టుకున్న దీపాలంకరణ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి గొల్లలకొండపై మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం రాత్రి చేపట్టిన దీపాల అలంకరణ ఆకట్టుకుంది. దాతలు సమకూర్చిన 500 కేజీల నూనె పెద్ద ప్రమిదల్లో వెయ్యి దీపాలను కొండపై వెలిగించారు. భక్తులు సాయంత్రం ఆరుగంటలకు కొండపైకి ఎక్కి వీటిని ఏర్పాటు చేశారు. రాత్రంతా ఈ దీపాలు వెలుగుతున్నాయి. వీరన్న కొండపైనా భక్తులు దీపాలు వెలిగించారు.

మార్చిలో నూకాలమ్మ ఆలయ పునఃప్రారంభం

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి నూకాలమ్మ ఆలయ పునః ప్రారంభం వచ్చే నెలలో చేపడతామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఆలయంలో పనులను ఆయన ఆదివారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణతో కలిసి పరిశీలించారు. నూకాలమ్మ జాతర మార్చి 17న ప్రారంభమవుతుందన్నారు. ఈలోగా ఆలయం ప్రారంభిస్తామన్నారు. పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. నెల రోజులు నిర్వహించే జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముందుగా ఆయన నూకాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను, కార్యనిర్వహణ అధికారి వై.శ్రీధర్ పాల్గొన్నారు. తొలగించిన శంకుస్థాపన శిలఫలకాలు నూతన ఆలయంలో ఏర్పాటు చేయాలని దేవస్థానం పూర్వపు ఛైర్మన్ కొణతాల మురళి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఈవో శ్రీధర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను నిర్మాణానికి అడ్డు ఉండడానికి ఉద్దేశంతో కార్యాలయం గోడకు తాత్కాలికంగా అతికించామన్నారు. వీటిని నూతన ఆలయ ప్రాంగణంలో సముచిత స్థానంలో ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఆలయ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ భద్రత

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఈనెల 17, 18 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరంలో పర్యటించనున్న ప్రదేశాలను నగర పోలీసు యంత్రాంగం ఆదివారం నిశితంగా పరిశీలించింది. ఈనెల 17న దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా ఈస్టర్న్ నేవల్ కమాండుకు చెందిన నేవల్ ఎయిర్ స్టేషన్ 'ఐఎన్ఎస్ డేగా'కు ఆమె చేరుకుంటారు. అక్కడి నుంచి డాక్‌యార్డు గోడౌను మీదుగా కమాండు ముఖ్య కార్యాలయం 'ఐఎన్ఎస్ సర్కార్స్'కు వెళతారు. ఆయా మార్గాలను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రతబాగ్చీ, డీసీపీ మేరీ ప్రశాంతి, ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆరిఫ్, ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. రూట్ షెడ్యూల్ మ్యాప్ ప్రకారం పటిష్ఠ భద్రతకు అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్రపతి 17న ఐఎన్ఎస్ డేగా చేరుకుంటారు. అక్కడ నుంచి ఐఎన్ఎస్ డేగాకు వెళ్తారన్నారు. ఆమెకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వాగతం పలుకుతారన్నారు. ఆమె 18న ఐఎఫ్ఆర్‌లో పాల్గొని, అదే రోజు సాయంత్రం దిల్లీకి పయనమవుతారని పేర్కొన్నారు.

నేవీ ప్రాంగణాన్ని పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు

ప్రమాదకరంగా పెద్దేరు వంతెన

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: జన్నవరం- పెద్దేరు వంతెన కింద చప్టా శిథిలమైంది. వరద ఉద్ధృతితోపాటు ఇసుక తవ్వకాల కారణంగా మరమ్మతులకు గురైంది. నిర్మించిన కొంతకాలానికే వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వంతెనకు ఆవల జన్నవరంతోపాటు బెన్నవోలు, చాకిపల్లి, రామజోగిపాలెం, కన్నంపాలెం, తిమ్మన్నపాలెం తదితర గ్రామాల నుంచి రోజూ వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం పడినప్పుడల్లా వంతెనపై వరదనీరు నిలిచిపోతుంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రక్షణ కుందలు శిథిలమయ్యాయి. వంతెన మీదుగా రాత్రివేళల్లో ప్రయాణించేవారంతా విద్యుత్తు దీపాలు లేకపోవడంతో భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వంతెనతోపాటు శిథిలమైన చప్టాకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శిథిలావస్థలో పెద్దేరు వంతెన

క్రికెట్ విజేతలకు సత్కారం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ క్రీడా పోటీల్లో భాగంలో ఇటీవల అమరావతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ ఆదివారం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. జట్టు కెప్టెన్ వానపల్లి నాగభూషణం తదితరులను ఆయన సత్కరించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో అనురాధ సత్తా

నాతవరం, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో నాతవరం జడ్పీ పాఠశాల పీడీ అనురాధ సత్తా చాటారు. 400 మీటర్ల పరుగులో పసిడి, హ్యామర్ త్రోలో రజతం, 5000 మీటర్ల వాకింగ్, 400 మీటర్ల రిలే పరుగులో రజత పతకాలు సాధించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో పతకాలు అందుకున్నారు. హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

బృంద సభ్యులతో అనురాధ

తెరపై క్రికెట్ మ్యాచ్ వీక్షణం

అనకాపల్లి గ్రామీణం, నక్కపల్లి, న్యూస్‌టుడే: గొలగాం దుర్గాదేవి కాలనీలో ఆదివారం టీ 20 ప్రపంచకప్ భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను గ్రామ యువకులు భారీ తెరపై ప్రదర్శించారు. క్రికెట్ అభిమానులు, యువకులు పెద్ద ఎత్తున చేరుకొని మ్యాచ్‌ను తిలకించి కేరింతలు కొట్టారు. ఇండియా జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. సిక్స్, ఫోర్లు కొట్టినప్పుడు యువకులు పెంటకోట లక్ష్మీనారాయణ, అప్పలరాజు, రాంబాబు, సాయిరాం ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సందడి చేశారు. నక్కపల్లిలోనూ తెర ఏర్పాటు చేసి మ్యాచ్ ప్రదర్శించారు.

గొలగాంలో ఏర్పాటుచేసిన తెర

ఆలోచనకు అంకురం.. హర్షితకు అందలం

గ్లోబల్ సమ్మిట్‌కు ఎంపికైన సబ్బవరం బాలిక

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆలోచనలకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) జోడించడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చునని ఓ బాలిక రుజువు చేసి గ్లోబల్ సమ్మిట్‌కు ఎంపికైంది. ఆ వివరాలిలా.. సబ్బవరం ప్రతిభా విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న దొడ్డి హర్షిత సంక్రాంతి పండగ కోసం ఆన్‌లైన్‌లో తనకు కావలసిన దుస్తులు బుక్ చేసుకుంది. తీరా అవి వచ్చాక వాటి రంగులు నచ్చలేదు. కొలతలు సరిపోలేదు. కావలసిన సమయానికి అవి చేరకపోవడంతో కొంత అసంతృప్తికి గురైంది. ఎందుకిలా జరిగిందని మొదలైన ఆలోచన ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెట్టింది.

ల్యాప్‌టాప్‌లో కొలతల ఆధారంగా దుస్తులు రూపొందిస్తున్న హర్షిత

ఆలోచన సాగిందిలా..: కావలసిన కొలతలు, రంగు, మనమే ఎంపిక చేసుకుని, సరైన టైలర్‌కు ఇచ్చి కుట్టించుకుంటే సరిపోయేది కదా అని ఆలోచన వచ్చింది. వెంటనే తనకున్న కృత్రిమ మేధ పరిజ్ఞానంతో ఏఐలో లాగిన్ అయ్యింది. వ్యక్తి రంగు, కొలతలను బట్టి ఏయే దుస్తులు, ఫ్యాషన్లు బాగుంటాయో ఏఐ ద్వారా తెలుసుకుంది. దీన్ని మరింత అభివృద్ధి చేస్తే ఎంతోమందికి 'మార్గదర్శి' కావచ్చునని మరింత లోతుగా ఆలోచించింది.

★ ఈ క్రమంలో తాను చదివే పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ మెంటార్ రాజశేఖర్ పర్యవేక్షణలో ఆన్‌లైన్ షాపింగ్‌పై నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో 'ఫ్యాషనీఫై' ప్రాజెక్టును రూపొందించింది. తర్వాత దేశ వ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నుంచి 100 ప్రాజెక్టులను నిర్వాహకులు ఆహ్వానించారు. వాటిలో 50 ఉత్తమ ప్రాజెక్టులను ఈనెల 16 నుంచి దిల్లీలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు ఎంపిక చేశారు. అందులో హర్షిత రూపొందించిన ప్రాజెక్టుకు కూడా చోటు దక్కడంతో పాఠశాల యాజమాన్యం ఆమెను అభినందించింది.

★ ఈమె స్వగ్రామం అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం బంగారమ్మపాలెం. తండ్రి రామారావు విశాఖ షిప్‌యార్డ్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లి శ్రావణి గృహిణి. రెండో తరగతి వరకు సబ్బవరంలోని అమర్ స్కూల్‌లో చదువుకుంది. 3 నుంచి 7వ తరగతి వరకు స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగింది. 8 నుంచి ప్రతిభా విద్యాలయంలో చదువుతోంది.

★ నేను రూపొందించిన ప్రాజెక్టుకు భవిష్యత్తులో మంచి ఆదరణ ఉంటుంది. ఎంబీఏ చేసి వ్యాపార రంగంలో స్థిరపడాలని ఉంది. ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థను ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పించాలని భావిస్తున్నా. – హర్షిత

షూటింగ్‌బాల్ విజేత అనకాపల్లి బాలుర జట్టు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని బీఎస్‌ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో గత మూడురోజులుగా బాలుర, బాలికల విభాగం రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో 12 జట్లు, బాలుర విభాగంలో 16 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో అనకాపల్లి బాలుర జట్టు విజేతగా నిలవగా, అనంతపురం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచింది. బాలికల జట్టుకు ధర్మవరం పట్టణ తెదేపా అధ్యక్షుడు పరిశే సుధాకర్, షూటింగ్ బాల్ అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి, పీడీ లక్ష్మీనారాయణ ట్రోఫీని అందజేశారు. శ్రీసత్యసాయి జట్టు సభ్యులంతా ధర్మవరం బీఎస్‌ఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థినులే కావడం విశేషం.

రోబో చేతి కాఫీ.. అదుర్స్

తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ నావెల్ బేస్‌లోని సముద్రిక వద్ద మిలాన్ విలేజ్ ప్రారంభమైంది. ఇక్కడ ఏర్పాటు చేసిన రోబో కాఫీ స్టాల్ నౌకాదళ అధికారులు, సిబ్బందిని ఆకట్టుకుంది. దీని పేరు బీన్‌బోర్డు రోబో. మనుషుల సహాయం లేకుండానే తనకు తానే యంత్రంలో కాఫీని పట్టి చేతితో ఇస్తుంది. ఫోన్‌పే ద్వారా డబ్బు చెల్లించినవారు కాఫీ తీసుకొని తాగవచ్చు. త్వరలో ఇటువంటి రోబోను దిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం విమానాశ్రయాల్లో ఏర్పాటు చేయనున్నట్లు బీన్‌బోర్డు రోబో సంస్థ ప్రతినిధులు తెలిపారు. – ఈనాడు, విశాఖపట్నం

మిలాన్ విలేజ్‌లో రోబో కాఫీ స్టాల్ వద్ద యువతి

హుండీలను కొల్లగొట్టకుండా..!

ఆలయాల్లో భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి

నక్కపల్లి, న్యూస్‌టుడే: రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం తదితర మండలాల్లోని ఆలయాల్లో ఇటీవల హుండీలు చోరీకి గురయ్యాయి. కొన్నిచోట్ల హుండీలను ఎత్తుకెళ్లారు. నక్కపల్లి మండలం కాగితలో రెండేళ్ల కిందట దుర్గమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగలు వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. మనబాలవానిపాలెం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అమ్మవారి ఆలయంలో ఏడాది కిందట హుండీ అపహరణకు గురైంది. గొలుగొండ మండలం చీడిగుమ్మల మొదలు కృష్ణదేవిపేట వరకు మూడేళ్ల కిందట ఆరు ఆలయాల్లో ఒకే రోజు వరుస చోరీలు జరిగాయి.

▼ ఆలయాల్లో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఆలయాల నిర్వహణకు సంబంధించి అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో మైకు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో నాలుగు వేలకు పైగా ఆలయాలు ఉన్నాయని అంచనా. నక్కపల్లి, మునగపాక, కశింకోట, నాతవరం మండలాల్లో అవగాహన కార్యక్రమాలు మొదలయ్యాయి. సీఐలు, ఎస్సైలు స్థానికులకు సూచనలు చేస్తున్నారు. చోరీల నియంత్రణకు అందించాల్సిన సహకారంపై వివరిస్తున్నారు.

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న నక్కపల్లి సీఐ

సూచనలివీ... ✦ ప్రతి ఆలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు. ✦ పూజల నిమిత్తం అలంకరించే ఆభరణాలను సాయంత్రం తీసి భద్రపర్చడం. తీయలేని పక్షంలో కాపలాదారును నియమించడం. ✦ హుండీల్లో భక్తులు వేసే కానుకలను ఎప్పటికప్పుడు కమిటీల ఆధ్వర్యంలో లెక్కించి బ్యాంకులో డిపాజిట్ చేయడం. ✦ హుండీలను పటిష్ఠంగా తయారు చేయించడం. తాళాలు పగలగొట్టడానికి వీల్లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. ✦ జాతీయ, ప్రధాన రహదారులను ఆనుకుని ఉండే ఆలయాల వద్ద మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

సమష్టి కృషితోనే.. ఆలయాల్లో వరుస చోరీ ఘటనల నేపథ్యంలో అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ ఆదేశాలతో చర్యలు చేపట్టాం. పోలీసులు గ్రామాలకు వెళ్లి ప్రజలతో సమావేశమవుతున్నారు. దేవాదాయ శాఖకు సంబంధించిన ఆలయాలు ఉంటే అధికారులను కలుస్తున్నాం. గ్రామాల్లో పోలీసు గస్తీ పెంచనున్నాం. ప్రజలందరి సమష్టి కృషితో చోరీలకు అడ్డుకట్ట పడుతుంది. – పి.శ్రీనివాసరావు, డీఎస్పీ, నర్సీపట్నం

'బాల'హీనతకు స్వస్తి పలుకుదాం..!

ఈనాడు, విశాఖపట్నం: అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులు, పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో వివిధ అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వాటిని చిన్న వయసులో గుర్తించకపోతే సమస్య తీవ్రమయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్కే), రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్కేఎస్కే)లు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన, ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తించి కేజీహెచ్‌లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ (డీఈఐసీ)కు తరలిస్తున్నారు.

ఆర్బీఎస్కేలో ఇలా..: అంగన్‌వాడీ కేంద్రాల్లో అయిదేళ్ల లోపు చిన్నారులకు, పాఠశాలల్లో ఒకటి నుంచి 12వ తరగతి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,22,895 మందికి, పాఠశాలల్లో 71,878 మందికి పరీక్షలు చేసినట్లు అధికారులు తెలిపారు.

★ ఉచితంగా వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలు
★ అండగా ఆర్బీఎస్కే, ఆర్కేఎస్కే కార్యక్రమాలు

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు గుర్తించిన చిన్నారుల వివరాలు

1054	ఎదుగుదల లోపం
1223	పోషకాహార లోపం
5747	వివిధ వ్యాధులు
1066	పుట్టుకతో లోపాలు

4,641 మందికి రక్తహీనత

★ ఆర్కేఎస్కేలో భాగంగా 10 నుంచి 19 ఏళ్ల బాలలకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 19,564 మందిని పరీక్షించగా.. వారిలో 4,641 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు.

★ పుట్టుకతో గుండె జబ్బులున్న 11 మంది చిన్నారులకు విశాఖలోని మెడికవర్, తిరుపతిలో పద్మావతి పిల్లల ఆసుపత్రి, ఆంధ్ర హాస్పిటల్స్‌లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేశారు.

★ అన్ని ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాయంత్రం సమయాల్లో అడాల సెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్‌లు (ఏఎఫ్‌హెచ్‌సీ) నిర్వహిస్తున్నారు. బాల బాలికలకు ఐరన్ మాత్రలు, పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ జనవరి వరకు 23,972 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

179 మంది తరలింపు..
ఆర్బీఎస్కే, ఆర్కేఎస్కే కార్యక్రమాల్లో భాగంగా చిన్నారుల్లో రక్తహీనత, ఎత్తు, బరువు, నేత్ర, వినికిడి, మానసిక రుగ్మతలు, ఇతర ఆరోగ్య సమస్యలను గుర్తిస్తున్నాం. వారి కోసం గతేడాది సెప్టెంబరులో ప్రత్యేక వాహనం అందుబాటులోకి తెచ్చాం. ఇప్పటివరకు ఆ వాహనంలో 179 మంది చిన్నారులను కేజీహెచ్‌లోని డీఈఐసీకి తరలించాం. రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు అందిస్తున్నాం.
– డాక్టర్ హారిక, ఆర్బీఎస్కే జిల్లా సమన్వయకర్త

త్రుటిలో తప్పిన ప్రమాదం

నక్కపల్లి: జాతీయ రహదారిపై నక్కపల్లిలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. సీఐ జె.మురళి కథనం ప్రకారం... విశాఖ నుంచి తుని వైపు ఎనిమందితో వెళ్తున్న కారు పోలీసు స్టేషన్ సమీపానికి రాగానే ట్రాఫిక్ కారణంగా నెమ్మదిగా వెళ్తుండగా, ఇదే మార్గంలో వస్తున్న లారీ వెనుక నుంచి దీన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో కారు వెనుకభాగం నుజ్జవ్వగా, అదృష్టవశాత్తు ఇందులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. లారీ అక్కడి నుంచి పరారవ్వగా, విషయం తెలుసుకున్న సీఐ.. సిబ్బందిని పంపించి టోల్‌గేట్ వద్ద పట్టుకుని స్టేషన్‌కు రప్పించారు. బెంగాల్‌కు చెందిన డ్రైవర్ కాజోల్‌దాస్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా, మద్యం తాగి ఉన్నట్లు నమోదైంది. ఇతడిపై కేసు నమోదుచేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాదంలో దెబ్బతిన్న కారు

JOBS

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

రావికమతం, న్యూస్‌టుడే: కన్నంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. స్థానిక యూపీ స్కూల్లో 2001లో 40 మంది విద్యార్థులు ఏడో తరగతి చదివారు. 25 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకొని నాటి జ్ఞాపకాలను తలచుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అప్పట్లో పాఠాలు చెప్పిన హెచ్.ఎం రమణమూర్తి, గణిత ఉపాధ్యాయుడు స్వామి, ఉపాధ్యాయుడు ఉగ్గిన సురేష్‌లను శాలువాలతో సత్కరించారు.

కెరటాల ఉద్ధృతికి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కెరటాల ఉద్ధృతికి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన రుషికొండ బీచ్ సమీప సముద్రతీరంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. కొమ్మాది సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు సమీప వసతిగృహంలో ఉంటున్నారు. ఆదివారం కావడంతో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దరి కొత్తపల్లి గ్రామానికి చెందిన **పి.అరవింద్**



నాయుడు (21), శ్రీకాకుళం జిల్లా వాసి సనపల రాజీవ్ (21)లు మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఉదయం 7 గంటలకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. 10 గంటల సమయంలో దగ్గరలోని ఓ రిసార్ట్స్ వెనుక బీచ్‌కు వచ్చారు. అరవింద్‌నాయుడు, రాజీవ్ సముద్రంలో ఈతకు దిగారు. ఒక్కసారిగా ఉద్ధృతంగా వచ్చిన కెరటాల్లో చిక్కుకున్న అరవింద్ కేకలు వేయడంతో పక్కనే ఉన్న రాజీవ్ కాపాడేందుకు ప్రయత్నించాడు. దీంతో ఇద్దరూ కెరటాల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. ఒడ్డున ఉన్న స్నేహితులు స్థానికుల సాయంతో జీవీఎంసీ బీచ్, టూరిజం లైఫ్‌గార్డులకు సమాచారం అందించారు. వెంటనే వారు బోటు ద్వారా గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి యువకులను రుషికొండ తీరానికి తీసుకొచ్చారు. వీరిలో అరవింద్‌నాయుడు పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో విద్యార్థి రాజీవ్‌కు ప్రాథమిక చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్డ్	206	230
స్కిన్‌లెస్	234	240

(c) eenadu

సాంకేతికత మెరుగుపర్చాలని వినతి

కేంద్రమంత్రి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్టీసీ జోన్ ఛైర్మన్ దొన్నుదొర తదితరులు

అరకులోయ, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో సాంకేతికత మెరుగుపర్చాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర వినతిపత్రం సమర్పించారు. అమరావతిలో ఆదివారం ఆయన్ను కలిశారు. అల్లూరి జిల్లాలోని చాలా గ్రామాల్లో ఇంటర్నెట్, సెల్ సిగ్నల్స్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని.. సంక్షేమ పథకాలు అందాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సాంకేతికతకు దూరంగా ఉండటంతో అవస్థలు తప్పడం లేదని పేర్కొన్నారు. కొన్నిచోట్ల సెల్‌టవర్లు నిర్మించినా వాటిని వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. గ్రామాల్లో టవర్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చాలని విన్నవించారు. భాజపా నాయకులు షేక్ అబ్దుల్ అలీమ్, తెదేపా నాయకులు సూకరాజు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం రేపు

కొయ్యూరు, న్యూస్‌టుడే: బీడిపాలెం పంచాయతీ సింగవరం గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 17న ఘనంగా నిర్వహించడానికి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. 17న ఉదయం ప్రభాత సేవ, చందన, పాల అభిషేకాలు, అష్టోత్తర పూజ, హోమాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు జి.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, కె.సూర్యనారాయణ, భద్రం, కల్యాణం తెలిపారు. భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరీక్షల సమయం.. ఆరోగ్యం భద్రం

జి.మాడుగుల, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఇంటర్, పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తగిన నిద్ర, పోషకాహారం, క్రమబద్ధమైన చదువు లేకపోతే ఒత్తిడి, ఏకాగ్రత లోపం, జ్ఞాపక శక్తి తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని పేర్కొంటున్నారు. పరీక్షల సమయంలో చదువు, ఆరోగ్యం రెండింటినీ సమానంగా చూసుకోవాలని విద్యాశాఖాధికారులు, వైద్యులు సూచిస్తున్నారు.

★ ఈనెల 23 నుంచి ఇంటర్, మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవనున్నాయి. పరీక్షల భయంతో కొందరు విద్యార్థులు రాత్రంతా మేల్కొని చదవడం, భోజనం మానేయడం, అధికంగా టీ, కాఫీ తీసుకోవడం చేస్తుంటారు. ఇది శరీరాన్ని బలహీనపరచడమే కాకుండా.. పరీక్ష సమయంలో అలసట, తలనొప్పి, ఆందోళనకు కారణమవుతాయని, రోజుకు కనీసం 7 నుంచి 8 గంటల నిద్ర తప్పనిసరిగా అవసరమని, సమయానికి భోజనం చేయాలని వైద్యులు చెబుతున్నారు.

పరీక్షకు సిద్ధమవుతున్న జి.మాడుగుల జూనియర్ కళాశాల విద్యార్థులు

ఖాళీ కడుపుతో వెళ్లొద్దు

ఖాళీ కడుపుతో పిల్లలను పాఠశాలలకు పంపొద్దు. అలా వెళితే నీరసించి చదువుపై దృష్టి సారించలేరు. పరీక్షల సమయంలో ఏదైనా పండు తినేలా చూడాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఏకాగ్రత పెరుగుతుంది. – నజియుల్లా, కిల్లగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

పరీక్షలకు దగ్గర పడుతున్న సమయంలో కొత్త పాఠాలను మొదలుపెట్టకుండా, తెలిసిన అంశాలనే పునశ్చరణ చేయాలి. పరీక్ష అంటే భయపడాల్సిన అవసరం లేదు. సిలబస్‌కు అనుగుణంగా చదవాలి. మోడల్ పేపర్లు, గత ప్రశ్న పత్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్ష హాల్లో ప్రశాంతంగా ఉండి.. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాధానాలు రాయాలి. – బాబూరావు, మండల విద్యాశాఖాధికారి, జి.మాడుగుల

'ఇరుముడి'లో స్థానికులకు అవకాశం


సాయికుమార్‌తో బాల

సీలేరు, న్యూస్‌టుడే: మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై 25 రోజులుగా సీలేరు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్న ఇరుముడి సినిమాలో పలువురు స్థానికులకు అవకాశం దక్కింది. శివనిర్వాణ దర్శకత్వంలో, రవితేజ, ప్రియా భవానీ శంకర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి అధిక సన్నివేశాలు సీలేరు, పొల్లూరు, డొంకరాయి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. సీలేరుకు చెందిన ఎస్.బాల, మోతుగూడెంకు చెందిన ఎం.వి.రమణలకు రవితేజ, సాయికుమార్ స్నేహితులుగా నటించే అవకాశం కల్పించారు. సీలేరు, పొల్లూరులో జరిగిన చిత్రీకరణలో వీరు పాల్గొన్నారు. ఈ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 900 మంది స్థానికులకు గ్రామస్థులుగా నటించేందుకు అవకాశం కల్పించారు. ఆగస్టు చివర వారంలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది.

నిరుపయోగంగా హాట్‌బజార్

గిరిజనులు పండించిన పంటలు, అటవీ ఉత్పత్తులను నిల్వ చేసి గిట్టుబాటు ధరకు విక్రయించేందుకు వీలుగా నిర్మించిన హాట్‌బజార్లు నిరుపయోగంగా ఉన్నాయి. ట్రైకార్ నిధులతో వీటిని అనువైన స్థలాల్లో కాకుండా.. అధికారులు వారికి నచ్చిన ప్రాంతాల్లో నిర్మించడంతో ఉపయోగం లేకుండా పోయింది. అరకులోయ మండలంలోని దిరసబందులో కొండపై దీన్ని నిర్మించడంతో వినియోగానికి వీలు లేని విధంగా మారింది. ఇవి సద్వినియోగం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – అరకులోయ, న్యూస్‌టుడే

సాగు సాగేదెలా?

మన్యంలో చెక్‌డ్యాంలు శిథిలమై వర్షాధారంగానే గిరిజనులు సాగు చేస్తున్నారు. కితలంగి పంచాయతీ పాత గ్రామంలో చెక్‌డ్యాం శిథిలావస్థకు చేరి పదేళ్లు కావొస్తోంది. తుపాను ప్రభావంతో సాగునీటి కాలువ కొట్టుకుపోయింది. దీంతో 56 ఎకరాల భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. పలుమార్లు పాలకులు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెక్‌డ్యాం మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

పాడిలో కొట్టుకుపోయిన కాలువ

ఏడేళ్లుగా.. ఇంతేనా?

పాడేరులోని వ్యవసాయశాఖ డివిజన్ కార్యాలయ నిర్మాణం ఏడేళ్లుగా అసంపూర్తిగా ఉండిపోయింది. వ్యవసాయశాఖకు శాశ్వత భవనం నిర్మించాలని 2018లో అప్పటి ప్రభుత్వం రూ. 36 లక్షల వరకూ నిధులు మంజూరు చేసింది. గుత్తేదారు హడావుడిగా పనులు మొదలుపెట్టారు. ఆ తర్వాత నిధులు సరిపోవని భావించి పనులు ఆపేశారు. ఈ భవనం అప్పటినుంచి అలాగే ఉండిపోయింది.



ప్రస్తుతం తుప్పలు పెరిగి నిరుపయోగంగా తయారైంది. వ్యవసాయశాఖ కార్యకలాపాలు మార్కెట్‌యార్డు గోదాముల్లో నిర్వహించాల్సిన పరిస్థితి. ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసి జిల్లా కార్యాలయంతోపాటు డివిజన్ కార్యాలయాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

మూగజీవాలతో ముప్పుతిప్పలు

అరకు- పాడేరు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉదయం, సాయంత్రం రహదారిపై అడ్డంగా పశువులు ఉండి.. ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. పశువులను తప్పించబోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – హుకుంపేట, న్యూస్‌టుడే

అరకు- పాడేరు ప్రధాన రహదారికి అడ్డంగా పశువులు

నీటి పథకం.. నిరుపయోగం!

ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల్‌జీవన్ మిషన్ పనులకు రూ.కోట్లాది నిధులు వెచ్చిస్తున్నాయి. ఈ పనులు చాలా గ్రామాల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గిరిజన గ్రామాల్లో నేటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొంది. పెదబయలు మండలం పర్రెడలో గత ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకం పనులు నామమాత్రంగా చేపట్టారు. ప్రస్తుతం ఇవి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. నీటి ట్యాంకుకు పైకప్పు ఏర్పాటు చేయలేదు. చెత్తాచెదారం ట్యాంకులోకి పడుతోంది. కుళాయిలు ఏర్పాటు చేయక నీరు వృథా అవుతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే

పర్రెడలో పైకప్పులేని ట్యాంకు

అ వీ ఇ వీ

అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం

పాడేరు, న్యూస్‌టుడే: అభివృద్ధి వైపు బలమైన అడుగులు పడేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని మాజీ ఎమ్మెల్యే, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమానికి, ఆదివాసీ ప్రాంత అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కి గిరిజనుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, డి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గడువు పెంచరూ..

అనంతగిరి, న్యూస్‌టుడే: ఉచిత గ్యాస్ కనెక్షన్ల దరఖాస్తు స్వీకరణ గడువును పొడిగించాలని తెదేపా ఎగువశోభ కమిటీ అధ్యక్షుడు మట్టం శ్యామ్ ఆదివారం కోరారు. గిరిజనులకు అవగాహన లేకపోవటంతో పలువురు నేటికీ దరఖాస్తు చేసుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలు మండలం బంగారుమెట్ట నుంచి చిట్రాయిపుట్టు వరకు రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. బంగారుమెట్ట నుంచి చిట్రాయిపుట్టు వరకు తారురోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.10 కోట్లు మంజూరు చేసిందని.. నాణ్యతగా, వేగంగా పనులు పూర్తి చేయాలని కోరారు. బంగారుమెట్ట నుంచి పన్నెడ మధ్యలో, కిత్తుకొండ, ముసిడిపుట్టు మధ్యలో రక్షణ గోడలు, కల్వర్టులు నిర్మించాలని డిమాండ్ చేశారు. జంబు కోటిబాబు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తరలిన మాంసం, చేపల దుకాణాలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చేపలు, మాంసం దుకాణాలను ఎట్టకేలకు సంత మార్కెట్ వద్దకు అధికారులు తరలించారు. వ్యాపారులు స్థానిక సంతమార్కెట్ వద్ద ఆదివారం నుంచి అమ్మకాలు చేపట్టారు. గత కొంతకాలంగా ప్రధాన రహదారికి ఇరువైపులా అమ్మకాలు చేపడుతుండటంతో ట్రాఫిక్ అంతరాయం, కుక్కల బెడద అధికమయ్యింది. పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. అధికారులు స్పందించి వ్యాపారులకు నోటీసులు అందజేసి.. ఈ నెల 11న దుకాణాలను తొలగించారు. వ్యాపారులకు లాటరీ విధానంలో సంతబయలు వద్దనున్న పంచాయతీ దుకాణాలు కేటాయించారు.

తాగునీటి పథకం ప్రారంభం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: సొలభం పంచాయతీ వనభరంగిపాడు గ్రామంలో జల్‌జీవన్ పథకం ద్వారా నిర్మించిన తాగునీటి పథకాన్ని సర్పంచి హనుమంతరావు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య తీరిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వనభరంగిపాడులో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి హనుమంతరావు

నమామి శంకరం.. ప్రణామి శుభకరం

కురిడి శివాలయంలో భక్తుల పూజలు

ఆర్వీనగర్‌లో భక్తుల కోలాటం

కొయ్యూరు మల్లికార్జున ఆలయంలో..

పాడేరు/పట్టణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పాడేరు మండలంలోని సంగోడి గ్రామంలో సిద్ధి సంగమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు బారులుతీరారు. స్ఫటిక లింగానికి అభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి స్వామివారిని దర్శించుకున్నారు. పాడేరులోని గిరి కైలాస్ క్షేత్ర సన్నిధిలో ఉమానీలకంఠేశ్వస్వామి సన్నిధిలో పూజలు వైభవంగా జరిగాయి. పాత పాడేరులో పురాతన దేవాలయానికి భక్తులు పోటెత్తారు. అయ్యప్ప ఆలయంలో కల్యాణం జరిగింది.

చింతపల్లి, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: చింతపల్లి మండలంలోని అంతర్ల, వంగసార, మడిగుంట శివాలయల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నసమారాధనలు జరిగాయి. గూడెంకొత్తవీధిలో అతి పురాతన మల్లికార్జునస్వామి ఆలయంలో జాతరకు భారీగా తరలివచ్చారు. ఆర్వీనగర్‌లో అన్నసమారాధన జరిగింది.

జి.మాడుగుల, చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జి.మాడుగుల సంతబయలు, గాంధీనగర్ తోపాటు పలు శివాలయాల్లో ఉదయం నుంచి భక్తులు బారులుదీరారు. చింతపల్లి మండలం బౌడ, అంతర్ల, చిలకలమామిడి, లోతుగెడ్డ తదితర శివాలయాలు కిటకిటలాడాయి.

సంగోడిలో సిద్ధిసంగమేశ్వరస్వామి

డుంబ్రిగుడ, కొయ్యూరు, న్యూస్‌టుడే: కురిడిలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో శివుని ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొయ్యూరు మల్లికార్జున స్వామి, ఎం.మాకవరం, పి.మాకవరం, శరభన్నపాలెం, రేవళ్లు, గాదిగుమ్మిలోని గిరిజాతాండవేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు, ధారకొండలో వేడుకలు ఘనంగా జరిగాయి. భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. సీలేరు జలాశయం శివారులోని గుంటవాడ వద్ద శివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

★ సీలేరు శివాలయంలోని శివపార్వతులకు జెన్‌కో ఉద్యోగి ఆకేటి దారబాబు, గౌరీ దంపతులు మకరతోరణం అందజేశారు. చింతలపూడి రమణ, అరుణ దంపతులు వినాయకుడు, కుమారస్వామితోపాటు ఉత్సవమూర్తులకు మకరతోరణాలు అందజేశారు.

అరకులోయ శివాలయంలో జలాభిషేకం

అనంతగిరి, ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: బొర్రా, కాశీపట్నం శివాలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తుల తాకిడి మొదలైంది. బొర్రాలో ఒడిశా ప్రాంతాల భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. పర్యాటకులతో గుహలు కళకళలాడాయి. కాశీపట్నం ఉమారామలింగేశ్వరస్వామి గుడికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కమిటీసభ్యులు, సచివాలయ, పోలీసు సిబ్బంది భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు. దారెల, కిలగాడ, చెరువుపాకల, కుమడ, బాబుసాల, జోలాపుట్టు, జర్జుల పంచాయతీలోని గుంజ్రి సంత కూడలి వద్ద ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దారెల గ్రామంలో సర్పంచి పాండురంగస్వామి, ఆలయ నిర్మాణదాతలు పాల్గొని పూజలు జరిపారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ, నందివలస, పెదలబుడు, మాడగడ, డింగ్రిపుట్టు, యండపల్లివలస తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అరకులోయ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామికి భక్తులు జలాభిషేకం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పాడేరు అయ్యప్ప ఆలయంలో కల్యాణానికి హాజరైన భక్తులు

సీలేరు శివాలయంలో ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులోని శివాలయాన్ని ఒడిశాలోని నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మాఝీ, మల్కాన్‌గిరి ఎమ్మెల్యే నరసింహా మడకామి ఆదివారం సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఒడిశాలోని పప్పులూరులో అధికారిక కార్యక్రమానికి వెళ్తూ.. సీలేరులో కాసేపు ఆగారు. స్థానికులతో మాట్లాడారు. ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, శివ, లక్ష్మణ్.. ఎంపీ, ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు. ఎస్సై యాసీన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూజలుచేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మత్స్యలింగేశ్వరుని సన్నిధిలో ప్రముఖులు

హుకుంపేట, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం మత్స్యగుండంలోని మత్స్యలింగేశ్వరుని పాడేరు ఐటీడీఏ పీవో శ్రీపూజ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మత్స్యగెడ్డలో మత్స్యాలను దర్శించుకున్న అనంతరం స్వామివారిని పూజించారు. పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి స్వామివారిని దర్శించుకొన్నారు. జాతరలో ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈశ్వరిని ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. మత్స్యగుండం విశిష్టత తెలిపే పుస్తకాలు అందించారు.

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మత్స్యగుండంలో కమిటీ సభ్యులు, అధికారులతో ఐటీడీఏ పీవో శ్రీపూజ

రూ.6.5 లక్షలతో రహదారి నిర్మాణం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిషత్ నిధులతో మారుమూల గ్రామాల్లో సిమెంట్ రహదారుల నిర్మాణాలు చేపడుతున్నామని ఎంపీపీ కోరాబు అనూషాదేవి తెలిపారు. చింతపల్లి పంచాయతీ చిలకలమామిడి గ్రామంలోని శివాలయం వద్ద నిర్మించిన సిమెంట్ రహదారిని ఆదివారం ప్రారంభించారు. రూ. 6.5 లక్షల మండల పరిషత్ నిధులతో ఆలయానికి షెడ్డు, 500 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం పూర్తిచేసి.. మహాశివరాత్రి రోజున ప్రారంభించామన్నారు. గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి, పీఆర్ జేఈ బాలకిషోర్, ఏఎంసీ డైరెక్టర్ బేతాళుడు, కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, వర్తక సంఘం అధ్యక్షుడు జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సంలో ఎంపీపీ అనూషాదేవి తదితరులు

ఆటో అదుపు తప్పి బోల్తా

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పన్నెడ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. కుడాసింగి గ్రామానికి చెందిన ఆటో.. ఆదివారం మత్స్యగుండం వెళ్లి తిరుగు ప్రయాణంలో పన్నెడ సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా.. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను పెదబయలు పీహెచ్‌సీలో చికిత్స అనంతరం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆటోలో సుమారు 15 మంది ఉన్నారు.

పెదబయలు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

అసంపూర్తి పనులు.. తప్పని అవస్థలు

కిలగాడలో గ్రామ సచివాలయానికి వసతి సమకూరక.. కార్యాలయ నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ పాలనలో రూ. 40 లక్షల ఖర్చుతో చేపట్టిన భవన నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. పనులు మధ్యంతరంగా నిలిపివేయడంతో నిర్మాణం చుట్టూ.. తుప్పలు పెరిగి, విషసర్పాలకు నిలయంగా మారింది. నిధులు వృథా అయ్యాయే తప్ప వసతి సమకూరలేదు. పంచాయతీ భవనంలో సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనం స్లాబు పెచ్చులూడి గోడలు బీటలువారుతున్నాయి. ఏనుగురాయి, దారెల, వనుగుమ్మ, కరిముఖిపుట్టు గ్రామాల్లోనూ సచివాలయాలకు వసతి సమకూరలేదు.

కిలగాడలో తుప్పల మధ్య సచివాలయ భవనం

ప్రమాదాల నివారణకు వినూత్న ప్రచారం

రోడ్డు ప్రమాదాల నివారణపై గూడెంకొత్తవీధి పోలీసులు వినూత్నంగా అవగాహన కల్పిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే చింతపల్లి గూడెంకొత్తవీధి, సీలేరు మార్గంలో పలు చోట్ల పోలీసులు ఏర్పాటు చేసిన పోస్టర్లు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. కాస్త ఆలస్యంగా వచ్చినా పరవాలేదు. దయచేసి హెల్మెట్ ధరించు నాన్నా అంటూ ఇద్దరు చిన్నారులు తండ్రిని ఉద్దేశించి అంటున్నట్లు ఏర్పాటు చేసిన పోస్టరు ఆలోచింపజేస్తోంది. స్పీడ్‌గా ఎవడైనా వెళతాడు.. క్షేమంగా వెళ్లినవాడే మొనగాడు. ఎంత స్పీడ్‌గా వెళ్లామన్నది కాదన్నయ్యా.. క్షేమంగా వెళ్లామా లేదా, హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అంటూ మహేష్‌బాబు, ప్రభాస్, అల్లుఅర్జున్ వంటి అగ్ర హీరోల మాటలను పోస్టర్లలో ముద్రించి కూడళ్లలో పోలీసులు ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు గూడెంకొత్తవీధి సీఐ సుధాకర్, ఎస్సై సురేష్ తెలిపారు. – గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే



మహేశ్‌బాబు చిత్రం, సందేశాలతో పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | చింతపల్లి: 94404 07658

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: జీలుగులపాడు వద్ద గోస్తనీనదిపై వంతెన నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. ఈ పనులు పూర్తిచేయాలి. – శ్యాంసన్, కొటపర్తి సన్యాసిరావు, గ్రామస్థులు

✔: త్వరలోనే పనులు పూర్తిచేస్తాం. – గణేష్, గిరిజన సంక్షేమ శాఖ ఏఈ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ఏనుగురాయి పంచాయతీలోని తడ్డాపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర భవనం ఐదేళ్ల నుంచి అసంపూర్తిగా దర్శనమిస్తోంది. భవనం లేక కేంద్రం నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – శివరామకృష్ణ, స్థానికుడు, ✔: భవన నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని ప్రతిపాదించాం. నిధులు విడుదలైతే పనులు పూర్తి చేస్తాం. – విమలాకుమారి, సీడీపీఓ, ఐసీడీఎస్, ముంచంగిపుట్టు

రవాణా కష్టాలు గట్టెక్కేలా!

లుంగపర్తి, కోనాపురం రహదారులకు నిధులు

అనంతగిరి, న్యూస్‌టుడే: అనంతగిరి మండలంలోని రెండు ప్రధాన రహదారులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలాకాలంగా కనీస మరమ్మతులకు నోచుకోకుండా పూర్తి అధ్వానంగా ఉన్న లుంగపర్తి, కోనాపురం గ్రామాల రహదారులకు నిధులు మంజూరయ్యాయి. త్వరితగతిన రహదారి నిర్మాణాలు పూర్తి చేసి.. తమను రవాణా కష్టాల నుంచి గట్టెక్కించాలని గిరిజనులు కోరుతున్నారు.

కోనాపురం రహదారికి రూ.4 కోట్లు

ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రా గేటువలస నుంచి కోనాపురం వరకు రహదారిని సుమారు 12 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కనీసం చిన్నపాటి మరమ్మతులు సైతం చేపట్టలేదు. దీంతో రహదారి చాలా రోజుల క్రితమే పూర్తిగా తారు ఊడి గతుకులమయంగా మారింది. పలుచోట్ల తారు జాడ కూడా తెలియని విధంగా ఉంది. కనీసం ద్విచక్రవాహనాలతో సైతం రాకపోకలు సాగించేందుకు అవకాశం లేకపోయింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఇక్కడి ప్రజలకు కూటమి ప్రభుత్వం తీపి కబురుచెప్పింది. ఈ రహదారి నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు పూర్తయితే అరకులోయ- అనంతగిరి మండలాల పరిధిలోని గ్రామాలకు రాకపోకలు సులువవుతాయి.

అధ్వానంగా కోనాపురం రహదారి

లుంగపర్తికి రూ.95 లక్షలు

పుసుమామిడి- లుంగపర్తి రహదారిని సుమారు పదేళ్ల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టపోవడంతో స్థానిక యువకులే స్వచ్ఛందంగా మరమ్మతులు చేసుకున్నారు. లుంగపర్తి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బాలుర వసతిగృహం ఉండటంతోపాటు అనేక గ్రామాలకు చేరుకునేందుకు ఈ మార్గమే ఆధారం. కివర్ల పంచాయతీ పరిధిలోని బొంగిజ తదితర గ్రామాలకు ఈ రహదారిలోనే వెళ్లాలి. ఈ రోడ్డు ఎక్కడికక్కడ కాలువల మాదిరిగా తయారైంది. ఈ తరుణంలో ప్రస్తుతం రహదారి నిర్మాణానికి రూ. 95 లక్షలను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రెండు రోడ్లకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో సుమారు 30కి పైగా గ్రామాల ప్రజలకు రవాణా ఇబ్బందులు తీరనున్నాయి.

త్వరితగతిన పూర్తిచేస్తాం

రహదారులకు సంబంధించి పరిపాలన ఆమోదం పొంది నిధులు మంజూరు అయ్యాయి. ఇంకా టెండరు ప్రక్రియ జరగాల్సి ఉంది. టెండరు ప్రక్రియ పూర్తి అయిన వెంటనే తక్షణమే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి.. త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం. – గణేష్, ఏఈ, పీఐయూ

(c) eenadu

కోటప్పకొండ వద్ద విద్యుత్తు వెలుగుల్లో భారీ ప్రభలు

పూజలు అందుకున్న త్రికోటేశ్వర స్వామి

ప్రభల తేజం.. ప్రణమిల్లిన జనం

మార్మోగిన శివనామస్మరణ

కోటప్పకొండ: క్యూలో భక్తుల రద్దీ

ఈనాడు, నరసరావుపేట- పెదకాకాని, మంగళగిరి అర్బన్, చేబ్రోలు, న్యూస్‌టుడే బృందం: మహాశివరాత్రి పురస్కరించుకుని త్రికూటగిరులు భక్తులతో కిటకిటలాడాయి. 'ఓం నమఃశివాయ.. . చేదుకో కోటయ్యా.. మము ఆదుకో రావయ్యా' అంటూ శివనామ స్మరణతో మార్మోగాయి. త్రికోటేశ్వరుడిని అధికసంఖ్యలో దర్శించుకున్నారు. శనివారం అర్ధరాత్రి తర్వాత మొదట బిందెతీర్థంతో స్వామిని అభిషేకించారు. అనంతరం విభూది, పసుపు, కుంకుమ, గంధాలతో అభిషేకాలు చేశారు. త్రికోటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మునుపెన్నడూ లేనిరీతిలో శనివారం రాత్రి ఒంటి గంట నుంచే స్వామి దర్శనం కల్పించారు. మెట్ల మార్గం భక్తులతో కిటకిటలాడింది. కొండపై భారీ నంది విగ్రహానికి పూజలు చేశారు. యాగశాలలో మేధా దక్షిణామూర్తి హోమాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రభలను కొండకు తీసుకొచ్చారు. కోటప్పకొండతో పాటు ఉమ్మడి జిల్లాలోని సత్రశాల, దైద, అమరావతి, పెదకాకాని, వడ్లమూడి క్వారీ దేవాలయాలకు భక్తులు పోటెత్తారు.

పెదకాకానిలో విశేష అలంకరణ

భక్తులతో కిక్కిరిసిన వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయం

క్వారీ ఆలయం వద్ద ప్రభలు, రంగులరాట్నాలు, జెయింట్ వీల్

అమరేశ్వరుని వైభవం

అమరావతి, న్యూస్‌టుడే: ఓంకార నాదం.. శంభో శివశంభో నామస్మరణతో అమరేశ్వరాలయం మార్మోగింది. మహాశివరాత్రి పురస్కరించుకుని పరమశివుని దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 4 గంటలకే స్వామికి అభిషేకాలు ప్రారంభించారు. భక్తులు కృష్ణానది వద్ద ఘాట్‌లో జల్లు స్నానాలు చేశారు. అనంతరం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

అమరేశ్వర స్వామి

సిఫార్సులతో హడావుడి.. సిఫార్సుల దర్శనాల పేరుతో వివిధ శాఖల సిబ్బంది చేసిన హడావుడితో సామాన్య భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారులు తమకు తెలిసిన ప్రతి ఒక్కరినీ సిఫార్సు చేస్తూ దర్శనాలకు తీసుకెళ్లారు. ఆ సమయంలో క్యూలైన్లు కదలక పోవడంతో రద్దీ పెరిగింది.

అమరావతిలో బిల్‌గేట్స్ పర్యటనకు ఏర్పాట్లు

తుళ్లూరు, తాడేపల్లి, న్యూస్‌టుడే: గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించనున్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో ఆయన సమావేశం కానున్నారు. సచివాలయంలో ఆర్టీజీఎస్‌లో సాంకేతిక వినియోగం, రియల్ టైం గవర్నెన్స్ విధానం-ఫలితాలు, ఉండవల్లిలో రైతులతో సమావేశం, వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ల వినియోగం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో బిల్‌గేట్స్ పర్యటించే మార్గాల్లో అధికారులు సుందరీకరణ పనులు చేపట్టారు. కృష్ణానది కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్డు(ఈ-3) ఫేజ్-1, 2.. రాష్ట్ర సచివాలయానికి వెళ్లే ఎన్-9 మార్గంలో సుమారు 10 కి.మీ. మేర రహదారులను శుభ్రపరిచారు. డివైడర్లకు రంగులు వేస్తున్నారు. కరకట్టపై ఇరువైపులా మట్టిని చదును చేయించారు. వీవీపీలు ప్రయాణించే మార్గంలో ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి శుభ్రపరిచారు. కృష్ణా కరకట్ట, సీడ్‌యాక్సెస్ రోడ్డు, ఎన్-9 రోడ్డులో ఆహ్లాదకర పూల మొక్కలతో సుందరీకరిస్తున్నారు. ఏడీసీ ఇంజినీరింగ్, గ్రీనరీ విభాగం అధికారులు నిరంతరం పనులు పర్యవేక్షిస్తున్నారు.

ఉండవల్లి వ్యవసాయ క్షేత్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

ఉండవల్లిలో కలెక్టర్ పరిశీలన.. ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను బిల్‌గేట్స్, చంద్రబాబు తదితరులు పరిశీలించనున్న నేపథ్యంలో అధికారులు ఆమేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సమావేశ వేదిక, సీసీ కెమెరాలు, యాక్సెస్ కంట్రోల్ పాయింట్లు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్ల ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. గుంటూరు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడే డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ, రైతులతో సమావేశం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. క్షేత్ర పరిశీలనలో కలెక్టర్‌తోపాటు వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకురాలు ఎం.పద్మావతి, ఉద్యానశాఖ ఉపసంచాలకురాలు రవీంద్రబాబు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

డివైడర్‌కు రంగులు వేస్తున్న కార్మికులు

మంగళగిరికి ఆధునిక రైతు బజారు

5.62 ఎకరాల్లో నిర్మాణానికి ప్రతిపాదన

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి, తాడేపల్లి నగర పరిధిలో ఆధునాతన రైతుబజారు ఏర్పాటుకు ప్రతిపాదించారు. దీనిని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహించాలని భావిస్తున్నారు. ఇందుకుగాను 5.62 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. కూరగాయలు, పండ్లు, శీతల గిడ్డంగులు అందుబాటులో ఉండే విధంగా దీని నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. వీటితో పాటు రిటైల్, హోల్‌సేల్ మార్కెట్ సౌకర్యం కల్పించనున్నారు. మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో దీన్ని త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రూ.21.30 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించి.. భవన నమూనాలను రూపొందించారు.

నమూనా చిత్రం

రెండు అంతస్తులుగా భవనం..

మొత్తం రెండు అంతస్తుల్లో నిర్మించే ఈ మార్కెట్‌లో సుమారు 530 ద్విచక్ర వాహనాలు, 60 కార్లు నిలిపే విధంగా పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. 18 అన్ లోడింగ్ ప్లాట్‌ఫాంలు, 23 హోల్‌సేల్ కూరగాయల దుకాణాలు, రిటైల్ మార్కెట్‌లో కూరగాయల స్టాళ్లు 150, ఫ్రూట్స్ స్టాళ్లు 54 ఉండేలా డిజైన్ చేశారు. వీటితోపాటు టాయిలెట్స్, కోల్డ్ స్టోరేజీ, కూరగాయలు శుభ్రం చేసే ప్రాంతం, పరిపాలన విభాగం తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. ఎన్నాళ్ల నుంచో ఎదురు చూస్తున్న రైతుబజారు సాకారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వారధిపై నిలిచిన కంటెయినర్

భారీగా నిలిచిపోయిన వాహనాలు

కనకదుర్గమ్మ వారధిపై తప్పిన ప్రమాదం

సుమారు 3 కి.మీ. మేర నిలిచిన ట్రాఫిక్

తాడేపల్లి, మంగళగిరి అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని కనకదుర్గమ్మ వారధిపై ఆదివారం మధ్యాహ్నం భారీ ప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న భారీ కంటెయినర్ లారీ డీజిల్ ట్యాంకు బోల్టులు విరిగి ఒక్కసారిగా ఊడిపోయింది. దీంతో కంటెయినర్ నిలిచిపోయింది. ఆ సమయంలో వెనుక ఎలాంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 వరకు సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. శివరాత్రి పర్వదినం నేపథ్యంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో విజయవాడ వైపు సుమారు 3 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. తాడేపల్లి, విజయవాడ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కంటెయినర్‌ను బయటకు తీసుకువచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదే సమయంలో వారధిపై వెళ్లే మార్గంలో మరో కారు మొరాయించి ఆగిపోయింది.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నేడు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్‌తో పాటు రెవెన్యూ క్లినిక్‌ను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పోలీసు వినతుల స్వీకరణ రద్దు

గుంటూరు నేరవార్తలు: శివరాత్రి పర్వదినం సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉన్న నేపథ్యంలో ఈనెల 16న సోమవారం పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

16, 17 తేదీల్లో ఉద్యోగ మేళా

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ 2వ ఫ్లోర్‌లోని సీడాప్ కార్యాలయంలో ఈనెల 16, 17 తేదీల్లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్- డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో బ్రాంచి మేనేజర్, క్యాషియర్, షిఫ్ట్ ఇన్‌ఛార్జి, వాలిడేటర్, ఐటీ ఎగ్జిక్యూటివ్, టోల్ కలెక్టర్లు మొత్తం 300 ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తారన్నారు. ఆసక్తి గల యువకులు విద్యార్హత ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

ఆంక్షలు.. అవస్థలు

కీలక నిందితుల వైద్య పరీక్షల సమయంలో రోగులకు తప్పని ఇబ్బందులు

ఈనాడు, అమరావతి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో అత్యవసర విభాగం వద్ద ఆంక్షలు అవస్థలు సృష్టిస్తున్నాయి. గేట్లు మూసేసి.. తలుపులు వేసి.. పోలీసులు కట్టడి చేస్తుండడంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జీజీహెచ్‌లో వైద్య పరీక్షల కోసం నిందితులు, అరెస్టయిన రాజకీయ పార్టీల నేతలు, ఇతర ముఖ్యులను బందోబస్తు మధ్య తీసుకొచ్చిన ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదురవుతోంది.

అత్యవసర విభాగంలోకి వెళ్లే ద్వారం వద్ద పోలీసుల ఆంక్షలు

ఇదీ పరిస్థితి..

అత్యవసర విభాగంలోకి సదరు వ్యక్తులు వచ్చే వరకు శవాగారం ముందున్న ప్రధాన గేటు మూసేస్తున్నారు. అక్కడ అధిక సంఖ్యలో పోలీసులు మోహరించి.. రాకపోకలు కట్టడి చేస్తున్నారు. భవనంలోకి ప్రవేశించే ద్వారం వద్ద మరికొందరు ఆంక్షలు విధిస్తుండడంతో రోగులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. గంటల తరబడి ఇదే పరిస్థితి. కొంతమంది రైల్వేస్టేషన్ వరకు నడిచి వచ్చి అక్కడి నుంచి లోపలకు ప్రవేశించినా.. అత్యవసర విభాగంలోకి వెళ్లలేకపోతున్నారు. వార్డులో పోలీసుల హడావుడితో అక్కడ ఉన్న రోగులకూ ఇబ్బంది అవుతోంది. పోలీసులు తీసుకొచ్చిన నిందితులు, భద్రత పరంగానూ ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడుతోంది.

ఇలా చేయొచ్చు..

- సదరు వ్యక్తుల వైద్య పరీక్షలకు అత్యవసర విభాగంలోకి తీసుకురాకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాల్సి ఉంది.
- రూ.వంద కోట్లతో నిర్మించిన మాతా శిశు సంరక్షణ భవనం ఇటీవలే ప్రారంభమైంది. జీజీహెచ్‌లో ఉన్న ప్రసూతి, పీడియాట్రిక్ విభాగాలను కొత్త భవనంలోకి మారుస్తున్నారు. ఈ క్రమంలో జీజీహెచ్‌లో ఖాళీ అయిన గదులను వినియోగించవచ్చు.
- సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో ఉన్న కొన్ని విభాగాలను ప్రసూతి వార్డుల గదుల్లోకి తరలించి.. అక్కడైనా ఏర్పాట్లు చేయొచ్చు.
- ప్రత్యేక సందర్భాల్లో శవాగారం సమీపంలోని ప్రధాన గేటు మూయకుండా.. రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న గేటు నుంచి తీసుకొస్తే అత్యవసర సేవలకు వచ్చే వారికి ఇబ్బంది ఉండదు.
- పోలీసులు సైతం ఆంక్షల పేరుతో రోగులను ఇబ్బంది పెట్టకుండా వ్యవహరించడం అవసరం.
- గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ 'ఈనాడు'తో మాట్లాడుతూ.. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెడతామని వివరించారు.

పరీక్ష గాలికి... శిక్ష ప్రజలకు

కాగితాలకే పరిమితమైన నీటి నమూనాల సేకరణ

ఈనాడు - అమరావతి

తాగునీటి పరీక్షల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. నమూనాల సేకరణ కాగితాలకే పరిమితమవుతోంది. అధికారుల అలక్ష్యం.. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఇబ్బందిగా పరిణమించాయి.

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పది లక్షల జనాభాకు రోజుకు 155.25 మిలియన్ లీటర్ల నీరు అవసరమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం 135.50 మిలియన్ లీటర్లే ఇస్తున్నారు. చాలావరకు పైపులైన్ల లీకేజీల వల్ల నీరు వృథాగా పోతోంది. కొన్నిచోట్ల మురుగునీటి కాలువల్లో పైపులైన్లు ఉండడంతో పగుళ్లున్నచోట వ్యర్థ జలాలు కలుస్తున్న పరిస్థితి. నీటి నాణ్యతను డివిజన్లవారీగా నమూనాలు సేకరించి పరీక్షించాలి. కొంతకాలంపాటు స్వర్ణ సచివాలయాల ఉద్యోగులకు ఈ బాధ్యతలు అప్పగించి.. 10 చొప్పున నమూనాలు ఆర్‌సీ టెస్టింగ్ కోసం సేకరించాలని సూచించినా ఇది మూలకు చేరింది. నగరంలోని రిజర్వాయర్ల వద్ద అరకొరగా సేకరిస్తున్నా.. అందులోనూ క్లోరిన్, టీడీఎస్ మినహా వేరే అంశాలను పరీక్షించడం లేదు. వారానికి 21 నమూనాల హెచ్2ఎస్ స్ట్రిప్స్ పరీక్షలు నిర్వహించాలని.. వాటర్ వర్క్స్ వద్ద 2పీపీఎం, పైపులైను శివారున 0.2పీపీఎం క్లోరినేషన్ విలువ తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశాలున్నా.. అమలు కాకపోవడం గమనార్హం.

జీఎంసీకి నీటిని సరఫరా చేసే తక్కెళ్లపాడులోని నీటి శుద్ధి కేంద్రం

పణంగా ప్రజారోగ్యం

2018, 2024, 2025 సంవత్సరాల్లో కలుషిత నీరు తాగి ప్రాణనష్టం వాటిల్లింది. అనేకమంది ఆసుపత్రుల పాలయ్యారు. ఇటీవల కమిషనర్ మయూర్ అశోక్ నీటి శుద్ధి కేంద్రాల్లో పర్యటించి పలు సూచనలు చేశారు. ఈ ఏడాదైనా యంత్రాంగం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. నీటి సరఫరా విభాగం అధికారులు మాత్రం పక్కాగా పరీక్షలు జరుగుతున్నట్లు చెబుతుండడం గమనార్హం.

'ఆది'లోనే అవస్థలు

★ జీఎంసీకి తక్కెళ్లపాడు వద్ద 45, 45, 42 ఎంఎల్‌డీల సామర్థ్యంతో మూడు ఫిల్టరేషన్ ప్లాంట్లు; సంగం-జాగర్లమూడి సమీపంలో 50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ప్లాంట్లు ఉన్నాయి.

★ రోజువారీ అవసరాల్లో ఎక్కువశాతం నీరు తక్కెళ్లపాడు నుంచే వస్తోంది. ఇక్కడ మూడు ప్లాంట్లకు ఒక్కటే ప్రయోగశాల ఉంది. ముగ్గురు సిబ్బంది షిఫ్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. తగినంత సిబ్బంది లేక పరీక్షలు సక్రమంగా జరగడం లేదు.

★ 2018లో ఏర్పాటు చేసిన 42 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన కేంద్రంలో ప్రయోగశాల ఉన్నా.. సిబ్బంది కొరతతో కొన్నాళ్లకే మూతపడింది.

నిమ్మ రైతుల గుండెల్లో గుబులు

మంచు ప్రభావంతో తొలికాపు ఆలస్యం

దుగ్గిరాల, న్యూస్‌టుడే

లక్షలాది రూపాయలు కౌలుకు తీసుకున్న నిమ్మ చేల పరిస్థితి చూసి రైతుల గుండెల్లో గుబులు ఏర్పడింది. సకాలంలో రాని కాయలు అన్నదాతల్ని కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దుగ్గిరాల మండలం చిలువూరులో దాదాపు 700 ఎకరాల నిమ్మ సాగు జరుగుతోంది. ఇక్కడ కౌలు ఎకరాకు రూ. లక్ష పైమాటే. గత పంట ద్వారా కొంత లాభాలు కన్పించడంతో ఈసారి కౌలు రైతులు ఎక్కువకు పోటీపడి తీసుకున్నారు. మార్చి నెల నుంచి నిమ్మ సీజన్ ఎక్కువగా ఉంటుంది. దాహార్తితో ప్రజలు తాగే పానీయాల్లో నిమ్మ వినియోగం ఎక్కువ. అన్ని ప్రాంతాల నుంచి మే నెలలో కాపు వస్తుంది. పంట అంతా ఒకేసారి మార్కెట్లోకి వస్తే అంత ధర పలకదు. ఇది ఆదాయాన్ని ఇవ్వదు. సాధారణంగా చిలువూరులో తొలి కాపు మార్చిలో వస్తుంది. ఆ నెలలో, తర్వాత వచ్చే ఏప్రిల్ నెలలో దిగుబడి అయ్యే నిమ్మ ద్వారా ప్రతి సంవత్సరం రైతులకు ఆదాయం ఉంటోంది. ఈసారి మార్చి నెలలో కాపు రాలేదు. ఇప్పుడు పిందెలు వస్తున్నాయి. అవి

మంచు కారణంగా ఎండిపోతున్న పూత

పెరిగి కాయ అయి విక్రయానికి పనికి వచ్చేసరికి ఏప్రిల్ నెల దాటిపోతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి మంచు ఇప్పటికీ కురుస్తుండడంతో ఆ ప్రభావం కూడా ఉందని కర్షకుడు దూరు పాములు తెలిపారు. మంచు కారణంగా పూత మాడిపోతోంది. అది కొంత నష్టమేనని ఆయన అన్నారు. గ్రామంలో నిమ్మ, సపోట కలిపి 1000 ఎకరాల వరకు ఉందని.. ఉద్యానాధికారులు తరచూ రైతులతో సమావేశం జరపడం, వారికి సూచనలు చేయడం వంటివి చేస్తే బాగుంటుందని, సబ్సిడీపై పురుగు మందులు అందుబాటులో ఉండేలా చేస్తే మేలు జరుగుతుందని కొందరు హాలికులు చెప్పారు. దీనికి తోడు ఏ పంట కాలంలో తెగుళ్లు ఎక్కువగా వచ్చాయి. మార్కెట్లో నిమ్మ కిలో కనీసం రూ.45 అయినా ఉంటే కొంతైనా గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు.

తెనాలి పురపాలికలో ఇంటిదొంగలు

రూ.10 లక్షల మళ్లింపు కలకలం

న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

ఖజానాకు జమచేయాల్సిన ఆస్తి పన్ను, పింఛనుదారులకు చెల్లించాల్సిన సొమ్ము సుమారు రూ.10 లక్షలు దారి మళ్లించిన ఉద్యోగి ఘటన తెనాలి పురపాలికలో కలకలం రేపుతోంది. ఇంత పెద్ద మొత్తం సొంతానికి మళ్లించుకోవడంపై కమిషనర్ రామ అప్పలనాయుడు విచారణకు ఆదేశించడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఓ స్వర్ణ వార్డు సచివాలయ అడ్మిన్ ఇలా సొమ్ము తస్కరించడంపై ప్రస్తుతం మేనేజర్ జయకర్, ఆర్వో రామ్‌ప్రసాద్ విచారణ చేపట్టారు.

మెతక ధోరణి అనుసరిస్తుండడంతో..

పన్ను చెల్లించమని ఇచ్చిన నగదు చెల్లించకుండా, పింఛన్‌దారులతో వేలిముద్రలు వేయించుకుని సొమ్ము ఇవ్వకుండా సొంతానికి వాడుకోవడం, మృతులు బతికి ఉన్నట్లు చూపి పింఛన్ నిధులు తస్కరించడం వంటి వాటికి కొందరు పురపాలక అధికారులు, ఉద్యోగులు పాల్పడుతున్నారు. ఇప్పటికే స్వర్ణ వార్డు సచివాలయాల ఇంజినీర్లు కొందరు పేదల వద్ద ఇళ్లు నిర్మిస్తామని నగదు తీసుకొని దిగమింగిన విషయం వెలుగులోకి వస్తున్నా.. పట్టించుకోవడం లేదు. ఇలా సొమ్ము స్వాహారాయుళ్లపై అధికారుల మెతక ధోరణి మీద విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగినా తగిన చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితిలో మార్పు లేదు. 2009లో పట్టణ పరిధిలోని మృతుల పేర్లను ఒక వార్డుకు బదలాయించి దొంగ వేలిముద్రలు వేసి రూ.84 లక్షలు దిగమింగారు కొందరు ఉద్యోగులు. 2022లో తాము మున్సిపల్ ఖజానాకు జమ చేయమని ఇచ్చిన రూ.5 లక్షల నగదు అప్పటి ఆర్వో వాడుకున్నట్లు అప్పటి కమిషనర్‌కు మున్సిపల్ అద్దె దుకాణదారులు ఫిర్యాదు చేశారు. ప్రజాధనం మింగుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాల్సి ఉందని ప్రజలు సూచిస్తున్నారు.

అశోక్ లేల్యాండ్ నకిలీ విడిభాగాల అమ్మకాలు

షాపుల యజమానులపై కేసు నమోదు

ఈనాడు, అమరావతి: ఆటోనగర్‌లో నకిలీ స్పేర్ పార్ట్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ అశోక్ లేల్యాండ్‌కు సంబంధించి నకిలీ విడిభాగాలు విక్రయిస్తున్న మూడు దుకాణాలపై పోలీసులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న సోనీ మోటార్ పార్ట్స్, వీరా క్లచ్ సెంటర్, విజయ కృష్ణ ఆటోమొబైల్స్‌లో కంపెనీకి చెందిన నకిలీ స్పేర్ పార్ట్స్ అమ్ముతున్నట్లు, కంపెనీ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని అశోక్ లేల్యాండ్‌కు చెందిన ప్రతినిధి నితూకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు ఆటోనగర్‌లోని ఈ దుకాణాల్లో శనివారం రాత్రి తనిఖీలు చేశారు. పలు విడిభాగాలు దొరికాయి. ఇవి అసలు వాటికి నకిలీలని గుర్తించారు. దీంతో ఆ దుకాణాల యజమానులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని 318 (4)తో పాటు కాపీరైట్ యాక్ట్‌లోని 63, 64 సెక్షన్లు, ట్రేడ్‌మార్క్ చట్టంలోని 103, 104 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆటోనగర్‌లో ఇంకా ఎక్కడైనా దుకాణాల్లో ఈ తరహాలో నకిలీ విడిభాగాలు అమ్ముతున్నారా? అని విచారిస్తున్నారు.

19 నుంచి స్వచ్ఛ భారత్ మిషన్‌పై శిక్షణ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) కింద చేపట్టే పనులపై మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, స్వర్ణ గ్రామం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఈనెల 19 నుంచి మార్చి 13వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు. గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో ప్రజలను భాగస్వాములను చేసేలా కార్యక్రమాలు రూపొందించారు. ఇప్పటికే శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇవ్వనున్నారు.

పీజీ మెడికల్ మాప్‌అప్ రౌండు సీట్ల వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కన్వీనర్ కోటా నాన్ సర్వీస్ కేటగిరీ మూడో విడత కౌన్సెలింగ్ (మాప్‌అప్) సీట్ల వివరాలను విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం వెల్లడించింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా ఆయా కళాశాలల్లో చేరాలని సూచించింది. తరగతులు గత ఏడాది డిసెంబరు 22వ తేదీ నుంచి మొదలైన విషయం తెలిసిందే.

(c) eenadu

పట్టుదలతో పయనం.. చేరువయ్యే విజయం

సాంకేతిక నైపుణ్యాలతో రాణిస్తున్న విద్యార్థులు

తాడికొండ, న్యూస్‌టుడే

తాడికొండ గురుకుల పాఠశాల బాలలు సాంకేతికత, ఐటీ రంగాల్లో జ్ఞానాన్ని సాధించి అబ్బుర పరుస్తున్నారు. పేదింటిలో పుట్టినా పట్టుదలతో తమదైన ముద్ర వేస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తోటి వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

తాడికొండ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు **వై.మేఘశ్యామ్, కె.నిఖిలేంద్ర, జి.నిషాంత్**లు బృంద స్ఫూర్తితో విజయాన్ని సాధించవచ్చని నిరూపించారు. ఈ ఏడాది జనవరి 22న 'సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ' ఆధ్వర్యంలో విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన సౌత్ ఇండియా రాకెట్ ఛాలెంజ్‌లో పాల్గొన్నారు. రాష్ట్రంలో మొత్తం 48 పాఠశాలలు పోటీ పడ్డాయి. హైడ్రోజన్ రాకెట్ ఛాలెంజ్‌లో ఓ ఖాళీ బాటిల్‌లో నీటిని నింపాలి. గాలి పీడనంతో ఒత్తిడి పెంచాలి. హైప్రెజర్‌కు చేరుకున్న తరువాత నిర్దేశిత కాల వ్యవధిలో ఆకాశంలో ఎక్కువ ఎత్తుకు పంపాలి. ఇందులో నీటిని, గాలిని కచ్చితమైన మోతాదులో నింపి సరియైన సమయంలో బాటిల్‌లో ఉన్న గాలిని రిలీజ్ చేయాలి. ఈ పోటీలో వీరు రాష్ట్రంలో మొదటి స్థానం, దక్షిణ భారత స్థాయిలో రెండో స్థానంలో నిలిచారు.

తూర్పుగోదావరి జిల్లా దూబచర్లకు చెందిన **బి.జయ రాఘవేంద్ర** తాడికొండ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు సింహాద్రి, మహాలక్ష్మిలు స్థానిక పేపర్ కంపెనీలో రోజువారీ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వారి రెక్కల కష్టంతో కుమారుడిని చదివిస్తున్నారు. గతేడాది నవంబర్ 20న ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్-2025 రూరల్ ఐటీ క్విజ్ నిర్వహించింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 290 మంది విద్యార్థులు పోటీ పడగా.. తాడికొండ గురుకుల పాఠశాల నుంచి జయరాఘవేంద్ర పాల్గొన్నాడు. టీసీఎస్ సంస్థ నిర్వహించిన డిజిటల్ ఐటీ క్విజ్‌లో సరియైన సమయానికి కచ్చితమైన సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ముందుగా ఎవరైతే బజర్ నొక్కుతారో వారికే సమాధానం ఇచ్చే అవకాశం వస్తుంది. ఈ పోటీల్లో ఐటీ రంగం పరిశ్రమలు, పనితీరు, కోర్సులు వంటి వాటిపై ప్రశ్నలు ఉంటాయి. ఇందులో జిల్లా, రాష్ట్ర, దక్షిణ భారత స్థాయిలో జయరాఘవేంద్ర మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో టీసీఎస్ సంస్థ వారే గన్నవరం నుంచి బెంగళూరుకు తమ సొంత ఖర్చుతో విమానంలో జాతీయ స్థాయి పోటీలకు పంపించారు. అక్కడ నాలుగో స్థానంలో నిలిచి సత్తా చాటి బహుమతులు అందుకున్నాడు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

రూ.10 లక్షల చెక్కును కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందిస్తున్న రాజేంద్రప్రసాద్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పీ4 కార్యక్రమంలో భాగంగా తెనాలి నియోజకవర్గంలోని పాఠశాలల్లో వసతుల కల్పనకు తెనాలికి చెందిన డాక్టర్ వడ్లమూడి బాబు రాజేంద్రప్రసాద్ రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. ఈ మేరకు విరాళం చెక్కును కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాకు ఆదివారం అందించారు. దాత బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వడ్లమూడి వెంకట లక్ష్మమ్మ ఫౌండేషన్ తరఫున ఈ విరాళాన్ని అందించినట్లు పేర్కొన్నారు. పీ4 లక్ష్యాలకు అనుగుణంగా నియోజకవర్గంలో విద్యారంగాన్ని బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించడానికి సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని, సమాజాభివృద్ధికి ఇది ఆదర్శప్రాయమైన ముందడుగని పేర్కొన్నారు. సమాజంలోని ఇతర దాతలు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెనాలి ఇన్‌ఛార్జి రెవెన్యూ డివిజన్ అధికారి లక్ష్మీకుమారి, డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి జెట్టి సౌలరాజు, యంగ్ ప్రొఫెషనల్ ప్రత్తిపాటి సురేష్ పాల్గొన్నారు.

పెదకాకాని: క్యూలైన్లో కిక్కిరిసిన భక్తులు

వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి

భ్రమరాంబ అమ్మవారు

మల్లన్న సన్నిధిలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

పెదకాకాని మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెదకాకాని, మంగళగిరి అర్బన్, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులు దర్శనం చేసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. రాత్రి లింగోద్భవ కాలంలో స్వామికి ఏకాదశ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. 12 గంటలకు గజవాహనంపై ఎదుర్కోలోత్సవం కనులపండువగా నిర్వహించారు. అనంతరం భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం వైభవంగా జరిపారు.

నారాకోడూరులో ఏర్పాటు చేసిన విద్యుత్తు ప్రభలు

స్వామి సేవలో ప్రముఖులు.. మల్లేశ్వరస్వామిని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులు, మంత్రి అచ్చెన్నాయుడు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దంపతులు, కుప్పం ఎమ్మెల్యే జగదీశ్వర్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు, సినిమా డైరెక్టర్ బోయపాటి శ్రీను, గుంటూరు న్యాయస్థానంలోని జడ్జి నీలిమ, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పలువురు ఉన్నతాధికారులు స్వామిని దర్శించుకున్నారు.

మల్లన్న ఆలయంలో మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన ఆలయ ఛైర్మన్ పూర్ణచంద్రరావు, ఈవో గోగినేని లీలాకుమార్ తదితరులు

ఎమ్మెల్యే ధూళిపాళ్లకు స్వామి చిత్రపటం అందిస్తూ..

శివ నామస్మరణతో మార్మోగిన క్వారీ

చేబ్రోలు నుంచి తరలివస్తున్న ప్రభలు

చేబ్రోలు, న్యూస్‌టుడే: శివ నామస్మరణతో వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరాలయం మార్మోగింది. స్వామి దర్శనానికి వేకువ జామునుంచే భక్తులు క్యూ కట్టారు. చేబ్రోలు, నారాకోడూరు, వడ్లమూడి, శేకూరు, శలపాడు, వేజండ్ల తదితర గ్రామాల నుంచి ప్రభలను తీసుకొచ్చి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి ఇన్‌ఛార్జి ఆర్డీవో లక్ష్మీ కుమారి నేతృత్వంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గుంటూరు, పొన్నూరు నుంచి వచ్చే బస్సులు వేజండ్ల అడ్డరోడ్డు వద్దే నిలిపివేయడంతో సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడవాల్సి వచ్చిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూలైన్లో వేచి ఉన్నవారికి కనీసం తాగేందుకు నీరు కూడా అందించలేదని భక్తులు వాపోయారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహారావు పేరుతో వీఐపీ పాస్‌లు విచ్చలవిడిగా పంపిణీ చేయడంతో అధిక శాతం మంది భక్తులు అటుగా బారులుదీరారు. దీంతో రూ. 100, ఉచిత దర్శనం కోసం భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.

ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికకు నామినేషన్ల దాఖలు

కార్యదర్శి పదవికి నామినేషన్ వేస్తున్న వజ్జా రామకృష్ణ

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: జీఎంసీ ఎన్టీఆర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికకు ఆదివారం మొత్తం 17 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి, డీసీ సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. కార్యదర్శి పదవికి పి.వెంగళరావు, వజ్జా రామకృష్ణ, డి.రాజేంద్రకుమార్, కొండబోలు నరసింహారావు, ఉపాధ్యక్ష స్థానానికి దామా మహేశ్వరరావు, కోశాధికారి స్థానానికి ఆర్.సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు, సహకార్యదర్శి పదవికి పి.ఉమామహేశ్వరరావు, ఎస్‌డీ అబ్దుల్ హలీం, జె.పార్థసారథిరావు, కొండబోలు నరసింహారావు, కార్యనిర్వాహక సభ్యుల పదవులకు ఆరుగురు(పురుషులు 5, మహిళలు 1) నామినేషన్లు వేశారని తెలిపారు. సోమవారం నామినేషన్లకు చివరిరోజని వెల్లడించారు.

ఆవుల అందాల పోటీలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శిల్పారామం ఎదురుగా ఉన్న కిలారి బ్రదర్స్ మైదానంలో ఆదివారం ఆవులకు అందాల పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో ఎం.శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.వి.సత్యనారాయణ పోటీలను ప్రారంభించారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 6-8 పళ్ల విభాగంలో అబ్బూరి శేషగిరిరావు, తోట శ్రీనివాసరావు, పెద్ది రామకోటేశ్వరరావుకు చెందిన ఆవులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. 2-4 పళ్ల విభాగంలో సాధినేని ప్రసాదరావు, నిత్యశ్రీ, కృష్ణయాదవ్, పాల పళ్ల విభాగంలో శివారెడ్డి, సాయిరాఘవేంద్ర, మోహనరావులకు చెందిన ఆవులు వరుస స్థానాల్లో నిలిచాయి. డాక్టర్ కె.ప్రసాద్, ఏవీ నారాయణ, అప్పారావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ శంకరరావు, అధికారులు ఈశ్వరరెడ్డి, రాజు, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు రాత పరీక్షలు

గుంటూరు రూరల్: ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌సీసీ-సీ సర్టిఫికెట్ పరీక్షలు ఆదివారం ముగిశాయి. వివిధ కళాశాలలకు చెందిన సీనియర్ డివిజన్, సీనియర్ వింగ్ (బాలురు, బాలికలు) క్యాడెట్లు రాత పరీక్షలకు హాజరయ్యారు. కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలు.. చైతన్య దీపాలు



విజేతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాలు చైతన్య దీపాలు కావాలని అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు రావి రంగారావు అన్నారు. గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. సామాజిక మాధ్యమాల్లో విష సంస్కృతి పెరుగుతోందని అనడం కంటే చక్కని సందేశాత్మక అంశాలు పోస్ట్ చేసి సామాజిక మాధ్యమాలను దేశ చైతన్య దీపాలుగా మార్చవచ్చని ఆయన కవులకు, కళాకారులకు సూచించారు. సమావేశంలో పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవితా పఠన కార్యక్రమంలో రమణి, సంబరాజు రవికుమార్, పుట్టంరాజు నరసింహమూర్తి, మెట్టు శ్రీనివాసరెడ్డి, పీవీ రెడ్డి, పి.కె.భార్గవి, పూసపాటి వేంకట కృష్ణ సూర్య కుమార్, గోలి హనుమత్‌శాస్త్రి, జి.విజయలక్ష్మి, ఎ.శంకర్, మండే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. సంబరాజు రమణి నిర్వహించిన రీల్స్ ప్రదర్శనలో కృష్ణభార్గవి, భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, కుసుమ, ఆర్.ఆర్.రావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. కథానికల పఠనంలో పగడాల వెంకటరెడ్డి, జి.ఎస్.మాధవరావు, మన్నం వెంకటగురువు, లక్ష్మీ, రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్తమ కవిత విజేత సంబరాజు రమణిని, ఉత్తమ కథానిక విజేత పగడాల వెంకటరెడ్డిని, ఉత్తమ రీల్స్ విజేత కృష్ణ భార్గవిని సంస్థ పక్షాన రావి రంగారావు, న్యాయ నిర్ణేత బండికల్లు జమదగ్ని, ముప్పాళ్ల ప్రసాదరావు శాలువాలతో సత్కరించారు.

రాజధాని రైతుల సమస్యలకు పరిష్కారం చూపండి

తుళ్లూరు, న్యూస్‌టుడే: తమ సమస్యలను పరిష్కరించాలని రాజధాని రైతులు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు విన్నవించారు. ఆదివారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మంత్రితో సమావేశమయ్యారు. రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎస్‌ఎఫ్‌ఐ)ని తగ్గించాలని, వీధి పోట్లు, గ్రామ కంఠాల సమస్యలను పరిష్కరించాలని, తుళ్లూరులో రహదారి నిర్మాణాల్లో కోల్పోతున్న వాణిజ్య స్థలాలకు ప్రత్యామ్నాయంగా వాణిజ్య ప్లాట్లు కేటాయించాలని కోరారు. అదేవిధంగా అబ్బురాజుపాలెంలో కేటాయించిన విల్లాలకు వాస్తు సరిగా లేదని పెమ్మసాని దృష్టికి తీసుకు వెళ్లారు. అసైన్డ్ రైతుల సమస్యలను పరిష్కరించాలని దళిత బహుజన ఐకాస కన్వీనర్ చిలకా బసవయ్య విన్నవించారు. తమ వినతులపై కేంద్ర సహాయ మంత్రి సానుకూలంగా స్పందించారని.. త్రిసభ్య కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని రైతులు తెలిపారు. అనంతరం సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబుతో రైతులు సమావేశమై రాజధాని సమస్యలపై చర్చించారు. రైతులు జమ్ముల శ్యామ్‌కిషోర్, కట్టా రాజేంద్ర ప్రసాద్, ఆలూరి శ్రీనివాసరావు, జొన్నలగడ్డ కిరణ్, కొమ్మినేని సత్యనారాయణ, మాదల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు(గోరంట్ల), న్యూస్‌టుడే: చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి రావడంతో తేలికగా ఉపశమనం పొందవచ్చని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్డులో స్కిన్ పర్ఫెక్ట్ హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఆసుపత్రి గుంటూరుకు రావడం హర్షణీయమన్నారు. డాక్టర్ మన్నె సింధూర మాట్లాడుతూ చర్మ సమస్యలకు లేజర్ టెక్నాలజీ, ఇమ్యునోథెరపీ, కాస్మెటిక్, రికన్‌స్ట్రక్టివ్ విధానాలతో కూడిన చికిత్సలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. చర్మ వ్యాధులకు తక్కువ సమయంలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, ఉగ్రనరసింహారెడ్డి, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రవికుమార్.పి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకరరావు, రాష్ట్ర టెక్నాలజీ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, నగర డిప్యూటీ మేయర్ సజీల, వైద్యులు గొట్టిపాటి లక్ష్మి, ఉప్పుటూరి అంజిత్, ఉప్పుటూరి హేమంత్, లక్ష్మీప్రియ, తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

REAL ESTATE

PLOT FOR SALE

MANGALAGIRI

అమ్మకానికి ప్లాట్లు- మారుతీ నగర్, నవలూరు, మంగళగిరి. 432 చ.గ.లు. క్లియర్ టైటిల్. సంప్రదించండి: 99638 89783, 70328 06709.

SHOP FOR SALE

GENERAL

243 sq.ft shop in upcoming biggest mall in guntur for sale with immediate 25000/- Rent. Call: 9573454266

TO LET

IJM రెయిన్‌ట్రీపార్క్‌లో 5B/R లగ్జరి ట్రిప్లెక్స్ విల్లా అద్దెకు. విశాలమైన లేఔట్, ప్రైవేట్ టెర్రస్ 24x7 భద్రత, NH5,నంబూరు VJA-GNT హైవే. 77024 75525

JOBS

LADY Staff Wanted. B.Tech/DegreeStudy Abroad Consultancy, Sal. upto15k, Good Communication skills. Exp / Freshers ✆ 9381985468.

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

గుంటూరులోని రియల్‌బూమ్ రియల్ ఎస్టేట్ సర్వీసెస్ నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (50), టెలీకాలర్స్ (10), DDOలు (10) కావలెను. ✆ 78010 32689.

Marvin Lifts Pvt.Ltdలో పనిచేయుటకు హెల్పర్స్ Q: ITI, జీ:15K to 20K. అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ Q: డిగ్రీ. జీ: 22K to25K కావలెను. ✆ 98859 14999

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ: 18K to 20K. ✆96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..

ఈనాడు లో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి:

8008510541

బడ్జెట్‌లో బీసీలకు సముచిత కేటాయింపులు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: జనాభాలో సగ భాగం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో అదే స్థాయిలో కేటాయింపులు చేసి కూటమి ప్రభుత్వం న్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం నవరత్నాలు పేరిట ఏడాదికి రూ.52 వేల కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం బీసీ సంక్షేమానికి రూ.51.021 కోట్లు బడ్జెట్లో కేటాయించడం సంతోషదాయకం అన్నారు. గత ప్రభుత్వాలు కార్పొరేట్లు, భూస్వాములకు ఎక్కువ లబ్ధి చేకూర్చడమే ప్రాధాన్యంగా పెట్టుకున్నాయన్నారు. గత వైకాపా ప్రభుత్వం 56 కుల కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది తప్పా నిధులు కేటాయించలేదన్నారు. బీసీ కులాల ఫైనాన్స్ కార్పొరేషన్లకు జనాభా దామాషా మేరకు నిధులు కేటాయించి.. వాటిని పక్కదారి పట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

కోటప్పకొండ వద్ద జనం రద్దీ



నిలిచిన వాహనాలు

కొండంత జనం.. స్తంభించిన ట్రాఫిక్

ఈనాడు, నరసరావుపేట: కోటప్పకొండకు ఆదివారం జనం తండోపతండాలుగా తరలివచ్చారు. జనం రద్దీని నియంత్రించలేక పోలీసులు చేతులు ఎత్తేశారు.. నరసరావుపేట, వినుకొండ, అద్దంకి నుంచి వచ్చే బస్సులకు అయితే ఏకంగా 2 కిలోమీటర్ల దూరంలో పార్కింగ్ ఇచ్చారు. తిరుగుపయనమయ్యేవారు 2 కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. వాహన రద్దీలో నడవలేక వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్న ప్రభలు

ఉత్సాహంగా షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్

గుడిపూడి(సత్తెనపల్లి గ్రామీణ): అంతర్ జిల్లాల షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సత్తెనపల్లి మండలం గుడిపూడిలో ఆదివారం ముగిశాయి. రెండ్రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల జట్ల సభ్యులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు ప్రథమ, పల్నాడు జట్టు ద్వితీయ, ఎన్టీఆర్ జిల్లా జట్టు తృతీయ స్థానాలను సాధించాయి. బాలికల విభాగంలో చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాల జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు ఆదివారం అందించారు. పోటీల పరిశీలకుడు, క్రీడా ప్రాధికార సంస్థ అధికారి నరసింహారెడ్డి, సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, తెదేపా నేతలు గజానన, అప్పారావు, పుల్లారావు పాల్గొన్నారు.

సందడిగా వాలీబాల్ టోర్నీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పులికొండ రాధాకృష్ణ గుప్తా, కొసన సుబ్బారావు మెమోరియల్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. పోటీల్లో మొదటి నుంచి నాలుగు స్థానాల్లో వరుసగా కృష్ణా జిల్లా, బాపట్ల, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాలు నిలిచాయి. వారికి రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పులికొండ మల్లికార్జునరావు, అల్లా భక్షు పాల్గొన్నారు.

మహిళను మోసగించిన పంచాయతీరాజ్ ఈఈపై కేసు

పట్టాభిపురం: ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌పై గుంటూరులోని పట్టాభిపురం ఠాణాలో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరులోని దేవాపురానికి చెందిన ఓ మహిళ భర్త కొన్నాళ్ల క్రితం మృతి చెందారు. ఆమెకు అనిల్ ద్వారా పంచాయతీరాజ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న బాపిరెడ్డి పరిచయమయ్యారు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెకు దగ్గరయ్యాడు. అవసరం తీరాక మాట మార్చాడు. రూ.1.5 కోట్ల వరకు ఆమె వద్ద డబ్బు కూడా తీసుకున్నాడు. ఆ నగదు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ బెదిరిస్తున్నాడు. మోసపోయానని తెలుసుకున్న ఆమె పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాపిరెడ్డి ప్రస్తుతం నూజివీడు పంచాయతీరాజ్ విభాగంలో ఈఈగా పని చేస్తున్నారు.

క్రేన్ కింద పడి కార్మికుడి మృతి

తుళ్లూరు: రాజధాని నిర్మాణ పనులు చేయడానికి వచ్చిన పశ్చిమబెంగాల్ వాసి శనివారం రాత్రి శాఖమూరు సమీపంలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజధాని గ్రామం శాఖమూరు సమీపంలో ఎన్-13 రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి తయారు చేసిన సిమెంటు దిమ్మెలను క్రేన్ సహాయంతో తరలిస్తుండగా.. ప్రమాదవశాత్తు క్రేన్ ముందు భాగం విరిగి పక్కన నిల్చొని ఉన్న కార్మికుడు మణికుల్ ఇస్లామ్(37)పై పడింది. తీవ్ర గాయాలైన అతడిని సిబ్బంది గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సాయిశ్రీ కన్‌స్ట్రక్షన్స్ తరపున కార్మికుడిగా పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 116, 123, 135 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 230.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

తెనాలి

•తెనాలి •పొన్నూరు

10 వేల మందికి అన్నదానం

ఆహారం వడ్డిస్తున్న సాంబశివరావు తదితరులు

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరిలో శ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మహా శివరాత్రి వచ్చిన సుమారు 10 వేల మందికి అన్నప్రసాదం సమకూర్చింది. ఆ ట్రస్ట్ అధ్యక్షుడు పండేటి సాంబశివరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. కర్నాటి శివసత్యనారాయణ, శివన్నారాయణ, అచ్చియ్య, శ్రీను, విష్ణుమూర్తి, వెంకట్రావు, శంకర్, రంగారావు, సుబ్రహ్మణ్యం రామిరెడ్డి పాల్గొన్నారు. ◆ మంగళగిరి మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద చిట్టెల గరటయ్య కుమారుల ఆధ్వర్యంలో 2000 మొక్కలు పంపిణీ చేశారు.

పోలీసుల బందోబస్తు

మహా శివరాత్రి సందర్భంగా తెనాలి మండలం సంగంజాగర్లమూడి శ్రీసంగమేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎస్సై ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి కొత్తపేట పాత ప్రభుత్వ వైద్యశాల వెనుక గోడ వెంబడి వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో నిండి అధ్వానంగా ఉంది. గతంలో ఉన్న మొక్కలు ఇప్పుడు లేవు. **- మురళి, కొత్తపేట**

✔ వ్యర్థాలను తీయిస్తాం. మొక్కలు ఏర్పాటు చేయిస్తాం. **- రామలింగప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్**

? తెనాలి కొత్తపేట ఎస్‌బీఐ మార్గంలో విద్యుత్తు బోర్డు రక్షణ లేకుండా ప్రమాదకరంగా ఉంది. **- రాఘవ, కొత్తపేట**

✔ రక్షణ కంచె ఏర్పాటు చేయిస్తాం. **- అశోక్‌కుమార్, విద్యుత్తు విభాగ డీఈ** - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? పొన్నూరు 4వ వార్డులో రూదారిపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. **- షేక్ కరిముల్లా, 4వ వార్డు** ✔ గొయ్యికి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హసీనా, సహాయ ఇంజినీరు**

? పొన్నూరు 14వ వార్డులో చెత్త పేరుకుపోయింది. **- ఎన్.డేవిడ్, 14వ వార్డు** ✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి** - న్యూస్‌టుడే, పొన్నూరు

స్పందన: ★ తెనాలి ఐతానగర్‌లో మురుగు కాలువలో పూడిక తొలగింపు సమస్యను స్థానికులు మున్సిపల్ అధికారులకు తెలియచేయగా పూడిక తీయించారు. ★ తెనాలి ఐస్తానపేటలో గృహ సముదాయ మరుగుదొడ్ల వ్యర్థాలు కాలువలోకి వస్తున్నాయని స్థానికులు మున్సిపల్ అధికారులకు తెలియచేయగా, సంబంధిత నివాసితులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. ★ తెనాలి బోసురోడ్డు, చినరావూరు మార్కెట్లో డంపింగ్ పాయింట్ల వద్ద వ్యర్థాల తొలగింపు ఆలస్యం అవుతోందన్న ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు సిబ్బందితో వాటిని ఎత్తివేయించారు.– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

★ పట్టణ పరిధిలోని 21వ వార్డులోని మురుగు నీటి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను కార్మికులు తొలగించారు.

★ శ్రీనగర్‌కాలనీలో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేశారు. – న్యూస్‌టుడే, పొన్నూరు

చెత్త వేరు చేయరు.. ఆదాయం పెంచరు!

న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)

కలిసిపోయిన తడి, పొడి చెత్త

చెత్తను ఆదాయ వనరుగా మార్చుకోవచ్చని ప్రభుత్వం పురపాలికలకు సూచించింది. పొడి చెత్తలో వచ్చిన సీసాలు, ఇనుప, పేపరు, అట్ట ముక్కలు వేరు చేసి, తడి చెత్తను నిల్వ చేసి కంపోస్టు ఎరువుగా మార్చి అమ్మి ఆదాయం పొందొచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఈ విధానాన్ని మొక్కుబడిగా చేస్తున్నట్లు విమర్శలు విన్పిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో పురపాలికలోని 47 వార్డుల్లో మూడు చోట్ల రూ.సుమారు 1.75 కోట్లతో వ్యర్థాల విభజన షెడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. రూ.కోట్లతో తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వటానికి సుమారు రూ.2 కోట్లతో ఇంటింటికి రెండు బుట్టలు అందించారు. ప్రస్తుత ప్రభుత్వం వ్యర్థాల విభజన షెడ్ల నిర్మాణ పనులు పునరుద్ధరించకుండా గాలి కొదిలేయడంతో మందుబాబులకు అడ్డాలుగా మారాయి. వీటి ఇనుము తుప్పు పట్టి గోడలు దెబ్బతింటున్నాయి. వీటిని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని జనం కోరుతున్నారు.

జిల్లాలోని ఏకైక సెలక్షన్ గ్రేడ్ పురపాలికైన తెనాలిలో తడి, పొడి చెత్త వేరు చేయడం పై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు మున్సిపల్ అధికారులు. వీరికి చిత్తశుద్ధి లేకపోవడంతో తడి, పొడి చెత్త సేకరణ ప్రక్రియ నిలిచిపోయింది. కొన్ని వార్డుల్లో వేరు చేసి ఇచ్చినా సిబ్బంది కలిపేసి పుష్కాట్లలో కలిపేయడంతో లక్ష్యం కాస్త చతికిలబడింది.

ఇలా కలిపేసిన సుమారు 90 టన్నుల చెత్తను బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. దీనిలో 60 టన్నులు యథాతథంగా అదే కాంపాక్టర్, మున్సిపల్ కాంపాక్టర్లలో జిందాల్ పరిశ్రమకు తరలిస్తున్నారు. మిగిలింది కాల్చేస్తున్నారు. పరిమితంగా తెచ్చిన 3, 4 టన్నుల చెత్తను మొక్కుబడిగా కంపోస్టు ఎరువుగా తయారు చేస్తున్నారు. ఇక్కడే సిబ్బందికి తగిన పనిసామర్థ్యం కొరవడింది. వీరిని ఓ మున్సిపల్ కాంట్రాక్టర్ తన పనులకు పురమాయించుకోవటం పరిపాటి అయింది. ఇది తెలిసిన మున్సిపల్ అధికారులు చూసీ చూడనట్టు ఉంటున్నారు. ఇటీవల తెనాలి పురపాలిక నుంచి వెళ్లిన కంపాక్టర్‌లో చనిపోయిన దూడను చెత్తలో కలిపి జిందాల్ పరిశ్రమకు తరలించటం గమనార్హం. దీనిపై కమిషనర్ జిందాల్ వారికి వివరణ ఇచ్చాక చెత్త తరలించటానికి అనుమతించారు.

చిత్తశుద్ధి లేక.. శుద్ధిజలం అందక!

తెనాలిలోని ప్రాథమిక పాఠశాలలో వృథాగా ఆర్వో ప్లాంటు

వైకాపా ప్రభుత్వ హయాంలో 2020-21 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో కొన్ని చోట్ల నాడు- నేడు కింద శుద్ధి జల యంత్రాలు ఏర్పాటు చేశారు. వాటికి తగిన రీతిలో ట్యాంకులు, అనుసంధాన మోటార్లు, స్థలం వంటివి సమకూర్చుకోవడానికే అత్యధిక కాలం గడిచింది. ఆ తర్వాత క్షేత్ర పర్యవేక్షణ, నిర్వహణ విధానాలు తెలియక తరుచూ యంత్రాలు మొరాయించేవి. సంబంధిత విభాగం తూతూ మంత్రపు మరమ్మతులతో మమ అనిపించేవారు. ఈ సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయి. తెనాలి పట్టణం, మండల పరిధిలో ప్రభుత్వ విభాగంలో 17 ఉన్నత, 74 ప్రాథమిక పాఠశాలలు ఉండగా వీటిల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 10,500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిల్లో దాదాపు సగం బడుల్లో ఇలా తాగు నీటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఆర్వో పాంట్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. కొన్ని చోట్ల ప్రధానోపాధ్యాయులు ఫిల్టర్ నీటి డబ్బాలను తాగు నీటి కోసం తెప్పిస్తూ ఉండగా మరి కొన్ని చోట్ల చేతి పంపులపైనే విద్యార్థులు ఆధారపడాల్సి వస్తోంది. బడుల్లో శుద్ధిజలం సరఫరాలో లోపాలను పరిష్కరించాలని విద్యార్థులు వేడుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

పేదలకు దుస్తుల బహూకరణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా మానవత సంస్థ, తెనాలి ఆధ్వర్యంలో 35 మంది చర్మకార వృత్తిదారులకు ఆదివారం దుస్తులను బహూకరించింది. స్థానిక ఏఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్త సుబ్రహ్మణ్యం, కొలసాని రాంచంద్, వాసు, వెంకట్, సోమయ్యశాస్త్రి, సత్యనారాయణ, కల్యాణి, సాంబశివరావు, వెంకట్రామయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీల మేరకు కేటాయింపులు లేవు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కూటమి పార్టీలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం తెనాలిలో రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడారు. ఇలా చేయడం ప్రజలను మోసం చేయడమేనని ఆయన విమర్శించారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో కూచిపూడి నృత్య కళాకారులు ప్రదర్శించిన భక్తి గీతాలు భక్తులను ఆదివారం అలరించాయి. తాడేపల్లికి చెందిన నృత్యాచార్య స్వర్ణలత శిష్య బృందం ప్రదర్శించిన శివతాండవం, శంకర శ్రీగిరి, తదితర భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. తెనాలికి చెందిన నాట్యాచారిణి ఆర్.వసంత దుర్గ శిష్య బృందం ప్రదర్శించిన గణేష్ స్తుతి, మహిషాసురమర్దిని స్తోత్రం భక్తుల్లో ఉత్తేజాన్ని నింపింది. నృత్య కళాకారిణులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

కళాకారుల నృత్యాభినయం

శివయ్యే తోడూనీడ!

శివలింగానికి పూజ చేస్తున్న వెంకట్రావు

నల్లమేకలవారిపాలెం (దుగ్గిరాల), న్యూస్‌టుడే: ఈమని శివారు గ్రామం నల్లమేకలవారిపాలెం గ్రామానికి చెందిన తుల్లిమిల్లి వెంకట్రావుకు 88 ఏళ్లు. ఆయనకు శివుడు అంటే అమిత భక్తి. దీంతో ఆయన స్వయంగా రెండేళ్ల కిందట శివలింగాన్ని తయారు చేసి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తున్నారు. శివకేశవులకు భేదం లేదని చాటిచెబుతూ లింగంపై ఆయా సంప్రదాయాల నామాలను పొందుపర్చారు. శివరాత్రి, ఇతర పర్వదినాల్లో చుట్టుపక్కల వారు వచ్చి ఇక్కడ పూజలు చేస్తుంటారని వెంకట్రావు చెబుతున్నారు.

మార్కెట్ యార్డు డైరెక్టరుగా శివపార్వతి

శివపార్వతిని సత్కరిస్తున్న తెదేపా నాయకులు

కొల్లిపర, న్యూస్‌టుడే: తూములూరు వాసి ఏమినేని శివపార్వతికి తెనాలి మార్కెట్ యార్డు డైరెక్టరుగా ఎంపికయ్యారు. తెదేపా కార్యకర్తగా క్రియాశీలక పాత్రపోషించి, కూటమి గెలుపు కోసం పోరాడిన ఆమె నియామకం ముదావహమని తెదేపా మండల పార్టీ అధ్యక్షులు భీమవరపు చినకోటిరెడ్డి అన్నారు. శివపార్వతిని పార్టీ బీసీ నాయకులు ఆదివారం సత్కరించారు. తెదేపా నాయకులు షేక్ రఫీ, కె.పోతురాజు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఖబర్‌స్థాన్‌లో నిర్మాణాలు వద్దు

మంగళగిరి గ్రామీణం, మంగళగిరి, న్యూస్‌టుడే: శతాబ్దాల చరిత్ర ఉన్న ఖబర్‌స్థాన్‌లో రహదారి విస్తరణ పేరుతో నిర్మాణాలు చేపట్టాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఆదివారం మంగళగిరిలో ఖబర్‌స్థాన్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇది కేవలం భూమి కాదని, తమ చారిత్రక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆ స్థలాన్ని తాకకుండానే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని, తెనాలి రోడ్డును వన్‌వే చేసి నేరుగా జాతీయ రహదారికి కలపాలని సూచించారు. మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. ఆ కమిటీ కన్వీనర్ యూసఫ్, పలు ముస్లిం సంఘాల నాయకులు మునీర్, అజీమ్, రఫీ, ఇక్బాల్ అహ్మద్, ఇస్మాయిల్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

వాడుక నీరు పోయే దారేది?

తెనాలి నందులపేటలోని ఏవీఆర్ పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 65 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరు చేతులు, ఆహారపు ప్లేట్లు శుభ్రం చేసుకునే కుళాయిల వద్ద వాడుక నీరు బయటకు పోయే మార్గం లేదు. కుళాయిల చెంతనే వాడుక నీరు నిలుస్తోంది. కాలువ నిర్మాణం లేదా నిర్ణీత ప్రమాణాలతో ఇంకుడు గుంత వంటిది ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని అధికారులను విద్యార్థులు వేడుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

మసకబారుతున్న నందివెలుగు

తెనాలి మండలం నందివెలుగు గ్రామం కూడలి చెంతనే ఉన్న వంతెన కింద కాలువల వెంబడి ఇలా వ్యర్థాల గుట్టలు, వాటిని కాల్చడం వల్ల పొగ నిత్యం కనిపిస్తూ ఉంటాయి. వాస్తవానికి ఈ ప్రాంతం డంపింగ్ యార్డు కాదు. కాని చెత్త వస్తూనే ఉంటుంది. తగులబెడుతూనే ఉంటారు. స్వచ్ఛత నిర్వహణలో ఉత్తమ పంచాయతీగా గుర్తింపు పొందిన గ్రామంలో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సమస్యను పంచాయతీ అధికారులు పరిష్కరించాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

ఆత్మలింగ దర్శనం

వరుసలో దర్శించుకుంటున్న భక్తులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తాళ్లాయపాలెం శైవ క్షేత్రంలో ఆత్మలింగ దర్శనానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. లింగోద్భవ సమయంలో క్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఆధ్వర్యంలో లక్ష రుద్రాక్షలతో కోటిలింగేశ్వర స్వామికి అభిషేకం చేశారు. రాజరాజేశ్వరీ దేవి, కోటిలింగేశ్వర స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నప్రసాద వితరణ జరిగింది.

కొల్లిపరలో స్వామివారు..

సంగంజాగర్లమూడిలో..

నందివెలుగులో ..

మారీసుపేట హరిహర దేవాలయంలో ..

సహస్రలింగేశ్వరస్వామికి..

ప్రత్యేక అలంకరణలో ..

హరహర మహాదేవ.. శంభోశంకర

తెనాలి, పొన్నూరు: తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మ వార్లకు విశేష పూజలు నిర్వహించారు. ప్రభలతో భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి కుటుంబాల సమేతంగా వచ్చారు. అధికార యంత్రాంగం, కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొల్లిపర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. మున్నంగి గ్రామంలోని పురాణ ప్రాచిచ్యమున్న బాలాత్రిపురసుందరి సమేత శ్రీభీమేశ్వరాలయంలో స్వామివార్లకు సోమవారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో కూచిపూడి ప్రదర్శన ఆహుతులను, భక్తులను ఆకట్టుకుంది. ఇవో పద్మావతి కార్యక్రమాలను పర్యవేక్షించారు. కొల్లిపర గ్రామంలోని శ్రీముక్తేశ్వరస్వామివారి ఆలయంలో కళ్యాణ మహోత్సవంలో భక్తులు

శివుని విగ్రహానికి మహారుద్రాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు శ్యామలరావు తదితరులు

నిర్వహించారు. దర్శించుకున్నారు. దాతలు ఏర్పాటు చేసిన అన్నదానం స్వీకరించారు.

పాల్గొని తరించారు.

తెనాలి(కొత్తపేట): మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకుని పూజా ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు క్యూలైన్లలో స్వామి వార్లను

పొన్నూరు: మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం పొన్నూరులోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పరిధిలోని సహస్రలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో స్వామికి గంధంతో చేసిన అభిషేకాన్ని వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య తొలగించారు. అనంతరం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మళ్లీ గంధంతో అభిషేకం చేశారు. పాతపొన్నూరు, నిడుబ్రోలు, మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు, చింతలపూడి, ములుకుదురు, మాచవరం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.

పెదకాకానిలో తొలిసారిగా విద్యుత్తు ప్రభ

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని సెంటర్‌లోని ఉయ్యూరు వీరమ్మ, పేరంటాలు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన కాకతీయ యూత్ సభ్యులు ఈ ఏడాది విద్యుత్తు ప్రభ ఏర్పాటు చేశారు. భరతనాట్యం, కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భావితరాల భవిష్యత్తుకు ఆశాజనకంగా బడ్జెట్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భావితరాల భవిష్యత్తుకు ఆశాజనకంగా ఉందని మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. 'సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యతో కేటాయింపులు జరిపారు. అమరావతి నిర్మాణం అత్యంత కీలకంగా భావించి రూ.6000 కోట్లు కేటాయించారు. అమరావతి ఎకనమిక్ రీజియన్, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్‌కు కలిపి రూ.30,000 కోట్లు, విశాఖ రీజియన్‌కు రూ.28,000 కోట్లు కేటాయించడం కూటమి ప్రభుత్వానికి ఉన్న దూరదృష్టికి నిదర్శనం. పోలవరం నిర్మాణానికి రూ.6,105 కోట్లు కేటాయించారు. మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో విద్యాశాఖకు రూ.32,308 కోట్లు కేటాయించి ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్యాశాఖకు పెద్దపీట వేశారు. ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతిపై దృష్టి సారించడం విశేషం.

పూరిల్లు దగ్ధం

కొల్లిపర, న్యూస్‌టుడే: కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పు అంటుకున్న సంఘటన చివలూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో గ్రామానికి చెందిన కనపర్తి ఉషారాణి పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. రూ.నాలుగు వేల నగదు, మూడు బంగారు ఉంగరాలు, వెండిపట్టీలు కాలి బూడిదయ్యాయని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసి వివరాలు నమోదు చేసుకున్నారు.

వంతెన పైనుంచి కిందపడ్డ కారు

ఒకరికి తీవ్ర గాయాలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి నుంచి మంగళగిరి వైపు వెళ్తున్న ఓ కారు 16వ నంబర్ జాతీయ రహదారిపై కుంచనపల్లి వద్ద డెల్టా కాలువపై ఉన్న వంతెనపై నుంచి అదుపుతప్పి కిందపడిపోయింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో ఉన్న వ్యక్తిని అతికష్టం మీద బయటకు తీశారు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో వంతెన దిగువన జనసంచారం లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. కాగా, క్షతగాత్రుడి వివరాలు తెలియరాలేదని, కారు నంబరు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా నృత్య కళాభారతి వార్షికోత్సవం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం రాత్రి నృత్య కళాభారతి 27వ వార్షికోత్సవం నిర్వహించారు. పలువురు విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు నాట్యాచార్య ఎన్.బాలు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, పయనీర్ గ్రూప్స్ ఛైర్మన్ చుక్కపల్లి రమేష్, రాయపాటి మమత, వైవీఎస్ ప్రభాకర్, పద్మావతి దేవి, చాగంటి తదితరులు పాల్గొని సంస్థ నిర్వాహకులు నృత్య కళారంగానికి చేస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం కూచిపూడి నృత్య అధ్యాపకులు మట్టుపల్లి విశ్వంను అతిథులు, నిర్వాహకులు సత్కరించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 76 మంది కళాకారులు విఘ్నరాజం భజే, గం గణపతి, జయ జనార్దన కృష్ణా, గోవర్ధన గిరిధారి వినాయక కౌతం, బ్రహ్మాంజలి, రామాయణ శబ్దం తదితర కీర్తనలకు అనుగుణంగా కూచిపూడి నృత్యాభినయం చేశారు. ఎన్.బాలు నవ్యశ్రీ నృత్య దర్శకత్వం చేశారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు అక్కినేని అలివేలు మంగతాయారు మరియు కొర్లిపర శ్రీదేవిల తల్లి లేటు హైమావతి గారు 1982 సంవత్సరంలో పెదకాకాని గ్రామ పరిధి లోని భ్రమరాంబపురం కాలనీ లో గల డోర్ నంబర్ 9–78 సమీపంలో గల సర్వే నంబర్లు 758, 759, 762 నుండి 768, 755/5, 778, 779/1A, 779/బి లోని ప్లాట్ నంబర్ 870 లో 430 చ.గ. ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆమె మరణానంతరం నా క్లయింట్లు ఆ స్థలాన్ని తమ పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిశ్చయించారు. ఈ స్థలానికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నచో వారం రోజులలో నన్ను లేదా కాలనీ మ్యానేజ్మెంట్‌ను సంప్రదించవలసినదిగా తెలియజేయడమైనది

ఇట్లు,
బొల్లిముంత నిర్మల అడ్వకేట్
F-304, విజయ టవర్స్ లక్ష్మీపురం
1st లైన్ గుంటూరు 522007

తెగుళ్ల బెడద.. తరిమే ఆపద..

మిర్చి రైతుల ఆవేదన

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

మిరప పంటలో తెగుళ్లు, తెల్ల దోమ, తామర పురుగు తాకిడితో మిరప పంట సాగు చేసిన రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గత నాలుగేళ్ల నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల పెట్టుబడితో సాగు చేసిన మిరప పంటలో ఈ తెగుళ్లు, తామర పురుగుతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. పంటకు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేకపోవడంతో ఈ ఏడాది పంట సాగును భారీగా తగ్గించారు. ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో క్లిష్ట పరిస్థితుల్లోనూ ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు మిరప పంటను సాగు చేశారు. రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టారు. పూత, పిందె దశలో కొంత పంట ఉండగా, ఖరీఫ్‌లో సాగు చేసిన పంట కోతకు వచ్చింది. మార్కెట్లో మిరప పంటకు ధర కొంత మేర ఆశాజనకంగా ఉండటంతో లక్షలు వెచ్చించి పంట సాగు చేసిన రైతులు గతంలో నష్టం జరిగినా ఈ ఏడాది అప్పులను తీర్చుకుందామనే ఆశగా ఉన్నారు. ఇంతలోనే తామర పురుగు, తెగుళ్లు విస్తరిస్తున్నాయి. మిరప ఆకులు ముడుచుకుని మొక్క ఆకారాన్ని కోల్పోతోంది. ఇదే విధంగా రోజుల వ్యవధిలో పంట మొత్తం వ్యాపిస్తోంది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా పంట నష్టపోతే పరిస్థితి ఏంటా.. అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టామని ఈ పరిస్థితిలో సస్యరక్షణకు అదనంగా ఖర్చు పెట్టాల్సి రావడం భారంగా మారిందని ప్రత్తిపాడుకు చెందిన రైతు వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా మిరప సాగు..

మండలం	విస్తీర్ణం (హెక్టార్లలో..)
గుంటూరు పశ్చిమ	58.24
గుంటూరు తూర్పు	199.26
కాకుమాను	45.79
మేడికొండూరు	2605.82
పెదనందిపాడు	437.51
ఫిరంగిపురం	2.09
ప్రత్తిపాడు	1073.07
తాడికొండ	612.25
తుళ్లూరు	1.50
వట్టిచెరుకూరు	3340.26

ప్రత్తిపాడు: ఆకులు ముడుచుకుని ఉన్న మిరప మొక్క

నివారణకు చర్యలు చేపట్టాలి

మిరప పంటలో తెల్లదోమ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఎకరాకు పెగాసస్ 250 గ్రాములు, సెఫీనా 280 గ్రా, ల్యానో 200 మిల్లీ లీటర్లు, ఎస్ఎల్ఆర్- 252 ఎకరాకు 350 మిల్లీలీటర్లు దఫాలుగా పిచికారీ చేసుకోవాలి. తామర పురుగు నివారణకు ఎకరాకు ఎక్స్పోనస్ 34 మి.లీ, గ్రేషియాహ 160 మి.లీ, సిమోడిస్ 240 మి.లీ, రోగర్ 500 మి.లీ, మూవెన్‌టో 200 మి.లీ ఎకరాకు ఒకటి తర్వాత మరొకటి పిచికారీ చేసుకోవాలి.

- డి.రవీంద్రబాబు, డిప్యూటీ డైరెక్టర్, ఉద్యానశాఖ

www.kimssikhara.com
KIMS SIKHARA HOSPITALS
కిమ్స్ శిఖర హాస్పిటల్స్ గుంటూరుకు చెందిన ప్రముఖ సీనియర్ కార్డియాలజిస్ట్ (గుండె వైద్యనిపుణులు) కన్సల్టేషన్ కొరకు తెనాలి లో అందుబాటులో ఉంటారు.
డా॥ నాగ శ్రీ హరిత పర్వతనేని
MD (Gen), DM (SVIMS), FESC, FSCAI, FACC
Ex. Associate Professor Guntur Medical College
Sr. Interventional Cardiologist
Director – Cardiac Sciences
ప్రతి మంగళవారం నాడు సమయం: ఉ॥ 10 గం॥ నుండి సా॥ 6 గం॥ వరకు అందుబాటులో ఉంటారు.
ECG, 2D Echo, TMT సదుపాయం కలదు
స్థలం : ఆశ్రిత సూపర్ స్పెషాలిటీ కేర్
7-5-31, లెక్చరర్స్ కాలనీ, ప్రకాశం రోడ్, బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద, గంగానమ్మపేట, తెనాలి.
ఫోన్ నెం: 97057 53356 | 99661 90493

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

కంటి వైద్య శిబిరం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: టిప్పర్ బజార్ నారా లోకేశ్ సంజీవని ఆసుపత్రిలో మంగళగిరి పట్టణ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో 'షేక్.సమీరా ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ 'హెల్పింగ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, హసినీ మల్టీ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 175 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ప్రతినిధులు షేక్.బాజీ, అనురాగ్, రెహమాన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందన: తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ వెల్లంకి వెంకట ప్రయ్య పాఠశాల వద్ద వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికులు ఈనాడు పీఆర్ రమణ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించి శుభ్రం చేయించారు. **తుళ్లూరు, న్యూస్‌టుడే:** ఐనవోలు గ్రామంలో ప్రధాన తాగునీటి పైపు లైను పగిలిపోవటంతో మంచి నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారులకు తెలిపారు. స్పందించిన ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మరమ్మతులు చేయించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మంగళగిరి గ్రామీణం: నిడమర్రు హరిజనవాడ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తున్నాయని ఈ నెల 14న 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్ ఇన్' ద్వారా స్థానికులు ఏఈఈ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో ఆ ప్రాంతంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఏఈ దిలీప్ మంగళవారం తెలిపారు.

వైభవంగా తేరు ఉత్సవం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: రావిపాడులో ఆర్‌సీఎం చర్చి పునర్నిర్మాణం సందర్భంగా ఆదివారం మరియతల్లి చిత్రాన్ని తేరుపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. విచారణ గురువు శౌరిరెడ్డి, సంఘ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

కాకుమాను, న్యూస్‌టుడే: మండలంలో ఆధార్ సేవా శిబిరాలను ఈ నెల 16 నుంచి 20 వరకు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో ఉషారాణి తెలిపారు. 16న తేదీన కాకుమాను, రేటూరు జడ్పీ పాఠశాలల్లో, 17న కాకుమాను, గరికపాడు, 18న కొమ్మూరు, తెలగాయపాలెం, 19న రేటూరు, బోడిపాలెం, 20న అప్పాపురం చినలింగాయపాలెం పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తారన్నారు. ఆధార్ సంబంధించిన వివరాలు, నమోదు, మార్పులు చేసుకోవచ్చన్నారు.

తెగుళ్ల బెడద.. తరిమే ఆపద..

మిర్చి రైతుల ఆవేదన

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

మిరప పంటలో తెగుళ్లు, తెల్ల దోమ, తామర పురుగు తాకిడితో మిరప పంట సాగు చేసిన రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గత నాలుగేళ్ల నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల పెట్టుబడితో సాగు చేసిన మిరప పంటలో ఈ తెగుళ్లు, తామర పురుగుతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. పంటకు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేకపోవడంతో ఈ ఏడాది పంట సాగును భారీగా తగ్గించారు. ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో క్లిష్ట పరిస్థితుల్లోనూ ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు మిరప పంటను సాగు చేశారు. రూ.లక్షల పైగా పెట్టుబడి పెట్టారు. పూత, పిందె దశలో కొంత పంట ఉండగా, ఖరీఫ్‌లో సాగు చేసిన పంట కోతకు వచ్చింది. మార్కెట్‌లో మిరప పంటకు ధర కొంత మేర ఆశాజనకంగా ఉండటంతో లక్షలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేసిన రైతులు గతంలో నష్టం జరిగినా ఈ ఏడాది అప్పులను తీర్చుకుందామనే ఆశగా ఉన్నారు. ఇంతలోనే తామర పురుగు, తెగుళ్లు విస్తరిస్తున్నాయి. మిరప ఆకులు ముడుచుకొని మొక్క ఆకారాన్ని కోల్పోతోంది. చివరి దశలో పంట మొత్తం వ్యాపిస్తోంది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా పంట నష్టపోతే పరిస్థితి ఏంటా..అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టామని ఈ పరిస్థితిలో సస్యరక్షణకు అదనంగా ఖర్చు చేయాల్సి రావడం భారంగా మారిందని ప్రత్తిపాడుకు చెందిన రైతు వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా మిరప సాగు..

మండలం	విస్తీర్ణం (హెక్టార్లలో)
గుంటూరు పశ్చిమ	58.24
గుంటూరు తూర్పు	199.26
కాకుమాను	45.79
మేడికొండూరు	2605.82
పెదనందిపాడు	437.51
ఫిరంగిపురం	2.09
ప్రత్తిపాడు	1073.07
తాడికొండ	612.25
తుళ్లూరు	1.50
వట్టిచెరుకూరు	3340.26

ప్రత్తిపాడు: ఆకులు ముడుచుకుని ఉన్న మిరప పైరు

నివారణకు చర్యలు చేపట్టాలి

మిరప పంటలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఎకరాకు పెగాసస్ 250 గ్రాములు, సెవిన్ 280 గ్రా, ల్యాసో 200 మిల్లీ లీటర్లు, ఎసిఫేట్ 252 ఎకరాకు 350 మిల్లీలీటర్లు చొప్పున పిచికారి చేసుకోవాలి. తామర పురుగు నివారణకు ఎకరాకు ఎక్స్‌పోనస్ 34 మి.లీ, గ్రేసియాహా 160 మి.లీ, సిమోడిస్ 240 మి.లీ, రోగర్ 500 మి.లీ, మూవెన్టో 200 మి.లీ నీటిలో ఒకటి తర్వాత మరొకటి పిచికారీ చేసుకోవాలి.
- డి.రవీంద్రబాబు, డిప్యూటీ డైరెక్టర్, ఉద్యానశాఖ

ఆత్మలింగ దర్శనం

తుళ్లూరు, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం తాళ్లాయపాలెం శైవ క్షేత్రంలో ఆత్మ లింగ దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. లింగోద్భవ సమయంలో క్షేత్ర పీఠాధిపతి శివస్వరూప ఆధ్వర్యంలో లక్ష రుద్రాక్షలతో కోటిలింగేశ్వర స్వామికి అభిషేకం చేశారు. రాజరాజేశ్వరీ దేవి, కోటిలింగేశ్వర స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నప్రసాద వితరణ జరిగింది.

ఆలయంలో భక్తుల రద్దీ

శివయ్యే తోడునీడ!

నల్లమేకలవారిపాలెం (దుగ్గిరాల), న్యూస్‌టుడే: ఈమని శివారు గ్రామం నల్ల మేకలవారి పాలెం గ్రామానికి చెందిన తుల్లి మిల్లి వెంకట్రావుకు 88 ఏళ్లు. ఆయనకు శివుడు అంటే అమిత భక్తి. దీంతో ఆయన స్వయంగా రెండేళ్ల కిందట శివలింగాన్ని తయారు చేసి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తున్నారు. శివకేశవులకు భేదం లేదని చాటిచెబుతూ లింగంపై ఆయన నామాలను పొందుపరిచారు. శివరాత్రి, ఇతర పర్వదినాల్లో చుట్టుపక్కల వారు వచ్చి ఇక్కడ పూజలు చేస్తుంటారని వెంకట్రావు చెబుతున్నారు.

శివలింగానికి పూజ చేస్తున్న వెంకట్రావు

అఖండ తేజం.. అఖిలాండ రూపం

న్యూస్‌టుడే బృందం: 'హరహర మహాదేవ శంభో శంకర' నామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. రాత్రి లింగోద్భవ పూజలు వైభవంగా సాగాయి. పలు చోట్ల శివపార్వతుల కల్యాణాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఆయా కమిటీల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. తాడేపల్లి మండలం సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద పలువురు పితృ కర్మలు నిర్వహించారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఫిరంగిపురం: వేమవరంలో..

తాడేపల్లి : సీతానగరంలో భక్తుల రద్దీ

మంగళగిరి గ్రామీణం: కృష్ణాయపాలెంలో..

దుగ్గిరాలలో..

దుగ్గిరాల పుట్ట వద్ద..

మంగళగిరి పట్టణ శివాలయంలో సాంస్కృతిక కార్యక్రమం

తుళ్లూరు: దొండపాడులో..

వట్టిచెరుకూరులో ప్రత్యేక సన్నిధిలో..

తాడేపల్లి శివాలయంలో..

పెదనందిపాడులో..

పేరేచర్లలో కైలాసనాథేశ్వరుడు

తాడికొండ: కొండ మల్లికార్జున సన్నిధిలో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

తుళ్లూరు: పెదపరిమిలో..

గుంటూరు రూరల్: కోటప్పకొండపై ఎమ్మెల్యే రామాంజనేయులు, నాయకులు

ముక్కంటి మనువు.. మురిసింది తనువు

మంగళగిరిలో మల్లేశ్వరస్వామి, అమ్మవార్లు

ప్రత్తిపాడులో కల్యాణ క్రతువు

మంగళగిరి, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మంగళగిరి గంగా, భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల కల్యాణం ఆదివారం అర్ధరాత్రి దాటాక వేలాది మంది భక్తుల సమక్షంలో అత్యంత వేడుకగా నిర్వహించారు. ఎదురుకోలు ఉత్సవం, నంది వాహనంపై ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ◆ ప్రత్తిపాడులోని శ్రీగంగా పార్వతీ సమేత దండేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. లింగోద్భవ కాలంలో స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు.

మంగళగిరిలో భారీగా హాజరైన భక్తులు

రక్షణ కరవు

మేడికొండూరు శివారు విద్యుత్ ఉప కేంద్రం ఇనుప గేటు పాడైపోయింది. ఈ నేపథ్యంలో అడ్డుగా కర్రలతో అడ్డుకట్ట పెట్టారు. పశువులు, కొంత మంది జనాలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రక్షణ లేకుండా పోతుంది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి గేటు ఏర్పాటు చేయాల్సి ఉంది. - **మేడికొండూరు, న్యూస్‌టుడే**

కదలని మురుగు

చినకాకాని గ్రామ ఓసీ కాలనీ నగర్‌లో డ్రైనేజీ స్తంభించి ఉంది. దుర్వాసన, దోమలతో నరకం చూస్తున్నామని, జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - **మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే**

ఇదేం 'సిత్రం'..!

పేరేచర్లలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణం జరిగింది. అప్పట్లో గ్రామంలోని మూడో లేఅవుట్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకంపై జగన్ ముఖ చిత్రం, పథకాల పేర్లు రాశారు. తర్వాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తోంది. అయినా ఇప్పటి వరకు అక్కడ పాత చిత్రాలే దర్శనమిస్తున్నాయి. - **మేడికొండూరు, న్యూస్‌టుడే**

బిక్కుబిక్కుమని.. దేవుడే దిక్కని..

లాం గ్రామ శివారు కొండవీటి వాగు వంతెనపై రక్షణ గోడలు లేవు. నిత్యం భారీ వాహనాలు, పాఠశాల బస్సులు తిరుగుతూ రద్దీగా ఉండే ఈ మార్గంలో వాహనాలు అదుపుతప్పితే నేరుగా వాగులో పడే ప్రమాదం లేకపోలేదు. వంతెనపై రహదారి కూడా అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - **తాడికొండ, న్యూస్‌టుడే**

గుమ్మడి కాయలకు గిరాకీ

ఇక్కడి దుకాణాల ఎదుట దిష్టి నివారణకు కట్టే గుమ్మడి కాయలు ప్రతి ఆదివారం మహంకాళి గుడి వద్ద ఎక్కువగా అమ్ముడవుతుంటాయి. అందుకే రంగులు వేసే కార్మికులు శనివారం పెద్ద ఎత్తున వీటిని సిద్ధం చేశారు. మంగళవారం అమావాస్య కావడంతో ఎక్కువగా విక్రయాలు ఉంటాయని వారు చెబుతున్నారు. బూడిద గుమ్మడి కాయలకు పసుపురంగు వేసి ఎరుపు రంగు బొట్లు పెడుతున్నారు. - **దుగ్గిరాల, న్యూస్‌టుడే**

గ్రామాల్లో శరవేగంగా రోడ్ల నిర్మాణం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో శరవేగంగా రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెదేపా మండల అధ్యక్షుడు శివ రామ ప్రసాద్ అన్నారు. తుమ్మలపాలెంలో రూ.10 లక్షలు, కొత్తమల్లాయపాలెంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆదివారం కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు చివరి భూములకు సాగునీరు అందించామని చెప్పారు. సొసైటీ ఛైర్మన్‌లు మారాచు శ్రీనివాసరావు, కుర్రి సుబ్బారెడ్డి, తెదేపా నాయకులు మాజీ సర్పంచి వి.సుబ్బారెడ్డి, నాయకులు వణుకూడి గణేశ్‌రెడ్డి, వెంకటరెడ్డి, మేకా సాంబిరెడ్డి, వణుకూరి వెంకటేశ్వరరెడ్డి, మేకా రోశిరెడ్డి, బొందలపాటి శేషరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తమల్లాయపాలెం: సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న తెదేపా మండల అధ్యక్షుడు శివరామప్రసాద్, నాయకులు

సమష్టిగా పాఠశాలను బాగు చేసుకుందాం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు జడ్పీ పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులంతా సమష్టిగా కృషి చేయాలని అప్న జడ్పీ హెచ్‌ఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సీకే రామయ్య అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి తన తల్లిదండ్రులు వీరయ్య, వెంకటరత్నమ్మ, కుమార్తె కీర్తి జ్ఞాపకార్థం రూ. 5 లక్షలు, కోడూరి సురేష్‌బాబు తన తండ్రి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం రూ. 5 లక్షలు, నాగులపాడుకు చెందిన ఆళ్ల భాస్కరరావు, వెంకట్, శేషుమాధవ్ లు తన తండ్రి అప్పారావు జ్ఞాపకార్థం రూ. 5 లక్షలు చొప్పున విరాళాలు ప్రకటించారని పేర్కొన్నారు. పాఠశాల పూర్వ భవనం (వారసత్వ భవనం) మరమ్మతులు 25 శాతం పూర్తి అయిందని మిగతా పనులు కూడా పూర్తి చేసి జూన్ నాటికి ఆ భవనం ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు శివరామకృష్ణయ్య, కార్యదర్శి జి. అప్పారావు, కోశాధికారి వి. శివరామప్రసాద్, ఎన్‌ఆర్ఐ విభాగ అధ్యక్షుడు వెంకట్, సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీకే రామయ్య

వసతుల్లేక భక్తుల ఇక్కట్లు

మేడికొండూరు, న్యూస్‌టుడే: పేరేచర్లలోని కొండపై ఉన్న కైలాసనాథేశ్వరుడి ఆలయంలో ఆదివారం నిర్వహించిన వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆ మేరకు పూర్తిస్థాయిలో టెంట్లు, తాగునీటి వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఎండకు నీరసించారు. ప్రత్యేక దర్శనం పేరుతో ముందుగా 10 వేలకు పైగా పాసులు పంపిణీ చేశారు. కారులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు పెద్ద సంఖ్యలో రావడంతో ఘాట్ రోడ్డు కిక్కిరిసింది. మధ్యాహ్న సమయంలో క్యూలైన్ల వద్ద రద్దీ నెలకొంది. ఒక సమయంలో అదుపు చేయలేక పోలీసులు సైతం ఇబ్బంది పడ్డారు. తహసీల్దారు రాఘవరావు, సీఐ మధుసూదనరావు తమ సిబ్బందితో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. కొండపై క్యూలైన్‌లో నిల్చొన్న 45 ఏళ్ల భక్తురాలు బీపీ సమస్యతో స్వల్ప అస్వస్థతకు గురై నీరసించింది. అంబులెన్స్‌లో గుంటూరులోని ఆసుపత్రికి తరలించగా కోలుకుని ఇంటికి చేరుకుంది.

స్వచ్ఛతకు తూట్లు.. తప్పని పాట్లు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరిలో జాతీయ రహదారి వెంబడి డ్రైనేజీ స్తంభించి మురుగు, వ్యర్థాలు ఎక్కడికక్కడ తిష్ఠ వేశాయి. దోమలు, దుర్వాసనతో నిత్యం నరకం చూస్తున్నామని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పరిధిలో సుమారు 3.25 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. రాజధాని ముఖద్వారం కావడంతో నిత్యం వివిధ పనుల నిమిత్తం వేల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. ఇంత ప్రాధాన్యం ఉన్న ప్రాంతంలో స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. రత్నాల చెరువు, మహిళా కమిషన్ ఆఫీసు, ఎన్‌ఆర్ఐ జంక్షన్, బీసీవై పార్టీ కార్యాలయంలో సమీపంలో, హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి.. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామని నగరపాలక అసిస్టెంట్ కమిషనర్ శకుంతల తెలిపారు.

జాతీయ రహదారి వెంబడి స్తంభించిన మురుగు నీరు

వాగుల పూడిక తీత ఏదీ?

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల పరిధిలో వాగుల్లో పూడిక తీయడం లేదు. కుర్నూతల, కోయవారిపాలెం వద్ద ఉన్న కొండవాగులు, ప్రత్తిపాడు శివారులో రామవాగు, నక్కవాగు, గొట్టిపాడులో మేకలవాగుల్లో జమ్ము, ముళ్ల పొదలు దాదాపు 10 అడుగుల ఎత్తు ఉన్నాయి. సాగునీరు, మురుగు నీటి పారుదలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి.

కుర్నూతల వద్ద వాగులో జమ్ము

'ఖబర్‌స్థాన్‌లో నిర్మాణాలు వద్దు'

మంగళగిరి గ్రామీణం, మంగళగిరి, న్యూస్‌టుడే: శతాబ్దాల చరిత్ర ఉన్న ఖబర్‌స్థాన్‌లో రహదారి విస్తరణ పేరుతో నిర్మాణాలు చేపట్టాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఆదివారం మంగళగిరిలో ఖబర్‌స్థాన్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇది కేవలం భూమి కాదని, తమ చారిత్రక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆ స్థలాన్ని తాకకుండానే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని, తెనాలి రోడ్డును వన్‌వే చేసి నేరుగా జాతీయ రహదారికి కలపాలని సూచించారు. మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. ఆ కమిటీ కన్వీనర్ యూసఫ్, పలు ముస్లిం సంఘాల నాయకులు మునీర్, అజీమ్, రఫీ, ఇక్బాల్ అహ్మద్, ఇస్మాయిల్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వైభవంగా నృత్య కళాభారతి వార్షికోత్సవం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం రాత్రి నృత్య కళాభారతి 27వ వార్షికోత్సవం నిర్వహించారు. పలువురు విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు నాట్యాచార్య ఎన్.బాలు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, పయనీర్ (గ్రూప్స్) ఛైర్మన్ చుక్కపల్లి రమేష్, రాయపాటి మమత, వైవీఎస్ ప్రభాకర్, పద్మావతి దేవి, చాగంటి తదితరులు పాల్గొని సంస్థ నిర్వాహకులు నృత్య కళారంగానికి చేస్తున్న సేవలను ప్రశంసించారు.

వంతెన పైనుంచి కిందపడ్డ కారు

ఒకరికి తీవ్ర గాయాలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి నుంచి మంగళగిరి వైపు వెళ్తున్న ఓ కారు 16వ నంబర్ జాతీయ రహదారిపై కుంచనపల్లి వద్ద డెల్టా కాలువపై ఉన్న వంతెనపై నుంచి అదుపుతప్పి కిందపడిపోయింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో ఉన్న వ్యక్తిని అతికష్టం మీద బయటకు తీశారు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో వంతెన దిగువన జనసంచారం లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. కాగా, క్షతగాత్రుడి వివరాలు తెలియరాలేదని, కారు నంబరు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

10 వేల మందికి అన్నదానం

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరిలో శ్రీకాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆదివారం మహా శివరాత్రికి వచ్చిన సుమారు 10 వేల మందికి అన్న ప్రసాదం సమకూర్చింది. ఆ ట్రస్ట్ అధ్యక్షుడు పందేటి సాంబశివరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. కర్నాటి శివసత్యనారాయణ, శివన్నారాయణ, అచ్చియ్య, శ్రీను, విష్ణుమూర్తి, రామకృష్ణ, శంకర్, రంగారావు, సుబ్రహ్మణ్యం రామిరెడ్డి పాల్గొన్నారు. ◆ మంగళగిరి మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద చిట్టేల గరటయ్య కుమారుల ఆధ్వర్యంలో 2000 మొక్కలు పంపిణీ చేశారు.

ఆహారం వడ్డిస్తున్న సాంబశివరావు తదితరులు

కూలీల కొరతతో ఇబ్బందులు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాలలో వ్యవసాయ కూలీల కొరత పట్టిపీడిస్తోంది సుమారు 10 వేల ఎకరాల్లో సాగైన పత్తి, మిరప వంటి పైర్లు ఒకేసారి చేతికి వచ్చాయి. పత్తి పంట తీతకు కిలోకి రూ. 15 నుంచి రూ. 20 ఇచ్చేందుకు ముందుకు వచ్చినా కూలీలు దొరకడం లేదు. దీంతో కొందరు కర్నూలు వెళ్లి కూలీలను మాట్లాడుకుని రప్పించుకుంటున్నారు. ఒక వైపు ఎండలు పెరుగుతుండటం, వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వట్టిచెరుకూరులో చేతికొచ్చిన పత్తి పంట

సేవాలాల్ మహరాజ్ జయంతి

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరులోని అయ్యన్న చెరువు సుగాలీ కాలనీలో ఆదివారం సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రతినిధి శివశంకర్, పలువురు స్థానికులు సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేశారు.

'కౌలు రైతులను విస్మరించిన బడ్జెట్'

గుంటూరు నేరవార్తలు, : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కౌలురైతుల పంట రుణాల ప్రస్తావనే లేదని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు పేర్కొన్నారు. కౌలు రైతులే సాగు చేస్తున్నారని, వారికి యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపుకార్డులు ఇస్తామన్న హామీని ప్రభుత్వం విస్మరించిందన్నారు.

(c) eenadu

గుంటూరు తూర్పు

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి.. (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 14, వంగ 19, బెండ 30, పచ్చిమిర్చి 36, కాకర 46, క్యారెట్ 27, క్యాబేజీ 18, బీర 26, దొండ 45, బంగాళాదుంప 20, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 36, దోస 35, పొట్ల 27, చామ 24, గోంగూర 10, తోటకూర 15, చుక్కకూర 15, మెంతికూర 5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 25, కీర 45, క్యాప్సికం 60, అల్లం 75, (పెంది బీన్స్) 65, సొర 10, అరటి 8.
- న్యూస్‌టుడే, పట్నంబజారు

వినతుల స్వీకరణ నేడు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: స్థానిక సమస్యలు, ప్రజాఫిర్యాదులపై అర్జీలు స్వీకరించేందుకు సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కౌన్సిల్ హాల్‌లో అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు జీఎంసీ ప్రధాన కార్యాలయంలో కాల్‌సెంటర్ 0863- 2345103, వాట్సప్ నెం.98499 08391లో ఫిర్యాదులు అందించవచ్చని వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

★ బాలాజీనగర్ 4వలైన్ సైడుకాల్వల్లో పూడికలు చేరి మురుగునీరు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికులు కోటేశ్వరరావు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ ఆయుబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో కాల్వల్లో పూడికలు తీయించారు. ★ సుద్దపల్లిడొంక యానాదికాలనీ రెండోలైన్‌లో చెత్తకుప్పలు తీయకుండా వదిలేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని స్థానికులు మణికంఠ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య అధికారులకు తెలియజేయడంతో వారు ట్రాక్టరును పంపి చెత్తకుప్పలు తీయించి తరలించారు. - న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

26 నుంచి జనసేన సభ్యత్వం నమోదు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ఈనెల 26వ తేదీ నుంచి జనసేనపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఆపార్టీ 56వ వార్డు అధ్యక్షుడు పులిగడ్డ నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. గత ఏడాది జనసేనపార్టీ సభ్యత్వాలను నమోదు చేసిన ఆపార్టీ 56వ వార్డు అధ్యక్షుడు పులిగడ్డ నాగేశ్వరరావు, 6వ వార్డు అధ్యక్షుడు దశవాయి శ్రీనివాసరావు ఆదివారం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందించారు. ఈ ఏడాది జరిగే సభ్యత్వ నమోదులో అంతే ఉత్సాహం, స్ఫూర్తితో పనిచేయాలని ఆయన నాగేశ్వరరావు, భార్గవ్‌లకు సూచించారు.

లెక్క లేదు.. పత్రం ఉండదు

పక్కదారి పడుతున్న తాగునీరు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే

వేసవి సమీపిస్తున్న కొద్దీ నగరంలో తాగునీటి ఎద్దడిపై పలుప్రాంతాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. శుద్ధజలం సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాల్లో, రిజర్వాయర్లు దూరంగా ఉండే శివార్లలో ఇబ్బందుల్లేకుండా ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో పేదల కాలనీలు, శివార్లకు సరఫరా పేరుతో ట్యాంకర్లను పక్కదారి పట్టిస్తున్నారు. సంవత్సరాల తరబడి పాతుకుపోయిన ఒప్పంద ఉద్యోగులతో కలిసి కొందరు అధికారులు ట్యాంకర్ల సరఫరాదారులతో కుమ్మక్కై అక్రమాల దందా కొనసాగిస్తున్నారు. గతంలో కమిషనర్ బీఆర్ స్టేడియం రిజర్వాయర్ పరిధిలో కాలనీకి వెళ్లే ట్యాంకర్లకు రికార్డులో నమోదు చేయకపోవడంతోపాటు పక్కదారి పడుతున్నట్లు గుర్తించారు. అక్కడ పనిచే

హెచ్‌ఎల్ఆర్ వద్ద నీరు పట్టుకునేందుకు వచ్చిన ట్యాంకర్లు

స్తున్న ఏఈని ప్రభుత్వానికి సరెండర్ చేసి..కారుపుడు ఒప్పంద ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఇలాగే హెచ్‌ఎల్ఆర్, స్తంభాలగరువు, నల్లచెరువు పరిధిలోని రిజర్వాయర్ల వద్ద ట్యాంకర్లు పక్కదారి పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారులు ఈ వ్యవహారంపై పక్కాగా నిఘా ఏర్పాటు చేయాల్సి ఉంది. పేదల కాలనీలకు, జీఎంసీ అధికారికంగా వెళ్లకుండా ప్రైవేటు మెస్‌లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లకు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా ఈ దందాపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఇలా చేస్తే మేలు..

తాగునీటి ట్యాంకర్ల పక్కదారిని అరికట్టేందుకు గతంలో 'డయల్ ఏ ట్యాంకర్' విధానం రూపొందించి అమలు చేశారు. రిజర్వాయర్ల వద్ద పట్టుకునే ప్రతి ట్యాంకరుకు పక్కాగా ఆన్‌లైన్‌లో చలానాలు చెల్లిస్తేనే నీరు పట్టుకునేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం కొన్ని ట్రాక్టర్లు 4 కేఎల్, లారీలు 12 కేఎల్ ఒకటి, రెండు చలానాలు తీసుకుని వాటికి అదనంగా మరో రెండు, మూడు ట్రిప్పుల నీటిని అక్కడి సిబ్బందితో కుమ్మక్కై తరలిస్తున్నారు. ట్యాంకర్ల దందాను అరికట్టేందుకు డయల్ ఏ ట్యాంకరును పునరుద్ధరించి డీఈఈ, ఏఈ స్థాయి అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా కేటాయించాల్సి ఉంది. దీంతోపాటు రిజర్వాయర్ల వద్ద ట్యాంకర్లు నీరు పట్టుకునే వాల్వుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా దందాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు వీలుంటుందని పలువురు సూచిస్తున్నారు. దీంతోపాటు ప్రతి ట్యాంకర్ రికార్డుల్లో నమోదయ్యేలా ఆపరేటర్ల వ్యవస్థను పెంచి జీఎంసీ నుంచి తిప్పుతున్న ట్యాంకర్లకు వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్ పక్కాగా ఏర్పాటు చేసేలా చూడాలి.

భక్తులకు అన్నదానం

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఓ వార్డు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అమరావతిలోని అమరలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కాకర్ల హనుమంతరావు, పచ్చిశెట్టి శ్రీనివాసరావు, మద్దాళ రామకృష్ణ, వరద వెంకటేశ్వరరావు, ఉతుకూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

17న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ఈనెల 17న గణేశ్వరరావు వీధిలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వేమూరి నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆరోజు వేకువజామున 5-30 గంటలకు కాగడహారతి అనంతరం పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. స్వర్ణరథ సాయి బృందంచే భక్తి గీతాలాపనలు, అనంతరం అన్నసమారాధన ఉంటుందని వెల్లడించారు.

తిరునాళ్ల బందోబస్తు పర్యవేక్షణ

నగరంలోని శివాలయం వద్ద పోలీసులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శివరాత్రి పండగ సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ వకుల్ జిందల్ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. ఆదివారం జిల్లాలోని శైవక్షేత్రాల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో జిల్లా వ్యాప్తంగా బందోబస్తు తీరును ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. తిరునాళ్ల మహోత్సవం జరిగే ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో గస్తీ నిర్వహించారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు వీటిని వినియోగించారు.

కొత్తపేట శివాలయంలో..

పాతగుంటూరు శివాలయంలో..

చేనేతకాలనీలోని మార్కండేయస్వామి ఆలయంలో..

మిర్చియార్డు సమీపంలోని కొత్త కాలనీలో శ్రీపర్వతమల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురుమాత తెలుగమ్మ ఆధ్వర్యంలో మహాశివరాత్రి మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అభిషేకాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

హరహర మహాదేవ

నెహ్రూనగర్, పట్నంబజారు, న్యూస్‌టుడే: నగరంలోని ఆలయాల్లో ఆదివారం మహాశివరాత్రి పర్వదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. శివునికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని ఆలయాలకు వేకువజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

ఉత్సవాల్లో కూటమి నాయకులు, భక్తులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఆదివారం నెహ్రూనగర్‌లో వైభవంగా నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గా శ్రీనివాస్ ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదం అందించారు.

కొత్తపేట: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తి ప్రపత్తులతో నృత్య జాగరణ

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి శివరాత్రిని పురస్కరించుకుని శ్రీసాయి మంజీర శివానీ నృత్య అకాడమీ ఆధ్వర్యంలో శివపద మంజీర నాదం పేరున నృత్య జాగరణ జరిగింది. గురువు కాజ వెంకట సుబ్రహ్మణ్యం శిష్య బృందం పలువురు ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు పలు నృత్యాంశాలను ప్రదర్శించారు. వెంకటగిరి నాగలక్ష్మి, తాళ్లూరి ధరణి, పచ్చల నాగమహిత తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యార్థినుల ప్రదర్శన

వైభవంగా నృత్య కళాభారతి వార్షికోత్సవం

చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం రాత్రి నృత్య కళాభారతి 27వ వార్షికోత్సవం నిర్వహించారు. పలువురు విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు నాట్యాచార్య ఎన్.బాలు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, పయనీర్ గ్రూప్స్ ఛైర్మన్ చుక్కపల్లి రమేష్, రాయపాటి మమత, వైఎస్ ప్రభాకర్, పద్మావతి దేవి, నాగంటి తదితరులు పాల్గొని సంస్థ నిర్వాహకులు నృత్య కారకంగా నిర్వహిస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం కూచిపూడి నృత్య ఆధ్యాపకులు మట్టుపల్లి విశ్వంను అతిథులు, నిర్వాహకులు సత్కరించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 76 మంది కళాకారులు విఘ్నరాజం భజే, గం గణపతి, జయ జనార్దన కృష్ణా, గోవర్ధన గిరిధారి వినాయక కౌతం, బ్రహ్మాంజలి, రామాయణ శబ్దం తదితర కీర్తనలకు అనుగుణంగా కూచిపూడి నృత్యాభినయం చేశారు. ఎస్.బాలు నవ్యశ్రీ నృత్య దర్శకత్వం చేశారు. బి.భువనేశ్వరి, తిన్నలూరి శ్రీహరిబాబు, తిరునగరు ప్రభాకరరావు, దూళిపాళ్ల శ్రీనివాస శర్మ, పి.బాలాజీ వాద్య సహకారం అందించారు.

అలరించిన భక్తి సంకీర్తనలు

గుంటూరు సాంస్కృతికం: కొండా వెంకటప్పయ్య కాలనీలోని సాయిబాబా దేవాలయంలో ఆదివారం స్వరరాగసుధ ఆధ్వర్యంలో భక్తి సంకీర్తన జరిగింది. కటకరాజు వెంకట సాయిబాబా శర్మ బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. రామకృష్ణ శర్మ, షణ్ముఖశర్మ వాద్య సహకారం అందించారు

సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం అవసరం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని ప్రముఖ వ్యాపారవేత్త టి.అరుణకుమార్ సూచించారు. జనచైతన్య వేదిక కార్యాలయంలో సేవా సంస్థలు, విద్యార్థి సంఘాల ఆత్మీయ కలయిక శనివారం జరిగింది.

సేవా సంస్థల ప్రతినిధులు, యువతతో అరుణకుమార్

ముఖ్యఅతిథిగా హాజరైన అరుణకుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజున సేవా మూర్తులందరినీ ఒకే వేదికపై కలవడం ఆనందంగా ఉందన్నారు. నేటి సమాజంలో దాతృత్వం గలవారికి కొదవలేదని..విరాళాలు ఎక్కడ, ఎవరికివ్వాలనే దానిపై అస్పష్టత నెలకొందన్నారు. సమాజ అవసరాలు, దాతల మధ్య స్వచ్ఛంద సేవా సంస్థలు అనుసంధానకర్తలుగా వ్యవహరించాలన్నారు. తమ మిత్రబృందంతో కలిసి నగరంలో సేవాకార్యక్రమాలు చేపడుతున్న సంస్థలకు తోడ్పాటు అందిస్తామని భరోసా ఇచ్చారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరూ బాగుండాలని అన్నిమతాలు, ఇజాలు చెబుతున్నాయన్నారు. నగరంలోని సేవా సంస్థలు కలిసి పని చేయడం ప్రశంసనీయమన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ధనుంజయరెడ్డి, రమేష్, జలీల్‌అహ్మద్, యశ్వంత్, పోతురాజు, వీరశేఖర్, నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దారి.. అధ్వానంగా మారి..

నగరపాలక సంస్థ: నిత్యం రద్దీగా ఉండే బుచ్చయ్యతోట ప్రధాన రహదారిలో గోతులతో రాకపోకలు చేసేవారు అవస్థలు పడుతున్నారు. నగరంలో సీసీ రహదారుల మరమ్మతులు చేసేందుకు ఆధునిక ప్యాచ్ మిషన్ అందుబాటులోకి వచ్చినా పెద్దగా ఉపయోగం కనిపించడం లేదు. ఈమిషన్‌తో కేవలం మార్కెట్, కలెక్టరేట్ రోడ్డు, రింగురోడ్లలో మాత్రమే పనులు చేపడుతున్నారు. మిగిలిన ప్రాంతాల్లో గోతులుపడినా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే బుచ్చయ్యతోట ప్రధాన రహదారిలో గోతుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

తవ్వారు.. వదిలేశారు..

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: స్థానిక నెహ్రూనగర్ ప్రధానరోడ్డు తాగునీటి పైపులైను మరమ్మతు కోసం తవ్విన గుంతను అలాగే వదిలేశారు. రద్దీ రహదారి కావడంతో ఇటుగా రాకపోకలు చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు గుంతపై చెట్టుకొమ్మలు పెట్టారు. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తిచేయించి గొయ్యి పూడ్చి చదును చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ముక్కుమూసుకోవాల్సిందే!

సిద్ధాబత్తునివారి వీధిలో రోడ్లపై వ్యర్థాలు పేరుకుపోవడంతోపాటు అక్కడే పలువురు మూత్రశాలకు వెళుతున్నారు. దీంతో అటుగా వెళ్లాలంటే దుర్వాసన భరించలేకపోతున్నామని పాదచారులు పెదవి విరుస్తున్నారు. ఇటుగా ఆలయాలకు, వ్యాపార దుకాణాలకు పెద్దసంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.
- నెహ్రూనగర్, న్యూస్‌టుడే

ఆకట్టుకున్న మహిళల కోలాటం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: గుజ్జనగుండ్ల శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలతోపాటు సాయంత్రం ప్రసన్నాంజనేయ కోలాట భజన మండలి రఘురాం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన ఉత్సాహంగా సాగింది.

యువకుడి దుర్మరణం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వేమూరుకు చెందిన హర్ష(25) నగరంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆదివారం హర్ష ద్విచక్రవాహనంపై కంకరగుంట పైవంతెన మీద నుంచి పట్టాభిపురం వైపు వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి రోడ్డు విభాగినిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పశ్చిమ ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భావితరాల భవిష్యత్తుకు ఆశాజనకంగా బడ్జెట్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భావితరాల భవిష్యత్తుకు ఆశాజనకంగా ఉందని మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. 'సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యతో కేటాయింపులు జరిపారు. అమరావతి నిర్మాణం అత్యంత కీలకంగా భావించి రూ.6000 కోట్లు కేటాయించారు. అమరావతి ఎకనమిక్ రీజియన్, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్‌కు కలిపి రూ.30,000 కోట్లు, విశాఖ రీజియన్‌కు రూ.28,000 కోట్లు కేటాయించడం కూటమి ప్రభుత్వానికి ఉన్న దూరదృష్టికి నిదర్శనం. పోలవరం నిర్మాణానికి రూ.6,105 కోట్లు కేటాయించారు. మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో విద్యాశాఖకు రూ.32,308 కోట్లు కేటాయించి ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్యాశాఖకు పెద్దపీట వేశారు. ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతిపై దృష్టి సారించడం విశేషం. పట్టణాభివృద్ధికి రూ.14,539 కోట్లు కేటాయించారు. గతం కంటే ఇది అధికం. ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది'.. అని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'కౌలు రైతులను విస్మరించారు'

గుంటూరు నేరవార్తలు : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కౌలురైతుల పంట రుణాల ప్రస్తావనే లేదని కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో 70 శాతం పొలాలను కౌలు రైతులే సాగు చేస్తున్నారని, వారికి యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపుకార్డులు ఇచ్చి పంట రుణాలు అందజేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిందన్నారు. గుంటూరు జిల్లాకు నిధులు కేటాయింపులో అన్యాయం జరిగిందన్నారు. 50 గ్రామాలకు తాగునీరందించే గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు, నల్లమడ వాగు ఆధునికీకరణకు నిధులు కేటాయించలేదన్నారు.

గుంతలు పూడ్చరు.. వెతలు తీర్చరు

స్టేషన్ సమీపంలో ఇలా..

నగరంలో ఇష్టారాజ్యంగా సాగుతున్న తవ్వకాలతో ప్రజలు నానా అగచాట్లకు గురవుతున్నారు. తాగునీటి సరఫరా పైపులైన్ల ఏర్పాటు, పాతలైన్లలో ఏర్పడే లీకులకు మరమ్మతులు, మురుగు కాలవల నిర్మాణం తదితర పనుల కోసం గుత్తేదారులు గుంతలు తవ్వి వదిలేస్తున్నారు. రోజుల తరబడి రోడ్లపైన మట్టికుప్పలు తీయడంలేదు. అరండల్‌పేట పోలీసు స్టేషన్ పక్క నుంచి మాజేటి గురవయ్య ఉన్నత పాఠశాల వైపు వచ్చే దారిలో వారం రోజుల క్రితం తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం గుంత తవ్వారు. తవ్విన మట్టిని కుప్పగా రోడ్డు మధ్యలో పోశారు. పోలీసు స్టేషన్ పక్కన పైపులైన్‌కు మరమ్మతులు చేసి గుంతలు పూర్తిగా పూడ్చకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనులతో నగరవాసులకు ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గుంటూరు నగరం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సాయిబాబా రోడ్డు ఫీడర్, సరఫరా లైన్లలో మరమ్మతులు చేపట్టిన కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని డీఈఈ గురవయ్య తెలిపారు. విద్యానగర్ 2, 3, 4వ లైన్లు, రింగ్ రోడ్డు, రాధాకృష్ణ టవర్స్, ఐటీసీ వెల్‌కం హోటల్ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కారు డ్రైవర్ బలవన్మరణం

గుంటూరు నేరవార్తలు : కారు డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..లక్ష్మీనగర్‌కు చెందిన వెంకటేష్(25) కారు డ్రైవర్. ఇతనికి ఇన్‌స్టాగ్రామ్‌లో నల్లపాడుకు చెందిన సురేష్‌తో పరిచయమై..స్నేహంగా మారింది. కొద్ది రోజుల కిందట వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి సురేష్ తనతో మాట్లాడడం లేదని వెంకటేష్ బాధపడుతున్నాడు. ఈక్రమంలో శనివారం రాత్రి వెంకటేష్ తన ఇంటి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలగని దీపాలు.. వీధుల్లో చిమ్మచీకట్లు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

మణిపురం వంతెన దిగువన తూర్పు వైపు నుంచి కొల్లపారం రోడ్డు మీదగా వినోబానగర్‌కు వెళ్లే రహదారిలో వీధిదీపాలు వెలగకపోవడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇది నందివెలుగురోడ్డు, బుడంపాడు బైపాస్‌కు వెళ్లడానికి తగిన మార్గం కావడంతో కొత్తపేట, సీతానగర్, మంగళదాస్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, గుంటూరువారితోట, రామిరెడ్డితోట, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల వాసులు నిత్యం ఇటుగా రాకపోకలు చేస్తుంటారు. వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లలో వాహనాలు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. వందలాది మంది వినోబానగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో సుమారు పదిహేను వీధి దీపాలు ఉండగా సగానికిపైగా వెలగడం లేదని వాపోతున్నారు.

అంధకారం ఇలా..

ఆందోళనలో కాలనీవాసులు...

గత మూడు నెలలుగా ఈ పరిస్థితే ఉన్నా పట్టించుకునే వారే లేరని అసహనం వ్యక్తం చేస్తున్నారు. చీకటిపడితే అటుగా మద్యం, గంజాయి వ్యసనపరులు సంచరించడంతో కళాశాలలకు వెళ్లి వచ్చే యువతులకు ఇబ్బందిగా మారిందని ఆందోళన చెందుతున్నారు. గొలుసు దొంగల బెడద ఉండడంతో బయటకు రావాలంటే భయపడుతున్నామని మహిళలు వాపోతున్నారు. ఈ మార్గం పక్కనే రైల్వేట్రాక్ ఉండడంతో రాత్రివేళల్లో అటువైపు ఆకతాయిలు తిరుగుతున్నారని, చీకట్లో ఎవరు ఎటువైపు నుంచి వస్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో లైట్ వేసినప్పుడు రహదారిలో కొంచెం వెలుగు ఉంటుందని, రాత్రి పొద్దుపోయాక ఆ బల్బులు ఆపేస్తే ఆ మార్గం పొడవునా చిమ్మ చీకట్లు అలముకుంటున్నాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రత్యక్ష ప్రసారాలను వీక్షిస్తూ.. భజనలు చేస్తున్న చిన్నారులు, మహిళలు

యోగా విన్యాసాలు.. గాన కచేరీలు..

మహాశివరాత్రి వేడుకలు వీక్షిస్తూ జాగరణ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వేడుకలు ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు భక్తులు. సద్గురు ఆధ్వర్యంలో కోయంబత్తూర్‌లో జరిగే మహాశివరాత్రి ప్రధాన కార్యక్రమాన్ని బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం రాత్రి నుంచి భక్తులు వీక్షించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సద్గురు ప్రత్యేకమైన మార్గదర్శక మెడిటేషన్లు, సంప్రదాయ నృత్యాలు, గాన కచేరీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, యోగా విన్యాసాలు, ఆదియోగి దివ్యదర్శనం తదితర కార్యక్రమాలను రాత్రంతా ఆధ్యాత్మిక వాతావరణంలో జాగారం చేస్తూ భక్తి పారవశ్యంలో ఓలలాడారు. పలువురు వైద్యులు, ఈశా వాలంటీర్లు, ప్రజలు కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వివాహిత ఒకరు అదృశ్యమైనట్లు అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బోరుగడ్డ దీప్తి అనే యువతికి బాపట్ల జిల్లా నగరం మండలం వెనిగళ్లకు చెందిన దాసరి కల్యాణ్‌తో వివాహమైంది. ఆయన ముంబయిలో ఉద్యోగం చేస్తున్నారు. పది రోజుల క్రితం ఆయన అక్కడకు వెళ్తూ భార్య దీప్తిని సంజయ్‌గాంధీ నగర్‌లోని ఇంటి వద్ద దించి వెళ్లారు. ఈనెల 14న ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. కుమార్తె ఆచూకీ నిమిత్తం తండ్రి డేవిడ్ పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

నేడు వినతుల స్వీకరణ

నగరపాలకసంస్థ : స్థానిక సమస్యలు, ప్రజాఫిర్యాదులపై అర్జీలు స్వీకరించేందుకు సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కౌన్సిల్ హాల్‌లో అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు జీఎంసీ ప్రధాన కార్యాలయంలో కాల్ సెంటర్ 0863- 2345103, వాట్సాప్ నెం.98499 08391లో ఫిర్యాదులు అందించవచ్చని వెల్లడించారు.

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలో రూ.ల్లో) : టమాట 14, వంగ 24, బెండ 29, పచ్చిమిర్చి 38, కాకర 46, బీర 40, క్యాలీఫ్లవర్ 24, క్యాబేజి 18, క్యారెట్ 26, దొండ 45, బంగాళదుంప 20, ఉల్లిపాయలు 24, గోరు చిక్కుళ్లు 35, దోస 36, సొర 15 పొట్లకాయ 27, అరటికాయ 10, పెద్ద చిక్కుళ్లు 49, చామదుంప 24, బీట్‌రూట్ 25, మునగ 16, కీరదోసకాయ 45, బీన్స్ 60 క్యాప్సికం 60, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 45, అల్లం 75, వెల్లుల్లి 155. - **న్యూస్‌టుడే, పట్టాభిపురం**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

స్పందన: చెత్త తొలగింపు: నగరంలోని కంకరగుంట వంతెన కింద రోజులుగా చెత్త తీయడంలేదు. దీంతో దోమల వ్యాప్తి అధికమై స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి శానిటరీ కార్యదర్శి సంజయ్‌నాయక్, సిబ్బందిని పంపించి వంతెన కింద చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

? రామిరెడ్డినగర్ నుంచి ఇస్కాన్ టెంపుల్‌కు వెళ్లే దారిలో మీనాక్షి విల్లా దగ్గరలో చెత్త నిల్వలు అధికంగా ఉన్నాయి. దీంతో దోమల బెడద ఎక్కువైంది. - **స్థానికులు, మీనాక్షి విల్లా** ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త, వ్యర్థాలు తొలగిస్తాం.- **అంగడి రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్** – న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సాయిబాబా రోడ్డు ఫీడర్, సరఫరా లైన్లలో మరమ్మతులు చేపట్టిన కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని డీఈఈ గురవయ్య తెలిపారు. విద్యానగర్ 2, 3, 4వ లైన్లు, రింగ్ రోడ్డు, రాధాకృష్ణ టవర్స్, ఐటీసీ వెల్‌కం హోటల్ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అంతా ఇష్టారాజ్యం!

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

రహదారులపైనే వాహనాలు నిలిపేస్తుండడంతో తప్పని వెతలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

★ సెల్‌ఫోన్ రింగవడమే తరువాయి.. రోడ్డుపై ప్రయాణిస్తున్నామన్న విషయాన్ని మర్చిపోయి కారు అక్కడే నిలిపేసి మాట్లాడేవారు కొందరు.

★ షాపింగ్‌కు వచ్చి అడ్డరోడ్డులో పార్కింగ్ చేసి వద్దామన్న సామాజిక స్పృహ లేకుండా రోడ్డు పైనే పార్కింగ్ చేసి వెళ్లేవారు మరికొందరు.

పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా వైకాపా హయాంలో రహదారుల్ని విస్తరించి అభివృద్ధి చేయలేదు. ప్రస్తుతం రహదారుల విస్తరణ జరుగుతోంది. కనీసం ఇటువంటి పరిస్థితుల్లోనైనా నిబంధనలు పాటించి వాహనాలు పార్కింగ్ చేసి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా సహకరిద్దామని ఉండడం లేదు. కార్లు, ఆటోలను ఎక్కడంటే అక్కడ ఇష్టారాజ్యంగా నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎక్కడెక్కడంటే.. : ముఖ్యంగా లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ రహదారిలో ఈ సమస్య విపరీతంగా ఉంది. కొరిటెపాడు, విద్యానగర్, గుజ్జనగుండ్ల, స్తంభాలగరువు, పట్టాభిపురం, బ్రాడీపేట, అరండల్‌పేటలోనూ ఇదే వరుస. రోడ్డుపై కార్లు పార్కింగ్ చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారన్న స్పృహ లేకుండా కొందరు న్యూసెన్స్‌గా వ్యవహరిస్తున్నారని వాహనచోదకులు విమర్శిస్తున్నారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తే సంకెళ్లే: రోడ్డుపై అడ్డదిడ్డంగా కార్లు నిలిపేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ట్రాఫిక్ పోలీసులు గతంలో కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు.

రింగ్‌రోడ్డులో డీ మార్టు వద్ద నడిరోడ్డు పైనే కార్లు, ఆటోల పార్కింగ్

ప్రధాన రహదారులపై పార్కింగ్ చేసే కార్లకు తాళాలు వేసేవారు. అంచు దాటి రోడ్డుపై నిలిపితే ఫొటోలు తీసి నోటీసులు అంటించి టైర్లకు తాళాలు వేసి పోలీసుల్ని సంప్రదించాలని తెలియజేసి చలానా చెల్లిస్తే తాళాలు తీసేవారు. అప్పట్లో కొన్నాళ్లు ఈ విధంగా చేయడం వల్ల కొంతమేరకు పరిస్థితి మెరుగుపడింది.

★ ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు ఆ విధానం అమలు విషయాన్ని విస్మరించడంతో కార్ల యజమానులు, డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే సమయాల్లో ఎక్కడంటే అక్కడే వాహనాలను పార్కింగ్ చేయడంతో సమస్యలు ఉత్పన్నమతున్నాయి. రోడ్లపై పార్కింగ్ చేస్తే ఎలా అని ప్రశ్నించిన వారిపై గొడవకు దిగుతున్నారు. మలుపుల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బాధ్యతగా వ్యవహరించాల్సిన వారు ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా వ్యవహరిస్తే ఎలాగని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికైనా స్పందించి రహదారులపై అడ్డంగా కార్లు, ఆటోలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

17న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ఈనెల 17న గణేశ్వరరావు వీధిలోని షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వేపూరి నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆరోజు వేకువజామున 5-30 గంటలకు కాగడ హారతి అనంతరం పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. స్వరరాగ సాయి బృందంచే భక్తి గీతాలాపనలు, అనంతరం అన్నసమారాధన ఉంటుందని వెల్లడించారు.

అలరించిన భక్తి సంకీర్తనలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కొండా వెంకటప్పయ్య కాలనీలోని సాయిబాబా దేవాలయంలో ఆదివారం స్వరరాగసుధ ఆధ్వర్యంలో భక్తి సంకీర్తన కార్యక్రమం జరిగింది. కటకరాజు వెంకట సాయిబాబు శర్మ బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. రామకృష్ణ శర్మ, షణ్ముఖశర్మ వాద్య సహకారం అందించారు.

సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం అవసరం

సేవా సంస్థల ప్రతినిధులు, యువతతో అరుణకుమార్

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని ప్రముఖ వ్యాపారవేత్త టి.అరుణకుమార్ సూచించారు. జనచైతన్య వేదిక కార్యాలయంలో సేవా సంస్థలు, విద్యార్థి సంఘాల ఆత్మీయ కలయిక శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అరుణకుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజున సేవామూర్తులందరినీ ఒకే వేదికపై కలవడం ఆనందంగా ఉందన్నారు. నేటి సమాజంలో దాతృత్వం గలవారికి కొదవలేదని.. విరాళాలు ఎక్కడ, ఎవరికివ్వాలనే దానిపై అస్పష్టత నెలకొందన్నారు. సమాజ అవసరాలు, దాతల మధ్య స్వచ్ఛంద సేవా సంస్థలు అనుసంధానకర్తలుగా వ్యవహరించాలన్నారు. తమ మిత్రబృందంతో కలిసి నగరంలో సేవాకార్యక్రమాలు చేపడుతున్న సంస్థలకు తోడ్పాటు అందిస్తామని భరోసా ఇచ్చారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరూ బాగుండాలని అన్నిమతాలు, ఇజాలు చెబుతున్నాయన్నారు. నగరంలోని సేవా సంస్థలు కలిసి పనిచేయడం ప్రశంసనీయమన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ధనుంజయరెడ్డి, రమేష్, జలీల్‌అహ్మద్, యశ్వంత్, పోతురాజు, వీరశేఖర్, నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్తుకు ఆశాజనకంగా బడ్జెట్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భావితరాల భవిష్యత్తుకు ఆశాజనకంగా ఉందని మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. 'సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యతతో కేటాయింపులు జరిపారు. అమరావతి నిర్మాణం అత్యంత కీలకంగా భావించి రూ.6000 కోట్లు కేటాయించారు. అమరావతి ఎకనమిక్ రీజియన్, రాయలసీమ గ్లోబల్ హార్టీకల్చర్‌కు కలిపి రూ.30,000 కోట్లు, విశాఖ రీజియన్‌కు రూ.28,000 కోట్లు కేటాయించడం కూటమి ప్రభుత్వానికి ఉన్న దూరదృష్టికి నిదర్శనం. పోలవరం నిర్మాణానికి రూ.6,105 కోట్లు కేటాయించారు. మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో విద్యాశాఖకు రూ.32,308 కోట్లు కేటాయించి ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్యాశాఖకు పెద్దపీట వేశారు. ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతిపై దృష్టి సారించడం విశేషం. పట్టణాభివృద్ధికి రూ.14,539 కోట్లు కేటాయించారు. గతం కంటే ఇది అధికం. ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది'.. అని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'కౌలు రైతులను విస్మరించారు'

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కౌలురైతుల పంట రుణాల ప్రస్తావనే లేదని కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో 70 శాతం పొలాలను కౌలు రైతులే సాగు చేస్తున్నారని, వారికి యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపుకార్డులు ఇచ్చి పంట రుణాలు అందజేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిందన్నారు. గుంటూరు జిల్లాకు నిధులు కేటాయింపులో అన్యాయం జరిగిందన్నారు. 50 గ్రామాలకు తాగునీరందించే గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు, నల్లమడ వాగు ఆధునికీకరణకు నిధులు కేటాయించలేదన్నారు.

వేలాడే తీగలు.. ప్రమాద హేతువులు

అంకమ్మనగర్ నాలుగో లైన్‌లో రహదారి పక్కన విద్యుత్తు సర్వీస్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా తయారయ్యాయి. చేతికి అందే ఎత్తులో ఉండడంతో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపించారు. అధికారులు స్పందించి తీగలు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

అధ్వానంగా దారి.. వెళ్లేదెలా మరి..

స్థానిక ఐడీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు గుంతలుగా ఉండడంతో పాటు కంకరరాళ్లు తేలి ఉండడంతో రాకపోకల సమయంలో రాళ్లు ఎగిరి పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదని, ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గోరంట్ల**

అప్రోచ్ లేక జనం అవస్థలు

ద్వారకానగర్ రెండో లైనులో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు పనులు పూర్తి చేసిన తర్వాత రోడ్డుకు ఇరువైపులా అప్రోచ్‌లు పోయకుండా వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. గృహాలు, అపార్ట్‌మెంట్‌ల నుంచి వాహనాలను రోడ్డుపైకి తీసుకురావాలన్నా, లోపలకు తీసుకెళ్లాలన్నా అగచాట్లు తప్పడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా అప్రోచ్ వేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గోరంట్ల**

రోడ్డుపై గుట్టలు.. రాకపోకలకు తిప్పలు

ఏటీ అగ్రహారం నాలుగో లైన్ సెయింట్ జాన్ లూథరన్ చర్చి దగ్గర భవన నిర్మాణ సామగ్రి వ్యర్థాలను రహదారి పైనే నిల్వ చేశారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఇలా రోజుల తరబడి నిల్వలు ఉంచినా నగరపాలక సంస్థ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై నిర్మాణ సామగ్రి వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

వివాహిత అదృశ్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వివాహిత ఒకరు అదృశ్యమైనట్లు అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బోరుగడ్డ దీప్తి అనే యువతికి బాపట్ల జిల్లా నగరం మండలం పెద్దగళ్లకు చెందిన దాసరి కల్యాణ్‌తో వివాహమైంది. ఆయన ముంబయిలో ఉద్యోగం చేస్తున్నారు. పది రోజుల క్రితం ఆయన అక్కడి నుంచి వచ్చి భార్య దీప్తిని సంజయ్‌గాంధీ నగర్‌లోని ఇంటి వద్ద దించి వెళ్లారు. ఈనెల 14న ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. కుమార్తె ఆచూకీ నిమిత్తం తండ్రి డేవిడ్ పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టాభిపురం రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న వేదపండితులు

అరండల్‌పేటలోని సోమసుందరేశ్వరస్వామికి పూజలు

శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

హరహర మహాదేవ.. శంభోశంకర..!

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం వేకువజాము నుంచి శివయ్యకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ శంభో శంకర.. అంటూ భక్తి శ్రద్ధలతో భక్తులు చేసిన శివనామస్మరణలు మిన్నంటాయి. పట్టాభిపురంలోని గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, అరండల్‌పేటలోని గంగా మీనాక్షి సమేత సోమసుందరేశ్వరస్వామి, శ్యామలానగర్‌లోని ఉమామహేశ్వరస్వామి, మారుతీనగర్‌లోని గౌరీశంకరస్వామి, చంద్రమౌళీశ్వర అగ్రహారంలోని చంద్రమౌళీశ్వరస్వామి, ధార్మిక ప్రాంగణంలోని శివలింగానికి భక్తులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గౌరీశంకరస్వామి దేవాలయంలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పూజలు చేశారు. శివయ్య దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పలు ఆలయాల్లో స్వామి కల్యాణోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. భక్తులు జాగారం చేస్తూ భక్తి శ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు.

మిర్చియార్డు సమీపంలోని కొత్త కాలనీలో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో గురుమాత శైలజమ్మ ఆధ్వర్యంలో మహాశివరాత్రి మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

స్వయంగా భక్తుల అభిషేకాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. అనంతరం భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు 9 మంది వేదపండితుల ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి, రుద్ర, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీ శంకరస్వామికి పూజలు

ఆకట్టుకున్న మహిళల కోలాటం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: గుజ్జనగుండ్ల శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం ప్రసన్నాంజనేయ కోలాట భజన మండలి రఘురాం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన ఉత్సాహంగా సాగింది.

భక్తి ప్రపత్తులతో నృత్య జాగరణ

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి శివరాత్రిని పురస్కరించుకుని శ్రీసాయి మంజీర కూచిపూడి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో శివపాద మంజీర నాదం పేరున నృత్య జాగరణ జరిగింది. గురువు కాజ వెంకట సుబ్రహ్మణ్యం శిష్య బృందం పలువురు ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు పలు నృత్యాంశాలను ప్రదర్శించారు. వెంకటగిరి నాగలక్ష్మి, తాళ్లూరి ధరణి, పచ్చల నాగమహిత తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గుంతలు పూడ్చరు.. వెతలు తీర్చరు..

నగరంలో ఇష్టారాజ్యంగా సాగుతున్న తవ్వకాలతో ప్రజలు నానా అగచాట్లకు గురవుతున్నారు. తాగునీటి సరఫరా పైపులైన్ల ఏర్పాటు, పాతలైన్లలో ఏర్పడే లీకులకు మరమ్మతులు, మురుగు కాలవల నిర్మాణం తదితర పనుల కోసం గుత్తేదారులు గుంతలు తవ్వి వదిలేస్తున్నారు. రోజుల తరబడి రోడ్లపైన మట్టికుప్పలు తీయడంలేదు. అరండల్‌పేట పోలీసు స్టేషన్ పక్క నుంచి మాజేటి గురవయ్య ఉన్నత పాఠశాల వైపు వచ్చే దారిలో వారం రోజుల క్రితం తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం గుంత తవ్వారు. తవ్విన మట్టిని కుప్పగా రోడ్డు మధ్యలో పోశారు. పోలీసు స్టేషన్ పక్కన పైపులైన్‌కు మరమ్మతులు చేసి గుంతలు పూర్తిగా పూడ్చకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనులతో నగర వాసులకు ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుంటూరు నగరం**

రోజులుగా రోడ్డుపైన మట్టికుప్ప

స్టేషన్ సమీపంలో గుంతలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : రోడ్డుప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమూరుకు చెందిన హర్ష(25) నగరంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆదివారం హర్ష ద్విచక్రవాహనంపై కంకరగుంట పైవంతెన మీద నుంచి పట్టాభిపురం వైపు వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి రోడ్డు విభాగినిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పశ్చిమ ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారు డ్రైవర్ బలవన్మరణం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : కారు డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన వెంకటేష్(25) కారు డ్రైవర్. ఇతనికి ఇన్‌స్టాగ్రామ్‌లో నల్లపాడుకు చెందిన సురేష్‌తో పరిచయమై.. స్నేహంగా మారింది. కొద్ది రోజుల కిందట వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి సురేష్ తనతో మాట్లాడడం లేదని వెంకటేష్ బాధపడుతున్నాడు. ఈక్రమంలో శనివారం రాత్రి వెంకటేష్ తన ఇంటి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లెక్క లేదు.. పత్రం ఉండదు

పక్కదారి పడుతున్న తాగునీటి ట్యాంకర్లు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే

వేసవి సమీపిస్తున్న కొద్దీ నగరంలో తాగునీటి ఎద్దడిపై పలుప్రాంతాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. శుద్ధజలం సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాల్లో, రిజర్వాయర్లు దూరంగా ఉండే శివార్లలో ఇబ్బందుల్లేకుండా ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో పేదల కాలనీలు, శివార్లకు సరఫరా పేరుతో ట్యాంకర్లను పక్కదారి పట్టిస్తున్నారు.

సంవత్సరాల తరబడి పాతుకుపోయిన ఒప్పంద ఉద్యోగులతో కలిసి కొందరు అధికారులు ట్యాంకర్ల సరఫరాదారులతో కుమ్మక్కై అక్రమాల దందా కొనసాగిస్తున్నారు. గతంలో కమిషనర్ పర్యటనకు వెళ్లిన సందర్భంలో బీఆర్ స్టేడియం రిజర్వాయర్ పరిధిలో కాలనీకి వెళ్లే ట్యాంకర్లను రికార్డులో నమోదు చేయకపోవడంతోపాటు పక్కదారి పడుతున్నట్లు గుర్తించారు. అక్కడ పనిచేస్తున్న ఏఈని ప్రభుత్వానికి సరెండర్ చేసి.. ఇరువురు ఒప్పంద ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఇలాగే హెచ్‌ఎల్‌ఆర్, స్తంభాలగరువు, నల్లచెరువు పరిధిలోని రిజర్వాయర్ల వద్ద ట్యాంకర్లు పక్కదారి పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారులు ఈ వ్యవహారంపై పక్కాగా నిఘా ఏర్పాటు చేయాల్సి ఉంది. పేదల కాలనీలకు, జీఎంసీ అభివృద్ధి పనుల కంటూ తీసుకెళ్తున్న ట్యాంకర్లను ప్రైవేటు మెస్‌లు, హోటల్స్, అపార్టుమెంట్లకు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా ఈదందాపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

హెచ్‌ఎల్‌ఆర్ వద్ద నీటిని పట్టుకునేందుకు వచ్చిన ట్యాంకర్లు

ఇలా చేస్తే మేలు..

తాగునీటి ట్యాంకర్ల పక్కదారిని అరికట్టేందుకు గతంలో 'డయల్ ఏ ట్యాంకర్' విధానం రూపొందించి అమలు చేశారు. రిజర్వాయర్ల వద్ద పట్టుకునే ప్రతి ట్యాంకర్‌కు పక్కాగా ఆన్‌లైన్‌లో చలానాలు చెల్లిస్తేనే నీరు పట్టుకునేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం కొన్ని ట్రాక్టర్లు 4 కేఎల్, లారీలు 12 కేఎల్ ఒకటి, రెండు చలానాలు తీసుకుని వాటికి అదనంగా మరో రెండు, మూడు ట్రిప్పుల నీటిని అక్కడి సిబ్బందితో కుమ్మక్కై తరలిస్తున్నారు. ట్యాంకర్ల దందాను అరికట్టేందుకు డయల్ ఏ ట్యాంకర్‌ను పునరుద్ధరించి డీఈఈ, ఏఈ స్థాయి అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించాల్సి ఉంది. దీంతోపాటు రిజర్వాయర్ల వద్ద ట్యాంకర్లు నీరు పట్టుకునే వాల్వ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా దందాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు వీలుంటుందని పలువురు సూచిస్తున్నారు. దీంతోపాటు ప్రతి ట్యాంకర్ రికార్డుల్లో నమోదయ్యేలా అధికారుల పర్యవేక్షణ పెంచి జీఎంసీ నుంచి తిప్పుతున్న ట్యాంకర్లకు వెహికల్ ట్రాకింగ్ మిషన్లను పక్కాగా ఏర్పాటు చేసేలా చూడాలి.

యోగా విన్యాసాలు.. గాన కచేరీలు..

మహాశివరాత్రి వేడుకలు వీక్షిస్తూ జాగరణ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వేడుకలు ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు భక్తులు. సద్గురు ఆధ్వర్యంలో కోయంబత్తూర్‌లో జరిగే మహాశివరాత్రి ప్రధాన కార్యక్రమాన్ని బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం రాత్రి నుంచి భక్తులు వీక్షించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సద్గురు ప్రత్యేకమైన మార్గదర్శక మెడిటేషన్లు, సంప్రదాయ నృత్యాలు, గాన కచేరీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, యోగా విన్యాసాలు, ఆదియోగి దివ్యదర్శనం తదితర కార్యక్రమాలను రాత్రంతా ఆధ్యాత్మిక వాతావరణంలో జాగారం చేస్తూ భక్తి పారవశ్యంలో ఓలలాడారు. పలువురు వైద్యులు, ఈశా వాలంటీర్లు, ప్రజలు కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తూ.. భజనలు చేస్తున్న చిన్నారులు, మహిళలు

వైభవంగా నృత్య కళాభారతి వార్షికోత్సవం

గుంటూరు సాంస్కృతికం: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం రాత్రి నృత్య కళాభారతి 27వ వార్షికోత్సవం నిర్వహించారు. పలువురు విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు నాట్యాచార్య ఎన్.బాలు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, పయనీర్ గ్రూప్స్ ఛైర్మన్ చుక్కపల్లి రమేష్, రాయపాటి మమత, వైఏస్ ప్రభాకర్, పద్మావతి దేవి, చాగంటి తదితరులు పాల్గొని సంస్థ నిర్వాహకులు నృత్య కళారంగానికి చేస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం కూచిపూడి నృత్య అధ్యాపకులు మట్టుపల్లి విశ్వం అతిథులు, నిర్వాహకులు సత్కరించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 76 మంది కళాకారులు విఘ్నరాజం భజే, గం గణపతి, జయ జనార్దన కృష్ణా, గోవర్ధన గిరిధారి వినాయక కౌత్తం, బ్రహ్మాంజలి, రామాయణ శబ్దం తదితర కీర్తనలకు అనుగుణంగా కూచిపూడి నృత్యాభినయం చేశారు. ఎన్.బాలు నవ్యశ్రీ నృత్య దర్శకత్వం చేశారు. బి.భువనేశ్వరి, తిన్నలూరి శ్రీహరిబాబు, తిరునగరం ప్రభాకరరావు, ధూళిపాళ్ల శ్రీనివాస శర్మ, పి.బాలాజీ వాద్య సహకారం అందించారు.

చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

(c) eenadu

ఈనాడు అమరావతి
కృష్ణా
సోమవారం ఫిబ్రవరి 16, 2026

మల్లేశ్వరుని కల్యాణం.. మురిసింది భక్తజనం

ఇంద్రకీలాద్రిపై కల్యాణ క్రతువులో మంగళసూత్రాలు చూపిస్తున్న అర్చకులు

రామలింగేశ్వరునికి హారతి

యనమలకుదురులో ప్రభల ఊరేగింపు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది. ప్రముఖ శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే కృష్ణానదీ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై గంగాపార్వతీ సమేత దుర్గామల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. యనమలకుదురులో ప్రభల ఊరేగింపు ఆకట్టుకుంది. - **ఈనాడు, అమరావతి**

పెదకళ్లేపల్లి: శ్రీ దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ఐలూరు: కృష్ణా నదిలో జల్లు స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

అంధకారంలోనే ప్రయాణం!

- రూ.40లక్షలతో సెంట్రల్ లైటింగ్ వేసేదెప్పుడో?
- తాడిగడప మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య ధోరణి

ఈనాడు, అమరావతి, కానూరు, న్యూస్‌టుడే

విజయవాడ నుంచి నిత్యం కానూరు సిద్ధార్థ పైవంతెన మీదుగా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం బందరు రోడ్డుకు ప్రత్యామ్నాయంగా మారిందీ దారి. కానీ రాత్రయితే పెనమలూరు పోలీస్‌స్టేషన్ నుంచి పైవంతెన మీదుగా తాడిగడప వందడుగుల రోడ్డు వరకూ చిమ్మచీకట్లు అలముకుంటున్నాయి. అత్యంత ప్రమాదకరంగా వాహనదారులు రాత్రివేళ పైవంతెన మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రాత్రి 7గంటల నుంచి తెల్లవారుజామున 5గంటల మధ్యలో భయం భయంగానే ఈ పైవంతెన మీద నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పైవంతెన ఆరంభమై ఏడాది దాటిపోయినా ఇంతవరకూ కనీసం ఒక్క వీధి దీపం కూడా ఏర్పాటు చేయలేదు. తాడిగడప మున్సిపల్ అధికారుల పనితీరుకు ప్రత్యక్ష నిదర్శనమిది.

వైకాపా హయాంలో ఐదేళ్లు ఆగిపోయిన కానూరు సిద్ధార్థ కళాశాల పైవంతెనను కూటమి ప్రభుత్వం రాగానే 2024 నవంబరులో తుది దశ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒకటి రెండు నెలల్లో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తామంటూ.. మున్సిపల్ అధికారులు ప్రకటించారు. రూ.40 లక్షలు కూడా మంజూరయ్యాయని తెలిపారు. రహదారికి పక్కనున్న డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే లైటింగ్ ఏర్పాటు చేస్తామంటూ తెలిపారు. పోలీసుస్టేషన్ నుంచి వందడుగుల రోడ్డు వరకు రూ.కోటిన్నరతో డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. సెంట్రల్ లైటింగ్ త్వరగా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతుంటే అధికారులు స్పందించడం లేదు.

రాత్రయితే పైవంతెనపై చీకటిలోనే సాగుతూ..

నిధులు ఎటువైపు మళ్లించేశారో..

సెంట్రల్ లైటింగ్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయంటూ గతంలో చెప్పిన అదే అధికారులు ఇప్పుడు నిధులు లేవని, పరిశీలిస్తున్నామంటూ సెలవిస్తుండడం గమనార్హం. ఆ నిధులను.. వేరే పనులకు మళ్లించేసినట్లు తెలుస్తోంది. నగరంతో శివారు ప్రాంతాలను కలిపే ప్రధానమైన అనుసంధానం కానూరు పైవంతెనే. అందుబాటులోకి వచ్చి 15నెలలు దాటుతున్నా.. చీకటిలోనే పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా.. యంత్రాంగంలో కనీస చలనం లేకపోవడం దారుణం.

పరిశీలించి.. నిర్ణయం తీసుకుంటాం..

-షేక్‌నజీర్, తాడిగడప మున్సిపల్ కమిషనర్

సిద్ధార్థ పైవంతనపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సంబంధించి ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. దీనిని పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకుంటాం. డ్రైనేజీ పనులు ఇటీవలే పూర్తయ్యాయి.

పీజీ మెడికల్ మాప్‌అప్ రౌండు సీట్ల వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కన్వీనర్ కోటా నాన్ సర్వీస్ కేటగిరీ మూడో విడత కౌన్సెలింగ్ (మాప్‌అప్) సీట్ల వివరాలను విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం వెల్లడించింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా ఆయా కళాశాలల్లో చేరాలని సూచించింది. తరగతులు గత ఏడాది డిసెంబరు 22వ తేదీ నుంచి మొదలైన విషయం తెలిసిందే.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఈ నెల 16న సోమవారం బందరు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తారని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదిక ఉంటుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమీపంలోని మండల, డివిజన్ కేంద్రాల్లో అర్జీలు సమర్పిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. కాల్ సెంటరులోని 1100 నంబరుకు కాల్ చేసి అర్జీలు నమోదు చేసుకోవడంతో పాటు వాటి స్థితిగతులను తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని సూచించారు.

చూస్తే బాగు.. తూస్తే తరుగు

మోసం చేస్తున్న వ్యాపారులు ✪ అరకొర తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు

ఈనాడు, అమరావతి

వినియోగదారుల అవగాహన రాహిత్యాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. బ్రాండెడ్ వస్తువుల పేరుతో నకిలీవి అంటగడుతున్నారు. ఎమ్మార్పీకి మించి అడ్డగోలుగా అమ్మేయడం.. తప్పుడు తరాజులతో బురిడీ కొట్టించడమే పరమావధిగా జేబులు నింపుకొంటున్నారు. తూనికలు కొలతల శాఖ అరకొర తనిఖీలతో మమ అనిపిస్తోంది.

దుకాణాల్లో తనిఖీలు చేస్తూ..

ఎందెందు వెతికినా...

★ పోరంకికి చెందిన రాజేశ్ ఫోన్ కొనేందుకు విజయవాడ ఎన్టీఆర్ కాంప్లెక్స్‌కి వెళ్లారు. కంపెనీ తయారీనే నిలిపేసిన శామ్‌సంగ్ గురు ఫోన్ ఇప్పటికీ అక్కడ అమ్ముతున్నారు. రూ.1700 తీసుకుని నకిలీ ఫోన్ అంటగట్టారు. దానికి బిల్లు, వారంటీ, గ్యారెంటీ లేదు. ఫోన్లు, ఛార్జర్లు, ఇయర్‌ఫోన్లు, బడ్స్ అన్ని ఇక్కడ దొరుకుతాయి. అసలైన బ్రాండ్ వస్తువుల్లా ఉండే నకిలీ వస్తువులను మాయ చేసి అమ్మేసి దోచేస్తున్నారు.

జిల్లా	నమోదైన కేసులు	రూ.లక్షలు జరిమానా
ఎన్టీఆర్	831	58.7
కృష్ణా	749	35.6
మొత్తం	1,580	94.3

★ అర్జునరావు కానూరులోని మాంసం దుకాణంలో కిలో మటన్ కొన్నారు. దుకాణంలో తూకంలో కిలోకి 7 గ్రాములు ఎక్కువే ఉంది. అనుమానంతో రైతుబజార్‌లోని మార్కెటింగ్‌శాఖ తరాజులో తూకం వేస్తే 897 గ్రాములే ఉంది. ఉమ్మడి జిల్లాలో 50శాతం పైగా దుకాణాల్లో ఇలాగే దోపిడీ చేస్తున్నారు. ఎలక్ట్రికల్ కాటాల్లో కేజీల మోడ్‌ను లీటర్లుగా మార్చి ఏమారుస్తున్నారు.

★ ఆటోనగర్ బస్టాండ్ సమీపంలోని ఓ శీతల పానీయాల దుకాణంలో రూ.10 శీతల పానీయం సీసాకు రూ.15 వసూలు చేస్తున్నారు. అంటే వారికి కంపెనీ ఇచ్చే మార్జిన్ కంటే రూ.50శాతం అదనం. ఉమ్మడి జిల్లాలో లెక్కకు మించిన దుకాణాల్లో ఇదే పరిస్థితి. విజయవాడ పీఎన్‌బీఎస్ మొదలు ఉమ్మడి జిల్లాలో చాలా బస్టాండ్లలో తాగునీరు, మజ్జిగ, లస్సీ, స్నాక్స్ ఏ వస్తువైనా ఎమ్మార్పీకి మించే వసూలు చేస్తున్నారు.

వాటివైపు చూడరేం..

☆ జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫిర్యాదులు మినహాయిస్తే.. బంగారం దుకాణాలు, పెట్రోలు బంకుల్లో తనిఖీల్లేవు. ఉమ్మడి జిల్లాలో 28 మంది సిబ్బందికి 12 మందే ఉన్నారు. మోసాలు ఎలా గుర్తించాలో ప్రజల్లో అవగాహన కల్పించడం లేదు. మోసం జరిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలన్న కనీస పరిజ్ఞానం లేదు.

☆ కొలతల్లో తేడాలు, ఇతర మోసాలపై వినియోగదారులు 1917 నంబరుకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా తూనికలు కొలతలశాఖ ఉప నియంత్రికులు బి.సాయిరామ్ తెలిపారు.

ఒకటే ఊరు.. రెండు పేర్లు..

గోడపై బాపులపాడు, హనుమాన్ జంక్షన్..

ఒకే గ్రామానికి రెండు పేర్లు ఉండటమనేది బహుశా ఎక్కడా ఉండదు. గతంలో ఒక పేరు ఉండి, మార్పు, చేర్పుల తర్వాత మరొక పేరు వాడుకలోకి రావడం చాలా ప్రాంతాల్లో చోటుచేసుకుంది. కానీ బాపులపాడు గ్రామం రెండు పేర్లతో చెలామణిలో ఉండడం ఆసక్తికరమే. బాపులపాడు కొన్ని దశాబ్దాల నుంచి హనుమాన్‌జంక్షన్‌గా ప్రాచుర్యం పొందుతోంది. నాలుగు రోడ్ల కూడలి ఉండడం, అభయాంజనేయస్వామి కొలువుదీరడంతో క్రమేణా హనుమాన్‌జంక్షన్‌గా మారిపోయింది. మండల కేంద్రంగా ఉండడంతో ప్రభుత్వ రికార్డులు, అధికారిక వ్యవహారాల్లోనూ ఇప్పటికీ బాపులపాడు పేరుతోనే కార్యకలాపాలు కొనసాగుతుంటాయి. బ్యాంకులు, ఆర్టీసీ బస్టాండ్, తపాలా కార్యాలయం మాత్రం హనుమాన్‌జంక్షన్ పేరుతో ఏర్పాటయ్యాయి. దీంతో ఇటీవల శివారులో నిర్మించిన స్వాగత గోడపై రెండు పేర్లతోనూ సూచికలు ఏర్పాటు చేయడం గమనార్హం. **- హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే**

అద్దె ఫోన్ నంబర్లతోనే వ్యవహారాలు

మ్యూల్ ఎకౌంట్స్ కేసులో బయటకొస్తున్న కోణాలు

ఈనాడు, అమరావతి

పోలీసులకు తమ జాడ ఎక్కడా దొరక్కుండా నిందితులు 'అద్దె' నంబర్లను ఉపయోగించారు. చట్టవిరుద్ధ లావాదేవీలు, సంభాషణలు, సందేశాలకు ఈ నంబర్లపైనే ఆధారపడ్డారు. నిందితులు ఉపయోగించిన నంబర్ల కాల్ రికార్డ్స్ తీసిన పోలీసులు షాక్ తిన్నారు. ఆ నంబర్లు ఏవీ నిందితులకు సంబంధించినవి కాకపోవడమే దీని కారణం. వాటితోనే మ్యూల్ వ్యవహారాలు నడిపించారు. విజయవాడలో గతవారం వెలుగుచూసిన మ్యూల్ ఎకౌంట్ల వ్యవహారంలో పలు కోణాలు వెలుగులోకి వస్తున్నాయి.

ఆ నంబర్లతోనే అన్నీ.. ఈ కేసులో అరెస్టయిన కీలక నిందితులు రవికుమార్ (ఏ1), అతని సోదరుడు స్టీవెన్ (ఏ2).. యనమలకుదురులోని చిన్నగదిని అద్దెకు తీసుకుని డిజిటల్ మార్కెటింగ్ పేరుతో అద్దె ఖాతాల వ్యవహారాలను నడిపించారు. గత తొమ్మిది నెలలుగా ఇక్కడి నుంచే చెన్నైలోని తమ బంధువుకు చెప్పినట్లు చేసేవారు. చెన్నైలో ఉన్న సూత్రధారి జాడ ఇంతవరకు బయటకు రాలేదు. అనామకులతో ఖాతాలు తెరిపించిన సమయంలోనే వారి నుంచి సిమ్‌లు తీసుకున్నారు. ఆ ఖాతాలకు ఈ నంబర్లను లింక్ చేయించారు. సూత్రధారితో నిందితులు అద్దె ఖాతాలు తెరిపించిన వారి సిమ్‌లతోనే సంభాషణలు సాగించారు.

బ్యాంక్ స్టేట్‌మెంట్లు వస్తేనే.. నిందితులు స్థానికంగా మొత్తం 36 బ్యాంకు ఖాతాలు తెరిపించారు. వీటిలో పొదుపు, కరెంట్ ఖాతాలు ఉన్నాయి. ఇవి కాకుండా చెన్నై నుంచి ఇచ్చిన 113 ఖాతాల ద్వారా కూడా ఏ1, ఏ2 లావాదేవీలు నిర్వహించినట్లు తేలింది. స్థానిక ఎకౌంట్లలో పడిన సొమ్మును.. బదిలీ చేసేందుకు ఇతర ఖాతాలను కూడా సూత్రధారి ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. పోలీసులు ఇప్పటికే సంబంధిత బ్యాంకులకు వివరాల కోసం లేఖలు రాశారు. ఇవి వస్తేనే ఏయే ఖాతాల నుంచి లావాదేవీలు జరిగాయి? ఎక్కడికి ఈ సొమ్ము అంతిమంగా తరలింది? చివరి లబ్ధిదారులు ఎవరు? అన్న వివరాలు తెలిసే అవకాశం ఉంది.

కస్టడీకి తీసుకుంటే వివరాలు

నిందితులు వారు నిర్వహించిన రోజువారీ లావాదేవీల వివరాలను ల్యాప్‌టాప్‌లో గూగుల్ షీట్‌లో నమోదు చేసేవారు. అవి చెన్నైలోని సూత్రధారికి వెళ్తుంటాయి. నిందితులను అదుపులోకి తీసుకున్న సమయంలో పోలీసులు ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీంతో అసలు సూత్రదారి.. గూగుల్ క్లౌడ్‌లో ఉన్న ఆ వివరాలను తొలగించడంతో ల్యాప్‌టాప్‌లోనూ వివరాలు డిలీట్ అయ్యాయి. రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు త్వరలో కస్టడీకి తీసుకోనున్నారు. చెన్నైలోని వ్యక్తి పైన ఎవరున్నారు?.. తదితర వివరాలు వీరిని లోతుగా విచారిస్తేనే తెలిసే అవకాశం ఉంది.

కనకదుర్గమ్మ వారధిపై తప్పిన ప్రమాదం

కంటెయినర్ నుంచి ఊడిపడిన డీజిల్ ట్యాంకు ✪ 3 కి.మీ మేర నిలిచిన ట్రాఫిక్

భారీగా నిలిచిపోయిన వాహనాలు

తాడేపల్లి, మంగళగిరి అర్బన్, కృష్ణలంక, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని కనకదుర్గమ్మ వారధిపై ఆదివారం మధ్యాహ్నం భారీ ప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న భారీ కంటెయినర్ లారీ డీజిల్ ట్యాంకు బోల్టులు విరిగి ఒక్కసారిగా ఊడిపోయింది. దీంతో కంటెయినర్ నిలిచిపోయింది. ఆ సమయంలో వెనుక ఎలాంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 వరకు సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. శివరాత్రి పర్వదినం నేపథ్యంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో విజయవాడ వైపు సుమారు 3 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. తాడేపల్లి, విజయవాడ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కంటెయినర్‌ను బయటకు తీసుకువచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదే సమయంలో వారధిపై వెళ్లే మార్గంలో మరో కారు మొరాయించి ఆగిపోయింది.

వారధిపై నిలిచిన కంటెయినర్

ఊడిపడిన డీజిల్ ట్యాంక్

అశోక్ లేల్యాండ్ నకిలీ విడిభాగాల అమ్మకాలు

★ ఆటోనగర్‌లోని 3 దుకాణాల్లో పోలీసుల సోదాలు
★ షాపుల యజమానులపై కేసు నమోదు

ఈనాడు, అమరావతి: ఆటోనగర్‌లో నకిలీ స్పేర్‌పార్ట్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ అశోక్ లేల్యాండ్‌కు సంబంధించి నకిలీ విడిభాగాలు విక్రయిస్తున్న మూడు దుకాణాలపై పోలీసులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న సోనీ మోటార్ పార్ట్స్, వీరా క్లచ్ సెంటర్, విజయకృష్ణ ఆటోమొబైల్స్‌లో కంపెనీకి చెందిన నకిలీ స్పేర్ పార్ట్స్ అమ్ముతున్నట్లు, కంపెనీ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని అశోక్ లేల్యాండ్‌కు చెందిన ప్రతినిధి నితూకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు ఆటోనగర్‌లోని ఈ దుకాణాల్లో శనివారం రాత్రి తనిఖీలు చేశారు. పలు విడిభాగాలు దొరికాయి. ఇవి అసలు వాటికి నకిలీలని గుర్తించారు. దీంతో ఆ దుకాణాల యజమానులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని 318 (4)తో పాటు కాపీరైట్ యాక్ట్‌లోని 63, 64 సెక్షన్లు, ట్రేడ్ మార్క్ చట్టంలోని 103, 104 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆటోనగర్‌లో ఇంకా ఎక్కడైనా దుకాణాల్లో ఈ తరహాలో నకిలీ విడిభాగాలు అమ్ముతున్నారా? అని విచారిస్తున్నారు.

నా ప్రాణం నువ్వే కన్నా.. నువ్వా పెట్టుకో నాన్నా..

గొల్లపూడి రహదారిలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న చిన్నారికి ప్రమాదం జరగకుండా హెల్మెట్ పెట్టడం హర్షణీయమే. కానీ బండి నడిపే వారూ శిరస్త్రాణం పెట్టుకుంటేనే ఇంటికి రక్ష అని గుర్తించాలి. **-ఈనాడు, అమరావతి**

విజయానందం...

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం శ్రీలంకలో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇండియా జట్టు విజయం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా విజయవాడ బెంజిసర్కిల్‌లో సంబరాలు చేసుకుంటున్న అభిమానులు. - ఈనాడు, అమరావతి

మాయమైన గతుకులు.. దారంతా తారు తళుకులు



కంకిపాడు మండలం వేల్పూరు నుంచి ఉప్పులూరు వెళ్లే మార్గం అడుగడుగునా గుంతలతో ప్రమాదకరంగా ఉండేది. 'దారంతా గుంతలే.. దాటాలంటే గంతులే..' శీర్షికన గతేడాది జులై 27న ఈనాడులో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన ప్రభుత్వం సుమారు 2 కి.మీ మేర పాత రోడ్డును తవ్వేసి కొత్తగా తారు రోడ్డు నిర్మించింది. గత ఐదేళ్లు నరకం అనుభవించిన చోదకులు రోడ్డు వేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. **-ఈనాడు, కృష్ణా**

లక్ష్యం శతశాతం.. సాధించేలా ఫలితం

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

పది పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. దీంతో పాటు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా కృషి చేస్తున్నారు.

వంద రోజుల ప్రణాళిక అమలు

పదిలో ఉత్తమ ఫలితాల సాధనలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గతేడాది డిసెంబరు 6 నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌లుగా విభజించారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. వారిపై సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు దృష్టి సారించి ప్రత్యేకంగా బోధించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. రోజూ ఉదయం, సాయంత్రం గంట పాటు ప్రత్యేక తరగతులు, మాదిరి పరీక్షలతో ఎప్పటికప్పుడు వారి సామర్థ్యాలను పరిశీలించి మెరుగయ్యేలా చర్యలు తీసుకున్నారు.

ఏడాది	ఉత్తీర్ణత %
2022-23	74.67
2023-24	90.05
2024-25	85.32

ఎలా చదవాలనే దానిపై..

జిల్లాలో డీఈవో యూవీ సుబ్బారావు చొరవతో ప్రత్యేకంగా రిసోర్సుపర్సన్ల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా తర్ఫీదు అందిస్తున్నారు. ఇందుకోసం మచిలీపట్నంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సబ్జెక్టుల వారీగా నిపుణులైన ఉపాధ్యాయులను రిసోర్సుపర్సన్‌లుగా ఎంపిక చేశారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు డివిజన్ల వారీగా సబ్జెక్టు ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, పది విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ప్రధానంగా ఉపాధ్యాయులు సబ్జెక్టుల్లో ఏయే పాఠాలు చదివించాలి, ఏం చదివితే ఎన్ని మార్కులు వస్తాయో వివరిస్తున్నారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టడం, చెప్పలేకపోతే మళ్లీ వివరించి సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

148 కేంద్రాల్లో పరీక్షలు

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో పరీక్షా కేంద్రాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. బందరు డివిజన్‌లో 53, గుడివాడ 45, ఉయ్యూరు డివిజన్‌లో 50 చొప్పున మొత్తం 148 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి కృష్ణా జిల్లా ముందంజలో ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీఈవో సుబ్బారావు తెలిపారు

హాజరవుతున్న విద్యార్థులు

డివిజన్	రెగ్యులర్	ప్రైవేటుగా..
బందరు	7,624	255
గుడివాడ	6,518	337
ఉయ్యూరు	7,154	318
మొత్తం	21,296	910

కియోస్క్ మెషిన్ల ద్వారా టికెట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ప్రయోగాత్మకంగా టెంపుల్ కియోస్క్ మెషిన్ల ద్వారా దర్శనం, ప్రసాదం, సేవల టికెట్లను భక్తులు నేరుగా తీసుకునే విధానాన్ని ఆదివారం ప్రారంభించారు. కరూర్ వైశ్యా బ్యాంక్ అధికారులు ఏర్పాటు చేసిన మెషిన్లు కనకదుర్గానగర్, లిఫ్టులు, ఘాట్ రోడ్డు మార్గంలో సమాచారం కేంద్రం వద్ద వీటిని ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వీటి పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత ఎన్ని దర్శనం టికెట్లు కావాలో ఎంటర్ చేస్తే దానికి సంబంధించిన మొత్తం భక్తుడి ఖాతా నుంచి కట్ అయిన వెంటనే టికెట్ బయటకు వస్తుంది. దాన్ని తీసుకొని భక్తుడు దర్శనం చేసుకోవచ్చని ఈవో తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఏసీ రంగారావు, సూపరింటెండెంట్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు

టికెట్ తీసుకుంటున్న భక్తుడు, పక్కన ఈవో శీనానాయక్, ఏసీ రంగారావు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

రామలింగేశ్వరా రక్షమాం..

యనమలకుదురు శివాలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తులకు ఉచితంగా పులిహోర, లడ్డూ ప్రసాదం పంపిణీ

కానూరు, యనమలకుదురు, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం గ్రామ మండపం వద్ద దేవస్థాన ప్రభకు ఎడ్లు కట్టి ఊరేగించారు. దీన్ని రూ.4,05,000 రావి భవిత్ పాట పాడి దక్కించుకున్నారు. ఉదయం నుంచే వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున భక్తులు గండదీపాలతో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

అట్టహాసంగా ప్రభోత్సవం..: శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ గిరిప్రదక్షిణకు ప్రభలు విద్యుత్తు దీపాలతో అట్టహాసంగా బయలుదేరాయి. పెద్ద ప్రభలు 41 ఉండగా, చిన్న ప్రభలు, చిన్నారులు చేసిన ప్రభలు మరో 20 వరకు గిరి సేవలో తరించాయి. రాత్రి మొత్తం ప్రభోత్సవం కొనసాగింది. ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా విద్యుత్తు శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

రామలింగేశ్వర స్వామి ప్రభ వద్ద పూజలు తిలకిస్తున్న జనాలు

ప్రముఖులు రాక..: స్వామి వారిని బందరు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దంపతులు, విజయవాడ నగర సీపీ రాజశేఖరబాబు, కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దంపతులు, కృష్ణా జిల్లా పూర్వపు ఎస్పీ గంగాధర్, దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, పలువురు పోలీసు, దేవాదాయ, రెవెన్యూ, విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్మోగిన శివనామ స్మరణ

నాగాయలంక, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా ప్రసిద్ధ సంగమేశ్వరంలో కొలువై ఉన్న శ్రీగంగా పార్వతీ సమేత శ్రీసంగమేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూల విరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. జగజ్యోతి, దివ్య కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కార్య నిర్వహణ అధికారి సీహెచ్ సుధాకరరావు, తదితరులు పర్యవేక్షించారు.

☛ కృష్ణాతీరాన శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక మహారుద్రాభిషేకాలు నిర్వహించారు. ఉదయం వేళ భక్తులు కృష్ణానదిలో పవిత్ర స్నానం ఆచరించి పితృదేవతలకు పిండప్రదానాలు జరిపారు.

నాగాయలంక శ్రీరామపాద క్షేత్రంలో రామలింగేశ్వరుడిని అభిషేకిస్తున్న భక్తులు

నాగాయలంక గణపేశ్వరంలో స్వామి వారికి భస్మాభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీరామపాద క్షేత్రంలో ఏర్పాటు చేసిన భారీ శివలింగాకృతి

ఐలూరు(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: దక్షిణకాశీగా పేరుగాంచిన ఐలూరులో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, తెదేపా జిల్లా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి, మండల తెదేపా అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రామినేని కుటుంబయ్య పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పమిడిముక్కల సీఐ చిట్టిబాబు ఆధ్వర్యంలో తోట్లవల్లూరు ఎస్సై కిషోర్, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఎం కుసుమకుమారి, ఎంపీడీవో రవికాంత్, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు.

భక్తులతో కిక్కిరిసిన ఐలూరు వీధి

నాగేశ్వరుని సేవలో...

పెదకళ్లేపల్లి(మోపిదేవి), న్యూస్‌టుడే: మహాశివరాత్రిని పురస్కరించి పెదకళ్లేపల్లి శ్రీదుర్గాపార్వతి సహిత నాగేశ్వరస్వామిని ఆదివారం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా కలెక్టర్ బాలాజీ, తూర్పుగోదావరి జిల్లా జడ్జి జస్టిస్ గంధం సునీత, ఆర్డీవో పోతురాజు తదితరులు దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు, డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, సీఐ ఈశ్వరరావు, ఎస్.ఐ గౌతమ్‌కుమార్, తహసీల్దార్ హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

లక్షమందికి పైగా పుణ్యస్నానాలు.. పెదకళ్లేపల్లి కృష్ణానదీ తీరాన దాదాపు లక్ష మందికి పైగా పుణ్యస్నానాలు ఆచరించారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. నది వద్ద ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలు, శివలింగానికి పూజలు చేశారు. స్వచ్ఛంద సంస్థలు అన్నదానం చేశాయి. పంచాయతీ సర్పంచ్ అరజా సంధ్యారాణి ఏర్పాట్లను సమన్వయం చేశారు. ☛ కె.కొత్తపాలెం శ్రీదుర్గాకోటేశ్వరస్వామి దేవాలయ నిర్వాహకులు రామిశెట్టి నాగలక్ష్మి దంపతులు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని మండలి వెంకట్రామ్ ప్రారంభించారు.

న్యాయమూర్తి జస్టిస్ గంధం సునీత కుటుంబం

నాగేశ్వరస్వామి సన్నిధిలో..

పెదకళ్లేపల్లి ఆలయానికి వచ్చిన కలెక్టర్ బాలాజీ

నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న అశేష భక్తులు

స్వామి సేవలో ఎంపీ బాలశౌరి

స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మండలి

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి విజయలక్ష్మి, కళాకారులు

కూచిపూడి శ్రీసిద్ధేంద్రయోగి నాట్యకళాపీఠం విద్యార్థులచే నృత్య ప్రదర్శన

శివయ్యకు కూచిపూడి నృత్య నీరాజనాలు

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేల్పయిన శ్రీబాలత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీసిద్ధేంద్రయోగి నాట్యకళావేదికపై ఆదివారం కూచిపూడి నృత్యాలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా హరిహర ఫైన్ ఆర్ట్స్(హైదరాబాద్) ఆధ్వర్యంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళారత్న పసుమర్తి రామలింగశాస్త్రి పర్యవేక్షణలో శ్రీవిజయదుర్గ నృత్యాంజలి డ్యాన్స్ అకాడమీ ఆచార్యులు తేజస్విప్రఖ్య, ప్రసన్నమోహన్ శిష్యులు పలు అంశాలను ప్రదర్శించారు. డాక్టర్ పసుమర్తి రామలింగశాస్త్రి శిష్యులు అఖిలాండేశ్వరి వందేవాణీ భవానీ ప్రదర్శించారు. నిర్మల నృత్య నికేతన్ డాక్టర్ నిర్మలా విశ్వేశ్వరరావు శిష్యులు పంచాక్షరి మహామంత్రం, కిరణ్మయి బోనాల శిష్యులు తూళ్లూరి శ్వేతి మహతి అమ్మ ఆనంద దాయిని పాహిమాం, శ్రీసిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠం విద్యార్థులు నమఃశివాయతే తరంగ నృత్యం చేశారు. మీనాక్షి ఇనిస్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ మోహనరావు శిష్యులు బ్రహ్మాంజలి, పుష్పాంజలి అంశాలను ప్రదర్శించారు. సర్పంచి కొండవీటి వెంకట రమణ విజయలక్ష్మి, వెంపటి సత్యప్రసాద్, దేవాలయ పాలకమండలి సభ్యుడు జ్యోష్యుల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గుడివాడలో గుండె జబ్బుల ఆసుపత్రి!

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో ప్రభుత్వం అనుమతులు వచ్చిన వెంటనే గుండె జబ్బుల ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కృషి చేస్తుందని గుడివాడ ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పాలడుగు వెంకట్రావు పేర్కొన్నారు. స్థానిక పెద ఎరుకపాడులోని శుభంకర మానవమహోదయ క్షేత్రంలో సంస్థ నిర్వాహకుడు రామిశెట్టి మురళీమోహన్ ఆదివారం ప్రజల ఆరోగ్యంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ పాలడుగు మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో పక్షవాతం రోగికి చేసే ఇంజక్షన్ అధిక రేటు ఉంటుందని, అందుకే రోగులను విజయవాడకు తరలిస్తున్నామన్నారు. రోగులు ఏదైనా కారణాల వలన ఆసుపత్రిలో చనిపోతే వైద్యులను బాధ్యులను చేయరాదని, దానికి వెనుకగల కారణాలు గుర్తించాలన్నారు. పట్టణంలో వైద్యులు నేత్రాలకు శస్త్ర చికిత్స చేస్తే ఎంత ఖరీదైన అద్దాలు వాడుతున్నారో చెప్పడం లేదని, ప్రతీ చిన్న విషయానికి పలు రకాల టెస్టులు రాస్తున్నారని, ఇవి ఎందుకు ఏ కారణం చేత చేయిస్తున్నారు, అవసరం ఎంతవరకూ ఉందో తెలపాలని మురళీమోహన్ వైద్యుల్ని కోరారు. కొవిడ్ అనంతరం డాక్టర్ల ఫీజులు భారీగా పెంచారని, మందులు కూడా వారి వద్దే కొనాలని ఆదేశిస్తున్నారని దీని వలన రోగులు నష్టపోతున్నారన్నారు. ఇంకా పలు అంశాలపై ఐఎంఏకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తెదేపా నేత లింగం ప్రసాద్, జనసేన నేతలు పాల్గొన్నారు.

డాక్టర్ పాలడుగు వెంకట్రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న మురళీ మోహన్ తదితరులు

లోక కల్యాణార్థం ధ్యానోత్సవం

గుడివాడ, న్యూస్‌టుడే: ధ్యానోత్సవం నిర్వహించడం ముదావహమని ప్రముఖ సినీ ఫైట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్ పేర్కొన్నారు. లోక కల్యాణార్థం గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీరమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం ధ్యానోత్సవాన్ని వారు ప్రారంభించారు. ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు రాజకుమారి మాట్లాడుతూ పిరమిడ్ ఉద్యమ వ్యవస్థాపకుడు సుభాష్ పత్రీజీ ఆశయ సాధనలో భాగంగా ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రబోధ్ అచ్యుత్ ధాన్యం ప్రాధాన్యతను వివరించారు. భీమవరానికి చెందిన పిప్పళ్ల ప్రసాదరావు బృందం సంగీతంతో అలరించారు. పలువురు నృత్య ప్రదర్శనలు, కోలాటం, చెక్క భజన, కర్రసాములతో ఆకర్షించారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, కమిటీ సభ్యులు లంకదాసరి ప్రసాదరావు, వల్లభనేని లక్ష్మీవర ప్రసాద్, విశ్రాంత ఐఏఎస్ అధికారి కాకొల్లు భస్మాకరరావు, తెదేపా నేతలు లింగం ప్రసాద్, చేకూరు జగన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న సినీ ఫైట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్

చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు

గుంటూరు(గోరంట్ల), న్యూస్‌టుడే: చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి రావడంతో తేలికగా ఉపశమనం పొందవచ్చని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్డులో స్కిన్ పర్ఫెక్ట్ హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఆసుపత్రి గుంటూరుకు రావడం హర్షణీయమన్నారు. డాక్టర్ మన్నె సింధూర మాట్లాడుతూ చర్మ సమస్యలకు లేజర్ టెక్నాలజీ, ఇమ్యునోథెరపి, కాస్మెటిక్, రికన్‌స్ట్రక్టివ్ విధానాలతో కూడిన చికిత్సలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. చర్మ వ్యాధులకు తక్కువ సమయంలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, ఉగ్రనరసింహారెడ్డి, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రవికుమార్.పి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకరరావు, రాష్ట్ర టెక్నాలజీ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, నగర డిప్యూటీ మేయర్ సజీల, వైద్యులు గొట్టిపాటి లక్ష్మి, ఉప్పటూరి అంజిత్, ఉప్పటూరి హేమంత్, లక్ష్మీప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

17న యూటీఎఫ్ ఆధ్వర్యంలో చలో విజయవాడ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశపెట్టినా కనీసం ఉద్యోగులు, పీఆర్సీ గురించి కనీస ప్రస్తావన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గవర్నర్‌పేటలోని కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని కానీ 20 నెలల కాలంలో ఒక డీఏతో రెండేళ్లు సరిపెట్టారని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా పోస్టుకార్డు ఉద్యమం, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం నుంచి పీఆర్సీ కమిషనర్ నియామకం గురించి ప్రస్తావన లేదన్నారు. మధ్యంతర భృతి 29 శాతం ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, బకాయిలు చెల్లించాలని, హెల్త్‌కార్డు, మెడికల్ బిల్లుల సమస్యలు తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రణభేరి 2.0 పేరుతో 17న చలో విజయవాడ చేపట్టామన్నారు. పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎం.సుందరయ్యలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మనోహర్‌కుమార్, పక్కన శ్రీనివాసరావు, సుందరయ్య

పూల్ సెమీస్‌లోకి 'కేఆర్‌యూ' నెట్‌బాల్ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల మైదానంలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల్లో ఆతిథ్య కృష్ణా విశ్వవిద్యాలయం (కేఆర్‌యూ) జట్టు పూల్ 'సి'లో సెమీ ఫైనల్‌లో ప్రవేశించింది. రెండో రోజైన ఆదివారం పోటీలు రసవత్తరంగా జరిగాయి. కృష్ణా వర్సిటీ జట్టు... మాధవ విశ్వవిద్యాలయం (రాజస్థాన్) జట్టుపై, ఆపై జేఎన్‌టీయూ (హైదరాబాద్) జట్టుపై గెలిచి పూల్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.

☛ పూల్ 'బి'లో అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్సిటీ (బిలాస్‌పూర్) జట్టు.. ఆదికవి నన్నయ్య వర్సిటీ (ఏపీ) జట్టుపై, రాజీవ్ గాంధీ ప్రౌద్యోగికి (ఎంపీ) జట్టు.. జనార్దన్ రాయ్ నగర్ రాజస్థాన్ విద్యాపీఠ్ (రాజస్థాన్)పై గెలిచింది.

☛ పూల్ సెమీస్‌లోకి 'కేఆర్‌యూ' నెట్‌బాల్ జట్టుపూల్ 'డి'లో కేరళ వర్సిటీ (కేరళ) జట్టు... డాక్టర్ భీమ్ రావ్ అంబేడ్కర్ (ఉత్తరప్రదేశ్) జట్టుపై, భారతీదాసన్ (తమిళనాడు) జట్టు... వీర్ నర్మద్ సౌత్ గుజరాత్ వర్సిటీ (గుజరాత్) జట్టుపై, మంగుళూరు (కర్ణాటక) జట్టు... కోటా (రాజస్థాన్) జట్టుపై, గోండ్వానా (మహారాష్ట్ర) జట్టు... ఉస్మానియా (తెలంగాణ) జట్టుపై, కాలికట్ (కేరళ) జట్టు... శివాజీ వర్సిటీ (మహారాష్ట్ర) జట్టుపై విజయం సాధించాయి.

☛ టీఎన్‌పీఈ (చెన్నై), సావిత్రిబాయి పులే (మహారాష్ట్ర), ఆర్‌టీఎన్‌ఎంయూ (మహారాష్ట్ర), హరియాణా స్పోర్ట్స్ (హరియాణా), హేమచంద్ యాదవ (ఛత్తీస్‌గఢ్), బెంగళూరు (కర్ణాటక), అటల్ బిహారీ వాజపేయీ (బిలాస్‌పూర్), కేరళ వర్సిటీ (కేరళ) జట్లు తమ ప్రత్యర్థి జట్లపై గెలిచాయి. పోటీలను తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కృష్ణా వర్సిటీ ఉపకులపతి కూన రాంజీ, రెక్టార్ మండవ వెంకట బసవేశ్వరరావు, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జె.నవీన లావణ్యలత, కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్యాసమ్మ పాల్గొన్నారు.

మంగుళూరు (కర్ణాటక), గోండ్వానా (మహారాష్ట్ర) వర్సిటీ జట్ల మధ్య మ్యాచ్

క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు అనురాధ

నేత్ర దానంతో మరో ఇద్దరికి చూపు

నాగాయలంక, న్యూస్‌టుడే: స్థానిక 9వ వార్డుకు చెందిన సబ్బినేని కామేశ్వరమ్మ (90) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కళ్లు మరో ఇద్దరికి చూపునిస్తాయని.. కుటుంబ సభ్యుల సహకారంతో సుదర్శి మానవత సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనగంటి నారాయణల ఆధ్వర్యంలో విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రాలను దానం చేశారు.

సబ్బినేని కామేశ్వరమ్మ

అమరావతిలో బిల్‌గేట్స్ పర్యటనకు ఏర్పాట్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే: గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించనున్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో ఆయన సమావేశం కానున్నారు. సచివాలయంలో ఆర్టీజీఎస్‌లో సాంకేతిక వినియోగం, రియల్ టైం గవర్నెన్స్ విధానం-ఫలితాలు, ఉండవల్లిలో రైతులతో సమావేశం, వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ల వినియోగం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి ఆదేశాల మేరకు అధికారులు బిల్‌గేట్స్ పర్యటించే మార్గాల్లో సుందరీకరణ పనులు చేపట్టారు. కృష్ణానది కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్డు(ఈ-3) పేజ్-1, 2.. రాష్ట్ర సచివాలయానికి వెళ్లే ఎన్-9 మార్గంలో సుమారు 10 కి.మీ. మేర రహదారులను శుభ్రపరిచారు. అతిథులను ఆకర్షించేలా డివైడర్లకు రంగులు వేస్తున్నారు. కరకట్టపై ఇరువైపులా మట్టిని చదును చేయించారు. వీఐపీలు ప్రయాణించే మార్గంలో ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి శుభ్రపరిచారు. కృష్ణా కరకట్ట, సీడ్‌యాక్సెస్ రోడ్డు, ఎన్-9 రోడ్డులో ఆహ్లాదకర పూల మొక్కలతో సుందరీకరిస్తున్నారు. ఏడీసీ ఇంజినీరింగ్, గ్రీనరీ విభాగం అధికారులు నిరంతరం పనులు పర్యవేక్షిస్తున్నారు.

ఉండవల్లిలో కలెక్టర్ పరిశీలన.. ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను బిల్‌గేట్స్, చంద్రబాబు తదితరులు పరిశీలించనున్న నేపథ్యంలో అధికారులు ఆమేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సమావేశ వేదిక, సీసీ కెమెరాలు, యాక్సెస్ కంట్రోల్ పాయింట్లు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్ల ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. గుంటూరు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడే డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారీ, రైతులతో సమావేశం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. క్షేత్ర పరిశీలనలో కలెక్టర్‌తో పాటు వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకురాలు ఎం.పద్మావతి, ఉద్యానశాఖ ఉపసంచాలకురాలు రవీంద్రబాబు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ఉండవల్లి వ్యవసాయ క్షేత్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

'బడ్జెట్‌లో పద్దులు సవరించాలి'

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్ రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీసేలా ఉందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లోని పద్దులను సవరించాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం బీసెంట్ రోడ్డులోని మహంతి మార్కెట్ వద్ద నిరసన తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చినట్లు, పరిశ్రమలు పెట్టినట్లు, యువతకు ఉపాధి కల్పించినట్లు మంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశం మొత్తంగా చూస్తే 25 శాతం పెట్టుబడులు మన రాష్ట్రానికే కుప్పలు తెప్పలుగా వచ్చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల ప్రసంగం సాగిందని ఎద్దేవా చేశారు. కానీ బడ్జెట్ చూస్తే మంత్రి చెప్పిన దానికి పూర్తి విరుద్ధంగా ఉందని ఏ రంగానికి నిధుల పెంపుదల లేదన్నారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న సంక్షేమ, వ్యవసాయ రంగాలకు నిధులు తగ్గించారని విమర్శించారు. ఉడిగం చేసే బడ్జెట్ అని విమర్శించారు. బుడమేరు ఆధునికీకరణకు నిధులు ఏవని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు కాశీనాథ్, రమణారావు, సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కాశీనాథ్, రమణారావు, సత్యబాబు తదితరులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - ఉ. 5

For Advertising on Eenadu FM Contact 8008003297

మచిలీపట్నం
•మచిలీపట్నం •పెడన

అన్ని రంగాల అభివృద్ధికి బడ్జెట్ తోడ్పాటు

బంటుమిల్లి: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్ ఉన్నట్లు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మల్లేశ్వరంలోని తెదేపా కార్యాలయం వద్ద బడ్జెట్‌పై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమలు, వైద్య, విద్య రంగాలతోపాటు మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. ఆర్థిక లోటులో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మండల పార్టీ కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు, డీసీ చైర్మన్ బొర్రా కాశీ, మల్లేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఓడుగు తులసీరావు, జిల్లా అధికార ప్రతినిధి కూనసాని చిన్న, భూపతి రమేష్, తెనాలి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

టమాట 14, వంగ 18, బెండ 26, పచ్చిమిర్చి 38, కాకర 32, క్యాబేజీ 16, క్యారెట్ 28, దొండ 44, బంగాళాదుంప 22, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుడు 26, దోస 26, సొర 10, అరటికాయ 7.6, చిక్కుళ్లు 30, బీర 26,చామదుంప 22,మునగ 08/10, కంద 36, బీట్‌రూట్ 24, కీరదోస 44, బీన్స్ 52, క్యాప్సికం 60, అలసందలు 24, బీరకాయదుంప 26కా, శ్రీరిక 12/06, పుదీనా 15/05 సోమవారం ఉదయం 7 గంటలవరకు ఈ ధరలు వర్తిస్తాయి. సమస్యలుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తిని 9182361295 ఫోన్ నంబరులో సంప్రదించొచ్చు. - మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

సినిమాలు

రేవతి: కపుల్‌ఫ్రెండ్లీ
సిరిపేట: సీతాపయనం
సిరికృష్ణ: మన శంకరవర ప్రసాద్ గారు
సిరివెంకట్: పంకి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందన : ✦ నగరంలోని జిల్లా కోర్టు కూడలి నుంచి నాయర్ బడ్డీ సెంటరుకు వెళ్లే రహదారి పక్కన ఉన్న చెత్తను తొలగించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. -మచిలీపట్నంకార్పొరేషన్,న్యూస్‌టుడే

ఎలాపురం వెంకయ్య మృతికి సంతాపం

మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే: శాసనమండలి మాజీ సభ్యులు ఎలాపురం వెంకయ్య మృతి పట్ల కృష్ణా జిల్లా రచయితల సంఘం సంతాపం ప్రకటించింది. సంఘానికి ఆత్మీయులుగా ఉండే ఆయన మృతి చెందారన్న సమాచారం ఎంతో దిగ్భ్రాంతి కలిగించిందని సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జి.వి.పూర్ణచంద్ పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

రైతులకు వరం

బంటుమిల్లి, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రైతాంగానికి వరమని బంటుమిల్లి డీసీ చైర్మన్ బొర్రా కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. నీటి సంఘాల అభివృద్ధికి సుమారు రూ. 18 వేల కోట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

నాడు ఇష్టారాజ్యం.. నేడు పట్టించుకోని రాజ్యం

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

బందరు నగరం

నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీ కాలం గడువు సమీపిస్తోంది. ఎన్నికల సంఘం కూడా స్థానిక సంస్థలకు సంబంధించిన ఓటరు జాబితాల తయారీపై ఆదేశాలు జారీ చేసింది. బందరు నగరంలో వైకాపా హయాంలో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికలకు ముందు వారికి ఇష్టం వచ్చినట్లు డివిజన్ల విభజన ఇష్టారాజ్యంగా చేశారు. అస్తవ్యస్తంగా మార్పులు చేయడంపై అప్పట్లోనే వివిధ పక్షాలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఇప్పటివరకు ఎలాంటి మార్పులు చేయకపోవడంతో నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ల సంఖ్యలో వ్యత్యాసం వేలల్లో

బందరు పురపాలక సంఘంగా ఉన్నప్పుడు 42 వార్డులు ఉండేవి. తెదేపా ప్రభుత్వం 2019లో నగరపాలక సంస్థగా మార్చి వాటిని 50 డివిజన్లుగా మార్చింది. ప్రస్తుతం 50 డివిజన్ల పరిధిలో దాదాపు 1,39,202 మంది ఓటర్లు ఉన్నారు. ఆతర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2021 మార్చిలో నగరపాలక సంస్థ ఎన్నికల సమయంలో డివిజన్ల విభజన అస్తవ్యస్తంగా చేసింది. తమకు అనుకూలంగా ఉండేలా నాటి పాలకులు మార్చారు. దీంతో ఒక డివిజన్ల జనాభాలో తీవ్ర వ్యత్యాసం కనిపించింది. 46వ డివిజన్‌లో ప్రస్తుతం 4,800 మంది ఓటర్లు ఉంటే 49వ డివిజన్‌లో కేవలం 1,600 మంది మాత్రమే ఉన్నారు. 35వ డివిజన్‌లోనూ 1800 మంది లోపే ఓటర్లు ఉన్నారు. ఇలా ఒక డివిజన్‌కు మరో డివిజన్ ఓటర్ల మధ్య వ్యత్యాసం వేల సంఖ్యలో ఉంది. అప్పట్లో తెదేపా, జనసేన బలంగా ఉన్న డివిజన్లను బలహీనం

అస్తవ్యస్తంగా బందరులో డివిజన్ల విభజన

చేయాలని ఇలా చేశారని ఆరోపణలు వచ్చాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లపై కూడా ఇది ప్రభావం చూపుతుందని ఆ సామాజిక వర్గ సంఘాల నాయకులు కూడా అధికారులకు అప్పట్లో వినతులు ఇచ్చినా అవి అటకెక్కాయి.

మార్పు చేయకపోతే ఇబ్బందులు

ఒక డివిజన్‌లో 4,500కు పైగా ఓటర్లుంటే.. ఐదు డివిజన్లలో 1500 వరకు, 33 డివిజన్లలో 2000, 11 డివిజన్లలో 3000 మంది ఓటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికీ డివిజన్ల మధ్య వ్యత్యాసాన్ని సరిచేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగే వదిలేస్తే పార్టీల గెలుపోటములు ఎలా ఉన్నా ప్రజలకు అందించే సేవలపై ప్రభావం చూపుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని నగర పౌరులు కోరుతున్నారు.

202 ట్రిప్పులు.. 10,500 మంది ప్రయాణికులు

బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా మచిలీపట్నం ఆర్టీసీ డిపోనుంచి వివిధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం నుంచే బస్సుల రాకపోకలు ప్రారంభించగా అన్ని బస్సులు కిక్కిరిసి ప్రయాణించాయి. పెదకళ్లేపల్లి, ఐలూరు, కృత్తివెన్నుతోపాటు విజయవాడకు కూడా సర్వీసులు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పెదకళ్లేపల్లి, ఐలూరుకు వేలాదిగా తరలివెళ్లారు. కొన్ని సర్వీసులు నిరంతరం నడిచాయి. ప్రయాణికులకు బస్సుల సమాచారం అందించి పర్యవేక్షించేలా ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ప్రయాణికుల సంఖ్యను బట్టి అప్పటికప్పుడు అదనంగా బస్సులు ఏర్పాటు చేయించి పుణ్యక్షేత్రాలకు పంపించేలా చర్యలు తీసుకున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి 8 గంటల వరకు మచిలీపట్నం నుంచి 202 ట్రిప్పులు వేయగా దాదాపు 10,500 మంది ప్రయాణం చేశారని డిపో మేనేజర్ టి.పెద్దిరాజు తెలిపారు. అవనిగడ్డ డిపో బస్సులు కూడా మచిలీపట్నం నుంచి రాకపోకలు సాగించినందున ప్రయాణికుల సంఖ్య మరింత ఎక్కువ ఉంటుందన్నారు.

అన్నప్రసాద వితరణ

మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మోటమర్రి హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కాలేఖాన్‌పేటలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, కార్పొరేషన్ సహాయ కమిషనర్ ఏపీ గోపాలరావు, 16, 38వ డివిజన్ కార్పొరేటర్లు చింతకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్ తదితరులు భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని అందజేశారు.

కాలువలో పూడిక.. మురుగు పారక!

నగరంలోని కొత్త హౌసింగ్‌బోర్డు కాలనీలో మురుగు కాలువ అంతా గుర్రపు డెక్కతో నిండి అధ్వానంగా ఉంటే.. కొందరు అందులో చెత్త, ఇతర వ్యర్థాలు వేసి పూడ్చేస్తున్నారు. దీంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. ఎప్పటినుంచో ఉన్న ఈ సమస్యను అధికారులు స్పందించి దాన్ని తొలగించడంతోపాటు వ్యర్థాలు డ్రైన్‌లో వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

గుర్రపు డెక్క, వ్యర్థాలతో..

బూడిద గుట్టలు.. కళ్లల్లో మంటలు

నగరంలోని డంపింగ్ యార్డు సమీపంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో దహనమైన చెట్ల కొమ్మలు కాలిపోయిన విషయం తెలిసిందే. ఇలా కాలిన కొమ్మలు బూడిద గుట్టలుగా మారాయి. వాటిని తొలగించకపోవడంతో గాలికి బూడిద కళ్లల్లో పడి మండుతున్నాయని స్థానికులతోపాటు, ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గుట్టలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

రహదారి పొడవునా దుమ్ము రేపుతూ..

విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథక విభాగం ఆధ్వర్యంలో ఆదివారం 30 మంది విద్యార్థులు బృందాలుగా ఏర్పడి బస్టాండ్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు. పేదలకు ఆహారపు పొట్లాలు అందిస్తున్న విద్యార్థులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు పర్యవేక్షించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం అలవడతాయని అన్నారు.

ఆహారపు పొట్లాలు అందజేస్తున్న విద్యార్థులు

జిల్లా క్రికెట్ జట్టులో బందరు బాలుడు

ధనదీప్

మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే: జిల్లా క్రికెట్ జట్టులో మచిలీపట్నానికి చెందిన బాలుడు చోటు దక్కించుకున్నాడు. బెల్ కంపెనీ ఉద్యోగి రామకృష్ణ దంపతుల కుమారుడైన ఆర్.ధనదీప్ ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో అసాధారణ ప్రతిభ చూపిన ధనదీప్ అండర్ 12 విభాగంలో జిల్లా క్రికెట్ జట్టులో స్థానం దక్కించుకున్నాడని జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) కార్యదర్శి ఎం.రవిచౌదరి తెలిపారు. ధనదీప్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి సహకార ఉద్యోగుల నిరవధిక సమ్మె

చల్లపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు సంఘం రాష్ట్ర నాయకుడు చంద్ర రవికుమార్, కృష్ణా జిల్లా అధ్యక్షులు తోట కృష్ణారావు చెప్పారు. ఆదివారం చల్లపల్లిలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అన్ని యూనియన్లు ఐక్యవేదిక (జేఏసీ) ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేసినా ప్రభుత్వం నుంచి సమస్యల పరిష్కారంపై ఎటువంటి స్పష్టమైన హామీలు రాలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2051 సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

స్వచ్ఛాంధ్ర నిధులు.. స్వచ్ఛ పెడనకు బాటలు

న్యూస్‌టుడే, పెడన

పెడనలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కంపోస్టు యార్డు సమస్యకు పరిష్కారం లభించింది. స్థానిక గుడివాడ రోడ్డులోఉన్న యార్డు ప్రక్షాళనకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రూ.43 లక్షలు విడుదల చేసింది. ఈ నిధులతో గుంటూరుకు చెందిన ఒక ఏజెన్సీ రీసైక్లింగ్ చేపట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. పట్టణంలోని 23 వార్డుల నుంచి రోజుకు 16 టన్నుల చెత్త సేకరించి కంపోస్టు యార్డుకు తరలిస్తారు. ఇలా డంప్ చేసిన చెత్తను రీసైక్లింగ్ చేయక టన్నుల కొద్దీ పేరుకుపోయింది. గత ప్రభుత్వంలో గుంటూరుకు చెందిన అవినాశ్ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ బిల్లులు రాక మొదట్లోనే పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రధాన రహదారికి పక్కగా రోడ్డుపైకి చెత్త వచ్చేసింది. ఇలా సమస్య రోజురోజుకూ పెరుగుతున్నా అప్పటి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. లేదు. ఆప్రాంతంలో తీవ్ర

కంపోస్టు యార్డులో సిద్ధమైన యంత్రాలు

కాలుష్య సమస్య ఏర్పడి పరిసర ప్రాంతాల ప్రజలు నివసించలేని దుస్థితి ఏర్పడింది. ఈ యార్డు ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది, రోగులు కూడా కాలుష్యం బారిన పడుతున్నారు. ఇలా సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

స్వచ్ఛాంధ్ర చైర్మన్ పర్యటన: ఇటీవల స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి పెడనలో పర్యటించి కంపోస్టు యార్డును పరిశీలించారు. ఇక్కడ అధ్వాన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన లెగసీ వేస్ట్ నిర్వహణకు రూ.43 లక్షలు విడుదల చేశారు. ఈనిధులతో గతంలో ఒప్పందం కుదుర్చుకున్న అవినాశ్ ఏజెన్సీ తిరిగి పనులు ప్రారంభించింది. ఈ యార్డులో దాదాపు 15 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పేరుకున్నాయని అంచనా వేశారు. ముందుగా 5 వేల మెట్రిక్ టన్నులను రీసైక్లింగ్ చేసి వ్యర్థాలను రోడ్ల నిర్మాణం, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. దశలవారీగా మిగిలిన వ్యర్థాలను కూడా రీసైక్లింగ్ చేపడతామని ఇటీవల ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు.

రెండ్రోజుల్లో పనులు

మున్సిపల్ పబ్లిక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతాయి. ఇప్పటికే ఏజెన్సీకి అవసరమైన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ సిద్ధం చేశాం. వ్యర్థాల పరిమాణాన్ని తెలుసుకునేందుకు తూకపు యంత్రం ఏర్పాటుచేశాం. యంత్రాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. రెండ్రోజుల్లో పనులు మొదలుపెట్టి స్వచ్ఛ పెడనకు బాటలు వేస్తాం.
- ప్రవీణ్, డీఈఈ, పబ్లిక్ హెల్త్, మచిలీపట్నం

కూలేలా స్తంభం.. నిత్యం భయం!

జిల్లా పరిషత్ కూడలిలో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైటు స్తంభం వాలిపోయి ప్రమాదకరంగా మారింది. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఆ ప్రాంతంలో అది ఎప్పుడు కూలి మీద పడుతుందోనని వాహనదారులు, పాదచారులు భయపడుతున్నారు. ప్రస్తుతం అడుగు భాగం వంగి కూలిపోయేలా తయారైంది. స్తంభం తొలగించడం లేదా, వాలకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

వాలిపోతున్న స్తంభం

త్రినేత్రుడికి రుద్రకవచం బహూకరణ

పెదప్రోలు(మోపిదేవి), న్యూస్‌టుడే: మహాశివరాత్రిని పురస్కరించి పెదప్రోలులో కొలువుదీరిన శ్రీదుర్గానాగ మల్లేశ్వరస్వామికి గ్రామానికి చెందిన యన్నం శ్రీనివాసరావు దంపతులు ఇత్తడితో రుద్రకవచాన్ని తయారు చేయించారు. ఆదివారం రాత్రి ఆలయ నిర్వాహకుల ద్వారా స్వామికి అలంకరించారు.

బందరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహావిరాట్‌స్వరూపుడైన శివుడు

పెడన: అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

పెడన: కంకటావ కాశీవిశ్వేశ్వర ఆలయంలో భక్తుల కోలాహలం

నాగులేరు వద్ద వాయినాలు మార్చుకుంటున్న మహిళలు

బచ్చుపేట మల్లేశ్వరస్వామి

జోడుగుళ్ల ఆలయంలో కల్యాణ పూజలు చేస్తున్న దంపతులు

శివోహం

ప్రత్యేక అలంకరణలో బలరామునిపేట కాశీవిశ్వేశ్వరస్వామి

ప్రత్యేక పూజలు అందుకున్న రసలింగేశ్వరస్వామి

మచిలీపట్నం(గొడుగుపేట): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని శైవక్షేత్రాలు అన్నీ శివనామస్మరణతో ప్రతిధ్వనించాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే నాగులేరులో శివరాత్రి పవిత్రస్నానాలు ఆచరించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్నానఘట్టాల వద్ద భక్తులు పుణ్యస్నానమాచరించి, పితృదేవతలకు పూజలు నిర్వహించి పిండ ప్రదానాలు చేశారు. పుణ్యస్నానమాచరించిన అనంతరం సమీపంలోని రసలింగేశ్వరస్వామి ఆలయం, శివగంగ, చింతగుంటపాలెం శివాలయం, తదితర ఆలయాల్లో భక్తులు దైవదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు బారులుతీరి దైవదర్శనం చేసుకున్నారు. ఆలయంలో మహావిరాట్‌స్వరూపుడైన స్వామివారికి హారతులు ఇవ్వడంతోపాటు పూజలుచేశారు. గాంధీబొమ్మ శివాలయం, బచ్చుపేట శివాలయం, ఖొజ్జిల్లిపేట నాగేంద్రస్వామి, గొడుగుపేట శాంతామల్లేశ్వరస్వామి, బలరామునిపేట అన్నపూర్ణాసహిత కాశీవిశ్వేశ్వరాలయంతోపాటు పలు ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేశారు.

గుడిదిబ్బ(కృత్తివెన్ను),న్యూస్‌టుడే: కృత్తివెన్ను మండలం గుడిదిబ్బ శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో మారుమోగింది. ఆదివారం వేకువజామునుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. తెల్లవారుజామున 3గంటలనుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు ఆలయం భక్తజనంతో నిండిపోయింది. ఆలయంలో శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వరస్వామికి పురోహితుడు కోట మురళీకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్-శిరీషా దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వరస్వామిని,శ్రీరామసత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో టి.టి.డి.కల్యాణ మండప ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

పెదతుమ్మిడిలో అగస్త్యేశ్వరస్వామి

గూడూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలపరిధిలోని ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో ఆదివారం భక్తులు విశేషపూజలు నిర్వహించారు. మండలంలో ప్రసిద్ధి చెందిన కంకటావ శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్, జడ్పీటీసీ మాజీ సభ్యులు బూరగడ్డ శ్రీకుమార్,పలువురు ప్రముఖులు పూజల్లో పాల్గొన్నారు. గూడూరు రామలింగేశ్వరస్వామి, మల్లవోలు చెన్నకేశ్వరస్వామి, మద్దిపట్ల మల్లికార్జునస్వామి, తరకటూరు కాశీవిశ్వేశ్వరస్వామి, ఐదుగుళ్లపల్లి సోమేశ్వరస్వామి తదితర శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. రామరాజుపాలెంలోని కాలువ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

పెడన, న్యూస్‌టుడే: స్థానిక శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవ వేళ ఏకాదశ రుద్రాభిషేకాన్ని ప్రధాన పూజారి గూడూరి అగస్త్యయ్య ఆధ్వర్యంలో జరిపారు. మడకలోని శ్రీగంగా పార్వతీ సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో పూజారి గుగ్గిలం కన్నయ్య శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గూడూరు మండలం కంకటావలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, పోలవరపుపేట శివాలయ కమిటీల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధనలు జరిగాయి.

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బంటుమిల్లి, చిన్నతుమ్మిడిలోని గంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామి, పెదతుమ్మిడిలోని శ్రీ పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి, ముల్లపద్రులో నాగేంద్ర స్వామి, ఆముదాలపల్లిలోని రామలింగేశ్వరస్వామి, అర్తమూరు, కంచడం, మల్లపరాజుగూడెం శివాలయాలలో విశేష పూజలు జరిగాయి. పలు ఆలయాలలో లింగోద్భవ సమయంలో పంచామృతాలతో శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీపెన్నమ్మ తల్లి పంచరాత్ర మహోత్సవాలు.

మాట్లం-పెన్నమ్మదిబ్బ(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: మండలంలోని మాట్లం-పెన్నమ్మ దిబ్బ గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీపెన్నమ్మ అమ్మవారి పంచరాత్ర మహోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారి రేవు దానామూర్తి దంపతులు పీటలపై కూర్చొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గుడిదిబ్బ నాగేశ్వరస్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ దంపతులు

వైభవంగా కల్యాణమహోత్సవాలు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా పలు దేవాలయాల్లో ఆదివారం సాయంత్రం కల్యాణమహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. నగరంలోని జోడుగుళ్ల ఆలయంలో శివకల్యాణ మహోత్సవం, గాంధీ బొమ్మ శివాలయంలో శాంతి కల్యాణం నిర్వహించగా దంపతులు అధికసంఖ్యలో పాల్గొని పూజా క్రతువులు జరిపించారు. పరాసుపేట సువర్చలాసమేత ఆంజనేయస్వామి ఆలయంలో దీపాలను శివలింగాకృతిలో అలంకరించారు.

పరాసుపేట ఆంజనేయస్వామి ఆలయంలో శివలింగాకృతిలో దీపాలంకరణ

గుడిదిబ్బ(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: కృత్తివెన్నులో శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వరస్వామివారి, శ్రీరమా వేంకట సత్యనారాయణ స్వామివార్ల కల్యాణ మహోత్సవ కార్యక్రమం కనులపండువగా సాగింది. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య అత్యంత వైభవోపేతంగా జరిగింది. రాత్రి 10.24 నిమిషాలకు శ్రీదుర్గాపార్వతి నాగేశ్వరస్వామి కల్యాణం ఆలయ కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు దంపతులు, ఆలయ ఛైర్మన్ చేకూరి వెంకట్రావు-ప్రమీలారాణి దంపతుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. రాత్రి లింగోద్భవ కాలంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వర స్వామివారి కల్యాణంలో దంపతులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

18 నుంచి శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఉత్సవాలు

కోడూరు: విశ్వనాధపల్లిలో కొలువై ఉన్న శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఈనెల 18 నుంచి ఘనంగా ప్రారంభం కానుంది. ప్రధాన గుడి సంబరం వచ్చే నెల 2, 3 తేదీల్లో నిర్వహించనున్నారు. 18న ఉదయం 6 గంటలకు రామినీడు (పోతురాజు) ఉత్సవం ప్రారంభమవుతుంది.

ప్రహరీలు లేని పాఠశాలలు

న్యూస్‌టుడే, పెడనగ్రామీణం

మండల నందమూరు, చెన్నూరు జడ్పీ పాఠశాలలకు ప్రహరీల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. నందమూరుకు రూ.12 లక్షలు, చెన్నూరుకు రూ.13 లక్షల ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. ఒక గ్రామంలో వేర్వేరు శాఖల నుంచి 20 పనుల కంటే ఎక్కువ చేసినట్లు ఉంటే కొత్తగా చేపట్టే పనులు కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ కావడం లేదు. దీంతో నిధులు ఉన్నప్పటికీ ఈ గ్రామాల్లో పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం ప్రారంభం కావటం లేదు. మరో పక్క ఉపాధి హామీ పథకం కింద మార్చి నెల 15 లోపు పనులు ప్రారంభించి పూర్తి చేయకపోతే ఆ నిధుల్ని వ్యయం చేసే అవకాశాన్ని కోల్పోతామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రహరీలు లేని కారణంగా సెలవుల్లో పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారతాయని ఆందోళన వ్యక్తమవుతోంది. నందమూరు, చెన్నూరు గ్రామాల్లో పాత పనులు కొన్ని పూర్తి చేసి కొత్త పనులు ప్రారంభిస్తాం. రెండు చోట్ల ప్రహరీ నిధులు మంజూరైన మాట వాస్తవమేనని పెడన పంచాయతీరాజ్ శాఖ ఏఈ వై.ధర్మయ్య న్యూస్‌టుడేకు తెలిపారు..

నందమూరు జడ్పీ పాఠశాల ఇలా..

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ప్రజల భవిష్యత్తును మార్చనున్న బడ్జెట్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, పక్కన నాయకులు

పెనమలూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర బడ్జెట్ ప్రజల జీవితాలు, భవిష్యత్తును మార్చనున్నట్లు పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. ఆదివారం పోరంకిలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ బడ్జెట్ ప్రగతికి సూచికగా అభివర్ణించారు. ప్రజల జీవితాల్లో మార్పును తీసుకొస్తుందని చెప్పారు. వ్యవసాయం, పారిశ్రామిక, సాగునీరు, విద్య, వైద్యం, టూరిజం, పంచాయతీరాజ్, మహిళ సంక్షేమంతో పాటు అన్ని అంశాలను బడ్జెట్‌లో సమకూర్చడం జరిగిందన్నారు. అన్ని వర్గాల సమగ్రాభివృద్ధిని గుర్తిస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి కేశవ్‌ను అభినందించారు. తెదేపా నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్, తుమ్మల రాంకుమార్, సంగెపు రంగారావు, పీతా గోపీచంద్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తు తీగల మరమ్మతుల కారణంగా సోమవారం పలుచోట్ల సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నఅవుటపల్లి పంచాయతీ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

సాధించిన పతకాలు, ధ్రువపత్రాలు చూపిస్తున్న విద్యార్థులు

కరాటే పోటీల్లో ప్రతిభ

ఉయ్యూరు, న్యూస్‌టుడే : సికింద్రాబాద్‌లో ఇటీవల న్యూ డ్రాగన్ ఫైట్స్, మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీశ్రీనివాస అక్షరాలయ విద్యాసంస్థ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని ప్రిన్సిపల్ పి.నీలిమ తెలిపారు. అండర్- 14 విభాగంలో ఎన్.సాయి సాత్విక్ బంగారు పతకం, ఏ.శేషసాయి చౌదరి కాంస్య పతకం, అండర్- 10 విభాగంలో జె.పార్థు రజత పతకం సాధించారని చెప్పారు. వీరికి డి.శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారన్నారు. ఈ మేరకు విజేతలను విద్యా సంస్థ డైరెక్టర్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

ఇసుక మేటలు.. వెళ్లాలంటే వెతలు

కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రధాన రహదారుల్లో మేట వేసిన ఇసుక ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో గతేడాదిలో పెనమలూరు నియోజకవర్గంలో ఎనిమిది మంది మృతి చెందగా పలువురు క్షతగాత్రులయ్యారు. మద్దూరు, రొయ్యూరు, కాసరనేనివారిపాలెం, చోడవరం, తాడిగడప తదితర నదీ పరివాహక గ్రామాల్లో ఇసుక క్వారీలు ఉన్నాయి. వీటి నుంచి రోజుకు వెయ్యికి పైగా వాహనాలు ఇసుక రవాణా చేస్తున్నాయి. టిప్పర్లు, ట్రాక్టర్ల క్యాబిన్‌పై మూడు నుంచి ఆరు అడుగుల ఎత్తున లోడింగ్ చేస్తున్నారు. పైన పరదాలు కప్పినా ఫలితం నామమాత్రంగానే ఉంటోంది. నీటితో కూడిన తడి ఇసుక వాహనాల నుంచి జారుతోంది. దీంతో ఎక్కడ చూసినా అంచుల్లో మేటలే కనిపిస్తున్నాయి.

కంకిపాడు బైపాస్ రహదారి అంచుల్లో పేరుకుని ఇలా..

ప్రమాదాలు జరిగే ప్రాంతాలు: కరకట్టపై యనమలకుదురు నుంచి రొయ్యూరు వరకు 12కి.మీ మేర ☛ కంకిపాడు-ఉయ్యూరు మధ్యనున్న ఆరు అంతర వంతెనలకు నాలుగు వైపులా ☛ కంకిపాడు బైపాస్, సర్వీస్ రహదారులు ☛ వేగ నియంత్రికలు ఉన్న చోట ☛ రొయ్యూరు-కంకిపాడు(వయా గొడవర్రు) ☛ మద్దూరు-గోసాల (వయా వణుకూరు) ☛ చోడవరం-పెనమలూరు. తదితర క్వారీల అనుసంధాన రహదారులు

ఇప్పటి వరకు జరిగినవి..: వణుకూరు వద్ద ఎదురుగా వస్తోన్న టిప్పరును తప్పించే క్రమంలో ఇసుకలో జారిపడి రైతు మృతి ☛ రొయ్యూరు-గొడవర్రు మధ్య ద్విచక్ర వాహనదారుడి మరణం ☛ కంకిపాడు తూర్పు బైపాస్ వద్ద ద్విచక్ర వాహనంపై పామర్రు వెళ్తున్న సచివాలయ ఉద్యోగి దుర్మరణం ☛ కంకిపాడు బైపాస్‌పై మానికొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి ☛ కోమటిగుంట లాకుల వద్ద దంపతులు ☛ కంకిపాడు-పునాదిపాడు సర్వీస్ రహదారిపై పునాదిపాడుకు చెందిన యువకుడు చనిపోయాడు ☛ ఇక క్షతగాత్రుల సంఖ్యకు లెక్కేలేదు.

పరిష్కార చర్యలు ఎలా?: ఓవర్ లోడుతో వచ్చే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడం ☛ మేట వేసిన ఇసుక తొలగింపు బాధ్యతను గుత్తేదారు నిర్వర్తించే విధంగా చేయడం ☛ అంతర వంతెనల వద్ద పేరుకుపోయిన ఇసుకను ఎన్‌హెచ్ఏఐ చొరవతో, నిర్వహణదారు నియమిత కార్మికులతో తొలగింపజేయడం ☛ ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా ఉండడం ☛ పైన పేర్కొన్న రహదారుల్లో ఓవర్‌టేక్ చేయకూడదు. దాటాల్సి వస్తే మరింత జాగ్రత్తగా వాహనాన్ని నడపడం.

వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోండి

నున్న, న్యూస్‌టుడే: నున్న గ్రామానికి చెందిన కొందరు తెదేపా నాయకులు గ్రామంలో వసూళ్లకు పాల్పడుతున్నారని అదే పార్టీకి చెందిన నాయకులు ఆరోపించారు. నున్న గ్రామంలో ఆదివారం సమావేశమై ఈమేరకు తెదేపా నున్న గ్రామ పార్టీ అధ్యక్షుడు, సహకార సంఘం అధ్యక్షుడు కలకోట శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాదు శివరామప్రసాద్‌లకు వారు వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులను, పెద్ద రైతులను, ప్రముఖులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి కేసు నమోదు చేయించాలని కోరారు.

నేటి నుంచి సహకార ఉద్యోగుల నిరవధిక సమ్మె

చల్లపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు సంఘం రాష్ట్ర నాయకులు చంద్ర రవికుమార్, కృష్ణా జిల్లా అధ్యక్షులు తోట కృష్ణారావు చెప్పారు. ఆదివారం చల్లపల్లిలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అన్ని యూనియన్ల ఐక్య వేదిక (జేఏసీ) ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేసినా ప్రభుత్వం నుంచి సమస్యల పరిష్కారంపై ఎటువంటి స్పష్టమైన హామీలు రాలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2051 సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

డప్పుల సందడి

కైలాసవాసా.. కరుణించరావా

కళాకారుల నృత్యం

కానూరు, న్యూస్‌టుడే : యనమలకుదురు శ్రీరామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు సహకారంతో దర్శనానికి విచ్చేసిన భక్తులకు లడ్డూ, పులిహోర ప్రసాదాలను ఉచితంగా అందజేశారు. అలానే భక్తుల దాహం తీర్చేలా మినరల్ వాటర్ బాటిల్స్‌ను అందుబాటులో ఉంచారు. వీటితో పాటు గ్రామానికి చెందిన ప్రముఖులు వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఆకట్టుకున్న మంచు శివలింగం

రామవరప్పాడు, న్యూస్‌టుడే: రామవరప్పాడులోని పేరంటాలమ్మ ఆలయంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఉపాలయంలో శివరాత్రి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి విశేష అభిషేకాలతో పాటు బిల్వార్చన, రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో ప్రియాంక ఏర్పాట్లు పరిశీలించారు.

స్వామికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

రగ్బీ అండర్-12 జిల్లా పోటీలు

గన్నవరం బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి అండర్-12 బాలబాలికల రగ్బీ పోటీలు, జిల్లా జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. పోటీలను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిశోర్, సీనియర్ వాకర్స్‌తో కలిసి రగ్బీ క్రీడ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలకృష్ణారావు ప్రారంభించినట్లు క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు తెలిపారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పెద్దఅవుటపల్లి, నున్న, విజయవాడ ఎంఎస్ఆర్ జట్లను ఏపీఆర్‌డీసీ డైరెక్టర్ శివశంకర్‌తో కలిసి అతిథులు అభినందించారు. **- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం**

202 ట్రిప్పులు.. 10,500 మంది ప్రయాణికులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా మచిలీపట్నం ఆర్టీసీ డిపోనుంచి వివిధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం నుంచే బస్సుల రాకపోకలు ప్రారంభించగా అన్ని బస్సులు కిక్కిరిసి ప్రయాణించాయి. పెద్దకళ్లేపల్లి, ఐలూరు, కృత్తివెన్నుతోపాటు విజయవాడకు కూడా సర్వీసులు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పెదకళ్లేపల్లి, ఐలూరుకు వేలాదిగా తరలివెళ్లారు. కొన్ని సర్వీసులు నిరంతరం నడిచాయి. ప్రయాణికులకు బస్సుల సమాచారం అందించి పర్యవేక్షించేలా ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ప్రయాణికుల సంఖ్యను బట్టి అప్పటికప్పుడు అదనంగా బస్సులు ఏర్పాటు చేయించి వారిని పుణ్యక్షేత్రాలకు పంపించేలా చర్యలు తీసుకున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి 8 గంటల వరకు మచిలీపట్నం నుంచి 202 ట్రిప్పులు వేయగా దాదాపు 10,500 మంది ప్రయాణం చేశారని డిపో మేనేజర్ టి.పెద్దిరాజు తెలిపారు. అవనిగడ్డ డిపో బస్సులు కూడా మచిలీపట్నం నుంచి రాకపోకలు సాగించినందున ప్రయాణికుల సంఖ్య మరింత ఎక్కువ ఉంటుందన్నారు.

బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

తాడిగడప, న్యూస్‌టుడే : తాడిగడప మనోజ్‌నగర్ శ్రీశిర్డీ సాయిబాబా ఆలయంలో 18వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పంచామృతాభిషేకం, గులాబీ పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆరు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శిర్డీ సాయిబాబా

పంట బోదె కాదు.. మంచినీటి కాల్వ

మండల కేంద్రంలో కొన్ని నెలలుగా రక్షిత మంచినీరు వృథా అవుతోంది. సరఫరా గొట్టాల మరమ్మతుల నిమిత్తం బ్యాంకు కాలనీ, వాణీనగర్, డాక్టర్ మురళీ వీధి తదితర చోట్ల పెద్ద గుంతలు తీశారు. బాగు చేయడానికి అవసరమైన పరికరాలు మార్కెట్‌లో అందుబాటులో లేవని చెబుతూ వాటిని అలానే వదిలేశారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వేల లీటర్ల నీరు వృథాగా బయటకు పోతోంది. రోడ్లపైకి చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కంకిపాడు**

ముందుకు కదలని సాగునీరు

బుడమేరులో భారీగా పేరుకున్న గుర్రపు డెక్కతో సాగునీరు ముందుకు కదలడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల పరిధిలో సుమారు ఐదు వందల ఎకరాల్లో వరి, అపరాల సాగు కొనసాగుతోంది. బుడమేరులో వ్యర్థాలు అడ్డంకిగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఎలుకపాడు, ఉంగుటూరు, లంకపల్లి, ఆముదాలపల్లి పరిధిలో భారీగా దర్శనమిస్తున్న గుర్రపు డెక్కను తొలగించాలని అన్నదాతలు కోరుతున్నారు. – గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

పెనమలూరు భీమేశ్వరాలయంలో..

ఉయ్యూరు శివాలయంలో భక్తులు

చిన్నారుల ప్రభోత్సవం

బాపులపాడులో..

శివమయం.. భక్తజన పరవశం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లోని ఆలయాలు శివనామస్మరణతో ప్రతిధ్వనించాయి. ఈ నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే శివరాత్రి పవిత్రస్నానాలు ఆచరించడానికి భక్తులు సమీపంలోని ఘాట్‌ల వద్దకు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. పుణ్యస్నానమాచరించి పితృదేవతలకు పూజలు నిర్వహించి పిండ ప్రదానాలు చేశారు. పలు చోట్ల అన్నదానాలు జరిగాయి. **- న్యూస్‌టుడే, బృందం**

పెరికీడులో ..

మద్దూరులో ఎమ్మెల్యే బోడే దంపతులు

మద్దూరులో భక్తులు

ముస్తాబాదలో చిన్నారుల నృత్య ప్రదర్శన, తిలకిస్తున్న భక్తులు

శివతత్వం.. మానవ జీవితానికి మార్గదర్శకం

రామవరప్పాడు, న్యూస్‌టుడే: శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం రామవరప్పాడులోని ఎస్ఎల్‌వీ కమ్యూనిటీ హాల్‌లో ట్రూత్ వివేకామృతం స్పిరిట్యువల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శివ చైతన్య సుజ్ఞాన సంబరాలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రబోధకులు గురువు వివేకానంద శివ చైతన్యం గురించి అనుగ్రహభాషణం చేశారు. శివతత్వం మానవ జీవితానికి మార్గదర్శకమని, శివ చైతన్యం ప్రతి మనిషిలోనూ ఉన్న దైవ స్ఫూర్తిని మేల్కొలుపుతుందని పేర్కొన్నారు. మనసు స్వచ్ఛత, ఆలోచనల్లో శాంతి, సేవాభావం ద్వారా శివ అనుగ్రహం పొందవచ్చని తెలిపారు. పూజా విధానాలు మాత్రమే కాకుండా, సత్యనిష్ఠ జీవన విధానం కూడా శివారాధనలో భాగమని పేర్కొన్నారు. తొలుత గురువు వివేకానందను ఉప్పలపాటి హనుమయ్య దంపతులు పూలమాలతో సత్కరించారు.

ప్రసంగిస్తున్న వివేకానంద

బంగారు పాద ప్రతిమల బహూకరణ

కానూరు, న్యూస్‌టుడే : మహాశివరాత్రి సందర్భంగా శ్రీరామలింగేశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేసిన దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావుకు అమ్మవారి బంగారు పాద ప్రతిమలను బహూకరించారు. ఆలయాన్ని రూ.కోట్లతో, సకల సౌకర్యాలతో అభివృద్ధి చేసినందుకు దుర్గగుడి ఛైర్మన్ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు.

నరసింహారావుకు అమ్మవారి బంగారు పాద ప్రతిమలు అందిస్తున్న రాధాకృష్ణ దంపతులు

ఆలయ నిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా బాపులపాడు ధర్మకోనేరు చెరువు వద్ద నిర్మిస్తున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయానికి ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన బొబ్బా కిరణ్‌కుమార్, గాయత్రి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణకర్తలు గూడపాటి రత్నశేఖర్, తదితరులకు ఆదివారం ఈ మొత్తాన్ని అందించారు.

నిర్మాణకర్తకు నగదు అందిస్తున్న దాతలు

నూలు సంచుల పంపిణీ

కాసరనేనివారిపాలెం (కంకిపాడు), న్యూస్‌టుడే : శివరాత్రి పుణ్యస్నానాలు ఆచరించడానికి కాసరనేనివారిపాలెం, మద్దూరు పుష్కర ఘాట్‌లకు వచ్చిన 500 మంది భక్తులకు 'ఎకో ఫ్రెండ్లీ కాటన్ బ్యాగ్స్' అధినేత కాసరనేని కృష్ణప్రసాద్ నూలు చేతి సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. తాత, నాయనమ్మ వెంకటకృష్ణయ్య, బసవమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి రావి సురేష్ బాబు, స్థానిక శివాలయం అర్చకుడు శ్రీనివాసాచార్యులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గొంది శివరామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంచులు అందుకున్న వారితో దాత కృష్ణప్రసాద్

కౌన్సిల్ సమావేశం వాయిదా

నగరపాలక సంస్థ: ఈ నెల 17న నిర్వహించాల్సిన విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

గుంత... అదుపు తప్పితే అంతే ఇక

ఉయ్యూరు- తేలప్రోలు రహదారిలో కడవకొల్లు గ్రామంలోని రైవస్ కాలువ వంతెన వద్ద రహదారి పక్కన గొయ్యి ఏర్పడింది. దీంతో వాహనాలు ఎదురైనప్పుడు ఏ మాత్రం పక్కకు వెళ్లిన అదుపు తప్పి అందులో పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో దగ్గరకు వచ్చే వరకు గొయ్యి కనిపించడం లేదని వాపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కడవకొల్లు(ఉయ్యూరు గ్రామీణం)**

ప్రాణధార వృథా పట్టదా..!

బాపులపాడు ధర్మకోనేరు చెరువు గట్టు సమీపంలోని రక్షిత నీటి పథకం వద్ద ప్రజావసరాల కోసం గతంలోనే వీధి కుళాయి ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా ఈ కుళాయి నుంచి నీరు వృథాగా పోతోంది. కుళాయికి అమర్చిన మర పాడైపోవడంతో ట్యాంకు నుంచి విడుదల చేసిన ప్రతిసారి ఇలా నీరు నేలపాలవుతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్**

నిరుపయోగంగా సంపద కేంద్రం

కోడూరుపాడు పంచాయతీ పరిధిలో నిర్మించిన సంపద సృష్టి కేంద్రం ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రావడం లేదు. గ్రామంలోని చెత్తను సేకరించి ఇక్కడకు తరలించిన తర్వాత దానిని విభజించి ఆదాయం లభించేలా కార్యాచరణ చేపట్టాల్సి ఉండగా, నేటికీ నిరుపయోగంగానే మిగిల్చారు. కేవలం చెత్తను తరలించి నిప్పు పెట్టేసి మమ అనిపిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్**

ప్రణాళిక లోపం.. ప్రాణాలతో చెలగాటం

ఒత్తిడి అధికంగా ఉండే సమయంలో ఆర్టీసీ బస్సు సర్వీసులు సరిపడా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. 40 గ్రామాలకు కూడలిగా ఉన్న కంకిపాడు బస్‌స్టాండ్ ఉదయం 8 నుంచి 10 వరకు, సాయంత్రం 4 నుంచి 7 వరకు రద్దీగా ఉంటోంది. ఈ సమయాల్లో విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటున్నారు. అధికారులు స్పందించి కీలక సమయంలో మరో రెండు, మూడు సర్వీసులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- కంకిపాడు**



విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందించే వైద్య సేవల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి చర్యలను సహించనని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావు అన్నారు. ఆదివారం ఉదయం, సాయంత్రం ఆయన ఆసుపత్రిలోని క్యాజువాలిటీ విభాగాన్ని సందర్శించారు. ప్రమాదాల బారిన పడి ఆసుపత్రికి వచ్చిన వారికి, అత్యవసర చికిత్స అవసరమైన రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అందరూ చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎటువంటి పరిస్థితుల్లో సహించేది లేదని, ఎవరైనా అలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సిబ్బందికి సూచనలిస్తున్న డా.ఏడుకొండలరావు

చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

పెనమలూరు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పాఠశాల బస్సు డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మస్తాన్(70) గోసాల కాల్వ కట్టపై నివసిస్తుంటారు. ఇతను ఓ పాఠశాల బస్సుకు డ్రైవర్‌గా పని చేస్తుంటారు. గత గురువారం ఇతను గోసాల కూడలి సమీపంలో బందరు రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకటన

నా క్లయింట్లు కృష్ణాజిల్లా,బాపులపాడు మండలము,శింగన్నగూడెం రు కాపురస్తులు పంజా రాధాకృష్ణ,సులోచన,పెరట్ల అరుణ సురేష్ గార్ల సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా,పై వారలకు జాయింటుగా సంక్రమించిన ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని హామీగా ఉంచి ఏదేని బ్యాంకులలో ఋణమును పొందుటకు ప్రయత్నము చేయుచున్నారు.ఈ దిగువ షెడ్యూలు ఆస్తి పంజా రాధాకృష్ణ గారు మరియు రోశయ్య వీరి కుమారుల వలన క్రయమును పొంది వారిచే క్రయ దస్తావేజు నెం.748/1996 రుగా మరియు 728/1996 రుగా రిజిస్టరు చేయించుకొని తదుపరి వారు వారి కుమారులైన సురేష్ మైనర్ అయినందున వారి తల్లి గారైన సులోచన గారిని గార్డియన్ గా ఉంచి దఖలు దస్తావేజు నెం.3097/2004 రుగన్ను, మరియొక కుమారుడైన గోపీనాథ్ గారు మైనర్ అయినందున వారి తల్లి గారైన సులోచన గారిని గార్డియన్ గా ఉంచి దఖలు దస్తావేజు నెం.3098/2004రుగన్ను రిజిస్టరు చేయించినారనియు తెలియచేయుచున్నారు.అయితే ఒక కుమారుడైన గోపీనాథ్ గారు ది.19-06-2015 వతేదీన అవివాహితుడుగా పరమపదించారనియు వారి మరణానంతరము పైన తెలిపిన వారలు వారి ఆస్తిని స్వాధీనపరచుకొన్నంతలో ఆస్తియును,మరియొక కుమారుడైన సురేష్ గారికి చెందిన ఆస్తియును అయిన ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని హామీగా ఉంచి ఏదేని బ్యాంకులలో ఋణమును పొందుటకు ప్రయత్నము చేయుచున్నారు.అయితే ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం.748/1996 రును,నెం.426/1994 రును మరియు 728/1996 ర్లు గైరుహాజరు (పోయినవి) అయినవని తెలియచేయుచున్నారు. కనుక ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనను ఏవిధమైన చెల్లదగు అభ్యంతరములు.కోర్టు జప్తులు,ఇంజక్షన్లు, భాగలబ్ద తగాదాలు వగైరాలు ఏదైనా వున్నచో ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపు ఈ దిగువ తెలిపిన అడ్రస్ నకు రిజిస్టరు పోస్టు తిరుగుటపా ద్వారా పంపవలసినది, లేనిచో అభ్యంతరములు లేవని ఎంచి నా క్లయింట్లు ఏదేని బ్యాంకులలో ఋణమును పొందెదరు. తదుపరి వచ్చు క్లయిములు, అభ్యంతరములు నా క్లయింటును ఏ విధముగాను బైండు చేయజాలవు. ఆస్తి షెడ్యూలు: కృష్ణాజిల్లా, బాపులపాడు మండలము,శింగన్నగూడెం గ్రామ ఆర్.ఎస్.నెం.16 రు సరియగు సర్వే నెం.48/1,48/2 ర్లు దాఖలా స్థిరాస్తికి హద్దులు.తూర్పు:సాగర్ కాలవ,దక్షిణము :రోడ్డు మరియు రోడ్డుకి అవతల వైపు గల నా క్లయింట్ల ఆస్తి,పడమర:అక్కినేని సదాశివరావు గారి ఆస్తి,ఉత్తరము:పంజా నాగేశ్వరరావు గారి ఆస్తి పై నాలుగు హద్దుల మధ్య య.2.06 సెంట్లు వ్యవసాయ భూమి. అందలి యావత్తు ఈజ్ మెంటు హక్కులతో సహా.

పి. రామమోహనరావు, దామ లక్ష్మణ కుమార్, పి.ఎస్.టి. వెంకటేశ్వర్లు, అడ్వకేట్స్,
డోరు నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11, సెల్: 9392114922

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

ప్రమాణస్వీకారంలో పాల్గొన్న అంతర్జాతీయ, జిల్లా, మండల నాయకులు

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక వాసవీ, వనితా క్లబ్‌ల నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం మచిలీపట్నం రోడ్డులోని వాసవీ వృద్ధచరణాలయంలో నిర్వహించారు. జిల్లా గవర్నర్ మాజేటి హరిప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా దివ్వెల శివయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.మోహనవంశీ, కోశాధికారిగా జి.రామయ్య ఉన్నారు. వనితా క్లబ్ అధ్యక్షురాలుగా దివ్వెల జ్యోతి సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా కె. సాదన్య నాగకోటేశ్వరి, కోశాధికారిగా జి.వరలక్ష్మీ ఉన్నారు. అంతర్జాతీయ అసిస్టెంట్ సెక్రటరీ అన్నం సాయి సురేఖ పాల్గొని మాట్లాడారు. సేవా కార్యక్రమాల్లో వాసవీ, వనితా క్లబ్‌లు ముందంజలో ఉన్నాయన్నారు. తక్షణ మాజీ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరామ్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఘంటసాల నాగవెంకట హరిసునీత, సముద్రాల సూర్యప్రకాశరావు, ఎండూరి సురేష్, ఘంటసాల భరతుడు, దోరెడ్ల కోటేశ్వరరావు, చిట్టూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారికి అభినందన

గుడివాడ బంటుమిల్లి రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. 1వ తరగతి చిన్నారి చిరు

వోలులంక వైష్ణవి శివునిపై గీతాలను ఆలపించి ఆందరినీ ఆకర్షించింది. వాసవీ ఇంటర్నేషనల్ పరివార్ జిల్లా అధ్యక్షుడు కూరాళ్ల శ్యామ్ సుందర్‌లు జ్ఞాపికతో సత్కరించారు. - గుడివాడ, న్యూస్‌టుడే

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

చల్లపల్లి: అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో మొదటి ర్యాంక్‌లో నిలపడం మనందరికీ గర్వకారణమని చల్లపల్లి మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నారా లోకేశ్ సేవాసమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నేతలు మోర్ల శివ, పైడిపాముల స్వప్న, షేక్ నబీఘూరి, భువనేశ్వరరావు, షేక్ సిలార్, నర్రా చిన్నా, తాతా ప్రదీప్ పాల్గొన్నారు.

భాజపా జిల్లా ఉపాధ్యక్షుడిగా అశోక్ కుమార్

కూచిపూడి: మొవ్వ మండలం కూచిపూడి గ్రామానికి చెందిన డాక్టర్ పోలన అశోక్‌కుమార్ భాజపా కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పార్టీ కార్యదర్శిగా, కృష్ణాజిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా పని చేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. మొవ్వ ఏఎంసీ ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య, భాజపా నాయకులు ఆయనను అభినందించారు.

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అశోక్ కుమార్

భక్తులకు మజ్జిగ పంపిణీ

చల్లపల్లి: చల్లపల్లిలో గ్రావిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ పంపిణీని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు ప్రారంభించారు. నేతలు మోర్ల శివ, పైడిపాముల స్వప్న, షేక్ నబీఘూరి, తదితరులు పాల్గొన్నారు. *చల్లపల్లి బస్టాండ్ సెంటర్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీని తూర్పుకృష్ణా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, మండలి వెంకట్రామ్(రాజా) ప్రారంభించారు.

ఘంటసాల: శ్రీకాకుళంలో శివాలయంలో 3వేల మందికి పైగా భక్తులకు ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు.

ఐలూరు: ఐలూరులో శివరాత్రి పండగ సందర్భంగా రామినేని సత్యనారాయణ, కాశీ అన్నపూర్ణ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు రామినేని కుటుంబయ్య భక్తులకు ఉచితంగా మజ్జిగా పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, తెదేపా జిల్లా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభించారు.

పామర్రులోని ప్రాకర్లలో పిండ ప్రదానాలు

గుడివాడ శ్రీభీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో..

నిమ్మకూరు బుద్దేశ్వరస్వామి ఆలయంలో..

కూచిపూడిలో శ్రీరామలింగేశ్వరస్వామికి అభిషేకం

పామర్రులో రేణుకా పరమేశ్వరునికి పూజలు

ఐలూరులో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా, గురుమూర్తి

మార్మోగిన శివనామ స్మరణ

న్యూస్‌టుడే, బృందం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు శివాలయాల్లో ఆదివారం స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు కృష్ణానది పుష్కరఘాట్ వద్ద జల్లు స్నానాలు ఆచరించి పిండ ప్రదానాలు చేశారు. శివనామ స్మరణతో శివాలయాలు భక్తులతో మార్మోగాయి.

గుడివాడ చిన్న శివాలయంలో ఆశీర్వచనాలు తీసుకుంటున్న న్యాయమూర్తి వాసుదేవ్ దంపతులు

మంటాడ శివాలయంలో..

గుడ్లవల్లేరు శ్రీసిద్ధేశ్వరాలయంలో శాంతి కల్యాణం

వేకనూరులో..

గుడివాడ: శ్రీభీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీస్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో పాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ: పెద్ద శివాలయానికి తరలి వచ్చిన భక్తులు

కాజలో శ్రీకాశీనాగేశ్వరస్వామి

దోకిపర్రు శ్రీఅగస్త్యేశ్వరాలయంలో కల్యాణం.. వీక్షిస్తున్న భక్తులు

కుమ్మమూరులో ఉయ్యూరు వీరమ్మతల్లికి ఆహ్వానం పలుకుతున్న రామినేని కుటుంబయ్య దంపతులు

కోడూరులోని శివాలయంలో..

కృష్ణాపురం (పమిడిముక్కల)లో భక్తులకు ఉపాహారం

గుడ్లవల్లేరులో లక్షరుద్ర శివలింగానికి భక్తుల పాలాభిషేకం

గుడ్లవల్లేరు శ్రీసిద్ధేశ్వరాలయంలో క్యూకట్టిన భక్తులు

తోట్లవల్లూరులో జల్లుస్నానాలు చేస్తున్న భక్తులు

వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు

అవనిగడ్డ శివాలయంలో..

రాపర్లలోని శివాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

రాష్ట్ర బడ్జెట్ కారు చీకట్లో కాంతి రేఖ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో అతలాకుతలమైన ఆర్థిక వ్యవస్థను తిరిగి పూర్వస్థితికి తెచ్చేందుకు కారు చీకట్లో కాంతిరేఖలా రాష్ట్ర బడ్జెట్ నిలిచిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. స్థిరమైన ఆర్థిక ప్రగతికి, మౌలిక సౌకర్యాల కల్పనకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుందన్నారు. పల్లెసీమల వికాసానికి తోడ్పాటు అందిస్తుందన్నారు.

పరిశ్రమలు, యువతకు పెద్ద పీట

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం పేదలు, యువకులు, మహిళలు, వృద్ధుల సంక్షేమానికి నిధులు భారీగా కేటాయించిందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా వివరించారు. పరిశ్రమల ప్రోత్సాహంతో యువతకు ఉపాధి కలిగి రాష్ట్ర ఆదాయం పెరుగుతుందన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల దిశగా ప్రభుత్వం వెళ్తుందని తెలిపారు.

సమగ్రాభివృద్ధే ధ్యేయంగా...

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: సమగ్రాభివృద్ధే ధ్యేయంగా, ప్రతి వర్గానికి ప్రయోజనం చేకూర్చేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించారని తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకట గురుమూర్తి పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో రూ.3.32లక్షల కోట్లు నిధులు కేటాయించారన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ఉందన్నారు. సీఎం చంద్రబాబు విజన్‌కు అద్దం పడుతోందని కొనియాడారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చేతిపంపుల ఏర్పాటు

ఘంటసాల, న్యూస్‌టుడే: గోగినేనిపాలెంలో వేసవిలో తాగునీటి పరిష్కారానికి మండల పరిషత్ నిధులు రూ.లక్షతో 2 సిలిండర్ చేతిపంపులు ఏర్పాటు చేసినట్లు సర్పంచి కుంపటి సుశీల పేర్కొన్నారు. వీటిద్వారా ప్రజల దాహార్తి తీరుతుందన్నారు.

పడవ ప్రయాణాల వద్ద పోలీసు బందోబస్తు

పిట్టల్లంక(కోడూరు), న్యూస్‌టుడే: పెదకళ్లేపల్లిలో జరిగే శివరాత్రి ఉత్సవాలకు కోడూరు మండలం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వెళ్తుంటారు. పిట్టల్లంక వెళ్లి కృష్ణానదిపై పడవ ప్రయాణాలతో తక్కువ సమయంలో వెళ్తుండడం ఆనవాయితీ. దీంతో నదిలో పడవ ప్రమాదాలు జరగకుండా కోడూరు ఎస్సై కె.చాణక్య ఆదివారం ప్రత్యేక పోలీసు బందోబస్తును నిర్వహించారు.

త్రినేత్రుడికి రుద్రకవచం బహూకరణ

పెదప్రోలు(మోపిదేవి), న్యూస్‌టుడే: మహాశివరాత్రిని పురస్కరించి పెదప్రోలులో కొలువుదీరిన శ్రీదుర్గానాగ మల్లేశ్వరస్వామికి గ్రామానికి చెందిన యన్నం శ్రీనివాసరావు దంపతులు ఇత్తడితో రుద్రకవచాన్ని తయారు చేయించారు. ఆదివారం రాత్రి ఆలయ నిర్వాహకులకు స్వామికి అలంకరించారు.

పేద మహిళలకు చీరల వితరణ

పామర్రు, న్యూస్‌టుడే: పేద మహిళలకు చీరలు పంపిణీ చేశామని స్థానిక మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఎన్.త్రివిక్రమరావు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో రామాలయం వద్ద శివరాత్రిని పురస్కరించుకుని పది మంది పేద మహిళలకు మానవతా వైస్ ప్రెసిడెంట్ అల్లాడ సోమశేఖర్, సీత దంపతులు చీరలు పంపిణీ చేశారు.

నేటి నుంచి సహకార ఉద్యోగుల నిరవధిక సమ్మె

చల్లపల్లి: రాష్ట్రంలోని అన్ని సహకార సంఘాలు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు సహకార సంఘం రాష్ట్ర నాయకులు చంద్ర రవికుమార్, కృష్ణా జిల్లా అధ్యక్షులు తోట కృష్ణారావు చెప్పారు. ఆదివారం చల్లపల్లిలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అన్ని యూనియన్ల ఐక్యవేదిక (జేఏసీ) ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేసినా ప్రభుత్వం నుంచి సమస్యల పరిష్కారంపై ఎటువంటి స్పష్టమైన హామీలు రాలేదని తెలిపారు.

ఆలయ పునఃనిర్మాణానికి రూ.3లక్షలు వితరణ

ఘంటసాల: శ్రీకాకుళంలోని ఏక రాత్రి ప్రసన్న మల్లికార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణానికి స్థానిక కొండవీటి రామచంద్రరావు దంపతులు రూ.3లక్షలు అందజేశారు. ఆదివారం ఆలయం వద్ద రామచంద్రరావు దంపతులను ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరావు (చిన్నా), నాయకులు దాసం రామకృష్ణ, కోటేశ్వరరావు, సోమేశ్వరరావు, రవికిరణ్, తదితరులు సత్కరించారు.

రామచంద్రరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

బీసీ సంఘాలచే నటులకు సత్కారం

గుడివాడ, న్యూస్‌టుడే: బీసీ ఐక్య వేదిక, ఆల్ బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రితిక ఫౌండేషన్ నుంచి నంది అవార్డులను అందుకున్న నాటక కళాకారుల్ని శనివారం రాత్రి ఘనంగా సత్కరించారు. అవార్డులు పొందిన చింతలూరి సత్యనారాయణ, వంగీవరపు నవీన్, ఆర్‌వీఎల్.నరసింహారావు, రెడ్డి శ్రీనివాసరావు, గోదా రవికుమార్‌లను, ఇటీవల ఏజీపీగా నియమితులైన రెడ్డి బంగారయ్యలను ఘనంగా సత్కరించారు.

కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

పాత ఎడ్లంకలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం చుట్టూ భారీ ప్రభతో ప్రదక్షిణ, స్వామికి పూజలు

భక్తులతో పోటెత్తిన పాత ఎడ్లంక

ఆలయం వద్ద వేసిన చలువ పందిరిలో భక్తులు

అవనిగడ్డ గ్రామీణం: పాతఎడ్లంకలోని బాలకోటేశ్వరస్వామిని భారీగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రి నుంచే భక్తులు తరలివచ్చి పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. పంచామృత అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో శిర్విశెట్టి రోహిత్ కుమార్ పర్యవేక్షించారు.

భక్తులకు అన్నదానం

యార్లగడ్డ (చల్లపల్లి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చల్లపల్లి మండలం యార్లగడ్డలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీనాగమల్లికోటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ట్రస్టీ యార్లగడ్డ హేమాంజనేయప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మచిలీపట్నానికి చెందిన దాతలు మార్గాని యుగంధర్-సీతారావమ్మ దంపతులు అన్నదానం చేశారు. దాతలను హేమాంజనేయప్రసాద్ అభినందించారు.

ప్రయాణికుల రద్దీతో ఇక్కట్లు

కోడూరు, న్యూస్‌టుడే: కరకట్ట రహదారి పొడవునా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ప్రయాణాలను సాగిస్తున్నారు. దీనికితోడు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించడంతో కిక్కిరిసి బస్సులు ప్రయాణిస్తున్నాయి. సామర్థ్యానికి మించి జనం ఎక్కుతుండటం, దానిలోనూ నిలబడే ప్రయాణాలు సాగించాల్సి రావడం, రహదారి బాగోలేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా కాకుండా పాత సర్వీసులనే కొనసాగిస్తుండంతో దివిసీమ వైపు వెళ్లే బస్సులు ఎక్కడానికి విజయవాడ బస్టాండులో పెద్ద యుద్ధమే చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. అవనిగడ్డ - విజయవాడ, విజయవాడ - అవనిగడ్డ మధ్య కరకట్ట ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందనేది సర్వత్రా వినిపిస్తున్న అంశం.

నాగమల్లికోటేశ్వరస్వామి వారికి పూజలు, ఆలయం చుట్టూ ప్రదక్షిణ

నాగదేవత పుట్టలో పాలు, నివేదనలు సమర్పిస్తున్న భక్తులు

పెదపారుపూడిలోని భూషణగుళ్లలో..

18 నుంచి ఉత్సవాలు

కోడూరు: విశ్వనాధపల్లిలో కొలువై ఉన్న శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఈనెల 18 నుంచి ఘనంగా ప్రారంభం కానుంది. ప్రధాన గుడి సంబరం వచ్చే నెల 2, 3 తేదీల్లో నిర్వహించనున్నారు. 18న ఉదయం 6 గంటలకు రామినీడు (పోతురాజు) ఉత్సవం ప్రారంభమవుతాయి.

కిక్కిరిసిన యార్లగడ్డ శివాలయం

యార్లగడ్డ(చల్లపల్లి): చల్లపల్లి మండలం యార్లగడ్డలో శ్రీగంగాపార్వతీ సమేత నాగమల్లికోటేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు తమ పశువులు, మేకలు, గొర్రెలను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. నాగదేవత పుట్టవద్ద మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ట్రస్టీ యార్లగడ్డ హేమాంజనేయప్రసాద్-సుశీ సౌరభ దంపతులచే అఖండ దీపారాధన, అభిషేకాలు నిర్వహించారు.

అవనిగడ్డ లంకమ్మ గుడిలో ఏర్పాటుచేసిన శివలింగం

రెండు పూరిళ్లు దగ్ధం

నాగాయలంక: మండలంలోని టి.కొత్తపాలెం శివారు మరియపురం గ్రామానికి చెందిన గుండం రామారావు, నంబూరు రత్నారావుల పూరిళ్లు ఆదివారం తెల్లవారుజామున కాలిపోయాయి. ఈ ఘటన తెలియగానే డీసీ ఛైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, మెండు లక్ష్మణరావు, వీఆర్వో టీజీఎస్ సాయిబాబు పరామర్శించారు. ప్రభుత్వం తరుపున బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద బాధితులకు భోగాది శివవిష్ణువర్ధన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వీరాంజనేయప్రసాద్, వెంకట్రామ్ నిత్యావసర వస్తువులను అందజేశారు.

23 మంది జూదరుల అరెస్టు

కోసూరు(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ మండలం పాలంకిపాడు, కోసూరు శివారు ప్రాంతాలలో జూదశిబిరాలపై ఆదివారం జరిపిన దాడుల్లో 23 మందిని అరెస్ట్ చేశామని కూచిపూడి ఎస్సై సురేష్ తెలిపారు. వారి నుంచి రూ.19,620 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

స్పందన: పెదపారుపూడి మండలం యలమర్రులో వాటర్ పైపులైన్ లీకుతో స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' ద్వారా సమస్యను పంచాయితీ కార్యదర్శి చైతన్య శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సిబ్బందిని పంపి పైపులైనుకు మరమ్మతులు చేయించారు. ★ యలమర్రు బీసీ కాలనీలో వీధిలైట్లు పోవడంతో కార్యదర్శి వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. ★ యలమర్రులో అంగన్‌వాడీ కేంద్రం వద్ద డ్రెయినేజీ పూడుకుపోయి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన డ్రెయినేజీలో పూడిక తీయించారు. ★ పెదపారుపూడి మండలం గుర్విందగుంటలో పంచాయతీ కార్యాలయం వద్ద చెత్త పేరుకుపోయి అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు సమస్యను పంచాయతీ కార్యదర్శి విజయ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన చెత్తను తొలగించారు. ★ గుర్విందగుంటలో ప్రాథమిక పాఠశాల దగ్గర వీధిలైట్లు వెలగకపోవడంతో కార్యదర్శి పరిష్కరించారు. -న్యూస్‌టుడే, పెదపారుపూడి

బలహీన వర్గాల పెన్నిధి ఐలాపురం వెంకయ్య

అవనిగడ్డ: మాజీ శాసన మండలి సభ్యులు, మంచితనానికి మారుపేరుగా నిలిచిన ఐలాపురం వెంకయ్య శివరాత్రి రోజు శివైక్యం చెందటం విభ్రాంతిని కలిగించిందని, ఆయన మరణం తీరని లోటని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కడా రాజీపడకుండా ఆదర్శవంతంగా, ఆనందంగా జీవితాన్ని గడిపేవారన్నారు. కష్టపడి మొక్కవోని ధైర్యంతో అంచెలంచెలుగా ఎదిగారన్నారు.

నాగాయలంక, న్యూస్‌టుడే: బీసీ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు ఐలాపురం వెంకయ్య మరణం వెనుకబడిన వర్గాలకు తీరని లోటని అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘం రాయకులు లకనం నాగాంజనేయులు అన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన వెంకయ్య నేటి తరం బీసీలకు ఆదర్శం అని కొనియాడారు.

తెదేపా నాయకుడు శివప్రసాదరావు మృతి



మొవ్వ(కూచిపూడి): మొవ్వ గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు, సేవామూర్తి తాతినేని (గుమ్మడి) శివప్రసాదరావు(55) శనివారం అనారోగ్యంతో మరణించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెదేపా సీనియర్ నాయకుడు నన్నపనేని వీరేంద్ర, తాతినేని పూర్ణచంద్రరావు, తెదేపా గ్రామ అధ్యక్షులు ఈడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్

మల్లేశ్వరుని కల్యాణం.. మురిసింది భక్తజనం

ఇంద్రకీలాద్రిపై కల్యాణ క్రతువులో మంగళసూత్రాలు చూపిస్తున్న అర్చకులు

రామలింగేశ్వరునికి హారతి

యనమలకుదురులో ప్రభల ఊరేగింపు

దుర్గాఘాట్‌లో భక్తుల జల్లు స్నానాలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది. ప్రముఖ శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే కృష్ణానది తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై గంగాపార్వతీ సమేత దుర్గామల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. యనమలకుదురులో ప్రభల ఊరేగింపు ఆకట్టుకుంది. - ఈనాడు, అమరావతి


నాగలింగేశ్వరస్వామి

ముక్త్యాలలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

అంధకారంలోనే ప్రయాణం!

- రూ.40లక్షలతో సెంట్రల్ లైటింగ్ వేసేదెప్పుడో?
- తాడిగడప మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య ధోరణి

ఈనాడు, అమరావతి, కానూరు, న్యూస్‌టుడే

రాత్రయితే పైవంతెనపై చీకటిలోనే సాగుతూ..

విజయవాడ నుంచి నిత్యం కానూరు సిద్ధార్థ పైవంతెన మీదుగా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం బందరు రోడ్డుకు ప్రత్యామ్నాయంగా మారింది దారి. కానీ రాత్రయితే పెనమలూరు పోలీస్‌స్టేషన్ నుంచి పైవంతెన మీదుగా తాడిగడప వందడుగుల రోడ్డు వరకూ చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. అత్యంత ప్రమాదకరంగా వాహనదారులు రాత్రివేళ పైవంతెన మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రాత్రి 7గంటల నుంచి తెల్లవారుజాము 5గంటల మధ్యలో భయం భయంగానే ఈ పైవంతెన మీద నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పైవంతెన ఆరంభమై ఏడాది దాటిపోయినా ఇంతవరకూ కనీసం ఒక్క వీధి దీపం కూడా ఏర్పాటు చేయలేదు. తాడిగడప మున్సిపల్ అధికారుల పనితీరుకు ప్రత్యక్ష నిదర్శనమిది.

వైకాపా హయాంలో పనులు ఆగిపోయిన కానూరు సిద్ధార్థ కళాశాల పైవంతెనను కూటమి ప్రభుత్వం రాగానే 2024 నవంబరులో తుది దశ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒకటి రెండు నెలల్లో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తామంటూ.. మున్సిపల్ అధికారులు ప్రకటించారు. రూ.40 లక్షలు కూడా మంజూరయ్యాయని తెలిపారు. రహదారికి పక్కనున్న డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే లైటింగ్ ఏర్పాటు చేస్తామంటూ తెలిపారు. పోలీసుస్టేషన్ నుంచి వంద డుగుల రోడ్డు వరకు రూ.కోటిన్నరతో డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. సెంట్రల్ లైటింగ్ త్వరగా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతుంటే అధికారులు స్పందించడం లేదు.

నిధులు ఎటువైపు మళ్లించేశారో..

సెంట్రల్ లైటింగ్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయంటూ గతంలో చెప్పిన అదే అధికారులు ఇప్పుడు నిధులు లేవని, పరిశీలిస్తున్నామంటూ సెలవిస్తుండడం గమనార్హం. ఆ నిధులను.. వేరే పనులకు మళ్లించేసినట్లు తెలుస్తోంది. నగరంలో శివారు ప్రాంతాలను కలిపే ప్రధానమైన అనుసంధాన రహదారి పైవంతెనే. అందుబాటులోకి వచ్చి 15నెలలు దాటుతున్నా.. చీకటిలోనే వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా.. యంత్రాంగంలో కనీస చలనం లేకపోవడం దారుణం.

పరిశీలించి.. నిర్ణయం తీసుకుంటాం..

-షేక్‌నజీర్, తాడిగడప మున్సిపల్ కమిషనర్

సిద్ధార్థ పైవంతనపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సంబంధించి ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. దీనిని పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకుంటాం. డ్రైనేజీ పనులు ఇటీవలే పూర్తయ్యాయి.

పీజీ మెడికల్ మాపప్ రౌండు సీట్ల వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కన్వీనర్ కోటా నాన్ సర్వీస్ కేటగిరీ మూడో విడత కౌన్సెలింగ్ (మాపప్) సీట్ల వివరాలను విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం వెల్లడించింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా ఆయా కళాశాలల్లో చేరాలని సూచించింది. తరగతులు గత ఏడాది డిసెంబరు 22వ తేదీ నుంచి మొదలైన విషయం తెలిసిందే.

జిల్లాలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈనెల 16న సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్ కూడా అందుబాటులో ఉంటుందని వివరించారు. అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని సూచించారు. ఇందులో అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని కలెక్టర్ వివరించారు.

చూస్తే బాగు.. తూస్తే తరుగు

మోసం చేస్తున్న వ్యాపారులు ✪ అరకొర తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు

ఈనాడు, అమరావతి

వినియోగదారుల అవగాహన రాహిత్యాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. బ్రాండెడ్ వస్తువుల పేరుతో నకిలీవి అంటగడుతున్నారు. ఎమ్మార్పీకి మించి అడ్డగోలుగా అమ్మేయడం.. తప్పుడు తరాజులతో బురిడీ కొట్టించడమే పరమావధిగా జేబులు నింపుకొంటున్నారు. తూనికలు కొలతల శాఖ అరకొర తనిఖీలతో మమ అనిపిస్తోంది.

దుకాణాల్లో తనిఖీలు చేస్తూ..

ఎందెందు వెతికినా...

★ పోరంకికి చెందిన రాజేశ్ ఫోన్ కొనేందుకు విజయవాడ ఎన్టీఆర్ కాంప్లెక్స్‌కి వెళ్లారు. కంపెనీ తయారీనే నిలిపేసిన శాంమ్‌సంగ్ గురు ఫోన్ ఇప్పటికీ అక్కడ అమ్ముతున్నారు. రూ.1700 తీసుకుని నకిలీ ఫోన్ అంటగట్టారు. దానికి బిల్లు, వారెంటీ, గ్యారెంటీ లేదు. ఫోన్లు, ఛార్జర్లు, ఇయర్‌ఫోన్లు, బడ్స్ అన్ని ఇక్కడ దొరుకుతాయి. అసలైన బ్రాండ్ వస్తువుల్లా ఉండే నకిలీ వస్తువులను మాయ చేసి అమ్మేసి దోచేస్తున్నారు.

జిల్లా	నమోదైన కేసులు	రూ.లక్షలు జరిమానా
ఎన్టీఆర్	831	58.7
కృష్ణా	749	35.6
మొత్తం	1,580	94.3

★ అర్జునరావు కానూరులోని మాంసం దుకాణంలో కిలో మటన్ కొన్నారు. దుకాణంలో తూకంలో కిలోకి 7 గ్రాములు ఎక్కువే ఉంది. అనుమానంతో రైతుబజార్‌లోని మార్కెటింగ్‌శాఖ తరాజులో తూకం వేస్తే 897 గ్రాములే ఉంది. ఉమ్మడి జిల్లాలో 50శాతం పైగా దుకాణాల్లో ఇలాగే దోపిడీ చేస్తున్నారు. ఎలక్ట్రికల్ కాటాల్లో కేజీల మోడ్‌ను లీటర్లుగా మార్చి ఏమారుస్తున్నారు.

★ ఆటోనగర్ బస్టాండ్ సమీపంలోని ఓ శీతల పానీయాల దుకాణంలో రూ.10 శీతల పానీయం సీసాకు రూ.15 వసూలు చేస్తున్నారు. అంటే వారికి కంపెనీ ఇచ్చే మార్జిన్ కంటే రూ.50శాతం అదనం. ఉమ్మడి జిల్లాలో లెక్కకు మించిన దుకాణాల్లో ఇదే పరిస్థితి. విజయవాడ పీఎన్‌బీఎస్ మొదలు ఉమ్మడి జిల్లాలో చాలా బస్టాండ్లలో తాగునీరు, మజ్జిగ, లస్సీ, స్నాక్స్ ఏ వస్తువైనా ఎమ్మార్పీకి మించే వసూలు చేస్తున్నారు.

వాటివైపు చూడరేం..

☆ జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫిర్యాదులు మినహాయిస్తే.. బంగారం దుకాణాలు, పెట్రోలు బంకుల్లో తనిఖీల్లేవు. ఉమ్మడి జిల్లాలో 28 మంది సిబ్బందికి 12 మందే ఉన్నారు. మోసాలు ఎలా గుర్తించాలో ప్రజల్లో అవగాహన కల్పించడం లేదు. మోసం జరిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలన్న కనీస పరిజ్ఞానం లేదు.

☆ కొలతల్లో తేడాలు, ఇతర మోసాలపై వినియోగదారులు 1917 నంబరుకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా తూనికలు కొలతలశాఖ ఉప నియంత్రికులు బి.సాయిరామ్ తెలిపారు.

ఒకటే ఊరు.. రెండు పేర్లు..

గోడపై బాపులపాడు, హనుమాన్ జంక్షన్..

ఒకే గ్రామానికి రెండు పేర్లు ఉండటమనేది బహుశా ఎక్కడా ఉండదు. గతంలో ఒక పేరు ఉండి, మార్పు, చేర్పుల తర్వాత మరొక పేరు వాడుకలోకి రావడం చాలా ప్రాంతాల్లో చోటుచేసుకుంది. కానీ బాపులపాడు గ్రామం రెండు పేర్లతో చెలామణిలో ఉండడం ఆసక్తికరమే. బాపులపాడు కొన్ని దశాబ్దాల నుంచి హనుమాన్‌జంక్షన్‌గా ప్రాచుర్యం పొందుతోంది. నాలుగు రోడ్ల కూడలి ఉండడం, అభయాంజనేయస్వామి కొలువుదీరడంతో క్రమేణా హనుమాన్‌జంక్షన్‌గా మారిపోయింది. మండల కేంద్రంగా ఉండడంతో ప్రభుత్వ రికార్డులు, అధికారిక వ్యవహారాల్లోనూ ఇప్పటికీ బాపులపాడు పేరుతోనే కార్యకలాపాలు కొనసాగుతుంటాయి. బ్యాంకులు, ఆర్టీసీ బస్టాండ్, తపాలా కార్యాలయం మాత్రం హనుమాన్‌జంక్షన్ పేరుతో ఏర్పాటయ్యాయి. దీంతో ఇటీవల శివారులో నిర్మించిన స్వాగత గోడపై రెండు పేర్లతోనూ సూచికలు ఏర్పాటు చేయడం గమనార్హం. - హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

అశోక్ లేల్యాండ్ నకిలీ విడిభాగాల అమ్మకాలు

★ ఆటోనగర్‌లోని 3 దుకాణాల్లో పోలీసుల సోదాలు
★ షాపుల యజమానులపై కేసు నమోదు

ఈనాడు, అమరావతి: ఆటోనగర్‌లో నకిలీ స్పేర్‌పార్ట్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ అశోక్ లేల్యాండ్‌కు సంబంధించి నకిలీ విడిభాగాలు విక్రయిస్తున్న మూడు దుకాణాలపై పోలీసులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న సోనీ మోటార్ పార్ట్స్, వీరా క్లచ్ సెంటర్, విజయకృష్ణ ఆటోమొబైల్స్‌లో కంపెనీకి చెందిన నకిలీ స్పేర్ పార్ట్స్ అమ్ముతున్నట్లు, కంపెనీ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని అశోక్ లేల్యాండ్‌కు చెందిన ప్రతినిధి నితూకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు ఆటోనగర్‌లోని ఈ దుకాణాల్లో శనివారం రాత్రి తనిఖీలు చేశారు. పలు విడిభాగాలు దొరికాయి. ఇవి అసలు వాటికి నకిలీలని గుర్తించారు. దీంతో ఆ దుకాణాల యజమానులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని 318 (4)తో పాటు కాపీరైట్ యాక్ట్‌లోని 63, 64 సెక్షన్లు, ట్రేడ్ మార్క్ చట్టంలోని 103, 104 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆటోనగర్‌లో ఇంకా ఎక్కడైనా దుకాణాల్లో ఈ తరహాలో నకిలీ విడిభాగాలు అమ్ముతున్నారా? అని విచారిస్తున్నారు.

నా ప్రాణం నువ్వే కన్నా.. నువ్వూ పెట్టుకో నాన్నా..

గొల్లపూడి రహదారిలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న చిన్నారికి ప్రమాదం జరగకుండా హెల్మెట్ పెట్టడం హర్షణీయమే. కానీ బండి నడిపే వారూ శిరస్త్రాణం పెట్టుకుంటేనే ఇంటికి రక్ష అని గుర్తించాలి. -ఈనాడు, అమరావతి

విజయానందం...

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం శ్రీలంకలో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇండియా జట్టు విజయం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా విజయవాడ బెంజిసర్కిల్‌లో సంబరాలు చేసుకుంటున్న అభిమానులు. - ఈనాడు, అమరావతి

కనకదుర్గమ్మ వారధిపై తప్పిన ప్రమాదం

కంటెయినర్ నుంచి ఊడిపడిన డీజిల్ ట్యాంకు ✪ 3 కి.మీ మేర నిలిచిన ట్రాఫిక్


భారీగా నిలిచిపోయిన వాహనాలు

వారధిపై నిలిచిన కంటెయినర్

ఊడిపడిన డీజిల్ ట్యాంక్

తాడేపల్లి, మంగళగిరి అర్బన్, కృష్ణలంక, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని కనకదుర్గమ్మ వారధిపై ఆదివారం మధ్యాహ్నం భారీ ప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న భారీ కంటెయినర్ లారీ డీజిల్ ట్యాంకు బోల్టులు విరిగి ఒక్కసారిగా ఊడిపోయింది. దీంతో కంటెయినర్ నిలిచిపోయింది. ఆ సమయంలో వెనుక ఎలాంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 వరకు సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. శివరాత్రి పర్వదినం నేపథ్యంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో విజయవాడ వైపు సుమారు 3 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. తాడేపల్లి, విజయవాడ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కంటెయినర్‌ను బయటకు తీసుకువచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదే సమయంలో వారధిపై వెళ్లే మార్గంలో మరో కారు మొరాయించి ఆగిపోయింది.

అద్దె ఫోన్ నంబర్లతోనే వ్యవహారాలు

మ్యూల్ ఎకౌంట్స్ కేసులో బయటకొస్తున్న కోణాలు

ఈనాడు, అమరావతి

పోలీసులకు తమ జాడ ఎక్కడా దొరక్కుండా నిందితులు 'అద్దె' నంబర్లను ఉపయోగించారు. చట్టవిరుద్ధ లావాదేవీలు, సంభాషణలు, సందేశాలకు ఈ నంబర్లపైనే ఆధారపడ్డారు. నిందితులు ఉపయోగించిన నంబర్ల కాల్ రికార్డ్స్ తీసిన పోలీసులు షాక్ తిన్నారు. ఆ నంబర్లు ఏవీ నిందితులకు సంబంధించినవి కాకపోవడమే దీని కారణం. వాటితోనే మ్యూల్ వ్యవహారాలు నడిపించారు. విజయవాడలో గతవారం వెలుగుచూసిన మ్యూల్ ఎకౌంట్ల వ్యవహారంలో పలు కోణాలు వెలుగులోకి వస్తున్నాయి.

ఆ నంబర్లతోనే అన్నీ.. ఈ కేసులో అరెస్టయిన కీలక నిందితులు రవికుమార్ (ఏ1), అతని సోదరుడు స్టీవెన్ (ఏ2).. యనమలకుదురులోని చిన్నగదిని అద్దెకు తీసుకుని డిజిటల్ మార్కెటింగ్ పేరుతో అద్దె ఖాతాల వ్యవహారాలను నడిపించారు. గత తొమ్మిది నెలలుగా ఇక్కడి నుంచే చెన్నైలోని తమ బంధువుకు చెప్పినట్లు చేసేవారు. చెన్నైలో ఉన్న సూత్రధారి జాడ ఇంతవరకు బయటకు రాలేదు. అనామకులతో ఖాతాలు తెరిపించిన సమయంలోనే వారి నుంచి సిమ్‌లు తీసుకున్నారు. ఆ ఖాతాలకు ఈ నంబర్లను లింక్ చేయించారు. సూత్రధారితో నిందితులు అద్దె ఖాతాలు తెరిపించిన వారి సిమ్‌లతోనే సంభాషణలు సాగించారు.

బ్యాంక్ స్టేట్‌మెంట్లు వస్తేనే.. నిందితులు స్థానికంగా మొత్తం 36 బ్యాంకు ఖాతాలు తెరిపించారు. వీటిలో పొదుపు, కరెంట్ ఖాతాలు ఉన్నాయి. ఇవి కాకుండా చెన్నై నుంచి ఇచ్చిన 113 ఖాతాల ద్వారా కూడా ఏ1, ఏ2 లావాదేవీలు నిర్వహించినట్లు తేలింది. స్థానిక ఎకౌంట్లలో పడిన సొమ్మును.. బదిలీ చేసేందుకు ఇతర ఖాతాలను కూడా సూత్రధారి ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. పోలీసులు ఇప్పటికే సంబంధిత బ్యాంకులకు వివరాల కోసం లేఖలు రాశారు. ఇవి వస్తేనే ఏయే ఖాతాల నుంచి లావాదేవీలు జరిగాయి? ఎక్కడికి ఈ సొమ్ము అంతిమంగా తరలింది? చివరి లబ్ధిదారులు ఎవరు? అన్న వివరాలు తెలిసే అవకాశం ఉంది.

కస్టడీకి తీసుకుంటే వివరాలు

నిందితులు వారు నిర్వహించిన రోజువారీ లావాదేవీల వివరాలను ల్యాప్‌ట్యాప్‌లో గూగుల్ షీట్‌లో నమోదు చేసేవారు. అవి చెన్నైలోని సూత్రధారికి వెళ్తుంటాయి. నిందితులను అదుపులోకి తీసుకున్న సమయంలో పోలీసులు ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీంతో అసలు సూత్రదారి.. గూగుల్ క్లౌడ్‌లో ఉన్న ఆ వివరాలను తొలగించడంతో ల్యాప్‌టాప్‌లోనూ వివరాలు డిలీట్ అయ్యాయి. రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు త్వరలో కస్టడీకి తీసుకోనున్నారు. చెన్నైలోని వ్యక్తి పైన ఎవరున్నారు?.. తదితర వివరాలు వీరిని లోతుగా విచారిస్తేనే తెలిసే అవకాశం ఉంది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

ఆలస్యంగా వచ్చిందని.. విద్యార్థినిని రాత్రివేళ గెంటేసి..

- గుణదల బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో అడ్డగోలు వ్యవహారం
- తండ్రి ఫిర్యాదుపై చర్యలు తీసుకోకుండా తాత్సారం

ఈనాడు, అమరావతి

తిరుపతి నుంచి చదువుకునేందుకు వచ్చిన ఓ విద్యార్థిని పట్ల హాస్టల్ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. ఆలస్యంగా వచ్చిందని రాత్రి సమయం అన్న కనీస ఆలోచన లేకుండా బయటికి గెంటేశారు. ఒంటరిగా ఎక్కడికి వెళుతుందని తండ్రి ఫోన్ చేసి ప్రాధేయపడినా నియంతృత్వంగా వ్యవహరించి ఉన్నతాధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా నిర్ణయం తీసుకున్నారు. జరిగిన విషయంపై అన్ని స్థాయిల్లో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేరు.

ప్రశ్నించినందుకు వేధింపులు: దసరా సెలవులకు ముందు హాస్టల్‌కు ఆహార నాణ్యత, మెనూ గురించి ఉన్నతాధికారులు తనిఖీకి వచ్చారు. సమస్యలు ఉంటే చెప్పాలని విద్యార్థులకు సూచించారు. సమస్యలు చెప్పేందుకు సదరు విద్యార్థిని వారి నుంచి నంబర్ తీసుకుంది. వారికి ఫిర్యాదు చేస్తుందన్న ఉద్దేశంతో వేధింపులు మొదలయ్యాయి. భోజనానికి వచ్చిన ప్రతిసారి 'ఇంట్లో తినడానికి గతి ఉండదు కానీ ఇక్కడ మాత్రం రుచులు కావాలి' అంటూ కిచెన్ సిబ్బంది సూటిపోటి మాటలతో నరకం చూపించారు.

✪ దీంతో విద్యార్థిని తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలోనే దసరా సెలవు ఇవ్వడంతో తిరుపతి వెళ్లింది. వ్యక్తిగత సమస్యలతో వారం ఆలస్యంగా రాత్రి వేళ హాస్టల్‌కు తిరిగి వచ్చింది. ఆలస్యంగా రావడంతో నీ పేరు తొలగించామని రాత్రి వేళ గెంటేశారు. మరో దారి లేక విద్యార్థిని రాత్రివేళ బిక్కుబిక్కుమంటూ తెలిసిన వారింట్లో తలదాచుకోవాల్సి వచ్చింది.

హాస్టల్‌లో చేర్చుకున్నారు కానీ.. ✪ ఈ అంశంపై విద్యార్థిని తండ్రి డివిజన్ మొదలు రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఫిర్యాదు చేశారు. విచారణలో హాస్టల్ అధికారులదే తప్పని నిర్ధారించారు. విద్యార్థినిని హాస్టల్‌లో చేర్చుకున్నా ఇప్పటికీ బాధ్యులపై కనీస చర్యలు తీసుకోలేదు. పైగా కిచెన్ సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నట్లు తప్పుడు ఉత్తర్వులు జారీ చేసి మిన్నకున్నారు. తల్లిదండ్రులను మోసం చేశారు.

✪ దీనిపై కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. విద్యార్థినికి అన్యాయం జరిగిందా లేదా అన్న విషయం పరిశీలించి హాస్టల్ అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రద్ధాంజలి

శ్రీ ఐలాపురం వెంకయ్య గారు
మాజీ ఎంఎల్‌సి, ఛైర్మన్- హోటల్ ఐలాపురం, విజయవాడ
మరణం : దిః15-02-2026 ఆదివారం

మా ఆత్మీయులు, శ్రేయోభిలాషి శ్రీ ఐలాపురం వెంకయ్య గారి అకాల మరణానికి చింతిస్తూ.. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ..

ఆళ్ళ గోవర్ధనరావు
కంచికచర్ల, ఎన్.టి.ఆర్ జిల్లా

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట!

ఇబ్రహీంపట్నం గ్రామీణం(గుంటుపల్లి), న్యూస్‌టుడే

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద అధికారులు మత్స్యకారులందరికీ బీమా పథకం వర్తింపజేశారు. ప్రమాదవశాత్తు మత్స్యకారులు చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే సదుద్దేశంతో బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో చేపల వేటలో మృతి చెందిన మత్స్యకారులకు రూ.10 లక్షలు బీమా పరిహారం అందజేస్తారు. మత్స్యకారుడు సాధారణ మరణంతో పాటు ఇతర ప్రమాదాల్లో మృతి చెందిన వారికి కార్మిక శాఖ ద్వారా రూ.2 లక్షల చొప్పున బీమా ప్రకటించారు. అయితే దీనికి ఈ- శ్రమ్ కార్డు తప్పని సరిగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.

పీఎంఎంఎస్‌వైకు అర్హులు ఎవరు?

మత్స్య సహకార సంఘాల్లో సభ్యులై ఉండాలి. చేపల వేట లైసెన్సు ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తోంది. చేపల వేట సమయంలో మరణించిన మత్స్యకారుడికి రూ.10 లక్షలు బీమా అందజేస్తారు. కార్మిక శాఖ ద్వారా ఈ- శ్రమ్ కార్డు పొందితే సాధారణ, ఇతర ప్రమాదాల్లో మత్స్యకారుడు మృతి చెందితే రూ.2 లక్షల చొప్పున పరిహారాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఇస్తారు.

అవసరమైన పత్రాలు

ఆధార్ కార్డు, మరణ ధ్రువపత్రం, శవపంచనామా పత్రం, రేషన్ కార్డు, మత్స్య సహకార సంఘం ధ్రువపత్రం, సంఘం తీర్మాన పత్రం సమర్పించాలి. వీటిని మత్స్య శాఖ జిల్లా కార్యాలయంలోని అధికారులకు కాని, రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని గానీ కలిసి నకళ్లను వారికి ఇవ్వాలి. తర్వాత అధికారులు వాటిని పరిశీలించి విజయవాడ రాష్ట్ర కార్యాలయానికి పంపుతారు.

జిల్లాలో గుర్తింపు పొందిన మత్స్యకారులు	1500 మంది
నదీ తీర సహకార సంఘాలు	21
చేపల చెరువు సంఘాలు	84

నదీతీరంలో పడవలకు లంగరు వేశారిలా..

సద్వినియోగం చేసుకోండి

పీఎంఎంఎస్‌వై పథకాన్ని మత్స్యకారులందరూ సద్వినియోగం చేసుకోవాలి. చేపల వేటలో మత్స్యకారుడు చనిపోతే రైతు సేవా కేంద్రాల్లో కాని, మత్స్య అభివృద్ధి శాఖ అధికారులను తక్షణమే సంప్రదించాలి. మత్స్య సంపద ఉత్పత్తి, నిల్వలు, విక్రయాలు నిర్వహించుకోవడానికి వివిధ పథకాలను అర్హులైన వారికి సబ్సిడీలపై అందజేస్తారు.

- చక్రాణి, జిల్లా మత్స్య శాఖ అధికారిణి

స్వామివారి ప్రభ వద్ద పూజలు తిలకిస్తున్న జనాలు

భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

రామలింగేశ్వరా రక్షమాం..

కానూరు, యనమలకుదురు, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. అనంతరం గ్రామ మండపం వద్ద దేవస్థాన ప్రభకు ఎడ్లు కట్టి ఊరేగించారు. దీన్ని రూ.4,05,000 రావి భవిత్ పాట పాడి దక్కించుకున్నారు. ఉదయం నుంచే వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

అట్టహాసంగా ప్రభోత్సవం..: శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ గిరి ప్రదక్షిణకు ప్రభలు విద్యుత్తు దీపాలతో అట్టహాసంగా బయలుదేరాయి. పెద్ద ప్రభలు 41 ఉండగా, చిన్న ప్రభలు, చిన్నారులు చేసిన ప్రభలు మరో 20 వరకు గిరి సేవలో తరించాయి. రాత్రి మొత్తం ప్రభోత్సవం కొనసాగింది.

ప్రముఖులు రాక..: స్వామి వారిని బందరు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దంపతులు, విజయవాడ నగర సీపీ రాజశేఖర్‌బాబు, కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దంపతులు, కృష్ణా జిల్లా పూర్వపు ఎస్పీ గంగాధర్, దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, పలువురు పోలీసు, దేవాదాయ, రెవెన్యూ, విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు దర్శించుకున్నారు.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గా ఘాట్‌లో భక్తులు పుణ్యస్నానాలకు ఆదివారం పోటెత్తారు. వేకువజామున నుంచే పుణ్యస్నానాలకు, పితృ తర్పాణాలు సమర్పించే వారు ఘాట్‌కు తరలి వచ్చారు. ప్రకాశం బ్యారేజీ పైనుంచి దుర్గాఘాట్‌కు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

ప్రభ ఊరేగింపు

ప్రజల్లో చైతన్యం తెచ్చేలా నార్నె లేఖలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేలా నార్నె వెంకటసుబ్బయ్య.. పత్రికలకు రాసిన లేఖలను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని డాక్టర్ సమరం అన్నారు. హేతువాత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య అధ్యక్షతన ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'శాస్త్రీయ సమాజం కోసం లేఖాస్త్రాలు' అనే పేరుతో నార్నె రూపొందించి పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం సమరం మాట్లాడారు. ఈ పుస్తకంలో పలు అంశాలపై ముక్కుసూటిగా రాయడం జరిగిందని ప్రశ్నలతోనే సమాజం ముందుకు పోతుందని చెప్పారు. వెంకటసుబ్బయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సమస్యలను వెలుగులోకి తీసుకురావడం గొప్ప విషయమన్నారు. మనోహర్ నాయుడు, జమీందార్, దిలీప్, మోతుకూరి వెంకటేశ్వర్లు, రాజు, కనకరాజు, పూర్ణగాంధీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం చూపుతున్న డాక్టర్ సమరం, పక్కన వెంకటసుబ్బయ్య, మనోహర్‌నాయుడు, జమీందార్, దిలీప్ తదితరులు

ఆకట్టుకుంటున్న వస్త్రాల ప్రదర్శన

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విజయవాడ ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ వేదికలో ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహించే నేషనల్ సిల్క్ ఎక్స్‌పోను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పండగలు, వివాహాల నేపథ్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే చేనేత ఉత్పత్తులు, సరికొత్త డిజైన్లు, పట్టు వస్త్రాలు, వివిధ రకాల చీరలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు తదితర ఉత్పత్తులను 50 శాతం వరకు తగ్గించి విక్రయిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల సిల్క్ చీరలు పలు స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితమని, నగర, సమీప ప్రాంతాల ప్రజలు సందర్శించాలని కోరారు.

పూల్ సెమీస్‌లోకి 'కేఆర్‌యూ' నెట్‌బాల్ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల మైదానంలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల్లో ఆతిథ్య కృష్ణా విశ్వవిద్యాలయం (కేఆర్‌యూ) జట్టు పూల్ 'సి'లో సెమీ ఫైనల్‌లో ప్రవేశించింది. రెండో రోజైన ఆదివారం పోటీలు రసవత్తరంగా జరిగాయి. కృష్ణా వర్సిటీ జట్టు... మాధవ విశ్వవిద్యాలయం (రాజస్థాన్) జట్టుపై, ఆపై జేఎన్‌టీయూ (హైదరాబాద్) జట్టుపై గెలిచి పూల్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.

☛ పూల్ 'బి'లో అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్సిటీ (బిలాస్‌పూర్) జట్టు.. ఆదికవి నన్నయ్య వర్సిటీ (ఏపీ) జట్టుపై, రాజీవ్ గాంధీ ప్రౌద్యోగికి (ఎంపీ) జట్టు.. జనార్దన్ రాయ్ నగర్ రాజస్థాన్ విద్యాపీఠ్ (రాజస్థాన్)పై గెలిచింది.

☛ పూల్ సెమీస్‌లోకి 'కేఆర్‌యూ' నెట్‌బాల్ జట్టుపూల్ 'డి'లో కేరళ వర్సిటీ (కేరళ) జట్టు... డాక్టర్ భీమ్ రావ్ అంబేడ్కర్ (ఉత్తర ప్రదేశ్) జట్టుపై, భారతీదాసన్ (తమిళనాడు) జట్టు... వీర్ నర్మద్ సౌత్ గుజరాత్ వర్సిటీ (గుజరాత్) జట్టుపై, మంగుళూరు (కర్ణాటక) జట్టు... కోటా (రాజస్థాన్) జట్టుపై, గోండ్వానా (మహారాష్ట్ర) జట్టు... ఉస్మానియా (తెలంగాణ) జట్టుపై, కాలికట్ (కేరళ) జట్టు... శివాజీ వర్సిటీ (మహారాష్ట్ర) జట్టుపై విజయం సాధించాయి.

☛ టీఎన్‌పీఈ (చెన్నై), సావిత్రిబాయి పులే (మహారాష్ట్ర), ఆర్‌టీఎస్ఎంయూ (మహారాష్ట్ర), హరియాణా స్పోర్ట్స్ (హరియాణా), హేమచంద్ యాదవ (ఛత్తీస్‌గఢ్), బెంగళూరు (కర్ణాటక), అటల్ బిహారీ వాజపేయీ (బిలాస్‌పూర్), కేరళ వర్సిటీ (కేరళ) జట్లు తమ ప్రత్యర్థి జట్లపై గెలిచాయి. పోటీలను తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కృష్ణా వర్సిటీ ఉపకులపతి కూన రాంజీ, రెక్టార్ మండవ వెంకట బసవేశ్వరరావు, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జె.నవీన లావణ్యలత, కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్నాసమ్మ పాల్గొన్నారు.

మంగుళూరు (కర్ణాటక), గోండ్వానా (మహారాష్ట్ర) వర్సిటీ జట్ల మధ్య మ్యాచ్

క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు అనురాధ

ప్రయోగాత్మకంగా కియోస్క్ మెషిన్ల ద్వారా టికెట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ప్రయోగాత్మకంగా టెంపుల్ కియోస్క్ మెషిన్ల ద్వారా దర్శనం, ప్రసాదం, సేవల టికెట్లను భక్తులు నేరుగా తీసుకునే విధానాన్ని ఆదివారం ప్రారంభించారు. కరూర్ వైశ్యా బ్యాంక్ అధికారులు ఏర్పాటు చేసిన మెషిన్లు కనకదుర్గానగర్, లిఫ్టులు, ఘాట్ రోడ్డు మార్గంలో సమాచారం కేంద్రం వద్ద వీటిని ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వీటి పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత ఎన్ని దర్శనం టికెట్లు కావాలో ఎంటర్ చేస్తే దానికి సంబంధించిన మొత్తం భక్తుడి ఖాతా నుంచి కట్ అయిన వెంటనే టికెట్ బయటకు వస్తుంది. దాన్ని తీసుకొని భక్తుడు దర్శనం చేసుకోవచ్చని ఈవో తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఏసీ రంగారావు, సూపరింటెండెంట్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు

టికెట్ తీసుకుంటున్న భక్తుడు, పక్కన ఈవో శీనానాయక్, ఏసీ రంగారావు

మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్యకు నివాళి

దుర్గాఅగ్రహారం(సీతారాంపురం), గాంధీనగర్: మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య(93) మృతితో రాజకీయ, సామాజిక, వ్యాపార వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఏఎంసీ విజయవాడ మాజీ ఛైర్మన్ పాండురంగారావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, ఆప్కోబ్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, నూజివీడు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్, కాంగ్రెస్ నాయకులు గురునాథం, రాజీవ్‌రతన్, దోనేపూడి శంకర్, కె.పోలారి, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ తదితరులు ఆదివారం వెంకయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు.

భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, చిత్రంలో రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, నగర కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు

చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు

గుంటూరు(గోరంట్ల), న్యూస్‌టుడే: చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి రావడంతో తేలికగా ఉపశమనం పొందవచ్చని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్డులో స్కిన్ పర్ఫెక్ట్ హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఆసుపత్రి గుంటూరుకు రావడం శుభపరిణామమన్నారు. డాక్టర్ మన్నె సింధూర మాట్లాడుతూ చర్మ సమస్యలకు లేజర్ టెక్నాలజీ, ఇమ్యునోథెరపీ, కాస్మెటిక్, రికన్‌స్ట్రక్టివ్ విధానాలతో కూడిన చికిత్సలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. చర్మ వ్యాధులకు తక్కువ సమయంలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, ఉగ్రనరసింహారెడ్డి, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రవికుమార్.పి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకరరావు, రాష్ట్ర టెక్నాలజీ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, నగర డిప్యూటీ మేయర్ సజీల, వైద్యులు గొట్టిపాటి లక్ష్మి, ఉప్పటూరి అంజిత్, ఉప్పటూరి హేమంత్, లక్ష్మిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల పింఛన్ పెంచాలి

మాట్లాడుతున్న శివనాగమల్లేశ్వరరావు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వి.శివనాగమల్లేశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులకు ప్రభుత్వం ఇచ్చే సామాజిక పింఛన్ కంటే తమకు తక్కువ పింఛను వస్తోందని, కేవలం రూ.2 వేలతో జీవనం ఎలా సాగించాలని వాపోయారు. తమకు జీవన భృతి కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, వైద్యఖర్చుల పరిమితి ఐదు లక్షలకు పెంచాలని కోరారు. సూపర్ లగ్జరీలో ప్రయాణాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు జి.సీతారామారావు, సాయి భాస్కరప్రసాద్, పి.రమేష్, వెంకట రామయ్య, మురళీకృష్ణ, సీహెచ్ ప్రసాద్, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ అండర్-12 జిల్లా పోటీలు

గన్నవరం బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి అండర్-12 బాలబాలికల రగ్బీ పోటీలు, జిల్లా జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. పోటీలను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిశోర్, సీనియర్ వాకర్స్‌తో కలిసి రగ్బీ క్రీడ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలకృష్ణారావు ప్రారంభించినట్లు క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు తెలిపారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పెద్దఅవుటపల్లి, నున్న, విజయవాడ ఎంఎస్ఆర్ జట్లను ఏపీఆర్‌డీసీ డైరెక్టర్ శివశంకర్‌తో కలిసి అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.

- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

అంతిమ యాత్రలో హల్‌చల్‌పై కేసు

భవానీపురం, న్యూస్‌టుడే: రౌడీషీటర్ అంతిమ యాత్రలో హల్‌చల్ చేసిన నలుగురిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. భవానీపురంలో నివాసం ఉంటున్న జనపాల ఫణీంద్ర అలియాస్ పావురం ఈనెల 3న రోడ్డు ప్రమాదంలో గాయపడి 12వ తేదీన చనిపోయాడు. అతడి అంతిమయాత్రను 13వ తేదీన భవానీపురం నుంచి కృష్ణలంక వరకు నిర్వహించారు. పావురంపై కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అంతిమ యాత్రలో డీజేలు, సైలెన్సర్లు తొలగించిన వాహనాలతో రౌడీషీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులు హల్‌చల్ చేశారు. అంతిమ యాత్రలో ట్రాఫిక్ అంతరాయం కలిగించడం, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు డీజేలు నిర్వహించి హల్‌చల్ చేసిన సాయి, సూర్య, నవీన్, కోడిలపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

అమరావతిలో బిల్‌గేట్స్ పర్యటనకు ఏర్పాట్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే: గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించనున్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో ఆయన సమావేశం కానున్నారు. సచివాలయంలో ఆర్టీజీఎస్‌లో సాంకేతిక వినియోగం, రియల్ టైం గవర్నెన్స్ విధానం-ఫలితాలు, ఉండవల్లిలో రైతులతో సమావేశం, వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ల వినియోగం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి ఆదేశాల మేరకు అధికారులు బిల్‌గేట్స్ పర్యటించే మార్గాల్లో సుందరీకరణ పనులు చేపట్టారు. కృష్ణానది కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్డు(ఈ-3) పేజ్-1, 2.. రాష్ట్ర సచివాలయానికి వెళ్లే ఎన్-9 మార్గంలో సుమారు 10 కి.మీ. మేర రహదారులను శుభ్రపరిచారు. అతిథులను ఆకర్షించేలా డివైడర్లకు రంగులు వేస్తున్నారు. కరకట్టపై ఇరువైపులా మట్టిని చదును చేయించారు. వీఐపీలు ప్రయాణించే మార్గంలో ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి శుభ్రపరిచారు. కృష్ణా కరకట్ట, సీడ్‌యాక్సెస్ రోడ్డు, ఎన్-9 రోడ్డులో ఆహ్లాదకర పూల మొక్కలతో సుందరీకరిస్తున్నారు. ఏడీసీ ఇంజినీరింగ్, గ్రీనరీ విభాగం అధికారులు నిరంతరం పనులు పర్యవేక్షిస్తున్నారు.

ఉండవల్లిలో కలెక్టర్ పరిశీలన.. ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను బిల్‌గేట్స్, చంద్రబాబు తదితరులు పరిశీలించనున్న నేపథ్యంలో అధికారులు ఆమేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సమావేశ వేదిక, సీసీ కెమెరాలు, యాక్సెస్ కంట్రోల్ పాయింట్లు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్ల ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. గుంటూరు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడే డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ, రైతులతో సమావేశం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. క్షేత్ర పరిశీలనలో కలెక్టర్‌తోపాటు వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకురాలు ఎం.పద్మావతి, ఉద్యానశాఖ ఉపసంచాలకురాలు రవీంద్రబాబు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ఉండవల్లి వ్యవసాయ క్షేత్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

'బడ్జెట్‌లో పద్దులు సవరించాలి'

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్ రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీసేలా ఉందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లోని పద్దులను సవరించాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం బీసెంట్ రోడ్డులోని మహంతి మార్కెట్ వద్ద నిరసన తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చినట్లు, పరిశ్రమలు పెట్టినట్లు, యువతకు ఉపాధి కల్పించినట్లు మంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశం మొత్తంగా చూస్తే 25 శాతం పెట్టుబడులు మన రాష్ట్రానికే కుప్పలు తెప్పలుగా వచ్చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల ప్రసంగం సాగిందని ఎద్దేవా చేశారు. కానీ బడ్జెట్ చూస్తే మంత్రి చెప్పిన దానికి పూర్తి విరుద్ధంగా ఉందని ఏ రంగానికి నిధుల పెంపుదల లేదన్నారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న సంక్షేమ, వ్యవసాయ రంగానికి, చివరకు విద్యా రంగానికి కూడా కోత పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వంలో గడిచిన 20 మాసాల్లో జరిగిన అభివృద్ధి సున్నా అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ఇది కార్పొరేట్లకు ఊడిగం చేసే బడ్జెట్ అని విమర్శించారు. బుడమేరు ఆధునికీకరణకు నిధులు ఏవని ప్రశ్నించారు. సీపీఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బోయి సత్యబాబు, పి.కృష్ణ, కె.దుర్గారావు, నారాయణ, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కాశీనాథ్, రమణారావు, సత్యబాబు తదితరులు

17న యూటీఎఫ్ ఆధ్వర్యంలో చలో విజయవాడ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశపెట్టినా కనీసం ఉద్యోగులు, పీఆర్‌సీ గురించి కనీస ప్రస్తావన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గవర్నర్‌పేటలోని కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని కానీ 20 నెలల కాలంలో ఒక డీఏతో రెండేళ్లు సరిపెట్టారని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా పోస్ట్‌కార్డు ఉద్యమం, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం నుంచి పీఆర్‌సీ కమిషనర్ నియామకం గురించి ప్రస్తావన లేదన్నారు. మధ్యంతర భృతి 29 శాతం ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, బకాయిలు చెల్లించాలని, హెల్త్ కార్డు, మెడికల్ బిల్లుల సమస్యలు తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రణభేరి 2.0 పేరుతో 17న చలో విజయవాడ చేపట్టామన్నారు. పెద్దఎత్తున ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎం.సుందరయ్యలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మనోహర్‌కుమార్, పక్కన శ్రీనివాసరావు, సుందరయ్య

ఆకట్టుకున్న అఖండ నాదార్చన

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: గవర్నర్‌పేటలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వరఝరి, దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో 12 గంటల అఖండ నాదార్చన జరిగింది. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ నాదార్చన నిరాటంకంగా రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. చిన్నారి విష్ణుభట్ల లక్ష్మీసంహిత ఆలపించిన కృతులు ప్రేక్షకులను అలరించాయి.


సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కృతులు ఆలపిస్తున్న చిన్నారి లక్ష్మీసంహిత

ధర వరలు

వంకాయలు-18/22, టమాటా-13, బెండ-26, పచ్చిమిర్చి-44, కాకర-32, బీర-26/28, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజీ-14, క్యారెట్-28, దొండ-42, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-26, దోస-16/26, సొర-12/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-22, అల్లం-72, మునగ-10/8, ఆకు కూరలు(కట్ట)-2.50, కంద-36, బీట్‌రూట్-24, కీరదోస-44, బీన్స్-52/56, క్యాప్సికమ్-60, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22(నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (కిలో రూ.ల్లో) వర్తిస్తాయి. **- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతరప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్ పెయిన్స్‌కు విజయవాడ:- శ్రీశరణం లాడ్జి, పాతబస్టాండ్ ఎదురుగా, బందర్‌రోడ్, ప్రతీనెల 2, 16 తేదీల్లో మందులు

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE

HOUSE FOR SALE

గుడివాడ 200 గజాలు, సీలామహల్ దగ్గరలో సూరంవారి వీధి నందు రెండు అంతస్తుల ఇంటితో అమ్మకానికి కలదు. గజం-75వేలు. సంప్ర: 81064 03490

TO LET

2Bed Room Independent House in Kondapalli Side Nagarjuna College for Rent Ph: 99515 22999, 94418 87641.

IJM రెయిన్‌ట్రీపార్క్‌లో 5B/R లగ్జరీ ట్రిప్లెక్స్ విల్లా అద్దెకు. విశాలమైన లేఔట్, ప్రైవేట్ టెర్రస్ 24x7 భద్రత, NH5, నంబూరు VJA-GNT హైవే. 77024 75525

JOBS

Wanted Female Telecallers. Freshers / Exp. Qul: Inter/ Any Graduate. Sal: 10K to 18K. Time: 9.30 to 6.00 ✆ 81422 22869

శ్రీశ్రీశ్రీ హోటల్, బైపాస్ రోడ్, ఖమ్మం నందు పనిచేయుటకు జనరల్ మేనేజర్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర: 99499 11636.

VJA, గాంధీనగర్‌లోని ఇంటీరియర్ ఆఫీస్‌కు హిందీ, ఇంగ్లీష్ వచ్చిన లేడీ రిసెప్షనిస్ట్, బైక్ ఉన్న Exp. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్. ✆ 98486 10708

Wanted Female Tele callers & Councellors. Qly: B.Tech. Exp: Freshers & Experienced. Salary: 15 to 20K ✆ 97045 64441

Engineering EEE /Diploma (Boys) ★ Computer Operator Female ★ Office Administrators. Switch Gears, Enikepadu. ✆ 99081 78777

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

ప్రముఖ AD AGENCYలో పనిచేయుటకు Computer Operator, Marketing Executive, Corel Draw Designer, Supervisor కావలెను. ✆ 98665 01439.

విజయవాడ హోం అప్లయన్సెస్ షోరూంలో Female/Male సేల్స్ ప్రమోటర్స్ జీతం: 15000/-+ ఇన్సెంటివ్ & హెల్పర్స్, ఆఫీస్‌బాయ్స్ కావలెను. ✆ 73311 73685.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ:18K to 20K. ✆96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

ఆటోడ్రైవర్, డెలివరీ బాయ్స్, లేడీ ఆఫీస్ స్టాఫ్ కావలెను. LIC Colony, రమేష్ హాస్పిటల్ రోడ్, విజయవాడ. సంప్రదించండి ✆ 92466 22459.

శ్రీ వెంకటేశ్వర రైస్ అగ్రో ఇండస్ట్రీస్ నందిగామ, కృష్ణాజిల్లా, నూకలు,బీరు ట్రేడింగ్ ప్రారంభిస్తున్నాము. అనుభవమున్న స్టాఫ్ కావలెను. శాలరీ+ కమీషన్. 89779 27069/ 17069, 98481 57069.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ★ తిరువూరు పట్టణం 17వ వార్డులోని డ్రెయిన్లలో మురుగు, చెత్త వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు ప్రభాకర్ సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ★ తిరువూరు పట్టణం 6వ వార్డులోని డ్రెయిన్లలో పిచ్చి మొక్కలు పెరిగి దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికుడు సాయి కుమార్ సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి దోమల మందు పిచికారీ చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

క్రికెట్‌లో ఉన్నతంగా రాణించాలి

జగ్గయ్యపేట గ్రామీణం : గుంటూరు జిల్లాలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగే ఏసీఏ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల అండర్-12 క్రికెట్ పోటీలకు మండలంలోని షేర్‌మహమ్మద్‌పేట డీవైఎఫ్ఐ నాయకుడు బడే మియా-షహనాజ్ కుమారుడు షేక్ ఫాదిల్ ఎంపికయ్యారు. ఫాదిల్ క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని సీపీఎం మండల కార్యదర్శి సోమోజు నాగమణి తెలిపారు. టోర్నమెంట్‌లో మంచిగా రాణించి రానున్న రోజుల్లో క్రికెట్‌లో ఉన్నత స్థానం సాధించాలన్నారు.

చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి బి.కాలనీ వద్ద ఉన్న సెయింట్ థామస్ చర్చి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎన్టీటీపీఎస్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి తెదేపా సీనియర్ నాయకుడు జంపాల సీతారామయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

శిలాఫలకం వద్ద సీతారామయ్య తదితరులు

మైనార్టీల సంక్షేమం.. అభివృద్ధికి కృషి

విస్సన్నపేట, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని రాజుపేటలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం జరిగిన అన్నదానంలో ముస్లిం సోదరులకు ఆయన స్వయంగా వడ్డించారు. తిరువూరు ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుబ్రమ్మణ్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని ఏసీపీ ప్రసాదరావు సూచించారు. 'డ్రగ్స్‌పై దండయాత్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్న మహిళా పోలీసు బృందానికి కంభంపాడులో పోలీసు అధికారులు, గ్రామస్థులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని పలు వీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కంభంపాడు ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. తిరువూరు సీఐ గిరిబాబు, ఎ.కొండూరు ఎస్సై మహాలక్ష్మణుడు, సిబ్బంది, తెదేపా మండల అధ్యక్షుడు పీక్లా నాయక్, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్ రెడ్డి, ఎలినేని చంద్రం పాల్గొన్నారు.

తిరువూరులో ఎస్సై శాతకర్ణి, సిబ్బంది

కంభంపాడులో యాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న అధికారులు, గ్రామస్థులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: డ్రగ్స్‌పై దండయాత్ర సైకిల్ ర్యాలీ తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి ఆదివారం సాయంత్రం ప్రవేశించింది. ఈ మేరకు బృంద సభ్యులకు ఎస్సై శాతకర్ణి, సిబ్బంది, కార్యక్రమస్థులు ఘన స్వాగతం పలికారు.

సమీపిస్తున్న గడువు.. నమోదు చేసుకుంటే మేలు

గంపలగూడెం, న్యూస్‌టుడే

రైతులకు భూహక్కు పత్రాలు ఎంత ముఖ్యమో. .తమ భూముల్లో సాగు చేసిన పంటలను ప్రభుత్వం గుర్తించేందుకు ఈ- పంట నమోదు అంతే అవసరం. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను మద్దతు ధరకు ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించాలన్నా, ప్రకృతి వైపరీత్యాలతో పంట పాడైపోతే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందాలన్నా, పంటల బీమా పథకం వర్తించాలన్నా, సాగైన పంటలకు రాయితీలు, అవసరమైన ఎరువులు కావాలన్నా ఈ- పంట నమోదు తప్పనిసరి. ఇన్ని వివరాలు ఎందుకంటే ప్రస్తుతం సాగైన రబీ పంటలకు సంబంధించి నమోదు గడువు ఈ నెల 20న ముగుస్తోంది. తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ప్రధానంగా వరి, మొక్కజొన్నకు వ్యవసాయాధికారులు ఈ- పంట నమోదును రెండు నెలలుగా చేస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచన మేరకు అన్నదాతలు గడువులోగా ఈ- పంట నమోదు చేసుకుంటే మేలు.

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ఆదివారం వరకు ఈ-పంట నమోదు వివరాలు..

మండలం పేరు	వరి (ఎకరాల్లో)	మొక్కజొన్న (ఎకరాల్లో)
తిరువూరు	18,003	633
ఎ.కొండూరు	4095	5964
గంపలగూడెం	8447	6453
విస్సన్నపేట	5745	2413
రెడ్డిగూడెం	5473	1624

మొబైల్ యాప్‌లో..

ఈ- పంటలో సాగు వివరాలను ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకులే నమోదు చేశారు. ఇకపై రైతులే స్వయంగా మొబైల్ యాప్‌లో నమోదు చేసుకునేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. అన్నదాతలు తమ స్మార్ట్ ఫోన్‌లో ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆధార్ నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, ఎంపిన్‌ను సెట్ చేసుకోవాలి. ఆధార్ నంబరు ఆధారంగా వెబ్‌ల్యాండ్‌లో అనుసంధానమైన రైతుకు చెందిన అన్ని భూకమతాలు ఆ యాప్‌లో కనిపిస్తాయి. దీని ద్వారా ఇప్పటి వరకు వీఏఏలు నమోదు చేయని పంటల వివరాలను సకాలంలో నమోదు చేసుకోవచ్చు. ఇందుకు రైతులు తప్పనిసరిగా పొలంలో ఉండాలి. 20 మీటర్ల జియో రిఫరెన్సు హద్దులతో పొలంలో పంటతో సహా చిత్రం తీసుకోవచ్చు.

గంపలగూడెం మండలం తునికిపాడులో ఈ- పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి

అంచనాలను దాటి..

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో రబీలో ఇప్పటి వరకు 41,763 ఎకరాల్లో వరి, 17,087 ఎకరాల్లో మొక్కజొన్న సాగైనట్లు వీఏఏలు ఈ-పంటలో నమోదు చేశారు. అయిదు మండలాల్లో వ్యవసాయాధికారుల అంచనాలను దాటి వరి, మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. ఇప్పటి వరకు నీటి లభ్యత అనుకూలంగా ఉండటంతో రైతులు ఆసక్తి చూపారు.

శివారు కాలనీలకు అందని.. తాగునీరు

విస్సన్నపేట శివారు రాజీవ్‌నగర్ కాలనీలో కుళాయి నీరు సక్రమంగా అందడం లేదు. వచ్చిన అరకొర నీరు మురుగుగా ఉంటుందని నివాసితులు వాపోతున్నారు. ఏళ్ల కిందట వేసిన పైపులు తుప్పు పట్టి మరమ్మతులకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో డబ్బా నీటిపై ఆధారపడాల్సి వస్తోందని తెలుపుతున్నారు. పైపు లైన్లు వేసిన కొంతకాలానికే సీసీ రోడ్డు వేయడంతో పైకి కుళాయిలు దిగువన ఉండడంతో మురుగు నీటిలోనే తాగు నీరు పట్టుకోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను గుర్తించి తగు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

గోమాతల యజమానులకు సత్కారం

సన్మానం అందుకున్న వారితో నిర్వాహకులు

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను శివాలయంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో గ్రామానికి చెందిన గోమాతల యజమానులను నిర్వాహకులు సత్కరించారు. సనాతన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు అన్నారు. గోవులు పెంచుతున్న యజమానులతో పాటు పలువురు కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. గోమాతకు పూజలు చేశారు.

లారీల రాకపోకలతో ఇబ్బందులు

ఆందోళన చేస్తున్న అరుణానగర్ వాసులు

కొండపల్లి, న్యూస్‌టుడే: క్వారీ లారీల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అరుణానగర్ వాసులు వాపోతున్నారు. ఈ మేరకు స్థానికులంతా ఆదివారం రహదారిపై నిరసన తెలిపారు. క్రషర్లు, క్వారీ, సిమెంటు కంపెనీలకు వెళ్లే లారీలు అరుణానగర్ మీదుగా అధిక లోడ్‌తో వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని చెబుతున్నారు. లారీలను అడ్డగిస్తుంటే.. అడ్డు వచ్చిన వారిని తొక్కిస్తామని డ్రైవర్లు మాట్లాడడం దారుణమన్నారు. పదేళ్లుగా బాధలు పడుతున్నా తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పారిశ్రామికవాడ నుంచి వెళ్లే రహదారిలోనే ఆయా లారీల వారికి మార్గం చూపే విధంగా అధికారులు చొరవ చూపాలని కోరారు.

దుర్గమ్మకు బంగారు ఆభరణాలు బహూకరణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు దుర్గగుడి స్థానాచార్య శివప్రసాద శర్మ కుమారుడు వి.ఎస్.వి.ఎల్.ఎస్.జె.శర్మ రూ.4 లక్షలు విలువ చేసే బంగారు బొట్టు, నత్తు, బులాకీని ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. 29.700 గ్రాముల బరువు ఉన్న వాటిని దుర్గమ్మ ఎదుట ఉంచి పూజ చేయించిన అనంతరం ఈవో శీనా నాయక్‌కు అప్పగించారు. ఆశీర్వచన మండపంలో దాత కుటుంబానికి వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఈవో శీనానాయక్‌కు ఆభరణాలు అందజేస్తున్న వి.ఎస్.వి.ఎల్.జె.శర్మ కుటుంబ సభ్యులు

అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి: ధర్మప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూచిపూడి నృత్య కళాకారులు ప్రదర్శించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. తాడేపల్లికి చెందిన నృత్యాచార్య సత్యవతి శిష్య బృందం ప్రదర్శించిన శివతాండవం, శంకర శ్రీగిరి తదితర భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. తెనాలికి చెందిన నాట్యాచార్య ఆర్.వసంత దుర్గ శిష్య బృందం ప్రదర్శించిన గణేష్ స్తుతి, మహిషాసురమర్దిని స్తోత్రం భక్తుల్లో ఉత్తేజాన్ని నింపింది. నృత్య కళాకారులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

చెవుటూరు గ్రామంలో ప్రధాన రహదారికి అనుసంధానంగా ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామంలో గంగానమ్మ బజారుకు వెళ్లే రోడ్డుతో అనుసంధానంగా దీన్ని మధ్యలో కాలువకు ఏర్పాటు చేసిన తూము విరిగిపోయి గుంత ఏర్పడింది. దీంతో రాత్రి వేళ ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

తిరువూరులో..

మేడూరులో జీవన్ముక్తేశ్వర స్వామి

కొత్తపల్లి గుడిలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పోలిశెట్టిపాడులో అభిషేకం

హర హర మహాదేవ శంభో శంకర

సంగమం వద్ద శివుని విగ్రహం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శివనామస్మరణతో తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని ఆలయాలు మారుమోగాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు పోటెత్తారు. పితృదేవతలకు పిండ ప్రదానాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్యస్నానమాచరించారు. అనంతరం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల అన్నదానాలు జరిగాయి. - న్యూస్‌టుడే యంత్రాంగం

జి.కొండూరులో ప్రభ

గుంటుపల్లి కాశీ విశ్వేశ్వర విశాలాక్షి ఆలయంలో దేవినేని ఉమా

సంగమం వద్ద భక్తుల పుణ్య స్నానాలు

గొల్లపూడి ఘాట్ వద్ద భక్తుల కోలాహలం

వెల్వడం బాలకోటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

కొండపర్వలో అన్నసంతర్పణ

గుంటుపల్లి రేవులో గజ ఈతగాళ్ల పర్యవేక్షణలో..

విశ్వశాంతి కల్యాణ మహోత్సవం

కొండపల్లి, న్యూస్‌టుడే : స్థానిక బి.కాలనీ వద్ద ఉన్న గిరివిరేశ్వర ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ విశ్వశాంతి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రమైన రెడ్డిగూడెంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో ఆదివారం శ్రీగోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణ వేడుక నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రెడ్డిగూడెంలో..

వైభవంగా శివ కల్యాణం

మైలవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి, ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీ భ్రమరాంబికా సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శివ కల్యాణం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎస్వీ సుధాకర్ రావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ ప్రాంగణంలో శివయ్య కల్యాణం కనులపండువగా ఆదివారం నిర్వహించారు. రుత్వికులు వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య మల్లేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కృష్ణా జలం, పంచామృతాలతో అభిషేకాన్ని నిర్వహించారు. లింగోద్భవకాలంలో గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు అందజేశారు.

వెల్వడం: ప్రభల ఊరేగింపులో ఎమ్మెల్యే తదితరులు

కొండపర్వలో మల్లయ్య స్వామి..

కొండపల్లి: క్రతువులో పాల్గొన్న భక్తులు

మైలవరం శివాలయంలో శివ కల్యాణం

ఇకపై స్వర్ణ గ్రామం.. వార్డులు

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామ, వార్డులుగా (ఎస్‌జీఎస్‌డబ్ల్యూ) మార్పు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు గ్రామ సచివాలయాలుగా ఉండగా ఇకపై స్వర్ణ గ్రామాలుగా పిలవనున్నారు. తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో 67 గ్రామ సచివాలయాలు, తిరువూరు పట్టణంలో 20 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ కార్యాలయాలపై ఉన్న బోర్డుల్లో అధికారులు పేర్లు మార్పు చేయాల్సి ఉంది. - న్యూస్‌టుడే, గంపలగూడెం

ఎర్ర వంతెన వద్ద లారీ బోల్తా

కొండపల్లి: కొండపల్లి ఎర్ర వంతెన వద్ద ఆదివారం ఉదయం లారీ పడిపోయింది. వంతెనకు అనుసంధానంగా నూతన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మైలవరం నుంచి కొండపల్లి వైపు వస్తున్న లారీ వంతెన వద్దకు రాగానే డ్రైవర్‌కు మార్గం అర్థం కాక ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో లారీ పక్కకు ఒరిగి పడిపోయింది. డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం వల్ల నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఘటన స్థలంలో లారీ

అన్నదానానికి విరాళం

నందిగామ గ్రామీణం: దాములూరు కూడలి శివాలయంలో అన్నదానానికి అదే గ్రామానికి చెందిన కొత్త వీరన్న ఆదివారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను గ్రామీణ వైద్యుల సంక్షేమసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి, డివిజన్ నాయకులు మార్కపూడి దేవదాసు, సైదులు, మధు, నరేంద్ర అభినందించారు.

ఆలయం సమీపంలో మద్యం అమ్మకాలు

సామాజిక మాధ్యమాల్లో వీడియో ★ అడ్డుకున్న ఎక్సైజ్ అధికారులు

మైలవరం, న్యూస్‌టుడే : విచ్చలవిడిగా మారిన మద్యం అమ్మకాలతో వ్యాపారులు మరింత బరితెగిస్తున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను మండలంలోని వెల్వడంలో మూడ్రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. దాన్ని ఆసరాగా తీసుకున్న గొలుసు కట్టు దుకాణదారులు, ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన ప్రాంతానికి సమీపంలో పట్టాలు కట్టి మరీ ఆదివారం దుకాణం తెరిచి విక్రయాలు ప్రారంభించారు. భక్తులకు కనిపించేలా మద్యం సీసాలు ఏర్పాటు చేశారు. ఈ నిర్వాకం, అధికారుల తీరుపై సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ అయ్యింది. దీనిపై స్పందించిన ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాస్ అక్కడ నుంచి మద్యం బాక్సులు తొలగించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇటువంటి అమ్మకాలపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిద్ధంగా మద్యం బాక్సులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పట్టాలెక్కనున్న చింతలపూడి ఎత్తిపోతల పథకం

● బడ్జెట్లో నిధుల కేటాయింపుతో రైతుల్లో హర్షం

మైలవరం, న్యూస్‌టుడే

ఎగువ రాష్ట్రం నుంచి సాగర్ నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులకు చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తితో చెక్ పడనుంది. తెదేపా హయాంలో మొదలు పెట్టిన ఈ పథకాన్ని వైకాపా పూర్తిగా అటకెక్కించింది. తిరిగి కూటమి ప్రభుత్వంలో పట్టాలెక్కుతోంది. తొలి ఏడాది దీనికి కొంతమేరకే నిధులు కేటాయించగా తాజా బడ్జెట్‌లో భూసేకరణతో పాటు కాలువల ఆధునికీకరణకు నిధులు ఇవ్వడంతో త్వరితగతిన పూర్తవుతుందన్న ఆశాభావం రైతుల్లో ఏర్పడుతోంది.

రాష్ట్ర విభజనతో..

జిల్లాలోనే ప్రధాన మెట్ట ప్రాంతంగా ఉన్న మైలవరం, తిరువూరు నియోజకవర్గాలకు పూర్తిగా, నందిగామ నియోజకవర్గానికి పాక్షికంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా సాగునీటి ఇబ్బందులను ఎన్నెస్పీ ద్వారా తీర్చుకుంటుండగా రాష్ట్ర విభజనతో సాగర్‌పై ఆశలు క్రమేపీ అడుగంటుతున్నాయి. ఈ ఏడాది ఆ ఇబ్బంది కాస్తా మరింత ఎక్కువ కాగా కేటాయింపుల్లో కనీసం సగం నీరు కూడా సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విభజన అనంతరం సాగర్ ఆయకట్టుకు వరప్రదాయినిగా చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి పనులు పరుగు పెట్టించారు. ఏడాదిన్నరలోనే దాదాపు సగానికి పైగా పూర్తవగా, 2019లో ప్రభుత్వం మారడంతో పథకం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. సాగర్ ఎడమ కాలువ పరిధిలోని మూడో జోన్‌లో ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను అందించాలన్న ఆశయం నీరుగారింది.

జిల్లాలో ఎత్తిపోతల ప్రవాహమిలా..

బ్రాంచి కాలువ - మైలవరం (37.5 కి.మీ)

మేజర్లు - జమలాపురం, జక్కంపూడి, రేపూడి- 1, రేపూడి- 2, గానుగపాడు, వెల్వడం, మూలపాడు

ఆయకట్టు - సుమారు 1.20 లక్షల ఎకరాలు

జీవం పోసినట్లు..

గతేడాది రాష్ట్ర బడ్జెట్‌లో కొద్ది మొత్తంలో నిధులు కేటాయించగా, తాజా బడ్జెట్‌లో రూ.430 కోట్లు ప్రకటించడం ఎత్తిపోతలకు జీవం పోసినట్లు అయ్యింది. దీని ద్వారా ఎన్నెస్పీ మూడో జోన్‌లోని 95వ కి.మీ వద్ద సాగర్ కాలువల్లోకి వచ్చే గోదావరి నీరు రెడ్డిగూడెం మండల పరిధిలోని మద్దులపర్వ వద్ద నుంచి నూజివీడు, మైలవరం బ్రాంచి కాలువల్లోకి ప్రవహించనుంది. అక్కడి నుంచి మేజర్లు, మైనర్ల ద్వారా మూడు నియోజకవర్గాల పరిధిలోని ఆయకట్టుకు నీరందనుంది.

(c) eenadu

విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కరెన్సీనగర్: 80085 74652

★ 3వ డివిజన్ గుణదల ఈఎస్ఐ బస్ స్టాపు సమీపంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి వీవీ వరప్రసాద్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపించి పూడిక తీయించారు. ★ 5వ డివిజన్ ఫిలిం కాలనీ 5-19/37 విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగడం లేదని స్థానిక నివాసి ప్రసాద్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. * నాలుగో డివిజన్ శ్రీనివాస నగర్ బ్యాంకు కాలనీ 8వ రోడ్డులో దోమల బెడద అధికంగా ఉందని స్థానిక నివాసి రాజారావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపించి దోమల మందులు కొట్టించారు. – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి ఒంటి గంట మధ్య లిఖిత పూర్వకంగా అందించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

సిబ్బందికి సూచనలిస్తున్న ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందించే వైద్య సేవల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి చర్యలను సహించనని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. ఏడుకొండలరావు అన్నారు. ఆదివారం ఉదయం, సాయంత్రం ఆయన ఆసుపత్రిలోని క్యాజువాలిటీ విభాగాన్ని సందర్శించారు. ప్రమాదాల బారిన పడి ఆసుపత్రికి వచ్చిన వారికి, అత్యవసర చికిత్స అవసరమైన రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అందరూ చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎటువంటి పరిస్థితుల్లో సహించేది లేదని, ఎవరైనా అలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పన్ను కడతాం.. డబ్బులు పంపండి

చెల్లింపుదారులకు మోసగాళ్ల ఫోన్

న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

'మీరు ఇంటి పన్ను చెల్లించలేదు. నా ఫోన్ పే నంబరుకు డబ్బులు పంపిస్తే.. నేను కడతాను' అంటూ భవానీపురంలోని ఓ విశ్రాంత ఉద్యోగికి ఒకడు ఫోన్ చేశాడు. నగరపాలక సంస్థ పన్నుల విభాగం ఉద్యోగి మాట్లాడుతున్నట్లు పరిచయం చేసుకున్నాడు. ఆ వ్యక్తి పదే పదే ఫోన్ చేయడంతో విశ్రాంత ఉద్యోగికి అనుమానం వచ్చింది. అతను చెప్పింది ధ్రువీకరించుకునేందుకు సమీపంలోని నగరపాలక సంస్థ పన్ను వసూలు కేంద్రానికి వెళ్లారు. ఫోన్ చేసిన వ్యక్తి సెల్ నంబరు, ఆయన చెప్పిన విషయాలను సిబ్బందికి తెలియజేశారు. అతడు చెప్పిన మాటలు అసత్యమని, ఆ ఫోన్ నంబరు కలిగిన వ్యక్తులెవరూ నగరపాలక సంస్థలో లేరని కార్యాలయ సిబ్బంది చెప్పారు. మోసం నుంచి బయటపడ్డానని విశ్రాంత ఉద్యోగి ఊపిరిపీల్చుకున్నారు.

పన్ను చెల్లిస్తున్న నగరవాసులు

తూర్పు నియోజకవర్గంలో పన్ను వసూలు కేంద్రాలు

- పటమట సర్కిల్-3 కార్యాలయంలో రెండు చోట్ల..
- స్టెల్లా కళాశాల దగ్గర్లోని సాయిబాబా ఆలయం సమీపంలో..
- గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో....
- కృష్ణలంక ఏపీఎస్ఆర్ఎం పాఠశాల వద్ద 102 సచివాలయం..

నగదు పంపి మోసపోవద్దు

నగరంలోని పన్ను చెల్లింపుదారులకు మోసగాళ్లు ఫోన్లు చేస్తున్న విషయం నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి వచ్చింది. నగర పాలక సంస్థ సిబ్బంది ఎవరూ అలా ఫోన్ చేయరని, అటువంటి ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఇంటి, కుళాయి, ఆస్తి పన్ను ఏదైనా.. ఎవరికీ ఫోన్ పే, గూగుల్ పే చేయవద్దని సూచిస్తున్నారు. నగర పాలక సంస్థ పన్ను చెల్లింపు వెబ్‌సైట్లు (www.ourvmc.org లేదా www.cdma.ap.gov.in), పన్ను వసూలు కేంద్రాల్లో మాత్రమే చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారికంగా ప్రకటించారు. పన్ను చెల్లించాలంటూ ఎవరైనా ఫోన్లు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెబుతున్నారు. మన మిత్ర వాట్సప్ నంబరు 95523 00009, పుర మిత్ర యాప్, సమీపంలోని నగరపాలక సంస్థ పన్ను వసూలు కేంద్రంలో సంప్రదించాలని కోరుతున్నారు. నగరంలోని మూడు నియోజకవర్గాల్లో పన్ను వసూలు కేంద్రాలు 14 ఉన్నాయని, వాటిలో మాత్రమే చెల్లించాలని, ఎవరికీ డబ్బులు చెల్లించి మోసపోవద్దని సూచిస్తున్నారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఈ నెల 17న నిర్వహించాల్సిన విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 21వ తేదీన సమావేశం నిర్వహించే అవకాశం ఉందని, అయితే... ఆ తేదీని మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఖరారు చేయాలని అధికారులు వెల్లడించారు.

అందరి సహకారంతో మసీదు నిర్మాణం అభినందనీయం

కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న జనాబ్ మాలిక్, రామ్మోహన్, వర ప్రసాద్, అవినాష్ తదితరులు

పటమట, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో మసీదు నిర్మించుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఏపీఐఐసీ కాలనీలో నూతనంగా నిర్మించిన కౌసర్ మసీదును ఆదివారం జమాతే-ఇ-ఇస్లామీ హింద్ జాతీయ ఉపాధ్యక్షుడు జనాబ్ మాలిక్ ప్రారంభించారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, వరప్రసాద్, ఎమ్మెల్సీ రుహుల్లా, వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొప్పన భవకుమార్ హాజరయ్యారు. గద్దె మాట్లాడుతూ.. 2014-19 సమయంలో హైటెన్షన్ రోడ్డు నిర్మాణానికి సీఎం చంద్రబాబును ఒప్పించి రూ.16 కోట్లు మంజూరు చేయిస్తే రోడ్డు వేశారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న మసీదు తొలగించి వేరే చోట నిర్మించేందుకు అనువైన స్థలం కేటాయించామని తెలిపారు. అవినాష్ మాట్లాడుతూ.. పాత మసీదు అభివృద్ధికి మాజీ మంత్రి నెహ్రూ కృషి చేశారని, తాను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు మసీదు నిర్మాణానికి సహకరించినట్లు తెలిపారు. ఏపీ ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫారుక్ షిబ్లీ, జమాతే-ఇ-ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ షౌకత్ హుసేన్, ఉపాధ్యక్షుడు మొహిద్దీన్, ప్రధాన కార్యదర్శి కమీరుద్దీన్, నగర అధ్యక్షుడు జబీల్లా పాల్గొన్నారు. రామ్మోహన్, అవినాష్ హాజరవుతారని ముందస్తు సమాచారం లేక పోలీసులు కంగారు పడ్డారు. వెంటనే అదనపు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ రచయిత, విశ్రాంత ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ రచించిన విలువైన అరుదైన పుస్తకాలను ఆదివారం ఠాగూర్ గ్రంథాలయానికి వితరణ చేశారు. వీటిని హైదరాబాద్ నుంచి నవభారత్ నిర్మాణ సంఘం వ్యవస్థాపకుడు సూరేపల్లి రవికుమార్ విజయవాడకు తీసుకువచ్చారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీతో కలిసి ఠాగూర్ గ్రంథాలయానికి వెళ్లి గ్రంథాలయాధికారిణి కె.రమాదేవికి ఈ పుస్తకాలు అందించారు. సామాన్య పాఠకులకే కాక పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కూడా ఇవి ఉపయోగపడతాయని వీటిని తమకు ఇవ్వడం ఆనందంగా ఉందని గ్రంథాలయాధికారిణి పేర్కొన్నారు.

ముగిసిన ఎడ్ల పందేలు

చిలుకూరు, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని బేతవోలులో కనకదుర్గమ్మ జాతర, శివరాత్రి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఒంగోలు జాతి వృషభరాజుల బండలాగుడు పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు న్యూ కేటగిరీ ఎడ్ల పందేలు జరిగాయి. ప్రకాశం జిల్లాకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి మొదటి స్థానంలో నిలిచి రూ. 70,000, ద్వితీయ స్థానంలో విజయవాడకు చెందిన మెగా కృష్ణమోహన్ నిలిచి రూ. 50,000 సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచి వట్టికూటి నాగయ్య, ఉపసర్పంచి ఏడుకొండలు, ప్రశాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు. పోటీలు చూడడానికి భారీగా జనం వచ్చారు.

దత్త పీఠంలో..

త్రిశక్తి పీఠంలో అన్నాభిషేకం

అర్ధ నారీశ్వర అలంకారంలో కామాక్షి

కృష్ణలంక : నదీ తీరంలో భక్తుల కోలాహలం

కైలాసవాసా.. మహాదేవా..

న్యూస్‌టుడే బృందం: మహా శివరాత్రి సందర్భంగా ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. గణపతి పూజ, గోపూజ, సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకం, రుద్ర హోమం, అన్నాభిషేకం, అన్నసమారాధన, స్వామి కల్యాణం చేశారు. కృష్ణలంక పరిధిలోని కృష్ణా తీరం, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు మెట్ల బజారు సమీపంలోని నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేశారు. సీఐ నాగరాజు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పీఎస్‌బీసీస్ సమీపంలోని త్రిశక్తి పీఠంలో కాళీ మాతను అర్ధ నారీశ్వరి అలంకరించారు. కృష్ణలంక మెట్ల బజారులోని కాశీ విశ్వేశ్వర ఆలయం, సర్వేస్ రోడ్డులోని శంకర మఠానికి భక్తులు పోటెత్తారు. ది లిటిల్ రైస్ అండ్ జనరల్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శివగిరి క్షేత్రాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శివగిరి క్షేత్రస్వామిని మల్లికార్జున శర్మ పర్యవేక్షించారు. మొగల్రాజపురంలోని శివాలయాలకు భక్తులు బారులు తీరారు. యనమలకుదురు వెళ్లే భక్తులకు పటమట లంకలో యలమంచిలి దేవేంద్ర, నర్రా కిషోర్ (ఫ్రెండ్స్ సర్కిల్) ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఎస్బీ సర్కిల్ సమీపంలోని గౌరీశంకర స్వామిని, పటమట దత్త పీఠంలోని గంగా ధరేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

మాచవరంలో కనకదుర్గామల్లేశ్వర స్వామి

శివగిరిపై నాగసాధువుల పూజలు

కృష్ణలంక శంకరమఠం వద్ద ప్రసాదాల పంపిణీ

పటమటలంకలో భక్తులకు మజ్జిగ అందజేత

కుక్కల బెడద.. ప్రజల కలత

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీలో తిరుగుతున్న శునకాలు

కొన్ని డివిజన్లలో శునకాలు బెడద అధికంగా ఉంది. స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గుంపులుగా తిరుగుతూ... రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్రవాహనదారుల వెంట పడుతున్నాయి. కొద్ది రోజుల కిందట బందులదొడ్డి ప్రాంతంలో నివసిస్తున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. గాంధీ నగర్‌లోని ఊర్వశి థియేటర్ సమీపంలో శునకాలు ఒక్కసారిగా అడ్డుపడ్డాయి. ఆయన అదుపు తప్పి పడిపోయి గాయాలపాలయ్యారు. కొన్ని నెలల కిందట మొగల్రాజపురానికి చెందిన ఒకరికి కుక్క కరిచింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. మొగల్రాజపురంలోని బోయపాటి మాధవరావు వీధి, పటమట వారి వీధి, అట్లూరి పరమాత్మ వీధి, శివగిరి కొండ ప్రాంతాలు, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, లబ్బీపేట, పటమట, గుణదల ప్రాంతాల్లో శునకాలతో ఇబ్బంది పడుతున్నామని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. రాత్రి పూట ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు వెళ్తున్న పిల్లల వెంట పడుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెత్త గుట్టలు.. తరలించక ఇక్కట్లు

ఆటోనగర్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. స్టాలిన్ కార్పొరేట్ కార్యాలయం రోడ్డులో చెత్త పేరుకుపోయింది. నిత్యం ఇదే పరిస్థితి ఉంటోంది. సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. పనుల నిమిత్తం ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. సమస్యను ఇలా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదు. నిత్యం చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **- ఆటోనగర్, న్యూస్‌టుడే**

అధ్వానంగా బస్‌స్టేషన్ దారి

ఆటోనగర్ బస్ స్టేషన్‌లోకి వెళ్లే మార్గం గుంతలతో అధ్వానంగా మారింది. ఆటోనగర్ బస్ స్టేషన్ కొంచెం దూరం ఉండగానే అక్కడ దిగే ప్రయాణికులు లేచి నిలబడుతున్నారు. బస్సులు గుంతల్లో ఒక్కసారిగా దిగడంతో నిలబడిన ప్రయాణికులు అదుపు తప్పి పడిపోతున్నారు. ప్రమాదకర గుంత పూడ్చకపోవడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. **- పటమట, న్యూస్‌టుడే**

పొంచి ఉన్న ప్రమాదం..

ఆటో నగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ రెండో రహదారిలో నియంత్రిక ప్రమాదకర స్థితిలో ఉంది. వాహనాల విడిభాగాలు, ఇనుప వస్తువులు దాని చుట్టూ పెట్టారు. చెత్త చేరింది. కనీసం దానికి రక్షణ కూడా లేదు. విద్యుత్తు అధికారులు స్పందించి నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేసి, అటువంటి వస్తువులు సమీపంలో పెట్టకుండా చూడాల్సిన అవసరం ఉంది. **- ఆటోనగర్, న్యూస్‌టుడే**

వ్యర్థాలు తొలగక.. మురుగు పారక

పటమట ఎన్ఎస్ఎం పాఠశాల సమీపంలో కాలువల నిర్వహణ సక్రమంగా లేదు. కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తరచూ తొలగించకపోవడంతో మురుగు పారక దుర్వాసన వెదజల్లుతోంది. దోమల వ్యాప్తి కూడా అధికంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వీఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- పటమట, న్యూస్‌టుడే**

పొంగుతున్న మ్యాన్‌హోల్.. స్పందించండి

కృష్ణలంక పాత పోస్టాఫీసు రోడ్డు మొదట్లో మ్యాన్‌హోల్ రోజుల తరబడి పొంగి పొర్లుతోంది. దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. పైగా రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని వాపోతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. **- కృష్ణలంక, న్యూస్‌టుడే**

మహాశివరాత్రి రోజు భక్తులకు సేవ అదృష్టం

భక్తులకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె, నామేశ్వరరావు తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన భక్తులకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కృష్ణలంక 21వ డివిజన్ మెట్ల బజారు సమీపంలోని కృష్ణా పుష్కర ఘాట్‌లో నది స్నానాలకు వచ్చిన భక్తులకు ఆదివారం మాజీ కార్పొరేటర్ గొరిపర్తి నరసింహారావు జ్ఞాపకార్థం పాలు, టీ, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ... గతంలో నరసింహారావు, పెరుమాళ్ల గుర్నాథం మహాశివరాత్రి రోజున సేవా కార్యక్రమాలు చేసేవారని గుర్తు చేశారు. నరసింహారావు లేనప్పటికీ అతని జ్ఞాపకార్థం భక్తులకు సేవ చేయడం అభినందనీయమని అన్నారు. తెదేపా నాయకుడు గొరిపర్తి నామేశ్వరరావు మాట్లాడుతూ... స్థానిక పెద్దలతో కలిసి 15 ఏళ్లుగా భక్తులకు అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు ఇసుకలో నడిచి వెళ్లి నదిలో స్నానాలాచరించి వస్తారని, వారికి ఉపశమనం కలిగించేందుకే టీ, పాలు, బిస్కెట్లు అందిస్తున్నామని తెలిపారు. నాయకులు బొప్పన భవకుమార్, పెరుమాళ్ల గుర్నాథం, కొర్రా అప్పన్న, కేశనం భావనారాయణ, పేరేపి ఈశ్వర్, వేమలపల్లి రంగారావు, లాకా వెంగళరావు, దుర్గాప్రసాద్, పోడూరి పవన్, పుప్పాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదరువు పోయింది... ఆవేదన మిగిలింది..

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

వితంతు పింఛను కోసం మహిళల ఎదురుచూపు

వితంతు పింఛను కోసం పేద మహిళలు ఎదురుచూస్తున్నారు. భర్తల సంపాదనపై ఆధార పడి జీవనం సాగించే ఆయా కుటుంబాలు ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నాయి. అంతా సాఫీగా సాగిపోతున్న తరుణంలో ఇంటి యజమాని అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఇప్పుడు కుటుంబ బాధ్యత భార్యలపై పడింది. రోజూ కూలీకి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. అధికారులు స్పందించి పింఛను ఇవ్వాలని కోరుతున్నారు.

విద్యుత్తు బిల్లు అధికంగా వచ్చిందని..

నా భర్త చనిపోయి నాలుగేళ్లు అవుతోంది. నేను అనారోగ్యంతో ఏ పనీ చేయలేకపోతున్నా. పింఛను కోసం గత ప్రభుత్వంలో దరఖాస్తు చేశాను. విద్యుత్తు బిల్లు ఎక్కువ వచ్చిందని మంజూరు చేయలేదు. ఇప్పుడు బిల్లు తక్కువ వస్తోంది. ఆ బిల్లులు తీసుకొని సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. నా కుమారుడు వేరే చోట ఉంటాడు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పింఛను మంజూరు చేయాలి.
- లింగాల విజయలక్ష్మి, సీఎస్ఐ పాఠశాల, మొగల్రాజపురం

పనికి వెళ్తేనే బతుకు బండి నడిచేది..

నా భర్త నరసింహారావు కారు డ్రైవర్‌గా పని చేస్తూ.. కుటుంబ బాధ్యత చూసుకునేవారు. ఆనందంగా జీవించేవాళ్లం. గుండెపోటు వచ్చి రెండేళ్ల కిందట మృతి చెందారు. అప్పటి నుంచి కుటుంబ భారం నా మీద పడింది. కుమార్తెకు వివాహమైంది. కుమారుడు డిగ్రీ చదివాడు. ఇళ్లలో పని చేస్తున్నా. వచ్చే డబ్బు సరిపోవడం లేదు. వితంతు పింఛను కోసం దరఖాస్తు పెట్టుకున్నా. రెండేళ్లు నుంచి ఎదురు చూస్తున్నా మంజూరు కావడం లేదు. **- నిడుమోలు రమాదేవి, చంద్ర రాజేశ్వరరావు నగర్**

ఆర్థిక ఇబ్బందులతో సతమతం

నా భర్త సత్యనారాయణ మూడేళ్ల కిందట మృతి చెందారు. అప్పటి నుంచి పింఛను కోసం అర్జీలు ఇస్తున్నా.. ఫలితం లేదు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నా. నా కుమారుడిని కూడా బడి మాన్పించి పనికి పంపిస్తున్నా. ఎంతో మందికి పింఛను ఆదరువుగా నిలుస్తోంది. కష్టాల్లో ఉన్న నాకు మంజూరు చేసి అండగా నిలవాలి. ఆర్థిక సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. **- పసుపులేటి ఈశ్వరి, మొగల్రాజపురం**

కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు

సత్కారం పొందిన ఉపాధ్యాయులతో అతిథులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని ఎంచుకుని అందుకు అనుగుణంగా కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీసీ) ఛైర్మన్ వేమూరు రవి అన్నారు. కమ్మ విద్యార్థి సహాయ సంఘం వసతి గృహ వార్షికోత్సవం సిద్ధార్థ ఫార్మసీ కళాశాల సెమినార్ హాలులో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కమ్మ విద్యార్థి సహాయ సంఘం అధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ, కార్యదర్శి కానుమిల్లి వెంకట సూర్య ప్రకాశరావు, కోశాధికారి చనమోలు కృష్ణారావు, ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు విద్యార్థులకు ప్రతిభా ఉపకార వేతనాలు, ఆటల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మారిస్ స్టెల్లా కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఆలిండియా అంతర్ వర్సిటీ మహిళా నెట్‌బాల్ పోటీల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం రాత్రి నిర్వాహకులు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు దేశంలోని పలు వర్సిటీల నుంచి వచ్చిన క్రీడాకారిణులు ఆసక్తిగా తిలకించి ఆనందించారు. అనంతరం నిర్వహించిన క్యాంప్ ఫైర్‌లో విద్యార్థినులు పాల్గొన్నారు. తమ తమ ప్రాంతీయ సంగీతం, నృత్యాలను ప్రదర్శించారు.

మత సామరస్యం వెల్లివిరిసేలా కూటమి పాలన

వలీకి ఆర్థిక సాయం అందజేస్తున్న ఛైర్మన్ షిబ్లీ

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : రాష్ట్రంలో మత సామరస్యం వెల్లివిరిసేలా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని, అన్ని వర్గాల ప్రజలు శాంతి, సామరస్యతతో జీవించేలా చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ అన్నారు. ఇటీవల జరిగిన మేడారం జాతరలో కొంతమంది మీడియా ప్రతినిధుల వల్ల కర్నూలుకు చెందిన కోవా బన్ అమ్మే వలీ, అతని మిత్రులు వేధింపులకు గురయ్యారు. వారికి ఆదివారం మొగల్రాజపురంలోని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో రూ.50 వేల ఆర్థిక సాయాన్ని షిబ్లీ అందజేశారు. కూటమి ప్రభుత్వ భాగస్వాములైన తెదేపా, జనసేన, భాజపా ముఖ్య నాయకులు కూడా వలీకి ఎదురైన అవమానానికి విచారం వ్యక్తం చేశారని షిబ్లీ తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక

పటమట, న్యూస్‌టుడే: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను తూర్పు నియోజకవర్గం 15వ డివిజన్ జనసేన అధ్యక్షుడు గాదిరెడ్డి అమ్ములు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరైన తాను అధినేతను కలవగా.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారని అమ్ములు తెలిపారు.

అశ్రునివాళి

జననం: 07-08-1947
మరణం: 15-02-2026

కీ॥శే॥ శ్రీమతి ఆలపాటి రమాదేవి గారు
(శ్రీ ఆలపాటి మురళీకృష్ణ మోహనరావు, డైరెక్టర్- విజయవాడ బాట్లింగ్ కంపెనీ లిమిటెడ్ గారి ధర్మపత్ని)

మా కుటుంబ అభ్యున్నతికి నిరంతరం పాటుపడి, మా ఉన్నతికి కారణమైన మా అమ్మగారు శ్రీమతి ఆలపాటి రమాదేవి గారు శివరాత్రి నాడు శివైక్యం చెందారని తెలియజేయుటకు చింతిస్తూ... వారి ఆత్మకు శాంతిని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాము.

కుమార్తె : ఎ. శ్రీ సుబ్బలక్ష్మి
మనుమరాళ్ళు : ఎ. కావ్యశ్రీ, ఎ. రమ్యశ్రీ

(c) eenadu

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

శిలాఫలకం వద్ద సీతారామయ్య తదితరులు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి బి.కాలనీ వద్ద ఉన్న సెయింట్ థామస్ చర్చి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి తెదేపా సీనియర్ నాయకుడు బొప్పన సీతారామయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

'క్రికెట్‌లో ఉన్నతంగా రాణించాలి'

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లాలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగే ఏసీఏ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల అండర్-12 క్రికెట్ పోటీలకు మండలంలోని షేర్‌మహమ్మద్‌పేట డీజీఎంపీ నాయకుడు షేక్ మియా-షహనాజ్ కుమారుడు షేక్ పాషల్ ఎంపికయ్యారు. పాషల్ క్రికెట్ పోటీలకు ఎంపికకావడం గర్వకారణమని సీపీఎం మండల కార్యదర్శి సోమోజు నాగమణి తెలిపారు. టోర్నమెంట్‌లో రాణించి రానున్న రోజుల్లో క్రికెట్‌లో ఉన్నత స్థానం సాధించాలని ఆకాంక్షించారు.

షేక్ పాషల్

హరోం హర.. శంభో శంకర..

సంగమేశ్వరా శరణు..

నందిగామ గ్రామీణం: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం దాములూరు కూడలి పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తులు తెల్లవారుజామునే వైరా, కట్టలేరులో పుణ్య స్నానాలు చేశారు. పితృదేవతలకు పిండప్రదానాలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి ఆలయం వెలుపల వరకు వరుస కట్టారు. రూ.100 దర్శనానికి ఎక్కువ మంది భక్తులు రావడంతో ఆలయ మండపం నిండి దక్షిణం వైపు వీధిలో వరుస కట్టారు. నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్సైలు పర్యవేక్షించారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, నందిగామ మున్సిపల్ ఛైర్మన్ మండవ కృష్ణకుమారి, మేళ్ల నాగేశ్వరరావు స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయం పక్కనే ఉన్న మరో శివాలయంలో శివలింగానికి అభిషేకం చేశారు. మహిళలు ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపీడీఓ ప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీఓ నాయేశ్వరరావు, దేవాలయ ఈవో ఎన్.నరసింహమూర్తి, ఆలయ ఛైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గాదెల వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీరాజరాజేశ్వరి మాత మూలమూర్తి

16 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ..

16 వేల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఏసీపీ తిలక్, కూటమి నాయకులు నాగుల శ్రీధర్‌రావు, చల్లా తులసీరావు, చెరుకూరు సాంబశివరావు, హైమారావు, మన్నేపల్లి వినయ్, గింజుపల్లి వెంకట్రావు, గుత్తా కృష్ణప్రసాద్, రంగాబత్తి శ్రీనివాసరావు, మాజీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, గొట్టు పూర్ణచంద్రరావు, సతీష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూడలి శివాలయ ధ్వజస్తంభానికి పూజలు చేస్తూ..

శివలింగానికి అభిషేకం చేస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

పుణ్యస్నానాలు ఆచరించి.. మొక్కులు తీర్చుకుని

హరిహర ఆలయంలో.. భోజనం వడ్డిస్తున్న శ్రీరాం చిన్నబాబు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ముక్త్యాలలోని శ్రీభవాని ముక్తేశ్వరస్వామివారిని, శ్రీకోటిలింగాల హరిహర మహాక్షేత్రాన్ని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. విశ్వభారతి డిగ్రీ కళాశాల, వాగ్దేవి కళాశాల, జేఆర్‌సీ విద్యాసంస్థల విద్యార్థులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి కల్యాణం

నందిగామ గ్రామీణం: నందిగామ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. శుక్రవారాలయాన్ని పుష్పాలతో అలంకరించారు. రెడ్డినాయ కాలనీ అంకమ్మతల్లి దేవాలయంలో అంకమ్మతల్లి, కనకదుర్గమ్మకు పంచామృతాభిషేకం చేశారు. సాయిబయ్యమ్మ దేవాలయ ఆవరణలో వీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో గంగాభవాని సమేత వీరభద్రేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, మున్సిపల్ ఛైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ➡ పల్లగిరిపై భవానీశంకరుని వాయులింగానికి రుద్రాభిషేకం చేశారు. మునేటి ఒడ్డున రామవరప్పాడు కోటలోని కొండపై పరశురాముడు ప్రతిష్ఠించిన శివాలయంలో గంగాపార్వతీ సమేత మల్లేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. దాతల సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. గోళ్లమూడి శివాలయంలో శంభులింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. సోమవారం చెరువుకట్టపై ఉన్న సోమేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు.

పుష్పాలంకరణలో శుక్రమలాంబ

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మునేరు ఒడ్డున వెలసిన శంభులింగేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. భక్తులు స్వామివారికి క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అంబికేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. అనిగండ్లపాడు, నవాబుపేట, కొణకంచి, శివాపురం గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు చేశారు.

పెనుగంచిప్రోలు: ప్రత్యేక అలంకరణలో అంబికేశ్వర స్వామి

కనులపండువగా..

చందర్లపాడు, న్యూస్‌టుడే: కాండ్రపాడులోని పంచముఖేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజామునే భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకుని అభిషేకాలు చేయించారు. రుద్రాభిషేకం నిర్వహించి కల్యాణం చేశారు. పొక్కునూరు శివాలయంలో, స్థానిక వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో, ముప్పాళ్ల, చింతలపాడు, ఏటూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కల్యాణ వేడుకలు నిర్వహించారు.

కాండ్రపాడులోని పంచముఖేశ్వరాలయంలో..

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

వీరులపాడు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక(జేఏసీ) పిలుపు మేరకు మండల పరిధిలోని ఏడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘ(పీఏసీఎస్) ఉద్యోగులు సోమవారం నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొననున్నట్లు జాక్ పెద్దాపురం బ్రాంచ్ అధ్యక్షుడు ఎన్.వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు అల్లూరు, పెద్దాపురం, వీరులపాడు, వి.అన్నవరం, జయంతి, చౌటపల్లి, జుజ్జూరు పీఏసీఎస్‌ల అధ్యక్షులకు సమ్మె నోటీసు అందజేశారు. తమ దీర్ఘకాల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మెను కొనసాగిస్తామని జాక్ సభ్యులు తెలిపారు.

వీరులపాడు పీఏసీఎస్ అధ్యక్షునికి సమ్మె నోటీసును అందజేస్తున్న ఉద్యోగులు

పొంచి ఉన్న ముప్పు.. పట్టించుకోకపోతే ప్రమాదం

నక్కలంపేట(కంచికచర్ల), న్యూస్‌టుడే: కంచికచర్ల నుంచి నక్కలంపేట మీదుగా జాతీయ రహదారి 65 వరకు గత తెదేపా ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మించారు. అందులో భాగంగా నక్కలంపేట వద్ద ఉన్న నక్కలవాగులోకి రహదారి జారకుండా రక్షణ గోడ నిర్మించారు. గతేడాది వరదలకు ఈ రక్షణ గోడలో సగభాగం కూలి శిథిలాలు వాగులో పడ్డాయి. దీంతో రహదారి నుంచి మట్టి వాగులోకి జారుతూ ప్రమాదకరంగా మారింది. దీనిపై అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెను ప్రమాదం తప్పదని స్థానికులు చెబుతున్నారు.

రక్షణ గోడ కూలడంతో జారుతున్న రహదారి మట్టి

ముస్లిం మైనార్టీ కమిటీ నియామకం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట నియోజకవర్గ ముస్లిం మైనార్టీ కమిటీని 17 మంది సభ్యులతో సీఎం మార్గదర్శకాలు, ఆదేశాల మేరకు నియమించినట్లు కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం తెలిపారు. కమిటీ అధ్యక్షులుగా షేక్ అక్బర్, జనరల్ సెక్రటరీగా సైదా, వైస్ ప్రెసిడెంట్లుగా మీరా హుస్సేన్, సోనుమియా, ఆజమ్ ఇతర కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా రఘురాం నియామక పత్రాలను అందించారు. మైనార్టీ వర్గాల సమస్యలను పరిష్కరించేందుకు ఈ కమిటీ సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హజ్ యాత్రకు ఒక్కో యాత్రికుడికి రూ.లక్ష రుణ సదుపాయం కల్పించడం పట్ల ముస్లింలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ➡ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ అక్బర్ కార్యవర్గ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, తెదేపా సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చిన్నబాబును కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీ వర్గాల సమస్యలపై కమిటీ ప్రతిక్షణం స్పందిస్తూ వారికి అవసరమైన సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందేలా కృషి చేయాలని తెలిపారు.

అక్బర్‌కు నియామక పత్రం అందిస్తున్న నెట్టెం రఘురాం

బస్సులు వస్తే.. వాహనాలకు బ్రేక్ పడాల్సిందే

కంచికచర్ల బస్టాపు నుంచి బస్సులు బయటకు రావాలంటే ఎదురుగా వచ్చే వాహనాలు నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో విజయవాడ వెళ్లే బస్సులు జుజ్జూరు సెంటరు వైపు నుంచి బస్టాప్‌లోకి వచ్చి ప్రధాన రహదారి వైపు బయటకు వచ్చేవి. విజయవాడ వైపు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు.. ప్రధాన రహదారి వైపు నుంచి బస్టాపులోకి వచ్చి, జుజ్జూరు సెంటరు వైపు బయటకు వెళ్లేవి. దీంతో ట్రాఫిక్ కొంత మేర అదుపులో ఉండేది. గత కొన్ని సంవత్సరాలుగా గతంలో ఉన్న విధానానికి బదులు.. బస్టాప్‌లోకి వచ్చే అన్ని బస్సులు ప్రధాన రహదారి వైపు నుంచి లోపలికి వచ్చి, జుజ్జూరు సెంటరు వైపు బయటకు వెళ్లే విధంగా అధికారులు మార్పు చేశారు. ఈ విధానం ద్వారా ప్రయాణికులకు ఇబ్బంది కలగడమే కాకుండా, ట్రాఫిక్ సైతం అస్తవ్యస్తంగా మారింది. దీనికి తోడు బస్టాప్ ఆవరణ ప్రధాన రహదారికి కన్నా పల్లంగా మారడంతో.. బస్సులు బయటకు వచ్చే సమయంలో ప్రధాన రహదారిపై ఇతర వాహనాలు ఆపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కంచికచర్ల

బస్సు వస్తుండటంతో ఆగిన ఆటో

అన్నదానానికి విరాళం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దాములూరు కూడలి శివాలయంలో అన్నదానానికి అదే గ్రామానికి చెందిన కొత్త వీరన్న ఆదివారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను గ్రామీణ వైద్యుల సంక్షేమసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి, డివిజన్ నాయకులు మార్కపూడి దేవదాసు, నిరీక్షణరావు, సైదులు, మధు, నరేంద్ర తదితరులు అభినందించారు.

ఎర్ర వంతెన వద్ద లారీ బోల్తా

కొండపల్లి: కొండపల్లి ఎర్ర వంతెన వద్ద ఆదివారం ఉదయం లారీ బోల్తాపడింది. వంతెనకు అనుసంధానంగా నూతన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మైలవరం నుంచి కొండపల్లి వైపు వస్తున్న లారీ వంతెన వద్దకు రాగానే డ్రైవర్‌కు మార్గం తెలియక ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో లారీ పక్కకు ఒరిగి పడిపోయింది. డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం వల్ల నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

తిరునాళ్లలో భక్తులకు సేవలు భేష్

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దాములూరు శివారు కూడలి సంగమేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చిన్నారులు, వృద్ధులకు పాలు, తదితరాలు పంపిణీ చేశారు. దాతలు దివంగత కపిలవాయి ధనలక్ష్మి జ్ఞాపకార్థం భర్త మల్లికార్జునరావు, కుమారుడు గంగాధర్, మన్నేపల్లి వినయ్‌కుమార్, అలేఖ్య సౌజన్యంతో 1000 మందికి వీటిని పంపిణీ చేశారు. ఆలయ ఛైర్మన్ జి.శ్రీనివాసరావు, ఈవో నరసింహమూర్తి, వీరులపాడు ఎస్సై అభిమన్యు పంపిణీని ప్రారంభించారు. ★ 4500 మంది భక్తులకు నందిగామ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ జోన్ ఛైర్మన్ పులిపాటి వెంకటేశ్వరరావు పంపిణీ ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు పబ్బతి రాజేష్, కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, కన్వీనర్ కేతేపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ★ గోళ్లమూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ అనిత, వైద్యసిబ్బంది భక్తులకు మందులు పంపిణీ చేశారు. నందిగామ ఆయుష్ ఆసుపత్రి డాక్టర్లు ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. భక్తులకు మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

భక్తులకు పంపిణీ చేసే మజ్జిగ డబ్బాలతో వాసవీ క్లబ్ సభ్యులు


ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు

చప్టా మీదుగా నడిచి శివయ్య దర్శనం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దాములూరు శివారు కూడలి సంగమేశ్వర స్వామి దర్శనానికి ఆదివారం వీరులపాడువైపు నుంచి వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వైరా, కట్టలేరుపై నిర్మించిన చప్టా మీదుగా భక్తులు దేవాలయానికి రావాలి. దేవాలయం వద్ద వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో చప్టాకు అవతలే వీరులపాడు వైపు నుంచి వచ్చే కార్లు తదితర వాహనాలను పోలీసులు నిలిపివేశారు. దీంతో భక్తులు చప్టా మీదుగా నడుచుకుంటూ శివాలయాన్ని చేరుకోవాల్సి వచ్చింది. గతేడాది సంభవించిన వరదకు చప్టా ఓవైపు ధ్వంసమైంది. దీనికి మరమ్మతులు అసంపూర్తిగా చేశారు. దీంతో భక్తులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

కూడలి వద్ద వైరా, కట్టలేరుపై చప్టా మీదుగా నడిచి వస్తున్న భక్తులు

కార్యాలయం ఎదుటే ఇలానా..?

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్లలోని పలు కాలనీల్లో కాలువలు సకాలంలో పూడిక తీయకపోవడంతో వ్యర్థాలతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. రోజుల తరబడి మురుగు నిల్వ ఉండడంతో దుర్వాసన, దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న కాలువలోనే వ్యర్థాలు నిల్వ ఉండి మురుగు పారకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మురుగు కాలువల్లో వ్యర్థాలు వారానికి ఒకసారైనా తొలగించాలని, అధికారులు మాత్రం నెలల తరబడి వ్యర్థాలు తొలగించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీయించాలని ప్రజలు కోరుతున్నారు.

కంచికచర్ల పంచాయతీ కార్యాలయం ఎదుట వ్యర్థాలు..

బడ్జెట్‌లో బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యం

నందిగామ, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయించారని భాజపా జిల్లా ఓబీసీ విభాగం ప్రధానకార్యదర్శి తొర్లికొండ సీతారామయ్య తెలిపారు. నందిగామలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బీసీల్లో చేతివృత్తుల ఆధారంగా జీవనం సాగిస్తున్న వారి కోసం విశ్వకర్మ యోజన పథకం ప్రవేశపెట్టారని తెలిపారు. దీనికి నిధులు కేటాయించటం వల్ల బీసీల్లో ఉపకులాలు అందరికీ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. దీంతోపాటు అమరావతి రాజధాని నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు ఇవ్వటం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. రాజధాని అభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సమాన దృష్టిలో నిధులు ఇచ్చారన్నారు. ప్రజారంజక బడ్జెట్‌లు తీసుకొచ్చిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు.

సీతారామయ్య

'వైకాపా నాయకులు అబద్ధాలు చెప్పడం మానుకోవాలని'

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో బీసీలకు అగ్రతాంబూలం వేసిందని తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి ఆదివారం తెలిపారు. వైకాపా నాయకులు బడ్జెట్‌పై అబద్ధాలు చెప్పడం మానుకోవాలన్నారు. గత వైకాపా పాలనలో అన్యాయానికి గురైన బీసీలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. తాజా బడ్జెట్‌లో బీసీలకు రూ.51 వేల కోట్లు కేటాయించారని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించడం వల్ల 16,500 మంది పదవులకు దూరమయ్యారని చెప్పారు. దీనిపై చర్చకు వైకాపా నాయకులు సిద్ధమా అని ప్రశ్నించారు.

మాట్లాడుతున్న వీరాస్వామి

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ఎ.కొండూరు : యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని ఏసీపీ ప్రసాదరావు సూచించారు. 'డ్రగ్స్‌పై దండయాత్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్న మహిళా పోలీసు బృందానికి కంభంపాడులో పోలీసు అధికారులు, గ్రామస్థులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని పలు వీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కంభంపాడు ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. తిరువూరు సీఐ గిరిబాబు, ఎ.కొండూరు ఎస్సై మహాలక్ష్మణుడు, సిబ్బంది, తెదేపా మండల అధ్యక్షుడు పీక్లా నాయక్, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్ రెడ్డి, ఎలినేని చంద్రం పాల్గొన్నారు.

విస్సన్నపేట: డ్రగ్స్‌పై దండయాత్ర సైకిల్ ర్యాలీ తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి ఆదివారం సాయంత్రం ప్రవేశించింది. ఈ మేరకు బృంద సభ్యులకు ఎస్సై శాతకర్ణి, సిబ్బంది, కాకర్ల గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కనులపండువగా భవానీశంకరుల కల్యాణం

సోమవరం గ్రామస్థులు కూడలికి తీసుకొస్తున్న ప్రభ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లగిరిపై భవానీశంకరుల కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. 108 మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదాతలుగా వ్యవహరించారు. భవానీశంకరుని వాయులింగ దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దాములూరు శివారు కూడలి తిరునాళ్లలో సోమవరం గ్రామస్థుల 30 అడుగుల ప్రభ, శివలింగం ఆకట్టుకుంది. ప్రభను తీసుకు వచ్చే సమయంలో సోమవరం-దాములూరు రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొణతాలపల్లికి చెందిన యువకులు గొర్రె పొట్టేళ్ల ప్రభతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. విద్యుద్దీపాల కాంతుల్లో దేవాలయం కాంతులీనింది.

ఉత్సవమూర్తులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కోలాటం ఆడుతున్న మహిళలు

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధి జుజ్జూరులోని శ్రీగిరి సోమేశ్వరాలయం తెల్లవారుజాము నుంచి భక్తులతో కిక్కిరిసిపోయింది. రెండు రోజుల తిరునాళ్లలో భాగంగా మొదటిరోజు ఎద్దుల బండిపై కట్టిన ప్రభ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం భరతనాట్యం, కోలాటం ప్రదర్శనలు అలరించాయి.

రేషన్ అందక పరేషాన్

పౌరసరఫరాలశాఖ అధికారుల ఉదాసీనత

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పల్లగిరిలో రేషన్ సరకులు సక్రమంగా అందక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. మూడేళ్లుగా సమస్యను పరిష్కరించకుండా పౌరసరఫరాలశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడుతున్నారు. గ్రామంలో 650 రేషన్‌కార్డులు ఉన్నాయి. రేషన్ డీలర్‌కు ప్రతీనెలా 102 క్వింటాళ్ల బియ్యం, 650 పంచదార ప్యాకెట్లు(ఒక్కో ప్యాకెట్ అరకిలో) కేటాయిస్తున్నారు. రేషన్ డీలర్ మూడేళ్ల కిందట బియ్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడటంతో సస్పెండ్ చేశారు. పౌరసరఫరాల శాఖకు సొమ్ములు చెల్లించడంతో మళ్లీ అతనికి రేషన్ పంపిణీ బాధ్యత అప్పగించారు.

45 క్వింటాళ్లు తక్కువగా..

ప్రతీనెలా పల్లగిరి షాప్‌నం-15 డీలర్‌కు పౌరసరఫరాలశాఖ 45 క్వింటాళ్ల బియ్యం తక్కువగా కేటాయిస్తోంది. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేయాలి. డీలర్ ముందుగా వచ్చిన లబ్ధిదారులకు రేషన్ బియ్యం, పంచదార పంపిణీ చేసి ఆలస్యంగా వచ్చే వారికి సరకులు లేవని చెబుతున్నారు. దీంతో రేషన్‌కార్డు లబ్ధిదారులు పొరుగున ఉన్న గోళ్లమూడి, కమ్మవారిపాలెం డీలర్ల వద్దకు వెళ్లి సరకులు తెచ్చుకుంటున్నారు. పొరుగు గ్రామాల డీలర్లు కూడా తమ వద్ద సరకులు లేవని పంపుతున్నారని బాధితులు వాపోతున్నారు. చదువురాని లబ్ధిదారులతో ఈపోస్ యంత్రంపై వేలిముద్రలు నమోదు చేయించిన తరువాత ఇంటికి రేషన్ పంపుతామని చెబుతున్నారని, తరువాత రేషన్ ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. గత మూడేళ్లుగా వేధిస్తున్న ఈ సమస్యను బాధితులు జనవరిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య దృష్టికి తీసుకువచ్చారు. ఆమె అధికారులను వివరణ కోరగా.. ఫిబ్రవరిలో పూర్తిగా రేషన్ సరకులు ఇప్పిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు. ఈ నెల కూడా రేషన్ డీలర్ తమకు బియ్యం, పంచదార ఇవ్వడం లేదని, అధికారుల హామీ నెరవేరలేదని బాధితులు వాపోతున్నారు.

మార్చి నుంచి పూర్తిగా ఇస్తాం..

దీనిపై నందిగామ పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దారు రామ్మూర్తిరెడ్డిని వివరణ కోరగా.. డీలర్ పెనాల్టీ చెల్లించడంతో జాయింట్ కలెక్టర్ గతంలో తగ్గించిన 45 క్వింటాళ్ల రేషన్ బియ్యం మరలా కేటాయించారని చెప్పారు. మార్చి నుంచి లబ్ధిదారులందరికీ గ్రామంలో పూర్తిగా రేషన్ సరకులు ఇప్పిస్తామని చెప్పారు.

దుర్గమ్మకు బంగారు ఆభరణాల బహూకరణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు దుర్గగుడి స్థానాచార్య శివప్రసాద శర్మ కుమారుడు వి.ఎన్.వి.ఎల్.ఎన్.జి.శర్మ రూ.4 లక్షలు విలువ చేసే బంగారు బొట్టు, నత్తు, బులాకీని ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. 29.700 గ్రాముల బరువు ఉన్న వాటిని దుర్గమ్మ ఎదుట ఉంచి పూజ చేయించిన అనంతరం ఈవో శీనానాయక్‌కు అప్పగించారు. ఆశీర్వచన మండపంలో దాత కుటుంబానికి వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఈవో శీనానాయక్‌కు ఆభరణాలు అందజేస్తున్న వి.ఎన్.వి.ఎల్.జి.శర్మ, కుటుంబ సభ్యులు

అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూచిపూడి నృత్య కళాకారులు ప్రదర్శించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. తాడేపల్లికి చెందిన నృత్యాచార్య స్వర్ణలత శిష్య బృందం ప్రదర్శించిన శివతాండవం, శంకర శ్రీగిరి తదితర భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. తెనాలికి చెందిన నాట్యాచారిణి ఆర్.వసంత దుర్గ శిష్య బృందం ప్రదర్శించిన గణేష్ స్తుతి, మహిషాసురమర్దిని స్తోత్రం భక్తుల్లో ఉత్తేజాన్ని నింపింది. నృత్య కళాకారులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం: పాల ఫ్యాక్టరీ గాంధీ దేవాలయం ఆవర ణలో చెత్త పేరుకు పోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్త తీయించారు. – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

వీధి దీపం ఏర్పాటు

ఈనెల 11వ తేదీన 'ఈనాడు'లో 'దారంతా అంధకారం' అనే శీర్షికన ప్రచురితమైన చిత్ర వార్తకు కార్పొరేషన్ ఎలక్ట్రికల్ సిబ్బంది స్పందించారు. కార్పొరేషన్ ఏఈ శ్రీనివాస్ సిబ్బందితో ఎర్రకట్ట పైవంతెన మార్గంలో ఉన్న వీధి దీపాలు పరిశీలించారు. వాటిల్లో రెండు దీపాలు వెలగకపోవడంతో వాటికి మరమ్మతులు చేసి వెలిగేలా చేశారు. – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? సీవీఆర్ పైవంతెన మార్గంలో వేగ నిరోధకాలు లేవు. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. **- సుధాకర్, స్థానికుడు** ✔ సాధ్యాసాధ్యాలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, సర్కిల్-I ఈఈ** ? కబేళా కూడలి సాయిబాబా ఆలయం వద్ద మురుగు కాలువలో పూడిక పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. **- నజ్మా, స్థానికురాలు.** ✔ పూడిక తీయించేందుకు చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వరరావు, స్థానిక శానిటరీ అధికారి** – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

శివరాత్రి విశిష్టతపై ప్రచారం

మధురానగర్: మహా శివరాత్రి సందర్భంగా త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక సభ్యులు శివరాత్రి విశిష్టతపై ప్రచారం చేశారు. ముత్యాలంపాడు, టీచర్స్, శ్రీనగర్ కాలనీల్లో పర్యటించి త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేశారు. శివరాత్రిని మోక్ష రాత్రి అని ఎందుకు అంటారో వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి ఒంటి గంట మధ్య లిఖిత పూర్వకంగా అందించి పరిష్కరించుకోవాలని సూచించారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఈనెల 17న నిర్వహించాల్సిన విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించే అవకాశం ఉందని, అయితే... ఆ తేదీని మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఖరారు చేయాలని అధికారులు వెల్లడించారు.

విజయవాడ పశ్చిమ

పన్ను కడతాం.. డబ్బులు పంపండి
చెల్లింపుదారులకు మోసగాళ్ల ఫోన్

న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ, భవానీపురం

'**మీ**రు ఇంటి పన్ను చెల్లించలేదు. నా ఫోన్ పే నంబరుకు డబ్బులు పంపిస్తే.. నేను కడతాను' అంటూ భవానీపురంలోని ఓ విశ్రాంత ఉద్యోగికి ఒకడు ఫోన్ చేశాడు. నగరపాలక సంస్థ పన్నుల విభాగం ఉద్యోగి మాట్లాడుతున్నట్లు పరిచయం చేసుకున్నాడు. ఆ వ్యక్తి పదే పదే ఫోన్ చేయడంతో విశ్రాంత ఉద్యోగికి అనుమానం వచ్చింది. అతను చెప్పింది ధ్రువీకరించుకునేందుకు సమీపంలోని నగరపాలక సంస్థ పన్ను వసూలు కేంద్రానికి వెళ్లారు. ఫోన్ చేసిన వ్యక్తి సెల్ నంబరు, ఆయన చెప్పిన విషయాలను సిబ్బందికి తెలియజేశారు. అతడు చెప్పిన మాటలు అసత్యమని, ఆ ఫోన్ నంబరు కలిగిన వ్యక్తులెవరూ నగరపాలక సంస్థలో లేరని కార్యాలయ సిబ్బంది చెప్పారు. మోసం నుంచి బయటపడ్డానని విశ్రాంత ఉద్యోగి ఊపిరిపీల్చుకున్నారు.

పన్ను చెల్లిస్తున్న నగరవాసులు

పశ్చిమ నియోజకవర్గంలో పన్ను వసూలు కేంద్రాలు

- చిట్టినగర్ సమీపంలోని సర్కిల్-1 కార్యాలయంలో రెండు చోట్ల
- హెచ్‌బీ కాలనీలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సమీపంలో..
- నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో రెండు ప్రాంతాల్లో..

నగదు పంపి మోసపోవద్దు

నగరంలోని పన్ను చెల్లింపుదారులకు మోసగాళ్లు ఫోన్లు చేస్తున్న విషయం నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి వచ్చింది. నగర పాలక సంస్థ సిబ్బంది ఎవరూ అలా ఫోన్ చేయరని, అటువంటి ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఇంటి, కుళాయి, ఆస్తి పన్ను ఏదైనా.. ఎవరికీ ఫోన్ పే, గూగుల్ పే చేయవద్దని సూచిస్తున్నారు. నగర పాలక సంస్థ పన్ను చెల్లింపు వెబ్‌సైట్లు (www.ourvmc.org లేదా www.cdma.ap.gov.in), పన్ను వసూలు కేంద్రాల్లో మాత్రమే చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారికంగా ప్రకటించారు. పన్ను చెల్లించాలంటూ ఎవరైనా ఫోన్లు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెబుతున్నారు. మన మిత్ర వాట్సప్ నంబరు 95523 00009, పుర మిత్ర యాప్, సమీపంలోని నగరపాలక సంస్థ పన్ను వసూలు కేంద్రంలో సంప్రదించాలని కోరుతున్నారు. నగరంలోని మూడు నియోజకవర్గాల్లో పన్ను వసూలు కేంద్రాలు 14 ఉన్నాయని, వాటిలో మాత్రమే చెల్లించాలని, ఎవరికీ డబ్బులు చెల్లించి మోసపోవద్దని సూచిస్తున్నారు.

కనులపండువగా శివయ్య కల్యాణం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ ప్రాంగణంలో శివయ్య కల్యాణం కనులపండువగా ఆదివారం నిర్వహించారు. రుత్వికులు వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య మల్లేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కృష్ణా జలం, పంచామృతాలతో అభిషేకాన్ని నిర్వహించారు. లింగోద్భవకాలంలో గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు అందజేశారు.

నీలకంఠునికి స్వర నీరాజనం

విజయవాడ సాంస్కృతికం: సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో 24 గంటలు నిర్వహిస్తున్న దశమ వార్షిక ఖచ్ఛపీ మహోత్సవం ఆదివారం ఉదయం 8 గంటలకు హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రారంభమయ్యింది. వర్ధమాన, ప్రసిద్ధ వైణికులు మహాశివునికి వీణావాద్యాలతో స్వర నీరాజనాలు అర్పించారు. సరస్వతీ మాతకు, మహాదేవునికి సమితి ప్రధాన కార్యదర్శి సీవీ రావు నేతృత్వంలో చిట్టా రామలక్ష్మి పర్యవేక్షణలో పలువురు వాగ్గేయకారుల కృతులను వాయించారు. రెండు తెలుగు రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వంద మందికి పైగా వైణికులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా వైణిక విద్వాంసులు గోవిందరాజన్, ప్రత్యేక ఆత్మీయ అతిథులుగా కొమ్మాజోస్యుల సద్గురు చరణ్, మోదుమూడి సుధాకర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

సంగీతంతో శివార్చన చేస్తున్న కళాకారులు

శివ శివ శంకరా..
ఆలయాల్లో భక్తుల సందడి

వివిధ రకాల పుష్పాలతో..

కెనాల్ రోడ్డులో బారులు తీరి

ఇంద్రకీలాద్రి, భవానీపురం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివయ్య దర్శనం కోసం భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి దర్శనం కోసం భక్తులు వేకువ జామునుంచి బారులు తీరారు. ప్రత్యేకంగా వివిధ రకాల పుష్పాలతో తయారు చేసిన శివలింగాకృతి భక్తులను ఆకట్టుకుంది. ఇంద్రకీలాద్రి దిగువన శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం), వసంత మల్లికార్జున స్వామి దేవస్థానం, విజయేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రుద్రహోమం, అర్చనలతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.


రామరాజ్యనగర్‌లో..

పాతశివాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

ప్రసాదాల పంపిణీ..: కెనాల్ రోడ్డులో మాజీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు భక్తులకు పులిహోర, పానకం పంపిణీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఎస్పీ, ఈవో సతీమణి షణ్ముఖ దంపతులు భక్తులకు పాలు అందజేశారు. శివయ్య దర్శనం చేసుకున్న భక్తులకు రూపాబాయమ్మ ట్రస్టు నిర్వాహకులు చక్ర పొంగలి, పులిహోర ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తులకు పాలు అందిస్తున్న నిర్వాహకులు

భవానీపురంలోని శివాలయంలో భక్తుల రద్దీ

భవానీపురం: కృష్ణానది ఒడ్డున ఉన్న పున్నమి, భవానీ స్నానఘాట్లకు భక్తులు ఆదివారం తెల్లవారుజాము నుంచే తరలి వచ్చారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల సభ్యులు రెండు ఘాట్ల వద్ద భక్తులు సామాన్లు భద్రపరచుకునేలా, మహిళలు దుస్తులు మార్చుకునేలా టెంట్లు, తదితర సౌకర్యాలు కల్పించారు. భవానీపురంలోని శివాలయం భక్తులతో నిండిపోయింది.

భవానీపురం, న్యూస్‌టుడే: శివరాత్రి పురస్కరించుకుని స్నానమాచరించేందుకు వచ్చే భక్తులు ఎలాంటి ప్రమాదానికి గురి కాకుండా డ్రోన్‌తో భవానీపురం పోలీసులు పర్యవేక్షించారు.

దుర్గమ్మకు బంగారు ఆభరణాల బహూకరణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు దుర్గగుడి స్థానాచార్య శివప్రసాద శర్మ కుమారుడు వి.ఎస్.వి.ఎల్.ఎన్.జి.శర్మ రూ.4 లక్షల విలువ చేసే బంగారు బొట్టు, నత్తు, బులాకీ ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. 29.700 గ్రాముల బరువు ఉన్న వాటిని దుర్గమ్మ ఎదుట ఉంచి పూజ చేయించిన అనంతరం ఈవో శీనానాయక్‌కు అప్పగించారు. ఆశీర్వచన మండపంలో దాత కుటుంబానికి వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఈవో శీనానాయక్‌కు ఆభరణాలు అందజేస్తున్న వి.ఎస్.వి.ఎల్.ఎన్.జి.శర్మ కుటుంబ సభ్యులు

అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రి ప్రాంగణంలో కూచిపూడి నృత్య కళాకారులు ప్రదర్శించిన భక్తి గీతాలు భక్తులను ఆదివారం అలరించాయి. తాడేపల్లికి చెందిన నృత్యాచార్య స్వర్ణలత శిష్య బృందం ప్రదర్శించిన శివ తాండవం, శంకర శ్రీగిరి, తదితర భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. తెనాలికి చెందిన నాట్యాచారిణి ఆర్.వసంత దుర్గ శిష్య బృందం ప్రదర్శించిన గణేష్ స్తుతి, మహిషాసురమర్దిని స్తోత్రం భక్తుల్లో ఉత్తేజాన్ని నింపింది. నృత్య కళాకారిణులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

కళాకారుల నృత్యాభినయం

నిలిచిన పనులు.. తప్పని అవస్థలు

కేఎల్‌రావు పార్కులో ప్రజల సౌకర్యార్థం సుమారు రూ.15 లక్షలతో నిర్మిస్తున్న ఓపెన్ ఎయిర్ థియేటర్ పనులు ఆగిపోయాయి. స్టేజీ, వెనుక గోడ కట్టి ఫ్లోరింగ్ చేయకుండా వదిలేశారు. ఓపెన్ ఎయిర్ థియేటర్ కొంత పొడువు పెంచేందుకు తవ్వి దాదాపు 20 రోజులకు పైగా గడిచింది. తవ్వి వదిలేయడం వల్ల ఊట నీరు నిలిచి దోమలు ప్రబలుతున్నాయి. దీంతో ఇబ్బందిగా మారిందని నివాసితులు, సందర్శకులు వాపోతున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

ఘాట్‌లో నీరు రీసైక్లింగ్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గాఘాట్‌లో సెల్లు తొలగించిన తరువాత భక్తులను నదీ స్నానానికి అనుమతించకపోవడంతో భక్తులు నదీ స్నానం కాకుండా జల్లు స్నానం చేస్తున్నారు. దీంతో జల్లు స్నానం చేసిన నీరు తిరిగి నదిలోకి చేరుతుంది. ఈ విషయం పోలీసు ఉన్నతాధికారులు.. దుర్గగుడి ఈవో శీనానాయక్ దృష్టికి తీసుకురావడంతో ఇంజిన్ల ద్వారా మురుగు నీటిని రీసైక్లింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘాట్‌లోకి చేరుతున్న నీరు

ఆకతాయిల ఆగడాలకు అడ్డేది

పెజ్జోనిపేట, న్యూస్‌టుడే

విజయవాడ పశ్చిమ 35వ డివిజన్‌లో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం మత్తులో ఘర్షణలకు పాల్పడుతున్నారు. రాకపోకల సమయంలో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వారి కారణంగా మహిళలు, విద్యార్థినులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. పలు ప్రాంతాల్లో యువకులు గుంపులుగా చేరి మహిళలను వేధిస్తున్నారు. స్థానిక పోలీసులు ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

ఏయే ప్రాంతాల్లో..

పూర్ణానందంపేటలోని జోసఫ్ వీధి, బాబాల ఆలయం, విక్రమ్ హోటల్ రోడ్, కరుణా హోటల్ సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్, ఆర్సీఎం చర్చి, పప్పులమిల్లు సెంటర్, ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్, బొగ్గు లైను కాలనీ హార్టుపేట, బాప్టిస్టుపాలెం, అంబేడ్కర్ బొమ్మ సెంటర్.

రక్షణ కల్పించాలి

పనులు నిమిత్తం నగరంలోకి వెళ్లి సాయంత్రం వస్తున్నాం. వీధి దీపాలు లేని ప్రాంతాల్లో ఆందోళన మరింతగా ఎక్కువగా ఉంది. రోడ్డుపైకి రావాలంటే భయంగా ఉంటుంది. **- ఆర్. సాయి కుమారి, పెజ్జోనిపేట**

కల్యాణం.. కమనీయం..

చిట్టినగర్: పాల ఫ్యాక్టరీ సమీపంలోని శ్రీవిజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి ఆలయ అర్చకులు చింతలపాటి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, నాగ వెంకట పవన్‌కుమార్‌శర్మ 11 ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సోమవారం అన్నప్రసాదం వితరణ, అనంతరం పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు హాజరు కావాలని కోరారు.

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఆంజనేయవాగు సెంటర్‌లోని వీరాంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో పద్మనాభ వీఎల్‌సీఎస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పంచ దేవతామూర్తుల శాంతి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కొలువైన భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారికి సుప్రభత సేవ, పంచామృతాభిషేకం చేసినట్లు ఆలయ అర్చకుడు విన్నకోట శ్రీనివాసశర్మ తెలిపారు. సంస్థ అధినేత కుంచం శ్రీనివాసరావు, రాణి దంపతులతో శ్రీగంగా పార్వతీ సమేత అరుణాచలేశ్వర స్వామి, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి, సీతారాములు, వేంకటేశ్వర స్వామి వార్లకు శాంతి కల్యాణం చేయించారు. ఈవో సింగంశెట్టి అర్జునరావు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగ వెంకట శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

క్రతువు నిర్వహిస్తున్న రుత్వికులు

ఐలాపురం వెంకయ్య మృతికి సంతాపం

భవానీపురం, న్యూస్‌టుడే: మాజీ శాసనమండలి సభ్యుడు ఐలాపురం వెంకయ్య మృతి పట్ల ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతికి, హక్కుల సాధన కోసం వెంకయ్య నిరంతరం పని చేశారని కొనియాడారు. అందరితో సత్సంబంధాలు కలిగి ఉండేవారని వెల్లడించారు. వెంకయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యాధరపురం, న్యూస్‌టుడే: బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య కృషి చేశారని వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి తీరని లోటని పేర్కొన్నారు. శాలివాహనుల సంక్షేమం కోసం తొమ్మిది పదుల వయసును కూడా లెక్క చేయకుండా విద్యాధరపురం రామమందిరం సెంటరులో రచయిత మొల్ల విగ్రహం ఆవిష్కరించిన వెంకయ్య బలహీన వర్గాల మదిలో చెరగని ముద్ర వేశారని ఆయన పేర్కొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

గవర్నర్‌పేట: సుప్రసిద్ధ రచయిత, విశ్రాంత ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ రచించిన విలువైన అరుదైన పుస్తకాలను ఆదివారం ఠాగూర్ గ్రంథాలయానికి వితరణ చేశారు. వీటిని హైదరాబాద్ నుంచి నవ భారత్ నిర్మాణ సంఘం వ్యవస్థాపకుడు సూరేపల్లి రవి కుమార్ విజయవాడకు తీసుకువచ్చారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీతో కలిసి ఠాగూర్ గ్రంథాలయానికి వెళ్లి గ్రంథాలయాధికారిణి కె.రమాదేవికి ఈ పుస్తకాలు అందించారు.

CHANGE OF NAME
I SUNKARA VIJAY KUMAR (old Name) S/o SUNKARA VENKATA KUSHAL RAO, Resident of D.No: 5-6-59/42, Tammina Krishna Street, Lambadipeta, Near Shakthi Industries, Vijayawada-520 001, NTR District, Andhra Pradesh. I have Changed my name as VIJAYKUMAR VENKATAKUSHALRAO SUNKARA (New name), S/o Venkata Kushal Rao Sunkara, Hereafter my name is Known as VIJAYKUMAR VENKATA KUSHALRAO SUNKARA (New Name), S/o VENKATA KUSHAL RAO SUNKARA.

తెదేపా అభ్యున్నతికి కృషి

చిట్టినగర్, న్యూస్‌టుడే: తెదేపా అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పేరాబత్తు రమణ అన్నారు. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్‌మీరా చేతుల మీదుగా నియామక పత్రం ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, తెదేపా నేతల ఆశీస్సులతో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తానని అన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజల్లోకి తీసుకు వెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శనీశ్వరస్వామి ఆలయం ఛైర్మన్ గణపా రామారావు, 48వ డివిజన్ నాయకులు చొక్కర అప్పారావు, తమ్మిన లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న రమణ

ప్రమాద కొండలు.. రక్షణ చర్యలు కరవు
ఇనుప మెష్‌లు వేయాలని విజ్ఞప్తులు

చిట్టినగర్, న్యూస్‌టుడే

పశ్చిమ నియోజకవర్గం భౌగోళికంగా ఎక్కువ శాతం కొండలను ఆవరించి ఉంది. ప్రజలు కూడా కొండలపై ఆవాసాలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంతో సుమారు 150 మెట్లపైన కూడా ఇళ్లు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. కానీ వర్షాలు కురిసినా, విపత్తులు సంభవించినప్పుడు కొండ ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ బండ రాయి పడుతుందోనని భయాందోళనలు చెందుతున్నారు. దశాబ్దాలుగా రక్షణ చర్యలు లేక కొండ ప్రాంత వాసులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పుడైనా వేసవిలో పనులు ప్రారంభించి వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని కొండ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలు

చిట్టినగర్ సొరంగం, గొల్లపాలెంగట్టు, క్వారీ, ప్రైజర్‌పేట, భీమనవారిపేట, రామరాజ్యనగర్, కబేళా ప్రాంతాల్లో కొండ రాళ్లు దొర్లి పడుతున్నాయి. పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సొరంగం మార్గంలో రాళ్లు దొర్లి అనేకమార్లు వాహన చోదకులకు గాయాలైన ఘటనలు ఉన్నాయి.

కొండ ప్రాంత డివిజన్లు:	11
జనాభా:	సుమారు 1.15 లక్షలు
ఓటర్లు:	సుమారు 65 వేలు
ఇబ్బందులు పడేది:	50 వేలకు పైనే


ఇనుప మెష్ వేయాల్సిన క్వారీ ప్రాంతం

◆ సొరంగానికి విద్యాధరపురం వైపు కొండకు ఇనుప మెష్ ఏర్పాటు చేశారు. అదే మాదిరిగా చిట్టినగర్ వైపు, గొల్లపాలెంగట్టు క్వారీ, ఇతర ప్రాంతాల్లో ఇనుప మెష్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటే ప్రమాదాలకు తావు లేకుండా రక్షణగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అండర్-12 క్రికెట్ జట్టుకు ఎంపిక

పవన్

లికిత్ ప్రేమ్

విజయవాడ క్రీడలు: అజిత్‌సింగ్‌నగర్ ఎంబీపీ స్టేడియంలోని ఏసీఏ-కేడీసీఏ, వీఎంసీ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఇరువురు క్రీడాకారులు జిల్లా అండర్-12 క్రికెట్ జట్టులో స్థానం సాధించారని ఏసీఏ కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక శ్రీరామ్ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న వి.పవన్, సెయింట్ ఆన్స్ స్కూల్‌లో చదువుతున్న టి.లికిత్ ప్రేమ్(స్టాండ్ బై)జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఆదివారం ఎంబీపీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన క్రీడాకారులను పలువురు క్రికెటర్లు అభినందించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అశ్రునివాళి

జననం : 07-08-1947
మరణం : 15-02-2026

కీ॥శే॥ శ్రీమతి ఆలపాటి రమాదేవి గారు
(శ్రీ ఆలపాటి మురళీకృష్ణ మోహన్‌రావు,
డైరెక్టర్- విజయవాడ బాటిలింగ్ కంపెనీ లిమిటెడ్ గారి ధర్మపత్ని)

మా కుటుంబ అభ్యున్నతికి నిరంతరం పాటుపడి, మా ఉన్నతికి కారణమైన
మా అమ్మగారు శ్రీమతి ఆలపాటి రమాదేవి గారు
శివరాత్రి నాడు శివైక్యం చెందారని తెలియజేయుటకు చింతిస్తూ...
వారి ఆత్మకు శాంతిని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాము.

కుమార్తె : ఎ. శ్రీ సుబ్బలక్ష్మి
మనుమరాళ్ళు : ఎ. కావ్యశ్రీ, ఎ. రమ్యశ్రీ

విజయవాడ మధ్య

పూడికతీత పనులకు చర్యలు

పాయకాపురం, న్యూస్‌టుడే: 64వ డివిజన్ కండ్రిక వాటర్ ట్యాంక్ వద్ద కాలువల్లో పూడిక తీయడం లేదని స్థానిక మహిళలు తెదేపా నాయకుడు పలగాని శివకు, ఎమ్మెల్యే కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో పలగాని శివ స్థానిక నాయకులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించి కాలువల్లో పూడిక తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాలతో పూడిక తొలగింపు పనులు చేయించామని శివ తెలిపారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎమ్మెల్యే సహించరని ఆయన పేర్కొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి ఒంటి గంట మధ్య లిఖిత పూర్వకంగా అందించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పేదల జీవనోపాధికి ఎమ్మెల్యే కృషి

సీ-బుక్స్ అందుకున్న వారితో బొండా ఉమా, రఘురామరాజు తదితరులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: పుట్టిన రోజును సేవా కార్యక్రమాలుగా మార్చడం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రత్యేకతని రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ కార్మికుల సలహా కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. జనవరి 30న ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా అందించిన 20 ఆటోలకు సీ బుక్‌లను ఆదివారం అజిత్‌సింగ్‌నగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో రఘురామరాజు ఆధ్వర్యంలో బొండా ఉమా.. లబ్ధిదారులకు అందజేశారు. రఘురామరాజు మాట్లాడుతూ ఉపాధి కోసం కష్టపడుతున్న కుటుంబాలకు ఆటోల డౌన్ పేమెంట్ కట్టి వారికి ఎమ్మెల్యే స్థిరమైన జీవనోపాధి మార్గం చూపించారని అన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కోశాధికారి సూర్యప్రకాష్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కనకరావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సతీష్, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోలా దుర్గారావు శ్రీనివాసరాజు, టీవీఎస్ కంపెనీ ప్రతినిధులు పవన్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను కడతాం.. డబ్బులు పంపండి

చెల్లింపుదారులకు మోసగాళ్ల ఫోన్

న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

పన్ను చెల్లిస్తున్న నగరవాసులు

'మీరు ఇంటి పన్ను చెల్లించలేదు. నా ఫోన్ పే నంబరుకు డబ్బులు పంపిస్తే.. నేను కడతాను' అంటూ భవానీపురంలోని ఓ విశ్రాంత ఉద్యోగికి ఒకడు ఫోన్ చేశాడు. నగరపాలక సంస్థ పన్నుల విభాగం ఉద్యోగి మాట్లాడుతున్నట్లు పరిచయం చేసుకున్నాడు. ఆ వ్యక్తి పదే పదే ఫోన్ చేయడంతో విశ్రాంత ఉద్యోగికి అనుమానం వచ్చింది. అతను చెప్పింది ధ్రువీకరించుకునేందుకు సమీపంలోని నగరపాలక సంస్థ పన్ను వసూలు కేంద్రానికి వెళ్లారు. ఫోన్ చేసిన వ్యక్తి సెల్ నంబరు, ఆయన చెప్పిన విషయాలను సిబ్బందికి తెలియజేశారు. అతడు చెప్పిన మాటలు అసత్యమని, ఆ ఫోన్ నంబరు కలిగిన వ్యక్తులెవరూ నగరపాలక సంస్థలో లేరని కార్యాలయ సిబ్బంది చెప్పారు. మోసం నుంచి బయటపడ్డానని విశ్రాంత ఉద్యోగి ఊపిరిపీల్చుకున్నారు.

మధ్య నియోజకవర్గంలో వసూలు కేంద్రాలు ఇవే..

- సత్యనారాయణ పురం సర్కిల్-2 కార్యాలయంలో రెండు చోట్ల
- పాయకాపురంలోని ఎన్ఎస్‌సీ బోసునగర్ అప్నా బజారు సమీపంలో
- అజిత్‌సింగ్ నగర్‌లోని రైతుబజారు వెనుక వైపు...

నగదు పంపి మోసపోవద్దు

నగరంలోని పన్ను చెల్లింపుదారులకు మోసగాళ్లు ఫోన్లు చేస్తున్న విషయం నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి వచ్చింది. నగర పాలక సంస్థ సిబ్బంది ఎవరూ అలా ఫోన్ చేయరని, అటువంటి ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఇంటి, కుళాయి, ఆస్తి పన్ను ఏదైనా.. ఎవరికీ ఫోన్ పే, గూగుల్ పే చేయవద్దని సూచిస్తున్నారు. నగర పాలక సంస్థ పన్ను చెల్లింపు వెబ్‌సైట్లు (www.ourvmc.org లేదా www.cdma.ap.gov.in), పన్ను వసూలు కేంద్రాల్లో మాత్రమే చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారికంగా ప్రకటించారు. పన్ను చెల్లించాలంటూ ఎవరైనా ఫోన్లు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెబుతున్నారు. మన మిత్ర వాట్సప్ నంబరు 95523 00009, పుర మిత్ర యాప్, సమీపంలోని నగరపాలక సంస్థ పన్ను వసూలు కేంద్రంలో సంప్రదించాలని కోరుతున్నారు. నగరంలోని మూడు నియోజకవర్గాల్లో పన్ను వసూలు కేంద్రాలు 14 ఉన్నాయని, వాటిలో మాత్రమే చెల్లించాలని, ఎవరికీ డబ్బులు చెల్లించి మోసపోవద్దని సూచిస్తున్నారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఈనెల 17న నిర్వహించాల్సిన విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించే అవకాశం ఉందని, అయితే.. . ఆ తేదీని మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఖరారు చేయాలని అధికారులు వెల్లడించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

రమాదేవికి పుస్తకాలు అందిస్తున్న కలిమిశ్రీ, చిత్రంలో రవికుమార్, రాఘవేంద్రశేఖర్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ రచయిత, విశ్రాంత ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ రచించిన విలువైన అరుదైన పుస్తకాలను ఆదివారం ఠాగూర్ గ్రంథాలయానికి వితరణ చేశారు. వీటిని హైదరాబాద్ నుంచి నవభారత్ నిర్మాణ సంఘం వ్యవస్థాపకుడు సూరేపల్లి రవికుమార్ విజయవాడకు తీసుకువచ్చారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీతో కలిసి ఠాగూర్ గ్రంథాలయానికి వెళ్లి గ్రంథాలయాధికారిణి కె.రమాదేవికి ఈ పుస్తకాలు అందించారు. సామాన్య పాఠకులకే కాక పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కూడా ఇవి ఉపయోగపడతాయని వీటిని తమకు ఇవ్వడం ఆనందంగా ఉందని గ్రంథాలయాధికారిణి పేర్కొన్నారు. బొప్పా రాఘవేంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠునికి స్వర నీరాజనం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో 24 గంటలు నిర్వహిస్తున్న దశమ వార్షిక ఖచ్చపీ మహోత్సవం ఆదివారం ఉదయం 8 గంటలకు హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రారంభమయ్యింది. వర్ధమాన, ప్రసిద్ధ వైణికులు మహాశివునికి వీణావాద్యాలతో స్వర నీరాజనాలు అర్పించారు. సరస్వతీ మాతకు, మహాదేవునికి సమితి ప్రధాన కార్యదర్శి సీవీ రావు నేతృత్వంలో చిట్టా రామలక్ష్మి పర్యవేక్షణలో పలువురు వాగ్గేయకారుల కృతులను వాయించారు. రెండు తెలుగు రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వంద మందికి పైగా వైణికులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా వైణిక విద్వాంసులు గోవిందరాజన్, ప్రత్యేక ఆత్మీయ అతిథులుగా కొమ్మూజోస్యుల సద్గురు చరణ్, మోదుమూడి సుధాకర్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం సోమవారం ఉదయం 8 గంటలకు ముగియనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

సంగీతంతో శివార్చన చేస్తున్న కళాకారులు

ముగిసిన ఎడ్ల పందేలు

చిలుకూరు, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని బేతవోలులో కనకదుర్గమ్మ జాతర, శివరాత్రి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఒంగోలు జాతి వృషభరాజుల బండలాగుడు పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు న్యూ కేటగిరీ ఎడ్ల పందేలు జరిగాయి. ప్రకాశం జిల్లాకు చెందిన చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి మొదటి స్థానంలో నిలిచి రూ.70,000, ద్వితీయ స్థానంలో విజయవాడకు చెందిన మెగా కృష్ణమోహన్ నిలిచి రూ.50,000 సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచి వట్టికూటి నాగయ్య, ఉపసర్పంచి ఏడుకొండలు, ప్రశాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు. పోటీలు చూడడానికి భారీగా జనం వచ్చారు.

భక్తితో మహా శివరాత్రి వేడుకలు

దాసాంజనేయస్వామి దేవస్థానంలో మల్లేశ్వరస్వామి

లెనిన్ కూడలిలో నాగమానసాదేవి మందిరంలో సుధాస్వామి

గవర్నర్‌పేట: కాశీవిశ్వేశ్వరుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బొండా ఉమ కుటుంబ సభ్యులు, నెల్లిబండ్ల బాలస్వామి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: సెంట్రల్ నియోజకవర్గంలో మహా శివరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచే శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. గవర్నర్‌పేట కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం భక్తులతో కిటకిటలాడిపోయింది. ఆలయ ఈవో యడ్లపల్లి సీతారామయ్య నేతృత్వంలో భక్తులు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. అఘోర పాశుపత రుద్రహోమాలు, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరునికి వేద పండితుల సమక్షంలో శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో 121 కిలోల అన్నంతో అభిషేకం నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనను స్థానిక కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి సత్కరించారు.

❖ లెనిన్ కూడలిలోని శిర్డీ నాగసాయిబాబా నాగమానసాదేవి మందిరంలో అధ్యక్షుడు సుధా స్వామి ఆధ్వర్యంలో మహా శివలింగానికి విభూది అభిషేకం నిర్వహించారు.

కార్మికపురం(సీతారాంపురం): కార్మికపురంలోని దాసాంజనేయస్వామి వార్ల దేవస్థానాల్లో మల్లేశ్వరస్వామి విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పాయకాపురం: పాయకాపురం శాంతినగర్‌లోని సన్యాసయ్య కొట్టు కూడలిలో స్థానిక యువత నవీన్ బృందం సభ్యుల ఆధ్వర్యంలో ప్రభ ఊరేగింపు నిర్వహించారు.

గాంధీనగర్: మా ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శివ కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విచ్చేసి మాట్లాడారు. బొండా సిద్ధార్థ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శివరాత్రి విశిష్టతపై ప్రచారం

భగవద్గీత పుస్తకం అందిస్తున్న సంఘ సభ్యులు

మధురానగర్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక సభ్యులు శివరాత్రి విశిష్టతపై ప్రచారం చేశారు. ముత్యాలంపాడు, టీచర్స్, శ్రీనగర్ కాలనీల్లో పర్యటించి త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేశారు. శివరాత్రిని మోక్ష రాత్రి అని ఎందుకు అంటారో వివరించారు. కాళ్ళ సత్యం, తిరుపతి, శేఖర్, శంకర్, లక్ష్మీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యం వెల్లివిరిసేలా కూటమి పాలన

మొగల్రాజపురం(విజయవాడ సిటీ): రాష్ట్రంలో మత సామరస్యం వెల్లివిరిసేలా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని, అన్ని వర్గాల ప్రజలు శాంతి, సామరస్యంతో జీవించేలా చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ అన్నారు. ఇటీవల జరిగిన మేడారం జాతరలో కొంతమంది మీడియా ప్రతినిధుల వల్ల కర్నూలుకు చెందిన కోవా ఐస్ అమ్మే వలీ, అతని మిత్రులు వేధింపులకు గురయ్యారు. వారికి ఆదివారం మొగల్రాజపురంలోని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో రూ.50 వేల ఆర్థిక సాయాన్ని షిబ్లీ అందజేశారు. కూటమి ప్రభుత్వ భాగస్వాములైన తెదేపా, జనసేన, భాజపా ముఖ్య నాయకులు కూడా వలీకి ఎదురైన అవమానానికి విచారం వ్యక్తం చేశారని షిబ్లీ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

? వాంబే కాలనీ హెచ్‌బ్లాక్ వద్ద వార్డు సచివాలయం ముందు రాత్రి వేళల్లో పలువురు యువకులు గంజాయి తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. - **అశోక్, స్థానికుడు** ✔ నిఘా ఏర్పాటు చేసి వారిని పట్టుకుంటాం. - **కృష్ణమోహన్, సీఐ, నున్న**

? తోటవారివీధి 10వ లైన్‌లో రోడ్డుపై మురుగు పొంగిపొర్లుతోంది. - **చంద్రిక, స్థానికురాలు** ✔ యూజీడీలోని పూడిక తీయిస్తాం. - **బాబూ శ్రీనివాసన్, సర్కిల్-2 ఏఎంవోహెచ్** – న్యూస్‌టుడే, పాయకాపురం

జిల్లా అండర్-12 క్రికెట్ జట్టుకు ఎంపిక

పవన్

లికిత్ ప్రేమ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అజిత్‌సింగ్‌నగర్ ఎంబీపీ స్టేడియంలోని ఏసీఏ-కేడీసీఏ, వీఎంసీ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఇరువురు క్రీడాకారులు జిల్లా అండర్-12 క్రికెట్ జట్టులో స్థానం సాధించారని ఏసీఏ కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక శ్రీరామ్ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న వి.పవన్, సెయింట్ ఆన్స్ స్కూల్‌లో చదువుతున్న టి.లికిత్ ప్రేమ్(స్టాండ్ బై)జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఆదివారం ఎంబీపీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన క్రీడాకారులను పలువురు క్రికెటర్లు అభినందించారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమెప్పుడు?

ప్రజలకు తప్పని కష్టాలు

కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డులో ద్విచక్ర వాహనాలకు మరమ్మతులు చేస్తుండడంతో స్తంభించిన ట్రాఫిక్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: విజయవాడలో గవర్నర్‌పేటకు ప్రధాన వ్యాపార కేంద్రంగా పేరు ఉంది. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్, వస్త్ర వ్యాపారాలకు ఈ ప్రాంతం నిలయం. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. పక్క జిల్లాల నుంచి వందల సంఖ్యలో వ్యాపారులు ఆటోమొబైల్ పరికరాలు కొనుగోలుకు విజయవాడకు వస్తారు. ఇక ఎలక్ట్రానిక్ వ్యాపారానికి పేరొందిన ఎన్టీఆర్ కాంప్లెక్సు నిత్యం కిటకిటలాడిపోతూ ఉంటుంది. ఈ క్రమంలో ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు వాహనచోదకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రోడ్లను ఆక్రమించి వాహనాలు మరమ్మతులు చేస్తుండడంతో ముందుకు వెళ్లే మార్గం లేక వాహనాలు నిలిచిపోతున్నాయి.

పోలీసుల హెచ్చరికలు బేఖాతరు

❖ కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డులో ఆటోమొబైల్ దుకాణాలు ఎక్కువ. వీటి ఎదురుగానే కొంతమంది రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాలు నిలిపి మరమ్మతులు చేస్తున్నారు. ఒక్కోసారి రోడ్డుకు ఒక వైపు రెండు వరుసల్లో ద్విచక్రవాహనాలు నిలుపుతుండడంతో రోడ్డు ఇరుకుగా మారిపోతోంది. మరోవైపు కూడా వాహనాలు ఉండడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. రాజగోపాలచారివీధిలోనూ ఇదే పరిస్థితి. కార్లు నిలపకూడదని పోలీసులు హెచ్చరిక బోర్డులు పెట్టినా యజమానులు పట్టించుకోవడం లేదు. జరిమానాలు విధించినా మార్పు రాకపోవడంతో ఏం చేయాలో తెలియక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

ఇలా చేస్తే మేలు..

❖ సింగిల్‌లైను పార్కింగ్‌కు మాత్రమే అనుమతించాలి. ❖ రోడ్లపై మరమ్మతులు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి. ❖ కార్లు సమీపంలోని ఎన్టీఆర్ కాంప్లెక్సు సెల్లార్‌లో నిలుపుకొనేలా చూడాలి.

ప్రధాన రహదారులు: కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, రాజగోపాలాచారివీధి, అలీబేగ్ వీధి.
నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు: 25 వేల మంది ❖ తిరిగే కార్లు 5,000, ద్విచక్ర వాహనాలు: 15,000

పొంగుతున్న మ్యాన్‌హోల్

మధురానగర్, న్యూస్‌టుడే: మధురానగర్ వి.వి.నరసరాజురోడ్డు పైవంతెన సమీపంలో మ్యాన్‌హోల్ పొంగి పొర్లుతోంది. ఈ వీధిలోని ప్రధాన డ్రైనేజీ పైపులైనులో మురుగునీరు సరిగా ప్రవహించక నిలిచిపోయింది. గత వారం రోజులుగా ఈ సమస్య ఉండడంతో మురుగునీరు ఇళ్లల్లోకి ఎగదన్నుతోంది. శనివారం నుంచి మురుగునీరు మ్యాన్‌హోల్ నుంచి బయటకు వచ్చి రోడ్డును ముంచెత్తుతోంది. ప్రధాన రహదారి కావడంతో మురుగునీటిలో నుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారు తప్ప సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రౌడీషీటర్లపై నిఘా

కౌన్సెలింగ్ ఇస్తున్న నున్న సీఐ కృష్ణమోహన్ తదితరులు

పాయకాపురం, న్యూస్‌టుడే: రౌడీషీటర్లపై నిఘా ఉంచామని, హద్దుమీరితే కఠిన చర్యలు తప్పవని నున్న సీఐ కృష్ణమోహన్ హెచ్చరించారు. ఆదివారం పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారు? ఏయే పనుల్లో నిమగ్నమై ఉంటున్నారనే అంశాలపై ఆరా తీశారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని వారికి సూచనలు చేశారు. సెక్టార్ ఎస్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు బంగారు ఆభరణాల బహూకరణ

ఈవో శీనానాయక్‌కు ఆభరణాలు అందజేస్తున్న వీఎన్‌వీఎల్‌జీ శర్మ, కుటుంబ సభ్యులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు దుర్గగుడి స్థానాచార్య శివప్రసాద శర్మ కుమారుడు వి.ఎన్.వి.ఎల్.ఎస్.జి.శర్మ రూ.4 లక్షలు విలువ చేసే బంగారు బొట్టు, నత్తు, బులాకీ ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. 29.700 గ్రాముల బరువు ఉన్న వాటిని దుర్గమ్మ ఎదుట ఉంచి పూజ చేయించిన అనంతరం ఈవో శీనానాయక్‌కు అప్పగించారు. ఆశీర్వచన మండపంలో దాత కుటుంబానికి వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు

సత్కారం పొందిన ఉపాధ్యాయులతో అతిథులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని ఎంచుకుని అందుకు అనుగుణంగా కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీసీ) ఛైర్మన్ వేమూరు రవి అన్నారు. కమ్మ విద్యార్థి సహాయ సంఘం వసతి గృహ వార్షికోత్సవం సిద్ధార్థ ఫార్మసీ కళాశాల సెమినార్ హాలులో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కమ్మ విద్యార్థి సహాయ సంఘం అధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ, కార్యదర్శి కానుమిల్లి వెంకట సూర్యప్రకాశరావు, కోశాధికారి చనమోలు కృష్ణారావు, ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు విద్యార్థులకు ప్రతిభా ఉపకార వేతనాలు, ఆటల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు.

ఐలాపురం వెంకయ్య మృతికి సంతాపం

భవానీపురం, న్యూస్‌టుడే: మాజీ శాసనమండలి సభ్యుడు ఐలాపురం వెంకయ్య మృతి పట్ల ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతికి, హక్కుల సాధన కోసం వెంకయ్య నిరంతరం పని చేశారని కొనియాడారు. అందరితో సత్సంబంధాలు కలిగి ఉండేవారని వెల్లడించారు. వెంకయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యాధరపురం, న్యూస్‌టుడే: బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య కృషి చేశారని వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పోదిలి చంటిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి తీరని లోటని పేర్కొన్నారు. శాలివాహనుల సంక్షేమం కోసం తొమ్మిది పదుల వయసును కూడా లెక్క చేయకుండా విద్యాధరపురం రామమందిరం సెంటరులో రచయిత మొల్ల విగ్రహం ఆవిష్కరించిన వెంకయ్య బలహీన వర్గాల మదిలో చెరగని ముద్ర వేశారని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మారిస్ స్టెల్లా కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఆలిండియా అంతర్ వర్సిటీ మహిళా నెట్ బాల్ పోటీల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం రాత్రి నిర్వాహకులు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు దేశంలోని పలు వర్సిటీల నుంచి వచ్చిన క్రీడాకారిణులు ఆసక్తిగా తిలకించి ఆనందించారు. అనంతరం నిర్వహించిన క్యాంప్ ఫైర్‌లో విద్యార్థినులు పాల్గొన్నారు. తమ తమ ప్రాంతీయ సంగీతం, నృత్యాలను ప్రదర్శించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో కూచిపూడి నృత్య కళాకారులు ప్రదర్శించిన భక్తి గీతాలు భక్తులను ఆదివారం అలరించాయి. తాడేపల్లికి చెందిన నృత్యాచార్య స్వర్ణలత శిష్య బృందం ప్రదర్శించిన శివతాండవం, శంకర శ్రీగిరి, తదితర భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. తెనాలికి చెందిన నాట్యాచారిణి ఆర్.వసంత దుర్గ శిష్య బృందం ప్రదర్శించిన గణేష్ స్తుతి, మహిషాసురమర్దిని స్తోత్రం భక్తుల్లో ఉత్తేజాన్ని నింపింది. నృత్య కళాకారిణులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

ముందస్తు ప్రణాళికతో మెరుగైన ఫలితాలు

ఈనాడు డిజిటల్ – అనకాపల్లి

'గతేడాది పదో తరగతి ఫలితాల్లో అనకాపల్లి జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచింది. ఈసారి మొదటి స్థానమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని చదివిస్తున్నారు. కనీసం 35 మార్కులు సాధించలేని వారిని వసతి గృహాల్లో ఉంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టు నిపుణులతో వీడియో తరగతులు చెప్పిస్తున్నాం. సబ్జెక్టుకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించి ఫోన్‌లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించా'మని జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంపై 'ఈనాడు డిజిటల్'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

✦ **వసతి గృహాల్లో ప్రత్యేక శిక్షణ..:** చదువులో బాగా వెనుకబడిన విద్యార్థులను వసతి గృహాల్లో ఉంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 20 ప్రభుత్వ వసతి గృహాల్లో 298 మంది విద్యార్థులకు తరగతులు జరుగుతున్నాయి. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1600 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులను అక్కడి ఉపాధ్యాయుల సంఖ్య ఆధారంగా దత్తత ఇచ్చి చదివిస్తున్నాం. రాత్రి వేళల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ, వసతి గృహాల్లోని విద్యార్థులతో రోజూ ఉదయం 6 గంటలకు వీడియో కాల్స్ చేసి మాట్లాడుతున్నాం.

✦ **ప్రతి మంగళవారం రివ్యూ:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ఆన్‌లైన్‌లో వారంలో అభ్యసించిన పాఠ్యాంశాలపై ప్రతి మంగళవారం రివ్యూ చేస్తున్నాం. సందేహాలు నివృత్తి చేస్తున్నాం. పరీక్షలు సమీపిస్తుండటంతో చదువులో వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా కలెక్టర్ ఆదేశాలతో 30 రోజుల ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టాం. వీరి కోసం ప్రత్యేకంగా అభ్యసన సామగ్రిని సిద్ధం చేశాం.

✦ **సందేహాల నివృత్తికి డయల్ యువర్ సబ్జెక్ టీచర్స్ :** ప్రతి పాఠ్యాంశానికి సంబంధించి నిపుణులైన ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున ఏడు సబ్జెక్టులకు 14 మందిని ఎంపిక చేశాం. పాఠ్యాంశాల్లో సందేహాలను నివృత్తి చేసేందుకు డయల్ యువర్ సబ్జెక్ట్ టీచర్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ 266 ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేకంగా అధికారులను నియమించాం. వీరు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నారు.

✦ **మార్కుల ఆధారంగా స్టార్స్.. :** ప్రభుత్వ పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థులు 14,572 మంది ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారు. కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు ఉండేలా చూస్తాం. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వందరోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నాం. రోజూ ఉదయం, సాయంత్రం గంట చొప్పున అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. రోజూ ఒక్కో సబ్జెక్టుపై సాయంత్రం 20 మార్కులకు పరీక్ష పెడుతున్నాం. 0 - 11 మార్కులొచ్చిన వారిని రైజింగ్ స్టార్స్‌గా, 11 - 20 మార్కులు వచ్చిన వారికి షైనింగ్ స్టార్స్‌గా విభజించాం.

ఆరాధనోత్సవం.. నేత్ర శోభితం!

దామరాజు వెంకట యోగింద్రులు (పోతలపాడు గురుదేవులు) 56వ ఆరాధనోత్సవం నర్సీపట్నంలో ఆదివారం వైభవంగా జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గురుదేవుల విగ్రహంతో గిరిజన భక్తులు రథయాత్ర నిర్వహించారు.

పుష్పాలంకరణలో గురుదేవుల విగ్రహం

భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఆశ్రమం తరపున ఏర్పాటు చేశారు. కోలాటాలు, భజనలతో ఆశ్రమంలో సందడి నెలకొంది. – న్యూస్‌టుడే. నర్సీపట్నం అర్బన్

నమామి శంకరం.. ప్రణామి శుభకరం

మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం కల్యాణపులోవ జలాశయం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. మూడు రోజులపాటు జరగనున్న పోతురాజుబాబు జాతరకు ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. జలాశయంలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. జాతరలో తొలిరోజు సుమారు 85 వేల మంది వచ్చారని దేవాదాయశాఖ అధికారులు వెల్లడించారు. – న్యూస్‌టుడే, రావికమతం

కళ్యాణపులోవ జలాశయం వద్ద రద్దీ (అంతర చిత్రం) పోతురాజుబాబు

పైడిపాల వామలింగేశ్వరుడు

శివ కామ సుందరిగా కనకదుర్గ

అనకాపల్లిలో శివలింగానికి పాలతో భక్తుల అభిషేకం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఉత్తరవాహిని తీరంలో స్నానఘట్టాల వద్ద నదికి హారతిచ్చే కార్యక్రమాన్ని సభాపతి అయ్యన్నపాత్రుడు దంపతులు ప్రారంభించారు. అన్నవరం దేవస్థానం వేదపండితులు గంగాహారతి నిర్వహించారు.

రాంబిల్లి, న్యూస్‌టుడే: పంచదార్ల శివాలయం భక్తులతో కిటకిటలాడింది. రాధామాధవ స్వామి ఆలయ ప్రాంగణంలోని పుణ్యధారల వద్ద స్నానాలు ఆచరించారు. అనంతరం ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు.

నీరిచ్చేలోగా.. నిధులొచ్చేనా?

✦ సాగునీటి సంఘాల అధ్యక్షుల ఎదురుచూపు
✦ మరమ్మతు పనులకు వేసవే అనుకూలం

పరిశీలన

'వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మే 15న నారుమళ్లు వేసుకోవాలి. జూన్ నుంచే నీరివ్వాలి. అప్పటికి 60 శాతం నీరు అందుబాటులో ఉండాలి'.
– ఈ నెల 9న మంత్రులు, ముఖ్య కార్యదర్శుల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

నర్సీపట్నం గ్రామీణం, చోడవరం, న్యూస్‌టుడే

సీఎం చెప్పినట్లు జరగాలంటే మరమ్మతుకు గురైన కాలువలు, ఆనకట్టలకు వెంటనే నిధులు విడుదల చేయాలి. సాగునీటి వనరులకు సంబంధించి పనులు చేసేందుకు వేసవే అనుకూలం. ఇప్పుడు నిధులిస్తేనే వర్షాకాలానికి ముందు మరమ్మతు పూర్తి చేసి సాగు భూములకు సజావుగా నీరిచ్చేందుకు వీలుంటుంది.

● తాండవ జలాశయం దిగువన అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 51,465 ఎకరాల ఆయకట్టు ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది 18 పనులకు రూ.2.10 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో జలాశయం ప్రధాన గేటు లీకేజీలు అరికట్టారు. కాంక్రీటు పనులు చేశారు. ఉపాధి హామీ నిధులు రూ.1.5 కోట్లతో కాలువల్లో పూడిక తీయించారు. మరో రూ.4.2 కోట్ల వ్యయంతో 57 చోట్ల కాలువ మరమ్మతు చేపట్టారు. తద్వారా ఆయకట్టు చివరి భూములకూ నీరివ్వగలిగారు. ఇంకా 49 చోట్ల మరమ్మతు చేపట్టాల్సి ఉందని నీటి సంఘాల అధ్యక్షులు గుర్తించారు. ఇందుకు రూ.9.55 కోట్లు అవసరమని అంచనా. కాలువల పర్యవేక్షణకు 31 మంది లస్కర్లు అవసరం కాగా ప్రస్తుతం తొమ్మిది మంది మజ్దూర్లే ఉన్నారు. లస్కర్లు లేక నీటి సరఫరాపై పర్యవేక్షణ కొరవడింది. జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 4.96 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.070 టీఎంసీల నీరుంది. సమృద్ధిగా నీరున్నందున ప్రభుత్వం చెప్పినట్లు జూన్ నుంచే నీటిని విడుదల చేయవచ్చు. మరమ్మతు పనులు పూర్తి చేస్తే ఆయకట్టు చివరి వరకు నీరు వెళ్తుంది.

చోడవరం ప్రాంతంలో శిథిలమైన చాకిపల్లి గ్రోయిన్

● రావణాపల్లి జలాశయం ప్రధాన గేటు పక్క గట్టు వర్షాకాలంలో కుంగింది. పెను ప్రమాదం జరగకముందే గట్టును బలోపేతం చేయాలి. రావణాపల్లి వైపు మదుం అడుగు భాగంలో రంధ్రం పడింది. మదుంను పునరుద్ధరించాలి. ఇందుకు రూ.80 లక్షలు అవసరమని ప్రతిపాదించారు.

● చోడవరం నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు మండలాల్లో ఏడు గ్రోయిన్ల కింద 6,068 ఎకరాల ఆయకట్టు ఉంది. 2016-17లో రూ.7 కోట్లు మంజూరయ్యాయి. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోలేదు. గ్రోయిన్లు సరిగాలేక నీరు పొలాలకు చేరడం లేదు.

● ఎలమంచిలి నియోజకవర్గంలో రాంబిల్లి మండలం రజాల సమీపంలో మొంథా తుపానుకు శారదా నది గట్టు 150 మీటర్ల మేర దెబ్బతింది. దీని కింద 700 ఎకరాల ఆయకట్టు ఉంది. కొత్తూరు గ్రామం వద్ద గట్టు 150 మీటర్ల పొడవున కుంగింది. దీనికింద 1400 ఎకరాల ఆయకట్టు ఉంది. పొలాల మీదుగా నీరు ప్రవహించడం వల్ల రైతులకు నష్టం జరుగుతోంది. మరమ్మతుకు రూ.2.69 కోట్లు అవసరం. 1500 ఎకరాల ఆయకట్టు ఉన్న ఏడు మళ్ల డ్యాం రక్షణ గట్టు దెబ్బతింది.

● పాయకరావుపేట నియోజకవర్గంలో మూలపాలెం గ్రోయిన్, భూమి గ్రోయిన్, ముఠా గ్రోయిన్ల షట్టర్లు పాడయ్యాయి. వీటికింద దాదాపు 15 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతుకు రూ.40 లక్షలు అవసరం. జలవనరుల శాఖ నర్సీపట్నం డివిజన్ పరిధిలోనే 1,264 వనరుల కింద 1,23,676 ఎకరాల ఆయకట్టు ఉంది. అవసరమైన చోట మరమ్మతు చేస్తేనే సమృద్ధిగా నీరివ్వగలమని ఆయకట్టుదారుల సంఘం ప్రతినిధులు చెబుతున్నారు. జలవనరుల శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజినీరు అప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లగా మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపినట్లు పేర్కొన్నారు.

కరివేపాకని తీసిపారేయొద్దు

మార్కెట్‌లో కేజీ రూ.100

శాకాహారమైనా.. మాంసాహారమైనా కరివేపాకు ఉండాల్సిందే. ఈ నెల ప్రారంభంలో కేజీ రూ.30 ఉన్న కరివేపాకు ధర ప్రస్తుతం రూ.100కి చేరింది. గతంలో కూరగాయలు కొంటే కొసరుగా కరివేపాకు ఇచ్చేవారు. ఇప్పుడు రూ.10 ఇచ్చినా ఇవ్వడం లేదు. పెరట్లో పెంచుకునే కరివేపాకు మొక్కలకు చలికాలంలో పెద్దగా ఆకులు రావు. వచ్చినవి కాస్తా మంచుకు రంగుమారి వంటల్లో వాడేందుకు పనికిరావు. గుంటూరు జిల్లా మంగళగిరి, అనంతపురం జిల్లాలో వాణిజ్య సరళిలో కరివేపాకు తోటలను పెంచుతున్నారు. అక్కడి నుంచి అనకాపల్లి మార్కెట్‌కు దిగుమతి అవుతోంది. ఇక్కడి నుంచి జిల్లాలోని ఇతర ప్రాంతాలకు వెళ్తోంది. హోల్‌సేల్ మార్కెట్‌లో టన్ను ధర రూ.55 వేలకు పెరిగింది. రవాణా ఛార్జీలతో అనకాపల్లి చేరే సరికి కేజీకి రూ.60 పడుతోంది. వ్యాపారులు లాభం కలుపుకొని కేజీ రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. కరివేపాకు లాభదాయకమైన పంట. జిల్లాలో చాలా తక్కువ విస్తీర్ణంలో సాగవుతోంది. ఒకసారి పంట వేస్తే 15 నుంచి 20 ఏళ్లపాటు దిగుబడి వస్తుంది. మొదటి ఏడాది దిగుబడి తక్కువ వచ్చినా.. రెండో ఏడాది నుంచి నాలుగు నెలలకు ఒకసారి చొప్పున ఏడాదికి నాలుగు కోతలు వస్తాయి. ఎకరాకు ఏడాదికి 24 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. చీడపీడల సమస్య అధికంగా ఉండటం వల్ల జిల్లాలో రైతుకు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. – న్యూస్‌టుడే, ఎలమంచిలి

హలో.. మాస్టారండీ!

ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకున్న విద్యార్థులు

పాయకరావుపేట, మాకవరపాలెం న్యూస్‌టుడే

పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ మరో వినూత్న కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చింది. జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు ఆదివారం 'డయల్ యువర్ టీచర్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించారు. పాఠ్యాంశాల్లో ఏ సందేహం ఉన్నా.. పాఠ్య పుస్తకాలు దగ్గర ఉంచుకుని అడగాలని విద్యార్థులకు సూచించారు. ఈ ఫోన్ ఇన్ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన వచ్చింది. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం సబ్జెక్టుల్లో సందేహాల నివృత్తికి ఎంపిక చేసిన ఉపాధ్యాయుల చరవాణి నంబర్లకు విద్యార్థులు ఫోన్ చేశారు. సుమారు 85 ఫోన్ కాల్స్ వచ్చాయని విద్యాశాఖ వెల్లడించింది.

❖ జిల్లాలో సుమారు 20 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతి ఆదివారం డయల్ యువర్ టీచర్ కార్యక్రమం కొనసాగుతుందని డీఈవో అప్పారావునాయుడు తెలిపారు. శత శాతం ఉత్తీర్ణతలో భాగంగా ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక, స్లిప్ టెస్టులు, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థుల ప్రగతి ఆధారంగా షైనింగ్, రైజింగ్ స్టార్లుగా ఎంపిక చేసి తర్ఫీదు ఇస్తున్నారు. తరగతుల నిర్వహణ పరిశీలనకు మండల స్థాయి అధికారుల బృందం పర్యటిస్తోంది. కనీసం 35 మార్కులు తెచ్చుకోలేని వారికి గురుకుల బోధన అందుబాటులోకి తెచ్చారు. సమీపంలోని వసతిగృహాల్లో ఉంచి బోధన చేస్తున్నారు.

ఇంటింటికీ ఫైబర్ నెట్

కొత్త కనెక్షన్లు, సేవల్లో నాణ్యత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

ఫైబర్ నెట్ వినియోగదారులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జనాలకు చుక్కలు చూపించిన సేవలను పట్టాలెక్కించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం ఊరట కలిగిస్తోంది.. ఇప్పటికే ఏపీ ఫైబర్ నెట్ నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ప్రత్యేక వాహన నౌక (ఎస్‌పీవీ) ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసింది. నెట్ సేవలను మెరుగుపరచడంతో పాటు కొత్త కనెక్షన్ల జారీ, సెటాప్ బాక్సుల మరమ్మతు చేయనున్నారు.

❍ జగన్ సర్కార్ తీరుతో ఫైబర్ నెట్ సేవలు అస్తవ్యస్తంగా మారాయి. కొత్త కనెక్షన్లు ఇవ్వకపోగా రూ.149 ఉన్న ధరను రూ.350కి పెంచేశారు. కొత్త కనెక్షన్లు విడుదల కాక, మరమ్మతుకు గురైన బాక్సులను బాగు చేసేవారు లేక ఐదేళ్లపాటు వినియోగదారులు నరకం చూశారు. తాజాగా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.252.67 కోట్లు కేటాయించడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

❍ సామాన్యులకు చౌకగా అంతర్జాలం అందించాలనే లక్ష్యంతో గత తెదేపా ప్రభుత్వం ఫైబర్ నెట్ సేవలను ప్రారంభించింది. కేవలం రూ.149కే అన్ని టీవీ ఛానళ్లతోపాటు 10 ఎంబీపీఎస్ వేగంతో అంతర్జాలం అందించింది. తక్కువ ధరకే టీవీ, నెట్ అందుబాటులోకి రావడంతో పల్లె జనాలు, విద్యార్థులు ఈ కనెక్షన్లు పొందేందుకు ఉత్సాహం చూపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 92 వేల మంది కనెక్షన్లు తీసుకున్నారు.

❍ 'సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని నెట్ సేవల మెరుగుకు చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉంది. కొత్త కనెక్షన్ల కోసం వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. కొత్త సెటాప్ బాక్సులకు డిమాండ్ ఉంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే వినియోగదారులు మేలు జరుగుతుంద'ని తిమ్మరాజుపేటకు చెందిన కేబుల్ ఆపరేటర్ ఆడారి శివ పేర్కొన్నారు.

రహదారి విస్తరణ చకచకా

నక్కపల్లి, న్యూస్‌టుడే

పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా జాతీయ రహదారి నుంచి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు చేపట్టిన విస్తరణ పనులు చకాచకా జరుగుతున్నాయి. తొలుత దీన్ని రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేయగా భవిష్యత్తు అవసరాల రీత్యా నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు.

● రాజయ్యపేట, చందనాడ, బుచ్చిరాజుపేట, డీఎల్‌పురం తదితర ప్రాంతాల్లో బల్క్ డ్రగ్ నిమిత్తం మౌలిక సదుపాయాల కల్పన శరవేగంగా సాగుతోంది. ఆర్సెలార్ మిత్తల్ నిప్పాన్ ఇండియా స్టీల్ ప్లాంటుకు తొలి విడతలో 2020 ఎకరాలు కేటాయించారు. ప్రాథమికంగా మట్టి పరీక్షలు, సరిహద్దు గుర్తింపు, కంచె ఏర్పాటు పనులు తుది దశకు చేరాయి. పరిశ్రమల వద్దకు రాకపోకలు సాగించడానికి వీలుగా ఏడాది కిందట రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కాగిత సమీపంలోని జాతీయ రహదారి నుంచి పాటిమీద వరకు రెండు వరుసల రోడ్డు వేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన భూమిని సేకరించారు. తొలుత 14 మీటర్ల వెడల్పున రూ.26 కోట్లతో రహదారి విస్తరణ చేపట్టారు. భవిష్యత్తు అవసరాల నిమిత్తం ఈ రోడ్డును మరింత విస్తరించాలన్న స్టీల్‌ప్లాంటు యాజమాన్యం సూచన మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు రెండు నెలల కిందట అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపగా ఆమోదం లభించింది. పనులు ప్రారంభమై శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో నిర్మించిన రహదారికి సమాంతరంగా రోడ్డు ఎత్తు చేస్తున్నారు. ఇప్పటికే నిర్మించిన 21 కల్వర్టులనూ విస్తరించనున్నారు. అడ్డుగా ఉన్న హైవోల్టేజి విద్యుత్తు టవర్లను తరలించాల్సి ఉంది.

నాలుగు వరుసలుగా విస్తరణ పనులు

ప్రస్తుతం ప్రాజెక్టు ఇలా..

మొత్తం వెడల్పు: 20 మీటర్లు (నాలుగు వరుసలు)
డివైడర్: రెండు మీటర్లు
కల్వర్టులు : 21
నిధులు : రూ.48.4 కోట్లు

నాలుగు నెలల్లో పూర్తి... రహదారి విస్తరణ ప్రతిపాదనలకు ఆమోదం రావడంతో పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం 20 శాతం వరకు పూర్తి చేశాం. రహదారికి ఇరువైపులా ఐదు అడుగులకుపైగా రాతి పేర్పు తరహాలో బెర్మలు వేస్తాం. నాలుగు నెలల్లో పనులన్నీ పూర్తవుతాయి.
– లలిత, ఏఈ, ర.భ.శా.
(కారిడార్ రోడ్డు పర్యవేక్షణ)

నేడు పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ రద్దు

కలెక్టరేట్, అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రభుత్వం సోమవారం ఐచ్ఛిక సెలవుగా ప్రకటించడంతో కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ రద్దు చేసినట్లు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. డివిజన్, మండల స్థాయిల్లోనూ ఈ కార్యక్రమం ఉండదన్నారు. జిల్లా పోలీసులు కార్యాలయంలోనూ పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు ఎస్పీ తుహిన్‌సిన్హా పేర్కొన్నారు.

విశాఖ డెయిరీ పాల ధరల పెంపు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ పాల ధరలను స్వల్పంగా పెంచినట్లు యాజమాన్యం ఆదివారం ప్రకటించింది. ఈ ధరలు సోమవారం అమల్లోకి రానున్నట్లు పేర్కొంది. అన్నిరకాల పాల ప్యాకెట్లు అర లీటరుకు రూ.1 చొప్పున, లీటరుకు రూ.2 చొప్పున పెంచారు. కూలీల ధరలు, నిర్వహణ, ప్యాకింగ్, రవాణా ఛార్జీలు పెరగడంతో ధరలు పెంచాల్సి వచ్చిందని యాజమాన్యం తెలిపింది.

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త
డాక్టర్ రెడ్డి టోటల్ బాడీ చెకప్ సెంటర్
కలెక్టర్ ఆఫీస్ జంక్షన్, కోస్టల్ బేటరీ రోడ్డు, కెనరా బ్యాంక్ ప్రక్కనఉన్న LUCID బిల్డింగ్, 4వ అంతస్తు, విశాఖపట్నం
శరీరంలో సైలెంట్‌గా దాగిఉన్న గుండెపోటును మరియు కేన్సర్‌ను 6 నెలల ముందుగానే గుర్తించే టోటల్ బాడీ చెకప్
రూ. 7,500/- విలువచేయు పరీక్షలు కేవలం 3,500/- కే
ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా॥ జి. శివప్రసాద్‌రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.
9393752255, 9393122525
ఈ పథకం 10 రోజులు మాత్రమే ప్రతి ఆదివారం శెలవు

క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

కశింకోట, న్యూస్‌టుడే: క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందడంతోపాటు క్రమశిక్షణ అలవడుతుందని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. బాలికలను క్రీడల్లో ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. కశింకోటలో ద్వారపురెడ్డి నూకరాజు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలికలకు ఆదివారం కబడ్డీ పోటీలు జరిగాయి. భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పర్యవేక్షించారు. విజేతలుగా నిలిచిన జట్లకు ఎంపీ రూ.10 వేల ప్రోత్సాహక బహుమతిగా ప్రకటించారు. ఉత్తమ ఉపాధ్యాయులు పీఎం అప్పారావు, ధవళ శకుంతలను సన్మానించారు. నీట్, ఐఐటీ, ఎన్ఐటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ట్రస్టు ప్రతినిధులు శ్రీనివాసబాబు, హరినాథరావు, రమేష్, నూకేశ్వరరావు పాల్గొన్నారు. కశింకోట, వెదురుపర్తి, మాకవరపాలెం, తామరం పాఠశాలల జట్లు వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ రమేశ్

హుండీలను కొల్లగొట్టకుండా..!

ఆలయాల్లో భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి

నక్కపల్లి, న్యూస్‌టుడే: రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం తదితర మండలాల్లోని ఆలయాల్లో ఇటీవల హుండీలు చోరీకి గురయ్యాయి. కొన్నిచోట్ల హుండీలను ఎత్తుకెళ్లారు. నక్కపల్లి మండలం కాగితలో రెండేళ్ల కిందట దుర్గమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగలు వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. మనబాలవానిపాలెం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అమ్మవారి ఆలయంలో ఏడాది కిందట హుండీ అపహరణకు గురైంది. గొలుగొండ మండలం చీడిగుమ్మల మొదలు కృష్ణదేవిపేట వరకు మూడేళ్ల కిందట ఆరు ఆలయాల్లో ఒకే రోజు వరుస చోరీలు జరిగాయి.

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న నక్కపల్లి సీఐ

ఆలయాల్లో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఆలయాల నిర్వహణకు సంబంధించి అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో మైకు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో నాలుగు వేలకుపైగా ఆలయాలు ఉన్నాయని అంచనా. నక్కపల్లి, మునగపాక, కశింకోట, నాతవరం మండలాల్లో అవగాహన కార్యక్రమాలు మొదలయ్యాయి. సీఐలు, ఎస్సైలు స్థానికులకు సూచనలు చేస్తున్నారు. చోరీల నియంత్రణకు అందించాల్సిన సహకారంపై వివరిస్తున్నారు.

సూచనలివీ... ✦ ప్రతి ఆలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు. ✦ పూజల నిమిత్తం అలంకరించే ఆభరణాలను సాయంత్రం తీసి భద్రపర్చడం. తీయలేని పక్షంలో కాపలాదారును నియమించడం. ✦ హుండీల్లో భక్తులు వేసే కానుకలను ఎప్పటికప్పుడు కమిటీల ఆధ్వర్యంలో లెక్కించి బ్యాంకులో డిపాజిట్ చేయడం. ✦ హుండీలను పటిష్ఠంగా తయారు చేయించడం. తాళాలు పగలగొట్టడానికి వీల్లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. ✦ జాతీయ, ప్రధాన రహదారులను ఆనుకుని ఉండే ఆలయాల వద్ద మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.



సమష్టి కృషితోనే.. ఆలయాల్లో వరుస చోరీ ఘటనల నేపథ్యంలో అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ ఆదేశాలతో చర్యలు చేపట్టాం. పోలీసులు గ్రామాలకు వెళ్లి ప్రజలతో సమావేశమవుతున్నారు. దేవాదాయ శాఖకు సంబంధించిన ఆలయాలు ఉంటే అధికారులను కలుస్తున్నాం. గ్రామాల్లో పోలీసు గస్తీ పెంచనున్నాం. ప్రజలందరి సమష్టి కృషితో చోరీలకు అడ్డుకట్ట పడుతుంది.
– పి.శ్రీనివాసరావు, డీఎస్పీ, నర్సీపట్నం

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
THE EENADU WAY CLASSIFIEDS
ఈనాడు క్లాసిఫైడ్స్
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
లీగల్ ప్రకటనలు
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు,
వేడుక ఏదైనా.. ఈనాడును చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్ర బడ్జెట్

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్ స్వర్ణాంధ్ర సాధన లక్ష్య సాధనకు దోహదపడేలా ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పేర్కొన్నారు. అనకాపల్లిలోని పీఆర్‌టీయూ కార్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు సమస్యలపై వినతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో దశల వారీగా అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్నట్లే తమకూ చేస్తారని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారులు ఎదురుచూస్తున్నారన్నారు. వైకాపా సర్కారు రివర్స్ పీఆర్సీ పేరుతో మోసం చేసిందన్నారు. పీఆర్సీ కమిటీ వేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలని కోరారు. విశ్రాంత ఉపాధ్యాయుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వేశ్వరరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, ఆనందరావు, సత్యనారాయణ, అప్పలనాయుడు, అర్జున్, అప్పారావు, జనార్దన్, రామచంద్రరావు, నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

బీసీలకు అగ్ర తాంబూలం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చారని గవర సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర తెలిపారు. వైకాపా హయాంలో బీసీలకు రూ.26 వేల కోట్లు కేటాయించగా కూటమి ప్రభుత్వం రూ.51 వేల కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. వైకాపా స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో 16,500 మంది బీసీలు పదవులకు దూరం అయ్యారన్నారు. బీసీలకు వైకాపా తీరని అన్యాయం చేసిందన్నారు. బడ్జెట్‌పై వైకాపా నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బీసీలకు వెన్నుదన్నుగా ఉండేది కూటమి ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

భవిష్యత్తు విశాఖ.. మెచ్చేలా 'ప్రణాళిక'!

భూ వినియోగం ఆధారంగా వ్యూహాలు

వీఎంఆర్‌డీఏ ముసాయిదా 'మాస్టర్‌ప్లాన్' సిద్ధం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) బృహత్తర ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్) పునఃపరిశీలనలో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాల మేరకు పలు సవరణలు చేపట్టారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) లక్ష్యాలకు అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు. అటవీ, నివాస, ఇతర సున్నిత ప్రాంతాల విస్తీర్ణాన్ని ఖరారు చేసి పొందుపరిచారు. దీంతో భూవినియోగం శాతాల్లో మార్పులొచ్చాయి. ఈ నిష్పత్తి ఆధారంగా భవిష్యత్తు విశాఖను నిర్మించనున్నారు. ప్రభుత్వం ఆమోదించిన తర్వాత ఈ ముసాయిదా ప్లాన్ అమల్లోకి వస్తుంది.

ప్రణాళికాయుత అభివృద్ధికి అవకాశం: మహా నగరాల అభివృద్ధిలో భూవినియోగం కీలకమైంది. నిర్దేశిత ప్రాంతాల్లోనే నివాస, పారిశ్రామిక, రవాణాకు సంబంధించిన నిర్మాణాలను చేపట్టాలి. ఉదాహరణకు నివాస జోన్లలో గృహ నిర్మాణాలే ఉండాలి. పారిశ్రామిక జోన్లలో పరిశ్రమలే ఏర్పాటు చేయాలి. మిశ్రమ జోన్‌లో అయితే నివాస, వాణిజ్య నిర్మాణాలు ఏవైనా ఉండొచ్చు. తద్వారా నగరంలో ఒక ప్రణాళికాయుత అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది. గత ప్రభుత్వం 2021లో ఆమోదించిన మాస్టర్‌ప్లాన్‌తో పోలిస్తే సవరించిన ప్లాన్‌లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. నివాస ప్రాంతం, అటవీ విస్తీర్ణం, రోడ్ల జోన్ విస్తీర్ణం కొంత పెరిగింది.

ప్రాంతాలవారీగా గుర్తించిన జోన్లు..

తగరపువలస: వాణిజ్య, నివాస, వివిధ సంస్థలు ★ ఆనందపురం: సంస్థాగత కేంద్రాల అభివృద్ధి, డేటా సెంటర్లు ★ మేహాద్రిగెడ్డ: జలాశయం ఆధునికీకరణ, ఉల్లాస సౌకర్యాలు ★ రావాడ: నివాస ప్రాంతాలు ★ భోగాపురం: ఆర్థిక, వర్తక, వాణిజ్య, ఐటీ, పర్యాటకం, ఏరో సిటీ ★ మధురవాడ: అధిక ఆవాస ప్రాంతం, విభిన్న ఆవాసాలు, ఐటీ సెంటర్లు ★ హనుమంతువాక: మెడ్ సిటీ ★ నరవ: బహుళ వినియోగ రవాణా కేంద్రం ★ వైజాగ్ బేసిటీ: కైలాసగిరి నుంచి భీమిలి

2041-సవరించిన మస్టర్‌ప్లాన్ ఇలా..

అంశం	శాతం
వ్యవసాయ భూమి	41
నివాస ప్రాంతం	17.3
అటవీ భూములు	15.9
మిశ్రమ జోన్	8.5
గ్రౌన్ జోన్	6.30
రోడ్ల నిర్మాణం	5.8
పర్యాటకం, పార్కులు	3.2
పారిశ్రామిక ప్రదేశం	1.1
పబ్లిక్, సెమీ పబ్లిక్ స్థలాలు	0.70
వాణిజ్య ప్రాంతం	0.20

వీఎంఆర్‌డీఏ మొత్తం విస్తీర్ణం: 6836.15 చ.కి.మీ.	జిల్లాలు: విజయనగరం, విశాఖ, అనకాపల్లి
2041సవరించిన ముసాయిదా బృహత్తర ప్రణాళిక విస్తీర్ణం: 4380.67 చ.కి.మీ.	మండలాలు: 52
ప్రస్తుతం సిద్ధమైన బృహత్తర ప్రణాళిక పరిధి: 4380.67 చ.కి.మీ.	గ్రామాలు: 1457

పురావస్తు శాఖ స్థలంలో తవ్వకాల నిలిపివేత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: రాంబిల్లి మండలం కొత్తూరు సమీపాన పురావస్తుశాఖ స్థలంలో యంత్రాలతో చేపడుతున్న తవ్వకాలను ఆదివారం నిలిపివేశారు. దీనిపై ఆదివారం 'ఈనాడు'లో 'పురావస్తు స్థలంపై పర్యవేక్షణ ఏదీ' శీర్షికన ప్రచురితమైన కథనం అధికారులను కదిలించింది. అధికారుల చర్యలతో పగలు, రాత్రి సాగుతున్న తవ్వకాలకు బ్రేక్ పడింది. ✦ పోలవరం కాలువ సమీపంలో కంకర తవ్వకాలు చేపట్టకుండా అధికారులు కందకాలు తవ్వించారు. 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ ప్రాంతానికి వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

మతమార్పిడి నిరోధక చట్టాలపై సదస్సు నేటినుంచి

అనకాపల్లి పట్టణం: 'మతమార్పిడి నిరోధక చట్టం రాజ్యాంగ బద్ధమా' అంశంపై అనకాపల్లిలో ఈ నెల 16, 17 తేదీల్లో సదస్సు నిర్వహించనున్నట్లు క్రిస్టియన్ డెమోక్రటిక్ మూమెంట్ సమన్వయకర్త జె.శేషుకుమార్ చెప్పారు. పట్టణంలోని వివేకానంద హాలులో ఏపీ, తెలంగాణకు చెందిన ప్రొఫెసర్లు, నాయకులు పాల్గొంటారన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోటలో శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవం ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. శనివారం రాత్రంతా గౌరీపరమేశ్వరులను గ్రామంలో ఊరేగించి ఆదివారం శారదానదిలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో రహదారులు కిక్కిరిసిపోయాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీష్, వేగి దొరబాబు, పెంటకోట రాము, వేగి రామబాబు తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ శ్రావణి పర్యవేక్షణలో సీఐ స్వామినాయుడు, ఎస్సైలు మనోజ్‌కుమార్, లక్ష్మణరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శారదానదిలో గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

గొల్లల కొండపై దీపాలు

ఆకట్టుకున్న దీపాలంకరణ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి గొల్లలకొండపై మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం రాత్రి చేపట్టిన దీపా అలంకరణ ఆకట్టుకుంది. దాతలు సమకూర్చిన 500 కేజీల నూనె పెద్ద ప్రమిదల్లో వెయ్యి దీపాలను కొండపై వెలిగించారు. భక్తులు సాయంత్రం ఆరుగంటలకు కొండపైకి ఎక్కి వీటిని ఏర్పాటు చేశారు. రాత్రంతా ఈ దీపాలు వెలుగుతున్నాయి. వీరన్న కొండపైనా భక్తులు దీపాలు వెలిగించారు.

మార్చిలో నూకాలమ్మ ఆలయ పునఃప్రారంభం

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి నూకాలమ్మ ఆలయ పునః ప్రారంభం వచ్చే నెలలో చేపడతామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఆలయంలో పనులను ఆయన ఆదివారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీమిరెడ్డి రామకృష్ణతో కలిసి పరిశీలించారు. నూకాలమ్మ జాతర మార్చి 17న ప్రారంభమవుతుందన్నారు. ఈలోగా ఆలయం ప్రారంభోత్సవం జరిపి, పనులు దాదాపు పూర్తి కావొచ్చాయన్నారు. నెల రోజులు నిర్వహించే జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముందుగా ఆయన నూకాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను, కార్యనిర్వహణ అధికారి వై.శ్రీధర్ పాల్గొన్నారు. తొలగించిన శంకుస్థాపన శిలఫలకాలు నూతన ఆలయంలో ఏర్పాటు చేయాలని దేవస్థానం పూర్వపు ఛైర్మన్ కొణతాల మురళి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఈవో శ్రీధర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుడి నిర్మాణానికి అడ్డు ఉందని కార్యాలయం గోడకు తాత్కాలికంగా అతికించామన్నారు. వీటిని నూతన ఆలయం ప్రాంగణంలో సముచిత స్థానంలో ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఆలయ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ భద్రత

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఈనెల 17, 18 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరంలో పర్యటించనున్న ప్రదేశాలను నగర పోలీసు యంత్రాంగం ఆదివారం నిశితంగా పరిశీలించింది. ఈనెల 17న దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా ఈస్టర్న్ నేవల్ కమాండుకు చెందిన నేవల్ ఎయిర్ స్టేషన్ 'ఐఎన్ఎస్ డేగా'కు ఆమె చేరుకుంటారు. అక్కడి నుంచి డాక్‌యార్డు గోడౌను మీదుగా కమాండు ముఖ్య కార్యాలయం 'ఐఎన్ఎస్ సర్కార్స్'కు వెళతారు. ఆయా మార్గాలను పోలీసు అధికారులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రతబాగ్చీ, డీసీపీ మేరీ ప్రశాంతి, ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆరిఫ్, ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. రూట్ షెడ్యూల్ మ్యాప్ ప్రకారం పటిష్ఠ భద్రతకు అధికారులు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్రపతి 17న ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని, అక్కడి నుంచి ఐఎన్ఎస్ చోళకు వెళ్లనున్నారు. ఆమెకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వాగతం పలుకుతారన్నారు. ఆమె 18న ఐఎఫ్ఆర్‌లో పాల్గొని, అదే రోజు సాయంత్రం దిల్లీకి పయనమవుతారని పేర్కొన్నారు.

నేవీ ప్రాంగణాన్ని పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు

GOVERNMENT OF ANDHRA PRADESH
ENDOWMENTS DEPARTMENT

E-PROCURMENT TENDER NOTICE

Re-Construction of Temple of **Sri Ramalayam** at Kattubolu (V), Rambilli (M), Anakapalli District. **NIT.NO.P/COE/1536/2025-4, Adm, Dt.24.11.2025.** For further details log onto website **https://tender.apeprocurment.gov.in** for further details Contact Ph.**9848234810.**

EXECUTIVE AUTHORITY
Sri Ramalayam, Kattubolu (V),
Rambilli (M), Anakapalli District.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - దేవదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం
అనకాపల్లి పట్టణం & జిల్లా. ఫోన్: 08924–226823

Rc.No. 225/2025 తేదీ:15-02-2026

దిగువ షెడ్యూలులో తెలిపిన విధంగా శ్రీ కొణతాల ప్రేమ్ కార్తిక్ తండ్రి జోగేశ్వరరావు (లేటు) అనకాపల్లి వారు తరుపున శ్రీ దాడి రవికుమార్ గారు (పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్) శ్రీ దాడి రవికుమార్ తండ్రి (లేటు) సూరిబాబు గారు, అనకాపల్లి వారు, గవరపాలెం, అనకాపల్లి, అనకాపల్లి జిల్లాకు చెందిన సర్వే నెం. 567/3లో ఉన్న య. 0.24 సెంట్లు భూమి శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం, గవరపాలెం, అనకాపల్లి, అనకాపల్లి జిల్లా పేర ప్రయివేటు సంప్రదింపులు ద్వారా కొనుగోలు చేయడానికి ప్రతిపాదించబడినదని A.P.C & H.R.I. & ఎండోమెంట్సు యాక్టు 30/87లోని సెక్షన్ 79 క్రింద తెలియజేయడమైనది. ఆసక్తి గలవారు తమ ఆక్షేపణలను, సలహాలను వ్రాతపూర్వకంగా ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా దాఖలు చేయాలి.

షెడ్యూలు

వ. నెం	ఆస్థి ఉన్న గ్రామం, మండలం, జిల్లా పేరు	సర్వే నెం	విస్తీర్ణం య. సెంటు	సరి హద్దులు
1.	గవరపాలెం, అనకాపల్లి పట్టణం, అనకాపల్లి పట్టణం జిల్లా.	567/3	0.24	తూర్పు: 10 అడుగుల రోడ్డు పడమర: దేవస్థానం ఖాళీ స్థలం ఉత్తరం: కొణతాల ధర్మారావు మరియు పి.లోకేష్ భూమి దక్షిణం: యల్లపు బాల మరియు కొణతాల ప్రకాష్ భూమి.

సం/- వై. శ్రీధర్
సహాయ కమిషనరు & కార్యనిర్వహణాధికారి

అథ్లెటిక్స్‌లో అనురాధ సత్తా

నాతవరం, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో నాతవరం జడ్పీ పాఠశాల పీడీ అనురాధ సత్తా చాటారు. 400 మీటర్ల పరుగులో పసిడి, హ్యామర్ త్రోలో రజతం, 5000 మీటర్ల వాకింగ్, 400 మీటర్ల రిలే పరుగులో రజత పతకాలు సాధించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో పతకాలు అందుకున్నారు. హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

బృంద సభ్యులతో అనురాధ

తెరపై క్రికెట్ మ్యాచ్ వీక్షణం

అనకాపల్లి గ్రామీణం, నక్కపల్లి, న్యూస్‌టుడే: గొలగాం దుర్గాదేవి కాలనీలో ఆదివారం టీ 20 ప్రపంచకప్ భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను గ్రామ యువకులు భారీ తెరపై ప్రదర్శించారు. క్రికెట్ అభిమానులు, యువకులు పెద్ద ఎత్తున చేరుకొని మ్యాచ్‌ను తిలకించి కేరింతలు కొట్టారు. ఇండియా జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. సిక్స్, ఫోర్లు కొట్టినప్పుడు యువకులు పెంటకోట లక్ష్మీనారాయణ, అప్పలరాజు, రాంబాబు, సాయిరాం ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సందడి చేశారు. నక్కపల్లిలోనూ తెర ఏర్పాటు చేసి మ్యాచ్ ప్రదర్శించారు.

గొలగాంలో ఏర్పాటుచేసిన తెర

ఆలోచనకు అంకురం.. హర్షితకు అందలం

గ్లోబల్ సమ్మిట్‌కు ఎంపికైన సబ్బవరం బాలిక

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆలోచనలకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) జోడించడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చునని ఓ బాలిక రుజువు చేసి గ్లోబల్ సమ్మిట్‌కు ఎంపికైంది. ఆ వివరాలిలా.. సబ్బవరం ప్రతిభా విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న దొడ్డి హర్షిత సంక్రాంతి పండగ కోసం ఆన్‌లైన్‌లో తనకు కావలసిన దుస్తులు బుక్ చేసుకుంది. తీరా అవి వచ్చాక వాటి రంగులు నచ్చలేదు. కొలతలు సరిపోలేదు. కావలసిన సమయానికి అవి చేరకపోవడంతో కొంత అసంతృప్తికి గురైంది. ఎందుకిలా జరిగిందని మొదలైన ఆలోచన ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చి పెట్టింది.

ల్యాప్‌టాప్‌లో కొలతల ఆధారంగా దుస్తులు రూపొందిస్తున్న హర్షిత

ఆలోచన సాగిందిలా..: కావలసిన కొలతలు, రంగు, మనమే ఎంపిక చేసుకుని, సరైన టైలర్‌కు ఇచ్చి కుట్టించుకుంటే సరిపోయేది కదా అని ఆలోచన వచ్చింది. వెంటనే తనకున్న కృత్రిమ మేధ పరిజ్ఞానంతో ఏఐలో లాగిన్ అయ్యింది. వ్యక్తి రంగు, కొలతలను బట్టి ఏయే దుస్తులు, ఫ్యాషన్లు బాగుంటాయో ఏఐ ద్వారా తెలుసుకుంది. దీన్ని మరింత అభివృద్ధి చేస్తే ఎంతోమందికి 'మార్గదర్శి' కావచ్చునని మరింత లోతుగా ఆలోచించింది.

★ ఈ క్రమంలో తాను చదివే పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ మెంటార్ రాజశేఖర్ పర్యవేక్షణలో ఆన్‌లైన్ షాపింగ్‌పై నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో 'ఫ్యాషనీఫై' ప్రాజెక్టును రూపొందించింది. తర్వాత దేశ వ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నుంచి 100 ప్రాజెక్టులను నిర్వాహకులు ఆహ్వానించారు. వాటిలో 50 ఉత్తమ ప్రాజెక్టులను ఈనెల 16 నుంచి దిల్లీలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు ఎంపిక చేశారు. అందులో హర్షిత రూపొందించిన ప్రాజెక్టుకు కూడా చోటు దక్కడంతో పాఠశాల యాజమాన్యం ఆమెను అభినందించింది.

★ ఈమె స్వగ్రామం అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం బంగారమ్మపాలెం. తండ్రి రామారావు విశాఖ షిప్‌యార్డ్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లి శ్రావణి గృహిణి. రెండో తరగతి వరకు సబ్బవరంలోని అమర్ స్కూల్‌లో చదువుకుంది. 3 నుంచి 7వ తరగతి వరకు స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగింది. 8 నుంచి ప్రతిభా విద్యాలయంలో చదువుతోంది.

★ నేను రూపొందించిన ప్రాజెక్టుకు భవిష్యత్తులో మంచి ఆదరణ ఉంటుంది. ఎంబీఏ చేసి వ్యాపార రంగంలో స్థిరపడాలని ఉంది. ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థను ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పించాలని భావిస్తున్నా. – హర్షిత

షూటింగ్‌బాల్ విజేత అనకాపల్లి బాలురజట్టు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని బీఎస్‌ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో గత మూడురోజులుగా బాలుర, బాలికల విభాగం రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో 12 జట్లు, బాలుర విభాగంలో 16 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో అనకాపల్లి బాలుర జట్టు విజేతగా నిలవగా, అనంతపురం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచింది. బాలికల జట్టుకు ధర్మవరం పట్టణ తెదేపా అధ్యక్షుడు పరిశే సుధాకర్, షూటింగ్ బాల్ అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి, పీడీ లక్ష్మీనారాయణ ట్రోఫీని అందజేశారు. శ్రీసత్యసాయి జట్టు సభ్యులంతా ధర్మవరం బీఎస్‌ఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థినులే కావడం విశేషం.

రోబో చేతి కాఫీ.. అదుర్స్

తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ నావెల్ బేస్‌లోని సముద్రిక వద్ద మిలాన్ విలేజ్ ప్రారంభమైంది. ఇక్కడ ఏర్పాటు చేసిన రోబో కాఫీ స్టాల్ నౌకాదళ అధికారులు, సిబ్బందిని ఆకట్టుకుంది. దీని పేరు బీన్‌బోర్డు రోబో. మనుషుల సహాయం లేకుండానే తనకు తానే యంత్రంలో కాఫీని పట్టి చేతితో ఇస్తుంది. ఫోన్‌పే ద్వారా డబ్బు చెల్లించినవారు కాఫీ తీసుకొని తాగవచ్చు. త్వరలో ఇటువంటి రోబోను దిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం విమానాశ్రయాల్లో ఏర్పాటు చేయనున్నట్లు బీన్‌బోర్డు రోబో సంస్థ ప్రతినిధులు తెలిపారు. – ఈనాడు, విశాఖపట్నం

మిలాన్ విలేజ్‌లో రోబో కాఫీ స్టాల్ వద్ద యువతి

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

ఇళ్ళు, స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో మార్టిగేజ్/ టేకోవర్ లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. * నో సిబిల్/ నో బ్రోకర్స్. *MSR గ్రూప్, వైజాగ్. Ph: 9121314141

HEALTH & CARE

PILES

పైల్స్, భగందరం, ఫిషర్ స్పెషలిస్ట్ : Dr. Prem Kumar, Mrs. Deepti వైజాగ్ : సింగ్ హోటల్ జంక్షన్, జడ్జికోర్ట్ దగ్గర & గాజువాక: శ్రీహరిపురం చర్చ్ డౌన్. ✆ 8309200608, 9866070593.

REAL ESTATE

FLAT FOR SALE

SANKARAMATHAM

వైజాగ్ మధురానగర్లో 1370Sft 3BHK, E/F, U/D 56.5 గII 100Sft కార్ పార్కింగ్ 9రోజుల్లో రిజి॥ చేసుకుంటే కేవలం రూ. 94,50,000/- మాత్రమే ✆ 7981768246.

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ 'మం' గోవిందాపురం రోడ్డు హైవేకి 1/2KM తారురోడ్డు ఫేసింగ్ 9&4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం & హోటల్ లీజుకు కలదు. ✆ 9440255187.

PLOT FOR SALE

TAGARAPUVALASA

Ready To Constrction 267 sq.yds VUDA plot, Rainbow estate layout @ tirumla schol, Talavalsa. Buyers only. ✆ 9704910838.

JOBS

Wanted Experienced Civil Engineers for MES & DGNP Govt. Projects. SSV Infra Projects. 9010597999. vidyasagardvp@gmail.com

Required Accountant (Female) Experience in GST Filing and Tally for our Granite Export Company at Vizag. ✆ 9908664521.

Urgently Wanted I.T.I. Fitter/ Electrical Diploma, B.Tech., (M.Tech) (EEE) B.Sc/ M.Sc/ Q.C/ Q.A Total Canddidates Freshers/ Experience. Ph: 9885986085.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

FACULTY/ TEACHERS

గాజువాకలో విశాఖ డిఫెన్స్ అకాడమీ కొరకు టెలికాలర్స్ Female కావలెను. ఇంటర్/డిగ్రీ, జీ॥ 8K. 9AM to 6PM. 9848577745/ 9666694545

SECURITY GUARDS

జై గణేష్ సెక్యూరిటీ సంస్థలో విశాఖ స్టీల్ ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డులు 16 మంది, డ్యూటీ 8 గం॥ W/H, జీతం నెలకు ₹16,500/, PF & ESI, సెక్యూరిటీ సూపర్‌వైజర్ (Ex-Service or Civil) 9 మంది, జీతం ₹20,000/, **ఉచిత** నివాసం, సబ్సిడీ భోజనం, యూనిఫాం ఉచితం ✆ 93460 01964

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

'బాల'హీనతకు స్వస్తి పలుకుదాం..!

ఈనాడు, విశాఖపట్నం: అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులు, పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో వివిధ అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వాటిని చిన్న వయసులో గుర్తించకపోతే సమస్య తీవ్రమయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్కే), రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్కేఎస్కే)లు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన, ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తించి కేజీహెచ్‌లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ (డీఈఐసీ)కు తరలిస్తున్నారు.

ఆర్బీఎస్కేలో ఇలా..: అంగన్‌వాడీ కేంద్రాల్లో అయిదేళ్ల లోపు చిన్నారులకు, పాఠశాలల్లో ఒకటి నుంచి 12వ తరగతి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,22,895 మందికి, పాఠశాలల్లో 71,878 మందికి పరీక్షలు చేసినట్లు అధికారులు తెలిపారు.

★ ఉచితంగా వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలు
★ అండగా ఆర్బీఎస్కే, ఆర్కేఎస్కే కార్యక్రమాలు

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు గుర్తించిన చిన్నారుల వివరాలు

1054	ఎదుగుదల లోపం
1223	పోషకాహార లోపం
5747	వివిధ వ్యాధులు
1066	పుట్టుకతో లోపాలు

4,641 మందికి రక్తహీనత

★ ఆర్కేఎస్కేలో భాగంగా 10 నుంచి 19 ఏళ్ల బాలలకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 19,564 మందిని పరీక్షించగా.. వారిలో 4,641 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు.

★ పుట్టుకతో గుండె జబ్బులున్న 11 మంది చిన్నారులకు విశాఖలోని మెడికవర్, తిరుపతిలో పద్మావతి పిల్లల ఆసుపత్రి, ఆంధ్ర హాస్పిటల్స్‌లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేశారు.

★ అన్ని ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాయంత్రం సమయాల్లో అడాలసెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్‌లు (ఏఎఫ్‌హెచ్‌సీ) నిర్వహిస్తున్నారు. బాలబాలికలకు ఐరన్ మాత్రలు, పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ జనవరి వరకు 23,972 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

179 మంది తరలింపు..

ఆర్బీఎస్కే, ఆర్కేఎస్కే కార్యక్రమాల్లో భాగంగా చిన్నారుల్లో రక్తహీనత, ఎత్తు, బరువు, నేత్ర, వినికిడి, మానసిక రుగ్మతలు, ఇతర ఆరోగ్య సమస్యలను గుర్తిస్తున్నాం. వారి కోసం గతేడాది సెప్టెంబరులో ప్రత్యేక వాహనం అందుబాటులోకి తెచ్చాం. ఇప్పటివరకు ఆ వాహనంలో 179 మంది చిన్నారులను కేజీహెచ్‌లోని డీఈఐసీకి తరలించాం. రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు అందిస్తున్నాం.
– డాక్టర్ హారిక, ఆర్బీఎస్కే జిల్లా సమన్వయకర్త

త్రుటిలో తప్పిన ప్రమాదం

నక్కపల్లి: జాతీయ రహదారిపై నక్కపల్లిలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. సీఐ జె.మురళి కథనం ప్రకారం... విశాఖ నుంచి తుని వైపు ఎనిమందితో వెళ్తున్న కారు పోలీసు స్టేషన్ సమీపానికి రాగానే ట్రాఫిక్ కారణంగా నెమ్మదిగా వెళ్తుండగా, ఇదే మార్గంలో వస్తున్న లారీ వెనుక నుంచి దీన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో కారు వెనుకభాగం నుజ్జవ్వగా, అదృష్టవశాత్తు ఇందులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. లారీ అక్కడి నుంచి పరారవ్వగా, విషయం తెలుసుకున్న సీఐ.. సిబ్బందిని పంపించి టోల్‌గేట్ వద్ద పట్టుకుని స్టేషన్‌కు రప్పించారు. బెంగాల్‌కు చెందిన డ్రైవర్ కాజోల్‌దాస్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా, మద్యం తాగి ఉన్నట్లు నమోదైంది. ఇతడిపై కేసు నమోదుచేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కెరటాల ఉద్ధృతికి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కెరటాల ఉద్ధృతికి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన రుషికొండ బీచ్ సమీప సముద్రతీరంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. కొమ్మాది సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు సమీప వసతిగృహంలో ఉంటున్నారు. ఆదివారం కావడంతో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దరి కొత్తపల్లి గ్రామానికి చెందిన **పి.అరవింద్ నాయుడు** (21), శ్రీకాకుళం జిల్లా వాసి సనపల రాజీవ్ (21)లు మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఉదయం 7 గంటలకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. 10 గంటల సమయంలో దగ్గరలోని ఓ రిసార్టు వెనుక బీచ్‌కు వచ్చారు. అరవింద్‌నాయుడు, రాజీవ్ సముద్రంలో ఈతకు దిగారు. ఒక్కసారిగా ఉద్ధృతంగా వచ్చిన కెరటాల్లో చిక్కుకున్న అరవింద్ కేకలు వేయడంతో పక్కనే ఉన్న రాజీవ్ కాపాడేందుకు ప్రయత్నించాడు. దీంతో ఇద్దరూ కెరటాల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. ఒడ్డున ఉన్న స్నేహితులు స్థానికుల సాయంతో జీవీఎంసీ బీచ్, టూరిజం లైఫ్‌గార్డులకు సమాచారం అందించారు. వెంటనే వారు బోటు ద్వారా గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి యువకులను రుషికొండ తీరానికి తీసుకొచ్చారు. వీరిలో అరవింద్‌నాయుడు పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో విద్యార్థి రాజీవ్‌కు ప్రాథమిక చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్డ్	206	230
స్కిన్‌లెస్	234	240

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

రాజా: ఫంకీ రామచంద్ర: అమరావతికి ఆహ్వానం వెంకటేశ్వర: స్కయ్, చథా పచ్ఛ సత్యనారాయణ స్క్రీన్1: అనగనగా ఒకరాజు, స్క్రీన్2: యుఫోరియా పర్తిసాయి: మన శంకర వరప్రసాద్‌గారు షిర్డిసాయి: విత్‌లవ్ అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: కపుల్ ఫ్రెండ్లీ స్క్రీన్-2: ఫంకీ

మైనింగ్ అక్రమాలతో ఖజానాకు గండి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: జిల్లాలో పెద్దఎత్తున జరుగుతున్న అక్రమంగా మైనింగ్‌తో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. రాంబిల్లి సమీపంలోని ప్రత్యామ్నాయ నావికా స్థావరానికి అనకాపల్లి మండలం నుంచి రోజూ 500 లారీల్లో రాయి, పిక్క తరలిపోతోందన్నారు. నాయకులు శంకరరావు, రాజు, తాలయ్యబాబు పాల్గొన్నారు.

పొగమంచు సొగసు..

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పేట పట్టణంలో ఆదివారం పొగమంచు అలరించింది. ఉదయం మంచు ముసుగులో రోడ్లు, పంట పొలాలు కొత్త సొగసులు అద్దుకున్నాయి. పాయకరావుపేట సహా మండలంలోని పలు గ్రామాలు ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించాయి. వాహనచోదకులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. సూరీడు విద్యుద్దీపంలా కనిపించాడు. ఈ దృశ్యాలు 'న్యూస్‌టుడే' కెమెరాలో బంధించింది.

పండితులకు సత్కారం

నక్కపల్లి, న్యూస్‌టుడే: రేబాకలో మాజీ సర్పంచి గొట్టిముక్కల శ్రీహరిరాజు పలువురు పండితులను ఆదివారం సత్కరించారు. గ్రామంలో ఆయన నిర్మిస్తున్న శివాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, వేద పండితులు శ్రీపాద ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్థానికులు పలువురు పాల్గొన్నారు.

కరాటేలో మెరిసి.. పతకాలు సాధించి..

పతకాలు సాధించిన విద్యార్థులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కరాటే పోటీల్లో అనకాపల్లి విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈనెల 7, 8 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి అండర్ 14, 17, 19 విభాగంలో విద్యార్థులు సత్తా చాటారు. కరాటేలో విద్యార్థులు చేసిన సాధన పతకాలు సాధించేలా చేసింది. ఈ పోటీల్లో అనకాపల్లికి చెందిన 18 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, మరో 18 మందికి వెండి, 15 మందికి కాంస్య పతకాలు వచ్చాయి. ప్రతి రోజు క్రమం తప్పకుండా చేస్తున్న కరాటే సాధనతో విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ విద్యార్థులను కోచ్ ఈశ్వరరావుతో పాటు పలువురు అభినందించారు.

ఆత్మరక్షణకు కరాటే..: ఆత్మరక్షణ కోసం కరాటేలో చాలామంది శిక్షణ తీసుకుంటున్నారు. పాఠశాలల్లోనూ దీన్ని నేర్పిస్తున్నారు. నాలుగేళ్లుగా సాధన చేస్తున్నాను. జాతీయస్థాయి పోటీలో బంగారు పతకం వచ్చింది. 2022లో తొలిసారిగా పోటీలో పాల్గొని పతకాలు పొందా! అప్పటి నుంచి పోటీల్లో పాల్గొంటున్నాను. – ప్రవీణ్

చదువుతో పాటే కరాటే..: కరాటే అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. ఇటీవల జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించాను. మూడో తరగతి తరగతి నుంచి సాధన చేస్తున్నా. ఇప్పటివరకు చాలా పోటీల్లో పాల్గొన్నా. వీటిలో 12 బంగారు పతకాలు సాధించాను. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలనేది లక్ష్యం. – ఎన్.సాయిసంతోష్ కుమార్, ఏడో తరగతి

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం..: నాకు కరాటేలో ఉన్న ఆసక్తిని గమనించి దీన్ని నేర్చుకోడానికి కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు. మూడో తరగతి నుంచి కరాటే నేర్చుకుంటున్నాను. అండర్- 14 విభాగంలో బంగారు పతకం సాధించాను. దేశానికి గుర్తింపు తెచ్చే క్రీడాకారుడిగా మారాలన్నది కోరిక. – బి.అవినాష్, ఆరో తరగతి

ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ..: కరాటే సాధన చాలామంది చేస్తున్నారు. దీనికి తగ్గట్టుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శిక్షణ సంస్థల వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే విద్య నేర్పిస్తున్నారు. దీనివల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. ఇటీవల జరిగిన పోటీలో బంగారు పతకం వచ్చింది. – బి. దివాకర్, ఎనిమిదో తరగతి

కేబుల్ తీగలు.. ప్రాణసంకటాలు

కుమారపురం వెళ్లే దారిలో కిందకు వేలాడుతూ..

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఈనెల 10న బాపట్ల జిల్లా చీరాల మండలంలోని గవినివారిపాలెంలో బైకుపై వెళుతున్న ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరావు మెడకు స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ తీగ మెడకు చుట్టుకోవడంతో కిందపడి దుర్మరణం చెందారు. పదిరోజుల క్రితం మండలంలోని పాల్తేరు నుంచి ఈదటం వెళ్లే దారిలో కేబుల్ తీగ తగిలి ఇద్దరు ద్విచక్ర వాహనచోదకులు కిందపడ్డారు. త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

పాయకరావుపేట సహా మండలంలోని ఈదటం, కుమారపురం, రాజవరం తదితర గ్రామాల పరిధిలో విద్యుత్తు స్తంభాలకు కేబుల్ తీగలను ఇష్టారాజ్యంగా కట్టారు. వీటి ఏర్పాటులో సరైన జాగ్రత్తలు తీసుకోలేదు. దీంతో కొన్నిచోట్ల చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. మరికొన్ని చోట్ల రోడ్డుపైనే పడి ఉన్నాయి. దీంతో వాహనచోదకులు వీటిని గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఈదటం సమీపంలోని చినకందిపూడి వద్ద తీగ రోడ్డుకు కిందకు వేలాడింది. దీన్ని చూసుకోకపోవడంతో ఆటో ప్రమాదానికి గురైంది. జిల్లాలోని నర్సీపట్నం, అనకాపల్లి, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, చోడవరం తదితర అన్ని మండలాల్లోనూ ఈ పరిస్థితి ఉంది. వాస్తవానికి విద్యుత్ స్తంభాలకు కేబుల్ తీగలు ఏర్పాటు చేసేందుకు ముందుగా ఏపీ ఈపీడీసీఎల్ అనుమతి తీసుకోవాలి. అనంతరం నిబంధనల మేరకు జాగ్రత్తలు తీసుకుంటూ ఏర్పాటు చేయాలి. దీనిపై ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా కేబుళ్లు ఏర్పాటు చేస్తే తొలగిస్తామన్నారు. అందరికీ తాఖీదులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా..!

ఈ కల్వర్టుపైనే తరచూ ప్రమాదాలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం - ధర్మవరం అగ్రహారం ఆర్అండ్‌బీ రోడ్డులో మలుపుతో కూడిన కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా మారింది. వ్యవసాయ శాఖ కార్యాలయం సమీపాన సాగునీటి కాలువపై నిర్మించిన కల్వర్టు ఇరుకుగా ఉండటంతో వాహనాలు అదుపుతప్పి వాహనాలు కాలువలో దూసుకెళ్తున్నాయి. సాయంత్రమైతే మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు గుర్తించలేక ప్రమాదాలు జరుగుతున్నారు. గత నెలలో బ్రాండిక్స్ బస్సు, వారం రోజుల క్రితం కారు అదుపు తప్పి కాలువలో దూసుకెళ్లాయి. బస్సు ప్రమాదం వల్ల దెబ్బతిన్న రక్షణ గోడ నేటికీ నిర్మించలేదు.

రక్షణ గోడ నిర్మిస్తాం..: ఎస్.రాయవరం రహదారిపై దెబ్బతిన్న కల్వర్టు రక్షణ గోడ త్వరలో నిర్మించి పెయింటింగ్ వేయిస్తాం. రహదారికి రెండు వైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– సత్యవేణి, ఏఈ,ఆర్అండ్‌బీ

అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలో పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటికీ సొంత భవనాలు ఏర్పాటు కాలేదు. దీంతో నిర్వహణ విషయంలో ఇబ్బందులు తప్పడంలేదు. ఉపమాకలో రెండు కేంద్రాలు ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాల సమీపంలో ఓ సామాజిక భవనాన్ని అద్దెకు తీసుకుని కేంద్రం-1 దాన్నక్కడ కొనసాగిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవలే దీని సన్‌షేడ్ విరిగిపడింది. ఫలితంగా భవనం ఎదురుగా మొత్తం ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఫలితంగా భవనం పరిస్థితిపైనిర్వాహకులతో పాటు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వీలైనంత త్వరగా నూతన భవనం నిర్మించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బహిరంగ బార్లుగా వంతెనలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: మండలంలోని వంతెనలు రాత్రి వేళల్లో బహిరంగ బార్లుగా మారుతున్నాయి. పోలవరం కాలువపై నిర్మించిన వంతెనల వద్ద రోజు రాత్రులు యువకులు మద్యం సేవిస్తున్నారు. ఏటికొప్పాక, ములకలపల్లి, పెదపల్లి సమీపంలో వంతెనలను బార్లుగా మందుబాబులు వాడుకుంటున్నారు. పద్మనాభరాజుపేట సమీపంలో నిర్మించిన రైల్వే అండర్ పాస్ వంతెన వద్ద ఇదే పరిస్థితి. వంతెనలపై మద్యం తాగేవారిపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

ఆదమరిస్తే ముప్పే..!

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో జలగల మదుం జాతీయ రహదారి వద్ద రోడ్డు మరమ్మతులకు గురైంది. నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రహదారి మరమ్మతులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధ్వానంగా బవులువాడ రహదారి

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బవులువాడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. కిలోమీటరు మేర పొడవున్న ఉన్న రహదారి పూర్తిగా దెబ్బతింది. బీటలు వారి పెచ్చులు ఊడిపోయాయి. వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీప పది గ్రామాల ప్రజలు ఈ రహదారిని ఆనుకొని రాకపోకలు సాగిస్తున్నారు. రహదారిపై గోతులతో జారి పడుతున్నారు. ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నత్తనడకన నీటి పథకం పనులు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెదరామభద్రపురంలో తాగునీటి పథకం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం గ్రామంలో రెండు ట్యాంకులు ఉన్నాయి. వీటి ద్వారా అరకొరగా నీటి సరఫరా అవుతోంది. శివారు ప్రాంత వాసులకు పూర్తిస్థాయిలో కుళాయి నీరు అందడంలేదు. కొత్తగా నిర్మిస్తున్న ట్యాంకు అందుబాటులోకి వస్తే సమీప ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు శివారు ప్రాంత వాసుల నీటి అవసరాలు తీరుతాయి. 40 వేల లీటర్ల సామర్థ్యంతో సుమారు రూ. 32 లక్షలకు పైగా నిధులు వెచ్చించి దీన్ని నిర్మిస్తున్నారు. నిధుల కొరత కారణంగా ఈ పథకానికి స్తంభాల వరకు నిర్మించి వదిలేశారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫణివర్మ వివరణ కోరగా సకాలంలో పనులు పూర్తి చేసి వేసవి నాటికి అందుబాటులోకి తెస్తామన్నారు.

పశువుల అక్రమ రవాణాదారుడిపై చర్యలు తీసుకోవాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: కూలీల ఆధార్ కార్డులతో పశువుల అక్రమ రవాణా చేస్తున్న విజయనగరానికి చెందిన శేఖర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. దేవవరంలో కూలీలతోపాటు ఉప సర్పంచి చినరాజు, బలరాంరాజు, రమణ తదితరులతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 20 ఏళ్లగా అతడి దందా సాగుతోందని, ఇప్పుడు దేవవరం, నామవరానికి చెందిన కూలీల పేరుతో ఇతర రాష్ట్రాలకు పశువులు అక్రమ రవాణా చేస్తున్నాడన్నారు. ఇతడికి కొందరు నాయకులు, పోలీసులు అండ ఉందని ఆరోపించారు. హోం మంత్రి దీనిపై సమగ్ర విచారణ చేసి ఇతడితో పాటు, ఇతడి అనుచరులపైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

మంత్రి చొరవతో కుళాయిల ఏర్పాటు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పెదిరెడ్డి సన్యాసిరావునగర్‌లో తాగునీటి కుళాయిల ఏర్పాటు చేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. ఈ కాలనీ వాసులు ఇటీవల తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి అధికారులకు ఆదేశాలివ్వడంతో పనులు మొదలయ్యాయి. దీనిపై కాలనీ వాసులు ఆదివారం సమావేశం నిర్వహించి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.. డ్రైనేజీ, రహదారులు కూడా నిర్మించాలని కోరారు. వంకా శ్రీను, జి.అశోక్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు

ఎమ్మెల్యే కొణతాలకు భోగలింగేశ్వరస్వామి చిత్రపటం అందిస్తున్న సత్యనారాయణ

పిసినికాడ ఆలయంలో పీలా, బత్తుల, కోట్ని

అనకాపల్లి సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో..

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనానికి బారులు తీరారు. అర్ధరాత్రి లింగోద్భవ సమయం వరకు ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు చేశారు. యువకులు, స్వచ్ఛంద, ఆధ్యాత్మిక సంస్థలు భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేపట్టాయి. అనకాపల్లిలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా, తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాంకీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు ఆలయాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. పుణ్య స్నానాలు ఆచరించేందుకు పేట మండలంలో సముద్ర తీరాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. మునగపాక మండలంలో పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే బృందం

మహాకాళేశ్వరుడిగా సాంబశివుడు

పాల్మన్‌పేటలో భక్తులు..

ఉపమాక శివాలయంలో క్యూ లైన్..

వేల్పుల వీధిలో మంచు శివలింగం

తిమ్మరాజుపేటలో శివుఇ దర్శించుకుంటున్న భక్తులు,

గెడ్డపాలెం, కట్టుపాలెం శివాలయాల వద్ద చిన్నారుల కోలాటం

గ్రామాల్లో ఘనంగా తీర్థాలు

నక్కపల్లి వీధుల్లో పల్లకీ ఊరేగింపు

కొత్తూరు, నెహ్రూచౌక్, (అనకాపల్లి), న్యూస్‌టుడే: గ్రామాల్లో తీర్థాలు ఘనంగా జరిగాయి. వెంకుపాలెం లక్ష్మణమ్మ తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు కోసూరి మన్మధరావు, అధ్యక్షులు కోరుకొండ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి తుంపాల సతీష్, కె.రాజు పాల్గొన్నారు.

నక్కపల్లి: నక్కపల్లి గాంధీనగర్ కాలనీలో బాల వినాయక స్వామి ఆలయం 15వ వార్షిక వేడుకలు ఆదివారం మొదలయ్యాయి. ఉత్సవ మూర్తిని పల్లకీలో ఊరేగించారు. మహిళా భక్తులు పల్లకీ మోశారు. సోమవారం అన్న సమారాధాన నిర్వహించనున్నారు.

అలంకరణలో లక్ష్మణమ్మ

కశింకోట: తీడలో కల్యాణ పోతురాజు ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవంలో ప్రధాన ఆకర్షణగా నిలిచే కొయ్య గుర్రాలను సిద్ధం చేశారు.

రాంబిల్లి: గొరపూడి శివారు అప్పన్నపాలెంలో ఆంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

నక్కపల్లి: రాజయ్యపేట నూకతాత జాతర సోమవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. సోమవారం రాత్రి బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం జాతర చేస్తారు. బోయపాడు రేవు నుంచి రాజయ్యపేట గుడికి నూకతాతను తీసుకొస్తారు.

అనకాపల్లిలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఊరేగింపు

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

అనకాపల్లి పట్టణం, ?: తుమ్మపాల పంచాయతీ విద్యుత్తు నగర్ 15వ వార్డులో దోమలు అధికంగా ఉన్నాయి. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదు. – **ఆడారి రామారావు, విద్యుత్తు నగర్,** ✓: సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. – **ఈశ్వర రావు, సంచాయతీ కార్యదర్శి, తుమ్మపాల**

పాయకరావుపేట, ?: పట్టణంలోని న్యూకాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. శివారు ప్రాంతం కావడంతో రాత్రిపూట వెళ్లేందుకు వీలుండటం లేదు. చీకటిలో రోడ్లపై పాములు తిరుగుతున్నాయి. – **ఆర్.అప్పారావు, స్థానికుడు,** ✓: వీధి దీపాలు వేయిస్తాం. – **వై.సత్యనారాయణ**

పాయకరావుపేట గ్రామీణం: ?: పెదరామభద్రపురంలో పంట కాలువలోకి మురుగునీరు మళ్లించడంతో కలుషితం అవుతోంది. దీంతో పంటలు దెబ్బతినే ప్రమాముంది. – **రైతులు,** ✓: పంట కాలువ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – **సురేష్‌కుమార్, జల వనరుల శాఖ డీఈ**

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: అనకాపల్లి అగ్గిమర్రిచెట్టు ప్రాంతంలో కాలువలు శుభ్రం చేయడం లేదు. – **కాండ్రేగుల సత్యనారాయణ, అనకాపల్లి,** ✓: కాలువల్లో పూడికలు తొలగించి శుభ్రం చేయిస్తాం. – **రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్**

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: ఎలమంచిలి పైవంతెన కింద రాత్రి సమయాల్లో మద్యం తాగుతున్నారు. రామారాయుడుపాలెం వైపు వెళ్లేవారంతా ఇబ్బంది పడుతున్నాం. – **పి. వనిత, ఎలమంచిలి,** ✓: వంతెన కింద నిఘా ఏర్పాటు చేస్తాం. మద్యం తాగేవారిపై కేసులు నమోదు చేస్తాం. – **సావిత్రి, ఎస్సై**

అచ్యుతాపురం, న్యూస్‌టుడే ?: ఇరువాడ-చిట్టిబోయినపాలెం రహదారిలో వీధి దీపాలు వెలగడంలేదు. – **అప్పలరాజు, చిట్టిబోయినపాలెం,** ✓: వీధి దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – **పీవీ.మురళీ, పంచాయతీ కార్యదర్శి**

గుంతలు పూడ్చారు

స్పందనకు వందనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి వెంబడి గుంతలు పూడ్చడంతో చోదకుల కష్టాలకు తెరపడింది. నక్కపల్లి ప్రభుత్వాసుపత్రి, వెదుళ్లపాలెం, కాగిత, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండపురం తదితర ప్రాంతాల్లో మట్టిజారి గుంతలు పడ్డాయి. ముఖ్యంగా ఆసుపత్రి వద్ద భారీ గుంతలు పడటంతో ప్రమాదాలు జరిగాయి. ఈ పరిస్థితిపై 'ఈనాడు'లో ఈనెల ఒకటిన 'ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా...' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన హైవే నిర్వహణ సంస్థ సేఫ్‌వే తగు చర్యలు చేపట్టింది ప్రాజెక్టు మేనేజరు నాగేశ్వరరావు ప్రమాదకర ప్రాంతాల్లో మరమ్మతు పనులు చేపట్టించారు. ఆసుపత్రి వద్ద రోడ్డు చెదరకుండా ఉండేలా శాశ్వత చర్యలు చేపడతామని 'న్యూస్‌టుడే'కి నాగేశ్వరరావు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

పాయకరావుపేట, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి చెక్కును ఆదివారం తెదేపా మండలశాఖ అధ్యక్షుడు ప్రదీప్ అందజేశారు. పట్టణంలోని ఇందిరాకాలనీకి చెందిన నక్కల జక్కయ్యమ్మ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఈ విషయాన్ని నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరీ హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ. 3.89 లక్షలు మంజూరు చేయించారు. దీన్ని తెదేపా కార్యాలయంలో ఆదివారం నాయకులు కన్నయ్యమ్మ కుటుంబసభ్యులకు అందజేశారు. తెదేపా పట్టణశాఖ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరీ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న తెదేపా మండలశాఖ అధ్యక్షుడు ప్రదీప్ తదితరులు

మొండిబకాయిలపై ప్రత్యేక దృష్టి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఇంటి పన్ను చెల్లించని యజమానులకు తుది నోటీసులు ఇచ్చి, తదుపరి చర్యలు తీసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్ఎస్ఎస్ మూర్తి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం, గుడివాడ, పెదగుమ్ములూరు, ఎస్.రాయవరం పంచాయతీల్లో ఇళ్ల పన్నుల ఆదివారం ఆయన పర్యవేక్షించారు. ప్రతి పంచాయతీలో శతశాతం ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు. గుడివాడ పంచాయతీ పరిధిలో ఆక్వా హేచరీల యజమానులు తక్షణమే పన్నులు చెల్లించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, నాగరాజు, నాగప్రభు తదితరులు ఉన్నారు.



గుడివాడలో ఆక్వా హేచరీల యజమానులతో మాట్లాడుతున్న డీఎల్పీఓ మూర్తి

ఆర్థిక సంక్షోభంలోనూ ప్రగతి బడ్జెట్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఆర్థిక సంక్షోభంలోనూ ప్రగతి బడ్జెట్‌ను కూటమి ప్రవేశపెట్టిందని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం అచ్యుతాపురంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పక్కా ప్రణాళికలతో బడ్జెట్ కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలు, అభివృద్ధి, సంక్షేమంపై సీఎం చంద్రబాబుకు ఉన్న ఆలోచన విధానాన్ని బడ్జెట్ తెలియజేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆలోచనకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించారని తెలిపారు.

జల్‌జీవన్ మిషన్ పనులపై సభ్యుల ధ్వజం

రాంబిల్లి, న్యూస్‌టుడే: జల్‌జీవన్ మిషన్ తాగునీటి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంపై సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీపీ గొట్టుముక్కల శిరీష అధ్యక్షతన ఆదివారం తుపాను భవనంలో మండల పరిషత్తు సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను సభలో చదివి వినిపించారు. కొత్తపట్నం, వాడనర్సాపురం, గోవిందపాలెంలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని సర్పంచులు తెలిపారు. సిమెంటు రహదార్లను ఇంటింటి కుళాయిలు ఏర్పాటుకు తవ్వేశారని కొత్తపట్నం ఎంపీటీసీ సభ్యుడు దోనె నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పనులను పూర్తిచేస్తామని ఏఈ కమలవికాస్ చెప్పారు. లేబర్ క్యాంపస్‌ల నుంచి చెరువులోకి పైపులైన్ వేసి మలమూత్రాలను విడిచిపెడుతున్నారని కొత్తపేట సర్పంచి అరుణలత సభ దృష్టికి తెచ్చారు. వాడనర్సాపురం రైతుల జిరాయతీ భూములను 22ఏలో పెట్టారని కోఆప్షన్ సభ్యుడు చింతకాయల పెంటయ్య సభ దృష్టికి తెచ్చారు.



జల్‌జీవన్‌పనులపై మాట్లాడుతున్న సభ్యులు

61 మంది రక్తదానం

మునగపాక, న్యూస్‌టుడే: యువత సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎస్సై ప్రసాదరావు అన్నారు. మునగపాక సంతబయలులో శరగడం కుమార్ జ్ఞాపకార్థం జూనియర్ హైటెక్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 61 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉల్లూరి సోమునాయుడు, ఆడారి గోవింద తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

రాజయ్యపేటలో సీసీ కెమెరాల ఏర్పాటు

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజయ్యపేటలో నూకతాత జాతర పురస్కరించుకుని భద్రతలో భాగంగా సీఐ జె. మురళి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని ఆదివారం ఆలయం, ముఖ్య కూడళ్ల వద్ద సీఐ దగ్గరుండి పెట్టించి పనితీరు పరిశీలించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవన్నారు. ఎస్సై సాహిబా అంజుమ్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

చదరంగం ఆడుతున్న చిన్నారులు

గ్రామీణ క్రీడాకారులకు మంచి అవకాశం

మాకవరపాలెం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లోని చదరంగం క్రీడాకారులకు గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రగతి చెస్ వెల్ఫేర్ అసోసియేషన్, గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం సంయుక్తంగా కృషి చేస్తున్నారని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు సుందరరావు తెలిపారు. స్థానికశాఖ గ్రంథాలయంలో ఆదివారం జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. విజేతలు గౌరీశంకర్, చరణ్, ప్రభవ్‌కు జ్ఞాపికలు అందజేశారు. గ్రంథాలయాధికారి చంద్రకళ, గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం కార్యదర్శి శేషగిరిరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య
ఆడి1: 100 డేస్ లవ్ స్టోరీ, ఒన్ ప్లస్ ఒన్ ఆఫర్, సైకో, అమరావతికి ఆహ్వానం, **ఆడి2:** యుఫోరియా, **ఆడి3:** ఫన్‌కీ, **ఆడి4:** ఓ రోమియో, క్రైం 101.
చోడవరం: సాయిలక్ష్మి: ఫన్‌కీ, శ్రీసాయిలక్ష్మి: ఫిబ్-14, పూర్ణా: మన శంకర వరప్రసాద్ గారు

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

మాకవరపాలెం, న్యూస్‌టుడే : ఈనెల 16 నుంచి 20 తేది వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఛాయసుధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమ, మంగళ, బుధవారం వరకు మాకవరపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురు, శుక్రవారాల్లో కస్తూర్బా పాఠశాలలో శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆధార్ నవీకరణ, నూతన దరఖాస్తులు, వివరాల మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శంకరం.. మహాకరం.. మనోహారం

దారమఠంలో భక్తజన సందోహం

గొలుగొండ, న్యూస్‌టుడే: జిల్లాలో పేరున్న శైవక్షేత్రాల్లో ఒకటైన దారమఠం దారమల్లేశ్వరస్వామి ఆలయ పరిసరాలు శివనామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

చోడవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా స్వయంభువు గౌరీశ్వరుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచి స్వామికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. ట్రస్టుబోర్డు ఛైర్మన్ గూనూరు సురేష్ దంపతులు ప్రథమ పూజలో పాల్గొన్నారు. స్వామిని స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి హరినారాయణ దర్శించుకున్నారు. ఎమ్మెల్యే రాజు దంపతులు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు చలపతి, శ్రీనివాస్, విఘ్నేష్ పూజలు చేయించారు.

చోడవరంలో స్వామి సేవలో తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి హరినారాయణ

హారతులందుకుంటున్న గౌరీశ్వరుడు

ఉత్తరవాహిని తీరంలో భక్తుల పుణ్యస్నానాలు

చమ్మచింత వద్ద పోలీసు బందోబస్తు

కె.కోటపాడులో ఆలయం వద్ద భక్తుల రద్దీ

పోతురాజుబాబు దర్శనానికి క్యూ లైన్లలో నిరీక్షణ

రావికమతం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా కల్యాణపులోవలో మూడు రోజుల పాటు జరిగే పోతురాజుబాబు ఉత్సవాలకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం పక్కాగా ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది ఆలయం వరకు బస్సులు వచ్చేలా ఏర్పాట్లు చేయడంతో భక్తుల తాకిడి పెరిగింది. కొత్తకోట సి.ఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో దాదాపు 500 మందితో సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి ఇక్కడే బస చేసి జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ తగు సూచనలు చేస్తున్నారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో జాతర జరిగే మూడు రోజులు భక్తులకు ఉచిత భోజనం 28 కౌంటర్ల ద్వారా అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

తిమిరాంలో

బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన మంచులింగం

రోలుగుంట కాశీవిశ్వేశ్వర ఆలయంలో 108 శివలింగాలకు పూజలు

గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న స్పీకర్ అయ్యన్న, ఎంపీ సి.ఎం రమేశ్, ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పి.భీమవరం రోడ్డులో శివాలయం దగ్గర నిర్మించిన పుష్కరిణిని ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఎంపీ సి.ఎం.రమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఆలయ కమిటీ ఛైర్మన్ తమరాన దాసు, విశాఖ డెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పెద్దేరు వంతెన

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: జన్నవరం- పెద్దేరు వంతెన కింద చప్టా శిథిలమైంది. వరద ఉద్ధృతితోపాటు ఇసుక తవ్వకాల కారణంగా మరమ్మతులకు గురైంది. నిర్మించిన కొంత కాలానికే వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వంతెనకు ఆవల జన్నవరంతోపాటు బెన్నవోలు, వాకపల్లి, రాయపురాజుపాలెం, కన్నంపాలెం, తిమ్మన్నపాలెం తదితర గ్రామాల నుంచి రోజూ వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం పడినప్పుడల్లా వంతెనపై వరద నీరు నిలిచిపోతుంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రక్షణ కుండలు శిథిలమయ్యాయి. వంతెన మీదుగా రాత్రివేళల్లో ప్రయాణించేవారంతా విద్యుత్తు దీపాలు లేకపోవడంతో భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వంతెనతోపాటు శిథిలమైన చప్టాకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శిథిలావస్థలో జన్నవరం పెద్దేరు వంతెన

పంచాయతీల పేరు మారుస్తూ త్వరలో బోర్డులు

చోడవరం, న్యూస్‌టుడే: సచివాలయాల పేర్లు త్వరలోనే మారనున్నాయి. ఇకపై స్వర్ణ పంచాయతీ, స్వర్ణ గ్రామంగా పిలవనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల పేర్ల మార్పుపై ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధికారికంగా స్వర్ణ పంచాయతీ, స్వర్ణ గ్రామం పేరిట కార్యకలాపాలు సాగడమే కాకుండా ఆయా గ్రామాల్లోనూ పేర్లు మార్చారు. త్వరలోనే సచివాలయ భవనాలకు స్వర్ణ పంచాయతీ, స్వర్ణ గ్రామంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్టు డివిజనల్ అభివృద్ధి అధికారిణి ఎస్.మంజులవాణి పేర్కొన్నారు.

విజ్ఞాన భాండాగారం.. సమస్యల వలయం

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పంచాయతీ, మండల వాసులకు విజ్ఞానాన్ని పంచేందుకు చోడవరంలో ఒకేఒక గ్రంథాలయం ఉంది. గ్రంథాలయంలో పత్రికలు చదివేందుకు, పుస్తకాలు తీసుకునేందుకు వెళ్లే పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కా కాలువ లేక వాడుక నీరు గ్రంథాలయానికి వెళ్లేమార్గం వద్దనే నిలిచిపోతోంది. దీనికితోడు కాలువపై ఆక్రమణలు ఉండటంతో నీరు పారడంలేదు. రహదారికి లోతుల్లో గ్రంథాలయ భవనం ఉండటంతో ఏమాత్రం వర్షం కురిసినా నీరంతా ఆవరణలో ఉండిపోయి చిన్నపాటి తటాకాన్ని తలపిస్తోంది. కనీసం వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రజా ప్రతిధులు ఈ సమస్య పట్టించుకోవట్లేదని పాఠకులు వాపోతున్నారు.

అధ్వానంగా చోడవరం గ్రంథాలయం

అసంపూర్తిగా దోబీఘాట్లు

ఇబ్బందులు పడుతున్న చేతివృత్తిదారులు

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రజకులకు వృత్తిపరంగా సరైన సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదేళ్ల కిందట అప్పటి తెదేపా ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్ నిధుల నుంచి గ్రామాల్లో అవసరమైన చోట దోబీఘాట్లు నిర్మించారు. వీటికి ఇప్పుడు పూర్తి స్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఈ విషయాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

★ చోడవరం మండలంలో సుమారు 1200 కుటుంబాలు రజకవృత్తిపై ఆధారపడి ఉన్నాయి. అంకుపాలెం రోడ్డులో రజకుల కోసం నీటి కుండీతో పాటు సామగ్రి పెట్టుకునేందుకు షెడ్డును నిర్మించారు. బీసీ కార్పొరేషన్ నిధుల నుంచి ఒక్కో దోబిఘాట్‌కు రూ.5.60లక్షల నిధులు కేటాయించారు. సకాలంలో నిధులు మంజూరుకాకపోవడంతో ఇక్కడ నీటి కుండీలతోపాటు షెడ్డు నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది. కన్నంపాలెం, వెంకన్నపాలెం, దుడ్డుపాలెం గ్రామాల్లో దోబీఘాట్లు నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయాయి. ఆయాచోట్ల షెడ్డు నిర్మించి బోరును తవ్వి వదిలేశారు. బెన్నవోలు గ్రామంలో సకాలంలో నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

★ బంగారమ్మపాలెం గ్రామంలో రజకుల షెడ్డు శిథిలావస్థలో ఉంది. ఇక్కడ 100 కుటుంబాలు వరకు ఉండేవి. ప్రస్తుతం చాలా కుటుంబాలు పల్లె విడిచి జీవనోపాధికోసం పట్టణాలకు వలస వెళుతున్నాయి. జన్నవరం పెద్దేరు వంతెన వద్ద దుస్తులు ఉతికేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఎటువంటి సదుపాయాలు లేకపోవడంతో పొట్టకూటికోసం ఈ వృత్తినే నమ్ముకుంటూ కాలం నెట్టుకొస్తున్నారు.

అంకుపాలెం రోడ్డులో అసంపూర్తిగా నీటి కుండీ

★ ఎమ్మెల్యే దృష్టికి రజకుల సమస్యలు: ఎమ్మెల్యే రాజు దృష్టికి చేతివృత్తిపై ఆధారపడుతున్న రజకుల సమస్యలను తీసుకువెళ్లినట్లు రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రామకోటేశ్వరరావు తెలిపారు. గత తెదేపా ప్రభుత్వంలో ఇస్త్రీపెట్టెలతో పాటు మిషన్లు రాయితీపై అందించారన్నారు. వైకాపా ప్రభుత్వం రజకుల జీవనోపాధి గురించి అసలు పట్టించుకోలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వంలో అయినా ఆదుకుంటారనే ఆశలు చిగురించాయని తెలిపారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న దోబీఘాట్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ఎమ్మెల్యే రాజుకు వినతి పత్రం అందించినట్లు చెప్పారు. బానయ్యకోనేరు వద్ద ఉన్న శిథిలావస్థలో ఉన్న సామాజిక భవనం తొలగించి కల్యాణ మండపం నిర్మిస్తామని చెప్పారన్నారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రజకుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చామన్నారు.

'డయల్ యువర్ టీచర్'తో సందేహాల నివృత్తి

మాకవరపాలెం, న్యూస్‌టుడే : పది విద్యార్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఆదివారం నిర్వహించిన డయల్ యువర్ టీచర్ కార్యక్రమం విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారని ఎంఈఓ మూర్తి తెలిపారు. సెలవు రోజుల్లో విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారన్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే వరకు కార్యక్రమం కొనసాగుతుందని ఎంఈఓ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నక్కపల్లి: జాతీయ రహదారిపై నక్కపల్లిలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. సీఐ జె.మురళి కథనం ప్రకారం... విశాఖ నుంచి తుని వైపు ఎనిమందితో వెళ్తున్న కారు పోలీసు స్టేషన్ సమీపానికి రాగానే ట్రాఫిక్ కారణంగా నెమ్మదిగా వెళ్తుండగా, ఇదే మార్గంలో వస్తున్న లారీ వెనుక నుంచి దీన్ని ఢీ కొట్టింది. ప్రమాదంలో కారు వెనుకభాగం నుజ్జవ్వగా, అదృష్టవశాత్తు ఇందులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. లారీ అక్కడి నుంచి పరారవ్వగా, విషయం తెలుసుకున్న సీఐ.. సిబ్బందిని పంపించి టోల్‌గేట్ వద్ద పట్టుకుని స్టేషన్‌కు రప్పించారు. బెంగాల్‌కు చెందిన డ్రైవర్ కాజోల్‌దాస్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా, మద్యం తాగి ఉన్నట్లు నమోదైంది. ఇతడిపై కేసు నమోదుచేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

తాగునీటి పథకం ప్రారంభం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: సొలభం పంచాయతీ వనభరంగిపాడు గ్రామంలో జల్‌జీవన్ పథకం ద్వారా నిర్మించిన తాగునీటి పథకాన్ని సర్పంచి హనుమంతరావు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య తీరిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హిందీ పరిచయ్ ప్రాథమిక్ పరీక్షలు

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తకోట జడ్పీ హైస్కూల్లో ఆదివారం విద్యార్థులకు హిందీ పరిచయ్ ప్రాథమిక్ పరీక్షలు జరిగాయి. హిందీ భాష పట్ల అసక్తిని, నైపుణ్యాన్ని, భాషాభివృద్ధిని మెరుగు పరచడానికి కృషి చేస్తున్న దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో ఈపరీక్షలు నిర్వహించారు. 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రచారక్‌గా వి.నాగమణి వ్యవహరించారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రూ.3 కోట్లతో ఆర్ఈసీ రోడ్డు నిర్మాణం

రావికమతం, న్యూస్‌టుడే: మండల కేంద్రం రావికమతం నుంచి గుడ్డిప వరకు ఆర్ఈసీ రోడ్డు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈరోడ్డు అభివృద్ధికి మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్డు ప్లాన్ (ఎండీఆర్) నిధులు రూ.3 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీంతో రావికమతం నుంచి గుడ్డిప వరకు 6 కి.మీల మేర రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. గత నెల 24న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కాంట్రాక్టు దక్కించుకున్న ఎల్.వి.ఎన్.నిర్మాణ సంస్థ 28 నుంచి పనులు చేపడుతోంది. యంత్రాలతో గుడ్డిప నుంచి రోడ్డు పనులు చేసుకుంటూ వస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా రెండేసి మీటర్ల వెడల్పుతో ఎర్త్‌వర్క్ జరుగుతుంది.

★ ఈ పనులు పిల్లవానిపాలెం వరకు 4.కి.మీలు వరకు వచ్చాయి. అక్కడి నుంచి రావికమతానికి మరో 2 కి.మీలు ఉంటుంది. ఇరువైపులా రెండేసి మీటర్ల వెడల్పుతో మట్టితో బెర్మ్‌లు ఏర్పాటు చేసి రోలింగ్ చేస్తున్నారు. మరోవైపు గుడ్డిప నుంచి శిథిలమైన తారు రోడ్డులో పికింగ్ చేసుకుంటూ వస్తున్నారు. ఎర్త్‌వర్క్, పాత తారు రోడ్డు పికింగ్స్ పనులు పూర్తయిన వెంటనే 3.75 మీటర్ల వెడల్పుతో వెట్ మిక్చర్ వేసి తదుపరి బీటీ (తారు) వేసి పూర్తి స్థాయిలో రోడ్డును అభివృద్ధి పర్చుతారు. ఆర్ఈసీ రోడ్డంతా తారు, రాళ్లు లేచిపోయి పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా ఉంది. ఈరోడ్డుపై రాకపోకలు సాగించేందుకు రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలోని పలు గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆర్ఈసీ రోడ్డు అభివృద్ధి చెందితే ఎన్నో ఏళ్లుగా ఎర్రవాయి ప్రాంత ప్రజల రోడ్డు కష్టాలు తీరినట్లే అవుతుంది.

యంత్రంతో రోడ్డు విస్తరణ పనులు

★ ఆర్ఈసీ రోడ్డు అభివృద్ధి పనులు గుడ్డిప నుంచి మొదలు పెట్టి రావికమతం వరకు చేసుకుంటూ వస్తున్నాం. ప్రస్తుతం ఎర్త్‌వర్క్ పనులు, రోడ్డుపై తారు పికింగ్ పనులు జరుగుతున్నాయి. ఈనెలాఖరునాటికి తారువేసి ఆర్ఈసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు ఆర్అండ్‌బీ జేసీ సాయి శ్రీనివాస్ తెలిపారు.

క్రికెట్ విజేతలకు సత్కారం

నర్సీపట్నం అర్బన్: ఉపాధ్యాయ క్రీడా పోటీల్లో భాగంలో ఇటీవల అమరావతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ ఆదివారం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. జట్టు కెప్టెన్ వానపల్లి నాగభూషణం తదితరులను ఆయన సత్కరించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

కెప్టెన్ నాగభూషణాన్ని సత్కరిస్తున్న డీజీనాథ్

భోజనాలు వడ్డిస్తున్న సత్యసాయి ప్రతినిధులు

భక్తులకు అన్న సంతర్పణ

నర్సీపట్నం: బలిఘట్టం బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం మహాశివరాత్రికి పోటెత్తిన భక్తులకు నర్సీపట్నం సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు అన్న సంతర్పణ చేపట్టారు. ఏటా వీరు ఇక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆలయంలో పూజల నిమిత్తం తరలివచ్చిన జనానికి భోజనాలు వడ్డించారు. సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

చురుగ్గా ఆయుష్ భవన నిర్మాణం

దేవరాపల్లి, న్యూస్‌టుడే : దేవరాపల్లిలో ఆయుష్ ఆసుపత్రి భవన నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి భూమిపూజ చేసి నెలరోజులు పూర్తి కాకముందే ముందే స్లాబు పూర్తయింది. మరోనెల రోజుల్లోగా పనులు పూర్తిచేసి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సొంత భవనం లేకపోవడంతో కొంతకాలం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుష్‌ను నడిపారు. ఆ తరువాత సిబ్బంది లేకపోవడంతో మరొకొన్నాళ్లు మూతపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యాధికారితోపాటు సహాయ సిబ్బందిని నియమించింది. దీంతో ఈ ఆసుపత్రి పునఃప్రారంభమైంది. సొంత భవనం లేకపోవడంతో ప్రస్తుతం పూర్వ ఎంపీడీఓ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్నారు. కొద్దిరోజుల్లో ఈ భవనం పూర్తయితే ఆయుర్వేద ఆసుపత్రికి భవనం సమకూరుతోంది.

స్లాబు దశకు చేరుకున్న ఆయుష్ భవనం

వడ్డాది వెంకటేశ్వరస్వామికి కల్యాణరాట

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది కొండపై కొలువైన వెంకటేశ్వరస్వామికి ఆదివారం కల్యాణపురాట వేశారు. కొండ దిగువన ప్రధానగేటు వద్ద శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు, శ్రీరామ్ చేతులమీదుగా రాట వేశారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరించారు. కన్నబాబు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 153వ వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈఓ శర్మ, సర్పంచి కోరుకొండ కామలక్ష్మి, గ్రామపెద్దలు దొండా సన్యాసిరావు, గిరిబాబు, శ్రీనివాసరావు, శ్రీరామమ్మూర్తి, వెంకట్రావు, సురేష్, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కన్నబాబు తదితరులు

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

కె.కోటపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ యోజన కార్యాచరణ ప్రణాళికపై సోమవారం నుంచి 21 వరకు మాడుగుల నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీఓ సాంబశివరావు తెలిపారు. కె.కోటపాడులో శిక్షణ తరగతులు తరగతులు ఉంటాయన్నారు.

పరుగుపోటీల జోరు

చీడికాడ, దేవరాపల్లి, న్యూస్‌టుడే : చీడికాడ మండలం తురువోలులోని ఉమామహేశ్వర మల్లికార్జునస్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా.. ఆదివారం సాయంత్రం జిల్లాస్థాయి ఎడ్ల పోటీలను నిర్వహించారు. విజయరామరాజుపేటకు చెందిన నూకాంబిక బండి ప్రథమస్థానంలో నిలిచింది. దేవరాపల్లి ఒడ్డు చింతల వారి కల్లాలు, మిడతాడ వారి కళ్లాల్లోని పేరంటాళ్ల తీర్థం జరిగింది. తీర్థం సందర్భంగా ఎడ్ల పోటీలు నిర్వహించారు. బీరక వీధిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం జరిగింది.

దేవరాపల్లిలో పోటీల్లో పరుగుతీస్తున్న ఎడ్ల బండి

తురువోలులో పరుగు తీస్తున్న ఎడ్ల బండి

దుర్గాదేవి ఆలయానికి వితరణ

మాడుగుల, న్యూస్‌టుడే : మాడుగులలో కొలువైన దుర్గాదేవి ఆలయంపైన నిర్మించిన నూతనగోపురం మార్చి 6న వైభవంగా ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా అభివృద్ధి పనులకు శనివారం రాత్రి ఆలయ పెద్ద కృష్టారెడ్డి, ఇతని కుమార్తె కామేశ్వరి రూ.50,116లు కమిటీ వారికి అందచేశారు. విజయాంజనేయ ఆలయం వద్ద సంగీత విభావరి నిర్వహించిన కారణంగా ఆలయ నిర్వాహకుడు రాకీ శ్రీనివాసరావుకు బొండా సత్తిబాబు రూ.5వేలు నగదు అందచేశారు. మాజీ సర్పంచి దంగేటి సూర్యారావు ఆధ్వర్యంలో గాయకులకు వాయిద్యకారులకు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు,సర్పంచి కళావతి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనాధు శ్రీనివాసరావు సత్కారాలు చేసి బహుమతులు అందజేశారు.

మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని పి.భీమవరం గ్రామానికి వెళ్లే కూడలి దగ్గర బస్‌షెల్టర్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధులు రూ.అయిదు లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్నారు. రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేశ్ పాల్గొని శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వసతుల కల్పనకు తనవంతు కృషి ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టరు, భాజపా నాయకుడు ఈర్లె శ్రీరామమూర్తి, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

పి.భీమవరం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ రమేశ్

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: ఘాటీరోడ్డు కూడలిలో వెలసిన మోదమాంబ అమ్మవారి పాదాల తీర్థ మహోత్సవాన్ని వచ్చే నెల 1న ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ తీర్థాన్ని పురస్కరించుకొని మండల స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ రాజారామ్, మాడుగుల తెదేపా పట్టణ అధ్యక్షుడు పి.లక్ష్మినారాయణ, గ్రామ సర్పంచి ఎస్.గంగాధర్ పాల్గొన్నారు.

ప్రారంభంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు, వర్తక సంఘం సభ్యులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని కన్నంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. స్థానిక యూపీ స్కూల్లో 2001లో 40 మంది విద్యార్థులు ఏడో తరగతి చదివారు. 25 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకొని నాటి జ్ఞాపకాలను తలచుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అప్పట్లో పాఠాలు చెప్పిన హెచ్.ఎం రమణమూర్తి, గణిత ఉపాధ్యాయుడు స్వామి, ఉపాధ్యాయుడు ఉగ్గిన సురేష్‌లను శాలువాలతో సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

గోతులు పూడ్చారు

స్పందనకు వందనం

గొలుగొండ, న్యూస్‌టుడే: గవిరంపేట వద్ద కృష్ణదేవిపేట వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడ్డ గోతులు ప్రమాదకరంగా మారాయి. దీంతో రాత్రిపూట వాహన చోదకులు ఇబ్బందులు పడేవారు. దీనిపై ఈ నెల 8న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ర.భ. శాఖ సిబ్బంది నల్లకంకర, తారు మిశ్రమంతో గోతులు పూడ్చించారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: గ్రామంలోని సామాజిక అవసరాలకు ఉపయోగించాల్సిన కమ్యూనిటీ భవనాన్ని కొందరు సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. – రాజబాబు, జె.నాయుడిపాలెం, ✔: ఈ విషయమై పలుమార్లు హెచ్చరికలు జారీచేశాం. మరోసారి బహిరంగంగా హెచ్చరిస్తాం. – బగుడు వెంకటరమణ, సర్పంచి, జె.నాయుడిపాలెం

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ ట్రిక్స్-1: ఫంకీ
ట్రిక్స్-2: మన శంకర వరప్రసాద్ గారు

తీరంలో సముద్ర స్నానాలకు ఏర్పాట్లు

పరవాడ, న్యూస్‌టుడే: ముత్యాలమ్మపాలెం తీరం వద్ద సోమవారం భక్తుల పుణ్యస్నానాల కోసం ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి జాగారం చేసిన భక్తులు తెల్లవారుజామున తీరానికి చేరుకుని సముద్ర స్నానాలు చేయనున్నారు. ఈ మేరకు తీరం వద్ద దుస్తులు మార్చుకోవడానికి వసతి సదుపాయం కల్పించారు. వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీసులు శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నారు.

19 నుంచి బ్రహ్మోత్సవాలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆదివారం పలువురు ప్రముఖులకు అందజేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, అదీప్ రాజ్, కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, బమ్మిడి రమణ, ముమ్మన దేముడు, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులకు ఆహ్వానం అందజేసి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు ఆహ్వానించారు. ఈ వేడుకలు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని ఈవో బండారు ప్రసాద్ పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం పెదముసిడివాడలోని నిరుపయోగంగా ఉన్న శిథిల పాఠశాల భవనం పనికి రాక ప్రమాదం పొంచి ఉంది. – శ్రీను, స్థానికుడు ✓: వెంటనే పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – రమేష్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం తిరుగొల్లపాలెం వద్ద వృద్ధులు పేరు కోల్పోయారు. – పి.అప్పలనాయుడు ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

?: సబ్బవరం మండలం పెద గొల్లల పాలెం వద్ద వృద్ధుల పేరుకుపోయిన దోమలు బెడద ఎదుర్కొంటున్నాం. – స్థానికులు, పెదగొల్లలపాలెం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – ఎస్.త్రినాథ్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ, సబ్బవరం.

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 93వ వార్డు బొడ్డపలివారి వీధిలోని ప్రధాన కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. –రాజారావు, స్థానికుడు ✓: కాలువలను వెంటనే శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. – ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎట్టకేలకు వ్యర్థాల తరలింపు

స్పందనకు వందనం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ సమస్యను 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ స్పందించారు. సిబ్బందితో శుభ్రత పనులు చేపట్టారు.

'అంగన్‌వాడీ'లకు ఆరోగ్య కిట్లు

11 రకాల ఔషధాలు

పరవాడ, న్యూస్‌టుడే

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా ప్రాథమిక చికిత్స కిట్లు అందించింది. గత ప్రభుత్వ హయాంలో ఈ కిట్ల కొరత కారణంగా ఇబ్బందులు పడేవారు. పిల్లలు గాయపడితే సమీప ప్రయివేటు, ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్యం అందించాలనే లక్ష్యంతో వైద్యానికి అవసరమైన కిట్లు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పిల్లలకు ప్రాథమిక చికిత్స సంబంధిత కేంద్రంలోనే అందనుంది. నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండల కేంద్రాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఐసీడీఎస్ ప్రభుత్వం నుంచి మెడికల్ కిట్లు సరఫరా అయ్యాయి.

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించిన కిట్‌లో 11రకాల మందులున్నాయి. చేతుల శుభ్రతకు శానిటైజర్, బ్యాండేజ్, కాటన్‌తో పాటు కంటి మందు, ఆయింట్‌మెంట్, జ్వరం, దగ్గు, జలుబు, విరేచనాలు, గజ్జి, దురద, కాలిన గాయాలు, చర్మవ్యాధుల నివారణ మందులు సంబంధిత కిట్‌లో ఉంటాయి. ఏ ఔషధం ఎంత వాడాలి, ఏ మోతాదులో చిన్నారులకు ఇవ్వాలనే వివరాలను కిట్‌లో పొందుపరిచారు.

పరవాడ కేంద్రానికి వచ్చిన మందులు

★ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎవరికి చిన్నపాటి గాయం, ఆరోగ్య సమస్య తలెత్తినా ప్రథమ చికిత్స చేయడానికి మెడికల్ కిట్టు ఎంతో ఉపయోగపడుతుంది. కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం వీటిని సరఫరా చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవి జీవిత కిట్టు చేరుకున్నాయి. కేంద్రాల్లో ఎవరికైనా అత్యవసర ప్రాథమిక చికిత్స చేయడం ఈ కిట్టు ఎంతో మేలు చేస్తాయి. – శ్యామలకుమారి, ఐసీడీఎస్ పరవాడ సెక్టార్ సూపర్‌వైజర్

నియోజకవర్గంలో మండలాల వారీగా వివరాలిలా..

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	3-6ఏళ్ల మధ్య చిన్నారులు	7-13 మధ్య వయసున్నవారు	గర్భిణులు	బాలింతలు
పెందుర్తి	225	10075	15693	2768	2568
పరవాడ	81	676	1697	389	389
సబ్బవరం	87	567	1661	315	334
మొత్తం	393	11318	19051	3472	3291

పాఠశాల స్థలం కాపాడాలని నిరసన

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 74వ వార్డు కోనవానిపాలెం ప్రభుత్వ పాఠశాల స్థలంలో ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ శ్రీకృష్ణ చైతన్య యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు, నివాసితులు ఆదివారం నిరసన తెలియజేశారు. అనధికార నిర్మాణాలను తొలగించి, పాఠశాలలో వసతులు కల్పించాలంటూ ఆందోళన చేపట్టారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉరుకూటి అప్పలనాయుడు, కోన రమణ, కోన అప్పలస్వామి మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం ఉక్కు పునరావాస శాఖ పాఠశాలకు 214 చ.గ. స్థలం కేటాయించిందని, కొంత భాగంలో భవనం నిర్మించి, మిగిలిన స్థలంలో పిల్లలు ఆటలు ఆడుకునేవారు. ఓ వ్యక్తి ఆ స్థలాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలు సాగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్‌పీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నివాసితులు

బౌద్ధ పునరుద్ధరణ కరపత్రాల ఆవిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే: బౌద్ధ ధర్మం ప్రాముఖ్యత తెలియజేసే ప్రచారంలో భాగంగా పునరుద్ధరణ-2026 కార్యక్రమాన్ని మార్చి 14న నిర్వహించనున్నట్లు బౌద్ధ, దళిత సంఘాలు తెలిపాయి. ఈ మేరకు రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ(ఏఎంఎస్)లో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, కోశాధికారి గార సత్యనారాయణ, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నేతలు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో శ్రీపోలమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు, గ్రామపెద్దలు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయం వద్ద ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన

వేపగుంట, న్యూస్‌టుడే: నాయుడుతోట వీరాంజనేయస్వామి ఆలయ పరిస, మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే ఆదివారం చేపట్టిన మహాన్నదాన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, గణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా తదితరులు ప్రారంభించారు. ఆయుధ దళాలలో ఇక్కడ అన్నదాన నిర్వాహణకు కొనియాడుతూ వ్యాపారి బుద్ధ శివాజీని అభినందించారు. సుమారు 10వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, తదితరులు

ఘనంగా కామాక్షమ్మ తీర్థం

పులగవానిపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధి పులగవానిపాలెంలో కొలువైన కామాక్షి అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో జగన్మాతను దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక నాయకులు శానపతి శంకర్రావు, అవగడ్డ అప్పలనాయుడు, కిశోర్, కాగిత ముత్యాలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హరహర మహాదేవ..

వాడవాడలా ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

శ్రమశక్తినగర్‌లో పూజలందుకున్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, పాల్గొన్న భక్తజనం

పినగాడిలో..

సరిపల్లిలో..

పెందుర్తి, న్యూస్‌టుడే: హరహర శంకర.. శివశివ శంకర.. గౌరీమనోహరా.. రక్షించు స్వామి అంటూ అశేష భక్తజనం పరమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పెందుర్తి నియోజకవర్గంలోని శివాలయాలు భక్తజన సందోహంగా మారాయి. వేకువజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు గంగాధరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో విశేష అభిషేకాలు నిర్వహించారు.

★ పెందుర్తి మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పెందుర్తి సీఐ కె.వి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

★ జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు శ్రీకాంత్ శర్మ వైదిక కార్యక్రమాలు జరిపించారు. ★ సుజాతనగర్ హరిహర క్షేత్రంలో కేదారేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. పెందుర్తి సూర్యానగర్‌లోని సంపత్ వినాయక ఆలయంలో విశేష హోమాలు చేపట్టారు.

పెందుర్తి సూర్యాలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

★ పినగాడి చోడేశ్వర స్వామి, సరిపల్లిలోని స్వయంభూ మల్లేశ్వర స్వామి, పెందుర్తి ప్రశాంతినగర్‌లోని స్వయంభూ లింగాల మల్లికార్జున స్వామి, వేంకటాద్రి ఘాట్‌రోడ్డు దరి ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.


అప్పికొండ సోమేశ్వరస్వామి సన్నిధిలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల దంపతులు, గండి బాబ్జీ తదితరులు

పెదగంట్యాడ మండలంలో..

అప్పికొండ(పరవాడ), న్యూస్‌టుడే: పెదగంట్యాడ మండలం అప్పికొండ సోమేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారి నాగరాజు తెల్లవారుజామున రుద్రాభిషేకం చేపట్టాక భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, మాజీ మంత్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, దేవాదాయశాఖ అధికారులు సుజాత, అన్నపూర్ణ, ఆలయ ఈవో కె.పద్మావతి, కూటమి నాయకులు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయం వద్ద ప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేశారు. సాయంత్రం శివపార్వతుల ఊరేగింపు జరిగాక రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అప్పికొండ తీరంలో సోమవారం జరిగే భక్తుల సముద్ర స్నానాలకు ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ యాజమాన్యం ఆలయానికి ప్రత్యేక బస్సులు నడిపింది. పోలీసులు శాంతిభద్రతలు పర్యవేక్షించారు.

వేపగుంట పరిసర ప్రాంతాల్లో..

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట మెట్టపైగల శివాలయంలో అర్చకులు సోమేశ్వరశర్మ, ఆలయ ధర్మకర్త గంట్ల దేముడు ఆధ్వర్యంలో, కృష్ణానగర్‌లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. నరవలోని స్వయంభూ ఉమానాగలింగేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త గండ్రెడ్డి మహలక్ష్మీనాయుడు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వేపగుంటలో శివరాత్రి పర్వదినం సందర్భంగా వీరాంజనేయస్వామి ఆలయంలో పరస ఘనంగా జరిగింది. రాత్రి చేపట్టిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. లక్ష్మీనరసింహనగర్ గోపీజనవల్లభస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి పూజలు చేశారు. ఇక్కడి మహిళా అసోసియేషన్ సభ్యులు భక్తిపాటలతో కోలాటాలతో జాగారం చేశారు. ప్రహ్లాదపురం నూకాంబికా అమ్మవారి ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్పొరేటర్ రాపర్తి కన్నా తదితర నాయకులు ఈ పోటీలను తిలకించారు.

నరవలో...

వేపగుంట శివాలయం మెట్టపై..

సబ్బవరం మండలంలో..

సబ్బవరం రామలింగేశ్వరుని మందిరంలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని లింగాల తిరుగుడులో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం కోటి దీపార్చన చేపట్టారు. పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, దేవస్థానం ఛైర్మన్ దొడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

★ సబ్బవరం రామలింగేశ్వరాలయంలో ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు, పూజా ద్రవ్యాలు సమర్పించారు. ★ పెదయాతపాలెం ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయంలో గౌరీ పరమేశ్వరులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాధన, రాత్రి ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. ★ దేవీపురంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అన్న సంతర్పణ చేపట్టారు. దేవతల ఊరేగింపు, కల్యాణం నిర్వహించారు.

గణపతిపురంలో..

దేవీపురంలో..

పెదయాతపాలెంలో..

పరవాడ మండలంలో..

పరవాడలో..


తాడిలో..

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ మల్లికార్జునస్వామి, దేశపాత్రునిపాలెం ఉమారామలింగేశ్వరస్వామి, తాడి ఉమానీలకంఠేశ్వర స్వామి, భరణికం సోమేశ్వరస్వామి, స్వయంభూవరంలోని స్వయంభూలింగేశ్వరస్వామి, ఫార్మాసిటీలోని శివాలయంలలో ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో కళకళలాడాయి. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే దర్శనానికి బారులు తీరారు. స్వామికి పంచామృత, రుద్రాభిషేకాలు చేశారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరవాడ మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎంటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.అప్పలనాయుడు తదితరులు కోరారు. సబ్బవరం సాయినగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్న ఉపాధ్యాయుల మాదిరిగానే 62 ఏళ్ల వరకు తమను కొనసాగించాలన్నారు. 12 నెలలు జీతం చెల్లించాలని పింఛన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. వి.ఈశ్వరరావు, సిరికి సూర్యనారాయణ, జ్ఞానేశ్వరి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొగలిపురంలో ఎడ్ల బళ్ల పోటీలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మొగలిపురం గ్రామంలో వీరాంజనేయ స్వామి తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఎడ్ల బళ్ల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈపోటీలను పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, సబ్బవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గండి దేముడు ప్రారంభించారు. ఉత్సాహంగా జరిగిన ఈ పోటీల్లో వాయిల్పాడుకు చెందిన గండి వెంకటరమణ ప్రథమ స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో తుమ్మికాపల్లికి చెందిన జయవర్ధన్, మూడో స్థానంలో దేవరాపల్లికి చెందిన వారాడ జ్ఞాన ప్రసన్న, నాలుగో స్థానంలో నరసాపురానికి చెందిన కనకదుర్గ నిలిచారు. వారికి వరుసగా రూ.15వేలు, రూ.12వేలు, రూ.10వేలు, రూ.4వేలు నగదు బహుమతులు అందించారు.

జూద శిబిరంపై దాడి.. రూ.1.6 లక్షలు స్వాధీనం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: భానోజీతోటలోని రోడ్డు నెంబర్-7లో ఒక ఇంట్లో గుట్టుగా సాగుతున్న జూద శిబిరంపై సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, న్యూపోర్టు సిబ్బంది ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. జూదమాడుతున్న 8 మందిని పట్టుకుని వీరి నుంచి రూ.1.6 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేటరింగ్ వంట మాస్టర్ ఒకరు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి జూదగాళ్లను రప్పించి శిబిరం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీల అభివృద్ధికి పెద్దపీట: పల్లా

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాకలోని కాలనీల సమగ్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డులో రూ.3.12 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం శిలాఫలకం ఆవిష్కరించి మాట్లాడారు. గాజువాకలో ఇప్పటికే రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సంక్షేమం ఆగిపోయిందని ఆరోపించారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అధ్యక్షత వహించారు. సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు రట్టివాసు, బైపిల్లి గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కూటమి నేతలు

దంపింగ్ యార్డు సమస్యకు.. త్వరలో పరిష్కారం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాకలో ఇళ్ల మధ్య ఉన్న డంపింగ్ యార్డు సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం కనుగొంటామని, ఎవరూ ఆందోళన చెందక్కర్లేదని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గాజువాక జోనల్ కార్యాలయంలో యార్డు పోరాట కమిటీ, జీవీఎంసీ అధికారులు, పోలీసుశాఖ సిబ్బందితో ఎమ్మెల్యే ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యార్డులో నిల్వల వల్ల పరిసర కాలనీల్లో దుర్వాసన వీడిస్తోందని, తగిన చర్యలు తీసుకోవాలని కమిటీ ప్రతినిధులు గంధం శ్రీనివాస్, ఎం.శంకరనారాయణ, రాంబాబు, రమణ కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా త్వరలోనే మంచి నిర్ణయం ప్రకటిస్తామన్నారు. జెడ్సీ శేషాద్రి, సీఎంఓహెచ్ డాక్టర్ నరేశ్ కుమార్, ఏఎంఓహెచ్ కిరణ్‌కుమార్, సౌత్ ఏసీపీ వెంకటరావు, సీఐ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పురుషోత్తపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురం హౌసింగ్ బోర్డు కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఆర్.వి.ఆసుపత్రి, శ్రీనివాస క్లీనిక్, జాస్ దంత ఆసుపత్రికి చెందిన వైద్యులు నివాసితులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. సుమారు వంద మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం అధ్యక్షురాలు గుండమ్మ, సభ్యులు పద్మ, ప్రసాద్, చంద్రశేఖర్, రమణ, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సింహాద్రినాథుడికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు

పూజల్లో పాల్గొన్న భక్తజనం

గోవిందరాజ స్వామికి గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో ఆదివారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేశారు.

20న నవశక్తి దేవతల ఆలయ ప్రారంభోత్సవం

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని గంగడిపాలెం, గోవుపేట, చీపుళ్లపాలెం గ్రామాల పరిదేశమ్మతల్లి అమ్మవారి సహిత నవశక్తి దేవతల ఆలయ ప్రారంభోత్సవం ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పుక్కెళ్ల సుందరరావు, వాసుపల్లి గురువులు తెలిపారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విశేష పూజలు, హోమాలు, అన్నదానం, తదితర ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు తప్పనిసరిగా ప్రతివారం కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని ఎస్ఐ లక్ష్మి స్పష్టం చేశారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం జరిగిన కౌన్సెలింగ్‌కు కొందరు రాకపోవడంతో ముందస్తు సమాచారం, అనుమతి లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ లక్ష్మి

మూతపడిన ఆర్వో ప్లాంటు

పిట్టవానిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెంలోని ఆర్వోప్లాంటు పడకేసింది. కొన్నాళ్లుగా మూతపడి ఉన్నా పట్టించుకునేవారే లేరని స్థానికులు వాపోతున్నారు. ప్రజలకు శుద్ధినీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో గతంలో దీన్ని నిర్మించి నిర్వహణ బాధ్యతను జీవీఎంసీకి అప్పగించారు. తొలుత ప్లాంటు బాగానే పనిచేయడంతో గ్రామస్థులు రక్షిత నీటిని వినియోగించుకున్నారు. తర్వాత నిర్వహణ లేక మూతపడింది. ఆర్వో యంత్ర సామగ్రి తుప్పు పడుతోంది. ప్రస్తుతం తాగునీటికి అవస్థలు పడుతున్నామని, సంబంధిత అధికారులు దీన్ని వినియోగంలోకి తేవడానికి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



(c) eenadu

కంకి పక్కన కవరు
శబ్దం విని బెదురు



పంటల్ని చీడపీడలు, అడవి జంతువులు, పక్షుల నుంచి కాపాడుకోవడం రైతులకు గగనంగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన సమస్య ఉంది. గుత్తి మండలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొన్ని పక్షులు మొత్తం జొన్న పంటను తినేస్తున్నాయి. శ్రీపురం గ్రామ సమీపాన 67వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఓ రైతు జొన్న పంటను వినూత్న ఆలోచనలతో కాపాడుకుంటున్నాడు. దీంతో పంటను రక్షించుకునేందుకు ఒక్కో కంకికి ఒక్కో ప్లాస్టిక్ కవరును ఏర్పాటు చేసుకున్నాడు. కంకులకు ప్లాస్టిక్ కవర్లు కడితే ఆ శబ్దానికి పక్షులు రాకుండా పంటను రక్షించుకుంటున్నాడు.

- న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

నేడు కలెక్టరేట్‌లో 'అర్జీల' స్వీకరణ రద్దు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఈనెల 16న జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు రద్దు అయ్యాయి. ఈ విషయాన్ని కలెక్టర్ ఆనంద్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలెవరూ అర్జీలిచ్చేందుకు జిల్లా కేంద్రానికి రావొద్దని తెలిపారు.

అరటి రైతుకు తీపి

టన్ను రూ.21,000 - 23,000

మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న అరటికాయలు

ధర్మవరం పట్టణం, తాడిమర్రి న్యూస్‌టుడే: ఉగాది, శ్రీరామనవమి పండగలు సమీపిస్తున్న వేళ అరటి ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం టన్ను రూ.21,000 నుంచి రూ.23,000 పలుకుతోంది. తమ కష్టానికి ఫలితం దక్కిందని రైతులు ఆనందపడుతున్నారు. గత పదేళ్ల కాలంలో ఇంత ధర పెరగలేదని చెబుతున్నారు. గత ఏడాది దీపావళి, దసరా సమయంలో అరటి ధరలు బాగా పడిపోయాయి. ఎంతలా అంటే టన్ను కేవలం రూ.1,000 మాత్రమే పలికాయి. కూలి డబ్బులు కూడా రావని చాలా మంది రైతులు గెలలను తోటల్లోనే వదిలేశారు. మరికొందరు పశువులకు మేతగా వేశారు. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో లక్షల్లో నష్టపోయారు. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా అరటి పంట 1,610 హెక్టార్లల్లో సాగులో ఉంది.

కొన్ని నెలలపాటు నిలకడగా ధరలు

- చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖాధికారి

ఇతర రాష్ట్రాల్లో అరటి కోతలు పూర్తయ్యాయి. వ్యాపారులు మన దగ్గరకు వచ్చి అరటిని కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు. అందుకే ధరలు భారీగా పెరిగాయి. ఇంకొన్ని నెలలపాటు ఇవే ధరలుంటాయి.

మదినిండా.. ముక్కంటి

తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరాలయంలో మూలవిరాట్‌కు అలంకరణ

అనంత సాంస్కృతికం, తాడిపత్రి, న్యూస్‌టుడే: ఘంటానాదాలు, శివనామస్మరణలు, దీపారాధనలతో శివరాత్రి పండుగను ఉమ్మడి అనంత జిల్లావ్యాప్తంగా భక్తులు మహోత్సవంలా జరుపుకొన్నారు.. అన్ని ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు తరలి వెళ్లారు. మహాగణపతి పూజ అనంతరం నవగ్రహ, హోమాల నిర్వహణ తర్వాత కల్యాణోత్సవం, రుద్రాభిషేకాలు నిర్వహించారు.

30 వేల మందితో రుద్రాభిషేకం

అనంతపురం శ్రీనగర్ కాలనీలో ఏపీఐఐ డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్, శైలజ దంపతుల నేతృత్వంలో జరిగిన ఈ ఉత్సవంలో స్థానిక ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్, రాప్తాడు, కల్యాణదుర్గం ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, మార్కెట్ యార్డు ఛైర్మన్ బల్లా పల్లవి, కుప్పం ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, డీఆర్వో మాలోల ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం 30 వేల మంది భక్తులతో సామూహిక రుద్రాభిషేకం జరిపారు.

సామూహిక రుద్రాభిషేకానికి హాజరైన భక్తజనం

అనంతపురం శ్రీనగర్ కాలనీలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, పరిటాల సునీత

✦ తాడిపత్రిలో బుగ్గ రామలింగేశ్వరాలయంలో నందివాహనంపై కొలువుతీర్చి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆకాశ దీపోత్సవం, లింగోద్భవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కాటికోటేశ్వరుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

కాటికోటేశ్వర నమో.. నమః

పూజల్లో మంత్రి సత్యకుమార్‌యాదవ్

తాడిమర్రి, న్యూస్‌టుడే: తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి గ్రామ సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. ఆదివారం స్వామివారిని బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. భక్తులు విశేష సంఖ్యలో తరలిరావడంతో క్షేత్రం కిటకిటలాడింది. మంత్రి సత్యకుమార్‌యాదవ్ కాటికోటేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిత్యాన్నదానాన్ని పరిశీలించి రూ.లక్ష విరాళం అందజేశారు. క్షేత్రం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. భక్తులు మూలవిరాట్టును దర్శించుకుని గదేగుండం వద్ద మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి నరసింహరాజు, డీఎస్పీ హేమంత్‌కుమార్, నాయకులు శ్రీనివాసులు, రాజశేఖర్, భాజపా మండల అధ్యక్షుడు రాము, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా స్వామి దర్శనం

గతంలో కాటికోటేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వివాదాలు నెలకొనేవి. పోలీసుల హడావుడి ఎక్కువగా ఉండేది. దీంతో స్వామిని దర్శించుకోలేక భక్తులు మదనపడేవారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మంత్రి సత్యకుమార్‌యాదవ్, పరిటాల శ్రీరామ్ చొరవ చూపి ఆలయ గుడికాపులు, భక్తులతో సమావేశాలు నిర్వహించి ఎటువంటి వివాదాలు లేకుండా చూశారు. దీంతో బ్రహ్మోత్సవాలు ప్రశాంత వాతావరణంలో వైభవంగా జరుగుతున్నాయి.

శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయంలో..

కొనుగోలు కష్టం

గోదాముల్లో నిల్వ ఉన్న రసాయన ఎరువులు

రసాయన ఎరువుల కంపెనీలు ధరలు పెంచడంతో రైతులకు రసాయన ఎరువులు కొనుగోలు భారంగా మారింది. బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, కళ్యాణదుర్గం గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం పామిడి, శింగనమల తదితర మండలాల్లో వ్యవసాయ బోర్ల చెరువుల వరి, వేరుసెనగ, మొక్కజొన్న పత్తి, తదితర పంటలను సాగు చేశారు.

✦ మిశ్రమ ఎరువుల తయారీకి అవసరమైన ముడిసరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు హెచ్చుగా ఉండటంతో ధరలు పెరిగాయని కంపెనీ యాజమాన్యం చెబుతోంది.

రైతుపై ఎరువుల ధరాభారం

రబీలో రెండోసారి పెంపుతో తీవ్ర ఇబ్బందులు

బొమ్మనహాళ్, రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: రబీ సీజన్ మొదట్లో ఒకసారి మిశ్రమ రసాయన ఎరువుల ధరలు పెరగడం రైతులకు అశనిపాతంలా మారింది. ఏదోలే నెట్టుకొద్దాం అనుకునే లోపే మరోసారి ధరల పెరుగుదలతో వారికి ఇబ్బందులు పెరిగాయి. ✦ యూరియా, డీఏపీ ధరలు మినహా మిశ్రమ కాంప్లెక్సు ఎరువులు పెరిగాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 50 వేల ఎకరాల వరకు వరి సాగు కాగా, పత్తి 75 వేల ఎకరాల వరకు సాగు అయింది. వీటితోపాటు వేరుసెనగ, మొక్కజొన్న, దానిమ్మ, వంటి రకాలకు చెందిన 2.5 లక్షల ఎకరాల వరకు పంటలు రబీలో సాగులో ఉన్నాయి.

పెరుగుదల ఇలా..

✦ మిశ్రమ ఎరువులకు సంబంధించి ఐదురకాల ఎరువులు రబీలో రెండుసార్లు పెరిగాయి.

✦ 15.15.15 మిశ్రమ ఎరువు రబీ ప్రారంభంలో 50 కిలోల బస్తా రూ.1550 ఉండగా ప్రస్తుతం రూ.1,650కి చేరింది.

✦ 20.20.0.13 కాంప్లెక్సు బస్తా నెల కిందట రూ.1400 ఉండగా ప్రస్తుతం రూ.1500కు పెరిగింది.

✦ 10.26.26 కాంప్లెక్సు గత నెలలోరూ.1900 ఉండగా రూ.2100కు పెరుగుదల

✦ 14.35.14 ఎరువు బస్తా రూ.1950 ఉండగా రూ.2150కు పెరిగింది. ✦ 16.16.16 మిశ్రమ ఎరువు రబీ ప్రారంభంలో రూ.1600 ఉండగా ప్రస్తుతం 1675కు చేరింది.

అధికారులేమంటున్నారు?

ఇష్టారాజ్యంగా రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి, తగిన మోతాదులో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందును వాడాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి రవికుమార్ తెలిపారు. డీలర్లు ఎంఆర్‌పీ ధరలకే ఎరువులను అమ్మాలన్నారు.

నిర్లక్ష్యం.. నివ్వెరపోయేలా!

అంగన్‌వాడీ భవన నిర్మాణాలపై కొరవడిన శ్రద్ధ

శింగనమల మండలం ఉల్లికంటిపల్లిలో గోడలకే పరిమితమైన కేంద్రం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణం అటకెక్కింది. అధికార యంత్రాంగం సకాలంలో స్పందించకపోవడంతో ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కొన్నింటికి నిధులు ఉన్నా ముందుకు సాగని స్థితి. కనీస శ్రద్ధ చూపకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. జిల్లాలో చాలా భవనాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ✦ కేంద్ర ప్రభుత్వ నిధులను నిర్దేశిత గడువులోపు ఖర్చు చేయకపోతే వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది. గతేడాదిలో ఇదే తరహాలో రూ.లక్షలు నిధులు రద్దు అయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం ఒకటిన్నర నెల మాత్రమే ఉంది. ఈలోపు నిర్మాణాల పురోగతిలో వేగం లేకపోతే అంతే సంగతి. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖలు ఈ భవనాల నిర్మాణాన్ని చేపట్టాయి.

'నాడు-నేడు'.. దుస్థితి చూడు

గత వైకాపా ప్రభుత్వం 'నాడు-నేడు' పథకాన్ని ఆరంభశూరత్వంగా మార్చింది. దీని పర్యావసానమే జిల్లాలో 91 అంగన్‌వాడీ భవనాల నిర్మాణ దుస్థితి దయనీయం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో భవనానికి రూ.12 లక్షల అంచనా వ్యయంతో ఆ 91 భవనాలను మంజూరు చేసింది.

✦ ఉరవకొండ ప్రాజెక్టులో 24, తాడిపత్రి 12, కణేకల్లులో 10, రాయదుర్గంలో 9, శింగనమల, కంబదూరులో 8 చొప్పున, అనంత గ్రామీణంలో 7, నార్పలలో 5, గుత్తి, కళ్యాణదుర్గంలో 4 ప్రకారం మంజూరు చేశారు. ఇందులో పునాది దశలోనే 38 ఉన్నాయి. రూఫ్ స్థాయిలో 13, గోడలకే 39, మొదలేకాని కేంద్రం ఒకటి ప్రకారం ఉన్నాయి. ఈ 91 భవనాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

ఊసేలేని ఉపాధి

గ్రామీణ 'ఉపాధి' హామీ పథకం నిధుల సహకారంతోనూ జిల్లాలో 639 భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో భవనానికి రూ.7 లక్షల అంచనా వ్యయంతో మొదలు పెట్టారు. తొలి విడతగా 424 కేంద్రాలు, రెండో విడతగా 215 భవనాలు మంజూరయ్యాయి. ఇప్పటికీ 303 భవనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 336 భవనాల నిర్మాణ పురోగతి కొద్దిమేర పర్వాలేదు. నిర్మాణాలపై ఆయా శాఖలు తగిన శ్రద్ధ చూపడం లేదన్నది సత్యం.

పురోగతిలేని నక్షం..

కేంద్రం అనుబంధ నక్షం పథకం కింద వచ్చిన నిధులు గతేడాది వెనక్కి వెళ్లాయి. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి. ఒక్కో కేంద్రానికి రూ.36 వేల ప్రకారం 239 కేంద్రాలకు మరుగుదొడ్లు, రూ.17 వేల ప్రకారం 240 కేంద్రాలకు తాగునీటి వసతి కల్పించాలని ఎప్పుడో నిధులు వచ్చాయి. ఇదే పథకం కింద రెండో దఫా కింద 37 కేంద్రాలకు మరుగుదొడ్లు, 106 కేంద్రాలకు తాగునీటి కల్పన ఊసేలేదు. ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 75 కేంద్రాలకు మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.36 వేలు ప్రకారం నిధులు వచ్చినా పురోగతి అంతంతే.

ఎదురొచ్చిన మృత్యువు

➤ రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

➤ పండగ పూట రెండు కుటుంబాల్లో విషాదం

గణేశ్

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ఆ రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం.. పండగ పూట సంతోషంగా గడపాల్సిన చోట రోదనలు మిన్నంటాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి అకాల మరణం ఒక వైపు, భార్యా పిల్లలకు అన్నీ తానై ఉన్న వ్యక్తి మరోవైపు మృతి చెందడం అందర్నీ కలచి వేసింది. శివయ్యా.. ఎందుకింత కష్టాన్ని మిగిల్చావంటూ ఓ గృహిణి రోదనలు.. కడుపు కోత తట్టుకోలేమయ్యా అంటూ మరో కన్నతల్లి వేదన వర్ణనాతీతం.

నల్లమాడ మండలం బాసంవారిపల్లికి చెందిన గణేశ్ అతని సోదరుడు రాకేశ్, మహేశ్ శివరాత్రిని పురస్కరించుకొని ద్విచక్ర వాహనంలో లేపాక్షికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఉంట్లవారిపల్లికి చెందిన లక్ష్మీనారాయణ ఓడీసీ నుంచి పుట్టపర్తికి వెళ్తున్న తరుణంలో వీరి వాహనాలు వీరాంజనేయపల్లి వద్ద ఎదురుపడి ఢీకొనడంతో లక్ష్మీనారాయణ(45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడిన గణేశ్(16)ను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. లక్ష్మీనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుగొండకు, గణేశ్ మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఓడీసీలో చికెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గణేశ్ నల్లమాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కూలిపనులు చేసుకుంటూ జీవనం గడిపే ఆ కుటుంబంలో పండగపూట కుమారుడి మృతితో శోకసంద్రంలో మునిగిపోయింది. ఈఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్సై క్రాంతి తెలిపారు.

సమ్మెలోకి సహకార సంఘాల ఉద్యోగులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై పోరుకు సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. సోమవారం నుంచి ఉద్యోగులంతా విధులను బహిష్కరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడానికి ఉద్యుక్తులయ్యారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 120 సహకార సంఘాల కార్యకలాపాలు స్తంభించనున్నాయి. దీనికి సంబంధించి అధికారులకు సమ్మె నోటీసులు కూడా అందజేసినట్లు జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి డి.శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జీఓ నం.36ను అమలు చేసి 2019, 2024 పీఆర్‌సీ లేదా మధ్యంతర భృతి ఇవ్వాలని ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘాల లాభ నష్టాలతో సంబంధం లేకుండా ఉద్యోగులకు జీతాలు చెల్లించి ఆరోగ్య బీమా రూ.5 లక్షలు, రూ.20 లక్షలు నిర్ణీత కాల బీమా అమలు చేయాలని కోరారు. దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే సమ్మెకు దిగుతున్నట్లు వారు తెలిపారు.

నాణ్యత దూరం..
మధ్యాహ్న భోజనం అమలులో వైఫల్యాలపై ఫిర్యాదులు
పర్యవేక్షణ శూన్యం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. ఏజెన్సీ నిర్వాహకులు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పిల్లలకు అందించే భోజనంలో నాణ్యత తగ్గుతోంది.

✦ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఐవీఆర్ సర్వేలో.. అనంత నగరం నాయక్‌నగర్ నగరపాలక ప్రాథమిక పాఠశాల, గుమ్మఘట్ట మండలం గొనికుంట, కణేకల్ మండల పాఠశాలల్లో యర్రగుంటలో పాఠశాలలో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులొచ్చాయి. అధికారులు ఇటీవల ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తరచూ ఏదో ఒక పాఠశాలలో ఇలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఇదే అంశంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

నాయక్‌నగర్‌లోని పాఠశాలలో భోజనం పరిశీలిస్తున్న డీఈవో ప్రసాద్‌బాబు

75శాతం మాత్రమే

మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఎప్పటికప్పుడు నివేదిక ఇస్తారు. మెనూ, కోడిగుడ్లు, చిక్కీలు తదితర వివరాలు యాప్‌లో రోజూ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో అధికారులు పరిశీలిస్తున్నారు. భోజనం ఎంత శాతం బాగుందో తెలియజేస్తారు. అనంత జిల్లాలో మధ్యాహ్నం భోజనం 80 శాతం మాత్రమే బాగుందని సర్వే ద్వారా తెలిసింది.

పరిశీలన పట్టదేం..

ప్రభుత్వ విద్యాసంస్థల్లో పథకం అమలుపై అధికారుల పర్యవేక్షణ లోపించింది. ప్రతిరోజూ ప్రధానోపాధ్యాయుడు మధ్యాహ్నం భోజనం పరిశీలించాలి. వార్డు సచివాలయంలోని విద్యాకార్యదర్శులు కూడా రోజూ పరిశీలించాలి. మండల విద్యాశాఖాధికారులు రోజుకు కనీసం ఒక పాఠశాల పరిశీలించాలి. ఆపైన ఉప, జిల్లా విద్యాశాఖాధికారులు పర్యవేక్షిస్తుండాలి. అధికారులు ఈ పని సక్రమంగా నిర్వర్తించక నిర్వాహకులు నాసిరకంగా భోజనం అందిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని డీఈవో ప్రసాద్‌బాబు తెలిపారు.

చొరవ + ధైర్యం = వ్యాపారం

నాటుకోళ్ల పెంపకంతో యువతకు స్ఫూర్తి

నాటు కోళ్లకు క్యారెట్ ముక్కలు ఆహారంగా వేస్తున్న రమేశ్

పెనుకొండ, న్యూస్‌టుడే: యువత స్వయం ఉపాధి కోసం అనేక మార్గాలు వెతుక్కుంటునారు. అందులో కొందరు వ్యాపార మార్గాన్ని ఎంచుకుంటున్నారు. కొంతమంది కొన్నాళ్లకే లాభాలు రావడం లేదని నిట్టూరుస్తారు. మరికొందరు పట్టుదలగా అలానే కొనసాగిస్తారు. వ్యాపారం సమర్థంగా నిర్వహించాలంటే ఒడిదొడుకులు వచ్చినపుడు కాసింత ధైర్యంగా, ఇష్టం పెంచుకొని ఎదుర్కోవడం లోనే ఉంది అసలు కిటుకు. పెనుకొండ మండలంలోని రాంపురానికి చెందిన రమేశ్ యాదవ్ ఈ మార్గం అనుసరిస్తూ సఫలీకృతం అవుతున్నారు. వారెంచుకున్న వ్యాపారం నాటుకోళ్ల పెంపకం.. తొలుత పూల వ్యాపారం చేసి నేర్చుకున్న మెలకువలతో కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు.

గ్రామం : కొండాపురంలోని బీసీ కాలనీలో ఏడాదికి లక్షతో అద్దెకు.. తీసుకొని

3800: 8 నెలల క్రితం తెలంగాణలోని ఉస్మానాబాద్ నుంచి 3,800 కోడిపిల్లలు తీసుకొచ్చాడు. ఒక్కో పిల్లకు రూ.85 వెచ్చించాడు.

ఆహారం : మొదట్లో ఒక్కోపిల్లకు రోజుకు 30 గ్రాముల ఆహారం ఇచ్చాడు. ప్రస్తుతం 8 నెలలు కావడంతో ఒక్కో కోడి 120 గ్రాముల ఆహారం తీసుకుంటుంది. సేంద్రియ ఆహారం ఇస్తున్నారు. ప్రతి రోజు మూడు పూటలా ఆహారంగా తెల్లజొన్నలు, మొక్కజొన్నలు, కత్తిరించిన అరటి, మునగ, బొప్పాయి ఆకులు, కత్తిరించిన స్వీట్ పొటాటో క్యారెట్, బీట్‌రూట్, దోస, గుమ్మడి కాయ ముక్కలు ఆహారంగా ఇస్తున్నారు.

ప్రస్తుత స్థితి

ప్రస్తుతం రోజు 1000కిపైగా కోడిగుడ్లు వస్తున్నాయి. ఒక్కో గుడ్డు రూ.15కి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. నెలకు ఆహారం, నిర్వహణ ఖర్చులు రూ.3 లక్షలు వెచ్చిస్తున్నారు. వీటిలో కోడిపెట్టలు 1.75 కిలోలు, కోడి పుంజులు 2 కిలోల వరకు బరువున్నాయి. కోడి కిలో రూ.450 ప్రకారం విక్రయిస్తున్నారు. సొంతంగా నాటుకోడి పిల్లల ఉత్పత్తి కోసం యంత్రాలను సమకూర్చుకున్నాడు. ప్రతి నెలా రూ.లక్షకు పైగా ఆదాయం గడిస్తున్నాడు.

రైతులకు పిల్లలిస్తాం

భవిష్యత్తులో నాటుకోళ్ల పెంపకం పట్ల ఆసక్తి ఉన్నవారు ముందుకొస్తే కోడి పిల్లలు సరఫరా చేస్తాం. పెంపకంలో మెలకువలు తెలియజేస్తాం. కోళ్లు, కోడి గుడ్లు తిరిగి తామే కొనుగోలు చేస్తాం

- రమేశ్‌యాదవ్, నాటు కోళ్లఫారం, యజమాని

షూటింగ్ బాల్ విజేత శ్రీసత్యసాయి జిల్లా

బాలికల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. గత మూడు రోజులుగా ధర్మవరం పట్టణంలోని బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలుర, బాలికల విభాగం రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో 12, బాలుర విభాగంలో 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో అనకాపల్లి బాలుర జట్టు విజేతగా నిలవగా, అనంతపురం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచింది. ఆదివారం బాలికల జట్టుకు పట్టణ తెదేపా అధ్యక్షుడు పరిశే సుధాకర్, షూటింగ్ బాల్ అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి, పీడీ లక్ష్మీనారాయణ ట్రోఫీని అందజేశారు. శ్రీసత్యసాయి జట్టు సభ్యులంతా ధర్మవరం బీఎస్ఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థినులే కావడం విశేషం.

(c) eenadu

సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత, అహుడా ఛైర్మన్ టి.సి.వరుణ్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

ఆదర్శ నగర పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యం : మంత్రి

పెనుకొండ, న్యూస్‌టుడే: స్థానిక నగరపంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారిపై రూ.92 లక్షలతో 3.2 కిలోమీటర్ల మేర 110 స్తంభాలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అహుడా ఛైర్మన్ టి.సి.వరుణ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. అతితక్కువ కాలంలో కుప్పం వరకు కృష్ణాజలాలను 720కిలోమీటర్లు తీసుకెళ్లిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. పెనుకొండలో గతంలో జరగని అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ. 61లక్షలతో క్యాంటీన్, ఇన్నర్ సహకారంతో రూ.454కోట్లతో కొండ పై పర్యాటక అభివృద్ధి పనులు, రూ.100కోట్లతో అమృతపథకంలో ఇంటింటికి తాగునీటి పనులు చేపడుతున్నామన్నారు. రూ. 4కోట్లతో నగరవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీసీరోడ్ల నిర్మాణం కోసం రూ. 20కోట్లతో ప్రతిపాదనలు పంపామని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. నగరపంచాయతీ కమిషనర్ సతీశ్‌కుమార్, సిబ్బంది, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమయ్య, కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడలో.. తటాకాలు

● బలహీన పడుతున్నా పట్టని తీరు
● గగ్గోలు పెడుతున్న ఆయకట్టు రైతులు

గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, న్యూస్‌టుడే: ఆయకట్టు రైతులతో పాటు ప్రజలకు దాహార్తి తీర్చే చెరువులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇది వరకు చెరువుల ఆయకట్టు కింద పంటలు విస్తారంగా పండించేవారు. దీంతోపాటు చెరువులకు సమీపంలో ఉన్న గ్రామాలు, పట్టణాల పరిధిలో భూగర్భ జలాలు పెరిగి నీటి సమస్య తీరేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోతోంది. ప్రధానంగా గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లోని చెరువుల బాగును ఎవరూ పట్టించుకోవడంలేదు.

అధ్వానంగా బ్రాహ్మణపల్లి చెరువు

ప్రతిపాదనలతో సరిపెడుతూ..

గతంలో పలు చెరువుల మరమ్మతుల కోసం చిన్ననీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. గుత్తి మండలంలోని బ్రాహ్మణపల్లి చెరువుకు రూ.55 లక్షలు, చిన్నచెరువుకు రూ.25 లక్షలు, జక్కలచెరువుకు రూ.65.76లక్షలు, ముద్దలాపురం చెరువుకు రూ.24 లక్షలు, కొత్తపేట చెరువుకు రూ.70.80 లక్షలు, తిమ్మారెడ్డి చెరువుకు రూ.55.65 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. ● ఉరవకొండ నియోజకవర్గంలోని నాలుగు చెరువుల బాగుకు రూ.3కోట్లతో ప్రతిపాదించినా పైసా కూడా విడుదల చేయలేదు. ● గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లోని చెరువుల మరమ్మతులకు రూ.కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినా పాలకులు పట్టించుకోవడం లేదు. జక్కలచెరువు, బాచుపల్లి చెరువు కట్టలు బలహీనంగా ఉన్నాయి. నేటా కట్టలకు గండ్లుపడుతున్నాయి. దీంతో చెరువుల్లో నీరు నిల్వ ఉండటం లేదు.

అడవులను తలపిస్తున్న చెరువులు

ఉరవకొండ నియోజకవర్గంలోని బూదగవి చెరువులో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తోంది. కోనాపురం చెరువు సైతం మరమ్మతులకు నోచుకోవడంలేదు. హావళిగి చెరువు కింద సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉన్నా ప్రయోజనం లేకుండాపోతోంది. ● గుత్తి పరిధిలో రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్న చెరువు కట్టల పటిష్ఠతకు రైల్వే అధికారులు నిధులు ఇవ్వాల్సిఉంది. గుత్తి, జక్కలచెరువు, తొండపాడు, గుంతకల్లు మండలంలోని పాతకొత్తచెరువుల వద్ద ట్రాక్‌లు ఉన్నాయి. వీటి బాగుకు బడ్జెట్ నుంచి నిధులు రావడం లేదు. దీనిపై ఇరిగేషన్‌శాఖ గుత్తి ఏఈఈ విజయకుమార్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి గతేడాది రెండు నియోజకవర్గాల్లోని చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేపడతామన్నారు.

అండర్-12 క్రికెట్ జట్టు కెప్టెన్‌గా హన్సిక్‌రెడ్డి

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: కడపలో సోమవారం నుంచి మొదలుకానున్న సౌత్‌జోన్ అంతర్ జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ప్రకటించారు. మండల, జిల్లాస్థాయి పోటీలు జరిపి, అందులో ప్రతిభ చూపిన బాలురు జిల్లా తుది జట్టుకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. కడపలో పోటీలు 22 వరకు జరుగుతాయి. ఎంపికైన జిల్లా జట్టులోని ఆటగాళ్ల వివరాలను జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ. యుగంధర్‌రెడ్డి ప్రకటించారు.

జట్టు ఆటగాళ్లు: హన్సిక్‌రెడ్డి (కెప్టెన్), ఎం. తౌఫిక్, గోవర్ధన్‌నాయుడు, అల్లు అభినవ్, డి. గౌరీష్, కె. మోక్షిత్‌రెడ్డి, కె. కార్తిక్, ఎన్. మనీష్‌సాయి, హఫీజ్, బి. శశ్వంత్, జె. అఖిల్‌తేజ్, దినేష్ గౌడ, పి. వెంకట్ నరేన్.

స్టాండ్‌బైస్‌గా..: రాహుల్‌రెడ్డి, సి. లలిత్‌కిశోర్, గోవర్ధన్‌రెడ్డి, నిహాంత్‌రెడ్డి, మహిధర్‌రెడ్డి, నిఖిల్ నివాస్‌రెడ్డి, ఎల్వీ వెంకట్‌సాయి యాదవ్ ఎంపికయ్యారు. జట్టుకు శిక్షకుడిగా జి. హరినాథ్‌రెడ్డి నియమితులయ్యారు.

అశ్వర్థ ఆలయం.. పోటెత్తిన భక్తజనం

అలంకారంలో అశ్వర్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలో ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో మాఘమాసం నాలుగో ఆదివారం బ్రహ్మోత్సవాల భక్తులు పోటెత్తారు. చివరి ఆదివారం కావడంతో ఆదివారం కలిసి రావడంతో భక్తులు స్వామి బ్రహ్మోత్సవాలకు భారీగా తరలివచ్చారు. అశ్వర్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి వారికి వేద పండితులు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో వేదపండితులు హోమం నిర్వహించి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏఎస్పీ రోహిత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో సుబ్బన్న, ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు భక్తులకు వివిధ సేవలు అందించారు.

దర్శనానికి బారులు తీరిన భక్తులు

శంభోశంకరా.. కరుణించవయ్యా!

తాడిపత్రి, న్యూస్‌టుడే: హరహర మహదేవ.. శంభోశంకర కరుణించవయ్యా అంటూ భక్తుల శివనామస్మరణతో శివాలయాలు మారుమోగాయి. పట్టణంలోని పెన్నానది ఒడ్డున ఉన్న బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పండగను వైభవంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పెద్దఎత్తున పాలాభిషేకం చేపట్టారు. తాడిపత్రి, జిల్లాలోని పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఆలయానికి తరలిరావడంతో కిటకిటలాడింది. స్వామిని నంది వాహనంలో కొలువుతీర్చి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆకాశదీపోత్సవం, లింగోద్భవం, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి నిర్వహించారు.

శివయ్యకు క్షీరాభిషేకం

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం. ✆ 7382114647.

REAL ESTATE

PLOT FOR SALE

అరవకూరు దగ్గర, బళ్లారి హైవేకి మొదటి బిట్టు, కార్గో హబ్-ఎయిర్‌పోర్ట్ దగ్గరలో 50 సెంట్స్ ప్లాటు అమ్మకానికి కలదు. సంప్ర: 9908469828.

LEASE/ RENT

స్కూలు లీజుకు కావలెను. అనంతపురం నగర పరిసరాలలో మంచి బిల్డింగ్ విశాలమైన గ్రౌండ్ అన్ని వసతులతో కూడిన స్కూల్ లీజుకు ఇవ్వదలుచుకొన్నవారు సంప్ర: 9133399861.

LAND REQUIRED

ల్యాండ్ పార్ట్నర్స్ Land Partners కావలెను. మీ భూమిలో అపార్ట్‌మెంట్లు, విల్లాలు, వాణిజ్య ప్రాజెక్టులు నిర్మించుకోవాలనుకునే భూమి యజమానులు సంప్రదించగలరు. అభివృద్ధి చేయించుకొని లాభం పొందండి. ఆసక్తికలవారు వెంటనే ఫోన్‌చేయండి. ✆ 9133399861.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ, బళ్లారి రోడ్, రాచానపల్లి, అనంతపురం రూరల్ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. ✆ 9780029999.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Eenadu Classifieds 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ముగిసిన సేవాలాల్ జయంతి ఉత్సవాలు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : గుత్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సేవాఘడ్‌లో వెలసిన సేవాలాల్ 287వ జయంతి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం ఉదయం సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక అలంకరణ, పూజలు, అభిషేకాలు, అర్చనలు, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి ఇచ్చారు. మాతా జగదాంబ దేవి ఆలయంలో 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు 101 బాలికలు సేవాలాల్ ఆలయం నుంచి మాతా జగదాంబదేవి ఆలయం వరకు కలశాల ప్రదర్శనతో జయంతి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సేవాలాల్ మాలధారులు భారీ ప్రదర్శనతో సేవాలాల్‌కు ఇరుముడులు సమర్పించారు. ట్రస్టు సభ్యులు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవ నాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్, రవీంద్రనాయక్ ఆలయ ప్రాంగణంలో ఉన్న మహాభోగ్ కట్ట వద్ద హోమం నిర్వహించారు. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సేవాలాల్, మాతా జగదాంబ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుసేన్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప సేవాలాల్‌ను దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఉత్సవాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీవో ప్రభాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాభోగ్ నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

అలంకరణలో సేవాలాల్ మహరాజ్

ఉత్సాహంగా రాతిదూలం లాగు పోటీలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: కూడేరు మండలం కొర్రకోడులో రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పయ్యావుల సోదరుల సహకారంతో శివరాత్రి సంబరాల్లో భాగంగా గ్రామస్థులు ఉత్సాహంగా రాతి దూలం పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ. 30116 తోపుదుర్తికి చెందిన రైతు చిన్నప్ప ఎద్దులు, రెండో బహుమతి రూ. 20116 మద్దెలచెరువుకు చెందిన రైతు కదిరప్ప ఎద్దులు, మూడో బహుమతి రూ. 10116 బళ్లారి జిల్లాకు చెందిన రైతు ఆంధ్రా ఆనంద రెడ్డి ఎద్దులు గెలుపొందినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆర్డీటీ ఫుట్‌బాల్ లీగ్ విజేత ధర్మవరం జట్టు

ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ఆర్డీటీ ఫుట్‌బాల్ లీగ్-2026లో ధర్మవరం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం కోచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అండర్-16 విభాగంలో బాలుర, బాలికల లీగ్ పోటీలు జరిగాయన్నారు. బాలుర విభాగంలో ఫైనల్‌లో హిందుపూరం జట్టుపై ధర్మవరం జట్టు 3-2 గోల్స్ తేడాతో గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకుందన్నారు. బాలికల విజేతగా హిందూపురం జట్టు నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విజేత జట్టుకు తెదేపా నాయకులు సంధారాఘవ, పురుషోత్తం, జనార్దన్, రవి ట్రోఫీ, మెడల్స్‌ను అందజేశారు.

తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధికి ఎంపీ నిధులు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: తిమ్మమాంబ మహా శివరాత్రి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తిమ్మమ్మ మర్రిమాను వద్ద కమ్యూనిటీ భవనానికి ఎంపీ గ్రాంట్ రూ.1 కోటి నిధులు మంజూరు చేయడంతో పాటు అభివృద్ధికి అండగా ఉంటానని తెలిపారు. తిమ్మమ్మ మర్రిమాను, పాల్పాడిదిన్నె ఆంజనేయ స్వామి, కటారుపల్లి వేమన్నస్వామి, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను కలుపుతూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపీ పార్థసారధిని కదిరి ఎమ్మెల్యే కందికుంట, మాజీ ఎమ్మెల్యే పార్థసారధిలు శాలువాతో సన్మానించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఎమ్మెల్యే అన్నదాన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

తిమ్మమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : కోటంక గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలు నాలుగో ఆదివారం వేలామంది భక్తుల నడుమ వైభవంగా ముగిశాయి. తెల్లవారు 4గంటలకు అభిషేకాలతో అర్చకులు రామాచార్యులు పూజలు ప్రారంభించారు. మాఘమాసం చివరి ఆదివారం కావడంతో స్వామిని దర్శించుకోవడానికి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామితో పాటు ఆలయ సమీపంలో నిర్మించి 108 శివలింగాలు, ఎత్తైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహంతోపాటు నందీశ్వర, శివలింగా విగ్రహాలు భక్తులకు దర్శించుకున్నారు. స్వామిని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ జడ్పీటీసీ సభ్యులు విశాలాక్షి, రామలింగారెడ్డి, తెదేపా నాయకులు, తదితరులు దర్శించుకున్నారు. ఎస్సై గౌస్‌బాషా ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ప్రత్యేకాలంకరణలో గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడు

శివయ్య కొలువు.. భక్తికి నెలవు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం మండలంలోని పరమేశ్వరుడి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శైవ క్షేత్రాలు హరహర మహదేవా..శంభోశంకర నామాలతో ప్రతిధ్వనించాయి. భక్తులు ఉదయం నుంచే స్వామి దర్శనాలకు బారులుతీరారు. పంపనూరులోని మంజునాథ స్వామికి వేకువజామున 4 గంటల నుంచి ప్రత్యేక పూజలు, రుద్రహోమం నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుంచి గౌరీ సమేత మంజునాథ స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

విశేషాలంకారంలో మంజునాథస్వామి

సకల జీవరాసుల్లోనూ పరమాత్ముడే..

జ్యోతి వెలిగిస్తున్న చేస్తున్న బ్రహ్మకుమారీలు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సృష్టిలో ఉన్న జీవరాసులన్నింటిలోనూ పరమాత్ముడు ఉంటాడని బ్రహ్మకుమారీల రీజనల్ డైరెక్టర్ సుగంధదీది పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం స్థాపించి 90సం.లు పూర్తి చేసుకున్న సందర్భంగా త్రిమూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ భగవంతుడిని నిత్యం శ్రద్ధతో ధ్యానించడం వల్ల మనలో సనాతనధర్మం అలవడుతుందన్నారు. సమాజంలో మన కంటే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. శివనామం స్మరిస్తూ 'పుర' వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజయోగిని కమల, పెద్ద సంఖ్యలో బ్రహ్మకుమారీలు, మహిళలు పాల్గొన్నారు.

టమాటా గరిష్ఠ ధర కిలో రూ.15

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణ మండలం కక్కలపల్లి మార్కెట్‌లో టమాటా ధరలు కాస్త పెరిగాయి. గత నాలుగు రోజులుగా పడిపోయిన ధరలు ఆదివారం కొద్దిగా పుంజుకుంది. కిలో గరిష్ఠ ధర రూ. 15 పలకగా, మధ్యస్థం రూ. 12, కనిష్ఠం రూ. 8 చొప్పున ఉన్నాయి. 15 కిలోల బుట్ట ధర గరిష్ఠం రూ. 225, మధ్యస్థం రూ. 180, కనిష్ఠం రూ. 120 చొప్పున పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రూప్‌కుమార్ తెలిపారు.

పశుగ్రాస పథకం.. రైతులకు ఊతం

కనగానపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తరువాత రైతులకు భరోసా కల్పించేది పాడి పరిశ్రమే. ఈ రంగం అభివృద్ధిని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. వరిగడ్డి, వేరుసెనగ గ్రాసం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో బహువార్షిక పశుగ్రాస పథకాన్ని ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసింది. పశుగ్రాసానికి అవసరమైన సామగ్రి కొనుగోలుకు నగదు, కూలీల వేతనాలను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ పథకానికి అర్హులైన రైతులు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

అర్హతలు..

- ఒక ఎకరా వరకు పశుగ్రాసం సాగుకు అనుమతి
- పొలంతోపాటు నీటివసతి కలిగి ఉన్న బోరుబావి
- అయిదెకరాల్లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు

అధికారుల పర్యవేక్షణ ఇలా...

పశుగ్రాసం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఉపాధి ఏపీఓ క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తరువాత సాంకేతిక సహాయకుడు అంచనాలు తయారు చేస్తారు. దరఖాస్తుదారుడికి పశువులు ఉన్నదీ లేనిదీ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సచివాలయ ఉద్యోగి నిర్ధారణ చేసిన తరువాత నిధులు మంజూరు చేస్తారు.

వ్యక్తిగత సాగు విస్తీర్ణం..

- 2 పశువులకు 25 సెంట్లు
- 3-5 పశువులకు 50 సెంట్లు
- 5 పశువులకు పైబడి 1 ఎకరా వరకు అవకాశం

కావాల్సిన పత్రాలు

ఉపాధి హామీ జాబ్‌కార్డు, భూమికి సంబంధించిన 1బి, ఆధార్, రేషనుకార్డు, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం

పథకం అమలు తీరు...

వ్యక్తిగతంగా పశుగ్రాసం సాగుచేసే రైతులకు 25 సెంట్ల నుంచి ఒక ఎకరాల్లో సాగు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఒక ఎకరాల్లో సాగు చేసే పశుగ్రాసానికి రెండేళ్ల వరకు ఉపాధి హామీ పథకం ద్వారా 184 రోజుల పని దినాలకు రూ. 56,488 చొప్పున వారి వ్యక్తిగత ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

సంతల ఆదాయం రూ.4.23 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల నుంచి మొత్తం రూ. 4,23,770 ఆదాయం లభించింది. ఇందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ. 2,53,670, ఆదివారం నిర్వహించిన పశువుల సంతలో రూ. 1,70,100 ఆదాయం వచ్చినట్లు యార్డు ఎంపిక శ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలియజేశారు.

కదిరి ఆలయ సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం నేటి (సోమవారం) ఉదయం ఆరు నుంచి 6.45 గంటల వరకు ఉంటుంది. 7 గంటల నుంచి 9 గంటల మధ్య ఖాద్రీశుడికి అభిషేక, స్వర్ణకవచ సేవలు. తర్వాత 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని కూలీ మృతి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న కూలీని గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందిన ఘటన మండలంలోని వెల్పుమడుగు బస్టాండ్ వద్ద జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లా శిబతల గ్రామానికి చెందిన పరమేశ్ సాహు (57) వేల్పుమడుగు వద్ద ఉన్న ఇటుకల బట్టీలో పని చేస్తున్నాడు. రోజు మాదిరి శనివారం రాత్రి వేల్పుమడుగు బస్టాండ్ సమీపంలోని సిల్క్ ఫ్యాక్టరీ పక్కన ఉన్న హోటల్ వద్దకు భోజనానికి వెళ్లాడు. రోడ్డు దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ఇటుకల బట్టీ నిర్వాహకుడు దుదేకుల పీరా సాహెబ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

యువకుడి దుర్మరణం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణ మండలం సిండికేట్‌నగర్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రూరల్ మండలం నరసనాయునికుంటకు చెందిన నరేశ్ (18) అనే యువకుడు వ్యక్తిగత పని నిమిత్తం నగరానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. సిండికేట్ నగర్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా, అనంతపురం నుంచి ఉరవకొండ వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. తలకు తీవ్రగాయాలైన నరేశ్ అపస్మారకస్థితికి చేరాడు. స్పందించిన స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున చనిపోయాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు పట్టణం కసాపురం రోడ్డుపక్కన నివాసముంటున్న రహిమాన్ కుమారుడు ఇర్ఫాన్ (18) ఇంట్లో ఉరేసుకుని ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించిన వివరాలను కసాపురం పోలీసులు రహిమాన్ హోటల్‌ను నిర్వహణతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతను ఊరికి వెళ్లగా కుమారుడు ఇంట్లో గడియపెట్టుకుని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇంటికొచ్చాక కుమారుడు మృతిని తట్టుకోలేక లబోదిబోమని విలపించారు. కుమారుడికి కడుపునొప్పి తీవ్రంగా ఉండేదని వాపోయారు. ఈక్రమంలోనే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశాడు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

సోమందేపల్లి, పెనుకొండ, న్యూస్‌టుడే: సోమందేపల్లి, రొద్దం గ్రామాల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రహదారి ప్రమాదాల్లో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పెట్రోల్ బంకు ఎదుట ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో సోమందేపల్లికి చెందిన ఫయాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. రొద్దం సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో చోదకుడు శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనాల్లో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు, బంధువులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

ఘర్షణలో మరో ముగ్గురికి..

గుత్తి: గుత్తిలోని జగనన్న కాలనీలో ఆదివారం సాయంత్రం ఇరువర్గాలకు చెందిన వారు ఘర్షణకు పాల్పడ్డారు. ఘర్షణలో ఓ వర్గానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నవీన్, జనార్దన్, మధు దాడికి పాల్పడ్డారు. ఆర్థిక లావాదేవీల వల్ల తమపై కర్రలతో బాలరంగారెడ్డి, విజయ కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలు దాడి చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరిగి చెరువులకు కృష్ణా జలాలు

సాగునీరు అందుతుందని అన్నదాతల హర్షం

పరిగి, న్యూస్‌టుడే: పరిగి మండలంలోని పరిగి, కొడిగెనహళ్లి, గొరవనహళ్లి చెరువులకు ఎట్టకేలకు హంద్రీ నీవా ద్వారా కృష్ణా జలాలను విడుదల చేయడంతో ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో మంత్రి సవిత చొరవతో ఎట్టకేలకు ఆయా చెరువులకు సాగునీటిని తరలిస్తున్నారు. నెల రోజుల పాటు నీటిని తరలిస్తే వ్యవసాయానికి సాగునీటితో పాటు, మండల ప్రజల దాహార్తి తీరుతుంది. పరిగి చెరువు కింద 2,800 ఎకరాలు, కొడిగెనహళ్లి, గొరవనహళ్లి చెరువుల కింద 1500 ఎకరాల సాగు భూమి ఉంది. ఇప్పటి వరకు హిందూపురం మండలంలోని చెరువులకు మాత్రమే నీటిని సరఫరా చేశారు. హంద్రీనీవా కాలువ చివరన ఉన్న మడకశిర ప్రాంతంలోని గుడిబండ చెరువులకు నీటిని తరలించి నింపారు. పరిగి చెరువు కింద రైతులు మొక్కజొన్న, మిరప పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పొట్టదశలో ఉంది. చెరువులో ఒక నెలకు సరిపడా నీరు నిల్వ ఉంది. మరో 15 రోజుల పాటు నీరు వస్తే చెరువు కింద రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరు సంవృద్ధిగా లభిస్తుందని రైతు సంఘం నాయకుడు కొండూరు నవీన్ హర్షం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు సైతం పై చెరువులను కృష్ణాజలాలతో నీటిని నింపేందుకు కృషి చేస్తున్నారు. చెరువుకు నీరు చేరితే సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు, బోర్లలో భూగర్భజల మట్టం పెరుగుతుందని మరో ఏడాది పాటు నీరు సమృద్ధిగా లభించి పంటలు సాగుకు అనుకూలంగా ఏర్పడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

నీటిని పరిశీలిస్తున్న తెదేపా నాయకులు

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

క్రికెట్ విజేత గంజికుంట జట్టు

విజేత జట్టు సభ్యులకు బహుమతులు అందిస్తున్న స్పాన్సర్లు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం గంజికుంటలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జీసీసీ ఎనిమిదో క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో గంజికుంటకు చెందిన ఈగల్స్ జట్టు విజేతగా నిలిచి కప్పు గెల్చుకోగా రూ.60 వేలు, రన్నర్‌గా నిలిచిన హోతూరు జట్టుకు రూ.30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన గంజికుంట సన్నీ జట్టుకు రూ.10 వేలతోపాటు కప్పును నిర్వాహకులు అందించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ గౌరవ అధ్యక్షుడు వీరప్ప, అధ్యక్షుడు జయేంద్రరెడ్డి, శ్రీనివాసులు, కుళ్లాయప్ప, గ్రామ యువత పాల్గొన్నారు.

సీమలో అగ్రి పరిశ్రమలకు ఊతం: అమిలినేని

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయలసీమను ‘గ్లోబల్ హార్టికల్చర్ హబ్’గా మార్చేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు ఉద్యాన అనుబంధ వర్గాలకు కేటాయింపు ప్రశంసనీయమన్నారు. దీనివల్ల అనంత జిల్లాలోని రైతులతోపాటు అన్ని సామాజిక వర్గాలవారికి మేలు చేకూరే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఉద్యాన ఎగుమతులు, పండ్ల ఆధారిత పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడంతోపాటు ఇతర రంగాల వారి అభివృద్ధికి నిధులు కేటాయించిన ప్రజారంజక బడ్జెట్ అని అమిలినేని కొనియాడారు. వ్యవసాయ అనుబంధ, పంచాయతీరాజ్, జలవనరుల, గృహనిర్మాణ శాఖలకు అధిక నిధులు కేటాయించిన సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, పయ్యావులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: చర్చి ఏరియాలో రైల్వే ట్రాక్ సమీపంలో చర్చి వెనుక వీధి దీపం వెలగడం లేదు. దీంతో రాత్రిపూట బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. **-నాగరాజు**

సమాధానం: సిబ్బంది పంపి దీపానికి మరమ్మతు చేస్తాం. **-జగన్నాథ్, ఫిట్టర్**

సమస్య: భగత్‌సింగ్ నగర్‌లో శనిమహాత్ముని ఆలయం ఎదుట నిలిచిన మురుగును తొలగించండి. **-శ్రీనివాసులు**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: వెంకటేశ్వర కాలనీలో దారుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. **- మహమ్మద్‌బాషా**

సమాధానం: పలుకాలనీల్లో త్వరలో సీసీ దారులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. **-దివాకర్‌రెడ్డి, కమిషనర్**

-న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

చేతి పంపుల మరమ్మతులకు వేళాయె

■ గ్రామాల్లో వేధిస్తున్న మెకానిక్‌ల కొరత

పనులు చేస్తున్న సిబ్బంది

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాలు పనిచేయని సమయంలో చేతిపంపులు ఊరట కలిగిస్తాయి. రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులేకుండా గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లోని పనిచేయని చేతిపంపులకు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు సమాయత్తం కావాలి. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 569 చేతిపంపులు ఉండగా ప్రస్తుతం పనిచేస్తున్నవి 305 మాత్రమే.

పొంచి ఉన్న కష్టాలు: నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాలకు సత్యసాయి, శ్రీరామిరెడ్డి పథకం నీరు సరఫరా అవుతోంది. మరికొన్ని గ్రామాల్లో పంచాయతీల బోర్లు ఉన్నాయి. నీటి పథకాలు, పంచాయతీ బోర్లు పనిచేయని పక్షంలో గ్రామీణులకు నీటి కష్టాలు తలెత్తుతాయి. ఈ సమయాల్లో ప్రజలు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలకు మాత్రమే మెకానిక్‌లు ఉండగా.. కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండలాలకు మెకానిక్‌లు లేరు. మండల పరిషత్ నిధుల నుంచి చేతి పంపుల మరమ్మతులు చేపడుతున్నారు.

అధికారుల లెక్కల ప్రకారం చేతిపంపుల వివరాలు

మండలం	చేతిపంపులు	పని చేస్తున్నవి	మరమ్మతులోవి	నీరు లేనివి
కళ్యాణదుర్గం గ్రామీణం	112	53	17	42
కుందుర్పి	129	83	14	32
కంబదూరు	103	36	24	43
శెట్టూరు	115	67	17	31
బ్రహ్మసముద్రం	110	66	18	26

నీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు

-చంద్రశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

గ్రామాల్లోని చేతిపంపులను గుర్తించి మరమ్మతు చేయిస్తాం. రెగ్యులర్ మెకానిక్ లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులతో పనులు చేయిస్తున్నాం. ప్రతిఏడాది తాగునీటి సరఫరా విభాగం, మండల పరిషత్ సంయుక్తంగా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

కుళాయికి బిరడా ఏర్పాటు

స్పందనకు వందనం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: గొడశలపల్లి నుంచి దొడగట్టకు వెళ్లే దారిలో నీటి కుళాయికి బిరడా లేక చాలా రోజులుగా తాగునీరు వృథాగా పోతుంది. దీంతో ‘ఎన్నాళ్లీ తాగునీటి వృథా.?’ అనే శీర్షికతో ఆదివారం ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. తక్షణమే స్పందించిన అధికారులు నీటి కుళాయికి బిరడాను ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామస్థులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యానాల్లో ఆహ్లాదం కరవు

టీచర్స్ కాలనీలో తుప్పు పట్టిన జారుడు బల్ల

న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం: సుమారు లక్ష జనాభా ఉన్న రాయదుర్గం పట్టణవాసులు సాయంత్రాలు సేద తీరాలంటే ఆహ్లాదం కరవయింది. పట్టణంలో వారాంతం పిల్లలు ఆడుకోవడానికి ఎక్కడా సరైన వసతులతో కూడిన ఉద్యానవనాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో శాంతినగర్, కణేకల్లు రోడ్డు, టీచర్స్ కాలనీల్లో పార్కులు ఉన్నప్పటికీ మౌలిక వసతులు లేవు. పచ్చిక లేక మట్టి, దుమ్ము ధూళితో కళాహీనంగా మారాయి.

పార్కులపై సిబ్బంది నిర్లక్ష్యం..

టీచర్స్ కాలనీలోని ఉద్యానవనంలో చెట్లు నరకడంతో నీడ కరవయింది. నీటి వసతి లేక ఫౌంటేన్ అలంకార ప్రాయంగా మారింది. చిన్నపిల్లలు ఆడుకునే పరికరాలు తుప్పుపట్టి నిరుపయోగంగా పడి ఉన్నాయి. కణేకల్లు రోడ్డులోని పార్కులో నీటి వసతి లేకపోవడంతో గడ్డి ఎండిపోయింది. చెట్ల పెంపకం లేకపోవడంతో కనీసం కూర్చొనేందుకు నీడ లేదు. బళ్లారి రోడ్డులోని చంద్రబాబు నాయుడు పార్కులో విగ్రహాలు రంగు వెలసి కళాహీనంగా తయారయ్యాయి. నీటి వసతి ఉన్నప్పటికీ పార్కులో సచివాలయం ఏర్పాటు చేయడంతో లోపలికి వెళ్లి సేద తీరేందుకు ఇబ్బందిగా ఉంది. మరోవైపు ఈ పార్కు మందుబాబులకు అడ్డాగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు.

అలంకారప్రాయంగా ఫౌంటేన్

ప్రారంభానికి నోచుకోని నగర వనం

చిన్నపార్కులు అందుబాటులో లేకపోయినా నగర వనంలో ప్రజలు తాత్కాలికంగా సేద తీరేవారు. రెండేళ్లుగా కొనసాగిన అభివృద్ధి పనులు ఇటీవల పూర్తియినప్పటికీ ప్రజలను లోపలికి రానివ్వడం లేదు. దీనిని ప్రారంభించక పోవడంతో ప్రజలు కర్ణాటకలోని మొలకాల్మూరుకు వెళుతున్నారు. సంబంధిత అధికారులు పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పనులకు టెండర్లు పిలిచాం

- దివాకర్‌రెడ్డి, కమిషనర్

పట్టణంలోని ఉద్యాన వనాలను అభివృద్ధి చేసేందుకు రెండు రోజుల కిందటే టెండర్ల ప్రక్రియ పూర్తిచేశాం. త్వరలో పార్కుల అభివృద్ధితోపాటు వసతులు కల్పించి పట్టణవాసులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

దుర్గంలో ‘స్పీడు బ్రేకర్లు’

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రమాదాలు జరుగకుండా పలు చోట్ల ఆర్ అండ్‌బీ అధికారులు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద, ప్రభుత్వ ఆసుపత్రి, స్టేట్ బ్యాంకు సమీపం, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఇటీవల జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఇద్దరు విద్యార్థినులు రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులు ప్రజల డిమాండ్ మేరకు ప్రమాదాల నివారణకు పట్టణంలోని పలుచోట్ల స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

బడ్జెట్‌లో కార్మికవర్గానికి అన్యాయం

అనంతపురం రోడ్డులో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్ ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తోందని, కార్మికవర్గాన్ని తీవ్ర నిరాశకు గురిచేసిందని మున్సిపల్ కార్మికులు ఆదివారం అనంతపురం రోడ్డులో బైఠాయించి రాస్తారోకో చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లికార్జున మాట్లాడుతూ బడ్జెట్‌లో 12వ పీఆర్‌సీని ప్రస్తావించకపోవటం శోచనీయమన్నారు. వేతనాలు పెరుగుతాయని ఆశించిన కార్మికుల ఆశలు నీరుగారి పోయాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, రాము, నాయకులు తిప్పేస్వామి, మల్లేసి, సిద్ధ, ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, వెంకటేశులు పాల్గొన్నారు.

మురుగు తొలగేదెన్నడు?

రాయదుర్గం పట్టణంలోని నేతాజీ రోడ్డులో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఓబుళాచారి రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో మలుపు దాటాక ఎడమ వైపున కాలువల్లో మురుగు నిలిచింది. దీంతో దోమల ఉద్ధృతి సైతం పెరిగింది. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులను పంపి మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం

సీసీ దారులు నిర్మించరూ..

రాయదురగం పట్టణం టీచర్స్ కాలనీలో దారికి ఇరువైపులా చెట్ల వల్ల పచ్చదనంతో ఉన్నప్పటికీ పలుచోట్ల సీసీ దారులు, మురుగు కాలువలు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు దారులు, మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, కణేకల్లు**

రక్షణ గోడ ఏర్పాటు చేయండి

రాయదుర్గం పట్టణంలోని దాసప్ప రోడ్డులో మురుగు కాలువకు కల్వర్టు వద్ద రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ గోడ కూలి ఏడాది గడుస్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. నిత్యం వేలాది మంది ప్రజలు ఇక్కడి నుంచే రాకపోకలు కొనసాగిస్తున్నారు. గతంలో పలువురు విద్యార్థులు సైకిళ్లతోపాటు కాలువలో పడిన ఘటనలున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ రక్షణ గోడ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

-న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

కేజీబీవీ దారి అధ్వానం

రాయదుర్గం పట్టణంలోని వాల్మీకి నగర్‌లో కేజీబీవీకు వెళ్లే దారి గుంతలు పడి అధ్వానంగా మారింది. కనీసం ఆటోలు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా మారింది. నిత్యం తల్లిదండ్రులు, ఇతర సరకులు తీసుకువెళ్లే ఆటోవాలాలు సైతం అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు దారి నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. **- న్యూస్‌టుడే, డి.హీరేహాళ్**

పెచ్చులూడుతున్న పైకప్పు

రాయదుర్గం పట్టణంలోని కణేకల్లు రోడ్డులోని పశువైద్యశాల నిర్మించి 50 ఏళ్లు కావడంతో పైకప్పు పెచ్చులూడుతోంది. దీంతో నిత్యం విధులు నిర్వహించే సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. నిత్యం వందలాది మంది రైతులు పశువుల చికిత్స కోసం వస్తుంటారు. అనుకోకుండా పెచ్చులూడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయమై పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

అవీ.. ఇవీ.. అన్నీ..

ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని మల్లాపురం బైపాస్‌లో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో రామస్వామి, బాలరాజులు గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఇద్దరికి కాళ్లు, చేతుల, తలకు గాయాలవడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కురువళ్లిలో వైద్య శిబిరం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా కురువళ్లిలో ఆదివారం ఆరోగ్య కార్యకర్తలు నాగేంద్ర, గోవర్ధన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు.

యువకుడి అదృశ్యం

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని బసాపురం గ్రామానికి చెందిన నందకుమార్(30) కొన్ని రోజుల నుంచి కనిపించడం లేదని ఆయన తల్లిదండ్రులు ఆదివారం కుందుర్పి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పొలంలోనే రైతు హఠాన్మరణం!

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లిలో పొలం పనులు చేస్తున్న రైతు వడ్డే రామస్వామి హఠాత్తుగా కుప్పకూలి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు విడపనకల్లు ఆసుపత్రికి, అక్కడి నుంచి ఉరవకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రామస్వామికి భార్య రంగమ్మ, కూతురు, కుమారుడు రమేష్ ఉన్నారు.

విష జ్వరంతో యానిమేటర్ మృతి

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని బిదురుకొంతం గ్రామానికి చెందిన వెలుగు పథకం యానిమేటర్ వికలాంగుడు వన్నూరుస్వామి కొన్నాళ్లుగా జ్వరంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

భవిష్యత్తు ప్రణాళికకు దిక్సూచి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ‘అభయ నిస్వార్థ ఫౌండేషన్’ నిర్వహిస్తున్న సూపర్-60 పదోతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో ఏ దిశగా వెళ్లాలనే ప్రశ్నకు దిక్సూచిలా ఉపయోగిపడుతుందని ఎంఈవో శ్రీధర్, ఉపాధ్యాయులు అశోక్ పేర్కొన్నారు. ఆదివారం కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సూపర్-60 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు బసవరాజు, ఆది ఆంధ్ర తిప్పేస్వామి, వన్నప్ప, ప్రసాద్, రామాంజనేయులు, మహేష్, ఓబులేష్, శ్రీనివాసులు, కుమార్, ధోనీ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ పరీక్షకు విద్యార్థుల హాజరు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్, ఏపీబీఆర్ఏజీ, సత్యసాయి కళాశాలల్లో ప్రవేశం నిమిత్తం పెట్టే పరీక్షలకు సిద్ధం చేయడానికి శిక్షణకు ఆదివారం పట్టణంలోని కరిబసవస్వామి పాఠశాలలో పరీక్ష నిర్వహించినట్లు ‘అభయ నిస్వార్థ బృందం’ సభ్యుడు వెంకట్ పేర్కొన్నారు. పరీక్షకు హాజరైన 172 మందిలో ప్రతిభ చూపిన 120 మందికి ఏప్రిల్ నుంచి మే 5 వరకు అనంతపురంలోని సీసీఎల్ క్యాంపస్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందిస్తున్న తిప్పయ్య కుటుంబ సభ్యులు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: అతి పురాతన ఆలయం అయిన రామేశ్వర ఆలయం(చోళరాజుల వంశంలోని కుళుత్తుంగ చోళుడు ప్రతిష్ఠించిన మరకత శివలింగం) అభివృద్ధికి కృషి చేస్తానని తెదేపా నాయకుడు తిప్పయ్య పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆదివారం శివ పార్వతుల కల్యాణోత్సవం అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు రూ.లక్ష చెక్కును ఆయన అందజేశారు.

నిలకడగా చింతపండు ధరలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన చింతపండు సంతలో ధరలు నిలకడగా ఉన్నాయి. రైతులకు ఇబ్బందులు, నష్టం జరగకుండా అధికారులు, మార్కెట్ యార్డు కమిటీ సభ్యులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే వ్యాపారులకు సంత ప్రారంభ విషయాన్ని తెలియజేశారు. కళ్యాణదుర్గంలో చింతచెట్లు ఎక్కువ ఉండటంతో సంతకు అదేస్థాయిలోనూ చింతపండు వస్తోంది. ఈ సీజన్‌లో కరిపులి రకం క్వింటాల్ ధర రూ.13,000 నుంచి రూ.17,500, ఫ్లవర్ రకం క్వింటాల్ ధర రూ.7,800 నుంచి రూ.12,000 పలుకుతోంది. ఇప్పటికే మార్కెట్ యార్డుకు మొత్తంగా 497 క్వింటాళ్ల చింతపండు వచ్చిందని, ధరలు నిలకడగానే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో కొనుగోళ్లు, అమ్మకాలను ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, సూపర్‌వైజర్ కేశవకుమార్, తెదేపా నాయకుడు రమేష్ పరిశీలిస్తున్నారు.

బంగారు నగలు, నగదు చోరీ

వజ్రకరూరు: వజ్రకరూరు మండలం చాబాల గ్రామం ఎస్సీ కాలనీలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం బంగారు నగలు, డబ్బులు చోరీకి గురయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. వ్యవసాయ కూలీగా జీవనం సాగించే లలిత ఇటీవల సొంత పనిమీద హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. అనంతపురంలో చదువుకునే ఆమె కుమారుడు ఆదివారం సొంతింటికి చేరుకోగా.. అప్పటికే ఇంటి తాళం తీసి ఉన్నట్లు గుర్తించారు. లోనికి వెళ్లి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా పరిశీలించగా అందులోని రెండు బంగారు గుండ్లు, ఉంగరాలు, గొలుసు, రూ.70 వేల నగదు చోరీ అయినట్లు బాధితులు గుర్తించారు.

ఎస్సీ, ఎస్టీ తెగల కమిషన్లకు అధికారమేదీ?

రుద్రంపేట: జాతీయ షెడ్యూల్డ్ కులాల, తెగల కమిషన్లకు హైకోర్టు అధికారాలు కల్పించాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం ఆయన రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు పెరుగుతున్నట్లు నేషనల్ క్రైమ్ బ్యూరో గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 75మంది ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అధికారాలు వచ్చేలా చూడాలన్నారు.

అంతటా శివోహం

శ్రీజరుట్ల రామలింగేశ్వరుడు

దర్శనంకోసం బారులు తీరిన భక్తులు

మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు

108 లింగాలకు పాలతో అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

50అడుగుల శివుడి విగ్రహం

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో శివరాత్రి పర్వదినోత్సవం వేడుకగా సాగింది. శివాలయాల ఆవరణలు భక్తులతో కిటకిటలాడాయి. జాగరణ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లలో భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, బిల్వార్చన, లింగార్చన తదితర పూజలు కొనసాగాయి. – న్యూస్‌టుడే బృందం

సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రుద్రంపల్లిలో ..

కుందుర్పిలో..

భవానీ శంకరస్వామి..

రామేశ్వరస్వామి..

పశుపతినాథుడు..

దర్శనానికి వరుస కట్టిన భక్తులు

రోడ్డు నిర్మించారు.. క్యూరింగ్‌లు మరిచారు!

న్యూస్‌టుడే రాయదుర్గం: రాయదుర్గం పట్టణంలో కొన్నాళ్లుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువురు ఆరోపిస్తున్నారు. సిమెంట్ రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణాలు జరుగుతున్నా.. నాణ్యతను తిలోదకాలు ఇస్తున్నట్లు తెలిసింది. రూ.3 కోట్లతో పట్టణంలోని కణేకల్లు రోడ్డు నుంచి బసవ నాగలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మించి నాలుగైదు రోజులవుతున్నా.. సదరు గుత్తేదారు సరైన తీరులో క్యూరింగ్ మరిచారు. స్థానిక ప్రజలతోపాటు తెదేపా నాయకుడు లోకేష్ ఈ విషయాన్ని గుత్తేదారుకు చెప్పడంతో శనివారం వక్కపొట్టు తీసుకొచ్చి రోడ్డుపై చల్లారు. పట్టణంలో ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

సీసీ దారిపై మడులు కట్టని తీరు

అధికారుల పర్యవేక్షణ లోపం

ఒకవైపు రోడ్డు నిర్మిస్తుండగానే మున్సిపల్ ఇంజినీర్లు కొలతలు తీసి బిల్లులు సిద్ధం చేసినట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. సీసీ రోడ్ల పనులు పూర్తయ్యాక చిన్నచిన్న మడులు కట్టి వాటిని 21 రోజులపాటు నీటితో నింపి క్యూరింగ్ చేయాల్సి ఉండగా.. ఇక్కడ కేవలం వక్కపొట్టు చల్లి నీరు చల్లి మమ అనిపిస్తున్నారు. దీంతో రూ.లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లకు పగుళ్లు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఇంజినీరు నరసింహులు ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ క్యూరింగ్ సక్రమంగా చేయాలని గుత్తేదారును ఆదేశించినట్లు పేర్కొన్నారు.

గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా మార్చాలి

గుత్తి: గుత్తికోటను పర్యాటక కేంద్రంగా చేయాలని కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. ఆదివారం మంత్రి సేవాలాల్ ఉత్సవాలకు వచ్చి పట్టణంలోని భాజపా నాయకులు తిమ్మారెడ్డి ఇంటికి వెళ్లి అల్పాహారం తీసుకున్నారు. అక్కడికి విజయ భాస్కర్ వెళ్లి మంత్రితో మాట్లాడారు. చారిత్రక కోటలోని పురాతన కట్టడాలు కూలిపోతున్నాయన్నారు.

కథల పుస్తకావిష్కరణ

ఎస్కేయూ: ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు రెడ్డెప్పరెడ్డి విలక్షణ కథాశిల్పి అని వక్తలు కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన ఆచార్య రెడ్డెప్పరెడ్డి రాసిన ‘ది గ్రేట్ డిక్లైన్ కథలు’ అనే పుస్తకాన్ని ఆదివారం విమలాశాంతి సేవా సమితి, అంబేడ్కర్ అక్షయం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

కోటంకలో భక్తులకు అన్నదానం

భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తెదేపా నాయకులు

గార్లదిన్నె (గ్రామీణం): మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలు భాగంగా నాలుగో ఆదివారం వచ్చిన వేలాదిమంది భక్తులకు మాజీ జడ్పీటీసీ సభ్యురాలు విశాలాక్షి, విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన సదుపాయం కల్పించారు. ఈకార్యక్రమాన్ని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఏడీసీసీబ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు.

గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా మార్చాలి

కోట చరిత్రను మంత్రికి వివరిస్తున్న విజయ భాస్కర్

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తికోటను పర్యాటక కేంద్రంగా చేయాలని కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. ఆదివారం మంత్రి సేవాలాల్ ఉత్సవాలకు వచ్చి పట్టణంలోని భాజపా నాయకులు తిమ్మారెడ్డి ఇంటికి వెళ్లి అల్పాహారం తీసుకున్నారు. అక్కడికి విజయ భాస్కర్ వెళ్లి మంత్రితో మాట్లాడారు. చారిత్రక కోటలోని పురాతన కట్టడాలు కూలిపోతున్నాయన్నారు. పురాతన కట్టడాల పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు ఇప్పించాలని కోరారు.

శాప్ లీగ్ పోటీల లోగో ఆవిష్కరణ

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: ఏపీ క్రీడాప్రాధికార సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న జిల్లా, రాష్ట్రస్థాయి శాప్ లీగ్ పోటీల లోగోను ఆదివారం రాత్రి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తన నివాసంలో ఆవిష్కరించారు. శాప్ లీగ్ జిల్లా స్థాయి పోటీలు 17 నుంచి ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. ఆరోజు జిల్లా స్థాయి చదరంగం పోటీలు డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ శాప్ ఆధ్వర్యంలో జరుగనున్న లీగ్ పోటీల్లో మన జిల్లా జట్టు విజయభేరి మోగించాలన్నారు. మొత్తం 31 అంశాల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు శాప్ ఆధ్వర్యంలో జరుగుతాయని, రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లను తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా శాప్ లీగ్ లోగో, షెడ్యూలును విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల, డీఎస్ఏ శిక్షకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు

తపోవనం (అనంత గ్రామీణం): చిన్మయ జగదీశ్వరాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు స్వామికి వివిధరకాల అభిషేకాలు చేశారు. చిన్మయ మిషన్ ఇన్‌ఛార్జి స్వామి విదానంద సరస్వతి ఆధ్వర్యంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం కమనీయంగా జరిగింది. అనంతపురం గ్రామీణ మండలం సజ్జలకాల్వ, ఎ.నారాయణపురం, సోమలదొడ్డి, పాముంలు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు భజనలతో జాగరణ చేశారు.

కసాపురం.. ప్రగతి ఆమడ దూరం

నిరుపయోగంగా ఎస్ఎస్ ట్యాంకు

★ గ్రామం : కసాపురం
★ నివాస గృహాలు : 1200
★ జనాభా : 4500

గుంతకల్లు, న్యూస్‌టుడే : అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఏ గ్రామంలో లేనివిధంగా ప్రతిరోజూ పెద్దసంఖ్యలో భక్తులు రాకపోకలు సాగించే గ్రామాల్లో కసాపురం ప్రథమ స్థానంలో ఉంటుంది. నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయం అభివృద్ధికి అధికారులు పనులను చేపట్టారు. కానీ గ్రామాభివృద్ధిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

20 ఏళ్ల కిందటే ట్యాంకు నిర్మాణం

కసాపురం గ్రామంతో పాటు నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి, సంగాల, దోనలదిన్నె గ్రామాలకు తుంగభద్ర నీటిని అందించడానికి గ్రామానికి రెండు కి.మీ.ల దూరంలో 20 ఏళ్ల కిందట ఎస్ఎస్ ట్యాంకును నిర్మించింది. ట్యాంకును నీటితో నింపినా అది ఇంకిపోతోంది. దీన్ని సరిచేయడానికి అధికారులు ప్రణాళిక రూపొందించినా నిధులు విడుదల కాలేదు.

ఫ్లోరైడ్ నీరు గ్రామానికి శాపం

★ కసాపురం ఆలయానికి, గ్రామానికి అవసరమైన నీటిని బోర్ల నుంచి సరఫరా చేస్తున్నారు. ఈనీటిలో అధిక శాతం ఫ్లోరైడ్ ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామస్థులు, భక్తులు వినియోగించాల్సి వస్తోంది.

• దుర్గంధం మధ్యనే భక్తుల రాకపోకలు

● సామాజిక భవన నిర్మాణానికి గతంలో ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించింది. స్థలం లేదని ఆలయానికి చెందిన స్థలంలో నిర్మించారు. ఇదికూడా గ్రామానికి దూరంగా ఉండటంతో అక్కరకు రాకుండా పోయింది.
● మురుగు కాలువలు దారుణంగా ఉండటంతో దుర్గంధం మధ్యనే భక్తులు నెట్టికంటయ్య దర్శనానికి వెళ్లాల్సి వస్తోంది.
● కాలువలు నిర్మించడానికి గత ప్రభుత్వం రూ.కోటి కేటాయించింది. పనులకు ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. తరువాత ఆ నిధులను దారి మళ్లించడంతో పనులు సాగలేదు. శుభకార్యాలు జరుపుకోవడానికి సామాజిక భవనం లేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు బస్టాండులో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు.

ప్రణాళికతో ముందుకెళ్తాం

కసాపురం ప్రజలకు తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు ప్రస్తుతం వృథాగా ఉంది. హంద్రీనీవా కాలువలో ప్రవహించే కృష్ణాజలాలను పంపింగ్ చేయడానికి అవసరమైన మోటార్లను సమకూర్చడానికి రూ.50 లక్షలు కేటాయించాలని జడ్పీ అధికారులకు విన్నవించాం. నిధులు విడుదలైన వెంటనే నీటిని పంపింగ్ చేయడం ప్రారంభిస్తాం. మురుగు కాలువల నిర్మాణం, కసాపురం గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు చేస్తాం. **- మాధవి, మండలాధ్యక్షురాలు**

జనరేటర్ ఉన్నా.. వాడని తీరు



విద్యుత్తు సరఫరా లేని సమయంలో తాగునీటి పంపింగ్‌కు అవరోధం ఏర్పడకుండా చూడాలన్న ఉద్దేశంతో రూ.6 లక్షలకు పైగా వ్యయం చేసి కొన్న జనరేటర్ ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం వల్ల తుప్పు పడుతోంది. తిమ్మాపురం గ్రామ సమీపంలో మున్సిపల్ అధికారులు నీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. గత ఆరు సంవత్సరాల కిందట ఈ పథకాన్ని పూర్తిగా తొలగించారు. అయితే ఓ గదిలో ఉన్న కొత్త జనరేటర్‌ను మాత్రం అలాగే ఉంచేశారు. వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే,గుంతకల్లు**

ఎస్సీ, ఎస్టీ తెగల కమిషన్లకు అధికారమేదీ?

రుద్రంపేట, న్యూస్‌టుడే: జాతీయ షెడ్యూల్ కులాల, తెగల కమిషన్లకు హైకోర్టు అధికారాలు కల్పించాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రవికాంత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం ఆయన రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు పెరుగుతున్నట్లు నేషనల్ క్రైమ్ బ్యూరో గణాంకాలు చెబుతున్నాయన్నారు.

హోరాహోరీగా బండలాగు పోటీలు

బండను లాగుతున్న వృషభాలు

పామిడి, న్యూస్‌టుడే : మండలంలోని వంకరాజుకాలువ గ్రామపంచాయతీలో ఉన్న పెన్నప్ప గుడి వద్ద ఎద్దుల, పశువుల తాలు 25 వార్షికోత్సవంలో భాగంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఆరుపళ్ల విభాగంలో వృషభాలకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో కర్నూలు జిల్లా వెంకటగిరికి చెందిన బీఎల్‌కే వృషభాలు మొదటి బహుమతి రూ. 40వేలు, అనంతపురం జిల్లాకు నాగేంద్ర రెడ్డి వృషభాలు రెండో బహుమతి రూ.30వేలు, గార్లదిన్నెకు చెందిన విష్ణుకాంత్‌రెడ్డి మూడో బహుమతి రూ.20వేలు, సత్యసాయి జిల్లాకు చెందిన బాచ్చల భాస్కర్ నాలుగో బహుమతి రూ.12 వేలు, ఇతర స్థానాల్లో గెలుపొందిన వారికి బహుతులను ప్రదానం చేశారు.

మాదిరి పదోతరగతి పరీక్షలు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదిరి పదోతరగతి పరీక్షలను నిర్వహించారు. శ్రీసాయి జూనియర్ కళాశాలలో పరీక్షలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలంటే భయం పోగొట్టేందుకు పరీక్షలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. వీటిపై విద్యార్థుల ఉత్తీర్ణతపై ఒక అంచనా వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో గేట్స్ కాలేజీ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, శ్రీసాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు రమేశ్, నవీన్‌యాదవ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కథల పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, ఆచార్యులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు రెడ్డెప్పరెడ్డి విలక్షణ కథాశిల్పి అని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన ఆచార్య రెడ్డెప్పరెడ్డి రాసిన 'ది గ్రేట్ డిక్లైన్ కథలు' అనే పుస్తకాన్ని ఆదివారం విమలాశాంతి సేవా సమితి, అంబేడ్కర్ అక్షయం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రముఖ కవి రాజారాం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆచార్య మేడిపల్లి రవికుమార్, జి. లక్ష్మీనరసయ్య, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రముఖ రచయిత శాంతినారాయణ, రచయితలు సడ్లపల్లి చిదంబరరెడ్డి, హనుమంతరెడ్డి, రాధేయ, రాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీకి జేసీ శివరాత్రి శుభాకాంక్షలు

ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరికి శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరికి శివరాత్రి శుభాకాంక్షలు చెప్పారు. పండగ సందర్భంగా పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీకి దర్శనానికి వచ్చిన ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి కుటుంబసభ్యులతో సహా ఎదురుపడటంతో కరచాలనం చేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. గత కొద్దికాలంగా జేసీ ఏఎస్పీపై పలు వ్యాఖ్యలు చేయడం, అతనిపై ఆగ్రహం వ్యక్తం చేయడం అందరికీ తెలిసిందే. ఈక్రమంలో ఇద్దరూ మాట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది.

నీటి సమస్యను పరిష్కరించరూ!

దోనిముక్కల కాలనీలో నీటి పథకం సంవత్సరం కిందట మూతపడింది. కాలనీలో బోరుకు విద్యుత్తు మోటారును ఏర్పాటుచేసి మూడు ట్యాంకులకు నీటిని అందించడానికి అధికారులు నిధులను వ్యయం చేశారు. పథకానికి చెందిన మోటారు మరమ్మతుకు గురైనా అధికారులు చోద్యం చూస్తున్నారు. నిరుపయోగంగా ఉండడంతో పైపులు పాడైపోతున్నాయి. పథకాన్ని పునరుద్ధరిస్తే దాదాపు 200 ఇళ్లకు నీటి సమస్య ఉండదు. అధికారులు వెంటనే నీటి పథకాన్ని పునరుద్ధరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుంతకల్లు**

గుంతల దారితో తిప్పలు

మండల పరిధిలోని గుమ్మేపల్లి నుంచి కల్లుమడికి వెళ్లే రహదారి గుంతమయంగా మారింది. ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈమార్గంలో భారీ వాహనాల రాకపోకలతో రహదారి అంతా గుంతలు పడి కంకర తేలింది. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, శింగనమల**

ఇంటిపై మృత్యుపాశాలు

నార్పలలోని ఓ ఇంటిపై 11 కేవీ విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. దీనిపై పలుమార్లు విద్యుత్తు అధికారులకు వినతి పత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని బాధితులు వాపోతున్నారు. ఈవిషయంలో లైన్‌మెన్ సైతం నిర్లక్ష్యంగా ఉన్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారుకోరుతున్నారు. **-న్యూస్‌టుడే, నార్పల**

మురుగు కాలువ శిథిలం

గుత్తిలోని ఆర్టీసీ బస్సు ప్రాంగణం వివిధ సమస్యలకు నిలయంగా మారింది. దీంతో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది అవస్థ పడుతున్నారు. కొన్నేళ్ల కిందట నిర్మించిన మురుగు కాలువలు పూర్తిగా శిథిలమయ్యాయి. ఫలితంగా మురుగు రోడ్డుపై పారుతోంది. మరోవైపు అధికారులు నూతన బస్సు ప్రాంగణం కోసం గత 15 రోజుల కిందట భూమి పూజ చేశారు. త్వరగా పనులు ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం**

స్పందించండి.. బాగు చేయండి!

తాడిపత్రి పట్టణంలో పలు చోట్ల రహదారులు దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నందలపాడులో రహదారిపై గొయ్యి ఏర్పడింది. యల్లనూరు రోడ్డు సర్కిల్, కడపరోడ్డుకు వెళ్లే మలుపులో రహదారి దెబ్బతింది. వీటిపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు నిర్వహించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తాడిపత్రి పట్టణం**

జూదస్థావరాలపై పోలీసుల దాడులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మండలంలోని పెద్దపొలమడ గ్రామంలో జూదం ఆడుతున్న పలువురిని అరెస్టు చేసినట్లు గ్రామీణ సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా 9 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.21,110 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

గుత్తి, న్యూస్‌టుడే: మండలంలోని అబ్బేదొడ్డి శివారులో పేకాట కేంద్రంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. కంపచెట్ల మధ్య జూదం ఆడుతున్న 8మందిని సీఐ రామారావు, ఎస్ఐ సురేశ్‌బాబు తన సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నారు. జూదరుల నుంచి రూ. 13,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. డ్రోన్‌సాయంతోనే జూద కేంద్రాన్ని గుర్తించామన్నారు.

గుంతకల్లు, న్యూస్‌టడే : గుంతకల్లు పట్టణ శివారులోని టిడ్కో ఇళ్ల సముదాయం సమీపంలో గ్రామీణ పోలీసులు ఆదివారం దాడులు చేసి జూదమాడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. వారి నుంచి రూ. 12,300 స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ: ఇద్దరికి గాయాలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మనచెరువు గ్రామ పరిధిలో కారు, ద్విచక్ర వాహనం ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. శింగనమల నియోజవర్గం గార్లదిన్నె మండలకేంద్రానికి చెందిన గణేష్, సుచరిత ద్విచక్ర వాహనంలో అశ్వర్థ ఆలయానికి వెళ్తుండగా వెనక నుంచి వస్తున్న కారు ఢీ కొంది. ఈ ఘటనలో గణేష్, సుచరితలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి, : గుత్తి, పామిడి, పెద్దవడుగూరు గ్రామీణంలో మద్యం దుకాణాల ఏర్పాటుకు గుత్తేదారులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గుత్తి ఎక్సైజ్ సీఐ ఉమాదేవి పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను రూ. 2లక్షలు నాన్‌రీఫండ్‌గా సొమ్ము చెల్లించాల్సి ఉందన్నారు. దుకాణాలకు రీనోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న గుత్తేదారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హరహర మహా దేవ.. శంభోశంకర

• వైభవంగా మహాశివరాత్రి పర్వదినం

నోట్లకట్టల హారం అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు

శివపార్వతి అలంకరణలో ముసలమ్మతల్లి

ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి

పెద్దవడుగూరులో వీరభద్రస్వామి

ప్రత్యేకాలంకరణలో భోగేశ్వరుడు

నాగులగుడ్డంలోని బ్రహ్మ సుత్రాల శివలింగం

ట్రాక్టర్ నగర్‌లో

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో మహాశివరాత్రి మహోత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం నుంచే శైవక్షేత్రాలన్నీ భక్తుల సందడితో కళకళలాడాయి. శివలింగాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయడానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆయా ఆధ్యాత్మిక క్షేత్రాల వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. **-న్యూస్‌టుడే బృందం**

శింగనమల: పూజల్లో పాల్గొన్న భక్తులు

గార్లదిన్నెలో

పెద్దపప్పూరులో చితంబరస్వామి

గుత్తిలో

తాడిపత్రి : నంది వాహనంపై బుగ్గరామలింగేశ్వరుడు

నీటి పథకం టెండర్లకు మోక్షమెన్నడో?

గుత్తి,న్యూస్‌టుడే: అనంతపురం రీజియన్‌లోనే తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న పట్టణంగా గుత్తి పురపాలికను గుర్తించారు. ఇక్కడ 6 నెలల కిందట వరకు నెలకోసారి తాగునీరు సరఫరా అయ్యేది. ఇప్పుడు 15రోజులకోసారి కుళాయిలకు పురపాలిక అధికారులు నీటిని వదులుతున్నారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో ఐదేళ్ల కిందట అప్పటి తెదేపా ప్రభుత్వం భారీ నీటి పథకాన్ని మంజూరు చేసింది. తొలుత రూ.70కోట్లతో గార్లదిన్నె ఎంపీఆర్ డ్యామ్ నుంచి గుత్తి వరకు పైపులైన్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి నీరు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా పనులు చేపట్టడంలో ఆలస్యం జరుగుతోంది. ఫలితంగా పథకం నిర్మాణ వ్యయం రూ. 173కోట్లకు చేరుకుంది.

గుత్తిలో అసంపూర్తిగా నీటి ట్యాంకు

పెరిగిన అంచనా వ్యయం : వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పథకం పనులను మూలనపడేసింది. తాజాగా పథకం నిర్మాణ వ్యయం రూ.200కోట్లకు చేరుకుంది. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పథకాన్ని పూర్తి చేయాలనుకొని నిర్ణయించుకుంది. గత ఏడాది టెండర్లను నిర్వహించింది.

పనుల అప్పగింతకు మీన మేషాలు : టెండర్లను పూర్తి చేసిన ప్రభుత్వం టెండర్లను ఖరారులో తీవ్ర జాప్యం చేస్తోంది. టెండర్లు పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా పనులను గుత్తేదారు సంస్థకు ఇవ్వడం లేదు. ఈకారణంగా పనులు మొదలు కావడంలేదు. నీటి పథకాన్ని 2020లోనే మంజూరు చేసినా పూర్తి చేయించడంలో ఆలస్యం జరుగుతోంది. ఇది పూర్తయితే గుత్తికి 30ఏళ్ల వరకు తాగునీటి సమస్య ఉండదు. ఈమేరకు పథకాన్ని రూపకల్పన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పథకం తెరపైకి వచ్చింది. గుత్తి, గుత్తిఆర్.ఎస్,చెట్నేపల్లి, సూరశింగనపల్లిలలో తాగునీటి సమస్య ఈపథకంతో తీరనుంది. గుత్తేదారు సంస్థకు పనులకు అప్పగింతపై చర్చలు జరుపుతున్నారు.

ఖరారు చేయాల్సి ఉంది

డిసెంబర్‌లోనే టెండర్లను ఉన్నతాధికారులు తెరిచారు. అయితే పనులు అప్పగింతకు ఆలస్యం జరుగుతోంది. ఏఐఐబీ అధికారులు గుత్తేదారు సంస్థలతో నిబంధనలపై చర్చిస్తున్నారు. టెండర్లు త్వరలోనే ఖరారు అవుతాయి. ఆ వెంటనే పనులు మొదలుపెడతారు. **-కేతన్‌రెడ్డి, డీఈఈ, ప్రజారోగ్య విభాగం, గుంతకల్లు**

రాగులపాడు కాలువను సాధించుకుందాం

ఐక్యతను చాటుతున్న రైతు సంఘం నాయకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు మండలంలోని చెరువులు, కుంటలకు హంద్రీనీవా నీటితో నింపడానికి ఉద్దేశించిన రాగులపాడు కాలువను సాధించుకోవడానికి రైతులమంతా కలిసి కట్టుగా పోరాడదామని రైతు సంఘం నాయకులు అన్నారు. ఆదివారం రైతుల సమావేశం బీరప్ప ఆలయం సామాజిక భవనంలో జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, రైతు సంఘం అధ్యక్షుడు జయన్న, కార్యదర్శి మందాలప్ప మాట్లాడారు. కాలువ ఏర్పాటుకు నిధులను కేటాయించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను, గుంతకల్లు ఎమ్మెల్యే జయరాంను కోరుతూనే ఉన్నామన్నారు. నిధులను విడుదల చేయాలని కోరుతూ ఈనెల 20 నుంచి గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని వివరించారు. రాజకీయాలకు అతీతంగా చేపడుతున్న ఆందోళనకు అన్ని వర్గాల వారు మద్దతు ఇవ్వాలని వారు విజ్ఞప్తిచేశారు. రైతు సంఘం నాయకులు కమత్యాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మల్లికార్జున, కదిరెప్ప, రంగయ్య, పాండురంగారెడ్డి, రమేశ్, సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, మహేశ్, రామాంజనేయులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కొరవడి.. అంగన్‌వాడీ తడబడి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని కేంద్రాల్లో చిన్నారులు లేకపోవడంతో బోసిపోయి దర్శనమిస్తున్నాయి. మరికొన్ని కేంద్రాలు పర్యవేక్షణ లేక గాడి తప్పుతున్నాయి.

పోషకాహారం పక్కదారి

కాశేపల్లిలో ప్రధాన కేంద్రంలో 20 మంది ఉండాల్సి ఉండగా రికార్డుల్లో నలుగురిని చూపారు. ఇందులో శనివారం కనీసం ఒక్కరు కూడా కేంద్రంలో కనిపించలేదు. దీనిపై స్థానికులు ప్రశ్నిస్తే తల్లిదండ్రులు బయటకు తీసుకెళ్లారంటూ కార్యకర్త బుకాయించారు. ప్రభుత్వ లక్ష్యాలను కొందరు కార్యకర్తలు నీరుగారుస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మిడుతూరు గ్రామంలో ఎస్సీ కాలనీలోని కేంద్రంలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ కేంద్రం ఉన్నట్లు కనీసం బోర్డు కూడా లేకపోవడం గమనార్హం. గంజిగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఒక చిన్నారి మాత్రమే ఉంది. చాలా గ్రామాల్లో చిన్నారులకు ఇవ్వాల్సిన పోషకాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. దీనిపై స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు.

కాశేపల్లిలో చిన్నారులు లేని కేంద్రం

వంతుల వారీగా విధులు

కొన్నిచోట్ల ఆయాలు ఉంటే కార్యకర్తలు ఉండని పరిస్థితి. కొండుపల్లి, కోనాపురం కేంద్రాల్లో ఆయాలు, కార్యకర్తలు వంతుల వారీగా రోజుకొకరు విధులకు హాజరవుతూ వ్యక్తిగత పనులకు వెళ్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై సూపర్‌వైజరు నాగేశ్వరిని వివరణ కోరగా కేంద్రాలు సరిగా ఉండేలా చూస్తామని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు తెలితే చర్యలు తీసుకుంటామన్నారు.

సామాజిక తనిఖీ వివరాల వెల్లడి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : గుట్టుచప్పుడు కాకుండా సామాజిక తనిఖీ అని 'ఈనాడు'లో ఆదివారం ప్రత్యేక కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఏపీవో సుజాత సామాజిక తనిఖీకి సంబంధించిన వివరాలను మీడియాకు విడుదల చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ఉపాధిహామీ సామాజిక తనిఖీ నెల రోజులపాటు కొనసాగుతుందని ఏపీవో సుజాత తెలిపారు. 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు, మెటీరియర్ ఖర్చులకు రూ.14.5 కోట్లు ఖర్చు చేశామన్నారు. వారం రోజుల కిందటే సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ, డీఆర్‌పిలు రికార్డులు స్వాధీనం చేసుకుని పనుల తనిఖీకి గ్రామాలకు వెళ్లారన్నారు. ప్రతి పంచాయతీలో వారం రోజుల పాటు నిశితంగా పనులు తనిఖీ చేస్తారన్నారు. తర్వాత గ్రామసభలు నిర్వహించి, మండల ప్రజావేధిక నిర్వహిస్తామన్నారు. మండలంలో ఉపాధిహామీ పనులకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే ప్రజలు సామాజిక తనిఖీ బృందానికి ఫిర్యాదు చేయవచ్చని ఆమె తెలిపారు.

18న వాహనాలకు వేలంపాట

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో జప్తు చేసిన పలు వాహనాలకు ఈనెల 18న స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

విద్యుత్తు సమస్యలా.. ఫోన్ చేయండి

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్, జిల్లాస్థాయిలో విద్యుత్తు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు డయల్ యువర్ సీఎండీ, డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం తెలిపారు. అనంతపురం జిల్లా విద్యుత్తు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు కింది నంబర్లకు తెలియజేయవచ్చన్నారు. • డయల్ యువర్ సీఎండీ • **సమయం :** ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 • ఫోన్ నెంబరు 89777 16661 • డయల్ యువర్ ఎస్ఈ • సమయం 8:30 - 9:30 గంటలు • అనంతపురం: 91547 90350

గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా మార్చాలి

కోట చరిత్రను మంత్రికి వివరిస్తున్న విజయ భాస్కర్

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తికోటను పర్యాటక కేంద్రంగా చేయాలని కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. ఆదివారం మంత్రి సేవాలాల్ ఉత్సవాలకు వచ్చి పట్టణంలోని భాజపా నాయకులు తిమ్మారెడ్డి ఇంటికి వెళ్లి అల్పాహారం తీసుకున్నారు. అక్కడికి విజయ భాస్కర్ వెళ్లి మంత్రితో మాట్లాడారు. చారిత్రక కోటలోని పురాతన కట్టడాలు కూలిపోతున్నాయన్నారు. పురాతన కట్టడాల పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు ఇప్పించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ తెగల కమిషన్లకు అధికారమేదీ?

రుద్రంపేట, న్యూస్‌టుడే: జాతీయ షెడ్యూల్డ్ కులాల, తెగల కమిషన్లకు హైకోర్టు అధికారాలు కల్పించాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం ఆయన రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు పెరుగుతున్నట్లు నేషనల్ క్రైమ్ బ్యూరో గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 75మంది ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అధికారాలు వచ్చేలా చూడాలన్నారు.

ఖాతా మార్పు.. ప్రగతికి మార్గం

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: గతంలో పన్నులు వసూళ్లు చేస్తే ఏరోజుకారోజు ప్రభుత్వ ఖాతాలకు ఆ మొత్తం జమయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరపాలక పరిధిలో ఆస్తి, ఖాళీ జాగా, నీటి పన్నులు చెల్లిస్తే, ఆ మొత్తాన్ని నేరుగా అభివృద్ధి పనులకు వినియోగించుకొనే వెసులుబాటు కల్పించింది. నగరంలోని ప్రజలు చెల్లించే పన్నులతోనే మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఆశించిన మేరకు వసూళ్లయితేనే అభివృద్ధి పనులు ఆశావహంగా సాగుతాయని అధికారులు తెలుపుతున్నారు.

అంకెల్లో ఇలా....

మొత్తం అసెస్‌మెంట్లు	: 60,603
బకాయిలు	: రూ. 80.94కోట్లు
ఇప్పటివరకు వసూలు	: రూ. 28.29 కోట్లు
ఇంకా రావాల్సిన మొత్తం	: రూ. 52.65 కోట్లు

గడువు సమీపిస్తున్నా ఇంకా వెనుకడుగే

ఈ ఏడాది మార్చి 31 తేదీకి ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఇప్పటివరకు కనీసం సగం మొత్తం కూడా వసూలు కాలేదు. ఎక్కువ బకాయిలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నగరంలో పలురకాల పనులు చేసిన గుత్తేదారులకు రూ.15కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అప్పుడే కొత్త పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకొస్తారు. ఈ దిశగా నగరపాలక అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

సెలవు రోజుల్లోనూ చెల్లించే వెసులుబాటు

మార్చి 31 వరకు సెలవు రోజుల్లోనూ నగరపాలకలోని పన్నుల వసూళ్ల కేంద్రం తెరిచే ఉంటుంది. ఆదివారాలు పన్నులు చెల్లించడానికి అవకాశం కల్పించాం. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో పన్నులు చెల్లించి నగర ప్రగతికి తోడ్పడాలి.

- జశ్వంత్‌రావు, నగరపాలక సంస్థ కమిషనరు

స్వామి సన్నిధిలో..

హౌసింగ్ బోర్డు కాశీ విశ్వేశ్వరాలయంలో..

✤ ఉదయం 6 గంటలకు యామ పూజ ముగింపు సేవ ✤ 6.30కు పంచామృతాభిషేకం ✤ 7 గంటలకు అన్నాభిషేకం ✤ 8.30కు మహామంగళ హారతులు ✤ 8.45 ప్రసాద వితరణ ✤ సాయంత్రం 5 గంటలకు సర్వదర్శనం ✤ 6.30కు మహా మంగళ హారతులు ✤ రాత్రి 8 గంటలకు పవళింపు సేవ

మొదటి రోడ్డు శివాలయంలో..

ఉదయం 5.30 గంటలకు యామ పూజ ముగింపు సేవ ✦ 8 గంటలకు రథాంగ హోమం ✦ 10కి మడుగు తేరు ✦ సాయంత్రం 5 గంటలకు దీక్షా హోమం ✦ 5.30కు బ్రహ్మ రథోత్సవం ✦ రాత్రి 8కి దశ హారతులు

- అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, ఆచార్యులు

కథల పుస్తకావిష్కరణ

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు రెడ్డెప్పరెడ్డి విలక్షణ కథారచయిత అని పలువురు కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన ఆచార్య రెడ్డెప్ప రెడ్డి రాసిన 'ది గ్రేట్ డిక్లైన్ కథలు' అనే పుస్తకాన్ని ఆదివారం విమలాశాంతి సేవా సమితి, అంబేడ్కర్ అక్షయం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రముఖ కవి రాజారాం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో [illegible] ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రముఖ రచయిత శాంతినారాయణ, రచయితలు సడ్లపల్లి చిదంబరరెడ్డి, హనుమంతరెడ్డి, రాధేయ, రాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయటే కాలకృత్యాలు

● **మార్కెట్‌యార్డులో ఇదీ పరిస్థితి**

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో పశువులు, గొర్రెలు, మేకల సంతలకు వచ్చే వ్యాపారులు, కాపర్లు, రైతులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు [illegible] ... అక్కడ కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. దీని వల్ల దుర్వాసన వస్తోందని, భరించలేక పోతున్నామని [illegible]

తలుపులు లేకపోవడంతో అపరిశుభ్రంగా..

హోరాహోరీగా బండలాగు పోటీలు

పామిడి, న్యూస్‌టుడే : మండలంలోని వంకరాజుకాలువ గ్రామపంచాయతీలో ఉన్న పెన్నప్ప గుడి వద్ద ఎర్రితాత, పక్కీరప్ప తాతల 25 వార్షికోత్సవంలో భాగంగా [illegible] ... బహుమతులు ప్రదానం చేశారు.

శాప్ లీగ్ పోటీల లోగో ఆవిష్కరణ

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఏపీ క్రీడాప్రాధికార సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న జిల్లా, రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ పోటీల లోగోను ఆదివారం రాత్రి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తన నివాసంలో ఆవిష్కరించారు. శాప్ లీగ్ జిల్లా స్థాయి పోటీలు 17 నుంచి ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. ఆరోజు జిల్లా స్థాయి చదరంగం పోటీలు డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ శాప్ ఆధ్వర్యంలో జరుగనున్న లీగ్ పోటీల్లో మన జిల్లా జట్లు విజయభేరి మోగించాలన్నారు. మొత్తం 31 అంశాల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు శాప్ ఆధ్వర్యంలో జరుగుతాయని, రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్లను తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా శాప్ లీగ్ లోగో, షెడ్యూలును విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల, డీఎస్ఏ శిక్షకులు పాల్గొన్నారు.

లోగో ఆవిష్కరిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

మొక్కే అని వదిలేస్తే.. ముప్పే

నగరంలోని జిల్లా ఉద్యాన శాఖ, సూక్ష్మ సాగునీటి పథక సంచాలకులు, ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రం అన్నీ కలిసి ఒకే భవనంలో ఉన్నాయి. కార్యాలయానికి వెనుక భాగంలో గోడపై బిగించిన పైపులతో పాటు ఫోన్‌లైన్లు, వీడియో కాన్ఫరెన్స్‌కు అవసరమైన వైర్లతో లైన్లు లాగారు. వాటి వద్ద ఫోన్ బాక్సు బిగించారు. పెద్ద పైపుల మధ్యలో జువ్వి మొక్క మొలిచి గోడలు బీటలు వారాయి. ఫలితంగా ఫోన్, వీడియో కాన్ఫరెన్స్ లైన్లకు తరచు అంతరాయం కలుగుతోంది. మొక్కే అని వదిలేస్తే మానై భవన భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

-న్యూస్‌టుడే, అనంతపురం(వ్యవసాయం)

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా నియంత్రిక

నగరంలోని వేణుగోపాల్‌నగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. ఆర్టీసీ బస్టాండు నుంచి ఎన్టీఆర్ మార్గ్‌కు వెళ్లే మార్గంలో మాస్టర్‌మైండ్స్ కళాశాలకు సమీపంలో దీన్ని ఏర్పాటు చేశారు. గత్యంతరం లేక వాహనచోదకులు దీన్ని ఆనుకొని వెళ్లాల్సి వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు వాహనాలు ఢీకొట్టకుండా ఉండేందుకు పార్కు బెంచీ ఏర్పాటు చేశారు. అక్కడ కూర్చున్నా ప్రమాదం తప్పదని, విద్యుత్తు శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, వేణుగోపాల్‌నగర్**

శివబాలయోగి ఆశ్రమంలో ప్రత్యేకాలంకారంలో అనంతేశ్వరుడు, అమ్మవారు

శారదానగర్‌లో సహస్ర లింగేశ్వరుడు

రెవెన్యూ కాలనీలో..

విశేషాలంకారంలో శివకోటి కామేశ్వరి సమేత మహేశ్వరుడు

మొదటి రోడ్డు శివాలయంలో ప్రత్యేకాలంకారంలో స్వామి

జగమంతా కైలాసమయం

● భక్తులతో పోటెత్తిన శివాలయాలు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నగరం పరమేశ్వరుడి కైలాసాన్ని తలపించింది. వేకువజాము నుంచే శివాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. బెంగుళూరు రోడ్డులోని అనంతేశ్వర ఆలయంలో 108 మంది దంపతులతో శతరుద్ర మహాయాగం వైభవంగా జరిగింది. సహస్ర లింగాల సమేత భారీ లింగం, ఆరడుగుల అమర్‌నాథ్ మంచులింగాలు ఆకట్టుకున్నాయి. జిల్లా ఫ్యామిలీ కోర్టు అదనపు జడ్జి హరిత దంపతులు హోమం చేశారు. రాత్రి నాట్య గురువు దేవరకొండ కౌసల్య సారథ్యంలో నృత్య ప్రదర్శనలు, శివబాలయోగి మహారాజ్ శిష్య బృందం ప్రత్యేక భజనలు అలరించాయి. హెచ్ఎల్సీ కాలనీ కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయంలో 1008 పార్థివ (మట్టి) లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాగంటి లత, భాస్కర రెడ్డి కుటుంబ సభ్యులు పుట్ట మట్టితో ఈ లింగాలను రూపొందించారు. ప్రతి శివాలయంలో సాయంత్రం 6 నుంచి ప్రతి మూడు గంటల చొప్పున నాలుగు యామ పూజలు, లింగోద్భవకాల మహారుద్రాభిషేకాలు జరిగాయి. కార్యక్రమాలను ఆయా ఆలయాల పాలకవర్గం, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శివబాలయోగి ఆశ్రమంలో హోమం చేస్తున్న అదనపు జడ్జి హరిత దంపతులు, భక్తులు

నంది వాహనంపై పరమేశ్వరుడి గ్రామోత్సవం

నగరంలోని మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో 8వ రోజు ఆదివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అమిలినేని నరేంద్రచౌదరి, ఈవో నాగేంద్రుడు ఆధ్వర్యంలో స్వామికి మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం జరిగింది. సాయంత్రం దీక్షా హోమం అనంతరం శివపార్వతులు నంది వాహనంపై విహరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. కమిటీ సభ్యులు, దేవాదాయశాఖ పరమేశ్వర, నవీన్, అర్చక బృందం నరసింహాశాస్త్రి, శ్రీహర్ష, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

మొదటి రోడ్డు శివాలయం ముందు బారులు తీరిన భక్తులు

హెచ్ఎల్సీ కాలనీలోని ఆలయంలో పార్థివ(మట్టి) లింగాలు

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

తపోవనం: గౌరీమహేశ్వర కల్యాణమూర్తులు

లక్ష్మీనగర్ రామాలయంలో...

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని పలు శివాలయాల్లో గౌరీమహేశ్వరుల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. బెంగళూరు రోడ్డులోని శివకోటి, హౌసింగ్ బోర్డు వేంకటేశ్వర, మొదటి రోడ్డులోని శివాలయం, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో తితిదే కల్యాణమండపం తదితరాల్లో జరిగిన కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మొదటి రోడ్డు శివాలయంలో స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. లక్ష్మీనగర్‌లోని రామాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది.

తపోవనం (అనంత గ్రామీణం): చిన్మయ జగదీశ్వరాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు స్వామికి వివిధరకాల అభిషేకాలు చేశారు. చిన్మయ మిషన్ ఇన్‌ఛార్జి స్వామి విదానంద సరస్వతి ఆధ్వర్యంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం కమనీయంగా జరిగింది. అనంతపురం గ్రామీణ మండలం సజ్జలకాల్వ, ఎ.నారాయణపురం, సోములదొడ్డి, పాములరాయి గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు భజనలతో జాగరణ చేశారు.

పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి దంపతులు

కాయగూరల ధరలు

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: (అనంతపురం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) టమాటాలు 20, రెండోరకం 10, ఉల్లిగడ్డలు 35, రెండోరకం 25, బంగాళాదుంపలు 30, మిరపకాయలు 40, బెండకాయలు 25, వంకాయలు 20.

కోటంకలో భక్తులకు అన్నదానం

గార్లదిన్నె గ్రామీణం: మండలంలోని కోటంక సమీప కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలు భాగంగా నాలుగో ఆదివారం వచ్చిన వేలామంది భక్తులకు మాజీ జడ్పీటీసీ సభ్యురాలు విశాలాక్షి, విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన సదుపాయం కల్పించారు. ఈకార్యక్రమాన్ని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఏడీసీసీబ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, చేతుల మీదుగా ప్రారంభించారు.

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: గౌరి: లవ్‌స్టోరీ, **గాయత్రి:** విత్ లవ్, చథా పచ్చ, **నీలిమ :** మన సంతా నువ్వే, **త్రివేణి:** సీతా పయనం, **తేజశ్విని :** నిలవె, అమరావతికి ఆహ్వానం, **ఎస్వీ సినిమా, శాంతి, తరంగిణి :** కపుల్ ఫ్రెండ్లీ, ఫంకీ, **సుధా:** మన శంకర వరప్రసాద్.

మాదిరి పదోతరగతి పరీక్షలు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదిరి పదోతరగతి పరీక్షలను నిర్వహించారు. శ్రీసాయి జూనియర్ కాలేజీలో పరీక్షలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలంటే భయం పోగొట్టేందుకు పరీక్షలు దోహదపడతామని నిర్వాహకులు తెలిపారు. వీటిపై విద్యార్థుల ఉత్తీర్ణతపై ఒక అంచనా వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో గేట్స్ కాలేజీ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, శ్రీసాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు రమేశ్, నవీన్ యాదవ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదానికి ఆహ్వానం

● **నగరవాసులకు ఆటవిడుపుగా ఉద్యానాలు**

అనంతపురం (అశోక్‌నగర్): మానవ నిర్మితమైనా ప్రకృతి సౌందర్యాన్ని పుణికిపుచ్చుకునే ఉద్యానాలు ఆహ్లాదానికి ఆలవాలాలు. ఆధునిక జీవనంలో ఉరుకులు, పరుగులతో అలసిపోయే మనుషులు కాసేపు సేదతీరేందుకు ఇక్కడికి వస్తుంటారు. నగరవాసులను ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంచడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. నగరాలు, పురపాలికల్లో లేఅవుట్లు వేసే సమయంలోనే పార్కుల కోసం కొంత స్థలాన్ని వదలడం నిబంధన. నగరపాలక సాధారణ నిధుల నుంచి 10 శాతం వీటి అభివృద్ధి, నిర్వహణకు కేటాయిస్తారు. మనసుతో ఆలోచిస్తే వాటిని అందంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దొచ్చని అనంత నగరపాలక సంస్థ నిరూపించింది. శారదానగర్‌లోని శిల్ప కళారామం ఉద్యానం మనసుకు హత్తుకునే విధంగా రూపొందించారు. వృథాగా ఉన్న తపాలా డబ్బా, పైపుల్లో మొక్కలు ఉంచి ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. విద్యార్థులు చదువుకోవడానికి, స్థానికులకు ఆనందం పంచేలా ఇక్కడి పరిసరాలు స్వాగతం పలుకుతున్నాయి.

శారదానగర్‌లోని శిల్పారామంలో పచ్చదనం పరవళ్లు

మనసు పెట్టారు.. మెప్పించారు

ఒకప్పుడు నేతాజీ ఉద్యానం అడుగు పెట్టలేని విధంగా ఉండేది. ఎక్కడ చూసినా మద్యం సీసాలు, వ్యర్థాలు పోగుపడి కనిపించేవి. మహిళలు, చిన్నారులు వెళ్లాలంటే భయపడేవారు. స్థానికులు వ్యాయామశాల ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితి. సమస్యలపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమవడంతో నగరపాలక అధికారులు స్పందించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద రూ. 37లక్షల నిధులు కేటాయించడంతో పార్కు రూపురేఖలు మారాయి. నడక దారి ఏర్పాటు చేసి పచ్చిక పరిచి ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. కూర్చోడానికి బెంచీలు అమర్చారు. సంగమేష్‌నగర్, అశోక్‌నగర్, సాయినగర్, బోయవీధి తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది సందర్శకులు పార్కులో ఉదయం, సాయంత్రం నడకకు వస్తున్నారు.

అధిక శబ్దాలతో బెంబేలు

● ప్రెషర్ హారన్లు, మైకులతో కర్ణకఠోరం

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో త్రిచక్ర, నాలుగు చక్రాల వాహన దారులు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. వ్యాపారం కోసం వినియోగించే చిన్న పాటి లగేజీ ఆటోల్లో అధిక శబ్దాలను వెదజల్లే ప్రెషర్ హారన్లు, మైకులను విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. ఇటువంటి వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు నిఘా ఉంచి అడ్డుకట్ట వేయాలి. స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి హారన్లను తొలగించడంతో పాటు అమర్చుకున్న వాహనదారులపై కేసులు నమోదు చేయాలి.

● ప్రెషర్ హారన్ అనేది సాధారణంగా లారీలు, బస్సులు, ఇతర భారీ వాహనాలకు అమర్చుతారు. వాటి నుంచి అధిక స్థాయిలో శబ్దం వెలువడుతుంది. ఈ కారణం చేత ప్రభుత్వం ఆ హారన్లను నిషేధించింది. శబ్దతీవ్రత 117 నుంచి 118 డెసిబుల్స్ ఉంటుంది. ఈ శబ్దాలను వింటే మనుషుల్లో కర్ణభేరి దెబ్బతిని శాశ్వతంగా చెవుడు వచ్చే అవకాశం ఉంది.

● గతంలో నగరంలో నాలుగైదు ఆటోలు, ద్విచక్ర వాహనాలకు ఉండేవి. ఇప్పుడు ఈ సంఖ్య 500 నుంచి 600 ఆటోలకు చేరింది. నగరంలో ప్రయాణికులను చేరవేసే ఆటోలు ట్రాఫిక్‌లో ఇష్టారాజ్యంగా హారన్లను వాడుతున్నారు. వేగంగా వెళ్తూ, తోటి వాహనదారులు బెంబేలెత్తేలా హారన్ మోగిస్తూ దూసుకెళ్తున్నారు. ఉదయం వేళల్లో, రోడ్లు ఖాళీగా ఉన్న సమయాల్లో సైతం హారన్లను మోగిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. వృద్ధులకు చెవుడు సంభవించడంతో పాటు గుండె జబ్బులు ఉన్నవారు హారన్ శబ్దాలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చిన్నపిల్లలు వృద్ధులు చెవి, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.

● ఉదయం చెత్త సేకరించే మున్సిపల్ వాహనాల మైకులతో మొదలుకొని... నగర వీధుల్లో దినుసులు, కూరగాయలు, పూలు విక్రయించే వాహనాల వరకు అధిక శబ్దాన్నిచ్చే మైకులు, స్పీకర్లు వాడుతున్నారు.

ఆటోకు బిగించిన ప్రెషర్ హారన్

పౌరులు స్వచ్ఛందంగా ఫిర్యాదు

నగరంలోని గడియార స్తంభం, సప్తగిరి కూడలి, శ్రీకంఠం కూడలి, ఐరన్ బ్రిడ్జి వంటి ఎక్కువ రద్దీ ఉండే కూడళ్లలో వ్యాపార దుకాణాదారులు శబ్దకాలుష్యానికి తీవ్రంగా ప్రభావితం చెందుతున్నారు. గడియార స్తంభం వద్ద ఓ దుకాణాదారుడు కొంత మంది నగర పౌరులతో కలిసి ఎస్పీ జగదీశ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రెషర్ హారన్ ఆటోల ఆట కట్టించాలని వారు కోరారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU
E.P.No. 249/2019 in O.S. No. 163/2017

Between:
Canara Bank (Rep by its authorized officer, Chief Manager & Authorised officer, Canara Bank Main Branch Anantapuramu) **...Petitioner/ D.Hr.**

V/S

P.Gopal S/o P.Govinda Chari, D.No. 22-196, Mahaldar Street, Old Town, Anantapuramu. **.. Respondent/ J.Dr**

వేలం ప్రకటన

అర్జీదారుడు E.P. మొత్తమును రాబట్టుటకు J.Drకు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలములో పాల్గొనదలచినవారు **05-03-2026**వ తేది ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

Property Of J.Dr (P.Gopal)
SCHEDULE

Property situated within Ananthapuramu R.D, Ananthapuramu S.D & Town Municipal Area:

	Old	New	Latest
Ward No:	7	16	22
Door No:	77	146	153 & 160
Asst No:	2179	5549	23635

Block No: 12; T.S.No: 1542, Mahaldar Street, Ananthapuramu Extent: 57 sft shop. **Boundaries: East:** same D.No paiki same day room purchased from Sheikh Shaukat Ali. **South:** Mahaldar Street Road. **West:** Bandaru Syed Ahammad sahab. **North:** same D.No paiki same day room purchased from Rama Chari. Measurement:
East to west: 6 feet or 1.82 Mts,
North to South: 9 1/2 or 2.89 Mts
D.Hr Value Rs. 10,00,000/-
అమీనా వ్యాల్యు రూ. 20,00,000/-
Market Value Rs. 2,51,070/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

చిలమకూరి శ్రీనివాసులు, అడ్వకేట్, అనంతపురం. సెల్: **9490122008.**

(c) eenadu

ఈనాడు అన్నమయ్య
సోమవారం ఫిబ్రవరి 16, 2026

● భూకైలాసమైన శ్రీకాళహస్తి ● కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

జగమేలే జంగమా.. జయహో శివలింగమా!

జగమేలే జంగమయ్యను గుండెల నిండా నింపుకొని.. 'ఓం నమః శివాయ' అని ధ్యానిస్తూ ఆ ముక్కంటి దర్శనానికి భక్తకోటి బారులు తీరారు. శివయ్యను దర్శించి కన్నీటితోనే అభిషేకిస్తూ మొక్కులు చెల్లించారు. ఆదివారం శివరాత్రి పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పసిపాప నుంచి ముసలి వారి వరకూ.. అందరినోట ఒకటే మంత్రం **ఓం నమః శివాయ.** జిల్లాలో ప్రధాన శైవ క్షేత్రాలన్నీ కిటకిటలాడాయి.

వాల్మీకిపురంలో...

● రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆంధ్రా, కన్నడ భక్తులతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండ భక్తజనంతో కిటకిటలాడింది.. వేలాదిగా భక్తులు తరలి రావడంతో కొండంతా జనంతో నిండిపోయింది. మదనపల్లెలోని మడికయ్యల శివాలయం, రామసముద్రం వాలీశ్వరాలయం, నిమ్మనపల్లెలో తవళం నేల మల్లేశ్వరుడు, సోమల సోమేశ్వరస్వామి, కలకడ కామాక్షీ సమేత సిద్ధేశ్వరాలయం, ఝరికోన, వాల్మీకిపురం లక్ష్మీ కామేశ్వరాలయం, ఉమామహేశ్వరాలయం, లింగోద్భవ మహా శివుడి క్షేత్రాలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శివ నామ స్మరణతో మార్మోగాయి. **- ఈనాడు, చిత్తూరు, తిరుపతి, న్యూస్‌టుడే, అన్నమయ్య బృందం**

పుంగనూరులో అర్ధనారీశ్వరుడిగా..

శ్రీకాళహస్తిలో..

రాయచోటిలో రథంపై వీరభద్రుడు, స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు, నీరుగుట్టువారిపల్లెలో శివయ్య కల్యాణం

పుంగనూరు శివాలయంలో...

శ్రీకాళహస్తిలో రాయంచపై ముక్కంటి

● దక్షిణ కైలాసమైన శ్రీకాళహస్తిలో వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరిగాయి. మహాశివరాత్రి వేళ స్వామి, అమ్మవార్లు ఇంద్ర విమానం, చప్పరంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నిర్వహించిన పంచమూర్తుల ఊరేగింపుతో తిరుమాడ వీధులు భక్తజన సంద్రంగా మారాయి. స్వర్ణముఖిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. శ్రీకాళహస్తీశ్వరుడిని, జ్ఞానప్రసూనాంబను దర్శించుకునేందుకు గంటలతరబడి వేచిఉన్నారు.

భేతాళ నృత్యాలతో కళాకారుల సందడి

అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మభాష!

మహల్‌లో బాలలకు పాఠాలు చెబుతున్న కార్యకర్త

▶ ఆంగ్లంతో పాటు తెలుగుకూ ప్రాధాన్యం

కలికిరి, న్యూస్‌టుడే: మాతృభాష మనిషి వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తూ.. సంస్కృతికి అద్దం పడుతూ.. ఆలోచనలు, భావోద్వేగాలను రేకెత్తిస్తుంది. అలాంటి అమ్మభాషను వెనక్కి నెడుతూ గత వైకాపా ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమానికి ప్రాధాన్యం ఇచ్చి ఆంగ్ల మాధ్యమ పుస్తకాలను మాత్రమే పంపిణీ చేశారు. దీంతో గత ఐదేళ్ల పూర్వ ప్రాథమిక విద్యలోనే చిన్నారులు మాతృభాషకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం మాతృభాషలో ముద్రించిన నూతన పుస్తకాలను ఇటీవల సరఫరా చేసింది.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: **10**
అంగన్‌వాడీ కేంద్రాలు: **2,275**
చిన్నారులు: **90,949**

ఆసక్తి పెరిగేలా.. ఆకర్షణీయంగా..

చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంచేలా తెలుగు, ఆంగ్లంలో రూపొందించిన పీపీ-1, పీపీ-2 పుస్తకాలను ఉచితంగా కూటమి ప్రభుత్వంలో అధికారులు అందజేశారు. గతంలో పిల్లలకు నాలుగు పుస్తకాలు మాత్రమే ఇచ్చే వారు. ప్రస్తుతం ఐదు పాఠ్య పుస్తకాలు అందజేశారు. మూడేళ్లలోపు వయసున్న వారిని ప్రీ ప్రైమరీ (పీపీ)-1, మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలను ప్రీ ప్రైమరీ (పీపీ)-2గా విభజించి పాఠాలు బోధిస్తున్నారు. దీంతో బోధనలో ఉన్న అడ్డంకులన్నీ తొలగి ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం

రాయచోటి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: హిందూ ధార్మిక సంస్థల భద్రత, రక్షణ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆదివారం ఆయన ఆలయానికి విచ్చేశారు. అర్చకులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వీరభద్రుడు, భద్రకాళీదేవికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడంపై ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులను మంత్రి అభినందించారు. రామాపురం మండలంలోని హసనాపురం, బండపల్లిలోని కంభరాయునిగుట్ట, కసిరెడ్డిగారిపల్లిలోని శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే వారం నుంచి దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

వీరభద్రస్వామికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

గంగమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించే గంగమ్మ జాతరకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గుట్టలు తవ్వేయ్.. చెరువులు పూడ్చేయ్!

● రెచ్చిపోతున్న భూబకాసురులు ● జిల్లా కేంద్రంలో యథేచ్ఛగా కబ్జాలు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంగా మారిన మదనపల్లెలో భూకబ్జాదారుల ఆగడాలకు ముకుతాడు వేసే వారు కరవయ్యారు. కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తూ, కొండలు, గుట్టలు చదును చేస్తూ, చెరువులు, కుంటలను పూడ్చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం ఆక్రమణదారులకు వరంగా మారుతోంది. చెరువులు, కుంటలు నిర్వహణలేక చిట్టడవులుగా మారడంతో ఆక్రమణలకు ఆస్కారంగా మారింది.

పుంగనూరు రహదారిలోని నక్కలకుంటలో వేసిన చెత్త, మట్టిదిబ్బలు

ఎక్కడెక్కడంటే..

● మదనపల్లె - పుంగనూరు మార్గంలో జాతీయ రహదారి గత నాలుగేళ్ల కిందట డ్రైవర్స్ కాలనీ మీదుగా వెళ్లేది. రహదారి విస్తరణలో భాగంగా దీన్ని మరో మార్గంలో మార్పు చేయడంతో పురాతన మార్గంలో విఘ్నేశ్వరుడి చెరువు 30 ఎకరాల్లో ఉండగా ప్రస్తుతం 20 ఎకరాలు కూడా లేకుండా స్థలాన్ని కబ్జా చేసేందుకు పూడ్చేస్తున్నారు. ● చెరువు చిట్టడివిగా ఉండటంతో ఆక్రమణలకు అవకాశంగా మారింది. గతంలో అధికారులకు ఫిర్యాదులు వెళ్తే కేవలంలో సర్వే చేసి పూడిక తొలగించకుండా వదిలేశారు. దీంతో తిరిగి ఆక్రమణదారులు పావులు కదుపుతున్నారు.

● ఇదే తరహా గృహనిర్మాణశాఖ ఏర్పాటు చేసిన నిర్మితి కేంద్రం సమీపంలోని నక్కలకుంటలో పరిస్థితి ఇదే విధంగా ఉంది. 50 ఎకరాలకు పైగా ఉన్న ఈ కుంట ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులు తమ స్థలాలతో పాటు వెనుక ఉన్న ఈ కుంటను చదును చేస్తున్నారు. ● ఈ చెరువు, కుంటల్లో ప్రభుత్వ తాగునీటి పథకాలు కూడా ఉన్నాయి. అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో కనుమరుగయ్యే అవకాశాలున్నాయి. దీంతో భూగర్భ జలాలకు నష్టం కలిగి తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి.

విస్తరిస్తున్న విష సంస్కృతి

■ మదనపల్లె పట్టణం విస్తరిస్తుండటంతో పుంగనూరు రహదారిలోని బసినికొండకు కిలోమీటరు వరకు పట్టణంలో కలిసిపోయింది. అదే విధంగా బసినికొండ బైపాస్ రోడ్డు వరకు పట్టణం విస్తరించింది. ■ బసినికొండతో పాటు, కొండామర్రిపల్లె పరిధిలోని వెంకప్పకోట, ఇసుకనూతిపల్లె, తట్టివారిపల్లె, పుంగనూరువాండ్లపల్లె ఇదే తరహాలో విస్తరిస్తున్నాయి. బసినికొండ పంచాయతీలోని చెరువులు ఆక్రమించే యత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ■ ఈ ప్రాంతంలోని నక్కలకుంట, విఘ్నేశ్వరుడి చెరువు, పాముల చెరువులోకి మట్టి, వ్యర్థాలను వేస్తూ చదును చేస్తున్నారు. దీంతో పాటు పట్టణ, పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను చెరువుల్లో వేస్తున్నారు. ■ పట్టణంలోని భవన నిర్మాణ వ్యర్థాలన్నీ ఈ చెరువుల్లో వేస్తూ చదును చేస్తూ ఆక్రమణ యత్నాలకు పాల్పడుతున్నారు.

సర్వే చేసి ఆక్రమణలు అరికడతాం

విఘ్నేశ్వరుడి చెరువు, నక్కలకుంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. రెవెన్యూ అధికారుల సహకారంతో సర్వే చేసి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. వంకలపై ప్రత్యేక దృష్టి పెడతాం.
- బాబురాజేంద్రప్రసాద్, ఏఈ, జలవనరులశాఖ, మదనపల్లె

టమాట కిలో రూ.19

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లె టమాట మార్కెట్‌లో ఆదివారం కిలో టమాట అత్యల్పంగా రూ.11 నుంచి అత్యధికంగా నాణ్యమైన టమాట కిలో రూ.19 వరకు పలికింది. దిగుబడులు భారీగా తగ్గాయి. సీజన్‌లో 2 వేల టన్నుల వరకు, సాధారణ సమయాల్లో కనీసం 120 టన్నులకు తగ్గకుండా వచ్చేవి ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయి. గత నెల రోజులుగా 80 టన్నులకు మించి సరకు రాలేదు. ఆదివారం 35 టన్నులు మాత్రమే రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఈ మేరకు ఏ-గ్రేడ్ కిలో రూ.16 నుంచి రూ.19 వరకు, బీ-గ్రేడ్ కిలో రూ.11 నుంచి రూ.15 వరకు పలికాయి. సగటున కిలో రూ.14 నుంచి రూ.18తో రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు.

ఆన్‌లైన్‌లో అర్జీ ఇవ్వచ్చు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతిపత్రాలు ఇచ్చేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)కు బాధితులు వెళ్తుంటారు. జిల్లాస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి కచ్చితంగా పీజీఆర్ఎస్ నిర్వహించే రోజే వెళ్లాల్సి ఉంటుంది. మారుమూల గ్రామాల్లో ఉన్నప్పటికీ ఎంత దూర ప్రాంతమైనా తప్పక జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి. తీరా వెళ్లిన తరువాత వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారితో కార్యాలయం నిండిపోయి ఉంటడంతో గంటల తరబడి వరుసలో ఎరుదుచూసి అధికారులకు వినతి పత్రం అందించాల్సి వస్తోంది. ఇకపై అలాంటి ఇబ్బందులు పడకుండా ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారానే ఫిర్యాదు చేసి రసీదు పొందే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది.

☛ గూగుల్‌లో హెచ్‌టీటీపీ//:పీజీఆర్ఎస్.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు అందజేసి రసీదు పొందవచ్చు. పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి హోం పేజీని క్లిక్ చేసి లాగిన్ అవ్వాలి. సిటిజన్ ఆప్షన్‌ను ఎంపిక చేసి ఆధార్ నంబరును నమోదు చేయగానే ఓటీపీ వస్తుంది. దాని ద్వారా లాగిన్ అవ్వాలి. ఫిర్యాదు వ్యక్తిగత లేదా సమాజానికి సంబంధించినదో తెలియజేయాలి.

☛ ఫిర్యాదు చేయగానే సంబంధిత ప్రభుత్వశాఖ అధికారికి చేరుతుంది. విచారణ చేసి నిర్దేశిత గడువులోగా సమస్య పరిష్కరిస్తారు. గొడవలు, నేరాలకు సంబంధించినదైతే ఆ అర్జీ సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళుతుంది.

టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా కూడా సమస్యలు తెలియజేయవచ్చు. **1100**కి ఫోన్ చేస్తే ఫిర్యాదు స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటారు.

విజిలెన్స్‌తో రూ.75 లక్షల ఆదాయం

చిత్తూరు, న్యూస్‌టుడే : విజిలెన్స్ బృందాల నిఘాతో మార్కెటింగ్ శాఖకు సుమారు రూ.75 లక్షల ఆదాయం సమకూరిందని ఆ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. చెక్‌పోస్టుల్లో అక్రమాల అడ్డుకట్ట, పంట ఉత్పత్తుల నుంచి వంద శాతం సెస్ వసూళ్లకు నవంబరు నెల నుంచి మూడు జిల్లాల్లో ప్రత్యేక విజిలెన్స్ బృందాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి.. అక్రమ రవాణాదారుల నుంచి సెస్ వసూళ్లు చేపడుతున్నారని చెప్పారు. తనిఖీల ద్వారా చిత్తూరు జిల్లాలో రూ.20 లక్షలు, తిరుపతిలో రూ.30 లక్షలు, అన్నమయ్య జిల్లాలో రూ.25 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. మార్కెట్ కమిటీలు నిర్దేశిత ఆదాయ లక్ష్యాలను అధిగమించేందుకు దృష్టి సారించాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలిపారు.

కొందరికే.. వంద రోజుల ఉపాధి

- న్యూస్‌టుడే, కంభంవారిపల్లి

గ్రామీణ ప్రాంతంలో కూలీలకు ఉపాధి కల్పించడానికి ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది.. కూలీలు వలస వెళ్లకుండా ఉన్న ఊరిలో పని చేసుకోవడమే ఈ పథక ముఖ్య ఉద్దేశం.. ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నదే లక్ష్యం.. అయితే జిల్లాలో ఇది ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.. ఫలితంగా లక్ష్యానికి దూరంగా ఉంది.. అసలు ఈ లక్ష్యం ఎప్పటికి నెరవేరుతుందనేది వేచిచూడాల్సిందే.

కంభంవారిపల్లెలో పనులు చేస్తున్న ఉపాధి శ్రామికులు

● ఈ పథకం కింద జిల్లావ్యాప్తంగా కూలీలకు ఉపాధి పనులు కల్పించడంతో నీటి కుంటలు, కాలువల్లో పూడికతీత పనులు, పాడి రైతులకు పశుగ్రాసం, పండ్ల తోటల పెంపకం తదితర పనులు చేపట్టారు. పశువులకు తాగునీటి తొట్టెలు, సిమెంటు రోడ్ల నిర్మాణాన్నీ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, అవగాహన కల్పించకపోవడంతో నేటికీ లక్ష్యం చేరుకోలేదు.

పారదర్శకంగా పనులు

గత వైకాపా పాలనలో ఉపాధి హామీ పథకంలో కొన్నిచోట్ల జరిగిన అవినీతి వెలుగులోకి రావడంతో, కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ, ముఖ ఆధారిత హాజరు తదితర కార్యక్రమాలు అమలు చేసింది. మస్టరులో పేరుంటే తప్పకుండా ఉపాధి పని చేయాలని, పనికి వెళ్తే ఈకేవైసీతో పాటు ముఖ ఆధారిత హాజరు విధానాన్ని ప్రవేశ పెట్టింది. దీంతో కొంత మేరకు పనులు మందగించాయి. ఉదాహరణకు కంభంవారిపల్లె మండలంలో 4,068 జాబ్‌కార్డులు ఉండగా, వాటిలో కేవలం 38 కార్డులకు మాత్రమే వంద రోజుల ఉపాధి కల్పించారు. ఏడాది చివరన ఫిబ్రవరి, మార్చి నెలల్లో పని దినాలు వంద రోజులకు చేరుకుంటాయని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు.

జిల్లాలో ఇలా.. మొత్తం జాబ్‌కార్డులు: **1,77,267** ■ ఉపాధి శ్రామికుల సంఖ్య : **2,89,302**
■ పనులకు హాజరవుతున్నది : **2,38,874** మంది ■ వంద రోజుల పని కల్పించినది: **3,445** మందికి

నాలుగవ వర్ధంతి

జననం : 01-08-1944
మరణం : 16-02-2022

కీ॥శే॥ Lion మారెడ్డి ఆనందరెడ్డి
ప్రొ॥ ఈగల్ డిస్టలరీస్

మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి, చెరిగిపోనిది
మీ ఘనత, మరపురానిది మీ మమత, మీ దృఢసంకల్పం, కార్యదీక్షత మాకు ఆదర్శనీయం.
మీ ఆలోచనా దృక్పథం మాకు స్ఫూర్తిదాయకం. ఉన్నతమైన వ్యక్తిత్వంతో,
సేవాగుణ సంపన్నులుగా కీర్తింపబడి అందరి మేలుకోరే మంచి మనిషి
Lion కీ॥శే॥ మారెడ్డి ఆనందరెడ్డి గారు మా నుండి దూరమై నేటికి నాలుగు సంవత్సరాలు
గడిచిననూ మిమ్మల్ని మరువలేకున్నాము... మీ జ్ఞాపకాలు మా మదిలో పదిలం.
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

భార్య : కీ॥శే॥ ప్రమీల రెడ్డి

కుమార్తెలు: శ్రీమతి విజయ, శ్రీమతి సౌభాగ్యరాణి, శ్రీమతి అనిత, శ్రీమతి లీలా
అల్లుళ్లు : కీ॥శే॥ సీతారామిరెడ్డి, IPS, సురేష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, డా॥ ప్రవీణ్‌రెడ్డి
కుమారుడు : మారెడ్డి సతీష్‌రెడ్డి
కోడలు : శ్రీమతి వీణారెడ్డి
మనుమరాలు : మారెడ్డి అదితిరెడ్డి
మరియు మనుమలు, మనుమరాండ్రు, కుటుంబసభ్యులు

కలియుగ దైవం.. కల్కి రూపం

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన ఆదివారం ఉదయం స్వామి వారు దేవేరులతో రథారోహణం చేసి దివ్యరథంపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను పట్టు పీతాంబరాలతో విశేషంగా అలంకరించి రథారోహణంపై సంకల్ప పూజలు నిర్వహించారు. పూల ఊయలపై శ్రీహరి భక్త జనులను తన్మయ పరిచారు.

అశ్వవాహనంపై కల్కి రూపంలో శ్రీనివాసుడు

విద్యుత్తు సమస్యలా.. ఫోన్ చేయండి

రాయచోటి, మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్, జిల్లాస్థాయిలో విద్యుత్తు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు డయల్ యువర్ సీఎండీ, డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు సర్వీసు నంబరు తమ వద్ద ఉంచుకుని, తాము ఎదుర్కొంటున్న సమస్యలు కింది నంబర్లకు తెలియజేయవచ్చన్నారు.

● డయల్ యువర్ సీఎండీ సమయం : ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30
ఫోన్ నెంబరు 89777 16661
● డయల్ యువర్ ఎస్ఈ
● సమయం 8:30 -9:30 గంటలు
అన్నమయ్య: **94408 17449**

హార్దిక శుభాకాంక్షలు

ఎంతో మంది విద్యార్థులను న్యాయవాదులుగా, జడ్జీలుగా తీర్చిదిద్ది బంగారు భవిష్యత్తును
అందించి న్యాయ విద్యా రంగంలో విశిష్ట సేవలందించినందుకు గాను
గ్లోబల్ రీసెర్చ్ కాన్ఫరెన్స్ ఫోరం మరియు అంతర్జాతీయ అకాడమిక్ భాగస్వామ్యం తో
ఇండో థాయ్ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు-2026 థాయ్‌లాండ్‌లో అందుకున్న
శుభసందర్భంగా డా॥ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్
డా॥ ఆర్. తిప్పారెడ్డి, B.Sc., B.L; L.L.M., Ph.D., గారికి
మా హార్థిక శుభాకాంక్షలు.
వారు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటూ...
Best Compliments from
STAFF - STUDENTS & WELL WISHERS
Dr. AMBEDKAR GLOBAL LAW INSTITUTE
K.K.Cheruvu, Renigunta Road, TIRUPATI - 517 501

(c) eenadu

ఏటా పుష్కరం సువర్ణముఖి ప్రత్యేకం



సువర్ణముఖి ప్రవాహ ఉద్ధృతి విహంగ వీక్షణం

నదిపేరు: సువర్ణముఖి
పుట్టుక: చంద్రగిరిలోని అగస్త్యాచలం
సముద్ర సంగమ ప్రదేశం: తూపులపాళెం సమీపంలో
ఉపనదులు: కల్యాణి, భీమ
సముద్రమట్టం నుంచి ఎత్తు: 300 మీటర్లపైనే
పొడవు: 130 కిలోమీటర్లు
తీర ప్రాంతం: 3,225 చదరపు కిలోమీటర్లు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఏ నదికైనా పన్నెండు సంవత్సరాలకు ఒక పర్యాయం పుష్కరం వస్తుంది. అదే అగస్త్య మహాముని తపోబలంతో ఆవిర్భవించిన సువర్ణముఖికి ఏటా పుష్కరమే. మాఘ మాసం పూర్ణిమ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున పుష్కరోత్సవం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది.

అగస్త్య ప్రసాదితం..: ఎన్నో విశిష్టతల సమాహారమైన శ్రీకాళహస్తి క్షేత్రంలో పుణ్యనది లేకపోవడంతో అగస్త్య మహర్షి ఆవేదనకు గురయ్యారు. సత్యవ్రత భాస్కర క్షేత్రమైన ఇక్కడ నదిని తీసుకురావాలన్న తలంపుతో పాకాలకు సమీపంలోని బ్రహ్మాచలంలో తపస్సు చేయడంతో సువర్ణముఖి ఆవిర్భవించింది. అగస్త్య మహర్షి తపస్సు చేసిన కారణంగా బ్రహ్మాచలం అగస్త్యాచలంగా ఖ్యాతి గడిస్తోంది. ఇక్కడి నదిలో ఇసుక బంగారంగా మెరిసిపోతుండటంతో సువర్ణముఖి అన్న పేరు సార్థకమైనట్లు పురాణాల ద్వారా విశదమవుతోంది.

సువర్ణముఖి గమనం ఇలా..: జిల్లాలో అత్యంత పెద్ద నదిగా గుర్తింపు పొందిన సువర్ణముఖి ఎంతో పురాణ ప్రాభవాన్ని సంతరించుకుంది. పాకాలకు సమీపంలోని ఆదినాపల్లి సమీపంలోని అగస్త్యాచలం వద్ద చిన్నపాటి వాగుగా ఆవిర్భవించి అక్కడి నుంచి చిన్న పాయగా ప్రారంభమవుతోంది. అక్కడే ఎగువన భీమానది, దిగువన కల్యాణి నదులతో సంగమించి శేషాచల పర్వతాలను తాకుతూ ఉత్తరవాహినిగా ప్రవహిస్తోంది. శ్రీకాళహస్తి క్షేత్రాన్ని తాకుతూ ముందుకు సాగుతోంది. తూపులపాళెం సమీపంలో సముద్రంలో సంగమిస్తోంది.

ఆరోగ్య సంరక్షకుడు మృత్యుంజయుడు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిష్ఠితమైన ఒక్కో శివలింగం ఒక్కో ప్రాశస్త్యాన్ని తెలియజేస్తోంది. స్వయంభు శ్రీకాళహస్తీశ్వరాలయ లింగం తర్వాత అంతటి ప్రఖ్యాతమైన శివలింగంగా మృత్యుంజయ శివలింగం గుర్తింపు పొందింది.

మృత్యుంజయ శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

పెరుగుతున్న ఆదరణ

ముక్కంటి ఆలయంలో పోటుకు సమీపంలో కొలువుదీరిన శ్రీమృత్యుంజయ శివలింగ అభిషేకాలకు ఆదరణ పెరుగుతోంది. కరోనా విస్తృతం కాకముందు ఇక్కడి శివలింగానికి అప్పుడప్పుడు అభిషేకాలు జరిపేవారు. కరోనా సమయంలో పరోక్ష సేవ ద్వారా భక్తులు ఇక్కడి శివలింగానికి నిత్యం అభిషేకాలు చేయించడంతో ఈ ఆర్జిత సేవకు భక్తుల నుంచి ఆదరణ మరింతగా పెరిగింది. దీంతో ఈ అభిషేకాన్ని నిత్యాభిషేక ఆర్జిత సేవగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

సేవ: మృత్యుంజయ శివలింగాభిషేకం
టికెట్ ధర: రూ.వెయ్యి
ప్రవేశం: ఇద్దరికి
నిర్వహణ: రోజూ 9 గంటలకు

సేవాఫలం: ఎక్కువ మంది ఆరోగ్యసిద్ధి కోసం అభిషేకాలు జరిపిస్తారు. ఆదరణ దృష్ట్యా ప్రస్తుతం ఈ సేవా టికెట్‌ను ఆన్‌లైన్ ద్వార మాత్రమే తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు. అభిషేకజలం, విభూది, చందనాలను భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ప్లాట్లు.. విక్రయానికి పాట్లు

- లాటరీ పద్ధతిన అంటగడతారు
- లాభార్జనే ధ్యేయంగా అక్రమాలు

గాలివీడు, న్యూస్‌టుడే: ప్రజలను వివిధ పద్ధతుల్లో నివాస ప్లాట్లు, భవనాలను అంటగట్టి సొమ్ము చేసుకునేందుకు కొందరు తెరతీశారు. అందుకోసం వేదికగా సామాజిక మాధ్యమాలను ఎంచుకున్నారు. రాష్ట్రంలో లాటరీ పద్ధతి నిషేధించారు. అయినప్పటికీ లాభార్జనే ధ్యేయంగా గుట్టు చప్పుడు కాకుండా నడపుతున్నారు. తమకున్న పరిచయాలను ఈ వ్యాపారానికి అనుకూలంగా మార్చుకుంటున్నారు.

అనుమతులు లేని వ్యాపారం

లేఅవుట్ ప్లాట్లకు ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. ఇష్టారీతిలో విక్రయిస్తున్నారు. మిగిలిన ప్లాట్లు అమ్ముకునేందుకు లాటరీ విధానాన్ని తీసుకువచ్చారు. ఇటీవల అరవీటివాండ్లపల్లి సమీపంలో ఓ వ్యవసాయ భూమిలో వేసిన ప్లాట్‌ను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఒక్కో లాటరీ రూ.1,999 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకున్నారు. దీనిలో భాగంగా నూతనంగా నిర్మించిన భవనం రూ.30 లక్షలు పలుకుతుందని నమ్మించారు. ఇలా 1,500 మందికి అమ్మాలని నిశ్చయించారు. రెండ్రోజుల నుంచి సామాజిక మాధ్యమాలు వేదికగా ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అల్లనేరేడు పండ్ల జీఐ ట్యాగ్‌కు దరఖాస్తు

దరఖాస్తు చూపుతున్న ఛాన్స్‌లర్ విజయ భాస్కర చౌదరి, వైస్ ఛాన్స్‌లర్ సి.యువరాజ్

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: మదనపల్లె పరిసర ప్రాంతాల్లో సాగవుతున్న అల్లనేరేడు (జామూన్ ఫ్రూట్) పండ్లకు జీఐ ట్యాగ్ కోసం అధికారికంగా దరఖాస్తు సమర్పించినట్లు మిట్స్ డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఆదివారం దరఖాస్తును ఛాన్స్‌లర్ విజయ భాస్కర్ చౌదరి చేతుల మీదుగా అందజేశామన్నారు. మిట్స్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటీస్ సెంటర్ మద్దతుతో దరఖాస్తు పూర్తి చేశామన్నారు. అల్లనేరేడు పండ్లు ఊదా రంగుతో తీపి- పులుపు రుచి, అధిక పోషక విలువలు, ఔషధ గుణాలు కలిగి ఎక్కువ కాలం నిల్వ ఉంటాయన్నారు. బరువు తగ్గడానికి, రోగ నిరోధక శక్తి పెంపు, జీర్ణక్రియకు ఔషధంలో పని చేస్తాయన్నారు. ప్రో ఛాన్స్‌లర్ ద్వారకనాథ్, సలహాదారు తులసీరామ్‌నాయుడు, డాక్టర్ రవీంద్రనాథ్, అసోసియేట్ డీన్ పి.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఏజెన్సీలు దస్త్రాలతో హాజరు కావాలి

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు. కార్మిక చట్టం ప్రకారం ఇక్కడ కార్మికులకు వేతనాలు, పీఎఫ్ బకాయిలు, ఈఎస్ఐ కార్డులు పంపిణీ సక్రమంగా లేదని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధరణీకుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఈ నెల 11న కార్మికశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయా ఏజెన్సీలు.. కార్మికులకు సంబంధించిన అన్ని దస్త్రాలతో హాజరు కావాలని కార్మిక శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారని ధరణీకుమార్ ఆదివారం తెలిపారు.

కరవు నేల..కోనసీమలా!

రాయచోటి నుంచి గాలివీడు వెళ్లే మార్గంలో మాండవ్య పార్కు ఉంది. కుటుంబ సమేతంగా వెళ్లే వారికి సరదాగా ఉంటుంది. పార్కు దగ్గర ఉన్న ఎత్తైన గుట్ట ట్రెక్కింగ్ చేయటానికి అనువుగా ఉంది. గుట్ట పై నుంచి చూస్తే, కోనసీమను తలపించేలా పచ్చని కొబ్బరి చెట్లు, వరి పైరు, మరో వైపు సాగర తీరంలా కందవ్య గండి, అక్కడి నుంచి చూస్తే రాయచోటి పట్టణం చాలా అందంగా కనబడుతుంది. ఇలా పిల్లలు, పెద్దలు ఆహ్లాదం పొందుతున్నారు.

-న్యూస్‌టుడే, రాయచోటి

'అలస్యం'పై అసంతృప్తి గళం

సర్వదర్శనం క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం ముక్కంటి ఆలయం తెరిచే సమయానికి అన్ని ప్రవేశ మార్గాల్లో క్యూలైన్లు నిండిపోయాయి. వారంతం, అందులోనూ వరుస సెలవుల దృష్ట్యా లక్ష మందికి పైగా వాయులింగేశ్వరుని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు భావిస్తున్నారు. దర్శన టికెట్ల ద్వారా రూ.55 లక్షలు ఆదాయం సమకూరింది.

సిఫార్సులకే ప్రాధాన్యం.. రూ.500, రూ.200 టికెట్లు పొందిన భక్తులు ఎక్కువ సమయం నిరీక్షించారు. తమను అనుమతించకుండా సిఫార్సు దర్శనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఆవేదనకు గురయ్యారు. కొందరైతే ఈవో, ఛైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దర్శనాల అనుమతికి సంబంధించి అమ్మవారి ఆలయం వద్ద ఇద్దరు సీఐలు వాదులాడుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని లోనికి అనుమతించకపోవడంతో పోలీసులు, అధికారులతో ఆయన వాగ్వాదానికి దిగారు.

నేడు మాలె పెద్దయ్య స్వామి తిరునాల

చిన్నమండెం, న్యూస్‌టుడే: దేవగుడిపల్లె గ్రామం కురవపల్లె సమీపంలో వెలసిన మాలె పెద్దయ్యస్వామి తిరునాల సోమవారం నిర్వహించనున్నారు. ఏటా మహాశివ రాత్రి మరుసటి రోజు ఈ జాతర నిర్వహించడం సంప్రదాయం. ఈ మేరకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం జల్లావాండ్లపల్లె నుంచి దేవరెద్దు ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో దేవగుడిపల్లెలోని దేవాలయానికి తీసుకొచ్చారు. సోమవారం తెల్లవారుజామున పూజలు చేసి కురవపల్లె మీదుగా మాలెకు దేవరెద్దు చేరుతుంది. అప్పటి నుంచి తిరునాల మొదలవుతుందని నిర్వాహకులు తెలిపారు. సంతానం కోసం దేవరెద్దుకు మహిళలు వరపడటం, మొక్కులు తీరిన భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. మంత్రి ఆధ్వర్యంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జాతరకు వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. చిన్నమండెం బస్టాండు నుంచి ఆటోల్లో జాతరకు వెళ్లొచ్చు.

ఆలయంలోని మూలవిరాట్

అన్నదాన ఏర్పాట్లపై నాయకులతో చర్చిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

జ్వరాలపై అప్రమత్తత అవసరం

కోళ్లఫారాలను పరిశీలిస్తున్న అధికారులు

సదుం, న్యూస్‌టుడే: బర్డ్ ఫ్లూ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్‌సీడీసీ జేడీ డాక్టర్ ప్రవీణ్, రాష్ట్ర ఎన్‌సీడీసీ కన్సల్టెంట్ డాక్టర్ అర్పిత రేడా సూచించారు. ఆదివారం కంచరివారిపల్లె, అమ్మగారిపల్లె, పుట్టావారిపల్లెలో పర్యటించి బర్డ్ ఫ్లూ సోకి మృతిచెందిన కోళ్లఫారాలను పరిశీలించారు. జ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య, జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ శ్రీధర్, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి, మండల పశు సంవర్ధక శాఖ వైద్యులు మునిచంద్రారెడ్డి, చరణ్, డీహెచ్‌ఈవో మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

కొంగు బంగారం.. అనంతపురం గంగమ్మ



రాయలసీమలో అత్యంత ప్రసిద్ధి గాంచిన, భక్తుల పాలిట కల్పతరువు అనంతపురం గంగమ్మ, బ్రిటిష్ హయాంలోనే వేలాదిగా వచ్చేవారని పెద్దలు చెబుతారు.

- చాగలగుట్టపల్లెలోని గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని బయటకు తీయగానే వేడుకలు మొదలవుతాయి. విగ్రహానికి ఈ నెల 17న అర్ధరాత్రి బోనం సమర్పించి దేవర ఇంట్లోని అమ్మవారిని బయటకు మేళతాళాలతో తెస్తారు.
- మహిళలు తడి దుస్తులతో పిల్లల కోసం ఆలయం ఎదుట వరపడగా సిద్ధల అన్నం అనే ప్రసాదాన్ని ఇస్తారు. పుట్టే పిల్లలకు గంగరాజు, గంగయ్య, గంగమ్మ, గంగాదేవి, గౌరి పేర్లు పెడతారు. - న్యూస్‌టుడే, లక్కిరెడ్డిపల్లె

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

అనంతపురం నుంచి వచ్చానని..

అనంతపురం పంచాయతీ ప్యారంపల్లెకు చెందిన తిమ్మిరెడ్డి ఉత్తారెడ్డి పొలాన్ని కాపాడుకునేందుకు చుట్టూ కంచె వేయడానికి 8 జతల ఎద్దులతో లాగించినా రాక పోవడంతో ఇంటికి వెళ్లిపోయాడు. ఆ రాత్రి అమ్మవారు అతడికి కలలో కనిపించి అనంతపురం నుంచి వచ్చా.. కంప తొడుగు కింద ఉన్నానని చెప్పడంతో పూజలు చేయగా అమ్మవారు శిలగా నిలిచిందని ప్రతీతి.

చాందినీ బండ్లు ప్రత్యేకత

మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవారికి చాందినీబండ్లు కట్టి బంధువులు, స్నేహితులను పిల్చుకొచ్చి గుడిచుట్టూ బండ్లు తిప్పి బోనాలు పట్టి అన్నం వండుకుని తింటారు. ఎద్దుల బండ్లకు టెంకాయ మట్టలు కట్టి పశువులను అలంకరిస్తారు. ● వీరబల్లి మండలం పుత్తావాండ్లపల్లె నుంచి కుంకుమ బండి రావడం ఆనవాయితీ. భక్తులకు కోనంపేట, దేవళంపల్లె పీహెచ్‌సీల వైద్యులు శిబిరాలు నిర్వహిస్తారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడప నుంది.

చెరకు రుచి..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జాతరకు తొలిసారిగా చెరకు గడలు వస్తాయి. ఇక్కడ చెరకు పంట లేనందున తొలి సారి ఈ జాతరలో రుచి చూస్తారు.

కార్యక్రమాలు ఇలా..

17న చాగలగుట్టపల్లెలో అమ్మవారి జాగరణ. 18న నిండు తిరుణాల. 19న మైలు తిరుణాల అమ్మవారి ఊరేగింపుతో, గంగస్నానాలతో, అభిషేకాలతో ముగుస్తుంది. 18వ శతాబ్దం చివరన కడపను ఏలిన నవాబులు అమ్మవారి శక్తిని గ్రహించి నిత్యం పూజాదులకు అర్చకులకు 35 ఎకరాలు భూమి మాన్యంగా కేటాయించారు. * జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా వసతులు కల్పిస్తామని ఈవో శ్రీనివాసులు తెలిపారు. నీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించామన్నారు. ఆలయాన్ని ప్రభుత్వ, ఆలయ, దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని, జాతర విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు.

వ్యవసాయంలో ఆకాశవాణి పాత్ర అమోఘం

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఆకాశవాణి పోషిస్తున్న పాత్ర అమోఘమని వ్యవసాయ వర్సిటీ అసోసియేట్ డైరెక్టరేట్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సుమతి పేర్కొన్నారు. ఆదివారం ఎయిర్ బైపాస్‌రోడ్డులోని ఆకాశవాణి కేంద్రంలో రేడియో కిసాన్ దివస్ నిర్వహించి మాట్లాడారు. రైతులు అత్యాధునిక పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రవికుమార్ మాట్లాడుతూ పశు పోషణతో గ్రామీణప్రాంతం ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారని వివరించారు. వ్యవసాయ శాఖ ఏడీ సౌభాగ్యలక్ష్మి, పట్టుపరిశ్రమశాఖ ఏడీ కిశోర్‌నాయక్ మాట్లాడారు. రైతుల సమస్యలను నివృతి చేశారు. వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, ఆకాశవాణి సహాయ సంచాలకులు సుధాకర్‌మోహన్ పాల్గొన్నారు.

తరిగొండలో వీధికుక్కల వీరంగం
30 మందికి గాయాలు

కుక్కకాటుకు గురైన రెడ్డిసాహెబ్

గుర్రంకొండ, న్యూస్‌టుడే: తరిగొండలో వీధికుక్కలు వీరంగం చేశాయి. ఆదివారం బస్టాండు, కొత్తవీధి, దళితవాడ, బజారువీధి తదితర ప్రాంతాల్లో మూడు కుక్కలు ఇష్టమొచ్చినట్లు ప్రజలపై విరుచుకుపడ్డాయి. కనపడిన వారందరినీ కరిచాయి. రెడ్డిసాహెబ్, శ్రీనివాసులు, బాషా, రెడ్డి తదితర 30 మందిని కరిచాయి. కాళ్లు, పాదాలపై ఎక్కడ పడితే అక్కడ కరిచి రక్తగాయాలు చేశాయి. పిచ్చికుక్కలు కాకపోయిన వీరంగం చేయడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధునాతన అన్నప్రసాద కేంద్రానికి అడ్డంకులు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే-రిలయన్స్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుమలలో తలపెట్టిన ఏఐ ఇంటిగ్రేటెడ్ అత్యాధునిక అన్నప్రసాద కేంద్రం నిర్మాణం ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు రూ.100 కోట్లతో అన్నప్రసాద కేంద్రం నిర్మించాల్సి ఉంటుంది. భక్తుల భద్రత దృష్ట్యా స్థానిక మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కేంద్రానికి సమీపంలో ఉన్న ఐవోసీఎల్ గ్యాస్ స్టోరేజీ కేంద్రం తరలించి అక్కడే నిర్మించాలని తితిదే నిర్ణయించింది. మరోవైపు ఔటర్‌రింగ్ రోడ్డులో 1.86 ఎకరాల విస్తీర్ణంలో రూ.8.13 కోట్లతో 45 టన్నుల సామర్థ్యంతో గ్యాస్ నిల్వ కేంద్రం నిర్మించాల్సి ఉంది. పనులు ఆరునెలల్లో పూర్తిచేయాలన్నది లక్ష్యం. గడువు దాటినా పునాదుల పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలించి వేగవంతం చేయాలని సీఈ సత్యనారాయణను ఆదేశించారు.

తెప్ప మునిగి విద్యార్థి మృతి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: మిత్రులతో కలిసి సరదాగా చెరువులో తెప్పపై షికారు చేస్తుండగా శశి(30) అనే యువకుడు మృతి చెందాడు. ఘటన ఆదివారం పునబాక చెరువులో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి పట్టణం కైలాసగిరికాలనీకి చెందిన బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శశి శివాలయం దగ్గర ఉత్సవాల అనంతరం సమీపంలోని చెరువులో చేపలకు మేత వేయడానికి ఉంచిన చిన్నపాటి తెప్పపై ఆరుగురు మిత్రులతో కలిసి వెళ్లాడు. తెప్ప మునిగిపోవడంతో మిగిలిన ఆరుగురు మిత్రులు ఈత రావడంతో సురక్షితంగా ఒడ్డుకు చేరారు. శశికి గల్లంతవగా స్థానికులు గుర్తించి గట్టుకు చేర్చేసరికి అప్పటికే మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు శివరాత్రి రోజు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ కొండారెడ్డి, చిత్రంలో ఎస్.ఐ సంజీవరెడ్డి, సిబ్బంది

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు నెహ్రూరోడ్డులోని నాగులకట్ట వీధిలో ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను ఆదివారం మూడో పట్టణ ఠాణాలో సీఐ కొండారెడ్డి వెల్లడించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ఎన్జీవోకాలనీకి చెందిన గువ్వల సుబ్రహ్మణ్యం(33) కొన్నేళ్ల కిందట రాజుపాళెం మండలం కొర్రపాడుకు చెందిన మహిళతో వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు సంతానం. సుబ్రహ్మణ్యం కార్పెంటర్, డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈ నేపథ్యంలో అతను కొన్ని రోజులుగా ప్రొద్దుటూరులోనే ఉంటూ పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యానికి వినయ్‌తో మద్యం దుకాణం వద్ద పరిచయం ఏర్పడింది. ఇటీవల ఇద్దరు మద్యం తాగుతూ గొడవ పడ్డారు. సుబ్రహ్మణ్యం వినయ్‌ను కొట్టాడు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకున్న వినయ్.. ఈ నెల 13న రాత్రి మద్యం తాగేందుకు సుబ్రహ్మణ్యాన్ని తన ఇంటికి తీసుకెళ్లి కత్తితో పొడిచి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఎస్.ఐ సంజీవరెడ్డి, ఏఎస్ఐ సుబ్బన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఎముకల చికిత్సకు బర్డ్ సహకారం

చిన్నారి కాళ్లు పరిశీలిస్తున్న డాక్టర్ జగదీష్

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: బర్డ్ వైద్యశాల చిన్నారుల మోకీళ్లు, వెన్నెముక సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆ సంస్థ సంచాలకులు డాక్టర్ గుడారు జగదీష్ పేర్కొన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా ఉలవపాడు సమీపంలోని కరేడులో బర్డ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి సమన్వయం చేశారు. భిన్న సామర్థ్యాలున్న చిన్నారుల ఎముకల సమస్యలకు స్క్రీనింగ్ నిర్వహించారు. 56 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నవారికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద బర్డ్‌లో ఉచితంగా నిర్వహించడానికి ఎంపిక చేశారు. గ్రామీణ, దూర ప్రాంతాల్లోని చిన్నారుల వద్దకు నాణ్యమైన వైద్యసేవలు చేరాలని డా. గుడారు జగదీష్ అభిప్రాయపడ్డారు. వైద్యులు మునిశంకర్‌రెడ్డి, అరవింద్ శర్మ, యోగానంద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి మృతి

వెంకటరమణారెడ్డి (పాతచిత్రం)

రామసముద్రం, న్యూస్‌టుడే: ఇసుక ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాప్పల్లె గ్రామ పంచాయతీ కొత్తూరులో జరిగింది. ఎస్సై ఉమామహేశ్వర్‌రెడ్డి వివరాల మేరకు.. కొత్తూరుకు చెందిన వెంకటరమణారెడ్డి (65), అదే గ్రామానికి చెందిన నారాయణ ద్విచక్ర వాహనంపై చెంబకూరు నుంచి ఇంటికి వెళ్తున్నారు. రామసముద్రం వైపు నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ వీరిని ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో వెంకట రమణారెడ్డి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య రవణమ్మ, కుమారులు శివశంకర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, కుమార్తె మల్లేశ్వరి ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: రెండు వేర్వేరు ప్రమాదాల్లో రెండు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ముగ్గురు గాయపడిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కలకడ మండలం పాపిరెడ్డిగారి పల్లెకు చెందిన భరత్‌కుమార్ ద్విచక్ర వాహనంలో పీలేరు నుంచి బయల్దేరారు. పొంతలచెరువు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి గాయపడ్డాడు. పూతలపట్టుకు చెందిన దుర్గాప్రసాద్, మాధవ ద్విచక్ర వాహనంలో కలకడ నుంచి పీలేరు వైపు వస్తుండగా రాణా వడ్డిపల్లె వద్ద అదుపు తప్పడంతో వీరు గాయపడ్డారు. వీరికి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

EENADU Classifieds

EDUCATION
DISTANCE EDUCATION
B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

FINANCIAL SERVICES
స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
నేషనల్ హైవేలకు అనుకొని తిరుపతిలో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ అన్ని సదుపాయాలతో తక్కువ ధరకే, డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్ ఫోన్ : 9966262221/ 9502774175.
1.తిరుపతి - సి.రామాపురం జైన్ మందిరం వద్ద 2.రేణిగుంట యోగానంద కాలేజీకి ప్రక్కన 3.చంద్రగిరిటౌన్‌లో ఉగ్రప్రత్యంగిరా అమ్మవారి గుడి దగ్గర 100 feet రోడ్డు ఆనుకొని ఉన్న వెంచర్స్‌లో తుడా అప్రూవల్స్‌తో హౌస్/ విల్లా కట్టుకునే ప్లాట్లు అమ్మబడును. 9505502346.

JOBS
WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.
Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.
Wanted Supervisors for Civil and Electrical Works. Contact: 90005 55035.
తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్ పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age: 30 to 65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 76750 95860.
గూడ్స్ ఆటో డ్రైవర్ -1 (టౌన్‌లో డెలివరి చేయుటకు) కావలెను. అనుభవం, లైసెన్స్, బ్యాడ్జ్ కలిగి ఉండవలెను. సంప్రదించ గలరు. ✆ 97034 02722

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆96404 00073, 98485 71888.
త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499
అయోధ్య సొసైటి, తిరుపతికి రికవరీ ఆఫీసర్స్ - 4 కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. Cont: 78427 30185, 70136 98363.
ప్రముఖ విద్యా సంస్థకు లేడీ టెలీకాలర్స్, కౌన్సిలర్స్ & ఫీల్డ్ అనుభవం కల్గిన PROలు కావలెను. ఆకర్షణీయమైన జీతం కల్పించబడును. ✆ 90320 30124.

SECURITY GUARDS
సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మదనపల్లిలో పని చేయుటకు. 10 Hr డ్యూటీ జీతం: 11,000/-. ✆ 72880 04466.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • పీలేరు

'అభివృద్ధి, సంక్షేమానికి సమతూకం బడ్జెట్'

రాయచోటి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వ బడ్జెట్ సమతూకంగా ఉందని రాజంపేట పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ప్రస్తుత బడ్జెట్ రూపొందించడం గొప్ప విషయమని చెప్పారు. గత వైకాపా ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని, ఫలితంగా ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. తదనుగుణంగా ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ ఎంతో దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో గ్రీవెన్స్

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నామని తహసీల్దార్ శివకుమార్ ఆదివారం తెలిపారు. ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీనివాసులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని చెప్పారు. దీన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
రాయచోటి: 9703622242
పీలేరు: 8008574958
చిన్నమండెం: 9440170752

న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

సమస్య: కూరగాయల మార్కెట్లో వ్యాపారులు కూరగాయల వ్యర్థాలు మురుగు కాలువల్లో నిర్లక్ష్యంగా పారబోస్తున్నారు. -మస్తూర్

సమాధానం: కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగింపజేస్తాం. -రవి, కమిషనర్

న్యూస్‌టుడే, గాలివీడు

సమస్య: ఎగవమూలలో మంచినీటి పథకం పని చేయలేదు. -నాయుడు, స్థానికుడు

సమాధానం: మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. - కుమార్‌నాయుడు, సర్పంచి

మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తాం: మంత్రి

మంత్రిని సత్కరిస్తున్న గ్రామస్థులు

సంబేపల్లె, న్యూస్‌టుడే: సంబేపల్లె గ్రామం నారాయణ లగుట్ల ప్రజల సౌకర్యార్థం కేటాయించిన శ్మశాన వాటిక అభివృద్ధికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా శ్మశాన వాటిక అభివృద్ధికి ఈ విరాళం ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు.. మంత్రిని మనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. దేవరాయి నల్లగుమ్మ తల్లి ఆలయ ఛైర్మన్ కూనాసి సుబ్బరాజు యాదవ్, హరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డు.. పట్నం గోడు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన చిన్నమండెంలో తరచూ ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. బస్టాండు, మెయిన్‌బజారు ప్రాంతాల్లో ఈ సమస్య ఉదయం, సాయంత్రం ఉంటోంది. ఇదే పెద్దమండ్యం వెళ్లే రోడ్డు కావడం, సంతవీధిలో బాలికల, ఉర్దూ, ఆదర్శ పాఠశాలల్లో వెయ్యి మందికి పైగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండటంతో రద్దీగా ఉంటోంది. దీనికితోడు రాయచోటి నుంచి వచ్చే పాఠశాలల బస్సులు, పెద్దమండ్యం వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు మరీ ఇబ్బందిగా మారుతోంది.

పురపాలక వాహనమా.. అమ్మేయ్..!

- పారిశుద్ధ్య యంత్రాలకు రక్షణ కరవు
- రూ.లక్షల విలువైన వాహనాలు మాయం
- స్క్రాప్ పేరుతో రహస్య విక్రయాలు

న్యూస్‌టుడే, రాయచోటి

రాయచోటి పురపాలక సంఘంలో పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించే వాహనాలకు రక్షణ కరవైంది. రూ.లక్షల విలువజేసే వాహనాల పర్యవేక్షణ కొరవడటం.. పారిశుద్ధ్య విభాగంపై 'పట్టు' లేకపోవడం.. వెరసి వైకాపా హయాంలో ఇష్టానుసారంగా పాలన సాగింది. ఫలితంగా ఎవరికివారు దర్జాగా నచ్చిన వాహనాన్ని విక్రయించుకున్నారు.. గత నాలుగేళ్లలో చాలా వాహనాలు ఇలా దొడ్డి దారిన 'చేజారడం'తో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విస్తరిస్తున్న పట్టణం..

పట్టణ పరిధి గ్రేడ్-1కు చేరడంతో నిత్యం చెత్త సేకరణకు ట్రాక్టర్లు, ఆటోలు ఎక్కువ వినియోగిస్తున్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు ట్యాంకులను పురపాలక నిర్వహించేది. వీటిని వినియోగించాక నిలిపేందుకు షెడ్ లేక ఎక్కడికక్కడ వదిలేయడంతో రక్షణ కొరవడింది. ఇదే అదనుగా కొందరు.. పారిశుద్ధ్య సిబ్బందితో కుమ్మక్కై వాటిపై కన్నేసి దోచేస్తున్నారు. గత నాలుగేళ్లలో చాలా వాహనాలు స్క్రాప్‌నకు వెళ్లినా వెలుగుచూడలేదు. పురపాలికకు చెందిన రూ.లక్షల విలువైన ఆస్తులు పరాధీనమవడం నాటి పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

వైకాపా హయాంలోనే కనుమరుగు..

పురపాలకలో అధికారులు వాహనాల నిర్వహణపై దృష్టి పెట్టలేదు. పారిశుద్ధ్య సిబ్బంది కొందరికి కౌన్సిలర్లు, ఇతర నేతలు అనుకూలంగా ఉండటం గమనార్హం. వారిపై చర్యలు తీసుకుంటే నేతల నుంచి ఒత్తిళ్లు వస్తాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు వచ్చిన పాత సామగ్రి, రెండు ట్రాక్టర్లు, రెండు ట్యాంకర్లు, ఆటో, మోటార్లు, పైపులు మాయమయ్యాయి. స్క్రాప్‌నకు వచ్చిన వేలం ద్వారా విక్రయించగా వచ్చిన ఆదాయం పురపాలకకు జమ చేయాల్సి ఉన్నా అలా జరగలేదు. పాలకవర్గంలోని కొందరు రూ.30 లక్షలకు పైబడి విలువైన వాహనాలను రహస్యంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. దీనిపై నాటి ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రశ్నిస్తే కేవలం రూ. 2 లక్షలు పురపాలక ఖాతాకు జమైంది. ఇంత గోల్ మాల్ జరిగినా నాటి పాలకులు అక్రమార్కులకు అండగా నిలవడం గమనార్హం.

పట్టణంలో ఇళ్ల నుంచి వెలువడే చెత్తను నింపేందుకు రోడ్లపై డంపర్‌బిన్లు ఏర్పాటు చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో చెత్త సేకరణ వాహనాలు రావడంతో 50కి పైగా డంపర్ బిన్‌లు పురపాలక కార్యాలయానికి తరలించారు. ఏడాది తర్వాత అవన్నీ మాయమవడం గమనార్హం.

పట్టణంలో నిత్యం 50 టన్నుల చెత్త వెలువడుతుంది. పొడి, తడిచెత్త వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించేందుకు 'మనం' స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన ట్రాక్టర్‌లోనే ప్రస్తుతం తరలిస్తున్నారు. పురపాలక వాహనాలు స్వల్ప మరమ్మతుకు గురైనా పక్కన పెట్టేసి రహస్యంగా మాయం చేస్తున్నారు.

104 వాహనాలదీ అదే తీరు..

తాజాగా దుమారం రేపిన 104 వాహనాల మాయం వెనుక పురపాలక సిబ్బంది ఉండటం ఈ అక్రమాలకు సాక్ష్యం. తమకు సంబంధం లేని వాహనాలు డంపింగ్ యార్డుకు తరలించడంలో పారిశుద్ధ్య సిబ్బంది జోక్యం చేసుకుని విక్రయించి రూ.లక్షల్లో కాజేయడంతో అధికారులు నివ్వెరపోయారు. కూటమి ప్రభుత్వం దీనిపై విచారణ చేపట్టడంతో వాస్తవాలు వెలుగుచూశాయి. గత వైకాపా హయాంలో మాయమైన వాహనాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు.. కమిషనర్ రవి, సీఐ చలపతికి ఫిర్యాదు చేయడంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది.

తొలగిన తీగలు

కలికిరి-కందూరు ప్రధాన రహదారి పక్కన అండేకు రవపల్లెను సూచించే నామఫలకానికి తీగలు, మొక్కలు పెరిగి బోర్డును ఆక్రమించేశాయి. దీంతో వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు దారి తెలియక అవస్థలు పడుతున్నారు. దీనిపై గత నెల ఐదో తేదీన 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీటీసీ మాజీ సభ్యురాలి భర్త మోహన్.. సదరు ఫలకానికి అల్లుకున్న తీగలు తొలగించి ప్రమాదాలు నివారించారు. -న్యూస్‌టుడే, కలికిరి

కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

దిగువవీధిలోని కాలువలో మురుగు, చెత్తాచెదారం సమస్యపై పంచాయతీ కార్యదర్శి శైలజ.. సిబ్బందిచే కాలువలో చెత్త తొలగించి శుభ్రం చేయించారు. -న్యూస్‌టుడే, కలకడ

చెత్తాచెదారం తొలగింపు

కోటపల్లె బాలబాలికోన్నత పాఠశాలల క్రీడా మైదానం వద్ద చెత్తకుప్పలు, వ్యర్థాలు వేస్తున్న సమస్యపై స్పందించిన విద్యాశాఖ అధికారులు పంచాయతీ అధికారులతో మాట్లాడి శుభ్రం చేయించారు.

● నాగూర్ రైస్ మిల్లు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అధ్వాన పారిశుద్ధ్యం సమస్యపై పంచాయతీ అధికారులు స్పందించి పరిసరాలు శుభ్రం చేశారు

-న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

ఇలానే వదిలేద్దామా..!

పట్టణంలోని మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద కొన్ని రోజుల క్రితం ప్రధాన రహదారిపై సూచిక బోర్డు నేల కొరిగింది. ఇది రోడ్డుపై అడ్డుగా పడటంతో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు చూసుకోక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫలితంగా క్షతగాత్రులవుతున్నారు. అధికారులు స్పందించి సూచిక బోర్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

కలగా సొంత భవనం

రెండో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రం అద్దె గదిలో నడుస్తోంది. పక్కా భవనం కోసం గతంలో ప్రభుత్వం భూమి కేటాయించింది. భవన నిర్మాణానికి భూమి చదును చేసి నిర్మించేందుకు సిద్ధమయ్యారు. ఏమైందో.. ఏమో.. నిర్మాణం ఆదిలోనే నిలిచి పోయింది. ప్రైవేటు గదుల్లో కేంద్రం నడుస్తుండటంతో యజమానులు ఎప్పుడు పడితే అప్పుడు ఖాళీ చేయిస్తున్నారు. చిన్నపిల్లలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. -న్యూస్‌టుడే, రాయచోటి పట్టణం

గండిమడుగు దారి.. నెర్రలు చీలి

గాలివీడులోని గండిమడుగు క్షేత్రానికి గుట్ట వాలు ప్రాంతంలో నూతనంగా కిలోమీటరు దూరం సీసీ రోడ్డు నిర్మించారు. వైకాపా పాలనలో సౌర విద్యుత్తు అభివృద్ధి నిధులు కేటాయించారు. సీసీదారిలో అక్కడక్కడ నెర్రలు వచ్చాయి. నాణ్యత పాటించక గాలి కొదిలేయడంతో ఇలా జరిగిందని వాహనదారులు, పరిసర ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గాలివీడు

మరుగుదొడ్లు పూర్తయ్యేదెన్నటికో..?

కె.రెడ్డివారిపల్లె ఆదర్శ పాఠశాలలో మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. ఇక్కడి 55 మంది విద్యార్థుల అవసరాలకు తగ్గట్టు నాడు-నేడు పథకంలో నూతన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. అయితే ప్రభుత్వం మారడంతో ఆయా పనులు నిలిచాయి. దీంతో పాతవాటినే విద్యార్థినులు వినియోగిస్తున్నారు. బాలురు బహిరంగ ప్రదేశాన్ని ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కలికిరి

లక్షలు ఖర్చు పెట్టి.. లక్షణంగా వదిలేసి

సరిమడుగులో గుర్రంకొండ-కలకడ రహదారి పక్కన లక్షల రూపాయలు ఖర్చు చేసి సచివాలయ భవనాన్ని నిర్మించారు. భవనం పూరైంది కానీ.. ఇప్పటివరకు సచివాలయ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. దాంతో లక్షణంగా వదిలేసి చాలీచాలని పంచాయతీ కార్యాలయంలో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. దీన్ని వినియోగంలోకి తీసుకురాక పోవడంతో అదికాస్తా శిథిలావస్థకు చేరుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -న్యూస్‌టుడే, గుర్రంకొండ

ఆరోగ్య కేంద్రానికి రక్షణ కావాలి

■ మందుబాబుల ఆగడాలతో నష్టం

కొత్తపల్లెలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మందుబాబులు ధ్వంసం చేసిన కిటికీల అద్దాలు

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజారోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయి. మురికి వాడల్లో నివసించే పేద ప్రజల ఆరోగ్యం కోసం కృషిచేస్తున్నాయి. అయితే కొందరు ఆకతాయిల చేష్టలతో ఆయా కేంద్రాలకు నష్టం వాటిల్లుతోంది. పూలతోట పల్లె, కొత్తపల్లెకు చెందిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ లేకపోవడం, నదీ పరీవాహక ప్రాంతం కావడంతో భారీగా కంప చెట్లు పెరిగిపోయాయి. ఈ కేంద్రంలోకి పాములు, విష పురుగులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. కొందరు ఆకతాయిలు మద్యం సేవించి రాళ్లతో ఈ కేంద్రంలోని వస్తువులను ధ్వంసం చేస్తున్నారు. ఆస్పత్రి భవనాల కిటికీలకు ఉన్న గ్లాసులను పగలగొట్టారు. అధికారులు స్పందించి ఆస్పత్రి భవనానికి ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఊరిపేరు.. తారుమారు

కలికిరి-కలకడ ప్రధాన రహదారి మధ్యనున్న ద్వారకానగరానికి గుర్తించే ఫలకం ఊడి పడిపోయింది. దీంతో ఆ గ్రామానికి వచ్చేవారు, వాహనదారులు ఫలకం తలకిందులు కావడంతో తికమక పడుతున్నారు. అసలు అక్కడ ఉన్నది ఏ ఊరో తెలియక నానా తంటాలు పడుతున్నారు. ఏం చేయాలో అర్థంకాక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ఫలకాన్ని సవరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కలికిరి

హరహర మహాదేవ.. శంభోశంకర

రాయచోటి: శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో మంచుతో చేసిన శివలింగం

రాయచోటి, పీలేరు, న్యూస్‌టుడే బృందం

మహాశివరాత్రిని పురస్కరించుకుని పీలేరు, రాయచోటి పట్టణం సహా నియోజకవర్గాల్లోని శివాలయాలు ఆదివారం భక్తులతో కిటకిలాడాయి.. శివనామ స్మరణతో మార్మోగాయి.. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చి ముక్కంటికి ప్రదక్షిణ చేసి ప్రత్యేకంగా బిల్వార్చన, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు.. హరహర మహాదేవ శంభో శంకర అంటూ ఎలుగెత్తారు.. ఆలయాల్లో శివపార్వతులకు ప్రత్యేక అలంకరణలు చేశారు. పలుచోట్ల కల్యాణోత్సవం కనులపండువగా సాగింది.. భక్తుల జాగరణ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు.. విద్యుదీపాల వెలుగుల నడుమ చాందినీ బండ్ల రాకతో పండగ శోభాయమానంగా సాగింది. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, తెదేపా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్‌బాబు, మాజీ విప్ శ్రీకాంతరెడ్డి తదితరులు వేర్వేరుచోట్ల ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

రామాపురం: కసిరెడ్డిగారిపల్లెలో అన్నప్రసాదాలు అందజేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి: అగస్త్యేశ్వరాలయంలో అన్నదానం చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

సంబేపల్లె: మోటకట్లలో ప్రత్యేక అలంకరణలో పరమశివుడు

సంబేపల్లె: విద్యుత్తు కాంతులతో చాందినీ బండి

గాలివీడు గండిమడుగు క్షేత్రంలో మూలవిరాట్‌కు అలంకారం


రాయచోటి: శ్రీ లింగేశ్వర, శనేశ్వర దేవస్థానంలో మూలవిరాట్టు

కలకడ.. నడిమిచెర్లలో శ్రీ శంకరనారాయణస్వామి

రాయచోటి: ఉమామహేశ్వరాలయంలో కల్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులు

రాయచోటి: శివపార్వతుల వేషధారణలో చిన్నారులు

కలకడ.. ప్రత్యేకాలంకరణలో శ్రీ సిద్ధేశ్వరస్వామి

వానరానికి అంత్యక్రియలు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: చింతపర్తి పంచాయతీ ఎర్రగుంట్లబావి గ్రామంలో ఓ వానరం కొద్దికాలంగా గ్రామస్థులతో సఖ్యతగా ఉంది. ఆదివారం ఆ అది అకస్మాత్తుగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆవేదన చెందారు. దాని కళేబరాన్ని గ్రామంలో ఊరేగించి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

IP No.11/25

బొమ్మల అమరనాథ S/o వెంకటరమణ, 43 సం॥లు. D.No.48/203, కొత్తపేట వీధి, రాయచోటి టౌన్ & మం. ...పిటీషనరు

Vs

1.B.లక్ష్మీదేవి D/o పుష్ప, 39 సం॥ D.No.231/1, V.R. కాలేజి వీధి, కొత్తపేట, రాయచోటి.
2.C.రవీంద్ర @ రవి S/o రమణ, 38 సం॥ 2/34, మస్తాన్‌రెడ్డి వీధి, కాకతీయ కాలేజి దగ్గర, రాయచోటి టౌన్.
3.ముదిశెట్టి రఘునాథయ్య, 3/45, K. రామాపురం, చౌడేశ్వరి దేవాలయం దగ్గర, రాయచోటి టౌన్.
4.ఓలిపట్టి రవీంద్ర, S/o వెంకటేసు, 3/8, వరిగకురవపల్లె H/o బోట్ల చెరువు గ్రామం, రాయచోటి.
5.మదనమోహన్‌రెడ్డి, 45 సం॥. 34/23, పాతరాజుస్కూల్, రాయచోటి.
6.ఆలూరి మస్తాన్, 40 సం॥. జండామానుదగ్గర, రాయచోటి.
7.N.నారాయణ రాజు, 45 సం॥. 38/39, శివాలయం వీధి, రాయచోటి.
8.పురం శ్రీరాములు, 2/33, K. రామాపురం, రాయచోటి టౌన్.
9.బొమ్మల అంజనాదేవి, W/o కొండయ్య, 5/709-73, దేవాంగుల పేట, ప్రొద్దుటూరు (టౌన్ & మం).
10.అరమాటి సుష్మ, W/o మోహన్‌రెడ్డి, 42సం॥, వినాయక వీధి, రాయచోటి టౌన్ & మం.
11.మరిపూరి ఆదిరెడ్డి, S/o నాగిరెడ్డి, చెర్వుక్రిందపల్లె, H/o చిట్లూరు (గ్రామం), రామాపురం (మం).
12.దేరంగుల ఆంజనేయులు, S/o నరసింహులు, 53సం॥, B.C. కాలనీ, నల్లగుట్టపల్లె గ్రామం, రామాపురం మం.
13.సాగిరాజు సూరి, S/o సూరయ్య, 65/56, K. రామాపురం, రాయచోటి టౌన్ & మం. ...రెస్పాండెంట్లు

నోటీసు ప్రకటన

పై నెంబరు దావాలో పిటీషనరు ఇన్‌సాల్వెన్సిగా తీర్మానించవమని రెస్పాండెంట్లు అయిన మీపైన I.P.పిటీషన్ను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీరు 26 తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెల్పుకోవలయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు
శ్రీ ఎం.నాగేశ్వర రావు
పిటీషనరుపరం అడ్వకేటు, రాయచోటి

కనులపండువగా సిద్ధేశ్వరస్వామి కల్యాణం

గజవాహనంపై సిద్ధేశ్వరస్వామి

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కలకడ, న్యూస్‌టుడే: సత్యవతి నదీతీరాన వెలసిన శ్రీ సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కామాక్షీ సమేత సిద్ధేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో చక్కగా అలంకరించారు. అర్చకులు విజయసారథి, సునీల్, సుబ్రహ్మణ్యం స్వాములు సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవం పూర్తి చేశారు. భక్తులకు స్వామి అమ్మవార్లకు కానుకలు సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త రవీంద్రశర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ● గజవాహన సేవ గాండ్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలప్రభపై స్వామివార్ల ఉత్సవమూర్తులు కొలువుదీర్చి పురవీధులలో విహరింపజేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పాటలు, నృత్య కార్యక్రమాలు అలరించాయి. గాండ్ల సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిర్మించారు.. మరిచారు..

గోరాన్‌చెరువు పంచాయతీ కుమ్మరపల్లి వద్ద అంగన్‌వాడీ కేంద్రం కోసం నిర్మించిన భవనం ప్రారంభించక పోవడంతో అది కాస్తా వృథాగా మారింది. ఈ కేంద్రానికి సొంత భవనం కోసం గతంలో తెదేపా ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు సమకూర్చింది. తుది బిల్లుల చెల్లింపు సమయాన వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దాన్ని పట్టించుకోలేదు. నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని కూటమి ప్రభుత్వ పాలనలోనైనా వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గాలివీడు

నేడు మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కలికిరి: గుట్టపాలెం గ్రామం కె.భరిణేపల్లె పూలకొండలో వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భ్రమరాంబ, మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బాలరెడ్డప్ప నాయిని, డాక్టర్ వెంకటస్వామి తెలిపారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహన్యాసపూర్వక అభిషేకాలు, జాగారం నిర్వహించారు. సోమవారం అన్నదానం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం కల్యాణోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

హమ్మయ్య.. రోడ్డు బాగుచేశారు

ఈనాడు కథనానికి స్పందన

ఎట్టకేలకు పీలేరుకు రెండు కిలోమీటర్ల దూరం కడప మార్గం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట కడప-చిత్తూరు జాతీయ రహదారిలో తారు రోడ్డు దెబ్బతింది. దీనిపై గత నెల 13న 'వేంకటేశ్వరా.. దారి చూడవయ్యా' శీర్షికన కథనం ప్రచురితమైంది.

నాడు

నేడు

దీనిపై స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు ఇటీవలే ఆలయం ఎదుట దెబ్బతిన్న రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశారు.

-న్యూస్‌టుడే, పీలేరు

(c) eenadu

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరిస్తాం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ తెలిపారు. శనివారం 'ఈనాడు'లో 'సర్వజనాసుపత్రికి.. సకల రోగాలు' శీర్షికతో ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు. ఆసుపత్రిలో శుద్ధజల యంత్రం మరమ్మతులకు నివేదిక పంపించామన్నారు.

గేట్‌వాల్వ్‌కు మరమ్మతులు

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని కందూరు సచివాలయం సమీపంలో నాగులబావి వద్ద గేట్‌వాల్వ్ పాడైంది. నీరు కలుషితం అవుతోందని ఈనాడులో వార్త ప్రచురితమవగా కార్యదర్శి జయశంకర్ స్పందించారు. కొత్త గేట్‌వాల్వ్ కొనుగోలు చేసి మార్పించారు.

హార్సిలీహిల్స్‌పై పర్యాటకుల సందడి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో రద్దీ కనిపించింది. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో కొండను సందర్శించారు. కొత్త, పాత వ్యూపాయింట్లు, అటవీ, పర్యాటక శాఖల ప్రాంగణాల్లో ఉత్సాహంగా కనిపించారు.

వైభవంగా గిరిజా కల్యాణం

మదనపల్లె అర్బన్: నీరుగట్టువారిపల్లె టౌన్ చౌడేశ్వరినగర్‌లో వెలసిన నీలకంఠేశ్వరాలయ ఆవరణలో గిరిజా కల్యాణం ఆదివారం రాత్రి కమిటీ ఛైర్మన్ రామాంజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పండితులు శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం చేపట్టారు. నీరుగట్టువారిపల్లెకు చెందిన ఉభయదారులు పాల్గొన్నారు.

సర్వేశ్వరాయ.. సదాశివాయ

కురబలకోట అలంకరణలో కల్లూరు చంద్రమౌళీశ్వర స్వామి

మల్లయ్య కొండపై వెలసిన మల్లికార్జునుడు

పూజలు అందుకుంటున్న రామసముద్రం వాలీశ్వరుడు

మల్లయ్య కొండపై దర్శనానికి వేచి ఉన్న భక్తులు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా మదికయ్యల శివాలయంలో విశేష పూజలు చేశారు. ✿ అల్లికత్తాపు కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజలు ఘనంగా జరిగాయి. ✿ సోమల: పెద్దఉప్పరపల్లె దుర్గంకొండపై వెలసిన గార్గేయమునీశ్వర, రెడ్డివారిపల్లెలోని మోక్షేశ్వర, మల్లేశ్వర, నంజంపేట, సోమల శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గార్గేయ మునీశ్వర ఆలయంలో పూజలు చేశారు. ✿ రామసముద్రం, నిమ్మనపల్లె: రామసముద్రం మండలం లోని వాలీశ్వరస్వామి కొండపై రథోత్సవం వైభవంగా నిర్వహించారు. వాలీశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. ✿ నిమ్మనపల్లె మండల తవలంలోని నేలమల్లేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ✿ బి.కొత్తకోట: బీరంగిలోని బండేస్వామి ఆలయంలో పీఠాధిపతి లక్ష్మీపతి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ✿ తంబళ్లపల్లె, ములకలచెరువు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన మల్లయ్యకొండకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మల్లికార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, తెదేపా నాయకుడు దాసరిపల్లి జయచంద్రారెడ్డి, నీడ్ మల్లికార్జుననాయుడు, శ్రీరామ్‌చిన్నబాబు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ తదితరులు పూజలు నిర్వహించారు. ✿ పుంగనూరు: భోగనంజుండేశ్వర, కాశీ విశ్వేశ్వర, సోమేశ్వర, పంచముఖ మృత్యుంజయేశ్వర, అమోరేపిరాజధ్ది, విరూపాక్షి మారెమ్మ ఆలయాల్లో అభిషేకాలు చేశారు. ✿ కల్లూరు: పులిచెర్ల మండలంలోని కమ్మరెడ్డిగారిపల్లె మల్లేశ్వర ఆలయానికి తెదేపా ఇన్‌ఛార్జి రామచంద్రారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ✿ సదుం: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎర్రాతివారిపల్లెలో అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఊటుపల్లె మల్లికార్జున ఆలయానికి తెదేపా మండలాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ✿ పెద్దమండ్యం, చౌడేపల్లె, పెద్దతిప్పసముద్రం: పెద్దమండ్యంలోని భవాని శంకరాలయం, సోమేశ్వర, నీలకంఠేశ్వర, చౌడేపల్లెలోని మృత్యుంజయేశ్వర, పీటీ సముద్రంలోని విరూపాక్ష స్వామి ఆలయంలో ఏకవార రుద్రాభిషేకం, పూర్ణాహుతి చేపట్టారు. పంచ రసాలతో అభిషేక పూజలు చేశారు.

ప్రత్యేక అలంకరణలో పుంగనూరు కాశీవిశ్వేశ్వరుడు

జంగాలపేటలోని అరుణాచలేశ్వర స్వామి..

దుర్గంకొండ గార్గేయమునీశ్వర స్వామి సేవలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు

రాష్ట్రాభివృద్ధి సూచికగా బడ్జెట్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, చిత్రంలో నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధి, పేదలు, రైతులు, మహిళ సంక్షేమం దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ వార్షిక బడ్జెట్ రూపొందించారని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. 6 కోట్ల ఆంధ్రుల తలరాత మారుతుందన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయం, ఎస్సీలు, బీసీలు, మహిళాశిశు సంక్షేమం, మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. వివిధ దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడంతో లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. మదనపల్లె అభివృద్ధికి ముఖ్యమంత్రి బాధ్యత తీసుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తెదేపా పట్టణాధ్యక్షుడు ఎన్.అరుణ్‌తేజ, నవీన్ చౌదరి, ఆంజనేయులు, బాబునాయుడు, మహాలక్ష్మి, నాగమణి, మల్లిక్ పాల్గొన్నారు.

సమతూకం : రాయచోటి : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వ బడ్జెట్ సమతూకంగా ఉందని రాజంపేట పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ప్రస్తుత బడ్జెట్ రూపొందించడం గొప్ప విషయమని చెప్పారు. గత వైకాపా ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో శ్రమిస్తున్నారన్నారు.

నాణ్యత డొల్ల.. ఖజానా గుల్ల

పైపులైన్ల లీకులతో నీరు వృథా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలో పైపులైను పగిలిపోయి నీరు వృథా కావడంతో పాటు కలుషితం అవుతోంది. అమృత్ పథకం కింద పట్టణంలోని ప్రతి వీధిలో తాగునీటి కోసం రూ.50 కోట్ల వ్యయంతో పైపులైను ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల పాటు విలియోగించడంతో శిథిల స్థితికి చేరాయి. ప్రస్తుతం నీటి సరఫరా జరగడంతో పైపులు పగిలి, లీకవుతున్నాయి.

ఎన్టీఆర్ కాలనీలో పైపు పగిలిపోవడంతో తొలగించారిలా..

200 కి.మీ. మేర పైపులు..

మదనపల్లె పురపాలక సంఘంలో తాగునీటి సరఫరా కోసం 200 కి.మీ. మేర ఆర్‌సీసీ, జీఐ, సీఐ, హెచ్‌డీపీఈ వంటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. కానీ నీరు వదిలే సమయంలో లీకవుతున్నాయి. ప్రధాన పైపులైన్లతో పాటు కాలనీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. పట్టణంలో రోజుకో చోట సమస్య రావడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్ల ద్వారా రోజుకు 12.25 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేయాల్సి ఉండగా 11.50 ఎంఎల్‌డీ అందిస్తున్నారు. సమస్యపై డీఈఈ శ్రావణి మాట్లాడుతూ.. పైపులైన్ల లీకులు అరికట్టేందుకు చర్యలు చూపుతామన్నారు.

ఇవీ వివరాలు.. ❖ బోర్లు: 262 ❖ పనిచేస్తున్నవి: 125 ❖ కుళాయిలు: 24,200 ❖ వీధి కుళాయిలు: 65 ❖ చేతిబోర్లు: 180 ❖ పనిచేస్తున్నవి: 160

తాగునీటి వార్షిక బడ్జెట్:

✦ కొత్త పైపులు, బోర్‌వెల్ విడి పరికరాల కొనుగోలుకు: రూ.1 కోటి ✦ నీటి సరఫరా పనులకు: రూ.65 లక్షలు ✦ ప్రధాన పైపు లైన్ల నిర్వహణ: రూ.50 లక్షలు ✦ పంపిణీ పైపులైన్ల నిర్వహణ: రూ.50 లక్షలు

ఈ ప్రాంతాల్లో సమస్యలు..

✦ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం సమీపంలో ఉన్న ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు నుంచి దేశాయి, దేవళం వీధులు, అప్పారావుతోట, నెహ్రూ బజార్, దర్బార్‌వీధి, నైలాజిక్ ప్రాంతాలకు నీరు సరఫరా చేస్తున్నారు. మధ్యలోని బోడిలేబుట్ వద్ద ప్రతినెలా రెండు మూడు సార్లు పైపులు పగులుతున్నాయి. ✦ అప్పారావుతోట అవంతి థియేటర్‌కు వెళ్లే మలుపులో పైపు పగిలి నీరు లీకవుతోంది. ✦ మధుసూదన థియేటర్ వద్ద పైపులైను లీకవుతోంది. ఇక్కడ మరమ్మతులు చేస్తున్నా లీకులు ఆగడం లేదు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మదనపల్లె పట్టణం: 80085 74611 తంబళ్లపల్లె: 94416 29636 పుంగనూరు: 80085 74622 (10 AM TO 1 PM)

? బి.కొత్తకోట పరిధిలోని అయ్యవారిపల్లె వద్ద విద్యుత్తు తీగలు వేలాడుతూ చేతికి అందేలా ఉన్నాయి. - నారాయణ ✶ విద్యుత్తు తీగలు సరి చేస్తాం. - ముజిబుల్, ఏఈ, విద్యుత్తు శాఖ - న్యూస్‌టుడే, బి.కొత్తకోట ? రామసముద్రం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చెత్త ఆకులు కుప్పలుగా ఉంటున్నాయి. శుభ్రం చేయాలి. - వినోద్ ✶ ఆవరణ శుభ్రం చేయిస్తాం. - లతీఖాన్, ఎంపీడీవో - న్యూస్‌టుడే, రామసముద్రం ? ములకలచెరువు రోడ్డుపై వ్యర్థాలు వేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - శ్రీనివాసులు ✶ రెండు రోజుల్లో శుభ్రత పనులు చేపడతాం. - మోహన్‌ప్రతాప్, ఈవోపీఆర్డీ - ములకలచెరువు ? చెర్లోపల్లె గ్రామంలో రోడ్డు మురుగు పారుతోంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. - మహేశ్ ✶ పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. - దొరబాబు, కార్యదర్శి - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం ? చిన్నతిప్పసముద్రం సచివాలయం ప్రాంతంలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. - శ్రీనాథ్, సీఐటీయూ ✶ కాలువలు శుభ్రం చేయిస్తాం. - పవన్‌కుమార్, కార్యదర్శి ? బెంగళూరు రహదారి నక్కలదిన్నె వద్ద వ్యర్థాలు వేయడంతో దోమలు విజృంభిస్తున్నాయి. - శ్రీనివాసులు ✶ పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - భారతి, డిప్యూటీ ఎంపీడీవో ? రాజీవ్‌నగర్‌లోని ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. - రమణ ✶ మరమ్మతులు చేయిస్తాం. - శ్రావణి, డీఈఈ ? దుబ్బిగానిపల్లె, తిరుపతి మార్గంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. - రమేశ్ ✶ క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. - తాజ్‌మస్రూర్, ఎంపీడీవో

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణం

ఆలయానికి రూ.2.10 లక్షల విరాళం

పుంగనూరు, న్యూస్‌టుడే: మండలంలోని నెక్కుంది సమీపంలో అగస్త్యేశ్వరస్వామి కొండపై శివుని విగ్రహ ప్రతిష్ఠ పనులకు కొత్తపల్లె చెంగారెడ్డి రూ.2.10 లక్షలు విరాళం అందించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయం వద్ద శివకోటి చేపట్టిన బృందానికి రూ.10 వేలు అందజేశారు. ✦ పెద్దమండ్యం: మండలానికి చెందిన దాతలు శివాలయం నిర్మాణానికి రూ.1,00,116 విరాళం అందజేశారని జీర్ణోద్ధారకుడు చిదానందగిరి తెలిపారు. పాపేపల్లె పంచాయతీలో ఉమామహేశ్వర ఆలయ నిర్మాణం చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన అంగడి పాపయ్య కుమారుడు సుమన్‌కుమార్, స్నేహితుడు అశ్వినీకుమార్ నగదును అందజేశారు.

బీసీ సింహగర్జన పోస్టర్ల ఆవిష్కరణ

బోయకొండ (చౌడేపల్లె), న్యూస్‌టుడే: బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ ఈనెల 22న తలపెట్టిన బీసీ సంహగర్జన విజయవంతం కావాలని బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసినట్లు పార్టీ నియోజకవర్గ కన్వీనరు హరిబాబు యాదవ్ తెలిపారు. ఆదివారం కొండపై బీసీ సింహగర్జన పోస్టర్లు ఆవిష్కరించారు. 108 కొబ్బరికాయలు కొట్టారు. ఆర్థికంగా వెనుకబడిన బీసీల కోసం ఐక్యంగా పోరాటం చేద్దామన్నారు. నాయకులు వెంకటేష్ యాదవ్, శంకర్, గణేష్, గౌడ తదితరులు పాల్గొన్నారు.

లుక్ అండ్ లైక్ షోరూమ్ ప్రారంభం

నగదు అందిస్తున్న చెంగారెడ్డి సహచరులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్.ఆర్ వీధిలో లుక్ అండ్ లైక్ వెడ్డింగ్ మాల్ షోరూమ్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదివారం ప్రారంభించారు. పట్టణ ప్రజలకు షోరూమ్ అందుబాటులోకి తీసుకురావడం సంతోషమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్ని వర్గాలను ఆకట్టుకునే దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. యజమాని ఖాదర్‌కుట్టి, ఏఎంసీ అధ్యక్షుడు జె.శివరామ్, టౌన్‌బ్యాంకు ఛైర్మన్ ఎన్.విద్యాసాగర్, నవీన్‌చౌదరి, వై.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్య భవనాలు

కూలడానికి సిద్ధంగా ఉన్న భవనం

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పశు సంవర్ధకశాఖ జిల్లా కార్యాలయం ఆవరణలో భవనాలు శిథిలావస్థకు చేరాయి. అయిదెకరాల స్థలంలో 110 ఏళ్ల క్రితం చిన్న ఆసుపత్రి ఏర్పాటు చేశారు. నేడు జిల్లా స్థాయికి మారినా పురాతన భవనాలే దిక్కుగా మారాయి. కొన్నింటిలో ఉప, సహాయ సంచాలకుల కార్యాలయాలు ఏర్పాటవగా, మరికొన్ని పురాతన భవనాలు నిరుపయోగంగా మారాయి. కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. పనికి రాని మొక్కలు పెరిగిపోవడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. విషయం జిల్లా అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై దృష్టికి తీసుకెళ్లగా.. ఆవరణలో భవనాల పరిస్థితిపై రాష్ట్ర అధికారులకు నివేదిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని జాండ్రబైలు వద్ద కోళ్లఫారంలో పనిచేస్తున్న గౌరీశంకర్‌నాయక్ (25) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆయన ఒడిశా రాష్ట్రం ఇందుపూర్ ఇమాలియాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. అనారోగ్యంగా ఉండడంతో శనివారం రాత్రి మదనపల్లెలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. తిరిగి కోళ్లఫారానికి చేరుకున్నాడు. ఉదయానికి ఆయన మృతి చెంది ఉండటంతో అనుమానాస్పద స్థితి మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

కుక్కల దాడిలో జింక మృత్యువాత

చౌడేపల్లె, న్యూస్‌టుడే: కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. అటవీ ప్రాంతం నుంచి దిగువపల్లె పంచాయతీ కొలింపల్లె గ్రామంలోకి ఆదివారం ఉదయం ఓ జింక దారి తప్పి వచ్చింది. దానిపై కుక్కలు దాడి చేశాయి. గ్రామస్థులు గుర్తించి కాపాడే ప్రయత్నం చేశారు. కానీ తీవ్రగాయాలతో ప్రాణాలు వదిలేసింది. అటవీశాఖ అధికారి రామయ్య పశువైద్యుల సాయంతో పోస్టుమార్టం చేశారు.

ఆలయంలో నగల చోరీ

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని టి.సదుం చౌడేశ్వరి ఆలయంలో సుమారు రూ.1.60 లక్షల విలువైన అమ్మ వారి బంగారు నగలు చోరీకి గురయ్యాయి. బంగారు కళ్లతో పాటు తాళిబొట్టు చోరీకి గురైనట్లు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ● బిందు సేద్యం పరికరాలు.. బి.కొత్తకోట: అయ్యవారిపల్లె వద్దనున్న ఆర్.నారాయణరెడ్డికి చెందిన రూ.2 లక్షల విలువైన బిందు సేద్యం పరికరాలు చోరీకి గురయ్యాయి. శనివారం రాత్రి దుండగులు ఓ వాహనంలో వచ్చి పైపులు, టమాట క్రేట్లను చోరీ చేశారని రైతు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఆటోల బోల్తా: పది మందికి గాయాలు

సోమల, న్యూస్‌టుడే: ఆటో బోల్తా పడి ఆరుగురు గాయపడిన ఘటన పెద్దఉప్పరపల్లె దుర్గంకొండ సమీపంలో జరిగింది. సోమల శెట్టివారివీధికి చెందిన రత్నమ్మ, పద్మావతి, లీలావతి, మునిరత్నమ్మ, బాలసుబ్రహ్మణ్యం పెద్దఉప్పరపల్లె సమీపంలోని గార్గేయ మునీశ్వర ఆలయానికి ఆటోలో వెళ్లారు. దుర్గంకొండ వద్ద ఆటో అదుపుతప్పడంతో చోదకుడితో పాటు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ✦ మదనపల్లె గ్రామీణం: ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలు అయ్యాయి. గంగవరం మండలంలోని బొమ్మనపల్లికి చెందిన గంగరాజు, భార్య మాలశ్రీ, పిల్లలు తన్విక, తన్విత శనివారం రాత్రి కర్ణాటక రాష్ట్రంలోని అత్త గారింటికి ఆటోలో బయలుదేరారు. పెద్దపంజాణి సమీపంలోని ఎలగట్టూరు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. నలుగురికి గాయాలవగా మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ✦ అంకిరెడ్డిపల్లెలో టిప్పరు.. పెద్దతిప్పసముద్రం: మండలం సమీపంలోని అంకిరెడ్డిపల్లె రోడ్డులో కంకర తరలించే టిప్పరు బోల్తా పడింది. పీటీఎం నుంచి అంకిరెడ్డిపల్లె మీదుగా బెట్టకొండకు వెళ్లే మార్గంలో రోడ్డు పనులు చేస్తున్నారు. ఈ మార్గంలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయడంతో ఆ తీగలు తగిలి వాహనం బోల్తా పడిందని పీఆర్ ఇంజినీరు నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఏనుగుల హల్‌చల్

కల్లూరు, న్యూస్‌టుడే: తూర్పు అటవీ ప్రాంతం నుంచి ఆదివారం రెండు ఏనుగులు పడమర ప్రాంతానికి చేరుకున్నాయి. చిత్తూరు రోడ్డులోని వ్యవసాయ పొలాలపై జాతీయ రహదారిని దాటి పీరుసాబ్, శ్రీరాములు, హరి, ఖాదర్‌బాషా, యాసిన్, నారాయణ, మహబూబ్‌ఖాన్ మామిడి తోటల్లో కొమ్మలు విరిచేశాయి. నౌషాద్, రియాజ్ సాగు చేసిన పశుగ్రాసంను ఏనుగులు తొక్కేశాయి. అటవీ అధికారులు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఏనుగులను దూరంగా తరమాలని విన్నవిస్తున్నారు.

తాగునీటి పైపులైను ఏర్పాటు

పైపులు బిగిస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: మోతీనగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త పైపులైను ఏర్పాటు చేశారు. ఈనెల 9న 'ఈనాడు' ఆధ్వర్యంలో 13వ వార్డులో 'వాక్‌విత్ కమిషనర్' కార్యక్రమం జరిగింది. ఇక్కడ 15 ఇళ్లకు నీరు రావడం లేదని కమిషనర్ ప్రమీలకు స్థానికులు చెప్పారు. ఆమె స్పందించడంతో కొత్తగా పైపులైను వేశారు. ● సోమల: 81.ఉప్పరపల్లె పంచాయతీ గురికానివారిపల్లెలో పైపులైన్ లీకుతో నీరు వృథాగా పోతోందని ఈనాడులో వార్త ప్రచురితమైంది. ఇన్‌ఛార్జి కార్యదర్శి జయశంకర్ కొత్త పైపులు వేయించారు.

'చేనేతకు అన్యాయం'..: మదనపల్లె పట్టణం: బడ్జెట్‌లో చేనేత రంగానికి అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వి.వీరభాస్కర్ విమర్శించారు. ఆదివారం మదనపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.3,32,205 కోట్ల వార్షిక బడ్జెట్‌లో నేతన్నలకు ఆర్థిక సాయంగా కేవలం రూ.245 కోట్లు, విద్యుత్తు రాయితీ కోసం రూ.600 కోట్లు కేటాయించారని, నిధులు పెంచితే బాగుండేదని పేర్కొన్నారు.

బంజారాలకు దారిచూపిన సేవాలాల్

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు

పుంగనూరు, న్యూస్‌టుడే: బంజారాల జాతిపితగా పేరొందిన శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. సుగాలిమిట్టలోని సంత్‌సేవాలాల్ సొసైటీ ఆధ్వర్యంలో పుంగనూరు పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ చేపట్టారు.

కోటగుట్టకు నిప్పు.. చెట్ల దహనం

రామసముద్రం, న్యూస్‌టుడే: పెంచుపాడు తండా సమీపంలోని కోటగుట్టకు ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గుట్ట ప్రాంతంలో సుమారు పది ఎకరాలకు పైగా చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు అదుపు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మురుగుతో ముప్పుతిప్పలు

బెంగళూరు రోడ్డులోని సొసైటీ కాలనీ మొదటి క్రాస్ రోడ్డులో మురుగు కాలువ పూడికతో నిండింది. మురుగు నిల్వ చేరడంతో దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలతో సతమతం అవుతున్నట్లు పలువురు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు ఆసుపత్రులు, పాఠశాలలు, హోటళ్లు ఉన్నాయి. మురుగుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణం

ఒకటీ.. రెండు.. ఉగ్గబట్టుకోనుండు!

నిరుపయోగంగా మారిన అమ్మచెరువు సమీపంలోని మరుగుదొడ్డి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: మదనపల్లె జిల్లా కేంద్రంగా మారిన తర్వాత రోజూ వివిధ రకాల పనులపై వేల సంఖ్యలో వస్తున్నారు. కానీ అవసరమైన మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ, ప్రైవేటు బస్టాండ్ల వద్ద డబ్బులు చెల్లిస్తూ అవసరాలు తీర్చుకుంటున్నారు.

ప్రజలకు ఇబ్బందులు..

కొన్ని చోట్ల ప్రజా మరుగుదొడ్లు ఉన్నా నిర్వహణ లేక కంపు కొడుతున్నాయి. ఇలాంటి వాటిని వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లె పట్టణంలో ఆర్టీసీ, చిత్తూరు, బెంగళూరు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు లేవు. నిర్వహణ లేక మూతపడ్డాయి. నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు, ఎన్టీఆర్ కూడలి, సొసైటీకాలనీలోనూ ఇదే పరిస్థితి. తహసీల్దారు, సబ్‌రిజిస్ట్రార్, సబ్‌జైలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఇక్కడికి రాకపోకలు ఎక్కువ. సీటీఎం రోడ్డు పారిశ్రామిక వాడ కూడలి, గొల్లపల్లె బైపాస్ రోడ్డు, ఎన్వీఆర్ లేఅవుట్, బసినికొండ ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేక ఆరుబయట అవస్థలు పడుతున్నారు.

1.80 లక్షల మందికి 6 మాత్రమే..

స్వచ్ఛభారత్ మార్గదర్శకాల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో లక్షమంది జనాభాకు 100 మరుగుదొడ్లు ఉండాలి. వీటిలో పురుషులు, మహిళలకు సమానంగా కేటాయించాలి. మదనపల్లె పురపాలకలో 1.80 లక్షల మంది జనాభా ఉన్నారు. వీరి కోసం 150 మరుగుదొడ్లు ఉండాలి. కానీ కేవలం 6 సామూహిక మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. తాజాగా పట్టణంలో మరో ఆరింటిని కొత్తగా నిర్మిస్తున్నట్లు డీఈఈ శ్రావణి తెలిపారు.

నిలిచిన పనులు.. దారిలేక అవస్థలు

మదనపల్లె మండలంలోని ఎగువ, దిగువ దొనబైలు వెళ్లే దారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గత ఎన్నికల ముందుకు రూ.3.80 లక్షలతో పనులు ప్రారంభించారు. కోడ్ రావడంతో పాటు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ఆగాయి. దీంతో విద్యార్థులు 8 కిలోమీటర్ల దూరం వరకు కాలినడకన పాఠశాలలకు వెళ్తున్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణం

నేడు మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం

కలికిరి: గుట్టపాలెం గ్రామం కె.భరిణేపల్లె పూలకొండలో వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భ్రమరాంబ, మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బాలరెడ్డప్ప నాయిని, డాక్టర్ వెంకటస్వామి తెలిపారు. శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహన్యాసపూర్వక అభిషేకాలు, రాత్రి జాగారం నిర్వహించారు. సోమవారం అన్నదానం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం కల్యాణోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

అన్నమయ్య జిల్లా, పూజగానిపల్లె స్వస్థలము ప్రస్తుతము పిట్స్‌బర్గ్ సిటిరోజ్‌మూర్ స్ట్రీట్, అమెరికా దేశములో కాపురముండు పప్పు వైదేహి శ్రీవర్ధన్, భర్త శ్రీవర్ధన్ గారి పరము ఇచ్చు బహిరంగ ప్రకటన. మా కక్షికర్త భీమిగానిపల్లె గ్రామం, పుంగనూరు మండలము నందు గల క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై 1/3 భాగము హక్కుగలదని మా కక్షికర్త రాజశ్రీ మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో పప్పు జగన్నాథరెడ్డి, పప్పు శ్రీకాంత్‌రెడ్డి, పప్పు భార్గవిరెడ్డిలపై భాగపరిష్కారము కోరుతూ వేసిన దావాను 24-11-2025వ తేదీనాడు మా కక్షికర్తకు వ్యతిరేకముగా తీర్పు వచ్చి సదరు దావాను కోర్టు వారు తోసివేసినారు. సదరు దావా డిక్రీ జడ్జిమెంటు కాపీలు ఇంకనూ మా కక్షికర్త అప్లై చేసినా ఇంకనూ కోర్టు వారి నుండి అందలేదు. మా కక్షికర్త సదరు తీర్పుపై హైకోర్టులో అప్పీలు వేయతలచినారు. సదరు తీర్పును ఆసరాగా తీసుకొని ప్రతివాది పప్పు భార్గవిరెడ్డి మరియు ఆమె తండ్రి పప్పు రవీంద్రనాథరెడ్డిలు ఇతరులకు అమ్మజూపుతున్నారని రూఢిగా తెలిసినది. కావున ఎవరేని క్రింద తెలిపిన షెడ్యూలు ఆస్తిపై ఎలాంటి లావాదేవాలు జరిపినా అవి ఎంతమాత్రము మా కక్షికర్త హక్కులకు భంగము వాటిల్లవని యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు

అన్నమయ్య జిల్లా, పుంగనూరు సబ్-జిల్లా-సబ్ రిజిస్ట్రారు, పుంగనూరు రెవిన్యూ మండలం, భీమగానిపల్లె రెవిన్యూ గ్రామం, పూజగానిపల్లె దగ్గర గల ఆస్తి వివరము :

S.No. 523/1 A.C. 3.02, S.No. 523/2 A.C. 0.80 పైకి 10,406 చ॥ గజాలు

RCC బిల్డింగ్ 60x63 = 3780 చ॥ అడుగులు

RCC బిల్డింగ్ 40x30 = 1200 చ॥ అడుగులు

తూర్పు - గుట్ట, పడమర - పాలెంపల్లి రోడ్డు, ఉత్తరం - పి.జగన్నాథరెడ్డి గారి జమీను, దక్షిణం - జె.శివశంకర్‌రెడ్డి గారి జమీను. పై ఆస్తిలోని బావిలో 1/50వ భాగం హక్కుపై జాగాలో అడుగు ప్రదేశములో వేసి వుండే పైపు లైన్ల ద్వారా నీటి పారుదలకు వేసిన పైపులో హక్కు.

వై.సాంబశివారెడ్డి, B.A., B.L.,
అడ్వకేట్, P & T Colony, మదనపల్లి.

(c) eenadu

కోటప్పకొండ వద్ద విద్యుత్తు వెలుగుల్లో భారీ ప్రభలు

అలంకరణలో త్రికోటేశ్వర స్వామి

ప్రభల తేజం.. ప్రణమిల్లిన జనం

కోటప్పకొండపై మారుమోగిన శివనామస్మరణ

వైభవంగా మహా శివరాత్రి తిరునాళ్ల

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే బృందం: మహాశివరాత్రి పురస్కరించుకుని త్రికూటగిరులు భక్తులతో కిటకిటలాడాయి. 'ఓం నమఃశివాయ... చేదుకో కోటయ్యా.. మముఆదుకో రావయ్యా' అంటూ శివనామ స్మరణతో మారుమోగాయి. త్రికోటేశ్వరుడిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శనివారం అర్ధరాత్రి తర్వాత మొదట బిందెతీర్థంతో స్వామిని అభిషేకించారు. అనంతరం విభూది, పసుపు, కుంకుమ, గంధాలతో అభిషేకాలు చేశారు. త్రికోటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మును పెన్నడూ లేనిరీతిలో శనివారం రాత్రి ఒంటి గంట నుంచే స్వామి దర్శనం కల్పించారు. మెట్ల మార్గం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు పసుపు కుంకుమ బొట్లు పెడుతూ మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై భారీ నంది విగ్రహానికి పూజలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం పుట్ట వద్ద నాగదేవతను దర్శించుకున్నారు. అభిషేక మండపాల్లో రుద్రాభిషేకాలు చేశారు. యాగశాలలో మేధా దక్షిణామూర్తి హోమాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రభలను కొండకు తీసుకొచ్చారు. అయిదు అడుగుల చిట్టి ప్రభ నుంచి 100 అడుగుల వరకు ఉన్న విద్యుత్తు ప్రభలు కనువిందు చేశాయి. కోటప్పకొండతో పాటు జిల్లాలోని సత్రశాల, ద్రైద, అమరావతి, బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు పోటెత్తారు.

కొండపై కోలాహలం

క్యూలో భక్తుల రద్దీ

అభిషేక మండపంలో..

గోవాడలోని బాలకోటేశ్వరుడు

అమరేశ్వరస్వామి

వేడి భానుడు.. తడిసి మోపెడు..

పెరిగిన ఎండతో పంటలకు నీరందక రైతులపై భారం

న్యూస్‌టుడే, బాపట్ల

ఫిబ్రవరి ఆరంభంలోనే ఎండ వేడితో కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీలో సాగు చేసిన పంటలకు సాగునీటి అవసరాలు పెరుగుతున్నాయి. చీరాల సబ్ డివిజన్ పరిధిలో ఆలస్యంగా సాగు చేసిన వరి ఆయకట్టుకు మాత్రమే కొమ్మమూరు కాలువ ద్వారా నీరు అందిస్తున్నారు. మొక్కజొన్న, అపరాల పంటలకు ఇంజిన్ల ద్వారా నీటిని తోడి తడులు ఇస్తున్నారు. మార్చి రెండో వారంతో అపరాల సాగు ముగిసినా మొక్కజొన్నకు మాత్రం ఏప్రిల్ మొదటి వారం వరకు సాగునీరు కావాల్సి ఉంది. అప్పటి వరకు నీటి లభ్యతపై సందిగ్ధత నెలకొంది.

❖ అపరాల సాగు మార్చి మొదటి, రెండువారాల్లో ముగుస్తుంది. కాలువలపై ఏర్పాటు చేసిన డీజిల్ ఇంజిన్ల ద్వారా ఒక ట్రెండు తడులు ఇస్తే పూత దశ దాటి కాయలు వస్తాయి. మరో ఇరవై, ఇరవై ఐదు రోజుల్లో నూర్పిడులు ప్రారంభిస్తారు. మొక్కజొన్న ఆలస్యంగా సాగు చేసిన పంటకు ఏప్రిల్ మొదటి వారం వరకు తడులు కావాల్సి ఉంటుంది. పంటకు మూడు నుంచి నాలుగు తడులు ఇస్తేనే దిగుబడులు బాగా వస్తాయి. రైతులు మొక్కజొన్న పంటపైనే ఆశలు పెట్టుకున్నారు. మార్చి ఆఖరు వరకు కాలువల ద్వారా నీరు అందించాల్సిన అవసరం ఉంది. దాళ్వా వరికి సైతం సాగునీరు కావాలి. పంటల సాగుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కాలువలకు నీరు విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం తెలిపారు. ఆయకట్టు అవసరాలు పరిగణనలోకి తీసుకుని నీటి విడుదల పెంచుతామన్నారు.

➡ డెల్టాలో రెండు లక్షలకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న, మరో 70 వేల ఎకరాల్లో అపరాలు, 27 వేల ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేశారు. కారంచేడు, చీరాల, చినగంజాం మండలాల్లో డిసెంబరులో వరి నాట్లు వేశారు. రైతులు ఎక్కువ మంది రెండో పంటగా మొక్కజొన్న సాగు చేశారు. అపరాల పంట పూత దశలో ఉంది. మొక్కజొన్న పంట మూడు దశల్లో ఉంది.

➡ ఇటీవల ఎండల తీవ్రత పెరిగింది. సగటు ఉష్ణోగ్రత 35 డిగ్రీలు దాటింది. రబీ పంటలకు సాగునీటి అవసరాలు పెరిగాయి. కొమ్మమూరు కాలువకు కేవలం 1095 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ఈ నీటిని కారంచేడు, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో వరి సాగుకు కేటాయించారు. నిజాంపట్నం ఛానల్, రేపల్లె బ్యాంకు కెనాల్‌కు అరకొరగా మాత్రమే వస్తోంది. వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో మొక్కజొన్న, అపరాలకు తడులు ఇవ్వటానికి కాలువలపై డీజిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నారు. ఎకరా పంటకు తడి ఇవ్వటానికి అదనంగా రూ.4 వేలు ఖర్చవుతోంది.

చుండూరు మండలంలో కాలువ నుంచి డీజిల్ ఇంజిన్ల ద్వారా పైరుకు నీరు

అప్పికట్లలో అలంకృత తాటి బొత్తల రథం

సోపిరాలలో శివోహం

చినగంజాం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా చినగంజాం పరిధిలోని సోపిరాల, కొత్తపాలెం శివాలయాల వద్ద ఆదివారం రాత్రి 14 విద్యుత్తు ప్రభలు ఏర్పాటు చేయగా ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సోపిరాల శివాలయం వద్ద గ్రామంలోని తూర్పుబజార్, పడమటి బజార్, గేటు సెంటర్, మండలం సెంటర్, పూలవారిపాలెం (వాసు), సోపిరాల ఉద్యోగులు, 1994-95, 1996-97 విద్యా సంవత్సరాల్లో చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన సోపిరాల గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు రెండు ప్రభలు ఏర్పాటు చేశారు. ఇక్కడ మొత్తం ఎనిమిది ప్రభలతో పాటు శివపార్వతులు, సీతారాములు, ఆంజనేయస్వామి, లక్ష్మీదేవి, కనకదుర్గమ్మ, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి దేవతా మూర్తుల విద్యుత్తు కటౌట్లు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కొత్తపాలెం తిరునాళ్లలో మున్నంవారిపాలెం, మూలగానివారిపాలెం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, శాంతినగర్, కుక్కలవారిపాలెంనకు చెందిన ఆరు భారీ విద్యుత్తు ప్రభలు, రెండు దేవతా మూర్తుల విద్యుత్తు కటౌట్లను ఏర్పాటు చేశారు. రెండు ఆలయాల వద్ద సుమారు 90 అడుగుల ప్రభలు, 50 అడుగుల కటౌట్లను నిలిపారు. ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సోపిరాల శివాలయం వద్ద

ఇక ఓటరు సేవలు సులువు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: భారత ఎన్నికల సంఘం ఈసీఐనెట్ యాప్‌తో పాటు వెబ్ ఆప్షన్‌ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి ద్వారా ఎలక్ట్రానిక్ ఓటరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటరు కార్డులో చిరునామా సైతం మార్చుకోవచ్చు.. మీ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంది. ఈ సేవలు పొందడానికి ముందుగా ఓటరు కార్డు నంబరులో మీ ఫోను నంబరు రిజిస్టర్ చేసుకోవాలి. గూగుల్ ప్లే స్టోర్‌లో నుంచి ఈసీఐనెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. గతంలో మీ చరవాణి నంబరు ఓటరు కార్డు నంబరుతో ఎన్నికల పోర్టల్‌లో నమోదై ఉంటే, సులువుగా లాగిన్ కావచ్చు. ఫోన్ నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దీని ద్వారా ఈసీఐనెట్ యాప్‌లోకి వెళ్లి కొత్త ఓటరు ఫారం-6 ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. చనిపోయిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించేందుకు దరఖాస్తు చేయవచ్చు. మీ అర్జీ ఏ దశలో ఉందో ట్రాక్ చేయడంతో పాటు కార్డులో తప్పులు సైతం సరిచేసుకోవడానికి అవకాశం ఉంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన అనంతరం ఫిర్యాదులు ఇందులో నుంచే చేసే వెసులుబాటు ఉంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, బయోడేటా, అఫిడవిట్లు ఉంటాయి. ఎన్నికల ఫలితాలను తెలుసుకోవడానికి ఇందులో ఆప్షన్లు ఉన్నాయి.

తీరంలో కాయ్ రాజా కాయ్!

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల తీరంలో జూదం నిర్వహణకు రాజకీయ నాయకుల ఆశీస్సులతో సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఒక సొసైటీ పేరుతో జూదం ఆడించేందుకు రామాపురం ప్రాంతంలో పక్కా నిర్మాణాలు చేస్తున్నారు. ప్రస్తుతం మంచి రోజులు కాకపోవడంతో ఈనెల 18వ తేదీ తరువాత దీన్ని ప్రారంభించాలనే ఆలోచనలో నిర్వాహకులు ఉన్నట్లు సమాచారం. రమ్మీ పేరుతో స్కిల్‌గేమ్ ఆడించేందుకు న్యాయస్థానం ఉత్తర్వులు ఉన్నాయని ప్రచారం చేసుకుంటున్నారు. వీరు గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని

జూదం నిర్వహణకు సన్నాహాలు

రెండు నియోజకవర్గాల్లో దీన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అదికాస్తా విఫలం కావడంతో ప్రశాంతంగా ఉండే తీరప్రాంతాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇక్కడికి ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది పర్యాటకులు తరచూ వస్తుంటారు. అదే సెలవు రోజుల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీంతో ఈ ప్రాంతం తమ వ్యాపారానికి అనుకూలమనే ఉద్దేశంతో ఇక్కడ నిర్వహించాలనే ఆలోచనకు వారు వచ్చి పక్కాగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అనుమతులు ఇవ్వలేదు

కొన్నాళ్ల క్రితం ఇద్దరు వ్యక్తులు నా దగ్గరకు వచ్చి రమ్మీ పేరుతో స్కిల్ గేమ్ నిర్వహించేందుకు అనుమతి కావాలని... దీనికి న్యాయస్థానం ఉత్తర్వులు ఉన్నాయని చెప్పారు. ఉత్తర్వులు మాత్రం నాకు చూపించలేదు. ఇటువంటి కార్యకలాపాల నిర్వహణకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇచ్చే ప్రసక్తిలేదని ఖరాఖండీగా చెప్పడంతో పాటు గట్టిగా మందలించడంతో వారు వెళ్లిపోయారు. పోలీసులు అనుమతి ఇవ్వడంలేదని మళ్లీ వీరు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిసింది. దానికి సంబంధించిన ఎటువంటి సమాచారం లేదు. **- మహ్మద్ మొయిన్, డీఎస్పీ, చీరాల**

పెచ్చులూడుతున్నా పట్టదా.. కూలేవరకు కట్టరా!

శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలల భవనాలు

న్యూస్‌టుడే, బాపట్ల, కొల్లూరు

జిల్లాలో పశువైద్యశాలల భవనాలు కొన్ని శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. కూలిపోయేలా ఉన్న భవనాల్లో పని చేయటానికి పశువైద్యులు, సిబ్బంది భయపడుతున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో రైతులకు అదనపు ఆదాయం సమకూర్చటంలో పశు సంపద కీలకపాత్ర పోషిస్తోంది. అధ్వాన భవనాల వల్ల పశువులకు సరైన వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. పూర్తిగా దెబ్బతిన్న వాటిని తొలగించి కొత్తవాటిని నిర్మించటంతో పాటు పాత భవనాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది.

❖ బాపట్ల మండల పరిధిలోని కంకటపాలెం, వెదుళ్లపల్లి, కర్లపాలెం మండలంలోని కర్లపాలెం, గణపవరం, పర్చూరు మండలంలో మూడు పశువైద్యశాలల భవనాలు శిథిలావస్థకు చేరి కుప్పకూలేలా ఉన్నాయి. భవనాల పైకప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. గోడలు పగుళ్లిచ్చాయి. పశువైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. పెచ్చులూడి పడుతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. భవనం లోపల మందులు, సామగ్రి ఉన్నాయి.

గణపవరంలో ఇలా..

పడిపోతున్న పాల ఉత్పత్తి

❖ పాడి పశువులకు సకాలంలో సరైన వైద్యం అందకపోవటం వల్ల పాల ఉత్పత్తి పడిపోతోంది. రైతులు ఆదాయాన్ని కోల్పోతున్నారు. మార్కెట్లో డిమాండ్‌కు తగినట్లు ఉత్పత్తి లేకపోవటం వల్ల కొందరు విక్రయదారులు, ప్యాపారులు కల్తీ ఎక్కువగా చేసి విక్రయాలు పెంచుకుంటున్నారు. ప్రజారోగ్యంపైన తీవ్ర ప్రభావం పడుతోంది. కొత్త భవన నిర్మాణానికి రూ.60 నుంచి 80 లక్షల మేర నిధులు కావాల్సి ఉంది. మరమ్మతులకు రూ.ఐదు లక్షల వరకు కనీసం కేటాయించాలి. రానున్న రాష్ట్ర కొత్త బడ్జెట్లో భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తే టెండర్లు పిలిచి వేసవిలో పనులు చేపట్టడానికి అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసేలా కృషి చేయాల్సి ఉంది.

➡ జిల్లాలో పశువైద్యశాలల భవనాలు	:	72
➡ శిథిలావస్థకు చేరినవి	:	16
➡ మరమ్మతులు చేయాల్సినవి	:	32
➡ కావాల్సిన నిధులు	:	రూ.15 కోట్లు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

❖ పశువైద్యశాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి సాధ్యమైనంత త్వరగా నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కంకటపాలెం గ్రామస్థులు కలిసి పశువైద్యశాల దుస్థితిని వివరించారు. కొత్త భవనం నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పశుసంవర్ధక శాఖ జేడీ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లగా పాత భవనాలు తొలగించి కొత్తది నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. నిధులు, అనుమతులు రాగానే టెండర్ పిలిచి కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

అమరావతిలో బిల్‌గేట్స్ పర్యటనకు ఏర్పాట్లు

తుళ్లూరు, తాడేపల్లి, న్యూస్‌టుడే: గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించనున్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో ఆయన సమావేశం కానున్నారు. సచివాలయంలో ఆర్టీజీఎస్‌లో సాంకేతిక వినియోగం, రియల్ టైం గవర్నెన్స్ విధానం-ఫలితాలు, ఉండవల్లిలో రైతులతో సమావేశం, వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ల వినియోగం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి ఆదేశాల మేరకు అధికారులు బిల్‌గేట్స్ పర్యటించే మార్గాల్లో సుందరీకరణ పనులు చేపట్టారు. కృష్ణానది కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్డు(ఈ-3) పేజ్-1, 2.. రాష్ట్ర సచివాలయానికి వెళ్లే ఎన్-9 మార్గంలో సుమారు 10 కి.మీ. మేర రహదారులను శుభ్రపరిచారు. అతిథులను ఆకర్షించేలా డివైడర్లకు రంగులు వేస్తున్నారు. కరకట్టపై ఇరువైపులా మట్టిని చదును చేయించారు. వీఐపీలు ప్రయాణించే మార్గంలో ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి శుభ్రపరిచారు. కృష్ణా కరకట్ట, సీడ్‌యాక్సెస్ రోడ్డు, ఎన్-9 రోడ్డులో ఆహ్లాదకర పూల మొక్కలతో సుందరీకరిస్తున్నారు. ఏడీసీ ఇంజినీరింగ్, గ్రీనరీ విభాగం అధికారులు నిరంతరం పనులు పర్యవేక్షిస్తున్నారు.

రహదారి డివైడర్‌కు రంగులు వేస్తున్న కార్మికులు

ఉండవల్లిలో కలెక్టర్ పరిశీలన..

ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను బిల్‌గేట్స్, చంద్రబాబు తదితరులు పరిశీలించనున్న నేపథ్యంలో అధికారులు ఆమేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సమావేశ వేదిక, సీసీ కెమెరాలు, యాక్సెస్ కంట్రోల్ పాయింట్లు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్ల ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. గుంటూరు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడే డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ, రైతులతో సమావేశం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. క్షేత్ర పరిశీలనలో కలెక్టర్‌తోపాటు వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకురాలు ఎం. పద్మావతి, ఉద్యానశాఖ ఉపసంచాలకురాలు రవీంద్రబాబు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

నిమ్మ రైతుల గుండెల్లో గుబులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే

లక్షలాది రూపాయలు కౌలుకు తీసుకున్న నిమ్మ చేల పరిస్థితి చూసి రైతుల గుండెల్లో గుబులు ఏర్పడింది. సకాలంలో రాని కాయలు అన్నదాతల్ని కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దుగ్గిరాల మండలం చిలువూరులో దాదాపు 700 ఎకరాల నిమ్మ సాగు జరుగుతోంది. ఇక్కడ కౌలు ఎకరాకు రూ. లక్షపైమాటే. గత పంట ద్వారా కొంత లాభాలు కన్పించడంతో ఈసారి కౌలు రైతులు ఎక్కువకు పోటీపడి తీసుకున్నారు. మార్చి నెల నుంచి నిమ్మ సీజన్ ఎక్కువగా ఉంటుంది. దాహార్తితో ప్రజలు తాగే పానీయాల్లో నిమ్మ వినియోగం ఎక్కువ. అన్ని ప్రాంతాల నుంచి మే నెలలో కాపు వస్తుంది. పంట అంతా ఒకేసారి మార్కెట్లోకి వస్తే అంత ధర పలకదు. ఇది ఆదాయాన్ని ఇవ్వదు. సాధారణంగా చిలువూరులో తొలికాపు మార్చిలో వస్తుంది. ఆ నెలలో, తర్వాత వచ్చే ఏప్రిల్ నెలలో దిగుబడి అయ్యే నిమ్మ ద్వారా ప్రతి సంవత్సరం రైతులకు ఆదాయం ఉంటోంది. ఈసారి మార్చి నెలలో కాపు రాలేదు. ఇప్పుడు పిందెలు వస్తున్నాయి. అవి పెరిగి కాయ అయి విక్రయానికి పనికి వచ్చేసరికి ఏప్రిల్ నెల దాటిపోతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి మంచు ఇప్పటికీ కురుస్తుండడంతో ఆ ప్రభావం కూడా ఉందని కర్షకుడు దూరు పాములు తెలిపారు. మంచు కారణంగా పూత

ఎండిపోతున్న పూత

మంచు ప్రభావంతో తొలికాపు ఆలస్యం

మాడిపోతోంది. అది కొంత నష్టమేనని ఆయన అన్నారు. గ్రామంలో నిమ్మ, సపోట కలిపి 1000 ఎకరాల వరకు ఉన్నా ఉద్యానాధికారులు తరచూ రైతులతో సమావేశం జరపడం, వారికి సూచనలు చేయడం వంటివి చేస్తే బాగుంటుందని, సబ్సిడీపై పురుగు మందులు అందుబాటులో ఉండేలా చేస్తే మేలు జరుగుతుందని కొందరు హాలికులు చెప్పారు. దీనికి తోడు ఏ పంట కాలంలో తెగుళ్లు ఎక్కువగా వచ్చాయి. మార్కెట్లో నిమ్మ కిలో కనీసం రూ.45 అయినా ఉంటే కొంతైనా గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు.

16, 17 తేదీల్లో ఉద్యోగ మేళా

గుంటూరు: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ 2వ ఫ్లోర్‌లోని సీడాప్ కార్యాలయంలో ఈనెల 16, 17 తేదీల్లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్-డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో బ్రాంచి మేనేజర్, క్యాషియర్, షిఫ్ట్ ఇన్‌ఛార్జి, వాలిడేటర్, ఐటీ ఎగ్జిక్యూటివ్, టోల్ కలెక్టర్లు మొత్తం 300 ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తారన్నారు. ఆసక్తి గల యువకులు విద్యార్హత ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

మీ పంటను మీరే నమోదు చేసుకోవచ్చు

న్యూస్‌టుడే, రేపల్లెఅర్బన్, ఉల్లిపాలెం (నగరం): ఈ-పంట నమోదు ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాల సహాయకులే నమోదు చేసేవారు. రబీ సీజను నుంచి సాగు చేస్తున్న పంటల వివరాలను ఏపీఏఐఎంఎస్ ఫార్మర్‌యాప్‌లో రైతులే స్వయంగా నమోదు చేసుకునేలా వ్యవసాయశాఖ ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టింది. యాప్‌లో పంటల వివరాలు నమోదు చేసుకునే ప్రక్రియను అందుబాటులోకి తీసుకొచ్చింది. రానున్న ఖరీఫ్‌లో అన్నదాతలే స్వయంగా నమోదు చేసుకునే వీలు కల్పించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఎలా నమోదు చేయాలి.. రైతులు తమ స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆధార్ నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఎంపిన్‌ను సెట్ చేసుకోవాలి. ఆధార్ నంబరు ఆధారంగా వెబ్‌ల్యాండ్‌తో అనుసంధానమైన రైతుకు చెందిన అన్ని భూకమతాలు ఆ యాప్‌లో కనిపిస్తాయి. ఇప్పటివరకు నమోదు చేయని పంట వివరాలను రైతులే స్వయంగా నమోదు చేసుకోవచ్చు. పంట నమోదు సమయంలో 20 మీటర్ల జియో రిఫరెన్సు హద్దులతో కూడిన పొలంలో ఫొటో తీసుకోవాలి. అందుకు రైతు తప్పనిసరిగా పొలంలోనే ఉండాలి. ఇలా నమోదైన సమాచారం సంబంధిత రైతు సేవా కేంద్రం సహాయకుడి ధ్రువీకరణకు వెళ్తుంది. ఈ యాప్ సహకారంతో సేవా కేంద్రం సహాయకుడు నమోదు చేసిన పంట వివరాలు సరిగా ఉన్నాయో లేవో అని కూడా పరిశీలించవచ్చు. సరిగా లేకుంటే ఫిర్యాదు చేసే అవకాశం రైతుకు కల్పించారు. రైతులే స్వయంగా ఈ-పంట నమోదు చేసుకునే క్రమంలో కొందరు మినుము వేసి మొక్కజొన్న పంట సాగు వివరాలు నమోదు చేసే వీలుంది. అలాంటి సమయంలో ఆ రైతు ఏ పంట వేశారో నిర్ధారించుకున్న తర్వాతే రైతు సేవా కేంద్రం సహాయకుడు ధ్రువీకరించాల్సి ఉంది.

❖ బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయనిర్మల మాట్లాడుతూ రబీలో పంట నమోదు ప్రక్రియలో భాగంగా ఏపీఏఐఎంఎస్ 2.0 ఫార్మర్ యాప్‌ను జిల్లాలో 12 వేల మంది రైతులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. 1026 మంది స్వయంగా పంటల సాగు వివరాలు యాప్ ద్వారా నమోదు చేసుకున్నారు. ఈ అవకాశాన్ని ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

19 నుంచి స్వచ్ఛ భారత్ మిషన్‌పై శిక్షణ

గుంటూరు: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) కింద చేపట్టే పనులపై మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, స్వర్ణ గ్రామం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఈనెల 19 నుంచి మార్చి 13వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు. గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో ప్రజలను భాగస్వాములను చేసేలా కార్యక్రమాలు రూపొందించారు. ఇప్పటికే శిక్షణ పొందిన రిసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇవ్వనున్నారు.

(c) eenadu

అమృతలూరు: బాలకోటేశ్వరుడికి పాలాభిషేకం

రేపల్లె: పట్టువస్త్రాలతో గుడిచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

జాగారంతో జ్ఞానం.. శివనామస్మరణే ధ్యానం

◆ హరహర మహాదేవ.. శంభో శంకర నినాదాలతో మారుమోగిన శివాలయాలు

◆ చినఅరవపల్లిలో పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి అనగాని

గోవాడ, (అమృతలూరు), న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం బాపట్ల జిల్లాలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. గోవాడలోని శ్రీగంగా పార్వతీ సమేత బాలకోటేశ్వరస్వామి దేవస్థానం తెల్లవారు జాము నుంచే శివనామస్మరణలతో మార్మోగింది. ఆలయంలో తొలిపూజ శనివారం అర్ధరాత్రి ప్రారంభమైంది. స్వామి దర్శనం కోసం వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. తెల్లవారు జాము నుంచి భక్తులు వందల సంఖ్యలో అభిషేకాలు చేయించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ట్రాక్టర్లు, సంప్రదాయ ఎద్దుల బండ్లపై ప్రభలతో భక్తులు ప్రదక్షిణ చేశారు. ధ్వజస్తంభం, ద్వాదశ జ్యోతిర్లింగాల వద్ద కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు బారులు తీరారు. చిన్నారులు బాలప్రభలతో స్వామి సన్నిధికి చేరారు. ఉదయం 4గం. నుంచి స్వామి దర్శనం కోసం క్యూలైన్లు భక్తులతో రద్దీగా మారాయి. అర్చకుడు శ్రీధరుశర్మ ఆధ్వర్యంలో 25 మంది అర్చక స్వాములు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో విఠల్ శ్రీనివాస్‌వర్మ, పాలక కమిటీ ఛైర్మన్ పావులూరి రమేష్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో చుండూరు సీఐ ఆనందరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

చినఅరవపల్లిలో ..

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె నియోజకవర్గంలో ఆదివారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివనామస్మరణతో శైవక్షేత్రాల పరిసరాలు మార్మోగాయి. రేపల్లె మండలం చినఅరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయానికి వేకువజాము నుంచే భక్తులు తరలి వచ్చారు. కుటుంబ సమేతంగా స్వామిని దర్శించి భక్తితో పూజలు చేశారు. నైవేద్యం, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎస్పీ ఉమామహేశ్వర్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, తెదేపా నాయకులు అనగాని శివప్రసాద్, పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, గుర్రం మురహరిరావు, కొలసాని రాము, దండుప్రోలు పిచ్చయ్య, కేసన రామకృష్ణ, సాయి, సురేష్, తహసీల్దారు శ్రీనివాసరావు, కమిషనర్ సాంబశివరావు స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాదాయశాఖ, పంచాయతీ అధికారులు తిరునాళ్ల ఉత్సవాలను పర్యవేక్షించారు.

పోటెత్తిన భక్తజనం

బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల ఉత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. గ్రామాల నుంచి టైరుబళ్లు, ట్రాక్టర్లపై బంధుమిత్ర, కుటుంబ సమేతంగా వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. రంగురంగుల కాగితాలు, శివుని చిత్రపటాలతో మహాదేవునికి ప్రభలు కట్టి వాటిని ప్రత్యేక వాహనాలపై ఏర్పాటు చేసి ఊరేగింపుగా వచ్చారు. రేపల్లె సీఐ మల్లికార్జునరావు పర్యవేక్షణలో ఎస్సైలు రాజశేఖర్, వెంకటశ్రీరాజ్యలక్ష్మి పోలీసులు, మహిళా పోలీసులు ఎన్‌సీసీ వాలంటీర్లు బందోబస్తు నిర్వహించారు.

పట్టువస్త్రాలతో ఎస్పీ ఉమామహేశ్వర్

చినగంజాం: అభిషేక పూజలో భక్తులు

సోపిరాల, కొత్తపాలెంలో భక్తుల కిటకిట

చినగంజాం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చినగంజాం పరిధిలోని సోపిరాల, కొత్తపాలెం శివాలయాల్లో ఆదివారం వేకువజామున నుంచే ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి. రెండు చోట్ల ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొనడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివలింగాలను ప్రత్యేక ప్లేట్లలో పెట్టి, భక్తులు ఎవరికి వారిచేత పంచామృతాభిషేకాలను అర్చకులు చేయించారు. భక్తులతో పాటు పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అభిషేక పూజల్లో పాల్గొన్నారు. బాపట్ల, గుంటూరు, నెల్లూరు, కృష్ణా, తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు ఒంగోలు, చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, నాగులుప్పలపాడు, మార్టూరు, పర్చూరు, కారంచేడు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు. పలువురు దాతలు సమకూర్చిన పొంగలి, పులిహోర, లడ్డు, దద్ధోజనంతో పాటు శుద్ధజలాన్ని భక్తులకు ఆలయాల వద్ద పంపిణీ చేశారు. అన్నదానాలు జరిగాయి. పశుపోషకులు, రైతులు తమ ఎద్దులు, పొట్టేళ్లకు రంగులు పులిమి, శివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి, మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తొలుత సోపిరాల, తర్వాత కొత్తపాలెం శివాలయాలను దర్శించుకున్నారు. ఆలయాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు టీఎస్‌ఆర్ ఆంజనేయులు, సీతయ్య, రామకృష్ణారెడ్డి, రామిరెడ్డిలు ఏలూరిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

అప్పికట్ల తిరునాళ్లలో తాటిబొత్తల రథం ప్రత్యేకం

బాపట్ల, న్యూస్‌టుడే: మహాశివరాత్రి మరుసటి రోజు అప్పికట్ల కాశీవిశ్వేశ్వరస్వామి తిరునాళ్ల సోమవారం నిర్వహిస్తారు. తాటిబొత్తల రథం ఈ తిరునాళ్ల ప్రత్యేకత. సాధారణంగా అన్ని ఆలయాల్లో శాశ్వత రథం ఉంటుంది. ఏటా ఉత్సవ సమయంలో ఆలయం వద్ద తాటిబొత్తలతో కొత్తగా రథాన్ని నిర్మిస్తారు. మహాశివరాత్రికి కాశీ విశాలాక్షి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. తిరునాళ్ల రోజు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో రథోత్సవం రెండ్రోజులు జరుగుతుంది. ఉత్సవానికి ఐదు రోజులు ముందు నుంచే ఏటా తాటిబొత్తలతో అప్పికట్ల వాసులు రథాన్ని రూపొందిస్తారు. పూలతో అందంగా అలంకరించి సోమవారం రాత్రి ఆలయం నుంచి రథోత్సవం ప్రారంభమై తెల్లవారుజామకు అప్పికట్ల గ్రామంలోకి వెళ్తుంది. మంగళవారం ఉదయం గ్రామం నుంచి మరలా ఆలయానికి చేరుకోవడంతో ఉత్సవం ముగుస్తుంది. భక్తులకు భారీగా అన్న సంతర్పణ చేస్తారు.

విప్పర్లలో జోరుగా కోడి పందేలు

నరసరావుపేట వ్యవసాయం: మహాశివరాత్రి పురస్కరించుకొని రొంపిచర్ల మండలంలో ఆదివారం కోడిపందేలు, ఇతర జూద క్రీడలు యథేచ్ఛగా నిర్వహించారు. రొంపిచర్ల మండలం విప్పర్ల, కొనకంచివారిపాలెం సమీపంలో పొలాల మధ్య టెంట్లు వేసి బరి ఏర్పాటు చేసి కోడిపందేలు నిర్వహించారు. బరుల వద్ద కోతముక్క, గుండాట వంటి జూద క్రీడల్లో రూ.లక్షల్లో నగదు చేతులు మారింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి జూదరులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పందేల వద్ద నిర్వాహకులు సకల ఏర్పాట్లు చేశారు. రాజకీయ నేతల ఆధ్వర్యంలోనే అంతా జరిగింది. దీంతో పోలీసులు ఇతర అధికారులు కన్నెత్తి చూడలేదు. మహిళలు కూడా పందేల్లో పాల్గొనేందుకు ఆసక్తిగా తరలివచ్చారు.

కోడిపందేల శిబిరం వద్ద జూద క్రీడలు

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

REAL ESTATE

PLOT FOR SALE

MANGALAGIRI

అమ్మకానికి ప్లాట్లు- మారుతీ నగర్, నవలూరు, మంగళగిరి. 432 చ.గ.లు. క్లియర్ టైటిల్. సంప్రదించండి: 99638 89783, 70328 06709.

SHOP FOR SALE

GENERAL

243 sq.ft shop in upcoming biggest mall in guntur for sale with immediate 25000/- Rent. Call: 9573454266

TO LET

IJM రెయిన్‌ట్రీపార్క్‌లో 5B/R లగ్జరీ ట్రిప్లెక్స్ విల్లా అద్దెకు. విశాలమైన లేఔట్, ప్రైవేట్ టెర్రస్ 24x7 భద్రత, NH5,నంబూరుVJA-GNT హైవే. 77024 75525

JOBS

LADY Staff Wanted. B.Tech/DegreeStudy Abroad Consultancy, Sal. upto15k, Good Communication skills. Exp / Freshers✆ 9381985468.

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

గుంటూరులోని రియల్‌బూమ్ రియల్ ఎస్టేట్ సర్వీసెస్ నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (50), టెలీకాలర్స్ (10), DDOలు (10) కావలెను. ✆ 78010 32689.

Marvin Lifts Pvt.Ltdలో పనిచేయుటకు హెల్పర్స్ Q: ITI, జీ:15K to 20K. అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ Q: డిగ్రీ. జీ: 22K to25K కావలెను. ✆ 98859 14999

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ: 18K to 20K. ✆96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం

అప్పికట్ల (బాపట్లటౌన్), న్యూస్‌టుడే: మండల పరిధిలోని అప్పికట్ల రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మృతుడి వయసు 50 నుంచి 60 మధ్యలో ఉంటుంది. మృతుడి చెవికి రింగు ఉంది. మృతుని ఆచూకీ తెలిసిన వారు రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సరస్వతి తెలిపారు.

నెల్లూరు బాలురు.. చిత్తూరు బాలికల విజయం

బాలికల జట్టుకు జ్ఞాపిక అందిస్తున్న అతిథులు

గుడిపూడి(సత్తెనపల్లి గ్రామీణ): అంతర్ జిల్లాల షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సత్తెనపల్లి మండలం గుడిపూడిలో ఆదివారం ముగిశాయి. రెండ్రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల జట్ల సభ్యులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు ప్రథమ, పల్నాడు జట్టు ద్వితీయ, ఎన్టీఆర్ జిల్లా జట్టు తృతీయ స్థానాలను సాధించాయి. బాలికల విభాగంలో చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాల జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు ఆదివారం అందించారు. పోటీల పరిశీలకుడు, క్రీడా ప్రాధికార సంస్థ అధికారి నరసింహారెడ్డి, సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, తెదేపా నేతలు గజానన, అప్పారావు, పుల్లారావు పాల్గొన్నారు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు ★ 'న్యూస్‌టుడే'తో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి జుబేర్

ముఖాముఖి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

ఇంటర్ పరీక్షలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి జి.కె.జుబేర్ తెలిపారు. అన్ని రకాల వసతులు ఉన్న కేంద్రాలనే ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈనెల 18న చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు వారి కేంద్రాలకు చేరుకుని మళ్లీ అక్కడ పరిస్థితులపై ధ్రువీకరించాల్సి ఉందన్నారు. పరీక్షల ఏర్పాట్లపై ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఈసారి విద్యార్థులకు 24, 32 పేజీలతో కూడిన బుక్‌లెట్‌లు పరీక్షలు రాయడానికి ఇస్తున్నట్లు చెప్పారు. దీన్ని ఇన్విజిలేటర్లు, విద్యార్థులు గమనించుకోవాలని సూచించారు. ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇవీ ఇదే రీతిలో జరిగేందుకు అందరు సహకరించాలన్నారు. ఫీజులు కట్టలేదనే నెపంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఆప కూడదన్నారు. పరీక్షలు, కేంద్రాలు, హాల్ టిక్కెట్లకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే జిల్లాలో 90007 97779 నంబరుతో కంట్రోలు రూం ఏర్పాటు చేశాం. ఇది 24 గంటలు పనిచేస్తోందని వెల్లడించారు.

అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి

ఈనెల 23న ప్రారంభమయ్యే పరీక్షలు మార్చి 24 వరకు జరుగుతాయి. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. దీనివల్ల ఎటువంటి ఒత్తిడి లేకుండా రాయడానికి అవకాశం ఉంటుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించే ప్రసక్తిలేదు.

జిల్లాలో..	
పరీక్ష కేంద్రాలు:	36
విద్యార్థుల సంఖ్య:	19,292
సిట్టింగ్ స్క్వాడ్‌లు:	2
ఫ్లయింగ్ స్క్వాడ్‌లు:	2
చీఫ్ సూపరింటెండెంట్లు:	36
డిపార్ట్‌మెంటల్ అధికారులు:	36
ఇన్విజిలేటర్లు:	116

నిఘా నీడలో.. : ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కి తావులేకుండా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వాటిని జిల్లా ఇంటర్ అధికారి కార్యాలయంతో పాటు కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేశాం. అక్కడ నుంచి పర్యవేక్షిస్తారు. స్థానికంగా ఎటువంటి అవకతవకలు జరగడానికి వీల్లేకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం.

కేంద్రాల వద్ద 163 సెక్షన్ : జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమల్లో ఉంటుంది. పటిష్ఠ బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహిస్తాం. దీనికి సంబంధించిన సిబ్బందిని నియమించాం. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని కేంద్రాల్లో అవసరమైన వసతులు సిద్ధం చేయడంతో పాటు తాగునీరు, వైద్యం అందుబాటులో ఉందని జుబేర్ వెల్లడించారు.

బాలకోటేశ్వరస్వామికి కలెక్టర్ పూజలు

బాపట్ల, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గోవాడ బాల కోటేశ్వర స్వామి వారిని ఆదివారం కలెక్టర్ వినోద్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయ ఈవో, ఛైర్మన్లు కలెక్టర్‌కు స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు కలెక్టర్‌కు అందించి ఆశీర్వచనం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మహాదేవుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. తొలుత ఆలయంలో భక్తుల సౌకర్యాల గురించి స్థానిక అధికారులు, ఆలయ సిబ్బందితో మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆర్డీవో రామలక్ష్మీ, ఈవో శ్రీనివాసవర్మ, ఆలయ పాలక మండలి అధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

అమృతలూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పండగ సందర్భంగా గోవాడ శ్రీ బాలకోటేశ్వరస్వామిని ఆదివారం మంత్రి అనగాని సత్యప్రసాద్, వేమూరు, బాపట్ల ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ, వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి తదితరులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా వారు ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. మహాదేవుని కృపతో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని వారు స్వామిని కోరుకున్నామన్నారు.

పూజలో నక్కా ఆనందబాబు తదితరులు

మల్లికార్జునుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు): మండల పరిధి అన్నంబొట్లవారిపాలెంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని హైకోర్టు జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రదక్షిణల అనంతరం స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయగా వేదపండితులు ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. వెంట సీనియర్ న్యాయవాది చిలుకూరి నరేంద్ర ఉన్నారు.

ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి

జేసీబీతో ప్రమాదకర ఫీట్లు

బైక్‌లను గాల్లో ఎగిరించి స్టంట్లు, ఫీట్లు చేయడం చూశాం. ఇక్కడ మాత్రం ఏకంగా జేసీబీతో ప్రమాదకరస్థాయిలో ఫీట్లు చేశారు. టైర్లను గాల్లో ఎగిరించి చుట్టూ తిప్పుతూ అతి వేగంతో స్టంట్లు చేశారు. నరసరావుపేట మండలం కాకాని గ్రామ పరిధిలో ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగింది. కోటప్పకొండకు ప్రభను తీసుకెళ్తున్న సమయంలో డీజే సౌండ్ల మధ్య జేసీబీని గాల్లో ఎగిరించి ప్రమాదకరంగా చుట్టూ తిప్పారు. అక్కడే జనం గుమిగూడి నృత్యాలు చేశారు. ఆన్‌లైన్లో షేర్ చేసిన వీడియోపై విమర్శలు వెల్లువెత్తాయి.

-ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, నరసరావుపేటసెంట్రల్

'వాలీబాల్' విజేత కృష్ణా

బహుమతి అందుకుంటున్న కృష్ణా జిల్లా జట్టు సభ్యులు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: భట్టిప్రోలు టీఎంరావు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పులికొండ రాధాకృష్ణ గుప్తా, కొసన సుబ్బారావు మెమోరియల్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. పోటీల్లో మొదటి నుంచి నాలుగు స్థానాల్లో వరుసగా కృష్ణాజిల్లా, బాపట్ల, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాలు నిలిచాయి. వారికి రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పులికొండ మల్లికార్జునరావు, కార్యనిర్వాహణ అధ్యక్షుడు అల్లా భక్షు, కన్వీనరు కరింశెట్టి సుబ్బారావు, కార్యదర్శి వంగర శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండ వద్ద జనం రద్దీ

నిలిచిన వాహనాలు

కొండంత జనం.. స్తంభించిన ట్రాఫిక్

ఈనాడు, నరసరావుపేట: కోటప్పకొండకు ఆదివారం జనం తండోపతండాలుగా తరలివచ్చారు. జనం రద్దీని నియంత్రించలేక పోలీసులు చేతులు ఎత్తేశారు.. నరసరావుపేట, వినుకొండ, అద్దంకి నుంచి వచ్చే బస్సులకు అయితే ఏకంగా 2 కిలోమీటర్ల దూరంలో పార్కింగ్ ఇచ్చారు. తిరుగుపయనమయ్యేవారు 2 కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. వాహన రద్దీలో నడవలేక వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ట్రాఫిక్ జామ్‌లో ఇరుకున్న ప్రభలు

నేడు పీజీఆర్ఎస్ రద్దు

బాపట్ల, న్యూస్‌టుడే: ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ 16న తాత్కాలికంగా రద్దు అయినట్లు ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదివారం తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు. ఎస్పీ కార్యాలయానికి రావద్దని ఆయన తెలిపారు.

నడవలేని వారిని తీసుకురావొద్దు

బాపట్ల, న్యూస్‌టుడే: నడవలేని వారిని, మంచాలకు పరిమితమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పీజీఆర్ఎస్‌కు తీసుకురావద్దని జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కు ద్విచక్రవాహనాలపై వచ్చేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. మంచంలో ఉన్నవారి తరపు కుటుంబ సభ్యులు వచ్చి అర్జీ ఇవ్వవచ్చున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

బాపట్ల, : విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన పట్టణంలోని ఇమ్మడిశెట్టి వారిపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. ముందుగా తీవ్ర గాయాలైన అతడిని హుటాహుటిన ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే సతీష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 116, 123, 135 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 230.

చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు

ఆసుపత్రి ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(గోరంట్ల), న్యూస్‌టుడే: చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి రావడంతో తేలికగా ఉపశమనం పొందవచ్చని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్డులో స్కిన్ పర్ఫెక్ట్ హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఆసుపత్రి గుంటూరుకు రావడం హర్షణీయమన్నారు. డాక్టర్ మన్నె సింధూర మాట్లాడుతూ చర్మ సమస్యలకు లేజర్ టెక్నాలజీ, ఇమ్యునోథెరపి, కాస్మెటిక్, రికన్‌స్ట్రక్టివ్ విధానాలతో కూడిన చికిత్సలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. చర్మ వ్యాధులకు తక్కువ సమయంలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, ఉగ్రనరసింహారెడ్డి, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రవికుమార్.పి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకరరావు, రాష్ట్ర టెక్నాలజీ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, నగర డిప్యూటీ మేయర్ సజీల, వైద్యులు గొట్టిపాటి లక్ష్మి, ఉప్పుటూరి అంజిత్, ఉప్పుటూరి హేమంత్, లక్ష్మీప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

మహాశక్తి దేవతగా బండ్లమ్మ

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు శ్రీబండ్లమ్మ అమ్మవారికి ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాత్యాల బంగారు కాసులహారం, రజత కవచంతో అలంకరించి 'మహాశక్తి దేవత'గా భక్తులకు దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెంలోని బండ్లమ్మ వార్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సామూహిక అఘోర పాశుపత రుద్రయాగం

యాగంలో భక్తులు

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల మహర్షి ఆశ్రమ గోశాలలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తుల సామూహిక అఘోర పాశుపత రుద్ర యాగం నిర్వహించారు. ఉదయం మండపారాధన, గోమాతపూజ, నవగ్రహ సహిత అష్టదిక్పాల హోమం, రుద్రమహాయాగం జరిగింది. భక్తులకు రుద్రాక్షలు వితరణ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల: 80085 73141, రేపల్లె: 80085 73136, వేమూరు: 91107 83738

? జంపని నుంచి మూల్పూరు వెళ్లే మార్గంలో పోతుమర్రు వద్ద గ్రామంలో సేకరించిన చెత్తను రోడ్డు పక్కన వేస్తున్నారు. - స్థానికులు, పోతుమర్రు. ✔ వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. - రవికుమార్, ఎంపీడీవో -న్యూస్‌టుడే, వేమూరు. ? చందోలు మదీనా వీధిలో నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.- స్థానికులు, చందోలు. ✔ పరిశీలించి ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - సుజాత, కార్యదర్శి చందోలు -న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం. ? రాజోలు ఊరి చివర రోడ్డు పక్కనే చెత్త తగలబెడుతున్నారు. వాహనదారులకు ఇబ్బందిగా ఉంది. -కిసుబ్బారావు, రాజోలు ✔ సిబ్బందిని పంపి చెత్త తొలగిస్తాం.. తగిన చర్యలు తీసుకుంటాం. -శ్రీనివాసన్, ఈవోపీఆర్‌డీ, చెరుకుపల్లి -న్యూస్‌టుడే, రాజోలు (చెరుకుపల్లి గ్రామీణ)

వీధి దీపాలు ఏర్పాటు

స్పందన: రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండలం పేటేరు నయాగర కల్యాణ మండపం రోడ్డులో పలుచోట్ల వీధి దీపాలు వెలగడంలేదు. 'సమస్యను మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక ఈనెల 14న ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి కోగ్రా ప్రసాద్ శనివారం కార్మికులను పంపి 13 చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు.

వ్యర్థాల తొలగింపు

స్పందన: ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: ఖాజీపాలెం పంచాయతీ పరిధిలోని నాంచారమ్మ ఆలయం వీధిలో ఇళ్ల మధ్యనే చెత్త వేస్తున్నారని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన 'ఈనాడు' దృష్టికి తీసుకురాగా ఈనెల 8వ తేదీన ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి ప్రసాదరావు సిబ్బందితో శుభ్రం చేయించారు.

అలంకృత సోమేశ్వర స్వామి మూలవిరాట్

ఉల్లిపాలెంలో చెన్న మల్లేశ్వరుడు

చుండూరు: అలంకరణలో అమ్మవారు

ఎస్‌ఎమ్‌పీ అగ్రహారంలో పాలాభిషేకం

చందోలు శివలింగం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గోవాడ ఆలయ ప్రాంగణం విహంగ వీక్షణం

హరహర మహాదేవ.. మమ్మేల రావా

న్యూస్‌టుడే, బృందం: బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామం లోనూ శివరాత్రి శోభ సంతరించుకుంది. శనివారం అర్ధరాత్రి నుంచి శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. నైవేద్యం, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాదాయ శాఖ, ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. చుండూరు బాలకోటేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అర్చకుల ఆశీర్వచనాలు అందుకున్నారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలోని శ్రీ కోదండేశ్వర వాయులింగ ఆలయం వద్ద విద్యుత్తు ప్రభలు వద్ద చిన్నారుల కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభల ఊరేగింపుల్లో కోలాటం, కాళికామాత వేషధారణ, పులివేషాలు, కర్రసాము వేషధారణ వంటివి భక్తులను ఆకట్టుకున్నాయి. తిరునాళ్లలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. బాపట్లలోని 12వ వార్డు శివనారాయణపురంలోని ఉమామహేశ్వర ఆలయంలో స్వామిని

వేడుకగా మహాశివరాత్రి

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ దర్శించుకున్నారు. నిజాంపట్నం మండలం ప్రసిద్ధ గోకర్ణమఠం శివాలయంలో వేకువ జామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాన్ని చేరుకుని శివలింగానికి అభిషేకం నిర్వహించారు. వివిధ మండలాల నుంచి ప్రభలు ఆయా ఆలయాలకు పయనమయ్యాయి. బాపట్ల పట్టణంలోని వెంకట రమణేశ్వర శ్రీనివాస శ్రీభవాని ఆలయంలో బాపట్ల జాతీయ కౌన్సిల్ సభ్యుడు అన్నం సతీష్ ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు.

శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

గోవాడలో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

చినఅరవపల్లి వెళ్తున్న ప్రభ

చందోలు లింగోద్భవ క్షేత్రం వద్ద..

దీపాల అలంకరణలో గోవాడ ఆలయ ప్రభ

సూరేపల్లిలో ఊరేగిస్తూ..

పూజల్లో అన్నం సతీష్ ప్రభాకర్

చుండూరులో ఎమ్మెల్యే ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి దంపతుల పూజలు

కొత్తపాలెంలో శివలింగం వద్ద అనగాని శివప్రసాద్, తెదేపా నాయకులు

రహదారిపై మురుగు

పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురు మురుగు కాలువలో నుంచి జాతీయ రహదారిపైకి మురుగు వస్తోంది. మురుగు పచ్చగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కరుణ మాట్లాడుతూ కాలువలో వ్యర్థాలు అడ్డుగా ఉండటం వల్ల సమస్య ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి మోటార్లతో మురుగు తొలగించే ఏర్పాటు చేస్తామన్నారు. -న్యూస్‌టుడే, బాపట్ల టౌన్

బడి భవన నిర్మాణం పూర్తి చేయరూ..!

మండలంలోని అల్లూరు ఎస్టీ కాలనీలో ప్రాథమిక పాఠశాలకు భవనం లేక విద్యార్థులు సామాజిక భవనంలోని ఇరుకు గదిలోనే పాఠాలు నేర్చుకుంటున్నారు. గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాల భవన నిర్మాణం ప్రారంభించి.. మధ్యలో పనులు నిలిపేసింది. అప్పటి నుంచి సామాజిక భవనంలోని ఒక గదిలో అయిదు తరగతుల్లో 28 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల భవనం పూర్తి చేయాలని ఎంఈవో, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు వినతి పత్రాలు అందించినా ఫలితం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, అల్లూరు, (పిట్టలవానిపాలెం)

పెచ్చు పడితే ప్రాణాంతకమే!

పిట్టలవానిపాలెం రైతు సేవా కేంద్రం ఏర్పాటు చేసిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కొత్త భవనం లేకపోవడంతో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనంలో రైతు సేవా కేంద్రం నిర్వహిస్తున్నారు. భవనం గోడలు బీటలు వారి పైకప్పు పెచ్చులూడి, ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. శ్లాబు పెచ్చులు ఎప్పుడు మీద పడతాయోనని సేవా కేంద్రానికి వచ్చే రైతులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే వేరే భవనంలోకి మార్చాలని రైతులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

మాకెందుకులే అని వదిలేశారిలా

పట్టణంలోని శారదాపురి కాలనీలో విద్యుత్తు స్తంభం రోడ్డు మధ్యలో ఉంది. రోడ్డు నిర్మించే గుత్తేదారుడు మాకెందుకులే అని వారి పని పూర్తి చేసుకుని వెళ్లిపోయారు. స్తంభం వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉంది. విద్యుత్తు శాఖ అధికారులు స్తంభాన్ని రోడ్డు మధ్యలో తొలగించి పక్కన ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు పట్టణ ఏఈ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు మధ్యలో విద్యుత్తు స్తంభం ఉందని తమ దృష్టికి ఇంతవరకు రాలేదన్నారు. పరిశీలించి స్తంభాన్ని వెంటనే మారుస్తామని ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, రైలుపేట(బాపట్లటౌన్)

ప్రభుత్వం మారినా.. అవే చిత్రాలా

ప్రభుత్వం మారినా పాలకుల తీరు మరలేదు. ఉల్లిపాలెంలో ఆరోగ్య కేంద్రం ముందు గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్ ఫొటోతో ఏర్పాటు చేసిన బోర్డును నేటికి తొలగించలేదు. ప్రభుత్వం మారి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా బోర్డును తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు బోర్డును మార్చాలని స్థానికులు అధికారులను కోరినా మార్చడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -న్యూస్‌టుడే, ఉల్లిపాలెం (నగరం)

కనులపండువగా ముక్తేశ్వరస్వామి కల్యాణం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా రేపల్లె మండలం మోర్తోట శివారు కృష్ణానది ఒడ్డున కొలువుదీరిన గంగాపార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి నిర్వహించిన పూజల్లో తెదేపా నాయకులు అనగాని శివప్రసాద్, పంతాని మురళీధరరావు, కొలసాని రాము, కేసన రామకృష్ణ, దండుప్రోలు పిచ్చయ్య పాల్గొన్నారు. ఉదయం స్వామివారికి నిర్వహించిన పూజల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. సాయంత్రం జగజ్యోతి మహా దీపారాధన, ఎదుర్కోలు సన్నాహం, రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు. సోమవారం రాత్రి ముక్తేశ్వరస్వామికి తిరునాళ్ల జరుగుతుందని ప్రధాన అర్చకుడు సురేష్‌శర్మ తెలిపారు.

పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం

వైభవంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి..

బాపట్ల, బాపట్లవెస్ట్: విశ్వబ్రాహ్మణ కాలనీలోని గోందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రంహ్మేంద్రస్వామి, కామాక్షి సమేత ఏకాంబేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఏకాంబేశ్వరస్వామికి తెల్లవారుజాము నుంచి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భక్తులకు సేవలు అభినందనీయం

చెరుకుపల్లి గ్రామీణ, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మహాశివరాత్రికి గోవాడ తిరునాళ్లకు వెళ్లే భక్తులకు సేవలందించడం అభినందనీయమని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. కూటమి నేతల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. చెరుకుపల్లి నుంచి గోవాడ తిరునాళ్ల మార్గంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన భోజనం వడ్డించారు. ★ గుళ్లపల్లి శివాలయం వద్ద ఆకురాతి శివయ్య జ్ఞాపకార్థం కుమారులు 6వ ఏట భక్తులకు అల్పాహారం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. ★ చెరుకుపల్లి ఐలాండ్ కూడలి వద్ద పీటా పోతురాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొలిసారి అల్పాహారం అందజేశారు. *టపాకాయల గోదాము సమీపంలో మధు టింబర్ డిపో నిర్వాహకుడు మధు అల్పాహారం, తాగునీరు, విశ్రాంతి కోసం టెంట్‌లు వేశారు. ఈ ఏడాది తిరునాళ్లకు భక్తులు పోటెత్తడంతో దాతల సేవలను సద్వినియోగం చేసుకున్నారు. రేపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము, వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరిటాల యువసేన, దండమూడి ధరణికుమార్ మిత్ర బృందం, ఆర్యవైశ్య, మహిళా సంఘం, అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ, శ్రీవేద గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, బొలిశెట్టి పూర్ణచంద్రరావు శంకుతల జ్ఞాపకార్థం, రేపల్లె పదో వార్డు, భాజపా, పురపాలక సంఘం ఆధ్వర్యంలో చెక్కర పొంగలి, పులిహోర, పొంగలి, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.

అల్పాహారం పంపిణీ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్

కౌలురైతులను పట్టించుకోలేదు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: బడ్జెట్‌లో జిల్లాకు రాష్ట్రప్రభుత్వం మొండిచేయి చూపిందని సీపీఎం రేపల్లె కార్యదర్శి సీహెచ్ మణిలాల్ విమర్శించారు. రేపల్లె సీపీఎం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొమ్మమూరు కాలువ ఆధునికీకరణ, కరకట్ట పటిష్ఠత, మెడికల్ కళాశాల పూర్తిచేసేందుకు, చీరాలలో చేనేత క్లస్టరు, తీరంలో ఆక్వా ఆధారిత అభివృద్ధికి సరైన కేటాయింపులు లేవన్నారు. సూపర్ సిక్స్‌లో మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగభృతి రూ.3 వేలు అమలు గురించి బడ్జెట్ పట్టించుకోలేదని విమర్శించారు. వ్యవసాయ ధరల స్థిరీకరణకు రూ.3 వేల కోట్లు అవసరమైతే రూ.500 కోట్లతో సరిపెట్టి రైతులకు అన్యాయం చేసి, కౌలు రైతుల గురించి పట్టించుకోలేదన్నారు. అంగన్‌వాడీ, ఆశ తదితర శ్రామిక మహిళలు, కార్మికుల వేతనాల పెంపు ఊసేలేదని బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని తెలిపారు. నాయకులు లక్ష్మణరావు, డానియల్, అగస్టీన్ పాల్గొన్నారు.

పవిత్రతకు మారుపేరు రంజాన్ మాసం

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: పవిత్రతకు మారుపేరు రంజాన్ మాసం అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని జమేదారుపేటలో జమీయత్ ఉల్మా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని మసీదుల పేష్‌మామ్‌లకు ఆదివారం ఎమ్మెల్యే రంజాన్ తోఫా అందజేశారు. రంజాన్ మాసం సందర్భంగా నియోజకవర్గంలోని మూడు మండలాల్లో తమ సంస్థ వేగేశన ఫౌండేషన్ ద్వారా ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషమన్నారు. జమీయత్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు హిందీ పరీక్షలు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: అద్దేపల్లి సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం హిందీ పరీక్ష నిర్వహించారు. ప్రాథమిక 54, మాధ్యమిక 67, రాష్ట్ర భాష పరీక్షలకు 46 మంది హాజరయ్యారు. మండల పరిధిలో ఉన్న వివిధ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారు.

డొంక మార్గం.. బాగు చేస్తేనే రైతుకు ఉపయోగం

జంపని, (వేమూరు), కొల్లూరు, ఐలవరం, (భట్టిప్రోలు), న్యూస్‌టుడే: రైతులు పొలాలకు వెళ్లే డొంక మార్గాలకు మరమ్మతులు చేయడానికి ఇదే అదునైన సమయం. ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు. జాప్యమైతే వర్షాకాలం వస్తోందని, ఆ సమయంలో పనులు చేయడం కుదరదని చెబుతున్నారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అందించిన వివరాల ప్రకారం నియోజకవర్గంలో 320 కిలోమీటర్ల మేర వ్యవసాయ పనులకు వినియోగించే మట్టిడొంక మార్గాలు ఉన్నాయి. గత వైకాపా పాలనలో వీటి సంగతి పట్టించుకున్న వారు లేకపోవడంతో అవి అధ్వానంగా మారాయి. ప్రస్తుతం పొడి వాతావరణం ఉండడం వల్ల పనులు చేయడానికి అనువైన సమయం. అధికారులు పనులు చేయించాలని రైతులు కోరుతున్నారు. కనీసం ప్రధాన డొంకల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

చుండూరు మండలంలో పెదగాదెలవర్రు నుంచి నడిగడ్డపాలెం పొలాలకు వెళ్లే దారి ఇలా..

ఇవిగో ఇవే..

వేమూరు మండలం జంపనిలో తెనాలి- వెల్లటూరు అడ్డరోడ్డు నుంచి ఉత్తరం వైపు పొలాలకు వెళ్లే డొంకమార్గం నాలుగు కిలోమీటర్ల మేర ఉంటుంది. మార్గం గుండా జంపనితో పాటు, బూతుమల్లి, చదలవాడ, కాకర్లమూడి తదితర గ్రామాల పొలాల్లో వ్యవసాయం చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇది అధ్వానంగా మారింది. కనీసం మరమ్మతులు చేయకపోతే పంట చేరవేత కష్టమవుతుంది. కొల్లూరు మండలంలో అనంతరం నుంచి కొల్లూరు వైపు వెళ్లే డొంక, దోనేపూడి, చినపులివర్రు తదితర మట్టి డొంకలు బాగా దెబ్బతిన్నాయి. అమృతలూరు మండలంలో మూల్పూరు నుంచి అమృతలూరు వెళ్లే డొంక, మోపర్రు నుంచి బోడపాడు వెళ్లే డొంక మార్గం దెబ్బతింది. చుండూరు మండలంలో పెదగాదెలవర్రు నుంచి నడిగడ్డపాలెం, వేటపాలెం నుంచి నడిగడ్డపాలెం, అయ్యన్నపాలెం నుంచి చుండూరుకు వెళ్లే డొంకదారులు పాడయ్యాయి. భట్టిప్రోలు మండలంలో అద్దేపల్లి నుంచి బాడవ పొలాలకు వెళ్లే డొంక, ఐలవరం పొలాల వైపు వెళ్లే మార్గాలు దెబ్బతిన్నాయి. సమస్యపై పంచాయతీ రాజ్ శాఖ డీఈ శివకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అయిదు మండలాల పరిధిలో 80 పనులు చేయడానికి, డొంక మార్గాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.33.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. పనులు ప్రారంభించామని, త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

తలపై పెట్టేద్దాం.. భద్రంగా జీవిద్దాం

న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం), రేపల్లె అర్బన్

ఇటీవల కాలంలో వాహన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వందల సంఖ్యలో ద్విచక్ర వాహనదారులే మృత్యువాత పడుతున్నారు. అనేక మంది క్షతగ్రాతులై మంచానికి పరిమితమవుతున్నారు. అప్పటి వరకు సంతోషంగా ఉన్న కుటుంబాలు ఒక్కసారిగా రోడ్డున పడుతున్నాయి. వీటికి ముగింపు పలకాలనే సంకల్పంతో పోలీసుశాఖ రోడ్డు భద్రతా నియమాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఉన్నతాధికారులే స్వయంగా వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నారు. పిట్టలవానిపాలెం, చెరుకుపల్లి, కర్లపాలెం, నిజాంపట్నం, రేపల్లె మండలాల్లో ప్రధాన రహదారులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు.

వేగం కన్నా ప్రాణం విలువైంది..: ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణమే ఆయుధమని తలకెక్కించుకుంటే బతుకు భద్రంగా ఉంటుందని పోలీసుల సూచన. ప్రత్యేక డ్రైవ్‌లో అపరాధ రుసుము వేయకుండా శిరస్త్రాణాలు కొనుగోలు చేయిస్తున్నారు. వారితోనే ప్లకార్డులు ప్రదర్శించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని ఇతరులకు అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకుమార్

మార్పునకు పునాది : చందోలు ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో గడిచిన నెల రోజుల నుంచి భారీ శబ్దాలు, అతివేగం, పరిమితికి మించి వెళ్తున్న ఆటోలు, ట్రాక్టర్ల చోదకులపై కేసులు నమోదు చేస్తున్నారు. అనుకోని విధంగా ప్రమాదం జరిగితే లైసెన్సు, బీమా వంటి ధ్రువ పత్రాలు సక్రమంగా ఉంటే పొందే ప్రయోజనాలను తెలియజేస్తున్నారు. సరైన పత్రాలు, నంబర్లు లేని వాహనాలపై కొరడా ఝుళిపిస్తున్నారు. మైనర్లను గుర్తిస్తే వారికి భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు, విధించే చట్టాలను తల్లిదండ్రులకు వివరిస్తూ మార్పునకు పునాది వేస్తున్నారు.

మాగాణి భూముల్లోకి ఆక్వా చెరువు మురుగు

నగరం, న్యూస్‌టుడే: తాడివాకవారిపాలెం శివారు కొత్త ఎస్సీ కాలనీ సమీపంలోని కొందరు రైతులు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆక్వా సాగు చేస్తున్నారు. వరి చేల మధ్యలో ఆక్వా సాగు చేయడం వల్ల మాగాణి భూములు బీడు భూములుగా మారుతున్నాయని బాధిత రైతులు జిల్లా, స్థానిక అధికారులకు ఫిర్యాదులు చేశారు. అధికారులు స్పందించక పోవడంతో చేసేది లేక మామిడి చెట్లను నాటి సాగు చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే తాజాగా రొయ్యల సాగు అనంతరం చెరువులోని మురుగు నీటిని పక్కనే ఉన్న మాగాణి భూముల్లోకి వదిలేశారు. కాలుష్యానికి గురైన నీరు మామిడి మొక్కల చుట్టూ చేరడంతో చెట్లు చనిపోతాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పచ్చదనంతో ఆరోగ్యం

బాపట్ల, బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : బాపట్ల ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సేవల్లో భాగంగా పర్చూరు మండలం కొత్తపాలెం, చెరుకూరు గ్రామాల రహదారుల వెంబడి ఆదివారం వాలంటీర్లు మొక్కలు నాటారు. పచ్చదనం, మొక్కలు, పరిసరాల పరిశుభ్రత గురించి వాలంటీర్లు ప్రజలకు వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి. విజయకుమార్, డాక్టర్ ఎన్.అశోక్ కుమార్ బోధన సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమూరుకు చెందిన హర్ష(25) నగరంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆదివారం హర్ష ద్విచక్రవాహనంపై కంకరగుంట పైవంతెన మీద నుంచి పట్టాభిపురం వైపు వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి రోడ్డు విభాగినిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పశ్చిమ ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేలం ప్రకటన

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION) : TENALI

E.P. No. 101 / 2022 in O.S. No. 381 / 2019

Between:

Pothana Varalakshmi ...D.Hr

And

Somarouthu VenkateswaraRao ....J.Dr

పైనెంబరు ఇ.పి.లో ఇస్తిహారు జారీకాబడి జప్తు భాయమైన షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలంవేయుటకు శ్రీ కోర్టువారు ది.09-03-2026వ తేదికి వాయిదావేసినారు. కావున వేలంపాటలో పాల్గొన దలచినవారు వాయిదా రోజున ఉ।।గం।।10-30ని।।లకు పైకోర్టువారి ఎదుటహాజరై వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును. కోర్టువారి షరతులకు లోబడి పాటజరుగును.

Schedule:Guntur Dt., Kolluru Sub.Dt. Ilaka Vemuru(Md), Chavali Grama Panchayat area, 6th Block, Chavali Grama D.No.111/10 an extent of Ac.0-10 cents of House site with asbestos sheet shed and hut therein is bounded by:East: Somarouthu Dhana Lakshmi's Property, South:Gopalam Veera Sankara Rao's property, West: Panchayat Bazaar, North: Kunche Adiyya's property. Within these boundaries an extent of AC.0-10 Cents equivalent to 484Sq.Yards or 406.56Sq. meters of house site with asbestos sheet shed and hut therein.

BY ORDER OF THE COURT

DHR Value : 7,50,000/-

Amin Value: 22,00,000/-

Market Value : 7,26,000/-

Proclamation and sale on:09.03.2026

Further hearing: 16.03.2026.

పరిశా రవీంద్రబాబు, డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్, తెనాలి, గుంటూరు జిల్లా, సెల్: 9848356442

(c) eenadu

చీరాల

• చీరాల • పర్చూరు

మూడు ఇన్వర్టర్లు అందజేత

పూసపాడు (ఇంకొల్లు), న్యూస్‌టుడే: కేసస్ప్లాన్, నేతాజీ మిత్రమండలి పక్షాన ఆదివారం ప్రార్థనా మందిరం, కళ్యాణ మండపానికి విద్యుత్తు ఇన్వర్టర్లు అందజేశారు. గ్రామంలోని విశ్వేశ్వర పంక్షన్ హాలుకు కమ్మలపాటి ప్రమారాలు, కమ్మలపాటి సుదీర్ఘులు ఒకటి, హరిజనవాడలోని చర్చికి అల్లనవెని శ్రీహర్ష, కమ్మలపాటి హరిక్రిష్ణలు రెండు ఇన్వర్టర్లను చర్చి నిర్వాహకులకు అందజేశారు. ముఖ్య అతిథి పర్చూరు రోటరీ ప్రతినిధి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడారు. నేతాజీ మిత్ర మండలి చైర్మన్ వై.వేణుగోపాల్, కరణం రమేష్, సూది సుబ్బారావు, వీరయ్యచౌదరి, నాగేశ్వరరావు, గంటా బాబు, మండవ సహదేవరావు పాల్గొన్నారు.

నేడు ఆర్డీవో ఇంకొల్లు పర్యటన

ఇంకొల్లు, న్యూస్‌టుడే: రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న రెవెన్యూ క్లినిక్‌కు చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు హాజరుకానున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. గతవారం ఆర్డీవో పర్యటన రద్దయిన కారణంగా తిరిగి సోమవారం నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ సమస్యలను వినతుల రూపంలో ఆర్డీవోకి సమర్పిస్తే పరిశీలించి పరిష్కరిస్తారని చెప్పారు.

ఉచిత విద్యుత్తుతో చేనేతకు ఊపిరి

చీరాల, న్యూస్‌టుడే: చేనేతల ఉచిత విద్యుత్తు పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించి, ఆ రంగం అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునిస్తోందని ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య హర్షం వ్యక్తంచేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల సంక్షేమానికి, అభివృద్ధికి తోడ్పాటునిస్తుందన్నారు. బీసీ సంక్షేమానికి అధిక నిధులు కేటాయించారని, బీసీల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో విద్యుత్తు ఉపకేంద్రం, కార్యాలయం, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.20 కోట్లు ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.10 కోట్లు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతి, ఇతర రాయితీ పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారని తెలిపారు. హార్బర్ ల్యాండ్ కస్టర్ ద్వారా రాయలసీమ అభివృద్ధికి తోడ్పాటునిస్తున్నారని అందులో భాగంగా చీరాల, పర్చూరు నియోజకవర్గాలను కలుపుతూ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. త్వరలో చీరాలలో బీచ్‌ఫెస్టివల్ నిర్వహిస్తామని వెల్లడించారు. క్రీస్తుల్ కారిడార్‌తో జిల్లా మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎం.సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ కె.జనార్దన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాత సామగ్రితో లేదు పరిశుభ్రత

జాండ్రపేట పంచాయతీ కార్యాలయంలో రిక్షాలు

జాండ్రపేట, ఈపూరుపాలెం (చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే: చీరాల మండల పరిధిలోని పలు పంచాయతీల్లో పాత సామగ్రి పేరుకుపోతోంది. పంచాయతీ అధికారులు వేలం వేయడానికి వెనకడుతున్నారు. కార్యాలయాలకు వచ్చే వారికి అసౌకర్యంగా ఉండటంతో పాటు పంచాయతీలకూ ఆదాయం సమకూరడం లేదు. జాండ్రపేట పంచాయతీలో కొన్నేళ్లుగా గ్రంథాలయం ముందు పాత సామగ్రి, మోటారుబండి చెత్త రిక్షా బళ్లు నిల్వ ఉంచారు. వీటిలో కొన్ని పూర్తిగా పనికిరాకుండా పోగా.. మరికొన్ని చిన్నపాటి మరమ్మతులు చేయిస్తే చెత్త తరలింపునకు వినియోగించుకోవచ్చు. కానీ జీతాల చెల్లింపులో అంతంతమాత్రంగా ఉన్న దశలో పాత బళ్లకు మరమ్మతులు చేయించలేని దుస్థితిలో ఉన్నారు. దీంతో అధికారులు అన్నింటినీ అక్కడే పేర్చి ఉంచారు. మండలంలో మరో మేజర్ పంచాయతీ ఈపూరుపాలెంలోనూ ఇదే పరిస్థితి. కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పాత బళ్లను ఉంచారు. ఏళ్లు గడుస్తున్నా.. అధికారులు వీటికి వేలం వేయకపోవడం అలాగే పేరుకుపోయాయి. ఇకనైనా వెంటనే స్పందించి వేలం వేసి కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

18న మెగా జాబ్ మేళా

పర్చూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో ఈనెల 18న స్థానిక కూనపరెడ్డి ప్రమీలా రాణి డిగ్రీ కళాశాలలో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెదేపా మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్ ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే మేళాలో 18 బహుళజాతి కంపెనీలు హాజరుకానున్నట్లు చెప్పారు. అర్హత కలిగిన వారు ధ్రువీకరణ పత్రాలతో రావాలని చెప్పారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉప్పుటూరులో అమరేశ్వరస్వామి

పర్చూరులో భీమేశ్వరస్వామి

కారంచేడు పెద్దజాలలో మల్లేశ్వరస్వామి

మార్టూరు ఘటేశ్వరస్వామి

చెరుకూరులో అగస్త్యేశ్వర స్వామి

చీరాల: ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో..

ఇసుకదర్శిలో నాగమల్లేశ్వరుడు

కైలాసవాసా.. కరుణించరావా

చీరాల: శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

కొత్తపాలెం శివాలయం వద్ద భారీ విద్యుత్తు ప్రభలు

ఇంకొల్లులో ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. శివయ్య.. పాహిమాం అంటూ భక్తుల స్మరణతో ఆలయాలు, భక్తుల తెల్లవారుజామునే దేవాలయాలకు పోటెత్తారు. ముక్కంటికి అర్చనలు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే కొండయ్య చీరాల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణ రోడ్డులోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక అలంకరణలు ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్దసంఖ్యలో వీటిని తిలకించారు. ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు, ఈవోల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాత్రికి స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని ఆయా దేవాలయాల వద్ద కనుల పండువగా నిర్వహించారు. **- న్యూస్‌టుడే బృందం**


కొత్తపాలెం శివాలయంలో పూజల్లో ఎమ్మెల్యే ఏలూరి

సోపిరాల శివాలయం వద్దకు ప్రభను తీసుకెళుతున్న యువకులు

పైపులైన్ల మరమ్మతులు పూర్తి

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరు తూర్పు బజారులోని రక్షిత మంచినీటి పైపులైను కొంత కాలం క్రితం పగిలిపోయింది. దీంతో మంచినీరు వృథా కావడంతో సమస్యను గుర్తించిన పంచాయతీ అధికారులు ఆదివారం మరమ్మతు పనులు చేపట్టారు. పగిలిన పైపులైను ప్రాంతాన్ని గుర్తించి, కొత్తది ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంతవాసుల తాగునీటి సమస్య పరిష్కారమైంది.

పొంచి ఉన్న ప్రమాదం

ఒరిగిన విద్యుత్తు స్తంభాల రూపంలో ప్రమాదం పొంచి ఉంది. కారంచేడు నాల్గో వార్డులో కొమ్మమూరు కాలువ ఎడమ గట్టుపై విద్యుత్తు స్తంభాలు కాలువ వైపు ఒరిగాయి. ఎప్పుడూ వాహనాలు, రైతులు ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ స్తంభాలు కాలువ గట్టును ఆనుకుని ఉండటంతో నీటి ప్రవాహం పెరిగితే కూలిపోయే అవకాశం ఉందని ఆ ప్రాంతవాసులతో పాటు రైతులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కారంచేడు**

మురుగు పారక.. దుర్వాసన భరించలేక

కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

మార్టూరు దీవర్స్ కాలనీలో సైడ్ కాలువల్లో ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోయింది. కాలువలను శుభ్రపరచకపోవడంతో దుర్వాసన వ్యాప్తి చెందుతోందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై వరకు మురుగు పేరుకుపోయింది, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే ప్రమాదం ఉందని తెలుపుతున్నారు. అధికారులు కాలువల్లో మురుగుపారుదలకు చర్యలు చేపట్టి, బ్లీచింగ్ చల్లించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే మార్టూరు**

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

మొక్క నాటుతున్న విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని బాపట్ల ఏజీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. కిశోర్ తెలిపారు. ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లో ప్రధాన వీధులు, చెరువు కట్టల వద్ద మొక్కలు నాటారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు స్వచ్ఛమైన గాలితోకూడిన వాతావరణాన్ని పొందవచ్చని చెప్పారు. డాక్టర్ ఎన్.అశోక్‌కుమార్, పీడీ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే చెరుకూరు (పర్చూరు)**

వైభవంగా శివ పార్వతుల కల్యాణం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు శివాలయంలో ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పదిమంది దంపతులు పాల్గొన్నారు. స్థానిక వస్త్ర పరిశ్రమలో పనిచేసే ఒడిశా, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ప్రత్యేక పూజలు చేశారు.

వేడుకలో పాల్గొన్న దంపతులు

పనులు చేసి... నిర్లక్ష్యంగా వదిలేసి

కారంచేడు-పర్చూరు మార్గంలో రోడ్డుపై మట్టి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కొమ్మమూరు కాలువ నుంచి నీటిని తరలించే పైపులైన్ల మరమ్మతులు చేపట్టేందుకు ఈ మార్గంలో రోడ్డు వెంబడి గుంతను తవ్వి, మట్టిని రోడ్డుపైనే వదిలేశారు. పనులు పూర్తి చేసిన తర్వాత మట్టిని పూర్తిస్థాయిలో గుంతలో నింపకపోవడం, రాత్రి సమయాల్లో ఆ ప్రాంతంలో విద్యుత్తు దీపాలు లేకపోవడంతో ప్రమాదభరితంగా మారిందని వాహన చోదకులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డుపైకి చేరిన మట్టిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కారంచేడు**

రహదారి నిర్మించారు.. కాలువలు వదిలేశారు

రోడ్డు ఎత్తుగా వేయడంతో నిలిచిన మురుగు

అధికారులు తీసుకొనే కొన్ని నిర్ణయాలు ప్రజలకు శాపంగా మారుతున్నాయి. ఏదైన ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో రహదారులు, కాలువలు పూర్తిస్థాయిలో అంచనా వేసి నిర్మించాలి. ప్రస్తుత పాలకవర్గం కాలపరిమితి ముగియనుండటంతో ఇటీవల వార్డుల వారీగా నిధులు కొద్దికొద్దిగా కేటాయింపులు చేశారు. దీంతో ఆ మొత్తంతోనే పనులు పూర్తి చేసి, స్థానిక ప్రజాప్రతినిధులు మమా అనిపించారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దండుబాట నుంచి వైకుంఠపురం వెళ్లే ప్రాంతాలకు ఇటీవల రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించారు. దీంతో రోడ్డు నిర్మించగా ఇరువైపులా కాలువలు వదిలేశారు. రహదారి ఎత్తుగా వేయడంతో గతంలో ఉన్న కాలువలు పూడిపోయాయి. మురుగు పారే మార్గం లేకపోవడంతో మొత్తం రహదారిపైనే నిలిచిపోతుంది. దీంతో స్థానికులు దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మించినందుకు సంతోషపడాలో కాలువలు వదిలేసినందుకు బాధపడాలో తెలియని పరిస్థితి స్థానికులది. ఈ విషయమై ఏఈ రవికుమార్ మాట్లాడుతూ త్వరలో కాలువలు నిర్మిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, వైకుంఠపురం, దండుబాట (చీరాల)**

సొంత గూడు లేని సర్కారు కార్యాలయాలు

రామకృష్ణాపురం, వైకుంఠపురం కొత్తపేట(చీరాల అర్బన్), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి అతి సమీపంలో చీరాల పట్టణం ఉండగా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు నేటికి సొంత గూడు లేక అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటిల్లో మౌలిక వసతులు సక్రమంగా లేకపోయినా ఏళ్ల నుంచి ఇక్కడే ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రధానంగా పట్టణ నడిబొడ్డులో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఉంది. దీనివల్ల ప్రభుత్వానికి రూ. లక్షల్లో ఆదాయం వస్తోంది. అయినా దీనికి సొంత కార్యాలయం లేదు. ఇక్కడ దాదాపు పది మందికిపైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇక ఇన్‌కం ట్యాక్స్ అధికారి కార్యాలయం కొత్తపేటలోని అద్దె భవనంలో కొనసాగుతోంది. అలాగే మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు కార్యాలయం చీరాల-వేటపాలెం బైపాస్ రోడ్డు వెంట కొత్తపేటలో ఉంది. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం దీన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఆనాడు దీని చుట్టూ ఖాళీగా ఉండేది. ఇప్పుడు గృహాలు ఏర్పడటంతో లైసెన్సు కోసం వచ్చే వారి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు సరైన వసతి లేని పరిస్థితి. దీని నిర్మాణానికి కొన్నాళ్ల క్రితం వీఆర్ఎస్ అండ్ వైఆర్ ఎన్ కార్యాలయ సమీపంలో రెండెకరాల స్థలం కేటాయించారని ఉన్నతాధికారులు చెప్పినా నేటికి దాన్ని స్వాధీనం చేయలేదు. ఎక్సైజ్ శాఖ కార్యాలయం కొత్తపేటలోని ఓ ప్రైవేట్ భవనంలో ఉంటోంది. దీన్ని ఖాళీ చేయాలని దాని యజమాని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా ఏర్పడిన తరువాత చీరాలకు ఆర్డీవో కార్యాలయం వచ్చింది. పర్చూరులో ఉండే డిప్యూటీ డీఈవోను చీరాలకు మార్పు చేశారు. ఇప్పటికి ఇక్కడ కార్యాలయం లేకపోవడం గమనార్హం. ఇకనైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీటికి సొంత కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి దృష్టిసారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

బాలసాయినగర్‌లో సమస్యల తిష్ఠ

అంతర్గత రోడ్డు దుస్థితి

చీరాల మున్సిపల్ పరిధిలోని 24వ వార్డు బాలసాయినగర్ ప్రాంతంలో నివసించే ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ ప్రాంతం పేరుకే పురపాలక సంఘ పరిధిలో ఉంది.. కానీ అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ అంతర్గత రోడ్లు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక అవస్థలు పడుతున్నారు. ఫలితంగా పిచ్చిమొక్కలు, విషసర్పాల సంచారంతో రాత్రయితే బయటకు రాలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇక వర్షాకాలంలో ఇక్కడి పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందంటున్నారు. లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపు నీరు నిలిచిపోవడం, బయటకు వెళ్లేదారి లేక దోమకాటు, దుర్వాసనతో అల్లాడిపోతున్నామని చెబుతున్నారు. ఈ ప్రాంత సమస్యలపై అనేకసార్లు అధికారుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు బాలసాయినగర్ ప్రాంత సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించి, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పేరాల**

చురుగ్గా కుటుంబ సర్వే

పేరాల, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అవాంతరాలు లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి అందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే చీరాల మండలం దేవాంగపురి పంచాయతీలో సాగుతోంది. ఈ క్రమంలోనే ఇప్పటికే పంచాయతీలోని కుటుంబాలను రెండుగా విభజించి, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే చేపట్టినట్లు కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 2న ఇది ప్రారంభంకాగా దేవాంగపురి-1లో 1900 ఇళ్లకు 1311 సర్వే చేశామన్నారు. దేవాంగపురి-2లో 1804 గృహాలకు 1022 సర్వే చేశామన్నారు. మిగిలిన గృహాలను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

మహాశక్తి దేవతగా బండ్లమ్మ

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు శ్రీబండ్లమ్మ అమ్మవారికి ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసులహారం, రజత కవచంతో అలంకరించగా 'మహాశక్తి దేవత'గా భక్తులకు దర్శనమిచ్చారు.

కుందేరు కాలుష్య కాసారం!

కాలువలో పెరిగిన జమ్ము, తూటుకాడ

కొత్తపేట (చీరాల అర్బన్), న్యూస్‌టుడే

కుందేరు కాలుష్య కాసారంగా తయారైంది. ఫలితంగా దీని పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు దుర్వాసనతో పాటు భూగర్భ జలాలు కలుషితం కావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే దోమలు స్వైరవిహారం చేయడంతో తరచూ అనారోగ్యాల బారిన పడాల్సి వస్తోందని వాపోతున్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం బైపాస్ నుంచి చినగంజాం మండలం మోటుపల్లి వరకు దాదాపు 25 కిలోమీటర్ల పరిధిలో ఇది విస్తరించి ఉంది. దీని ఆధునికీకరణకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య సిఫార్సుతో రూ.89 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపారు. దీనికి అదనంగా మున్సిపల్ పరిధిలో ఉన్న కుందేరులో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించేందుకు మరో రూ.37.90 లక్షలు పురపాలక సంఘం నుంచి ఇచ్చేలా తీర్మానం చేశారు. నాలుగు నెలల క్రితం రెవెన్యూ అధికారులు దీన్ని సర్వే చేసి, ఆక్రమణలు సైతం గుర్తించారు. ఇక నిధులు మంజూరైతే కుందేరుకు మహర్దశ పట్టనుంది.

కుందేరు వివరాలు (ఎకరాల్లో)

మండలాలు	విస్తీర్ణం	ఆక్రమణకు గురైంది
చీరాల	267.72	20.18
వేటపాలెం	656.06	173.26
చినగంజాం	452.98	290.44

ఇష్టానుసారంగా నీటి తరలింపు

అక్రమ బోర్లు ద్వారా ట్యాంకరుకు పట్టుకుంటున్న నీరు

వేటపాలెం, న్యూస్‌టుడే: అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురం నుంచి కొత్తపేట వెళ్లేదారిలో అక్రమంగా బోర్లు వేసి నీటిని నిత్యం ట్యాంకర్ల ద్వారా తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. ఇది యథేచ్ఛగా సాగుతున్నా కనీసం పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వాల్టా చట్టం ప్రకారం బోరు వేయాలంటే తప్పనిసరిగా పంచాయతీ అధికారులు అనుమతి ఉండాలి. కానీ వీటిని పట్టించుకోకుండా బోర్లు వేసి, ఇక్కడ నీటి వ్యాపారం చేస్తున్నారు. రాబోయే వేసవిలో ఎక్కువగా ఇక్కడ నుంచి నీటిని తరలించే అవకాశం ఉందని, ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమంగా నీటి తరలింపును అడ్డుకోవాలని కోరుతున్నారు.

కౌన్సిల్ సమావేశం ఉంటుందా.. కోరం అవుతుందా?

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల పురపాలిక పీఠాన్ని కూటమి ప్రభుత్వం కైవసం చేసుకున్న కొన్ని నెలల్లోనే కౌన్సిల్‌లో మార్పులు చోటు చేసుకోవడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కౌన్సిల్‌లో తెదేపా నుంచి ఒక కౌన్సిలరు ఉన్నప్పటికి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు కౌన్సిలర్లు తెదేపాలో చేరారు. దీంతో గత ఏడాది మే 14న ప్రతిపక్ష పార్టీకి చెందిన ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ సమయంలో 25 మంది కౌన్సిలర్లు దీనికి మద్దతు తెలపడంతో ఆయన పదవి నుంచి వైదొలగారు. రెండు నెలల అనంతరం కొత్త ఛైర్మన్ ఎంపిక కోసం 27 మంది చేతులెత్తారు. ఆరోజున అంత మంది మద్దతు తెలిపితే... ఇప్పుడు కౌన్సిల్‌లో సమావేశం నిర్వహిస్తే కోరం అవుతుందా లేదా అనే పరిస్థితి ఉత్పన్నం అవుతోంది.

ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య కౌన్సిల్ సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరైన ప్రతిసారీ పార్టీలకతీతంగా చీరాల పట్టణాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలనేది తన ధ్యేయమని చెబుతున్నారు. కానీ కౌన్సిల్‌లో దీనికి విరుద్ధంగా జరుగుతోందనే వాదన ఉంది. గత ఏడాది జులై 16న తెదేపా తరపున కొత్త ఛైర్మన్ ఎంపికయ్యారు. ఆగస్టులో జరిగిన మున్సిపల్ సమావేశంలో 29 అంశాలకు ఒకటి రద్దు చేశారు. ఆ రోజున జీరో అవర్ ప్రవేశపెట్టి సభ్యులు సమస్యలపై మాట్లాడే అవకాశం కల్పించారు. అంతేకాకుండా వారు మాట్లాడిన అంశాలను ఆయా శాఖాధికారులు నమోదు చేసుకుని, తరువాత జరిగే కౌన్సిల్‌లో వాటిపై తీసుకున్న చర్యలపై వివరించాలన్నారు. దీనికి సభ్యుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఆ తరువాత నెలలో జరిగిన సమావేశంలో 35 అంశాలకు మూడింటిని వాయిదా వేశారు. ఇక అక్టోబరులో ఏర్పాటు చేసిన సమావేశానికి కోరం లేక వాయిదా వేశారు. అదే రోజు కార్యాలయం ముందు కొంతమంది కౌన్సిలర్లు ఛైర్మన్ తనకు ఇష్టం వచ్చిన వారికే పనులు చేస్తున్నారని... తమ ముందు అధికారులకు పనులు చేయమని చెప్పి... ఆ తరువాత చేయవద్దని సూచిస్తున్నారని దీనికి నిరసనగా కౌన్సిల్‌ని బాయ్‌కాట్ చేశామని మీడియాకు చెప్పడం గమనార్హం. నవంబరులో కౌన్సిల్ సమావేశమే నిర్వహించలేదు. ఇక డిసెంబరులో జరిగిన సమావేశంలో కోరం లేకపోయినా ఎలా సభ నిర్వహిస్తారని వైకాపా కౌన్సిలర్లు కమిషనరుపై వాగ్వాదానికి దిగారు. ఆ తరువాత కౌన్సిల్‌కి సభ్యులు హాజరుకావడం...కోరం ఉందని కమిషనరు పేర్కొనడంతో దాదాపు 128 అంశాలు ఆమోదించారు. గత నెలలో అసలు సమావేశం ఊసేలేదు. మూడు రోజుల క్రితం ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు మార్చి 9న నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ఈలోపు ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఈ నెలలో మాత్రమే సమావేశం నిర్వహించి... ప్రజా సమస్యలపై కౌన్సిలర్లు చివరిసారిగా తమ గళాన్ని వినిపించేందుకు అవకాశం ఉంది. మరి దీన్ని సద్వినియోగం చేసుకుంటారా... గత నెలలో మాదిరిగానే సమావేశం పెట్టకుండా ఉంటారో వేచి చూడాలి.

క్రికెట్ విజేతలకు నగదు బహుమతి

వేటపాలెం జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందజేస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, న్యూస్‌టుడే: తెలుగు యువత నిర్వహించిన బీవీ హెచ్ స్మారక టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. గత 40 రోజులుగా ప్రీమియర్ లీగ్ పద్ధతిలో జరిగిన పోటీల్లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతి సాధించిన వేటపాలెం జట్టుకు రూ.లక్ష, ద్వితీయ స్థానం దక్కించుకున్న చిలకలూరిపేట క్రీడాకారులకు రూ.60వేలు, మూడో స్థానంలో నిలిచిన నెల్లూరు జట్టుకు రూ.40వేలు నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు. పోటీల నిర్వాహకులు మక్కెన మహేష్, బొట్లగుంట శ్రీను, లగడపాటి సూర్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

కౌలురైతులను పట్టించుకోలేదు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: బడ్జెట్‌లో జిల్లాకు రాష్ట్రప్రభుత్వం మొండిచేయి చూపిందని సీపీఎం రేపల్లె కార్యదర్శి సీహెచ్ మణిలాల్ విమర్శించారు. రేపల్లె సీపీఎం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొమ్మమూరు కాలువ ఆధునికీకరణ, కరకట్ట పటిష్ఠత, మెడికల్ కళాశాల పూర్తిచేసేందుకు, చీరాలలో చేనేత క్లస్టరు, తీరంలో ఆక్వా ఆధారిత అభివృద్ధికి సరైన కేటాయింపులు లేవన్నారు. నాయకులు లక్ష్మణరావు, డానియల్, అగస్టీన్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd., Chirala Branch issued the following notice to the general public.

My client intends to grant loan to the applicant **NUTHALAPATI ANIL BABU MOTHER NUTHALAPATI SUSEELA R/o. Medarametla Village, Korisapadu Mandal,** Prakasam Dt., A.P. Offered the Following notice schedule Property as a security of the business loan granted to the above said person and after scrutinasation of the documents pertaining to the notice schedule property by the way of registered mortgage As such if anyone have any claims, charges, mortgages, sale agreements, court attachments, court disputes, etc., shall be informed to my client of to me within 5 days from the date of notice. Otherwise later objections will not bind my client in this regards.

SCHEDULE: Ongole Sub District - Tanguturu Mandal - Tanguturu Grama panchayat - Tanguturu Grama Village Sy.No. 1230/1 - Viswabrahmana Bazaar - Door No. 10-72 Assessment No. 1458 - Current meter no.3830-RCC Roof Shed with an extent of 759 Sq.feets = 10 rooms = 39.Sq.feets = 84 3/9 Sq.Yards = 70-50 Sq.Mts. constructed with an plinth area 306 sq.feet house bounded by: **East :** Property of Kandukuru Nageswara Rao and others -14ft.3 inches. **West :** Property of Hymathi D/o Lakshmipati SubbaRao -14ft.03 inches. **North :** Property of Kandukuri Rajendra Prasad S/o Nageswara Rao - 53ft.06 **South :** Panchayat Bazaar - 53ft.

Place: Chirala
Date: 14-02-2026
Sd/- **G Srinivasulu**
Advocate, Chirala

(c) eenadu

శ్రీకాళహస్తి : నంది, సింహ వాహనాలపై సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక ▶ నగరోత్సవంలో భక్తులకు దర్శనభాగ్యం ▶ దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

• భూకైలాసమైన శ్రీకాళహస్తి • కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

జగమేలే జంగమా.. జయహో శివలింగమా!

కపిలతీర్థంలో 'భోగితేరు' మురిపం.. తిరుపతి నడిబొడ్డున ఉన్న కపిలతీర్థం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. వేకువజామున నిర్వహించిన మహాభిషేకం, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం భోగితేరు (రథోత్సవం) వేడుకగా కొనసాగాయి. భజన మండళ్ల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో స్వామివారు విహరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తితిదే ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసింది. రుద్రాభిషేకాలు, బిల్వార్చనలతో స్వామివారిని సేవించుకుని భక్తులు తన్మయత్వం చెందారు. తలకోన, గుడిమల్లం, నారాయణవనం తదితర క్షేత్రాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి.

ఈనాడు డిజిటల్, తిరుపతి-న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి: గాలిలో విభూతి పరిమళం.. గుండెల్లో శివయ్య ధ్యానం... లయకారుడి సేవలో సకలజగత్తు మునిగిపోయిన వేళ 'ఓం నమః శివాయ' మంత్రం మారుమోగింది. కంటికి కనిపించే దైవం కోసం.. కన్నీటితో చేసుకున్న అభిషేకంలా.. భక్తజనం ఆధ్యాత్మికత సందడిలో మునిగిపోయింది. హరిహరులు వేరు కాదు.. అంతా ఒక్కటే అని చాటిచెబుతూ.. ఆదివారం జిల్లా శివనామస్మరణలో తడిసి ముద్దయ్యింది. పసిపాప నుంచి ముసలి వారి వరకూ.. అందరిదీ ఒక్కటే మాట.. ఓం నమఃశివాయ.

శ్రీకాళహస్తి ఆలయంలో పుష్పాలంకరణ

● దక్షిణ కైలాసమైన శ్రీకాళహస్తిలో వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరిగాయి. మహాశివరాత్రి వేళ స్వామి, అమ్మవార్లు ఇంద్ర విమానం, చప్పరంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నిర్వహించిన పంచమూర్తుల ఊరేగింపుతో తిరుమాడ వీధులు భక్తజన సంద్రంగా మారాయి. ఆదివారం రాత్రి వాయులింగేశ్వరుడు వృషభ వాహనాన్ని, జ్ఞానప్రసూనాంబిక అమ్మవారు సింహ వాహనాన్ని అధిరోహించడంతో భక్తకోటి దర్శించుకుని పులకించిపోయింది.

కపిల్వేరుడికి నంది వాహన సేవ

కళాకారుల నృత్య ప్రదర్శన

కపిలతీర్థంలో దర్శనానికి పోటెత్తిన భక్తులు

అధునాతన అన్నప్రసాద కేంద్రానికి అడ్డంకులు

■ గ్యాస్ కేంద్రం తరలిస్తేనే సాకారం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే-రిలయన్స్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుమలలో తలపెట్టిన ఏఐ ఇంటిగ్రేటెడ్ అత్యాధునిక అన్నప్రసాద కేంద్రం నిర్మాణం ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. భద్రతా దృష్ట్యా స్థానిక మార్పుల్ని తరిగొండ వెంగమాంబ కేంద్రానికి సమీపంలో ఉన్న ఐవోసీఎల్ గ్యాస్ స్టోరేజ్ కేంద్రం తరలించాలని తితిదే ఇప్పటికే నిర్ణయించింది. ఆ స్థానంలో దాదాపు రూ.100 కోట్లతో అన్నప్రసాద కేంద్రం నిర్మించాల్సి ఉంటుంది. తితిదే-ఐవోసీఎల్ ఒప్పందంలో భాగంగా 30 సంవత్సరాలపాటు ఎల్పీజీ సరఫరా చేయాల్సి ఉంది. ఇందుకు ఔటర్‌రింగ్ రోడ్డులో 45 టన్నుల సామర్థ్యంతో గ్యాస్ నిల్వ కేంద్రం నిర్మించాలని నిర్ణయించారు. 1.86 ఎకరాల విస్తీర్ణంలో రూ.8.13 కోట్లతో పనులు చేపట్టగా ఆరునెలల్లో పూర్తిచేయాలన్నది లక్ష్యం. అయితే గడువు దాటినా ప్లాంట్ తరలింపు ఆటంకంగా మారింది. కోసం గ్యాస్ నిల్వ కేంద్రం పునాది పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. ఇటీవల వాటి పురోగతిని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలించారు. నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన పనులు వేగవంతం చేయాలని తితిదే సీఈ సత్యనారాయణను ఆదేశించారు.

ఔటర్ రింగ్‌రోడ్డులో పురోగతి లేని ఐవోసీఎల్ గ్యాస్ గోదాము పనులు

కలియుగ దైవం.. కల్కి రూపం

చంద్రగిరి: శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారు దేవేరులతో దివ్య రథంపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దుష్ట శిక్షణ... శిష్ట రక్షణకై అశ్వవాహనంపై కల్కి స్వరూపంతో శ్రీనివాసుడు తిరువీధుల్లో విహరించారు. సోమవారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

రథోత్సవంలో భక్తులు

ఆటలాడించాల్సిందే..!

• ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలన్న ప్రభుత్వం
• మైదానాల కోసం వెతుకులాట

తిరుపతి, చిత్తూరు నగరాల్లో చాలావరకు ప్రైవేటు పాఠశాలలకు మైదానాల్లేవు. అధికశాతం నివాసాలు, అపార్టుమెంట్లలో నిర్వహిస్తున్నారు. వాటిలో కనీస భద్రత ఉండటం లేదు. అటు పురపాలికల్లోనూ పదుల సంఖ్యలో ఉన్న పాఠశాలలకు మైదానాలు కరవే. వాటిపై ఆశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తిరుపతిలోని ప్రైవేటు పాఠశాలలు: 250పైగా
చిత్తూరుతోపాటు పురపాలికల్లో: 650 పైగా
చదువుతున్న విద్యార్థులు: 1.20 లక్షల మంది

పుత్తూరు, న్యూస్‌టుడే: పొద్దున లేచింది మొదలు పుస్తకాలతో కుస్తీ పట్టాలి. మెదడుకు మేతతో పాటు సాధించాలి. ఆపై చదువులో ఆటలు. ఇదీ ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల పరిస్థితి. వారికి శారీరక శ్రమలేక అనారోగ్య బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో బాలల ఆరోగ్యానికి భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కచ్చితంగా వ్యాయామవిద్య అమలు చేయాలంటూ ఇటీవల ఆదేశాలిచ్చింది. దీంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు క్రీడామైదానాల వెతుకులాటలో పడ్డారు.

పుత్తూరులో నెట్‌బాల్ ఆడుతున్న విద్యార్థినులు

ఆరోగ్య విద్యకు ప్రాధాన్యం

కచ్చితంగా అన్ని పాఠశాలల్లోనూ ప్రతి విద్యార్థితో గంట సేపు వివిధ రూపాల్లో శారీరక శ్రమ చేయించాల్సిందే. ప్రతి విద్యార్థికి వారానికి ఆరు పీరియడ్లు చొప్పున ఆడించాల్సిందే. ఉదయం పది నిమిషాలు ధ్యానం చేయించాలి. ఒక పీరియడ్ ఆరోగ్య విద్యకు కేటాయించాల్సిందే.

మానసిక ఒత్తిడి తగ్గించాలని

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య అమలు చేస్తున్నారు. సాయంత్రం ఓ గంట మానసిక ఒత్తిడి తగ్గించే విధంగా విద్యార్థులతో ఆటలు ఆడిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కేవలం కొన్ని పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య అమలు చేస్తున్నారు. ఈ దుస్థితి నుంచి బయట పడేలా ఒకటి నుంచి పదో తరగతి వరకు ఆటలు ఆడించాల్సిందేనంటూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

తప్పక అమలు చేయాలి

ప్రైవేటు పాఠశాలల్లో చదువు, ఒత్తిడితో మానసికంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. తప్పక అమలు చేయాలి. **-బాబు, జిల్లా కార్యదర్శి వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం, తిరుపతి**

ఉరకలెత్తిన కోడె గిత్తలు

ఐరాల, న్యూస్‌టుడే: మండలంలోని 35-యర్లం పల్లె పంచాయతీ దివిటివారి పల్లెలో పశువుల పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు పశువులకు ప్రత్యేక పూజలు చేశారు. యువత కోడెగిత్తలను పట్టుకునేందుకు ఉత్సాహం చూపారు. పరిసర మండలాల నుంచి భారీగా పశువులు తరలివచ్చాయి. పండుగను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెరకు రైతుకు చేదు ఫలం

■ రెక్కల కష్టం.. మధ్యవర్తుల పరం

పుత్తూరు, న్యూస్‌టుడే: అప్పులు తెచ్చి సాగు చేస్తున్న చెరకు రైతుకు చేదు ఫలం మిగులుతోంది.

చెరకు పంట

ఉమ్మడి రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా సహకార రంగంలో రెండు, ప్రైవేటు రంగంలో నాలుగు షుగర్ ఫ్యాక్టరీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉండేవి. నష్టాల పేరుతో సహకార షుగర్ ఫ్యాక్టరీలను మూసేశారు. పుంగనూరులోని వాణీ షుగర్స్, బీఎన్ కండ్రిగలో మయూరి షుగర్స్, నిండ్రలోని నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీలు దశల వారీగా మూసేశారు. ప్రస్తుతం ఎస్‌ఆర్‌పురం మండలం నెలవాయి వద్ద ఎస్ఎన్‌జే షుగర్స్ కర్మాగారం మాత్రమే నడుస్తోంది. రైతులు పండించిన పంటంతా అక్కడికే తరలిస్తున్నారు. నాలుగు కర్మాగారాలు క్రషింగ్ చేసే చెరకుతో ఒక్క ఫ్యాక్టరీపై భారం పడింది. దీంతో రైతులు పంటను పొలంలోంచి తరలించడానికి ఏజెంట్లను ఆశ్రయించాల్సి వచ్చింది. దీన్ని కొందరు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

తమిళనాడులో రూ.4 వేలు చెల్లింపు

ఎస్ఎన్‌జే కార్మాగారంలో టన్నుకు ప్రస్తుతం రూ.3290 రైతులకు చెల్లిస్తున్నారు. రవాణా ఉచితం. అదే తమిళనాడులో కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలైన వేలూరు, తిరువాలాంగాడు టన్నుకు రూ.4 వేలు చెల్లిస్తున్నాయి. తిరుణామల్లై, సెంజి ప్రైవేటు ఫ్యాక్టరీల్లో టన్నుకు రూ.3600 చెల్లిస్తున్నాయి. ఏజెంట్లు జిల్లాలో రేట్లు ప్రామాణికంగా తీసుకుని రైతుల నుంచి చెరకు కొనుగోలు చేసి అక్కడకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం చెరకు నరుకుడు కూలీ రూ.950, పొలంలోంచి బయటకు చెరకు తరలించేందుకు టన్నుకు రూ.150, ఇతర ఖర్చులు రూ.100 వెరసి రూ.1300 ఖర్చు వస్తోంది. రైతులకు మిగిలేది రూ.2వేలు. అందులో పెట్టుబడి, తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించాల్సిందే. కనీసం రైతుకు టన్నుకు రూ.1000 కూడా దక్కడం లేదు.

ఏజెంట్ల బెడద లేకుండా చూడాలి

తూర్పు మండలాల్లోని రైతులు మాత్రమే ఫ్యాక్టరీలపై ఆధారపడి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రైతులకు పర్మిట్లు దొరక్కపోవడంతో ఏజెంట్లను ఆశ్రయించి తమిళనాడులోని వేలూరు, సెంజి, తిరువాలాంగాడు, తిరువణామలై వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. టన్నుకు సుమారు రూ.700 వరకు నష్టపోతున్నారు. జిల్లా అధికారులు తమిళనాడు అధికారులతో మాట్లాడి ఏజెంట్ల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో సహకారం రంగంలోని ఫ్యాక్టరీలను పునఃప్రారంభిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందని చెరకు రైతులు కోరుతున్నారు.

మహిళా ప్రాంగణం.. నైపుణ్య ప్రాభవం

• కూటమి పాలనలో పునర్వైభవం
• శిక్షణతో స్వయం ఉపాధికి బాటలు

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా బలపడితేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందన్న ఆలోచనతో దివంగత నందమూరి తారక రామారావు 1986లో తిరుపతిలో ప్రత్యేకంగా మహిళా ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌గా నామకరణం చేశారు. గత ప్రభుత్వ పాలనలో వెలవెలబోగా కూటమి ప్రభుత్వ పాలనలో నిరంతర శిక్షణలతో కళకళలాడుతోంది.

సీపీఆర్‌పై శిక్షణ పొందుతున్న జీడీఏ కోర్సు అభ్యర్థులు

అర్హతలు ఇలా..: పాఠశాల స్థాయిలోనే చదువు మానేసిన, పదో తరగతి వరకు చదువుకున్న మహిళలకు ప్రాంగణంలో ఇచ్చే శిక్షణలన్నీ ఉచితం.

రెండున్నరేళ్లలో తొమ్మిది రకాల ఉపాధి కోర్సుల్లో 1,500 మందికిపైగా మహిళలు శిక్షణ తీసుకున్నారు. 90% మంది మహిళలు సొంత వ్యాపారాలు ప్రారంభించి స్వయంఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం 90

సరికొత్తగా కోర్సులు

మంది మహిళలు వివిధ కోర్సుల్లో శిక్షణలో ఉన్నారు. కంప్యూటర్ అండ్ ఇంటర్నెట్ లిటరసీ కోర్సులో 45 మంది శిక్షణ వచ్చే నెల 13న ముగుస్తుంది. వీరికి కంప్యూటర్ బేసిక్స్, జీమెయిల్ క్రియేషన్, ఏఐ టూల్స్ వినియోగించడం నేర్పిస్తున్నారు. జీడీఏ కోర్సులో బేసిక్ నర్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న మహిళలు త్వరలో నారాయణాద్రి ఆసుపత్రిలో ఉద్యోగంలో చేరనున్నారు.

త్వరలో పలు శిక్షణలు

వచ్చేనెలలో కిచెన్, టెర్రస్ గార్డెన్‌పై శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. 18ఏళ్ల వయసు పైబడిన మహిళలు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం 15 దరఖాస్తులు వచ్చాయి. అర్హులు ఈ నెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, శారీరోలింగ్‌లో వచ్చేనెలలో శిక్షణ ఉంటుంది. పెయింటింగ్‌లో 30 రోజులు, శారీరోలింగ్‌లో 10 రోజులు శిక్షణ ఇస్తాం.
- డా.ఫర్జానా, ప్రాంగణం మేనేజర్

ఈ-దస్త్రం.. పదిలం

● రికార్డుల డిజిటలైజేషన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ కార్యాలయాల్లో దస్త్రాల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వివిధ దస్త్రాలను డిజిటలైజేషన్ ద్వారా పదిలంగా భద్రపరిచే పనులు చేస్తున్నారు. గతంలో దస్త్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో ఎక్కడపడితే అక్కడ పేర్చేస్తున్నారు. దీంతో విలువైన ఫైళ్లు మాయమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దస్త్రాల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. కలెక్టరేట్, రెవెన్యూ శాఖ, రెవెన్యూ డివిజనల్, తహసీల్దార్ కార్యాలయాల్లో వేలాది సంఖ్యలో రికార్డులు ఉన్నాయి. ఏ కార్యాలయానికి వెళ్లినా ఫైళ్ల కట్టలు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. కొన్ని మండలాల్లో ప్రత్యేకంగా రికార్డు గదులుండగా.. మరికొన్ని చోట్ల బీరువాలు, అల్మారాలు, ర్యాక్‌లలో పేర్చేశారు. కొన్ని చోట్ల దస్త్రాలను చించివేయడంతో లభ్యత లేని పరిస్థితులు ఉన్నాయి. భవిష్యత్ అవసరాల కోసం రికార్డుల భద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఉన్నతాధికారులు వివిధ శాఖల అధికారులకు డిజిటలైజేషన్‌పై ఆదేశాలు జారీచేశారు. మరోవైపు అన్ని శాఖల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ-ఆఫీసు ద్వారా సాగాలన్న నిబంధన ఉంది.

విద్యుత్తు సమస్యలా.. ఫోన్ చేయండి

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్, జిల్లాస్థాయిలో విద్యుత్తు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు డయల్ యువర్ సీఎండీ, డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం తెలిపారు. వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు కింది నంబర్లకు తెలియజేయవచ్చన్నారు. ● **డయల్ యువర్ సీఎండీ :** ఉదయం 10–12:30 ఫోన్ నెంబరు 89777 16661 ● **డయల్ యువర్ ఎస్ఈ :** సమయం 8:30–9:30 ● **తిరుపతి:** 87126 52679 ● **చిత్తూరు:** 79931 47979 ● **అన్నమయ్య:** 94408 17449

నేడు పోలీసు గ్రీవెన్స్.. చిత్తూరు (నేరవార్తలు): జిల్లా ఏఆర్(పాత డీపీవో) కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఫిర్యాదులను ఎస్పీ, ఏఎస్పీలు స్వీకరించనున్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు.. తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 82,337 మంది భక్తులు దర్శించుకోగా రూ.3.58 కోట్ల హుండీ కానుకలు లభించాయి. ● **14 వేల టోకెన్ల జారీ:** తిరుపతిలో శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద ఆదివారం భక్తులకు 14 వేల సర్వ దర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడకదారి భక్తులకు మరో రెండువేల టోకెన్లు జారీ చేశారు.

రైతుబజారులో రూ.10కే కిలో టమాట

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు రైతుబజారులో కిలో టమాట రూ.10 చొప్పున విక్రయిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వర్ తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు సరసమైన ధరలకే నాణ్యమైన టమాట ఉత్పత్తులు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అనంతపురం జిల్లా నుంచి చిత్తూరు రైతుబజారుకు 7 టన్నులు, తిరుపతికి 5 టన్నుల సరఫరా జరిగిందన్నారు. చిత్తూరులో ఆదివారం విక్రయాలు ప్రారంభించామన్నారు. రైతుబజారుతో పాటు నాలుగు మొబైల్ వాహనాల ద్వారా వీటిని విక్రయిస్తున్నామని పేర్కొన్నారు.

మొబైల్ వాహనం ద్వారా టమాట విక్రయాలు

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

(c) eenadu

ఏటా పుష్కరం సువర్ణముఖి ప్రత్యేకం

సువర్ణముఖి ప్రవాహ ఉద్ధృతి విహంగ వీక్షణం

నదిపేరు: సువర్ణముఖి
పుట్టుక: చంద్రగిరిలోని అగస్త్యాచలం
సముద్ర సంగమ ప్రదేశం: తూపులపాళెం సమీపంలో
ఉపనదులు: కల్యాణి, భీమ
సముద్రమట్టం నుంచి ఎత్తు: 300 మీటర్లపైనే
పొడవు: 130 కిలోమీటర్లు
తీర ప్రాంతం: 3,225 చదరపు కిలోమీటర్లు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఏ నదికైనా పన్నెండు సంవత్సరాలకు ఒక పర్యాయం పుష్కరం వస్తుంది. అదే అగస్త్య మహాముని తపోబలంతో ఆవిర్భవించిన సువర్ణముఖికి ఏటా పుష్కరమే. మాఘ మాసం పూర్ణిమ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున పుష్కరోత్సవం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది.

అగస్త్య ప్రసాదితం..: ఎన్నో విశిష్టతల సమాహారమైన శ్రీకాళహస్తి క్షేత్రంలో పుణ్యనది లేకపోవడంతో అగస్త్య మహర్షి ఆవేదనకు గురయ్యారు. సత్యవత్ర భాస్కర క్షేత్రమైన ఇక్కడ నదిని తీసుకురావాలన్న తలంపుతో పాకాలకు సమీపంలోని బ్రహ్మాచలంలో తపస్సు చేయడంతో సువర్ణముఖి ఆవిర్భవించింది. అగస్త్య మహర్షి తపస్సు చేసిన కారణంగా బ్రహ్మాచలం అగస్త్యాచలంగా ఖ్యాతి గడిస్తోంది. ఇక్కడి నదిలో ఇసుక బంగారంగా మెరిసిపోతుండటంతో సువర్ణముఖి అన్న పేరు సార్థకమైనట్లు పురాణాల ద్వారా విశదమవుతోంది.

సువర్ణముఖి గమనం ఇలా..: జిల్లాలో అత్యంత పెద్ద నదిగా గుర్తింపు పొందిన సువర్ణముఖి ఎంతో పురాణ ప్రాభవాన్ని సంతరించుకుంది. పాకాలకు సమీపంలోని ఆదినాపల్లి సమీపంలోని అగస్త్యాచలం వద్ద చిన్నపాటి వాగుగా ఆవిర్భవించి అక్కడి నుంచి చిన్న పాయగా ప్రారంభమవుతోంది. అక్కడే ఎగువున భీమానది, దిగువన కల్యాణి నదులతో సంగమించి శేషాచల పర్వతాలను తాకుతూ ఉత్తరవాహినిగా ప్రవహిస్తోంది. శ్రీకాళహస్తి క్షేత్రాన్ని తాకుతూ ముందుకు సాగుతోంది. తూపులపాళెం సమీపంలో సముద్రంలో సంగమిస్తోంది.

ఆరోగ్య సంరక్షకుడు మృత్యుంజయుడు

సేవలు ఫలాలు

మృత్యుంజయ శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిష్ఠితమైన ఒక్కో శివలింగం ఒక్కో ప్రాశస్త్యాన్ని తెలియజేస్తోంది. స్వయంభు శ్రీకాళహస్తీశ్వరాలయ లింగం తర్వాత అంతటి ప్రఖ్యాతమైన శివలింగంగా మృత్యుంజయ శివలింగం గుర్తింపు పొందింది.

పెరుగుతున్న ఆదరణ

ముక్కంటి ఆలయంలో పోటుకు సమీపంలో కొలువుదీరిన శ్రీమృత్యుంజయ శివలింగ అభిషేకాలకు ఆదరణ పెరుగుతోంది. కరోనా విస్తృతం కాకమునుపు ఇక్కడి శివలింగానికి అప్పుడప్పుడు అభిషేకాలు జరిపేవారు. కరోనా సమయంలో పరోక్ష సేవ ద్వారా భక్తులు ఇక్కడి శివలింగానికి నిత్యం అభిషేకాలు చేయించడంతో ఈ ఆర్జిత సేవకు భక్తుల నుంచి ఆదరణ మరింతగా పెరిగింది. దీంతో ఈ అభిషేకాన్ని నిత్యాభిషేక ఆర్జిత సేవగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

సేవ: మృత్యుంజయ శివలింగాభిషేకం
టికెట్ ధర: రూ.వెయ్యి
ప్రవేశం: ఇద్దరికి
నిర్వహణ: రోజూ 9 గంటలకు

సేవాఫలం: ఎక్కువ మంది ఆరోగ్యసిద్ధి కోసం అభిషేకాలు జరిపిస్తారు. ఆదరణ దృష్ట్యా ప్రస్తుతం ఈ సేవా టికెట్‌ను ఆన్‌లైన్ ద్వార మాత్రమే తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు. అభిషేకజలం, విభూది, చందనాలను భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

వాడేస్తున్నారు.. పడేస్తున్నారు

నగర, పురపాలికల్లో గుట్టలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు

పుత్తూరు ముద్దుకృష్ణాపురం వద్ద..

పుత్తూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్లాస్టిక్ భూతం పర్యావరణ పరిరక్షణకు పెనుముప్పుగా మారింది. ప్లాస్టిక్ నిషేధం అమలు నామమాత్రంగా ఉండడంతో వ్యాపారులు, హోటళ్లు, మాంసం, చికెన్ దుకాణాల్లో ఏ మాత్రం తగ్గడం లేదు. వినియోగం అనంతరం ఎక్కడబడితే అక్కడ పడేయడం పెద్ద సమస్యగా మారింది. మురుగు కాలువలు, ఖాళీ ప్రదేశాలు, రోడ్ల పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. మురుగు నీటి పారుదలకు అవరోధంగా మారుతున్నాయి.

ప్రజల్లో మార్పు రాక.. నగరపాలికలు, పట్టణాల్లో గృహాల నుంచి పారిశుద్ధ్య కార్మికులు నిత్యం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో రోజుకు 500 టన్నుల వ్యర్థాలను సేకరిస్తున్నారు. వీటిలో 50 టన్నుల వరకు సింగిల్ యూసేజ్ కవర్లు ఉంటున్నాయి. చాలామంది వాటిలో మిగిలిన ఆహార పదార్థాలు ఉంచి రోడ్ల పక్కన పడేస్తున్నారు. వాటిని తిని మూగజీవాలు అనారోగ్యం పాలవుతున్నాయి. స్వర్ణ, స్వచ్ఛ ఆంధ్రా పేరుతో నగరపాలికలు, పురపాలక సంఘాలు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పేపరు, గోనె సంచులు వాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. తరచూ నగరాలు, పట్టణాల్లో ప్రజారోగ్యశాఖ సిబ్బంది దాడులు నిర్వహించి ప్లాస్టిక్ సంచులు స్వాధీనం చేసుకుని అపరాధం రుసుం విధిస్తున్నారు. కానీ దుకాణదారులు, ప్రజల్లో మార్పు రావడం లేదు.

పూర్తిగా నిషేధించేలా చర్యలు

నగరాలు, పట్టణాల్లో తరచూ దాడులు నిర్వహించి కవర్లు దొరికితే భారీగా జరిమానాలు వేస్తాం. సింగిల్ యూసేజ్ బ్యాగుల్ని విక్రయించకుండా చర్యలు చేపడతాం. ప్రజలు కూడా మార్కెట్‌కు వెళ్లే సమయంలో గోనె సంచులు వాడి పర్యావరణాన్ని పరిరక్షించాలి.

-నాగరాజు, మున్సిపల్ ఆర్డీ, అనంతపురం

గజవాహనంపై ఊరేగిన శ్రీపద్మావతీ అమ్మవారు

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారు ఆదివారం రాత్రి గజ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. జన్మనక్షత్రం ఉత్తరాషాఢను పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అలంకార శోభితురాలైన అమ్మవారు తనకు ఇష్టమైన ప్రీతిపాత్రమైన గజవాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో భక్తులకు సాక్షాత్కరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మంగళహారతులు పట్టారు. డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ సురేష్‌బాబు, రమేష్, మునికృష్ణయ్యలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు, విద్యార్థులకు బయోమెట్రిక్ నవీకరణ పూర్తిచేసేందుకు జిల్లాలో ఈ నెల 16 నుంచి 20 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నారు. పాఠశాలలు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో శిబిరాలు నిర్వహించనున్నారు. 5 నుంచి 17 ఏళ్లలోపు, 15 నుంచి 17 ఏళ్లలోపు బాలలు.. తప్పనిసరిగా నవీకరణ చేయనివారు ఈ శిబిరాల్ని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది. జిల్లాలో సుమారు 40 వేల మంది బాలలు తమ వివరాల్ని అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది.

● నవీకరణ కోసం ఆధార్ కార్డు తీసుకెళ్లాలి. కొత్త ఆధార్ నమోదుకు పుట్టిన తేదీ ధ్రువపత్రం, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు తీసుకెళ్లాలి. మార్పులు/చేర్పులకు పుట్టిన తేదీ ధ్రువపత్రం, చిరునామా నిర్ధారణ ధ్రువపత్రాలు, పదో తరగతి నిజ ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లాలి.

ఉచిత ప్రవేశ పరీక్షకు స్పందన

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి గానూ.. సూపర్-60 అభయ నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ కోసం.. ఆదివారం నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత ప్రవేశ పరీక్షకు మంచి స్పందన లభించిందని స్కూల్ అసిస్టెంట్స్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరోత్తమరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించగా అధిక సంఖ్యలో విద్యార్థులు రాశారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన వారు అనంతపురంలో నిర్వహించే రెండో స్థాయి పరీక్షకు హాజరు కావాలని చెప్పారు. ఫౌండేషన్ తరఫున షఫీర్, దుర్గాప్రసాద్, దామోదరరెడ్డి, రెడ్డయ్య, దేవరాజులురెడ్డి, లయన్స్ గోల్డ్ క్లబ్ ప్రతినిధులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి, భాస్కర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో క్షేత్రపాలకుడికి వేడుకగా అభిషేకం

రుద్రుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, న్యూస్‌టుడే: గోగర్భం సమీపంలోని రుద్రుని రూపమైన క్షేత్రపాలకుడికి ఆదివారం వేడుకగా అభిషేకం జరిగింది. తిరుమల క్షేత్రానికి పాలకునిగా ఉన్న రుద్రునికి మహాశివరాత్రి సందర్భంగా ఏటా అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుంచి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు క్షేత్రపాలకుడి శిలవద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు తదితర ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. తరువాత నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు. రింగురోడ్డుకు సమీపంలోని నాగతీర్థంలో శివరాత్రి వేడుక నిర్వహించారు.

గణనాథుడి గ్రామోత్సవం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి శివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి సిద్ధి బుద్ధి సమేతుడై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పూతలపట్టు మండల పేటఅగ్రహారానికి చెందిన సుబ్రహ్మణ్యంపిళ్లై వారి కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ సూరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ రవి, భక్తులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఏపీ ఆర్టీఐ కమిషనర్

పీఎస్ నాయుడుకు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో ధనపాల్

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఏపీ ఆర్టీఐ కమిషనర్ పీఎస్ నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ప్రొటోకాల్ ఏఈవో ధనపాల్, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. మూలమూర్తి దర్శన అనంతరం వారికి స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

శివశివ శంకర

వి.కోట, న్యూస్‌టుడే: వి.కోట సమీపంలోని కర్ణాటక రాష్ట్రం కోటిలింగాల క్షేత్రంలో శివరాత్రిని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. 108 అడుగుల భారీ శివలింగంతో పాటు, క్షేత్రంలో కొలువు తీరిన 36 అడుగుల నంది, విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని సందర్శించడానికి మూడురాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. - న్యూస్‌టుడే, వి.కోట

SWAYAMBHU SRI VARASIDDI VINAYAKA SWAMI DEVASTHANAM
KANIPAKAM (V)-IRALA(M)-CHITTOOR DISTRICT.
Rc.No. Q1/99/2022 E-procurement Short Tender Notice Dated: 14.02.2026
Tenders are invited for Developmental works in the premises of Devasthanam, Kanipakam. E-procurement registered contractors are requested to download the Tender Bid & BOQ from https://tender.apeprocurement.gov.in tenders site. For further details contact Ph: 08573-281747.
1) Bid Document Download Starting date:19.02.2026 1.00P.M., 2)Bid Document Download Ending Date :26.02.2026 1.00P.M., 3) Last Date & Time for Receipt of Bids: 26.02.2026 1.30P.M., 4) Technical Bid Opening Date : 26.02.2026 2.00P.M., 5) Price Bid Opening Date: 26.02.2026 4.00P.M.
Sd/- Executive Officer & Spl. Grade. Deputy Collector.

విజిలెన్స్ తనిఖీలతో రూ.75 లక్షలు ఆదాయం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో మార్కెటింగ్ శాఖకు సుమారు రూ.75 లక్షల ఆదాయం సమకూరిందని ఆ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. చెక్‌పోస్టుల్లో అక్రమాల అడ్డుకట్ట, పంట ఉత్పత్తుల నుంచి వంద శాతం సెస్ వసూళ్లకు నవంబరు నెల నుంచి మూడు జిల్లాల్లో ప్రత్యేక విజిలెన్స్ అధికార బృందాలను ఏర్పాటు చేశామన్నారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి.. అక్రమదారుల నుంచి సెస్ వసూళ్లు చేపడుతున్నారని చెప్పారు. తనిఖీల ద్వారా చిత్తూరు జిల్లాలో రూ.20 లక్షలు, తిరుపతి జిల్లాలో 30 లక్షలు, అన్నమయ్య జిల్లాలో రూ.25 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. మార్కెట్ కమిటీలు నిర్దేశిత ఆదాయ లక్ష్యాలను అధిగమించేందుకు దృష్టి సారించాలని కమిటీల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలిపారు.

పిందెలు రాకముందే నీటి తడులు ఇవ్వొద్దు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో మామిడి తోటల్లో పూత విస్తారంగా పూయగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడు పూత కన్పిస్తోందని జిల్లా ఉద్యాన శాఖ డీడీ రామాంజనేయులు తెలిపారు. మామిడి తోటల్లో పిందెలు రాకముందే ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి తడులు ఇవ్వరాదని చెప్పారు. పిందెలు గోలీ సైజు వచ్చిన తర్వాత నీటి తడులు ఇవ్వాలని స్పష్టం చేశారు. పిందె దశకు ముందు నీటి తడులిస్తే.. తేనెమంచు పురుగు ఉద్ధృతి పెరుగుతుందన్నారు. రైతులు ఇష్టానుసారంగా క్రిమిసంహారక మందుల పిచికారీతో ఫలితం లేదన్నారు. ఉద్యాన శాఖ అధికారుల సూచనలు, సిఫార్సు చేసిన క్రిమిసంహారక మందులనే పిచికారి చేయాలని రైతులకు ఆయన సూచించారు.

సహాయకులకు అధునాతన వసతి

ఈనాడు, తిరుపతి: తిరుపతి రుయా ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం రాయలసీమ జిల్లాల నుంచి రోగులు, రోగుల సహాయకులు వివిధ సమస్యలతో చికిత్స కోసం వస్తుంటారు. వారికోసం ప్రత్యేకంగా విశ్రాంతి గది లేకపోవడంతో ఎండ, వాన, చలికి అల్లాడిపోతున్నారు. ఇలాంటి వారి కోసం దాతల సాయంతో అత్యవసర విభాగం పక్కన సహాయకుల విశ్రాంతి గది ఏర్పాటు చేశారు. 32 పడకలు అందుబాటులో ఉంచారు. గది పక్కనే వేచిఉండు రేకులషెడ్డు నిర్మాణం పూర్తిచేశారు. అంత సవ్యంగా జరిగితే ఈ మాసంలోనే అందుబాటులోకి రానుంది.

10,300 మట్టి నమూనాల సేకరణ

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ చేపడుతున్న పొలాల్లో మట్టి నమూనాల సేకరణ కొనసాగుతోంది. ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 16,401 మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, ప్రకృతి వ్యవసాయ పథకం డీపీఎం శివశంకర్ తెలిపారు. ఇప్పటి వరకు 10,300 మట్టి నమూనాలను సేకరించి. . 75 శాతం పూర్తయిందన్నారు. మార్చి 20 లోపు పూర్తి చేస్తామన్నారు. మట్టి నమూనాలను కడపలోని భూసార పరీక్ష ఫలితాల ప్రయోగశాలకు పంపనున్నామని తెలిపారు.

వ్యవసాయంలో ఆకాశవాణి పాత్ర అమోఘం

తిరుపతి (గ్రామీణం): వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఆకాశవాణి పోషిస్తున్న పాత్ర అమోఘమని వ్యవసాయ వర్సిటీ అసోసియేట్ డైరెక్టరేట్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సుమతి పేర్కొన్నారు. ఆదివారం ఎయిర్ బైపాస్‌రోడ్డులోని ఆకాశవాణి కేంద్రంలో రేడియో కిసాన్ దివస్ నిర్వహించి మాట్లాడారు. రైతులు అత్యాధునిక పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రవికుమార్ మాట్లాడుతూ పశుపోషణతో గ్రామీణప్రాంతం ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారని వివరించారు. వ్యవసాయ శాఖ ఏడీ సౌభాగ్యలక్ష్మి, పట్టుపరిశ్రమశాఖ ఏడీ కిశోర్‌నాయక్ మాట్లాడారు. రైతుల సమస్యలను నివృతి చేశారు.

నేడు చిత్తూరులో మయాన సేవ

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలో సోమవారం మయాన సేవ ఉత్సవం జరగనుంది. పరమశివుణ్ని అవమానించిన దక్ష ప్రజాపతి సంహారం నిమిత్తం.. మహాశివరాత్రి మరుసటి రోజున చిత్తూరులో మయాన సేవ నిర్వహించడం సంప్రదాయం. ఉత్సవంలో భాగంగా ఆదివారం శక్తి గరిగెతో గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం స్థానిక గుర్రప్పనాయుడు వీధిలోని శ్రీఅంకాళ పరమేశ్వరి ఆలయంలో ఉదయం మహాభిషేకం, అమ్మవారికి పుష్పాలంకరణ చేయనున్నారు. అనంతరం అమ్మవారు పరమశివుని ఝటాఝూటంగా మహాకాళీ రూపంలో భూత వాహనంపై బయల్దేరి నీవానదికి చేరుకుని దక్ష సంహారం గావిస్తారు. అనంతరం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించనున్నారు. ఉత్సవం నేపథ్యంలో నీవానది వద్ద ఏర్పాట్లు చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఆలయం ఎదుట ప్రభుత్వ విప్ గణబాబు కుటుంబం

ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, మాజీ స్పీకర్ ప్రతిభ భారతి తదితరులు

తిరుమల: శ్రీవారిని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి మూలమూర్తిని ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, గాయని డాక్టర్ పద్మశ్రీ శోభారాజు దర్శించుకున్నారు. ప్రముఖులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

స్థిరాస్తులు కొంటున్నారా.. జాగ్రత్తలు తప్పనిసరి

మెళకువ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇంటి స్థలం, భూముల క్రయవిక్రయాలు చేయాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి. హక్కుదారులు ఎవరు? నిబంధనల ప్రకారం వివరాలు ఉన్నాయా.. లేదా అనే విషయాలు తప్పనిసరిగా తెలుసుకోవాలి. లేదంటే తర్వాత లేనిపోని చిక్కులు తప్పవు.

● గ్రామ పంచాయతీలు, పురపాలికల్లో లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసేటప్పుడు ఆయా స్థలాలను వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర(కన్వర్షన్)గా మార్చారా? లేదా అనేది తెలుసుకోవాలి. వెంచర్‌కు అన్ని అనుమతులు ఉన్నాయో లేదో చూడాలి.

● భూమి కొనుగోలు సమయంలో మీ భూమి వెబ్‌సైట్ ద్వారా భూయాజమాన్య హక్కు పత్రం అడంగల్, 1బీ తనిఖీ చేసి అమ్మకందారు పేరిట ఆస్తి ఉందా? లేదా? అని సరిచూసుకోవాలి.

● హక్కుదారులు భూములు తనఖా పెట్టారా, ఏమైనా బకాయిలు ఉన్నాయా అనే విషయం నిర్ధారించుకోవాలి.

● దస్తావేజు ప్రతులు, ఈసీ ద్వారా ఆస్తిపై హక్కు ఎవరిది? వారికి ఎలా సంక్రమించిందన్న విషయాలు తెలుసుకునే వీలుంది.

● పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా ఆస్తి పొందిన వ్యక్తి అమ్మకం చేస్తున్నప్పుడు హక్కులు ఉన్నాయా లేవా అనేది చూడాలి.

● వివాదాలు, ఇతరులకు హక్కులు లేవన్న విషయం క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకున్నాకే సమయానికి ఆస్తికి సంబంధించి ఆస్తి, నీటి పన్నులు, విద్యుత్తు బిల్లుల బకాయిలు లేకుండా చూసుకోవాలి.

ద్విచక్రవానాలు ఢీకొని ఇద్దరి దుర్మరణం

భూపాల్‌రెడ్డి (పాతచిత్రం)

చంద్రగిరి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్ని ఇద్దరు ద్విచక్ర వాహనదారులు మృతిచెందారు. ఈ ఘటన జాతీయ రహదారిలో ఐతేపల్లి సమీపంలోని సర్వీసురోడ్డులో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పనపాకం పంచాయతీ బోడిగుట్టవారిపల్లికి చెందిన **భూపాల్‌రెడ్డి** (35) కాశిపెంట్లలోని హెరిటేజ్ కర్మాగారంలో విధులు ముగించుకుని వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో చంద్రగిరికి వెళ్తున్నారు. యల్లంపల్లికి చెందిన మల్లికార్జున (24) ఓ మహిళ, మూడేళ్ల బాబుతో చిత్తూరు వెపు వెళ్తున్నారు. ఈక్రమంలో ఐతేపల్లి సమీపంలో సర్వీసు రోడ్డుపైన వీరి ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో మల్లికార్జున ఘటనాస్థలంలోనే మరణించారు. తీవ్రంగా గాయపడ్డ భూపాల్‌రెడ్డిని స్థానికులు చంద్రగిరి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వారి మృతదేహాలను ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. సర్వీసు రోడ్డులో అతివేగంగా వాహనాలు నడపటంతోనే ప్రమాద తీవ్రత పెరిగిందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ప్రమాదంలో మహిళ, మూడేళ్ల బాబుకు స్వల్పగాయాలు కావడంతో రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెప్ప మునిగి బీటెక్ విద్యార్థి మృతి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: మిత్రులతో కలిసి సరదాగా చెరువులో తెప్పపై షికారు చేస్తుండగా శశి(30) అనే యువకుడు మృతి చెందాడు. ఘటన ఆదివారం పునబాక చెరువులో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి పట్టణం కైలాసగిరికాలనీకి చెందిన బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శశి శివాలయం దగ్గర ఉత్సవాల అనంతరం సమీపంలోని చెరువులో చేపలకు మేత వేయడానికి ఉంచిన చిన్నపాటి తెప్పపై ఆరుగురు మిత్రులతో కలిసి వెళ్లాడు. తెప్ప మునిగిపోవడంతో మిగిలిన ఆరుగురు మిత్రులు ఈత రావడంతో సురక్షితంగా ఒడ్డుకు చేరారు. శశికి గల్లంతవగా స్థానికులు గుర్తించి గట్టుకు చేర్చేసరికి అప్పటికే మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు శివరాత్రి రోజు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

EENADU e Classifieds

EDUCATION
DISTANCE EDUCATION
B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

FINANCIAL SERVICES
స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోద్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
నేషనల్ హైవేలకు ఆనుకొని తిరుపతిలో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ అన్ని సదుపాయాలతో తక్కువ ధరకే, డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్ ఫోన్ : 9966262221/ 9502774175.
1.తిరుపతి - సి.రామాపురం జైన్ మందిరం వద్ద 2.రేణిగుంట యోగానంద కాలేజీకి ప్రక్కన 3.చంద్రగిరిటౌన్‌లో ఉగ్రప్రత్యుంగరా అమ్మవారి గుడి దగ్గర 100 feet రోడ్డు ఆనుకొని ఉన్న వెంచర్స్‌లో తుడా అప్రూవల్స్‌తో హౌస్/ విల్లా కట్టుకునే ప్లాట్లు అమ్మబడును. 9505502346.

JOBS
WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.
Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.
Wanted Supervisors for Civil and Electrical Works. Contact: 90005 55035.
తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్ పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్ వివాహితులు కావలెను. Age: 30 to 65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 76750 95860.
గూడ్స్ ఆటో డ్రైవర్ -1 (టౌన్‌లో డెలివరి చేయుటకు) కావలెను. అనుభవం, లైసెన్స్, బ్యాడ్జ్ కలిగి ఉండవలెను. సంప్రదించ గలరు. ✆ 97034 02722

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆96404 00073, 98485 71888.
త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499
అయోధ్య సొసైటీ, తిరుపతికి రికవరీ ఆఫీసర్స్ - 4 కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. Cont: 78427 30185, 70136 98363.
ప్రముఖ విద్యా సంస్థకు లేడీ టెలీకాలర్స్, కౌన్సిలర్స్ & ఫీల్డ్ అనుభవం కల్గిన PROలు కావలెను. ఆకర్షణీయమైన జీతం కల్పించబడును. ✆ 90320 30124.

SECURITY GUARDS
సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మదనపల్లిలో పని చేయుటకు. 10 Hr డ్యూటీ జీతం: 11,000/-. ✆ 72880 04466.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

చిత్తూరు
●చిత్తూరు ● పూతలపట్టు ●గంగాధరనెల్లూరు ●నగరి

తెదేపా కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మండలంలోని నల్లగాంపల్లెకు చెందిన తెదేపా కార్యకర్త దినకర్ కుటుంబానికి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్, తెదేపా మండల అధ్యక్షుడు ధరణీప్రసాద్‌నాయుడు, గౌరవాధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు ఆదివారం రూ.4 లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఏడాది కిందట రోడ్డు ప్రమాదంలో దినకర్ మృతి చెందారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

విజయపురం: కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ చినబాబు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని శ్రీహరిపురం నుంచి లక్ష్మీవిలాసపురానికి రూ.80 లక్షలు, శ్రీహరిపురం నుంచి ఎస్సీకాలనీకి రూ.70 లక్షలు బీటీ రోడ్లకు ఆయన భూమి పూజ చేశారు. రమేష్‌రాజు, బాబుయాదవ్, బాలసుబ్రహ్మణ్యరాజు, చుక్కా ధనుంజయయాదవ్, దశరథరాజు, సురేష్‌రాజు, చిన్నబ్బరాజు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: గ్రామీణ యువత జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పొన్నాయుగంధర్ అన్నారు. మండలంలోని సీడీకండ్రిగలో పవన్‌కల్యాణ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రతాప్, అన్నామలై తదితరులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న పొన్నాయుగంధర్, క్రీడాకారులు

కవి హరికృష్ణారెడ్డికి సన్మానం

హరికృష్ణారెడ్డిని సన్మానిస్తున్న తిరుపతి ఆకాశవాణి అధికారులు

పెనుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని దాసరపల్లెకు చెందిన కవి, ప్రకృతి వ్యవసాయ రైతు పి.హరికృష్ణారెడ్డిని తిరుపతి ఆకాశవాణి కేంద్రం అధికారులు ఘనంగా సన్మానించారు. జాతీయ ఆకాశవాణి దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆకాశవాణి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయనను సత్కరించారు. నాలుగు దశాబ్దాలుగా వ్యవసాయ రంగానికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి పురస్కారం దక్కింది. ఆకాశవాణి కూడా పలు రచనలు, ప్రసంగాలు, నాటికలు, కవితలు, గేయాలు రచించి ఆకాశవాణికి అందించారని పలువురు కొనియాడారు. ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ సుధాకర్ మోహన్, వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు రవికుమార్, సుమతి, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'నాగేంద్రన్‌ను భాజపా నుంచి సస్పెండ్ చేయాలి'

చిత్తూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: తమిళనాడు భాజపా నేత నైనార్ నాగేంద్రన్‌ను భాజపా నాయకత్వం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సీపీఐ జాతీయ కంట్రోల్ ఛైర్మన్ డా.కె.నారాయణ డిమాండ్ చేశారు. చిత్తూరు నుంచి తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం వెళ్తూ ఆయన ఆదివారం ఉదయం చిత్తూరులో విలేకర్లతో మాట్లాడారు. టీవీకే అధినేత విజయ్‌పై వ్యాఖ్యలు తగవని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కుల సాధన

మాట్లాడుతున్న నాయకుడు బైరి నరేష్, ఎస్సీ నాయకులు

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: ఐక్యతతో ఉద్యమించి హక్కులు సాధిద్దామని మూఢనమ్మకాల నిర్మూలనాసంఘం, దళిత ఉద్యమ నాయకుడు బైరి నరేష్ అన్నారు. ఆదివారం 49కొత్తపల్లిమిట్ట లోని దీపికా కల్యాణ మండపంలో రాష్ట్ర దళిత మహాసభ వారి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి నాయకుడు మునిక్రిష్ణ అధ్యక్షతన దళిత మహాసభను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం అదిలాబాద్ డిప్యూటీ కలెక్టరు ప్రకాష్‌రావు, హైకోర్టు న్యాయవాది నవయాన్, తమిళనాడు పెరియార్ సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు రాజేంద్రన్, ముత్యాలు, రామాంజనేయులు పాల్గొన్నారు.

● పురపాలక సంఘం ఏర్పాటు: 1917 ● మొత్తం డివిజన్లు: 50 ● నగర విస్తీర్ణం: 95.97 చదరపు కిలోమీటర్లు
● జనాభా : 2.22 లక్షలు(అంచనా) ● కుటుంబాలు: 55 వేలు ● వీధులు: 400 పైనే

ఇరుకు వీధులు.. జీవనానికి అవస్థలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ఎప్పుడో తాతల కాలం నాటి ఇరుకు వీధులు. ద్విచక్రవాహనాలు తప్పితే.. నాలుగు చక్రాల వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ప్రణాళిక లేకుండా నగరంలో ఇష్టారాజ్యంగా భవనాలు నిర్మించడం దీనికి ప్రధాన కారణం. పట్టణ ప్రణాళిక ప్రకారం అంతర్గత వీధుల్లో కనీసం 20 అడుగుల రోడ్లు ఉండాలి. అయితే నగరంలో 5-10 అడుగుల వెడల్పుతో ఉన్న వీధులు కోకొల్లలు. ఈ రోడ్లలో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సైతం వెళ్లలేని దుస్థితి.

అనుమతుల్లేకుండా నిర్మాణాలు

వందేళ్ల చరిత్ర కలిగిన నగరంలో దాదాపు 40 వేలకు పైగా భవనాలు, ఇళ్లు ఉండగా.. వీటిలో 70 శాతం వరకు భవనాలకు ప్రణాళిక అనుమతి(ప్లాన్ అప్రూవల్) లేదు. మూడు, నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన ఇళ్లకు నగరపాలక సంస్థ నుంచి ప్రణాళిక అనుమతి తీసుకున్న దాఖలాల్లేవు. ఇదే నగరానికి శాపంగా పరిణమించింది. నగరంలోని దాదాపు సగభాగం వీధుల్లో కేవలం పది నుంచి 15 అడుగుల రహదారే ఉంటోంది.

శివాలయం వీధిలో ఐదు అడుగుల రహదారి

అక్కడే వాహనాల నిలిపివేత

నగరంలో దాదాపు 10 వేలకు పైగా వాహనాలున్నాయి. సింహభాగం వాహనాల పార్కింగ్ వీధుల్లోనే ఉంటోంది. మొత్తం నోటిఫైడ్ మురికివాడలు 73, నాన్ నోటిఫైడ్ 5 వరకు ఉండగా.. ఈ ప్రాంతాలు అత్యంత ఇరుకుగా ఉన్నాయి. నగరంలోని బజారువీధిని ఆనుకుని ఉన్న చావడి, ఆషార, గుర్రప్ప, వన్నియర్‌బ్లాక్, పాత పూలమార్కెట్, పాత బందేఖానా, బ్రాహ్మణవీధి తదితర వీధుల్లో 90శాతం వరకు ద్విచక్రవాహనాలు వెళ్లలేవు. ఆస్పత్రులు, మెడికల్ దుకాణాలు ఎక్కువగా ఉన్న సుందరయ్యర్‌వీధి ఇరుకుగా ఉండటంతో ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రవేశించాయంటే ట్రాఫిక్ మొత్తం ఆగిపోవాల్సిందే.

కలగానే విస్తరణ

కొండమిట్టలోని చామంతిపురం, వినాయకపురం, అశోకపురం వీధుల్లో అత్యంత ఇరుకుగా ఉంటోంది. కొండ ప్రాంతం కావడంతో దశాబ్దాల కిందట ఇళ్లను నిర్మించుకోవడంతో..అయిదు అడుగుల రోడ్లే స్థానికులకు దిక్కయ్యాయి. ఎత్తైన ప్రాంతాలైన ఇక్కడ వీధుల్లోనే ఇళ్లకు మెట్లు నిర్మించుకోవడంతో.. రోడ్లు మరింతగా కుంచించుకుపోయాయి. నీటి ట్యాంకర్లు వెళ్లలేని పరిస్థితి. ఇళ్లకు బంధువులు వస్తే ఆటోల్లో సైతం ఇళ్లకు వద్దకు చేరుకోలేరు. వీధుల విస్తరణ కలగానే మిగిలిపోతోంది.

మాజీ మంత్రి సేవలు చిరస్మరణీయం

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: మాజీ మంత్రిగా, మాజీ ఉప సభాపతిగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గుమ్మడి కుతూహలమ్మ ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు, వేపంజేరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ డీసీఎంఎస్ అధ్యక్షుడు బాబురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుతూహలమ్మ వర్ధంతి సందర్భంగా స్వగ్రామమైన ఎన్.లక్ష్మీరెడ్డిపల్లెలో ఆమె సమాధికి ఆమె కుమారుడు ఆనగంటి హరికృష్ణ, అఖిలపక్ష నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ● **వెదురుకుప్పం:** పచ్చికాపల్లం దాసరికాలనీలో దివంగత మాజీ ఉప సభాపతి గుమ్మడి కుతూహలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె అభిమానులు నివాళులర్పించారు. ఆదివారం స్థానిక దాసరికాలనీలో అభిమానులు ఏర్పాటు చేసిన కుతూహలమ్మ చిత్రపటం వద్ద ఆమె తనయుడు హరికృష్ణ కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు.

కుతూహలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుమారుడు హరికృష్ణ, నాయకులు

మురుగు కాలువలు శుభ్రం

గుడిపాల: 189.కొత్తపల్లె ఎస్సీకాలనీలో మురుగు కాలువలు శుభ్రమయ్యాయి. 'ఈనాడు' ఇటీవల వచ్చిన వార్తకు ఈవోపీఆర్డీ కృష్ణప్రసాద్ స్పందించారు. సర్పంచి సంపత్ సహకారంతో కాలువల్లోని వ్యర్థాలను సిబ్బందితో తొలగించారు.

స్పందనకు వందనం

ఇళ్లకు కుళాయిల ఏర్పాటు

గంగాధరనెల్లూరు: ముక్కళత్తూరు పంచాయతీ నాశంపల్లె ప్రభుత్వ కాలనీలో స్థానిక రక్షిత మంచినీటి ట్యాంకు నుంచి కొన్ని ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంపై పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ స్పందించారు. సంబంధిత గుత్తేదారునితో కాలనీలోని ప్రతి ఇంటికి కుళాయి వేయించారు.

బాధ్యతల స్వీకరణ

పలమనేరు : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా బాధ్యతలు స్వీకరించిన శిరీష.. ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆదివారం కలిశారు. ఏపీ టిడ్కో నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె ఆదివారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పుత్తూరు మార్కెట్ యార్డులో టమాట విక్రయం

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు మార్కెట్ యార్డులో టమాటాలు విక్రయిస్తున్నట్లు మార్కెట్ కమిటీ ఛైర్మన్ డీఎస్ గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరలు పతనం అవుతున్న తరుణంలో రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ యార్డుల్లో విక్రయాలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రూ.100కు 10 కిలోల టమాటాలు విక్రయిస్తున్నట్లు చెప్పారు.

ఏఎంసీ మాజీ ఛైర్మన్ మృతికి నివాళి

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: పెనుమూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్, పాపిరెడ్డిపల్లె పంచాయతీ మాజీ సర్పంచి, వైకాపా సీనియర్ నేత చిన్నమరెడ్డి(68) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆదివారం మాజీ మంత్రి నారాయణస్వామి, నియోజకవర్గ వైకాపా బాధ్యురాలు కృపాలక్ష్మి, సత్యవేడు బాధ్యులు రాజేష్, చిత్తూరు బాధ్యులు విజయానందరెడ్డి, మాజీ సీఎం జగన్ వోఎస్‌డీ హరికృష్ణ, కుతూహలమ్మ తనయుడు హరికృష్ణ, అఖిలపక్షనేతలు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

సీఆర్‌కండ్రిగలో పశువుల పండుగ

వెదురుకుప్పం: మండల పరిధి సీఆర్‌కండ్రిగ ఎస్సీ కాలనీలో ఆదివారం పశువుల పండుగను స్థానికులు కోలాహలంగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినం కావడంతో పండుగలో పాల్గొనడానికి ఔత్సాహికులు పెద్ద ఎత్తున పోటెత్తారు. బరిలో దిగే పశువులకు వాటి యజమానులు చేసిన ఏర్పాట్లు చూపరులను అబ్బురపరచాయి. పశువులను విడతల వారీగా జనంలోకి వదలిపెట్టారు. వేగంగా పరుగులు తీస్తున్న పశువులను నిలువరించడానికి యువత చేసిన సాహసాలు అలరించాయి. స్థానిక యువత పోలీసుల సహకారంతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జనంలోకి దూసుకెళుతున్న ఎద్దు

కాలనీకి వెళ్లాలంటే.. నరకయాతనే

నారగళ్లు జగనన్న కాలనీకి వెళ్లాలంటే గులకరాళ్లల్లో వెళ్లాలిందే. వైకాపా ప్రభుత్వ హయాంలో నారగళ్లు ఎస్సీ కాలనీలో ఇంటి స్థలాలు, ఇళ్లులేని పేదలకు నారగళ్లు నుంచి తమిళనాడు తిరుత్తణికి వెళ్లే మార్గంలో ఓ గుట్టపై 22 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి, పక్కా ఇళ్లను మంజూరు చేశారు. సుమారు పదిహేను మంది లబ్ధిదారులు ఇళ్లను పూర్తి చేసి అందులో నివాసమున్నారు. సమీప తారురోడ్డు నుంచి కాలనీకి వెళ్లే దారిలో గులకరాళ్లు తేలి కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **-న్యూస్‌టుడే, గుడిపాల**

తాగునీటికి కటకట

పుత్తూరు మండలం కేబీఆర్‌పురంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని రామాలయం వెనుక వైపు ఉన్న బోరు మోటారు నెల రోజుల క్రితం కాలిపోయింది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. ఉన్న మరో బోరులో సక్రమంగా నీరు రావడం లేదు. దీంతో నిత్యం అవస్థలే. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి కూడా లేరని, ఇన్‌ఛార్జిని నియమిస్తే అతనూ సక్రమంగా రావడం లేదని చెబుతున్నారు. **-న్యూస్‌టుడే, పుత్తూరు**

రహదారి.. గుంతలమయం

రంగాపురం-బాలకృష్ణాపురం తారురోడ్డు దుస్థితికి చేరింది. రంగాపురం క్రాస్ నుంచి బాలకృష్ణాపురం గ్రామం వరకు వెళ్లే తారురోడ్డు ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడింది. ప్రజలు, వాహనదారులు ప్రయాణించాలన్నా, నడవాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడో ఈ పంచాయతీలో వేసిన తారురోడ్డు ప్రస్తుతం రాళ్లు తేలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పాలసముద్రం**

వాహనాలు అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

పీలేరు గ్రామీణ : రెండు వేర్వేరు ప్రమాదాల్లో రెండు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ముగ్గురు గాయపడిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కలకడ మండలం పాపిరెడ్డిగారి పల్లెకు చెందిన భరత్‌కుమార్ ద్విచక్ర వాహనంలో పీలేరు నుంచి బయల్దేరారు. పొంతలచెరువు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి గాయపడ్డాడు. పూతలపట్టుకు చెందిన దుర్గాప్రసాద్, మాధవ ద్విచక్ర వాహనంలో కలకడ నుంచి పీలేరు వైపు వస్తుండగా రాణా వడ్డిపల్లె వద్ద అదుపు తప్పడంతో వీరు గాయపడ్డారు. వీరికి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అవయవదానంపై అవగాహన అవసరం

పలమనేరు, న్యూస్‌టుడే: అవయవదానం అనేది మహత్కార్యమని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీవన్‌దాన్‌కు సంబంధించిన గోడప్రతులను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అవయవదానంపై అందరికి అవగాహన ఎంతో అవసరమన్నారు. రాష్ట్రంలో 4,796 మంది అవయవదానం కోసం వేచి ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ సభ్యుడు జనార్దన్, కన్వీనర్ మనోహర్, సభ్యులు వాసుదేవన్, చరణ్, హేమ పాల్గొన్నారు.

చిత్తూరులో.. ఉమామహేశ్వరస్వామి ✦ కార్వేటినగరంలో.. సదాశివేశ్వరస్వామి ✦ బంగారుపాళ్యంలో మొగిలీశ్వరస్వామి ..✦ పుత్తూరులో నంది వాహనంపై సదాశివేశ్వరుడు..

ఐరాల: మంతంపల్లె శ్రీచంద్రమౌళీశ్వరస్వామికి పట్టువస్త్రాలు తెస్తున్న ఎంపీ ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

పెనుమూరు: కలవకుంట ముక్కంటీశ్వరమి

నగిరి: చంద్రమౌళీశ్వరస్వామి..

సర్వం.. శివోహం

న్యూస్‌టుడే బృందం: మహా శివరాత్రి సందర్భంగా చిత్తూరు, నగరి, పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఆదివారం శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో లింగోద్భవ పూజలు, త్రిశూల స్నానం, అభిషేకాల్ని, ఇతర క్రతువుల్ని శాస్త్రోక్తంగా జరిపారు. తమిళనాడు, కర్ణాటక, చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి బంగారుపాళ్యంలోని శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు నిత్యాన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాల వద్ద కోలాటలు, పండరి భజనలు, చెక్క భజనలు, ఆటపాటలు అలరించాయి. శివపార్వతుల కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కన్నుబొమ్మల కదిలికలే సమాధానం

నేత్రావధానంలో రాణిస్తున్న నేస్తాలు

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గణితం క్లాస్ అంటే కొంత మంది పిల్లలు చాలా ఇబ్బందిగా ఫీల్ అవుతుంటారు. కానీ మరీ అంత కష్టమేం కాదని చెబుతున్నారు ఈ విద్యార్థులు. కాస్త కష్టపడితే అందరికీ ఇష్టంగా మారుతుందనే దానికి నిదర్శం ఆ నేస్తాలు. వారి కన్ను బొమ్మల కదిలికల గారడీలతో లెక్కల చిక్కుల్ని విప్పుతూ.. నేత్రావధానంలో పట్టుసాధిస్తూ.. అందరినీ అబ్బురపరుస్తున్నారు చిత్తూరు మండలం తుమ్మింద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జ్ఞానప్రియ, చాముండీ, శ్వరణ్‌లు.

నేత్రావధానం చేస్తున్న విద్యార్థులు

ప్రతిభను గుర్తించి.. తర్ఫీదు

ఎనిమిదో తరగతి విద్యనభ్యసిస్తున్నా. అమ్మ విజయలక్ష్మి మధ్యాహ్న భోజన కార్మికురాలు. నాన్న మణికంఠ ఆటోడ్రైవరు. నేను కనుబొమ్మలను విడివిడిగా కదల్చడాన్ని గుర్తించిన గణిత ఉపాధ్యాయులు అరుణశివప్రసాద్.. నీ ప్రతిభను గణితానికి అన్వయిస్తే బాగుటుందని తర్ఫీదు ఇచ్చారు. కన్నుబొమ్మల కదిలికలకు ఆంగ్ల అక్షరాలు, అంకెలకు ప్రత్యేక కోడ్ చెప్పి, వారంపాటు శిక్షణ ఇచ్చారు. పదాలు, వాక్యాలు, అర్థరహిత వాక్యాల్ని చెప్పడం నేర్చుకున్నా. గతేడాది తుమ్మింద పాఠశాలలో గణితావధానం, గణిత నేత్రావధానంలో ప్రతిభ చూపా. **- జ్ఞానప్రియ**

మూడు నెలలుగా శిక్షణ

ఏడో తరగతి విద్యనభ్యశిస్తున్నా. మాది సాధారణ మధ్యతరగతి కుటుంబం. అమ్మ నదియా, నాన్న చిట్టిబాబు. నాన్న మేస్త్రీ, అమ్మ గృహిణి. లెక్కల మాస్టర్ అరుణశివప్రసాద్ లెక్కలపై అవగాహన కల్పించారు. ఆయన చొరవతో మూడు నెలలుగా శిక్షణ తీసుకొని, గణిత అవధానంపై పట్టు సాధించా. జ్ఞానప్రియతో కలిసి కన్ను బొమ్మల కదలికలకు అనుగుణంగా ఆల్ఫాబెట్స్ ఆంగ్ల అక్షరాలు, అంకెలు(సున్న-9)లకు ఒక ప్రత్యేక కోడింగ్‌తో వారంపాటు శిక్షణ ఇచ్చారు. ఇటీవల తుమ్మింద, కదిరిలో జరిగిన గణితావధానం, గణిత నేత్రావధానంలో రాణించాం. **-చాముండి**

ప్రశంసలు, బహుమతులు



ఎనిమిదో తరగతి చదువుతున్నా. అమ్మ కల్పన, నాన్న విజయ్‌కుమార్. అమ్మ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలు. నాన్న చిరు వ్యాపారి. గణిత ఉపాధ్యాయుడి ధైర్యంతో ఐదు నెలలుగా గణిత, నేత్రావధానంపై ప్రత్యేక తర్ఫీదు తీసుకున్నా. గతేడాది డిసెంబరు నెలలో తుమ్మింద ఉన్నత పాఠశాలలో జరిగిన గణిత అవధానంలో ప్రతిభ చూపా. ఇటీవల కదిరి ఉన్నత పాఠశాలలో జరిగిన గణిత నేత్రావధానంలో ప్రశంసాపత్రం, జ్ఞాపికను సొంతం చేసుకున్నా. **- శ్వరణ్, ఎనిమిదో తరగతి, తుమ్మింద**

అడవి పందుల దాడిలో వ్యక్తికి ..

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: అడవి పందుల దాడిలో వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని మొగిలివారిపల్లెలో ఆదివారం చోటు చేసుకుంది. రైతు ఏకోధరనాయుడు మామిడి తోటకు వెళ్లగా అక్కడ మకాం వేసిన మూడు అడవి పందులు దాడి చేశాయని రైతు తెలిపారు. గాయపడిన అతను ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. అడవి పందులు దాడి చేసిన సమాచారాన్ని అటవీశాఖ సిబ్బందికి తెలిపామన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మృతి

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: మండల పరిధి బందార్లపల్లె సమీపంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి అంకిరెడ్డి(67) మృతిచెందాడు. బోడిరెడ్డికండిగకు చెందిన అంకిరెడ్డి చిత్తూరు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న పెనుమూరు మండలం పీఆర్‌కండిగ ధనకొండారెడ్డి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో అంకిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలకు గురైన ధనకొండారెడ్డిని చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. జీడీనెల్లూరు సీఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం

వైభవంగా ధ్వజారోహణం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తీర్థం-కోటీపల్లె గ్రామాల మధ్య వెలసిన శ్రీ కబేలేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. అర్చకులు స్వామివారికి పంచామృత అభిషేకం, పుష్పాలంకరణతో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. దేవదాస్, కోటీపల్లె గ్రామస్థులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. కళ్యాణోత్సవ ఉభయదారులుగా బెంగళూరు వెంకట్రాయశెట్టి కుటుంబీకులు వ్యవహరించారు.

అవయవదానంపై అవగాహన అవసరం

గోడపత్రులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, న్యూస్‌టుడే: అవయవదానం అనేది మహోన్నతమని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జీవన్‌దాన్‌కు సంబంధించిన గోడపత్రులను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అవయవదానంపై అందరికి అవగాహన ఎంతో అవసరమన్నారు. రాష్ట్రంలో 4,796 మంది అవయవదానం కోసం వేచి ఉన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ అసోసియేషన్ సభ్యుడు జనార్దన్, కన్వీనర్ మనోహర్, సభ్యులు వాసుదేవన్, చరణ్, హేమ పాల్గొన్నారు.

▸ పెద్దపంజాణి: రాయలపేట సమీపంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో.. ▸ శాంతిపురంలో.. శివరాత్రి పూజలందుకున్న శివయ్య ▸ పలమనేరు: దేవరకొండలో స్వామివారికి పూజలు ▸ కుప్పం సోమేశ్వరస్వామి ఆలయంలో.. ▸ వి.కోట: ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

దేవరకొండ ఆలయంలో..

పలమనేరు: పట్టణానికి 10 కి.మీ దూరంలోని దేవరకొండ ఆలయంలో స్వామివారికి మహాశివరాత్రి సందర్భంగా విశిష్ట పూజలు చేపట్టారు. 200 అడుగుల ఎత్తులో కొండలోని గుహలో ఉన్న శివపార్వతి, వినాయక విగ్రహాలను దర్శించుకుని పూజలు చేశారు.

మొగిలి దేవరకొండ

మహాశివరాత్రిని పురస్కరించుకుని వివిధ శైవ క్షేత్రాల్లో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. పలమనేరు మండలం దేవరకొండపేటలోని వందనమల్లేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించుకునే వారి కోసం ఆలయ నిర్వాహకులు ఉచిత ఆటోలు ఏర్పాటు చేశారు. కుప్పం పట్టణం పాతపేటలోని సోమేశ్వరాలయంలో స్వామివారు రుద్రాభిషేకం, ప్రత్యేకాలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. గుడుపల్లె మండలం మల్లేశ్వర స్వామివారి ఆలయానికి కుప్పంతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల భక్తులు తరలివచ్చారు. - న్యూస్‌టుడే బృందం

గుడుపల్లె: మల్లప్పస్వామి ఆలయంలో పల్లకీని మోస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నాయకులు

పాఠశాల ఆవరణలో వాణిజ్య సముదాయమా..?

వి.కోట, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర సరిహద్దు మండలంలోని వి.కోట బాలుర ఉన్నత పాఠశాలకు దశాబ్దాల చరిత్ర ఉంది. వేల మంది విద్యార్థులు ఇక్కడ విద్యాబుద్ధులు నేర్చుకొన్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండటం ఇప్పుడు ఈ పాఠశాలకు శాపంగా మారింది. ఇక్కడ వాణిజ్య సముదాయాన్ని నిర్మించడానికి జడ్పీ నిధులు కూడా మంజూరయ్యాయి. దీంతో పాఠశాల ఆవరణలో పాఠశాల బదులు వ్యాపార సముదాయం ఏంటని పలువురు స్వచ్ఛంద సంస్థలు నిర్మాణ పనులు అడ్డుకొని ప్రశ్నిస్తున్నారు.

వి.కోటలోని బాలుర ఉన్నత పాఠశాల

రూ.25లక్షల మంజూరు.. వి.కోట లాంగ్ బజారులో ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న బాలుర ఉన్నత పాఠశాల ఉంది. ఇక్కడ వాణిజ్య సముదాయం నిర్మాణానికి రూ.25 లక్షల జడ్పీ నిధులు విడుదల చేస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు విడుదల చేశారు. ఇక్కడ ఆరు గదులు నిర్మించి వాటిని అద్దెకు ఇవ్వాలని ఈ ఉత్తర్వుల సారాంశం.

రూ.15లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణం.. గతంలో ఈ పాఠశాల స్థలం ఆక్రమణలకు గురి కాకుండా స్థానికులు, ఉపాధ్యాయులు ప్రహరీ నిర్మించారు. రహదారి పక్కన దాదాపు 12 అడుగుల ఎత్తైన ప్రహరీ, ప్రవేశ ద్వారం, గేటు ఏర్పాటు చేశారు. ఇందుకోసం స్థానికులు, ఉపాధ్యాయులు చందాల రూపంలో దాదాపు రూ.15లక్షలు సేకరించి నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు అధికారులు ఈ భారీ గోడలను కూల్చి ఈ ప్రాంతంలోనే వాణిజ్య సముదాయాన్ని నిర్మించాలని కొలతలు వేశారు.

ఆగిపోయిన అంబేడ్కర్ భవన్.. గతంలో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో దాదాపు రూ.1.11కోట్ల వ్యయంతో అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. అయితే హైకోర్టు పాఠశాల ఆవరణలో ఇతర నిర్మాణాలు చేపట్టొద్దని ఉత్తర్వులు మంజూరు చేసింది. దీంతో పునాది దశలో ఉన్న అంబేడ్కర్ భవనం అర్ధాంతరంగా ఆగిపోయి ప్రభుత్వ నిధులు నిరుపయోగంగా మారాయి. మళ్లీ ఇప్పుడు బాలుర ఉన్నత పాఠశాల స్థలంలో వాణిజ్య సముదాయం అని తెరపైకి తీసుకురావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడ్డుకొన్న స్థానికులు.. శనివారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వాణిజ్య సముదాయం కోసం కొలతలు తీయడానికి వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకొన్నారు. ప్రభుత్వ పాఠశాల స్థలంలో వ్యాపార సముదాయం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. దీంతో అధికారులు సమాధానం చెప్పకుండానే వెనుదిరిగారు.

రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం

శాంతిపురం మండల పరిధి ఏడోమైలు-కేజీఎఫ్ అంతర్రాష్ట్ర రహదారిలో ఎండిన చెట్టు రూపంలో ప్రమాదం పొంచి ఉంది. రెడ్డివారిపల్లెకు సమీపంలో పూర్తిగా ఎండిపోయిన చెట్టు రోడ్డుపై వాలిపోయి ఏక్షణంలో అయినా కూలేందుకు సిద్ధంగా ఉండటంపై వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, శాంతిపురం

ప్రజలకు పొగబెడుతున్నారు..!

కుప్పం మోడల్ కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డులో మంటలు కొనసాగుతున్నాయి. మంటలను ఆర్పేందుకు ఎంత యత్నించినా ఫలితం లేకపోతోంది. పొగ అలుముకోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మోడల్ కాలనీ, పలవాయిగానిమిట్ట ప్రాంతాలకు పొగ వెళ్లడంతో ప్రజలు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఆదివారం మంటలను కొంతమేర అదుపుచేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

ఇలా ఉంటే సంపూర్ణ అనారోగ్యమే

కుప్పం ప్రాంతంలోని ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే కుప్పం పురపాలిక పరిధి అర్బన్ కాలనీలో కాలువలు లేకపోవడంతో ఏళ్లుగా ఇళ్ల మధ్య, రోడ్లపై మురుగు నిల్వ ఉంటోంది. ఈ విషయమై కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

కర్రే ఆధారం.. పడితే అపాయం

పురపాలిక పరిధిలోని మోడల్ కాలనీలో విద్యుత్తు స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో ఇళ్ల మీదుగా వెళ్లిన తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీంతో నామమాత్రంగా విద్యుత్తు తీగలు కిందకు జారకుండా కర్రసాయంతో స్థానికులు పైకి నిలబెట్టారు. కర్ర విరిగితే ఒకదానికొకటి తగలడమో.. లేక తెగి కిందకు పడటమో జరుగుతుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై రెస్కో ఏడీఈ సుధాకర్‌ను వివరణ కోరగా.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

దారి చూపండి సారూ..!

పలమనేరులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదురుగా నాలుగో నంబరు జాతీయ రహదారి మీద పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఓ పక్కన ఆటోలు నిలుపుతున్నారు. ఇక ప్రధాన రహదారిపై నిరంతరం వాహనాలు వెళ్తుండటంతో నడిచేందుకు స్థలం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, పలమనేరు

బంగారు భవిష్యత్తుకు విద్యే మార్గదర్శి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు విద్యే మార్గదర్శి అని బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బీసీ నాగరాజ్ అన్నారు. స్థానిక కుప్పం పబ్లిక్ స్కూల్ 23వ వార్షికోత్సవం, కుప్పం జూనియర్ కళాశాల 18వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలనటుడు రేవంత్ పవన్‌సాయి సుభాష్(బుల్లి రాజు) పాల్గొని విద్యార్థులను ఎంతగానో అలరించాడు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

బాలనటుడు బుల్లిరాజుతో బీసీఎన్ విద్యా సంస్థల అధినేత నాగరాజ్ తదితరులు

శ్మశానవాటికకూ దారి కరవే..!

కడపనత్తంలో మృతి చెందిన వారిని ఖననం చేయడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. గ్రామం నుంచి శ్మశానవాటికకు వెళ్లడానికి దారి సదుపాయం లేదు. మృతదేహాన్ని తీసుకుని పొలం గట్లపై ఇబ్బందికరంగా వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో శ్మశానవాటికలో వర్షపు నీరు నిలిచి కుంటను తలపిస్తోందని చెబుతున్నారు. శ్మశానవాటిక అభివృద్ధి, దారి సదుపాయానికి అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ దారి ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

బంజారాల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్

సంత్‌సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజనులు, తెదేపా నేతలు

రామకుప్పం, న్యూస్‌టుడే: బంజారాల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ అని గ్రంథాలయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ మునస్వామి, అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రవినాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుట్టూరు తండా వద్ద సంత్‌సేవాలాల్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

కుప్పంలో రోడ్డు విస్తరణ షురూ..!

రూ.7.41 కోట్ల మంజూరు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం ప్రాంతంలో కొత్త పరిశ్రమల స్థాపన.. ఆలయాల అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయి.. పట్టణంలో మాత్రం రోడ్లు ఇరుకుగా ఉండటంతో వాహనచోదకులు ఇక్కట్లు పడేవారు. కుప్పం ప్రధాన రహదారి అభివృద్ధి పనులను 2016లో మూడు రీచ్‌లుగా విభజించారు. మొదటి రీచ్ పనుల్లో భాగంగా పూర్తిస్థాయిలో విస్తరణ చేపట్టి రోడ్డు నిర్మించారు. రెండో రీచ్ పనులు కొంత మేరకు పూర్తికావడం, పలువురు కోర్టును ఆశ్రయించడంతో మిగిలిన 10 శాతం పూర్తికాకపోవడంతో పనులు అక్కడే నిలిచిపోయాయి. ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో రోడ్డు విస్తరణను పూర్తిగా విస్మరించడంతో కుప్పం ప్రధాన రహదారి రూపుకోల్పోయింది.

విస్తరణ జరగనున్న రోడ్డు ఇదే..



కుప్పం ప్రధాన రహదారి ప్రతిపాదిత మ్యాప్

మూడు రీచ్‌లలో విస్తరణ ఇలా..

కుప్పం ప్రధాన రహదారి అభివృద్ధిని మూడు రీచ్‌లుగా విభజించారు. ఇందులో మొదటి రీచ్ కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి కుప్పం చెరువు కట్ట వరకు, రెండో రీచ్ కుప్పం చెరువు కట్ట నుంచి ఎంఆర్‌రెడ్డి కూడలి వరకు, మూడో రీచ్ ఎంఆర్‌రెడ్డి కూడలి నుంచి రైల్వే గేటు వరకు గుర్తించారు. అప్పట్లో మొదటి రీచ్ పూర్తిస్థాయి విస్తరణ చేపట్టి రోడ్డు నిర్మించారు. కుప్పం చెరువు కట్ట నుంచి ఎంఆర్‌రెడ్డి కూడలి వరకు రోడ్డు విస్తరణ చేపట్టగా కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఆరు భవనాల వరకు తొలగింపు చేపట్టలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు పూర్తి చేస్తామని చెప్పిన వైకాపా ప్రభుత్వం విస్తరణను పట్టించుకోలేదు. దీంతో ఇరుకైన రోడ్లలో రాకపోకలు సాగించలేక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. కుప్పం ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సులు వస్తే, ఏదైనా వాహనం నిలిచిపోయినా ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది.

నిధుల విడుదల..

కుప్పం ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ(మూడో రీచ్)కు సంబంధించి రూ.7.41 కోట్ల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇరుకైన రోడ్లతో ఇక్కట్లు పడుతున్న ప్రజలు ఓ వైపు.. విస్తరణ ఎప్పుడు చేస్తారోనని వ్యాపారస్థులు మరో వైపు ఎదురు చూస్తున్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అలాగే రెండో రీచ్‌లో కోర్టును ఆశ్రయించిన బాధితులతో కూడా మాట్లాడుతామని అధికారుల సమాచారం. పనులు ప్రారంభమైతే కుప్పానికి కొత్త కళ వస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

‘విశిష్ట’ సంఖ్యతో రైతులకు ‘ప్రయోజనాలు’

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ప్రజలకు ఆధార్ గుర్తింపులా.. రైతులకు ఓ గుర్తింపు సంఖ్యను కేటాయించి ప్రభుత్వ రాయితీ, ప్రోత్సాహకాలు అందించే లక్ష్యంతో ‘రైతు విశిష్ట సంఖ్య’ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విశిష్ట సంఖ్యను ప్రామాణికంగా చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలను అందించనుంది. వ్యవసాయశాఖాధికారులు రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా రైతు విశిష్ట సంఖ్య నమోదు చేపడుతున్నారు. భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చాలన్నా ఈ సంఖ్య తప్పక ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంలో 32,925 మంది రైతులు ఉండగా.. ఇప్పటివరకు 70 శాతం పైగా విశిష్ట సంఖ్య నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

వివరాలిలా..

మండలం	రైతుల సంఖ్య
పలమనేరు	4,043
పెద్దపంజాణి	6,690
బైరెడ్డిపల్లె	6,707
వి.కోట	8,439
గంగవరం	7,046

నమోదు ఇలా..

రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవచ్చు. రైతులు స్వయంగా apfr.agristack.gov.in వెబ్‌సైట్ ద్వారా సులభంగా నమోదు చేసుకునే అవకాశం కలదు. వీలైనంత త్వరగా రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల సిబ్బందికి తెలిపి నమోదు పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇవీ ప్రయోజనాలు..

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కలిగిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తించడం జరుగుతుంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం, ఎరువులు, రాయితీ విత్తనాల పంపిణీకి విశిష్ట సంఖ్య అనుసంధానం చేస్తారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ యంత్ర పరికరాలు, ఇతర ప్రోత్సాహకాలను అందించడానికి విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుంది.

త్వరగా నమోదు చేయించుకోవాలి..

రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. వీలైనంత త్వరగా రైతులు నమోదు చేయించుకోవాలి. స్థానిక రైతు సేవా కేంద్రాల సిబ్బందికి వివరాలు తెలియజేస్తే నమోదు చేస్తారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రైతులు స్వయంగా apfr.agristack.gov.in ద్వారా నమోదు చేసుకోవచ్చు.
- గీతాకుమారి, వ్యవసాయశాఖాధికారిణి, బైరెడ్డిపల్లె

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని చీలంపల్లెకు చెందిన వెంకటప్ప అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. బైరెడ్డిపల్లె ఎస్సీ, ఎస్టీ సంఘం ప్రతినిధులు.. వెంకటప్ప కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు సుబ్రహ్మణ్యం, బాబు, నారాయణప్ప, చలపతి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని టీఎస్‌అగ్రహారం రోడ్డులో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.

సమాధానం: సిబ్బందిని పంపి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: కొత్తపేట కూర్మాయపురంలో వీధి తాగునీటి బోరుకు ఏర్పాటు చేసిన స్టార్టరు ఎలాంటి భద్రతా లేకుండా చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. - రాజు, కుప్పం

సమాధానం: భద్రతా చర్యలు చేపట్టి, సమస్య తలెత్తకుండా చూస్తాం. - శ్రీనివాసరావు, కమిషనర్

శాంతిపురం, న్యూస్‌టుడే: సమస్య: అబకలదొడ్డి పంచాయతీ కేంద్రంలోని వీధుల్లో సీసీ రోడ్లు కంకరతేలి గుంతలమయం కావడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - వెంకటేష్

సమాధానం: రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం.. నిధులు మంజూరైన వెంటనే సమస్యను పరిష్కరిస్తాం. - నాగేంద్రకుమార్, పీఆర్ ఏఈ

మురుగు కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని విద్యానగర్‌లో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధిలో మురుగు కాలువలను శుభ్రం చేసి పిచ్చి మొక్కలు తొలగించారు.

బాధ్యతల స్వీకరణ

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా బాధ్యతలు స్వీకరించిన శిరీష.. ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆదివారం కలిశారు. ఏపీ టిడ్కో నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె ఆదివారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

‘నీరు’గారిన ఆశయం.. తొట్టెలు నిరుపయోగం

✧ మూగజీవాలకు తీరని దాహార్తి

నడింపల్లె వద్ద నీళ్లులేని తొట్టె

● శాంతిపురం మండలం నడింపల్లె వద్ద పశువుల దాహార్తి తీర్చిందేందుకు నిర్మించిన తాగునీటి తొట్టె నిరుపయోగంగా దర్శనమిస్తోంది. గ్రామీణ ఉపాధి నిధులు రూ.32 వేలతో నిర్మించిన తొట్టెలో నీటి వసతి లేక అలంకారప్రాయంగా మారింది. ● శాంతిపురం మండలం చిన్నారిదొడ్డి పంచాయతీ కేంద్రంలో దశాబ్దం కిందట నిర్మించిన తొట్టెకు నీటి వసతిని విస్మరించారు. నీటి వసతి లేక చెత్తా.. చెదారంతో తొట్టె నిండిపోయి దుస్థితికి చేరుకొంటోంది.

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని 23 పంచాయతీల్లో పెద్ద ఎత్తున పశువుల తాగునీటి తొట్టెలను నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన వెంటనే.. తొట్టెల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. దాదాపు 40 గ్రామాల్లో గ్రామీణ ఉపాధి నిధులు రూ.32 వేలు వంతున ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తి చేశారు. ఏడాది కావస్తున్నా.. తొట్టెల్లో నీటి సౌకర్యాన్ని కల్పించలేదు. క్షేత్రస్థాయిలో ఉపాధి, పంచాయతీ, నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపంతో తొట్టెలు నీటి వసతికి నోచుకోలేని దుస్థితి దాపురించింది.

దశాబ్దం కిందట నిర్మించినవి..

పదేళ్ల కిందట తెదేపా పాలనలో రక్షిత మంచినీటి పథకాల వద్ద పశువుల తాగునీటి తొట్టెలను నిర్మించారు. అందుబాటులో పుష్కలంగా నీటి వసతి ఉన్నా.. తొట్టెలకు సరఫరాను పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. అలంకారప్రాయంగా మారిన తొట్టెలు నేడు చెత్తదిబ్బలతో నిండిపోతున్నాయి. కొన్నిచోట్ల స్వార్థపరులు తొట్టెలను ధ్వంసం చేశారు. రూ.లక్షల వ్యయంతో చేపట్టిన నిర్మాణాలు అధికారుల నిర్లక్ష్యం పుణ్యమా.. అని నిర్దేశిత అవసరాలకు వినియోగించని దుస్థితి ఏర్పడిందని జనం అంటున్నారు.

(c) eenadu

శివోహం.. భక్తజన పరవశం

మహాశివరాత్రి పురస్కరించుకుని పంచారామ క్షేత్రాలు ఆదివారం భక్తులతో కిక్కిరిశాయి. సేవా సంస్థలు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశాయి. దీపాలంకరణలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగాలు ఆకట్టుకున్నాయి. ద్రాక్షారామ భీమేశ్వరాలయం పంచాక్షరీ జపంతో మార్మోగింది. ఉదయం 4 గంటల నుంచి దర్శనాలు కల్పించారు. అర్ధరాత్రి లింగోద్భవకాలం అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. కోటిపల్లిలో సర్వదర్శన క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. స్నానఘట్టాల వద్ద భక్తులకు లోపలికి ప్రవేశించకుండా ఏర్పాట్లు చేశారు. **-న్యూస్‌టుడే బృందం**

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో..

నేదునూరులో వీరభద్రస్వామికి రూ.90వేలు విలువైన నోట్లతో అలంకరణ

ద్రాక్షారామ మహాదేవుని ఆలయం వద్ద శివలింగాకృతిలో దీపాలు

అమలాపురంలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో రుద్రాక్షలతో శివలింగాలకు అలంకరణ

తీర్థం.. జనసంద్రం

దీవిలా ఉండే మగసానితిప్పలో కాలభైరవుని ఆలయం వద్ద ఆదివారం తీర్థం వైభవంగా నిర్వహించారు. గోదావరి పాయల్లో పడవలపై భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే సుబ్బరాజు తదితరులు పూజలు చేశారు. **-న్యూస్‌టుడే, కాట్రేనికోన**

చిన్నారి తల్లి.. అనారోగ్యంతో తల్లడిల్లి

బాల్య వివాహాలతో ఇబ్బందులు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

బాల్య వివాహాల కారణంగా బాలికలు అనారోగ్యానికి గురవుతున్నారు. 18 ఏళ్లు నిండకుండానే తల్లులుగా మారుతుండటంతో వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ పరిస్థితిపై ఈ నెల 9న నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మార్పు తీసుకురావాలని ఆదేశించారు.

ప్రతిబంధకాలు ఇలా...

బాలికల్లో శారీరకంగా ఎదుగుదల లేక అనివార్య పరిస్థితుల్లో సిజేరియన్ల ద్వారానే ప్రసవాలు చేస్తున్నారు. వీరిలో 65 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వీరికి ప్రసవాలు కష్టతరం అవుతోంది. అక్కడి నుంచి జిల్లా ప్రాంతీయ ఆసుపత్రులకు పంపుతున్నారు. ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురై మాతాశిశు మరణాలు పెరుగుతున్నాయి. ఇటువంటి కేసుల్లో జన్మించిన చిన్నారులు బలహీనంగా ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

అవగాహన లోపంతోనే..

ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లేవారు అమ్మాయిలకు వివాహ వయసు రాకుండానే పెళ్లిళ్లు చేస్తున్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోనే బాల్య వివాహాలు ఎక్కువగా నమోదు అవుతున్నట్లు చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు చెబుతున్నారు.

సమాచారం అందిస్తే..

బాల్య వివాహాలను అడ్డుకునేందుకు అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలతో కమిటీలు ఏర్పాటు చేశారు. బాల్య వివాహం గురించి 1098 నంబరుకు ఫోన్ చేస్తే చైల్డ్ లైన్ కమిటీ సభ్యులు, స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులు నిలుపుదల చేస్తారు.

మాతృ, శిశు మరణాలు

ఏడాది	మాతృ	శిశు
2023–24	11	138
2024–25	8	134
2025–26 ఇప్పటి వరకు..	5	85

జిల్లాలో ఇలా..

ఏడాది	ప్రసవాలు	సాధారణ	శస్త్రచికిత్స	18 ఏళ్లలోపు
2024–25	20,263	6,033	14,230	506

● రికార్డుల్లో నమోదుకాని మైనర్ గర్భిణులు దీనికి రెండు రెట్లు వరకు ఉంటారని అధికారుల అంచనా

తీవ్ర అనారోగ్య సమస్యలు

18 ఏళ్లలోపు బాలికలకు బిడ్డకు జన్మనిచ్చే సామర్థ్యం ఉండదు. గర్భస్థ శిశువులో అవయవాల పెరుగుదల సక్రమంగా ఉండదు. నెలలు నిండకుండానే ప్రసవాలు జరగడం, శిశువుల్లో అవయవలోపాలు, బరువు తక్కువగా జన్మించడం జరుగుతుంది. ప్రసవ సమయంలో అధిక రక్తపోటు వల్ల మాతృ మరణాలు సంభవించే ప్రమాదం ఉంది. భవిష్యత్తులోనూ అనారోగ్య సమస్యలు వెంటాడే ప్రమాదం ఉంది.

-డా.మౌనిక, గైనకాలజిస్ట్, అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి

ప్రగతి వేదిక పారిశ్రామిక వీచిక

వీఈఆర్ పరిధిలోకి ఉమ్మడి తూర్పు

ఈనాడు, రాజమహేంద్రవరం: విశాఖ ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్) పరిధిలోకి తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పోలవరం జిల్లాలను చేర్చుతూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ ప్రాంతం ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చినట్లయింది. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న ఈ రీజియన్‌లో ప్రధానంగా ఉత్పత్తి, సేవా రంగాలతో పాటు, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయం తదితర ఏడు అంశాలు గ్రోత్ డ్రైవర్స్‌గా వృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ఎక్కడ ఏ తరహా సేలందించాలన్న అంశంపై డీపీఆర్‌ల తయారీకి కన్సల్టెంట్ల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. దీని పరిధిలో 41 రకాల అత్యున్నత రంగాలకు చెందిన ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయి. కేంద్ర, ప్రైవేటు సంస్థల సహకారంతో వీటిని ఏర్పాటు చేస్తామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు.

మారేడుమిల్లిలో ఓ ఇంటి ముందు ఆరబెట్టిన రబ్బరు

ఇదీ ఉపయోగం

☛ తూర్పు గోదావరి జిల్లాలో మౌలిక వసతులు, ఉత్పత్తి, పర్యాటక రంగాలకు సంబంధించి అనేక వనరులున్నాయి. ప్రధానంగా రోడ్డు, రైలు, విమానయానం అందుబాటులో ఉంది. విమానాశ్రయ విస్తరణ నేపథ్యంలో మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి.

☛ కాకినాడ జిల్లా ఇప్పటికే పారిశ్రామిక పురోగతి, ఐటీ సంస్థలతోపాటు ఆక్వా, వ్యవసాయ రంగాల్లో దూసుకుపోతోంది. పోర్టు ప్రధాన ఆదాయ వనరుగా మారుతోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా ఈ నగరం ఎంపికైన నేపథ్యంలో పట్టణీకరణ శివారు ప్రాంతాలకూ శరవేగంగా విస్తరిస్తోంది. కొత్త ప్రాజెక్టులు వస్తే అందుకు తగిన వసతులు కల్పించేందుకు ఇక్కడ అపార వనరులున్నాయి.

☛ డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పర్యాటకం, వ్యవసాయం, ఉద్యాన రంగాల ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం. ఇప్పటికే ఈ ప్రాంతంలో కొబ్బరి ఆధారిత ఉత్పత్తులు చేసే పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. కొబ్బరిలో అంతర పంటగా కోకో, గడ్డి పెంపకం చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఆక్వా, పీత పిల్లల తయారీ కేంద్రం ఏర్పాటుతో మత్స్యకార రంగం అభివృద్ధికి అవకాశాలున్నాయి.

☛ పోలవరం జిల్లాలో ఆహార ఉత్పత్తులు, సేవా రంగం ఆధారిత పరిశ్రమలకు అవకాశాలున్నాయి. ప్రధానంగా మారేడుమిల్లి పర్యాటకంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడ అంతర్జాతీయ స్థాయి రిసార్ట్‌లు, విడిది కేంద్రాలు వచ్చే అవకాశాలున్నాయి. రబ్బరు తయారీ, అరకు కాఫీ తోటల పెంపకం, జీలుగు నుంచి బెల్లం తయారీ, జీడిపప్పు ప్రాసెసింగ్ తదితర రంగాలు ఇప్పటికే అక్కడ కొనసాగుతున్నాయి. వీటి నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు తీసేయానిట్లు వస్తే మరింత మెరుగైన జీవన ప్రమాణాలు పెరగడంతోపాటు, జిల్లా ఆర్థిక వృద్ధికి తోడ్పాటునిస్తుంది.

నదీకోతకు.. రక్షణ మంత్రం

రూ.24.75 కోట్ల వ్యయం

న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

వశిష్ఠ నదికి ఎడమ వైపున రాజోలు-మేకలపాలెం మధ్య నదీపాతం నుంచి ఒడ్డుకు రక్షణ కల్పించేందుకు చేపట్టిన పనులు దాదాపు 90 శాతం పూర్తి కావొచ్చాయి. నదీ జలాల్లో దాదాపు 15 మీటర్ల లోతున పెద్ద గుండురాళ్లు (రఫ్ స్టోన్) వేసి ఒడ్డుకు రక్షణ కల్పిస్తున్నారు. నదీ పాతం నుంచి శాశ్వత రక్షణకు రూ.24.75 కోట్ల వ్యయంతో వశిష్ఠ నది తీరంలో బెడ్ పిచింగ్, రివిట్మెంట్ పనులు చేపట్టారు. సోంపల్లి నుంచి రాజోలు కాటన్ పార్క్ వరకు 5 మీటర్ల వెడల్పున 475 మీటర్ల మేర రెండు పొరల పనులు పూర్తి చేశారు. రాజోలు పుష్కరఘాట్ నుంచి మేకలపాలెం మధ్య రెండుచోట్ల 5 మీటర్ల వెడల్పుతో చేపట్టిన పనులు 75 శాతం పూర్తయ్యాయి. ఇక్కడ రిటైనింగ్ గోడ వద్ద 5 మీటర్ల వెడల్పున జియోసింగ్ ఫ్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక శ్మశానవాటిక సమీపంలో 115 మీటర్ల మేర నిర్మించేందుకు సన్నద్ధమవుతున్నారు.

మేకలపాలెంలో నది ఒడ్డున రక్షణ పనులు

ఏటిగట్టు బలోపేతమేదీ..

రాజోలు పరిధిలోని మేకలపాలెం నుంచి సున్నపువారిబాడవ వరకు 2 కిలోమీటర్ల మేర ఉన్న ఏటిగట్టును విస్తరించాల్సి ఉంది. వరద నీరు గట్టుపై నుంచి పొంగిపొర్లే సమయంలో రాజోలు ప్రాంత ప్రజలు రాత్రిపూట జాగారం చేస్తున్నారు. గట్టుపై ఇసుక బస్తాలు వేయడం, బాధిత కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించడంలో హైరానా తప్పడం లేదు. ఇక్కడి గట్టును 2 మీటర్ల ఎత్తు, 6.50 మీటర్ల మేర వెడల్పుతో విస్తరించేందుకు గతంలో రూ.7.10 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు లేకపోవడంతో ఏటిగట్టు అంచనాలకే పరిమితమైంది.

వేగంగా రక్షణ పనులు..

వశిష్ఠ ఎడమ గట్టుకు రాజోలు, సోంపల్లిలో చేపట్టిన బెడ్ పిచింగ్, రివిట్మెంట్ పనులు 90 శాతం వరకు జరిగాయి. నెలాఖరు నాటికి మిగతా పనులు పూర్తిచేస్తాం. ఒడ్డుకు శాశ్వత ప్రాతిపదికన పూర్తి రక్షణ ఏర్పడుతుంది. ఏటిగట్టు విస్తరణకు గతంలో ప్రతిపాదనలు చేసి పంపించాం. నిధులు మంజూరైతే వెంటనే పనులు చేపడతాం.

- టీఎల్ఎన్ మూర్తి, ఏఈఈ, వశిష్ఠ హెడ్‌వర్క్స్

ఐఐఎఫ్‌టీకి పూర్తి స్థాయిలో నిధులు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం పొన్నాడ పంచాయతీ శీలంవారిపాలెం సమీపంలో నిర్మిస్తున్న ఐఐఎఫ్‌టీ క్యాంపస్‌కు వంద శాతం నిధులు మంజూరయ్యాయని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. వైకాపా పాలనలో రాష్ట్ర వాటా నిధులు కేటాయించలేదని, జాప్యం జరిగిందని, ప్రాజెక్టు పనులు 10 శాతం కూడా కాలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో వేగవంతంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ నిధులు రూ.28.43 కోట్లు విడుదల చేసేందుకు అంగీకరించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.57.10 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసిందన్నారు. దీంతో మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.221.81 కోట్లు విడుదలకు మార్గం సుగమం అయ్యిందన్నారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలో క్యాంపస్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నిధుల విడుదలకు సహకరించిన ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

పొన్నాడలో చివరి దశకు చేరుకున్న క్యాంపస్ నిర్మాణం

ట్రాఫిక్ నియంత్రణే సవాలు..!

● 5 లక్షల మంది శివరాత్రి పుణ్యస్నానాలు చేసినట్లు అంచనా

ఈనాడు, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో మహా శివరాత్రిని నమూనాగా తీసుకుని యంత్రాంగం ఆదివారం రాజమహేంద్రవరంలో ట్రయల్ రన్ నిర్వహించింది. దీనికి విస్తృతంగా సాంకేతికతను వినియోగించారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం సుమారు 5 లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు ఓ అంచనాకు వచ్చారు.

● పుష్కర [illegible].. సాంకేతిక సవారీ

పుష్కరాల రేవులు ఎంతమంది వచ్చారంటే..

ఆదివారం మధ్యాహ్నం 11.37 గంటలకు 56,885 మంది వచ్చారు. వీఐపీ ఘాట్ 3 గంటలకు ముందే స్నానాలకు తరలివచ్చారు. ఉదయం 10 వరకు వచ్చే వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. నగరంలో 1.31 లక్షల మంది స్నానాలు చేసినట్లు కమిషనర్ రాహుల్‌మీనా తెలిపారు.

● స్నానఘట్టాల్లో ఒక చదరపు మీటరుకు సుమారు 42 మంది జనసాంద్రత ఉండేలా కెమెరాల్లో సాంకేతికత నిక్షిప్తం చేశారు. రద్దీకి సంబంధించి 100కు పైగా సందేశాలు వెళ్లాయి. వెంటనే అధికారులు అప్రమత్తమై తగిన చర్యలు తీసుకునేందుకు వీలు ఏర్పడింది.

డ్రోన్‌లతో పర్యవేక్షించినా..

ప్రధానంగా రద్దీ నియంత్రణపై దృష్టి సారించాలని పెద్దఎత్తున పోలీసులను మోహరించి, డ్రోన్‌లతో పర్యవేక్షించారు. కానీ రద్దీ నియంత్రణ పెద్ద సవాలుగా మారింది. తెల్లవారుజామున 3 గంటల నుంచి స్నానాలు ప్రారంభం కాగా, ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఒక్కసారిగా రద్దీ పెరిగింది. ఘాట్‌లకు అనుసంధానంగా ఉన్న రహదారుల్లో జనం కిక్కిరిసిపోయారు. గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏఐ సాంకేతికతతో రద్దీని అంచనా వేసినప్పటికీ రహదారులు ఇరుగ్గా ఉండడం సమస్యగా మారింది. ఈ ప్రక్రియలో చాలా లోపాలు కనిపించాయి.

గుర్తించిన లోపాలు..

● రహదారులపై ఆక్రమణలు ట్రాఫిక్ తీవ్ర ఆటంకంగా మారాయి. ● ప్రణాళికకు అనుగుణంగా రహదారుల విస్తరణ చేయకపోవడం ● రద్దీ నియంత్రణపై పూర్తిస్థాయి కార్యాచరణ లేకపోవడం ● భక్తులకు మార్గదర్శక బోర్డులు లేకపోవడం ● నగరంలోకి పెద్ద వాహనాలను సైతం అనుమతించడం.

ఏం చేయాలంటే..

● మెయిన్‌రోడ్డుతోపాటు అనుబంధ రహదారులను యుద్ధప్రాతిపదికన విస్తరించాలి. ● ఘాట్‌లకు అనుబంధ మార్గాలను వెడల్పు చేయాలి. ● నగరంలో జంక్షన్ల విస్తరణ చేపట్టాలి.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఇంటర్మీడియట్ పరీక్షల సమయం దగ్గరపడుతోంది. జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు 40 కేంద్రాల్లో ఈ నెల 23 నుంచి జరుగనున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 25,887 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

ముమ్మిడివరంలోని ఓ కళాశాలలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న అధ్యాపకులు

జిల్లా వివరాలు..

మొదటి ఏడాది విద్యార్థులు	13,131
ద్వితీయ సంవత్సరం	12,756
పరీక్ష కేంద్రాలు	40
సీసీ కెమెరాలు	763
పరీక్ష పేపర్ల నిల్వ కేంద్రాలు	14

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్

ఇంటర్మీడియట్ విద్యామండలి హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో ఉంచింది. https:e.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు గతంలో రాసిన పదో తరగతి హాల్ టికెట్ నంబరు, పుట్టిన తేదీ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం హాల్ టికెట్ నంబరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మనమిత్ర వాట్సాప్ నంబరు ద్వారా హాల్ టికెట్ పొందే అవకాశం ఉంది. హాల్ టికెట్లపై కళాశాల ప్రిన్సిపల్, సదరు కళాశాల స్టాంప్ సైతం అవసరం లేదని ఇంటర్మీడియట్ విద్యామండలి పేర్కొనడంతో విద్యార్థులు సులువుగా హాల్ టికెట్లు పొందుతున్నారు.

పరీక్ష కేంద్రాలపై నిరంతర నిఘా..

జిల్లాలోని 40 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయానికి అనుసంధానం చేస్తాం. అక్కడ ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ జరుగుతుంది. పరీక్షలకు సంబంధించి సిబ్బందిని సైతం ఇప్పటికే నియమించాం

నేటి నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు

గాంధీనగర్: సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు సోమవారం నుంచి బుధవారం వరకు కాకినాడ సూర్యకళామందిరంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు తెలియజేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ సమావేశాల్లో దేశం, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చిస్తామన్నారు. రాష్ట్రంలోని మెడికల్ మాఫియా, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, మన గ్యాస్ మనహక్కు, టిడ్కో, ఇళ్లు, ఇళ్ల స్థలాలు తదితర అంశాలపై నాయకులు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా పార్టీ సీనియర్ నాయకులు కె.నారాయణ, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తదితరులతో పాటు 26 జిల్లాల ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు.

విజేతలతో సాత్విక్ సాయిరాజ్, రంగమణి, చరణ్

మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తాం

అమలాపురం పట్టణ: భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ తెలిపారు. అమలాపురం ఓసీ రిక్రియేషన్ క్లబ్‌లో సాయిరాజ్, చరణ్ ఆధ్వర్యంలో రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఇన్విటేషన్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో కె.శ్రీకర్, కె.సరియు, మెన్స్ డబుల్స్‌లో పి.చంద్రగోపీనాథ్, విగ్నేష్, మాస్టర్ డబుల్స్‌లో ఉదయ్ భాస్కర్, జేమ్స్‌లు విజేతలుగా నిలిచారు. విజేతలకు రూ.1.50 లక్షల విలువైన బహుమతులను రంగమణి, సాయిరాజ్, చరణ్ అందజేశారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యాళ్ల సతీష్, అల్లాడ శరత్, తిక్కిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలం.. సేంద్రియ ఫలం..!

ఈనాడు, కాకినాడ : కొన్ని నెలల కిందట తుప్పలు, డొంకలతో చిట్టడవిని తలపించేలా ఉన్న అబ్కారీ స్థలాలు నేడు పూల మొక్కలు, కూరగాయల తోటలతో పచ్చదనం పంచుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని సామర్లకోట, చాగల్లు ఐఎంఎల్ డిపోల్లోని నిరుపయోగ స్థలాల్లో చేపడుతున్న సేంద్రియ సేద్యం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

అబ్కారీశాఖ ఖాళీ స్థలాల్లో కూరగాయల సాగు

సామర్లకోట మద్యం డిపో స్థలంలో కూరగాయల సాగు

పోషకాలపై అవగాహనతో

సామర్లకోట, చాగల్లు మద్యం డిపోల్లో గోదాములు మినహా రెండు, మూడు ఎకరాలకు పైగా ఖాళీ భూములున్నాయి. అవన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఈ డిపోల్లో తనిఖీలకు వచ్చేటప్పుడు ఆయా స్థలాలను పరిశీలించి వాటిలో అందరికీ ఉపయోగపడే మొక్కలు పెంచితే బాగుంటుందని ఉప కమిషనర్ చైతన్య మురళి ఆలోచన చేశారు. అక్కడి సిబ్బంది, హమాలీలకు పోషక పంటలపై అవగాహన కల్పించారు.

● పాలకూర, కొత్తిమీర, తోటకూర, పచ్చిమిరప, వంగ, మునగ, అరటి, ఆనబ ఇలా అన్ని రకాల కూరగాయలను చిన్నచిన్న మడులుగా చేసి పండిస్తున్నారు.

పండిస్తే లాభం.. తింటే ఆరోగ్యం..

● సామర్లకోట డిపోలో ఇప్పుడు ప్రతిరోజు 10 నుంచి 15 కిలోల వంకాయలు పండుతున్నాయి.

● అరటి గెలలతో చెట్లు నిండుగా ఉన్నాయి. ఆకు కూరలు రోజూ 15 నుంచి 20 కట్టలు తెంచుతున్నారు.

● టమాటా అయిదారు కిలోలు దిగుబడి వస్తుంది. వీటన్నింటిని అక్కడ పనిచేసే సిబ్బంది రోజువారీగా పంచుకుంటున్నారు. దీనివల్ల వారి వంటింట బడ్జెట్‌లో కూరగాయల ఖర్చు మిగులుతుంది.

'కాకినాడలోని మా కార్యాలయం ఎదుట చిన్న స్థలంలో పది రకాలు సాగుచేసి వాటితో అక్కడే వండించి తింటున్నాం. అక్కడ పండిన పంటను చూపించి ఆరోగ్యంపై అవగాహన కల్పించాకే డిపోల్లో సాగుకు ముందుకు వచ్చారు. చక్కగా పంటలు పండిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో చొల్లంగి వద్ద గురుకుల పాఠశాలలోని రెండు ఎకరాల ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేస్తున్నాం.' అని డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి అన్నారు.

కేరళ ఆల్ఫాన్స్- దక్షిణ మధ్య రైల్వే జట్ల హోరాహోరీ

ఎగిరి గంతేసేలా.. విజయం

ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో అరిగెల రంగయ్య జాతీయస్థాయి వాలీబాల్ బాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జీఎస్టీ (ముంబయి) జట్టు 3-2 స్కోరుతో ఎస్ఏఐ(కేరళ)పై గెలుపొందింది. అనంతరం ఇండియన్ బ్యాంకు(చెన్నై) జట్టు కర్ణాటక జట్టుతో తలపడింది. మహిళ విభాగంలో అల్ఫాన్సా(కేరళ), ఎస్‌సీఆర్ జట్ల మధ్య హోరాహోరీగా పోటీ సాగింది.

-న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ముంబై జీఎస్టీ- కేరళ సాయి జట్లు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

నులిపురుగును నులిమేద్దాం..!

17 నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

న్యూస్‌టుడే, అల్లవరం

కడుపులోని నులి పురుగుల కారణంగా పిల్లలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 17న జిల్లా వ్యాప్తంగా జాతీయ నులి పురుగు నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. నులి పురుగులను నులిమేద్దాం అనే నినాదంతో వైద్యారోగ్యశాఖ సిబ్బంది అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు సిద్ధపడుతున్నాయి.

ఇవీ సమస్యలు..

నులి పురుగుల వల్ల కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, కడుపు ఉబ్బరం, చర్మంపై దద్దుర్లు, రక్తహీనత, ఆయాసం, కాళ్ల వాపులు, ముఖం ఉబ్బడం, వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్యులు తెలిపారు.

నివారణకు చర్యలు..

ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రామల మాత్ర ఏడాదిలో రెండు సార్లు వేసుకుంటే నులి పురుగుల్ని పూర్తిగా నిర్మూలించవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు. 2 నుంచి 5 ఏళ్ల వరకు పిల్లలకు అర మాత్ర, 6 నుంచి 19 ఏళ్ల వారికి పూర్తి మాత్ర వేస్తారు. జిల్లాలో 3,10,500 మందికి పంపిణీ చేసేందుకు 3.25 లక్షల మాత్రలను సరఫరా చేశారు.

అందరికీ పంపిణీ

19 ఏళ్ల లోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేశాం. మిగిలిన వారికి 24న పంపిణీ చేస్తాం. ప్రతి పాఠశాలలో పర్యవేక్షణకు ఆరోగ్య సిబ్బందిని నియమించాం. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు మాత్రలు వేయిస్తారు.

-దుర్గారావు దొర, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

(c) eenadu

కోటి దీపాలు వెలిగె..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి కోటిపల్లి ఆలయ ముఖ మండపంలో కోటి దీపారాధన కనులపండువగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు పూజలు చేసి మొదటి దీపాన్ని వెలిగించారు. మండపం చిన్నది కావడంతో నిర్ణీత సంఖ్యలో భక్తులను అనుమతించారు. వేలాది మంది భక్తులు ఆలయ బేడామండపాల నుంచి దీపోత్సవాన్ని వీక్షించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పామర్రు

శూలాల సంబరం.. భక్తి పరవశం

అమలాపురం మండలం ఇమ్మిడివరప్పాడులోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శూలాల సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కరకాల భక్తులు 20 మంది బుగ్గలకు శూలాలు గుచ్చుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. -న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ద్రాక్షారామ.. జ్యోతిర్లింగార్చన

ద్రాక్షారామ భీమేశ్వరాలయం నంది మండపంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి జ్యోతిర్లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. వండి ఉపాసకుడు ఐండగంటి రామరాఘవశర్మ నేతృత్వంలో శివలింగాకృతిలో 365 దీపాలతో లింగార్చన జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. - న్యూస్‌టుడే, ద్రాక్షారామ

ఆదియోగి.. కొలువుదీరి

మలికిపురం మండల కేంద్రంలో శివరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్థానిక మార్కెట్ కూడలిలో ఈశ టెంపుల్ మాదిరిగా శివుడి విగ్రహం, ఏడు ద్వారాలతో వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనాలు ఆకట్టుకున్నాయి. పలువురు భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. - న్యూస్‌టుడే, మలికిపురం

సభలో మాట్లాడుతున్న ఆనందరావు

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో క్రీడలకు, క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో అరిగెల రంగయ్య మెన్, ఉమెన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడలకు పూర్వవైభవం వచ్చిందన్నారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ సోంబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, కూటమి అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఉప్పలగుప్తం మత్తి శెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గం

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం సర్పవరం జంక్షన్‌లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్ 4వ తరగతి ఉద్యోగుల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణరావు ఎన్నికల అధికారిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.రాజేష్‌ప్రభుకుమార్ పరిశీలకుడుగా ఎన్నికలు నిర్వహించారు. మూడేళ్లపాటు పదవీకాలం ఉండే కార్యవర్గానికి అధ్యక్షుడిగా పి.నాగబాబు, కార్యదర్శి డీఎస్‌వీ కిరణ్, అసోసియేట్ అధ్యక్షురాలిగా సీహెచ్ సువర్ణకుమారి, ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాస్, ఎం.కృష్ణశాస్త్రి, జాయింట్ సెక్రటరీగా ఎం.రాజశేఖర్, కోశాధికారిగా వి.సూరజ్, కోఆప్షన్ సభ్యుడిగా పి.రోహిత్‌లను ఎన్నుకున్నారు.

వాహన వైద్య సేవలకు జవసత్వాలు

108 సిబ్బందికి పెరిగిన జీతాలు

న్యూస్‌టుడే, మండపేట

ఆపదలో ఆదుకునే అపర సంజీవనిగా పిలిచే 108 అంబులెన్సు సేవలు మరింత విస్తృతం కానున్నాయి. ఈ వాహనాల్లో పనిచేసే సిబ్బందికి ప్రోత్సాహించేలా సిబ్బందికి జీతాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వారిలో సంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నో సంవత్సరాలుగా జీతాలు పెంచాలంటూ వారు ఆందోళనలు చేసినా గత వైకాపా ప్రభుత్వం కనికరం చూపలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 22 అంబులెన్సులు ఉండగా వీటిలో 102 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు (ఈఎంటీ) 53 మంది, డ్రైవర్లు (పైలెట్లు) 49 మంది ఉద్యోగం చేస్తున్నారు. దీంతో వారంతా థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డుల ప్రదర్శిస్తూ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

గత తెదేపా హయాంలోనే జీవో..

కరోనా విపత్తు సమయంలో 108 సిబ్బంది ప్రాణాలకు తెగించి సేవలందించారు. వైరస్ బాధితులను ఆసుపత్రులు, క్వారంటైన్‌లకు తరలించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయా సందర్భాల్లో సిబ్బంది కూడా కరోనా బారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పట్లో వీరి సేవలను ప్రజలంతా ప్రశంసించారు. కనీసం ఆ తరువాతైనా జీతాలు పెంచుతారనుకుంటే జీతాల స్లాబులు పెంచాలని వారు వేడుకున్నా అప్పటి వైకాపా ప్రభుత్వం కరుణించలేదు. అయితే 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో తెదేపా ప్రభుత్వం 108 అంబులెన్స్ సిబ్బంది జీతాలు రూ.4000 చొప్పున పెంచుతూ జీవో నంబర్ 49 విడుదల చేశారు. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ జీవోని తుంగలో తొక్కడంతో అమలుకు నోచుకోలేదు.

పెంపుదల ఇలా..

ప్రస్తుతం ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఈఎంటీలు, పైలెట్లు, 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్నవారికి స్లాబులు వేర్వేరుగా ఉన్నాయి. ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున పెంపుదల వర్తిస్తోంది. అలాగే 15 సంవత్సరాలు, 20 సంవత్సరాలు సర్వీసు దాటినవారికి త్వరలోనే స్లాబు పెరిగే అవకాశం ఉంది.

ధాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అంబులెన్సు సిబ్బంది

వారిపై నిర్ణయం తీసుకోవాలి..

2వ నుంచి ఎవరైతే 5, 10 సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసుకున్నారో వారికి ఆటోమేటిక్‌గా రూ.5 వేల వేతనం పెరుగుతుంది. 15, 20 సంవత్సరాలు దాటిన వారి స్లాబు పెంపుదలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. - ఎం.రాజా, 108 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఈఎంటీ, మండపేట

కోటిపల్లి.. భక్తులు ప్రణమిల్లి

పామర్రు, న్యూస్‌టుడే: గౌతమి నదీతీరాన వెలసిన పుణ్యక్షేత్రం కోటిపల్లి భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారి తీర్థపు బిందెను తీసుకెళ్లి అభిషేకించిన అనంతరం దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీతో ప్రత్యేక దర్శనం, సర్వదర్శనం వరుసలన్నీ నిండిపోయాయి. దర్శనానికి కనీసం మూడు గంటల సమయం పట్టింది. గోదావరి స్నానఘట్టాలన్నీ జనాలతో నిండిపోయాయి. భక్తులు లోపలికి వెళ్లటంలో పడవలను బారికేడ్లుగా కట్టేశారు. గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. మూడు ప్రధాన స్నానఘట్టాల్లోనూ జిమ్కో మేటలు వేయడంతో సుమారు అరకిలోమీటరు నడిచి వెళ్లి స్నానాలు చేశారు. జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద, సేవా సంస్థలు, కుల సంఘాలు అన్నదానం, పులిహోర ప్రసాద వితరణ చేశారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్, శ్రీ తెలగ సభ్యుల ఆదర్శమిత్ర మండలి, ఫ్రైడే వారి సంస్థలు, శాలివాహన, విశ్వబ్రాహ్మణ, కాకతీయ, బ్రాహ్మణ, వైశ్య సంఘాలు, సత్యసాయి సేవాసంస్థలు సేవల్లో పాలుపంచుకున్నాయి. కె.గంగవరం కూడలిలో మనగంగవరం సేవా సంస్థ మజ్జిగ పంపిణీ చేసింది.

ప్రత్యేక అలంకరణలో కోటిపల్లి శివుడు

సత్యదేవునికి ముగిసిన కోటి తులసి అర్చన

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో ఈనెల 6న ప్రారంభమైన కోటి తులసి పూజ ఘనంగా ముగిసింది. రోజూ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.30 గంటల వరకు తులసి పూజ, సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాద నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం ఉదయం 8 గంటలకు ధన్వంతరీ హోమం, రుద్రహోమం ప్రారంభించారు. 11 గంటలకు అర్చకులు, పండితులు, పురోహితుల బృందం ఆధ్వర్యంలో పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ, దేవస్థానం ఛైర్మన్ ఐ.వి.రోహిత్, ఈవో వి.త్రినాధరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న 62 మంది వైదిక బృందానికి దేవస్థానం తరఫున సంభావన, ప్రశంసాపత్రాలు అందించారు. దాతల నుంచి సుమారు రూ.15 లక్షలు విరాళాలు అందాయని ఈవో త్రినాధరావు తెలిపారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రాకారం చుట్టూ రథ సేవ ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో 12 గంటలకు పరమేశ్వరుడికి అభిషేకం నిర్వహించారు.

పూర్ణాహుతి నిర్వహిస్తున్న వైదిక బృందం

నేడు బాలయోగీశ్వరుల తీర్థం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరంలోని భగవాన్ బాల యోగేశ్వరుల తపో ఆశ్రమం వద్ద సోమవారం బాలయోగీశ్వరుల తీర్థం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి తర్వాత రోజు తీర్థం జరపడం ఆనవాయితీ. ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే ఆశ్రమంలో బాలయోగీశ్వరుల విగ్రహ దర్శనానికి అవకాశం ఉంటుంది. భగవాన్ సమాధుల వద్ద పూజలు, దర్శనాల అనంతరం రాత్రి పురవీధుల్లో స్వామి వారి చిత్రపటాల ఊరేగింపు గ్రామోత్సవానికి ఏర్పాట్లు చేశారు.



పెద బాలయోగీశ్వరులు

నేటి నుంచి సహకార సంఘ ఉద్యోగుల సమ్మె

రామచంద్రపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక రాష్ట్ర వ్యాప్త సమ్మెకు సహకార సంఘాల ఉద్యోగులు సిద్ధమయ్యారు. రాష్ట్రంలోని సహకార సంఘాల్లో కార్యకలాపాలకు ఆటంకం కలగనుంది. సంఘ పూర్వ రాష్ట్ర నాయకుడు వెంకే సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గత 18 నెలలుగా ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు కోరినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. రాష్ట్ర జేఏసీ నిర్ణయం మేరకు గత 2 నెలలుగా డీసీవో కార్యాలయాల వద్ద, డీసీసీబీల వద్ద ధర్నాలు చేస్తూ నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించారన్నారు. రాష్ట్రంలో 2,060 ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులు 9 వేల మంది ఉద్యోగులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినప్పటికీ స్పందించక పోవడంతో సమ్మెలో దిగుతున్నామన్నారు. ఈ నెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార సంఘ ఉద్యోగులతో కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేసినప్పటికి ప్రభుత్వంలో చలనం లేదన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు ఉద్యోగులు సమ్మెకు వెళ్తున్నట్లు ఆయన వెల్లడించారు.

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

శ్రీ లలిత రైస్‌మిల్, పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీ సాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆ రోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 9493338823.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలు లోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

ఇళ్ళు, స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో మార్టిగేజ్/ టేకోవర్ లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. ★ నో సిబిల్/ నో బ్రోకర్స్. ★ MSR గ్రూప్, వైజాగ్. Ph: 9121314141.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు. రాజమండ్రి: 'శ్రీ సాయిలక్ష్మీ లాడ్జి' SVG మార్కెట్ రోడ్, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతీనెల 3, 17 తేదీల్లో మందులు కలవు.

REAL ESTATE

PLOT FOR SALE

KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJANAGARAM

ఓనర్ డైరెక్ట్‌గా అమ్మే, రెసిడెన్షియల్ ప్లాట్లు రాజానగరం మండల ఆఫీస్ వెనుక, డిటిసిపి అప్రూవ్డ్ లేఅవుట్‌లో స్థలాలు అమ్మబడును. Cell: 96668 94019, 93980 83034.

GENERAL

ఖాళీస్థలం అమ్మకం. పెద్దాపురం పట్టణం TTD కళ్యాణమండపం రోడ్ వరహాలయ్యపేటలో 192 చ॥గ॥ స్థలం అమ్మకం. ✆ 8328310691, 9177311445

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. MS ఆఫీస్, టైపింగ్‌లో పరిజ్ఞానం, పూర్తి వివరాలతో ఈనెల 16 నుండి 21 లోపు (10 am to 4 pm) సంప్రదించండి. సాగర్ కాంప్లెక్స్, సెవెన్ హిల్స్ రోడ్, సాంబమూర్తినగర్ 5వ వీధి, కాకినాడ-1, ✆ 92472 55155, 94928 02345.

Accountant & Receptionist (F) రియల్ ఎస్టేట్ కంపెనీలో చేయుటకు అనుభవం గలవారు కావలెను. జీతం:10 - 15 వేలు. ✆ 93924 41891.

స్త్రీ అభ్యర్థిని (40 సం॥లోపు) హిందువు మాత్రమే. విజయవాడలో ఇంటిలోనే ఉంటూ ఇంట్లోపని, 1 వెజిటేరియన్‌కు వంట చేయుటకు కావలెను. ✆ 92472 88381.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అన్నప్రసాదం విస్తర్లపై అన్యమత ప్రచారం

- తంటికొండ ఆలయ సిబ్బందిని నిలదీసిన భక్తులు
- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం..

గోకవరం, న్యూస్‌టుడే: వేంకటేశ్వరస్వామివారి అన్నసమారాధనలో అన్యమత ప్రచారానికి సంబంధించిన విస్తర్లు వినియోగించడంపై భక్తులు మండిపడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించిన వివరాలివీ.. తంటికొండ గ్రామంలో వెంకటగిరిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని దర్శించుకునేందుకు ప్రతి శనివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు దేవస్థానం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తారు. శనివారం నిర్వహించిన అన్నసమారాధనలో ఉపయోగించిన విస్తర్లను చూసి భక్తులు ఖంగుతిన్నారు. ఎందుకంటే ఆ విస్తర్లపై ఆంగ్ల అక్షరాలతో మేరీ క్రిస్మస్ అని రాసి ఉంది. అన్యమతానికి సంబంధించి విస్తర్లను దేవస్థానాలలో అన్నసమారాధనకు ఏవిధంగా ఉపయోగిస్తారంటూ అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీశారు. గతంలోను ఇదేవిధంగా ఆకులను వినియోగించిన సంఘటనను గుర్తుచేశారు. మీ నిర్లక్ష్యం కారణంగా దేవస్థానం ప్రతిష్ఠ దెబ్బతింటుందని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఈవో అక్కడకు చేరుకొని విస్తర్లను తొలగించారు. వంట గదిలో ఉన్న మిగిలిన విస్తర్లను ధ్వంసం చేయాలని పట్టుబట్టడంతో కొంత వివాదం నెలకొంది. దీనిపై దేవస్థానం ఛైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొరను వివరణ కోరగా పొరపాటున వచ్చిన ఆ విస్తర్లను వెంటనే తొలగిస్తామన్నారు. ఈ విధమైన సంఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామన్నారు.

తంటికొండ దేవస్థానంలో వినియోగించిన అన్యమత ప్రచార విస్తర్లు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,500
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారం రేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ డీఎస్ఏలో నిర్వహించిన అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఆదివారం ఫైనల్స్ ఉత్సాహంగా జరిగాయి. రొనాల్డో జట్టు విజేతగా నిలిచింది. భాటియా జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. గత రెండు నెలలుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో ప్రతి ఆదివారం మూడు మ్యాచ్‌లు చొప్పున జరిగాయని నిర్వాహకులు తెలిపారు. బహుమతి ప్రధానోత్సవానికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అధ్యక్షుడు తలాటం హరీష్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్, ఫుట్‌బాల్ కోచ్ స్వామి హాజరై క్రీడాకారులకు పతకాలు, కప్‌లను అందజేశారు. సత్తిరాజు, కృష్ణబాబు, ఫుట్‌బాల్ క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, సంఘ అసోసియేషన్ నాయకులు తదతరులు పాల్గొన్నారు.

విజేత రొనాల్డో జట్టుకు కప్‌ను అందజేస్తున్న ముఖ్యఅతిథులు

ఆర్ఎస్‌బీ హాకీ జట్టుకు కోచ్, కెప్టెన్‌గా కాకినాడ వాసులు

ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకూ న్యూదిల్లీలో జరగనున్న ఆల్‌ఇండియా హాకీ సివిల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆర్ఎస్‌బీ జట్టు కోచ్‌గా కడియాల రవిచంద్రప్రసాద్, కెప్టెన్‌గా ఎన్.వీరబాబు ఎంపికయ్యారు. వీరిద్దరూ కాకినాడ వాసులే కావడం విశేషం. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

9000180626, 9989993175

సత్యదేవుని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర అధికారి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామిని తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి.ఆనంద్ ఆదివారం దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం స్వామి దర్శనానికి వెళ్లిన ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

రాజానగరం: అనుమానాస్పదంగా తన కుమారుడు మృతి చెందాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజానగరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. జి.యర్రంపాలెంనకు చెందిన వీరలక్ష్మి, రమేష్ దంపతుల కుమారుడు కాలా ఇస్సాక్ అలియాస్ అశోక్ (21) మెకానిక్‌గా పని చేస్తున్నాడు. వీరలక్ష్మికి తన భర్తతో మనస్పర్థలు రావడంతో కుమారుడు అశోక్‌తో కలసి అదే గ్రామంలో ఉంటున్న తన సోదరి ఇంట్లో నివాసం ఉంటూ వంట, వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పనికి వెళ్లిన వీరలక్ష్మికి తన సోదరి నుంచి ఫోన్ రావడంతో ఇంటికి వెళ్లారు. అప్పటికే నేలపై పడి ఉన్న కుమారుడుని చూసి సోదరిని వివరం అడగగా.. శివరాత్రి సందర్భంగా స్నానానికి వెళ్లేందుకు ఇంట్లో ఉన్న అశోక్‌కు ఫోన్ చేయగా. . తీయలేదని, కిటికీలోంచి చూడగా ఇంటి దూలానికి ఉరి వేసుకుని కనిపించాడని చెప్పినట్లు వీరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీతో బహుళ ప్రయోజనాలు

- ఈనెలాఖరులోగా నమోదు పూర్తికి ఆదేశాలు

మీ కోసం

గండేపల్లి, న్యూస్‌టుడే: సొంత భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాలు అందేలా ప్రభుత్వాలు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశాయి.

నమోదు ప్రక్రియ ఇలా..:

ఈ ఫార్మర్ రిజిస్ట్రీని ఆర్ఎస్‌కేల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేస్తారు. ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, చరవాణి నంబరుతో సహాయకులను సంప్రదించాలి. నమోదయ్యాక చరవాణికి 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తోంది.

రిజిస్ట్రీతో ప్రయోజనాలివీ

విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పెట్టుబడి సాయం, ఎరువుల/ వ్యవసాయ యంత్రాల రాయితీ, పంటల బీమా, పంట దిగుబడుల విక్రయాలు, పంట రుణాలు తదితరాలు పొందొచ్చు.

28వ తేదీతో నమోదు పూర్తి

గత కొన్నాళ్లుగా నమోదు ప్రక్రియ జరుగుతోంది. గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన రైతుల సేకరిస్తున్నాం. నెలాఖరుకు వందశాతం నమోదు పూర్తి చేస్తాం. – లక్ష్మి, వ్యవసాయ అధికారి, గండేపల్లి

కెరటాల ఉద్ధృతికి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

పీఎంపాలెం, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కెరటాల ఉద్ధృతికి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన విశాఖపట్టణంలోని రుషికొండ బీచ్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. కొమ్మాది సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న అయిదుగురు విద్యార్థులు సమీప వసతిగృహంలో ఉంటున్నారు. ఆదివారం తూర్పు గోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన పి.అరవింద్‌నాయుడు (21), శ్రీకాకుళం జిల్లా వాసి సనపల రాజీవ్‌లు మరో ముగ్గురు స్నేహితులు గోకుల్‌కృష్ణ, ఆదిత్య, సాధిల్యలతో కలిసి ఉదయం 7 గంటలకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. సుమార 10 గంటల సమయంలో దగ్గరలోని ఓ రిసార్టు వెనుక బీచ్‌కు వచ్చారు. వీరిలో అరవింద్, రాజీవ్ సముద్రంలో ఈతకు దిగారు. మిగిలిన ముగ్గురు ఒడ్డున కూర్చున్నారు. ఒక్కసారిగా ఉద్ధృతంగా వచ్చిన కెరటాల్లో చిక్కుకున్న అరవింద్ కేకలు వేయడంతో పక్కనే ఉన్న రాజీవ్ కాపాడేందుకు ప్రయత్నించాడు. దీంతో ఇద్దరూ కెరటాల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. ఒడ్డున ఉన్న స్నేహితులు స్థానికుల సాయంతో జీవీఎంసీ బీచ్, టూరిజం లైఫ్‌గార్డులకు సమాచారం అందించారు. వెంటనే వారు బోటు ద్వారా గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి యువకులను రుషికొండ తీరానికి తీసుకొచ్చారు. వీరిలో అరవింద్ పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో విద్యార్థి రాజీవ్‌కు ప్రాథమిక చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడి తండ్రి సూర్యప్రకాష్ ఫిర్యాదు మేరకు ఎస్సై వరహాలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వారధిపై నుంచి దూకి యువతి ఆత్మహత్యాయత్నం

మామిడికుదురు, న్యూస్‌టుడే: పాశర్లపూడిబాడవ వైనతేయ వారధిపై నుంచి 29 ఏళ్ల యువతి ఆదివారం ఉదయం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వీరభద్ర సంబరంలో భాగంగా అక్కడే స్నానాలు ఆచరిస్తున్న భక్తులు గమనించి కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు అప్రమత్తమై ఆమెను రక్షించి బయటకు తీసుకువచ్చారు. మండలంలోని మాకనపాలేనికి చెందిన యువతిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. గల్ఫ్‌లో కొంతకాలం ఉండి వచ్చిన ఆమె ఇటీవల మానసికంగా ఇబ్బంది పడుతోందని వారు తెలిపారు.

(c) eenadu

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

త్వరితగతిన సబ్‌స్టేషన్ పనులు పూర్తిచేయాలి

కొత్తపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు సబ్‌స్టేషన్ పనులను నిర్దిష్ట గడువు లోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. కొత్తపేట శివారు ఏనుగుల మహల్ ప్రాంతంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ ప్రారంభమైతే పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా మరింత నాణ్యతతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, పోలారి సత్యానందం, ధరణాల రామకృష్ణ, ముద్రగడ సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రతిరోజు తాగునీటి సరఫరాకు చర్యలు

మలికిపురం, న్యూస్‌టుడే: ఇంటింటికి ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయడానికి ప్రభుత్వం నిధులు సమకూర్చుస్తూ పూర్తి సహాయ సహకారాలందిస్తోందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాజోలు నియోజకవర్గంలోని అమరజీవి జలధార పథకం ద్వారా మెరుగైన తాగునీటి సరఫరాకు కొత్తగా 37 ఓహెచ్ ఎస్సార్‌లు, 630 కి.మీ.ల మంచినీటి పైపులైన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కొత్తగా 30 వేల కొళాయిలు కేటాయించామన్నారు. అన్ని గ్రామాల్లో 60 వేల ఇళ్లకు శుద్ధమైన తాగునీరందించేందుకు చేసే ప్రయత్నంలో కొత్తగా మంజూరైన కొళాయిలు, పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు.

పలివెల ఉమాకొప్పులింగేశ్వరస్వామి ఆలయం వద్ద..

కనులపండువగా రథోత్సవం

కొత్తపేట, అంతర్వేది, న్యూస్‌టుడే: పలివెల ఉమాకొప్పులింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కనులపండుగగా రథోత్సవం నిర్వహించారు. వేలమంది భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వీక్షించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి సాయంత్రం స్వామివారిని పుష్పాలతో అలంకరించిన రథంపై ఊరేగింపు తరలించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కూటమి నాయకులతో కలిసి రథాన్ని లాగారు. ఈవో కామేశ్వరరావు, ఎస్సై సురేంద్రలను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మి, సాధే లక్ష్మి, కంఠంశెట్టి శ్రీనివాసరావు, గుబ్బల వీరేష్, పోలారి సత్యానందం, సాధే శ్రీనివాస్, వై.వి.కృష్ణ పాల్గొన్నారు. సఖినేటిపల్లి మండలం గుడిమూలలో శృంగవృక్షరామలింగేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు.

గుడిమూలలో ..

సర్వం.. శివమయం

● అశేష భక్తజనంతో పోటెత్తిన శైవక్షేత్రాలు

అంబాజీపేట, పి.గన్నవరం, మలికిపురం, అంతర్వేది, అయినవిల్లి, రాజోలు, మామిడికుదురు, ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ నామస్మరణ మార్మోగింది. ఆదివారం వేకువజాము నుంచే రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని శివాలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఏకాదశరుద్రులు కొలువైన గ్రామాల్లో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ముందుగా సమీప గోదావరి నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. మధ్యాహ్నం రుద్రహోమం, శాంతికళ్యాణం నిర్వహించారు. స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, దీపారాధనలు చేశారు. అన్నసమారాధనలు జరిగాయి. ఆలయాల వద్ద కమిటీ సభ్యులు, పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మలికిపురం భ్రమరాంబ మల్లేశ్వరస్వామి / ఉడుమూడిలో పార్వతీరామలింగేశ్వరుడు / మామిడికుదురులో మట్టి శివలింగం / అంతర్వేదిలో.. / క్షణముక్తేశ్వరస్వామికి అభిషేకం / చింతలపల్లిలో చిన్నారులు, మహిళల కోలాటం / పొన్నమండలో.. / అప్పనపల్లి మైసర్‌రాజు వీధిలో.. / మామిడికుదురులో.. / పెదపల్లలో.. / రావులపాలెం రామలింగేశ్వరుడు

గ్రామీణ రహదారులకు మహర్దశ

– న్యూస్‌టుడే, మలికిపురం, సఖినేటిపల్లి

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. గత వైకాపా ప్రభుత్వంలో రహదారులన్నీ నిర్లక్ష్యానికి గురై అధ్వానంగా మారడంతో ప్రజలు యాతన పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధిపై దృష్టిసారించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఫలితంగా ప్రజలకు ప్రయాణ, రవాణా సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి.

మొత్తం రూ.7.67 కోట్లు మంజూరు

పల్లె పండగ 2.0 కార్యక్రమం కింద రూ.7.67 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్‌లో రాజోలు నియోజకవర్గానికి 114 రహదారులు మంజూరయ్యాయి. మలికిపురం మండలం కేశనపల్లిలో 7, ఇరుసుమండ, విశ్వేశ్వరాయపురం, శంకరగుప్తంలో 5, గుబ్బలపాలెం, గుడిమెళ్లంకలో 4, లక్కవరం, బట్టేలంక, మట్టపర్రు, మేడిచర్లపాలెంలో 3, ఆదవిపాలెం, గూడపల్లి, కత్తిమండ, రామరాజులంకలో 2, చింతలమోరి, దిండి, మలికిపురం, పడమటిపాలెం, గూడపల్లిపల్లిపాలెంలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 55 రోడ్లకు రూ.3.79 కోట్లు మంజూరయ్యాయి.

● సఖినేటిపల్లి మండలంలో కేశవదాసుపాలెం,మోరిపోడు, వీవీమెరక, సఖినేటిపల్లిలో 4, అంతర్వేదిపాలెం, రామేశ్వరంలో 3, అంతర్వేది దేవస్థానం, అప్పనరామునిలంక, గొంది, మోరి, శృంగవరప్పాడులో 2, అంతర్వేదికర, గుడిమూల, సఖినేటిపల్లిలంకలో ఒకటి చొప్పున మొత్తం 35 రహదారులకు రూ.2.32 కోట్లు వచ్చాయి.

అభివృద్ధి చేయనున్న మేడిచర్లపాలెం ఏఏస్ కాలనీ నుంచి కొత్త కాలనీ వరకు రోడ్డు

● మామిడికుదురు మండలంలో 7 (గ్రామాలు) మగటపల్లికి 5, ఈదరాడ, మామిడికుదురులు 4, గోగన్నమఠం, కరవాకకు 3, కొమరాడకు 2 చొప్పున 24 రహదారులకు రూ.1.56 కోట్లు మంజూరయ్యాయి. రాజోలు మండలంలో 16 గ్రామాలకు గతంలోనే నిధులు వచ్చాయి.

పల్లె పండగ-2 లో..

రాజోలు నియోజకవర్గంలో మొత్తం వెయ్యి గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయడం లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. పల్లె పండగ కార్యక్రమంలో తొలి దశలో రూ.19 కోట్లతో 323 రోడ్లు మంజూరు కాగా, ఈసారి సుమారు రూ. 8 కోట్లతో మరో 115 రహదారులు మంజూరయ్యాయి. ఈ పనులు త్వరలో ప్రారంభమవుతాయి. రెండు మూడేళ్లలో మరో 500 రహదారులు అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఇవన్నీ పూర్తయితే చాలావరకు సమస్యలు తీరుతాయి.- దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే

బడులకు రక్షణ కరవు

● ప్రహరీల్లేక ప్రమాదాలు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

మండలంలో 50 శాతం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో రక్షణ కరువైంది. మొత్తం 53 పాఠశాలలు ఉండగా 2,800 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం ద్వారా విద్యాలయాల రూపురేఖలు మార్చామంటూ గొప్పలు చెప్పుకొన్నారు. కీలకమైన ప్రహరీల నిర్మాణం గురించి పట్టించుకోకపోవడంతో పాఠశాలలకు, విద్యార్థులకు రక్షణ కరువైంది.

మెర్లపాలెంలో రహదారికి చేర్చి ఉన్న పాఠశాల

పక్కనే కాలువలు.. చెరువులు

మండలంలోని మెర్లపాలెంలో ఎస్సీపేటను ఆనుకుని ఉన్న రెండు ప్రాథమిక పాఠశాలల చెంతన పంట కాలువలు, అదే గ్రామంలో కొత్తపాలెం పాఠశాల పక్కన చెరువు ఉన్నాయి. ప్రస్తుతం నీరు నిండుగా ఉండటంతో విద్యార్థులు అటువైపు వెళ్తే ప్రమాదం జరుగుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆత్రేయపురం ఎస్సీపేటలో ఉన్న పాఠశాల మురుగు కాలువకు ఆనుకుని ఉంది. గతంలో డ్రెయిన్‌లో పడి ఒక బాలుడు మృతి చెందాడు. మెర్లపాలెం జడ్పీ పాఠశాలకు రక్షణ గోడ నిర్మించేందుకు అవసరమైన స్థలం కూడా లేదు. మెట్టు దిగితే సరాసరి రోడ్డుపైకి వెళ్లాల్సి ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. అదే గ్రామ ర్యాలిలో జడ్పీ ఉన్నత పాఠశాలకు కొంత భాగం ప్రహరీ నిర్మించి వదిలేశారు. సెలవు రోజుల్లో కొంత మంది ఆకతాయిలు పాఠశాలలోకి ప్రవేశించి జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. తరగతి గదుల్లోకి రాళ్లు విసిరి పాడుచేస్తున్నారు. ఇలా పలు పాఠశాలలు ప్రహరీలు లేక రక్షణ కరువైంది. విద్యాశాఖ స్పందించి వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖాధికారి పీవీ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ప్రహరీలతోపాటు క్రీడా స్థలాల అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆమోదం లభించిన తరువాత పనులు చేపడతామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1

మంచినీటి ట్యాంకు శుభ్రం

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: లక్ష్మీపోలవరంలో మంచినీటి పథకం ద్వారా సరఫరా చేసే నీటిలో మలినాలు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి సవిత దృష్టికి తీసుకుని వెళ్లగా ట్యాంకును శుభ్రం చేయించారు.

వసంతవాడలో చెత్త తొలగించారు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వసంతవాడలో పలుచోట్ల చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని సర్పంచి గాదిరాజు రామకృష్ణంరాజు వద్ద ప్రస్తావించగా సిబ్బందితో శుభ్రం చేయించారు.

శాశ్వత ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ

మామిడికుదురు, న్యూస్‌టుడే: స్థానిక ఆల్‌కోట్ కాలనీలో 11 ఇళ్లు కాలిపోయి నిరాశ్రయులైన కుటుంబాలకు ఆరు నెలల్లో ఒకేచోట నివేశన స్థలాలు కేటాయించి శాశ్వత గృహ నిర్మాణాలకు కార్యాచరణ చేస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. దీనికి సంబంధించి మామిడికుదురులో తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో జి.భవాని, వివిధ శాఖల అధికారులతో ఆదివారం సమీక్షించారు. అప్పటి వరకు తాత్కాలికంగా రేకుల షెడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పునరావాస కేంద్రంలో ఉన్న బాధిత కుటుంబాలకు మరో వారం రోజుల వరకు దాతల సహకారంతో భోజనాలు సమకూర్చాలన్నారు. అనంతరం ఆయన తాత్కాలిక రేకుల షెడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. దాతలు సమకూర్చిన నిత్యావసరాలను అందజేశారు. సర్పంచి గొస్ మొహిద్దీన్, నగరం సొసైటీ ఛైర్మన్ ఈలి శ్రీనివాసరావు, తెదేపా, జనసేన మండల అధ్యక్షులు బోనం బాబు, దొడ్డ జయరామ్, మట్టా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్

వ్యర్థాలతో పారుదలకు ఆటంకం

లొల్ల మీడియం డ్రెయిన్‌లో తూడు, వ్యర్థాలు మేట వేయడంతో మురుగునీటి పారుదలకు అంతరాయం కలుగుతోంది. గ్రామం నుంచి బ్యాంక్‌కెనాల్ వరకు విస్తరించి ఉన్న ఈ డ్రెయిన్‌ను శుభ్రపరచకపోవంతో సార్వా, దాళ్వా సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత శాఖ ఏఈ వి.జయలక్ష్మి వద్ద ప్రస్తావించగా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ప్రాంగణమిలా.. ఆటలెలా..?

రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా మైదానంలో మొక్కలు మొలిచి దుర్భరంగా ఉంది. విషసర్పాలు సంచరిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ క్రీడల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నా సాధనకు అనుకూలంగా లేదు. దీనిపై ప్రిన్సిపల్ పి.సాయిబాబును వివరణ కోరగా క్రీడా ప్రాంగణం అభివృద్ధికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

పునాదుల్లోనే పనులు.. తుప్పు పట్టిన ఊచలు

మలికిపురం మార్కెట్ ప్రాంతంలో వాణిజ్య దుకాణ సముదాయ నిర్మాణం నిధుల కొరతతో పునాది దశలోనే నిలిచిపోయింది. 2020లో ఇక్కడ ఆరు దుకాణాలతో వాణిజ్య సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆరేళ్ల నుంచి పునాదుల్లో ఉన్న ఇనుప ఊచలు తుప్పుపడుతూ పాడైపోతున్నాయని స్థానికులు అంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబును వివరణ కోరగా సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి సహకారంతో నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

ఇదేం తీరు.. ఎవరూ పట్టించుకోరు!

పాశర్లపూడి గ్రామ సచివాలయం-2 భవనంపై నవరత్నాల పేరుతో గత పాలనలోని బోర్డును ఇప్పటికీ తొలగించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీటీసీ మాజీ సభ్యుడు చుట్టుగుల్ల కిషోర్ తదితరులు తెలిపారు. ఈ విషయాన్ని ఉప ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా అక్కడి కార్యదర్శికి తెలియజేసి వెంటనే చర్యలు చేపట్టేలా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

అప్రోచ్ శిథిలం.. రాకపోకలు ఇబ్బందికరం

సిరిపల్లిలో పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రహదారిలో పంట కాలువపై ఉన్న వంతెనకు రెండు వైపులా అప్రోచ్ దిగబడి, గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో పలువురు వాహన చోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. ఈ సమస్యను ఎంపీడీవో సరోవర్‌రావు దృష్టికి తీసుకువెళ్లగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

రథానికి స్వాగతం పలుకుతున్న నాయకులు

బౌద్ధధర్మ ప్రచారం అవసరం

అంబాజీపేట, న్యూస్‌టుడే: బౌద్ధధర్మ ప్రచారం చాలా అవసరమని పుల్లేటికుర్రు సర్పంచి జల్లి బాలరాజు, మాజీ సర్పంచి నూకపెయ్యి చిన్న, కోట హనుమంతరావు అన్నారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు కూడళ్లలో ఆదివారం బౌద్ధధర్మ ప్రచార రథానికి వీరు స్వాగతం పలికారు. బౌద్ధ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. వివిధ గ్రామాల్లో ఈ ప్రచార రథంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాగాబత్తుల వెంకటసుబ్బారావు, బీర సురేష్, ఎన్.సుధాకర్, మట్టా వెంకట్రావు, గోసంగి శ్రీనివాస్, కె.వి.వి.సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

జొన్నాడ వారధి వద్ద అగ్నిప్రమాదం

ఆలమూరు, న్యూస్‌టుడే: జొన్నాడ-రావులపాలెం వంతెన దిగువ ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వంతెనపై నుంచి గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ కాల్చి పడేయడంతో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. జొన్నాడ పైవంతెన పనుల కోసం గుత్తేదారు అక్కడ ఉంచిన సామగ్రి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. మంటల నుంచి ఎగసిన పొగతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

జొన్నాడలో వ్యాపిస్తున్న పొగ

భక్తిశ్రద్ధలతో వీరభద్రుని పూజలు

ఆలమూరు, న్యూస్‌టుడే: ఆలమూరులో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వీరభద్రుని సంబరం నిర్వహించారు. గ్రామంలో గద్దె వద్ద ఉన్న వీరభద్రులను తీసుకెళ్లి గౌతమీ నదిలో స్నానమాచరింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో సాగిన ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఊరేగింపులో భక్తులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయ సమీపంలో వీరభద్రుడి సంబరం వైభవంగా నిర్వహించారు. బోనగిరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వీరభద్రుడు కల్యాణోత్సవం జరిగింది. రాత్రి నిప్పులగుండాన్ని తొక్కారు.

ప్రజా రంజకంగా రాష్ట్ర బడ్జెట్

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 రాష్ట్ర బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్ అన్నారు. అంతర్వేదిలో సఖినేటిపల్లి భాజపా మండల శాఖ అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. రోడ్లు, నీటిసరఫరా, గ్రామీణాభివృద్ధి, మురుగునీటి పారుదల, జలజీవన్ మిషన్, చిన్నపరిశ్రమల బలోపేతం, రైతులు, మహిళలు, యువత తదితర వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి నిధులు కేటాయించడం ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోణం నాయుడు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

చెత్త, వ్యర్థాల తొలగింపు

అయినవిల్లి, న్యూస్‌టుడే: కె.జగన్నాథపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడాది కిందట శిథిలావస్థకు చేరిన పాతభవనం తొలగించినా వాటి వ్యర్థాలు, చెత్తను పాఠశాల ప్రధాన గేటు వద్ద వదిలేయడంతో ప్రాంగణంలో పాములు, కీటకాలు సంచరించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. ఈ దుస్థితిపై ఈ నెల 7న 'వ్యర్థాలతో విద్యార్థుల ఇక్కట్లు' శీర్షికన ప్రచురితమైన చిత్రవార్తకు స్పందించిన అధికారులు వాటిని తొలగించారు.

విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న నాయకులు

బులుసు సాంబమూర్తి జయంతి

కొత్తపేట, న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్యం, ప్రత్యేకాంధ్ర రాష్ట్రం, విశాలాంధ్ర అనే లక్ష్యాల సాధనకు బులుసు సాంబమూర్తి నిరంతరం కృషి చేశారని పలివెల మహాత్మాగాంధీ అధ్యయన సంస్థ కార్యదర్శి దుళ్ల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పలివెలలో సాంబమూర్తి జయంతిని పురస్కరించుకుని జాతీయ నాయకుల విగ్రహాలకు చేనేత దండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకరుగా ఆ పదవికే ఆయన వన్నె తెచ్చారని, రైతు సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించేలా చర్యలు చేపట్టేవారని కొనియాడారు. కంకటాల శ్రీరామమూర్తి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఐలాపురం' మృతి తీరనిలోటు

అంబాజీపేట, న్యూస్‌టుడే: కుమ్మరిశాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతి తీరని లోటని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరరావు, సలహాదారు దొడ్డిపట్ల శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్సీగా ప్రజలు, సామాజికవర్గానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. వెల్లా త్రిమూర్తులు, సఖినేటిపల్లి పెద్దిరాజు, పుల్లేటికుర్తి రత్నం, ర్యాలి శ్రీనివాస వుడయార్, జిల్లా అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి, చిరుతపూడి హేమలత, మంతెన లక్ష్మీ తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

బాధిత కుటుంబాలకు రోటరీ క్లబ్ వితరణ

మామిడికుదురు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆశ్రయం పొందుతున్న ఆల్‌కోట్ కాలనీ అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు రాజోలు రోటరీక్లబ్ ఆదివారం సాయమందించింది. నిత్యావసరాలు, దుస్తులు, దుప్పట్లు, కొంత ఆర్థిక సాయాన్ని అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి ఆంజనేయులు, కార్యదర్శి నామన షణ్ముఖ్, లక్ష్మణరావు, కవీంద్ర, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

ఆలయాల నిర్మాణానికి విరాళాల వెల్లువ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురంలోని విశ్వేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామానికి చెందిన నంద్యాల రామచంద్రరాజు జ్ఞాపకార్థం మనుమలు వెంకటరాజు, నాగరాజు ఆదివారం రూ.5 లక్షలు, ముదునూరి సత్యనారాయణరాజు(ర్యాలి అబ్బాయి) దంపతుల పేరు మీద డాన్స్‌మాస్టర్ సురేష్‌వర్మ రూ.లక్ష అందించారు. దాతలను ఆలయ ఛైర్మన్లు వేగేశ్న ప్రసాదరాజు, పులవర్తి కాశీవిశ్వనాథం, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు అభినందించారు.

తీర గ్రామాల దాహార్తి తీరేనా!

– న్యూస్‌టుడే, అంతర్వేది

తీరప్రాంత ప్రజల దాహార్తి తీర్చడానికి అంతర్వేది దేవస్థానం గ్రామంలో నిర్మించిన తాగునీటి ప్రాజెక్టు ఎప్పటికి ప్రారంభమయ్యేనని ఆశగా ఎదురు చూస్తున్నారు. స్థానికులతో పాటు పల్లిపాలెం, గొంది, అంతర్వేదికరకు చెందిన సుమారు 35 వేల మందికి తాగునీరు అందించడానికి జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ. 17.83 కోట్లతో దీనిని నిర్మించారు. సఖినేటిపల్లి మూడు తూముల వద్ద ప్రధాన పంటకాలువ నుంచి ప్రాజెక్టు వరకు 12 కిలోమీటర్ల ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసి సుమారు నాలుగు నెలల పాటు నీటితో నింపారు. అన్ని హంగులతో తీర్చిదిద్ది జనవరి 30న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. అనివార్య కారణాలతో ప్రారంభోత్సవం నిలిచిపోయింది.

కలుషితమవుతున్న నీరు

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ తాగునీటి ప్రాజెక్టులో నింపిన నీరు ఆరు నెలల పాటు నిల్వ ఉండిపోయింది. దీంతోపాటు అడుగు భాగం నుంచి ఉప్పునీరు ఊరడంతో క్రమేపీ కలుషితమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోనే ఆక్వా చెరువులు ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. ఇప్పటికే కొంత నీటిని బయటకు తోడేశారు. వేసవి కాలం సమీపిస్తుండటంతో మరో నెలలో కాలువలు కట్టేసే అవకాశం ఉంది. దీంతో మరింతగా ఉప్పునీటి జలాలుగా మారే అవకాశం ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

తాగునీటి ప్రాజెక్టు

ఎమ్మెల్యేకు విన్నవించాం

కిందిభాగంలో వేసిన బెడ్‌కార్పెట్ నుంచి జలాలు పైకివచ్చి వగరుగా, ఉప్పుగా మారినట్లు అనిపిస్తుంది. ప్రస్తుతం చెరువులోని నీటిని కొంతవరకు బయటకు తోడేశాం. కాలువ ద్వారా కొత్తగా నింపుతున్నాం. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు పరిస్థితిని వివరించాం. సురక్షితమైన నీటినే కొళాయిల ద్వారా పంపిణీ చేస్తాం.
– శిరీష, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, సఖినేటిపల్లి

పాస్‌పోర్టు పోయినది

డా॥ B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు మండలం, కడలి గ్రామం, D.No. 5-23/Aకి చెందిన ఇస్టా త్రిమూర్తులు, S/o శ్రీరాములు అను నా యొక్క R9333763 నెంబరు గల ఒరిజినల్ పాస్‌పోర్టు జిరాక్సు నిమిత్తం ఇంటి దగ్గర నుండి జగ్గన్నపేట సెంటర్‌కి వెళ్ళి వస్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు దయవుంచి ఈ క్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు.
సెల్. 72073 18645

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

అమలాపురం మున్సిపల్ కాలనీలో వీరబ్రహ్మేంద్ర స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం

అమలాపురం పట్టణం: అమలాపురం మున్సిపల్ కాలనీలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మ 27వ కల్యాణ మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కొప్పాడి సత్యనారాయణ, సత్యవతి దంపతులు ఏర్పాట్లు చేశారు.

రైతుబజార్‌లో ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాట - 16, వంకాయలు నలుపు - 30, తెలుపు - 26, బెండకాయలు - 36, పచ్చిమిర్చి - 45, కాకరకాయ - 42, బీరకాయలు - 40, కాలీఫ్లవర్ - 25, క్యాబేజీ - 20, క్యారెట్ - 30, దొండకాయలు - 45, బంగాళదుంపలు - 20, ఉల్లిపాయలు - 18, 25, గోరుచిక్కుళ్లు - 39, దోసకాయలు - 28, చిక్కుడుకాయలు - 33, చేమదుంపలు - 37, కంద -54, బీట్‌రూట్ - 30, కీరదోసకాయలు - 29, అల్లం - 75, క్యాప్సికం - 75, చిలకడదుంపలు - 35, 45, గుమ్మడి - 34, ఉసిరి - 80, ముల్లంగి - 40, కరివేపాకు - 90, నిమ్మకాయలు - 55, మామిడికాయ- 110. ● అనబకాయ - 18, పొట్లకాయ -20, అరటికాయ -6, మునగకాయ -15, ఆకుకూరలు కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 8, కొబ్బరికాయ - 25.

మురమళ్లలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి అభిషేకం

యానాంలో బెల్లంతో శివలింగాలు

ద్రాక్షారామ: దక్షగుండంలో చెరువులో పూలు, విద్యుద్దీపాలంకరణ

కుండలేశ్వరాలయం చెంతన నదిలో స్నానాలు

శివోహం.. భక్తజన ప్రవాహం

● వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు

నాగ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఎస్పీ రాహుల్ మీనా పూజలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పరమశివుడి సేవలో భక్తులు తరించారు. శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. శివాలయాల వద్ద హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల శివ నామస్మరణతో పరవశించారు.

● ముమ్మిడివరంలోని ఉమాసూర్యేశ్వర స్వామి ఆలయం వద్ద తెల్లవారుజాము 3 గంటల నుంచే భక్తుల తాకిడి ప్రారంభమైంది. భగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

రామచంద్రపురం: బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనాలకు క్యూ కట్టారు. ఈవో సత్యనారాయణ, ట్రస్టుబోర్డు ఛైర్మన్ చెరుకుపల్లి గణేష్‌శర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి పుష్కరనదీ జలాభిషేకం జరిగింది. దేశంలోని 12 నదుల నుంచి తీసుకొచ్చిన జలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ రామకృష్ణంరాజు, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యానాం: గౌతమి గోదావరి తీరంలోని శివంబాత్ వద్ద వేకువ జాము నుంచే భక్తులు పుణ్యస్నానాలాచరించారు. అయ్యన్ననగర్ స్వధర్మ ప్రచారకేంద్రం నిర్వాహకుడు మల్లాడి వసంతరావు 108కిలోల బెల్లంతో తయారుచేయించిన శివలింగం వద్ద మహా రుద్రాభిషేకం నిర్వహించారు. 180 చిన్న శివలింగాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వివిధ ఆలయాలను సందర్శించి పూజలు చేశారు.

కాట్రేనికోన: కుండలేశ్వరాలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. అమలాపురం ఆర్డీవో మాధవి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

● తెదేపా నేత పీఎస్ఎన్ రాజు కాట్రేనికోన నుంచి కుండలేశ్వరానికి ఉచిత ఆటోలు ఏర్పాటు చేశారు. కాట్రేనికోన సిద్ధార్థ ఆటో యూనియన్ 30 ఆటోలను ఏర్పాటు చేసింది. ● కుండలేశ్వరున్ని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ దంపతులు, అధికారులు దర్శించుకున్నారు.

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ ఛైర్మన్ రామకృష్ణంరాజు వృద్ధులు, చిన్నారులకు పాలు, బిస్కట్లు పంపిణీ చేశారు. సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సత్యసాయి భజనామండలి సభ్యులు భక్తులకు సేవలందించారు. ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు స్వామివారిని దర్శించుకున్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ ఘంటాంబిక అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అఖండ దీపోత్సవం నిర్వహించారు. సత్తి సుబ్బారెడ్డి దీపాలు వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండమూరి కొండ ఆధ్వర్యంలో శివలింగాకృతి, స్వస్తిక్ ఆకారంలో దీపాలు వెలిగించారు. దక్షగుండం నీటిలో చామంతిపూలు, గులాబి రేకలు వేసి, ఘంటాంబిక ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

అమలాపురం గ్రామీణం: నడిపూడిలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, సమయనలోని సర్వమంగళ సమేత సోమేశ్వరస్వామి, రంగాపురంలోని రామేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. బండారులంకలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.



ముమ్మిడివరం మండలం కొత్తలంక శివాలయంలో పూజలు

కోటిపల్లి ఆలయ ముఖమండపం మీద కోటి దీపారాధన పూజలు చేస్తున్న మంత్రి సుభాష్

కిక్కిరిసిన క్యూలు.. సొమ్మసిల్లిన మహిళ

మహిళకు సపర్యలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పామర్రు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన ప్రముఖ శైవక్షేత్రం కోటిపల్లిలో స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూ కాంప్లెక్సుల్లో రద్దీ ఏర్పడింది. ఎండ వేడిమి, ఉపవాస దీక్షల కారణంగా ఒక భక్తురాలు సొమ్మసిల్లి పడిపోయారు. అదే సమయానికి అటుగా వచ్చిన మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం గమనించి తన వాహనంలో స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్దకు తీసుకెళ్లారు.

16 కిలోమీటర్లు.. 26 చోట్ల ఆహార పంపిణీ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, కోటిపల్లిలో రాజరాజేశ్వరీ సమేత ఛాయాసోమేశ్వరస్వామి దర్శనాలకు వెళ్లే భక్తులకు పలువురు పులిహోర, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. రామచంద్రపురం నుంచి ద్రాక్షారామ మీదుగా కోటిపల్లి వెళ్లే మార్గం మొత్తం 16 కిలోమీటర్లలో.. 26 ప్రాంతాల్లో పులిహోర, మజ్జిగ పంపిణీ, పలుచోట్ల అన్నదానాలు చేశారు.

మగసానితిప్పలో కాలభైరవుడి తీర్థం

బోటులో ఆలయానికి వెళ్తున్న ఎమ్మెల్యే దాట్ల తదితరులు

కాట్రేనికోన: మగసానితిప్పలో కాలభైరవుడి ఆలయం వద్ద ఆదివారం తీర్థం ఘనంగా నిర్వహించారు. బలుసుతిప్ప, ఐ.మూలపాలెం, యానాం, దరియాలతిప్ప, ఉప్పాడ తదితర రేవుల నుంచి మగసానితిప్పకు మడ అడవుల మధ్యన ప్రవహించే గోదావరి పాయల్లో 45 నిమిషాల పాటు బోటు ప్రయాణం చేసి భక్తులు ఈ ఆలయానికి చేరుకున్నారు. పెద్దఎత్తున తీర్థం, సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సై అవినాష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కాలభైరవస్వామిని దర్శించుకున్నారు.

విశ్వశాంతి యాత్ర

యాత్రను ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీ శ్రీదేవి

అమలాపురం పట్టణం: పట్టణంలోని సర్వారామలింగేశ్వర స్వామి, చెన్నమల్లేశ్వరస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి, సిద్ధేశ్వర స్వామి ఆలయాలలో అభిషేకాలు, అఖండ దీపారాధన చేశారు. రవణంలోని ఓం శాంతి కేంద్రంలో బ్రహ్మకుమారీ విశ్వశాంతియాత్ర నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద భారీ బాణసంచా కాల్పులను భక్తులు వీక్షించారు.

ప్రతిగ్రామంలో తెదేపా డిజిటల్ సైన్యం

అమలాపురం పట్టణం: ప్రతి గ్రామంలో 'మై టీడీపీ' యాప్ గోడపత్రికలను ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. అమలాపురం హోంగార్డ్సులోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే ఆనందరావు, తెదేపా నాయకులు ఆదివారం 'మై టీడీపీ' యాప్ గోడపత్రికలను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ప్రతి గడపకు చేరవేసేలా ఈ యాప్ రూపొందించారన్నారు. పార్టీ తీసుకునే నిర్ణయాలు, కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి సమాచారం యాప్ ద్వారా నేరుగా తెలుసుకోవచ్చన్నారు. సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలో నంబర్ 1 డిజిటల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకోవాలని పేర్కొన్నారు.

నేడు మహాధర్నా

కాట్రేనికోన, న్యూస్‌టుడే: గచ్చకాయలపోరలోని కూనవరం స్ట్రెయిట్ కట్ మొగ సముద్రంలో కలిసేచోట పూడిక తీయాలని కోరుతూ మత్స్యకారులు, రైతులతో సోమవారం ధర్నా చేస్తామని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు తెలిపారు. కన్నెళ్లుగా మొగ మూసుకుపోవడంతో మత్స్యకారులు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. స్ట్రెయిట్‌కట్ డ్రెయిన్ గట్టులను ఆధునికీకరించి చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు.

యానాంలో హిందీ పరీక్ష

యానాం, న్యూస్‌టుడే: చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో స్థానిక పడవలరేవు వీధిలోని డ్రీమ్స్ పాఠశాలలో ఆదివారం హిందీ అధ్యయన పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర ప్రవేశిక పరీక్షలను వివిధ తరగతుల విద్యార్థులకు హిందీ ప్రచారక్ సభ్యులు నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ యర్రంశెట్టి వీరబాబు, హెచ్‌ఎం టిళ్లపూడి అప్పారావు బృందం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: చిన గాడవిల్లిలోని 198, 199 పోలింగ్ కేంద్రాలను గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. స్థానిక తెదేపా నాయకులను అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి లంకే భీమరాజు, ఎంపీటీసీ సభ్యుడు నిమ్మకాయల రాము, వాసంశెట్టి శ్రీనివాస్, దడాల శ్రీనివాస్, నిమ్మకాయల వెంకటరామారావు, చుక్కల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిశాంతి, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. అర్జీదారులు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని సూచించారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్

విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం, న్యూస్‌టుడే: సావిత్రి నగర్‌లోని మల్లాడి సత్యలింగ నాయకర్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన మల్లాడి దర్వాడావు మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. 23 జట్లు పోటీలో పాల్గొనగా డబుల్స్ విజేతగా మురళి, విజయ్, రన్నరప్‌గా పవన్, చిన బాబు నిలిచారు. ఉత్తమ క్రీడాకారుడి అవార్డు యువరాజ్‌కు లభించింది. మల్లాడి రాజు, తాతాజీ పోటీలను నిర్వహించగా విజేతలకు ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ట్రోఫీలు, రూ.5వేలు, మూడు వేలు చొప్పున నగదు, బహుమతులను అందజేశారు. బ్యాడ్మింటన్ కోచ్ రజాక్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

విలసవిల్లిలో జాగరణోత్సవాలు

ప్రత్యేకాలంకరణలో ఆలయం

ఉప్పలగుప్తం: విలసవిల్లిలో వీరేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం రాత్రి నుంచి గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, తీర్థాన్ని తిలకించి పలు గ్రామాల ప్రజలు జాగరణోత్సవాల్లో పాల్గొన్నారు.

అమ్మవారి జాతర ప్రారంభం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఐ.పోలవరం ఇలవేల్పు మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు అమ్మవారికి జాతర నిర్వహించి ఉగాది రోజున జరిగే తీర్థమహోత్సవంతో ముగుస్తుంది. మిరిమిట్లు గొలిపే విద్యుత్తు కాంతులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించనున్నారు.

అసంపూర్తిగా కార్యాలయ భవనం

అమలాపురం మండలం ఎ.వేమవరంలోని సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. గత వైకాపా పాలనలో నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఇప్పటివరకు పూర్తికాలేదు. ఇక్కడి సిబ్బంది ఓ సామాజిక భవనంలోని ఇరుకు గదిలో విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

వేలాడుతున్న ప్రమాదం

ఉప్పలగుప్తం మండలం ఎన్.కొత్తపల్లిలో నల్లావారిపేటలో పంపుహౌస్ వద్ద విద్యుత్తు నియంత్రిక పరిస్థితి ఇదీ. ఫ్యూజ్‌బాక్సు దెబ్బతినడంతో రెండు తీగలను కలిపేశారు. అవి నేలనుతాకేలా ఉండటం గమనార్హం. ఈ ప్రాంతంలో పశువులు, మనుషులు తిరుగుతుండటంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

రాళ్లు లేచిన రహదారి

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పైగోడిమెరక వెళ్లే రహదారి రాళ్లుతేలి అధ్వానంగా మారింది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగుకాలువ చెంతన ఉన్న ఈ రహదారిపై నడిచేందుకు సైతం వీలులేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ముమ్మిడివరం

బ్యాంక్ ఆఫ్ బరోడా (बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda)

టి.కొత్తపల్లి బ్రాంచ్
డోర్ నెం.1-32, మెయిన్ రోడ్, టి.కొత్తపల్లి,
ఐ.పోలవరం మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆం.ప్ర.-533220

అనుబంధం-1, తిరిగి పొందుటకు నోటీసు (రిడెంప్షన్ నోటీసు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని
రూల్ 6(2) మరియు / లేదా రూల్ 8(6) క్రింద నోటీసు

BOB/VJTKOT/REDEMPTION NOTICE/2025-26/1 Date: 16.09.2025

దిగువ వారికి:
శ్రీ దాసరి భీమేశ్వరరావు, తండ్రి: దాసరి సాయిబాబు, డి.నెం. 2-31, గొడ వారి వీధి, జి.వేమవరం, ...

[illegible]

స్వాధీనం నోటీసు తేది: 19-10-2024
స్వాధీనం ప్రచురణ తేది: 24-10-2024

తేదీ: 16.02.2026, స్థలం: టి.కొత్తపల్లి — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

అన్నివర్గాలకు న్యాయం చేసేలా బడ్జెట్

తెదేపా కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు, తెదేపా, జనసేన నాయకులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అన్నివర్గాలకు ఉపయోగపడేలా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కొనియాడారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆదివారం తెదేపా, జనసేన, భాజపా నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో రాక్షస పాలన సాగించిందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం పేదల కోసం ప్రత్యేకంగా మూడు సెంట్ల ఇళ్లస్థలం ఇవ్వడంతో పాటు, గృహనిర్మాణానికి రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుందని తెలిపారు. అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, మట్టా ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధి

అల్లవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. ఆదివారం అల్లవరం నుంచి తూర్పులంక వరకు ఉన్న ర.భ. శాఖకు చెందిన రహదారి ఆధునికీకరణ పనులకు ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. గత వైకాపా పాలనలో రహదారులు ఛిద్రమై ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడ్డారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రహదారుల అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, ఏడుకొండలు, ముత్యాల బాబి, ఎంపీటీపీ సభ్యురాలు మౌనిక, సర్పంచి బాలవేణి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో చెరువులు కలుషితం

మంచినీటి చెరువు గట్టుపై వ్యర్థాలు

యానాం, న్యూస్‌టుడే: యానాం సరిహద్దు ద్రాక్షారామ రోడ్డు మార్గంలో ఉన్న 53ఎకరాలు రక్షిత మంచినీటి చెరువులు తగినంత పర్యవేక్షణ లేక కలుషితమవుతున్నాయి. తాగునీటి కొరత అధికంగా ఉండే వేసవిలో మంచినీటిని సరఫరా చేయడం కోసం 2005లో అప్పటి ఏపీ ప్రభుత్వం యానాంకు భూములను మంజూరుచేసింది. ధవళేశ్వరం నుంచి పైపులైన్ ద్వారా ఇక్కడి చెరువులకు నీటి సరఫరా చేస్తున్నారు. తగినంత కాపలా లేకపోవడంతో సాయంత్రం సమయంలో మందుబాబులు చెరువు గట్లపై మద్యం సేవించి పేపరు ప్లేట్లు, మద్యం, నీటి సీసాలను అక్కడే పారేస్తున్నారు. దీంతో అవి చెరువులో పడి నీరు కలుషితం అవుతోంది. నిత్యం నడక, వ్యాయామానికి వచ్చేవారు దుస్థితి చూసి ఆవేదన చెందుతున్నారు. ప్రజా పనులశాఖ కార్యనిర్వాహక ఇంజినీరు ఎక్కువ రోజులు సెలవులో ఉండడంతో సరైన పర్యవేక్షణ, జవాబుదారీతనం కరవయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

పండగ రోజుల్లోనూ.. చెత్తతీయరే..?

రామచంద్రపురం పట్టణంలో సకాలంలో చెత్తను తరలించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. శివాలయం వెనుక వీధి బండారు వారి వీధి మొదట్లో, త్యాగరాజ నగర్, సూర్యానగర్‌లు కలిసే కూడలిలో చెత్తపోగులు ఉన్నాయి. పండగ సమయాల్లోనైనా వీధుల్లో చెత్త లేకుండా పురపాలక అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు. దీనిపై శానిటరీ తనిఖీదారు డేవిడ్‌రాజును వివరణ కోరగా ఆదివారం కావడంతో కొన్ని ప్రాంతాల్లో చెత్త ఉండిపోయిందని, ఇకపై సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రామచంద్రపురం

వెంకయ్య మృతి తీరనిలోటు

పామర్రు, న్యూస్‌టుడే: రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంఘ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతి తీరనిలోటని వక్తలు అన్నారు. ఆదివారం కె.గంగవరంలో మండల శాఖ అధ్యక్షుడు ఆదుర్తి గోపాలరావు అధ్యక్షతన సంతాపసభ జరిగింది. ఏడిద నాగరాజు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏడిద వెంకటరమణ, మురళి, అంబటి నరేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అమృతమూర్తికి అశ్రునివాళి

మాకు అత్యంత ఆప్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అయిన శ్రీ తోట త్రిమూర్తులు గారి సోదరుడు, శ్రీ తోట పుండరీకాక్షులు (బాబి) గారి తండ్రి గారైన కీ॥శే॥ శ్రీ తోట సత్యనారాయణ (సత్తికొండ) గారి మరణమునకు చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీ తోట సత్యనారాయణ (సత్తికొండ) గారు
వెంకటాయపాలెం

V.V.V.S.N.చౌదరి — M/s శ్రీ వల్లూరి కామేశ్వరరావు ప్రగతి ఫైనాన్స్

పంపన గోవిందు — డైరెక్టర్: సెయింట్ గ్లోరియస్, శ్రీ వైష్ణవి జూనియర్ కాలేజ్, రామచంద్రపురం

అమృతరక్ష హాస్పిటల్ — డా॥ M.రాంబాబు, డా॥ M.S.V.రఘువీర్‌కాంత్, ద్రాక్షారామ

మేర్నీడి శ్రీను — తోటపేట

పసుపులేటి సత్తిబాబు — మాజీ మున్సిపల్ కౌన్సిలర్, రామచంద్రపురం

అనిశెట్టి రామకృష్ణ, సర్పంచ్ — కోనసీమ జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఛైర్మన్, జగన్నాయకులపాలెం

పోతాబత్తుల శ్రీవెంకట ఉమాశేషు — Ex. MPTC, జగన్నాయకులపాలెం

అంజనీ A/C ఫ్యామిలీ రెస్టారెంట్ — కంచెర్ల సర్వ యేసు ఆంజనేయరాజు, రామచంద్రపురం

అనిశెట్టి సత్యం (చంటి) — S/o విష్ణుమూర్తి, Y.S.R.C.P. నాయకులు, జగన్నాయకులపాలెం, సెల్: 98484 53125

శ్రీ వెంకటరమణ రైస్‌మిల్లు — ప్రొ: తాడాల రామకృష్ణ (రాంబాబు), K.గంగవరం, సెల్: 98497 55229

సౌభాగ్యలక్ష్మి రా & బాయిల్డ్ రైస్‌మిల్లు — మే॥పా॥ సలాది గంగన్న, సలాది వీరవెంకటరమణ, K.గంగవరం, సెల్: 93488 64438

శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ — కా॥: శ్రీ లక్ష్మీగణేష్ రా & బాయిల్డ్ రైస్‌మిల్లు, మే॥పా॥ కొరిపెల్ల రాజశేఖర్, K.గంగవరం

పొట్టిపోతుల శ్రీనివాస్ (చలపతి), అన్నాయిపేట

యాట్ల చిన అప్పారావు — Ex. సర్పంచ్, ద్రాక్షారామ

దేవి లారీ సప్లయి ఆఫీసు — చవాకుల సూర్యభాస్కరరావు, Ex. సర్పంచ్, తలాటం నాగేశ్వరరావు, జగన్నాయకులపాలెం

శ్రీ లక్ష్మీగణపతి ట్రేడర్స్ — ఆనాల రాజబాబు, అన్నాయిపేట, సెల్: 89198 04028

దంబాల వీరభద్రరావు — వెలంపాలెం

దాడ్లా బ్రదర్స్ — తోటపేట

ర్యాలి గోవిందు — అమలాపురం

10th (1989-90) BATCH స్నేహితులు
S.P.V.R. హైస్కూల్, ద్రాక్షారామ

(c) eenadu

ఈనాడు
తూర్పుగోదావరి
సోమవారం ఫిబ్రవరి 16, 2026

రాజమహేంద్రవరంలోని ఉమా మార్కండేయస్వామికి క్షీరాభిషేకం

భక్తులతో కిక్కిరిసిన కోటగుమ్మం ప్రధాన రహదారి

రాజమహేంద్రవరంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

జగమంతా శివయ్య.. మనసెంతో మురిసెనయ్య

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, సాంస్కృతికం, వీవీవి రోడ్డు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం తెల్లవారుజాము నుంచే గోదావరి తీరంలో స్నానాలకు భక్తులు పోటెత్తారు. జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. రాజమహేంద్రవరంలోని కోటిలింగాల ఘాట్‌లో అర్ధరాత్రి దాటిన నుంచి భక్తులు స్నానాలు చేశారు. శ్రీఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. గోదావరిగట్టున శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో తెల్లవారుజాము 1గంట నుంచి స్వామి వారికి అభిషేకాలు, పార్వతీదేవి అమ్మవారికి కుంకుమార్చనలు మొదలయ్యాయి. సమీపంలోని ఘాట్‌లో పుణ్యస్నానం ఆచరించిన భక్తులు మార్కండేయుని దర్శనం కోసం బారులు తీరారు.

కోటిలింగాల ఘాట్‌లో భక్తజనం

కాకినాడ నగరంలో కూడళ్లను పార్టీ జెండాలతో అలంకరిస్తున్న కార్యకర్తలు

నేటి నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు సోమవారం నుంచి బుధవారం వరకు కాకినాడ సూర్యకళామందిరంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు తెలియజేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ సమావేశాల్లో దేశం, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చిస్తామన్నారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, మన గ్యాస్ మనహక్కు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాలు తదితర అంశాలపై నాయకులు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా పార్టీ సీనియర్ నాయకులు కె.నారాయణ, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తదితరులతోపాటు 26 జిల్లాల ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. సమావేశాల సందర్భంగా నగరంలోని కూడళ్లలో పార్టీ జెండాలతో తీర్చిదిద్దుతున్నారు. సూర్యకళామందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

ముంచేస్తున్న సైబర్ మాయగాళ్లు..!

కంబాలచెరువు, న్యూస్‌టుడే

● రాజమహేంద్రవరానికి చెందిన ఓ వ్యక్తి చరవాణికి స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులకు సంబంధించిన లింక్ వచ్చింది. దానిని క్లిక్ చేసి, అవతలి వారితో చాటింగ్ చేశాడు. పెట్టుబడి పెడితే పదింతలు ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మబలికారు. మూడు నెలల్లో పలు దఫాలుగా పెట్టుబడి పెట్టి, రూ.4.70 కోట్ల మేర మోసపోయాడు.

● దానవాయిపేటకు చెందిన 63 ఏళ్ల విశ్రాంత ఉద్యోగికి ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి, డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించాడు. పలు దఫాలుగా రూ.10లక్షలు కాజేశాడు.

● కాతేరుకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన లింక్ క్లిక్ చేశాడు. దీంతో అతడి చరవాణి నిర్వహణ సైబర్ నేరగాళ్లకు వెళ్లిపోయింది. నాలుగు దఫాలుగా రూ.2లక్షలు కాజేశారు. వెంటనే అతడు స్పందించి, పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సంబంధిత ఖాతాను నిలుపుదల చేసి, రూ.లక్షను వేరే ఖాతాలోకి వెళ్లకుండా చూడగలిగారు.

అధిక లాభాలు వస్తాయనగానే ఆశ పడుతున్నారు.. తక్కువ ధరకే వస్తువులు ఇస్తామంటే ఎగబడుతున్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి డిజిటల్ అరెస్టు అయ్యారంటే బెదిరిపోతున్నారు.. వెరసి సైబర్ నేరగాళ్ల వలకు జనం సులభంగా చిక్కిపోతున్నారు. జిల్లాలో గత ఏడాది కాలంలో మంది సైబర్ నేరగాళ్ల మోసాలకు గురయ్యారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

ఆశ చూపి..

ఇప్పటివరకు జరిగిన సైబర్ మోసాల్లో ఎక్కువగా అధిక మొత్తంలో లాభాలు వస్తాయనే ఆశచూపి, డిజిటల్ అరెస్ట్ చేశామని చెప్పి రూ.కోట్లలో నగదు దోచుకున్నారు. మొదట పెట్టుబడి పెట్టిన దానికి లాభాలు వచ్చినట్లు ఖాతాల్లో చూపిస్తారు. విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు మాత్రం కల్పించరు. ఈకేవైసీ, ఇతర కారణాలు సాకుగా చూపుతారు. చివరికి మోసపోయామని గుర్తించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

డిజిటల్ అరెస్టు పేరిట బెదిరిస్తే

సైబర్ మోసాలకు గురైన వారు తక్షణం 1930 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. సైబర్‌వింగ్ వారు అప్రమత్తమై తక్షణం బాధితుడికి సంబంధించిన అన్ని బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తారు. ప్రజలంతా సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఎవరైనా బెదిరిస్తే తక్షణం సంప్రదించాలని తెలిపారు.

జిల్లాలో 2025లో నమోదైన సైబర్ నేరాలు

నమోదైన మొత్తం కేసులు	: 123
పోగొట్టుకున్న నగదు	: రూ.20.52 కోట్లు
ఖాతాల్లో హోల్డ్ చేసిన మొత్తం	: రూ.1.34కోట్లు

భూసమస్యలకు.. సత్వర పరిష్కారమేదీ..?

● రెవెన్యూ క్లినిక్‌లో వెల్లువలా వినతులు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం: భూసమస్యలకు సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'రెవెన్యూ క్లినిక్' పేరిట ప్రత్యేక వ్యవస్థను తీసుకొచ్చింది. మండల రెవెన్యూ అధికారులతోపాటు ఒకటే కార్యాలయంలో కౌంటర్లు ఏర్పాటు చేసి అర్జీదారుల భూసంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో గతేడాది డిసెంబరు 29 నుంచి ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఫిర్యాదులు అందించేందుకు రాజమహేంద్రవరం కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు

రెవెన్యూ క్లినిక్‌లో అందిన ఫిర్యాదుల్లో కొన్ని

ఫిర్యాదు స్వభావం	అర్జీలు	✔	✘	●
ఆర్‌ఓఆర్ సమస్యలు	171	06	11	154
భూరీ-సర్వే లోపాలు	132	09	03	120
నిషేధ జాబితా(22ఎ)	52	08	0	44
భూసేకరణపై	43	07	04	32
ఆక్రమణలు	25	08	01	16
సరిహద్దు వివాదాలు	05	0	0	05
ఇతర సమస్యలు	151	42	10	99

ఆమోదించినవి ✔ తిరస్కరించినవి ✘ పెండింగ్‌లో ఉన్నవి ●

పెద్దఎత్తున వస్తున్నా..

ప్రజల నుంచి భూసంబంధిత సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్నా.. వేగంగా పరిష్కారం చూపడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. తహసీల్దార్లు నేరుగా బాధ్యత తీసుకుని వీటిని పరిష్కరించాల్సి ఉంది. కొన్నింటికి నిర్దిష్ట గడువు ఉంటుంది. రీసర్వే, భూ సరిహద్దు లోపాలు (ఎల్‌పీఎం సబ్‌డివిజన్), ఆర్‌ఓఆర్, జాయింట్ ఎల్పీఎంలు, మ్యుటేషన్, వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు, డి-పట్టా భూముల ఆక్రమణ వంటి భూసమస్యలకు సంబంధించి వేర్వేరు కౌంటర్ల ద్వారా వినతులు స్వీకరిస్తున్నారు. వీటికి గరిష్ఠంగా 75 రోజుల గడువు ఇవ్వడంతో అధికారులు, సిబ్బందికి ఇది సాకుగా మారింది.

ఇదీ పరిస్థితి..

ఇప్పటి వరకు అయిదుసార్లు నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో మొత్తం 588 ఫిర్యాదులు అందాయి. ఇప్పటివరకు కేవలం 82 మాత్రమే పరిష్కరించారు. వివిధ కారణాలతో 31 తిరస్కరించగా 475 పెండింగ్‌లోనే ఉన్నాయి. ● రాజమహేంద్రవరం గ్రామీణం నుంచి 66 వినతులు రాగా 15 మాత్రమే పరిష్కారమయ్యాయి. ● రాజానగరం మండలం నుంచి 57 ఫిర్యాదులు వస్తే ఆరు మాత్రమే పరిష్కరించారు. ● నల్లజర్ల మండలం నుంచి 38 కు గాను రెండు మాత్రమే పరిష్కారమయ్యాయి. అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

ట్రాఫిక్ నియంత్రణే సవాలు..!

● 5 లక్షల మంది శివరాత్రి పుణ్యస్నానాలు చేసినట్లు అంచనా

● పుష్కర ఝరి.. సాంకేతిక సవారీ

ఈనాడు, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో మహాశివరాత్రిని సవాలుగా తీసుకుని యంత్రాంగం ఆదివారం రాజమహేంద్రవరంలో ట్రయల్ రన్ నిర్వహించింది. దీనికి విస్తృతంగా సాంకేతికతను వినియోగించారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం సుమారు 5 లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు ఓ అంచనాకు వచ్చారు.

పుష్కరాల రేవులకు ఎంతమంది వచ్చారంటే..

ఆదివారం మధ్యాహ్నం 11.37 గంటలకు 56,885 మంది వచ్చారు. వేకువజాము 3 గంటలకు ముందే స్నానాలకు తరలివచ్చారు. ఉదయం 10 వరకు వచ్చే వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. నగరంలో 1.31 లక్షల మంది స్నానాలు చేసినట్లు కమిషనర్ రాహుల్‌మీనా తెలిపారు.

● స్నానఘట్టాల్లో ఒక చదరపు మీటరుకు సుమారు 42 మంది జనసాంద్రత ఉండేలా కెమెరాల్లో సాంకేతికత నిక్షిప్తం చేశారు. రద్దీకి సంబంధించి 100కు పైగా సందేశాలు వెళ్లాయి. వెంటనే అధికారులు అప్రమత్తమై తగిన చర్యలు తీసుకునేందుకు వీలు ఏర్పడింది. ● భక్తులు స్నాన ఘట్టాలకు వెళ్లే ముందుకు సమీప దూరంలో అక్కడ ఎంత రద్దీ ఉందో (శాతాల్లో) తెలుసుకునేలా ఎల్ఈడీ తెరలపై ఏర్పాట్లు చేశారు.

డ్రోన్‌లతో పర్యవేక్షించినా..

ప్రధానంగా రద్దీ నియంత్రణపై దృష్టి సారించాలని పెద్దఎత్తున పోలీసులను మోహరించి, డ్రోన్‌లతో పర్యవేక్షించారు. కానీ రద్దీ నియంత్రణలో యంత్రాంగం విఫలమైంది. తెల్లవారుజాము 3 గంటల నుంచి స్నానాలు ప్రారంభం కాగా, ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఒక్కసారిగా రద్దీ పెరిగింది. ఘాట్లకు అనుసంధానంగా ఉన్న రహదారుల్లో జనం కిక్కిరిసిపోయారు. గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సాంకేతికతతో రద్దీని అంచనా వేసినప్పటికీ రహదారులు ఇరుగ్గా ఉండడం సమస్యగా మారింది. ఈ ప్రక్రియలో చాలా లోపాలు కనిపించాయి.

దేవీచౌక్ వద్ద ట్రాఫిక్ రద్దీ

గుర్తించిన లోపాలు

☛ రహదారులపై ఆక్రమణలు ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకంగా మారాయి. ☛ ప్రణాళికకు అనుగుణంగా రహదారుల విస్తరణ చేయకపోవడం ☛ రద్దీ నియంత్రణపై పూర్తిస్థాయి కార్యాచరణ లేకపోవడం ☛ భక్తులకు మార్గదర్శకం లేకపోవడం ☛ నగరంలోకి పెద్ద వాహనాలను సైతం అనుమతించడం.

ఏం చేయాలంటే..

☛ మెయిన్‌రోడ్డుతోపాటు అనుబంధ రహదారులను యుద్ధప్రాతిపదికన విస్తరించాలి. ☛ ఘాట్లకు అనుబంధ మార్గాలను వెడల్పు చేయాలి. ☛ నగరంలో జంక్షన్ల విస్తరణ చేపట్టాలి. ☛ ఆక్రమణలపై దృష్టి సారించాలి

మారేడుమిల్లిలో ఓ ఇంటి ముందు ఆరబెట్టిన రబ్బరు

ప్రగతి వేదిక పారిశ్రామిక వీచిక

● వీఈఆర్ పరిధిలోకి ఉమ్మడి తూర్పు

ఈనాడు, రాజమహేంద్రవరం : విశాఖ ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్) పరిధిలోకి తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పోలవరం జిల్లాలను చేర్చుతూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ ప్రాంతం ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చినట్లయింది. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న ఈ రీజియన్‌లో ప్రధానంగా ఉత్పత్తి, సేవా రంగాలతోపాటు, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయం తదితర ఏడు అంశాలు గ్రోత్ డ్రైవర్స్‌గా వృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ఎక్కడ ఏ తరహా సేలందించాలన్న అంశంపై డీపీఆర్‌ల తయారీకి కన్సల్టెంట్ల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. దీని పరిధిలో 41 రకాల అత్యున్నత రంగాలకు చెందిన ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయి. కేంద్ర, ప్రైవేటు సంస్థల సహకారంతో వీటిని ఏర్పాటు చేస్తామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు.

ఇవీ ఉపయోగాలు..

● తూర్పు గోదావరి జిల్లాలో మౌలిక వసతులు, ఉత్పత్తి, పర్యాటక రంగాలకు సంబంధించి అనేక వనరులున్నాయి. ప్రధానంగా రోడ్డు, రైలు, విమానయానం అందుబాటులో ఉంది. విమానాశ్రయ విస్తరణ నేపథ్యంలో మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి. ● కాకినాడ జిల్లా ఇప్పటికే పారిశ్రామిక పురోగతి, ఐటీ సంస్థలతోపాటు ఆక్వా, వ్యవసాయ రంగాల్లో దూసుకుపోతోంది. పోర్టు ప్రధాన ఆదాయ వనరుగా మారుతోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌గా ఈ నగరం ఎంపికైన నేపథ్యంలో పట్టణీకరణ శివారు ప్రాంతాలకూ శరవేగంగా విస్తరిస్తోంది. కొత్త ప్రాజెక్టులు వస్తే అందుకు తగిన వసతులు కల్పించేందుకు ఇక్కడ అపార వనరులున్నాయి. ● కోనసీమ పర్యాటకం, వ్యవసాయం, ఉద్యాన రంగాల ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం. ఇప్పటికే ఈ ప్రాంతంలో కొబ్బరి ఆధారిత ఉత్పత్తులు చేసే పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. కొబ్బరిలో అంతర పంటగా కోకో, గడ్డి పెంపకం చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఆక్వా, పీత పిల్లల తయారీ కేంద్రం ఏర్పాటుతో మత్స్యకార రంగం అభివృద్ధికి అవకాశాలున్నాయి.

పచ్చని నిర్లక్ష్యం

రాజమహేంద్రవరం గ్రామీణం పరిధిలోని హుకుంపేట కల్వర్టు వద్ద ప్రధాన మురుగు కాలువ గుర్రపు డెక్కతో నిండిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి చెత్త తీసుకొచ్చి ఇక్కడ కాలువలో పడేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పిడింగొయ్యి, హుకుంపేట నుంచి కాలువ బొమ్మూరు మీదుగా మురుగు ధవళేశ్వరానికి చేరుకుంటుంది. కాలువ మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలు, డెక్కతో నిండింది. మూడు నెలలకు ఒకసారైనా శుభ్రం చేయని పరిస్థితి.

– న్యూస్‌టుడే, హుకుంపేట

తల్లడిల్లుతున్న కౌమార ప్రాయం..!

ఈనాడు, రాజమహేంద్రవరం :

● ఇటీవల ఓ గ్రామానికి చెందిన బాలిక ప్రేమ పేరిట మోసపోయి గర్భం దాల్చింది. ఆ విషయం తెలిసిన పెద్దలు గుట్టుచప్పుడు కాకుండా గర్భస్రావం చేయించారు. ● ఇటీవల జరిగిన కొన్ని ఘటనల్లో కొందరు బాలికలు సామాజిక మాధ్యమాల ప్రభావానికి గురై, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకుని మోసపోతున్న ఘటనలు వెలుగులోకివచ్చాయి.

కృత్రిమ మేధ. క్వాంటమ్ కంప్యూటింగ్.. గూగుల్ డేటా సెంటర్‌ల ఏర్పాటు.. తదితర ఆధునిక సాంకేతికతతో రాష్ట్రం ఓ వైపు దూసుకుపోతుంటే... మరో వైపు నాగరికతకు మారుపేరుగా నిలిచిన తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని చోట్ల అనాగరిక విధానాలు నేటికీ అమలవుతున్నాయి. పుస్తకాల సంచులు భుజాన వేసుకుని బడికెళ్లాల్సిన బాలికల్లో ఏటా వేల మంది యుక్త వయసులోనే ప్రసవ వేదన అనుభవిస్తున్న దయనీయ స్థితి నెలకొంది. ఇటీవల అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యదర్శులు, కలెక్టర్లు, ఎస్పీ సమీక్షలో ఈ అంశంపై చర్చ జరిగింది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గత మూడేళ్లలో పరిస్థితి పరిశీలన చేస్తే..

చిన్నవయసులోనే తల్లులు అయిన వారి సంఖ్య (గత మూడేళ్లలో)

వయసు	2023-24	2024-25	2025-26
14 ఏళ్లు	21	14	17
15	76	88	68
16	204	205	174
17	358	422	337
18	758	727	654

ప్రమాదకర పరిస్థితిలో జిల్లా

● రాష్ట్రంలోని బాలికలు (టీనేజ్) గర్భధారణ సగటున 5 శాతానికి మించి ఉండకూడదని దిశానిర్దేశం చేశారు. విశాఖపట్నంలో 3.5 శాతంతో సురక్షిత జోన్‌లో ఉండగా, తూర్పు గోదావరి, కాకినాడ 8 నుంచి 10 శాతం వరకు నమోదై ప్రమాదకర పరిస్థితిని సూచిస్తోంది. ● ధవళేశ్వరం, కడియపులంక, కాతేరు పీహెచ్‌సీ క్లస్టర్ పరిధిలో వరుస మూడేళ్లలో పరిశీలిస్తే 152, 177, 125 మంది బాలికలు గర్భం దాల్చారు. ● కోరుకొండ, గోకవరం, జి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల క్లస్టర్ పరిధిలో వరుస మూడేళ్లలో 141, 130, 151 మంది ఈ జాబితాలో ఉన్నారు. ● రంగంపేట, రాజానగరం, సీతానగరం పీహెచ్‌సీ క్లస్టర్ల పరిధిలోనూ ఏటా సగటున 50 నుంచి 60 మంది ఉంటున్నారు.

బాల్య వివాహాలు... ప్రేమలే కారణం..

ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి పూర్తయిన వెంటనే బాలికకు వివాహం చేసేయాలన్న ధోరణి ఇప్పటికీ కనిపిస్తోందని పలువురు వైద్యులు తెలిపారు. మంచి సంబంధం వచ్చిందనో.. ఇతర కారణాలతో వివాహం చేసేందుకు మొగ్గ చూపుతున్నారు మరోవైపు కౌమార దశలో కొందరు బాలికలు ప్రేమ పేరుతో ఆకర్షణకుగురై మోసపోతున్న ఉదంతాలు సైతం నిత్యం వెలుగు చూస్తున్నాయి.

మహిళల ఆదాయమిక వెరీగుడ్డు

● కోడిగుడ్ల వ్యాపారంలోకి పట్టణ వనితలు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం: ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటుతో పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ)లోని మహిళలు సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. త్వరలో కోడిగుడ్ల వ్యాపారంలోకి అడుగుపెట్టనున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ(ఎన్‌ఈసీసీ) సహకారంతో ఎగ్‌మార్ట్‌ల నిర్వహణతో ఉపాధిబాటలు వేసుకోనున్నారు.

జిల్లాలో పది ఎగ్‌మార్ట్‌లు..

జిల్లాకు పదింటిని ప్రభుత్వం మంజూరు చేయగా, నిర్వహణపై పట్టణ ఎస్‌హెచ్‌జీ మహిళలకు అవగాహన కల్పించారు. ఎంపిక ప్రక్రియను మెప్మా అధికారులు చేపట్టారు. నగరం, పట్టణ ప్రాంతాల్లో కలిపి మొత్తం 9 వేల స్వయం సహాయక మహిళా సంఘాలు ఉన్నాయి. పట్టణ ప్రాంత మహిళలతో ఎగ్ మార్ట్‌ల ఏర్పాటుకు నిర్ణయించారు. తొలుత రాజమహేంద్రవరం నగరానికి ఎనిమిది, కొవ్వూరు, నిడదవోలు పట్టణాలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం పదింటిని మంజూరు చేసింది.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న మెప్మా పీడీ

రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటు..

ఒక్కొక్క ఎగ్‌మార్ట్ యూనిట్ విలువ రూ.50వేలు.. దీనిలో రూ.35 వేలు చక్రాల బండి, వంట సామగ్రి, రూ.15 వేలు విలువైన కోడిగుడ్లు ఇస్తారు. వీటితోపాటు ఆయా ఎస్‌హెచ్‌జీల్లోని సభ్యులు పలురకాల ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించుకోవచ్చు. నగరం, పట్టణాల్లోని రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం వీటిపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యమిచ్చి ఈ నెలాఖరులోగా ఎంపిక చేసేందుకు దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకరాజు తెలిపారు.

ఎగిరి గంతేసేలా.. విజయం

ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో అరిగెల రంగయ్య జాతీయస్థాయి వాలీబాల్ బాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జీఎస్‌టీ(ముంబయి) జట్టు 3-2 స్కోరుతో ఎస్ఏఐ(కేరళ)పై గెలుపొందింది. అనంతరం ఇండియన్ బ్యాంకు(చైన్నై) జట్టు కర్ణాటక జట్టుతో తలపడింది. మహిళ విభాగంలో అల్ఫాన్సా(కేరళ), ఎస్‌సీఆర్ జట్ల మధ్య హోరాహోరీగా పోటీ సాగింది. –న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఖాళీ స్థలం.. సేంద్రియ ఫలం..!

ఈనాడు, కాకినాడ : కొన్ని నెలల కిందట తుప్పలు, డొంకలతో చిట్టడవిని తలపించేలా ఉన్న అబ్కారీ స్థలాలు నేడు పూల మొక్కలు, కూరగాయల తోటలతో పచ్చదనం పంచుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని సామర్లకోట, చాగల్లు ఐఎంఎల్ డిపోల్లోని నిరుపయోగ స్థలాల్లో చేపడుతున్న సేంద్రియ సేద్యం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

అబ్కారీశాఖ ఖాళీ స్థలాల్లో కూరగాయల సాగు

సామర్లకోట మద్యం డిపోలోని స్థలంలో కూరగాయల సాగు ఇలా..

● పాలకూర, కొత్తిమీర, తోటకూర, పచ్చిమిరప, వంగ, మునగ, అరటి, ఆనబ ఇలా అన్ని రకాల కూరగాయలను చిన్నచిన్న మడులుగా చేసి పండిస్తున్నారు.

పండిస్తే లాభం.. తింటే ఆరోగ్యం..

● సామర్లకోట డిపోలో ఇప్పుడు ప్రతిరోజు 10 నుంచి 15 కిలోల వంకాయలు పండుతున్నాయి.

● అరటి గెలలతో చెట్లు నిండుగా ఉన్నాయి. ఆకు కూరలు రోజూ 15 నుంచి 20 కట్టలు తెంచుతున్నారు.

● టమాటా అయిదారు కిలోలు దిగుబడి వస్తుంది. అక్కడ పనిచేసే సిబ్బంది రోజువారీగా పంచుకుంటున్నారు. వారికి కూరగాయల ఖర్చు మిగులుతుంది.

పోషకాలపై అవగాహనతో

సామర్లకోట, చాగల్లు మద్యం డిపోల్లో గోదాములు మినహా రెండు, మూడు ఎకరాలకు పైగా ఖాళీ భూములున్నాయి. అవన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. వాటిని పరిశీలించి వాటిలో మొక్కలు పెంచితే బాగుంటుందని ఉప కమిషనర్ చైతన్య మురళి ఆలోచన చేశారు. సిబ్బంది, హమాలీలకు పోషక పంటలపై అవగాహన కల్పించారు. దీంతో ఆ భూముల స్వరూపం మారిపోయింది. ట్రాక్టర్లు పెట్టి దున్నించారు. సేంద్రియ ఎరువులతో రకరకాల కూరగాయలు, ఆకుకూరలు పండించి ప్రకృతి సాగులో మమేకం అవుతున్నారు.

'కాకినాడలోని మా కార్యాలయం ఎదుట చిన్న స్థలంలో పది రకాలు సాగుచేసి వాటితో అక్కడే వండించి తింటున్నాం. అక్కడ పండిన పంటను చూపించి ఆరోగ్యంపై అవగాహన కల్పించాకే డిపోల్లో సాగుకు ముందుకు వచ్చారు. చక్కగా పంటలు పండిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో చొల్లంగి వద్ద గురుకుల పాఠశాలలోని రెండు ఎకరాల ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేస్తున్నాం.' అని డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి అన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): మహాశివరాత్రిని పురస్కరించుకుని సోమవారం(16వ తేదీ) రాష్ట్ర ప్రభుత్వం ఐచ్ఛిక సెలవు ప్రకటించిన దృష్ట్యా ఈ వారం జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ రద్దు చేశారు. ఈ మేరకు కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్, డివిజన్, మండల కార్యాలయాలకు రావద్దని సూచించారు. అత్యవసర ఫిర్యాదులు 1100 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 95523 00009 ద్వారా సత్వర పౌరసేవలు పొందవచ్చన్నారు.

పాపికొండలకు 5 పర్యాటక బోట్లు

దేవీపట్నం: గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి ఆదివారం అయిదు బోట్లలో 374 మంది పాపికొండల అందాలను తిలకించడానికి వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు. పోలీసుల తనిఖీలు అనంతరం వారందరిని విహారయాత్రకు అనుమతించారు. పోలవరం ప్రాజెక్టు వెనుక జలాలు కారణంగా పోశమ్మగండి వద్ద గోదావరిలో నీటి మట్టం రోజురోజుకి పెరుగుతూనే ఉంది. దండంగి, చినరమణయ్యపేట పరిసర ప్రాంతాల్లో మొక్కజొన్న చేలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీతపల్లి వాగుకు వరద ప్రవాహం మరింత పెరగడంతో వాగులో రాకపోకలు తాత్కాలికంగా నిలిచాయి. దండంగి- డి.రావిలంక గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ వరద ప్రవాహం కొనసాగుతోంది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

లఘు చిత్రం.. సందేశాత్మకం

● స్ఫూర్తిదాయక ఇతివృత్తాలతో కొవ్వూరు కుర్రోళ్ల ముందడుగు

న్యూస్‌టుడే, చాగల్లు

'మార్పు' లఘు చిత్రంలో ఓ సన్నివేశం

నటనపై ఆసక్తి.. దర్శకత్వంపై మక్కువ పెంచుకున్న కొంతమంది యువకులు సామాజిక చైతన్యం కలిగించే లఘు చిత్రాలను రూపొందిస్తున్నారు. మహిళలు, మధ్య తరగతి కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, యువకుల ఆర్భాటపు ఆలోచనలు తదితర ఇతివృత్తలతో చక్కటి సందేశాన్ని ఇస్తూ రూపొందించిన ఆ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో ప్రేక్షకులను ఆకట్టుకుని లైకులు సంపాదించి పెడుతున్నాయి.

స్నేహితులతో కలిసి బృందం..

కొవ్వూరు పట్టణానికి చెందిన బొరుసు ప్రసాదు, కె.పవన్ అంతంత మాత్రంగానే చదువుకున్నారు. తాపీ పనులు, చిరుద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమ అభిరుచికి తగ్గట్టుగా మరికొందరి స్నేహితులతో కలిసి గడచిన ఐదేళ్లుగా లఘు చిత్రాలు రూపొందిస్తున్నారు. ప్రేమ పేరిట సమయం వృథా చేసుకుంటూ యువత లక్ష్యాన్ని విస్మరిస్తున్నారనే కథాంశంతో 'లవ్ చేయాలా..వద్దా', కుటుంబ నేపథ్యంలో బంధం, చిన్నారులు చరణాలకు బందీలు అవుతున్న వైనంపై 'పబ్జీ', యువత స్థాయికి మించిన ఆర్భాలకుపోయి కుటుంబాలను ఇబ్బందుల్లో నెట్టేస్తున్నారనే అంశంతో 'మార్పు' తరతర లఘు చిత్రాలు రూపొందించారు. చరవాణితో చిత్రీకరణ పూర్తి చేసి వివిధ యాప్‌ల సాయంతో వీటిని తీర్చిదిద్దుతున్నారు. సినిమాలకు తీసిపోని నేపథ్య సంగీతంతో పాటు గ్రాఫిక్స్‌కు ప్రాధాన్యం ఇస్తుండడంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. వీరు రూపొందించిన లవ్ చేయాలా? వద్దా? అనే లఘు చిత్రానికి సుమారు 77 వేలు, బంధం లఘుచిత్రానికి సుమారు 4 లక్షలు, పబ్జీ ప్రభావంకు సుమారు 2 వేలు, మార్పు లఘుచిత్రానికి సుమారు 6,900 లైకులు వచ్చాయి. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ప్రోత్సహిస్తే ఉత్తమ చిత్రాలను తెరకెక్కిస్తామని వారు అంటున్నారు.

శూలాల సంబరం.. భక్తి పరవశం

అమలాపురం మండలం ఇమ్మిడివరప్పాడులోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శూలాల సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కరికాల భక్తులు 20 మంది బుగ్గలకు శూలాలు గుచ్చుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. -న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ద్రాక్షారామ.. జ్యోతిర్లింగార్చన

ద్రాక్షారామ భీమేశ్వరాలయం నంది మండపంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి జ్యోతిర్లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. చండీ ఉపాసకుడు ఇంద్రగంటి రామరావుశర్మ నేతృత్వంలో శివలింగాకృతిలో 365 దీపాలతో లింగార్చన జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. - న్యూస్‌టుడే, ద్రాక్షారామ

భక్తి నీరాజనం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీమహా కోటిలింగేశ్వర ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగా స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, వివిధ వేషధారణలు బాణసంచాతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. రాజమహేంద్రవరం నగరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పెద్దఎత్తున నగరవాసులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, వీఎల్ రోడ్డు

వాహన వైద్య సేవలకు జవసత్వాలు

108 సిబ్బందికి పెరిగిన జీతాలు

న్యూస్‌టుడే, మండపేట

ఆపదలో ఆదుకునే అపర సంజీవనిగా పిలిచే 108 అంబులెన్సు సేవలు మరింత విస్తృతం కానున్నాయి. ఈ వాహనాల్లో పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించేలా సిబ్బందికి జీతాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వారిలో సంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నో సంవత్సరాలుగా జీతాలు పెంచాలంటూ వారు ఆందోళనలు చేసినా గత వైకాపా ప్రభుత్వం కనికరం చూపలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ● తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 21 అంబులెన్సులు ఉండగా వీటిలో 100 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు (ఈఎంటీ) 55 మంది, డ్రైవర్లు (పైలెట్లు) 45 మందికి లబ్ధి చేకూరనుంది. దీంతో వీరంతా థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

గత తెదేపా హయాంలోనే జీవో..

కరోనా విపత్తు సమయంలో 108 సిబ్బంది ప్రాణాలకు తెగించి సేవలందించారు. వైరస్ బాధితులను ఆసుపత్రులు, క్వారంటైన్‌లకు తరలించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయా సందర్భాల్లో సిబ్బంది కూడా కరోనా బారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పట్లో వీరి సేవలను ప్రజలంతా ప్రశంసించారు. కనీసం ఆ తరవాతైనా జీతాలు పెంచకపోవడంతో జీతాల స్లాబులు పెంచాలని వారు వేడుకున్నా అప్పటి వైకాపా ప్రభుత్వం కరుణించలేదు. అయితే 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో తెదేపా ప్రభుత్వం 108 అంబులెన్స్ సిబ్బంది జీతాలు రూ.4000 చొప్పున పెంచుతూ జీవో నంబర్ 49 విడుదల చేశారు. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ జీవోని తుంగలో తొక్కడంతో అమలుకు నోచుకోలేదు.

పెంపుదల ఇలా..

ప్రస్తుతం అయిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఈఎంటీలు, పైలెట్లు, 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్నవారికి స్లాబులు వేర్వేరుగా ఉన్నాయి. ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున పెంపుదల వర్తిస్తోంది. అలాగే 15 సంవత్సరాలు, 20 సంవత్సరాలు సర్వీసు దాటినవారికి త్వరలోనే స్లాబు పెరిగే అవకాశం ఉంది.



థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అంబులెన్సు సిబ్బంది

వారిపై నిర్ణయం తీసుకోవాలి..

ఇక నుంచి ఎవరైతే 5, 10 సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసుకున్నారో వారికి ఆటోమేటిక్‌గా రూ.5 వేల వేతనం పెరుగుతుంది. 15, 20 సంవత్సరాలు దాటిన వారి స్లాబు పెంపుదలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. - ఎం.రాజు, 108 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఈఎంటీ, మండపేట

మంత్రి దుర్గేష్ పూజలు

పెరవలి: మండలంలోని తీపర్రులోని రాజరాజేశ్వరీ, మల్లేశ్వరస్వామివార్ల ఆలయంలో మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావులు స్వామివారిని దర్శించుకున్నారు. అన్నవరప్పాడులోని మంత్రి స్వతిలింగం దర్శనం చేసుకున్నారు. తీపర్రు, మల్లేశ్వరం గ్రామాల్లో జరిగిన రథోత్సవాల్లో పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర అధికారి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామిని తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి. ఆనంద్ ఆదివారం దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ బిందుమాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం స్వామి దర్శనానికి వెళ్లిన ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

ఆనంద్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్పీ బిందుమాదవ్

మాజీ ఎంపీ రత్నాబాయి మృతి

రంపచోడవరం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ(రాజ్యసభ) తడపట్ల రత్నాబాయి(79) పోలవరం జిల్లా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందారు. కాంగ్రెస్‌పార్టీలో రత్నాబాయి సీనియర్ నాయకురాలుగా ఉన్నారు. 1972లో ఎల్లవరం (ప్రస్తుత రంపచోడవరం) నియోజకవర్గంలో మొదటగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2007లో జీసీసీ ఛైర్మన్, 2009లో రాజ్యసభ సభ్యురాలిగా, 2014లో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో ఉంటూ ఇంటివద్దనే ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఆమెకు ఆరోగ్యం క్షీణించగా స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భర్త సత్యనారాయణ వీసీసీ సభ్యులుగా పనిచేశారు. ఇద్దరు కుమారులు ఉన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ డీఎస్ఏలో నిర్వహించిన అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఆదివారం ఫైనల్స్ ఉత్సాహంగా జరిగాయి. రౌనాల్డో జట్టు విజేతగా నిలిచింది. భాటియా జట్టు ద్వితీయస్థానం దక్కించుకుంది. గత రెండు నెలలుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో ప్రతి ఆదివారం మూడు మ్యాచ్‌లు జరిగాయని నిర్వాహకులు తెలిపారు. బహుమతి ప్రదానోత్సవానికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అధ్యక్షుడు తలాటం హరీష్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్, ఫుట్‌బాల్ కోచ్ స్వామి హాజరై క్రీడాకారులకు పతకాలు, కప్‌లను అందజేశారు. సత్తిరాజు, కృష్ణబాబు, ఫుట్‌బాల్ క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, సంఘ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజేత రౌనాల్డో జట్టుకు కప్‌ను అందజేస్తున్న ముఖ్యఅతిథులు

ఆర్ఎస్‌బీ హాకీ జట్టుకు కోచ్, కెప్టెన్‌గా కాకినాడ వాసులు

ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు న్యూదిల్లీలో జరుగనున్న ఆల్ఇండియా హాకీ సివిల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆర్ఎస్‌బీ జట్టు కోచ్‌గా కడియాల రవిచంద్రప్రసాద్, కెప్టెన్‌గా ఎస్.వీరబాబు ఎంపికయ్యారు. వీరిద్దరూ కాకినాడ వాసులే కావడం విశేషం. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీకి శివరాత్రి కళ

● ప్రత్యేక బస్సుల్లో 30 వేల మంది ప్రయాణం

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ప్రత్యేక బస్సుల్లో రద్దీ ఇలా..

డిపో	ప్రయాణికులు
గోకవరం	13,200
రాజమహేంద్రవరం	5,000
కొవ్వూరు	6,000
నిడదవోలు	5,800

మహాశివరాత్రి సందర్భంగా గోదావరి ఘాట్లలో పుణ్యస్నానాలచరించేవారు, శైవక్షేత్రాలను దర్శించుకునే భక్తులతో ఆదివారం ఉమ్మడి జిల్లాపరిధిలో ఆర్టీసీ లోకల్ సర్వీసులు కిక్కిరిశాయి. షెడ్యూల్ సర్వీసులతో పాటు జిల్లాలోని నాలుగు డిపోల నుంచి తిప్పిన శివరాత్రి ప్రత్యేక బస్సులు కిటకిటలాడాయి. తెల్లవారుజాము 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 30 వేల మంది రాకపోకలు సాగించినట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీవో) వై.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. నాలుగు డిపోల్లో మొత్తం 275 బస్సులు ఉండగా, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు 190 ఉన్నాయి. ఈ బస్సుల్లో ప్రతిరోజూ సగటున 1.26 లక్షల మంది రాకపోకలు సాగిస్తుండగా శివరాత్రి సందర్భంగా ఈ సంఖ్య 1.50 లక్షలకు పెరిగింది. రాజమహేంద్రవరం డిపో నుంచి కోటిపల్లి, వంగలపూడికి, గోకవరం డిపో నుంచి రంప, రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్‌కు, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి పట్టిసీమకు తిప్పిన 82 ప్రత్యేక బస్సుల్లో 30 వేల మంది భక్తులు రాకపోకలు సాగించారు. లోకల్ షెడ్యూల్స్, శివరాత్రి ప్రత్యేక సర్వీసులు కలిపి ఒక్కరోజే ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) 110 శాతం వరకు ఉన్నట్లు డీపీటీవో తెలిపారు.

నేటి నుంచి సహకార సంఘ ఉద్యోగుల సమ్మె

రామచంద్రపురం: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక రాష్ట్ర వ్యాప్త సమ్మెకు సహకార సంఘాల ఉద్యోగులు సిద్ధమయ్యారు. రాష్ట్రంలోని సహకార సంఘాల్లో కార్యకలాపాలకు ఆటంకం కలగనుంది. సంఘ పూర్వ రాష్ట్ర నాయకుడు పెంకే సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గత 18 నెలలుగా ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. రాష్ట్ర జేఏసీ నిర్ణయం మేరకు గత 2 నెలలుగా డీసీసీ కార్యాలయాల వద్ద, డీసీసీబీల వద్ద ధర్నాలు చేస్తూ నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించారు. రాష్ట్రంలో 2060 ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులు 9 వేల మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. ఐదో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి విన్నవించారు. ఇచ్చినప్పటికీ స్పందించక పోవడంతో సమ్మెలో దిగుతున్నామన్నారు. ఈ నెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార సంఘ ఉద్యోగులతో కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేసినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు ఉద్యోగులు సమ్మెను వెళ్తున్నట్లు ఆయన వెల్లడించారు.

అన్నప్రసాదం విస్తర్లపై అన్యమత ప్రచారం

● తంటికొండ ఆలయ సిబ్బందిని నిలదీసిన భక్తులు
● ఆలస్యంగా వెలుగుచూసిన వైనం..

గోకవరం, న్యూస్‌టుడే: వేంకటేశ్వరస్వామివారి అన్నసమారాధనలో అన్యమత ప్రచారానికి సంబంధించిన విస్తర్లు వినియోగించడంపై భక్తులు మండిపడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించిన వివరాలివీ.. తంటికొండ గ్రామంలో వెంకటగిరిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని దర్శించుకునేందుకు ప్రతి శనివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు దేవస్థానం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తారు. శనివారం నిర్వహించిన అన్నసమారాధనలో ఉపయోగించిన విస్తర్లను చూసి భక్తులు ఖంగుతిన్నారు. ఎందుకంటే ఆ విస్తర్లపై ఆంగ్ల అక్షరాలతో మేరీ క్రిస్మస్ అని రాసి ఉంది. అన్య మతానికి సంబంధించి విస్తర్లను దేవస్థానాలలో అన్నసమారాధనకు ఏవిధంగా ఉపయోగిస్తారంటూ అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీశారు. గతంలోను ఇదేవిధంగా ఆకులను వినియోగించిన సంఘటనను గుర్తు చేశారు. మీ నిర్లక్ష్యం కారణంగా దేవస్థానం ప్రతిష్ట దెబ్బతింటుందని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఈవో అక్కడకు చేరుకొని విస్తర్లను తొలగించారు. వంట గదిలో ఉన్న మిగిలిన విస్తర్లను ధ్వంసం చేయాలని పట్టుబట్టడంతో కొంత వివాదం నెలకొంది. దీనిపై దేవస్థానం ఛైర్మన్ బద్ది రెడ్డి అచ్చన్నదొరను వివరణ కోరగా పొరపాటున వచ్చిన ఆ విస్తర్లను వెంటనే తొలగిస్తామన్నారు. ఈ విధమైన సంఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు.



తంటికొండ దేవస్థానంలో వినియోగించిన అన్యమత ప్రచార విస్తర్లు

సాగరంలో ఇంజినీరింగ్ విద్యార్థి విషాదాంతం

పీఎంపాలెం, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కెరటాల ఉద్ధృతికి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన విశాఖపట్టణంలోని రుషికొండ బీచ్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా. . కొమ్మాది సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న అయిదుగురు విద్యార్థులు సమీప వసతిగృహంలో ఉంటున్నారు. ఆదివారం తూర్పు గోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన పి.అరవింద్‌నాయుడు (21), శ్రీకాకుళం జిల్లా వాసి సనపల రాజీవ్‌లు మరో ముగ్గురు స్నేహితులు గోకుల్‌కృష్ణ, ఆదిత్య, సాధిల్యలతో కలిసి ఉదయం 7 గంటలకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. సుమార 10 గంటల సమయంలో దగ్గరలోని ఓ రిసార్టు వెనుక బీచ్‌కు వచ్చారు. వీరిలో అరవింద్, రాజీవ్ సముద్రంలో ఈతకు దిగారు. మిగిలిన ముగ్గురు ఒడ్డున కూర్చున్నారు. ఒక్కసారిగా ఉద్ధృతంగా వచ్చిన కెరటాల్లో చిక్కుకున్న అరవింద్ కేకలు వేయడంతో పక్కనే ఉన్న రాజీవ్ కాపాడేందుకు ప్రయత్నించాడు. దీంతో ఇద్దరూ కెరటాల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. ఒడ్డున ఉన్న స్నేహితులు స్థానికుల సాయంతో జీవీఎంసీ బీచ్, టూరిజం లైఫ్‌గార్డులకు సమాచారం అందించారు. వెంటనే వారు బోటు ద్వారా గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి యువకులను రుషికొండ తీరానికి తీసుకొచ్చారు. వీరిలో అరవింద్ పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో విద్యార్థి రాజీవ్‌కు ప్రాథమిక చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడి తండ్రి సూర్యప్రకాష్ ఫిర్యాదు మేరకు ఎస్సై వరహాలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పి.అరవింద్‌నాయుడు

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

రాజానగరం: అనుమానాస్పదంగా తన కుమారుడు మృతి చెందాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజానగరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. జి.యర్రంపాలెంనకు చెందిన వీరలక్ష్మి, రమేష్ దంపతుల కుమారుడు కాలా ఇస్సాక్ అలియాస్ అశోక్ (21) మెకానిక్‌గా పని చేస్తున్నాడు. వీరలక్ష్మికి తన భర్తతో మనస్పర్థలు రావడంతో కుమారుడు అశోక్‌తో కలసి అదే గ్రామంలో ఉంటున్న తన సోదరి ఇంట్లో నివాసం ఉంటూ వంట, వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పనికి వెళ్లిన వీరలక్ష్మికి తన సోదరి నుంచి ఫోన్ రావడంతో ఇంటికి వెళ్లారు. అప్పటికే నేలపై పడి ఉన్న కుమారుడుని చూసి సోదరిని వివరం అడగగా.. శివరాత్రి సందర్భంగా స్నానానికి వెళ్లేందుకు ఇంట్లో ఉన్న అశోక్‌కు ఫోన్ చేయగా.. తీయలేదని, కిటికీలోంచి చూడగా ఇంటి దూలానికి ఉరి వేసుకుని కనిపించాడని చెప్పినట్లు వీరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రైస్తవ సభలకు వెళ్లొస్తూ..

● అపసవ్య దిశలో ప్రయాణిస్తుండగా ప్రమాదం
● సుబ్బరాయపురానికి చెందిన ఇద్దరు దుర్మరణం

దేవరపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై అపసవ్య దిశలో వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం సుబ్బరాయపురానికి చెందిన ముప్పాల రాజశివకృష్ణ(24), పెనుమాల చిన్నారి(30) శనివారం రాత్రి కోరుకొండ మండలం కృష్ణుడుపాలెంలో జరుగుతున్న క్రైస్తవ సభలకు వెళ్లారు. పూర్తయిన తర్వాత స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. జాతీయ రహదారిలోని యాదవోలు వంతెన వద్ద అపసవ్య దిశలో ప్రయాణిస్తుండగా రాత్రి 11 గంటల సమయంలో విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వ్యాన్ డ్రైవర్, మరో మహిళకు స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సంఘటన స్థలాన్ని సీఐ బి.నాగేశ్వర్ నాయక్, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

ముప్పాల రాజశివకృష్ణ

పెనుమాల చిన్నారి

అనాథలైన చిన్నారులు..

పెనుమాల చిన్నారి(30)కి 16 ఏళ్ల కిందట వివాహమైంది. భర్త పండు నాలుగేళ్ల కిందట కడియం వద్ద రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. ఆమెకు 7, 8 తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులున్నారు. వారిని తాడేపల్లిగూడెం వద్ద గల ఆరుగొలను గురుకుల వసతి గృహంలో చదిస్తున్నారు. గతంలో తండ్రి, ఇప్పుడు తల్లి ప్రమాదంలో మృతి చెందడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ఆ పసి హృదయాలకు దిక్కెవరని కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు.

పెద్ద దిక్కును కోల్పోయి..

పదేళ్ల కిందట భర్తను కోల్పోయిన, ఆశలన్నీ కుమారుడుపై పెట్టుకుని జీవిస్తున్న తల్లికి కడుపుకోత మిగిలింది. ఆశా కార్యకర్తగా పని చేస్తున్న ముప్పాల శాంతికుమారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె బీ ఫార్మసీ చదువుతుండగా, కుమారుడు రాజశివకృష్ణ(24) పదో తరగతి వరకు చదివి కూలి పనులకు వెళుతున్నాడు. ఊహించని ప్రమాదంలో అతను మృతి చెందడంతో పెద్ద దిక్కును కోల్పోయామని తల్లి, చెల్లి గుండెలు అవిసేలా రోదించారు.

యర్నగూడెం వద్ద గుర్తుతెలియని వ్యక్తి..

దేవరపల్లి మండలం యర్నగూడెం జాతీయ రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు వివరాలు ప్రకారం యర్నగూడెంలోని ఏ6 హోటల్ సమీపంలో వంతెన వద్ద ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తిపై గుర్తుతెలియని వాహనం దూసుకెళ్లింది. మృతుడు శరీరం ఛిద్రం కావడంతో ఎటువంటి ఆధారాలు లభించలేదు. భిక్షాటన చేసుకుంటూ తిరుగుతాడని స్థానికులు తెలిపారని, మృతుడుకి సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా తమను సంప్రదించాలని ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	18,500
పాతకురిడీ గండేరా	30,500
గుటక	29,000
కొత్తకురిడీ గండేరా	30,000
గుటక	29,000
నీటికాయ (వెయ్యింటికి)	20,000-21,000
కొత్త (పచ్చ) కొబ్బరి	16,000-17,000
కొబ్బరినూనె (15 కిలోలు)	5,000
1 కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ఆదివారం ఇవి మారుతుంటాయి.

వెంకటేశ్వర చికెన్ ధర కిలో రూ॥లో

ఫారంకోడి	115.00
బ్రాయిలర్ లైవ్	142.00
డ్రెస్డ్	206.00
స్కిన్‌లెస్	234.00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

AUTO — VEHICLES FOR SALE

BUSINESS SERVICES

FINANCIAL SERVICES

HEALTH & CARE

REAL ESTATE — PLOT FOR SALE — KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJANAGARAM

GENERAL

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives. © 93493 94835, 70753 45527.

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

రాజమహేంద్రవరం

17న ధర్నా విజయవంతం చేద్దాం

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న యూటీఎఫ్ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీఆర్ ప్రసాద్, ఎ.షరీఫ్ అన్నారు. విజయవాడ ధర్నాచౌక్‌లో 17న 20వేల మంది ఉపాధ్యాయులతో ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

టి.నగర్, న్యూస్‌టుడే: శివరాత్రి నేపథ్యంలో విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఐచ్ఛిక సెలవును మంజూరు చేసింది. ఈ క్రమంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ అంశాన్ని గమనించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

సమస్య: స్థానిక నారాయణపురం వెంకట్రామయ్యనగర్‌లో డ్రెయిన్లు శుభ్రం చేయడంలేదు. దీంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. దోమల బెడద పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లు తుడిచే సిబ్బంది కూడా సక్రమంగా రావట్లేదు. **- లక్ష్మి, స్థానికురాలు**

సమాధానం: పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- వినూత్న, ఎంహెచ్‌వో**

సమస్య: స్థానిక ఆల్‌బ్యాంకు కాలనీ శివారు వీధిలో విద్యుత్తు దీపాలు ఉన్నప్పటికీ ఇబ్బంది వరకు దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రివేళ అంధకారంగా ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. **- పాపారావు, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపించి పరిశీలిస్తాం. **- విమల, ఎలక్ట్రికల్ ఏఈ**

రాష్ట్రస్థాయి పోటీల్లో రైల్వే ఉద్యోగి ప్రతిభ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాజమహేంద్రవరం రైల్వే ఉద్యోగి ప్రతిభ చూపారు. ఇక్కడి రైల్వే మెము కార్‌షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న డి.లక్ష్మీనారాయణ ఈనెల 13 నుంచి 15 వరకు అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూల్‌లో జరిగిన 3వ ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ పోటీలు (83 కేజీల సీనియర్స్ విభాగం)లో పాల్గొని రెండవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఈయన రాష్ట్ర, జాతీయ స్థాయి పవర్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ ఇప్పటికే పలు పతకాలు సాధించారు. ఇప్పుడు రాష్ట్రస్థాయి పోటీల్లో మరో పతకాన్ని తన ఖాతాల్లో వేసుకున్న లక్ష్మీనారాయణను ఈ సందర్భంగా రైల్వే మెముకార్ షెడ్ ఏడీఈఈ డి.ప్రసాద్‌రావు, సిబ్బంది అభినందించారు.

1.31 లక్షల మంది పుణ్యస్నానాలు

టి.నగర్, న్యూస్‌టుడే: శివరాత్రి నేపథ్యంలో 1.31 లక్షల మంది నదీ స్నానం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన గోదావరి ఘాట్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఐ సాంకేతికతతో పుష్కర ట్రయల్ రన్ విజయవంతమైనట్లు తెలిపారు. ఏఐ కెమెరాలతో అన్నింటినీ నిశితంగా పరిశీలించామన్నారు. రద్దీ నియంత్రణకు ఈ పరిశీలన ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. భక్తుల భద్రత దృష్ట్యా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పుష్కర విధుల్లో 1,200 మంది నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు. ● నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఘాట్లను పరిశీలించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

సారంగధరేశ్వర స్వామి వారికి అభిషేకం

కోటగుమ్మం వద్ద శివుని విగ్రహం

గోకవరం బస్టాండ్‌లో మంచు శివలింగం

నల్లమందుసందు వర్తకుల ఆధ్వర్యంలో..

పుష్కరాల రేవులో మహిళల పూజలు

నాగేంద్ర హారాయ త్రిలోచనాయ

రాజమహేంద్రవరం సాంస్కృతికం, దేవీచౌక్, ఏవీఏ.రోడ్డు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం నగరంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు ఘాట్‌ల్లో స్నానాలు చేశారు. సారంగధరమెట్టపై కొలువైన సారంగధరేశ్వరుడి ఆలయం, జాంపేట ఉమారామలింగేశ్వర ఆలయం, దేవీచౌక్ బసవ లింగేశ్వరాలయం, సరస్వతీఘాట్ జ్ఞానలింగేశ్వరాలయం, ఏవీఏ రోడ్డు శివాలయంలోను స్వామివారికి విశేష అభిషేకాలు జరిగాయి. భక్తులు ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయం, శ్రీఉమా కోటిలింగేశ్వరస్వామి, సారంగధర ఆలయం, జాంపేట ఆలయంలోను స్వామివారిని దర్శించుకున్నారు.



కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి

● ఫారెస్ట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక లలితానగర్ ఫారెస్ట్ కల్యాణమండపం వద్ద అసోసియేషన్ సభ్యులు ఆదివారం భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కాలెపు సత్యసాయిరామ్, యెజ్జు వెంకటేశ్వరరావు, బెల్లంకొండ కోటేశ్వరరావు, గవర వీర వెంకట సత్యనారాయణ, వై.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

● నల్లమందుసందు వర్తకులు, ఫ్రెండ్స్ సర్కిల్, గంటాలమ్మగుడి వీధి వర్తకుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. శివలింగం, దేవతామూర్తులను నిలబెట్టారు. భక్తులకు భారీ అన్నదానం చేశారు. * గోదావరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సీతంపేట వాటర్ టాంకులు ఎదురుగా బస్‌షెల్టర్ వద్ద టి.కె.విశ్వేశ్వర రెడ్డి నిర్వహణలో భక్తులకు పులిహోర, మంచినీరు పంపిణీ చేశారు. ● గోకవరం బస్టాండ్ వద్ద ఎస్ ఆర్‌కే క్యాటరింగ్, మాజీ కార్పొరేటర్ వాసంశెట్టి గంగాధరరావు సంయుక్త ఆధ్వర్యంలో మంచు శివలింగం ఏర్పాటు చేసి భక్తులకు అల్పాహారం, ప్రసాదం పంపిణీ చేశారు.

● అన్నపూర్ణమ్మపేటలో ముచ్చకర్ల చిన్నారావు సహకారంతో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం, అప్పారావు చేతుల మీదుగా భక్తులకు పంపిణీ చేశారు. ● శ్రీనటరాజ పీఠంలో నాట్యాచార్యులు పద్మశ్రీ దుర్గాప్రసాద్ నిర్వహణలో శివరాత్రి నృత్యోత్సవం వైభవంగా నిర్వహించారు. శైవాగమ నృత్యరీతిలో విద్యార్థులు నటరాజస్వామికి నృత్యంతో నీరాజనం సమర్పించారు.

పుష్కరఘాట్‌లో నగరవాసుల స్నానాలు

అడుగు కదలదు వాహనం ముందుకెళ్లదు

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రధాన కూడళ్లు, రహదారులపై వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రధాన రహదారుల వెంట భక్తులకు ప్రసాదం, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు వితరణ చేయడంతో భక్తులు రోడ్డు పక్కన వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. శ్యామలాసెంటర్ నుంచి దేవీచౌక్ వరకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. దేవీచౌక్ ప్రాంతంలో నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఒకదానికి ఒకటి ఎదురుపడి ముందుకు వెళ్లేందుకు సుదీర్ఘసమయం పట్టింది. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా ఏమీ చేయలేని పరిస్థితి. పుష్కరఘాట్ నుంచి కొవ్వూరు వరకు భక్తులకు మంచినీరు, ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయాలతో పాటు ప్రధాన రహదారులు, ఆనుకుని ఉన్న వీధుల్లో టెంట్లు వేసి వితరణ చేశారు. దీంతో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు కనిపించాయి. ఒకవైపు పారిశుద్ధ్య సిబ్బంది తొలగించినా మళ్లీ ఇష్టానుసారంగా రోడ్లపై పడేశారు. నిర్వాహకులు చెత్తబుట్టలు ఏర్పాటు చేసినా సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ప్రధాన సమస్యగా నెలకొంది. దేవీచౌక్, కంబాలచెరువు, గోదావరి బండ్ రోడ్డు, ఆర్యాపురం, కోటిలింగాల రేవును ఆనుకుని ఉన్న రహదారుల్లో రద్దీగా మారిపోయాయి. - న్యూస్‌టుడే, దేవీచౌక్

ప్రధాన రహదారిలో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ రద్దీ

శూలాల సంబరం

శ్రీభద్రావతి సమేత భావనాఋషి స్వామి వారు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని తుమ్మలావలో శ్రీభద్రావతి సమేత భావనాఋషి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాన్ని దీపాలతో అలంకరించి, కాశీ అన్నపూర్ణేశ్వర స్వామివారికి సహస్ర లింగార్చన, శూలాల సంబరం, పురవీధుల్లో ఊరేగింపు, లింగోద్భవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

జ్వాల వెలిగించి ఉత్సవం ప్రారంభిస్తున్న భక్తులు

ఎంసీసీ ప్రాంగణంలో ఉద్యోగమేళా రేపు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం తాడితోట వద్ద మోడల్ కెరీర్ సెంటర్(ఎంసీసీ) ప్రాంగణంలో ఈనెల 17న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి హరీశ్‌చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ మేళాలో రాగార్ ల్యాబ్స్, ఎస్‌బీఐ ప్రైమెంట్స్, పేటీఎం, ఇన్నోవా సోర్స్ కంపెనీల్లో పలు పోస్టుల భర్తీకి అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ విద్యార్హతలు కలిగిన 19 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబరులో సంప్రదించాలన్నారు.

కాలువ అనుసంధానించరూ

దివాన్‌చెరువు వద్ద హైవే విస్తరణ నిర్మాణంలో భాగంగా సర్వీసు రోడ్డు పక్కన నిర్మిస్తున్న మేజర్ డ్రెయిన్ పాతూరు మురుగు నీటి డ్రెయిన్‌ను అనుసంధానించక పోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో మురుగు బయటకు పోయే మార్గం లేక ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. సొసైటీ భవనం వద్ద డ్రెయిన్ లోతు పెంచి, పాతూరు వద్ద అనుసంధానం చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అంటున్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

ప్రమాదానికి చిరునామాగా

గామన్‌వంతెన మార్గంలో కాతేరు నుంచి కొంతమూరు రహదారిలో ఇరువైపులా లారీలను పార్కింగ్ చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిలో ఎక్కడపడితే అక్కడ భారీ వాహనాలు ఆపుతుండటంతో ప్రమాదాలకు అవకాశం ఉంటోంది. వీటిని నిలపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ఇసుకతో ఇక్కట్లు

కాతేరు రహదారిలో ఇసుక పేరుకుపోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ వైపుగా వెళ్లే బస్సులు, భారీ వాహనాలు నిత్యం ఈ మార్గంలోనే ప్రయాణిస్తాయి. ద్విచక్రవాహనాలు, పాఠశాల బస్సులతో రద్దీగా ఉంటుంది. హఠాత్తుగా బ్రేకులు వేస్తే అదుపుతప్పి పడిపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనచోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

వెలగని వీధిదీపాలు

ధవళేశ్వరం రోడ్డు స్వరాజ్‌నగర్ ప్రాంతంలో రాత్రి పూట దీపాలు సరిగ్గా వెలగట్లేదు. ఇతర ప్రాంతాల నుంచి దీని మీదుగా రాజమహేంద్రవరానికి వస్తారు. దీంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాత్రిపూట రాకపోకలు సాగించేందుకు స్థానికులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. వెలిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ఉచిత వైద్యశిబిరం

మహాశివరాత్రి సందర్భంగా మార్కండేయ స్వామి ఆలయం వద్ద బీఎంపీ అసోసియేషన్ రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ మదనసింగ్ రాజపుత్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ లంక సత్యనారాయణ ప్రారంభించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన 600 మందికి పైగా వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ఆకాశం గౌరీష్‌బాబు, డాక్టర్ కొమ్మా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

పుష్కరం.. పచ్చదనంపై ప్రత్యేక దృష్టి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని పచ్చదనం విస్తరణకు నగరపాలక సంస్థ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ప్రధానంగా ఉద్యానాలపై దృష్టి సారించారు. నగరంలో 21 పార్కులను గుర్తించి ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఒక్కొక్కదానికి రూ.50 లక్షలు పైబడి నిధులు వెచ్చిస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌తోపాటు, గ్రీనరీ కల్పన, చిన్నారులకు ఆట వస్తువులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో పాడైన వాటర్ ఫౌంటేన్‌ల మరమ్మతు పనులు పూర్తి చేశారు. నగరంలో అలంకరణ నిమిత్తం ఎంపిక చేసిన కూడళ్లలో ఫౌంటేన్‌లు ఏర్పాటు చేస్తుండగా పనులు జరుగుతున్నాయి. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ముఖ్య రహదారులను ఎంపిక చేసి విభాగినులు నిర్మిస్తూ, విరివిగా మొక్కలు పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. దీనికోసం ప్రత్యేక యంత్రాన్ని పెడుతున్నారు. గాలిలో నీటిని వెదజల్లడం ద్వారా కాలుష్యం కొంతమేర తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఈ యంత్రం ఒకటి మాత్రమే అందుబాటులో ఉండగా, త్వరలో మరొక యంత్రం అందుబాటులోకి తీసుకురానున్నారు.

పైపులైను పగిలి.. సమస్యలే మిగిలి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: కలెక్టరేట్ సమీపంలోని 'బి' బ్లాకు టిడ్కో గృహసముదాయాల వద్ద పైపులైను పగిలి తాగునీరు వృథాగా పోతుంది.

రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా మరమ్మతులకు నోచుకోవడం లేదని స్థానికుల వాపోతున్నారు. నగరంలోని పేదలకు నాలుగేళ్ల కిందట ఇక్కడ టిడ్కో గృహాలు కేటాయించినప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీటి సదుపాయం లేదని, ప్రస్తుతం ఉన్న రక్షిత ట్యాంకుల నుంచి సరఫరా అవుతున్న నీరు వాడకానికి తప్ప తాగడానికి ఉపయోగపడడం లేదని వారు చెబుతున్నారు. ఆ నీరు కూడా ఇలా వృథాగా పోవడంతోపాటు కలుషితమవుతున్నా సిబ్బంది ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైను మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శుద్ధజలం.. పచ్చి అబద్ధం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రస్తుత జీవన విధానంలో అన్ని వర్గాల ప్రజలు మినరల్ వాటర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. చాలామంది డబ్బులు వెచ్చించి మరీ కొనుగోలు చేసుకుని తాగుతున్నారు. 20 లీటర్ల తాగునీటి టిన్‌ను రూ.20 నుంచి రూ.30 వెచ్చించి మరీ కొంటున్నారు. ఇదే అదునుగా కొంతమంది మినరల్ వాటర్ పేరుతో నకిలీ దందా చేస్తున్నారు. పూర్తిగా ఫిల్టర్ లేని నీళ్లు తాగి వినియోగదారులు రోగాల బారిన పడుతున్నారు. నగరంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా వ్యాపారం నిర్వహిస్తున్నారు.

పాటించాల్సిన నియమాలు..

తాగునీరు సేకరణ, శుద్ధి విషయంలో కచ్చితంగా కొన్ని ప్రమాణాలు పాటించాలి. పూర్తిస్థాయిలో శుద్ధి ప్రక్రియ చేపట్టాలి. సేకరణ, ఫిల్టరేషన్, నీటి పంపింగ్, సరఫరా తదితరాలకు సంబంధించి ఎక్కడా నిబంధనలు అమలు కావట్లేదు. తాగునీటి సేకరణపై భూగర్భజలశాఖ నుంచి ఆమోదం తీసుకోవాలి. ప్లాంటుల వద్ద బోర్ ఏర్పాటు చేయాలి. ప్రత్యేకంగా శుద్ధీకరణ ప్లాంటు ఉండాలి. నీటిలో పీహెచ్ విలువ తెలియజేసేలా ప్రదర్శించాలి. ఇవన్నీ ఉంటేనే నగరపాలక సంస్థ పరిశీలించి ధ్రువీకరించాలి. కొన్నిచోట్ల ఎక్కడో పట్టిన నీళ్లను తీసుకొచ్చి, నేరుగా విక్రయిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా మున్సిపల్ ట్యాప్‌లను వినియోగిస్తున్నారు. వాటినే కూలింగ్ చేసి టిన్‌లలో పోసి అమ్మేస్తున్నారు. తాజాగా ఆల్కలిన్ పేరుతో లీటరు రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు.

నగరంలో 50కు పైగా..

నగరంలో 50కు పైగా నీటిశుద్ధి ప్లాంట్‌లు ఉన్నాయి. కొన్నిచోట్ల మినరల్స్ పక్కన పెడితే పీహెచ్ విలువలు లేని నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో గుండె, ఊపిరితిత్తులు, కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వచ్చేది ఎండాకాలం.. ఎక్కువ మంది చల్లని నీటిని తాగేందుకు ఇష్టపడతారు. దీంతోపాటు ఐస్ కలిపిన పానీయాలు తాగేందుకు ఆసక్తి చూపుతారు. ఇవన్నీ నిబంధనలకు విరుద్ధంగా తయారవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలో జాంపేట, కోటిపల్లి బస్టాండ్, ఆజాద్ చౌక్, కోటిపల్లి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఈ పరిస్థితి ఉందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

శక్తివేషధారణలో

రథోత్సవంలో నృత్యాలు

ఆకట్టుకున్న వేషాలు.. అలరించిన నృత్యాలు

గొరిల్లా వేషంలో..

శివరాత్రి సందర్భంగా రాజమహేంద్రవరంలో ఆదివారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆలయాలు, ఘాట్‌లు, సత్రాలు, కళాక్షేత్రాలు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శివాలయాల వద్ద ఉరేగింపులు, గ్రామోత్సవాలు నిర్వహించారు. కోటిలింగేశ్వరాలయంలో రథోత్సవం కనులపండువగా సాగింది. ఆయా కార్యక్రమాల్లో వివిధ వేషధారణల్లో భక్తులు ఆకట్టుకున్నారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, సంగీత వేడుకలు విశేషంగా ఆకట్టుకున్నాయి. - ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే

కాంతారగా...

రంజాన్ తోఫా పంపిణీ

మోరంపూడి, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకుని మీర్జా అన్వర్ బేగ్ సౌజన్యంతో తుమ్మా ఆధ్వర్యంలో తెదేపా నాయకుడు షేక్ సుభాన్ అధ్యక్షతన ఆదివారం శాటిలైట్ సిటీలో రంజాన్ తోఫా కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వంద కుటుంబాలకు తోఫా పంపిణీ చేశారు. రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రంజాన్ నెలలో వారి శక్తి మేరకు పేదవారికి సహాయం చేస్తే అల్లా కృప ఉంటుందన్నారు. తోఫా ఏర్పాటు చేసిన వారిని అభినందించారు.

మద్యం మత్తు.. గోదావరిలో పడి ఒకరికి గాయాలు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసం ఉత్సవాలకు తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ నుంచి వచ్చిన అబ్బులు అనే వ్యక్తి తాగిన మైకంలో నది ఒడ్డున నీటిలో పడడంతో ఆదివారం మధ్యాహ్నం కొంతసేపు ఉత్కంఠ నెలకొంది. వెంటనే అప్రమత్తమైన భక్తులు అధికారులకు సమాచారం అందించడంతో పోలీసులతోపాటు వైద్యులు పరుగులు తీశారు. అతడ్ని బయటకు తీసి పోలవరం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మద్యం మత్తులో నీటిలో పడిపోయాడని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆసుపత్రిలో అతడు కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు.

మల్లంపూడిలో 30 గ్రాముల బంగారం చోరీ

రాజానగరం, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే లోపు రెండు గంటల వ్యవధిలోనే చోరీ జరిగిన సంఘటన రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధి మల్లంపూడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పబ్బు సురేష్, తల్లి కనకమహలక్ష్మిని తీసుకుని ద్విచక్రవాహనంపై తెల్లవారుజామున మూడు గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరం వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు పగలగొట్టి.. బీరువా తెరచి ఉంది. వెంటనే లోపలికి వెళ్లి చూసేసరికి 30 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు వెండి కుంకుమ బరిణిలు, హాలులో ఉంచిన రూ.1.16 లక్షల నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో నలుగురిపై కేసు

కోరుకొండ, న్యూస్‌టుడే: కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటనలో మండలంలోని జంబూపట్నం గ్రామానికి చెందిన నలుగురు యువకులపై కోరుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జంబూపట్నం మీదుగా వెళ్తున్న మట్టి లారీలను స్థానిక యువత నిలిపివేయడంతో సమాచారం అందుకున్న కానిస్టేబుల్ సంఘటనా ప్రాంతానికి వచ్చి పరిశీలిస్తుండగా.. స్థానిక యువకులకు, కానిస్టేబుల్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కానిస్టేబుల్‌పై దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సోమవారం కోర్టులో హాజరుపర్చనున్నట్లు సమాచారం.

CHANGE OF NAME
I, SWAPNADEVI HARI called as Swapnadevi Karumuri, W/o Ravi Sankar Hari, Resident of D.No.81-43-04, Flat No.301, Tulasi Rama Nilayam, Happy Street, Rajamahendravaram, solemnly declare. That for and on behalf of myself and my remitter issue wholly Changed my Name from SWAPNADEVI KARUMURI (Old Name) to SWAPNADEVI HARI (New Name) and so that I and my remitter issue may hereafter be called, known and distinguished not by my former name, but assumed name of SWAPNADEVI HARI.

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

17న ధర్నా విజయవంతం చేద్దాం

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న యూటీఎఫ్ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీఆర్ ప్రసాద్, ఎ.షరీఫ్ అన్నారు. విజయవాడ ధర్నాచౌక్‌లో 17న 20వేల మంది ఉపాధ్యాయులతో ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కడియం: కడియపులంకలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 76వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. స్వామిని భారీ గజమాలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బాలోత్సవం-3లో భాగంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

కడియపులంకలో అభయాంజనేయస్వామి

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు	ధవళేశ్వరం: 91212 29057	కడియం: 91212 29062
	బొమ్మూరు: 91549 78039	మోరంపూడి: 94935 92696
	రాజానగరం: 98492 36167	కోరుకొండ: 80085 74213

సమస్య: బొమ్మూరు చెరువుగట్టుకు ఆనుకుని చేపట్టిన రోడ్డు పనుల కారణంగా రహదారి పక్కన ఉన్న తాగునీటి పైపులైను పగిలిపోయి నీరు వృథాగా పోతుంది. - శ్రీధర్

సమాధానం: నీటి వృథా అరికడతాం. మరమ్మతులు చేయిస్తాం. - కాశీ, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, బొమ్మూరు

మల్లవరం శివాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బొమ్మూరు శివాలయంలో..

పిడింగొయ్యిలో..

దుళ్లలో సాంస్కృతిక ప్రదర్శనలతో స్వామి రథోత్సవం

రంజాన్ తోఫా పంపిణీ

మోరంపూడి, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకుని మీర్జా అన్వర్ బేగ్ సౌజన్యంతో తుమ్మా ఆధ్వర్యంలో తెదేపా నాయకుడు షేక్ సుభాన్ అధ్యక్షతన ఆదివారం శాటిలైట్ సిటీలో రంజాన్ తోఫా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల రవిరామ్ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వంద కుటుంబాలకు తోఫా పంపిణీ చేశారు. రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రంజాన్ నెలలో వారి శక్తి మేరకు పేదవారికి సహాయం చేస్తే అల్లా కృప ఉంటుందన్నారు. తోఫా ఏర్పాటు చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు మత్యేటి శివ ప్రసాద్, శాటిలైట్ సిటీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిద్దనకోళ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న రవిరామ్ కిరణ్, తదితరులు

అద్వైత భాస్కరం అర్ధనారీశ్వరం

కడియం, రాజానగరం, బొమ్మూరు, హుకుంపేట, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజానగరం, రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గాల్లోని పలు శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగిపోయాయి. భక్తులు శివుని పంచాక్షరీ మంత్రం జపిస్తూ తెల్లవారు జాము నుంచే దర్శనాలకు బారులు తీరారు. సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, శాంతి కల్యాణం, రథోత్సవం, మహాన్యాస పూర్వక, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. రాత్రి లింగోద్భవ సమయం వరకు భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. ● కడియంలోని శ్రీభ్రమరాంబా సమేత శ్రీమల్లేశ్వర స్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు, కడియపులంక హరిహర మహాక్షేత్రంలోని శ్రీఉమా సమేత ఆనందేశ్వర స్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. హిమవంతుని కుమార్తె మంచు కొండల మధ్య అలంకార రూపిణి అపర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ● దుళ్లలో శ్రీగోకర్ణేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య రథోత్సవం కనులవిందుగా సాగింది. ● దివాన్‌చెరువులోని ద్వాదశ జ్యోతిర్లింగాలు, కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాలను రాజమహేంద్రవరం నుంచి భక్తులు తరలివచ్చారు. రాజానగరంలోని రాజలింగేశ్వర స్వామిని విశేషంగా అలంకరించారు. సంపత్ నగరం శివనాగేశ్వరాలయంలో కల్యాణం నిర్వహించారు. ● హుకుంపేట ఉమారామలింగేశ్వర, బొమ్మూరు గౌరి చంద్రమౌళేశ్వర ఆలయాల్లో రాత్రి లింగోద్భవ కాలంలో విశేష అభిషేకాలు నిర్వహించారు.

మోరంపూడి, ధవళేశ్వరం: పిడింగొయ్యి గ్రామం కపిలేశ్వర శివాలయం, శైవ క్షేత్రాలను గోదావరి స్నానం ఆచరించి భక్తులు దర్శించుకున్నారు. ● ధవళేశ్వరంలో కొలువైన అగస్త్యేశ్వర స్వామిని తెదేపా యువ నాయకుడు ఆదిరెడ్డి... గోరంట్ల రవిరామ్ కిరణ్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు.

రాజానగరంలోని రాజలింగేశ్వరస్వామి

కడియపులంకలో అపర్ణాదేవి

గోకవరం: మల్లవరం గ్రామంలోని కొలువైన శ్రీ ఉమామల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి గ్రామోత్సవ నిర్వాహకులు భక్తుల సహకారంతో నూతన రథాన్ని చేయించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి శివనామస్మరణతో రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ● మల్లవరం, తంటికొండ, గోకవరం, కొత్తపల్లి, కృష్ణునిపాలెం తదితర గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కోరుకొండ, సీతానగరం, న్యూస్‌టుడే: కోరుకొండ మండలం కాపవరం, కణుపూరు భ్రమరాంబా మల్లికార్జున స్వామివారి ఆలయాల్లో విశేష రుద్రాభిషేకాలు, లక్షపత్రి, కుంకుమ పూజలు నిర్వహించారు. సీతానగరం మండలం మునికూడలిలో శివాలయంలో పూజలు జరిగాయి. రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి, విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంటాల శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆయా శివాలయాలను దర్శించుకున్నారు.

పూజలో పాల్గొన్న రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి

పార్టీ సిద్ధాంతాలను విస్తృతం చేయాలి

కడియం, న్యూస్‌టుడే: యువతకు జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలు నిశితంగా వివరించి సభ్యత్వ నమోదు క్షేత్రస్థాయిలో ప్రారంభించాలని ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సూచించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కడియపులంక సర్పంచి సంపూర్ణ అయ్యప్ప తెలిపారు. ఆదివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపముఖ్యమంత్రిని కలిసినట్లు పేర్కొన్నారు. గతంలో రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గంలో పార్టీ తరఫున చేసిన సభ్యత్వాల నమోదు గురించి వివరించినట్లు తెలిపారు. గతంలో అత్యధిక సభ్యత్వ నమోదు చేసిన వారి సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందదాయకమని అయ్యప్ప అన్నారు.

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసిన అయ్యప్ప

ఈ నెల 20 నుంచి బ్రహ్మోత్సవాలు

పాలచర్ల పంచాయతీ పరిధి లక్ష్మీ పద్మావతి గోదా ఆండాళ్ సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఐదు రోజులు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు బుద్దాల సోదరులు వెంకన్నబాబు, అమ్మిరాజు, ఆలయ పురోహితులు జి.గణేష్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు విష్ణు సహస్రనామ పారాయణ, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అఖండ హోమాలు నిర్వహిస్తారన్నారు. ● 21న సప్త కలశారాధన, పంచామృత మండపారాధన, 22న శ్రీలక్ష్మీ పద్మావతి, గోదా ఆండాళ్ అమ్మవార్లకు, ఆంజనేయ స్వామివారికి, షిర్డీ సాయిబాబా వారికి పుష్పాభిషేకం, సామూహిక కుంకుమాభిషేకం, సదస్యం ఉంటుందన్నారు. 23న నవగ్రహ హోమాలు, మేళతాళాలతో స్వామివారికి వాహనంపై గ్రామోత్సవం, 24న చక్రస్నానం, వసంతోత్సవం, వివిధ రకాల పండ్లతో ద్వాదశ ప్రదక్షిణలు, నివేదన, పవళింపు సేవ, దీక్షా విసర్జన, మహా ఆశీర్వచనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

కణుపూరు కొండపై జ్యోతి దర్శనం

కణుపూరు కొండ అనగానే భక్తులకు శబరిమల గుర్తుకొస్తుంది. అక్కడ ఏటా సంక్రాంతికి జ్యోతి రూపంలో దర్శనం ఉంటుందని విశ్వసం తెలిసిందే. అదే మాదిరిగా కోరుకొండ మండలం కణుపూరు కొండపైనా ఆలయం ఉంది. భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామివారు ఇక్కడ కొండపై పంచ లింగాల రూపంలో స్వయంభువుగా వెలిశారు. అయిదు రోజుల మహాశివరాత్రి ఉత్సవాల్లో ఒకరోజు రాత్రి శబరిమలలో మాదిరిగా భక్తులు జ్యోతిదర్శనం చేసుకుంటారు. దీనిని తిలకించేందుకు వేలసంఖ్యలో భక్తులు తరలివస్తారు. కొండపైన స్వామివారి దర్శనానికి సుమారు 300 మెట్లు ఎక్కాలి. - న్యూస్‌టుడే, కోరుకొండ



నిలువెల్లా నిర్లక్ష్యం..?

దివాన్‌చెరువు వద్ద జాతీయ రహదారిపై ఫైవంతెన నిర్మాణ పనుల కారణంగా ఇరువైపులా సుమారు నాలుగు అడుగుల లోతున సర్వీసు రహదారి నిర్మిస్తున్నారు. ఈ కారణంగా రద్దీ విపరీతంగా ఉంటోంది. అసలే ప్రమాదకర పరిస్థితులు ఉండగా కొంతమంది ఆటో చోదకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలకు అవకాశం ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

రహదారిపైకి మురుగు

ధవళేశ్వరం క్వారీ కాలువ సెంటర్ ప్రధాన రహదారి పక్కన మురుగు కాలువ నిండి రోడ్లపైకి వస్తుంది. కాలువలో సిల్ట్, వ్యర్థాలు పేరుకుపోవడంతో నెల రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసనతో, దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మోరంపూడి

జారిపోతున్న వాహనాలు

జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద గామన్ ఇండియా రహదారి వైపునకు మళ్లే కూడలి (జీరోపాయింట్) వద్ద ఇసుక పేరుకుపోయి ప్రమాదకరంగా మారింది. అటు రాజమహేంద్రవరం, ఇటు కొవ్వూరు నుంచి దివాన్ చెరువు వైపు వేగంగా రాకపోకలు సాగిస్తారు. ఏమాత్రం ఆదమరుపుగా ఉన్నా జారిపోయే అవకాశాలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు కారణంగానే రోడ్డుపై పడి సమస్యగా మారిందని ప్రజలు వాపోతున్నారు. వీటి అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

గుంతతో ప్రమాదం

కాతేరు - రాజమహేంద్రవరం ప్రధాన రహదారిలో భారీ గుంత ఏర్పడడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వెనుక నుంచి వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో వాహనాలు గుంతలో దిగిపోయి మరమ్మతులకు గురవుతున్నాయి. ఇక్కడే మలుపు ఉండడంతో వాహనదారులు రహదారి అంచుల వరకు వచ్చేసి అదుపుతప్పి పడిపోతున్నారు. సమీపంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిళ్లు సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బొమ్మూరు

కాలువను అనుసంధానించరూ..?

దివాన్‌చెరువు వద్ద ఫైవంతెన నిర్మాణం పనుల్లో భాగంగా సర్వీసు రోడ్డు పక్కన నిర్మిస్తున్న మేజర్ డ్రైయిన్ పాతూరు మురుగు నీటి డ్రైయిన్‌ను అనుసంధానించకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో గ్రామంలోని మురుగు, వర్షాల సమయంలో నీరు బయటకు పోయే మార్గం లేక పాతూరు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. స్థానిక సొసైటీ భవనం వద్ద రెండు అడుగులు లోతుకు మేజరు డ్రైయిన్ నిర్మించి పాతూరు మురుగునీటి డ్రైనును అనుసంధానించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. లేకుంటే మేజర్ డ్రైన్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని గ్రామస్థులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

108 అంబులెన్స్ సిబ్బంది మోములో ఆనందం

రాజానగరం, న్యూస్‌టుడే: అత్యవసర వైద్య సేవలందిస్తున్న 108 సిబ్బందికి కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించడంతో వారి మోముల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. విధి నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న అంబులెన్స్ చోదకులు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం రాకతో ఒక్కొక్కరికి రూ.రెండు వేల నుంచి రూ.ఏడు వేల వరకు వేతనాలు పెరిగాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం మత్తులో గోదావరి నీటిలో పడిన వ్యక్తికి గాయాలు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసం ఉత్సవాలకు తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ నుంచి వచ్చిన అబ్బులు అనే వ్యక్తి తాగిన మైకంలో నది ఒడ్డున నీటిలో పడడంతో ఆదివారం మధ్యాహ్నం కొంతసేపు ఉత్కంఠ నెలకొంది. వెంటనే అప్రమత్తమైన భక్తులు అధికారులకు సమాచారం అందించడంతో పోలీసులతోపాటు వైద్యులు పరుగులు తీశారు. అతడ్ని బయటకు తీసి పోలవరం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మద్యం మత్తులో నీటిలో పడిపోయాడని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆసుపత్రిలో అతడు కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు.

మల్లంపూడిలో చోరీ

30 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు అపహరణ

రాజానగరం, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే లోపు రెండు గంటల వ్యవధిలోనే చోరీ జరిగిన సంఘటన రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధి మల్లంపూడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పబ్బు సురేష్, తల్లి కనకమహలక్ష్మిని తీసుకుని ద్విచక్రవాహనంపై తెల్లవారుజామున మూడు గంటలకు బయలు దేరి రాజమహేంద్రవరం వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి.. బీరువా తెరచి ఉంది. వెంటనే లోపలికి వెళ్లి చూసేసరికి 30 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు వెండి కుంకుమ బరిణిలు, హాలులో ఉంచిన రూ.1.16 లక్షల నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో నలుగురిపై కేసు

కోరుకొండ, న్యూస్‌టుడే: కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటనలో మండలంలోని జంబూపట్నం గ్రామానికి చెందిన నలుగురు యువకులపై కోరుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జంబూపట్నం మీదుగా వెళ్తున్న మట్టి లారీలను స్థానిక యువత నిలిపివేయడంతో సమాచారం అందుకున్న కానిస్టేబుల్ సంఘటనా ప్రాంతానికి వచ్చి పరిశీలిస్తుండగా.. స్థానిక యువకులకు, కానిస్టేబుల్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కానిస్టేబుల్‌పై దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సోమవారం కోర్టులో హాజరు పర్చనున్నట్లు సమాచారం.

శుద్ధజలం.. పచ్చి అబద్ధం

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

ప్రస్తుత జీవన విధానంలో అన్ని వర్గాల ప్రజలు మినరల్ వాటర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. చాలామంది డబ్బులు వెచ్చించి మరీ కొనుగోలు చేసుకుని తాగుతున్నారు. 20 లీటర్ల తాగునీటి టిన్‌ను రూ.20 నుంచి రూ.30 వెచ్చించి మరీ కొంటున్నారు. ఇదే అదునుగా కొంతమంది మినరల్ వాటర్ పేరుతో నకిలీ దందా చేస్తున్నారు. పూర్తిగా ఫిల్టర్ లేని నీళ్లు తాగి వినియోగదారులు రోగాల బారిన పడుతున్నారు. నగరంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా వ్యాపారం నిర్వహిస్తున్నారు.

పాటించాల్సిన నియమాలు..

తాగునీరు సేకరణ, శుద్ధి విషయంలో కచ్చితంగా కొన్ని ప్రమాణాలు పాటించాలి. పూర్తిస్థాయిలో శుద్ధి ప్రక్రియ చేపట్టాలి. సేకరణ, ఫిల్టరేషన్, నీటి పంపింగ్, సరఫరా తదితరాలకు సంబంధించి ఎక్కడా నిబంధనలు అమలు కావట్లేదు. తాగునీటి సేకరణపై భూగర్భజలశాఖ నుంచి ఆమోదం తీసుకోవాలి. ప్లాంటుల వద్ద బోర్ ఏర్పాటు చేయాలి. ప్రత్యేకంగా శుద్ధీకరణ ప్లాంటు ఉండాలి. నీటిలో పీహెచ్ విలువ తెలియజేసేలా ప్రదర్శించాలి. ఇవన్నీ ఉంటేనే నగరపాలక సంస్థ పరిశీలించి ధ్రువీకరించాలి. కొన్నిచోట్ల ఎక్కడో పట్టిన నీళ్లను తీసుకొచ్చి, నేరుగా విక్రయిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా మున్సిపల్ ట్యాప్‌లను వినియోగిస్తున్నారు. వాటినే కూలింగ్ చేసి టిన్‌లలో పోసి అమ్మేస్తున్నారు. తాజాగా ఆల్కలీన్ పేరుతో లీటరు రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు.

నగరంలో 50కు పైగా..

నగరంలో 50కు పైగా నీటిశుద్ధి ప్లాంట్‌లు ఉన్నాయి. కొన్నిచోట్ల మినరల్స్ పక్కన పెడితే పీహెచ్ విలువలు లేని నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో గుండె, ఊపిరితిత్తులు, కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వచ్చేది ఎండాకాలం.. ఎక్కువ మంది చల్లని నీటిని తాగేందుకు ఇష్టపడతారు. దీంతోపాటు ఐస్ కలిపిన పానీయాలు తాగేందుకు ఆసక్తి చూపుతారు. ఇవన్నీ నిబంధనలకు విరుద్ధంగా తయారవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలో జాంపేట, కోటిపల్లి బస్టాండ్, ఆజాద్ చౌక్, కోటిపల్లి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఈ పరిస్థితి ఉందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

పుష్కరం.. పచ్చదనంపై ప్రత్యేక దృష్టి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని పచ్చదనం విస్తరణకు నగరపాలక సంస్థ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ప్రధానంగా ఉద్యానాలపై దృష్టి సారించారు. నగరంలో 21 పార్కులను గుర్తించి ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఒక్కొక్కదానికి రూ.50 లక్షలు పైబడి నిధులు వెచ్చిస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌తోపాటు, గ్రీనరీ కల్పన, చిన్నారులకు ఆట వస్తువులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో పాడైన వాటర్ ఫౌంటేన్‌ల మరమ్మతులు పూర్తి చేశారు. నగరంలో అలంకరణ నిమిత్తం ఎంపిక చేసిన కూడళ్లలో ఫౌంటేన్‌లు ఏర్పాటు చేస్తుండగా పనులు జరుగుతున్నాయి. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ముఖ్య రహదారులను ఎంపిక చేసి విభాగినులు నిర్మిస్తూ, విరివిగా మొక్కలు పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. దీనికోసం ప్రత్యేక యంత్రాన్ని పెడుతున్నారు. గాలిలో నీటిని వెదజల్లడం ద్వారా కాలుష్యం కొంతమేర తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఈ యంత్రం ఒకటి మాత్రమే అందుబాటులో ఉండగా, త్వరలో మరొక యంత్రం అందుబాటులోకి తీసుకురానున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రైల్వే ఉద్యోగి ప్రతిభ

రజత పతకంతో లక్ష్మీనారాయణ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాజమహేంద్రవరం రైల్వే ఉద్యోగి ప్రతిభ చూపారు. ఇక్కడి రైల్వే మెము కార్‌షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న డి.లక్ష్మీనారాయణ ఈనెల 13 నుంచి 15 వరకు అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూల్‌లో జరిగిన 3వ ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ పోటీలు (83 కేజీల సీనియర్స్ విభాగం)లో పాల్గొని రెండవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఈయన రాష్ట్ర, జాతీయ స్థాయి పవర్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ ఇప్పటికే పలు పతకాలు సాధించారు. ఇప్పుడు రాష్ట్రస్థాయి పోటీల్లో మరో పతకాన్ని తన ఖాతాల్లో వేసుకున్న లక్ష్మీనారాయణను ఈ సందర్భంగా రైల్వే మెముకార్ షెడ్ ఏడీఈఈ డి.ప్రసాద్‌రావు, సిబ్బంది అభినందించారు.

శూలాల సంబరం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని తుమ్మలావలో శ్రీభద్రావతి సమేత భావనాఋషి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాన్ని దీపాలతో అలంకరించి, కాశీ అన్నపూర్ణేశ్వర స్వామివారికి సహస్ర లింగార్చన, శూలాల సంబరం, పురవీధుల్లో ఊరేగింపు, లింగోద్భవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

శ్రీభద్రావతి సమేత భావనాఋషి స్వామి వారు

ఉత్సవంలో భక్తులు

ఎంసీసీ ప్రాంగణంలో ఉద్యోగమేళా రేపు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం తాడితోట వద్ద మోడల్ కెరీర్ సెంటర్(ఎంసీసీ) ప్రాంగణంలో ఈనెల 17న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళీ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ మేళాలో ఠాగూర్ లాబ్స్, ఎస్‌బీఐ ప్రైమెంట్స్, పేటీఎం, ఇన్నోవా కంపెనీల్లో పలు పోస్టుల భర్తీకి అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ విద్యార్హతలు కలిగిన 19 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ ఆధార్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబరులో సంప్రదించాలన్నారు.

CHANGE OF NAME

I, **SWAPNADEVI HARI called as Swapnadevi Karumuri,** W/o Ravi Sankar Hari, Resident of D.No.81-43-04, Flat No.301, Tulasi Rama Nilayam, Happy Street, Rajamahendravaram, solemnly declare. That for and on behalf of myself and my remitter issue wholly Changed my Name from **SWAPNADEVI KARUMURI** (Old Name) to **SWAPNADEVI HARI** (New Name) and so that I and my remitter issue may hereafter be called, known and distinguished not by my former name, but assumed name of **SWAPNADEVI HARI.**

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

గోపాలపురం, న్యూస్‌టుడే: పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. మండలంలోని దొండపూడి, కొవ్వూరుపాడు, గుడ్డిగూడెం, భీమోలు గ్రామాల మీదుగా ఆర్టీసీ సర్వీసును 10 ఏళ్ల కిందట రద్దు చేశారు. ఈ విషయం పలు సందర్భాల్లో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొవ్వూరు డిపో మేనేజరుతో మాట్లాడడంతో అక్కడి నుంచి తాళ్లపూడి మీదుగా దొండపూడి, అక్కడ నుంచి రాజమహేంద్రవరం వరకు సర్వీసు ఏర్పాటు చేశారు. దానిని భీమోలులో ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, తెదేపా మండల అధ్యక్షుడు కె.రామ, నాయకులు గంధ్రోతు శ్రీనివాసరావు, అప్పారావు, రమేష్, సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీసీ ప్రాంగణంలో ఉద్యోగమేళా రేపు

వి.ఎల్.పురం : రాజమహేంద్రవరం తాడితోట వద్ద మోడల్ కెరీర్ సెంటర్(ఎంసీసీ) ప్రాంగణంలో ఈనెల 17న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ మేళాలో రాగార్ ల్యాబ్స్, ఎస్‌బీఐ పేమెంట్స్, పేటీఎం, ఇన్నోవా సోర్స్ కంపెనీల్లో పలు పోస్టుల భర్తీకి అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ విద్యార్హతలు కలిగిన 19 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబరులో సంప్రదించాలన్నారు.

కొవ్వూరు గోష్పద క్షేత్రంలో అభిషేకం

ఉమాకాటకోటేశ్వరస్వామికి మంత్రి దుర్గేష్ పూజలు

గోష్పద క్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ముప్పిడి..

ఘంటావారిగూడెం లలితా కామేశ్వస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే మద్దిపాటి..

నిడదవోలు సోమేశ్వరస్వామి ఆలయంలో వాసవి వనితాక్లబ్ సభ్యుల అన్నదానం

నాగేంద్ర హారాయ నమశ్శివాయః

న్యూస్‌టుడే బృందం : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం తెల్లవారుజాము నుంచే గోదావరి తీరంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పరిసరాలు శివనామ స్మరణతో మార్మోగాయి. • కొవ్వూరు గోష్పద క్షేత్రంలో సుందరీ సమేత సుందరేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరారు. స్వామికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారు పట్టు వస్త్రాలలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన, కల్యాణం నిర్వహించారు. • చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో రథోత్సవం, శూలాల వేడుక నిర్వహించారు. • నిడదవోలు మండలం కాటకోటేశ్వరంలోని ఉమాకాటకోటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. • దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని శ్రీగౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున తీర్థబిందె సర్కార్ అభిషేకం, సాయంత్రం స్వామివారి కల్యాణం, ఉండ్రాజవరం మండలం వెలగదుర్రులోని విశ్వేశ్వర, మల్లేశ్వర, వడ్లూరులోని సోమేశ్వరస్వామి వార్ల రథోత్సవాలు నిర్వహించారు. పాలంగి, మోర్త ఆలయాల్లో జరిగిన పూజల్లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. • పట్టిసీమ ఉత్సవాలకు వెళ్లే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తాళ్లపూడి ఎస్సై రామకృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. గోదావరి నదిలో బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

కొవ్వూరు గోష్పదక్షేత్రంలో భక్తుల రద్దీ

నిడదవోలు సోమేశ్వరస్వామికి అభిషేకం

మంత్రి, ఎమ్మెల్యేల పూజలు..

• నిడదవోలులోని గోలింగేశ్వర, సోమేశ్వర, కాటకోటేశ్వరంలోని ఉమాకాటకోటేశ్వరస్వామి వార్లను మంత్రి కందుల దుర్గేష్ కుమారుడు డాక్టర్ కృష్ణతేజతో కలిసి దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. • కొవ్వూరు గోష్పద క్షేత్రంలోని సుందరేశ్వరస్వామిని ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, నాయకులు, నల్లజర్ల మండలం దూబచర్ల, ఘంటావారిగూడెం గ్రామాల మధ్య ఉన్న లలితా కామేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులకు సేవలు..

కొవ్వూరు గోష్పద క్షేత్రంలో అవంతి ఫీడ్స్ అధ్వర్యంలో సుమారు 6 వేల లీటర్ల పాలు పంపిణీ చేశారు. వాసవి, సత్యసాయి సేవా సమితి, పతంజలి యోగా కేంద్రం, పాతపేట యూత్ సభ్యులు భక్తులకు పాలు, మజ్జిగ, అల్పాహారం అందించారు. • నిడదవోలు వాసవి, వాసవి వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో గోలింగేశ్వర, సోమేశ్వర స్వామి వార్ల ఆలయాల్లో భక్తులకు అల్పాహారం, బిస్కెట్లు, లడ్డూ, కాఫీ, పాలు, మజ్జిగ, మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. • గోపాలపురం మండలం దొండపూడి గ్రామస్థులు పట్టిసీమ వెళుతున్న భక్తులకు మజ్జిగ, అల్పాహారం అందించారు.

20 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

చాగల్నాడు వేంకటేశ్వరస్వామి

రాజానగరం, న్యూస్‌టుడే: పాలచర్ల పంచాయతీ పరిధి లక్ష్మీ పద్మావతి గోదా అండాళ్ సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ఐదు రోజులు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు బుద్దాల సోదరులు వెంకన్నబాబు, అమ్మిరాజు, ఆలయ పురోహితులు జి.గణేష్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు విష్ణు సహస్ర నామ పారాయణ, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అఖండ దీపారాధన, హోమాలు నిర్వహిస్తారన్నారు. * 21న సప్త కలశారాధన, పంచామృత మండపారాధన, 22న శ్రీలక్ష్మీ పద్మావతి, గోదా అండాళ్ అమ్మవార్లకు, ఆంజనేయ స్వామివారికి, షిర్డీ సాయిబాబా వారికి పూర్ణాభిషేకం, సామూహిక కుంకుమార్చన, సదస్యం ఉంటుందన్నారు. 23న నవగ్రహ హోమాలు, మేళ తాళాలతో స్వామివారికి వాహనంపై గ్రామోత్సవం, 24న చక్రస్నానం, వసంతోత్సవం, వివిధ రకాల పండ్లతో ద్వాదశ ప్రదక్షిణలు, నివేదన, పవళింపు సేవ, దీక్షా విసర్జన, మహా ఆశీర్వచనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

పైపులైను సరిచేశారు..

యాదవోలు పంచాయతీ పరిధిలో గోపాలపురం వెళ్లే రహదారిలోని ఎస్సీ ప్రాంతంలో పైపు లైన్ దెబ్బతినడంతో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు.

మురుగుకాలువలు శుభ్రం..

యర్నగూడెంలోని బీసీ తూర్పుపేట ప్రాంతం, ఎస్సీ పాతపేట, సంగాయిగూడెం రోడ్డు, బాలికల వసతి గృహం నుంచి సొసైటీ వరకు డ్రెయిన్లలో మురుగు కదలక దుర్వాసన, దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి అమ్మిరాజు దృష్టికి తీసుక వెళ్లగా సిబ్బందితో డ్రెయిన్లను శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, దేవరపల్లి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

వెలిగితే ఆరవు.. ఆరితే వెలగవు

అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ

న్యూస్‌టుడే, గోపాలపురం

పల్లెలు, పట్టణాల్లో వీధి దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా కాంతులు వెదజల్లుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతి వీధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఫలితంగా పంచాయతీలు, పురపాలికలపై బిల్లుల రూపంలో అదనపు భారం పడుతోంది. కొవ్వూరు డివిజన్‌లో ఉన్న మూడు నియోజకవర్గాల పరిధిలో 90 శాతం గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ గాడి తప్పింది. చాలా చోట్ల స్తంభానికి ఏర్పాటు చేసిన లైట్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. ఇదే సమయంలో మరికొన్ని ప్రాంతాల్లో పూర్తిగా చీకట్లు అలముకున్నాయి. దీనిపై అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకున్న వారేరీ...

డివిజన్ పరిధిలో కొవ్వూరు, నిడదవోలు పురపాలికలు, 210 పంచాయతీలున్నాయి. వీటి పరిధిలోని వీధి దీపాలు కొన్ని పగటిపూట సైతం వెలుగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో పూర్తిగా మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదు. సరఫరా నిలుపుదల చేసే స్విచ్‌లు లేక కొన్ని చోట్ల నిరంతరాయంగా వెలుగుతుండడంతో బిల్లులు భారమై చెల్లించలేక పంచాయతీలు సతమతమవుతున్నాయి. ఒక గోపాలపురం విద్యుత్తు సబ్ డివిజన్ పరిధిలోనే 2024-25 ఏడాదికిగాను సుమారు రూ.కోటి రూపాయల వరకు బకాయిలు ఉన్నాయి.

గోపాలపురంలో పగటి పూట వెలుగుతున్న వీధి దీపం

నాణ్యత లేని బల్బుల కారణంగా...

చాలా గ్రామాల్లో రాత్రి పగలు తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతుంగా మరికొన్ని గ్రామాల్లో చీకటి పడినా వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ బయటకు రావడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే పంచాయతీలో బల్బులు ఏర్పాటు చేసే గుత్తేదారులు ఖర్చు భారం తగ్గించుకునేందుకు స్తంభాలకు నాణ్యత లేని వాటిని వేసి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో అవి తరచూ కాలిపోతున్నాయి. ఈ పరిస్థితిపై గోపాలపురం ఎంపీడీవో రాజ్‌మనోహర్‌ను వివరణ కోరగా పల్లెల్లో వీధి దీపాలు నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు తరచూ సూచనలు చేస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఉండ్రాజవరం : కొత్త లైన్లు ఏర్పాటు పనుల నిమిత్తం వేలివెన్ను, కాల్దరిలో ఈ నెల 17న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నారాయణఅప్పారావు తెలిపారు.

అన్నదేవరపేటలో ఉచిత వైద్యశిబిరం..

తాళ్లపూడి :అన్నదేవరపేట ఏపీజే అబ్దుల్ కలాం ఉన్నత పాఠశాలలో ఈనెల 17న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మానవతా సంస్థ అధ్యక్షుడు వి.శ్రీనివాస్ తెలిపారు. చర్మ, దంత, నేత్ర, చెవిముక్కు, గొంతు, కీళ్ళు, ఎముకలు, కిడ్నీ, సాధారణ, స్త్రీ సంబంధిత వ్యాధులు, ఈసీజీ, ఎక్సరే తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కడియం న్యూస్‌టుడే: కడియపులంకలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 76వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. స్వామిని భారీ గజమాలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బాలోత్సవం-3లో భాగంగా పలు సాంస్కృతిక ప్రదర్శలు నిర్వహించారు.

108 అంబులెన్స్ సిబ్బంది మోములో ఆనందం

రాజానగరం : అత్యవసర వైద్య సేవలందిస్తున్న 108 సిబ్బందికి కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించడంతో వారి మోముల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. విధి నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న అంబులెన్స్ చోదకులు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

కల్వర్టు శిథిలం

ఉండ్రాజవరం మండలం మోర్త - పెరవలి రహదారిలోని రామయ్యకుంట కాలువపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఇరువైపులా రక్షణ గోడలు పడిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఏ మాత్రం వాహనం అదుపు తప్పినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టును పునర్నిర్మించాలని కోరుతున్నారు. పరిశీలించి ప్రతిపాదనలు పంపుతామని ర.భ.శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

దోమల బెడద.. దుర్వాసనతో అవస్థ

మున్సిపల్ యంత్రాంగం ఎన్ని చర్యలు చేపడుతున్నా నిడదవోలు పట్టణ వాసులకు దోమల బెడద తప్పడం లేదు. సంతమార్కెట్ వద్దనున్న బొబ్బా కృష్ణమూర్తి పురపాలక సంఘ వాణిజ్య సముదాయం వెనుక, 8వ సచివాలయం మధ్య భారీగా మురుగునీరు చేరి దుర్వాసన వస్తుండడంతో పరిసరాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ప్రధాన ప్రాంతాల్లో మురుగు నిలిచిపోకుండా చూడడంతోపాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

దారిపొడవునా వ్యర్థాలే..

దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామ శివారులో గండి చెరువు సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని చెత్తా చెదారం పేరుకుపోయింది. పందులు, శునకాలు వాటిని రహదారిపైకి లాగేస్తున్నాయి. చెత్త గాలికి ఎగిరి మీదపడుతోందని, తీవ్ర దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని అటుగా వెళ్లే వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అమ్మిరాజును వివరణ కోరగా చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, దేవరపల్లి

మురుగు పారేదెలా..?

దమ్మెన్ను, మోర్త, ఉండ్రాజవరం, పాలంగి, కె.సావరం, చివటం మీదుగా తణుకు వరకు ఉన్న ప్రధాన డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క పెరగడంతో మురుగు పారడం లేదు. వర్షాకాలంలో పొలాల్లో అదనంగా చేరిన నీరు కూడా ఈ కాలువలోకి వచ్చి చేరుతోంది. సుమారు 8 కిలోమీటర్ల మేర 6 గ్రామాల మీదుగా ఈ కాలువ ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై డ్రెయినేజీ విభాగం ఏఈ వెంకటేశ్వరరావును వివరణ కోరగా పరిశీలించి పనులు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

తాగునీరు వృథా పట్టదా...?

నిడదవోలు పట్టణంలోని రామ్‌నగర్ మూడు డాబాల వీధి శివారు పురపాలక సంఘ తాగునీరు కొద్ది రోజులుగా వృథాగా పోతుంది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొళాయిల ద్వారా రావలసిన నీరు పూర్తిగా రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సరఫరా వేళల్లో నీరు డ్రెయిన్‌లోకి చేరి నిలిచిపోతోంది. దోమలకు ఆవాసాలుగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాగు నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

నిబంధనలు పాటించకుండా భక్తులను తరలిస్తున్న బోట్ సీజ్

తాళ్లపూడి, న్యూస్‌టుడే : ఎటువంటి భద్రతా చర్యలు పాటించకుండా నిర్లక్ష్యంగా గోదావరి నదిపై భక్తులను తీసుకెళ్తున్న బోట్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం 15 మందితో కొవ్వూరు నుంచి తాళ్లపూడి మీదుగా ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ వెళుతున్న బోట్‌ను తాళ్లపూడి వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు సిబ్బంది నిలుపుదల చేశారన్నారు. భక్తులను ఒడ్డున దించేసి వాహనంలో ఆలయానికి పంపించినట్లు తెలిపారు. బోట్‌ను సీజ్ చేసి, నడుపుతున్న నూకరాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

నాగేశ్వరరావు మృతి తీరని లోటు

నిడదవోలు : మానవతా సంస్థ జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు మృతి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. నిడదవోలులో ఆయన చిత్ర పటానికి సంస్థ సభ్యులు ఆదివారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంస్థ ఆత్మీయ కమిటీ ఛైర్మన్ దారపురెడ్డి సూర్యచంద్రరావు, ఛైర్మన్ తన్నీడి బోస్, కోఛైర్మన్ కాజ గంగరాజు, మాజీ అధ్యక్షుడు కుందుల ప్రభాకంర, మాజీ ఉపాధ్యక్షుడు అన్నంరెడ్డి కొండలరాయుడు, సభ్యులు ఎన్‌వీ చౌదరి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడికి అభినందన

నిడదవోలు : ఐకేఎఫ్ ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ఒకసారి, రాష్ట్రస్థాయి పోటీల్లో నాలుగుసార్లు పాల్గొని ప్రతిభ చూపిన తిమ్మరాజుపాలెం ఏకేఆర్‌జీ పాఠశాల 8వ తరగతి విద్యార్థి గరగ విరాట్ నందన్‌ను పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఐ పీవీజీ తిలక్ అభినందించి బహుమతి అందజేశారు. పాఠశాల ఛైర్మన్ చావా గోకుల్, ప్రిన్సిపల్ జి.పద్మజ తదితరులు అభినందించారు.

సీఐ తిలక్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్ననందన్

సొసైటీ భవనం శిథిలం

తాళ్లపూడి, న్యూస్‌టుడే : మండలంలోని అన్నదేవరపేట సొసైటీ పరిధి వేగేశ్వరపురంలో ఉన్న సొసైటీ భవనం నిరుపయోగంగా వదిలేయడంతో శిథిలావస్థకు చేరుకుంది. స్థానిక రైతులు సుమారు 8కి.మీ దూరంలో ఉన్న అన్నదేవరపేట సొసైటీ నుంచి ఎరువులు తెచ్చుకుంటున్నారు. వేగేశ్వరపురంలోని సొసైటీ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు రైతులు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సొసైటీ కార్యదర్శి శ్రీనివాసు వివరణ ఇచ్చారు. ప్రస్తుత భవనాన్ని తొలగించి కొత్తది నిర్మిస్తామని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో రైల్వే ఉద్యోగి ప్రతిభ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాజమహేంద్రవరం రైల్వే ఉద్యోగి ప్రతిభ చూపారు. ఇక్కడి రైల్వే మెము కార్‌షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న డి.లక్ష్మీనారాయణ ఈనెల 13 నుంచి 15 వరకు అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూల్‌లో జరిగిన 3వ ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ పోటీలు (83 కేజీల సీనియర్స్ విభాగం)లో పాల్గొని రెండవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఈయన రాష్ట్ర, జాతీయ స్థాయి పవర్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ ఇప్పటికే పలు పతకాలు సాధించారు. ఇప్పుడు రాష్ట్రస్థాయి పోటీల్లో మరో పతకాన్ని తన ఖాతాల్లో వేసుకున్న లక్ష్మీనారాయణను ఈ సందర్భంగా రైల్వే మెముకార్ షెడ్ ఏడీఈఈ డి.ప్రసాద్‌రావు, సిబ్బంది అభినందించారు.

రజత పతకంతో లక్ష్మీనారాయణ

అడ్డుకట్ట ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

నిడదవోలు: సమిశ్రగూడెం వద్ద పశ్చిమడెల్టా ప్రధాన కాలువపై ఉన్న పురాతన వంతెన శిథిలావస్థకు చేరడంతో భారీ వాహనాల రాకపోకలను నిలువరించేందుకు వంతెనకు ఇరువైపులా గడ్డర్‌పై అడ్డుకట్ట ఏర్పాటు చేశారు. కొంతకాలం క్రితం గడ్డర్‌ను వాహనాలు ఢీకోవడంతో వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 9న 'ప్రమాదం అంచున.. ఏళ్లనాటి వంతెన' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి శుక్రవారం గడ్డర్‌పై అడ్డుకట్ట ఏర్పాటు చేశారు.

ధర్నా విజయవంతం చేద్దాం

శ్యామలా సెంటర్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న యూటీఎఫ్ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీఆర్ ప్రసాద్, ఎ.షరీఫ్ అన్నారు. విజయవాడ ధర్నాచౌక్‌లో 17న 20వేల మంది ఉపాధ్యాయులతో ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

శ్రద్ధాంజలి

ఆప్యాయతానురాగాలతో మమ్మల్ని పెంచి, మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన మా మాతృమూర్తి శ్రీ గెడా శ్రీలక్ష్మీ గారి మరణం మాకు తీరనిలోటు.. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ శ్రీమతి గెడా శ్రీలక్ష్మీ గారు
W/o. (లేటు) వీర్రాజు గారు
దిప్పకాయలపాడు. మరణం: 09-02-2026

కుమారులు: గెడా శ్రీనివాస్, గెడా సూరిబాబు కోడళ్ళు: అనిత, సుష్మ
కుమార్తె: పరిమి పద్మరాణి అల్లుడు: రామచంద్రప్రసాద్
మనుమలు, మనుమరాండ్రు: గెడా రిషిక, గెడా శ్రీమణికంఠ-దివ్య, గెడా హైందవి, ఆలపాటి కమలప్రియ-ఫణిధర్, పరిమి రాజ్‌కుమార్-లావణ్య
మునిమనుమరాండ్రు: ఆలపాటి రుత్వికవల్లి, పరిమి అన్విశ్రీ

పెదకార్యం: 23-02-2026 సోమవారం, కొయ్యలగూడెం మండలం, దిప్పకాయలపాడు గ్రామంలో మా స్వగృహము నందు జరుపబడును. గాన తెలియపర్చడమైనది

పొట్టకొట్టేస్తున్న ఎలుకలు..!

• వరి పంటను కాపాడుకోవడానికి అన్నదాతల అగచాట్లు

న్యూస్‌టుడే, తాళ్లపూడి

వాతావరణం అనుకూలంగా ఉండటంతో రబీ వరిచేలు ఏపుగా పెరిగాయి. కొన్ని చోట్ల చిరుపొట్ట దశకు చేరుకుంటున్నాయి. ఈ సమయంలో వాతావరణ మార్పులు, చీడపీడలతోపాటు ఎలుకలు చేసే విధ్వంసం అంత ఇంత కాదు. వాటిని వదిలేస్తే దిగుబడి గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

88,114 ఎకరాల్లో నాట్లు..

కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో ఈ రబీలో 88,114 ఎకరాల్లో నాట్లు వేశారు. ముందస్తుగా నాట్లు వేసిన చోట వరి చిరు పొట్ట దశలో ఉంది. ప్రారంభంలోనే ఎలుకల దాడి మరింత పెరిగింది. పంటచేలు, గడ్డివాములు, ఖాళీస్థలాలు, పుంతర హదారుల్లో వీటి తాకిడి మరింత ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. అవి చిరుపొట్టదశలో ఉన్న పిలకలను కొరికి పంటను ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల చీడపీడలు ఆశించే అవకాశం కూడా ఉంటుందంటున్నారు. ఈ కారణంగా ఎకరానికి సుమారు 3 నుంచి 6 బస్తాల దిగుబడి తగ్గిపోతుందని చెబుతున్నారు. తీవ్రత పెరిగితే నష్టం మరింత అధికమవుతుందని అంటున్నారు.

బొరియ వద్ద పొగ పెడుతున్న కూలీలు

ఎకరానికి రూ. 2 వేల వరకు భారం..

గత సార్వాలో మూడు నియోజక వర్గాల పరిధిలో ఎంపిక చేసిన 100 గ్రామాల్లోని 30,724 ఎకరాల్లోని 37,824 మంది రైతులకు 307 కిలోల బ్రోమోడలిన్ మందును పంపిణీ చేశారు. ఈ సారి ఆ దిశగా చర్యలు లేకపోవడంతో బయలు కొనుగోలు చేయడమో లేదా మందు పెట్టే వ్యక్తులను ఆశ్రయించడమో చేస్తున్నారు. ఎకరానికి రూ. 500 చెల్లించి మందు నూకల్లో కలిపి గట్లు వెంబడి వారానికి రెండు సార్లు పెట్టిస్తున్నారు. కొన్నిసార్లు ఈ మందు సక్రమంగా పనిచేయకపోవడంతో రూ. 50 చొప్పున చెల్లించి బొరియల వద్ద బుట్టలు పెట్టిస్తున్నారు. బొరియ గుర్తించి పొగ సైతం పెట్టిస్తున్నారు. ఎలుక బొరియను తవ్వి ఎలుకను పడితే రూ.50 ఇస్తున్నారు. మరికొంత మంది రైతులు మోనోక్రోటోఫాస్‌ను ధాన్యంతో కలిపి పెడుతున్నామని చెబుతున్నారు. ఇలా ఎకరానికి రూ.1000 నుంచి రూ.2 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని అయినా ఎలుకల నివారణ సాధ్యం కావడం లేదంటున్నారు. పరిస్థితిని వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లగా కొన్ని చోట్ల గత సీజన్‌లో మిగిలిన బ్రోమోడలిన్ మందును పంపిణీ చేస్తున్నామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అంటున్నారు.

పుష్కరం.. పచ్చదనంపై ప్రత్యేక దృష్టి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని పచ్చదనం విస్తరణకు నగరపాలక సంస్థ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ప్రధానంగా ఉద్యానాలపై దృష్టి సారించారు. నగరంలో 21 పార్కులను గుర్తించి ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఒక్కొక్కదానికి రూ.50 లక్షలు పైబడి నిధులు వెచ్చిస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌తోపాటు, గ్రీనరీ కల్పన, చిన్నారులకు ఆట వస్తువులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో పాడైన వాటర్ ఫౌంటేన్‌ల మరమ్మతు పనులు పూర్తి చేశారు. నగరంలో అలంకరణ నిమిత్తం ఎంపిక చేసిన కూడళ్లలో ఫౌంటేన్‌లు ఏర్పాటు చేస్తుండగా పనులు జరుగుతున్నాయి. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ముఖ్య రహదారులను ఎంపిక చేసి విభాగినులు నిర్మిస్తూ, విరివిగా మొక్కలు పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు.

మండపేట

• మండపేట • అనపర్తి

ఎంసీసీ ప్రాంగణంలో ఉద్యోగమేళా రేపు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం తాడితోట వద్ద మోడల్ కెరీర్ సెంటర్(ఎంసీసీ) ప్రాంగణంలో ఈనెల 17న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళీ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ మేళాలో రాగూర్ లాబ్స్, ఎస్‌బీఐ ప్రెమెంట్స్, పేటీఎం, ఇన్నోవా సోర్స్ కంపెనీల్లో పలు పోస్టుల భర్తీకి అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ విద్యార్హతలు కలిగిన 19 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ ఆధార్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబరులో సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

'ప్రభుత్వ, పార్టీ విధులేవో తెలియకపోవడం శోచనీయం'

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన సూర్యనారాయణరెడ్డికి ప్రభుత్వ, పార్టీ విధులకు తేడా తెలియకపోవడం శోచనీయమని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జీబీఆర్ విద్యా సంస్థల గురించి మాట్లాడుతూ స్త్రీ విద్యను ప్రోత్సహించాలని ఆనాటి ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి జనతా పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరి కళాశాలకు అనుమతులు సాధించారని, ప్రస్తుతం ఇందుకు విరుద్ధంగా యాజమాన్యాలు నడుస్తున్నాయని తాను చెబితే.. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆ విషయం పక్కనపెట్టి విద్యాసంస్థల ఆక్రమణల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల స్థలాన్ని పరిరక్షించే పేరుతో ఆంజనేయనగర్ వాసులను వైకాపా హయాంలో ఇబ్బందులు పెడుతూ ప్రహరీ నిర్మించారని తెలిపారు. ఆ గోడ నిర్మాణంతో మహిళ మృతికి కారణమయ్యారని ఆరోపించారు. ఆయన బావమరిది ఆధ్వర్యంలో నడుస్తున్న జీబీఆర్ కళాశాల యాజమాన్యం ఆక్రమణలకు పాల్పడితే ఐదేళ్లపాటు పట్టించుకోలేదన్నారు. కళాశాల పరిపాలన భవనాలకు పంచాయతీ అనుమతులు లేవన్నారు. శాసన మండలి, రాజ్యసభ సభ్యుల నిధులతో వాటిని నిర్మించారని ఆరోపించారు. అలాంటప్పుడు అవి ప్రభుత్వ భవనాలా? ప్రైవేటు భవనాలా అని ప్రశ్నించారు. రైతుల సహకారంతో నిర్మించిన విద్యాసంస్థ సహకార వ్యవస్థలో ఉంటే, దానిని ఏవిధంగా ప్రైవేటుపరం చేయడానికి అనుమతించారన్నారు.

హిందీ భాషా పరీక్షకు 177 మంది హాజరు

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేటలో ఆదివారం దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యాన జరిగిన హిందీ భాషా పరీక్షకు 177 మంది హాజరయ్యారు. శ్రీవుండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీభారతి స్కూల్, శ్రీజ్ఞానలహరి స్కూల్‌లో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయుడు పార్థసారథి, నిర్వాహకులు ఉమామణి, నాగులపాటి మల్లేశ్వరి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు	మండపేట: 80085 74183	ద్వారపూడి: 98490 93850
	అనపర్తి: 95333 66637	అంగర: 97044 16418
	రాయవరం: 80085 74185	

మురుగు పారక ఇబ్బందులు

సమస్య: మండపేట మండలం ఇప్పనపాడు గ్రామంలో బొమ్మలగుడి వీధి కల్వర్టు వద్ద డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడం లేదు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. – వై.వీరబాబు, ఇప్పనపాడు

సమాధానం: డ్రెయినేజీలో మురుగు సమస్యను పంచాయతీ కార్యదర్శి ఆర్ఎన్‌వీవీ సత్యనారాయణకు తెలియజేయగా స్పందించారు. సిబ్బందిని పంపించి మురుగు పారుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ద్వారపూడి

సదాశివం.. భక్తజన పారవశ్యం

మహాశివరాత్రి అభిషేకాలు

మండపేట అగస్త్యేశ్వరాలయంలో క్షీరాభిషేకం

మండపేట, మండపేట గ్రామీణం, రాయవరం, కపిలేశ్వరపురం, రంగంపేట, బిక్కవోలు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం మండపేట, అనపర్తి నియోజవర్గాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. అన్న సంతర్పణలు నిర్వహించారు. స్నానఘట్టాల వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పలువురు ప్రజాప్రతినిధులు మండపేటలో ఆలయాలను సందర్శించి అభిషేకాలు చేశారు. ● మండపేట అగస్త్యేశ్వరాలయం, మండపేట గ్రామీణం ఏడిదలోని సంగమేశ్వరస్వామి, తాపేశ్వరం ఉమాఅగస్త్యేశ్వరస్వామి, ఇప్పనపాడులో ఉమారామలింగేశ్వరస్వామి, అర్తమూరులో అగస్త్యేశ్వరస్వామి, కేశవరంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, ద్వారపూడిలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ● రాయవరం మండలం అష్టసోమేశ్వరాలయాలైన సోమేశ్వరం, వెంటూరు, చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామున 4 గంటల నుంచి వెదురుపాక, వి.సావరం, రాయవరం, లొల్ల, మాచవరం, పసలపూడిలోని ఆలయాల్లో పుష్పాలంకరణలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. ● కపిలేశ్వరపురం మండలంలోని పడమర ఖండ్రిక ఉయ్యాల జంపాల క్షేత్రంలో త్రయంబకేశ్వరస్వామి, కోరుమిల్లి సోమేశ్వరస్వామి, వల్లూరు అగస్త్యేశ్వరస్వామి, కపిలేశ్వరపురం పాపవినాశేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు బారులుదీరారు. సత్యవాడ అయోధ్య రామ భజన మండలి ఆధ్వర్యంలో చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

ఏడిదలో సంగమేశ్వరస్వామి

కపిలేశ్వరపురంలో పాపవినాశేశ్వరస్వామి

రంగంపేటలో పుష్పాలంకరణలో..

అనపర్తి నియోజకవర్గంలో..

రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి, జి.దొంతమూరు, ఈలకొలను, వీరంపాలెం, సుభద్రంపేట, పెదరాయవరం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ● బిక్కవోలు మండలం కొంకుదురు బుడతల మామిడి వద్ద బాలత్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరుడు, ఊలపల్లిలో అగస్త్యేశ్వరస్వామి, బిక్కవోలులో గోలింగేశ్వర, కేదారేశ్వరస్వామి, బలభద్రపురం ద్వాదశ లింగాల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అభిషేకాలు చేశారు.

బలభద్రపురంలో శిర్డీ సాయి మందిరం వద్ద దీపారాధన

కొంకుదురు గోదావరి కాలువ రేవులో స్నానాలు చేస్తున్న భక్తులు

సోమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ

నాణ్యతగా అభివృద్ధి పనులు చేపట్టండి

రహదారి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులను నాణ్యతాలోపం లేకుండా చేపట్టాలని ఎస్ఈసీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలం తాపేశ్వరం దేవుడుమాన్యం వీధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం చేపట్టిన సీసీ రహదారులు, డ్రైనేజీల అభివృద్ధి పనులను ఆదివారం కూటమి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గుత్తేదారులకు పలు సూచనలు చేశారు. ముత్యాల పట్టాభి, నూని వీర్రాజు, చుక్కాన సుబ్బారావు, గుత్తుల శ్రీనివాస్, కోరా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం, న్యూస్‌టుడే: నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం మాచవరంలోని దేవుడుమాన్యం కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. లోపాలు లేకుండా సత్వరమే పనులను పూర్తిచేయాలని గుత్తేదారులను ఆదేశించారు. మాచవరం సహకార సంఘ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రారెడ్డి, తెదేపా నాయకులు సబ్బెళ్ల వెంకన్నబాబు, కొవ్వూరి ఆదిరెడ్డి, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన నేడు

మండపేట, న్యూస్‌టుడే: ఏడిద రోడ్డులో సీసీ రహదారి నిర్మాణానికి ఎస్ఈసీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు రభశాఖ డీఈ సూర్యనారాయణ తెలిపారు. కమ్మసంఘ భవనం నుంచి బైపాస్ రోడ్డు జంక్షన్ వరకు రూ.3.50 కోట్లతో సీసీ రహదారి నిర్మించనున్నారు. ఈ రోడ్డులో రైస్‌మిల్లులు అధికంగా ఉన్నందున భారీ వాహనాల కారణంగా బీటీ రోడ్డు గోతులు పడుతోంది. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఫలితకం లేకపోవడంతో పది మీటర్ల వెడల్పులో సీసీ రోడ్డు నిర్మించడానికి ప్రతిపాదనలు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రైల్వే ఉద్యోగి ప్రతిభ

రజత పతకంతో లక్ష్మీనారాయణ

వి.ఎల్.పురం: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాజమహేంద్రవరం రైల్వే ఉద్యోగి ప్రతిభ చూపారు. ఇక్కడి రైల్వే మెము కార్‌షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న డి.లక్ష్మీనారాయణ ఈనెల 13 నుంచి 15 వరకు అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూల్‌లో జరిగిన 3వ ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ పోటీలు (83 కేజీల సీనియర్స్ విభాగం)లో పాల్గొని రెండవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఈయన రాష్ట్ర, జాతీయ స్థాయి పవర్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ ఇప్పటికే పలు పతకాలు సాధించారు. ఇప్పుడు రాష్ట్రస్థాయి పోటీల్లో మరో పతకాన్ని తన ఖాతాల్లో వేసుకున్న లక్ష్మీనారాయణను రైల్వే మెముకార్ షెడ్ ఏడీఈఈ డి.ప్రసాద్‌రావు, సిబ్బంది అభినందించారు.

17న ధర్నా విజయవంతం చేద్దాం

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న యూటీఎఫ్ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐవీఆర్ ప్రసాద్, ఎ.షరీఫ్ అన్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో 17న 20వేల మంది ఉపాధ్యాయులతో ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

ఇటుక బట్టీల పాగతో ఉక్కిరిబిక్కిరి

రాయవరం మండలంలోని మాచవరం-చెల్లూరు రహదారిలో ఇటుక బట్టీల్లో ఆవ కాల్చే సమయంలో వెలువడే దట్టమైన పొగ రోడ్డంతా కమ్మేస్తోంది. ధూళి, నలకలు ప్రయాణికుల కళ్లలో పడటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొగతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక చోదకులు పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని బట్టీల వద్ద రక్షణ చర్యలు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రాయవరం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలంతోపాటు చుట్టుపక్కల మండలాల్లోనూ చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హరీష్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన అంగర పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ అనుమానితుల వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లేటపుడు పోలీసులకు తెలియపరచాలని సూచించారు. ఇటీవల మండలంలోని వల్లూరు, నేలటూరులో జరిగిన చోరీలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

108 అంబులెన్స్ సిబ్బందిలో ఆనందం

రాజానగరం, న్యూస్‌టుడే: అత్యవసర వైద్య సేవలందిస్తున్న 108 సిబ్బందికి కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించడంతో వారి మోముల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. విధి నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న అంబులెన్స్ చోదకులు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం రాకతో ఒక్కొక్కరికి రూ.రెండు వేల నుంచి రూ.ఏడు వేల వరకు వేతనాలు పెరిగాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

రాజానగరం, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే లోపు రెండు గంటల వ్యవధిలోనే చోరీ జరిగిన సంఘటన రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధి మల్లంపూడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పబ్బు సురేష్, తల్లి కనకమహాలక్ష్మిని తీసుకుని ద్విచక్రవాహనంపై తెల్లవారుజామున మూడు గంటలకు బయలు దేరి రాజమహేంద్రవరం వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు పగలగొట్టి.. బీరువా తెరచి ఉంది. వెంటనే లోపలికి వెళ్లి చూసేసరికి 30 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు వెండి కుంకుమ బరిణిలు, హాలులో ఉంచిన రూ.1.16 లక్షల నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'కానిస్టేబుల్‌పై దాడి' ఘటనలో నలుగురిపై కేసు

కోరుకొండ, న్యూస్‌టుడే: కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటనలో మండలంలోని జంబూపట్నం గ్రామానికి చెందిన నలుగురు యువకులపై కోరుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జంబూపట్నం మీదుగా వెళ్తున్న మట్టి లారీలను స్థానిక యువత నిలిపివేయడంతో సమాచారం అందుకున్న కానిస్టేబుల్ సంఘటనా ప్రాంతానికి వచ్చి పరిశీలిస్తుండగా.. స్థానిక యువకులకు, కానిస్టేబుల్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కానిస్టేబుల్‌పై దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సోమవారం కోర్టులో హాజరు పర్చనున్నట్లు సమాచారం.

బాబా మందిర వార్షికోత్సవానికి ఏర్పాట్లు

న్యూస్‌టుడే – బిక్కవోలు

ఆంధ్రా శిర్డీగా పేరొందిన బలభద్రపురంలో సాయి మందిరం వార్షికోత్సవాన్ని 17వ తేదీన నిర్వహించనున్నారు. రంగురంగుల విద్యుత్తు దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు లక్ష మంది భక్తులు వస్తారని కమిటీ అంచనా వేస్తోంది. భక్తులకు అన్నసంతర్పణ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా షామియానాలు, క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కె.పి.ఆర్. సంస్థల ఛైర్మన్ కొవ్వూరి పాపారెడ్డి, నియోజకవర్గం, జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. ఇక్కడ బిర్యానీ ప్రసాదం అంటే భక్తులకు మక్కువ. మసాలా దినుసులు కలిపిన బియ్యం బిర్యానీని ప్యాకెట్లలో విక్రయిస్తుంటారు.

విద్యుద్దీపాల అలంకరణలో బాబా ఆలయం

కార్యక్రమాలు ఇవీ..

మంగళవారం ఉదయం 5.15 గంటలకు బాబావారి కాకడ హారతితో మేలుకొలుపు జరుగుతుంది. అనంతరం వేద పండితుడు మహంకాళి వెంకటరామశాస్త్రి ఆధ్వర్యంలో గణపతి పూజ, హోమం, ధుని పూజ నిర్వహిస్తారు. లక్షపత్రిపూజ, శ్రీచక్ర రూపంలో ఉన్న అమ్మవారికి లక్ష కుంకుమపూజ, గోపూజ, హోమం, పూర్ణాహుతి జరిపిస్తారు. 1,008 లీటర్ల ఆవుపాలతో బాబాకు క్షీరాభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల నుంచి భారీ అన్నసమారాధన ఉంటుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి బాబావారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నిలిచిన ట్రాఫిక్.. చోదకుల ఇక్కట్లు

ప్రధాన రహదారిలో ట్రాఫిక్ రద్దీతో నిలిచిన వాహనాలు

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రధాన కూడళ్లు, రహదారులపై వాహనాలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రధాన రహదారుల వెంట భక్తులకు ప్రసాదం, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు వితరణ చేయడంతో భక్తులు రోడ్డు పక్కన వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. క్వారీ సెంటర్ నుంచి దేవీచౌక్ వరకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. దేవీ చౌక్ ప్రాంతంలో నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఒకదానికి ఒకటి ఎదురుపడి ముందుకు వెళ్లేందుకు సుదీర్ఘసమయం పట్టింది. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా ఏమీ చేయలేని పరిస్థితి. పుష్కరఘాట్ నుంచి క్వారీ వరకు భక్తులకు మంచినీరు, ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయాలతో పాటు ప్రధాన రహదారులు, ఆనుకుని ఉన్న వీధుల్లో టెంట్లు వేసి వితరణ చేశారు. దీంతో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు కనిపించాయి. ఒకవైపు పారిశుద్ధ్య సిబ్బంది తొలగించినా మళ్లీ ఇష్టానుసారంగా రోడ్లపై పడేశారు. నిర్వాహకులు చెత్తబుట్టలు ఏర్పాటు చేసినా సరైన పర్యవేక్షణ లేకపోవడం ప్రధాన సమస్యగా నెలకొంది. దేవీచౌక్, కంబాలచెరువు, గోదావరి బండ్ రోడ్డు, ఆర్యాపురం, కోటిలింగా రేవును ఆనుకొని ఉన్న రహదారులన్నీ రద్దీగా మారిపోయాయి.

– న్యూస్‌టుడే, దేవీచౌక్, ఏవీఏ రోడ్డు

ప్రమాదకారకాలు.. కేబుల్ కట్టలు

న్యూస్‌టుడే – మండపేట

వినోదం కోసం విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేసిన కేబుల్ తీగలు ఒక్కోసారి ప్రాణాంతకంగా మారుతున్నాయి. గతంలో టీవీ ప్రసారాలకు సంబంధించి కేబుళ్లు మాత్రమే ఉండేవి. వీటికి అంతర్జాలానికి సంబంధించిన కేబుళ్లు తోడవడంతో స్తంభాల నిండా అవే కనిపిస్తున్నాయి. ఇటీవల బాపట్ల జిల్లాలో ఉపాధ్యాయుడు పాఠశాలకు వెళ్తుండగా విద్యుత్ స్తంభంపై నుంచి వేలాడుతున్న కేబుల్ వైరు మెడకు చుట్టుకుని మృత్యువాత పడ్డారు. సామాజిక మాధ్యమం కారణంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వేలాడే విద్యుత్ తీగల కారణంగా తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఉపాధ్యాయుడు మృతి ఘటన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. మండపేట పట్టణంలో కేబుల్ ఆపరేటర్లను పిలిచి తీగలను తొలగించాలంటే హెచ్చరించారు.

మండపేటలో అధికం..

మండపేట పట్టణంలో పదికిపైగా కేబుల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ ఆపరేటర్లు ఉన్నారు. పట్టణంలోని 2000కు పైగా విద్యుత్తు స్తంభాలపై కేబుల్ వైర్లు కట్టలుగా కట్టి వేలాడదీశారు. స్తంభానికి అధిక వోల్టుల విద్యుత్తు తీగలున్నా పట్టించుకోవడం లేదు. భవిష్యత్‌లో ఇటువంటి వాటి వల్ల మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాలని అనేక ఫిర్యాదులు అందినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆపరేటర్లు ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలను వినియోగించుకుంటున్నారు. కేబుళ్లకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విజయలక్ష్మినగర్‌లో ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుల్ వైర్లు

మరమ్మతులకు ఇబ్బందికరంగా..

లెక్కకు మించిన కేబుళ్ల కట్టలను విద్యుత్ స్తంభాలకు కడుతున్నారు. అవసరాలకు మించి వాటిని ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్తు శాఖ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా కనెక్షన్‌కు మరమ్మతు చేయాల్సివచ్చినప్పుడు స్తంభం ఎక్కి సరిచేయడం సవాలుగా మారుతోంది. ఏ కనెక్షన్ ఎవరితో తెలియనంతంగా కేబుల్ తీగలు అలముకుని ఉంటున్నాయని లైన్‌మేన్‌లు వాపోతున్నారు. స్తంభాలు ఎక్కే సమయంలో తీగల కట్టల్లో కాళ్లు ఇరుక్కుపోతున్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

పట్టణంలో అన్ని విద్యుత్ స్తంభాలపై అవసరానికి మించి కేబుల్ కట్టలు ఉన్నాయి. విద్యుత్తు శాఖ సిబ్బంది విధులు నిర్వహించడానికి ఇబ్బంది పడుతున్నారు. అవసరం మేరకు మాత్రమే వైర్లు ఉంచి మిగిలినవి తొలగించాలని ఆదేశాలిచ్చాం. స్పందించకపోతే మేమే చర్యలు తీసుకుంటాం.

- టీవీ రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

శుద్ధజలం.. నిష్ఫలం!

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రస్తుత జీవన విధానంలో అన్ని వర్గాల ప్రజలు మినరల్ వాటర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. చాలామంది డబ్బులు వెచ్చించి మరీ కొనుగోలు చేసుకుని తాగుతున్నారు. 20 లీటర్ల తాగునీటి టిన్‌ను రూ.20 నుంచి రూ.30 వెచ్చించి మరీ కొంటున్నారు. ఇదే అదునుగా కొంతమంది మినరల్ వాటర్ పేరుతో నకిలీ దందా చేస్తున్నారు. పూర్తిగా ఫిల్టర్ లేని నీళ్లు తాగి వినియోగదారులు రోగాల బారిన పడుతున్నారు. నగరంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా వ్యాపారం నిర్వహిస్తున్నారు.

పాటించాల్సిన నియమాలు..

తాగునీరు సేకరణ, శుద్ధి విషయంలో కచ్చితంగా కొన్ని ప్రమాణాలు పాటించాలి. పూర్తిస్థాయిలో శుద్ధి ప్రక్రియ చేపట్టాలి. సేకరణ, ఫిల్టరేషన్, నీటి పంపింగ్, సరఫరా తదితరాలకు సంబంధించి ఎక్కడా నిబంధనలు అమలు కావట్లేదు. తాగునీటి సేకరణపై భూగర్భజలశాఖ నుంచి ఆమోదం తీసుకోవాలి. ప్లాంటుల వద్ద బోర్ ఏర్పాటు చేయాలి. ప్రత్యేకంగా శుద్ధీకరణ ప్లాంటు ఉండాలి. నీటిలో పీహెచ్ విలువ తెలియజేసేలా ప్రదర్శించాలి. ఇవన్నీ ఉంటేనే నగరపాలక సంస్థ పరిశీలించి ధ్రువీకరించాలి. కొన్నిచోట్ల ఎక్కడో పట్టిన నీళ్లను తీసుకొచ్చి, నేరుగా విక్రయిస్తున్నారు. మరికొన్నిచోట్ల ఏకంగా మున్సిపల్ ట్యాప్‌లను వినియోగిస్తున్నారు. వాటినే కూలింగ్ చేసి టిన్‌లలో పోసి అమ్మేస్తున్నారు. తాజాగా ఆల్కలిన్ పేరుతో లీటరు రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు.

నగరంలో 50కు పైగా..

నగరంలో 50కు పైగా నీటి శుద్ధి ప్లాంట్‌లు ఉన్నాయి. కొన్నిచోట్ల మినరల్స్ పక్కన పెడితే పీహెచ్ విలువలు లేని నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో గుండె, ఊపిరితిత్తులు, కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వచ్చేది ఎండాకాలం.. ఎక్కువ మంది చల్లని నీటిని తాగేందుకు ఇష్టపడతారు. దీంతోపాటు ఐస్ కలిపిన పానీయాలు తాగేందుకు ఆసక్తి చూపుతారు. ఇవన్నీ నిబంధనలకు విరుద్ధంగా తయారవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలో జాంపేట, కోటిపల్లి బస్టాండ్, ఆజాద్ చౌక్, కోటిపల్లి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఈ పరిస్థితి ఉందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

టి.నగర్, న్యూస్‌టుడే: శివరాత్రి నేపథ్యంలో విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఐచ్ఛిక సెలవును మంజూరు చేసింది. ఈ క్రమంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ అంశాన్ని గమనించాలని సూచించారు.

పార్టీ సిద్ధాంతాలను విస్తృతం చేయాలి

కడియం : యువతకు జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలు నిశితంగా వివరించి సభ్యత్వ నమోదు క్షేత్రస్థాయిలో ప్రారంభించాలని ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సూచించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కడియపులంక నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప తెలిపారు. ఆదివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని ఉపముఖ్యమంత్రిని కలిసినట్లు పేర్కొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

మోరంపూడి : పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకుని మీర్జా అన్వర్ బేగ్ సౌజన్యంతో తువ్వా ఆధ్వర్యంలో తెదేపా నాయకుడు షేక్ సుభాన్ అధ్యక్షతన ఆదివారం శాటిలైట్ సిటీలో రంజాన్ తోఫా కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వంద కుటుంబాలకు తోఫా పంపిణీ చేశారు. రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రంజాన్ నెలలో వారి శక్తి మేరకు పేదవారికి సహాయం చేస్తే అల్లా కృప ఉంటుందన్నారు.

(c) eenadu

గోవిందా.. గోవిందా..

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

ఆలయ ప్రాంగణంలో సందడి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మహా శివరాత్రి, ఆదివారం కలిసి రావడంతో గోవిందా.. గోవిందా.. అంటూ వేలాది మంది భక్తులు ద్వారకాతిరుమల క్షేత్రానికి పాదయాత్రగా వచ్చారు. ఏలూరు తూర్పు వీధి శిర్డీ సాయి మందిరం నుంచి సుమారు 10 వేల మంది రథంతో పాదయాత్రగా వచ్చి చిన వేంకన్న ఆలయాన్ని దర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏలూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా వస్తూనే ఉన్నారు. వేలాది మంది రాకతో శ్రీవారి దర్శన క్యూలు, ఆలయ పరిసరాలు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం క్యూలు కిటకిటలాడాయి.

వైభవం.. ధన్వంతరి మహాయజ్ఞం

యాగశాలలో ఉంచిన శంఖాలు, సాలగ్రామాలు, కలశాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా ఐఎస్ జగన్నాథపురంలో లక్ష్మీనరసింహస్వామి కొలువైన సుందరగిరిపై అతిరుద్ర సహిత సుదర్శన నృసింహ ధన్వంతరి మహాయజ్ఞం ఆదివారం రాత్రి వైభవంగా కొనసాగింది. హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట నరసింహ గురూజీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ క్రతువు నిర్వహించారు. ఉదయం సాల గ్రామాలకు అభిషేకం, లక్ష తులసిపూజ, సూర్యనమస్కారాలు, అతిరుద్ర సహిత సుదర్శన నృసింహ ధన్వంతరి మహాయజ్ఞం నిర్వహించారు. ఈ క్రతువులో భాగంగా అభిషేకం కోసం 1,116 కలశాలు వినియోగించారు. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఈ వేడుకను వేద పండితులు, రుత్వికులు తెల్లవార్లూ జరిపించారు.

గంగా తరంగమై.. భక్తజన సంద్రమై..

బలివేలో భక్త జన సందోహం

స్వామికి అభిషేకాలు

పంట్లపై రాకపోకలు

న్యూస్‌టుడే బృందం: మహా శివరాత్రి పర్వదినాన జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలన్నీ శివనామ స్మరణతో మార్మోగింది. అఖండ గోదావరి మధ్యలోని పట్టిసం క్షేత్రం భక్తజన గోదారిగా మారింది. తమ్మిలేరు తీరం బలివే క్షేత్రంలో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచే ఆయా క్షేత్రాల్లో స్వామికి అభిషేకం చేశారు.

పట్టిసంలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

కిటకిటలాడుతున్న క్యూలైన్లు

మెరక.. ఎవరికెరుక!

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

● గణపవరం మండలం జల్లికొమ్ములో సుమారు ఎనిమిదెకరాల విస్తీర్ణంలోని పొలంలో వారం రోజులుగా మూడున్నర అడుగుల మేర మట్టి తవ్వేశారు. భీమవరం, పెంటపాడు, వీరవాసరం, ఉండి, గణపవరం మండలాలోని లేఅవుట్లకు లారీల్లో తరలిస్తున్నారు. పరిమితికి మించిన లోడు తరలిస్తుండటంతో.. రోడ్లపై మట్టి పెళ్లలు పడిపోతున్నాయి. దీన్ని ప్రశ్నించిన ఓ వ్యక్తిపై లారీ డ్రైవర్ దురుసుగా ప్రవర్తించడం వివాదాస్పదమైంది.

● వల్లూరులో కాలువకు అడ్డుకట్ట వేసిన చెరువు మట్టిని వారం రోజులు అక్రమంగా తరలించి రవాణా చేశారు. దీన్ని ప్రశ్నించిన ఆయకట్టు రైతులను అక్రమార్కులు దూషించారు. ఆయన మిగతా అన్నదాతలను వెంటపెట్టుకొని లారీలను అడ్డుకున్నారు.

గణపవరం, న్యూస్‌టుడే: గణపవరం మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. పొలాలు, కాలువ గట్లలోని మట్టి తవ్వేసి.. తరలిస్తోంది. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు దిగుతోంది. వీరికి రాజకీయ నాయకులు వత్తాసు పలుకుతుండటంతో.. రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. గ్రామాల మీదుగా మట్టి లారీలు దూసుకెళ్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

రాత్రింబవళ్లు.. జల్లికొమ్ములో రెండు పొక్లెయిన్లు ఏర్పాటు చేసి సుమారు 50 లారీల్లో రాత్రింబవళ్లు మట్టి తరలిస్తున్నారు. పొలాల్లో మెరక తీసేందుకు రైతులు ముందుకు రావడంతో.. వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. నిత్యం వందకు పైగా ట్రిప్పుల్లో మట్టి తరలిస్తున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. 'రెవెన్యూ, మైనింగ్ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. మట్టి అక్రమ తరలింపును అడ్డుకుంటాం.' అని ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

ఉమ్మడి పశ్చిమకు జలసత్వాలు

ప్రధాన నీటి వనరులకు బడ్జెట్‌లో పెద్దపీట

జంగారెడ్డిగూడెం (కుక్కునూరు), న్యూస్‌టుడే రాష్ట్ర బడ్జెట్ ఉమ్మడి పశ్చిమకు ఆశాజనకంగా ఉంది. ప్రధానంగా వ్యవసాయ ఆధారమైన ఉభయ 'జల' సత్వాలు సమకూరేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. దీంతో జిల్లాలోని డెల్టాతోపాటు మెట్టప్రాంత రైతులకు కూడా సాగునీటి వసతులు ఏర్పడబోతున్నాయి. గోదావరి డెల్టా ఆధునికీకరణ, చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జిల్లాలోని అన్నదాతల్లో ఆనందం నింపింది.

గోదావరి డెల్టా.... పశ్చిమలో 2.10 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించే అతిపెద్ద సాగునీటి వ్యవస్థ. శిథిల లాకులు, అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు, ఇతర వ్యవస్థలు సరిగా పనిచేయక కర్షకులు కష్ట పడుతున్నారు. వీటి మరమ్మతులు, అదనంగా చేపట్టాల్సిన పనుల కోసం బడ్జెట్‌లో గోదావరి డెల్టాకు రూ.200 కోట్లు కేటాయించారు. గత ఆరేళ్లలో ఈ స్థాయిలో నిధులు కేటాయించటం ఇదే ప్రథమం. ఇందులో తూర్పుగోదావరి జిల్లాలోని పనులు, జలాశయాలకు కొంత కేటాయింపులు జరిగినా, జిల్లాకు రూ.70-80 కోట్లు వరకూ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నిధులతో కాలువలు, స్లూయిస్‌లు, లాకులకు మరమ్మతులు జరిగితే సాగునీటి సరఫరా సానుకూలంగా సాగుతుంది.

చింతలపూడి ఎత్తిపోతలకు... ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు ఇదో వరదాయిని. అయితే గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ పథకం మూలనపడింది. తాజాగా కూటమి ప్రభుత్వం పనులను పట్టాలెక్కించేందుకు బడ్జెట్‌లో రూ.430 కోట్లు కేటాయించింది. వైకాపా హయాంలో ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. అయిదేళ్లలో కేవలం రూ.88.49 కోట్లు మాత్రమే కేటాయించారు. తాజా కేటాయింపులతో పనులు పూర్తయితే ఏలూరు, తూర్పుగోదావరి, ఎన్టీఆర్ జిల్లాలకు సాగు నీరు, 281 గ్రామాలకు తాగునీరు అందించే అవకాశం ఉంది. పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, చింతలపూడి, లింగపాలెం, చాట్రాయి మండలాలకు సాగునీరు అందుతుంది.

కొమ్ముగూడెం వద్ద చింతలపూడి ఎత్తిపోతల కాలువ ఇలా..

→ జిల్లాలోని మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించే మరో ఎత్తిపోతల తాడిపూడి అయిదో లిఫ్టు పనులకు రూ.15 కోట్లు కేటాయించారు. ఈ ఎత్తిపోతల ద్వారా కొయ్యలగూడెం మండలంలో అధికంగా, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం మండలాల్లో పాక్షికంగా సాగునీరు అందుతుంది. దాదాపు 8 వేల ఎకరాల్లో సాగునీటి సవ్వడులు వినిపించనున్నాయి.

రూ.3 కోట్లతో బలివే ఆలయం అభివృద్ధి: మంత్రి

ముసునూరు, న్యూస్‌టుడే: వచ్చే ఏడాదికి రూ.3 కోట్లతో బలివే రామలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని పునర్నిర్మించి, మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం బలివే రామలింగేశ్వర స్వామిని మంత్రి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన మంత్రికి ఆలయ అధికారులు, వేద పండితులు స్వాగతం పలికారు. అనంతరం కొలుసు పెద రెడ్డయ్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మజ్జిగ, తాగునీరు పంచారు.

తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న పార్థసారథి

కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు: నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. యలమంచిలిలో పుష్కర ఘాట్‌ను, శ్మశానవాటికను ఆయన ఆదివారం పరిశీలించారు. శ్మశాన వాటికలో శిథిలావస్థకు చేరిన షెడ్డుపై రేకులు తొలగించి శ్లాబ్ నిర్మించేందుకు రూ. 15 లక్షలు మంజూరయ్యాయన్నారు. పుష్కర, ఇతర అభివృద్ధి పనులకు దాతలు సహకరించాలని మంత్రి కోరారు. లంక భూములు కోతకు గురవుతున్న నేపథ్యంలో గ్రోయన్లు నిర్మించాలని అన్నదాతలు కోరగా త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తామని వెల్లడించారు.

పారదర్శకంగా.. పకడ్బందీగా..

'పది' పరీక్షల్లో డిజిటల్ విధానం నియామకాలు

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు(సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారుల(డీవో)ను డిజిటల్ విధానంలో నియమించనున్నారు. గతేడాది వరకు జిల్లా స్థాయిలోనే డీఈవోలు, డీవైఈవోలు ప్రక్రియ చేపట్టారు. ఈ ఏడాది రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇన్విజిలేటర్లను నియమించనున్నారు. టీచర్స్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్(టిస్)లో నమోదు చేసిన ఉపాధ్యాయుల వివరాల ప్రకారం ఇన్విజిలేషన్ విధులు కేటాయించనున్నారు.

సాకులు కుదరవు.. గతంలో ఇన్విజిలేటర్లుగా నియమితులైన ఉపాధ్యాయుల్లో కొందరు సాకులు చెబుతూ విధుల నుంచి తప్పించుకునేవారు. కొత్త విధానంలో సాకులు కుదరవు. పదో తరగతి పరీక్ష ఫీజు రూ.125 ఉండగా.. కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి రూ.500-1000 వసూలు చేసేవి. తమ విద్యార్థులు పరీక్షలు రాసే కేంద్రాల్లోని ఇన్విజిలేటర్లకు రోజూ అల్పాహారాలు, శీతల పానీయాలు సరఫరా చేసేవారు. వారు పిల్లలను చూసీచూడనట్లు వదిలేసేవారు.


కైకరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు

వీరికి మాత్రమే మినహాయింపు 60 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులు, గర్భిణులు, బాలింతలు(పాలిచ్చే తల్లులు), దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మాత్రమే పదో తరగతి పరీక్షల విధుల నుంచి మినహాయింపు ఇచ్చారు. గతంలో మాల్‌ప్రాక్టీస్‌లకు పాల్పడిన వారు, సస్పెన్షన్‌లో ఉన్నవారికి విధులు అప్పగించలేదు. పరీక్ష సబ్జెక్టులకు అనుగుణంగా జంబ్లింగ్ విధానంలో విధులు కేటాయిస్తారు.

ప్రైవేటు గురువులకూ.. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షల విధులకు వెళ్లడంతో. నిర్వహణ కష్టంగా ఉండేది. దాంతో ఎస్జీటీలకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. పాఠశాల సహాయకులు, వ్యాయామోపాధ్యాయులను మాత్రమే ఇన్విజిలేటర్లుగా నియమించనున్నారు. తొలిసారిగా ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకూ అవకాశం కల్పించనున్నారు.

జిల్లా వివరాలిలా..

పరీక్ష కేంద్రాలు	133
విద్యార్థులు	24,285

గతేడాది నియామకం ఇలా.. ✦ ఇన్విజిలేటర్లు 1,120 ✦ చీఫ్ సూపరింటెండెంట్లు 133 ✦ డిపార్ట్‌మెంటల్ అధికారులు 133 ✦ రూట్ అధికారులు 20 ✦ కస్టోడియన్ 62 ఫ్లయింగ్ స్క్వాడ్లు 6

బాధల బడి

➡ కొయ్యలగూడెం మండలం మంగపతిదేవిపేటలోని అంగన్‌వాడీ కేంద్రం వద్దనున్న మరుగుదొడ్డి దుస్థితి ఇది. ఇక్కడ చదువుతున్న బాలలు తమ అవసరాలకు ఇంటికి వెళ్లాల్సిందే. కొత్తగా మరుగుదొడ్డి మంజూరైందని చెబుతున్నారు. పనులు మాత్రం చేయడం లేదు.

కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, పెదపాడు, టి.నరసాపురం, న్యూస్‌టుడే: పేరుకు సొంత భవనాలే కానీ శౌచాలయాలు లేవు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఏ అవసరానికి అయినా ఇంటికి పరుగులు తీయాల్సి వస్తోంది. అదేమంటే ఎన్నడో కట్టిన మరుగుదొడ్లు శిథిలమయ్యాయని, ఆకతాయిలు పాడు చేస్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. పోనీ మరమ్మతులైనా చేస్తున్నారా.. అంటే నిధులు వచ్చాయని అధికారులు చెబుతున్నారే తప్ప అడుగు ముందుకు పడిందీ లేదు.

➡ పోలవరం కోడ్ నంబరు 31 అంగన్‌వాడీ కేంద్రంలో 24 మంది పిల్లలు ఉన్నా.. మరుగుదొడ్డి సదుపాయం లేదు.

→ అంగన్‌వాడీ కేంద్రాల్లో శిథిల శౌచాలయాలు

→ ఒంటికి.. రెండుకి ఇంటికి పరుగులు తీస్తున్న చిన్నారులు

➡ పెదపాడు మండలం సత్యవోలులోని కోడ్ నంబరు 29 కేంద్రంలో మరుగుదొడ్డి తలుపు పాడై మూడు నెలలుగా మూతపడి ఉంది. వినియోగంలో లేక మూత్రశాల పరిసరాల్లో తుప్పలు నిండి దారి మూసుకుపోయి అడవిని తలపిస్తోంది.

నిధులు మంజూరయ్యాయి జిల్లాలో 30 చోట్ల సొంత భవనాలు కలిగి మరుగుదొడ్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో దాని నిర్మాణానికి రూ.36 వేల చొప్పున స్వచ్ఛభారత్ నిధులు మంజూరయ్యాయని ఐసీడీఎస్ జిల్లా పథక సంచాలకురాలు పి.శారద తెలిపారు. మరో 29 చోట్ల నిర్మాణాలకు అనుమతి మంజూరైందన్నారు. ఇప్పటికే పలు చోట్ల పనులు పూర్తి కాగా.. మరికొన్ని పురోగతిలో ఉన్నాయన్నారు.

జిల్లాలో మొత్తం కేంద్రాలు	2,226
సొంత భవనాలు	974
అద్దెవి	837
అద్దె లేని భవనాలు	415
3-6 ఏళ్ల వయసు బాలలు	47,198

పాలకొల్లు, న్యూస్‌టుడే: పశ్చిమలో 60 కి.మీ. మేర విస్తరించిన సుందర గోదావరి తీరం, 17 కి.మీ. పరిధిలో ఉన్న సాగర తీరంలో పలు పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. గోదావరి వెంబడి సిద్ధాంతం, చించినాడ, నరసాపురం, సాగర తీరంలో పేరుపాలెం, తూర్పుతాళ్లు, బియ్యపుతిప్ప గ్రామాలు జాతీయ రహదారికి చేరువలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఇప్పటి వరకు పర్యాటక ఉత్సవాలు నిర్వహించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పర్యాటక పరంగా ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా ప్రోత్సాహం అందిస్తోంది. జిల్లాల వారీగా ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వారం కిందట పల్నాడు జిల్లాలో కొండవీడు ఉత్సవాలు, ఈ నెల 14న ప్రకాశం జిల్లా సింగరాయకొండ సమీపాన బీచ్ ఫెస్టివల్ నిర్వహించారు. విశాఖలోనూ బీచ్ ఫెస్ట్ జరిగింది. పశ్చిమలో ఉత్సవాల ఊసే లేదు.

పర్యాటక వేడుక.. ప్రగతి వేదిక!

యలమంచిలి వద్ద గోదావరి తీరం

వనరుల సద్వినియోగంతో పురోగతి

ప్రాంతానిదో వైవిధ్యం.. జిల్లాలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. భీమవరం అంటే విభిన్న వంటకాలకు ప్రసిద్ధి. పాలకొల్లు కళాకారులకు పుట్టినిల్లు. ఆయా రంగాలను పరిగణనలోకి తీసుకుని భిన్నమైన వేడుకలు నిర్వహించే అవకాశాలున్నాయి. పేరుపాలెంలో బీచ్ ఉత్సవాలు ఏర్పాటు చేయవచ్చు. ఏలూరు జిల్లా కొల్లేరు ప్రాంతంలో పడవల్లో షికారు పెట్టవచ్చు. ద్వారకాతిరుమల, మద్ది, పారిజాతగిరి, గుబ్బల మంగమ్మ క్షేత్రాలు, గుంటుపల్లి గుహలను కలుపుతూ ఆధ్యాత్మిక యాత్రలను ఏర్పాటు చేయవచ్చు.

వసతులకు అవకాశం.. పర్యాటక ఉత్సవాలను నిర్వహిస్తే ఆయా ప్రాంతాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉంటుంది. పర్యాటకుల తాకిడి పెరిగితే స్థానికులకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. ఈ అంశంపై జిల్లా పర్యాటక అధికారి ఏవీ అప్పారావు స్పందిస్తూ రాబోయే కార్తికమాసంలో బీచ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

యాప్‌సోపాలు!

❖ పూర్తవ్వని ఏకీకృత కుటుంబ సర్వే
❖ 20 వరకు గడువు పెంపు

ఏలూరు ఆర్‌ఆర్ పేట, ఉంగుటూరు- న్యూస్‌టుడే: జిల్లాలో ఏకీకృత కుటుంబ(యూనిఫైడ్ ఫ్యామిలీ) సర్వే నత్తతో పోటీ పడుతోంది. రెండోసారి పెంచిన గడువు సైతం పూర్తయినా.. ప్రక్రియ కొలిక్కి రాలేదు. గతేడాది డిసెంబరు 15 నుంచి సర్వే ప్రారంభం కావాల్సి ఉండగా.. అనివార్య కారణాలతో ఆలస్యంగా మొదలైంది. జనవరి 12తో గడువు ముగియగా.. ఆశించిన మేర సర్వే జరగకపోవడంతో.. ఈ నెల 10 వరకు గడువు పెంచారు. అయినా జిల్లాలో 61.86 శాతం మాత్రమే పూర్తవడంతో.. తాజాగా 20 వరకు గడువు పొడిగించారు.

ప్రత్యేక యాప్ రూపకల్పన.. సర్వే నిర్వహణకు యూఎఫ్ఎస్ పేరిట ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు క్లస్టర్ల వారీగా ఇళ్లకెళ్లి కుటుంబ, వ్యక్తిగత సమాచారాన్ని యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆధార్, పేరు, ఫోన్ నంబరు, జనన తేదీ, కులం, మతం, ఆదాయం, ఉపాధి, విద్యుత్తు, ఎల్పీజీ కనెక్షన్లు, వాహనాలు, ఇతరత్రా 20 రకాల వివరాలు, ధ్రువపత్రాలు యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఒక్కో కుటుంబానికి సుమారు 30 నిమిషాలు సమయం పడుతుండటంతో ప్రక్రియ ఆలస్యమవుతోంది.

చేబ్రోలులో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో ముత్తయ్య

సాంకేతిక సమస్యలు.. యూఎఫ్ఎస్ యాప్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో.. 1.0 నుంచి 1.11 వరకు వెర్షన్ నవీకరించారు. అయినా ప్రక్రియ ఊపందుకోలేదు. ఇంజినీరింగ్, డిజిటల్, సంక్షేమ శాఖ సహాయకులు తమ క్లస్టర్ల పరిధిలో సర్వే దాదాపు పూర్తి చేశారు. వీఆర్వోలు, సర్వేయర్లు వీపీఏలు సర్వేకు దూరంగా ఉండటంతో.. వారి క్లస్టర్ల పరిధిలోనూ ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఇంజినీరింగ్, డిజిటల్, సంక్షేమ శాఖ సహాయకులపై ఒత్తిడి చేస్తున్నారు.

చాట్రాయిలో అత్యల్పం.. జీలుగుమిల్లిలో అత్యధికంగా 83.53 శాతం సర్వే పూర్తవగా.. చాట్రాయిలో అత్యల్పంగా 34.77 శాతం నమోదైంది. చింతలపూడి, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, ముసునూరు. నిడమర్రు, పెదపాడు, పెదవేగి మండలాల్లో 60 శాతం ప్రక్రియ దాటలేదు.

జిల్లా వివరాలిలా.. ■ మొత్తం ఇళ్లు: 6,80,730 ■ సర్వే పూర్తయినవి:4,21,071

నడిస్తే రూ.40.. లాంచీకి రూ.30

పట్టిసం క్షేత్రంలో అడ్డగోలు దోపిడీ

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినాన శివయ్య దర్శనానికి వచ్చిన భక్తులకు గడ్డు పరిస్థితి ఎదురైంది. సాధారణ రోజుల్లో పట్టిసీమ రేవు నుంచి లాంచీపై నది దాటేందుకు గుత్తేదారుడు ఒకరికి రూ.30 చొప్పున వసూలు చేయాలని పంచాయతీ అధికారులు నిర్ణయించారు. శివరాత్రి పర్వదినాన ఏర్పాట్ల పేరుతో భక్తులు నదిని దాటేందుకు పంటులను ఏర్పాటు చేసి, ఆ బాటలో నడిచి వెళ్లేందుకు ఒక్కొక్కరికి రూ.40 చొప్పున వసూలు చేయడం భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. కౌంటర్ల వద్ద, మైకుల ప్రకటనల్లో కూడా టికెట్ల ధరలు ప్రదర్శించకపోవడం గమనార్హం. లాంచీపై నదిని దాటాలంటే దూరం సుమారు ఒక కిలోమీటరు మాత్రమే ఉండటం, పంటుపై కాలినడకన చేరడానికి రానుపోను సుమారు 5 కి.మీ.లు దూరం ఉండటం గమనార్హం. బస్సులు దిగి ఆలయానికి వెళ్లి తిరిగి బస్సు వద్దకు చేరేటప్పటికి నడిచి రావడానికి అవస్థలు పడ్డామని, టికెట్ ధర పెంచడంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

టికెట్ కౌంటర్ల వద్ద కానరాని ధరల పట్టికలు

నేడు యథావిధిగా 'మీ కోసం'

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, పురపాలక, డివిజనల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. 'మీ కోసం' వినతుల పరిష్కార స్థితి తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించవచ్చని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గేట్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు కేంద్రాల్లో గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్(గేట్) ఆదివారంతో ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఏలూరు సమీప వట్లూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 200కి 176 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 120కి 98 మంది పరీక్ష రాశారు. సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో ఉదయం 170కి 151 మంది, మధ్యాహ్నం 103కి 90 మంది హాజరయ్యారు. చివరి రోజు 78 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.

(c) eenadu

శివోహం.. బలివే క్షేత్రం

రామలింగేశ్వరుడు

ముసునూరు, న్యూస్‌టుడే: హరహర మహాదేవ.. శంభోశంకర.. అంటూ శివనామ స్మరణతో బలివే రామలింగేశ్వర స్వామి క్షేత్రం మార్మోగింది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ముసునూరు మండలంలోని బలివే రామలింగేశ్వర స్వామి ఉత్సవాలకు కృష్ణా, గుంటూరు, పశ్చిమ, తూర్పుగోదావరి, ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. తమ్మిలేరులో పవిత్ర పుణ్యస్నానాలు చేసి పితృ దేవతలకు పిండ ప్రదానం చేసి తర్పణాలు వదిలారు. రామలింగేశ్వరస్వామిని లక్షన్నర మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో క్యూలైన్లు కిక్కిరిశాయి. స్వామి దర్శనానికి సుమారు 3 గంటల నుంచి 4 గంటల వరకు సమయం పట్టింది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్ల వద్ద భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య, ఫెస్టివల్ అధికారిణి కె.అనురాధ, నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, ఎస్సై చిరంజీవి, నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ పర్యవేక్షించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, నూజివీడు సివిల్ జడ్జి నాగ శైలజ, సబ్ కలెక్టర్ వినూత్న స్వామివారిని దర్శించుకున్నారు.

తమ్మిలేరు వద్ద జల్లు స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

శనివారం అర్ధరాత్రి ధర్మకర్త కుటుంబ సభ్యుల తొలి పూజలు

పట్టిసం.. భక్తజన సంద్రం

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినాన పోలవరం మండలం పట్టిసీమ వద్ద అఖండ గోదావరి మధ్య గల భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి క్షేత్రం భక్త జనసంద్రమైంది. తెల్లవారుజామున ఒంటి గంట సమయాన నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన ఆలయ ధర్మకర్త కొచ్చెర్లకోట కుటుంబ సభ్యులు తీర్థం బిందెతో గోదావరి జలాలను తెచ్చి స్వామికి తొలిపూజ చేశారు. సుమారు 3 గంటల సమయంలో అప్పటికే క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. ఏలూరుతోపాటు పోలవరం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల భక్తుల రాకతో క్యూలైన్లు పోటెత్తాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వామి దర్శనానికి గంటల కొద్దీ సమయం పట్టింది. సాయంత్రం 6 గంటలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు రేవును దాటినట్లు అధికారుల అంచనా. పోలవరం, కొవ్వూరు శాసనసభ్యులు చిర్రి బాలరాజు, ముప్పిడి వెంకటరావు కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఎండ తాకిడికి విలవిల.. ఫెర్రీ పాయింట్లో క్యూలైన్లలో భక్తులు ఎండ తాకిడికి విలవిల్లాడారు. టికెట్ కౌంటరు దాటి పంటులకు వెళ్లే మార్గంలో నీడ కోసం అధికారులు ఈ ఏడాది ఏర్పాట్లు చేయలేదు. రద్దీని నియంత్రించే క్రమంలో క్యూలైన్లను పంటుల మీదకు వెళ్లకుండా ఒకవైపు నిలిపివేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల కొద్దీ వేచి ఉండలేక, ఎండ వేడిమికి తాళలేక అసహనం వ్యక్తం చేశారు.

గోదావరి దాటే మార్గంలో భక్తుల రద్దీ

దర్శన వరుసల్లో తోపులాట

స్వయంగా రంగంలోకి దిగిన డీఐజీ

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినాన పట్టిసం క్షేత్రం ఆదివారం భక్తజన గోదారిగా మారింది. ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు స్వామి దర్శనానికి గంటల తరబడి ఆలస్యం, పలు ప్రాంతాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చే భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తుల రద్దీని నియంత్రించడం ఒక దశలో పోలీసులకు సవాల్‌గా మారింది. ఎండ వేడిమికి తాళలేని భక్తులు కొండ దిగువన క్యూలైన్లలో ముందుకెళ్లే క్రమంలో తోపులాటలు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో దర్శనానికి వచ్చిన ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. భక్తులను సంయమనం పాటించాలని కోరుతూ తోపులాటలు అదుపు చేశారు. అదే ప్రాంతంలో కంపార్ట్‌మెంట్లు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో తోపులాటలకు ఆస్కారం ఉందని పేర్కొంటూ 'గతానికి భిన్నంగా..' శీర్షికన 'ఈనాడు'లో శనివారం కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. డీఐజీ వెంట అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, పోలవరం డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు ఉన్నారు.

హరహరా.. పాతాళ భోగేశ్వరా!

కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు

అన్న ప్రసాదం వడ్డిస్తున్న కామినేని, మంత్రి పార్థసారథి

కలిదిండి, న్యూస్‌టుడే: 'హరహరా.. పాతాళ భోగేశ్వరా' అంటూ కలిదిండి భోగేశ్వర లంక మార్మోగింది. మహా శివరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతుల మీదుగా స్వామివారు, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు అడివి శ్రీరామ సుబ్రమణ్య శివప్రసాద్, రామలక్ష్మి దంపతుల నేతృత్వంలో వేద పండితుల వేద ఘోష మధ్య రాత్రి 1.20 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఏపీ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి సుమారు 2 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ప్రసంగిస్తున్న పాస్టర్ జ్యోతిరాజు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని మన్నా చర్చి పాస్టర్ ఎం.జ్యోతిరాజు అన్నారు. స్థానిక సెయింట్ జేవియర్ పాఠశాల ఆవరణలో ఆదివారం స్తుతి నైవేద్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత విభావరి రమణీయంగా సాగింది. సుమారు 80 మంది క్రైస్తవ సంగీత దర్శకులు, గాయకులు, వాయిద్య కళాకారులు పాల్గొని స్తుతి గీతాలు ఆలపించారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొని క్రీస్తును ఆరాధించారు.

జగన్ ముఠాది గోబెల్స్ ప్రచారం: మంత్రి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేని జగన్ ముఠా చేస్తున్న గోబెల్స్ ప్రచారం మానుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఆదివారం నూజివీడులోని క్యాంపు కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రూ. 9ల క్షల కోట్ల పెట్టుబడులు వస్తే వైకాపా ముఠా.. జగన్ బెల్ట్ మోగిస్తూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. 11 సీట్లకు పరిమితం చేసినా తీరు మార్చుకోలేదన్నారు. బడ్జెట్ కేటాయింపులు రూ.3,32,205 కోట్లు అని స్పష్టంగా తెలిపితే అమ్మ ఒడి నిలిపేస్తున్నారని.. పింఛన్లు ఆపేస్తారని... రైతు భరోసా ఇవ్వరంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నాడు-నేడు లెక్కలతో తాను సిద్ధమని స్పష్టం చేశారు. ఐదు కోట్ల మంది ప్రజలకు మంచి భవిష్యత్తు పునాది వేసేలా ఈ బడ్జెట్ ఉందన్నారు. పర్యావరణ అనుమతులు రాగానే చింతలపూడి ఎత్తిపోతలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

పోలవరం పూర్తయితే రైతుల అభ్యున్నతి.. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రైతుల ఆర్థిక పరిస్థితి మారుతుందన్నారు. ధరల స్థిరీకరణ నిధి, అమరావతిలో రహదారులు నిర్మాణం, సంక్షేమం, వైద్యానికి రూ.కోట్లలో నిధులు కేటాయించినట్లు చెప్పారు. విద్యుత్తు యూనిట్ ధరలను తగ్గిస్తామని తెలిపారు. నూజివీడు ఏఎంసీ పరిధిలో మామిడి రైతులకు అవసరమైన సలహాలను సూచనలను ఉద్యానాధికారులతో ఇప్పించే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బైపాస్ రహదారి నిర్మాణంలో భూసేకరణ సంబంధించి రూ. 6.5 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. నూజివీడులోని మొఘల్ చెరువు కట్ట వెంట ఉన్న ఆక్రమణలు తొలగించి షాపింగ్ కాంప్లెక్స్, పైన గృహాలు ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. సమావేశంలో నాయకులు చెరుకూరి దుర్గాప్రసాద్, పగడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలు కిటకిట

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా జిల్లాలోని అన్ని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయని పశ్చిమ కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3.50 లక్షల మంది భక్తులు ఆలయాలను దర్శించుకున్నారని వెల్లడించారు. భీమవరంలోని సోమేశ్వరాలయం, పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరాలయంతో పాటు ఆచంట, నత్తారామేశ్వరం, శివదేవునిచిక్కాల, జుత్తిగ, వీరంపాలెం, యనమదుర్రు శక్తీశ్వరాలయం వద్ద బాగా రద్దీ నెలకొందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించారన్నారు.

శివ.. శివా..! శివరాత్రి సందర్భంగా పోలవరం మండలం పట్టిసంలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించేందుకు భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. గోదారిలో పుణ్యస్నానాలు ఆచరించి దుస్తులు అక్కడే విడిచిపెట్టారు. అవన్నీ నీటిలో నానిపోయి దుర్గంధం వ్యాపిస్తున్నాయి. పెద్దల పేర్లు చెప్పి పురోహితులకు అందించిన సామగ్రిని అక్కడే విడిచిపెట్టారు. దీంతో నిన్నటి వరకూ స్వచ్ఛంగా ఉన్న గోదావరిలో నేడు వ్యర్థాలు పేరుకుపోయి కళావిహీనంగా మారింది. - ఈనాడు, పోలవరం

చలో విజయవాడ రేపు: యూటీఎఫ్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సుభాషిణి, ఆర్.రవికుమార్ తెలిపారు. గత ప్రభుత్వం 11వ పీఆర్సీ ప్రకటించగా.. ఇంకా ఆర్థిక అంశాలు పరిష్కరించకపోవడం, 2023 జులై 1 నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ 30 నెలలు గడిచినా ఎలాంటి పురోగతి లేకపోవడం, డీఏ బకాయిలు చెల్లించకపోవడం తదితర డిమాండ్ల సాధనకు రణభేరి 2.0 పేరిట నిర్వహించే చలో విజయవాడలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని వారు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

శనగ తీసి.. కొలతలు వేసి

చరవాణిలో వివరాలు చూపుతూ..

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: వసంతవాడ వంతెన సమీపంలోని వేరుశనగ పంట వేసిన పొలం వద్ద చరవాణి పట్టుకుని చూస్తున్న కార్మికుడు ఛత్తీస్‌గఢ్ వాసి. ఆయనకు పొలంలో ఏం పని అనుకుంటున్నారా. . మండలంలో ముమ్మరంగా వేరుశనగ కోతలు ప్రారంభమయ్యాయి. ఐదేళ్లుగా ఏటా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కూలీలు మిర్చి, వేరుశనగ కోతలకు ఈ ప్రాంతానికి వస్తున్నారు. వేరుశనగ కోతకు ఎకరాకు రూ.7 వేలు రైతులు చెల్లిస్తున్నారు. పని పూర్తయ్యాక భూమి విస్తీర్ణం లెక్క తేల్చడానికి చరవాణి ద్వారా ప్రత్యేక యాప్‌తో లెక్కిస్తున్నారు. ఒక ప్రదేశంలో మొదలు పెట్టి.. చుట్టూ తిరుగుతూ మళ్లీ అదే ప్రదేశానికి నడిచి వచ్చి భూమి కొలత ఎంత ఉందో చూస్తారు. రైతులకు, కార్మికుల మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తేలిన లెక్క ప్రకారం డబ్బులు చెల్లిస్తున్నారు. అన్ని రంగాల్లో మాదిరి వ్యవసాయంలోనూ కార్మికులు సాంకేతికతను వినియోగించుకుంటున్నారు.

తలనీలాలకు తప్పని తిప్పలు

నేలపై కూర్చొని ఇబ్బంది పడుతున్న భక్తులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి కేశఖండనశాల వద్ద భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. వీరు కుటుంబ సమేతంగా వస్తుంటారు. కొందరు తలనీలాలు సమర్పిస్తే మిగతా కుటుంబ సభ్యులు వారి కోసం అక్కడే వేచి ఉంటారు. రద్దీ సమయంలో కేశఖండన టికెట్లు తీసుకోవడం దగ్గర నుంచి స్వామికి తలనీలాలు సమర్పించి స్నానం చేసి వచ్చేసరికి సుమారు గంటన్నరకు పైగా సమయం పడుతోంది. ఈ లోపు మిగతా వారు అక్కడే నిలబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి.

ఖాళీ లేక.. కేశఖండనశాల వద్ద భక్తులు కూర్చోవడానికి కుర్చీలు, బెంచీలు లేకపోవడంతో భక్తులు నేలపై కూర్చొని ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడా ఖాళీ లేకపోవడంతో మెట్లపైన, హాల్లో, దిమ్మలపైన కూర్చుంటున్నారు. పిల్లలతో వచ్చిన వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. గంటల తరబడి నిలబడలేక అవస్థలు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం.. విషయం నా దృష్టికి వచ్చింది. భక్తులు కూర్చోవడానికి సౌకర్యాలు కల్పించి సమస్యను పరిష్కరిస్తాం.
- వై.భద్రాజీ, ఈవో, ద్వారకా తిరుమల దేవస్థానం

కోతకు గురైన చోట మట్టి పోస్తూ..!

పోలవరంలోని మహానందీశ్వరస్వామి దేవాలయం చెంత గోదావరి వరద తీవ్రతకు కోతకు గురైన విషయం తెలిసిందే. శివరాత్రి వేళ భక్తుల తాకిడి నేపథ్యంలో హడావుడిగా లారీలతో రాళ్లు, మట్టిని తెచ్చి పోశారు. కోతకు గురైన చోట గోదావరిలో దిగొద్దంటూ పోలీసులు హెచ్చరిక బ్యానర్లను ఏర్పాటు చేశారు. -ఈనాడు, పోలవరం

ఫ్రీజరులో మృతదేహం భద్రపరచాలంటూ నిరసన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: శవాన్ని శీతల పెట్టెలో భద్రపరచకుండా బయట ఉంచడం పట్ల మృతుని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేసిన వైనమిది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. అత్తిలి మండలం వరిఘేడుకు చెందిన కె.రాంబాబు ఆదివారం భీమవరం రెండో పట్టణంలో ఆటోలో వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో స్నేహితులు భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఫిట్స్ కారణంతో మృతి చెందాడని ధ్రువీకరించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. శవాన్ని పోస్టుమార్టం అనంతరం అప్పగిస్తామని పోలీసులు చెప్పారు. దాంతో మృతదేహాన్ని ఆసుపత్రి ఆవరణలోని మార్చురీ గదిలో బల్లమీద పొద్దుపోయే వరకు ఉంచారు. ఫ్రీజర్‌లోనైనా పెట్టండి, లేకపోతే శవాన్ని ఇస్తే తీసుకెళ్లిపోతామంటూ మృతుని బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్నారు. శవం పాడైపోతుందని వేడుకున్నా కనికరం చూపడం లేదన్నారు. ప్రైవేటుగా ఏర్పాటు చేసుకోండని చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి పర్యవేక్షకుడు లక్ష్మణ్ జితానంద్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఫ్రీజరులో పెట్టాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. గత నాలుగు రోజులుగా విద్యుత్తు సౌకర్యం లేని మార్చురీ గదిలో శీతలపెట్టె ఎలా పనిచేస్తుందంటూ బాధితులు ఆందోళన చేపట్టారు.

గల్ఫ్ ఏజెంట్ నివాసం ఎదుట ఆందోళన

ఉండి, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గల్ఫ్ ఏజెంట్ నివాసం వద్ద మృతదేహం ఉన్న శవపేటికతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన ఘటన ఆదివారం ఎన్నార్పీ అగ్రహారంలో చోటుచేసుకొంది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురం మండలం చిట్టవరానికి చెందిన మురాల రాజమణి (48)ని ఎన్నార్పీఅగ్రహారానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ విమల నాలుగు నెలల కిందట మస్కట్‌కు ఉపాధి కోసం పంపారు. అక్కడ అనారోగ్యం బారిన పడిన రాజమణి తిరిగి స్వదేశానికి వచ్చేందుకు ప్రయత్నించగా ఏజెంట్ సహకరించలేదు. గతేడాది డిసెంబర్ 4న అక్కడే ఆమె మృతిచెందారని, మృతదేహాన్ని రప్పించాలని కుటుంబసభ్యులు కోరినా ఏజెంట్ పట్టించుకోలేదని నరసాపురం నియోజకవర్గ మాలల ఐక్యవేదిక కన్వీనర్ కాకిలేటి అనంత్ కుమార్ తెలిపారు. దీంతో మంత్రి నారా లోకేశ్‌కు రాజమణి కుమార్తె ఫిర్యాదు చేయడంతో ఆయనిచ్చిన ఆర్థిక సహకారం, మస్కట్, విజయవాడల్లోని ఎన్ఆర్ఐలిచ్చిన ప్రోత్సాహంతో మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో బంధువులు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో ఏజెంట్ ఇంటికి తాళం వేసి ఉంది. కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సంఘటనాస్థలికి ఎస్సై నసీరుల్లా, సిబ్బంది చేరుకొని ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. దీంతో వారు ఆందోళన విరమించి అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామం చిట్టవరం తీసుకెళ్లారు.

శవపేటికను ఇంటి ముందు ఉంచిన బంధువులు

అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపిక



పతకాలతో నాగబాబు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ మీట్‌లో 5 పతకాలు సాధించినట్లు భీమవరానికి చెందిన యాతం నాగబాబు తెలిపారు. ఆయన భీమవరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయంలో జిల్లా మలేరియా విభాగంలో ఉప మలేరియా అధికారిగా పనిచేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో పోటీలు ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగాయన్నారు. 800, 1500 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలతో పాటు రిలే పరుగు పందేల్లో రజత పతకాలు అందుకున్నానని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభతో థాయ్‌లాండ్‌లో ఈ ఏడాది మార్చిలో జరిగే అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యానన్నారు.

18న కలెక్టర్‌కు వీఆర్‌ఏల రాయబారం

ఉండి, న్యూస్‌టుడే: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న జిల్లా కలెక్టర్‌కు రాయబారం చేయనున్నామని వీఆర్‌ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు తెలిపారు. ఉండి మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆదివారం సమావేశమై మాట్లాడారు. న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని గత ఎన్నికల్లో హామీఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏనాడూ తమ మొర ఆలకించలేదని వాపోయారు. తెలంగాణ మాదిరిగా పేస్కేలు వర్తింపజేయాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం. ఆంజనేయులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ముసునూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన ముసునూరు మండలం లోపూడిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జోనుబోయిన ఏసు (50) ఆదివారం పశువులకు గడ్డి కోసేందుకు పొలానికి వెళ్లాడు. అక్కడ బోరు సమీపం వద్ద గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు సర్వీసు వైరు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. రైతులు గమనించి వైద్యం నిమిత్తం నూజివీడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఏసుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రేమ పేరిట వంచన

నిందితుడిపై పోక్సో కేసు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: బాలికను ప్రేమ పేరిట మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. నరసాపురం పట్టణ ఎస్సై జయలక్ష్మి కథనం ప్రకారం.. రుస్తుంబాదకు చెందిన వివాహితుడు కొవ్వెల కల్యాణ్‌కు పట్టణానికి చెందిన బాలికతో రెండేళ్ల కిందట పరిచయం ఏర్పడింది. అతడికి వివాహం జరిగిన విషయాన్ని ఆ బాలికకు చెప్పకుండా ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. ఇటీవల అతడి మోసం బయటపడటంతో బాధిత బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

Roc No. 2422/E1/2023-24 Dated: 12-02-2026

S. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs. In Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1.	Civil & Water Supply Works - 11	General Funds	95.27	16-02-2026	02-03-2026

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender.apeprocurement.gov.in.

Sd/- Commissioner, Tadepalligudem Municipality

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

గణపతి (పాత చిత్రం)

భీమడోలు, ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యులతో చిన్నపాటి వాగ్వాదంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ద్వారకాతిరుమలకు చెందిన శీమకుర్తి జ్యోతికృష్ణ గణపతి(50) శనివారం సాయంత్రం కుటుంబీకులతో ఓ విషయమై గొడవ పడ్డారు. వారిపై కోపంతో బయటకెళ్లిన అతడు తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆదివారం ఉదయం భీమడోలు రైల్వే గేటు సమీపంలో గణపతి మృతదేహం కనిపించారు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కూలి పనికి వెళ్లి కానరాని లోకాలకు

సుబ్బారావు (పాత చిత్రం)

గోపాలపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: అతడిది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. భార్య, ఇద్దరు కుమార్తెలతో ఉన్నంతలోనే సంతోషంగా జీవిస్తున్నారు. పండగ పూట ఆ కుటుంబ పెద్దని విద్యుదాఘాతం రూపంలో మృత్యువు కబళించింది. చిరుప్రాయంలోనే ఆ చిన్నారులకు తండ్రిని శాశ్వతంగా దూరం చేసింది. ఈ విషాదకర ఘటన రామచంద్రపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గోపాలపురానికి చెందిన మారుబోయిన సుబ్బారావు(38) కూలి పనులకెళ్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆదివారం నల్లమాడు పంచాయతీ రామచంద్రపురంలో ఆయిల్‌పామ్ గెలలు నరికే పనికెళ్లారు. అక్కడ గెలలు కత్తితో తొలగిస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యారు. సహచర కూలీలు తాడేపల్లిగూడెంలోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సుబ్బారావును పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు భార్య నాగభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

మహిళను మోసం చేసిన పంచాయతీరాజ్ ఈఈపై కేసు

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌పై గుంటూరులోని పట్టాభిపురం ఠాణాలో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరులోని దేవాపురానికి చెందిన ఓ మహిళ భర్త కొన్నాళ్ల కిందట మృతి చెందారు. ఆమెకు అనిల్ ద్వారా పంచాయతీరాజ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న బాపిరెడ్డి పరిచయమయ్యారు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెకు దగ్గరయ్యాడు. అవసరం తీరాక మాట మార్చాడు. రూ.1.5 కోట్ల వరకు ఆమె వద్ద డబ్బు కూడా తీసుకున్నాడు. ఆ నగదు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ బెదిరిస్తున్నాడు. మోసపోయానని తెలుసుకున్న ఆమె పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాపిరెడ్డి ప్రస్తుతం నూజివీడు పంచాయతీరాజ్ విభాగంలో ఈఈగా పని చేస్తున్నారు.

ఆపద్బాంధవులకు అండగా..

108 సిబ్బందికి వేతనం పెంచిన కూటమి సర్కారు

చింతలపూడి, ఉంగుటూరు, న్యూస్‌టుడే: ప్రాణాపాయంలో ఉన్న వారికి సత్వర ప్రథమ చికిత్స అందించి సకాలంలో ఆసుపత్రులకు చేరవేస్తున్న 108 వాహన సిబ్బందికి కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏళ్లుగా అరకొర జీతాలతో పని చేస్తున్న వారికి ఇచ్చిన హామీ మేరకు.. వేతనం పెంచుతూ నిర్ణయించింది. దీంతో ఉద్యోగులంతా థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు పట్టుకొని కృతజ్ఞతలు తెలిపారు.

థాంక్యూ సీఎం సార్ ప్లకార్డులతో ఉద్యోగులు

ఏలూరు జిల్లాలో ఇలా..
వాహనాలు - 28
ఈఎంటీలు -68
చోదకులు-68

136 మందికి లబ్ధి.. జిల్లాలో మొత్తం 28 వరకు 108 వాహనాలున్నాయి. చోదకులు(పైలెట్లు) 68 మంది, ఈఎంటీ(అత్యవసర వైద్య టెక్నీషియన్)లు 68 మంది సేవలందిస్తున్నారు. గత తెదేపా హయాంలో వారి జీతాలు పెంచుతూ ప్రభుత్వం 49వ జీవో తీసుకొచ్చింది. 2019లో వైకాపా వచ్చిన తర్వాత ఆ జీవోను అమలు చేయకుండా పక్కన పెట్టి శ్లాబ్ పద్ధతి తీసుకొచ్చింది. 108 సిబ్బంది ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున జీతం పెంచేందుకు అంగీకరించింది.

పెంపు ఇలా.. స్లాబ్‌ల ప్రకారం జీతాలను రూ.2 వేలు చొప్పున ప్రభుత్వం పెంచింది. దీంతో ఐదేళ్ల లోపు స్లాబ్‌లో ఉన్న ఈఎంటీకి రూ. 22 వేలు, పైలెట్‌కు 20 వేలు, 5 నుంచి 10 ఏళ్ల స్లాబ్‌లో ఉన్న వారికి ఈఎంటీకి రూ. 28 వేలు, చోదకుడికి రూ.26 వేలు, 10 ఏళ్లు దాటినవారికి ఈఎంటీకి రూ.32 వేలు, చోదకుడికి రూ.30 వేలకు పెరగనుందని సిబ్బంది తెలిపారు. 108 డీఎం డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 136 మంది ఉద్యోగులకు జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుందని తెలిపారు.

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). Ph.81422 92071.

FINANCIAL SERVICES

ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో మార్టుగేజ్/ టేకోవర్ లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. * నో సిబిల్/ నో బ్రోకర్స్. *MSR గ్రూప్, వైజాగ్. Ph: 9121314141

REAL ESTATE

PLOT FOR SALE

నర్సాపురం గాంధీనగర్-1లో అన్ని వసతులు కల్గిన 7 సెంట్లు (331 గజాలు) ఈస్ట్ ఫేస్ స్థలము అమ్మబడును. సంప్రదించవలసిన నెం: 99480 17232.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

FACULTY/ TEACHERS

Wanted faculty Urgently Required Maths Faculty for IPE & JEE Mains. Contact: 86390 45758.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
* For the Information of Trade & Industry
* గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.15 పై॥ తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

(c) eenadu

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

ముక్కంటికి నాట్య నీరాజనం

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: స్థానిక వైఎంహెచ్ఏ హాలులో హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. పాద్రి జ్యోతి నేతృత్వంలో హరి శ్రీనివాస బృందం శివ సంకీర్తన గానం చేశారు. పార్వతి రామచంద్రన్, హేమసుందర్ శిష్య బృందం నాట్య నీరాజనం సమర్పించారు. ఏర్పాట్లను వైఎంహెచ్ఏ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.కె.గుప్తా, సభ్యులు పర్యవేక్షించారు.

టెన్నికాయిట్‌లో విద్యార్థినుల ప్రతిభ

మండవల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండలం గురజలో నిర్వహించిన బాలికల సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో కానుకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్ఎం ఏవీఎస్‌ప్రసాద్ తెలిపారు. ఏడో తరగతికి చెందిన వి.వైష్ణవి, ఎస్.తేజశ్రీ, పి.బిందు మాధురి ఆయా మండలాల్లోని 5 పాఠశాలల విద్యార్థులతో పోటీ పడి మొదటి స్థానం సాధించినట్లు వివరించారు. సత్తా చాటిన విద్యార్థులను, పీడీ సత్యనారాయణను, సర్పంచి నాగదాసి థామస్, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

శివోహం.. భక్త సందోహం!

వాడవాడలా శివరాత్రి వేడుకలు

కైకరం రామలింగేశ్వరస్వామి

ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో మహాశివరాత్రి వేడుకలు ఆదివారం అంబరాన్నంటాయి. శైవ క్షేత్రాలన్నీ భక్తులతో నిండిపోయాయి. వేకువజాము నుంచే పరమేశ్వరుడికి ప్రత్యేకాభిషేకాలు, ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేశారు. పెద్దఎత్తున భక్తులు ముక్కంటిని దర్శించుకొని తరించారు. బలివే క్షేత్రం జన సంద్రమైంది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వామి, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఏలూరులో ఎమ్మెల్యే చంటి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు, మేయర్ నూర్జహాన్ దంపతులు రామలింగేశ్వరుని సేవలో పాల్గొన్నారు. ఉంగుటూరు, భీమడోలు మండలాల్లోని పలు శివాలయాలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు సందర్శించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. - న్యూస్‌టుడే బృందం

ఏలూరు: స్పటిక లింగానికి క్షీరాభిషేకం

పెదపాడు: బలివేలో భక్త జన సందోహం

పత్తేబాదలో స్వామివారికి అభిషేకం

పెదపాడు: బలివేలో అమ్మవారిని దర్శించుకుంటున్న చింతమనేని దంపతులు

అంబరుపేటలో అన్నప్రసాదం వడ్డిస్తున్న ధర్మరాజు, వీరాంజనేయులు

ఏలూరు: విశేషాలంకరణలో..

శివకేశవుడిగా సూర్యనారాయణుడు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మాఘ మాసం, మహాశివరాత్రి సందర్భంగా పవరుపేట సూర్య దేవాలయంలో ఆదివారం విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సూర్యభగవానుడిని శివకేశవులుగా అలంకరించారు. అనంతరం నామార్చన, ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పాలన.. పరాయి పంచన!

శిథిలావస్థకు కార్యాలయాల భవనాలు

పరిశీలన

భీమడోలు, గణపవరం, పెదపాడు- న్యూస్‌టుడే: ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లోని పలు మండల కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్నాయి. గోడలు పెచ్చులూడి ఎప్పుడు నేలకూలుతాయో పరిస్థితి నెలకొంది. వివిధ పరిస్థితుల్లో అద్దె భవనాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఫలితంగా ఆయా కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఖజానాపై భారం..

భీమడోలు మండల పరిషత్తు, తహసీల్దారు కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, ఉప ఖజానా, ఉపాధిహామీ పథకం కార్యాలయాలకు సొంత భవనాల్లేవు. న్యాయస్థానం అద్దె భవనంలో కొనసాగుతోంది. గణపవరంలోని మత్స్యశాఖ కార్యాలయం పరాయి పంచన నడుస్తోంది. పోలీసు సర్కిల్ కార్యాలయానికి సొంత భవనం లేదు. పెదపాడు మండల పరిషత్తు కార్యాలయం, పోలీస్‌స్టేషన్ శిథిలావస్థలో నడుస్తున్నాయి. అద్దె భవనాల్లో కార్యాలయాలు కొనసాగుతుండటంతో.. ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోంది.

గణపవరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం లేదు. రెండు గదులున్న అద్దె భవనంలో కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇక్కడ ఏటా రూ.కోట్ల విలువైన భూముల క్రయవిక్రయాలు చేపడుతున్నారు. ఇక్కడికొచ్చే ప్రజలకు తగిన సదుపాయాలు లేకపోవడంతో.. అవస్థలు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

సొంత స్థలాలున్నా..

ఆయా మండలాల్లోని శిథిల, అద్దె భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలకు సొంత స్థలాలున్నాయి. నూతన భవన నిర్మాణాలకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో సమస్య నెలకొంటోంది. ఇకనైనా పక్కా భవనాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

భీమడోలు మండల పరిషత్తు కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. ఓ మోస్తరు వర్షానికే భవనం ఉరుస్తోంది. పిచ్చిమొక్కలు మొలిచి ప్రాంగణమంతా చిట్టడవిని తలపిస్తోంది. వివిధ పరిస్థితుల్లో అదే ప్రాంగణంలోని మండల సమాఖ్య భవనంలో ఎంపీడీవో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. సమీక్షలు, సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఇబ్బంది పడుతున్నారు.

'భీమడోలులో శిథిలావస్థకు చేరిన మండల పరిషత్తు కార్యాలయ భవనాన్ని తొలగించి.. కొత్తది నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం' అని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: ? జాలిపూడి నుంచి బాబాజీ గూడెంకెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నాం. పాములు, విష పురుగుల బెడద ఎక్కువ ఉంది. **- వెంకటేశ్వరరావు**

✔ సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేస్తాం. **- వర్మ, పంచాయతీ కార్యదర్శి**

దెందులూరు, న్యూస్‌టుడే: ? స్థానిక సచివాలయం సమీపంలో మద్యం దుకాణం వద్ద మందుబాబులు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణం సాగించే వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- ప్రసాద్, స్థానికుడు**

✔ సమస్య నా దృష్టికి రాలేదు. వాహనాలు అడ్డదిడ్డంగా పెట్టకుండా చర్యలు తీసుకుంటా. **- శివాజీ, ఎస్సై**

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: ? రాట్నాలగుంట రాట్నాలమ్మ ఆలయం వెనుక భాగంలోని ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. గోతులు పడి, కంకర తేలి రాకపోకలు సాగించలేని విధంగా మారింది. **- నారాయణమూర్తి, వాహనదారుడు**

✔ రహదారిని పరిశీలిస్తాం. మరమ్మతులకు అంచనాలు రూపొందించి అధికారులకు నివేదిస్తాం. **- రాజేష్‌ఖన్నా, పంచాయతీ కార్యదర్శి**

రాట్నాలమ్మకు అభిషేకం

పెదవేగి, న్యూస్‌టుడే: రాట్నాలకుంటలో వెలసిన రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం, అర్చన చేసి పట్టువస్త్రాలు, ఆభరణాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులు రాట్నాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజాద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ. 53,834 ఆదాయం సమకూరిందని ఆలయ ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో తెలిపారు.

శాంతి మార్గంలో జీవిద్దాం: బడేటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సమాజంలోని ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో జీవించాలని.. ఇదే విషయాన్ని అన్ని మతాలు బోధిస్తున్నాయని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం జమీయత్ అహ్లెహదీస్ ఆధ్వర్యాన ఆదివారం ఇస్లాం శాంతి సందేశ మహాసభ నిర్వహించారు. చంటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మానవుల మధ్య సోదర భావం, సమానత్వాన్ని రంజాన్ పండగ పెంపొందిస్తోందని చెప్పారు. సాటి మనుషులకు సాయం చేయాలని ఇస్లాం చెబుతోందని.. దీన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. నాయకులు శివప్రసాద్, పార్థసారథి, వెంకటరత్నం, మత పెద్దలు అబ్దుల్ అజీమ్ ఉమి మదనా, ఇస్లాముద్దీన్ సలాఫీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

యువతకు సేవాలాల్ ఆదర్శం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: యువతకు లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ ఆదర్శమని.. ఆయన చూపిన మార్గం అనుసరణీయమని ఎస్టీ బంజారా సుగాలి లంబాడీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం సేవాలాల్ జయంతిని వేడుకగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సేవాలాల్ తన బోధనలతో యావత్ బంజారా జాతి అభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. తండాల నిర్మాణానికి జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. సంఘ నాయకులు జి.కృష్ణ, రంగా నాయక్, బి.సోములు, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నమస్కరిస్తున్న నాయకులు

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

దెందులూరు, న్యూస్‌టుడే: రామారావుగూడెం ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా సోమ, మంగళవారాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. రామారావుగూడెం, పెరుగుగూడెం ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వ్యవసాయానికి బోరు మోటార్లకు వేకువజాము 3 నుంచి ఉదయం 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు రెండు దఫాలుగా విద్యుత్తు సరఫరా చేస్తామని చెప్పారు. రామారావుగూడెం, పెరుగుగూడెం, మలకచర్ల, ధర్మారావుపేట గ్రామాల ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు!

ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో సచివాలయ భవన నిర్మాణాన్ని రెండేళ్ల కిందట పూర్తి చేశారు. విద్యుత్తు కనెక్షను ఇవ్వకపోవడంతో.. దాన్ని నేటికీ ప్రారంభించ లేదు. పాత పంచాయతీ భవనంలోనే కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇరుకు గదిలో విధులు నిర్వర్తించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

– న్యూస్‌టుడే, గోపీనాథపట్నం(ఉంగుటూరు)

చెత్త.. తొలగక చింత!



పెదవేగి మండలం అమ్మపాలెంలో అంబేడ్కర్ విగ్రహం సమీప రోడ్డు పక్కన చెత్తచెదారం పడేస్తున్నారు. రోజులు తరబడి తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. చోదకులు, ప్రయాణికులు ముక్కులు మూసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. – న్యూస్‌టుడే, అమ్మపాలెం (పెదవేగి)

ఎత్తు తగ్గి.. ప్రమాదం పెరిగి

గణపవరం మండలం కోమర్రులో వ్యవసాయ క్షేత్రాలకెళ్లే పుంత రోడ్డులో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఇటీవల పుంత మార్గాన్ని సీసీ రహదారిగా అభివృద్ధి చేశారు. దాంతో రోడ్డు ఎత్తు పెరిగి తీగలు తగిలేలా కనిపిస్తున్నాయి. వ్యవసాయోత్పత్తుల తరలింపునకు రైతులు అవస్థలు పడుతున్నారు. – న్యూస్‌టుడే, గణపవరం

దారి.. అధ్వానంగా మారి!

పెదవేగి మండలం వంగూరు నుంచి కవ్వకుంట, గార్లమడుగు మీదుగా రాట్నాలకుంటకెళ్లే ర.భ.శా. రహదారి పలుచోట్ల కంకర తేలి అధ్వానంగా మారింది. వాహనదారులు రాళ్లు తప్పించే క్రమంలో అదుపుతప్పి పడిపోతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ర.భ.శా. డీఈ శ్రీకర్ తెలిపారు. – న్యూస్‌టుడే, పెదవేగి(పెదపాడు)

అంచు.. ప్రమాదం పొంచు



నిడమర్రు ప్రధాన కూడలి సమీప మలుపులో వంతెన శిథిలావస్థకు చేరింది. ఓవైపు రక్షణ గోడ పూర్తిగా దెబ్బతింది. రాత్రివేళ చోదకులు ఏమాత్రం ఏమరపాటు వహించినా.. అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లే ప్రమాదముంది. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం

నిర్మాణం నిలిపేసి.. పశువులు కట్టేసి!

నిడమర్రు మండలం బావాయిపాలెంలో అయిదేళ్ల కిందట గ్రామ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గుత్తేదారు పిల్లర్లు వేసి.. శ్లాబు పూర్తి చేశారు. ఆ తర్వాత గత వైకాపా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిపివేశారు. దాంతో స్థానికులు పశువులను కట్టేస్తున్నారు. ఫలితంగా ఆ ప్రాంతమంతా అపరిశుభ్రత నెలకొంటోంది. అధికారులు స్పందించి త్వరితం పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం

అంగన్‌వాడీ.. అవస్థల ఒడి!

పెదవేగి మండలం బాపిరాజుగూడెంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం శ్లాబు దశలో నిలిచిపోయిన దృశ్యమిది. గత తెదేపా ప్రభుత్వం భవనాన్ని మంజూరు చేయగా.. చకచకా పనులు జరిగిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా.. గుత్తేదారుకు బిల్లులు చెల్లించలేదు. ఫలితంగా నిర్మాణం ఆగిపోయి.. పిల్లలకు అద్దె భవనమే దిక్కయింది.

ఇబ్బందులు పడుతున్న చిన్నారులు

పెదవేగి, పెదపాడు- న్యూస్‌టుడే: దెందులూరు నియోజకవర్గంలోని పలుచోట్ల అంగన్‌వాడీ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా వసతుల్లేని.. ఇరుకైన అద్దె గదుల్లో పిల్లలకు బోధన చేస్తున్నారు. కొన్నిచోట్ల చిన్నారులు కూర్చొనేందుకు జాగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు చివరి దశలో నిలిచిపోయాయి. వాటికి కాస్త నిధులు కేటాయిస్తే.. భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అవకాశముందని గ్రామీణులు పేర్కొంటున్నారు. 'అసంపూర్తి భవన నిర్మాణాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం' అని ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్టు ఇన్‌ఛార్జి సీడీపీవో విజయకుమారి తెలిపారు.

ప్రాజెక్టు వివరాలిలా..			
మండలాలు: పెదపాడు, పెదవేగి, దెందులూరు			
కేంద్రాలు: 241	సొంత భవనాలు: 171	అద్దెవి: 71	

విజయరాయిలో నాలుగేళ్ల కిందట ప్రారంభించిన అంగన్‌వాడీ భవన నిర్మాణం అసంపూర్తిగా ఆగిన చిత్రమిది. పిల్లర్లు పోసి రెండడుగుల మేర గోడలు నిర్మించి వదిలేశారు. సమస్యను గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. చిన్నారులు అరకొర వసతులున్న అద్దె భవనంలో పూర్వ ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు.

ఆలపాటికి పలువురి నివాళి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావు మృతికి ఆదివారం పలువురు నివాళి అర్పించారు. నగరంలోని ఆలపాటి నివాసంలో బాధిత కుటుంబ సభ్యులను మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు అధ్యక్షుడు పెనుమల్లి మధు, అమరావతి బాలోత్సవం సమన్వయకర్త పి.మురళీకృష్ణ ఆదివారం పరామర్శించారు. హేలాపురి బాలోత్సవం కమిటీ ప్రతినిధులు నరసింహారావు, వి.కనకదుర్గ, ఎ.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలనులో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.20,150 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలో ఎవరైనా జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో జూద క్రీడలాడితే తమకు సమాచారం అందించాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

పొగబెట్టక.. పొమ్మనక!

మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు

నిడమర్రు, న్యూస్‌టుడే: ఉంగుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించింది. దోమలు వృద్ధి చెంది.. ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో మొత్తం 81 పంచాయతీలుండగా.. అందులో 17 మేజర్ పంచాయతీలున్నాయి. ఆయా గ్రామాల్లో దోమల నివారణకు ప్రభుత్వం ఫాగింగ్ యంత్రాలు పంపిణీ చేసింది. తొలినాళ్లలో వారానికి రెండు, మూడు రోజులు ఫాగింగ్ చేసేవారు. తద్వారా దోమల వ్యాప్తిని అడ్డుకట్ట వేసేవారు. ప్రస్తుతం సింహభాగం పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు చిన్నపాటి మరమ్మతులకు గురై మూలకు చేరాయి. దాంతో దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోయాయి. మహిళలు, వృద్ధులు, పిల్లలు దోమకాటుకు గురై అనారోగ్యం బారిన పడుతున్నారు.

కాలువలు శుభ్రం చేయక.. కొన్ని గ్రామాల్లో డ్రెయిన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటోంది. నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన రావడంతో పాటు దోమపోటు ఎక్కువవుతోంది. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని.. ఫాగింగ్ యంత్రాలు వినియోగంలోకి తేవాలని గ్రామీణులు కోరుతున్నారు. 'మండలంలో ఎక్కడెక్కడ ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయో తెలుసుకుంటాం. వాటిని బాగు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. అంతటా ఫాగింగ్ చేయించి దోమల వ్యాప్తిని అరికడతాం' అని డిప్యూటీ ఎంపీడీవో స్వామి తెలిపారు.

డ్రమ్ముంది.. చూసి పొమ్మంది!

భీమడోలు, న్యూస్‌టుడే: ఉంగుటూరు నియోజకవర్గం మీదుగా వెళ్తున్న 216ఏ జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయి. గ్రామాల కూడళ్లు, విభాజకాల ఖాళీల వద్ద ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారిని ఆనుకొని పల్లెలుండటం.. కూడళ్ల వద్ద ద్విచక్ర వాహనదారులు ముందు, వెనుక చూడకుండా దూసుకొచ్చేస్తుండటం కారణమవుతోంది. భీమడోలు మండలం కురెళ్లగూడెం, భీమడోలు, పూళ్ల; ఉంగుటూరు మండలం నారాయణపురం, చేబ్రోలు, కైకరం కూడళ్ల వద్ద సంభవించిన ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు.

అపసవ్య దిశలో.. జాతీయ రహదారిపై కొన్నిచోట్ల ద్విచక్ర వాహనదారులు అపసవ్య దిశలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు కారులు, భారీ వాహనాల వేగ నియంత్రణకు పోలీసులు ఆయా కూడళ్లలో ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేశారు. వీటి కారణంగా ప్రమాదాలు తగ్గడం అటుంచితే.. డ్రమ్ములు ఢీకొని పలువురు గాయపడిన ఘటనలు ఎక్కువవుతున్నాయి. 'గ్రామాల కూడళ్లలో రహదారి విభాజకాలకు ఖాళీలు ఇవ్వకపోవడంతో కొందరు అపసవ్య దిశలో వాహనాలు నడుపుతున్నారు. ఈ కారణంగానే ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. వీటి నివారణకు వేగ నిరోధకాలు ఏర్పాటు చేస్తున్నాం. ఎన్‌హెచ్ అధికారులతోనూ మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని భీమడోలు సీఐ యు.జె.విల్సన్ తెలిపారు.

భీమడోలు వద్ద జాతీయ రహదారిపై ఇలా..

పుంత రోడ్డు.. నిర్లక్ష్యం చూడు!

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలను-దేవరగోపవరం మధ్య పుంత రహదారి ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. పెదనిండ్రకొలను సినిమా హాలు నుంచి దేవరగోపవరం వెళ్లడానికి ఇది దగ్గర మార్గం. రోడ్డుకిరువైపులా చేపలు, రొయ్యల చెరువులున్నాయి. చెరువులు తవ్వక ముందు పొలాల గట్ల మీదుగా ప్రజలు రాకపోకలు సాగించేవారు. ఆక్వా సాగుకు పూనుకున్నాక.. పుంత దారి మరుగున పడింది. గతేడాది పందికోడు వంతెన నుంచి దేవరగోపవరం వరకు సీసీ రహదారి నిర్మించారు. ఆ సమయంలో ప్రజలు ప్రత్యామ్నాయంగా రాకపోకలు సాగించేందుకు పుంత దారిని అభివృద్ధి చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయి.. వాహన రాకపోకలను అనుమతి ఇచ్చాక.. పుంత మార్గంలో రాకపోకలు తగ్గాయి. ఈ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే రైతులు, ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ఛిద్రంగా పెదనిండ్రకొలను-దేవరగోపవరం మార్గం

మోక్షిత్ ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: శ్రీహరిపురం బీసీ కాలనీకి చెందిన రెండున్నరేళ్ల బాలుడు ఆకేటి మోక్షిత్ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. గత నెల 20న ఇంటి వద్ద ఆడుకుంటూ మోక్షిత్ అదృశ్యమైన విషయం విదితమే. దీనిపై క్యాంప్‌బెల్ కాలువల్లోను, బస్సు స్టాండ్, రైల్వే స్టేషన్లను సైతం గాలించారు. ఆదివారం ఎస్సై వీరభద్రరావు, సిబ్బందితో కలిసి పలు మండలాల్లో నిర్వహించిన శివరాత్రి వేడుకల్లో గాలించారు. యాచకుల వద్ద ఉన్న బాలుడిని పరిశీలించారు. యాచకులు ఎవరైనా కొత్త బాలుడిని తీసుకువస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలతో యాచక వృత్తి చేయించడం నేరమని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	మన శంకర వరప్రసాద్ గారు
అంబిక మినీ	జగన్నాథ్
సాయి బాలాజీ	హానీ
బాలాజీ	ఆపరేషన్ పద్మ
సత్యనారాయణ 1	అనగనగా ఒక రాజు
సత్యనారాయణ 2	యుఫోరియా
సత్యనారాయణ 3	విత్ లవ్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మన శంకర వరప్రసాద్ గారు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సుమతీ శతకం
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	నారీ నారీ నడుమ మురారి
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	భర్త మహాశయులకు విజ్ఞప్తి
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	మన శంకర వరప్రసాద్ గారు
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	అనగనగా ఒక రాజు

(c) eenadu

చింతలపూడి

•చింతలపూడి • పోలవరం

బస్సులు లేక భక్తుల అవస్థలు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసం క్షేత్రానికి ప్రత్యేక సర్వీసుల పేరుతో అధిక సంఖ్యలో బస్సులు నడిపిన ఆర్టీసీ శివరాత్రి పర్వదినాన పోలవరం గ్రామానికి ఆదివారం బస్సులను నిలిపివేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రులకు, దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రజలు మూడు కిలోమీటర్ల దూరం ప్రైవేటు వాహనాల్లో పట్టిసం చేరుకొని అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల్లో ప్రయాణాలు సాగించాల్సి వచ్చిందని ఆగ్రహించారు. కొవ్వూరు, జంగారెడ్డిగూడెం, నిడదవోలు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం డిపోల నుంచి నిత్యం పోలవరం తిరిగే సర్వీసులను కూడా నిలిపివేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.

శాంతి మార్గంలో జీవిద్దాం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో జీవించాలని.. ఇదే విషయాన్ని అన్ని మతాలు బోధిస్తున్నాయని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం జమీయత్ అహ్లేహదీస్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఇస్లాం శాంతి సందేశ మహాసభలో ఆయన మాట్లాడారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి, న్యూస్‌టుడే: ? శివాపురం ప్రధాన రహదారి పక్కనే గడ్డివాములు ఏర్పాటు చేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తున్నప్పుడు ఇవి అడ్డుగా ఉండి కనిపించడం లేదు - **జయరాజు, శివాపురం**

✔ సొంత పొలాల్లో గడ్డివాములు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచనలిస్తాం. - **రాజా, పంచాయతీ కార్యదర్శి**

? ఫాతిమాపురం జామాయిల్ అడవి మధ్యలో రాత్రి సమయంలో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. -**నవీన్, వెలగలపల్లి**

✔ మట్టి తవ్వకాలు చేస్తే కేసులు పెడతాం. - **బాలీ, సెక్షన్ ఆఫీసర్**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం కొవ్వూరిగూడెం ముస్లింవీధి రహదారి గుంతలుపడి ప్రమాదకరంగా మారింది. రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. - **సత్యం, స్థానికుడు**

✔ మరమ్మతులు చేయిస్తాం - **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ? జంగారెడ్డిగూడెం పట్టణం సాయిసూర్య నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. - **తేజ**

✔ మరమ్మతులు చేయిస్తాం - **కేవీ రమణ, కమిషనర్**

రామాలయ నిర్మాణం పూర్తి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: వీరభద్రవరంలో స్థానికుల ఆర్థిక సాయంతో చేపట్టిన రామాలయ నిర్మాణం పూర్తయ్యింది. సుమారు రూ.20 లక్షలతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు తెలిపారు. ఈ నెల 26న ఆలయంలో సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల విగ్రహాలు ప్రతిష్ఠిస్తామన్నారు. ఇప్పటికే స్వామి వార్ల విగ్రహాలు, ధ్వజ స్తంభాన్ని ఆలయం వద్దకు చేర్చారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసం వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని అయినవిల్లి మంజుశ్రీ చేసిన కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి.

ఉచితం మాటున దందా.. పట్టించుకునేదుండా..?

రెచ్చిపోతున్న ఇసుకాసురులు..

తాడువాయి సమీపంలో జల్లేరు వంతెన పక్కన తవ్వి పడవలు, ట్రాక్టర్లపై నింపుతున్న కార్మికులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాకు అడ్డు, అదుపు లేకుండా పోతోంది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం గృహావసరాల కోసం కాలువలు, వాగుల నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు ఉచిత విధానం అమలు చేసింది. దీన్ని ఆసరాగా చేసుకొని పలువురు అక్రమార్కులు దందాకు పాల్పడుతున్నారు.

చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జంగారెడ్డిగూడెం పట్టణంలోని బైనేరు, మండలంలోని తాడువాయి సమీపంలో జల్లేరు వంతెన, మైసన్నగూడెం- స్వర్ణవారిగూడెం వెళ్లే దారిలో జల్లేరు వాగు, వాడపల్లి కాలనీ సమీపంలో పెద్దకాలువ, వేలేరుపాడు మండలంలోని వసంతవాడలోని పెదవాగుతో పాటు పలు కాలువల్లో యథేచ్ఛగా తవ్వకాలు కొనసాగుతున్నాయి. సెలవు రోజుల్లో ఇసుక అక్రమ రవాణా రెండింతలుగా సాగుతోందని, ట్రాక్టర్లపై తరలిస్తున్న క్రమంలో పట్టా కప్పకపోవడంతో ఇసుక ఎగిరిపడుతూ ఇబ్బందులు పడుతున్నామని వెనుక వస్తున్న పలువురు చోదకులు ఆందోళన చెందుతున్నారు.

ప్రేక్షకపాత్రలో అధికారగణం

కాలువలు, వాగుల నుంచి ఉచితంగా ఇసుక తెచ్చుకోవచ్చనే సడలింపు ఇసుకాసురులకు వరంగా మారింది. గ్రామాల్లో ఇసుక విక్రయదారులు ముఠాగా ఏర్పడి పదుల సంఖ్యలో ట్రాక్టర్లపై ఇసుక తోడేస్తున్నారు. వారికి స్థానిక నాయకుల అండదండలు మెండుగా ఉండటంతో అధికారగణం ప్రేక్షకపాత్ర పోషిస్తోందనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఒకవేళ దాడులు చేసేందుకు వెళ్లినా..ఆ సమాచారం ముందుగానే అక్రమార్కులకు చేరుతుండడంతో ఇసుక తవ్వకాల ప్రాంతాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కాలువల్లో నీరు ఉన్నాగానీ పడవల్లో ఇసుక నింపి ఒడ్డుకు తీసుకొచ్చిన తరువాత ట్రాక్టర్లపై ఎగుమతి చేసి తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు రూ.1,800 నుంచి 3,500 వరకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా వంతెనలు, కాజ్‌వేల పక్క నుంచి కాలువలు, వాగుల్లోకి వాహనాలు వెళ్లేలా బాటలు ఏర్పాటు చేసుకొని అక్కడే రాత్రీ పగలు తేడాలేకుండా ఇసుక తవ్వేస్తున్నారు. దీంతో వంతెనలు, కాజ్‌వేలు ఇతర నిర్మాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు మౌనం వహించడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

17 నుంచి సిలువ గట్టు జాతర

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడులో ఈ నెల 25, 26, 27 తేదీల్లో సిలువ గట్టు తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు ఫా.దారం సతీశ్ తెలిపారు. ఆదివారం సిలువ గట్టు వద్ద పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 25,26,27 తేదీల్లో తిరునాళ్ల ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గట్టుపై వివిధ కార్యక్రమాలతో పాటు ప్రార్థనలు తదితరాలు ఉంటాయన్నారు.

కొయ్యలగూడెం: అంకాలగూడెం ఉమా సమేత భోగలింగేశ్వర స్వామి

టి.నరసాపురం: మల్లుకుంటలో..

సర్వాలంకారంలో తడికలపూడి గంగేశ్వరుడు

తాడువాయి ఆలయ క్యూలైన్లలో..

హరోం.. హర

మహాశివరాత్రి పర్వదినాన పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల్లోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే వేలాది సంఖ్యలో భక్తులు గోదావరి నదీ తీరాన పుణ్యస్నానాలు ఆచరించి పరమశివుడికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆయా క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. పలు చోట్ల ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. సాయంత్రం నందీశ్వర అభిషేకం, లింగోద్భవం, గ్రామోత్సవం, శివ సహస్ర నామార్చన, కల్యాణోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. రాత్రి లింగోద్భవకాల అభిషేకాలు, అనంతరం స్వామి వారి తిరుకల్యాణోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు. కొన్ని చోట్ల పెద్దఎత్తున ప్రభలతీర్థం నిర్వహించారు. పట్టిసం వీరేశ్వరస్వామిని జిల్లా పరిషత్ సీఈవో శ్రీహరి రావు, హైకోర్టు సహాయ రిజిస్ట్రార్ కె.వి.రామారావు, ఏలూరు రేంజి డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కె. ప్రతాప్‌శివకిశోర్, ఐటీడీఏ పీవో రాములు నాయక్ తదితరులు దర్శించుకున్నారు. - **న్యూస్‌టుడే బృందం**

జంగారెడ్డిగూడెం: భైరవపాలెం శివాలయం వద్ద..

జంగారెడ్డిగూడెంలో..

ద్వారకా తిరుమల: లింగోద్భవ కాల అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు

దారి కష్టాలకు తెర!

కన్నాయగూడెం వాసులు ఎనిమిదేళ్లుగా పడుతున్న దారి కష్టాలకు తెర పడింది. 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో పొంగుటూరు నుంచి యర్రగూడెం వరకు రహదారి నిర్మించారు. ఖమ్మం నుంచి వచ్చే భారీ వాహనాలను కొయ్యలగూడెం నుంచి జీలుగుమిల్లి మళ్లించడంతో నెల వ్యవధిలో అధ్వానంగా తయారైంది. 2019 ఎన్నికల అనంతరం వైకాపా ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. ఇదే విషయంపై 'ఈనాడు'లో పలు పర్యాయాలు కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం రూ.1.10కోట్లు మంజూరు చేయడంతో రహదారికి మోక్షం లభించింది. - **న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ**

రహదారి తవ్వారు.. మరమ్మతులు మరిచారు

రాళ్లపూడి సమీపంలో ప్రధాన రహదారిపై దుమ్ము లేస్తూ..

వేలేరుపాడు మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు ప్రయాణానికి ప్రాణ సంకటంగా మారాయి. రెండేళ్ల కిందట గోదావరి, పెదవాగు వరదలు, భారీ వర్షాలకు దెబ్బతిన్న తెలంగాణ సరిహద్దు గ్రామం మేడేపల్లి నుంచి రుద్రంకోట, వేలేరుపాడు-కొయిదా గ్రామాల మధ్యలోని 8 కి.మీ. ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతుల కోసం రూ.5.5 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు నెల రోజుల కిందట పాక్షికంగా రహదారులు తవ్వించి కంకరతో నింపి వదిలేశారు. దారంతా దుమ్ము లేస్తుండటంతో రాకపోకలు కొనసాగించే ద్విచక్రవాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు కంకర రాళ్లు లేచిపోవడంతో పడుతూ.. లేస్తూ.. ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈకు ఫిర్యాదు చేస్తే వెంటనే రహదారులను బాగు చేయిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, వేలేరుపాడు**

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి

బంజారా నాయక్, కార్బరీలను సన్మానిస్తున్న స్థానికులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: కృష్ణాపురంలో ఆదివారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ ప్రబోధకులైన హనుమాన్, హాతీరామ్, సేవాలాల్ జెండాలు ఎగరేశారు. సేవాలాల్ జ్యోతిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం తెలుగు రాష్ట్రాలకు చెందిన 25 మంది బంజారా నాయక్, కార్బరీలకు సేవాలాల్ మహారాజ్ పురస్కారాలిచ్చి స్థానికులు సత్కరించారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: సుగాలి, బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని కోయరాజమండ్రిలో ఆదివారం నిర్వహించారు. కేఆర్‌పురం ఐటీడీఏ పీవో రాములు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ సేవాలాల్ మహారాజ్ ధర్మప్రబోధకుడిగా వెలుగొందిన దైవమని కొనియాడారు. సుగాలి, బంజారాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేవాలాల్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ గుగ్గులోతు మోహనరావు, సంఘం ప్రతినిధులు బానోతు బాబూరావు, పాపారావు, బానోతు కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

ప్రమాదకర ప్రయాణం.. పట్టించుకోని యంత్రాంగం

అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఆటోలు, లారీలు, ట్రాక్టర్ల చోదకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, ఆయిల్‌పామ్ తోటల్లో పనిచేసే కూలీలను ఆటోలు, ట్రాక్టర్లలో సామర్థ్యానికి మించి తరలిస్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీనిపై ఎస్సై సతీశ్‌కుమార్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా కూలీలను తరలించే వాహనాలను తనిఖీ చేసి సామర్థ్యానికి మించి తరలించే చోదకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. - **న్యూస్‌టుడే, చింతలపూడి పట్టణం**

మోటారు లేక మోతలు

పంచాయతీలోని ఓ కాలనీలో మంచి నీటి సరఫరా మోటారు పాడైంది. రెండు రోజులుగా మంచినీటి ఎద్దడి తలెత్తటంతో స్థానికులు కార్యదర్శికి సమస్య తెలిపారు. దీంతో ట్యాంకరు ద్వారా కాలనీ వాసులకు నీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు కార్యదర్శి రవినాయక్ తెలిపారు. కాగా పాడైన మోటారును బాగు చేతకు పంపినట్లు తెలిపారు.

-**న్యూస్‌టుడే, కామవరపుకోట**

యంత్రపరికరాలెక్కడ?

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన గాలంకి గంగరాజు అనే రైతు తైవాన్ స్ప్రేయర్ కోసం స్థానిక వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాడు. ఇంకా రాలేదని వ్యవసాయశాఖ సిబ్బంది సమాధానం చెప్పారు. దీంతో చేసేదేం లేక మరో రైతుకు చెందిన స్ప్రేయర్ అద్దెకు అడిగి తోటకు మందు పిచికారీ చేయించారు.

ప్రతి దశలోనూ కీలకం..

వ్యవసాయంలో యంత్ర పరికరాలు కీలకం. విత్తు మొదలు.. నూర్పిడి వరకు సాగులో ప్రతి దశలోనూ అవసరం. కూలీల కొరత అధిగమించాలంటే అవి అందుబాటులో ఉండాలి. అందుకే ప్రభుత్వాలు రాయితీ ఇచ్చి పరికరాల కొనుగోలును ప్రోత్సహిస్తున్నాయి. నాగళ్ల నుంచి ట్రాక్టర్ వరకు అనేక పరికరాలను రైతులకు 40 నుంచి 60 శాతం వరకు రాయితీపై ఇస్తోంది. ఏటా ఖరీఫ్ సమయంలో దరఖాస్తు చేసుకుంటే వాటిని అందించేవారు. ఈసారి రబీ తుది దశకు వస్తున్నా..ఇప్పటికీ రైతులకు చేరలేదు. ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించినా..యంత్ర పరికరాలు ఇవ్వడంలో తాత్సారం జరుగుతోంది.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా ఎదురుచూపులే..

ఆయిల్‌పాం పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

రూ.3.90 కోట్ల విలువైన పరికరాల పంపిణీ

గత ఆర్థిక సంవత్సరం ఏలూరు జిల్లాలో రూ.3.90 కోట్లు విలువైన 1253 పరికరాలను రైతులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా, రూ.2.90 కోట్లు విలువైన 951 పరికరాలను యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు అందించారు. ఇందులో ప్రభుత్వ రాయితీ రూ.1.50 కోట్లు పైగానే ఉంది. ఈ నిధులతో రోటవేటర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, పవర్ టిల్లర్లు, ట్రాక్టర్‌తో నడిచే యంత్ర పరికరాలు అందించారు.

అద్దె యంత్రాలపై ఆధారం..

చిన్న, సన్నకారు రైతులు అద్దె యంత్రాలపై ఆధారపడుతున్నారు. రోజువారీ అద్దెకు తెచ్చి యంత్రాలను వినియోగిస్తున్నారు. రబీ సీజన్‌లో పంటలకు ఎరువులు, మందుల పిచికారీకి పరికరాలు అవసరమవుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా యంత్ర పరికరాలు విడుదల చేస్తుందనే ఆశాభావంతో రైతులు ఉన్నారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా యంత్ర పరికరాల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రావాల్సి ఉందన్నారు.

మా 'ఇంటి'కి రావే లక్ష్మి !

గృహ నిర్మాణ సాయం రూ.2.39 లక్షలకు పెంపు

సర్వే చేస్తున్న అధికారులు

లింగపాలెం(చింతలపూడి), న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై-2.0) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు ఇచ్చే యూనిట్ విలువను రూ.2.39 లక్షలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రకటించారు. దీంతో గృహ నిర్మాణ లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

గ్రామాల్లో సొంత స్థలం ఉండి గృహాలు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న పేదలకు పీఎంఏవై-2.0(గ్రామీణ) పథకం కింద ప్రభుత్వం గృహాల మంజూరుకు చర్యలు చేపడుతోంది. దీనిపై ఇంటింటి సర్వే సైతం నిర్వహించడంతో నియోజకవర్గంలో దాదాపు 7,840 మంది అర్హులుగా గృహ నిర్మాణ సంస్థ అధికారులు గుర్తించారు.

నియోజకవర్గంలో ఇలా..	
లింగపాలెం	2214
చింతలపూడి	1860
కామవరపుకోట	1412
జంగారెడ్డిగూడెం	2354

ఇప్పటివరకు..

ఒక్కో యూనిట్ విలువ ఇప్పటివరకు రూ.1.80 లక్షలుగా ఉండేది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.30 వేలు వంతున సాయం చేసేవి. గత వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చింది. పేదల కాలనీల పేరుతో తప్ప పీఎంఏవైలో ఇళ్లు సక్రమంగా మంజూరు చేయలేదు. ప్రస్తుతం 2.0 పథకంలో రూ.2.39 లక్షల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాతోపాటు వీబీ జీ రామ్‌జీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా సాయం అందించనున్నారు. దీనికి అదనంగా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణంపై వడ్డీని ప్రభుత్వమే రాయితీగా చెల్లించాలని నిర్ణయించింది.

విధివిధానాలు విడుదల కావాలి.

పీఎంఏవై-2.0 ద్వారా పేదలకు ఇచ్చే ఇళ్లకు నిధులు పెంచి ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీనిపై ఇంకా విధి విధానాలు విడుదల కావాల్సి ఉంది.

- **రామకృష్ణ, గృహనిర్మాణ సంస్థ డీఈ**

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

కుక్కునూరు, న్యూస్‌టుడే : కుక్కునూరు సమీపంలోని కాలువలో గుర్తు తెలియని ఓ యువకుడి శవం పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చీరవల్లిలో పూరిల్లు దగ్ధం

కుక్కునూరు, న్యూస్‌టుడే: చీరవల్లి గ్రామంలో గంజి పిచ్చయ్యకు చెందిన పూరిల్లు ఆదివారం సాయంత్రం దగ్ధమైంది. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. కుక్కునూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో రూ.50 వేల నగదు, కొంత బంగారం కాలిపోయినట్లు బాధిత కుటుంబం తెలిపింది.

మద్యం మత్తులో నీటిలో పడిన వ్యక్తి

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసం ఉత్సవాలకు తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ నుంచి వచ్చిన అబ్బులు అనే వ్యక్తి తాగిన మైకంలో నది ఒడ్డున నీటిలో పడడంతో ఆదివారం మధ్యాహ్నం కొంతసేపు ఉత్కంఠ నెలకొంది. వెంటనే అప్రమత్తమైన భక్తులు అధికారులకు సమాచారం అందించడంతో పోలీసులతోపాటు వైద్యులు పరుగులు తీశారు. అతడ్ని బయటకు తీసి పోలవరం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మద్యం మత్తులో నీటిలో పడిపోయాడని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆసుపత్రిలో అతడు కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు.

సంకీర్తన ఆలపిస్తున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

సంగీత మహా సభల్లో ప్రతిభ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: విజయవాడలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో తెలుగు భాషా సంగీత మహా సభలు-2026 పేరున స్వరఝురి సంస్థ కార్యక్రమం నిర్వహించింది. శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు పాల్గొని త్యాగరాజు, రామదాసు, అన్నమయ్య వంటి వాగ్గేయకారుల సంకీర్తనలను ఆలపించి ఆహూతుల మన్ననలు పొందినట్లు ట్రిపుల్ ఐటీ సంగీత విభాగ అధ్యాపకులు చంద్రమౌళి, శ్రీధర్, విద్యాసాగర్ తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్, ఏవో, డీన్‌లు అభినందించారు.

రాట్నాలమ్మకు అభిషేకం

పెదవేగి, న్యూస్‌టుడే: రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం, అర్చన చేసి పట్టువస్త్రాలు, ఆభరణాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులు రాట్నాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజాద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.53,834 ఆదాయం సమకూరిందని ఆలయ ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో తెలిపారు.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, కామవరపుకోట మండలం, జీలకర్రగూడెం గ్రామం గోరింక సత్తిబాబు S/o వెంకటేశ్వరరావు అను నాకు సంబంధించిన R.S.No. 181/1-Fలో 0.27 సెంట్లు ది. 25-6-2021 తేదీన కామవరపుకోట SROలో నమోదు కాబడిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెం: 1770/2021 పై డాక్యుమెంట్ 10-01-2026 తేదీన జీలకర్రగూడెం నుండి కామవరపుకోట వెళ్ళి జిరాక్స్ తీసుకుని వస్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైననూ దొరికిన యెడల క్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.

93465 50794

చివరికి తెచ్చారు.. చేతులెత్తేశారు

అసంపూర్తిగా ఆసుపత్రి నిర్మాణం

చింతలపూడి, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంత ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల కొరతతో గుత్తేదారు చేతులెత్తేయడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఆసుపత్రి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

అయిదేళ్లైనా ఇంతే..

2020లో రూ.18 కోట్ల నిర్మాణ వ్యయంతో ప్రారంభమైన వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు ఇప్పటికీ 78 శాతమే పూర్తయ్యాయి. ఇప్పటివరకూ రూ.12 కోట్లు నిధులు ఖర్చు చేసినా ఇంకా రూ.6 కోట్లు విడుదల కావాల్సి ఉండటంతో గుత్తేదారు చేతులెత్తేశాడు. 2023 నుంచి 2025 వరకు నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారు పనులు చేపట్టలేదు. గత నవంబర్‌లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ చొరవతో రూ.4 కోట్లు విడుదలైనా పాత బకాయిలకే సరిపోయాయి. మళ్లీ నిధులు విడుదలైతే కానీ పనులు చేపట్టేందుకు గుత్తేదారు సుముఖత చూపడం లేదు.

సేవలు అంతంత మాత్రమే..

ఆసుపత్రి వినియోగంలోకి వస్తే చింతలపూడితో పాటు టి.నర్సాపురం, లింగపాలెం, చాట్రాయి మండలాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించి రోగులకు సేవలందిస్తున్నారు. ఇక్కడ వైద్యులున్నా పరికరాలు లేకపోవడంతో తూతూ మంత్రంగా సేవలందిస్తున్నారు.

మిగిలిన పనులు..

రూ.1.50 కోట్లతో టైల్స్ ఏర్పాటు, రూ.1 కోటి వ్యయంతో విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, పచ్చదనానికి రూ.10 లక్షలతో పాటు రహదారి పనులకు మరో రూ.1 కోటి కావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

నిధులు విడుదల కావాల్సి ఉంది..

వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు ఇప్పటికే 78 శాతం పూర్తయ్యాయి. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

-**రాజాబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ.**

శ్రద్ధాంజలి

ఆప్యాయతానురాగాలతో మమ్మల్ని పెంచి, మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన మా మాతృమూర్తి శ్రీ గెడా శ్రీలక్ష్మీ గారి మరణం మాకు తీరనిలోటు.. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ శ్రీమతి గెడా శ్రీలక్ష్మీ గారు
W/o. (లేటు) వీర్రాజు గారు
దిప్పకాయలపాడు. మరణం: 09-02-2026

కుమారులు: గెడా శ్రీనివాస్, గెడా సూరిబాబు
కోడళ్ళు: అనిత, సుష్మ
కుమార్తె: పేరిమి పద్మరాణి
అల్లుడు: రామచంద్రప్రసాద్
మనుమలు, మనుమరాండ్రు: గెడా రిషిక, గెడా శ్రీమణికంఠ-దివ్య, గెడా హైందవి, ఆలపాటి కమలప్రియ-ఫణిధర్, పేరిమి రాజ్‌కుమార్-లావణ్య
మునిమనుమరాండ్రు: ఆలపాటి రుత్వికవల్లి, పేరిమి అన్విశ్రీ

పెదకార్యం: 23-02-2026 సోమవారం, కొయ్యలగూడెం మండలం, దిప్పకాయలపాడు గ్రామంలో మా స్వగృహము నందు జరుపబడును. గాన తెలియపర్చడమైనది

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

టెన్నికాయిట్‌లో కానుకొల్లు విద్యార్థినుల ప్రతిభ

సత్తాచాటిన చిన్నారులతో ఉపాధ్యాయులు

మండవల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండలం గురజలో నిర్వహించిన 85వ బాలికల సబ్ జూన్ టెన్నికాయిట్ పోటీల్లో కానుకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం ఏవీఎస్‌ప్రసాద్ తెలిపారు. ఏడో తరగతికి చెందిన వి.వైష్ణవి, ఎస్.తేజశ్విని, పి.బిందు మాధురి ఆయా మండలాల్లోని 5 పాఠశాలల విద్యార్థులతో పోటీ పడి మొదటి స్థానం సాధించినట్లు వివరించారు. సత్తా చాటిన విద్యార్థులను, పీడీ సత్యనారాయణను, సర్పంచి నాగదాసి థామస్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

దర్శనానికి క్యూలో భక్తులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో అభిషేకాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన ఆదివారం, మహాశివరాత్రి కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు దర్శనానికి తరలివచ్చారు. అధిక సంఖ్యలో అభిషేకాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	ఆగిరిపల్లి:	9121229090
ముసునూరు	:93983 81268	చాట్రాయి:	8008574700
కైకలూరు	:73060 88555	మండవల్లి:	8106099008
కలిదిండి	:90594 84862	ముదినేపల్లి:	8008574693

కలిదిండి, న్యూస్‌టుడే : ? కలిదిండిలోని సుగుణ కళాశాల సమీపంలో రహదారి పక్కన పెద్ద ఎత్తున చెత్త, ఇతర వ్యర్థాలు పోస్తున్నారు. వీటిని సకాలంలో తొలగించడం లేదు. దీని వల్ల దోమలు ఉద్ధృతంగా ఉన్నాయి. దుర్వాసన వస్తోంది. - నాగు, కలిదిండి

✔ చర్యలు తీసుకుంటాం. - మారుతీ ప్రసన్న, సర్పంచి, కలిదిండి

కైకలూరు, న్యూస్‌టుడే: మండలంలోని వరహాపట్నం నుంచి ఆటపాక వెళ్లే రోడ్డుమార్గంలో పంచాయతీ వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానికురాలు నీలిమ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి శ్రీవిద్య దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె వెలగని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు.

సంకీర్తన ఆలపిస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

సంగీత మహా సభల్లో ప్రతిభ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: విజయవాడలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో తెలుగు భాషా సంగీత మహా సభలు-2026 పేరున స్వరఝరి సంస్థ కార్యక్రమం నిర్వహించింది. శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు పాల్గొని త్యాగరాజు, రామదాసు, అన్నమయ్య వంటి వాగ్గేయకారుల సంకీర్తనలను ఆలపించి ఆహూతుల మన్ననలు పొందినట్లు ట్రిపుల్ ఐటీ సంగీత విభాగ అధ్యాపకులు చంద్రమోహన్, శ్రీధర్, విద్యాసాగర్ తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్, ఏవో, డీన్‌లు అభినందించారు.

విశేష అలంకరణలో మండవల్లి మల్లేశ్వరస్వామి

అల్లినగరంలో పూజలందుకుంటున్న స్వామివారు.

చంద్రమౌళేశ్వర స్వామి వారు

గురజలో పార్వతీదేవి

బలివే ఆలయంలో మొక్కుతున్న భక్తులు

ఆగిరిపల్లిలో గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి

హరహర మహాదేవ... శంభో శంకర...

● వైభవంగా మహా శివరాత్రి ● శివ నామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

నూజివీడు, న్యూస్‌టుడే: హర హర మహాదేవ..శంభో శంకర మమ్ముద్భవగరావా.. అంటూ భక్తుల స్మరణతో నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లోని శివాలయాలు మార్మోగాయి. పరమశివుడికి అత్యంత ప్రీతి పాత్రమైన శివరాత్రి పర్వదినాన్ని ఆదివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. భక్తులు వేకువ జామునే శైవ క్షేత్రాలకు వెళ్లి శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు.

బలివే రామలింగేశ్వరస్వామి ఆలయం ఎదుట భక్త జనసందోహం

★ శ్రీ శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నృసింహ స్వామి కొండపై వేంచేసిన స్వయంభు కొండ మల్లేశ్వర స్వామిని 850 మెట్లు కాలినడకన కొండ ఎక్కి పరమశివుడిని దర్శించుకుని భక్తులు పూజలు నిర్వహించారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: వడాలి, గురజ, పెదపాలపర్రు, సింగరాయపాలెం, అల్లూరు, వణుదుర్రు, చేవూరు, వాడవల్లి, ప్రొద్దువాకలోని శివాలయాల్లో స్వామి వారిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. రాత్రి లింగోద్భవ కాలం సందర్భంగా అభిషేకాలు నిర్వహించారు.

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు శ్యామలాంబ ఆలయ క్షేత్ర సముదాయంలోని పార్వతీ సమేత రామలింగేశ్వర, శ్రీరామేశ్వర, శ్రీకనక లింగేశ్వర స్వామివార్ల దేవస్థానాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, లక్ష్మీ గణపతి హోమం, జ్యోతిర్లింగార్చన, సాయంత్రం స్వామివార్లకు శాంతి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.

★ సీతనపల్లిలోని కాశీ అన్నపూర్ణ సమేత రామ లింగేశ్వర స్వామికి విశేష పూజల అనంతరం స్వామివారి ప్రభ గ్రామోత్సవం నిర్వహించారు. 2 వేల మందికి అన్నదానం నిర్వహించగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, శోభానాద్రిపురం శ్రీభ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వర, పుట్లచెరువులో అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకాలను నిర్వహించారు. అల్లినగరం, లింగాల, ఉనికిలి, చావలిపాడు, లోకుమూడి శివాలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు హోమాలు చేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: సెయింట్ పాల్స్ సెమినరీలో ఆదివారం డాన్‌బోస్కో యువజనోత్సవాలు ఘనంగా జరిగాయి. యువత ఆటలు, పాటలు, నృత్యాల ద్వారా మానసిక వికాసం పొందాలని చెడు మార్గంలో నడవ కూడదని రెక్టర్ ఫాదర్ రాయన్న తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి విచ్చేసిన 250 మంది పైగా యువతీ యువకులు నృత్యాలు, కోలాటం, బైబిల్ పరీక్షలు, దేవుడి పాటలతో హోరెత్తించారు. ఆయా అంశాల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వికార్ ఫోరిన్ ఫా.లాము జయరాజు, సెయింట్ పాల్స్ సెమినరీ అడ్మినిస్ట్రేటర్ ఫా. ఏసుదాసు, ఈదులగూడెం విచారణకర్తలు రె.ఫా. ప్రశాంత్, సలేషియన్ సహకారుల ప్రెసిడెంట్ బేతే జోసఫ్, కార్యదర్శి విన్సెంట్, ప్రొవెన్స్ కోఆర్డినేటర్ జీవీ ప్రాన్సిస్, పి.జోజప్ప, జీడి రావు, చార్లెస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి నుంచే పూజలు

ప్రసాదాలు అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: శివరాత్రి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆదివారం కావడంతో శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్ధ రాత్రి నుంచి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు వివిధ రకాల అభిషేక కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బస్‌స్టాండ్ రోడ్‌లో ప్రఖ్యాతిగాంచిన దుర్గామల్లేశ్వర దేవస్థానం, కోట శివాలయం, గొల్లపల్లిలో రామలింగేశ్వర స్వామి ఆలయం ఆయన శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి అధిక సంఖ్యలో భక్తులు ఆయా దేవాలయాల్లో స్వామి వార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కోటశివాలయంలో వాసవీ క్లబ్ సభ్యులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అడుగు పడింది.. అభివృద్ధి మొదలైంది..!

● యర్రవారిగూడెం రోడ్డుకు రూ.194 లక్షలు
● జయపురం రహదారికి రూ.3.03 కోట్లు

ధ్వంసమైన జనార్దనవరం-జయపురం రహదారి

చాట్రాయి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి నేరుగా చేరేలా రెండు రహదారులను అనుసంధానం చేస్తూ అభివృద్ధికి అడుగు పడింది. చిత్తపూరు - బూరుగుగూడెం రోడ్డులో జనార్దనవరం నుంచి జయపురం వరకు(5.30 కి.మీ.)కు రూ.3.03 కోట్లు, మర్లపాలెం - యర్రావారిగూడెం రోడ్డు(2.9 కి.మీ.)కు రూ.1.94 కోట్లు నిధులు మంజూరయ్యాయి.

పదేళ్లుగా ప్రతిపాదనలకు దూరమై.. వైకాపా హయాంలో ఈ రహదారులకు కనీసం మరమ్మతుల ఊసే లేదు. వీటిని బాగు చేస్తే చాలా గ్రామాల ప్రజలు నేరుగా ఏలూరుకు, చింతలపూడి-ఏలూరు రోడ్డులో వలసపల్లికి చేరుకోవచ్చు. కూటమి పాలన వచ్చాక ఈ రోడ్ల అభివృద్ధి తెరమీదకు వచ్చింది. జయపురం రోడ్డు ఏనాడో పీఎంజీఎస్‌వైలో అభివృద్ధి చేస్తే వైకాపా పాలనలో తట్ట మట్టి పోయలేదు. మర్లపాలెం-యర్రవారిగూడెం రోడ్డు మట్టి రోడ్డుగా ఉంది. దీనిపై కూటమి నేతలు పట్టుబట్టి తారు రోడ్డు వచ్చేలా చేశారు.

అందుబాటులోకి వస్తే.. చాట్రాయి నుంచి జయపురం మీదుగా మర్లపాలెం చేరితే అక్కడి నుంచి యర్రవారిగూడెం, ముసునూరు మండలంలోని గుళ్లపల్లి, వలసపల్లి, ఏలూరు-చింతలపూడి రోడ్డుకు చేరుకోవచ్చు. ఈ రెండు రోడ్లు అభివృద్ధి చెందితే దూరం తగ్గి రవాణా కలిసొస్తుంది.

కూటమి నేతలు పట్టుబట్టి మరీ.. ఈ రోడ్లకు నిధులు కావాలని, తమకు ఇవ్వాల్సిందిగా అంటూ జయపురం, మర్లపాలెం, యర్రావారిగూడెం తెదేపా నాయకులు ఏడాదిన్నరగా మంత్రి పార్థసారథితో నిధులకోసం యుద్ధమే చేశారు. తమ అవసరాలను వివరిస్తూ వైకాపా పాలనలో చూపిన నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ ఎట్టకేలకు నిధులను సాధించారు. త్వరలోనే వీటికి సాంకేతిక సమస్యలు తీరి పనులు చేస్తారని పంచాయతీ రాజ్ డీఈ కమల కిశోర్ తెలిపారు.

ఆలపాటికి పలువురి నివాళి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావు మృతికి ఆదివారం పలువురు నివాళి అర్పించారు. నగరంలోని ఆలపాటి నివాసంలో బాధిత కుటుంబ సభ్యులను మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు అధ్యక్షుడు పెనుమల్లి మధు, అమరావతి బాలోత్సవం సమన్వయకర్త పి.మురళీకృష్ణ ఆదివారం పరామర్శించారు. హేలాపురి బాలోత్సవం కమిటీ ప్రతినిధులు నరసింహారావు, వి.కనకదుర్గ, ఎ.నిర్మల పాల్గొన్నారు.

17 నుంచి సిలువ గట్టు జాతర

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడులో ఈ నెల 25, 26, 27 తేదీల్లో సిలువ గట్టు తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు ఫా.దారం సతీశ్ తెలిపారు. ఆదివారం సిలువ గట్టు వద్ద పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 25,26,27 తేదీల్లో జాతర ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గట్టుపై వివిధ కార్యక్రమాలతో పాటు ప్రార్థనలు తదితరాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శిథిలావస్థలో బస్సు షెల్టర్లు

ముసునూరు, న్యూస్‌టుడే: పల్లె బస్సుస్టాండ్‌ల గోడు ఎవరికీ పట్టడం లేదు. ప్రయాణికుల సౌలభ్యం కోసం దాతలు, ప్రభుత్వాలు నిర్మించిన బస్సు షెల్టర్లు నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ముసునూరు మండలం సూరేపల్లి అడ్డురోడ్డు వద్ద, గుడిపాడు అడ్డ రోడ్డు, కొర్లగుంట సెంటర్ సమీపం వద్ద, వేల్పుచర్ల అడ్డ రోడ్డు వద్ద దాతలు ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏ ఊరు వెళ్లాలన్నా.. బస్సు, ఆటోల కోసం ప్రయాణికులు ఇక్కడే వేచి ఉంటారు. బస్సు షెల్టర్ల పిల్లర్లు బీటలు వారి ప్రమాదకరంగా మారాయి. ఈ క్రమంలో కూలడానికి సిద్ధంగా ఉన్న వాటిలో వేచి ఉండడానికి ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వర్షాలు పడే సమయంలో వాహనాల కోసం ఎదురు చేసేందుకు ఎండా వానల్లో ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని కోరుతున్నారు.

ఎండా వానల్లో.. ఎన్నాళ్లిలా!

పాఠశాలల్లో లేని సైకిల్ స్టాండ్లు

మండవల్లి, కైకలూరు, న్యూస్‌టుడే: పాఠశాలల్లో సైకిళ్లకు వసతి లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. దూర గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థి, విద్యార్థినులకు సైకిళ్లే ఆధారం. కానీ వాటిని నిలిపేందుకు పాఠశాలల్లో షెడ్లు లేవు. దీంతో ఆరు బయట, ప్రహరీ పక్కన, చెట్ల నీడన నిలుపుతున్నారు. అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. ఫలితంగా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో సాయంత్రానికి సైకిళ్లు ఉన్నా కాళ్లకు పని చెప్పాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

నియోజకవర్గంలో ఇలా.. కైకలూరు నియోజకవర్గ మండలాల్లో 38 జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 10 పాఠశాలల్లో మాత్రమే దాతల సహాయంతో షెడ్లు ఏర్పాటు చేశారు. బస్సులు, ఆటోలు లేని చాలా ప్రాంతాల నుంచి విద్యార్థులు పాఠశాలలకు సైకిళ్లపైనే వెళ్తున్నారు. కొల్లేరు లంక గ్రామాల్లో విద్యార్థినులు పాఠశాలలకు వెళ్లాలంటే సైకిళ్లే కీలకం. వీటిని ఎండలో ఉంచడం వల్ల టైర్లు పంక్చర్లు పడుతున్నాయి. స్థానికంగా పంక్చర్ దుకాణాలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

మండవల్లి జడ్పీ హైస్కూల్‌లో..

● మండవల్లి మండలం చింతపాడు పాఠశాలలో 60 వరకు ఉన్న సైకిళ్లకు ఎండలోనే ఉంచడంతో పంక్చర్లు పడి నడిపించుకొని వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కైకలూరు మండలం ఆటపాక ప్రభుత్వపాఠశాలలో 800 మంది విద్యార్థులుండగా 250 మందికి పైగా సైకిళ్లపై వస్తారు. వీటిని నిలిపేందుకు అవసరమైన వసతి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులెదుర్కొంటున్నారు.

షెడ్లలోనే వంట.. మండవల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సైకిళ్ల కోసం ఏర్పాటు చేసిన షెడ్డులో మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తుండటంతో సైకిళ్లను ఎండలో ఉంచాల్సి వస్తోంది. చింతపాడు, పుట్లచెరువు, లోకుమూడి పాఠశాలల్లో ఎండలోనే, లింగాల, మండవల్లి, ఇంగిలిపాకలంక, ఆటపాక, సీతనపల్లి, గురజ గ్రామాల్లో చెట్లు కింద నిలపాల్సి వస్తోంది. దీనిపై ఆయా మండలాల ఎంఈవోలను వివరణ కోరగా ఉన్నత పాఠశాలల్లో సైకిల్ షెడ్లు నిర్మించాలని ఇప్పటికే సమగ్ర శిక్షా అధికారులను కోరినట్లు వివరించారు. నిధులు మంజూరవగానే షెడ్లను నిర్మిస్తామని తెలిపారు.

మోక్షిత్ ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: శ్రీహరిపురం బీసీ కాలనీకి చెందిన రెండున్నరేళ్ల బాలుడు ఆకేటి మోక్షిత్ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. గత నెల 20న ఇంటి వద్ద ఆడుకుంటూ మోక్షిత్ అదృశ్యమైన విషయం విదితమే. దీనిపై క్యాంప్‌బెల్ కాలువల్లోను, బస్సు స్టాండ్, రైల్వే స్టేషన్లను సైతం గాలించారు. ఆదివారం ఎస్సై వీరభద్రరావు, సిబ్బందితో కలిసి పలు మండలాల్లో నిర్వహించిన శివరాత్రి వేడుకల్లో గాలించారు. యాచకుల వద్ద ఉన్న బాలుడిని పరిశీలించారు. యాచకులు ఎవరైనా కొత్త బాలుడిని తీసుకువస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలతో యాచక వృత్తి చేయించడం నేరమని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చివరికి తెచ్చారు.. చేతులెత్తేశారు

అసంపూర్తిగా ఆసుపత్రి నిర్మాణం

చింతలపూడి, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంత ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల కొరతతో గుత్తేదారు చేతులెత్తేయడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఆసుపత్రి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

అయిదేళ్లైనా ఇంతే.. 2020లో రూ.18 కోట్ల నిర్మాణ వ్యయంతో ప్రారంభమైన వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు ఇప్పటికీ 78 శాతమే పూర్తయ్యాయి. ఇప్పటివరకూ రూ.12 కోట్లు నిధులు ఖర్చు చేసినా ఇంకా రూ.6 కోట్లు విడుదల కావాల్సి ఉండటంతో గుత్తేదారు చేతులెత్తేశాడు. 2023 నుంచి 2025 వరకు నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారు పనులు చేపట్ట లేదు. గత నవంబర్‌లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ చొరవతో రూ.4 కోట్లు విడుదలైనా పాత బకాయిలకే సరిపోయాయి. మళ్లీ నిధులు విడుదలైతే కానీ పనులు చేపట్టేందుకు గుత్తేదారు సుముఖత చూపడం లేదు.

సేవలు అంతంత మాత్రమే.. ఆసుపత్రి వినియోగంలోకి వస్తే చింతలపూడితో పాటు టి.నర్సాపురం, లింగపాలెం, చాట్రాయి మండలాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించి రోగులకు సేవలందిస్తున్నారు. ఇక్కడ వైద్యులున్నా పరికరాలు లేకపోవడంతో తూతూ మంత్రంగా సేవలందిస్తున్నారు.

మిగిలిన పనులు.. రూ.1.50 కోట్లతో టైల్స్ ఏర్పాటు, రూ.1 కోటి వ్యయంతో విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, పచ్చదనానికి రూ.10 లక్షలతో పాటు రహదారి పనులకు మరో రూ.1 కోటి కావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

నిధులు విడుదల కావాల్సి ఉంది.. వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు ఇప్పటికే 78 శాతం పూర్తయ్యాయి. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. - **రాజాబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ.**

సద్గురు సేవాలాల్‌కు సామూహిక పూజలు

చాట్రాయి, న్యూస్‌టుడే: బంజారాల ఆరాధ్య దైవమైన సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్‌కు పోతనపల్లిలో ఆదివారం సామూహిక పూజలు నిర్వహించారు. బంజారాల కుల పెద్దలు ఆలయంలో పూజలు చేసి కులాచారం ప్రకారంనైవేద్యాన్ని సమర్పించారు. కుల పెద్దలు దరావతు నాగేశ్వరరావు, దరావతు పేరయ్య, డి.బాలరాజు, హసావతు చెన్నారావు, డి.మల్లికార్జునరావు, దారావతూ మురజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: యువతకు లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ ఆదర్శమని.. ఆయన చూపిన మార్గం అనుసరణీయమని ఎస్టీ బంజారా సుగాలి లంబాడీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం సేవాలాల్ జయంతిని వేడుకగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సేవాలాల్ తన బోధనలతో యావత్ బంజారా జాతి అభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. తండాల నిర్మాణానికి జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. సంఘ నాయకులు జి.కృష్ణ, రంగా నాయక్, బి.సోములు, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం.. పట్టించుకోని యంత్రాంగం

అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఆటోలు, లారీలు, ట్రాక్టర్ల చోదకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, అయిల్‌పామ్ తోటల్లో పని చేసే కూలీలను ఆటోలు, ట్రాక్టర్లలో సామర్థ్యానికి మించి తరలిస్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీనిపై ఎస్సై సతీశ్‌కుమార్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా కూలీలను తరలించే వాహనాలను తనిఖీ చేసి సామర్థ్యానికి మించి తరలించే చోదకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, చింతలపూడి పట్టణం

ఆలయ నిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా బాపులపాడు ధర్మకోనేరు చెరువు వద్ద నిర్మిస్తున్న శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి దేవాలయానికి ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన బొబ్బా కిరణ్‌కుమార్, గాయత్రి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణకర్తలు గూడపాటి రత్నశేఖర్, తదితరులకు ఆదివారం ఈ మొత్తాన్ని అందించారు.

శుద్ధికి శైవలాల చిక్కు.. కలుషిత నీరే దిక్కు..

రెండు నెలలకే పాడైపోతున్న ఫిల్టర్ బెడ్లు

మండవల్లిలో..

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలంలోని 29 పంచాయతీలలో ఫిల్టర్ బెడ్ల నిర్వహణ పంచాయతీలకు తలకు మించిన భారంగా మారింది. మండల అంతటా పెద్దఎత్తున చేపల చెరువులు విస్తరించడంతో దాని ప్రభావం స్థానికంగా ఉండే ప్రజలపై పడింది. మంచినీటి చెరువుల పక్కన పెద్ద ఎత్తున చేపల చెరువులు ఉండటంతో చేపల చెరువుల ఊట నీరు మంచినీటి చెరువుల్లోకి చేరుతోంది. పంట కాలువలకు ఇష్టారాజ్యంగా చేపల చెరువుల నీటిని విడుదల చేసి కలుషితం చేస్తున్నారు.

పంచాయతీ నిధులు చాలక.. మంచినీటి చెరువుల్లో పెద్దఎత్తున ఆకుపచ్చ శైవలాలు వృద్ధి చెందుతున్నాయి. ఆ నీటిని రక్షిత మంచినీటి పథకంలోని ఫిల్టర్ బెడ్లలోకి పంపి నీటిని శుద్ధిచేయడం ద్వారా సంవత్సరం రావాల్సిన అవి రెండు నెలలకే సామర్థ్యం తగ్గిపోతున్నాయి. శైవలాలు పెద్దఎత్తున ఫిల్టర్ బెడ్లలో పట్టేయడం ద్వారా నీటి శుద్ధికి అవాంతరం ఏర్పడుతోంది. ప్రతి రెండు నెలలకు వాటిని మార్చేందుకు పంచాయతీ నిధులు సరిపోకపోవడంతో చాలా పంచాయతీల్లో నీటిని నేరుగా చెరువుల్లో నుంచి ఎక్కించి పైపుల ద్వారా ప్రజలకు విడుదల చేస్తున్నారు.

నాలుగైదు గ్రామాలకే శుద్ధ నీరు మండవల్లి మండలంలో నాలుగైదు గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. లంక గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ప్రజలు పైపుల ద్వారా వచ్చి కలుషిత నీటినే తాగి రోగాల పాలవుతున్నారు. ఒక ఫిల్టర్ బెడ్డు మరమ్మతు చేయాలంటే రూ.2 లక్షల నుంచి 5 లక్షల వరకు ఖర్చు వుతుంది. కొన్ని గ్రామాల్లో వాటి మరమ్మతుల పేరుతో నిధులు వాడుకుని పాత ఇసుకనే తిరిగి అందులో వేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబును వివరణ కోరగా ఇప్పటికే చాలా ఫిల్టర్ బెడ్లకు మరమ్మతులు చేసినట్లు, మిగిలిన వాటిని త్వరలో బాగు చేస్తామని తెలిపారు.

నిర్భాగ్యులకు బాసటగా 'మేము సైతం'

సాయం అందిస్తున్న నాయకులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: నిర్భాగ్యులైన వారి కుటుంబాలకు బాసటగా నిలిచి నిత్యావసర సరకులు, బియ్యం అందిస్తూ మేము సైతం బృందం చేస్తున్న సేవలు అభినందనీయమని భాజపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ అన్నారు. అన్నవరం కాలనీ గట్టుపై నివసిస్తున్న టి.అప్పారావు కుటుంబానికి 'మేము సైతం' సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సరకులు, బియ్యం పంపిణీ చేశారు. 13 ఏటే ప్రమాదంలో కన్ను, రెండేళ్ల క్రితం లారీ ప్రమాదంలో కాలు కోల్పోయానని, అప్పటి నుంచి పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదని అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి పింఛను అందేలా చేస్తామని కోటప్రోలు కృష్ణ భరోసానిచ్చారు. పాస్టర్ల సంఘం మండల్యాక్షుడు స్పర్జనరాజు, విజయకుమార్, మొవ్వా ఫణీంద్ర, సత్యవోలు గణేశ్, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

భయం గుప్పిట్లో పశు వైద్యం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో పశువైద్య కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలాచోట్ల భవనాలు పూర్తిగా పాడవటంతో సిబ్బందితో పాటు పాడి రైతులకు అవస్థలు తప్పడం లేదు. నియోజకవర్గంలో 24 పశు వైద్య కేంద్రాల్లో 10 కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నియోజకవర్గంలో ఆవులు 8,879, గేదెలు 1,05,378, గొర్రెలు 99,093, మేకలు 41,638 ఉన్నాయి.

శిథిలావస్థకు చేరి.. నూజివీడు మండలంలో యనమదల, ఆగిరిపల్లి మండలంలో ఈదర, ఆగిరిపల్లి పశువైద్య శాలలు, ముసునూరు మండలంలో చెక్కపల్లి, రమణక్కపేట, ముసునూరు పశువైద్య శాలలు, చాట్రాయి మండలంలో చనుబండ, మర్లపాలెం, చాట్రాయి గ్రామాల్లో పశు వైద్యశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఫలితంగా భవనాలు పెచ్చులూడి వర్షం నీరు కారుతోంది. ఔషధాలు గది, వైద్యుడి గది, రికార్డుల భద్రపరచు గదులు సైతం వర్షానికి తడిచిపోతున్నాయి. భవనాలు ఎక్కడ కూలుతాయోనని భయపడుతూ గడుపుతున్నారు.

పెచ్చులూడి ఇనుప చువ్వలు కనిపిస్తున్న ఔషధాలు భద్రపరిచే గది

ప్రభుత్వానికి నివేదించాం.. శిథిలమైన పశువైద్య కేంద్రాల భవనాలపై ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. - **డా.రమేశ్, డీడీ, పశుసంవర్ధక శాఖ, నూజివీడు.**

(c) eenadu

భక్తజనం.. శివాలయం!

ద్రాక్షారామలో భీమేశ్వరుడికి పూజలు

పిఠాపురం, సామర్లకోట: జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. పిఠాపురం పాదగయ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. పుష్కరిణిలో వేలాదిగా పుణ్య స్నానాలు ఆచరించారు. కుక్కుటేశ్వర స్వామి నిజరూప దర్శనం చేసుకున్నారు. రాజరాజేశ్వరి, పురుహూతిక అమ్మవార్లు, దత్తాత్రేయస్వామి, కాశీవిశ్వేశ్వరుడికి పూజలు చేశారు. రద్దీతో పట్టణం కిటకిటలాడింది. భక్తుల రద్దీని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిత్యం పర్యవేక్షించారు. రద్దీ ప్రాంతాల్లో భక్తుల ఇబ్బందులపై ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ మనీష్ ఆరా తీస్తూ నివారణ చర్యలు చేపట్టారు.

సామర్లకోట.. ఆధ్యాత్మిక తోట

సామర్లకోట కుమారారామా భీమేశ్వరాలయం భక్తుల రద్దీతో ఆధ్యాత్మికతతో భాసిల్లింది. పుష్కరిణిలో వేలాదిగా పుణ్యస్నానాలు ఆచరించారు. భీమేశ్వరస్వామికి పిఠాపురం మహారాజా వారి గోత్రనామాలతో శాస్త్రోక్తంగా తొలి అభిషేక పూజలు ప్రారంభించారు. అనంతరం భక్తులను స్వామి దర్శనం నిమిత్తం అనుమతించారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు రంగనాగ్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈవో నీలకంఠం, ఛైర్మన్ జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లుచేశారు.

పాదగయలో కుక్కుటేశ్వరుడికి అభిషేకం

సామర్లకోటలో..

సామర్లకోట భీమేశ్వరాలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

పాదగయ పుష్కరిణి వద్ద భక్తుల తాకిడి

రైతే అమ్ముకుని.. లాభం చేత'పట్టు'కుని..!

గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలులో ఉన్న ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో ఆ కేంద్రం ఎదుట రైతులే ఎన్నడూ లేని విధంగా ఆదివారం పట్టుగూళ్ల విక్రయాలు సాగించారు. పది మంది ఇక్కడికి రెండు టన్నుల పట్టుగూళ్లు తెచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రీలర్లు కేజీకి రూ.680 నుంచి రూ.710 చొప్పున చెల్లించేందుకు అధికారుల సమక్షంలో నిర్ణయించారు. అంతకన్నా అధికంగా ఇచ్చేందుకు మార్కెట్‌లో రీలర్లు అంగీకరించలేదు. దీంతో పట్టుగూళ్లను రైతులు బయటకు తీసుకువచ్చారు. కేజీకి రూ.750 నుంచి రూ.760 చొప్పున చెల్లించేందుకు స్థానిక రీలర్లు అంగీకరించడంతో వారికే విక్రయించారు. రెండు టన్నుల పట్టుగూళ్లు బయట విక్రయించడంతో సుమారు రూ.20 వేలు ప్రభుత్వ మార్కెట ఆదాయం కోల్పోయిందని రైతులు తెలిపారు. ఆదివారం మూడు దఫాలు వేలం నిర్వహించినా ధర విషయమై టేలర్లు అంగీకరించక రైతులు పట్టుగూళ్లు సొంతంగా అమ్ముకున్నారని పట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారిణి గీతారాణి తెలిపారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

మరమ్మతులు ఇచ్చట.. మూడునెలల ముచ్చట

జిల్లాలో అత్యంత ముఖ్యమైన రహదారుల్లో ఒకటైన కాకినాడ-సామర్లకోట ఒకటి. 15 కిలోమీటర్లు ఉండే ఈ మార్గం గతంలో పూర్తిగా పాడవడంతో మూడు నెలల కిందటే రూ.5.02 కోట్లతో కొంత మేర మరమ్మతులు చేపట్టారు. కొన్ని చోట్ల అప్పుడే రహదారిపై వేసిన తారు ఊడిపోయి పాత రోడ్డు దర్శనమిస్తోంది. ఇది పనుల నాణ్యతను తేటతెల్లం చేస్తోంది. వెంకట కృష్ణరాయపురం సమీపంలో పాడయిన రహదారే అందుకు నిదర్శనం. మరోవైపు ఈ ప్రదేశంలో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పని నాణ్యత విషయంలో గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. - ఈనాడు, కాకినాడ

కట్టేది అంతా.. జమయ్యేది కొంతే!

ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లలో మాయాజాలం

న్యూస్‌టుడే, బాలాజీచెరువు

నగరపాలక సంస్థలో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూళ్లలో కొందరు శానిటేషన్, సచివాలయం సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఈ నెలాఖరులోగా పెంచిన ఫీజులు చెల్లించకపోతే వ్యాపారాలు సాగనివ్వమనే హుకుంతో వర్తకులు బెంబేలెత్తుతున్నారు. నోటీసులు ఇవ్వకుండా.. సిబ్బంది చెప్పినంత ఫీజు చెల్లిస్తే సరి.. లేకపోతే ముప్పుతిప్పలు పెడుతున్నారు.

పన్నులకు ఒకలా.. దీనికి ఇంకోలా..

ఆస్తి పన్ను, నీటి ఛార్జీలు యజమానులే నగరపాలిక పౌర సేవా కేంద్రంలో చెల్లించి, రసీదులు తీసుకుంటున్నారు. ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో శానిటేషన్ విభాగం చెప్పిందే వేదం. సిబ్బందే దుకాణాల వద్దకు వెళ్లి.. ఇంత చెల్లించాలని మౌఖికంగా చెబుతున్నారు. తర్వాత రోజు వెళ్లి వసూలు చేసి, దానిలో కొంత నొక్కేసి, మిగిలింది జమ చేసి, కొన్ని రోజుల తర్వాత రసీదులు ఇవ్వడం ఇక్కడ రివాజుగా మారింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెంచిన ట్రేడ్ లైసెన్స్ ఫీజులు ఈనెలాఖరులోగా చెల్లింపునకు గడువు విధించారు. దీనిని ఆసరా చేసుకుని కొందరు శానిటేషన్, సచివాలయం సిబ్బంది అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇవీ ఉదాహరణలు..

● 38వ డివిజన్‌లో ఒక టెంట్ హౌస్ వ్యాపారికి గతంలో రూ.1000 ట్రేడ్ ఫీజు ఉండేది. ఇప్పుడు కట్టమంటున్నారు. ఎటువంటి నోటీసులు ఇవ్వలేదు. శానిటరీ అధికారులు చెప్పారు.. మీకు మేం అదే చెబుతున్నామని సచివాలయ సిబ్బంది చెప్పడం గమనార్హం.

● 27వ డివిజన్‌లో ఒక ట్రాన్స్‌పోర్టు వ్యాపారికి ఏటా రూ.2వేలు ట్రేడ్ ఫీజు వసూలు చేసి, రసీదు ఇచ్చేవారు కాదు. వాస్తవంగా ఈ వ్యాపారికి సంబంధించి రూ.1000 మాత్రమే నగరపాలికకు జమ అయ్యేది. ఈ ఏడాది రూ.5వేలు చెల్లించాలని చెప్పారు.

ఫీజుల పెంపుతో..

నగరపాలక సంస్థ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌లు కిందకు వచ్చే వ్యాపారాలు 6,700 ఉన్నట్లు గుర్తించారు. వీరి నుంచి ఏటా రూ.98 లక్షల మేర ఫీజులు వసూళ్ల డిమాండ్‌గా ఉంది. ప్రతి మూడేళ్లకు 25 శాతం పెంచుతూ ఫీజులు వసూలు చేయాలి. గత 15 ఏళ్లుగా దీనికి జోలికి వెళ్లలేదు. ఇప్పుడు ఒకేసారి రెండు, మూడు రెట్లు పెంచేయడంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. తాజా పెంపుతో వీటి ఏడాది డిమాండ్ రూ.1.50 కోట్ల వరకు చేరింది. ప్రతి మూడేళ్లకు ఒకసారి ఫీజు పెంచితే భారం ఉండేది కాదని, ఒకస్మాత్తుగా అయిదు విడతలకు ఒకేసారి పెంచడం తగదని, దీనిపై పాలకులు, అధికారులు పునరాలోచించాలని కోరుతున్నారు.

నోటీసులు జారీకి చర్యలు

ట్రేడ్ ఫీజులకు నోటీసుల జారీకి చర్యలు తీసుకుంటాం. దీనికి అనుగుణంగా వ్యాపారులే నేరుగా ఫీజులు చెల్లించుకునే అవకాశం కల్పిస్తాం. ఇప్పటికే అధికారులు ఆదేశాలిచ్చాం. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.
- ఎన్‌వీవీ సత్యనారాయణ, కమిషనర్(ఎఫ్‌ఏసీ), నగరపాలక సంస్థ

వశిష్ఠ గట్టు.. ఇక పటిష్ఠం

రూ.24.75 కోట్ల వ్యయం

న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

వశిష్ఠ నదికి ఎడమ వైపున రాజోలు- మేకలపాలెం మధ్య నదీపాతం నుంచి ఒడ్డుకు రక్షణ కల్పించేందుకు చేపట్టిన పనులు దాదాపు 90 శాతం పూర్తి కావొచ్చాయి. నది జలాల్లో దాదాపు 15 మీటర్ల లోతున పెద్ద గరుకురాళ్లు (లాంచ్ స్టోన్) వేసి ఒడ్డుకు రక్షణ కల్పిస్తున్నారు. నదీపాతం నుంచి శాశ్వత రక్షణకు రూ.24.75 కోట్ల వ్యయంతో వశిష్ఠ నదీ తీరంలో బెడ్ పిచింగ్, రివిట్మెంట్ పనులు చేపట్టారు. సోంపల్లి నుంచి రాజోలు కాటన్ పార్క్ వరకు 5 మీటర్ల వెడల్పున 475 మీటర్ల మేర రెండువైపుల పనులు పూర్తి చేశారు. రాజోలు పుష్కర ఘాట్ నుంచి మేకలపాలెం మధ్య రెండువైపులా 5 మీటర్ల వెడల్పుతో చేపట్టిన పనులు 75 శాతం పూర్తయ్యాయి. ఇక్కడ రిటైనింగ్ గోడ వద్ద 5 మీటర్ల వెడల్పున బెడ్‌పిచింగ్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక కైలాస భూమి సమీపంలో 115 మీటర్ల మేర నిర్మించేందుకు సన్నద్ధమవుతున్నారు.

మేకలపాలెంలో నది ఒడ్డున రక్షణ పనులు

పటిష్ఠగట్టు బలోపేతమైతే..

రాజోలు పరిధిలోని మేకలపాలెం నుంచి సున్నపాటిలంక వరకు 2 కి.మీ. మేర ఏటిగట్టును విస్తరించాల్సి ఉంది. వరద నీరు గట్టుపై నుంచి పొంగి పొర్లే సమయంలో రాజోలు ప్రాంత ప్రజలు రాత్రిళ్లు భయపడుతున్నారు. ఇక్కడి గట్టును విస్తరించేందుకు గతంలో రూ.7.10 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు లేకపోవడంతో ఏటిగట్టు అంతే ఉన్నట్లు కనిపిస్తోంది.

వేగంగా రక్షణ పనులు..

వశిష్ఠ ఎడమ గట్టుకు రాజోలు, సోంపల్లిలో చేపట్టిన బెడ్‌పిచింగ్, రివిట్మెంట్ పనులు 90 శాతం జరిగాయి. నెలాఖరు నాటికి మిగతా పనులు పూర్తిచేస్తాం. ఒడ్డుకు శాశ్వత ప్రాతిపదికన పూర్తి రక్షణ ఏర్పడుతుంది. విస్తరణకు నిధులు మంజూరైతే పనులు చేపడతాం. - టీఎల్ఎన్ మూర్తి, ఏఈఈ

ఖాళీ స్థలం.. సేంద్రియ ఫలం..!

ఈనాడు, కాకినాడ : కొన్ని నెలల కిందట తుప్పలు, డొంకలతో చిట్టడవిని తలపించేలా ఉన్న అబ్కారీ స్థలాలు నేడు పూల మొక్కలు, కూరగాయల తోటలతో పచ్చదనం సంతరించుకున్నాయి. ఉమ్మడి జిల్లాలోని సామర్లకోట, వాళ్లపు ఎక్సైజ్ డిపోల్లో నిరుపయోగ స్థలాల్లో చేపడుతున్న సేంద్రియ సేద్యం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

అబ్కారీశాఖ ఖాళీ స్థలాల్లో కూరగాయల సాగు

సామర్లకోట మద్యం డిపోలోని స్థలంలో కూరగాయల సాగు ఇలా..

పోషకాలపై అవగాహనతోనే

సామర్లకోట, వాళ్లపు మద్యం డిపోల్లో గోదాముల వినియోగం తర్వాత రెండు, మూడు ఎకరాల వరకు ఖాళీ భూములున్నాయి. అవన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. వాటిని పరిశీలించి వాటిలో మొక్కలు పెంచితే బాగుంటుందని ఉప కమిషనర్ చైతన్య మురళి ఆలోచన చేశారు. సిబ్బంది, హమాలీలకు పోషక పంటలపై అవగాహన కల్పించారు. దీంతో ఆ భూముల స్వరూపం మారిపోయింది. ట్రాక్టర్లు పెట్టి దున్నించారు. సేంద్రియ ఎరువులతో రకరకాల కూరగాయలు, ఆకుకూరలు పండించి ప్రకృతి సాగులో మమేకం అవుతున్నారు.

● పాలకూర, కొత్తిమీర, తోటకూర, పచ్చిమిరప, వంగ, మునగ, అరటి, ఆనబ ఇలా అన్ని రకాల కూరగాయలను చిన్నచిన్న మడులుగా చేసి పండిస్తున్నారు.

పండిస్తే లాభం.. తింటే ఆరోగ్యం..

● సామర్లకోట డిపోలో ఇప్పుడు ప్రతిరోజు 10 నుంచి 15 కిలోల వంకాయలు పండుతున్నాయి.

● అరటి గెలలతో చెట్లు నిండుగా ఉన్నాయి. ఆకు కూరలు రోజూ 15 నుంచి 20 కట్టలు తెంచుతున్నారు.

● టమాటా అయితే రోజూ కిలోలు దిగుబడి వస్తుంది. అక్కడ పనిచేసే సిబ్బంది రోజువారీగా వంటకు వాడుకుంటున్నారు. వారికి కూరగాయల ఖర్చు మిగులుతుంది.

'కాకినాడలోని మా కార్యాలయం ఎదుట చిన్న స్థలంలో పది రకాల సాగుచేసి వాటితో అక్కడే వండించి తింటున్నాం. అక్కడ పనిచేసే వంటలు చూపించి ఆరోగ్యంపై అవగాహన కల్పించాకే డిపోల్లో సాగుకు ముందుకు వచ్చారు. చక్కగా పంటలు పండిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో చొల్లంగి వద్ద గురుకుల పాఠశాలలోని రెండు ఎకరాల ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేస్తున్నాం.' అని డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి అన్నారు.

ఆటంకాలు లేకుండా.. సరఫరా ఆగకుండా..

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ప్రస్తుతం ఎండలు మొదలయ్యాయి.. విద్యుత్తు వినియోగం అంతకంతకూ పెరుగుతోంది.. ఇప్పటివరకు జిల్లాలో రోజుకు 6 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం ఉండగా, గత రెండు రోజుల నుంచి 6.95 మి.యూ.కు చేరింది. రానున్న మూడు నెలలూ మరింత పెరిగే అవకాశం ఉంది. గరిష్ఠంగా మేలో రోజువారీ వినియోగం 10 నుంచి 11 మిలియన్ యూనిట్లు ఉంటుందని విద్యుత్తుశాఖ అంచనా వేసింది. దీన్ని తట్టుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోంది.

విద్యుత్తు శాఖ వేసవి ప్రణాళిక

ఇదీ సన్నద్ధత..

● కాకినాడ నగరంలోని ఏటిమొగ, పిఠాపురంలోని కొత్త మనోహర్ నగర్, కాకినాడ గ్రామీణంలోని రాయుడుపాలెం, సామర్లకోట మండలం అచ్చంపేట, గండేపల్లి మండలం సింగరంపాలెంలో కొత్తగా 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాలను ప్రారంభించారు.

● ఒక్కో ఉపకేంద్రం పరిధిలో 10 వేల విద్యుత్తు కనెక్షన్లకు ఎటువంటి అంతరాయం లేకుండా సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశారు. ప్రత్తిపాడు మండలం శాంతి ఆశ్రమంలో కొత్త ఉప కేంద్రం పనులు ఈనెలాఖరుకు పూర్తి చేయనున్నారు.

డివిజన్	విద్యుత్తు కనెక్షన్లు
జగ్గంపేట	2,57,570
కాకినాడ	3,36,523
పెద్దాపురం	1,98,975

● 46చోట్ల 11కేవీ ఫీడర్లు అదనంగా ఏర్పాటు చేశారు. 35 చోట్ల విభజించారు. 14 చోట్ల 33/11కేవీ అంతర్గత లైన్లను ఏర్పాటు చేశారు. ఏడు చోట్ల 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 8ఎంవీఏకు పెంచారు. 201 చోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.

రూ.120 కోట్లతో అదనపు పరికరాలు

ఓవర్ లోడ్, లోఓల్టేజీ ఉన్న ప్రాంతాలను గుర్తించి, అదనపు సామర్థ్యంతో యంత్ర పరికరాలను ఏర్పాటు చేశారు. వేసవిలో కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట విద్యుత్తు డివిజన్ల పరిధిలో సరఫరాలో అంతరాయాలకు తావు లేకుండా రూ.120 కోట్ల వ్యయంతో విద్యుత్తు ఉపకేంద్రాలు, ఇతర సామగ్రిని అమర్చారు. నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు సన్నద్ధమయ్యారు.

పక్కాగా ప్రణాళిక అమలు

జిల్లాలో వేసవిలో విద్యుత్తు అంతరాయాలు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాం. ఇప్పటికే రూ.120 కోట్లు ఖర్చు చేసి, అదనపు సామర్థ్యాలను పెంచాం. వచ్చే నెల నుంచి అన్ని సెక్షన్లలోనూ కంట్రోల్ రూంలు నిర్వహిస్తాం. అధిక లోడ్ ఉన్న అన్ని ప్రాంతాల్లో అదనపు సామర్థ్యంలో యంత్ర పరికరాలను ఏర్పాటు చేశాం.
- జి.ప్రసాద్, పర్యవేక్షక ఇంజినీరు, ఈపీడీసీఎల్, కాకినాడ

ఐఐఎఫ్‌టీకి పూర్తి స్థాయిలో నిధులు విడుదల

పొన్నాడలో చివరి దశకు చేరుకున్న క్యాంపస్ నిర్మాణం

కొత్తపల్లి, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం పొన్నాడ పంచాయతీ శీలంవారిపాలెం సమీపంలో నిర్మిస్తున్న ఐఐఎఫ్‌టీ క్యాంపస్‌కు వంద శాతం నిధులు మంజూరయ్యాయని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. వైకాపా పాలనలో రాష్ట్ర వాటా నిధులు కేటాయించడంలో జాప్యం జరగడంతో ప్రాజెక్టు పనులు 10 శాతం కూడా కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో వేగవంతంగా నిర్మాణ పనులు జరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ నిధులు రూ.28.43 కోట్లు విడుదల చేసేందుకు అంగీకారం తెలిపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.57.10 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసిందన్నారు. దీంతో మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.221.81 కోట్ల విడుదలకు మార్గం సుగమం అయ్యిందన్నారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలో క్యాంపస్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నిధుల విడుదలకు సహకరించిన ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

కాకినాడ వేదికగా సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు సోమవారం నుంచి బుధవారం వరకూ కాకినాడ సూర్యకళా మందిరంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు తెలియజేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ సమావేశాల్లో దేశం, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చిస్తామన్నారు. రాష్ట్రంలోని మెడికల్ మాఫియా, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, మన గ్యాస్ మనహక్కు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాలు తదితర అంశాలపై నాయకులు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా పార్టీ సీనియర్ నాయకులు కె.నారాయణ, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తదితరులతోపాటు 26 జిల్లాల ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. సమావేశాల సందర్భంగా నగరంలోని కూడళ్లలో పార్టీ జెండాలతో తీర్చిదిద్దుతున్నారు. సూర్యకళామందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

కాకినాడ నగరంలో కూడళ్లను పార్టీ జెండాలతో అలంకరిస్తున్న కార్యకర్తలు

అభినయ యుక్తి.. అమ్మ శక్తి

దుర్గాడ శివాలయంలో ఆదివారం రాత్రి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నృత్యరూపక చిత్రమిది. శ్రీఉమారామలింగేశ్వర కోలాట భజన మండలి ఆధ్వర్యంలో ఇలా ఆకట్టుకున్నారు. చెరుకూరి ఆదిత్యశర్మ పర్యవేక్షణలో ప్రదర్శనలు కొనసాగాయి. గొల్లప్రోలు శివాలయం వద్ద కూడా పిల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో చిన్నారులు నృత్యంతో అలరించారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

ఎగిరి గంతేసేలా.. విజయం

ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో అరిగెల రంగయ్య జాతీయస్థాయి వాలీబాల్ బాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జీఎస్‌టీ(ముంబయి) జట్టు 3-2 స్కోరుతో ఎస్ఏఐ(కేరళ)పై గెలుపొందింది. అనంతరం ఇండియన్ బ్యాంకు(చెన్నై) జట్టు కర్ణాటక జట్టుతో తలపడింది. మహిళ విభాగంలో అల్ఫాన్సా(కేరళ), ఎస్‌సీఆర్ జట్ల మధ్య హోరాహోరీగా పోటీ సాగింది. -న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

'ఉచిత' ప్రవేశం.. అందుకో అవకాశం

ప్రైవేటు పాఠశాలల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను పేదలకు కేటాయించాలి. ఈ ఉచిత సీట్లు పొందిన పిల్లలకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడదల చేసింది. గత వైకాపా ప్రభుత్వంలో ఈ పథకాన్ని పూర్తిగా నీరుగార్చారు. సీట్లు పొందిన పిల్లలకు ఫీజులు చెల్లించకుండా అమ్మఒడి సాయం నుంచి ఇవ్వాలంటూ చెప్పింది. దీంతో తల్లిదండ్రులు ఇక్కట్లు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిని గాడిన పెట్టింది. ఆయా పాఠశాలలకు స్టార్ గ్రేడ్ల ఆధారంగా ఫీజులు ఖరారు చేసి పథకాన్ని సక్రమంగా అమలు చేస్తోంది.

ఎవరు అర్హులంటే..

ప్రధానంగా అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, దారిద్ర్య రేఖ దిగువున ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఓసీల్లోని అల్పాదాయ వర్గాలు ఈ ప్రవేశాలకు అర్హులు. వారికి ప్రాధాన్య క్రమంలో ఒకటో తరగతిలో సీట్లు కేటాయించి, పదో తరగతి వరకు ఉచిత విద్యనందిస్తారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ వంటి సెంట్రల్ సిలబస్‌ను బోధించే పాఠశాలల్లో చేరేందుకు 2020 ఏప్రిల్ 2 నుంచి 2021 మార్చి 31 మధ్య, రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో చేరేందుకు 2020 జూన్ 2 నుంచి 2021 మే 31 మధ్య పుట్టిన వారు అర్హులు.

నాలుగేళ్లలో ప్రవేశాలు పొందిన వారి సంఖ్య

2022-23	215
2023-24	1120
2024-25	2,102
2025-26	2,221

నమోదు ఇలా..

పిల్లల తల్లిదండ్రులు సమీపంలోని ప్రైవేటు పాఠశాలలకు www.cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 20 నుంచి మార్చి 10 లోపు దరఖాస్తు చేసుకోవాలి. అదే నెల 25న లాటరీ ద్వారా మొదటి విడత సీట్లు కేటాయిస్తారు. సందేహాలు, ఫిర్యాదులకు 1800-4258-599 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలి.

సద్వినియోగం చేసుకోవాలి..

విద్యా హక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేటు పాఠశాలలు ఉచిత ప్రవేశాలు కల్పించాలి. అర్హత గల పిల్లల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలి. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎటువంటి ఇబ్బందులున్నా సంబంధిత మండల విద్యాశాఖాధికారులను సంప్రదించాలి. - పిల్లి రమేష్, డీఈవో

(c) eenadu

ముగిసిన కోటి తులసి అర్చన

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో ఈనెల 6న ప్రారంభమైన కోటి తులసి పూజ ఘనంగా ముగిసింది. రోజూ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.30 గంటల వరకు తులసి పూజ, సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాదం నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం ఉదయం 8 గంటలకు ధన్వంతరీ హోమం, రుద్రహోమం ప్రారంభించారు. 11 గంటలకు అర్చకులు, పండితులు, పురోహితుల బృందం ఆధ్వర్యంలో పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ, దేవస్థానం ఛైర్మన్ ఐ.వి.రోహిత్, ఈవో వి.త్రినాథరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పుజలో పాల్గొన్న 62 మంది వైదిక బృందానికి దేవస్థానం తరపున సంభావన, ప్రశంసాపత్రాలు అందించారు. దాతల నుంచి సుమారు రూ.15 లక్షలు విరాళాలు అందాయని ఈవో త్రినాథరావు తెలిపారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రాకారం చుట్టూ రథ సేవ ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో 12 గంటలకు పరమేశ్వరుడికి అభిషేకం నిర్వహించారు.

పూర్ణాహుతి నిర్వహిస్తున్న వైదిక బృందం

భావనారాయణస్వామికి ప్రత్యేక పూజలు

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో మాఘమాస నాలుగో ఆదివారం తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తెల్లవారుజాము నుంచే నారద కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించి ఆవుపేడ పిడకలపై నైవేద్యం వండి సమర్పించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో తూము చైతన్యకృష్ణ(బన్ను) చేతుల మీదుగా సుమారు 30 వేలమంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సీఐ పెద్దిరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఆలయ ఈవో రాపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది, గ్రామ పెద్దలు, పారాయణ మండలి సభ్యులు, భక్తులకు అవసరమైన సేవలు అందించారు.

కుక్కుటేశ్వరస్వామి నిజరూప దర్శనం

పిఠాపురం: మహాశివరాత్రి సందర్భంగా పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి నిజరూప దర్శనభాగ్యం భక్తులకు ఆదివారం కల్పించారు. స్వామివారికి అభిషేకం, రాజరాజేశ్వరి, పురుహూతిక అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు అర్చకుడు దత్తప్రసన్నశర్మ ఆధ్వర్యంలో సదస్యం, పండితసభ జరిపారు. 8 గంటలకు లింగోద్భవ కాలాభిషేకం, పిఠాపురం మహారాజా గోత్రనామాలతో ఆయన తనయుడు రాజారావు వెంకటమహీపతి రామరత్నారావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ నందీశ్వరుడికి పూజలు చేశారు. స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా రథోత్సవం సోమవారం మధ్యాహ్నం ప్రారంభం కానుంది.

ఏలేరులో భక్తఝురి

ఏలేశ్వరం: మహాశివరాత్రి పర్వదినం ఏలేరు నదీతీరంలో జనతరంగాలు ఎగిసిపడ్డాయి. తెల్లారకుండానే జనం ఏలేశ్వరం సమీపంలోని అప్పనపాలెం వద్ద ఏలేరు చెంతకు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చిన భక్తజనం భక్తితో క్రమశిక్షణగా అప్పనపాలెం వంతెన వద్ద ఎటువైపు వారు అటువైపే స్నానమాచరించారు. ఏలేరుపై శిథిలమైన వంతెనపైకి జనం తాకిడి లేకుండా పోలీసు పహారా కాశారు. - న్యూస్‌టుడే, ఏలేశ్వరం

సత్యదేవుని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర అధికారి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామిని తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి.ఆనంద్ ఆదివారం దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం స్వామి దర్శనానికి వెళ్లిన ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

ఆనంద్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

పాడి రైతులకు క్రెడిట్ కార్డులు

పశుషోషణ, కొనుగోలుకు రుణాల మంజూరు

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: పాడిరంగంలో అధికమవుతున్న ఖర్చులు, కూలీల కొరతతో పాడి రంగంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో పాడి రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం పశుకిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. పాడి రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించి తద్వారా పశువులు, దాణాల కొనుగోలు, తదితర ఖర్చులకు అవసరమైన నిధులను రుణాల రూపంలో బ్యాంకుల ద్వారా సమకూర్చటానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

రూ.3 లక్షల వరకు రుణం

కార్డు ద్వారా గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు రుణం అందిస్తారు. రూ 1.60 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు అవసరం లేకుండా తీసుకున్న రుణాన్ని 40 రోజుల్లో చెల్లిస్తే వడ్డీ ఉండదు. అనంతరం 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోగా క్రమం తప్పకుండా తిరిగి చెల్లిస్తే ఆర్బీఐ, నాబార్డ్ 3 శాతం వడ్డీ మినహాయింపు ఇస్తాయి. సాధారణ క్రెడిట్ కార్డు మాదిరిగానూ వినియోగించుకోవచ్చు, ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు.

బ్యాంకుల్లో దరఖాస్తులు

పశుసంవర్ధక శాఖ గ్రామ సహాయకులు ఆయా బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అర్హులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు, పాస్ పుస్తకం ఇస్తారు. కేవైసీ కోసం భూమి దస్త్రాలు, పశువుల ఆరోగ్య ధ్రువపత్రం, పాస్ పోర్టు సైజు ఫోటోలు, ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డుల నకళ్లు పొందుపర్చాలి.



జిల్లాలో 1790 దరఖాస్తులు

పశు కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం గత ఆర్థిక సంవత్సరంలో కాకినాడ జిల్లా వ్యాప్తంగా 1790 దరఖాస్తులు రాగా వాటిలో 919 మందికి కార్డులు మంజూరు చేశారు. వీటిలో పలు దరఖాస్తులు పెండింగ్ దశలో ఉండగా కొన్ని తిరస్కరణకు గురయ్యాయి. ఇది నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పాడి రైతు కిసాన్ క్రెడిట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని పశుసంవర్ధక శాఖ జేడీ కృష్ణమూర్తి తెలిపారు.

జిల్లా సమాచారం..

ఆవులు	76,502
గేదెలు	2,82,273
గొర్రెలు	1,41,229
మేకలు	1,01,870
కోళ్లు	92,48,636

పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గం

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం సర్పవరం జంక్షన్‌లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్ 4వ తరగతి ఉద్యోగుల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జి.రత్నకుమార్ ఎన్నికల అధికారిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.రాజేష్‌ప్రభుకుమార్ పరిశీలకుడుగా ఎన్నికలు నిర్వహించారు. మూడేళ్లపాటు పదవీకాలం ఉండే కార్యవర్గానికి అధ్యక్షుడిగా పి.నాగబాబు, కార్యదర్శి డీఎస్‌వీ కిరణ్, అసోసియేట్ అధ్యక్షురాలిగా సీహెచ్ సువర్ణకుమారి, ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాస్, ఎం.కృష్ణశాస్త్రి, జాయింట్ సెక్రటరీగా ఎం.రాజశేఖర్, కోశాధికారిగా వి.సూరజ్, కోఆప్షన్ సభ్యుడిగా పి.రోహిత్‌లను ఎన్నుకున్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

జేఎన్‌టీయూకేలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

గాంధీనగర్, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: కాకినాడ జేఎన్‌టీయూకేలో వసతిగృహంలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. వర్సిటీలోని యూసీఈకే ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం పాలసింగికి చెందిన గిరిజన విద్యార్థిని అప్పుసూరి అరుణ(19) బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నాగావళి మహిళా హాస్టల్‌లో ఉంటోంది. ఆదివారం గదిలో నుంచి ఆమె బయటకు రాలేదు. తోటి విద్యార్థులు పలుమార్లు పిలిచినా లోపలి నుంచి స్పందన లేకపోవడంతో సమాచారం అందించారు. సాయంత్రం 5.30కు చీఫ్ వార్డెన్ నరేష్ ఘటనపై సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు హాస్టల్‌కు చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థిని మృతికి కారణాలు ఆరా తీస్తున్నారు. యువతి తండ్రి రాము భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ మూడేళ్ల కిందట తిరువనంతపురంలో ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందారు. తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. యువతికి తొమ్మిదో తరగతి చదువుతున్న తమ్ముడు ఉన్నాడు. ఇదిలా ఉండగా.. తన కుమార్తెను వేధిస్తున్నాడని అరుణ తల్లి సంధ్య గతేడాది సెప్టెంబరు నెలలో మెళియాపుట్టి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిపై ఫిర్యాదు చేశారు. దీనిపై టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మనస్తాపంతో పురుగుల మందు తాగిన యువకుడు శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొద్దిరోజులు చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఫార్మర్ రిజిస్ట్రీతో బహుళ ప్రయోజనాలు

● ఈనెలాఖరులోగా నమోదు పూర్తికి ఆదేశాలు

మీ కోసం

గండేపల్లి, న్యూస్‌టుడే: సొంత భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాలు అందేలా ప్రభుత్వాలు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేశాయి.

నమోదు ప్రక్రియ ఇలా..

ఈ ఫార్మర్ రిజిస్ట్రీని ఆర్బీకే లేదా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేస్తారు. ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, భూవివరాలు నమోదు చేసి ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా సహాయకులు సంపూర్ణం చేస్తారు. నమోదయ్యాక రైతుకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తోంది.

ప్రయోజనాలివీ..

విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పెట్టుబడి సాయం, ఎరువులు/ వ్యవసాయ యంత్రాల రాయితీ, పంటల బీమా, పంట దిగుబడుల విక్రయాలు, పంట రుణాలు తదితరాలు పొందొచ్చు.

28వ తేదీతో నమోదు పూర్తి..

గత కొన్నాళ్లుగా నమోదు ప్రక్రియ జరుగుతోంది. గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన రైతుల సేకరిస్తున్నాం. నెలాఖరుకు వందశాతం నమోదు పూర్తి చేస్తాం. - లక్ష్మి, వ్యవసాయ అధికారి, గండేపల్లి

కోటిపల్లి.. భక్తులు ప్రణమిల్లి

పామర్రు: గౌతమి నది తీరాన వెలిసిన పుణ్యక్షేత్రం కోటిపల్లి భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారి తీర్థపు బిందెను తీసుకెళ్లి అభిషేకించిన అనంతరం దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీతో ప్రత్యేకదర్శనం, సర్వదర్శనం క్యూలైన్లు నిండిపోయాయి. దర్శనానికి కనీసం మూడు గంటల సమయం పట్టింది. గోదావరి స్నానఘట్టాల్లోనూ జనాలతో నిండిపోయాయి. భక్తులు లోపలికి వెళ్లే మార్గంలో చాలా సేపు వేచి ఉండాల్సి వచ్చింది. గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. మూడు ప్రధాన స్నానఘట్టాల్లోనూ ఉషకు పోటెత్తిన భక్తులు సుమారు అరకిలోమీటరు నడిచి వెళ్లి స్నానాలు చేశారు. జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద, సేవా సంస్థలు, కుల సంఘీయులు అన్నదానం, పులిహోర ప్రసాద వితరణ చేశారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్, తోట త్రిమూర్తులు ఆదర్శమిత్ర మండలి, పైడా వారి సంస్థలు, శాలివాహన, విశ్వబ్రాహ్మణ, కాకతీయ, బ్రాహ్మణ, వైశ్య సంఘాలు, సత్యసాయి సేవాసంస్థలు సేవల్లో పాలుపంచుకున్నాయి. కె.గంగవరం కూడలిలో మనగంగవరం సేవా సంస్థ మజ్జిగ పంపిణీ చేసింది.

మారేడుమిల్లిలో ఓ ఇంటి ముందు ఆరబెట్టిన రబ్బరు

ప్రగతి వేదిక పారిశ్రామిక వీచిక

● వీఈఆర్ పరిధిలోకి ఉమ్మడి తూర్పు

ఈనాడు, రాజమహేంద్రవరం: విశాఖ ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్) పరిధిలోకి తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పోలవరం జిల్లాలను చేర్చుతూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ ప్రాంతం ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చినట్లయింది. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న ఈ రీజియన్‌లో ప్రధానంగా ఉత్పత్తి, సేవా రంగాలతోపాటు, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయం తదితర ఏడు అంశాలు గ్రోత్ డ్రైవర్స్‌గా వృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ఎక్కడ ఏ తరహా సేలందించాలన్న అంశంపై డీపీఆర్‌ల తయారీకి కన్సల్టెంట్ల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. దీని పరిధిలో 41 రకాల అత్యున్నత రంగాలకు చెందిన ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయి. కేంద్ర, ప్రైవేటు సంస్థల సహకారంతో వీటిని ఏర్పాటు చేస్తామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు.

ఇదీ ఉపయోగం

● తూర్పు గోదావరి జిల్లాలో మౌలిక వసతులు, ఉత్పత్తి, పర్యాటక రంగాలకు సంబంధించి అనేక వనరులున్నాయి. ప్రధానంగా రోడ్డు, రైలు, విమానయానం అందుబాటులో ఉంది. విమానాశ్రయ విస్తరణ నేపథ్యంలో మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి. ● కాకినాడ జిల్లా ఇప్పటికే పారిశ్రామిక పురోగతి, ఐటీ సంస్థలోపాటు ఆక్వా వ్యవసాయ రంగాల్లో దూసుకుపోతోంది. పోర్టు ప్రధాన ఆదాయ వనరుగా మారుతోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌గా ఈ నగరం ఎంపికైన నేపథ్యంలో పట్టణీకరణ శివారు ప్రాంతాలకూ శరవేగంగా విస్తరిస్తోంది. కొత్త ప్రాజెక్టులు వస్తే అందుకు తగిన వసతులు కల్పించేందుకు ఇక్కడ అపార వనరులున్నాయి. ● డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పర్యాటకం, వ్యవసాయం, ఉద్యాన రంగాల ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం. కొబ్బరిలో అంతర పంటగా కోకో, గడ్డి పెంపకం చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఆక్వా, పీత పిల్లల తయారీ కేంద్రం ఏర్పాటుతో మత్స్యకార రంగం అభివృద్ధికి అవకాశాలున్నాయి. ● పోలవరం జిల్లాలో ఆహార ఉత్పత్తులు, సేవా రంగం ఆధారిత పరిశ్రమలకు అవకాశాలున్నాయి. ప్రధానంగా మారేడుమిల్లి పర్యాటకంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడ అంతర్జాతీయ స్థాయి రిసార్ట్‌లు, విడిది కేంద్రాలు వచ్చే అవకాశాలున్నాయి. రబ్బరు తయారీ, అరకు కాఫీ తోటల పెంపకం, జీలుగు నుంచి బెల్లం తయారీ, జీడిపప్పు ప్రాసెసింగ్ తదితర రంగాలు ఇప్పటికే అక్కడ కొనసాగుతున్నాయి. వీటి నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు తీసే యూనిట్లు వస్తే మరింత మెరుగైన జీవన ప్రమాణాలు పెరగడంతోపాటు, జిల్లా ఆర్థిక వృద్ధికి తోడ్పాటునిస్తుంది.

నేటి నుంచి సహకార సంఘ ఉద్యోగుల సమ్మె

రామచంద్రపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక రాష్ట్ర వ్యాప్త సమ్మెకు సహకార సంఘాల ఉద్యోగులు సిద్ధమయ్యారు. రాష్ట్రంలోని సహకార సంఘాల్లో కార్యకలాపాలకు ఆటంకం కలగనుంది. సంఘ పూర్వ రాష్ట్ర నాయకుడు వెంకే సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గత 18 నెలలుగా ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు కోరినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. రాష్ట్ర జేఏసీ నిర్ణయం మేరకు గత 2 నెలలుగా డీసీవో కార్యాలయాల వద్ద, డీసీసీబీల వద్ద ధర్నాలు చేస్తూ నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించారన్నారు. రాష్ట్రంలో 2,060 ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులు 9 వేల మంది ఉద్యోగులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినప్పటికీ స్పందించక పోవడంతో సమ్మెలో దిగుతున్నామన్నారు. ఈ నెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార సంఘ ఉద్యోగులతో కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేసినప్పటికి ప్రభుత్వంలో చలనం లేదన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు ఉద్యోగులు సమ్మెకు వెళ్తున్నట్లు ఆయన వెల్లడించారు.

అన్నప్రసాదం విస్తర్లపై అన్యమత ప్రచారం

● తంటికొండ ఆలయ సిబ్బందిని నిలదీసిన భక్తులు
● ఆలస్యంగా వెలుగుచూసిన వైనం..

గోకవరం, న్యూస్‌టుడే: వేంకటేశ్వరస్వామివారి అన్నసమారాధనలో అన్యమత ప్రచారానికి సంబంధించిన విస్తర్లు వినియోగించడంపై భక్తులు మండిపడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించిన వివరాలివీ.. తంటికొండ గ్రామంలో వెంకటగిరిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని దర్శించుకునేందుకు ప్రతి శనివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు దేవస్థానం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తారు. శనివారం నిర్వహించిన అన్నసమారాధనలో ఉపయోగించిన విస్తర్లను చూసి భక్తులు ఖంగుతిన్నారు. ఎందుకంటే ఆ విస్తర్లపై ఆంగ్ల అక్షరాలతో మేరీ క్రిస్మస్ అని రాసి ఉంది. అన్యమతానికి సంబంధించి విస్తర్లను దేవస్థానాలలో అన్నసమారాధనకు ఏవిధంగా ఉపయోగిస్తారంటూ అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీశారు. గతంలోను ఇదేవిధంగా ఆకులను వినియోగించిన సంఘటనను గుర్తు చేశారు. మీ నిర్లక్ష్యం కారణంగా దేవస్థానం ప్రతిష్ఠ దెబ్బతింటుందని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఈవో అక్కడకు చేరుకొని విస్తర్లను తొలగించారు. వంట గదిలో ఉన్న మిగిలిన విస్తర్లను ధ్వంసం చేయాలని పట్టుబట్టడంతో కొంత వివాదం నెలకొంది. దీనిపై దేవస్థానం ఛైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొరను వివరణ కోరగా పొరపాటున వచ్చిన ఆ విస్తర్లను వెంటనే తొలగిస్తామన్నారు. ఈ విధమైన సంఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామన్నారు.


తంటికొండ దేవస్థానంలో వినియోగించిన అన్యమత ప్రచార విస్తర్లు

AUTO

VEHICLES FOR SALE

శ్రీ లలిత రైస్‌మిల్, పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీ సాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆ రోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 9493338823.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలు లోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో మార్టిగేజ్/ టేకోవర్ లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. ★ నో సిబిల్/ నో బ్రోకర్స్. ★ MSR గ్రూప్, వైజాగ్. Ph: 9121314141.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు. రాజమండ్రి 'శ్రీ సాయిలక్ష్మి లాడ్జ్' SVG మార్కెట్ రోడ్, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతీనెల 3, 17 తేదీల్లో మందులు కలవు.

EENADU e Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJANAGARAM

ఓనర్ డైరెక్ట్‌గా అమ్మే, రెసిడెన్షియల్ ప్లాట్లు రాజానగరం మండల ఆఫీస్ వెనుక, డిటిసిపి అప్రూవ్ లేఅవుట్‌లో స్థలాలు అమ్మబడును. Cell: 96668 94019, 93980 83034.

GENERAL

ఖాళీస్థలం అమ్మకం. పెద్దాపురం పట్టణం TTD కళ్యాణమండపం రోడ్ వరహాలయ్యపేటలో 192 చ॥గ॥ స్థలం అమ్మకం. ✆ 8328310691, 9177311445

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. MS ఆఫీస్, టైపింగ్‌లో పరిజ్ఞానం, పూర్తి వివరాలతో ఈనెల 16 నుండి 21 లోపు (10 am to 4 pm) సంప్రదించండి. సాగర్ కాంప్లెక్స్, సెవెన్ హిల్స్ రోడ్, సాంబమూర్తినగర్ 5వ వీధి, కాకినాడ-1, ✆ 92472 55155, 94928 02345.

Accountant & Receptionist (F) రియల్ ఎస్టేట్ కంపెనీలో చేయుటకు అనుభవం గలవారు కావలెను. జీతం:10 - 15 వేలు. ✆ 93924 41891.

స్త్రీ అభ్యర్థిని (40 సం॥లోపు) హిందువు మాత్రమే. విజయవాడలో ఇంటిలోనే ఉంటూ ఇంట్లోపని, 1 వెజిటేరియన్‌కు వంట చేయుటకు కావలెను. ✆ 92472 88381.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ డీఎస్ఏలో నిర్వహించిన అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఆదివారం ఫైనల్స్ ఉత్సాహంగా జరిగాయి. రొనాల్డో జట్టు విజేతగా నిలిచింది. భాటియా జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. గత రెండు నెలలుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో ప్రతి ఆదివారం మూడు మ్యాచ్‌లు చొప్పున జరిగాయని నిర్వాహకులు తెలిపారు. బహుమతి ప్రదానోత్సవానికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అధ్యక్షుడు తలాటం హరీష్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్, ఫుట్‌బాల్ కోచ్ స్వామి హాజరై క్రీడాకారులకు పతకాలు, కప్‌లను అందజేశారు. సత్తిరాజు, కృష్ణబాబు, ఫుట్‌బాల్ క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, సంఘ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజేత రొనాల్డో జట్టుకు కప్ అందిస్తున్న ముఖ్యఅతిథులు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,500
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

ఆర్ఎస్‌బీ హాకీ జట్టుకు కోచ్, కెప్టెన్‌గా కాకినాడ వాసులు

ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకూ న్యూదిల్లీలో జరగనున్న ఆల్‌ఇండియా హాకీ సివిల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆర్ఎస్‌బీ జట్టు కోచ్‌గా కడియాల రవిచంద్రప్రసాద్, కెప్టెన్‌గా ఎన్.వీరబాబు ఎంపికయ్యారు. వీరిద్దరూ కాకినాడ వాసులే కావడం విశేషం. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

రాజానగరం: అనుమానాస్పదంగా తన కుమారుడు మృతి చెందాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజానగరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. జి.యర్రంపాలెంనకు చెందిన వీరలక్ష్మి, రమేష్ దంపతుల కుమారుడు కాలా ఇస్సాక్ అలియాస్ అశోక్ (21) మెకానిక్‌గా పని చేస్తున్నాడు. వీరలక్ష్మికి తన భర్తతో మనస్పర్థలు రావడంతో కుమారుడు అశోక్‌తో కలసి అదే గ్రామంలో ఉంటున్న తన సోదరి ఇంట్లో నివాసం ఉంటూ వంట, వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పనికి వెళ్లిన వీరలక్ష్మికి తన సోదరి నుంచి ఫోన్ రావడంతో ఇంటికి వెళ్లారు. అప్పటికే నేలపై పడి ఉన్న కుమారుడుని చూసి సోదరిని వివరం అడగగా.. శివరాత్రి సందర్భంగా స్నానానికి వెళ్లేందుకు ఇంట్లో ఉన్న అశోక్‌కు ఫోన్ చేయగా.. తీయలేదని, కిటికీలోంచి చూడగా ఇంటి దూలానికి ఉరి వేసుకుని కనిపించాడని చెప్పినట్లు వీరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

సమయానికి అంబులెన్స్ వచ్చిఉంటే.. ఒక్క ప్రాణమైనా దక్కేది

సర్పవరం, న్యూస్‌టుడే: ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చని వైద్యులు చెబుతుంటారు. ఇందుకోసమే ప్రభుత్వం 108 ఉచిత అంబులెన్స్ సర్వీసులు ఏర్పాటు చేసింది. అంబులెన్సుల కొరత, ఉన్నవి కొన్ని మరమ్మతులకు నోచుకోకపోవడం తదితర కారణాలతో క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించడంలో ఆలస్యమై ప్రాణాలు పోతున్న ఘటనలు నెలకొంటున్నాయి.

● కాకినాడ గ్రామీణం సర్పవరం పరిధిలో నిర్మాణంలో ఉన్న బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి టిప్పర్ కారును ఢీకొట్టిన ప్రమాదంలో విశాఖకు చెందిన మహిళలు సుంకర వెంకట పద్మావతి, కొల్లు దీప్తి మృతిచెందిన విషయం తెలిసిందే. ఘటనలో దీప్తి వెంటనే ప్రాణాలు కోల్పోగా.. వెంకట పద్మావతి కొద్దిసేపు విలవిల్లాడి చనిపోయారు. తక్షణం స్థానికులు 108 అంబులెన్స్‌కోసం ఫోన్ చేశారు. సిబ్బంది వేరే కేసులో గాయపడిన వ్యక్తిని కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తున్నారని, అంబులెన్స్ లేకపోతే తామేం చేస్తామని చేతులెత్తేశారు. దాంతో ఫోన్ చేసినవారు కాకినాడ జిల్లాలో 23 అంబులెన్స్‌లున్నా.. ఎన్ని పనిచేస్తున్నాయో తెలియని పరిస్థితులున్నాయని వాపోయారు. ఘటనాస్థలానికి రెండుమూడు కిలోమీటర్ల దూరంలో మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉంది. వెంటనే అంబులెన్స్ వచ్చిఉంటే ఒక్క ప్రాణమైనా నిలిచే అవకాశం ఉండేదని వారన్నారు.

సర్పవరం వద్ద నిర్మాణంలో ఉన్న బైపాస్ రోడ్డు మూసివేత

తాత్కాలికంగా దారి మూసివేత

ప్రమాదం నేపథ్యంలో జాతీయ రహదారి-216 అధికారులు నిర్మాణంలో ఉన్న కాకినాడ బైపాస్ రహదారిని సర్పవరం గ్రామం వద్ద ఆదివారం తాత్కాలికంగా మూసి వేశారు. రహదారికి అడ్డంగా నిర్మాణ సామగ్రి ఉంచడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. సర్పవరం-మాధవపట్నం మధ్యలోని బైపాస్ రోడ్డులో రైల్వేవంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో వాహనదారులు పుంత దారి మీదుగా సర్పవరం భావనారాయణస్వామి ఆలయ ప్రాంతం ద్వారా మాధవపట్నం చేరుకుంటున్నారు. ఎక్కువగా టిప్పర్‌లు మితిమీరిన వేగంతోపాటు ఓవర్ లోడ్‌తో పోతుండడంతో ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని సర్పవరం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి మూసివేతతో ట్రాఫిక్ సమస్యతోపాటు ఇబ్బందులు తప్పాయని పేర్కొన్నారు.

(c) eenadu

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట- 10, 13, వంకాయలు- 24, 26, 30, 34, బెండకాయలు- 36, పచ్చిమిర్చి- 46, 54, 60, కాకరకాయ- 50, బీర- 35, 40, క్యాలీఫ్లవర్- 15, 20, క్యాబేజీ- 18, క్యారెట్- 26, దొండకాయలు- 46, 50, బంగాళాదుంపలు- 16, 20, ఉల్లి- 18, 26, దోసకాయలు- 30, చిక్కుడు- 20, చేమదుంపలు- 30, బీట్‌రూట్- 26, కీరదోస- 44, బీన్స్‌కాయలు- 60, అల్లం- 70, క్యాప్సికం- 60, బొబ్బర్లు- 24, చిలకడదుంపలు- 36, ఒకటి పొట్లకాయ ఆనపకాయ- 15, 20, పొట్లకాయ- 25, 28, అరటికాయ- 6, 8, మునగకాడ- 12, 15, మామిడికాయ- 15, 20, నిమ్మకాయలు(డజన్) - 30, 36.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4(స్క్రీన్- ఆనంద్ రీజెన్సీ- కపుల్ ఫ్రెండ్లీ, పంకీ, వితిలవ్, మన శంకరవరప్రసాద్ గారు, దేవీ మల్టీప్లెక్స్ 4(స్క్రీన్- కపుల్ ఫ్రెండ్లీ, పంకీ, చాదాపప్పు, పంకీ, విత్ లవ్, లక్ష్మీ- పంకీ, సత్యగౌరి- కపుల్ ఫ్రెండ్లీ, తిరుమల- మన శంకరవరప్రసాద్ గారు, సిలంద్ 1- పంకీ, సిలంద్ 2- నారీనారీ నడుమ మురారి, శ్రీప్రియ - అరెంజ్(ఉమ), అనగనగా ఒకరాజు, పద్మప్రియ- పంకీ, సూర్య1(వాకలపూడి) - పంకీ, సూర్య 2- సీతాపయనం.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ 10 - మ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

వెలగని వీధిదీపం

మసీదుసెంటర్: కాకినాడ వెంకట్‌నగర్ ప్రధాన రహదారిపై వీధి దీపం వెలగకపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. కూడలి ప్రాంతం కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దాంతో ఆ రహదారి గుండా రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

చెత్తాచెదారాన్ని తొలగించరూ..

మసీదు సెంటర్ (కాకినాడ): నగరంలోని పలు రహదారుల పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కాకినాడ, అయోధ్యనగర్‌లోని ఓ వీధిలో వ్యర్థాలు తొలగించకపోవడంతో అధ్వానంగా దర్శనమిస్తోంది. గత కొన్ని రోజులుగా ఇలాగే ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు.

రామారావుపేటలో విశ్వేశ్వరస్వామికి అభిషేకం

పెద్ద శివాలయంలో భీమేశ్వరస్వామి

బంగారు చీరలో బాలాత్రిపురసుందరి

రామారావుపేటలో అష్టాదశ శివలింగాలు

పెద్ద శివాలయంలో క్యూలైన్లలో భక్తజనం

హరోం హర... శంభో శంకరా

మహాశివరాత్రికి కిక్కిరిసిన ఆలయాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: హరహర మహాదేవ.. శంభో శంకరా అంటూ భక్తజనం పరమేశుడిని ఆర్తితో అర్చించారు. మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని శివాలయాలను తెల్లవారు జామునుంచే భక్తులంతా ఆలయాల్లో స్వామివారికి అభిషేకించేందుకు తరలివచ్చారు. పురాతన పెద్ద శివాలయంలో క్యూలైన్లు నిండిపోయాయి. స్వామివారికి లక్షపత్రి పూజ, అమ్మవారికి కుంకుమార్చన జరిగాయి. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ద్వాదశ శివలింగాలను భక్తులు దర్శించుకుని తరించారు. భానులింగేశ్వరస్వామి ఆలయానికి భారీగా భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు రోడ్డు మీదకు చేరాయి. సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు బంగారు చీరలో దర్శనమివ్వగా, రామలింగేశ్వరస్వామి విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. గొడారిగుంట జర్నలిస్టు కాలనీలో శ్రీరమాసత్యదేవి, దాసాంజనేయ స్వామి మందిరంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. బాలాజీచెరువు సెంటర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయంలోని శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేకించుకుని భక్తిపారవశ్యం చెందారు. సాగరతీరంలోని ఆదికుంభేశ్వరస్వామి, జగన్నాథపురంలోని భీమేశ్వరస్వామి, సాంబమూర్తినగర్, శ్రీనగర్, భానుగుడి రిజర్వుపోలీస్‌లైన్ అయ్యప్పస్వామి తదితర ఆలయాల వద్ద విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం దుగ్గిరాల వారి వీధిలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీచంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా సాయంత్రం శివ పార్వతులను నగర వీధుల్లో ఊరేగించి, రాత్రి ఆలయం వద్ద కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం లింగోద్భవం, భస్మాభిషేకం జరిగాయి.

నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూజలు

దుగ్గిరాలవారి వీధిలో శివపార్వతుల కల్యాణం

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు అభినందనీయం

మసీదుసెంటర్, కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణుల జీవితాల్లో వెలుగులు నింపేలా 2026-27 వార్షిక బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయడంపై ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి వీవీఎస్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వృత్తిదారులకు విద్యుత్తు వినియోగం 200 యూనిట్ల వరకూ పూర్తి ఉచితం ఇచ్చి, 201 యూనిట్ నుంచి మాత్రమే బిల్లు వసూలు చేసేలా ఉత్తర్వులు సవరించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ సెలూన్లను నియంత్రించాలన్నారు.

నేడు ఎస్పీ పీజీఆర్ఎస్ రద్దు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఈనెల 16న రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ సెలవు ప్రకటించిన నేపథ్యంలో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ బిందుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కోరారు.

విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేయాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకేలోని ఇంజినీరింగ్ విద్యార్థిని ఉరి వేసుకుని హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కమిటీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి పారదర్శకమైన విచారణ జరపాలని కమిటీ ప్రతినిధులు పోలీసులను కోరారు. బాధ్యులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాలువ పారదు.. దుర్వాసన వీడదు

✦ ప్రధాన ప్రాంతాల్లో నిర్వహణపై నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

నగర పరిధిలో కాలువల నిర్వహణ రోజురోజుకూ తీసికట్టుగా మారుతోంది. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, చెదారం, పూడికలను సకాలంలో తొలగించకపోవడంతో పలు రకాల సమస్యలు ఎదరవుతున్నాయి. నీరు కిందకు పారే పరిస్థితి లేక కాలువల సమీపంలో నివసించే ప్రజలు దుర్వాసన, దోమల సమస్యలతో సతమతమవుతున్నారు. వర్షాకాల సమయంలో మాత్రమే ప్రత్యేక డ్రైవ్ పేరుతో కాలువల్లో పూడికలు తీయడం ఆనవాయితీగా మారింది. తరువాత చెత్తాచెదారం, ఇతర వ్యర్థాల తొలగింపునకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వార్డుల్లో అంతర్గత కాలువల్లో మాత్రమే కాస్త తొలగిస్తున్నారు. దీంతో పెద్ద కాలువల్లో పూడికలను జేసీబీల సాయంతో తీయాల్సి ఉంది. ఈ పనిని ఇంజినీరింగ్ విభాగం చేపట్టాల్సి ఉన్నా.. చర్యలు తీసుకోవడం లేదు.

ఆయా ప్రాంతాల్లో ఇవి..

● ఎల్‌బీ నగర్ నుంచి చీడీలపార మీదుగా గాంధీనగర్ హౌస్ ఆఫ్ ప్రేయర్ వద్ద ఉప్పుటేరులో కలిసే ప్రధాన కాలువ పూర్తిగా చెత్తా చెదారంతో నిండి ఉంది. గాంధీనగర్, రామారావుపేట, కొండయ్యపాలెం, ఎల్‌బీ నగర్ తదితర ప్రాంతాల్లోని చిన్నకాలువలన్నీ దీనిలోనే కలుస్తాయి. ఈ కాలువలో అనేక చోట్ల గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తారం పేరుకుపోవటంతో నీరు కిందకు దిగడం లేదు. ● పావురాల తూము నుంచి డెయిరీఫారం రాజీవ్ గృహకల్ప కాలనీ మీదుగా వెళ్లిన ప్రధాన కాలువ మరీ అధ్వానంగా ఉంది. వ్యర్థాలు పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది. అటు దోమలు, ఇటు దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. ● డెయిరీ ఫారం నుంచి దుమ్ములపేట అపార్టుమెంట్ల వరకు గల మరొక ప్రధాన కాలువ దుర్భరంగా ఉంది. దీనిపై పలు దుకాణాలు వెలిశాయి. దాంతో గ్లాసులు, ప్లాస్టిక్ సీసాలు, కవర్లు వంటి చెత్త పడేయడంతో మురుగు కిందకు దిగటం లేదు. ● ఆర్టీసీ బస్ స్టేషన్ నుంచి రేచర్లపేట, సాంబమూర్తినగర్ మీదుగా రెవెన్యూ కాలనీ వరకు వెళ్లే ప్రధాన కాలువ కూడా అధ్వానంగానే ఉంది.

గాంధీనగర్ మార్కెట్ సమీపాన చీడీలపార కాలువలో వ్యర్థాలు

చర్యలు తీసుకుంటాం..

ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల తొలగింపుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. కాలువల్లో వ్యర్థాలు, చెత్త వేయరాదని పదేపదే చెబుతున్నాం. ఇకపై కఠినంగా వ్యవహరిస్తాం. ఆక్రమణలు తొలగిస్తాం. దుకాణాల సమీపంలో పేరుకుపోయిన చెత్తకు వారినే బాధ్యుల్ని చేస్తాం.

- ఎన్‌వీవీ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి కమిషనర్, నగరపాలక సంస్థ, కాకినాడ

విజేతను అభినందిస్తున్న ఆర్టీసీ అధికారులు

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఈనెల 13, 14, 15 తేదీల్లో అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ డెడ్ లిఫ్ట్ పోటీలో కాకినాడ ఆర్టీసీ డిపో ఉద్యోగి మందపల్లి శ్రీనివాసరావు రెండు స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈయన వివిధ పోటీలో 99 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు, సహకార ఉద్యోగులు శ్రీనివాసరావును అభినందించారు.

ఆర్డీవో కార్యాలయంలో శిక్షణకు అసిస్టెంట్ కలెక్టర్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అసిస్టెంట్ కలెక్టర్ మనీషా సోమవారం నుంచి వారం రోజులపాటు రెవెన్యూ అంశాలపై కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో శిక్షణ పొందనున్నారు. అనంతరం వారం రోజులపాటు ఆమె ఇన్‌ఛార్జి ఆర్డీవోగా విధులు నిర్వహించనున్నారు. వివిధ అంశాలపై అధికారులు, సిబ్బందితో సమీక్షించనున్నారు.

అల్లుకున్న తీగలు..

కాకినాడ రామారావు పేటలోని ఓ వీధిలో విద్యుత్తు స్తంభానికి పిచ్చిమొక్కలు, తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కరెంటు పోతుందో, ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి వీచినపుడు తీగల రాపిడికి నిప్పురవ్వలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదు సెంటర్

ఆరోగ్యానికి పొగబెడుతున్నారు..

కాకినాడ గొడారిగుంట ప్రధాన రహదారి పక్కన చెత్త కుప్పకు నిప్పంటించడంతో దట్టమైన పొగ వ్యాపించింది. దాంతో ఆ ప్రాంతవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్తలో ఉంటే ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్స్ కారణంగా వచ్చే పొగతో తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదు సెంటర్

ఇటువైపు జాగ్రత్త సుమా..!

స్థానిక 43వ డివిజన్ ప్రతాప్‌నగర్‌లోని తోట నరసింహం పార్కు వద్ద కల్వర్టుపై వేసిన ఇనుప గ్రిల్ పాడై ప్రమాదభరితంగా మారింది. నాలుగు రోడ్ల కూడలి వద్ద కల్వర్టుపై వేసిన ఈ గ్రిల్ కిందకు కుంగిపోవడంతో వాహనచోదకులు, పాదచారులు రాత్రిపూట ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే మూడు, నాలుగు ప్రమాదాలు జరిగాయని, పాడైన గ్రిల్‌ను తొలగించి, కొత్తది వేయాలని స్థానికుడు కంభం గణేశ్ తదితరులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, బాలాజీచెరువు

మేం.. మారమంతే!

రవాణా నిబంధనలు కచ్చితంగా పాటించాలని అటు రవాణాశాఖ అధికారులు, ఇటు పోలీస్ శాఖ హెచ్చరికలు చేస్తున్నా కొందరు వాహన యజమానులు అవేమీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కాకినాడ ఆర్టీవో కార్యాలయం మీదుగా ఇలా రవాణా వాహనంపై ప్రజలను ఎక్కించుకుని ప్రమాదకరంగా వెళుతున్నారు. ఇలాంటి ప్రయాణాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని నగర వాసులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

సూక్ష్మ శివ లింగం...చిన్మయానందం

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడకు చెందిన సూక్ష్మ కళాఖండాల నిపుణుడు ఆరిపాక రమేష్‌బాబు పెన్సిల్ ముల్లుపై అతి సూక్ష్మ సుందరమైన శివలింగం తయారు చేశారు. దీంతో పాటు రాగి త్రిశూలం కూడా తయారు చేశాడు. ఈ కళాఖండాల ఎత్తు కేవలం 5మిల్లీ మీటర్లు మాత్రమే. శివలింగాన్ని స్పష్టంగా కనిపించాలంటే భూతద్దం ఉపయోగించాల్సిందే. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దీనిని రూపొందించినట్లు రమేష్‌బాబు పేర్కొన్నారు.


రమేష్‌బాబు

పెన్సిల్ ముల్లుపై శివలింగం

సముద్రతీరంలో పర్యాటకుల సందడి

సర్పవరం: కాకినాడ సముద్రతీరంలో ఆదివారం, శివరాత్రి సెలవు రావడంతో పెద్ద సంఖ్యలో పర్యాటకుల సందడి కనిపించింది. యువత ఎక్కువగా సముద్ర స్నానాలకు మక్కువ చూపారు. మెరైన్ సీఐ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, గజ ఈతగాళ్లు భద్రత చర్యలు చేపట్టారు.

నిత్యావసరాలు అందజేత

సర్పవరం: వాకలపూడి నివాసితుడు మోకా గౌతమ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని తల్లికి కాకినాడ రాయుడుపాలేనికి చెందిన స్టీఫెన్ ఆనంద్ ఆధ్వర్యంలో ఆదివారం బియ్యం, నిత్యావసరాలు, నగదు అందించారు. శ్రీనివాస్, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

పశువులను కట్టడి చేయరూ..

కాకినాడ రైస్ మార్కెట్ రోడ్డులో పశువుల సంచారంతో స్థానికులు, వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం రోడ్డు మధ్యలో సంచరిస్తూ అక్కడే తిష్ఠవేస్తున్నాయని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. ఇటీవల ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తూ పశువులను తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కట్టడి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

ఆ ముప్పు.. తల్లిదండ్రులదే తప్పు

ఇష్టారాజ్యంగా ద్విచక్రవాహనాలు నడుపుతున్న పిల్లలు

న్యూస్‌టుడే, మసీదు సెంటర్

చిన్నప్పుడే తమ పిల్లలు ద్విచక్రవాహనాలు నడుపుతున్నారంటూ తల్లిదండ్రులు సంబర పడిపోతుంటారు. కానీ వచ్చీరాని.. తెలిసీ తెలియని డ్రైవింగ్‌తో విన్యాసాలు చేస్తూ, వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇతర వాహనదారులకూ ఇక్కట్లు తెస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల పోలీసు తనిఖీల్లో మైనర్లే ఎక్కువ పట్టుబడుతున్నారు.

● గతేడాది పెద్దాపురం పరిధిలో ముగ్గురు మైనర్లు ద్విచక్రవాహనం నడుపుతూ వేగంగా వెళ్లడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరు బాలురు అక్కడికక్కడే మృతిచెందారు.

● ఇటీవల కాకినాడలో ముగ్గురు యువకులు ఒకే ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు.

45 రోజుల్లో 250 మంది..

ప్రధానంగా కళాశాలలు, విద్యాసంస్థల వద్ద ఎక్కువగా మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుపడుతున్నారు. ఏకంగా ముగ్గురు కలిసి ఒకే వాహనం వేగంగా వెళుతున్నారు. కాకినాడ డివిజన్‌లో గత ఏడాది సుమారు 550 మైనర్లను పట్టుకుని కేసులు నమోదు చేశారు. వారి తల్లిదండ్రులను పిలిచి ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఏడాది 45 రోజుల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి సుమారు 250 మందిని పట్టుకుని, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

మైనర్లకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కన్నవారే బాధ్యులు..

18 ఏళ్ల తర్వాతే ఎవరైనా డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి అర్హులు. ప్రస్తుతం హైస్కూల్‌కు కూడా పిల్లలు ద్విచక్రవాహనాలు వేసుకుని వస్తున్నారు. చిన్న వీధుల్లో కూడా అతివేగంతో వెళుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం తల్లిదండ్రులే అని పోలీసులు పేర్కొంటున్నారు. తనిఖీల్లో పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. జరిమానా విధించి, మరోసారి బండి ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. రెండోసారి దొరికితే తల్లిదండ్రులు, సంరక్షకులకు కూడా జైలు, జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్సు రద్దు అవుతుందని పోలీసుల స్పష్టం చేస్తున్నారు.

తనిఖీలు చేస్తున్నాం..

వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ మైనర్లు, వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు తరలించి జరిగే ప్రమాదాలు, చట్టపరమైన శిక్షలపై అవగాహన కల్పిస్తున్నాం. మరోసారి పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, ఇస్తే సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నాం. **- రమేష్, డి.రామారావు, సీఐలు, ట్రాఫిక్**

దయనీయం.. ఉద్యోగుల గృహ సముదాయం

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

పేరుకే ఉద్యోగుల గృహ సముదాయం.. లోపలికి అడుగు పెడితే అన్నీ సమస్యలే. కాకినాడ న్యూ పోర్టు రైల్వే సమీపంలోని సూర్యనారాయణపురానికి వెళ్లే రైల్వే గేటు రహదారిలో రైల్వే ఉద్యోగుల క్వార్టర్స్‌లో ఈ పరిస్థితి నెలకొంది. దీనికి వెళ్లేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. అందులో ఒక మార్గంలో ప్రహరీ శిథిలమైంది. రక్షణగా ఎలాంటి తలుపులు ఏర్పాటు చేయలేదు. చీకటి పడితే పరిసర ప్రాంతమంతా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారైంది. ఆ దారిలో ఎలాంటి వీధి దీపాలు లేవు. ఉన్నా వెలగవు. దీంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు.

శిథిలమైన కిటికీ స్లాబులు

చిట్టడవిని తలపిస్తున్న ప్రాంగణం

క్వార్టర్స్ ప్రాంగణమంతా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో చిట్టడవిని తలపిస్తోంది. క్వార్టర్స్‌కు వెళ్లే రహదారి ముళ్ల మొక్కలతో మూసుకుపోయాయి. అధికారులు కనీసం శుభ్రత చర్యలు చేపట్టడం లేదు. ప్రాంగణంలో పాములు సంచరిస్తుండడంతో అక్కడ నివసిస్తున్న వారు బయటకు రావాలంటే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక భవనాల పై భాగాన, బయటకు వైపు పిచ్చి మొక్కలు మొలిచి నాచుతో కళావిహీనంగా దర్శనమిస్తోంది. గతంలో పైపైన మరమ్మతులు చేసి వదిలేయడంతో పరిస్థితి యథాస్థితికి చేరుకుంది. కిటికీ స్లాబులు శిథిలమై ఇనుప ఊచలు బయటకు దర్శనమిస్తున్నాయి. తాగునీటి సంపు వద్ద బురదతో అపరిశుభ్రంగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని అక్కడి నివాసితులు కోరుతున్నారు.

రహదారి చెంత పెరిగిన ముళ్లపొదలు

శిథిలం.. ప్రయాణమెలా పదిలం

తాళ్లరేవు మండలం గాడిమొగ పరిధిలో మందార కాలువపై ఉన్న వంతెన పరిస్థితి అధ్వానంగా మారింది. బాబానగర్, గోపాలపురం, గాడిమొగ, రాంజీనగర్, పత్తిగొంది, పి.మల్లవరం, యానాం వెళ్లేందుకు అనుసంధానంగా వంతెనకు ఇరు వైపులా రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. అటుగా వెళ్లే వాహనాలు వంతెన అంచు నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అడుగు భాగంలో ఇనుప ఊచలు తుప్పుపట్టాయి. వంతెన గోడలు పెచ్చులూడుతున్నాయి. వంతెన నిర్మించాలని ఏడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

ప్రమాదకరంగా వంతెన అంచున వెళ్తున్న ట్రాక్టరు

(c) eenadu

శ్వేత శివలింగ దర్శనం

గొల్లప్రోలు: గొల్లప్రోలు గాంధీనగర్‌లోని శివద ర్శన్ భవనంలో శ్వేత శివలింగ దర్శనం ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. నగర పంచా యతీ ఛైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు, శ్రీరా మచంద్రమూర్తి జ్యోతి ప్రజ్వలనతో శివలింగ దర్శ నాన్ని ప్రారంభించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం గొల్లప్రోలు శాఖ నిర్వాహకురాలు చంద్రకళ మహాశివరాత్రి ప్రాము ఖ్యత గురించి భక్తులకు వివరించారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

సప్తాహ మహోత్సవాల పూజలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు శివాలయంలో ఉమారామలింగేశ్వర స్వామివారి వార్షికోత్సవ సప్తాహ మహోత్సవ పూజలు ఆది వారం రాత్రి వైభవంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, అన్నపూర్ణ దంపతులు కలశపూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 9న ప్రారంభ మైన మహోత్సవాలు సోమవారం ఉదయంతో ముగుస్తాయని ఆలయ కమిటీ ఛైర్మన్ గొల్లపల్లి పెదబాబి తెలిపారు.

పూజల్లో పెండెం దొరబాబు దంపతులు

బోలా శంకరా.. భక్త శుభంకరా..

పెనుపూడి: అలంకరణలో సంపర ఈక్షణముక్తేశ్వరస్వామి

గొల్లప్రోలు: దుర్గాడ శివాలయంలో అలంకరణ

తాళ్లరేవు కేశవపురంలో వీరేశ్వరుడికి అభిషేకాలు

పెద్దాపురం: శివాలయంలో భక్తులు



రమణయ్యపేట ప్రేమ పీఠంలో దీపోత్సవం

పిఠాపురం: పాదగయలో భక్తుల రద్దీ

మహాశివరాత్రి పర్వదినాన ఆదివారం శైవాలయాలు భక్తు లతో కిక్కిరిశాయి. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి శివలింగాలకు అభిషేకాలు నిర్వహించి తరించారు. అనంతరం ఎక్కడికక్కడ ఫలహార, అన్న ప్రసాదాలు స్వీకరించారు. స్వచ్ఛంద సంస్థలు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు ఎదురవ్వకుండా చర్యలు చేపట్టారు. వేడుక ఇలా వైభవంగా కనిపించింది. ✦ పిఠాపురం: పాదగయ క్షేత్రంలో స్వచ్ఛంద సంస్థల పాలు, మజ్జిగ, పులిహోర, భోజనం పంపిణీ చేశాయి. శ్రీపాద హిందూ ఆధ్యాత్మిక సమాజ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ జనార్దనాచార్యులు, కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు జయశ్రీ ఇతర దాతల ఆధ్వర్యంలో మాధవస్వామి కోనేరు వద్ద ప్రసాదం, పులిహోర అందించారు. సత్యసాయి మిత్రమండలి యువతకు అవగాహన శిబిరం నిర్వహిం చింది. డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం కొనసాగింది. కమిషనర్ కనకారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు కొనసా గాయి. ఈవో జగన్మోహన్‌శ్రీనివాస్, సీఐ శ్రీని వాస్ ఆధ్వర్యంలో కంట్రోల్ రూం నుంచి ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తుల రద్దీతో ట్రాఫిక్ స్తంభించి అన్ని దారులూ వాహనాలతో కిటకిటలాడాయి. మాజీ ఎమ్మెల్యే వర్మ, లక్ష్మీ దేవి దంపతులు, తనయుడు గిరీష్‌వర్మ, పాద గయ మాజీ ఛైర్మన్ కొండేపూడి ప్రకాష్, తెదేపా నేతలు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎమ్మెల్సీ పంతం నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి తదితరులు ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ✦ సామర్లకోట గ్రామీణం: ఉండూరు నాగ లింగేశ్వర, కాపవరం, జి.మేడపాడు, వేట్లపాలెం, పెద్దబ్రహ్మదేవం ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ✦ కిర్లంపూడి: కొత్తపల్లి, దేవీపట్నం శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. ✦ గొల్లప్రోలు: గొల్లప్రోలులో ఉమారామలింగేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. వాసవీక్లబ్ కపుల్స్ సభ్యులు గొల్లపూడి శిర్డీ సాయి ఆలయంలో మజ్జిగ వితరణ చేశారు. దుర్గాడ శివాలయంలో సదస్యం జరి గింది. చేబ్రోలు, తాటిపర్తి ఆలయాల్లో పూజలు జరిపించారు. ✦ పెద్దాపురం: పట్టణంలోని శివాలయంలో అధికారులు, సిబ్బంది, పాలకమండలి సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ✦ కరప: నడకుదురు, కరప, పెద్దాపుర ప్పాడు, పెనుగుదురు, అరట్లకట్ట ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ✦ రమణయ్యపేట: సర్పవరం భావనారాయణ సమేత నీలకంఠేశ్వరస్వామిని రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దర్శించుకున్నారు. తూరంగేశ్వరస్వామిని ఎమ్మెల్యే నానాజీ కుటుంబ సభ్యులతో దర్శించారు. రమణయ్యపేట ప్రేమ పీఠంలో దీపోత్సవం నిర్వ హించారు. శ్రీపీఠంలో స్వామి పరిపూర్ణానంద ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

పిఠాపురం: కుక్కుటేశ్వరుని సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే వర్మ

తూరంగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం నీలకంఠేశ్వరుడి సన్నిధిలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

నడకుదురులో బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరుడు

మంత్రి అభిషేకాలు

కాజులూరు: మండలంలోని కాజు లూరు, పెనుమళ్ల, కోలంకలోని శైవ క్షేత్రాలతోపాటు దుగ్గుదూరు, ఉప్పు మిల్లి, అయితపూడి, గొల్లపాలెంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషే కాలు నిర్వహించారు. గొల్లపాలెం శివాలయంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక పూజలు చేశారు. కాజులూరు శివాలయం వద్ద అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గొల్ల పాలెం ఎస్సై ఎం.మోహన్‌కు మార్ ఆధ్వర్యంలో మహిళా పోలీ సులు, సిబ్బంది ప్రత్యేక బందో బస్తు ఏర్పాటు చేశారు. కాజులూ రులో స్కౌట్, గైడ్స్ విద్యార్థులు సేవలు అందించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

గొల్లపాలెం శివాలయంలో మంత్రి సుభాష్

శిథిలం.. ప్రయాణమెలా పదిలం

ప్రమాదకరంగా అంచున వెళ్తున్న ట్రాక్టరు

అడుగు భాగంలో తుప్పు పట్టిన ఊచలు

తాళ్లరేవు మండలం గాడిమొగ పరిధిలో మందార కాలువపై ఉన్న వంతెన పరిస్థితి అధ్వానంగా మారింది. బాబానగర్, గోపాలపురం, గాడిమొగ, రాంజీన గర్, పత్తిగొంది, పి.మల్లవరం, యానాం వెళ్లేందుకు అనుసంధా నంగా వంతెనకు ఇరు వైపులా రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. అటుగా వెళ్లే వాహనాలు వంతెన అంచు నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అడుగు భాగంలో ఇనుప ఊచలు తుప్పుపట్టాయి. వంతెన గోడలు పెచ్చులూడుతు న్నాయి. వంతెన నిర్మించాలని ఏడు గ్రామాల ప్రజలు కోరుతు న్నారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

కరెంటు పోదు.. కష్టం కలగదు..

ఉప ముఖ్యమంత్రి చొరవతో విద్యుత్తు ఉపకేంద్రం

– న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురంలో రైల్వే గేటు అవతల కొన్నే ళ్లుగా విద్యుత్తు సమస్యలతో జనం ఇబ్బం దులు పడేవారు. శివారు ప్రాంతాల్లో నివాస గృహాలు, రైస్ మిల్లులు, ఇతర చిన్నపాటి పరిశ్ర మలు ఉన్నాయి. ఈ నేప థ్యంలో విద్యుత్తు కనెక్షన్ లకు సరిపడా సరఫరా లేక నిత్యం అంతరాయాలు ఏర్పడేవి. ముఖ్యంగా సరఫ రాలో హెచ్చుతగ్గులతో షార్ట్‌సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు కాలి పోయి ఆర్థికంగా నష్టపోయే వారు. ఇక వేసవిలో ఫ్యాన్లు తిరగక ఉక్కపో తతో చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోయేవారు. దాంతో జనం నుంచి విద్యుత్తు సమస్యలు పరి ష్కరించాలనే అర్జీలు వెల్లువెత్తేవి. కానీ గత పాలకులు ఎవరూ స్పందించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకున్నారు. కొత్తగా రైల్వేగేటు దాటిన తరువాత నివాసం ఉండే కాలనీలకు నిరంతర విద్యుత్తు సరఫరాకు చర్యలు చేపట్టారు. కొత్తగా ఉపకేంద్రం నిర్మించి నాలుగు నెలల కాలంలోనే అందుబాటులోకి తెచ్చారు. దాంతో స్థానికులు ఉపముఖ్యమంత్రి చొరవ తీసుకుని సౌకర్యం కల్పించారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూతనంగా నిర్మించిన ఉప కేంద్రం

వేసవిలో సమస్యలు ఉండవు

ఈ ఉపకేంద్రం నిర్మాణంతో పిఠాపురం లోని మోహన్‌నగర్, అయితేనగర్, టిడ్కోకా లనీ, కొత్తకొంపలు, ఏడు కాలువలు, గోర్స రోడ్డు, డ్రైవర్స్ కాలనీ ప్రాంతాలకు ఇకపై విద్యుత్తు సమస్యలు ఉండవు. ఇంత కాలం ఈ ప్రాంతాలకు అగ్రహారంలోని ఉపకేంద్రం నుంచి సరఫరా చేసేవారు. కనెక్షన్‌లు పెరిగిపోయి నిత్యం విద్యుత్తు షార్ట్‌స ర్క్యూట్‌లతో రోజుల తరబడి సమస్యలు ఉండేవి. ముఖ్యంగా ఈ ప్రాంతాలకు సరఫరా సక్రమంగా జరక్క మంచినీటి సమస్యలు ఎదురయ్యేవి. ఇక వేసవిలో ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగం పెరిగి నియంత్రికలు కాలిపోతుండేవి.

అంతరాయాలకు చెక్

పట్టణంలోని ఉపకేంద్రంపై లోడ్ పెరిగి నిత్యం శివారు ప్రాంతాలకు విద్యుత్తు అంతరాయాలు ఏర్పడేవి. కొత్త కేంద్రం నాలుగు నెలల్లో నిర్మించాం. దీనివల్ల పట్టణంలో చాలావరకు ఉపశమనం కలుగుతుంది. వేస విలోనూ ఇబ్బందులు ఉండవు.

– ఆర్.శ్రీనివాస్, డీఈఈ

ఉప కేంద్ర నిర్మాణం ఇలా..

ఎక్కడ నిర్మించారు: టిడ్కో గృహాల వద్ద
నిర్మాణ వ్యయం: రూ.2.95 కోట్లు
సామర్థ్యం: 5 ఎంవీఏ
ఎన్ని సర్వీసులకు ఇవ్వొచ్చు: 9 వేలు

అక్కడ వెలుగు.. ఇక్కడ వెత..!

పిఠాపురంలో మహాశివరాత్రి సందర్భంగా పాద గయ క్షేత్రం చుట్టూ విద్యుత్తు దీపాలంకరణ చేశారు. కానీ పట్టణంలోని పలు వార్డుల్లో మాత్రం చీకట్లు కమ్ముకున్నాయి. వీధిదీపాలు మరమ్మతులకు నోచుకో వడం లేదు. కోటగుమ్మం నుంచి పెద్దబజారుకు వెళ్లే ప్రధానమార్గం ఆదివారం రాత్రి చీకటిగా మారి జనం ఇబ్బందిపడ్డా.. అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. – న్యూస్‌టుడే, పిఠాపురం

ప్రధాన మార్గం పరిశుభ్రం

స్పందనకు వందనం

గొల్లప్రోలు ప్రధాన రహదారిపై మురుగు చేరకుండా కాలువలో వ్యర్థాలు తొలగించే పనులను పారిశుద్ధ్య సిబ్బంది ఆదివారం నిర్వహించారు. ఈ నెల 14న 'ఈనాడు'లో ఈ సమస్యపై ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. ప్రధాన కాలువలో మురుగు నిల్వ కుండా పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ పనులు చేయిం చారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

నీటి వృథా.. నిర్లక్ష్యం ఆగదా..

గొల్లప్రోలులో రక్షిత నీటి పథకం పైపులైన్లకు పలు చోట్ల లీకేజీలు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. వీధి కుళాయిలకు మూతలులేక ఈ సమస్య నెలకొంది. దీంతో శివారు ప్రాంతాల ప్రజలకు కుళాయిల ద్వారా రక్షిత నీరు సక్రమంగా సరఫరాకాక ప్రజలు ఇబ్బందిప డుతున్నారు. సమస్య తెలుపగా చర్యలు చేపడతామని ఏఈ అలీషా తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పూడిక తొలగదు.. మురుగు కదలదు..

పిఠాపురంలోని నాలుగో వార్డు పరి ధిలో పలు మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. నెల రోజు లుగా పూడిక తొలగిం చక దుర్వాసన వస్తోంది. వాటిలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ సీసాలు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి దయనీయంగా మారుతోంది. నిల్వ నీటిలో దోమలు పెరిగిపోయాయి. కమిషనర్ కనకారావు కాలువలు శుభ్రం చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

బెర్ములు వేయక ఇబ్బందులు

వాకాడ ఎస్సీపేటలో సీసీరోడ్డు వేసి నెలలు గడు స్తున్నా రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్‌తో బెర్ములు వేయక పోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డు అంచుల వరకు వెళ్లి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారని ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఏఈ శైలజకు చెప్పగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: పండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రాంతంలోని మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. - రమేష్

పరిష్కారం: పంచాయతీ కార్య దర్శి వెంకటరత్నంకు చెప్పగా కార్మి కులతో శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, సర్పవరం

సమస్య: పొన్నాడ పంచా యతీ కోనపాపపేట ప్రధాన రహదారి వెంట చెత్తతో రాకపో కలకు ఇబ్బందిగాఉంది.

- ప్రయాణికులు

పరిష్కారం: డిప్యూటీ ఎంపీడీవో గోవిందరాజు సిబ్బందిని ఆదేశించి చెత్తను తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: గొల్లప్రోలు కమ్మరశాల వీధిలో రోడ్డు పక్కన చెత్త పేరుకు పోయి ప్రజలు ఇబ్బందిపడుతు న్నారు. - స్థానికులు

పరిష్కారం: పారిశుద్ధ్య పర్య వేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో చెత్తను తొలగింపజే శారు.

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: పిఠాపురంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెల గడం లేదు. శివరాత్రికి అంధకా రంగా ఉంచొద్దు. - కిషోర్

పరిష్కారం: కమిషనర్ కనకా రావు పట్టణంలో వెలగని దీపా లకు మరమ్మతులు చేయించారు.

- న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: అంకయ్యపేటలో రహదారిపై చెత్తపోగులున్నాయి. పురపాలిక అధికారులు చర్యలు తీసుకోవాలి. - సత్యనారాయణ

పరిష్కారం: పారిశుద్ధ్య అధి కారి ఆదినారాయణ కార్మికులను పంపి చెత్త తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, పెద్దాపురం

ముదిమి.. మురిసింది

– న్యూస్‌టుడే, రమణయ్యపేట

అరవై ఏళ్లు దాటాయని మరిచి మరీ ఆరేళ్ల చిన్నారులయ్యారు. ఆటపా టల్లో రాణించి విజేతలయ్యారు. బహు మతులు, ప్రశంసాపత్రాలు అందుకుని కేరింతలు కొట్టారు. కాకినాడ బోట్‌క్లబ్ ఉద్యానంలో ఇటీవల జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బుద్ధ రాజు సత్యనారాయణరాజు, బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు ఇతర ప్రతినిధుల సహకారంతో వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజ న్‌లకు నిర్వహించిన క్యారమ్స్, పెయింటింగ్, డ్రాయింగ్, మ్యూజిక్, చిట్టికథలు, మట్టి పాత్రల తయారీ, పాటలు, నడక, నృత్యం తదితర పోటీల్లో నిర్వహించారు. 350 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. మళ్లీ ఇలా ఆడాలని ఉందంటూ పలువురు అభిప్రాయాలు పంచుకున్నారు.

చిన్నపిల్లల్లా మారిపోయాం

నాకు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ప్రాణం. నేర్చుకుని ఇప్ప టివరకు వందలు ప్రదర్శ నలు ఇచ్చా. అన్నిరకాల పాటలు పాడతా. కళాకౌముది అవార్డు అందుకున్నా. సింగర్, ఈవెంట్ ఆర్గనైజర్‌గా చేస్తున్నా. పాటల పోటీల్లో ద్వితీయ బహు మతి అందుకున్నా. ఈ పోటీలతో తిరిగి చిన్నపిల్లలైపోయాం. – ఆర్.జోగామణి, విశ్రాంత సీఈవో, కోఆపరేటివ్ శాఖ

మట్టి పాత్రల తయారీ

వ్యాయామంతో చలాకీగా..

వృద్ధాప్యంలో ఆరో గ్యంపై ఎక్కువ జాగ్ర త్తలు తీసుకోవాలి. విశ్రాంత ఉపాధ్యాయు డైన నా భర్త, నేను నిత్యం నడక వ్యాయామం చేస్తాం. మాకు నడకలో ప్రథమ, ద్వితీయ బహుమతులు వచ్చాయి. వర్షం వచ్చి బయటకు వెళ్లలేని పరిసితుల్లో కూడా ఇంటి మేడపైన తప్పనిసరిగా వ్యాయామం చేస్తాం. ప్రభుత్వం ఏటా ఇలాంటి పోటీలు నిర్వహించి వృద్ధుల్లో ఉత్సాహం నింపాలి.

– నిట్టల అన్నపూర్ణ, సూర్యనారాయణ

చిట్టి కథలు చెప్పా..



ఈ పోటీలు ఉత్సాహం కలిగించాయి. రోజు వారీ జీవన విధానం మర్చిపోయి అందరితో కలిసిమెలిసి సంతో షంగా గడిపాం. చిత్రలేఖనం, నృత్యంలో మొదటి, చిట్టికథల పోటీల్లో రెండో స్థానంలో నిలిచాం. ఆరోగ్య అవగాహన కల్పించడం బాగుంది. – వేదుల శ్రీకృష్ణఫణీంద్రయోగి, విశ్రాంత డ్రాయింగ్ టీచర్

నేడు

ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: సామర్ల కోట బుధవారం సంత వద్ద సెంటినరీ బాప్టిస్టు చర్చిలో సోమ వారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని పాస్టర్ మోజేస్‌కు మార్ తెలిపారు. కాకినాడ న్యూస్టార్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సేవలందిస్తారని, ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

పీజీఆర్ఎస్ రద్దు

పిఠాపురం: పిఠా పురం పాడా కార్యాలయంలో ప్రతి వారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం ఈ సోమవారం రద్దు చేసినట్లు పీడీ శ్రీనివాసరావు తెలి పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు కార్యాల యానికి రావద్దని కోరారు.

విభూది పండ్లతో ప్రదర్శన

గొల్లప్రోలు: గొల్లప్రోలులో కొంతం ఆదిభ వానీ ఆధ్వర్యంలో భక్తులు బోనాలు, విభూది పండ్లతో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఈబీసీకాలనీ నుంచి ప్రారం భమైన ఊరేగింపు ప్రధాన రహదారి, వివిధ వీధులగుండా సూరంపేట శివారు కొత్తకాలువ వరకు కొనసాగించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

పర్యాటకుల సందడి

సర్పవరం: కాకినాడ గ్రామీణం సూర్యారావు పేట వద్దనున్న సముద్రతీరంలో ఆదివారం, శివరాత్రి సెలవు రావడంతో పెద్ద సంఖ్యలో పర్యాటకుల సందడి కనిపిం చింది. ఆటపాటలతో కాలక్షేపం చేశారు. యువత ఎక్కువగా సముద్ర స్నానాలకు మక్కువ చూపారు. మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, గజ ఈతగాళ్లు భద్రత చర్యలు చేపట్టారు.

నిత్యావసరాల అందజేత

సర్పవరం: వాకలపూడి నివాసితుడు మోకా గౌతమ్ ఇటీవల రోడ్డు ప్రమా దంలో మృతి చెందగా అతని తల్లికి కాకినాడ రాయుడుపాలేనికి చెందిన స్టీఫెన్ ఆనంద్ ఆధ్వర్యంలో ఆదివారం బియ్యం, నిత్యావసరాలు, నగదు అందించారు. శ్రీనివాస్, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

పురపాలికలు కనక.. పారిశుద్ధ్యం పడక

– న్యూస్‌టుడే, పెద్దాపురం, సామర్లకోట

అభివృద్ధికి రూ.కోట్లు వ్యయం చేసినా పారిశుద్ధ్యం మెరుగుపడకపోతే నిధులు వృథా అయినట్లే. చెత్త నిర్వ హణకు, కార్మికుల జీతాలకు రూ.కోట్లు వ్యయం చేసినా పారిశుద్ధ్యం ఆశించినంత మెరుగుపడకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. నియోజకవర్గంలోని పెద్దాపురం, సామర్లకోట రెండు ద్వితీయ శ్రేణి పురపాలికల్లో 60 వార్డులు ఉండగా 1.20 లక్షల జనాభా నివసిస్తున్నారు. సిబ్బంది 190 మంది మాత్రమే ఉండడంతో రోజువారీ ఉత్పత్తి అయ్యే 56 మెట్రిక్ టన్నుల చెత్తను నిర్వహించలేక ఏటా సుమారు రూ.4 కోట్లు ఖర్చు చేస్తున్నా స్వచ్ఛత చేకూ రడం లేదు.

పెద్దాపురం తలుపులమ్మ కాలనీలో దారిపై చెత్త

రెండు పట్టణాల్లో అధ్వానంగా..

పెద్దాపురం పట్టణంలో ప్రధానంగా శివారు కాలనీలైన పాతపెద్దాపురం, ఒకటోవార్డు గుడివాడ ప్రాంతం, టిడ్కో, భాస్క ర్‌కాలనీలు, ఎన్టీఆర్, తలుపులమ్మ, గణేష్‌నగ ర్‌లు, యానాదులగూడెం, పద్మనాభకాలనీ ప్రాంతాల్లో ఇంకా పారిశుద్ధ్యం మెరుగుపడాలి. రాజమహేంద్రవరం-సామర్లకోట దారిలో బ్రషింగ్ చేయాలి. సామర్లకోట పట్టణంలో రాజీవ్ గృహకల్ప, అమ్మణ్ణమ్మ అపార్ట్‌మెంట్, అయోధ్యరామపురం, కోదండ రామపురం, ఇస్మాయిల్ నగర్, బలుసులపేటలపై అధికా రులు దృష్టిసారించాలి.

శివారుపై ప్రత్యేకంగా దృష్టి

ప్రతిరోజూ పట్టణంలో పారిశుద్ధ్య విభాగం ఏ విధంగా ఉందో వార్డులకు వెళ్లి పరిశీలిస్తున్నాం. చాలావరకు నిర్వహణ మెరుగుపడింది. శివారు కాలనీలపై ప్రత్యేకంగా దృష్టిపెడతాం. ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం. చెత్తను రహదారులపై, కాలువల్లో వేయకూడదు.

– శ్రీకాంత్‌రెడ్డి, శ్రీవిద్య, కమిషనర్లు

లస్కర్లు ఏరీ.. పొలాలెలా తడిచేదీ..

– న్యూస్‌టుడే, కరప

నీటి నిర్వహణ సాఫీగా సాగా లంటే వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లే కీలకం. సాగునీటి పారుదల శాఖలో కీలకమైన లస్కర్ల పోస్టులు కొంతకా లంగా భర్తీ అవ్వక నీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. లస్కర్ల కొరతతో కాలువలపై షట్టర్లు, తూముల నిర్వహణ సక్రమంగా జర గడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రధాన కాలువ, ఉప కాలువ, పంట కాలువ, క్రాస్ రెగ్యులేటర్లు ఇలా ప్రతి చోటా లస్కర్ల నిఘా, గస్తీ అవసరం. ఏటా రబీ సీజన్‌లో సాగునీటికోసం అన్నదాతలు ఆత్రుతగా ఎదురుచూ స్తుంటారు. క్షేత్ర స్థాయిలో కీలకమైన పోస్టులు భర్తీ అవ్వక ఇబ్బందులు తప్పడం లేదని రైతులంటు న్నారు. వాస్తవంగా ప్రతి 1,500 ఎకరాలకు ఒక లస్క రును నియమించాలి. ఉద్యోగ విరమ ణలతో ఈ పోస్టులు ఖాళీ అవు తుంటే.. తాత్కాలిక సిబ్బందిని నియ మించుకుంటున్నారు. వారికి సరైన అవగాహన లేకపోవడంతో గేట్లు(షట్టర్లు), తూముల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. కాలువ లపై కంప చెట్లు, తుంగ, పిచ్చిమొక్కలు పెరిగిపో వడం, పూడికతో నీటి ప్రవాహం తగ్గి చివరి ఆయకట్టు రైతులకు నీరందడం లేదు. రాత్రి వేళల్లో కాలువలపై పాములు, విషపురు గులు ఉంటాయి. బూట్లు, టార్చ్‌లైట్లు ఇతర మౌలిక వసతులు సమకూర్చకపోవడంతో తాత్కాలిక సిబ్బంది కూడా విధులు సరిగా నిర్వర్తించలేకపోతున్నారు.

కరప మండలం వాకాడలోని సంపర బోదె కాలువ ఇలా..

ఇవీ సమస్యలు..

- కరప మండలంలో సుమారు 14 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా మేజర్ హెడ్స్ 11 ఉన్నాయి. వీటి కింద పలు ఉప కాలువలు ఉన్నాయి. ముగ్గురు మాత్రమే సిబ్బంది ఉండగా 8 మందిని తాత్కాలికంగా నియమించారు.
- కాకినాడ గ్రామీణ మండ లంలో 4,200 ఎకరాల ఆయ కట్టు ఉండగా గోదావరి, పీబీసీ ఏలేరు కాలువలు ఉన్నాయి. పీబీసీకి లస్కరు ఉద్యోగ విరమణ పొందగా, గోదావరి కాలువకు ఒకరే విధులు చేపడుతున్నారు.

(c) eenadu

వీధి దీపాలు వెలిగాయి

సమస్య: శంఖవరం మండలంలో పెదమల్లాపురం గ్రామంలో పెద్ద వాటర్ ట్యాంకు సమీపంలో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయాల్లో ఇబ్బందిగా ఉంది.
– నాగేశ్వరరావు, స్థానికుడు

స్పందనకు పందనం

సమాధానం: సిబ్బందిని పంపించి సమస్య ఉన్నచోట్ల కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేశాం.
– రమణ, కార్యదర్శి, పెదమల్లాపురం. న్యూస్‌టుడే, శంఖవరం

మేమున్నాం.. మీకు తోడుగా
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066
ఉ॥ 10 - మ॥ 1

తుని
•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

మల్లవరంలో రథం ప్రారంభం

రథాన్ని లాగుతున్న భక్తులు

గోకవరం, న్యూస్‌టుడే: మల్లవరంలో గ్రామంలోని కొలువై ఉన్న శ్రీ ఉమామల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి గ్రామోత్సవ నిర్వహణకు భక్తుల సహకారంతో నూతన రథాన్ని చేయించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రథానికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి శివనామస్మరణతో ఈ రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఏటిపక్క ఊర్లు.. సాగునీటికి తప్పని పాట్లు

● గ్రోయిన్ నిర్మించాలని రైతుల వేడుకోలు

నీరు లేక ఎండిపోతున్న పొలాలు

కిర్లంపూడి, న్యూస్‌టుడే : కిర్లంపూడి మండలం రామచంద్రపురం, తామరాడ గ్రామాలను ఆనుకునే ఏలేరు ప్రధాన దిగువకు పారుతుంది. ఆ గ్రామాల మీదుగానే పిఠాపురం, పెద్దాపురం సెక్షన్ల పరిధిలోని వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. అయినా రామచంద్రపురం, తామరాడ గ్రామాల ఆయకట్టుకు చుక్కనీరు పారని తీరు. దీంతో ఇక్కడి రైతులు ప్రస్తుత రబీ పంటకు మోటార్లతో నీటిని తోడుకుని పంటలు వేసుకోవాల్సిన దుస్థితి. దీనికి ప్రధాన కారణం ఏలేరు ప్రధాన కాల్వలో ఇసుక తవ్వేస్తుండడంతో ప్రధాన కాలువ నాలుగైదు అడుగులు పైబడి గర్భంలోతై పంట కాలువ ఎత్తులో ఉండడంతో సాగునీరు పారడం లేదు. ఏలేరు ప్రధాన కాలువను ఆనుకుని ఉన్న ఈ గ్రామాల ఆయకట్టు పొలాలకు అసలు సాగునీరు పారకపోవడంతో గోనేడ, వీరవరం, పాలెం గ్రామాల ఆయకట్టుకు ఏలేరు ప్రధాన కాలువలో వాలంకలు వేసుకుంటేనే కొద్దాగొప్పో నీరు పారుతుంది. ఈ విధంగా సుమారు పదివేల ఎకరాల్లోని ఆయకట్టు రైతులు ఏటిఒడ్డునే ఉన్నప్పటికీ సాగునీటికి అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి ఏటిపట్టు గ్రామాలలో పంట కాలువలకు సాగునీరు పారేలా గోనేడ గ్రామశివారున ఏలేరు ప్రధాన కాలువపై గ్రోయిన్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. అప్పటి వరకు తమ భూములను ఒక్క పంటకే పరిమితం చేయలేక సాగునీటి కోసం పాట్లు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఏటిఒడ్డున మోటార్లు పెట్టి నీటిని పంట కాలువల్లోకి తోడుకుని పంటలకు మళ్లించుకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. దీనికి డీజిల్, కరెంటు బిల్లులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. దీనిపై ఏలేరు జలవనరులశాఖ ఈఈ శేషగిరిరావును వివరణ కోరగా ఏలేరుపై కాలువల ఆధునికీకరణపై కొత్త డీపీఆర్ తయారుచేసి ఈ గ్రామాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీవాణి నిధులు.. వైభవంగా ఆలయాలు

వేళంగిలో అభివృద్ధి కానున్న ధారమల్లికార్జున క్షేత్రం

రౌతులపూడి, శంఖవరం, కోటనందూరు, తొండంగి, న్యూస్‌టుడే: భజన మందిరాల నిర్మాణం, ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం, హిందూ ధార్మిక ప్రచార, సేవా కార్యక్రమాల లక్ష్యంగా తితిదే ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్టు నిధులు విడుదల చేసింది. గ్రామాల్లో భక్తి, సంస్కృతిని పెంపొందించడం, భజనల నిర్వహణకు వీలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎక్కువగా నివసించే కాలనీల్లో నిర్మాణాలకు ప్రాధాన్యం కల్పించారు. రౌతులపూడి, శంఖవరం, కోటనందూరు, తొండంగి మండలాల్లో పలు నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి.

స్థలం ఆధారంగా నిధులు

ఆయా గ్రామాల్లోని కాలనీల్లో స్థల లభ్యతకు అనుగుణంగా నిధులను కేటాయించారు. టైప్ ఏ, బీ, సీ లుగా నిర్మాణాలను చేపట్టనున్నారు. 5 సెంట్ల స్థలం ఉన్న మందిరాలకు రూ.10 లక్షలు, 8 సెంట్లు ఉన్నచోట రూ.15 లక్షలు, 10 సెంట్లు అంత కన్నా ఎక్కువ సెంట్లు స్థలం ఉన్నట్లయితే రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, తుని ఎమ్మెల్యే యనమల దివ్య ప్రత్యేక చొరవతో నిధులొచ్చాయి. మంజూరైన పనులను నిర్దేశిత ప్లాన్ ప్రకారం ఏడాది లోపు పూర్తి చేయాల్సి ఉంది.

ఎంపికైన గ్రామాలు

తొలిదశలో తితిదే ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్టు మంజూరు చేసిన నిధులతో తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని రామాలయం, దుర్గాదేవి, కృష్ణుడు, ఆంజనేయ, మరిడిమాంబ, మల్లికార్జున స్వామి తదితర ఆలయాలను అభివృద్ధిపరచనున్నారు.

త్వరగా పనులు పూర్తి కావాలని ఆదేశాలు

రౌతులపూడి మండలం: ఎస్.అగ్రహారం, లచ్చిరెడ్డిపాలెం, గిడజాం, జల్దాం, గుమ్మరేగుల, గంగవరం, దిగువశివాడ, సార్లంక, దబ్బాది, పారుపాక, ధార జగన్నాధపురం

శంఖవరం: వేళంగి, సీతయ్యమ్మపేట, శంఖవరం, **కోటనందూరు మండలం:** కొత్త కొట్టాం, కేఈచిన్నాయిపాలెం, తొండంగి మండలంలోని ఎ.కొత్తపల్లి, అద్దరిపేట, దానవాయిపేట, జి.ముసలయ్యపేట, హుకుంపేట, కొత్తపేట, అవల్లదారుపాడు, శృంగవృక్షం, తొండంగి, పంపాదిపేట, గోపాలపట్నం, కుమ్మరిపేట, పాత పెరుమాళ్లపురం, పైడికొండ, ఒంటిమామిడి, ఆనూరు గ్రామాల్లోనూ తితిదే శ్రీవాణి నిధులను ఖర్చుచేయనున్నారు.

దశలవారీగా మిగిలినవి కూడా..

దశలవారీగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మరిన్ని ఆలయాలను రాబోయే రోజుల్లో శ్రీవాణి ట్రస్టు నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ధర్మవరంలోని అయిదో వార్డులో..

ఏళ్లుగా నీటి కష్టాలు

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం గ్రామంలోని ఐదో వార్డులో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. వార్డులో 1500కు పైగా జనాభా ఉన్నారు. ప్రజల అవసరానికి తగ్గట్టుగా నీరు అందడం లేదు. ఇంట్లో ఐదారడుగులు అడుగుల లోతు గోతిలో కొళాయి ఏర్పాటు చేసినా నీటిచుక్క రాని పరిస్థితి. పైపులైన్లు మార్పు చేయాల్సి ఉంది. నాలుగేళ్లుగా పడుతున్న నీటి యాతనపై పలు మార్లు ఆందోళనలు జరిగాయి. జిల్లా కలెక్టరుకు మొరపెట్టుకున్నారు. కొత్తగా పైపులైను వేస్తామని పంచాయతీ వర్గాలు చెప్పినా, వార్డులో రెండు బోర్లు వేయడంతో పాటు జీఎల్ఆర్ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చినా జనం గొంతు తడవడం లేదు. వేసవిలో తమ పరిస్థితి ఏమిటని వార్డు జనం ఆవేదన చెందుతున్నారు.

'మహా' భక్తి..శివమే శక్తి

తిమ్మాపురంలోని శివాలయంలో పూజలు

న్యూస్‌టుడే బృందం: మహాశివరాత్రి పర్వదినాన నది, కడలి తీరాల్లో జన తరంగాలు ఎగిసిపడ్డాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. తీర్థస్నానాల వద్ద పోలీసులు పహారా కాశారు. ఏలేరుపై శివలింగం వద్ద జనం తాకిడి లేకుండా కాపలా కాశారు. రావులపాలెంలోని ఆంధ్రారుణాచలంలో అష్ట మహాశివలింగాలను కొలువు దీర్చి రుద్రాభిషేకాలు చేశారు.

● తుని పట్టణంలోని గవరపేట, బెల్లపువీధి, పెద్ద వీధి, కట్టాల్ కొండపల్ల శివాలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. దివా ఇపువీధిలో ఉన్న బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో శ్రీశైల మల్లికార్జున శివ లింగాన్ని ఏర్పాటు చేశారు. ఇర్రిపాకలో శివకేశవుల ఆలయం వద్ద ఏర్పాటు చేసిన జల్లు స్నానఘట్టం వద్ద అధికసంఖ్యలో భక్తులు స్నానాలు ఆచరించారు. రాజపూడిలో శ్రీదుర్గా రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో 500 మంది మహిళలు గోదావరి

● తీర్థస్నానాలు..అభిషేకాలు..అన్నదానాలు

జలాలను కలశాలతో తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ శివాలయాల్లో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేలంగిలో జలధారలో పెద్దసంఖ్యలో భక్తులు స్నానాలాచరించారు. కైలాసగౌరీ నోములు ఆచరించారు. పూజాకార్యక్రమం అనంతరం పసుపు, కుంకుమ, రవికలను నిర్వాహకులు అందజేశారు. ● కిర్లంపూడి ఉమామల్లేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. దానవాయిపేట సముద్ర తీరానికి భక్తులు తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. గండేపల్లి ఉమా చంద్రశేఖర స్వామి, నీలాద్రిరావుపేట, నాయకంపల్లి, మురారి గ్రామాల్లో లింగేశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. ● కె.ఓ.అగ్రహారంలోని శివాలయంలో పశ్చిమ ముఖంగా వెలసిన విద్యా శంకర స్వామివారికి అర్చకులు దుర్గాప్రసాద్ లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. తిమ్మాపురం, తేటగుంట, హంసవరం, జన్నాధగిరి తదితర గ్రామాల్లోని ఉన్న పూరాతన శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజపూడిలో కలశాలతో గోదావరి జలాలు తీసుకెళ్తున్న మహిళలు

ప్రత్తిపాడులో కల్యాణం

తుని: బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో..

ఆంధ్రా అరుణాచలంలో అష్ట మహాశివ లింగాలకు అభిషేకాలు

రేవు..నీరు ఏకం చేస్తూ..ఏలేరు నీటిలో స్నానాలు

స్తంభించిన మురుగు

తుని పట్టణంలోని పెద్దవీధిలో డ్రైనేజీ వ్యవస్థ ఎక్కడికక్కడే స్తంభించింది. కాలువలు పూర్తిగా ఆక్రమించి గట్లు, మెట్లు వంటివి నిర్మించడంతో రోజూ శుభ్రం చేయడానికి వీలు లేకుండా పోయింది. పలువురు వ్యాపారులు అనేక రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా కాలువల్లోనే వేస్తున్నారు. దీంతో మురుగు పొంగిపొర్లి రోడ్డుపైకి చేరుతోంది. తీవ్రమైన దుర్వాసన, దోమలతో ఉండలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, తుని

గ్రామ ముఖద్వారం.. చెత్తతో స్వాగతం..

గ్రామాల ముఖద్వారం వద్ద చెత్తే స్వాగతం పలకడం అధికారుల తీరుకు అద్దం పడుతుంది. తేటగుంట, తిమ్మాపురం, హెచ్.కొత్తూరు తదితర గ్రామాల పరిధిలో గ్రామ ప్రధాన రహదారుల వెంబడి పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. దీంతో వచ్చి వెళ్లే వాహనాల దాడికి దుమ్ము ధూళి వ్యాప్తి చెందడంతో స్థానికంగా నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్త తొలగించే పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

పంట కాలువ దుస్థితి ఇలా..!

మల్లేపల్లి గ్రామంలో ఓవైపు పంచాయతీ కార్యాలయం, మరోవైపు ఉన్నత పాఠశాల ఉంది. వీటి రెండింటి మధ్యలో పంటకాలువ ఉంది. ఈ కాలువలో కోళ్ల వ్యర్థాలు, మార్కెట్‌లోని కూరగాయల వ్యర్థాలు వేయడంతో అధ్వానంగా తయారైంది. కార్యాలయాలకు వచ్చే సిబ్బంది, పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

రోడ్డు అంచులు.. ఇదేం తీరు..

పాడైన ప్రాంతాల్లో పునఃనిర్మించిన జాతీయ రహదారి పక్కన వేసే బెర్ములను గ్రావెల్‌తో వేయాల్సిఉంది. రోడ్డు తొలగించగా వచ్చిన తారు, పిక్కతో కలిసి ఉన్న దానిలో కాస్తా గ్రావెల్ కలిపి బెర్ములు చేసేందుకు సిద్ధం చేయడం గమనార్హం. దీంతో ఇదేం తీరు అని వాహనచోదకులు, పలు శాఖల అధికారులు వాపోతున్నారు. హైవే ఆథారిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో సంబంధిత గుత్తేదారులు ఈ పనులు చేపడుతుండటం విశేషం. ఈవిషయమై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

మురుగులోనే నీటి కొళాయి

శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో నాలుగో వార్డులో కొంతకాలంగా తాగునీటి కొళాయి మురుగునీటిలోనే ఉంది. దీంతో తాగునీరు కలుషితమై దుర్వాసన వస్తుంది. పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శంఖవరం

తుది మెరుగులు దిద్దుకుంటున్న ములగపూడి పీహెచ్‌సీ

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడి మండల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో రెండు పీహెచ్‌సీలు మంజూరయ్యాయి. ములగపూడి కేంద్రంగా పీహెచ్‌సీని తాత్కాలిక భవనంలో ఏర్పాటుచేశారు. పూర్తిస్థాయి సేవలు అందించేందుకు వీలుగా భవన నిర్మాణానికి నిధులు విడుదల చేసి, పనులు ప్రారంభించారు. నెలలుగా ఆ పనులు పూర్తికాని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిలిచిన పనులను తిరిగి ప్రారంభించారు.

చకచకా పనులు

ములగపూడి పీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.2.45 కోట్ల నిధులు విడుదలైనా ప్రజలకు పూర్తిస్థాయి సేవలు అందని పరిస్థితి ఉంది. తాత్కాలిక భవనంలో వసతులు లేకపోవడంతో ఓపీ సేవలే సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెరుగైన వైద్య సేవలు అందించాలని నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్యే సత్యప్రభ, కూటమి నాయకుల చొరవతో నిర్మాణ పనులు చకాచకా సాగుతున్నాయి. త్వరలోనే తాత్కాలిక భవనం నుంచి శాశ్వత భవనం నుంచి సేవలు అందనున్నాయి. ఆసుపత్రి నిర్వహణకు ఇద్దరు వైద్యులను ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది. పీహెచ్‌సీ నిర్వహణకు అవసరమైన పూర్తిస్థాయి సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవాలి. రౌతులపూడి కోలోకేటెడ్ పీహెచ్‌సీకీ వైద్యుడున్నా..తాత్కాలిక భవనం లేని పరిస్థితి ఉంది. భవనాన్ని కేటాయించి సేవలను మెరుగుపరచాలి.

యునాని వైద్యసేవలు సైతం..

ములగపూడిలో ఏళ్లకాలంగా యునాని ఆసుపత్రి సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో సిబ్బంది, మందుల కొరత ఉండేది. ఆయుష్ విభాగంలో కొనసాగుతున్న యునాని ఆసుపత్రికి కూటమి ప్రభుత్వం సిబ్బందిని నియమించి, మందులను సరఫరా చేసింది. ఏళ్ల కిందట నిర్మించిన భవనం శిథిలస్థితిలో ఉండేది. భవనానికి మెరుగులు దిద్ది, సేవలకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు రూ.32 లక్షల నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో పనులు సాగుతున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

అభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం: ఎమ్మెల్యే

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పేదప్రజల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యంఇస్తున్న బడ్జెట్ రాష్ట్ర ప్రగతికి దోహదం చేస్తుందని ఎమ్మెల్యే, తితిదే పాలకవర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట రావులమ్మనగర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర బడ్జెట్‌పై వివరాలు వెల్లడించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారన్నారు. రూ.52 కోట్లతో త్వరలోనే పుష్కర ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభిస్తామన్నారు. మామిడాడ నుంచి రూ.3.5 కోట్లతో జ్యోతుల పాపారావు సాగునీటి పథకం పనులు పూర్తికావస్తున్నాయన్నారు. ఏఎంసి ఛైర్మన్ అడపా భరత్, తెదేపా మండల పార్టీ అధ్యక్షులు జీను మణిబాబు, ఎస్వియస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ లైనింగ్ పనులకు నీళ్లే ఆటంకం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: గతంలో అర్ధాంతరంగా నిలిచిన పోలవరం కాలువ పనులు ముందుకు సాగేందుకు నీళ్లే అడ్డంకిగా మారాయి. దీంతో సీసీ లైనింగ్ పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా మోటార్లు ఏర్పాటు చేసి సమీపంలో ఉన్న చెరువులకు తరలించడం పెద్ద పనిగా మారిందని ఈఈ గోవింద్ తెలిపారు. తేటగుంట సమీపంలోని పోలవరం కాలువలో నిల్వఉన్న నీటిని తొలగించేందుకు ప్రత్యేకంగా ఎనిమిది మోటార్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పూర్తిస్థాయిలో నీటిని తొలగిస్తేనే కాలువ సీసీ లైనింగ్ పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. వి.కొత్తూరు, రాజుపేట, తాళ్లూరు తదితర గ్రామాల పరిధిలోని కాలువలో నీటిని తొలగించి సీసీ లైనింగ్ పనులు సుమారు 80 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన 20 శాతం పనులను మరో రెండు నెలల వ్యవధిలో పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

తేటగుంట సమీపంలో పోలవరం కాలువలో ఉన్ననీటిని తొలగిస్తున్న మోటార్లు

స్థానిక మిల్లులకే ధాన్యం సరఫరా

మాట్లాడుతున్న శెట్టి శ్రీనివాసరావు

కోటనందూరు: రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల ప్రమేయం లేకుండా నేరుగా మిల్లులకే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవడంపై రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దళారుల వల్ల ఈ ప్రాంతంలో మిల్లులు మూతపడే అవకాశం ఉందని, కార్మికులకు ఉపాధి కరవైందని శెట్టి శ్రీనివాసరావు, పెనుమచ్చ నరసింగరావు, తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వినతిపై స్పందించిన ఎమ్మెల్యే ధాన్యం సేకరణలో దళారుల ప్రమేయం లేకుండా చర్యలు తీసుకోవడంపై కాకరాపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రకటన

మా క్లయింట్ తేటగుంట గ్రామ కాపురస్తులు పేరూరి వరహా లక్ష్మీనరసింహారావు గారి భార్య పేరూరి సత్యవతి సంజాయిషీపై ఈ ప్రకటన చేయడమైనది. మా క్లయింటుకు A. అన్నవరం గ్రామంలో సర్వే నంబర్ 67 రులో ఎ.4.90 సెంట్లు భూమి తన భర్త మరణానంతరం దఖలు పడినది. సదరు ఆస్తిని కాజేయాలనే దురుద్దేశంతో తేటగుంట గ్రామ కాపురస్తులు పేరూరి అప్పలరాజు గారి కుమారుడు పేరూరి వెంకట చిన కృష్ణయ్యా ది.11-06-2005 వద్ద గల తప్పుడు వీలునామా సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో తన పేరున మార్పించుకొని నంబర్ 791862 రు గల పాస్ పుస్తకం పొందగా, మా క్లయింట్ గౌరవ పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కోర్టులో అప్పీలు చేయగా, RDO గారు పూర్తి విచారణ చేసి ది.8-03-2007వ తేదీన పాస్ పుస్తకములు రద్దు చేస్తూ ఆర్డర్ ఇచ్చినారు. సదరు ఆర్డర్‌ను కాకినాడ జాయింట్ కలెక్టర్ గారు, గౌరవ హైకోర్టు వారు ధృవీకరించినారు.

ది.11-06-2005 తేది అన్ రిజిస్టర్డ్ వీలు నంబర్ 791862 గల పాస్ పుస్తకములు ఆధారంగా పేరూరి వెంకట చిన కృష్ణయ్యా పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో వేసిన OS.No.52/2006 రు గల డిక్లరేషన్ దావా కూడా ది.31-01-2013న డిస్మిస్ చేయగా, ప్రస్తుతం గౌరవ అమరావతి హైకోర్టులో అప్పీల్ పెండింగ్‌గా ఉంది. మా క్లయింట్‌కు చెందిన A.అన్నవరం గ్రామం సర్వే నెంబర్ 67రు, యు. 4.90 సెంట్లు పేరూరి వెంకట చిన కృష్ణయ్యా గారు రద్దుచేసిన పాస్ పుస్తకాల ద్వారా ట్రేపేర్ చేసిన వెబ్ ల్యాండ్ రికార్డ్ ఆధారంగా ఇతరులకు అమ్ముతున్నట్లుగా మా క్లయింట్ కు తెలిసినది. పైన తెల్పిన ఆస్తిని పేరూరి వెంకట చిన కృష్ణయ్యా గారి దగ్గర నుంచి ఎటువంటి క్రయ వ్యవహారాలు, ఇతరత్రా ట్రాన్సఫర్లు పొందిన యెడల చెల్లవని మరియున్ను మా క్లయింట్ గౌరవ హైకోర్టులో తీసుకునే చర్యలకు బాధ్యులగుదురని తెలియపరచడమైనది.

M.V. సూర్యనారాయణ రాజు, అడ్వకేట్
తుని, Cell; 98490 99360

ఉపాధి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు

కుమ్మరిలోవలో..

న్యూస్‌టుడే, తుని గ్రామీణం: గత వైకాపా పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను పూర్తిగా విస్మరించారు. దీంతో రోడ్లు, కాలువల నిర్మాణాలు జరగక ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం గ్రామాల్లో రోడ్లు, కాలువలు నిర్మించేందుకు ఉపాధి నిధులు మంజూరు కావడంతో గ్రామాభివృద్ధికి బాటలు పడ్డాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి మారనుంది. జీరాంజీ పథకంగా అమలు కానున్న నేపథ్యంలో నిధులు మంజూరై చేసిన పనులకు మార్చి 31 వరకు బిల్లులు మంజూరు చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో నాలుగు, అయిదు విడతల్లో మంజూరు చేసిన నిధులను ఫిబ్రవరి చివరికి ఖర్చుచేయాల్సి ఉంది. దీంతో గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన నాయకులు, గుత్తేదారులు పనులు పూర్తిచేసేందుకు శ్రమిస్తున్నారు.

రూ.కోట్ల నిధులు.. 43 రోజులే వ్యవధి

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గంలోని మూడు మండలాలకు రూ.23 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామాల్లోని సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం వాటికి అనుసంధానంగా సీసీ డ్రైన్లు నిర్మాణపనులు చేపట్టాల్సిఉంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి చివరి వరకు మాత్రమే గడువు విధించడంతో పనులు చేపట్టేందుకు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ప్రస్తుతం మంజూరు చేసిన నిధులకు సంబంధించిన పనులు ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేసిన అనంతరం వాటికి సంబంధించిన బిల్లులు మరో 15 రోజుల వ్యవధిలో నివేదించాల్సి ఉందని ఉన్నతాధికారులు సూచించారు. దీంతో కూటమి నాయకులు గ్రామాల్లో ముమ్మరంగా రోడ్లు, కాలువల నిర్మాణాలు పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నారు. వీటికి సంబంధించిన బిల్లులతోపాటు గతంలో పెండింగ్ ఉన్న ఉపాధి హామీ పనులకు సంబంధించిన బిల్లులు ప్రభుత్వం మంజూరు చేయనుందని ఏపీవో నారాయణరావు తెలిపారు.

మైమరపించిన వేడుక

విజయనగర గత వైభవాన్ని పునఃసృష్టించి, ఆరుబయలు పర్యాటక క్షేత్రం హంపీకే కొత్తఅందాలు తెచ్చిన మూడ్రోజుల ఉత్సవాలు ఉల్లాసంగా ముగిశాయి. కనువిందు చేసే జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు, రంజింపజేసే నృత్యరూపకాలు, మన పురాణాల్ని నెమరువేసే పౌరాణిక నాటక ప్రదర్శనలతో సమ్మిళితమైన విజయనగర ఉత్సవాలకు ఆదివారం రాత్రి తెరపడింది. మూడు రోజుల్లో సుమారు 10 లక్షల మంది ఉత్సవాలను తిలకించినట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది. ఉత్సవాల్లో మొదటిసారి పరిచయం చేసిన డ్రోన్ల ప్రదర్శన మచ్చుతునకగా నిలిచింది. - న్యూస్‌టుడే, హొస్పేట్

పెరుగుతున్న ఉష్ణోగ్రత

బెంగళూరు (బాణసవాడి),: రాష్ట్రంలో వేసవి ప్రారంభం కాకముందే నిదానంగా చలి తగ్గి పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అన్ని జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత 32 డిగ్రీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కరావళి జిల్లాలో 35 డిగ్రీలకు పైగా, బెంగళూరు నగర, బెంగళూరు గ్రామీణ, బెంగళూరు దక్షిణ జిల్లాలో పగటి ఉష్ణోగ్రత 33 డిగ్రీలుగా నమోదైంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో వేడి పెరుగుతుందని హెచ్చరించారు.

దేవుడా.. ఎందుకీ కడుపు కోత

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు విద్యార్థులు

'కారు' చీకట్లు కమ్మేస్తున్నాయి..
యువ్వన హృదయాలు 'వేగం' మత్తులో కొట్టుకుపోయాయి..
చక్కటి జీవితాన్ని మొదలెట్టాల్సిన వయసులోనే కలలు కనే 'కళ్లే' క్షణాల్లో మూసుకుపోయాయి..
నునుపైన విశాల రహదారులు రయ్‌మంటూ దూసుకెళ్తే ఖరీదైన 'కార్లు' ఎన్నో కుటుంబాల్లో చీకట్లు నింపుతున్నాయి..
శివరాత్రి అర్ధరాత్రి యువకిశోరాల 'పంచ' ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి..
కన్నవారికి జీవితాంతం గుండెకోత మిగిల్చే ఘటనలు కన్నడ నాట ఇటీవల వరుసగా జరగడం గమనార్హం..
తెల్లవారితే మహాశివరాత్రి పర్వదినం జరుపుకోవాల్సిన ఆ విద్యార్థులు కారులో మృత్యువు కౌగిలికి చిక్కారు..

నెత్తురోడుతున్న రహదారులతో ఉద్యాననగరి ఉలిక్కిపడుతోంది.. రెండు రోజుల కిందట ఏడుగురు విద్యార్థులు దుర్మరణం చెందిన విషాద ఘటన మరవకముందే మళ్లీ అలాంటి ఘటన కన్నవారికి పుత్రశోకాన్ని మిగిల్చింది.. బెంగళూరులోని మాదనాయకనహళ్లి పోలీసు సర్కిల్ పరిధిలోని జిందాల్ వద్ద సంభవించిన ఘోర ప్రమాదం తీవ్రత పరిశీలిస్తే.. అతివేగం ఎంత ప్రమాదకరమో ఇట్టే తెలుస్తుంది. మూడు రోజుల్లోనే ఉజ్వల భవిష్యత్తు ఉన్న 12 మంది యువకులు ఇలా అసువులు బాయడం తీరని విషాదాన్ని నింపింది. 150 కిలోమీటర్ల వేగంతో కారు నడుపుతూ ప్రమాదం బారిన పడిన రెండు ఘటనల్లో కార్లు తుత్తునియలు కాగా.. కనీసం మృతదేహాలు బయటకు తీయడానికి కట్టర్లు, వెల్డింగ్, క్రేన్ల సాయంతో పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. కళ్లముందే నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నా యువతలో పరివర్తన రాకపోవడం బాధాకరం. తాజా ప్రమాదంలో దొడ్డబళ్లాపురకు చెందిన విద్యార్థిప్రసాద్ (20), కేశవ్ (19) లలిత్ (22), హర్షిత్ (20), లలిత్‌కుమార్ (22) మృత్యువాత పడటంతో స్థానికంగా అంతులేని విషాదం నెలకొంది. ఈ నెల 13న హొసకోట - దాబస్‌పేట రహదారిలోని ఎం.సత్యవర గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు విద్యార్థుల మృతికి మితిమీరిన వేగమే కారణం కావడం గమనార్హం. - ఈనాడు, కర్ణాటక

రసబాళెకు రక్షణ కవచం

ఈనాడు, బెంగళూరు: సరిగ్గా రెండు దశాబ్దాల కిందట డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) చేసిన ఓ ప్రకటనతో నంజనగూడు రైతులు ఎగిరి గంతేశారు. తాము పండించే రసబాళె అరటికి భౌగోళిక గుర్తింపు (జియాగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్)తో ఇక కష్టాలన్నీ తీరినట్లే అని అనుకున్నారు. వీరి ఆనందం ఎంతో సేపు నిలవలేదు. ఆ ఏడాది కేవలం 12.5 ఎకరాల్లోనే నంజనగూడు రసబాళె అరటిని పండిస్తుండగా 2024-25 ఏడాదికి ఈ విస్తీర్ణం 200 ఎకరాలకు పెరిగినా ఈ అరటి వాస్తవ జన్యురూపాన్ని రక్షించుకోవటం సవాలుగా మారింది. రైతులు, ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు కలిసికట్టుగా ప్రయత్నిస్తున్నా ఈ పంటకు పట్టిన ప్రమాదకరమైన ఫంగస్ నేటికీ వెంటాడుతోంది.

జన్యు సంరక్షణే సవాలు

నంజనగూడు అరటి కబిని నది ప్రవహించే నేలల్లో పండించే పంట. ఈ నది ప్రవహించే ప్రాంతంలోని నల్లరేగడి నేలల్లోని ప్రత్యేకతే రసబాళె అరటి రుచికి కారణం. ఈ అరటి కర్ణాటక సంస్కృతిలో భాగంగా మారింది. ఈ అరటిని నంజనగూడు తాలూకాలోని దేవరసనహళ్లిలో అత్యధికంగా పండిస్తారు. పలుచటి తోలు, అంతే దట్టమైన గుజ్జు, తిరుగులేని తీయదనం ఈ అరటి ప్రత్యేకత. గరిష్ఠంగా 6 అంగుళాలు మించకుండా పెరిగే ఈ అరటికి 2005 వరకు దేశీయ విపణిలో మంచి డిమాండ్ ఉండగా, జీఐ గుర్తింపు తర్వాత అరబ్, యూరప్ దేశాలకు ఎగుమతి అవుతోంది. తాజాగా మాల్దీవుల మార్కెట్‌లోనూ అరటి ప్రత్యేక మార్కెట్ సంతరించుకుంది. ఇదే సమయంలో ఈ అరటి జన్యు రూపాన్ని రక్షించుకోవటం సవాలుగా మారింది. కేవలం నేల ప్రత్యేకత కారణంగానే పెరిగే ఈ అరటికి నకిలీ జన్యు రూపాలు మార్కెట్టును ముంచెత్తుతుంటంతో రైతులు సైతం ఆందోళన చెందుతున్నారు.

నంజనగూడు నుంచి మాల్దీవులకు పంపుతున్న రసబాళె



మొగ్గ దశలోనే తెగులు సోకిన అరటి

రైతుల అవగాహనే కీలకం

వరదలతో వచ్చిన ముప్పు

కబిని నదికి ఎప్పుడు వరదలు వచ్చినా రసబాళె అరటి రైతుల గుండె బద్దలవుతుంటుంది. రాష్ట్రంతో పాటు కేరళలో భారీ వర్షాలు కురిసినా కబినీ నదికి వరద పోటెత్తుతుంటుంది. వరద నీరే నంజనగూడు అరటి ఉనికికి ప్రమాదాన్ని తెచ్చింది. వరద మట్టి నుంచి వచ్చే పనామా విల్ట్ (ఫ్యుసేరియం ఆక్సిస్పోరమ్) అనే ఫంగస్ రసబాళె అరటిని పట్టి పీడిస్తోంది. 2008లో వచ్చిన అతివృష్టి కారణంగా నది ప్రవహించే ప్రాంతంలో పండించిన రసబాళె పంట అంతా ఫంగస్ కారణంగా తల్లడిల్లింది. 2005 వరకు ఈ అరటిని నీటిపారుదల విధానాలతో పండించగా క్రమంగా వరదల కారణంగా వర్షాధార పంటగా మారింది. ఈ వర్షాధారమే రసబాళెకు ప్రాణసంకటంగా మారింది. ఈ కారణంగా మూడు దశాబ్దాల క్రితం 30వేల ఎకరాల్లో పండించే రసబాళె 2008లో 12 ఎకరాలు, 2018లో వంద ఎకరాలకు పరిమితమైంది. ఈ ఫంగస్ నేల ద్వారా సంక్రమిస్తున్న కారణంగా తెగులు సోకిన మొక్క నుంచి నీరు ప్రవహించిన ప్రాంతమంతా ఈ ఫంగస్‌కు లోనవుతోంది. ఇలా ప్రస్తుతం నంజనగూడులో కేవలం 4 గ్రామాల్లో మాత్రమే రసబాళె అరటిని పండిస్తున్నారు.

వ్యాధి నివారణకు కసరత్తు: ఒక అరటి చెట్టుకు గరిష్ఠంగా 100 అరటి పళ్లు పండితే ఆ రైతుకు అయ్యే ఖర్చుతో పాటు ఆదాయం కూడా సాధ్యమవుతుంది. ఫంగస్ కారణంగా ఎకరంలో సగానికి సగం పంట పాడవుతూ, ఒక వేళ అరటి కాయలు పండినా గెలకు 40 పండ్లు కూడా చేతికందని పరిస్థితి. ఈ కారణంగా ఎకరానికి అయ్యే రూ.50వేల ఖర్చులో సగం కూడా అందక రైతులు నష్టపోతున్నారు. ఈ పరిస్థితులను కేంద్ర వ్యవసాయశాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐకార్), నంజనగూడు జేఎస్ఎస్ కేవీకే సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో ఫంగస్ నివారణతో పాటు రైతులకు అవగాహన శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించాయి. ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్ ఈ అరటి రక్షణకు ప్రత్యేక పరిశోధన బృందాన్ని నియమిస్తామని హామీ ఇచ్చారు. ఎప్పటి నుంచో కాపాడుకుంటూ వస్తున్న అరుదైన అరటి రకం సాగును కాపాడుకోవడానికి రైతులు ఆపసోపాలు పడుతున్నారు. వీరికి శాస్త్రవేత్తలు, ప్రభుత్వం అండగా నిలిస్తేనే భవిష్యత్తులో ఈ పంట సాగుకు మార్గం ఉంటుంది.

మురుగు నీరే పంట సాగుకు శాపం

నిలువునా వాడిపోయిన అరటి చెట్టు

తెగులు పట్టిన మొక్కను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

అంటుకట్టులో శోధన

రసబాళె జన్యు రకాన్ని సంరక్షించేందుకు విజన్ గ్రూప్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కే-ఫస్ట్‌తో పాటు జేఎస్ఎస్ అకాడమీలు నంజనగూడు ప్లాంట్ టిష్యూ కల్చర్ అధ్యయనానికి ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా రసబాళె అరటిని వెంటాడే ఫంగస్ నివారణ, ఫంగస్ రహిత మొక్కల పంపిణీ, మార్కెటింగ్, ప్యాకేజింగ్ వంటి వ్యవస్థలను సమన్వయం చేయనున్నాం. ఈ వ్యవస్థలతో రసబాళె జన్యు సంరక్షణ సాధ్యమవుతుంది.
- డా.బాలసుబ్రహ్మణియన్, డీన్, జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్

'ఆర్ఎస్ఎస్ అంటే భూతం'

ప్రియాంక్ ఖర్గే

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ అంటే భూతమని దాని నీడలో భాజపా పెరుగుతోందని గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖమంత్రి ప్రియాంక్ ఖర్గే ఆరోపించారు. ఆదివారం ఇక్కడ గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇర్షాద్ ఉప్పినంగడి రాసిన 'కరావళి రక్తకన్నీరు' అనే పుస్తకాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పోరాటం ఎప్పుడు భూతంతో తప్ప ఆ నీడలో ఉన్న భాజపాతో కాదన్నారు. భాజపా నేతలు తమ పిల్లలను మత పోరాటాల్లో ఉండరని, సామాన్యులను బలి చేస్తారన్నారు. తమ పిల్లలను విదేశాల్లో ఉంచి చదివిస్తారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, భాజపా నేతలు తరహాలో అబద్ధాలు, అసత్యాలను ప్రచారం చేయడంతో ముందు వరుసలో ఉంటారని మండిపడ్డారు. నటన, కృత్రిమంగా మాట్లాడటంలోనూ సంఘపరివార్ శక్తులు ఖ్యాతి పొందాయని ఖర్గే దుయ్యబట్టారు. ఈ శక్తులకు ప్రజలు దూరంగా ఉంటే సమాజంలో మార్పు వస్తుందన్నారు.

సీఐడీ కస్టడీకి భైరతి బసవరాజు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే: రౌడీషీటర్ శివకుమార్ అలియాస్ బిక్లుశివ హత్య కేసులో అరెస్టయిన శాసనసభ్యుడు భైరతి బసవరాజును నగర 46వ ఏసీఎంఎం న్యాయస్థానం వారంపాటు సీఐడీ కస్టడీకి అప్పగించింది. ఆరోగ్య పరీక్షలు చేసే సమయంలో ఈసీజీలో తేడా రావడంతో ఆయన జయదేవ ఆసుపత్రికి తరలించి ఐసీయూలో ఉంచి వైద్య పరీక్షలు వైద్యులు చేశారు. యాంజియోగ్రాం నిర్వహించడంతో ఆయన ఆరోగ్యం బాగుపడింది. దీంతో ఆదివారం ఇక్కడ సీఐడీ పోలీసులు బసవరాజును న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. 14 రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరారు. అందుకు న్యాయమూర్తి స్పందిస్తూ వారంపాటు సీఐడీ కస్టడీకి అప్పగించారు. ఆయనను సీఐడీ కార్యాలయానికి తీసుకువచ్చి విచారించడం ప్రారంభించారు. గత జులై 15న రాత్రి రౌడీషీటర్ శివకుమార్ హత్యకు గురయ్యాడు. తన కుమారుడి హత్య వెనక ఎమ్మెల్యే భైరతి బసవరాజు హస్తం ఉందని హతుడి తల్లి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఆయనను అరెస్టు చేసేందుకు సీఐడీ పోలీసులు ప్రయత్నించారు. సర్వోన్నత న్యాయస్థానం జామీను పిటిషన్‌ను తిరస్కరించడంతో గుజరాత్ నుంచి విమానంలో బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం రాగానే సీఐడీ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు.

చామరాజనగర జిల్లా ఎం.ఎం.హిల్స్ వద్ద శివభక్తుల సందడి

ముక్కంటికి.. ప్రణమిల్లిన భక్తకోటి

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: మహాశివరాత్రి మహాపర్వదినం సందర్భంగా ఉద్యాన నగరి పరమశివుడి నామస్మరణతో మారుమోగింది.. రాష్ట్రవ్యాప్తంగా శైవక్షేత్రాలన్నీ శంకరుడి సేవలో నిమగ్నమయ్యాయి. భక్తకోటి తరలివచ్చి మొక్కులు చెల్లించి శివలింగాలకు అర్చనలు, పూజలు చేపట్టారు. కైలాసనాథుడి చారిత్రక ఆలయాలు రాత్రంతా పూజలు, భజన కార్యక్రమాలతో నిండిపోయాయి. ఆలయ ఆవరణాల్లో చేపట్టిన భక్తిగీతాలు, ప్రవచనాలు, సంగీత, నృత్య, కళా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి.

మైసూరు జిల్లా లింగగురుకుల ఆలయంలో లింగపూజ

ఈశా ఫౌండేషన్ సమీపంలో మంటలు

● ఆందోళనకు గురైన భక్తులు

చిక్కబళ్లాపురం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేలాది మంది భక్తులు పట్టణానికి సమీపంలోని ఈశా ఫౌండేషన్ నిర్మించిన 112 అడుగుల ఎత్తైన ఆది శివయోగి విగ్రహం వద్దకు తరలిరావడంతో అటు వైపు వెళ్లే రహదారి వాహన సంచారంతో కిక్కిరిసిపోయింది. ఆదివారం సాయంత్రం భారీగా భక్తులు జాగరణ కోసం తరలిరావడంతో రద్దీ తీవ్ర సంచారానికి అంతరాయం ఏర్పడింది. రాత్రి 8 గంటల సమయంలో నాగమంటపానికి ఎదురుగా ఉన్న గుట్టల్లో మంటలు చెలరేగడంతో భక్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మంటలను అదుపు చేయడానికి స్థానిక పోలీసులు, అటవీశాఖ అధికారులు, అగ్నిమాపక దళ సిబ్బంది సాయాన్ని కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు అడవిలో చెట్లకు నిప్పంటించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. చిక్కబళ్లాపురం నుంచి వందకు పైగా ఆర్టీసీ బస్సులను నడిపినా వేలాది మంది భక్తులు బస్టాండులో నిరీక్షించాల్సి వచ్చింది. బెంగళూరు, తుమకూరు, కోలారు, తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సొంత వాహనాల్లో భక్తులు తరలిరావడంతో వంద ఎకరాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం సరిపోలేదు. అటు వైపు వస్తున్న వాహనాలను నిలపడానికి స్థలం లేక రహదారికి పక్కనే పర్యాటకులు వాహనాలను ఆపడం ట్రాఫిక్‌ను మరింత పెంచింది. రద్దీ నియంత్రించడానికి పోలీసులు, ఈశా సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

చిక్కబళ్లాపురం వద్ద ఈశా ఫౌండేషన్ నిర్మించిన ఆదిశివయోగి విగ్రహం

'వైద్య సేవల్లో సర్కారు విఫలం'

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు మందులు సరఫరా చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, ఆరోగ్య శాఖ పూర్తిగా అనారోగ్యమైందని ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైద్యాధికారులు, ఆరోగ్య, వైద్య విద్య శాఖ ఉద్యోగులు తమ సమస్య పరిష్కారం కోసం ఆందోళనలు చేపడుతున్నట్లు ప్రకటించారని, అందులో ప్రభుత్వం మందులు సరఫరాను గురించి ప్రస్తావించారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద రోగులకు మందులు దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం వైద్యం అందిస్తున్న వైద్యులు, ఉద్యోగులు లిఖిత పూర్వంగా మందులు సరఫరా కావడం లేదని తెలియజేశారని చెప్పారు. మంత్రి దినేశ్‌గుండూరావు ఆరోగ్య శాఖను అనారోగ్య శాఖగా మార్చివేశారని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. తక్షణం మందులు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

శివార్లలో దాహార్తి శివాలు

● 483 ప్రాంతాల్లో సమస్య తీవ్రం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయిలో ఐటీ నగరిగా ఖ్యాతి పొందిన బెంగళూరు నగరంలో వేసవి ప్రారంభం కావడంతో శివార్లలో తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది. 483 ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొన్నట్లు బెంగళూరు జలమండలి అధికారులు గుర్తించారు. సమస్య పరిష్కరించేందుకు పలు చర్యలు చేపడుతున్నారు. కొత్తగా బోరుబావులు తవ్వించడం, పాడుపడిన బోరుబావులు మరమ్మతులు చేయించడం, చెరువు నీటిని శుద్ధీకరించడం, ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయడం, నీటి వృథా అరికట్టడం తదితర చర్యలు చేపడుతున్నారు. నగర శివార్లలో సమస్య తీవ్రమవుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వారు పూర్తిగా బోరుబావులపై ఆధారపడ్డారు. భూగర్భ జలాల మట్టం తగ్గడంతో అవి ఎండిపోతున్నాయి. దీంతో నీటి ఎద్దడి తీవ్రమవుతుందని తెలియజేశారు. ఏటా నగరంలో 1200 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతోంది. ఫలితంగా భూగర్భజలాల మట్టం పెరుగుతోంది. ఈ ఏడాది కేవలం 750 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో నీటి సమస్య తలెత్తినట్లు చెబుతున్నారు. పెరుగుతున్న నీటి ట్యాంకర్ల ధరలకు కళ్లెం వేసేందుకు పాలికె, జలమండలి సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాయి. త్వరలో ట్యాంకర్ల ధరలను నిర్ణయిస్తామని అధికారులు తెలిపారు. శివారు ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్‌లు ట్యాంకర్లపై ఆధారపడుతున్న విషయం తెలిసిందే.

ద్విచక్రవాహనంపై నీటి క్యానను నీటిని తరలిస్తున్న ప్రజలు

నీటి సరఫరా ట్యాంకర్ల వద్ద పడిగాపులు

తాగునీటి ఎద్దడి ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్న జలమండలి అధికారులు

అడుగంటిన బోరుబావులు

● నగరం పరిధిలో 16,781 బోరుబావులు ఉన్నాయి. వాటిల్లో 6,997 బోరుబావుల్లో చుక్కనీరు లేక ఎండిపోయాయి. మరో 2,823 బోరుబావులు ఎండే స్థితికి వస్తున్నట్లు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు ఉన్న చెరువులు చుట్టు పక్కల వేయి బావులు తవ్వించేందుకు పథకాలను సిద్ధం చేశారు. చెరువు పక్కన భూగర్భజలాల పుష్కలంగా దొరికే అవకాశం ఉన్నందు వల్ల బోరుబావులు వేసి అక్కడి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి ఎద్దడి ఉండే ప్రాంతాలకు సరఫరా చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం కావేరి జలాశయాల నుంచి నిత్యం 670 ఎంఎల్‌డీ నీటిని నగరానికి సరఫరా చేస్తున్నారు. నిల్వ చేసిన కావేరి నీటిని వారానికి రెండు సార్లు 14 లక్షల కుళాయిలకు సరఫరా చేస్తున్నారు.

రసాయన ట్యాంక్ పేలి ఇద్దరి మృతి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రసాయన ట్యాంకర్ పేలి ఇద్దరు కార్మికులు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం మండ్య సమీపంలోని బసరాళు- కారెకట్టె గ్రామంలో కీర్తీ రసాయన కంపెనీలో జరిగింది. కారెకట్టె నుంచి ఆ కంపెనీని వేరే ప్రదేశానికి తరలిస్తున్నారు. బిహార్ కార్మికులు రసాయనాలతో కూడిన ట్యాంకర్‌ను తరలిస్తున్న సమయంలో అది ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నాలుగేళ్ల కిందట ఆ కంపెనీలో రసాయన పేలుడు జరిగింది. స్థానికులు కంపెనీ వద్దని ఆందోళనలు చేపట్టారు. నాశనమైన పంటకు మండ్య జిల్లా యంత్రాంగం రైతులకు పరిహారం అందించింది. ఈనేపథ్యంలోనే కంపెనీని వేరే ప్రాంతానికి తరలిస్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. బసరాళు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భద్రానదిలో మునిగి ఇద్దరి విషాదాంతం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: చిక్కమగళూరు జిల్లా కళస తాలూకా బాళెహొళె వద్ద ఉన్న భద్రా నదిలో మునిగి కొడగు నివాసులు యోగేశ్(17), అభిషేక్ (23) అనే వ్యక్తులు మృతి చెందారు. ఈత రాక నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది నీటిలో గాలించి మృతదేహాలను బయటకు తీసుకొచ్చి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉద్యాన నగరి.. జజ్జనకరి!

చారిత్రక టి-20 ప్రపంచ కప్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో దాయాది దేశం పాకిస్థాన్‌పై భారత జట్టు మరోసారి విజయపతాక ఎగరేయడంతో ఉద్యాననగరిలో సంబరాలు అంబరాన్ని తాకాయి.. యువత కేరింతలు కొడుతూ వీధుల్లోకి పరుగులు తీసింది.. బాణసంచా కాల్చి ఇండియా జట్టుకు జేజేలు పలికారు.. రెండో ఇన్నింగ్స్‌లో ఆరంభం నుంచే వరుసగా పాక్ బ్యాట్స్‌మెన్లను పెవిలియన్ బాట పట్టించిన భారత ఆటగాళ్లపై ప్రశంసల వర్షం కురిపించారు. నెటిజన్లు
- ఈనాడు, బెంగళూరు

(c) eenadu

హంపీలో మార్మోగిన శివనామస్మరణ

విరూపాక్షేశ్వరుడిని బంగారు కిరీటంతో అలంకరించి పూజిస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

హొసపేటె, న్యూస్‌టుడే: దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ ధార్మిక క్షేత్రం హంపీలో మహాశివ రాత్రి వేడుకలు భక్తి పూర్వకంగా నిర్వహించారు. హంపీ ఉత్సవాలు, శివరాత్రి పర్వదినం తోడురావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు హంపీ వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో విరూపాక్ష ఆలయం వీధి, ఆవరణ భక్తులతో కిటకిటలాడాయి. స్వామిని దర్శించుకోవటానికి భక్తులు బారులుదీరారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూట్ల స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. ఆంధ్ర భోజ శ్రీకృష్ణదేవరాయ కానుకగా ఇచ్చిన బంగారు కిరీటంతో స్వామి వారిని అలంకరించి పూజించారు. ఈ సందర్భంగా భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

సిలిండర్ పేలి నవదంపతులకు గాయాలు

బెంగళూరు (యలహంక): వంటగ్యాస్ సిలిండర్ పేలి నవదంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం ఉదయం యలహంక పోలీసుఠాణా పరిధిలోని చౌడేశ్వరి లేఔట్‌లో జరిగింది. బాగేపల్లి నివాసులు కృష్ణమ్మ, రాజు గాయపడినట్లు గుర్తించారు. విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు. ఉదయం ఆరుగంటలకు గ్యాస్ సిలిండర్ లీకై పేలి ఉండవచ్చని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పేలుడు ధాటికి ఇంటి గోడలు కూలిపోయాయి.

అంగరంగ వైభవంగా కురుగోడు ఉత్సవం

ఎడ్ల బండిపై ఎమ్మెల్యే జె.ఎన్.గణేశ్

కురుగోడు(బళ్లారి) న్యూస్‌టుడే: కురుగోడు ఉత్సవంలో భాగంగా మొదటి రోజు ఆదివారం చారిత్రక పట్టణం కురుగోడులో పండగ వాతావరణం నెలగొంది. జిల్లా యంత్రాంగం, కన్నడ సంస్కృతి శాఖ, కురుగోడు తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో కురుగోడు ఉత్సవాన్ని ఎమ్మెల్యే జె.ఎన్.గణేష్ తదితరులు పాల్గొని ఆదివారం ప్రారంభించారు.

రన్ ఫర్ హెల్త్: పట్టణంలో 'రన్ ఫర్ హెల్త్' పేరుతో మారథాన్‌ను నిర్వహించారు. స్థానిక వద్దట్టి క్రాస్ నుంచి కురుగోడు శ్రీ దొడ్డ బసవేశ్వర దేవస్థానం వరకు మారథాన్ నిర్వహించారు. ఎమ్మెల్యే జె.ఎన్.గణేష్‌తో పాటు యువతి, యువకులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేసి అభినందించారు.

ఆకట్టుకున్న ఎడ్లబళ్ల ప్రదర్శన

రైతు కార్యకలాపాలు, గ్రామీణ సౌందర్యాన్ని ప్రతిబింబించేలా ఎడ్లబళ్ల ప్రదర్శన నిర్వహించారు. తాలూకాలోని వివిధ గ్రామాల నుంచి రైతుల తమ ఎద్దులను విశేషంగా అలంకరించి ప్రదర్శనలో పాల్గొన్నారు. 60పైగా ఎడ్లబళ్ల ప్రదర్శనలో పాల్గొనడంతో పట్టణంలో గ్రామీణ వాతావరణం నెలకొంది

రంగోలి పోటీలు

ఉత్సవంలో మహిళలను ప్రోత్సహించడానికి నిర్వహించిన రంగోలి పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీ దొడ్డ బసవేశ్వర దేవస్థానం ముందు రంగోలి పోటీలను నిర్వహించారు. దేవస్థానం నుంచి కంప్లి రహదారిలోని పెట్రోల్ బంకు మహిళలు ముగ్గులు వేశారు.

బురదలో పరుగు

స్థానిక ప్రజలు, రైతులను ప్రోత్సహించడానికి బాదనహట్టి సమీపంలోని పొలంలోని బురద మడిలో పరుగుల పోటీలు నిర్వహించారు. మహిళల కోసం టగ్-ఆఫ్-వార్ పోటీలు ఏర్పాటు చేశారు.

జ్యోతుల్ని పట్టుకొని నిలబడిన పూజారులు

దేదీప్యంగా శివ బసవ జ్యోతి

కురుగోడు ఉత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం దొడ్డబసవేశ్వర దేవస్థానం ముందు గంగా హారతి మాదిరిగా శివబసవ హారతిని నిర్వహించారు. పూజారులు వరుసగా నిలబడి మంత్రాలు జపాల మధ్య పెద్ద కాంస్య దీపాలతో హారతిని వెలిగించారు. మహాశివరాత్రి పండగ సందర్భంగా దర్శనం కోసం వచ్చిన భక్తులు శివ బసవ హారతిని కళ్లకద్దుకున్నారు. ఎమ్మెల్యే, తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బురదమడిలో పరుగు పందెం

మారథాన్‌కు తరలివచ్చిన యువత

జనాకర్షణగా నిలిచిన జానపద వాహిని

జానపద వాహిని కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గవియప్పకు మాలార్పణ చేస్తున్న విరూపాక్ష ఆలయ ఏనుగు లక్ష్మీ

డోలు వాయిద్యం కళాకారుల వినూత్న విన్యాసం

హొసపేటె, న్యూస్‌టుడే: ఉత్సవాల చివరి రోజు సాయంత్రం విజయనగర వీధుల్లో నిర్వహించిన జానపద కళాబృందాల జానపద వాహిని కార్యక్రమం ఆకట్టుకుంది. సుమారు పాతిక కళాబృందాల నుంచి 800 మంది కళాకారులు పాల్గొన్నారు. ఉద్దాన వీరభద్రేశ్వర ఆలయం వద్ద ఎమ్మెల్యే గవియప్ప జానపద వాహిని కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ శ్రుతి మళ్లప్ప గౌడ్రు తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రభోజ శ్రీకృష్ణదేవరాయలు హయాంలో కళలు, కళాకారులకు మంచి ఆదరణ ఉండేది, ఆ గత వైభవాన్ని కళ్లకు కట్టేవిధంగా చూపించేందుకు ఉత్సవాల్లో జానపద వాహిని కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే గవియప్ప తెలిపారు. రామాయణ దృశ్యాలను అభినయించే కళాకారులు, వీరగాసె,కంసాళె నృత్యం, జోగతి నృత్యం, మహిళల డోలు వాయిద్యం, దొడ్డ తప్పెట వాయిద్యం, నంది కోలు, సోమనకుణిత, మరగాళ్ల కళాకారులు ఆకట్టుకున్నారు. జానపద వాహిని దారిపొడవునా ప్రజలకు కనువిందు చేసింది.

ప్రాచీన విగ్రహాల ధ్వంసం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: గదగ జిల్లా ముండగిరి తాలూకా శింగహళ్లి గ్రామంలో చోళులు నిర్మించిన ప్రాచీన శివాలయంలో ఉన్న శివలింగం, శివలింగ ప్రాణి, నందీశ్వరుడి విగ్రహాలను శనివారం రాత్రి నిందితులు ధ్వంసం చేసిన సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. శివాలయం తుంగభద్ర నది పక్కన ఉంది. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి వచ్చి పరిశీలించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

దర్గాలో శివపూజ

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే: కలబురగి జిల్లా ఆళంద పట్టణంలో వివాదాస్పదంగా ఉన్న లాడ్లెమశాన్ దర్గాలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం అక్కడ ఉన్న శివలింగానికి పూజలు నిర్వహించారు. కలబురగి ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కేవలం 14 మంది పూజలు నిర్వహించేందుకు జిల్లాధికారులు అనుమతించారు. పూజ చేసేందుకు వెళ్లే వ్యక్తులు చరవాణి, కెమెరాలు తదితర వాటిని తీసుకువెళ్లకుండా నిషేధించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు 14 మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. దర్గా చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

చిన్నారి మృతి

బెంగళూరు (యలహంక): గర్భిణి ఫోటోషూట్ చేస్తున్న సమయంలో ఆడుకుంటున్న గిడ్డెనహళ్లి నివాసి బాలుడు లక్ష్మీర్(3) నీటి తొట్టెలో పడి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం మాదనాయకనహళ్లి పోలీసుఠాణా పరిధిలో జరిగింది. గర్భం దాల్చిన తల్లి స్వాతి తన మొదట బిడ్డ లక్ష్మీర్ ఏమి చేస్తున్నాడో గమనించకుండా ఫోటోషూట్‌లో మునిగిపోయారు. అక్కడ చిన్న నీటి కొలను ఉంది. ఆడుకుంటున్న బాలుడు అందులో పడి మృతి చెందాడు. బాలుడు నీటిలోపడిన విషయాన్ని తల్లి ఆలస్యంగా గ్రహించి బయటకు తీసి చికిత్స కోసం నెలమంగల ప్రభుత్వ ఆసుపత్రి తరలించింది. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

అద్భుతం.. కళాకారుల మానవ గోపురం

విరూపాక్ష వేదికలో యువకవితా గోష్ఠిని ప్రారంభిస్తున్న రచయితలు

సంప్రదాయ పాటకు నృత్యం చేస్తున్న యువత

వెళ్లొస్తా.. మళ్లీ

విజయవంతంగా ముగిసిన హంపీ ఉత్సవాలు

హొసపేటె, న్యూస్‌టుడే: శిలలపై శిల్పాలు చెక్కినారూ..మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారూ..అనే తెలుగు పాట అక్షరాలా నిజం చేసేలా హంపీ ఉత్సవాలు ఉర్రూతలూగించాయి. విభిన్న, వైవిధ్యమైన కార్యక్రమాలు రసమంజరి, సంగీత ఫ్యూజన్, ర్యాప్ సంగీతాలు యువతను మైమరిపించాయి. అర్ధరాత్రి దాటినప్పటికీ వేదికపై సాగిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఆదివారం విజయవంతంగా ఉత్సవాలు ముగిశాయి. 'నెలరోజుల నుంచి జిల్లా యంత్రాంగం ఉత్సవాల విజయవంతానికి తీవ్రంగా కృషి చేసిందని ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గవియప్ప కితాబిచ్చారు. హంపీ, కమలాపుర చెరువు ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపామని' ఆయన వెల్లడించారు.

ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప

ప్రధాన వేదికలో సామూహిక నృత్య ప్రదర్శన

పశ్చిమ కనుమల్లో స్వచ్ఛ నడక

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: పరిసరాల్ని సంరక్షించే నేపథ్యంలో ఓ యువకుల బృందం కొత్త అభియాన్‌ను ప్రారంభించింది. శివరాత్రి నేపథ్యంలో లక్షల మంది భక్తులు పాదయాత్రగా ధర్మస్థలకు చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర మార్గంలో ఉన్న పశ్చిమ కనుమలు చార్మాడీ మార్గంలో భక్తులు తెచ్చుకొనే ప్లాస్టిక్ సీసాలు, ఇతర వ్యర్థాలను అక్కడక్కడా విసిరి వెళ్లడంతో పరిసరాలు కలుషితం అవుతున్నాయి. స్పందించిన బేరుభూమి యువకుల బృందం పరిసర సంరక్షణకు 'పవిత్రమైన నడక.. స్వచ్ఛదారి' పేరిట కొత్త అభియాన్‌ను స్వచ్ఛ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. పాదసేవతో మంజునాథస్వామిని దర్శించుకొనేందుకు వచ్చే ఈ సేవ చాలా పవిత్రమైంది. హాసన, చిక్కమగళూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పాదయాత్రతో వచ్చే భక్తులకు పరిసరం సంరక్షణ గురించి జాగృతి కల్పించేందుకు ఈ అభియానాను చేపట్టారు. పశ్చిమ కనుమల పాదయాత్ర మార్గంలో వ్యర్థాలను, ప్లాస్టిక్ సీసాల వంటివి పడేయడంతో వన్యజీవులు, పక్షులపై ప్రభావం పడుతోంది. స్వయంసేవక యువకులు రంజిత్, ప్రవీణ్, సచిన్, యశస్ హాసన నుంచి ధర్మస్థల మార్గంగా ఉన్న బేలూరు, మూడిగెరె, కొట్టిగెహార, చార్మాడీ. బెళ్తంగడి ఇలా దాదాపు వందల కిలోమీటర్ల ఈ మార్గంలో 200 మీటర్లు, 500 మీటర్ల దూరంలో గోతాం సంచులు ఏర్పాటు చేసి వాటి చుట్టూ ఇనుప జాలరీలతో చెత్త తొట్టెలు నిర్మించారు.

పెంపుడు కుక్కలకు అనుమతి తప్పనిసరి

బెంగళూరు (యలహంక): బెంగళూరు నగరంలో పెంపుడు కుక్కలు పోషించేందుకు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) నూతన చట్టాన్ని తేనున్నారు. నగరంలో వీధి కుక్కలు నియంత్రించేందుకు సర్వోన్నత న్యాయస్థానం కొన్ని నిబంధనలు విధించింది. ఇప్పటికే వీధి కుక్కలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది జీబీఏ అధికారులకు వీధి కుక్కల బెడదపై ఫిర్యాదులు చేశారు. పెంపుడు కుక్కలు సాకేందుకు కొత్త నిబంధనలు తీసుకురావాలని న్యాయస్థానం సూచించింది. ఈ నేపథ్యంలో కొత్త చట్టాన్ని సిద్ధం చేసింది. దీనికోసం పెంపుడు కుక్కల సంరక్షణ చట్టం 1960ను సవరిస్తున్నారు. ఇందుకోసం కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించారు. వాటిని ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా వసూలు చేస్తారు. పెంపుడు కుక్కలు పెంచుకునేందుకు జీబీఏ అనుమతి పొందాలి. ఏటా లైసెన్స్‌ను పునరుద్ధరించాలి. జీబీఏ పశువైద్యాధికారి నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. ప్రతి పెంపుడు కుక్కకు యజమాని సొంత ఖర్చుతో మైక్రో చిప్ అమర్చాలి. పెంపుడు కుక్కకు రేబిస్ టీకా వేయించాలి. 12 నెలలు పైబడిన పెంపుడు కుక్కలకు సంతానరహిత శస్త్రచికిత్సలు చేయించాలి. ఒక ఇంట్లో మూడు కుక్కలు కంటే ఎక్కువగా పెంచుకోకూడదు. జీబీఏ బైలా ప్రకారం పెంపుడు కుక్కలు సాకాలి. ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. బహిరంగ ప్రదేశాల్లో పెంపుడు కుక్కను వాకింగ్‌కు తీసుకువెళ్లినప్పుడు గొంతుకు గొలుసు వేయాలి. మలమూత్రాలు విసర్జిస్తే యజమాని శుభ్రం చేయాలి. జర్మన్‌షెపర్డ్, రోట్రిలర్, డాబర్‌మ్యాన్ తదితర జాతులకు చెందిన కుక్కలు పెంపకాన్ని నిషేధించారు.

రహదారి ప్రమాదంలో యువ రైతు దుర్మరణం

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం): ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసి.. వచ్చిన దిగుబడులను అమ్ముకునేందుకు వెళ్లే క్రమంలో ఓ యువ రైతు రహదారి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడిన ఘటన ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా కౌతాళం మండలం బంటకుంట గ్రామానికి చెందిన యువ రైతు వీరనాగ, అదే ప్రాంతానికి చెందిన చాకలి ఈరన్న, గోవర్ధన్, మరికొందరు కలిసి బొలెరో వాహనంలో మిర్చి దిగుబడులు వేసుకుని బ్యాడిగ మిర్చి మార్కెట్‌యార్డుకు బయలుదేరారు. చిత్రదుర్గ వద్ద వాహనం టైరు పేలిపోయింది. వాహనం అదుపు తప్పి పడిపోగా మిర్చి బస్తాలన్నీ వారిపై పడ్డాయి. వీరనాగు అక్కడికక్కడే మృతి చెందగా.. ఈరన్న, గోవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరనాగకు వివాహమై మూడేళ్లైంది. ఆయనకు భార్య అయ్యమ్మ ఉన్నారు. అతను రెండెకరాల్లో మిర్చి సాగు చేశారు. దిగుబడులను తీసుకెళ్తూ అనుకోని ప్రమాదంలో మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

ఆటాపాట అదుర్స్!

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ ఉత్సవాలు హృద్యంగా కొనసాగాయి. ఆటాపాటల్ని తిలకించిన ప్రేక్షకులు మైమరిచిపోయారు. సెలబ్రిటీలతో పాటు సినీ, టీవీ నటీనటులూ అలరింపజేయడంతో వేడుకలు విజయవంతమయ్యాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకుల్ని ఓలలాడించాయి.

వేదికపై ఓ కళాకారిణి సంగీత కార్యక్రమం

వేదికపై నృత్యం చేసిన కాంతారా సినిమా హీరోయిన్ సప్తమిగౌడకు జ్ఞాపిక అందిస్తున్న సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం

సహ కళాకారులతో నృత్యం చేస్తున్న బుల్లితెర నటీ కావ్యశైవ

బళ్లారి గాదిలింగనగౌడ బృందం నుంచి కురుక్షేత్ర నాటక ప్రదర్శన

వేదికపై చిందులేస్తున్న బిగ్‌బాస్ కన్నడ విజేత గిల్లినట

EENADU eClassifieds

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్సును/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

సీతాపయణ చిత్రం విడుదల

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: హీరో నిరంజన్ నాయక్, హీరోయిన్ ఐశ్వర్య అర్జున్ నటించిన 'సీతాపయణ' చిత్రం శనివారం ప్రపంచ వ్యాపంగా విడుదలైంది. ప్రముఖ సినీ నటుడు అర్జున్‌సర్జా చిత్రానికి దర్శకత్వం వహించారు. టీజర్, పాటలు తదితర వాటికి ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు తెలిపారు. థియేటర్ల విడుదలైన చిత్రాన్ని తిలకించిన ప్రేక్షకులు నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేశారు. అర్జున్ సర్జా, సత్యరాజ్, ప్రకాశ్‌రాయ్, ధ్రువసర్జా తదితరులు నటించారు.

సీతాపయణ చిత్రంలో నిరంజన్ నాయక్, ఐశ్వర్య

స్టార్ చిత్రం టీజర్ విడుదల

స్టార్ చిత్రం టీజర్ వచ్చేసింది

లయన్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై శరత్ ప్రకాశ్ నిర్మిస్తున్న 'స్టార్' చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌ను తిలకించిన ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు విజయసూర్య తెలిపారు. చిత్రంలో మూడు పాటలకు వికాశ్ సంగీతం అందించారు. రౌడీయిజం చేసే వ్యక్తి కుటుంబం ఏవిధంగా ఉంటుందని, తల్లి కుమారుడి సంబంధం, ప్రేమతదితర అంశాలతో కూడిన కథాచిత్రమని తెలియజేశారు. బెంగళూరు నగరంలోని వివిధ మురికివాడల్లో పలు దృశ్యాలను చిత్రీకరించారు. శరత్‌ప్రకాశ్, రజతరక్ష తదితరులతో పాటు రంగభూమి కళాకారులు నటిస్తున్నారు.

'అనంత పయణ' సిద్ధం

ఎస్కే ఫిలింస్ బ్యానర్‌పై 'అనంత పయణ' చిత్రం చిత్రీకరణను పూర్తి చేశారు. బెళగావి,బెంగళూరులతో పాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించినట్లు దర్శకుడు శ్రీకాకా తెలిపారు. మేకలు, గొర్రెల కాపర్లు జీవన విధానాన్ని చిత్రం ద్వారా చూపిస్తున్నట్లు తెలియజేశారు. ఐదుపాటలకు ఆకాశ్ వర్మ సంగీతం అందిస్తున్నారు. నిమిశ్మాపాటిల్, ఎం.కె.మఠ, మంజునాథ్ హెగ్డే, అపూర్వశ్రీ, లక్ష్మీసిద్ధయ్య, బలరాజవాడి, సందీప్‌నీవాసం, ప్రశాంత్‌సిద్ధి, లపంగ్ రాజా, అనన్య నిహారికలతో పాటు శ్రీకాకా నటిస్తున్నారు.

అనంతపయణ చిత్రంలో నృత్యదృశ్యం

డైరెక్టర్స్ కట్ చిత్రీకరణ షురూ

రాజేశ్వరి ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'డైరెక్టర్స్ కట్' చిత్రం చిత్రీకరణ నగరంలోని కెంగేరి ఉన్న విశ్వవిద్యా గణపతి దేవస్థానంలో ప్రారంభమైంది. విభిన్నమైన కథాచిత్రమని, ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు సూరజ్‌గౌడ తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరిస్తామని తెలియజేశారు. సూరజ్‌గౌడ, రాధా ఎస్. భాగి, దివ్యజైన్, వీడీ సతీశ్, స్వాతి తదితరులు నటిస్తున్నారు.

డైరెక్టర్స్ కట్ చిత్రంలో సూరజ్‌గౌడ, రాధాఎస్.భాగి, దివ్యజైన్

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

వైభవంగా మౌనేశ్వర ఉత్సవం

కారటగిలో మౌనేశ్వర స్వామి పల్లకి ఉత్సవం

కారటగి, న్యూస్‌టుడే: కారటగిలో ఆదివారం మౌనేశ్వర పల్లకి ఉత్సవం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగింపుగా మహదేశ్వర పుష్కరిణికి తీసుకొచ్చారు. అక్కడ గంగ పూజ అనంతరం పాత బస్‌స్టాండ్ గుండా ఊరేగింపు తిరిగి ఆలయానికి చేరుకుంది. పురవంతర నృత్యం ఊరేగింపులో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆలయంలో ధార్మిక సభ, అన్న సంతర్పణ జరిగాయి. విశ్వకర్మ సముదాయ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రవణానందంగా సంగీతలహరి

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కువెంపునగర్ అమృతేశ్వర ఆలయంలో స్వామివారికి విశేష పూజలు జరిపారు. ఆలయ ఆవరణలో భక్తి సంగీతలహరి కార్యక్రమం భక్తులను విశేషంగా అలరించింది. శివునిపై విద్యాబృందం ఆలపించిన పాటలు భక్తులను శ్రవణానందపరిచాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, కువెంపునగర్‌వాసులు పాల్గొన్నారు.

కువెంపునగర్ అమృతేశ్వర ఆలయంలో భక్తిగీతాలు ఆలపిస్తున్న బృందం

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

చెళ్లూరు క్యాంపు (కారటగి), న్యూస్‌టుడే: కారటగి తాలూకా చెళ్లూరు క్యాంపులో షిర్డీ సాయిబాబా ఆలయ 7వ వార్షికోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఉదయం అభిషేకం, హారతుల అనంతరం సామూహిక సాయి సత్యవ్రతాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయిబాబా విగ్రహాన్ని క్యాంపులో ఊరేగించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 12 గంటల పాటు సామూహిక సాయి నామ సంకీర్తన చేపట్టారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ జరిగింది. ఆలయ సమితి సభ్యులు, స్థానికులు, చుట్టుపక్కల గ్రామాలు, క్యాంపుల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సామూహిక సాయి సత్య వ్రతంలో పాల్గొన్న మహిళలు

కంప్లిలో జాగృతి ఊరేగింపు

కంప్లి, న్యూస్‌టుడే: ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మహాశివ రాత్రి సందర్భంగా ఆదివారం పట్టణంలో విశ్వ శాంతి జాగృతి ఊరేగింపు నిర్వహించింది. విద్యాలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ప్రధాన వీధుల్లో కొనసాగింది. తాలూకాలోని ఎమ్మిగనూరు, హోసనెల్లూడి గ్రామాల్లోనూ ఊరేగింపు నిర్వహించారు.

పాల్గొన్న మహిళలు తదితరులు

1016 మట్టి శివలింగాల ప్రతిష్ఠాపన

బళ్లారి, న్యూస్‌టుడే: స్థానిక రేడియో పార్కు గణేశ్ దేవస్థానం సమీపంలో నివాసముంటున్న వసుంధర అనే భక్తురాలు 1016 మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి శివభక్తిని చాటుకున్నారు. గత కొన్నేళ్లుగా ఆమె మహాశివరాత్రికి 45 రోజుల ముందు నుంచి కొంత సేపు పండ్లు తీసుకుంటూ దీక్ష చేపడతారు. చెరువు నుంచి బంక మట్టి తెచ్చించి శివలింగాలను తయారు చేస్తారు. ఏటా సహస్రాధిక శివలింగాలను రూపొందించి మహాశివరాత్రికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ ఏడాది 1016 శివలింగాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. చుట్టుపక్కల భక్తులు ఆమె ఇంటికి వచ్చి శివలింగాలను దర్శించుకొని పూజలాచరించి తరించారు.

శివలింగాలకు నిర్వహించిన ప్రత్యేక పూజలు

పాత కక్షలకు బుగ్గయిన మొక్కజొన్న పంట

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: 20 ఎకరాల పొలంలో పండించిన మొక్కజొన్న కంకుల రాశులకు దుండగులు నిప్పంటించడంతో అవి బూడిద కుప్పగా మారాయి. రైతు ధనంజయ్‌కు రూ.లక్షల పంట నష్టం మిగిల్చిన ఈ దారుణ ఘటన రూరల్‌పోలీసు ఠాణా పరిధిలోని లక్ష్మీసాగర్‌లో శనివారం రాత్రి జరిగిందని పోలీసు అధికారులు ఆదివారం తెలిపారు. శనివారం అర్ధరాత్రి మొక్కజొన్న కంకుల రాశుల వద్ద ఎవరూ కాపలా లేని సమయంలో నిప్పంటించి పరారయ్యారు. విషయం తెలుసుకొన్న అగ్నిమాపక దళం వాహనాలతో ఘటనా స్థలానికి వచ్చి మంటలను నియంత్రించే సమయానికి నష్టం జరిగిపోయింది. గ్రామంలో నెలకొన్న పాత కక్షలే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

లక్ష్మీసాగర్ గ్రామంలో దుండగులు నిప్పంటించగా బూడిద కుప్ప మిగిలిందిలా

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ: ఇద్దరి దుర్మరణం

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: హొసదుర్గం తాలూకా మాళిగేహట్టి గ్రామానికి చెందిన ప్రజలు కల్లత్తగిరిలో కాటలింగేశ్వర స్వామికి పూజలు ఆచరించి ట్రాక్టర్‌లో వెనుదిరిగి వస్తూ ప్రమాదం బారినపడ్డారు. చన్నాపుర గ్రామం వద్ద వెనక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొనడంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. పలువురు గాయపడినట్లు పోలీసు అధికారులు ఆదివారం తెలిపారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామ ప్రజలు పూజలు నిర్వహించుకొని వెనుదిరిగి వస్తుండగా లారీ రూపంలో మృత్యువు కబళించింది. దుర్ఘటనలో గ్రామానికి చెందిన మంజునాథ్(34), మళియప్ప(35) మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం శివమొగ్గ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసును నమోదు చేసుకొన్నారు.

నీటమునిగి ఇద్దరు బాలలు..

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: హొళల్కెర తాలూకా కాల్కెర గ్రామ చెరువులో నీట మునిగి ఇద్దరు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకొన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. కాల్కెరకు చెందిన బీరేశ(12) తన తల్లితో పాటుగా దుస్తులు శుభ్రం ఉతకడానికి చెరువు దగ్గరకు వెళ్లాడు. వారితో పాటుగా బంధువు హరపనహళ్లి తాలూకా తాండ్రహళ్లికి చెందిన కవిత(14) కూడా చెరువు వద్దకు వెళ్లింది. బీరేశ చెరువులో దిగి ఈత కొడుతూ ఊబిలో చిక్కుకొన్నాడు. అతనిని రక్షించడానికి కవిత ప్రయత్నించి ఊబిలో ఇరుక్కుపోయింది. బీరేశ తల్లి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి బాల, బాలికలను రక్షించే లోపే తుదిశ్వాస వదిలారు. చిక్కజాజూరు పోలీసు ఠాణాలో కేసును నమోదు చేసుకొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

15-02-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1602.15	1612.65
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	428	7,951
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.427	43.071

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

మేయర్ పట్టు.. సభ్యుల బెట్టు

● పాలికె బడ్జెట్ ప్రవేశపెట్టేనా?
● అధికార పార్టీ కార్పొరేటర్ల దుమ్ము!
● అవినీతిపై చర్చకు భాజపా పంతం

"**బళ్లారి, న్యూస్‌టుడే:** బళ్లారి నగర పాలికె 2026-27 బడ్జెట్‌ను సోమవారం ప్రవేశ పెట్టడానికి మేయర్ పూజారి గాదెప్ప సర్వసన్నద్ధంగా ఉన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల్లో అధికులు బడ్జెట్ సమావేశానికి సుముఖంగా లేరు. ఈ గందరగోళం మధ్య నేడు బడ్జెట్ ప్రవేశ పెడతారా? తాత్కాలికంగా వాయిదా వేస్తారా? సమావేశం ప్రారంభమైన తర్వాత కోరం లేక వాయిదా పడుతుందా? అనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది."

తొమ్మిది నెలలుగా సాధారణ సమావేశమే లేదు

నగర ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా.. మేయర్ తొమ్మిది నెలలుగా సాధారణ సమావేశం కూడా నిర్వహించలేదు. దీనిపై ప్రతిపక్ష కార్పొరేటర్ ఇబ్రహీంబాబు ప్రభుత్వానికి లేఖ రాశారు. వేసవి రాక ముందే నగరంలో వారం, 10 రోజులకోసారి తాగునీటిని అందిస్తున్నారు. నగరంలో గుంతల రోడ్లతో పాటు, పారిశుద్ధ్యం లోపించిందనే ఆరోపణలున్నాయి.

బడ్జెట్‌కు ముందు మేయర్ సమావేశం

నగర పాలికె 2026-27 బడ్జెట్‌కు ముందు అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే కార్పొరేటర్ ముందస్తు ప్రభంజన్‌కుమార్ నేతృత్వంలో 19 మంది కార్పొరేటర్లు సంతకాలు సేకరించి బడ్జెట్ సమావేశం తాత్కాలికంగా వాయిదా వేయాలని కమిషనర్‌కు వారం రోజుల ముందే వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్యేలు దూరంగా ఉంటారా?

నగర పాలికెలో మొత్తం 39 వార్డులు ఉండగా, వాటిలో కాంగ్రెస్-26, భాజపా-13 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు, లోక్‌సభ సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు, ఎమ్మెల్సీలు మొత్తం 44 మంది అవుతారు. 19 మంది కాంగ్రెస్ కార్పొరేటర్లు, అవినీతిపై చర్చించాలని పట్టుబడుతున్న 13 మంది భాజపా కార్పొరేటర్లు, ఎమ్మెల్సీ కూడా దూరంగా ఉంటే.. మిగిలిన ఏడుగురు కార్పొరేటర్లు, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు హాజరైనా కూడా మొత్తం 11 మంది అవుతారు. కనీసం కోరం 14 మంది ఉండాలి.

నగర పాలికె కార్యాలయం

బడ్జెట్ సమావేశం నిర్వహిస్తాం

సోమవారం నగర పాలికె 2026-27 బడ్జెట్ సమావేశం నిర్వహించిన తర్వాత సాధారణ సమావేశం కూడా నిర్వహిస్తాం. సొంత పార్టీకి చెందిన కార్పొరేటర్లు వస్తారు. నగర పాలికెలో జరిగిన అక్రమాలపై చర్చించాలని భాజపా కార్పొరేటర్లు కోరుతున్నారు. వారు చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం. - **పూజారి గాదెప్ప, మేయర్, బళ్లారి**

భక్తులకు బిల్వపత్రి వితరణ

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి వైదిక మార్గ ఆధ్వర్యంలో ఆదివారం మహాశివ రాత్రి సందర్భంగా భక్తులకు ఉచితంగా బిల్వపత్రి, రుద్రాక్షలు, పూలు, పంచామృతం తదితర పూజ సామగ్రిని వితరణ చేశారు. బళ్లారి నగరంలో శివరాత్రి రోజున ప్రజలకు శివుడికి ఇష్టమైన బిల్వపత్రి లభించడం కష్టమైంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత కొన్నేళ్లుగా బళ్లారి దుర్గమ్మ దేవస్థానం వద్ద వైదిక మార్గ ఆధ్వర్యంలో పూజా సామగ్రి బిల్వపత్రి, తదితర వస్తువులను ఉచితంగా వితరణ చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వీటిని స్వీకరించారు.

భక్తులకు రుద్రాక్షలు పూజా సామగ్రి వితరణ చేస్తున్న స్వామీజీ తదితరులు

ఘనంగా సేవాలాల్ జయంతి

కంప్లి: కార్యాలయంలో పాల్గొన్న అధికారులు, బంజార సముదాయ నాయకులు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం సంత సేవాలాల్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి పూజలు జరిపారు. అరళిహళ్లి తాండా సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు ఆర్.కె.గోవి సిద్ధప్ప మాట్లాడుతూ ప్రకృతితో పాటు గోవుల సంరక్షణకు సేవాలాల్ ఎంతో కృషి చేశారంటూ ఆయన జీవితం గురించి వివరించారు. అధికారులు జగదీశ్, లక్ష్మణ నాయక్, బంజార సముదాయ నాయకులు నాగప్ప, బసవరాజ పవార్, పుండలీకప్ప, లింబప్ప, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కారటగి: కారటగి భాజపా కార్యాలయంలో సేవా లాల్ జయంతిని ఆచరించారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి పూజలు చేశారు. తహసీల్దార్, పురసభ, అగ్నిమాపక కేంద్రం తదితర కార్యాలయాలతో పాటు విద్యాలయాల్లోనూ సేవా లాల్ జయంతిని నిర్వహించారు. బంజార సముదాయ ప్రజలు తాలూకాలోని వివిధ తాండాల్లో వేడుకను ఆచరించారు.

సిరివార, (మాన్వి): స్థానిక దేవదుర్గకు దగ్గర వద్ద సజ్జలశ్రీ శరణమ్మ మఠం ప్రాంగణంలో సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ ప్రారంభించి మాట్లాడారు. ప్రమాణికత జీవన మూలమంత్రమని చాటిచెప్పిన సంత సంస్కర్త సేవాలాల్ అన్నారు. సత్యం, దయ, కరుణ, ప్రమాణికతలను జీవితంలో ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన హితోపదేశమన్నారు. తాలూకాలోని వివిధ తండాలకు చెందిన లంబాడీలు భారీ ఎత్తున పట్టణానికి తరలివచ్చారు. నీటిపారుదల శాఖ కార్యాలయం నుంచి సభ వేదిక వరకు ఊరేగింపు నిర్వహించారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు హాజీసాబ్, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, సభ్యులు, స్థానిక ప్రముఖులు జాడలదిన్ని శరణప్పగౌడ, జి.లోకారెడ్డి, మల్లికార్జునపాటిల్, కృష్ణనాయక్, మౌనేశ్, రామ, శివరాజ్, రామాచారి, రాజు రాథోడ్, మంజులా, శాంతప్ప పవార్, కమలప్ప నాయక్, శ్రీనివాస్‌నాయక్, దేవేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటప్పనాయక్

శ్రీరామనగర్: ఊరేగింపుగా గంగా జలం తెస్తున్న మహిళలు

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: గంగావతి తాలూకా డణాపుర గ్రామంలో సేవా లాల్ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. తుంగభద్ర నది నుంచి మహిళలు ఊరేగింపుగా సేవాలాల్ మందిరానికి గంగా జలం తెచ్చి విగ్రహాన్ని అభిషేకించారు. వివిధ ధార్మిక కార్యక్రమాలు, అన్న సంతర్పణ జరిగాయి. గ్రామ పెద్దలు, బంజార సముదాయ ప్రజలు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

మాన్వి, న్యూస్‌టుడే: పుల్వామా దాడిలో ప్రాణాలు త్యాగం చేసిన 40 మంది వీరయోధుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ యోధుడు మంజునాథ్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు బసవరాజ్ మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడుల్లో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. వారిని స్మరించుకోవటం భారతీయుల కనీస బాధ్యతగా భావించాలన్నారు. వారు చేసిన ప్రాణత్యాగాలు వృథాకారాదన్నారు. వారి ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. మాజీ సైనికుల జిల్లా ఆంజనేయ, నేతాజీ శిక్షణ సంస్థ అధ్యక్షుడు కె.ఇ.నరసింహ, మహేశ్‌నాయక్ బెళ్లదార్, అక్షయ్ కుమార్ కోనాపూర్‌పేట, శరణబసవనాయక్ జానేకల్, గురురాజ్ నాగలాపూర్, ఆంజనేయ నస్లాపూర్, యువకులు పాల్గొన్నారు.

మంజునాథ్‌నాయక్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న యువకులు

నాగేశ్వరాలయంలో నిర్వహిస్తున్న హోమం

కొత్త బంగారు కిరీటం ధరించిన మల్లేశ్వర స్వామికి పూజలు

స్వామి దర్శనం చేసుకుంటున్న భక్తులు

బాలాజీ క్యాంపులో పూజలు చేస్తున్న సచ్చిదానంద భారతి స్వామీజీ

కారటగి: అలంకరణలో ఉణ్ణి బసవేశ్వరుడు

మాన్వి అత్తనూరు క్యాంపులో ఓంకారేశ్వరుడు

సర్వం శివోహం

బళ్లారి, న్యూస్‌టుడే: ఓం నమశ్శివాయ శంభో శంకర హర...హర మహాదేవ శంకర అంటూ.. శివనామ స్మరణంతో శివాలయాలు మార్మోగాయి. బళ్లారి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా మహా శివరాత్రిని ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఓ భక్తుడు శివుడికి బంగారు కిరీటం చేయించాడు..కొత్త బంగారు కిరీటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బసవణ్ణ క్యాంపు (కారటగి): బసవణ్ణ క్యాంపు ప్రజల ఆరాధ్య దైవం ఉణ్ణ బసవేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: సత్యనారాయణ పేటలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో స్వామివారికి, పార్వతిదేవికి విశేష అభిషేకాలు చేపట్టారు. పుష్పాలు, బిల్వపత్రంతో అలంకరించారు. బాలాజీ క్యాంపులో అమృతేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపారు. స్వయంప్రకాశ సచ్చిదానంద భారతి స్వామిజీ పాల్గొని భక్తుల్ని ఆశీర్వదించారు. కార్యక్రమంలో సినీ నిర్మాత కొర్రపాటి సాయి, రామకృష్ణ, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింధనూరు, న్యూస్‌టుడే: గాంధీనగర్‌లోని శ్రీ విశ్వేశ్వర పంచాయతన క్షేత్రం కిటకిటలాడింది. ఆలయ ప్రాంతం అంతా శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారు జామున నాలుగు నుంచే భక్తుల తాకిడి అధికమైంది. లక్ష లింగాల మహాగిరిలోని స్ఫటికలింగ దర్శనం ఉదయం ఆరు గంటల నుంచి ఆరంభించారు. 17వ శివరాత్రి వార్షికోత్సవం కావడంతో లక్షలింగాల ఆలయం వెలుపల శివలింగానికి 12 నదుల నుంచి సేకరించి తెచ్చిన పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లా మండవల్లికి చెందిన వేద పండితుడు చాగంటిపాటి శ్రీనివాసశర్మ చేతుల మీదుగా కైంకర్యాలు జరిగాయి. ఆలయ అధ్యక్షుడు ముళ్లపూడి భాస్కర రావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: పట్టణవీధుల్లో జానపద ఉత్సవాలను, పూల పల్లకిని ఊరేగించారు. ఈ ఉత్సవాలలో చండే వాద్యం, కీలు గుర్రాలు, జాంజ్ నృత్యం, లంబాడీనృత్యం, ఖాసాబెడరపడే, డోలు కుణిత తదితర జానపద కళాకారుల బృందాలు పాల్గొన్నాయి.

సిరుగుప్ప, న్యూస్‌టుడే: సిరుగుప్ప, తెక్కలకోట పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో, తెలుగు క్యాంపుల్లో మహాశివరాత్రిని భక్తి, శ్రద్ధలతో ఆచరించారు. పట్టణంలోని అమృతేశ్వర, నీలకంఠేశ్వర, శ్రీశైలం మల్లికార్జున స్వామి, శ్రీశంభులింగేశ్వర ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మాన్వి, న్యూస్‌టుడే: నగరేశ్వర, మల్లికార్జున, నీలకంఠేశ్వర, ధ్యానమందిరం, ఓంకార శక్తి మండలి, ఈశ్వర దేవస్థానాలతో పాటు తాలూకాలోని వివిధ క్యాంపులు, గ్రామ శివాలయాల్లో పూజలు ఘనంగా ఆచరించారు.

కోటె మల్లేశ్వర స్వామి ఆలయానికి తరలివచ్చిన భక్తులు

విశేషాలంకరణలో గణేశుడు

మాన్విలో శోభిల్లుతున్న శివుడు

సిరుగుప్ప:వెండి ఆభరణాలు, పుష్పాలంకరణలో శంభులింగేశ్వర స్వామి

చెళ్లకెర:కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న ముత్తైదువులు

సింధనూరు:పంచాయతన క్షేత్రంలో బారులు తీరిన భక్తులు

ధర్మమార్గం ద్వారానే శాంతి, ప్రగతి

నూతన వధూవరులు

మాన్వి, న్యూస్‌టుడే : జాతి వర్గ మత విభేదాలకు అతీతంగా మఠాలు కృషి చేయాలని, సముదాయాలు భాగస్వాములు కావాలని కల్మఠ విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ పేర్కొన్నారు. కల్మఠ గారిగె జాతరలో ఆయన మాట్లాడారు. ధార్మిక కార్యక్రమాలు, ప్రవచనాలు జాతి, వర్ణ, ద్వేష, అసూయ రహిత సమాజ నిర్మాణానికి సహకరిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నడిస్తే సమాజంలో శాంతి, అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సాధకుల సేవలను గుర్తించి వారిని కల్మఠం ప్రోత్సహిస్తోందన్నారు. సింధనూరుకు చెందిన కారుణ్యాశ్రమం నిర్వాహకులకు శ్రీవిరూపాక్ష కృపాభూషణ పురస్కారాలు ప్రకటించినట్లు చెప్పారు. చెన్నబసవస్వామి, సుజాత దంపతులను సత్కరించారు.

21 జంటలకు సామూహిక వివాహాలు

కల్మఠం ఆధ్వర్యంలో ధ్యానమందిరం వద్ద 21జంటలకు ఉచిత సామూహిక వివాహాలు జరిపించారు. వివిధ మఠాల స్వామీజీలు, ప్రముఖులు కొత్త దంపతులను ఆశీర్వదించారు. కల్మఠం విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ, నీలగల్ అభినవ శాంతమల్ల శివాచార్య, మంగళవారపేట హిరేమఠం వీరసంగమేశ్వర స్వామీజీ, బళ్లారి సనాతన ధర్మ ప్రచారకురాలు అనురాధ, ప్రభురాజ్ కొడ్లి తదితరులు మాట్లాడారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

బళ్లారి, న్యూస్‌టుడే: మహానుభావుల జయంతులు కేవలం వేడుకలు మాత్రమే కాదు.. సమాజ ఐక్యత, సమాజంలో పలువురికి ఆదర్శంగా జీవనం సాగించాలని మేయర్ పూజారి గాదెప్ప సూచించారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ సంస్కృతిశాఖ, బళ్లారి నగర పాలికె సంయుక్తంగా ఆదివారం స్థానిక డా. జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించి మాట్లాడారు. సమాజ పెద్దలు, నాయకులు నిర్దేశించిన మార్గాన్ని అనుసరించడం ముఖ్యమన్నారు. గొప్ప వ్యక్తుల సందేశాలను తదుపరి తరానికి అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. వీఎస్కేయూ ఆచార్యులు శాంతనాయక్ ప్రత్యేక ఉపన్యాసం చేశారు. అనంతరం బళ్లారికి చెందిన సంధ్యారావు బృందంచే నిర్వహించిన సంగీత కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో కన్నడ సంస్కృతిశాఖాధికారి నాగరాజు, అధికారులు, సముదాయం ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. తొలుత నగరంలో సంత్ సేవాలాల్ చిత్రపటం ఊరేగింపు నిర్వహించారు.

మాట్లాడుతున్న మేయర్ పూజారి గాదెప్ప

మంత్రికి సాదర స్వాగతం పలికిన ఎమ్మెల్యే

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు-రాయచూరు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం పనులు వేగంగానే జరిగాయి. అంతిమదశకు చేరుకున్న ఈ పనులు మరింత వేగం పెంచితే త్వరగా పూర్తికాగలదు, ఆ దిశలో సూచనలు అందిస్తానని ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి తెలిపారు. ఆయన మస్కి నియోజకవర్గం గుంజళ్లి గ్రామంలో గ్రామస్థులు ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవంలో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నం సింధనూరుకు వచ్చారు. హెలీకాప్టరులో ఆయన సింధనూరులో దిగి కుష్టిగి మార్గంలో కారులో గుంజళ్లి గ్రామానికి బయలుదేరారు. మార్గం మధ్యలో ఆయన్ను మస్కి ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ, పీసీసీ సభ్యుడు నల్ల వెంకటేశ్వరరావు, కేఎంఎఫ్ నిర్దేశకుడు బొబ్బా ప్రవీణ్‌కుమార్ మంత్రికి స్వాగతం పలికారు. కాగా ఇదే కార్యక్రమంలో భాజపా నాయకుడు, మాజీ మంత్రి బి.శ్రీరాములు కూడా పాల్గొన్నారు.

మంత్రి సతీశ్ జార్కిహోళికి స్వాగతం పలుకుతున్న మస్కి ఎమ్మెల్యే బసనగౌడ

(c) eenadu

త్రినేత్రుడికి మహాపూజలు

శివలింగానికి భక్తుల క్షీరాభిషేకం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిన జేపీనగరలోని శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలో మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజ కార్యక్రమాలను నిర్వహించారు. రుద్రాక్ష మొక్కల మధ్య ఉన్న శివాలయాన్ని వివిధ పువ్వులతో అలంకరించారు. వివిధ పండ్లు, కూరగాయలతో లోపల అందంగా అలంకరించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. పండ్లు కూరగాయల అలంకరణ అందరిని ఆకట్టుకుంది. శివలింగం వద్ద క్షీరాభిషేకం చేసేందుకు భక్తులకు అవకాశం కల్పించారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. గంట గంటకు ప్రత్యేక హారతులను ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆశ్రమంలో భక్తి వాతావరణం నెలకొంది. కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చారు. వచ్చిన భక్తులకు ప్రసాదాలను అందించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించినట్లు ఆశ్రమ ట్రస్టు కార్యాధ్యక్షుడు రాంబాబు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు కళాకారులు భజన, భరతనాట్యం, సుందర కాండ నాటకం ప్రదర్శించారు.

రాచనగరి త్రినేశ్వరస్వామికి అర్చనలు

బెంగళూరు (కెంగేరి): మహాశివరాత్రి నేపథ్యంలో మైసూరు ప్యాలెస్ ఆవరణలో ఉన్న త్రినేశ్వరస్వామికి ఆదివారం పదకొండు కిలోల బంగారు ముఖవాడ (ముఖావళి)ను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ఉన్న త్రినేశ్వరస్వామి మూల విరాట్టుకు తెల్లవారుజామునే అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. త్రినేశ్వరుడిని దర్శించుకొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఏసీపీ నేతృత్వంలో గట్టి బందోబస్తు వ్యవస్థల ఏర్పాట్లు చేశారు.

సోమవారం ఉదయం రుద్రాక్షి మండపంలో ఉత్సవాలను ఏర్పాటు చేయనున్నారు.

బంగారు ముఖవాడ ప్రత్యేకత

మైసూరు మహారాజు జయచామరాజేంద్ర ఒడెయార్‌కు మగ సంతానం ఉండలేదు. మగసంతాన భాగ్యం కలిగితే ప్యాలెస్ ఆవరణలో ఉన్న త్రినేశ్వర, నంజనగూడు నంజుండేశ్వరుడు, మలేమహదేశ్వర కొండలో నెలకొన్న మహదేశ్వరుడికి బంగారు కవచాన్ని చేయిస్తామని మొక్కుకున్నారు. ఈశ్వరుడి అనుగ్రహం మేరకు మహారాజు కుటుంబంలో మగ సంతానం కలిగింది. మహారాజు పదకొండు కిలోల బరువుతో ఉన్న బంగారు ముఖవాడను చేయించారు. ఈ కారణంగా మహాశివరాత్రి రోజున త్రినేశ్వరస్వామికి బంగారుతో చేసిన ముఖకవచాన్ని పెట్టడం ఆనవాయితీగా వస్తోందని స్థానికుల కథనం. మహేశ్వరకొండలో ఉన్న మహదేశ్వరస్వామి, నంజనగూడు నంజుండేశ్వరస్వామికి శాశ్వతంగా బంగారుతో చేసిన ఈ ముఖవాడను మహారాజు తయారు చేయించారు. రోజూ ధరించడం ఇబ్బంది కావడంతో ఏడాదికొకసారి జల్లాధికారి ఖజానాలో ఉంచిన ముఖవాడను తెప్పించి శివరాత్రిరోజున పెట్టి పూజించడం ఆనవాయితీగా వస్తోందని చెబుతారు.

బంగారు ముఖవాడతో అలంకరించిన త్రినేశ్వరస్వామి

విరూపాక్షేశ్వరుడిని బంగారు కిరీటంతో అలంకరించి పూజిస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

శివబాలయోగి ఆశ్రమంలో అలంకరణ

హంపీలో మార్మోగిన శివనామస్మరణ

హొసపేటె: దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ ధార్మిక క్షేత్రం హంపీలో మహాశివరాత్రి వేడుకలు భక్తిపూర్వకంగా నిర్వహించారు. హంపీ ఉత్సవాలు, శివరాత్రి పర్వదినం తోడురావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు హంపీ వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో విరూపాక్ష ఆలయం వీధి, ఆవరణ భక్తులతో కిటకిటలాడాయి. స్వామిని దర్శించుకోవటానికి భక్తులు బారులుదీరారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూట్ల స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. ఆంధ్రభోజ శ్రీకృష్ణదేవరాయ కానుకగా ఇచ్చిన బంగారు కిరీటంతో స్వామి వారిని అలంకరించి పూజించారు. ఈ సందర్భంగా భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

దర్గాలో శివపూజ

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే: కలబురగి జిల్లా ఆళంద పట్టణంలో వివాదాస్పదంగా ఉన్న లాడ్లేమశాన్ దర్గాలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం అక్కడ ఉన్న శివలింగానికి పూజలు నిర్వహించారు. కలబురగి ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కేవలం 14 మంది పూజలు నిర్వహించేందుకు జిల్లాధికారులు అనుమతించారు. పూజ చేసేందుకు వెళ్లే వ్యక్తులు చరవాణి, కెమెరాలు తదితర వాటిని తీసుకువెళ్లకుండా నిషేధించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు 14 మందికి మాత్రమే దర్గాలోకి వెళ్లి పూజలు నిర్వహించేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు. దర్గా చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పట్టణంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నీటితొట్టెలో పడి చిన్నారి మృతి

బెంగళూరు (యలహంక): గర్భిణి ఫోటో షూట్ చేస్తున్న సమయంలో ఆడుకుంటున్న గిడ్డెనహళ్లి నివాసి బాలుడు లక్ష్మీర్(3) నీటి తొట్టెలో పడి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం మాదనాయకనహళ్లి పోలీసుఠాణా పరిధిలో జరిగింది. గర్భం దాల్చిన తల్లి స్వాతి తన మొదట బిడ్డ లక్ష్మీర్ ఏమి చేస్తున్నాడో గమనించకుండా ఫోటోషూట్‌లో మునిగిపోయారు. అక్కడ చిన్న నీటి కొలను ఉంది. ఆడుకుంటూ వెళ్లిన బాలుడు అందులో పడి మృతి చెందాడు. బాలుడు నీటిలోపడిన విషయాన్ని తల్లి ఆలస్యంగా గ్రహించి బయటకు తీసి చికిత్స కోసం నెలమంగల ప్రభుత్వ ఆసుపత్రి తరలించింది. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	40
క్యారెట్-	55
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	115
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా-	25
గుమ్మడి-	30
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	35
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	120
పండ్లు, ఫలాలు ధరలు	
వాషింగ్టన్ ఆపిల్-	395
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	345
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	95
బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

EENADU Classifieds

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, © 9849394835, 7075345527.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K to 20K. © 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. © 8520980099, 8520874499

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

అద్భుతం.. కళాకారుల మానవ గోపురం

విరూపాక్ష వేదికలో యువకవితా గోష్ఠిని ప్రారంభిస్తున్న రచయితలు

సంప్రదాయ పాటకు నృత్యం చేస్తున్న యువత

వెళ్లొస్తా.. మళ్లీ

విజయవంతంగా ముగిసిన హంపీ ఉత్సవాలు

హొసపేటె, న్యూస్‌టుడే: శిలలపై శిల్పాలు చెక్కినారూ.. మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారూ.. అనే తెలుగు పాట అక్షరాలా నిజం చేసేలా హంపీ ఉత్సవాలు ఉర్రూతలూగించాయి. విభిన్న, వైవిధ్యమైన కార్యక్రమాలు రసమంజరి, సంగీత ఫ్యూజన్, ర్యాప్ సంగీతాలు యువతను మైమరిపించాయి. అర్ధరాత్రి దాటినప్పటికీ వేదికపై సాగిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఆదివారం విజయవంతంగా ఉత్సవాలు ముగిశాయి. 'నెలరోజుల నుంచి జిల్లా యంత్రాంగం ఉత్సవాల విజయవంతానికి తీవ్రంగా కృషి చేసిందని ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గవియప్ప కితాబిచ్చారు. హంపీ, కమలాపుర చెరువు ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపామని' ఆయన వెల్లడించారు.

ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప

ప్రధాన వేదికలో సామూహిక నృత్య ప్రదర్శన

సిలిండర్ పేలి నవదంపతులకు గాయాలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: వంటగ్యాస్ సిలిండర్ పేలి నవదంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం ఉదయం యలహంక పోలీసుఠాణా పరిధిలోని చౌడేశ్వరి లేఔట్‌లో జరిగింది. బాగేపల్లి నివాసులు కృష్ణమ్మ, రాజు గాయపడినట్లు గుర్తించారు. విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు. ఉదయం ఆరుగంటలకు గ్యాస్ సిలిండర్ లీకై పేలి ఉండవచ్చని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పేలుడు ధాటికి ఇంటి గోడలు కూలిపోయాయి. ఘటనా స్థలాన్ని స్థానిక పోలీసులు పరిశీలించారు.

ప్రాచీన విగ్రహాల ధ్వంసం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: గదగ జిల్లా ముండగిరి తాలూకా శింగహళ్లి గ్రామంలో చోళులు నిర్మించిన ప్రాచీన శివాలయంలో ఉన్న శివలింగం, శివలింగప్రాణి, నందీశ్వరుడి విగ్రహాలను శనివారం రాత్రి నిందితులు ధ్వంసం చేసిన సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. శివాలయం తుంగభద్ర నది పక్కన ఉంది. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి వచ్చి పరిశీలించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పెంపుడు కుక్కలకు అనుమతి తప్పనిసరి

బెంగళూరు (యలహంక): బెంగళూరు నగరంలో పెంపుడు కుక్కలు పోషించేందుకు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) నూతన చట్టాన్ని తేనున్నారు. నగరంలో వీధి కుక్కలు నియంత్రించేందుకు సర్వోన్నత న్యాయస్థానం కొన్ని నిబంధనలు విధించింది. ఇప్పటికే వీధి కుక్కలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది జీబీఏ అధికారులకు వీధి కుక్కల బెడదపై ఫిర్యాదులు చేశారు. పెంపుడు కుక్కలు సాకేందుకు కొత్త నిబంధనలు తీసుకురావాలని న్యాయస్థానం సూచించింది. ఈ నేపథ్యంలో కొత్త చట్టాన్ని సిద్ధం చేసింది. దీనికోసం పెంపుడు కుక్కల సంరక్షణ చట్టం 1960ను సవరిస్తున్నారు. ఇందుకోసం కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించారు. వాటిని ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా వసూలు చేస్తారు. పెంపుడు కుక్కలు పెంచుకునేందుకు జీబీఏ అనుమతి పొందాలి. ఏటా లైసెన్స్‌ను పునరుద్ధరించాలి. జీబీఏ పశువైద్యాధికారి నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. ప్రతి పెంపుడు కుక్కకు యజమాని సొంత ఖర్చుతో మైక్రో చిప్ అమర్చాలి. పెంపుడు కుక్కకు రేబిస్ టీకా వేయించాలి. 12 నెలలు పైబడిన పెంపుడు కుక్కలకు సంతానరహిత శస్త్రచికిత్సలు చేయించాలి. ఒక ఇంట్లో మూడు కుక్కలు కంటే ఎక్కువగా పెంచుకోకూడదు. జీబీఏ బైలా ప్రకారం పెంపుడు కుక్కలు సాకాలి. ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. బహిరంగ ప్రదేశాల్లో పెంపుడు కుక్కను వాకింగ్‌కు తీసుకువెళ్లినప్పుడు గొంతుకు గొలుసు వేయాలి. మలమూత్రాలు విసర్జిస్తే యజమాని శుభ్రం చేయాలి. జర్మన్‌షెపర్డ్, రోట్రీలర్, డాబర్‌మ్యాన్ తదితర జాతులకు చెందిన కుక్కలు పెంపకాన్ని నిషేధించారు.

రహదారి ప్రమాదంలో యువ రైతు దుర్మరణం

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం): ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసి.. వచ్చిన దిగుబడులను అమ్ముకునేందుకు వెళ్లే క్రమంలో ఓ యువ రైతు రహదారి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడిన ఘటన కర్ణాటకలో ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా కౌతాళం మండలం బంటకుంట గ్రామానికి చెందిన యువ రైతు వీరనాగ, అదే ప్రాంతానికి చెందిన చాకలి ఈరన్న, గోవర్ధన్, మరికొందరు కలిసి బొలెరో వాహనంలో మిర్చి దిగుబడులు వేసుకుని కర్ణాటకలోని బ్యాడిగ మిర్చి మార్కెట్‌యార్డుకు బయలుదేరారు. చిత్రదుర్గ వద్ద వాహనం టైరు పేలిపోయింది. వాహనం అదుపు తప్పి పడిపోగా మిర్చి బస్తాలన్నీ వారిపై పడ్డాయి. వీరనాగు అక్కడికక్కడే మృతి చెందగా.. ఈరన్న, గోవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరనాగకు వివాహమై మూడేళ్లైంది. ఆయనకు భార్య అయ్యమ్మ ఉన్నారు. అతను రెండెకరాల్లో మిర్చి సాగు చేశారు. దిగుబడులను తీసుకెళ్తూ అనుకోని ప్రమాదంలో మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

పశ్చిమ కనుమల్లో స్వచ్ఛ నడక

జాగృతి చేపట్టిన బేరుభూమి బృందం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: పరిసరాల్ని సంరక్షించే నేపథ్యంలో ఓ యువకుల బృందం కొత్త అభియాన్‌ను ప్రారంభించింది. శివరాత్రి నేపథ్యంలో లక్షల మంది భక్తులు పాదయాత్రగా ధర్మస్థలకు చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర మార్గంలో ఉన్న పశ్చిమ కనుమలు చార్మాడీ మార్గంలో భక్తులు తెచ్చుకొనే ప్లాస్టిక్ సీసాలు, ఇతర వ్యర్థాలను అక్కడక్కడా విసిరి వెళ్లడంతో పరిసరాలు కలుషితం అవుతున్నాయి. స్పందించిన బేరుభూమి యువకుల బృందం పరిసర సంరక్షణకు 'పవిత్రమైన నడక.. స్వచ్ఛదారి' పేరిట కొత్త అభియాన్‌ను స్వచ్ఛసేవా కార్యక్రమాన్ని చేపట్టారు. పాదసేవతో మంజునాథస్వామిని దర్శించుకొనేందుకు వచ్చే ఈ సేవ చాలా పవిత్రమైంది. హాసన, చిక్కమగళూరు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పాదయాత్రతో వచ్చే భక్తులకు పరిసరం సంరక్షణ గురించి జాగృతి కల్పించేందుకు ఈ అభియానాను చేపట్టారు. పశ్చిమ కనుమల పాదయాత్ర మార్గంలో వ్యర్థాలను, ప్లాస్టిక్ సీసాల వంటివి పడేయడంతో వన్యజీవులు, పక్షులపై ప్రభావం పడుతోంది. స్వయంసేవక యువకులు రంజిత్, ప్రవీణ్, సచిన్, యశస్ హాసన నుంచి ధర్మస్థల మార్గంగా ఉన్న బేలూరు, మూడిగెరె, కొట్టిగెహార, చార్మాడీ. బెళ్తంగడి ఇలా దాదాపు వందల కిలోమీటర్ల ఈ మార్గంలో 200 మీటర్లు, 500 మీటర్ల దూరంలో గోతాం సంచులు ఏర్పాటు చేసి వాటి చుట్టూ ఇనుప జాలరీలతో చెత్త తొట్టెలు నిర్మించారు. మూడు రోజుల నుంచి ఈ యువకులు రాత్రి పదకొండు వరకు శ్రమించి మార్గంలో విసిరేసే సీసాలను సేకరించి వాటిలో వేస్తున్నారు. ఈ మార్గంలో పాదయాత్రగా వెళ్లే వారందరికి వ్యర్థపదార్థాలను తొట్టెలో వేయమని మనవి చేసుకున్నారు. చెట్లకు బ్యానర్లు కట్టి అడవి, ప్రాణిపక్షులను సంరక్షించుదాం అనే సందేశాలను రాశారు. పశ్చిమ కనుమలు కేవలం అటవీ ప్రాంతం కాదు అనేక వన్య జీవులకు ఆశ్రయంగా ఉంది. ఈ మార్గాలన్ని ప్లాస్టిక్ మార్గంగా కాకూడదని దీన్ని కాపాడే బాధ్యతలు ప్రతి ఒక్కరి కర్తవ్యమని పాదయాత్రలకు ఈ స్వయంసేవకుల బృందం జాగృతి కల్పిస్తోంది. గ్రామ పంచాయతీల్లో చెత్తను కాల్చకుండా తడి, పొడి చెత్తను వేరుచేసి సంచుల్లో వేసి సహకరిస్తే పరిసరం స్వచ్ఛంగా ఉంటుందంటారు. పాదయాత్రికులు ప్లాస్టిక్ సీసాలు, గ్లాసులు , తట్టలు కాకుండా అరటి ఆకులను వినియోగించాలి. మజ్జిగ పొట్లాలు తాగి అక్కడే వేయరాదని చెబుతున్నారు. అందరి సహకారంతోనే పశ్చిమ కనుమలు సంరక్షణ సాధ్యమవుతుందని యువ బృందం చెబుతోంది. మన ఊరు, మన పశ్చిమకనుమలు అనే సందేశంతో పరిసరాన్ని సంరక్షించేందుకు నడుంకట్టిన బేరుభూమి జట్టు సభ్యులందరికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

పవిత్రమైన అభియాన్‌లో చెట్టుకు కట్టిన బ్యానర్

పరిసర సంరక్షణకు కొత్త అభియాన్ చేపట్టిన యువకుల బృందం

సీతాపయణ చిత్రం విడుదల

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: హీరో నిరంజన్ నాయక్, హీరోయిన్ ఐశ్వర్య అర్జున్ నటించిన 'సీతాపయణ' చిత్రం శనివారం ప్రపంచ వ్యాపంగా విడుదలైంది. ప్రముఖ సినీ నటుడు అర్జున్‌సర్జా చిత్రానికి దర్శకత్వం వహించారు. టీజర్, పాటలు తదితర వాటికి ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు తెలిపారు. థియేటర్ల విడుదలైన చిత్రాన్ని తిలకించిన ప్రేక్షకులు నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేశారు. అర్జున్ సర్జా, సత్యరాజ్, ప్రకాశ్‌రాయ్, ధ్రువసర్జా తదితరులు నటించారు.

సీతాపయణ చిత్రంలో నిరంజన్ నాయక్, ఐశ్వర్య

స్టార్ చిత్రం టీజర్ విడుదల

స్టార్ చిత్రం టీజర్ వచ్చేసింది

లయన్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై శరత్ ప్రకాశ్ నిర్మిస్తున్న 'స్టార్' చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌ను తిలకించిన ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు విజయసూర్య తెలిపారు. చిత్రంలో మూడు పాటలకు వికాశ్ సంగీతం అందించారు. రౌడీయిజం చేసే వ్యక్తి కుటుంబం ఏవిధంగా ఉంటుందని, తల్లి కుమారుడి సంబంధం, ప్రేమతదితర అంశాలతో కూడిన కథాచిత్రమని తెలియజేశారు. బెంగళూరు నగరంలోని వివిధ మురికివాడల్లో పలు దృశ్యాలను చిత్రీకరించారు. శరత్‌ప్రకాశ్, రజతరక్ష తదితరులతో పాటు రంగభూమి కళాకారులు నటిస్తున్నారు.

'అనంత పయణ' సిద్ధం

ఎస్కే ఫిలింస్ బ్యానర్‌పై 'అనంత పయణ' చిత్రం చిత్రీకరణను పూర్తి చేశారు. బెళగావి,బెంగళూరులతో పాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించినట్లు దర్శకుడు శ్రీకాకా తెలిపారు. మేకలు, గొర్రెల కాపర్ల జీవన విధానాన్ని చిత్రం ద్వారా చూపిస్తున్నట్లు తెలియజేశారు. ఐదుపాటలకు ఆకాశ్ వర్మ సంగీతం అందిస్తున్నారు. నిమిశ్మాపాటిల్, ఎం. కె. మఠ, మంజునాథ్ హెగ్డే, అపూర్వశ్రీ, లక్ష్మీసిద్ధయ్య, బలరాజవాడి, సందీప్‌నీవాసం, ప్రశాంత్‌సిద్ధి, లపంగ్ రాజా, అనన్య నిహారికలతో పాటు శ్రీకాకా నటిస్తున్నారు.

అనంతపయణ చిత్రంలో నృత్యదృశ్యం

డైరెక్టర్స్ కట్ చిత్రీకరణ షురూ

రాజేశ్వరి ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'డైరెక్టర్స్ కట్' చిత్రం చిత్రీకరణ నగరంలోని కెంగేరి ఉన్న విశ్వవిద్యా గణపతి దేవస్థానంలో ప్రారంభమైంది. విభిన్నమైన కథాచిత్రమని, ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు సూరజ్‌గౌడ తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరిస్తామని తెలియజేశారు. సూరజ్‌గౌడ, రాధా ఎస్. భాగి, దివ్యజైన్, పీడీ సతీశ్, స్వాతి తదితరులు నటిస్తున్నారు.

డైరెక్టర్స్ కట్ చిత్రంలో సూరజ్‌గౌడ, రాధాఎస్.భాగి, దివ్యజైన్

(c) eenadu

బెంగళూరు

• బెంగళూరు • కోలారు • మైసూరు • హోసూరు • చిక్కబళ్లాపుర • తుమకూరు

విశ్వప్రసన్నతీర్థరను ఆహ్వానిస్తున్న వాదీంద్ర, నందకిశోరాచార్యులు

వైభవంగా శ్రీగురురాఘవేంద్రస్వామి పట్టాభిషేకం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : జయనగర ఐదో బ్లాక్‌లోని నంజనగూడు శ్రీరాఘవేంద్రస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి 24 వరకు శ్రీరాఘవేంద్ర పట్టాభిషేకం, జన్మదినోత్సవం వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయం సీనియర్ వ్యవస్థాపకుడు ఆర్.కె.వాదీంద్రచార్యులు తెలిపారు. ఈనెల 24న ఉడుపి పేజావర మఠాధిపతి విశ్వేశ్వర తీర్థస్వామీజీని ఆహ్వానిస్తున్నట్లు నందకిశోరాచార్యులు తెలిపారు.

మైసూరు అవధూత దత్తపీఠంలో సంబరాలు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : అవధూత దత్తపీఠం ఇతిహాసంలో ఆదివారం అరవై ఏళ్ల శివరాత్రి మహోత్సవం నిర్వహించడం ఆశ్రమంలో సంబరాలు నెలకొన్నాయని దత్తపీఠం పీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానందస్వామీజీ తెలిపారు. శివరాత్రి మహోత్సవం నేపథ్యంలో ఆశ్రమంలోని విశ్వప్రార్థన మందిరంలో సచ్చిదానందేశ్వర శివలింగానికి విశేష అభిషేకం, మంగళహారతి ఇచ్చారు. శివరాత్రి సందర్భంగా 24 గంటల పాటు నిరంతరాయంగా శివనామస్మరణ, జాగరణ, సంగీతం, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

అభిషేకం చేస్తున్న గణపతి సచ్చిదానందస్వామీజీ

హోసూరు కబుర్లు

అర్హులందరికీ ఇంటి పట్టాలు

డెంకణీకోట, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో అర్హులందరికీ ఇంటి పట్టాలు అందజేస్తామని తళి ఎమ్మెల్యే రామచంద్రన్ తెలిపారు. ఆదివారం డెంకణీకోటలో వెయ్యి మందికి ఎమ్మెల్యే ఇంటిపట్టాలు అందజేశారు. ఇళ్లు కట్టుకోవడానికి ఆర్థిక స్థోమత లేదని, ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని పట్టాలందుకున్న మహిళలు ఎమ్మెల్యేను కోరారు. అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డెంకణీకోట తహసీల్దార్ గంగై, యూనియన్ కౌన్సిలర్లు ప్రశాంత్, జగదీశ్, చెన్నీరప్ప, నెక్సల్, కృష్ణన్, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శ్రీపుట్టలింగేశ్వరస్వామి రథోత్సవం

యళచేపల్లి, (బేరికె), న్యూస్‌టుడే : శూలగిరి యూనియన్ యళచేపల్లిలో పార్వతీ శ్రీపుట్టలింగేశ్వరస్వామి రథోత్సవం భక్తజనాల మధ్య వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త సాధు మాత వెంకటమ్మ ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. బేరికెలోని ప్రసన్న పార్వతీ కైలాసనాథస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

రథంపై ఊరేగుతున్న దేవదేవుడు

నంజుండేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

డెంకణీకోట, న్యూస్‌టుడే : డెంకణీకోట, కెలమంగలం, అంచెట్టి, తళి, రాయకోట ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడింది. డెంకణీకోట నంజుండేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. శివానంజుండేశ్వరస్వామి, సిద్ధలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి కన్నుమూత

హోసూరు, న్యూస్‌టుడే : తెలుగు భాషావికాసానికి, తెలుగు సంస్కృతిని పరిరక్షించడానికి అనేక పోరాటాలు చేసిన మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.కోదండరాయ్య కుమారుడు విశ్రాంత ఉపాధ్యాయుడు కె.ఎస్.గోపాలకృష్ణయ్య (86) ఆదివారం రాత్రి కన్ను మూశారు. ఆంధ్ర సాంస్కృతిక సమితి అధ్యక్షుడు విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. లోక్‌సభ సభ్యుడు కె.గోపినాథ్, మాజీ ఎమ్మెల్యే కె.ఎ.మనోహరన్, విశ్రాంత విద్యాధికారి ఐ.కెంపన్న, మాజీ మంత్రి పి.బాలకృష్ణారెడ్డి, భాజపా నాయకుడు నాగరాజ్, పారిశ్రామికవేత్త బాలకృష్ణన్, కాంగ్రెస్ నాయకుడు ఎస్.ఎ.మురళీధరన్, ఆంధ్ర సాంస్కృతిక సమితి సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.



గోపాలకృష్ణయ్య

తిరుమలగిరిలో పూజిస్తున్న దేవెగౌడ

శివలింగానికి పూజ చేస్తున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

లింగాలను పూజిస్తున్న మహిళలు

మహాకాళేశ్వరుడు

భక్తుల క్షీరాభిషేకం

శివుడి అలంకారంలో నల్లనయ్య

దివినంటిన శివనామ ఘోషలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : మహాశివరాత్రి పర్వదినాన తెల్లవారుజామున సూర్యోదయానికి ముందే హరహరమహాదేవ..శంభోశంకర..పాపహరంకరా పిలుపులు, భక్తుల హృదయాంతరాళాల నుంచి వెలువడిన స్తోత్ర పఠనాలు మిన్నంటాయి. బలమురి శేషమహాగణపతి దర్శనానికి 15 వేలమంది భక్తులు హాజరయ్యారు. మంగళూరులో మంగళా దేవి భక్తులకు అర్ధనారీశ్వరిగా దర్శన భాగ్యం కల్పించగా..గవిపురం గుట్టహళ్లిలో బండేమహాకాళి, మహాకాళేశ్వర సర్వాలంకార, సర్వాభరణ సుందరులుగా భక్తులను ప్రసన్నులను చేశారు.



కెంగేరిలో భారీ శివలింగం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మహాశివరాత్రి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు మాజీ ప్రధాని దేవెగౌడ జేపీనగర రెండో స్టేజిలోని తిరుమలగిరి దేవస్థానంలో శివలింగానికి పూజలు, పాలాభిషేకం నిర్వహించారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరారు. బెళగావిలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం ఏర్పాటు చేసిన మహాశివరాత్రి దర్శన కార్యక్రమాన్ని స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ప్రారంభించి పూజలు చేశారు. అక్కడ శివలింగాలను ప్రదర్శించారు.

బెంగళూరు (కెంగేరి) : కెంగేరి ఉపనగరంలోని గణేశ ఆటల మైదానంలో మహాశివరాత్రి ధార్మిక సంబరాల పండగ అంబరాన్నంటింది. ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ నేతృత్వంలో పవిత్ర కేదారనాథ ఆలయం ప్రతిరూపాన్ని నిర్మాణం చేశారు.

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి) : దాసరహళ్లి కెంపేగౌడ నగరలో శివాలయ సేవాసమితి ట్రస్టు ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు శివున్ని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మునిరాజు, సుజాత దంపతులు దర్శనం చేసుకున్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యే దంపతులకు ప్రసాదం అందజేశారు. మత్తికెరె సమీపంలోనే జె.పి.పార్కు మైదానంలో ఎమ్మెల్యే మునిరత్న నేతృత్వంలో ఏర్పాటు చేసిన భారీ శివుడి విగ్రహాన్ని భక్తులు దర్శించుకున్నారు.

వేడుకల్లో రూపంజోశి, గుణరంజన్‌శెట్టి తదితరులు

బెంగళూరు (కెంగేరి) : చామరాజనగర హనూరు తాలూకా మలేమహదేశ్వర కొండలో మహాశివరాత్రి వేడుకలను ఆదివారం వైభవంగా ఆచరించారు. వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్రతో వేలసంఖ్యలో భక్తులు విచ్చేసి మహదేశ్వరుడిని దర్శించుకొన్నారు. ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ సతీమణి మహదేశ్వరుడి దర్శించుకొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాలూరు మఠంలో సాలూరుశ్రీ ఉషా శివకుమార్‌కు ఫలతాంబూలం, జ్ఞాపికను అందించి ఆశీర్వదించారు. నగరంలోని కాడుమల్లేశ్వర ఆలయంలో గిరిజా కల్యాణం జరిపించారు. సోమవారం బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు.

ముళబాగిలు : కోలారు పట్టణ సోమేశ్వర దేవాలయం, శ్రీనివాసపుర తాలూకా కేజీఎఫ్ తాలూకాలో వరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి మునియప్ప, ఎమ్మెల్యే రూపశశిధర్, ఆర్యవైశ్య బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మాలూరులో జరిగిన శివరాత్రి పూజల్లో మాలూరు ఎమ్మెల్యే వై.నంజేగౌడ పాల్గొన్నారు.

చిత్రదుర్గ : ఇష్టలింగ పూజతో ఆత్మశుద్ధి చేసుకోవచ్చని దావణగెరె విరక్త మఠం పీఠాధిపతి బసవప్రభు స్వామి పేర్కొన్నారు. ఆదివారం ఇక్కడి శివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఇష్టలింగ పూజ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేవాలయాలకు పోవడానికి బదులుగా స్వగృహాల్లోనే శివారాధన చేసుకోవచ్చన్నారు.

పావగడ : శివరాత్రి పండగ పురస్కరించుకొని పట్టణం, తాలూకాలోని ఈశ్వరుడి దేవాలయాలు భక్తుల ఉదయం నుంచి బారులు తీరారు. శివుడి భక్తులు, మహిళలు ఉపవాసంతో ఈశ్వరుడిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో విశేష పూజలాచరించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలో పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

బెంగళూరు (కెంగేరి) : ఉడుపి శ్రీకృష్ణమఠంలో శివరాత్రి నేపథ్యంలో భక్తులకు శ్రీకృష్ణుడు హరిహరుడిగా దర్శనం ఇచ్చాడు. ఆదివారం శిరూరు పర్యాయంలో ఆలయంలోని మూలవిగ్రహం నల్లనయ్య హరిహరుడిగా అలంకరించారు. వివిధ రకాల కుంకుమ, త్రిశూలం, డమరుకం, తలలో అర్ధచంద్రుడు ప్రతిష్ఠ ముగ్ధం చేశారు. ఉడిపికి విచ్చేసిన భక్తులు, స్థానికులు ఆ భగవంతుడి అలంకారాన్ని చూసి ఆనందించారు.

జె.పి.పార్కు మైదానంలో భారీ శివుడి ప్రతిమ

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : మహాలింగేశ్వర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో హెచ్ఎఎల్ మూడో స్టేజీ శివగ్రహ పూర్ణప్రజ్ఞ ఆట మైదానంలో మహాశివరాత్రి మహోత్సవాన్ని ఘనంగా ఆచరించారు. ట్రస్టు అధ్యక్షుడు శ్రీకెర్రపోడి గుణరంజన్‌శెట్టి మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి భక్తుల సహకారంతో వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది ఉజ్జయిని తరహాలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం శివలింగం ప్రాణప్రతిష్ఠ చేశారు. ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయ ప్రధాన అర్చకుల రూపజోశి బృందం శివలింగానికి పూజలు చేశారు.

కెంగేరిలో శివపార్వతులు

సాలూరుశ్రీతో ఫలతాంబూలాన్ని స్వీకరిస్తున్న ఉషాశివకుమార్

కమ్మసంద్రలో పూజలు చేస్తున్న మంత్రి మునియప్ప, ఎమ్మెల్యే రూపశశిధర్,తదితరులు

శివుడికి ప్రత్యేక అలంకారం

చిత్రదుర్గంలో ఇష్టలింగ పూజల్లో భక్తులు

పావగడలో రామలింగేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయి..

బెంగళూరు శివానంద కూడలి సమీపాన నిర్మాణంలో ఉన్న భవంతికి కాంక్రీటు అందించేందుకు వచ్చిన ఒక మిక్సర్ లారీ.. రహదారి భద్రకు ఉద్దేశించిన రెయిలింగ్ కింద శుక్రవారం ఇరుక్కుపోయింది. కుమారకృప రోడ్డులో రైల్వే అండర్ పాస్ దిగువన ఎత్తుగా ఉన్న వాహనాలు రాకుండా రైల్వే శాఖ దీన్ని ఏర్పాటు చేసింది. దాన్ని పట్టించుకోకుండా డ్రైవరు ముందుకు రావడంతో వాహనం దెబ్బతింది. వెనక్కు తీయడం సాధ్యం కాకపోవడంతో టైర్లలో గాలి తగ్గించి, వాహనాన్ని వెనక్కు తీసుకువెళ్లారు. ఈ ప్రమాదంతో ఈ మార్గంలో అరగంటకు పైగా వాహన సంచారం అస్తవ్యస్తమైంది. **(న్యూస్‌టుడే, సదాశివనగర)**

బిలమార్గానికి అడ్డుగా బ్యారికేడ్

బీఎంటీసీ బస్టాండ్ సమీపంలోని పాదచారి మార్గంలోని బిలమార్గంపై ఉన్న మూత దొంగలపాలైంది. రాత్రుళ్లు నడుస్తూ కొందరు గుంతలో పడి గాయపడడంతో ట్రాఫిక్ పోలీసులు దానికి అడ్డుగా బ్యారికేడ్‌ను ఉంచారు. పాదచారిమార్గాల్లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మూతలు దొంగల పాలు కాకుండా, తాళం ఉండేలా అమర్చాలని స్థానిక దుకాణదారులు కోరారు. **- న్యూస్‌టుడే, బెంగళూరు (గాంధీనగర)**

వీధివ్యాపారులకు గుర్తింపు కార్డుల పంపిణీ

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : సీవీ రామన్ నగర విధానసభ నియోజకవర్గం పరిధిలోని వీధి వ్యాపారులకు స్థానిక శాసనసభ్యుడు ఎస్.రఘు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా వారికి ఆహార సామాగ్రిలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు ఉపాధి కోసం వీధివ్యాపారం చేపడతారని తెలిపారు. స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే విధంగా గుర్తింపు కార్డులు ఉపయోగకరంగా ఉంటాయని తెలియజేశారు. ప్రాధికార అధికారులు సూచించిన ప్రదేశంలో వీధి వ్యాపారులు తమ వ్యాపారం చేసుకోవాలని సూచించారు.

వీధి వ్యాపారులకు ఆహార సామాగ్రి, గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే ఎస్.రఘు పంపిణీ చేశారు

సంచారానికి రైల్వే వంతెన సిద్ధం

నగరంలోని బెనగానహళ్లి రైల్వే కింద వంతెన నిర్మాణ పనులు పూర్తి చేశారు. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని రైల్వే అధికారులు తెలిపారు. వంతెన ప్రారంభమైతే బెనగానహళ్లి నుంచి పాత మద్రాసు రహదారి సంచరించే వాహనాలకు అనుకూలమవుతుంది. సమయం, ఇంధనం ఆదా కానుంది. బెనగానహళ్లి నుంచి పాత మద్రాసు రహదారి తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు మధ్యలో రైలు పట్టాలు దాటి సంచరించాలి. ఐదేళ్ల కిందట కింద వంతెన పనులను ప్రారంభించి ఇప్పుడు ముగించారు. వంతెన ప్రారంభమైతే వాహన సంచార సమస్య అదుపులోకి వస్తుందని అధికారులు తెలిపారు. విశ్వేశ్వరయ్య రైల్వే టర్మినల్ వెళ్లే ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. - **న్యూస్‌టుడే, బెంగళూరు (బాణసవాడి)**

తీగల తొలగింపు వేగవంతం

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో అక్రమ ఓఎఫ్‌సీ కేబుల్ తీగలను తొలగింపు ప్రక్రియకు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) శ్రీకారం చుట్టింది. పాదచారులు, వాహనదారులకు అడ్డంగా మారిన తీగలను గుర్తించి తొలగించడం ప్రారంభించారు. మరోవైపు తీగలు వేసేందుకు ప్రాధికార విధించిన మొత్తం చెల్లించకుండా అక్రమంగా తీగలు బెస్కాం విద్యుత్తు స్తంభాలు, నివాసాలు, చెట్ల మీదగా పరిసరాలకు హాని కలిగించే విధంగా ఉన్న తీగలను కత్తిరిస్తున్నారు. పది కిలోమీటర్ల వరకు తీగలు లాగేందుకు ప్రాధికార వద్ద అనుమతులు తీసుకుని అక్రమంగా 50 కిలోమీటర్ల వరకు లాగిన తీగలను గుర్తించి తొలగించడం ప్రారంభించారు. ఐటీబీటీ ప్రదేశంగా గుర్తింపు పొందిన మహదేవపుర, వైట్‌ఫీల్డ్, బెళ్లందూరు, సర్జాపుర, కుందనహళ్లి, బీఈఎంఎల్ లేఅవుట్, దొడ్డనెక్కింది, వర్తూరు తదితర ప్రాంతాల్లో అక్రమ కేబుల్ తీగలను తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో తొలగించినా మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా తీగలు వేసినట్లు గుర్తించారు. వారం నుంచి ఇప్పటి వరకు వంద కిలోమీటర్ల మేరకు తీగలను తొలగించి వాటిని ఆయా నగర పాలికె కార్యాలయాలకు తరలించినట్లు తెలిపారు. తీగలను తొలగించడంతో ఆయా ప్రాంతాల్లో అంతర్జాలం సమస్య నెలకొంది. అధికారులు ఒత్తిళ్లకు తొలగకుండా తీగలను తొలగిస్తున్నారు. వచ్చే రూ.ఐదు వందల కోట్లు ఆదాయానికి అక్రమ తీగలు గండికొడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రైవేట్ టెలికాం సంస్థలకు నోటీసులు పంపించినా స్పందించక పోవడంతో తీగలు తొలగింపు పనులు చేపట్టారు. అంతర్జాలం ఎక్కడ వినియోగం ఎక్కువగా ఉంటుందో అక్కడ అక్రమ కేబుళ్ల ఉంటాయని ఆయా ప్రాంతాలను గుర్తించి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు అధికారులు వివరించారు.

బెళ్లందూరులో తీగలను కత్తిరిస్తున్న పాలికె సిబ్బంది

విద్యుత్తు స్తంభాలపై తీగల తొలగింపు

బాస్కెట్‌బాల్ విజేత జైన్ విశ్వవిద్యాలయం జట్టు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : అఖిల భారత అంతర విశ్వవిద్యాలయం మహిళల బాస్కెట్‌బాల్ పోటీలో ఆతిథ్యం వహించిన జైన్ విశ్వవిద్యాలయం జట్టు ఛాంపియన్‌గా జ్ఞాపికను సొంతం చేసుకొంది. జైన్ క్యాంపస్‌లో ముగిసిన ఫైనల్స్‌లో జైన్ జట్టు 74-51 పాయింట్ల తేడాతో పంజాబ్ విశ్వవిద్యాలయం జట్టుపై విజయం సాధించింది. వరస విజయాలతో విజేత జట్టుకు సియా 17, నామీ 16 పాయింట్లను సాధించారు. మూడో స్థానం కోసం జరిగిన పోటీలో ఎస్ఆర్ఎం జట్టు 82-58 పాయింట్ల తేడాతో ఎన్ఐపీఈ జట్టుపై గెలుపొందింది. ముగింపు కార్యక్రమంలో జైన్ క్రీడా విభాగం డైరెక్టర్ యు.వి.శంకర్, జట్టు మేనేజర్ లోకేశ్, కోచ్ సురేశ్ పాల్గొన్నారు.

ట్రోఫీతో ఛాంపియన్ జట్టు క్రీడాకారిణులు

తాగునీటి సరఫరాలో రాజీ పడొద్దు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : తాగునీటి సరఫరాలో రాజీ పడకూడదని జిల్లాధికారి జి.ప్రభు అధికారులకు సూచించారు. రైతులకు పంట నష్టపరిహారం, పంటబీమా పరిహారం, ప్రభుత్వం నుంచి రావలసిన పథకాలు, ప్రయోజనాలకు సంబంధించి అలసత్వం వద్దని సూచించారు. జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో సహా జిల్లాలోని ఏ ప్రాంతంలోనైనా ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బంది రాకూడదన్నారు. ట్యాంకర్లతో నీటి సరఫరాతో పాటు గొట్టం బావుల యజమానుల సాయంతో నీటిని యుద్ధప్రాతిపదికన అందించాలని సూచించారు. గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు జిల్లాలో వర్షపాతం 735 మి.మీ. ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో తాగునీటికి కొరత రావచ్చని అంచనా వేశామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 13 గ్రామాలు, 24 వార్డుల్లో తాగునీటికి సమస్య ఉందని చెప్పారు. సమావేశంలో ఎస్పీ కుశాల్ చౌక్సే, అదనపు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎన్.భాస్కర్, సబ్ డివిజనల్ అధికారి డీహెచ్ అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాధికారి

సామూహిక స్వచ్ఛత పనులు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) పరిధిలోని కేంద్ర నగర పాలికె పారిశుద్ధ్య కార్మికులు సామూహిక స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చామరాజపేటలోని 6.1 కిలోమీటర్ల రహదారి, పాదచారి మార్గాన్ని శుభ్రం చేశారు. ఈ పనుల్లో 218 మంది కార్మికులు పాల్గొన్నారు. సేకరించిన చెత్తను ట్రాక్టర్లతో తరలించారు. సామూహిక స్వచ్ఛత కార్యక్రమం ద్వారా 19 బ్లాక్ స్పాట్స్‌లో ఉన్న చెత్తకుప్పలను తొలగించారు. చామరాజపేటతో పాటు చిక్కపేట, గాంధీనగర, శాంతినగర, శివాజీనగర, సీవీరామన్‌నగర విధానసభ నియోజకవర్గాల్లో స్వచ్ఛత పనులు చేపట్టినట్లు కమిషనర్ రాజేంద్రచోళన్ తెలిపారు. పోగు చేసిన చెత్తను ట్రాక్టర్లతో అప్పటికప్పుడు డంపింగ్ యార్డులకు తరలించినట్లు వెల్లడించారు. వారానికోసారి సామూహిక స్వచ్ఛత పనులు చేపడతామని తెలిపారు.

పాదచారిమార్గంపై మట్టి తొలగిస్తున్న కార్మికులు

మాదక పోలీసుఠాణాలో..

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : శాంతిభద్రతలను కాపాడుతున్న పోలీసులు తాము విధులు నిర్వహిస్తున్న పోలీసుఠాణాల ఆవరణాల్లో స్వచ్ఛత పనులు చేపట్టారు. నగరంలోని మాదనాయకనహళ్లి పోలీసుఠాణా ఆవరణలో ఉన్న నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలను శుభ్రం చేసి వాటిని క్రమంగా ఉంచారు. అనంతరం ఆవరణలో ఉన్న చెత్త తొలగించారు. చీపుర్ల చేతపట్టి ఊడ్చి శుభ్రం చేశారు. మొన్నటి వరకు అశుభ్రంగా ఉన్న పోలీసు ఠాణాను పరిశుభ్రంగా మార్చారు. విషపురుగుల బెడద ఉండదని, శుభ్రత వల్ల పోలీసుఠాణా ఆవరణలో మార్పు వచ్చిందని అధికారులు తెలిపారు.

ఆవరణను శుభ్రం చేస్తున్న పోలీసులు

వివాహిత ఆత్మహత్య

ముళబాగిలు, న్యూస్‌టుడే : తాలూకాలోని బైరకూరు గ్రామంలో చైత్రా (20) అనే మహిళ ఆదివారం విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అనేకల్ సమీపంలోని బొమ్మసంద్ర గ్రామానికి చందిన బాలకృష్ణ మూడేళ్ల క్రితం చైత్రాను వివాహం చేసుకున్నాడు. బాలకృష్ణ వేరే మహిళతో సంబంధం కలిగి ఉన్నాడని ప్రశ్నించినందుకు ఆత్మహత్యకు ప్రేరేపించారని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. భర్త బాలకృష్ణ, సుధమ్మ, మరో మహిళ భాగ్యలను నంగలి పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

సమాజ సేవకుడికి కళాభూషణ్ ప్రశస్తి

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : సమాజసేవకుడు, ఆప్తసేవా ట్రస్టు అధ్యక్షుడు జిగ్గిణి బి.ఎన్. రాజశేఖర్‌కు కళాభూషణ్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 ఏళ్ళుగా అనేక రంగాల్లో ఉత్తమ సేవలందించామని, తమ ఆప్త సేవాట్రస్టు ద్వారా కరోనా సమయంలో నిత్యావసరాలు, దుప్పట్లు, అన్నదానం చేశామన్నారు . తన సేవలను గుర్తించి సేవారత్న, కళాభూషణ్ అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా సేవ లందించాలన్నారు. సమాజాభివృద్ధికి నిరంతరం కృషిచేయాలన్నారు. వివిధ సంస్థల నిర్వాహకులు, అభిమానులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకుంటున్న రాజశేఖర్, తదితరులు

మూఢ నమ్మకాలపై పోరాడిన సంత్ సేవాలాల్

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : సమాజంలో చోటు చేసుకొన్న మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రజల్లో చైతన్యం నింపడానికి కృషి చేసిన ఘనత అధ్యాత్మిక గురువు సంత్ సేవాలాల్‌కే దక్కుతుందని జిల్లా సహాయక కమిషనర్ కాంతరాజ్ పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో సేవాలాల్ చిత్రపటానికి పూలహారం వేసి నివాళులర్పించారు. అఖిల కర్ణాటక బణజార గురుపీఠాధిపతి నందమసంద్ సేవాలాల్ స్వామి, నగరాభివృద్ధి సంస్థ అధ్యక్షులు తాజ్‌పీర్, తహసీల్దార్ తాజ్ పీర్, కన్నడ సంస్కృతి శాఖ సహాయక డైరెక్టర్ గుర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పుష్పార్చన చేస్తున్న కాంతరాజ్ తదితరులు

రైల్వే ప్రయాణికులకు జాగృతి

బెంగళూరు (కెంగేరి) : రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది, మండ్య రైల్వే విభాగం ఆధ్వర్యంలో ప్రమాదాలు సంబంధించినపుడు, ఇతర భద్రతా అంశాలపై జాగృతి కల్పించారు. ఏఎస్ఐ బసవరాజ్ హుట్టార్, నవ్య నేతృత్వంలో నిర్వహించిన జాగృతిలో రైలు కిటికీల పక్కన నిద్రించే ప్రయాణికులను లేపి దొంగలున్నారని భద్రత గురించి హెచ్చరించారు. రైలు పట్టాలను దాటడం, పట్టాలపై బయలుదేరుతున్న రైళ్లను ఎక్కడం అత్యంత ప్రమాదకరమన్నారు. ఫుట్‌బోర్డ్‌పై ప్రయాణం, లగేజీల జాగ్రత్తలపై చైతన్యం కల్పించారు. రైలు ప్రయాణికులు నియమాలను ఖచ్చితంగా పాటించి బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. మండ్య ఏఎస్ఐ శ్రీకృష్ణ, నవ్య, మండ్య ఆర్‌పీఎఫ్ అధికారి గోవిందరాజు, డి.ఎం.సురేశ్, ఎం.కె. ప్రశాంత్ పాల్గొన్నారు.

కిటికీల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

పెరుగుతున్న ఉష్ణోగ్రత

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : రాష్ట్రంలో వేసవి ప్రారంభం కాకముందే నిదానంగా చలి తగ్గి పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తెల్లవారుజాము చలి ఎక్కువగా ఉంటుంది. కరావళి, కల్యాణ కర్ణాటక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అన్ని జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత 32 డిగ్రీలు ఉన్నట్లు తెలియజేశారు. కరావళి జిల్లాలో 35 డిగ్రీలకు పైగా, బెంగళూరు నగర, బెంగళూరు గ్రామీణ, బెంగళూరు దక్షిణ జిల్లాలో పగటి ఉష్ణోగ్రత 33 డిగ్రీలుగా నమోదైంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో వేడి ఎక్కువ అవుతుందని హెచ్చరించారు. ప్రస్తుత ఉష్ణోగ్రత కన్నా నాలుగు నుంచి ఐదు శాతం కొన్ని ప్రాంతాల్లో పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

దర్గాలో శివపూజ

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : కలబురగి జిల్లా ఆళంద పట్టణంలో వివాదాస్పదంగా ఉన్న లాడ్లెమశాన్ దర్గాలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం అక్కడ ఉన్న శివలింగానికి పూజలు నిర్వహించారు. కలబురగి ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కేవలం 14 మంది పూజలు నిర్వహించేందుకు జిల్లాధికారులు అనుమతించారు. పూజ చేసేందుకు వెళ్లే వ్యక్తులు చరవాణి, కెమెరాలు తదితర వాటిని తీసుకువెళ్లకుండా నిషేధించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు 14 మందికి మాత్రమే దర్గాలోకి వెళ్లి పూజలు నిర్వహించేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు. దర్గా చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పట్టణంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగదేవతలకు పూజలు

పండ్లు పంపిణీ చేస్తున్న ముస్లిం మహిళలు

శివపార్వతుల కల్యాణం

కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

నమో భూతనాథ..నమో దివ్యతేజ

రాయచూరు, న్యూస్‌టుడే : మహాశివరాత్రి పర్వదినాన జిల్లాలోని శైవక్షేత్రాలు ఓంకారనాదంతో ప్రతిధ్వనించాయి. శివనామస్మరణతో మార్మోమోగాయి. హరహర మహదేవ. . శంభోశంకర ఘోషణలతో హోరెత్తాయి. శనివారం అర్ధరాత్రి నుంచి ఆలయాలకు భక్తుల పోటెత్తారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం నుంచి రాత్రి వరకు బారికేడ్లు భక్తులతో నిండిపోయాయి. కుటుంబ సమేతంగా తరలివచ్చారు. శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు చేసి పరవశులయ్యారు. మహాదేవుడికి ఎదురుగా ఉన్న నందులు, నాగలకట్టలకు పూజలు చేశారు. ఇతర దేవతామూర్తులను దర్శించుకున్నారు. రాయచూరులోని నందీశ్వర, చంద్రమౌళేశ్వర ఆలయాలు కిక్కిరిశాయి. దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. భక్తులకు తాగునీటి సీసాలు అందజేశారు. ముస్లింలు పండ్లను పంపిణీ చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు. ఇస్కాన్ సంస్థ భగవద్గీత పుస్తకాల ప్రదర్శన ఏర్పాటు చేసింది. చంద్రమౌళేశ్వర దేవస్థానానికి భక్తులు అసంఖ్యాకంగా తరలివచ్చారు. మధ్యాహ్నం కూడా రద్దీ తగ్గలేదు. మహిళలు నవగ్రహాలు చుట్టూ ప్రదక్షణ చేశారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం కన్నుల పండువుగా జరిగింది. భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా సంస్థల ప్రతినిధులు సేవలందించారు. రామలింగేశ్వర, ఈశ్వర, వీరభద్రేశ్వర, రాయచూరు తాలూకాలోని సూగూరేశ్వర దేవస్థానాలు సందడిగా మారాయి. స్థానిక కిల్లే బృహన్మఠంలో స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు అభిషేకం చేశారు. సాయంత్రం దర్శనమయ్యాక ఉపవాసకులు సూర్యాస్తమయం తర్వాత దీక్షను విరమించారు. పండగ రోజు పండ్లు, పూలూ కొనుగోలుకు వచ్చిన వారితో మార్కెట్ ప్రాంతాలు కిటకిటలాడాయి.

కిల్లేర బృహన్మఠంలో అభిషేకం

అత్తనూరు క్యాంపులో ఓంకారేశ్వరుడు

మాన్విలో శోభిల్లుతున్న శివుడు

స్ఫటిక లింగ దర్శనం చేసుకొని వస్తున్న భక్తులు

మాన్వి : పట్టణంలోని నగరేశ్వర, మల్లికార్జున, నీలకంఠేశ్వర, ధ్యానమందిరం, ఓంకార శక్తి మండలి, ఈశ్వర దేవస్థానాలతో బాటు తాలూకాలోని వివిధ క్యాంపులు, గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. భక్తులు కుటుంబ సమేతంగా ఉదయాన్నే ఆలయాలకు తరలివచ్చారు. అర్చకుల సాన్నిధ్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈశ్వరుడికి అభిషేక పూజలు చేయించుకున్నారు. దేవస్థానాల వద్ద ఆలయ సేవా సమితులు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. దేవస్థానాల్లోని శివుడి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ ప్రాంగణాలు హర హర మహాదేవ్, శంభోశంకర అంటూ మారుమోగాయి.

సింధనూరు : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శివుని దర్శనం కోసం పోటెత్తిన భక్తజనంతో సింధనూరు తాలూకా గాంధీనగర్‌లోని శ్రీ విశ్వేశ్వర పంచాయతన క్షేత్రం కిటకిటలాడింది. ఆలయ ప్రాంతం అంతా శివనామస్మరణతో మారుమోగింది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే భక్తుల తాకిడి అధికమైంది. లక్ష లింగాల మహాగిరిలోని స్ఫటికలింగ దర్శనం ఉదయం ఆరు గంటల నుంచి ఆరంభించారు. ఏడాది శివరాత్రి వార్షికోత్సవం కావడంతో లక్షలింగాల ఆలయం వెలుపల శివలింగానికి 12 నదుల నుంచి సేకరించి తెచ్చిన పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. అశేష జనం భక్తితో తిలకించారు. ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లా మండవల్లికి చెందిన వేద పండితుడు చాగంటిపాటి శ్రీనివాసశర్మ చేతుల మీదుగా కైంకర్యాలు జరిగాయి. ఆలయ అధ్యక్షుడు ముళ్లపూడి భాస్కరరావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

రాయచూరు : రాయచూరు నగరం సవితా సమాజం ప్రముఖులు ఆదివారం మడ్డిపేట సవితానగర్ శంఖుచక్ర మారుతి దేవస్థానంలోని శివయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. లింగానికి గంగపూజ, అభిషేకం చేయించారు. సంకల్పం చెప్పుకున్నాక మహామంగళ హారతి పట్టారు. ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురిపించేలా, వ్యవసాయ దిగుబడులు పుష్కలంగా సాధించాలే కరుణించాలని దేవదేవుడిని ప్రార్థించామని నగరాధ్యక్షుడు వి.గోవిందు తెలిపారు. ప్రతినిధులు రాఘవేంద్ర ఇటగి, గూళ్యం ఆనంద్, భీమేశ్, నాగరాజ్, రఘుకుమార్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానమందిరంలో కోటిలింగాలకు పూజలు

హారతి ఇస్తున్న దృశ్యం

పాత్రికేయులకు శిక్షణా శిబిరం

రాయచూరు, న్యూస్‌టుడే : రాజ్యాంగం, పత్రికోద్యమంలో మార్పులు, నిజానిజాల పరిశీలన, పత్రికల్లో వాడాల్సిన భాష గురించి మైసూరు విభాగం పాత్రికేయులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 27న శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తారు. మైసూరు, మండ్య, హాసన, చామరాజనగర్, కొడగు, చిక్కమగళూరు, దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లా పాత్రికేయులు గూగుల్ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కర్ణాటక మాధ్యమ అకాడమీ అధ్యక్షురాలు ఆయేశాఖానం సూచించారు. ఆసక్తి కలిగిన విలేకరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రసాయన ట్యాంక్ పేలి ఇద్దరి మృతి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రసాయన ట్యాంకర్ పేలి ఇద్దరు కార్మికులు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం మండ్య సమీపంలోని బసరాళు- కారెకట్ట గ్రామంలో కెర్రీ రసాయన కంపెనీలో జరిగింది. కారెకట్ట నుంచి ఆ కంపెనీని వేరే ప్రదేశానికి తరలిస్తున్నారు. బిహార్ కార్మికులు రసాయనాలతో కూడిన ట్యాంకర్‌ను తరలిస్తున్న సమయంలో పేలి ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నాలుగేళ్ల కిందట ఈ కంపెనీలో రసాయనం పేలుడు జరిగింది. స్థానికులు కంపెనీ వద్దని ఆందోళనలు చేపట్టారు. నాశనమైన పంటకు మండ్య జిల్లా యంత్రాంగం రైతులకు పరిహారం అందించింది. ఈసారి కంపెనీని వేరే ప్రాంతానికి తరలిస్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. బసరాళు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నీటితొట్టెలో పడి చిన్నారి..

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: గర్భిణి ఫోటోషూట్ చేస్తున్న సమయంలో ఆడుకుంటున్న గడ్డెనహళ్లి నివాసి బాలుడు లక్ష్మీశ్(3) నీటి తొట్టెలో పడి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం మాదనాయకనహళ్లి పోలీసురాణా పరిధిలో జరిగింది. గర్భం దాల్చిన తల్లి స్వాతి తన మొదటి బిడ్డ లక్ష్మీశ్ ఏమి చేస్తున్నాడో గమనించకుండా ఫోటోషూట్‌లో మునిగిపోయారు. అక్కడ చిన్న నీటి కొలను ఉంది. ఆడుకుంటూ వెళ్లిన బాలుడు అందులో పడి మృతి చెందాడు. బాలుడు నీటిలోపడిన విషయాన్ని తల్లి ఆలస్యంగా గ్రహించి బయటకు తీసి చికిత్స కోసం నెలమంగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

భద్రానదిలో మునిగి ఇద్దరి విషాదాంతం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే : చిక్కమగళూరు జిల్లా కళస తాలూకా బాళెహొళె వద్ద ఉన్న భద్రా నదిలో మునిగి కొడగు నివాసులు యోగేశ్(17), అభిషేక్(23) అనే వ్యక్తులు మృతి చెందారు. ఈత రాక నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది నీటిలో గాలించి మృతదేహాలను బయటకు తీసుకొచ్చి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సిలిండర్ పేలి నవదంపతులకు గాయాలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : వంటగ్యాస్ సిలిండర్ పేలి నవదంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం ఉదయం యలహంక పోలీసుఠాణా పరిధిలోని చౌడేశ్వరి లేఔట్‌లో జరిగింది. బాగేపల్లి నివాసులు కృష్ణమ్మ, రాజు గాయపడినట్లు గుర్తించారు. విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు. ఉదయం ఆరుగంటలకు గ్యాస్ సిలిండర్ లీకై పేలి ఉండవచ్చని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పేలుడు ధాటికి ఇంటి గోడలు కూలిపోయాయి. ఘటనా స్థలాన్ని స్థానిక పోలీసులు పరిశీలించారు.

ప్రాచీన విగ్రహాల ధ్వంసం

బెంగళూరు (యశ్వంతపుర) : గదగ జిల్లా ముండగిరి తాలూకా శింగహళ్లి గ్రామంలో చోళులు నిర్మించిన ప్రాచీన శివాలయంలో ఉన్న శివలింగం, శివలింగప్రాణి, నందీశ్వరుడి విగ్రహాలను శనివారం రాత్రి నిందితులు ధ్వంసం చేసిన సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ముఖ్యమంత్రి నకిలీ సిఫార్సు లేఖ

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి పేరుతో నకిలీ బదిలీ లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న సంఘటనపై విధానసౌధ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ముఖ్యమంత్రి సంయుక్త కార్యదర్శి అరుణ్‌పుర్టాడో విధానసౌధ పోలీసుఠాణాలో ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి సచివాలయంలో నమోదు కాని లేఖను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో ఉంచి ముఖ్యమంత్రికి చెడ్డ పేరు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండ్య జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ మోహన్‌ను మైసూరు గ్రామీణ జిల్లా ఎక్సైజ్ శాఖ ఉప కమిషనర్‌గా బదిలీ చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు నిందితులు నకిలీ లేఖను సృష్టించారు. దీనిపై భాజపా నేతలు ప్రభుత్వ పరిపాలన గాడి తప్పుతోందనే దానికి లేఖ నిదర్శనమని మండిపడ్డారు. ఇలాంటి నకిలీ లేఖలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏఐ యుగంలో ఉన్నామని, తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ట్వీట్ చేశారు. మరోవైపు నకిలీ లేఖ సృష్టించిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ధర్మమార్గంలోనే శాంతి అభివృద్ధి సాధ్యం

దంపతులను సత్కరిస్తున్న స్వామీజీలు, నిర్వాహకులు

మాన్వి, న్యూస్‌టుడే : జాతి వర్గ మత విభేదాలకు అతీతంగా మఠాలు కృషి చేయాలని, సముదాయాలు భాగస్వాములు కావాలని కల్మఠ విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ పేర్కొన్నారు. కల్మఠ గారిగె జాతరలో ఆయన మాట్లాడారు. ధార్మిక కార్యక్రమాలు, ప్రవచనాలు జాతి, వర్ణ, ద్వేష, అసూయ రహిత సమాజ నిర్మాణానికి సహకరిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడిస్తే సమాజంలో శాంతి, అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సాధకుల సేవలను గుర్తించి వారిని కల్మఠం ప్రోత్సాహిస్తోందన్నారు. సింధనూరుకు చెందిన కారుణ్యాశ్రమం నిర్వాహకులకు శ్రీవిరూపాక్ష కృపాభూషణ పురస్కారాలు ప్రకటించినట్లు చెప్పారు. చెన్న బసవస్వామి, సుజాత దంపతులను సత్కరించారు.

21జంటలకు సామూహిక వివాహాలు

కల్మఠం ఆధ్వర్యంలో ధ్యానమందిరం వద్ద 21జంటలకు ఉచిత సామూహిక వివాహాలు జరిపించారు. వివిధ మఠాలకు చెందిన స్వామీజీలు, ప్రముఖులు దాంపత్య జీవితంలోకి అడుగిడుతున్న కొత్త దంపతులను ఆశీర్వదించారు. కల్మఠం విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ, నీలగల్ అభినవ శాంతమల్ల శివాచార్య, రాయచూరు మంగళవారపేట హిరే మఠం వీరసంగమేశ్వర స్వామీజీ, బళ్లారి సనాతన ధర్మ ప్రచారకురాలు అనురాధ, ప్రభురాజ్ కొడ్లి తదితరులు మాట్లాడారు.

నూతన వధూవరులు

28న ప్రతిభా ప్రోత్సాహకాల ప్రదానం

రాయచూరు, న్యూస్‌టుడే : మాదిగ సామాజిక వర్గం విద్యార్థుల ప్రతిభా ప్రోత్సహకాలను ఈ నెల 28వ తేదీ అందజేస్తామని నవరత్న యువక సంఘం అధ్యక్షుడు శరణప్ప తెలిపారు. పది నుంచి పీజీ వరకు పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వ్యక్తిగత చిరునామా, మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం నకళ్లు, రెండు పాస్ ఫోటోలను ఈ నెల 25 లోపు దళితవాడలోని నూతన హైటెక్ గ్రంథాలయంలో అందజేయాలని సూచించారు.

తాలూకా విలేకర్లకు బస్సు పాసులు

రాయచూరు, న్యూస్‌టుడే : సమాచారశాఖలో పేరు నమోదైన మాధ్యమ సంస్థలకు సంబంధించి తాలూకా స్థాయిలో పనిచేసే విలేకర్లకు ఉచిత బస్సు పాస్‌లు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సేవా ప్రమాణ పత్రం, సిఫార్సు లేఖ, 11 నెలల వేతన పత్రం లేక లైనేజ్, కమీషన్, గౌరవ వేతనం దాఖలాలు లేక జీతం జమ చేసిన బ్యాంకు స్టేట్‌మెంట్‌తో సేవా సింధు పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అప్‌డేట్ చేసిన దాఖలాలను జిల్లా సమాచారశాఖ కార్యాలయంలో అందజేయాలని వార్త, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హేమంత్ నింబాళ్కర్ ఒక ప్రకటనలో సూచించారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

మంజునాథ్‌నాయక్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న యువకులు

మాన్వి, న్యూస్‌టుడే : పుల్వామా దాడుల్లో ప్రాణాలు త్యాగం చేసిన 40 మంది వీరయోధుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ యోధుడు మంజునాథ్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు బసవరాజ్ మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడుల్లో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. వారిని స్మరించుకోవటం భారతీయుల కనీస బాధ్యతగా భావించాలన్నారు. వారి చేసిన ప్రాణత్యాగాలు వృథాకారాదన్నారు. వారి ఆశయ సాధనకి యువత కృషి చేయాలన్నారు. మాజీ సైనికుడు జెల్లి ఆంజినేయ, నేతాజీ శిక్షణ సంస్థ అధ్యక్షుడు కె.ఇ. నరసింహ, మహేష్‌నాయక్ బెట్టదూర్, అక్షయ్‌కుమార్ కోనాపూర్‌పేట, శరణబసవనాయక్ జానేకల్, గురురాజ్ నాగలాపూర్, ఆంజినేయ నస్లాపూర్, యువకులు పాల్గొన్నారు.

శివార్లలో దాహార్తి శివాలు

483 ప్రాంతాల్లో సమస్య తీవ్రం

తాగునీటి ఎద్దడి ప్రాంతాలకు బెంగళూరు జలమండలి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయిలో ఐటీ నగరిగా ఖ్యాతి పొందిన బెంగళూరు నగరంలో వేసవి ప్రారంభం కావడంతో శివార్లలో తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది. 483 ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొన్నట్లు బెంగళూరు జలమండలి అధికారులు గుర్తించారు. సమస్య పరిష్కరించేందుకు పలు చర్యలు చేపడుతున్నారు. కొత్తగా బోరుబావులు తవ్వించడం, పాడుపడిన బోరుబావులు మరమ్మతులు చేయించడం, చెరువు నీటిని శుద్ధీకరించడం, ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయడం, నీటి వృథా అరికట్టడం తదితర చర్యలు చేపడుతున్నారు. నగర శివార్లలో సమస్య తీవ్రమవుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వారు పూర్తిగా బోరుబావులపై ఆధారపడ్డారు. భూగర్భ జలాల మట్టం తగ్గడంతో అవి ఎండిపోతున్నాయి. దీంతో నీటి ఎద్దడి తీవ్రమవుతుందని తెలియజేశారు. ఏటా నగరంలో 1200 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతోంది. ఫలితంగా భూగర్భజలాల మట్టం పెరుగుతోంది. ఈ ఏడాది కేవలం 750 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో నీటి సమస్య తలెత్తినట్లు చెబుతున్నారు. పెరుగుతున్న నీటి ట్యాంకర్ల ధరలకు కళ్లెం వేసేందుకు పాలికె, జలమండలి సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాయి. త్వరలో ట్యాంకర్ల ధరలను నిర్ణయిస్తామని అధికారులు తెలిపారు. శివారు ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్‌లు ట్యాంకర్లపై ఆధారపడుతున్న విషయం తెలిసిందే.

అడుగంటిన బోరుబావులు

● నగరం పరిధిలో 16,781 బోరుబావులు ఉన్నాయి. వాటిల్లో 6,997 బోరుబావుల్లో చుక్కనీరు లేక ఎండిపోయాయి. మరో 2,823 బోరుబావులు ఎండే స్థితికి వస్తున్నట్లు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు ఉన్న చెరువులు చుట్టు పక్కల వేయి బావులు తవ్వించేందుకు పథకాలను సిద్ధం చేశారు. చెరువు పక్కన భూగర్భజలాల పుష్కలంగా దొరికే అవకాశం ఉన్నందు వల్ల బోరుబావులు వేసి అక్కడి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి ఎద్దడి ఉండే ప్రాంతాలకు సరఫరా చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం కావేరి జలాశయాల నుంచి నిత్యం 670 ఎంఎల్‌డీ నీటిని నగరానికి సరఫరా చేస్తున్నారు. నిల్వ చేసిన కావేరి నీటిని వారానికి రెండు సార్లు 14 లక్షల కుళాయిలకు సరఫరా చేస్తున్నారు.

నీటి సరఫరా ట్యాంకర్ల వద్ద సిబ్బంది

నీటి ఎద్దడి ఏర్పడటంతో ద్విచక్రవాహనంలో క్యాన్ నీరు తీసుకెళ్తున్న దృశ్యం

మానవతా విలువలను ప్రబోధించిన సేవాలాల్

రాయచూరు, న్యూస్‌టుడే : స్థానిక వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం పరిపాలన భవన్‌లో ఆదివారం సంత సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. చిత్రపటానికి ఉప కులపతి డాక్టర్ ఎం.హనుమంతప్ప పూలమాల వేసి అధికారులతో కలసి నివాళులర్పించారు. ఉపకులపతి మాట్లాడుతూ మానవతా విలువులను ప్రబోధించిన సేవాలాల్‌ను ఒక సామాజికవర్గానికి పరిమితం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. సత్యం, అహింసా మార్గాలతో దేనినైనా సాధించవచ్చని ఇచ్చిన సందేశాన్ని నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థి క్షేమాభివృద్ధి డీన్ సతీష్‌కుమార్ ప్రసంగిస్తూ బంజార సముదాయం దైవంగా భావించే సంత్ జయంతిని అంతా కలసికట్టుగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. సేవాలాల్ జీవిత చరిత్రను విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరముందన్నారు. అధికారులు మహదేవస్వామి, రాజణ్ణ, సహాయక అధ్యాపకుడు సురేశ్ వేదికను అలంకరించారు.

నివాళులర్పిస్తున్న ఉపకులపతి తదితరులు

ఘనంగా సేవాలాల్ జయంతి

ప్రారంభమైన ఊరేగింపు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం సంత్ సేవాలాల్ చిత్రపటంతో నగరంలో ఊరేగింపు జరిగింది. బసవేశ్వర కూడలి వద్ద రాయచూరు విభాగం కమిషనర్ డాక్టర్ పంపణ్ణ సజ్జన్ ప్రారంభించారు. లంబాడీ మహిళల, యువకుల నృత్యాలు, కళాకారుల ప్రదర్శనల మధ్య మెరవణి ఎల్ఐసీ విభాగం కార్యాలయం రహదారి, అంబేడ్కర్ కూడలి మీదుగా జయంత్యుత్సవం జరిగే రంగమందిరాన్ని చేరుకుంది. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణ శావంతగేరా, తాలూకా పంచాయతీ ఇవో చంద్రశేఖర్ పవార్, గ్రేడ్ 2 తహసీల్దార్ పరశురామ్, బంజార సామాజిక వర్గం పెద్దలు పాల్గొన్నారు.

సిరివార, (మాన్వి) : స్థానిక దేవదుర్గకూడలి వద్ద సజ్జలశ్రీ శరణమ్మ శాఖ మఠం ప్రాంగణలో సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్ ప్రారంభించి మాట్లాడారు. ప్రమాణికత జీవన మూల మంత్రమని చాటిచెప్పిన సంఘ సంస్కర్త సేవాలాల్ అన్నారు. సత్యం, దయ, కరుణ, ప్రమాణికతలని జీవితంలో ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన హితోపదేశమన్నారు. తాలూకాలోని వివిధ తండాలకు చెందిన లంబాడీలు భారీ ఎత్తున పట్టణానికి తరలివచ్చారు. నీటిపారుదల శాఖ కార్యాలయం నుంచి సభా వేదిక వరకు ఊరేగింపు నిర్వహించారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు హాజీచౌదరి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, సభ్యులు, స్థానిక ప్రముఖుల జాడలదిన్ని శరణప్పగౌడ, జి.లోకరెడ్డి, మల్లికార్జున పాటిల్, కృష్ణనాయక్, మౌనేశ్, రాము, శివరాజ్, రామాచారి, రాజు రాథోడ్, మంజుళా, శాంతప్ప పవార్, కమలప్పనాయ్క, శ్రీనివాస్‌నాయ్క, దేవేంద్రనాయ్క తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటప్పనాయక్

సీఐడీ కస్టడీకి భైరతి బసవరాజు

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: రౌడీషీటర్ శివకుమార్ అలియాస్ బిక్లుశివ హత్య కేసులో అరెస్టయినా శాసనసభ్యుడు భైరతి బసవరాజు నగర 46వ ఏపీఎంసీ న్యాయస్థానం వారంపాటు సీఐడీ కస్టడీకి అప్పగించింది. ఆరోగ్య పరీక్షలు చేసే సమయంలో ఈసీజీలో తేడా రావడంతో ఆయన జయదేవ ఆసుపత్రికి తరలించి ఐసీయూలో ఉంచి వైద్య పరీక్షలు వైద్యులు చేశారు. ఆంజియోగ్రాం నిర్వహించడంతో ఆయన ఆరోగ్యం బాగుపడింది. దీంతో ఆదివారం ఇక్కడ న్యాయమూర్తి బసవరాజును సీఐడీ పోలీసులు హాజరుపరిచారు. 14రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరారు. అందుకు న్యాయమూర్తి స్పందిస్తూ వారంపాటు సీఐడీ కస్టడీకి అప్పగించారు. ఆయనను సీఐడీ కార్యాలయానికి తీసుకువచ్చి విచారించడం ప్రారంభించారు. గత జులై 15న రాత్రి రౌడీషీటర్ శివకుమార్ హత్యకు గురయ్యాడు. తన కుమారుడి హత్య వెనక ఎమ్మెల్యే భైరతి బసవరాజు హస్తం ఉందని హతుడి తల్లి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఆయనను అరెస్టు చేసేందుకు సీఐడీ పోలీసులు ప్రయత్నించారు. సర్వోన్నత న్యాయస్థానం జామీను పిటిషన్‌ను తిరస్కరించడంతో గుజరాత్ నుంచి విమానంలో బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం రాగానే సీఐడీ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు.

(c) eenadu

మొక్కిన చేతుల పుణ్యం.. చూసిన కనులు ధన్యం

● కమనీయం.. భ్రమరాంబ, మల్లికార్జున స్వామి కల్యాణం



పాగాలంకరణలో మెరిసిపోతున్న ఆలయం

పాతాళగంగలో పుణ్య స్నానమాచరించారు.. ప్రభోత్సవం చూసి తరించారు.. నంది వాహన సేవలో పాల్గొని పులకించిపోయారు.. పాగాలంకరణ వీక్షించి పరవశించిపోయారు.. దేవదేవుల కల్యాణ వేడుకను కనులారా తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆదిదంపతుల బ్రహ్మోత్సవ కల్యాణం రాత్రి 12 గంటలకు మొదలైంది. వేదికపై ఉత్సవమూర్తులు కల్యాణశోభతో కొలువుదీరారు. అధికార యంత్రాంగం, భక్తజనులు బ్రహ్మోత్సవ కల్యాణ వేదిక ఎదుట ఆశీనులయ్యారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, వేదపండితులు, పరిచారకులు అంతా కలిసి భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవ కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీశైల మల్లన్న తన ఇష్టసఖి భ్రామరీతో కలిసి బ్రహ్మోత్సవంలో నవదాంపత్యశోభతో భక్తజనులకు సాక్షాత్కరించారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం, సున్నిపెంట సర్కిల్

కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులు

రమణీయం.. పాగాలంకరణ

కల్యాణానికి ముందు ఆదివారం రాత్రి 10 నుంచి 12 గంటల వరకు కొనసాగిన పాగాలంకరణ ఘట్టం భక్తజనులకు ఆధ్యాత్మికానుభూతిని కలిగించింది. పాగాలంకరణ క్రతువు ఓవైపు కొనసాగుతుండగానే గర్భాలయంలో మల్లికార్జునస్వామి మూలమూర్తికి అర్చకులు రాత్రి 10 నుంచి 1.30 గంటల వరకు లింగోద్భవకాల మహా న్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని శాస్త్రయుక్తంగా నిర్వహించారు.

నందీశ్వరా.. నమోస్తుతే

సుమధుర శోభిత పుష్పాలంకృతమైన నంది వాహనంపై ఆదిదంపతులు కొలువుదీరారు. అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. శివ నామస్మరణల మధ్య స్వామి, అమ్మవార్ల భక్తుల చెంతకు తరలొచ్చారు. ఉత్సవంలో కళాకారిణులు ప్రదర్శించిన కోలాటాలు, ఢమరుకనాదాలు అలరించాయి.

ప్రభోత్సవం.. నేత్రశోభితం

సాయంత్రం ప్రభోత్సవం నేత్రశోభితంగా సాగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో తీసుకొచ్చి ప్రభపై వేంచేబు చేశారు. వేలాదిమంది భక్తజనుల శివనామస్మరణలు, మంగళవాయిద్యాలు, కళాకారుల సందడి నడుమ ప్రభోత్సవం శోభాయమానంగా జరిగింది.

నందివాహనంపై స్వామి అమ్మవార్లు

ప్రభోత్సవంలో జనసందడి

సైబర్ వల.. కూలీ విలవిల

హొళగుంద, న్యూస్‌టుడే: సైబర్ మోసగాళ్ల వలలో చిక్కి రూ.1.60 లక్షలు పోగొట్టుకున్న ఘటన మండల కేంద్రంలో జరిగింది. బాధితుడు ఆదివారం తెలిపిన వివరాల మేరకు.. హొళగుంద ఈబీసీ కాలనీకి చెందిన చంద్రశేఖర్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈనెల 11న అతని చరవాణికి ఓ మెసేజ్ వచ్చింది. అందులోని లింక్‌ను నొక్కారు. వెంటనే 73405 66937 నంబరు నుంచి ఫోన్ వచ్చింది. ఆ సమయంలో బాధితుడు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. కొద్దిసేపటి తర్వాత తిరిగి ఫోన్ చేశారు. 'మీరు రూ.కోటి విలువైన బంగారు బిట్ నాణేలు గెలుచుకున్నారు. రూ.750 చెల్లించాలి' అని తెలిపారు. ఆ నగదు పంపిన తర్వాత, మరో రూ.1,250 చెల్లిస్తే బాండ్ పంపిస్తామని నమ్మించారు. వెంటనే ఫోన్‌పే చేశారు. మరుసటి రోజు నాణేలకు రూ.16,500 పన్ను చెల్లించాలని చెప్పగా మళ్లీ ఫోన్‌పే చేశారు. మళ్లీ బాధితుడికి ఫోన్ చేసి బంగారు నాణేలు తెచ్చామని నమ్మబలికించారు. కర్నూలులోని విమానాశ్రయంలో కస్టమ్స్ వారికి కొంత చెల్లించాలని అన్నారు. తన వద్ద డబ్బు లేదని బాధితుడు తెలిపారు. చరవాణికి రూ.కోటి బాండ్ పంపించామని సైబర్ మోసగాళ్లు తెలిపారు. రూ.కోటి వస్తాయన్న ఆశతో ఇంట్లోని బంగారు ఆభరణాలను బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బు తీసుకొని రూ.30 వేలు, రూ.42 వేలు, రూ.60 వేలను విడతలవారీగా చెల్లించారు. ఇలా మొత్తం రూ.1.60 లక్షలు ఖాతా నుంచి ఖాళీ అయ్యాయి. తన తోటి మిత్రులకు ఆదివారం విషయం తెలపడంతో సైబర్ వలలో చిక్కి మోసపోయావని తెలిపారు. వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వాపోయారు.

మోసపూరిత లింకులను నమ్మొద్దు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : టీ20 ప్రపంచ కప్ క్రికెట్ పోటీల నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. క్రికెట్ పోటీల పట్ల ప్రజలకు ఉండే ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని లైవ్ స్ట్రీమింగ్ పేరుతో సామాజిక మాధ్యమాల ద్వారా నకిలీ లింకులు పంపుతున్నారని తెలిపారు. ఫ్రీలైవ్ మ్యాచ్, వాచ్ ఐపీఎల్ ఫ్రీ, హెచ్‌డీ లైవ్ స్ట్రీమింగ్ వంటి లింకులను పంపుతారన్నారు. వాటిని క్లిక్ చేయగానే బ్యాంకు ఖాతా, ఓటీపీ వివరాలు సైబర్ నేరగాళ్లకు చేరతాయన్నారు. వాటి ఆధారంగా డబ్బులు కాజేస్తారన్నారు. ఫ్రీ ఆఫర్ల పేరుతో వచ్చే లింకులను నమ్మొద్దని చెప్పారు. బ్యాంకు కేవైసీ అప్‌డేట్, పార్సిల్ డెలివరీ, రివార్డు పాయింట్లు, లోన్ ఆఫర్లు, విద్యుత్తు బిల్లుల చెల్లింపు పేరుతో వచ్చే నకిలీ లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

తాయమ్మవ్వకు కలశ మహోత్సవం

ఆదోని పట్టణం కుంబారుగేరిలో వెలసిన తాయమ్మవ్వ కలశ మహోత్సవం ఆదివారం వేడుకగా సాగింది. దాతల సహకారంతో కొత్తగా నిర్మించిన అమ్మవారి ఆలయాన్ని ప్రారంభించారు. మహిళలు పెద్దఎత్తున చలువ బిందెలతో గంగమ్మకు పూజలు చేసి స్థానిక గౌళీపేట నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తరలివెళ్లారు. అనంతరం హోమం, అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు.

– న్యూస్‌టుడే, ఆదోని సాంస్కృతికం

రైతులను దారుణంగా దోచేశారు

● సహకార సంఘాల సీఈవోల చేతివాటం

కొత్తపల్లి మండలం నాగపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘానికి రైతులు చెల్లించిన రూ.42 లక్షలు పక్కదారి పట్టాయి. సీఈవో స్వాహా చేసినట్లు తేలింది. ఆయన 2022 నుంచి సీఈవోగా పని చేశారు. రైతులు తీసుకున్న రుణాలు తిరిగి చెల్లిస్తున్న క్రమంలో తప్పుడు రసీదులిచ్చారు. నగదును సంఘంలో జమ చేయకుండా దారి మళ్లించారు. ఇప్పటికీ కేవలం రూ.10 లక్షలే చెల్లించారు.

మంత్రాలయం మండలం కల్లుదేవకుంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం పరిధిలో రూ.20 లక్షల సొమ్ము దారి మళ్లింది. అక్కడ పనిచేసిన అప్పటి సీఈవో రైతులు చెల్లించిన సొమ్మును సంబంధించిన వివరాలు కంప్యూటర్లో నమోదు చేయకుండా స్వాహా చేశారు. సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేయడంతో ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో స్థానిక నేతలు పెత్తనం చేశారు. ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేయడం.. రికవరీ చేయకుండా సంఘాలను నష్టాల ఊబిలోకి దించారు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత కంప్యూటరీకరణ చేపట్టి గాడిలో పెట్టేయత్నం చేస్తోంది.

– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

రికవరీ చేయడంలో ఆలస్యం

కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు (పీఏసీఎస్) ఉన్నాయి. వీటి పరిధిలో 1.25 లక్షల మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఏటా రూ.4 వేల కోట్ల మేర టర్నోవర్‌తో వ్యాపారం జరుగుతోంది. రైతుల భూ దస్త్రాలు, భూ విస్తీర్ణం ఆధారంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేస్తుంటారు. సుమారు 50 వేల మంది రైతులు రూ.900 కోట్ల వరకు పంట రుణాలు తీసుకున్నారు. పలువురు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి సొమ్మును పక్కదారి పట్టించారు. 2024-25 నుంచి కంప్యూటరీకరణ మొదలు పెట్టారు. పలు సొసైటీల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో నగదు రికవరీ చేయలేదు.

కంప్యూటరైజ్డ్ రసీదులే చెల్లుబాటు

● ప్రాథమిక సహకార సంఘాల కంప్యూటరీకరణ పూర్తయింది. సొసైటీల్లో మాన్యువల్ రసీదు పుస్తకాలను సీజ్ చేశారు. సహకార సంఘం ద్వారా రుణాలు పొందిన రైతులు తిరిగి చెల్లింపులు చేసేటప్పుడు సహకార సంఘంలోని కంప్యూటర్ సిస్టమ్ జనరేట్ చేసిన రసీదు, దానిపై సొసైటీ సీఈవో సంతకం, సీల్ ఉన్న రసీదు మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది.

● మాన్యువల్‌గా జారీ చేసిన రసీదులు ఏమాత్రం చెల్లుబాటు కావు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 ప్రాథమిక సహకార సంఘాల వద్ద సహకార సంఘ అధికారులు బ్యానర్లు ఏర్పాటు చేయించారు.

● సొసైటీ సీఈవోలు మాన్యువల్ రసీదులిచ్చినా.. ఇస్తున్నట్లు తెలిసినా సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార సంఘం అధికారులు పేర్కొంటున్నారు.

విద్యుత్తు సమస్యలా.. ఫోన్ చేయండి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్, జిల్లాస్థాయిలో విద్యుత్తు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు ఏర్పాటు చేసిన డయల్ యువర్ సీఎండీ, డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు.

డయల్ యువర్ సీఎండీ
సమయం : ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30
ఫోన్ నెంబరు 89777 16661

డయల్ యువర్ ఎస్ఈ
సమయం 8:30 -9:30 గంటలు
కర్నూలు: 73826 14308
నంద్యాల: 73826 18976

ప్రయాణమే పెద్ద పరీక్ష

☛ రద్దీ రహదారులపై విద్యార్థులకు తిప్పలే

☛ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని విన్నపాలు

కర్నూలు గాయత్రి ఎస్టేట్, విద్య, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో ఏటా పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరిగే రోజుల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. పరీక్ష రాసేందుకు వెళ్లే విద్యార్థులు వాహనాల రద్దీలో చిక్కుకుని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

కలెక్టరేట్ వద్ద ఈ వాహనాలను దాటి పరీక్షా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది

ఈ నెల 17 నుంచి మొదలు..

పదో తరగతి సీబీఎస్ఈ విద్యార్థులకు ఈనెల 17వ తేదీ నుంచి, రాష్ట్ర సిలబస్ చదివిన వారికి మార్చి 16వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 23వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగనున్నాయి. కర్నూలు నగరంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు 50 కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 10 వేల మందికిపైనే విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇంటర్ పరీక్షలను 34 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. దాదాపు 7 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

అస్తవ్యస్తంగా పార్కింగ్

ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక బస్సులు, మినీవ్యాన్‌లు, ఆటోలు ఇతర వాహనాలు ఏర్పాటు చేస్తాయి. అధికశాతం పరీక్షా కేంద్రాలు ప్రధాన రహదారుల పక్కనే ఉన్నాయి. కళాశాలల వాహనాలను కేంద్రాల వద్ద రోడ్లపైనే నిలిపి విద్యార్థులను దించుతున్నారు. పరీక్ష ముగిసే వరకు వాటిని అక్కడే నిలిపి తిరిగి విద్యార్థులను ఎక్కించుకొని వెళ్తున్నారు. దీనికితోడు ద్విచక్ర వాహనాలు సైతం పెద్దసంఖ్యలో వస్తున్నాయి. వాటినీ కేంద్రాల చుట్టుపక్కల రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఒకేసారి వందల సంఖ్యలో బస్సులు ఇతర వాహనాలు రావడం, వాటిని రోడ్లపైనే నిలపడంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీంతో పరీక్ష జరిగినన్ని రోజులూ విద్యార్థులతో పాటు వాహనదారులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా ఇదే సమస్య పునరావృతం అవుతున్నా అధికారులు పరిష్కార మార్గాలు అన్వేషించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇలా చేస్తే మేలు

పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉండే మైదానాలను వాహనాల పార్కింగ్‌కు ఉపయోగిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని పలువురు చెబుతున్నారు. ఈ విషయాన్ని విద్యా సంస్థల నిర్వాహకులు పట్టించుకోకుండా రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు.

● కోట్ల కూడలి సమీపంలోని టౌన్ మోడల్, మున్సిపల్ హైస్కూల్, కోల్స్ పరీక్ష కేంద్రాలకు వచ్చే బస్సులను ఎగ్జిబిషన్ మైదానంలో నిలిపే అవకాశం ఉంది. పరీక్ష ముగిసి విద్యార్థులంతా కేంద్రాల నుంచి వెళ్లిన తర్వాత బస్సులు బయల్దేరితే ట్రాఫిక్ సమస్య తలెత్తదు. మిగతా కేంద్రాల వద్ద కూడా ఇదే విధంగా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి పరీక్షల సమయంలో రద్దీ నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

పత్తి బేరం.. కొత్త మోసం

అక్రమాల అడ్డాగా సీసీఐ కేంద్రాలు ● పోలీసు స్టేషన్ చేరిన పంచాయితీ

పరిశ్రమలో సీసీఐ పత్తి నిల్వ

పత్తి వ్యాపారానికి ప్రసిద్ధి చెందిన ఆదోనిలోని సీసీఐ కేంద్రాల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకొన్నాయి. 2025-26 ఏడాదికి గాను సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పది కేంద్రాల్లో 14,585 మంది రైతుల నుంచి 4.59 లక్షల క్వింటాళ్ల మేర పత్తి కొనుగోలు చేసింది. వీటి విలువ విపణిలో రూ.361 కోట్లు. రికార్డు స్థాయిలో కొనుగోలు చేయడం ఒకటైతే.. అక్రమాలు అంతే స్థాయిలో జరిగాయి. తాజాగా పత్తి కొనుగోళ్లు ఆగిపోయాయి. పట్టణ శివారు శిరుగుప్ప రహదారిలోని ఓ పరిశ్రమలో పత్తి కొనుగోలు లెక్కలు తప్పడంతో పంచాయితీ ఠాణాకు చేరింది. చివరికి రాజకీయ జోక్యంతో కేసు లేకుండా చేశారని సమాచారం.

– న్యూస్‌టుడే, ఆదోని మార్కెట్

దూది దిగమింగారు

◆ దూది బేళ్ల ఔటన్ విషయంలోనూ అక్రమాలు జరిగాయి. ఒక క్వింటాలుకు చూపాల్సిన దూది ఔటన్ కంటే తక్కువ చూపి కొందరు పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై దిగమింగినట్లు సమాచారం. యంత్రాంగానికీ వాటాలు వెళ్లినట్లు తెలుస్తోంది.

◆ క్వింటాలుకు ఐదారు కిలోల దూది.. పక్కదారి పట్టించినట్లు సమాచారం. ఈ లెక్కన పాతిక వేల కిలోలకు పైగా దూది లెక్కలో రాలేదు.

◆ ఔటన్ లెక్కలపై పలుమార్లు సీసీఐ అధికారులను 'న్యూస్‌టుడే' కోరినా.. దాటవేత ధోరణి ప్రదర్శించారు.

సిబ్బంది కీలక పాత్ర

◆ సీసీఐ కొనుగోలులో సిబ్బందిదే కీలక పాత్ర. ఏటా పొరుగు సేవల కింద సిబ్బంది నియామకాల కోసం ప్రకటన విడుదల చేస్తారు. ఇందులో కొత్త వారికి చోటు ఉండదు. నామమాత్రంగా ప్రకటన ఉంటుంది.

◆ పాతవారికే ఇందులోని లొసుగులు పూర్తిగా తెలిసుంటాయి. అందులోనూ ఇతర ప్రాంతాల్లో అనుభవం ఉన్నవారినే నియమించేలా చక్రం తిప్పుతారు. వీరిని ఓ కీలక వ్యక్తి పర్యవేక్షిస్తుంటారు.

◆ ఆదోనిలో సైతం సీసీఐ అధికారి ఉన్నా.. ఆయన వెనుక ఓ అజ్ఞాత వ్యక్తి మొత్తం అక్రమ బాగోతం నడిపించినట్లు తెలుస్తోంది.

తూకం లెక్క తప్పింది

◆ సీసీఐ కొనుగోలు చేసిన దిగుబడుల్లో తూకం లెక్కలు తప్పాయి. శిరుగుప్ప రహదారిలోని సీసీఐ కేంద్రంలో రెండు నెలల కిందట అగ్ని ప్రమాదం జరిగింది.

◆ సీసీఐ కొనుగోలు చేసిన పత్తి కాలిబూడిదైందని మొదట చెప్పారు.. తర్వాత పరిశ్రమకు సంబంధించి సరకు కాలిపోయిందన్నారు.

◆ 'తూకం' తప్పిందని కొందరు రైతులు ఏకంగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతేడాదీ ఈ పరిశ్రమలో రైతుల పత్తి అమ్మకాలపై ఆరోపణలు వచ్చాయి.

◆ ఒకే చోట సీసీఐ కొనుగోలు చేయడం.. పరిశ్రమ వాళ్లు తీసుకోవడంతో అక్రమాలకు వేదికగా మారింది.

మద్దికెర బీసీ వసతి గృహంలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

మంచాలు మడతపెట్టేశారు

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం అధికారుల ఉదాసీనత వల్ల నెరవేరడం లేదు. మద్దికెరలోని బీసీ వసతి గృహంలో 200 మంది విద్యార్థులున్నారు. 170 మందికి పైగా హాజరవుతున్నారు. ఇక్కడ కొన్నేళ్లుగా రెగ్యులర్ వార్డెన్ లేరు. ఇన్‌ఛార్జిలే కొనసాగుతున్నారు. కొత్త మంచాలు వసతిగృహానికి చేరినా.. విద్యార్థులకు అందుబాటులోకి రాలేదు. సుమారు 50కి పైగా మంచాలు ఓ మూలకు చేర్చారు. అలాగే వదిలేస్తే తుప్పు పట్టి పూర్తిగా పనికి రాకుండా పోతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మద్దికెర

మూలన పడేసిన కొత్త మంచాలు

ఉపాధి బాటలో మాధవి ప్రయాణం
ఐకానిక్ వంతెనకు మరోసారి టెండర్ల పొడిగింపు
6లో..

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు కలెక్టరేట్ న్యూస్‌టుడే : కర్నూలు కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ డా.ఎ.సిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న ఉదయం నుంచి విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో మంత్రులు, రాష్ట్ర సెక్రెటరీలతో బిల్‌గేట్స్ బృందం సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లాస్థాయిలో కలెక్టర్, ఆర్డీవోలు, మండలస్థాయి అధికారులు వర్చువల్‌గా పాల్గొంటారన్నారు. ఈ కారణంగా జిల్లా, డివిజన్, మండలస్థాయిలో పీజీఆర్ఎస్ రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు దీనిని గమనించాలని, అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ సూచించారు.

స్థానిక పోరు.. సన్నద్ధత జోరు

● ఓటర్ల జాబితా తయారీపై కసరత్తు

● ఈఆర్ఎంఎస్ సాఫ్ట్‌వేర్‌తో విభజన

స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితాను మార్చి 9వ తేదీ నాటికి సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాలుగు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లా, మున్సిపాలిటీ, మండల స్థాయిలో ఓటర్ల జాబితాలను సులువుగా తయారు చేసేందుకు వీలుగా ఎలక్టోరల్ రోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఆర్ఎంఎస్)ను వినియోగించనున్నారు. కలెక్టర్ల ఆధ్వర్యంలోనే అధికారులు జాబితాలు సిద్ధం చేయనున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

70 కొత్త పంచాయతీలు

◆ స్థానిక సంస్థలకు 2021 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 972 గ్రామ పంచాయతీలు ఉండగా 970 చోట్ల ఎన్నికలు జరిగాయి. ఆదోని మండలంలోని మండగిరి, సాదాపురం పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. వచ్చే ఏప్రిల్ 2 నాటికి సర్పంచుల పాలన ముగియనుంది.

◆ ఉమ్మడి జిల్లాలో కొత్తగా 70కి పైగా కొత్త పంచాయతీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు.

◆ ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలకతో పాటు తొమ్మిది మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పాలకవర్గాల గడువు మార్చి 17 నాటికి ముగియనుంది.

ఓటర్లు	కర్నూలు	నంద్యాల
పురుషులు	10,17,074	6,81,581
మహిళలు	10,45,183	7,10,193
ఇతరులు	312	262

వార్డులు.. డివిజన్ల వారీగా

కేంద్ర ఎన్నికల సంఘం సహకారంతో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలు సేకరించి.. ఈఆర్ఎంఎస్ సర్వర్ల నుంచి జిల్లా, మండల, మున్సిపల్ అధికారుల లాగిన్‌కి డేటా వెళ్లనుంది. వాటి నుంచి పంచాయతీ, పుర, నగరపాలక సంస్థల్లో వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయనున్నారు.

సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాగానే పంచాయతీ కార్యదర్శులకు కొత్త ఓటర్ల చేరికలు, మృతుల తొలగింపు, మార్పులు, చేర్పులు చేయడానికి అవకాశం కల్పించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక మార్చి 9న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆ తర్వాత తుది ఓటరు జాబితా ప్రచురించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

నత్తనడకన సాగుతున్న సర్

● ఉమ్మడి జిల్లాలో సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం (సర్) గతేడాది సెప్టెంబరు నుంచి జరుగుతోంది. ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. కర్నూలు జిల్లాలో 20,82,374 మంది ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 10,66,705 మంది (51.23 శాతం) మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. నంద్యాల జిల్లాలో 14,02,547కి గాను 7,43,456 మంది (53.01 శాతం) ఓటర్లను మ్యాపింగ్ చేశారు. ఐదు నెలలకు పైగా గడిచిపోయినా సగం మందిని మాత్రమే మ్యాపింగ్ చేయగలిగారు.

● ఈ పరిస్థితుల్లో మిగతా సగం మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేసి మార్చి 9న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించడం కష్టసాధ్యమని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో 2025 జనవరి 1న విడుదలైన తుది ఓటరు జాబితా ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు జాబితా తయారీ సాధ్యమవుతుందని ఎన్నికల విభాగం అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

శ్రీశైలంలో పాగాలంకరణను తిలకిస్తున్న భక్త జనం

వేంకటేశ్వరస్వామి గుహ వద్ద భక్తుల సందడి



కాల్వబుగ్గలో బుగ్గరామేశ్వరస్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి దంపతులు

యాగంటిలో పూజలందుకున్న ఉమామహేశ్వరుడు

మహానందిలో మయూర వాహనంపై స్వామి అమ్మవార్లు

ముక్కంటి దర్శనం.. భక్తకోటి పరవశం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శైవక్షేత్రాలు ఆధ్యాత్మిక కాంతులతో శోభిల్లాయి. వేలాదిమంది భక్తులతో ప్రతి ఆలయం ఇల కైలాసాన్ని తలపించింది. శ్రీశైల మహాక్షేత్రంలోని మల్లన్న సన్నిధికి భక్తులు పోటెత్తారు. మహానంది క్షేత్రం, కర్నూలు సమీపంలోని జగన్నాథగట్టుపై ఉన్న రూపాల సంగమేశ్వరస్వామి ఆలయం, ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గలోని రామేశ్వరస్వామి కోవెలు, వెల్దుర్తి మండలం బ్రహ్మగుండం, నందవరం మండలం గురజాల రామలింగేశ్వరాలయం, నంద్యాల జిల్లాలోని నవ నంది క్షేత్రాలు, బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం, వెలుగోడు అటవీ పరిధిలోని గుండ్ల బ్రహ్మేశ్వరాలయం, కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం, గడివేముల మండలంలోని దుర్గా భోగేశ్వరాలయం, ఆత్మకూరు మండలం నల్లమల అరణ్యంలోని రుద్రకోటేశ్వర క్షేత్రం, నాగలూటి వీరభద్ర ఆలయం, నందికొట్కూరులోని ఉమామహేశ్వరస్వామి కోవెల భక్తులతో కిటకిటలాడాయి. భక్తజనం ఉపవాస దీక్ష పాటించి శివయ్యకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రంతా జాగరణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. - న్యూస్‌టుడే, బృందం



ప్రభోత్సవం ముందు ఆలయ ఛైర్మన్ రమేశ్‌నాయుడు పండితులు

శివనామ స్మరణలో భక్తులు

సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఊరేగింపులో డప్పు వాయిద్యాల హోరు

నందవరం : గురజాలలో రామలింగేశ్వరస్వామికి హారతి ఇస్తున్న భక్తులు

నందవరం : గురజాలలో దర్శనానికి నిరీక్షిస్తున్న భక్తులు

ఆదోనిలో పేటవీరభద్రస్వామి ఆలయంలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం(ఓం శాంతి) ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ ప్రదర్శన

మయూర వాహనంపై మహానందీశుడు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ఆదివారం మయూర వాహనంపై కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరుడు విహరించారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల మధు, వేదపండితులు వేదోక్తంగా పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు తితిదే తరఫున పారుపత్తేదారు బాలసుబ్రహ్మణ్యం దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. 'అమ్మోరు' ధారావాహిక తారాగణం నేత్రజావేద్, చరిష్మా, రజిత్‌సాహు, కల్కి, రాజా తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు భక్తులకు అత్యవసర వైద్య సేవలందించడం అభినందనీయమని నంద్యాల ఎమ్మెల్సీ జాబిలీ పేర్కొన్నారు. మహానందిలో నంద్యాల సాయివాణి ఆసుపత్రి అధినేత డాక్టర్ హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత అత్యవసర వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

మహానంది క్షేత్రంలో నృత్యం

ఐకానిక్ వంతెనకు మరోసారి టెండర్ల పొడిగింపు

కొల్లాపూర్, న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానిస్తూ సోమశిల వద్ద కృష్ణానదిపై నిర్మించనున్న తీగల వంతెన (ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి)కి మరోసారి టెండర్ల గడువు పొడిగించారు. ఈ ఏడాది మార్చి 3 వరకు టెండర్లు స్వీకరించనున్నట్లు నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత జాతీయ రహదారి అధికారులు ఆదివారం పేర్కొన్నారు. ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం గడువుల మీద గడువులు పెంచుతుండటంతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదు. మొదట్లో 2023-24లో ఏడాది పాటు గడువు పొడిగించారు. తర్వాత 2026 ఫిబ్రవరి 16 వరకు గడువు విధించి టెండర్ల స్వీకరణకు చర్యలు చేపట్టారు. తాజాగా మరోసారి మార్చి 3 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి కొట్ర తండా నుంచి కొల్లాపూర్ సోమశిల వరకు 74 కిలోమీటర్ల మేర 167కె జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

శివ..శివా

ఆలయం తలుపులు మూత వేసిన దృశ్యం

ఆళ్లగడ్డ గ్రామీణం: మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో రద్దీ ఉంటే నల్లగట్ల గ్రామంలో ఆదివారం శివాలయం మూత పడింది. తొమ్మిది దాటినా ఆలయం తలుపులు మూసి ఉండటంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. చాలా సేపటి తర్వాత అర్చకులు వచ్చి తలుపులు తీశారు. ఈ క్రమంలో పూజారి కుమారుడితో గ్రామస్థులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దుర్భాషలాడటంతో ఆగ్రహించిన గ్రామస్థులు అర్చకుడి కుమారుడిపై దాడి చేశారు. దీంతో సదరు పూజారి కుమారుడు ఆలయం తలుపులకు మళ్లీ తాళం వేశాడు. విషయం తెలుసుకున్న ఈవో సాయి జయచంద్రారెడ్డి, ఎస్సై వరప్రసాద్ ఘటనాస్థలికి చేరుకొని గ్రామస్థులు, పూజారి కుమారుడితో మాట్లాడి పరిస్థితి సద్దుమణిగించారు.

ఉపాధి బాటలో మాధవి ప్రయాణం

☛ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న మహిళ

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : కుటుంబాన్ని పోషించే భర్త ప్రమాదానికి గురవడంతో.. ఇంటి నిర్వహణ భారం మాధవిపై పడింది. రోజు కూలీగానో.. దుకాణాల్లో పనులకో వెళ్దామని ప్రయత్నించారు.. పని ప్రదేశాల్లో మహిళల పట్ల చిన్నచూపు చూస్తుండటం చూసి ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఏదైనా స్వయం ఉపాధి చూసుకోవాలని నిర్ణయించుకున్నారు. డ్రైవింగ్ వృత్తిని ఎంచుకున్నారు. నగరంలో ఆటో నడుపుతూ వచ్చే సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రమాదంతో మారిన పరిస్థితి..

కర్నూలు నిర్మల్‌నగర్‌కు చెందిన 23 ఏళ్ల మాధవి తొమ్మిదో తరగతి వరకు చదువుకున్నారు. 2019లో ఈమెకు ప్రవీణ్‌కుమార్‌తో వివాహమైంది. ఆయన బేల్దారి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఏడాది కిందట ఆయన పని ప్రదేశంలో రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. మతిస్థిమితం కోల్పోయి పనికి దూరమయ్యారు. దీంతో కుటుంబ పోషణ కోసం మాధవి తనకు ఇష్టమైన డ్రైవింగ్ వృత్తిని ఎంచుకొని ఆటో డ్రైవర్‌గా మారారు. గతేడాది అక్టోబరులో ఓ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.5 లక్షలకు ఆటోను కొనుగోలు చేశారు. దానిని నడుపుతూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.

సమస్యల స్పీడ్ బ్రేకర్లు

రోజువారీ డీజిల్ ఖర్చు రూ.300 పోగా రూ.400- 500 మిగులుతోందని ఈమె చెబుతున్నారు. నెలకు రూ.10 వేలు కంతు చెల్లించగా మిగిలే రూ.3-4 వేలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నానని మాధవి అంటున్నారు. తమకు సొంత ఇల్లు కూడా లేదంటున్నారు. అత్తమామల పేరుతో ఉన్న ఇంటిని భాగ పరిష్కారాలు చేసినా తమకు ఆస్తి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉస్మానియా కళాశాల సమీపంలోని తమ తల్లిదండ్రుల ఇంట్లో ఈమె భర్తతో కలిసి ఉంటున్నారు. తమకు నివేశన స్థలం కేటాయించి ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

- భర్త, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆటో నడుపుతున్నట్లు చెబుతున్న ఈమె పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులు రాయితీ ఆటో ఇప్పించి ర్యాపిడో డ్రైవర్ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వాహనమిత్ర పథకం కింద ఏటా ఇచ్చే రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలని అధికారులకు విన్నవించారు.

ఆటో నడుపుతున్న మాధవి

మహిళా ప్రయాణికులకు నమ్మకం

మాధవి ఐదు నెలలుగా నగరంలో ఆటో నడుపుతున్నారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు పాతబస్తీ, కొత్త బస్టాండు, రైల్వేస్టేషన్‌తో పాటు వివిధ మార్గాల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. ఆరోగ్య కుదుటపడటంతో ఈమె భర్త వారం రోజులుగా మళ్లీ కూలి పనులకు వెళ్తున్నారు. సాయంత్రం పని నుంచి వచ్చిన భర్తను వెంటబెట్టుకుని 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆటో నడుపుతున్నారు. పురుషులు నడిపే ఆటోల్లో ఒంటరిగా ప్రయాణించాలంటే భయంగా ఉండేదని.. మాధవి ఆటోలో వెళ్తుంటే ధైర్యంగా ఉందని మహిళా ప్రయాణికులు చెబుతున్నారు. కొంతమంది మహిళా ప్రయాణికులు ఆటో అవసరమైతే మాధవికి ఫోన్‌చేసి మరీ పిలిపించుకుంటున్నారు. ఆత్మవిశ్వాసంతో ఆటో నడుపుతున్న మాధవి పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.

కార్యకర్తలే తెదేపాకు అసలైన బలం

మంత్రి ఫరూక్‌ను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

నంద్యాల పట్టణం, నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: తెదేపాకు పార్టీ కార్యకర్తలే అసలైన బలం అని మంత్రి ఎన్ఎండీ.ఫరూక్ పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పునరంకితం కావాలన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడూ వెన్నంటి ఉండి నడిపించిన కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం రూ.6090 కోట్ల భారీ నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆ సంఘం నాయకులు మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను సన్మానించారు. తెదేపా నాయకులు షేక్ మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో స్థానిక మంత్రి కార్యాలయంలో ఈ మేరకు కలిసి సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార పుణ్యక్షేత్రంలో ఆదివారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తెదేపా మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి, టీజీపీ ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు కంచర్ల మనోహర్ చౌదరిలు ప్రారంభించారు. పోటీల్లో గోస్పాడు మండలం సాంభవరం గ్రామానికి చెందిన రాంపల్లె ప్రభాకర్‌రెడ్డి వృషభాలు 4500 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు అల్లె ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉండవల్లి తాలూకా కంచుపాడు గ్రామానికి చెందిన హేమలత, ఆంజనేయరెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో, బేతంచర్ల గ్రామానికి చెందిన భానుజ వృషభాలు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో మొత్తం 20 జతల వృషభాలు పాల్గొన్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో తాతిరెడ్డి మనీష్‌రెడ్డి, సిద్దం ప్రతాప్‌రెడ్డి, బండిశ్రీను, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, పేదల సంక్షేమానికి పెద్దపీట

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. 2026 బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేశారు. అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన, నిరుద్యోగ నిర్మూలన దిశగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఒక విజనరీ బడ్జెట్‌ను తీసుకొచ్చారన్నారు.

హంపి ఉత్సవాలకు మధుసూదన్ ఎంపిక

మధుసూదన్

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దహరివాణం గ్రామానికి చెందిన యువ కళాకారుడు కె.మధుసూదన్ హంపి ఉత్సవాలకు ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి 19 వరకు హంపి ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతి రోజు సాయంత్రం ఏడు నుంచి 9.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఉంటుంది. ధ్వని మత్తు బెళకు అనే కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయలుగా, ఇమ్మడి దేవరాయలుగా, ఇతర పాత్రల్లో నటించనున్నట్లు మధుసూదన్ తెలిపారు. గ్రామస్థులు హర్షం ప్రకటించారు.

రహదారి ప్రమాదంలో యువ రైతు దుర్మరణం

వీరనాగ (పాత చిత్రం)

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే : ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసి. . వచ్చిన దిగుబడులను అమ్ముకునేందుకు వెళ్లే క్రమంలో ఓ యువ రైతు రహదారి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడిన ఘటన కర్ణాటక రాష్ట్రంలో ఆదివారం జరిగింది. కౌతాళం మండలం బంటకుంట గ్రామానికి చెందిన యువ రైతు వీరనాగ, అదే ప్రాంతానికి చెందిన చాకలి ఈరన్న, గోవర్ధన్, మరికొందరు కలిసి బొలెరో వాహనంలో మిర్చి దిగుబడులు వేసుకుని కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగ మిర్చి మార్కెట్‌యార్డుకు బయలుదేరారు. కర్ణాటకలోని చిత్రదుర్గ వద్ద వాహనం టైరు పేలిపోయింది. ఈ క్రమంలో వాహనం అదుపు తప్పి పడిపోగా మిర్చి బస్తాలన్నీ వారిపై పడ్డాయి. వీరనాగు అక్కడికక్కడే మృతి చెందగా.. ఈరన్న, గోవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరనాగకు వివాహమై మూడేళ్లైంది. ఆయనకు భార్య అయ్యమ్మ ఉన్నారు. అతను రెండెకరాల్లో మిర్చి సాగు చేశారు. దిగుబడులను తీసుకెళ్తూ అనుకోని ప్రమాదంలో మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

ప్రేమ పేరిట మోసం..యువకుడిపై కేసు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసగించిన ఓ యువకుడిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలకు చెందిన యువతి(24) బ్యాంకులో ఉద్యోగం చేస్తూ పంజాగుట్టలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నారు. గత సంవత్సరం వరుణ్ నాగేంద్ర(26) అనే యువకుడు ఇన్‌స్టాలో ఆమెకు పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఎస్సార్‌నగర్‌లోని తన గదికి తీసుకెళ్లి పలుమార్లు తన కోరిక తీర్చుకున్నాడు. ఈ సందర్భంలో బలవంతంగా ఆమె ఫొటోలు, వీడియోలు తీశాడు. కొంత కాలానికి ఆ యువతి గర్భం దాల్చడంతో బలవంతంగా మాత్రలు వేయించాడు. దీంతో బాధితురాలు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా దానికి నాగేంద్ర నిరాకరించాడు. ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఫిర్యాదు చేశారు.

ప్రేమికుల రోజు విషాదం

☛ యువకుడి బలవన్మరణం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ప్రేమికుల రోజు ఆళ్లగడ్డ పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. పొట్టకూటి కోసం రాజస్థాన్ నుంచి పట్టణానికి వలస వచ్చి తోపుడు బండిపై ఐస్‌క్రీమ్ వ్యాపారం చేసుకుంటున్న ఓ యువకుడు శనివారం రాత్రి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సత్యనారాయణ సయామి(25) అనే ఈ యువకుడు పుల్లారెడ్డి వీధిలో అద్దెకుంటున్న ఇంట్లోనే పైకప్పునకు తాడుతో ఉరేసుకున్నారు. రాజస్థాన్‌లో ఒక అమ్మాయితో ప్రేమలో ఉన్నారని, అది విఫలం కావడంతో జీవితంపై విరక్తి చెంది తనువు చాలించినట్లు సమాచారం. ప్రేమికుల రోజే ఇతడు మృతి చెందడం విషాదకరం. పట్టణ పోలీసులు ఆదివారం ఘటనపై కేసు నమోదు చేశారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

కలుగొట్ల(వెల్దుర్తి), న్యూస్‌టుడే: భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకుపాల్పడిన ఘటన వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆకుల నాగశేషు(24)కు నాలుగేళ్ల కిందట చెరుకులపాడు గ్రామానికి చెందిన గిరిజతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు మహేంద్ర ఉన్నాడు. భర్త మద్యానికి బానిస అయ్యాడరు. తాగడం మానుకోవాలని భార్య గిరిజ పలుసార్లు కోరినా మారకపోవడంతో వారంరోజుల కిందట పుట్టింటికి వెళ్లారు. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన నాగశేషు గ్రామ సమీపంలోని సుంకులమ్మ ఆలయం దగ్గర చెట్టుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

గుడిసె దగ్ధం.. వృద్ధురాలికి గాయాలు

కరివేముల (దేవనకొండ) న్యూస్‌టుడే: కరివేముల గ్రామానికి చెందిన వృద్ధురాలు గంగమ్మ గుడిసెలో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఉదయం గ్యాస్ పొయ్యి మీద వంటకు పెట్టి, సామగ్రి కడిగేందుకు ఇంటి బయటకు వెళ్లారు. ఒక్కసారిగా మంటలు గుడిసెకు వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు యత్నించిన గంగమ్మ గాయాలపాలైంది. ఇంట్లోని సామగ్రి, రూ.50 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు కూడా మంటల్లో బూడిదయినట్లు బాధితులు తెలిపారు. మాజీ సర్పంచి గిడ్డయ్యగౌడు, ఆయన సోదరుడు ప్రభాకర్‌గౌడు బాధితురాలి కుమారుడికి రూ.5 వేలు అందజేశారు.

నీట మునిగి బాలుడి మృతి

ఎం.సిద్ధార్థ (పాతచిత్రం)

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలోని గురుసదన్ పక్కన నీటి కుంటలో గల్లంతైన బాలుడు ఎం. సిద్ధార్థ(14) మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. శనివారం రాత్రంతా ఎన్డీఆర్ఎఫ్ పోలీసులు, స్థానిక మత్స్యకారగజ ఈతగాళ్లు ఎంత గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం నీటిలో మృతదేహం బయటకు రావడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కర్నూలు జిల్లా ఆలూరు మండలం తుంబలవీడు గ్రామానికి చెందిన సల్లప్ప తన కుమారుడు సిద్ధార్థతో కలిసి బ్రహ్మోత్సవాలు చూసేందుకు శ్రీశైలం వచ్చాడు. మరోవైపు బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వచ్చిన ఒక భక్తుడి కాలుపై నుంచి నీటి ట్యాంకర్ వెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కాలికి తీవ్రగాయం కావడంతో 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు.

కారు ఢీకొని మహిళ..

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని బుక్కాపురం గ్రామానికి వెళ్లే మెట్ట వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. ఆర్.కొత్తపల్లె గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ(60), బుక్కాపురం గ్రామానికి చెందిన ఈరమ్మ, మధుసుధలు ఆదివారం బేతంచెర్లకు పని నిమిత్తం వచ్చారు. అనంతరం ఆటోలో గ్రామం మెట్ట వద్ద దిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో నాగలక్ష్మమ్మ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు మహిళలకు గాయాలకు గురయ్యారు.

రచయిత శ్రీనివాస్ మృతిపై హత్య కేసు నమోదు

☛ 'పాలేరు'లో కారు మునిగి మృతి చెందిన ఉదంతంలో సోదరుల ఫిర్యాదు మేరకు విచారణ

కూసుమంచి, నందికొట్కూరు న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న యూట్యూబర్, రచయిత, సాహిత్య పరిశోధకుడు బొగ్గుల శ్రీనివాస్(48) మృతి ఘటనపై ఆదివారం హత్య కేసు నమోదైంది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయంలోకి శనివారం ఓ కారు దూసుకెళ్లిన ప్రమాదంలో అందులో ఉన్న శ్రీనివాస్ నీట మునిగి మృతిచెందాడు. ప్రమాద సమయంలో వాహనం నడుపుతున్న వ్యక్తి ఒకరు కారులో నుంచి కిందపడిపోయి అక్కడి నుంచి పరారైనట్లు మత్స్యకారులు గుర్తించారు. వారంతా వచ్చి కారును వెలికితీయగా వెనక సీట్లో శ్రీనివాస్ మృతదేహం లభ్యమైంది. పోలీసులు, మృతదేహాన్ని నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రి శవాగారంలో భద్రపరిచారు. ఈ ఘటనపై మృతుని సోదరుడు బొగ్గుల అబ్బులయ్య ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలోని అల్లూరుకు చెందిన బొగ్గుల శ్రీనివాస్(48) 20 ఏళ్లుగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. అవివాహితుడైన ఇతను యూట్యూబర్‌గా పనిచేస్తున్నారు. పాలేరు జలాశయం వద్ద తన సోదరుడు శ్రీనివాస్ మృతి చెందిన సమాచారం అతని స్నేహితుల ద్వారా తెలిసిందని, సోదరులు సుధాకర్, సాంబశివుడుతో కలిసి ఆదివారం ఘటనా స్థలానికి వచ్చి ఆరా తీసినట్లు అబ్బులయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. కారు నీటిలో పడే సమయంలో ఓ వ్యక్తి దూకి పారిపోయినట్లు తెల్సిందని, నేలకొండపల్లి ఆస్పత్రిలో ఉన్న తమ తమ్ముడి మృతదేహాన్ని పరిశీలించగా తలకు, ముఖంపై, ఎడమ చేతిపైనా గాయాలు ఉన్నట్లు గుర్తించామని ఫిర్యాదులో పేర్కొన్నారు. సోదరుని మృతిపై అనుమానాలున్నాయని వివరించారు.

వాహనం నడిపిన వ్యక్తి ఎవరు?

శ్రీనివాస్ సోదరుల ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసిన పోలీసులు శవపరీక్ష అనంతరం వారికి మృతదేహాన్ని అప్పగించారు. కారు నడిపిన వ్యక్తి సంఘటన స్థలం నుంచి పరారవడంతో అతను ఎవరనే విషయమై ఆరా తీస్తున్నారు. మృతుని స్నేహితుడు, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని పాకాలపాడుకు చెందిన వేణుమాధవరెడ్డికి చెందిన కారు (ఏపీ16 డీపీ 2345- కేయూవీ, కె8)గా గుర్తించిన పోలీసులు అతని ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి ఉండటంతో ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. కారు నడిపిన వ్యక్తి అతనేనా, లేక డ్రైవర్ ఉన్నాడా? అనే విషయమై స్పష్టత లభించలేదు. వాహనం ఎటునుంచి ఎటు వెళ్తున్నదీ తెలియలేదు. ఘటనపై విచారణ చేపట్టినట్లు, వాహన యజమాని, డ్రైవింగ్ చేసిన వ్యక్తి ఆచూకీ కోసం ఓ బృందాన్ని ఏర్పాటు చేశామని కూసుమంచి సీఐ సంజీవ చెప్పారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి 10 మంది మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్ లీడర్స్, టెలికాలర్ కావలెను. తేజేశ్వర్ రెడ్డి సెల్: 62811 96419, 94941 91951.

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును.(రిటైర్డ్ పోలీస్‌డిపార్ట్మెంట్) గోల్డెన్‌ట్రేడింగ్ కం. ✆ 73821 14647.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

JOBS

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K to 20K. ✆96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499.

కోడుమూరులోని ప్రముఖ సినిమా థియేటర్ నందు పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ సూపర్వైజర్ కావలెను. 12 గంటల డ్యూటి, 12,000 జీతం. సంప్రదించండి: 91829 64173.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసి ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

జిల్లా సాధనకు కదిలిన మహిళలు

ఆదోనిలో రిలే దీక్షలు చేస్తున్న మహిళలు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధన కోసం తాము సైతం మద్దతు తెలుపుతామని మహిళలు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 92వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్థానిక ప్రకాశ్‌నగర్, భాస్కర్‌రెడ్డి నగర్, కల్లుబావికి చెందిన పగడాల జయమ్మ, జానకమ్మ, పార్వతి, లక్ష్మి, మల్లేశ్వరి, దేవకమ్మ, శారదమ్మ, లక్ష్మి, లక్ష్మి కూర్చొని మద్దతు తెలిపారు. ఐకాస నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, కోదండ, దస్తగిరినాయుడు మాట్లాడారు. గత మూడు నెలలుగా దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

మద్దికెర, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ మిత్రుడికి సాయమందించారు. మద్దికెరలో 1992లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల బృందం గ్రామానికి చెందిన రాఘవేంద్రాచార్యులకు రూ.20వేల విలువ చేసే బియ్యం, బేడలు, ఇతర నిత్యావసరాలను ఆదివారం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ?: పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా.. బైపాస్ రహదారి మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. **- వీరేశ్, ఆదోని పట్టణం**

✔: బైపాస్ రహదారి మీదుగా రాకపోకలు సాగించేలా వాహన చోదకులకు అవగాహన కల్పిస్తాం.

- అబ్దుల్ గౌస్, సీఐ, ట్రాఫిక్ పోలీసు స్టేషన్, ఆదోని

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని పాత టీజీఎల్. ఉన్నత పాఠశాల చెత్తకు నిప్పుపెడుతున్నారు. ఇళ్లలోకి పొగ చేరుతోంది. **- నేహా పాండే, ఆదోని**

✔: ప్రజారోగ్య విభాగం సిబ్బందికి సూచించి, చెత్త తరలించేలా చర్యలు తీసుకుంటాం.

- నయూమ్ అహ్మద్, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

చిప్పగిరి, న్యూస్‌టుడే : ?: బోగేశ్వరస్వామి ఆలయం వెనుక మురుగు కాల్వలు నిండి దుర్వాసన వస్తున్నాయి. కాల్వలు శుభ్రం చేయాలి. **- పెద్దయ్య, చిప్పగిరి**

✔: రెండు రోజుల్లో పూడిక తీయించి కాల్వలు శుభ్రం చేయిస్తా. **- దాసరి గోవిదరాజులు, చిప్పగిరి**

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని ఆలయాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి. **- ఈరన్న గౌడ్, మద్దికెర,** ✔: ప్రతి ఆలయం వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర**

దేవనకొండ, న్యూస్‌టుడే: ?: దేవనకొండలోని పాత మార్కెట్ కాలనీలో సీసీ రహదారి లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి గురువారం దస్తగిరయ్య దర్గాకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. **- ముల్లా జాకీర్, దేవనకొండ** ✔: నిధులు మంజూరైతే సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు చేపడతాం. **- జ్యోతి, ఎంపీడీవో, దేవనకొండ**

హొళగుంద, న్యూస్‌టుడే: ?: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో దోమల వ్యాపిస్తున్నాయి. ఫాగింగ్ చేపట్టాలి. **- నాగరాజు, హొళగుంద**

✔: సిబ్బందికి సూచించి, దోమల మందు ఫాగింగ్ చేయిస్తాం.

- చక్రవర్తి, డిప్యూటీ, ఎంపీడీవో, హొళగుంద

శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు 19న

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఈ నెల 19వ తేదీన ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ సమితి కేంద్ర నిర్వహకులు కునిగిరి నీలకంఠ, మంజుల వెంకటేష్ ఆదివారం తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, హోమ పూజలు నిర్వహిస్తామన్నారు. హైందవ ధర్మ రక్షణకు శివాజీ పాటుపడిన విషయాలను నేటి సమాజానికి తెలియాల్సిన అవసరముందన్నారు. పురవీధుల్లో శోభయాత్ర ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిర్వహకులు ఉపేంద్ర కుమార్, సాయిప్రసాద్, విజయ్‌కృష్ణ, జ్ఞానేశ్వర్, అంజయ్‌కుమార్, శివరాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉత్సవ సమితి సభ్యులు

నాడి పట్టేదెవరు.. సేవలు అందేదెన్నడు

◆ ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది కొరత

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కీలక విభాగాల వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకే జిల్లా సర్వజన ఆస్పత్రి, కనీసం వంద పడకల స్థాయిలో వైద్యులు లేకపోవడం విడ్డూరంగా ఉంది. గత వైకాపా పాలనలో ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణం పూర్తిచేయకముందే.. జిల్లా సర్వజన ఆస్పత్రిగా స్థాయి పెంచి, వైద్యులను నియమించారు. తీరా కేంద్ర వైద్య బృందం భవనాలను పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేయడంతో వైద్య కళాశాల సేవలు ప్రారంభం కాలేదు. చివరికి కూటమి ప్రభుత్వం వచ్చాక, వైద్య కళాశాల కోసం వచ్చిన వైద్యులను కళాశాల పూర్తయ్యే వరకు అవసరమున్న చోటుకు బదిలీ చేసింది. దీంతో అత్యాధునిక వైద్య సేవలు, నిపుణులు లేక ఇక్కడి జనం వంద కి.మీ. దూరంలోని కర్నూలు, బళ్లారి వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి..

ఆదోని సర్వజన ఆస్పత్రిలో వంద మందికి పైగా వైద్య నిపుణులు ఉండాలి. ఉన్నది కేవలం 16 మందే. అందులో రోజూ ఒకరు వారాంతపు సెలవు ఉంటుంది. ఇక రోజులో ముగ్గురు వైద్యులు విధులు ఆయా వేళలకు తగ్గట్లు విధులు నిర్వర్తిస్తారు. వారంలో ఒకరిద్దరు సెలవులో ఉంటారు. ఇక మిగిలిన వారు రోజు వారి ఓపీ సేవలో ఉండాల్సి వస్తోంది. ఇక ఇద్దరు జనరల్ సర్జన్లు ఉండాల్సిన చోట, ఒకరున్నారు. ఇక కంటి, ఎముకలు, జనరల్ వ్యాధులకు సంబంధించి ముగ్గురు మాత్రమే సర్జన్లు ఉన్నారు. బ్లడ్ బ్యాంకులో పాథాలజిస్ట్ లేక సేవలు ఇబ్బందిగా మారాయి. ఇక్కడి నుంచి చుట్టూ ఉన్న నాలుగు నియోజకవర్గాలకు రక్తం సరఫరా చేయాల్సి రావడంతో ఇన్‌ఛార్జి వైద్యుడితో సేవలు అందిస్తున్నారు.

◆ కీలకమైన ఫోరెన్సిక్ విభాగం నిపుణిడి సేవలు అత్యవసరం. ప్రతి నెల వివిధ రకాల కారణాలతో 40కి పైగా మృతి కేసులు వస్తుంటాయి. వీటికి ఫోరెన్సిక్ విభాగం నిపుణుడు అవసరం.

◆ అల్ట్రాసౌండ్ స్కానర్ యంత్రం ఉన్న రేడియాలజిస్ట్ లేక సాధరణ వైద్యులతోనే సేవలందించే పరిస్థితి నెలకొంది. దీని వల్ల కడుపు నొప్పి, పీసీవోడీ, రుతుక్రమ తదితర సమస్యలను పరిశీలించేందుకు వీలు పడుతుంది. ఐసీయూ కేంద్రం లేకపోవడంతో అత్యవసర కేసులకు ఇబ్బందికరంగా మారుతోంది.

పరిస్థితి విషమిస్తే..

ఇంత పెద్ద ఆస్పత్రికి కీలకమైన వైద్యులను నియమించాలని జనం కోరుతున్నారు. రోజు వారీ ఓపీ 800, ఇన్‌పేషెంట్ల సంఖ్య 60కి పైగా ఉంటుంది. ప్రమాదకర కేసులు రోజుకు పది దాకా వస్తుంటాయి. చాలా వరకు ప్రాథమిక చికిత్స చేసి, రెఫర్ చేయాల్సి వస్తోంది. దీని వల్ల అంబులెన్స్ రవాణాకు రూ.4 వేలు భరించక తప్పడం లేదు. పేదలకు అత్యవసర వైద్య సేవలు గగనంగా మారాయి.

◆ పశ్చిమ ప్రాంతంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. సరైన రవాణా సౌకర్యాలూ లేవు. నిరక్షరాస్యత తదితర కారణాలతో రోజూ పలు రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటు ఆదోని 40 కి.మీ., ఆపై వంద కి.మీ. కర్నూలుకు వెళ్లాల్సి వస్తోంది. చాలా సందర్భాల్లో ఆస్పత్రులకు చేరుకోలేక మార్గమధ్యలో మృతిచెందిన ఘటనలున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఇక్కడి ప్రాంతంలో వైద్య నిపుణులను నియమించి, అత్యాధునిక సేవలందించేలా చొరవ చూపాలని కోరుతున్నారు.

దాహం తీర్చిన బావిని విస్మరించారు

హొళగుంద బాలాంజనేయ స్వామి ఆలయం ఎదుట పురాతన కాలం నాటి దిగుడు బావి ఉంది. ప్రస్తుతం చిన్న మొక్కలు మొలచి, పాచిపట్టి ఆకుపచ్చగా మారింది. దశాబ్దాల కిందట ఈ బావిని నిర్మించారు. చుట్టుపక్కల వాసులు నీటిని వినియోగించుకునేవారు. కాలక్రమేణా దిగువ కాల్వ చేతిపంపులు అందుబాటులోకి రావడంతో బావినీటి అవసరం తగ్గిపోయింది. వినియోగం, నిర్వహణ లేక అపరిశుభ్రంగా మారింది. వేసవి దృష్ట్యా పూర్తిగా బావిని శుభ్రం చేయిస్తే.. ప్రయోజనం ఉంటుందని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, హొళగుంద

రైలు దిగలేరు.. ఎక్కలేరు

హాలహర్వి మండల పరిధిలో మారుమూల గ్రామమైన బి.సాకిబండ గ్రామస్థులు రైల్వే ప్లాట్‌ఫాం కష్టాలు తప్పడం లేదు. ఈ గ్రామం రైల్వేస్టేషన్ మీదుగా గుంతకల్లు, బళ్లారి రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం సుమారు 50 నుంచి వంద మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. రైళ్లు నిలిచిన సమయంలో ప్లాట్‌ఫాం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు మాత్రమే ప్లాట్‌ఫాం ఉందని, మరోవైపు రైలు నిలిచినప్పుడు దిగేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, హాలహర్వి

ఆట స్థలం కాదు... చెరువే

ఇదేదో ఆటస్థలం అనుకుంటే పొరపాటే. ఆస్పరి మండలం శంకరబండ గ్రామంలో ఊరి చెరువు ఆటస్థలాన్ని తలపిస్తోంది. చెరువు నిండా నీరు ఉండగా అందులో పూర్తిగా గుర్రపు డెక్క మొలిచింది. దీంతో చెరువులోని నీరు వాడటం వల్ల దురద వస్తుందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. అందులోని గుర్రపు డెక్కను తొలగిస్తే బాగుంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆస్పరి

వాహనాలు దెబ్బతింటున్నాయ్

భారీగా ఉన్న గుంతల వల్ల కార్లు, జీపులు, ద్విచక్ర వాహనాలు అందులో పడి దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పత్తికొండ నుంచి ఆదోనికి వెళ్లే ప్రధాన రహదారిలోని రాతన వద్ద రెండు చోట్ల అతి భారీ గుంతల కారణంగా నిత్యం ఈ ప్రాంతంలో ఏదో ఒక వాహనం నిలిచిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు నుంచి, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని తదితర ప్రాంతాల నుంచి గుత్తి, అనంతపురం, బెంగళూరు వెళ్లే ఈ దారిలో నిత్యం 12వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని అధికారులు చెపుతున్నారు. ఇలాంటి గుంతలు పూడ్చా మరమ్మతులు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, పత్తికొండ

ప్రమాదంపై ప్రయాణం

పంటలు నూర్పిడి చేసేందుకు ఉపయోగించే యంత్రంపై రైతులు, వ్యవసాయ కూలీలు ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఆస్పరి నుంచి ఆదోనికి వెళ్లే ప్రధాన రహదారిలో పంటల నూర్పిడి యంత్రంపై కూర్చొని ప్రయాణం సాగిస్తున్నారు. ఏమాత్రం అదుపు తప్పి కిందపడితే.. ప్రాణాపాయం తప్పదు. పోలీసులు, ఆర్టీఓ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా.. మార్పు రావడం లేదు. ఇలా ప్రమాదపు ప్రయాణం సరికాదని పలువురు సూచిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఆస్పరి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఖాసీం, జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సేకరించిన సంతకాలతో కూడిన పోస్టు కార్డులను ఆదివారం పోస్టు బాక్సులో వేశారు. వారు మాట్లాడుతూ.. డిమాండ్లతో కూడిన పోస్టు కార్డుల్లో ఉపాధ్యాయుల సంతకాలు తీసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పంపామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుధాశేఖర్, బసవరాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ కార్డులను బాక్స్‌లో వేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మహాధర్నా జయప్రదం చేయండి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడలో ఈ నెల 18న తలపెట్టనున్న ఎమ్మార్పీఎస్ మహాధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ రాంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పత్తికొండలో ఆదివారం సాయంత్రం సమితి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై దాడులు అధికమైన నేపథ్యంలో వాటిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ.. విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నామన్నారు. ఇటీవల తుగ్గలి మండలంలో హత్య ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు పందికోన వెంకటేశ్వర్లు, పులికొండమాదిగ, నరసింహులు, ప్రసాద్, రమేశ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా బడ్జెట్

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడారు. ఓ వైపు సంక్షేమం.. మరో వైపు అభివృద్ధి మంత్రంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో, మూడోసారి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రధానంగా ఆర్థిక కారిడార్లు, విలువైన ఖనిజాల వెలికితీత, పోలవరం ప్రాజెక్టు పూర్తి, రాయలసీమలో ఉద్యాన హబ్‌తో పాటు గత పాలనలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేయించే బాధ్యత కూటమి ప్రభుత్వం భుజాన వేసుకొందన్నారు.

శివోహం.. భక్తజన సందోహం

➤ ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం ➤ భక్తిశ్రద్ధలతో శివరాత్రి

ఆదోని పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో వేడుకలు

ఆదోని మండలం నారాయణపురంలో సందడి

ఆలూరు: భీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ఆలూరులోని మల్లిస్వామి రథం లాగుతున్న భక్తులు

ఓం నమఃశివాయ.. ఓం పార్వతి పతయే నమః.. నామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. పల్లెల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అభిషేకాలు, బిల్వార్చన చేశారు. పశ్చిమ ప్రాంతంలో పలు గ్రామాల్లో ప్రభల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. రథోత్సవాలు ఘనంగా చేపట్టారు. జాగరణ నేపథ్యంలో నిర్వాహకులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

– న్యూస్‌టుడే, బృందం

తుగ్గలి: జొన్నగిరిలో గర్భాలయానికి పుష్పాలంకరణ

ఆస్పరి: రామతీర్థం క్షేత్రంలో జ్యోతిర్లింగాలకు పూజలు

మద్దికెర: బుగ్గలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

క్షేత్రంలో కోలాటం ఆడుతున్న శర్మాస్ పాఠశాల విద్యార్థులు

నాన్న ప్రోత్సాహం.. అక్రమ్ పరాక్రమం

తుగ్గలి, న్యూస్‌టుడే: కుమారుడి ఆసక్తిని గుర్తించారు ఆ తండ్రి. ఇష్టమైన క్రికెట్ క్రీడలో రాణించాలని ప్రోత్సహించారు. ఆటలో మెలకువలు నేర్చుకొని, పట్టు సాధించాడు కుమారుడు. నాన్న కల నెరవేర్చే దిశగా అడుగులేస్తున్నాడు. తుగ్గలి సాధన పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న అక్రమ్ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ 2026 మార్చిలో నిర్వహించనున్న క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నాడు. అండర్-12 జిల్లా జట్టుకు బౌలర్‌గా ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ తెలిపారు. మద్దికెర మండలం పెరవలికి చెందిన హనీఫ్ గ్రానైట్ బండలు వేసే కూలీగా పనిచేస్తున్నారు. తన కుమారుడు అక్రమ్‌ను క్రికెటర్‌గా చూడాలనుకున్నారు. స్వతహాగా క్రికెట్ క్రీడాకారుడైన హనీఫ్ తన కుమారుడిని ప్రోత్సహిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే అక్రమ్ తండ్రి వద్ద, పాఠశాలలో శిక్షణ పొందుతూ పేస్ బౌలింగ్‌లో రాణిస్తున్నాడు. 2025లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చేపట్టిన గుంటూరులో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. పిల్లల ఆసక్తిని దృష్టిలో పెట్టుకొని వారికి ఇష్టమైన క్రీడలో శిక్షణ ఇస్తున్నట్లు భాస్కర్ తెలిపారు. బాలురతో పాటు బాలికలకు క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమ్ క్రికెట్ ప్లేయర్

జాతీయ అబాకస్ పోటీలకు పెరవలి విద్యార్థులు

మద్దికెర, న్యూస్‌టుడే: పెరవలికి చెందిన ఏడో తరగతి విద్యార్థులు పల్లవి, నందకిశోర్ రాష్ట్ర స్థాయిలో జరిగిన అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపి, జాయతీ స్థాయికి ఎంపిక య్యారు. విజయవాడలో విశ్వం ఎడ్యుటెక్ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సీనియర్ ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

విజయవాడలో ప్రశంసా పత్రం అందుకుంటున్న పల్లవి, నందకిశోర్

పుల్వామా అమరవీరులకు నివాళి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఆదోని బీసీ వసతి గృహంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నాయకులు, విద్యార్థులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమితి సభ్యుడు వీరేశ్, గోవిందరాజు, రాహుల్, శివచరణ్, ఉదయ్, స్రవంతి తదతరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

పేయింటర్ల హక్కుల సాధనకు పోరాటం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: పేయింటర్ల హక్కుల సాధన కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ దోకా అన్నారు. పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన పేయింటర్స్ అసోసియేషన్ కొత్త కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశు మాట్లాడుతూ.. పేయింటర్లు వృత్తిలో పడుతున్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనిథ్,మారుతి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, ఓబులేశు, కోశాధికారి రంగన్న, నాగరాజు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో పేయింటర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దిలీప్‌దోకా

యువకుడిపై దాడి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: విరుపాపురం గ్రామానికి చెందిన యువకుడు రాజుపై అదే గ్రామానికి చెందిన యల్లయ్య దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని పోలీసులు తెలిపారు. చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. రాజు గొర్రెలు మేపుతుండగా.. యల్లయ్య దాడి చేశాడని బాధితుడు ఫిర్యాదు చేశారన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి సమీపంలోని డోన్ రైల్వే గేటు ప్రాంతంలోని 44వ జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, దస్తగిరి ద్విచక్రవాహనంపై వెల్దుర్తికి వెళ్తున్నారు. రోడ్డు దాటే క్రమంలో బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ఈశ్వరయ్యకు తీవ్ర గాయాలు కాగా దస్తగిరి స్వల్పంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఈశ్వరయ్యను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లక్షల వ్యయం.. ఎవరికి ఉపయోగం

◆ ప్రారంభానికి నోచుకోని భవనాలు ◆ ప్రజాధనం వృథా

దేవనకొండ, న్యూస్‌టుడే: రైతులకు సేవలందించాలని రూ.లక్షలు వెచ్చించి రైతు భరోసా కేంద్రం, విద్యార్థుల సౌకర్యార్థం అదనపు తరతగతి గదులు నిర్మించారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. పాలకులు వాటివైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ప్రారంభానికి నోచుకోక ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభానికి ఎదురుచూపులు

దేవనకొండ మండలంలోని గుండ్లకొండలో గత ప్రభుత్వం హయాంలో రూ.20లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మించారు. పనులు పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా.. భవనం ప్రారంభించలేదు. ఇలాగే వదిలేస్తే.. వస్తువులు చోరీకి గురై, భవనం ఎందుకూ పనికిరాకుండా పోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రం కార్యకలాపాలు ఇక్కడ నిర్వహించి, రైతులకు సేవలందించాలని కోరుతున్నారు.

పదేళ్లుగా అంతే..

కొత్తపేట గ్రామంలో పదేళ్ల కిందట ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి సమగ్రశిక్ష నిధుల నుంచి మూడు తరగతి గదులకు రూ.19లక్షలు మంజూరు చేశారు. 2017లో గదుల నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క రోజు కూడా వినియోగించలేదు. భవనం చుట్టూ ముళ్లపొదలతో నిండిపోయింది. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు ఉండగా 93 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించాలని స్థానికులు కోరుతున్నారు.

గంగా భవాని ఆలయానికి మైక్ సెట్ విరాళం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: బైచిగేరి గ్రామంలోని మాతా గంగాభవాని ఆలయానికి శివరాత్రి సందర్భంగా ఆదోని మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్ ఆదివారం మైక్ సెట్‌ను విరాళంగా అందించారు. కార్యక్రమంలో నాయకులు మలేకర్ శ్రీనివాస్, గంగపుత్రులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: పట్టణంలో మహాశివరాత్రి సందర్భంగా వార్డుల్లో ఆదివారం శుభ్రత పనులు చేపట్టినట్లు పురపాలక సంఘం కమిషనర్ నయూమ్ అహ్మద్ పరిశీలించారు. భక్తుల రద్దీ ఉండే ఆలయాల ప్రాంతంలో శుభ్రత, బ్లీచింగ్ పౌడి చల్లడం వంటి పనులను చేయించారు. రాత్రి సమయంలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. కొత్తబస్టాండు రహదారితో పాటు శుక్రవారంపేట కాలనీలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

(c) eenadu

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక, ప్రసాదాలు అందజేస్తున్న శ్రీమఠం అధికారులు

గురువైభవోత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానం

మంత్రాలయం (గ్రామీణం) (కౌతాళం), న్యూస్‌టుడే: మంత్రాలయంలో ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు శ్రీరాఘవేంద్రస్వామి గురువైభవోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీమఠం అధికారులు ఏపీ నరసింహస్వామి, అనంత పురాణిక్‌లు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి ఆహ్వాన పత్రికతోపాటు ప్రసాదాలు అందజేశారు. గురువైభవోత్సవాల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

సీఎం సహాయ నిధి.. పేదలకు వరం

మంత్రాలయం (గ్రామీణం) (కౌతాళం), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని తెదేపా మండల నేత వన్నెగ వెంకటేశప్పస్వామి అన్నారు. మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామానికి చెందిన ఈరమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.20 వేల విలువైన చెక్కును ఆదివారం ఇచ్చారు. వీరప్ప, సుంకన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు 8008573824 కోడుమూరు 9885988357 కౌతాళం 8008574913

?: క్లబ్ ఏరియా ప్రాంతంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. - నారాయణ ✓: వీధి దీపాలు ఏర్పాటు చేయించి ఇబ్బందులు తొలగిస్తాం. - నీరజ, డీఈఈ

?: గంజహళ్లి రహదారి గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. - రంగన్న
✓: నూతన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు: ?: కోసిగి మండల కేంద్రంలోని సిద్ధప్పపాళెం కాలనీలో శ్రీరుద్రముని ఆలయం వెనుక ఉన్న ఐరన్ స్తంభం తాకితే విద్యుదాఘాతం జరుగుతోంది. వెంటనే సమస్యను పరిష్కరించాలి. - ప్రవీణ్ ✓: వెంటనే లైన్‌మెన్‌ను పంపించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - వీరేష్, ఇన్‌ఛార్జి ఏఈ

బీమా వర్తింపజేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: అంబులెన్స్ డ్రైవర్లకు బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ తాలూకా అధ్యక్షుడు గోవింద డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం సరైన వైద్య సేవలు అందించడం లేదని ఆరోపించారు. అత్యవసర పరిస్థితులు, అనారోగ్యం, ప్రమాదాలబారిన పడిన వారిని కాపాడేందుకు నిత్యం సేవలందిస్తున్న అంబులెన్స్ డ్రైవర్లకు రూ.20 లక్షల విలువైన బీమా పథకం వర్తింపజేయాలని కోరారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐటీయూ నేతలు రాముడు, సురేష్‌కుమార్, హుస్సేన్, వీరేష్, మల్లికార్జున, వలి, బలరాం, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చనుగొండ్ల ప్రాథమిక పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి పురుషుల కబడ్డీ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కేశవ నాగలింగేశ్వర స్వామి రథోత్సవం, మహాశివరాత్రి పురస్కరించుకుని ఈ పోటీలు జరుపుతున్నట్లు కబడ్డీ పోటీల నిర్వాహకులు తెలిపారు. ముందుగా పోటీల నిర్వహణకు సహకరించిన వారిని సన్మానించారు. రెండో రోజులపాటు పోటీలు జరుగుతాయని ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రఫీ, వీరాంజనేయులు, రమేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తలపడుతున్న క్రీడాకారులు

పట్టణం విస్తరించి.. ఆక్రమణలు చొచ్చుకొచ్చి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన మార్గాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వేధిస్తున్నాయి. పలువురు ఇష్టానుసారంగా రహదారులను ఆక్రమించుకున్నారు. మరోవైపు విస్తరణ పనులు ముందుకు సాగకపోవడం.. ఆక్రమణల తొలగింపునకు ఆటంకాలు ఏర్పడుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మిగనూరు పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. శివారు కాలనీలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అందుకు తగ్గట్టు సౌకర్యాలు కానరావడం లేదు. గతంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారుల విస్తరణ చేపట్టి మధ్యలో వదిలేశారు. పనులు ముందుకు కదలకపోవడం.. దారులు విశాలంగా లేకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మరోవైపు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం జనం పట్టణానికి వస్తుంటారు. రహదారుల ఆక్రమణ నేపథ్యంలో తరచూ రాకపోకలకు సమస్యలు ఎదురవుతున్నాయి.

గాంధీచౌక్ ప్రాంతంలో రోడ్లపైనే వ్యాపారాలు

కాలువలనూ వదలక..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు ఏకంగా కాలువలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం దుకాణాలు, వాణిజ్య సముదాయాల ముందు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా పక్కా కట్టడాలు నిర్మించేస్తున్నారు. ఫలితంగా వాహనదారులు రోడ్లపైనే ఆపుతున్నారు. ఈ నేపథ్యంలో గాంధీచౌక్, మెయిన్ బజార్, బంగార్ రోడ్డు తదితర ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. గోనెగండ్ల రహదారి పరిస్థితి మరింత అధ్వానమే. బస్సులు, లారీలు ఎదురెదురుగా వస్తే ముందుకు కదలలేని పరిస్థితి. ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్ నుంచి సోమప్ప కూడలి, బస్టాండుకు వెళ్లే రోడ్డు సైతం ఆక్రమణకు గురైంది.

■ అడుగడుగునా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలు

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు భాగంలో గతంలో దుకాణాలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతంపై ఇప్పటికే పలువురు మళ్లీ ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.
- కొందరు రహదారులపైనే తోపుడు బండ్లు నిలుపుతున్నారు. వీటివద్ద జనం గుమిగూడుతుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.
- దుకాణాల తొలగింపు విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- పట్టణంలో కాలువలు, రహదారులను ఇష్టానుసారంగా ఆక్రమించుకున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా పురపాలక అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా వాహనదారుల కష్టం తీర్చాలని కోరుతున్నారు.

మొత్తం జనాభా : 1.35 లక్షలు
పట్టణ పరిధిలో వార్డులు : 34
నిత్యం తిరిగే వాహనాలు: 20 వేలకుపైగా..

చేనేతల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: చేనేత సంక్షేమానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించి పెద్దపీట వేసిందని తెదేపా పట్టణ అధ్యక్షుడు మహేష్ అన్నారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. డ్రిఫ్ట్ పథకం కింద రూ.5 కోట్లు కేటాయించడం ద్వారా దాదాపు 5,386 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరనుందని చెప్పారు. వెంకటగిరిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌ల్యూమ్ టెక్నాలజీకి రూ.1.26 కోట్లు కేటాయించారని తెలిపారు. మగ్గం సరకు కొనుగోలు కింద 6,265 మందికి రూ.20 లక్షలు మంజూరు చేయనున్నట్లు చెప్పడం సంతోషకరమన్నారు. మొత్తంగా చేనేత కోసం బడ్జెట్‌లో రూ.115.53 కోట్లు కేటాయించడం సంతోషకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుర్ని కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మిన్నప్ప, టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడు నరసప్ప, పట్టణ ప్రధాన కార్యదర్శి దామ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగక.. దుర్గంధం వదలక

కోడుమూరు పట్టణంలోని గుప్తానగర్ కాలనీలో మురుగు కాలువల నిర్వహణ అధ్వానంగా ఉంది. గత కొన్ని రోజులుగా వ్యర్థాలు తొలగించకపోవడంతో పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. భరించలేని దుర్గంధం వస్తుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు మురుగు పొంగి రహదారులపైకి చేరుతోంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

బాటన పడేదెన్నడో

గోనెగండ్ల పంచాయతీ పరిధి.. ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఈ రోడ్డును మూడు దశాబ్దాల కిందట నిర్మించారు. అప్పటినుంచి మరమ్మతులు చేయకపోవడంతో నిర్వహణ కరవై దెబ్బతింది. అక్కడక్కడా గుంతలు ఉండటంతో జనం అదుపు తప్పి పడిపోతున్నారు. నూతన రహదారి నిర్మించి కష్టాలు తొలగించాలని పలువురు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, గోనెగండ్ల

తవ్వారు.. పూడ్చక వదిలేశారు

పట్టణ పరిధిలోని గాంధీనగర్ కాలనీ.. ఐదో రోడ్డులో పైపులైను ఏర్పాటు కోసం రహదారి పొడవుగా గుంత తవ్వారు. 15 రోజులు గడిచినా ఇప్పటివరకు పూడ్చలేదు. ఫలితంగా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మట్టి రోడ్డుపై పేరుకుపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. వెంటనే పూడ్చేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

చెత్త బండి.. చిల్లులతో నిండి

సి.బెళగల్ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యానికి ఉపయోగించే ట్రాక్టరు అధ్వానంగా మారింది. ట్రాక్టర్ ట్రాలీ డబ్బా తిని రంధ్రాలు పడ్డాయి. దీనిని చెత్త తరలింపునకు వాడుతున్నారు. ఫలితంగా వ్యర్థాలంతా రోడ్లపైనే పడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కొత్త ట్రాలీ మంజూరు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. – న్యూస్‌టుడే, కోడుమూరు

నిర్మించి.. వదిలేసి

ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్లో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు అలంకారప్రాయంగా ఉంది. విపణికి ప్రతిరోజూ వేలాది మంది వస్తుంటారు. ట్యాంకులో చుక్కనీరు ఉండటం లేదు. వివిధ అవసరాల నిమిత్తం ట్యాంకులోని నీటిని ఉపయోగిస్తుంటారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే దీనిని అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

సమకూరనిధి.. ఏదీ పర్యాటక సిరి

■ అభివృద్ధికి నోచుకోని గాజులదిన్నె

గోనెగండ్ల, న్యూస్‌టుడే : గాజులదిన్నె జలాశయ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పాలకులు, అధికారులు హామీ ఇచ్చారు. అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. స్థల పరిశీలన జరిపి హడావుడి చేశారు. ఆ తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో జనం నిరాశ చెందుతున్నారు.

నీటితో కళకళలాడుతున్న జలాశయం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్మించిన గాజులదిన్నె దామోదరం సంజీవయ్య సాగర్ ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. గోనెగండ్ల మండల పరిధిలో హంద్రీ నదిపై 1977లో జలాశయాన్ని నిర్మించారు. 1,274 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నీటి నిల్వ ఉండేలా ఏర్పాటు చేశారు. 2019లో జలాశయం ఆనకట్ట ఎత్తు పెంచి 4.5 నుంచి 5.5 నీటి నిల్వ ఉండేలా పనులకు శ్రీకారం చుట్టారు. ఈ జలాశయానికి హంద్రీనీవాతో అనుసంధానం చేయడంతో ఏడాది పొడవునా నీటితో కళకళలాడుతోంది.

భూములు అందుబాటులో ఉన్నా..

గాజులదిన్నె ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. బోటు షికారుకు అనుకూలంగా ఉంది. జలాశయం ఉత్తరం వైపు ఉద్యానవనం ఉంది. దీని అభివృద్ధిపై అటు పాలకులు.. ఇటు అధికారులు దృష్టి సారించలేదు. ఫలితంగా ఇందులోని చెట్లన్నీ ఎండిపోయి కళావిహీనంగా మారింది. పార్కులు తదితర అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి. ఎమ్మిగనూరు-కర్నూలు ప్రధాన రహదారి సమీపంలో జలాశయం ప్రాంతం ఉంది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి జనం పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుంది. పలువురికి ఉపాధి సైతం లభిస్తుంది. ఇన్ని అవకాశాలు ఉన్నప్పటికీ అడుగులు మాత్రం ముందుకు పడటం లేదు.

వచ్చారు.. వెళ్లారు

ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గాజులదిన్నె ప్రాజెక్టును విడిది కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం స్పందించి కావాల్సిన నిధులు కేటాయించడం ద్వారా పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఫలితంగా ప్రజలు ప్రకృతిని తనివితీరా ఆస్వాదించే అవకాశం ఏర్పడుతుంది.

మహా రుద్రాయ.. నీలకంఠాయ

■ వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

ఎమ్మిగనూరు : నీలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఓం నమఃశివాయ అంటూ భక్తులు పంచాక్షరీ మంత్రాన్ని జపించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. తేరు బజారులో ఉన్న మార్కండేయస్వామి ఆలయ ఆవరణలో కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. –న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు బృందం

గోనెగండ్ల : కైరవాడిలో ప్రభోత్సవం

మంత్రాలయం గ్రామీణం : ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మంత్రాలయం : రామలింగేశ్వర స్వామికి పుష్పాలంకరణ

ఎమ్మిగనూరు : తేరుబజారులో కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తజనం

శివలింగానికి అభిషేకం చేస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

సి.బెళగల్‌లో కాశీ విశ్వేశ్వరుడు, విశాలాక్షి అమ్మవార్లకు పూజలు

గూడూరు గ్రామీణం : భువనేశ్వరి సమేత నీలకంఠేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు జగన్నాథగట్టు వద్దనున్న రూపాల సంగమేశ్వరస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

సంక్షిప్త సమాచారం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : పట్టణంలో ఆదివారం సంత జరిగింది. ప్రధాన రహదారిపై వాహనాలను అడ్డదిడ్డంగా పెట్టడంతో జనం రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : లక్ష్మీపేటలోని మూడో లైన్‌లో రహదారిపై కంకర తేలడంతో వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి. ఈ రోడ్డును 15 ఏళ్ల కిందట నిర్మించారని.. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని స్థానికులు లక్ష్మన్న, రంగన్న తదితరులు పేర్కొన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : బనవాసి గ్రామంలో వంక వద్ద పైపులైను దెబ్బతిని నీరంతా వృథాగా పోతోంది. మరమ్మతులు చేయకపోవడంతో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : పార్లపల్లి గ్రామంలో కాలువలు శుభ్రం చేయడం లేదు. భరింపరాని దుర్గంధం వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పూడిక తొలగించేలా చూడాలని వారు విన్నవిస్తున్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : వెంకటాపురంలోని మిలటరీ కాలనీలో ప్రధాన మార్గం కంకర తేలింది. దీనికితోడు కాలువ శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగు నీరంతా రోడ్డుపైకి చేరుతోందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ముగతిపేట కాలనీలో ప్రధాన పైపులైను మూడు చోట్ల దెబ్బతింది. మంచినీరు నేలపాలవుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు.

పాగులాపురం (గూడూరు), న్యూస్‌టుడే : మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టరు వెంకటరాముడు ఆదివారం నాగులాపురంలోని సుంకులా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బత్తిన కిరణ్, బండారు తిరుపాల్, శ్రీనివాసులు, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి, న్యూస్‌టుడే: గ్రామంలో ఈనెల 26న బసవేశ్వరస్వామి రథోత్సవం, మార్చి 3, 4 తేదీల్లో మారెమ్మ దేవర జరగనుందని.. గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందంటూ మండల పరిధిలోని జంపాపురం ప్రజలు మంత్రాలయం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి రాఘవేంద్రరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ఈ నేపథ్యంలో మాజీ సర్పంచి బసప్ప, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బసవరాజు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో పంచాయతీ నిధులతో బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలులో విఫలం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దగా నిధులు కేటాయించలేదని ఏపీ మహిళా సంక్షేమ సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ ఆరోపించారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి కింద 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు రూ.1,500 ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. పొదుపు మహిళలకు సరిగా రుణాలు పంపిణీ చేయడం లేదని ఆరోపించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ఆలయాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోందని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని మార్కండేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తేరుబజారులోని ఆలయంలో బిల్వార్చన తదితరాలు జరిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి దేవాలయానికి వెళ్లి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించి అభివృద్ధికి పాటుపడుతున్నామని చెప్పారు. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

బాధిత రైతుకు చేయూత

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే : కౌతాళంలో ఐదు రోజుల కిందట ఈరన్న అనే వ్యక్తి వ్యక్తి గడ్డివామి దగ్ధమైంది. రైతు పరిస్థితి గమనించిన సర్పంచి పాల్ దినకర్, ఉప ఎంపీపీ బుజ్జిస్వామి, వైకాపా నేత దేశాయి ప్రహ్లాదాచారి విషయాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలమేరకు ఒక ట్రాక్టర్ పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి బాధిత రైతుకు అందజేశారు.

పొగచూరిన బతుకులు

గూడూరు, న్యూస్‌టుడే : గూడూరు నగర పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. పలు ప్రాంతాల్లో వ్యర్థాలు రోజుల తరబడి పేరుకుపోయినా తొలగించడం లేదు. ఫలితంగా జనం ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో 40 వేల మందికి పైగా నివసిస్తున్నారు. రోజుకు 8 టన్నులకుపైగా తడి, పొడి వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

● యథేచ్ఛగా వ్యర్థాలకు నిప్పు

చెత్తాచెదారాలకు నిప్పు పెట్టడంతో వస్తున్న పొగ

తరలింపు ఆగిపోయి..

- పట్టణ ప్రాంతంలో పదేళ్ల కిందట తాత్కాలిక డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య సిబ్బంది రహదారులకు ఇరువైపులా వ్యర్థాలను వాహనాల్లో తెచ్చి పడేస్తున్నారు. మునగాల దారి వెంబడి.. పడమర బీసీ కాలనీ సమీపంలో వేస్తుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రోగాలు సైతం ప్రబలుతున్నాయని పేర్కొంటున్నారు.
- వ్యర్థాల నుంచి సంపద సృష్టించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ఇక్కడి డంపింగ్ యార్డులోని చెత్తాచెదారాలను కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని డంపింగ్ యార్డుకు తరలించేందుకుగాను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. కొంతమేర తరలించి మధ్యలో ఆపేశారు. వ్యర్థాల గుట్ట పేరుకుపోతుండటంతో చివరికి కార్మికులు నిప్పు పెడుతున్నారు.

వేధిస్తున్న ఆరోగ్య సమస్యలు

- డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో సమీపంలోని కాలనీవాసులతో పాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఊపిరి పీల్చుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దట్టంగా పొగ వస్తుండటంతో వారి ఇబ్బందులు వర్ణనాతీతం. వారం రోజులుగా చెత్తాచెదారాలు మండుతూనే ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. గతంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ ఇక్కడి నుంచి డంపింగ్ యార్డును తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కానీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.
- "కలెక్టర్ ఆదేశాలమేరకు స్థలం చూపాలని రెవెన్యూ అధికారులను కోరాం. ఇక్కడ ప్రభుత్వ భూమి అందుబాటులో లేదు. పాలకులతో చర్చించాం. స్థలాన్వేషణలో ఉన్నాం. త్వరలో యార్డు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం" అని కమిషనర్ రమేశ్‌బాబు చెప్పారు.

అరకొర వసతులతో ఇబ్బందులు

గురజాల (నందవరం), న్యూస్‌టుడే : మండల పరిధిలోని గురజాలలో శ్రీరామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి వేడుకలు ఆదివారం వైభవోపేతంగా జరిగాయి భక్తులు వేకువజాము నుంచే తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. మరోవైపు ఆలయం వద్ద సరైన వసతులు కరవయ్యాయి. తాగునీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మహిళల కోసం ప్రత్యేకంగా స్నానఘట్టాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా దేవాదాయ శాఖ అధికారులు దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

కప్పు అందుకుంటున్న విద్యార్థినులు

సి.బెళగల్, న్యూస్‌టుడే : కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సి.బెళగల్ కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి పతకాలు సాధించారని ప్రత్యేకాధికారిణి జ్యోతి తెలిపారు. 63 కిలోల విభాగంలో కీర్తన బంగారు పతకం, 58 కిలోల విభాగంలో చాముండేశ్వరి, లక్ష్మీనరసమ్మలు వెండి పతకాలు అందుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

ముగిసిన ఎన్‌సీసీ పరీక్షలు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కర్నూలు, అనంతపురం జిల్లాల ఎన్‌సీసీ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. కర్నూలు వైద్య కళాశాలలో 9 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు (ప్రాక్టికల్) పరీక్షలు జరిగాయి. కవాతు, ఫైరింగ్, మ్యాపింగ్ విభాగాల్లో విద్యార్థులను పరీక్షించారు. 10.30 గంటల వరకు ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థిని విద్యార్థులకు ఆడిటోరియంలో పరీక్షలు నిర్వహించారు. 99 శాతం మంది పరీక్షకు హాజరైనట్లు ఎన్‌సీసీ అధికారులు తెలిపారు. పరీక్షను ఎన్‌సీసీ గ్రూప్ కమాండెంట్ కల్నల్ అలోక్ త్రిపాఠి పర్యవేక్షించారు. 9వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ కల్నల్ జోబి ఫిలిప్స్, 28వ ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ శశికుమార్ పాల్గొన్నారు.

బడ్జెట్ పట్ల న్యాయవాదుల హర్షం

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : రాష్ట్ర బడ్జెట్‌లో న్యాయ వ్యవస్థకు రూ.349 కోట్ల కేటాయించటం పట్ల భారత న్యాయవాదుల సంఘం జిల్లా కార్యదర్శి రవిశాంత్‌ప్రసాద్, సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయశాఖలో వసతులు మెరుగుపరచడంతో పాటు కోర్టు భవనాలు, గృహాల నిర్మాణాల ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం పట్ల కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05406, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ: ?: గాంధీనగర్, విద్యానగర్‌లో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగునీరు నిల్వ ఉండిపోతుంది. - **కిరణ్**
?: జోహరాపురంలో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఫాగింగ్ చేయాలి. - **స్థానికులు**
?: సంతోష్‌నగర్, విజయలక్ష్మినగర్‌లో మురుగుకాలువలు పూడిపోయాయి. కొన్ని నెలలుగా పూడిక తీయడం లేదు. - **సాదిక్**
?: ధర్మపేటలో దోమలు ఎక్కువయ్యాయి. - **వికాస్**
✔: నగరంలో కాలువలు శుభ్రం చేయిస్తాం. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేస్తాం. - **నగరపాలక అధికారులు**

నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి సహకారం

ఎంపీ బస్తిపాటి దంపతులను సన్మానిస్తున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : అఖిల భారత కురువ నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హామీ ఇచ్చారు. ఎంపీ దంపతులను ఆదివారం శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం కురువ సంఘం నిత్యాన్నదాన సత్రాన్ని సందర్శించి నాలుగోరోజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీశైలం కురువ సత్రం కమిటీ తరఫున ఎంపీ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, రంగస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

గుర్తింపుతోనే ప్రయోజనాల వర్తింపు

★ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే పథకాల లబ్ధి ★ అన్నదాతలు త్వరపడాలని అధికారులు సూచన

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : అన్నదాతలు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే 'ఫార్మర్ రిజిస్ట్రేషన్' తప్పక చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు వివరాలను నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సహాయం, పంటల బీమా, పంట దిగుబడులను మద్దతు ధరకు విక్రయించుకోవడం.. బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందాలన్నా 'ఫార్మర్ రిజిస్ట్రేషన్' సంఖ్య తప్పనిసరి. ఈ ప్రక్రియ చాలాకాలం నుంచి కొనసాగుతున్నా.. ఇప్పటికీ వేలాదిమంది రైతులు వివరాలను నమోదు చేసుకోలేదు. కర్నూలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో సి.బెళగల్, గూడూరు, కోడుమూరు, కర్నూలు రూరల్ మండలాలు ముందంజలో.. కల్లూరు, ఓర్వకల్లు మండలాలు వెనకబడ్డాయి.

గూడూరు మండలంలోని ఆర్‌ఎస్‌కేలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు వచ్చిన రైతులు

● కర్నూలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈనెల 7వ తేదీ నాటికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ మండలాల వారీగా పురోగతి ఇలా..

మండలం	మొత్తం రైతులు	రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు	చేయించుకోని రైతులు	పురోగతి శాతం
కర్నూలు రూరల్	10,435	8,191	2,244	78
కల్లూరు	12,498	8,800	3,698	71
కోడుమూరు	11,098	8,913	2,185	80
గూడూరు	8,332	6,977	1,355	84
ఓర్వకల్లు	11,373	7,455	3,918	66

ఆర్‌ఎస్‌కేల్లో నమోదు

గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేస్తున్నారు. ఆధార్ నంబరు, పట్టాదారు పాసుపుస్తకం వివరాలు, ఆధార్‌తో అనుసంధానమైన చరవాణి నంబరును వ్యవసాయ సహాయకులకు అందజేస్తే వారు నమోదు చేస్తారు. ఆ తర్వాత రైతుల ఫోన్‌కు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది. ఈ సంఖ్యతో మీసేవా కేంద్రాల్లో స్మార్ట్ కార్డును డౌన్‌లోడ్ చేయించుకోవచ్చు.

స్వయంగా చేసుకోవచ్చు

స్మార్ట్‌ఫోన్ కలిగిన రైతులు ఇంటివద్ద ఉండే స్వయంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకోసం వ్యవసాయశాఖ కొత్తగా రూపొందించిన రైతు మొబైల్ యాప్ (ఏపీఏఐఎంఎస్ 2.0)ను అందుబాటులోకి తెచ్చింది. రైతులు ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమకు సంబంధించిన వివరాలను నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

సదస్సులో మాట్లాడుతున్న డా.బ్రహ్మారెడ్డి

ఉన్నత లక్ష్యాలతో పనిచేయాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక మరింత ఉన్నత లక్ష్యాలతో పనిచేసి బాధ్యతగల పౌర సమాజాన్ని నిర్మించాలని జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకుడు డా.బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో నాయకురాలు రోజారమణి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సదస్సులో వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. అనంతరం రామకృష్ణారెడ్డి, రత్నం ఏసేపు సంపాదకత్వంతో వెలువడిన 'గమ్యం.. గమనం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రాధాకృష్ణ, శ్రీనివాసరావు, భాస్కర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుంకన్న, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల వద్ద పటిష్ఠ బందోబస్తు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగన్నాథగట్టు, కాల్వబుగ్గ రామేశ్వరాలయం ఇతర అన్ని శివాలయాల వద్ద గట్టి భద్రతా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు సందర్శించనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే డయల్ 100, 112 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

గౌతమి.. గెలుపు పంచ్

★ ఉషూ, కరాటే క్రీడల్లో ప్రతిభ

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : జొహరాపురానికి చెందిన గౌతమి ఆత్మరక్షణ క్రీడల్లో ప్రతిభ చూపుతోంది. 8వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని మూడేళ్లుగా ఉషూ, కరాటే శిక్షణ పొందుతోంది. తల్లిదండ్రులు, శిక్షకుల ప్రోత్సాహంతో పోటీల్లో రాణిస్తోంది. 2024 నుంచి జరిగిన పలు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ఉషూ, కరాటే పోటీల్లో పతకాలు సాధించి ఆదర్శంగా నిలుస్తోంది.

● 2024 డిసెంబరు 6న నగరంలోని కిడ్స్ వరల్డ్‌లో జరిగిన జిల్లాస్థాయి ఉషూ పోటీల్లో సబ్‌జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించింది.

● 2025 ఆగస్టు 1న కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఖేలో ఇండియా ఉషూ పోటీల్లో స్వర్ణం అందుకుంది.

● 2025 నవంబరు 4, 5 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా పోటీల్లో ఉషూలో స్వర్ణం గెలుచుకుంది.

● ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపి సబ్‌జూనియర్ విభాగంలో బ్లూ బెల్ట్ అందుకుంది.

విద్యార్థులు సామాజిక దృక్పథం అలవర్చుకోవాలి

విజేతలతో డైరెక్టర్ నూరీ మన్సూర్‌అలీ ఖాన్, తదితరులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచే సామాజిక దృక్పథం అలవర్చుకోవాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ నూరీ మన్సూర్ అలీ ఖాన్ పేర్కొన్నారు. పాతబస్తీలోని దర్వేష్ ఖాద్రీ దర్గా ఆవరణలో ఖురాన్ సూక్తులు, ప్రవక్త బోధనలపై ఆదివారం పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెహబూబ్‌ఖాన్, హఫీజ్ అబ్దుల్ గఫ్ఫార్, మౌలానా ముస్తఫా, మౌలానా అర్షద్, హఫీజ్‌షాషా వలి పాల్గొన్నారు.

హరోం హర.. పాహి పరమేశ్వరా

★ భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

జగన్నాథగట్టుపై కొలువైన రూపాల సంగమేశ్వరునికి ప్రత్యేక అలంకరణ

నెహ్రూనగర్‌లోని సాయీశ్వర ఆలయంలో మహబలేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ

హర హర మహాదేవ శంభో శంకర.. ఓం నమఃశివాయ అన్న శివనామ స్మరణలతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే భక్తులు శివయ్య సన్నిధికి తరలివచ్చారు. జగన్నాథగట్టులోని రూపాల సంగమేశ్వరస్వామి, కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయాలతో పాటు కర్నూలు నగరంలోని శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీ కాల్వ సమీపంలోని కైలాసగిరి, సూర్యనారాయణస్వామి, సత్యనారాయణస్వామి ఆలయాలు, నెహ్రూనగర్‌లోని మహబలేశ్వర ఆలయం, లలితా పీఠం, శంకరమఠం, సంకల్‌బాగ్ హరిహరక్షేత్రం, పాతబస్తీ లలితాపీఠం, మార్కండేయస్వామి గుడి, నగరేశ్వర కోవెల, గణేశ్‌నగర్‌లోని శివాలయాల్లో రాత్రంతా భక్తులు జాగారం చేశారు. ఈసదర్భంగా ఆలయాల నిర్వాహకులు ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. లింగోద్భవ పూజల అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవాలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. – న్యూస్‌టుడే, కర్నూలు ఆధ్యాత్మికం, కల్లూరు గ్రామీణ

లలితాపీఠంలో శివపార్వతుల కల్యాణోత్సవం

జగన్నాథ గట్టుపై ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కల్లూరు పట్టణం ఉమామహేశ్వనగర్‌లోని శివాలయంలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి దంపతులు

శివలింగానికి చిన్నారితో కలిసి అభిషేకం చేస్తున్న తల్లిదండ్రులు

రూపాల సంగమేశ్వరస్వామి దర్శనానికి భక్తుల బారులు

మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలోని కైలాసగిరిని దర్శించుకుంటున్న భక్తులు

పందిపాడు నుంచి కల్లూరు నీలకంఠేశ్వరస్వామి ఆలయం వరకు కలశాలతో మహిళల శోభాయాత్ర

పాతబస్తీ భద్రావతి భావనారాయణ ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం

కర్నూలు బి.క్యాంపు : జగన్నాథగట్టుపై జాగారం చేస్తున్న భక్తులు

సంక్షిప్త సమాచారం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పోలీసుస్టేషన్‌లలో సీఐలు, ఎస్సైలు రౌడీషీటర్లకు మంత్రణం నిర్వహించారు. నేర ప్రవృత్తిని కొనసాగిస్తే తీసుకునే చర్యలను వివరించారు. జిల్లా బహిష్కరణ, పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : మేడారం జాతరలో కోవాబన్ అమ్ముకునే వారిని ఇబ్బందిపెట్టి మత విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నించిన వారిపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకునేలా ఏపీ ప్రభుత్వం చొరవచూపాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్, సభ్యులు ఇక్బాల్‌హుస్సేన్, షరీఫ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ ఏమైందో తెలపాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా, హుస్సేన్‌బాషా ప్రశ్నించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లా విద్యార్థులు వలస వెళ్లకుండా నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప ఒక ప్రకటనలో విమర్శించారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : రాష్ట్రంలో 30 రకాల చేతి వృత్తిదారులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపించారని ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

పవర్ లిఫ్టింగ్ విజేత కర్నూలు

ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని అందుకుంటున్న కర్నూలు క్రీడాకారులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో మూడు రోజుల పాటు కొనసాగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. అత్యధిక పాయింట్లు సాధించిన కర్నూలు మహిళల జట్టు మొదటి స్థానంలో నిలిచి ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. కృష్ణా జట్టు ద్వితీయ, గుంటూరు జిల్లా మూడో స్థానంలో నిలిచాయి. పురుషుల విభాగంలో కర్నూలు జట్టు మొదటి స్థానంలో నిలిచి ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీ కైవసం చేసుకుంది. కృష్ణా జట్టు ద్వితీయ, పశ్చిమ గోదావరి జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, కార్యదర్శి దినేష్‌బాబు, కర్నూలు కార్యదర్శి లోకేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి వేణుగోపాల్, షణ్ముఖ, రేష్మ, రవి తేజ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు వెలికితీయాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : గ్రామీణ విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీయాల్సిన బాధ్యత క్రీడా సంఘాలపై ఉందని ప్రముఖ వైద్యుడు డా.శంకర్‌శర్మ పేర్కొన్నారు. కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలోని నీలం రామచంద్రయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఆయన క్రీడా పరికరాలు అందజేశారు. వాటిని ఆదివారం ప్రధానోపాధ్యాయుడు సునీల్‌కుమార్, నాయకుడు జయన్నగౌడ్‌లకు అందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు నాగన్న, గ్రామ పెద్దలు వెంకటస్వామి, నీలం జగన్, రమణారెడ్డి, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.

ఆర్‌యూ, శ్రీలక్ష్మి కళాశాల జట్ల విజయం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల హ్యాండ్‌బాల్, ఖోఖో పోటీలు ఆదివారం ముగిశాయి. ఖోఖోలో ఆర్‌యూ జట్టు సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలపై విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. హ్యాండ్‌బాల్ పోటీలో శ్రీలక్ష్మి బీపీఈడీ, ఎంపీఈడీ కళాశాల జట్టు, సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టుపై గెలిచి ట్రోఫీ అందుకుంది. విజేతలకు కళాశాల సీఈవో శౌరీలురెడ్డి, ఆర్‌యూ క్రీడల సమన్వయకర్త శివకిషోర్, కళాశాల ప్రిన్సిపల్ డా.శాంత ట్రోఫీలు, పతకాలు అందజేశారు.

ఖోఖో విజేత ఆర్‌యూ జట్టు

రామేశ్వరస్వామికి పట్టు వస్త్రాల సమర్పణ

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాల్వబుగ్గలోని బుగ్గ రామేశ్వరస్వామి, అమ్మవార్లకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తెదేపా నందికొట్కూరు ఇన్‌ఛార్జి గౌరు వెంకటరెడ్డి దంపతులు ఆదివారం సాయంత్రం పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఈవో మద్దిలేటి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే దంపతులను ఆహ్వానించారు. అనంతరం వారు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో తితిదే పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్, మండల తెదేపా అధ్యక్షుడు నాగిరెడ్డి, ఓర్వకల్లు, హుసేనాపురం, నన్నూరు సొసైటీ అధ్యక్షులు సుధాకరరావు, సుధాకరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ నారాయణ, తహసీల్దారు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదానికి తాళం

స్థానిక వినాయక ఘాట్ సమీపంలోని నగరపాలక ఉద్యానవనం ఆదివారం సాయంత్రం 6 గంటలు దాటినా తెరుచుకోలేదు. దీంతో పార్కుకు వచ్చిన పలువురు ప్రజలు, పిల్లలు గేటుకు వేసిన తాళాన్ని చూసి నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. నిత్యం వందలాదిమంది వచ్చే ఉద్యానవనాన్ని మూసివేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే తరచూ ఇలా జరుగుతోందని విమర్శిస్తున్నారు. నిర్వహణలేక ఉద్యానవనం సైతం కళావిహీనంగా మారింది.
– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

నడిరోడ్డుపై యమపాశాలు

నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాల సర్కిల్ వద్ద నడిరోడ్డుపై కేబుల్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. భారీ వాహనం వెళ్లిన సందర్భంగా తీగలు తగులుకుని తెగిపడ్డాయి. గృహ విద్యుత్తు తీగల మీదుగా వెళ్తున్న ఈ కేబుల్ తీగలు తెగిపోయి వేలాడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఈ దారిన వెళ్లే రాకపోకలు సాగించే వాహనదారులకు ఇవి తగులుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు చూసుకోకుండా దూసుకెళ్తే ఇవి తగులుకుని ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ప్రమాదాలు జరగకముందే వీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

చెత్తే సర్వం.. ఇదేనా స్వచ్ఛ నగరం

★ శివరాత్రి రోజూ నగరంలో పారిశుద్ధ్య లోపం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ప్రధాన రహదారులతో పాటు వీధిరోడ్లపై ఎటుచూసినా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. పారిశుద్ధ్య సిబ్బంది వాటిని సకాలంలో తొలగించకపోవడంతో నగరవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువులు, కుక్కలు వ్యర్థాలను చెల్లాచెదురు చేయడంతో దారంతా విస్తరించి తీవ్ర అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆదివారం మహా శివరాత్రి పర్వదినం రోజు సైతం నగరంలోని పలు ప్రాంతాల ప్రజలు పారిశుద్ధ్య లోపంతో ఇబ్బందిపడాల్సి వచ్చింది.

ఇది నగరం నడిబొడ్డున ఉన్న గిప్సన్‌కాలనీలోని వీధి. ఈ ప్రాంతంలో రహదారులపై ఎటుచూసినా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ చిత్రం స్వామిరెడ్డినగర్‌లోనిది. వినాయక ఘాట్ నుంచి స్వామిరెడ్డినగర్ వరకు వీధిరోడ్లపై వ్యర్థాలు కుప్పలు పేరుకుపోయాయి. పారిశుద్ధ్య సిబ్బంది వీటిని సేకరించకపోవడంతో స్థానికులు సమీపంలోని కేసీ కాలువ చెత్త, వ్యర్థాలు వేస్తున్నారు.

పేరుకుపోయిన వ్యర్థాలు

కర్నూలు నగరంలోని 52 వార్డుల్లో ప్రతిరోజు 225 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. నగర పాలక సంస్థలో దాదాపు 1070 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరు విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ప్రధాన కూడళ్లలో, వీధుల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా రోడ్ల పక్కనే పడేస్తున్నారు.

● బంగారుపేట, గాంధీనగర్, విద్యానగర్, వీకర్‌సెక్షన్‌కాలనీ, స్వామిరెడ్డినగర్, లక్ష్మీనగర్, గణేశ్‌నగర్, సంతోష్‌నగర్, మునగాలపాడు, మామిదాలపాడు, పాతనగరంలోని వీధుల్లో పారిశుద్ధ్య లోపం వేధిస్తోంది.

భారత్ విజయంతో అభిమానుల సంబరాలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : క్రికెట్ టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా ఆదివారం రాత్రి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించడంతో అభిమానులు సంబరాలు చేసుకున్నారు. నగరంలోకి రాజ్‌విహార్ కూడలి, బి.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాల్లో యువత రహదారులపైకి వచ్చి సందడి చేశారు. బాణసంచా కాల్చి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

(c) eenadu

ఈనాడు
మార్కాపురం
సోమవారం 16 ఫిబ్రవరి 2026

బీచ్ ఫెస్ట్... అదుర్స్

జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభిస్తున్న మంత్రులు జేసీ జనార్దన్‌రెడ్డి, స్వామి, రవీంద్ర, ఎంపీ మాగుంట, దామచర్ల సత్య, బాలాజీ, కలెక్టర్ రాజాబాబు

▸ పాకలకు పోటెత్తిన జనం ▸ ఘనంగా ముగిసిన ఉత్సవాలు

అటు అలల హోరు... అంతకు మించి ఇటు జనం జోరుతో పాకల బీచ్ ఉర్రూతలూగింది. పర్యాటకానికి ఊతమిచ్చేలా గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఫెస్ట్ ఆదివారంతో ఘనంగా ముగిసింది. జిల్లా యంత్రాంగం అంచనాలకు మించి సందర్శకులు పోటెత్తడంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఒకటే సందడి నెలకొంది. హెలికాప్టర్, పారాగ్లైడింగ్, రేసింగ్ బోట్‌పై విహరించేందుకు పిల్లలతో పాటు పెద్దలూ పోటీపడ్డారు. తీరంలో ఒంటెలు, గుర్రాలపై సవారీ చేశారు. సాయంత్రం ప్రారంభమైన సాంస్కృతిక సంబరాలతో వేడుకలు మరో స్థాయికి చేరాయి. యాంకర్ రవి, శ్రీప్రియ హుషారైన మాటలకు... హైపర్ ఆది, రైజింగ్ రాజు పంచ్‌లు తోడవ్వడంతో వీక్షకుల కేరింతలు మిన్నంటాయి. తప్పెట గుళ్లు, జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా... శివోహం నృత్య రూపకం ప్రేక్షకులను మరో ప్రపంచానికి తీసుకెళ్లింది. ముందుగా వేడుకలను మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, బీసీ జనార్దన్ రెడ్డి, కొల్లు రవీంద్ర, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, కలెక్టర్ రాజాబాబు ప్రారంభించారు. గత ప్రభుత్వం పర్యాటక రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఆ లోటుపాట్లను సరిచేస్తూ కూటమి ప్రభుత్వం ప్రగతి పాలన దిశగా దూసుకెళ్తుందన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం నిర్విరామంగా కృషి చేసిందని కొనియాడారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుచిత్ర, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్, జేసీ కల్పనాకుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, టంగుటూరు, సింగరాయకొండ గ్రామీణం, కొండపి గ్రామీణం

హైపర్ ఆది, రైజింగ్ రాజు సందడి

శివోహం నృత్యరూపకంలో ఓ సన్నివేశం

యాంకర్లు రవి, శ్రీప్రియ

మహిళల జానపద నృత్యం

బీచ్ కబడ్డీలో తలపడుతున్న జట్లు

నిధులొచ్చినా నీడ లేదు!

▸ చెంచు గిరిజనుల కాలనీల్లో ఇదీ పరిస్థితి

న్యూస్‌టుడే – యర్రగొండపాలెం పట్టణం

చెంచు గిరిజనులకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు కేంద్రం ఏడు నెలల క్రితమే నిధులు కేటాయించినా లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. వివరాల్లోకి వెళ్తే... మార్కాపురం జిల్లాలో చెంచు గిరిజనులు ఎక్కువ. వీరికి గృహాలు నిర్మించి ఇచ్చేందుకు ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసి నవ్య అభియాన్ (పీఎం జన్మన్) కింద... మార్కాపురం, గిద్దలూరు, అర్ధవీడు, పెద్దారవీడు, వై.పాలెం, పుల్లలచెరువు, దోర్నాల మండలాల పరిధిలోని 612 మందికి గత జులైలో ఇళ్లు మంజూరు చేశారు. ఒక్కో నిర్మాణానికి రూ.2.39 లక్షలు చొప్పున కేటాయించారు. అడవి బిడ్డలు కావడంతో పనులు ప్రారంభించేందుకు సైతం డబ్బులు ఉండవని... పునాదుల నిర్మాణం కోసం ముందుగానే ఒక్కో లబ్ధిదారుకు రూ.70 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేశారు. ఇలా గత ఏడాది జులైలో 377 మందికి చెల్లించినా... 49 నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. కొందరు దళారులు లబ్ధిదారుల పంచన చేరి ఇళ్లు నిర్మిస్తామని చెప్పి నగదు తీసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడమే ఇందుకు కారణం. దీంతో ఇప్పటి వరకు రూ.3 కోట్లకు పైగా ఖర్చు చేసినా లక్ష్యం మాత్రం నెరవేరలేదు.

చెన్నుపల్లెలో పునాది గుంతలతోనే సరిపెట్టిన వైనం

ముఖం చాటేస్తున్న గుత్తేదారులు...

గిరిజనులు స్వతహాగా పక్కా ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితి ఉండడంతో కొన్నిచోట్ల అధికారులే గుత్తేదారులను నియమించారు. అడ్వాన్సు రూపంలో వచ్చిన మొత్తాన్ని సదరు గుత్తేదారులు తీసుకుని... కొద్ది పాటి పనులు చేసి ముఖం చాటేస్తున్నారు. చేసిన పనుల్లోనూ నాణ్యత కొరవడింది. ఈ విషయమై వై.పాలెం గృహనిర్మాణ శాఖ ఈఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ ఏడాది మార్చి వరకు గడువు ఉన్నందున లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు గిరిజనులు బేల్దారీ మేస్త్రీలకు గుత్తకు ఇస్తున్నారని... వారితో మా శాఖకు సంబంధం ఉండదని వివరించారు.

గంజాయి మత్తు వదిలిస్తున్నారు!

మూడేళ్ల క్రితం... ఓ గంజాయి ముఠా సభ్యులు ఆ మత్తులో ఓ వ్యక్తిని చితకబాదారు. అంతటితో ఆగకుండా అతడిపై మూత్రం పోశారు. ముక్తినూతలపాడు - త్రోవగుంట మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడు పోలీసులను ఆశ్రయించినా కేసు నమోదు కాలేదు. ఆ వీడియోను 'ఈనాడు' వెలుగులోకి తెచ్చి కథనం ప్రచురించడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది.

మంగమూరు రోడ్డులో గాంధీనగర్ శివారులోని ఓ జామాయిల్ తోటలో రెండు గంజాయి ముఠాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఓ ముఠా సభ్యుడి ఇంటిపైకి ముప్పై మందికి పైగా వెళ్లి మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటనతో ఆ పరిసర నివాసితులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇదీ మూడేళ్ల క్రితమే చోటుచేసుకుంది.

గత ప్రభుత్వ హయాంలో గంజాయి ముఠాలు ఎంతలా చెలరేగాయో తెలియజెప్పే ఉదంతాలివి.

▸ ఫలితమిస్తున్న ప్రభుత్వ చర్యలు, పోలీసుల కార్యాచరణ

న్యూస్‌టుడే – ఒంగోలు నేరవిభాగం

అప్పట్లో రాజకీయ నాయకులు, వారి అనుచరగణం వీటిని ప్రోత్సహించేవారన్న ఆరోపణలున్నాయి. యువత, విద్యార్థులు సైతం వీటిలో ఉండడం ఆందోళన కలిగించేది. ఈ మత్తులో నిత్యం వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకునేవి. ప్రస్తుతం... ఆ పరిస్థితిలో కొంతమార్పు వచ్చింది. గంజాయిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం... పోలీసు యంత్రాంగమూ ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి దూకుడుగా వ్యవహరిస్తుండడంతో వారి ఆగడాలకు చాలావరకు అడ్డుకట్ట పడింది.

ముఠాల జులుం...

గతంలో చీకటి పడిందంటే చాలు శివారు ప్రాంతాలు, పాడుబడిన భవనాలను అడ్డాగా చేసుకుని గంజాయి ముఠాలు చెలరేగిపోయేవి. ఒంగోలు పరిధిలోని వెంగముక్కపాలెం రోడ్డు, పేర్నమిట్ట పరిసరాలు, నూతన జాతీయ రహదారి వంతెన ప్రాంతాల్లో మత్తులో జోగుతుండేవారు. అర్ధరాత్రి వేళ బైకులపై గుంపులుగా తిరుగుతూ పెద్దపెద్ద శబ్దాలతో హోరెత్తించేవారు. ఇదేంటన్న ప్రశ్నించే పరిస్థితి ఉండేది కాదు. రాజకీయ దన్ను ఉండడంతో పోలీసులు సైతం స్వేచ్ఛగా విధులు నిర్వర్తించలేని పరిస్థితి. కట్టడికి ప్రయత్నించిన కొందరు పోలీసు అధికారులపై నడిరోడ్డుపైనే తిరగబడిన ఉదంతాలూ ఉన్నాయి. మార్కాపురం, బేస్తవారపేట, కంభం, గిద్దలూరు తదితర ప్రాంతాల్లోనూ గంజాయి విక్రయాల ఘటనలు పెద్ద సంఖ్యలో వెలుగు చూశాయి.

టాస్క్‌ఫోర్స్ దూకుడు...

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లాలో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. సీనియర్ సీఐ నేతృత్వంలో ఇద్దరు ఎస్సైలు, పది మంది సిబ్బంది ఈ బృందంలో ఉన్నారు. ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో వీరు పనిచేస్తున్నారు. వ్యసనపరులను గుర్తించి విక్రేతలు, వారికి అది ఎక్కడి నుంచి వస్తోందన్న మూలల్లోకి వెళ్లి విచారణ చేపడుతున్నారు. అలా జీఆర్పీ, ఈగల్ బృందాలను సమన్వయం చేసుకుంటూ గత ఏడాది కాలంలో నిర్వహించిన తనిఖీల్లో 85 కిలోల మేర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మత్తులో ఉన్నవారు చిక్కితే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో పరిస్థితుల్లో కొంతమేర మార్పు వచ్చింది.

పోలీసులు ఇంతలా కృషి చేస్తున్నా కళాశాల విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని నేటికీ కొన్ని గంజాయి ముఠాలు పని చేస్తున్నట్లు సమాచారం. చీమకుర్తి, గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వంటి ప్రాంతాల్లో వలస కార్మికులకూ గంజాయి సరఫరా అవుతోందన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో మరింతగా దృష్టి సారించి ఆయా ముఠాల ఆటకట్టించాల్సిన అవసరం ఉంది.

జమ్ములపాలెంలో 1,116 శివలింగాలకు పూజలు

భైరవకోనలో త్రిముఖ దుర్గాంబ

చీమకుర్తి: రామతీర్థం క్షేత్రంలో భక్తుల బారులు

ముక్కంటి... మురిసిన భక్తకోటి!

త్రిపురాంతకం క్షేత్రంలో స్వామివారు... మెట్లమార్గంలో దర్శనాలకు వస్తున్న భక్తులు

మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం వేకువజాము నుంచే శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఆయా దేవస్థానాల్లో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, రుద్ర, చండీయాగం, హోమాలు.. . శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకం, భైరవకోన, రామతీర్థం తదితర ఆలయాల్లో క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా వివిధ సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో మంచినీరు, మజ్జిగ అందజేశారు. సామాజిక సత్రాల్లో అన్న ప్రసాదం అందజేశారు. అర్ధరాత్రి వేళ లింగోద్భవ పూజల అనంతరం విశేష అభిషేకాలు చేపట్టారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులు జాగరణ చేశారు.

– న్యూస్‌టుడే బృందం

ఒంగోలు: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో...

మార్కాపురంలో కొలువుదీరిన మార్కండేశ్వరుడు

పరికరాలు సరే... నిర్వహణేదీ?

సాగర్ కాలువల్లో నీటి ప్రవాహాన్ని గుర్తించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ గేజ్ పరికరాలివి. క్షేత్రస్థాయిలో సిబ్బంది అవసరం లేకుండానే నిరంతరాయంగా ఆన్‌లైన్‌లో పరిశీలించేందుకు అమర్చారు. ఒంగోలు బ్రాంచి కాలువతో పాటు పలు మేజర్, మైనర్ కాలువల పరిధిలో వీటికి సీసీ కెమెరాలు, సౌరఫలకలు సైతం బిగించారు. ఇంతవరకు బాగానే ఉన్నా వీటి నిర్వహణ ఎవరు చూస్తున్నారన్న విషయంలో జల వనరుల శాఖ అధికారుల్లోనే స్పష్టత కొరవడింది. దీంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పరికరాలు ఇలా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, సంతనూతలపాడు, చీమకుర్తి

జాబ్‌కార్డు... 48 గంటల్లోనే!

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు తీసుకువచ్చింది. వికసిత్ భారత్ గ్రామీణ రోజ్‌గార్ మిషన్ (వీబీ జీ రామ్ జీ)గా పేరు మార్చడంతో పాటు.. అవకతవకలకు తావులేకుండా మస్టర్ నమోదు ప్రక్రియను తీసుకువచ్చింది. ఒక్కో కుటుంబానికి పని దినాలను 125 రోజులకు పెంచడంతో పాటు.. సమయానికి వేతన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంది. ఇందులో జాప్యం జరిగితే తగిన పరిహారం అందించేలా మార్పులు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు ఖర్చు చేయనున్నాయి. కొత్త జాబ్‌కార్డు జారీ విధానాన్ని సైతం సులభతరం చేసింది. దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే జారీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కార్డు కావాల్సినవారు క్షేత్రసహాయకుడిని నేరుగా సంప్రదిస్తే... ఈకేవైసీ పూర్తి చేసి దరఖాస్తు చేయిస్తారు. ఉన్నతాధికారులు పరిశీలించి నిర్దేశిత సమయంలోగా కార్డు జారీకి చర్యలు తీసుకుంటారు.

అక్రమాలకు అడ్డుకట్ట...

ఇప్పటికే జాబ్‌కార్డు ఉన్న వారికి సైతం ఆధార్‌తో ఈకేవైసీ చేశారు. పనికి వచ్చిన వారు తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది. దీంతో రెండు మూడు ప్రాంతాల్లో పేర్ల నమోదు, ఒకరికి బదులుగా మరొకరు పనికి రావడం, గైర్హాజరైనవారికి మస్టర్లు వేయడం వంటి వాటికి అడ్డుకట్ట పడనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో కొత్త విధానం అమల్లోకి వస్తుందని ఏపీడీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

నాటి అక్రమాలకు వంతపాడారు!

▸ అనధికార వెంచర్లకే స్తంభాలు, పరివర్తకాలు ▸ కనిగిరి విద్యుత్తు అధికారుల తీరుపై విమర్శలు

న్యూస్‌టుడే – కనిగిరి

అయిదేళ్ల వైకాపా పాలనలో చోటుచేసుకున్న భూ అక్రమాలు, ఇతర దందాలు ఒక ఎత్తయితే... కొందరు అధికారులు వారికి వంతపాడుతూ చేసిన అడ్డగోలు వ్యవహారాలు మరో ఎత్తు. స్తంభం మార్చాలని, పరివర్తకం ఏర్పాటు చేయాలని రైతులు, సామాన్యులు అడిగితే పట్టించుకోని విద్యుత్తు సిబ్బంది... కనిగిరిలో అప్పటి నాయకులు అడ్డగోలుగా వేసిన వెంచర్లకు మాత్రం వందలాదిగా వాటిని తరలించారు. ప్రత్యేకంగా లైన్లు సైతం వేశారు. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో నజరానాలూ అందుకున్నారన్న ఆరోపణలున్నాయి.

కనిగిరి - కంభం రోడ్డులో అనుమతి లేని వెంచర్‌లో వేసిన విద్యుత్తు స్తంభాలు

యథాశక్తి సహకారం...

కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని కనిగిరి, పామూరు, సి.ఎస్.పురం, వెలిగండ్ల మండలాలతో పాటు.. పొదిలి, సి.ఎస్.పురం రోడ్డును ఆనుకుని కనిగిరి అడ్డరోడ్డు, తుమ్మగుంట, కాశీపురం, పేరంగుడిపల్లి, శంకవరం, చిన ఇర్లపాడు, చాకిరాల, కంభం రోడ్డు, అర్బన్ కాలనీ తదితర ప్రాంతాలో 175 ఎకరాల ప్రభుత్వ భూమిని గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాయకులు ఆక్రమించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తాజాగా అసెంబ్లీలోనే ప్రస్తావించారు. వీటిలో యాభైకి పైగా అనధికార వెంచర్లు వేశారు. ప్లాన్ అప్రూవల్ లేని లే అవుట్లకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సదుపాయలు కల్పించకూడదన్న నిబంధనలు ఉన్నా... కనిగిరి విద్యుత్తు శాఖ అధికారులు మాత్రం అక్రమార్కులకు వంతపాడారు. వందలాది స్తంభాలను ఆయా వెంచర్లలో వేశారు. ప్రత్యేకంగా లైన్లు వేసి ట్రాన్స్‌ఫార్మర్లు సైతం బిగించారు.

ప్రజల ఇక్కట్లు విస్మరించి...

ఓ స్తంభం ఏర్పాటు చేయాలంటే రూ.18 వేలు ఖర్చవుతుంది. ఇందుకోసం ముందుగా దరఖాస్తు చేసి నగదు చెల్లించాలి. తరువాత ప్రాధాన్యతా క్రమంలో వాటిని మంజూరు చేస్తారు. ఎక్కడా ఈ విధానం పాటించలేదు. లో వోల్టేజీ, వ్యవసాయ విద్యుత్తు సరఫరా మెరుగుకు కొత్త స్తంభాలు, పరివర్తకాలు ఏర్పాటు చేయాలని వివిధ కాలనీల వారు, రైతులు కోరినా పట్టించుకోకుండా... ఆర్‌డీఎస్ఎస్ స్కీం కింద మంజూరైన వందలాది స్తంభాలను అనుమతి లేని వెంచర్లకు సర్దుబాటు చేశారు. నాడు వంతపాడిన అధికారుల్లో కొందరు నేటికీ ఇక్కడే విధుల్లో కొనసాగుతుండడం గమనార్హం. ఈ విషయమై ఈఈ ఆర్.ఉమాకాంత్ స్పందిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్తంభాలు, పరివర్తకాల్లో కొన్నిటిని తొలగించామన్నారు. మిగతావీ తొలగిస్తామని చెప్పారు. శాఖాపరంగా అవకతవకలు చోటు చేసుకుంటే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెల్లరాయి తరలిపోతోంది!

▸ లీజులు 46... తవ్వకాలు వందకు పైగా క్వారీల్లో

న్యూస్‌టుడే – మార్కాపురం

జిల్లాకే ప్రత్యేకమైన విలువైన వైట్ క్వార్ట్జ్ (తెల్లరాయి) అక్రమంగా తరలిపోతోంది. తవ్వకం, రవాణా అంతా బాహాటంగానే సాగిస్తూ అక్రమార్కులు రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు నాయకుల అండతోనే వ్యవహారమంతా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కర్నూలు రహదారిలో వెళ్తున్న తెల్లరాయి లారీలు

▸ పేలుళ్లు సాగిస్తూ...: కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు కందుకూరు, పామూరు, సి.ఎస్.పురం, పి.సి.పల్లి తదితర మండలాల్లో తెల్లరాయి నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయి. వీటి తవ్వకాలకు ఉమ్మడి జిల్లా పరిధిలో 26 మండలాల్లో 46 క్వారీలకు మాత్రమే అనుమతి ఉంది. ఈ లీజులను చూపి అనధికారికంగా వందకు పైగా ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారు. ముద్దపాడు, అయ్యన్నకోట, లింగనపాలెం, తక్కెళ్లపాడు, లక్ష్మక్కపల్లి, చీర్లదిన్నె వెలిగండ్ల, బల్లిపల్లి, విశ్వనాథపురం, జమ్మలమడక, అడ్డరోడ్డు, సి.ఎస్.పురం, చల్లగిరగల తదితర ప్రాంతాల్లో పగటి వేళల్లోనే పేలుళ్లు సాగిస్తూ... రాయి తవ్వకాలు చేపడుతున్నారు. రాత్రి వేళ తడ, సూళ్లూరుపేట, నాయుడిపేట మీదుగా కృష్ణపట్నం పోర్టు, తమిళనాడులోని మరికొన్ని రేవులకు తరలించి... అక్కడి నుంచి సముద్రమార్గంలో విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తేనే

చైనా, జపాన్, మలేసియా, సింగపూర్ తదితర దేశాల్లో తెల్లరాయికి మంచి డిమాండ్ ఉంది. స్థానికంగా టన్ను ధర రూ.30 వేలకు పైగా పలుకుతుండగా... విదేశాల్లో ఇంతకు రెట్టింపు ధర లభిస్తోంది. ఎటువంటి బిల్లులు లేకుండా జిల్లా నుంచి నెలకు నలభై లారీలకు పైగా సరకు అనధికారికంగా ఇతర ప్రాంతాలకు తరలుతున్నట్లు అంచనా. అధికారులు అప్పుడప్పుడూ దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నా పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. గత ఏడాది వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి దాదాపు నాలుగు వేల టన్నుల రాయి స్వాధీనం చేసుకున్నట్లు మైనింగ్ అధికారులు చెబుతున్నా... అక్రమ తవ్వకాలకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. ప్రభుత్వ భూములతో పాటు అటవీ ప్రాంతంలోనూ తవ్వకాలు సాగిస్తుండడం దందా తీవ్రతను తెలియజెబుతోంది. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో దృష్టిసారించి వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

(c) eenadu

త్రిపురాంతకం.. భక్తజన సందోహం

❖ వైభవంగా ఉత్సవాలు

తూర్పు ద్వారం మెట్ల వద్ద భక్తుల సందడి

న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం, త్రిపురాంతకం: ప్రసిద్ధ శైవ పుణ్య క్షేత్రం త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపురసుందరీ దేవి ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ఆరంభమయ్యాయి. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తులు వేలాదిమంది తరలిరావడంతో మధ్యాహ్నానికల్లా ఆలయాల్లో రద్దీ పెరిగింది.

❖ యర్రగొండపాలెం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సొంత నిధులతో నూతనంగా తారు రోడ్డు వేయించి ఆదివారం ఉదయం ప్రారంభించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మార్కాపురం డీఎస్పీ నాగరాజు క్యూలైన్లను పరిశీలించి వసతి ఏర్పాట్ల గురించి భక్తులతో మాట్లాడారు.

❖ ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల పర్యవేక్షణ

మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఆర్డీవో శివరామిరెడ్డి మూడు రోజుల నుంచి స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు, త్రిపురాంతకం సీఐ హసన్, ఎస్సై శివబసవరాజు నేతృత్వంలో 10 మంది ఎస్సైలు, 200 మంది సిబ్బందితో శాంతి భద్రతలు పర్యవేక్షించారు. భక్తులకు వసతుల్లో ఎలాంటి సమస్య తలెత్తకుండా మార్కాపురం ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, తహసీల్దారు విజయభాస్కర్, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఈవో అనిల్ కుమార్ పర్యవేక్షించారు. త్రిపురాంతకం ఎస్‌బీఐ, త్రిపురాంతకం రామాలయ కమిటీ, పలు విత్తనాల కంపెనీల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగతో పాటు పలువురు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు పులిహోర, దద్దోజనం ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఈవో అనిల్ కుమార్‌తో కలిసి క్యూలైను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కోటా సత్యమాంబదేవికి కుంకుమార్చనలు

కంభం పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. మహాశివరాత్రి పండగ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని సత్యమణికంఠస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది.
– న్యూస్‌టుడే, కంభం

కళాకారుల వేషధారణ

హెలికాప్టర్ రైడ్

ఉర్రూత లూగించిన నృత్య ప్రదర్శన

ఆనంద తీరం.. ఆహ్లాదభరితం!

సింగరాయకొండ గ్రామీణం, టంగుటూరు, కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ మండలం పాకల తీరంలో బీచ్ ఫెస్టివల్ చివరి రోజు సంబరాలు అంబరాన్నంటాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఇసుకేస్తే రాలనంతగా తరలివచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. తీరంలో ఏర్పాటు చేసిన భారీ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ గీతాలాపన, నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు, వినోదభరిత కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. హెలికాప్టర్, బోట్ రైడింగ్, పారా గ్లైడ్ వంటివి ఆకట్టుకున్నాయి.

బీచ్ వాలీబాల్‌లో తలపడుతున్న జట్లు

తీరంలో జనసందోహం

వనితల అశ్వవిహారం

హోరెత్తిన తప్పెటగుళ్ల మోతలు

భైరవ కోన.. ముక్కంటి ఆన

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ పుణ్యక్షేత్రం భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాలు ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. ప్రకాశం, నెల్లూరు, కడప, గుంటూరు, కృష్ణా తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ పుణ్య క్షేత్రాలను సందర్శించి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భైరవకోనలో జలపాతాన్ని వీక్షించి అక్కడ కాలభైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాంబ అమ్మవారు, శివలింగాలను, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పూజలను అర్చకులు ఎం.శివప్రసాద్ శర్మ నిర్వహించారు.

బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ జట్టుకు ఎంపిక

శివమణికృష్ణ

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చేవూరుకు చెందిన పొట్టేళ్ల శివమణికృష్ణ బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ జట్టుకు ఎంపికైనట్లు చినలాటరపి ఉన్నత పాఠశాల పీడీ మురళీమోహన్ ఆదివారం తెలిపారు. భారత జట్టు ఈ నెల 15 నుంచి 18 వరకు ఇండోనేషియాలో నిర్వహించే సౌత్ ఏషియన్ బాల్‌బ్యాడ్మింటన్ టెస్ట్ సిరీస్‌లో పాల్గొంటుందని పేర్కొన్నారు. శివమణి చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అతడు ఇప్పటి వరకు రెండుసార్లు సబ్ జూనియర్స్ విభాగంలో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాలు, జూనియర్స్ విభాగంలో రెండు బంగారు, రెండు కాంస్య, అఖిల భారత స్థాయి పోటీల్లో అన్నా విశ్వవిద్యాలయం తరఫున పాల్గొని రజత పతకం సాధించారన్నారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన శివమణికృష్ణకు స్థానికులు అభినందనలు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన ఎస్ఎఫ్ఐ నాయకులు, బాలుడి కుటుంబ సభ్యులు

విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి మృతికి కారణమైన సింగరాయకొండ మండలంలోని ఓ కోచింగ్ సెంటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ మాట్లాడుతూ.. కనిగిరి పట్టణానికి చెందిన బాలుడు 6వ తరగతి చదువుతుండగా, ఈ నెల 14న పాఠశాలలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, విద్యార్థుల పట్ల వార్డెన్ దురుసు ప్రవర్తన కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపించారు. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపి, అందుకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఈవో ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. ఆయన హామీతో ఆందోళన విరమించారు.

కోటప్పకొండ భక్తుల వసతికి రూ.10 లక్షల విరాళం

నరసరావుపేట వ్యవసాయం: మహాశివరాత్రికి కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన శ్రీ త్రికోటేశ్వర గ్రానైట్ క్వారీ అసోసియేషన్ రూ. 10లక్షల విరాళాన్ని ఆదివారం అందించారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో కలెక్టర్ కృతికాశుక్లాకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం మెరుగైన వసతులు కల్పించడంలో ప్రభుత్వ కృషికి తోడు ఈ క్రమంలో క్వారీ అసోసియేషన్ సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి దాతృత్వం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. దాతలను కలెక్టర్ తదితరులు అభినందించారు.

Canara Bank ప్రాంతీయ కార్యాలయం ఒంగోలు. ఫోన్: 8332997013 బంగారు ఆభరణముల వేలం ప్రకటన

ఇ-వేలం ద్వారా బంగారు ఆభరణముల అమ్మకము
https://bankeauctions.com

[illegible]

క్ర.సం.	ఖాతా సంఖ్య	రుణగ్రహీత పేరు మరియు చిరునామా	స్థూల బరువు
	గద్దలగుంట (బ్రాంచ్ (13719), ప్రకాశం జిల్లా, ఫోన్: 9849543583		
1	164062145714	[illegible]	36.3 గ్రా
	పేర్నమిట్ట (బ్రాంచ్ (13687), ప్రకాశం జిల్లా, ఫోన్: 9492813543		
1	180363422599	[illegible]	10.3 గ్రా

[illegible] https://www.bankeauctions.com

తేదీ: 16.02.2026, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సొంత గృహం.. సాకారానికి ప్రాకారం

❖ కార్యాచరణకు అధికారుల కసరత్తు

న్యూస్‌టుడే, మార్కాపురం, పొదిలి: ప్రతి పేదవాడికి సొంత ఇల్లు అనేది ఒక కల. దాన్ని సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగానే ఇంటి నిర్మాణానికి అదనపు సాయం చేస్తోంది.

వైకాపా ఇచ్చిన మొత్తం సరిపోవడంలేదని..

గత వైకాపా ప్రభుత్వం ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయించింది. నిర్మాణానికి సరిపోవడం లేదని అనేక మంది పేదలు మధ్యలోనే నిర్మాణాలను నిలుపుదల చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అదనపు సాయంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, గిరిజన ప్రాంతాల్లో ఉన్న వారికి రూ.లక్ష అదనపు సాయం చేస్తోంది. దీంతో ఇంటి నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లాలో ఉగాది నాటికి కొంత మందికైనా సొంతింటి కలను సాకారం చేసేందుకు లక్ష్యం పెట్టుకుంది.

మార్కాపురంలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గృహనిర్మాణ శాఖ అధికారులు

21 మండలాల్లో 5,196 ఇళ్లు

మార్కాపురం జిల్లాలోని 21 మండలాల్లో ఉగాది నాటికి 5,196 గృహాలను పూర్తి చేయడానికి అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. ఈపాటికే మార్కాపురం జిల్లాలో ఇన్‌ఛార్జి పీడీ శ్రీనివాసప్రసాద్, ఈఈ పవన్‌కుమార్‌తో పాటు ఈఈలు, ఏఈలు, పర్యవేక్షకులు, ఇంజినీరింగ్ సహాయకులు ప్రతి గ్రామానికి వెళ్లి ఉగాది నాటికి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న వారికి బిల్లులు చెల్లిస్తున్నారు.

నియోజకవర్గం..	గృహాల లక్ష్యం
మార్కాపురం	- 1,971
యర్రగొండపాలెం	- 1,140
గిద్దలూరు	- 1,469
కనిగిరి	- 589

క్షేత్ర స్థాయికి వెళ్లి.. నిర్మాణదారులతో మాట్లాడి..

గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు శ్లాబ్, రూఫ్ లెవెల్, గోడలు, బేస్‌మట్టం స్థాయిలో ఉన్న వారితో మాట్లాడి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నారు. రూ.1.80 లక్షల సాయంతో పాటు అదనంగా కూటమి ప్రభుత్వం ఇస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అధికారులు దగ్గర ఉండి నిర్మాణాలను ప్రారంభిస్తున్నారు.

❖ జిల్లాలో నూతనంగా 24,177 పీఎంఏవై గ్రామీణ్ కింద గృహాలు నిర్మాణం చేసుకోవడానికి అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. త్వరలోనే నిర్మాణాలు ప్రారంభించడానికి అనుమతులు వస్తాయని గృహ నిర్మాణ ఈఈ పవన్‌కుమార్ తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు.

మార్కాపురం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

పొదిలి, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఆదివారం పొదిలి నిర్మమహేశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు మార్కాపురం ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు. జిల్లాను అన్నిరంగాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా నీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయడం ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. పారిశ్రామికంగాను, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. వెనుకబడిన ఏపీని అభివృద్ధిలోకి తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం సైతం సానుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఆయన వెంట ఏఎంసీ ఛైర్మన్ ఇమామ్‌సాహెబ్, మాజీ ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, తెదేపా నాయకులు జి.భాస్కర్, స్వర్ణ గీత, ఖుద్దూస్, అంజిరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

'చలో విజయవాడ' విజయవంతానికి పిలుపు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17వ తేదీన విజయవాడలో తలపెట్టిన 'చలో విజయవాడ' రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఓ.వి.వీరారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మాట్లాడుతూ ఐకాస అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉద్యోగుల ఊసేలేకపోవడం బాధాకరమన్నారు. పన్నెండవ వేతన కమిషన్ నియమించాలి, 29శాతం ఐఆర్ ప్రకటించాలి. తదితర డిమాండ్ల సాధనకు నెరవేర్చాలనే ఉద్దేశంతో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రణభేరి కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)
బ్రాయిలర్ ఫారం ధర - 115, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234

గురుకుల ప్రవేశాలకు వేళాయె!

కొండపి గ్రామీణం: కొండపి డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి అయిదో తరగతితో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 4 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అయిదో తరగతిలో 80, ఇంటర్ ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి.

అర్హతలు ఇవే..

❖ అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది.
❖ ఎస్సీ, ఎస్టీలు 01.09.2013-31.08.2017 మధ్య, బీసీ, బీసీ-సీ, ఓసీలు 01.09.2015-31.08.2017 మధ్య జన్మించి ఉండాలి
❖ పది, నాలుగో తరగతి ఆయా జిల్లాలో గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి
❖ ఇంటర్‌లో చేరే వారు 2025-26లో పదో తరగతి తొలి ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఉండాలి
❖ దరఖాస్తులు హెచ్‌టీటీపీ://ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా చేసుకోవాలి. ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటో, తల్లిదండ్రుల ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో రూ.100 రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ఉచితంగా ఉన్నత విద్యనందిస్తోంది. ఈ అవకాశాన్ని అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి
–ఎస్.అరుణ ప్రిన్సిపల్ కొండపి గురుకుల పాఠశాల

నేటి 'మీ కోసం' కార్యక్రమం రద్దు

మార్కాపురం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో ప్రభుత్వం ఈ నెల 16వ తేదీన ఐచ్ఛిక సెలవుగా ప్రకటించింది. ఈ కారణంగా సోమవారం (నేడు) జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టరేట్ పరిపాలన అధికారి రవీంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని మార్కాపురం జిల్లా ప్రజలు అందరూ గమనించగలరని కోరారు. ఈ మార్పును దృష్టిలో ఉంచుకుని ఎవరు కూడా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

శాంసన్

నూజండ్ల, న్యూస్‌టుడే: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పలపాడు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. మండలంలో ములకలూరుకు చెందిన మందా శాంసన్ (27) మిత్రుడు సురభి చిన్నతో కలిసి వినుకొండ నుంచి తమ గ్రామానికి వస్తుండగా ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం భీమవరానికి చెందిన సోమబత్తిన ధనుంజయ కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లడానికి మరియమ్మతో కలిసి వస్తుండగా ఉప్పలపాడు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాద ధాటికి శాంసన్ రోడ్డుపై ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనాలపై ఉన్న మిగిలిన వారికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, రెండేళ్లు, పది నెలల వయసున్న ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడంతో వారంతా కన్నీటిపర్యంతమయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణారావు తెలిపారు.

తిరునాళ్లకు వెళుతూ..

బల్లికురవ, న్యూస్‌టుడే: కోటప్పకొండ తిరునాళ్లకు వెళుతుండగా, ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దోర్నాలకు చెందిన దార సల్మాన్(30), ఒడిశాకు చెందిన జన ప్రదీప్ (25) ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై చీమకుర్తి నుంచి కోటప్పకొండ తిరునాళ్లకు బయలుదేరారు. వారి వాహనం బల్లికురవ మండలం అంబడిపూడి శివార్లలో అదుపు తప్పి పడిపోగా సల్మాన్, ప్రదీప్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుంటుపల్లి ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

మనుబోలు, న్యూస్‌టుడే: లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కాగితాలపూరు అడ్డరోడ్డు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకొంది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా దర్శి నుంచి చెన్నైకు వెళుతున్న లారీలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం రావడంతో దాడులు చేశారు. 700 బస్తాల్లో ఉన్న 35 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ రూ.14.70 లక్షలు ఉంటుందని పౌరసరఫరాల శాఖ ఏఎస్‌వో లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. వీటిని పొదలకూరు గోదాముకు తరలించినట్లు వివరించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ రవి, వీఆర్వో గుణశేఖర్, ఎస్సై రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

లారీని పట్టుకున్న అధికారులు

బండలాగుతున్న ఎడ్లు

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కంభం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పండగను పురస్కరించుకొని మండలంలోని చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన రెండు ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రావిపాడు గ్రామానికి చెందిన పి.రామయ్య, రామారావు సంయుక్త జత 3 వేల అడుగుల దూరంలాగి ప్రథమ, కొమరోలు వాసులు కామూరి రమణారెడ్డి, గోపు రమణారెడ్డిల ఎడ్లు 2,865తో ద్వితీయ, దర్శి మండలం రాజంపల్లి వాసి జి.ఉపేంద్రచౌదరి కోడెలు 2,742తో తృతీయ, అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కే పెద్ద మీరావలి జత 2,700తో నాలుగు, అదే మండలం అచ్చంపేటకు చెందిన సూరే రాంబాబు ఎడ్లు 2,419 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల జతల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ. 15 వేలు, రూ.10 వేలను నిర్వాహకులు అందజేశారు.

సత్తా చాటిన చేబ్రోలు రత్తయ్య కోడెలు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మార్కాపురం మండలం తిప్పాయపాలెం గ్రామంలో ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పార్వతీ సమేత మునీశ్వరస్వామి దేవస్థానంలో ఎప్పటి మాదిరి నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఔత్సాహికులకు ఆనందోత్సాహాలు అందించాయి. ఈ పోటీల్లో న్యూ కేటగిరీ విభాగంలో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెం గ్రామానికి చెందిన రావినేని రత్తయ్య చౌదరి ఎడ్లజత మొదటిస్థానంలో నిలిచి రూ.60వేలు గెలిచి సత్తాచాటాయి. రెండు పళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా రాజంపల్లికి చెందిన గొర్ల బ్రదర్స్‌కు చెందిన కోడెలు ప్రథమ స్థానంలో నిలిచినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న శివాలయం కావడంతో తెల్లవారుజామునుంచి భక్తులు వేల సంఖ్యలో మునీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

బేతవోలులో మన గిత్తలు..

చిలుకూరు, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని బేతవోలులో కనకదుర్గమ్మ జాతర, శివరాత్రి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఒంగోలు జాతి వృషభరాజుల బండలాగుడు పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు న్యూ కేటగిరీ ఎడ్ల పందేలు జరిగాయి. ప్రకాశం జిల్లాకు చెందిన చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి మొదటి స్థానంలో నిలిచి రూ.70,000, ద్వితీయ స్థానంలో విజయవాడకు చెందిన మెగా కృష్ణమోహన్ నిలిచి రూ.50,000 సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచి వట్టికూటి నాగయ్య, ఉపసర్పంచి ఏడుకొండలు, ప్రశాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

Ph.81422 92071.

Universal Bags, Ongole Looking for candidates with experience in Excel, Tally, Software Ledger Reports & Sales. Please Cont: ✆ 96762 11011

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

EDUCATION

DISTANCE EDUCATION

B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

REAL ESTATE

PLOT FOR SALE

99624 12363.

97012 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B&W: రూ. 500
Colour: రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

కనిగిరి

• కనిగిరి • గిద్దలూరు

ఉగాదికి గృహ ప్రవేశాల సంబరం!

కనిగిరి, న్యూస్‌టుడే: అసంపూర్తిగా నిలిచిపోయిన టిడ్కో గృహాల పనులను వేగవంతం చేసి ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో కనిగిరిలో లబ్ధిదారుల ఆనందానికి హద్దులే లేకుండా పోయాయి. ఇప్పటికే రెండు నెలల నుంచి ఆయా పనులు జరుగుతుండటంతో తమకు నమ్మకం కుదిరిందని అంటున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా సరిగా పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా ఎనిమిదేళ్లుగా సొంత ఇంటి తాళాల కోసం ఎదురు చూస్తున్న తమ కల నెరవేరనుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ● కనిగిరి పట్టణ సమీపంలో చాకిరాల వద్ద నిర్మించిన 19 బ్లాకుల్లో 912 ఇళ్లకు టైల్స్, కిటికీలు, పైపులైన్లు తదితర 60 శాతం పనులు పూర్తిచేశారు. వీటిలో మూడు బ్లాకుల్లో 90 శాతం వరకు పూర్తయ్యాయి. రెండు నెలల నుంచి తుప్పల తొలగింపు, రహదారుల పనులు, టైల్స్, వాల్ పుట్టీ, పెయింటింగ్, సెప్టిక్ ట్యాంకు తదితర పనులు చేపట్టారు. ఉగాది నాటికి లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

టిడ్కో గృహాల సముదాయంలో పూర్తయిన మొదటి బ్లాక్

పరీక్షల వేళ ఆందోళన వద్దు

కనిగిరి, న్యూస్‌టుడే: విద్యార్థులకు పరీక్షలు ఎంతో కీలకమైనవి. ఈనెల 23 నుంచి ఇంటర్మీడియట్, మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒకింత ఆందోళనకు గురవడం సహజం. కొందరైతే ఆహారం, నిద్రమాని చదువులో లీనమవుతున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో అభ్యాసంతో పాటు ఆహారం, ఆరోగ్యం ఎంతో ప్రధానమని, ఒత్తిడిని అధిగమిస్తేనే ఏకాగ్రత దరిచేరుతుందని నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలో పదోతరగతి 23,685 మంది, ఇంటర్మీడియట్ 13,100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు ఆరోగ్యం, ఆహార విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వ వైద్యుల సూచనలు కొన్ని వారి కోసం...

స్టడీఅవర్స్‌లో పదో తరగతి విద్యార్థులు

తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తినండి

పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. ఆహారం ఒకేసారి ఎక్కువగా తీసుకోకుండా తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తినాలి. టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్ వంటి పానీయాలకు దూరంగా ఉండాలి. ఆకుకూరలు, పండ్లు, పాలు, రాగిజావ లాంటివి తీసుకోవాలి. వేపుళ్లు, ఆయిల్‌తో చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది.

– డా.కె.చక్రవర్తి, ప్రభుత్వ వైద్యులు, పొదిలి

కనీసం 20 నిమిషాలైనా ధ్యానం చేయాలి

విద్యార్థులు పరీక్షల ఒత్తిడి నుంచి బయట పడాలంటే ప్రతిరోజు కనీసం 20 నిమిషాలైనా ధ్యానం చేయాలి. పరీక్షలు దగ్గరపడే కొద్దీ ఒత్తిడి, అలజడి ఉంటుంది. ఒక్కొక్కసారి చికాకుగా అనిపిస్తూ త్వరగా కోపం వస్తుంటుంది. వాటన్నింటిని అధిగమించి మనసు ప్రశాంతంగా ఉండాలంటే ఉదయాన్నే ధ్యానం చేస్తే మంచిది. దీనివల్ల ఏకాగ్రత పెరుగుతుంది. – ఎ.శంకర్, యోగా గురువు

ఏడు గంటల నిద్ర తప్పనిసరి

పరీక్షలు అనగానే నిద్రపోకుండా ఎక్కువ మంది చదువుతుంటారు. సరైన నిద్రలేకపోవడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురవుతారు. మన శరీరానికి పూర్తిస్థాయిలో గ్లూకోజ్ అందేలా చూసుకోవాలి. గ్లూకోజ్ తగ్గితే శరీరం నీరసిస్తుంది. బ్రెయిన్‌కు గ్లూకోజ్ సప్లై కాకపోతే చదువుకున్న పాఠ్యాంశాలు కూడ ఒక్కొక్కసారి గుర్తుకు రావు. ఏడు గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలి. –డాక్టర్‌శరత్‌చంద్ర, ప్రభుత్వ వైద్యులు, పొదిలి

కష్టపడి చదివితేనే ఉన్నత భవిత

కొత్తపట్నం, న్యూస్‌టుడే: యువత బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విశాఖపట్నం జిల్లా జడ్జి, కొత్తపట్నం గ్రామానికి చెందిన మోదడుగుల హరినారాయణ సూచించారు. ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో కొత్తపట్నానికి చెందిన బేతాల శ్రుతి సత్తాచాటి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆదివారం గ్రామంలో మేళతాళాలతో కారులో ఊరేగించారు. అనంతరం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో మండల ప్రజల తరఫున అభినందన పౌర సన్మానం ఏర్పాటు చేశారు. జడ్జితోపాటు ఒంగోలులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత చాపల వంశీ కృష్ణ, ఆయన సతీమణి శాంతికుమారి, ఇతర ప్రముఖులు శ్రుతికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వంశీకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జడ్జి హరినారాయణ మాట్లాడుతూ.. తాను కూడా ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తుచేసుకున్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ ప్రతిభా పోటీల్లో గిద్దలూరు పట్టణంలోని వివిధ పాఠశాల విద్యార్థులు షేక్ హమేరా, ఎం.లక్ష్మి రాణించారు. వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అచ్చుకట్ల భాజవలి, వగిడి భూషణ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

నిర్వాహకుల నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

గిద్దలూరు: పాతాళ నాగేశ్వర స్వామి కల్యాణంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దంపతులు

కనిగిరి: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని శివలింగాల వద్ద పూజలు

శంకరమఠంలో శివపార్వతులకు అభిషేకాలు నిర్వహిస్తున్న మహిళలు

త్రిలోచనాయ.. నమశ్శివాయ!

భైరవకోనలో హోమ పూజలు చేస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం కనిగిరి పట్టణంతో పాటు, మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని విజయమార్కండేశ్వర దేవస్థానం, శివాలయం, సాయిబాబా, కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాలు, కనక పట్టణంలోని శంకరమఠం, చాకిరాల శివాలయం, పునుగోడు సిద్ధేశ్వరాలయం, చినఇర్లపాడు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సిద్ధేశ్వరాలయంలో మహా యజ్ఞాలు నిర్వహించారు. నందనమారెళ్ల బాలకోటేశ్వర దేవస్థానంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా దేవాలయాల వద్ద అన్నదానాలు చేశారు. కోలాటం, నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ● హనుమంతునిపాడు: మండలంలోని మువ్వాపాడు సగమేశ్వరం, వీరారం పురం, కొండారెడ్డిపల్లి, గొల్లపల్లి, నందనవనం, బ్రహ్మంగారిగుడి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ● పామూరు: స్థానిక శ్రీవల్లీ భుజంగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. రాత్రి శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవాలను ఈవో గిరిరాజు నరసింహారావు, అర్చకుడు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. లింగోద్భవ కాలంలో స్వామి వారికి మహాన్యాసపూర్వక అభిషేకాలు చేశారు. ● గిద్దలూరు పట్టణం: గిద్దలూరు పాతాళ నాగేశ్వర స్వామి, బురుజుపల్లె అటవీప్రాంతంలో పొట్టులవీడు, ముండ్లపాడు భవానీశంకరాలయం, సంజీవరాయునిపేటలోని జోడీశ్వరాలయం, కృష్ణంశెట్టిపల్లె ఎగువ భీమలింగేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాతాళ నాగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, మధ్యాహ్నం అన్నాభిషేకం చేపట్టారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. భక్తులకు దేవస్థాన కమిటీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు ఆరవీటి వెంకట సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ● బేస్తవారపేట: మండలంలోని మొక్షగుండం సమీపంలోని ముక్తీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా జరుగుతున్న తిరునాళ్ల మహోత్సవంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, తనయుడు దివ్యేష్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో విద్యుత్తు సరఫరా నిమిత్తం ఏర్పాటుచేసిన నూతన విద్యుత్తు పరివర్తకాన్ని ప్రారంభించి ఆలయ విశిష్టతను తెలిపే పుస్తకాలను ఆవిష్కరించారు.

భైరవకోనలో ప్రజాప్రతినిధుల పూజలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాలను ప్రజా ప్రతినిధులు సందర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి, ఒంగోలు ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దామచర్ల జనార్దన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జోడే రామకృష్ణ యాదవ్, ఒంగోలు పార్లమెంట్, కనిగిరి నియోజకవర్గ వైకాపా బాధ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దద్దాల నారాయణ యాదవ్, అధికారులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ● మండలంలోని పెదరాజుపాలెం కూడలి సంగమేశ్వరస్వామి ఆలయంలో పార్వతి, పరమేశ్వరులకు ఘనంగా కల్యాణం నిర్వహించారు. సి.ఎస్.పురంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి భక్తులు పూజలు చేశారు. ఈవోలు డి.వంశీకృష్ణారెడ్డి, ఎస్.నరసింహబాబు, కనిగిరి డీఎల్‌డీవో కె.శ్రీనివాసరెడ్డి, ఆయా ఆలయాల ఛైర్మన్లు ఎం.శ్యామ్‌సుందర్‌రాజు, కె.చిన్నఆదినారాయణ ఆలయ అధికారులు, సిబ్బంది, ఏర్పాట్లు పర్యవేక్షించారు. కనిగిరి డీఎస్పీ పి.సాయిఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో పామూరు సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్సైలు ఎం.వెంకటేశ్వర నాయక్, కె.అనూక్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భైరవకోనలో జలపాతం వద్ద సందడి

హెచ్‌ఎంపాడు: హనుమంతాపురంలోని వీరబ్రహ్మం ఆలయంలో..

పామూరు: శ్రీవల్లీభుజంగేశ్వర స్వామి దేవస్థానం వద్ద..

భైరవకోనలో పూజలు చేస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు

రైతు సేవా కేంద్రం ప్రారంభం ఎప్పుడో..!

కంభం మండలంలోని ఆకవీడు గ్రామంలో రైతు సేవా కేంద్రం భవన నిర్మాణం పూర్తయి, ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దాంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ ప్రైవేటు అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. గ్రామంలో ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. త్వరలో రైతు సేవా కేంద్రం భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని వ్యవసాయాధికారి మహబూబ్‌బాష తెలిపారు. - న్యూస్‌టుడే, రాచర్ల

అంతర్గత మార్గాలు.. నిరంతర ఇక్కట్లు

కంభం పట్టణ పరిధి హజరత్‌గూడెం పంచాయతీలోని ఈశ్వర్ లాడ్జి వెనుక వైపు, బృందావనం ఫంక్షన్ హాల్, మధుప్రియా రెస్టారెంట్, గౌతమి విద్యాసంస్థల వెనుక, కృపామృత స్కూల్‌కు వెళ్లే అంతర్గత రహదారులు గుంతలమయంగా ఉన్నాయి. దాంతో ఆయా ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతాల్లో వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా దారులు అధ్వానంగా మారుతున్నాయి. వాహనాలు దెబ్బతింటున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఒక్క సిమెంట్ రోడ్డు లేదు. రోడ్లకు మట్టి కూడా వేయడం లేదు. పంచాయతీలో నిధుల లేవని, డబ్బులు మంజూరైతే రహదారులను బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి తెలిపారు. - న్యూస్‌టుడే, కంభం

నడిచేందుకు దారేదీ..?

ఆక్రమణల తొలగింపులో భాగంగా పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్ సమీపంలోని రోడ్డును నాలుగు నెలల క్రితం మున్సిపల్ అధికారులు తొలగించారు. అటుగా రాకపోకలు సాగించేందుకు మట్టి తోలి చదును చేశారు. భవిష్యత్తులో సీసీ రోడ్డు నిర్మించి ట్రాఫిక్ చిక్కులు లేకుండా చేస్తామని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఆ విషయాన్ని పట్టించుకోలేదు. పైగా. . అటుగా ఎవరూ రాకుండా ఉన్న దారికి అడ్డుగా ఇనుప కంచె ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కంచె తొలగించి రాకపోకలు సాగించేలా చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కనిగిరి

భయపెడుతున్న తీగలు!

పట్టణంలోని పలు ప్రాంతాల్లో కేబుల్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. రెండు రోజుల క్రితం ఎన్జీవో కాలనీలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడికి తగలడంతో అతడు పడిపోయి గాయపడ్డాడు. వీటితో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్తు తీగలు సైతం తక్కువ ఎత్తులో ఉన్నాయి. అధికారులు స్పందించి సరిచేసి, ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కనిగిరి

ఇళ్ల మధ్య మురుగు మడుగు

బేస్తవారపేట మేజర్ పంచాయతీలోని అంకాలమ్మ గుడి సమీపంలో నివాసాల మధ్య మురుగునీటి మడుగుతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గృహాల్లోని వ్యర్థ జలం దిగువకు వెళ్లే మార్గం లేకపోవడంతో లోతట్టుప్రాంతంలో నిల్వ ఉంటున్నాయి. దీంతో కాలనీలో దుర్గంధం వ్యాపిస్తోందని, దోమల బెడద తీవ్రమైందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి అక్కడి మురుగునీటి తటాకాన్ని పూడ్పించాలని వారు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బేస్తవారపేట

సిబ్బంది రావాలి... వైద్యసేవలు పెరగాలి

☛ ఆసుపత్రిలో ఓపీ బాగున్నా చికిత్సల పెంపు అవసరం

న్యూస్‌టుడే, గిద్దలూరు, మార్కాపురం అర్బన్:

మార్కాపురం జిల్లా కేంద్రంలోని సర్వజన వైద్యశాలలో అనుకున్న మేరకు ఓపీ నమోదు అవుతోంది. సాధారణంగా వచ్చే వ్యాధులకు మంచి వైద్యం అందుతున్నప్పటికీ ఇంకా చాలా శస్త్ర చికిత్సలకు వైద్యులను సమకూర్చాల్సి ఉంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇది రెండో జిల్లా వైద్యశాల.

350 పడకలు, సరిపోని సిబ్బంది, వైద్యులు

1998లో అప్పటి వైద్య ఆరోగ్య శాఖామంత్రి ఎన్.జనార్దన్ రెడ్డి మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల భవనానికి శంకుస్థాపన చేశారు. మొదట 50పడకలతో ప్రారంభమైన వైద్యశాల ఆ తర్వాత 100 పడకలుగా ఏర్పడింది. ఈప్రాంత ప్రజల పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న అప్పటి ప్రస్తుత తెదేపా ప్రభుత్వం 2019-24 మధ్య జిల్లా వైద్యశాలగా మార్చింది. ప్రస్తుతం సర్వజన వైద్యశాలగా ఏర్పడి 350 పడకలతో వైద్యశాల నడుస్తోంది. కానీ అందుకు తగిన వైద్యులు, వసతులు మాత్రం అందుబాటులో ఉండడం లేదు.

400కు పైగా ఓపీ...

సర్వజన వైద్యశాలకు 50 నుంచి 60 కిలో మీటర్ల సుదూర ప్రాంతాల నుంచి నిత్యం రోగులు వస్తుంటారు. జనరల్ మెడిసిన్‌కు ఇక్కడ అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో ప్రతి రోజు సుమారు 450 మంది వరకు రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారు. 15 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి.

◗ వైద్యశాలలో ప్రస్తుతం 19 మంది వివిధ విభాగాలకు సంబంధించిన వైద్యులున్నారు. మామూలుగా ఇక్కడి వైద్యశాలలో అన్ని విభాగాలకు 50 మంది వరకు డాక్టర్లు ఉండాలి. వైద్యులు లేకపోవడంతో కొన్ని కొన్ని వ్యాధులకు ఇక్కడ వైద్యం అందడం లేదు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం వైద్యులతో పాటు 53 మంది స్టాఫ్ నర్సులు ఉన్నట్లు ఇన్‌ఛార్జి సూపరింటెండెంటు శ్రీనివాసరావు చెప్పారు.

◗ ఈ వైద్యశాలకు యర్రగొండపాలెం, దోర్నాల, గిద్దలూరు, కంభం, అర్ధవీడు ప్రాంతాల నుంచి నిత్యం రోగులు వస్తుంటారు. సాధారణ రోగులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

నా మొక్క.. నాదే బాధ్యత!

☛ కనిగిరిలో దత్తత తీసుకున్న దుకాణదారులు

కనిగిరి, న్యూస్‌టుడే: ఎక్కడైనా అధికారులు, విద్యార్థులు మొక్కలు పెంచడం చూస్తుంటాం. కనిగిరి పట్టణంలో మాత్రం దుకాణదారులు 'నా మొక్క.. నాదే బాధ్యత' అంటూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. పట్టణంలోని ఎమ్మెస్సార్ రోడ్డుకు చెందిన వ్యాపారులు మొక్కలు నాటి వాటిని పెంచి పచ్చదనం పెంపొందించాలని తలచారు. అందుకు మానవతా సంస్థను సంప్రదించారు. నీడనిచ్చే వివిధ రకాల మొక్కలను విజయవాడ, రాజమహేంద్రవరం నగరాల నుంచి తెప్పించి నాటారు. అలాగే వదిలేయకుండా రూ.వెయ్యి రూపాయలకు పైగా విలువ చేసే ట్రీగార్డులు వంద వరకు తయారు చేయించారు. పశువుల బారిన పడకుండా రక్షణ కల్పించారు. రోజూ ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు అందిస్తూ కన్న బిడ్డల్లా చూసుకుంటున్నారు. దుకాణదారులు వాగిచెర్ల వెంకటేశ్వర్లు, వలేటి మురళి, సోమిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను దత్తత తీసుకుని కాపాడుకుంటున్నామని తెలిపారు. ఇలా చేయడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

మొక్కకు నీళ్లు పోస్తున్న దుకాణదారుడు మురళి

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పామూరు, న్యూస్‌టుడే: కొత్త లైన్ పనుల కారణంగా సోమవారం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పామూరులోని సీఎస్‌పురం రోడ్డు, విరువూరు రోడ్డు, రాఘవేంద్ర స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ జిలానీబాష తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

17న జేవీవీ వక్త -2026 పోటీలు

పొదిలి, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 17న పొదిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మండలస్థాయి వక్త-2026 పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాఠశాల స్థాయిలో విజేతలైన 23 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. మండలస్థాయి విజేతలను జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

శివారు ఆయకట్టుకూ సాగర్ నీరు

సంతనూతలపాడు: చివరి భూములకు సాగర్ నీరు అందించేలా కృషి చేస్తున్నట్లు ఎన్నెస్పీ ఎస్ఈ వరలక్ష్మి తెలిపారు. ఆదివారం చిలకపాడు మేజర్ కాలువపై కొణిజేడు చివరి భూములను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రామతీర్థం రిజర్వాయరు నుంచి 330 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. వీటిలో 260 క్యూసెక్కుల నీటిని త్రోవగుంట మేజరుకు వెళ్తుందని, చిలకపాడు మేజరుకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

గ్రాసం కొరత.. జీవాలు వలస

☛ వేసవికి ముందే మొదలు

న్యూస్‌టుడే, హనుమంతునిపాడు:

కనిగిరి నియోజకవర్గంలో వేసవి ప్రారంభంలోనే పశువుల కొరత ఏర్పడి మూగ జీవాలు తరలి పోతున్నాయి. కొందరు పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. అయినకాడికి అమ్ముకొని కొందరు పశుపోషకులు తెలంగాణా ప్రాంతాలకు పనులు వెతుక్కుంటూ వెల్తున్నారు. ఇప్పటికే ఇంకొల్లు, కొండపి, చీమకుర్తి, దర్శి ప్రాంతాలకు కొందరు వలస వెళ్లారు.

వరిగడ్డి ట్రాక్టర్‌కు రూ.10,000

డివిజన్లో కొందరు పోషకులు గత్యంతరం లేక, పాడిని వదులుకోలేక వరి గడ్డి ట్రాక్టరు రూ.10,000 వెచ్చించి గుంటూరు, తెనాలి, నెల్లూరు, కృష్ణా జిల్లాల నుంచి తెచ్చుకుంటున్నారు. ఇటీవల కురిసిన అరకొర వర్షాలకు చెరువుల్లో, చెక్‌డ్యాంలలో నీరుచేరినా, అవి కూడా అడుగంటి పోయాయి. మండలంలో ఏటా వేసవిలో పశు పోషణతో అదనపు ఆదాయంతో నెట్టుకొచ్చే కుటుంబాలు ఇక్కట్లు పడుతున్నాయి. గత తెదేపా ప్రభుత్వంలో ఐవేళ్లకు ముందు గిద్దలూరు నంద్యాల ప్రాంతం నల్లమల నుంచి గడ్డితెచ్చుకొనేందుకు రవాణా కింద లారీలను ఏర్పాటు చేసింది. వైకాపా ప్రభుత్వంలో ఆ వెసులుబాటు గురించి పట్టించుకోలేదు. గతంలో మాగుడుగడ్డి ఒక రూపాయికే రాయితీపై ఇచ్చారు. ఈ ఏడాది అదికూడా అందుబాటులో లేదు. నీటి సౌకర్యం ఉన్న చోట్ల గడ్డిని పెంచి రైతులకు అందచేస్తామన్న వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ ఈ ఏడాది చర్యలు తీసుకోలేదు.

హెచ్‌ఎంపాడు నుంచి కొండపి, ఇంకొల్లు ప్రాంతానికి తరలుతున్న మూగ జీవాలు

వెంటనే చర్యలు తీసుకోవాలి

పశువులు, జీవాలకు నీటి సౌకర్యం కలిగించేందుకు బీడు ప్రాంతాల్లో ఉన్న నీటితొట్లను ట్యాంకర్‌లతో నింపాలని, రాయితీపై గడ్డిని వెంటనే విడుదల చేయాలని పోషకులు కోరుతున్నారు. మండలంలో గ్రాసం కొరత తీర్చేందుకు పశుసంవర్ధకశాఖ వెంటనే చర్యలు తీసుకోవాలని పశు పోషకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్సులు వచ్చే వరకు రోడ్డుపైనే!

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. డివిజన్ కేంద్రం కావడంతో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ప్రజలు కనిగిరి వస్తుంటారు. తిరుగు ప్రయాణంలో బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి. ఇలాంటి సమయంలో బస్ షెల్టర్లు లేక పోవడంతో అవస్థలు తప్పడం లేదు. పామూరు బస్టాండ్‌లో షెల్టర్ ఉండడంతో అటువైపు వెళ్లే వారికి కాస్త ఊరట కలిగిస్తోంది. ఒంగోలు, పొదిలి, మార్కాపురం వెళ్లే ప్రయాణికులు మాత్రం కాసేపు వేచి ఉండాల్సి వస్తే ఎండలో, చెట్ల కింద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపల్, ఆర్టీసీ అధికార్లు స్పందించి అన్ని చోట్ల బస్ షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మార్కాపురం వెళ్లేందుకు చెట్టు కింద వేచి ఉన్న ప్రయాణికులు

(c) eenadu

ప్రత్యేక పుష్పాలంకరణలో ముద్దసానమ్మతల్లి

తర్లుపాడు: చందనపు అలంకరణలో నీలకంఠేశ్వరుడు

మార్కాపురం గ్రామీణం: విశేష అలంకరణలో పోలేరమ్మతల్లి

మార్కాపురం

•మార్కాపురం • యర్రగొండపాలెం

17న జేవీవీ వక్త -2026 పోటీలు

పొదిలి, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 17న పొదిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మండలస్థాయి వక్త-2026 పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాఠశాల స్థాయిలో విజేతలైన 23 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. మండలస్థాయి విజేతలను జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
యర్రగొండపాలెం : 8008552658

తర్లుపాడు, న్యూస్‌టుడే:

?: మండలంలోని తాడివారిపల్లి గ్రామానికి చెందిన జగన్ కాలనీలో సింగిల్ ఫేజ్ తాగునీటి బోరు చెడిపోయింది. ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే మరమ్మతులు చేయించండి. - వెంకటేశ్వర్లు, జగన్ కాలనీ, తాడివారిపల్లి.

✓: తాగునీటి బోరుకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం. ఇబ్బందులు తొలగిస్తాం. - అనూష, పంచాయతీ అధికారి, తాడివారిపల్లి.

పొదిలి, న్యూస్‌టుడే:

?: పొదిలి విరాట్‌నగర్ కాలనీలోని మూడోలైనులో మురుగునీటి కాలువలు, సిమెంటు రోడ్డు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. వర్షాకాలం మరింత ఇబ్బందిగా ఉంటోంది. కొత్త రోడ్డు మంజూరు చేయాలి. - స్థానిక ప్రజలు

✓: పట్టణంలో అవసరమైన చోట్ల కాలువలకు ప్రతిపాదనలు తయారుచేశాం. నిధుల లభ్యతను బట్టి పనులు చేయిస్తాం. - ఎ.నారాయణరెడ్డి, కమిషనర్, పొదిలి.

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

?: వెంకటాద్రిపాలెం వీధుల్లో అపరిశుభ్రంగా ఉంటోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది ఇబ్బంది పడుతున్నాం. అధికారులు వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. బ్లీచింగ్ చల్లాలి. - వెంకటయ్య, స్థానికుడు

✓: వీధుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లిస్తాం. రోగాలు వ్యాప్తి చెందకుండా చూస్తాం. - లక్ష్మీనాయక్, పంచాయతీ కార్యదర్శి.

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని కంభం రోడ్డులోని కాలువల్లో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కనీసం పదిహేను రోజులకు ఒకసారైనా శుభ్రం చేసేలా చర్యలు తీసుకోండి. - అరవింద్, స్థానికుడు.

✓: పలు ప్రాంతాల్లో ఇప్పటికే మురుగు తొలగిస్తున్నాం. ఇక్కడ కూడా పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. - నారాయణరావు, మున్సిపల్ కమిషనర్.

?: పట్టణంలోని నాగులవరం రోడ్డులో పైపుల కోసం కాలువలు తీసి అలానే వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. - ఖలీల్, స్థానికుడు.

✓: ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసే క్రమంలో కాలువలు తీయడం జరిగింది. త్వరలో కాలువలు పూడ్చి సమస్యను పరిష్కరిస్తాం. -నారాయణరావు, మున్సిపల్ కమిషనర్.

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని బీసీ కాలనీ పక్కన కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడంలేదు. రాత్రి వేళల్లో వెళ్లాలంటే ఇబ్బంది ఉంటోంది. బాగు చేయించాలి. - రామయ్య, స్థానికుడు

✓: మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. -రామ సుబ్బయ్య, స్థానికుడు

శివోహం.. శివోహం..

☛ ముక్కంటి నామస్మరణతో హోరెత్తిన శివాలయాలు

న్యూస్‌టుడే, మార్కాపురం, మార్కాపురం అర్బన్, మార్కాపురం గ్రామీణం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం మార్కాపురం, వై.పాలెం నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో హోరెత్తాయి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు రావడంతో రద్దీ పెరిగిపోయింది.

● పెద్దదోర్నాల: శ్రీశైలం వెళ్లి, వచ్చే భక్తులకు చింతల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యసిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ రాక్షాన్ పర్యవేక్షించారు.

● పొదిలి: పొదిలిలోని శ్రీపార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి రథోత్సవం సోమవారం జరగనుంది. దేవస్థానం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, ధర్మకర్తలు నెర్లిపూడి చంద్రశేఖర్ హైమావతి, ఎన్.నాగేశ్వరరావు పార్వతి, రథనిర్మాణ దాత సామంతపూడి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

● శివరాత్రి సందర్భంగా నిర్మమహేశ్వరుడిని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైకాపా ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పొదిలిలోని అధికారులు, ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు.

● మార్కాపురం పట్టణంలో మదిరాల్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో నగరోత్సవం కనుల పండువగా సాగింది. అర్చకులు బాలాజీసింగ్, ధర్మకర్త కృష్ణారెడ్డి పూజలు చేశారు.

● తర్లుపాడు: తర్లుపాడులోని కేదార్‌నాథ్ స్వామి ఆలయంలో తర్లుపాడు తహసీల్దార్ కె.కె.కిశోర్ కుమార్ అభిషేకం చేయించారు.

● త్రిపురాంతకం గ్రామీణం, త్రిపురాంతకం: ప్రసిద్ధ శైవ పుణ్య క్షేత్రం త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వైకాపా ఎమ్మెల్యే టి.చంద్రశేఖరరావు, వైకాపా నాయకులు చెవిరెడ్డి భాస్కరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

త్రిపురాంతకేశ్వరుని పూజల్లో పాల్గొన్న తెదేపా నేత ఎరిక్షన్ బాబు

ప్రసాద పంపిణీలో ఆర్డీవో శివరామిరెడ్డి

పొదిలి: నిర్మమహేశ్వర ఆలయంలో భక్తుల కోలాహలం

మునీశ్వర దేవస్థానంలో అలరించిన కోలాటప్రదర్శన

సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న చింతల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది

పెద్దదోర్నాల: భక్తులకు భోజనం వడ్డిస్తున్న సీఐ అజయ్‌కుమార్, డీడీవో బాలునాయక్ తదితరులు

పెద్దారవీడు: అలంకరణలో కాటంరాజు స్వామి

పొదిలి: గజోత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

ప్రత్యేకాలంకరణలో జగదాంబ అమ్మవారు

ధ్యానంతో ఏకాగ్రత.. ఆహారంతో ఆరోగ్యం

☛ పరీక్షల వేళ..విద్యార్థులకు నిపుణుల సూచనలు

విద్యార్థులకు పరీక్షలు ఎంతో కీలకమైనవి. ఈనెల 23 నుంచి ఇంటర్మీడియట్, మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒకింత ఆందోళనకు గురవడం సహజం. కొండంత ఆహారం, నిద్రమాని చదువులో లీనమవుతుంటారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో అభ్యాసంతో పాటు ఆహారం, ఆరోగ్యం ఎంతో ప్రధానమని, ఒత్తిడిని అధిగమిస్తేనే ఏకాగ్రత దరిచేరుతుందని నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలో పదోతరగతి 23,685 మంది, ఇంటర్మీడియట్ 13,100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆరోగ్యం, ఆహార విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వ వైద్యులు సూచనలు కొన్ని వారి కోసం... - న్యూస్‌టుడే, పొదిలి

స్టడీఅవర్స్‌లో పదో తరగతి విద్యార్థులు

తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తినండి

పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. ఆహారం ఒకేసారి ఎక్కువగా తీసుకోకుండా తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తినాలి. టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్ వంటి పానీయాలకు దూరంగా ఉండాలి. ఆకుకూరలు, పండ్లు, పాలు, రాగిజావ లాంటివి తీసుకోవాలి. వేపుళ్లు, ఆయిల్‌తో చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది. - డా.కె.చక్రవర్తి, ప్రభుత్వ వైద్యులు, పొదిలి

కనీసం 20 నిమిషాలైనా ధ్యానం చేయాలి

విద్యార్థులు పరీక్షల ఒత్తిడి నుంచి బయట పడాలంటే ప్రతిరోజు కనీసం 20 నిమిషాలైనా ధ్యానం చేయాలి. పరీక్షల దగ్గరపడే కొద్దీ ఒత్తిడి, ఆందోళన ఉంటుంది. ఒక్కొక్కసారి చికాకు అనిపిస్తూ త్వరగా కోపం వస్తుంటుంది. వాటన్నింటిని అధిగమించి మనసు ప్రశాంతంగా ఉండాలంటే ఉదయాన్నే ధ్యానం చేస్తే మంచిది. దీనివల్ల ఏకాగ్రత పెరుగుతుంది. - ఎ.శంకర్, యోగా గురువు

ఏడు గంటలు నిద్ర తప్పనిసరి

పరీక్షలు అనగానే నిద్రపోకుండా ఎక్కువ మంది చదువుతుంటారు. సరైన నిద్రలేక పోవడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురవుతారు. మన శరీరానికి పూర్తిస్థాయిలో గ్లూకోజ్ అందేలా చూసుకోవాలి. గ్లూకోజ్ తగ్గితే శరీరం నీరసిస్తుంది. బ్రెయిన్‌కు గ్లూకోజ్ సప్లై కాకపోతే చదువుకున్న పాఠ్యాంశాలు కూడా ఒక్కొక్కసారి గుర్తుకు రావు. ఏడు గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలి. - డాక్టర్ శరత్‌చంద్ర, ప్రభుత్వ వైద్యులు, పొదిలి

చెరువు కట్ట మలుపు.. ప్రమాదాలకు పిలుపు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం చెరువు కట్ట ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. కట్ట మలుపు పెద్దగా ఉండటం, ఇరువైపులా సరిహద్దు రాళ్లు లేకపోవడం, ఉన్నా సరిగా కనిపించకపోవడం తదితర కారణాలతో గతంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పలువురు మృతి చెందారు, గాయపడ్డారు. డ్రైవర్‌కాలనీ సమీపం వైపు ఉన్న భారీ మలుపు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. చెరువు కట్టనే వంక తిరిగినట్లుగా ఉంటుంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను సైతం తప్పించబోయి మూలమలుపు వద్ద ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. చెరువు కట్టను అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి కాంతి దీపాలు ఏర్పాటు చేస్తామని చెప్పినా నేటికీ పట్టించుకోలేదు. దీంతో ప్రమాదాలు పెరగడం తప్ప తగ్గడం లేదని పలువురు పేర్కొన్నారు. కనీసం కూటమి ప్రభుత్వమైనా కట్టకు ఇరువైపులా భారీ స్తంభాలు ఏర్పాటు చేయాలని, సూచిక బోర్డులు నెలకొల్పాలని ప్రజలు కోరుతున్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నత భవిత

కొత్తపట్నం, న్యూస్‌టుడే: యువత బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విశాఖపట్నం జిల్లా జడ్జి, కొత్తపట్నం గ్రామానికి చెందిన మోదడుగుల హరినారాయణ సూచించారు. [illegible] తాను కూడా ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తుచేసుకున్నారు.

సర్వజన వైద్యం.. మెరుగుపడితే నయం

☛ ఆసుపత్రిలో ఓపీ బాగున్నా చికిత్సల పెంపు అవసరం

న్యూస్‌టుడే, మార్కాపురం అర్బన్:

మార్కాపురం జిల్లా కేంద్రంలోని సర్వజన వైద్యశాలలో అనుకున్న మేరకు ఓపీ నమోదు అవుతోంది. సాధారణంగా వచ్చే వ్యాధులకు మంచి వైద్యం అందుతున్నప్పటికీ ఇంకా చాలా శస్త్ర చికిత్సలకు వైద్యులను సమకూర్చాల్సి ఉంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇది రెండో జిల్లా వైద్యశాల.

350 పడకలు, సరిపోని సిబ్బంది, వైద్యులు

1998లో అప్పటి వైద్య ఆరోగ్య శాఖామంత్రి ఎన్.జనార్దన్ రెడ్డి మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల భవనానికి శంకుస్థాపన చేశారు. మొదట 50పడకలతో ప్రారంభమైన వైద్యశాల ఆ తర్వాత 100 పడకలుగా ఏర్పడింది. ఈప్రాంత ప్రజల పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న అప్పటి ప్రస్తుత తెదేపా ప్రభుత్వం 2019-24 మధ్య జిల్లా వైద్యశాలగా మార్చింది. ప్రస్తుతం సర్వజన వైద్యశాలగా ఏర్పడి 350 పడకలతో వైద్యశాల నడుస్తోంది. కానీ అందుకు తగిన వైద్యులు, వసతులు మాత్రం అందుబాటులో ఉండడం లేదు.

400కు పైగా ఓపీ...

సర్వజన వైద్యశాలకు 50 నుంచి 60 కిలో మీటర్ల సుదూర ప్రాంతాల నుంచి నిత్యం రోగులు వస్తుంటారు. జనరల్ మెడిసిన్‌కు ఇక్కడ అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో ప్రతి రోజు సుమారు 450 మంది వరకు రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారు. 15 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి.

◗ వైద్యశాలలో ప్రస్తుతం 19 మంది వివిధ విభాగాలకు సంబంధించిన వైద్యులున్నారు. మామూలుగా ఇక్కడి వైద్యశాలలో అన్ని విభాగాలకు 50 మంది వరకు డాక్టర్లు ఉండాలి. వైద్యులు లేకపోవడంతో కొన్ని కొన్ని వ్యాధులకు ఇక్కడ వైద్యం అందడం లేదు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం వైద్యులతో పాటు 53 మంది స్టాఫ్ నర్సులు ఉన్నట్లు ఇన్‌ఛార్జి సూపరింటెండెంటు శ్రీనివాసరావు చెప్పారు.

◗ ఈ వైద్యశాలకు యర్రగొండపాలెం, దోర్నాల, గిద్దలూరు, కంభం, అర్ధవీడు ప్రాంతాల నుంచి నిత్యం రోగులు వస్తుంటారు. సాధారణ రోగులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ముక్కు మూసుకుంటేనే.. వెళ్లగలిగేది

తర్లుపాడు, న్యూస్‌టుడే: తర్లుపాడు గ్రామానికి తూర్పువైపున దిగువ భాగంలో శివాలయం ఉండటంతో ఊరిలోని డ్రైనేజీ కాలువ చెత్త అంతా ఆలయం ముందుకు వచ్చి చేరుతోంది. దానికితోడు వ్యర్థాలు మొత్తం ఆ కాలువలోనే వేస్తుండటంతో బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో డ్రైనేజి రోడ్డుపైకి పొంగుతోంది. దీంతో ఆలయం ముందు ఉన్న రోడ్డు మొత్తం మురికి నీటితో నిండిపోవడంతో అటుగా వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిత్యం తీవ్ర దుర్గంధంతో అవస్థలు పడుతున్నామని పలువురు వాహనదారులు, స్థానికులు తెలిపారు. పంచాయతీ యంత్రాంగం స్పందించి వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గుంతల దారి.. అద్దంలా మారి

వై.పాలెం-త్రిపురాంతకం ఆర్‌అండ్‌బీ రోడ్డు.. అడుగుకో గుంతతో అధ్వానంగా ఉంది. అత్యవసర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి. ఇంత దారుణంగా ఉన్న ఈ కీలక రహదారికి కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నరలో దీని బాగుకోసం రూ.7కోట్లు కేటాయించింది. ఇటీవలే పనులు ప్రారంభించిన అధికారులు.. 90శాతం పూర్తి చేశారు. మొన్నటిదాకా మోకాళ్లలోతు గోతులతో అల్లాడిన వాహనదారులు నేడు ఉపశమనం పొందుతున్నారు. కొత్త తారు రోడ్డు అద్దంలా మెరిసిపోతూ ఇక్కట్లకు చెక్ పెట్టడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, యర్రగొండపాలెం

నీటి ట్యాంకు శుభ్రం చేయరూ..

పొదిలి పిచ్చిరెడ్డి కాలనీలో నీటిట్యాంకు చుట్టూ పాచి పేరుకు పోయింది. నాలుగు వీధుల్లో నాలుగు చోట్ల నీటి ట్యాంకులు ఉండగా ఒక చోట పూర్తిగా నీరు చేరడం లేదు. రెండు చోట్ల ట్యాంకు బయట పాచిపట్టి ఉంది. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కుళాయిలు సైతం సక్రమంగా లేకపోవడంతో నీరు వృథా అవుతోంది. ఈ కాలనీకి సాగర్‌నీరు (తాగునీరు) పూర్తిగా రావడం లేదు. సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని ఎన్‌ఏపీ సంపు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. - న్యూస్‌టుడే, పొదిలి

పరికరాలు శిథిలం.. ఆటలు ఆడలేం

పెద్దదోర్నాలలో స్థానిక అటవీశాఖ చెక్ పోస్టు సమీపంలో అటవీశాఖ ఏర్పాటు చేసిన అడ్వెంచర్ పార్కులో ఆట వస్తువులు నిరుపయోగంగా ఉన్నాయి. రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ పార్కు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఆట వస్తువులు శిథిలావస్థకు చేరాయి. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన దానిని గురించి అటవీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దానిని ప్రారంభించి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

పైపు బాగు చేశారు.. నీటి సమస్య తీర్చారు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని బోయలపల్లె బీసీ కాలనీలో నెల నుంచి సాగర్ పైపు పగిలి పోయి నీరు రావడం లేదు. ఈ విషయాన్ని ఈనెల 10న ఈనాడులో 'బోయలపల్లె బీసీ కాలనీలో తాగునీటికి వెత' అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమస్య తీర్చారు. పగిలిపోయిన ఇనుప పైపునకు వెల్డింగ్ చేశారు. లీకులు లేకుండా చర్యలు చేపట్టారు. సాగర్ నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో నెల రోజుల సమస్య తీరిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

పగిలిన సాగర్ పైపునకు వెల్డింగ్ చేస్తున్న సిబ్బంది

లయన్స్ సేవలు అభినందనీయం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం లయన్స్ క్లబ్ వారి సేవలు అభినందనీయమని ఆర్టీసీ డిపో మేనేజరు లావణ్య అన్నారు. ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని డీఎం ప్రారంభించి ప్రయాణికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రామకృష్ణారావు, బి.వి.రంగయ్య, హరినాథ్‌బాబు, జగన్‌బాబు, నారాయణరెడ్డి, రమణ, శ్రీరంగాచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎం లావణ్య

సేవ చేస్తూ.. మన్ననలు పొందుతూ..

☛ ఏళ్లుగా అన్నదానం, వైద్య శిబిరం తదితరాల నిర్వహణ

న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం:

త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల వద్ద ఉన్న పలు సత్రాలు ఏళ్ల తరబడి అన్నసంతర్పణ చేస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నాయి. బ్రాహ్మణ, కమ్మ, రెడ్లు, బలిజ, యాదవ, ఆర్యవైశ్యులతో పాటు దాదాపు 25 రకాల సామాజిక వర్గాల ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఏటా అన్నదానం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మహాశివరాత్రి నుంచి రథోత్సవం వరకు మూడు రోజుల పాటు అన్ని సత్రాల్లో 250 క్వింటాళ్ల బియ్యం వండి మధ్యాహ్నం, రాత్రి పూటల్లో అన్న సంతర్పణ చేస్తున్నారు.

పెద్దదోర్నాల: కాకతీయ కమ్మ వారి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం, వైద్య శిబిరాన్ని రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర, ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణలు ప్రారంభించారు. రెడ్ల సంక్షేమ సేవా సంఘం నిర్వహించిన అన్నదాన శిబిరంలో జేసీ పి.శ్రీనివాసులు, డీఎస్పీ నాగరాజులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. బలిజ కాపు సంఘం అన్నదాన శిబిరం నిర్వహిస్తోంది. యూనియన్ బ్యాంకు సహకారంతో ఇస్కాన్ సంస్థ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మేనేజర్ తిరుమల ప్రసాద్ ప్రారంభించారు.

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలోని నిర్మమహేశ్వరస్వామి మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. అన్నపూర్ణ సేవాసమితి అధ్యక్షురాలు సామి పద్మావతి, కమిటీ సభ్యులు ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో మానవతా సేవాసంస్థ ప్రతినిధులు సుబ్బారెడ్డి, పార్థసారధి, అశోక్, చిరంజీవి, బి.వి.రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రవీంద్ర

భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న మానవతా సేవాసంస్థ ప్రతినిధులు

పీఆర్సీని వెంటనే నియమించాలి

పొదిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని వెంటనే నియమించాలని పింఛనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి మదార్‌వలి చెప్పారు. పొదిలి పింఛనర్ల సంఘం భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, అడిషనల్ క్వాంటం పది శాతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పింఛనర్ల సంఘం గౌరవ అధ్యక్షులు వీరారెడ్డి, కోశాధికారి చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, కార్యదర్శి మోహనరావు, రామకృష్ణ, సుబ్బారెడ్డి, మహిళా కార్యదర్శి దానమ్మ, సుదర్శన్‌రెడ్డి, యల్లమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని ప్రభుత్వం

పొదిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జైల్లో పెట్టడమే పనిగా పనిచేస్తుందని వైకాపా ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం పొదిలి నిర్మమహేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించారు. స్వామివారికి సారె సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదన్నారు. ఎవరిని జైల్లో పెట్టాలా, ఎన్నిరోజులు పెట్టాలా అనే కార్యక్రమం మీదే పనిచేస్తుందన్నారు. ఆయన వెంట మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసులరెడ్డి తదితరులున్నారు.

(c) eenadu

ఈనాడు నంద్యాల
సోమవారం ఫిబ్రవరి 16, 2026

మొక్కిన చేతుల పుణ్యం.. చూసిన కనులు ధన్యం

● కమనీయం.. భ్రమరాంబ, మల్లికార్జున స్వామి కల్యాణం

పాగాలంకరణలో మెరిసిపోతున్న ఆలయం

కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులు

పాతాళగంగలో పుణ్య స్నానమాచరించారు.. ప్రభోత్సవం చూసి తరించారు.. నంది వాహన సేవలో పాల్గొని పులకించిపోయారు.. పాగాలంకరణ వీక్షించి పరవశించిపోయారు.. దేవదేవుల కల్యాణ వేడుకను కనులారా తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆదిదంపతుల బ్రహ్మోత్సవ కల్యాణం రాత్రి 12 గంటలకు మొదలైంది. వేదికపై ఉత్సవమూర్తులు కల్యాణశోభతో కొలువుదీరారు. అధికార యంత్రాంగం, భక్తజనులు బ్రహ్మోత్సవ కల్యాణ వేదిక ఎదుట ఆశీనులయ్యారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, వేదపండితులు, పరిచారకులు అంతా కలిసి భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవ కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీశైల మల్లన్న తన ఇష్టసఖి భ్రామరీతో కలిసి బ్రహ్మోత్సవంలో నవదాంపత్యశోభతో భక్తజనులకు సాక్షాత్కరించారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం, సున్నిపెంట సర్కిల్

నందీశ్వరా.. నమోస్తుతే

సుమధుర శోభిత పుష్పాలంకృతమైన నంది వాహనంపై ఆదిదంపతులు కొలువుదీరారు. అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. శివ నామస్మరణల మధ్య స్వామి, అమ్మవార్లు భక్తుల చెంతకు తరలొచ్చారు. ఉత్సవంలో కళాకారులు ప్రదర్శించిన కోలాటాలు, ఢమరుకనాదాలు అలరించాయి.

ప్రభోత్సవం.. నేత్రశోభితం

సాయంత్రం ప్రభోత్సవం నేత్ర శోభితంగా సాగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో తీసుకొచ్చి ప్రభపై వేంచేబు చేశారు. వేలాదిమంది భక్తజనుల శివనామస్మరణలు, మంగళవాయిద్యాలు, కళాకారుల సందడి నడుమ ప్రభోత్సవం శోభాయమానంగా జరిగింది.

నందివాహనంపై స్వామి అమ్మవార్లు

ప్రభోత్సవంలో జనసందడి

రమణీయం.. పాగాలంకరణ

కల్యాణానికి ముందు ఆదివారం రాత్రి 10 నుంచి 12 గంటల వరకు కొనసాగిన పాగాలంకరణ ఘట్టం భక్తజనులకు ఆధ్యాత్మికానుభూతిని కలిగించింది. పాగాలంకరణ క్రతువు ఓవైపు కొనసాగుతుండగానే గర్భాలయంలో మల్లికార్జునస్వామి మూలమూర్తికి అర్చకులు రాత్రి 10 నుంచి 1.30 గంటల వరకు లింగోద్భవకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని శాస్త్రయుక్తంగా నిర్వహించారు.

భక్తజనగిరి

● కిక్కిరిసిన శ్రీశైల క్షేత్రం

ఉచిత దర్శనం క్యూలైన్ వద్ద రద్దీ

ఈనాడు, కర్నూలు: మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. 2.50 లక్షల మంది వరకు స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకొన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం తెల్లవారుజాము 2.20 గంటల నుంచే దర్శనం చేసుకున్నారు.

- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ సునీల్ షొరాణ్‌లు శ్రీశైల ఆలయం, పరిసరాల్లో తిరుగుతూ ఏర్పాట్లు పరిశీలించారు. క్యూలైన్లలో ఉన్న చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. భక్తులకు మంచినీళ్లు అందుబాటులో ఉంచారు.
- క్యూలైన్లను పరిశీలించి ఎక్కడా తొక్కిసలాట జరగకుండా ప్రశాంతంగా దర్శించుకోవాలని భక్తులకు సూచించారు. దర్శనం చేసుకున్న ప్రతి భక్తుడికి ఉచితంగా ప్రసాదం పంపిణీ చేశారు.
- ప్రతి గేటు దగ్గరా పోలీసు బలగాల్ని మోహరించి అర్హులైన వారినే పంపేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆత్మకూరు ఆర్డీవో వీవీపీ గేటు దగ్గర నుంచి కొందరిని లోపలికి పంపించారన్న ఆరోపణలొచ్చాయి.
- శ్రీశైలానికి వచ్చే వాహనాల రద్దీ కారణంగా ఎక్కడా ట్రాఫిక్ అవాంతరాలు తలెత్తకుండా ఉన్నతాధికారులు పలు కీలక ప్రాంతాల్లో పోలీసులను మోహరించారు. పార్కింగ్ ప్రదేశాల్లో తప్ప ఎక్కడా రోడ్డుపై ఎక్కువ సేపు నిలపకుండా ఏర్పాట్లు చేయడంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. టోల్‌గేట్ దగ్గర రుసుముల వసూళ్లను నిలిపివేసి వాహనాలన్నింటినీ ఉచితంగానే పంపించారు.

విద్యుత్తు సమస్యలా.. ఫోన్ చేయండి

ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్, జిల్లాస్థాయిలో విద్యుత్తు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు ఏర్పాటు చేసిన డయల్ యువర్ సీఎండీ, డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సీఎండీ శివశంకర్ తెలిపారు. – న్యూస్‌టుడే, వెంకటరమణ కాలనీ

● డయల్ యువర్ సీఎండీ
సమయం : ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30
ఫోన్ నంబరు 89777 16661

● డయల్ యువర్ ఎస్ఈ
సమయం 8:30 - 9:30 గంటలు
కర్నూలు : 73826 14308
నంద్యాల : 73826 18976

17న అహోబిలంలో దర్శనాలు బంద్

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో 17వ తేదీన దర్శనాలు నిలిపేస్తున్నట్లు ఆలయ సీఏవో రామానుజన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దర్శనాలు ఉండవన్నారు. ఈ నెల 20వ తేదీన బ్రహ్మోత్సవాలు ఆరంభం కానుండటంతో 17న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గర్భగుడి సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో దర్శనాలు తాత్కాలికంగా నిలిపేస్తున్నామని.. దీనిని భక్తులు గమనించాలని ఆయన కోరారు.

రైతులను దారుణంగా దోచేశారు

కంప్యూటరైజ్డ్ రసీదులే చెల్లుబాటు

● సహకార సంఘాల సీఈవోల చేతివాటం

కొత్తపల్లి మండలం నాగంపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘానికి రైతులు చెల్లించిన రూ. 42 లక్షలు పక్కదారి పట్టారు. సీఈవో కోటేశ్వరరావు స్వాహా చేసినట్లు తేలింది. ఆయన 2022 నుంచి సీఈవోగా పని చేశారు. రైతులు తీసుకొన్న రుణాలు తిరిగి చెల్లిస్తున్న క్రమంలో తప్పుడు రసీదులిచ్చారు. నగదును సంఘంలో జమ చేయకుండా దారి మళ్లించారు. ఇప్పటికీ కేవలం రూ.10 లక్షలే చెల్లించారు.

మంత్రాలయం మండలం కల్లుదేవకుంట్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం పరిధిలో రూ.20 లక్షల సొమ్ము దారి మళ్లింది. అక్కడ పనిచేసిన అప్పటి సీఈవో రైతులు చెల్లించిన సొమ్ముకు సంబంధించిన వివరాలు క్యాష్‌బుక్‌లో నమోదు చేయకుండా స్వాహా చేశారు. సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేయడంతో ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో స్థానిక నేతలు పెత్తనం చేశారు. ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేయడం.. రికవరీ చేయకుండా సంఘాలను నష్టాల ఊబిలోకి దించారు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత కంప్యూటరీకరణ చేపట్టి గాడిలో పెట్టేయత్నం చేస్తోంది.

– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

రికవరీ చేయడంలో ఆలస్యం

కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు (పీఏసీఎస్) ఉన్నాయి. వీటి పరిధిలో 1.25 లక్షల మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏటా రూ.4 వేల కోట్లకు పైగా టర్నోవర్‌తో వ్యాపారం జరుగుతుంది. రైతులకు భూ దస్త్రాలు, భూ విస్తీర్ణం ఆధారంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేస్తుంటారు. సుమారు 50 వేల మంది రైతులు రూ. 900 కోట్ల వరకు పంట రుణాలు తీసుకున్నారు. పలువురు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి సొమ్ములు పక్కదారి పట్టించారు. 2024-25 నుంచి కంప్యూటరీకరణ మొదలు పెట్టారు. పలు సొసైటీల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో నగదు రికవరీ చేయలేదు.

- ప్రాథమిక సహకార సంఘాల కంప్యూటరీకరణ పూర్తైంది. సొసైటీల్లో మాన్యువల్ రసీదు పుస్తకాలను సీజ్ చేశారు. సహకార సంఘం ద్వారా రుణాలు పొందిన రైతులు తిరిగి చెల్లింపులు చేసేటప్పుడు సహకార సంఘంలోని కంప్యూటర్ సిస్టమ్ జనరేట్ చేసిన రసీదు, దానిపై సొసైటీ సీఈవో సంతకం, సీల్ ఉన్న రసీదు మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది.
- మాన్యువల్‌గా జారీ చేసిన రసీదులు ఏమాత్రం చెల్లుబాటు కావు. ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 ప్రాథమిక సహకార సంఘాల వద్ద సహకార సంఘ అధికారులు బ్యానర్లు ఏర్పాటు చేయించారు.
- సొసైటీ సీఈవోలు మాన్యువల్ రసీదులిచ్చినా.. ఇప్పటివరకు తెలిసినా సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార సంఘం అధికారులు పేర్కొంటున్నారు.

ముక్కంటి సేవలో మంత్రి బీసీ

పట్టువస్త్రాలతో వస్తున్న మంత్రి బీసీ దంపతులు

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రహదారి, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో మజ్జిగ, నిమ్మరసం, అన్నదాన కేంద్రం, వైద్యశిబిరాలను ప్రారంభించారు. ఉత్సవం రోజు వాహనాల టోల్‌గేట్ రుసుం లేకుండా భక్తులకు ఏర్పాట్లు చేసిన సౌకర్యాలు పరిశీలించారు. ఆలయాధికారి పాండురంగారెడ్డి, ఆలయ ఛైర్మన్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కార్యనిర్వాహకులేరీ

● 20 ఆలయాలకు ఒక్కరే అధికారి
● అడుగడుగునా పర్యవేక్షణ లోపం

ఆలయాలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కరవైంది. చాలా ప్రాంతాల్లో కార్యనిర్వహణాధికారులు లేకపోవడంతో దాతలు అందించే సొమ్ముకు లెక్కలు లేకుండా పోతున్నాయి. మాన్యం భూముల నిర్వహణ కానరావడం లేదు. ఆళ్లగడ్డ ప్రాంతంలో దేవాదాయ శాఖ పరిధిలో సుమారు 20 వరకు ఆలయాలు ఉన్నాయి. గ్రూపు-1 కింద చాగలమర్రి, శిరివెళ్ల, గ్రూప్-2 కింద ఆళ్లగడ్డ, రుద్రవరం పరిధిలోని ఆలయాలున్నాయి. వీటి బాధ్యతలను గత ఆరు నెలలుగా ఆళ్లగడ్డ గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణ అధికారి సాయిజయచంద్రారెడ్డి చూస్తున్నారు. 6ఏ పరిధిలోకి వచ్చే (రూ.25 లక్షల కంటే ఎక్కువ ఆదాయం) పుట్టాలమ్మ క్షేత్రం, 6బీ కింద వచ్చే సర్వనరసింహ (రూ.25 లక్షల కంటే తక్కువ) ఆలయాలు ఉన్నాయి. ఈ 20 క్షేత్రాలను ఒక్కరే పర్యవేక్షిస్తున్నారు. చాలాచోట్ల నిర్వహణ లోపాలు కనిపిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– న్యూస్‌టుడే, నంద్యాల

ఆదాయం కోల్పోతూ..

- శిరివెళ్ల మండలం పచ్చర్లలోని సర్వనరసింహస్వామి ఆలయంలో కొబ్బరి చిప్పలు, శీతల పానీయాలు తదితరాలకు సంబంధించిన వేలం పాటలు జరగలేదు. గడువు మీరినా ఇప్పటికీ వేలం నిర్వహించకపోవడంతో ఆలయం పెద్దఎత్తున ఆదాయం కోల్పోతోంది. బియ్యం బేడలకు వేలం వేయకపోవడంతో రెండు గదుల్లో నిల్వలు పేరుకుపోయాయి. నాణ్యత దెబ్బతింటోందని భక్తులు ఆందోళన చెందుతున్నారు.
- కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలోని ఆలయాలకు పెద్దఎత్తున మాన్యాలున్నా అందుకనుగుణంగా ఆదాయం లభించడం లేదు. భూముల కౌలు వేలం పాటల్లో పారదర్శకంగా కానరావడం లేదు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి కనీసం మండలానికి ఒక ఈవోను నియమించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

వెండి ఆభరణాలు మాయం

ఆళ్లగడ్డ మండల పరిధిలోని పుట్టాలమ్మ క్షేత్రం నిర్వహణ అధ్వానంగా మారింది. అన్నదాన నిర్వహణ బాధ్యతలను దేవాలయానికి సంబంధం లేని వ్యక్తికి అప్పగించారు. అన్నదాన హుండీకి వచ్చే ఆదాయం వివరాలు వెల్లడించడంలో పారదర్శకత లోపించిందని భక్తులు పేర్కొంటున్నారు. ఈ ఆలయంలోనే ఏడు నెలల కిందట 20 కిలోల వెండి మాయమైంది. చోరీ చేసినవారు సీసీ కెమెరాల ఫుటేజీ లభించకుండా మాయం చేశారు. ఇప్పటివరకు పోలీసులు దొంగలను పట్టుకోలేకపోయారు.

చాగలమర్రి మండలం మద్దూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వెండి ఆభరణాల చోరీ ఘటనలో ఈవో నిర్లక్ష్యం కన్పిస్తోంది. గతంలో ఈవోగా పనిచేసిన నరసయ్య ఉద్యోగ విరమణ పొందిన తర్వాత బాధ్యతలు చేపట్టాల్సిన సాయి జయచంద్రారెడ్డి నెలలు తరబడి స్పందించలేదు. బాధ్యతల స్వీకరణపై నిర్లక్ష్యం వహించడంతోనే చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదీ గ్రామస్థులు గుర్తించడంతోనే స్వామివారి ఆభరణాల స్థానంలో నకిలీవి ఉన్నట్లు తెలిసింది. అంతా జరిగాక తాపీగా పోలీసులకు ఈవో ఫిర్యాదు చేశారు.

డాకటన్ వంతెన ధాం

కొలిమిగుండ్ల మండలంలోని కొలిమిగుండ్ల- కలువటాల గ్రామాల మధ్య డాకటన్ వంతెన శిథిలావస్థకు చేరుకొంది. వర్షాకాలంలో నీరు వెళ్లేందుకు 80 ఏళ్ల క్రితం దీనిని నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదని గ్రామస్థులు చెబుతున్నారు. వంతెనకు రక్షణగోడ లేక గతంలో చాలా ప్రమాద ఘటనలు చోటుచేసుకున్నాయి. అధికారులు తాత్కాలికంగా రాళ్లు పేర్చారు. ఇటీవల వాహనాలు ఢీకొట్టడంతో రాళ్లు కిందపడిపోయాయి. వంతెనపై ఒకే వాహనం వెళ్లేందుకు అవకాశం ఉంది. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని వాహన దారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొలిమిగుండ్ల

మోసపూరిత లింకులను నమ్మొద్దు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : టీ20 ప్రపంచ కప్ క్రికెట్ పోటీల నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. క్రికెట్ పోటీల పట్ల ప్రజలకు ఉండే ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని లైవ్ స్ట్రీమింగ్ పేరుతో సామాజిక మాధ్యమాల ద్వారా నకిలీ లింకులు పంపుతున్నారని తెలిపారు. ఫ్రీలైవ్ మ్యాచ్, వాచ్ ఐపీఎల్ ఫ్రీ, హెచ్‌డీ లైవ్ స్ట్రీమింగ్ వంటి లింకులను పంపుతారన్నారు.

మెరవని శనగ

● ధర లేక అన్నదాత దిగాలు

శనగ పంటను సాగు చేసిన రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. దరలు ఉన్నప్పుడు దిగుబడులు రాక, దిగుబడులు వచ్చినప్పుడు దరలు లేక అల్లాడుతున్నారు. గత రెండేళ్లు వాతావరణం అనుకూలించక పంట దెబ్బతిని దిగుబడులు తగ్గిపోయి నష్టాలపాలయ్యారు. ఈ ఏడు వాతావరణం అనుకూలించడంతో పంట బాగా పండి మంచి దిగుబడులు వస్తున్నాయి. కానీ మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో రైతన్నలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. – న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

1,34,502 ఎకరాల్లో సాగు

రబీ సీజన్‌లో జిల్లాలో అధికంగా సాగయ్యే పంటల్లో శనగ ప్రధానమైంది. ఇందులో అధికంగా జేజీ11 రకం (ఎర్ర శనగలు), కాబూలీ రకం (తెల్ల శనగలు) సాగు చేస్తారు. గతేడాది జిల్లాలో శనగ సాధారణ సాగు విస్తీర్ణం 1,55,507 ఎకరాలు ఉండగా 1,28,137 ఎకరాల్లో సాగు చేశారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 98,632 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా 95,740 ఎకరాల్లో శనగ పంట సాగు చేశారు. ఈ ఏడు జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 1,49,702 ఎకరాలు కాగా 1,34,502 ఎకరాల్లో సాగు చేశారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం లక్ష ఎకరాలు కాగా 98,932 ఎకరాల్లో సాగు చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి - చెన్నకృష్ణారెడ్డి, రైతు, జొలదరాశి

పదెకరాల్లో తెల్లరకం శనగ పంట సాగు చేశా. ఎకరాకు 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కొంతమందికి 10 క్వింటాళ్లు వచ్చాయి. ఆశించిన దిగుబడులు వస్తున్నా మార్కెట్‌లో ధర లేదు. ప్రస్తుతం ఉన్న ధరలకు పెట్టుబడి ఖర్చులు, కౌలు చెల్లింపులకే సరిపోతోంది. కనీస ధర రూ.7,500 ఉంటే రైతులకు గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

వాతావరణం

విత్తన సాగు సమయంలో అధిక వర్షాల కారణంగా ఇబ్బందులు పడ్డారు. మొలకెత్తిన దశలో అధిక వర్షాలతో పంట దెబ్బతినగా కొంతమంది రైతులు మరోసారి విత్తుకున్నారు. మొందా తుపాను ప్రభావం చూపిస్తుందేమో దేవుడి మీద భారమేసి విత్తుకున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంట బాగా పెరిగింది. ప్రస్తుతం పంట చేతికి రావడంతో నూర్పిడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ఎకరాకు 7 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తుండటంతో రైతులు సంతోషిస్తుండగా మరోపక్క మార్కెట్‌లో ధర లేక దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం క్వింటా ఎర్ర శనగలు రూ.5 వేలు, తెల్ల శనగలు రూ.5,400 ఉన్నాయి. గతేడాదీ ఇవే ధరలే కొనసాగగా కొంతమంది పెట్టుబడుల కోసం చేసిన అప్పులు చెల్లించేందుకు దిగుబడులను విక్రయించగా మరికొంతమంది ధరలు పెరుగుతాయనే ఆశతో గోదాముల్లో నిల్వ చేశారు. ఇప్పుడూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. పంట సాగు కోసం ఎకరాకు రూ.20వేలు, కౌలు కోసం ఎకరాకు రూ.20 వేలు అవుతోందని, కనీసం రూ.7 నుంచి రూ.8 వేలు గిట్టుబాటు ధర కల్పిస్తే తమ కష్టాలు తీరుతాయని రైతులు కోరుతున్నారు.

ఉపాధి బాటలో మాధవి ప్రయాణం
కార్యకర్తలే తెదేపాకు అసలైన బలం
6లో..

కేసీకి నీటి విడుదల నిలిపివేత

మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి కేసీకి నీటి విడుదలను ఆదివారం నిలిపివేశారు. ప్రస్తుతం కేసీ కాలువ ఆయకట్టు కింద రబీలో వివిధ పంటలు సాగవుతున్నాయి. వరి, మొక్కజొన్న.. సగభాగం కాపు ప్రారంభ దశలో ఉన్నాయి. సరైన సమయంలో నీరు అందకపోతే నష్టం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కేసీకి నీటి విడుదల చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

స్థానిక పోరు.. సన్నద్ధత జోరు

● ఓటర్ల జాబితా తయారీపై కసరత్తు
● ఈఆర్ఎంఎస్ సాఫ్ట్‌వేర్‌తో విభజన

స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితాను మార్చి 9వ తేదీ నాటికి సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాలుగు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లా, మున్సిపాలిటీ, మండల స్థాయిలో ఓటర్ల జాబితాలను సులువుగా తయారు చేసేందుకు వీలుగా ఎలక్టోరల్ రోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఆర్ఎంఎస్)ను వినియోగించనున్నారు. కలెక్టర్ల ఆధ్వర్యంలోనే అధికారులు జాబితాలు సిద్ధం చేయనున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

70 కొత్త పంచాయతీలు

- స్థానిక సంస్థలకు 2021 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 972 గ్రామ పంచాయతీలు ఉండగా 970 చోట్ల ఎన్నికలు జరిగాయి. ఆదోని మండలంలోని మండగిరి, సాదాపురం పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. వచ్చే ఏప్రిల్ 2 నాటికి సర్పంచుల పాలన ముగియనుంది.
- ఉమ్మడి జిల్లాలో కొత్తగా 70కి పైగా కొత్త పంచాయతీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు.
- ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలకతో పాటు తొమ్మిది మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పాలకవర్గాల గడువు మార్చి 17 నాటికి ముగియనుంది.

ఓటర్లు	కర్నూలు	నంద్యాల
పురుషులు	10,17,074	6,81,581
మహిళలు	10,45,183	7,10,193
ఇతరులు	312	262

వార్డులు.. డివిజన్ల వారీగా

- కేంద్ర ఎన్నికల సంఘం సహకారంతో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలు సేకరించి.. ఈఆర్ఎంఎస్ సర్వర్ల నుంచి జిల్లా, మండల, మున్సిపల్ అధికారుల లాగిన్‌కి డేటా వెళ్లనుంది. వాటి నుంచి పంచాయతీ, పుర, నగరపాలక సంస్థల్లో వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయనున్నారు.
- సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాగానే పంచాయతీ కార్యదర్శులకు కొత్త ఓటర్ల చేరికలు, మృతుల తొలగింపు, మార్పులు, చేర్పులు చేయడానికి అవకాశం కల్పించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక మార్చి 9న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆ తర్వాత తుది ఓటరు జాబితా ప్రచురించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

నత్తనడకన సాగుతున్న సర్

- ఉమ్మడి జిల్లాలో సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం (సర్) గతేడాది సెప్టెంబరు నుంచి జరుగుతోంది. ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. కర్నూలు జిల్లాలో 20,82,374 మంది ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 10,66,705 మంది (51.23 శాతం) మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. నంద్యాల జిల్లాలో 14,02,547కి గాను 7,43,456 మంది (53.01 శాతం) ఓటర్లను మ్యాపింగ్ చేశారు. ఐదు నెలలకు పైగా గడిచిపోయినా సగం మందిని మాత్రమే మ్యాపింగ్ చేయగలిగారు.
- ఈ పరిస్థితుల్లో మిగతా సగం మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేసి మార్చి 9న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించడం కష్టసాధ్యమని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో 2025 జనవరి 1న విడుదలైన తుది ఓటరు జాబితా ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు జాబితా తయారీ సాధ్యమవుతుందని ఎన్నికల విభాగం అధికారులు అభిప్రాయ పడుతున్నారు.



(c) eenadu

శ్రీశైలం ప్రధానవీధిలో భక్తజనం

యాగంటిలో వేంకటేశ్వరస్వామి గుహ వద్ద భక్తుల సందడి

కాల్వబుగ్గలో బుగ్గరామేశ్వరస్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి దంపతులు

యాగంటిలో పూజలందుకున్న ఉమామహేశ్వరుడు

మహానందిలో మయూర వాహనంపై స్వామి అమ్మవారు

ముక్కంటి దర్శనం.. భక్తకోటి పరవశం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శైవక్షేత్రాలు ఆధ్యాత్మిక కాంతులతో శోభిల్లాయి. వేలాదిమంది భక్తులతో ప్రతి ఆలయం ఇల కైలాసాన్ని తలపించింది. శ్రీశైల మహాక్షేత్రంలోని మల్లన్న సన్నిధికి భక్తులు పోటెత్తారు. మహానంది క్షేత్రం, కర్నూలు సమీపంలోని జగన్నాథగట్టుపై ఉన్న రూపాల సంగమేశ్వరస్వామి ఆలయం, ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గలోని రామేశ్వరస్వామి కోవెల, వెల్దుర్తి మండలం బ్రహ్మగుండం, నందవరం మండలం గురజాల రామలింగేశ్వరాలయం, నంద్యాల జిల్లాలోని నవ నంది క్షేత్రాలు, బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం, వెలుగోడు అటవీ పరిధిలోని గుండ్ల బ్రహ్మేశ్వరాలయం, కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం, గడివేముల మండలంలోని దుర్గా భోగేశ్వరాలయం, ఆత్మకూరు మండలం నల్లమల అరణ్యంలోని రుద్రకోటేశ్వర క్షేత్రం, నాగలూటి వీరభద్ర ఆలయం, నందికొట్కూరులోని ఉమామహేశ్వరస్వామి కోవెల భక్తులతో కిటకిటలాడాయి. భక్తజనం ఉపవాస దీక్ష పాటించి శివయ్యకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రంతా జాగరణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. - న్యూస్‌టుడే, బృందం

శివనామ స్మరణలో భక్తులు

ప్రభోత్సవం ముందు ఆలయ కమిటీ ఛైర్మన్ రమేశ్‌నాయుడు పండితులు

సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఊరేగింపులో డప్పు వాయిద్యాల హోరు

బండిఆత్మకూరు: భక్తులతో కళకళలాడుతున్న ఓంకార క్షేత్రం

కాల్వబుగ్గలో క్యూకట్టిన భక్తులు

ఆత్మకూరు : భక్తులతో కిటకిటలాడుతున్న రుద్రకోటేశ్వర క్షేత్రం

మయూర వాహనంపై మహానందీశుడు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ఆదివారం మయూర వాహనంపై కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరుడు విహరించారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల మధు, వేదపండితులు వేదోక్తంగా పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల తిథిలో తరఫున పొరుపత్యేదారు బాలసుబ్రహ్మణ్యం దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. 'అమ్మోరు' ధారావాహిక తారాగణం నేత్రజావేద్, చంద్రప్ప, రోహిత్‌సాహ్నీ, కల్కిరాజా తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు భక్తులకు అత్యవసర వైద్య సేవలందించడం అభినందనీయమని నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ పేర్కొన్నారు. మహానందిలో నంద్యాల సాయిబాలాజీ ఆసుపత్రి అధినేత దస్తగిరి హరినాథరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత అత్యవసర వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

మహానంది క్షేత్రంలో నృత్యం

ఐకానిక్ వంతెనకు మరోసారి టెండర్ల పొడిగింపు

కొల్లాపూర్, న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానిస్తూ సోమశిల వద్ద కృష్ణానదిపై నిర్మించనున్న తీగల వంతెన (ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి)కి మరోసారి టెండర్ల గడువు పొడిగించారు. ఈ ఏడాది మార్చి 3 వరకు టెండర్లు స్వీకరించనున్నట్లు జాతీయ రహదారి అధికారులు ఆదివారం పేర్కొన్నారు. ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ గడువుల మీద గడువులు పెంచుతుండటంతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదు. మొదట్లో 2023-24లో ఏడాది పాటు గడువు పొడిగించారు. తర్వాత 2026 ఫిబ్రవరి 16 వరకు గడువు విధించి టెండర్ల స్వీకరణకు చర్యలు చేపట్టారు. తాజాగా మరోసారి మార్చి 3 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి కొట్ర నుంచి కొల్లాపూర్ సోమశిల వరకు 74 కిలోమీటర్ల మేర 167కె జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

శివ..శివా

ఆలయం తలుపులు మూత వేసిన దృశ్యం

ఆళ్లగడ్డ గ్రామీణం: మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో రద్దీ ఉంటే నల్లగట్ల గ్రామంలో ఆదివారం శివాలయం మూత పడింది. తొమ్మిది దాటినా ఆలయం తలుపులు మూసి ఉండటంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. చాలాసేపటి తర్వాత అర్చకులు వచ్చి తలుపులు తీశారు. ఈ క్రమంలో పూజారి కుమారుడికి గ్రామస్థులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దుర్భాషలాడటంతో ఆగ్రహించిన గ్రామస్థులు అర్చకుడి కుమారుడిపై దాడి చేశారు. దీంతో సదరు పూజారి కుమారుడు ఆలయం తలుపులకు మళ్లీ తాళం వేశాడు. విషయం తెలుసుకున్న ఈవో సాయి జయచంద్రారెడ్డి, ఎస్సై వరప్రసాద్ ఘటనాస్థలికి చేరుకొని గ్రామస్థులు, పూజారి కుమారుడితో మాట్లాడి పరిస్థితి సద్దుమణిగించారు.

ఉపాధి బాటలో మాధవి ప్రయాణం

☛ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న మహిళ

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : కుటుంబాన్ని పోషించే భర్త ప్రమాదానికి గురవడంతో.. ఇంటి నిర్వహణ భారం మాధవిపై పడింది. రోజు కూలీగానో.. దుకాణాల్లో పనులకో వెళ్దామని ప్రయత్నించారు.. పని ప్రదేశాల్లో మహిళల పట్ల చిన్నచూపు చూస్తుండటం చూసి ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఏదైనా స్వయం ఉపాధి చూసుకోవాలని నిర్ణయించుకున్నారు. డ్రైవింగ్ వృత్తిని ఎంచుకున్నారు. నగరంలో ఆటో నడుపుతూ వచ్చే సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రమాదంతో మారిన పరిస్థితి..

కర్నూలు నిర్మల్‌నగర్‌కు చెందిన 23 ఏళ్ల మాధవి తొమ్మిదో తరగతి వరకు చదువుకున్నారు. 2019లో ఈమెకు ప్రవీణ్‌కుమార్‌తో వివాహమైంది. ఆయన బేల్దారి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఏడాది కిందట ఆయన పని ప్రదేశంలో రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. మతిస్థిమితం కోల్పోయి పనికి దూరమయ్యారు. దీంతో కుటుంబ పోషణ కోసం మాధవి తనకు ఇష్టమైన డ్రైవింగ్ వృత్తిని ఎంచుకొని ఆటో డ్రైవర్‌గా మారారు. గతేడాది అక్టోబరులో ఓ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.5 లక్షలకు ఆటోను కొనుగోలు చేశారు. దానిని నడుపుతూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.

సమస్యల స్పీడ్ బ్రేకర్లు

రోజువారీ డీజిల్ ఖర్చు రూ.300 పోగా రూ.400- 500 మిగులుతోందని ఈమె చెబుతున్నారు. నెలకు రూ.10 వేలు కంతు చెల్లించగా మిగిలే రూ.3-4 వేలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నానని మాధవి అంటున్నారు. తమకు సొంత ఇల్లు కూడా లేదంటున్నారు. అత్తమామల పేరుతో ఉన్న ఇంటిని భాగ పరిష్కారాలు చేసినా తమకు ఆస్తి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉస్మానియా కళాశాల సమీపంలోని తమ తల్లిదండ్రుల ఇంట్లో ఈమె భర్తతో కలిసి ఉంటున్నారు. తమకు నివేశన స్థలం కేటాయించి ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

● భర్త, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆటో నడుపుతున్నట్లు చెబుతున్న ఈమె పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులు రాయితీ ఆటో ఇప్పించి ర్యాపిడో డ్రైవర్ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వాహనమిత్ర పథకం కింద ఏటా ఇచ్చే రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలని అధికారులకు విన్నవించారు.

ఆటో నడుపుతున్న మాధవి

మహిళా ప్రయాణికులకు నమ్మకం

మాధవి ఐదు నెలలుగా నగరంలో ఆటో నడుపుతున్నారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు పాతబస్తీ, కొత్త బస్టాండు, రైల్వేస్టేషన్‌తో పాటు వివిధ మార్గాల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. ఆరోగ్య కుదుటపడటంతో ఈమె భర్త వారం రోజులుగా మళ్లీ కూలి పనులకు వెళ్తున్నారు. సాయంత్రం పని నుంచి వచ్చిన భర్తను వెంటబెట్టుకుని 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆటో నడుపుతున్నారు. పురుషులు నడిపే ఆటోల్లో ఒంటరిగా ప్రయాణించాలంటే భయంగా ఉండేదని.. మాధవి ఆటోలో వెళ్తుంటే ధైర్యంగా ఉందని మహిళా ప్రయాణికులు చెబుతున్నారు. కొంతమంది మహిళా ప్రయాణికులు ఆటో అవసరమైతే మాధవికి ఫోన్‌చేసి మరీ పిలిపించుకుంటున్నారు. ఆత్మవిశ్వాసంతో ఆటో నడుపుతున్న మాధవి పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.

కార్యకర్తలే తెదేపాకు అసలైన బలం

మంత్రి ఫరూక్‌ను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

నంద్యాల పట్టణం, నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: తెదేపాకు పార్టీ కార్యకర్తలే అసలైన బలం అని మంత్రి ఎన్ఎండీ.ఫరూక్ పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పునరంకితం కావాలన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడూ వెన్నంటి ఉండి నడిపించిన కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం రూ.6090 కోట్ల భారీ నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆ సంఘం నాయకులు మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను సన్మానించారు. తెదేపా నాయకులు షేక్ మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో స్థానిక మంత్రి కార్యాలయంలో ఈ మేరకు కలిసి సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

బండలాగులు పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార పుణ్యక్షేత్రంలో ఆదివారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తెదేపా మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి, టీజీపీ ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు కంచర్ల మనోహర్ చౌదరిలు ప్రారంభించారు. పోటీల్లో గోస్పాడు మండలం సాంభవరం గ్రామానికి చెందిన రాంపల్లె ప్రభాకర్‌రెడ్డి వృషభాలు 4500 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు అల్లె ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉండవల్లి తాలూకా కంచుపాడు గ్రామానికి చెందిన హేమలత, ఆంజనేయరెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో, బేతంచర్ల గ్రామానికి చెందిన భానుజ వృషభాలు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో మొత్తం 20 జతల వృషభాలు పాల్గొన్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో తాతిరెడ్డి మనీష్‌రెడ్డి, సిద్ధం ప్రతాప్‌రెడ్డి, బండిశ్రీను, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank
నంద్యాల బ్రాంచ్ (1319)
25/516ఎ, శ్రీనివాసనగర్, నంద్యాల, ఏపీ-518501. ఫోన్: 73829 32231

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1. M/s. యూనిక్ అండ్ నైన్ రెస్టారెంట్, ప్రొప్రయిటర్: శ్రీమతి బుర్రా లక్ష్మి సుజాత, రిజిస్టర్డ్ ఆఫీస్ చిరునామా: డి.నెం. 25/687-C, రెవెన్యూ వార్డ్ 25, పద్మావతి నగర్ రోడ్, నంద్యాల-518501. మరియు
రెస్టారెంట్ చిరునామా: యస్‌వై. నెం. 752, మూలసాగరం, నంద్యాల-518501.
2. శ్రీమతి బుర్రా లక్ష్మి సుజాత (ప్రొప్రయిటర్), భర్త: బుర్రా వెంకట రమణ, హెచ్.నెం. 2-428-44, బాలాజీ కాంప్లెక్స్, బాలాజీ కళ్యాణ మండపం, నంద్యాల-518501.
3. శ్రీ బుర్రా వెంకట రమణ (హామీదారు), తండ్రి: లేటు బుర్రా వెంకటేశం, హెచ్.నెం. 2-428-44, బాలాజీ కాంప్లెక్స్, బాలాజీ కళ్యాణ మండపం, నంద్యాల-518501.
4. శ్రీ బుర్రా రామకృష్ణ (హామీదారు), తండ్రి: లేటు బుర్రా వెంకటేశం, హెచ్.నెం. 2-428-44-సి, బాలాజీ కాంప్లెక్స్, బాలాజీ కళ్యాణ మండపం, నంద్యాల-518501.
5. శ్రీమతి రంగ సైదమ్మ (హామీదారు), భర్త: రంగ సుబ్బారాయుడు, తండ్రి: లేటు బుర్రా వెంకటేశం, హెచ్.నెం. 2-428-44-సి, బాలాజీ కాంప్లెక్స్, బాలాజీ కళ్యాణ మండపం, నంద్యాల-518501.

డియర్ సర్/మేడమ్
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, నంద్యాల-I బ్రాంచ్ నుండి M/s. యూనిక్ అండ్ నైన్ రెస్టారెంట్, ప్రొప్రయిటర్: శ్రీమతి బుర్రా లక్ష్మి సుజాత, భర్త: బుర్రా వెంకట రమణ (ఇక్కడ ''ఋణగ్రహీత''గా సూచిస్తారు), 1. శ్రీ బుర్రా వెంకట రమణ, తండ్రి: లేటు బుర్రా వెంకటేశం, 2. శ్రీ బుర్రా రామకృష్ణ, తండ్రి: లేటు బుర్రా వెంకటేశం & 3. శ్రీమతి రంగ సైదమ్మ, భర్త: రంగ సుబ్బారాయుడు (ఇక్కడ ''హామీదారులు''గా సూచిస్తారు) గారు పొందిన లోన్ / ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ప్రస్తుత తేదీ నాటికి బకాయి మొత్తం వడ్డీతో	వడ్డీ రేటు
LOANS TO MSME – SERVICES A/c No. 170009921222	రూ. 1,07,00,000/- తేదీ 14.08.2023	రూ. 87,05,830.16	10.95%
LOANS TO MSME – SERVICES A/c No. 170014733170	రూ. 19,10,000/- తేదీ 26.11.2024	రూ. 16,11,890.18	10.40%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని 05-02-2026 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.1,03,17,720.34/- (అక్షరాల ఒక కోటి మూడు లక్షల పదిహేడు వేల ఏడు వందల ఇరవై రూపాయలు మరియు ముప్పై నాలుగు పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం సందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి
నంద్యాల జిల్లా, నంద్యాల రిజిస్ట్రేషన్ మరియు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, 13వ వీధి, నీలివీధి, నంద్యాల మునిసిపల్ పరిధి, హెచ్.నెంలు. 13/90, 13/95 మరియు 13/95A లో సర్వే నెం. 888/P1 పైకి విస్తీర్ణం: 333.960 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఆస్తి. **హద్దులు: తూర్పు:** బండారు శేషన్న, వెంకట సుబ్బన్న మరియు రహంతుల్లా యొక్క ఇళ్లు, **పడమర:** పబ్లిక్ రాస్తా మరియు కార్పెంటర్ అజీజ్ మరియు పతంగి శేషగిరిరావు యొక్క ఇళ్లు, **ఉత్తరం:** పరమటూరు హుస్సేన్ సాబ్ మరియు ఇతరుల యొక్క ఇళ్లు, **దక్షిణం:** పోలూరు శ్రీనివాసులు మరియు ఇతరుల యొక్క ఇళ్లు.
టైటిల్ హోల్డర్: 1. శ్రీ బుర్రా వెంకట రమణ, తండ్రి: లేటు బుర్రా వెంకటేశం, 2. శ్రీ బుర్రా రామకృష్ణ, తండ్రి: లేటు బుర్రా వెంకటేశం & 3. శ్రీమతి రంగ సైదమ్మ, భర్త: రంగ సుబ్బారాయుడు

తేది: 06.02.2026, ప్రదేశం: నంద్యాల — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ప్రేమ పేరిట మోసం..యువకుడిపై కేసు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసగించిన ఓ యువకుడిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలకు చెందిన యువతి(24) బ్యాంకులో ఉద్యోగం చేస్తూ పంజాగుట్టలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నారు. గత సంవత్సరం వరుణ్ నాగేంద్ర(26) అనే యువకుడు ఇన్‌స్టాలో ఆమెకు పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఎస్సార్‌నగర్‌లోని తన గదికి తీసుకెళ్లి పలుమార్లు తన కోరిక తీర్చుకున్నాడు. ఈ సందర్భంలో బలవంతంగా ఆమె ఫొటోలు, వీడియోలు తీశాడు. కొంత కాలానికి ఆ యువతి గర్భం దాల్చడంతో బలవంతంగా మాత్రలు వేయించాడు. దీంతో బాధితురాలు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా దానికి నాగేంద్ర నిరాకరించాడు. ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఫిర్యాదు చేశారు.

ప్రేమికుల రోజు విషాదం

☛ యువకుడి బలవన్మరణం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ప్రేమికుల రోజు ఆళ్లగడ్డ పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. పొట్టకూటి కోసం రాజస్థాన్ నుంచి పట్టణానికి వలస వచ్చి తోపుడు బండిపై ఐస్‌క్రీమ్ వ్యాపారం చేసుకుంటున్న ఓ యువకుడు శనివారం రాత్రి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సత్యనారాయణ సయామి(25) అనే ఈ యువకుడు పుల్లారెడ్డి వీధిలో అద్దెకుంటున్న ఇంట్లోనే పైకప్పునకు తాడుతో ఉరేసుకున్నారు. రాజస్థాన్‌లో ఒక అమ్మాయితో ప్రేమలో ఉన్నారని, అది విఫలం కావడంతో జీవితంపై విరక్తి చెంది తనువు చాలించినట్లు సమాచారం. ప్రేమికుల రోజే ఇతడు మృతి చెందడం విషాదకరం. పట్టణ పోలీసులు ఆదివారం ఘటనపై కేసు నమోదు చేశారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

కలుగొట్ల(వెల్దుర్తి), న్యూస్‌టుడే: భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకుపాల్పడిన ఘటన వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆకుల నాగశేషు(24)కు నాలుగేళ్ల కిందట చెరుకులపాడు గ్రామానికి చెందిన గిరిజతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు మహేంద్ర ఉన్నాడు. భర్త మద్యానికి బానిస అయ్యాడరు. తాగడం మానుకోవాలని భార్య గిరిజ పలుసార్లు కోరినా మారకపోవడంతో వారంరోజుల కిందట పుట్టింటికి వెళ్లారు. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన నాగశేషు గ్రామ సమీపంలోని సుంకులమ్మ ఆలయం దగ్గర చెట్టుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

గుడిసె దగ్ధం.. వృద్ధురాలికి గాయాలు

కరివేముల (దేవనకొండ) న్యూస్‌టుడే: కరివేముల గ్రామానికి చెందిన వృద్ధురాలు గంగమ్మ గుడిసెలో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఉదయం గ్యాస్ పొయ్యి మీద వంటకు పెట్టి, సామగ్రి కడిగేందుకు ఇంటి బయటకు వెళ్లారు. ఒక్కసారిగా మంటలు గుడిసెకు వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు యత్నించిన గంగమ్మ గాయాలపాలైంది. ఇంట్లోని సామగ్రి, రూ.50 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు కూడా మంటల్లో బూడిదయినట్లు బాధితులు తెలిపారు. మాజీ సర్పంచి గిడ్డయ్యగౌడు, ఆయన సోదరుడు ప్రభాకర్‌గౌడు బాధితురాలి కుమారుడికి రూ.5 వేలు అందజేశారు.

నీట మునిగి బాలుడి మృతి

ఎం.సిద్ధార్థ (పాతచిత్రం)

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలోని గురుసదన్ పక్కన నీటి కుంటలో గల్లంతైన బాలుడు ఎం.సిద్ధార్థ(14) మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. శనివారం రాత్రంతా ఎన్డీఆర్ఎఫ్ పోలీసులు, స్థానిక మత్స్యకార గజ ఈతగాళ్లు ఎంత గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం నీటిలో మృతదేహం బయటకు రావడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కర్నూలు జిల్లా ఆలూరు మండలం తుంబలవీడు గ్రామానికి చెందిన సల్లప్ప తన కుమారుడు సిద్ధార్థతో కలిసి బ్రహ్మోత్సవాలు చూసేందుకు శ్రీశైలం వచ్చాడు. మరోవైపు బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వచ్చిన ఒక భక్తుడి కాలుపై నుంచి నీటి ట్యాంకర్ వెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కాలికి తీవ్రగాయం కావడంతో 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని బుక్కాపురం గ్రామానికి వెళ్లే మెట్ట వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. ఆర్.కొత్తపల్లె గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ(60), బుక్కాపురం గ్రామానికి చెందిన ఈరమ్మ, మధుసుధలు ఆదివారం బేతంచెర్లకు పని నిమిత్తం వచ్చారు. అనంతరం ఆటోలో గ్రామం మెట్ట వద్ద దిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో నాగలక్ష్మమ్మ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు మహిళలకు గాయాలకు గురయ్యారు.

రచయిత శ్రీనివాస్ మృతిపై హత్య కేసు నమోదు

☛ 'పాలేరు'లో కారు మునిగి మృతి చెందిన ఉదంతంలో సోదరుల ఫిర్యాదు మేరకు విచారణ

కూసుమంచి, నందికొట్కూరు న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న యూట్యూబర్, రచయిత, సాహిత్య పరిశోధకుడు బొగ్గుల శ్రీనివాస్(48) మృతి ఘటనపై ఆదివారం హత్య కేసు నమోదైంది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయంలోకి శనివారం ఓ కారు దూసుకెళ్లిన ప్రమాదంలో అందులో ఉన్న శ్రీనివాస్ నీట మునిగి మృతిచెందాడు. ప్రమాద సమయంలో వాహనం నడుపుతున్న వ్యక్తి ఒకరు కారులో నుంచి కిందపడిపోయి అక్కడి నుంచి పరారైనట్లు మత్స్యకారులు గుర్తించారు. వారంతా వచ్చి కారును వెలికితీయగా వెనక సీట్లో శ్రీనివాస్ మృతదేహం లభ్యమైంది. పోలీసులు, మృతదేహాన్ని నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రి శవాగారంలో భద్రపరిచారు. ఈ ఘటనపై మృతుని సోదరుడు బొగ్గుల అబ్బులయ్య ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలోని అల్లూరుకు చెందిన బొగ్గుల శ్రీనివాస్(48) 20 ఏళ్లుగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. అవివాహితుడైన ఇతను యూట్యూబర్‌గా పనిచేస్తున్నారు. పాలేరు జలాశయం వద్ద తన సోదరుడు శ్రీనివాస్ మృతి చెందిన సమాచారం అతని స్నేహితుల ద్వారా తెలిసిందని, సోదరులు సుధాకర్, సాంబశివుడుతో కలిసి ఆదివారం ఘటనా స్థలానికి వచ్చి ఆరా తీసినట్టు అబ్బులయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. కారు నీటిలో పడే సమయంలో ఓ వ్యక్తి దూకి పారిపోయినట్లు తెల్సిందని, నేలకొండపల్లి ఆస్పత్రిలో ఉన్న తమ తమ్ముడి మృతదేహాన్ని పరిశీలించగా తలకు, ముఖంపై, ఎడమ చేతిపైనా గాయాలు ఉన్నట్లు గుర్తించామని ఫిర్యాదులో పేర్కొన్నారు. సోదరుని మృతిపై అనుమానాలున్నాయని వివరించారు.

వాహనం నడిపిన వ్యక్తి ఎవరు?

శ్రీనివాస్ సోదరుల ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసిన పోలీసులు శవపరీక్ష అనంతరం వారికి మృతదేహాన్ని అప్పగించారు. కారు నడిపిన వ్యక్తి సంఘటన స్థలం నుంచి పరారవడంతో అతను ఎవరనే విషయమై ఆరా తీస్తున్నారు. మృతుని స్నేహితుడు, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని పాకాలపాడుకు చెందిన వేణుమాధవరెడ్డికి చెందిన కారు (ఏపీ16 డీపీ 2345- కేయూవీ, కె8)గా గుర్తించిన పోలీసులు అతని ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి ఉండటంతో ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. కారు నడిపిన వ్యక్తి అతనేనా, లేక డ్రైవర్ ఉన్నాడా? అనే విషయమై స్పష్టత లభించలేదు. వాహనం ఎటునుంచి ఎటు వెళ్తున్నదీ తెలియలేదు. ఘటనపై విచారణ చేపట్టినట్టు, వాహన యజమాని, డ్రైవింగ్ చేసిన వ్యక్తి ఆచూకీ కోసం ఓ బృందాన్ని ఏర్పాటు చేశామని కూసుమంచి సీఐ సంజీవ చెప్పారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును.(రిటైర్డ్ పోలీస్‌డిపార్ట్మెంట్) గోల్డెన్‌ట్రేడింగ్ కం. ✆ 73821 14647.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి 10 మంది మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్ లీడర్స్, టెలికాలర్ కావలెను. తేజేశ్వర్ రెడ్డి సెల్: 62811 96419, 94941 91951.

JOBS

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18k to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499.

కోడుమూరులోని ప్రముఖ సినిమా థియేటర్ నందు పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ సూపర్వైజర్ కావలెను. 12 గంటల డ్యూటీ, 12,000 జీతం. సంప్రదించండి: 91829 64173.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

మహానందిలో ఘనంగా మహారుద్రాభిషేకం

స్వామి అమ్మవార్ల ప్రత్యేక పూజలో పాల్గొన్న అధికారులు, దాతలు, పండితులు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో ఆదివారం రాత్రి మహాలింగోద్భవ, మహారుద్రాభిషేకం కార్యక్రమాన్ని పండితులు రవిశంకరఅవధాని, ప్రధానార్చకులు అర్జున శర్మల సారథ్యంలో వేదోక్తంగా నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దొర్నిపాడు మండలం గుండుపాపల, శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామాలకు చెందిన వారు ఇరువైపులా పెళ్లిపెద్దలుగా పాల్గొని నిశ్చితార్థాన్ని పూర్తిచేశారు. నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్, దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితోపాటు భక్తులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానించిన కాళికాంబ ఆలయ పాలకవర్గం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల కాళికాంబ చంద్రశేఖర దేవస్థానం నూతన కార్యవర్గ సభ్యులు మంత్రి ఎన్‌ఎండీ.ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఛైర్మన్‌గా నియమితులైన సుబ్బలక్ష్మయ్య, సభ్యులు వసుంధర దేవి, సుబ్రహ్మణంలు ఆదివారం స్థానిక మంత్రి కార్యాలయంలో కలిసి సన్మానించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

మిడుతూరు: ?: మండలంలోని కడుమూరులోని దర్గా వద్ద చెత్తాచెదారంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉంది. దర్గా ముందు పరిశుభ్రంగా ఉంచాలి. **- సుధాకర్, గ్రామస్థుడు, కడుమూరు.**

✔: దర్గా ముందు ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించే చర్యలు తీసుకుంటాం. **- కళ్యాన్ సింగ్, గ్రామ కార్యదర్శి, కడుమూరు.**

వసతిగృహ నిర్మాణానికి రూ.2.11 లక్షల విరాళం



ఆలయ సిబ్బందికి నగదు విరాళాన్ని అందిస్తున్న భక్తులు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పరిధిలోని వసతిగృహ నిర్మాణానికి భక్తులు రూ. 2.11 లక్షలు విరాళంగా అందజేసినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. బనగానపల్లె పట్టణం మంగళవారం వీధికి చెందిన చిన్ననాగరాజు, లక్ష్మీ సరస్వతి దంపతుల కుమారుడు సురేంద్రబాబు, కోడలు లావణ్య రూ. 1,11,116 నగదు, నంద్యాల పట్టణం సంజీవనగర్‌కు చెందిన మద్దాల యుగంధర్, ఉమ దంపతుల కుమారుడు, కుమార్తె గోవిందు, తులసి రూ. 1 లక్ష నగదును విరాళంగా ఆలయ సిబ్బందికి ఆదివారం అందజేశారు. స్వామి వారిని దర్శించుకుని పాలాభిషేకం, అర్చన తదితర పూజలు చేసినట్లు ఈవో పేర్కొన్నారు.

మల్లన్న సన్నిధిలో శబరి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ మహాద్వారం వద్ద దేవస్థానం ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, సభ్యులు, ఈవో ఎం. శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె శ్రీస్వామి అమ్మవార్ల అలంకార దర్శనం చేసుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆమెకు అర్చకులు వేదాశీర్వచనాలు పలికారు.

నిబంధనలకు పొగబట్టీ

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఇటుకల బట్టీల నిర్వాహకులు నిబంధనలకు పొగ పెడుతున్నారు. జనావాసాల మధ్యలో, రహదారుల పక్కనే బట్టీలను నెలకొల్పి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మట్టి తవ్వాలన్నా.. బట్టీలు నిర్వహించాలన్నా పలు శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. పట్టణంలోని పొన్నాపురం కాలనీ, అయ్యలూరు మెట్ట, పెద్దకొట్టాల, గాజులపల్లె రోడ్డులో సుమారు 100 పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. అనుమతులు తీసుకోకుండా నంద్యాల పట్టణంలో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేస్తున్నారు. వీటి నుంచి వచ్చే పొగతో స్థానిక ప్రజలు, సమీపంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, ఈ దారుల గుండా రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలు పాటించని ఇటుక బట్టీల నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పొన్నాపురం కాలనీలో ఇటుకల బట్టీల నుంచి వస్తున్న పొగ

రహదారుల పక్కనే..

ఇటుకల బట్టీలు రహదారుల పక్కనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు, ఆ దారుల గుండా రాకపోకలు సాగించడానికి కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటుకలు కాల్చే సమయంలో వెలువడే పొగ, కాల్చిన తర్వాత రేగుతున్న బూడిదతో రోగాలబారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇటుకలు కాల్చడానికి ఉపయోగించే పొట్టును రహదారుల పక్కనే వేస్తున్నారు. గాలి వీచినప్పుడు ఇవి రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారుల కళ్లలో పడి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తీవ్రమైన పొగ వ్యాపించి ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి.

★ ఇటుకల తయారీ పొగతో ప్రజలకు ఇబ్బందులు

మార్గదర్శకాలు ఇవీ..

- ఇటుకల బట్టీల నిర్వహణపై పర్యావరణ శాఖ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. జనావాసాలకు కిలోమీటరు మేర దూరం ఉండాలి. రెండు బట్టీల మధ్య దూరం కి.మీ. మేర ఉండాలి.
- బట్టీలన్నీ ఒక చోట ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతంలో వాయు కాలుష్యం పెరిగే ప్రమాదం ఉన్నందున ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలి. కానీ నంద్యాలలో ఒకే చోట 10 నుంచి 20 బట్టీలు ఏర్పాటు చేశారు.
- వ్యవసాయ భూములను వ్యవసాయేతర పనులకు ఉపయోగించాలంటే రెవెన్యూ అధికారులకు నాలా రుసుం చెల్లించాలి. అనంతరం గ్రామ పంచాయతీ, కాలుష్య నియంత్రణ మండలి ఆమోదం పొందాలి.
- కొంత మంది వ్యాపారులు భూములను కౌలుకు తీసుకొని బట్టీలు నిర్వహిస్తున్నారు. అక్కడున్న బోర్ల నుంచి నీటిని వాడుతున్నారు. వ్యవసాయానికి ఇచ్చే ఉచిత విద్యుత్తును వినియోగిస్తున్నారు.
- పలు బట్టీల్లో బాల కార్మికులు పని చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల వలస కార్మికులకు పనిలో పెట్టుకొని తక్కువ వేతనం ఇచ్చి కనీస వసతులు కల్పించడం లేదు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

స్టేట్ ఛాంపియన్‌షిప్ కప్పును టీజీ వెంకటేష్ చేతుల మీదుగా అందుకుంటున్న విద్యార్థులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు విజ్‌డమ్ పాఠశాల విద్యార్థులు స్టేట్ ఛాంపియన్ షిప్ కప్పును దక్కించుకున్నట్లు పాఠశాల ఏవో మౌలాలి తెలిపారు. ఈ నెల 13, 14, 15వ తేదీలలో ఏపీ అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జౌట్ డోర్ స్టేడియంలో మూడవ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ కేటగిరీలకు చెందిన విద్యార్థులు బంగారు, సిల్వర్, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. అన్ని కేటగిరీలలో విద్యార్థులు ప్రతిభ చూపడంతో ఛాంపియన్‌షిప్ కప్పును దక్కించుకున్నారు. ఈ కప్పును మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు.

పరమశివా.. పాహిమాం

★ శివనామ స్మరణలతో మార్మోగిన శైవక్షేత్రాలు

ప్రత్యేక అలంకరణలో సోమనందీశ్వర స్వామి అమ్మవారు

ప్రత్యేక అలంకరణలో నాగలింగేశ్వర స్వామి

మహానందిలో విద్యుత్తు వెలుగులు

భోగేశ్వరంలో పూజలు చేస్తున్న జిల్లా జడ్జి అమ్మన్నరాజ

హర హర మహాదేవ శంభో శంకర.. ఓం నమశివాయ అన్న శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే భక్తులు శివయ్య సన్నిధికి తరలివచ్చారు. నంద్యాల పట్టణంలోని ప్రథమ నంది, నాగనంది, సోమనంది, మల్లికార్జునస్వామి ఆలయం, కాశికాంబ చంద్రశేఖరస్వామి ఆలయం, అమ్మ స్ఫటిక ఆలయం, నాగలింగేశ్వర ఆలయం, సంజీవనగర్‌లో వెలసిన కోదండ రామాలయం, కొలనుభారతి, సంగమేశ్వరం క్షేత్రాలు, నల్లమలలోని రుద్రకోటేశ్వర, నందీశ్వరాలయం, పాణ్యంలోని పాతకోటేశ్వరస్వామి భక్తులతో కిక్కిరిసింది. ఆలయాల నిర్వాహకులు ఆధ్వర్యంలో ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శివాలయాల్లో రాత్రంతా భక్తులు జాగారం చేశారు. లింగోద్భవ పూజల అనంతరం శివపార్వతుల కళ్యాణోత్సవాలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్, గడివేముల, కొత్తపల్లి, ఆత్మకూరు, నందికొట్కూరు గ్రామీణం

శంకర మల్లేశ్వరస్వామి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

ప్రభల ర్యాలీగా వెళ్తున్న భక్తులు

భోగేశ్వరంలో దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

సంజీవనగర్‌లో రామాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

శివనంది క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న తాతిరెడ్డి తులసిరెడ్డి

దేవస్థానం అతిథిగృహంలో ఎంపీ శబరితో దేవస్థానం ఛైర్మన్ రమేష్‌నాయుడు, సభ్యులు

భక్తులతో కిక్కిరిసిన నందీశ్వరాలయం

బస్సు ఎక్కకుండా అడ్డుకున్న కండక్టర్

బస్సు ఎక్కకుండా చెయ్యి అడ్డుపెట్టిన మహిళా కండక్టర్

నందికొట్కూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా శివాలయాల దర్శనం, జాగరణకు వెళ్లే భక్తుల వల్ల ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఆత్మకూరు డిపోనకు చెందిన బస్సు ఆత్మకూరు నుంచి కర్నూలు వెళుతూ నందికొట్కూరు వద్ద నిలిచింది. ఆ బస్సు ఎక్కేందుకు ప్రయాణికులు గుమికూడారు. బస్సు కండక్టర్ ప్రయాణికులు బస్సు ఎక్కకుండా ఫుట్‌బోర్డుపై అడ్డుగా నిలబడింది. కొందరు ప్రయాణికులు బలవంతంగా ఎక్కడంతో డ్రైవర్ బస్సు ఆపి దిగిపోయారు. ప్రయాణికులు దిగాలని కండక్టర్ కూడా బస్సు నుంచి దిగిపోయారు. దీంతో కొంత మంది ప్రయాణికులు బస్సు దిగారు. ఎవరూ ఎక్కకుండా కండక్టర్ ఫుట్ బోర్డుపై నిలబడ్డారు. డ్రైవర్ బస్సు స్టార్టు చేసుకుని బయలుదేరారు. ఆత్మకూరు డిపోనకు చెందిన బస్సు డ్రైవర్, కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.

మహానంది గ్రామోత్సవంలో అమ్మోరు ధారావాహిక కథానాయికలు నేత్రజాదవ్, చరిష్మా శ్రీకర్, హీరో రోహిత్‌సాహ్నీ, విలన్ కల్కిరాజా, స్క్రీన్‌ప్లే రచయిత ప్రజాప్రభాకర్

పైకప్పు లేక.. ప్రమాదకరంగా కాలువ

నంద్యాల పట్టణంలోని రైతునగర్ సర్వీసు రోడ్డు నుంచి హైవేకు వెళ్లే దారిలో మురికి కాలువపై పైకప్పు లేకపోవడంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిలో ఎదురెదురుగా వచ్చినప్పుడు అదుపు తప్పి కాలువలో పడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి మురికి కాలువపై పైకప్పు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

దెబ్బతిన్న కాలిబాటలు.. పాదచారులకు ఇబ్బందులు

నంద్యాల పట్టణం చామకాల్వ కూడలి సమీపంలో చామకాల్వ వంతెన నిర్మించారు. పాదచారులు నడవడానికి వంతెనకు ఇరువైపులా కాలిబాటలు ఏర్పాటు చేశారు. చాలాకాలంగా కాలిబాటలు పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. పాదచారులు వీటిపై నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఏర్పాటు చేసిన రైలింగ్ సిమెంటు దిమ్మెలు ధ్వంసమయ్యాయి. కొత్తవి ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

కాలువపై నియంత్రిక.. మురుగు పారేదెలా

నంద్యాల పట్టణంలోని బొల్లెద్దుల వీధిలో విద్యుత్తు నియంత్రికను కాలువపై ఏర్పాటు చేశారు. కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు నీరు ప్రవహించకుండా దుర్వాసన, దోమలకు నిలయంగా మారింది. దీంతో స్థానికులు, ఈ దారి గుండా ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని కాలువను శుభ్రం చేయడంతో పాటు, నియంత్రికను మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల పురపాలకం

అక్షరం చెదిరి.. అవస్థలు మిగిలి

సుదూర ప్రాంతాల నుంచి యాత్రికులు మహానంది, అహోబిలం, యాగంటి, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరికి మార్గదర్శనం చేయడానికి నంద్యాల మండలం అయ్యలూరుమెట్ట వద్ద ఎత్తైన నామఫలకాలు ఏర్పాటు చేశారు. అందులో అక్షరాలు, సూచికలు చెదిరిపోయాయి. ప్రయాణికులు ఎటువెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కొత్త మార్గదర్శన సూచికలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మహానంది

ప్రమాదానికి కర్ర సంచులు

పైపులైన్ మరమ్మతు అనంతరం పురపాలక సిబ్బంది ఓ కర్రకు సిమెంట్ సంచులను ఏర్పాటు చేసి ప్రమాద సూచికను ఏర్పాటు చేశారు. పైపులైన్ మరమ్మతులకు గురైన ప్రాంతంలో రహదారి గోతులుగా ఉంది. ఈ రహదారిలో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. నేడు వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం కూడా ఉంది. మరమ్మతులు రథోత్సవానికి అడ్డుకానున్నాయి. పురపాలక సిబ్బంది స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నందికొట్కూరు

ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఏపీఆర్ జేసీ, పాలిటెక్నిక్, అగ్రిసెట్ ప్రవేశ పరీక్షలకు అభయ, నిస్వార్థ ఫౌండేషన్ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ వెంకట్, జిల్లా సూపర్ 60 కోఆర్డినేటర్‌లు చంద్రశేఖర శర్మ, మల్లారెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాలోని పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్జీవోస్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఆదివారం సూపర్ 60 పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 102 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అనంతపురంలో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ, మెటీరియల్ ఇచ్చి భోజనం వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహుడు, భాస్కర్, రామకృష్ణ, వేణునాథ్, సతీష్, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడ లేక.. నిర్మాణాలు కానరాక

★ బస్సు షెల్టర్లు తొలగించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పురపాలక పరిధిలో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేందుకు బస్సు షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణాలు చేస్తున్నారు. పగిడ్యాల, ఆత్మకూరు వైపు వెళ్లే ప్రయాణికుల కోసం గతంలో షెల్టర్లు ఉండేవి. ప్రస్తుతం అవి కనుమరుగు కావడంతో ప్రయాణికులు రోడ్డుపైనే ఎదురుచూడాల్సి వస్తోంది.

- నందికొట్కూరు పట్టణానికి వివిధ పనుల కోసం మిడుతూరు, గడివేముల, జూపాడుబంగ్లా, పాములపాడు, పగిడ్యాల, ర్యాలంపాడు(తెలంగాణ), గార్గేయపురం నుంచి వచ్చి పనులు చూసుకుని వెళ్తుంటారు. ప్రయాణికులకు నీడ కోసం ఆయా ప్రాంతాల్లో దాతలు బస్సు షెల్టర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి పూర్తిగా కనుమరుగవుతున్నాయి.

బస్సు షెల్టర్ లేక ఎండలో నిలుచున్న ప్రయాణికులు

- పగిడ్యాల వైపు వెళ్లే ప్రయాణికుల కోసం బస్సు షెల్టరు ఉండేది. ఆ ప్రాంతంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులకు నిలువ నీడ లేకుండా పోయింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన వైకాపా నాయకులు చేయలేదు. రెండు మార్గాల్లో ప్రయాణికులకు నిలువ నీడ లేక ఎండలో, వర్షంలో నిలుచుని ప్రయాణం చేస్తున్నారు.
- ఆత్మకూరు వైపు వెళ్లే ప్రయాణికుల కోసం బాలకృష్ణ ఫ్యాన్సు బస్సు షెల్టరును ఏర్పాటు చేశారు. కేజీ రహదారి విస్తరణలో భాగంగా తొలగించారు. దానిని పునర్నిర్మాణం చేయాల్సిన అధికారులు, పాలకవర్గం పట్టించుకోలేదు.
- అల్లూరు రహదారిలో బస్సు షెల్టర్ నిర్మాణం లేదు. పట్టణంలో మిడుతూరు రహదారిలో మాత్రమే బస్సు షెల్టర్ ఉంది. మిగతా ప్రాంతంలో ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్లు నిర్మాణం చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బండలాగుడు పోటీల్లో రాయవరం ప్రథమ స్థానం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణంలో నిర్వహించిన బండలాగుడు పోటీలో రాయవరం వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన, శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 14 జతల ఎద్దులు పాల్గొన్నాయి. రాయవరం వృషభాలు ప్రథమ స్థానంలో నిలువగా, పిన్నాపురం ద్వితీయ స్థానంలో నిలిచాయి. చెర్లగార్లపాడు వృషభాలు తృతీయం, కొత్తపల్లి(కోడుమూరు) నాలుగోస్థానం, పంచలింగాల ఐదో స్థానం, కొత్తకోట ఆరోస్థానం, నూతనపల్లి ఏడో స్థానం, పడిగ్యాల ఎనిమిదో స్థానం, కంబాలపాడు తొమ్మిదో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన వారికి నగదు పారితోషకం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఎన్నికలు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని, ప్రజలకు నేరుగా సేవ చేసే వేదిక అని ఎస్‌డీపీఐ జాతీయ కమిటీ సభ్యులు జహీర్ అబ్బాస్, రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ తాహెర్ అన్నారు. పట్టణంలో ఆదివారం స్థానిక సంస్థల నేపథ్యంలో ఎస్‌డీపీఐ నాయకులు అభ్యర్థుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌డీపీఐ పార్టీ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు హుస్సేన్ పీరాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజాస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పతకాల కిక్

★ తైక్వాండోలో రాణిస్తున్న అకిరానందన్

సాధించిన పతకంతో అకిరానందన్

నంద్యాల గాంధీ చౌక్, న్యూస్‌టుడే: క్రీడల్లో రాణించాలంటే అంకితభావం, క్రమశిక్షణ ఎంతో అవసరం. జాతీయస్థాయిలో రాణించాలంటే శ్రమ, పట్టుదల, కుటుంబసభ్యుల ప్రోత్సాహం, కోచ్‌ల సహకారం ఉండాలి. గతంలో తైక్వాండో క్రీడకు అంతగా ఆదరణ లేదు. ప్రస్తుతం క్రీడా స్ఫూర్తి పెరిగింది. పట్టుదల, కష్టం తోడైతే అనుకున్నది సాధించవచ్చని నిరూపిస్తున్నారు చిన్నారులు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ఇష్టమైన తైక్వాండోలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. నంద్యాల పట్టణం పెద్దబండ వీధికి చెందిన నాగభూషణం, పక్కీరమ్మ దంపతుల కుమారుడు అకిరానందన్.. 7వ తరగతి చదువుతున్నాడు. ఆటలంటే మక్కువ. గత మూడేళ్ల నుంచి శిక్షకుడు బిలాల్‌బాషా వద్ద తైక్వాండోలో శిక్షణ తీసుకుంటూ జాతీయస్థాయిలో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. రోజు మూడు గంటల పాటు సాధన చేస్తూ విజయానికి అవసరమైన నైపుణ్యాలను పెంచుకుంటూ ప్రత్యేకతను చాటుతున్నాడు.

సాధించిన విజయాలు

- 2022 జులైలో ఆళ్లగడ్డలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలో బంగారు పతకం.
- 2023 జూన్‌లో నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి ఓపెన్ పోటీల్లో బంగారు పతకం.
- 2023 జులైలో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ పోటీల్లో రజతం.
- 2024 నంద్యాలలో జరిగిన అసోసియేషన్ మీట్ జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం.
- 2024 అక్టోబర్‌లో నంద్యాలలో ఎస్‌జీఎఫ్ పోటీల్లో జిల్లా స్థాయిలో బంగారు పతకం.
- 2025 జనవరిలో కాకినాడలో జరిగిన అసోసియేషన్ మీట్ రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం.
- 2025 జులైలో విజయవాడలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు.
- 2025 కర్నూలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని వెండి పతకం.

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలి

డోన్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు అందరు కష్టప డాలని నంద్యాల జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు ఉన్నిగొర్ల జనార్దన్ అన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర ఈనెల 18వ తేదీన నంద్యాల జిల్లాలో కొనసాగుతుంద న్నారు. ఉదయం కానాలపల్లెలో రచ్చబండ కార్య క్రమం, సాయంత్రం శిరివెళ్ల గ్రామంలో పరిరక్షణ యాత్ర చేపడతారన్నారు. పేదల పొట్ట కొడుతున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఉద్యమ రూపంలో పోరాటం చేసి ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ యాత్రకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎ త్తున తరలిరావాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశే ఖర్, నాయకులు గోపినాథ్, మధుసూద న్‌రెడ్డి, పఠాన్ మహమ్మద్‌హుసేన్, గిడ్డయ్య, నాగన్న, రంగస్వామి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు ప్రజలకు విజ్ఞానాన్ని అందించే భాండాగారాలని గ్రంథాలయ అధి కారిణి సుజాత పేర్కొన్నారు. గ్రంథాలయాలను చిన్నా రులు, విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసు కోవాలని ఆమె పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో పుస్తకపఠనం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతి రోజూ పుస్తకాలను చదివించడం, విద్యా నైపుణ్యాలపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను తల్లి దండ్రులు గ్రంథాలయానికి పంపించాలని కోరారు.

కాలనీలో జరుగుతున్న నూతన వీధి దీపాల ఏర్పాట్లను సర్పంచి ఆదివారం పరిశీలించారు. శివరాత్రి పురస్కరిం చుకుని గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టామని, రాత్రి సమయాల్లో దోమలతో ఇబ్బందులు తలెత్తకుండా ఫాగింగ్ పనులు చేపట్టినట్లు సర్పంచి తెలిపారు.

రహదారి పనులు ప్రారంభం

అవుకు, న్యూస్‌టుడే: అవుకులోని రెండు ప్రధాన వీధుల్లో సీసీ రహదారు నిర్మించనున్నారు. ఈ మేరకు గిరిజన సహకార సంఘం డైరెక్టర్ అరుణ్ నాయక్ ఆదివారం భూమిపూజ చేశారు. అవుకులోని రాయలసీమ గ్రైన్ మిల్లు నుంచి కోట గోడ వరకు ఒకటి, శివరామరావు కాలనీ నుంచి కొత్తకాలువ వరకు మరొక దారి నిర్మించనున్నారని ఆయన తెలి పారు. రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో రూ.78 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రమణానాయక్, తిక్కన్న, జగన్, శివ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

వీరారెడ్డిపల్లె (శిరివెళ్ల), న్యూస్‌టుడే: సకాలంలో ప్రజలు పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని వీరారెడ్డిపల్లె సర్పంచి మందాల రాధికారెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో పలు

17న నూర్‌షావలి ఉరుసు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని నూర్‌షావలి దర్గాలో ఈనెల 17న ఉరుసు భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఏటా శివరాత్రి పండగ అనంతరం నూర్‌షావలి దర్గాలో ఉరుసు వేడుకలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 16న రాత్రి గంధం, మరుసటిరోజు ఉరుసు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దర్గాను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

ప్లాస్టిక్ నిషేధం.. పత్రాలకే పరిమితం

● డోన్‌లో పెరుగుతున్న వినియోగం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వినియోగంతో పెను ముప్పు ఉన్నా వినియోగదారులు మాత్రం వాటి వినియోగాన్ని మానడంలేదు. పట్టణంలో నిషేధం పత్రాలకే పరిమితమైంది. ప్లాస్టిక్‌ను నివారించి పర్యావ రణ పరిరక్షణకు కృషి చేస్తామని, ఎక్కడైనా ప్లాస్టిక్ కన్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పురపా లక పాలకులు, అధికారులు చెబుతున్నారు. ఆమలులో మాత్రం విఫలమవుతున్నారు. తూతూమంత్రంగా దాడులు చేస్తున్నా ప్రయోజనం కన్పించడం లేదు.

దాడులు, జరిమానాలు ఇలా..

★ 2023లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 50 కేజీల ప్లాస్టిక్ కవ ర్లను సీజ్ చేసి, 15 దుకాణ దారులకు రూ.2,500 వరకు జరిమానా విధించారు.

★ 2024లో ఆరు సార్లు దుకాణాల్లో సిబ్బంది దాడులు నిర్వహించి రూ.15 వేల వరకు జరిమానా విధించారు.

★ 2025లో దుకాణాల్లో సచి వాలయాల సిబ్బంది 12 సార్లు దాడులు చేసి 37 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని, రూ. 47వేల వరకు జరిమానా విధించారు. ఈ ఏడాది ప్లాస్టిక్‌పై దాడులు ఊసే లేకుండా పోయింది.

★ డోన్ పట్టణంలో 32 వార్డు లకు గాను 75 వేల వరకు జనాభా నివసిస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో మూడు వేలకుపైగా దుకాణాలు ఉన్నాయి. పట్టణంలోని పాతబస్టాండు, ఉపరితల వంతెన, కూరగాయల మార్కెట్, పూలమార్కెట్, కిరాణ దుకా ణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద ప్లాస్టిక్ కవర్ల వాడకం కన్పిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదనే నిబంధన ఉన్నా వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా విక్రయాలు నిర్వహి స్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారు.

మున్సిపల్ అధికారుల తనిఖీలు శూన్యం

వ్యాపారులు ఇచ్చే మామూళ్లకు పురపా లక అధికారులు తలొగ్గుతున్నారు. నేతల అండదండలతో అధికారులు దాడులు చేయడం లేదని ప్రజాసం ఘాలు, పర్యావరణ ప్రేమికులు ఆరోపి స్తున్నారు.

★ డోన్ మున్సిపాలిటీలో 2022లో ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు కౌన్సిల్ సభ్యులు తీర్మానించారు. పలుమార్లు సచివాలయం సిబ్బందితో, వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు చేసినప్పటికీ అవేమీ పట్టవన్న ట్లుగా ప్లాస్టిక్ కవర్లలో వస్తువులు వేసి వినియోగదారులకు ఇస్తుండటం గమ నార్హం. ఈ ఏడాదిలో ప్లాస్టిక్‌పై దాడుల ఊసే లేకుండా పోయింది.

★ పురపాలక పరిధిలోని 32 వార్డుల్లో సేకరించిన చెత్తాచెదారం రోజూ 29 మెట్రిక్ టన్నుల వరకు చెత్త ఉత్పత్తి కాగా, 3 మెట్రిక్ టన్నుల వరకు బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ పోగవుతోంది. ఇందులో నాలుగు మెట్రిక్ టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నట్లు, 3 శాతం మురుగు కాల్వల ద్వారా చేరుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మహదేవపురం గ్రామం లోని సంతమార్కెట్‌లో అపరిశుభ్రత తొలగించాలి. - జూలాలయ్య, గ్రామస్థుడు. ✔: అపరిశుభ్రతను తొలగిం చేందుకు చర్యలు తీసుకుంటాం. - రమణయ్య, సర్పంచి.

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోటకందుకూరు గ్రామం ఎస్సీ కాలనీలో దోమల బెడద అధికంగా ఉంది. - ఓబులేసు, కోటకందుకూరు ✔: దోమల నివారణ మందులు చల్లిస్తాం. - నూర్జహాన్, ఎంపీడీవో.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ?: స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వెనుక వీధిలో వారం రోజుల నుంచి వీధి దీపం వెలగడం లేదు. - రాముడు, స్థానికుడు. ✔: వీధి దీపం ఏర్పాటు చేయిస్తాం. - ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.

అవుకు, న్యూస్‌టుడే: ?: అవుకులో పారిశుద్ధ్యం లోపించి దోమలు ఎక్కువయ్యాయి. రాత్రి వేళ అవస్థలు పడుతున్నాం. - రవీంద్ర, అవుకు. ✔: దోమల నివారణ చర్యల్లో భాగంగా ఫాగింగ్ చేపడతాం. - హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, అవుకు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: పాతపేటలో లేబర్ కార్యాలయం వీధిలో కాల్వ లేక మురుగు ప్రవహించే దుకు వీలు లేకుండా పోయింది. రహదారి అపరిశుభ్రంగా మారి రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. - సుంకన్న, పాతపేట. ✔: నిధులు మంజూరయ్యాక మురుగు కాల్వను నిర్మించేందుకు కృషి చేస్తాం. - సురేష్, మున్సిపల్ ఏఈ. ?: కొత్త ఇందిరానగర్‌లో ప్రధాన రహదారి పక్కన మూడు రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ ఇబ్బందిగా ఉంది. వీధిలైట్ల సమస్య పరిష్కరించాలి. - మాధవి, కొత్త ఇందిరానగర్. ✔: పరిశీలించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసు కుంటాం. - సురేష్, మున్సిపల్ ఏఈ.

సంజామల, న్యూస్‌టుడే: ?: గ్రామంలోని ఏళ్లనాటి దిగుడు బావి రక్షణ గోడ కూలి ప్రమాదాలకు నిలయంగా మారింది. - వెంకటేశ్వర్లు, ముదిగేడు. ✔: రక్షణగోడ నిర్మించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటాం. - సాల్మన్, ఎంపీడీవో, సంజామల

వెలగని విద్యుత్తు దీపాలు.. కారుచీకట్లు

డోన్ పురపాలక సంఘం పరిధిలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా రూ.30 లక్షల ఖర్చుతో విద్యుత్తు స్తంభాలకు దీపాలను అమర్చారు. కొన్ని రోజు లుగా పది దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో చీక టిమయంగా ఉండటంతో ఆ దారిలో వెళ్లే జనం తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. కొత్త దీపాల కోసం ప్రతిపాద నలు పంపించినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. త్వరితగతిన దీపాలను తెప్పించి ఏర్పాటు చేయాలని పుర ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

కేసీ కట్ట అధ్వానం.. అవస్థల పయనం



ఆళ్లగడ్డ మండలంలోని ఎస్.లింగందిన్నె, పాతకందు కూరు గ్రామాల మధ్య కేసీ ప్రధాన కాల్వ కట్ట అధ్వా నంగా మారింది. 27వ లాక్ నుంచి పాతకందుకూరు వరకు కాల్వ కట్ట గుంతలు ఏర్పడి దెబ్బతింది. కాల్వ ఆయకట్టు కింద పొలాలు సాగు చేస్తున్న రైతులు కట్ట దుర్భరంగా మారడంతో రాకపోకలు చేయలేక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. అధికారులు దృష్టి సారించి కట్ట మరమ్మతులు చేయలేని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎస్.లింగందిన్నె(ఆళ్లగడ్డ గ్రామీణం)

ముమ్మరంగా అభివృద్ధి పనులు

బనగానపల్లి ఆర్టీసీ బస్టాండులో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పటికే బస్టాండు పైభా గాన తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసిన అధికారులు బస్సు ప్రవేశ మార్గంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. సుమారు రూ.20లక్షలు పైగా వెచ్చించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి ఆధునిక బస్టాండుగా చేసేం దుకు అధికారులు పనులు చేపట్టారు. పట్టణంలో జరు గుతున్న భూగర్భ డ్రైనేజీ కాలువకు అనుసంధానం చేసి మురుగు బస్టాండు ఆవరణలోకి రాకుండా పనులు చేస్తున్నారు. - న్యూస్‌టుడే, బనగానపల్లి

అదుపు తప్పితే.. తప్పదు ముప్పు

బనగానపల్లి మండలంలోని పలుకూరు గ్రామం నాప రాయి గనులకు ప్రసిద్ధి. పలుకూరు నుంచి ఇతర ప్రాంతా లకు నాపరాళ్ల ట్రాక్టర్లు నిత్యం వందల సంఖ్యలో వెళ్తుం టాయి. భారీ లోడుతో వెళ్లే వాహనాలపై కూలీలు ప్రమా దకరంగా ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం అదుపుతప్పినా ప్రాణాలు పోయే పరిస్థితి. గతంలో పలువురు ప్రమాదా నికి గురై మృతిచెందిన సందర్భాలున్నాయి. అయిన కూడా ప్రయాణం సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, పలుకూరు (బనగానపల్లి గ్రామీణం)

విద్యుత్తు నియంత్రిక.. ప్రమాద ఘంటిక

ఉయ్యాలవాడ మండల పరిధిలోని పెద్దయమ్మనూరు గ్రామం ఎస్సీ కాలనీలో ట్రాన్స్‌కో అధికారులు సింగిల్ ఫేజ్ నియంత్రికను ఏర్పాటు చేశారు. నియంత్రిక సమీపంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఉంది. నియంత్రిక సమీపం నుంచే విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. కంచె లేక పోవటంతో విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. తక్షణమే అధికారులు నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దయమ్మనూరు (ఉయ్యాలవాడ)

బనగానపల్లి గ్రామీణం: కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బనగానపల్లి గ్రామీణం: యాగంటి క్షేత్రంలో..

డోన్: కొత్తబుగ్గలో స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ముక్కంటి సన్నిధి.. మురిసిన భక్తకోటి

✦ ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకుని ఆదివారం బనగానపల్లి, డోన్, ఆళ్ల గడ్డ నియోజకవర్గాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అభిషేకాలు, దీపోత్సవాల్లో పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, కోవెల కుంట్ల గ్రామీణం, బనగానపల్లి, సంజామల, అవుకు, చాగలమర్రి, డోన్.

కిటకిటలాడిన యాగంటి

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయం భక్తు లతో కిటకిటలాడింది. ఆర్టీసీ అధికా రులు ప్రత్యేక బస్సు సర్వీసులు నడి పారు. టంగుటూరు వీహెచ్‌సీ వైద్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది ఆధ్వ ర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరిం చాయి. అర్ధరాత్రి అనంతరం కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయాధికారి పాండురంగారెడ్డి తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో ఉచిత లడ్డూ ప్రసాదం అందించినట్లు ఆలయ ఛైర్మన్ మౌళీశ్వరరెడ్డి చెప్పారు. సోమవారం నందికోల ఉత్సవం నిర్వహించనున్నారు.

← బనగానపల్లి: కొండపేట శివాలయంలో..

ఆళ్లగడ్డ గ్రామీణం: రామతీర్థం క్షేత్రంలో..

బేతంచెర్ల: ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో..

ఆళ్లగడ్డ: అమృతలింగేశ్వర స్వామి ఆలయంలో..

కోవెలకుంట్ల: గుల్లదుర్తి గ్రామంలో..

చాగలమర్రి: రామలింగేశ్వరాలయంలో..

ముగిసిన రాష్ట్రస్థాయి ఆటల పోటీలు

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: శివరాత్రి పండగ సందర్భంగా పెట్నికోట సమీపంలోని గుండు మల్లేశ్వ రస్వామి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగి శాయి. కబడ్డీ తుది పోరులో పెట్నికోట జట్టు, బాల్ బాడ్మింటన్ పోటీలో బనగానపల్లి జట్టు గెలు పొందాయి. విజేత జట్లకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

కొలిమిగుండ్ల: కబడ్డీ తుది పోటీలో తలపడుతున్న జట్లు

డోన్, న్యూస్‌టుడే: మండలంలోని దేవరబండ గ్రామంలో బోడబండ తిమ్మగురుడు స్వామి తిరునాల, మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వృషభాల రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు హోరాహో రీగా సాగాయి. మొత్తం 16 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు రూ.40 వేల నుంచి రూ.3 వేల వరకు వరుసగా నగదు బహుమతులు నిర్వాహకులు అందజేశారు.

డోన్: వృషభాల యజమానులకు నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

నమో మాధవాయ.. మహోబలాయ

ఆర్.నాగులవరం(రుద్రవరం), న్యూస్‌టుడే: అహో బిలం పార్వేటోత్సవంలో భాగంగా రుద్రవరం మండలం లోని ఆర్.నాగులవరం గ్రామంలో ఆదివారం ఉత్సవ మూర్తులకు ప్రజలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. శనివారం రాత్రి తిప్పారెడ్డిపల్లె నుంచి ఆర్. నాగులవరానికి చేరుకున్న ఉత్సవ పల్లకి గ్రామ ప్రజలు మేళతాళాలతో ఎదురేగి ఘనంగా స్వాగతం పలికారు. ఆది వారం గ్రామంలోని వివిధ తెలుపులపై కొలువుదీరిన ప్రహ్లా దవరద, జ్వాలానృసింహ మూర్తులకు పూజలు చేశారు. సాయంత్రం పల్లకి తువ్వపల్లె గ్రామానికి చేరుకుంది.

పార్వేట ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

సంక్షిప్త సమాచారం

డోన్, న్యూస్‌టుడే: డోన్ ప్రభు త్వాసుపత్రిలో ఓ దాత సాయంతో ప్రార్థన సమయం నిర్వాహకులు జానప్రభాకర్ రోగులకు పౌష్టికా హారం పంపిణీ చేశారు. దాతల సాయంతో ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం కొనసా గుతుందన్నారు.

మాయలూరు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: మాయలూరు గ్రామం లోని భీమేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఎ.నరేంద్రనాథ్‌రెడ్డి రూ.25 వేలు, మాజీ సర్పంచి ఎస్.రవిచం ద్రుడు రూ.10 వేలను శివ ట్రస్టు సభ్యులకు విరాళంగా అందజేశారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: దొర్నిపాడు మండలంలోని డబ్ల్యూగో విందిన్నె గ్రామంలో మూల పెద్దమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని బెలుం గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయప డినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం చెప్పారు. బెలుం శింగవరం గ్రామానికి చెందిన బి.శివా రెడ్డి బెలుం గుహల సమీపంలో రోడ్డును దాటుతుండగా, అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన రామ వెంకటేశ్వరరెడ్డి ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడిపి ఢీ కొట్టా డన్నారు. బలమైన గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలిం చారు. బాధితుడి కుమారుడు విశ్వనాథరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదా రులు విధిగా ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సు కలిగి ఉండాలి సీఐ రాము పేర్కొన్నారు. కడప- కర్నూలు 40వ జాతీయ రహదారిలోని గోవిందపల్లె మెట్ట వద్ద సీఐ తన సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టి శిర స్త్రాణం ధరించని పలువురు ద్విచక్ర వాహన దారులకు జరిమానా విధించారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నామని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి వాహనాలు నడిపితే జరిమానా విధి స్తామని హెచ్చరించారు.

తప్పిపోయిన పిల్లలు.. బంధువుకు అప్పగింత

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బనగానపల్లికి చెందిన ఇద్దరు పిల్లలను బేతంచెర్ల పోలీసులు గుర్తించి బంధువులకు అప్పగించారు. బనగా నపల్లికి చెందిన రామాంజనేయులు, సుంకమ్మ దంపతులు గొడపడ్డారు. దీంతో సుంకమ్మ రెండు రోజుల కిందట కృష్ణగిరిలోని పుట్టింటికి వెళ్లిపోయారు. వీరి కుమారులు శివ, వీరభ ద్రుడులు తల్లి వద్దకు వెళ్లాలని నాన్నమ్మకు చెప్పకుండా బేతంచెర్లకు వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం పట్టణంలో దారి తప్పి తిరుగు తుండగా పోలీసులు గుర్తించి వివరాలు తెలు సుకుని బంధువు సత్తిబాబుకు అప్పగించారు.

నేడు చర్చి ప్రతిష్ఠ మహోత్సవం

పెద్దబోధనం(చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలం లోని పెద్దబోధనం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ స్టీఫెన్స్ చర్చి ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఫాదర్ చెంచుల రవీంద్రనాథ్ తెలియ జేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల బిషప్ సంతోష్‌ప్రసన్నరావు హాజరు కానున్నారని చెప్పారు. ప్రారంభోత్సవం సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

పారిశుద్ధ్య పనులు చేయించండి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలో దోమల బెడద అధికమైందని అధికారులు పారిశు ద్ధ్య పనులు చేయించాలని ప్రజాసంఘాల ఐక్యవే దిక నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. రాత్రివేళ దోమలు అధికమై ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయని, జ్వరాల బారిన పడి అల్లాడుతున్నారన్నారు. స్పందించకపోతే ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు.

రహదారిపైనే చెత్తాచెదారం

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని చింత లచెరువు రహదారిపైనే చెత్తాచెదారం నిల్వ ఉండడంతో సమీప కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కాల నీలో నివాసం ఉండే ఇళ్లలోకి చెత్తాచెదారం వచ్చి పడుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డు లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది చెత్తాచెదారాన్ని రహదారు లపై ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీడ కరవు.. అత్యవసరానికి పరుగు

■ బస్సు షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు

చాగలమర్రి, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఆరింట నాలుగు మండలాల్లో ఆర్టీసీ బస్సు ప్రాంగణాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో బస్సు షెల్టర్లు లేక అగచాట్లు పడుతున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వచ్చేందుకు, ఇతర ప్రాంతాలకు ప్రయా ణాలు చేసేందుకు అగచాట్లు పడాల్సి వస్తోంది. ఉన్న ఆర్టీసీ బస్సు ప్రాంగణాలు అధ్వానంగా తయారయ్యాయి. కనీసం నిలబడేందుకు వీలుగా లేకుండా పోయాయి. షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

☛ చాగలమర్రి పట్టణంలో ఆర్టీసీ బస్టాండు అధ్వాన స్థితిలో ఉంది. బస్టాండు పరిధిలో గతంలో సమాచార కేంద్రంతోపాటు సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం అక్కడ ఎవ్వరూ లేరు. ఆవరణలో మరుగుదొడ్లలో అపరిశుభ్రత నెలకొంది. వర్షాకాలంలో ప్రాంగణం అంతా బురదమ యంగా ఉంటోంది. మండలంలోని మద్దూరు, పెద్దబోధనం మెట్ట వద్ద కనీసం బస్సు షెల్టర్లు లేక ఎండావానలకు అలాగే బస్సులకై వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

అధ్వానంగా మారిన చాగలమర్రి బస్సు ప్రాంగణం

☛ దొర్నిపాడులో గతంలో షెల్టర్ ఉండేది. అయితే బస్టాండు ఇచ్చిన దాతలు తిరిగి తీసుకోవడంతో నీడ కర వైంది. ప్రధాన రహదారిపైనే బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. రుద్ర వరం మండల కేంద్రంలో బస్టాండు లేదు. రుద్రవరం మండల కేంద్రంలో నంద్యాలకు వెళ్లే మార్గంలోని కూడలిలో బస్టాండు, షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

☛ రుద్రవరం నుంచి ఆళ్లగడ్డ వెళ్లేందుకు వేచి ఉండే ప్రదేశంలో కనీసం షెల్టర్ కానీ, మూత్రశాలలు కూడా లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాల నుంచి రుద్రవరానికి వచ్చే వారు బస్టాండు లేక నానాపాట్లు పడుతున్నారు.

☛ రుద్రవరం మండలంలోని నర్సాపురం కూడలి పెద్దది. అక్కడ బస్సు షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. అహో బిలంలో ఆర్టీసీ బస్టాండు ముళ్లపొదల నడుమ ఉంది. ఆల యానికి వచ్చే భక్తులు రహదారిపైనే నిల్చుని బస్సులు ఎక్కాల్సి వస్తోంది. ఆళ్లగడ్డ మండలం గుండా సాగే జాతీయ రహదా రిపై నల్లగట్ల, పేరాయిపల్లె, బత్తలూరు గ్రామాల వద్ద బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

☛ శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల మేజర్ పంచాయతీల పరిధిలో బస్ షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపైనే ప్రయాణికులు నిలబడలేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం జాతీయ రహదారులపై ఉండే గ్రామాల మెట్టలపై బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచుకోక.. సేవలు అందక

సంజామల మండలంలోని ఆకుమల్లలో రైతు సేవా కేంద్రం నిర్మాణం పూర్తైనప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో సకాలంలో రైతులకు సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేంద్రం పరిధిలో దాదాపు వెయ్యి మందికి పైగా అన్నదాతలు ఉన్నారు. వీరికి చిన్న సమస్య వచ్చినా సంజామలకు రావాల్సి వస్తోంది. ఈ విషయం పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్ప టికైనా ఉన్నతాధికారులు స్పందించి కేంద్రం ప్రారంభించేందుకు చర్యలు తీసు కోవాలని అన్నదాతలు కోరుతున్నారు.-న్యూస్‌టుడే, సంజామల

(c) eenadu

తత్ప్రణమామి సదాశివ లింగం



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ శిల్పి సుదర్శన్ పట్నాయక్ పూరీ తీరంలో ముక్కంటి రూపం, లింగం సైకత శిల్పంగా తీర్చిదిద్దారు. ఇందులో 17 వేల రుద్రాక్షలు వినియోగించామని, 500 చిన్న లింగాలు ఉన్నట్లు పట్నాయక్ తెలిపారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్

ఆధ్యాత్మిక బీజాలు నాటిన భీమభోయ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భక్త కవి భీమభోయ్ తన రచనల ద్వారా ఆధ్యాత్మిక బీజాలు నాటి, శాంతి, సమత, మమత, సోదరభావాన్ని పెంచి పోషించారని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ప్రస్తుతించారు. ఆదివారం భీమభోయ్ వర్ధంతిని పురస్కరించుకుని అసెంబ్లీ ఆవరణలోని ఆ మహనీయుని విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతోపాటు శాసన సభాపతి సుర మాపాడి, ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ తదితర ప్రముఖులు పాల్గొని భక్తకవి సేవలు ప్రశంసించారు.

భీమభోయ్ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న సీఎం మోహన్, ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్, సభాపతి సురమాపాడి

జగన్నాథుని సంపద లెక్కింపుపై నేడు నిర్ణయం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలోని రత్నభాండాగారానికి జరిగిన మరమ్మతులపై ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి సోమవారం (16న) భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో సమీక్షిస్తారు. జగన్నాథుని సంపద లెక్కింపునకు సంబంధించి మార్గదర్శకాలు ఖరారయ్యే సూచనలున్నాయని న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఆదివారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. స్వామి ఆభరణాల లెక్కింపు నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమావళి తదితరాలపై సీఎం కూలంకషంగా చర్చిస్తారు.

మహేంద్రగిరి.. మార్మోగిన పంచాక్షరి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఒడిశా, ఆంధ్రా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో మహేంద్రగిరి పర్వతం కిటకిటలాడింది. ఓం నమశ్శివాయ అన్న పంచాక్షరితో పర్వత పరిసరాలు మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జిల్లా యంత్రాంగం మహేంద్రగిరిపై అన్ని ఏర్పాట్లు చేసింది. గజపతి, గంజాం జిల్లాల చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి భారీగా వచ్చిన భక్తులు పూజలు చేశారు.

కనువిందు

ఇక్కడి ప్రకృతి అందాలు, పక్షుల కిలకిల రావాలు, ఉదయం లేలేత సూర్యుని రూపం, మరోపక్క భీముని గుడి దర్శనం కనువిందు చేస్తుంది. పెద్ద పెద్ద రాళ్లతో నిర్మించిన గుడి ముఖద్వారం నుంచి లోపలికి భక్తులు వెళ్లి ఓ చిన్న సందు నుంచి బయటకు రావడం ఇక్కడి ప్రత్యేకం. అలా చేయడం వల్ల సర్వరోగాలు నయమవుతాయని భక్తుల నమ్మకం. సూర్యోదయం సువర్ణ శోభితంగా కనిపిస్తుంది. సుమారు 70 శాతం మంది ప్రజలు ఆంధ్రప్రదేశ్ జిల్లాలకు చెందిన వారుగా తెలుస్తుంది. అదేవిధంగా ధర్మరాజు మందిర ప్రాంతంలో 24 గంటల పాటు హరే రామ హరే కృష్ణ భజన కార్యక్రమాలు, కుంతి మందిరం ప్రాంతంలో సాంస్కృతిక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

తిరుగు ప్రయాణంలో భక్తులు


భీముని మందిరం సందు నుంచి వస్తున్న భక్తులు

కిటకిటలాడిన ధవళేశ్వరం

గోపాలపూర్, న్యూస్‌టుడే: గోపాల్‌పూర్ తీరానికి చేరువలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం ధవళేశ్వరం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ తలుపులు తెరిచారు. ముక్కంటి దైనందిన సేవల తర్వాత 4 గంటల నుంచి దర్శనాలకు అనుమతించారు. పాలకవర్గం పర్యవేక్షణలో ఒకవైపు సేవలు జరగ్గా, గర్భగుడికి చేరువలోని ప్రాంగణంలో సామూహిక రుద్రాభిషేకాలు జరిగాయి. గోపాల్‌పూర్ ఠాణా యంత్రాంగం గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. భక్తులందరికీ ఇక్కడ తీర్థ ప్రసాదాలు అందజేశారు. రోజంతా స్వామి దర్శనాలు జరిగాయి. జాగరణ చేసేవారి కోసం ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ముక్కంటి దర్శనానికి భక్తుల బారులు

రూ.3 లక్షల కోట్ల బడ్జెట్

- సాలంది కాలువ పనులకు రూ.378 కోట్లు
- క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అధ్యక్షతన శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌కు సంబంధించి తుది కసరత్తు జరిగింది. ఆర్థికశాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి ఈ నెల 20న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్ స్వరూపం రూ.3 లక్షల కోట్లకుపైగా ఉంది. దీనికి మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. వివరాలు గోప్యంగా ఉంచారు. గతేడాది బడ్జెట్ రూ.2.90 లక్షల కోట్లు. ఈ ఏడాది మరో రూ.20 వేల కోట్లు పెంచినట్లు తెలిసింది.

క్యాబినెట్ సమావేశంలో సీఎం మోహన్, ఉపముఖ్యమంత్రులు కనకవర్ధన్‌సింగ్‌దేవ్, ప్రభాతి పరిధ, సీఎస్ అనూగార్గ్

ఆనందపూర్ ఆనకట్ట విస్తరణ

క్యాబినెట్ సమావేశం వివరాలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనూగార్గ్ విలేకర్లకు తెలిపారు. ఆనందపూర్ వద్ద సాలంది నది ఆనకట్ట విస్తరించడానికి రూ.378.29 కోట్లు కేటాయించారన్నారు. 49.810 కిలోమీటర్ల కాలువ నిర్మాణమవుతుందని, పైపులైను ద్వారా కేంఝర్, బాలేశ్వర్ జిల్లాల్లోని ఆనందపూర్, నీలగిరి, జలేశ్వర్ సమితుల పంట పొలాలకు నీటిపారుదల జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి దాఖలైన మూడు టెండర్లకు క్యాబినెట్ ఆమోదించినట్లు చెప్పారు. కార్మికశాఖకు సంబంధించి ప్రభుత్వోద్యోగుల బీమా సొమ్ము, ఈఎస్ఐ ఆసుపత్రి సేవల క్రమబద్ధీకరణకు సంబంధించి చట్టంలో స్వల్ప సవరణ జరిగినట్లు సీఎస్ చెప్పారు.

21వ శతాబ్దం యువతదే

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్, బరగడ్, న్యూస్‌టుడే: ఈ శతాబ్దం యువతదేనని, 'వికసిత్ భారత్-2047' ధ్యేయం నెరవేర్చడానికి వారంతా ముందుకు రావాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పిలుపునిచ్చారు. ఆదివారం సంబల్‌పూర్ పరిధిలోని హిరాకుడ్ జలాశయం ఆవరణలో అంతర్జాతీయ హాఫ్ మారథాన్ కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ వేడుకకు జెండా ఊపి ప్రారంభించిన ధర్మేంద్ర యువతతో కలిసి మారథాన్‌లో పాల్గొన్నారు. హిరాకుడ్ రిజర్వాయరులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి రబినారాయణ నాయక్, ఇతర అభిమానులతో కలిసి బోట్ షికారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక, విజ్ఞాన రంగంలో పైచేయిగా ఉన్న భారత్ యువశక్తితో సమీప భవిష్యత్తులో ఇంకెంతో సాధిస్తుందన్నారు. వికసిత్ భారత్‌లో ఒడిశా క్రియాశీలక పాత్ర పోషిస్తుందని ధర్మేంద్ర ఆశాభావం వ్యక్తం చేశారు.

యువతతో కలిసి మారథాన్‌లో కేంద్రమంత్రి ధర్మేంద్ర

నేత వస్త్రాల్లో ఒడిశాదే పైచేయి

- ఉప ముఖ్యమంత్రి సింగ్‌దేవ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నేత, పట్టువస్త్రాల తయారీలో ఒడిశాదే పైచేయిగా ఉందని, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన సంబల్‌పూర్ డిజైన్లు ఉదాహరణ అని, నేత కార్మికులు రాష్ట్ర ప్రతిష్ఠ ఇనుమడింపజేస్తున్నందుకు గర్వంగా ఉందని ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ తెలిపారు. భువనేశ్వర్‌లోని జనతా మైదానంలో 'తోషాలి స్వదేశీ చేనేత వస్త్ర మేళా-2026' శనివారం రాత్రి ప్రారంభమైంది. ఈ నెల 26 వరకు ఇది కొనసాగనుంది. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సింగ్‌దేవ్ మాట్లాడుతూ ఈసారి మేళాలో 905 స్టాళ్లు ఏర్పాటు కాగా, 20 రాష్ట్రాల నేత కార్మికులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. స్వదేశీ సామగ్రికి మార్కెటింగ్ ధ్యేయంగా ప్రభుత్వం దేశ, విదేశాల్లో ప్రదర్శనలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి ప్రదీప్ బలసామంత, ఎమ్మెల్యే బాబూసింగ్, చేనేత శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి గుహ పూనం తాపస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా 12 మంది ప్రముఖ నేత కార్మికులను సింగ్‌దేవ్ సన్మానించారు.

వేదికపై ఆధునిక నేతయంత్రం తిలకిస్తున్న ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్, పక్కన మంత్రి ప్రదీప్, తదితర ప్రముఖులు

కాలినడకన మృతదేహాన్ని ఆసుపత్రికి చేర్చిన గ్రామస్థులు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ సమితి సుకు పంచాయతీకి చెందిన ఓ మృతదేహాన్ని శవ పరీక్షలకు 5 కిలోమీటర్ల రైల్వే లైను మీదుగా వంతెన దాటుకుంటూ కాలి నడకన సమితి కేంద్రంలో గల లక్ష్మణ నాయక్ వైద్య కళాశాల ఆసుపత్రికి తీసుకురావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పంచాయతీకి చెందిన వ్యక్తి భగవాన్ సుకియా అందించిన వివరాల ప్రకారం.. రెండు రోజులు కిందట బోడో సుకు గ్రామానికి చెందిన దాము(55) అనే వ్యక్తి స్థానిక కొలాబ్ నదిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. అగ్నిమాపక విభాగం వారు గాలింపు చర్యలతో శనివారం అతని మృతదేహం బయటకు తీశారు. శవ పరీక్షలకు కొరాపుట్ తీసుకురావాల్సి ఉండగా, వేరే దారి లేక రైల్వే లైను గుండా వంతెన దాటుకుంటూ కొరాపుట్ చేరుకుని అక్కడ నుంచి వేరే వాహనంలో లక్ష్మణ నాయక్ వైద్యకళాశాలకు చేరుకున్నట్లు తెలిపారు. దశాబ్దాల కాలంగా సుకు పంచాయతీకి జిల్లా కేంద్రాన్ని కలుపుతూ వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్లు చేస్తున్నా ఎలాంటి మార్పులు చేయట్లేదని, అధికారులు ఇప్పటికైనా పరిస్థితిపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

5 కిలోమీటర్లు పాడి మోసుకుంటూ వచ్చిన గ్రామస్థులు

ఏకామ్ర క్షేత్ర అభివృద్ధికి చర్యలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఏకామ్ర హెరిటేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, లింగరాజ్ స్వామి ఆలయం పుష్కరిణి బిందుసాగరాన్ని ఇంటర్‌ప్రిటెసన్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని ప్రజాపనులు, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ చెప్పారు. ఆదివారం లింగరాజ్ ఆలయ సందర్శనకు వచ్చిన మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ ఏకామ్ర (ముక్కంటి) క్షేత్రం విస్తరణ పనులు ప్రారంభమయ్యాయని, డిజైన్‌లో మార్పులు చేసి వారసత్వ పథకంగా చేపట్టాలని నిర్ణయించామని, టెండర్లు ఖరారయ్యాయని వివరించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ సంవత్సరాంతంలోగా నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. ఇందులో భాగంగా బిందుసాగరానికి కొత్త హంగులు సమకూరుస్తామని, లింగరాజ్ ఆలయ ప్రాంగణానికి ఎదురుగా ముక్కంటి భారీ విగ్రహం ఏర్పాటవుతుందన్నారు. ఏకామ్ర క్షేత్రాన్ని ప్రముఖ తీర్థయాత్ర కేంద్రంగా తీర్చిదిద్దుతామని, సేవాయత్‌ల వివాదం చక్కదిద్దుతామని, సేవాయత్‌ల వివాదం చక్కదిద్దడానికి త్వరలో ప్రత్యేక చట్టం తెస్తున్నట్లు మంత్రి తెలిపారు.

బిందుసాగరం పుష్కరిణి

అరెస్టుల భయంతో గ్రామం వదిలి వెళ్లిన పురుషులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా భంజనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని సార్దుల గ్రామంలో సామూహిక దాడిలో కొంధమాల్ జిల్లాకు చెందిన బాణధర ప్రధాన్ (40) మృతిచెందాడు. ఈ ఘటనపై దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు గ్రామానికి చెందిన ఇరవై మందిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో అరెస్టుల భయంతో గ్రామంలోని మగవాళ్లంతా ఊరొదిలి ఆదివారం వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో పోలీసులను మోహరించామని అదనపు ఎస్పీ రంజన్ కుమార్ దే విలేకరులకు చెప్పారు. ఈ ఘటనతో సంబంధమున్న వారందరిపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి నలుగురు వ్యక్తులు గ్రామంలో సంచరిస్తుండగా, వారు దొంగతనానికి వచ్చారన్న అనుమానంతో గ్రామస్థులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ముగ్గురు పారిపోగా, గ్రామస్థులకు చిక్కిన బాణధరను వారు స్తంభానికి కట్టి కొట్టారు. తీవ్రంగా గాయపడ్డ ఆయన భంజనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందిన సంగతి తెలిసిందే.

ప్రమాదం పరుగు... దూరం జరుగు

పరిమితికి మించి లగేజీతో వెళుతున్న వాహనం

రాయగడ మీదుగా ఉన్న ఎన్‌హెచ్-326పై పరిమితికి మించి లగేజీతో కూడిన వాహనాలు తోటి చోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏమాత్రం పట్టుజారినా ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రహదారి భద్రత వారోత్సవాలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించే రవాణాశాఖ అధికారులు ఇలాంటి వాటిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. రాయగడ-జేకేపూర్ రహదారిలో కనిపించిన ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

–న్యూస్‌టుడే, రాయగడ పట్టణం

హరహర మహాదేవ శంభో

- లింగరాజ్ సన్నిధికి పోటెత్తిన భక్తులు
- సేవాయత్‌ల కొట్లాటతో 2 గంటలు అంతరాయం

విద్యుత్తు కాంతులతో ఏకామ్ర క్షేత్రం ధగధగ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రముఖ శైవపీఠాలు హరనామ స్మరణతో మార్మోగాయి. భువనేశ్వర్‌లోని లింగరాజ్, పూరీలోని లోక్‌నాథ్, కటక్‌లోని ధవళేశ్వరం, ఢెంకనాల్‌లోని కపిలాస్, భద్రక్ అరడిలోని అఖండల మణి తదితర ముక్కంటి క్షేత్రాలు భక్తజనంతో కళకళలాడాయి.

అపశ్రుతులు పునరావృతం

భువనేశ్వర్‌లోని ఏకామ్ర(లింగరాజ్) క్షేత్రానికి మూడు లక్షలకు పైగా భక్తులొస్తారన్న అంచనాగా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆలయానికి అందంగా అలంకరించారు. విద్యుత్తు దీపాలతో ముక్కంటి సన్నిధి ధగధగలాడింది. గట్టి బందోబస్తు చేశారు. శివరాత్రి ముందుగా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాలు చేపట్టారు. సేవాయత్‌లు నిష్ఠగా విధులు నిర్వహిస్తారని మంత్రి ముందస్తుగా చెప్పారు. ఇది వాస్తవం కాదని ఆదివారం జరిగిన ఘటనలు నిరూపించాయి. అపశ్రుతులు పునరావృతమయ్యాయి.

బారికేడ్ లైన్లలో భక్తులు

నకిలీ పాసుల విక్రయం

ఆలయ యంత్రాంగం వీవీఐపీల దర్శనాలకు ప్రత్యేక పాసులు వితరణ ముందుగా చేసింది. సరిగ్గా ఇలాంటివే ఇంటర్నెట్ కేంద్రాల్లో తయారు చేయించిన సేవాయత్‌లు బారికేడు లైన్లలో దర్శనాలకు వేచి ఉన్న కొంత మందికి విక్రయాలు చేశారు. సేవాయత్‌ల కుటుంబాల వారు దక్షిణ ద్వారం మీదుగా లోపలికి ప్రవేశించారు. దీంతో సేవాయత్‌ల మధ్య ఘర్షణ, కొట్లాట జరిగింది. నిలువరించిన పోలీసులపై జులుం ప్రదర్శించారు. దీని వల్ల ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సాధారణ భక్తుల దర్శనాలకు, ముక్కంటి సేవలకు అంతరాయం కలిగింది. భువనేశ్వర్ డీసీపీ జగ్మోహన్ మీనా బలగాలతో చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. తర్వాత న్యాయశాఖ మంత్రి హరిచందన్ వచ్చి ఘర్షణకు కారణమైన సేవాయత్‌లతో మాట్లాడారు. అనంతరం స్వామి దర్శనాలు జరిగాయి.

రూ.81 లక్షల సైబర్ మోసం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ పెట్టుబడుల పేరిట రాజధాని నగరానికి చెందిన ఓ సీనియర్ పౌరుడి నుంచి రూ. 81 లక్షల సైబర్ మోసానికి పాల్పడ్డ నిందితుడ్ని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన నిరంజన్ బొయితాయి(61) అనే వ్యక్తిని నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడుల వాట్సాప్ గ్రూపులో నిందితుడు చేర్చాడు. ఇందులో పెట్టుబడులతో అధిక ఆదాయం పొందవచ్చని నమ్మబలకడంతో నిరంజన్ పలు దఫాలుగా రూ. 81.30 లక్షలను నిందితుడి ఖాతాలో జమ చేశారు. అనంతరం మోసపోయినట్లు గ్రహించిన బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలెట్టారు. నిందితుడు భోపాల్‌కు చెందిన ఆకాష్ కౌషిక్(23)గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రెండు చరవాణులు, వివిధ గుర్తింపు పత్రాలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఆకాష్‌కు వివిధ రాష్ట్రాలకు చెందిన 28 సైబర్ నేరాల్లో హస్తమున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు.

పోలీసుల అదుపులో నిందితుడు

మహోత్సవాలతో చైతన్యం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఆధునిక చికిత్సా విధానం, అనారోగ్య సమస్యలపై ప్రజల్లో మరింత చైతన్యం కల్పించేందుకు మహోత్సవాలు దోహదపడతాయని, ఆరోగ్య పర్యాటకానికి గంజాం జిల్లా కేంద్రం కావాలని అతిథులన్నారు. దక్షిణ ఒడిశా ఫార్మాశిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఇతర సంస్థల సహకారంతో స్థానిక కళ్లికోట వర్సిటీ మైదానంలో '3వ గంజాం జిల్లా ఆరోగ్య మహోత్సవాలు' కోలాహలంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు బిజయ కుమార్ స్వాయిన్ అధ్యక్షత వహించారు. అస్కా ఎంపీ అనితా శుభదర్శిని, సురడా ఎమ్మెల్యే నీలమణి బిశోయి, వివిధ రంగాల ప్రముఖులు పూడిపెద్ది సత్యనారాయణ (బాబు), సిమాంచల బారిక్, డాక్టర్ ప్రేమ్‌రాజ్ శత్పథి అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కళాకారిణులు ప్రదర్శనలు చేశారు. వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు.

నృత్య బృందాలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేస్తున్న అతిథులు. చిత్రంలో నిర్వాహకులు

ఉద్యానవనం... నిండా నిర్లక్ష్యం

- పట్టించుకోని అధికారులు - స్థానికుల అసంతృప్తి

వాకింగ్ ట్రాక్‌పై ఉన్న చెత్త, మొలిచిన మొక్కలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: అందమైన పువ్వులు, సువాసన గల మొక్కల మధ్య కలకలలాడుతూ ఉండాల్సిన ఉద్యానవనం, పిచ్చి మొక్కలు, చెత్తతో నిండిపోయి అధ్వానంగా మారిందని నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ ఎండిపోయిన మొక్కలు, వాకింగ్ పాథ్‌పై చెత్త, పింపురు పట్టిన వ్యాయామ పరికరాలతో వెలవెలబోతోంది. పిల్లలు, వృద్ధులతో ఉండాల్సిన పార్కు ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పలుమార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. రూ.కోట్లు వెచ్చించి ఉద్యానవనాలు నిర్మిస్తున్నామని నేతలు, అధికారులు ప్రగల్భాలు పలుకుతున్నారు. కానీ ఎటువంటి సమాచార పలకలు లేకుండా ఉద్యానవనాలు అసంపూర్ణంగా నిర్మించి నిధులు పక్కతోవ పట్టిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' కార్యనిర్వాహణాధికారి అలోక్ కుమార్‌ను అడగ్గా ఉద్యానవనం వెనుక భాగంలో పనులు అసంపూర్ణంగా ఉండిపోయాయి. పనులు పూర్తి కాగానే త్వరలో పునః ప్రారంభిస్తామని తెలిపారు.


పిచ్చి మొక్కలు మధ్య వ్యాయామ పరికరాలు

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త
డాక్టర్ రెడ్డి టోటల్ బాడీ చెకప్ సెంటర్
కలక్టర్ ఆఫీస్ జంక్షన్, కోస్టల్ బేటరీ రోడ్డు, కెనరా బ్యాంక్ ప్రక్కనఉన్న LUCID బిల్డింగ్, 4వ అంతస్తు, విశాఖపట్నం
శరీరంలో సైలెంట్‌గా దాగిఉన్న గుండెపోటును మరియు కేన్సర్‌ను 6 నెలల ముందుగానే గుర్తించే టోటల్ బాడీ చెకప్
రూ. 7,500/- విలువచేయు పరీక్షలు కేవలం 3,500/- కే
ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా॥ జి. శివప్రసాద్‌రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.
9393752255, 9393122525
ఈ పథకం 10 రోజులు మాత్రమే ప్రతీ ఆదివారం శెలవు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

(c) eenadu

సేవలతో మానవత్వం గుబాళించాలి ❖ గవర్నర్ హరిబాబు

కోరాపుట్ ప్రాంతంలో విశిష్ట సేవలందిస్తున్న ఆదివాసీ మహిళను సత్కరిస్తున్న హరిబాబు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సమాజంలో సేవలు చేసేవారంతా నిజమైన హీరోలని, మానవత్వం మూర్తీభవించిన ఉత్తములని గవర్నర్ కంభంపాటి హరిబాబు చెప్పారు. ఒక టీవీ ఛానెల్ భువనేశ్వర్‌లో బ్రైట్ ఆఫ్ ఒడిశా సీజన్-2 వేడుకలు చేపట్టింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ అంకితభావంతో చేసే సేవలు సత్ఫలితాలిస్తాయని, సమాజాభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర హితం, అభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తూ, సేవాభావంతో పనులు చేస్తున్న వారిని సత్కరిస్తున్న కొన్ని వార్తా సంస్థలు రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కోవకు చెందిన 'అర్గస్ న్యూస్' ఛానెల్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఛానెల్ సీఈఓ ప్రకాశ్‌సాహు, కార్యనిర్వాహక కార్యదర్శి దుర్గాశిష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో ఒడిశాకు పది పతకాలు

❖ మూడు పతకాలతో బిద్యుస్మిత కొత్త రికార్డు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: మోదీనగర్ (ఉత్తరప్రదేశ్)లోని యాదవ్ ఫార్మ్‌హౌస్‌లో ఈ నెల 3 నుంచి 14 వరకు జరిగిన జాతీయ యూత్, జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఒడిశా పురుషులు, మహిళా లిఫ్టర్లు రాణించారు. ఇందులో భువనేశ్వర్, డెంకనాల్ ఉన్నత శిక్షణ కేంద్రాలకు చెందిన బిద్యుస్మిత భొయి, రీమా భొయి, ప్రీతిశ్మిత భొయి, మీనా శాంత, కస్తూరికా సాహు, సుజిత్ నాయక్ వివిధ శరీర బరువు కేటగిరీలలో స్నాచ్, క్లీన్-జర్క్‌లలో అధిక బరువులెత్తి మూడు పసిడి, రెండు రజత, అయిదు కాంస్య పతకాలను గెలుచుకున్నట్లు రాష్ట్ర సీనియర్ కోచ్ కె.రవికుమార్ ఆదివారం మధ్యాహ్నం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. పోటీల్లో జూనియర్ విభాగంలో లిఫ్టర్ బిద్యుస్మిత మూడు పతకాలు గెలుచుకుని కొత్త రికార్డులను నెలకొల్పినట్లు ఆయన తెలిపారు.

పసిడి, రజత, కాంస్య పతకాలతో బిద్యుస్మిత భొయి

ఐటా-ఓటీఏ టెన్నిస్ టైటిల్ విజేతలు సుయాష్, సనరచనా

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని మెండసల్ గురుకుల్ టెన్నిస్ అకాడమీలో ఈ నెల 9 నుంచి 14 వరకు జరిగిన ఆలిండియా టెన్నిస్ సంఘం (ఐటా), ఒడిశా టెన్నిస్ సంఘం (ఓటీఏ) అండర్-14 బాలబాలికల ఛాంపియన్ సిరీస్ శనివారం సాయంత్రం ముగిసింది. ఇందులో ఒడిశా బాలలే టైటిళ్లు సొంతం చేసుకున్నారు. బాలుర విభాగంలో తుదిపోరులో సుయాష్ పట్నాయక్ (ఒడిశా) 6-2, 6-2 సెట్లతో సమయ ఆగ్నస్ (ఝార్ఖండ్)పై గెలుపొందాడు. బాలికల విభాగంలో సనరచనా దాస్ (ఒడిశా) 6-4, 6-3 సెట్లతో ఇవనో అరోరా (పశ్చిమబెంగాల్)పై గెలుపొందింది. బాలికల డబుల్స్ టైటిల్‌ను సనరచనా దాస్, ఇవనో అరోరాల జోడీ 6-3, 6-4 సెట్లతో సాయిరూప్ మహంతి (ఒడిశా), నీలాస్య దాస్ (పశ్చిమబెంగాల్)ల జోడీపై గెలుపొందింది. జాతీయ రిఫరీ జతిన్ బత్యా ఆయా వివరాలను ఆదివారం 'న్యూస్‌టుడే'కు తెలియజేశారు.

బాలుర విన్నర్ సుయాష్ పట్నాయక్, రన్నర్ సమయ ఆగ్నస్

బాలికల విన్నర్ సనరచనా దాస్, రన్నర్ ఇవనో అరోరా

హరోం... హర

గోపాల్‌పూర్ దీర్ఘపురంలో తెలుగు జంటల మహారుద్రాభిషేకం

మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ ఆవిష్కృతమైంది. ఆలయ అలంకరణలు, విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఊరూవాడల్లో హరోం హరా!.. అన్న నామధ్యేయం మార్మోగింది. శివయ్య అనుగ్రహం కోసం ప్రజలు ఆలయాల వద్ద బారులు తీరారు. మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న పురోహితుడు

పర్లాఖెముండి: రాజసీతాపురం గ్రామంలో స్పటిక లింగానికి పూజలు చేస్తున్న భక్తులు

బ్రహ్మపురలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు. పాల్గొన్న భక్తులు

అయిదుగురిని కాపాడిన లైఫ్‌గార్డులు

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పూరీకి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. లోకనాథ, జగన్నాథ ఆలయాల్లో ఆరాధ్య దైవాలను దర్శనం చేసుకున్న వారిలో కొంతమంది సముద్రస్నానాలు చేశారు. అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో అయిదుగురు పర్యాటకులు కొట్టుకుపోవడంతో లైఫ్ గార్డులు వార్ని కాపాడి సురక్షితంగా ఒడ్డుకు చేర్చి అందరి మన్ననలందుకున్నారు.

సెలవు రోజూ...సేవలు అందించాలి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ప్రతి ఆదివారం దిఘా-అసన్ సోల్ రైలు చాత్నా రైల్వేస్టేషన్లో ఆగుతూ ఉంటుంది. ఇకపై ఈ రైలు సెలవు రోజుల్లో కూడా ఆపాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఆదివారం ఉదయం నిరసన ప్రదర్శన చేశారు. రైల్వే మంత్రి తమ కోరికను తీర్చాలని విన్నవిస్తున్నామని పేర్కొన్నారు.

శిరస్త్రాణంపై స్టిక్కర్లు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ గ్రామీణ పోలీసులు ద్విచక్ర వాహన దారులను ఆపి వారి శిరస్త్రాణాలపై వాహనదారుని కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్ రాసి స్టిక్కర్ అతికిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఎప్పుడైనా ఏమైనా జరిగితే ఆ నెంబరు ఆధారంగా ఇంటికి తెలియజేయొచ్చని తెలిపారు. తొలి రోజు 250 మంది శిరస్త్రాణాలపై స్టిక్కర్లు అంటించామని, ఈ కార్యక్రమం కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

వచ్చే నెల 15 నుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

మాట్లాడుతున్న అశోక్ మహంతి. చిత్రంలో ఎమ్మెల్యే బాబుసింగ్ తదితరులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్ అథ్లెటిక్ సంఘం (బీఏఏ), సిటీ క్లబ్ ఆధ్వర్యంలో వచ్చే మార్చి 15 నుంచి దేబేంద్ర స్మారక రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న దేబేంద్ర ప్రధాన్ స్మారక ఫౌండేషన్ ట్రస్టు అధ్యక్షుడు అశోక్ మహంతి మాట్లాడుతూ యూనిట్-1లోనున్న భువనేశ్వర్ ఫుట్‌బాల్ అకాడమీ మైదానంలో మార్చి 15 నుంచి 22 వరకు పోటీలు జరగనున్నట్లు వెల్లడించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తండ్రి దివంగత దేబేంద్ర ప్రధాన్ పేరిట నిర్వహిస్తున్నారు. సమావేశంలో ఏకామ్ర ఎమ్మెల్యే బాబుసింగ్, బీసీసీ కార్యదర్శి సౌమ్యరంజన్ పరిజా, భాజపా యువనాయకుడు జగన్నాథ్ ప్రధాన్, మాజీ ఎమ్మెల్యే ప్రియదర్శి మిశ్ర, భాజపా భువనేశ్వర్ అధ్యక్షుడు నిరంజన్ మిశ్ర, ఒడిశా ఒలింపిక్ సంఘం (ఓఓఏ) అధ్యక్షుడు సమీర్ మహంతి, టోర్నీ నిర్వాహక కార్యదర్శి రౌత్రాయ్, ఒడిశా ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పక్కా రహదారుల ఏర్పాటుకు కృషి

శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పవిత్ర

సిమిలిగుడ, న్యూస్‌టుడే: లక్ష్మీపూర్ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పక్కా రహదారుల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పవిత్ర శాంత అన్నారు. లక్ష్మీపూర్ సమితి బీటర్ ఘడ్ పంచాయతీలో బిలాపుట్ గ్రామానికి గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే పవిత్ర ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రచారానికి ఈ గ్రామానికి వచ్చేటప్పుడు గ్రామస్థులు రహదారి కోసం డిమాండ్ చేయగా ప్రజల చిరకాల సమస్యకు తెరపడిందన్నారు. సర్పంచి లలితా జానీ అధ్యక్షతన సమితి అధ్యక్షురాలు సుహాయి కులసిక్, జిల్లా పరిషత్ సభ్యులు హంగు శాంత తదితరులు పాల్గొన్నారు.

బీఎంజేడీ కొత్త కార్యవర్గాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజు మహిళా జనతాదళ్ (బీఎంజేడీ)కు ఆదివారం కొత్త కార్యవర్గాలు ఏర్పాటయ్యాయి. 26 జిల్లాలకు సంబంధించి 158 మంది అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులను బిజద అధినేత నవీన్‌పట్నాయక్ ఎంపిక చేశారు. త్వరలో స్థానిక సంస్థల (పంచాయతీ, మున్సిపల్) ఎన్నికలు జరగనుండగా, బిజదను బలోపేతం చేయడానికి నవీన్ సన్నాహాలు చేస్తున్నారు.

ఆబ్కారీ అధికారి...పతకాల భేరీ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లో జబల్‌పూర్ ప్రాంతంలోని గోకల్‌పూర్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 13 నుంచి 15 వరకు సాగిన జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లోత పర్లాఖెముండి పట్టణానికి చెందిన ఆబ్కారీ విశ్రాంత అధికారి కిషోర్ చంద్ర రథ్ పతకాల మోత మోగించారు. వంద మీటర్ల పరుగు పందెం, 4x100 మీటర్ల రిలే రేస్‌లో రెండు పసిడి, లాంగ్‌జంప్‌లో రజత, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

పతకాలతో కిశోర్‌చంద్ర రథ్

పుల్వామా అమరులకు నివాళులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవానులకు నివాళులర్పిస్తూ శనివారం రాత్రి బ్రహ్మపురలో పలు సంస్థలు కార్యక్రమాలు నిర్వహించాయి. బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్ నాయకత్వంలో స్థానిక కళ్లికోట వర్సిటీ వద్ద కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా ఇది సాగింది. ఇందులో పలువురు నగర ప్రముఖులు, భాజపా నాయకులు తదితరులు పాల్గొన్నారు. టీమ్ క్లీన్ సిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్కేసీజీ వైద్య కళాశాల ప్రధాన గేటు వద్ద కొవ్వొత్తులతో అమర జవానులకు నివాళులర్పించి ర్యాలీ చేపట్టారు.

కాగడాలతో నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న బ్రహ్మపుర ఎమ్మెల్యే అనిల్ కుమార్, ఇతరులు

మజ్జిగౌరి ఆలయంలో పూజల వివరాలు

రాయగడ: ● ఉదయం 5 గంటలకు తొలిపూజ, దీప ధూప నివేదన, హారతి ● 6.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారి సర్వదర్శనం ● 12.30 నుంచి 2.00 గంటల వరకు మహానైవేద్యం, ఆలయం మూత ● 2.00 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వదర్శనం ● సాయంత్రం 6.00 గంటలకు ప్రత్యేక హారతి.

భారత్‌పై బెల్జియం గెలుపు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రవుర్కెలాలోని బిర్సా ముండా హాకీ మైదానంలో కొనసాగుతున్న ఎఫ్ఐహెచ్ ప్రోలీగ్ హాకీ మ్యాచుల టోర్నీలో భారత్ మూడు మ్యాచులు ఓడిపోయింది. శనివారం రాత్రి నిర్వహించిన పోటీలో బెల్జియం జట్టు 4-2 గోల్ల తేడాతో భారత్‌పై గెలుపొందింది. మ్యాచుకు ముందు జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిప్యూటీ స్పీకర్ భవానీ శంకర్ భొయి, ఇతర అతిథులుగా రవుర్కెలా స్టీల్‌ప్లాంట్ డీఐజీ రతన్‌కుమార్ సింగ్, క్రీడా శాఖ అధికారులు బిజయ్ కుమార్ స్వయిన్, నెల్సన్ లక్రా, శాశ్వత్‌కుమార్ రౌత్, హాకీ ఇండియా డైరెక్టర్ జనరల్ ఆర్కే శ్రీవాస్తవ, అధ్యక్షుడు దిలీప్ తిర్కి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవానీ శంకర్‌కు దిలీప్ తిర్కి జ్ఞాపిక అందించారు.

డిప్యూటీ స్పీకర్ భవానీ శంకర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దిలీప్ తిర్కి

అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ విజేత ప్రమోద్‌కు సీఎం అభినందనలు

● సింగిల్స్, డబుల్స్‌లో రెండు పసిడి పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, బరగడ్, న్యూస్‌టుడే: బహ్రెయిన్‌లో జరుగుతున్న బీడబ్ల్యూఎఫ్ అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో ఒడిశా క్రీడాకారుడు ప్రమోద్ భగత్ రాణించి రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చాడు. శనివారం నిర్వహించిన ఎస్ఎల్-3, 4 కేటగిరీలో పురుషుల డబుల్స్ ఫైనల్ మ్యాచులో ఆయన తన జోడీ సుకాంత్ కదమ్‌తో 21-19, 21-16 సెట్లతో జగదీష్ దిల్లీ, నవీన్ శివకుమార్‌ల జోడీపై గెలుపొంది పసిడి పతకం గెలుచుకున్నాడు. అంతకుముందు రోజు సింగిల్స్ కేటగిరీలో ప్రమోద్ పసిడి పతకం సాధించిన సంగతి విదితమే. ఆరుసార్లు వరుసగా పసిడి పతకాలు గెలుచుకుని, టైటిల్ సొంతం చేసుకున్న ప్రమోద్‌కు సీఎం మోహన్‌చరణ్ మాఝి, క్రీడల మంత్రి సూర్యవంశీ సూరజ్‌లు అభినందనలు తెలుపుతూ 'ఎక్స్' వేదికగా పోస్టులు చేశారు.

పసిడి పతకాలతో ప్రమోద్ భగత్

సామూహిక భవనం ప్రారంభం

కాశీనగర్, న్యూస్‌టుడే: సమితిలోని గొరిబంధ పంచాయతీ ఖురిగాం గ్రామంలోని గౌరీ నీలకంఠేశ్వర ఆలయంలో శివరాత్రి సందర్భంగా శాసనసభ్యులు రూపేష్‌కుమార్ పాణిగ్రహి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆ ప్రాంగణంలో నిర్మించిన నూతన సామూహిక భవనాన్ని ప్రారంభించారు. ఈ భవనం ప్రారంభంతో ఇక్కడికి వచ్చే భక్తులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్. చిత్రంలో తదితరులు

జింక పిల్లను కాపాడిన యువకులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా మోహన ఠాణా పరిధిలోని మోహన ప్రాంతంలో ఉన్న సరస్వతి శిశు విద్యా మందిర్ పాఠశాల ప్రాంతానికి గాయాలతో చేరుకున్న జింకను స్థానిక యువకులు కాపాడారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రేంజర్ లక్ష్మీకాంత్ బిశోయ్ తెలిపిన వివరాల ప్రకారం ఆ ప్రాంతం అడివిలో సుమారు పది జింక పిల్లలు ఉన్నాయని, కుక్కలు జింకపై దాడి చేయగా తప్పించుకొని వస్తున్న సమయంలో స్థానిక యువకులు కాపాడినట్లు వివరించారు.

ప్రింటింగ్ ఆర్ట్స్‌పై కార్యశాల

జయపురం, న్యూస్‌టుడే: జయపురం విక్రమ్‌దేవ్ చారు కళల విద్యాలయం తరఫున ఆదివారం 'ప్రింటింగ్ ఆర్ట్స్'పై కార్యశాల నిర్వహించారు. సిమాద్రి మహరణా కళాభవనం ప్రాంతంలో అధ్యక్షుడు యుధిష్ఠర్ మాలిక్ నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో విద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పేపర్ కటింగ్, ఉడ్ కార్వింగ్ మొదలైన వాటి గురించి బోధించారు.

కార్యశాలలో పాల్గొన్న అతిథులు

ఆంధ్రా భవన్ పాఠశాల ఫౌండేషన్ డే

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ కొత్తకోళి ప్రాంతంలో ఉన్న ఆంధ్రా ఉన్నత మాధ్యమిక పాఠశాల(ఆంధ్రా భవన్) ఫౌండేషన్ డే ఆదివారం నిర్వహించారు. పాఠశాల మాతృ సంస్థ ఆంధ్ర యువజన సంఘం, పాఠశాల మేనేజింగ్ కమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల పతాకాన్ని ఎగరవేసి అభివాదం చేశారు. తెలుగు ప్రముఖులు డీడీ రావు, ఎల్ఆర్‌కే రావు, పూజా నాయుడు, ఎస్. సూర్యప్రకాశరావు, వి.శేషగిరిరావు, బల్ల శ్రీనివాసరావు, డా. కర్రి తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పతాకానికి అభివాదం చేస్తున్న తెలుగు ప్రముఖులు

ఒడిస్సీ నృత్యాభినయం

బ్రహ్మపురలో డైమండ్ ట్యాంకు రోడ్డులోని శ్రీ విరాట్ పోతులూరు వీర బ్రహ్మేంద్ర స్వామి మందిరంలో జరుగుతున్న వార్షిక నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఒడిస్సీ నృత్య ప్రదర్శన జరిగింది. ఆవరణలోని మండపంలో నిర్వహించిన ఇందులో ప్రముఖ ఒడిస్సీ నృత్య కళాకారిణి డాక్టర్ సోనాలి సాబత్ నృత్యాభినయాలతో ప్రేక్షకుల్ని అలరించారు. ఆమె శిష్య బృందం ప్రదర్శించిన నాట్యాలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

నృత్యంతో అలరించిన డాక్టర్ సోనాలి సాబత్

ధనుయాత్రకు శాశ్వత రంగమహల్ నిర్మాణం

బరగఢ్, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రసిద్ధి చెందిన ధనుయాత్ర మహోత్సవానికి శాశ్వత రంగమహల్ నిర్మాణాన్ని నిశ్రామణి స్కూల్ మైదానంలో చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.12 కోట్ల 79 లక్షల వ్యయం కానుంది. ఈ ప్రతిష్ఠాత్మక పనులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. శనివారం రాత్రి శుభ ముహూర్తంలో బరగఢ్ ఎమ్మెల్యే అశ్విని షడంగి పూజ చేసి రంగమహల్ నిర్మాణానికి శుభారంభం చేశారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అశ్విని షడంగి

ఘాట్ రోడ్డులో ప్రమాదం


ఘటన స్థలం వద్ద ప్రమాదాలకు గురైన ఆటోలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: మహేంద్రగిరి పర్వతంపై పూజలు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో గారబంద ఠాణా పరిధిలోని అర్సిలింగ్ గ్రామ ప్రాంత మలుపు వద్ద 3 ఆటోలు ప్రమాదానికి గురయ్యాయి. ఈ విషయమై ఠాణా అధికారి ప్రశాంత్ నిషిక వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ప్రమాదం జరిగిన విషయం వాస్తవమని, కానీ పోలీసు బృందం ఘటనా స్థలానికి చేరుకుని చూసే ఎవరూ లేరని ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుందో వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

EENADU Classifieds

JOBS

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ: 18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్సను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K ✆ 8520980099, 8520874499

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

బరగఢ్ జిల్లాలో అక్రమ ఇసుక మైనింగ్

బరగఢ్, న్యూస్‌టుడే: జగదల్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహుల్పాలి ఇసుక క్వారీలో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న ప్రధాన నిందితుడు షేక్ మహమ్మద్ వజీద్ అలియాస్ చుట్లా (44)ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం గత నెల జనవరి 17న మైనింగ్ ఆఫీసర్ అజయ్‌కుమార్ ప్రధాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగదల్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు వజీద్ మనోజ్ ప్రధాన్ అనే వ్యక్తికి లీజుకు ఇచ్చిన క్వారీలో పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా చట్టవిరుద్ధంగా మైనింగ్ చేస్తున్నట్లు తేలింది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

విద్యార్థి హఠాన్మరణం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట పోలీసు స్టేషన్ పరిధిలోని కళ్లికోట పట్టణంలో ఆదివారం ఉదయం నడకకు వెళ్లి తిరిగి వస్తూ మిహిర్ ప్రధాన్ (16) అనే బాలుడు హఠాన్మరణం చెందాడు. బాగలపూర్ గ్రామానికి చెందిన మిహిర్ కళ్లికోటలోని శ్రీ అరవింద పూర్ణాంగ విద్యా కేంద్రంలో పదో తరగతి చదువుతూ... అదే వసతి గృహంలో ఉంటున్నాడు. బోధకుడు, తోటి విద్యార్థులతో ఉదయం నడకకు వెళ్లి వసతి గృహానికి తిరిగి వస్తున్న సమయంలో మార్గమధ్యంలో బాలుడు హఠాత్తుగా రోడ్డుపై కుప్పకూలిపోయాడు. వెంట వచ్చిన వారు పిలిచినా స్పందించకపోవడంతో ఆటోలో కళ్లికోటలోని ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న బాలుడి కుటుంబీకులు ఆరోగ్య కేంద్రానికి చేరుకోవడంతో అక్కడ కొంత సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న కళ్లికోట ఠాణా అధికారి రమేష్‌కుమార్ ప్రధాన్, ఇతర సిబ్బంది, తహసీల్దారు డి.మలేశ్వరరావు తదితరులు ఆరోగ్య కేంద్రానికి చేరుకుని, ప్రజలకు నచ్చజెప్పిన అనంతరం పరిస్థితి శాంతించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, బాలుడి మృతదేహాన్ని పరీక్షకు ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షా నివేదిక అందితే మిహిర్ మృతికి గల కారణాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొన్నారు.

రెండు కార్లు ఢీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఇన్ఫో వ్యాలీ ప్రాంతంలో ఆదివారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొని రోడ్డుకు దూరంగా పొలాల్లోకి దొర్లిపోయాయి. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రిలో చికిత్సకు చేర్పించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శీతల గిడ్డంగిలో అగ్ని ప్రమాదం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సంబల్‌పూర్ జిల్లా బమరా పరిధిలోని శీతల గిడ్డంగిలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. విలువైన యంత్ర సామగ్రి కాలి బూడిదైంది. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. రూ.5 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని అంచనా. సంబల్‌పూర్, బమరా నుంచి వచ్చిన ఫైరింజన్లు అయిదు గంటలు శ్రమించి మంటలు నియంత్రణలోకి తెచ్చాయి.

ట్రక్కు బోల్తా: చోదకుడి మృతి

రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబీకులు

పరిహారం కోసం బాధితుల రాస్తారోకో

సిమిలిగుడ, న్యూస్‌టుడే: లక్ష్మీపూర్ సమితి కోడింగమాలి పర్వతం పై నుంచి శనివారం రాత్రి ఓ ట్రక్కు బోల్తా పడి చోదకుడు మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... కోడింగమాలి పర్వతం పైకి ఓ ట్రక్కు బాక్సైట్ లోడింగ్ కోసం వెళ్లగా అక్కడ అదుపుతప్పి 500 అడుగుల కిందకి పడడంతో చోదకుడు ప్రకాష్ మినక్య(35) మృతి చెందాడు. సహాయకుడు మున్నాకు గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు. లక్ష్మీపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. తిమ్మిజ్వాలాకు చెందిన ప్రకాష్ మృతి చెందడంతో బాధిత కుటుంబీకులు ఆదివారం మధ్యాహ్నం గనుల ప్రాంతానికి వెళ్లే మార్గంలో రాస్తారోకోకు దిగారు. పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితుల ఆందోళన కొనసాగుతూనే ఉంది. అధికారుల జాడ కనిపించలేదు.

పోలీసుల అదుపులో డ్రగ్స్ వ్యాపారి

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్‌లో అక్రమంగా డ్రగ్స్ వ్యాపారం చేస్తున్న ఔషధ దుకాణం వ్యాపారిని ఛత్తీస్‌గఢ్ పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. నిందితుడు స్థానిక జేఈఎల్ కాంప్లెక్స్‌లో ఔషధ దుకాణం వ్యాపారి వి.రామకృష్ణగా గుర్తించారు. బస్తర్ జిల్లా బోధఘాట్ ఠాణాధికారి లీలాధర్ రాథోడ్ ఆదివారం మీడియా సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం... డ్రగ్స్ వ్యాపారిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. గంగాముండా ప్రాంతంలో రాజేంద్రసింగ్ అనే వ్యక్తి అక్రమంగా 672 క్రోనోడోల్ మాత్రలు ఇవ్వటానికి కస్టమర్ కోసం ఎదురుచూస్తుండగా పోలీసులకు చిక్కాడు. అతడ్ని విచారించగా నవరంగపూర్‌లోని డీలరు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు. రాజేంద్ర దగ్గర రూ. 2,68,800 లక్షలు, రామకృష్ణ దగ్గర రూ.11 లక్షలు విలువచేసే 2,848 మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఇద్దరిని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బోధఘాట్ పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష

నవరంగపూర్, న్యూస్‌టుడే: అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్షను నవరంగపూర్ న్యాయస్థానం విధించింది. న్యాయమూర్తి మృత్యుంజయ్ మహారాణా తెలిపిన వివరాల ప్రకారం... నవరంగపూర్ ఠాణా పరిధిలో ఓ ప్రాంతానికి చెందిన మైనర్ బాలిక ఒంటరిగా వెళుతుండగా, అదే ప్రాంతానికి చెందిన దుర్యోధన్ హరిజన్ ఆమెను సమీప అడవిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. 2025 మార్చి 13న ఈ ఘటన జరగ్గా, బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో అతడ్ని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి శనివారం సాయంత్రం పోక్సో కోర్టులో 19 మంది సాక్ష్యులను విచారించిన న్యాయమూర్తి తుది తీర్పు ప్రకటించారు. నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ. 5 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ. 10 లక్షలు నష్ట పరిహారం అందజేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృత్యువాత

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా మత్తిలి సమితి ఉదులిబెడ గ్రామం దగ్గర టిప్పర్, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడం వల్ల ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే...ఆదివారం మత్తిలి గ్రామం ఉపర్‌సాహికి చెందిన కేశవ్‌గౌడ(24)తో పాటు అతని మిత్రుడు గోవిందపల్లి నుంచి స్వగ్రామానికి వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలోనే మృతి చెందగా ఆయన మిత్రుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మిత్రుడిని కొరాపుట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలంలో స్థానికులు రాస్తారోకో చేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకొని మత్తిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రజలకు నచ్చజెప్పడంతో నిరసన విరమించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నవరంగపూర్ జిల్లా టెంటులిఖుంటి ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దహన గ్రామానికి చెందిన శుభమ్ బెహర(27) శనివారం రాత్రి భోజనం చేసి గదిలో నిద్రపోయాడు. ఉదయం ఎంత సేపటికీ ఆయన బయటకు రాలేదు. తలుపు తట్టినా ఎలాంటి స్పందనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు పగులు గొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

రైలులో ఆకస్మిక తనిఖీలు

తనిఖీలు చేస్తున్న ప్రకాష్‌కుమార్

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి నిలిపి రైల్వే భద్రతా దళాల సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ప్రకాష్‌కుమార్ పండా ధవళి ఎక్స్‌ప్రెస్ రైల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇతనితో పాటు ఇతర అధికారులు రైల్వే ఎస్కార్ట్ పోలీసులు ఉన్నారు.

బిజద మహిళా అధ్యక్షుల ఎంపిక

సంజుక్త బెహర

పార్వతి మస్తీ

సిమిలిగుడ, పర్లాఖెముండి, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బిజద మహిళా అధ్యక్షురాలిగా పార్వతి మస్తీ నియమితులయ్యారు. ★ గజపతి జిల్లా బిజు మహిళా జనతాదళ్ అధ్యక్షురాలిగా సంజుక్త బెహరాను నియమిస్తున్నట్లు పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

గంజాయి స్వాధీనం-ఒకరి అరెస్టు

పోలీసుల అదుపులో నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయి

జయపురం, న్యూస్‌టుడే: అక్రమంగా రవాణా చేస్తున్న ద్రవ గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ ఉల్లాస్ చంద్రరౌత్ తెలిపిన వివరాల ప్రకారం... జాతీయ రహదారి-26పైన శనివారం ఓ యువకుడు సంచులతో అనుమానాస్పదంగా నిలబడి ఉండటంతో పోలీసులు తనిఖీలు చేశారు. ఆయన వద్ద ఒక కిలో 20 గ్రాముల ద్రవ గంజాయి, 6 కిలోల 200 గ్రాముల సాధారణ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బొయిపరిగుడ సమితి లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గోపబంధు ఖిల్(27)గా గుర్తించారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

(c) eenadu

పాండురంగ విగ్రహాలకు స్వాగతం

మశాఖపురంలో నిర్మిస్తున్న పాండురంగ ఆలయంలో కొలువుదీర్చనున్న విగ్రహాలు గ్రామానికొచ్చాయి. స్థానిక భక్తులు పూర్ణ కుంభాలు, మేళతాళాలతో ప్రత్యేక పూజలు చేపట్టి స్వాగతం పలికారు. త్వరలో ప్రతిష్ఠించనున్నారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

భక్తిశ్రద్ధలతో సంతోషిమాతకు పూజలు

అకరభద్రలో సంతోషిమాతకు శనివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి ఉపవాస దీక్షలు చేశారు. సాయంత్రం అమ్మవారికి తిరువీధి నిర్వహించారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

గీతారాణి ఇక లేరు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రముఖ గాయని గీతారాణి పట్నాయక్ (71) ఆదివారం రాత్రి కటక్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. కొన్నాళ్లుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుండేవారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలంలోని జాంద్రబైలు వద్ద కోళ్లఫారంలో పనిచేస్తున్న గౌరీశంకర్‌నాయక్(25) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆయన ఒడిశా రాష్ట్రం ఇందుపూర్ ఇమాలియాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కొన్నాళ్లుగా ఆయన కోళ్లఫారంలో పనులు చేస్తున్నాడు. శనివారం రాత్రి అనారోగ్యంగా ఉండడంతో మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. మందులు తీసుకొని కోళ్లఫారానికి వచ్చాడు. ఉదయానికి ఆయన మృతి చెంది ఉండటంతో అనుమానాస్పద స్థితి మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వే గేటును కొనసాగించాలి

చినభోగిల రైల్వే గేటు వద్ద గ్రామస్థుల ఆందోళన

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండలంలోని చినభోగిల కూడలి వద్ద రైల్వే గేటును కొనసాగించాలని గ్రామస్థులు శనివారం ఉదయం ఆందోళన చేపట్టారు. గేటు మూసివేయడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని, కూడలిలోని చిన్న తరహా దుకాణాలు మూత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు శ్రీనివాసరావు, జగన్నాథం, రామకృష్ణ, సీపీఎం నాయకులు వేణు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

350 మందికి వైద్య సేవలు

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: మంచి ఆహారపు అలవాట్లు ఆరోగ్యవంతమైన జీవితానికి మూలమని పట్టణానికి చెందిన వైద్యుడు డి.రామ్మోహనరావు అన్నారు. శనివారం ప్రభుత్వ ఎస్వీ డిగ్రీ కళాశాల, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ వైద్యులు, శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి సహకారంతో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 350 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. లయన్స్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ చలపతి రావు, బీవీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

రక్తం అందిస్తున్న దాతలు

పాలకొండ, న్యూస్‌టుడే: రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని సత్యసాయి విద్యాసంస్థల కరస్పాండెంటు దూబ వెంకటరమణ పేర్కొన్నారు. సత్యసాయి విద్యా సంస్థల ఛైర్మన్, పల్సస్ సంస్థ సీఈవో గేదెల శ్రీనుబాబు పుట్టినరోజు సందర్భంగా శనివారం పాలకొండ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయాసుపత్రిలో వంద మంది రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంటు కె.చిరంజీవి, వైద్యులు, కళాశాల ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గ్లూకోజ్ అనుకుని.. చీమల మందుతాగి..

పార్వతీపురం పట్టణం, పురపాలక, న్యూస్‌టుడే: గ్లూకోజ్ అనుకుని చీమల మందు తాగిన వ్యక్తి అస్వస్థతకు గురైన ఘటన పార్వతీపురం పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని గంటా వీధికి చెందిన పి.ఉపేంద్ర ఎలక్ట్రికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. కొన్నాళ్లుగా మానసిక పరిస్థితి బాగోలేక మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో గ్లూకోజ్ అనుకుని చీమల మందు తాగడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు గమనించి బాధితుడిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

సీలేరు శివాలయంలో ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

పూజలుచేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సీలేరు, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం సీలేరు శివాలయాన్ని ఒడిశాలోని నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మాఝీ, మల్కాన్‌గిరి ఎమ్మెల్యే నరసింహ మడకామిలు ఆదివారం సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఒడిశాలోని పప్పులూరులో అధికారిక కార్యక్రమానికి వెళ్తూ.. సీలేరులో కాసేపు ఆగారు. స్థానికులతో మాట్లాడారు. ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, శివ, లక్ష్మణ్.. ఎంపీ, ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు. ఎస్సై యాసీన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బహుళ నిష్ప్రయోజనం..!

- న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

వైకాపా హయాంలో పంటకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు నిల్వ చేసేందుకు బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు నిర్మించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నుంచి ఒక్కో భవనం నిర్మాణానికి రూ.40 లక్షలు వెచ్చించారు. పనులు పూర్తయినా ప్రారంభించక పోవడంతో వినియోగానికి దూరంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, కూటమి పాలకులు స్పందించి భవనాలను ప్రారంభించి రైతు సంఘాలకు అప్పగించాలని పలువురు కోరుతున్నారు.

కరకవలసలో నిరుపయోగంగా గోదాం

పాతపట్నం నియోజకవర్గంలో పరిస్థితి

◆ ఎల్ఎన్‌పేట మండలం మోదుగువలస పునరావాస కాలనీ, కరకవలస, కొర్లాం గ్రామాలలో పనులు పూర్తయినా ప్రారంభించలేదు. ◆ పాతపట్నంలో ఏఎంసీ సముదాయంలో పనులు చేపట్టగా బిల్లులు చెల్లింపుల్లో జాప్యంతో ముందుకు సాగలేదు. మిగిలిన ఐదు చోట్ల నిర్మాణాలు చేపట్టలేదు. ◆ హిరమండలం పరిధి ఎం.ఎల్.పురంలో నిర్మాణం చేపట్టారు. మిగిలిన నిర్మాణాలు సంబంధించి అడుగులు పడలేదు. ◆ మెళియాపుట్టి మండలంలో మెళియాపుట్టి, గొప్పిలి గ్రామాల్లో ప్రారంభానికి నోచుకోలేదు. అద్దెకు ఇస్తామని అధికారులు ప్రకటన చేసినా ఫలితం లేకుండా పోయింది. ◆ కొత్తూరు మండలంలో 8 కేంద్రాలకు ప్రతిపాదనలు పంపించినా ఒక్కటీ మంజూరు కాలేదు.

నెరవేరని లక్ష్యం

గోదాములు అద్దెకు ఇచ్చి పీఏసీఎస్‌లకు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా పనులు ప్రారంభించారు. నాబార్డు సమకూర్చిన నిధులతో భవనాల నిర్మాణాలకు పీఏసీఎస్‌లు ఆమోదం తెలిపాయి. కొన్ని

గుత్తేదారులు అప్పగించలేదు

పనులు ప్రారంభించిన కేంద్రాలు దాదాపుగా పూర్తయ్యాయి. గుత్తేదారులు భవనాలు అప్పగించలేదు. పీఏసీఎస్‌లకు అందిస్తే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.
- మురళీకృష్ణ, డీసీవో, శ్రీకాకుళం

ప్రత్యేక పర్యాటక రైల్లో కశ్మీర్ లోయ, వైష్ణోదేవి యాత్ర

విజయవాడ, న్యూస్‌టుడే: కశ్మీర్ అందాల వీక్షణతో పాటు వైష్ణోదేవి పుణ్యక్షేత్రాన్ని దర్శించాలనుకునే భక్తుల సౌకర్యార్థం ఏప్రిల్ 11న భారత్ గౌరవ్ రైలు పేరుతో ప్రత్యేక పర్యాటక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈ యాత్రలో కేంద్ర ప్రభుత్వం 33 శాతం రాయితీ కల్పిస్తోందన్నారు. టికెట్ల బుకింగ్ కోసం సెల్ ఫోన్ నంబర్ 93550 21516లో సంప్రదించాలని లేదా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని www.tourtimes.in సంప్రదించవచ్చన్నారు.

గమ్యం చేరే వరకు గుండెల్లో గుబులే..

పాచిపెంట మండలం మాతుమూరు, గొడవలస కూడలి నుంచి గిరిశిఖర గ్రామాల ముఖద్వారం వేటగానివలస వరకు 7 కి.మీ బీటీ రోడ్డు పూర్తిగా పాడైంది. దీంతో వాహనాలు నడపడానికి ఇబ్బందులు పడుతున్నామని చోదకులు వాపోతున్నారు. ఆటోలు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలు ఎన్నో. దారి పొడవునా గోతులు ఏర్పడ్డాయి. ఈ సమస్యపై జేఈ శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. రూ.3.13 కోట్లు మంజూరయ్యాయని, టెండర్ దశలో ఉందని తెలిపారు.

- న్యూస్‌టుడే, పాచిపెంట

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒడిశావాసి మృతి

ఇచ్ఛాపల్లి, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ కూలీ మృతిచెందాడు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని వేల్పుమడుగు బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బొలంగీర్ జిల్లా శికుత గ్రామానికి చెందిన పద మేక్ సాహు (57) వేల్పుమడుగు వద్ద ఉన్న ఇటుకల బట్టీలో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి భోజనం చేసేందుకు బట్టీ సమీపంలోని సిల్క్ ఫ్యాక్టరీ పక్కన ఉన్న హోటల్ వద్దకు వెళ్లాడు. రోడ్డు దాటే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందినట్లు ఇటుకల బట్టీ నిర్వాహకుడు మాదిరెడ్డి వీరసాహెబ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

బస్సు బోల్తా.. ఏడుగురికి గాయాలు

బోల్తాపడిన బస్సు

సాలూరు, న్యూస్‌టుడే: బస్సు అదుపుతప్పి బోల్తా పడి, ఏడుగురికి గాయాలైన ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ప్రత్యామ్నాయ మార్గంలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ అప్పలనాయుడు వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నవరంగ్‌పూర్ నుంచి ఓఎస్ ఆర్టీసీ బస్సు 23 మంది ప్రయాణికులతో విజయవాడకు శనివారం సాయంత్రం బయలుదేరింది. అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో సాలూరు పట్టణానికి చేరుకుంది. దండిగాంవద్ద సమీపంలో డ్రైవర్ ఏమరపాటుతో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని ప్రయాణికులను బయటకు తీశారు. సాలూరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రమాదంలో ఆ రాష్ట్రానికి చెందిన పల్లా నూకరాజు, ఖిలో బాబూరావు, సుకరంజన్ మండల్, మమతా రణా, దిలీప్‌రాయ్, దీపక్‌రాయ్, మాధవ్ ధాలికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న క్షతగాత్రులు

అన్నదానానికి రూ.లక్ష విరాళం

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానానికి విశ్రాంత హెచ్.ఎం. భాస్కరరావు, కృష్ణకుమారి దంపతులు రూ.లక్ష విరాళాన్ని శనివారం అందించారు.

పట్టించుకోం.. తప్పించుకోండి..!

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, మెళియాపుట్టి

ఇసుక, గంజాయి, పశువులు, సారా, మద్యం, నకిలీ వస్తువులు, కలప.. ఇవన్నీ ఒడిశా నుంచి జిల్లా మీదుగా అక్రమంగా రవాణా చేసే జాబితాలో నిత్యం కనిపిస్తాయి. నిషేధిత పదార్థాలు, వస్తువులు యథేచ్ఛగా తరలిస్తున్నా తనిఖీ చేసే వ్యవస్థ జిల్లాలో నిద్దరోతోంది.. దాదాపు 175 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి, 191 కిలోమీటర్ల సముద్ర తీరం, పాతపట్నం నుంచి అటు ఇచ్ఛాపురం వరకు ఒడిశా రాష్ట్రంతో 100 కి.మీ. సరిహద్దు కలిగి ఉన్నా అసలేం వస్తున్నాయో.. ఏం వెళ్తున్నాయో తెలుసుకోలేని స్థితి జిల్లాలో నెలకొంది. అక్కడక్కడ చెక్‌పోస్టులు పెట్టినా అక్కడ ఎవరూ కనిపించరు. ఉన్నా పట్టించుకోరు.

మెళియాపుట్టి: వసుంధర గ్రామం వద్ద నిర్మానుష్యంగా సరిహద్దు ప్రాంతంలోని తనిఖీ కేంద్రం

● ఒడిశా నుంచి సరకు రవాణాపై జిల్లాలో పర్యవేక్షణ లేకుండా పోయింది. వివిధ రకాల నిషేధిత పదార్థాలు, వస్తువులను అక్రమార్కులు యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రారంభంలో విస్తృతంగా తనిఖీలు చేసి తర్వాత వదిలేశారు. పోలీసులు, రెవెన్యూ, అటవీశాఖ, వాణిజ్యపన్నులు, ఆర్టీవో, ఆబ్కారీ, పౌరసరఫరాలు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖలు తనిఖీ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. కానీ అవేమీ లేకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

అనేక మార్గాలు..

పాతపట్నం నుంచి ఇచ్ఛాపురం వరకు ఒడిశాతో సరిహద్దు విస్తరించి ఉంది. ప్రస్తుతం మెళియాపుట్టిలో వసుంధర వద్ద ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్ట్, పాతపట్నం, ఇచ్ఛాపురంలోని పురుషోత్తపురం వద్ద పోలీసు తనిఖీ కేంద్రాలున్నాయి. ఇవి కూడా తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. పైడిభీమవరం వద్ద పూర్తిగా గేట్లెత్తేశారు. మెళియాపుట్టి, కొత్తూరు, పాతపట్నం, మందస, సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి, పలాస మండలాల్లో ఒక్కో మండలంలో సగటున పదికిపైగా గ్రామాల మీదుగా జిల్లాలోకి ప్రవేశించే ప్రధాన మార్గాలున్నాయి. వీటి ద్వారా అక్రమ రవాణాకు తెరలేపుతున్నారు.

● చెక్ పోస్టులను గాలికొదిలేసిన అధికారులు

కార్యాచరణ సిద్ధం.. జిల్లాలోని మూడు తనిఖీ కేంద్రాలను పటిష్ఠం చేస్తాం. సరిహద్దు నుంచి జిల్లాలోకి ప్రవేశించే ఇతర మార్గాలపై ఇప్పటికే దృష్టిసారించాం. ఆయా ప్రాంతాల్లోనూ చెక్ పోస్టుల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేశాం.
- కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ

అక్రమ రవాణా చేస్తున్నవి ఇవే..

- పరిమితికి మించి ఇసుక, గ్రానైట్, గ్రావెల్
- ఒడిశా నుంచి మద్యం, గంజాయి, ద్విచక్ర వాహనాలు, ధాన్యం
- ఇచ్ఛాపురం, పాతపట్నం నియోజకవర్గాల మీదుగా పశువులు
- బిల్లులు లేని ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులు
- కలప, ఎర్రచందనం, విలువైన నిషేధిత అటవీ ఉత్పత్తులు

దినదిన గండం.. వంతెనలకో దండం

శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బందులు

- న్యూస్‌టుడే, సీతంపేట, కురుపాం గ్రామీణం, వీరఘట్టం, పాలకొండ, జియ్యమ్మవలస

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వరదలకు కొన్ని, ఏళ్ల నాటివి కావడంతో మరికొన్ని పాడయ్యాయి. నత్తనడకన నిర్మాణాలు జరిగేవి కొన్ని అయితే, నిధులు మంజూరు కాక పూర్తిగా ఆగినవి మరికొన్ని.. ఇలా కారణం ఏదైనా ప్రజలకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అవసరమైన వంతెనల నిర్మాణాలకు చర్యలు చేపడితే కష్టాలు తీరుతాయని ఆశిస్తున్నారు. వేసవి నేపథ్యంలో పనులు చేపడితే వర్షాకాలానికి నదీ, గెడ్డలకు ఆనుకుని ఉన్న గ్రామాలకు అవస్థలు తీరుతాయి. ఆయా ప్రాంతాల్లో వారధుల నిర్మాణాలు, మరమ్మతులకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని అధికారులు అంటున్నారు.

ఎక్కడెక్కడంటే..

● సీతంపేట మండలం రేగులగూడకాలనీ-వెంపలగూడ మధ్య వంతెన తిత్లీ తుపాను దెబ్బకు కూలిపోయింది. రోడ్డు, వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. వంతెన పిల్లర్ల వరకు, రోడ్డు మెటల్ మిక్స్ వేసి వదిలేశారు. ఇబ్బందులు తప్పడం లేదు. పనులు ప్రారంభించామని, పూర్తి చేస్తామని డీఈ నాగభూషణరావు తెలిపారు. కీసరజోడు సమీపంలో బగ్గామర్రిపాడు గెడ్డపై ఉన్న పైపు కల్వర్టు పాడైంది. అంతర్ మండల రోడ్లు నిర్మించి.. వంతెన వదిలేశారు. భారీ వర్షాలొస్తే మరింత దెబ్బతినడంతోపాటు వాగు నీటి ప్రవాహం ఎక్కువై రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రతిపాదనలు పెట్టామని ఏఈ గౌరీశంకర్ తెలిపారు. చిన్నబగ్గ-బొండి పైపు కల్వర్టు పాడవడంతో రూ.4 కోట్లు మంజూరయ్యాయి. పనులు చేయాల్సి ఉంది.

కురుపాం మండలంలోని నీలకంఠాపురం వెళ్లే దారిలో వంతెన ఇలా..

కూలేలా ఉన్నా.. పట్టించుకోరా?

కురుపాం మండలం గుమ్మగదబవలస వద్ద వంతెన, మొండెంఖల్లు నుంచి నీలకంఠాపురం వెళ్లే దారిలో వంతెన శిథిలమైంది. జీఎల్ పురం, పార్వతీపురం, పాలకొండకు వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి.

- జియ్యమ్మవలస మండలం రావాడ వద్ద వట్టిగెడ్డ జలాశయం దిగువన కాజ్‌వేపై వంతెన లేక 35 గిరి శిఖర గ్రామాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
- పాలకొండ మండలం అన్నవరం వద్ద వంతెన, సీఎస్పీ రహదారిలో వీపీ రాజుపేట కూడలి వద్ద వంతెన శిథిలావస్థకు చేరుకుంది. జిల్లా కేంద్రానికి, ఒడిశాకు వెళ్లే మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఏ క్షణంలో అయినా కూలితే పెను ప్రమాదం తప్పదు.
- వీరఘట్టం మండలం దశుమంతపురం వద్ద వట్టిగెడ్డపై వారధి పాడైనా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

మలుపులు.. కానరాని సూచికలు

- న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని గ్రామీణ, తీరప్రాంత గ్రామాల రహదారులు చాలా వరకు మలుపులతో ప్రమాదకరంగా ఉన్నాయి. చాలా చోట్ల వేగ నియంత్రికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా ఇరువైపులా పెరిగిన పొదలతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. అక్కడక్కడ ఉన్న హెచ్చరిక బోర్డులపై వీటితో మూసుకుపోతున్నాయి.

తామాడపేట రహదారిలో ప్రమాదకర మలుపు

ప్రమాద ఘటనలు

● పూండి రెయ్యిపాడు మధ్య మలుపులో మూడేళ్ల కిందట ప్రైవేట్ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందారు. ● పూండి నుంచి బెండిగేటు వెళ్లే ప్రధాన రోడ్డులో బెండిగేటు సమీప మలుపు వద్ద ట్రాక్టర్-ద్విచక్ర వాహనం ఢీకొని కొండవూరుకు చెందిన కొరికాన చైతన్య అనే యువకుడు మృతిచెందాడు. ● ఇచ్ఛాపురం మండలం ఈదుపురం-జగన్నాథపురం మధ్య రోడ్డు మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో అరకభద్రకు చెందిన ఆర్మీ జవాన్ మృతిచెందాడు.

ఇదీ పరిస్థితి

✧ వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి నుంచి గుణపల్లి రహదారిపై ఎక్కడా సూచిక బోర్డులు కానరావు. ఎన్‌పీరోడ్డు నుంచి అమలపాడు, పూండి నుంచి కంబాలరాయుడుపేట, పీఎంపురం- పల్లివూరు, రెయ్యిపాడు రోడ్డు నుంచి కొండవూరు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. ✧ మందస మండలంలోని హరిపురం-బహుడపల్లి, హరిపురం కూడలి-రట్టి, రట్టి రోడ్డు-లింబుగాం, హరిపురం రోడ్డు-లోహరిబంద గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ✧ ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు-డొంకూరు, ఈదుపురం-జగన్నాథపురం, కొఠారి-బరంపురం, సోంపేట-కంచిలి-కవిటి, మకరంపురం మీదుగా కవిటి, జాతీయ రహదారి నుంచి కత్తివరం, శ్రీరాంపురం వెళ్లే రహదారులపై మలుపులు ఎక్కువగా ఉన్నాయి.

ప్రత్యేక దృష్టి

మలుపులతో ఉన్న ప్రధాన రహదారులపై దృష్టిసారించి సూచిక బోర్డులు, వేగ నియంత్రికలు ఏర్పాటుకు కృషిచేస్తాం. ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.
- జగదీశ్, జేఈ, ఆర్అండ్‌బీ శాఖ, పలాస

సుర్రుమంటున్నా చూడరు.. చిన్నారులున్నా కనికరించరు

వరండాలో మొండిగోడల మధ్య తరగతులు

పాచిపెంట మండలం గిరిశిఖర గ్రామం వై.గొట్టూరు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అవస్థలు ఇవి. ఇక్కడ ఒకటో తరగతి నుంచి అయిదు వరకు 39 మంది చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వసతిలేదు, కనీస సదుపాయాల్లేవు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద రూ.6.50 లక్షలతో పనులు ప్రారంభించారు. తర్వాత నిధులివ్వక స్లాబ్ వేయలేదు. వేరే దిక్కులేక మొండి గోడల నడుమ, చిన్న రేకుల షెడ్డు వేసుకుని అందులోనే చదువుతున్నారు. ఈ విషయమై ఎంఈవో సతీష్ కుమార్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

- న్యూస్‌టుడే, పాచిపెంట

స్లాబ్ లేకుండా ఇలా..

వాలుతోంది.. కూలుతుందేమో..

ఇచ్ఛాపురం కార్జీవీధి నుంచి బెల్లుపడకు వెళ్లే మార్గంలో ఉప్పాడవీధి కూడలిలో రణాసుర అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్తు స్తంభం ఇది. ఉప్పాడవీధి, పూరేటివీధి ప్రాంతాలకు వెళ్లే అనుసంధాన తీగలున్న స్తంభం వాలిపోయింది. పక్కనే మరో స్తంభం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అవసరమైన ప్రమాద నివారణ చర్యలు చేపడతామని విద్యుత్తు శాఖ ఏఈ గోవిందరావు తెలిపారు.

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



శిథిలం.. భయం భయం...



కంచిలి మండలం బొనమాలి ప్రాథమిక పాఠశాలకు ఆనుకుని ఉన్న పాత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. విరామ సమయాల్లో విద్యార్థులు ఆ పరిసరాల్లో ఆడుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పాత భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంఈవో 2 చిట్టిబాబు తెలిపారు. - న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

అర్ధాంతర పనులు.. రాకపోకలకు అవస్థలు

కంచిలి ప్రధాన రహదారి మఠం కంచిలి నుంచి జాతీయ రహదారి బలియాపుట్టుగ వరకు నిర్మాణం చేపట్టాల్సిన సీసీ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రోడ్డుపై క్రషర్ బుగ్గి, చిన్న రాళ్లు వేసి విడిచిపెట్టడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై పీఆర్ జేఈ ప్రవీణ్‌ను వివరణ కోరగా రూ.40 లక్షలతో అంచనాలు తయారీ చేసి పంపామని, నిధులు రాగానే పనులు పూర్తి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, కంచిలి

రోడ్డు పక్కనే చెత్త

పలాస మండలం కిష్టుపురం ప్రధాన వీధిలో రోడ్డు పక్కనే చెత్త వేస్తున్నారు. అక్కడే ఉన్న కాలువలో ప్లాస్టిక్ వస్తువులు, వాటర్ సీసాలు పడేస్తుండటంతో పరిసర ప్రాంతాలు అధ్వానంగా తయారయ్యాయి. గ్రామమంతా శుభ్రంగా ఉన్నా ఈ ఒక్క చోటే దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి, పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

సంజీవయ్య ఆశయ సాధనకు కృషి

పార్వతీపురం పట్టణం: ప్రజాసేవకు ప్రేరణగా నిలిచిన మహానేత దామోదరం సంజీవయ్య అని ఏఎస్పీ వెంకటేశ్వరరావు, డీబీసీడబ్ల్యూవో అప్పన్న అన్నారు. శనివారం జిల్లా పోలీసు, సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయాల్లో సంజీవయ్య జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, ఎస్బీ సీఐ రమణమూర్తి, ఏఆర్ ఆర్ఐ నాయుడు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరావు, అధికారులు

(c) eenadu

కోటప్ప కొండ వద్ద విద్యుత్తు వెలుగుల్లో భారీ ప్రభలు

అలంకరణలో త్రికోటేశ్వర స్వామి

ప్రభల తేజం.. ప్రణమిల్లిన జనం

కోటప్పకొండపై మారుమోగిన శివనామస్మరణ

వైభవంగా మహా శివరాత్రి తిరునాళ్ల

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే బృందం: మహాశివరాత్రి పురస్కరించుకుని త్రికూటగిరులు భక్తులతో కిటకిటలాడాయి. 'ఓం నమఃశివాయ... చేదుకో కోటయ్యా.. మము ఆదుకో రావయ్యా' అంటూ శివనామ స్మరణతో మారుమోగాయి. త్రికోటేశ్వరుడిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శనివారం అర్ధరాత్రి తర్వాత మొదట బిందెతీర్థంతో స్వామిని అభిషేకించారు. అనంతరం విభూది, పసుపు, కుంకుమ, గంధాలతో అభిషేకాలు చేశారు. త్రికోటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మునుపెన్నడూ లేనిరీతిలో శనివారం రాత్రి ఒంటి గంట నుంచే స్వామి దర్శనం కల్పించారు. మెట్ల మార్గం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు పసుపు కుంకుమ బొట్లు పెడుతూ మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై భారీ నంది విగ్రహానికి పూజలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం పుట్ట వద్ద నాగదేవతను దర్శించుకున్నారు. అభిషేక మండపాల్లో రుద్రాభిషేకాలు చేశారు. యాగశాలలో మేధా దక్షిణామూర్తి హోమాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రభలను కొండకు తీసుకొచ్చారు. అయిదు అడుగుల చిట్టి ప్రభ నుంచి 100 అడుగుల వరకు ఉన్న విద్యుత్తు ప్రభలు కనువిందు చేశాయి. కోటప్ప కొండతో పాటు జిల్లాలోని సత్రశాల, ద్వైద, అమరావతి, బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు పోటెత్తారు.

కొండపై కోలాహలం

క్యూలో భక్తుల రద్దీ

అభిషేక మండపంలో..

గోవాడలోని బాలకోటేశ్వరుడు

కోటయ్య సన్నిధికి తరలివస్తున్న ప్రభలు

త్రికోటేశ్వరుడి తొలి అభిషేకానికి విశిష్టత

నరసరావుపేట వ్యవసాయం: మహాశివరాత్రి నాడు శ్రీ త్రికోటేశ్వర స్వామికి చేసే తొలి అభిషేకానికి విశిష్టత ఉంది. తొలి అభిషేకం తర్వాత లింగోద్భవ కాలం వరకు మళ్లీ అభిషేకం చేయరు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలోనే స్వామికి అభిషేకాలు చేయిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువన సుమారు 2 గంటల సమయంలో మేళ తాళాలతో ఆలయ ప్రధాన అర్చక స్వామి బిందె తీర్థం తీసుకొని రాగా ఆయన వెంట ఎమ్మెల్యే అరవిందబాబు, ఈవో చంద్రశేఖర్, వంశపారంపర్య ధర్మకర్త మల్రాజు రామకృష్ణ కొండలరావు తదితరులు తోడ్కొని వచ్చారు. సంప్రదాయంగా అభిషేకాలు నిర్వహించారు. హారతి ఇచ్చి అలంకరణ చేశారు. తొలి పూజలో ఎమ్మెల్యేతో పాటు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పాల్గొన్నారు.

తీర్థం తీసుకొస్తున్న అర్చకులు, ఆలయ జమీందార్ రామకృష్ణ కొండలరావు, ఎమ్మెల్యే అరవిందబాబు

స్వామివారికి తొలి అభిషేక పూజ చేస్తున్న అర్చకులు

కదిలొచ్చారు కొండకు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. కొండ చుట్టూ దారులన్నీ భక్తజనంతో నిండిపోయాయి. చేదుకో కోటయ్యా... మమ్మాదుకోవయ్యా...హర హర శివ శివ... నామస్మరణతో కొండ మార్మోగింది. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచే భక్తుల రాక మొదలైంది. క్రమేణా భక్తుల తాకిడి పెరిగింది. కోటయ్యను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కొందరు భక్తులు త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం పాత కోటయ్య, పాప విమోచన స్వామిని దర్శించుకున్నారు. పెట్లూరివారిపాలెం రోడ్డు, నరసరావుపేట రోడ్డు, చిలకలూరిపేట రోడ్డు, కొండకావూరు రోడ్డు తదితర రహదారులన్నీ భక్తుల రాకతో నిండాయి. కొండ దిగువనున్న వినాయకస్వామి, సాయిబాబా దేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. నరసరావుపేట పట్టణ పరిధిలోని కేదారేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

పెట్లూరివారిపాలెం రోడ్డులో నడిచి వస్తున్న జనం

హరోంహరా.. అమరేశ్వరా

అమరావతి, న్యూస్‌టుడే: ఓంకార నాదం.. శంభో శివశంభో నామస్మరణతో అమరేశ్వరాలయం మార్మోగింది. మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం పరమశివుని దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 4 గంటలకే స్వామికి అభిషేకాలు ప్రారంభించారు. భక్తులు కృష్ణానది వద్ద ఘాట్‌లో జల్లు స్నానాలు చేశారు. అనంతరం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో అభిషేకాలు చేయించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈవో రేఖ, డీఎస్పీ వెంకటరమణ, సీఐ అచ్యుతయ్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సిఫార్సులతో హడావుడి.. సిఫార్సుల దర్శనాల పేరుతో వివిధ శాఖల సిబ్బంది చేసిన హడావుడితో సామాన్య భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారులు తమకు తెలిసిన ప్రతి ఒక్కరినీ సిఫార్సు చేస్తూ దర్శనాలకు తీసుకెళ్లారు. ఆ సమయంలో క్యూలైన్లు కదలక పోవడంతో రద్దీ పెరిగింది.

అమరేశ్వరస్వామి

అమరేశ్వర ఘాట్‌లో భక్తులు

ఇక ఓటరు సేవలు సులువు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: భారత ఎన్నికల సంఘం ఈసీఐనెట్ యాప్‌తో పాటు వెబ్ ఆప్షన్‌ని అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా ఎలక్ట్రానిక్ ఓటరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటరు కార్డులో చిరునామా సైతం మార్చుకోవచ్చు. మీ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంది. ఈ సేవలు పొందడానికి ముందుగా ఓటరు కార్డు నంబరులో మీ ఫోను నంబరు రిజిస్టర్ చేసుకోవాలి. గూగుల్ ప్లే స్టోర్‌లో నుంచి ఈసీఐనెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీనికి మీ చరవాణి నంబరు ఓటరు కార్డు నంబరుతో ఎన్నికల పోర్టల్‌లో నమోదై ఉంటే, సులువుగా లాగిన్ కావచ్చు. ఫోన్ నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దీని ద్వారా ఈసీఐనెట్ యాప్‌లోకి వెళ్లి కొత్త ఓటరు ఫారం-6 ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. చనిపోయిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించేందుకు దరఖాస్తు చేయవచ్చు. మీ అర్జీ ఏ దశలో ఉందో ట్రాక్ చేయడంతో పాటు కార్డులో తప్పులు సైతం సరిచేసుకొనే దానికి అవకాశం ఉంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన అనంతరం పోలింగ్ కేంద్రాలు ఇందులో నుంచే తెలిసే వీలు ఉంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల, బయోడేటా, అఫిడవిట్లు ఉంటాయి. ఎన్నికల ఫలితాలను తెలుసుకోవడానికి ఇందులో అవకాశం ఉన్నాయి.

సమయానికి చేరని ప్రభలు.. ముందుకు కదలని వాహనాలు

ఈనాడు, నరసరావుపేట, నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: ఏటా మాదిరే ఈ ఏడాదీ కోటప్పకొండ భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. భారీ ప్రభలు గ్రామాల నుంచి కొండకు ఆలస్యంగా బయలుదేరాయి. దీంతో కొండకు వెళ్లే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. ఆదివారం ఉదయం వరకు అంతా సవ్యంగా సాగుతుందని భావిస్తుండగానే మధ్యాహ్నానికి ఎక్కడికక్కడ ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. పెట్లూరివారిపాలెం వైపు నుంచి ప్రభలు బయలుదేరినప్పుడు వినుకొండ-నరసరావుపేట మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. చిలకలూరిపేట మండలం పురుషోత్తమపట్నం నుంచి కూడా ప్రభలు చాలా ఆలస్యంగా కొండకు బయలుదేరాయి. దీనివల్ల వాహనాలు ముందుకు కదల్లేకపోయాయి. కోటప్పకొండ-చిలకలూరిపేట మార్గంలో యూటీ నుంచి శారదా ఫార్మసీ కళాశాల వరకు ట్రాఫిక్‌తో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇక్కడ చిలకలూరిపేట నుంచి వచ్చే మార్గం ఒకటే కావడంతో ఎదురెదురు వాహనాలతో ఇక్కట్లు తప్పలేదు. ప్రభల కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేసినా ప్రభల్ని త్వరగా కొండకు చేర్చేలా చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ప్రభలు ఆలస్యంగా వెళ్లడంతోనే ట్రాఫిక్ ఇక్కట్లు వచ్చాయి. ఓ వైపు జిల్లా అధికారులు ప్రభలను ఒక రోజు ముందే తరలించాలని.. తిరునాళ్ల రోజే ప్రభలను తరలిస్తున్నామని నిర్వాహకుల పట్టుతో గంటల కొద్దీ సమయం ట్రాఫిక్ నిలిచి భక్తులు ఇబ్బందులు పడటం సర్వసాధారణమైంది.

కోటప్పకొండ వద్ద ట్రాఫిక్ నిలిచి..

మొరాయించిన బండి.. కదిలితేనే ప్రసాదమండి!

మహాశివరాత్రికి కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా త్రికోటేశ్వరస్వామిని దర్శించుకోవటానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులను తరలించేందుకు వీలుగా ఓ బ్యాటరీ వాహనాన్ని అధికారులు ఆలయం వద్ద సిద్ధం చేశారు. వృద్ధులను తరలించాల్సిన ఈ వాహనాన్ని ఆదివారం స్వామి వారి ప్రసాదాలను తరలించటానికి వినియోగించారు. ఆ వాహనం కొండపైకి ఎక్కలేకపోవటంతో అక్కడ విధులు నిర్వహించే కూలీలు తోసుకుంటూ ముందుకు నెట్టారు. వృద్ధులకు ఉపయోగకరంగా ఉండాల్సిన వాహనాన్ని ఇలా ప్రసాదాల తరలింపునకు వినియోగించడంపై పలువురు పెదవివిరిచారు. స్వామికి సకాలంలో ప్రసాదం చేరాలంటే ఇలా నెట్టాల్సిందేనని చర్చించుకున్నారు. - న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం

మహనీయుడు.. మరువలేని వేడుక

కమ్మవారిపాలెం ప్రభపై ఆకట్టుకున్న రామోజీరావు చిత్రం

ఈ ఏడాది కోటప్పకొండకు తరలించిన ప్రభలలో చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం ప్రభ ప్రత్యేకంగా నిలిచింది. ఈ ప్రభ ముందు భాగంలో విద్యుత్తు వెలుగుల మందిరం ఉండగా వెనుక రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు నిలువెత్తు ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం అందరినీ ఆకర్షించింది. ఫొటో కింది భాగంలో 'ఓ మహాగ్రంథం.. ఓ స్ఫూర్తి కేంద్రం.. కింగ్ ఆఫ్ మీడియా మొఘల్ శ్రీ రామోజీరావు' అని రాశారు. తెలుగు ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం పొంది, తుదిశ్వాస వరకు మచ్చలేని జీవితం గడిపి కారణజన్ముడిగా నిలిచిపోయిన రామోజీరావు ఫొటోను తమ ప్రభపై వేసుకోవడం గర్వంగా ఉందని నిర్వాహక కమిటీ పేర్కొంది. - న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

భక్తులకు కొత్త కష్టాలు

సుదూరంగా పార్కింగ్‌తో వృద్ధులు, మహిళల పాట్లు

ఈనాడు, నరసరావుపేట: ట్రాఫిక్ లేకుండా చేస్తామంటూ అధికారులు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. వీఐపీలకు మాత్రం దగ్గరగా పార్కింగ్ సౌకర్యం ఇచ్చి.. సామాన్యులను గాలికొదిలేశారు. నరసరావుపేట, వినుకొండ, అద్దంకి నుంచి వచ్చే బస్సులకు అయితే ఏకంగా రెండు కిలోమీటర్ల దూరంలో పార్కింగ్ ఇచ్చారు. ఇదివరకు ఘాట్‌రోడ్డు వరకు వెళ్లేవి. కానీ ఈసారి అచ్చమ్మపాలెం నగరవనం వద్దే ఆపేశారు. దీంతో కొండకు వచ్చేవారు.. తిరుగు పయనమయ్యేవారు రెండు కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. అంతదూరం నడవలేక వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పైగా ఎండలో వారి కష్టాలు వర్ణనాతీతం. పైగా ఈ మార్గంలో మంచినీళ్ల ప్యాకెట్ల పంపిణీ కూడా చేయలేదు.

దుమ్ముతో..: తిరుగు ప్రయాణంలో నరసరావుపేట, వినుకొండ వెళ్లే బస్సులను కొండకావూరు, కాకాని మార్గం వైపు మళ్లించారు. ఈ రోడ్డును బాగు చేయలేదు. బస్సులు, కార్లు వెళ్తున్న సమయంలో మొత్తం దుమ్ముధూళి రేగుతూ, గుంతల్లో కుదుపులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. వీఐపీ పార్కింగ్‌లు, వీఐపీ వాహనాల రాకపోకలకు అధికారులు ఇచ్చిన ప్రాధాన్యం సామాన్యులకు ఇవ్వలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొండపై బస్సులెక్కలేక..: రద్దీ తగ్గించాలనుకునే ప్రయత్నంలో చేసిన ప్రయోగం వికటించింది. తిరుగు ప్రయాణంలో బస్సులు ఎక్కాలనుకునే వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఏకమార్గం ఇవ్వకుండా.. మూడు క్యూలైన్లు ఏర్పాటు చేసి బస్టాండ్‌లోకి పంపించారు. ఓ పక్క ఎండ. మరోపక్క ఇరుకు క్యూలైన్లతో నానా అవస్థలు పడ్డారు. బస్సుల కోసం వెళ్లే వారంతా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

కొండపైకి చేరడానికి బస్సులు ఎక్కేందుకు బారులు

ఎండలో నడిచి వస్తున్న భక్తులు

పదో తరగతి విద్యార్థులకు అభయం

చదువులో వెనుకబడిన వారి కోసం సీజనల్ హాస్టళ్లు

న్యూస్‌టుడే, నరసరావుపేట, మాచర్ల

పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాయుత కృషి చేస్తోంది. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది. చదువులో పూర్తిగా వెనకబడిన.. పరీక్షకు ఫీజుకట్టి చాలా రోజులుగా బడికి గైర్హాజరవుతున్న వారిని గుర్తించింది. సీజనల్ హాస్టళ్లలో పరీక్షలు ముగిసే వరకు వారిని ఉంచి ప్రత్యేక తరగతులు బోధించేలా చర్యలు ఆరంభించింది. జిల్లాలో ఇప్పటికే కొన్నిచోట్ల సీజనల్ హాస్టళ్లు ప్రారంభమయ్యాయి. ఇంట్లో ఉంటే చరవాణులు, బయటకు వెళ్తే స్నేహితులతో సమయం వృధా చేసుకుంటున్నారని బిడ్డలపై బెంగ పెట్టుకున్న తల్లిదండ్రులు రెసిడెన్షియల్ బోధన మంచి ఆలోచన అంటున్నారు. పిల్లల్ని వెన్నుతట్టి వారు చదివిస్తున్నారు.

❖ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థుల కోసం సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. ఈ విధానంతో ఆర్థికంగా భారమైనప్పటికి పదిలో ఉత్తీర్ణతతో ఉన్నత విద్యాభ్యాసనపై పిల్లల్లో ఉత్సాహన్ని రేకెత్తించాలనే సదుద్దేశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1600 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయనుంది. జిల్లాలో 14,805 మంది పదో తరగతి విద్యార్థులకుగాను 1,586 మంది అనుత్తీర్ణులయ్యే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. వీరితోపాటు బడికి చాలా రోజులుగా గైర్హాజరవుతున్న వారిని కలుపుకొని 2 వేల మంది సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశారు. అయితే 746 మంది విద్యార్థుల తల్లిదండ్రులు దీనికి అంగీకారం తెలిపారు. మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా క్రమంగా ముందుకొస్తున్నారు.

❖ బాలికల కోసం అచ్చంపేట, బెల్లంకొండ, మాచర్ల, వినుకొండ, నరసరావుపేట కేజీబీవీల్లో రెసిడెన్షియల్ బోధనకు ఏర్పాట్లు చేశారు. వాటికి పర్యవేక్షకులను కేటాయించారు. బాలుర కోసం వినుకొండ ఎస్టీ సంక్షేమ వసతి గృహం, విజయపురిసౌత్, సత్తెనపల్లి పట్టణంలోని జడ్పీ సుగాలి ఉన్నత పాఠశాల, నరసరావుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశారు. పిడుగురాళ్లలోనూ బాలుర కోసం హాస్టల్ నడపనున్నారు. వీటికి కూడా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కేటాయించారు. శివరాత్రి తర్వాత పూర్తిస్థాయిలో వీటిని నడిపేలా ఏర్పాట్లు చేశారు. పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత లక్ష్యంగా సీజనల్ హాస్టళ్లను నడుపుతున్నట్లు డీఈవో రామారావు, ఏఎంవో పూర్ణ తెలిపారు.

సీజనల్ హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థినులు

ఆధార్ నమోదుకు కదలాలోయ్

నేటి నుంచి 20 వరకు ప్రత్యేక శిబిరాలు

సత్తెనపల్లి, గాంధీనగర్ (పిడుగురాళ్ల), న్యూస్‌టుడే: సంక్షేమ, అభివృద్ధి పథకాలతోపాటు విద్యాలయాల్లో ప్రవేశాలు, వివిధ రాష్ట్ర, జాతీయస్థాయి పరీక్షల్లో పాల్గొనేందుకు ఆధార్ ప్రామాణికంగా మారింది. ఆధార్ లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న విద్యార్థి విశిష్ట గుర్తింపు సంఖ్య (అపార్) అందుకోలేకపోయిన విద్యార్థులు జిల్లాలో వేలాదిమంది ఉన్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ నవీకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు సోమవారం నుంచి ఈ నెల 20 వరకు ప్రత్యేక శిబిరాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

86 సచివాలయాల్లో.. మొన్నటివరకు ఆధార్ శిబిరాలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో నడిచాయి. పరీక్షల నేపథ్యంలో కేవలం కిట్లు అందుబాటులో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లోనే నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 538 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. 86 సచివాలయాల్లో కిట్లు అందుబాటులో ఉన్నాయి.

ఎక్కడెక్కడంటే.. నరసరావుపేట ప్రశాంతినగర్-1, మల్లమ్మ సెంటర్-1, లయన్స్‌క్లబ్ సచివాలయాల్లో రెండు, నకరికల్లు మండలం గుండ్లపల్లి, పిడుగురాళ్లలో చెరువుకట్ట బజారు, సంజీవరెడ్డినగర్, గాంధీనగర్, సత్తెనపల్లిలో రంగాకాలనీ, భవిరిశెట్టివారివీధి, వినుకొండలో శాలివాహన నగర్-2, లాయర్ స్ట్రీట్-2, వెల్దుర్తిలో పట్లవీడు, ఉప్పలపాడు, రొంపిచర్లలో నలగార్లపాడు, రొంపిచర్ల, విప్పర్లరెడ్డిపాలెం, చిలకలూరిపేటలో డైక్‌మెన్‌నగర్-2, సుగాలికాలనీ-1, వేలూరు రోడ్డు, అమరావతిలో దిడుగు, వైకుంఠపురం, మాచర్లలో రోప్‌వేకాలనీ, పూర్ణయ్యషెడ్ బజార్, లింగబలిజ కాలనీలోని సచివాలయాల్లో శిబిరాలు నడవనున్నాయి.

ఈ పత్రాలు తప్పనిసరి.. 5-7, 15-17 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఇప్పటివరకు ఆధార్ నవీకరించుకోని వారు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో ఇలాంటివారు 41 వేల మంది ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటివరకు ఆధార్ నమోదు చేయించుకోని వారికి కూడా అవకాశం కల్పిస్తున్నారు. కొత్తగా ఆధార్ నమోదుకు జనన ధ్రువపత్రం, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు అవసరం. నవీకరణకు పాత ఆధార్ తీసుకెళ్తే సరిపోతుంది. మార్పు, చేర్పులకు పుట్టిన తేదీ ధ్రువపత్రం, పదో తరగతి ఒరిజినల్ మార్కుల జాబితా, చిరునామా నిర్ధారణ ధ్రువపత్రాలు అవసరమవుతాయి.

ఆధార్ నమోదు చేయించుకుంటున్న విద్యార్థి

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
పుట్టినరోజు శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

(c) eenadu

భక్తుల వసతికి రూ.10 లక్షల విరాళం

మంత్రి గొట్టిపాటి, కలెక్టర్ కృతికాశుక్లాకు చెక్కు అందిస్తున్న క్వారీ అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: మహాశివరాత్రికి కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం గురిజేపల్లికి చెందిన శ్రీ త్రికోటేశ్వర గ్రానైట్ క్వారీ అసోసియేషన్ రూ. 10లక్షల విరాళాన్ని ఆదివారం అందించారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో కలెక్టర్ కృతికాశుక్లాకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ క్రమంలో క్వారీ అసోసియేషన్ సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి దాతృత్వం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. దాతలను కలెక్టర్ అభినందించారు.

వాహనాలకు ప్రవేశం లేదంటూనే.. కొండపైకి అనుమతి

ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్‌జాం

ఈనాడు, నరసరావుపేట: కోటప్పకొండపై అసలే చిన్న ఘాట్‌రోడ్డు.. దానికి వచ్చిపోయే ఆర్టీసీ బస్సులతో రద్దీ ఉన్నా రాజకీయ నాయకుల కార్లకు ప్రవేశం కల్పించారు. ఘాట్‌రోడ్డుపై కార్లు, ద్విచక్ర వాహనాలకు ప్రవేశం లేదని.. ఎవరైనా సరే ఆర్టీసీ బస్సుల్లోనే కొండపైకి చేరుకోవాలని కలెక్టర్, ఎస్పీ ప్రకటించారు. శివరాత్రి రోజు మాత్రం చూసీచూడనట్లు వదిలేశారు. ఫలితంగా భారీగా కార్లు ఘాట్‌రోడ్డుపై నుంచి కొండకు చేరుకున్నాయి. కొండమొత్తం ఇవే ఆక్రమించాయి. కొండపై పార్కింగ్ ప్రదేశం లేదు. తిరనాళ్లరోజు భక్తులతో నిండిపోతుంది. అందుకే ఏటా శివరాత్రిరోజు కేవలం ఆర్టీసీ బస్సులకే ప్రవేశం కల్పిస్తారు. కానీ ఈసారి కార్లు ఎక్కువ కనిపించాయి. పదుల సంఖ్యలో రావడంతో ఘాట్‌రోడ్డుపై ట్రాఫిక్ సమస్యకు కారణమయ్యాయి.

అధికారుల నిర్లక్ష్యం.. అల్లాడిన భక్తులు

నరసరావుపేటసెంట్రల్, టౌన్, యడ్లపాడు, చిలకలూరిపేట గ్రామీణ, పట్టణం: ఆదివారం రాత్రి భక్తుల రద్దీ పెరగడంతో రహదారులు స్తంభించిపోయాయి. కార్లు, ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, ఆటోల్లో తరలివచ్చిన భక్తులు త్వరగా కొండకు చేరుకోవాలని నిబంధనలు అతిక్రమించారు. పోలీసుల నియంత్రణ లేకపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నరసరావుపేట నుంచి యల్లమంద, గురవాయపాలెం మీదుగా కోటప్పకొండకు చేరుకునే మార్గంలో చిలకలూరిపేట 10ఆర్ మేజర్ ఎన్ఎస్పీ కెనాల్ నుంచి 3 కి.మీ. దూరం ట్రాఫిక్ స్తంభించింది. వీఐపీలు వచ్చిన సమయంలో మాత్రమే పోలీసులు హడావుడి చేసి తరువాత మిన్నకుండటంతో రాత్రి 10 తర్వాత భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆలయ ప్రవేశద్వారం వద్ద నందీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

కేదారేశ్వర స్వామి పూజలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు

స్వామిని దర్శించుకుంటున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, వంశపారంపర్య ధర్మకర్త మల్రాజు రామకృష్ణ కొండలరావు

అమరేశ్వరుని దర్శనానికి వెళుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మేడిమల్లి బాలాజి

సర్వరూపాయా.. కరుణచూపయ్యా

శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు

పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

రొంపిచర్ల, నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలకు అండగా నిలవాలని త్రికోటేశ్వర స్వామిని కోరుకున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మహాశివరాత్రి పురస్కరించుకొని స్వామికి హోం మంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతో కలిసి పట్టు వస్త్రాలు సమర్పించి ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం.. కోటప్పకొండపై స్వామి దర్శనానికి వచ్చిన వారికి స్వచ్ఛంద సంస్థలు మంచి నీరు, బిస్కెట్లు, పాలు, అల్పాహారం అందించటం అభినందనీయమని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి దేవుని అండ ఉండాలని స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. సాయంత్రం వేళ భారీ ప్రభల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ, కలెక్టర్ ఏర్పాట్లు చేశారని, భక్తులు పోలీసులకు సహకరించాలన్నారు.

వైకాపా హయాంలో హిందువుల మనోభావాలకు తిలోదకాలు.. మహాశివరాత్రి రోజున త్రికోటేశ్వర స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఆన్‌లైన్ టికెట్లు కొని దర్శనం చేసుకున్నాం. టైం స్లాట్ ప్రకారం దర్శనాలు జరుగుతున్నాయి. ప్రైవేటు వాహనాలు పైకి రాకుండా పోలీసులు చేపట్టిన చర్యలు అభినందనీయం. గత ప్రభుత్వం హిందువుల మనోభావాలను కాపాడలేకపోయింది. అంతర్వేదిలో రథం తగలబెట్టినా చర్యలు తీసుకోలేదు. అటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు వద్దనుకున్నారు. కూటమి ప్రభుత్వం అన్ని మతాల ప్రజల మనోభావాలను కాపాడుతూ పాలన చేస్తుందన్నారు.

మెట్ల మార్గంలో భక్తుల రద్దీ

ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇళ్లకు చేరాలి.. పవిత్ర పర్వదినాన అత్యంత శక్తిమంతుడైన పరమశివుని దర్శనం, ఆశీస్సులు స్వీకరించటంతో మనసు భక్తి భావనతో పరవశించిందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. స్వామిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఈ ఏడాది భక్తులకు వీలుగా ఆన్‌లైన్ టికెట్ వ్యవస్థ అందుబాటులోకి తెచ్చామన్నారు. తిరునాళ్లకు వచ్చే వారు తగు జాగ్రత్తలు వహిస్తూ, నిబద్ధతతో స్వామిని దర్శించుకుని, ఆనందోత్సాహాలతో క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలన్నారు.

ప్రజలు గమనించాలి.. త్రికోటేశ్వరుని ఆశీస్సుల కోసం లక్షలాది మంది భక్తులు వస్తున్నారని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో ఏర్పాట్లు, ఇప్పుడు చేపట్టిన చర్యలను ప్రజలు గమనించాలన్నారు.

స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు.. త్రికోటేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ కె.వి.సురేష్‌రెడ్డి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ జేవీ సుజాత, జస్టిస్ మండల కిరణ్మయి, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయికల్యాణ్‌చక్రవర్తి, స్థానిక ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆశీర్వాదం పాల్ దర్శించుకున్నారు.

తరలివచ్చిన రాజకీయ ప్రముఖులు.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు, మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు దర్శించుకున్నారు.

అమరేశ్వరుని సేవలో..

అమరావతి: నవ్యాంధ్ర రాజధాని అమరావతికి అమరేశ్వరుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అమరేశ్వరున్ని ఆయన దర్శించుకున్నారు. అలాగే ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మేడిమల్లి బాలాజి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజ

కోటప్పకొండ వద్ద రద్దీగా జనం

ఎమ్మెల్యే పుల్లారావు దంపతులు

స్వామి దర్శనానికి వస్తున్న ఎంపీ లావు కుటుంబ సభ్యులు, మక్కెన తదితరులు

చేతులు శుభ్రం.. ఆరోగ్యం భద్రం

★ రేపు నులిపురుగుల నివారణ దినోత్సవం

★ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో చిన్నారులకు మాత్రలు పంపిణీ

రొంపిచర్ల, నరసరావుపేట వ్యవసాయం, సత్తెనపల్లి

గోడపత్రిక ఆవిష్కరణలో కలెక్టర్ కృతికాశుక్లా, జిల్లా అధికారులు

ఒక్క మాత్ర చిన్నారి ఆరోగ్య భవిష్యత్తుకు శ్రీరామరక్ష. ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి కాపాడి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తుంది. నులిపురుగులు చిన్నారులను శక్తి హీనులుగా మార్చేస్తున్నాయి. అన్ని విధాల ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తాయి. ఇలాంటి సమయంలో వాటి నివారణే ప్రధాన ధ్యేయంగా జిల్లాలో ఈనెల 17న అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో నులిపురుగుల నివారణ (నేషనల్ డీవార్మింగ్ డే) దినోత్సవం నిర్వహించాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశించారు. 1-19 ఏళ్ల వయస్సు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నారు. అనివార్య కారణాలతో ఈనెల 17న మాత్రలు అందని విద్యార్థులకు 24న పంపిణీ చేస్తారు.

4.94 లక్షల మందికి పంపిణీ: జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు వయసు కలిగినవారు 4,94,845 మంది ఉన్నారు. వీరందరికి ఈ నెల 17న అల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నరసరావుపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. నులిపురుగుల నివారణలో అందరూ భాగస్వామ్యులు కావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ జిల్లా సమన్వయకర్త డాక్టర్ రాజరాజేశ్వరి తెలిపారు.

అనారోగ్య లక్షణాలివే.. : నులిపురుగులు కడుపులోకి చేరి పలు రకాల వ్యాధులు వ్యాపింపజేస్తాయి. చిన్నారులు ఎక్కువగా మట్టిలో ఆడుకోవడం, చేతులు పరిశుభ్రం చేసుకోకపోవడంతో ఈ పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఫలితంగా చిన్నారుల ఆరోగ్యం క్షీణిస్తుంది. ఇవి సన్నటి దారాల్లా ఉండి పేగుల గోడలకు అంటిపెట్టుకొని రక్తాన్ని పీల్చివేస్తాయి. తిన్న ఆహారం వంట పట్టకుండా చేస్తాయి. ఇవి ప్రధానంగా ఏలిక పాములు, నులిపురుగులుగా శరీరంలో ఉంటున్నాయి. 50శాతానికి పైగా చిన్నారులు ఏదో ఒక రకం నులిపురుగుల బారిన పడి రక్తహీనత, అనారోగ్యానికి గురవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. నులిపురుగులతో రక్తహీనత, నీరసం, ఆయాసం, ఎదుగుదల లోపించడం, మల, మూత్ర విసర్జన ప్రదేశాల్లో దురద, చర్మంపై ఎర్రని దద్దులు, దురద రావడం, బరువు తగ్గడం, పోషకాహార లోపం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, మలంలో రక్తం పడడం, జ్వరం, తలనొప్పి, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయి.

మాత్రలను ఎలా వేసుకోవాలంటే..: మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత ఆల్బెండజోల్ మాత్ర వేయాలి. 1 నుంచి 5 ఏళ్లలోపు ఉన్న వారికి సగం మాత్ర గ్లాసు నీళ్లలో కరిగించి తాగించాలి. 6నుంచి 19 ఏళ్లలోపు వారు ఒక్క మాత్రను మింగాలి. మధ్యాహ్న భోజనం అయిన అరగంట తరువాత ఈ మాత్రలు వేసుకోవాలని వైద్యులు సూచించారు.

గ్రిడ్ దాటేందుకు మూడున్నర గంటల సమయం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : చిలకలూరిపేట ప్రాంతం నుంచి కోటప్పకొండకు తరలివెళ్లిన విద్యుత్తు ప్రభలు యూటీ వద్ద నిలిచిపోయాయి. ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య గ్రిడ్ దాటేందుకు అధికారులు సమయం కేటాయించారు. అయితే ప్రభల నిర్వాహకుల కోలాహలం, వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ప్రభలు దాటేందుకు మూడున్నర గంటలకు పైగా సమయం పట్టింది. ప్రతి ప్రభ ముందు ఆ ఊరి నుంచి తరలివచ్చిన జనసందోహం కేరింతలు, డీజే చప్పుళ్లు, తప్పెట్లు, తాళాలతో ఆ ప్రాంతం మార్మోగింది. యువతీ, యువకులు పంబతాళ్లు పట్టుకుని ఎండను సైతం లెక్కచేయకుండా ప్రభలు లాగారు.

యూటీ వద్ద ప్రభ గ్రిడ్ దాటుతోందిలా..

జేసీబీతో ప్రమాదకర ఫీట్లు

బైక్‌లను గాల్లో ఎగిరించి స్టంట్లు, ఫీట్లు చేయడం చూశాం. ఇక్కడ మాత్రం ఏకంగా జేసీబీతో ప్రమాదకరస్థాయిలో ఫీట్లు చేశారు. టైర్లను గాల్లో ఎగిరించి చుట్టూ తిప్పుతూ అతి వేగంతో స్టంట్లు చేశారు. నరసరావుపేట మండలం కాకాని గ్రామ పరిధిలో ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగింది. కోటప్పకొండకు ప్రభను తీసుకెళ్తున్న సమయంలో డీజే సౌండ్ల మధ్య జేసీబీని గాల్లో ఎగిరించి ప్రమాదకరంగా చుట్టూ తిప్పారు. అక్కడే జనం గుమిగూడి నృత్యాలు చేశారు. ఆన్‌లైన్లో షేర్ చేసిన వీడియోపై విమర్శలు వెల్లువెత్తాయి.

-ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

జోరుగా కోడి పందేలు

రూ.లక్షల్లో చేతులు మారిన నగదు

నరసరావుపేట వ్యవసాయం: మహాశివరాత్రి పురస్కరించుకొని రొంపిచర్ల మండలంలో ఆదివారం కోడిపందేలు, ఇతర జూద క్రీడలు యథేచ్ఛగా నిర్వహించారు. రొంపిచర్ల మండలం విప్పర్ల, కొనకంచివారిపాలెం సమీపంలో పొలాల మధ్య టెంట్లు వేసి బరి ఏర్పాటు చేసి కోడిపందేలు నిర్వహించారు. బరుల వద్ద కోతముక్క, గుండాట వంటి జూద క్రీడల్లో రూ. లక్షల్లో నగదు చేతులు మారింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి జూదరులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పందేల వద్ద నిర్వాహకులు సకల ఏర్పాట్లు చేశారు. రాజకీయ నేతల ఆధ్వర్యంలోనే అంతా జరిగింది. దీంతో పోలీసులు ఇతర అధికారులు కన్నెత్తి చూడలేదు. మహిళలు కూడా పందేల్లో పాల్గొనేందుకు ఆసక్తిగా తరలివచ్చారు.

కోడిపందేల వద్ద జూద క్రీడలు

నెల్లూరు బాలురు.. చిత్తూరు బాలికల విజయం

బాలికల జట్టుకు జ్ఞాపిక అందిస్తున్న అతిథులు

గుడిపూడి(సత్తెనపల్లి గ్రామీణ): అంతర్ జిల్లాల షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సత్తెనపల్లి మండలం గుడిపూడిలో ఆదివారం ముగిశాయి. రెండ్రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల జట్ల సభ్యులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు ప్రథమ, పల్నాడు జట్టు ద్వితీయ, ఎన్టీఆర్ జిల్లా జట్టు తృతీయ స్థానాలను సాధించాయి. బాలికల విభాగంలో చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాల జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు ఆదివారం అందించారు. పోటీల పరిశీలకుడు, క్రీడా ప్రాధికార సంస్థ అధికారి నరసింహారెడ్డి, సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, తెదేపా నేతలు గజానన, అప్పారావు, పుల్లారావు పాల్గొన్నారు.

స్పృహ తప్పిన బాలికకు సత్వర వైద్యం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా మెట్ల మార్గంలో కొండకు చేరుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మెట్ల మార్గం కిటకిటలాడింది. నందిని అనే పదేళ్ల బాలిక స్పృహతప్పి పడిపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది వెంటనే బాలికను కింద ఉన్న ప్రాథమిక వైద్యశాలకు తరలించి వైద్య చికిత్స అందించారు. బాలిక క్షేమంగానే ఉన్నట్లు పోలీసులు, వైద్యులు తెలిపారు.

చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు(గోరంట్ల): చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి రావడంతో తేలికగా ఉపశమనం పొందవచ్చని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్డులో స్కిన్ పర్ఫెక్ట్ హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఆసుపత్రి గుంటూరుకు రావడం హర్షణీయమన్నారు. డాక్టర్ మన్నె సింధూర మాట్లాడుతూ చర్మ సమస్యలకు లేజర్ టెక్నాలజీ, ఇమ్యునోథెరపి, కాస్మెటిక్, రికన్‌స్ట్రక్టివ్ విధానాలతో కూడిన చికిత్సలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. చర్మ వ్యాధులకు తక్కువ సమయంలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, ఉగ్రనరసింహారెడ్డి, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రవికుమార్.పి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకరరావు, రాష్ట్ర టెక్నాలజీ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, నగర డిప్యూటీ మేయర్ సజీల, వైద్యులు గొట్టిపాటి లక్ష్మి, ఉప్పుటూరి అంజిత్, ఉప్పుటూరి హేమంత్, లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

కాలువలో యువకుడి గల్లంతు

నరసరావుపేట సెంట్రల్: మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన కోటప్పకొండ తిరునాళ్లలో విషాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. ప్రకాశం జిల్లా వలేటివారిపాలెం మండలం సింగమనేనిపల్లి గ్రామం నుంచి అయిదుగురు యువకులు ఆదివారం తిరునాళ్లకు వచ్చారు. మార్గంమధ్యలో నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం వద్ద చిలకలూరిపేట మేజర్ కాలువలో స్నానానికి దిగారు. నీటి ఉద్ధృతికి ప్రమాదవశాత్తు వారిలో రోహిత్ (20) అనే యువకుడు కొట్టుకుపోయాడు. అతని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. స్నేహితుడు శ్రీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసరావుపేట గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు బాలికలు సురక్షితం

నరసరావుపేట వ్యవసాయం: మహాశివరాత్రి పురస్కరించుకొని పుణ్య స్నానం ఆచరించేందుకు నలుగురు బాలికలు కొండ దిగువన చిలకలూరిపేట మేజర్ కాలువలో దిగారు. లోతు అంచనా వేయటంలో విఫలమై నీటిలో మునిగి పోయారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నూజండ్ల: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పలపాడు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ములకలూరుకు చెందిన **మందా శాంసన్ (27)** మిత్రుడు సురభి చిన్నతో కలిసి వినుకొండ నుంచి తమ గ్రామానికి వస్తుండగా ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం భీమవరానికి చెందిన సోముబత్తిన ధనుంజయ కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లడానికి మరియమ్మతో కలిసి వస్తుండగా ఉప్పలపాడు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. శాంసన్ అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనాలపై ఉన్న మిగిలిన వారికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణారావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 116, 123, 135 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 230.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

REAL ESTATE

PLOT FOR SALE

MANGALAGIRI

అమ్మకానికి ప్లాట్లు- మారుతీ నగర్, నవలూరు, మంగళగిరి. 432 చ.గ.లు. క్లియర్ టైటిల్. సంప్రదించండి: 99638 89783, 70328 06709.

SHOP FOR SALE

GENERAL

243 sq.ft shop in upcoming biggest mall in guntur for sale with immediate 25000/- Rent. Call: 9573454266

TO LET

IJM రెయిన్‌ట్రీపార్క్‌లో 5B/R లగ్జరీ ట్రిప్లెక్స్ విల్లా అద్దెకు. విశాలమైన లేఔట్, ప్రైవేట్ టెర్రస్ 24x7 భద్రత, NH5,నంబూరు VJA-GNT హైవే. 77024 75525

JOBS

LADY Staff Wanted. B.Tech/DegreeStudy Abroad Consultancy, Sal. upto15k, Good Communication skills. Exp / Freshers ✆ 9381985468.

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

గుంటూరులోని రియల్‌బూమ్ రియల్ ఎస్టేట్ సర్వీసెస్ నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (50), టెలీకాలర్స్ (10), DDOలు (10) కావలెను. ✆ 78010 32689.

Marvin Lifts Pvt.Ltdలో పనిచేయుటకు హెల్పర్స్ Q: ITI, జీ:15K to 20K. అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ Q: డిగ్రీ. జీ: 22K to25K కావలెను. ✆ 98859 14999

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ: 18K to 20K. ✆96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

నారాయణ స్వామికి పొంగలి నైవేద్యం

నూజండ్ల, న్యూస్‌టుడే: మండలంలో రెడ్డిపాలెం కాలువ కట్ట వద్ద నారాయణస్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. నూజండ్ల, రవ్వారం, గాంధీనగరం, లక్ష్మీపురం, బుర్రిపాలెం, పాతరెడ్డిపాలెం, మేకపాడు తదితర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి పొంగళ్లు చేసి నైవేద్యంగా సమర్పించారు. అన్నదానం నిర్వహించారు. భజనలు చేశారు. రాత్రికి సంగీత విభావరి, కోలాట, బృందావన భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కొండకు ప్రముఖుల తాకిడి

ప్రత్యేక దర్శన క్యూలైన్ భక్తుల ఆగ్రహం

పోలీసులతో భక్తుల వాగ్వాదం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: కోటప్పకొండపై త్రికోటేశ్వరస్వామి దర్శనానికి ఆదివారం వీవీఐపీ తాకిడి పెరిగింది. దీంతో శీఘ్ర, అభిషేక దర్శనం కోసం రూ.200, రూ.500 చెల్లించి టిక్కెట్లు కొనుగోలు చేసి క్యూలైన్లలో ఉన్న భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇష్టారాజ్యంగా వీవీఐపీలు పెద్ద సంఖ్యలో తమ అనుచరులను తీసుకు రావడం, వివిధ శాఖల సిబ్బంది తమ బంధువులు, అనుచరులతో తరలిరావడంతో ఆయా మార్గాల వద్ద గంటల కొద్దీ రద్దీ నెలకొంది. ప్రత్యేక దర్శన క్యూలైన్లు ఎక్కువ సేపు నిలిచిపోవటంతో భక్తులు పలు మార్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

టైం స్లాట్ విజయవంతం: తొలిసారి వీవీఐపీ పాస్‌లకు బదులు ఆన్‌లైన్ విధానంలో టికెట్లు కేటాయించటంతో టైం స్లాట్ విధానం విజయవంతం అయిందని చెప్పొచ్చు. ఆన్‌లైన్ విధానంలో టికెట్లు కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. గతంలో పోట్లు ఉండేవి. ఈ విధానం ద్వారా భక్తులు, వీవీఐపీలు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు. ఖాళీ సమయంలో ఉచిత దర్శనానికి వచ్చిన భక్తులను ఈ మార్గం ద్వారా పంపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో రాజీవ్ గృహకల్ప సముదాయం చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు పెరిగాయి. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - **శ్రీనివాసరావు** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటాం. - **సునీత, పారిశుద్ధ్య అధికారిణి** – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? జిల్లా కేంద్రం నరసరావుపేటలో వరవకట్ట రెండో లైనులో డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు. దోమలతో ఇబ్బంది పడుతున్నాం. - **బాజీ, స్థానికుడు** ✔ సిబ్బందిని పంపి డ్రెయినేజీ పూడిక తీయిస్తాం. - **రమాదేవి, పారిశుద్ధ్య అధికారిణి** – న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

చిలకలూరిపేట: నాగేశ్వరస్వామికి..

రొంపిచర్ల: విప్పర్లలో..

ఈపూరు వీరేశ్వరస్వామి

పసుమర్రు తాండవేశ్వరస్వామి

యడ్లపాడు శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో

శివమయం.. భక్తజన పరవశం

మహాశివరాత్రి సందర్భంగా నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో పట్టణాలు, గ్రామాల నుంచి భక్తులు ఆదివారం శివాలయాలకు పోటెత్తారు. వాడవాడలా శివనామస్మరణ మార్మోగింది. పలు ఆలయాల్లో అభిషేకాలతో పాటు సాయంత్రం శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మహిళలు పొంగళ్లు చేసి స్వామివార్లకు సమర్పించారు. గిరిప్రదక్షిణలు నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ ఆధ్వర్యంలో కలశ పూజలు చేశారు. సాయంత్రం వేళ ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. శివ నామ స్మరణతో ఏకాహ భజనలు, జాగారం చేశారు.

\- న్యూస్‌టుడే బృందం

వినుకొండ: శివ లింగాకారంతో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఆకట్టుకున్న పూల అలంకరణ

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండపై త్రికోటేశ్వరస్వామి ఆలయాన్ని వివిధ రకాల పూలతో ఆదివారం సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద శివలింగం, నంది, ఓంకారం తదితర ఆకారాలను వివిధ రకాల పుష్పాలతో తీర్చిదిద్దారు. పట్టణానికి చెందిన ఓ మహిళ, ఇస్కాన్ ప్రతినిధి స్వామికి కలువ పూలు అందజేయటానికి ప్రత్యేకంగా తెచ్చారు.

భక్తులతో పులకించిన మన్నేపల్లి కొండ

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మన్నేపల్లి కొండ భక్తులతో పులకించింది. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో కొండకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సమీప ప్రాంతాల రైతులు వారి పశుసంపద, ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో వచ్చి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి మెట్ల పూజ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సంతానం కోసం పలువురు దంపతులు స్వామికి బెల్లం మొక్కుకున్నారు. సాయంత్రం నరసింహ స్వామి ఎదుర్కోలు ఉత్సవం, వేంకటేశ్వర స్వామికి కల్యాణం నిర్వహించారు. బండ్లమోటు ఎస్సై నజీర్‌బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూజలందుకుంటున్న స్వామి

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలో మిద్దె బావి కాలనీలో వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం 9 ఏళ్ల అభిరామ్ ఆదివారం కిరాణా దుకాణానికి వెళ్తుండగా వీధి కుక్కలు దాడి చేసి కరిచాయి. బాలుడి తల్లిదండ్రులు పరుగున వచ్చేసరికి కుక్కలు పారిపోయాయి. బాలుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఇటీవల పట్టణంతో పాటు గ్రామాల్లోనూ వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంటోందని అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాలుగెకరాల్లో వరిగడ్డి దగ్ధం

శావల్యాపురం, న్యూస్‌టుడే : గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రూ.50వేలు విలువైన వరిగడ్డి దగ్ధమైన సంఘటన మండలంలోని గుంటుపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చాగంటి సుబ్బయ్యకు చెందిన 4 ఎకరాల వరిగడ్డి వామికి మంటలు వ్యాపించాయి. వినుకొండకు చెందిన అగ్నిమాపక శకటం కోటప్పకొండ తిరునాళ్లలో ఉండటంతో గ్రామస్థులంతా మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేదని వాపోయారు.

చిలకలూరిపేట: భజనలు చేస్తున్న మహిళలు

వినుకొండ: శివలింగం వద్ద కలశాలతో బ్రహ్మకుమారిలు

శిర్డీసాయి ధ్యాన మందిర వార్షికోత్సవం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేట వాసవీనగర్ పోలీసుస్టేషన్ సమీపంలోని శ్రీశిర్డీ సాయి పర్తిసాయి ఆధ్యాత్మిక ధ్యాన మందిరం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం, పార్వతీ పరమేశ్వరుల శాంతి కల్యాణం పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయిబాబాకు చేసిన ప్రత్యేక అలంకరణ ఆకట్టుకుంది. ఆలయంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, భక్తులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి వెండి, బంగారు వస్తువులు దోచుకెళ్లిన సంఘటన వినుకొండ పట్టణ పరిధిలోని ఓబయ్య కాలనీలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం ఓబయ్య కాలనీలో నివాసం ఉండే బ్రహ్మయ్య భార్య చనిపోవడంతో పిల్లలిద్దరినీ నూజండ్ల మండలం తెల్లబాడులోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంచి పనిచేస్తున్నాడు. అతను ప్రకాశం జిల్లా చీమకుర్తి క్వారీలో పనిచేస్తుంటాడు. అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 14న శనివారం తెల్లబాడు వెళ్లి పిల్లలను తీసుకుని ఇంటికి వచ్చాడు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి లోపలకెళ్లి చూడగా బీరువా పగలకొట్టి అందులోని దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో బంగారు ఉంగరాలు, వెండి చైను కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆర్థిక స్వావలంబన సాధించండి

నరసరావుపేట వ్యవసాయం, సెంట్రల్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా కొండ వద్ద డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా ఉత్పత్తుల స్టాళ్లను కలెక్టర్ కృతికాశుక్లా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఉత్పత్తులు తయారు చేసి స్వయంగా విక్రయించి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం అక్కడున్న లీగల్ మెట్రాలజీ, రోడ్డు సేఫ్టీ, సమాచార పౌరసంబంధాల శాఖ గ్యాలరీ, వ్యవసాయ అనుబంధ స్టాళ్లను పరిశీలించారు. ఆమె వెంట డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, ఆర్డీవో మధులత, తహసీల్దార్ వేణుగోపాలరావు, డేవిడ్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టాల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

క్రికెట్ విజేతలకు నగదు బహుమతి

వినుకొండ, న్యూస్‌టుడే: తెలుగు యువత నిర్వహించిన బీవీహెచ్ స్మారక టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. గత 40 రోజులుగా ప్రీమియర్ లీగ్ పద్ధతిలో జరిగిన పోటీల్లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతి సాధించిన వేటపాలెం జట్టుకు రూ.లక్ష, ద్వితీయ స్థానం దక్కించుకున్న చిలకలూరిపేట క్రీడాకారులకు రూ.60వేలు, మూడో స్థానంలో నిలిచిన నెల్లూరు జట్టుకు రూ.40వేలు నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు. పోటీల నిర్వాహకులు మక్కెన మహేష్, బొట్లగుంట శ్రీను, లగడపాటి సూర్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిలకలూరిపేట జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జీవీ ఆంజనేయులు

ఉద్యాన హబ్‌లో జిల్లాను చేర్చాలని కోరతాం

వినుకొండ: ఉమ్మడి ప్రకాశం, రాయలసీమను కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే అంతర్జాతీయ ఉద్యాన హబ్‌లో పల్నాడు జిల్లాను చేర్చాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కోరారు. ఈ మేరకు త్వరలో జిల్లాలో శాసనసభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ నేల, వాతావరణం ఉద్యాన పంటలకు ఎంతో అనుకూలంగా ఉన్నందున ప్రోత్సహిస్తే రైతులు లాభాలు సాధిస్తారన్నారు. సమావేశంలో ఐడీసీ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, బొల్లాపలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి పి.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట ఎన్నార్టీ కూడలి వద్ద..

కాకతీయ కమ్మసత్రంలో అన్నం రాశికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పూజ

తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరాం ఆధ్వర్యంలో..

కోటప్పకొండ వద్ద ఓ వ్యవసాయ క్షేత్రంలో..

ఎండను సైతం లెక్క చేయక..

వెల్లివిరిసిన దాతృత్వం

కోటప్పకొండ తిరునాళ్లకు దాతలు తమ దాతృత్వాన్ని చాటుతున్నారు. చిలకలూరిపేట నుంచి కోటప్పకొండ వరకు రహదారుల పక్కన, నరసరావుపేటలో అడుగడుగునా పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేస్తూ భక్తుల ఆకలి తీరుస్తూ వారి ప్రశంసలు అందుకుంటున్నారు. కొండ దిగువన సామాజిక వర్గాల వారీ సత్రాల్లో భక్తులకు భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం

చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద బస్సుల వరుస

పరుగులో కారుమంచి బాలల ప్రతిభ

కారుమంచి (శావల్యాపురం), న్యూస్‌టుడే : కారుమంచికి చెందిన బాలలు తాజాగా పుణెలో నిర్వహించిన నార్తన్ మారథాన్ పరుగు పందెంలో ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. బాలుడు అక్షయ్ 5 కి.మీ పరుగులో తృతీయ బహుమతి సాధించగా, అతని సోదరి నితీష 3 కి.మీ పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించింది. వీరు సైనికోద్యోగి పోలా అంకమరావు సంతానం. ఆయన పలు పరుగు పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఆయన బాటలోనే పిల్లలూ పయనిస్తున్నారని గ్రామపెద్దలు ప్రశంసించి వారికి అభినందనలు తెలిపారు.

బాలికల విద్యాలయంలో మరమ్మతులకు శ్రీకారం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: వచ్చే ఏడాదికి ముస్లిం మైనార్టీ బాలికల విద్యాలయం అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. చిలకలూరిపేట సుభానినగర్‌లోని విద్యాలయానికి రూ. 30లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను కూటమి నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమంలో రాజీపడదని, వారి అభ్యున్నతి, రక్షణకు కట్టుబడి ఉంటుందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ ఎస్‌కే రఫాని, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఎస్‌కే కరీముల్లా, నెల్లూరి సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతుడికి సత్కారం

కారుమంచి (శావల్యాపురం), న్యూస్‌టుడే : ఇటీవల వెలువడిన గ్రూప్-2 పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాయలసీమ జోన్‌లో నాన్ లోకల్ కోటా కింద సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగానికి అర్హత సాధించిన కారుమంచికి చెందిన మన్నం వేణును ఆదివారం గ్రామ పెద్దలు, తారకరామా కళాపరిషత్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. మాజీ ఎంపీపీ యరమాసు కోటేశ్వరరావు మాట్లాడుతూ వేణు చిన్నతనం నుంచి విద్యలో మంచి ప్రతిభ చూపేవాడన్నారు. కార్యక్రమంలో కళా పరిషత్ సభ్యుడు కూచి రామాంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు గోపాళం శివప్రసాద్, క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జి కోట హరిబాబు, బిక్కి అజిత్, మాదాల చిరంజీవి, వరగాని వెంకట్రామయ్య, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాల్య మిత్రుడికి ఆర్థికసాయం

పోట్లూరు (శావల్యాపురం), న్యూస్‌టుడే : అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడి వైద్య ఖర్చులకు బాల్యమిత్రులు సాయం అందించారు. పోట్లూరుకు చెందిన ఏసుపోగు నరసరాజు మెదడు సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. 1991-92 శావల్యాపురం జడ్పీ పాఠశాలలో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన ఇతని మిత్రులు జక్కా నాగశ్రీనివాసరావు, కొర్నెమల్లి సాంబశివరావు ఇతర స్నేహితులను సంప్రదించి రూ.25 వేలు సేకరించారు. ఆదివారం నరసరాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందచేశారు. పూర్వ విద్యార్థులు చిలంకూరి సుధాకర్, కంచి శ్రీనివాసరావు, అబ్బూరి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సుగాలీకాలనీలో సేవాలాల్ జయంతి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : బంజారాల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని చిలకలూరిపేట సుగాలీకాలనీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు, ఆలిండియా బంజారా సేవా సంఘం, సుగాలీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా సేవాలాల్ గొప్పతనాన్ని పలువురు వివరించారు. అనంతరం విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, బాలునాయక్, విగ్రహ కమిటీ సభ్యులు కోటా నాయక్, బాలికోటి నాయక్, చిన్న నాయక్, శ్రీను నాయక్, నారాయణ నాయక్, అఖిలబాయి, మోతీబాయి పాల్గొన్నారు.

నరసరావుపేట: సత్తెనపల్లి రోడ్డు నుండి కొండకు..

నరసరావుపేట: మొక్కు తీర్చుకునేందుకు స్వామి సన్నిధికి..

కోమటినేనివారిపాలెం ప్రభ వెనుక ఫ్లెక్సీపై ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి లోకేశ్ ఫొటోలు

ప్రభపై ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

నరసరావుపేట:పంబతాళ్లు లాగుతూ కొండకు ప్రభను తీసుకెళుతున్న గోనెపూడి మహిళలు

డీజేల హోరు.. ప్రభల జోరు

చిలకలూరిపేట గ్రామీణ, పట్టణం, యడ్లపాడు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు తరలివెళ్లే ప్రభల వద్ద ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. చిలకలూరిపేట, నరసరావుపేట మండలాల నుంచి బయల్దేరిన ప్రభలను నిర్వాహకులు కనక తప్పెట్లు, మేళతాళాలు, డీజే పాటలతో నృత్య ప్రదర్శన చేస్తూ తరలించారు. యూటీ వద్ద ప్రభలు గ్రిడ్‌ను దాటే సమయంలో ప్రభలను తిలకిస్తున్న భక్తులు అందించిన ప్రశంసలతో నిర్వాహకులు మురిసిపోయారు. నెలరోజుల కష్టాన్ని మరిచిపోయారు. కొన్ని ప్రభల వెనుక వైపు రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు, ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి నారా లోకేశ్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు, కృష్ణుడి వేషధారణలో ఉన్న ఎన్టీఆర్ ఫొటోలు చూపరులను ఆకట్టుకున్నాయి. వీటి వెంట చిన్న ప్రభలూ కొండకు తరలాయి. ఈ ప్రభల వెంట ఉన్న గ్రామస్థులు, యువత తమ ఆనందాన్ని ఇలా పంచుకున్నారు.

నరసరావుపేట సెంట్రల్, టౌన్, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: బరంపేట బాలసంఘం ప్రభ వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుండి తరలివస్తున్న ప్రభలను చూసేందుకు భక్తులు తండోపతండాలుగా వచ్చారు. డీజే పాటలతో నరసరావుపేట పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. మొక్కులు తీర్చుకునేందుకు ఎడ్లను కొండకు తీసుకెళ్లారు. మండలంలో పెట్లూరివారిపాలెం, ఉప్పలపాడు, యల్లమంద, గోనెపూడి గ్రామాలకు చెందిన ప్రభలు కొండకు తరలాయి.

కాకతీయ సత్రానికి విరాళం

పోట్లూరు (శావల్యాపురం), న్యూస్‌టుడే : మహాశివరాత్రి పురస్కరించుకుని శావల్యాపురం మండలం పోట్లూరు నుంచి మొక్కుబడి ప్రభ కొండకు తరలివెళ్లింది. ముందుగా ప్రభపై నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. దారి పొడవునా ప్రజలు నీరాజనం పట్టారు. సంతమాగులూరులో ప్రజలు కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. కోటప్పకొండలో కాకతీయ అన్నదాన సత్రానికి పోట్లూరు గ్రామం నుంచి రూ. 1,41,116 విరాళంగా అందచేశారని గ్రామ పెద్దలు తెలిపారు. వినుకొండకు చెందిన గంగినేని రామయ్య రూ.10 వేలు అందించారు.

అమీన్‌సాహెబ్‌పాలెం ప్రభ వెనుక మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద్ చిత్రం

గోవిందపురం ప్రభ ముందు మహిళల సందడి

గ్రిడ్ వద్దకు పెద్దఎత్తున తరలివచ్చిన యువకులు

మాటల్లో చెప్పలేని ఆనందం

మా ఊరి ప్రభ విద్యుత్తు గ్రిడ్ తీగలను తాకి ముందుకు సాగే సమయంలో జనం కేరింతలు చూసినప్పుడు కలిగే ఆనందం మాటల్లో చెప్పలేం. ఇవి చూసేందుకే ఆస్ట్రేలియా నుంచి గ్రామానికి చేరుకున్నాను. ప్రభల వెంట నడిచి పంబతాళ్లు పట్టుకుని లాగుతూ ముందుకు సాగుతుంటే పెద్దలు చూపిన సంస్కృతీ సంప్రదాయాలు వెలకట్టలేనివనిపించింది. ఊరంతా కలిసి ఐక్యతగా ప్రభ పండగను ఎప్పటికీ కొనసాగిస్తాం. **- భార్గవి, కోమటినేనివారిపాలెం.**

తరతరాలకు స్ఫూర్తి

ప్రభను గ్రిడ్ దాటిస్తున్న సమయంలో ఎండ తీవ్రత ఉన్నప్పటికీ మేమంతా కేరింతలు కొడుతూ ముందుకు నడిపించాం. ఊరంతా కలిసికట్టుగా ప్రభను నడిపించిన తీరు చూసేందుకు మలేషియా నుంచి వచ్చాను. గ్రామాల నుంచి కోటప్పకొండకు ప్రభలను తరలించడం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. **- రేణుశ్రీ, కోమటినేనివారిపాలెం**

నిరంతరం శ్రమించిన పోలీసులు..

చిలకలూరిపేట గ్రామీణ: యూటీ వద్ద ప్రభలు గ్రిడ్ దాటేందుకు ఎక్కువ సమయం పట్టింది. దీంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్ల పక్కనే అన్నదానాలు ఏర్పాటు చేయడం ట్రాఫిక్ అంతరాయానికి కారణంగా నిలిచింది. చిలకలూరిపేట పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు రాత్రి పొద్దుపోయే వరకు శ్రమించారు.

దుకాణంలో అగ్నిప్రమాదం

సురక్షితంగా బయటపడిన వృద్ధ దంపతులు

దుకాణంలో ఎగిసి పడుతున్న మంటలు

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో మెయిన్ బజారులోని బంగారపు కొట్ల సెంటర్లో ఆదివారం తెల్లవారుజామున ఓ కిరాణా దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక కూకట్ల కోటిలింగయ్య, చిన్నమ్మ దంపతులు తమ ఇంట్లో ముందు సగభాగం అద్దెకిచ్చారు. అందులో చీతిరాల సత్యనారాయణ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం షాపు లోపల నుంచి పొగలు వస్తుండటంతో చూసిన చిన్నమ్మ స్థానికులను పిలిచింది. వారు స్పందించి నడవలేని స్థితిలో ఉన్న కోటిలింగయ్యను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేస్తే స్థానికంగా ఉన్న శకటం కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లిందని చెప్పడంతో మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు ట్యాంకర్లను పంపారు. ప్రకాశం జిల్లా దర్శి నుంచి వచ్చిన అగ్నిమాపక శకటం ఇన్‌ఛార్జి ఫైర్ అధికారి ఆంజనేయులు నాయకత్వంలో మంటలను పూర్తిగా ఆర్పేశారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో రూ.10లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి భరోసా

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. మాచర్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తును నిర్దేశించే విజన్‌గా బడ్జెట్ నిలుస్తుందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, సాగునీటి ప్రాజెక్టులు, పేదల సొంతింటి నిర్మాణానికి భారీగా కేటాయింపులు చేయడం అభినందనీయమన్నారు. విద్యారంగానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. యువత భవితకు బాట వేశారన్నారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలకు నిధులు కేటాయించి సామాజిక న్యాయం పాటించారన్నారు.

పెదకూరపాడు: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చే విజన్ డాక్యుమెంట్ అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశ, దశను చూపేలా బడ్జెట్ ఉందన్నారు. మూలధన వ్యయానికి రూ. 53,915 కోట్లు కేటాయించడం రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బలహీన వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా రూపొందించిన బడ్జెట్ 2047 లక్ష్యసాధనకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ? పట్టణంలోని అచ్చంపేట రోడ్డు, నాగన్నకుంటలోని శివాలయాల వద్ద పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. మురుగు కాల్వలు శుభ్రం చేయడంలేదు. ఆలయం చుట్టూ చెత్త, వ్యర్థాల శుభ్రత చర్యలు చేపట్టాలి. **- భక్తులు, అచ్చంపేట రోడ్డు** ✔ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాల వద్ద స్వచ్ఛతకు ప్రత్యేక డ్రైవ్‌ను మూడ్రోజులపాటు నిర్వహిస్తాం. చెత్త, వ్యర్థాలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా మారుస్తాం. కాలువలను శుభ్రం చేస్తాం. **- విజయసారథి, శానిటరి ఇన్‌స్పెక్టర్**

వైద్య శిబిరానికి స్పందన

పాటిబండ్ల(పెదకూరపాడు), న్యూస్‌టుడే: పాటిబండ్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కోట సైదయ్య నేత్రాలయం ఆధ్వర్యంలో వైద్య బృందం 100 మందికి పైగా విద్యార్థులు, వృద్ధులకు పరీక్షలు నిర్వహించారు. కొందరికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. గ్రామ పెద్దలు పాటిబండ్ల రత్తయ్య, కర్లపూడి పుల్లారావు, శ్రీను, వీరాస్వామి తదితరులు సహకారం అందించారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

గురజాలలో ఇష్టకామేశ్వరస్వామి

మాచవరం: మోర్జంపాడు బుగ్గమల్లేశ్వరుడు

భ్రమరాంబ అమ్మవారు

సత్రశాల మల్లయ్య స్వామి

సత్రశాలలో విద్యుత్తు ప్రభ

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి దంపతులు

మాచవరం: బుగ్గమల్లయ్యకు అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గుత్తికొండలో ఓంకారేశ్వరుడికి పూజలు

గురజాలలో బారులు

హర హర మహాదేవ

ఘనంగా శివరాత్రి వేడుకలు

మహా శివరాత్రి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. శైవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. హర హర మహాదేవ.. ఓం నమశ్శివాయ అంటూ భక్తుల నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మూలవిరాట్టులను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు రాత్రంతా జాగరణ చేశారు. దాతలు పులిహోర, మజ్జిగ, అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి స్వామి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. **- న్యూస్‌టుడే, బృందం**

సత్రశాల ఆలయంలో..

బాలచాముండికా అమ్మవారికి పూజలు చేస్తున్న భాష్యం ప్రవీణ్ తదితరులు

బెల్లంకొండలో ప్రభ ఊరేగింపు

దైద వద్ద కృష్ణానది ఘాట్‌లో భక్తులు

మహిళల కోలాటం

అమరేశ్వరాలయంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

భక్తులకు సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

కృష్ణానది తీరం భక్తులతో కిటకిట

అచ్చంపేట, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కృష్ణానది తీరం భక్తులతో కిటకిటలాడింది. మాదిపాడు కృష్ణానది ఆవలి ఒడ్డున ఉన్న ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాలలో ముక్తేశ్వరస్వామి దేవస్థానం తిరునాళ్ల జరుగుతుంది. ఆ సందర్భంగా ఆయా ప్రాంతాల భక్తులు నది దాటి మాదిపాడు పడవలో తరలివచ్చి పూజలు చేశారు. పులిచింతల ప్రాజెక్టు వద్ద నందుల రేవులో కృష్ణానదిలో తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అచ్చంపేట, చామర్రులలోని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

మాదిపాడు: నందుల రేవులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు

అమరావతి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా అమరేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు సేవలు అందించాయి. కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరై ప్రారంభించారు. వాసవి నిత్యాన్నదాన సత్రం, కాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. టీం భాష్యం, ధర్మకర్తల మండలి సభ్యుడు వీరబాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా ఎన్ఆర్ఐల ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటి సీసాలు, మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. యండ్రాయి ఏకాంబరేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో ప్రసాదాలు అందజేశారు. నిర్వాహకులు చిరుమామిళ్ల శౌరయ్య, గంగాధర్, నాగార్జున, రామారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

శివాలయంలో విద్యార్థుల నృత్యార్చన

దాచేపల్లి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా దాచేపల్లి శివాలయంలో విద్యార్థుల నృత్యార్చన భక్తులను ఆకట్టుకుంది. శివుని సన్నిధిలో నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు.

కాకతీయ సత్రానికి విరాళం

శావల్యాపురం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పురస్కరించుకుని శావల్యాపురం మండలం పోట్లూరు నుంచి మొక్కుబడి ప్రభ కొండకు తరలివెళ్లింది. ముందుగా ప్రభపై నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. దారి పొడవునా ప్రజలు నీరాజనం పట్టారు. సంతమాగులూరులో ప్రజలు కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. కోటప్పకొండలో కాకతీయ అన్నదాన సత్రానికి పోట్లూరు గ్రామం నుంచి రూ. 1,41,116 విరాళంగా అందచేశారని గ్రామ పెద్దలు తెలిపారు. వినుకొండకు చెందిన గంగినేని రామయ్య రూ. 10వేలు అందించారు.

మృతి ఘటనపై హత్య కేసు నమోదు

కూసుమంచి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న యూట్యూబర్, రచయిత, సాహిత్య పరిశోధకుడు బొగ్గుల శ్రీనివాస్(48) మృతి ఘటనపై ఆదివారం హత్య కేసు నమోదైంది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు జలాశయంలోకి శనివారం ఓ కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ నీట మునిగి మృతి చెందాడు. ప్రమాద సమయంలో వాహనం నడుపుతున్న వ్యక్తి ఒకరు కారులో నుంచి కిందపడిపోయి అక్కడి నుంచి పరారైనట్లు మత్స్యకారులు గుర్తించారు.

వాహనం నడిపిన వ్యక్తి ఎవరు?

శ్రీనివాస్ సోదరుల ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనా స్థలం నుంచి పరారైన వ్యక్తి ఎవరనే విషయమై ఆరా తీస్తున్నారు. మృతుని స్నేహితుడు, సత్తెనపల్లి మండలం పాకాలపాడుకు చెందిన వేణుమాధవరెడ్డికి చెందిన కారుగా గుర్తించిన పోలీసులు అతని ఫోన్ స్విచ్ఆఫ్ చేసి ఉండటంతో ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. కారు నడిపిన వ్యక్తి అతనేనా, లేక డ్రైవర్ ఉన్నాడా? అనే విషయమై స్పష్టత లభించలేదు.

డీజేల హోరు.. ప్రభల జోరు

నరసరావుపేట, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు తరలివెళ్లే ప్రభల వద్ద ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. చిలకలూరిపేట, నరసరావుపేట మండలాల నుంచి బయల్దేరిన ప్రభలను నిర్వాహకులు కనక తప్పెట్లు, మేళతాళాలు, డీజే పాటలతో నృత్య ప్రదర్శన చేస్తూ తరలించారు. యూటీ వద్ద ప్రభలు గ్రిడ్‌ను దాటే సమయంలో ప్రభలను తిలకిస్తున్న భక్తులు అందించిన ప్రశంసలతో నిర్వాహకులు మురిసిపోయారు. కొన్ని ప్రభల వెనుక వైపు రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు, ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి నారా లోకేశ్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు, కృష్ణుడి వేషధారణలో ఉన్న ఎన్టీఆర్ ఫొటోలు చూపరులను ఆకట్టుకున్నాయి.

కల్యాణం.. కమనీయం

వీరబ్రహ్మేంద్ర, గోవిందమాంబ ఉత్సవమూర్తులు



రామలింగేశ్వరస్వామి

రాజుపాలెం : మహాశివరాత్రి పురస్కరించుకుని ఆకులగణపవరంలో ఆదివారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్టును ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం శివ కల్యాణం జరిపారు.

వైభవంగా నీలకంఠేశ్వరుని తిరునాళ్ల

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: గోగులపాడులోని గంగా పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది. స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నీలకంఠేశ్వరస్వామి

అన్నదానం చేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

నిత్యాన్నదానానికి ఎమ్మెల్యే విరాళం

తిరునాళ్లను పురస్కరించుకుని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానానికి 30 క్వింటాళ్ల బియ్యం, రూ. 1.50 లక్షలు ఆలయ కమిటీకి అందించారు.

దైద బిలాన్ని అభివృద్ధి చేశాం

దైద అమరలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా దైద బిలంలోని అమరలింగేశ్వరస్వామి, బుగ్గమల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ దైద బిలంలో పార్కులు, భక్తులు ఉండేందుకు గదుల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

ఇసుక మేట.. ప్రమాదాల బాట

ఇసుక రవాణా దారులు నిబంధనలు పాటించకపోవడంతో వంతెనల సమీపంలో ఇసుక, మట్టి చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇసుకపై పట్టలు కప్పకుండా తరలించడంతో దారులపై పడుతోంది. ఇసుకపై జారి ద్విచక్ర వాహన చోదకులు గాయపడుతున్నారు. పెదకూరపాడు-గుంటూరు మార్గంలో లింగంగుంట్ల, పొడపాడు వంతెనలపై డ్రైనేజీ వ్యవస్థ సవ్యంగా లేకపోవటంతో వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. **- న్యూస్‌టుడే, పెదకూరపాడు**

పొడపాడు వంతెనపై మేట వేసిన ఇసుక

ప్రభుత్వాసుపత్రిలో మృత శిశువు కలకలం

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో మృత శిశువు లభ్యమైంది. ఆసుపత్రిలోని మరుగుదొడ్ల పక్కనే నెలలు నిండక ముందే పుట్టిన శిశువు మృతదేహాన్ని ఓ తల్లి పడేసి వెళ్లింది. దీంతో కలకలం రేగింది. అబార్షన్ మాత్రలు మింగి ఇలా చేసి ఉంటుందని వైద్యులు భావిస్తున్నారు. మహిళను గుర్తించేందుకు సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణరావు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

నూతన మసీదుల ప్రారంభం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: అల్లాహ్ అక్బర్.. అంటూ ముస్లిం మత గురువులు, సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని ఎన్జీవో హోమ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన మస్జిద్ ఏ బిలాల్(చిన మసీద్)ను ఆదివారం ప్రత్యేక దువాతో ముస్లిం మత పెద్దలు ప్రారంభించారు. 110 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన పాత మస్జిద్ శిథిలావస్థకు చేరడంతో కూల్చేసి చిలకలూరిపేట ముఫ్తీ అబ్బాస్ సహకారం, ముస్లిం సోదరుల విరాళాలతో రూ. 2.11 కోట్లు వెచ్చించి అన్ని హంగులతో కొత్త మస్జిద్ నిర్మాణాన్ని చేపట్టారు. దిల్లీ, హైదరాబాద్‌ల నుంచి వచ్చిన మత గురువులు శాంతి, సామరస్యం, లోక కల్యాణార్థం నమాజ్, దువా చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

లగడపాడు(పెదకూరపాడు): లగడపాడు గ్రామంలో దాతల తోడ్పాటుతో ముస్లిం సోదరులు నిర్మించిన మసీదును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం పెద్దలు షేక్ హనీఫ్, పెద బాజి, అల్లాభక్షు, ఖాసిం పీరా, మక్తుమ్ బుడా, పెద్దమస్తాన్‌వలి పాల్గొన్నారు.

లగడపాడులో ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

పంచాయతీరాజ్ రోడ్లకు మంచిరోజులు

రూ.8.79 కోట్లు మంజూరు

పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ కల్గింది. గత ప్రభుత్వంలో గ్రామాల్లోని పంచాయతీరాజ్ రోడ్లను గాలికి వదిలేయడంతో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. వాహనదారులు ప్రయాణం చేయడానికి అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి పంపారు. ఆ మేరకు ప్రభుత్వం రూ. 8.79 కోట్లు మంజూరు చేసింది. గురజాల, దాచేపల్లి, మాచవరం మండలాలకు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణం పూర్తయితే ప్రయాణం సాఫీగా సాగుతుంది.

ఏయే గ్రామాలకు ఎంతెంత.. కొత్త అంబాపురం- గోగులపాడు రోడ్డుకు రూ. 1.50 కోట్లు, దాచేపల్లి- ఇరికేపల్లి దారికి రూ. 1.02 కోట్లు, పిల్లుట్ల నుంచి సింగరాయిపాలెం తండా రోడ్డుకు రూ. 1.27 కోట్లు, రామచంద్రపురం- పిల్లుట్ల రోడ్డుకు రూ. 2.కోట్లు, మాచవరం నుంచి మోర్జంపాడు వయా కొత్తపాలెం రోడ్డుకు రూ. 1.50 కోట్లు, కొత్తపాలెం- తురకపాలెం దారికి రూ. 1.50 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో వీటికి టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

రూపుదిద్దుకోనున్న ఇరికేపల్లి రోడ్డు

నదిలో స్నానానికి వెళ్లి బాలుడి మృతి

మాదిపాడు(అచ్చంపేట) న్యూస్‌టుడే: పండగ వేళ విషాదం నెలకొంది. నదిలో స్నానానికి వెళ్లి ఓ బాలుడు మృతి చెందిన ఘటన మాదిపాడు పరిధిలోని నందుల రేవు వద్ద ఆదివారం జరిగింది. కంచుబోడు తండాకు చెందిన విష్ణునాయక్(15) ముగ్గురు స్నేహితులతో కలిసి పులిచింతల ప్రాజెక్టు సమీపంలోని నందుల రేవు కృష్ణానదిలో స్నానానికి వెళ్లాడు. లోతుల్లోకి వెళ్లి గల్లంతయ్యాడు. మిగతా ముగ్గురు ఒడ్డుకు చేరుకున్నారు. తర్వాత జాలర్లు, స్థానికులు గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. విష్ణునాయక్ సత్తెనపల్లిలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం ప్రత్తిపాడుకు చెందిన మాముడూరి బాబి(32) అనే వ్యక్తి గుంటూరులో శనివారం రాత్రి మృతి చెందాడు. రామకృష్ణాపురంలోని ఓ మిల్లులో రేకుల షెడ్డు నిర్మాణ పనులకు ప్రత్తిపాడుకు చెందిన పలువురు కార్మికులతో కలిసి బాబి ఇటీవల వచ్చాడు. ఈ నెల 4వ తేదీన నిర్మాణ పనుల్లో ఉండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

శతాధిక వృద్ధురాలు ..

పెదకూరపాడు: పెదకూరపాడు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పఠాన్ షరీఫా బి(110) శనివారం రాత్రి చెందారు. వందేళ్ల వయసులోనూ ఆమె ఆరోగ్యంగా ఉన్నారని, తన పనులు తానే చేసుకునే వారని గ్రామస్థులు తెలిపారు. ఆమెకు 16 మంది సంతానం.

ఆర్థిక స్వావలంబన సాధించండి

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కొండ వద్ద డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా ఉత్పత్తుల స్టాళ్లను కలెక్టర్ కృతికాశుక్లా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఉత్పత్తులు తయారు చేసి స్వయంగా విక్రయించి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం అక్కడున్న లీగల్ మెట్రాలజీ, రోడ్డు సేఫ్టీ, సమాచార పౌరసంబంధాల శాఖ గ్యాలరీ, వ్యవసాయ అనుబంధ స్టాళ్లను పరిశీలించారు. ఆమె వెంట డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, ఆర్డీవో మధులత, తహసీల్దార్ వేణుగోపాలరావు, డేవిడ్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కోతుల దాడి

సత్తెనపల్లి: కోతుల గుంపు దాడిలో ఓ వ్యక్తి గాయపడిన ఘటన తారకరామసాగర్ వాకింగ్ ట్రాక్‌పై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. నాగార్జున నగర్ నంది గామ డొంక రోడ్డుకు చెందిన వెంకట్రావు వాకింగ్ చేస్తుండగా ట్రాక్‌పై బ్రహ్మంగారి గుడి సమీపంలో కోతుల గుంపు దాడి చేసింది. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. వ్యాయామానికి వచ్చిన వారు భయాందోళనకు గురయ్యారు. గతంలోనూ మహిళలపై కోతులు దాడి చేశాయి.

కార్యకర్తలను ఆదుకుంటాం

గురజాల గ్రామీణ: ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తను ఆదుకుంటామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. దైద గ్రామానికి చెందిన షేక్ జానీ బాషా అనారోగ్యంతో బాధపడుతూ కనీసం మందులు కొనలేని పరిస్థితిలో ఉన్నాడని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటి వెళ్లారు. మందుల ఖర్చు నిమిత్తం రూ. 10 వేలు అందించి ధైర్యం చెప్పారు.

సంత్ సేవాలాల్ జయం

బెల్లంకొండ, న్యూస్‌టుడే: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు న్యూ చిట్యాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా లంబాడీల ఐక్యవేదిక అధ్యక్షుడు భూక్యా రామాంజనేయులు ఆధ్వర్యంలో భోగ్ బండారు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ప్రసాద్ నాయక్, అర్జున్ నాయక్, రామాంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేసిన లంబాడీ, బంజారా నాయకులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: సంత్ సేవాలాల్ జయంతి విజయపురిసౌత్‌లోని ఆలయం వద్ద ఆదివారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పాండునాయక్ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. మాచర్ల రవితేజ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వెల్దుర్తి తహసీల్దారు రాజశేఖర్ నాయక్, నాయకులు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, బసివిరెడ్డి, బ్రహ్మశ్రీ రామానుజ దాస, బాలాజీనాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తెగులు తగ్గలేదు.. దిగులు తీరలేదు!

వాతావరణ ప్రభావంతో తగ్గిన దిగుబడి

పిడుగురాళ్ల, గాంధీనగర్, గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల ప్రభావంతో మిరప పంట ఆశించినంత స్థాయిలో దిగుబడి రాలేదు. ధర బాగున్నా దిగుబడి తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురజాల డివిజన్ పరిధిలో పంటకు నల్లి, ముడత, ఎర్రతెగులు సోకింది. ఎకరాకు రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టిన రైతుకు పంట దిగుబడి నిరాశకు గురిచేస్తోంది. మూడేళ్ల నుంచి మిర్చి ధర పూర్తిగా పడిపోవడంతో నష్టపోయిన రైతులు ఈసారి ధర బాగుందని సంతోషపడ్డారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి పంట దిగుబడి ఆశాజనకంగా లేదు.

ఎకరాకు 10 క్వింటాళ్లే

గురజాల డివిజన్ పరిధిలో సుమారు 21వేల హెక్టార్లకు పైగా రైతులు మిరప సాగు చేశారు. ఆరంభంలో వర్షాలు కొంత దెబ్బతీశాయి. తర్వాత పూత, కాయ దశలో ఉండగా తెగులు సోకి దిగుబడులపై ప్రభావం చూపింది. దీంతో ఎకరాకు సుమారు 22 క్వింటాళ్లు దిగుబడి రావాల్సి ఉండగా 6 నుంచి 10 క్వింటాళ్లకు పరిమితమైంది. ధర ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందని, కొన్ని ప్రాంతాల్లో ఒక్క కోతకే మిరప ముఖం చాటేసిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గొట్టిముక్కలలో తెగులు సోకిన మిరప పంట

నల్లి దెబ్బతీసింది

ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎకరా రూ. 14వేల చొప్పున నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప సాగు చేశా. అన్ని ఖర్చులు కలుపుకొని రూ. 4 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టా. మొదట పంట బాగున్నా నల్లి తెగులు సోకింది. వారానికోసారి రూ. వేలల్లో మందులు తెచ్చి పంటకు పిచికారీ చేసినా నల్లి ప్రభావం తగ్గలేదు. పంట దిగుబడి తగ్గిపోయింది. –నాగరాజు, సమాదానంపేట

పెట్టుబడి వస్తే చాలు

ఖరీఫ్‌లో మూడు ఎకరాలు సొంతభూమితోపాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప సాగు చేశా. వాతావరణ మార్పులతో తెగులు సోకి దిగుబడి తగ్గింది. చెట్టుకు కాయలు తక్కువగా వచ్చాయి. వాటిలో కొన్ని కుళ్లిపోతున్నాయి. ధర ఆశాజనకంగా ఉన్నా దిగుబడి తగ్గడంతో పెట్టుబడి ఖర్చు వస్తుందో, లేదోనని ఆందోళనగా ఉంది. –బాలస్వామి, సమాదానంపేట

ఈనాడు
పార్వతీపురం మన్యం
సోమవారం ఫిబ్రవరి 16, 2026

ఒడిశా ఆర్టీసీ బస్సు బోల్తా

ఏడుగురికి తీవ్ర గాయాలు

సాలూరు, న్యూస్‌టుడే: బస్సు అదుపు తప్పి బోల్తాపడడంతో ఏడుగురికి తీవ్ర గాయాలైన ఘటన సాలూరు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ అప్పల నాయుడు వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ నుంచి ఓఎస్ ఆర్టీసీ బస్సు 23 మంది ప్రయాణికులతో శని వారం సాయంత్రం విజయవాడ బయలు దేరింది. డ్రైవర్ ఏమరుపాటుతో రాత్రి రెండున్నర గంటల సమయంలో సాలూరు పట్టణంలో డంపింగ్ యార్డు సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు ప్రయాణికులను బయటకు తీశారు. సాలూరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రమాదంలో ఒడిశాకు చెందిన పల్లా నూకరాజు, ఖిలో బాబూరావు, సుకరంజన్ మండల్, మమతా రణా, దిలీప్‌రాయ్, దీపక్‌రాయ్, మాధవ్ ధాలికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదివారం ఉదయం పరిశీలించి, కారణాలపై ఆరా తీశారు. చోదకుడితో మాట్లాడారు.

ప్రమాదాల ఘాట్ రోడ్డు

ఎన్‌హెచ్-26పై ప్రయాణం ప్రాణ సంకటం

ఈనాడు, పార్వతీపురం మన్యం, న్యూస్‌టుడే, సాలూరు

ఎత్తైన కొండలు.. ప్రమాదకర మలుపులు.. నిర్మాణంలో సాంకేతిక లోపాలు.. ఆపై ఘాట్ రోడ్డులో కానరాని రక్షణ చర్యలు.. మితిమీరిన వేగంతో దూసుకెళ్లే వాహనాలు.. వెరసి విశాఖపట్నం-రాయపూర్ 26వ జాతీయ రహదారిలో సాలూరు తర్వాత నుంచి ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఘాట్ రోడ్డుపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారుతోంది.

ఒడిశా సరిహద్దు నుంచి సాలూరు పట్టణ శివారు ప్రత్యామ్నాయ దారి(బైపాస్) వరకు 31 కిలోమీటర్ల పొడవునా రహదారిపై నిత్యం ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఈ మార్గంలో సమస్యలు పరిష్కరించకపోతే మరిన్ని ప్రాణాలకు ముప్పు తప్పదు.

నాలుగు రాష్ట్రాల రహదారి: ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి సరకుల రవాణా వాహనాలు సహా ప్రయాణికుల రాకపోకలు నిత్యం సాగుతుంటాయి.

30 ప్రమాదకర మలుపులు: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు నుంచి ఘాట్ రోడ్డు కిందకు దిగేటప్పుడు అత్యంత ప్రమాదకర మలుపులు సుమారు 30 వరకు ఉన్నాయి. రొడ్డవలస, కంకణాపల్లి ప్రాంతాల్లో హెయిర్ పిన్ బెండ్ కార్నర్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ రక్షణ చర్యలు లేక వాహనాలు బోల్తా పడుతున్నాయి. ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా పదుల సంఖ్యలో వాహనాలు అదుపుతప్పి లోయలో పడటం.. కొండలను ఢీకొట్టడం జరుగుతోంది.

ఇంజినీర్లతో చర్చిస్తా..: ఆంధ్ర-ఒడిశా మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై జాతీయ రహదారుల విభాగం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమై చర్చిస్తా. లోపాలు సరిదిద్ది, అవసరమైనచోట రక్షణ చర్యలు తీసుకుంటాం. - ఎస్పీ మాధవరెడ్డి, ఎస్పీ

18న మెగా ఉద్యోగ మేళా

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఈనెల 18న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీహెచ్ చలపతిరావు తెలిపారు. ఎనిమిది ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థులు హాజరు కావొచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆ రోజు ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించొచ్చన్నారు.

చూసిందొకటి.. రాసిందొకటి!

● తప్పులుతడకగా భూ సర్వే
● పాసు పుస్తకాల్లో దోషాలతో రైతన్నకు తిప్పలు

ఉన్న భూమి మాయం

◆ విజయనగరం జిల్లా రామభద్రపురానికి చెందిన కేతిరెడ్డి రామకృష్ణకు ఎకరాన్నర భూమి ఉంటే.. తాజాగా అందజేసిన పట్టాదారు పాస్ పుస్తకంలో ఎకరా అని నమోదైంది.

◆ ఇదే గ్రామానికి చెందిన రైతు కేతిరెడ్డి గోవిందుదీ ఇలాంటి పరిస్థితే. ఆయన పేరిట ఎకరాన్నర భూమి ఉంది. సర్వే చేసి 41 సెంట్లకు పట్టాదారు పాస్ పుస్తకం ఇచ్చారు. రబీ పంటల సాగు పెట్టుబడికి బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలంటే 41 సెంట్లకే లెక్కగట్టి ఇస్తామనడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరివి ఒకే రైతు చిత్రంతో..

కొమరాడ మండలంలో అందరి రైతుల భూములు ఒకే రైతు చిత్రంతో పట్టాదారు పాస్ పుస్తకాలు ముద్రించి పంపిణీ చేసేశారు. ఇలా ఎక్కువ తప్పులు ఉన్న పాస్ పుస్తకాలు అధిక సంఖ్యలో ఉండటాన్ని గ్రామ రెవెన్యూ అధికారులు గ్రహించి తక్కువ సంఖ్యలో పంపిణీ చేశారు.

ఈనాడు, విజయనగరం

ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూములు సర్వే చేస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చితే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 50 సెంట్లు ఉన్న చిన్న కమతాలు అధికం. ఇతర జిల్లాల్లో 15 ఎకరాలకు మించిన కమతాలు ఎక్కువ. ఆ జిల్లాల్లో సర్వే ఉద్యోగులకు విధించిన లక్ష్యం ఇక్కడ ఉభయ జిల్లాలకు అదే లక్ష్యం నిర్దేశించడంతో వెనుకబడుతున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో చాలా ఎక్కువ తప్పులు దొర్లుతున్నాయి.

ఇలా చేయాలి..

★ రీ సర్వే చేసే ముందు పాత దస్త్రాలు పరిశీలించి ఇన్‌కార్పొన్ (సమాచార విలీనం) చేయాలి.

★ భూముల రీసర్వేకు సరైన లైసెన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ అందించాలి. దాంతో పాటు అవసరమైన సాంకేతిక పరికరాలు సరఫరా చేయాలి.

★ సర్వేకు ముందు ఆ గ్రామానికి సంబంధించిన భూ యజమానులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలి.

★ గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే చేసిన గ్రామంలో సర్వే శాఖ తప్పులు కంటే పట్టాదారు వివరాల నమోదుకు సంబంధించి ఎక్కువ తప్పులు నమోదైనట్లు గుర్తిస్తున్నారు.

మూడు శాఖల సమన్వయలోపం

◆ భూముల వ్యవహారంలో సర్వే, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ పాత్ర కీలకం. భూ వివాదాలు పెరగడానికి ఈ మూడు శాఖల యంత్రాంగం మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీని వల్ల చాలా తప్పులు జరుగుతున్నాయి.

◆ గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వే తప్పులను పూర్తిగా అవగాహన చేసుకుని వాటి పరిష్కారానికి తగిన సమయం ఇవ్వడం లేదు. తహసీల్దారు లాగిన్‌లో ఆప్షన్ ఇస్తే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయి.

◆ భూ యజమానులకు నోటీసులు ముందుగా ఇవ్వకుండా అప్పట్లో చేపట్టిన రీసర్వే ప్రక్రియ ముగించే ప్రయత్నం చేశారు. కొందరు జిల్లా, మండల అధికారులు రీ సర్వే రద్దవుతుందని లేదా మెయింటెనెన్స్ పీరియడ్ ఇస్తారని చెప్పి తొందరగా చేయించారు.

వీటిని ఎందుకు పట్టించుకోరు

❒ సాంకేతిక సిబ్బంది తక్కువగా ఉన్నందున ఉండాల్సిన భూమికి, పాస్‌పుస్తకంలో ఉండే సర్వే నంబరుకు సంబంధం లేకుండా చాలా గ్రామాల్లో 30 శాతానికి పైగా తప్పులు నమోదవుతున్నాయి.

❒ భూముల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో పట్టాదారులు ప్రతి చిన్న అంశానికీ అధికారులకు దరఖాస్తు చేసే అవకాశం ఉంది. తగిన సాంకేతిక సిబ్బంది లేకుంటే ఇంకా సమస్యలు పెరుగుతాయి.

లీకైన క్లోరినేషన్ సిలిండరు

ఏడుగురికి తీవ్ర అస్వస్థత

పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు

బలిజిపేట, న్యూస్‌టుడే: క్లోరినేషన్ సిలిండర్ లీకై ఏడుగురు అస్వస్థతకు గురైన ఘటన బలిజిపేట మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.

. అంపావల్లి రక్షిత తాగునీటి పథకం పైలెట్ ప్రాజెక్టు పంపుహౌస్ వద్ద 30 ఏళ్ల క్రితం నాటి మూడు క్లోరినేషన్ సిలిండర్లు ఉన్నాయి. ఇవి పాడైపోవడంతో వాడకుండా ట్యాంకు సమీపంలో ఒకచోట పడేశారు. వీటిలోని ఒక సిలిండరు పూర్తిగా తుప్పపట్టింది. ఆదివారం సాయంత్రం దాన్నుంచి ఒక్కసారిగా ఎక్కువ గ్యాస్ లీకై పది మీటర్ల దూరంలో ఉన్న ఇళ్ల వద్దకు చేరింది. దీంతో రాగాల రాధ(37), బొందు సురేష్(38), బొందు మురళీకుమారి(55), కామేశ్వరి(35), బి.కుమారి(55), బి.సుధాకర్(60), బి.లావణ్య(45) అస్వస్థతకు గురై సొమ్మసిల్లిపోయారు. వీరిని స్థానికులు బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. రాధ, సురేష్, మురళీకుమారిలకు ఆక్సిజన్ శాతం తక్కువగా ఉండడంతో పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించినట్లు వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి తెలిపారు. మిగిలిన ముగ్గురికీ పీహెచ్‌సీలోనే చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై నీటి సరఫరా విభాగం జేఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా.. 30 ఏళ్ల క్రితం వేసిన మూడు క్లోరినేషన్ సిలిండర్లు పాడైపోవడంతో స్టోర్‌లో ఉంచేశామని, తుప్పు పట్టినందున లీకై ఉండొచ్చని చెప్పారు. వాటిని సత్వరమే నీటి సరఫరా విభాగం జిల్లా కేంద్ర కార్యాలయానికి తరలించామని చెప్పారు.

తుప్పు పట్టిన సిలిండరు

భక్తజన సంద్రం

పరజపాడులో అలంకరణలో స్ఫటిక లింగం

జిల్లా అంతటా ఓంకారనాదం ప్రతిధ్వనించింది. శివయ్యను పంచామృతాలతో అభిషేకించి భక్తజనం పులకించిపోయారు. పరమేశ్వరుడికి ప్రణమిల్లాలని కొండలు.. వాగులు.. నదులు దాటుకుని దర్శనాలకు తరలివెళ్లారు. మహాశివరాత్రి వేళ ఆదివారం జిల్లాలోని శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. జంఝావతి, నాగావళి నదుల సంగమం వద్ద బలరాముడు ప్రతిష్ఠించిన గుంప సోమేశ్వరాలయానికి తరలివచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించారు.

– న్యూస్‌టుడే, కొమరాడ, జియ్యమ్మవలస

గుంప సోమేశ్వరుడి దర్శనానికి నది దాటి వెళ్తున్న భక్తులు

చనిపోయినా ప్రాణం పోశాడు

వంగర, న్యూస్‌టుడే: వంగర మండలం కొత్తవలస గ్రామానికి చెందిన పెంకి పారినాయుడు(65) తాను మరణించినా.. మరికొంత మంది జీవితాల్లో వెలుగులు నింపారు. స్థానికుల వివరాల ప్రకారం.. పారినాయుడు వ్యవసాయ పనులు చేస్తుండేవారు. వారం కిందట పొలంలో పడిపోవడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. జీవన్‌దాన సంస్థ ప్రతినిధులు, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ప్రతినిధి చైతన్యకుమార్ కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. మృతుడి భార్య సోములమ్మ, కుమార్తెలు ఆదిలక్ష్మి, సావిత్రి అంగీకరించారు. ఆదివారం వైద్యులు ప్రక్రియ పూర్తిచేశారు. మూత్రపిండాలు కిమ్స్ ఆసుపత్రికి, కళ్లు శ్రీకాకుళం రెడ్‌క్రాస్‌కు, కాలేయం జెమ్స్‌లో అవయవ గ్రహీతలకు అమర్చేందుకు ఉంచారు.

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త
డాక్టర్ రెడ్డి టోటల్ బాడీ చెకప్ సెంటర్
కలక్టర్ ఆఫీస్ జంక్షన్, కోస్టల్ బేటరీ రోడ్డు, కెనరా బ్యాంక్ ప్రక్కనఉన్న LUCID బిల్డింగ్, 4వ అంతస్తు, విశాఖపట్నం
శరీరంలో సైలెంట్‌గా దాగిఉన్న గుండెపోటును మరియు కేన్సర్‌ను 6 నెలల ముందుగానే గుర్తించే టోటల్ బాడీ చెకప్



రూ. 7,500/- విలువచేయు పరీక్షలు కేవలం 3,500/- కే
ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా॥ జి. శివప్రసాద్‌రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.
9393752255, 9393122525
ఈ పథకం 10 రోజులు మాత్రమే ప్రతీ ఆదివారం శెలవు

పారిశుద్ధ్య కార్మికురాలిని రాష్ట్రపతి దగ్గరకు తీసుకెళ్తా: ఎంపీ

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నైకు చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు పద్మ తనకు దొరికిన రూ.45 లక్షల విలువైన బంగారు ఆభరణాల బ్యాగును నిజాయతీగా పోలీసుల ద్వారా యజమానికి అప్పగించిన సంఘటనపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పందించారు. ఆమెకు జాతీయస్థాయి గుర్తింపు ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. 'ఈనాడు' ప్రధాన పత్రికలో జనవరి 13న 'చెత్త సేకరిస్తుంటే.. 45 సవర్ల బంగారం దొరికింది' శీర్షికన పద్మ నిజాయతీ గురించి వార్త ప్రచురితమైంది. ఇదే వార్తను ఆయన రాష్ట్రపతి లేఖకు జతచేశారు. ఆమె నిజాయతీకి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక అవార్డుకు సిఫారసు చేయాలని రాష్ట్రపతిని ఎంపీ అప్పలనాయుడు కోరారు. త్వరలో పద్మను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దగ్గరకు తీసుకెళ్తానని వివరించారు.

స్వయం ఉపాధికి కొత్త ఆశలు

న్యూస్‌టుడే, విజయనగరం మయూరి కూడలి

పేద, మధ్యతరగతి వర్గాలను ఆదుకునేందుకు వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధికి రాయితీతో కూడిన యూనిట్ల మంజూరు కోసం కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. గతేడాది ఎస్సీ, బీసీ, ఓబీసీ, మైనార్టీలకు యూనిట్ల మంజూరుకు రూ.137.52 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత బడ్జెట్‌లో (2026-27)లో కేటాయించింది. దీంతో ఇన్నాళ్లూ నిరాశతో ఉన్న ఆయా వర్గాల్లో కొత్త ఆశలు చిగురించాయి.

ఇదీ పరిస్థితి..

విజయనగరం, మన్యం జిల్లాల్లో బీసీ, ఈబీసీ, మైనార్టీ, ఎస్సీ విభాగాల్లో 21 ఏళ్లు దాటిన యువతకు ఆయా కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేస్తామని గతేడాదే ప్రభుత్వం ప్రకటించింది. నేటికి ఒక్క యూనిట్ కూడా మంజూరు కాలేదు. దీంతో ఆ రుణాలు వస్తాయో రావోనని అంతా ఎదురుచూశారు. రెండు జిల్లాల్లో ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకోగా, 5,871 మందికి యూనిట్లు కేటాయించారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీ మొత్తం నేటికీ బ్యాంకులకు విడుదల చేయలేదు. ఈ బడ్జెట్‌లో కేటాయింపుతో ఆ మొత్తం రానుంది. దీంతో యూనిట్ల ఏర్పాటుకు మార్గదర్శకాలు రానున్నాయి.

ఆదేశాలు రాగానే కార్యాచరణ: బీసీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు నిధులు విడుదల కావాల్సి ఉంది. వీటిపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కార్యాచరణ సిద్ధం చేస్తాం.
- జ్యోతిశ్రీ, వెంకటేశ్వరరావు, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, విజయనగరం.

లబ్ధిదారులకు కేటాయింపులు ఇలా..(విలువ రూ. కోట్లలో)

కేటగిరీ	విజయనగరం		మన్యం	
	యూనిట్లు	నిధులు	యూనిట్లు	నిధులు
మైనార్టీ	86	1.33	10	0.32
బీసీ	2942	58.02	1246	25.26
ఈబీసీ	113	3.02	14	0.37
ఎస్సీ	930	31.46	522	17.74

శ్రద్ధాంజలి
జననం 01-01-1940 మరణం 05-02-2026
మమతానురాగాలకు మారుపేరుగా, నిరంతరం మా శ్రేయస్సు కోసం కృషి చేసిన మీరు భౌతికంగా మా నుండి దూరమైనందుకు చింతిస్తూ మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...
కీ.శే. మావుడ సరస్వతి గారు
భర్త: కీ.శే.మావుడి అప్పారావునాయుడు
కుమారులు - కోడళ్లు
రమేష్‌నాయుడు, కాంట్రాక్టర్ - లక్ష్మి
చక్రధరరావు, AAO - యూనిస్
కుమార్తెలు - అల్లుళ్లు
పాలవలస ఇందిరి - కీ.శే. గోపాలనాయుడు, Rtd VRO
కీ.శే. లెంక భారతి - నారాయణరావు, Rtd టీచర్
మనుమలు/మనుమరాండ్రు బంధుమిత్రులు
పెద్దకర్మ: 16-02-2026 మధ్యాహ్నం మా స్వగృహమందు జరుపబడును.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9000866020, 8008597609

(c) eenadu

ప్రతిధ్వనించెను పంచాక్షరీ మంత్రం


మానసాదేవికి లక్ష బిల్వార్చన

గరివిడిలో నృత్యం చేస్తున్న బాలభవన్ చిన్నారులు

జిల్లా అంతటా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మహాశివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలన్నీ కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే దర్శనాలకు భక్తులు బారులు తీరారు. - న్యూస్‌టుడే, పాలకొండ, పాచిపెంట, ఎల్.కోట, బొబ్బిలి గ్రామీణం, గరివిడి, చీపురుపల్లి గ్రామీణం, కంటోన్మెంట్

కలవరాయి రమణ మహర్షి ఆశ్రమంలో..

పాండవుల కొండపై భక్తుల రద్దీ

రింగురోడ్డు రుద్రాభిషేకంలో భక్తులు

ఎల్.కోటలో శివలింగానికి అన్నాభిషేకం

పాలకొండలోని మరకత మృత్యుంజయేశ్వరుడు

విద్యా సాయం నింపిన వెలుగు

రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు వారివి. ఇంటర్ పూర్తి చేసి ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేయాలన్న వారి ఆశయానికి వరల్డ్ విజన్ సేవా సంస్థ అండగా నిలిచింది. ప్రతిభే ప్రామాణికంగా ఏటా పేద విద్యార్థులను ఎంపిక చేసి ఉచిత వసతితో కూడిన ఇంజినీరింగ్ విద్యను అందించింది. రెండేళ్ల కిందట వరల్డ్ విజన్ ప్రాజెక్టు నుంచి విరమించుకున్నప్పటికీ తమిళనాడుకు చెందిన సత్యభామ యూనివర్సిటీ మాత్రం దాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది ఎనిమిది మందికి అవకాశం కల్పించింది. పదేళ్లుగా ఇప్పటివరకు సుమారు 41 మందిని వరల్డ్ విజన్ సంస్థ చదివించింది. వారిలో 20 మంది వివిధ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. మండలంలోని గంట్యాడ, పెదమజ్జిపాలెం, పెణసాం, కిర్తుబర్తి, కె.వెలగాడ, బోనంగి గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మండలాన్ని దత్తత తీసుకున్న వరల్డ్‌విజన్ భవనాలు కట్టించడం, రోడ్లు వేయడం వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టింది.

అదో స్వచ్ఛంద సంస్థ.. మండలంలో విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేసింది. ఉచితంగా ఇంజినీరింగ్ విద్య చెప్పించింది. వారిలో పలువురు సాయాన్ని సద్వినియోగం చేసుకుని నేడు ఉన్నత స్థానాలకు ఎదిగి జీవితాల్లో స్థిరపడ్డారు. - న్యూస్‌టుడే, గంట్యాడ, పెదమజ్జిపాలెం

సహకారం మరువలేను..

మాది వ్యవసాయ కుటుంబం. వరల్డ్‌విజన్ సహకారం ద్వారా సత్యభామ యూనివర్సిటీలో బీటెక్ సీటు వచ్చింది. చదువు పూర్తికాగానే రూ.5.5 లక్షల ప్యాకేజీతో ఏవీఎల్‌లో ఉద్యోగం సాధించా. ఆ సాయం లేకుంటే డిగ్రీ వరకే చదివి ఆగిపోయేదానినేమో. ఈ రోజున కుటుంబానికి అండగా ఉన్నా. - పి.సాహితి, కొర్లాం

అసలు ఊహించలేదు

పేరున్న యూనివర్సిటీలో బీటెక్ చేసే అవకాశం వస్తుందని ఊహించలేదు. నాలుగేళ్లకు కనీసం రూ.20 లక్షలైనా ఖర్చు అవుతుంది. అలాంటిది రూపాయి ఖర్చు లేకుండా చదువు పూర్తి చేశాను. రూ.6 లక్షల ప్యాకేజీతో హెచ్‌సీఎల్‌లో జాబ్ వచ్చింది. నా తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారు. - మధుసూదనరావు, పెదమజ్జిపాలెం

క్యాంపస్ ఇంటర్వ్యూలో కొలువు

యూనివర్సిటీలో చేరిన తర్వాత బీటెక్ పూర్తికాకముందే క్యాంపస్ ఇంటర్వ్యూలో రూ.6 లక్షల ప్యాకేజీతో డక్సీన్ కంపెనీలో కొలువు సంపాదించా. - డి.వంశీకృష్ణ, పెదమజ్జిపాలెం

అతివల ఉన్నతికి గండి

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధుల మెరుగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నా.. క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉంటోంది. వెలుగు ఉన్నతి పథకం ద్వారా వడ్డీ లేకుండా, రాయితీపై రుణాలు ఇస్తున్నారు. వీటిని ప్రజలకు చేరువ చేసే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో లక్ష్యం చేరుకోలేక పోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

చేతివాటం చూపుతున్న సిబ్బంది..

రుణాలు ఇచ్చే సమయంలో కొంతమంది సిబ్బంది చేతి వాటం చూపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వెలుగు సిబ్బంది, ఇతర ఖర్చుల కోసమని చెప్పి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూళ్లు చేస్తున్నారు. కొంత మంది మహిళలు బ్యాంకుల చుట్టూ తిరగలేక ఇచ్చేస్తున్నారు. కొన్ని చోట్ల రుణం అవసరం లేకున్నా వారి పేరిట తీసుకుని, వాడుకున్న సందర్భాలూ ఉన్నాయి. దీనికోసం మహిళలతో బేరసారాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అవగాహన లేక..

రుణాలపై మహిళలకు అవగాహన కల్పించడం లేదు. దీంతో తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. కూటమి వచ్చిన తర్వాత ఉన్నతి పథకాన్ని పటిష్ఠంగా అమలు చేస్తున్నా.. సిబ్బంది సకాలంలో ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఈ ఆర్థిక ఏడాదిలో 1,837 మందికి రూ.9.18 కోట్లు లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 676 మందికి రూ.4.31 కోట్లు మాత్రమే ఇచ్చారు. రూ.4.87 కోట్లు ఇవ్వాల్సి ఉంది. గడువు సమీపిస్తుండడంతో లక్ష్యం చేరుకుంటారా? అన్న అనుమానం కలుగుతోంది. కేంద్ర ప్రభుత్వం పీఎం అజయ్ ద్వారా రాయితీ ఇవ్వగా, వీటిని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అందించనున్నారు.

రుణాల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం

ఉన్నత రుణాలపై సమీక్ష చేసుకుంటున్న మహిళలు

సభ్యురాలికి రూ.50 వేల వరకు రాయితీ రానుంది. ఇందుకు జిల్లాలో గత కొద్ది నెలలుగా సర్వే చేపట్టి, 108 మందిని గుర్తించారు. వీరికి రూ.1.58 కోట్లు కేటాయించగా, ఇప్పటికీ ఎవరికీ రుణం ఇవ్వలేదు.

అవగాహన కల్పిస్తున్నాం..

ఈ పథకం ద్వారా గతంకంటే జిల్లాలో ప్రగతి బాగానే ఉంది. వంద శాతం రుణాలు ఇస్తున్నాం. ఎవరైనా చేతివాటం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవు. పీఎం అజయ్ ద్వారా పలువురిని ఎంపిక చేశాం. త్వరలో లబ్ధిదారుల ఖాతాల్లోకి యూనిట్ల ఆధారంగా జమ చేస్తాం. ఈ ఏడాది లక్ష్యం చేరుకుంటాం.
- శ్రీనివాస్‌పాణి, పీడీ, డీఆర్డీఏ

నీలాచలం కొండపై శిఖరదీపం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రామతీర్థం దేవస్థానంలో మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం నీలాచలం కొండపై శిఖర దీపాన్ని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. విద్యుత్తు దీపాలంకరణలో దేవస్థానం విరాజిల్లింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పతివాడ రమువర్మ, తెదేపా నాయకులు రవిశేఖర్, రాజారావు, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


శిఖర దీపం వెలిగిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే లోకం మాధవి

చికెన్ ధరలు

రకం	బ్రాయిలర్ లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

ప్రపంచ శాంతికి కలశ యాత్ర

రథాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

పట్టణంలో కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న బ్రహ్మకుమారీలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా ప్రపంచ శాంతిని కోరుతూ పట్టణంలోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆదివారం కలశ యాత్ర నిర్వహించారు. ఓం శాంతి మందిరం నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో రథాన్ని ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే జగదీశ్వరరావు, ప్రముఖ వైద్యుడు బి.ఈశ్వరరావు, న్యాయవాది వెంకటరావు, బీజే జ్యుకరత్నం జెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. భక్తులు శివలింగాన్ని దర్శించుకున్నారు. వందలాది మంది భక్తులు కలశ యాత్రలో పాల్గొన్నారు.

జాతర జయప్రదం చేయాలి

జామి, న్యూస్‌టుడే: జామి యల్లారమ్మ జాతరను జయప్రదం చేయాలని ఆలయ సేవా కమిటీ అధ్యక్షుడు అల్లాడ ఎర్రిబాబు(పెద్ది), తెదేపా మండల అధ్యక్షుడు రమణ అన్నారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలను ఆదివారం ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు.

యువ కెరటాల క్రీడా కేరింత

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: లక్కవరపుకోట మండలంలోని లచ్చంపేటలో వీరమాంబ సహిత గిరి నాగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి ఉన్నత పాఠశాలల విద్యార్థుల(బాలురు) వాలీబాల్ పోటీలు నిర్వహించారు. దీనిలో 18 జట్లు పాల్గొన్నాయి. రవితేజ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, కుమారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, కళ్లేపల్లిరేగ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు వరుస మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నిర్వాహక కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఎందుకమ్మా ఇంత ప్రమాదకరంగా..

శివరాత్రి వేళ గుంప సోమేశ్వరుడి దర్శనానికి భక్తులు జంఝావతి, నాగావళి నదులు దాటి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఓ మహిళ.. చిన్నారిని ఎత్తుకుని.. మరొకరిని చేత్తో పట్టుకుని నదిలో స్నానానికి వచ్చారు. తనతోపాటు పిల్లాడిని ఇలా నడుములోతు నీటిలో ప్రమాదకరంగా తీసుకెళ్లారు. - న్యూస్‌టుడే, కొమరాడ

సకిలించాయి అశ్వాలు

కొత్తవలస, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నిపాలెంలో శనివారం ప్రారంభమైన మహాశివరాత్రి తీర్థ మహోత్సవంలో భాగంగా ఆదివారం నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు ఆకట్టుకున్నాయి. సిహెచ్. విక్రమ్, నవీన్, సత్యనారాయణకు చెందిన గుర్రాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు గ్రామ పెద్దలు నగదు బహుమతులు అందజేశారు. సర్పంచి ఆర్.పద్మలత, యువత పాల్గొన్నారు.

దౌడు తీస్తున్న గుర్రం

అక్కడ ఆట.. ఇక్కడ ఆనందం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను జిల్లా వ్యాప్తంగా అభిమానులు ఆస్వాదించారు. భారత్ గెలుపుతో సంబరాలు చేసుకున్నారు. విజయనగరం జిల్లా కేంద్రంతో పాటు రామతీర్థం దేవస్థానం కల్యాణ మండపం వద్ద ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. ఇండియా బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ కొట్టిన సిక్సర్లు, ఫోర్లకు అభిమానులు కేరింతలు కొట్టారు.

రామతీర్థంలో ఎల్‌ఈడీ తెరపై మ్యాచ్ తిలకిస్తున్న అభిమానులు

ఇక్కడే ఇలా ఉంటే.. ఊరంతా శుభ్రమెలా?

పాలకొండలో నగర పంచాయతీ కార్యాలయం ఎదుట అపారిశుద్ధ్యం నెలకొంది. దీని ఎదురుగా ప్రధాన మార్కెట్‌లో దుకాణ సముదాయం నిరుపయోగంగా ఉంది. అక్కడే చెత్త వేస్తుండడం, శుభ్రం చేయక ఇలా అధ్వానంగా కనిపిస్తోంది. కమిషనర్ రత్నరాజ్ వద్ద ప్రస్తావించగా పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, పాలకొండ

జాతీయస్థాయిలో సత్తా చాటాలి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: 'ఏఐ టెక్నాలజీతో వ్యవసాయం'పై ప్రాజెక్టు ద్వారా అగస్త్య అంతర్జాతీయ ఫౌండేషన్ నిర్వహించిన జిజ్ఞాస పోటీలకు జాతీయ స్థాయికి అర్హత సాధించిన జడ్పీహెచ్‌ఎస్ పూల్‌బాగ్ విద్యార్థులు సి.హెచ్.వెంకటేష్, ఆర్.గగన్‌దీప్‌ను ఆదివారం డీఈవో యు.మాణిక్యం నాయుడు అభినందించారు. జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ నెల 18, 19 తేదీల్లో పుణెలో జరగనున్న పోటీలకు వీరంతా ఆదివారం పయనమయ్యారు. డిసెంబరులో వర్చువల్ విధానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయ స్థాయికి అర్హత పొందారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ కె.శైలజ, ప్రధానోపాధ్యాయుడు వి.రఘురామరాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

అభినందిస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

శ్రీగురుదేవ ఆసుపత్రిలో డా.ఎన్టీఆర్ వైద్య సేవలు

కొత్తవలస, న్యూస్‌టుడే: మంగళపాలెం శ్రీగురుదేవ ఆసుపత్రిలో డా.ఎన్టీఆర్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ట్రస్ట్ ఛైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ ఆదివారం తెలిపారు. ఎముకలు, రోడ్డు ప్రమాదాలు తదితరాల్లో తీవ్ర గాయాలైతే ఇక్కడ ఉచితంగా వైద్య సేవలు పొందొచ్చని తెలియజేశారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED

Do you Need a Staff for Business Hire with ease www.mrvijay.in HR solutions ✆ 8309661801.

FINANCIAL SERVICES

ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో మార్టిగేజ్/ టేకోవర్ లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. * నో సిబిల్/ నో బ్రోకర్స్. *MSR గ్రూప్, వైజాగ్. Ph: 9121314141

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

TO LET

VZM టౌన్, K.Lపురంలో కలెక్టర్ ఆఫీస్‌కు దగ్గరలో హైవేకు వాకబుల్ డిస్టెన్స్‌లో ఇండివిడ్యువల్ ఇల్లు 2BHK ఫస్ట్‌ఫ్లోర్ అద్దెకు కలదు ✆ 8985914456.

JOBS

రాఘవ ఆటోఫైనాన్స్‌లో పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. అనుభవం కలిగి విజయనగరం, గజపతినగరం లోకల్ వారికి ప్రాధాన్యత. మంచి జీతం + TA + ఇన్‌సెంటివ్ సంప్ర|| రాఘవ ఆటోఫైనాన్స్, 100 ఫీట్ రోడ్, ఐస్‌ఫ్యాక్టరీ జం|| కెనరాబ్యాంక్ పైన, విజయనగరం. ✆ 7680880206, 9154020715.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

SECURITY GUARDS

జై గణేష్ సెక్యూరిటీ సంస్థలో విశాఖ స్టీల్ ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డులు 16 మంది, డ్యూటీ 8 గం|| W/H, జీతం నెలకు ₹16,500/, PF & ESI, సెక్యూరిటీ సూపర్‌వైజర్ (Ex-Service or Civil) 9 మంది, జీతం ₹20,000/, ఉచిత నివాసం, సబ్సిడీ భోజనం, యూనిఫాం ఉచితం ✆ 93460 01964

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి

జామి, న్యూస్‌టుడే: పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న మహిళను వ్యాన్ ఢీకొట్టడంతో మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై జనార్దనరావు వివరాల మేరకు.. అలమండ గ్రామానికి చెందిన **కె.రాములమ్మ(55)** వ్యవసాయ కూలి. శనివారం ఉదయం గ్రామంలో పొలం పనికి వెళ్లారు. పనులు ముగించుకుని రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా, భీమసింగి నుంచి కొత్తవలస వైపు వెళ్తున్న వ్యాన్ ఆమెను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో స్థానికులు పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆమెకు భర్త చెల్లయ్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: నగరంలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండో పట్టణ ఎస్సై కృష్ణమూర్తి వివరాల ప్రకారం.. మన్యం జిల్లా వీరఘట్టానికి చెందిన ఓ బాలిక(16), తన అక్కతో కలిసి విజయనగరంలోని దాసన్నపేటలో ఉంటూ ఇంటర్ చదువుకుంటోంది. శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అక్క ఒక గదిలో పడుకుని ఉండగా.. బయటకు వెళ్తానని చెప్పి వేరే గదిలో పంకాకు ఉరేసుకుంది. కొంత సేపటి తర్వాత చూసిన సోదరి వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. వారొచ్చి పరిశీలించగా అప్పటికే ఆమె చనిపోయింది. మృతదేహాన్ని మహారాజా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నెలసరి సమయంలో తీవ్ర కడుపు నొప్పి వస్తోందని బాలిక బాధపడుతున్నట్లు సోదరి, కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

టీ తాగేందుకు వచ్చి.. ప్రాణాలు వదిలి

రాజాం, న్యూస్‌టుడే: పరిస్థితి విషమంగా ఉందని బంధువులు ఆసుపత్రిలో చేర్పించిన వ్యక్తి ఎవరికీ చెప్పకుండా టీ తాగేందుకు బయటకు వచ్చి కుప్పకూలి మృతిచెందిన ఘటన రాజాంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రాజాం మండలం ఒమ్మి గ్రామానికి చెందిన ఊడికల పరుశురాం(61) దీర్ఘకాల రోగి. రాజాంలోని ప్రభుత్వాసుపత్రికి మూడు రోజుల క్రితం తీసుకొచ్చారు. అప్పటి నుంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ఎవరూ గమనించని సమయంలో టీ తాగేందుకని బయటకొచ్చిన ఆయన పురపాలిక కార్యాలయం సమీపంలో కుప్పకూలిపోయాడు. మృతదేహాన్ని స్వగ్రామం తరలించేందుకు అంబులెన్స్ కోసం ప్రయత్నించినా అందుబాటులో లేకపోవడంతో బంధువులు ద్విచక్ర వాహనంపై గ్రామానికి తీసుకెళ్లారు.

మార్చి 8న హోమియో వైద్య శిబిరం

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 8న స్త్రీల ఆరోగ్య సమస్యల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియో పతిక్ ఫిజిషియన్స్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ప్రకృతి సాగు.. ఆరోగ్యం బాగు

బీఆర్సీ కేంద్రాల ఏర్పాటుతో ప్రయోజనాలు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం రైతులకు శిక్షణ, సలహాలు ఇచ్చేందుకు ఆయా ప్రాంతాల్లో బయోరీసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా తక్కువ ధరకే కషాయాలను అందిస్తూ ప్రోత్సహిస్తోంది. పురుగుల మందులు, యూరియా తదితర రసాయన ఎరువులు ఎక్కువ మోతాదులో వాడటం వల్ల భూసారం తగ్గుతుంది. వాటితో పండించిన పంటలు తినడం వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వీటి వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కల్పిస్తున్నారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించడమే కాకుండా అధికాదాయం పొందవచ్చు. బీఆర్సీ కేంద్రాల్లో జీవామృతం, పంచగవ్యం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, బీజామృతం వంటి కషాయాలు తయారు చేస్తుంటారు. వీటిని రైతులకు తక్కువ ధరకే అందిస్తున్నారు. మండలంలో నాలుగు వరకు కేంద్రాలు ఉన్నాయి. విత్తనాలనూ అందిస్తున్నారు.

బలిజిపేట బీఆర్సీలో కషాయాలు

జిల్లాలో ఇలా...

జిల్లాలో 15 మండలాల్లో ఇప్పటికే 209 దుకాణాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో అవసరమైన అన్నిరకాల ఔషధాలు, విత్తనాలను అందుబాటులో ఉంచారు. బలిజిపేట మండలంలోని బీఆర్సీ ద్వారా ఇప్పటికే దాదాపు 600 మంది రైతులు 720 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ సంఖ్యను పెంచేందుకు, అన్ని మండలాల్లో ఇదే స్థాయిలో జరిగేలా చూసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

రసాయనాల వాడకం తగ్గించాలి. కషాయాలు వినియోగిస్తూ.. ప్రకృతి వ్యవసాయం చేయాలి. ఇందుకు అవసరమైనవి బీఆర్సీ కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నాం. సద్వినియోగం చేసుకోవాలి.
- శ్రావణ్‌కుమార్, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రబంధకులు

(c) eenadu

అసలే ఇరుకు.. ఆపై స్తంభం!

పాలకొండ నగర పంచాయతీ పరిధి వడమ లోని శివారు వీధి రోడ్డు మధ్యలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. అసలే ఇరుకు మార్గం కావడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలోనే రేషన్ దుకాణం ఉండడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొత్తగా విద్యుత్తు స్తంభం వేసేందుకు స్థలం లేదని నగర పంచాయతీ ఏఈ దేవీవరప్రసాద్ అన్నారు.

– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

సాగునీటి కాలువలో చెత్త ప్రవాహం

పార్వతీపురం పట్టణ కేంద్రం, గోపాలపురం, బాలగుడబ ప్రాంతాల్లోని జంఝావతి సాగునీటి కాలువలపై ఉన్న వంతెనల వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. స్థానికులు పూజా సామగ్రి, ఉత్సవ విగ్రహాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడంతో ఎక్కడికక్కడ కుప్పలుగా ఉండిపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయని రైతులు వాపోతున్నారు. చెత్త తొలగింపునకు నిధులు కోరుతూ ప్రతిపాదనలు చేశామని, ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఏఈ పవన్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

నిర్మాణం ఇంతేనా..?

వీరఘట్టంలో రెండు సచివాలయ భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ పనులు ప్రారంభించారు. పలు కారణాలతో మధ్యలో వదిలేశారు. దీంతో సొంత భవనాలు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అరకొర సౌకర్యాల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. మండల ఇంజినీరింగ్ అధికారిణి డి.కల్యాణిదుర్గ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

– న్యూస్‌టుడే, వీరఘట్టం

సార్.. రోడ్డు నిర్మించండి

రావివలస-కంబర గ్రామాల మధ్య ఉన్న 4 కి.మీ రహదారి మొక్కలు, గడ్డితో నిండింది. దీంతో కనీసం కాలినడకన ప్రయాణం కూడా కష్టంగా మారింది. ఈ రహదారిలోనే సుమారు 200 ఎకరాల పంట పొలాలకు రైతులు వెళ్లాల్సి ఉంది. వర్షాకాలం అయితే మరింత ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కంబర వాసులు రావివలస పీహెచ్‌సీకి రావడానికి కూడా ఇదే దగ్గర మార్గం. రోడ్డు నిర్మించాలని ఇటీవల కలెక్టరుకు వినతి కూడా అందించారు. చర్యలు చేపడతామని జేఈగౌరీ శంకరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, గరుగుబిల్లి, గ్రామీణం

ఈ వేసవికైనా పూర్తి చేయరూ..

పెదబొండపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో మూడేళ్లుగా రక్షిత ట్యాంకు పనులు పూర్తికాక తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ ఎస్సీ, బీసీ కాలనీలో 500 వరకు గృహాలున్నాయి. 2 వేల వరకు జనాభా ఉన్నారు. వీరికి నిత్యం తాగునీరు అందించేలా ఈ ట్యాంకు పనులు మొదలెట్టారు. దాదాపు పూర్తి కావస్తున్న తరుణంలో గత ప్రభుత్వం బిల్లులు విడుదల చేయక పనులు ఆగాయి. ఈ వేసవికైనా పూర్తిచేసి నీరందించాలని ప్రజలు కోరుతున్నారు. పరిస్థితి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బసవరాజు అన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)	
పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పాలకొండ వెంకటరాయుడు కోనేరు గట్టుపై విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలి. **- రజని, ఉద్యోగిని** ★ విద్యుత్తు స్తంభాలు కొనుగోలు చేసి ఏర్పాటు చేయిస్తాం. **- దేవీవరప్రసాద్, ఏఈ** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? గుచ్చిమి ఎస్సీ కాలనీలోని చర్చి వీధిలో ఇంటింటి కుళాయిలు లేక ఇబ్బందులు పడుతున్నాం. **- అసిరయ్య** ★ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- పవన్‌కుమార్, ఏఈ** – న్యూస్‌టుడే, సీతానగరం

? బలిజిపేట-చిలకలపల్లి మార్గంలో ఆరు చోట్ల మలుపులున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. **- బి.శ్రీనివాసరావు, మెట్ట వీధి** ★ పరిశీలించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- రామ్మోహనరావు, జేఈ** – న్యూస్‌టుడే, బలిజిపేట

? భాసూరువారి వీధి పరిధిలో కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. **- స్థానికులు** ★ పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తాం. **- రత్నరాజ్, కమిషనర్** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? రావికోన పంచాయతీ బట్టివలసలో కాలువలు పూడికతో నిండిపోయాయి. **- రత్నాలమ్మ** ★ కార్యదర్శిని అప్రమత్తం చేస్తాను. **- కె.సత్యం, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? నిడగల్లు కాలనీలోని యాదవ వీధికి వెళ్లే మార్గంలో ఉన్న కాలువ మురుగుతో నిండి దుర్గంధం వస్తోంది. **- మరియదాసు** ★ చర్యలు తీసుకుంటాం. **- ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, సీతానగరం

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సిపురం ఉన్నత పాఠశాల, పశువుల ఆసుపత్రి మార్గాల్లో చెత్త తీయించి శుభ్రం చేశారు. ఇక్కడ విద్యార్థులు, రైతులు తిరగలేని పరిస్థితి ఉండేది. దీనిపై 'ఈనాడు'లో వచ్చిన వార్తకు సర్పంచి బంగారమ్మ, కార్యదర్శి రామకృష్ణ స్పందించారు.

కొండ వద్ద డ్రోన్‌తో పర్యవేక్షిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

సీఎం గారూ.. ఇవే మా సమస్యలు

నివేదికల తయారీలో యంత్రాంగం

నియోజకవర్గాల వారీగా..

– న్యూస్‌టుడే, పార్వతీపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి జిల్లాకు చెందిన శాసనసభ్యులు, ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టరుతో జిల్లాల వారీగా సమావేశం నిర్వహించి, సమస్యలపై చర్చించాలని నిర్ణయించిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఈ వారంలో పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించిన సమావేశం ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పరిష్కారానికి ఎదురుచూస్తున్న అంశాలను గుర్తించి సీఎం దృష్టిలో పెట్టాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. నివేదికలను రూపొందించే బాధ్యతను ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తున్న జిల్లా అధికారులకు పాలనాధికారులు అప్పగించారు.

ప్రస్తావించాల్సిన అంశాలు..

★ జిల్లాలో నిధులతో పనిలేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ముస్తాబు, గ్రామ ముస్తాబు వంటివి చేపడుతున్నారు. వీటికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం లేనప్పటికీ కొనసాగాలంటే మాత్రం నిర్వాహకులపై ఆర్థిక భారం పడకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. దీనికి అవసరమైన నిధులను కోరాలి.

★ జిల్లాలో పర్యాటక కేంద్రాలు, జలపాతాలను గుర్తించి అభివృద్ధి చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలంటే పర్యాటక శాఖ పెద్దఎత్తున నిధులు మంజూరు చేయాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

★ జిల్లాలో సాంస్కృతిక వికాసానికి చేపడుతున్న చర్యలకు కూడా ఆర్థిక సహకారం అవసరం.

★ కురుపాం నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తికాకపోవడం ప్రభుత్వాల వైఫల్యంగా మారింది. దీనిపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

★ జంఝావతి పూర్తి చేస్తామని అందరూ హామీలు ఇచ్చారు. బడ్జెట్‌లో కేటాయింపులు కంటితుడుపునకైనా విదల్చని పరిస్థితి. సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించేలా ఇంజినీరింగు యంత్రాంగాన్ని సమాయత్తం చేయాల్సిన అవసరం ఉంది.

★ కురుపాం ఇంజినీరింగు కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయించాలి.

- పార్వతీపురం నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలకు ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలి.
- పార్వతీపురం పట్టణానికి తాగునీటి సమస్య ఉంది. 1950 నాటి వ్యవస్థనే ఇప్పటికీ వినియోగిస్తున్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పథకాన్ని ఏర్పాటు చేయాలి.
- అడారుగెడ్డ ఆనకట్ట పూర్తి చేసి దశాబ్దాలు గడుస్తోంది. కాలువ తవ్వకానికి భూసేకరణ జరగకపోవడంతో సాగునీరు అందే వీలున్నా... రైతులకు ప్రయోజనం లేని పరిస్థితి.
- మన్యం జిల్లాలోని ఒక్కగానొక్క సీతానగరం మండలం లచ్చయ్యపేట చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించాలి. రైతులు ఇబ్బంది పడుతున్నారు.
- సాలూరులోని ఆటోనగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.
- సాలూరు మండలం శివరాంపురం దగ్గర 15 ఏళ్ల క్రితం చేపట్టిన వంతెన నిర్మాణం పూర్తి చేయాలి. వెలగవలస వద్ద గెడ్డకు ఆనకట్ట నిర్మించాలి.
- పాచిపెంట మండలం నుంచి అరకు వెళ్లే దారి పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి.
- పాలకొండ నియోజకవర్గంలో నాగావళి రెగ్యులేటరు కింద ఆయకట్టు భూములకు సాగునీరు అందించేలా కాలువల వ్యవస్థను ఆధునికీకరించాలి.
- కళింగపట్నం-పార్వతీపురం, చిలకపాలెం-రాయగడ రహదారులను ఎన్‌హెచ్‌గా మార్చేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలి.
- వంశధార, నాగావళి నదులకు కరకట్టల నిర్మాణం చేపట్టాలి.
- మధ్యలో నిలిచిపోయిన జంపరకోట జలాశయ నిర్మాణ పనులను పూర్తి చేయాలి.

"ఆవులు మేపి.. ఇంటికొచ్చాను. ఆకలిగా ఉండటంతో అన్నం తింటున్నా. ఇంతలో ఘాటైన వాసన.. తెలుసుకునే లోపు ఊపిరి ఆడటం కష్టమైంది. గుండె పట్టేసింది.. బతుకుతాననుకోలేదు.. ఆ అయ్యప్ప దయవల్లే ప్రాణాలతో ఉన్నాను" – బాధితుడు బి.సురేష్ కన్నీటిపర్యంతం అయ్యాడు

"ఇంట్లోకి ఘాటైన వాసన వచ్చింది. వికారంగా అనిపించింది. ఏదో అవుతోందని భావించి పశువులకు ఏమీ కాకూడదని పరుగున వెళ్లి కట్లు విప్పాం. కళ్లు తిరుగుతున్నట్లు అనిపించి అక్కడే చతికిలపడ్డాం. సమీపంలోని కొంతమంది మమ్మల్ని ఆసుపత్రికి తరలించారు" – బి.మురళీకుమారి, ఆర్.రాధ

ఉక్కిరిబిక్కిరి అయిపోయాం.. బతుకుతామనుకోలేదు

క్లోరినేషన్ సిలిండర్ లీకు బాధితుల ఆవేదన

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, బలిజిపేట

ఆసుపత్రిలో బాధితులు

క్లోరినేషన్ సిలిండర్ లీకవ్వడంతో అస్వస్థతకు గురైన బలిజిపేట మండలం అంపావల్లి గ్రామానికి చెందిన ఏడుగురు బాధితులు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆక్సిజన్ అందక ముగ్గురు తీవ్ర ఇబ్బందికి గురికాగా.. మరో నలుగురు కాస్త కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు.

కొన్నిరోజులుగా స్వల్ప వాసన..

మహాశివరాత్రి పర్వదినం.. తెల్లవారి త్వరగా మేల్కొని శివయ్యను దర్శించుకున్నాం. రాత్రికి జాగారం చేద్దామనుకుంటే మాయదారి గ్యాస్ ఆసుపత్రి పాల్జేసిందని బాధితులు వాపోయారు. గ్యాస్ పీల్చిన సమయంలో ఎదురైన ఇబ్బందిని మర్చిపోలేకపోతున్నారు. ఇంకా ఆ క్షణాల భయం వారిని వెంటాడుతోంది. మరేం పర్వాలేదని వైద్యులు అంటున్నా.. ఆసుపత్రిలో మంచాలపై బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కొన్నిరోజులుగా చిన్నపాటి వాసన వస్తోందని, విషయాన్ని తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. తహసీల్దార్ బాలమురళీకృష్ణ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. కొన్ని పశువులు అస్వస్థతకు గురయ్యాయని, వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఘటన విషయాన్ని తెలుసుకొని.. గ్రామంలో సహాయక చర్యలకు సూచనలు చేశారు.

శివయ్య దర్శనం.. నేత్రపర్వం

వీరఘట్టం: త్రిశూల స్నానానికి బయలుదేరిన భక్తులు

సాలూరులో పూజలు చేస్తున్న మహిళలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హరహర మహాదేవ శంభో శంకర అంటూ నామస్మరణ చేశారు. రాత్రి శిఖర దీపాలు వెలిగించి ఉపవాసంతో జాగారం చేశారు. సీతానగరం మండలం కృష్ణరాయపురంలో పంచముఖ సోమేశ్వరస్వామి ఆలయంలో హోమం, సువర్ణముఖేశ్వరస్వామి, గుచ్చిమిలో గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహించారు. పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల కాశీ విశ్వేశ్వరాలయంలో క్యూలైన్లు భక్తులతో నిండాయి. బలిజిపేట మండలం గళావల్లిలోని ఉమాసహిత కామలింగేశ్వరాలయంలోని నీలిరంగు శివలింగాన్ని అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి క్షీరాభిషేకం చేశారు. జియ్యమ్మవలస మండలంలోని పరజపాడులో స్ఫటిక లింగం, రావాడలోని ద్వాదశ జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర, బురదవెంకటాపురంలో శివ పార్వతుల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. – న్యూస్‌టుడే, బృందం

కృష్ణరాయపురంలో..

గళావల్లి కామలింగేశ్వరాలయంలో..

పార్వతీపురం ఉమారామ లింగేశ్వర ఆలయంలో అభిషేకం

ఉల్లిభద్రలో జరిగిన కల్యాణోత్సవంలో భక్తులు

సీదిలో యువజనోత్సవాలు

వాలీబాల్ పోటీలో తలపడుతున్న యువకులు

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని సీది-సామరెల్లిలో మన్య ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో 9వ గ్రామీణ యువజనోత్సవాలు ఆదివారం ప్రారంభించినట్లు సంస్థ ఛైర్మన్ జి.రవి, అధ్యక్షుడు జి.జనార్దనరావు తెలిపారు. ఈనెల 19 వరకు వాలీబాల్, షటిల్, చెస్ తదితర క్రీడలతోపాటు వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.ఉమామహేశ్వరరావు, తెదేపా నాయకురాలు బి.దమయంతి నాయుడు, ఏఈఈ బి.నీరజ, ఫిజియోథెరపిస్టు బి.నిరోషా, ఎం.అప్పలనాయుడు, జి.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రత.. భక్తులకు అస్వస్థత

కొమరాడ, న్యూస్‌టుడే: శివరాత్రి నాడు గుంప సోమేశ్వర ఆలయ ప్రాంగణం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. గంగరేగువలస, కోటిపాం, కురుపాం, దళాయిపేట మీదగా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. పుణ్యస్నానాల కోసం క్యూ కట్టారు. భక్తులు వేచి ఉండేందుకు టెంట్లు సరిపోకపోవడంతో ఎండ తీవ్రతకు ముగ్గురు, నలుగురు అస్వస్థతకు గురయ్యారు. పార్వతీపురం బంగారమ్మకాలనీకి చెందిన ఆర్.రవణమ్మ బీపీతో, ఓ యాచకురాలు మూర్ఛ రావడంతో పడిపోయారు. మరో బాలిక క్యూలైన్ల వద్ద అస్వస్థతకు గురికావడంతో పోలీసులు, దేవాదాయ శాఖ స్పందించి, వైద్య శిబిరానికి తరలించారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే పీవో జగన్మోహనరావు, వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. తాగునీటి సరఫరాపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై జగదీష్ నాయుడు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మహిళకు వైద్యసేవలందిస్తున్న బృందం

మహిళకు గాయాలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదకోటిపల్లిలో కొండపై ఉన్న శివాలయం మెట్లు దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ పాలకొండకు చెందిన ఓ మహిళకు గాయాలయ్యాయి. స్థానికంగా ఉన్న వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు.

అభిమానుల సందడి

పాలకొండ, న్యూస్‌టుడే: టీ-20 వరల్డ్ కప్‌లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య ఆదివారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా పాలకొండ పట్టణంలోని జెట్టివారి వీధిలో అభిమానులు తెర ఏర్పాటు చేశారు. భారత్ విజయం సాధించడంతో ఉత్సాహంగా సంబరాలు చేసుకుని, కేరింతలు కొట్టారు.

పారమ్మ జాతర

పాచిపెంట, న్యూస్‌టుడే: గిరిజనుల ఆరాధ్య దైవం పారమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి వేలాది మంది భక్తులు వచ్చి, అమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. తొక్కిసలాటలు జరగకుండా, భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఏఎస్పీ మనీషారెడ్డి, సీఐ రామకృష్ణ, తహసీల్దారు రవి తదితరులు ఉన్నారు. సాలూరు డిపో నుంచి జాతరకు 30 ప్రత్యేక బస్సులు నడిపారు.

పుష్కరిణి అభివృద్ధి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సంగంవలసలో పుష్కరిణి అభివృద్ధి పనులకు తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు జీవీనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ చేశారు. మండల మహిళా ప్రతినిధి శ్రీవాణి, నాయకులు చంటి, చంద్రమౌళి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెలుగుల జాతర

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పాలకొండ మండలం కోటిపల్లి గ్రామంలో కొండపై ఉన్న శివాలయం విద్యుత్తు అలంకరణతో ఆకట్టుకుంటోంది. మూడు రోజులపాటు కొండపై జాతర నిర్వహిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

విద్యుత్తు వెలుగులో కొండపై శివాలయం

ఈ బడ్జెట్ దూరదృష్టికి నిదర్శనం

పార్వతీపురం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు దూరదృష్టికి 2026-27 బడ్జెట్ నిదర్శనమని తెదేపా అరకు పార్లమెంటరీ అధ్యక్షురాలు తేజోవతి అన్నారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు. రైతులు, పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనకరమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సాగునీరు, తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వడం, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా పద్దుల్లో కేటాయింపులు చేశారన్నారు. మహిళలకు ఎంతో ప్రయోజనకరమైన రీతిలో పథకాల అమలుకు నిధులు కేటాయించారని చెప్పారు.

సండే.. ఫన్ డే

ఐటీడీఏ ఉద్యాన క్షేత్రంలో యువత ఫొటోషూట్

గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలం తోటపల్లి పర్యాటక ప్రాంతంలో ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. సుంకి వద్ద ఐటీడీఏ ఉద్యాన క్షేత్రం, చిన్నారుల పార్కులో ఆటపాటలతో గడిపారు. వెదురు కర్రలతో తయారు చేసిన ఆకృతుల వద్ద యువత ఫొటోషూట్ నిర్వహించారు. సువిశాల జలాశయం ఆహ్లాదకరమైన వాతావరణంలో రోజంతా సరదాగా గడిపారు.

సాగునీరు విడుదల

పాలకొండ, న్యూస్‌టుడే: తోటపల్లి ఎడమ కాలువ ద్వారా అధికారులు సాగునీటిని విడుదల చేశారు. కోటిపల్లి కొండపై వెలసిన శివాలయంతోపాటు తెట్టంగి అమ్మవార్ల పండగల నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతోపాటు ఆరుతడి పంటలకు సాగునీరు కావాలంటూ సాగునీటి సంఘాల విజ్ఞప్తి మేరకు నీటిని విడుదల చేసినట్లు ఏఈ బీవీ రమణ తెలిపారు.

రైల్వే గేటు తెరిచారు

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండలం చినభోగిల కూడలిలోని రైల్వేగేటు మూసి వేయడంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు ఈనెల 14న నిరసన చేపట్టారు. దీంతో స్పందించిన అధికారులు ఈనెల 24 వరకు గేటును తెరిచేందుకు అంగీకరించారు. అండర్ పాస్ పనులు పూర్తి చేసేందుకు కొంత సమయం అవసరం కావడంతో తాత్కాలికంగా ఆదివారం నుంచి తెరుస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణ ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా టి.అఖిల్, కె.రాజేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధులు

పాలకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని పురాతన కోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. ప్రభుత్వం రూ.70 లక్షలు నిధులు విడుదల చేసింది. శ్రీరామనవమి తర్వాత పనులు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

రణభేరి విజయవంతానికి పిలుపు

సీతంపేట, న్యూస్‌టుడే: పీఆర్సీ, ఇతర ఆర్థిక డిమాండ్లపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న చలో విజయవాడ పేరిట నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం సీతంపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కె.ఆనందరావు, ఎ.ప్రకాశం, సింహాద్రి, చంద్రకళ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సమ్మె



జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: తమ డిమాండ్ల సాధనకు సోమవారం నుంచి సమ్మె చేపట్టనున్నట్లు పీఏసీఎస్ ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు చినమేరంగి, బీజేపురం పీఏసీఎస్‌ల అధ్యక్షులు ఆర్.బలరామస్వామి నాయుడు, డి.సోములును ఆదివారం ఉద్యోగులు కలిశారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు విధులకు హాజరుకామని నోటీసు ఇచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ఇబ్బందులు గుర్తించాలని ఆవేదన వ్యక్తం చేశారు. సీఈవోలు ఎస్.పోలిరాజు, సీహెచ్ తిరుపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడవిలో నీటికుంట.. వన్యప్రాణికి నిశ్చింత

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

వేసవి వచ్చిందంటే చాలు వన్యప్రాణులు ప్రాణభయంతో విలవిలలాడుతాయి. మోడువారిన అడవిలో ఆహారం, నీటి కొరత ఏర్పడడంతో కడుపు నింపుకోవడానికి దారి తప్పి జనావాసాలకు వస్తుంటాయి. ఇదే అదునుగా భావించి వేటగాళ్లు చేపట్టే చేష్టలకు బలి అయిపోతున్నాయి. ఇలా వివిధ కారణాలతో రోజురోజుకూ వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో అడవి జంతువులకు కొండంత భరోసా దొరికినట్లు అయ్యింది.

సాసర్‌పిట్‌లు ఏర్పాటు

పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ పరిధిలో 1,07,721 హెక్టార్లలో అడవులున్నాయి. ఇక్కడి జీవులు నీరు, ఆహారం దొరక్క.. మైదానానికి పరుగులు తీస్తున్నాయి. ప్రధానంగా చుక్కల దుప్పులు నీటి కోసం అటవీ ప్రాంతానికి దగ్గర్లోని గ్రామాల్లో కనిపిస్తుంటాయి. వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా నడుం బిగించిన అధికారులు గుక్కెడు నీరు దొరకని ప్రదేశాల్లో 20 చోట్ల సాసర్‌పిట్‌లు(కుంటలు) ఏర్పాటు చేశారు. నిరంతరం నీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఉదయం 8 లోపు, సాయంత్రం 6 తరువాత ఆహారం కోసం బయటకు వస్తుంటాయి. ఆ సమయంలో దాహార్తిని తీర్చుకునేందుకు కుంటలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

నిడగల్లుగూడ సమీపంలో ఏర్పాటు చేసిన కుంట

నిఘా నేత్రాలతో సంరక్షణ

వన్యప్రాణులు సంచరించే ప్రదేశాల్లో దాహార్తి తీర్చుకునేందుకు వచ్చే తాగునీటి వసతుల వద్ద రహస్య ప్రాంతాల్లో నిఘా నేత్రాలు బిగించారు. ఈ ప్రాంతాల్లో వాటి స్వేచ్ఛకు భంగం కలిగించకుండా ఉండేందుకు ఇవి రక్షణ కవచాలుగా నిలవనున్నాయి. 15 రోజులకు ఒక సారి కెమెరాలను పరిశీలిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు ఆయా ప్రదేశాల్లో సంచరిస్తే వారి కదలికలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తం కానున్నాయి. ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు అటవీ ప్రాంతాన్ని మూడో కంటితో కాపలా కాస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

అందరి బాధ్యత

అడవుల సంరక్షణ మన అందరి బాధ్యత. జిల్లాలోని 20 ప్రాంతాల్లో సాసర్‌పిట్లు ఏర్పాటు చేసి.. నిరంతరం నీరు అందుబాటులో ఉంచనున్నాం. సీసీ కెమెరాల వల్ల జీవుల పర్యవేక్షణతోపాటు వేటకు అడ్డుకట్ట వేయొచ్చు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కెమెరా కంటికి చిక్కే అవకాశం ఎక్కువగా ఉంది. **– జీఏపీ ప్రసూన, జిల్లా అటవీ శాఖ అధికారిణి**

ఇక లెక్క తేలనుంది

పచ్చని చెట్ల మధ్య స్వేచ్ఛగా విహరించే మూగజీవాల సంఖ్య అటవీ ప్రాంత పర్యావరణ సమతుల్యతకు కొలమానం. అందులో భాగంగా అటవీశాఖ అధికారులు జిల్లాలో డిసెంబరు 1వ తేదీ నుంచి 8 వరకు వన్యప్రాణుల లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. వాటి ఆనవాళ్లను గుర్తించిన అధికారులు యాప్ సహాయంతో ఫొటోలు తీసి కేంద్రానికి పంపించారు. అక్కడి ఉన్నతాధికారులు వాటిని విశ్లేషించి లెక్కలు తేల్చనున్నారు. జంతువులతోపాటు అడవిలోని మొక్కలపై కూడా సిబ్బంది సర్వే చేశారు. ప్రధానంగా జిల్లాలోని అడవుల్లో అడవి పందులు, కుందేళ్లు, పునుగు పిల్లులు, చుక్కల దుప్పిలు వంటివి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

ఇలాగేనా నిర్వహణ?



పారన్నవలస పంచాయతీ పెదపారన్నవలస గ్రామంలోని సంపద తయారీ కేంద్రం ఇది. నిర్మించిన తర్వాత ఒక్కసారి కూడా వినియోగించలేదు. చెత్తను సేకరించి గ్రామ శివారులో పడేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో పార్వతి మాట్లాడుతూ త్వరలోనే అన్ని కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

(c) eenadu

రంపలో మార్మోగిన శివనామస్మరణ

రంప శివాలయంలో ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ పూజలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా మన్యంలో ప్రసిద్ధిగాంచిన రంప శివాలయం శివనామస్మరణతో మార్మోగింది. ఆదివారం తెల్లవారుజామున 3గంటల నుంచి భక్తులు శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి వారి ఆలయాన్ని భక్తులు దర్శించుకున్నారు. జలపాతం వద్ద పుణ్యస్నానాలను ఆచరించి అనంతరం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆ తర్వాత కొండ దిగువన ఉన్న ఆలయాన్ని దర్శించుకొని శివునికి పాలాభిషేకం చేశారు. ★ రంప శివాలయాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ బాలాజీ, సీఐ సన్యాసినాయుడు ఆలయాన్ని దర్శించుకున్నారు. భానుకల్యాణ మండపం అధినేత బత్తిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ★ పంచారామ క్షేత్రాలైన ద్రాక్షారామ, సామర్లకోట భీమేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ద్రాక్షారామలో భీమేశ్వరునికి అభిషేకం

సామర్లకోటలో..

జలపాతాల సొగసు.. మైమరిపించే మనసు

సీలేరు నది వద్ద ప్రకృతి రమణీయ చిత్రం

మోతుగూడెం, న్యూస్‌టుడే: ఏడాది పొడవునా జాలువారే జలపాతాలు.. ప్రవహించే సీలేరు నది.. కట్టిపడేసే ప్రకృతి రమణీయ అందాలు.. వంపులు తిరిగే కొండకోనల సొగసుతో పోలవరం జిల్లాలోని మోతుగూడెం పర్యాటక ప్రాంతం భూతల స్వర్గాన్ని తలపిస్తోంది. ఇక్కడికి ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు, ఇతర రాష్ట్రాల నుంచి అనేక మంది సందర్శకులు వస్తుంటారు.

షూటింగ్‌లు ఎన్నో..

● వివిధ ఛానళ్లలో ప్రసారమవుతున్న సీరియళ్ల సన్నివేశాలను పొల్లూరు జలపాతం, శివాలయం వద్ద చిత్రీకరించారు. ● విశాఖ జిల్లాకు చెందిన మోడళ్లతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 60 మంది ఫొటోగ్రాఫర్లు 2022లో ట్రయల్ షూట్ నిర్వహించారు. ● ఇక్కడ చిత్రీకరించిన పుష్ప-1, 2, అఖండ బ్లాక్ బాస్టర్ మూవీస్‌గా నిలిచాయి. ● 2023 ఫిబ్రవరిలో నాగచైతన్య హీరోగా, కృతిశెట్టి కథనాయికగా రూపొందించిన 'కస్టడీ' సినిమాలో ఓ ఫైటింగ్ సన్నివేశాన్ని సీలేరు నది ప్రాంతంలో చిత్రీకరించారు. ● 2025లో చిత్రీకరించిన తమ్ముడు సినిమాలో ఓ పాటను పొల్లూరు జలపాతం వద్ద చిత్రీకరించారు.

ఆకట్టుకుంటున్న పొల్లూరు జలపాతం..

అభయారణ్యంలో ఎత్తైన కొండల నుంచి పాలనురగలతో జాలువారే పొల్లూరు ఎగువ, దిగువ జలపాతాల అందాలు పర్యాటకులను మైమరిపిస్తున్నాయి. ఏపీ జెన్‌కో పొల్లూరు, డొంకరాయి జలవిద్యుత్కేంద్రాలు, వాటి కోసం నిర్మించిన ఫోర్‌బే, ఏవీపీ, డొంకరాయి జలాశయాల అందాలు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.

పొల్లూరు జలపాతంలో జలకాలాడుతున్న సందర్శకులు

జలవిద్యుత్కేంద్రాల సందర్శన..

సీలేరు కాంప్లెక్స్‌లోని పొల్లూరు, డొంకరాయి, సీలేరు జలవిద్యుత్కేంద్రాలను కళాశాల విద్యార్థులు సందర్శించి క్షేత్రస్థాయిలో వాటి వివరాలను తెలుసుకోవడంతో వారి భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ కేంద్రాల సందర్శనకు వచ్చే విద్యార్థులకు ఇంజినీరింగ్ అధికారులు జలవిద్యుత్తు ఉత్పత్తి గురించి క్షుణ్ణంగా వివరిస్తున్నారు.

గణనీయంగా పెరిగిన సంఖ్య

పుష్ప-1, 2, అఖండ-2, కస్టడీ, తమ్ముడు, గరుడవేగ తదితర సినిమాల చిత్రీకరణ అనంతరం మోతుగూడెం పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మరికొన్ని సినిమాల చిత్రీకరణకు ప్రముఖ దర్శకులు వచ్చి లోకేషన్లను ఎంపిక చేస్తున్నారు.

పుష్ప-1, 2 సినిమాలు చిత్రీకరించిన బ్రిడ్జి

ఈ ప్రాంతాల్లో సినిమాలు, టీవీ సీరియళ్లు, డాక్యుమెంటరీ ఫిల్మ్‌లు, ప్రీవెడ్డింగ్, బేబి షూట్లు కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో కెమెరామెన్లు, ఫొటోగ్రాఫర్లు వస్తూనే ఉన్నారు. వారికి కావాల్సిన గదులు, భోజన సదుపాయాలతోపాటు, దుస్తులను కూడా రిసార్ట్స్ యజమానులు అద్దెప్రాతిపదికన ఇస్తున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ కూడా ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి, అభివృద్ధి చేస్తే మా ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు అంటున్నారు.

17న 'చలో విజయవాడ'

రంపచోడవరం: విజయవాడలో ఈ నెల 17న యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే రణభేరి 2.0ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.కృష్ణ, జి.విశ్వరాజ్ పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2023 జులై నుంచి 12వ పీఆర్‌సీని అమలు చేయాల్సి ఉండగా మూడేళ్లు కావస్తున్నా నేటికి అమలు చేయలేదన్నారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని వీటికి బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేకపోవడంతో పీఆర్‌సీ, ఐఆర్ అమలు జరగదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాపికొండలకు 5 పర్యాటక బోట్లు

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి ఆదివారం అయిదు బోట్లలో 374 మంది పర్యాటకులు పాపికొండల అందాలను తిలకించడానికి వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు. పోలీసుల తనిఖీలు అనంతరం వారందరిని విహారయాత్రకు అనుమతించారు. పోలవరం ప్రాజెక్టు వెనుక జలాలు కారణంగా పోశమ్మగండి వద్ద గోదావరిలో నీటి మట్టం రోజురోజుకి పెరుగుతూనే ఉంది. దండంగి, చినరమణయ్యపేట పరిసర ప్రాంతాల్లో మొక్కజొన్న చేలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీతపల్లి వాగుకు వరద ప్రవాహం మరింత పెరగడంతో వాగులో రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. దండంగి- డి.రావిలంక గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ వరద ప్రవాహం కొనసాగుతోంది.

మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తాం

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ తెలిపారు. అమలాపురం ఓసీ రిక్రియేషన్ క్లబ్‌లో సాయిరాజ్, చరణ్ ఆధ్వర్యంలో రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఇన్విటేషన్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. మిక్సిడ్ డబుల్స్‌లో కె.శ్రీకర్, కె.సరియు, మెన్స్ డబుల్స్‌లో పి.చంద్రగోపీనాథ్, విగ్నేష్, మాస్టర్ డబుల్స్‌లో ఉదయ్ భాస్కర్, జేమ్స్‌లు విజేతలుగా నిలిచారు. విజేతలకు రూ.1.50 లక్షల విలువైన బహుమతులను రంగమణి, సాయిరాజ్, చరణ్ అందజేశారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యాళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్

ఎమ్మెల్యే శిరీషాదేవి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దశను, దిశను చూపే విధంగా ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. అమరావతిలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయం, పారిశ్రామిక, సాగునీటి, విద్య, వైద్యం, పర్యాటకం, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమం తదితర రంగాలకు బలోపేతం చేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. అన్ని వర్గాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రూ.3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని, ఆర్థిక మంత్రి కేశవ్‌ను అభినందిస్తున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ఎన్నడూ లేని విధంగా మూలధన వ్యయానికి రూ.53,915 కోట్లు కేటాయించడం శుభపరిణామమన్నారు. గత ప్రభుత్వం అయిదేళ్లలో ధరల స్థిరీకరణకు రూ.880 కోట్లు ఖర్చు చేయగా ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించి రైతులకు అండగా ఉందన్నారు. విజన్ 2047 లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రగతి వేదిక పారిశ్రామిక వీచిక

వీఈఆర్ పరిధిలోకి ఉమ్మడి తూర్పు

ఈనాడు, రాజమహేంద్రవరం: విశాఖ ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్) పరిధిలోకి తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పోలవరం జిల్లాలను చేర్చుతూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ ప్రాంతం అభివృద్ధికి ఊతమిచ్చినట్లయింది. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న ఈ రీజియన్‌లో ప్రధానంగా ఉత్పత్తి, సేవా రంగాలతోపాటు, పౌల్ట్రీ, మసాలు, పట్టుజీరలు, వ్యవసాయం తదితర ఏడు అంశాలు గ్రోత్ డ్రైవర్లుగా వృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ఎక్కడ ఏ తరహా [illegible] అంశంపై డీపీఆర్‌ల తయారీకి కన్సల్టెన్సీ ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. దీని పరిధిలో 41 రకాల అత్యున్నత రంగాలకు చెందిన ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయి. కేంద్ర, ప్రైవేటు సంస్థల సహకారంతో వీటిని ఏర్పాటు చేస్తామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు.

మారేడుమిల్లిలో ఓ ఇంటి ముందు ఆరబెట్టిన రబ్బరు

ఇదీ ఉపయోగం

● పోలవరం జిల్లాలో ఆహార ఉత్పత్తులు, సేవా రంగం ఆధారిత పరిశ్రమలకు అవకాశాలున్నాయి. ప్రపంచంలో మారేడుమిల్లి పర్యాటకంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడ అంతర్జాతీయ స్థాయి రిసార్ట్లు, విడిది కేంద్రాలు వస్తే అవకాశాలున్నాయి. [illegible] రబ్బరు తయారీ, అరకు కాఫీ తోటల పెంపకం, జీలుగు నుంచి బెల్లం తయారీ, జీడిపప్పు ప్రాసెసింగ్ తదితర రంగాలు ఇప్పటికే అక్కడ కొనసాగుతున్నాయి. వీటి నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు తీసే యూనిట్లు వస్తే మరింత మెరుగైన జీవన ప్రమాణాలు పెరగడంతోపాటు, జిల్లా ఆర్థిక వృద్ధికి తోడ్పాటునిస్తుంది.

● తూర్పు గోదావరి జిల్లాలో పౌల్ట్రీ, మసాలు, ఉత్పత్తి, పర్యాటక రంగాలకు సంబంధించి అనేక వనరులున్నాయి. ప్రధానంగా రోడ్డు, రైలు, విమానయానం అందుబాటులో ఉంది. విమానాశ్రయ విస్తరణ నేపథ్యంలో మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి.

● కాకినాడ జిల్లా ఇప్పటికే పారిశ్రామిక పురోగతి, ఐటీ సంస్థలతోపాటు ఆక్వా, వ్యవసాయ రంగాల్లో దూసుకుపోతోంది. పోర్టు ప్రధాన ఆదాయ వనరుగా మారుతోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు ఈ నగరం ఎంపికైన నేపథ్యంలో పట్టణీకరణ శివారు ప్రాంతాలకూ శరవేగంగా విస్తరిస్తోంది. కొత్త ప్రాజెక్టులు వస్తే అందుకు తగిన వసతులు కల్పించేందుకు ఇక్కడ అపార వనరులున్నాయి.

● డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పర్యాటకం, వ్యవసాయం, ఉద్యాన రంగాల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూలం. ఇప్పటికే ఈ ప్రాంతంలో కొబ్బరి ఆధారిత ఉత్పత్తులు చేసే పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. కొబ్బరిలో అంతర పంటగా కోకో, గడ్డి పెంపకం చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఆక్వా, పీత పిల్లల తయారీ కేంద్రం ఏర్పాటుతో మత్స్యకార రంగం అభివృద్ధికి అవకాశాలున్నాయి.

వనం.. జ్ఞాపకాలు పదిలం!

అరకులోయ, న్యూస్‌టుడే

పచ్చని చెట్లు.. పొగమంచు సోయగాలు.. మనసుని ఇట్టే కట్టిపడేసే రమణీయ దృశ్యాలు పర్యాటకులను రారమ్మంటున్నాయి. ఆంధ్రాఊటీ అరకులోయ సమీపంలోని అరకు పీనరీ.. ఉడెన్ బ్రిడ్జి ఫొటో షూట్‌లకు నెలవయ్యాయి. అంజోడాలోని అరకు పీనరీలో.. పైనస్ వృక్షాల మధ్య అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఉడెన్ కాటేజీలు, ఉడెన్ ఫొటోఫ్రేమ్‌లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అరకు సమీపంలోని సుంకరమెట్ట వద్ద కాఫీ తోటల నడుమ ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఉడెన్ బ్రిడ్జి పర్యాటకుల మదిని చూరగొంటోంది. ప్రీవెడ్డింగ్, ఫొటోషూట్‌లకు నిలయంగా మారింది. పలు డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిల్మ్‌ల చిత్రీకరణలకు వేదికైంది.

పీనరీలో రుసుములిలా..

★ వెడ్డింగ్ షూట్: 10 మందికి 4 గంటలకు రూ.2 వేలు
★ సినిమా షూటింగ్: ఒక రోజుకు రూ.20 వేలు
★ సినిమా షూటింగ్: ఒకరోజు, ఒక రాత్రికి రూ.30 వేలు
★ పిక్నిక్ : 50 మందికి రూ.5 వేలు
★ ప్రవేశ రుసుము : పెద్దలకు రూ.40, చిన్నారులకు రూ.20

పర్యాటకుల మదిని దోచే ఉడెన్ బ్రిడ్జి

ఒక్క నిమిషం ఆలస్యమైనా.. పరీక్షకు అనుమతించం

ఇంటర్ విద్యామండలి డీఐఈవో ఎస్.భీమశంకరరావు

ముఖాముఖి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ఉన్నత చదువులు అభ్యసించాలంటే ఇంటర్‌లో మార్కులు ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే ప్రయోగ పరీక్షలు పూర్తయ్యాయి. ఈ నెల 23 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ఆయా కళాశాలల యాజమాన్యాలకు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను ఇంటర్ బోర్డు జిల్లా అధికారి (డీఐఈవో) ఎస్.భీమశంకరరావు 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వివరించారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..

జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పటిష్ఠ బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహిస్తాం. అందుకు సంబంధించి ఇప్పటికే సిబ్బందిని నియమించాం. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

జిల్లా ఏర్పడిన తరువాత మొదటిసారిగా పోలవరం జిల్లా పేరుతో హాల్‌టికెట్లు అందజేయనున్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా అన్ని కేంద్రాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేశాం. వాటిని ఇంటర్ బోర్డు సెక్రటరీ, డీఐఈవో కార్యాలయాలకు అనుసంధానిస్తాం. అక్కడి నుంచి నేరుగా పర్యవేక్షిస్తారు. స్థానికంగా ఎలాంటి అవకతవకలు జరగడానికి వీలులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం.

అరగంట ముందే చేరుకోవాలి

ఫిబ్రవరి 23 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకుంటే ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేందుకు వీలుంటుంది. జంబ్లింగ్ పద్ధతిలో కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలి. కళాశాల కోడ్, చిరునామాలతో కూడిన వివరాలను ఆయా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తారు. జిల్లాలో 7 స్టోరేజీ పాయింట్లను, పరీక్ష పత్రాల స్ట్రాంగ్ రూంని రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేశాం.

కంట్రోల్ రూం ఏర్పాటు

పాడేరు (ఉమ్మడి అల్లూరి జిల్లా)లోని డీఐఈవో కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశాం. పోలవరం జిల్లాలో హాల్‌టికెట్లు, పరీక్ష కేంద్రాల సమాచారం, ఇతర ఎలాంటి సందేహాలున్నా 9493259259 నంబరును సంప్రదించొచ్చు. పరీక్షల పర్యవేక్షణకు జిల్లాలో మొదటిసారిగా డీఈసీ (జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల కమిటీ) ఏర్పాటు చేశారు.

జిల్లాలో వివరాలు ఇలా..			
మొత్తం కళాశాలలు: 32	పరీక్ష కేంద్రాలు: 10	విద్యార్థులు: 4,955	డిపార్ట్‌మెంటల్ అధికారులు: 10
సిట్టింగ్ స్క్వాడ్‌లు: 1	ఫ్లయింగ్ స్క్వాడ్‌లు: 3	చీఫ్‌సూపరింటెండెంట్‌లు: 10	ఇన్విజిలేటర్లు: 150

ఐఐఎఫ్‌టీకి పూర్తి స్థాయిలో నిధుల విడుదల

కొత్తపల్లి, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం పొన్నాడ పంచాయతీ శీలంవారిపాలెం సమీపంలో నిర్మిస్తున్న ఐఐఎఫ్‌టీ క్యాంపస్‌కు వంద శాతం నిధులు మంజూరయ్యాయని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. వైకాపా పాలనలో రాష్ట్ర వాటా నిధులు కేటాయించడంలో జాప్యం జరగడంతో ప్రాజెక్టు పనులు 10 శాతం కూడా కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో వేగవంతంగా నిర్మాణ పనులు జరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ నిధులు రూ.28.43 కోట్లు విడుదల చేసేందుకు అంగీకారం తెలిపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.57.10 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసిందన్నారు. దీంతో మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.221.81 కోట్ల విడుదలకు మార్గం సుగమం అయ్యిందన్నారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలో క్యాంపస్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నిధుల విడుదలకు సహకరించిన ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

పొన్నాడలో చివరి దశకు చేరుకున్న క్యాంపస్ నిర్మాణం

నేటి నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు సోమవారం నుంచి బుధవారం వరకూ కాకినాడ సూర్యకళామందిరంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు తెలియజేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ సమావేశాల్లో దేశం, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చిస్తామన్నారు. రాష్ట్రంలోని మెడికల్ మాఫియా, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, మన గ్యాస్ మనహక్కు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాలు తదితర అంశాలపై నాయకులు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా పార్టీ సీనియర్ నాయకులు కె.నారాయణ, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తదితరులతో పాటు 26 జిల్లాల ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. సమావేశాల సందర్భంగా నగరంలోని కూడళ్లలో పార్టీ జెండాలతో తీర్చిదిద్దుతున్నారు. సూర్యకళామందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

కాకినాడ నగరంలో కూడళ్లను పార్టీ జెండాలతో అలంకరిస్తున్న కార్యకర్తలు

అభినయ యుక్తి.. అమ్మ శక్తి

దుర్గాడ శివాలయంలో ఆదివారం రాత్రి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నృత్యరూపక చిత్రమిది. శ్రీఉమారామలింగేశ్వర కోలాట భజన మండలి ఆధ్వర్యంలో ఇలా ఆకట్టుకున్నారు. చెరుకూరి ఆదిత్యశర్మ పర్యవేక్షణలో ప్రదర్శనలు కొనసాగాయి. గొల్లప్రోలు శివాలయం వద్ద కూడా పిల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో చిన్నారులు నృత్యంతో అలరించారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

ఖాళీ స్థలం.. సేంద్రియ ఫలం..!

అబ్కారీశాఖ ఖాళీ స్థలాల్లో కూరగాయల సాగు

ఈనాడు, కాకినాడ : కొన్ని నెలల కిందట తుప్పలు, డొంకలతో చిట్టడవిని తలపించేలా ఉన్న అబ్కారీ స్థలాలు నేడు పూల మొక్కలు, కూరగాయల తోటలతో పచ్చదనం పంచుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని సామర్లకోట, చాగల్లు ఐఎంఎల్ డిపోల్లోని నిరుపయోగ స్థలాల్లో చేపడుతున్న సేంద్రియ సేద్యం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

సామర్లకోట మద్యం డిపోలోని స్థలంలో కూరగాయల సాగు ఇలా..

పోషకాలపై అవగాహనతో

సామర్లకోట, చాగల్లు మద్యం డిపోల్లో గోదాములు మినహా రెండు, మూడు ఎకరాలకు పైగా ఖాళీ భూములున్నాయి. అవన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఈ డిపోల్లో తనిఖీలకు వచ్చేటప్పుడు ఆయా స్థలాలను పరిశీలించి వాటిలో అందరికీ ఉపయోగపడే మొక్కలు పెంచితే బాగుంటుందని ఉప కమిషనర్ చైతన్య మురళి ఆలోచన చేశారు. అక్కడి సిబ్బంది, హమాలీలకు పోషక పంటలపై అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేసుకుంటే బాగుంటుందని సూచించారు. దీంతో ఆ భూముల స్వరూపం మారిపోయింది.

● పాలకూర, కొత్తిమీర, తోటకూర, పచ్చిమిరప, వంగ, మునగ, అరటి, ఆనబ ఇలా అన్ని రకాల కూరగాయలను చిన్నచిన్న మడులుగా చేసి పండిస్తున్నారు.

పండిస్తే లాభం.. తింటే ఆరోగ్యం..

● సామర్లకోట డిపోలో ఇప్పుడు ప్రతిరోజు 10 నుంచి 15 కిలోల వంకాయలు పండుతున్నాయి.

● అరటి గెలలతో చెట్లు నిండుగా ఉన్నాయి. ఆకు కూరలు రోజూ 15 నుంచి 20 కట్టలు తెంచుతున్నారు.

● టమాట అయిదారు కిలోల దిగుబడి వస్తుంది. వీటన్నింటిని అక్కడ పనిచేసే సిబ్బంది రోజువారీగా పంచుకుంటున్నారు. దీనివల్ల వారి వంటింట బడ్జెట్‌లో కూరగాయల ఖర్చు మిగులుతుంది.

'కాకినాడలోని మా కార్యాలయం ఎదుట చిన్న స్థలంలో పది రకాలు సాగుచేసి వాటితో అక్కడే వండించి తింటున్నాం. అక్కడ పండిన పంటను చూపించి ఆరోగ్యంపై అవగాహన కల్పించాకే డిపోల్లో సాగుకు ముందుకు వచ్చారు. చక్కగా పంటలు పండిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో చొల్లంగి వద్ద గురుకుల పాఠశాలలోని రెండు ఎకరాల ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేస్తున్నాం.' అని డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి అన్నారు.

ఎగిరి గంతేసేలా.. విజయం

ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో అరిగెల రంగయ్య జాతీయస్థాయి వాలీబాల్ బాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జీఎస్‌టీ(ముంబయి) జట్టు 3-2 స్కోరుతో ఎస్ఏఐ(కేరళ)పై గెలుపొందింది. అనంతరం ఇండియన్ బ్యాంకు(చెన్నై) జట్టు కర్ణాటక జట్టుతో తలపడింది. మహిళ విభాగంలో అల్ఫాన్సా(కేరళ), ఎస్‌సీఆర్ జట్ల మధ్య హోరాహోరీగా పోటీ సాగింది. –న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

(c) eenadu

కోటి దీపాలు వెలిగె..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి కోటిపల్లి ఆలయ ముఖ మండపంలో కోటి దీపార్చన కనులపండువగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు పూజలు చేసి మొదటి దీపాన్ని వెలిగించారు. మండపం చిన్నది కావడంతో నిర్ణీత సంఖ్యలోనే భక్తులను అనుమతించారు. వేలాది మంది భక్తులు బయట నుంచి దీపోత్సవాన్ని వీక్షించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పామర్రు

శూలాల సంబరం.. భక్తి పరవశం

అమలాపురం మండలం ఇమ్మిడివరప్పాడులోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శులాల సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కరికాల భక్తులు 20 మంది బుగ్గలకు శులాలు గుచ్చుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. –న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ద్రాక్షారామ.. జ్యోతిర్లింగార్చన

ద్రాక్షారామ భీమేశ్వరాలయం నంది మండపంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి జ్యోతిర్లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. చండీ ఉపాసకుడు ఇంద్రగంటి రామరావుశర్మ నేతృత్వంలో శివలింగాకృతిలో 365 దీపాలతో లింగార్చన జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. – న్యూస్‌టుడే, ద్రాక్షారామ

ఆదియోగి.. కొలువుదీరి

మలికిపురం మండల కేంద్రంలో శివరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్థానిక మార్కెట్ కూడలిలో ఈశ టెంపుల్ మాదిరిగా శివుడి విగ్రహం, ఏడు ద్వారాలతో వేంకటేశ్వర స్వామి ఆలయ నమూనాలు ఆకట్టుకున్నాయి. పలువురు భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

సభలో మాట్లాడుతున్న ఆనందరావు

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో క్రీడలకు, క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో అరిగెల రంగయ్య మెన్, ఉమెన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడలకు పూర్వవైభవం వచ్చిందన్నారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ సోంబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, కౌశిక్ అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు మద్దింశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గం

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం సర్పవరం జంక్షన్‌లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్ 4వ తరగతి ఉద్యోగుల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జి.రత్నకుమార్ ఎన్నికల అధికారిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్‌ప్రభుకుమార్ పరిశీలకుడుగా ఎన్నికలు నిర్వహించారు. మూడేళ్లపాటు పదవీకాలం ఉండే కార్యవర్గానికి అధ్యక్షుడిగా పి.నాగబాబు, కార్యదర్శి డీఎన్‌వీ కిరణ్, అసోసియేట్ అధ్యక్షురాలిగా సీహెచ్ సువర్ణకుమారి, ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాస్, ఎం.కృష్ణశాస్త్రి, జాయింట్ సెక్రటరీగా ఎం.రాజశేఖర్, కోశాధికారిగా వి.సూరజ్, కోఆప్షన్ సభ్యుడిగా పి.రోహిత్‌లను ఎన్నుకున్నారు.

న్యూస్‌టుడే, మండపేట

వాహన వైద్య సేవలకు జవసత్వాలు

108 సిబ్బందికి పెరిగిన జీతాలు

ఆపదలో ఆదుకునే అపర సంజీవనిగా పిలిచే 108 అంబులెన్సు సేవలు మరింత విస్తృతం కానున్నాయి. ఈ వాహనాల్లో పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించేలా సిబ్బందికి జీతాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వారిలో సంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నో సంవత్సరాలుగా జీతాలు పెంచాలంటూ వారు ఆందోళనలు చేసినా గత వైకాపా ప్రభుత్వం కనికరం చూపలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 22 అంబులెన్సులు ఉండగా వీటిలో 102 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు (ఈఎంటీ) 53 మంది, డ్రైవర్లు (పైలెట్లు) 49 మందికి లబ్ధి చేకూరనుంది. దీంతో వీరంతా థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

గత తెదేపా హయాంలోనే జీవో..

కరోనా విపత్తు సమయంలో 108 సిబ్బంది ప్రాణాలకు తెగించి సేవలందించారు. వైరస్ బాధితులను ఆసుపత్రులు, క్వారంటైన్‌లకు తరలించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయా సందర్భాల్లో సిబ్బంది కూడా కరోనా బారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పట్లో వీరి సేవలను ప్రజలంతా ప్రశంసించారు. కనీసం ఆ తరవాతైనా జీతాలు పెంచకపోవడంతో జీతాల స్లాబులు పెంచాలని వారు వేడుకున్నా అప్పటి వైకాపా ప్రభుత్వం కరుణించలేదు. అయితే 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో తెదేపా ప్రభుత్వం 108 అంబులెన్స్ సిబ్బంది జీతాలు రూ.4000 చొప్పున పెంచుతూ జీవో నంబర్ 49 విడుదల చేశారు. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ జీవోని తుంగలో తొక్కడంతో అమలుకు నోచుకోలేదు.

పెంపుదల ఇలా..

ప్రస్తుతం అయిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఈఎంటీలు, పైలెట్లు, 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్నవారికి స్లాబులు వేర్వేరుగా ఉన్నాయి. ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున పెంపుదల వర్తిస్తోంది. అలాగే 15 సంవత్సరాలు, 20 సంవత్సరాలు సర్వీసు దాటినవారికి త్వరలోనే స్లాబు పెరిగే అవకాశం ఉంది.

థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అంబులెన్సు సిబ్బంది

వారిపై నిర్ణయం తీసుకోవాలి..

ఇక నుంచి ఎవరైతే 5, 10 సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసుకున్నారో వారికి ఆటోమేటిక్‌గా రూ.5 వేల వేతనం పెరుగుతుంది. 15, 20 సంవత్సరాలు దాటిన వారి స్లాబు పెంపుదలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. - ఎం.రాజు, 108 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఈఎంటీ, మండపేట

కోటిపల్లి.. భక్తులు ప్రణమిల్లి

పామర్రు, న్యూస్‌టుడే: గౌతమి నదీ తీరాన వెలిసిన పుణ్యక్షేత్రం కోటిపల్లి భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారి తీర్థపు బిందెను తీసుకెళ్లి అభిషేకించిన అనంతరం దర్శనానికి అనుమతించారు.

ప్రత్యేక అలంకరణలో కోటిపల్లి శివుడు

భక్తుల రద్దీతో ప్రత్యేకదర్శనం, సర్వదర్శనం క్యూలన్నీ నిండిపోయాయి. దర్శనానికి కనీసం మూడు గంటల సమయం పట్టింది. గోదావరి స్నానఘట్టాలన్నీ జనాలతో నిండిపోయాయి. భక్తులు లోపలికి వెళ్లకుండా పడవలను బారికేడ్లుగా కట్టేశారు. గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. మూడు ప్రధాన స్నానఘట్టాల్లోనూ ఇసుక మేటలు వేయడంతో సుమారు అరకిలోమీటరు నడిచి వెళ్లి స్నానాలు చేశారు. జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద, సేవా సంస్థలు, కుల సంఘీయులు అన్నదానం, పులిహోర ప్రసాద వితరణ చేశారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్, తోట త్రిమూర్తులు ఆదర్శమిత్ర మండలి, పైడా వారి సంస్థలు, శాలివాహన, విశ్వబ్రాహ్మణ, కాకతీయ, బ్రాహ్మణ, వైశ్య సంఘాలు, సత్యసాయి సేవాసంస్థలు సేవల్లో పాలుపంచుకున్నాయి. కె.గంగవరం కూడలిలో మనగంగవరం సేవా సంస్థ మజ్జిగ పంపిణీ చేసింది.

సత్యదేవునికి ముగిసిన కోటి తులసి అర్చన

పూర్ణాహుతి నిర్వహిస్తున్న వైదిక బృందం

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో ఈనెల 6న ప్రారంభమైన కోటి తులసి పూజ ఘనంగా ముగిసింది. రోజూ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.30 గంటల వరకు తులసి పూజ, సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాదం నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం ఉదయం 8 గంటలకు ధన్వంతరీ హోమం, రుద్రహోమం ప్రారంభించారు. 11 గంటలకు అర్చకులు, పండితులు, పురోహితుల బృందం ఆధ్వర్యంలో పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ, దేవస్థానం ఛైర్మన్ ఐ.వి.రోహిత్, ఈవో వి.త్రినాథరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పుజలో పాల్గొన్న 62 మంది వైదిక బృందానికి దేవస్థానం తరపున సంభావణ, ప్రశంసాపత్రాలు అందించారు. దాతల నుంచి సుమారు రూ.15 లక్షలు విరాళాలు అందాయని ఈవో త్రినాథరావు తెలిపారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రాకారం చుట్టూ రథ సేవ ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో 12 గంటలకు పరమేశ్వరుడికి అభిషేకం నిర్వహించారు.

మాజీ ఎంపీ రత్నాబాయి మృతి

రంపచోడవరం: మాజీ ఎంపీ(రాజ్యసభ) తడపట్ల రత్నాబాయి(79) పోలవరం జిల్లా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందారు. కాంగ్రెస్‌పార్టీలో రత్నాబాయి సీనియర్ నాయకురాలుగా ఉన్నారు. 1972లో ఎల్లవరం (ప్రస్తుత రంపచోడవరం) నియోజకవర్గంలో మొదటగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2007లో జీసీసీ ఛైర్మన్‌గా, 2009లో రాజ్యసభ సభ్యురాలిగా, 2014లో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగాను ఎన్నికయ్యారు. గత కొన్నాళ్లగా అనారోగ్యంతో ఉంటూ ఇంటివద్దనే ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఆమెకు ఆరోగ్యం క్షీణించగా స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అయితే ఆమె మృతిచెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. భర్త సత్యనారాయణ పీసీసీ సభ్యులుగా పనిచేశారు. ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేటి నుంచి సహకార సంఘ ఉద్యోగుల సమ్మె

రామచంద్రపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక రాష్ట్ర వ్యాప్త సమ్మెకు సహకార సంఘాల ఉద్యోగులు సిద్ధమయ్యారు. రాష్ట్రంలోని సహకార సంఘాల్లో కార్యకలాపాలకు ఆటంకం కలగనుంది. సంఘ పూర్వ రాష్ట్ర నాయకుడు పెంకే సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గత 18 నెలలుగా ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు కోరినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. రాష్ట్ర జేఏసీ నిర్ణయం మేరకు గత 2 నెలలుగా డీసీవో కార్యాలయాల వద్ద, డీసీసీబీల వద్ద ధర్నాలు చేస్తూ నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించారన్నారు. రాష్ట్రంలో 2,060 ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులు 9 వేల మంది ఉద్యోగులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినప్పటికీ స్పందించక పోవడంతో సమ్మెలో దిగుతున్నామన్నారు. ఈ నెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార సంఘ ఉద్యోగులతో కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేసినప్పటికి ప్రభుత్వంలో చలనం లేదన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు ఉద్యోగులు సమ్మెకు వెళ్తున్నట్లు ఆయన వెల్లడించారు.

అన్నప్రసాదం విస్తర్లపై అన్యమత ప్రచారం

- తంటికొండ ఆలయ సిబ్బందిని నిలదీసిన భక్తులు
- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం..

గోకవరం, న్యూస్‌టుడే: వేంకటేశ్వరస్వామివారి అన్నసమారాధనలో అన్యమత ప్రచారానికి సంబంధించిన విస్తర్లు వినియోగించడంపై భక్తులు మండిపడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించిన వివరాలివీ.. తంటికొండ గ్రామంలో వెంకటగిరిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని దర్శించుకునేందుకు ప్రతి శనివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు దేవస్థానం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తారు. శనివారం నిర్వహించిన అన్నసమారాధనలో ఉపయోగించిన విస్తర్లను చూసి భక్తులు ఖంగుతిన్నారు. ఎందుకంటే ఆ విస్తర్లపై ఆంగ్ల అక్షరాలతో మేరీ క్రిస్మస్ అని రాసి ఉంది. అన్యమతానికి సంబంధించి విస్తర్లను దేవస్థానాలలో అన్నసమారాధనకు ఏవిధంగా ఉపయోగిస్తారంటూ అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీశారు. గతంలోను ఇదేవిధంగా ఆకులను వినియోగించిన సంఘటనను గుర్తు చేశారు. మీ నిర్లక్ష్యం కారణంగా దేవస్థానం ప్రతిష్ఠ దెబ్బతింటుందని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఈవో అక్కడకు చేరుకొని విస్తర్లను తొలగించారు. వంట గదిలో ఉన్న మిగిలిన విస్తర్లను ధ్వంసం చేయాలని పట్టుబట్టడంతో కొంత వివాదం నెలకొంది. దీనిపై దేవస్థానం ఛైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొరను వివరణ కోరగా పొరపాటున వచ్చిన ఆ విస్తర్లను వెంటనే తొలగిస్తామన్నారు. ఈ విధమైన సంఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామన్నారు.

తంటికొండ దేవస్థానంలో వినియోగించిన అన్యమత ప్రచార విస్తర్లు

ఫార్మర్ రిజిస్ట్రీతో బహుళ ప్రయోజనాలు

- ఈనెలాఖరులోగా నమోదు పూర్తికి ఆదేశాలు

మీ కోసం

గండేపల్లి, న్యూస్‌టుడే: సొంత భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాలు అందేలా ప్రభుత్వాలు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశాయి.

నమోదు ప్రక్రియ ఇలా..:

ఈ ఫార్మర్ రిజిస్ట్రీని ఆర్ఎస్‌కేల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేస్తారు. ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, చరవాణి నంబరుతో సహాయకులను సంప్రదించాలి. నమోదయ్యాక చరవాణికి 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తోంది.

రిజిస్ట్రీతో ప్రయోజనాలివీ

విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పెట్టుబడి సాయం, ఎరువుల/వ్యవసాయ యంత్రాల రాయితీ, పంటల బీమా, పంట దిగుబడుల విక్రయాలు, పంట రుణాలు తదితరాలు పొందొచ్చు.

28వ తేదీతో నమోదు పూర్తి

గత కొన్నాళ్లుగా నమోదు ప్రక్రియ జరుగుతోంది. గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన రైతుల సేకరిస్తున్నాం. నెలాఖరుకు వందశాతం నమోదు పూర్తి చేస్తాం. – లక్ష్మి, వ్యవసాయ అధికారి, గండేపల్లి

AUTO

VEHICLES FOR SALE

శ్రీ లలిత రైస్‌మిల్, పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీ సాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆ రోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 9493338823.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలు లోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

ఇళ్ళు, స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో మార్టిగేజ్/ టేకోవర్ లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. ★ నో సిబిల్/ నో బ్రోకర్స్. ★ MSR గ్రూప్, వైజాగ్. Ph: 9121314141.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు. రాజమండ్రి 'శ్రీ సాయిలక్ష్మీ లాడ్జి' SVG మార్కెట్ రోడ్, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతీనెల 3, 17 తేదీల్లో మందులు కలవు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJANAGARAM

ఓనర్ డైరెక్ట్‌గా అమ్మే, రెసిడెన్షియల్ ప్లాట్లు రాజానగరం మండల ఆఫీస్ వెనుక, డీటీసీపీ అప్రూవ్డ్ లేఅవుట్‌లో స్థలాలు అమ్మబడును. Cell: 96668 94019, 93980 83034.

GENERAL

ఖాళీస్థలం అమ్మకం. పెద్దాపురం పట్టణం TTD కళ్యాణమండపం రోడ్ వరహాలయ్యపేటలో 192 చ॥గ॥ స్థలం అమ్మకం. ✆ 8328310691, 9177311445

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. MS ఆఫీస్, టైపింగ్‌లో పరిజ్ఞానం, పూర్తి వివరాలతో ఈనెల 16 నుండి 21 లోపు (10 am to 4 pm) సంప్రదించండి. సాగర్ కాంప్లెక్స్, సెవెన్ హిల్స్ రోడ్, సాంబమూర్తినగర్ 5వ వీధి, కాకినాడ-1, ✆ 92472 55155, 94928 02345.

Accountant & Receptionist (F) రియల్ ఎస్టేట్ కంపెనీలో చేయుటకు అనుభవం గలవారు కావలెను. జీతం:10 - 15 వేలు. ✆ 93924 41891.

స్త్రీ అభ్యర్థిని (40 సం॥లోపు) హిందువు మాత్రమే. విజయవాడలో ఇంటిలోనే ఉంటూ ఇంట్లోపని, 1 వెజిటేరియన్‌కు వంట చేయుటకు కావలెను. ✆ 92472 88381.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్ చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ డీఎస్ఏలో నిర్వహించిన అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

ఆదివారం ఫైనల్స్ ఉత్సాహంగా జరిగాయి. రొనాల్డో జట్టు విజేతగా నిలిచింది. భాటియా జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. గత రెండు నెలలుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో ప్రతి ఆదివారం మూడు మ్యాచ్‌లు చొప్పున జరిగాయని నిర్వాహకులు తెలిపారు. బహుమతి ప్రదానోత్సవానికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అధ్యక్షుడు తలాటం హరీష్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్, ఫుట్‌బాల్ కోచ్ స్వామి హాజరై క్రీడాకారులకు పతకాలు, కప్‌లను అందజేశారు. సత్తిరాజు, కృష్ణబాబు, ఫుట్‌బాల్ క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, సంఘ అసోసియేషన్ నాయకులు తదతరులు పాల్గొన్నారు.

విజేత రొనాల్డో జట్టుకు కప్‌ను అందజేస్తున్న ముఖ్యఅతిథులు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,500
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

ఆర్ఎస్‌బీ హాకీ జట్టుకు కోచ్, కెప్టెన్‌గా కాకినాడ వాసులు

ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకూ న్యూదిల్లీలో జరగనున్న ఆల్‌ఇండియా హాకీ సివిల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆర్ఎస్‌బీ జట్టు కోచ్‌గా కడియాల రవిచంద్రప్రసాద్, కెప్టెన్‌గా ఎన్.వీరబాబు ఎంపికయ్యారు. వీరిద్దరూ కాకినాడ వాసులే కావడం విశేషం. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

సత్యదేవుని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర అధికారి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామిని తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి.ఆనంద్ ఆదివారం దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ బింధుమాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం స్వామి దర్శనానికి వెళ్లిన ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

రాజానగరం: అనుమానాస్పదంగా తన కుమారుడు మృతి చెందాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజానగరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. జి.యర్రంపాలెంకు చెందిన వీరలక్ష్మి, రమేష్ దంపతుల కుమారుడు కాలా ఇస్సాక్ అలియాస్ అశోక్ (21) మెకానిక్‌గా పని చేస్తున్నాడు. వీరలక్ష్మికి తన భర్తతో మనస్పర్థలు రావడంతో కుమారుడు అశోక్‌తో కలిసి అదే గ్రామంలో ఉంటున్న తన సోదరి ఇంట్లో నివాసం ఉంటూ వంట, వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పనికి వెళ్లిన వీరలక్ష్మికి తన సోదరి నుంచి ఫోన్ రావడంతో ఇంటికి వెళ్లారు. అప్పటికే నేలపై పడి ఉన్న కుమారుడుని చూసి సోదరిని వివరం అడగగా.. శివరాత్రి సందర్భంగా స్నానానికి వెళ్లేందుకు ఇంట్లో ఉన్న అశోక్‌కు ఫోన్ చేయగా.. తీయలేదని, కిటికీలోంచి చూడగా ఇంటి దూలానికి ఉరి వేసుకుని కనిపించాడని చెప్పినట్లు వీరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కెరటాల ఉద్ధృతికి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

పీఎంపాలెం, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కెరటాల ఉద్ధృతికి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన విశాఖపట్టణంలోని రుషికొండ బీచ్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. కొమ్మాది సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న అయిదుగురు విద్యార్థులు సమీప వసతిగృహంలో ఉంటున్నారు. ఆదివారం తూర్పు గోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన పి.అరవింద్‌నాయుడు (21), శ్రీకాకుళం జిల్లా వాసి సనపల రాజీవ్‌లు మరో ముగ్గురు స్నేహితులు గోకుల్‌కృష్ణ, ఆదిత్య, సాధిల్యలతో కలిసి ఉదయం 7 గంటలకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. సుమార 10 గంటల సమయంలో దగ్గరలోని ఓ రిసార్టు వెనుక బీచ్‌కు వచ్చారు. వీరిలో అరవింద్, రాజీవ్ సముద్రంలో ఈతకు దిగారు. మిగిలిన ముగ్గురు ఒడ్డున కూర్చున్నారు. ఒక్కసారిగా ఉద్ధృతంగా వచ్చిన కెరటాల్లో చిక్కుకున్న అరవింద్ కేకలు వేయడంతో పక్కనే ఉన్న రాజీవ్ కాపాడేందుకు ప్రయత్నించాడు. దీంతో ఇద్దరూ కెరటాల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. ఒడ్డున ఉన్న స్నేహితులు స్థానికుల సాయంతో జీవీఎంసీ బీచ్, టూరిజం లైఫ్‌గార్డులకు సమాచారం అందించారు. వెంటనే వారు బోటు ద్వారా గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి యువకులను రుషికొండ తీరానికి తీసుకొచ్చారు. వీరిలో అరవింద్ పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో విద్యార్థి రాజీవ్‌కు ప్రాథమిక చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడి తండ్రి సూర్యప్రకాష్ ఫిర్యాదు మేరకు ఎస్సై వరహాలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వారధిపై నుంచి దూకి యువతి ఆత్మహత్యాయత్నం

మామిడికుదురు, న్యూస్‌టుడే: పాశర్లపూడిబాడవ వైనతేయ వారధిపై నుంచి 29 ఏళ్ల యువతి ఆదివారం ఉదయం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వీరభద్ర సంబరంలో భాగంగా అక్కడే స్నానాలు ఆచరిస్తున్న భక్తులు గమనించి కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు అప్రమత్తమై ఆమెను రక్షించి బయటకు తీసుకువచ్చారు. మండలంలోని మాకనపాలేనికి చెందిన యువతిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. గల్ఫ్‌లో కొంతకాలం ఉండి వచ్చిన ఆమె ఇటీవల మానసికంగా ఇబ్బంది పడుతోందని వారు తెలిపారు.

(c) eenadu

భాజపాలో పలువురి చేరిక

పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మన్యంలో భారతీయ జనతా పార్టీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మంగరౌతు వీరబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వీరబాబు సమక్షంలో పెమ్మె శ్రీను, కీలు అప్పలకొండ, దారబల్ల హరీష్, విక్రమంతి వీరబాబు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు, నాయకులంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నేతలు అడపా సత్యనారాయణ, గొలగాని శ్రీను, తోట శ్రీను, సింహాద్రి రామకృష్ణ తనూజ్, బుద్దా త్రినాథ్, మద్దాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాల కళకళ

మోతుగూడెం, న్యూస్‌టుడే: మహాశివరాత్రికి శని, ఆదివారాలు సెలవు దినాలు రావడంతో మోతుగూడెం పర్యాటక అందాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సీలేరు, పొల్లూరు జలపాతంలో పుణ్యస్నానాలు ఆచరించి సమీపంలోని శివాలయాలను దర్శించుకుని విశేష పూజలు చేశారు. పొల్లూరు దారాలమ్మ పిక్నిక్ స్పాట్, పోర్‌బే, ఏపీపీ, డొంకరాయి జలాశయాలకు వెళ్లి ప్రకృతి అందాలను తిలకించారు. ఎక్కువ సమయం సీలేరు నది, జలపాతం వద్ద గడిపేందుకు వారు ఆసక్తి చూపారు.

పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

ఖాళీగా రంపచోడవరం సంత

వెలవెలబోయిన వారపు సంత

రంపచోడవరం : జిల్లా ప్రధాన కేంద్రమైన రంపచోడవరంలో వారపు సంత వెలవెలబోయింది. ప్రతి ఆదివారం జరిగే సంతకు మండలంతో పాటు చుట్టు పక్కల మండలాలకు చెందిన గిరిజనులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే మహాశివరాత్రి సందర్భంగా మార్కెట్, మెయిన్ రోడ్డులో ఉన్న వివిధ దుకాణాల వద్ద జనాలు లేక అంతంతమాత్రంగానే వ్యాపారాలు సాగాయని నిర్వాహకులు వాపోయారు.

ప్రహరీ లేక..ఇక్కట్లు

మారేడుమిల్లిలోని కొత్తకాలనీలో ఉన్న గిరిజన ప్రాథమిక పాఠశాలకు చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. సమస్యపై ఎంఈవో-2 ముత్యాలరావు స్పందిస్తూ ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మారేడుమిల్లి

గంగవరం ఎస్సైగా ఎస్.వెంకయ్య

గంగవరం : గంగవరం ఎస్సైగా ఎస్.వెంకయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన బి.వెంకటేష్ ఇటీవల ఏసీబీ వలకు చిక్కి రిమాండ్‌లో ఉండటంతో పాడేరు ఎస్‌బీలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్.వెంకయ్యను గంగవరం ఎస్సైగా పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు నియమించడంతో ఆదివారం విధుల్లో చేరారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో గంజాయి, డ్రగ్స్, నాటుసారా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. విధుల్లో చేరిన ఎస్సైకు ఏఎస్సై మహర్షి, హెచ్‌సీ రాంబాబు, సిబ్బంది స్వాగతం పలికారు.

బాలురెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

రంపచోడవరం, న్యూస్‌టుడే: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లా బాలురెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ పార్టీ జిల్లా నాయకులు పల్లాల లచ్చిరెడ్డి, చీకట్ల వెంకటేశ్వరరావు, కుంజా దూలయ్య పేర్కొన్నారు. బాలురెడ్డి మృతదేహానికి అంతిమ యాత్ర నిర్వహించి అంత్యక్రియలు చేశారు. సంతాపం తెలిపిన వారిలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భీమశంకరం, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధూ, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అనసూయ, నాయకులు ఉన్నారు.

కొత్త ఆలోచనలు.. కొంగొత్త పంటలు

కూనవరం, న్యూస్‌టుడే: సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తరువాత వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది. పాత పంటలతో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో కర్షకులు కొత్తగా ఆలోచిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు వేయడానికి ముందుకు వస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఆ పంటల యాజమాన్య పద్ధతులు, విత్తనాల లభ్యతను తెలుసుకుంటున్నారు. స్థానిక పరిస్థితులకు అనుకూలంగా ఏ పంట సరిపోతుందో అంచనా వేసుకుని సాగుకు ఉపక్రమిస్తున్నారు. ఫలితంగా ఏజెన్సీలో కొత్త పంటలు కనువిందు చేస్తున్నాయి.

కూనవరం మండలంలో వేసిన బార్లీ పొగాకు

విలీన మండలాల్లో నూతనంగా..

కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల్లోని రైతులు ఆనవాయితీగా పండించే మిరప, మొక్కజొన్న, లంకపొగాకు, పత్తి వంటి వాణిజ్య పంటలకు తోడుగా కొత్త పంటలను వేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇందులో భాగంగా మండలాల్లో పుచ్చకాయల తోటలు, బార్లీ, పొగాకు సాగు చేస్తున్నారు. ఎటపాకలో పూల తోటలు అందుబాటులో ఉన్నాయి. గతంలో పూలను సమీప పట్టణాల నుంచి దిగుమతి చేసుకునే వారు. పుచ్చకాయలు కావాల్సిన దుకాణదారులు రాజమహేంద్రవరం, భద్రాచలం వంటి పట్టణాల నుంచి వాహనాల ద్వారా తీసుకువచ్చి విక్రయించేవారు.

ఎటపాక మండలంలో వేసిన పూలతోట

స్థానికంగా అందుబాటులోకి

శుభకార్యాల సమయంలో పూల అలంకరణకు రాజమహేంద్రవరం, విజయవాడలకు వెళ్లి తీసుకుని రావాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం పూలతోటలను స్థానికంగా సాగు చేయడంతో తాజా సరకు అందుబాటులో ఉంటోంది. దీంతో శుభకార్యాల వేదికలు పూల పరిమళాలతో అందాలను రెట్టింపు చేస్తున్నాయి. వీటి వల్ల కొనుగోలు, సమయం, రవాణా ఖర్చు ఆదా అవుతోంది. ప్రముఖ కంపెనీలు సిగరెట్ తయారీలో వినియోగించే బార్లీ పొగాకును గతంలో ఇక్కడి రైతులు పండించినా అప్పట్లో నష్టాలు రావడంతో వదిలేశారు. ప్రస్తుతం దీనికి మంచి గిరాకీ ఉండడంతో మళ్లీ ప్రారంభించారు. కొందరు రైతులు మిరప అంతర పంటగా క్యాబేజీ సాగును చేపట్టి మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నేడు

ఎటపాక, న్యూస్‌టుడే: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నేడు(సోమవారం) మధ్యాహ్నం 2గం.లకు నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ డా.మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రి అభివృద్ధికి 2025-26 సంవత్సరానికి గాను రూ.2.25 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో మిగిలిన అభివృద్ధి నిధులను కలిపి మొత్తం రూ.2,65,720లు ఉన్నాయన్నారు. ఈ మొత్తం నిధులతో పీహెచ్‌సీలో అవసరమైన పనులను గుర్తించి వాటికి అభివృద్ధి కమిటీ తీర్మానం, ఆమోదం అనంతరం పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీవో, స్థానిక సర్పంచిలను తదితరులను ఆహ్వానించినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పర్వదినం

చట్టి శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జడ్డంగిలో ప్రత్యేక అలంకరణలో శివయ్య

పొల్లూరు దుర్గా మల్లీశ్వరస్వామిని దర్శించుకున్న రంపచోడవరం మేజిస్ట్రేట్ మురళీ గంగాధర్ దంపతులు

అడ్డతీగల మండలం పొంగారెపాడు వాగు వద్ద భక్తులు

జడ్డంగిలో స్వామివారి రథం ఊరేగింపు

చింతూరు, మోతుగూడెం, ఎటపాక, గంగవరం, అడ్డతీగల, దేవీపట్నం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, వరరామచంద్రాపురం, వై.రామవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. ఓం నమశివాయ.. హరహర మహాదేవ నామస్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి. ఆదివారం వేకువజాము నుంచే మోతుగూడెం, ఎటపాక, గంగవరం, అడ్డతీగల, దేవీపట్నం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, వరరామచంద్రాపురం, వై.రామవరం మండలాల్లోని ఆయా గ్రామాల శివాలయాలకు, చింతూరు మండలం చట్టిలో గానే రామలింగేశ్వర స్వామి శివాలయానికి ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మోతుగూడెం లోయరు సీలేరు నది, పొల్లూరు జలపాతం, ఏటిపల్లిలోని పెద్దేరు, మడేరు తదితర వాగుల్లో భక్తులు స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయాల్లో విభూది, చందనంతోపాటు పలురకాల ద్రవ్యాలతో అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి అర్చన చేసి, భక్తులు తీసుకొచ్చిన దీప, దూప, నైవేద్యాలను నివేదించారు. గొల్లగూడెం శివాలయానికి వెళ్లే భక్తుల కోసం ఐటీడీఏ ఆటోల సౌకర్యాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో గ్రామోత్సవాలు, అన్న సమారాధన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వై.రామవరంలో ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి

బడ్జెట్‌తో అన్ని రంగాల అభివృద్ధికి దోహదం

రంపచోడవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో అన్ని రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బడ్జెట్‌పై హర్షం ప్రకటిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం చంద్రబాబు రూ.3,32,205.34కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టి అన్ని రంగాలకు ప్రాముఖ్యతను ఇవ్వడం జరిగిందన్నారు..

మారేడుమిల్లి తహసీల్దార్‌గా అమ్మాజీ

మారేడుమిల్లి: మారేడుమిల్లి మండల రెవెన్యూ అధికారిణిగా కె.అమ్మాజీ నియమితులయ్యారు. దీనికి సంబంధించి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ అర్బన్‌లో రెవెన్యూశాఖ రీసర్వే విభాగంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆమెకు పదోన్నతి లభించింది. ఇప్పటివరకు డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న బాలాజీ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి

ఎటపాక, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచి హిందీ భాషపై పట్టు సాధించాలని దక్షిణ భారత హిందీ ప్రచార సభ (డీబీహెచ్‌పీ)సభ్యులు రవినాయక్, సీతాపురం జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబూరావు అన్నారు. మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం హిందీ లోయర్, హయ్యర్ పరీక్షలను ఉపాధ్యాయిని సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు.

మన్యంలో తేనెలూరేలా!

గిరి రైతులకు పంపిణీ చేసిన తేనెపెట్టెలు

చింతపల్లి, న్యూస్‌టుడే

మన్యం పేరుచెప్పగానే ఒకప్పుడు అటవీ ఉత్పత్తి అయిన తేనె గుర్తుకు వచ్చేది. అడవుల్లో సహజసిద్ధంగా తేనెపట్లు ఉండేవి. కాలక్రమంలో మారుతున్న వాతావరణం, కాలుష్యం, అడవుల విస్తీర్ణం తగ్గడం, తేనెటీగలకు అనువైన ఆవాసాలు లేకపోవడం, సెల్ టవర్లతో రేడియేషన్ వంటి అనేక కారణాలతో తేనె దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయం, ఉద్యాన పంటలతోపాటు వ్యవసాయానుబంధ పరిశ్రమలకూ ప్రోత్సాహం అందిస్తున్నాయి. ప్రధానంగా చేపలు, కోళ్ల పెంపకం, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు, పెట్టె తేనె నిర్వహణ వంటి వాటికి సహకారం అందిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో..

ఇటీవల చింతపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 40 మంది గిరిజన రైతులకు పెట్టెతేనె నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన గ్రామోద్యోగ వికాస్ యోజన విభాగం అధికారులు పది రోజులపాటు శిక్షణ ఇచ్చారు. పెట్టె తేనె అభివృద్ధి, తేనెటీగల సంరక్షణపై నిపుణులతో శిక్షణలు, మెలకువలు నేర్పించారు. శిక్షణ పొందిన వారందరికీ ధ్రువపత్రాలతోపాటు రూ.40 వేల విలువ కలిగిన పది తేనెపెట్టెలు.. తేనెటీగలతో సహా అందించారు. రైతులు పొలాల వద్ద ఈ పెట్టెలను ఉంచడం, వాటి ఆహారానికి అవసరమైన విధంగా ఉద్యాన, పూలతోటలు పండిస్తే చాలు. రైతులకు అదనంగా ఆదాయం వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది.

★ ఒకప్పుడు గిరిజన సహకార సంస్థ (జీసీసీ).. తమ మొత్తం వ్యాపారంలో 30 శాతం తేనెపైనే ఆధారపడి ఉండేది. గిరిజనులు అడవుల్లో సేకరించిన తేనెను సేకరించి దాన్ని చిత్తూరు, రాజమహేంద్రవరం కేంద్రాలకు పంపించి.. అక్కడ శుద్ధి చేసి రిటైల్ మార్కెట్‌లో గిరిజన హనీ పేరిట విక్రయించేవారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో ఒకప్పుడు 500 నుంచి 1000 టన్నుల వరకూ తేనె దిగుబడులు ఉండేవి. ఇప్పుడు పాడేరు, చింతపల్లి డివిజన్ల పరిధిలో కేవలం 70 టన్నులకు మించి దిగుబడులు రావడం లేదు. రైతులు పెట్టెతేనె నిర్వహణపై దృష్టిసారిస్తే ఆదాయంతో పాటు మన్యానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.

గుంతలు పడి.. రాళ్లు తేలి..

రంపచోడవరం మండలంలో కాకవాడ నుంచి లంకపాకల రహదారి గుంతలు పడి రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. సమస్యపై డీఈ వెంకటరమణ స్పందిస్తూ కాకవాడ నుంచి లంకపాకలు మీదుగా ఆకూరు గ్రామానికి పక్కా రహదారి మంజూరైందన్నారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రంపచోడవరం

ఎండిన చెట్లు.. కూలిపోయేటట్లు

అసలే ప్రధాన రహదారి..! పైగా పర్యాటక ప్రాంతం...! నిత్యం వందలాదిగా తిరిగే వాహనాలు..మారేడుమిల్లిలోని కొత్తకాలనీ వద్ద రెండు ఎండిపోయిన చెట్లు రహదారికి అటు, ఇటు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇవి ఎప్పుడు కూలిపోతాయోనని భయపడుతూ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి వీటిని తొలగించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మారేడుమిల్లి

భీముని కొండ.. కిలగాడకు అండ

మైదానంలా కొండ పైభాగం

ముంచంగిపుట్టు మండలం కిలగాడ గ్రామానికి భీముని కొండే అండని అక్కడి గిరిజనులు చెబుతున్నారు. గ్రామానికి సమీపంలో 1600 అడుగుల ఎత్తయిన కొండ ఉంది. చుట్టూ అటవీ ప్రాంతం, కొండపై చెరువు ఉంది. ఈ చెరువు నుంచి గ్రామానికి నీరు ప్రవహిస్తోంది. ఆ నీటినే గ్రామస్థులు వినియోగించుకుంటున్నారు. సమీపంలో ప్రదేశం క్రీడామైదానంలా దర్శనమిస్తోంది. మహాభారతంలో పాండవులు సంచరించిన ప్రాంతమని, భీముడు పర్యటించిన ఆనవాలు ఉండటంతో పూర్వీకులు దీన్ని భీమునికొండగా పిలిచేవారని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కొండ పైనుంచి చూస్తే.. కిలగాడతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, 12 కి.మీ.ల దూరంలోని ముంచంగిపుట్టు కనిపిస్తాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు

కరివేపాకని తీసిపారేయొద్దు

మార్కెట్‌లో కేజీ రూ.100

శాకాహారమైనా.. మాంసాహారమైనా కరివేపాకు ఉండాల్సిందే. ఈ నెల ప్రారంభంలో కేజీ రూ.30 ఉన్న కరివేపాకు ధర ప్రస్తుతం రూ.100కి చేరింది. గతంలో కూరగాయలు కొంటే కొసరుగా కరివేపాకు ఇచ్చే వారు. ఇప్పుడు రూ.10 ఇచ్చినా ఇవ్వడం లేదు. పెరట్లో పెంచుకునే కరివేపాకు మొక్కలకు చలికాలంలో పెద్దగా ఆకులు రావు. వచ్చినవి కాస్తా మంచుకు రంగుమారి వంటల్లో వాడేందుకు పనికిరావు. గుంటూరు జిల్లా మంగళగిరి, అనంతపురం జిల్లాలో వాణిజ్య సరళిలో కరివేపాకు తోటలను పెంచుతున్నారు. అక్కడి నుంచి అనకాపల్లి మార్కెట్‌కు దిగుమతి అవుతోంది. ఇక్కడి నుంచి జిల్లాలోని ఇతర ప్రాంతాలకు వెళ్తోంది. హోల్‌సేల్ మార్కెట్‌లో టన్ను ధర రూ.55 వేలకు పెరిగింది. రవాణా ఛార్జీలతో అనకాపల్లి చేరే సరికి కేజీకి రూ.60 పడుతోంది. వ్యాపారులు లాభం కలుపుకొని కేజీ రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. కరివేపాకు లాభదాయకమైన పంట. జిల్లాలో చాలా తక్కువ విస్తీర్ణంలో సాగవుతోంది. ఒకసారి పంట వేస్తే 15 నుంచి 20 ఏళ్లపాటు దిగుబడి వస్తుంది. మొదటి ఏడాది దిగుబడి తక్కువ వచ్చినా.. రెండో ఏడాది నుంచి నాలుగు నెలలకు ఒకసారి చొప్పున ఏడాదికి నాలుగు కోతలు వస్తాయి. ఎకరాకు ఏడాదికి 24 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. చీడపీడల సమస్య అధికంగా ఉండటం వల్ల జిల్లాలో రైతుకు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. – న్యూస్‌టుడే, ఎలమంచిలి

విత్తనాలిస్తారు.. పెట్టుబడి రుణమిస్తారు!

'వెలుగు' ఆధ్వర్యంలో కూరగాయల సాగు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

నిరుపేద రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. వెలుగు పథకం ఆధ్వర్యంలో పొలాన్ని లీజుకు తీసుకుని రైతులకు అప్పగించనుంది. మార్కెట్‌లో డిమాండు ఉన్న కూరగాయలతోపాటు పూల సాగు చేపడుతూ రైతులకు ప్రోత్సాహం అందించనుంది. జిల్లాలో ప్రతి మండలం నుంచి తొలి దశలో ఐదు ఎకరాలు సమీకరించి సాగుకు సన్నద్ధమవుతోంది.

★ కూరగాయలు, పూల సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులను గుర్తిస్తున్నాం. రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య (ఎఫ్‌పీవో) ప్రతి మండలంలో లీజుకు తీసుకున్న పొలాన్ని ఎంపిక చేసిన రైతులకు అప్పగిస్తుంది. మార్కెట్‌లో డిమాండు ఉన్న కూరగాయలు, పూల తోటల సాగుకు విత్తనాలు అందజేస్తుంది. సాగునీటి వసతితోపాటు యంత్ర పరికరాలను సమకూరుస్తారు. పెట్టుబడి రుణాలు మంజూరు చేస్తారు. పంట దిగుబడులను వసతిగృహాలతోపాటు విశాఖ, అనకాపల్లిలోని రైతుబజార్లు, కూరగాయల మార్కెట్లకు తరలిస్తామని వెలుగు ఏపీఎం ప్రసాదరావు పేర్కొన్నారు.

పొలంలో నారు నాటుతున్న రైతు

తొలి దశలో సేకరించనున్న భూమి : 55 ఎకరాలు
సాగు చేసే పంటలు : క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యాప్సికం, బీర, వంకాయ, బంతిపూలు
పర్యవేక్షణ : రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య

వైభవంగా స్వామి వారి కల్యాణం

కూనవరం : కుమారస్వామిగూడెం, కూనవరం ఆలయాల్లో వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సంగమేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. కుమారస్వామిగూడెంలో నందికొండ వెంకన్న ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. అటవీ, రెవెన్యూ, పోలీసు, వైద్యశాఖల సిబ్బంది విధులు నిర్వహించారు.

వేగనియంత్రికలు కనిపించక.. ప్రమాదాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: వాహనాల వేగాన్ని నియంత్రించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన నియంత్రికలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మారేడుమిల్లి నుంచి గుర్తేడు వెళ్లే ప్రధాన రహదారిలో ఇదే పరిస్థితి. మండలంలోని మారేడుమిల్లి, పాములేరు, చట్లవాడ, చావడికోట, పుల్లంగి, గుర్తేడు మండలంలోని ధారగడ్డ, గుర్తేడు, పాతకోట, బొడ్డగండి, కానివాడ, చింతలపూడి పంచాయతీల పరిధిలోని వందలాది గ్రామాలకు వెళ్లే వారు ఇదే రహదారిపై ప్రయాణిస్తారు. నియంత్రికలకు ఎటువంటి రంగులు వేయకపోవడంతో వేగంగా వచ్చే వాహనదారులు వీటిని గమనించలేక పోతున్నారు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు స్పందించి వీటిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

స్పీడుబ్రేకర్లు వద్ద వాహనదారులు ఇబ్బందులు

తాగునీరు ఇలా.. వదిలేస్తే ఎలా?

ఒకవైపు కలుషితం, మరోవైపు వృథా

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వరరామచంద్రాపురం మండలం అన్నవరం గ్రామంలో దాదాపు వంద కుటుంబాలకు పైగా ప్రజలు నివాసముంటున్నారు. వీరికి నిత్యం తాగునీటి సమస్యతో అవస్థలు తప్పడం లేదు.

శుద్ధి చేయకుండానే సరఫరా..

అన్నవరం తాగునీటి పథకానికి వేసిన బోరుపాయింట్ దగ్గరికి చుట్టుపక్కల వారు వాడిన మురుగునీరు వచ్చి చేరుతుంది. దీంతో బోరునీరు కలుషితమవుతోంది. ఆ నీటిని శుద్ధి చేయకుండానే మోటార్ల ద్వారా నేరుగా కుళాయిలకు సరఫరా చేస్తున్నారు.● ఈ మోటారుకు సంబంధిత విద్యుత్తు బోర్డు, తీగలను చేతి కందేంత ఎత్తులో ఒక కర్రకు అమర్చి వదిలేశారు. దీంతో వీటికి ఎటువంటి రక్షణ లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి.● కలుషిత కుళాయినీరు తాగడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని గ్రామస్థులు కిలో మీటరు దూరంలో ఉన్న కొండ వాగు దగ్గరకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు.

అన్నవరం గ్రామంలో బోరుపాయింట్ వద్ద మురుగునీరు

సమస్య పరిష్కరించాలి

ప్రతిరోజు వాగుకు వెళ్లి నీరు తెచ్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నామని, వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని కుళాయినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పైపులైన్లు ధ్వంసమవుతున్నా..

మారేడుమిల్లి : మారేడుమిల్లిలోని స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు ప్రభుత్వం అదనపు భవనాలను మంజూరు చేసింది. వీటిని మండల పరిషత్తు కార్యాలయం ఎదురుగా ఉన్న పాత క్వార్టర్లను తొలగించి, ఆ స్థలంలో భవనాలను నిర్మించడానికి పునాదులు పొక్లెయిన్లతో తీశారు. అయితే ఈ ప్రదేశం గుండా గ్రామంలోని ఇంటింటికీ కుళాయిలు ద్వారా నీటి సరఫరా చేసే పైపులైన్లు ఉండడంతో వాటికి రంధ్రం ఏర్పడి లీకేజీ అవుతుంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

మారేడుమిల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల వద్ద వృథాగా పోతున్న నీరు

మరమ్మతులు చేపట్టాలి

తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకోకుండా సంబంధిత గుత్తేదారులు తమ పనులు చేసుకుంటూ పోతున్నారు. ఈ లీకేజీకి మరమ్మతులు చేయకుండా పునాదులు వేస్తే తర్వాత పరిస్థితి ఏమిటిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

(c) eenadu

బీచ్ ఫెస్ట్... అదుర్స్

▶ పాకలకు పోటెత్తిన జనం ▶ ఘనంగా ముగిసిన ఉత్సవాలు

అటు అలల హోరు... అంతకు మించి ఇటు జనం జోరుతో పాకల బీచ్ ఉర్రూతలూగింది. పర్యాటకానికి ఊతమిచ్చేలా గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఫెస్ట్ ఆదివారంతో ఘనంగా ముగిసింది. జిల్లా యంత్రాంగం అంచనాలకు మించి సందర్శకులు పోటెత్తడంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఒకటే సందడి నెలకొంది. హెలికాప్టర్, పారాగ్లైడింగ్, రేసింగ్ బోట్‌పై విహరించేందుకు పిల్లలతో పాటు పెద్దలూ పోటీపడ్డారు. తీరంలో ఒంటెలు, గుర్రాలపై సవారీ చేశారు. సాయంత్రం ప్రారంభమైన సాంస్కృతిక సంబరాలతో వేడుకలు మరో స్థాయికి చేరాయి. యాంకర్ రవి, శ్రీప్రియ హుషారైన మాటలకు... హైపర్ ఆది, రైజింగ్ రాజు పంచ్‌లు తోడవ్వడంతో వీక్షకుల కేరింతలు మిన్నంటాయి. తప్పెట గుళ్లు, జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా... శివోహం నృత్య రూపకం ప్రేక్షకులను మరో ప్రపంచానికి తీసుకెళ్లింది. ముందుగా వేడుకలను మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, బీసీ జనార్దన్ రెడ్డి, కొల్లు రవీంద్ర, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, కలెక్టర్ రాజాబాబు ప్రారంభించారు. గత ప్రభుత్వం పర్యాటక రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఆ లోటుపాట్లను సరిచేస్తూ కూటమి ప్రభుత్వం ప్రగతి పాలన దిశగా దూసుకెళ్తుందన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం నిర్విరామంగా కృషి చేసిందని కొనియాడారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుచిత్ర, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్, జేసీ కల్పనాకుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, టంగుటూరు, సింగరాయకొండ గ్రామీణం, కొండపి గ్రామీణం

జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభిస్తున్న మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, స్వామి, రవీంద్ర, ఎంపీ మాగుంట, దామచర్ల సత్య, బాలాజీ, కలెక్టర్ రాజాబాబు

హైపర్ ఆది, రైజింగ్ రాజు సందడి

శివోహం నృత్యరూపకంలో ఓ సన్నివేశం

యాంకర్లు రవి, శ్రీప్రియ

మహిళల జానపద నృత్యం

బీచ్ కబడ్డీలో తలపడుతున్న జట్లు

నిధులొచ్చినా నీడ లేదు!

▶ చెంచు గిరిజనుల కాలనీల్లో ఇదీ పరిస్థితి

న్యూస్‌టుడే – యర్రగొండపాలెం పట్టణం

చెంచు గిరిజనులకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు కేంద్రం ఏడు నెలల క్రితమే నిధులు కేటాయించినా లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. వివరాల్లోకి వెళ్తే... మార్కాపురం జిల్లాలో చెంచు గిరిజనులు ఎక్కువ. వీరికి గృహాలు నిర్మించి ఇచ్చేందుకు ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసి న్యాయ అభియాన్ (పీఎం జన్మన్) కింద... మార్కాపురం, గిద్దలూరు, అర్ధవీడు, పెద్దారవీడు, వై.పాలెం, పుల్లలచెరువు, దోర్నాల మండలాల పరిధిలోని 612 మందికి గత జులైలో ఇళ్లు మంజూరు చేశారు. ఒక్కో నిర్మాణానికి రూ.2.39 లక్షలు చొప్పున కేటాయించారు. అడవి బిడ్డలు కావడంతో పనులు ప్రారంభించేందుకు సైతం డబ్బులు ఉండవని... పునాదుల నిర్మాణం కోసం ముందుగానే ఒక్కో లబ్ధిదారుకు రూ.70 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేశారు. ఇలా గత ఏడాది జులైలో 377 మందికి చెల్లించినా... 49 నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. కొందరు దళారులు లబ్ధిదారుల పంచన చేరి ఇళ్లు నిర్మిస్తామని చెప్పి నగదు తీసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడమే ఇందుకు కారణం. దీంతో ఇప్పటి వరకు రూ.3 కోట్లకు పైగా ఖర్చు చేసినా లక్ష్యం మాత్రం నెరవేరలేదు.

ముఖం చాటేస్తున్న గుత్తేదారులు...

గిరిజనులు స్వతహాగా పక్కా ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితి ఉండడంతో కొన్నిచోట్ల అధికారులే గుత్తేదారులను నియమించారు. అడ్వాన్సు రూపంలో వచ్చిన మొత్తాన్ని సదరు గుత్తేదారులు తీసుకుని... కొద్ది పాటి పనులు చేసి ముఖం చాటేస్తున్నారు. చేసిన పనుల్లోనూ నాణ్యత కొరవడింది. ఈ విషయమై వై.పాలెం గృహనిర్మాణ శాఖ ఈఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ... ఈ ఏడాది మార్చి వరకు గడువు ఉన్నందున లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు గిరిజనులు బేల్దారీ మేస్త్రీలకు గుత్తకు ఇస్తున్నారని... వారితో మా శాఖకు సంబంధం ఉండదని వివరించారు.

చెన్నుపల్లెలో పునాది గుంతలతోనే సరిపెట్టిన వైనం

⊷ మూడేళ్ల క్రితం... ఓ గంజాయి ముఠా సభ్యులు ఆ మత్తులో ఓ వ్యక్తిని చితకబాదారు. అంతటితో ఆగకుండా అతడిపై మూత్రం పోశారు. ముక్తినూతలపాడు - త్రోవగుంట మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడు పోలీసులను ఆశ్రయించినా కేసు నమోదు కాలేదు. ఆ వీడియోను 'ఈనాడు' వెలుగులోకి తెచ్చి కథనం ప్రచురించడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది.

⊷ మంగమూరు రోడ్డులో గాంధీనగర్ శివారులోని ఓ జామాయిల్ తోటలో రెండు గంజాయి ముఠాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఓ ముఠా సభ్యుడి ఇంటిపైకి ముప్పై మందికి పైగా వెళ్లి మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటనతో ఆ పరిసర నివాసితులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇదీ మూడేళ్ల క్రితమే చోటుచేసుకుంది.

గత ప్రభుత్వ హయాంలో గంజాయి ముఠాలు ఎంతలా చెలరేగాయో తెలియజెప్పే ఉదంతాలివి.

గంజాయి మత్తు వదిలిస్తున్నారు!

▶ ఫలితమిస్తున్న ప్రభుత్వ చర్యలు, పోలీసుల కార్యాచరణ

న్యూస్‌టుడే – ఒంగోలు నేరవిభాగం

అప్పట్లో రాజకీయ నాయకులు, వారి అనుచరగణం వీటిని ప్రోత్సహించేవారన్న ఆరోపణలున్నాయి. యువత, విద్యార్థులు సైతం వీటిలో ఉండడం ఆందోళన కలిగించేది. ఈ మత్తులో నిత్యం వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకునేవి.

ప్రస్తుతం... ఆ పరిస్థితిలో కొంతమార్పు వచ్చింది. గంజాయిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం... పోలీసు యంత్రాంగమూ ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి దూకుడుగా వ్యవహరిస్తుండడంతో వారి ఆగడాలకు చాలావరకు అడ్డుకట్ట పడింది.

ముఠాల జులుం...

గతంలో చీకటి పడిందంటే చాలు శివారు ప్రాంతాలు, పాడుబడిన భవనాలను అడ్డాగా చేసుకుని గంజాయి ముఠాలు చెలరేగిపోయేవి. ఒంగోలు పరిధిలోని వెంగముక్కపాలెం రోడ్డు, పేర్నమిట్ట పరిసరాలు, నూతన జాతీయ రహదారి వంతెన ప్రాంతాల్లో మత్తులో జోగుతుండేవారు. అర్ధరాత్రి వేళ బైకులపై గుంపులుగా తిరుగుతూ పెద్దపెద్ద శబ్దాలతో హారెత్తించేవారు. ఇదేంటన్న ప్రశ్నించే పరిస్థితి ఉండేది కాదు. రాజకీయ దన్ను ఉండడంతో పోలీసులు సైతం స్వేచ్ఛగా విధులు నిర్వర్తించలేని పరిస్థితి. కట్టడికి ప్రయత్నించిన కొందరు పోలీసు అధికారులపై నడిరోడ్డుపైనే తిరగబడిన ఉదంతాలూ ఉన్నాయి. మార్కాపురం, బేస్తవారపేట, కంభం, గిద్దలూరు తదితర ప్రాంతాల్లోనూ గంజాయి విక్రయాల ఘటనలు పెద్ద సంఖ్యలో వెలుగు చూశాయి.

టాస్క్‌ఫోర్స్ దూకుడు...

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లాలో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. సీనియర్ సీఐ నేతృత్వంలో ఇద్దరు ఎస్సైలు, పది మంది సిబ్బంది ఈ బృందంలో ఉన్నారు. ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో వీరు పనిచేస్తున్నారు. వ్యసనపరులను గుర్తించి విక్రేతలు, వారికి అది ఎక్కడి నుంచి వస్తోందన్న మూలల్లోకి వెళ్లి విచారణ చేపడుతున్నారు. అలా జీఆర్పీ, ఈగల్ బృందాలను సమన్వయం చేసుకుంటూ గత ఏడాది కాలంలో నిర్వహించిన తనిఖీల్లో 85 కిలోల మేర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మత్తులో ఉన్నవారు చిక్కితే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో పరిస్థితుల్లో కొంతమేర మార్పు వచ్చింది.

పోలీసులు ఇంతలా కృషి చేస్తున్నా కళాశాల విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని నేటికీ కొన్ని గంజాయి ముఠాలు పని చేస్తున్నట్లు సమాచారం. చీమకుర్తి, గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వంటి ప్రాంతాల్లో వలస కార్మికులకూ గంజాయి సరఫరా అవుతోందన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో మరింతగా దృష్టి సారించి ఆయా ముఠాల ఆటకట్టించాల్సిన అవసరం ఉంది.

జమ్ములపాలెంలో 1,116 శివలింగాలకు పూజలు

భైరవకోనలో త్రిముఖ దుర్గాంబ

చీమకుర్తి: రామతీర్థం క్షేత్రంలో భక్తుల బారులు

ముక్కంటి... మురిసిన భక్తకోటి!

మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం వేకువ జాము నుంచే శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఆయా దేవస్థానాల్లో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, రుద్ర, చండీయాగం, హోమాలు... శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకం, భైరవకోన, రామతీర్థం తదితర ఆలయాల్లో క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా వివిధ సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో మంచినీరు, మజ్జిగ అందజేశారు. సామాజిక సత్రాల్లో అన్న ప్రసాదం అందజేశారు. అర్ధరాత్రి వేళ లింగోద్భవ పూజల అనంతరం విశేష అభిషేకాలు చేపట్టారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులు జాగరణ చేశారు.

– న్యూస్‌టుడే బృందం

త్రిపురాంతకం క్షేత్రంలో స్వామివారు... మెట్లమార్గంలో దర్శనానికి వస్తున్న భక్తులు

ఒంగోలు: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో...

మార్కాపురంలో కొలువుదీరిన మార్కండేశ్వరుడు

జాబ్‌కార్డు... 48 గంటల్లోనే!

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు తీసుకవచ్చింది. వికసిత్ భారత్ గ్రామీణ రోజ్‌గార్ మిషన్ (వీబీ జీ రామ్ జీ)గా పేరు మార్చడంతో పాటు.. ఆవశ్యకతను తెలుసుకుని ప్రక్రియను తీసుకువచ్చింది. ఒక్కో కుటుంబానికి పని దినాలను 125 రోజులకు పెంచడంతో పాటు.. సమయానికి వేతన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంది. ఇందులో జాప్యం జరిగితే తగిన పరిహారం అందించేలా మార్పులు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు ఖర్చు చేయనున్నాయి. కొత్త జాబ్‌కార్డు జారీ విధానాన్ని సైతం సులభతరం చేసింది. దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే జారీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కార్డు కావాల్సినవారు క్షేత్రసహాయకుడిని నేరుగా సంప్రదిస్తే... ఈకేవైసీ పూర్తి చేసి దరఖాస్తు చేయిస్తారు. ఉన్నతాధికారులు పరిశీలించి నిర్దేశిత సమయంలోగా కార్డు జారీకి చర్యలు తీసుకుంటారు.

అక్రమాలకు అడ్డుకట్ట...

ఇప్పటికే జాబ్‌కార్డు ఉన్న వారికి సైతం ఆధార్‌తో అనుసంధానం చేశారు. పనికి వచ్చిన వారి ఫొటో నిర్ధారణ... ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది. దీంతో రెండు మూడు ప్రాంతాల్లో పేర్ల నమోదు, ఒకరికి బదులుగా మరొకరు పనికి రావడం, గైర్హాజరైనవారికి మస్తర్లు వేయడం వంటి వాటికి అడ్డుకట్ట పడనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో కొత్త విధానం అమల్లోకి వస్తుందని ఏపీడీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

పరికరాలు సరే... నిర్వహణేదీ?

సాగర్ కాలువల్లో నీటి ప్రవాహాన్ని గుర్తించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ గేజ్ పరికరాలివి. క్షేత్రస్థాయిలో సిబ్బంది అవసరం లేకుండానే నిరంతరాయంగా ఆన్‌లైన్‌లో పరిశీలించేందుకు అమర్చారు. ఒంగోలు బ్రాంచి కాలువతో పాటు పలు మేజర్, మైనర్ కాలువల పరిధిలో వీటికి సీసీ కెమెరాలు, సౌరఫలకలు సైతం బిగించారు. ఇంతవరకు బాగానే ఉన్నా వీటి నిర్వహణ ఎవరు చూస్తున్నారన్న విషయంలో జలవనరుల శాఖ అధికారుల్లోనే స్పష్టత కొరవడింది. దీంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పరికరాలు ఇలా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, సంతనూతలపాడు, చీమకుర్తి

న్యూస్‌టుడే – మార్కాపురం

జిల్లాకే ప్రత్యేకమైన విలువైన వైట్ క్వార్ట్జ్ (తెల్లరాయి) అక్రమంగా తరలిపోతోంది. తవ్వకం, రవాణా అంతా బాహాటంగానే సాగిస్తూ అక్రమార్కులు రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు నాయకుల అండతోనే వ్యవహారమంతా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కర్నూలు రహదారిలో వెళ్తున్న తెల్లరాయి లారీలు

తెల్లరాయి తరలిపోతోంది!

▶ లీజులు 46... తవ్వకాలు వందకు పైగా క్వారీల్లో

▶ **పేలుళ్లు సాగిస్తూ...:** కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు కందుకూరు, పామూరు, సి.ఎస్.పురం, పి.సి.పల్లి తదితర మండలాల్లో తెల్లరాయి నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయి. వీటి తవ్వకాలకు ఉమ్మడి జిల్లా పరిధిలో 26 మండలాల్లో 46 క్వారీలకు మాత్రమే అనుమతి ఉంది. ఈ లీజులను చూపి అనధికారికంగా వందకు పైగా ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారు. ముద్దపాడు, అయ్యన్నకోట, లింగనపాలెం, తక్కెళ్లపాడు, లక్ష్మక్కపల్లి, చీర్లదిన్నె వెలిగండ్ల, బల్లిపల్లి, విశ్వనాథపురం, జమ్మలమడక, అడ్డరోడ్డు, సి.ఎస్.పురం, చల్లగిరగల తదితర ప్రాంతాల్లో పగటి వేళల్లోనే పేలుళ్లు సాగిస్తూ... రాయి తవ్వకాలు చేపడుతున్నారు. రాత్రి వేళ తడ, సూళ్లూరుపేట, నాయుడిపేట మీదుగా కృష్ణపట్నం పోర్టు, తమిళనాడులోని మరికొన్ని రేవులకు తరలించి... అక్కడి నుంచి సముద్రమార్గంలో విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తేనే

చైనా, జపాన్, మలేసియా, సింగపూర్ తదితర దేశాల్లో తెల్లరాయికి మంచి డిమాండ్ ఉంది. స్థానికంగా టన్ను ధర రూ.30 వేలకు పైగా పలుకుతుండగా... విదేశాల్లో ఇంతకు రెట్టింపు ధర లభిస్తోంది. ఎటువంటి బిల్లులు లేకుండా జిల్లా నుంచి నెలకు నలభై లారీలకు పైగా సరకు అనధికారికంగా ఇతర ప్రాంతాలకు తరలుతున్నట్లు అంచనా. అధికారులు అప్పుడప్పుడూ దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నా పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. గత ఏడాది వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి దాదాపు నాలుగు వేల టన్నుల రాయి స్వాధీనం చేసుకున్నట్లు మైనింగ్ అధికారులు చెబుతున్నా... అక్రమ తవ్వకాలకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. ప్రభుత్వ భూములతో పాటు అటవీ ప్రాంతంలోనూ తవ్వకాలు సాగిస్తుండడం దందా తీవ్రతను తెలియజెబుతోంది. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో దృష్టిసారించి వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

నాటి అక్రమాలకు వంతపాడారు!

▶ అనధికార వెంచర్లకే స్తంభాలు, పరివర్తకాలు ▶ కనిగిరి విద్యుత్తు అధికారుల తీరుపై విమర్శలు

న్యూస్‌టుడే – కనిగిరి

అయిదేళ్ల వైకాపా పాలనలో చోటుచేసుకున్న భూ అక్రమాలు, ఇతర దందాలు ఒక ఎత్తయితే... కొందరు అధికారులు వారికి వంత పాడుతూ చేసిన అడ్డగోలు వ్యవహారాలు మరో ఎత్తు. స్తంభం మార్చాలని, పరివర్తకం ఏర్పాటు చేయాలని రైతులు, సామాన్యులు అడిగితే పట్టించుకోని విద్యుత్తు సిబ్బంది... కనిగిరిలో అప్పటి నాయకులు అడ్డగోలుగా వేసిన వెంచర్లకు మాత్రం వందలాదిగా వాటిని తరలించారు. ప్రత్యేకంగా లైన్లు సైతం వేశారు. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో నజరానాలూ అందుకున్నారన్న ఆరోపణలున్నాయి.

కనిగిరి - కంభం రోడ్డులో అనుమతి లేని వెంచర్‌లో వేసిన విద్యుత్తు స్తంభాలు

యథాశక్తి సహకారం...

కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని కనిగిరి, పామూరు, సి.ఎస్.పురం, వెలిగండ్ల మండలాలతో పాటు.. పొదిలి, సి.ఎస్.పురం రోడ్డును ఆనుకుని కనిగిరి అడ్డరోడ్డు, తుమ్మగుంట, కాశీపురం, పేరంగుడిపల్లి, శంకవరం, చిన ఇర్లపాడు, చాకిరాల, కంభం రోడ్డు, అర్బన్ కాలనీ తదితర ప్రాంతాల్లో 175 ఎకరాల ప్రభుత్వ భూమిని గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాయకులు ఆక్రమించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డే తాజాగా అసెంబ్లీలోనే ప్రస్తావించారు. వీటిలో యాభైకి పైగా అనధికార వెంచర్లు వేశారు. ప్లాన్ అప్రూవల్ లేని లే అవుట్లకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సదుపాయలు కల్పించకూడదన్న నిబంధనలు ఉన్నా... కనిగిరి విద్యుత్తు శాఖ అధికారులు మాత్రం అక్రమార్కులకు వంతపాడారు. వందలాది స్తంభాలను ఆయా వెంచర్లలో వేశారు. ప్రత్యేకంగా లైన్లు వేసి ట్రాన్స్‌ఫార్మర్లు సైతం బిగించారు.

ప్రజల ఇక్కట్లు విస్మరించి...

ఓ స్తంభం ఏర్పాటు చేయాలంటే రూ.18 వేలు ఖర్చవుతుంది. ఇందుకోసం ముందుగా దరఖాస్తు చేసి నగదు చెల్లించాలి. తరువాత ప్రాధాన్యతా క్రమంలో వాటిని మంజూరు చేస్తారు. ఎక్కడా ఈ విధానం పాటించలేదు. లో వోల్టేజీ, వ్యవసాయ విద్యుత్తు సరఫరా మెరుగుకు కొత్త స్తంభాలు, పరివర్తకాలు ఏర్పాటు చేయాలని వివిధ కాలనీల వారు, రైతులు కోరినా పట్టించుకోకుండా... ఆర్‌డీఎస్ స్కీం కింద మంజూరైన వందలాది స్తంభాలను అనుమతి లేని వెంచర్లకు సర్దుబాటు చేశారు. నాడు వంతపాడిన అధికారుల్లో కొందరు నేటికీ ఇక్కడే విధుల్లో కొనసాగుతుండడం గమనార్హం. ఈ విషయమై ఈఈ ఆర్.ఉమాకాంత్ స్పందిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్తంభాలు, పరివర్తకాల్లో కొన్నిటిని తొలగించామన్నారు. మిగతావీ తొలగిస్తామని చెప్పారు. శాఖాపరంగా అవకతవకలు చోటు చేసుకుంటే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

(c) eenadu

త్రిపురాంతకం.. భక్తజన సందోహం

❖ వైభవంగా ఉత్సవాలు

తూర్పు ద్వారం మెట్ల వద్ద భక్తుల సందడి

న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం, త్రిపురాంతకం: ప్రసిద్ధ శైవ పుణ్య క్షేత్రం త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపురసుందరీ దేవి ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ఆరంభమయ్యాయి. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తులు వేలాదిమంది తరలిరావడంతో మధ్యాహ్నానికల్లా ఆలయాల్లో రద్దీ పెరిగింది.

❖ యర్రగొండపాలెం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సొంత నిధులతో నూతనంగా తారు రోడ్డు వేయించి ఆదివారం ఉదయం ప్రారంభించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మార్కాపురం డీఎస్పీ నాగరాజు క్యూలైన్లను పరిశీలించి వసతి ఏర్పాట్ల గురించి భక్తులతో మాట్లాడారు.

❖ ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల పర్యవేక్షణ

మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఆర్డీవో శివరామిరెడ్డి మూడు రోజుల నుంచి స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు, త్రిపురాంతకం సీఐ హసన్, ఎస్సై శివ బసవరాజు నేతృత్వంలో 10 మంది ఎస్సైలు, 200 మంది సిబ్బందితో శాంతి భద్రతలు పర్యవేక్షించారు. భక్తులకు వసతుల్లో ఎలాంటి సమస్య తలెత్తకుండా మార్కాపురం ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, తహసీల్దారు విజయభాస్కర్, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఈవో అనిల్ కుమార్ పర్యవేక్షించారు. త్రిపురాంతకం ఎస్‌బీఐ, త్రిపురాంతకం రామాలయ కమిటీ, పలు విత్తనాల కంపెనీల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగతో పాటు పలువురు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు పులిహోర, దద్దోజనం ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఈవో అనిల్ కుమార్‌తో కలిసి క్యూలైను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కోటా సత్యమాంబదేవికి కుంకుమార్చనలు

కంభం పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. మహాశివరాత్రి పండగ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని సత్యమణికంఠస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది.

– న్యూస్‌టుడే, కంభం

కళాకారుల వేషధారణ

హెలికాప్టర్ రైడ్

ఉర్రూతలూగించిన నృత్య ప్రదర్శన

ఆనంద తీరం.. ఆహ్లాదభరితం!

సింగరాయకొండ గ్రామీణం, టంగుటూరు, కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ మండలం పాకల తీరంలో బీచ్ ఫెస్టివల్ చివరి రోజు సంబరాలు అంబరాన్నంటాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఇసుకేస్తే రాలనంతగా తరలివచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. తీరంలో ఏర్పాటు చేసిన భారీ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ గీతాలాపన, నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు, వినోదభరిత కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. హెలికాప్టర్, బోట్ రైడింగ్, పారా గ్లైడ్ వంటివి ఆకట్టుకున్నాయి.

బీచ్ వాలీబాల్‌లో తలపడుతున్న జట్లు

తీరంలో జనసందోహం

వనితల అశ్వవిహారం

హోరెత్తిన తప్పెటగుళ్ల మోతలు

భైరవ కోన.. ముక్కంటి ఆన

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ పుణ్యక్షేత్రం భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాలు ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. ప్రకాశం, నెల్లూరు, కడప, గుంటూరు, కృష్ణా తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ పుణ్యక్షేత్రాలను సందర్శించి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భైరవకోనలో జలపాతాన్ని వీక్షించి అక్కడ కాలభైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాంబ అమ్మవారు, శివలింగాలను, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పూజలను అర్చకులు ఎం.శివప్రసాద్ శర్మ నిర్వహించారు.

బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ జట్టుకు ఎంపిక

శివమణికృష్ణ

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చేవూరుకు చెందిన పొట్టేళ్ల శివమణికృష్ణ బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ జట్టుకు ఎంపికైనట్లు చినలాటరపి ఉన్నత పాఠశాల పీడీ మురళీమోహన్ ఆదివారం తెలిపారు. భారత జట్టు ఈ నెల 15 నుంచి 18 వరకు ఇండోనేషియాలో నిర్వహించే సౌత్ ఏషియన్ బాల్‌బ్యాడ్మింటన్ టెస్ట్ సీరీస్‌లో పాల్గొంటుందని పేర్కొన్నారు. శివమణి చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అతడు ఇప్పటి వరకు రెండుసార్లు సబ్ జూనియర్స్ విభాగంలో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాలు, జూనియర్స్ విభాగంలో రెండు బంగారు, రెండు కాంస్య, అఖిల భారత స్థాయి పోటీల్లో అన్నా విశ్వ విద్యాలయం తరపున పాల్గొని రజత పతకం సాధించారన్నారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన శివమణికృష్ణకు స్థానికులు అభినందనలు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన ఎస్ఎఫ్ఐ నాయకులు, బాలుడి కుటుంబ సభ్యులు

విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి మృతికి కారణమైన సింగరాయకొండ మండలంలోని ఓ కోచింగ్ సెంటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సీహెచ్.వినోద్ మాట్లాడుతూ.. కనిగిరి పట్టణానికి చెందిన బాలుడు 6వ తరగతి చదువుతుండగా, ఈ నెల 14న పాఠశాలలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, విద్యార్థుల పట్ల వార్డెన్ దురుసు ప్రవర్తన కారణంగానే ఉరి వేసుకున్నట్లు ఆరోపించారు. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపి, అందుకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఈవో ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. ఆయన హామీతో ఆందోళన విరమించారు.

కోటప్పకొండ భక్తుల వసతికి రూ.10 లక్షల విరాళం

నరసరావుపేట ప్రపంచం: మహాశివరాత్రికి కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం గురిపిల్లికి చెందిన శ్రీ శ్రీకోటేశ్వర గ్రానైట్ క్వారీ అసోసియేషన్ రూ. 10లక్షల విరాళాన్ని ఆదివారం అందించారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో కలెక్టర్ కృతికాశుక్లాకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తులకు మెరుగైన వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని, ఈ క్రమంలో క్వారీ అసోసియేషన్ సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి దాతృత్వం తదితరులకు స్ఫూర్తిదాయకమన్నారు. దాతలను కలెక్టర్ అభినందించారు.

సొంత గృహం.. సాకారానికి ప్రాకారం

❖ కార్యాచరణకు అధికారులు కసరత్తు

న్యూస్‌టుడే, మార్కాపురం, పొదిలి: ప్రతి పేదవాడికి సొంత ఇల్లు అనేది ఒక కల. దాన్ని సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగానే ఇంటి నిర్మాణానికి అదనపు సాయం చేస్తోంది.

వైకాపా ఇచ్చిన మొత్తం సరిపోవడంలేదని..

గత వైకాపా ప్రభుత్వం ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయించింది. నిర్మాణానికి సరిపోవడం లేదని అనేక మంది పేదలు మధ్యలోనే నిర్మాణాలను నిలిపివేశారు. అయితే కూటమి ప్రభుత్వం అదనపు సాయంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, గిరిజన ప్రాంతాల్లో ఉన్న వారికి రూ.లక్ష అదనపు సాయం చేస్తోంది. దీంతో ఇంటి నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లాలో ఉగాది నాటికి కొంత మందికైనా సొంతింటి కలను సాకారం చేసేందుకు లక్ష్యం పెట్టుకుంది.

మార్కాపురంలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గృహనిర్మాణ శాఖ అధికారులు

21 మండలాల్లో 5,196 ఇళ్లు

మార్కాపురం జిల్లాలోని 21 మండలాల్లో ఉగాది నాటికి 5,196 గృహాలను పూర్తి చేయడానికి అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. ఈపాటికే మార్కాపురం జిల్లాలో ఇన్‌ఛార్జి పీడీ శ్రీనివాసప్రసాద్, ఈఈ పవన్‌కుమార్‌తో పాటు ఈఈలు, ఏఈలు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ సహాయకులు ప్రతి గ్రామానికి వెళ్లి ఉగాది నాటికి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న వారికి బిల్లులు చెల్లిస్తున్నారు.

నియోజకవర్గం..	గృహాల లక్ష్యం
మార్కాపురం	- 1,971
యర్రగొండపాలెం	- 1,140
గిద్దలూరు	- 1,469
కనిగిరి	- 589

క్షేత్ర స్థాయికి వెళ్లి.. నిర్మాణదారులతో మాట్లాడి..

గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు శ్లాబ్, రూఫ్ లెవెల్, గోడలు, బేస్‌మట్టం స్థాయిలో ఉన్న వారితో మాట్లాడి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నారు. రూ.1.80 లక్షల సాయంతో పాటు అదనంగా కూటమి ప్రభుత్వం ఇస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అధికారులు దగ్గర ఉండి నిర్మాణాలు ప్రారంభిస్తున్నారు.

❖ జిల్లాలో నూతనంగా 24,177 పీఎంఏవై గ్రామీణ్ కింద గృహాలు నిర్మాణం చేసుకోవడానికి అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. త్వరలోనే నిర్మాణాలు ప్రారంభించడానికి అనుమతులు వస్తాయని గృహ నిర్మాణ ఈఈ పవన్‌కుమార్ తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు.

మార్కాపురం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

పొదిలి, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఆదివారం పొదిలి నిర్మమహేశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు మార్కాపురం ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు. జిల్లాను అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా నీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేయడం ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. పారిశ్రామికంగాను, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. వెనుకబడిన ఏపీని అభివృద్ధిలోకి తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం సైతం సానుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఆయన వెంట ఏఎంసీ ఛైర్మన్ ఇమాంసాహెబ్, మర్రిపూడి ఎంపీపీ వాక వెంకటరెడ్డి, తెదేపా నాయకులు జి.భాస్కర్, స్వర్ణ గీత, ఖుద్దూస్, అంజిరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

'చలో విజయవాడ' విజయవంతానికి పిలుపు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17వ తేదీన విజయవాడలో తలపెట్టిన 'చలో విజయవాడ' రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఓ.వి.వీరారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉద్యోగుల ఊసేలేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పీఆర్సీ కమిషన్ నియమించాలి, 29శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి. తదితర డిమాండ్లను నెరవేర్చాలనే ఉద్దేశంతో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రణభేరి కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 115, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

గురుకుల ప్రవేశాలకు వేళాయె!

కొండపి గ్రామీణం: కొండపి డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి అయిదో తరగతితో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 4 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అయిదో తరగతిలో 80, ఇంటర్ ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి.

అర్హతలు ఇవే..

❖ అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది.

❖ ఎస్సీ, ఎస్టీలు 01.09.2013-31.08.2017 మధ్య, బీసీ, బీసీ-సీ, ఓసీలు 01.09.2015-31.08.2017 మధ్య జన్మించి ఉండాలి

❖ పది, నాలుగో తరగతి ఆయా జిల్లాలో గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి

❖ ఇంటర్‌లో చేరే వారు 2025-26లో పదో తరగతి తొలి ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఉండాలి

❖ దరఖాస్తులు హెచ్‌టీటీపీ://ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా చేసుకోవాలి. ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటో, తల్లిదండ్రుల ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో రూ.100 రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ఉచితంగా ఉన్నత విద్య నందిస్తోంది. ఈ అవకాశాన్ని అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

–ఎస్.అరుణ ప్రిన్సిపల్ కొండపి గురుకుల పాఠశాల

నేటి 'మీ కోసం' రద్దు

ఒంగోలు నేరవిభాగం: ఒంగోలులోని జిల్లా కలెక్టరేట్, పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం) కార్యక్రమాన్ని ఈ వారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజులు తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం పాకల బీచ్ ఫెస్టివల్ విధుల్లో ఉండటం, మహా శివరాత్రి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ సోమవారం ఐచ్ఛిక సెలవుదినంగా ప్రకటించటంతో మీ కోసం కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజానీకం వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని అధికారులు సూచించారు.

బండలాగుతున్న ఎడ్లు

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కంభం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పండగను పురస్కరించుకొని మండలంలోని చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన రెండు ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రావిపాడు గ్రామానికి చెందిన పి.రామయ్య, రామారావు సంయుక్త జత 3 వేల అడుగుల దూరంలాగి ప్రథమ, కొమరోలు వాసులు కామూరి రమణారెడ్డి, గోపు రమణారెడ్డిల ఎడ్లు 2,865తో ద్వితీయ, దర్శి మండలం రాజంపల్లి వాసి జి.ఉపేంద్రచౌదరి కోడెలు 2,742తో తృతీయ, అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన ఎస్కే పెద్ద మీరావలి జత 2,700తో నాలుగు, అదే మండలం అచ్చంపేటకు చెందిన సూరే రాంబాబు ఎడ్లు 2,419 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల జతల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ. 15 వేలు, రూ.10 వేలను నిర్వాహకులు అందజేశారు.

సత్తా చాటిన చేబ్రోలు రత్తయ్య కోడెలు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మార్కాపురం మండలం తిప్పాయపాలెం గ్రామంలో ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పార్వతీ సమేత మునీశ్వరస్వామి దేవస్థానంలో ఎప్పటి మాదిరి నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఔత్సాహికులకు ఆనందోత్సాహాలు అందించాయి. ఈ పోటీల్లో న్యూ కేటగిరీ విభాగంలో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెం గ్రామానికి చెందిన రావినేని రత్తయ్య చౌదరి ఎడ్లజత మొదటిస్థానంలో నిలిచి రూ.60వేలు గెలిచి సత్తాచాటాయి. రెండు పళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా రాజంపల్లికి చెందిన గొర్ల బ్రదర్స్‌కు చెందిన కోడెలు ప్రథమ స్థానంలో నిలిచినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న శివాలయం కావడంతో తెల్లవారుజామునుంచి భక్తులు వేల సంఖ్యలో మునీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

బేతవోలులో మన గిత్తలు..

చిలుకూరు, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని బేతవోలులో కనకదుర్గమ్మ జాతర, శివరాత్రి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఒంగోలు జాతి వృషభరాజుల బండలాగుడు పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు న్యూ కేటగిరీ ఎడ్ల పందేలు జరిగాయి. ప్రకాశం జిల్లాకు చెందిన చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి మొదటి స్థానంలో నిలిచి రూ. 70,000, ద్వితీయ స్థానంలో విజయవాడకు చెందిన మెగా కృష్ణమోహన్ నిలిచి రూ.50,000 సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచి వట్టికూటి నాగయ్య, ఉపసర్పంచి ఏడుకొండలు, ప్రశాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

శాంసన్

నూజండ్ల, న్యూస్‌టుడే: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పలపాడు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. మండలంలో ములకలూరుకు చెందిన మందా శాంసన్ (27) మిత్రుడు సురభి చిన్నతో కలిసి వినుకొండ నుంచి తమ గ్రామానికి వస్తుండగా ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం భీమవరానికి చెందిన సోముబత్తిన ధనుంజయ కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లడానికి మరియమ్మతో కలిసి వస్తుండగా ఉప్పలపాడు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాద ధాటికి శాంసన్ రోడ్డుపై ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనాలపై ఉన్న మిగిలిన వారికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, రెండేళ్లు, పది నెలల వయసున్న ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడంతో వారంతా కన్నీటిపర్యంతమయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణారావు తెలిపారు.

తిరునాళ్లకు వెళుతూ..

బల్లికురవ, న్యూస్‌టుడే: కోటప్పకొండ తిరునాళ్లకు వెళుతుండగా, ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దోర్నాలకు చెందిన దార సల్మాన్(30), ఒడిశాకు చెందిన జన ప్రదీప్ (25) ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై చీమకుర్తి నుంచి కోటప్పకొండ తిరునాళ్లకు బయలుదేరారు. వారి వాహనం బల్లికురవ మండలం అంబడిపూడి శివార్లలో అదుపు తప్పి పడిపోగా సల్మాన్, ప్రదీప్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుంటుపల్లి ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

మనుబోలు, న్యూస్‌టుడే: లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కాగితాలపూరు అడ్డరోడ్డు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకొంది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా దర్శి నుంచి చెన్నైకు వెళుతున్న లారీలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం రావడంతో దాడులు చేశారు. 700 బస్తాల్లో ఉన్న 35 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ రూ.14.70 లక్షలు ఉంటుందని పౌరసరఫరాల శాఖ ఏఎస్‌వో లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. వీటిని పొదలకూరు గోదాముకు తరలించినట్లు వివరించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ రవి, వీఆర్వో గుణశేఖర్, ఎస్సై రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

లారీని పట్టుకున్న అధికారులు

కెనరా బ్యాంక్ Canara Bank
ప్రాంతీయ కార్యాలయం ఒంగోలు, ఫోన్: 8332997013
బంగారు ఆభరణముల వేలం ప్రకటన
ఇ-వేలం ద్వారా బంగారు ఆభరణముల అమ్మకం
https://bankeauctions.com
గిద్దలూరు బ్రాంచ్ (13719), ప్రకాశం జిల్లా, ఫోన్: 9849543583
1	164062145714	[illegible]	36.3 గ్రా
పెద్దపర్లపాడు బ్రాంచ్ (13687), ప్రకాశం జిల్లా, ఫోన్: 9492813543
2	180363422599	[illegible]	10.3 గ్రా
తేది: 16.02.2026, ప్రదేశం: ఒంగోలు
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). Ph.81422 92071.

EDUCATION

DISTANCE EDUCATION

B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

REAL ESTATE

PLOT FOR SALE

సింగరాయకొండ గంజివారి కళ్యాణ మండపం దగ్గర మెయిన్ రోడ్ ఫేసింగ్ కమర్షియల్ 3.3 సెంట్లు అమ్మకానికి కలదు. ✆ 99624 12363.

JOBS

Universal Bags, Ongole Looking for candidates with experience in Excel, Tally, Software Ledger Reports & Sales. Please Cont: ✆ 96762 11011

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

గుంటూరులోని రియల్‌బూమ్ రియల్‌ఎస్టేట్ సర్వీసెస్ నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (50), టెలీకాలర్స్(10), DDOలు (10) కావలెను. ✆ 78010 32689.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

రాఘవ ఆటోఫైనాన్స్, చీరాల, మార్కాపురం, కంభం, నందు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం+ ఇన్సెంటివ్స్+TA. సంప్ర: గుంటూరు రోడ్డు, PAG కన్వెన్షన్‌హాలు ప్రక్కన ఒంగోలు. ✆ 91009 04979.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/w 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

విశిష్ట సంఖ్యతోనే ప్రభుత్వ పథకాల లబ్ధి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

రైతులకు వివిధ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కేంద్రం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రీ చేపట్టారు. ఇందులో భాగంగా సాగు భూమి ఉన్న ప్రతి ఒక్కరికి ఆధార్ తరహాలో 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేస్తున్నారు.

నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న ఏవో అబ్దుల్ రహీం

రైతు సేవా కేంద్రాల్లో నమోదు

ఏడాది నుంచి రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ చేపట్టారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో అనుసంధానించిన చరవాణి నంబరుతో రైతు సేవా కేంద్రానికి వెళితే సిబ్బంది నమోదు చేస్తారు. వివరాల నమోదు పూర్తయిన వెంటనే గుర్తింపు సంఖ్య వస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పెట్టుబడి సాయం, పంటల బీమా, రాయితీపై ఎరువులు, ఉత్పత్తుల విక్రయాలు, రుణాలు పొందడానికి ఈ సంఖ్య కీలకం. సాగుభూమి ఉన్న ప్రతి రైతు నమోదు చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 54 రైతు సేవాకేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 38813 మంది కర్షకులు నమోదు చేసుకోవాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 28053 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు.

తప్పనిసరిగా చేసుకోవాలి

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధి పొందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి. ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సిబ్బందిని సంప్రదించాలి. గుడ్లూరు మండలంలో తక్కువ సంఖ్యలో నమోదు చేసుకున్నారు. సిబ్బందికి సూచనలు చేసి నూరుశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. -కేవీ శేషారెడ్డి, ఏడీఏ, కందుకూరు

దివ్యాంగుల అభ్యున్నతే సర్కారు లక్ష్యం

టంగుటూరు, న్యూస్‌టుడే: దివ్యాంగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'ఇంద్రధనస్సు' కార్యక్రమం తీసుకొచ్చారని మంత్రి బాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో ఉద్యోగాలు పొందిన నలుగురు దివ్యాంగులకు ఆదివారం నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగులకు కేటాయించిన నాలుగో తరగతి బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను త్వరలో భర్తీచేస్తామని తెలిపారు. అంతేకాకుండా వారికి ఉచిత బస్సు ప్రయాణం, మూడు చక్రాల మోటారు వాహనాలు, చక్రాల కుర్చీలు, సహాయ పరికరాలు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, చరవాణులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. వసతి గృహం ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.

నాయుడుపాలెంలో దివ్యాంగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి స్వామి

కందుకూరు

• కందుకూరు • కొండపి

రాకపోకలకు ఇక్కట్లు

సింగరాయకొండ గ్రామీణం, టంగుటూరు, కొండపి గ్రామీణం: పాకల బీచ్ ఫెస్టివల్‌కు వెళ్లే మార్గంలో రద్దీ కారణంగా పలుచోట్ల ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోయి గాయపడ్డారు. పాకల సమీపంలో రెండు కార్ల ఇంజిన్లలో మంటలు చెలరేగాయి. పోలీసులు, స్థానికుల సహాయంతో అదుపు చేశారు. కారులో ప్రయాణిస్తున్న వారిని సురక్షితంగా బయటకు తీశారు. మరో వాహనం ద్వారా తీరం వద్దకు చేర్చారు. ఊళ్లపాలెం రోడ్డు నుంచి సింగరాయకొండకు వచ్చే క్రమంలో ఓ కారు అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. స్థానికులు స్పందించి వాహనాన్ని బయటకు తీశారు.

బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం

కందుకూరు పట్టణం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుందని, అందుకు నిదర్శనమే శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అని తెదేపా నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి సీహెచ్ కొండయ్య అన్నారు. ఎస్సీలకు రూ.20 వేల కోట్లు, ఎస్టీలకు రూ.9,190 కోట్లు కేటాయించడం ద్వారా వారి అభివృద్ధికి ప్రభుత్వం ఏవిధంగా కట్టుబడి ఉందో అర్థమవుతుందన్నారు.

ఒక్క ఇల్లు కడితే ఒట్టు!

☛ చిట్టడవులను తలపిస్తున్న జగనన్న కాలనీలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:

వైకాపా ప్రభుత్వం ఇస్తుంది ఇళ్లు కాదు.. ఏకంగా ఊర్లేనని ఉపన్యాసం ఇచ్చారు.. ఆ పార్టీ నాయకులు. జగనన్న కాలనీల పేరిట నివేశన స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయడమే కాదు.. అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. ఆ మేరకు నియోజకవర్గంలో రూ.కోట్లు ఖర్చుచేసి పేదలకు స్థలాలు ఇచ్చారు. అందులో కొన్నింటిలో ఒక్కటంటే ఒక్క ఇల్లు నిర్మించలేదు.

కొండికందుకూరు లేఅవుట్ ఇలా..

మట్టి పనులకు రూ.కోట్లు ఖర్చు

కందుకూరులో 2020లో ఇళ్లులేని 9600 మందికి పేదలకు పట్టాలిచ్చి.. 7500 మందికి ఇళ్లు మంజూరు చేశారు. అయితే ఆయా స్థలాలు దూరంగా ఉండటం, వసతుల లేమి వంటి సమస్యలతో లబ్ధిదారులు ముందుకు రాలేదు. దీంతో సుమారు 4వేల ఇళ్లు రద్దు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో కాకుండా.. సుమారు 6 కిలోమీటర్ల దూరంలోని కొండికందుకూరు పంచాయతీలో లేఅవుట్ వేసి 580 మందికి పట్టాలిచ్చారు. వారిలో ఒక్కరు కూడా ఇల్లు నిర్మించుకోలేదు. ఈ లేఅవుట్ కోసం 13 ఎకరాలను రూ.1.7 కోట్లకు కొనుగోలు చేశారు. మట్టి చదునుకు మరో రూ.1.6 కోట్లు ఖర్చు చేశారు. సౌకర్యాల పేరుతో రూ.4 కోట్లకు పైగా వెచ్చించినా.. ప్రజలు ఆసక్తి చూపలేదు.

◗ మహదేవపురంలో సుమారు 35 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. ఇక్కడ 1400 మందికి పట్టాలిచ్చి.. 600 ఇళ్లు మంజూరు చేశారు. మట్టి చదును కోసం సుమారు రూ.3.5కోట్లు ఖర్చు చేశారు. 30 శాతం ఇళ్లు కూడా నిర్మించలేదు.

◗ మదనగోపాలపురం లేఅవుట్‌లో రూ.30 లక్షలు వెచ్చించి మట్టి తోలారు. ఇలా నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో కాలనీల్లో వసతులు, మట్టి కోసం ఉపాధి నిధులు సుమారు రూ.25 కోట్లు ఖర్చు చేశారు.

◗ మహదేవపురం, కొండికందుకూరు, గోపాలపురం, దివివారిపాలెం, దూబగుంట, ఓగూరు, నరిశెట్టివారిపాలెం, గుండ్లపాలెం, తెట్టు తదితర గ్రామాల్లోని లేఅవుట్లు ప్రస్తుతం చిట్టడవులను తలపిస్తున్నాయి. విద్యుత్తు తీగలు, నీళ్ల ట్యాంకులు, పైపులైన్లు వంటివి చోరీకి గురయ్యాయి.

◗ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలనీలపై విజిలెన్స్ విచారణ చేశారు. నివేదికలు ఉన్నతాధికారులకు వెళ్లినా.. నేటికీ ఎలాంటి చర్యలు లేవు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114
గిద్దలూరు పట్టణం : 8008574135

జరుగుమల్లి, న్యూస్‌టుడే

?:మండలంలోని బిట్రగుంటలో ప్రధాన రహదారుల్లో చెత్త పేరుకుపోయింది. -కృష్ణ, స్థానికుడు
✓: చెత్త తొలగించి సమస్య పరిష్కరిస్తాం. -షఫీ, పంచాయతీ కార్యదర్శి

మద్దిపూడి, న్యూస్‌టుడే

?:మండలంలోని తంగెళ్ల బీసీ కాలనీలో బోరు మరమ్మతులకు గురవడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నాం. -బాలరాజు, స్థానికుడు
✓: మెకానిక్‌ను పంపి వెంటనే బాగు చేయిస్తాం. - నాగూర్‌వలి, ఎంపీడీవో

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే

?: మండలంలోని మోపాడు గ్రామంలో కేజేటీ రహదారి నుంచి ప్రాథమిక పాఠశాలకు వెళ్లే మార్గంలో మురుగు కాలువలు లేక నీరు నిలుస్తోంది. -కొండయ్య, మోపాడు
✓: ఉన్నతాధికారులకు సమస్య తెలియజేసి తగిన చర్యలు తీసుకుంటాం. -సుధాకర్, పంచాయతీ కార్యదర్శి

పదిలం.. అయిదు దశాబ్దాల స్నేహం

మండలంలోని కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-77 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారంతా హాజరై ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకొని ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. నాటి మధుర జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. మొత్తం బ్యాచ్‌లో 24 మందికి గాను 16 మంది హాజరయ్యారు. - న్యూస్‌టుడే, జరుగుమల్లి

అయిదేళ్లుగా.. అసంపూర్తిగా..!

మండల కేంద్రం గుడ్లూరు పెద్దచెరువు వద్ద గత ప్రభుత్వం పాలకేంద్రాల నిర్మాణం చేపట్టింది. సుమారు రూ.17 లక్షలు వెచ్చించి భవనం నిర్మించారు. దాని పక్కనే మరో కేంద్రం పనులు ప్రారంభించి రూ.10 లక్షలు ఖర్చుపెట్టి పునాది వరకు పూర్తిచేశారు. అయిదేళ్లుగా అవి అసంపూర్తిగా ఉన్నాయి. చుట్టుపక్కల వారు వాటిలో పశువులు, జీవాలను ఉంచుతున్నారు. ప్రభుత్వ ధనం నిరుపయోగంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, గుడ్లూరు

దారి.. గోతులమయంగా మారి!

మండలంలో ఓవీ రోడ్డు నుంచి ముక్కమారివారిపాలెం, చెరుకూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారైంది. ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయంలో ప్రయాణించేటప్పుడు నానా అవస్థలు పడుతున్నారు. అటుగా స్థానిక ప్రజలు, విద్యార్థులు రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. వారంతా భయాందోళనలో వెళ్లాల్సి వస్తోంది. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, పొన్నలూరు

అభిమానులతో స్వీయ చిత్రం దిగుతున్న సుమ

కందుకూరులో యాంకర్ సుమ సందడి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఓ వస్త్ర దుకాణం వద్ద ప్రముఖ యాంకర్ సుమ కనకాల ఆదివారం సందడి చేశారు. శని, ఆదివారాల్లో సింగరాయకొండ మండలం పాకల బీచ్ ఫెస్టివల్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆమె.. కందుకూరులోని ఓ వస్త్ర దుకాణ యజమానితో ఉన్న పరిచయంతో వారి ఆహ్వానం మేరకు వస్తున్నట్లు తెలియడంతో పట్టణ వాసులు, మహిళలు ఆమెను చూసేందుకు భారీగా తరలివచ్చారు. దీంతో కోవూరు రోడ్డులో సందడి వాతావరణం నెలకొంది. వారందరికి సుమ అభివాదం చేస్తూ స్వీయ చిత్రం దిగారు.

బిట్రగుంట ప్రసన్న కాల భైరవస్వామి ఆలయంలో భక్తుల పూజలు

చెన్నిపాడులో సంగమేశ్వరుడు

జమ్ములపాలెంలో..

కూచిపూడిలో..

కల్యాణ శోభలో మాచవరం మల్లేశ్వరస్వామి

దాత రవి దంపతులకు విరాళం రసీదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

నీలకంఠేశ్వరాలయ నిర్మాణానికి విరాళం

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం గుడ్లూరులో నిర్మాణంలో ఉన్న నీలకంఠేశ్వరాలయానికి గ్రామానికి చెందిన బంకా రవి దంపతులు రూ.2,00116 విరాళంగా ఆదివారం అందజేశారు. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వారు.. నిర్మాణ కమిటీ సభ్యులు సోమానాయుడు, కాశీవిశ్వనాథం, రాఘవులు, వెంకట్రామరాజు, వేణులకు విరాళం నగదు అందజేశారు. కార్యక్రమంలో అమరా మాల్యాద్రి, నాగరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ!

పుష్పాలంకరణలో మన్నేటికోట అమరలింగేశ్వరస్వామి

కందుకూరు పట్టణం, గ్రామీణం, గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు, వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆయా ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. లింగోద్భవ కాలంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో పలు చోట్ల అన్నదానాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. * కందుకూరు స్కందపురి సోమేశ్వరస్వామిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. * గుడ్లూరు నీలకంఠేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన శివలింగానికి అర్చకులు లక్ష్మీనరసింహస్వామి ఆధ్వర్యంలో మహారుద్రాభిషేకం చేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కొత్తపేట ఆలయం వద్ద ఉప్పుతో ఏర్పాటు చేసిన శివలింగం భక్తులను ఆకట్టుకుంది. (లింగసముద్రం మండలం దత్తాత్రేయస్వామి, కోటయ్య మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. (ఉలవపాడు మండలం మన్నేటికోట అమరలింగేశ్వరస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. (వలేటివారిపాలెం రామలింగేశ్వరస్వామిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. * కందుకూరు మండలం మాచవరంలో మల్లేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

కందుకూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు

కొండపి నియోజకవర్గంలో..

మద్దిపూడి, సింగరాయకొండ గ్రామీణం, టంగుటూరు, జరుగుమల్లి, పొన్నలూరు, న్యూస్‌టుడే: మద్దిపూడి మండలం కూచిపూడి శివాలయంలో పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ◗ టంగుటూరు మండలం జమ్ములపాలెం శివాలయంలో 1116 శివలింగాలకు భక్తులు పూజలు చేశారు. ◗ సింగరాయకొండ మండలం పాకలలో రామలింగేశ్వరస్వామి, పాతసింగరాయకొండ కాశీవిశ్వేశ్వరుడి ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ◗ జరుగుమల్లి మండలం బిట్రగుంటలోని ప్రసన్న కాల భైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ◗ పొన్నలూరు మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం చెన్నిపాడు సంగమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గుడ్లూరులో శివలింగానికి అభిషేకం

లింగసముద్రం: కోటయ్యస్వామి దర్శనానికి బారులు

కరేడులో ఉచిత వైద్య శిబిరం

ఉలవపాడు, న్యూస్‌టుడే: తిరుపతి బర్డ్ ట్రస్టు ఆసుపత్రి ఆధ్వర్యంలో కరేడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. చిన్నారులకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బర్డ్ ట్రస్టు ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ గుడారు జగదీష్‌తో పాటు వైద్యులు మునిశంకర్, అరవింద్‌శర్మ, యోగానంద్ పాల్గొన్నారు.

చిన్నారిని పరీక్షిస్తున్న బర్డ్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ జగదీష్

కాలువలో యువకుడి గల్లంతు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా పల్నాడు జిల్లాలో నిర్వహించిన కోటప్పకొండ తిరునాళ్లలో విషాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. ప్రకాశం జిల్లా వలేటివారిపాలెం మండలం సింగమనేనిపల్లి గ్రామం నుంచి అయిదుగురు యువకులు ఆదివారం తిరునాళ్లకు వచ్చారు. మార్గం మధ్యలో నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం వద్ద చిలకలూరిపేట మేజర్ కాలువలో స్నానానికి దిగారు. నీటి ఉద్ధృతికి ప్రమాదవశాత్తు వారిలో రోహిత్ (20) అనే యువకుడు కొట్టుకుపోయాడు. అతని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. స్నేహితుడు శ్రీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసరావుపేట గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతూ.. క్రీడల్లో రాణిస్తూ..!

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఓవైపు చదువు, మరోవైపు క్రీడల్లో రాణిస్తూ అటు పాఠశాల, ఇటు తల్లిదండ్రులకు పేరు తెస్తున్నారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపుతూ శభాష్ అనిపించుకుంటున్నారు. వారంతా ఉలవపాడు మండలం కరేడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. - న్యూస్‌టుడే, ఉలవపాడు

వ్యాయామ ఉపాధ్యాయుడినవుతా..

కరేడుకు చెందిన ఆర్.యశ్వంత్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గత నవంబరు, డిసెంబరు నెలల్లో నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. చదువుతో పాటు క్రీడల్లో రాణించి వ్యాయామ ఉపాధ్యాయుడి ఉద్యోగం సాధించడమే లక్ష్యమని చెప్పారు.

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం

పట్టపుపాలెంలో మత్స్యకార కుటుంబాలకు చెందిన కె.చరిష్మా, బి.వర్షితలు ఎనిమిది, తొమ్మిదో తరగతులు చదువుతున్నారు. గత నవంబరులో కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. భవిష్యత్తులో క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించాలన్నదే తమ లక్ష్యమని చెబుతున్నారు.

భవిష్యత్తులో మరింతగా రాణిస్తాం

కరేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హృదయ్ సందేష్, ఉపదేష్‌లు బాల్‌బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నారు. గత నవంబరులో అనంతపురం, చేవూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. భవిష్యత్తులో మరింతగా రాణించి జీవితంలో ఉన్నతంగా ఎదుగుతామన్నారు.

పెద్దవార్డు... సమస్యలు బోలెడు!

కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో విస్తీర్ణంలో అతి పెద్దదిగా 29వ వార్డు ఉంది. అందులో పట్టణంలోనే ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో మధురానగర్, రామానాయుడునగర్, ఐ.ఎస్.ఆర్.గార్డెన్స్ తదితర ప్రాంతాలున్నాయి. వీటిలో కొంతకాలంగా భవన నిర్మాణాలు ఊపందుకున్నాయి. మౌలిక వసతుల సమస్య మాత్రం స్థానికులను వేధిస్తోంది. ప్రధానంగా రోడ్లు, కాలువలు ఏర్పాటు కాలేదు. రామానాయుడు నగర్‌లో ప్రధాన వీధి ఒక్కటి మాత్రమే సీసీ రోడ్డు నిర్మించారు. దానికి సైడు కాలువలు లేక మురుగునీటి పారుదల జరగడం లేదు. వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా ఉంటున్నాయి. ఈ మూడు కాలనీల్లో ఎక్కడా మురుగు కాలువలు ఏర్పాటు కాలేదు. దాదాపు అన్నీ కచ్చా కాలువలే కావడంతో మురుగునీరు నిల్వ ఉండి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండి మురుగు కూపాలను తలపిస్తోంది. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో ఈ కాలనీల్లో మౌలిక వసతుల గురించి కనీసం పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు అరకొరగానే ఉన్నాయి. తాగునీటి సరఫరా రెండు వీధులకే పరిమితమవుతుంది. ఇప్పటికే పలు వీధుల్లో ఇళ్ల నిర్మాణాలు జరిగినా మున్సిపల్ అధికారులు పైపులైన్లు ఏర్పాటు చేయకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడు విద్యుత్తు లోవోల్టేజీ సమస్యతో అవస్థలు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. చల్లావారికొష్టాలు, మందలపు కొష్టాలు ప్రాంతాలకు వెళ్లే దారి అడుగడుగునా గతుకులమయంగా ఉంది. బిలాల్‌నగర్‌లో విద్యుత్తు స్తంభాలు కాలువ మధ్యలో ఉండటంతో నీటి పారుదలకు అడ్డంకిగా మారాయి. స్తంభాల సమస్య పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు ఇప్పటికే పలుమార్లు చెప్పినా.. ఆచరణకు నోచుకోవడం లేదు. కనిగిరి రోడ్డు నుంచి ఈ కాలనీకి వచ్చే దారుల్లో కట్టెల అడితలు ఉండటం, వస్తువులను ఈ దారులకు అడ్డంగా ఉంచడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

వార్డు	29
ప్రాంతాలు	మధురానగర్, చల్లావారికొష్టాలు, మందలపుకొష్టాలు, ఐ.ఎస్.ఆర్.గార్డెన్స్, బిలాల్‌నగర్, రామానాయుడునగర్, వెంకటాద్రిపాలెం
నివాసాలు	550
జనాభా	1900 మంది

మట్టిరోడ్డు, కచ్చాకాలువలతో ఉన్న రామానాయుడు నగర్

(c) eenadu

అద్దంకి

•అద్దంకి •దర్శి

చుక్క నీటికి భగీరథ యత్నం

☛ రైతన్నపై ఎకరాకు రూ.10 వేల భారం

పరిశీలన

తాళ్లూరు, న్యూస్‌టుడే : ఎన్నో ఆశలతో సాగు చేసిన పొగాకు పంటను కాపాడుకునేందుకు రైతులు భగీరథ యత్నం చేస్తున్నారు. ప్రతి చుక్క నీటిని కాపాడుకునేందుకు బిందు సేద్యం చేస్తున్నారు. గతేడాది సరైన ధరలు దక్కక నష్టాల పాలైన పొగాకు రైతులు ఈ ఏడాదైనా గట్టెక్కేందుకు యత్నిస్తున్నారు. జిల్లా పరిధిలో సుమారు 70 వేల హెక్టార్లలో పంట సాగులో ఉంది. గతేడాదిలో ముంథా తుపాన్ ప్రభావంతో నారుమళ్లు దెబ్బతినడంతో మూట నారు ధర రూ.ఆరువేల రికార్డు స్థాయికి చేరింది. అయినా రైతులు లెక్కచేయక సాగు చేపట్టారు. పొగాకు సాగుతో పాటు బ్యారన్ అద్దెలు, కట్టెలు, కూలీల ఖర్చులతో పాటు ఇతరత్రా అన్ని రకాల ఖర్చులు పెరిగి పోవడంతో రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో సాగునీటి ఎద్దడి తీవ్రతరమైంది. అద్దంకి, దర్శి, కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఎక్కువైంది. దీంతో కిలోమీటర్ల దూరంలోని కుంటలు, వాగులు, వంకల్లో అందుబాటులో ఉండే నీటిని పొలాల నుంచి ప్రత్యేక రబ్బరు, ప్లాస్టిక్ పైపుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ఏడాదిలో బిందు సేద్యంతో పంటను బతికించుకుంటున్నారు. ఒక్కో ఎకరాకు అదనంగా రూ.పదివేల వరకూ ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

కిలోమీటరు దూరం నుంచి రబ్బరు ట్యూబు వేసి.

కేవీపాలెం వద్ద నీటి వృథా అరికట్టేందుకు బిందుసేద్యం

గోపాలపురం వద్ద విస్తరించని మార్గంలో వాహనాల రాకపోకలు

నామ్ బాధితులకు త్వరలో పరిహారం

గోపాలపురం (అద్దంకి), న్యూస్‌టుడే : నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారి బాధితులకు ఒకటి రెండు రోజుల్లో పరిహారం అందించనున్నారు. అద్దంకి మండలం గోపాలపురానికి చెందిన 49 మందికి, చక్రాయపాలేనికి చెందిన 72 మందికి, కలవకూరుకు చెందిన ఒకరికి, సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. దాదాపు 11.29 ఎకరాలకు గాను నగదు రూ.45,24,174 సోమ, మంగళవారాల్లో వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. ఇప్పటికే ఒంగోలు ఆర్డీవో కార్యాలయం జిల్లా పీఏవో కార్యాలయానికి దస్త్రం వెళ్లిందని, అక్కడి నుంచి రైతుల బ్యాంక్ ఖాతాకు నగదు జమ చేయడమే మిగిలిందని వెల్లడించారు.

త్వరలో మరిన్ని ఉపకేంద్రాలు

☛ వేసవికి ప్రత్యేక కార్యాచరణ ముఖాముఖి ☛ విద్యుత్తు ఈఈ శ్రీనివాసులు

వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో లో ఓల్టేజీ పలకరిస్తోంది. మరోవైపు పరివర్తకాల ధ్వంసంతో రైతన్నలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో దర్శి ప్రాంతంలో విద్యుత్తు సమస్యలపై ఏపీసీపీడీసీఎల్ ఈఈ పాలగిరి శ్రీనివాసులుతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది. చేపడుతున్న పనులు, నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు చేపట్టిన చర్యలను వివరించారు. ఆ వివరాలు.. - **న్యూస్‌టుడే, తాళ్లూరు, దర్శి**

రూ.9 కోట్లతో కొత్త పరివర్తకాలు..

వేసవిలో లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ముండ్లమూరు మండలంలో మూడు, తాళ్లూరులో నాలుగు, దర్శి పట్టణంలో ఒకటి చొప్పున కొత్త పరివర్తకాలు ఏర్పాటుచేసి ఉపకేంద్రాల సామర్థ్యాన్ని పెంచాం. ఇందుకోసం సుమారు రూ.తొమ్మిది కోట్లు ఖర్చు చేశాం. వీటితోపాటు గ్రామాల్లో సరఫరాకు కొన్నిచోట్ల 100 కేవీఏ, మరి కొన్నిచోట్ల 63 కేవీఏ పరివర్తకాలను బిగించాం.

ప్రత్యేక లైన్ ఏర్పాటు..

కురిచేడు మండలం కల్లూరు, ముండ్లమూరు మండలం ఉల్లగల్లులో మరో రెండు నెలల్లో రెండు ఉపకేంద్రాల నిర్మాణం పూర్తి చేసి నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం. తాళ్లూరు మండలం గుంటిగంగ వద్ద 132 కేవీఏ సామర్థ్యంతో ఉపకేంద్రాన్ని పూర్తి చేసి తాళ్లూరు, దర్శి, ముండ్లమూరు ప్రాంతాల్లో లో ఓల్టేజీ, అంతరాయానికి తావులేకుండా మెరుగైన విద్యుత్తు సరఫరా చేస్తాం. ఇందుకోసం రూ.నాలుగు కోట్లతో ప్రత్యేక లైన్ ఏర్పాటు, రూ.నాలుగు కోట్లతో దర్శిలో డివిజన్ కార్యాలయ భవనం పనులు చేస్తున్నాం.

పంటలు ఎండిపోకుండా..

అధిక ఓల్టేజీ కారణంగా ఎక్కడన్నా పరివర్తకాలు కాలిపోతే త్వరితగతిన మరమ్మతులు చేయించి మళ్లీ బిగిస్తున్నాం. పంటలు ఎండిపోకుండా ప్రత్యామ్నాయంగా మరో పరివర్తకం అత్యవసరంగా అమరుస్తున్నాం. ఏడాది కాలంలో 94 కాలిపోగా 82 ఏర్పాటు చేయించాం. మరో పన్నెండు త్వరితగతిన బిగించేందుకు ప్రయత్నిస్తున్నాం. దర్శి కేంద్రంలో అందుబాటులో లేకుంటే ఒంగోలు నుంచి రప్పించి ఇబ్బందులను అధిగమిస్తున్నాం.

కొత్త దరఖాస్తులకు పరిష్కారం..

ప్రస్తుత ఏడాదిలో రైతుల వ్యవసాయ అవసరాలకు ఇప్పటికే 1473 కనెక్షన్లు మంజూరు చేశాం. ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే మరో 1560 దరఖాస్తులను కూడా పరిష్కరిస్తాం. ఈపాటికే కొత్త స్తంభాలు, లైన్లు కూడా వేయించాం. విద్యుత్తు బకాయిలు పేరుకుపోతున్నాయి. దీన్ని అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నాం.

శింగరకొండపాలెం గ్రామ పంచాయితీ

వేలం ప్రకటన

తేది:14.02.2026

అద్దంకి మండలం శింగరకొండపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని (శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానం యొక్క భూములు మినహాయించి) శింగరకొండపాలెం గ్రామంలో జరుగు శింగరకొండ **శ్రీలక్ష్మినరసింహస్వామి మరియు శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి తిరునాళ్ళ** సందర్భముగా **తేది 01.03.2026 నుండి 03.03.2026** వరకు దుకాణములు పెట్టి వ్యాపారం చేసుకొనుటకు **తేది. 19.02.2026న మధ్యాహ్నం 3.00 గంటలకు** శింగరకొండపాలెం గ్రామ సచివాలయం వద్ద శ్రీయుత డివిజనల్ పంచాయితీ అధికారి, అద్దంకి వారి ఉత్తర్వుల మేరకు పంచాయితీ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం జరుగును.

షరతులు: 1. రూ. **50,000/-** (యాభై వేల రూపాయలు) ధరావత్తు చెల్లించి బహిరంగ వేలం పాటలో పాల్గొనవలెను. 2). హెచ్చు పాట పాడిన వారు పాటలో 1/2 భాగము పైకము పాట ముగిసిన వెంటనే చెల్లించవలెను. 3). హెచ్చుపాటదారుడు మిగిలిన 1/2 భాగము పైకమును తేది 22.02.2026 లోపు చెల్లించి రశీదు పొంది ఉత్తర్వులు పొందవలెను. 4). పాట కాలం తేది 01.03.2026 నుండి 03.03.2026 వరకు మాత్రమే.

మిగిలిన వివరములకు గ్రామ పంచాయితీ కార్యదర్శి వారిని సంప్రదించవలెను.

ఎర్రిబోయిన తిరుపతయ్య, సర్పంచ్, శింగరకొండపాలెం గ్రామ పంచాయితీ, అద్దంకి మండలం. సెల్: 80080 55328

ఎ.చెన్నయ్య పంచాయితీ గ్రామ కార్యదర్శి, శింగరకొండపాలెం గ్రామ పంచాయితీ, అద్దంకి మండలం సెల్: 94400 76514

రైల్వేలైన్ కోసం చర్చిల్లో ప్రార్థనలు

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి ప్రాంతానికి రైల్వేస్టేషన్, రైల్వేలైన్ మంజూరు చేయాలని సాధన సమితి నాయకుల నేతృత్వంలో ఆదివారం పట్టణంలోని పలు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. పసుమర్తిపాలెం, కట్టబండపాలెం, రామ్‌నగర్, ఎన్జీవోనగర్ తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో సమితి తరఫున పిట్టల మధుసూదనరావు, మానికొండ రవితేజ, కత్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సర్వమత ప్రార్థనల్లో భాగంగా రెండు రోజుల క్రితం మసీదుల్లో 'దువా' నిర్వహించారు.

పసుమర్తిపాలెం మందిరం వద్ద ప్రార్థనల్లో సంఘకాపరి, సమితి బాధ్యులు

పీఆర్సీని వెంటనే నియమించాలి

పొదిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని వెంటనే నియమించాలని పింఛనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి మదార్‌వలీ చెప్పారు. పొదిలి పింఛనర్ల సంఘం భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, అడిషనల్ క్వాంటం పది శాతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పింఛనర్ల సంఘం గౌరవ అధ్యక్షులు వీరారెడ్డి, కోశాధికారి చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, కార్యదర్శి మోహనరావు, రామకృష్ణ, సుబ్బారెడ్డి, మహిళా కార్యదర్శి ధనమ్మ, సుదర్శన్‌రెడ్డి, యల్లమందారెడ్డి పాల్గొన్నారు.

బీకేపాడులో వైద్య శిబిరం

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని బొద్దికూరపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో వైద్య సిబ్బంది భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు.

వైద్య శిబిరంలో సిబ్బంది

ఇదీ రాచబాట సొగసు

పేరుకే జాతీయ రహదారి. చూస్తే మురుగునీటిమయం. ఇదీ పుట్టావారిపాలెం కూడలి నుంచి నరసరావుపేట వెళ్లే మార్గంలో రాచబాట దుస్థితి. వ్యాపార దుకాణాల సముదాయం, నివాస గృహాల నుంచి వస్తున్న వృథాజలాలు రోడ్డుపైకి చేరి మురుగునీటి తటాకంలా మారింది. రహదారి నిర్వహణ, పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - **సంతమాగులూరు, న్యూస్‌టుడే**

తిరునాళ్లకు వెళ్లే వాహనాలపై దృష్టి

అమరావతి-అనంతపురం జాతీయ రహదారి, నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారి కలిసే పుట్టావారిపాలెం కూడలిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ ఆదివారం సందర్శించారు. కూడలికి సమీపంలోనే ప్రభుత్వ కోటప్పకొండ తిరునాళ్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాలు ఎప్పటికప్పుడు ముందుకు సాగేలా చూడాలని, అక్కడికి వెళుతున్న వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచనలు చేశారు. స్థానిక సీఐ వెంకట్రావు, ఎస్సై పట్టాభిరామయ్యతో మాట్లాడారు. - **సంతమాగులూరు, న్యూస్‌టుడే**

నడి రోడ్డుపైనే మాంసం విక్రయాలు

దర్శి(తాళ్లూరు), న్యూస్‌టుడే : దర్శి పట్టణంలోని చౌటపాలెం వైపు రహదారి ఎంతో రద్దీగా ఉంటోంది. ఆ మార్గంలో రోడ్డును సగం వరకు ఆక్రమించి మాంసం విక్రయాలు చేస్తుండటంతో అటువైపు రాకపోకలు సాగించేవారు అవస్థల పాలవుతున్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఆ మార్గంలోంచే వెళ్లాల్సి వస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం వచ్చిందంటే ఆ ప్రాంతంలో వాహనాలు సాధ్యంకావడం లేదని వాపోతున్నారు. కొందరు వ్యాపారులు మాంసం కుప్పలను ప్రధాన రహదారి పక్కనే నిల్వ చేసి విక్రయాలు సాగిస్తున్నారు.

దర్శిలోని చౌటపాలెంవైపు ప్రధాన రహదారిని ఆక్రమించి క్రయ, విక్రయాలు

కోటప్పకొండ సందర్శకులకు అన్నదానం

సంతమాగులూరు: పుట్టావారిపాలెం కూడలిలో ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కోటప్పకొండ తిరునాళ్లకు వెళుతున్న భక్తుల సౌకర్యార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి సన్నెబోయిన గురుయాదవ్, గ్రామస్థులు దీనికి సహకరించారు.

ఆరవల్లిపాడులో.. దొనకొండ: ఆరవల్లిపాడులోని తారకేశ్వరస్వామికి మంత్రపుష్ప, పంచామృత అభిషేకాలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శివరాత్రి పూజలు, అన్నదానాలు చేశారు.

గతుకుల బాటలకు ఇక వీడ్కోలు

▸ రహదారులకు నిధుల కేటాయింపు

కురిచేడు, న్యూస్‌టుడే: గతుకుల రోడ్లతో పడిన కష్టాలు ఇక దూరం కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా పక్కా రహదారుల కోసం నిరీక్షిస్తున్న గ్రామాల వారికి కూటమి పాలకులు శుభవార్త చెప్పారు. జెడ్పీ వర కురిచేడు నుంచి గొల్లపాలెం కాటంవారిపల్లె మీదుగా పేరంబొట్లపాలెం రోడ్డుకు, వెంగాయపాలెం నుంచి పడమర వీరాయపాలెం వరకు, పెద్దవరం ఎన్నెస్పీ కాలువ నుంచి బయ్యవరం గ్రామం వరకు ఉన్న మట్టి రహదారులను తారు రోడ్లుగా మార్చనున్నారు. ఈ మేరకు ఆయా రోడ్లకు వరుసగా రూ.3.25 కోట్లు, రూ.90 లక్షలు, రూ.1.14 కోట్లు కేటాయించారు. గ్రామాలు ఏర్పడినప్పటి నుంచి తారు రోడ్డు నిర్మించక ఆయా గ్రామాల వాసులు నరకయాతన అనుభవించారు. అత్యవసర వైద్యం, ఉన్నత చదువుల పరంగా వారికి గగనంగా మారాయి. త్వరలోనే రహదారుల నిర్మాణం చేపట్టనుండటంతో అక్కడి వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

దశ మారనున్న కురిచేడు - పేరంబొట్లపాలెం రహదారి

ఈ రోడ్డును పట్టించుకోరూ..

తాళ్లూరు: దర్శి-చీమకుర్తి ప్రధాన రహదారిలో తూర్పుగంగవరం సమీపాన రోడ్డు అధ్వానంగా మారింది. ఇంధన బంకుల సమీపంలో రోడ్డు ఛిద్రమైంది. ర.భ.శాఖ పరిధిలో ఉన్న రోడ్లలో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు తమ సమస్య పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ డీఈ గోపీకృష్ణను సంప్రదించగా, త్వరలోనే రహదారికి మరమ్మతులు చేయిస్తామన్నారు.

వాహనం అదుపుతప్పి దంపతులకు గాయాలు

బల్లికురవ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయాల పాలయ్యారు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సంతమాగులూరు మండలం కరుమంచి గ్రామానికి చెందిన ఎం.అశోక్, భార్య ఉషతో కలిసి ఆదివారం మధ్యాహ్నం బంధువుల ఇంటికి బయలుదేరారు. వారి వాహనం అద్దంకి - నార్కట్‌పల్లి జాతీయ రహదారిపై ఎస్.ఎల్.గుడిపాడు వద్ద అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో అశోక్ తలకు తీవ్ర గాయాలవ్వగా, భార్య ఉషాకు ఓ మాదిరి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

బంగ్లారోడ్డులో..: అద్దంకి: ద్విచక్ర వాహనం ఢీకొని పాదచారుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన అద్దంకి బంగ్లారోడ్డు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..ఆదివారం రాత్రి ఓ పాదచారుడు నామ్ రహదారి దాటుతుండగా, వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

లారీ నుంచి కట్టెలు జారిపడి..

అద్దంకి : నామ్ రహదారిపై దూసుకెళుతున్న లారీ నుంచి కట్టెలు జారిపడ్డాయి. గోపాలపురం వద్ద వేగ నిరోధకం దాటుతున్న సమయంలో కట్టెలు ఒక్కసారే పడిపోయాయి. ఆ సమయంలో వెనుక వాహనాలేవీ రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు, ప్రకాశం జిల్లా, జె.పంగులూరు మండలం, నార్నేవారిపాలెం గ్రామ వాస్తవ్యులు ప్రస్తుతం బెంగుళూరు పట్టణం నివాసం అయిన **కోయి శివరాజేంద్ర ప్రసాద్‌గారి భార్య కోయి లక్ష్మీశైలజ,** అనువారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థి మా క్లయింట్ మరియు ఆమె తల్లి బండారు లక్ష్మీప్రమీల, సోదరుడు బండారు చంద్రశేఖర్, కోయి లక్ష్మీశైలజ (మా క్లయింట్), భీమని అనూష గార్లు తేది. 01.06.2016న పార్టీషన్ దస్తావేజు నెం. 2051/2016 ద్వారా అద్దంకి జాయింట్ సబ్‌రిజిస్ట్రారు కార్యాలయములో రిజిష్టర్ చేయించుకొని మా క్లయింట్ వాటాకు రాబడి మా క్లయింట్ సంపూర్ణ హక్కులతో అనుభవించుచున్నారు. ఈ క్రింది షెడ్యూలు స్థలమునకు మూడు వైపులా గోడ, మరో వైపు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకొని మా క్లయింట్ నిరాటంకముగా స్వాధీనానుభవములో ఉన్నారు.

ఇది ఇలా ఉండగా పై తెలిపిన పార్టీషన్ దస్తావేజును కోర్టువారికి తెలియజేయకుండా మా క్లయింట్‌కు తెలియచేయకుండా, ఈమని రజని కుమారి అనునామె ఒంగోలు 1వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో ఓ.యస్.నెం. 127/2017 అను దావా, బండారు లక్ష్మీప్రమీల, బండారు చంద్రశేఖర్, దేవరపల్లి విశాలాక్షి అను వారిపై దాఖలు చేసి తేది.01.09.2023న మా క్లయింట్ యొక్క షెడ్యూలు ఆస్థిపై మోసపూరితంగా డిక్రీ పొందినారు. అలాగే మా క్లయింట్‌కు తెలియపరచకుండా మా క్లయింట్ ఆస్థిపై ఇ.పి. 7/2024 దాఖలు చేసి మా క్లయింట్ ఆస్థిపై కోర్టు నుండి ఆర్డరు పొంది తేది.13.02.2026న మా క్లయింట్ల యొక్క షెడ్యూలు ఆస్థికి కోర్టువారి నుండి విక్రయ దస్తావేజు అద్దంకి జాయింట్ సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంట్ నెం. 862/2026ను రిజిష్టర్ చేయించుకున్నారు.

మా క్లయింట్‌కు చెందిన ఈ క్రింది షెడ్యూలు ఆస్థి విషయమై మా క్లయింట్‌కు తెలియకుండా శ్రీ కోర్టు వారి నుండి అద్దంకి జాయింట్ సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో ఈమని రజని కుమారి విక్రయ రిజిస్ట్రేషన్ పొందిన దస్తావేజు నెం. 862/2026 చట్టరీత్యా చెల్లనేరదని, మా క్లయింట్‌ను బద్ధపరచజాలదని, సదరు విక్రయ దస్తావేజు నెం. 862/2026 గురించి మా క్లయింట్ చట్టరీత్యా న్యాయస్థానములో వ్యాజ్యము దాఖలు చేసి చెల్లని డాక్యుమెంట్‌గా కోర్టు వారి నుండి ఉత్తర్వులు పొందగలదని కావున పై తెలిపిన విక్రయ దస్తావేజును అనుసరించి ఈమని రజని కుమారితో షెడ్యూలు ఆస్థి విషయమై ఎవరు ఎలాంటి లావాదేవీలు జరిపినా అవి ఏమీ చెల్లనేరవని ఇందుమూలముగా యావన్మందికి తెలియపరచటమైనది.

షెడ్యూలు:- ప్రకాశం జిల్లా - మార్కాపురం డి॥ రిజిస్ట్రేషన్ - అద్దంకి సబ్ రిజిస్ట్రేషన్ - కొరిశపాడు మండలం - మేదరమెట్ల గ్రామ పంచాయతీ ఏరియాలోని - బొడ్డువానిపాలెం శివారు మేదరమెట్ల గ్రామ సర్వే నెం. 587, ప్రస్తుత సర్వే నెం. 587/1 - ఓల్డ్ డోర్ నెం. 9-204, శిథిలము చేయబడిన రైస్ & ఫ్లోర్ మిల్ తాలూకు స్థల విస్తీర్ణం 1258.4 చదరపు గజాలు అనగా 1052.02 చదరపు మీటర్లు ఈ క్రింది హద్దులలో. **తూర్పు:** పాత ఎన్.హెచ్.5 రోడ్డు, **దక్షిణం:** బెల్లం కోటయ్యగారి గోడౌన్ దారి, **పడమర:** బెల్లం కోటయ్య, మల్లెల వెంకటేశ్వరరావు గార్ల ఆస్థి, **ఉత్తరం:** భీమని అనూష విక్రయం చేసిన మొరవినేని జస్వంత్, మామిళ్ళపల్లి రంగబాబు గార్ల ఆస్థి.

సం/- **పంగులూరి గోవిందయ్య.**
దొప్పలపూడి రేవంత్, పంగులూరి సింధూర
అడ్వకేట్స్, ఒంగోలు.

ఒంగోలు,
తేది:15.02.2026

బహిరంగ ప్రకటన

మా క్లయింట్లు, 1) ప్రకాశం జిల్లా, కొరిశపాడు మండలం, యర్రబాలెం గ్రామ వాస్తవ్యులు, ప్రస్తుతం జర్మనీ దేశంలో నివాసం ఉంటున్న గల మొరవినేని సర్వేశ్వరరావు కుమారుడు జస్వంత్, అను వారు మరియు 2) ప్రకాశం జిల్లా, బల్లికురవ మండలం, వెలమవారిపాలెం గ్రామ వాస్తవ్యులు ప్రస్తుతం మలేషియా దేశంలో నివాసం ఉంటున్న మామిళ్ళపల్లి చిరంజీవిరావు కుమారుడు రంగబాబు అనువారల తరపున ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం, యర్రబాలెం గ్రామ వాస్తవ్యుడు మొరవినేని కృష్ణయ్య గారి కుమారుడు సర్వేశ్వరరావు గారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థి మా క్లయింట్స్ తేది. 18.06.2021న కొరిశపాడు మండలం, దైవాలరావూరు గ్రామ వాస్తవ్యురాలు భీమని అనూష అను వారి నుండి మార్కెట్ ధరకు కొనుగోలు చేసి క్రయధనం మొత్తం బ్యాంక్ అకౌంట్‌ల ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసి విక్రయ దస్తావేజు నెం. 3335/2021 ద్వారా అద్దంకి జాయింట్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయములో రిజిష్టర్ చేయించుకొని యున్నాడు. ఈ క్రింది షెడ్యూలు స్థలమునకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకొని అందులో ఆర్‌సిసి బిల్డింగ్ నిర్మించుకొని మా క్లయింట్లు జామాయిల్ పైరు, కూరగాయల మొక్కలు, పండ్ల మొక్కలు వేయించి మా క్లయింట్స్ స్వాధీనానుభవం కలిగియున్నారు.

మా క్లయింట్ల యొక్క వెండార్ భీమని అనూష అను ఆమెకు షెడ్యూలు ఆస్థి తేది. 01.06.2016న ఉమ్మడి కుటుంబ పార్టీషన్ దస్తావేజు నెం. 2051/2016 ద్వారా సంక్రమించి ఆమె సంపూర్ణ హక్కులతో అనుభవించుచూ ఉండి, మార్కెట్ ధరకు మా క్లయింట్లకు విక్రయించటమైనది. ఇది ఇలా ఉండగా పై తెలిపిన పార్టీషన్ దస్తావేజు గురించి కోర్టువారికి తెలియజేయకుండా మా క్లయింట్స్‌కు కానీ, మా క్లయింట్స్ యొక్క వెండార్ అయిన భీమని అనూషకుగాని తెలియచేయకుండా, ఈమని రజని కుమారి అనునామె ఒంగోలు 1వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో ఓ.యస్.నెం. 127/2017 అను దావా, బండారు లక్ష్మీప్రమీల, బండారు చంద్రశేఖర్ మరియు దేవరపల్లి విశాలాక్షి అనువారిపై దాఖలు చేసి తేది. 01.09.2023న మా క్లయింట్ యొక్క షెడ్యూలు ఆస్థిపై మోసపూరితంగా డిక్రీ పొందినారు. అలాగే మా క్లయింట్లకు తెలియపరచకుండా మా క్లయింట్ల ఆస్థిపై ఇ.పి. 7/2024 దాఖలు చేసి మా క్లయింట్ల ఆస్థిపై కోర్టు నుండి ఆర్డరు పొంది తేది.13.02.2026న మా క్లయింట్ల, యొక్క షెడ్యూలు ఆస్థికి కోర్టువారి నుండి విక్రయ దస్తావేజు అద్దంకి జాయింట్‌సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంట్ నెం. 862/2026ను రిజిష్టర్ చేయించుకున్నారు.

మా క్లయింట్లకు చెందిన ఈ క్రింది షెడ్యూలు ఆస్థి విషయమై మా క్లయింట్లకు తెలియకుండా శ్రీ కోర్టు వారి నుండి అద్దంకి జాయింట్ సబ్‌రిజిస్ట్రారు ఆఫీసులో ఈమని రజని కుమారి విక్రయ రిజిస్ట్రేషన్ పొందిన దస్తావేజు నెం. 862/2026 చట్టరీత్యా చెల్లనేరదని, మా క్లయింట్లను బద్ధపరచజాలదని, సదరు విక్రయ దస్తావేజు నెం. 862/2026 గురించి మా క్లయింట్లు చట్టరీత్యా న్యాయస్థానములో వ్యాజ్యము దాఖలు చేసి చెల్లని డాక్యుమెంట్‌గా కోర్టువారి నుండి ఉత్తర్వులు పొందగలరని కావున పై తెలిపిన విక్రయ దస్తావేజును అనుసరించి ఈమని రజని కుమారితో షెడ్యూలు ఆస్థి విషయమై ఎవరు ఎలాంటి లావాదేవీలు జరిపినా అవి ఏమీ చెల్లనేరవని ఇందుమూలముగా యావన్మందికి తెలియపరచటమైనది.

షెడ్యూలు:- ప్రకాశం జిల్లా - మార్కాపురం డి॥ రిజిస్ట్రేషన్ - అద్దంకి సబ్ రిజిస్ట్రేషన్ - కొరిశపాడు మండలం - మేదరమెట్ల గ్రామ పంచాయతీ ఏరియాలోని - బొడ్డువానిపాలెం శివారు మేదరమెట్ల గ్రామ సర్వే నెం. 587, ప్రస్తుత సర్వే నెం. 587/1 - ఓల్డ్ డోర్ నెం. 9-204, కొత్త డోర్ నెం. 16-232 అసెస్‌మెంట్ నెం. 234719002967 - ఎలక్ట్రిసిటీ సర్వీస్ కనెక్షన్ నెం. 4611410006027 - స్థల విస్తీర్ణం య. 0.45 1/2 సెంట్లు లేక 2202.20 చదరపు గజాలు అందులోని ఆర్‌సిసి బిల్డింగ్ 539 చదరపు అడుగులు ఈ క్రింది హద్దులలో **తూర్పు:** పాత ఎన్.హెచ్.5 రోడ్డు, ఈ దిశ 196 లింకులు, **దక్షిణం:** కోయి లక్ష్మీశైలజ స్థలం ఈ దిశ 250 లింకులు, **పడమర:** మల్లెల వెంకటేశ్వరరావు గారి బాలాజీ రా & బాయిల్డ్ రైస్‌మిల్ వగైరాలు ఈ దిశ 86 లింకులు, క్రాస్‌లో 149 లింకులు, **ఉత్తరం:** శివపురం వెంకటరామయ్యగారి ఆస్థి ఈ దిశ 170 లింకులు.

సం/- **పంగులూరి గోవిందయ్య.**
దొప్పలపూడి రేవంత్, పంగులూరి సింధూర
అడ్వకేట్స్, ఒంగోలు.

ఒంగోలు,
తేది:15.02.2026

శివోహం.. భజేహం..

అద్దంకి : పట్టువస్త్రాలు తీసుకెళుతున్న చైర్‌పర్సన్ తదితరులు

అద్దంకి, న్యూస్‌టుడే : మహా శివరాత్రి పర్వదినం వేళ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల శివనామస్మరణతో ఆ క్షేత్రాలు మార్మోగాయి. మణికేశ్వరం మల్లేశ్వరస్వామి ఆలయంలో అద్దంకి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి బి. అఖిల కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని భద్రకాళి సమేత కమఠేశ్వరాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉభయదేవేరుల కల్యాణం జరిగింది. ధన్వంతరి దత్తపాదుకా క్షేత్రం వద్ద సచ్చిదానందేశ్వర కల్యాణం నిర్వహించారు. నాగసూరి హనుమత్‌ప్రసాద్, అర్చకులు అత్తోట భాస్కర ఫణికుమార్‌శర్మ పర్యవేక్షించారు.

▸ **ముండ్లమూరు:** మారెళ్లలోని హరిహర దత్తక్షేత్రంలో భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వస్వామికి, ఈదరలో ఉమామహేశ్వరస్వామి, ముండ్లమూరులోని మల్లమాంబ సమేత మల్లికార్జునస్వామి, పెదఉల్లగల్లులోని కోటేశ్వరస్వామి, పోలవరంలోని చెన్నమల్లేశ్వరస్వామి, ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

▸ **మేదరమెట్ల:** మేదరమెట్లలో కనకదుర్గా మల్లేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేశారు.

▸ **అద్దంకి:** పట్టణంలోని పాతశివాలయం, నగరేశ్వరాలయం, కమఠేశ్వరాలయం, ధేనువకొండ, బొమ్మనంపాడు కాశీవిశ్వేశ్వరాలయం, మణికేశ్వరం మల్లేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు క్యూలైన్‌లలో బారులు తీరారు. మణికేశ్వరానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు నడిపారు.

▸ స్థానిక గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ సింగిల్ ట్రస్టీ రామలింగేశ్వరరావు ఇంటి నుంచి ఉత్సవమూర్తులను పల్లకీలో తరలించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, వైస్‌ఛైర్మన్ విజయలక్ష్మి దంపతులు, ఆర్యవైశ్య ప్రముఖులు నూతన వస్త్రాలను సమకూర్చారు. అర్చకులు కంఠంరాజు శంకరరావు నేతృత్వంలో కల్యాణ క్రతువు కనుల పండువగా జరిగింది. ▸ **బల్లికురవ:** కొండాయపాలెంలోని గంగా పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామికి పూజలు చేశారు. సాయంత్రం శాంతి కల్యాణం కోలాహలంగా జరిగింది. ▸ **కురిచేడు:** స్థానిక శివాలయం భక్తులతో కిటకిటలాడింది. జ్ఞానప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. భారీ అన్నదాన వితరణ చేశారు.

▸ **జె.పంగులూరు:** పంగులూరు, కొండమూరు, కోటపాడు, చందలూరు, రామకూరు శివాలయాల్లో సందడి నెలకొంది. పంగులూరులో స్వయంభు భీమలింగేశ్వరాలయంలో విశేష పూజలు జరిగాయి. రామకూరు రామలింగేశ్వరాలయంలో గ్రామోత్సవం నిర్వహించారు.

▸ **దర్శి (తాళ్లూరు):** దర్శి పట్టణంలోని ప్రముఖ శివాలయంలో అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామార్చనలు చేశారు. నారపుశెట్టి శివప్రసాద్, పెద్దల తోడ్పాటుతో అన్నదానం చేశారు.

▸ **తాళ్లూరు:** తాళ్లూరు, బొద్దికూరపాడు, లక్కవరం, శివరాంపురం, గుంటిగంగలోని శివాలయాల్లో పంచామృతాభిషేకాలు జరిగాయి. గుంటిగంగలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో శివ, పార్వతుల కల్యాణోత్సవాలు నిర్వహించారు. మాధవరంలోని నీలకంఠేశ్వరస్వామితోపాటు పార్వతీదేవి అమ్మవారిని అలంకరణ చేసి ఉత్సవాలు చేశారు. ▸ గుంటిగంగలో గంగాభవాని అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించారు. పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కమఠేశ్వరాలయం వద్ద మాంగల్యధారణ ఘట్టం

మణికేశ్వరంలో న్యాయమూర్తి అఖిల కుటుంబసభ్యులు

ముండ్లమూరు : మారెళ్లలో స్వామి వారు

దొనకొండ : ఆరవల్లిపాడులో తారకేశ్వరస్వామి

(c) eenadu

83 మందికి రూ.52.6 లక్షల ఆర్థిక సాయం

సీఎం సహాయ నిధి లబ్ధిదారులు, తెదేపా నాయకులతో ఎమ్మెల్యే విజయకుమార్

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ఒంగోలులోని తన కార్యాలయంలో ఎస్‌ఎన్.పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 83 మందికి రూ.52,60,196ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు గొట్టిపాటి రామచంద్రరావు, తేళ్ల మనోజ్‌కుమార్, ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, రాజపల్లి సురేష్‌బాబు, పోలినేని శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూప్-1 విజేత శ్రుతిని సత్కరిస్తున్న న్యాయమూర్తి హరినారాయణ, వేదికపై డాక్టర్ వంశీకృష్ణ, గ్రామస్థులు

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: యువత బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని విశాఖపట్నం జిల్లా జడ్జి, కొత్తపట్నం గ్రామానికి చెందిన మోదుగుల హరినారాయణ సూచించారు. ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో కొత్తపట్నానికి చెందిన బేతాల శ్రుతి సత్తా చాటి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆదివారం గ్రామంలో మేళతాళాలతో కారులో ఊరేగించారు. అనంతరం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో మండల ప్రజల తరఫున అభినందన పౌర సన్మానం ఏర్పాటు చేశారు. జడ్జితోపాటు ఒంగోలులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత చాపల వంశీ కృష్ణ, ఆయన సతీమణి శాంతికుమారి, ఇతర ప్రముఖులు శ్రుతికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వంశీకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జడ్జి హరినారాయణ మాట్లాడుతూ.. తాను కూడా ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తుచేసుకున్నారు. శ్రుతి గ్రూప్-1కు ఎంపికై మండలానికి ఎంతో పేరు తీసుకొచ్చారని కొనియాడారు. ఇలాంటి ఉద్యోగాలు సాధించడం సామాన్యమైన విషయం కాదని, కొన్ని ఏళ్లుగా శ్రమించి చదివితే తప్ప పొందలేరని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి చేరేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమకు దొరికిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని, సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిన్ని వెంకటేశ్వర్లు, కాకి కృపారావు, మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చీమకుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని ఆర్.ఎల్.పురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నూతన లైన్ ఏర్పాటు జరుగుతున్నందున ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాలకు సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ మోహన్‌రావు, ఏఈ శ్రీనివాసరావులు తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

?: చీర్వానుప్పలపాడులో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రి వేళలో వీధులు అంధకారంలో ఉంటున్నాయి.
– వెంకటేశ్వర్లు, గ్రామస్థుడు

✓: పరిశీలించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపడతాం.
– తేళ్ల రవికుమార్, ఎంపీడీవో

?:ఒంగోలు నగరంలోని గాంధీరోడ్డులో కోర్టు సెంటర్ నుంచి ప్రకాశం బొమ్మ వరకు ఎక్కడా స్పీడ్ బ్రేకర్ లేదు. ద్విచక్ర వాహనాలు వేగంగా రావడం వల్ల రద్దీగా ఉండే ఈ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నాయి.
–స్థానికులు

✓: అసిస్టెంట్ ఇంజినీర్‌ని పంపించి పరిశీలించి స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.
– ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?:ఒంగోలు 9వ డివిజన్ రాజీవ్ గృహకల్ప కాలనీ ఆరోలైన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ స్తంభానికి ఉన్న వీధి దీపం తొలగించారు. కూడలి ప్రాంతం కావడం వల్ల రాత్రివేళ ఇబ్బందిగా ఉంది. – స్థానికులు

✓:విద్యుత్తు విభాగం సిబ్బందిని పంపించి పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.
– ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?:కొత్తపట్నంలోని నాగేశ్వర స్వామి దేవస్థానం పక్క రోడ్డులో వ్యర్థాలు నిలిచిపోయాయి.
–సుబ్బారావు, గ్రామస్థుడు

✓:వెంటనే పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.
–వేణుగోపాల కృష్ణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో

?:మద్దిపాడు మండలం వెల్లంపల్లిలోని తాళ్లూరు రహదారిలో వాహనాలు ఎక్కడబడితే అక్కడ అడ్డదిడ్డంగా నిలుపుదల చేస్తున్నారు. దీనివల్ల ప్రజలు ట్రాఫిక్‌తో ఇబ్బందులకు గురవుతున్నారు.
–షేక్ కాలేషా, గ్రామస్థుడు

✓:వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపుదల చేసే వారిపై చర్యలు తీసుకుని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తాం.
–వెంకటసూర్య, ఎస్సై

?:మద్దిపాడు పడమర పాలెం చెరువు, ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగడం లేదు.
– వేల్పుల నాగరాజు, స్థానికుడు

✓: వెంటనే పరిశీలించి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.
–నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు, ఒంగోలు నగరం, కొత్తపట్నం, మద్దిపాడు

అండర్ పాస్ పనులు.. ఆగిన మంచినీళ్లు

❑ ట్యాంకర్లు పెంచాలని ప్రజల వినతులు

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఏదైనా అభివృద్ధి పని జరిగే సమయంలో కొన్ని రోజులు అసౌకర్యం కలగడం సహజం. అయితే అత్యవసరమైన తాగునీటికి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత నగరపాలక సంస్థపై ఉంది. అగ్రహారం లెవల్ క్రాసింగ్ వల్ల ప్రజా రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో అండర్‌పాస్ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మూడు నెలలుగా అక్కడ పనులు జరుగుతున్నాయి. పూర్తికావడానికి మరో మూడు నెలలు సమయం పడుతుందని అంచనా. రైల్వేలైన్‌కు తూర్పువైపున గల ఆరు కాలనీల వారికి తాగునీటి సమస్య తలెత్తింది. వంతెన నిర్మాణానికి పైపులైన్లు తొలగించాల్సి రావడంతో కుళాయిల్లో సరఫరా నిలిచిపోయింది. బాలాజీనగర్, అరవింద కాలనీ, దత్తాత్రేయ కాలనీ, పోతురాజుపాలెం, యానాది కాలనీ తదితర ప్రాంతాలకు రోజుకు 15 ట్రిప్పులు నీరు సరఫరా చేస్తున్నారు. నాలుగురోజులకు ఒకసారి ఇస్తున్న నీరు సరిపోవడం లేదని ప్రజలు గగ్గోలు పెట్టడంతో ఇటీవల కొన్ని ప్రాంతాల్లోని కుళాయిలకు నీరు వచ్చే ఏర్పాటు చేశారు. రామనగర్ నుంచి సాగర్ కాలువ మార్గంలో పైపులైన్ వేసి నీరు సరఫరా చేశారు. దీనివల్ల కొన్ని కాలనీల సమస్య తీరింది. పోతురాజు పాలెం ఒకటి, రెండు లైన్లు, బాలాజీనగర్‌లోని ఆరు పెద్దరోడ్లు, 15 అడ్డరోడ్లకు నీటి సమస్య కొనసాగుతోంది. వేసవి సమీపిస్తున్నందున నీటి అవసరాలు పెరిగాయి. ఇప్పుడిస్తున్న 15 ట్యాంకర్లకు అదనంగా మరో అయిదు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్రహారం లెవల్ క్రాసింగ్ గేటు ప్రదేశంలో జరుగుతున్న అండర్ పాస్ పనులు

ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి స్వామి

దివ్యాంగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

టంగుటూరు, న్యూస్‌టుడే: దివ్యాంగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'ఇంద్రధనస్సు' కార్యక్రమం తీసుకొచ్చారని మంత్రి బాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని తూర్పునాయుడు పాలెం క్యాంపు కార్యాలయంలో ఉద్యోగాలు పొందిన నలుగురు దివ్యాంగులకు ఆదివారం నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగులకు కేటాయించిన నాలుగో తరగతి బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను త్వరలో భర్తీచేస్తామని తెలిపారు. అంతే కాకుండా వారికి ఉచిత బస్సు ప్రయాణం, మూడు చక్రాల మోటారు వాహనాలు, చక్రాల కుర్చీలు, సహాయ పరికరాలు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, చరవాణులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. వసతి గృహం ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.

యువకుల రక్తదానం

కొత్తపట్నం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కొత్తపట్నం మండలం మడనూరులోని శ్రీరామలింగేశ్వర స్వామి యూత్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 30 మందిపైగా యువకులు, స్థానికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యూత్ ఫోర్స్ కమిటీ అధ్యక్షుడు మరపాల శివారెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారన్నారు. యువత సమాజ సేవ పట్ల చూపిన ఆసక్తి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అభినాష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టింపులేదా..?

లింగసముద్రం మండలం గంగపాలెం సమీపంలో పచ్చాకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు మహిళా కూలీలు శనివారం మృతి చెందారు. అంతకు ముందు రోజు ఆటో బోల్తా పడిన ఘటనలో పలువురు మహిళా కూలీలు గాయపడి లకు గాయాలై ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఇలా.. నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నా.. కొందరు అవేమీ తమకు పట్టవంటూ ప్రమాదకర రీతిలో ప్రయాణిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం పొగాకు కొట్టే పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో మద్దిపాడు నుంచి చుట్టు పక్కల గ్రామాలతో పాటు పక్క మండలాలకు కూడా ఆటోలు, ట్రాక్టర్లలో ప్రమాదకరమైన ప్రయాణాలు చేస్తున్నారు. సీతారామపురం కొష్టాల్ కూడలిలో ఆదివారం పచ్చాకు కూలీలు ట్రాక్టర్ సైడ్ డోర్లు తీసి వెళ్తున్న చిత్రమిది. -న్యూస్‌టుడే, మద్దిపాడు

కొత్తలైన్‌తో కరెంట్ కోతలకు చెల్లు!

చీమకుర్తి మండలం ఆర్‌ఎల్‌పురం ఉపకేంద్రం పరిధిలో ఉన్న గ్రానైట్, అనుబంధ పరిశ్రమలకు మెరుగైన విద్యుత్తు సరఫరా అందజేసే దిశగా నూతనంగా 11 కేవీ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. రాజుపాలెంలోని ఉపకేంద్రం వద్ద నుంచి కారుమంచి మేజర్ కాలువ గ్లోబల్ స్టోన్ క్రషర్ ప్రాంతం వరకు సుమారు ఆరు కిలోమీటర్ల పరిధిలో నూతనంగా తీగలు ఏర్పాటు చేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు రూ.50 లక్షలు వెచ్చించి ఈ లైను ఏర్పాటు చేస్తున్నారు. ఇది పూర్తయితే పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరాకు మార్గం సుగమం అవుతుందని విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. క్రేన్ సాయంతో స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న కూలీలను చిత్రంలో చూడవచ్చు. -న్యూస్‌టుడే, చీమకుర్తి

పట్టు జారితే.. ప్రమాదమే!

కొత్తపట్నం-ఒంగోలు మార్గంలో వరి గడ్డి మోపుల లోడుతో రయ్‌మంటూ ట్రాక్టర్లు తిరిగేస్తున్నాయి. భారీగా లోడు వేసినప్పటికీ చోదకులు కనీసం వెనుకా ముందు వచ్చే వాహనాలను గమనించకుండా దూసుకెళ్తున్నారు. దీనివల్ల మోపులు పట్టుజారి రోడ్డుపై పడి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారీ ఎత్తున గడ్డి వేసుకొని ప్రయాణం చేయడంతో కొన్ని గ్రామాల వద్ద కరెంట్ తీగలు తాకే అవకాశం ఉంది. పోలీసులు దృష్టి ఇలాంటి ట్రాక్టర్ డ్రైవర్లకు తగు జాగ్రత్తలు చెప్పాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కొత్తపట్నం

ఎస్‌ఎన్.పాడు: విశేష అలంకరణలో త్రిపురాంతకేశ్వరుడు

ఒంగోలు నగరంలో పూజలందుకున్న కాశీ విశ్వేశ్వరుడు

మడనూరులోని రామలింగేశ్వర స్వామివారికి అభిషేకం

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులో శివ కల్యాణం..

నీలకంఠాయ.. నమశ్శివాయ!

చీమకుర్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం శైవ క్షేత్రాలన్నీ శివ నామస్మరణతో మార్మోగాయి. దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన రామతీర్థం క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మోక్ష రామలింగేశ్వర స్వామిని దర్శించుకొనేందుకు గంటలపాటు క్యూలైన్లో వేచి ఉన్నారు. దీంతో కొందరు భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు దంపతులు, తెదేపా నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన 15 సత్రాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రానైట్ క్వారీల వారు తాగునీరు, వైద్య ఆరోగ్య శాఖ తరఫున ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. తహసీల్దారు ఆర్.బ్రహ్మయ్య, సీఐ డి.ప్రసాద్, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ● ఒంగోలు సాంస్కృతికం: స్థానిక కేశవస్వామిపేటలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, సంతపేట సాయిబాబా ఆలయం, కొత్తపట్నం బస్టాండ్ కూడలిలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సంతపేట సాయిబాబా మందిరంలో వివిధ యాగాలను బ్రహ్మశ్రీ మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కాశీవిశ్వేశ్వరస్వామి, సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాశీవిశ్వేశ్వరస్వామికి వైకాపా నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. ● ఒంగోలు గ్రామీణం: మండలంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెళ్లూరు, కొప్పోలుల్లోని ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ● నాగులుప్పలపాడు: నాగులుప్పలపాడు శివాలయంలో ఈవో సుబ్బారావు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించి అన్నదానం చేశారు. ఉప్పుగుండూరు శివాలయంలో ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో శివ కల్యాణం వైభవంగా సాగింది. అనంతరం రాత్రిపూట గ్రామోత్సవాలు సందడిగా సాగాయి. ● మద్దిపాడు: స్థానిక మల్లికార్జున స్వామి దేవాలయంతోపాటు, కొలచన కోట, దొడ్డవరం, మల్లవరం, వెల్లంపల్లి, గుండ్లాపల్లి, నందిపాడు, పెదకొత్తపల్లి, ఘడియాపూడి గ్రామాల్లోని శివాలయాల్లో రద్దీ నెలకొంది. ● సంతనూతలపాడు: స్థానిక త్రిపురాంతకేశ్వర స్వామి, పేర్నమిట్టలోని రామలింగేశ్వరస్వామి, చిలకపాడు, మంగమూరు, మైనంపాడు, ఎండ్లూరు, మద్దులూరు, రుద్రవరం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● కొత్తపట్నం: మండలంలోని మడనూరు రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. పాదర్తిలోని గంగా పార్వతీ సమేత లక్ష్మీ ఈశ్వర స్వామి ఆలయంలో కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

కొత్తపట్నం: పాదర్తి శివాలయంలో కల్యాణ వేడుకలో పాల్గొన్న గ్రామస్థులు

ఒంగోలులోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ

శివారు ఆయకట్టుకూ సాగర్ నీరు

రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎన్నెస్పీ ఎస్ఈ వరలక్ష్మి

చిలకపాడు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: చివరి భూములకు సాగర్ నీరు అందించేలా కృషి చేస్తున్నట్లు ఎన్నెస్పీ ఎస్ఈ వరలక్ష్మి తెలిపారు. ఆదివారం చిలకపాడు మేజర్ కాలువపై కొణిజేడు చివరి భూములను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రామతీర్థం రిజర్వాయరు నుంచి 330 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. వీటిలో 260 క్యూసెక్కుల నీటిని త్రోవగుంట మేజరుకు వెళ్తుందని, చిలకపాడు మేజరుకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతి ఎకరానికి సాగరు నీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట సబ్ డివిజన్ డీఈ పద్మావతి, డీసీ ఛైర్మన్ రామా శ్రీనివాసరావు, సహాయ ఇంజినీర్లు రమణారెడ్డి, షేక్ కరిముల్లా బాష, రైతులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని పడమటి కట్టకిందపల్లి శివారులో కోడిపందేలు ఆడుతున్న వారిపై ఆదివారం పామూరు పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు పందెం కోళ్లు, రూ.1,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎప్పటి పనులు అప్పుడే!

న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాలతో ఉపాధిహామీ పథకంలో మార్పులు చోటుచేసుకొన్నాయి. గ్రామాల్లో చేపట్టిన పనులు పెండింగ్‌లో లేకుండా పూర్తయ్యేలా, వేతనదారులకు ఎక్కువ పనిదినాలతో ఉపాధి లభించేలా రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29న స్టాండర్డ్ ఆపరేషన్ గైడ్‌లైన్స్ జారీ చేసింది. దీని ప్రకారం ఒక్కో పంచాయతీకి తొలుత పది పనుల వంతున మంజూరు చేస్తారు. ఒకటి పూర్తయ్యాక మరొకటి చేపట్టాల్సి ఉంటుంది. 2014వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులను ఈ ఏడాది మార్చి 31వ తేదీకల్లా పూర్తి చేయాలని నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ప్రారంభించిన పనులను అదే ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాల్సి ఉంది. ప్రతి పంచాయతీలో గ్రామ సభల ద్వారా 20 నుంచి 25 పనులను గుర్తించి అనుమతులు తీసుకోవడం.. వాటిలో సగమే చేపట్టడం, నిధులు మురిగిపోవడం వంటివి ఇప్పటివరకు జరుగుతుండేది. అత్యవసరంగా పంచాయతీల్లో ఎక్కడైనా కొత్త పనులు చేపట్టాలంటే జిల్లా ప్రోగ్రాం అధికారిగా ఉండే కలెక్టర్ మంజూరు చేస్తుంటారు. కొత్త జీవో ప్రకారం ఈ అధికారాన్ని వినియోగించకుండా లాగిన్‌ను నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది.

కొత్తకోటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పెండింగ్ పడకూడదని..

కాలనీల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు మంజూరైతే 90 రోజుల్లో వెచ్చించాలి. పండ్ల తోటల పెంపకంలో మూడేళ్ల నిర్వహణకు అనుమతి ఉంది. రహదారులు, భవనాల నిర్మాణాలకు నిర్దుష్ట కాలపరిమితి ఉంటుంది. పథకంలో ఇప్పటి వరకు ఉన్న నిబంధనల మేరకు ఒక ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు తరువాత ఏడాదిలో కొనసాగించే అవకాశం ఉండటంతో జిల్లాలో వేల సంఖ్యలో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సంతనూతలపాడు నియోజకవర్గంలో వందల సంఖ్యలో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ ఈ ఏడాది మార్చి 31 లోగా పూర్తి చేయాలని నిర్దేశించారు.

పూర్వ విద్యార్థుల సాయం.. కళావేదిక సాకారం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కోలాహలంగా జరిగింది. పాఠశాలలో 1986 నుంచి 1991 వరకు చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు లక్ష్మీకటాక్షం, రామ్మోహన్, చిట్టిబాబు, రామారావు, జాహ్నవిలను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి పాఠశాలలో రూ.2 లక్షలతో నిర్మించిన కళా వేదికను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.వి.ఎల్.నరసింహారావు, ఎస్ఎంసీ ఛైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, పూర్వ విద్యార్థులు ఆళ్ల శ్రీను, కె.ప్రభాకర్, కోటేశ్వరరావు, శ్రీలత, నాగు, శ్రీనివాసులు, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

కళావేదికపై నాటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కాలువలిలా.. దోమలు వదిలేదెలా?

న్యూస్‌టుడే, మద్దిపాడు

మద్దిపాడు మండలంలో దోమల నియంత్రణ చర్యలు కాగితాలకే పరిమితమయ్యాయి. రూ.లక్షల నిధులు ఖర్చు చేస్తున్నామని లెక్కలు చూపిస్తున్నారు. ఈ మేరకు ఎక్కడా పనులు చేసిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలకు రాత్రిళ్లు కంటి మీద కునుకు కరవైంది. దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ఆసుపత్రుల్లో చికిత్సకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో దోమల నివారణకు రసాయనాలు పిచికారీ చేసే యంత్రాలు లేకపోవడంతో మొక్కుబడిగానే పనులు చేస్తూ చేతులు దులుపుకొంటున్నారు. మురుగు కాలువల్లో పూడిక తొలగించే పనులను చిత్రాలతో సరిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొలచన కోటలో మురుగు కాలువలో నిలిచిన నీరు

అట్టపెట్టెల్లోనే ఫాగింగ్ యంత్రాలు..

మండల కేంద్రం మద్దిపాడుతో పాటు 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొలచనకోట, మల్లవరం, దొడ్డవరం, ఇనమనమెళ్లూరు, మద్దిపాడు తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారవడంతో దోమలు ముసురుతున్నాయి. వీటి నివారణకు కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు అట్టపెట్టెలో నుంచి ఇంకా బయటకు తీయలేదు. దీంతో మందు పిచికారీ చేసిన పాపాన పోలేదు. మురుగు కాలువల నిర్వహణ గాలికొదిలేశారు. దీనికితోడు ఎక్కడికక్కడ వీధుల్లో చెత్త పేరుకుపోతుంది. కాలువలో పూడిక పెరగడం వల్ల మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. ఈ కారణంగా దోమల వ్యాప్తి మరింత ఎక్కువైంది. అయినా అధికారులు నివారణ చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబును వివరణ కోరగా.. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

(c) eenadu

నిధి.. సోమశిలకు పెన్నిధే

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సోమశిల జలాశయానికి రూ.226.12 కోట్లు కేటాయించి రైతుల్లో ఆనందం నింపింది. నిధులతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కానున్నాయి. జలాశయం రక్షణ కట్టడాలు 2020, 2021 వరదలకు ఛిద్రమైన విషయం తెలిసిందే. గత వైకాపా ప్రభుత్వం వీటి పటిష్ఠతపై నిర్లక్ష్యం చూపింది. ప్రస్తుతం పనులు కొలిక్కి వచ్చేలా కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

రూ.99 కోట్లతో.. జలాశయం పరిధిలో రూ.99 కోట్లతో రక్షణ పనులు చేపట్టినా అవి ప్రస్తుతం ఆగిపోయి ఉన్నాయి. వైకాపా ప్రభుత్వంలో చేసిన పనులకు రూ.22కోట్లు బిల్లుల బకాయి ఉంది. గుత్తేదారు పనులు ఆపి కోర్టుకు వెళ్లి తెచ్చుకున్నారు. ఆపై ప్రారంభించ లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తిరిగి మొదలయ్యేలా చేసింది. రూ.7కోట్ల వరకు పనులు చేసిన గుత్తేదారు బిల్లులు రాలేదంటూ పనులు ఆపేశారు. ప్రస్తుతం బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో కదలిక రానుంది. జలాశయం పరిధిలో వరదలకు దెబ్బతిన్న రక్షణ కట్టడాల పటిష్ఠతే మొదటి ప్రాధాన్యం. దాంతో ఈ ఏడాది కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు క్రస్ట్‌గేట్ల రోప్‌ల మార్పు, కండలేరు వరదకాలువ రెగ్యులేటర్ పనులు చేపడతారు. మరో ప్రాధాన్యం పని సోమశిల హైలెవల్ కాలువ పనులకు ప్రస్తుతం భూసేకరణ చేస్తున్నారు. మరో పని ఉత్తర కాలువ విస్తరణ జరగనుంది.

ఆగిన ఆప్రాన్ పనులు

కండలేరుకు.. మరోవైపు కండలేరు జలాశయానికి రూ.359.20 కోట్లు కేటాయించడంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. కండలేరు వరద కాలువ పరిధిలో దశాబ్దాల కాలంగా ఆగి ఉన్న ఉపకాలువ పనులు ముందుకు సాగనున్నాయి.

కాకివాయి మహాకాళేశ్వరుని సన్నిధిలో దీపాలతో శివలింగం.. మైపాడులో శివలింగానికి క్షీరాభిషేకం.. బీచ్‌లో భక్తుల స్నానాలు.. మూలాపేట శివాలయంలో భక్తుల రద్దీ.. శ్రీ స్వర్ణ లింగేశ్వర ఆలయంలో క్షీరాభిషేకం చేస్తున్న భక్తురాలు

శివోహం.. జనసందోహం

జిల్లావ్యాప్తంగా మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శివాలయాలన్నీ ఓం నమఃశివాయ నామస్మరణతో మార్మోగాయి. నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. రాత్రికి లింగోద్భవ కాలాన్ని విశేషంగా చేపట్టారు. శివపార్వతులను వెండినందిపై ఊరేగించారు. మైపాడ్ బీచ్ వద్ద భారీ శివలింగానికి భక్తులు క్షీరాభిషేకం చేశారు.పెద్దసంఖ్యలో భక్తులు సముద్రస్నానం చేశారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

మేమిలాగే.. మీరు ఆగాల్సిందే

నెల్లూరు నగరంలో ఆత్మకూరు బస్టాండు అండర్ బ్రిడ్జి మీదుగా వెళ్లే దారి ఇది. రోడ్డును కొంత మేర సిటీ బస్సులు ఆక్రమించాయి. వాటి పక్కనే ఆటోలు బారులు తీరాయి.ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలు లేని పరిస్థితి ఉంది. ప్రతిరోజూ ఇక్కడ ఇలాగే ఉంటోంది. ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండు లోపలకు వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే.
– న్యూస్‌టుడే, నెల్లూరు(వేదాయపాలెం)

అతిక్రమణ.. తలకెక్కని నిబంధన

● రెండు రోజుల క్రితం మినీబైపాసు రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో చిన్నపాటి గాయాలతో వాహనదారులు బయటపడ్డారు. ఇద్దరు వాహనదారులు నిబంధనలు పాటించలేదు. శిరస్త్రాణం ధరించలేదు, అతి వేగం, రాంగ్ రూట్ ప్రయాణం తోనే ప్రమాదం జరిగింది.

● ట్రాఫిక్ పోలీసులు నిత్యం నగరంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. వీటిలో అత్యధికం శిరస్త్రాణం ధరించకపోవడంపైనే నమోదు అవుతున్నాయి. ఆ తర్వాత డ్రైవింగ్ లైసెన్సు లేకుండా, మద్యం తాగి వాహనాలు నడపడం ఉన్నాయి.

న్యూస్‌టుడే, నెల్లూరు(వేదాయపాలెం)

నిబంధనలు పక్కాగా పాటిస్తే ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగవు. ప్రస్తుతం జరుగుతున్నవి పరిశీలిస్తే నిబంధనలు పాటించకపోవడం తోనే జరిగాయనేది అధికారుల ప్రాథమిక నివేదిక. అతి వేగం, మద్యం తాగి వాహనం నడపడం, సెల్‌ఫోన్, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌తోనే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు నిత్యం తనిఖీలు చేసి.. . నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. ఒకరికి రెండేసి

శిరస్త్రాణం ధరించక ప్రమాదాలు

చొప్పున చలానాలు ఉండటం గమనార్హం.

తలకు గాయంతోనే..

నగరంలో రహదారి ప్రమాదాలు ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాల వల్లే జరుగుతున్నాయి. మృతుల్లో ఎక్కువ మంది తలకు గాయంతోనే చనిపోతున్నారు. తలకు హెల్మెట్ లేకుండా తిరుగుతూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఎక్కువ మందిలో పౌర స్పృహ లేకపోవడమే కారణం.

నిబంధనలపై యువకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం

ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించేలా ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నాం. నిత్యం అవగాహన కార్యక్రమాలు చేస్తున్నా.. చైతన్యం రావడం లేదు. అందుకే తనిఖీలు కొనసాగిస్తున్నాం. ఎస్పీ ఆదేశాల మేరకు విస్తృతం చేశాం. –వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

గతేడాది పోలీసులు నమోదు చేసిన కేసుల వివరాలు

మద్యం తాగి నడుపుతూ..	4,567
డ్రైవింగ్ లైసెన్సు లేకుండా..	12,345
శిరస్త్రాణం ధరించక పోవడం..	16,098
సీటు బెల్టు పెట్టుకోని వారు..	534
రాంగ్ పార్కింగ్	1893
వ్యతిరేక దిశలో ప్రయాణం	1435
అతివేగం	3,230
ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం	1,534
మైనర్ డ్రైవింగ్	435
ఇతర అతిక్రమణలు	9845

తీరిన వేతన కష్టాలు

108 సిబ్బంది ఆనందం

న్యూస్‌టుడే, దుత్తలూరు, నెల్లూరు(వైద్యం): ప్రమాదాల సమయంలో అత్యవసర సేవలు అందిస్తున్న 108 సిబ్బందికి కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. విధి నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న పైలెట్లు(అంబులెన్స్ చోదకులు), ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు(ఈఎంటీలు)ల వేతనాలు పెంచుతూ ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఒక్కొక్కరికి సీనియారిటీని బట్టి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు పెరిగింది. రూ.18వేల జీతం వచ్చేవారికి రూ.23వేలు, ఈఎంటీకి రూ.20వేల నుంచి రూ. 25 వేల వరకు పెరిగింది. వేతనాలు ఈనెల పదో తేదీనే ఖాతాల్లో పడ్డాయని సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 108 వాహనాలు 41 ఉన్నాయి. వీటిల్లో పైలెట్లు, ఈఎంటీలు కలిపి 185 మంది పనిచేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు వేతనాలు పెంచాలని 108 సిబ్బంది పలుమార్లు ఆందోళనలు, ధర్నాలు చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా సానుకూలంగా స్పందించి వేతనాలు పెంచారు.

ఇసుక.. అక్రమాలకు ఇలాఖా!

రోడ్డుపై అధిక ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్

జిల్లాలో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. నాయకుల అండతో నిబంధనలకు విరుద్ధంగా జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. సామర్థ్యానికి మించి ఇసుక నింపుకొని వెళుతున్నా.. అధికారులు చోద్యం చూస్తున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతిసెంటర్)

జిల్లాలో మినగల్లు, పడమటికంభం పాడు, పల్లెపాడు, విరువూరులో పెన్నానదిలో ఓపెన్ రీచ్‌లు, సంగం, సూరాయిపాలెం, నెల్లూరు బ్యారేజీలో డీసిల్టేషన్ రీచ్‌లు ఉన్నాయి. వీటిలో ఇష్టానుసారంగా ఇసుక తరలిపోతోంది. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ప్రతి ట్రాక్టర్, టిప్పర్, లారీలకు బిల్లులు తీసుకొని తరలించాలి. వాహన సామర్థ్యం ఎంత ఉంటే ఆ స్థాయిలో ఇసుక నింపుకోవాలి. వాహనాలు అధికలోడుతో తరలిస్తున్నాయి.

వందల లారీల్లో...

జిల్లా నుంచి ప్రతిరోజూ వందల లారీల ఇసుక ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలిపోతున్నట్లు సమాచారం. ప్రతి ఇసుక రీచ్‌లో మైనింగ్ శాఖ అనుమతుల ప్రకారం మీటరు లోతులో 46,500 నుంచి 48,800 మెట్రిక్ టన్నులు నాలుగు ఎకరాల నుంచి ఐదు ఎకరాల విస్తీర్ణంలో తీసుకోవాలి. అందుకు విరుద్ధంగా అనుమతులు ఐదు ఎకరాలకు ఇస్తే పది ఎకరాలకు పైనే ఇసుకను తవ్వేస్తున్నారు.

పొరుగు జిల్లాలకు..

నెల్లూరు నగరం భగత్‌సింగ్ కాలనీలో వందల ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తి వాహనాల నుంచి టోల్‌గేట్ వసూలు చేస్తున్నట్లు తెలిసింది. పొట్టేపాలెం నుంచి రాత్రి, పగలు తేడాలేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిపోతోంది. అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు రీచ్ నుంచి వైఎస్ఆర్ జిల్లా బద్వేల్‌కు తరలించి అక్కడ నిల్వ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. సంగం రీచ్ నుంచి విజయవాడుకు వెళుతోంది.

నిరంతరం తనిఖీలు చేస్తున్నాం

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్ తనిఖీ చేసి వాహనాలు పట్టుకుంటోంది. అధిక లోడుతో వెళ్లే బిల్లులు లేని వాహనాలను పోలీసులు, మైనింగ్ అధికారులు సీజ్ చేస్తున్నారు. అధిక ఇసుక తీసుకెళుతున్న వాహనాలను ఇటీవల కావలి, ఆత్మకూరు వద్ద పట్టుకున్నాం.
– శ్రీనివాసరావు, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

మనుబోలు, న్యూస్‌టుడే: లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కాగితాలపూరు అడ్డరోడ్డు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకొంది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా దర్శి నుంచి చెన్నైకు వెళుతున్న లారీలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం రావడంతో దాడులు చేశారు. 700 బస్తాల్లో ఉన్న 35 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ రూ. 14.70 లక్షలు ఉంటుందని పౌరసరఫరాల శాఖ ఏఎస్‌వో లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. వీటిని పొదలకూరు గోదాముకు తరలించినట్లు వివరించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ రవి, వీఆర్వో గుణశేఖర్, ఎస్సై రాకేశ్ పాల్గొన్నారు.

ఆరేళ్లుగా మూతపడిన అకాడమీలు

క్రీడా నేర్పు.. ఏదీ కూర్పు?

క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే కేవలం శిక్షణ సరిపోదు.. వారికి పౌష్టికాహారంతో పాటు సరిపడా వ్యాయామం, క్రీడల్లో మెలకువలు అవసరం. ఇవన్నీ అకాడమీలోనే నేర్పిస్తారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఇవి.. ఆరేళ్లుగా మూతపడ్డాయి.

ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పూర్తయిన అకాడమీ భవనం

న్యూస్‌టుడే, నెల్లూరు (క్రీడా విభాగం)

క్రీడల్లో ప్రతిభావంతులను ఎంపిక చేసి వారిని భావి భారత క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే అకాడమీల లక్ష్యం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి జిల్లాలో ఆరు ఉండేవి. నెల్లూరులో బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, ఖోఖో, అథ్లెటిక్స్ అకాడమీలు ఉండగా, ఓజిలిలో హ్యాండ్‌బాల్, వాలీబాల్‌కు సంబంధించి ఉండేవి. గత ప్రభుత్వ తీరుతో మూతపడ్డాయి. నాటి నుంచి వాటి ఊసే లేదు.

గతంలో జిల్లాలో ఉన్న అకాడమీల్లో బాలబాలిక వివరాలు ఇలా..

- బ్యాడ్మింటన్ క్రీడలో బాల, బాలికలు 25 మంది వంతున ఉంటారు
- అథ్లెటిక్స్‌లో 20 మంది బాలికలకే అవకాశం
- ఫుట్‌బాల్, ఖోఖోలో 20 మంది బాలికలను ఎంపిక చేస్తారు
- హ్యాండ్‌బాల్, వాలీబాల్ క్రీడలో 20 మంది బాలురకే అవకాశం

ఏటా ఎంపికలు..

జిల్లాలో ఉన్న ఆరు అకాడమీలలో ఏటా ఎంపికలు జరుగుతాయి. ఏడాది పాటు ఇక్కడే శిక్షణ కల్పిస్తారు. చదువుకునేందుకు పాఠశాలలు, కళాశాలల్లో చేరవచ్చు. బాలికలకు ఏసీ క్రీడా మైదానంలో ఉచితంగా వసతి ఏర్పాటు చేసి, బాలురకు జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ప్రాంగణంలో ఉన్న భవనంలో ఏర్పాట్లు చేస్తారు. పౌష్టికాహారంతో కూడిన భోజనం, నిష్ణాతులైన శిక్షకులతో శిక్షణ ఇస్తారు.

సాధ్యసాధ్యాలపై పరిశీలన చేసినా..

రెండు నెలల క్రితం శాప్ అధికారులు జిల్లాలో పర్యటించారు. అకాడమీల ఏర్పాటుకు సాధ్యసాధ్యాలపై పరిశీలన చేశారు. ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో క్రీడాకారులకు అవసరమైన వసతి సౌకర్యాలు, వనరులు పరిశీంచారు. నెలలు గడిచినా.. అకాడమీల ఊసే లేదు.

● కావలి పురపాలక పొరుగుసేవల విభాగంలో పనిచేస్తున్న ఓ కార్మికుడు అనారోగ్యంతో మృతిచెందారు. వయోభారంతో తల్లి పనిచేయలేదని, తనకు ఆ పోస్టు ఇవ్వాలని కుమార్తె అధికారులను విన్నవించుకున్నారు. ఆమెకు రూ.10 వేలు వచ్చే దినసరి కార్మిక పోస్టు కేటాయించి.. ఖాళీ అయిన అవుట్‌సోర్సింగ్ పోస్టు విక్రయించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

● పొరుగు సేవల విభాగంలో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదంలో మృతిచెందారు. ఆయన సతీమణికి ఆ పోస్టు ఇవ్వడానికి అధికారులు సుముఖత చూపలేదు. ఆరేళ్ల నుంచి దినసరి కార్మికురాలిగానే ఆమె పనిచేస్తున్నారు. ఇటీవల ఆర్డీవోని కలసి మొరపెట్టుకున్నారు.

● నగర, పురపాలికల్లో నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందిని నియమించుకుంటున్నారు. నేతల సిఫార్సుతో కొందరు చేరుతున్నారు. అధికారులు డబ్బు తీసుకుని నియామక పత్రం ఇస్తున్నారు.

పొరుగుసేవల ఉద్యోగాల భర్తీలో అక్రమాలు

కారుణ్యం లేకున్నా.. కాసులిస్తే కనికరమే

సమస్యలపై కావలి ఆర్డీవోకు మొరపెట్టుకుంటున్న పురపాలక దినసరి కార్మికులు

న్యూస్‌టుడే, కావలి, నెల్లూరు(టౌన్)

పురపాలకంలో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది మరణించినా, ఆ విధులకు దూరమైనా అదే పోస్టుల భర్తీకి భారీ డిమాండ్ నెలకొంటోంది. పొరుగు సేవలకు సంబంధించి కారుణ్య నియామకాలు ఉండకపోవడంతో అధికారులు ఆ దాయవనరుగా మార్చుకుంటున్నారు. చనిపోయిన సిబ్బంది కుటుంబం నుంచి పోస్టు కావాలంటే కనీసం ఎంతోకొంత ముట్టజెప్పాలి. గత కొన్నాళ్లుగా రెండు విడతలుగా భర్తీ చేసిన పోస్టుల్లో కొన్నింటికి డబ్బులు చేతులు మారాయని సమాచారం. గతంలో కొందరి వద్ద రూ.లక్షల్లో దండుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ వ్యవహారం వివాదాస్పమై. పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఎక్కడుంటారో.. ఎప్పుడొస్తారో..

నెల్లూరు నగరపాలకసంస్థ కార్యాలయంలో వివిధ పార్టీల నేతల సిఫార్సుతో దాదాపు 150 మంది వరకు కింది స్థాయి ఉద్యోగులు ఉండగా.. 50 మంది అసలు కార్యాలయానికి రావడం లేదు. గత ఎన్నికల సమయంలో వైకాపా నేతల ప్రచార కార్యక్రమాల్లో కార్పొరేషన్ ఉద్యోగులు పాల్గొనగా అప్పటి కమిషనర్ దాదాపు 20 మందిని తొలగించారు.

చర్యలు తీసుకుంటాం..

పారిశుద్ధ్య విభాగంలోనే పొరుగు సేవల నిమిత్తం చేరుతున్నారు. ఎక్కడ విధులు నిర్వహించినా డ్యూటీ ధ్రువీకరణపత్రం పొందాలని కమిషనర్‌కు సూచించా. నియామకాల్లో అక్రమాలు జరగకుండా చూస్తా. – ఎం.సన్నీ వంశీకృష్ణ, ఆర్డీవో, పురపాలక సంఘ ప్రత్యేకాధికారి, కావలి

సేవల స్నేహం

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

సమాజం పట్ల బాధ్యత.. అవగాహన కావాలంటే ఎన్ఎస్ఎస్ వంటి సేవా సంస్థలో యువత భాగస్వామ్యం కావాలి. అందులో బాలురతోపాటు బాలికలు కూడా చేరాలని పిలుపునిస్తున్నారు. నెల్లూరుకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ స్నేహ భవాని... పదో తరగతి నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రస్తుతం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఉత్తమ వాలంటీర్‌గా కొనసాగుతున్నారు. గణతంత్ర వేడుకల్లో బెస్ట్ వాలంటీర్‌గా అవార్డు అందుకున్నారు. దిల్లీలో జరిగిన పరేడ్‌లో పాల్గొన్నారు. దేశానికి సేవలు అందిస్తానని బాలిక చెబుతోంది. ఆమెపై 'ఈనాడు- ఈటీవీ' కథనం.

డిగ్రీ చదువుతూ...

నెల్లూరు నగరానికి చెందిన స్నేహ భవాని తండ్రి చంద్రశేఖర్, తల్లి సులోచన. తండ్రి బంగారు దుకాణంలో పని చేస్తున్నారు. ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. డీకేడబ్ల్యూ మహిళా కళాశాలలో బీఎస్సీ బయోటెక్నాలజీ మూడో సంవత్సరం చదువుతోంది. వీఎస్‌యూ స్నేహ భవాని సేవలను గుర్తించగా.. బెస్ట్ వాలంటీర్‌గా మూడేళ్లు గుర్తింపు పొంది.. శిబిరాల్లో పాల్గొంటోంది.

ఉత్తమ వాలంటీర్‌గా గుర్తింపు

2024 మార్చి, 2025 ఫిబ్రవరిలో హైదరాబాదు, నర్సాపూర్‌లో జరిగిన శిబిరాల్లో, మార్చి 2025లో నెల్లూరు నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నందుకు బెస్ట్ వాలంటీరుగా నిలిచారు. శుభ్రత, మొక్కలు నాటడం, అవగాహన కల్పించడంలో 2025 ఆగస్టు 15న విక్రమ సింహపురి వర్సిటీ అవార్డు అందించింది. ఎక్కువగా శిబిరాల్లో పాల్గొన్నందుకు గత ఏడాది సెప్టెంబరులో యూనివర్సిటీ అవార్డు అందుకున్నారు. సేవలను గుర్తించిన అధికారులు ఆమెను 2026 జనవరి 26న రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలకు రాష్ట్రం నుంచి ఆహ్వానించారు.

నిధుల స్వాహాపై గప్‌చుప్!

ఖంగుతిన్న సర్పంచులు

వెంకటాచలం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో నిధులు మళ్లించిన కార్యదర్శులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వెంకటాచలం మండలంలోని దాదాపు 70 శాతం పంచాయతీల కార్యదర్శులు డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను వెండర్ (గుత్తేదారుడు)గా చూపి అతని ఖాతాకు నిధులు మళ్లించారు. ఆరు నెలల వ్యవధిలోనే... ఇడిమేపల్లి, ఇస్కపాళెం, కనుపూరు, కంటేపల్లి, తిక్కవరప్పాడు, ఈదగాలి, వెంకటాచలం, తాటిపర్తిపాళెం, పుంజులూరుపాడు, కసుమూరు, గుడ్లూరువారిపాళెం తదితర పంచాయతీల నిధులు సుమారు రూ.50 లక్షలకు పైగానే స్వాహా చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పంచాయతీ సాధారణ, 15వ ఆర్థిక సంఘ నిధులను డేటా ఎంట్రీ ఆపరేటర్ ఖాతాలకు మళ్లించిన విషయం సర్పంచులకు తెలియకపోవటం గమనార్హం. ఇటీవల 'ఈనాడు'లో 'పంచాయతీల నిధులు ఫలహారం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఆయా పంచాయతీల సర్పంచులు ఆరా తీశారు. తమకు తెలియకుండానే మళ్లించారని తెలిసి ఆశ్చర్యపోయారు.

విచారణ లేకుండా ఒత్తిడి

వైకాపా హయాంలో ప్రారంభమైన అక్రమం ఆరు నెలల వరకు కొనసాగింది. వెంకటాచలం పంచాయతీలో విచారణ సందర్భంగా విషయం వెలుగుచూడటంతోనిధుల మళ్లింపు నిలిపి వేశారు. అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నిధుల మళ్లింపుపై విచారణ జరపకుండా అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

● సర్వజన, ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే హైరిస్క్ కేసుల్లో ఎక్కువగా రక్తహీనత సమస్య ఉన్నవారే ఉంటారు. వీరికి ప్రసవం కష్టంగా ఉంటుంది. ఒక్కోసారి తల్లీబిడ్డ ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. నెలవారీ నమోదయ్యే మాతాశిశు మరణాల్లో 50 శాతం రక్తహీనత కారణాలతో జరిగినవే ఉంటాయని గణాంకాలు చెబుతున్నాయి.

● తల్లీబిడ్డ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల్లో సమస్యను అధిగమించేందుకు ఎఫ్‌సీఎం(ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్) ఇంజెక్షన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది.

అమ్మకు భరోసా

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

జీజీహెచ్‌లో చికిత్సకు వచ్చిన గర్భిణులు

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

జిల్లాలో 61 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, నెల్లూరు నగరంలోని సర్వజన ఆసుపత్రి, ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, రెండు ఏరియా ఆసుపత్రులున్నాయి. గత నెల 31వ తేదీకి జిల్లా వ్యాప్తంగా 13078 మంది గర్భిణులు నమోదయ్యారు. నెలవారి పరీక్షలు చేయాల్సిన లక్ష్యంలో 74 మందికి రక్తపరీక్షలు చేయగా.. అందులో 29 మందికి కొద్దిగా, నలుగురికి మధ్యస్థంగా రక్తహీనత ఉంది. లెక్కల ప్రకారం 25శాతం పైగా గర్భిణులు రక్తహీనతతో బాధపడుతుంటారని లెక్కలు చెబుతున్నాయి.

మూడురకాలుగా..

రక్తహీనత సమస్య తక్కువ(మైల్డ్), మధ్యస్థం(మోడరేట్), ఎక్కువ(సివియర్)గా విభజిస్తారు. మొదటి, రెండు స్టేజీలలో ఐరన్ మాత్రలతో సమస్య పరిష్కారం అవుతుంది. మూడో స్థాయిలో సూక్రోజ్ సూది మందు వేస్తుంటారు. మాత్రలు, సూది మందులతో రక్తహీనత తగ్గక బాధపడేవారు ఉంటారు. వీరికి ఎఫ్‌సీఎం ఇంజెక్షన్లు ఉపకరిస్తాయి. ఇలాంటి వారిని వైద్య సిబ్బంది గుర్తించి వారికి ప్రసవం పూర్తయ్యే లోపు రెండు నుంచి మూడు ఇంజెక్షన్లు వేస్తారు. మార్కెట్‌లో ఒక్కో సూది మందు విలువ రూ. 1500గా ఉంది. ఇదే ప్రైవేటు ఆసుపత్రుల్లో వేసుకోవాలంటే అదనంగా వసూలు చేస్తుంటారు. ఖరీదైన సూది మందును రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం సర్వజన ఆసుపత్రి, సీహెచ్‌సీలతో అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే పీహెచ్‌సీలకు కూడా సరఫరా చేయనున్నారు.

అన్ని సీహెచ్‌సీలలో అందుబాటులో ఉన్నాయి

సర్వజన ఆసుపత్రి, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. రక్తహీనత ఎదుర్కొంటున్న గర్భిణులు ఉపయోగించుకోవాలి. అవసరమైతే అదనంగా తెప్పిస్తాం.
– పరిమళ, డీసీహెచ్ఎస్

(c) eenadu

విష సర్పాలతో భయాందోళన

పొదలకూరు-కలువాయి మార్గంలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ చెందిన బాలిక బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరింది. దీనికి సమీపంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, నివాస ప్రాంతాల మధ్య ఉన్న శిథిల భవనం నుంచి పాములు, విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారిణి సుధామణి మాట్లాడుతూ జడ్పీ పాఠశాల కలెక్టరు దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిధులు మంజూరైతే భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, పొదలకూరు

పడుగుపాడు.. ప్రమాదాల గూడు

పడుగుపాడు పంచాయతీ జాతీయ రహదారి వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో వాహనాలు వేగంగా వస్తుండడంతో రాత్రి సమయాల్లో వాహనాలు ఢీకొని పలువురు మృతిచెందారు. పడుగుపాడు సర్వీసు రోడ్డు మీదుగా ఎక్కువ మంది వివిధ గ్రామాలకు వెళుతుంటారు. ఆ మార్గంలో ఇష్టారాజ్యంగా లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు నిలపడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. పోలీసులు స్పందించి సర్వీసు రోడ్డులో వాహనాలు నిలపకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోవూరు

ప్రారంభించారు.. వదిలేశారు

బుచ్చి పురపాలక పరిధిలో కట్టుబడిపాళెంలో నూతనంగా నిర్మించిన అర్బన్ ఆరోగ్య కేంద్రాన్ని ఇటీవల ప్రారంభించారు. స్థానికులంతా వైద్యసేవలందుతాయని భావించారు. కానీ ఇప్పటివరకు వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. వైద్యాధికారి మనోజ్ మాట్లాడుతూ.. కొన్ని పనులు చేయాల్సి ఉందని పూర్తికాగానే వైద్యసేవలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాలెం

తరలిస్తున్నా పట్టించుకునేదెవరు..!



పొదలకూరు మండలంలో అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక, గ్రావెల్, మట్టి తరలిపోతోంది. నిత్యం ప్రభుత్వ కార్యాలయాల మీదుగా తరలిస్తున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. పలు గ్రామాల్లో అధిక లోడుతో వెళుతూ కనీసం పరదాలు సైతం కప్పకపోవడంతో వెనక వచ్చే ద్విచక్ర వాహనచోదకులపై పడుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

విద్యుత్తు సమస్యలా.. ఫోన్ చేయండి

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్, జిల్లాస్థాయిలో విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు డయల్ యువర్ సీఎండీ, ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన విద్యుత్తు వినియోగదారులు సమస్యలను సూచించిన నంబర్లకు తెలియజేయాలన్నారు. ❖ డయల్ యువర్ సీఎండీ ❖ సమయం : ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 ❖ ఫోన్ నంబరు : 89777 16661 ❖ డయల్ యువర్ ఎస్ఈ ❖ సమయం 8:30 -9:30 ❖ ఫోన్ నంబరు : 08612320427

రహదారి పనులను పరిశీలించిన మంత్రి

మర్రిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని 565 జాతీయ రహదారిపై జరుగుతున్న నూతన లేయర్ పనులను ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. కడప నుంచి విజయవాడకు వెళుతున్న మంత్రి మండలంలోని సింగనపల్లి వద్ద జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారుల కల్పన కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నిర్ణీత కాల పరిమితిలో త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.

పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

విలువైన స్థలాలు.. యథేచ్ఛగా ఆక్రమణలు

న్యూస్‌టుడే, పొదలకూరు, కోవూరు, విడవలూరు, సైదాపురం, బుచ్చి

జిల్లాలో కోట్ల రూపాయల విలువైన ఆర్టీసీ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి.. గతంలో ఊరు బయట ఉండగా ప్రస్తుతం శివారు ప్రాంతాలు పెరగడంతో ప్రతి చోట పట్టణ నడిబొడ్డులో ఉన్నాయి.. అధికారుల పర్యవేక్షణ లేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఆక్రమించారు.. తొలగించాలని నోటీసులిస్తున్నా బేఖాతరు చేస్తున్నారు.. ప్రయాణికులు మాత్రం ఎండలోనే నిరీక్షిస్తున్నారు. పట్టణాల్లో ఏకంగా భారీ భవంతులు వెలిశాయి. ఇప్పటికైనా ఆర్టీసీ, పంచాయతీ అధికారులు స్పందించి సమన్వయంతో ఆక్రమణలు తొలగించి ప్రయాణికులకు వినియోగంలోకి తేవాలని పలువురు విన్నవిస్తున్నారు. దీనిపై 'న్యూస్‌టుడే' పరిశీలనాత్మక కథనం

● సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు పట్టణంలో సుమారు మూడెకరాల పంచాయతీ బస్టాండు ఆక్రమణలతో కుంచించుకుపోయింది. ఎనిమిదేళ్ల క్రితం విశాలంగా ఉండగా నేడు మూడు బస్సులు కూడా పట్టని స్థితికి చేరింది. ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన బస్సు షెల్టరును కూడా పూర్తిగా ఆక్రమించి వ్యాపారం చేసుకుంటున్నారు. నెల్లూరు, గూడూరు, రాపూరు, రాజంపేట, ఆత్మకూరు డిపోల నుంచి వందలాది బస్సులు ఇక్కడికి వచ్చి వెళ్లాల్సిందే. వెంకటాచలం, కసుమూరు, సర్వేపల్లి, మనుబోలు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, బ్రహ్మదేవం, కృష్ణపట్నం, పంటపాళెం వద్ద పలువురు ఆక్రమార్కులు కాజేశారు.

పొదలకూరులో ఆక్రమణలకు గురైన బస్టాండ్

● గూడూరు నియోజకవర్గ కేంద్రంతో పాటు చెన్నూరు, చిల్లకూరు, కోట, విద్యానగర్ పలు చోట్ల ఆర్టీసీ స్థలాలు, దాతలు నిర్మించిన బస్టాండ్లు ఆక్రమణలకు గురయ్యాయి.

కోవూరు సాయిబాబా ఆలయం వద్ద బస్టాండ్ దుస్థితి

● కోవూరు పట్టణంలో జాతీయ రహదారి అండర్ బ్రిడ్జి సాయిబాబా ఆలయం వద్ద ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. గత వైకాపా పాలనలో కొందరు సమీపంలో బంకులు ఏర్పాటు చేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో మరికొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. బస్టాండ్ బాగు చేయకుండా సమీపంలో చిన్న రేకుల షెడ్డు వేసి వదిలేశారు. విడవలూరు, రామన్నపాళెం, పడుగుపాడు, దామరమడుగు, రేబాల, బుచ్చి, ఇందుకూరుపేట, మైపాడు, కొత్తూరు మేజర్ పంచాయతీల్లో బస్టాండ్ పరిసరాలన్నీ ఆక్రమణలకు గురవడంతో ప్రయాణికులు దూరంగా ఎండలోనే వేచి ఉంటున్నామని పలువురు వాపోతున్నారు. బుచ్చి ఆర్టీసీ బస్టాండ్ చుట్టూ ఇటీవల కొందరు ఆక్రమిస్తున్నారని అధికారులకు విన్నవించినా పట్టించుకునేవారే లేరు. నార్త్‌రాజుపాళెంలో బస్సులు ఆగే ప్రాంతాల్లో బంకులు ఏర్పాటు చేయడంతో అల్లూరు, విడవలూరు వెళ్లేవారంతా దుకాణాల ఎదుట నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది.

● వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు, సైదాపురం, కలువాయి మండల కేంద్రాల్లో బస్సెక్కాలంటే ప్రయాణికులకు నరకయాతన తప్పడం లేదు. ఊటుకూరు, కలిచేడు, మద్దెలమడుగు తదితర గ్రామాల వద్ద రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు ఆక్రమించడంతో బస్సు ఆగిన సమయంలో వెళ్లలేకపోతున్నారు.

నేత్ర వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో శాంతా బయోటెక్ సౌజన్యంతో శాంతా-వసంత ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయ వైద్యుల కంటి వైద్య నిపుణులు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతా బయోటెక్ ఛైర్మన్ వరప్రసాద్‌రెడ్డి సౌజన్యంతో తొమ్మిది రోజుల పాటు వైద్యశిబిరం జరుగుతుందని తెలిపారు. శస్త్రచికిత్సలు నిర్వహించి కంటి అద్దాలు అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాఫర్‌సాహెబ్ కాలువ డీసీ ఛైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తెదేపా మండల అధ్యక్షులు రఘుబాబు, నిర్వాహకులు కోడూరు చంద్రశేఖర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఆనం మహేష్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. ఆది దంపతుల కల్యాణం

మనుబోలు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. స్థానిక బ్రహ్మేశ్వర స్వామి, బద్దెవోలు, కొలనుకుదురు, కట్టువపల్లి, పిడూరు, కుడితిపల్లి, మడమనూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బద్దెవోలు అడ్డరోడ్డు సమీపంలోని కామాక్షితాయి సమేత సంగమేశ్వరాలయంలో కనుల పండువగా ఆదిదంపతుల కల్యాణం జరిగింది. రాత్రి స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గంగపట్నంలో వెలసి ఉన్న గంగా తారకేశ్వర ఆలయ నిర్మాణానికి అమ్మ హేచరీస్ అధినేత దుగ్గా శంకర్‌రెడ్డి రూ. లక్ష నూట పదహార్లు విరాళాన్ని ఛైర్మన్ విజయశేఖర్ రెడ్డికి అందజేశారు. అర్చకులు ఆదివారం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పరిహారం ఇప్పించండంటూ ఎమ్మెల్యే ఇంటి వద్ద నిరసన

ఎమ్మెల్యేను కలిసిన అనంతరం తిరిగి గ్రామానికి వెళుతున్న మహిళలు

కావలి, న్యూస్‌టుడే: 'బీపీసీఎల్ పరిశ్రమ ఏర్పాటు కోసం భూ సేకరణ చేపడతున్నారు. ఏళ్లుగా భూమిసాగు చేసుకుంటున్న మాకు సైతం పరిహారం అందించాలి' అంటూ చెన్నాయపాలెం రెవెన్యూ పరిధిలోని పెద్దపట్టుపాలెం గ్రామ మహిళలు ఆదివారం కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ఇంటి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని 133 ఎకరాల ప్రభుత్వ భూముల్లో తాము ఏళ్లుగా సవక, వేరుసెనగపంటలు సాగు చేసుకుంటున్నామని భూసేకరణ చట్టం -2013 ప్రకారం పరిహారానికి అర్హులమన్నారు. అయితే కొందరు నాయకులు.. ఆ భూములను వారి పేర్లతో అడంగళ్లలో నమోదు చేయించుకున్నారన్నారు. దీంతో తాము పరిహారానికి దూరమవుతున్నామని పరిశీలించి న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యేకు విన్నవించారు. కాగా ఈ ఘటనను వీడియో తీస్తున్న కొందరిని ఎమ్మెల్యే సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. వీడియోలు డిలీట్ చేయించారు. ఈ విషయమై న్యూస్‌టుడే ఎమ్మెల్యేను సంప్రదించగా.. పలువురు మహిళలు తనను కలిశారని మంగళవారం జిల్లా కలెక్టర్‌ని కలవాలని వారికి సూచించినట్లు తెలిపారు.

పలు ఆలయాల్లో మంత్రి ఆనం పూజలు

శివాలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఆనం, నాయకులు

ఆత్మకూరు, సంగం, అనంతసాగరం, న్యూస్‌టుడే: శైవక్షేత్రాల్లో భక్తులు ప్రశాంతంగా మహాదేవుడిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మహాశివరాత్రిని పురస్కరించుకుని పలు ఆలయాలను సందర్శించారు. ముందుగా సంగంలో కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు స్వయంగా ప్రసాద వితరణ చేశారు. అనంతరం ఎనిమిది మందికి రూ. 8.1లక్షల విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆత్మకూరులోని అన్నపూర్ణాసమేత విశ్వేశ్వరాలయం, కాశీనాయన ఆశ్రమంలోని దుర్గా మల్లేశ్వర ఆలయంలో పూజలు చేశారు. సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వర స్వామి, చిలకలమర్రిలో మల్లెం కొండేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. రూ. 1.5 కోట్లతో సోమశిలలో సీసీ రోడ్ల మరమ్మతులకు సీఎం చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపినట్లు మంత్రి ఆనం తెలిపారు. ఆయన వెంట గిరినాయుడు, రవీంద్రారెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కేశవచౌదరి, ఆత్మకూరు పురపాలక ఛైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

బీసీ సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామచంద్ర యాదవ్

వరికుంటపాడు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాటం చేస్తానని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ తెలిపారు. ఆదివారం వరికుంటపాడులో పర్యటించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈనెల 22న విజయవాడలో జరిగే బీసీ సింహగర్జన పోస్టర్‌ను స్థానికులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన వెంట నాయకులు రమేష్ యాదవ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 14,894
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 1,19,152
వెండి గ్రాము :	రూ. 265. 40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	114
లేయర్	90
బ్రాయిలర్స్	208
బ్రాయిలర్ స్కిన్‌లెస్	230
లేయర్ మాంసం	153

మామిడికోన అడవిలో తప్పిపోయిన భక్తులు

రాపూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని మామిడికోనకు ఆదివారం నెల్లూరుకు చెందిన 20 మంది భక్తులు వచ్చారు. తిరుగు ప్రయాణంలో 12 మంది అడవుల్లో దారి తప్పి కనిపించకపోవడంతో మిగతా వారు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసు అధికారులు స్పందించి వెంటనే స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. రాపూరు సీఐ సత్యనారాయణ, పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది అడవిలో గాలించి తప్పిపోయిన వారి ఆచూకీని గుర్తించారు. వారంతా ఒక చోట చేరడంతో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది స్పందించిన తీరుపై హర్షం వ్యక్తం చేశారు.

దొరికిన భక్తులతో రాపూరు పోలీసులు

భూములు కలుషితం.. సాగు సంకటం

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

కోడూరు సమీపంలో సాగు భూముల్లో చేరిన కలుషిత నీరు

రొయ్యల సాగు కొందరికి కాసులు కురిపిస్తుంటే.. మరికొందరికి కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వేయడంతో భూములు చౌడు బారి వరి సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. వాటిల్లో వినియోగించే నీరు పంట కాలువలను, మంచినీటి చెరువులను సైతం ఉప్పు నీటి వనరులుగా మార్చేస్తోంది. దీంతో ఉప్పు శాతం పెరిగి భూసారం దెబ్బతింటోంది.

రొయ్యల సాగుకు వినియోగిస్తున్న ఉప్పునీరు, యాంటీ బయోటిక్ మందులు, అధిక సాంద్రత గల రసాయనాలతో నీరు విషతుల్యంగా మారుతోంది. నేరుగా మంచినీటి కాలువల్లోకి, మురుగు గుంతల్లోకి విడుదల చేయడంతో తీరప్రాంతాల్లో వరి సాగు కష్టంగా మారింది. 200 నుంచి 400 మీటర్లలో అనధికార బోర్లు వేసి ఉప్పు నీటి ద్వారా రొయ్యలు సాగుచేస్తున్నారు. భూములు చౌడుబారి రైతులు ఎలాంటి సాగు చేపట్టలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రొయ్యల సాగులో ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదు. వందల అడుగుల్లో బోర్లు వేసి నీటిని తోడేస్తున్నా పట్టించుకునేవారే లేరు. ఉప్పు శాతం ఐదు కంటే ఎక్కువగా ఉంటే చేప పిల్లలు మృత్యువాత పడతాయి. ప్రస్తుతం డెల్టా ప్రాంతాల్లో ఏ చెరువులో చూసినా 4 నుంచి 6 వరకు ఉప్పు శాతంతో దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. ఇలాగే కొనసాగితే మత్స్య సంపద మనుగడ ప్రశార్థకంగా మారింది..! పదేళ్లలో పోలిస్తే వరిసాగు తీర ప్రాంత గ్రామాల్లో తగ్గిందని అధికారుల సర్వేలోనూ వెల్లడైంది.

చౌడుబారుతున్న పొలాలు.. ఉప్పునీటితో నష్టపోతున్న రైతులు

తీరంలో మండలాలు : తొమ్మిది	
జిల్లాలో రొయ్యలు, చేపల చెరువులు – 13940	
రొయ్యల సాగు : 40 వేల ఎకరాలు	
అనధికారికంగా సాగు : 30 వేల ఎకరాలు	

నష్టాలివిగో...

◗ మంచినీటి వనరులు పూర్తిగా కాలుష్యమై, ఏడాదిలోనే వనరులు హరించుకుపోయే ప్రమాదముంది. ◗ భూగర్భజలాలు తగ్గిపోవడంతో సముద్రపు ఉప్పునీటి జలాలు చొచ్చుకొస్తున్నాయి. ◗ భూమి, నీటితో పాటు గాలి కూడా కాలుష్యమై భూతాపం పెరుగుతుంది. ◗ పొలాలు చౌడు బారుతుండటంతో సాగు విస్తీర్ణం తగ్గుతోంది.

మత్స్యశాఖ ఏడీ చాంద్‌బాషా మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 0.5 శాతం ఉన్న ఉప్పునీటిలో మాత్రమే రొయ్యల సాగు చేయాలన్నారు. స్థానికంగా 6 నుంచి 9 శాతం వరకు ఉన్నా సాగుచేస్తున్నారని, దీని వల్ల ఎక్కువగా ఉప్పునీరు బయటకు వస్తోందన్నారు. వర్షపాతం తక్కువగా ఉండడంతో నీటి వనరుల్లో ఉప్పు కిందకు వెళ్లడం లేదని, ఎక్కువగా ఉంటే సమస్య కొంత వరకు తగ్గుతుందన్నారు. రొయ్యల చెరువుల్లో నీటిని మురుగు గుంతల్లోనే విడుదల చేయాలని సూచిస్తున్నామని పేర్కొన్నారు.

గ్రావెల్ తరలింపునకు సొమ్ము వసూలు

నిలదీసిన గ్రామస్థులు

సంస్థ ప్రతినిధులను ప్రశ్నిస్తున్న ప్రజలు

కలిగిరి, న్యూస్‌టుడే

మండలంలోని పోలంపాడులో ముప్పవరపు హరీష్ పునాదుల కోసం స్థానికంగా ఉన్న చెరువు నుంచి ట్రాక్టర్లతో గ్రావెల్ తోలుతుండగా ఓ ప్రైవేటు సంస్థ సూపర్‌వైజర్ వచ్చి అడ్డుకున్నారు. ట్రాక్టరుకు రూ. 260 చెల్లించాలని లేకుంటే వాహనం స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో చేసేదిలేక 20 ట్రిప్పులకు రూ. 5,200 చెల్లించారు. దీనికి ఆ సంస్థ తరఫున రసీదు ఇవ్వలేదు. ఇతరులు అనుమతి తీసుకున్న ట్రాన్సిట్ నంబర్లు ఇచ్చారు. ఈవిషయం తెలిసి గ్రామస్థులు, నాయకులు ఆదివారం సంస్థ ప్రతినిధులను నిలదీశారు.

అనుమతి ఇచ్చాక తీసుకెళ్లాలి

జిల్లాలో సీనరేజి వసూళ్లకు సంస్థ అనుమతులు పొందింది. అలాగని వారు నేరుగా సొమ్ము వసూలు చేయకూడదు. అనుమతి కోసం వస్తే వారు నిబంధనలు తెలియజేసి, అధికారుల దగ్గరకు పంపాలి. అనుమతులు ఇచ్చాక తీసుకెళ్లాలి. – శ్రీనివాసరావు, మైనింగ్ ఏడీ

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఆటో

బొజ్జనపల్లికి చెందిన ఆరుగురికి గాయాలు

రాపూరు, న్యూస్‌టుడే: మండలంలోని నవాబ్‌పేట రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. మండల పరిధిలోని బొజ్జనపల్లికి చెందిన ఆరుగురు భక్తులు నవాబ్‌పేటలోని శివాలయానికి ఆటోలో వెళుతుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో గాయాలయ్యాయి. 108లో రాపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం

జలదంకి, న్యూస్‌టుడే: దివ్యాంగురాలైన మహిళపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలో వెలుగు చూసింది. జలదంకి ఏఎస్సై హరిబాబు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామంలోని గిరిజన కాలనీకి చెందిన పోట్లూరి మల్లికార్జున బేల్దారి పనులకు వెళ్తుంటారు. అతనికి పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం సాయంత్రం అదే కాలనీకి చెందిన అవివాహితురాలైన 23 ఏళ్ల దివ్యాంగురాలు ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించారు. అనంతరం ఇంట్లోకి చొరబడి ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమెను కావలి ఏరియా వైద్యశాలకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరావు, కావలి రెండో పట్టణ సీఐ వి. గిరిబాబు, ఏఎస్సై హరిబాబు బాధితురాలి నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రకృతి సేద్యం.. ఆరోగ్యదాయకం

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్,

రసాయనాలు, పురుగుల మందులు వినియోగించిన వ్యవసాయ ఉత్పత్తులను తినడంతో అనారోగ్యానికి గురవుతున్నారు.. క్యాన్సర్, ఇతర వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రభుత్వం వాటిపై దృష్టి సారించి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నవారిని ప్రోత్సహిస్తున్నారు.. కూరగాయలు సాగు చేసేవారికి ఉద్యాన శాఖ ద్వారా పలు రాయితీలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో కూడా అవగాహన పెరిగింది. నాణ్యమైన వాటికి డిమాండ్ పెరగడంతో కొందరు వాటిని సాగు చేస్తూ లాభాలు సాధిస్తున్నారు.

▼ పొదలకూరు మండలం బిరదవోలుకు చెందిన అరుణ నాలుగెకరాల పొలంలో నిమ్మ మొక్కలు సాగు చేస్తూ అంతర పంటగా 30 రకాల తాజా కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంపై మక్కువతో స్వయంగా సాగు చేసి జీవామృతం, ఆవుపేడ, వంటివి వినియోగించి పర్యావరణానికి, ప్రజలకు హాని కలగని ఉత్పత్తులను విక్రయించి రోజుకు రూ. వెయ్యి ఆదాయం పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గత నెల జనవరి 26న గణతంత్ర దినోత్సవం నాడు ఉత్తమ మహిళా రైతుగా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జిల్లాలో ఈ విభాగంలో అవార్డు పొందిన తొలి మహిళ ఆమె కావడం విశేషం.

వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న అరుణ

▼ ఎఫ్ఎంటీ అరుణ మాట్లాడుతూ.. నాణ్యమైనవి తక్కువ ధరకు విక్రయించడంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ పెరిగిందన్నారు. ఉద్యోగులు, కార్యాలయాలకు వచ్చే పనుల నిమిత్తం వచ్చే వారి కోసం మండల కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రైలు కిందపడి ముగ్గురి మృతి

నెల్లూరు (వేదాయపాలెం), రాపూరు, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రాంతాల్లో రైలు కిందపడి ముగ్గురు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. నెల్లూరులోని విజయమహల్ గేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడికి సుమారు 25 నుంచి 30 ఏళ్లలోపు వయసు ఉంటుంది. తెలుపు గ్రే రంగు జర్కిన్, నలుపు రంగు ప్యాంటు ధరించాడు. అలాగే వేదాయపాలెం-నెల్లూరు రైల్వే స్టేషన్ల మధ్య పట్టాల మధ్య 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించాడు. సంఘటనా స్థలాలను పరిశీలించిన నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్. హరిచందన మృతదేహాలను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

▼ రాపూరు- డక్కిలి మండలాల మధ్య ఉన్న వెలికల్లు రైల్వేస్టేషన్ వద్ద మాధవయ్య పాళెం సమీపంలోని రైల్వే లైన్ వద్ద ఆదివారం రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి(60) ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి నెల్లూరు రైల్వే పోలీసులకుసమాచారమిచ్చారు. సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని నెల్లూరుకు తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్ఐ హరిచందన పేర్కొన్నారు.

EENADU Classifieds

BUILDING CONSTRUCTION

House Constructions: ★★10 సం॥లు వారెంటీతో కాంట్రాక్ట్ పద్ధతిలో మీ ఇంటిని కట్టించి ఇవ్వబడును. ✆ 98499 99280, 97009 21539

EDUCATION

DISTANCE EDUCATION

B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

REAL ESTATE

PLOT FOR SALE

Commercial Property of 42.5 Ankanams for Sale on Stonehousepet Main Road, Nellore. Contact: 96633 13308

కావలి టౌన్ రామమూర్తిపేట ట్రెండ్స్ షోరూం ప్రక్క వీధిలో MRO ఆఫీస్‌కి ఎదురుగా 220 అంకణముల స్థలం అమ్మకమునకు కలదు. ✆ 92987 52705.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే. వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

నెల్లూరు కొండాయపాలెం, వాటర్ ట్యాంక్ ఏరియా, మెయిన్ రోడ్డుకు దగ్గర, తూర్పుఫేసింగ్ ఇరువైపుల రోడ్ కల్గిన, 56 అంకణములు స్థలం అమ్మబడును. 9440281977

TO LET

COMMERCIAL

కమర్షియల్ బ్యాంక్ స్థలం నెల్లూరు వెంకట్ రెడ్డి నగర్ మెయిన్ రోడ్ గతంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ స్ట్రాంగ్ రూమ్‌తో అద్దెకు కలదు. ✆ 7032175886

JOBS

Female Telecallers Needed Adhira Educational Consultancy Good Communication Skills Required. Contact : 86397 89383

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

WANTED TELECALLERS
Telecallers Required for Reputed Universities across India. Candidates should possess good communication skills and basic computer knowledge.
Salary: Rs.10,000/- to 15,000/- per month
Incentives: Attractive performance-based incentives provided.
Sri Mahalakshmi Educational Service, Fathekhanpet, Nellore.
Cont: 99127 63999 96661 22247

SBI అనుబంధ సంస్థలో పనిచేయుటకు స్త్రీ/పు P.T/F.T కావలెను. వయస్సు: 25+, 10th, Sal:12K+, గృహిణులకు, రిటైర్డైన వారికి ప్రాధాన్యత. ✆ 7702320574

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను / పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ:18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

లేడీ టెలీకాలర్స్ కావలెను. నెల్లూరు టౌన్‌లోని ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీసు నందు పనిచేయుటకు సంప్రదించండి. ✆ 80192 57945, 86393 30705

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

ప్రముఖ విద్యాసంస్థకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్, టెలీకాలర్స్, కౌన్సిలర్స్ & ఫీల్డ్ అనుభవం కల్గిన PROలు కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 73827 44791

నెల్లూరులోని రైస్‌మిల్లు నుండి వచ్చే నూకలు ఖరీదు చేయడానికి అనుభవం కలిగిన వ్యక్తి కావలెను. తగిన జీతం మరియు కమీషన్ ఇవ్వబడును. సంప్ర: వినాయక బ్రోకర్స్, GVS ప్రసాద్, 98481 57069, రేవంత్ సాయి, 70758 25969.

ప్రముఖ కంపెనీలో ప్యాకింగ్ మిషన్ వద్ద ప్యాకింగ్ చేయుటకు మహిళలు కావలెను. నారాయణరెడ్డిపేట (డేవిస్ పేట) నెల్లూరు. ✆ 9100574129, 7675974297

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కావలి
• కావలి • ఉదయగిరి • ఆత్మకూరు

ప్రణాళిక పదిలం.. ఉత్తీర్ణతే లక్ష్యం

సోమశిలలో ప్రత్యేకశిక్షణలో పదోతరగతి విద్యార్థులు

న్యూస్‌టుడే, అనంతసాగరం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులు పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతను సాధించాలన్న లక్ష్యంతో అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తుండగా... అందులోనూ వెనుకబడిన విద్యార్థుల వివరాలను సేకరించారు. వీరు ఉత్తీర్ణత సాధించేందుకు నెలరోజులపాటు ప్రత్యేక రెసిడెన్షియల్ క్యాంపులు ఏర్పాటు చేశారు.

డివిజన్‌లో 120 మంది..

విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా ఏ, బీ గ్రేడ్ సాధించిన వారిని షైనింగ్ స్టార్లుగా, సీ, డీ గ్రేడ్ విద్యార్థులను రైజింగ్ స్టార్లుగా విభజించారు. వీరికి వేర్వేరుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఆత్మకూరు డివిజన్ పరిధిలో రైజింగ్ స్టార్లుగా ఉన్న విద్యార్థుల తోపాటు వంద రోజుల కార్యాచరణకు హాజరుకాని వారిని 125 మందిని గుర్తించారు. అందులో 25 మంది విద్యార్థినులు ఉన్నారు. మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న పరీక్షల నేపథ్యంలో డివిజన్ పరిధిలో వీరికి మూడు చోట్ల క్యాంపులు ఏర్పాటు చేశారు.

ఎక్కడెక్కడంటే..

ఉదయగిరి మండలం గండిపాలెంలోని గురుకుల పాఠశాల, అనంతసాగరం మండలం సోమశిలలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల, ఆత్మకూరులోని గురుకుల బాలికల పాఠశాలలో క్యాంపులు ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయులు అంగీకార ఒప్పంద పత్రం తీసుకుని ఎలాంటి ఒత్తిడి చేయకుండా వసతి కేంద్రాలకు పంపుతున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కాగా.. మార్చి 10 వరకు కొనసాగనుంది. ప్రస్తుతం ఈ మూడు కేంద్రాల్లో 67మంది బాల బాలికలు శిక్షణ తీసుకుంటున్నారు. వీరికి ప్రతి సెంటర్లో సుమారు ఎనిమిది మంది చొప్పున ఉపాధ్యాయులు ఉన్నారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరిని పర్యవేక్షిస్తుంటారు. ఉదయం 5:30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు స్టడీ అవర్, ప్రతి సబ్జెక్టుపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో బాలబాలికలకు ఉచిత భోజనం, బస వేర్వేరుగా ఏర్పాట్లు చేశారు. రాత్రి వేళల్లో కేంద్రాల వద్ద వాచ్‌మెన్‌లు ఉంటారు. ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖాధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

జానకిరామ్, డిప్యూటీ డీఈవో, ఆత్మకూరు డివిజన్

వందరోజుల కార్యాచరణకు సక్రమంగా హాజరు కాని విద్యార్థులపై దృష్టి సారించాం. వారిని పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు రెసిడెన్షియల్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఈసారి మెరుగైన ఫలితాలు సాధిస్తాం.

సోమశిలకు 1,112 క్యూసెక్కుల వరద

అనంతసాగరం: సోమశిల జలాశయంలో ఆదివారానికి ఎగువ ప్రాంతాల నుంచి 1,112 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 68.711 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 325.814 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 1,800, 12వ క్రస్ట్‌గేట్ ద్వారా 1,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 150, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య : సంగం మండలం కోలగట్ల గ్రామంలోకి నెల్లూరు ముంబయి జాతీయరహదారి నుంచి వెళ్లే మార్గంలో ముళ్ల చెట్లు విస్తారంగా ఉండటంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. వెంటనే తొలగించాలి –నరసయ్య, కోలగట్ల

సమాధానం : తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. – అన్వేష్‌రెడ్డి, ర.భశాఖ ఏ.ఈ

? అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి- వెంగంపల్లి ప్రధాన రహదారి మార్గంలోని మలుపుల వద్ద ముళ్ల చెట్లు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. –నరసింహులు, గ్రామస్థుడు

✓ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ముళ్ల చెట్లను తొలగించేలా చర్యలు చేపడతాం. –సూర్యప్రకాశ్ రెడ్డి, ఎస్సై, అనంతసాగరం

? దగదర్తిలోని ఎస్టీ కాలనీలో మురుగు కాలువల్లో పూడిక చేరడంతో దోమల కారణంగా ఇబ్బందులు పడుతున్నాం.–శేఖరయ్య, స్థానికుడు

✓ పరిశీలించిన వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం – మయూరి, పంచాయతీ కార్యదర్శి. – న్యూస్‌టుడే, దగదర్తి

? కావలి- ఉదయగిరి వంతెన కూడలి వద్ద నీరు లీకవుతుండటంతో ఆ ప్రాంతమంతా రొచ్చుగా మారుతోంది. – మురళి, స్థానికుడు

✓ విషయం మా దృష్టికి రాలేదు. సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. – సాయిరాం, డీఈ, కావలి పురపాలకం – న్యూస్‌టుడే, కావలి

మరమ్మతులా.. రైతులదే భారం

విద్యుత్తు శాఖ వైఖరితో అవస్థలు

విద్యుత్తు శాఖ అధికారుల వైఖరితో కర్షకులు కష్టనష్టాలకు గురవుతున్నారు. నియంత్రికలు మరమ్మతులకు గురైతే వీరికి వ్యయప్రయాసలు తప్పడం లేదు. సకాలంలో బాగు చేయకపోవడంతో పంటలకు నీరు అందడం లేదు. ఎంత మొత్తుకున్నా స్పందించడం లేదు. అదేమంటే నియంత్రికలు మీరు కావలికి తేవాలని చెబుతున్నారు. దీంతో చందాలు వేసుకొని తీసుకెళుతున్నారు. ఇదీ కావలి ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం పరిధిలో నెలకొన్న పరిస్థితి.

న్యూస్‌టుడే, కావలి

జిల్లాలో వరి పొట్ట దశలో ఉంది. ఈసమయంలో నీరు సమృద్ధిగా పెట్టాలి. ఈతరుణంలో నియంత్రికలు మరమ్మతులకు గురవుతున్నాయి. వీటిని బాగు చేయించడం సమస్యగా మారింది. కావలి సబ్ డివిజన్ పరిధిలో 1524 నియంత్రికలు ఉన్నాయి. వీటి ద్వారా ఉన్న మోటార్లతో 15 వేల ఎకరాలకుపైగా నీరు అందుతోంది. ఇవి ఎక్కడైనా కాలిపోతే ఫిర్యాదు చేస్తే స్పందించడం లేదు. కార్యాలయానికి తెస్తే బాగు చేస్తామని సెలవిస్తున్నారు. దీంతో పంటలను కాపాడుకోవడానికి భారమైనా తీసుకెళ్లక తప్పడం లేదు.

బోగోలు ప్రాంతానికి ప్రైవేట్‌గా ట్రాక్టర్‌లో తీసుకెళుతున్న నియంత్రికలు

వాహనం ఉన్నా..

వాస్తవంగా వీటి రవాణాకు శాఖాపరంగా వాహనం ఉన్నా, వినియోగించడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిబదులు రైతులను తీసుకెళ్లమంటున్నారు. బాగు చేశాక తీసుకెళ్లి ఏర్పాటుచేయించుకుంటున్నారు. ఇలాంటి సమయంలో ఏమాత్రం ఆలస్యమైనా ఆయిల్ ఇంజిన్ల ద్వారా చాలా ఖర్చు చేయాల్సి వస్తుందని సాగుదారులు చెబుతున్నారు. తరచూ మరమ్మతులకు గురవడంతో రవాణా భారం మోయాల్సి వస్తోందని వాపోతున్నారు.

వారి సౌలభ్యం కోసమే

– రవికుమార్, డీఈ, కావలి సబ్ డివిజన్

రైతులు, రొయ్యల సాగుదారులు వారి సౌలభ్యం కోసమే అలా చేస్తున్నారు. మా దగ్గర వ్యాన్ ఉంది. దానిలో పొలాలు, రొయ్యల గుంతల వద్దకు తీసుకెళ్లడం కష్టం.

రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి

ఉదయగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఉదయగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేస్తారని రైతులు తమ ఆధార్ కార్డు, పాసుపుస్తకం, ఆధార్ లింకు ఫోన్ నంబరుతో నమోదు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలంటే విశిష్ట నమోదు సంఖ్య తప్పనిసరి అన్నారు. సబ్ డివిజన్‌లో 60శాతం నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు.

ఉపాధి హామీపై అసత్య ప్రచారం తగదు

జలదంకి, న్యూస్‌టుడే: వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా ఉపాధి హామీ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం నూతన చట్టం రూపొందించిందని, దీనిపై ప్రతిపక్షాలు బురద చల్లటం మానుకోవాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, ఎం.బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం జలదంకి భాజపా కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచటంతోపాటు కూలీలకు ప్రతి వారం చెల్లింపులు జరిగేలా వీబీ జీ రాంజీ పథకాన్ని తెచ్చిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎం.కిషోర్‌రెడ్డి, నాయకులు హనుమారెడ్డి, రాకేష్‌రెడ్డి, వెంకటరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాజపా నాయకులు

వైభవంగా గంధోత్సవం

సీతారామపురం, న్యూస్‌టుడే: దేవమ్మచెరువు పంచాయతీలో ఘటిక సిద్ధేశ్వరం క్షేత్రానికి వెళ్లేమార్గంలోని హజరత్ సయ్యద్ మహమ్మద్ అబ్దుల్ హుస్సేనీ పీర్‌ఖాదరీ గంధోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన మతపెద్దలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు గంధం పంచిపెట్టారు.

బహుమతుల ప్రదానం

కావలి, న్యూస్‌టుడే: స్నేహితుల జ్ఞాపకార్థం ఏటా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న ఏఏబీ మెమోరియల్ ప్రతినిధుల చొరవ అభినందనీయమని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నాయకులు జ్యోతి బాబురావు, ఆవుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంతెన.. నరకయాతన

వింజమూరు-చిట్టేటిమిట్ట రోడ్డులో ఉన్న వంతెనపై రెండుచోట్ల రంధ్రాలు పడి కూలేందుకు సిద్ధంగా ఉంది. 15 రోజుల క్రితం వంతెనపై నుంచి అధిక లోడుతో వాహనం వెళ్లడంతో రంధ్రాలు పడినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించాలంటే భయంగా ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ తిరుమలయ్య మాట్లాడుతూ వంతెనను పరిశీలించి పునర్నిర్మాణానికి నిధులు కేటాయిస్తామన్నారు. –న్యూస్‌టుడే, వింజమూరు

దుమ్ముతో భక్తుల అవస్థలు

ప్రాచీన శైవక్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరానికి వెళ్లే మార్గం ఆదివారం మహాశివరాత్రి పురస్కరించుకుని భక్తుల రాకతో రద్దీగా మారింది. వేంపల్లితోక దాటిన తర్వాత మట్టి రోడ్డు కావడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము లేస్తుండటంతో ప్రయాణికులు ద్విచక్రవాహనాలపై వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. – న్యూస్‌టుడే, సీతారామపురం

మురుగునీటిలో.. రాకపోకలెలా?

పొంగూరులో ప్రధాన రహదారిలో నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు లేక రోజుల తరబడి నీరు నిలుస్తుండటంతో దుర్వాసనతోపాటు దోమలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువలు నిర్మించడంతోపాటు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, మర్రిపాడు

అలరించిన చిన్నారుల కోలాటం

సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రాళ్లచెలికలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల బాలికలు పలు ఆధ్యాత్మిక గీతాలకు అనుగుణంగా కోలాటం ప్రదర్శన చేశారు. వారి నృత్యం భక్తులను అలరించింది. –న్యూస్‌టుడే, సంగం

తాగునీరు వృథా

మర్రిపాడు గ్రామంలో తాగునీటి సరఫరా అధ్వానంగా ఉంది. ప్రాథమిక పాఠశాల సమీపంలోని కుళాయి విరగడంతో తాగునీరు వృథాగా మురుగు నీటి కాలువలో పడుతోంది. వెంటనే బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, మర్రిపాడు (సంగం)

ట్రంకురోడ్డులో టిప్పర్ల దూకుడు

కావలి ఎంపీ ట్రంకు రోడ్డులో ఓ టిప్పర్ దూకుడుగా వస్తున్న దృశ్యమిది. ఉదయగిరి కూడలి వంతెన వద్ద ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా భారీ వాహనాలు రాంగ్‌రూట్‌లో వచ్చేస్తున్నాయి. దీంతో వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. టిప్పర్ వంటి వాహనాలను తుమ్మలపెంట మార్గంలో జాతీయ రహదారికి మీదుగా వెళితే సమస్య ఉండదని ఆ దిశగా అధికారులు వాహనాలను మళ్లించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కావలి

ద్విచక్రవాహనం ఢీకొని యువకుడి మృతి

ఉదయగిరి, న్యూస్‌టుడే : పట్టణంలోని అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు... పట్టణంలోని దేవలాలగడ్డ వీధికి చెందిన షేక్ జన్నత్ హుస్సేన్ (35) ఇంటి నుంచి శివాలయం వైపు నడుచుకుంటూ వెళుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వంట మాస్టర్ చిరంజీవి తారసపడడంతో మాట్లాడుతున్నారు. ఆ సమయంలో ఆర్టీసీ డిపో వైపు నుంచి పట్టణంలోకి ద్విచక్రవాహనంపై వస్తున్న మునాఫ్ ఢీకొట్టాడు. దీంతో జన్నత్ ఎగిరి దూరంగా.. మునాఫ్ రోడ్డు పక్కన పడిపోగా తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని సమీపంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు జన్నత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో వైద్యశాల వద్దకు వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు వైద్యశాలకు చేరుకొని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ఉదయగిరి, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి ప్రమాదవశాత్తు సూచిక బోర్డును ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన సంఘటన పట్టణ శివారులోని కావలి మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు ఆత్మకూరుకు చెందిన వ్యక్తి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఘుటిక సిద్ధేశ్వరం, భైరవకోనకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పట్టణ శివారు ప్రాంతానికి రాగానే కారు అదుపుతప్పి పక్కనే ఉన్న సూచిక బోర్డును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాళ్లు స్వల్ప గాయాలతో బయటపడగా కారు ముందు భాగం, అద్దాలు ధ్వంసమయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి వారిని చికిత్స నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు.

హరహర మహాదేవా..

ప్రత్యేక అలంకరణలో దుత్తలూరు కొండపై స్వామివారు

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శైవ క్షేత్రాలు కిక్కిరిశాయి. శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు పుణ్యస్నానాలు చేసి ఆదిదంపతులను దర్శించుకుని ఆనందపరవశులయ్యారు. అనంతరం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తులకు గ్రామోత్సవాలు నిర్వహించారు. రాత్రిళ్లు భక్తులు జాగరణ చేశారు. ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి కావలిలోని పాతూరు శివాలయంలో పూజలు చేశారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కడనూతలలోని శివాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దుత్తలూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో, సిద్ధేశ్వరంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక పూజలు చేశారు. – కావలి, ఉదయగిరి, ఆత్మకూరు న్యూస్‌టుడే బృందం

జువ్వలదిన్నెలో రావణసేవలో శివపార్వతులు

సీతారామపురం : భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కావలి పాతూరు శివాలయంలో స్వామివారికి వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

ఆత్మకూరులో విశ్వేశ్వరుడు.. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

సంగం: కల్యాణవేదికపై ఆది దంపతులు

దగదర్తి: ఆలయంలో భక్తులు

మర్రిపాడులో లారీ బీభత్సం

మర్రిపాడు, న్యూస్‌టుడే: మర్రిపాడులో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున సిమెంటు ట్యాంకర్ లారీ బీభత్సం సృష్టించింది. బద్వేల్ వైపు నుంచి నెల్లూరు వెళుతుండగా.. డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుకు అడ్డంగా ఆగిపోయింది. డివైడర్ కమ్ములు ధ్వంసం అయ్యాయి. ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను వినియోగంలోకి తెస్తాం

బిట్రగుంట, న్యూస్‌టుడే: అధికారులు సహకరిస్తే అక్కరాజువారికండ్రికలో నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు మరమ్మతులు చేయించేందుకు సిద్ధంగా ఉన్నామని.. అమర ఛారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీలు బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతులు అన్నారు. ఆదివారం ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు రూ.40లక్షలతో నిర్మించిన కోదండరామస్వామి ఆలయాన్ని సందర్శించారు.

మరమ్మతులు చేయరూ!

దుత్తలూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన దుత్తలూరు కూడలిలో పాత ఆంధ్రబ్యాంక్ వద్ద పైప్‌లైన్ లీకేజీతో నీరు రహదారిపైకి చేరుతుంది. వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజుల నుంచి ఇలాగే జరుగుతున్నా అధికారులు, పంచాయతీ సిబ్బంది పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుంతల్లో నీరు చేరి నిల్వ ఉండడంతో దోమల బెడద కూడా అధికంగా ఉందని చెబుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి నజీముల్లా మాట్లాడుతూ పరిశీలించి పైప్‌లైనుకు మరమ్మతులు చేయిస్తామన్నారు.

లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

అంబులెన్స్‌లో ప్రసవం

మర్రిపాడు, న్యూస్‌టుడే: నెలలు నిండి పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణి 108 వాహనంలో ప్రసవించిన సంఘటన మర్రిపాడు మండల పరిధిలో చోటు చేసుకుంది. చాబోలు పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన రాధకు ఆదివారం తెల్లవారుజామున పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. బద్వేల్‌లోని ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో పైలట్ షేక్ మస్తాన్, టెక్నీషియన్ ఫణికుమార్ కాన్పు చేశారు. మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగానే ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

బీసీ సభను జయప్రదం చేయాలి

సంగం, న్యూస్‌టుడే: బీసీ సింహగర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షులు బీ బాలాజీ కోరారు. సంగంలో ఆదివారం గోడపత్రికలను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా పులే ప్రాంగణంలో తమ పార్టీ జాతీయ అధ్యక్షులు రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

కమ్మేసిన పొగమంచు

కలిగిరి, న్యూస్‌టుడే: కమ్మేసిన పొగ మంచుతో కలిగిరి ప్రజలు ఆదివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 9 గంటల వరకు మంచు వీడలేదు. ఇళ్ల ముంగిట, ప్రధాన రోడ్లపై దగ్గరకు వచ్చేంతవరకు మనుషులు, వాహనాలు కనబడని పరిస్థితి నెలకొంది. కొందరు వాహనదారులు ప్రయాణం చేయలేక ఎక్కడికక్కడ ఆగిపోగా.. మరి కొందరు లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగించారు.

ప్రమాదకర ప్రయాణం..

ప్రాణాలకు గండం

● మర్రిపాడు మండలంలోని చిలకపాడు నుంచి శనివారం పొగాకు తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. వాహనం ట్రక్కుడోర్‌పై కూర్చొని ఉన్న పెగళ్లపాడుకు చెందిన ఐదుగురు ముఠా కూలీలు గాయాలపాలవగా.. మల్లీశ్వరి అనే యువతి మృతిచెందింది.

● రెండు నెలల క్రితం.. పదిహేను మంది కూలీలు వెళ్తున్న ఆటోను మర్రిపాడు మండలం నందవరం కూడలిలోని లారీ ఢీకొట్టడంతో 11 మంది గాయపడ్డారు.

న్యూస్‌టుడే, మర్రిపాడు

నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణాలు చేయడం ఎప్పుడూ ప్రమాదకరమే. అవగాన లేమితో కొందరు చోదకులు ట్రాక్టర్, ఆటోలు ఇతర వాహనాల్లో పరిమితికిమించి ప్రయాణికులను, కూలీలను ఎక్కించుకుంటున్నారు. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు లేదా, బరువు అధికం కావడంతో అదుపుచేయలేక ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నారు.

ట్రాక్టర్ ట్రక్కుపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న కూలీలు

అవగాహనలేక

ప్రస్తుతం డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. నిత్యం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాక్టర్లలో పచ్చాకు లోడు తీసుకురావడం, ముఠా కూలీలను తీసుకెళుతున్న చిత్రాలే ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. కూలీలు ట్రాక్టర్‌లో నింపి అదే ట్రక్కు వెనుక, పక్కల కూర్చొని ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్నారు. పొలాల్లో పనులకు వెళ్లే కూలీలది ఇదే పరిస్థితి. వీరు ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయిస్తుంటారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి 15 నుంచి 18 మంది వరకు మహిళా కూలీలను తరలిస్తున్నారు. డ్రైవర్ సీటుకు ఇరువైపులా ముగ్గురు వరకు కూర్చోబెట్టి వాహనం హ్యాండిల్ తిప్పడానికి కూడా అవకాశం లేకుండా ఎక్కిస్తున్నారు. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. విద్యార్థులను కూడా పాఠశాలలకు, ఇళ్లకు తీసుకువచ్చే క్రమంలో ఒకరిపై ఒకరిని కూర్చోపెట్టి మరీ తరలిస్తున్నారు. తరచూ ఇలాంటి దృశ్యాలు కనిపిస్తూనే ఉన్నా అధికారులకు మాత్రం పట్టడం లేదు. అడపదడప అవగాహన ర్యాలీలు చేయడం తప్పించి ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలను అరికట్టడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు బాగా వినిపిస్తున్నాయి.

బాల యోధులు

సామాజికాంశాలపై చిన్నారుల ప్రయోగాలు

న్యూస్‌టుడే, కావలి

ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరిగింది. బజారులో ఏ వస్తువు కొన్నా ప్లాస్టిక్ సంచుల్లో వేసి ఇస్తున్నారు. వీటితో పర్యావరణం కలుషితమవుతోంది. మానవాళికి రోగాలు వస్తున్నాయి. ప్రధానంగా క్యాన్సర్ మహమ్మారికి కారణమవుతోంది. ఈనేపథ్యంలో వీటితో కలిగే అనర్థాలను చిన్నారులు ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. వీరు చేసిన ప్రయోగాలను వేదికలపై ప్రదర్శిస్తున్నారు. ఇప్పటి వరకు పట్టణంలో నాలుగు చోట్ల వీటిని ప్రదర్శించారు.

కాగితం టీకప్పుల్లోనూ విషమే!

కాగితం టీకప్పుల్లోనూ ప్లాస్టిక్ రేణువులు ఉంటాయని.. వీటితో క్యాన్సర్ బారిన పడతారని పట్టణంలోని గీతాంజలి పాఠశాలకు చెందిన కె.హరిణి, టి.మనస్వి హెచ్చరిస్తున్నారు. ఇందు కోసం ఓ అందమైన బొమ్మతో టీకప్పులు తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. వీటికి బదులు ఇతర వాటిలో తాగాలని సూచిస్తున్నారు.

ట్రిపుల్ ఆర్‌తో ఎంతో మేలు

పర్యావరణ హిత వస్తువుల వినియోగంతోనే మేలు జరుగుతుందని కావలి పట్టణంలోని పాతూరు పురపాల కోన్నత పాఠశాల విద్యార్థులు ఐ.సాకేత్, పి.సాయివెంకట శశాంక్ అవగాహన కల్పిస్తున్నారు. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ పేరుతో ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించాలని సూచిస్తున్నారు. వీటికి వస్త్ర సంచులను బజారుకెళ్లేటప్పుడు తీసుకెళ్లాలని అవగాహన కల్పిస్తున్నారు. పారేసే ప్లాస్టిక్ వస్తువులను మొక్కల పెంపకానికి వినియోగించాలని తెలుపుతున్నారు. అట్టలు, కాగితాలు వంటివి కాలుష్య కారకం కాదనే విషయాన్ని వివరిస్తున్నారు.

(c) eenadu

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు యువత నడుం బిగించాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు యువత నడుం బిగించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కేవీ రమణారావు ఉద్ఘాటించారు. నగరంలోని ఆర్ఎస్ఆర్ కాలనీలో ఇటీవల గంజాయి మాఫియా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబాన్ని జనవిజ్ఞాన వేదిక నాయకులతో కలిసి ఆదివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.75 వేలు నగదు అందజేశారు. జిల్లాతో పాటు రాష్ట్రంలో మాదకద్రవ్యాలు లేని సమాజ స్థాపనకు 'మేము సిద్ధం.. మీరు సిద్ధమా' అనే గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు ఎంపీ చలపతి, ప్రధాన కార్యదర్శి ఎ.విజయకుమార్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

గూడూరు

• గూడూరు • కోవూరు • సర్వేపల్లి

గూడూరును జిల్లా చేయాలని డిమాండ్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరును జిల్లా చేయాలని భారత వికాస్ పరిషత్ సౌతిండియా నాయకుడు పెంచలనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీబొమ్మ వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 72వ రోజుకు చేరాయి. ఎంతో చరిత్ర కలిగిన గూడూరును ముక్కలుగా చేయడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు వెంకటసుబ్బయ్య, రాము, సుబ్బారెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

17న ఉపాధ్యాయుల సమస్యలపై చలో విజయవాడ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ 'రణభేరి' 2.0 పేరిట చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

ఉపాధ్యాయుల కొరత.. విద్యార్థులకు వెత

రాపూరులోని నార్త్ పాఠశాల

న్యూస్‌టుడే, రాపూరు

జిల్లాలోనే అత్యధికంగా రాపూరు మండలంలో ఉపాధ్యాయ ఖాళీలతో బోధన కుంటుపడుతోంది. జిల్లా మారుమూల ప్రాంతం కావడం.. దూర గ్రామాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడంతో పోస్టులు భర్తీ కావడం లేదు. దీంతో చాలా మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం లేదు. మండలంలో మొత్తం 66 ప్రాథమిక పాఠశాలలుండగా 33 చోట్ల ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగుతున్నాయి. వీటిలో మూడు పాఠశాలలకు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇతర పాఠశాలల నుంచి డిప్యుటేషన్‌పై కొందరిని నియమించారు.

● వారం రోజుల క్రితం గుండవోలు బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పూర్తిగా ఉపాధ్యాయులు లేక గ్రామస్థులు పిల్లలను బయటకు పంపి తలుపులకు తాళాలు వేసి నిరసన తెలిపారు. డీఈవో బాలాజీరావు స్పందించి ఒకరిని నియమించారు. మండల పరిధిలోని బండిపల్లి, తాతాయపాలెం, జోరేపల్లి రెండు చొప్పున పాఠశాలలతో పాటు ఏపూరు, వెలుగోను, సిద్దవరం, రామిరెడ్డిపల్లి, జేపీ పురం, జీవనిపాలెం, గుండూరుపల్లి, ఆదూరుపల్లి, నవాబ్‌పేట, వెల్లోపల్లి, పులిగిలపాడు, మసీదుపేట, సైదాపల్లి, లింగపాళెం, మెసుబర్తి, జోరేపల్లి, గుండవోలు, రాపూరు నార్త్ తదితర పాఠశాలల్లో ఏకోపాధ్యాయులతో కొనసాగిస్తున్నారు.

● ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఖాళీలను త్వరలోనే రేషనలైజేషన్ చేసి జూన్‌లోగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేస్తామని పేర్కొన్నారు.

పొదలకూరు ఆసుపత్రి వంద పడకలయ్యేనా..!

న్యూస్‌టుడే, పొదలకూరు

మెట్ట ప్రాంతంలో గత వైకాపా పాలనలో వైద్యసేవలు అంతంతమాత్రంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆసుపత్రుల్లో వసతులు కల్పించడంతో రోగుల తాకిడి పెరిగింది. పొదలకూరు వివిధ ప్రాంతాలకు కూడలి కావడంతో ఎక్కువ మంది ఇక్కడికే వస్తున్నారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటుచేయడంతో దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్యసేవలు పొందుతున్నారు. ● పొదలకూరు సీహెచ్‌సీని 50 నుంచి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదనలు పంపారు. ఆసుపత్రిలో గతేడాది ఓపీ 84657 మంది, ఐపీ సేవలు 8045 మందికి అందించారు. వైద్యసేవల్లో జిల్లాలో మూడో స్థానం, ఫిజియోథెరపీ విభాగంలో ఆరో స్థానంలో ఉంది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో సుమారు కోటి రూపాయలతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. కలెక్టరుతో మాట్లాడి వంద పడకలకు అవసరమైన పంచాయతీ రాజ్ శాఖకు చెందిన స్థలాన్ని కేటాయించారు. కలువాయి, చేజర్ల, సైదాపురం, మనుబోలు మండలాలకు కేంద్రంగా ఉన్న పొదలకూరు ఉండటంతో రోజుకు 300 ఓపీ(ఔట్ పేషెంట్లు), నెలకు సుమారుగా, 30 మందికిపైగా ఐపీ(ఇన్‌పేషెంట్లు)గా చేరుతున్నారు.

పొదలకూరు సీహెచ్‌సీలో వైద్యసేవలకు వచ్చిన రోగులు

ప్రభుత్వం ఆమోదిస్తే మెట్ట ప్రాంతంలో మెరుగైన వైద్యం

● సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ.. సీహెచ్‌సీ వంద పడకల ఆసుపత్రిగా చేస్తే ఎక్కువ మందికి వైద్యసేవ అందుతాయని ఉన్నతాధికారులకు ప్రతిపాదించామన్నారు. కీళ్లు, ఎముకలు, ఈఎన్‌టీ, నేత్ర వైద్యసేవల విభాగాలు ఏర్పాటు చేయాలని నివేదించామని త్వరలో మంజూరవుతాయని, ఎక్కువ మందికి సేవలు అందుతాయని పేర్కొన్నారు.

గతేడాది పొదలకూరు సీహెచ్‌సీకి వచ్చిన రోగుల వివరాలు

నెల	జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబరు	అక్టోబరు	నవంబరు	డిసెంబరు
ఓ.పి	7023	7221	7648	5724	6837	7106	7122	6862	7328	6611	7771	7364
ఐ.పి	688	642	737	586	749	747	677	643	624	629	666	657

ప్రతిపక్ష నాయకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలి

శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: ప్రతిపక్ష నాయకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని పరమేశ్వరుడిని కోరుకున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని బద్దెవోలు అడ్డరోడ్డు సమీపంలోని శ్రీకామాక్షితాయి సమేత సంగమేశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, తెదేపా మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● వెంకటాచలం మండలం కనుపూరు, కాకుటూరు, అడవిలోని శివాలయాలను సోమిరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ● తోటపల్లిగూడూరులోని శ్రీ ప్రసన్న కామాక్షి సమేత శ్రీఖరేశ్వర స్వామి ఆలయంలో సోమిరెడ్డి గోమాతకు పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ మన్నెం నీలిమ, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, సురేష్‌రెడ్డి, నాయకులు జితేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

కల్పవృక్షవాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణానగర్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి దశమవార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లు కల్పవృక్షవాహనంపై భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ఉదయం పూర్ణాహుతి, మంగళశాసనం, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

గంగపట్నంలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

ఆది దంపతుల వేషధారణలో నాట్యం చేస్తున్న చిన్నారులు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలో జరుగుతున్న పలు విశేష కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గంగపట్నంలో వెలసిఉన్న శ్రీ తారకేశ్వర కైలాసనాథ్వేర స్వామి ఆలయంలో ఆదివారం చిన్నారులు ఆది దంపతుల వేషధారణలో చేసిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకుంది. ఆలయ ఛైర్మన్ కొండూరు విజయశేఖర్ రెడ్డి, చాముండేశ్వరీ ఆలయ ఛైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, అర్చకులు చిన్నారుల ప్రదర్శనకు ముగ్ధులై శాలువా కప్పి జ్ఞాపికలను అందజేశారు.

జూద స్థావరంపై పోలీసుల దాడులు

బుచ్చిరెడ్డిపాళెం: వవ్వేరు సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీఐ శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని 21 ద్విచక్రవాహనాలు, కారు, రూ.8,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదకరంగా కల్వర్టు

కోట, న్యూస్‌టుడే: గూడలి సమీపంలోని ర.భ రోడ్డుకు అడ్డంగా పంటకాలువపై నిర్మించిన పురాతన కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఇరువైపులా రక్షణ గోడలు కిందకు ఉన్నాయి. అంచుల వద్ద కోతకు గురయ్యాయి. ఈ క్రమంలోనే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా కనీసం రేడియం సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు విన్నవిస్తున్నారు. ర.భ అధికారులు మాట్లాడుతూ త్వరలో మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు.

నిరుపయోగం

తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచాయతీ పాతకోడూరులో గ్రామ సచివాలయం సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టరు నిరుపయోగంగా మారింది. స్థానిక పాలకుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు నీడనివ్వాల్సింది పోయి ఎవరికీ ఉపయోగపడడం లేదు. షెల్టరు వద్ద వ్యర్థాలు వేయడంతో దుర్వాసనతో సతమతమవుతున్నారు. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

కాలువలిలా.. మురుగుపారేదెలా

గూడూరు పురపాలక పరిధిలోని పలు చోట్ల మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. అటు పంచాయతీల నిధులు రాక, ఇటు పురపాలక నిధులు రాక సమస్యలు పరిష్కారం కావడం లేదు. చెన్నూరులోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు సక్రమంగా లేక నీరంతా రోడ్డుపై నిలుస్తోంది. ఆ మార్గంలో వెళ్లేవారంతా దుర్వాసనతో సతమతమవుతున్నారు. శిథిలావస్థలో ఉన్నవి తొలగించి నూతన కాలువలు నిర్మించాలని పలువురు సూచిస్తున్నారు. – న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

తుప్పు పడుతున్నా వినియోగించరేం..!

ప్రజలకు చౌక దుకాణాల ద్వారా సరకులు పంపిణీ చేసేందుకు గత ప్రభుత్వం అందజేసిన రేషన్ సరకుల పంపిణీ వాహనం నాలుగేళ్లుగా మండల కార్యాలయంలో నిరుపయోగంగా ఉంది. గత వైకాపా పాలనలో వాహనాలు మంజూరు చేయగా, ఒకరు మండల కార్యాలయం వద్ద వదిలేశారు. తహసీల్దారు కార్యాలయం పక్కనే ఉన్నా ఎవరూ పట్టించుకోక తుప్పు పడుతోంది. మరొకరికి అప్పగిస్తే ఉపాధి కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. – న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

ట్రాఫిక్‌తో సతమతం

పొదలకూరు ప్రధాన బస్టాండు ప్రాంతంలో శనివారం సాయంత్రం బస్సులు, ఆటోలు, కార్లు కిలో మీటరు మేర బారులు తీరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శనివారం ఒక ప్రైవేట్ కార్యక్రమం జరగడంతో భారీగా జనం గుమిగూడారు. ప్రధాన రహదారి కాస్త ఇరుకుగా మారింది. కనీసం ద్విచక్ర వాహనం సైతం వెళ్లలేక పాఠశాలల నుంచి తిరిగి ఇళ్లకు పయనమైన విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు స్పందించి ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని విన్నవిస్తున్నారు.– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

పనిచేయడం లేదు.. పట్టించుకోండి..?

గత పాలనలో ఆరేళ్ల క్రితం పొదలకూరులోని గ్రామ సచివాలయాలకు అందించిన కంప్యూటరు, ప్రింటర్లు, వివిధ సామగ్రి పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాసులకు కుక్కుర్తి పడి నాసిరకమైనవి అందించడంతో కొన్ని నెలలకే మూలనపడ్డాయి. వివిధ పనులమీద వచ్చే ప్రజలు గంటలసేపు వేచి ఉండక తప్పడం లేదు. మండలంలోని పలు సచివాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు :79950 67034, సర్వేపల్లి :80085 73980

సమస్య : పొదలకూరులోని శివాలయం వీధి పూర్తిగా ఆక్రమణలకు గురై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో ఎక్కువ దేవాలయాలు ఉండడంతో ఊరేగింపు సమయంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. – వేణుగోపాల్, స్థానికుడు

సమాధానం : పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – యశ్వంత్ సింగ్, కార్యదర్శి

? తోటపల్లిగూడూరు మండలం చెన్నపల్లిపాలెం నుంచి వెంకన్నపాలెంకు వెళ్లే రోడ్డు గతుకులమయంగా మారింది. వర్షాలకు మరింత గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – శ్రీకాంత్

✓ రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – రమేష్, ఏఈ, పంచాయతీరాజ్

? తోటపల్లిగూడూరు మండలం ఈదూరు సమీపంలో వ్యర్థాలు పడేస్తున్నారు. రోడ్డు పక్కనే వేయడంతో వర్షాలకు దుర్గంధమయంగా మారింది. – వెంకటేష్, స్థానికుడు

✓ పరిశీలించి వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. – నరసయ్య, డిప్యూటీ ఎంపీడీవో

? కోట మండలం ఊనుగుంటపాళెం-రుద్రవరం ర.భ రోడ్డు అధ్వానంగా ఉంది. వాహనచోదకులు ఇబ్బందులు పడున్నారు.–మస్తానయ్య

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. –మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జి ఏఈ

? రాపూరులోని పడమర అగ్రకట్ట ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగు నీరు రోడ్డుపైకి వదిలేస్తున్నారు. – స్థానికులు

✓ కాలువలు నిర్మిస్తాం.– భవాని, ఎంపీడీవో

? పొదలకూరు రూరల్ పరిధిలో బత్తులపల్లిలో సైడు కాలువలు వ్యర్థాలతో నిండిపోయాయి. దోమలతో సతమతమవుతున్నాం. – రాజా

✓ పంచాయతీ సిబ్బందికి చెప్పి శుభ్రం చేయిస్తాం. – నరసింహారావు, ఎంపీడీవో

? గూడూరులోని నెల్లటూరు ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. – వెంకటరమణ, నెల్లటూరు

✓ సిబ్బంది వీధి దీపాలు వేసేలా చర్యలు తీసుకుంటాం.– వెంకటేశ్వర్లు, కమిషనర్, గూడూరు

? కోటలోని కాంప్లెక్సుకు వెళ్లే రోడ్డు వద్ద రేడియం సూచిక బోర్డు లేక తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపు తిరిగేటప్పుడు సూచిక బోర్డు లేక ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. – రాజేంద్రబాబు, వాహనచోదకుడు

✓ పరిష్కరిస్తాం. – కిరణ్, ఇన్‌ఛార్జి ఏఈ

? గూడూరు రెండో పట్టణంలోని దిగువవీరారెడ్డిపల్లి ప్రాంతంలో రహదారి వద్ద చెత్తాచెదారాలు పేరుకుపోయాయి– తిరుపాలు

✓ తొలగిస్తాం.–వెంకటేశ్వర్లు, కమిషనర్,

? గూడూరు పురపాలక పరిధిలోని నమాజ్ కట్ట ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. – షబ్బీర్, గూడూరు

✓ వీధి దీపాలు వేసేలా చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వర్లు, కమిషనర్

శంభో శివశంభో

గూడూరు : శివపార్వతులకు కల్యాణం చేస్తున్న అర్చకులు

పొదలకూరులో

ముత్తుకూరు మండలం పంటపాలెంలో

గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి బృందం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలోని శివాలయాలు భక్తులతో ఆదివారం కిటకిటలాడాయి. అభిషేకాలు, అర్చనలు, శివపార్వతుల కల్యాణంతో పాటు ఆలయాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. గూడూరు, కోట, చిల్లకూరు ఆలయాల్లో కమిటీ సభ్యులు, దాతలు కలసి అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కాటేపల్లి సముద్రతీరంలో భక్తులు పూజలు నిర్వహించి సముద్రస్నానాలు చేశారు. జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి ఆలయంలో విశేష అభిషేకాలు జరిగాయి. గండవరంలో వెలసిఉన్న గంగాపార్వతీ సమేత ఉదయకోశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఇందుకూరుపేట తీరం భక్తులతో కిక్కిరిసిపోయింది. పుణ్య స్నానాలు ఆచరించి ఒడ్డున ఉన్న శివలింగానికి క్షీరాభిషేకం చేశారు. రాపూరు ఘాట్ రోడ్డు మార్గంలో సిద్ధిలేశ్వర కోనలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సైదాపురం, కోట, చిల్లకూరు, ముత్తుకూరు, పొదలకూరు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కోటలో పూజలందుకుంటున్న కామాక్షిదేవి సమేత సోమేశ్వరస్వామి

రాపూరులో..

తలుపూరు నారాయణ స్వామి ఆశ్రమంలో..

గూడూరు శివాలయంలో..

కాటేపల్లి తీరంలో భక్తుల సందడి..

కోవూరు మండలం పడుగుపాడులో

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

పొదలకూరు రూరల్ న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమైన ఘటన ఆర్‌వై పాలెం హరిజనవాడలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన తాళ్లూరి శీనయ్య శివరాత్రి ఉత్సవాలకు పొదలకూరు శివాలయానికి వచ్చారు. అకస్మాత్తుగా శీనయ్య ఇంటి నుంచి మంటలు వ్యాపించడాన్ని గమనించిన గ్రామస్థులు బాధితుడికి, పొదలకూరు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. సదరు వాహనం బందోబస్తు నిమిత్తం ముత్తుకూరు మండలం కృష్ణపట్నం వెళ్లిందని అధికారులు తెలిపారు. అనంతరం రాపూరు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారమిచ్చారు. వాహనం వచ్చేలోగా స్థానికులు నీటితో మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయారు.

సోమశిలకు 1,112 క్యూసెక్కుల వరద

అనంతసాగరం: సోమశిల జలాశయంలో ఆదివారానికి ఎగువ ప్రాంతాల నుంచి 1,112 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 68.711 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 325.814 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది.

పగిలిన దిమ్మెలు తొలగించండి

పొదలకూరు రాంనగర్ గేటు సెంటరులోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఉండే కాంక్రీట్ దిమ్మెలు తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. రాత్రివేళల్లో దిమ్మెల పక్కనే భారీ వాహనాలు నిలుపుతుండడంతో వాటి పక్క నుంచి వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎప్పుడు రద్దీగా ఉండే ప్రాంతంలో ధ్వంసమైన కాంక్రీట్ దిమ్మెలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

విద్యతోనే సమాజంలో గుర్తింపు

దుప్పట్లు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని బాలసదనంలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లోహిత్ దాతృత్వంతో విద్యార్థినులకు దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెదేపా మైనార్టీ నాయకుడు రహీమ్ మాట్లాడుతూ పేద విద్యార్థినులను ఆదుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తోందని తెలిపారు. తెదేపా నాయకులు ఆరికట్ల మస్తాన్‌నాయుడు, కేశవనాయుడు, ఆశోక్, అసోసియేషన్ అధ్యక్షుడు ఆత్మకూరు సురేష్, సభ్యులు శేషు, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

'చేనేతలకు ప్రభుత్వాల అన్యాయం'

నెల్లూరు (విద్య): బడ్జెట్‌లో చేనేతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేశాయని చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు కటికాల వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆదివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో చేనేతలకు మొండి చేయి చూపిస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే చేసిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం రూ.25 వేలు నేతన్న భరోసా అందిస్తామని చెప్పి.. దానికి నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి భరోసా..!

న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయిదేళ్ల వైకాపా పాలనలో చిన్నారులకు ఆరోగ్య సమస్యలుంటే హడావుడిగా సమీపంలోని ప్రైవేట్ ఆర్ఎంపీ వైద్యుడు లేక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లేవారు. కూటమి పాలన వచ్చాక చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పోషకాహారం అందిస్తోంది. ప్రాథమిక వైద్యం అంగన్‌వాడీ కార్యకర్తలే అందించేలా మెడికల్ కిట్లను అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి అందించిన కిట్

గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వివరాలు

గూడూరు పట్టణం	100	2938	319	329
గూడూరు మండలం	94	2702	332	273
చిల్లకూరు	85	2769	259	261

మండలాలు, కేంద్రాలు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు

కిట్‌లో ఏమున్నాయంటే..

కేంద్రానికి వచ్చే చిన్నారులకు అనుకోకుండా విరోచనాలు, కడపునొప్పి, జ్వరం, దగ్గు, జలుబు, దురదలు వంటి సమస్యలు తలెత్తినప్పుడు అవసరమైన 11 రకాల మందులతో కిట్‌ను అందజేశారు. కళ్లు ఎర్రబడినప్పుడు, చెవిపోటు తగ్గేందుకు ద్రావణం, అనుకోకుండా కిందపడి గాయాలైతే కట్టు కట్టేందుకు రోల్, బ్యాండేజి, దూది, చేతులు శుభ్రం చేసేందుకు క్రిమి సంహారక ద్రావణం, ఇతర అవసరమైన మందులు ఉన్నాయి. ఏవిధంగా ఉపయోగించాలో నియమాలున్నాయి. చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులు ప్రథమ చికిత్సకు అవసరమైన మందులున్నాయి.

● గూడూరు సీడీపీవో మెహబూబి మాట్లాడుతూ... ప్రభుత్వం ద్వారా అందించిన మెడికల్ కిట్లు ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేశామన్నారు. కార్యకర్తలు మందులు వినియోగించడంపై అవగాహన కల్పించామని, దూర ప్రాంత గ్రామాల్లో ఉన్నవారు ఆసుపత్రులకు రావాలంటే ఇబ్బందులు పడేవారని, అలాంటి కేంద్రాల వారికి మందులు కిట్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

విడవలూరు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరికి గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని పొన్నపూడికి చెందిన రవి, శేఖరయ్య ఈ నెల 12న ద్విచక్రవాహనంపై రామతీర్థానికి వెళుతున్నారు. రామచంద్రాపురం మలుపు వద్ద వంతెనపై నెల్లూరు నుంచి పొన్నపూడికి వెళుతున్న ఆర్టీసీ బస్సు బైకును ఢీకొంది. రవికి తీవ్రగాయాలవగా నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శేఖరయ్య శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రథమ వర్ధంతి

శ్రీమతి ఆశం నిర్మలమ్మ గారు
కోట
మీరు మా నుండి దూరమై సంవత్సరము గడిచినను
మీ మధురస్మృతులు మరువలేకున్నాం.
ప్రథమ వర్ధంతి సందర్భంగా స్మరించుకుంటూ...
భర్త: ఆశం సిద్దేశ్వరరావు Rtd. H.M., ZPHS
కుమారులు- ఆశం అమరనాథ్, ఆశం గీతానాథ్
కోడళ్ళు గౌరి, రమ్య
మనుమడు: వేద వివేక్
మనుమరాలు: సాయి స్వస్తిద
మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

వాహనాలు ఇష్టారాజ్యం.. ట్రాఫిక్‌కు అంతరాయం

ఎక్కడ పడితే అక్కడ వాహనాలు.. ఆటోల్లోనే వ్యాపారాలు.. రోడ్లపై వస్తువులు.. వెరసి, సాయంత్రమైతే ట్రాఫిక్ నిలిచిపోవడం పరామామూలుగా మారింది. పాదచారులు నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ వేదాయపాలెం ప్రధాన కూడలిలో పరిస్థితి. పోలీసులు కూడా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు (వేదాయపాలెం)

నెల్లూరు
•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

సుందర నగరమే లక్ష్యం: నారాయణ



ఇంటి పట్టాను అందిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నగరాన్ని సుందరంగా చేయడమే లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో సమీక్షించిన రమాదేవికి కలిసి 17 మంది లబ్ధిదారులకు రూ.17,28,220 సీఎం సహాయనిధి చెక్కులు, 101 మంది వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, 17 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబునాయుడు సహకారంతో రూ.50 కోట్లతో కాలువలను ఆధునికీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 42వ డివిజన్ రహమతీయా మసీదు ప్రాంతంలో పర్యటించారు. రోడ్లు, కాలువలు, విద్యుత్తు సమస్యలను పరిశీలించారు. మసీదు కమిటీ కోరిన పనులన్నీ మార్చి 15వ తేదీ లోపు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 44వ డివిజన్‌లో ఇటీవల విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన తెదేపా మహిళా కార్యకర్త పాశాన కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సహాయంగా రూ.50 వేలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ తహసీన్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు తాళ్లపాక అనూరాధ, మధు, విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి తోడ్పాటు అభినందనీయం

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: మానవ సేవే మాధవ సేవ బృందంలోని అధికారులు, ఉద్యోగులు జనహిత వాత్సల్య కేంద్రంలో పిల్లల అభ్యున్నతికి తోడ్పాటు అందివ్వడం అభినందనీయమని ఆత్మకూరు ఆర్డీవో శివరావు తెలిపారు. ఆదివారం వనంతోపు సెంటర్‌లోని ఆశ్రమంలో చిన్నారుల ఎదుట సబ్‌ఇన్‌స్పెక్టర్ తక్కోలు వెంకటేశ్వర్లు తన పదవీ విరమణ సందర్భంగా రూ.10 వేలు విలువైన నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో ఏపీ హంస అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ రావు, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండె చప్పుడుగా పనిచేయాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రజల గుండె చప్పుడుగా పని చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం నవలాకులతోటలో ఒకటో డివిజన్ తెదేపా అధ్యక్షుడు జావిద్ ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, చిరంజీవిగౌడ్, జానకిరామయ్య, హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

సీసీ కెమెరాలు..డ్రోన్లతో నిఘా

'న్యూస్‌టుడే'తో గ్రామీణ ఇన్‌స్పెక్టర్ వేణు

ముఖాముఖి

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

రౌడీషీటర్ల కదలికలను నిత్యం గమనిస్తున్నాం. స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్, డ్రోన్ నిఘా పెడుతున్నాం. సీసీ కెమెరాలతో మా పరిధిలో పరిశీలిస్తున్నాం. ఎక్కడ నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇవీ నెల్లూరు గ్రామీణ ఇన్‌స్పెక్టర్ గుంజి వేణు మాటలు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

వారంవారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

స్టేషన్ పరిధిలో 100 మందిపై రౌడీ షీట్లు ఉన్నాయి. వీరిలో 27 మంది జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. మరో పదిమంది వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు. మిగతా వారికి ప్రతి వారం స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వారి కదలికలు ఆకస్మిక తనిఖీలు చేస్తూ తరచూ వారి ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్నాం. తేడావస్తే వారిని పిలిపించి హెచ్చరిస్తున్నాం.

దాతల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు

స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాలు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశాం. శివారు ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతంలో చాలా వరకు లేవు. ఆయా ప్రాంతాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. వీటిద్వారా నిఘా పెడతాం.

గంజాయిపై ఉక్కుపాదం

నెల్లూరుగ్రామీణ పరిధిలో గంజాయి విక్రయాల నిరోధానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం తదితర వారిపై నిఘా పెడుతున్నాం. గస్తీ నిర్వహిస్తున్నాం. ఖాళీ ప్రదేశాల్లో అనుమానితులు తిరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి విక్రయాలు లేవు. తాగే వారు ఉన్నారు. వారిని కూడా నియంత్రిస్తున్నాం. స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలపైనా నిఘా ఉంచాం. స్థల వివాదాలు, డబుల్ రిజిస్ట్రేషన్లు లాంటివి ఉన్నాయి. వాటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వారిని తహసీల్దారు వద్ద రూ.5లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేయిస్తున్నాం. భవిష్యత్తులో వివాదాల్లో తలదూరిస్తే నష్టపరిహారం చెల్లించేలా చేస్తున్నాం.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు యువత నడుం బిగించాలి: కేఎస్

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు యువత నడుం బిగించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కేఎస్ లక్ష్మణరావు ఉద్బోధించారు. నగరంలోని ఆర్‌డీటీ కాలనీలో ఇటీవల గంజాయి మాఫియా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబాన్ని జన విజ్ఞాన వేదిక నాయకులతో కలిసి ఆదివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.75 వేలు నగదు అందజేశారు. జిల్లాతో పాటు రాష్ట్రంలో మాదకద్రవ్యాలు లేని సమాజ స్థాపనకు 'మేము సిద్ధం.. మీరు సిద్ధమా' అనే గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు ఎంవీ చలపతి, ప్రధాన కార్యదర్శి ఎ.విజయకుమార్, మాజీ ఉప మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, నాయకులు

'చేనేతలకు ప్రభుత్వాల అన్యాయం'

నెల్లూరు (విద్య): బడ్జెట్‌లో చేనేతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేశాయని చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు కటికాల వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆదివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో చేనేతలకు మొండి చేయి చూపిస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే చేసిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం రూ.25 వేలు నేతన్న భరోసా అందిస్తామని చెప్పి.. దానికి నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పముజుల శంకరయ్య, హరి పాల్గొన్నారు.

17న ఉపాధ్యాయుల సమస్యలపై చలో విజయవాడ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారానికి ఈ నెల 17వ తేదీ 'రణభేరి' 2.0 పేరిట చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

టీఎన్ఎస్ఎఫ్ రూరల్ అధ్యక్షుడి రాజీనామా

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ నాయకుడు పఠాన్ ఆషిక్ అలీఖాన్ టీఎన్ఎస్ఎఫ్ రూరల్ అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలు, తప్పని పరిస్థితులతో రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధ్యతల నుంచి విముక్తి కల్పించాలని నాయకత్వాన్ని కోరారు.

పూడిక తీశారు.. తొలగించడం మరిచారు

నగరంలోని వేదాయపాలెం పుట్ట వీధిలో ఇటీవల కాలువల్లో పూడిక తీశారు. అది ఎండిపోయినా అధికారులు తొలగించ లేదు. మళ్లీ కాలువలోకి చేరుతోంది. దీంతో సమస్య మొదటికొస్తోంది. ఇదే పరిస్థితి గాయత్రి నగర్‌లో నెలకొంది. అధికారులు స్పందించి పూడిక మట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

దర్గా.. నిర్లక్ష్యమేగా!

రూ.కోట్లలో ఆదాయం నిర్వహణ కరవు

గుర్రపు డెక్కతో నిండిపోయిన ఘాట్

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ప్రసిద్ధి చెందిన స్వర్ణాల చెరువు ప్రాంతంలో ఉన్న బారాషహీద్ దర్గా నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వక్ఫ్ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ నగరానికి చెందిన వారైనా దీని గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రజా ప్రతినిధులు రొట్టెల పండగ సమయంలో వచ్చే భక్తుల కళ్లలో పడేందుకు నాలుగు రోజుల పాటు హడావుడి చేసి ముఖం చాటేస్తున్నారు. మళ్లీ ఏడాది వరకు కన్నెత్తి కూడా చూడడం లేదు.

వక్ఫ్ బోర్డుకు కాసులు : బారా షహీద్ దర్గా వక్ఫ్ బోర్డు పరిధిలో ఉండడంతో ఏటా రూ.1.50 కోట్ల వరకు ఆదాయం జమవుతోంది. పండగ సమయంలో మాత్రం నగరపాలకసంస్థ సాధారణ నిధుల నుంచి రూ.4 కోట్లు ఖర్చు చేస్తున్నారు. గత ఏడాది అధికార పార్టీకి చెందిన చోటా నాయకులు రూ.1.30 కోట్లకే ఏడాది పాటు నిర్వహణ హక్కులు దక్కించుకున్నారు. రొట్టెను ముక్కలు చేసినట్లుగా చేసి సబ్ లీజులకు ఇచ్చి దాదాపు రూ.2 కోట్ల వరకు గడించి చేతులు దులుపుకొన్నారు. సబ్ లీజుకు తీసుకున్న గుత్తేదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా..: ఆవరణ మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఇందులో నిద్రిస్తున్న భక్తులపై గంజాయి బ్యాచ్ దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. రాత్రి పూట మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లే దర్శనమిస్తున్నాయి.

కళావిహీనంగా స్వర్ణాల ఘాట్

దర్గా ఆవరణతో పాటు భక్తులు రొట్టెలు మార్చుకొనే, స్నానాలు చేసే చెరువు ఘాట్ కళావిహీనంగా తయారైంది. గుర్రపు డెక్కతో నిండిపోయింది. మెట్లపై ఎండిపోయిన చెత్తకు కొందరు నిప్పు పెడుతున్నారు. భక్తులతో పాటు పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంసంధ్య వేళ సేదదీరేందుకు వచ్చే పర్యాటకులు, కుటుంబ సభ్యులతో వచ్చే నగరవాసులు ముక్కులు మూసుకుని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆవరణ చెత్తాచెదారంతో నిండిపోయింది. వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మేయర్‌గా ఉన్న సమయంలో రూ.4 కోట్లతో అభివృద్ధి చేసిన ఘాట్‌ను ప్రస్తుతం పట్టించుకోకపోవడం గమనార్హం.

నెల్లూరు నగరంలో నంది వాహనంపై ఊరేగుతున్న మూలస్థానేశ్వరుడు, భువనేశ్వరి అమ్మవారు

రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన పూజలు

శివయ్యా.. మము బ్రోవవయ్యా!

న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

నగరంలోని ఆలయాల్లో ఆదివారం శివ నామస్మరణ ధ్వనించింది. శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో వేడుకలు వైభవంగా చేశారు. పూజలు చేసేందుకు భక్తులు బారులుదీరడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. దర్గామిట్టలోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మ వారికి చందనాలంకారం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పాత పురపాలక కార్యాలయం సమీపంలో బ్రహ్మంగారి శివాలయంలో మంత్రి నారాయణ పూజలు చేశారు. నెల్లూరు చెరువు ఒడ్డున ఉన్న స్వర్ణ లింగేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుటుంబసభ్యులు పూజలు చేశారు.

సైకత లింగానికి పూజలు చేస్తున్న స్విమ్మర్ల అసోసియేషన్ సభ్యులు

వేదాయపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు

పూడిక చేరి.. దోమలు ప్రబలి

నగరంలోని మినీబైపాస్ రోడ్డు శ్రీహరినగర్ మూడో వీధి సమీపంలో మురుగునీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు పూడిక తీయించాలని ఇక్కడి వారు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

రోడ్డుపైనే చెత్త.. రాకపోకలకు అవస్థ

నగరంలోని యడ్లవారివీధిలో చెత్త పేరుకుపోయింది. అసలే వీధి ఇరుకుగా ఉండడం, రహదారి సగం వరకు చెత్త పేరుకుపోవడంతో రాకపోకలు సాగించే వారు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

రాదారిపై మురుగు.. భరించలేని దుర్గంధం

నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ రోడ్డుపై మురుగు నీరు పారుతుంది. సింహపురి హోటల్ వైపు ప్రధాన మార్గంలో కాలువ పొంగడంతో మురుగునీరు రోడ్డు మీదకు చేరుతుంది. ప్రయాణికులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు.
- న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

అధ్వానంగా రహదారి

నగరంలోని రామకోటి నగర్ నుంచి శ్రామికనగర్, కుమ్మరగుంటకు వెళ్లే రోడ్డులో పెద్దపెద్ద గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిళ్లు ద్విచక్ర వాహనచోదకులు ఈమార్గంలో వచ్చేందుకు హడలిపోతున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి సెంటర్)

తాగునీరు కలుషితం.. రోగాల భయం

నగరంలోని పలు ప్రాంతాల్లో రంగు మారిన తాగునీరు సరఫరా అవుతోంది. ఇది తాగితే వ్యాధులు వస్తాయని ప్రజలు భయపడుతున్నారు. కోటమిట్ట, మెక్లిన్స్ రోడ్డు, జెండావీధి, కుక్కలగుంట తదితర ప్రాంతాల్లో కుళాయిల ద్వారా రంగు మారి వస్తోంది. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

హమ్మయ్య.. గుంతల సమస్య తీరుతోంది

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నెల్లూరులో నరకం చూపుతున్న రహదారులు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. నగరంలో కొంతకాలంగా రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఏ రోడ్డు చూసినా గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు నానా అవస్థలు పడేవారు. ప్రధాన రహదారులతోపాటు పలు వీధులు గుంతలు మిట్టలుగా మారాయి. దీనికితోడు ఎవరికివారు రహదారులను అడ్డంగా తవ్వేయడంతో దారుణంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి. రద్దీగా ఉండే రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు వర్ణనాతీతం. గుంతల పక్క నుంచి వెళ్లే క్రమంలో ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడేది. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేసేవారు. అధికారులు ఎట్టకేలకు స్పందించారు. గుంతలకు మరమ్మతులు చేస్తున్నారు. రద్దీగా ఉండే మార్గాల్లో ఎక్కడిక్కడ ప్యాచ్ పనులు చేస్తున్నారు. మూలాపేట, ఆచారివీధి, బారకాసు సెంటర్, చిన్నబజార్, వాహబ్‌పేట, రంగనాయకులపేట, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో గుంతలను కాంక్రీట్‌తో పూడుస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఎండ్ టూ ఎండ్ రోడ్డు పనులు సాగుతున్నాయి. గుంతలు పడిన ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పనులు చేస్తున్నారు. రోడ్లు బాగు పడుతుండటంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాగునీటి పథకం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం తవ్వి వదిలేసిన రోడ్లకు మరమ్మతులు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు. దర్గామిట్ట పోలీస్ కాలనీ, గాయత్రీ నగరలో మూడు రోజుల కిందట మరమ్మతులకు గుంతలు తీశారు. పనులు చేయడం ఆలస్యం కావడంతో వాహనచోదకులు అందులో పడి గాయాల పాలవుతున్నారు. నగరపాలక అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

మూలాపేట పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రహదారికి ప్యాచ్ పనులు

నిస్సీ.. బాల్ కొడితే గోలే!

ఫుట్‌బాల్‌లో ప్రతిభావంతురాలు

న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

మైదానంలోకి దిగితే చిరుతలా పరుగెడుతోంది. ఎవరికీ చిక్కకుండా గోల్ చేయందే వదలదు. జట్టులో ఉంటే గెలుపు ఖాయమన్న గుర్తింపు తెచ్చుకుంది నగరానికి చెందిన **నిస్సీ అభిరూప.** అయిదో ఏట నుంచి ఈక్రీడలో సాధన ప్రారంభించింది. తండ్రి ప్రైవేట్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు కావడంతో శిక్షణ ఇస్తున్నారు. అనతి కాలంలోనే నైపుణ్యాన్ని సాధించింది. ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొనేలా శిక్షణ ఇచ్చారు. దీంతో పోటీల్లో సత్తా చాటడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. పదో తరగతి చదువుతున్న ఈమె ఇటీవల రాంచీలో జరిగిన ఆలిండియా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో 17 సంవత్సరాల లోపు విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచింది.

సాధించిన విజయాలు: 2015లో ఈమె ఆటతీరును తిలకించిన అప్పటి కలెక్టర్ జానకి ఫుట్‌బాల్ కానుకగా అందజేశారు. ● 2021లో రాష్ట్రస్థాయిలో విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో రూ.2000 నగదు బహుమతి అందుకుంది. ● 2022లో తాడేపల్లిగూడెంలో జరిగిన 14 సంవత్సరాల లోపు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో జట్టు మొదటి స్థానంలో నిలవడంలో కీలకపాత్ర పోషించింది. ● 2023లో జోనల్ స్థాయిలో తిరుపతిలో జరిగిన పోటీల్లో బంగారు పతకాన్ని అందుకుంది. ● 2024లో రాష్ట్రస్థాయిలో వినుకొండలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో బంగారు పతకాన్ని గెలుచుకుంది.

కల్పవృక్షవాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణానగర్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి దశమవార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లు కల్పవృక్షవాహనంపై భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ఉదయం పూర్ణాహుతి, మంగళశాసనం, తీర్థప్రసాదాలు అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: గాంధీనగర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్నాయి. పిల్లలను బయటకు పంపించాలంటే భయమేస్తోంది. – **రియాజ్ అహ్మద్**

సమాధానం: కుక్కలను పట్టించేందుకు వెంటనే చర్యలు చేపడతాం.
– **డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి**

? జడ్పీ కాలనీలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. ఇళ్లలో ఉండలేకున్నాం. – **నీలిమ**

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం.
– **డాక్టర్ దినేష్‌కుమార్, ఆరోగ్యాధికారి**

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

నరాల వ్యాధుల చికిత్సపై సదస్సు

సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నరాల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో వస్తున్న మార్పులపై విక్రమ సింహపురి న్యూరో క్లబ్ సహకారంతో మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం న్యూరో స్పేర్ సదస్సు నగరంలోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో జరిగింది. న్యూరాలజీ, న్యూరో సర్జరీ, స్ట్రోక్ మేనేజ్‌మెంట్, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ తదితర అంశాలపై పలువురు నిపుణులు ప్రసంగించారు. అజ్ఞాత పక్షవాతంపై సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.దీక్షాంతి నారాయణ్, స్ట్రోక్ చికిత్సలో త్రోంబోలిసిస్ ప్రాముఖ్యతపై డాక్టర్ బాలఖాసిం ప్రసంగించారు. న్యూరో సర్జరీలో ఆధునిక చికిత్సపై డాక్టర్ జి.దినేష్, పోస్ట్ ట్రామాటిక్ కాన్‌కషన్స్‌పై డాక్టర్ ఉదయ్‌కిరణ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింహపురి న్యూరో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.వి.రమణమూర్తి, కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎస్.సంపత్‌కుమార్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ పి.ఎస్.రెడ్డి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే : మహాశివరాత్రిని పురస్కరించుకుని గంగపట్నంలో వెలసిఉన్న శ్రీ తారకేశ్వర కైలాసనాథ్వేర స్వామి ఆలయంలో ఆదివారం చిన్నారులు ఆది దంపతుల వేషధారణలో చేసిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకుంది. ఆలయ ఛైర్మన్ కొండూరు విజయశేఖర్ రెడ్డి, చాముండేశ్వరీ ఆలయ ఛైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, అర్చకులు చిన్నారుల ప్రదర్శనకు ముగ్ధులై శాలువా కప్పి జ్ఞాపికలను అందజేశారు.

'రహ'దారుణం.. కాలువలు అధ్వానం

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

నెల్లూరు నగరంలోని రామలింగాపురంలో సమస్యలు తిష్ఠ వేశాయి. వీధికో సమస్య అన్నట్లు పరిస్థితి తయారైంది. ఇక్కడ ప్రధానంగా 50 శాతం వీధుల్లో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. పలు వీధుల్లో ఇటీవల ప్యాచ్ పనులు చేశారు. కొన్నిచోట్ల 20 ఏళ్ల క్రితం రహదారులు నిర్మించడంతో సిమెంట్ చెదిరిపోయి కంకర రాళ్లు బయట పడుతున్నాయి. ఇక్కడ అధిక శాతం 30 ఏళ్ల క్రితం నిర్మించిన కాలువలే కనిపిస్తున్నాయి. . నాలుగు, అయిదు వీధుల్లో వెడల్పులేని స్థితిలో ఉన్నాయి. మురుగు నీటిపారుదల సవ్యంగా లేదు. ప్రధానంగా పలు సందుల్లో కాలువలు లేక వర్షం వస్తే ఆ వీధులు చెరువును తలపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోపల గల ఓ వీధిలో అడుగు లోపే మూడు మ్యాన్‌హోల్స్ ఉండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. స్థానిక శానిటరీ కార్యాలయం లక్షల రూపాయల విలువ గల స్థలంలో ఉంది. శిథిలావస్థకు చేరినా కార్పొరేషన్ అధికారులు వినియోగంలోకి తీసుకురాకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

దెబ్బతిన్న ప్రధాన రోడ్డు

ప్యాచ్ పనులు దెబ్బతిన్నాయి

– గోవిందరావు, ఉద్యోగి

రామలింగాపురం ప్రాంతానికి ఎంతో గుర్తింపు ఉంది.. ఇటీవల కాలంలో సమస్యలు ఎక్కువయ్యాయి. చాలారోడ్లు దెబ్బతిన్నాయి. ఇటీవల ప్యాచ్ పనులు చేశారు. అవి మళ్లీ దెబ్బతిన్నాయి.

దోమల సమస్య

– పద్మావతి, స్థానిక మహిళ

గత కొద్దిరోజులుగా తరచూ దోమలతో ఇబ్బంది పడుతున్నాం. కొందరు అతిసారం భయంతో ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్యం పరంగా వేగంగా చర్యలు తీసుకోవాలి.

తెరపై ఈనాడు

పార్వీ సినిమాస్ (ఎం.I) షెడ్యూల్ : స్క్రీన్..1. మనసంతా నువ్వే (తెలుగు), ఆరెంజ్ (తెలుగు) స్క్రీన్ 2.. ఫంకీ (తెలుగు) స్క్రీన్.3..కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు) **పార్వీ సినిమాస్ (స్పైస్) :** స్క్రీన్.1..కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు) స్క్రీన్ 2. సీతా పయనం (తెలుగు), క్రైమ్ 101 (ఇంగ్లిష్), స్క్రీన్ 3. ఓ రోమియో (హిందీ) స్క్రీన్ 4. 3 తెలుగు, లవ్ స్టోరీ (తెలుగు), విత్‌లవ్ (తెలుగు) స్క్రీన్.5.. ఫంకీ (తెలుగు) **రైన్ సినిమా షెడ్యూల్ :** స్క్రీన్..1. ఫంకీ (తెలుగు) స్క్రీన్ 2. కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు) స్క్రీన్ 3. సీతా పయనం (తెలుగు), ఎర్రచీర (తెలుగు) నిలవే (తెలుగు)

శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణోత్సవం

లేపాక్షి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్ర స్వామి ఆలయంలో శివ, పార్వతుల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. ఉదయం మహిళలు దీపాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామికి అభిషేకార్చనలు, రుద్రహోమం చేశారు. ఏడు శిరస్సుల నాగేంద్రుని చెంత కాలసర్పదోష నివారణ పూజలు నిర్వహించారు. అనంతరం అశేష భక్తజన సందోహం నడుమ కల్యాణోత్సవాన్ని వేద పండితులు సునీల్‌శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. శివరాత్రి విశిష్టతను పండితులు వివరించారు. జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఏడుశిరస్సుల నాగేంద్రుడి చెంత శివలింగానికి అభిషేకం చేశారు. ఆతర్వాత కల్యాణంలో పాల్గొన్నారు. సాయంత్రం గ్రామ వీధుల్లో స్వామివారు వృషభ వాహనంలో ఊరేగారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం హేమ, ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీవో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శివలింగానికి కొబ్బరి నీళ్లతో అభిషేకం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నేడు బ్రహ్మరథోత్సవం: ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామికి అభిషేకార్చనలు, రథసంప్రోక్షణ, దవనోత్సవం, కలశస్థాపన, హోమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్వామిని రథంపై ఉంచి ఊరేగిస్తామని కమిటీ ఛైర్మన్, ఈవో తెలిపారు.

కాటికోటేశ్వర నమో.. నమః

తాడిమర్రి, న్యూస్‌టుడే: తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి గ్రామ సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. ఆదివారం స్వామివారిని బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. భక్తులు విశేష సంఖ్యలో తరలిరావడంతో క్షేత్రం కిటకిటలాడింది. మంత్రి సత్యకుమార్‌యాదవ్ కాటికోటేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిత్యాన్నదానాన్ని పరిశీలించి రూ.లక్ష విరాళం అందజేశారు. క్షేత్రం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. భక్తులు మూలవిరాట్టును దర్శించుకుని గదేగుండం వద్ద మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి నరసింహరాజు, డీఎస్పీ హేమంత్‌కుమార్, నాయకులు శ్రీనివాసులు, రాజశేఖర్, భాజపా మండల అధ్యక్షుడు రాము, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మంత్రి సత్యకుమార్‌యాదవ్



కాటికోటేశ్వరుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

ప్రశాంతంగా స్వామి దర్శనం

గతంలో కాటికోటేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వివాదాలు నెలకొనేవి. పోలీసుల హడావుడి ఎక్కువగా ఉండేది. దీంతో స్వామిని దర్శించుకోలేక భక్తులు మదనపడేవారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మంత్రి సత్యకుమార్‌యాదవ్, పరిటాల శ్రీరామ్ చొరవ చూపి ఆలయ గుడికాపులు, భక్తులతో సమావేశాలు నిర్వహించి ఎటువంటి వివాదాలు లేకుండా చూశారు. దీంతో బ్రహ్మోత్సవాలు ప్రశాంత వాతావరణంలో వైభవంగా జరుగుతున్నాయి.

సాయీశ్వరలింగానికి మహారుద్రాభిషేకం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: హర.. హర.. మహాదేవ శంభో సాయిఈశ్వర నామస్మరణతో పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం మారుమ్రోగింది. సత్యసాయి సన్నిధిలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలు కనుల పండువగా సాగాయి. శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉదయం సాయి విద్యార్థులు వేదాలు పఠిస్తూ.. నాదస్వరం.. పంచవాయిద్యం.. భక్తి గీతాలు ఆలపించారు. సాయంత్రం సాయికుల్వంత్ మందిరంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ వేదపండితులు భజన మందిరం నుంచి మహాసమాధి చెంతకు సాయిఈశ్వరలింగాన్ని తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. వేదపండితులకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జేరత్నాకర్ పట్టువస్త్రాలు, పూజ సామగ్రి అందజేసి, అభిషేక పూజలను ప్రారంభించారు. గణపతిపూజ అనంతరం దేశంలోని వివిధ పుణ్యనదుల నుంచి తీసుకువచ్చిన జలాలు, సుగంధ పుష్పాలతో లింగానికి మహారుద్రాభిషేకం, మహాభిషేకం, సత్యసాయి అష్టోత్తరనామం నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో బాబా మహాసమాధిని అలంకరించారు. సత్యసాయి విద్యార్థులు పంచవాయిద్యం, డప్పు వాయిద్యం, మంగళ వాయిద్యాలతో కచేరి నిర్వహించారు. సత్యసాయి పూర్వ ప్రసంగాన్ని తెరపై ప్రదర్శించారు. సాయంత్రం 6 గంటలకు భక్తులు అఖండ భజనను ప్రారంభించారు. ఈ భజన సోమవారం ఉదయం 6 గంటలకు ముగిసింది.

లింగానికి క్షీరాభిషేకం

వేడుకలో పాల్గొన్న విద్యార్థినులు, మహిళా భక్తులు

చొరవ+ ధైర్యం = వ్యాపారం

■ నాటుకోళ్ల పెంపకంతో యువతకు స్ఫూర్తి

కోళ్లకు క్యారెట్ ముక్కలు ఆహారంగా వేస్తున్న రమేశ్

పెనుకొండ, న్యూస్‌టుడే: యువత స్వయం ఉపాధి కోసం అనేక మార్గాలు వెతుకుతున్నారు. అందులో కొందరు వ్యాపార మార్గాన్ని ఎంచుకుంటున్నారు. కొంతమంది కొన్నాళ్లకే లాభాలు రావడం లేదని నిట్టూరుస్తారు. మరికొందరు పట్టుదలగా అలానే కొనసాగిస్తారు. వ్యాపారం సమర్థంగా నిర్వహించాలంటే ఒడిదొడుకులు వచ్చినపుడు కాసింత ధైర్యంగా, ఇష్టం పెంచుకొని ఎదుర్కోవడం లోనే ఉంది అసలు కిటుకు. పెనుకొండ మండలంలోని రాంపురానికి చెందిన రమేశ్ యాదవ్ ఈ మార్గం అనుసరిస్తూ సఫలీకృతం అవుతున్నారు. వారెంచుకున్న వ్యాపారం నాటుకోళ్ల పెంపకం.. తొలుత పూల వ్యాపారం చేసి నేర్చుకున్న మెలకువలతో కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు.

గ్రామం : కొండాపురంలోని బీసీ కాలనీలో ఏడాదికి లక్షతో అద్దెకు.. తీసుకొని

కోడిపిల్లలు : 8 నెలల క్రితం తెలంగాణలోని ఉస్మానాబాద్ నుంచి 3,800 కోడిపిల్లలు తీసుకొచ్చాడు. ఒక్కో పిల్లకు రూ.85 వెచ్చించాడు.

ఆహారం : మొదట్లో ఒక్కోపిల్లకు రోజుకు 30 గ్రాముల ఆహారం ఇచ్చాడు. ప్రస్తుతం 8 నెలలు కావడంతో ఒక్కో కోడి 120 గ్రాముల ఆహారం తీసుకుంటుంది. సేంద్రియ ఆహారం ఇస్తున్నారు. ప్రతి రోజు మూడు పూటలా ఆహారంగా తెల్లజొన్నలు, మొక్కజొన్నలు, కత్తిరించిన అరటి, మునగ, బొప్పాయి ఆకులు, కత్తిరించిన స్వీట్ పొటాటో క్యారెట్, బీట్‌రూట్, దోస, గుమ్మడికాయ ముక్కలు ఆహారంగా ఇస్తున్నారు.

ప్రస్తుత స్థితి : రోజు 1000కిపైౖ కోడిగుడ్లు వస్తున్నాయి. ఒక్కో గుడ్డు రూ.15కి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. నెలకు ఆహారం, నిర్వహణ ఖర్చులు రూ.3 లక్షలు వెచ్చిస్తున్నారు. వీటిలో కోడిపెట్టలు 1.75 కిలోలు, కోడిపుంజులు 2 కిలోల వరకు బరువున్నాయి. కోడి కిలో రూ.450 ప్రకారం విక్రయిస్తున్నారు. సొంతంగా నాటుకోడి పిల్లల ఉత్పత్తి కోసం యంత్రాలను సమకూర్చుకున్నారు. నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం గడిస్తున్నారు.

రైతులకు పిల్లలిస్తాం - రమేశ్‌యాదవ్, నాటు కోళ్లఫారం, యజమాని

భవిష్యత్తులో నాటుకోళ్ల పెంపకం పట్ల ఆసక్తి ఉన్నవారు ముందుకొస్తే కోడి పిల్లలు సరఫరా చేస్తాం. పెంపకంలో మెలకువలు తెలియజేస్తాం. కోళ్లు, కోడి గుడ్లు తిరిగి తామే కొనుగోలు చేస్తాం

నల్లబంగారంపై ఆధిపత్యం!

➡ మహారాష్ట్ర వ్యాపారులతో కలిసి నాయకుల దందా

ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే, బత్తలపల్లి: ధర్మవరం నియోజకవర్గంలో బొగ్గు తయారీ దందా రోజురోజుకు విస్తరిస్తోంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ, బీడు, దేవాదాయ భూములు అధికంగా ఉండటంతో ముళ్లకంప విపరీతంగా పెరిగింది. దీన్ని బొగ్గులుగా కాల్చి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు పుణేకు చెందిన ఆదివాసీలకు అడ్వాన్సులు ఇచ్చి కూలీలను తెచ్చుకొని పనిచేయిస్తున్నారు. బత్తలపల్లి మండలంలో దంపెట్ల, డి.చెర్లోపల్లి, వెంకటగారిపల్లి, మాల్యవంతం, వేల్పుమడుగు, పోట్లమర్రి, గంటాపురం, ధర్మవరం మండలంలో రాయచెరువు, కుణుతూరు, రేగాటిపల్లి, గరుడాంపల్లి, నాగలూరు, తాడిమర్రి మండలంలో నిడిగల్లు, అగ్రహారం, తిన్నదరి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలంలో ఎక్కువగా ఈ వ్యాపారం సాగుతోంది.

కొడవాండ్లపల్లిలో బట్టీ వద్ద కలప

రైతులకు బెదిరింపులు

బొగ్గు కిలో రూ.100 పైగా పలుకుతోంది. ఒక్కో సంచిలో 35 కిలోల వరకు సరకు ఉంటుంది. మహారాష్ట్ర వ్యాపారులు ఒక సంచిని రూ.350 నుంచి రూ.600 వరకు బెంగళూరు, చెన్నై, ముంబయి, పాకాల, హిందూపురం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామానికి చెందిన రైతు లోకేశ్ పొలంలో అక్రమంగా ముళ్లకంపలు తొలగించగా ఆయన కుటుంబ సభ్యులతో వెళ్లి నిలదీశారు. దీంతో వ్యాపారులు బెదిరింపులకు దిగారు. దంపెట్లలో కూడా ఇదే తరహాలో అక్రమంగా ముళ్లకంప తొలగించారు. పొలంలో పైపులు పగిలిపోవడంతో రైతు గట్టిగా నిలదీయడంతో కొంత డబ్బు చెల్లించి వెళ్లిపోయారు.

అనుమతులు ఇలా..

- ముళ్లకంపను కాల్చి బొగ్గు తయారు చేయాలంటే.. కాలుష్య నియంత్రణ మండలి, అటవీశాఖ, స్థానిక సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.
- అడవులు, గ్రామాలకు దూరంగా.. కాలుష్య ప్రమాదం లేకుండా కాల్చుకోవాలి.
- వ్యాపారులు ముళ్లకంప ఉన్న రైతులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత కిలాన్ కోసం అటవీశాఖకు దరఖాస్తు చేసుకుంటే వారు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతులు జారీ చేయాలి.

క్షేత్రస్థాయిలో ఇలా..

★ సగం వరకు లైసెన్సులు ముగిసినా కొనసాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.
★ లారీలకు కేటాయించిన మార్గాల్లోనే సరకు తరలించాలి. కానీ, చేయితడిపితే చాలు.. అధికారులు తనిఖీలు చేయకుండా వదిలేస్తున్నారు.
★ అటవీ అధికారులు కిలాన్ కోసం అధికంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.
★ బొగ్గుల వ్యాపారంపై స్థానిక నాయకుల కన్ను పడింది. లైసెన్సులు, అనుమతులు తామే ఇప్పిస్తామని చెప్పి బత్తలపల్లి మండలానికి చెందిన ఒక నాయకుడు మహారాష్ట్ర వ్యాపారులపై రెండేళ్ల నుంచి ఆధిపత్యం చెలాయిస్తున్నాడు. బొగ్గు తయారైన తర్వాత లారీకి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇది చూసిన మరో నాయకుడు ఈ వ్యవహారంలో తలదూర్చాడు. దీంతో ఇరువర్గాల మధ్య రెండుసార్లు ఘర్షణలు జరిగాయి. మారణాయుధాలతో ఒకరినొకరు బెదిరించుకున్నారు.

నిబంధనల మేరకే..

- మల్లికార్జున, అటవీశాఖ అధికారి

క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతులు మంజూరు చేస్తున్నాం. అనుమతులకు ఎక్కువ వసూలు చేయడం లేదు. ఎక్కడైనా అక్రమాలు జరిగినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

సమ్మెలోకి సహకార సంఘాల ఉద్యోగులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై పోరుకు సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. సోమవారం నుంచి ఉద్యోగులంతా విధులను బహిష్కరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడానికి ఉద్యుక్తులయ్యారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 120 సహకార సంఘాల కార్యకలాపాలు స్తంభించనున్నాయి. దీనికి సంబంధించి అధికారులకు సమ్మె నోటీసులు కూడా అందజేసినట్లు జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి డి.శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జీఓ నం.36ను అమలు చేసి 2019, 2024 పీఆర్సీ లేదా మధ్యంతర భృతి ఇవ్వాలని ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘాల లాభ నష్టాలతో సంబంధం లేకుండా ఉద్యోగులకు జీతాలు చెల్లించి ఆరోగ్య బీమా రూ.5 లక్షలు, రూ.20 లక్షలు నిర్ణీత కాల భీమా అమలు చేయాలని కోరారు. దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే సమ్మెకు దిగుతున్నట్లు వారు తెలిపారు.

షూటింగ్ బాల్ విజేత శ్రీసత్యసాయి జిల్లా

బాలికల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. గత మూడు రోజులుగా ధర్మవరం పట్టణంలోని బీఎస్‌ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలుర, బాలికల విభాగం రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో 12, బాలుర విభాగంలో 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో అనకాపల్లి బాలుర జట్టు విజేతగా నిలవగా, అనంతపురం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచింది. ఆదివారం బాలికల జట్టుకు పట్టణ తెదేపా అధ్యక్షుడు పరిశే సుధాకర్, షూటింగ్ బాల్ అధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి, పీడీ లక్ష్మీనారాయణ ట్రోఫీని అందజేశారు. శ్రీసత్యసాయి జట్టు సభ్యులంతా ధర్మవరం బీఎస్‌ఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థినులే కావడం విశేషం.

ఎదురొచ్చిన మృత్యువు

■ రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం
■ పండగ పూట రెండు కుటుంబాల్లో విషాదం

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ఆ రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం.. పండగ పూట సంతోషంగా గడపాల్సిన చోట రోదనలు మిన్నంటాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి అకాల మరణం ఒకవైపు, భార్యా పిల్లలకు అన్నీ తానై ఉన్న వ్యక్తి మరోవైపు మృతి చెందడం అందర్నీ కలచి వేసింది. శివయ్యా.. ఎందుకింత కష్టాన్ని మిగిల్చావంటూ ఓ గృహిణి రోదనలు.. కడుపు కోత తట్టుకోలేమయ్యా అంటూ మరో కన్నతల్లి వేదన వర్ణనాతీతం.

నల్లమాడ మండలం బాసంవారిపల్లికి చెందిన గణేశ్ అతని సోదరుడు రాకేష్, మహేష్ శివరాత్రిని పురస్కరించుకొని ద్విచక్రవాహనంలో లేపాక్షికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఉంట్లవారిపల్లికి చెందిన లక్ష్మీనారాయణ ఓడీసీ నుంచి పుట్టపర్తికి వెళ్తున్న తరుణంలో వీరి వాహనాలు వీరాంజనేయపల్లి వద్ద ఎదురుపడి ఢీకొనడంతో లక్ష్మీనారాయణ(45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడిన గణేశ్(16)ను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. లక్ష్మీనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుగొండకు, గణేశ్ మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఓడీసీలో చికెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గణేశ్ నల్లమాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కూలిపనులు చేసుకుంటూ జీవనం గడిపే ఆ కుటుంబంలో పండగపూట కుమారుడి మృతితో శోకసంద్రంలో మునిగిపోయింది. ఈఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్సై క్రాంతి తెలిపారు.

గణేశ్

రైజింగ్ స్టార్స్‌కు 30 రోజుల తరగతులు

పెనుకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే వందరోజుల ప్రత్యేక ప్రణాళిక ప్రారంభించారు. ప్రభుత్వం డీ గ్రేడ్ విద్యార్థులను 30 రోజుల పాటు రెసిడెన్షియల్ తరగతులు శుక్రవారం ప్రారంభించారు. పెనుకొండ డివిజన్ పరిధిలో కొత్తచెరువు, గుడిబండ, అమరాపురం, మడకశిర, లేపాక్షి, పెనుకొండ ప్రత్యేక కేంద్రాలు ప్రారంభించారు. ఈ రెసిడెన్షియల్ తరగతుల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా సరఫరా చేసిన మెటీరియల్ చదివించడం, వాయించడం, నేర్చుకున్న వాటి పై పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. రైజింగ్ స్టార్స్‌ను ఉదయం 5.30 గంటలకే నిద్రలేపి యోగాతో ప్రారంభిస్తారు. తరువాత ఓ గంట సమయం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం సమకూర్చుతారు. 30 రోజుల రెసిడెన్షియల్ తరగతులకు అవసరమైన వసతులు కల్పించారు.

ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవోలు రాఘవయ్య, సుధాకర్

ఉత్తీర్ణతే లక్ష్యం:

డీగ్రేడ్ విద్యార్థులకు 30 రోజుల రెసిడెన్షియల్ తరగతులు ప్రారంభించాం. ఇక్కడ ఇద్దరు ఎంఈవోలు, ఇద్దరు ఎంటీఎస్ ఉపాధ్యాయులు, ఓ ప్రధానోపాధ్యాయుడిని నియమించారు. ప్రతి కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థుల ప్రోగ్రెస్‌ను పరిశీలిస్తాం.

- జాన్‌రెడ్డప్ప, డీవైఈవో, పెనుకొండ

పెనుకొండ డివిజన్ పరిధిలో మొత్తం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు: **165**

ఈ ఏడాది పది పరీక్షలు రాయనున్న విద్యార్థులు: **8485**

డీగ్రేడ్‌లోని విద్యార్థులు: **260**

పబ్లిక్ పరీక్షల ప్రారంభ తేది : **మార్చి 16 నుంచి 31 వరకు**

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని కార్యాలయాలతోపాటు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని, వాటిని కూడా పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీలుగానే పరిగణించి పరిష్కరిస్తామన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

అరటి రైతుకు తీపికబురు

➡ టన్ను రూ.21,000 - 23,000

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, న్యూస్‌టుడే: ఉగాది, శ్రీరామనవమి పండగలు సమీపిస్తున్న వేళ అరటి ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం టన్ను రూ.21,000 నుంచి రూ.23,000 పలుకుతోంది. తమ కష్టానికి ఫలితం దక్కిందని రైతులు ఆనందపడుతున్నారు. గత పదేళ్ల కాలంలో ఇంత ధర పెరగలేదని చెబుతున్నారు. గత ఏడాది దీపావళి, దసరా సమయంలో అరటి ధరలు బాగా పడిపోయాయి. ఎంతలా అంటే టన్ను కేవలం రూ.1,000 మాత్రమే పలికాయి. కూలి డబ్బులు కూడా రావని చాలా మంది రైతులు గెలలను తోటల్లోనే వదిలేశారు. మరికొందరు పశువులకు మేతగా వేశారు. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో లక్షల్లో నష్టపోయారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అరటి పంట 1,610 హెకార్లల్లో సాగులో ఉంది.

లారీలో అరటి కాయలు లోడు చేస్తున్న కూలీలు

కొన్ని నెలలపాటు నిలకడగా ధరలు

- చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖాధికారి

ఇతర రాష్ట్రాల్లో అరటి కోతలు పూర్తయ్యాయి. వ్యాపారులు మన దగ్గరకు వచ్చి అరటిని కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు. అందుకే ధరలు భారీగా పెరిగాయి. ఇంకొన్ని నెలలపాటు ఇవే ధరలుంటాయి

రైతుపై ఎరువుల ధరాభారం

■ రబీలో రెండోసారి పెంపుతో తీవ్ర ఇబ్బందులు

గోదాముల్లో నిల్వ ఉన్న రసాయన ఎరువులు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: రబీ సీజన్ మొదట్లో ఒక సారి మిశ్రమ రసాయన ఎరువుల ధరలు పెరగడం రైతులకు అశనిపాతంలా మారింది. ఏదోలే నెట్టుకొద్దాం అనుకునే లోపే మరోసారి ధరల పెరుగుదలతో వారికి ఇబ్బందులు పెరిగాయి.

- యూరియా, డీఏపీ ధరలు మినహా మిశ్రమ కాంప్లెక్సు ఎరువులు పెరిగాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 50 వేల ఎకరాల వరకు వరి సాగు కాగా, పత్తి 75 వేల ఎకరాల వరకు సాగు అయింది. వీటితో పాటు వేరుసెనగ, మొక్కజొన్న, దానిమ్మ, వంటి రకాలకు చెందిన 2.5 లక్షల ఎకరాల వరకు పంటలు రబీలో సాగులో ఉన్నాయి.

కొనుగోలు కష్టం

రసాయన ఎరువుల కంపెనీలు ధరలు పెంచడంతో రైతులకు రసాయన ఎరువులు కొనుగోలు భారంగా మారింది. బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, కళ్యాణదుర్గం గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం పామిడి, శింగనమల తదితర మండలాల్లో వ్యవసాయ బోర్లు చెరువుల వరి, వేరుసెనగ, మొక్కజొన్న పత్తి, తదితర పంటలను సాగు చేశారు.

- మిశ్రమ ఎరువుల తయారీకి అవసరమైన ముడిసరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు హెచ్చుగా ఉండటంతో ధరలు పెరిగాయని కంపెనీ యాజమాన్యం చెబుతోంది.

పెరుగుదల ఇలా..

- మిశ్రమ ఎరువులకు సంబంధించి ఐదురకాల ఎరువులు రబీలో రెండుసార్లు పెరిగాయి.
- 15.15.15 మిశ్రమ ఎరువు రబీ ప్రారంభంలో 50 కిలోల బస్తా రూ.1550 ఉండగా ప్రస్తుతం రూ.1,650కి చేరింది.
- 20.20.0.13 కాంప్లెక్సు బస్తా నెల కిందట రూ.1400 ఉండగా ప్రస్తుతం రూ.1500కు పెరిగింది.
- 10.26.26 కాంప్లెక్సు గత నెలలోరూ.1900 ఉండగా రూ.2100కు పెరుగుదల
- 14.35.14 ఎరువు బస్తా రూ.1950 ఉండగా రూ.2150కు పెరిగింది.
- 16.16.16 మిశ్రమ ఎరువు రబీ ప్రారంభంలో రూ.1600 ఉండగా ప్రస్తుతం 1675కు చేరింది.

అధికారులేమంటున్నారు?

ఇష్టారాజ్యంగా రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి, తగిన మోతాదులో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి రవికుమార్ తెలిపారు. డీలర్లు ఎంఆర్‌పీ ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు.

(c) eenadu

సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత, అహుడా ఛైర్మన్ టి.సి.వరుణ్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

ఆదర్శ నగర పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యం : మంత్రి

పెనుకొండ, న్యూస్‌టుడే: స్థానిక నగరపంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారిపై రూ.92 లక్షలతో 3.2 కిలోమీటర్ల మేర 110 స్తంభాలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అహుడా ఛైర్మన్ టి.సి.వరుణ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళుతోందన్నారు. అతితక్కువ కాలంలో కుప్పం వరకు కృష్ణాజలాలను 720కిలోమీటర్లు తీసుకెళ్లిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. పెనుకొండలో గతంలో జరగని అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.61లక్షలతో అన్నక్యాంటీన్, ఇస్కాన్ సహకారంతో రూ.454కోట్లతో కొండ పై పర్యాటక అభివృద్ధి పనులు, రూ.100కోట్లతో అమృత్‌పథకంలో ఇంటింటికీ తాగునీటి పనులు చేపడుతున్నామన్నారు. రూ.4కోట్లతో నగరవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీసీరోడ్ల నిర్మాణం కోసం రూ.20కోట్లతో ప్రతిపాదనలు పంపామని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. నగరపంచాయతీ కమిషనర్ సతీశ్‌కుమార్, సిబ్బంది, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమయ్య, కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడలో.. తటాకాలు

- బలహీన పడుతున్నా పట్టని తీరు
- గగ్గోలు పెడుతున్న ఆయకట్టు రైతులు

గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, న్యూస్‌టుడే : ఆయకట్టు రైతులతో పాటు ప్రజలకు దాహార్తిని తీర్చే చెరువులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇది వరకు చెరువులు ఆయకట్టు కింద పంటలు విస్తారంగా పండించేవారు. దీంతోపాటు చెరువులకు సమీపంలో ఉన్న గ్రామాలు, పట్టణాల పరిధిలో భూగర్భ జలాలు పెరిగి నీటి సమస్య తీరేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోతోంది. ప్రధానంగా గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లోని చెరువుల బాగును ఎవరూ పట్టించుకోవడంలేదు.

అధ్వానంగా బ్రాహ్మణపల్లి చెరువు

ప్రతిపాదనలతో సరిపెడుతూ..

గతంలో పలు చెరువుల మరమ్మతుల కోసం చిన్ననీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. గుత్తి మండలంలోని బ్రాహ్మణపల్లి చెరువుకు రూ.55 లక్షలు, చిన్నచెరువుకు రూ.25 లక్షలు, జక్కలచెరువుకు రూ.65.76లక్షలు, ముల్లావాని చెరువుకు రూ.24 లక్షలు, కొత్తపేట చెరువుకు రూ.70.80 లక్షలు, తిమ్మారెడ్డి చెరువుకు రూ.55.65 లక్షలతో ప్రతిపాదించారు. ● ఉరవకొండ నియోజకవర్గంలోని నాలుగు చెరువుల బాగుకు రూ.3కోట్లతో ప్రతిపాదించినా పైసా కూడా విడుదల చేయలేదు. ● గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లోని చెరువుల మరమ్మతులకు రూ.5కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినా పాలకులు పట్టించుకోవడం లేదు. జక్కలచెరువు, బాచుపల్లి చెరువు కట్టలు బలహీనంగా ఉన్నాయి. నేటా కట్టలకు గండ్లుపడుతున్నాయి. దీంతో చెరువుల్లో నీరు నిల్వ ఉండటం లేదు.

అడవులను తలపిస్తున్న చెరువులు

ఉరవకొండ నియోజకవర్గంలోని బూదగవి చెరువులో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తోంది. కోనాపురం చెరువు సైతం మరమ్మతులకు నోచుకోవడంలేదు. హావలిగి చెరువు కింద సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉన్నా ప్రయోజనం లేకుండాపోతోంది. ● గుత్తి పరిధిలో రైల్వే ట్రాక్‌లకు సమీపంలో ఉన్న చెరువు కట్టల పటిష్ఠతకు రైల్వే అధికారులు నిధులు ఇవ్వాల్సిఉంది. గుత్తి, జక్కలచెరువు, తొండపాడు, గుంతకల్లు మండలంలోని పాతకొత్తచెరువుల వద్ద ట్రాక్‌లు ఉన్నాయి. వీటి బాగుకు ఐదేళ్ల నుంచి నిధులు రావడం లేదు. దీనిపై ఇరిగేషన్‌శాఖ గుత్తి ఏఈఈ విజయ్‌కుమార్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి గతేడాది రెండు నియోజకవర్గాల్లోని చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేపడతామన్నారు.

అండర్-12 క్రికెట్ జట్టు కెప్టెన్‌గా హన్సిక్‌రెడ్డి

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: కడపలో సోమవారం నుంచి మొదలుకానున్న సౌత్‌జోన్ అంతర్ జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ప్రకటించారు. మండల, జిల్లాస్థాయి పోటీలు జరిపి, అందులో ప్రతిభ చూపిన బాలురు జిల్లా తుది జట్టుకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. కడపలో పోటీలు 22 వరకు జరుగుతాయి. ఎంపికైన జిల్లా జట్టులోని ఆటగాళ్ల వివరాలను జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ.యుగంధర్‌రెడ్డి ప్రకటించారు.

జట్టు ఆటగాళ్లు: హన్సిక్‌రెడ్డి (కెప్టెన్), ఎం.తౌఫిక్, గోవర్ధన్‌నాయుడు, అల్లు అభనవ్, డి.గౌరీష్, కె.మోక్షిత్‌రెడ్డి, కె.కార్తిక్, ఎన్.మనీష్‌సాయి, హఫీజ్, బి.శాన్‌భండవ్, జె.అఖిల్‌గౌడు, దినేష్ గౌడు, పి.వెంకట్ నరేన్.

స్టాండ్‌బైస్‌గా..: రాహుల్‌రెడ్డి, సి.లలిత్‌కిశోర్, గోవర్ధన్‌రెడ్డి, నిహాంత్‌రెడ్డి, మహిధర్‌రెడ్డి, నిఖిల్ నివాస్‌రెడ్డి, ఎల్‌వీ వెంకట్‌సాయి యాదవ్ ఎంపికయ్యారు. జట్టుకు శిక్షకుడిగా జి.హరినాథ్‌రెడ్డి నియమితులయ్యారు.

అశ్వర్థ ఆలయం.. పోటెత్తిన భక్తజనం

అలంకారంలో అశ్వర్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలో ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో మాఘమాసం నాలుగో ఆదివారం వాలకు భక్తులు పోటెత్తారు. చివరి ఆదివారం శివరాత్రి కలిసి రావడంతో భక్తులు స్వామి బ్రహ్మోత్సవాలకు భారీగా తరలివచ్చారు. అశ్వర్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి వారికి వేద పండితులు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పెన్నా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో వేదపండితులు హోమం నిర్వహించి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఏఎస్పీ రోహిత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం, ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు భక్తులకు వివిధ సేవలు అందించారు.

దర్శనానికి బారులు తీరిన భక్తులు

శంభోశంకరా.. కరుణించవయ్యా!

తాడిపత్రి, న్యూస్‌టుడే: హరహర మహదేవా.. శంభోశంకరా కరుణించవయ్యా అంటూ భక్తుల శివనామస్మరణతో శివాలయాలు మారుమోగాయి. పట్టణంలోని పెన్నానది ఒడ్డున ఉన్న బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పండగను వైభవంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పెద్దఎత్తున పాలాభిషేకం చేపట్టారు. తాడిపత్రి, జిల్లాలోని పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఆలయానికి తరలిరావడంతో కిటకిటలాడింది. స్వామిని నంది వాహనంలో కొలువుతీర్చి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆకాశదీపోత్సవం, లింగోద్భవం, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి నిర్వహించారు.

శివయ్యకు క్షీరాభిషేకం

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : కోటంక గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలు నాలుగో ఆదివారం వేలామంది భక్తుల నడుమ వైభవంగా ముగిశాయి. తెల్లవారు 4గంటలకు అభిషేకాలతో అర్చకులు రామాచార్యులు పూజలు ప్రారంభించారు. మాఘమాసం చివరి ఆదివారం కావడంతో స్వామిని దర్శించుకోవడానికి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామితో పాటు ఆలయ సమీపంలో నిర్మించి 108 శివలింగాలు, ఎత్తైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహంతోపాటు నందీశ్వర, శివలింగా విగ్రహాలు భక్తులకు దర్శించుకున్నారు. స్వామిని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ జడ్పీటీసీ సభ్యులు విశాలాక్షి, రామలింగారెడ్డి, తెదేపా నాయకులు, తదితరులు దర్శించుకున్నారు. ఎస్సై గౌస్‌బాషా ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ప్రత్యేకాలంకరణలో గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడు

శివయ్య కొలువు.. భక్తికి నెలవు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం మండలంలోని పరమేశ్వరుడి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శైవ క్షేత్రాలు హరహర మహదేవా..శంభోశంకర నామాలతో ప్రతిధ్వనించాయి. భక్తులు ఉదయం నుంచే స్వామి దర్శనాలకు బారులుతీరారు. పంపనూరులోని మంజునాథ స్వామికి వేకువజామున 4 గంటల నుంచి ప్రత్యేక పూజలు, రుద్రహోమం నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుంచి గౌరీ సమేత మంజునాథ స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

విశేషాలంకారంలో మంజునాథస్వామి

ముగిసిన సేవాలాల్ జయంతి ఉత్సవాలు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : గుత్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సేవాఘడ్‌లో వెలసిన సేవాలాల్ 287వ జయంతి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం ఉదయం సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక అలంకరణ, పూజలు, అభిషేకాలు, అర్చనలు, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి ఇచ్చారు. మాతా జగదాంబ దేవి ఆలయలో 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు 101 బాలికలు సేవాలాల్ ఆలయం నుంచి మాతా జగదాంబదేవి ఆలయం వరకు కలశాల ప్రదర్శనతో జయంతి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సేవాలాల్ మాలధారులు భారీ ప్రదర్శనతో సేవాలాల్‌కు ఇరుముడులు సమర్పించారు. ట్రస్టు సభ్యులు జగన్నాధరావు, ఉపాధ్యక్షుడు కేశవ నాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్, రవీంద్రనాయక్ ఆలయ ప్రాంగణంలో ఉన్న మహాభోగ్ కట్ట వద్ద హోమం నిర్వహించారు. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సేవాలాల్, మాతా జగదాంబ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుసేన్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప సేవాలాల్‌ను దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఉత్సవాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీవో ప్రభాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాభోగ్ నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

అలంకరణలో సేవాలాల్ మహరాజ్

ఉత్సాహంగా రాతిదూలం లాగు పోటీలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: కూడేరు మండలం కొర్రకోడులో రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పయ్యావుల సోదరుల సహకారంతో శివరాత్రి సంబరాల్లో భాగంగా గ్రామస్థులు ఉత్సాహంగా రాతి దూలం పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.30116 తోపుదుర్తికి చెందిన రైతు చిన్నప్ప ఎద్దులు, రెండో బహుమతి రూ.20116 మద్దెలచెరువుకు చెందిన రైతు కదిరప్ప ఎద్దులు, మూడో బహుమతి రూ.10116 బళ్లారి జిల్లాకు చెందిన రైతు ఆంధ్రా ఆనంద రెడ్డి ఎద్దులు గెలుపొందినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆర్డీటీ ఫుట్‌బాల్ లీగ్ విజేత ధర్మవరం జట్టు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ఆర్డీటీ ఫుట్‌బాల్ లీగ్-2026లో ధర్మవరం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం కోచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అండర్-16 విభాగంలో బాలుర, బాలికల లీగ్ పోటీలు జరిగాయన్నారు. బాలుర విభాగంలో ఫైనల్‌లో హిందూపురం జట్టుపై ధర్మవరం జట్టు 3-2 గోల్స్ తేడాతో గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకుందన్నారు. బాలికల విజేతగా హిందూపురం జట్టు నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విజేత జట్టుకు తెదేపా నాయకులు సంధారాఘవ, పురుషోత్తం, జనార్ధన్, రవి ట్రోఫీ, మెడల్స్‌ను అందజేశారు.

ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధికి ఎంపీ నిధులు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: తిమ్మమాంబ మహా శివరాత్రి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తిమ్మమ్మ మర్రిమాను వద్ద కమ్యూనిటీ భవనానికి ఎంపీ గ్రాంట్ రూ.1 కోటి నిధులు మంజూరు చేయడంతో పాటు అభివృద్ధికి అండగా ఉంటానని తెలిపారు. తిమ్మమ్మ మర్రిమాను, పాల్పాడిదిన్నె ఆంజనేయ స్వామి, కటారుపల్లి వేమన్నస్వామి, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను కలుపుతూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపీ పార్థసారథిని కదిరి ఎమ్మెల్యే కందికుంట, మాజీ ఎమ్మెల్యే పార్థసారథిలు శాలువాతో సన్మానించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఎమ్మెల్యే అన్నదాన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

తిమ్మమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట

టమాటా గరిష్ఠ ధర కిలో రూ.15

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణ మండలం కక్కలపల్లి మార్కెట్‌లో టమాటా ధరలు కాస్తా పెరిగాయి. గత నాలుగు రోజులుగా పడిపోయిన ధరలు ఆదివారం కొద్దిగా పుంజుకుంది. కిలో గరిష్ఠ ధర రూ.15 పలకగా, మధ్యస్థం రూ.12, కనిష్ఠం రూ.8 చొప్పున ఉన్నాయి. 15 కిలోల బుట్ట ధర గరిష్ఠం రూ.225, మధ్యస్థం రూ.180, కనిష్ఠం రూ.120 చొప్పున పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రూప్‌కుమార్ తెలిపారు.

పశుగ్రాస పథకం.. రైతులకు ఊతం

కనగానపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తరువాత రైతులకు భరోసా కల్పించేది పాడి పరిశ్రమే. ఈ రంగం అభివృద్ధిని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. వరిగడ్డి, వేరుసెనగ గ్రాసం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో బహువార్షిక పశుగ్రాస పథకాన్ని ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసింది. పశుగ్రాసానికి అవసరమైన సామగ్రి కొనుగోలుకు నగదు, కూలీల వేతనాలను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ పథకానికి అర్హులైన రైతులు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

అర్హతలు..

- ఒక ఎకరా వరకు పశుగ్రాసం సాగుకు అనుమతి
- పొలంతోపాటు నీటివసతి కలిగి ఉన్న బోరుబావి
- అయిదెకరాల్లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు

అధికారుల పర్యవేక్షణ ఇలా...

పశుగ్రాసం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఉపాధి ఏపీఓ క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తరువాత సాంకేతిక సహాయకుడు అంచనాలు తయారు చేస్తారు. దరఖాస్తుదారుడికి పశువులు ఉన్నదీ లేనిదీ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సచివాలయ ఉద్యోగి నిర్ధారణ చేసిన తరువాత నిధులు మంజూరు చేస్తారు.

వ్యక్తిగత సాగు విస్తీర్ణం..

- 2 పశువులకు 25 సెంట్లు
- 3-5 పశువులకు 50 సెంట్లు
- 5 పశువులకు పైబడి 1 ఎకరా వరకు అవకాశం

కావాల్సిన పత్రాలు

ఉపాధి హామీ జాబ్‌కార్డు, భూమికి సంబంధించిన 1బి, ఆధార్, రేషనుకార్డు, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం

పథకం అమలు తీరు...

వ్యక్తిగతంగా పశుగ్రాసం సాగుచేసే రైతులకు 25 సెంట్ల నుంచి ఒక ఎకరాల్లో సాగు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఒక ఎకరాల్లో సాగు చేసే పశుగ్రాసానికి రెండేళ్ల వరకు ఉపాధి హామీ పథకం ద్వారా 184 రోజుల పని దినాలకు రూ.56,488 చొప్పున వారి వ్యక్తిగత ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

సకల జీవరాసుల్లోనూ పరమాత్ముడే..

జ్యోతి వెలిగిస్తున్న చేస్తున్న బ్రహ్మకుమారీలు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సృష్టిలో ఉన్న జీవరాసులన్నింటిలోనూ పరమాత్ముడు ఉంటాడని బ్రహ్మకుమారీల రీజనల్ డైరెక్టర్ సుగంధదీది పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం స్థాపించి 90సంలు పూర్తి చేసుకున్న సందర్భంగా త్రిమూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ భగవంతుడిని నిత్యం శ్రద్ధతో ధ్యానించడం వల్ల మనలో సనాతనధర్మం అలవడుతుందన్నారు. సమాజంలో మనకంటే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. శివనామం స్మరిస్తూ 'పుర' వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజయోగిని కమల, పెద్ద సంఖ్యలో బ్రహ్మకుమారీలు, మహిళలు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.4.23 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల నుంచి మొత్తం రూ.4,23,770 ఆదాయం లభించింది. ఇందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.2,53,670, ఆదివారం నిర్వహించిన పశువుల సంతలో రూ.1,70,100 ఆదాయం వచ్చినట్లు యార్డు ఎంపిక శ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలియజేశారు.

కదిరి ఆలయ సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం నేటి (సోమవారం) ఉదయం ఆరు నుంచి 6.45 గంటల వరకు ఉంటుంది. 7 గంటల నుంచి 9 గంటల మధ్య ఖాద్రీశుడికి అభిషేక, స్వర్ణకవచ సేవలు. తర్వాత 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

పరిగి చెరువులకు కృష్ణా జలాలు

సాగునీరు అందుతుందని అన్నదాతల హర్షం

పరిగి, న్యూస్‌టుడే: పరిగి మండలంలోని పరిగి, కొడిగెనహళ్లి, గొరవనహళ్లి చెరువులకు ఎట్టకేలకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను విడుదల చేయడంతో ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో మంత్రి సవిత చొరవతో ఎట్టకేలకు ఆయా చెరువులకు సాగునీటిని తరలిస్తున్నారు. నెల రోజుల పాటు నీటిని తరలిస్తే వ్యవసాయానికి సాగునీటితో పాటు, మండల ప్రజల దాహార్తి తీరుతుంది. పరిగి చెరువు కింద 2,800 ఎకరాలు, కొడిగెనహళ్లి, గొరవనహళ్లి చెరువుల కింద 1500 ఎకరాల సాగు భూమి ఉంది. ఇప్పటి వరకు హిందూపురం మండలంలోని చెరువులకు మాత్రమే నీటిని సరఫరా చేశారు. హంద్రీనీవా కాలువ చివరన ఉన్న మడకశిర ప్రాంతంలోని గుడిబండ చెరువులకు నీటిని తరలించి నింపారు. పరిగి చెరువు కింద రైతులు మొక్కజొన్న, మిరప పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పొట్టదశలో ఉంది. చెరువులో ఒక నెలకు సరిపడా నీరు నిల్వ ఉంది. మరో 15 రోజుల పాటు నీరు వస్తే చెరువు కింద రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరు సంవృద్ధిగా లభిస్తుందని రైతు సంఘం నాయకుడు కొండూరు నవీన్ హర్షం వ్యక్తం చేశారు. కూటమి నాయుకులు సైతం పై చెరువులను కృష్ణాజలాలతో నీటిని నింపేందుకు కృషి చేస్తున్నారు. చెరువుకు నీరు చేరితే సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు, బోర్లలో భూగర్భజల మట్టం పెరుగుతుందని మరో ఏడాది పాటు నీరు సమృద్ధిగా లభించి పంటలు సాగుకు అనుకూలంగా ఏర్పడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

నీటిని పరిశీలిస్తున్న తెదేపా నాయకులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని కూలీ మృతి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న కూలీని గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందిన ఘటన మండలంలోని వెల్పుమడుగు బస్టాండ్ వద్ద జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లా శిబతల గ్రామానికి చెందిన పరమేశ్ సాహు (57) వేల్పుమడుగు వద్ద ఉన్న ఇటుకల బట్టీలో పని చేస్తున్నాడు. రోజు మాదిరి శనివారం రాత్రి వేల్పుమడుగు బస్టాండ్ సమీపంలోని సిల్క్ ఫ్యాక్టరీ పక్కన ఉన్న హోటల్ వద్దకు భోజనానికి వెళ్లాడు. రోడ్డు దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ఇటుకల బట్టీ నిర్వాహకుడు దుదేకుల పీరా సాహెబ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

యువకుడి దుర్మరణం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణ మండలం సిండికేట్‌నగర్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రూరల్ మండలం నరసనాయునికుంటకు చెందిన నరేశ్ (18) అనే యువకుడు వ్యక్తిగత పని నిమిత్తం నగరానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. సిండికేట్ నగర్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా, అనంతపురం నుంచి ఉరవకొండ వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. తలకు తీవ్రగాయాలైన నరేశ్ అపస్మారకస్థితికి చేరాడు. స్పందించిన స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున చనిపోయాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు పట్టణం కసాపురం రోడ్డుపక్కన నివాసముంటున్న రహిమాన్ కుమారుడు ఇర్ఫాన్ (18) ఇంట్లో ఉరేసుకుని ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించిన వివరాలను కసాపురం పోలీసులు రహిమాన్ హోటల్‌ను నిర్వహణతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతను ఊరికి వెళ్లగా కుమారుడు ఇంట్లో గడియపెట్టుకుని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇంటికొచ్చాక కుమారుడు మృతిని తట్టుకోలేక లబోదిబోమని విలపించారు. కుమారుడికి కడుపునొప్పి తీవ్రంగా ఉండేదని వాపోయారు. ఈక్రమంలోనే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశాడు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

సోమందేపల్లి, పెనుకొండ, న్యూస్‌టుడే: సోమందేపల్లి, రొద్దం గ్రామాల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రహదారి ప్రమాదాల్లో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పెట్రోల్ బంకు ఎదుట ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో సోమందేపల్లికి చెందిన ఫయాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. రొద్దం సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో చోదకుడు శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనాల్లో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు, బంధువులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

ఘర్షణలో మరో ముగ్గురికి..

గుత్తి: గుత్తిలోని జగనన్న కాలనీలో ఆదివారం సాయంత్రం ఇరువర్గాలకు చెందిన వారు ఘర్షణకు పాల్పడ్డారు. ఘర్షణలో ఓ వర్గానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నవీన్, జనార్దన్, మధు దాడికి పాల్పడ్డారు. ఆర్థిక లావాదేవీల వల్ల తమపై కర్రలతో బాలరంగారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలు దాడి చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం. ✆ 7382114647.

REAL ESTATE

PLOT FOR SALE

అరవకూరు దగ్గర, బళ్లారి హైవేకి మొదటి బిట్టు, కార్గో హబ్-ఎయిర్‌పోర్ట్ దగ్గరలో 50 సెంట్స్ ప్లాటు అమ్మకానికి కలదు. సంప్ర: 9908469828.

LEASE/ RENT

స్కూలు లీజుకు కావలెను. అనంతపురం నగర పరిసరాలలో మంచి బిల్డింగ్ విశాలమైన గ్రౌండ్ అన్ని వసతులతో కూడిన స్కూల్ లీజుకు ఇవ్వదలుచుకొన్నవారు సంప్ర: 9133399861.

LAND REQUIRED

ల్యాండ్ పార్ట్నర్స్ Land Partners కావలెను. మీ భూమిలో అపార్ట్‌మెంట్లు, విల్లాలు, వాణిజ్య ప్రాజెక్టులు నిర్మించుకోవాలనుకునే భూమి యజమానులు సంప్రదించగలరు. అభివృద్ధి చేయించుకొని లాభం పొందండి. ఆసక్తికలవారు వెంటనే ఫోన్‌చేయండి. ✆ 9133399861.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ, బళ్లారి రోడ్, రాచానపల్లి, అనంతపురం రూరల్ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. ✆ 9780029999.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS

5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

పరిగిలో జ్యోతులతో వస్తున్న మహిళలు

వైభవంగా జ్యోతుల ఉత్సవం

పరిగి, న్యూస్‌టుడే: మహాశివారాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భీరలింగేశ్వరస్వామికి మహిళలు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. కర్ణాటకకు చెందిన సాంస్కృతిక కళాకారుల నృత్య ప్రదర్శనలు, శివుడి వేషధారణ ఆకట్టుకున్నాయి.

క్షయవ్యాధి మందులతో నయం : మంత్రి

పెనుకొండ, న్యూస్‌టుడే: క్షయ వ్యాధిగ్రస్థులు క్రమం తప్పకుండా ప్రభుత్వం సరఫరా చేసే మందులు వేసుకుంటే పూర్తిగా కోలుకోవచ్చని మంత్రి సవిత అన్నారు. ఆదివారం పెనుకొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం(ఎన్‌టీఈపీ) సిబ్బంది ఆధ్వర్యంలో సంపూర్ణ హైటెక్, ఏఆండ్‌డీ ప్రైవేటు పరిశ్రమలు కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్) ద్వారా పంపిణీ చేస్తున్న పోష్టికాహార కిట్లు రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సరైన పోష్టికాహారం, పరిశుభ్రత, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా క్షయవ్యాధి పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. వ్యాధి నిర్మూలన చర్యల్లో భాగంగా రోగుల ఖర్చుల కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.1000 అందజేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని సమాజాన్ని ఆరోగ్యవంతంగా మార్చడంలో భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో డీపీసీ మల్లికార్జున, పీపీఎం సమన్వయకర్త నాగేంద్ర, ల్యాబ్ పర్యవేక్షకుడు శశిధర్, సిబ్బంది అఫ్జల్ అహ్మద్, టీబీ హెచ్‌వీ రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, వైద్య సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: కగ్గల్లు నుంచి పూలకుంటకు వెళ్లే రోడ్డులో గుంతలు పడ్డాయి. **- అనిల్‌కుమార్**
సమాధానం: రెండు రోజుల్లో మట్టిని వేయించి మరమ్మతులు చేయిస్తాం. **-నద్మావతి, సర్పంచి**
సమస్య: గుడ్డంపల్లిలో శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. **- నారాయణప్ప**
సమాధానం: త్వరలో కొత్తదీపాలు ఏర్పాటు చేస్తాం. **- మహేశ్, విద్యుత్తు ఏఈ**
సమస్య: బంద్రేపల్లి అంగన్‌వాడీ ప్రాంతంలో మురుగు నీరు నిలుస్తోంది. **-నాగరాజు**
సమాధానం: వెంటనే తొలగింపజేస్తాం.
- నరసింహప్ప, సర్పంచి, ఎమ్.రాయాపురం
సమస్య: ఆర్.గొల్లహట్టి గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. **- కరియన్న**
సమాధానం: కొత్తవాటిని ఏర్పాటు చేయిస్తాం. **- రచన, కార్యదర్శి, రత్నగిరి**
సమస్య: తిమ్మలాపురం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారం నెలకొంది. **-నాగరాజు**
సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **- రంగస్వామి, సర్పంచి, తాళికెర**
సమస్య: ఎంఎస్ తండాలో మోటారు, స్టార్టరు బిగించాలి. **- జయరామ్‌నాయక్**
సమాధానం: త్వరలో బిగించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.
-లక్ష్మీనరసప్ప, మండల కన్వీనర్, గుడిబండ
సమస్య: మద్దనకుంట ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేవు. **- హనుమంతరాయప్ప**
సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం.
-అమరేశ్, పంచాయతీ కార్యదర్శి, మద్దనకుంట
సమస్య: మండలపల్లిలో తాగునీటి సమస్య నెలకొంది. **- ఈరక్కాతప్ప**
సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.**- నాగరాజునాయక్, డిప్యూటీ ఎంపీడీఓ, గుడిబండ. – న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం, రొళ్ల, గుడిబండ**

ఎండిన చెట్లు.. విరుగుతున్న కొమ్మలు

రహదారుల్లో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

మడకశిర గ్రామీణం, రొళ్ల, న్యూస్‌టుడే: ప్రధాన రోడ్ల పక్కన ఏళ్ల కాలం నాటి చెట్లు ఎండిపోయాయి. గాలి కాలం కావడంతో వాటి కొమ్మలు విరిగి పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రహదారులు, పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణాల్లో చెట్లు ఎండి తరచూ కొమ్మలు విరిగి పడుతున్నాయి. సమస్యను వివరిస్తూ 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమైనా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

- రొళ్ల మండలం బాజయ్యనపాళ్యం, పిల్లిగుండ్లు, జీబీహళ్లి, అలుపనపల్లి, కాకీ, రంగాపురం, హుణిసేకుంట, సీఎం గట్ట ఆర్‌అండ్‌బీ రహదారిలో బలమైన గాలులు వీస్తే విరిగి పడుతున్నాయి.
- అమరాపురం నుంచి హిందూపురం వెళ్లే రోడ్డులో ఉగ్రేపల్లి, తడకలపల్లి, అయ్యవారిపల్లి, భూతప్ప కనుమ ప్రాంతంలో ఉన్నాయి.

రొళ్లలో విరిగి పడిన జువ్విచెట్టు కొమ్మ

నివేదిక ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఆర్‌అండ్‌బీ రోడ్లలో ఎండిన చెట్లు తొలగించేందుకు ఆ శాఖ అధికారులు నివేదిక సమర్పిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి నుంచి ఆదేశాలు అందిన వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **-చాంప్లానాయక్, అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, మడకశిర**

చోటుచేసుకున్న ఘటనలు

తీవ్రంగా గాయపడిన విజయలక్ష్మి

- గుడిబండ మండలం మోరుబాగల్ గ్రామానికి చెందిన ఇద్దరు దంపతులు ఆరు నెలల క్రితం కరికెర కేజీబీవీలో చదువుతున్న కుమార్తెను చూసి వచ్చేందుకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా నాగేపల్లి వద్ద ఎండిన చెట్టు కొమ్మ విరిగి ద్విచక్రవాహనంపై పడి భర్త గాయపడగా భార్య అక్కడికక్కడే మృతి చెందింది.
- నాలుగు రోజుల క్రితం రొళ్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి ద్విచక్రవాహనంలో భర్తతో కలిసి వస్తుండగా బస్టాండు సమీపంలో ఎస్ఎల్ఎన్ హోటల్ ముందు భాగంలో ఎండిన జువ్వి చెట్టు కొమ్మవిరిగి తలపై పడింది. తీవ్ర గాయం కావడంతో ఆమెను స్థానిక ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్ణాటకలోని తుమకూరు తరలించారు.

భక్తిశ్రద్ధలతో 16 సోమవారాల వ్రతం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని చిన్నమార్కెట్ సర్కిల్‌లో ఉన్న సత్యనారాయణస్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి మహిళా మండలి సభ్యులచేత 16 సోమవారాల వ్రతం, డీబీ కాలనీలో ఉన్న అష్టలక్ష్మి ఆలయంలో అష్టలక్ష్మి మహిళా మండలి వారిచే ద్వాదశ జ్యోతిర్లింగాల వ్రతం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు నియమ నిష్ఠలతో మట్టితో లింగాలను తయారు చేసిప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్షుడు సీఎం ఆదినారాయణ గుప్త, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

వ్రతం ఆచరిస్తున్న మహిళా మండలి సభ్యులు

లింగోద్భవం.. భక్తపరవశం

శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు

హిందూపురం: టీచర్స్ కాలనీలో అచలేశ్వరుడు

కొండూరులో పరమేశ్వరుడు

సిద్ధేశ్వరస్వామి

బూదిలి కోటిలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

సోమందేపల్లి: చాలకూరులో..

మహాశివరాత్రి వేడుకలు భక్తులు ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. ఆలయాలన్నీ శివ నామస్మరణతో మార్మోగాయి. భక్తులు ఉదయమే ఆలయాలకు వచ్చి అభిషేకాలు, కుంకుమార్చనలు, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. జాగారం చేసే చోట భక్తులకు సౌకర్యాలు కల్పించారు. శివ పార్వతుల కల్యాణాన్ని ఘనంగా అర్చకులు నిర్వహించారు. పెనుకొండ పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. **-న్యూస్‌టుడే బృందం**

ఐముక్తేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న ఎంపీ బీకే పార్థసారథి, కూటమి శ్రేణులు

పెనుకొండ: బోగసముద్రం చెరువు వద్ద..

లేపాక్షి : నాగేంద్రుడి చెంత లింగానికి క్షీరాభిషేకం

భోగసముద్రం చెరువులో నృత్య బృందంతో మంత్రి సవిత

రొళ్లలో విశేష అలంకారం

సమస్య.. పరిష్కారం

స్పందనకు వందనం

హిందూపురం సాంస్కృతికం: పట్టణంలోని రిలయన్స్ సూపర్ మార్కెట్ నుంచి ధర్మపురం వెళ్లే రహదారిలోని కాలువలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పారిశుధ్య కార్మికుల చేత తొలగింపజేశారు.

ఆకట్టుకున్న శివుడి చిత్రం

మహాశివరాత్రి పురస్కరించుకొని స్థానిక పాండురంగనగర్‌లో ఉన్న ఓం క్రియేషన్స్ ఆర్ట్స్ స్కూలు ఆవరణంలో శిక్షకురాలు సరస్వతి తనకున్న చిత్రలేఖనం నైపుణ్యం, అనుభవంతో ఆదివారం వేసిన రంగు రంగుల శివుడి చిత్రం బాగా ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, తదితరులు చిత్రాన్ని చూసి వివిధ ఆకృతిలో ఉన్న శివుడి బొమ్మను తిలకించారు.
-న్యూస్‌టుడే- హిందూపురం గ్రామీణం

మట్టి తోలించి చదును చేయిస్తున్న అధికారులు

హంద్రీనీవా కాలువకు మరమ్మతులు

సోమందేపల్లి: స్థానిక నక్కలగుట్ట సమీపంలో హంద్రీనీవా కాలువకు గండి పడే ప్రమాదం పొంచి ఉండటంతో హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు ఆదివారం ఉదయం మరమ్మతులు చేపట్టారు. శనివారం సాయంత్రం నక్కలగుట్ట పంప్‌హౌస్ వద్ద మూడు మోటార్ల ద్వారా కృష్ణా జలాలను తోడి కాలువలోకి సరఫరా చేయడంతో నీరు పొంగిపోయి పక్కన ఉన్న గుంతలోకి వెళ్లడంతో కాలువకు ప్రమాదం ఏర్పడింది. ఈ సమాచారం అందుకున్న హెచ్ఎన్ఎస్ఎస్ డీఈ రామసుబ్బయ్య, ఏఈలు రాత్రి కాలువను పరిశీలించి, ఒక మోటారును ఆపివేయించడంతో పాటు అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించారు. ఆదివారం ట్రాక్టర్లతో మట్టిని తెప్పించి ప్రమాదంగా ఉన్న కాలువపై వేయించారు. పొక్లెయిన్‌తో చదును చేయించారు.

పేద ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ

గోరంట్ల, న్యూస్‌టుడే: కదిరికి చెందిన అల్ ఖైర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ పండగను పురస్కరించుకుని గోరంట్లలో 150 మంది పేద కుటుంబాలకు ఆదివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇందుకోసం స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి కిట్లను అందజేశారు. నాలుగు దశాబ్దాలుగా ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు ట్రస్ట్‌ఛైర్మన్ అన్వర్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ఉపాధ్యాయులు, మౌలానాలు, బ్రాడ్‌వే పాఠశాల హెచ్ఎం గౌస్‌బాషా పాల్గొన్నారు.

నిత్యావసరాల కిట్ అందజేస్తున్న సంస్థ నిర్వాహకుడు

భూతప్ప కనుమలో ఖవాళీ

గుడిబండ: మండలంలోని భూతప్ప కనుమలో హజరత్ సయ్యద్‌మస్తాన్‌షావలి దర్గాలో ఆదివారం ఖవాళీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దర్గాను నూతన వస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి చదివింపులు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూల అలంకరణలో మస్తాన్‌వలి దర్గా

ఘనంగా సంత్‌సేవాలాల్ ఉత్సవం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజను ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సంత్‌సేవాలాల్ ఉత్సవాన్ని టీడీపల్లి తండాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి హాజరై సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తెదేపా నాయకులు సేవాలాల్ ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పూలు, పండ్లు, కొబ్బరికాయలు, జ్యోతులతో ఊరేగింపుగా వెళ్లి స్వామి వారికి సమర్పించారు.

పెనుకొండ: మండలంలోని శెట్టిపల్లిలో గరుడవాహనంపై సేవాలాల్ చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో తెదేపా మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్షావలి, పలువురు కూటమి శ్రేణులు, తండాపెద్దలు పాల్గొన్నారు.

శెట్టిపల్లితండాలో సేవాలాల్ చిత్రపటం ఊరేగింపు

ఉత్సవంలో పాల్గొన్న మహిళలు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి

పగిలిన పైపు.. పొంచి ఉన్న ప్రమాదం

ఆ మిదాలగొంది గ్రామంలో ప్రధాన రోడ్డు పక్కన పశువుల నీటి తొట్టికు నీరు సరఫరా అయ్యే పైపు పగిలి గుంత ఏర్పడింది. గుంత కారణంగా ప్రమాదం పొంచి ఉంది. సత్వరమే పైపునకు మరమ్మతుచేసి గుంతను పూడ్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి విష్ణువర్దన్‌రెడ్డి మాట్లాడుతూ గుంతను పూడ్చనున్నట్లు తెలిపారు. **-న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం**

రహదారి పనుల్లో నాణ్యత పాటించండి

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: 70 అడుగుల వెడల్పుతో చేపడుతున్న రైల్వే రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ గుత్తేదారులకు సూచించారు. ఆదివారం ఆయన నిర్మాణ పనులను ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డా.సురేంద్రతో కలిసి పరిశీలించారు. మొదటి విడతగా నంది సర్కిల్ నుంచి ఎస్ఆర్‌కే రెసిడెన్సీ వరకు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డుకు మధ్యలో నాలుగు అడుగుల డివైడర్ ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్, ఇరువైపులా మురుగుకాలువలు నిర్మాణ పనులు మార్చి నెలఖరుకు పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. రెండో విడత ఎస్ఆర్‌కే రెసిడెన్సీ నుంచి బాలాజీ సర్కిల్ వరకు సోమవారం పనులు ప్రారంభిస్తామన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్‌కుమార్, మాజీ జిల్లా తెదేపా అధ్యక్షుడు అంజినప్ప, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, కౌన్సిలర్ రాఘవేంద్రర, వ్యక్తిగత కార్యదర్శి బాలాజి, తెదేపా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రైల్వే రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి

పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలి

హిందూపురం సాంస్కృతికం: పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని పోటీ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ఆదివారం అభయ నిస్వార్థ ఫౌండేషన్ రెసిడెన్సియల్ పద్ధతిలో బోధన ఇవ్వడానికి విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల నుంచి 270మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సిద్ధగిరి శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్, ఎంఈఓ, అభయ నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధులు

రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే : పట్టణంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో రహదారులు, మురుగుకాలువలు నిర్మిస్తూ ఉన్నారు. పలుచోట్ల క్యూరింగ్ చేయడం లేదు. మొదటిరోజు చేసి తర్వాత వదిలేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గుత్తేదారు క్యూరింగ్ పనులకు ఇతరులకు అప్పగించారు. అయితే వారు క్యూరింగ్ చేయడం లేదు. నీళ్లు వేయకపోగా ఎవరి ఇంటి ముందు వారు వేసుకోవాలని అభివృద్ధి పనులు జరిగిన ప్రాంతాల్లో జనానికి చెబుతుండటం గమనార్హం. పట్టణంలోని విద్యానగర్‌లో బాలాజీ కళాశాల ఎదుట కాలనీలో వేసిన రోడ్డుకు ఆయా ప్రాంత ప్రజలే నీళ్లు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి క్యూరింగ్ సక్రమంగా చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నీళ్లు పోయని రోడ్డు

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
గోరంట్ల బ్రాంచ్, శ్రీ సత్యసాయి జిల్లా.
బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా "స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" ఈ క్రింది బ్రాంచీలో "బంగారు నగలు" తాకట్టుపెట్టి అప్పు తీసుకొన్న ఈ దిగువ తెలిపిన ఖాతాదారుడు గడువు మీరిననూ, పలుమార్లు కోరిననూ, అప్పు తిరిగి చెల్లించనందులకు రిజర్వు బ్యాంకు వారి నిబంధనల ప్రకారం దిగువ కనబరచిన షెడ్యూలు ప్రకారం **18-02-2026వ తేది బుధవారం సా॥ 5.00 గం॥లకు బ్రాంచ్ ఆవరణం నందు బహిరంగ వేలము వేయబడును.**

క్ర. సం.	ఖాతాదారుని పేరు, చిరునామా	అకౌంట్ నెంబర్	అప్పు మొత్తం (సుమారుగా) రూ॥
	గోరంట్ల బ్రాంచి, శ్రీ సత్యసాయి జిల్లా. మొబైల్ నెం: 7259215109		
1	గొల్ల సోమరాజు S/o జి.పాపన్న, డోర్.నెం: 3, కొత్త బయనపల్లి గ్రామం, పూలేరు (పోస్టు), గోరంట్ల.	42213001647	1,35,000/-

వేలం షరతులు: 1) వేలం నందు పాల్గొనదలచినవారు రూ॥ 10,000/- ధరావత్తు కట్టి వేలములో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తమును అదే రోజు నగదును చెల్లించి నగలను పొందవలెను. 3) ఈ ఖాతాదారుడు మరణించిన యెడల అతని వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 4) అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవచ్చును. 5) వేలం ద్వారా వచ్చిన సొమ్ము బాకీ మొత్తమునకు సరిపోనియెడల చట్టరీత్యా చర్యలు తీసుకొని మిగిలిన బాకీ మొత్తము రాబట్టుకొనబడును. 6) వేలం పాటలో పాల్గొనదలచినవారు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డుతో రావలెను. 7) ఇందలి ఖాతాదారునకు ఏ ఇతర రుణములు ఉన్నచో మిగిలిన సొమ్ము ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును. 8) ఈ ప్రకటనకు అయ్యే ఖర్చు పైన తెలిపిన ఖాతాదారుని నుంచి వసూలు చేయబడును. 9) నగల బరువునకు, నాణ్యతకు బ్యాంకువారికి పూచీలేదు.
గమనిక: ఏ విధమైన కారణం చూపకుండానే షరతులు మార్చుకొనుటకుగానీ, వేలం వాయిదా వేయుటకుగానీ, వేలం రద్దు చేయుటకు గానీ ఆయా బ్యాంకు మేనేజర్ల గారికి పూర్తి అధికారము కలదు.
తేది: 15-02-2026 సం/- మేనేజర్
స్థలం: గోరంట్ల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోరంట్ల

రథోత్సవ శుభాకాంక్షలు
శిల్పకళలకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి శ్రీ దుర్గా పాపనాశేశ్వర వీరభద్ర స్వామి వారి బ్రహ్మరథోత్సవానికి విచ్చేయుచున్న అశేష భక్తకోటికి స్వాగతం.
విద్యుత్-శాఖ, లేపాక్షి

రథోత్సవ శుభాకాంక్షలు
శిల్పకళలకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి శ్రీ దుర్గా పాపనాశేశ్వర వీరభద్ర స్వామి వారి బ్రహ్మరథోత్సవానికి విచ్చేయుచున్న అశేష భక్తకోటికి స్వాగతం.
భక్తబృందము, లేపాక్షి

రథోత్సవ శుభాకాంక్షలు
కళలకు కాణాచిగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి శ్రీ దుర్గా పాపనాశేశ్వర వీరభద్ర స్వామి వారి బ్రహ్మరథోత్సవ కార్యక్రమానికి విచ్చేయుచున్న అశేష భక్తజనులకు లేపాక్షి గ్రామ పంచాయతి ప్రజల తరపున ఇదే మా హృదయపూర్వక స్వాగతం.
మహాశివరాత్రి ఉత్సవాలకు అహర్నిశలుగా శ్రమిస్తున్న లేపాక్షి మండల అధికారులకు, పోలీసు వారికి, గ్రామ పంచాయతీ సిబ్బందికి మా హృదయపూర్వక ధన్యవాదములు.
వి.ఆదినారాయణ (కొండ) సర్పంచ్, లేపాక్షి
దుర్గం నాగరాజు Grade-II పంచాయతి కార్యదర్శి, లేపాక్షి

బ్రహ్మ రథోత్సవ ఆహ్వానము
శిల్పకళలకు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి శ్రీశ్రీశ్రీ దుర్గాపాపనాశేశ్వర స్వామి వారి బ్రహ్మ రథోత్సవానికి విచ్చేయుచున్న ఆశేష భక్తకోటికి స్వాగతం.
బ్రహ్మ రథోత్సవ సమయం
16-02-2026వ తేది సోమవారం మధ్యాహ్నం 1 గంటకు
రథోత్సవ సమయంలో భక్తాదులందరూ క్రమశిక్షణ పాటించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరుకుంటూ..
సి.కరణం రమానందన్
ఆలయ కమిటీ ఛైర్మన్, లేపాక్షి

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

'రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు అన్యాయం'

ధర్మవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి నిధుల కేటాయింపులో అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం చేసిన అన్యాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనసాగించిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు రూ.115 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. ఎన్నికల హామీగా చేనేత కార్మికులకు ప్రతి ఏటా నేతన్న భరోసా పథకం ద్వారా రూ. 25 వేలు ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా అమలు చేయలేదన్నారు. ఈ నెల 22న మంగళగిరిలో జరగనున్న చేనేత గర్జనలో సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: వీరనారాయణస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆదివారం మండలంలోని సంకేపల్లి దగ్గర ఉన్న ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చానన్నారు. రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, మరో రూ.14 లక్షలతో మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకులు నిర్మించామన్నారు. అభివృద్ధి పనులు చేసి మాట నిలబెట్టుకున్నానన్నారు. ఆలయం అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ నాయుడు, తెదేపా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేశ్ బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో సమాజంలో గౌరవం

కదిరి, న్యూస్‌టుడే: సమాజంలో గౌరవ స్థానం సత్ప్రవర్తనతో సాధ్యం అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్‌ఉన్నీసా తెలిపారు. కదిరిలోని రబ్బానియా మదరసా వార్షికోత్సవాన్ని హజ్రత్ మౌలానా షఫ్కతుల్లా అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఛైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మదరసా కార్యదర్శి హాజీ అత్తార్ మహబూబ్‌బాషా మాట్లాడారు. మదరసాను 21ఏళ్లుగా నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 18 మంది బాలబాలికలు, మహిళలు ఖురాన్ పఠనాన్ని పూర్తి చేశారని, వారికి అతిథుల చేతుల మీదుగా ఖురాన్, బురఖాలు, దుస్తులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బీబీజాన్, తెదేపా నాయకుడు బహావుద్దీన్, మదరసా కమిటీ సభ్యులు అజీంఖాన్, అన్వర్‌బాషా, హబీబ్ అహమ్మద్ హుసేన్, నౌషాద్, చాంద్‌బాషా, బాబ్జాన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఛైర్‌పర్సన్, మదరసా సభ్యులు

సర్వం శివనామస్మరణ..



గాండ్లపెంట: ప్రత్యేకంగా అలంకారంలో శివలింగం | తనకల్లు: గౌరీ సమేత జంబులింగేశ్వరస్వామి | కదిరి: గ్రామోత్సవంలో ఉమామహేశ్వరులు | బత్తలపల్లి: లలిత త్రిపుర సుందరి ఓంకారేశ్వరుడు | ధర్మవరం: జలలింగేశ్వరస్వామి | పుట్టపర్తిలో.. | ధర్మవరం: చంద్రమౌళేశ్వరుడు

తాడిమర్రిలో శివపార్వతుల ఊరేగింపు | నల్లమాడ: ఉమామహేశ్వరులు | సంగమేశ్వర దేవాలయంలో జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో భక్తులు ఆదివారం మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించారు. శైవక్షేత్రాల్లో మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. శివలింగాలకు భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ధర్మవరంలో జల లింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదనరెడ్డి, చాయాదేవి దంపతులు రూ.10వేల విరాళం అందజేశారు. మూలపల్లిలో జబర్దస్త్ బృందం సందడి చేశారు. పెద్దన్నవారిపల్లిలో కోలన్నలు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే బృందం

కనుల పండువగా కాశీవిశ్వనాథస్వామి రథోత్సవం

ధర్మవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం ధర్మవరం శివనగర్ బచ్చునాగంపల్లి కాశీవిశ్వనాథ స్వామి రథోత్సవం నిర్వహించారు. రథంపై శివపార్వతుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం మడుగుతేరును శివభక్తులు, స్థానికులు లాగారు. సాయంత్రం శివనగర్ ప్రధాన రహదారి మీదుగా రథోత్సవం సాగింది. మంత్రి సత్యకుమార్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి రథాన్ని లాగారు. శివనామస్మరణతో పురవీధులు హోరెత్తాయి.

రథాన్ని లాగుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కల చిన్నచెరువు మరువ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు లైన్‌లో ఓ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. మరమ్మతు చర్యలు తీసుకోవాలి. **- ధనుంజయ, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- రామాంజనేయులు, మండల విద్యుత్తు అధికారి**

సమస్య: చెన్నేకొత్తపల్లి మండలం ఓబుళంపల్లి గ్రామ సమీపంలో చేపట్టిన రహదారి వంతెన పనుల వద్ద ఓ వైపు దారికి లోతైన గుంత తవ్వి వదిలేశారు. ఆ దిశగా వాహనరాకపోకలు మళ్లించారు. గుంత ప్రమాదకరంగా మారింది. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయగలరు. **- నారాయణరెడ్డి, అమిదాలకుంట**

సమాధానం: నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి ఏర్పాటు చేయిస్తాం. **- అబ్దుల్ ఖాదర్, పంచాయతీరాజ్, మండల ఇన్‌ఛార్జి ఏఈ**

–న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడండి

తాడిమర్రి, న్యూస్‌టుడే: కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండదని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు ఎస్పీ అంకితా సురాన హెచ్చరించారు. ఆదివారం క్షేత్రంలో జరుగుతున్న ఉత్సవాలను పరిశీలించారు. అనంతరం చిల్లవారిపల్లి గ్రామానికి చేరుకొని స్వామి వారి ప్రతిమలైన గుర్రం విగ్రహం ఊరేగింపులో తీసుకోవాల్సిన భద్రత చర్యలను బందోబస్తు సిబ్బందికి సూచించారు. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని గ్రామస్థులకు తెలియజేశారు. అనంతరం కాటికోటేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అదనపు ఎస్పీ వెంట డీఎస్పీలు హేమంత్‌కుమార్, విజయ్‌కుమార్, సీఐ సునీత తదితరులు ఉన్నారు.

చిల్లవారిపల్లిలో భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ అంకితా సురాన

రణభేరి 2.0 జయప్రదం చేయండి

కదిరి, న్యూస్‌టుడే: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న చలో విజయవాడ రణభేరి 2.0ను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి రామచంద్రరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీవో హోంలో యూటీఎఫ్ డివిజన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్సీ, ఐఆర్, డీఏ, ఈఎల్, ఇతర హామీల అమలు సాధనకు రణభేరి కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పెద్దసంఖ్యలో తరలి వెళ్లి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, రామకృష్ణనాయక్, రవివర్ధన్ రెడ్డి, తాహిర్‌వలి, సునీల్‌కుమార్, నారాయణస్వామి, ఆజంబాషా, మధుసూదన్, పాల్గొన్నారు.

'డీజే పెడితే కేసులు నమోదు చేస్తాం'

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: సంకేపల్లి దగ్గర ఉన్న వీరనారాయణస్వామి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరగనున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ముదిగుబ్బ టౌన్ సీఐ శివరాముడు సూచనలు ఇలా..

- సంకేపల్లి క్రాస్ నుంచి వీరనారాయణస్వామి గుడికి ద్విచక్ర వాహనాలు, ఎద్దుల బండ్లకు మాత్రమే అనుమతి ఉంది. పరస మండ్లలో ట్రక్కికి కుడివైపున మాత్రమే పార్కింగ్ చేయాలి.
- కమ్మవారిపల్లి రోడ్డు మీదుగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, బొలెరో, పెద్ద వాహనాలు మాత్రమే వెళ్లాలి. పరస మండ్ల దగ్గర మట్టి రోడ్డు పక్కనే పార్కింగ్ చేయాలి.
- ఉదయం 6 నుంచి 10గంటల వరకు గద్దె చుట్టూ ట్రాక్టర్లు, కార్లు ప్రదక్షిణలు చేయొచ్చు. 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎద్దుల బండ్లు మాత్రమే ప్రదక్షిణ చేపట్టాలి. అనంతరం వాహనాలకు అనుమతి ఉంది.
- గద్దె చుట్టూ రెండు రౌండ్లు మాత్రమే తిప్పాలి. డీజేలు, సినిమా పాటలు, రాజకీయ పాటలు పెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జాతర పరిసరాల్లో జూదం ఆడినా, నిర్వహించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం.

ఉద్యోగుల హామీలు నెరవేర్చాలి

నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్సీ, ఐఆర్, డీఏ, ఈఎల్‌తో పాటు ఇతర హామీలను సాధించుకునే వరకు ఉద్యమిస్తూనే ఉంటామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణనాయక్ తెలిపారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. మూడేళ్లు గడుస్తున్నా పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయలేదని, ప్రభుత్వం ఎన్నికల హామీలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 17న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, యూటీఎఫ్ డివిజన్ నాయకులు ఆంజనేయులు, లక్ష్మయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు నిత్యావసరాల పంపిణీ

తలుపుల, న్యూస్‌టుడే: మండలంలోని ప్రకాష్‌నగర్, ఉబ్బరవాండ్లపల్లి, నాగప్పగారిపల్లి, బండ్లపల్లి, కొత్తపల్లి, ఉడమలకుర్తి గ్రామాల్లో తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన చిన్నారులను గుర్తించి వారి ఆరోగ్యం, పోషణ, వ్యక్తిగత శుభ్రతకు ఉపయోగపడే 13రకాల అత్యవసర కిట్‌ను 11మందికి పంపిణీ చేసినట్లు కుర్లి ఉన్నత పాఠశాల పీడీ సాయికృష్ణ, తెలిపారు. కార్యక్రమంలో నావికాదళ ఉద్యోగి శ్రీకాంత్‌రెడ్డి, ఐఈఆర్‌పీలు శ్రీనివాసులు, భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగ అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించలేదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున విమర్శించారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగం బలోపేతానికి 30శాతం నిధులు కేటాయింపులు ఉండాలన్న కొఠారి కమిషన్ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు.

నిత్యం వృథా.. పట్టదా!

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: నీటి వృథాను అరికట్టాలని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారుల కార్యాలయంలోనే ఇలా నీరు వృథాగా పోతోంది. ఎనుములపల్లిలోని తహసీల్దార్ కార్యాలయ ప్రవేశద్వారం వద్ద నెలల తరబడి నీరు పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కార్యాలయ సిబ్బంది చొరవ తీసుకుని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మామిడికి రాయితీ కవర్లు

గాండ్లపెంట, కదిరి, న్యూస్‌టుడే: మామిడి కాయలకు తొడిగే కవర్లను రాయితీతో ఇస్తున్నట్లు ఉద్యాన అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. నాణ్యమైన దిగుబడులకు పొందాలంటే ఫ్రూట్ కవర్లను తప్పక వినియోగించాలన్నారు. తద్వారా మామిడి కాయలను అధిక వేడి, చీడపీడల నుంచి కాపాడుకొని అధిక ధరకు అమ్ముకోవచ్చని వివరించారు. ఈగ సమస్యను కూడా నివారించవచ్చని తెలిపారు. కవర్లకు రైతులు ఉద్యానశాఖ నుంచి హెక్టారుకు రూ. 15వేల రాయితీ పొందవచ్చని తెలపారు. ఆసక్తి కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి

శుద్ధజల ప్లాంట్లు ప్రారంభం

తలుపుల, న్యూస్‌టుడే: మండలంలోని కుర్లి గ్రామానికి చెందిన శుభకర్‌రెడ్డి ఆదివారం మూడు గ్రామాల్లో శుద్ధజలం ప్లాంట్లను ప్రారంభించారు. ఒక్కో ప్లాంట్‌కు రూ.5లక్షల వరకు ఖర్చు చేశారు. కుర్లి పంచాయతీలో రెడ్డివారిపల్లి, వీరప్పగారిపల్లి, బట్రేపల్లి పంచాయతీ మూలపల్లిలో వీటిని ప్రారంభించారు. ఈయన స్థానికుడైనప్పటికీ బెంగళూరు, విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఎగుమతులు నిర్వహిస్తున్నాడు. సొంతూరిపై మమకారంతో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వీటిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వీటిపై ఎలాంటి ప్రతిఫలం ఆశించలేదన్నారు. నిర్వహణ నిమిత్తం రూ.5 కాయిన్ బాక్స్‌ను కూడా స్థానికుల కోరిక మేరకే ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కుర్లి సర్పంచి అరుణమ్మ, శివారెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు శుద్ధజలం బిందెను అందజేస్తున్న శుభకర్‌రెడ్డి

మూడేళ్లుగా మంచానికే పరిమితం

కుటుంబ పోషణ భారం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: బేకరీలో పని చేస్తూ వినియోగదారులకు కేక్ డెలివరీ చేయడానికి వెళ్లి ద్విచక్రవాహన ప్రమాదం జరిగి మూడేళ్లుగా మంచానికే పరిమితమైన 34 ఏళ్ల వ్యక్తి దీనగాథ ఇది. కొత్తచెరువు మండల కేంద్రంలోని వృత్తి పనివారల కాలనీకి చెందిన పేద దంపతులు రామాంజనమ్మ, ఈశ్వరప్పల కుమారుడు రాఘవేంద్రకు సమీప బంధువుల కుమార్తె శిరీషతో పదేళ్ల క్రితం వివాహం అయింది. ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తిపాస్తులు లేని వీరికి కూలీ పనులే జీవనాధారం. రోజూ కూలీ పనులతో కుటుంబం హాయిగా గడిచేది. ఇంతలో విధి వెక్కిరించింది. బేకరీలో పనిచేస్తున్న రాఘవేంద్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెన్ను దెబ్బతినడంతో చేతిలో ఉన్న డబ్బంతా వెచ్చించారు. అప్పుచేసి వైద్యం చేయించారు. అనంతపురం, బెంగళూరులో లక్షలు వెచ్చించి చికిత్సలు చేయించడంతో కొంతకాలానికి కోలుకున్నా... తరువాత మళ్లీ ఆరోగ్యం క్షీణించి నడవలేని స్థితిలో మూడేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. సొంత పనులు కూడా చేసుకోలేని ఆయనను చూసి కుటుంబ సభ్యులు కుమిలిపోతున్నారు. దీంతో రాఘవేంద్రకు సేవలు చేయడంతో పాటు ఇద్దరు చిన్నారుల సంరక్షణ భారం భార్య శిరీషపై పడింది. తల్లి రామాంజనమ్మ గ్రామాల్లో తిరుగుతూ రెడీమేడ్ దుస్తులు విక్రయించడం, తండ్రి ఈశ్వరప్ప కుట్టుమిషన్ పనితో కుటుంబ పోషణ భారంగా మారింది.

భార్య, పిల్లలతో బాధితుడు రాఘవేంద్ర

పింఛను అందక ఇబ్బంది

రాఘవేంద్రకు పింఛను మంజూరు చేయాలని మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేదని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. ఇటీవల మండల పరిషత్ కార్యాలయానికి వెళితే మూడు చక్రాల సైకిల్ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పింఛను మంజూరుచేసి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

వరిగి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భీరలింగేశ్వరస్వామికి మహిళలు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. కర్ణాటకకు చెందిన సాంస్కృతిక కళాకారుల నృత్య ప్రదర్శనలు, శివుడి వేషధారణ ఆకట్టుకున్నాయి.

ఘనంగా పెద్దమ్మ జాతర

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బలో పెద్దమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే అమ్మవారి జాతరలో భాగంగా మొదటిరోజు మహాశివరాత్రి సందర్భంగా వెండి కిరీటాలు, గొడుగులతో అమ్మవారి మూలవిరాట్టును అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. పల్లకీసేవలో అమ్మవారిని గ్రామ పురవీధుల గుండా రాత్రంతా వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం గ్రామ శివారులోని నల్లలమ్మ ఆలయానికి పెద్దమ్మతల్లి మూలవిరాట్టును తీసుకొచ్చి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు.

అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న లారీ.. సరఫరా బంద్

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులోని ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్తు స్తంభాన్ని లారీ ఢీకొనడంతో విద్యుత్తు సరఫరా పూర్తిగా స్తంభించింది. నాలుగు రోడ్ల కూడలి మీదుగా బుక్కపట్నం వైపునకు బిందు, తుంపర పరికరాల లోడ్‌తో వెళుతున్న లారీ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగి తీగలు కిందపడ్డాయి. తెల్లవారు జామున కావడంతో రోడ్డుపై జన సంచారం లేక పెనుప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా నిప్పులు ఎగసిపడటంతో దుకాణదారులు భయపడ్డారు. దీంతో మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్తు సరఫరా పూర్తిగా స్తంభించింది. విద్యుత్తు శాఖ అధికారులు విరిగిన స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి రాత్రికి కరెంటు సరఫరాను పునరుద్ధరించారు.

కొత్తచెరువులో లారీ ఢీకొనడంతో విరిగిన విద్యుత్తు స్తంభం

ప్రమాదకరంగా నియంత్రిక

నల్లమాడ మండలం చారుపల్లి గ్రామంలో రహదారి పక్కన చిన్న పిల్లలకు చేతికందేలా నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. చారుపల్లి ఎస్సీ కాలనీకి దగ్గర ఉండటంతో మూగ జీవాలు, చిన్న పిల్లలు నిరంతరం ప్రయాణిస్తుంటారు. ఆదమరిచి వెళితే నేరుగా నియంత్రికను ఢీకొనే అవకాశం ఉంది. అప్పుడప్పుడు ఒక జంపర్ నుంచి నిప్పురవ్వలు పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, నల్లమాడ**

తిమ్మమాంబ ఉత్సవాలకు బందోబస్తు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: తిమ్మమాంబ ఉత్సవాలలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని దిశా నిర్దేశం చేస్తూ పోలీసులకు కదిరి రూరల్, టౌన్ సీఐలు నాగేంద్ర, నారాయణ రెడ్డిలు వివరించారు. తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఏర్పాటు చేసిన బస్టాండు వద్ద చోరీలు జరగకుండా పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేయాలని వారు సూచించారు. ఎస్సైలు కృష్ణమూర్తి, సుమతి, తదితరులు పాల్గొన్నారు. ● పవిత్ర పుణ్యక్షేత్రం అయిన తిమ్మమాంబ ఆలయం వద్ద జరుగుతున్న ఉత్సవాలలో రెండోరోజు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి పూజలు చేసి శివనామస్మరణతో మారుమోగించారు. దర్శనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పర్యవేక్షించారు. ఈషా ఫౌండేషన్ సద్గురు వారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులందరికి అన్నదానం చేశారు.

రుణాలు.. స్వయం ఉపాధికి మార్గాలు

ధర్మవరం పట్టణం, కదిరి, తాడిమర్రి, న్యూస్‌టుడే: పొదుపు సంఘాలు లేని కాలంలో మహిళలు ఇంటి పనులకే పరిమితమయ్యేవారు. కొందరైతే కూలీ పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకునేవారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటుతో మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు. రుణాలు తీసుకుని చాలా మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. వ్యాపారంలో వచ్చిన ఆదాయంతో కుటుంబ పరిస్థితిని మెరుగుపరుస్తూ పిల్లలను ఉన్నతంగా చదివించగలుగుతున్నారు.

ప్రతినెలా రూ.45 వేలు ఆదాయం

మేము కదిరి పట్టణ పరిధిలోని కుటాగుళ్లలో నివాసం ఉండే వాళ్లం. గతంలో చింత పిక్కలను ఏరివేసే దిన సరి కూలీ పనులకు వెళ్ళేదాన్ని. పద్దెనిమిదేళ్ళ క్రితం లక్ష్మీభారతి పొదుపు సంఘంలో చేరి మొదటగా రూ. 40,000 రుణంతో కిరాణా దుకాణాన్ని ప్రారంభించాను. అనంతరం రూ. రెండు లక్షల రుణాన్ని పొంది దుకాణాన్ని మరింత విస్తరించాను. ప్రతి నెల రూ. 45,000లకు పైగానే ఆదాయం వస్తోంది. కుటుంబ జీవనం చక్కగా సాగిపోతోంది. **- సరస్వతి, కుటాగుళ్ల**

మరింత పొదుపు చేస్తున్నా..

సంఘంలో చేరకముందు కిరాణా దుకాణాన్ని నిర్వహించేదాన్ని. సక్రమంగా వ్యాపారం జరిగేదికాదు. బయట అప్పులు తెచ్చి దాన్ని ఏర్పాటు చేయడంతో ఆదాయమంతా వడ్డీలకే సరిపోయేది. దీంతో మహిళా సంఘంలో చేరాలని నిర్ణయించుకున్నా. మొదట్లో చిన్నగా ఉన్న దుకాణాన్ని స్త్రీనిధి, వ్యక్తిగతంగా రూ. రెండున్నర లక్షల రుణం పొంది వ్యాపారాన్ని పెద్దగా ప్రారంభించాను. వ్యాపారం బాగా పుంజుకుంది. గతంలో మాదిరి కుటుంబ పోషణకు ఇబ్బందులు లేవు. పిల్లలను చదివిస్తున్నా. వచ్చిన ఆదాయంతో రుణ కంతులను చెల్లిస్తూ మరికొంత పొదుపు చేస్తున్నా. **- పల్లవి, తాడిమర్రి**

వ్యాపారంలో రాణిస్తున్నా..

సంఘంలో చేరక ముందు నేను, నా భర్త కూలీ పనులకు వెళ్లేవాళ్లం. వచ్చిన ఆదాయం సరిపోయేదికాదు. అకస్మాత్తుగా భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో దిక్కుతోచని స్థితిలో ఉన్నా ఆ సమయంలోనే 2012లో రూ. 50 పొదుపుతో లక్ష్మీనరసింహ సంఘంలో సభ్యురాలిగా చేరాను. కూలీ పనులకు వెళ్తే పిల్లలను ఉన్నతంగా చదివించలేనని సంఘంలో రుణం తీసుకుని వ్యాపారం ప్రారంభించా. రూ. 5,000 నుంచి రుణం పొందుతూ గ్రామంలోనే చిన్న కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారాన్ని వృద్ధి చేశాను. స్త్రీనిధిలో రూ. లక్ష రుణం తీసుకుని చీరల వ్యాపారం కూడా ప్రారంభించాను. నెలకు రూ. 20వేలు ఆదాయం వస్తోంది. **- రాజి, నిడిగల్లు, తాడిమర్రి మండలం**

క్షయవ్యాధి మందులతో నయం : మంత్రి

పెనుకొండ: క్షయ వ్యాధిగ్రస్థులు క్రమం తప్పకుండా ప్రభుత్వం సరఫరాచేసే మందులు వేసుకుంటే పూర్తిగా కోలుకోవచ్చని మంత్రి సవిత అన్నారు. ఆదివారం పెనుకొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం(ఎన్‌టీఈపీ) సిబ్బంది ఆధ్వర్యంలో సంగ్వా హైటెక్, ఏజీఅండ్‌పీ ప్రైవేటు పరిశ్రమలు కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్‌ఆర్) ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహార కిట్లు రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సరైన పౌష్టికాహారం, పరిశుభ్రత, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా క్షయవ్యాధి పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. వ్యాధి నిర్మూలన చర్యల్లో భాగంగా రోగుల ఖర్చుల కోసం ప్రభుత్వం ప్రతినెలా రూ. 1000 అందజేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని సమాజాన్ని ఆరోగ్యవంతంగా మార్చడంలో భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో డీపీసీ మల్లికార్జున, పీపీఎం సమన్వయకర్త నాగేంద్ర, ల్యాబ్ పర్యవేక్షకుడు శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

చీరలే పంటలకు రక్షణ

పొలం చుట్టూ కట్టిన చీరలు

కనగానపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయ పొలంలో సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఒకపక్క తెగుళ్లు మరోపక్క అడవి పందులు, జింకలు పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లితోంది. ప్రస్తుతం బోరుబావుల కింద వేరుసెనగ, కర్బూజ, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేశారు. పంటలు కోత దశకు చేరుకునే సమయానికి అడవి పందులు, జింకలు పొలంలోకి ప్రవేశించి పంటలను నాశనం చేస్తున్నాయి. వాటి నుంచి పంటలను కాపాడుకునేందుకు పొలం చుట్టూ చీరలను ఏర్పాటు చేసి పంటలను కాపాడుకుంటున్నట్లు రైతులు తెలిపారు.

In the Court of the Ist Addl. District Judge, Anantapuramu.
E.P. No: 561/2025
in Arbitration Case No. 703/2024

Between:
M/s. Five Star Business Finance Limited, Chennai represented by its Authorized Signatory S.Pavan Kumar, Anantapur. **...Petitioner/D.Hr**
And
Jagadheesh and others **....Respondents/J.Drs**

To,
J.Dr.No:1: Jagadheesh S/o Ugrappa, Business, D.No.7-216, Jowk Palyam Street, Kadiri, Sri Sathyasai District.

J.Dr 01 కు Order 21 Rule-54 CPC Notice

డిక్రీ హోల్డర్‌కు రావలసిన ఇ.పి. మొత్తము వసూలు చేయుటకు గాను E.P.లోని షెడ్యూలు ఆస్తిని జప్తు చేసియున్నారు. సదరు E.P. వేలము షరతులు నిర్ణయించుటకు మీ హాజరు నిమిత్తం 24-02-2026వ తేదీకి వాయిదా వేసియున్నారు. అందుకు మీకు ఆక్షేపణలున్న యెడల సదరి దినము ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షము నందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)

M.SURESH KUMAR, Advocate, Ananthapuram. Cell: 9441168233.

(c) eenadu

ఈనాడు శ్రీకాకుళం

సోమవారం ఫిబ్రవరి 16, 2026

శివోహం..!



లింగోద్భవ సమయంలో శ్రీముఖలింగేశ్వరస్వామికి జియ్యంతో అభిషేకం చేస్తున్న అర్చకులు

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. భక్తులు శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే ముక్కంటి దర్శనానికి బారులు తీరారు. మధ్యాహ్నం వరకు అభిషేకాలు, పూజలతో రద్దీ కొనసాగింది. అర్ధరాత్రి లింగోద్భవ సమయం వరకు శివ పంచాక్షరి పఠనంతో జాగరణ చేశారు. శ్రీముఖలింగం, రావివలస, శ్రీకాకుళంలో ఉమారుద్రకోటేశ్వర స్వామి, ఇతర దేవాలయాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

- న్యూస్‌టుడే, జలుమూరు, శ్రీకాకుళం సాంస్కృతికం, టెక్కలి పట్టణం

శ్రీకాకుళంలో ఉమారుద్రకోటేశ్వరస్వామికి క్షీరాభిషేకం

శ్రీముఖలింగంలో దర్శనానికి వేచి ఉన్న భక్తులు

టెక్కలి మండలం రావివలసలో కిక్కిరిసిన మల్లన్న క్షేత్రం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీలు నేరుగా లేదా meekosam.ap.gov.in పోర్టల్‌లో సమర్పించొచ్చని పేర్కొన్నారు. నమోదైన అర్జీల స్థితికి సంబంధించిన సమాచారానికి టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించాలని సూచించారు.

రూ.లక్షలు వ్యయం.. లక్ష్యానికి దూరం!

న్యూస్‌టుడే, మందస

వైకాపా పాలనలో గ్రామాల నుంచి చెత్త తరలించడానికి 102 పంచాయతీలకు ట్రాక్టర్లు సమకూర్చాలని నిర్ణయించినా అప్పగించలేక పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 90 పంచాయతీలకు సమకూర్చింది. 12 పంచాయతీలకు ఇంజిన్లు మాత్రమే ఇచ్చారు. ఏడాదిన్నర గడచినా తొట్టెలు రాలేదు. ఆయా సచివాలయాల వద్ద ఎలాంటి సంరక్షణ లేకుండా ఆరుబయట ఉన్నాయి. ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తుండటంతో దెబ్బతింటున్నాయి. ఒక్కో ఇంజిను రూ.6.80 లక్షలకు కొనుగోలు చేశారు. 12 ఇంజిన్లకు మొత్తం రూ.81.60 లక్షలు వ్యయం చేశారు. రూ.లక్షలు వెచ్చించినా లక్ష్యానికి దూరంగా ఉండటంతో విమర్శలు వస్తున్నాయి.

మందస మండలం హరిపురం గ్రామ సచివాలయం వద్ద నిలిపిన ఇంజిన్

అద్దె ట్రాక్టర్లే దిక్కు

తొట్టెలు లేకపోవడంతో ప్రైవేటు ట్రాక్టర్లను పారిశుద్ధ్య పనులకు వినియోగిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో చెత్త తొలగించినట్లు చూపి ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.10 వేల నుంచి 12 వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. బిల్లుల్లో రూ.15 వేల నుంచి రూ.20 వేలు చూపి నిధులు పక్కదారి పట్టిస్తున్నారు. పెద్దఎత్తున ప్రజాధనం కొల్లగొడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తొట్టెలు అందని పంచాయతీలు

మందస మండలం హరిపురం, అంబుగాం, ఎచ్చెర్ల మండలం ఇప్పిలి, కుశాలపురం, తోటపాలెం, జి.సిగడాం, ఆనందపురం, ఇచ్ఛాపురం మండలం కేశుపురం, ఎల్ఎన్ పేట మండలం పెద్దకోట, పలాస మండలం బ్రాహ్మణతర్లా, శ్రీకాకుళం గ్రామీణ మండలం ఖాజీపేట, వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ.

త్వరలో పంపుతాం..

తొలుత 102 పంచాయతీల్లో కొన్నింటికి ట్రాక్టర్లు ఇచ్చాం. మరికొన్నింటికి ఇంజిన్లు మంజూరు చేశాం. త్వరలో ఆయా పంచాయతీలకూ తొట్టెలు సమకూరుస్తాం. ప్రభుత్వ వాహనాలు సమకూర్చి అవినీతికి తావు లేకుండా చర్యలు తీసుకుంటాం.

- సౌజన్య భారతి, డీపీవో, శ్రీకాకుళం

మోదీతో మాట్లాడతారా..?

న్యూస్‌టుడే, పాతపట్నం

ఆర్థికవేత్తలు, నిపుణులు మాత్రమే కేంద్ర బడ్జెట్‌పై అవగాహన ఉంటుందనే భావన ఉంది. భాజపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యువత దేశ ప్రగతిలో భాగస్వాములయ్యేలా చేయడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. ప్రధాని మోదీ మన్ కీ బాత్, మై భారత్ వంటి కార్యక్రమాలతో మమేకమవుతున్నారు. కేంద్ర స్థాయిలో చేపట్టిన పథకాలు, అంశాలపై వారికి పట్టు ఉండాలనే లక్ష్యంతో 'మై భారత్ బడ్జెట్ క్వెస్ట్' పేరిట వర్చువల్‌గా కార్యక్రమాన్ని రూపొందించారు.

● రేపటి వరకు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం

2 అంశాల్లో పోటీలు

- బడ్జెట్‌ను యువత అర్థం చేసుకోవాలనే లక్ష్యంతో పోటీలు నిర్వహిస్తున్నారు.
- మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ (క్విజ్) 2026 పోటీలకు 15 నుంచి 29 వయసుండే వారిని అర్హులుగా నిర్ణయించారు.
- mybharat.gov.in లో మెయిల్ ఐడీ, సెల్‌ఫోన్ నంబరు, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలి.
- బడ్జెట్‌కు సంబంధించి 30 ప్రశ్నలకు 15 నిమిషాల్లో సమాధానాలివ్వాలి. 30 మార్కులకు 10 వస్తే ఉత్తీర్ణత సాధించినట్లు పరిగణిస్తారు.
- పోటీల్లో ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ధ్రువపత్రం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. క్విజ్‌లో ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. విజేతలు ప్రధానితో మాట్లాడటానికి అర్హత సాధిస్తారు. వీరందరితో మోదీ బడ్జెట్‌లోని అంశాలు వర్చువల్‌గా మాట్లాడే తేదీ, సమయం నిర్ణయించనున్నారు.

కనికరించరు.. ఆధునికీకరించరు!

న్యూస్‌టుడే, సోంపేట

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో నీటి వనరుల ఆధునికీకరణ ప్రతిపాదనలకే పరిమితమవడంతో సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గిపోతోంది. మహేంద్రతనయ, బాహుదా నదుల ఆధారంగా నిర్మించిన ప్రాజెక్టులు పునరుద్ధరణకు నోచుకోకపోవడంతో ఖరీఫ్, రబీల్లో అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. వంశధార జలాలు పలాస నియోజకవర్గానికి కొంతమేర వస్తుండగా ఇచ్ఛాపురానికి అందుబాటులో లేవు. కొద్దిపాటి నిధులు ఖర్చు చేస్తే వేల ఎకరాలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

కంచిలి మండలం జలంత్రకోట వద్ద ఎనిమిదేళ్ల నుంచి అసంపూర్తిగా నిలిచిన గంగాసాగరం జలాశయ నిర్మాణం

పునరుద్ధరణకు నోచుకోని సాగునీటి ప్రాజెక్టులు

ఇదీ పరిస్థితి

- మహేంద్రతనయపై సోంపేట మండలం బాతుపురం వద్ద నిర్మించిన పైడిగాం ప్రాజెక్టు ద్వారా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంది. నది కంటే ప్రధాన కాలువ ఎగువ భాగంలో ఉండటంతో పంట పొలాలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- ఆనకట్ట వేరే చోటుకు మార్చడం.. కాలువల మరమ్మతులు, ఆధునికీకరణ పనులకు కొన్నేళ్లుగా ప్రతిపాదనలు రూపొందించడం తప్ప నిధులు మంజూరుచేయడం లేదు. వర్షాకాలంలో నదికి 15 వేల క్యూసెక్కుల వరకు నీరు వస్తున్నప్పటికీ వినియోగించడం లేదు.
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రూ.38 కోట్ల అంచనాతో దస్త్రం పంపినా కదలిక లేక కంచిలి, సోంపేట, మందస మండలాల రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు.
- మహేంద్రతనయపై ఏర్పాటు చేసిన సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు రూ.40 కోట్లు వెచ్చిస్తే 30 వేల ఎకరాలకు ఇబ్బందులు తీరే అవకాశం ఉంది. నిధులు విడుదల చేయకపోవడంతో అన్నదాతలు సాగుకు దూరమవుతున్నారు.

ఛానల్ వ్యవస్థ అస్తవ్యస్తం

- ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో బాహుదా ఛానల్ వ్యవస్థ ఆధునికీకరణకు చేపట్టిన చర్యలు ముందుకు సాగడం లేదు. ఇసుక అక్రమ తవ్వకాల కారణంగా 9 గ్రోయిన్లు, 11 ఛానళ్లు ఉపయోగంలో లేక 6 వేల ఎకరాల సాగుకు ఇబ్బందులు నెలకొన్నాయి.
- రూ.21 కోట్లతో ప్రతిపాదనలు పంపగా ముందుకు కదలక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ముఖ్యమంత్రి సూచన మేరకు గతేడాది ఫిబ్రవరి 17న బాహుదా నది పరిశీలనకు అప్పటి చీఫ్ ఇంజినీర్ రాజగోపాల్ ఇక్కడికి వచ్చి అన్నదాతలతో మాట్లాడారు. గ్రోయిన్లు పునరుద్ధరించినా ప్రయోజనం ఉండదని.. ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తే ఇచ్ఛాపురం, కవిటి మండలాల పరిధిలో 10 వేల ఎకరాలకు ప్రయోజనం కలుగుతుందని రైతులు వివరించారు. కదలిక లేకపోవడంతో ఖరీఫ్ సాగుకే పరిమితమవుతున్నాయి.

త్వరలో పనులు జరిగేలా చూస్తాం..

సాగునీటి వనరుల ఆధునికీకరణకు రూ.120 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. నిపుణుల పరిశీలన పూర్తయింది. త్వరలో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. - బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

పచ్చదనం ఆవిరి..!

లావేరు మండలం బొంతుపేట సమీపంలో జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న ఆకేశు కర్రలు

పచ్చని చెట్లపై అక్రమార్కులు గొడ్డలి వేటు వేస్తున్నారు. పొలాలు, కొండలు, చెరువులు, అటవీ ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల నుంచి విలువైన ఆకేశు, నీలగిరి, టేకు తదితర కలపను రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో దందా యథేచ్ఛగా సాగుతోంది. ఏపుగా పెరిగిన వృక్షాలు కనుమరుగవుతుండటంతో పర్యావరణానికి హాని జరుగుతోందని పర్యావరణవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లావేరు, రణస్థలం మండలాల సరిహద్దులో ఉన్న తామాడ కొండ ప్రాంతంలో ఆకేశు కర్రలను కొందరు అడ్డగోలుగా నరికి విక్రయిస్తున్నారు. లావేటిపాలెం, కొండములగాం గ్రామాలకు సమీపంలోని కొండల నుంచి కర్రలను రాత్రి వేళ గుట్టుగా తరలిస్తున్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి, నడిపల్లి, బొప్పడాం తదితర ప్రాంతాల నుంచి ఆకేశు, టేకు తదితర విలువైన కర్రలు సుభద్రాపురం కూడలి సమీపంలోని డిపోలకు వస్తున్నాయి. ఈ విషయమై అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి వి.గౌరీశంకర్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఇటీవల ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో పలు టింబర్ డిపోలకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. కలప అక్రమంగా తరలించడంపై నిఘా పెట్టామన్నారు. అనధికారింగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. - న్యూస్‌టుడే, లావేరు

17న చలో విజయవాడ

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, రాష్ట్ర మాజీ కార్యదర్శి గొంటి గిరిధర్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. పీఆర్సీ నియమించకపోవడం, బకాయిలు, పెండింగ్ డీఏలు చెల్లించకపోవడం, ఐఆర్ ప్రకటించకపోవడం, సీపీఎస్ రద్దు, మెమో 57 అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడా రంగ అభివృద్ధికి కృషి

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

నరసన్నపేట, న్యూస్‌టుడే: క్రీడా రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వైఎంసీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడానికి ప్రధాన మంత్రి మోదీ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జిల్లాలో రూ.14 కోట్లతో పాత్రునివలస వద్ద స్టేడియం నిర్మిస్తామని.. దశల వారీగా మరో ఆరు మైదానాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తెదేపా నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు కృష్ణంనాయుడు, నర్సింహులు, వైఎంసీఏ అధ్యక్షుడు గొద్దు చిట్టిబాబు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

పాతపట్నం మండలం కొరసవాడ వద్ద రాగి తీగ చోరీకి గురైన ఎత్తిపోతల పథకం

ఎత్తిపోతల పథకాలకు విద్యుత్తు సరఫరా చేసే నియంత్రికల నుంచి రాగి తీగలు వరుసగా చోరీకి గురవుతుండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఆయకట్టు పరిధిలో పంటలకు అవసరమైనప్పుడు నీరందించలేక నష్టపోక తప్పడం లేదు. పాతపట్నం మండలం కొరసవాడ ఎత్తిపోతల పథకం సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. అన్నదాతలే దీన్ని నిర్వహించుకుంటున్నారు. ఏటా ఖరీఫ్‌లో వరి, కూరగాయలు, రబీలో మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పథకం నియంత్రికలో రాగి తీగను ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మొక్కజొన్న చివరి దశలో ఉండగా నీటి కష్టాలు ఎదురయ్యాయి. విద్యుత్తు శాఖ సహకారంతో తాత్కాలికంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. చోరీకి గురైన నియంత్రికలో రాగి తీగ వేయడానికి సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ఏపీఎస్ఐడీసీ డీఈ ఎం.కామరాజును 'న్యూస్‌టుడే' సంప్రదించగా కొరసవాడ ఎత్తిపోతల పథకం నిర్వహణ బాధ్యత ఆయకట్టు పరిధిలో రైతులదేనని తెలిపారు. మరమ్మతులు, ఇతర అవసరాలను వారే పర్యవేక్షించుకోవాలని స్పష్టం చేశారు.

- న్యూస్‌టుడే, పాతపట్నం

రూ.2 కోట్లతో సైబర్ పోలీసు స్టేషన్..!

● పెరుగుతున్న మోసాల అడ్డుకట్టకు ప్రణాళిక

- శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ వైద్యుడు డిజిటల్ అరెస్టు పేరిట మోసపోయారు. సకాలంలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొంత మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో స్తంభింపజేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకున్నారు.
- గత నెలలో సైబర్ నేరగాళ్లు జిల్లా కేంద్రానికి చెందిన మెకానికల్ ఇంజినీరు నుంచి రూ.1.03 కోట్లు కాజేశారు. అతను ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో రూ.9.50 లక్షలు స్తంభింపజేశారు. ఈ కేసులో ముగ్గుర్ని అరెస్టు చేశారు.
- జలుమూరు మండలానికి చెందిన మహిళా ఉద్యోగిని డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించి రూ.2.75 లక్షలు కాజేశారు. ఫిర్యాదు ఆలస్యంగా అందడంతో ఆ మొత్తాన్ని రికవరీ చేయలేక పోయారు.

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్త విభాగం

సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రభుత్వం జిల్లాకు ఒక సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. ఇప్పటికే సైబర్ సెల్ పేరిట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని నియమించి బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నారు. పోగొట్టుకున్న మొత్తం దేశంలోని బ్యాంకు ఖాతాల్లో ఉన్న సమయంలో ఫిర్యాదులు స్వీకరించగలిగితే స్తంభింపజేయడానికి వీలుంటుంది. ఎక్కువ శాతం విదేశాలకు బదిలీ చేస్తుండటంతో బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదు.

ఏడాది	కేసులు	పోగొట్టుకున్న మొత్తం (రూ.కోట్లలో..)
2024	171	8.20
2025	148	9.68
2026 ఫిబ్రవరి 6 వరకు	9	2.16

- నేరగాళ్లు ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి సొమ్ము కాజేస్తుండటంతో రికవరీ చేయడం సవాల్‌గా మారింది.
- ప్రతి జిల్లాలో సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటైతే నేరాల కట్టడికి వీలవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాకు ఒక సైబర్ స్టేషన్ నిర్మించడానికి అనుమతించింది. జిల్లాలో రూ.2 కోట్లతో ఏర్పాటు చేయడానికి బడ్జెట్‌లో ప్రతిపాదించారు.
- సైబర్ సెల్‌లో సాంకేతిక పరిజ్ఞానంపై పట్టున్న సిబ్బంది పూర్తిస్థాయిలో లేక ఇబ్బందులు తప్పడం లేదు. కేసుల్ని ఛేదించడం కంటే నిందితుల్ని పట్టుకోవడం కష్ట సాధ్యమవుతోంది.

సకాలంలో ఫిర్యాదు చేస్తే మేలు..

సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటైతే సాంకేతికంగా మరింత తోడ్పాటు అందుతుంది. నేరాల్ని కట్టడి చేయొచ్చు. బాధితులు సకాలంలో ఫిర్యాదు చేస్తేనిధులు మళ్లించే లోపు గుర్తించి నియంత్రించడానికి వీలవుతుంది.

-కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

ఆదిత్యుని ఆదాయం రూ.7.28 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లిలో సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి గోశాలలో పూజలు చేశారు. ఆర్జిత సేవలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.7.28 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు.

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త

డాక్టర్ రెడ్డి టోటల్ బాడీ చెకప్ సెంటర్

కలక్టర్ ఆఫీస్ జంక్షన్, కోస్టల్ బేటరీ రోడ్డు, కెనరా బ్యాంక్ ప్రక్కనఉన్న LUCID బిల్డింగ్, 4వ అంతస్తు, విశాఖపట్నం

శరీరంలో సైలెంట్‌గా దాగిఉన్న గుండెపోటును మరియు కేన్సర్‌ను 6 నెలల ముందుగానే గుర్తించే టోటల్ బాడీ చెకప్



రూ. 7,500/- విలువచేయు పరీక్షలు కేవలం 3,500/- కే

ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా॥ జి. శివప్రసాద్‌రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.

9393752255, 9393122525

ఈ పథకం 10 రోజులు మాత్రమే ప్రతీ ఆదివారం శెలవు

ఏదీ డిజిలక్ష్మి కటాక్షం..?

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

జిల్లాలో అతివలకు డిజిలక్ష్మి పథకం అక్కరకు రావడం లేదు. డ్వాక్రా మహిళల్లో అర్హులను ఎంపిక చేసి వారితో మినీ మీసేవ కేంద్రాల తరహాలో సేవా కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తోంది. కామన్ డిజిటల్ సేవా కేంద్రాలు నిర్వహించే లక్ష్యంతో డిజిలక్ష్మి సీఎస్సీ పేరిట కేంద్రాలను గుర్తిస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరం, పురపాలక సంఘాల్లో ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 194 కేంద్రాల ఏర్పాటుకు అర్హులను గుర్తించినా.. శ్రీకాకుళం నగరంలో తప్ప ఎక్కడా ప్రారంభం కాలేదు.

కేంద్రం	మహిళా సంఘాలు	సభ్యులు	స్లమ్ లెవల్ ఫెడరేషన్లు	డిజిలక్ష్మి ప్రతిపాదనలు
ఇచ్ఛాపురం	816	8,491	31	30
ఆమదాలవలస	743	7,776	27	26
పలాస-కాశీబుగ్గ	1,211	12,346	46	46
శ్రీకాకుళం	2,977	30,090	92	92

విద్యావంతులకు చేయూత.. ఎస్ఎల్ఎఫ్ స్థాయిలో విద్యావంతులైన మహిళలు సీఎస్సీ కేంద్రాలు నిర్వహించడానికి అర్హులు. పొదుపు సంఘాల్లో సభ్యురాలై ఉండి డిగ్రీ విద్యార్హత, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారిని ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా 194 మందిని గుర్తించారు. వారికి శిక్షణ ఇచ్చి బ్యాంకు రుణం రూ.2.50 లక్షలు అందించడమే పథకం లక్ష్యం. రూ.3 లక్షల వరకు రుణం ఇచ్చే అవకాశం ఉంది.

194 కేంద్రాలకు ఒక్కటే ప్రారంభం

ప్రోత్సాహం కరవు శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస పురపాలక సంఘాల పరిధిలో సీఎస్సీ కేంద్రాల నిర్వహణకు మెప్మా ఆధ్వర్యంలో కొన్ని నెలల కిందట శిక్షణ ఇచ్చారు. మహిళలకు ఆసక్తి కలిగించేలా.. స్వయం ఉపాధికి ఉపయోగపడుతుందని అవగాహన కల్పించడంలో ప్రోత్సాహం కరవైంది. శ్రీకాకుళం కేంద్రంలో ఒక సీఎస్సీ ప్రారంభమైంది.

అందించే సేవలు.. డిజిలక్ష్మి సీఎస్సీ కేంద్రాల్లో బ్యాంకింగ్, బీమా, పెట్టుబడులు, చెల్లింపులతో పాటు ఆరోగ్య సేవలు, వ్యవసాయం, ప్రయాణం, ఇ-మొబిలిటీ, నైపుణ్యాభివృద్ధి, రైల్వే, బస్సు టికెట్ల బుకింగ్, పురపాలక సంఘ పన్నుల చెల్లింపు తదితర 250 రకాల సేవలు అందించేలా ప్రతిపాదించారు.

300 కుటుంబాలకు ఒకటి జిల్లాలో 5,747 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటి పరిధిలో 58,703 మంది సభ్యులుండగా, స్లమ్ లెవల్ సమాఖ్యలు (ఎస్ఎల్ఎఫ్) 196 ఉన్నాయి. ఒక్కో ఎస్ఎల్ఎఫ్ పరిధిలో సుమారుగా 300 కుటుంబాలు ఉన్నాయి. వారికో డిజిలక్ష్మి సీఎస్సీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అవగాహన కల్పిస్తున్నాం..

ప్రభుత్వం మహిళా వికాసానికి వివిధ పథకాలు అమలు చేస్తోంది. అవగాహన పెంచుకుంటే స్థిరమైన ఉపాధికి సీఎస్సీ తోడ్పడుతుంది. ఆ ప్రాంతంలో చక్కటి సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ విషయమై సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. త్వరలోనే మరికొన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. - రాము, నైపుణ్యాభివృద్ధి నిపుణుడు, మెప్మా, శ్రీకాకుళం

ఇంటర్ విద్యార్థులకు సంకల్ప్..!

● 20 వరకు ప్రత్యేక తరగతులు

న్యూస్‌టుడే, పొందూరు, సరుబుజ్జిలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించి మంచి ఫలితాలు సాధించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తీర్ణత సాధించేలా 'సంకల్ప్' పేరిట శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ నెల 20 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

రోజూ పరీక్షలు

- జిల్లాలోని 38 కళాశాలల్లో 13,575 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతేడాది నవంబరులో పరీక్షలకు సంబంధించి విద్యా సామగ్రి అందజేశారు. ఆయా పాఠ్యాంశాల్లో నిపుణులతో తరగతులు నిర్వహిస్తున్నారు. సందేహాలు నివృత్తి చేస్తున్నారు. రోజూ పరీక్షలు పెట్టి సామర్థ్యాలు గుర్తించి తక్కువ మార్కులు వచ్చే వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.
- సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కులను ఎప్పటికప్పుడు ఇంటర్ బోర్డుకు ఆన్‌లైన్‌లో నివేదిస్తున్నారు. వీటి ఆధారంగా విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి మరుసటి పరీక్షల్లో మరింత రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. ఎప్పటికప్పుడు నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ నిర్వహిస్తున్న పరీక్షల్లో ఫలితాల ఆధారంగా పబ్లిక్ పరీక్షల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నామని జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి ఆర్.సురేష్‌కుమార్ తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80085 97609

(c) eenadu

శ్రీకాకుళం: నక్క వీధి ఉమాజఠలేశ్వరాలయంలో క్షీరాభిషేకం

కంచిలి మండలం మండపల్లిలో మహామృత్యుంజయ హోమం

శ్రీకాకుళం: నాగావళి నదిలో మహాకుంభాభిషేకం

రుద్రనామం భజేహం

జిల్లాలోని శైవక్షేత్రాల్లో ఆదివారం ఓంకార నాదం మార్మోగింది. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక అభిషేకాలు, హోమాలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. శ్రీకాకుళం నగరంలో నాగావళి నదీ తీరాన కాలభైరవ పీఠం ఆధ్వర్యంలో 11 అడుగుల మృత్తిక శివలింగానికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం, హిరమండలం, కంచిలి గ్రామీణం

హిరమండలం: దుర్భలాపురంలో సామూహిక రుద్రాభిషేకాలు

ఉమారుద్రకోటేశ్వరాలయంలో నంది విగ్రహానికి నమస్కరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

వెదురు సాగుకు సర్కారు ప్రోత్సాహం..!

న్యూస్‌టుడే, హిరమండలం

'ఎలాంటి నేలైనా.. బీడు భూములైనా వెదురు ఏపుగా పెరుగుతుంది. ఎరువులు వేయడం, సస్యరక్షణ చర్యలు వంటివి చేపట్టనక్కర్లేదు. ఒకసారి పంట వేస్తే 40 ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది. పెద్దగా పెట్టుబడి కూడా అక్కర్లేదు' అని ఉద్యానశాఖ అధికారులు వెదురు సాగుపై జిల్లాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం కూడా జాతీయ వెదురు మిషన్ ద్వారా రాయితీలు అందిస్తోంది.

కొత్తూరు మండలం అడ్డంగి, హిరమండలంలోని భగీరథపురం, ఆమదాలవలస మండలంలోని కొన్ని గ్రామాల్లో వెదురు సాగు జరుగుతోంది. ఆయిల్‌పామ్ రైతులు పొలం గట్టు చుట్టూ ఈ మొక్కలు నాటుతున్నారు. గిరిజన గ్రామాల్లోనూ ఈ సాగును ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు.

ఆమదాలవలసలో నాటిన వెదురు మొక్క

ఎకరాకు 300 మొక్కలు..

ఎకరా విస్తీర్ణంలో ఇవి 300 మొక్కలు నాటుకోవచ్చు. 10 నుంచి 15 అడుగుల మధ్య దూరం ఉండేలా చూసుకోవాలి. ఒక్కో మొక్క రూ.40 చొప్పున 300 నాటేందుకు రూ.12 వేలు ఖర్చవుతుంది. దీనికి సేంద్రియ ఎరువు వేయాలి. రసాయనాల అవసరం లేదు. తెగుళ్లు వ్యాప్తి చెందవు. పురుగు మందులు అవసరం లేదు. మొక్క నాటేముందు ఆఖరి దుక్కిలో పశువుల గత్తం వేసుకుంటే మంచి దిగుబడి వస్తుంది. ప్రభుత్వం హెక్టారుకు 400 మొక్కలు అందజేస్తోంది. మొక్కకు రూ.150 చొప్పున మొదట ఏడాది రూ.90, రెండో సంవత్సరం రూ.60 ఇస్తుంది.

నాలుగో ఏట నుంచే ఆదాయం..

నాటిన నాలుగో సంవత్సరం నుంచి మొక్క కోతకు వస్తుంది. ఒక మొక్క నుంచి 10 నుంచి 15 కాండాలు ఏపుగా పెరుగుతాయి. ఒక్కో కాండం రూ.100 నుంచి రూ.150 ధర పలుకుతుంది. 300 మొక్కలు నాటితే నాలుగేళ్లు దాటాక మొదటి ఏడాది సగటున పది కాండాలు కోతకు వచ్చినా రూ.100 చొప్పున రూ.3 లక్షల ఆదాయం వస్తుంది. ఈ విధంగా నాలుగో ఏట నుంచి రైతులు కొన్నేళ్ల వరకు ఆదాయం పొందొచ్చు. 'వెదురు సాగు రైతులకు ఆర్థికంగా రాయితీలు ఇస్తూ, రెండేళ్ల పాటు ఆదుకుంటుంది. ఇటీవల ఎంపిక చేసిన గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం' అని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

బహిరంగ వేలం ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) శ్రీకాకుళం వారి కోర్టులో

E.P. No: 02/2022 in OS No: 305/2018.

[illegible]

వేలం వేయబడు ఆస్తి షెడ్యూలు వివరములు:

[illegible]

Dhr విలువ, అసలు విలువ: రూ. 2,50,000/-

[illegible]

NB: [illegible]

తేది: 15-02-2026. పొన్నాడ రాము, న్యాయవాది, శ్రీకాకుళం. సెల్: 9398430483

పాఠశాల మురిసేలా.. ప్రగతి విరిసేలా..!

'విద్యాంజలి 2.0'తో ప్రభుత్వ బడుల్లో సేవకు అవకాశం

జిల్లాలో వివరాలిలా..

పాఠశాలలు: 3,014

కార్యక్రమం అమలవుతున్నవి: 2,612

విద్యార్థులు : 2,66,902

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం), కంచిలి గ్రామీణం

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యాంజలి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. సామాజిక బాధ్యతతో పాఠశాలల పురోభివృద్ధికి సహకారం అందించాలనుకునే వారికి అవకాశం కల్పిస్తోంది. కేవలం డబ్బుల రూపంలోనే కాకుండా వస్తువులు, సేవల రూపంలోనూ చేయూతనందించొచ్చు. మొత్తం 5 విభాగాల్లో 15 రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించొచ్చని అధికారులు సూచిస్తున్నారు.

విభాగాలివీ..

- విద్యాసహాయం
- కళలు, నైపుణ్యాలు పెంపొందించడం
- ఆరోగ్యం, క్రీడలు
- మార్గనిర్దేశం
- సామాజిక బాధ్యత

ఏమేం చేయొచ్చంటే..

● నిపుణులు లేదా ఆసక్తి ఉన్న వ్యక్తులు విద్యార్థులకు పాఠాలు బోధించొచ్చు. ● యోగా, క్రీడలు, సంగీతం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యాల పెంపుపై శిక్షణ ఇవ్వొచ్చు. ● భవిష్యత్తు మార్గనిర్దేశం చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించొచ్చు. ● బడికి అవసరమైన వస్తువుల వితరణ, కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, సౌండ్ సిస్టమ్‌లు, సౌర పలకలు, ఎల్‌ఈడీ దీపాలు, కుర్చీలు, బల్లలు ఇవ్వొచ్చు. ● తాగునీటి సదుపాయంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించొచ్చు. ● గ్రంథాలయాలకు పుస్తకాలు అందజేయొచ్చు.

నమోదు ఇలా...

తోడ్పాటు అందించాలనుకునేవారి వివరాలు vidyanjali.education.gov.inలో నమోదు చేయాలి. పాఠశాల, ఆసక్తి ఉన్న సేవారంగాన్ని ఎంపిక చేసుకోవాలి. ప్రధానోపాధ్యాయులు ఆమోదించిన తర్వాత సేవలు ప్రారంభించేందుకు అనుమతి ఇస్తారు. వాలంటీర్లకు ఎలాంటి వేతనం చెల్లించరు. నగదు రూపంలో విరాళాలు ఇవ్వడానికి వీలుండదు. కేవలం వస్తు రూపంలోనే అందించాలి. జిల్లాలో విద్యాంజలికి సంబంధించి రెండు దశల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. దాతలు, స్వచ్ఛంద సేవకులను ఎలా అనుసంధానించాలో వాటిల్లో దిశానిర్దేశం చేశారు.

ఉపాధ్యాయులకు విద్యాంజలి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పారితోషికం ఉండదు..

విద్యాంజలిలో నమోదు చేసుకున్న వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందించాలి. తమకు నచ్చిన బడికి సహకారం అందించొచ్చు. అందుకు ఎలాంటి పారితోషికం ఇవ్వరు. సేవలు కొనసాగించడం.. నిలిపివేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదే.

– పి.వేణుగోపాలరావు, సమగ్ర శిక్షా, ఏపీసీ

కూర్మనాథుని సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

గార(శ్రీకూర్మం), న్యూస్‌టుడే: గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ ఆదివారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం క్షేత్ర మహాత్మ్యాన్ని వివరించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు జడ్జి సి.హెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జి కె.ఆనంద్ ఉన్నారు. అమరావతికి చెందిన కౌంటర్ ఇంటలిజెన్స్ ఎస్పీ కె.శ్రీనివాసరావు కూడా స్వామిని దర్శించుకున్నారు.

కూర్మనాథ ఆలయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్‌కి స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

బహిరంగ జప్తు ఆస్తి విక్రయ ప్రకటన

(సివిల్ ప్రొసీజర్ కోడ్ ఆర్డర్ 21, రూల్ 66 అండ్ 67 ప్రకారము)

మహారాజశ్రీ శ్రీకాకుళం 4వ అదనపు జిల్లా జడ్జి (SC & ST) వారి కోర్టు

ఇ.పి. నెం. 81/2025 ఓ.ఎస్.నెం. 15/2018లో

- డిక్రీ హోల్డర్లు / వాదులు

- జడ్జిమెంట్ డెటార్ / ప్రతివాదులు

[illegible]

వేలం తేది: 23.03.2026, వేలం సమయము: ఉదయం 10.30 గం.

[illegible]

కనిష్ట ధర (Upset Price) [illegible]

ఆస్తులవివరం (Schedule of Property)

[illegible]

తేది: 16-2-2026 [illegible]

యువతి బలవన్మరణం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి మండలం పాలసింగి గ్రామానికి చెందిన గిరిజన యువతి అనుపురం అరుణ(19) బలవన్మరణానికి పాల్పడటంతో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె కాకినాడ జేఎన్‌టీయూలో బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నాగావళి మహిళా హాస్టల్‌లో ఉంటోంది. ఆదివారం గది నుంచి బయటకు రాలేదు. తోటి విద్యార్థినులు వెళ్లి చూసేసరికి లోపల ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. సాయంత్రం 5:30 గంటలకు చీఫ్ వార్డెన్ నరేష్ ఘటనపై సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరణ స్థలాన్ని వీసీ ప్రసాద్, జేఎన్‌టీయూ అధికారులు పరిశీలించారు. ఆదివారం ఉదయం.. తన కుమార్తెను వేధిస్తున్నాడని అరుణ తల్లి సంధ్య గతేడాది సెప్టెంబరులో మెళియాపుట్టి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిపై ఫిర్యాదు చేశారు. దీనిపై టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మనస్తాపానికి గురై పురుగు మందు తాగిన యువకుడు శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొద్దిరోజులు చికిత్స పొందుతూ మృతి చెందాడు. యువతి తండ్రి రాము భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ మూడేళ్ల కిందట తిరుపతిలో ఓ ఇంటిపైనుంచి ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందారు. తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. తొమ్మిదో తరగతి చదువుతున్న తమ్ముడు ఉన్నాడు.

అరుణ (పాతచిత్రం)

జీవన్మృతుడి అవయవదానం

బలగ(శ్రీకాకుళం), వంగర, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా వంగర మండలం కొప్పర కొత్తవలస గ్రామానికి చెందిన పెంకి పారినాయుడు(65) మరణిస్తూ మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపారు. ఈయన వారం కిందట పొలంలో పనిచేస్తూ స్పృహ కోల్పోయారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు గుర్తించారు. జీవన్‌దాన్ ప్రతినిధి పెంకి చైతన్య అవగాహన కల్పించడంతో పారినాయుడు కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. మూత్రపిండాలను కిమ్స్ ఆసుపత్రికి, కాలేయాన్ని రాగోలు జెమ్స్ [illegible] రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించారు. పారినాయుడుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



పారినాయుడు

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని బాదుర్లపేటకు చెందిన దోర అజయ్(42) బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆయనకు ఈ నెల 13న తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో భరించలేక ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగారు. కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ ఎస్సై ఎం.హరికృష్ణ తెలిపారు.

శ్రీకాకుళం కళలు, కళాకారులకు పుట్టినిల్లు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం కళలు, కళాకారులకు పుట్టినిల్లు అని వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరం బాపూజీ కళామందిరంలో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక జిల్లాశాఖ ఆధ్వర్యంలో సిక్కోలు సాహితీ సంబరం, కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ కవులు, కళాకారులను ప్రోత్సహించడమే ధ్యేయమని చెప్పారు. త్వరలో మలేషియాలో సాహితీ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వివరించారు. సాహితీ సమ్మేళనంలో పలువురు కవులు, రచయితలు కవితా గానం చేశారు. అనంతరం వారిని సత్కరించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా కమిటీ కన్వీనర్ బి.అమ్మాజీ శ్యామల, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు దబ్బీరు గోవిందరావు, జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, సభ్యులు పాపయ్య, ఉపేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం పొందిన కవులు, రచయితలతో నిర్వాహకులు

EENADU Classifieds

FINANCIAL SERVICES

ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో మార్టిగేజ్/ టేకోవర్ లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. * నో సిబిల్/ నో బ్రోకర్స్. *MSR గ్రూప్, వైజగ్. Ph: 9121314141

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

11వ జన్మదిన శుభాకాంక్షలు

చి|| చాగంటి శ్రేయ, UK

మా చాగంటి ఆడపడుచు, మా చిరునవ్వుల బంగారు తల్లికి జన్మదిన శుభాకాంక్షలు

తాతయ్య: చాగంటి బాపయ్య పంతులు (SKLM)
నాన్నమ్మ : చాగంటి మంగమ్మ
తాతయ్య: అరుణ్‌నామ్‌జోషి, నాగపూర్
అమ్మమ్మ :స్వాతినామ్‌జోషి
నాన్న : చాగంటి శివప్రసాద్ (UK)
అమ్మ : ప్రియారాణి (UK)
అన్నయ్య: అభయ్ (UK)
బాబాయ్ : చాగంటి వంశీకృష్ణ (HYD)
పిన్ని : చాగంటి సమత
అక్కయ్యలు: నిత్య, దీక్ష
మేనత్త :చాగంటి వెంకటసాయిసుధ (USA)
మామయ్య : కర్నాటి రవీంద్రనాథ్ (USA)
వదినలు : కర్నాటి సుచిత, మహిత, (USA)
సెల్: 9550706076, 9550105151

TO LET

COMMERCIAL

శ్రీకాకుళం టౌన్ RTC కాంప్లెక్స్ SSR డిగ్రీకాలేజ్ దరి 15,500 & 5500 SFTతో 2G+3 బిల్డింగ్స్ విద్యాసంస్థలు హాస్పిటల్స్ బ్యాంక్స్ అద్దెకు ✆ 9703779230, 9398873241.

JOBS

ఉద్యోగావకాశాలు. అందరు రిటైర్డ్ ఉద్యోగులకు, గృహిణులకు, నిరుద్యోగులకు, ఉద్యోగావకాశాలు కల్పించబడును. గృహిణులకు ఇంటి వద్ద ఉండి పనిచేయు సౌకర్యము కలదు. ఆదాయము నెలకు లక్ష నుండి 2 లక్షల వరకు. ఇంటర్వ్యూ: 16, 17, 18 తేదీలలో- ఫిబ్రవరి. Con:9959083267

SSR డిగ్రీ & పీజీ కాలేజ్ శ్రీకాకుళంలో పనిచేయుటకు PRO's కంప్యూటర్ ఆపరేటర్స్, డ్రైవర్స్, అటెండర్స్ కావలెను స్థానికులే బయోడేటాతో సంప్ర 9290163952, 9398873241.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్ చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ: 18k to 20K. ✆ 96404 00073, 98485 71888.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 3 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

DRIVERS

హైదరాబాద్ టూర్స్ & ట్రావెల్స్‌లో టూరిస్టు బస్సులకు పనిచేయుటకు హెవీ డ్రైవర్స్, క్లీనర్స్ & ఆఫీస్ బోయ్స్ కావలెను డ్రైవర్‌కి జీతం 14000, బేటా వేరుగా మీరు తిరిగిన బస్సు ప్రకారం ఇస్తారు. ఫ్రీగా రూమ్ సదుపాయం ✆ 7780228329, 9985313972.

SECURITY GUARDS

జై గణేష్ సెక్యూరిటీ సంస్థలో విశాఖ స్టీల్ ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డులు 16 మంది. డ్యూటీ 8 గం|| W/H, జీతం నెలకు ₹16,500/, PF & ESI, సెక్యూరిటీ సూపర్‌వైజర్ (Ex-Service or Civil) 9 మంది, జీతం ₹20,000/, ఉచిత నివాసం, సబ్సిడీ భోజనం, యూనిఫాం ఉచితం ✆ 93460 01964

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

విధానం తెలుసుకో.. ఉద్యోగం తెచ్చుకో..!

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

ఇంజినీరింగ్, డిగ్రీ పూర్తయ్యే నాటికి ఉద్యోగం సాధించాలంటే తొలి ఏడాది నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలి. అకడమిక్ సబ్జెక్టులతో పాటు మరిన్ని నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. ఆన్‌లైన్, సర్టిఫికెట్ కోర్సులు నేర్చుకోవాలి. ఆ వివరాలను కంపెనీల ప్రతినిధులను ఆకట్టుకునేలా రెజ్యూమెలో పరచాలి. అనంతరం ముఖాముఖిని సమర్థంగా ఎదుర్కొంటే సులువుగా కొలువు కల సాకారమవుతుంది. అందుకు విద్యార్థులకు పాటించాల్సిన సూత్రాలు, మెలకువలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ అధికారి విద్యాసాగర్ వివరించారు.

బహుళజాతి కంపెనీల ఎంపిక ప్రక్రియలో తొలి ప్రాధాన్యం రెజ్యూమెకే ఇస్తారు. దీని ద్వారా విద్యార్హత, మార్కుల శాతం, నైపుణ్యాలు, ఆలోచన ధోరణి వంటి వివరాలను తెలుసుకొనే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం విద్యార్థుల రెజ్యూమెలను కంపెనీలు ఆటోమేషన్ విధానంలో కంప్యూటర్‌లోనే ఫిల్టర్ చేస్తున్నాయి. గతంలో మాదిరిగా సరైన సమాచారం లేకుండా తయారు చేస్తే తొలి దశలోనే వెనకబడిపోవాల్సి వస్తుంది. ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. స్వతహాగా రెజ్యూమె తయారీపై ముందుగానే అవగాహన పెంపొందించుకోవాలి.

● జిల్లాలో డా.బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఆర్జీయూ కేటీ శ్రీకాకుళం క్యాంపస్(ట్రిపుల్ ఐటీ), మూడు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో కలిపి 13,500 మంది బీటెక్ విద్యార్థులున్నారు. వారితో పాటు బీఆర్ ఏయూ పరిధిలో 25 వేల మంది వివిధ కళాశాలల్లో డిగ్రీ కోర్సులు చదువుతున్నారు.

వీటిని గుర్తుంచుకోండి..

● ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సుల్లో చేరిన తొలి ఏడాది నుంచే నైపుణ్యాలు పెంచుకొనేలా నిర్దిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలి. కనీసం ఏడాదికి రెండు అదనపు సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేయాలి.

● నేర్చుకున్న కోర్సు వివరాలను రెజ్యూమెలో స్పష్టంగా పొందుపరచాలి.

● అకడమిక్ అంశాలతో పాటు కోడింగ్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు, ఇతర అంశాలపై పట్టు సాధించాలి. ఆ వివరాలను రెజ్యూమె పై భాగంలోనే ఉండేలా చూడాలి.

● రూపొందించిన ప్రాజెక్టులు, వృత్యంతర శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం గురించి రాయాలి. సాధించిన విజయాలు, ప్రశంసలు, ఇతరప్రత్యేకతలను తెలియజేయాలి.

ముఖాముఖిలో ఇవి ముఖ్యం..

●ఇంటర్వ్యూలో ప్రధానంగా అభ్యర్థుల విషయ పరిజ్ఞానాన్ని గమనిస్తారు. ● కొత్త అంశాలను నేర్చుకునే స్వభావం ఉందా.. ఏదైనా సమస్య ఎదురైతే పరిష్కరించగలరా.. లేదా..? అనేది చూస్తారు. ● 50 శాతం సబ్జెక్టు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పరిశీలిస్తారు. ● ఆంగ్ల భాష పరిజ్ఞానం, కూర్చునే విధానం, నడవడిక, మాట తీరును గమనిస్తారు.

పారిశుద్ధ్య కార్మికురాలిని రాష్ట్రపతి దగ్గరకు తీసుకెళ్తా

'ఈనాడు' వార్తకు స్పందించిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

చెన్నై, ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: చెన్నైకి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు పద్మ తనకు దొరికిన రూ.45 లక్షల విలువైన బంగారు ఆభరణాల బ్యాగును నిజాయతీగా పోలీసుల ద్వారా యజమానికి అప్పగించిన ఘటనపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పందించారు. ఆమెకు జాతీయస్థాయి గుర్తింపు ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. 'ఈనాడు' ప్రధాన పత్రికలో జనవరి 13న 'చెత్త సేకరిస్తుంటే.. 45 సవర్ల బంగారం దొరికింది' శీర్షికన పద్మ నిజాయతీ గురించి వార్త ప్రచురితమైంది. ఇదే వార్తను ఆయన రాష్ట్రపతి లేఖకు జతచేశారు. చెత్తను సేకరించే క్రమంలో రోడ్డుపక్కన పడి ఉన్న బ్యాగు పద్మ కంటపడింది. అందులో బంగారు ఆభరణాలు ఉండటంతో ఆశ్చర్యపోయింది. ఆ బ్యాగును ఆమె నేరుగా పాండిబజార్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించింది. ఆ బ్యాగులో రూ.45 లక్షల విలువైన ఆభరణాలున్నా ఆమె ఆశించలేదు. పద్మను ఈ మధ్యే చెన్నై మహానగర పాలక సంస్థ మేయర్ ప్రియ, ముఖ్యమంత్రి స్టాలిన్, సినీనటుడు రజనీకాంత్ సత్కరించారు. ఆమె నిజాయతీకి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక అవార్డుకు సిఫార్సు చేయాలని రాష్ట్రపతిని ఎంపీ అప్పలనాయుడు కోరారు. త్వరలో పద్మను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దగ్గరకు తీసుకెళ్తానని వివరించారు.

పద్మ

కుక్కల దాడిలో జింక మృతి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే : దాహం తీర్చుకునేందుకో, ఆహార అన్వేషణ కోసమే బాహుదానదిని దాటి రత్తకన్న మార్గం వైపు వచ్చిన జింక ఆదివారం సాయంత్రం వీధి కుక్కల దాడికి బలైంది. కొండప్రాంతాలు, సమీప ఒడిశా అడవుల్లో ఉండే జింకలు పలుమార్లు ఇలా దారితప్పి మృత్యువాత పడుతున్నాయి. వాటిని వీధి కుక్కలు వెంబడించినపుడు ఎటు వెళ్లాలో తెలియక వాటికి చిక్కుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గార మండలం కొర్ని గ్రామానికి చెందిన క్రీడాకారుడు చమళ్ల రాజశేఖరరావు సత్తా చాటాడు. ఫుల్‌పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ అంశాల్లో 59 కిలోల విభాగంలో రెండు పతకాలు అందుకున్నాడు. బెంచ్ ప్రెస్‌లో బంగారు పతకం, పవర్ లిఫ్టింగ్‌లో రజత పతకం దక్కించుకున్నాడు. ఈయన గతంలోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ పలుమార్లు రాణించాడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందనలు తెలిపారు.

రాజశేఖరరావు

నేతన్నలకు తీపికబురు..!

ఏప్రిల్ నుంచి ఉచిత విద్యుత్తు అమలు

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తామని ప్రకటించింది. ఇందుకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్తు సరఫరా చేయనున్నారు.

పొందూరులో మగ్గంపై పని చేస్తున్న చేనేత కార్మికురాలు

నిబంధనల్లో మార్పులు

గతంలో ఇంటి వద్ద మగ్గాలు అమర్చుకుని నేత పని చేస్తుంటే.. వారికి 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించేవారు. 101 యూనిట్ విద్యుత్తు వాడితే మొత్తం బిల్లు చేనేత కుటుంబమే భరించాల్సి వచ్చేది. విద్యుత్తుశాఖ సిబ్బంది ప్రతి నెలా ఆలస్యంగా రీడింగ్ నమోదు చేయడంతో గడువు దాటి అదనపు వినియోగం నమోదయ్యేది. దీంతో యూనిట్లు పెరిగిపోయేవి. ఇప్పుడు ఆ విధానాన్ని మార్చారు. ఉచిత పరిమితిని దాటి వినియోగిస్తే అదనంగా వచ్చిన యూనిట్లకే బిల్లు చెల్లించేలా నిబంధనలను సడలించారు.

జిల్లాలో వివరాలిలా...

చేనేత క్లస్టర్లు: 6

సంఘాలు: 36

సభ్యులు: 3 వేల మందికిపైనే

మగ్గాలు: 2,497

ప్రభుత్వ నిర్ణయంతో మేలు..

జిల్లాలో ఎక్కువ మంది చేనేత కార్మికులు ఇప్పటికీ మగ్గాలపైనే నేత నేస్తారు. పని చేసినంతసేపు మగ్గం వద్ద కాంతి తప్పక ఉండాలి. మధ్యలో విద్యుత్తు సరఫరా నిలిచిపోతే పనిలో వ్యత్యాసం వస్తుంది. ఎక్కువ సేపు బల్బు వినియోగిస్తే విద్యుత్తు బిల్లు మరింత భారమయ్యేది. ప్రభుత్వ నిర్ణయంతో వారికి మేలు జరగనుంది. కూటమి అధికారంలోకి వచ్చాక నేత కార్మికులకు పింఛను కూడా రూ.2,750 నుంచి రూ.4 వేలకు పెంచారు.

వారంతా అర్హులే..

కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న ఉచిత విద్యుత్తు పథకానికి గతంలోని లబ్ధిదారులంతా అర్హులే. కొత్తవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హతను పరిశీలించి మంజూరు చేస్తాం. ప్రతి చేనేత కుటుంబం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – టి.జనార్దనరావు, ఏడీ, చేనేత జౌళీశాఖ

(c) eenadu

కాశీబుగ్గ: బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచు శివలింగం

ఇచ్ఛాపురంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహారుద్రాభిషేకం

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

హరహర శంభో

నెలవంకలో బాహుదా నుంచి జలాలు తీసుకొస్తున్న మహిళలు

పలాస: ఉమా రామలింగేశ్వరాలయంలో..

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామునుంచే భక్తులు శైవక్షేత్రాలకు పోటెత్తారు. రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. లింగోద్భవ సమయంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు.

– న్యూస్‌టుడే, బృందం

ఇచ్ఛాపురం: చిదంబరేశ్వరాలయంలో కొలను వద్ద భక్తుల పూజలు

వజ్రపుకొత్తూరు మండలం బెండిలో నందికేశ్వరుడు

ఇచ్ఛాపురం కంచి కామాక్షి స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో రథంవీధిలోని పూజావేదిక వద్ద ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణకారులు, బంగారం వ్యాపారులు పాల్గొన్నారు. తొలుత వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని పుర మార్గాల్లో మేళతాళాలతో ఊరేగించారు. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు సింహాద్రి ప్రసాద్ ఆచారి స్వేచ్ఛావతి అమ్మవారి రోడ్డులో ఉన్న వాసవీమందిరం వద్ద ప్రత్యేక పీఠాన్ని నెలకొల్పి పూజలు చేశారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి తిరువీధి

శిలాఫలకాలతో సరి.. రహదారో మరి

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి పంచాయతీ పరిధి శివరాంపురం ప్రజలు ఏళ్ల తరబడి బీటీ రోడ్డుకు నోచుకోలేక రాకపోకలకు నరకం చూస్తున్నారు. ఇది ఉప్పుటేరు ఆనుకొని ఉండటంతో వరదల సమయంలో అవస్థలు తప్పడం లేదు. తెదేపా ప్రభుత్వంలో రోడ్డు, కల్వర్టు పనులు ప్రారంభించినప్పటికీ అనంతరం వచ్చిన వైకాపా సర్కారు నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా పనులు పూర్తికాలేదు.

ఏళ్లుగా రోడ్డు పనులు పూర్తికాక ప్రజలకు నరకయాతన

అసంపూర్తిగా ఉన్న శివరాంపురం రహదారి

వైకాపా ప్రభుత్వంలో తారురోడ్డు నిర్మాణ పనులకు గ్రామీణ రహదారుల పథకం (ఏఐబీ-ఈఏపీ) కింద సుమారు రూ.1.20 కోట్ల అంచనాతో అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు భూమిపూజ చేసి పక్కనే మరో శిలాఫలకం ఆవిష్కరించారు. తదుపరి 40ఎంఎం మెటల్ పరిచి అసంపూర్తిగా వదిలేశారు.

ఉప్పుటేరుకు వరద పోటెత్తిన సమయంలో రహదారి నీటి ముంపునకు గురవుతోంది. తాడు సాయం, ట్రాక్టర్ల మీద ప్రమాదకరంగా ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. అత్యవసర వేళ సేవలు అందక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడుతున్న దుస్థితి నెలకొంది.

మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరు అధికార కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న శివరాంపురంలో 90 కుటుంబాలు నివసిస్తున్నాయి. పంచాయతీ ప్రతినిధులు, అంతగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. బెండి-నువ్వలరేవు రోడ్డు నుంచి 1.2 కి.మీ రహదారి మాత్రమే ఉంది. వీటి మధ్యలో ఉప్పుటేరు వరద పరుపు ఉండటంతో బీటీ రోడ్డుతోపాటు వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అప్పటి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న గౌతు శివాజీ పక్కా రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి శిలాఫలకం ఆవిష్కరించారు.

చర్యలు తీసుకుంటున్నాం..

పలాస నియోజకవర్గంలో కొన్ని రోడ్ల నిర్మాణాలకు ఏఐబీ నిధులు మంజూరు చేశారు. ఆ నిధులు ప్రస్తుతం హోల్డ్‌లో పెట్టడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించాను. త్వరలో పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటా.

– గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 8008574279 9063144707

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? ఇచ్ఛాపురం పట్టణం బెల్లుపడకాలనీ సమీపంలోని మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. - **స్థానికులు** ★ రాత్రివేళ గస్తీ ఏర్పాటు చేస్తాం. - **సీఐ ఎం.చిన్నంనాయుడు** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం ? పలాస మండలం ఈదురాపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డు గుంతలుగా మారింది. : **గ్రామస్థులు** ★ త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం: **విక్రమ్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ** – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం ? కాశీబుగ్గ మండల పరిషత్తు కార్యాలయం నుంచి జామియా మసీదుకు వెళ్లే రహదారిలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు.- **కాంతారావు, కాశీబుగ్గ** ★ సిబ్బందిని పంపించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - **ఏఈ కిరణ్‌కుమార్** – న్యూస్‌టుడే, పలాస

ముళ్ల పొదలు తాకుతున్నాయ్..

ఇచ్ఛాపురం మండలం ఇన్నేసుపేట సమీప రహదారిలో ముళ్లపొదలు పెరిగి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మార్గం మీదుగా తులసిగాం, ధర్మపురం, కొళిగాం తదితర ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయంలో పొదలు అడ్డుగా వచ్చి ప్రమాదాల బారినపడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏవో కె.రామారావును వివరణ కోరగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

వినియోగిస్తే వృథా కాదు..

కవిటి మండలం బొరివంక గ్రామ సచివాలయం గతంలో పంచాయతీ భవనంలో ఉండేది. ఏడాది కిందట కొత్త భవనం నిర్మించి ప్రారంభించడంతో పాత పంచాయతీ కార్యాలయం వృథాగా మారింది. దానిని తమకు అప్పగిస్తే గ్రంథాలయంగా నిర్వహించుకుంటామని స్థానికులు పేర్కొంటున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

కర్రలే మాకు రక్ష..

కంచిలి మండలం బొనమాలి ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో గ్రామస్థుల సహకారంతో ఉపాధ్యాయులు వెదురు కర్రలతో కంచెను ఏర్పాటు చేశారు. పశువుల నుంచి రక్షణ కోసం ఇలా తాత్కాలికంగా కంచెను ఏర్పాటు చేశామని, అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయం మండల విద్యాధికారి చిట్టిబాబు వద్ద ప్రస్తావించగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, అనుమతులు రాగానే నిర్మాణం చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

దుర్వాసనతో స్వాగతం..

పలాస మండలం సవర గోవిందపురం గ్రామ శివారులో స్థానికులు చెత్త, వ్యర్థాలు పారబోస్తుండటంతో దుర్వాసన భరించలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను గ్రామానికి దూరంగా పారబోసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంచాయతీ అధికారి జీవన్ మాట్లాడుతూ రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

కుళాయిలు ఇలా.. రోగాలు రావా

ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో జల్ జీవన్ మిషన్ పనుల్లో భాగంగా కుళాయిలను మురుగు నీటి కాలువలో ఏర్పాటు చేశారు. దీంతో మురుగుతో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కలరా, డయేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రక్షిత ప్రదేశాలకు వాటిని మార్చాలని కోరుతున్నారు. దీనిపై ఏవో కె.రామారావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

మలుపులు.. మృత్యు దారులు..

సీమూరు నుంచి కవిటి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో పలు చోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. ముఖ్యంగా సీమూరు, నెలవంక సమీపంలోని మలుపు ప్రమాదకరంగా ఉంది. అక్కడ ఎలాంటి సూచికలు, వేగనియంత్రికలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ డి.విక్రమ్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ఉత్సాహంగా అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు..

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రాజావారి క్రీడామైదానంలో జరుగుతున్న దేవ్ జయంతి స్మారక టీ 20 అంతర రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా సాగుతోంది. ఈ పోటీల్లో భాగంగా ఆదివారం ఇచ్ఛాపురం ఎఫ్‌సీసీ, భీమవరం ఆర్‌కే, ఒడిశాలోని రంభ, మకరాంపురం జట్ల మధ్య రసవత్తరంగా పోటీలు జరిగాయి. ఉదయం ఆర్‌కే, మధ్యాహ్నం మకరాంపురం జట్లు విజయం సాధించాయి. ప్రతిభ కనబరిచినవారికి జ్ఞాపిక, పురస్కారాలను నిర్వాహకులు అందజేశారు. వీరిని సీఐ ఎం.చిన్నంనాయుడు అభినందించారు.

సామూహికంగా.. చిత్రగుప్తుడి నోము

మహాశివరాత్రి సందర్భంగా ఇచ్ఛాపురంలోని దాసన్నపేటలో చిత్రగుప్తుడి నోములను సామూహికంగా నిర్వహించారు. మహిళలు తమ కుటుంబ శ్రేయస్సుకు సూర్యనారాయణస్వామి, యమధర్మరాజు, చిత్రగుప్తులను ప్రార్థించారు. ఈ నోములను ఏటా రథసప్తమి, మహా శివరాత్రి పర్వదినాల్లో చేపట్టడం సంప్రదాయంగా వస్తోందని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బాధితులకు ఆర్థిక అండ

కవిటి మండలం నెలవంక గ్రామానికి చెందిన గడ్డి శ్రీను ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కేసుపురం గ్రామానికి చెందిన శ్రీకాళీమాత సేవా సమితి సభ్యులు ఆదివారం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. సీమూరు గ్రామానికి చెందిన తెప్పల శ్యామసుందర రావు కిడ్నీ వ్యాధితో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పిల్లల పార్కే కదా.. పట్టించుకోం..

– న్యూస్‌టుడే, సోంపేట

నాలుగు దశాబ్దాల కిందట రెండు పార్కులున్న సోంపేటలో ప్రస్తుతం సేదతీరేందుకు ఒక్క ఉద్యానం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల పార్కు ఏర్పాటు పేరిట అయ్యప్ప ఆలయ సమీపంలో ఎనిమిదేళ్ల కిందట చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచాయి. నిధుల సమస్య ఏర్పడడంతో ప్రహరీకే పరిమితమయ్యాయి. దీంతో స్థానికులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు.

కూరగాయల మార్కెట్, రాజుగారిపేటకు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న రెండు పార్కులు నిర్వహణ లేకపోవడంతో మరుగునపడ్డాయి. ఆర్టీసీ బస్టాండు వద్ద గతంలో పార్కు ఉండేది. అక్కడ గ్రంథాలయంతోపాటు పచ్చని చెట్లు, పూల మొక్కలతో ఆహ్లాదకర వాతావరణం కనిపించేది. సాంకేతిక విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకునేవారు. పెద్దలు, యువత వచ్చి సేదతీరేవారు. ఆర్టీసీ బస్టాండు కోసం ఈ స్థలాన్ని ఎంపిక చేయడంతో 1992లో పార్కు తొలగించారు. దీని స్థానంలో మరో పార్కు ఏర్పాటు చేసుకోవడానికి పంచాయతీకి ఆర్టీసీ నిధులు సమకూర్చింది. దీంతో రాజుగారిపేట దరిలో ఉన్న దంసింగియా రుగా తొలగించి రూ.50 లక్షలకు పైగా వ్యయంతో పార్కును అభివృద్ధి చేశారు. ఉత్తరభాగంలో మురుగు కాల్వ నిర్మించకపోవడంతో పట్టణంలో ఉన్న చెత్త అంతా ఇక్కడికే చేరుతుంది. దీని వల్ల ఈ ఉద్యానం వినియోగానికి దూరమైంది.

సోంపేటలో ఉద్యానం లేకపోవడంతో స్థానిక అయ్యప్ప ఆలయ సమీపంలో ఎకరాకు పైగా స్థలంలో పిల్లల పార్కు ఏర్పాటు చేసేందుకు ఎనిమిదేళ్ల కిందట చర్యలు చేపట్టారు. అక్కడ బోరుబావి నిర్మించి, ప్రహరీ ఏర్పాటు చేసేందుకు రూ. 20 లక్షల వరకు నిధులు వెచ్చించారు. రోటరీ, ఇతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో పార్కు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ పనులు ముందుకు సాగలేదు. దీంతో ఈ సమస్యను బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. బీసీ సంక్షేమ సంఘం ఈ ఉద్యానానికి జ్యోతిరావుపులే అని పేరు పెట్టి బోర్డు ఏర్పాటు చేసింది. ఇప్పటికైనా పెద్దలు చొరవ చూపి సోంపేట పట్టణంలో సేదతీరే కేంద్రం ఏర్పాటు చేయాలని ఉద్దానం గ్రామాల ప్రజలతోపాటు స్థానికులు కోరుతున్నారు.

మార్కెట్ సమీపంలో ఇండిపెండెన్స్ పార్కు ఉండేది. అక్కడ ఉద్ద గ్రంథాలయాన్ని పంచాయతీ నిర్మించింది. అనంతరం అధికారులు విస్తరించడంతో నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వం దాన్ని మూసేసి సచివాలయం, రైతుసేవాకేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇక్కడ ఉన్న గాంధీ విగ్రహం కూడా మరుగునపడింది. ఈ రెండు పార్కులను పట్టించుకోకపోవడంతో స్థానికులు సేదతీరేందుకు అవకాశం లేకుండా పోయింది.

ప్రహరీకే పరిమితమైన పనులు

విప్ దృష్టికి తీసుకెళ్లాం...

పిల్లల పార్కు ఏర్పాటుకు నిధుల సమస్య నెలకొంది. పంచాయతీ ఆదాయం పారిశుద్ధ్యం, మంచినీరు, విద్యుత్తు సదుపాయం, ఇతర ప్రాథమిక అవసరాలకే సరిపోవడం లేదు. దీని నిర్మాణానికి నిధులు సమకూర్చాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకొస్తాం.

– ఎం.శాంతికుమారి, పంచాయతీ ఈవో, సోంపేట

క్రాష్.. అయ్యేనా భేష్!

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఈ నెల 1 నుంచి మార్చి 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో క్రాష్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చేతి పంపులతోపాటు రక్షిత తాగునీటి పథకాలను వినియోగంలోకి తీసుకురావాలన్నది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

✧ గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేతి పంపులే కీలకం. వేసవిలో అధిక శాతం గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురవుతుండటంతో రోజుల తరబడి సరఫరా నిలిచిపోతోంది. ఈ నేపథ్యంలో వాడుక నీటి కోసం స్థానికంగా ఉండే చేతి పంపులపైనే ఆధారపడతారు. వినియోగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏటా వేసవికి సన్నద్ధత క్రమంలో ముందస్తుగా చేతి పంపులకు (బోర్లు) మరమ్మతులు చేస్తున్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సామగ్రికి మండల పరిషత్తు నిధులు

'క్రాష్' కార్యక్రమం కింద బోర్ల మరమ్మతులకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు మండల ప్రజా పరిషత్తు నిధులు కేటాయించనున్నారు. ఇటీవలే మండల పరిషత్తులకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడంతో అందులోని 15 శాతం తాగునీటి అవసరాలకు కేటాయించారు. గ్రామాల్లో అంచనాల మేరకు ప్రతి మండలంలోనూ సుమారుగా రూ.5 లక్షల నిధులతో పైపులు, ఇతర పరికరాలు కొనుగోలు చేస్తారు. అవసరమైతే గ్రామ పంచాయతీల నుంచి మరో 15 శాతం నిధులు ఖర్చు చేయనున్నారు.

✧ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నీటి వనరుల లభ్యత లేక సగం బోర్లు ఎండిపోయాయి. వీటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురానున్నారు. రక్షిత, మినీ రక్షిత తాగునీటి, డైరెక్టు పంపింగ్ పథకాలకు మరమ్మతులు చేయనున్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గ వివరాలు

మండలం	బోర్లు
కవిటి	716
ఇచ్ఛాపురం	323
కంచిలి	618
సోంపేట	503

✧ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీ మోహనరావును వివరణ కోరగా వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. ప్రస్తుతం గతంలో ఉన్న పరికరాలతో పనులు చేయిస్తున్నాం. కొత్తవి త్వరలోనే రానున్నాయని తెలిపారు.

సగంలో వదిలేశారు..

వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేట నుంచి పల్లివూరు బీటీ రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టారు. 40 ఎంఎం మెటల్ వేసి అసంపూర్తిగా వదిలేశారు. కొద్ది నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు పక్కన నివాసితులు దుమ్ము రేగి అవస్థలు పడుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని రోడ్డు, భవనాల శాఖ జేఈ జగదీశ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ప్రమాదం జరగకముందే పలకండి..

ఇచ్ఛాపురం పురపాలకసంఘం ఉప్పాడవీధి నుంచి కార్జీవీధి, దళితపేటకు చేరే మార్గం కూడలిలో కల్వర్టు పరిస్థితి ఇలా ఉంది. పాత సిమెంటు పలకలు శిథిలం కావడంతో పాటు, విరిగిన పలకను తొలగించి, అలా వదిలేశారు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహన చోదకులు పేర్కొంటున్నారు. స్థానికులే కర్రకు జెండా కట్టి ప్రమాద సూచిక ఏర్పాటుచేశారు. ఈ సమస్యను పుర కమిషనర్ నల్లి రమేష్ వద్ద ప్రస్తావించగా, సిబ్బందితో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

చారిత్రక వంతెన.. బలమైన రక్షణ

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణ ముఖద్వారంలో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న బాహుదానది పాత వంతెనకు ఉన్న సమస్యకు రహదారులు, భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారులు పరిష్కారం చూపారు. వారధికి ఇరువైపులా ఇనుప చట్రాలను అమర్చడంతో పాటు, చిన్నవాహనాలు మాత్రమే వెళ్లేలా రాతిగట్లను నిర్మించారు. ప్రస్తుతం కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు మాత్రమే వంతెన మీదుగా ప్రయాణిస్తున్నాయి. కొత్త వారధి నిర్మాణం పూర్తయ్యేవరకూ ఇలా పరిరక్షించుకుంటే కొన్నాళ్లపాటు రాకపోకలకు ఇబ్బందులుండవు.

✤ ఇసుక, ఇటుక, రాళ్ల రవాణా ట్రాక్టర్లు, ప్రైవేటు బస్సులు, మిని వ్యాన్లు దర్జాగా నడిపేవారు. 'ఈనాడు'లో కథనాలు రాగా, స్పందించిన ర.భ. శాఖ డీఈఈ నాగమోహనరావు సూచనలతో ఏఈ డి.విక్రమ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. సొంత సొమ్ముతో ఇనుప చట్రాలను పునరుద్ధరించారు. మళ్లీ వాటిని తొలగించే అవకాశం లేకుండా, వెల్డింగ్ అతుకులతో గేటును అమర్చారు. రాతి గోడల పనులు చేపట్టారు. దీంతో వంతెనకు ఇరువైపులా భారీ, అక్రమ వాహనాలకు అడ్డుకట్ట పడినట్లయింది.

ఇచ్ఛాపురం పట్టణం వైపు భారీవాహనాలను నియంత్రించేలా ఏర్పాట్లు

చర్యలు చేపడతాం...

కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలున్నాయి. నిధులు సమీకరించి ఉన్న వంతెనను పరిరక్షించేందుకు అవసరమైన రక్షణ చర్యలు చేపడతాం. సమస్యను ర.భ. శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.

– బి.అశోక్, ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కంచిలి, న్యూస్‌టుడే : మండల కేంద్రం కంచిలిలో కొలువైన శ్రీ రాధాకృష్ణ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతోందని వైద్యుడు నర్తు శేషగిరి పేర్కొన్నారు. ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామంలో క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మేరుగు సూర్యనారాయణ, సర్పంచి రాజశేఖర్, స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను నూరుశాతం వసూలు చేయాలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని, నూరుశాతం త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన కవిటి మండలం కవిటి మేజర్ పంచాయతీలో పన్ను వసూలును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారానే పన్నులు వసూలు చేయాలన్నారు. సర్పంచి పూడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతా.. మమ్మల్ని ఎవరడిగేది?

– న్యూస్‌టుడే, పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంస్థ అనుమతి తీసుకుని చేయాల్సిన పనులు శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కొంతమంది ఉద్యోగుల చేతివాటంతో అక్రమాల బాట పడుతున్నాయి. ఇదే కోవలో పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో కె.టి. రోడ్డులోని ఓ వాణిజ్య దుకాణానికి పురపాలక శాఖ అనుమతి లేదని చెప్పినా మాకెవడు అడ్డొస్తాడంటూ విద్యుత్తు స్తంభం, నియంత్రికలను ఇష్టారీతిన ఏర్పాటు చేస్తున్నారు.

కె.టి.రోడ్డులో అక్రమంగా వేస్తున్న విద్యుత్తు స్తంభాలు

చోద్యం చూస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం

కేటీ రోడ్డులో అక్రమంగా వేస్తున్న స్తంభం

★ జంట పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండటంతో పురపాలకశాఖ ఆధ్వర్యంలో కె.టి. రోడ్డును విస్తరించారు. అదే అదునుగా వాణిజ్య సముదాయ యజమాని ఆక్రమించి విద్యుత్తు నియంత్రిక, స్తంభం వేయడంలో నోట్లకట్టలు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

★ ఇదే విషయమై పురపాలక సంఘం కమిషనర్ ఇ.శ్రీనివాసులు వద్ద ప్రస్తావించగా పట్టణ ప్రణాళిక విభాగం ఉద్యోగులకు సమాచారం అందించి పనులు నిలిపివేయాలని ఆదేశాలిచ్చామన్నారు. రోడ్డుపై స్తంభం వేసిన యజమానిపై చర్యలు తీసుకుంటామని, విద్యుత్తుశాఖ ఉద్యోగులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

★ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో కె.టి.రోడ్డులో మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్యదొర విగ్రహం ఉంది. ఆ పక్కనే ఓ వాణిజ్య దుకాణం కోసం విద్యుత్తుశాఖకు చెందిన కొందరు రహదారిని యథేచ్ఛగా విద్యుత్తు స్తంభం ఏర్పాటుకు తవ్వేశారు. ఇదే విషయం పురపాలక కమిషనర్ ఇ.శ్రీనివాసుకు సమాచారం ఇవ్వడంతో ఆయన పట్టణ ప్రణాళిక విభాగానికి తెలపడంతో ఈ పనులు నిలపాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిబ్బంది చేరుకుని పనుల ఆపాలంటూ విద్యుత్తుశాఖ సిబ్బందికి చెప్పారు. అయినప్పటికీ వారు మాకు ఎదురెవరు అనే రీతిలో పనులు సాగించారు.

(c) eenadu

టెక్కలి

• టెక్కలి • నరసన్నపేట • పాతపట్నం

నాగేంద్ర హారాయ.. త్రిలోచనాయ

పూజలందుకుంటున్న శ్రీముఖలింగేశ్వరుడు

శ్రీముఖలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే శంకర్

ఎండల మల్లికార్జునస్వామి క్షేత్రానికి చెరువుగట్టు మార్గంలో తరలివస్తున్న భక్తులు

కోటబొమ్మాళి: తులసిపేట కాశీవిశ్వేశ్వరునికి అరటిగెలల నివేదన

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా తెల్లవారు జామునుంచే భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. అధికారులు అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే బృందం

కళ్యాణి గజపతి నారాయణ మహాదేవ్ వర్మకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఎమ్మెల్యే రమణమూర్తి దంపతులు, చిత్రంలో ఆర్డీవో సాయిప్రత్యూష

జలుమూరు: దర్శనానికి వేచి ఉన్న భక్తులు

జలుమూరు: కళాకారుల నృత్య ప్రదర్శన

వైభవంగా కల్యాణం

జలుమూరు, న్యూస్‌టుడే: లింగాలవలసలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురోహితుడు పురిపండ వెంకటరమణమూర్తిశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మంత్రి సుందరరావు, కృష్ణవేణి, వెంకటరమణమూర్తిశర్మ, నిర్మల దంపతులు, రాణా, చల్లవానిపేట, ఉసిరికిజోల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం పాలూరులోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. సెలవు రోజుల్లో పిల్లలు అందులో ఆడుకుంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలి. - **జోగారావు, స్థానికుడు**

★ మండల ఇంజినీరింగ్ అధికారితో మాట్లాడి, భవనాన్ని నేలమట్టం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - **జి.నరసింహులు, ఎంఈవో, నందిగాం** – న్యూస్‌టుడే, నందిగాం

ప్రసవ వేదనలో ప్రసూతి విభాగం

ఐదేళ్లవుతున్నా పూర్తికాని రూ.2.09 కోట్ల పనులు

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రి ఎదురుగా నిర్మాణ దశలో భవనాలు

లోపల పరిస్థితి

కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రి ఎదురుగా రూ.2.09 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రసూతి విభాగం ప్రసవ వేదన పడుతోంది. 2021 జులైలో పనులు ప్రారంభించగా.. దాదాపు ఐదేళ్లవుతున్నా పూర్తి కాలేదు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ సర్వీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంహెచ్ఎస్ఐడీసీ) నేతృత్వంలో ప్రారంభమైన నిర్మాణాలు ఏడాదిన్నరలో పూర్తిచేయాల్సి ఉంది. అధికారుల అలసత్వం, పాలకుల పట్టింపులేనితనంతో ఇప్పటికి 4 సార్లు గడువు పెంచారు. గుత్తేదారుడికి ఇంతవరకు రూ.1.44 కోట్లు బిల్లులు చెల్లించారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

అత్యవసరమైన తాగునీటి బోరు వేయలేదు. కనీసం ఎక్కడ తవ్వించాలన్న దానిపై జియాలజిస్టులు పరిశీలన చేయలేదు. చేసినట్లు చెబుతున్నా బోరు ఎందుకు వేయలేదో వారికే ఎరుక. నీటి సరఫరాకు 15 కేఎల్ ట్యాంకు పనులు చేయాల్సి ఉండగా కనీసం వాటి ఊసే లేదు. మరుగుదొడ్లు, పైపులైన్ల అనుసంధానం, విద్యుత్తు సరఫరా, కిటికీల పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

మంత్రి పరిశీలన

పర్యవేక్షకులు, గుత్తేదారులను మారిస్తే ప్రయోజనం ఉంటుందని అంతా అభిప్రాయపడుతున్నారు. సామాజికాసుపత్రి పరిధిలో ప్రసూతి విభాగాన్ని నిర్మిస్తున్నా ఇక్కడి సూపరింటెండెంట్‌ను కనీసం భాగస్వామ్యం చేయక పోవడం విడ్డూరం. ఇంజినీరింగు యంత్రాంగం మాత్రం ఎప్పుడు వచ్చి ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మూడుసార్లు ఆసుపత్రిని సందర్శించారు. ప్రతి సారీ పనులు జాప్యం గూర్చి ఉన్నతాధికారులను ప్రశ్నిస్తూనే ఉన్నారు. ఈనెల రెండో వారానికి పూర్తి చేస్తామని ప్రకటించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు.

చర్యలు తీసుకుంటున్నాం

పైపులైన్ల మెటీరియల్ రావాల్సి ఉంది. సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేశాం. బోరు ఎక్కడ తవ్వించాలో జియాలజిస్టులతో పరిశీలన చేయించాం. పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – వెంకటేశ్, ఏఈఈ, ఏపీఎంహెచ్ఎస్ఐడీసీ, శ్రీకాకుళం

రేపు ఉమాకామేశ్వరస్వామి చక్రతీర్థస్నానోత్సవం

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమాకామేశ్వరస్వామి చక్రతీర్థస్నానోత్సవం మంగళవారం నిర్వహించనున్నామని నిర్వాహక ప్రతినిధి కేవీఎల్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై బి.గణేశ్ ఆదివారం లుకులాం నదీ తీర రేవును పరిశీలించారు. భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, లోతైన, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రాధాన్య భవనం.. పట్టని వైనం

వైకాపా హయాంలో ప్రాధాన్య భవనాల పేరుతో గ్రామాల్లో సచివాలయాలు, వెల్‌నెస్, రైతుసేవా కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో చాలా వరకు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. కొత్తూరు మండలం పారాపురంలో రైతుసేవా కేంద్రం పరిస్థితిని చిత్రంలో చూడొచ్చు. దీంతో సిబ్బంది ఇబ్బందుల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

పారిశుద్ధ్యం.. అధ్వానం..!

కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పలు ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి, పనికిరాని మొక్కలు పెరిగిపోయినా పట్టించుకునే వారే లేకుండా పోయారని ప్రజలు వాపోతున్నారు. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని, రోగాల బారిన పడక ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సమస్యను మేజర్ పంచాయతీ ఈవో చింతాడ సన్యాసి వద్ద ప్రస్తావించగా.. తక్షణమే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

గుర్రపు డెక్క.. కదలని నీటి చుక్క

వంశధార ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువల్లో గుర్రపు డెక్క పేరుకుపోయింది. దీంతో ఏటా శివారు భూములకు సాగునీరందడం లేదు. 19 ఆర్ కాలువలో జలుమూరు మండలం దంపాక వద్ద పరిస్థితిని చిత్రంలో చూడొచ్చు. సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని మాకివలస, పర్లాం, గంగన్నపేట ప్రాంతాల రైతులు వాపోతున్నారు. దీనిపై వంశధార జేఈ సీహెచ్.భాను మాట్లాడుతూ.. ప్రతిపాదనలు పంపించామని, త్వరలో పనులు చేయిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, జలుమూరు

ముందు ప్రమాదం.. వెనక కేంద్రం

సారవకోట రైతు సేవా కేంద్రం ఎదురుగా భారీ గొయ్యి ఏర్పడి ఆందోళన కలిగిస్తోంది. దీని వల్ల ఇక్కడి సిబ్బంది, వివిధ పనులపై వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఆదమరిస్తే గోతిలో పడే అవకాశముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఏవో వెంకటరావును వివరణ కోరగా.. బీఎస్ఎన్ఎల్ కేబుల్స్ అమర్చిన సమయంలో గొయ్యి తవ్వారని, ఉన్నతాధికారులతో మాట్లాడతామన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

చేతిపంపు.. ఎదురుచూపు..!

పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మూడు బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా.. స్పందన లేదని, తాగునీటికి సమీప ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాగు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు దృష్టికి తీసుకెళ్లగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు, చిత్రంలో కూటమి నాయకులు

పాతపట్నం, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ 2026-27 బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ రంగం, మున్సిపల్ పరిపాలనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్య, వైద్యానికి ఎక్కువగా నిధులు కేటాయించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరంలో చోరీ

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: కొసమాల గ్రామంలో క్రైస్తవ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉదయం చోరీ జరిగింది. నిర్వాహకులు తెలిపిన వివరాలు ప్రకారం.. మహేంద్రతనయ నదీ సమీపంలోని చర్చిలో దొంగలు చొరబడి బీరువాను ధ్వంసం చేశారు. అందులో ఉన్న రూ.10 వేలు నగదు, 15 తులాల వెండి ఆభరణాలు, 4 సీసీ కెమెరాలు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు నిర్వాహకుడు సంజీవరావు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు తీరాయి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో మాల్కోదార్‌వీధిలో మురుగు కాలువల నిర్మాణ పనులు వల్ల తాగునీటి కుళాయిల పైపులు ధ్వంసమయ్యాయి. దీంతో స్థానికులు అవస్థలు ఎదుర్కొనేవారు. సమస్యపై ఇటీవల 'కోటబొమ్మాళిలో దాహం దాహం' శీర్షికతో ఈనాడులో కథనం వెలువడింది. గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏఈ గౌతమి స్పందించి పనులు చేపడుతున్నారు.

ఎట్టకేలకు దారికి తెచ్చారు

ఈనాడు కథనానికి స్పందన

హిరమండలం, న్యూస్‌టుడే: నౌగుడ రహదారి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. వంశధార జలాశయం నిర్మాణం వల్ల ప్రత్యామ్నాయంగా 2017లో రోడ్డు నిర్మించినప్పటికీ, వివిధ కారణాలతో నౌగుడ గ్రామం వద్ద 60 మీటర్ల మార్గాన్ని అసంపూర్తిగా వదిలేశారు. దీనిపై పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు బీటీ రోడ్డు పనులు పూర్తి చేశారు.

ఆర్థిక స్వావలంబన దిశగా అతివల అడుగులు

– న్యూస్‌టుడే, పోలాకి

మహిళలు కేవలం పొదుపు చేయడానికే పరిమితం కాకుండా కుటుంబ ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలను అందిస్తోంది. అందులో భాగంగానే స్వయం శక్తి సంఘాల్లో ఉన్నవారికి వెలుగు, స్త్రీనిధి ద్వారా ఆర్థిక భరోసానిస్తోంది. మరోవైపు బ్యాంకులు అతివలకు రుణాలు అందిస్తూ ఆర్థికంగా తోడ్పాటునిస్తున్నాయి. వ్యక్తిగతంగా రుణాలు పొందలేని వారిని పొదుపు సంఘాలు ఆదుకుంటున్నాయి. నాడు వెయ్యి రూపాయలు పొందడానికి నానా అవస్థలు పడే వారు కానీ నేడు రూ.5 లక్షల వరకు సంబంధిత సంఘాల ద్వారా రుణాలు పొందుతున్నారు. వీటితో పలు రకాల వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా పయనిస్తూ మరి కొందరికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు.

నరసన్నపేట నియోజకవర్గ వివరాలు

మండలం	వ్యాపారాలు చేస్తున్నవారు	రుణాలు (రూ.కోట్లలో)
పోలాకి	370	31.26
నరసన్నపేట	1,200	50
జలుమూరు	353	25
సారవకోట	1,100	25

ఆదర్శంగా నిలుస్తున్నారు

మండల వెలుగు కార్యాలయ పరిధిలో రుణాలు తీసుకొని వ్యాపారాలు చేస్తున్న వారు మిగిలిన సభ్యులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తూ బ్యాంకుల నుంచి మరింత ఎక్కువ రుణాలు పొందుతూ వారి వ్యాపారాలను విస్తరించుకుంటూ అభివృద్ధి బాటలో నడుస్తున్నారు. - **సుశీల, ఏపీఎం పోలాకి**

ఆర్థిక ఇబ్బందులు తీరాయి

నేను సత్యసాయి స్వయం శక్తి సంఘంలో సభ్యురాలిగా ఉంటున్నాను. కుటుంబానికి అండగా ఉండి ఆర్థిక ఇబ్బందులు తొలగించేందుకు మూడేళ్ళుగా కిరాణా వ్యాపారం చేస్తున్నాను. దుకాణం ఏర్పాటుకు రూ.1,50,000 బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాను. రోజువారి అమ్మకాలు రూ.4 వేలు వరకు జరుగుతున్నాయి. తీసుకున్న రుణం నెల నెలా చెల్లిస్తున్నాను. వ్యాపారం మరింతగా విస్తరిస్తాను.

- **గుడ్ల పుణ్యవతి, పిన్నింటిపేట**

వ్యాపారం బాగానే సాగుతోంది

నేను అయ్యప్ప స్వామి మహిళా సంఘంలో సభ్యురాలిని. బీకాం పూర్తిచేసి ఖాళీగా ఉండలేక రెండేళ్ళ కిందట పోలాకి ఆసుపత్రి కూడలిలో టీ దుకాణం ప్రారంభించాను. బ్యాంకు ఇచ్చిన రూ.లక్ష పెట్టుబడితో దుకాణం నిర్వహిస్తున్నాను. వ్యాపారం బాగానే సాగుతోంది. - **జల్లు ధనలక్ష్మి, డోల గ్రామం**

పునరావాస కాలనీల్లో ఇళ్ల స్థలాలు

హిరమండలం, న్యూస్‌టుడే: పునరావాస కాలనీల్లో వంశధార నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను గుర్తించి సమాచారం అందజేయాలని హిరమండలం, ఎల్ఎన్‌పేట, కొత్తూరు, ఆమదాలవలస మండలాల తహసీల్దార్లకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్కడెక్కడ స్థలాలు ఇచ్చారో తెలియజేస్తే ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కొద్దిరోజుల క్రితం జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు నిర్వాసితులు ఇబ్బందులపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గోవిందరావు, కలెక్టర్లను కలిసి వినతి పత్రం అందించడంతో చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

స్పందించారు.. ఇబ్బందులు తీర్చారు

టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడేవారు. వీటిపై ఈనాడులో వరుస కథనాలు రావడంతో స్పందించిన అధికారులు, పాలకులు పనులు చేపట్టారు. దీంతో ఆయా ప్రాంతాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో నగదు

జలుమూరు, న్యూస్‌టుడే: చల్లవానిపేట స్టేట్ బ్యాంకు ఏటీఎంలో నగదు లేక ఖాతాదారులు ఇబ్బందులు పడేవారు. దీనిపై 'సేవలకు తాళం' శీర్షికతో ఈనెల 10న వార్త ప్రచురితమైంది. దీంతో బ్యాంకు మేనేజరు ఆర్.వెంకటశ్రీను స్పందించారు. ఏటీఎంలో నగదు అందుబాటులో ఉంచారు.

మరమ్మతులు చేపట్టారు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట మండల కేంద్రం రోటరీనగర్ వద్ద మెగా రక్షిత మంచినీటి పథకం పైపులైన్ల లీకేజీతో తాగునీరు వృథాగా పోయేది. దీనిపై ఈనెల 8న 'వృథా.. పట్టని వ్యథ' శీర్షికతో చిత్ర వార్త వెలువడింది. దీంతో గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు మరమ్మతులు చేపట్టారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ట్యాంకర్‌ను ఏర్పాటు చేసినట్లు సర్పంచి డి.సుందరమ్మ తెలిపారు. ఈనెల 13న 'అక్కరకు రాదు అలంకారప్రాయమే' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యాలయం వద్ద పూజలు నిర్వహించి వాహనాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి సాయిప్రసాద్, ఉప సర్పంచి వి.బాలరాజు ఉన్నారు.

మురుగుకు దారి చూపారు

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట నాయుడు వీధిలో కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో 'ఈనాడు'లో ఈనెల 9న 'మురుగుకు దారి చూపరూ' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన సర్పంచి కె.శంకర్ బాబు, కార్యదర్శి లక్ష్మి మురుగునీరు దిగువకు ప్రవహించే విధంగా పనులు చేయించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై గణేశ్

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: యారబాడులో ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు రామ మందిర ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎస్సై గణేశ్ ఆదివారం గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారమివ్వాలన్నారు.

నేటి నుంచి సహకార సంఘాల ఉద్యోగులు సమ్మె బాట

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: డిమాండ్ల సాధనలో భాగంగా రాష్ట్ర ఐకాస నిర్ణయం మేరకు సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం నుంచి సమ్మె బాట పట్టనున్నారు. కోటబొమ్మాళిలో ఆదివారం సీఈవో మెండ సత్యనారాయణ సంఘ అధ్యక్షురాలు విజయలక్ష్మికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని 49 సంఘాల పరిధిలో 250 మందికి పైగా ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. 18 నెలలుగా ప్రభుత్వాన్ని కోరుతున్నా సమస్యలు పరిష్కరించడం లేదని.. ఇప్పటికైనా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే నిరసన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలపాలని ఈ మేరకు కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

హిరమండలం, న్యూస్‌టుడే: కల్లట పంచాయతీ జిల్లేడుపేట గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం రక్షిత నీటి పథకం ద్వారా కుళాయిలకు నీరు విడిచి పెట్టేందుకు గ్రామస్థులు మోటారు వేశారు. ఒక్కసారిగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. వెంటనే తేరుకున్న స్థానికులు వాటిని అదుపు చేసి విద్యుత్తు కనెక్షన్ తొలగించారు. పక్కనే ఉన్న గడ్డివాములు, పూరిళ్లకు మంటలు వ్యాపించకుండా అప్రమత్తమవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేసి, తాగునీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తాగునీటి మోటారు వద్ద మంటలార్పుతున్న గ్రామస్థులు

మరుగు.. ఆరుబయటకు పరుగు..!

– న్యూస్‌టుడే, నందిగాం

నందిగాం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేవు. మరికొన్ని చోట్ల ఉన్నా వినియోగానికి నోచుకోని దుస్థితి. మండల స్థాయి అధికారులు 112 రెవెన్యూ గ్రామాల్లో పర్యటించి ప్రతి కుటుంబానికి మరుగుదొడ్లు అవసరమని, 2018 మార్చి 31 నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని అప్పట్లో అవగాహన కల్పించారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలన్న విషయాన్ని వారు మరిచారు. తమ కార్యాలయాల్లోని మరుగుదొడ్ల పరిస్థితిని పట్టించుకోని అధికారులు ప్రజలకు ఎలా అవగాహన కల్పించారో ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని సిబ్బంది, వివిధ పనులపై వచ్చే వారు కోరుతున్నారు.

నందిగాం వెలుగు కార్యాలయంలో నీటి సదుపాయం లేక మరుగుదొడ్లకు తాళం

నిర్వహణ శోచనీయం

బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధం. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలనే మాటలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. తహసీల్దారు కార్యాలయంలో మరుగుదొడ్లు నిర్మించినా వినియోగంలోకి తీసుకురాలేదు. వెలుగు కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి. దీంతో ఆయా చోట్ల విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు, కార్యాలయానికి వచ్చే వారు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ, పశువైద్య, విద్యుత్తు శాఖ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేవు. గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో నిర్మించినా నీటి వసతి లేదు.

వినియోగంలోకి తీసుకొస్తాం

ఏయే ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు వినియోగంలో లేవో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. నిర్మాణంలో ఉన్న వాటిని త్వరగా పూర్తిచేస్తాం. అన్ని చోట్ల నీటి సదుపాయం కల్పిస్తాం. మరుగుదొడ్లు శుభ్రం చేసేవారిని ప్రభుత్వం విధుల్లో నుంచి తొలగించడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. – యు.కుమార్ పట్నాయక్, ఎంపీడీవో, నందిగాం

నీటి సౌకర్యం కల్పించాలి

మా కార్యాలయంలో మరుగుదొడ్లు నిర్మించారు. నీటి సౌకర్యం కల్పించలేదు. అధికారులు స్పందించి బోరుబావి తవ్విస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. - **మళ్ల రజని, అకౌంటెంట్, వెలుగు కార్యాలయం, నందిగాం**

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నందిగాం, న్యూస్‌టుడే: ఉయ్యాలపేటలో అభివృద్ధి పనులను తెదేపా మండలాధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో పల్లెల గురించి కనీసం పట్టించుకోలేదని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.20 లక్షలు గ్రామానికి కేటాయించిందని తెదేపా కార్యకర్త శ్రీనివాసరెడ్డి తెలిపారు. వీటితో పలు అభివృద్ధి పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

సన్యాసమ్మ పేరంటాల వేడుకలు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ముసిడిగట్టులో సన్యాసమ్మ పేరంటాల వేడుకలు ఆదివారం పల్లి కుటుంబీకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మేళతాళాలు, ముగ్గురాటలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

(c) eenadu

శ్రీకాకుళం

●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

చేపల వ్యాను బోల్తా

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండలం జాతీయ రహదారి అదపాక పైవంతెన సమీపంలో శనివారం అర్ధరాత్రి శ్రీకాకుళం నుంచి విశాఖ చేపల పిల్లలతో వెళ్తున్న బొలెరో వ్యాను అదుపుతప్పి రహదారికి అడ్డంగా బోల్తా పడింది. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు. రహదారిపై వ్యాను పక్కకు తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూశారు. ఫిర్యాదు అందలేదని లావేరు పోలీసులు తెలిపారు.

మహిళల వికాసానికి కూటమి కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస పట్టణం, పొందూరు, బూర్జ, న్యూస్‌టుడే: మహిళల వికాసానికి కూటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో జెండర్ రిసోర్స్ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అందుకు తగిన అవకాశాలు కూటమి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రిసోర్స్ కేంద్రాల ద్వారా మహిళలకు ఆరోగ్యం, విద్య, ఆర్థిక స్వావలంబన, సమానత్వం, చైతన్యం, కుటుంబ నియంత్రణ, న్యాయ అవగాహనతో పాటు శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని బాధ్యులు నడుమ తగాదాలను తీర్చి, కౌన్సెలింగ్ చేయనున్నారు. కార్యక్రమంలో పీడీ కిరణ్ కుమార్, ఎంపీడీవో సీపాన రామ్మోహన్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ❖ పొందూరు మండలం రాపాక గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే కూన రవికుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లను పరిశీలించారు. ❖ గుత్తావల్లి రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు.

మాజీ ఎమ్మెల్యే భుక్తాకు సత్కారం

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లాలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కె.ఎన్.భుక్తాను ఆదివారం సత్కరించారు. దివంగత నాయకులు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలతో ఆయన అనుభవాలను ఈ సందర్భంగా పంచుకున్నారు. జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి సూచనలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు, కె.వి.ఎల్.ఎస్. ఈశ్వరి, చాన్ బాషా, జి.రామారావు పాల్గొన్నారు.

సాగదీత.. తప్పని వెత..!

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

సరుబుజ్జిలిలో సర్వే చేస్తున్న సచివాలయం సిబ్బంది, ఈవోపీఆర్డీ

సాంకేతిక సమస్యలు, సచివాలయ ఉద్యోగుల వ్యక్తిగత విధులతో ఏకీకృత సర్వే ముందుకు సాగడం లేదు. వైఎస్సార్ హయాంలో కుటుంబ గణన(హౌస్ హోల్డ్ సర్వే) చేసి మ్యాపింగ్ చేశారు. ఆ సమయంలో పలు పొరపాట్లు జరగడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల లబ్ధి ఎంపిక విషయంలో నాటి తప్పిదాలు నేటికీ వెంటాడుతున్నాయి. తద్వారా అర్హత ఉన్నప్పటికీ చాలా మంది సంక్షేమ పథకాలు దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో వాటిని సరి చేసేందుకు ప్రభుత్వం తాజాగా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఎఫ్‌బీఎంఎస్)ను తీసుకొచ్చింది. దీని కోసం ఏకీకృత సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే-2025)కు శ్రీకారం చుట్టింది. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే రోజుల తరబడి జాప్యం జరుగుతోంది.

▶ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో గతేడాది డిసెంబరు 20న సర్వే ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి నెలాఖరులోపు పూర్తి కావాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు నత్తనడకనే కొనసాగుతుంది.

▶ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడంతోపాటు యూఎఫ్ఎస్ సర్వేకు సంబంధించిన యాప్‌లో వ్యక్తిగత, కుటుంబ స్థాయి వివరాలు నమోదు చేస్తారు. వ్యక్తిగత ఆధార్, పేరు, జనన తేదీ, చరవాణి నంబరు, ఉమ్మడి కుటుంబ స్థాయిలో వివాహ స్థితి, తండ్రి, భర్త పేరు, వారి ఆధార్ నంబర్లు, కులం, మతం, విద్యార్హత నమోదు చేస్తున్నారు. ఉపాధి, ఆదాయం, ఇల్లు, తాగునీరు, మరుగుదొడ్డి, అంతర్జాలం, ఎల్పీజీ కనెక్షన్, వాహనాలు, ఆస్తుల వివరాలు సేకరిస్తున్నారు.

గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించడం జరిగింది. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సర్వేను ఈవోపీఆర్డీలు, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుంది. తప్పులు దొర్లకుండా సర్వే చేయాలని సమావేశాల్లో సూచిస్తున్నాం. అని సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల ఎంపీడీవోలు ఎం.పావని, సీపాన రామ్మోహన్, వాసుదేవరావు, తిరుపతిరావు తెలిపారు.

తెరపై ఈనాడు

★ సరస్వతి: పంకీ ★ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): మన శంకరవర ప్రసాద్‌గారు ★ సన్‌ప్లెక్స్: సీతా పయనం ★ మారుతీ: మనసంతా నువ్వే ★ కిన్నెర: విత్ లవ్ ★ సూర్య: కపుల్ ఫ్రెండ్లీ – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య: ఆమదాలపాడు, శ్రీరాంవానిపేట, పెద్ద వత్సవలస ప్రాంతాల్లో కొందరు రైతులు మొక్కజొన్న పంటకు తమలు అందించేందుకు సాగునీటిని వినియోగిస్తున్నారు. దీంతో మా గ్రామానికి తాగునీటి సరఫరా సక్రమంగా జరగట్లేదు. - పి.బాబూరావు, చిన్నవత్సవలస

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - చంద్రకళ, జేఈ, శాలిహుండం ప్రాజెక్టు – న్యూస్‌టుడే, గార

మురుగు పారదు.. సమస్య తీరదు

పొందూరు మండలం కొంచాడ గ్రామంలో మురుగు కాలువలు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. దీనివల్ల మురుగు ముందుకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దుర్వాసన, దోమల బెడద ఎక్కువైందని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద వివరణ కోరగా పరిశీలించి, చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం,

చివరి మజిలీకీ చిక్కులే

పొందూరు పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక అధ్వానంగా మారింది. ప్రస్తుతం పనికిరాని మొక్కలతో నిండి అంతిమ సంస్కారాలు జరిపేందుకు వీలుకాని పరిస్థితి నెలకొంది. దీంతో లోపలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా, పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు. –న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

కూలేంత వరకు పట్టించుకోరా

జాతీయ రహదారిపై కేశవరావుపేట పంచాయతీ కింతలమిల్లు సమీపంలో విద్యుత్తు స్తంభం సర్వీసు రోడ్డు వైపు ఒరిగిపోయింది. ఏ సమయంలో కూలుతుందోనని వాహన చోదకులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. జాతీయ రహదారి ప్రాధికార సంస్థ డిప్యూటీ మేనేజర్ సీహెచ్ సతీష్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. –న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

భయపెడుతోంది

సరుబుజ్జిలి మండలంలోని చిగురువలస గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలోని శిథిలమైన పాఠశాల భవనం భయపెడుతోంది. 42 ఏళ్ల కిందట నిర్మించిన భవనం గోడలు వర్షాలకు తడిసి ముద్దయి ఏ క్షణాన కూలుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవోలు-1, 2 బాలరాజు, శ్రీనివాసరావుల వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

చెత్తంతా ఇక్కడికే..!

ఆమదాలవలస మండలం గోపీనగరం నాగావళి వంతెన వద్ద గ్రామాల్లో సేకరించిన చెత్తను వేస్తున్నారు. వర్షాలు కురిస్తే ఆ ప్రాంతంలో దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు పేర్కొంటున్నారు. నీరు కూడా కలుషితమవుతుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నదిలో వేసిన చెత్తను తొలగించాలని కోరుతున్నారు. పరిశీలించి, సమస్య పరిష్కరిస్తామని ఈవోపీఆర్డీ గోపాలరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, గోపీనగరం(ఆమదాలవలస గ్రామీణం)

అవస్థల ప్రయాణం

జి.సిగడాం మండలంలో గెడేలపేటకు వెళ్లే రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. రాకపోకలు సమయంలో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు పాడవుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ లతశ్రీని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, జి.సిగడాం

పశుగ్రాసం.. పండించు రైతన్న..!

న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

పాడి పరిశ్రమలో పెరుగుతున్న ఖర్చులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం పశుగ్రాసం పెంపకానికి ప్రోత్సహిస్తోంది. రైతులకు శతశాతం రాయితీలను అందిస్తోంది.

★ పశుగ్రాసం సాగుకు 5 ఎకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులు కాగా, జాబ్ కార్డు కచ్చితంగా పొంది ఉండాలి. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రం, పశు వైద్యాధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. నీటి వసతిని పరిశీలించి రైతులకు అనుమతిని ఇస్తారు.

◆ నాపియార్, గినియా గ్రాస్ వంటి మేతను పంట పొలాల్లో సాగు చేసి, పశులకు రోజూ తాజా మేత అందించాలి. ఇది ఒకసారి నాటితే 3 నుంచి 5 సంవత్సరాలపాటు ఉపయోగపడే సాగు. పెద్ద రైతులే కాకుండా 10 సెంట్లు ఉన్నవారు కూడా సాగు చేయొచ్చు.

◆ శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని ఇప్పటి వరకు 45 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా వారిలో 41 మందికి అర్హత లభించింది.

◆ శ్రీకాకుళం గ్రామీణ మండలంలో రాగోలు, సింగుపురం, శిలగాం సింగువలస, పెదపాడు వంటి పంచాయతీల్లో అత్యధికంగా ఆవులు, గేదెలు ఉన్నాయి. భైరి, కరజాడ, కళ్లేపల్లి, కిల్లిపాలెంతో పాటు మరికొన్ని నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక బండ్లు, వ్యవసాయానికి తోడుగా ఎడ్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో రైతులకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పిస్తే మరింత మంది ఈ ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందే అవకాశం ఉంది.

శ్రీకాకుళం గ్రామీణ మండలం శిలగాం సింగువలసలో పశుగ్రాసం సాగు చేస్తున్న రైతు

◆ గ్రామాల్లో విరివిగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జాబ్‌కార్డు లేని వారు వచ్చినా వారికి వెంటనే కార్డును మంజూరు చేసి, పశుగ్రాసం సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. దీనికోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

– కిల్లారి సీతారాం, మండల ఏపీవో

నమో రుద్రాయ

లావేరు మండలం బెజ్జిపురం శ్రీ ఉమారామలింగేశ్వరస్వామికి అభిషేకం

సరుబుజ్జిలి: దంతపురిలో..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారి జాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సహస్ర బిల్వార్చనలు చేపట్టారు. ధర్మకర్తలు, ప్రధాన అర్చకులు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయాలు విద్యుత్తు కాంతులతో శోభిల్లాయి. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మహిళా భక్తులు ఉపవాసాలతో జాగారాలు చేశారు.

–న్యూస్‌టుడే, బృందం

ఆమదాలవలస మండలం సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద

మండల వీధిలోని మండలేశ్వరాలయంలో బారులుదీరిన భక్తులు

గుడివీధి ఉమారుద్రకోటేశ్వరాలయం వద్ద అన్నదానం

కూరగాయల ధరలు

శ్రీకాకుళం రైతుబజారులో కూరగాయల నిన్నటి ధరలు (కిలో రూపాయల్లో) ● టమాటాలు 12 ● వంకాయలు 26/36 ● బెండ 42 ● పచ్చిమిర్చి 60 ● కాకర 40 ● బీర 44 ● క్యాలీఫ్లవర్ 15/20● క్యాబేజీ బుట్ట 20 ● క్యారెట్ 34 ● దొండ 36 ● బంగాళదుంపలు 18 ● ఉల్లిపాయలు 20/24 ● గోరు చిక్కుడు 44 ● ఆనప 16 ● అరటికాయ(జత) 16 ● గోల్కొండ చిక్కుడు 20 ● అల్లం 80 ● వెల్లుల్లి 140 ● బీట్‌రూట్ 30 ● క్యాప్సికమ్ 56 ● కీరదోస 44 ● పప్పుదోస 26 ● బఠానీకాయలు 40 ● ముల్లంగి 26 – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

మాజీ సైనికులకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ

శిక్షణలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, శిక్షకులు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ సైనికులకు వ్యవసాయ డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి శైలజ తెలిపారు. శ్రీకాకుళం నగరం పెద్దపాడు సమీపంలోని ఓ హోటల్‌లో కార్యక్రమం జరిగింది. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, వాటి ప్రయోజనాల గురించి శిక్షకులు వివరించారు. మాజీ సైనికులు శ్రీనివాస్ ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై సందీప్ తదితరులు

పొందూరు గ్రామీణం, జి.సిగడాం, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మండల వ్యాయామ ఉపాధ్యాయుల అధ్వర్యంలో ఆదివారం పాలఖండ్యాం సమీపంలో రాజాం జోన్ పరిధి ఉపాధ్యాయులు నిర్వహించిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. వృత్తితో పాటు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. క్రీడలు జ్ఞాపకశక్తిని ఇనుమడింపజేస్తాయన్నారు. కార్యక్రమంలో రాజాం, జి.సిగడాం. సంతకవిటి, సీతంపేట, వంగర, రేగిడి మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తగ్గిన రాజమ్మ తల్లి జాతర రద్దీ

గార (వత్సవలస), న్యూస్‌టుడే: గార మండలం వత్సవలస పంచాయతీ చిన్నవత్సవలస గ్రామంలో రాజమ్మతల్లి జాతరలో ఆదివారం భక్తుల రద్దీ అంతంత మాత్రంగానే ఉంది. మహాశివరాత్రి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్దగా భక్తులు రాలేదు. వచ్చేవారం రద్దీ ఉండే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా మహాలింగార్చన

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ రుత్వికులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈవో కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

ప్రయాణం.. ప్రాణాలే పణం..!

జేఆర్‌పురం నుంచి రావాడ వెళ్లే మార్గంలో ద్విచక్రవాహనంపై ప్రమాదకరంగా ఆరుగురు ప్రయాణిస్తున్నారు. జేఆర్‌పురం కూడలిలో అసలే ట్రాఫిక్ సమస్య, పైవంతెన నిర్మాణంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఇలాంటి సమయంలో చిన్నారులతో వెళ్లడం ఎంతమాత్రం సురక్షితం కాదని ఎస్సై చిరంజీవి హితవు పలికారు. ఇలా ప్రయాణం చేసేవారిని గుర్తించి నిలువరిస్తామన్నారు. న్యూస్‌టుడే, రణస్థలం

నిరసనలో పాల్గొనాలని పిలుపు

గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

పొందూరు గ్రామీణం, జి.సిగడాం, న్యూస్‌టుడే: సీపీఎస్ రద్దు చేయడంతోపాటు పాత పింఛను విధానం అమలు చేయాలని కోరుతూ ఏపీసీపీఎస్ఈఏ అధ్వర్యంలో చేపడుతున్న సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం పాలఖండ్యాంలో నిర్వహించిన నాయకుల సమావేశంలో మాట్లాడారు. 22న విశాఖలోని జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. అనంతరం గోడ ప్రతులను ఆవిష్కరించారు.

ఎన్నికల హామీలు మరిచారు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఎన్నికల హామీలను మరిచారని డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు విమర్శించారు. ఆదాయ వనరులు, ఖర్చులు, రుణాలకు అసలు పొంతన లేదన్నారు. ఫిషింగ్ హార్బర్ల పేరుతో మత్స్యకారులను మోసం చేశారన్నారు.

గుట్టుగా యూరియా విక్రయాలు!

గార(వమరవల్లి), న్యూస్‌టుడే: గార మండలం వమరవల్లి గ్రామ సచివాలయంలో ఆదివారం గుట్టుగా యూరియా విక్రయించడం చర్చనీయాశంమైంది. ఇటీవల స్థానిక రైతు సేవా కేంద్రానికి వచ్చిన 25 టన్నుల యూరియాను స్థానిక గ్రామ సచివాలయ గోదాంలో భద్రపరిచారు. ఈ-పంట నమోదు కారణంగా యూరియా పంపిణీ బాధ్యతను తూలుగు పీఏసీఎస్‌కు అప్పగించారు. అక్కడి సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం వమరవల్లి సచివాలయం వద్ద గుట్టుగా విక్రయాలు ప్రారంభించారు. సమాచారం తెలిసి కొందరు రైతులు అక్కడికి వెళ్లారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా పంపిణీ చేస్తారని సిబ్బందిని నిలదీశారు. దీంతో పొరపాటు జరిగిందని, సోమవారం అందరికీ యూరియా ఇస్తామని చెప్పి అక్కడి నుంచి వారు జారుకున్నారు. నిర్దేశిత ధర కంటే ఎక్కువ మొత్తానికి అనర్హులకే విక్రయించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారిణి దుంపల పద్మావతిని వివరణ కోరగా యూరియా పంపిణీ చేస్తున్నట్లు సమాచారం లేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కష్టాల ఆహ్వానం.. ఇక్కట్ల జీవనం

న్యూస్‌టుడే, బూర్జ

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. నివాసాల వద్ద రోడ్లు గుంతలు ఏర్పడి మురుగు తిష్ఠ వేస్తోంది. దోమల సంచారంతో పల్లె ప్రజలకు కునుకు కరవవుతోంది. రహదారులపై ఇరువైపులా మూగజీవాలను ఉంచడం, వ్యర్థాలు, విసర్జితాలతో అధ్వానంగా మారింది. బూర్జ, తోటవాడ, లచ్చయ్యపేట, ఉప్పినివలస, తదితర గ్రామాల శివారు కాలనీ వాసులు మౌలిక వసతుల లేమితో అవస్థలు పడుతున్నారు.

❖ ఉప్పినివలస కాలనీలో మురుగు కాలువల నిర్మాణం లేక ఇళ్లల్లో వాడుక నీరు నిలిచి దోమలకు నివాసంగా మారుతోంది.

❖ ఇంటింటికీ కుళాయిలు లేక తాగు నీరు గగనంగా మారుతుంది. తోటవాడలో పాత ఎస్సీ కాలనీలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా పైపులైను వేసేందుకు గుంతలు తీశారు. ఆ తరువాత పనుల్లో పురోగతి లేకపోవడంతో వాడుక నీరు ఆ గుంతల్లో చేరి అధ్వానంగా మారింది. బ్లీచింగ్ చల్లడం లేదని స్థానికులు వాపోతున్నారు. బూర్జ మండల కేంద్రంలో పలు వీధులతోపాటు బీసీ, ఎస్సీ కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

తోటవాడ ఎస్సీ కాలనీ చేరుకునే రహదారిలో మురుగునీరు

❖ పారిశుద్ధ్య పనులు ప్రతి రోజు చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. పంచాయతీ అధికారులకు పలు మార్లు విన్నవించినా చర్యలు చేపట్టడం లేదని, వృద్ధులు, చిన్నారులు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారని తోటవాడ గ్రామస్థులు వాపోతున్నారు.

సమస్య ఉన్న కాలనీల్లో పరిశీలిస్తాం. సీసీ రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణానికి కృషి చేస్తాం. అని బూర్జ ఎంపీడీవో తిరుపతి రావు అన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన నగరపాలక సంస్థ కమిషనర్



శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ హనుమంతు కూర్మారావు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లను ఆదివారం ఆదివారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నగరాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. తెదేపా నాయకుడు మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

పూడిక తొలగించండి సారూ

పట్టణంలోని 20వ వార్డు వెంగళరావుకాలనీ కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగనీరు ప్రవహించకుండా రహదారిపైకి వస్తోందని, దోమల బెడద, దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. సమస్య మున్సిపల్ కమిషనర్ టి.రవి వద్ద ప్రస్తావించగా పూడిక తొలగిస్తామని హామీ ఇచ్చారు.

- న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

(c) eenadu

24న శశికళ కొత్త పార్టీ ప్రకటన?

సైదాపేట, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి జయలలిత జయంతి రోజైన ఫిబ్రవరి 24న జయలలిత నెచ్చెలి వీకే శశికళ కొత్త పార్టీ ప్రకటించనున్నట్లు సమాచారం. ఈ నెల 6వ తేదీ చెన్నై పోయెస్ గార్డెన్‌లోని తన నివాసంలో శశికళ తన మద్దతుదారులతో కొత్త పార్టీ పెట్టడం గురించి ఆలోచనలు జరిపినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఇటీవల శశికళ ఉసిలంపట్టిలో పోటీ చేయాలని ఆమె మద్దతుదారులు పోస్టర్లు అంటించడం గమనార్హం. ఈ నేపథ్యంలో 24న రామనాథపురం జిల్లా పసుంపొన్‌లో భారీ సభ నిర్వహించేందుకు శశికళ ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి ముహూర్త కార్యక్రమం ఆదివారం ఉదయం జరిగింది. పంచాయతీ మండ్ర మాజీ అధ్యక్షుడు రామకృష్ణన్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో శశికళ మద్దతుదారులు పలువురు పాల్గొన్నారు. పసుంపొన్‌లో జరిగే సమావేశంలో కొత్త పార్టీ గురించి ప్రకటించనున్నట్లు సమాచారం.

చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా చక్రస్నాన మహోత్సవం

ముగిసిన పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై టీనగర్ జీఎన్ చెట్టి రోడ్డులోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం చక్రస్నానం మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో తితిదే తమిళనాడు విభాగ ఏఈవో ధనుంజయ, సూపరింటెండెంట్ పుష్పలత, స్థానిక సలహా మండలి మాజీ అధ్యక్షులు శ్రీకృష్ణ, మాజీ సభ్యులు కృష్ణారావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం ఆలయంలో పుష్పయాగం నిర్వహించనున్నట్టు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నైలో వళ్లలార్ పరిశోధన కేంద్రం

ఏర్పాటుకు ముఖ్యమంత్రి ప్రకటన

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నైలో హిందూ దేవాదాయశాఖ కార్యాలయ ప్రాంగణంలో వళ్లలార్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. చెన్నై కీల్పాక్కంలోని ఏకాంబరనాథర్ ఆలయ మైదానంలో అఖిల భారత వళ్లలార్ సదస్సును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రాన్ని ప్రారంభించారు. చెన్నై- తిరువొట్టియూరు హైరోడ్డుకు వళ్లలార్ పేరు పెట్టి నామఫలకాన్ని వీసీ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. తమిళ సమాజంలో ఉదయించిన విప్లవకారుడు వళ్లలార్ అని తెలిపారు. ప్రపంచానికి కరుణ మార్గాన్ని బోధించారని అన్నారు. ఆయన మార్గంలో ద్రావిడ మోడల్ ప్రభుత్వం పేద, బడుగుల ఆకలి తీర్చే పథకాలు అమలు చేస్తోందని తెలిపారు.

ఎనిమిది కీలక ప్రకటనలు

అంతర్జాతీయ వళ్లలార్ సదస్సు స్మారకంగా కాంచీపురం ఏకాంబరనాథర్ పాఠశాలలో స్మారక స్థూపం ఏర్పాటు, వడలూరులో సన్మార్గ శిక్షణ పాఠశాల ఏర్పాటు, వడలూరులో వళ్లలార్ పేరుతో మూలికల తోట, ఆధ్యాత్మిక రసవాదం అనే పుస్తకాన్ని దేవాదాయశాఖ పబ్లికేషన్ ద్వారా విడుదల చేయడం, ఏటా మూడు రోజులపాటు వళ్లలార్ జయంతి వేడుకలు జరపడం, మేట్టుకుప్పం, మరుదూరు, కరుంగుళి ప్రాంతాల్లో వళ్లలార్ పేరుతో అన్నదాన కేంద్రం ప్రారంభం, కడలూరు కలెక్టరేట్ దగ్గర ఏర్పాటు కానున్న పార్కుకు వళ్లలార్ పేరు పెట్టడం, చెన్నైలో వళ్లలార్ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సిద్ధ వైద్యం, మూలికలు, వళ్లలార్ జీవితచరిత్రకు సంబంధించి ఫొటో ప్రదర్శన ప్రారంభించి తిలకించారు. సదస్సులో మంత్రులు, అధికారులు, పలువురు ఆధ్యాత్మికవేత్తలు, తమిళ జ్ఞానులు పాల్గొన్నారు.

క్షణికావేశం.. బలవుతున్న నిండు ప్రాణం

- రాష్ట్రంలో అధికమవుతున్న ఆత్మహత్యలు
- మదురై నగరంలోనే ఎక్కువగా నమోదు

జనాలు తమకొచ్చిన కష్టం ముందు ప్రాణం చిన్నదిగా చూస్తున్నారు. క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ తీవ్రత దేశంలోకల్లా తమిళనాడులోనే ఎక్కువగా ఉండటం ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల్లో రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. –ఈనాడు,చెన్నై

ఆత్మహత్య మరణాల రేటు (ఎన్‌సీఆర్‌బీ) తమిళనాడులో ఎక్కువగా ఉందని తేలింది. ప్రతి లక్ష జనాభాకు 25.9మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ రేటు జాతీయస్థాయిలో అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. గత మూడేళ్ల ఈ తీవ్రత ఆందోళనకరంగా కొనసాగుతోంది. 2022లో ఇక్కడ 19,834 ఆత్మహత్యలు చోటుచేసుకోగా.. 2023లో 19,483 జరిగాయి. ఈరెండేళ్లలో స్వల్పంగా తగ్గినా.. ఆత్మహత్యల తీవ్రత మాత్రం అలాగే ఉండటం ఆందోళనకు గురిచేస్తోంది.

బలవన్మరణాల రేటు	
మదురై	27.6
కోయంబత్తూరు	19.1
తిరుచ్చి	17.8
చెన్నై	17.6

సామాజిక మాధ్యమాలతో చేటు

మనుషులు మానసికంగా బలంగా ఉండాలంటే బలమైన సామాజిక బంధాలుండాలని నివేదికలో తెలిపారు. అవి లోపించడం వల్లే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తమ విశ్లేషణలో తేల్చారు. స్నేహాలు సైతం ఈరోజుల్లో సాంకేతికంగా మారుతున్నాయని వెల్లడించారు. పరస్పరం మాట్లాడుకోవడం మానేసి సామాజిక మాధ్యమాల్లో పరిచయాలు, స్నేహాలు, అందులోనే మాట్లాడుకోవడాలు వంటి పరిస్థితులు తయారయ్యాయని ఉటంకించారు. తమిళనాడులో సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువగా ఉందని, ఇది కూడా ఆత్మహత్యలకు దారితీయడానికి ఓ కారణంగా వెల్లడించారు. అలా కాకుండా వ్యక్తుల మధ్య బంధాలు బాగున్న బిహార్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో ఆత్మహత్యలు తక్కువగా ఉండటం ఇందుకు నిదర్శనంగా చూపారు. తమిళనాడులో ఆత్మహత్యల వాటాలో అనారోగ్య కారణాలు 35.1శాతంగా ఉండగా, కుటుంబ సమస్యలు 33.9శాతంగా ఉన్నాయి.

ఎక్కువగా వివాహితలు

- దేశంలో వివాహిత మహిళల ఆత్మహత్యలు సైతం తమిళనాడులోనే ఎక్కువే. దేశంలో తమిళనాడు వాటా 12.80 శాతంగా ఉంది. ఈ కేటగిరీలో రాష్ట్రం దేశంలోనే తొలిస్థానంలో ఉంది.
- ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మహత్యల్లోనూ తమిళనాడు మొదటిస్థానంలో ఉంది. దేశంలోనే అత్యధికంగా 317 మంది 2023లో ఆత్మహత్యలు చేసుకున్నారు.
- అలాగే విద్యార్థుల వాటా దేశంలో 9.6శాతం, నిరుద్యోగులు 11.2శాతం, వ్యాపారులు 8.9శాతం, రైతులు 5.9శాతంమంది ప్రాణాలు వదిలారు.
- కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు.. ఇలా మూకుమ్మడిగా ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితులు చాలానే ఉన్నాయి. ఇలా ఒక్క తమిళనాడులో 120మంది ప్రాణాలు వదిలారు.

హాట్‌స్పాట్‌గా మదురై

రాష్ట్రంలో ఎక్కువ కేసులో మదురైలోనే నమోదవుతున్నాయి. ఈ రేటు అత్యధికంగా ఇక్కడ 27.6శాతంగా ఉంది. 19.1శాతంతో కోయంబత్తూరు తర్వాతి స్థానంలో ఉంది. 2022తో పోల్చితే 2023లో కోయంబత్తూరులో 9.3శాతం, మదురైలో 6శాతం మేర ఆత్మహత్యలు పెరగడం గమనార్హం. దేశంలో మెట్రో నగరాల జాబితాలో చూస్తే.. చెన్నై 3వ స్థానంలో ఉంది. 2011-21 మధ్య జరిపిన అధ్యయనాన్నిబట్టి వీఐటీకి చెందిన పరిశోధకులు అంజలి, రుషికుమార్ చెప్పిన విషయాల ప్రకారం.. రాష్ట్రంలోనే మదురై నగరం ఆత్మహత్యలకు హాట్‌స్పాట్‌గా మారింది. దీంతో పాటు చెన్నై, కోయంబత్తూరులో ఆత్మహత్యలు పెరగడానికి మానసిక, ఆర్థిక సమస్యలు ఎక్కువ కారణమని చూపించారు.

చిన్న కుటుంబాలతోనే సమస్య

రాష్ట్రంలో ఆత్మహత్యాయత్నాలకు పాల్పడేవారిలో ఎక్కువమంది చిన్న కుటుంబాల నుంచి వచ్చినవారేనని మరో అధ్యయనం బయటపెట్టింది. 25శాతం మంది గతంలో ఇలాంటి ప్రయత్నాలు చేసి విఫలమై, మళ్లీ ప్రయత్నించినవారేనని వివరించారు. దీన్ని తమ జీవితంలో నిరాశ చెంది ఏదోవిధంగా చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడవుతోంది. ఇందుకోసం విషపదార్థాల్ని వినియోగిస్తున్నట్లు స్పష్టత వస్తోంది. ఈ అధ్యయనంలో ఎక్కువ మంది తమ వివాహ బంధంలో సమస్యలతోనే ఆత్మహత్యలకు పాల్పడ్డారని తేలింది. ఆ తర్వాత ఆర్థిక సమస్యలు, ప్రేమ విఫలమవడం, పరీక్షల భయం, పరిస్థితుల్ని ఎదుర్కోలేకపోవడం లాంటివి కనిపించాయి.

పారిశుద్ధ్య కార్మికురాలిని రాష్ట్రపతి వద్దకు తీసుకెళ్తా

• ఆమె నిజాయతీ దేశానికి తెలియాలంటున్న ఆంధ్రా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

పారిశుద్ధ్య కార్మికురాలు పద్మ

చెన్నై, ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: చెన్నైకి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు పద్మ తనకు దొరికిన రూ.45లక్షల విలువైన బంగారు ఆభరణాల బ్యాగును నిజాయతీగా పోలీసుల ద్వారా యజమానికి అప్పగించిన సంఘటనపై ఆంధ్రప్రదేశ్ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పందించారు. ఆమెకు జాతీయస్థాయి గుర్తింపు ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. 'ఈనాడు' ప్రధాన పత్రికలో జనవరి 13న 'చెత్త సేకరిస్తుంటే.. 45 సవర్ల బంగారం దొరికింది' శీర్షికన పద్మ నిజాయతీ గురించి వార్త ప్రచురితమైంది. ఇదే వార్తను ఆయన రాష్ట్రపతి లేఖకు జతచేశారు. చెత్తను సేకరించే క్రమంలో రోడ్డు పక్కన పడిఉన్న బ్యాగు పద్మ కంటపడింది. అందులో బంగారు ఆభరణాలు ఉండటంతో ఆశ్చర్యపోయింది. ఆ బ్యాగును ఆమె నేరుగా పాండిబజార్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించింది. ఆ బ్యాగులో రూ.45లక్షల విలువైన ఆభరణాలున్నా ఆమె ఆశించలేదు. పద్మను ఈ మధ్యే చెన్నై మహానగర పాలక సంస్థ మేయర్ ప్రియ, ముఖ్యమంత్రి స్టాలిన్, సినీనటుడు రజనీకాంత్ సత్కరించారు. ఆమె నిజాయతీకి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక అవార్డుకు సిఫారసు చేయాలని రాష్ట్రపతిని ఎంపీ అప్పలనాయుడు కోరారు. త్వరలో పద్మను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దగ్గరకు తీసుకెళ్తానని వివరించారు.

ఎన్డీయేలోనే ఎన్నికలు ఎదుర్కొంటాం: పుదువై సీఎం రంగసామి

అమిత్ షాకు వెండి వినాయకుడి విగ్రహం బహూకరిస్తున్న రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో రానున్న శాసన సభ ఎన్నికల్లో ప్రస్తుతం ముఖ్యమంత్రి రంగసామి నేతృత్వంలోని ఎన్నార్ కాంగ్రెస్, భాజపా కూటమి కొనసాగనున్నట్లు నిర్ధారణైంది. కారైక్కాల్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాని శనివారం సాయంత్రం కలిసిన ముఖ్యమంత్రి రంగసామి వెండి వినాయకుడిని బహుమతిగా అందజేశారు. అనంతరం సీట్ల పంపకం గురించి తొలి విడత చర్చలు జరిపారు. సమావేశంలో కేంద్ర మంత్రి మన్సుక్ మాండవీయా, భాజపా పుదుచ్చేరి విభాగ ఇన్‌చార్జ్ నిర్మల్‌కుమార్ సురానా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలోలానే ఎన్నార్ కాంగ్రెస్‌కు 16, భాజపాకు 14 సీట్లు ఖరారైనట్లు సమాచారం. అన్నాడీఎంకేకు రెండు, ఎల్‌జేకే రెండు సీట్లలో పోటీ చేయడానికి అంగీకరించాయని తెలుస్తోంది. సమావేశంలో పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇవ్వాలని తన దీర్ఘకాలిక కోరికను రంగసామి ముందుంచారు. తర్వాత రానున్న ఎన్నికల్లో ఎన్డీయేలోనే ఎన్నికలను ఎదుర్కొంటామని రంగసామి ప్రకటించారు.

కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్, జగ్గీ వాసుదేవ్

'ఈశా'లో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూర్‌లోని ఈశా యోగా కేంద్రంలోని ఆదియోగి విగ్రహం ఎదుట మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు విచ్చేశారు. రాజ్‌నాథ్ సింగ్ ఉదయం 10.35 గంటలకు కోయంబత్తూర్ విమానాశ్రయం నుంచి దిల్లీ బయల్దేరి వెళ్లనున్నారు.

23న తుది ఓటర్ల జాబితా విడుదల

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడులో తుది ఓటర్ల జాబితా ఈనెల 23న విడుదల కానున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ ప్రకటించారు. రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పనులు ముగిసిన తర్వాత విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 97.37 లక్షల ఓట్లు తొలిగాయి. శాశ్వత వలసదారుల లెక్కలో 66,44,881 మంది తిరిగి పేర్లు చేర్చుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ పనులన్నీ పూర్తయ్యి 17న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం ఇదివరకు ప్రకటించింది. ఈ నేపథ్యంలో 23వ తేదీ విడుదల కానున్నట్లు అర్చనా పట్నాయక్ ప్రకటించారు.

భక్తులకు ఆహారం వడ్డిస్తున్న నాయినార్ నాగేంద్రన్

కపాలీశ్వరాలయంలో నాగేంద్రన్ అన్నదానం

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై మైలాపూర్ కపాలీశ్వరర్ ఆలయంలో భక్తులకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆదివారం అన్నదానం చేశారు. భాజపా తమిళనాడు విభాగ జాతీయ ఇన్‌చార్జ్ అరవింద్ మేనన్‌తో కలిసి ఆయన కపాలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా టీనగర్‌లోని భాజపా ప్రధాన కార్యాలయమైన కమలాలయంలో విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి కాళిదురై.. నయినార్ నాగేంద్రన్, అరవింద్ మేనన్ సమక్షంలో భాజపాలో చేరారు.

అన్నాడీఎంకేకు పలు పార్టీల మద్దతు

ఈపీఎస్‌తో కొంగునాడు వ్యవసాయిగళ్ కగళ నిర్వాహకులు

సైదాపేట, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు పలు పార్టీలు అన్నాడీఎంకేకు మద్దతు తెలిపాయి. సేలంలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి నివాసంలో ఆయన్ను కొంగునాడు వ్యవసాయిగళ్ కళగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజామణి, విశ్వకర్మ పురట్చి కళగ రాష్ట్ర అధ్యక్షుడు మనో చోళవరాయర్, దేశీయవాద కాంగ్రెస్ కట్చి (తమిళనాడు) రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌కుమార్ తమ తమ శ్రేణులతో పళనిసామి సమక్షంలో అన్నాడీఎంకేకు మద్దతు ప్రకటించారు. ఈపీఎస్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వానికి రూ.5 వేలు తిరిగిచ్చేసిన సామాజిక కార్యకర్త

ప్యారిస్, న్యూస్‌టుడే: మగళిర్ ఉరిమై తొగై పథకం కింద మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన రూ.5వేల నగదుని ఓ వ్యక్తి తిరిగి పంపించేసిన సంఘటన మదురైలో చోటుచేసుకుంది. మదురైకి చెందిన శంకరపాండి సామాజిక కార్యకర్త. ఈయన తన భార్య ఖాతాలో ప్రభుత్వం జమ చేసిన రూ.5 వేల సాయాన్ని భార్య ఆమోదంతో మని ఆర్డర్ ద్వారా తిరిగి ప్రభుత్వానికి పంపారు. దీని గురించి శంకరపాండి మాట్లాడుతూ... అప్పుల భారంతో ఉన్న తమిళనాడు ప్రభుత్వానికి తన వంతు సాయంగా ఉంటుందని లేఖ రాసినట్లు తెలిపారు.

ప్రసంగిస్తున్న జితేంద్ర సింగ్

ఈ ఏడాది 18 ఉపగ్రహాల ప్రయోగాలు

కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఇస్రో ద్వారా ఈ ఏడాది 18 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపనున్నట్లు కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. భారత పారిశ్రామిక పరిశోధన మండలి నిర్వహించిన పరిశోధన, వ్యవస్థాపకతపై రెండురోజుల సదస్సు శనివారం చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ఏర్పాటైంది. దీనిని కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ప్రారంభించి ప్రసంగించారు. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో సూక్ష్మ, లఘు, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించిందన్నారు. వినూత్న పరిశ్రమల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించిందన్నారు. దీని ద్వారా 21లక్షల మంది ఉద్యోగావకాశాలు పొందారన్నారు. చెన్నై, కోవై జిల్లాల్లో స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయని చెప్పారు. మిగిలిన జిల్లాల్లో కూడా ప్రారంభానికి కేంద్రం సహాయం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. అంతరిక్ష పరిశోధన ప్రాజెక్టులలో భారతదేశానికి ప్రముఖ స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఇస్రో 18 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనుందని తెలిపారు.

ఎన్డీయేలో 10 సీట్లు కోరాము: రామ్‌దాస్ ఆఠవలె

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడులో అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయేలో పోటీ చేసేందుకు 10 స్థానాలు కోరామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రామ్‌దాస్ ఆఠవలె తెలిపారు. దీని గురించి ఆయన మాట్లాడుతూ... కోరిన సీట్లు ఇవ్వకుంటే 51 నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను బరిలో దించుతామని చెప్పారు. పోటీ చేయని నియోజకవర్గాల్లో ఎన్డీయేకి మద్దతిస్తామని పేర్కొన్నారు.

దవసిమేడైలో కోలాహలంగా జల్లికట్టు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుగల్ జిల్లా సారనార్‌పట్టి సమీపం దవసిమేడైలోని ఆంతోనియార్ ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జల్లికట్టు పోటీ జరిగింది. ఇందులో 800 ఎద్దులు, 350మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆర్డీవో తిరుమలై పోటీని ప్రారంభించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులు, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. పాలమేడుకు చెందిన విఘ్నేష్(22) అనే యువకుడిని ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని దిండుగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ మహేష్ నేతృత్వంలో 340మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.

ఎద్దును లొంగదీసే యత్నంలో క్రీడాకారులు

పైవంతెన ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

'ఎల్' ఆకార పైవంతెన ప్రారంభం

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై మధ్య కైలాస్ ప్రాంతంలో 'ఎల్' ఆకారంలో నిర్మించిన పైవంతెనను ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం ప్రారంభించారు. చెన్నై అడైయారు, గిండి ప్రాంతాలను కలిపే ప్రధాన మార్గంగా సర్దార్ పటేల్ రోడ్డు ఉంది. 3.2 కి.మీ దూరం ఉండే ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రూ.61 కోట్ల వ్యయంతో 'ఎల్' ఆకారంలో పైవంతెన నిర్మించారు. కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, సుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకే అధికార ప్రతినిధి శివాజీ కృష్ణమూర్తికి మూడేళ్ల జైలు శిక్ష

ప్యారిస్, న్యూస్‌టుడే: గవర్నర్, నటి ఖుష్బూ తదితరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో డీఎంకే అధికార ప్రతినిధి శివాజీ కృష్ణమూర్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. చెన్నై కొడుంగైయూర్‌లో 2023లో జరిగిన బహిరంగ సభలో శివాజీ కృష్ణమూర్తి ప్రసంగించారు. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి, భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై, భాజపా నాయకురాలు, నటి ఖుష్బూ తదితరుల గురించి అసభ్యకరంగా వ్యాఖ్యలు చేశారు. దీంతో కొడుంగైయూర్ పోలీసులు నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు చెన్నై ఎగ్మోర్ కోర్టు విచారించి అల్లర్లు ప్రేరేపించారనే ఆరోపణలు రుజువు కాలేదని, అయితే మిగిలిన ఆరోపణలు రుజువు అయ్యాయని తెలిపి శివాజీ కృష్ణమూర్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ శనివారం తీర్పునిచ్చింది. అదేవిధంగా ఆయన అప్పీల్ చేసుకునేందుకు ఒక నెల గడువు ఇచ్చింది.

తీర్పును స్వాగతించిన ఖుష్బూ: సైదాపేట: కోర్టు తీర్పు న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని మరోసారి చాటిందని ఖుష్బూ తెలిపారు. ప్రతీ మహిళ ఎవరో మన కోసం పోరాడతారని ఎదురు చూడకుండా వారి కోసం వారు పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలు తలలు పైకెత్తి నిలబడాలని, ప్రపంచం మహిళల పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు.

కారైక్కుడిలో సీమాన్ పోటీ?

సైదాపేట, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ కారైక్కుడి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు సమాచారం. సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కట్చి 2000 సంవత్సరం నుంచి అన్ని ఎన్నికల్లోనూ ఒంటరిగా పోటీ చేస్తూ వస్తోంది. 2026 ఎన్నికల్లో కూడా ఒంటరిగానే రంగంలోకి దిగనున్నట్లు సీమాన్ ప్రకటించారు. 21వ తేదీ తిరుచ్చిలో జరిగే మహానాడులో 234 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో సీమాన్ తాను పుట్టిన శివగంగై జిల్లాలోని కారైక్కుడిలో పోటీ చేయనున్నట్లు సమాచారం వెలువడింది.

శిల్పకళా నగరం.. మామల్లపురం

– న్యూస్‌టుడే, మామల్లపురం

భారతదేశంలోనే శిల్పకళలకు ప్రసిద్ధి మామల్లపురం. చెంగల్పట్టు జిల్లాలోని మామల్లపురం పల్లవుల కాలం నుంచి అభివృద్ధి చెందుతున్న ఓడరేవు పట్టణం. పల్లవులు ఇక్కడ శిల్పాలకు జీవం పోశారు. ఇక్కడి పురాతన కట్టడాలు ద్రావిడ ఆలయాల నిర్మాణ శైలి, పల్లవుల శిల్పకళకు అద్భుతమైన ఉదాహరణలు. శిల్పాలతో కూడిన ఫలకాలు, గుహలు, ఏకశిలా రథాలు, దేవాలయాలతో కూడిన అద్భుతమైన కట్టడాలు వీక్షించడానికి రెండు కళ్లు చాలవు.

సీషోర్ టెంపుల్

వెన్నముద్ద రాయి

యునెస్కో గుర్తింపు

సముద్రం పైనుంచి వీచే చల్లటి గాలితో సీషోర్ టెంపుల్‌ను రాత్రి సమయంలో సందర్శిస్తే ఆ అనుభూతి వేరు. ఈ ఆలయం స్వదేశీ, విదేశీ పర్యాటకులను ఎక్కువగా ఆకర్షిస్తోంది. మామల్లపురంలోని రాళ్లలో 9 గుహాలయాలు ఉన్నాయి. వీటి లోపల హిందూ పురాణాల్లోని సంఘటనల ఆధారంగా శిల్పాలు చెక్కారు. ఇవి చాలా వాస్తవికంగా కనిపిస్తాయి. ఇక్కడి శిల్ప కళ, రాతి కట్టడాలు యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందాయి. ఇక్కడున్న పంచ రథాలు, వెన్నముద్ద రాయి, అర్జున తపస్సు శిల్పం సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటాయి.

పల్లవుల కాలంలో అభివృద్ధి

పౌరాణిక సంఘటనలు, ఇతిహాస యుద్ధాలు, రాక్షసులు, దేవుళ్లు, జంతువులు అన్నీ రాళ్లపై స్పష్టంగా చిత్రీకరించారు. చాలా ఆలయాలు, నిర్మాణాలు నరసింహవర్మన్-1, నరసింహ వర్మన్-2 పాలనలో పూర్తయ్యాయి. చోళుల కాలం నాటి గొప్ప కట్టడాలకు భిన్నంగా పల్లవుల వాస్తు శిల్పకళ సరళమైనది. అయినప్పటికీ చాలా ఆకర్షణీయంగా కనిపిస్తాయి. పల్లవులు జైన మతస్థులు. కానీ మహేంద్ర వర్మన్ శైవ మతంలోకి మారడంతో జైన మతం భవిష్యత్తుపై తీవ్ర పరిణామాలను చూపింది. మామల్లపురంలోని శివాలయం, విష్ణువు ఆలయాలు ఇందుకు నిదర్శనం. తీరపు ఆలయం (సీషోర్ టెంపుల్) శృంగార భరితమైన ఇతివృత్తాన్ని కలిగి ఉంది. తాజ్‌మహల్ తరువాత భారతదేశంలో అత్యధిక ఫొటోలు తీసిన చారిత్రక కట్టడం ఇదే.

నయినార్ స్త్రీలను గౌరవించే వ్యక్తి : తమిళిసై

సైదాపేట, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ స్త్రీలకు చాలా గౌరవం ఇస్తారని భాజపా సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. టీవీకే అధ్యక్షుడు విజయ్‌పై ఆయన చేసిన వ్యక్తిగత ఆరోపణల గురించి తమిళిసై మాట్లాడుతూ... నయినార్ నాగేంద్రన్ స్త్రీలకు చాలా గౌరవం ఇచ్చే వ్యక్తని, ఎవరినైనా బాధపెట్టాలని, మహిళలను కించపరచాలనే ఉద్దేశం ఆయనకు ఉండదని పేర్కొన్నారు. నయినార్‌ను విమర్శించేందుకు డీఎంకే, కాంగ్రెస్‌లకు అర్హత లేదన్నారు.

అదీ వారి రాజకీయం: కమల్‌హాసన్

సైదాపేట: విజయ్‌పై నయినార్ నాగేంద్రన్ చేసిన వ్యక్తిగత ఆరోపణల గురించి ఎంఎన్ఎం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడైన కమల్‌హాసన్ స్పందించారు. అది వారి రాజకీయమని ఏక వాక్యంలో బదులిచ్చారు. శనివారం ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమంలో పాల్గొన్న కమల్ ఈ విధంగా బదులిచ్చారు.

(c) eenadu

కరుణానిధి, అన్నా విగ్రహాల వద్ద ఉదయనిధి, మంత్రులు అన్బిల్ మహేశ్, కేఎన్ నెహ్రూ తదితరులు

రెండు నెలల్లో ప్రజలకు రూ.9వేల సాయం

☛ ఉదయనిధి స్టాలిన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రెండు నెలల్లో రాష్ట్ర ప్రజలకు రూ.9వేల సాయాన్ని ముఖ్యమంత్రి అందజేశారని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. తంజావూర్ జిల్లా పట్టుకోట్ట బైపాస్ రోడ్డులో అన్నా, కరుణానిధి విగ్రహాలను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేశ్, మెయ్యనాథన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలను కారణంగా చూపి మగళిర్ ఉరిమై తొగై పథక సాయాన్ని నిలిపివేయాలని భాజపా కూటమి పార్టీలు ప్రయత్నించాయని, కానీ ముఖ్యమంత్రి స్టాలిన్ వారి కుట్రలను భగ్నం చేసి ఒకేసారి మహిళలకు రూ.5వేలు చేరేలా చేశారన్నారు. గత నెల మగళిర్ ఉరిమై తొగై సాయం రూ.వెయ్యి, పొంగల్ కానుక రూ.3వేలు, ఇప్పుడు రూ.5వేలుతో కలిపి రెండు నెలల్లో ప్రజలకు రూ.9వేల సాయాన్ని ముఖ్యమంత్రి అందజేశారని చెప్పారు.

బస్టాండ్ ప్రారంభం.. ఆర్కేనగర్: తంజావూర్ జిల్లా పట్టుకోట్టైలో రూ.20కోట్లతో నిర్మించిన బస్టాండ్‌ను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమిళనాడు ప్రస్తుతం దేశంలో 11.1శాతం వృద్ధిరేటుతో మొదటి స్థానంలో ఉందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి దక్కిందని ఆరోపించారు. ఎన్డీయే రాష్ట్ర ప్రజల్లో నమ్మకాన్ని పొందలేదన్నారు.

డీఎంకేను విమర్శించొద్దు: వైగో

విల్లివాక్కం, న్యూస్‌టుడే: డీఎంకేను, ప్రభుత్వాన్ని విమర్శించరాదని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో పార్టీ శ్రేణులకు సూచించారు. ఈరోడ్‌లో ఎన్నికల నిధి సేకరణ సమావేశం శనివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా వైగో మాట్లాడుతూ.. శ్రీలంక పోరులో తనకు ఎదురైన అనుభవాల గురించి పుస్తకంగా, సీడీ రూపంలో తయారు చేసినట్లు గుర్తు చేశారు. గతంలో తాను చేసిన పొరబాటు వల్ల నమ్మకాన్ని పోగొట్టుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నాడీఎంకేతో పొత్తు క్షమించరాని నిర్ణయమని పేర్కొన్నారు. మళ్లీ అలాంటి విమర్శలు పునరావృతం కాకూడదన్నారు. డీఎంకేతో కూటమి వ్యవహారంగా చర్చలు జరగనున్నట్టు చెప్పారు. అందువల్ల డీఎంకేను, ప్రభుత్వాన్ని విమర్శించకూడదని పార్టీ శ్రేణులకు సూచించారు.

ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం పునఃప్రారంభం

☛ చెన్నై పోర్ట్, మధురవోయల్ మధ్య పనులు ☛ పాడికుప్పం తర్వాత డబుల్ డెక్కర్ మార్గం

- న్యూస్‌టుడే, వడపళని

చెన్నై పోర్ట్ నుంచి మధురవోయల్ వరకు 20.9 కి.మీ దూరానికి ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం పునఃప్రారంభమైన సంగతి తెలిసిందే. మార్గంలోని వానగరం నుంచి కోయంబేడు వరకు పూందమల్లి హైరోడ్డు వెంట 5.7 కి.మీ వరకు సింగిల్ డెక్ ఎలివేటెడ్ రోడ్డు ఉండనుంది. ఈ ప్రాంతంలో 2008లో స్తంభాల నిర్మాణం జరిగింది. కావున ఇక్కడ సింగిల్ డెక్ పనులను ఉన్న పునాదులతోనే చేపట్టారు.

పాడికుప్పం ప్రాంతం

కూవం నదిపై 25 డబుల్ డెక్ స్తంభాలు

ప్రాజెక్టు గురించి ఆ విభాగ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. ఒక డెక్‌ను ఉంచేందుకు స్తంభాలు బలమైన పునాదితో ఉన్నాయన్నారు. ఇది ఎనిమిది మీటర్ల ఎత్తులో పైవంతెనతో కూడుకుని, పాడికుప్పం వద్ద కూవం నది గుండా, 100 అడుగుల రహదారిని దాటిన తర్వాత వీఆర్ మాల్ పక్కన 16 మీటర్ల ఎత్తులో రెండో కారిడార్‌గా విస్తరించనుందని పేర్కొన్నారు. మధురవోయల్ క్లోవర్ గ్రేడ్ సెపరేటర్‌ను దాటిన తర్వాత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఎనిమిది మీటర్ల ఎత్తులో కొత్తగా స్తంభాలను కూడా నిర్మించిందని, పాత స్తంభాలను తాజాగా కాంక్రీటుతో తిరిగి అమర్చారని, ఎగ్మోర్, చేట్‌పేట్ వంటి కోర్ సిటీ ప్రాంతాల్లో కూవం నదిపై ఎన్‌హెచ్ఏఐ 25 డబుల్ డెక్ స్తంభాలను ఉంచినట్లు తెలిపారు. అదే సమయంలో కోయంబేడుకు ముందు పాడికుప్పం కనెక్షన్ పాయింట్ వద్ద పైలింగ్ పనులు కూడా ప్రారంభించినట్టు పేర్కొన్నారు.

టోల్ చార్జీల వసూలు

కూవం నది ప్రాంతంలో ఎటువంటి ఆటంకాలు లేవని, పనులు వేగంగా పూర్తి చేయవచ్చని ఎన్‌హెచ్ఏఐ అధికారులు పేర్కొన్నారు. మొదటి మార్గంలో నగరంలోని కీలక ప్రదేశాలలో బయటికి వెళ్లడానికి ర్యాంప్ కలిగి ఉండటంతో వాహనదారులకు అనుకూలంగానే ఉంటుందని, రెండో మార్గం పోర్టు వద్ద మాత్రమే ముగుస్తుందని చెప్పారు. రెండు మార్గాలు నగర పరిధిలోనే ఉన్నప్పటికీ బెంగళూరులో ఎలక్ట్రానిక్ సిటీ పైవంతెనలా టోల్‌చార్జీలు వసూలు చేయనున్నారు. 60 ఎకరాల యార్డులో పైల్ క్యాప్, దాదాపు 2,000 సెగ్మెంట్లను కాస్టింగ్ చేస్తున్నారు. కోయంబేడు సమీపంలో పనులు వేగవంతంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.

తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయాలి

పూందమల్లి హైరోడ్డును అనుసంధానించే మొగప్పేర్, గోల్డెన్ జార్జ్ నగర్‌ల మధ్య హై లెవల్ వంతెన నిర్మాణానికి ఉన్న కాజ్‌వేను పైలింగ్ పనుల కోసం కూల్చివేశారు. దాదాపు రెండేళ్ల క్రితం పూందమల్లి హైరోడ్డులోని ఐదు కి.మీ విస్తీర్ణంలో ఎన్‌హెచ్ఏఐ బారికేడ్లను ఏర్పాటు చేసింది. నిర్మాణాలు చాలా తక్కువగానే జరిగాయి. తమిళనాడు శాండ్ అండ్ లారీ ఓనర్స్ ఫెడరేషన్(టీఎన్ఎస్ఎల్ఓఎఫ్) నాయకుడు ఎస్. యువరాజ్ మాట్లాడుతూ.. క్యారేజ్ మార్గం బాగా కుంచించుకుపోయిందని, రాత్రి వేళల్లో క్రేన్ సాయంతో గిర్డర్ ఫిట్టింగ్ పనులు చేపట్టినప్పుడు పూందమల్లి హైరోడ్డు మార్గాన్ని కూడా మూసివేస్తున్నారు. దీంతో రాత్రి పూట వచ్చే ట్రక్కులు, ప్రయివేటు వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటోందని, ఈ ప్రాంతంలో పనులు జరుగుతున్నందున పైవంతెన పనులు పూర్తయ్యేవరకు వానగరం నుంచి కోయంబేడు వరకు తాత్కాలిక రహదారిని కూవం నది వెంబడి ఏర్పాటు చేయవచ్చని యువరాజ్ సూచించారు.

కున్నూరు రోడ్డులో ఏనుగు సంచారం

అడవిలోకి వెళ్తున్న ఏనుగు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళైయం వన్యప్రాణుల అభయారణ్యం, సిరుముగై ప్రాంతాలలో ఒంటరి అడవి ఏనుగు సంచరిస్తోంది. ఆదివారం తెల్లవారుజామున మేట్టుపాళైయం-కున్నూర్ రోడ్డులోని ఓడంతురై ప్రాంతంలో సంచరించింది. ఉదగై రోడ్డు దాటుతుండగా వాహనదారులు భయంతో వాహనాలను నిలిపివేశారు. ఏనుగు ఓ ప్రైవేటు రెస్టారెంట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ముళ్ల కంచెను ధ్వంసం చేసి అడవిలోకి వెళ్లిపోయింది.

స్టాలిన్ కన్నియాకుమరి పర్యటన తేదీ మార్పు

ప్యారిస్: ముఖ్యమంత్రి స్టాలిన్ కన్నియాకుమరి పర్యటన తేదీ మళ్లీ మారింది. స్టాలిన్ ప్రతి జిల్లాలో పర్యటించి పూర్తయిన ప్రాజెక్టులను ప్రారంభించి, కొత్త వాటికి శంకుస్థాపన చేస్తున్నారు. అందులో భాగంగా కన్నియాకుమరి జిల్లాలో 19, 20 తేదీల్లో పర్యటించనున్నట్లు ముందుగా ప్రకటించారు. ఆ తర్వాత తేదీ మార్చిన నేపథ్యంలో మార్చి 24, 25 తేదీల్లో పర్యటిస్తారని తాజాగా ప్రకటించారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ప్యారిస్, న్యూస్‌టుడే: ఖైదీ పారిపోయిన వ్యవహారంలో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండయ్యారు. శివగంగై జిల్లా మానామదురైకి చెందిన పులిప్పాండి(25) అనే వ్యక్తి ఓ హత్య కేసులో అరెస్టయ్యాడు. బెయిల్‌పై బయటకు వచ్చాడు. కోర్టు విచారణకు హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం శనివారం వైద్య పరీక్షల నిమిత్తం కానిస్టేబుళ్లు రాజకణ్ణప్పన్, షణ్ముగవేల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పులిప్పాండి పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండు చేశారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రామాపురం, అంబత్తూర్, వ్యాసార్పాడి ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్తు శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

ఆది కుంభేశ్వరాలయంలో నాట్యాంజలి ఉత్సవం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ సురేష్‌కుమార్ తదితరులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ జిల్లా కుంభకోణంలోని ఆదికుంభేశ్వరస్వామి ఆలయంలో 23వ వార్షిక నాట్యాంజలి ఉత్సవం శనివారం సాయంత్రం నాట్యాంజలి అధ్యక్షుడు చంద్రశేఖర్ నేతృత్వంలో ఘనంగా జరిగింది. దీనిని మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌కుమార్, సిటీ యూనియన్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్.కామకోటి, ప్రియ మురళి ప్రారంభించారు. మహాశివరాత్రి సందర్భంగా నాట్యాంజలి విద్యార్థులు దాదాపు 500మంది, భరతనాట్య కళాకారులు ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పలు ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

శివప్రసాద్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

అలరించిన ఈల గాన కచేరి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: శ్రీ పాపనాశం శివన్ సత్సంగ సంగీత సభ తరపున చెన్నై మడిప్పాక్కం షీలా నగర్‌లోని శ్రీ సుందర వినాయగర్ ఆలయంలో శనివారం రాత్రి నిర్వహించిన కర్ణాటిక్ ఆధ్యాత్మిక ఈల గాన కచేరి అలరించింది. హైదరాబాద్‌కు చెందిన గాయకుడు డాక్టర్ కొమరవోలు శివప్రసాద్ పాల్గొని తన ఈల గానంతో ఆహూతులను రంజింపజేశారు. డాక్టర్ బద్రీనారాయణన్(వయోలిన్), సేలం రంగనాథన్ (మృదంగం), ఆదంబాక్కం శంకర్ (ఘటం), పీఎస్ రామానుజం (మోర్సింగ్) వాద్య సహకారం అందించారు. సంగీత సభ అధ్యక్షుడు శంకర నారాయణన్ కళాకారులను ఘనంగా సత్కరించారు.

అమిత్‌షా సభలో డ్రోన్ ఎగురవేసిన యువకుడు

☛ పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు

లోకేష్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పుదుచ్చేరిలోని కారైక్కాల్‌లో శనివారం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేసేందుకు పోలీసులు నిషేధం విధించారు. ఈ క్రమంలో అమిత్ షా వేదికపై ప్రసంగిస్తున్న సమయంలో ఓ డ్రోన్ ఎగురుతుండడాన్ని గుర్తించిన కమాండోలు వెంటనే తుపాకీతో పేల్చేశారు. దానిని ఎగురవేసిన వ్యక్తిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతను తిరునల్లారు ప్రాంతానికి చెందిన లోకేష్‌గా గుర్తించారు. సభ ప్రాంగణం సమీపంలోని దుకాణంలో అతను పనిచేస్తున్నట్లు తెలిసింది. అతన్ని రహస్య ప్రాంతంలో ఉంచి దర్యాప్తు చేస్తున్నారు.

జనరంజకం.. కీర్తన గాన విన్యాసం

వడపళని, న్యూస్‌టుడే: సంగీత విద్వాంసురాలు కీర్తన గాన విన్యాసం జనరంజకంగా ఉందని సంగీతాభిమానులు ప్రశంసించారు. ఇండియన్ ఫైనార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి చివరిగా జరిగిన కార్యక్రమంలో కీర్తన గాత్ర కచేరి ఆళ్వార్‌పేటలోని యతిరాజ కల్యాణ నిలయంలో జరిగింది. త్యాగరాజ ఆరాధన కార్యక్రమంలో భాగంగా జరిగిన కచేరీలో అధిక శాతం త్యాగరాజ కృతులను ఎంపిక చేసుకుని ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. వయోలిన్‌పై గాయత్రి శివాని, మృదంగంపై సాయి రాఘవన్, మోర్సింగ్‌పై సాయి సుబ్రహ్మణ్యం వాద్య సహకారం అందించారు.

గానం చేస్తున్న కీర్తన

70 మంది సంగీత విద్వాంసులు

ఆరాధనోత్సవాలలో భాగంగా శనివారం 70 మంది సంగీత విద్వాంసుల బృంద గానానికి ప్రముఖ మృదంగ విద్వాంసుడు శ్రీముష్ణం రాజారావు సారథ్యం వహించారు. ముందుగా త్యాగరాజస్వామి చిత్రపటానికి ఆరాధన చేసి, వేదపారాయణం నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక విభాగం, ప్రముఖ కళా పోషకులు పి.ఓబుల్ రెడ్డి, జ్ఞానాంబ ట్రస్టు ధర్మనిధి, నారాయణ గురవయ్య శెట్టి ఎస్టేట్ అండ్ చారిటీస్ పోషకులుగా వ్యవహరించాయి. కార్యదర్శి డాక్టర్ ఆర్.రాధాకృష్ణన్ కళాకారులను సత్కరించారు. సంగీత ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయ్ ఏడాదికొక సినిమా తీయాలి

☛ నటుడు శశికుమార్

విలేకరులతో మాట్లాడుతున్న శశికుమార్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నటుడు విజయ్ ఏడాదికి ఒక సినిమాలో అయినా నటించాలన్నదే తన ఆశ అని నటుడు శశికుమార్ పేర్కొన్నారు. తంజావూర్ రొతకత బస్టాండ్ వద్ద ఉన్న ఈస్కోర్ సినిమా థియేటర్‌లో శశికుమార్ హీరోగా నటించిన 'మై లార్డ్' సినిమా విడుదలైంది. ఈ క్రమంలో శశికుమార్ చిత్రబృందంతో కలిసి సినిమా వీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అభిమానులతో కలిసి సినిమా చూడటం ఆనందంగా ఉందన్నారు. కుటుంబాలతో వచ్చి సినిమా చూస్తున్నారని, మంచి సినిమా ఇస్తే ప్రజలు స్వీకరిస్తారనే నమ్మకం ఉందన్నారు. జన నాయగన్ సినిమాను తిరిగి సెన్సార్‌కు పంపడం ఆనందంగా ఉందన్నారు. విజయ్ సినిమాల్లో నటన కొనసాగించాలని చెప్పారు. అంతపెద్ద స్టార్ అయినప్పటికీ మార్కెట్ ఉండగానే ప్రజలకు సేవ చేయడానికి అన్నీ వదిలేసి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. రాజకీయాల్లో ఉన్నా ఆయన ఏడాదికొక సినిమాలో నటించాలన్నది తన కోరికగా పేర్కొన్నారు.

రాజకీయ నాయకులపై వ్యక్తిగత విమర్శలు సరికాదు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాజకీయ నాయకులపై వ్యక్తిగత విమర్శలు సరికాదని మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. ఆదివారం దిండుగల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్.. టీవీకే అధ్యక్షుడు విజయ్ గురించి వ్యక్తిగత విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. అందుకు నాగేంద్రన్ వివరణ ఇస్తారన్న నమ్మకం ఉందన్నారు. అదేవిధంగా సెంగోట్టయన్ రాజకీయం కోసం మాట్లాడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి కడలూర్ వెళితే వళ్లలార్ పాలన అంటారని, తూత్తుకుడికి వెళ్తే వీవోసీ పాలన అంటారన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాతే ఏ పాలనో తెలుస్తుందన్నారు. ఒంటరిగా పార్టీని ప్రారంభించిన విజయ్.. ఎంజీఆర్, జయలలిత చిత్రపటాలను ఉపయోగించకూడదని తెలిపారు.

IN THE COURT OF SPECIAL JUDGE FOR TRIAL AND DISPOSAL OF COMMERCIAL DISPUTES AT VISAKHAPATNAM

I.A. No. 323/2025
IN
C.O.S. 16/2022

BETWEEN:

M/s. Andhra Enterprises represented by its Proprietor, **I) Vinod Kumar Surana, S/o. Prithwiraj Surana, Jain,** Aged 51 years, Business, D. No. 6-1-8/2, Rangachari Street, T. Nagar, Rajahmundry, Proprietor. Vinod Kumar Surana (died)

2) Mr. Pavan Surana, S/o. Late Vinod Kumar Surana, aged about 35 years, residing at New No. 44, Old No. 72, Flat No. 1101, B Block, /11th Floor, Prince Galada Garden, EVK Sampath Road, Vepery, Chennai, Tamil Nadu- 600 007.

3) Mrs. Susila Surana, W/o. Late Vinod Kumar Surana, aged about 61 years, residing at 'Rest Do'.

4) Ms. Komal Surana, D/o. Late Vinod Kumar Surana, aged about 33 years, residing at 'Rest Do' **....Plaintiffs/Petitioners**

AND

M/s. Chennai Marine Trading (P) Ltd, represented by its Director. Manesh Rajesh Mehera, S/o. P. Kushi Ram, Hindu, aged 45 years, D. No. 8-13, Sivan Koil Tank Street, Villivakkam, Chennai-600049, State of Tamil Nadu. **...Defendant/Respondent**

The above case is listed before the Hon'ble Court of Special Judge for Trial and Disposal of Commercial Disputes at Visakhapatnam on 02.03.2026, and as the sole Defendant, you are hereby summoned to appear at 10:30 am on that day, i.e., on 02.03.2026. Otherwise, the Court shall decide the case against you.

By The Order of the Court

Hyndhavi Hanumanthu, Advocate for Petitioners/Plaintiffs

Visakhapatnam
Date: 16/02/2026 Ph: 9790104941

'మగళిర్ ఉరిమై తొగై'తో గెలుపు నిర్ణయించలేం

☛ ప్రవీణ్ చక్రవర్తి

సైదాపేట, న్యూస్‌టుడే: కలైజ్ఞర్ మగళిర్ ఉరిమై తొగై పథకం ఒక్కటే ఎన్నికల్లో డీఎంకేకు విజయం అందించదని ఏఐసీసీ డేటా కమ్యూనికేషన్ విభాగ ఛైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. దీని గురించి ఆయన విడుదల చేసిన ప్రకటనలో... మగళిర్ ఉరిమై తొగై మంచి పథకమని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేయడం అభినందనీయమని చెప్పారు. అంతేకాకుండా ఇదే ఎన్నికల విజయాన్ని తీర్మానిస్తుందనేది నిజం కాదన్నారు. గత మూడేళ్లలో ఎన్నికలకు ముందు ఇలాంటి పథకాలను ప్రకటించిన 9 పెద్ద రాష్ట్రాల్లో 4 చోట్లే ప్రభావం కనిపించిందని తెలిపారు.

వీధులకు నిర్దిష్ట పేర్లు పెట్టాలని ఆదేశాలివ్వలేం

☛ మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: వీధులకు నిర్దిష్ట పేర్లు పెట్టాలని ఆదేశించలేమని మద్రాసు హైకోర్టు తెలిపింది. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని చెట్టి వీధి కులాన్ని సూచిస్తుండటంతో దానిని థాయ్-తంథై కోవిల్ వీధిగా మార్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఆ ప్రాంతానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారించిన సింగిల్ జడ్జి.. కులాన్ని నిర్మూలించాలన్న పిటిషనరు ప్రయత్నాన్ని అభినందిస్తున్నామని, ఆయన ఇష్టానుసారంగా వీధికి పేరు పెట్టాలని కోరడం ఆమోదయోగ్యం కాదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేశారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ వెంకటేశ్ అప్పీల్ చేశారు. ఈ పిటిషన్‌ను శనివారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్‌మురుగన్ ధర్మాసనం విచారించింది. వీధులకు నిర్దిష్ట పేర్లు పెట్టాలని కోర్టు ఆదేశించడం కుదరదని తెలిపారు. సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వుల్లో ఎలాంటి తప్పు లేదని తెలుపుతూ పిటిషన్‌ను కొట్టివేశారు.

'విజయ్‌వి అజ్ఞానంతో కూడిన మాటలు'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుబ్రమణియన్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: టీవీకే అధ్యక్షుడు విజయ్ అజ్ఞాన శిఖరాగ్రంలో ఉన్నారని మంత్రి మా.సుబ్రమణియన్ విమర్శించారు. కోయంబత్తూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఐదు కొత్త భవనాలు, అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక స్టీమ్ లాండ్రీ, బహుళ అంతస్తుల దంత వైద్యశాలను ప్రారంభించారు. తర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కోయంబత్తూర్ జిల్లాలో ఒకే రోజు రూ.12 కోట్లతో వివిధ ఆరోగ్య ప్రాజెక్టులను ప్రారంభించినట్లు తెలిపారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ కరుణానిధి విజయాలను ప్రస్తావించకుండా మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అన్నారు. విజయ్ పుట్టకముందే తమిళనాడు వివిధ రంగాలలో విజయాలు సాధించిందన్నారు. స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో తమిళనాడు భారతదేశంలో ఉన్నత విద్యా రంగంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు.

పలు 'మెము' సర్వీసుల రద్దు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై ఎగ్మోర్-విళుపురం సెక్షనులోని మయిలం, దిండీవనం స్టేషన్ల మధ్య జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా 17, 19, 21 తేదీల్లో పలు మెము సర్వీసులు పాక్షికంగా రద్దయినట్లు దక్షిణ రైల్వే ఓ ప్రకటనలో పేర్కొంది.

- తాంబరం-విళుపురం మెము 09.40 రైలు దిండీవనం వరకు నడుస్తుంది.
- విళుపురం-చెన్నై బీచ్ 13.30 రైలు దిండీవనం నుంచి బయలుదేరుతుంది.

16 నుంచి గోల్డ్ అప్రైజల్‌పై శిక్షణ

వడపళని, న్యూస్‌టుడే: ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్(ఈడీఐఐ)లో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు బంగారం మూల్యాంకనం (గోల్డ్ అప్రైజల్)పై శిక్షణ కార్యక్రమం జరగనుంది. గిండి ఈక్కాట్టుతాంగల్‌లోని సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఈడీఐఐ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ జరుగుతుందని అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18 ఏళ్లకు పైబడి, కనీసం పదో తరగతి ఉత్తీర్ణులైన వారు శిక్షణకు అర్హులు. ముందుగా వచ్చే వారికి హాస్టల్ వసతి కూడా ఉంటుంది. శిక్షణలో చేరాలనుకునే వారు పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 93602 21280, 86681 00181 నెంబర్లను సంప్రదించాలి.

పప్పుధాన్యాలతో ఐస్‌క్రీమ్ తయారీపై...

వడపళని: సూక్ష్మ, లఘు, మధ్యతరహా పరిశ్రమలశాఖ అనుబంధ సంస్థ అయిన ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్(ఈడీఐఐ) గోధుమలు, పప్పుధాన్యాలతో ఐస్‌క్రీమ్ తయారీపై శిక్షణ ఇవ్వనుంది. ఈనెల 19, 20 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిక్షణకు గిండి ఈక్కాట్టుతాంగల్‌లోని సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఈడీఐఐ కార్యాలయం వేదిక కానుంది. ఇతర వివరాలకు 86681 02600, 87544 95254 నెంబర్లను సంప్రదించాలి.

పోక్సో కేసుల్లో బాధిత పిల్లల సంక్షేమమే ముఖ్యం

ప్యారిస్, న్యూస్‌టుడే: పోక్సో కేసుల్లో బాధిత పిల్లల సంక్షేమమే ముఖ్యమని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం తెలిపింది. ఓ చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో తేని జిల్లాకి చెందిన భగవతిరాజ్ మొదలైన ఇద్దరిపై పోక్సో కేసు నమోదైంది. కేసుని విచారించిన తేని పోక్సో కోర్టు.. వారికి జీవిత ఖైదు శిక్ష విధించింది. శిక్షను సవాలు చేస్తూ భగవతిరాజ్ మదురై ధర్మాసనంలో అప్పీల్ చేశారు. ఈ అప్పీల్ న్యాయమూర్తులు జస్టిస్ ఇళంతిరైయన్, జస్టిస్ పూర్ణిమ ధర్మాసనంలో శనివారం విచారణకు వచ్చింది. పిటిషనరు తరపున.. పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని, ఈ కేసులో ఇద్దరిపై ఆరోపణలు చేశారని, పిటిషనరును రెండో నిందితుడిగా చేర్చారన్నారు. ఇద్దరు ఒకే నేరాన్ని చేయలేదని, వేర్వేరు తేదీల్లో, వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు జరిగాయని, కింది కోర్టు ఇద్దరిపై ఒకే విచారణ జరపకూడదని వాదించారు. ప్రభుత్వం తరపున.. ఇద్దరు బాధిత చిన్నారులకు ఒకే రకమైన అన్యాయం జరిగిందని, ఒకే విచారణ జరపడంతో నిందితులకు ఎలాంటి బాధింపు ఏర్పడలేదన్నారు. అనంతరం న్యాయమూర్తులు... విచారణను రెండుగా వేరు చేసి జరిపితే విధానపరమైన సమస్యలు ఉంటాయని, ఇద్దరు ఒకరి తర్వాత ఒకరు నేరానికి పాల్పడ్డారన్నారు. కావున ట్రయల్ కోర్టు చట్ట ప్రకారం ఒకే రకమైన ప్రశ్నలను వేసిందని, ఇది ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి హక్కులను ప్రభావితం చేస్తాయని చెప్పడం కుదరదని తెలిపారు. అదేవిధంగా బాలలపై లైంగిక వేధింపులు మొదలైన నేరాలకు సంబంధించిన కేసులు విచారించేటప్పుడు బాధిత పిల్లల క్షేమాన్ని పరిరక్షించేలా చట్టాలను ఉపయోగించాలని, నేరం చేసిన వారి క్షేమం కన్నా, బాధిత పిల్లల క్షేమమే ముఖ్యమని తెలిపారు. ఈ కేసులో ట్రయల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సమర్థిస్తున్నట్లు పేర్కొంటూ అప్పీల్‌ను కొట్టివేశారు.

శిక్షణలో పాల్గొన్న కమిటీ సమన్వయకర్తలు

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ శిబిరం

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర పాలకసంస్థ చెన్నై పాఠశాలలకు చెందిన శుభ్రతా నిర్వహణ కమిటీ కో-ఆర్డినేటర్లకు ఘనవ్యర్థాల నిర్వహణపై శిక్షణను రిప్పన్ బిల్డింగ్‌లోని సమావేశ హాలులో నిర్వహించారు. తడి, పొడి చెత్తను విభజించడం, పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఘనవ్యర్థాల నిర్వహణ గురించి ప్రతినెలా మూడో బుధవారం అవగాహన కార్యక్రమాలు, ప్రతి బుధవారం చివరి పిరియడ్‌లో అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఘనవ్యర్థాల నిర్వహణ విభాగ చీఫ్ ఇంజినీరు బాలమురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాసన్, విద్యాధికారి వసంతి, ఆరోగ్య విద్య అధికారి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

కావిన్‌కేర్ పురస్కారాల ప్రదానం

వడపళని, న్యూస్‌టుడే: కావిన్‌కేర్, ఎబిలిటీ ఫౌండేషన్ సంయుక్తంగా 24వ కావిన్‌కేర్ ఎబిలిటీ-2026 పురస్కారాలను దేశవ్యాప్తంగా విభిన్న రంగాలకు చెందిన ఐదుగురు దివ్యాంగులకు అందజేసింది. చెన్నైలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రపంచ కప్ గెలుచుకున్న అంధ్రా మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక టీసీ, కేరళలో మొదటిసారిగా అంధ న్యాయమూర్తి కాబోతున్న తాన్యనాథన్ తదితరులు పాల్గొని పురస్కారాలందజేశారు. కార్యక్రమంలో భాగంగా 2023 'సరిగమప మ్యూజిక్ రియాల్టీ షో' విజేత పురుషోత్తమన్, ప్రసిద్ధ శాస్త్రీయ సంగీతకారుడు అభినయ షెన్బగరాజ్ బృందం కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. లెఫ్టినెంట్ జనరల్ అరుణ్ అనంతనారాయణన్, సురానా అండ్ సురానా ఇంటర్నేషనల్ అటార్నీ మేనేజింగ్ పార్ట్‌నర్, సీఈఓ డాక్టర్ వినోద్ సురానా, సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఛాన్సలర్ డాక్టర్ మరియాజీనా జాన్సన్, గేయ రచయిత, స్క్రీన్ రైటర్ మదన్ కార్కీ తదితరులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.

గ్రహీతలు వీరే.. బెంగళూరుకు చెందిన సునీల్ జైన్, హరియాణాలోని గురుగ్రామ్‌కి చెందిన డాక్టర్ జితేంద్ర అగర్వాల్, తమిళనాడులోని కాట్టుమన్నార్ కోయిల్‌కి చెందిన అరివురాజా తంగవేలు, పంజాబ్‌కిచెందిన శివ్ కుమార్ శర్మతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నర్సీపట్నానికి చెందిన ద్వారపురెడ్డి చంద్రమౌళి పురస్కారాలందుకున్నారు. చంద్రమౌళి బీటెక్ పూర్తయ్యాక 21ఏళ్ల వయసులో విద్యుత్తు ప్రమాదంలో రెండు చేతులు, కాళ్లు పోగొట్టుకున్నారు. ఆరు నెలల్లో కృత్రిమ అవయవాలను ధరించారు. స్వతంత్రంగా జీవించేందుకు కొత్తమార్గాలను ఎంచుకుని, న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేసి, సీఏటీ కూడా పూర్తి చేశారు. ఐఐఎం అహ్మదాబాద్‌లో చదివి అమెజాన్‌లో కొంతకాలం ఉద్యోగం చేసి ప్రస్తుతం యాక్సెంచర్‌లో పని చేస్తున్నారు. ఎబిలిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ జయశ్రీ రవీంద్రన్ పురస్కార గ్రహీతలను అభినందించారు.

పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

ఆకట్టుకున్న ఆద్య వినయ్ భరతనాట్య ప్రదర్శన

వడపళని: తెలుగు వెలుగు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక చేట్‌పేట్ నివాసి ఆశ, వినయ్‌ల కుమార్తె ఆద్య వినయ్ భరతనాట్య అరంగేట్రం ఆదివారం ఆర్ఆర్ మహాసభలో జరిగింది. భారతీయ విద్యా భవన్ డైరెక్టర్, కలైమామణి పురస్కార గ్రహీత కేఎన్ రామస్వామి ముఖ్య అతిథిగా, ఆద్య వినయ్ గురువు శృతి శోభ పాల్గొన్నారు. పాటకు తగ్గట్లు హావభావాలతో నృత్యం చేసి ఆద్య ప్రేక్షకుల కరతాళధ్వనులందుకుంది. సంఘాధ్యక్షుడు రాజశేఖర్ నర్తకిని సత్కరించి, 'నాట్య మయూరి' బిరుదు ప్రదానం చేశారు.

ఆద్య వినయ్‌ను సత్కరిస్తున్న రాజశేఖర్ తదితరులు

EENADU Classifieds
JOBS

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ: 18K to 20K. ✆96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499.

(c) eenadu

రైతు పాత్రలో జీవించిన ముత్తరసన్

ఆడియో ఆవిష్కరిస్తున్న ఉదయనిధి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ 'అరిసి' చిత్రంలో రైతు పాత్రలో జీవించారని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. ముత్తరసన్, సముద్రకని నటించిన 'అరిసి' ట్యాగ్‌లైన్ 'ఉయిరిన్ మరు పెయర్' చిత్రం ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం వళ్లువర్ కోట్టంలో జరిగింది. ఆడియో, ట్రైలర్‌ను ఉదయనిధి స్టాలిన్ ఆవిష్కరించి మాట్లాడుతూ... మంత్రి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సినీ రంగానికి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనడంలేదన్నారు. ముత్తరసన్ ఆహ్వానించడంతో కాదనలేక ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని తెలిపారు. తాను సినీరంగం నుంచి బయటకు వచ్చి ప్రజాసేవ చేస్తుండగా ముత్తరసన్ దానికి భిన్నంగా ప్రజాసేవ నుంచి సినీరంగానికి వచ్చారని పరిహాసమాడుతున్నారని పేర్కొన్నారు. ఆయన ఈ రంగంలో ఉన్నత శిఖరాలకు చేరిన ప్రజాసేవకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రజాహక్కుల గురించి మాట్లాడేందుకే ఆయన సినీరంగానికి వచ్చారని తెలిపారు. ఈ చిత్రంలో ఆయన రైతుగా నటించారని చెప్పడం కన్నా జీవించారని చెప్పడం సబబుగా ఉంటుందన్నారు. సముద్రకని కూడా కమ్యూనిస్టు భావజాలం ఉన్న వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్, ఐయూఎంఎల్ అధ్యక్షుడు ఖాదర్ మొహిదీన్ తదితరులు పాల్గొన్నారు.

కోయంబత్తూర్ మాప్పిళ్లై ఫస్ట్‌లుక్ విడుదల

చెన్నై: 'నాయ్ శేఖర్' ఫేమ్ కిశోర్ రాజ్‌కుమార్ కథ రాసి దర్శకత్వం వహించి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కోయంబత్తూర్ మాప్పిళ్లై'. మలయాళ నటి అన్నా బెన్ నాయిక. నాయిస్ అండ్ గ్రెయిన్స్ చిత్ర నిర్మాణ సంస్థకు ఇది తొలి చిత్రం. ఈ బ్యానరుపై కార్తిక్ శ్రీనివాస్, మహావీర్ అశోక్ సంయుక్తంగా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల చిత్రీకరణ పనులు ముగిసిన నేపథ్యంలో ఫస్ట్‌లుక్‌ను కోయంబత్తూర్ అల్లుడైన ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఆవిష్కరించి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమకథతో రూపొందిన ఈ చిత్రం ఆద్యంతం హాస్యానికి కొదవ ఉండదని దర్శకుడు కిశోర్ రాజ్‌కుమార్ తెలిపారు. దర్శకనటుడు భాగ్యరాజ్ దర్శకత్వంలోని చిత్రాల తరహాలో నేడు చిత్రాలు రావడంలేదని నిరాశతో ఉన్న ప్రేక్షకులకు ఆ లోటును ఈ సినిమా భర్తీ చేస్తుందని, ఇది నాయికకు ప్రాధాన్యత ఉన్న చిత్రమని పేర్కొన్నారు.

మార్చి 19న యూత్...

చెన్నై: నటుడు కరుణాస్ తనయుడు కెన్ కరుణాస్ దర్శకత్వం వహించి కథానాయకుడిగా నటించిన చిత్రం 'యూత్'. పార్వతి ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ చిత్రంలో అనిష్మా, మీనాక్షి దినేశ్, ప్రియాంశి యాదవ్ నాయికలు. ఇతర ముఖ్యమైన పాత్రలో సూరజ్ వెంజరమూడు నటించారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రం మార్చి 19న విడుదల కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

'మై లార్డ్' బృందానికి సూర్య అభినందనలు

సూర్యతో శశికుమార్, చైత్ర ఆచార్, రాజు మురుగన్

చెన్నై: రాజు మురుగన్ దర్శకత్వంలో శశికుమార్, చైత్ర ఆచార్ జంటగా నటించిన 'మై లార్డ్' చిత్రం గురువారం థియేటర్లలో విడుదలైంది. చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో చిత్రబృందాన్ని ఆ చిత్ర పంపిణీదారులైన నటుడు సూర్య పిలిపించి అభినందించారు. సూర్యతో దర్శకుడు రాజు మురుగన్, శశికుమార్, చైత్ర ఆచార్ తదితరులు ఉన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌ అవుతోంది.

'తాయ్ కిళవి' విడుదల ఆలస్యం

చెన్నై: నటుడు శివకార్తికేయన్ నిర్మాణంలో సీనియర్ నటి రాధిక నటించిన చిత్రం 'తాయ్ కిళవి'. వర్ధమాన దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి నివాస్ కె.ప్రసన్న సంగీతం అందించారు. ఉసిలంపట్టి సమీపంలోని కాటుపట్టిలో జీవిస్తున్న 75ఏళ్ల వృద్ధురాలు, ఆమె కుటుంబాన్ని కేంద్రంగా తీసుకుని నిర్మించిన ఈ చిత్రంలో సింగం పులి, అరుల్‌దాస్, బాల శరవణన్, మునీశ్‌కాంత్, ఇళవరసు తదితరులు ఇతర ముఖ్యమైన పాత్రల్లో నటించారు. ఫిబ్రవరి 20న చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు ఇదివరకు ప్రకటించిన చిత్రబృందం ప్రస్తుతం ఆ తేదీని 27కు మార్చింది.

సిగ్నల్ ఎట్ 11.30 ఫస్ట్‌లుక్...

చెన్నై: ఆలర్ స్టూడియోస్ పతాకంపై మలర్‌విళి నటేశన్, డాక్టర్ శివాని సుబ్రమణి సమర్పిస్తున్న చిత్రం 'సిగ్నల్ ఎట్ 11.30'. ఈ చిత్రం ద్వారా మలర్‌విళి నటేశన్ దర్శకుడిగా తమిళ చిత్రసీమకు పరిచయమవుతున్నారు. కాలం ఎవరి కోసమూ నిరీక్షించదని చెప్పేలా థ్రిల్లర్ కథాంశంతో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సంతోష్ ప్రతాప్ కథానాయకుడిగా నటిస్తుండగా భవ్య త్రిఖ, పూజిత పొన్నాడ, జయప్రకాశ్, మునీశ్‌కాంత్ తదితరులు ఇతర ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. రాత్రి 11.30 గంటలకు ఓ సిగ్నల్‌లో కథానాయకుడికి ఎదురయ్యే అనూహ్యమైన మలుపు ఆయన జీవితాన్ని ఎలా మలుపు తిప్పిందనేదే కథాంశమని నిర్మాతలు వెల్లడించారు. చిత్రానికి డి.ఇమాన్ సంగీతం అందించారు.

కాదల్ రీసెట్ రిపీట్ టీజర్...

చెన్నై: విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కాదల్ రీసెట్ రిపీట్' చిత్రం ద్వారా తమిళ చిత్రసీమకు మదుమేశ్, జియా శంకర్ జంటగా పరిచయమవుతున్నారు. ఇందులో మలయాళ అగ్ర నటుడు అర్జున్ అశోకన్ ముఖ్యపాత్రలో నటిస్తుండగా.. ఎం.ఎస్.భాస్కర్, జయప్రకాశ్, విజే చంద్రశేఖర్ తదితరులు ఇతర నటీనటులు. సరికొత్త కథతో, అనూహ్యమైన మలుపులతో, భావోద్వేగమైన సన్నివేశాలతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు చిత్రబృందం తెలిపింది. మార్చి 6న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.

ప్రజలు ముందుగా అందించిన సమాచారం మేరకు చెన్నై మహానగర పాలకసంస్థ సిబ్బంది శనివారం 103 మంది నుంచి 4.6.21 మెట్రిక్ టన్నుల నిరుపయోగ వస్తువులను సేకరించి కొడుంగైయూర్‌లోని దహన కేంద్రంలో కాల్చివేశారు. అలందూర్ జోన్ రామాపురం వీధిలోని ఓ ఇంటి నుంచి వస్తువులను సేకరిస్తున్న దృశ్యం - న్యూస్‌టుడే, చెన్నై

మాదర్‌పాక్కం యూనియన్ ఆవిర్భావం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి యూనియన్‌లో 52 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ యూనియన్‌ను రెండుగా విభజించి కొత్తగా మాదర్‌పాక్కం యూనియన్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. ఆ మేరకు మాదర్‌పాక్కం యూనియన్ ఆవిర్భవించినట్లు రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేడీ ఆదివారం విడుదల చేసిన గెజిట్‌లో తెలిపారు. కొత్త యూనియన్‌లో బూదూరు, సెదిల్‌పాక్కం, ఈగువార్‌పాళ్యం, ఎళావూర్, కన్నంబాక్కం, కన్నన్‌కోటతో పాటు 22 గ్రామ పంచాయతీలను చేర్చారు.

అలంకరణలో శివపార్వతులు ▸ ప్రమిదలతో శివలింగ రూపం

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నైలోని శ్రీ కచ్చాల పరమేశ్వర దేవస్థానం ధర్మసంస్థ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయంలోని శివలింగానికి, సాలగ్రామాలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివపార్వతులను నంది వాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కొందరు భక్తులు మహామండపంలో శివలింగాకారంలో దీపాలు వెలిగించారు. కార్యదర్శి కిశోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓట్లు అడిగేందుకు వస్తే ఆ డబ్బులు అడగండి

మాజీమంత్రి విజయభాస్కర్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: డీఎంకే వారు ఓట్లు అడిగేందుకు వస్తే మీకు రావాల్సిన రూ.50వేలు అడగాలని అన్నాడీఎంకే మాజీ మంత్రి విజయభాస్కర్ తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని డీఎంకే ప్రభుత్వం రద్దు చేయడానికి యత్నిస్తోందని ఆరోపిస్తూ పుదుకోట జిల్లా విరాలిమలై పంచాయతీ యూనియన్ కార్యాలయం ఎదుట ఆదివారం ఆందోళన జరిగింది. ఇందులో విజయభాస్కర్ పాల్గొని మాట్లాడుతూ... డీఎంకే అధికారంలోకి రాగానే నెలకు రూ.వెయ్యి ఇస్తామని చెప్పారని, కానీ మూడేళ్ల తర్వాతే ఆ డబ్బులు ఇచ్చారని తెలిపారు. అలా చూస్తే వడ్డీతో కలిపి రూ.50వేలు ఇవ్వాలన్నారు. డీఎంకే వాళ్లు ఎన్నికల ముందు ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు ఆ డబ్బులు అడగాలని సూచించారు. రూ.5వేలు ఇచ్చి విద్యుత్ ఛార్జీలు, ఆస్తి, తాగు నీటి పన్నులు, నిత్యావసరాల ధరలు పెంచేశారన్నారు.

ఘనంగా మయూర నాట్యాంజలి ఉత్సవాలు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా మైలాడుతురై సప్తస్వరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20వ వార్షిక మయూర నాట్యాంజలి ఉత్సవాలు మయూరనాథర్ ఆలయంలో ఫిబ్రవరి 12 నుంచి జరుగుతున్నాయి. మూడో రోజు శనివారం రాత్రి స్విట్జర్లాండ్‌కు చెందిన త్రికోణేశ్వర నృత్యాలయ ఉపాధ్యాయిని మతివదని సుధాకర్ విద్యార్థులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆదివారం చెన్నై గురు శీలా ఉన్నికృష్ణన్ శ్రీదేవి రుద్రాలయకు చెందిన 30మంది పైగా విద్యార్థులు తగిన ప్రామాణికమైన దుస్తులలో శివ నవ భక్తి నృత్య నాటకాన్ని ప్రదర్శించారు.

ముల్లైక్కాడు షిప్‌యార్డ్ ప్రాజెక్టు ప్రభుత్వం విరమించుకోవాలి : ప్రేమలత

సైదాపేట, న్యూస్‌టుడే: ముల్లైక్కాడు షిప్‌యార్డు ప్రాజెక్టును ప్రభుత్వం విరమించుకోవాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో... కోవళం, పళువందల్లై, దాసపాడి, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఉప్పు ఉత్పత్తిదారుల సంఘాలు, వేల మంది ఉప్పు కార్మికుల జీవనోపాధి దెబ్బతినే విధంగా ముల్లైక్కాడు ప్రాంతంలో షిప్‌యార్డు ప్రాజెక్టుకు ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిసిందన్నారు. వేలాది ఉప్పు కార్మికుల జీవనోపాధి దెబ్బతినే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

డీఎంకే కూటమిలోకి ఎంఎంకే

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: మనిదనేయ మక్కళ్ కట్చి (ఎంఎంకే) రాష్ట్ర సర్వసభ్య సమావేశం చెన్నైలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడు జవాహిరుల్లా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎంకే కూటమిలో కొనసాగేందుకు తీర్మానం చేశారు. జవాహిరుల్లా మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో తాము 5 స్థానాల్లో పోటీ చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. మతతత్వ సిద్ధాంతాలు కలిగిన పార్టీలను అడ్డుకునేందుకు తాము డీఎంకే కూటమిలో కొనసాగుతామన్నారు. గత ఎన్నికల్లో ఎంఎంకే రెండు స్థానాల్లో పోటీ చేయడం గమనార్హం.

మంత్రి సీవీ గణేశన్ నుంచి పురస్కారం అందుకుంటున్న రవిచంద్రన్

ఆర్డీవో రవిచంద్రన్‌కు పురస్కారం

రెడ్‌హిల్స్: తిరువళ్లూర్ జిల్లాలో వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలించాలని కలెక్టర్ ప్రతాప్ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ఆర్డీవో రవిచంద్రన్ గత ఏడాదిలో బియ్యపు మిల్లులు, ఇటుకల బట్టీల్లో వెట్టి చాకిరీ చేస్తున్న ఉత్తరాది రాష్ట్రానికి చెందిన 130 మందికి విముక్తి కల్పించారు. దీంతో ఉత్తమంగా విధులు నిర్వర్తించిన ఆర్డీవో రవిచంద్రన్‌కు రాష్ట్ర ప్రభుత్వం పురస్కారం ప్రకటించింది. రాష్ట్ర కార్మిక సంక్షేమశాఖ మంత్రి సీవీ గణేశన్ ఆదివారం తిరువళ్లూరులో జరిగిన కార్యక్రమంలో రవిచంద్రన్‌కు పురస్కారం అందజేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న వ్యాను

ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురి మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని వ్యాను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటన తూత్తుకుడిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... తూత్తుకుడి జిల్లా విళాత్తికుళం సమీపం పల్లాకుళం గ్రామానికి చెందిన గురుసామి(40), ముత్తులక్ష్మి(40), సుమిత్రన్(3), ముగిల్(5), మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఆదివారం కుళత్తూర్ నుంచి పల్లావరం గ్రామానికి బయలుదేరారు. ఈస్ట్ కోస్ట్ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన పర్యాటకుల వ్యాను వారి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఐదుగురు ఘటనాస్థలిలోనే మృతిచెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి వ్యాను డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నాడీఎంకే వైద్య విభాగ సమావేశం

సైదాపేట: దివంగత ముఖ్యమంత్రి జయలలిత జయంతి ఘనంగా జరుపుకోవడం, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే విజయం కోసం వైద్య విభాగం చేపట్టాల్సిన పనుల గురించి ఆలోచనా సమావేశం ఆదివారం జరిగింది. చెన్నై రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో వైద్య విభాగ నిర్వాహకులు అనేక మంది పాల్గొన్నారు.

విజయ్ మాటలు ప్రజలు స్వీకరించరు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మగళిర్ ఉరిమై తొగై పథకం కింద అందజేసిన రూ.5వేల సాయం గురించి టీవీకే అధ్యక్షుడు విజయ్ చేసిన వ్యాఖ్యలు ప్రజలు స్వీకరించరని రాష్ట్ర మంత్రి ముత్తుసామి తెలిపారు. దివ్యాంగుల సంక్షేమశాఖ తరఫున లబ్ధిదారులకు వాహనాలు, కుట్టు యంత్రాల పంపిణీ కార్యక్రమం ఈరోడ్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం జరిగింది. పాల్గొన్న మంత్రి ముత్తుసామి 62మంది దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు అందజేశారు. అదేవిధంగా సత్యవాణిముత్తు అమ్మవారి స్మారకంగా వితంతువులు, ఒంటరి మహిళలు 97 మందికి కుట్టు యంత్రాలు అందజేశారు.

దివ్యాంగుడికి ద్విచక్ర వాహనం అందజేస్తున్న మంత్రి ముత్తుసామి

విజయ్‌పై నయినార్ వ్యాఖ్యలు బాధాకరం

వానతీ శీనివాసన్

కార్యక్రమంలో వానతీ శీనివాసన్, ఎల్.మురుగన్ తదితరులు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: టీవీకే అధ్యక్షుడు విజయ్‌పై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలు విచారకరమని భాజపా ఎమ్మెల్యే వానతీ శీనివాసన్ పేర్కొన్నారు. కోవై బాంబు పేలుళ్ల ఘటనలో మరణించినవారికి అంజలి ఘటించే కార్యక్రమం కోయంబత్తూర్‌లోని ఆర్‌ఎస్ పురంలో శనివారం సాయంత్రం జరిగింది. ఇందులో కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, వానతీ శీనివాసన్, హిందూ మున్నని అధ్యక్షుడు కాదేశ్వర సుబ్రమణియన్, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి అరవిందన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వానతి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నయినార్ చాలా ప్రశాంతంగా, మర్యాదగా ఉండే వ్యక్తి అన్నారు. అసెంబ్లీలోనూ అలానే ప్రవర్తిస్తారని తెలిపారు. విజయ్ గురించి అలా ఎందుకు మాట్లాడారో తనకు తెలియదన్నారు. ఆయన వ్యాఖ్యలు బాధాకరంగా ఉన్నాయని తెలిపారు.

అనాగరికం: కనిమొళి

సైదాపేట: విజయ్‌పై నయినార్ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలు అనాగరికమని డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. ఆమె ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... ఓ పురుషుడిని విమర్శించేందుకు కూడా ఒక మహిళను కించపరచి అనాగరికంగా మాట్లాడటమే ఆర్‌ఎస్‌ఎస్, భాజపా అసహ్యకరమైన రాజకీయాలని విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించదగినవని పేర్కొన్నారు.

పుస్తకాలను పరిశీలిస్తున్న మంత్రి నాజర్

తిరువళ్లూర్‌లో పుస్తక ప్రదర్శన ప్రారంభం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ కలెక్టరేట్ ప్రాంగణంలో 5వ పుస్తక ప్రదర్శన ఆదివారం ప్రారంభమైంది. రాష్ట్ర మంత్రి నాజర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈనెల 22వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగనుంది. ఎమ్మెల్యేలు కృష్ణస్వామి, దురైచంద్రశేఖర్, డీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిలో... ఆర్కేనగర్: తిరుచ్చి జిల్లా యంత్రాంగం, దక్షిణ ఇండియా పుస్తక విక్రయదారుల సంఘం తరఫున 4వ పుస్తక ప్రదర్శన తిరుచ్చి వెస్టరీ పాఠశాల మైదానంలో శనివారం సాయంత్రం ఏర్పాటైంది. దీనిని మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేశ్ ప్రారంభించి తిలకించారు. అనంతరం కేఎన్ నెహ్రూ మాట్లాడుతూ.. .. స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో జిల్లాల వారీగా పుస్తక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా పుస్తకాలు చదవాలని సూచించారు.

భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించిన భర్త అరెస్ట్

క్రైం కార్నర్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి నగరంలోని పిటమనేరి ప్రాంతానికి చెందిన సెల్‌ఫోన్ మెకానిక్ గోకుల్, అంజుమాస్టెలస్ దంపతులు. వీరికి ఏడేళ్ల కుమార్తె ఉంది. కుటుంబ కలహాలతో గోకుల్ భార్యపై దాడి చేసి పుట్టింటికి తరిమేసినట్లు తెలుస్తోంది. తర్వాత తల్లిదండ్రులు కుమార్తెకు నచ్చజెప్పి భర్త వద్దకు పంపారు. ఈ క్రమంలో మళ్లీ భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆక్రోశించిన గోకుల్ భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. చుట్టుపక్కల వారు గాయపడిన అంజుమాస్టెలస్‌ను ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. బాధితురాలి అన్న ఫిర్యాదు మేరకు ధర్మపురి టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టి గోకుల్, ఆయన తల్లి విజయపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. శనివారం గోకుల్‌ని అరెస్ట్ చేసి పరారీలో ఉన్న విజయ కోసం గాలిస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు...

పొన్నేరి: తిరువళ్లూర్ జిల్లా రెడ్‌హిల్స్ సమీపం మొండిఅమ్మన్ నగర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని సోదా చేసి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన మహ్మద్ సమీర్, ముర్షిద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు.

మత్తుమాత్రల విక్రేత...

ఆర్కేనగర్: తిరుచ్చి ఈబీ రోడ్డు లూర్ధుసామి పార్క్ వద్ద మత్తుమాత్రలు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు ఆదివారం ఆ ప్రాంతంలో సోదాలు జరిపి కమల నెహ్రూ ప్రాంతానికి చెందిన కాళిముత్తు(19)ను అరెస్టు చేశారు. అతని నుంచి మత్తుమాత్రలు, ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు.

సీఎంపై అనుచిత పోస్టు చేసిన అన్నాడీఎంకే నేత...

విల్లివాక్కం: కరూర్ జిల్లా వేలాయుధంపాలయానికి చెందిన పశుపతి సెంధిల్ అన్నాడీఎంకే ఈరోడ్ జోన్ సమాచార, సాంకేతిక విభాగ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఈయన శుక్రవారం రాత్రి తన ఫేస్‌బుక్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్, కరూర్ ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీ గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టు చేశారు. దీని గురించి వేలాయుధంపాలయానికి చెందిన సూర్యకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం పశుపతి సెంధిల్‌ని అరెస్ట్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో

ఇద్దరు రైతుల మృతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం మేరకు.. దిండుగల్ జిల్లా వత్తలంగుండు సమీపం ముత్తులాపురానికి చెందిన అళగుమలై(60), ఈయన బంధువు మునియాండి(60) రైతులు. వీరిద్దరు శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వత్తలంగుండు రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో అళగుమలై, మునియాండి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

వంతెన పైనుంచి పడి బిషప్...


జాకబ్ లివింగ్‌స్టన్ (పాతచిత్రం)

విల్లివాక్కం: సేలం సీఎస్ఐ చర్చి బిషప్‌గా గతేడాది ఆగస్టులో జాకబ్ లివింగ్‌స్టన్(56) బాధ్యతలు స్వీకరించారు. ఈరోడ్‌లో నివాసం ఉంటున్న ఆయన డ్రైవర్‌తో పాటు శనివారం ఉదయం వ్యాహ్యాళికి వెళ్లారు. ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో పైవంతెన పైనుంచి కింద మీనాక్షి సుందరనార్ రోడ్డుపై పడ్డారు. వెంటనే డ్రైవర్ ఈరోడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. బిషప్ ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేదా? ప్రమాదవశాత్తు పడ్డారా? అన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన బాలిక...

సైదాపేట: ప్రేమ విఫలమైందని ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించిన బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. తిరువణ్ణామలై జిల్లా దేవనూరు గ్రామానికి చెందిన కాళియప్పన్ కుమార్తె ముత్తళగి(17)కి, బంధువైన యువకుడికి వివాహం చేసేందుకు పెద్దలు నిర్ణయించారు. ఈనెల 9వ తేదీ నిశ్చితార్థం జరిగింది. అయితే ముత్తళగి వేరే యువకుడిని ప్రేమించింది. ఇంట్లోంచి వెళ్లిపోయి ప్రియుడైన కాళి అనే యువకుడిని 10వ తేదీ వివాహం చేసుకుంది. ఇదిలా ఉండగా శుక్రవారం ముత్తళగికి కడుపునొప్పి రావడంతో భర్త ఎందుకొస్తుందని అడగ్గా.. మరో వ్యక్తిని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక 9వ తేదీ ఎలుకల మందు తిన్నట్లు తెలిపింది. దీంతో వెంటనే తిరువణ్ణామలై ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో అక్కడ చికిత్స పొందుతూ ముత్తళగి శనివారం సాయంత్రం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుడి బలవన్మరణం

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై వ్యాసర్పాడికి చెందిన జాక్ కార్నర్ లెస్(27) ఉక్రెయిన్‌లో వైద్య విద్య పూర్తి చేసి ప్రస్తుతం రాయపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో డాక్టరుగా పని చేస్తున్నారు. ఈయన మానసిక ఒత్తిడితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి తన గదిలోకి వెళ్లి ఎంతసేపయినా బయటకు రాకపోవడంతో ఆయన తండ్రి జాన్ తలుపులు తట్టారు. తీయకపోవడంతో పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా కుమారుడు ఫ్యానుకి ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పుళల్ జైల్లో ఇద్దరు ఖైదీల

ఆత్మహత్యాయత్నం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: చెన్నై వ్యాసర్‌పాడి సమీపం కన్నికాపురానికి చెందిన అజిత్, వ్యాసర్‌పాడి మల్లిగైప్పూ కాలనీకి చెందిన అజిత్ కుమార్ ఇటీవల గంజాయి కేసుల్లో అరెస్టయి పుళల్ కేంద్ర కారాగారంలో ఉన్నారు. ఇద్దరిని ఒకే గదిలో ఉంచారు. ఆదివారం వేర్వేరు గదులకు మార్చారు. ఇందుకు నిరసనగా ఇద్దరు బ్లేడ్లతో ఒంటిపై కోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. గాయాలతో ఉన్న ఇద్దరిని పోలీసులు జైల్లోని ఆస్పత్రికి తరలించారు. పుళల్ పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా పూందమల్లి పోలీసులు సెన్నీర్‌కుప్పంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడ్డ వ్యక్తి చెన్నై వ్యాసర్‌పాడికి చెందిన సురేష్‌గా గుర్తించారు. అరెస్టు చేసి పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు.

రూ.23.50 లక్షల నగదు...

ప్యారిస్: చెన్నై పాండి బజార్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రాత్రి టీనగర్ తిరుమలైపిళ్లై సాలై-హబిబుల్లా సాలై జంక్షన్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా నెంబర్ ప్లేట్ లేకుండా వచ్చిన కారును ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.23.50 లక్షల నగదును గుర్తించారు. కారులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ఫైనాన్స్ సంస్థ నిర్వాహకుడు మిరియాల వెంకట నాగేశ్వరరావు, వ్యాపారి సుబ్బయ్య, డ్రైవరు అశ్విన్‌కుమార్, గణేష్, మహేష్, సందీప్ వర్మను విచారించారు. వారు కాంచీపురంలోని ఆలయానికి వెళ్తూ నగదు తీసుకెళ్తున్నట్లు పొంతనలేని సమాధానాలు చెప్పారు. తగిన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

శ్రీకాళహస్తి : నంది, సింహ వాహనాలపై సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక .. ◗ నగరోత్సవంలో భక్తులకు దర్శనభాగ్యం.. ◗ దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

● భూకైలాసమైన శ్రీకాళహస్తి ● కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

జగమేలే జంగమా.. జయహో శివలింగమా!

ఈనాడు డిజిటల్, తిరుపతి- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి, తిరుపతి(బైరాగిపట్టెడ) : గాలిలో విభూతి పరిమళం.. గుండెల్లో శివయ్య ధ్యానం... లయకారుడి సేవలో సకలజగత్తు మునిగిపోయిన వేళ 'ఓం నమఃశివాయ' మంత్రం మారుమోగింది. కంటికి కనిపించే దైవం కోసం.. గంటల తరబడి నిరీక్షించి ఆధ్యాత్మికత సందడిలో మునిగిపోయింది. హరిహరులు వేరు కాదు.. అంతా ఒక్కటే అని చాటిచెబుతూ.. ఆదివారం జిల్లా శివనామస్మరణలో తడిసి ముద్దయ్యింది. పసిపాప నుంచి ముదసలివారి వరకూ.. అందరిదీ శివయ్య ధ్యానమే!

శ్రీకాళహస్తి ఆలయంలో ..

● దక్షిణ కైలాసమైన శ్రీకాళహస్తిలో వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరిగాయి. మహాశివరాత్రి వేళ స్వామి, అమ్మవార్లు ఇంద్ర విమానం, చప్పరంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నిర్వహించిన పంచమూర్తుల ఊరేగింపుతో తిరుమాడ వీధులు భక్తజన సంద్రంగా మారాయి. ఆదివారం రాత్రి వాయులింగేశ్వరుడు వృషభ వాహనాన్ని, జ్ఞానప్రసూనాంబిక అమ్మవారు సింహ వాహనాన్ని అధిరోహించడంతో భక్తకోటి దర్శించుకుని పులకించిపోయింది.

కపిలతీర్థంలో 'భోగితేరు' మురిపం.. తిరుపతి నడిబొడ్డున ఉన్న కపిలతీర్థం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. వేకువజామున నిర్వహించిన మహాభిషేకం, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం భోగితేరు (రథోత్సవం) వేడుకగా కొనసాగాయి. భజన మండళ్ల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో స్వామివారు విహరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తితిదే ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసింది. రుద్రాభిషేకాలు, బిల్వార్చనలతో స్వామివారిని సేవించుకుని భక్తులు తన్మయత్వం చెందారు. గుడిమల్లం, నారాయణవనం తదితర పురాతన శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి.

నంది వాహనంపై సోమస్కంద మూర్తి వైభవం..

కళాకారుల నృత్య ప్రదర్శన

కపిలతీర్థంలో దర్శనానికి పోటెత్తిన భక్తులు

రైతుబజారులో రూ.10కే కిలో టమాట

మొబైల్ వాహనం ద్వారా టమాట విక్రయాలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు రైతుబజారులో కిలో టమాట రూ.10 చొప్పున విక్రయిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వర్ తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు సరసమైన ధరలకే నాణ్యమైన టమాట ఉత్పత్తులు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అనంతపురం జిల్లా నుంచి చిత్తూరు రైతుబజారుకు 7 టన్నులు, తిరుపతికి 5 టన్నుల సరఫరా జరిగిందన్నారు. చిత్తూరులో ఆదివారం అమ్మకాలు ప్రారంభించామన్నారు. రైతుబజారుతో పాటు నాలుగు మొబైల్ వాహనాల ద్వారా విక్రయాలు చేపట్టామని చెప్పారు.

అధునాతన అన్నప్రసాద కేంద్రానికి అడ్డంకులు

గ్యాస్ కేంద్రం తరలిస్తేనే సాకారం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే-రిలయన్స్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుమలలో తలపెట్టిన ఏఐ ఇంటిగ్రేటెడ్ అత్యాధునిక అన్నప్రసాద కేంద్రం నిర్మాణం ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు రూ.100 కోట్లతో అన్నప్రసాద కేంద్రం నిర్మించాల్సి ఉంటుంది. భక్తుల భద్రత దృష్ట్యా స్థానిక మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కేంద్రానికి సమీపంలో ఉన్న ఐవోసీఎల్ గ్యాస్ స్టోరేజీ కేంద్రం తరలించి అక్కడే నిర్మించాలని తితిదే నిర్ణయించింది. మరోవైపు ఔటర్‌రింగ్ రోడ్డులో 1.86 ఎకరాల విస్తీర్ణంలో రూ.8.13 కోట్లతో 45 టన్నుల సామర్థ్యంతో గ్యాస్ నిల్వ కేంద్రం నిర్మించాల్సి ఉంది. పనులు ఆరునెలల్లో పూర్తిచేయాలన్నది లక్ష్యం. గడువు దాటినా పునాదుల పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలించి వేగవంతం చేయాలని సీఈ సత్యనారాయణను ఆదేశించారు.

ఔటర్ రింగ్‌రోడ్డులో పురోగతి లేని ఐవోసీఎల్ గ్యాస్ స్టోరేజీ కేంద్రం నిర్మాణ పనులు

ఆటలాడించాల్సిందే..!

● ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలన్న ప్రభుత్వం
● మైదానాల కోసం వెతుకులాట

తిరుపతి, చిత్తూరు నగరాల్లో చాలావరకు ప్రైవేటు పాఠశాలలకు మైదానాల్లేవు. అధికశాతం నివాసాలు, అపార్టుమెంట్లలో నిర్వహిస్తున్నారు. వాటిలో కనీస భద్రత ఉండదు. అటు పురపాలికల్లోనూ పదుల సంఖ్యలో ఉన్న పాఠశాలలకు మైదానాలు కరవే. వాటిపై ఆశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పుత్తూరు, న్యూస్‌టుడే: పొద్దున లేచింది మొదలు పుస్తకాలతో కుస్తీ పట్టాలి. మెరుగైన మార్కులు సాధించాలి. ఆపై చదవాలి ఆటలు. ఇదీ ప్రైవేటు పాఠశాల విద్యార్థుల పరిస్థితి. వారికి శారీరక శ్రమలేక అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో బాలల ఆరోగ్యానికి భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కచ్చితంగా వ్యాయామవిద్య అమలు చేయాలంటూ ఇటీవల ఆదేశాలిచ్చింది. దీంతో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు క్రీడామైదానాల వెతుకులాటలో పడ్డారు.

పుత్తూరులో నెట్‌బాల్ ఆడుతున్న విద్యార్థినులు

ఆరోగ్య విద్యకూ ప్రాధాన్యం

కచ్చితంగా అన్ని పాఠశాలల్లోనూ ప్రతి విద్యార్థితో గంట సేపు వివిధ రూపాల్లో శారీరక శ్రమ చేయించాల్సిందే. ప్రతి విద్యార్థికి వారానికి ఆరు పీరియడ్లు చొప్పున ఆడించాల్సిందే. ఉదయం పది నిమిషాలు ధ్యానం చేయించాలి. ఒక పీరియడ్ ఆరోగ్య విద్యకు కేటాయించాల్సిందే.

తప్పక అమలు చేయాలి

ప్రైవేటు పాఠశాలల్లో చదువు, ఒత్తిడితో మానసికంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. తప్పక అమలు చేయాలి. -బాబు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి, తిరుపతి

తిరుపతిలోని ప్రైవేటు పాఠశాలలు: 250 పైగా
చిత్తూరుతోపాటు పురపాలికల్లో: 650 పైగా
చదువుతున్న విద్యార్థులు: 1.20 లక్షల మంది

మానసిక ఒత్తిడి తగ్గించాలి

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య అమలు చేస్తున్నారు. సాయంత్రం మానసిక ఒత్తిడి తగ్గించే విధంగా విద్యార్థులతో పలు ఆటలు ఆడిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కేవలం కొన్ని పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య అమలు చేస్తున్నారు. ఈ దుస్థితి నుంచి బయటపడేలా ఒకటి నుంచి పదో తరగతి వరకు ఆటలు ఆడించాల్సిందేనంటూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుత్తు సమస్యలా.. ఫోన్ చేయండి

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్, జిల్లా స్థాయిలో విద్యుత్తు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు డయల్ యువర్ సీఎండీ, డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం తెలిపారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించిన విద్యుత్తు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు కింది నంబర్లకు తెలియజేయవచ్చన్నారు..

పీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి

డయల్ యువర్ సీఎండీ
సమయం : ఉ.10 - 12:30
ఫోన్ నెంబరు 89777 16661

డయల్ యువర్ ఎస్ఈ
సమయం : ఉ 8:30 -9:30 గంటలు
తిరుపతి: 87126 52679

మశకాల కట్టడికి ఏఐ దిశ

◗ ప్రయోగాత్మక పరిశీలనకు కార్యాచరణ

నగరంలో అమర్చనున్న ఐవోటీ పరికరం

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: నగరాలు, పట్టణాల్లో దోమల నివారణ పెద్ద సవాలే. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసేది అవే. వలసలు, మురికివాడల పెరుగుదల వంటి సమస్యల తోడు సిబ్బంది మొక్కుబడి చర్యలతో ఆశించిన ఫలితాలు ఉండటం లేదు. శాశ్వత పరిష్కారంలో భాగంగా ఆధునిక సాంకేతికను వినియోగించేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రభుత్వంలో అందులో భాగంగా నగరంలో ఏఐ ఆధారిత స్మార్ట్ దోమల నిఘా వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు సిద్ధం చేస్తోంది.

పనితీరు ఇలా..!

నిర్దేశిత ప్రాంతాల్లో ఐవోటీ పరికరాలు ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక వాసన (ఫిరమోన్) ద్వారా దోమల్ని ఐవోటీ పరికరాలు ఆకర్షిస్తాయి. తద్వారా దోమల సాంద్రత, వాటి జాతి, లింగం గుర్తించి సమాచారాన్ని సెంట్రల్ డ్యాష్‌బోర్డుకు పంపుతుంది. కృత్రిమమేధ విశ్లేషించి ప్రమాదకర స్థాయిలను హెచ్చరించి అప్రమత్తం చేస్తుంది.

250 హాట్‌స్పాట్లు

ప్రస్తుతం నగరంలో 250 ప్రాంతాలు దోమలకు హాట్‌స్పాట్లుగా ఉన్నాయి. నగరపాలక కార్యాలయం, వినాయక సాగర్, శ్రీనివాసం యాత్రికుల వసతి సముదాయం, ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ వంటి హాట్‌స్పాట్లలో ఐవోటీ సెన్సార్లు, జాప్‌ట్రాప్‌లు ఏర్పాటు చేయనున్నారు.

ముఖ్యమంత్రి ఆదేశానుసారం ప్రయోగాత్మక పరిశీలన

సీఎం చంద్రబాబు ఆదేశానుసారం ఓ ప్రైవేటు సంస్థ ద్వారా ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించాం. ప్రాథమికంగా రూ. 20 లక్షలతో నాలుగు ప్రాంతాల్లో ఐవోటీ పరికరాలు, జాప్‌ట్రాప్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వాటి ఫలితాల్ని అనుసరించి తిరుపతి వ్యాప్తంగా అందుబాటులోకి తెస్తాం. - ఎన్.మౌర్య, కమిషనర్

మహిళా ప్రాంగణం.. నైపుణ్య ప్రాభవం

☛ కూటమి పాలనలో పునర్వైభవం ☛ శిక్షణతో స్వయం ఉపాధికి బాటలు

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: అతివల అభ్యున్నతి లక్ష్యంగా దివంగత నందమూరి తారకరామారావు 1986లో తిరుపతిలో ప్రత్యేకంగా మహిళా ప్రాంగణాన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వ పాలనలో వెలవెలబోగా కూటమి పాలనలో నిరంతర శిక్షణలతో కళకళలాడుతోంది.

అర్హతలు ఇలా..
పాఠశాల స్థాయిలోనే చదువు మానేసిన, పదో తరగతి వరకు చదువుకున్న మహిళలకు ప్రాంగణంలో ఇచ్చే శిక్షణలన్నీ ఉచితం.

సీపీఆర్‌పై శిక్షణ పొందుతున్న జీడీఏ కోర్సు అభ్యర్థులు

సరికొత్తగా కోర్సులు

రెండున్నరేళ్లలో తొమ్మిది రకాల ఉపాధి కోర్సుల్లో 1,500 మందికిపైగా మహిళలు శిక్షణ తీసుకున్నారు. వారిలో 90% మంది స్వయంఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం 90 మంది మహిళలు వివిధ కోర్సుల్లో శిక్షణలో ఉన్నారు. కంప్యూటర్ అండ్ ఇంటర్నెట్ లిటరసీ కోర్సులో 45 మంది శిక్షణ వచ్చే నెల ముగుస్తుంది. వీరికి కంప్యూటర్ బేసిక్స్, జీమెయిల్ క్రియేషన్, ఏఐ టూల్స్ నేర్పిస్తున్నారు. జీడీఏ కోర్సులో బేసిక్ నర్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న మహిళలు త్వరలో ఆసుపత్రిలో ఉద్యోగంలో చేరనున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

వచ్చేనెలలో కిచెన్, టెర్రస్ గార్డెన్‌పై శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. 18ఏళ్ల వయసు పైబడిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం 15 దరఖాస్తులు వచ్చాయి. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, శారీరోలింగ్‌లో వచ్చేనెలలో శిక్షణ ఉంటుంది. పెయింటింగ్‌లో 30 రోజులు, శారీ రోలింగ్‌లో పది రోజులపాటు శిక్షణ ఇస్తాం. - డా.ఫర్జానా, మేనేజర్

చెరకు రైతుకు చేదు ఫలం

■ రెక్కల కష్టం.. దళారుల పరం

పుత్తూరు, న్యూస్‌టుడే: అప్పులు తెచ్చి సాగు చేస్తున్న చెరకు రైతుకు చేదు ఫలం మిగులుతోంది. పుంగనూరులోని వాణీ షుగర్స్, బీఎన్ కండ్రిగలో మయూరి షుగర్స్, నిండ్రలోని నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీలు దశల వారీగా మూసేశారు. ప్రస్తుతం ఎస్ఆర్‌పురం మండలం నెలవాయి వద్ద ఎస్ఎన్‌జే షుగర్స్ కర్మాగారం మాత్రమే నడుస్తోంది. రైతులు పండించిన పంటంతా అక్కడికే తరలిస్తున్నారు. నాలుగు కర్మాగారాలు క్రషింగ్ చేసే చెరకుతో ఒక్క ఫ్యాక్టరీపై భారం పడింది.

మిగులు లేక నష్టాలు

చెరకు నరుకుడు కూలీ రూ.950, పొలంలోంచి తరలించేందుకు టన్నుకు రూ.150, ఇతర ఖర్చులు రూ.100 వెరసి రూ.1300 ఖర్చు అవుతోంది. రైతులకు మిగిలేది రూ.2వేలు. అందులో పెట్టుబడి, అప్పులకు వడ్డీలు పోను కనీసం టన్నుకు రూ.1000 కూడా దక్కడం లేదు.

తమిళనాడులో రూ.4 వేలు

ఎస్ఎన్‌జే కార్మాగారంలో టన్నుకు ప్రస్తుతం రూ.3290 రైతులకు చెల్లిస్తున్నారు. రవాణా ఉచితం. అదే తమిళనాడులో కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలైన వేలూరు, తిరువాంలాంగాడు టన్నుకు రూ.4 వేలు చెల్లిస్తున్నాయి. తిరుణామలై, సెంజి ప్రైవేటు ఫ్యాక్టరీల్లో టన్నుకు రూ. 3600 చెల్లిస్తున్నాయి.

ఏజెంట్ల బెడద లేకుండా

తూర్పు మండలాల్లోని రైతులు పర్మిట్లు దొరక్క ఏజెంట్లను ఆశ్రయించి తమిళనాడు తరలిస్తున్నారు. టన్నుకు రూ.700 వరకు నష్టపోతున్నారు. జిల్లా అధికారులు ఏజెంట్ల బెడద లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్లతో.. నెట్టుకొస్తున్నారు

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: ఆర్టీసీకి చోదకశక్తి కరవైంది. జిల్లాలో తిరుమల, తిరుపతి, మంగళం, అలిపిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, పుత్తూరు, సత్యవేడు, వాకాడు డిపోలు ఉండగా వీటిల్లో ప్రసుత్తం డ్రైవర్ల కొరత వేధిస్తోంది. ఫలితంగా ఉన్నవారిపై అదనపు భారం పడుతోంది. ఈక్రమంలో విశ్రాంతి లేమి, పనిఒత్తిడి వంటి సమస్యలతో అనారోగ్యం బారిన పడుతున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. మరోవైపు డ్రైవర్లు లేరనే కారణంతో చాలావరకు డిపోల్లో రద్దీ అవసరాల మేరకు అదనపు ట్రిప్పులు, బస్సులు తిప్పలేక రద్దు చేస్తున్న ఘటనలు ఉంటున్నాయి.

307 మంది అవసరం..

జిల్లాలో ఏళ్లతరబడి నియామకాలు చేపట్టకపోవడంతో పది డిపోల పరిధిలో 307 మంది డ్రైవర్ల అవసరం ఉంది. ప్రస్తుతం స్త్రీశక్తి పథకం అమలుతో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో ఆన్‌కాల్ డ్రైవర్లను వినియోగించుకుంటున్నారు. వీరిలో కొందరు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

జిల్లా వివరాలు ఇలా..
జిల్లాలో డిపోలు- 10
అవసరమైన డ్రైవర్లు- 1647
ప్రస్తుతం ఉన్నది - 1456
మొత్తం కండక్టర్లు - 1370
ప్రస్తుతం ఉన్నది - 1254

సమస్యలు తలెత్తకుండా చర్యలు

ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం సిబ్బంది కొరత స్థానంలో ఆన్‌కాల్ డ్రైవర్లను వినియోగించుకుంటున్నాం. సర్వీసుల రద్దు, ప్రయాణికులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. - జగదీష్, ప్రజా రవాణాధికారి

కలియుగ దైవం.. కల్కి రూపం

చంద్రగిరి : కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారు దివ్యరథంపై దర్శనభాగ్యం కల్పించారు. రాత్రికి అశ్వవాహనంపై కల్కి స్వరూపంతో తిరువీధుల్లో విహరించారు. సోమవారం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

రథోత్సవంలో భక్తులు

(c) eenadu

ఏటా పుష్కరం సువర్ణముఖి ప్రత్యేకం

సువర్ణముఖి ప్రవాహ ఉద్ధృతి విహంగ వీక్షణం



నదిపేరు: సువర్ణముఖి
పుట్టుక: చంద్రగిరిలోని అగస్త్యాచలం
సముద్ర సంగమ ప్రదేశం: తూపులపాళెం సమీపంలో
ఉపనదులు: కల్యాణి, భీమ
సముద్రమట్టం నుంచి ఎత్తు: 300 మీటర్లపైనే
పొడవు: 130 కిలోమీటర్లు
తీర ప్రాంతం: 3,225 చదరపు కిలోమీటర్లు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఏ నదికైనా పన్నెండు సంవత్సరాలకు ఒక పర్యాయం పుష్కరం వస్తుంది. అదే అగస్త్య మహాముని తపోబలంతో ఆవిర్భవించిన సువర్ణముఖికి ఏటా పుష్కరమే. మాఘ మాసం పూర్ణిమ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున పుష్కరోత్సవం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది.

అగస్త్య ప్రసాదితం..: ఎన్నో విశిష్టతల సమాహారమైన శ్రీకాళహస్తి క్షేత్రంలో పుణ్యనది లేకపోవడంతో అగస్త్య మహర్షి ఆవేదనకు గురయ్యారు. సత్యవ్రత భాస్కర క్షేత్రమైన ఇక్కడ నదిని తీసుకురావాలన్న తలంపుతో పాకాలకు సమీపంలోని బ్రహ్మాచలంలో తపస్సు చేయడంతో సువర్ణముఖి ఆవిర్భవించింది. అగస్త్య మహర్షి తపస్సు చేసిన కారణంగా బ్రహ్మాచలం అగస్త్యాచలంగా ఖ్యాతి గడిస్తోంది. ఇక్కడి నదిలో ఇసుక బంగారంగా మెరిసిపోతుండటంతో సువర్ణముఖి అన్న పేరు సార్థకమైనట్లు పురాణాల ద్వారా విశదమవుతోంది.

సువర్ణముఖి గమనం ఇలా..: జిల్లాలో అత్యంత పెద్ద నదిగా గుర్తింపు పొందిన సువర్ణముఖి ఎంతో పురాణ ప్రాభవాన్ని సంతరించుకుంది. పాకాలకు సమీపంలోని ఆదినాపల్లి సమీపంలోని అగస్త్యాచలం వద్ద చిన్నపాటి వాగుగా ఆవిర్భవించి అక్కడి నుంచి చిన్నపాయగా ప్రారంభమవుతోంది. అక్కడే ఎగువన భీమానది, దిగువన కల్యాణి నదులతో సంగమించి శేషాచల పర్వతాలను తాకుతూ ఉత్తరవాహినిగా ప్రవహిస్తోంది. శ్రీకాళహస్తి క్షేత్రాన్ని తాకుతూ ముందుకు సాగుతోంది. తూపులపాళెం సమీపంలో సముద్రంలో సంగమిస్తోంది.

ఆరోగ్య సంరక్షకుడు మృత్యుంజయుడు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిష్ఠితమైన ఒక్కో శివలింగం ఒక్కో ప్రాశస్త్యాన్ని తెలియజేస్తోంది. స్వయంభు శ్రీకాళహస్తీశ్వరాలయ లింగం తర్వాత అంతటి ప్రఖ్యాతమైన శివలింగంగా మృత్యుంజయ శివలింగం గుర్తింపు పొందింది.

మృత్యుంజయ శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

పెరుగుతున్న ఆదరణ

ముక్కంటి ఆలయంలో పోటుకు సమీపంలో కొలువుదీరిన శ్రీమృత్యుంజయ శివలింగ అభిషేకాలకు ఆదరణ పెరుగుతోంది. కరోనా విస్తృతం కాకముందు ఇక్కడి శివలింగానికి అప్పుడప్పుడు అభిషేకాలు జరిపేవారు. కరోనా సమయంలో పరోక్ష సేవ ద్వారా భక్తులు ఇక్కడి శివలింగానికి నిత్యం అభిషేకాలు చేయించడంతో ఈ ఆర్జిత సేవకు భక్తుల నుంచి ఆదరణ మరింతగా పెరిగింది. దీంతో ఈ అభిషేకాన్ని నిత్యాభిషేక ఆర్జిత సేవగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

సేవ: మృత్యుంజయ శివలింగాభిషేకం
టికెట్ ధర: రూ.వెయ్యి
ప్రవేశం: ఇద్దరికి
నిర్వహణ: రోజూ 9 గంటలకు

సేవాఫలం: ఎక్కువ మంది ఆరోగ్యసిద్ధి కోసం అభిషేకాలు జరిపిస్తారు. ఆదరణ దృష్ట్యా ప్రస్తుతం ఈ సేవా టికెట్‌ను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు. అభిషేకజలం, విభూది, చందనాలను భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీవారి ఆలయం ఎదుట ప్రభుత్వ విప్ గణబాబు కుటుంబం

ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి తదితరులు

తిరుమల: శ్రీవారిని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి మూలమూర్తిని ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, గాయని డాక్టర్ పద్మశ్రీ శోభారాజు దర్శించుకున్నారు. ప్రముఖులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అపరిష్కృత అర్జీలపై తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1100ను సంప్రదించవచ్చని తెలిపారు.

పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కార్యాలయం ఆదివారం ప్రకటనలో తెలిపింది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భద్రత, బందోబస్తు విధుల్లో పోలీసులు ఉన్నందున రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అత్యవసర ఫిర్యాదులను సమీప పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని అందులో కోరారు.

గజవాహనంపై ఊరేగిన శ్రీపద్మావతీ అమ్మవారు

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారు ఆదివారం రాత్రి గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. జన్మనక్షత్రం ఉత్తరాషాఢను పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అలంకార శోభితురాలైన అమ్మవారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గజవాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో భక్తులకు సాక్షాత్కరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మంగళహారతులు పట్టారు. డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ సురేష్‌బాబు, రమేష్, మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తిరుమలలో క్షేత్రపాలకుడికి వేడుకగా అభిషేకం

రుద్రుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, న్యూస్‌టుడే: గోగర్భం సమీపంలోని రుద్రుని రూపమైన క్షేత్రపాలకునికి ఆదివారం వేడుకగా అభిషేకం జరిగింది. తిరుమల క్షేత్రానికి పాలకునిగా ఉన్న రుద్రునికి మహాశివరాత్రి సందర్భంగా ఏటా అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుంచి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు క్షేత్రపాలకుని శిలవద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు తదితర ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. తరువాత నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. రింగురోడ్డుకు సమీపంలోని నాగతీర్థంలో శివరాత్రి వేడుక నిర్వహించారు.

కపిలతీర్థంలో భక్తుల కష్టాలు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం శ్రీ కపిలేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఏర్పాట్లలో లోపాలు స్పష్టంగా కనిపించాయి. అయితే శ్రీ కపిలేశ్వర స్వామి, శ్రీ కామాక్షి అమ్మవారిని దర్శించుకునేందుకు బయటకు వచ్చే మార్గం ద్వారా కొందరు ప్రముఖులు, వీఐపీలు, అతిథులను అనుమతించిన సమయంలో సామాన్యులు అవస్థలు పడ్డారు. కొందరి సిఫార్సుతో భక్తులను అనుమతించడంతో తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. దీంతోపాటు పాదరక్షలు భద్రపరిచే కేంద్రాలు లేకపోవడంతో భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

ఏదైనా.. ఎక్కడికైనా..!

- పార్సిల్ సర్వీసుల్లో నిషిద్ధ వస్తువుల తరలింపు
- పర్యవేక్షించాల్సిన శాఖల నిఘా వైఫల్యం

ఔషధాల అక్రమ రవాణా, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం, సీఐ శ్రీనివాసులు (పాతచిత్రం)

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మత్తు కలిగించడమే కాకుండా అతిగా తీసుకుంటే ఆరోగ్యానికి హానికరమైన ఔషధాలు, సిరప్‌లు ఆన్‌లైన్ కార్గోలో జిల్లాకు యథేచ్ఛగా తిరుపతికి చేరాయి. ఒక్కరోజు కాదు.. సుమారు మూడువేల మందు బిళ్లలు కలిగిన 33 బాక్సులు అనంతపురం నుంచి తాడిపత్రి మీదుగా తిరుపతికి చేరాయి. వాటిని డిస్పోజబుల్ లో కలిగించి మత్తు సూదులుగా తయారు చేసి యువతను బానిసలుగా మార్చుతున్న ఓ ముఠా బాగోతం వెలుగులోకి వచ్చింది.

* దీపావళి టపాకాయలను తమిళనాడు నుంచి ఎలాంటి పన్నులు చెల్లించకుండా పార్సిల్ సర్వీసుల్లో జిల్లాకు తరలిస్తున్నారు. వ్యాపారుల అంతర్గత పోరుతో అందిన రహస్య సమాచారం మేరకు పోలీసులు వెళ్లి గుట్టురట్టు చేశారు. ప్రమాదకర పేలుడు పదార్థాలు కూడా పార్సిల్ సర్వీసులో తరలిస్తున్నా పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం.

నిషేధిత.. పన్ను చెల్లించని వస్తువులు పార్సిల్ సర్వీసులో యథేచ్ఛగా పుణ్యక్షేత్రం తిరుపతి జిల్లాకు తరలివస్తున్నాయి. నేరుగా తీసుకొస్తే దొరికిపోతామనే భయంతో ఏదో చిరునామా, స్టేషన్ పేరుతో వాటిని గమ్యస్థానానికి చేరుస్తున్నారు. అక్రమ మార్గంలో వచ్చేవాటిని దుర్వినియోగం చేస్తూ పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్టీసీ కార్గో, గుర్తింపు లేని కొరియర్, ప్రైవేట్ ట్రావెల్ సర్వీసులు, ఇంకొన్ని పార్సిల్ సర్వీసులను వేదికగా చేసుకుని ఈ అక్రమ దందా సాగిస్తుండగా ఏశాఖ దృష్టి సారించడం లేదు.

నిఘా పెట్టని శాఖలు

నిషేధిత వస్తువులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా సాగుతుండడం తెలిసినా పలు శాఖలు నిఘా పెట్టడం లేదు. వాణిజ్య పన్నుల శాఖ అప్పుడప్పుడు రికార్డులు పరిశీలించి పన్ను చెల్లింపు గురించి మాత్రమే ప్రశ్నిస్తోంది. స్టేషన్ పేరుతో ఎలాంటి వస్తువులు వస్తున్నాయి.. తగిన పన్ను చెల్లించారా? లేదా? అనే కోణంలో పర్యవేక్షణ లేకపోయింది. మరోవైపు ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సులు పన్ను చెల్లించాయా? లేదా? అని మాత్రమే రవాణా శాఖ పరిశీలిస్తోంది. అందులో ఎలాంటి వస్తువులు తరలిపోతున్నాయి.. అనుమతుల మాటేమిటి వంటివి చూడటం లేదు. రహస్య సమాచారం.. ఫిర్యాదు ఉంటేనే పోలీసుశాఖ స్పందిస్తోంది. దీంతో వ్యాపార.. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి జిల్లాలో అక్రమ రవాణా స్వేచ్ఛగా జరుగుతోంది.

చెప్పింది రాసుకుని.. పంపడమే

పార్సిల్, కొరియర్ సర్వీసులు నిబంధనలను విస్మరిస్తున్నాయి. పార్సిల్ తీసుకొచ్చి.. ఏ చిరునామాకు పంపాలో చెప్పి తగిన సొమ్ము చెల్లిస్తే చాలు అంగీకరిస్తున్నారు. అందులో నిషేధిత వస్తువులు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలు వంటివి ఉంటున్నా పట్టించుకోవడం లేదు. వ్యాపారం వస్తే చాలనే ఆలోచనతో చెప్పింది రాసుకుని కొందరు పంపుతున్నారు.. మరికొన్ని ప్రైవేట్ సర్వీసులు ఎలాంటి రికార్డులు నిర్వహించడం లేదు. ప్రయాణికులను తరలించే ప్రైవేట్ ట్రావెల్స్‌లోనూ ఈ అక్రమ రవాణా సాగుతోంది. కార్గో అనుమతులు లేకపోయినా దూరప్రాంతాల నుంచి తరలిస్తున్నారు. భారీ, మినీ వాహనాల్లో సమీపంలోని పక్క రాష్ట్రాల నుంచి వస్తువులను జిల్లాకు తీసుకొస్తున్నారు.

ముఖ్యక్షేత్రంలో పర్యవేక్షణ అవసరం: ప్రపంచ గుర్తింపు కలిగిన పుణ్యక్షేత్రం తిరుపతికి ఎలాంటి వస్తువులు వస్తున్నాయనే పర్యవేక్షణ అవసరం. టపాకాయల తరహాలో పేలుడు పదార్థాలు, డ్రోన్లు వంటివి అక్రమంగా తరలించే అవకాశం లేకపోలేదు. అన్ని శాఖలను సమన్వయం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది.

పైకప్పు నిర్మాణంతో ప్రమాదం తప్పించారు

నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో ఐతేపల్లికి వెళ్లే మార్గంలో కల్వర్టుపై పైకప్పు ఏర్పాటు చేశారు. ఈనెల 13న 'ఈనాడు'లో 'జాతీయ ప్రమాద రహదారి' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి జాతీయ రహదారి అధికారులు స్పందించారు. **–ఈనాడు, తిరుపతి**

స్పందనకు వందనం

వీధి దీపానికి సీసీ దిమ్మె ఏర్పాటు

తిరుమల, న్యూస్‌టుడే: భక్తులు భారీగా సంచరించే హెచ్‌టీ షాపింగ్ వద్ద వీధి దీపం స్తంభానికి సీసీ దిమ్మెను ఏర్పాటు చేశారు. దిమ్మె పగిలిపోయి ప్రమాదకరంగా ఉండటంపై 'ఈనాడు'లో ఈనెల13 చిత్ర కథనం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించారు.

విజిలెన్స్ తనిఖీలతో రూ.75 లక్షలు ఆదాయం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో మార్కెటింగ్ శాఖకు సుమారు రూ.75 లక్షల ఆదాయం సమకూరిందని ఆ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. చెక్‌పోస్టుల్లో అక్రమాల అడ్డుకట్ట, పంట ఉత్పత్తుల నుంచి వంద శాతం సెస్ వసూళ్లకు నవంబరు నెల నుంచి మూడు జిల్లాల్లో ప్రత్యేక విజిలెన్స్ అధికార బృందాలను ఏర్పాటు చేశామన్నారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి.. అక్రమదారుల నుంచి సెస్ వసూళ్లు చేపడుతున్నారని చెప్పారు. తనిఖీల ద్వారా చిత్తూరు జిల్లాలో రూ.20 లక్షలు, తిరుపతి జిల్లాలో 30 లక్షలు, అన్నమయ్య జిల్లాలో రూ.25లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. మార్కెట్ కమిటీలు నిర్దేశిత ఆదాయ లక్ష్యాలను అధిగమించేందుకు దృష్టి సారించాలని కమిటీల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలిపారు.

సహాయకులకు అధునాతన వసతి

తిరుపతి రుయా ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం రాయలసీమ జిల్లాల నుంచి రోగులు, రోగుల సహాయకులు వివిధ సమస్యలతో చికిత్స కోసం వస్తుంటారు. వారికోసం ప్రత్యేకంగా విశ్రాంతి గది లేకపోవడంతో ఎండ, వాన, చలికి అల్లాడిపోతున్నారు. ఇలాంటి వారి కోసం దాతల సాయంతో అత్యవసర విభాగం పక్కన సహాయకుల విశ్రాంతి గది ఏర్పాటు చేశారు. 32 పడకలు అందుబాటులో ఉంచారు. గది పక్కనే వేచిఉండు రేకులషెడ్డు నిర్మాణం పూర్తిచేశారు. అంత సవ్యంగా జరిగితే ఈ మాసంలోనే అందుబాటులోకి రానుంది. **- ఈనాడు, తిరుపతి**

దాతలు నిర్మించిన విశ్రాంతిగది.. లోపల ఏర్పాటు చేసిన బెడ్లు

ఎముకల చికిత్సకు బర్డ్ సహకారం

చిన్నారి కాళ్లు పరిశీలిస్తున్న డాక్టర్ గుడారు జగదీష్

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: బర్డ్ వైద్యశాల చిన్నారుల మోకీళ్లు, వెన్నెముక సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆ సంస్థ సంచాలకులు డాక్టర్ గుడారు జగదీష్ పేర్కొన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా ఉలవపాడు సమీపంలోని కరేడులో బర్డ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి సమన్వయం చేశారు. భిన్న సామర్థ్యాలున్న చిన్నారుల ఎముకల సమస్యలకు స్క్రీనింగ్ నిర్వహించారు. 56 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద బర్డ్‌లో ఉచితంగా నిర్వహించడానికి ఎంపిక చేశారు. గ్రామీణ, దూర ప్రాంతాల్లోని చిన్నారుల వద్దకు నాణ్యమైన వైద్యసేవలు చేరాలని డా.గుడారు జగదీష్ అభిప్రాయపడ్డారు. వైద్యులు మునిశంకర్‌రెడ్డి, అరవింద్ శర్మ, యోగానంద్ పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఆకాశవాణి పాత్ర అమోఘం

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఆకాశవాణి పోషిస్తున్న పాత్ర అమోఘమని వ్యవసాయ వర్సిటీ అసోసియేట్ డైరెక్టరేట్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సుమతి పేర్కొన్నారు. ఆదివారం ఎయిర్ బైపాస్‌రోడ్డులోని ఆకాశవాణి కేంద్రంలో రేడియో కిసాన్ దివస్ నిర్వహించి మాట్లాడారు. రైతులు అత్యాధునిక పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రవికుమార్ మాట్లాడుతూ పశుపోషణతో గ్రామీణప్రాంతం ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారని వివరించారు. వ్యవసాయ శాఖ ఏడీ సౌభాగ్యలక్ష్మి, పట్టుపరిశ్రమశాఖ ఏడీ కిశోర్‌నాయక్ మాట్లాడారు. రైతుల సమస్యలను నివృతి చేశారు. వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, ఆకాశవాణి సహాయ సంచాలకులు సుధాకర్‌మోహన్ పాల్గొన్నారు.

గణేష్ మణిరత్నంకు మరో పసిడి

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారుడు తిరుమూరు గణేష్ మణిరత్నం కేరళ రాష్ట్రం కొచ్చిలో నిర్వహిస్తున్న ఎన్‌టీపీసీ మూడో జాతీయ ఆర్చరీ పోటీల్లో జూనియర్ కాంపౌండ్ విభాగంలో పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పలు దేశాల్లో జరిగిన అంతర్జాతీయ ఆర్చరీ పోటీల్లో పాల్గొని ఇప్పటి వరకు 12 పసిడి పతకాలు సాధించాడు. గతనెల ఫ్రాన్స్‌లో నిమ్స్ కేంద్రంగా జరిగిన అంతర్జాతీయ పోటీల్లోనూ పసిడి పతకం సాధించాడు. తాజాగా మరో పతకం సాధించడంపట్ల తల్లిదండ్రులు తిరుమూరు సుప్రియ, హరిప్రసాద్, పలువురు క్రీడా కారులు హర్షం వ్యక్తం చేశారు.

విజయహాసంతో గణేష్ మణిరత్నం

'అలస్యం'పై అసంతృప్తి గళం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం ముక్కంటి ఆలయం తెరిచే సమయానికి అన్ని ప్రవేశ మార్గాల్లో క్యూలైన్లు నిండిపోయాయి. వారంతం, అందులోనూ వరుస సెలవుల దృష్ట్యా లక్ష మందికి పైగా వాయులింగేశ్వరుని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు భావిస్తున్నారు. దర్శన టికెట్ల ద్వారా రూ.55 లక్షలు ఆదాయం సమకూరింది.

సిఫార్సులకే ప్రాధాన్యం

రూ.500, రూ.200 టికెట్లు పొందిన భక్తులు ఎక్కువ సమయం నిరీక్షించారు. తమను అనుమతించకుండా సిఫార్సు దర్శనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ పలువురు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కొందరైతే ఈవో, ఛైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దర్శనాల అనుమతికి సంబంధించి అమ్మవారి ఆలయం వద్ద ఇద్దరు సీఐలు వాదులాడుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని లోనికి అనుమతించకపోవడంతో పోలీసులు, ఆలయ అధికారులతో ఆయన వాగ్వాదానికి దిగారు.

సర్వదర్శనం క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

హత్య కేసులో నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ కొండారెడ్డి, చిత్రంలో ఎస్.ఐ సంజీవరెడ్డి, సిబ్బంది

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు నెహ్రూరోడ్డులోని నాగులకట్ట వీధిలో ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను ఆదివారం మూడో పట్టణ ఠాణాలో సీఐ కొండారెడ్డి వెల్లడించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ఎన్జీవోకాలనీకి చెందిన గువ్వల సుబ్రహ్మణ్యం(33) కొన్నేళ్ల కిందట రాజుపాళెం మండలం కొర్రపాడుకు చెందిన మహిళతో వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు సంతానం. సుబ్రహ్మణ్యం కార్పెంటర్, డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈ నేపథ్యంలో అతను కొన్నిరోజులుగా ప్రొద్దుటూరులోనే ఉంటూ పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యానికి వినయ్‌తో మద్యం దుకాణం వద్ద పరిచయం ఏర్పడింది. ఇటీవల ఇద్దరు మద్యం తాగుతూ గొడవ పడ్డారు. సుబ్రహ్మణ్యం వినయ్‌ని కొట్టాడు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకున్న వినయ్.. ఈ నెల 13న రాత్రి మద్యం తాగేందుకు సుబ్రహ్మణ్యాన్ని తన ఇంటికి తీసుకెళ్లి కత్తితో పొడిచి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఎస్.ఐ సంజీవరెడ్డి, ఏఎస్ఐ సుబ్బన్న, సిబ్బంది పాల్గొన్నారు.

తెప్ప మునిగి బీటెక్ విద్యార్థి మృతి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: మిత్రులతో కలిసి సరదాగా చెరువులో తెప్పపై షికారు చేస్తుండగా శశి(30) అనే యువకుడు మృతి చెందాడు. ఘటన ఆదివారం పునబాక చెరువులో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి పట్టణం కైలాసగిరి కాలనీకి చెందిన బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శశి శివాలయం దగ్గర ఉత్సవాల అనంతరం సమీపంలోని చెరువులో చేపలకు మేత వేయడానికి ఉంచిన చిన్నపాటి తెప్పపై ఆరుగురు మిత్రులతో కలిసి వెళ్లాడు. తెప్ప మునిగిపోవడంతో మిగిలిన ఆరుగురు మిత్రులు ఈత రావడంతో సురక్షితంగా ఒడ్డుకు చేరారు. శశికి గల్లంతవగా స్థానికులు గుర్తించి గట్టుకు చేర్చే సరికి అప్పటికే మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు శివరాత్రి రోజు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరి దుర్మరణం



చంద్రగిరి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్ని ఇద్దరు ద్విచక్ర వాహనదారులు మృతిచెందారు. ఈ ఘటన జాతీయ రహదారిలో ఐతేపల్లి సమీపంలోని సర్వీసురోడ్డులో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పనపాకం పంచాయతీ బోడిగుట్ట వారిపల్లికి చెందిన **భూపాల్‌రెడ్డి** (35) కాశిపెంట్లలోని హెరిటేజ్ కర్మాగారంలో విధులు ముగించుకుని వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో చంద్రగిరికి వెళ్తున్నారు. యల్లంపల్లికి చెందిన మల్లికార్జున (24) ఓ మహిళ, మూడేళ్ల బాబుతో చిత్తూరు వెపు వెళ్తున్నారు. ఈక్రమంలో ఐతేపల్లి సమీపంలో సర్వీసు రోడ్డుపైన వీరి ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో మల్లికార్జున ఘటనాస్థలంలోనే మరణించారు. తీవ్రంగా గాయపడ్డ భూపాల్‌రెడ్డిని స్థానికులు చంద్రగిరి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వారి మృతదేహాలను ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. సర్వీసు రోడ్డులో అతివేగంగా వాహనాలు నడపటంతోనే ప్రమాద తీవ్రత పెరిగిందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ప్రమాదంలో మహిళ, మూడేళ్ల బాబుకు స్వల్పగాయాలు కావడంతో రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

EENADU Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

నేషనల్ హైవేలకు అనుకొని తిరుపతిలో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ అన్ని సదుపాయాలతో తక్కువ ధరకే, డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్ ఫోన్ : 9966262221/ 9502774175.

1.తిరుపతి - సి.రామాపురం జైన్ మందిరం వద్ద 2.రేణిగుంట యోగానంద కాలేజీకి ప్రక్కన 3.చంద్రగిరిటౌన్‌లో ఉగ్రప్రత్యుంగరా అమ్మవారి గుడి దగ్గర 100 feet రోడ్డు ఆనుకొని ఉన్న వెంచర్స్‌లో తుడా అప్రూవల్స్‌తో హౌస్/ విల్లా కట్టుకునే ప్లాట్లు అమ్మబడును. 9505502346.

JOBS

WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

Wanted Supervisors for Civil and Electrical Works. Contact: 90005 55035.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్ పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age: 30 to 65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 76750 95860.

గూడ్స్ ఆటో డ్రైవర్ -1 (టౌన్‌లో డెలివరి చేయుటకు) కావలెను. అనుభవం, లైసెన్స్, బ్యాడ్జ్ కలిగి ఉండవలెను. సంప్రదించ గలరు. ✆ 97034 02722

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

అయోధ్య సొసైటి, తిరుపతికి రికవరీ ఆఫీసర్స్ - 4 కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. Cont: 78427 30185, 70136 98363.

ప్రముఖ విద్యా సంస్థకు లేడీ టెలీకాలర్స్, కౌన్సిలర్స్ & ఫీల్డ్ అనుభవం కల్గిన PROలు కావలెను. ఆకర్షణీయమైన జీతం కల్పించబడును. ✆ 90320 30124.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మదనపల్లిలో పని చేయుటకు. 10 Hr డ్యూటీ జీతం: 11,000/-. ✆ 72880 04466.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా కల్యాణం

పాకాల, న్యూస్‌టుడే: స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భారతంమిట్టలో కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద స్వామి వారితో శ్రీ గోవిందమాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం 9 గంటలకు శివారాధన, అభిషేకం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, రాత్రి భజనలు నిర్వహించారు.

బ్రహ్మర్షి ఆశ్రమంలో పలువురు ప్రముఖులు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలోని సి.రామాపురం సమీపంలోని శ్రీ బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమంలో ఆదివారం మహా శివరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల్లో భాగంగా స్ఫటిక లింగానికి మధ్యప్రదేశ్ మంత్రి విశ్వాస్ సారంగ్, మహారాష్ట్ర మంత్రి రాధాకృష్ణ పాటిల్, సూరత్ ఎంపీ ముఖేష్ దయాల్, తిరుపతి ఎంపీ గురుమూర్తి, తిరుపతి భాజపా నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి గురువానంద గురూజీ ఆశీస్సులు పొందారు. ప్రముఖులకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

నగరపాలిక: 80080 20003, తిరుపతి (విద్య, తితిదే): 93936 28003
తిరుచానూరు: 80082 30008, మంగళం-జీవకోన: 80080 40005
తిరుపతి గ్రామీణ: 80085 74564, చంద్రగిరి: 80085 74561

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే:

సమస్య: స్కావెంజర్స్ కాలనీలోని దుకాణం వద్ద కోళ్ల మాంసం, వ్యర్థాలను మురుగునీటి కాలువలో పడేస్తున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నాం. **- స్థానికులు, స్కావెంజర్స్ కాలనీ**

సమాధానం: చికెన్ దుకాణం యజమానిని హెచ్చరించి సమస్యను పరిష్కరిస్తాం. **- డా.యువఅన్వేష్, నగరపాలిక వైద్యాధికారి**

సమస్య: లీలామహల్ రోడ్డు నుంచి రైల్వేకాలనీకి వెళ్లే మార్గంలో కంకర తేలడంతో పాటు అక్కడక్కడ గుంతలు ఉండడంతో ద్విచక్ర వాహనాల్లో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంటుంది. స్థానికులు అనేకమార్లు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేదు. **- విష్ణుకుమార్, రైల్వే కాలనీ.**

సమాధానం: నగరంలో గుంతలను పూడ్చే ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలో పరిష్కారం చూపుతాం. **- శ్యాంసుందర్, ఎస్‌ఈ**

తిరుచానూరు, న్యూస్‌టుడే

సమస్య: తిరుచానూరు పంచాయతీ కొత్తపాళ్యం లేఅవుట్‌లో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో నివాసాల మధ్య మురుగు చేరి దుర్గంధభరితంగా మారుతోంది. మురుగునీరు రోడ్డుపై చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. **- సచ్చిదానందమూర్తి, స్థానికుడు**

సమాధానం : కొత్తపాళ్యం లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. నివాసాల మధ్య మురుగునీరు నిల్వ లేకుండా సిబ్బందితో ఎప్పటికప్పుడు తొలగిస్తాం. **- మణి, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి - చంద్రగిరి, న్యూస్‌టుడే**

సమస్య: చంద్రగిరి పంచాయతీ కొత్తపేట చర్చివీధిలో రోడ్డు పక్కన వారం రోజులుగా చెత్తాచెదారం నిండి ఉంది. **- గురునాథం, స్థానికుడు**

సమాధానం: చెత్తాచెదారం తొలగించి దోమల నివారణకు చర్యలు చేపడతాం. **- చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో**

స్పందనకు వందనం

మద్యం సీసాల తొలగింపు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: ముత్యాలరెడ్డిపల్లిలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో పెద్దఎత్తున పడేసిన మందుసీసాలను అధికారులు తొలగించారు. రాత్రి వేళల్లో కొందరు మద్యం తాగి సీసాలు అక్కడే వేస్తున్నారు. దీనిపై 'ఈనాడు'లో ఇటీవల మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ కార్యాలయం శీర్షికన వార్త వెలువడింది.

మరమ్మతులు చేశారు

ఈనాడు కథనానికి స్పందన

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని ధనలక్ష్మీనగర్‌లో మ్యాన్‌హోల్‌కు అధికారులు మరమ్మతులు చేశారు. రాయలచెరువు ప్రధాన రోడ్డుకు పక్కనే మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగుతోంది. ఈ కారణంగా వాహన చోదకులు, స్థానికులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడ్డారు. సమస్యపై బుధవారం ఈనాడులో 'అరకొర మరమ్మతులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేశారు.

పోలీసింగ్ ఎక్కడ..?

☛ ఏడు నెలలకే నీరుగారిన లక్ష్యం
☛ జీవకోనలో అవుట్ పోస్టు మూత?

మూతపడిన జీవకోనలోని పోలీస్, ఫారెస్ట్ అవుట్ పోస్ట్

ఇదీ సంగతి.. నగరంలో జీవకోనకు అధిక ప్రాధాన్యం ఉంది. ఒకప్పుడు రాజీవనగర్ పంచాయతీగా ఉండి..నగరపాలక సంస్థలోకి విలీనమైంది. 46, 47, 48, 49, 50 డివిజన్ల పరిధిలో విస్తరించింది. నగరంలోనే అతిపెద్ద మురికివాడ. వలసదారులకు ఆశ్రయం ఇస్తుంది. దీంతో నిత్యం గంజాయి బ్యాచ్‌ల గొడవలు, అసాంఘిక కార్యకలాపాలు, అలజడులు, అల్లరిమూకల దాడులు, హత్యలు సైతం జరిగాయి. వైకాపా పాలనలో గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా, ఎర్రచందనం అక్రమ రవాణాకు కేంద్రంగా మారిపోయింది. దీంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. తమకు భద్రత కల్పించాలని, తమ ప్రాంతాన్ని సురక్షితంగా మార్చాలని పోలీసులను, ప్రజా ప్రతినిధులను వేడుకున్నారు.

హామీలు నెరవేర్చినా..

ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఆయన ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష నెరవేర్చేందుకు పోలీస్, అటవీశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ చేసేలా చర్యలు చేపడతానని, గంజాయి రహితంగా ప్రాంతంగా చేసేందుకు పోలీస్-అటవీ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఆరణి హామీ ఇచ్చారు. అలానే రాజీవ్‌నగర్ పంచాయతీ మాజీ సర్పంచి అన్నా రామకృష్ణ రూ.4 లక్షలు విరాళంగా అందజేసి, జీవకోన శ్రీజీవలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో భవనాన్ని నిర్మించారు. 2025 ఆగస్టు 10న అవుట్‌పోస్ట్‌ను ప్రారంభించారు.

'విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా జీవకోనను ప్రశాంతంగా ఉంచుతాం. అందుకే ఇక్కడి ప్రజల విన్నపం మేరకు పోలీస్, అటవీ శాఖ సంయుక్త పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నాం. పోలీస్-ఫారెస్ట్ అవుట్ పోస్టు ద్వారా ఎర్రచందనం అక్రమ రవాణా అడ్డుకోవడమే కాకుండా, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు బ్రేకులు వేస్తాం. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతాం'. ఇదీ ఏడు నెలల కిందట అవుట్ పోస్టును ప్రారంభిస్తూ తిరుపతి శాసన సభ్యుడు ఆరణి శ్రీనివాసులు, అప్పటి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జిల్లా అటవీ అధికారి వివేక్ ప్రజలకు ఇచ్చిన భరోసా. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడంలేదు.

న్యూస్‌టుడే, తిరుపతి(జీవకోన)

గదికి తాళాలు

సంయుక్త సిబ్బంది కొన్ని నెలలపాటు విధులు నిర్వర్తించారు. ఆపై క్రమంగా సిబ్బంది రావడమే మానేశారు. ఎప్పుడు చూసిన అవుట్ పోస్ట్‌కు తాళాలు వేసి ఉంచుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయంలో మాత్రం బ్లూకోట్ సిబ్బంది వచ్చి కొంత సమయం గడిపి వెళ్లిపోతున్నారని అంటున్నారు. సమస్యలు వచ్చినప్పుడు ఫిర్యాదు చేద్దామన్నా పోలీసులు అందుబాటులో ఉండడం లేదని అంటున్నారు. ఏడు నెలలకే అవుట్ పోస్ట్ సేవలకు మంగళం పాడేశారని అంటున్నారు. ప్రజల ఆవేదనలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఔట్ పోస్టుకు ఎంచక్కా తాళాలు వేసేశారు.

శ్రీపరాశరేశ్వరస్వామికి పట్టువస్త్రాల సమర్పణ

తిరుచానూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుచానూరులోని శ్రీపరాశరేశ్వరస్వామికి ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్ద ఆయనకు ఛైర్మన్ నీలకంఠం, తెదేపా నాయకులు ఈశ్వర్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, సాయిరాయల్, మధు, ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. ✦ **యర్రావారిపాలెం:** తలకోన సిద్దేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని దంపతులు తలకోనకు విచ్చేసి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి ఆలయ అధికారులు ధర్మకర్తలు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. బాలాలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నెరబైలుగ్రామం తిమ్మాడివాండ్ల పల్లి సమీపంలోని గుడిమిట్ట శివాలయం, ఉదయమాణిక్యం శివాలయాన్ని ఎమ్మెల్యే దంపతులు దర్శించుకున్నారు.

ఆలయంలోకి పట్టువస్త్రాలతో వెళ్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

శేషాచల లింగేశ్వరస్వామి సేవలో తుడా ఛైర్మన్

పూజల్లో పాల్గొన్న దివాకర్ రెడ్డి

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి కందులవారి పల్లి పంచాయతీ పరిధిలోని శేషాచల లింగేశ్వర స్వామి వారి ఆలయాన్ని ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొబ్బ కృష్ణకుమారి, చిత్ర కేశవులు నాయుడు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భవుని కల్యాణం.. భక్తుల పరవశం

చిగురువాడ: అలంకరణలో పార్వతీ పరమేశ్వరులు

చంద్రగిరి: శ్యామలాంబ సమేత మల్లేశ్వరస్వామి

నరశింగాపురంలో..

పాకాల: సూరినేనిపల్లిలో శ్రీగురప్పస్వామి

రామచంద్రాపురం: ఉత్సవమూర్తుల ఊరేగింపు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం చిగురువాడ స్వర్ణముఖి పార్వతీపరమేశ్వరుల ఆలయంలో వేడుకలు జరిగాయి. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త, ఎస్వీయూ డిప్యూటీ రిజిస్ట్రార్ పరంధామయ్య పాల్గొన్నారు. **యర్రావారిపాలెం:** పండగ రోజు తలకోనకి భక్తులు పోటెత్తారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. **చంద్రగిరి:** మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తొండవాడ శ్రీఅగస్త్యేశ్వరాలయం, చంద్రగిరి శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో పూజలు జరిగాయి. **ముత్యాలరెడ్డిపల్లి:** తితిదే ప్లాట్లలోని గౌరీశంకరాలయంలో, ఎల్‌ఎస్‌నగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. **పాకాల:** సూరినేనిపల్లి శ్రీ గురప్ప స్వామివారిని ఎమ్మెల్యే పులివర్తినాని దర్శించుకున్నారు. **రామచంద్రాపురం:** రాయలచెరువు భవానీ జలకంఠేశ్వర ఆలయం, జన్మస్థల పరమేశ్వర ఆలయం, బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయంలో పూజలు జరిగాయి. **చంద్రగిరి గ్రామీణ:** కందులవారిపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీ శేషాచల లింగేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు జరిగాయి.

కందలవారిపల్లెలో.. ఆలయంలో భక్తుల రద్దీ

ఘనంగా పుట్టినరోజు వేడుకలు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలం తెదేపా మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు పెరుమాళ్లపల్లిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఎమ్మెల్యే పులివర్తినాని, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి ఈశ్వర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం కేకు కోసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అమిలినేని మధు, మధుశేఖర్, శ్రీధర్‌నాయుడు, సుధాకర్, శోమశేఖర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మిస్టర్ రాయలసీమ పోటీలు

విజేతలతో శాప్ ఛైర్మన్ రవి నాయుడు, మహేష్ యాదవ్, గిరిధర్, శివప్రసాద్

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: మిస్టర్ రాయలసీమ బాడీబిల్డింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. తిరుపతిలోని ప్రభుత్వ యువజన వసతిగృహంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు జిల్లాలకు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. ఉత్తమ ప్రదర్శనతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో గెలుపొందిన విజేతలకు శాప్ ఛైర్మన్ రవి నాయుడు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ కుప్పాల గిరిధర్ కుమార్ నగదు, ట్రోఫీలు ప్రదానం చేశారు.

బడ్జెట్‌లో నిధుల కేటాయింపులపై హర్షం

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా సెలూన్ షాపులకు విద్యుత్తు రాయితీ అమలు కోసం రూ. 50 కోట్లు కేటాయించడంపై రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చి వారి సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేయడం కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని స్పష్టం చేశారు.

తిప్పారెడ్డికి ఇండో- థాయ్ అవార్డు

అవార్డు అందుకుంటున్న డాక్టర్ తిప్పారెడ్డి

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తిరుపతిలోని డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ లా ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి ఇండో- థాయ్ ఎడ్యుకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు - 2026ను ఆదివారం అందుకున్నారు. ఈ అవార్డును గ్లోబల్ రీసెర్చ్ కాన్ఫరెన్స్ ఫోరం (జీఆర్‌సీఎఫ్) అంతర్జాతీయ అకడమిక్ భాగస్వామి సంస్థలతో కలిసి ప్రదానం చేసింది. ఆయన బ్యాంకాక్‌లో అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు అభినందనలు తెలిపారు. ✦ తిరువనంతపురంలో కేరళ అకాడమీ నిర్వహించిన 'అకాడమీ మూట్ కోర్టు పోటీల్లో కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎన్.యశ్వంత్ వర్మ ఉత్తమ మూటర్‌గా నిలిచారు.

నోరు తెరిచిన కాలువ

తిరుపతి లక్ష్మీపురం కూడలి నుంచి ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే మార్గంలో మురుగు కాలువపై పైకప్పు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. నిత్యం ఈ మార్గంలో విద్యార్థులు, నడకదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి పైకప్పు ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. **-ఈనాడు, తిరుపతి**

వర్షంనీరు కాదు.. ఎండమావి

రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుంది. నాయుడుపేట - పూతలపట్టు జాతీయరహదారిలో తొండవాడ సమీపంలో తారురోడ్డుపై వర్షంనీటిని తలపిస్తూ ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఎండమావులు కన్పించాయి. ఇటువైపుగా వెళ్లే జనాలు, వాహన చోదకులు ఇది చూసి శివరాత్రి వెళ్లకముందే ఎండలు పెరిగాయి అంటూ.. చర్చించుకుంటూ కన్పించారు. **-ఈనాడు, తిరుపతి**

నిత్యం అందుబాటులో

శ్రీవారి ఆలయ పరిసరాల్లో శునకాలు, వరాహాలు వంటి వాటితో భక్తులు ఇబ్బంది పడకుండా తితిదే జంతువులను పట్టుకునేందుకు బ్యాటరీ ఆపరేటెడ్ వాహనాలను ప్రారంభించింది. ఈ వాహనాల్లో జంతువులను బంధించేందుకు శిక్షణ పొందిన నిపుణులు అందుబాటులో ఉంటారు. వీరు నాలుగు మాడవీధుల్లో తిరుగుతూ జంతువులు ఆలయ పరిసరాల్లో రాకుండా పర్యవేక్షిస్తుంటారు. ప్రవేశించిన వాటిని పట్టుకుని ఇతర ప్రాంతాల్లో వదిలిపెడతారు. **- న్యూస్‌టుడే, తిరుమల**

ఇలా ఉంటే నీటిని ఎలా తాగాలి..?

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కూడలిలో ఏర్పాటు చేసిన తాగునీటి విద్యుత్తు పంపు నుంచి నిత్యం నీరు కారణంతో పాచి పట్టి అపరిశుభ్రంగా మారింది. ఇక్కడ బస్సుల కోసం వేచి ఉండే ప్రజలు కుళాయి నీరు తాగేవారు. పాచి పట్టి అపరిశుభ్రంగా ఉండడంతో అటువైపు రావడం లేదు. అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

వందేళ్ల చరిత్రకు చిల్లులు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఉద్యానవనాల్లో సరైన వసతులు లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు. మరమ్మతులకు గురైన పరికరాల వల్ల ఎప్పుడు ఎలాంటి ముప్పు వస్తుందో తెలియక బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. స్థానిక మంచాల వీధిలోని పార్కుకు వందేళ్ల చరిత్ర ఉంది. నగరంలో ఏర్పడిన మొదటి పార్కుల్లో ఇదొకటి. అయితే క్రీడా పరికరాలు విరిగిపోవడం, చిల్లులు పడటంతో చిన్నారులు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల పార్కు ప్రహరీ, ఇనుపగ్రిల్స్‌కు రంగుల అద్దారు. బయటకు చూడముచ్చటగా కనిపిస్తున్నా.. లోపలికి వెళ్తే క్రీడా పరికరాలు పనికి రాక ఊసురుమంటూ బయటకు రావాల్సిన పరిస్థితి. రెండేళ్లుగా ఊయల, తోపుడు బల్లలు, రంగుల రాట్నం, వాటర్ ఫౌంటైన్ పనిచేయడం లేదు. కనీసం ఆ ప్రాంత కార్పొరేటర్ అటువైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు వాపోతున్నారు. నగరపాలిక అధికారులు రెండు పర్యాయాలు చూసి మరమ్మతులు చేస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.

శిల్పారామంలో జానపద నృత్య ప్రదర్శనలు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన జానపద నృత్య ప్రదర్శనలు కనువిందు చేశాయి. పీపుల్స్ ఫ్రండ్ వ్యవస్థాపకుడు నాగరాజు, కార్యదర్శి మస్తాన్ బృందం కళాకారుల నృత్య ప్రదర్శనలు జరిగాయి. ఇందులో భాగంగా కళాకారులు చేసిన జానపద, తాండవ నృత్యాలు నగరవాసులను అలరించాయి. ఏవోలు సుధాకర్, ఖాదర్‌వల్లీ, ఏఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తత అవసరం

పాకాల: మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ పుల్లావాండ్లపల్లి శివారు అడవిలో ఆదివారం ఏనుగులు ప్రవేశించాయని అటవీశాఖ అధికారులు స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేశారు. ప్రధానంగా ఇదే పంచాయతీలోని నడింపల్లి, కొండకిందపల్లి, పెరుమాళ్లగుడిపల్లి, దామలచెరువు పంచాయతీ పరిధిలోని మొరవపల్లి, కాకర్లవారిపల్లి ప్రాంతాల రైతులు రాత్రి పూట పొలాలవద్దకు వెళ్లరాదని హెచ్చరించారు.

తిరునగరిలో షూటింగ్ సందడి

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తిరుపతిలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 'శ్రీనివాసమంగాపురం' అనే పేరు ఉండటంతో చిత్రీకరణ తిరుపతి, పరిసర ప్రాంతాల్లో చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం స్థానిక ఎమ్మార్‌పల్లి కూడలిలోని ఓ టిఫిన్ దుకాణం వద్ద ఓ సన్నివేశాన్ని చిత్రీకరించారు. దీంతో స్థానికులు, పాదచారులు ఆసక్తిగా తిలకించారు.

అశ్వవాహనంపై శ్రీమూలస్థానమ్మ విహారం

చంద్రగిరి, న్యూస్‌టుడే: గ్రామదేవత శక్తిస్వరూపిణి శ్రీమూలస్థాన ఎల్లమ్మతల్లి అశ్వవాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారి మూలమూర్తికి, సపరివార దేవతామూర్తులకు విశేష అభిషేకం చేసి అలంకరణ సేవలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

(c) eenadu

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

భక్తులతో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

ఆలయంలో పరిస్థితులపై ఆరా

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లు, దర్శనానికి వెళ్లే భక్తుల వాస్తవ పరిస్థితులను ఎస్పీ సుబ్బరాయుడు ఆరా తీశారు. సర్వదర్శనం క్యూలైన్ల గుండా వెళ్లే పలువురు భక్తులతో మాట్లాడారు. ఇబ్బందులను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. తప్పిపోయిన పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగించడంలో పోలీసులు కీలక పాత్ర పోషించారు.

సుందరీకరణకు అధిక ప్రాధాన్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక పట్టణంగా ఖ్యాతి గడిస్తున్న శ్రీకాళహస్తి పట్టణం సుందరీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పురపాలక సంఘం తరఫున జడ్పీ అతిథి గృహం సమీపంలో ఏర్పాటు చేసిన సెల్ఫీపాయింట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే దంపతులు సెల్ఫీ తీసుకున్నారు. సువర్ణముఖి నది ప్రక్షాళన పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

సువర్ణముఖి నదిపై రామసేతు కొత్త, పాత వంతెనలు

రామసేతు వ్యయం రూ.3.58 లక్షలే..!

సువర్ణముఖి నదిపై నిర్మించిన పురాతన వంతెన రామసేతు. 1926వ జనవరి 31న ప్రారంభించిన ఈ వంతెన నిర్మాణానికి అయిన వ్యయం రూ.3,58,500. అప్పటి వరకు నదిపై వంతెన లేదు. వర్షం వస్తే పట్టణ అవలి ప్రాంత వాళ్లు ఇటు వైపునకు వచ్చే అవకాశం లేదు. అలాంటి పరిస్థితుల్లో 1923 మార్చి 31న వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. దీన్ని పానగల్ సంస్థానాధీశులు, ఒకప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రాజా రామానాయన శంకుస్థాపన చేశారు. మూడేళ్లలో నిర్మించాలనుకొని రెండు నెలలు ముందుగానే వంతెన ప్రారంభించడం విశేషం. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

ధూర్జటి కళా ప్రాంగణంలో పాట పాడుతున్న కోటి

స్వామివారి వేషధారణలో..

శివరాత్రి.. ఆనందధాత్రి..

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సర్వ మంగళకరమైన శివనామస్మరణతో అన్ని శైవాలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయాల వద్ద భక్తుల రద్దీతో పాటు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి పుష్ప, విద్యుద్దీపాల అలంకరణలు అంగరంగ వైభవాన్ని తీసుకువచ్చాయి. భక్తుల పాలిట భూకైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిలో కొలువుదీరిన శివయ్యను దర్శించుకునేందుకు అశేష రీతిలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి తొమ్మిది కాలాల పూజలు విశేషాభిషేకాలు జరిపారు. జాగారం దీక్షతో జాగరణ చేసేందుకు వచ్చిన భక్త కోటి అర్ధరాత్రి ప్రారంభమైన నంది, సింహవాహన సేవలతో చతుర్మాడ వీధులన్నీ పులకించిపోయాయి. సంగీత దర్శకుడు కోటి నేతృత్వంలో ఆధ్యాత్మిక సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది.

బ్రహ్మోత్సవం.. ఆకర్షణీయం..

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ముక్కంటి ఆలయం ఆకర్షణీయంగా సిద్ధమైంది. విశేష రీతిలో పుష్పాలు, ఫలాలు, కూరగాయలతో ఆలయ ఆవరణలో ఏర్పాట్లు విశేష రీతిలో చేపట్టారు. పురవీధుల ఉత్సవం ముందు కేరళ పంచవాయిద్యాలు, ప్రత్యేక వాయిద్య బృందాలు ఆకట్టుకున్నాయి.

భక్తులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన లడ్డూలు

లడ్డూ కావాలా నాయనా..!

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి దర్శనం పూర్తయిన భక్తులకు ఆలయం తరఫున చిన్నలడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు. మహిళలకు ఆలయం తరఫున జాకెట్టు వస్త్రం, గాజులు, పసుపుదారం కానుకగా అందజేశారు.

ముక్కంటి దర్శనార్థం వచ్చిన స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో ఎమ్మెల్యే దంపతులు

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు ఆమెకు వీడ్కోలు పలికారు. ఎమ్మెల్సీ గ్రీష్మ, జిల్లా జడ్జి ఆరుణసారిక, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ పి.ఎస్.నాయుడు, సునీల్ తదితరులు ముక్కంటిని దర్శించుకున్నారు.

నారదపుష్కరిణిలో సిద్ధమైన తెప్పలు

నేడు రథోత్సవం.. తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో మహాశివరాత్రి తరువాత రోజును బ్రహ్మరాత్రిగా పిలుస్తారు. గరళాన్ని మింగి సమస్త లోకాలను సంరక్షించిన సర్వేశ్వరుడి రథానికి బ్రహ్మ సారథిగా విజయోత్సవం నిర్వహించడం రథోత్సవ పరమార్థం. బ్రహ్మరాత్రిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లు జోడు రథాలపై ఊరేగనున్నారు. రాత్రి.. బాబుఅగ్రహారంలోని నారదపుష్కరిణిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తెప్పలపై శ్రీజ్ఞానప్రసూనాంబసమేత సోమస్కందమూర్తి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఈ విశేష ఉత్సవాలకు శ్రీకాళహస్తికి చెందిన గాజుల సత్యనారాయణ, సరస్వతమ్మ దంపతులు, ఏర్పేడు మండలం మాధవమాలకు చెందిన రామచంద్రారెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన జూలుగంటి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం జూలుగంటి సత్యనారాయణశెట్టి, మురళీమోహన్ గుప్త, చంద్రశేఖర్ ఉభయదాతలుగా వ్యవహరించనున్నారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

గుండాలకోనలో దర్శనమిస్తున్న నీలకంఠేశ్వరస్వామి

గుడిమల్లంలో పరశురామేశ్వరస్వామి

పుల్లంపేటలో పర్వతవర్ధనిదేవి

కైలాసకోనలో ప్రత్యేక అలంకరణలో కైలాసనాథేశ్వరస్వామి

వెదళ్లచెరువులో జ్యోతిర్లింగేశ్వరస్వామి

గాజులమండ్యంలో కామాక్షీమాత

నాగలాపురంలో.. నాగలింగేశ్వరుని గ్రామోత్సవం

శివనామ స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

వరదయ్యపాళెంలో వాలీశ్వరుడు..

న్యూస్‌టుడే, బృందం: శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆదివారం శివరాత్రిని పురస్కరించుకుని మూడు నియోజకవర్గాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఓబులవారిపల్లె మండలం గుండాలకోనలో నీలకంఠేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. రైల్వేకోడూరు పట్టణంలోని శ్రీ భుజంగేశ్వరాలయంలో స్వామివారికి కల్యాణోత్సవం చేశారు. నారాయణవనం మండలం కైలాసకోనలోని శ్రీకామాక్షాంబిక సమేత కైలాసనాథేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, లలితాసహస్రనామ కుంకుమార్చన పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. **రేణిగుంట** మండలం గాజులమండ్యంలో శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో ఊంజల్‌సేవ, నంది వాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు కనులవిందుగా చేపట్టారు. పుల్లంపేట పర్వతవర్ధనీదేవి సమేత శాంతిలింగేశ్వరాలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. **వరదయ్యపాళెం** మండలంలోని శివాలయాలు శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులతో నిండిపోయాయి. **సత్యవేడు:** స్థానిక మాతాంగీస్వారాలయం, కల్యాణ వీరభద్ర ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **నాగలాపురంలో** నాగలింగేశ్వరాలయంలో పార్వతీ సమేతుడైన స్వామిని గ్రామవీధుల్లో ఊరేగించారు. గుడిమల్లం శ్రీఆనందవల్లీదేవి సమేత శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పల్లకీసేవ నిర్వహించారు. **నాగలాపురం:** సురుటుపల్లిలో వెలసిన సర్వమంగళ సమేత పల్లికొండేశ్వరాలయం ఆదివారం భక్తజనసంద్రమైంది. రాత్రి వృషభ వాహనంపై మరగదాంబికా సమేత వాల్మీకేశ్వరులను వీధులలో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. స్వామి వారి కల్యాణోత్సవానికి తితిదే తరఫున పట్టు వస్త్రాలను సమర్పించారు.

సురుటుపల్లిలో వృషభ వాహనంపై పార్వతీపరమేశ్వరులు

బావి.. నోరు బార్లా

మండలంలోని మదనంబేడు గ్రామంలోని పలు పాత బావులు ప్రమాదకరంగా మారాయి. గతంలో తాగునీరు కోసం తవ్వినవి.. చేతిబోర్లు, మోటార్లు రావడంతో అధ్వానంగా తయారయ్యాయి. బావి చుట్టు పిచ్చిమొక్కలు పెరగడంతో మూగజీవాలు మేతకోసం వెళ్లి బావిలో పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉదయం, సాయంత్రం పిల్లలు ఆడుకోవడానికి అటువైపు వెళ్తే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల తెలిపిన పట్టించుకోలేదని వాపోతున్నారు. బావిపై కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

అదుపు తప్పిందా.. పంట కాల్వలోకే

మండల పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. కనుమరుగైన పంటకాల్వలను బాగు చేస్తున్నారు. కొత్తగా తారు రోడ్డు వేయడంతో ఎత్తు పెరిగింది. దీంతో పంట కాల్వ 8 మీటర్ల లోతులోకి పోయింది. రోడ్డు పక్కగానే ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాహనాలు అదుపు తప్పితే కాల్వలోకి దూసుకెళ్తుంది. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పుల్లంపేట

ఎండీఎం వాహనం టైర్లు మాయం

పుల్లంపేట ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఎండీఎం వాహనం టైర్లను దొంగిలించారు. గత ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ బియ్యాన్ని అందించాలనే ఆశయంతో వీటిని ఏర్పాటు చేశారు. అది సక్రమంగా జరగక పోవడంతో వాహనాలను మూలన పెట్టారు. దీంతో వాటిని పట్టించుకొనే వారు కరవయ్యారు. వాహనాలను ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగించాలని స్థానికులు కోరుతున్నారు. తహసీల్దారు పుల్లారెడ్డిని వివరణ కోరగా పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, పుల్లంపేట

గడ్డి ట్రాక్టర్ ట్రాలీ దగ్ధం

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం నుంచి చిత్తూరుకు గడ్డిని తరలిస్తున్న ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమైన ఘటన ఆదివారం మండలంలోని వినోభానగర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి పొలంలోని గడ్డిని భాస్కర్ అనే రైతు చిత్తూరుకు తరలిస్తుండగా.. ప్రమాదవశాత్తు పొలం వద్దనే మంటలు చెలరేగాయి. ట్రాక్టర్‌ను నడుపుతున్న భాస్కర్‌కు ట్రాలీని వదలి ట్రాక్టరును పక్కకు తీసేశారు. గడ్డి, ట్రాలీ అగ్నిలో దగ్ధమయ్యాయి.

తిరునగరిలో షూటింగ్ సందడి

తిరుపతి(గాంధీరోడ్డు): తిరుపతిలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 'శ్రీనివాసమంగాపురం' అనే పేరు ఉండటంతో చిత్రీకరణ తిరుపతి, పరిసర ప్రాంతాల్లో చేస్తున్నారు.

ప్రకటన

మా కక్షిదారు అయినటువంటి గల్ల రాజగోపాల్ నాయుడు, తండ్రి గల్ల వెంకట రామానాయుడు, తూకివాకం గ్రామం, రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా యిచ్చిన సంజాయిషీ మేరకు యిందుమూలంగా యాపస్మందికీ తెలియజేయడమేమనగా... మా కక్షిదారు అయిన గల్లా రాజగోపాల్ నాయుడు గారు తిరుపతి జిల్లా, సత్యవేడు మండలం, వానెల్లూరు గ్రామ లెక్క దాఖలా సర్వే నెం. 104/4 పూరా య. 1.95 సెంట్లలో య. 0.96 సెంట్లు పుంజ భూమిని హనుమంతు మునెయ్య గారి మనుమడు అయిన హనుమంతు చంద్రశేఖర్, తండ్రి హనుమంతు కాటయ్య అను వారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకుని వున్నారు. కావున ఎవ్వరికైననూ యెలాంటి ఆక్షేపణలు వున్న యెడల వ్రాతపూర్వకముగా ఈ క్రింది చిరునామాదారునకు ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోగా తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. అట్లు లేని యెడల మా కక్షిదారుడు సదరు భూమిని కొనుగోలు చేయగలరని తీర్మానించుకోగలరు.

సం/- **హనుమంతు చంద్రశేఖర్,**
హక్కుదారుడు, యజమాని

సం/- **గల్ల రాజగోపాల్‌నాయుడు,**
కొనుగోలుదారుడు

ఇట్లు: సం/- ఏపూగుంట వెంకట రమణరావు, M.A., B.L.,
కోటపోలూరు గ్రామం & పోస్టు,
సూళ్ళూరుపేట మండలం, తిరుపతి జిల్లా,
ఆంధ్రప్రదేశ్-524 123,
Cell : 9676322552.

సత్యవేడు-ఊతుకోట మార్గంలో ఆధునికీకరించిన రహదారి

గుంతలకు స్వస్తి.. రహదారుల ప్రగతి

నిధుల మంజూరుతో వేగంగా నిర్మాణాలు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో కూటమి ప్రభుత్వ పాలనలో పలు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు అవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు తాము గోతుల రోడ్లలో పడిన ఇక్కట్లు తప్పనున్నాయని అంటున్నారు.

గత పాలనలో ..

వైకాపా పాలనలో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడంతో అయిదేళ్లపాటు ప్రజలు ఇబ్బంది పడ్డారు. అడుగడుగునా గుంతలు ఉండటంతో రాకపోకలకు అవస్థలు పడేవారు. వర్షాకాలం వస్తే వాహనచోదకుల కష్టాలు వర్ణనాతీతం. శ్రీసిటీ పరిశ్రమలకు నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, శ్రీకాళహస్తి, బీఎన్‌కండ్రిగ మండలాల నుంచి కంపెనీ వాహనాలే కాకుండా, వందలాది మంది కార్మికులు ద్విచక్రవాహనాల్లో విధులకు రాకపోకలు సాగిస్తుంటారు. చెన్నైకి వెళ్లడానికి ఈ రహదారులే ప్రధానం. అలాంటిది వీటిని నాటి పాలకులు నిర్లక్ష్యం చేశారు. దీంతో రాత్రివేళల్లో విధులకు వెళ్లే కార్మికులు, విధులు ముగించుకుని ఇంటికి చేరే కార్మికులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు కోకొల్లలు.

ఎక్కడెక్కడ పనులు చేస్తున్నారంటే..

కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారులకు మోక్షం కలిగింది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో పలు రహదారుల అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. సత్యవేడు-ఊతుకోట మార్గంలో రహదారి ఆధునికీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. వరదయ్యపాళెం-సత్యవేడు మార్గంలో రహదారులకు మరమ్మతుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నాగలాపురం నుంచి టీపీకోట మీదుగా చిన్న పాండూరు రహదారి ఆధునికీకరణకు రూ. 16కోట్లు మంజూరు కావడంతో, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నాగలాపురం-కన్నావరం రహదారి మరమ్మ

విద్యుదాఘతంతో పూరిల్లు దగ్ధం

బి ఎన్ కండ్రిగ, న్యూస్‌టుడే: షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన బి.ఎన్.కండ్రిగ మండలం కాటూరు ఎస్సీ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. కాలనీకి చెందిన నెలటూరు రమణమ్మ పూరి గుడిసెలో నివాసం ఉంటుంది. ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఆర్పేలోగా గుడిసె పూర్తిగా కాలిపోయింది. బాధితులకు తహసీల్దారు లక్ష్మీనారాయణ రూ. 2500, వైకాపా మండల కన్వీనర్ మణినాయుడు రూ. 5000 ఆర్థిక సాయం అందించారు.

దర్శనానికి వచ్చి మహిళ మృతి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి దర్శనార్థం వచ్చి మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. చిట్టమూరు మండలానికి చెందిన మణెమ్మ (45) ఒకటో ప్రవేశ గోపురం వద్ద స్పృహతప్పి కుప్పకూలింది. అక్కడున్న వైద్యసిబ్బంది ఆమెకు సీపీఆర్ చేసి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సేవాలాల్ జయంతి వేడుకలు

సేవాలాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బంజారులు

రేణిగుంట, న్యూస్‌టుడే: సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందిస్తామని శ్రీహథీరాం బావాజీ బంజారా సేవా సంఘ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బాలాజీనాయక్ తెలిపారు. శనివారం స్థానిక వెంకటాపురం పంచాయతీలోని బంజారా హిల్స్ కాలనీలో సంఘ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో సొసైటీ నాయకులు రామచంద్రనాయక్, సురేష్‌నాయక్, శంకర్‌నాయక్, అంజినాయక్ ఉన్నారు.



ఆలస్యంగా పూత.. చిగురిస్తున్న ఆశ

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: ఈ ఏడాది మామిడి పంటలో ఆశించిన స్థాయిలో పూత లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పిందె దశలో ఉండాల్సిన తోటల్లో ఇప్పుడిప్పుడే పూత కనిపిస్తోంది. నియోజకవర్గంలో 25 వేల ఎకరాల్లో కేవలం 60 శాతం తోటల్లోనే పూత కనిపిస్తోంది. దీనికి వర్షాభావం, వాతావరణంలో వచ్చిన మార్పులు ఒక కారమణమైతే.. సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం మరో కారణం. సాధారణంగా పూత ప్రారంభమైన నాటి నుంచి రైతులు పంటపై శ్రద్ధ వహిస్తారు. అప్పటి నుంచి ఎరువులు, పురుగు మందులు, ఇతర యాజమాన్య పద్ధతులు పాటించి జూన్‌లో కోతలు పూర్తవగానే తోటను పట్టించుకోరు. పూతలు రావడం మొదలయ్యాక యాజమాన్య చర్యలు ప్రారంభిస్తుంటారు. దీంతో పూతలు ఆలస్యమౌతున్నాయి.

పూత దశలో మామిడి చెట్లు

ఉష్ణోగ్రతల్లో మార్పులతో..

ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతల్లో కొంత మార్పులు చోటు చేసుకోవడంతో అక్కడక్కడా పూత వస్తోంది. దీంతో రైతుల్లో కొంత వరకు ఆశలు చిగురిస్తున్నాయి. ఆలస్యంగానైనా పంట వస్తుందనే ఆశ నెలకొంది.

ప్రభుత్వ ప్రోత్సాహం

నియోజవకర్గంలోని ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి, కోడూరు మండలాల్లో 25 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. రైతులు బొప్పాయి, అరటి పంటతో పాటు మామిడి పంటను ప్రధానంగా సాగు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పంట విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. ఎక్కువగా సూక్ష్మ సేద్యంతో అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ధరలు తగ్గుముఖం పట్టడం, ప్రకృతి వైపరీత్యాలు, దిగుబడులు లేకపోవడం, పూత దశ నుంచి చీడపీడలు ఆశించడం, మార్కెటింగ్ సమస్యలతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా డిసెంబర్, జనవరిలో రావాల్సిన పూత ఇంత వరకు 80 శాతం కూడా రాలేదు.

అంతర పంటల సాగుతో

కొందరు రైతులు మామిడి తోటల్లో అంతర పంటలను సాగు చేస్తున్నారు. అదనపు ఆదాయం పొందుతున్నారు. అందరూ ఈ విధానాన్ని పాటించాలి. శాస్త్రవేత్తలు సూచించిన ఎరువులు వాడాలి. పూత వచ్చినప్పటి నుంచి సస్య రక్షణ చర్యలను విధిగా పాటించాలి.

-భాస్కర్, ఉద్యానశాఖ అధికారి, ఓబులవారిపల్లె, కోడూరు, పుల్లంపేట

(c) eenadu

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

నీలకంఠేశ్వరుడికి వాహన సేవలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: తుమ్మూరు శ్రీగంగా కామాక్షి సమేత శ్రీనీలకంఠేశ్వర స్వామి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నంది, హంస వాహనాలపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం అభిషేకాలు, చప్పర ఉత్సవం అనంతరం సాయంత్రం వేర్వేరు వాహనాల్లో శివపార్వతులు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణముఖినది తీరాన ప్రసూనాంబ నీలకంఠేశ్వర స్వామి నందివాహనంపై దర్శనం ఇచ్చారు. గ్రామోత్సవం అనంతరం స్వామి వారికి లింగోద్భవ పుణ్యకాల మహాన్యాస పూర్వక ఏకాదశ పూజలు, రుద్రాభిషేకం కుంభమార్చన పూజలు నిర్వహించారు.

నందివాహనంపై గంగా సమేత నీలకంఠేశ్వరస్వామి

రామసేతు వ్యయం రూ.3.58 లక్షలే..!

సువర్ణముఖి నదిపై కనిపించిన పురాతన వంతెన రామసేతు. 1926వ జనవరి 31న ప్రారంభించిన ఈ వంతెన నిర్మాణానికి అయిన వ్యయం రూ.3,58,500. అప్పటి వరకు నదిపై వంతెన లేదు. వర్షం వస్తే పట్టణ అవలి ప్రాంతం వాళ్లు ఇటు వైపునకు వచ్చే అవకాశం లేదు. అలాంటి పరిస్థితుల్లో 1923 మార్చి 31న వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. దీన్ని పానగల్ సంస్థానాధీశులు, ఒకప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రాజా రామానాయుని శంకుస్థాపన చేశారు. మూడేళ్లలో నిర్మించాలనుకోగా రెండు నెలలు ముందుగానే వంతెన ప్రారంభించడం విశేషం. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

తడ: చేనిగుంటలో నీలకంఠేశ్వరుడి వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

వాకాడు: యాకశిరితిప్పలో శ్రీభూపతేశ్వరస్వామి ◆ చిట్టమూరు: రామలింగేశ్వరస్వామి ◆ నాయుడుపేట: ప్రత్యేక అలంకరణలో నీలకంఠేశ్వరస్వామి ◆ నాయుడుపేట పట్టణం: వీధుల్లో ఊరేగింపు ◆ దొరవారిసత్రం: శ్రీధనమల్లిలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీధరేశ్వరస్వామి ◆ వాకాడు: భస్మ అలంకరణలో శ్రీనాగేశ్వరస్వామి

శైవక్షేత్రాల్లో శివనామం

వైభవంగా శివరాత్రి ఉత్సవాలు

వెంకటగిరి: రామలింగేశ్వర స్వామికి అలంకరణ ◆ డక్కిలి: స్తంభాలగిరి ఈశ్వరుడికి ప్రత్యేకాలంకరణ

వెంకటగిరి: కాత్యాయిని సమేత కైలాసనాథస్వామి నగరోత్సవం

సూళ్లూరుపేట గ్రామీణం: జలాభిషేకంలో పాల్గొన్న భక్తులు ◆ సూళ్లూరుపేట గ్రామీణం: శ్రీసంతానేశ్వర స్వామి

న్యూస్‌టుడే బృందం: సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం శివరాత్రిని పురస్కరించుకుని ఆలయాలను ముస్తాబు చేశారు. ఉదయం హోమాలు, సామూహిక లలితకు మార్చన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సముద్రస్నానాలు, నదీస్నానాలు చేసి తెల్లవారజాము నుంచి పరమశివుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. వాకాడు, పంద్రంగం, ఏకసిరిత్పి, నాయుడుపేటలో నీలకంఠేశ్వర స్వామి, తడలో వాటంబేడు, సూళ్లూరుపేట గ్రామీణం మన్నారు పోలూరు శ్రీసంతానేశ్వర స్వామి, సూళ్లూరుపేట పట్టణం శ్రీనాగేశ్వరస్వామి, ఓజిలి సగుటూరు శ్రీబాలామృత మృత్యుంజయేశ్వరస్వామి, దొరవారిసత్రం శ్రీధనమల్లి, చంధనమూడి శివాలయల్లో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి గ్రామాల్లో ఉరేగింపు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

వాకాడు: పంత్రంగంలో వెండి ఆభరణాలతో శ్రీపాండురంగేశ్వరస్వామి ◆ ఓజిలి: ప్రత్యేక అలంకారంలో

సూళ్లూరుపేట పట్టణం: శ్రీనాగేశ్వరస్వామి ◆ తడ: తడకండ్రిగ భువనేశ్వరాలయంలో కొలువైన ఉత్సవమూర్తులు

మేమున్నాం.. మీకు తోడుగా..

నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని తాగునీటి కొళాయి లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. -రామలింగేశ్వర్‌రావు, స్థానికుడు

సమాధానం: తాగునీటి కొళాయిలు అందరికీ ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. -చిన్నయ్య, కమిషనర్

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామంలోని తూర్పు హరిజనవాడలో డ్రైనేజీ కాలువలో మురుగు రోడ్డుపైకి చేరుతోంది. - మునుస్వామి, స్థానికుడు

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - మురళీకృష్ణ, ఎంపీడీవో

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని కాళి వీధిలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. - రవికుమార్

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - చిన్నయ్య, కమిషనర్

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని షార్ బస్టాండ్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రహదారి పక్కన, మురుగు ముందుకు కదలక పోవడంతో దుర్వాసన వేస్తోంది. - గోవిందయ్య

సమాధానం: మురుగును సిబ్బందితో వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - చిన్నయ్య, కమిషనర్

తడ, న్యూస్‌టుడే: సమస్య: వాటంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వం నాడు-నేడు కింద నిర్మాణం చేపట్టిన అదనపు తరగతుల భవనం అసంపూర్తిగా మిగిలింది. దీంతో చెట్ల కింద విద్యార్థులకు తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. నిధులు దుర్వినియోగం అయ్యాయని విమర్శలు ఉన్నాయి. - బాలు, స్థానికుడు

సమాధానం: గత ప్రభుత్వంలో నిధులు వచ్చిన మేరకు మాత్రమే నిర్మాణ పనులు జరిగాయి. భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం. నిధులు రాగానే పనులు చేయిస్తాం. -ఎంఈవో, మల్లికార్జున్‌రావు

రహదారిలో నడవలేక

సూళ్లూరుపేట పట్టణం న్యూకాలనీలో ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న రహదారి అధ్వానంగా మారింది. అక్కడ కుళ్లాయి నీరు రోడ్డుపై పారడంతో బురదమయంగా మారింది. స్కూలు పిల్లలు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

రోడ్డుపై జీవాలు.. చిక్కుల్లో ప్రజలు

పట్టణంలో యజమానులు పట్టించుకోక పోవడంతో ఇష్టారీతిన సంచరిస్తున్న ఆవులతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ పడితే అక్కడ రోడ్డుకు అడ్డంగా నిలుస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఆర్టీసీ బస్టాండ్, షార్ బస్టాండ్, కోళ్లమిట్ట, బజారువీధి, మార్కెట్ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట పట్టణం

మద్యం దుకాణాలు.. ప్లాస్టిక్ వ్యర్థాలు

నాయుడుపేట పురపాలక సంఘ పరిధిలోని మద్యం దుకాణాల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దుకాణాలను ఆనుకుని ఉండే ఖాళీ స్థలాల్లో వేస్తున్నారు. గుట్టలు గుట్టలుగా పేరుకుంటున్నాయి. ఖాళీ స్థలాలు చెట్లలో చెత్త చెదారంతో కలిపి పడేయడంతో అపరిశుభ్రత చోటు చేసుకుంటోంది. ఈ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశముంది. -న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

గేటు లేక.. పశువుల రాక

తుమ్మూరు ప్రాథమిక పాఠశాల ప్రాంగణానికి ప్రహరీ లేక రహదారిగా మారింది. ఇక్కడ నాడు-నేడులో గతంలో ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. గత ప్రభుత్వంలో బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా ముందుభాగంలో గేటు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో పశువులు, ఇతరులు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించడంతో అపరిశుభ్రంగా మారుతోంది. -న్యూస్‌టుడే, నాయుడుపేట

భారీ గుంత.. తప్పని తంటా

వెదురుపట్టు ర.భ రహదారిపై భారీ గుంతతో వాహనదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్.ఎం.అగ్రహారం సమీపంలోని జాతీయ రహదారి నుంచి వెదురుపట్టు మీదగా తిరుపతి ఆరు వరుసల రహదారి వరకు ఈ రోడ్డు ఉంది. రెండు జాతీయ రహదార్లను కలిపే ఈ రహదారిలో వాహనాలు అధికంగా ప్రయాణిస్తాయి. కుప్పారెడ్డిపాలెం వద్ద ఉన్న వంతెన సమీపంలో పడిన గుంతతో ఇబ్బందులు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, దొరవారిసత్రం

తీరంలో సముద్ర స్నానాల సందడి

వాకాడు, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వాకాడు మండలం తూపిలిపాలెం, ఒడపాలెం సముద్ర తీరాలలో ఆదివారం వేకువ జాము నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి సముద్ర స్నానాలు చేస్తున్నారు. శివుడికి దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం సూర్యోదయం వేళలో సూర్యభగవానుడికి నమస్కరించారు. దీంతో తీరం ఒడ్డున సందడి నెలకొంది. దుగరాజపట్నం, శ్రీహరికోట మెరైన్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులను అప్రమత్తం చేశారు.

ఇలాగైతే పారుదల కష్టమే

కాలువ నిండా ఆకులు

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ నుంచి దుగరాజపట్నం చెరువుకు నీరు చేరే కాలువ దుస్థితికి చేరింది. గత కొంత కాలంగా అధ్వానంగా మారింది. నీటి పారుదల సక్రమంగా సాగక పోవడంతో చెరువుకు నీరు చేరడంలేదని ఆయకట్టు దారులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డెక్కితే తిరిగొస్తామా!

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాన రహదారులు మెరుగు పడ్డాయి. వాహనాల వేగానికి అదుపు లేకుండా పోయింది. వేగంగా దూసుకెళుతున్న వాహనాలు ప్రమాదాలకు గురౌతున్నాయి. తప్పు ఎవరిదైనా, కారణం ఏదైనా, జీవితాలు బలవుతున్నాయి. వారి కుటుంబాలు వీధిన పడుతున్నారు. ఎంతో మంది క్షతగాత్రులౌతున్నారు. అవయవాలు కోల్పోయి జీవితాలు నరకప్రాయంగా మారుతున్నాయి.

జాతీయ రహదారిపైనే: సూళ్లూరుపేట పట్టణ పరిధిలో 16వ నంబరు జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా హోలీక్రాస్, కోటపోలూరు మలుపు, వట్రపాళెం, చెంగాళమ్మ ఆర్చి, గోకులకృష్ణ కళాశాల, ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతాల్లో హెచ్చరిక లైట్లు ఏర్పాటు చేసినా ప్రయోజనం స్వల్పమే. మొత్తం ప్రమాదాల్లో 60 శాతానికి పైగా మరణాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రధాన కారణాలివే: ఈ ప్రాంతంలో ప్రైవేటు కర్మాగారాల నుంచి వచ్చే వాహనాలు అధిక వేగంతో రావడం ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం కారణంగా వెనకాల నుంచి వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలకు కారణమవుతున్నాయి.
● చరవాణిలో మాట్లాడుతూ వాహనాలు నడపడంతో నియంత్రణ కోల్పోవడం. ● దూరప్రాంతాల నుంచి వచ్చే సమయంలో విశ్రాంతి లేకుండా గంటల తరబడి డ్రైవింగ్ చేస్తూ నిద్రలోకి జారడం. ● టిప్పర్లు, కంటైనర్లు, ప్రైవేట్ బస్సులు రహదారికి ఇరువైపులా డాబాలు, పంచర్ షాపులు, దుకాణాల వద్ద రహదారి పక్కన పెట్టడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

జాగ్రత్తలు పాటించాలి: ప్రమాదాల నియంత్రణకు మా వంతు కృషి చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. అతి వేగంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలి. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలి. వాహన చోదకులు విశ్రాంతి తీసుకోవాలి. - బ్రహ్మనాయుడు, ఎస్సై

సూళ్లూరుపేట జాతీయ రహదారిలో ప్రమాదాలు

సంవత్సరం	ఘటనలు	మృతులు	క్షతగాత్రులు
2024	18	10	8
2025	31	8	23

అభివృద్ధి చేస్తే అందరికీ ఉపయోగం

విన్నమాల ప్రజల విన్నపం

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో జాతీయ రహదారికి అనుసంధానంగా పాత విన్నమాల రోడ్డును అనుసంధానం చేస్తే స్థానికుల రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది. విన్నమాల గ్రామానికి సమీపంలో ఎన్‌హెచ్ 16, 71 జాతీయ కూడలి ఏర్పాటు కావడం, దీనికి దగ్గరలో ఆరు వరుసల సాగరమాల రహదారి ఏర్పాటు చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో రైల్వేస్టేషన్, డీఎస్పీ, తహసీల్దారు, డివిజన్ ఖజానా, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యాలయాలు ఉన్నాయి. కొత్త రహదారి కూడలి ఏర్పాటైన తరువాత చెన్నై, నెల్లూరు, తిరుపతి మార్గాలవైపు వెళ్లే బైపాస్ రైడర్ బస్సులు అన్ని ఇక్కడే నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు, చిన్నపాటి వాహనదారులంతా జాతీయ రహదారి నుంచి రైల్వే అండర్ పాస్, పాత విన్నమాల రోడ్డు మీదగా పట్టణంలోకి రాకపోకలు సాగించడంతో ఈ మార్గం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆక్రమణలతో కుచించుకుపోయిన విన్నమాల రోడ్డు

అభివృద్ధి చేస్తే అనుకూలం

ప్రస్తుతం పాత బస్టాండ్ సమీపంలోని జీఎన్‌టీ రోడ్డు నుంచి ఎన్‌హెచ్‌ఏ 16 నంబరు రహదారి వరకు పాత విన్నమాల రోడ్డు 60 అడుగులు వెడల్పు ఉంది. ప్రస్తుతం ఏడు అడుగులు మాత్రమే ఉంది, ఇరువైపులా ఆక్రమించడంతో కుచించుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయక పోవడంతో రాత్రి సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యలను అధికారులు, నాయకులు పరిష్కరించాల్సిన అవసరం ఉంది. విన్నమాల, పెరికిలంపాటికండ్రిగ, కమ్మవారిపాళెం, చిట్టమూరు మండలంలోని గ్రామాల ప్రజలకు రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది. తుడా, పురపాలిక సంఘం నిధులతో ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఆదిశగా ఎమ్మెల్యే విజయశ్రీ చొరవచూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డుపై వాహనాలతో ప్రమాదాలు

రాజుపాళెం వద్ద రహదారిపై నిలిపిన లారీలు

ఓజిలి, న్యూస్‌టుడే: మండలంలోని రాజుపాళెం వద్ద జాతీయ రహదారిపై లారీలను నిబంధనలకు విరుద్ధంగా నిలుపుతున్నారు. ఇలా జాతీయ రహదార్లపై ఎక్కడ పడితే అక్కడ లారీలు అడ్డగోలుగా నిలపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నిబంధనల మేరకు జాతీయ రహదార్లపై వాహనాలు విశ్రాంతి స్థలంలోనే నిలపాల్సి ఉండగా ఇక్కడ మాత్రం పోలీసుల పర్యవేక్షణ లోపం కారణంగా నిర్లక్ష్యంగా వాహనాలను జాతీయ రహదార్లపై ఆపేస్తున్నారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అండర్‌పాస్‌లో అవస్థలు

పండ్లూరు అండర్‌పాస్‌లో నిలిచిన నీరు

నాయుడుపేట మండలం పండ్లూరు రైల్వే అండర్ పాస్‌లో మురుగుతో ఇబ్బందులు తప్పడం లేదు. ఓజిలి మండలం భట్లకనుపూరు పరిసర నాలుగైదు గ్రామాలకు ఇటుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. రైతులు పండించే ధాన్యాన్ని తరలించాల్సి ఉంది. జామాయిల్, సవక కర్రను నాయుడుపేట మీదగా ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. ఈ అండర్‌పాస్‌లో మోకాటి లోతు నీరు నిలిచి ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

నేడు రథోత్సవం.. తెప్పోత్సవం

నారదపుష్కరిణిలో సిద్ధమైన తెప్పలు

బ్రహ్మోత్సవాల్లో మహాశివరాత్రి తరువాత రోజును బ్రహ్మరాత్రిగా పిలుస్తారు. గరళాన్ని మింగి సమస్త లోకాలను సంరక్షించిన సర్వేశ్వరుడి రథానికి బ్రహ్మా సారథిగా విజయోత్సవం నిర్వహించడం రథోత్సవ పరమార్థం. బ్రహ్మరాత్రిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లు జోడు రథాలపై ఊరేగనున్నారు. రాత్రి.. బాబుఅగ్రహారంలోని నారదపుష్కరిణిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తెప్పలపై శ్రీజ్ఞానప్రసూనాంబికసమేత సోమస్కందమూర్తి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఈ విశేషోత్సవాలకు శ్రీకాళహస్తికి చెందిన గాజుల సత్యనారాయణ, సరస్వతమ్మ దంపతులు, ఏర్పేడు మండలం మాధవమాలకు చెందిన రామచంద్రారెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన జూలుగంటి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం జూలుగంటి సత్యనారాయణశెట్టి, మురళీమోహన్ గుప్త, చంద్రశేఖర్ ఉభయదాతలుగా వ్యవహరించనున్నారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

మాదిరి పత్రాలపై ప్రత్యేక దృష్టి

నిత్య సాధనతో మంచి మార్కులు

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: త్వరలో జరగబోయే ఇంటర్ పరీక్షల్లో మాదిరి పేపర్స్‌పై దృష్టి సారించాలని పలువురు అధ్యాపకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పరీక్షలంటే భయం లేకుండా మానసిక ప్రశాంతతతో హాజరు కావాలన్నారు. చిన్న మార్కుల ప్రశ్నలు రాయడంవల్ల ఇంటర్‌లో మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

శ్రమిస్తే మెరుగైన ఫలితాలు

ఇంటర్ భౌతిక శాస్త్రంలో ముఖ్యంగా రెండో సంవత్సరంలో విద్యుత్తు మరియు అయస్కాంతత్వం, ఆప్టిక్స్, ఆధునిక భౌతిక శాస్త్రం అత్యధిక మార్కులు తీసుకువచ్చే ముఖ్యమైన అధ్యాయాలు, ప్రథమ సంవత్సరంలో థర్మోడైనమిక్స్, మెకానిక్స్ అధ్యాయాలపై విద్యార్థులు శ్రద్ధ పెట్టాలి. బోర్డు వారి మాదిరి ప్రశ్న పత్రాలు సాధన చేయాలి. మొదటి సంవత్సరం పరీక్షలో నూతనంగా ప్రవేశ పెట్టిన ఒక్క మార్కు ప్రశ్నలు బాగా దోహదపడతాయి. ఫార్ములాలు, వ్యాసరూప ప్రశ్నలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. -ఎస్.శ్రీరామ చైతన్య, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు

ఒక మార్కు ప్రశ్నలపై శ్రద్ధ

ఇంటర్ పరీక్షల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు గణితంలో త్రికోణమిత, సరళరేఖలు, అవధులు మరియు అవకలనం వంటి ముఖ్యమైన అధ్యాయాలపై దృష్టి సారిస్తే ఎక్కువ మార్కులకు అవకాశం ఉంటుంది. మొదటి సంవత్సరం గణితంలో మంచి మార్కులు సాధించడానికి ఒక మార్కు ప్రశ్నలపై శ్రద్ధ పెట్టాలి. రెండో సంవత్సరం గణితంలో 2ఎ లో డి-మోర్గ్, సంభావ్యత, 2బి లో సమాకలనం, అవకలన సమీకరణం, కోఆర్డినేట్ జామెంట్రీ వంటి అధ్యాయాలపై ఫోకస్ చేయాలి. 4 మార్కులు, 7 మార్కులు, ప్రశ్నలపై సాధన చేస్తే మంచి మార్కులు సాధించవచ్చు. గతంలో జరిగిన ప్రశ్నా పత్రాలను ఎక్కువగా సాధన చేయాలి.

- బి.సుబ్రహ్మణ్యం, గణిత అధ్యాపకుడు

వ్యాకరణంపై దృష్టి పెట్టాలి

ఆంగ్లంలో ఎక్కువ మార్కులు సాధించడానికి వ్యాకరణం మరియు ఉల్లేఖనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యాకరణంపై దృష్టి పెడితే సులువుగా 30 మార్కులు సాధించవచ్చు. పునరావృతమయ్యే ప్యాసేజ్‌లను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. వ్యాసరచనపై దృష్టి పెట్టాలి. గతంలో జరిగిన కనీసం 5 ప్రశ్న పత్రాలను చూడాలి.

- జె.సుమలత, ఆంగ్ల అధ్యాపకురాలు

శుభాకాంక్షలు

సంజీవనీ హెల్త్ కేర్ స్కీమ్ ద్వారా 5 కోట్ల మంది వ్యక్తుల కోసం వారి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నేడు బిల్‌గేట్స్ ద్వారా కార్యక్రమం ప్రారంభిస్తున్న శుభసందర్భంగా హార్ధిక శుభాకాంక్షలు...

కె.రామచంద్రయ్య M.Tech.

(c) eenadu

ఈనాడు విశాఖపట్నం
సోమవారం 16 ఫిబ్రవరి 2026 | సిటీ 5

నేడు పీజీఆర్ఎస్ రద్దు

ఎన్టీవోపీ, కార్పొరేషన్, జగదాంబ కూడలి, న్యూస్టుడే: నగరంలో ఐఎఫ్ఆర్, మిలాన్ తదితర నౌకాదళ కార్యక్రమాలతో పాటు, 17న రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్లో, జీవీఎంసీ కార్యాలయాల్లో, పోలీస్ కమిషనరేట్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) రద్దు చేసినట్లు కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, సీపీ శంఖబ్రతబాగ్చీ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఆయా కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ ఉండదని, ప్రజలు గమనించాలని వారు సూచించారు.

రోబో చేతి కాఫీ.. అదుర్స్

తూర్పు నౌకాదళ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ నావెల్ బేస్లోని సముద్రిక వద్ద మిలాన్ విలేజ్ ప్రారంభమైంది. ఇక్కడ ఏర్పాటు చేసిన రోబో కాఫీ స్టాల్ నౌకాదళ అధికారులను, సిబ్బందిని ఆకట్టుకుంది. దీని పేరు బీన్‌బోర్డు రోబో. మనుషుల సహాయం లేకుండానే తనకు తానే యంత్రంలో కాఫీని పట్టి చేతికి ఇస్తుంది. ఫోన్‌పే ద్వారా డబ్బు చెల్లించిన వారు కాఫీ తీసుకొని తాగవచ్చు. త్వరలో ఇటువంటి రోబోను దిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం విమానాశ్రయాల్లో ఏర్పాటు చేయనున్నట్లు బీన్‌బోర్డు రోబో సంస్థ ప్రతినిధులు తెలిపారు. – ఈనాడు, విశాఖపట్నం

మిలాన్ విలేజ్‌ను ప్రారంభిస్తున్న వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, తదితరులు

సముద్ర పరేడ్‌కు 71 యుద్ధనౌకలు

తూర్పు నౌకాదళ ప్రధాన అధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా

ఈనాడు, విశాఖపట్నం: 'స్వతంత్ర భారతదేశంలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ ఒక అతి పెద్ద ఈవెంట్. ఈనెల 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యుద్ధనౌకల సమీక్ష చేసి సముద్రంలో నౌకల పరేడ్‌ను పరిశీలిస్తారు. 71 నౌకలు ఆరు వరుసల్లో బారులు తీరుతాయి. ఇందులో 19 విదేశీ యుద్ధనౌకలు, 45 భారత నౌకాదళం నుంచి, మిగిలినవి కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలుంటాయి' అని తూర్పు నౌకాదళ ప్రధాన అధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా తెలిపారు. ఆదివారం నావెల్ బేస్‌లోని సముద్రిక వద్ద ఆయన మిలాన్ విలేజ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...'మిలాన్ విన్యాసాలు 1995లో ప్రారంభమయ్యాయి. నాడు నాలుగు దేశాలు పాల్గొనగా, ఇప్పుడు 65 దేశాల నుంచి నౌకా దళాలు పాల్గొంటున్నాయి. ఈసారి భారత దేశం మిలాన్-2026కు అధ్యక్షత వహిస్తోంది. అంతర్జాతీయ సిటీ పరేడ్ విశాఖ బీచ్ రోడ్డులో జరుగుతుంది. ఈనెల 19వ తేదీ సాయంత్రం జరిగే ఈ పరేడ్‌లో మొత్తం 7-8 దేశాలకు చెందిన నావికా బ్యాండ్లు పాల్గొంటాయి. ఐఎఫ్ఆర్‌లో పాల్గొనడానికి ఐఎన్ఎస్ విక్రాంత్ ఇప్పటికే విశాఖ చేరుకుంది' అని తెలిపారు.

★ మిలాన్ విలేజ్‌లో మిలాన్, ఐఎఫ్ఆర్‌కు సంబంధించిన టోపీలు, బ్యాగ్‌లు, కొయ్యబొమ్మలు, మట్టి కుండలు, రుచికరమైన వంటల స్టాల్స్, చేనేత, హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈనెల 21 వరకు మిలాన్ విలేజ్ కొనసాగుతుంది.

కడలిలో కదన బాహుబలులు.. శత్రువుల గుండెల్లో గుబులు..!

ఈనాడు, విశాఖపట్నం, సింధియా-న్యూస్‌టుడే: ఈ యుద్ధ నౌకల పేర్లు చెబితే శత్రు దేశాల గుండెల్లో గుబులు రేగుతుంది. ఏడు కోట్ల చదరపు కి.మీ. విస్తీర్ణం కలిగిన హిందూ మహా సముద్రంలో ఆధిపత్యం కోసం భారత్ సిద్ధం చేసిన బ్రహ్మాస్త్రాల్లో ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ఉన్నాయి. అదే విధంగా ఐఎన్ఎస్ విశాఖ ఉంది. రక్షణ పరంగా దుర్భేద్యంగా నిలవడంతోపాటు, హిందూ మహా సముద్రంలో తిరుగులేకుండా దూసుకెళ్లే సామర్థ్యం వీటి సొంతం. ఐఎఫ్ఆర్, మిలాన్ నేపథ్యంలో వాటిల్లో కొన్నింటి విశేషాలు తెలుసుకుందాం.

దేశ అమ్ములపొదిలో 'ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విశాఖ'

మిలాన్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్న యుద్ధ నౌకలు

ఇది 'విక్రాంత్' సవాల్..

నౌక పొడవు: 262.5 మీటర్లు
వెడల్పు: 61.6 మీటర్లు
బరువు: 45వేల టన్నులు
డెక్‌లు: 14
కంపార్టుమెంట్లు: 2,300
వేగం: 28 నాటికల్ మైళ్లు

భారత నౌకాదళంలో దేశీయంగా నిర్మించిన తొలి విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్. రూ.20వేల కోట్లతో కొచ్చిన్ షిప్ యార్డు లిమిటెడ్ నిర్మించిన ఈ బాహుబలి యుద్ధ నౌకను 2022లో ప్రధాని మోదీ కమిషనింగ్ చేశారు. ఇది శత్రువులకు వణుకు పుట్టించే సముద్రంలో తేలియాడే నౌకాదళ స్థావరంగా పేరుగాంచింది. 'జయం సం యుద్ధి స్పర్థః' (నన్ను సవాలు చేసేవారిని నేను ఓడిస్తా) అనే రుగ్వేద సూక్తులతో ఇది పనిచేస్తుంది.

సామర్థ్యం: నాలుగు జనరల్ ఎలక్ట్రికల్ ఎల్ఎం 2500 గ్యాస్ టర్బైన్‌లతో 88 మెగా వాట్స్ విద్యుత్తు సాయంతో నడుస్తుంది. మిగ్29కే ఫైటర్ జెట్స్, కమోవ్-31, హెచ్ఆర్-60 ఆర్ హెలికాప్టర్లను, లైట్ అడ్వాన్స్‌డ్ హెలికాప్టర్లని సునాయాసంగా రవాణా చేయగలదు. 250 ట్యాంకర్ల ఇంధనాన్ని మోసుకెళుతుంది.

సౌకర్యాలు ఇలా: ఇందులో 16 పడకల ఆసుపత్రి, రెండు ఆపరేషన్ థియేటర్లు, మహిళా అధికారులకు ప్రత్యేక క్యాబిన్లు ఉంటాయి.

కలిగి ఉండే ఆయుధాలు: 64 బరాక్ క్షిపణులు, బ్రహ్మోస్ క్రూజ్ క్షిపణులు, ఒటోబ్రెడా 70ఎంఎం గన్స్, ఏకే-360 క్లోజిన్ ఆయుధ వ్యవస్థలు, ఆధునిక సెన్సార్లతో శత్రు వైమానిక, క్షిపణి దాడులను తట్టుకునే బహుళ అంచెల రక్షణ వ్యవస్థ దీని సొంతం.

ఐఎన్ఎస్ విశాఖపట్నం నౌక

సాటిలేని 'ఐఎన్ఎస్ విశాఖ'

నౌక బరువు: 7,400టన్నులు
పొడవు: 164మీటర్లు
వేగం: గంటకు 30నాటికల్ మైళ్లు (55 కి.మీ.)

ప్రాజెక్టు 15బి కింద భారత రక్షణ రంగం చేపట్టిన నాలుగు స్టెల్త్ గైడెడ్ క్షిపణి విధ్వంసక నౌకల్లో ఐఎన్ఎస్ విశాఖపట్నం ఒకటి. ఇది అత్యంత వేగంతో శత్రువులను ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు కలిగి ఉంది. ఈ నౌకను దేశీయంగానే మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్‌లో నిర్మించారు.

ప్రత్యేకత: నాలుగు గ్యాస్ టర్బైన్లతో వేగంగా దూసుకెళుతుంది. శత్రుదేశాల రాడార్లకు చిక్కకుండా అత్యాధునిక రాడార్ వ్యవస్థ, ఎలక్ట్రానిక్ వార్ ఫేర్, యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ వ్యవస్థలను కలిగి ఉంది.

కలిగి ఉండే ఆయుధాలు: బ్రహ్మోస్, బరాక్-8, సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు, 76ఎంఎం తుపాకులు, హల్ మౌంటెడ్ సోనార్ హమ్సా ఎన్జీ, హెవీ వెయిట్ టార్పెడో ట్యూబ్ లాంచర్లు, రాకెట్ లాంచర్‌లు ఉంటాయి. అణు, రసాయన యుద్ధ పరిస్థితుల్లోనూ ఇది సత్తా చాటగలదు.

నీలి సంద్రంలో 'మిలాన్' బంధం

సింధియా, న్యూస్‌టుడే: నీలి సంద్రంలో దేశ నావికా బలాన్ని చాటేలా.. మిత్ర దేశాలతో బంధం పెంపొందించేలా మిలాన్(మల్టీలేటరల్ నేవీ ఎక్సర్‌సైజ్) నిలుస్తోంది. పరస్పర సహకారం.. విశాఖ నగరం ఈ అద్భుత కార్యక్రమానికి ఆతిథ్యం ఇస్తోంది. సాంస్కృతిక, సామాజిక మమేకం వంటి అంశాలు కూడా ఇందులో మిళితమై ఉన్నాయి. గత కొద్దిరోజులుగా నగరవాసులు మిలాన్‌పై ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. బహుళజాతీయ దేశాల నౌకాదళ బహుముఖ విన్యాసాలను సాగించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తూర్పు నౌకాదళ అధికారులు తెలిపారు. ప్రతి రెండేళ్లకోసారి మారిటైం సహకారాన్ని అందించే లక్ష్యంతో దీనికి రూపకల్పన చేశారు.

★ తొలిగా 1995లో పోర్టుబ్లెయిర్‌లో నిర్వహణ
★ ఈసారి 65 దేశాల భాగస్వామ్యం

బహుళ జాతీయ సముద్ర విన్యాసాల్లో వివిధ దేశాల యుద్ధనౌకలు

ప్రారంభం ఇలా..: తొలిసారిగా 1995లో అండమాన్ నికోబార్ రాజధాని పోర్టు బ్లెయిర్‌లో కేవలం నాలుగు దేశాలతో 'మిలాన్' ప్రారంభమైంది. నాడు 'లుక్ ఈస్ట్ పాలసీ' ద్వారా ఇండోనేషియా, సింగపూర్, శ్రీలంక, థాయిలాండ్ దేశాలు భారత్ ఆధ్వర్యంలో సంయుక్త విన్యాసాలు చేపట్టాయి. తర్వాత 2022లో విశాఖ తీరాన జరిగిన మిలాన్‌లో మొత్తం 39 దేశాల పాల్గొన్నాయి.

★ 2024లో అతిపెద్ద ఎడిషన్‌గా 51 దేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ విన్యాసాల్లో భారత ప్రతిష్ఠాత్మక యుద్ధ విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్యలు పాల్గొనడం విశేషం.

★ 2026లో ఏకంగా మిలాన్ తోపాటు అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్), భారత సముద్ర నౌకాదళ చర్చాగోష్ఠి (ఐవోఎన్ఎస్) కూడా జరుగుతోంది. ఇందులో 65 దేశాలు పాల్గొననుండటం మరింత ప్రాముఖ్యతను తెచ్చి పెడుతోంది.

భవిష్యత్తు విశాఖ.. మెచ్చేలా 'ప్రణాళిక'!

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) బృహత్తర ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్) పునఃపరిశీలనలో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాల మేరకు పలు సవరణలు చేపట్టారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) లక్ష్యాలకు అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు. అటవీ, నివాస, ఇతర సున్నిత ప్రాంతాల విస్తీర్ణాన్ని ఖరారు చేసి పొందుపరిచారు. దీంతో భూవినియోగం శాతాల్లో మార్పులొచ్చాయి. ఈ నిష్పత్తి ఆధారంగా భవిష్యత్తు విశాఖను నిర్మించనున్నారు. ప్రభుత్వం ఆమోదించిన తర్వాత ఈ ముసాయిదా ప్లాన్ అమల్లోకి వస్తుంది.

ప్రణాళికాయుత అభివృద్ధికి అవకాశం: మహా నగరాల అభివృద్ధిలో భూవినియోగం కీలకమైంది. నిర్దేశిత ప్రాంతాల్లోనే నివాస, పారిశ్రామిక, రవాణాకు సంబంధించిన నిర్మాణాలను చేపట్టాలి. ఉదాహరణకు నివాస జోన్లలో గృహ నిర్మాణాలే ఉండాలి. పారిశ్రామిక జోన్లలో పరిశ్రమలే ఏర్పాటు చేయాలి. మిశ్రమ జోన్‌లో అయితే నివాస, వాణిజ్య నిర్మాణాలు ఏవైనా ఉండొచ్చు. తద్వారా నగరంలో ఒక ప్రణాళికాయుత అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది. గత ప్రభుత్వం 2021లో ఆమోదించిన మాస్టర్‌ప్లాన్‌తో పోలిస్తే సవరించిన ప్లాన్‌లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. నివాస ప్రాంతం, అటవీ విస్తీర్ణం, రోడ్ల జోన్ విస్తీర్ణం కొంత పెరిగింది.

ప్రాంతాలవారీగా గుర్తించిన జోన్లు..

తగరపువలస: వాణిజ్య, నివాస, వివిధ సంస్థలు ★ ఆనందపురం: సంస్థాగత కేంద్రాల అభివృద్ధి, డేటా సెంటర్లు ★ మేహాద్రిగెడ్డ: జలాశయం ఆధునికీకరణ, ఉల్లాస సౌకర్యాలు ★ రావాడ: నివాస ప్రాంతాలు ★ భోగాపురం: ఆర్థిక, వర్తక, వాణిజ్య, ఐటీ, పర్యాటకం, ఏరో సిటీ ★ మధురవాడ: అధిక ఆవాస ప్రాంతం, విభిన్న అవసరాలు, ఐటీ సెంటర్లు ★ హనుమంతువాక: మెడ్‌సిటీ ★ నరవ: బహుళ వినియోగ రవాణా కేంద్రం ★ వైజాగ్ బేసిటీ: కైలాసగిరి నుంచి భీమిలి.

2041-సవరించిన మాస్టర్‌ప్లాన్ ఇలా

అంశం	శాతం
వ్యవసాయ భూమి	41
నివాస ప్రాంతం	17.3
అటవీ భూములు	15.9
మిశ్రమ జోన్	8.5
బ్రౌన్ జోన్	6.30
రోడ్ల నిర్మాణం	5.8
పర్యాటకం, పార్కులు	3.2
పారిశ్రామిక ప్రదేశం	1.1
పబ్లిక్, సెమీ పబ్లిక్ స్థలాలు	0.70
వాణిజ్య ప్రాంతం	0.20

భూ వినియోగం ఆధారంగా వ్యూహాలు

వీఎంఆర్‌డీఏ ముసాయిదా 'మాస్టర్‌ప్లాన్' సిద్ధం

వీఎంఆర్‌డీఏ మొత్తం విస్తీర్ణం: 6836.15 చ.కి.మీ.	జిల్లాలు: విజయనగరం, విశాఖ, అనకాపల్లి
2041సవరించిన ముసాయిదా బృహత్తర ప్రణాళిక విస్తీర్ణం: 4380.67 చ.కి.మీ.	మండలాలు: 52
ప్రస్తుతం సిద్ధమైన బృహత్తర ప్రణాళిక పరిధి: 4380.67 చ.కి.మీ.	గ్రామాలు: 1457

చేతిరాత మార్చుకో.. మార్కులు గెలుచుకో..!

15రోజుల సాధనతో దస్తూరిలో మార్పు

ఏయూ లైబ్రేరియన్ యర్రాజీరెడ్డి శిక్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఎంత బాగా చదివినా.. అక్షరాలు సరిగా లేకపోతే విద్యార్థులకు మార్కులు తగ్గే అవకాశం ఉంది. మార్కుల సాధనలో చేతిరాత కూడా కీలకపాత్ర పోషిస్తుందని చెబుతున్నారు ఏయూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఈ)లో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న **బి.యర్రాజీ రెడ్డి.** ఆయన తన చేతితోనే 70వేల మంది ఏయూ విద్యార్థుల సర్టిఫికెట్లను రాశారు.

★ ఐఏఎస్ఈలో బీఎడ్ చదివే విద్యార్థులకు ఆయన రాత(దస్తూరి) నేర్పిస్తున్నారు. అలాగే ఏయూ తెలుగు మాధ్యమ పాఠశాల విద్యార్థుల చేతిరాతలు మార్చి ఆత్మవిశ్వాసం నింపారు. 15రోజుల సాధనతో చేతిరాతను మెరుగుపర్చుకోవచ్చని చెబుతున్నారు. గోడలపై చిత్రకారుల రాతలను చూసి తానూ ఎందుకు అలా రాయలేను అని సొంతంగా ప్రయత్నించి విజయం సాధించినట్లు చెప్పారు. అందుకు నాలుగు పద్ధతులు కనిపెట్టినట్టు తెలిపారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

నాలుగు విధానాలు ఇలా..

1 మొదటి పద్ధతిలో పెద్ద వృత్తం, పక్కనే చిన్న వృత్తం(జీరో) రాయాలి. వంపులు లేకుండా జీరో రాయడం బాగా సాధన చేయాలి. సరిగా వస్తోందని అనుకున్న తర్వాత యమున వంటి పదాలు రాయాలి. అందులో 'య' అక్షరానికి పెద్ద సున్నా, 'ము' అక్షరానికి చిన్న సున్నా వస్తుంది. తద్వారా చేయి తిరగడం ప్రారంభమవుతుంది. ఆంగ్ల అక్షరమైనా, తెలుగు అక్షరమైనా ఇదే సూత్రం వర్తిస్తుంది.

2 ఈ విధానం పేరు లైట్ అండ్ డార్క్. ఈ పద్ధతిలో ఏదైనా అక్షరం రాసేటప్పుడు కింది నుంచి పైకి సన్నగా, పై నుంచి కిందకు రాసేటప్పుడు దళసరి(తిక్)గా రాయాలి. ఇలా పదేపదే సాధన చేయాలి.

ఈ విధంగా ప్రాక్టీస్ చేయాలి

3 దీన్ని స్ట్రోక్స్ విధానం అంటారు. ఇందులో అక్షరాలను వంపులతో రాయాలి. వీటినే కర్సివ్ అంటారు. ఇవి పైనుంచి కిందకు, ఎడమ నుంచి కుడికి, వాలుగా ఉండే పంక్తులు కలిగి ఉంటాయి.

4 పైమూడు విధానాలు నేర్చుకున్నాక నాలుగో విధానంలో పేర్లు రాయడం సాధన చేయాలి. ఈ విధంగా పది నుంచి 15రోజుల్లో దస్తూరిని మెరుగుపర్చుకోవచ్చు.

శివమ్.. సుందరం

ములగాడ హౌసింగ్ కాలనీలో హిమ శివలింగం

మహాశివరాత్రి పర్వదినం వేళ ఆదివారం నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హరహరమహాదేవ శంభోశంకర నినాదాలతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే క్షీరాభిషేకాలు, అర్చనలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి వేళ లింగోద్భవ సమయంలో నిర్వహించిన రుద్రాభిషేకాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. రాత్రంతా జాగారం చేసి తీరంలో సముద్రస్నానాలు ఆచరించారు. – ఈనాడు, విశాఖపట్నం, సింధియా- న్యూస్‌టుడే

ఆర్కేబీచ్‌లో లింగాకృతి వద్ద భక్తులు

'బాల'హీనతకు స్వస్తి పలుకుదాం..!

ఈనాడు, విశాఖపట్నం: అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులు, పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో వివిధ అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వాటిని చిన్న వయసులో గుర్తించకపోతే సమస్య తీవ్రమయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్కే), రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్కేఎస్కే)లు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన, ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తించి కేజీహెచ్‌లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ (డీఈఐసీ)కు తరలిస్తున్నారు.

ఆర్బీఎస్కేలో ఇలా..: అంగన్‌వాడీ కేంద్రాల్లో అయిదేళ్ల లోపు చిన్నారులకు, పాఠశాలల్లో ఒకటి నుంచి 12వ తరగతి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,22,895 మందికి, పాఠశాలల్లో 71,878 మందికి పరీక్షలు చేసినట్లు అధికారులు తెలిపారు.

★ ఉచితంగా వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలు
★ అండగా ఆర్బీఎస్కే, ఆర్కేఎస్కే కార్యక్రమాలు

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు గుర్తించిన చిన్నారుల వివరాలు

1054	ఎదుగుదల లోపం
1223	పోషకాహార లోపం
5747	వివిధ వ్యాధులు
1066	పుట్టుకతో లోపాలు

4,641 మందికి రక్తహీనత

★ ఆర్కేఎస్కేలో భాగంగా 10 నుంచి 19 ఏళ్ల బాలలకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 19,564 మందిని పరీక్షించగా.. వారిలో 4,641 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు.

★ పుట్టుకతో గుండె జబ్బులున్న 11 మంది చిన్నారులకు విశాఖలోని మెడికవర్, తిరుపతిలో పద్మావతి పిల్లల ఆసుపత్రి, ఆంధ్ర హాస్పిటల్స్‌లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేశారు.

★ అన్ని ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాయంత్రం సమయాల్లో అడాలసెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్‌లు (ఏఎఫ్‌హెచ్‌సీ) నిర్వహిస్తున్నారు. బాలబాలికలకు ఐరన్ మాత్రలు, పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ జనవరి వరకు 23,972 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

179 మంది తరలింపు..

ఆర్బీఎస్కే, ఆర్కేఎస్కే కార్యక్రమాల్లో భాగంగా చిన్నారుల్లో రక్తహీనత, ఎత్తు, బరువు, నేత్ర, వినికిడి, మానసిక రుగ్మతలు, ఇతర ఆరోగ్య సమస్యలను గుర్తిస్తున్నాం. వారి కోసం గతేడాది సెప్టెంబరులో ప్రత్యేక వాహనం అందుబాటులోకి తెచ్చాం. ఇప్పటివరకు ఆ వాహనంలో 179 మంది చిన్నారులను కేజీహెచ్‌లోని డీఈఐసీకి తరలించాం. రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు అందిస్తున్నాం.
– డాక్టర్ హారిక, ఆర్బీఎస్కే జిల్లా సమన్వయకర్త

మంగమారిపేటలో పెద్ద తెరపై క్రికెట్‌ను తిలకిస్తున్న యువత

భారత్ గెలిచే.. అభిమానులు మురిసే

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భారత్-పాకిస్థాన్ మ్యాచ్ వీక్షణకు నగరంలో పలు చోట్ల భారీ తెరలు ఏర్పాటు చేశారు. ప్రారంభం నుంచి అభిమానులు మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకించారు. చిరకాల ప్రత్యర్థిపై విజయం సాధించడంతో హర్షధ్వానాలు చేసి మిఠాయిలు పంచుకున్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి శారదాపీఠం సందర్శన

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ ఆదివారం విశాఖ శారదా పీఠాన్ని సందర్శించి రాజశ్యామల అమ్మవారిని, ఇతర దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు పీఠం ప్రతినిధి కిశోర్‌కుమార్ శర్మ తదితరులు ఆయనకు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అమ్మవారి శేషవస్త్రం, ఆదిశంకరుల ప్రతిమ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన వేద విద్యార్థులు, పండితులతో కాసేపు ముచ్చటించారు.

పండితులు, వేదవిద్యార్థులతో జస్టిస్ సంజయ్ కరోల్

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త
డాక్టర్ రెడ్డి టోటల్ బాడీ చెకప్ సెంటర్
కలెక్టర్ ఆఫీస్ జంక్షన్, కోస్టల్ బేటరీ రోడ్డు, కెనరా బ్యాంక్ ప్రక్కనవున్న LUCID బిల్డింగ్, 4వ అంతస్తు, విశాఖపట్నం
శరీరంలో సైలెంట్‌గా దాగిఉన్న గుండెపోటును మరియు కేన్సర్‌ను 6 నెలల ముందుగానే గుర్తించే టోటల్ బాడీ చెకప్

రూ. 7,500/- విలువచేయు పరీక్షలు కేవలం 3,500/- కే
ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా॥ జి. శివప్రసాద్‌రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.
9393752255, 9393122525
ఈ పథకం 10 రోజులు మాత్రమే | ప్రతీ ఆదివారం శెలవు

పర్యాటక కేంద్రాల సమయాల్లో మార్పు

సిరిపురం (ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: నగరంలో ఐఎఫ్ఆర్ సందర్భంగా వి.ఎం.ఆర్.డి.ఎ. పర్యాటక కేంద్రాల సందర్శన సమయాలను మార్పు చేశారు. విశాఖ పర్యటనకు వస్తున్న విదేశీ పర్యాటకుల సౌలభ్యం నిమిత్తం ఈ నిర్ణయం తీసుకున్నారు. కైలాసగిరి, తొట్ల కొండ, సబ్‌మెరైన్, సీహారియర్, యూహెచ్3హెచ్ హెలికాప్టర్, టి.యు-142 యుద్ధ విమాన మ్యూజియం వద్ద ఈ నెల 16, 17, 18, 19 తేదీల్లో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు 20న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 7 గంటల వరకు వారికి కేటాయించారు. ఆయా సమయాల్లో తప్ప మిగిలిన వేళల్లో సాధారణ ప్రజలకు ప్రవేశం ఉంటుందని వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రథమ వర్ధంతి

అనురాగం, ఆప్యాయతలు మాకు పంచి, మా అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించిన నీవు మానుండి దూరమై నేటికి 1 సం॥ గడిచిననూ నీ మధుర స్మృతులు, జ్ఞాపకాలు మా మదిలో మెదులుతూనే ఉన్నాయి. నీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
భర్త: పీతల అప్పారావు
Retd. VPT, ADVOCATE
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు
కీ॥శే॥ పీతల అప్పలనరసమ్మ గారు
మరణం: 16-02-2025
సంవత్సరీకం: తేది. 16-02-2026
సోమవారం డో.నెం. 9-5-9, తన స్వగృహం (పీతలవానిపాలెం) నందు జరుపబడును.

ఆలోచనకు అంకురం.. హర్షితకు అందలం

గ్లోబల్ సమ్మిట్‌కు ఎంపికైన సబ్బవరం బాలిక

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆలోచనలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) జోడించడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చునని ఓ బాలిక రుజువు చేసి గ్లోబల్ సమ్మిట్‌కు ఎంపికైంది. ఆ వివరాలిలా. సబ్బవరం ప్రతిభా విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న దొడ్డి హర్షిత సంక్రాంతి పండగ కోసం ఆన్‌లైన్‌లో తనకు కావలసిన దుస్తులు బుక్ చేసుకుంది. తీరా అవి వచ్చాక వాటి రంగులు నచ్చలేదు. కొలతలు సరిపోలేదు. కావలసిన సమయానికి అవి చేరకపోవడంతో కొంత అసంతృప్తికి గురైంది. ఎందుకిలా జరిగిందని మొదలైన ఆలోచన ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెట్టింది.

ల్యాప్‌టాప్‌లో కొలతల ఆధారంగా దుస్తులు రూపొందిస్తున్న హర్షిత

ఆలోచన సాగిందిలా..: కావలసిన కొలతలు, రంగు, మనమే ఎంపిక చేసుకుని, సరైన టైలర్‌కు ఇచ్చి కుట్టించుకుంటే సరిపోయేది కదా అని ఆలోచన వచ్చింది. వెంటనే తనకున్న కృత్రిమ మేధ పరిజ్ఞానంతో ఏఐలో లాగిన్ అయ్యింది. వ్యక్తి రంగు, కొలతలను బట్టి ఏయే దుస్తులు, ఫ్యాషన్లు బాగుంటాయో ఏఐ ద్వారా తెలుసుకుంది. దీన్ని మరింత అభివృద్ధి చేస్తే ఎంతోమందికి 'మార్గదర్శి' కావచ్చునని మరింత లోతుగా ఆలోచించింది.

★ ఈ క్రమంలో తాను చదివే పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ మెంటార్ రాజశేఖర్ పర్యవేక్షణలో ఆన్‌లైన్ షాపింగ్‌పై నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో 'ఫ్యాషనీఫై' ప్రాజెక్టును రూపొందించింది. తర్వాత దేశ వ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నుంచి 100 ప్రాజెక్టులను నిర్వాహకులు ఆహ్వానించారు. వాటిలో 50 ఉత్తమ ప్రాజెక్టులను ఈనెల 16 నుంచి దిల్లీలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు ఎంపిక చేశారు. అందులో హర్షిత రూపొందించిన ప్రాజెక్టుకు కూడా చోటు దక్కడంతో పాఠశాల యాజమాన్యం ఆమెను అభినందించింది.

★ ఈమె స్వగ్రామం అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం బంగారమ్మపాలెం. తండ్రి రామారావు విశాఖ షిప్‌యార్డ్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లి శ్రావణి గృహిణి. రెండో తరగతి వరకు సబ్బవరంలోని అమర్ స్కూల్‌లో చదువుకుంది. 3 నుంచి 7వ తరగతి వరకు స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగింది. 8 నుంచి ప్రతిభా విద్యాలయంలో చదువుతోంది.

★ నేను రూపొందించిన ప్రాజెక్టుకు భవిష్యత్తులో మంచి ఆదరణ ఉంటుంది. ఎంబీఏ చేసి వ్యాపార రంగంలో స్థిరపడాలని ఉంది. ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థను ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పించాలని భావిస్తున్నా. –హర్షిత

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

అండమాన్‌లో త్రైపాక్షిక విన్యాసాలు

సింధియా, న్యూస్‌టుడే: ప్రాంతీయ స్థిర భద్రత లక్ష్యంగా ఈనెల 13వ తేదీ నుంచి అండమాన్ సాగర జలాల్లో త్రైపాక్షిక సముద్ర విన్యాసాలు జరుగుతున్నాయని ఆదివారం నేవీ వర్గాలు తెలిపాయి. ఈ విన్యాసాల్లో సంయుక్త ఆపరేషనల్ సంసిద్ధత ప్రామాణికంగా భారత్, జపాన్ స్వీయ రక్షణ దళంతో పాటు ఇండోనేషియా నౌకాదళానికి చెందిన నౌకలు పాల్గొన్నాయని ఆ వర్గాలు పేర్కొన్నాయి. సముద్ర ప్రాంత భద్రతలో సమన్వయంతో కూడిన పరస్పర సహకారం, నిర్వహణ వంటి అంశాలు ఈ విన్యాసాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని తెలిపాయి.

విన్యాసాల్లో పాల్గొన్న ఇండియా, జపాన్, ఇండోనేషియా నౌకలు

సింహగిరిపై మల్టీ లెవెల్ పార్కింగ్‌కు సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై పార్కింగ్ సమస్య పరిష్కారంపై అధికారులు దృష్టి సారించారు. పెరుగుతున్న వాహనాల తాకిడికి అనుగుణంగా పార్కింగ్ సదుపాయం కల్పించేందుకు మల్టీ లెవెల్ పార్కింగ్ భవనం నిర్మించాలని నిర్ణయించారు. ఇది వరకే ఉన్న ఈ ప్రతిపాదనలకు కార్యరూపం కల్పించనున్నారు. సింహగిరి బస్టాండు సమీపంలోని గ్రామ దేవతల ఆలయాల సముదాయం వద్ద బహుళ అంతస్తుల పార్కింగ్ ప్రాంగణం నిర్మాణానికి ఆకృతుల తయారీకి కన్సల్టేషన్ సంస్థలకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆదివారం ఆ సంస్థ ప్రతినిధులు ఈవో జె.వెంకటరావు, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేశారు. అందుబాటులో ఉన్న స్థలాన్ని అనుసరించి అధిక ప్రయోజనం చేకూరేలా ఆకృతులు తయారు చేయాలని ఈవో వెంకటరావు ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ హరిరాజు, ఏఈ రవిరాజు పాల్గొన్నారు.

కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధికి సూచనలిస్తున్న ఈవో వెంకటరావు

నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఈనెల 16 నుంచి 19 వరకు బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ శంఖబ్రతబాగ్చీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐఎఫ్‌ఆర్, మిలాన్ తదితర కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశపాసులు జారీ చేశారని, ఆయా పాసులు ఉన్న వారికే బీచ్ రోడ్డులోకి అనుమతి ఉంటుందన్నారు. స్థానిక నివాసితులంతా తమ తమ వాహనాలను రోడ్లపై కాకుండా, సెల్లార్లలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అతిథులు వస్తున్న నేపథ్యంలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఎవరైనా ఇష్టానుసారంగా ఫొటోలు, వీడియోలు తీసినా...రీల్స్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే వాహనాల పార్కింగ్‌కు అవకాశం ఉంటుందన్నారు.

వేధించే నొప్పుల నుంచి విముక్తి

కేజీహెచ్‌లో అందుబాటులోకి 'పెయిన్ క్లినిక్'

ఈనెల 25 నుంచి పూర్తిస్థాయిలో వైద్య సేవలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : దీర్ఘకాలిక వ్యాధులు, వివిధ రకాల క్యాన్సర్లు, వృద్ధాప్యం కారణంగా తీవ్రమైన నొప్పులతో బాధపడే రోగులకు 'పెయిన్ క్లినిక్'తో ఉపశమనం కలగనుంది. రాష్ట్రంలోనే తొలిసారిగా కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఈనెల 25 నుంచి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించనున్నారు.

★ పూర్వ విద్యార్థుల చొరవ: ఉత్తర అమెరికాలో స్థిరపడిన ఇద్దరు ఆంధ్ర వైద్యకళాశాల పూర్వ విద్యార్థులు అందించిన ఆర్థికసాయంతో కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) అత్యవసర వైద్య విభాగం పైఅంతస్తులో 'సెంటర్ ఫర్ పెయిన్ మేనేజ్‌మెంట్ (సీపీఎం-పెయిన్ క్లినిక్)'ను ఏర్పాటు చేశారు. ★ వైద్య పరికరాలు, పడకలు: బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా అత్యాధునిక వైద్య పరికరాలతో ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

★ రేడియో ఫ్రీక్వెన్సీ ఎబిలేషన్, సీఆర్మ్, అల్ట్రాసౌండ్ తదితర వైద్య పరికరాలతో చికిత్స అందించనున్నారు. రోగులకు అవసరమైన పడకలను సిద్ధం చేశారు. ఎబిలేషన్ పరికరం ద్వారా నరాల్లో ఎక్కడ నొప్పి ఉందో గుర్తించి, చికిత్స అందిస్తారు. ఒక్కసారి చికిత్స అందిస్తే 12 నెలల నుంచి 18 నెలల వరకు రోగులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఎనస్థీషియా విభాగాధిపతి **డాక్టర్ అపరంజి** పేర్కొన్నారు.

అత్యాధునిక వైద్య పరికరాలతో సిద్ధం చేసిన ఆపరేషన్ థియేటర్

★ ఇంటర్వెన్షనల్, ఫార్మకోలాజికల్, పెయిన్ థెరపి, ఫిజికల్, సైకలాజికల్ థెరపితో పాటు ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా నొప్పుల నివారణకు వైద్యం చేయనున్నారు.

ఓపీ సేవలు ఇలా: ఈ కేంద్రం ద్వారా ఓపీ సేవలతో పాటు, 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆసుపత్రి ఎనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో కేంద్రం కొనసాగనుంది. ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ కె.అపరంజి నోడల్ అధికారిణిగా వ్యవహరించనున్నారు. ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి పర్యవేక్షించనున్నారు.

నేవీ ప్రాంగణాన్ని పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ భద్రత

సింధియా, వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈనెల 17, 18 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరంలో పర్యటించనున్న ప్రదేశాలను నగర పాలనా యంత్రాంగం ఆదివారం నిశితంగా పరిశీలించింది. ఈనెల 17న దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా ఈస్టర్న్ నేవల్ కమాండుకు చెందిన నేవల్ ఎయిర్ స్టేషన్ 'ఐఎన్ఎస్ డేగా'కు ఆమె చేరుకుంటారు. అక్కడి నుంచి డాక్‌యార్డు గోదాముల మీదుగా కమాండు ముఖ్య కార్యాలయం 'ఐఎన్ఎస్ సర్కార్స్'కు వెళతారు. ఆయా మార్గాలను పాలనాధికారులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, డీసీపీ మేరీ ప్రశాంతి, ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆరిఫ్, ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. రూట్ షెడ్యూల్ మ్యాప్ ప్రకారం పటిష్ఠ భద్రతకు అధికారులు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... 17న రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వాగతం పలుకుతారన్నారు. ఆమె 18న ఐఎఫ్‌ఆర్‌లో పాల్గొని, అదే రోజు సాయంత్రం దిల్లీకి పయనమవుతారని పేర్కొన్నారు.

విశాఖ డెయిరీ పాల ధరల పెంపు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ పాల ధరలను స్వల్పంగా పెంచినట్లు యాజమాన్యం ఆదివారం ప్రకటించింది. ఈ ధరలు సోమవారం అమల్లోకి రానున్నట్లు పేర్కొంది. అన్నిరకాల పాల ప్యాకెట్లు అర లీటరుకు రూ.1 చొప్పున, లీటరుకు రూ.2 చొప్పున పెంచారు. కూలీల ధరలు, నిర్వహణ, ప్యాకింగ్, రవాణా ఛార్జీలు పెరగడంతో ధరలు పెంచాల్సి వచ్చిందని యాజమాన్యం తెలిపింది.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి నేపథ్యంలో ఇస్కాన్ మందిరం(సాగర్‌నగర్)లో ఆదివారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర విగ్రహాలను పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ప్రత్యేకపూజలు సోమవారం కూడా కొనసాగుతాయని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ పేర్కొన్నారు. అన్నసమారాధన చేపట్టారు.

తీరంలో యుద్ధ ట్యాంకర్లు

అబ్బురపరిచిన సాహస విన్యాసాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: 'ఐఎఫ్‌ఆర్' నేపథ్యంలో ఆదివారం సాయంత్రం విశాఖ తీరంలో నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, యుద్ధ ట్యాంకర్లతో నిర్వహించిన విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

బాంబులు జారవిడుస్తున్న విమానం

మిలాన్ విలేజ్ ప్రధాన ద్వారం

ప్రదర్శనను తిలకిస్తున్న మహిళలు

ఆకట్టుకున్న 'మిలాన్' విలేజ్

ఈనాడు, విశాఖపట్నం: నావెల్ బేస్‌లోని సముద్రిక వద్ద ఏర్పాటు చేసిన మిలాన్ విలేజ్‌ను ఆదివారం మధ్యాహ్నం తూర్పు నావికాదళ ప్రధాన అధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా ప్రారంభించారు. ఇక్కడ కొయ్యబొమ్మలు, చేనేత వస్త్రాలు, హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేశారు. .. తూర్పు నౌకాదళ అధికారులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కార్యక్రమానికి హాజరైన నావికాదళ అధికారులు, కుటుంబ సభ్యులు

మహిళల మెడలో ఆరోగ్య 'హారం'..

ఈమె చేతిలో ఉన్న దండను చూశారా... ఇది మెడలో వేసుకునే అలంకరణ వస్తువే కాదు.. మహిళలకు ఆరోగ్యాన్ని ఇచ్చే హారం కూడా. దీన్ని భూమి నుంచి తవ్వి తీసిన క్రిస్టల్స్‌తో తయారు చేశారు. తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిలాన్ విలేజ్‌లో [illegible] ప్రదర్శించారు. ఈ హారంలోని క్రిస్టల్స్ మహిళలకు ఆరోగ్యపరంగా ఉపయోగపడతాయని నిర్వాహకులు లాస్య తెలిపారు. ఇవి గుండె లయను క్రమబద్ధీకరించడంతో పాటు భావోద్వేగ స్థిరత్వాన్ని ఇస్తాయని, సంతాన సాఫల్యతను పెంచడానికి సహాయ పడతాయని చెప్పారు. ఇవి దృష్టిని పెంచడంతోపాటు, శక్తిని ప్రసాదిస్తాయని పేర్కొన్నారు. – ఈనాడు, విశాఖపట్నం

నీలకంఠాయ..నమోనమః..!

కనులపండువగా మహా శివరాత్రి వేడుక

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మహా శివరాత్రి సందర్భంగా ఆర్కేబీచ్ తీరంలో ఆదివారం ఉదయం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపీ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో చిన్న పిల్లలు శివలింగాలతో భారీ శివలింగాకృతిని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సుబ్బరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు రుద్రాక్షలు, పసుపు తాళ్లు, ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, పి.రమణకుమార్, టీవీకేర్ కార్యదర్శి ఎస్.కె.రావు, తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ తదితరులు పాల్గొన్నారు.



అభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ సుబ్బరామిరెడ్డి

బారులు తీరిన భక్తులు

చేపలరేవులో సందడే సందడి..!

విదేశీ నౌకాదళ అధికారులు, సిబ్బంది రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్‌ఆర్)లో పాల్గొనేందుకు వివిధ దేశాల సిబ్బంది నౌకల ద్వారా విశాఖ చేపలరేవుకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. సముద్ర జలాల్లో యాంకరేజ్ పాయింట్ల వద్ద నౌకల్లో బస చేసిన వారంతా ఆదివారం మర పడవల ద్వారా చేపలరేవులోని 11వ నెంబర్ జెట్టీ వద్దకు చేరుకున్నారు. వారిని ప్రత్యేక వాహనాల్లో వివిధ ప్రదేశాలకు తరలిస్తున్నారు. విదేశీ అధికారులు, సిబ్బంది రాకపోకలకు వీలుగా దాదాపు వంద బోట్లను సిద్ధం చేసి, ప్రత్యేకంగా ఓ జెట్టీని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు తెలిపారు. విదేశీయుల భద్రతకు పోలీసు యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది.

చేపలరేవులో నిలిపి ఉంచిన బోట్లు

బోట్లలో వచ్చిన సిబ్బంది

కెరటాల ఉద్ధృతికి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

పీఎంపాలెం, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కెరటాల ఉద్ధృతికి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన రుషికొండ బీచ్ సమీప సముద్రతీరంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. కొమ్మాది సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు సమీప వసతిగృహంలో ఉంటున్నారు. ఆదివారం కావడంతో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దరి గోకవరానికి చెందిన పి.అరవింద్‌నాయుడు (21), శ్రీకాకుళం జిల్లా వాసి ససపల రాజీవ్ (21)లు మరో ముగ్గురు స్నేహితులు గోకుల్‌కృష్ణ, ఆదిత్య, సాయిలతో కలిసి ఉదయం 7 గంటలకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. తీరంలో సరదాగా గడిపిన యువకులు 10 గంటల సమయంలో దగ్గరలోని ఓ రిసార్టు వెనుక బీచ్‌కు వచ్చారు. వీరిలో అరవిందనాయుడు, రాజీవ్ సముద్రంలో ఈతకు దిగారు. మిగిలిన ముగ్గురు ఒడ్డున కూర్చున్నారు. ఒక్కసారిగా ఉద్ధృతంగా వచ్చిన కెరటాల్లో చిక్కుకున్న అరవింద్ కేకలు వేయడంతో పక్కనే ఉన్న రాజీవ్ కాపాడేందుకు ప్రయత్నించాడు. దీంతో ఇద్దరూ కెరటాల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. ఒడ్డున ఉన్న స్నేహితులు స్థానికుల సాయంతో జీవీఎంసీ బీచ్, టూరిజం లైఫ్ గార్డులకు సమాచారం అందించారు. వెంటనే వారు బోటు ద్వారా గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి యువకులను రుషికొండ తీరానికి తీసుకొచ్చారు. [illegible] అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మరో విద్యార్థి రాజీవ్‌కు ప్రాథమిక చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడి తండ్రి సూర్యప్రకాష్ ఫిర్యాదు మేరకు ఎస్సై వరహాలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అరవింద్‌నాయుడు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పి.అరవింద్‌నాయుడు (పాతచిత్రం)

భక్తి, సంగీత పుస్తకాలకు ఆదరణ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : భక్తి, సంగీత పరమైన అంశాలపై రచించిన పుస్తకాలు పలువురిని ఆకట్టుకుంటాయని కళాభారతి కార్యదర్శి జి.ఆర్.కె. ప్రసాద్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వీవీఎల్‌శాస్త్రి సంగీత సమితి వ్యవస్థాపకులు ఎ.వెంకటప్పారావు రచించిన 'మనుగాన వైభవం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంగీత కచేరి అలరించింది. పుస్తక రచయిత ఎ.వెంకటప్పారావు, గాయకులు [illegible] జి.సుదర్శనరావు, డి.స్వర్ణకుమారి, పి.రాజేశ్వరి, కె.విజయశ్రీ, సాయిశేఖర్, ఎం.వీ.రాజశేఖర్, కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు ప్రదర్శిస్తున్న ప్రసాద్, తదితరులు

నృత్య ప్రదర్శనలు అదరహో

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం కూచిపూడి నాట్య అకాడమీ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన వివిధ శిక్షణ సంస్థలకు చెందిన సుమారు 180కి పైగా నాట్య కళాకారులు పాల్గొని కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. పలువురి కళాకారులను సత్కరించారు. కూచిపూడి రంగంలో 45 ఏళ్లుగా విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ పసుమర్తి వెంకటరమణ దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మణికుమార్, రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పసుమర్తి వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నృత్యాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో మార్టగేజ్/ టేకోవర్ లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. * నో సిబిల్/ నో బ్రోకర్స్. *MSR గ్రూప్, వైజాగ్. Ph: 9121314141

HEALTH & CARE

PILES

పైల్స్, భగందరం, ఫిషర్ స్పెషలిస్ట్ : Dr. Prem Kumar, Mrs. Deepti వైజాగ్ : సింగ్ హోటల్ జంక్షన్, జడ్జికోర్ట్ దగ్గర & గాజువాక: శ్రీహరిపురం చర్చ్ డౌన్. ✆ 8309200608, 9866070593.

REAL ESTATE

FLAT FOR SALE

SANKARAMATHAM

వైజాగ్ మధురానగర్లో 1370Sft 3BHK, E/F, U/D 56.5 గ॥ 100Sft కార్ పార్కింగ్ 9రోజుల్లో రిజి॥ చేసుకుంటే కేవలం రూ. 94,50,000/- మాత్రమే ✆ 7981768246.

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ 'మం' గోవిందాపురం రోడ్డు హైవేకి 1/2KM తారురోడ్డు ఫేసింగ్ 9&4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం & హోటల్ లీజుకు కలదు. ✆ 9440255187.

PLOT FOR SALE

TAGARAPUVALASA

Ready To Consrtction 267 sq.yds VUDA plot, Rainbow estate layout @ tirumla schol, Talavalsa. Buyers only. ✆ 9704910838.

JOBS

Wanted Experienced Civil Engineers for MES & DGNP Govt. Projects. SSV Infra Projects. 9010597999. vidyasagardvp@gmail.com

Required Accountant (Female) Experience in GST Filing and Tally for our Granite Export Company at Vizag. ✆ 9908664521.

Urgently Wanted I.T.I. Fitter/ Electrical Diploma, B.Tech., (M.Tech) (EEE) B.Sc/ M.Sc/ Q.C/ Q.A Total Canddidates Freshers/ Experience. Ph: 9885986085.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

FACULTY/ TEACHERS

గాజువాకలో విశాఖ డిఫెన్స్ అకాడమీ కొరకు టెలీకాలర్స్ Female కావలెను. ఇంటర్/ డిగ్రీ, జీ॥ 8K. 9AM to 6PM. 9848577745/ 9666694545

SECURITY GUARDS

జై గణేష్ సెక్యూరిటీ సంస్థలో విశాఖ స్టీల్ ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డులు 16 మంది, డ్యూటీ 8 గం॥ W/H, జీతం నెలకు ₹16,500/, PF & ESI, సెక్యూరిటీ సూపర్‌వైజర్ (Ex-Service or Civil) 9 మంది, జీతం ₹20,000/, **ఉచిత** నివాసం, సబ్సిడీ భోజనం, యూనిఫాం ఉచితం ✆ 93460 01964

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రైవేటీకరణతో రిజర్వేషన్లకు ముప్పు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలతో రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయని సీఐటీయూ నాయకురాలు పి.మణి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణతో ఉపాధికి ముప్పు అనే అంశంపై ఆదివారం సిటూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ఆందోళనలో ఆమె మాట్లాడారు. పెట్టుబడిదారులు రిజర్వేషన్లు పక్కన పెట్టి, పైరవీలు చేసే వారికే ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి.. ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలకాలని ఆమె కోరారు.

మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు మణి

మార్చిలో నూకాలమ్మ ఆలయ పునఃప్రారంభం

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి నూకాలమ్మ ఆలయ పునః ప్రారంభం వచ్చే నెలలో చేపడతామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఆలయంలో పనులను ఆయన ఆదివారం జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణతో కలిసి పరిశీలించారు. నూకాలమ్మ జాతర మార్చి 17న ప్రారంభమవుతుందన్నారు. ఈలోగా ఆలయం ప్రారంభిస్తామన్నారు. పనులు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. నెల రోజులు నిర్వహించే జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముందుగా ఆయన నూకాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను, కార్యనిర్వహణ అధికారి వై.శ్రీధర్ పాల్గొన్నారు. తొలగించిన శంకుస్థాపన శిలాఫలకాలు నూతన ఆలయంలో ఏర్పాటు చేయాలని దేవస్థానం పూర్వపు ఛైర్మన్ కొణతాల మురళి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఈవో శ్రీధర్‌కు వినతపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రాంభించామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుడి నిర్మాణానికి అడ్డు ఉండరాదనే ఉద్దేశంతో కార్యాలయం గోడకు తాత్కాలికంగా అతికించామన్నారు. వీటిని నూతన ఆలయం ప్రాంగణంలో సముచిత స్థానంలో ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఆలయ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

23న మిస్టర్ ఆంధ్ర శరీర సౌష్టవ పోటీలు

సీతంపేట, న్యూస్‌టుడే: ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అనుబంధ సంస్థలు తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ (టీబీబీఏ), విశాఖ బాడీ బిల్డింగ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 9వ మిస్టర్ ఆంధ్ర శరీర సౌష్టవ పోటీలు ఈనెల 23న నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు విశాఖ బౌన్సర్స్ వ్యవస్థాపకులు శివ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బోర కోటిరెడ్డి, రాజారావు, గున్న రామకృష్ణారావు, శివశంకర్, మమ్మీప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

భక్తిశ్రద్ధలతో మూడు పీఠాల పండగ

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : జ్ఞానాపురం సమీప పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఆదివారం మూడు పీఠాల పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుముల బాలశౌరీ చేతుల మీదుగా చర్చిలో చిన్నారులకు కొత్తగా దివ్య సత్ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రైస్తవ విశ్వాసులంతా రానున్న తపస్సుకాలానికి సిద్ధం కావాలని సూచించారు. సాయంత్రం 4 గంటలకు పురవీధుల్లో ప్రదక్షిణ నిర్వహించారు. మొదటి దివ్య సత్ప్రసాద పీఠాన్ని వడిచర్లవీధిలో, రెండో పీఠాన్ని స్లీవగుర్తు మండపంలో, మూడో పీఠాన్ని పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఏర్పాటు చేసి ఏసుక్రీస్తును ఆరాధించారు. కార్యక్రమంలో చర్చి విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్, సహాయ విచారణ గురువులు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

దివ్యసత్ప్రసాదం వద్ద ప్రార్థనలు చేస్తున్న అర్చిబిషప్ బాలశౌరీ

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్డ్	206	230
స్కిన్‌లెస్	234	240

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1: **ఫంకీ**

స్క్రీన్-2: **మన శంకర వరప్రసాద్ గారు**

తీరంలో సముద్ర స్నానాలకు ఏర్పాట్లు

పరవాడ, న్యూస్‌టుడే: ముత్యాలమ్మపాలెం తీరం వద్ద సోమవారం భక్తుల పుణ్యస్నానాల కోసం ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి జాగారం చేసిన భక్తులు తెల్లవారుజామున తీరానికి చేరుకుని సముద్ర స్నానాలు చేయనున్నారు. ఈ మేరకు తీరం వద్ద దుస్తులు మార్చుకోవడానికి వసతి సదుపాయం కల్పించారు. వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీసులు శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నారు.

19 నుంచి బ్రహ్మోత్సవాలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆదివారం పలువురు ప్రముఖులకు అందజేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, అదీప్ రాజ్, కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, బమ్మిడి రమణ, ముమ్మన దేముడు, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులకు ఆహ్వానం అందజేసి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు ఆహ్వానపత్రాలు అందజేశారు. ఈ వేడుకలు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని ఈవో బండారు ప్రసాద్ పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం పెద్దస్వయంభూవరంలో నిరుపయోగంగా ఉన్న శిథిల పాఠశాల భవనం పరిసరాల్లో ప్రమాదం పొంచి ఉంది. –శ్రీను, స్థానికుడు ✓: వెంటనే పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – రమేశ్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం చినగొల్లలపాలెం వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. – పి.అప్పలనాయుడు ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

?: సబ్బవరం మండలం పెద గొల్లలపాలెం వద్ద వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద వెంటాడుతోంది.– స్థానికులు, పెదగొల్లలపాలెం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – ఎస్.త్రినాథ్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ, సబ్బవరం.

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 93వవార్డు బొబ్బిలివారి వీధిలోని ప్రధాన కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. –రాజారావు, స్థానికుడు ✓: కాలువలను వెంటనే శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. – ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎట్టకేలకు వ్యర్థాల తరలింపు

స్పందనకు వందనం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ సమస్యను 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ స్పందించారు. సిబ్బందితో శుభ్రత పనులు చేపట్టారు.

'అంగన్‌వాడీ'లకు ఆరోగ్య కిట్లు

పరవాడ, న్యూస్‌టుడే

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా ప్రాథమిక చికిత్స కిట్లు అందించింది. గత ప్రభుత్వ హయాంలో ఈ కిట్ల కొరత కారణంగా ఇబ్బందులు పడేవారు. పిల్లలు గాయపడితే సమీప ప్రయివేట్, ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక వైద్యం అందించాలనే లక్ష్యంతో వైద్యానికి అవసరమైన కిట్లు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పిల్లలకు ప్రాథమిక చికిత్స. సంబంధిత కేంద్రంలోనే అందనుంది. నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఇటీవల ప్రభుత్వం నుంచి మెడికల్ కిట్లు సరఫరా అయ్యాయి.

11 రకాల ఔషధాలు

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించిన కిట్‌లో 11రకాల మందులున్నాయి. చేతుల శుభ్రతకు శానిటైజర్, బ్యాండేజ్, కాటన్‌తో పాటు కంటి మందు, ఆయింట్‌మెంట్, జ్వరం, దగ్గు, జలుబు, విరేచనాలు, గజ్జి, దురదలు, కాలిన గాయాలు, చర్మవ్యాధుల నివారణ మందులు సంబంధిత కిట్‌లో ఉంచారు. ఏ ఔషధం ఎంత వాడాలి, ఏ మోతాదులో చిన్నారులకు ఇవ్వాలనే వివరాలు కిట్‌లో పొందుపరిచారు.

పరవాడ కేంద్రానికి వచ్చిన మందులు

★ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎవరికి చిన్నపాటి గాయం, ఆరోగ్య సమస్య తలెత్తినా ప్రథమ చికిత్స చేయడానికి మెడికల్ కిట్లు ఎంతో ఉపయోగపడతాయి. కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం వీటిని సరఫరా చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇటీవల కిట్లు చేరుకున్నాయి. కేంద్రాల్లో ఎవరికైనా అత్యవసర ప్రాథమిక చికిత్స చేయడానికి కిట్లు ఎంతో మేలు చేస్తాయి.

– శ్యామలాకుమారి, ఐసీడీఎస్ పరవాడ సెక్టార్ సూపర్‌వైజర్

నియోజకవర్గంలో మండలాల వారీగా వివరాలిలా..

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	3–6ఏళ్ల మధ్య చిన్నారులు	7–13 మధ్య వయసున్నవారు	గర్భిణులు	బాలింతలు
పెందుర్తి	225	10075	15693	2768	2568
పరవాడ	81	676	1697	389	389
సబ్బవరం	87	567	1661	315	334
మొత్తం	393	11318	19051	3472	3291

పాఠశాల స్థలం కాపాడాలని నిరసన

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 74వ వార్డు కోనవానిపాలెం ప్రభుత్వ పాఠశాల స్థలంలో ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ శ్రీకృష్ణ చైతన్య యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు, నివాసితులు ఆదివారం నిరసన తెలియజేశారు. అనధికార నిర్మాణాలను తొలగించి, పాఠశాలలో వసతులు కల్పించాలంటూ నినాదాలు చేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉరుకూటి అప్పలనాయుడు, కోన రమణ, కోన అప్పలస్వామి మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం ఉక్కు పునరావాస శాఖ పాఠశాలకు 214 చ.గ. స్థలం కేటాయించిందని, కొంత భాగంలో భవనం నిర్మించి, మిగిలిన స్థలంలో పిల్లలు ఆటలు ఆడుకునేవారు. ఓ వ్యక్తి ఆ స్థలాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలు సాగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్‌పీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నివాసితులు

బౌద్ధ పునరుద్దీపన కరపత్రాల ఆవిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే: బౌద్ధ ధర్మం ప్రాముఖ్యత తెలియజేసే ప్రచారంలో భాగంగా పునరుద్దీపన-2026 కార్యక్రమాన్ని మార్చి 14న నిర్వహించనున్నట్లు బౌద్ధ, దళిత సంఘాలు తెలిపాయి. ఈ మేరకు రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ(ఏఎంఎస్)లో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బొద్దు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, కోశాధికారి గార సత్యనారాయణ, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నేతలు

ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన

వేపగుంట, న్యూస్‌టుడే: నాయుడుతోట వీరాంజనేయ స్వామి ఆలయ పరస, మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే ఆదివారం చేపట్టిన మహాన్నదాన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, గణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా తదితరులు ప్రారంభించారు. ఆలయ దశాబ్దాలుగా ఇక్కడ అన్నదాన నిర్వహిస్తుండడం పట్ల కొనియాడుతూ వ్యాపారి బుద్ధ శివాజీ అభినందించారు. సుమారు 10వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, తదితరులు

ఘనంగా కామాక్షమ్మ తీర్థం

పులగవానిపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధి పులగవానిపాలెంలో కొలువైన కామాక్షి అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో జగన్మాతను దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక నాయకులు శానపతి శంకర్రావు, అవగడ్డ అప్పలనాయుడు, కిశోర్, కాగిత ముత్యాలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రమశక్తినగర్‌లో పూజలందుకున్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, పాల్గొన్న భక్తజనం

పినగాడిలో..

సరిపల్లిలో..

హరహర మహాదేవ..

వాడవాడలా ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

పెందుర్తి సూర్యాలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

పెందుర్తి, న్యూస్‌టుడే: హరహర శంకర.. శివశివ శంకర.. గౌరీమనోహరా.. రక్షించు స్వామి అంటూ అశేష భక్తజనం పరమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పెందుర్తి నియోజకవర్గంలోని శివాలయాలు భక్తజన సంద్రోహంగా మారాయి. వేకువజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు గంగాధరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో విశేష అభిషేకాలు నిర్వహించారు.

★ పెందుర్తి మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పెందుర్తి సీఐ కె.వి.సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ★ జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు శ్రీకాంత్ శర్మ వైదిక కార్యక్రమాలు జరిపించారు. ★ సుజాతనగర్ హరిహర క్షేత్రంలో కేదారేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. పెందుర్తి సూర్యానగర్‌లోని సంపత్ వినాయక ఆలయంలో విశేష హోమాలు చేపట్టారు. ★ పినగాడి చోడేశ్వర స్వామి, సరిపల్లిలోని స్వయంభూ మల్లేశ్వర స్వామి, పెందుర్తి ప్రశాంతినగర్‌లోని స్వయంభూ లింగాల మల్లికార్జున స్వామి, వేంకటాద్రి ఘాట్‌రోడ్డు దరి ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో శ్రీపోలమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు, గ్రామపెద్దలు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయం వద్ద ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎంటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.అప్పలనాయుడు తదితరులు కోరారు. సబ్బవరం సాయినగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మాదిరిగానే 62 ఏళ్ల వరకు తమను కొనసాగించాలన్నారు. 12 నెలల జీతం చెల్లించాలని పింఛన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. వి. ఈశ్వరరావు, సికిలి సూర్యనారాయణ, జ్ఞానేశ్వరి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొగలిపురంలో ఎడ్ల బల్ల పోటీలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మొగలిపురం గ్రామంలో వీరాంజనేయ స్వామి తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఎడ్ల బల్ల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈపోటీలను పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, సబ్బవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గండి దేముడు ప్రారంభించారు. ఉత్కంఠగా జరిగిన ఈ పోటీల్లో వాయిల్లాడకు చెందిన గండి వెంకటరమణ ప్రథమ స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో తుమ్మికపల్లికి చెందిన జయవర్ధన్, మూడో స్థానంలో దేవరపల్లికి చెందిన వారాడ జ్ఞాన ప్రసన్న, నాలుగో స్థానంలో నరసాపురానికి చెందిన కనకదుర్గ నిలిచారు. విజేతలకు రూ.15వేలు, రూ.12వేలు, రూ.10వేలు, రూ.4వేలు నగదు బహుమతులు అందించారు.

జూద శిబిరంపై దాడి.. రూ.1.6 లక్షలు స్వాధీనం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: బాంజీతోట లోని రోడ్డు నెంబర్-7లో ఒక ఇంట్లో గుట్టుగా సాగుతున్న జూద శిబిరంపై సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, న్యూపోర్టు సిబ్బంది ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. జూదమాడుతున్న 8 మందిని పట్టుకుని వీరి నుంచి రూ.1.6 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేటరింగ్ వంట మాస్టర్ ఒకరు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి జూదగాళ్లను రప్పించి శిబిరం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీల అభివృద్ధికి పెద్దపీట: పల్లా

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాకలోని కాలనీల సమగ్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డులో రూ.3.12 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం శిలాఫలకం ఆవిష్కరించి మాట్లాడారు. గాజువాకలో ఇప్పటికే రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సంక్షేమం ఆగిపోయిందని ఆరోపించారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అధ్యక్షత వహించారు. సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు రట్టివాసు, బైపిల్లి గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కూటమి నేతలు

దంపింగ్ యార్డు సమస్యకు.. త్వరలో పరిష్కారం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాకలో ఇళ్ల మధ్య ఉన్న డంపింగ్ యార్డు సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం కనుగొంటామని, ఎవరూ ఆందోళన చెందక్కర్లేదని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గాజువాక జోనల్ కార్యాలయంలో యార్డు పోరాట కమిటీ, జీవీఎంసీ అధికారులు, పోలీసుశాఖ సిబ్బందితో ఎమ్మెల్యే ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యార్డులో నిల్వల వల్ల పరిసర కాలనీల్లో దుర్వాసన పీడిస్తోందని, తగిన చర్యలు తీసుకోవాలని కమిటీ ప్రతినిధులు గంధం శ్రీనివాస్, ఎం.శంకరనారాయణ, రాంబాబు, రమణ కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా త్వరలోనే మంచి నిర్ణయం ప్రకటిస్తామన్నారు. జెడ్సీ శేషాద్రి, సీఎంఓహెచ్ డాక్టర్ నరేశ్ కుమార్, ఏఎంఓహెచ్ కిరణ్‌కుమార్, సౌత్ ఏసీపీ వెంకటరావు, సీఐ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పురుషోత్తపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురం హౌసింగ్ బోర్డు కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఆర్.వి.ఆసుపత్రి, శ్రీనివాస క్లీనిక్, జాస్ దంత ఆసుపత్రికి చెందిన వైద్యులు నివాసితులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. సుమారు వంద మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం అధ్యక్షురాలు గుండమ్మ, సభ్యులు పద్మ, ప్రసాద్, చంద్రశేఖర్, రమణ, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అప్పికొండ సోమేశ్వరస్వామి సన్నిధిలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల దంపతులు, గండి బాబ్జీ తదితరులు

పెదగంట్యాడ మండలంలో..

అప్పికొండ(పరవాడ), న్యూస్‌టుడే: పెదగంట్యాడ మండలం అప్పికొండ సోమేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారి నాగరాజు తెల్లవారుజామున రుద్రాభిషేకం చేపట్టాక భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, మాజీ మంత్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, దేవాదాయశాఖ అధికారులు సుజాత, అన్నపూర్ణ, ఆలయ ఈవో కె.పద్మావతి, కూటమి నాయకులు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయం వద్ద ప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేశారు. సాయంత్రం శివపార్వతుల ఊరేగింపు జరిగాక రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అప్పికొండ తీరంలో సోమవారం జరిగే భక్తుల సముద్ర స్నానాలకు ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ యాజమాన్యం ఆలయానికి ప్రత్యేక బస్సులు నడిపింది. పోలీసులు శాంతిభద్రతలు పర్యవేక్షించారు.

వేపగుంట పరిసర ప్రాంతాల్లో..

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట మెట్టపైగల శివాలయంలో అర్చకులు సోమేశ్వరశర్మ, ఆలయ ధర్మకర్త గంట్ల దేముడు ఆధ్వర్యంలో, కృష్ణానగర్‌లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. నరవలోని స్వయంభూ ఉమానాగలింగేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త గండ్రెడ్డి మహాలక్ష్మీనాయుడు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వేపగుంటలో శివరాత్రి పర్వదినం సందర్భంగా వీరాంజనేయస్వామి ఆలయంలో పరస ఘనంగా జరిగింది. రాత్రి చేపట్టిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. లక్ష్మీనరసింహనగర్ గోపీజనవల్లభస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి పూజలు చేశారు. ఇక్కడి మహిళా అసోసియేషన్ సభ్యులు భక్తిపాటలతో కోలాటాలతో జాగారం చేశారు. ప్రహ్లాదపురం నూకాంబికా అమ్మవారి ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్పొరేటర్ రాపర్తి కన్నా తదితర నాయకులు ఈ పోటీలను తిలకించారు.

నరవలో...

వేపగుంట శివాలయం మెట్టపై..

సబ్బవరం మండలంలో..

సబ్బవరం రామలింగేశ్వరుని మందిరంలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని లింగాల తిరుగుడులో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం కోటి దీపార్చన చేపట్టారు. పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, దేవస్థానం ఛైర్మన్ దొడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

★ సబ్బవరం రామలింగేశ్వరాలయంలో ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు, పూజాద్రవ్యాలు సమర్పించారు. ★ పెదయాతపాలెం ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయంలో గౌరీ పరమేశ్వరులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాధన, రాత్రి ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. ★ దేవీపురంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అన్న సంతర్పణ చేపట్టారు. దేవతల ఊరేగింపు, కల్యాణం నిర్వహించారు.

గణపతిపురంలో..



దేవీపురంలో..



పెదయాతపాలెంలో..

పరవాడ మండలంలో..

పరవాడలో..



తాడిలో..

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ మల్లికార్జునస్వామి, దేశపాత్రునిపాలెం ఉమారామలింగేశ్వరస్వామి, తాడి ఊమానీలంకంఠేశ్వర స్వామి, భరణికం సోమేశ్వరస్వామి, స్వయంభూవరంలోని స్వయంభూలింగేశ్వరస్వామి, ఫార్మాసిటీలోని శివాలయంలలో ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో కళకళలాడాయి. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే దర్శనానికి బారులు తీరారు. స్వామికి పంచామృత, రుద్రాభిషేకాలు చేశారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పరవాడ మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు

సింహాద్రినాథుడికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు

పూజల్లో పాల్గొన్న భక్తజనం

గోవిందరాజ స్వామికి గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో ఆదివారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేశారు.

20న నవశక్తి దేవతల ఆలయ ప్రారంభోత్సవం

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని గంగడిపాలెం, గోవుపేట, చీపుళ్లపాలెం గ్రామాల పరిదేశమ్మతల్లి అమ్మవారి సహిత నవశక్తి దేవతల ఆలయ ప్రారంభోత్సవం ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పుక్కెళ్ల సుందరరావు, వాసుపల్లి గురువులు తెలిపారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విశేష పూజలు, హోమాలు, అన్నదానం, తదితర ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు తప్పనిసరిగా ప్రతివారం కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని ఎస్ఐ లక్ష్మి స్పష్టం చేశారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం జరిగిన కౌన్సెలింగ్‌కు కొందరు రాకపోవడంతో ముందస్తు సమాచారం, అనుమతి లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ లక్ష్మి

మూతపడిన ఆర్వో ప్లాంటు

పిట్టవానిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెంలోని ఆర్వోప్లాంటు పడకేసింది. కొన్నాళ్లుగా మూతపడి ఉన్నా పట్టించుకునేవారే లేరని స్థానికులు వాపోతున్నారు. ప్రజలకు శుద్ధినీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో గతంలో దీన్ని నిర్మించి నిర్వహణ బాధ్యతను జీవీఎంసీకి అప్పగించారు. తొలుత ప్లాంటు బాగానే పనిచేయడంతో గ్రామస్థులు రక్షిత నీటిని వినియోగించుకున్నారు. తర్వాత నిర్వహణ లేక మూతపడింది. ఆర్వో యంత్ర సామగ్రి తుప్పు పడుతోంది. ప్రస్తుతం తాగునీటికి అవస్థలు పడుతున్నామని, సంబంధిత అధికారులు దీన్ని వినియోగంలోకి తేవడానికి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



(c) eenadu

భీమిలి

సినిమాలు
చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేష్ - మన శంకర వరప్రసాద్ గారు
రాములమ్మ - భర్త మహాశయులకు విజ్ఞప్తి
తాతా - సీతా పయనం
సప్తగిరి - ఫంకీ

20న నవశక్తి దేవతల ఆలయ ప్రారంభోత్సవం

చేపలుప్పాడ (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని గంగడిపాలెం, గోవుపేట, చీపుళ్లపాలెం గ్రామాల పరిదేశమ్మతల్లి అమ్మవారి సహిత నవశక్తి దేవతల ఆలయ ప్రారంభోత్సవం ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పుక్కెళ్ల సుందరరావు, వాసుపల్లి గురువులు తెలిపారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విశేష పూజలు, హోమాలు, అన్నదానం, తదితర ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: సుభాష్‌నగర్ (సాగర్‌నగర్) ప్రధాన దారిలో ఓ మద్యం దుకాణం వద్ద వాహనాలు అడ్డంగా పెట్టడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – కాలనీవాసులు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – ప్రభాకర్, సీఐ

?: లక్ష్మీవానిపాలెం(మధురవాడ)లో సరైన కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నాం.– స్థానికులు ✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. – అయ్యప్పనాయుడు, జెడ్సీ.

?: బోయపాలెం నుంచి కాపులుప్పాడ ప్రధాన దారిలో విద్యుద్దీపాలు వెలగక చీకటిమయంగా ఉంటోంది. – స్థానికులు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – విద్యుత్ సిబ్బంది.

?: పీఎంపాలెంలో కంటి ఆసుపత్రి ఎదురుగా ఉన్న దారిలో వీధిదీపాలు వెలగడం లేదు. - పీఎంపాలెం వాసులు ✓:వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. –గాయత్రీ, విద్యుత్ ఏఈ

ఆక్రమణలు.. తప్పని ఇక్కట్లు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస కూడలి, ప్రధానరోడ్డులో రోడ్లు, కాలువలను ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తుండటంతో పారిశుద్ధ్య, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తగరపువలస-భీమిలి మార్గంలో రోడ్డు, కాలువలను ఆక్రమించిన దుకాణదారులు

✦ కూడలిలో పెద్ద పెద్ద దుకాణదారులు అక్కడ కాలువ ఉందన్న సంగతి చూడకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్నిసార్లు చెత్తతో పూడికపోయి మురుగు రోడ్డుపైకి వచ్చి కూడలిని ముంచెత్తుతోంది. అటు తాతా థియేటర్ నుంచి ఇటు రాములమ్మ థియేటర్ వరకూ రోడ్డుకి రెండు వైపులా ఇదే దుస్థితి. అంబేడ్కర్ కూడలి వద్ద, భీమిలి రోడ్డులో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

✦ మరోవైపు దుకాణదారులు కాలువలు కనిపించకుండా నిర్మాణాలు చేపట్టడం ఒక ఎత్తయితే రోడ్డును ఆక్రమించి చిరు వ్యాపారాలకు అద్దెకు ఇస్తుండటం మరో విశేషం. ఈ దుకాణాలకు వచ్చేవారు వాహనాలను రోడ్లపైనే గంటల కొద్దీ పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. రోడ్డంతా కుదించుకుపోయి ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. ఆపరేషన్ లంగ్స్ పేరుతో ఆక్రమణల తొలగింపు చేపట్టిన అధికారులు కొన్నిచోట్ల విడిచిపెట్టడం పట్ల ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆయా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతరలో అలరించిన నృత్య ప్రదర్శనలు

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం కళావేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నగరానికి చెందిన ఎస్పీ డాన్స్ అకాడమీ చిన్నారులైన శ్రీహన్, వర్షిత, మోక్ష, నవనీత, దామిని, నిహారిక తదితరులంతా వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. వీటికి ఎస్.పి. హారిక దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి చిన్నారులకు ధ్రువపత్రాలు అందించి అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

జెడ్పీ అతిథి గృహం మరమ్మతులకు చర్యలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో జీర్ణావస్థకు చేరి మూతపడ్డ జెడ్పీ అతిథి గృహాన్ని కొత్త హంగులతో తీర్చిదిద్దేందుకు రూ.22 లక్షలు మంజూరయ్యాయి. బీచ్ వద్ద సముద్రానికి అభిముఖంగా 1988లో అప్పటి తెదేపా హయంలో దీన్ని నిర్మించారు. ఎంతో మందికి ఆతిథ్యం ఇచ్చిన ఈ గృహం గత పదేళ్లుగా శిథిలావస్థకు చేరి మూతపడింది. దీనిని పునరుద్ధరించేందుకు 15వ ఆర్థిక సంఘం నుంచి తాజాగా జెడ్పీ సీఈఓ పి.నారాయణమూర్తి నిధులు కేటాయించారు. అతిథి గృహంలో ఉన్న మూడు సూట్లతో పాటు ఫంక్షన్ హాలు వంటి సౌకర్యాలతో వినియోగంలోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ఆనందపురం, న్యూస్‌టుడే: గుడిలోవలోని శ్రీరంగనాథ స్వామి ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. రూ.10 లక్షలతో దీన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింహాచలం నాయుడు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్, ఏఈ అప్పలనాయుడు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

దాకమర్రి (తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస-విజయనగరం రోడ్డులోని దాకమర్రి పంచాయతీ అల్లుపేట గ్రామంలో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు సీఐ తిరుమలరావు చెప్పారు. వీరి నుంచి రూ.2050 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

పద్మనాభం, న్యూస్‌టుడే: పీఏసీఎస్ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించకపోతే సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఉద్యోగ సంఘ ప్రతినిధి గెల్ల రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవో 36 అమలు చేయాలని, పదవీ విరమణ వయసు పెంచాలని, 2019 తర్వాత విధుల్లో చేరిన వారిని రెగ్యులర్ చేయాలని కోరారు.

ఇనాం భూ రికార్డుల తారుమారుపై వివాదం!

మజ్జివలస (తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం మజ్జివలస గ్రామంలో ఇనాం భూ రికార్డుల తారుమారు వ్యవహారం చర్చనీయాంశమైంది. భీమిలి మాజీ ఎమ్మెల్యే దాట్ల జగన్నాథరాజు వారసులకు చెందిన 3.41 ఎకరాల భూమి వేరొకరి పేరిట ఆన్‌లైన్ అయినట్లు ఇటీవల జరిగిన రీ సర్వేలో గ్రామ సభల్లో గుర్తించారు. దీనిపై బాధితులు జేసీ, తదితర ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో ఎమ్మెల్యే కుమారుల్లో ఒకరైన డీవీకేజేజే రాజు పేరిట 1బి, అడంగల్, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి జరిగిన పొరపాటును సరిదిద్దారు. ఈ భూమిని తమ పేరిట ఆన్‌లైన్ చేసుకున్న లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొందరు రైతులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆదివారం నిరసనకు దిగారు. దీనికి ప్రతిగా సమావేశం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే వారసులు కుమార్‌బాబు మాట్లాడుతూ 1996 ఇనాం సెటిల్‌మెంట్ చట్టప్రకారం దాదాపు వంద ఎకరాలకు పైగా భూమిని తాము రైతులకు దానం చేశామన్నారు. తమకు వాటాగా వచ్చిన భూముల్లో మూడెకరాల నలభై ఒక సెంట్ల భూమిని నిబంధనలకు విరుద్ధంగా రైతులు ఆన్‌లైన్ చేసుకోవడంతో తాము ఉన్నతాధికారులను ఆశ్రయించి న్యాయం పొందడం జరిగిందన్నారు. ఈ వివాదంపై భీమిలి తహసీల్దార్ రామారావును వివరణ కోరగా రెవెన్యూ రికార్డుల ప్రకారం రైతులు గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఆన్‌లైన్ చేసుకున్న 3.41 ఎకరాల భూమి మాజీ ఎమ్మెల్యే వారసులదిగా నిర్ధారణ కావడంతో జరిగిన తప్పిదాన్ని గుర్తించి ఇటీవల వారి పేరిట తిరిగి ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు.

నేడు హోమియో ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 68వ వార్డు మింది గ్రామంలో ప్రభుత్వ హోమియో ఆసుపత్రి భవన నిర్మాణానికి సోమవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతులమీదుగా భూమిపూజ చేయనున్నట్లు విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం తెదేపా మహిళా అధ్యక్షురాలు ఎస్.అనంతలక్ష్మి తెలిపారు. గతంలో పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉండేది. ఎమ్మెల్యే పల్లా చొరవతో ఆయుష్ శాఖ రూ.30 లక్షల నిధులు కేటాయించడంతో ఇటీవల పాత భవనాన్ని తొలగించారు. ఏఈ కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం భవన నిర్మాణానికి కొలతలు తీశారు.

త్రిమూర్తి శివ జయంతి

ఎండాడ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా ఎండాడలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో త్రిమూర్తి శివ జయంతి మహోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ తిలకించారు. అనంతరం ఆయన్ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మకుమారీ ప్రతినిధి బి.కె.రామేశ్వరి, సంఘ సేవకురాలు లక్ష్మీభార్గవి, తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

పేదలకు అన్నప్రసాదం అందించిన క్లబ్ ప్రతినిధులు

సేవలు అభినందనీయం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: స్థానిక వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యుడు సీహెచ్ రామకోటిభాస్కరరావు జయంతి పురస్కరించుకుని ఆదివారం పీఎంపాలెం రాయల్‌కాజిల్ అపార్టుమెంట్ వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. ఫ్రెండ్స్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు బి.పద్మజ తన తండ్రి గుర్తుగా ఈ సేవ చేపట్టారు. సుమారు 200 మందికి అన్నదానం పొట్లాలను అందించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షురాలు డీజీఈ కె.జ్యోతికమల, కమిటీ కార్యదర్శి ఎస్.రాజ్యలక్ష్మి, కోశాధికారి వి.ఇందిరారావు, జాలీవాకర్ ఎస్.పద్మావతి, ఎన్.రమాదేవి, వై.రంజిత తదితరులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

కొమ్మాది, న్యూస్‌టుడే: క్రియాశీలక సభ్యత్వ నమోదును పెద్దఎత్తున చేపట్టి జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచించారని 5వ వార్డు అధ్యక్షులు దేవర శివ పేర్కొన్నారు. మంగళగిరిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా అధిక సంఖ్యలో క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టిన 50 మంది వాలంటీర్లను ఎంపిక చేశారు. ఈ మేరకు భీమిలి నియోజకవర్గం నుంచి దేవర శివకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా అధినేత పవన్ కల్యాణ్ తమతో అల్పాహారం చేసి స్థానిక సమస్యలను తెలుసుకున్నారని శివ తెలిపారు.


జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో దేవర శివ, తదితరులు

రంగవల్లుల పోటీల్లో ప్రతిభ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి సాంస్కృతిక, నాటక, యోగా, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విశాఖ దండుబజార్ రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద జగన్నాథ నాటక కళాపరిషత్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఈ పోటీలు నిర్వహించారు. రంగవల్లుల విభాగం పోటీల్లో భీమిలికి చెందిన పల్లా భరత్‌కుమార్ కుమార్తె పల్లా నోవజ్ఞ ప్రథమ బహుమతి లభించింది. బాబాసా రావు వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, డాక్టర్ శిష్టా శ్రీలక్ష్మి చేతులమీదుగా నోవజ్ఞను సత్కరించి ప్రశంసా పత్రం, బహుమతి అందించారు.

ప్రథమ బహుమతి పొందిన ముగ్గు

విజేత నోవజ్ఞను సత్కరిస్తున్న దృశ్యం

కరాటే సంఘం సమావేశం

ఐఎన్ఎస్‌కళింగ (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ విశాఖ (ఎస్కేఏవీ) జిల్లా కార్యవర్గ సమావేశం ఐఎన్ఎస్ కళింగ సమీపంలో నేరెళ్లవలస గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వాసుపల్లి శ్రీహరి మాట్లాడుతూ వార్షిక సమ్మర్, టెక్నికల్ సెమినార్లు, ట్రైనింగ్ క్యాంప్‌లు, ఛాంపియన్‌షిప్‌ల నిర్వహణపై చర్చించామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పల్లా సుధాకర్, కోశాధికారి బి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పోలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్కేఏవీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

శంకర శశిధర.. గౌరీ మనోహర

వైభవంగా మహా శివరాత్రి వేడుకలు

మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం శివాలయాలు హరనామ స్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచి భక్తజనం ఆలయాలకు తరలివచ్చి పరమేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు చేశారు. లింగోద్భవ కాలంలో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పరమశివుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు ఉపవాస దీక్షలు, జాగారం చేశారు. – న్యూస్‌టుడే బృందం

మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠం ఆవరణ శివాలయంలో..

రుషికొండ బీచ్‌లోని సప్తరుషీశ్వరాలయంలో అన్నాభిషేకం

మంగమారిపేట రామాద్రి శివాలయంలో..

సాగర్‌నగర్ సాగరేశ్వరాలయంలో

కాశీవిశ్వేశ్వరుడికి కుటుంబ సమేతంగా అభిషేకాలు చేస్తున్న ఈవో వెంకటరావు

భీమిలి యోగా చైతన్య సంస్థలో రుద్రాభిషేకాల్లో పాల్గొన్న దంపతులు

సింహగిరిపై పూజలందుకున్న బాలాత్రిపుర సుందరి సమేత త్రిపురాంతక స్వామి

పద్మనాభంలో పార్వతీ నారాయణేశ్వర స్వామి

అడివివరంలో జలాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మధురవాడ సిద్ధేశ్వరస్వామి పీఠం ఆవరణలో..

తుర్లువాడ గ్రామంలో..

'శక్తి' యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలి

కొమ్మాది, న్యూస్‌టుడే: మహిళలు, విద్యార్థినులు 'శక్తి' యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని పోలీసులు తెలిపారు. నార్త్ సబ్‌డివిజన్ పోలీసు అధికారి సింహాచలం సారథ్యంలో సిబ్బంది ఆదివారం పలు దేవాలయాల వద్ద అవగాహన కల్పించారు. శివరాత్రి సందర్భంగా పెద్దఎత్తున ఆలయాలకు మహిళలు వచ్చే క్రమంలో శక్తి బృందాలు ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠం శివాలయం వద్ద మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టీకాల ప్రాముఖ్యతపై అవగాహన

మురళీనగర్, న్యూస్‌టుడే: మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి సౌజన్యంతో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో పీడియాట్రిక్ దంత వైద్యుడు గౌతమ్ విద్యార్థినులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. దంత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ సమగ్ర ప్రదర్శన ఇచ్చారు. నెలసరి సమయంలో వచ్చే ఇబ్బందులు, వాటి నివారణ, హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో వార్డెన్ గిరీశ్వరి, జిల్లా 101 గవర్నర్ మహేష్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డి.శిరీష, పి.కమల, సి.హెచ్.వరలక్ష్మి, పూర్వ అధ్యక్షులు ఎం.శేషామణి తదితరులు పాల్గొన్నారు.

బార్ లైసెన్స్ రద్దుకు డిమాండ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కలెక్టరేట్ సమీప ఆఫీషియల్ కాలనీ మూడో లైన్‌లో నిబంధనలకు విరుద్ధంగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయొద్దని సీపీఐ, ఏఐటీయూసీ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు ఆదివారం కలెక్టరేట్ వద్ద ఆఫీషియల్ కాలనీలో ధర్నా నిర్వహించారు. బార్ ఏర్పాటుకు జారీ చేసిన లైసెన్స్ రద్దు చేయాలని కోరారు. ఆయా పార్టీల నాయకులు వెంకటేశ్వరరావు, పైడిరాజు, పోలరాజు, నత్తిరాజు తదితరులు మాట్లాడారు. బార్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతానికి ఆనుకుని పలు కాలనీలు ఉన్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వారు పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరారు.

గీతంలో ముగిసిన జాతీయ సదస్సు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, హంసరాజ్ కళాశాల (దిల్లీ యూనివర్సిటీ)కి చెందిన ఇండియన్ నాలెడ్జ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, జాదవ్‌పూర్ వర్సిటీ అంతర్జాతీయ సంబంధాల విభాగం సంయుక్తంగా గీతంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. 'మూర్తీభవించిన న్యాయం భారతదేశంలో స్మృతి హింస స్థితిస్థాపకత' అనే అంశంపై సదస్సు జరిగింది. గీతం ప్రో-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ సిద్ధాంతానికి ఆచరణకు మధ్య ఉన్న సంబంధాన్ని వివరించారు. వక్తలకు జ్ఞాపికలు అందజేశారు. గీతం డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుష్మారాజ్, పలు వర్సిటీలు, ఐఐటీల ప్రొఫెసర్లు, పరిశోధకులు తన్వీర్‌ఫజల్, సలీల్ మిశ్రా, అబ్దుల్‌మతీన్ తదితరులు మాట్లాడారు. ప్రతివ్యక్తి గౌరవంగా, స్వేచ్ఛగా జీవించగలిగే వాతావరణం కల్పించడమే నిజమైన న్యాయమన్నారు.

ప్రొఫెసర్‌ను సత్కరిస్తున్న ప్రొ-వీసీ గౌతమ్‌రావు

సింహాద్రినాథుడికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు

పూజల్లో పాల్గొన్న భక్తజనం

స్వామికి గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

గోవిందరాజ స్వామికి గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో ఆదివారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీ దళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

సాగర తీరంలో శుభ్రత చర్యలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా సాగర్‌నగర్ బీచ్ పరిసరాలను జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రత చర్యలు చేపట్టారు. సందర్శకులకు ఇబ్బంది తలెత్తకుండా వ్యర్థాలు చేరిన తక్షణమే బీచ్ క్లీనింగ్ వాహన యంత్రంతో తొలగించేలా ఏర్పాట్లు చేశారు.

బీచ్ పరిసరాలను యంత్రంతో శుభ్రం చేస్తున్న సిబ్బంది

సముద్ర స్నానాలకు ఏర్పాట్లు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా జాగారం చేసిన భక్తులు సోమవారం ఉదయం భీమిలి సముద్ర తీరంలో పుణ్యస్నానాల ఆచరణకు అనువుగా జీవీఎంసీ, పోలీసు విభాగాల ఆధ్వర్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. భీమిలి వద్ద పవిత్ర గోస్తనీ సాగర సంగమం ఉండటంతో భక్తులు అధికంగా విచ్చేస్తుంటారు. ఇందు కోసం జీవీఎంసీ ఆధ్వర్యంలో భీమిలి తీరంలో ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గుడారాలు, తాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తుతో పాటు గజ ఈతగాళ్లు, కంట్రోల్ పాయింట్ అందుబాటులో ఉంటుందని భీమిలి సీఐ బి.తిరుమలరావు పేర్కొన్నారు.

భీమిలి తీరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

40 మంది పోలీసులతో నిఘా

పీఎంపాలెం, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా రుషికొండ ఐటీ కూడలిలోని సాగర తీరానికి సోమవారం పెద్ద ఎత్తున విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పీఎంపాలెం పోలీసుస్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. సంబంధిత బీచ్ వద్ద భద్రతా ఏర్పాట్లను ఆదివారం రాత్రి స్వయంగా పర్యవేక్షించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు సముద్ర స్నానాలకు వస్తారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసకుంటున్నామన్నారు. 40 మంది పోలీసు సిబ్బందితో పాటు పలువురు ఎస్సైలు, ఏఎస్సైలను విధుల్లో ఉంచుతామన్నారు. తీరం వెంబడి తాత్కాలిక విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశామన్నారు. స్నానాలకు దిగిన భక్తులు లోతుకు వెళ్లి ప్రమాదం బారినపడకుండా ఎప్పటికప్పుడు మైకులతో ప్రచారం చేస్తారని, లైఫ్‌గార్డులు సిద్ధంగా ఉంటారన్నారు.

ఐటీ హిల్స్ కూడలి వద్ద తీరంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఐ బాలకృష్ణ

ఎక్కడికక్కడ భవన నిర్మాణ వ్యర్థాలు

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి ఎండాడ-బీచ్‌రోడ్డు మార్గంలో ఉన్న వైఎల్పీ లేఅవుట్‌లో నిర్మాణ వ్యర్థాల డంపింగ్ అంతకంతకూ పెరిగిపోతోంది. జనావాసాల్లో అంతర్గత రహదారుల పక్కన ఎక్కడ జాగా కనిపిస్తే అక్కడ గుట్టుచప్పుడు కాకుండా వేస్తున్నారు. దీంతో అదంతా రోడ్డుపైకి రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా వ్యర్థాలను అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎండాడ-బీచ్‌రోడ్డు మార్గంలో..

అభివృద్ధికి నోచుకోని అంతర్గత దారులు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో అటుగా వెళ్లే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందికి గురవుతున్నారు. ప్రధానంగా బ్యాంకు లే-అవుట్, భాస్కర్‌నగర్ లే-అవుట్, పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ వెనుక వైపు ఉన్న ప్రాంతాల అంతర్గత రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని అభివృద్ధి చేయాలని పలుమార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని ఆయా కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. వీధిదీపాలు సైతం వెలగడం లేదని, పలు చోట్ల ఖాళీస్థలాల్లో తుప్పలు మొలిచి విషసర్పాలు సంచరిస్తున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

రేవళ్లపాలెం పరిధిలో మట్టి రోడ్డు ఇలా..

(c) eenadu

విశాఖ తూర్పు

సింహాద్రినాథుడికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేదిక సమీపంలోని గోవిందరాజ స్వామిని మాడమ ఛట్టగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

గురువులతోనే జ్ఞాన సంపద మెరుగు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : గురువులను ఆశ్రయిస్తే జ్ఞాన సంపద మెరుగుపడుతుందని ఆధ్యాత్మిక కార్యకర్త ఎం.పి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీప శ్రీ సత్యానంద విశ్వవిహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహా శివరాత్రి, శ్రీ సత్యానంద మహర్షి జయంతిని పురస్కరించుకుని 'గురు వందనం' అనే అంశంపై ప్రసంగించారు. అజ్ఞానం తొలగించి జ్ఞానం ప్రసాదించే శక్తి గురువుల మాటల్లోనే ఉంటుందని, అలాంటి వారిని నిత్యం పూజించి, గౌరవించాలన్నారు. కార్యక్రమంలో మాతాజీ సునంద, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరూ..!

కాలనీవాసులకు తప్పని ఇక్కట్లు

పేరుకుపోయిన వ్యర్థాలు

లాసన్స్‌బేకాలనీ (పెదవాల్తేరు), న్యూస్‌టుడే : పెదవాల్తేరు సమీప లాసన్స్‌బేకాలనీలో వివిధ సమస్యలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా... పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

« ప్రధాన రహదారులతో పాటు, అంతర్గత మార్గాల్లో ఎక్కడికక్కడ పేరుకుపోయిన వ్యర్థాలను సకాలంలో తరలించకపోవడంతో తీవ్ర దుర్వాసన, దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటోంది. పారిశుద్ధ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడంతో సమస్య తీవ్రత పెరుగుతోందని నివాసితులు చెబుతున్నారు.

« పైపులైన్ల ఏర్పాటుకు ఎక్కడికక్కడ రహదారులను పూర్తిగా తవ్వేశారు. ఆయా గోతుల్ని పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..!

తవ్వి వదిలేశారిలా...

« వీధి కుక్కలు గుంపుగా సంచరిస్తూ, ఒంటరిగా నడిచి వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. దీంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు.

★ రహదారులన్నీ గోతులమయంగా మారడంతో.. రాత్రి సమయంలో వాహనచోదకులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

★ ప్రయాణికుల కోసం గతంలో నిర్మించిన బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రయాణికులు వేచి ఉండేందుకు అవస్థలు పడుతున్నారు.

★ కాలువలపై నిర్మించిన కల్వర్టులు, విద్యుత్తు స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్స్‌లు అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. ఆయా సమస్యల్ని పరిష్కరించాలని నివాసితులు కోరుతున్నారు.

ఉద్యానవనం... పూర్తయ్యేదెప్పుడో..?

అసంపూర్తి నిర్మాణాలు

చినగదిలి (ఆరిలోవ), న్యూస్‌టుడే: చినగదిలి బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని ఉన్న ముడసర్లోవ జీవీఎంసీ నర్సరీ ప్రాంగణంలో నిర్మాణం చేపట్టిన 'పిల్లల ఉద్యానవనం' ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో తెలియని దుస్థితి నెలకొంది.

రూ.4 కోట్లతో అంచనాలు

★ 2023లో అప్పటి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇక్కడి ప్రాంతాన్ని సందర్శించి పిల్లలకు అవసరమైన ఉద్యానవనం ఏర్పాటుకు నిర్ణయించారు. ★ సుమారు 3 ఎకరాల స్థలంలో రూ.4 కోట్లు అంచనా వ్యయంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో అనుమతులు రావడంతో, టెండర్లు ఖరారు చేశారు. 2023 జులై నుంచి పనులు ప్రారంభమయ్యాయి. 2025 మార్చి నాటికి పనులు పూర్తి చేసి, పిల్లలకు ఆడుకునేందుకు అవకాశం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ★ 3 నుంచి 14 ఏళ్ల వయసు ఉన్న పిల్లలకు ప్రవేశం ఉంటుందని అధికారులు ప్రకటించారు. దీంతో స్థానికులు ఎంతో సంతోషించారు.

చినగదిలి ప్రాంతంలో పిల్లల ఉద్యానవనం దుస్థితి

ప్రస్తుతం ఇలా..: ★ ప్రాంగణంలో భారీ చెట్లు ఉన్నప్పటికీ, చెట్ల మధ్య నుంచి నడక దారి (వాకింగ్ ట్రాక్) సిద్ధం చేశారు. పిల్లలు ఆడుకునేందుకు కొన్ని నిర్మాణాలు చేపట్టి, మధ్యలోనే వదిలేశారు. ★ అయితే గత వైకాపా ప్రభుత్వ హయాంలో సకాలంలో బిల్లులు అందక పనులు నిలిపేశామని గుత్తేదారు చెబుతున్నారు. ★ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమేర నిధులు విడుదల చేయడంతో... పార్కు చుట్టూ రక్షణ గోడ నిర్మించారు. ★ పార్కుకు ప్రధాన ముఖద్వారం నిర్మించకపోవడంతో ఆకతాయిలు, మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారింది.

పనులు పూర్తయితే..

★ ఉద్యానవనం నిర్మాణం పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకొస్తే.. ఆరిలోవ ప్రాంత పిల్లలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

★ మొక్కలు పెంచడంతో పచ్చదనం వృద్ధి చెంది.. పరిసరాలు ఆహ్లాదకరంగా మారుతాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం, నడక సాధన చేసే వారికి ప్రశాంతమైన వాతావరణం దక్కే వీలుంటుంది.

★ ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి... పిల్లల ఉద్యానవనం నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 11వ వార్డు డ్రైవర్స్‌కాలనీ, అప్సరకాలనీ కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. –స్వామినాయుడు, డ్రైవర్స్ కాలనీ. ✓: సిబ్బందిని పంపి శుభ్రత పనులు చేయిస్తాం. –బంగార్రాజు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్.

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 15వ వార్డు పాతవెంకోజీపాలెం రహదారిపై వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. – కె. పవన్ ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. – కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ?: విశాలాక్షినగర్ కో-ఆపరేటివ్ కాలనీలో దోమలు బెడద ఎక్కువగా ఉంది. –రాజుబాబు, విశాలాక్షినగర్. ✓: దోమల నివారణ మందు చల్లిస్తాం. –శ్రీనివాస్, మలేరియా అధికారి.

స్పందనకు వందనం

ఆరిలోవ, న్యూస్‌టుడే : జీవీఎంసీ 11వ వార్డు ముస్తఫాకాలనీ మురుగు కాలువల్లో పూడికలు పేరుకుపోయిన సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ ఎన్.బంగార్రాజు స్పందించారు. తమ సిబ్బందితో శుభ్రత పనులు చేయించారు.

పరిసరాల పరిశుభ్రత

ఎం.ఎం.టి.సి.కాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: 15వ వార్డు ఎం.ఎం.టి.సి.కాలనీ ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలో రహదారిపై చెత్త కుప్పలు పేరుకుపోయాయని ఆదివారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్ సిబ్బందితో తీయించి శుభ్రం చేయించారు.

పశువుల తరలింపు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాలాక్షినగర్ బీవీకేకూడలి నుంచి హనుమంతువాక స్టేట్‌బ్యాంక్ వరకు ఉన్న ప్రధాన రహదారిలో పశుసంచారం అధికంగా ఉండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడేవారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రాజారవికుమార్ స్పందించారు. తమ సిబ్బందితో పశువులను పట్టించి, తరలించారు.

■ 'బాహుబలి బడ్జెట్'

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ జనరంజకంగా ఉందని విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం తెదేపా అధ్యక్షుడు చోడె పట్టాభిరామ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.3.32 లక్షల కోట్లతో ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టికి ప్రాధాన్యం ఇస్తూ బాహుబలి బడ్జెట్‌గా రూపొందించారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేస్తూ, విశాఖ ఎకనమిక్ జోన్‌కు రూ.26 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం అన్నారు.

■ మాంసం దుకాణాలపై దాడులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మహాశివరాత్రి నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా మాంసం దుకాణాలు తెరిచి, విక్రయాలు జరపడంతో ఆదివారం జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది దాడులు నిర్వహించారు. 28 వార్డు రామ్‌నగర్ పరిసరాల్లో పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ సురేష్, ఇతర సిబ్బంది కలిసి అయిదు దుకాణాలపై దాడులు చేపట్టి, జరిమానాలు విధించారు.

■ 8 మంది జూదరుల అరెస్టు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పెదగంట్యాడలోని న్యూపోర్ట్ పోలీస్‌స్టేషన్ పరిధి భానోజీతోటలో ఆదివారం బహిరంగంగా జూదం ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కరరావు తెలిపారు. వారి వద్ద రూ.1,06,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

■ నేడు సినీ సంగీత విభావరి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: శీతల్ స్వర్ ఈవెంట్స్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు, వ్యాఖ్యాత లక్ష్మీస్వరూప పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం మూడో అంతస్తులో జరుగుతుందన్నారు.

హరహర మహాదేవ.. శంభో శంకర..!

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

మద్దిలపాలెంలో..

ఆరిలోవలో..

ఆరిలోవ, న్యూస్‌టుడే : మహాశివరాత్రి సందర్భంగా తూర్పు నియోజకవర్గంలోని శివాలయాల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి భక్తులు జాగారం చేసి, పూజలు చేశారు. ★ పెదగదిలి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, ఆరిలోవ ముస్తఫాకాలనీ బాలాత్రిపుర సుందరి సహిత మల్లేశ్వర స్వామి, నెహ్రూనగర్ నాగలింగేశ్వర స్వామి, చినగదిలి మృత్యుంజయేశ్వర స్వామి ఆలయాల్లో వేడుకలు జరిగాయి.

చైతన్యనగర్‌లో..

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పెదవాల్తేరు శ్రీ కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు జ్యోతి, దేవారెడ్డి, ప్రధాన అర్చకులు కాశీప్రసాద్, చిన్న అప్పారావు పర్యవేక్షించారు. ★ లాసన్స్‌బే కాలనీలో, ఈస్ట్‌పాయింట్ లెండీవనంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. ★ పెదవాల్తేరులో మృత్యులింగానికి తెదేపా జిల్లా అధ్యక్షులు వెంకటపట్టాభిరామ్ అభిషేకాలు చేశారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : పదో వార్డు రవీంద్రనగర్ కొండపై, ఆదర్శనగర్, కైలాసగిరి కూడలి, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్ తీరంలోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు.

ఎంవీపీకాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: మద్దిలపాలెం ఉమామహేశ్వర పంచాయత ఆలయం, హెచ్‌బీ కాలనీ శ్రీజ్ఞానానంద ఆశ్రమం, గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం, ఇసుకతోట, పీతలవానిపాలెం, ఎంవీపీకాలనీలోని శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగిపోయాయి. ఎంవీపీకాలనీ సత్యసాయి విద్యావిహార్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

పెదవాల్తేరు కాశీ విశ్వేశ్వరాలయంలో...

పెదగదిలి శివాలయంలో..

ఎంవీపీకాలనీ సత్యసాయి విద్యావిహార్ మందిరంలో..

పెదవాల్తేరులో పూజలు చేస్తున్న పట్టాభిరామ్

బార్ లైసెన్స్ రద్దుకు డిమాండ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కలెక్టరేట్ సమీప ఆఫీషియల్ కాలనీ మూడోలైన్‌లో నిబంధనలకు విరుద్ధంగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయొద్దని సీపీఐ, ఏఐటీయూసీ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు ఆదివారం కలెక్టరేట్ వద్ద ఆఫీషియల్ కాలనీలో ధర్నా నిర్వహించారు. బార్ ఏర్పాటుకు జారీ చేసిన లైసెన్స్ రద్దు చేయాలని కోరారు. ఆయా పార్టీల నాయకులు వెంకటేశ్వరరావు, పైడిరాజు, పోలరాజు, నత్తిరాజు తదితరులు మాట్లాడారు. బార్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతానికి ఆనుకుని పలు కాలనీలు ఉన్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వారు పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరారు.

టీకాల ప్రాముఖ్యతపై అవగాహన

మురళీనగర్, న్యూస్‌టుడే: మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి సౌజన్యంతో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో దంత వైద్యుడు గౌతమ్ విద్యార్థినులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. దంత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ సమగ్ర ప్రదర్శన ఇచ్చారు. నెలసరి సమయంలో వచ్చే ఇబ్బందులు, వాటి నివారణ, హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో వార్డెన్ గిరీశ్వరి, జిల్లా 101 గవర్నర్ మహేష్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డి. శిరీష, పి. కమల, సి. హెచ్. వరలక్ష్మి, పూర్వ అధ్యక్షులు ఎం. శేషామణి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సముద్రస్నానాలకు ఏర్పాట్లు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : మహాశివరాత్రి జాగారం చేసే భక్తుల పుణ్యస్నానాలకు వీలుగా జీవీఎంసీ, అటవీశాఖ, మెరైన్, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జోడుగుళ్లపాలెం తీరంలో ఏర్పాట్లు చేశారు. విద్యుత్తు దీపాలు, తాత్కాలిక మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకొచ్చి, భక్తులు దుస్తులు మార్చుకునేందుకు టెంట్లు వేశారు. అప్పుఘర్ తీరంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో తాగునీరు, భక్తుల విశ్రాంతికి టెంట్లు సిద్ధం చేశారు. వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తీరంలో గజ ఈతగాళ్ల పర్యవేక్షణ ఉంటుందని, సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా ఉంచుతామని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

దుస్తులు మార్చుకునేందుకు వీలుగా...

అలరించిన నృత్య ప్రదర్శనలు

వేదికపై కళాకారుల ప్రదర్శన

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : బీచ్‌రోడ్డులో జీవీపీ ఎంఎల్ బీటీ స్కూల్ ఆవరణలో ఆదివారం విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, గాయత్రి విద్యాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శివోహం నృత్య నీరాజనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 257 మంది కళాకారులు హాజరై తమ ప్రదర్శనలతో పలువురిని ఆకట్టుకున్నారు. విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు, ప్రిన్సిపల్ మధురవాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటనపై వ్యతిరేకత

కార్పొరేషన్, న్యూస్‌టుడే : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 'బోర్డ్ ఆఫ్ పీస్'కు భారత ప్రధాని మోదీ వెళ్లడం సరికాదని ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటి విత్ పాలస్తీనా సంఘం ప్రతినిధి సుజన్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ బస్‌స్టాపు వద్ద సంఘం ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెండేళ్లలో 70 వేల మందికిపైగా పాలస్తీనా ప్రజలను ఇజ్రాయెల్ హత్య చేసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన వ్యతిరేకతతో కాల్పుల విరమణ చేసినా, ఆ తర్వాత దాడులు కొనసాగించారన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రధాని పర్యటన తగదని సుజన్ పేర్కొన్నారు. నిరసనలో సంఘం సభ్యులు పాల్గొని నినాదాలు చేశారు.

ఆందోళనలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

దుర్గాలమ్మ సారె ఊరేగింపు

ఊరేగింపులో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, భక్తులు

పూర్ణమార్కెట్(అల్లిపురం), న్యూస్‌టుడే : పూర్ణమార్కెట్ సమీప వెలంపేటలోని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సారెను ఊరేగించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై, ప్రసాద్‌గార్డెన్స్ వద్ద కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. భక్తులకు వివిధ రకాల పిండి వంటలు సిద్ధం చేసి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటీల్లో బాలల ప్రతిభ

విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శిష్లా శ్రీలక్ష్మి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాలు, శివరాత్రిని పురస్కరించుకుని 29వ వార్డు దండుబజార్ రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక, నాటక, యోగా, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. రంగవల్లుల పోటీలో ప్రథమస్థానం సాధించిన పల్లా నొవజ్ఞ(భీమిలి)కు భాజపా వైద్య విభాగం కన్వీనర్ ఆర్.రవికుమార్, డాక్టర్ శిష్లా శ్రీలక్ష్మి, నిర్వాహకులు పల్లా చలపతిరావు తదితరుల చేతుల మీదుగా బహుమతి అందించారు. ఇతర పోటీల్లో విజేతలను అభినందించారు. నిర్వాహకులు హిమబిందు, దుర్గామాధవి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్రిమూర్తి శివ జయంతి

ఎండాడ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా ఎండాడలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో త్రిమూర్తి శివ జయంతి మహోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ తిలకించారు. అనంతరం ఆయన్ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మకుమారీ ప్రతినిధి బి.కె. రామేశ్వరి, సంఘ సేవకురాలు లక్ష్మీభార్గవి, తదితరులు పాల్గొన్నారు.

'విభజించి.. పాలించడంతో తీవ్ర నష్టం'

సమావేశంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర కార్యదర్శి సాధిక్, సభ్యులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : దేశంలో ప్రాంతాలు, మతాలు, కులాల వారీగా విభజించి, పాలించే విధానాలు అమలు చేస్తున్నారని... దీంతో తీవ్ర అనర్థాలు ఎదురవుతాయని అవాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాధిక్ ఆరోపించారు. ఆదివారం జగదాంబకూడలి సమీప సీఐటీయూ(సిటూ) కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో 'గణతంత్ర రాజ్యాంగం.. నేటి సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ... భాజపా ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కుతోందని ఆరోపించారు. కేంద్రం తీరుపై ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం సభ్యులు ఆయూబ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ పునరుద్ధీపన కరపత్రాల ఆవిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే: బౌద్ధ ధర్మం ప్రాముఖ్యత తెలియజేసే ప్రచారంలో భాగంగా భాగంగా పునరుద్ధీపన-2026 కార్యక్రమాన్ని మార్చి 14న నిర్వహించనున్నట్లు బౌద్ధ, దళిత సంఘాలు తెలిపాయి. ఈ మేరకు రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ(ఏఎంసీ)లో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, కోశాధికారి గార సత్యనారాయణ, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ముగిసిన జాతీయ సదస్సు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, హంసరాజ్ కళాశాల (దిల్లీ యూనివర్సిటీ)కి చెందిన ఇండియన్ నాలెడ్జ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, జాదవ్‌పూర్ వర్సిటీ అంతర్జాతీయ సంబంధాల విభాగం సంయుక్తంగా గీతంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. 'మూర్తీభవించిన న్యాయం భారతదేశంలో స్మృతి హింస స్థితిస్థాపకత' అనే అంశంపై సదస్సు జరిగింది. గీతం ప్రొ-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ సిద్ధాంతానికి ఆచరణకు మధ్య ఉన్న సంబంధాన్ని వివరించారు. వక్తలకు జ్ఞాపికలు అందజేశారు. గీతం డైరెక్టర్ డాక్టర్ ఎస్. సుష్మారాజ్, పలు వర్సిటీలు, ఐఐటీల ప్రొఫెసర్లు, పరిశోధకులు తన్వీర్‌ఫజల్, సలీల్ మిశ్రా, అబ్దుల్ మతీన్ తదితరులు మాట్లాడారు. ప్రతివ్యక్తి గౌరవంగా, స్వేచ్ఛగా జీవించగలిగే వాతావరణం కల్పించడమే నిజమైన న్యాయమన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రొ-వీసీ గౌతమ్‌రావు, తదితరులు

పైపు పగిలే.. నీరంతా పోయే..

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పెదవాల్తేరు నుంచి లాసన్స్‌బేకాలనీకి వెళ్లే ప్రధాన రహదారి బస్‌స్టాప్ వద్ద పైపులైన్ పగిలి, నీరంతా వృథాగా పోతోంది. గత కొద్ది రోజుల నుంచి నీరంతా లీకై, రహదారిపైకి చేరుతోంది. దీంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

★ ఈ అంశంపై జీవీఎంసీ నీటి సరఫరా విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్ వివరణ కోరగా.. సిబ్బందిని పంపి, పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు.

గుట్టుగా తెచ్చి.. గుట్టలుగా పోసే..

టీఐసీపాయింట్(ఆరిలోవ),న్యూస్‌టుడే : జీవీఎంసీ 12వ వార్డు పార్వతీనగర్ సమీప శ్రీకాంత్‌నగర్ డబుల్ రోడ్డు నడకదారిలో భవన నిర్మాణ వ్యర్థాల గుట్టలు పేరుకుపోతున్నాయి. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వాహనాల్లో తీసుకొచ్చి, ఇక్కడి ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. దీంతో విషపురుగులు, పశువుల సంచారం పెరిగిందని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి... తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కూడలిలో వెలుగులేవి..?

సుందర్‌నగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : పదో వార్డు పరిధి ఆదర్శనగర్ మసీదు కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్తు దీపం వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంటోందని, చోరీలు జరుగుతున్నాయని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... కూడలిలో వెలుగులు ప్రసరించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ఎర్రన్నాయుడు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని రెండో పట్టణ సీఐ ఎర్రన్నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతీ రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కష్టపడి పని చేసుకుంటూ, కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 37వ వార్డు రెల్లివీధి చేపల మార్కెట్ సమీపంలో అనధికార పార్కింగ్‌లో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. – చెన్నా రాము, స్థానికుడు. ✓: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. – వరప్రసాద్, ఒకటో పట్టణ సీఐ.

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు రామన్నకాలనీ గెడ్డ వ్యర్థాలతో పూడుకుపోయి మురుగు సేవా రహదారిపై ప్రవహిస్తోంది. తీవ్ర దుర్వాసన వస్తోంది. – కె.అరుణ్‌కుమార్ ✓: సిబ్బందిని పంపించి కాలువల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. – వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

వేగనియంత్రికపై జీబ్రాగుర్తులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే

జీవీఎంసీ 37వ వార్డు విశాఖ చేపలరేవు ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన వేగనియంత్రికలపై జీబ్రా గుర్తులు లేకపోవడంతో వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడేవారు. ఈ సమస్యపై ఇటీవల పలుమార్లు 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తలకు అధికారులు స్పందించారు. ఎట్టకేలకు తమ సిబ్బందితో వేగనియంత్రికలపై జీబ్రాగుర్తులు వేయించారు. దీంతో స్థానికులు, వాహన చోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

ట్రాఫిక్ ఐల్యాండ్.. ఉన్నా లేనట్లే!!

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే

నగరంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ఎటువంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఐలాండ్స్ ఏర్పాటు చేశారు. వీటి నుంచి ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రచార బోర్డులు పెట్టారు. అంతవరకు బాగానే ఉన్నా.. అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. ఇందులో ట్రాఫిక్ సిబ్బంది సక్రమంగా ఉండటం లేదు. దీంతో నగరంలోని ప్రధాన కూడళ్లలో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. కొంతమంది ఆకతాయిలు రెడ్ సిగ్నల్ పడినా ఆగకుండా రోడ్డు దాటుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో ఇవి దిష్టిబొమ్మలా మారడంతో పాటు గుత్తేదారుకు మాత్రం ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. ప్రయాణికులు, పాదచారులు కనపడేలా సిగ్నల్ కూడళ్లలోని ఫుట్‌పాత్‌లపై వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో ఐల్యాండ్ నిర్మాణానికి సుమారు రూ.50 వేలు రూ.70 వేల వరకు ఖర్చు అవుతుంది. ఒక్కో యాడ్‌కు నెలకు రూ.5 నుంచి రూ.10 వేల వరకు గుత్తేదారు వసూలు చేసి చేస్తూ ఆదాయం సంపాదిస్తున్నారు.

కంచరపాలెం మెట్టు వద్ద నిరుపయోగంగా ట్రాఫిక్ ఐల్యాండ్

కొరవడిన నిర్వహణ: వీటిపై గుత్తేదారుడి నిర్వహణ లేకుండా పోయింది. ఫ్లైబోర్డులు వరకే బాగున్నాయో లేదో చూస్తున్నారు తప్పితే.. ఐల్యాండ్లు ఎలా ఉన్నాయో కనీసం పట్టించుకోకుండా గాలికి వదిలేశారని ట్రాఫిక్ సిబ్బంది చెబుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది సైతం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో మొత్తం ఎన్ని ట్రాఫిక్ ఐల్యాండ్లు ఉన్నాయో జీవీఎంసీ అధికారులు పరిశీలించి ఎండలు ముదరక ముందే వాటిని బాగు చేయించి ట్రాఫిక్ సిబ్బంది అందులో ఉండి విధులు నిర్వహించేలా చూడాలని, గుత్తేదారు నుంచి పూర్తిస్థాయిలో పన్ను వసూలు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

సగానికి మాత్రమే లెక్క చూపించి: రోడ్ల పక్కన ఐల్యాండ్లు నిర్మించినందుకు గుత్తేదారుడు సంవత్సరానికి ఒకసారి జీవీఎంసీకి కొంత నగదు చెల్లిస్తుంటాడు. సగం మాత్రమే లెక్క చూపించి వాటికి మాత్రమే నగదు చెల్లిస్తున్నాడు. మిగతా వాటికి పన్ను చెల్లించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో సుమారు 200 ఐల్యాండ్లు నిర్మించి జీవీఎంసీకి మాత్రం 100 ఐల్యాండ్లు మాత్రమే లెక్క చూపిస్తున్నాడని పలువురు చెబుతున్నారు. 200 ఐల్యాండ్ల వద్ద ప్రచార బోర్డులు ఏర్పాటు చేసి ప్రతినెలా అద్దె వసూలు చేస్తున్నారు. కొంతమంది జీవీఎంసీ అధికారులే గుత్తేదారుకు అండగా నిలుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

రూ.30 కోట్లతో రహదారి విస్తరణ

శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మాధవధార, న్యూస్‌టుడే: నగరంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటున్నామని దీనిలో భాగంగా ఉత్తర నియోజకవర్గంలోని సీతమ్మధార నుంచి ఆర్అండ్‌బీ జాతీయ రహదారి వరకు సుమారు 11 కిలోమీటర్లు మేర సింహాచలం గిరి ప్రదక్షిణ రహదారిని విస్తరించనున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రూ.30.09 కోట్లతో చేపట్టబోయే రోడ్డు విస్తరణ పనులకు ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుతో కలిసి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ఈ రహదారి 60 అడుగుల మేర ఉంది, దీన్ని 80 అడుగులకు విస్తరించి ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించనున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాసితులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

★ **ముచ్చటగా మూడోసారి శంకుస్థాపన:** ఈ రోడ్డు విస్తరణ పనులకు మూడోసారి శంకుస్థాపన చేశారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, 2023లో వైకాపా అప్పటి సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. వీరంతా ఉన్న రహదారిపైనే మళ్లీ రోడ్డు వేశారు తప్ప విస్తరణ మాత్రం చేయలేదు. ప్రస్తుతం విస్తరణ పేరుతో శంకుస్థాపన చేశారు. ఈ సారైనా పూర్తి స్థాయిలో విస్తరణకు నోచుకునేనా అని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మాంసం దుకాణాలపై దాడులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మహాశివరాత్రి నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా మాంసం దుకాణాలు తెరిచి, విక్రయాలు జరపడంతో ఆదివారం జీవీఎంసీ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. 28 వార్డు రామ్‌నగర్ పరిసరాల్లో పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ సురేష్, ఇతర సిబ్బంది కలిసి అయిదు దుకాణాలపై దాడులు చేపట్టి, జరిమానాలు విధించారు.

గురువులతో జ్ఞాన సంపద మెరుగు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : గురువులను ఆశ్రయిస్తే జ్ఞాన సంపద పెరుగుతుందని ఆధ్యాత్మిక కార్యకర్త ఎంవీ. రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీప శ్రీ సత్యానంద విశ్వవిహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహా శివరాత్రి, శ్రీ సత్యానంద మహర్షి జయంతిని పురస్కరించుకుని 'గురు వందనం' అనే అంశంపై ప్రసంగించారు. అజ్ఞానం తొలగించి జ్ఞానం ప్రసాదించే శక్తి గురువులకు మాత్రమే ఉంటుందని, అలాంటి వారిని నిత్యం పూజించి, గౌరవించాలన్నారు. కార్యక్రమంలో మాతాజీ సునంద, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ఆధ్యాత్మిక గురువు ఎంవీ.రాజశేఖర్

ప్రధాని మోదీ పర్యటనపై వ్యతిరేకత

కార్పొరేషన్, న్యూస్‌టుడే : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 'బోర్డ్ ఆఫ్ పీస్'కు భారత ప్రధాని మోదీ వెళ్లడం సరికాదని ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా సంఘం ప్రతినిధి సుజన్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ బస్‌స్టాప్ వద్ద సంఘం ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెండేళ్లలో 70 వేల మందికిపైగా పాలస్తీనా ప్రజలను ఇజ్రాయెల్ హత్య చేసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన వ్యతిరేకతతో కాల్పుల విరమణ చేసినా, ఆ తర్వాత దాడులు కొనసాగించారన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రధాని ట్రంప్ వెనుక నడవడం సరికాదని పేర్కొన్నారు. నిరసనలో సంఘం సభ్యులు పాల్గొని నినాదాలు చేశారు.

ఆందోళనలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

నిరసన తెలుపుతున్న సీపీఐ శ్రేణులు

బార్ లైసెన్స్ రద్దుకు డిమాండ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కలెక్టరేట్ సమీప ఆఫీసర్స్ కాలనీ మూర్తియాదవ్ కాలనీలో నివాసాలకు విరుద్ధంగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయొద్దని సీపీఐ, ఏఐటీయూసీ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు ఆదివారం కలెక్టరేట్ వద్ద ఆఫీసర్స్ కాలనీలో ధర్నా నిర్వహించారు. బార్ ఏర్పాటుకు జారీ చేసిన లైసెన్స్ రద్దు చేయాలని కోరారు. ఆయా పార్టీల నాయకులు వెంకటేశ్వరరావు, పైడిరాజు, పోలరాజు, నత్తిరాజు తదితరులు మాట్లాడారు. బార్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతానికి ఆనుకుని పలు కాలనీలు ఉన్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వారు పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎరుకుమాంబకు ప్రత్యేక పూజలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దొండపర్తిలో కొలువైన ఎరుకుమాంబ అమ్మవారిని ఆదివారం ఉదయం దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఈవో సురేఖారాణి, అర్చకులు ఆలయ సంప్రదాయ ప్రకారం ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు గొలగాని వీరారావు, ఆళ్ల లీలావతి, 27వ వార్డు తెదేపా అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీవరప్రసాద్, నాయకులు ఆకిరెడ్డి జగదీష్, ఎస్.వి.ఎస్. ప్రకాష్ రెడ్డి, కారాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్లు, కూటమి నాయకులు

దుర్గాలమ్మ సారె ఊరేగింపు

ఊరేగింపులో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, భక్తులు

పూర్ణామార్కెట్(అల్లిపురం), న్యూస్‌టుడే : పూర్ణ మార్కెట్ సమీప వెలంపేటలోని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సారెను ఊరేగించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై, ప్రసాద్‌గార్డెన్స్ వద్ద కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. భక్తులకు వివిధ రకాల పిండి వంటలు సిద్ధం చేసి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా విద్యుత్తు వెలుగులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఐఎఫ్‌ఆర్, మిలాన్ తదితర కార్యక్రమాల నేపథ్యంలో ఆర్కే బీచ్ పరిసరాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రధాన రహదారిలోని విభాగిని పై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణ పలువురిని ఆకట్టుకుంటుంది.

'విభజించు.. పాలించడంతో తీవ్ర నష్టం'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : దేశంలో ప్రాంతాలు, మతాలు, కులాల వారీగా విభజించి, పాలించే విధానాలు అమలు చేస్తున్నారని, దీంతో తీవ్ర అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆజాక్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాధిక్ ఆరోపించారు. ఆదివారం జగదాంబకూడలి సమీప సీఐటీయూ(సిటు) కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో 'గణతంత్ర రాజ్యాంగం.. నేటి సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ... భాజపా ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కుతోందని ఆరోపించారు. కేంద్ర తీరుపై ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం సభ్యులు ఆయూబ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర కార్యదర్శి సాధిక్, సభ్యులు

■ 'బాహుబలి బడ్జెట్'

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ జనరంజకంగా ఉందని విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం తెదేపా అధ్యక్షుడు చోడె పట్టాభిరామ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.3.32 లక్షల కోట్లతో ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టికి ప్రాధాన్యం ఇస్తూ బాహుబలి బడ్జెట్‌గా రూపొందించారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేస్తూ, విశాఖ ఎకనమిక్ జోన్‌కు రూ.26 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం అన్నారు.

■ నేడు సినీ సంగీత విభావరి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: శీతల్ స్వర్ ఈవెంట్స్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు, వ్యాఖ్యాత లక్ష్మీస్వరూప పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం మూడో అంతస్తులో జరుగుతుందన్నారు. గాయకుడు సోమేశ్ బృందం గీతాలు ఆలపిస్తారన్నారు. ఆహూతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

■ రోల్‌బాల్ పోటీల్లో ప్రతిభ

మురళీనగర్, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని దిల్లీ పబ్లిక్ పాఠశాలలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగిన అస్మిత స్టేట్‌లెవెల్ రోల్‌బాల్ పోటీల్లో నగరానికి చెందిన బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా అండర్-17 విభాగంలో విశాఖ బాలికల జట్టు పూసర్ల ప్రభ, దీక్షిత, స్నేహ, ఇషిత, అఫ్రీన్, జాహ్నవి, అవని విజేతలుగా నిలిచారు. రోల్‌బాల్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తోట లలిత ప్రియ, కోచెస్ కమిటీ ఛైర్మన్ పి.సంతోష్‌కుమార్ బాలికలకు అభినందనలు తెలిపారు.

పోటీల్లో పాల్గొన్న బాలికలు

వైభవంగా అభయాంజనేయస్వామి పరస

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: తాటిచెట్లపాలెంలోని శ్రీసుందర అభయాంజనేయస్వామి మందిర పరస మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హనుమాన్ వ్రతం నిర్వహించారు. ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆళ్ల నర్సింగరావు, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాసరావు దంపతులు పాల్గొని పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఎన్.సీతారామారావు, ఆర్.గోవింద్ సేతు మాధవశర్మ, ముత్యాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కమిటీ ప్రతినిధులు

సామాజిక సేవలకు ప్రాధాన్యం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : సమాజంలో పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఒకటో పట్టణ ఎస్సై జె. రమేష్ అన్నారు. ఫౌండేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ లీగ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వస్త్రాలు అందజేశారు. శివరాత్రి సందర్భంగా ఆదివారం పూర్ణమార్కెట్టు దుర్గాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంస్థ వ్యవస్థాపకులు దుర్గా మాట్లాడుతూ...అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సెయింట్ జోసెఫ్ కళాశాల అధ్యాపకులు పృథ్వీలా సంఘం సభ్యులు కె.శివ, బి. అప్పలరాజు, టి.అశోక్, సీహెచ్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వస్త్రాలు అందజేస్తున్న ఎస్సై రమేష్

పోటీల్లో బాలల ప్రతిభ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాలు, శివరాత్రిని పురస్కరించుకుని 29వ వార్డు దండుబజార్ రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక, నాటక, యోగా, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. రంగవల్లుల పోటీలో ప్రథమస్థానం సాధించిన పల్లా నావజ్ఞ(భీమిలి)కు భాజపా వైద్య విభాగం కన్వీనర్ ఆర్.రవికుమార్, డాక్టర్ శిష్ట్లా శ్రీలక్ష్మి, నిర్వాహకులు పల్లా చలపతిరావు తదితరుల చేతుల మీదుగా బహుమతి అందించారు. ఇతర పోటీల్లో విజేతలను అభినందించారు. నిర్వాహకులు హిమబిందు, దుర్గామాధవి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శిష్ట్లా శ్రీలక్ష్మి

ఆకట్టుకున్న ముగ్గు

పరమేశ్వరుడికి ప్రణమిల్లి.. శివనామస్మరణతో శోభిల్లి..

మురళీనగర్ ఉమారామలింగేశ్వరుడికి పూజలు

సూర్యాబాగ్ విశ్వేశ్వరస్వామి ఆలయంలో..

పూజలు చేస్తున్న అర్చకులు

వైశాఖి స్పోర్ట్స్ సమీప పార్కు బహుళ అంతస్తుల సముదాయంలో మంచు శివలింగాలు

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విశాఖ ఉత్తరం, దక్షిణం నియోజకవరాల్లోని శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి. స్వామివారికి అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాలు జరిపారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పలు ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. మహిళలు సాయంత్రం ధ్వజస్తంభాల వద్ద దీపాలు వెలిగించారు. రాత్రికి పలు కాలనీ, వాకర్స్ సంఘాల ఆధ్వర్యంలో జాగారాలు చేశారు.

– న్యూస్‌టుడే, మాధవధార, అక్కయ్యపాలెం, మురళీనగర్, తాటిచెట్లపాలెం, వన్‌టౌన్, జగదాంబకూడలి

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీప పాతశివాలయంలో..

శాంతిధామంలో సహస్రదీపాలంకరణ

తాటిచెట్లపాలెం రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

గణేష్‌నగర్‌లోని పంచాయతన దేవాలయంలో..

లలితాపీఠం దర్బార్ హాలులో హోమం చేస్తున్న దృశ్యం

జలధార వద్ద అన్నసమారాధన

మాధవధారలో బారులు తీరిన భక్తులు

టీకాల ప్రాముఖ్యతపై అవగాహన

మురళీనగర్, న్యూస్‌టుడే: మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి సౌజన్యంతో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో పీడియాట్రిక్ దంత వైద్యుడు గౌతమ్ విద్యార్థినులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. దంత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ సమగ్ర ప్రదర్శన ఇచ్చారు. నెలసరి సమయంలో వచ్చే ఇబ్బందులు, వాటి నివారణ, హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో వార్డెన్ గిరీశ్వరి, జిల్లా 101 గవర్నర్ మహేష్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డి.శిరీష, పి.కమల, సి.హెచ్.వరలక్ష్మి, పూర్వ అధ్యక్షులు ఎం.శేషామణి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ నిరోషిణిని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ సభ్యులు

బౌద్ధ పునరుద్దీపన కరపత్రాల ఆవిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే: బౌద్ధ ధర్మం ప్రాముఖ్యత తెలియజేసే ప్రచారంలో భాగంగా భాగంగా పునరుద్దీపన-2026 కార్యక్రమాన్ని మార్చి 14న నిర్వహించనున్నట్లు బౌద్ధ, దళిత సంఘాలు తెలిపాయి. ఈ మేరకు రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ(ఏఎంసీ)లో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, కోశాధికారి గార సత్యనారాయణ, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నేతలు

(c) eenadu

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

సొంత నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం

అగనంపూడి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముందుకొచ్చారు. ఆలయానికి ప్రతి రోజూ అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారు. వారి సౌకర్యం కోసం సొంత నిధులతో మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ కమిటీ ప్రతినిధులు అభినందించారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

వైభవంగా పరస

మల్కాపురం, న్యూస్‌టుడే: పరసలతో గ్రామ ప్రజల మధ్య సంబంధాలు బలపడతాయని ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డులో ఆదివారం దుర్గానగర్, గుడివాడ అప్పన్నకాలనీ, త్రినాథపురానికి సంబంధించి గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన 'శ్రీ శివసాయి వెంకట దుర్గ అభయ ఆంజనేయ కొండదేవతమ్మ' పరసలో ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ప్రారంభించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. వార్డు తెదేపా అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన ప్రారంభిస్తున్న మౌర్యసింహ

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: బీసీ రోడ్డు నుంచి భవానీనగర్ దారిలో వాహనాలు అడ్డదిడ్డంగా పెట్టి దారి లేకుండా చేస్తున్నారు. ఇదే పరిస్థితి వెంపలినగర్, అంబేడ్కర్ కాలనీలోనూ ఉంది. – శ్రీనివాస్, సత్యారావు, **సమాధానం:** సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం. – వెంకటరావు, ఏసీపీ, ?: వడ్లపూడి ఉక్కు కాలనీల్లోని వీధి కాలువలు శుభ్రత లేక అధ్వానంగా ఉన్నాయి. దోమలు ముసురుతున్నాయి. – సన్యాసిరావు, ✔: పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలిచ్చాం. – కిరణ్‌కుమార్, ఏఎంఒహెచ్

కోళ్ల వ్యర్థాలకు.. ఇక పక్కా లెక్క..!

గాజువాక, న్యూస్‌టుడే: మాంసం దుకాణాల నుంచి కోళ్ల వ్యర్థాల తరలింపులో అక్రమాలకు చెక్ పెట్టడానికి మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రజా ఆరోగ్య విభాగం నడుం బిగించింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రతి వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల కార్యదర్శులకు తాజాగా ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. దుకాణాల నుంచి సేకరించిన వ్యర్థాలకు పక్కా లెక్క ఉండేలా మార్గదర్శకాలను జారీ చేశారు. దీంతో వారు ప్రతి దుకాణానికి వెళ్లి రోజువారీ కోస్తున్న కోళ్లు ఎన్ని? ఎంతమేర వ్యర్థాలు వస్తున్నాయి? దుకాణదారుడి పేరు, వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ విధానం వల్ల ఎక్కడా అక్రమాలకు, పొరపాట్లకు తావుండదని చెబుతున్నారు.

ప్రతిజోన్‌కు 2 వాహనాలు కేటాయింపు: నగర వ్యాప్తంగా(ప్రతి ఆది, బుధవారాల్లో) కోళ్ల వ్యర్థాలు సుమారు 25 టన్నుల వరకు వస్తుంటాయి. వీటిని తరలించడానికి ప్రతి జోన్‌కు 2 చొప్పున వాహనాలను కేటాయించారు. గాజువాక నియోజకవర్గంలో సుమారు 250 వరకూ దుకాణాలు ఉన్నట్లు అంచనా. గతంలో ఎంతమేర వ్యర్థాలు ఉత్పత్తయ్యేవి, ఇతర జిల్లాలకు ఎంత వెళ్తుందనేది లెక్కాపక్కా ఉండేది కాదు. చేపల మేతకు వినియోగించేందుకు ఈ వ్యర్థాలకు మంచి డిమాండ్ ఉంటోంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు సిబ్బంది, చోటామోటా నాయకులు వ్యర్థాల తరలింపులో చేతివాటం ప్రదర్శించేవారు. దీనివల్ల జీవీఎంసీ ఆదాయానికి గండి పడటంతో పాటు కోళ్ల వ్యర్థాలు తిన్న చేపలు తినడం వల్ల ప్రజలు అనారోగ్య పాలవుతున్నారు. ఈ దుస్థితికి చెక్ పెట్టేందుకు కమిషనర్ కేతన్‌గార్గ్ పక్కాగా ఆన్‌లైన్ విధానాన్ని తెరముందుకు తెచ్చారు. సచివాలయాల సిబ్బంది నిర్దేశిత దుకాణానికి వెళ్లి ఎన్ని వ్యర్థాలు వస్తున్నాయో రికార్డు చేసి వాటిని మెయిన్ సర్వర్‌కు పంపుతున్నారు. ప్రతి దుకాణానికి ఒక కోడ్ ఇచ్చారు. ఇక్కడి నుంచి తరలించే వ్యర్థాలు నగరంలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు పంపిస్తారు. లోడింగ్, అన్‌లోడింగ్ సమయాల్లో వ్యర్థాలు సమానంగా ఉండేలా ఆదేశాలు ఇచ్చారు.

మాంసం దుకాణం నుంచి వ్యర్థాలను సేకరిస్తున్న సిబ్బంది

పొరపాటు జరిగితే సిబ్బందిదే బాధ్యత: ఒక్క గాజువాక నుంచే ఆదివారం రోజుల్లో 2600 కేజీలు, బుధవారం 1900 కేజీలు వరకు వ్యర్థాలు వస్తున్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీల పర్యవేక్షణ, సచివాలయ కార్యదర్శి నిఘా ఉన్నందున వ్యాపారులు కోడి వ్యర్థాలను దొంగచాటుగా తరలించే అవకాశం ఉండదు. ప్రత్యేక నిఘా, కార్యాచరణ ఉన్నందున కోడి వ్యర్థాల్లో అక్రమాలకు తావుండదని, ఈ విధానానికి వ్యాపారులు కూడా అలవాటు పడి సహకరిస్తున్నారని జీవీఎంసీ గాజువాక జోన్ ప్రజారోగ్య విభాగం ఏఎంఒహెచ్ డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. ఎక్కడైనా పొరపాటు జరిగితే అందుకు వార్డుల్లోని సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కాలనీల అభివృద్ధికి పెద్దపీట: పల్లా

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాకలోని కాలనీల సమగ్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డులో రూ.3.12 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం శిలాఫలకం ఆవిష్కరించి మాట్లాడారు. గాజువాకలో ఇప్పటికే రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సంక్షేమం ఆగిపోయిందని ఆరోపించారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అధ్యక్షత వహించారు. సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు రట్టివాసు, బైపిల్లి గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కూటమి నేతలు

డంపింగ్ యార్డుకు.. త్వరలో పరిష్కారం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాకలో ఇళ్ల మధ్య ఉన్న డంపింగ్ యార్డు సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం కనుగొంటామని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గాజువాక జోనల్ కార్యాలయంలో యార్డు పోరాట కమిటీ, జీవీఎంసీ అధికారులు, పోలీసుశాఖ సిబ్బందితో ఎమ్మెల్యే ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యార్డులో నిల్వల వల్ల పరిసర కాలనీల్లో దుర్వాసన వీడిస్తోందని, తగిన చర్యలు తీసుకోవాలని కమిటీ ప్రతినిధులు గంధం శ్రీనివాస్, ఎం.శంకరనారాయణ, రాంబాబు, రమణ కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా త్వరలోనే మంచి నిర్ణయం ప్రకటిస్తామన్నారు. జెడ్సీ శేషాద్రి, సీఎంఒహెచ్ డాక్టర్ నరేశ్ కుమార్, ఏఎంఒహెచ్ కిరణ్ కుమార్, సౌత్ ఏసీపీ వెంకటరావు, సీఐ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో వినోద ఉత్సవం

వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

పంతులుగారిమేడ(గాజువాక), న్యూస్‌టుడే: పాతగాజువాక హోలీ క్రాస్ చర్చిలో యూత్, మరియ దళం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విందు, వినోదం, వినోద ఉత్సవం సందడిగా సాగింది. పేద విద్యార్థులకు సహాయం చేసేందుకు తోమస్ చరకల్ పేరుతో విరాళాలు సేకరించారు. అనంతరం సామూహిక విందు, వినోదంలో చర్చి సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫాదర్ ఆర్.జి. ప్రకాశ్ తదితరులు పర్యవేక్షించారు.

'విద్యుత్తు బస్సుల పేరుతో ఆర్టీసీ ప్రైవేటీకరణకు యత్నాలు'

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసేందుకు చేస్తున్న యత్నాలు విరమించుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన తప్పదని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు హెచ్చరించారు. కూర్మన్నపాలెంలోని స్టీల్‌సిటీ డిపోలో ఆదివారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు-2, నెల్లూరు-2 తిరుపతి డిపోల్లోని విద్యుత్ బస్సులను పూర్తిగా ప్రైవేటుకు అప్పగించడం వల్ల సంస్థకు నష్టమని, వర్కషాపులు, గ్యారేజీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ముప్పు కలుగుతుందన్నారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బాసుమూర్తి, సంఘం నాయకులు శ్రీనివాసరావు, కేఎస్ఎన్‌మూర్తి, ఎంఎస్‌రావు, జి. తాతాలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

కాలుష్యంపై ప్రజా సంఘాల ధర్నా

గాజువాక, న్యూస్‌టుడే: భారీ వాహనాల కాలుష్యంపై పాత కర్ణవానిపాలెం గ్రామ కమిటీ, నివాసిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, ఇతర కర్మాగారాల నుంచి వస్తున్న వాహనాల నుంచి వెలువడే పొగతో ఉక్కిరిబిక్కిరవుతున్నామని, భారీ వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. గాజువాక నియోజకవర్గం భాజపా కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ పోరాటంలో భాజపా ముందుంటుందన్నారు. వీరంతా రహదారిపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగంలోకి దిగి వారికి నచ్చజెప్పి పంపించేశారు. అఖిలపక్ష నాయకులు సిరసపల్లి అప్పారావు, కరణం శ్రీను, గొంతెన దేవుడు, కొండలరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న నివాసిత సంఘాల ప్రతినిధులు, నాయకులు, స్థానిక ప్రజలు

జూద శిబిరంపై దాడి.. రూ.1.6 లక్షలు స్వాధీనం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: భానోజీతోటలోని రోడ్డు నెంబర్-7లో ఒక ఇంట్లో గుట్టుగా సాగుతున్న జూద శిబిరంపై సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, న్యూపోర్టు సిబ్బంది ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. జూదమాడుతున్న 8 మందిని పట్టుకుని వీరి నుంచి రూ.1.6 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేటరింగ్ వంటమాస్టర్ ఒకరు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి జూదగాళ్లను రప్పించి శిబిరం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిక్కు లేక.. దిక్కులు చూస్తూ..!

దర్పణం

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాకలోని జంతుకబేళా నిర్వహణ చూసే నాథుడు లేక మూలకు చేరింది. శిథిల గదులు, వసతుల లేమి కారణంగా జీర్ణావస్థలో మగ్గుతోంది. మేకలు, గొర్రెలను జీవీఎంసీ వెటర్నరీ విభాగం సిబ్బంది పరీక్షించి ఆ తర్వాత వధించాల్సి ఉంటుంది. ముద్రవేసిన తర్వాతే మాంసం విక్రయాలు జరపాలి. అయితే సరైన సౌకర్యాలు లేక జంతువధ శాల ఏళ్ల తరబడి నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఆదివారం, బుధవారం మొక్కుబడిగా తెరుస్తున్నా అంతగా మూగజీవాల పరీక్ష జరగడం లేదు. దీంతో గాజువాకలో నాణ్యతలేని మాంసం అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తుప్పు పట్టిన శిథిలావస్థలో ఉన్న కబేళా భవనాన్ని పునరుద్ధరించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

కాలువల్లో పోసేసి.. కష్టాలు మిగిల్చి..

బీసీరోడ్డు (గాజువాక), న్యూస్‌టుడే: ఎక్కడా చోటు లేనట్లు డ్రైనేజీలు, గెడ్డల్లో చెత్త పోయడంతో లోతట్టు కాలనీవాసులకు మురుగు కష్టాలు తప్పడం లేదు. గతవారం రోజులుగా డంపింగ్ యార్డును తరలించాలంటూ యార్డు గేటు వద్ద స్థానికులు ఆందోళన చేయడంతో వార్డుల్లో చెత్త తరలింపు సాధ్యం కాలేదు. దీంతో చాలాచోట్ల కాలువల్లో వ్యర్థాలు పారబోశారు. కణితిరోడ్డు, బీసీరోడ్డు, గాజువాక వాంబే కాలనీల్లో ఎక్కడ చూసినా కాలువల్లో వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ఆదివారం అదనపు పారిశుద్ధ్య సిబ్బందితో గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలను వెలికితీయడానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అవస్థలు పడాల్సి వచ్చింది. కాలువల్లో చెత్త పోయకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఫోకస్

త్వరలోనే అంటూ మూడేళ్లు గడిపేశారు..!

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: యూజీడీ పనుల నిమిత్తం రహదారులను ఎక్కడికక్కడ తవ్వేయడంతో అడుగు తీసి అడుగేయడానికి నివాసితులు అవస్థలు పడుతున్నారు. పాతగాజువాక దరి శ్రామికనగర్, టీడీఏ, ఎర్రగెడ్డ, కుంచమాంబకాలనీ, 76వ వార్డు హౌసింగ్ బోర్డు, డెయిరీ కాలనీల్లో దారులు గుంతలు పడి పాడైపోయాయి, వాహన చోదకులకు పరీక్ష పెడుతున్నాయి. త్వరలోనే పనులు చేపడతామంటూనే మూడేళ్లు గడిపేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటే వృద్ధులు, దివ్యాంగులు భయాందోళన చెందుతున్నారు. పలుమార్లు జీవీఎంసీ అధికారులకు పరిస్థితిని వివరించినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

క్లిక్ క్లిక్

నేడు హోమియో ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 68వ వార్డు మింది గ్రామంలో ప్రభుత్వ హోమియో ఆసుపత్రి భవన నిర్మాణానికి సోమవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతులమీదుగా భూమిపూజ చేయనున్నట్లు విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం తెదేపా మహిళా అధ్యక్షురాలు ఎస్.అనంతలక్ష్మి తెలిపారు. గతంలో వంద పడకల భవనం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉండేది. ఎమ్మెల్యే పల్లా చొరవతో ఆయుష్ శాఖ రూ.30 లక్షల నిధులు కేటాయించడంతో జీవీఎంసీ పాత భవనాన్ని తొలగించారు. ఏళ్ల కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం భవన నిర్మాణానికి కొలతలు తీశారు.

పనులను పరిశీలిస్తున్న తెదేపా నాయకులు అనంతలక్ష్మి, ఏళ్ల కల్యాణ్

'విభజించి.. పాలించడంతో తీవ్ర నష్టం'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: దేశంలో ప్రాంతాలు, మతాలు, కులాల వారీగా విభజించి, పాలించే విధానాలు అమలు చేస్తున్నారని... దీంతో తీవ్ర అనర్థాలు ఎదురవుతాయని అవాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాధిక్ ఆరోపించారు. ఆదివారం జగదాంబకూడలి సమీప సీఐటీయూ(సిటూ) కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో 'గణతంత్ర రాజ్యాంగం.. నేటి సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ... భాజపా ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కుతోందని ఆరోపించారు.

కార్మికుడికి ఆర్థిక సాయం అందజేత

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: బెల్లం కార్మికుడిగా పని చేస్తున్న బి.నర్సింహమూర్తి గతనెల 16న గాజువాక వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో కాలుకు బలమైన గాయమైంది. కార్మికులు చందాలు వేసుకుని సుమారు రూ.26,200ను సేకరించి ఆదివారం నర్సింహమూర్తికి అందజేశారు. కష్ట సమయంలో తోటి కార్మికులు అందించిన సాయం మరువలేనిదని బాధితుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు ప్రసాద్, రమేశ్‌బాబు, అప్పారావు, సతీశ్, రమణ, సురేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహమూర్తికి సాయం అందిస్తున్న తోటి కార్మికులు

దర్గాలో ఘనంగా గంధోత్సవం

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక బీసీ రోడ్డులోని బాబా సయ్యద్ మదీనాషా ఔలియా 69వ గంధోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సర్వమత సామరస్యానికి ప్రతీకగా ఈ వేడుక జరుగుతుందని, అందరి జీవితాల్లోనూ మంచి జరగాలని ఆకాంక్షించారు. మాజీ కార్పొరేటర్ ఎండీ రఫీ, కమిటీ సభ్యులు మదీనా వలీ, అన్సార్ వలీ, మోతి, మెర్తాజా, షౌకత్ అలీ, రిజ్వానా, జహంగీర్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా, చిత్రంలో ముస్లిం పెద్దలు

పాఠశాల స్థలం కాపాడాలని నిరసన

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 74వ వార్డు కోనవానిపాలెం ప్రభుత్వ పాఠశాల స్థలంలో ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ శ్రీకృష్ణ చైతన్య యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు, నివాసితులు ఆదివారం నిరసన తెలియజేశారు. అనధికార నిర్మాణాలను తొలగించి, పాఠశాలలో వసతులు కల్పించాలంటూ ఆందోళన చేపట్టారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉరుకూటి అప్పలనాయుడు, కోన రమణ, కోన అప్పలస్వామి మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం ఉక్కు పునరావాస శాఖ పాఠశాలకు 214 చ.గ.స్థలం కేటాయించిందని, కొంత భాగంలో భవనం నిర్మించి, మిగిలిన స్థలంలో పిల్లలు ఆటలు ఆడుకునేవారు. ఓ వ్యక్తి ఆ స్థలాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలు సాగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్‌డీసీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నివాసితులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, న్యూస్‌టుడే: ఫార్మాసిటీ పునరావాస కాలనీలోని ఈదుల పాక వాసుల ఆరాధ్య దేవత పోలమాంబ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

'రాష్ట్ర బడ్జెట్ గణాంకాల పుస్తకం కాదు..'

కరాస, న్యూస్‌టుడే: భవిష్యత్తుకు బ్లూ ప్రింట్‌లా 2026-2027 బడ్జెట్ ఉందని ప్రభుత్వ విప్, పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఆదివారం గోపాలపట్నం తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది గణాంకాల పుస్తకం కాదని కోట్లాది మంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే విజన్ డాక్యుమెంట్ అని, మాటల కోసం కాకుండా ప్రగతి కోసం తీర్చిదిద్దిన బడ్జెట్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశను చూపి ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యంగా దీన్ని రూపొందించిందన్నారు. ప్రతి పేదవాని సొంత ఇంటి కల నెరవేర్చాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గణబాబు తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

పోటీలు స్నేహానికి వారధిగా ఉండాలి

సింధియా, న్యూస్‌టుడే: ఆటల పోటీలు యువకుల మధ్య స్నేహానికి వారధిగా ఉండాలని 61వ వార్డు తెదేపా అధ్యక్షుడు మజ్జి సోమేశ్ అన్నారు. వార్డులో ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. మల్కాపురం లవ్‌బర్డ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా శివరాత్రికి ఆటల పోటీలు నిర్వహించి క్రీడా స్ఫూర్తిని పెంచడం మంచి పరిణామం అన్నారు. టోర్నీకి సహకరిస్తున్న స్థానిక సంఘాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు నాగభూషణం, శ్రీలక్ష్మి, లవ్‌బర్డ్స్ సంఘ సభ్యులు మహేష్, యశ్వంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మజ్జి సోమేశ్

నాతయ్యపాలెంలో..

90వ వార్డులో ఉమాశంకరుడు.. పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం సెక్టారు-6లో..

శ్రీసోమశేఖర పంచాయతన శివాలయంలో..

గుల్లలపాలెం పార్కులో..

కైలాసవాసా.. కరుణించు దేవా..!

సనత్‌నగర్ ఉమారామలింగేశ్వరుడి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గాజువాక, పెదగంట్యాడలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం సనత్‌నగర్ ఉమారామలింగేశ్వరస్వామి, వుడాకాలనీ కాశీ విశ్వేశ్వర, విశాలాక్షి ఆలయాలు, పెదగంట్యాడ బాలచెరువులోని ఉమారామలింగేశ్వరస్వామి, శ్రీనగర్, దుర్గవానిపాలెం, గాంధీనగర్, దత్తసాయినగర్ ఆలయాల్లో మహా రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు చేశారు.

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: నాతయ్యపాలెం కాశీ విశ్వేశ్వరుడు, అక్కిరెడ్డిపాలెం ఉమామహేశ్వరుడు, తుంగ్లాం, షీలానగర్, మింది శివాలయాలకు తెల్లవారుజామునుంచే భక్తులు బారులు తీరారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి.

అగనంపూడి, న్యూస్‌టుడే: పెదమడక కాలనీలోని ఉమామహేశ్వర ఆలయం, కర్రివానిపాలెం, జాబిలీహిల్స్ కాలనీల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి దివ్యజ్యోతి భవనంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో దేశంలో ప్రాముఖ్యత కలిగిన శివలింగాల నమూనాలను ప్రతిష్ఠించారు.

ఉక్కునగరం, న్యూస్‌టుడే: ఉక్కునగరం సెక్టారు-6లోని శివాలయంలో ఉక్కునగరం దేవాలయాల అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా మృత్యుంజయ హోమం, శాంతి కల్యాణం, మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు చేశారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: కూర్మన్నపాలెం బ్రహ్మకుమారీల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగానికి పూజలు చేశారు. కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, ఉక్కు జనరల్ ఆసుపత్రి వైద్యులు నవీన్‌కుమార్, ఉక్కు పూర్వ జీఎం కనకయ్య, కూర్మన్నపాలెం శాఖ బ్రహ్మకుమారీస్ ఇన్‌ఛార్జి రమణి పాల్గొన్నారు.

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతంలోని శివాలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. జింక్ కొండపై శివాలయం, హిమాచల్‌నగర్, మాజీ సైనికుల కాలనీల్లో ఉమారామలింగేశ్వర ఆలయాలు, శ్రీహరిపురం హరిహర క్షేత్రంలో మధ్యాహ్నం వరకు భక్తులతో రద్దీ సంతరించుకుంది. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం పలుచోట్ల హోమాలు నిర్వహించారు.

కరాస, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 52, 56, 57, 90 వార్డులలోని శివాలయాలు ఆదివారం వేకువజాము నుంచి శివనామస్మరణతో మార్మోగాయి. ఈ నేపథ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

పెదమడకలో భక్తి గీతాలు ఆలపిస్తున్న పారాయణ సమితి సభ్యులు

శ్రీహరిపురం హరిహర క్షేత్రంలో..

మల్కాపురం, సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక వాడలో జీవీఎంసీ 40వ వార్డు శ్రీ సాగరగిరి కొండపై శ్రీమల్లికార్జున స్వామి ఆలయంతోపాటు, గాంధీగ్రాం షిప్‌యార్డు కాలనీ, ఏకేసీకాలనీ, ఐఓసీ కూడలి, 62వ వార్డు దుర్గానగర్, ప్రకాష్‌నగర్‌లలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

శివలింగానికి పూజలు చేస్తున్న బ్రహ్మకుమారీలు

జ్యోతిర్లింగాలను తిలకిస్తున్న భక్తులు

యారాడ బీచ్‌లో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు

యారాడ (మల్కాపురం), న్యూస్‌టుడే: మహాశివరాత్రిని పురస్కరించుకొని యారాడ తీరంలో జీవీఎంసీ అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసింది. పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన వసతులు కల్పించినట్లు న్యూపోర్టు, మెరైన్ పోలీసులు తెలిపారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. వీటితో పాటు తాగునీటి సౌకర్యం, సంచార మరుగుదొడ్లు కూడా ఉంటే బాగుండేదని స్థానికులు అభిప్రాయపడ్డారు.

(c) eenadu

పరమేశ్వరం.. పరమానందం

రామతీర్థం కొండ పైనుంచి దిగుతున్న భక్తులు

గజపతినగరం: మరుపల్లి శివాలయంలో..

ఆలయ ప్రాంగణంలో అశేష భక్తజనం

జిల్లా అంతటా ఓంకారనాదం ప్రతిధ్వనించింది. శివయ్య పంచామృతాలతో అభిషేకించి భక్తజనం పులకించిపోయారు. పరమేశ్వరుడికి ప్రణమిల్లారు. కొండలు.. వాగులు.. నదులు దాటుకుని దర్శనాలకు తరలివెళ్లారు. మహాశివరాత్రి వేళ ఆదివారం శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. పుణ్యగిరి, రామతీర్థం తదితర ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.
– న్యూస్‌టుడే, నెల్లిమర్ల, కంటోన్మెంట్, గజపతినగరం

నృత్యనందనం

మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విజయనగరం సేవా కేంద్రం ఆధ్వర్యంలో అయోధ్య మైదానంలో, బాబామెట్ట ఏడుకొండల శివపంచాయతన ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్, మయూరి కూడలి

స్వయం ఉపాధికి కొత్త దారులు

న్యూస్‌టుడే, విజయనగరం మయూరి కూడలి

పేద, మధ్యతరగతి వర్గాలను ఆదుకునేందుకు వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధికి రాయితీతో కూడిన యూనిట్ల మంజూరు కోసం కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. గతేడాది ఎస్సీ, బీసీ, ఓబీసీ, మైనార్టీలకు యూనిట్ల మంజూరుకు రూ.137.52 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత బడ్జెట్‌లో (2026-27)లో కేటాయించింది. దీంతో ఇన్నాళ్లు నిరాశతో ఉన్న ఆయా వర్గాల్లో కొత్త ఆశలు చిగురించాయి.

ఇదీ పరిస్థితి..

విజయనగరం, మన్యం జిల్లాల్లో బీసీ, ఈబీసీ, మైనార్టీ, ఎస్సీ విభాగాల్లో 21 ఏళ్లు దాటిన యువతకు ఆయా కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేస్తామని గతేడాదే ప్రభుత్వం ప్రకటించింది. నేటికి ఒక్క యూనిట్ కూడా మంజూరు కాలేదు. దీంతో ఆ రుణాలు వస్తాయో రావోనని అంతా ఎదురుచూశారు. రెండు జిల్లాల్లో ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకోగా, 5,871 మందికి యూనిట్లు కేటాయించారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీ మొత్తం నేటికీ బ్యాంకులకు విడుదల చేయలేదు. ఈ బడ్జెట్‌లో కేటాయింపుతో ఆ మొత్తం రానుంది. దీంతో యూనిట్ల ఏర్పాటుకు మార్గదర్శకాలు రానున్నాయి.

ఆదేశాలు రాగానే కార్యాచరణ: బీసీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు నిధులు విడుదల కావాల్సి ఉంది. వీటిపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కార్యాచరణ సిద్ధం చేస్తాం.
- జ్యోతిశ్రీ, వెంకటేశ్వరరావు, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, విజయనగరం.

లబ్ధిదారులకు కేటాయింపులు ఇలా..(విలువ రూ. కోట్లలో)

కేటగిరీ	విజయనగరం		మన్యం	
	యూనిట్లు	నిధులు	యూనిట్లు	నిధులు
మైనార్టీ	86	1.33	10	0.32
బీసీ	2942	58.02	1246	25.26
ఈబీసీ	113	3.02	14	0.37
ఎస్సీ	930	31.46	522	17.74

చూసిందొకటి.. రాసిందొకటి!

ఉన్న భూమి మాయం

◆ విజయనగరం జిల్లా రామభద్రపురానికి చెందిన కేతిరెడ్డి రామకృష్ణకు ఎకరాన్నర భూమి ఉంటే.. తాజాగా అందజేసిన పట్టాదారు పాస్ పుస్తకంలో ఎకరా అని నమోదైంది.
◆ ఇదే గ్రామానికి చెందిన రైతు కేతిరెడ్డి గోవిందుదీ ఇలాంటి పరిస్థితే. ఆయన పేరిట ఎకరాన్నర భూమి ఉంది. సర్వే చేసి 41 సెంట్లకు పట్టాదారు పాస్ పుస్తకం ఇచ్చారు. రబీ పంటల సాగు పెట్టుబడికి బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలంటే 41 సెంట్లకే లెక్కగట్టి ఇస్తామనడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరివి ఒకే రైతు చిత్రంతో..

కొమరాడ మండలంలో అందరి రైతుల భూములు ఒకే రైతు చిత్రంతో పట్టాదారు పాస్ పుస్తకాలు ముద్రించి పంపిణీ చేసేశారు. ఇలా ఎక్కువ తప్పులు ఉన్న పాస్ పుస్తకాలు అధిక సంఖ్యలో ఉండటాన్ని గ్రామ రెవెన్యూ అధికారులు గ్రహించి తక్కువ సంఖ్యలో పంపిణీ చేశారు.

ఈనాడు, విజయనగరం

ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూములు సర్వే చేస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చితే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 50 సెంట్లు ఉన్న చిన్న కమతాలు అధికం. ఇతర జిల్లాల్లో 15 ఎకరాలకు మించిన కమతాలు ఎక్కువ. ఆ జిల్లాల్లో సర్వే ఉద్యోగులకు విధించిన లక్ష్యం ఇక్కడ ఉభయ జిల్లాలకు అదే లక్ష్యం నిర్దేశించడంతో వెనుకబడుతున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో చాలా ఎక్కువ తప్పులు దొర్లుతున్నాయి.

● తప్పులుతడకగా భూ సర్వే
● పాసు పుస్తకాల్లో దోషాలతో రైతన్నకు తిప్పలు

ఇలా చేయాలి..

★ రీ సర్వే చేసే ముందు పాత దస్త్రాలు పరిశీలించి ఇన్‌కార్పొరేషన్ (సమాచార విలీనం) చేయాలి. ★ భూముల రీసర్వేకు సరైన లైసెన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ అందించాలి. దాంతో పాటు అవసరమైన సాంకేతిక పరికరాలు సరఫరా చేయాలి. ★ సర్వేకు ముందు ఆ గ్రామానికి సంబంధించిన భూ యజమానులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలి. ★ గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే చేసిన గ్రామంలో సర్వే శాఖ తప్పులు కంటే పట్టాదారు వివరాల నమోదుకు సంబంధించి ఎక్కువ తప్పులు నమోదైనట్లు గుర్తిస్తున్నారు.

మూడు శాఖల సమన్వయలోపం

◆ భూముల వ్యవహారంలో సర్వే, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ పాత్ర కీలకం. భూ వివాదాలు పెరగడానికి ఈ మూడు శాఖల యంత్రాంగం మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీని వల్ల చాలా తప్పులు జరుగుతున్నాయి.
◆ గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వే తప్పులను పూర్తిగా అవగాహన చేసుకుని వాటి పరిష్కారానికి తగిన సమయం ఇవ్వడం లేదు. తహసీల్దారు లాగిన్‌లో ఆప్షన్ ఇస్తే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయి.
◆ భూ యజమానులకు నోటీసులు ముందుగా ఇవ్వకుండా అప్పట్లో చేపట్టిన రీసర్వే ప్రక్రియ ముగించే ప్రయత్నం చేశారు. కొందరు జిల్లా, మండల అధికారులు రీ సర్వే రద్దవుతుందని లేదా మెయింటెనెన్స్ పీరియడ్ ఇస్తారని చెప్పి తొందరగా చేయించారు.

వీటిని ఎందుకు పట్టించుకోరు

❐ సాంకేతిక సిబ్బంది తక్కువగా ఉన్నందున ఉండాల్సిన భూమికి, పాస్‌పుస్తకంలో ఉండే సర్వే నంబరుకు సంబంధం లేకుండా చాలా గ్రామాల్లో 30 శాతానికి పైగా తప్పులు నమోదవుతున్నాయి.

❐ భూముల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో పట్టాదారులు ప్రతి చిన్న అంశానికీ అధికారులకు దరఖాస్తు చేసే అవకాశం ఉంది. తగిన సాంకేతిక సిబ్బంది లేకుంటే ఇంకా సమస్యలు పెరుగుతాయి.

ఏడేళ్ల ఆశల ఫలం.. ఆరేళ్లకే అందనంత దూరం

● వ్యాను ఢీకొని బాలుడి మృతి ● తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

లోహిత్‌సాయి (పాత చిత్రం)
బాలుడి తల్లిని ఓదార్చుతున్న కుటుంబీకులు

రాజాం, న్యూస్‌టుడే: 'పెళ్లైన ఏడేళ్లకు లేకలేక పుట్టిన బిడ్డ.. వాడే ఆ దంపతుల లోకం. చిన్నారి ప్రతి అడుగూ సంబరమే.. అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. భార్య దివ్యాంగురాలైనా.. తాను తాపీ పని చేస్తున్నా.. కుమారుడికి ఏ లోటూ రాకుండా చూసుకుంటున్నారు. వ్యాను రూపంలో మృత్యువు ఆరేళ్లకే బాలుడిని దూరం చేసింది. 'కన్నా వదిలి వెళ్లిపోయావా' అంటూ వారు రోదిస్తున్న తీరు కంటతడి పెట్టిస్తోంది. ఎస్సై పి.ఉమామహేశ్వరరావు వివరాల ప్రకారం.. రాజాం మండలం జీఎస్‌పల్లి గ్రామానికి చెందిన మద్దు నారాయణరావు తాపీమేస్త్రీ. భార్య ఆదిలక్ష్మి దివ్యాంగురాలు. వీరి కుమారుడు లోహిత్‌సాయి(6) రాజాంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో పక్కనే ఉన్న ఇప్పిలిపేటలో అమ్మమ్మగారి ఊళ్లో మహాశివరాత్రి సందర్భంగా సంబరం ఉండటంతో తల్లితో కలిసి వెళ్లాడు. రాజాం-వీరఘట్టం ప్రధాన రహదారి సమీపంలోనే భోజన ఏర్పాట్లు చేశారు. అక్కడే జనమంతా ఉన్నారు. బాలుడు ఏమరుపాటుగా రహదారిపైకి వచ్చాడు. అంతలోనే అతివేగంతో వచ్చిన వ్యాన్ బాలుడిని ఢీకొంది. బంధువులు వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. తండ్రి నారాయణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని పేర్కొన్నారు. అర్జీదారులు తమ సమస్యపై కచ్చితమైన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరిస్తారని ఆయన తెలిపారు.

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త
డాక్టర్ రెడ్డి టోటల్ బాడీ చెకప్ సెంటర్

రూ. 7,500/- విలువచేయు పరీక్షలు కేవలం 3,500/- కే
ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా॥ జి. శివప్రసాద్‌రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.
9393752255, 9393122525
ఈ పథకం 10 రోజులు మాత్రమే ప్రతి ఆదివారం శెలవు

న్యూస్‌టుడే– బొబ్బిలి

ఉమ్మడి విజయనగరం జిల్లా ఒకప్పుడు చెరకు పంటకు ప్రసిద్ధి. చెరకు కర్మాగారాలూ అదే స్థాయిలో ఉండేవి. రైతులకు రాయితీలూ ప్రకటించేవి. నేడు అవేవీ ఇవ్వటంలేదు. దీనికితోడు ఎన్‌సీఎస్, భీమసింగి కర్మాగారాలు మూతపడ్డాయి. ఫలితంగా రైతులు చెరకు సాగు వదులుకుని ఇతర పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో సంకిలి ఈఐడీ ప్యారీ కర్మాగారం ఒక్కటే మిగిలింది. దీన్ని నిలబెట్టేందుకైనా రైతులను ప్రోత్సహించాలి. ఆ దిశగా చర్యలు లేవు.

60 శాతానికి పైగా తగ్గిన సాగు

చెరకు సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. గతేడాది కంటే 60 శాతం పైచిలుకు సాగు పడిపోయింది. ఎన్‌సీఎస్, భీమసింగి, సంకిలి ప్యారీ జోన్ల పరిధిలో గతేడాది ఇదే సమయానికి 1,659 హెక్టార్లలో సాగు కాగా.. ఈ ఏడాది 491.14 హెక్టార్లలో పంట వేశారు. ఉమ్మడి జిల్లాలోని పార్వతీపురం డివిజన్‌లో ఎక్కువగా సాగు ఉండేది. ఇప్పుడు 43.47 హెక్టార్లలో వేశారు.

చెరకు సాగు.. కనుమరుగేనా?

సంకిలి కర్మాగారానికి తరలించేందుకు రేజేరు కాటాల వద్ద వేచిఉన్న వాహనాలు

కారణాలివే..

◆ గతంలో కర్మాగారాలు విత్తనం, ఎరువులు, పురుగు మందులు, పవర్ స్ప్రేయర్లు, యాజమాన్యాలు ఇచ్చేవి. అవన్నీ నిలిచిపోయాయి. ◆ గతంలో కర్మాగార నిర్వాహకులే కూలీలను ఏర్పాటుచేసి, పంట కోయించి కర్మాగారానికి తరలించేవారు. ◆ రైతులకు ప్రోత్సాహకాల కింద ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు రాయితీలు ఇచ్చేవారు. ◆ పొలం నుంచి కర్మాగారం వరకు రవాణా ఛార్జీలు ఉండేవి కాదు. ఇప్పుడు 30 కి.మీల వరకు రైతు భరించుకోవాలి. దీంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి.

సమావేశాలకే పరిమితమా?: చెరకు సాగు పెంచాలని ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన రెండు సార్లు సమావేశాలు నిర్వహించారు. సాగు తగ్గడంపై విశ్లేషించారు. రాయితీలు లేకపోవడంతోనే తగ్గుతోందని, వాటిని ఇవ్వాలని యాజమాన్యానికి సూచించారు. అయినప్పటికీ సరైన ప్రకటన రాలేదు. జిల్లాలో సంకిలి ప్యారీ ఒక్కటే నడుస్తోంది. ఏడు లక్షల మెట్రిక్ టన్నుల గానుగ చేసే చెరకు ఉంటేనే కర్మాగారం మనుగడ ఉంటుంది. ప్రస్తుతం 2.50 లక్షల మెట్రిక్ టన్నుల గానుగ చేపట్టే చెరకు ఉంది.

చక్కెర జోన్	చెరకు విస్తీర్ణం (హెక్టార్లలో)	
	(2025-26)	2024-25
ఎన్‌సీఎస్	43.47	403.27
భీమసింగి	0	50.75
సంకిలి ప్యారీ	447.67	1205.44

చర్యలు తీసుకుంటాం..: విస్తీర్ణం పెంచడంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని డిప్యూటీ కేన్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. ఇప్పటికే సమావేశాలు నిర్వహించామని, యాజమాన్యానికి కూడా సూచనలు చేశామని చెప్పారు. పూర్తిస్థాయిలో రాయితీలు కల్పించే అంశంపై యాజమాన్యం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

చనిపోయినా ప్రాణం పోశాడు



వంగర, న్యూస్‌టుడే: వంగర మండలం కొత్తవలస గ్రామానికి చెందిన పెంకి పారినాయుడు(65) తాను మరణించినా.. మరికొంత మంది జీవితాల్లో వెలుగులు నింపారు. స్థానికుల వివరాల ప్రకారం.. పారినాయుడు వ్యవసాయ పనులు చేస్తుండేవారు. వారం కిందట పొలంలో పడిపోవడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. జీవన్‌దాన సంస్థ ప్రతినిధులు, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ప్రతినిధి చైతన్యకుమార్ కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. మృతుడి భార్య సోములమ్మ, కుమార్తెలు ఆదిలక్ష్మి, సావిత్రి అంగీకరించారు. ఆదివారం వైద్యులు ప్రక్రియ పూర్తిచేశారు. మూత్రపిండాలు కిమ్స్ ఆసుపత్రికి, కార్నియాలు శ్రీకాకుళం రెడ్‌క్రాస్‌కు, కాలేయం జెమ్స్‌లో అవయవ గ్రహీతలకు అమర్చేందుకు ఉంచారు.

పారిశుద్ధ్య కార్మికురాలిని రాష్ట్రపతి దగ్గరకు తీసుకెళ్తా

'ఈనాడు' వార్తకు స్పందించిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నైకు చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు పద్మ తనకు దొరికిన రూ.45 లక్షల విలువైన బంగారు ఆభరణాల బ్యాగును నిజాయతీగా పోలీసుల ద్వారా యజమానికి అప్పగించిన సంఘటనపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పందించారు. ఆమెకు జాతీయస్థాయి గుర్తింపు ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. 'ఈనాడు' ప్రధాన పత్రికలో జనవరి 13న 'చెత్త సేకరిస్తుంటే. . 45 సవర్ల బంగారం దొరికింది' శీర్షికన పద్మ నిజాయతీ గురించి వార్త ప్రచురితమైంది. ఇదే వార్తను ఆయన రాష్ట్రపతి లేఖకు జతచేశారు. ఆమె నిజాయతీకి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక అవార్డుకు సిఫార్సు చేయాలని రాష్ట్రపతిని ఎంపీ అప్పలనాయుడు కోరారు. త్వరలో పద్మను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దగ్గరకు తీసుకెళ్తానని వివరించారు.

బడ్జెట్‌పై గ్రామస్థాయిలో చర్చ జరగాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ జరగాలని, కూటమి నాయకులు దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం అశోక్‌బంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అద్భుతమైన బడ్జెట్‌ను ప్రకటించిందన్నారు. అన్ని వర్గాల ప్రయోజనాలనూ బడ్జెట్‌లో పొందుపర్చారని పేర్కొన్నారు. గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం బడ్జెట్ పేరుతో ప్రజలను దగా చేసిందన్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు పాల్గొన్నారు.



(c) eenadu

ప్రతిధ్వనించెను పంచాక్షరీ మంత్రం


మానసాదేవికి లక్ష బిల్వార్చన

గరివిడిలో నృత్యం చేస్తున్న బాలభవన్ చిన్నారులు

జిల్లా అంతటా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మహాశివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలన్నీ కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే దర్శనాలకు భక్తులు బారులు తీరారు. - న్యూస్‌టుడే, పాలకొండ, పాచిపెంట, ఎల్.కోట, బొబ్బిలి గ్రామీణం, గరివిడి, చీపురుపల్లి గ్రామీణం, కంటోన్మెంట్

కలవరాయి రమణ మహర్షి ఆశ్రమంలో..

పాండవుల కొండపై భక్తుల రద్దీ

రింగురోడ్డు రుద్రాభిషేకంలో భక్తులు

ఎల్.కోటలో శివలింగానికి అన్నాభిషేకం

పాలకొండలోని మరకత మృత్యుంజయేశ్వరుడు

విద్యా సాయం నింపిన వెలుగు

రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు వారివి. ఇంటర్ పూర్తి చేసి ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేయాలన్న వారి ఆశయానికి వరల్డ్ విజన్ సేవా సంస్థ అండగా నిలిచింది. ప్రతిభే ప్రామాణికంగా ఏటా పేద విద్యార్థులను ఎంపిక చేసి ఉచిత వసతితో కూడిన ఇంజినీరింగ్ విద్యను అందించింది. రెండేళ్ల కిందట వరల్డ్ విజన్ ప్రాజెక్టు నుంచి విరమించుకున్నప్పటికీ తమిళనాడుకు చెందిన సత్యభామ యూనివర్సిటీ మాత్రం దాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది ఎనిమిది మందికి అవకాశం కల్పించింది. పదేళ్లుగా ఇప్పటివరకు సుమారు 41 మందిని వరల్డ్ విజన్ సంస్థ చదివించింది. వారిలో 20 మంది వివిధ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. మండలంలోని గంట్యాడ, పెదమజ్జిపాలెం, పెణసాం, కిర్తుబర్తి, కె.వెలగాడ, బోనంగి గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మండలాన్ని దత్తత తీసుకున్న వరల్డ్‌విజన్ భవనాలు కట్టించడం, రోడ్లు వేయడం వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టింది.

అదో స్వచ్ఛంద సంస్థ.. మండలంలో విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేసింది. ఉచితంగా ఇంజినీరింగ్ విద్య చెప్పించింది. వారిలో పలువురు సాయాన్ని సద్వినియోగం చేసుకుని నేడు ఉన్నత స్థానాలకు ఎదిగి జీవితాల్లో స్థిరపడ్డారు. - న్యూస్‌టుడే, గంట్యాడ, పెద్దమజ్జిపాలెం

సహకారం మరువలేను..

మాది వ్యవసాయ కుటుంబం. వరల్డ్‌విజన్ సహకారం ద్వారా సత్యభామ యూనివర్సిటీలో బీటెక్ సీటు వచ్చింది. చదువు పూర్తికాగానే రూ.5.5 లక్షల ప్యాకేజీతో ఏవీఎల్‌లో ఉద్యోగం సాధించా. ఆ సాయం లేకుంటే డిగ్రీ వరకే చదివి ఆగిపోయేదానినేమో. ఈ రోజున కుటుంబానికి అండగా ఉన్నా. - పి.సాహితి, కొర్లాం

అసలు ఊహించలేదు

పేరున్న యూనివర్సిటీలో బీటెక్ చేసే అవకాశం వస్తుందని ఊహించలేదు. నాలుగేళ్లకు కనీసం రూ.20 లక్షలైనా ఖర్చు అవుతుంది. అలాంటిది రూపాయి ఖర్చు లేకుండా చదువు పూర్తి చేశాను. రూ.6 లక్షల ప్యాకేజీతో హెచ్‌సీఎల్‌లో జాబ్ వచ్చింది. నా తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారు. - మధుసూదనరావు, పెదమజ్జిపాలెం

క్యాంపస్ ఇంటర్వ్యూలో కొలువు

యూనివర్సిటీలో చేరిన తర్వాత బీటెక్ పూర్తికాకముందే క్యాంపస్ ఇంటర్వ్యూలో రూ.6 లక్షల ప్యాకేజీతో డక్సిన్ కంపెనీలో కొలువు సంపాదించా. - డి.వంశీకృష్ణ, పెదమజ్జిపాలెం

అతివల ఉన్నతికి గండి

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధుల మెరుగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నా.. క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉంటోంది. వెలుగు ఉన్నతి పథకం ద్వారా వడ్డీ లేకుండా, రాయితీపై రుణాలు ఇస్తున్నారు. వీటిని ప్రజలకు చేరువ చేసే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో లక్ష్యం చేరుకోలేక పోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

చేతివాటం చూపుతున్న సిబ్బంది..

రుణాలు ఇచ్చే సమయంలో కొంతమంది సిబ్బంది చేతి వాటం చూపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వెలుగు సిబ్బంది, ఇతర ఖర్చుల కోసమని చెప్పి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూళ్లు చేస్తున్నారు. కొంత మంది మహిళలు బ్యాంకుల చుట్టూ తిరగలేక ఇచ్చేస్తున్నారు. కొన్ని చోట్ల రుణం అవసరం లేకున్నా వారి పేరిట తీసుకుని, వాడుకున్న సందర్భాలూ ఉన్నాయి. దీనికోసం మహిళలతో బేరసారాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అవగాహన లేక..

రుణాలపై మహిళలకు అవగాహన కల్పించడం లేదు. దీంతో తీసుకోవడానికి ముందుకు రావడం లేదు.

రుణాల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం

కూటమి వచ్చిన తర్వాత ఉన్నతి పథకాన్ని పటిష్ఠంగా అమలు చేస్తున్నా.. సిబ్బంది సకాలంలో ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఈ ఆర్థిక ఏడాదిలో 1,837 మందికి రూ.9.18 కోట్లు లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 676 మందికి రూ.4.31 కోట్లు మాత్రమే ఇచ్చారు. రూ.4.87 కోట్లు ఇవ్వాల్సి ఉంది. గడువు సమీపిస్తుండడంతో లక్ష్యం చేరుకుంటారా? అన్న అనుమానం కలుగుతోంది. కేంద్ర ప్రభుత్వం పీఎం అజయ్ ద్వారా రాయితీ ఇవ్వగా, వీటిని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అందించనున్నారు.

ఉన్నత రుణాలపై సమీక్ష చేసుకుంటున్న మహిళలు

సభ్యురాలికి రూ.50 వేల వరకు రాయితీ రానుంది. ఇందుకు జిల్లాలో గత కొద్ది నెలలుగా సర్వే చేపట్టి, 108 మందిని గుర్తించారు. వీరికి రూ.1.58 కోట్లు కేటాయించగా, ఇప్పటికీ ఎవరికీ రుణం ఇవ్వలేదు.

అవగాహన కల్పిస్తున్నాం..

ఈ పథకం ద్వారా గతంకంటే జిల్లాలో ప్రగతి బాగానే ఉంది. వంద శాతం రుణాలు ఇస్తున్నాం. ఎవరైనా చేతివాటం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవు. పీఎం అజయ్ ద్వారా పలువురిని ఎంపిక చేశాం. త్వరలో లబ్ధిదారుల ఖాతాల్లోకి యూనిట్ల ఆధారంగా జమ చేస్తాం. ఈ ఏడాది లక్ష్యం చేరుకుంటాం.

- శ్రీనివాస్‌పాణి, పీడీ, డీఆర్‌డీఏ

నీలాచలం కొండపై శిఖరదీపం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రామతీర్థం దేవస్థానంలో మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం నీలాచలం కొండపై శిఖర దీపాన్ని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. విద్యుత్తు దీపాలంకరణలో దేవస్థానం విరాజిల్లింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, తెదేపా నాయకులు రవిశేఖర్, రాజారావు, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శిఖర దీపం వెలిగిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే లోకం మాధవి

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

ప్రపంచ శాంతికి కలశ యాత్ర

రథాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

పట్టణంలో కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న బ్రహ్మకుమారీలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా ప్రపంచ శాంతిని కోరుతూ పట్టణంలోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆదివారం కలశ యాత్ర నిర్వహించారు. ఓం శాంతి మందిరం నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో రథంపై శివలింగాన్ని ఊరేగించారు. మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వరరావు, ప్రముఖ వైద్యుడు బి.ఈశ్వరరావు, న్యాయవాది వెంకటరావు, బీకే జ్ఞానరత్నం జెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. భక్తులు శివలింగాన్ని దర్శించుకున్నారు. వందలాది మంది భక్తులు కలశ యాత్రలో పాల్గొన్నారు.

యువ కెరటాల క్రీడా కేరింత

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: లక్కవరపుకోట మండలంలోని లచ్చంపేటలో వీరమాంబ సహిత గిరి నాగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి ఉన్నత పాఠశాలల విద్యార్థుల(బాలురు) వాలీబాల్ పోటీలు నిర్వహించారు. దీనిలో 18 జట్లు పాల్గొన్నాయి. రవితేజ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, కుమారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ఖోడిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు వరుస మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నిర్వాహక కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఎందుకమ్మా ఇంత ప్రమాదకరంగా..

శివరాత్రి వేళ గుంప సోమేశ్వరుడి దర్శనానికి భక్తులు జంఝావతి, నాగావళి నదులు దాటి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఓ మహిళ.. చిన్నారిని ఎత్తుకుని.. మరొకరిని చేత్తో పట్టుకుని నదిలో స్నానానికి వచ్చారు. తనతోపాటు పిల్లాడిని ఇలా నడుములోతు నీటిలో ప్రమాదకరంగా తీసుకెళ్లారు. - న్యూస్‌టుడే, కొమరాడ

సకిలించాయి అశ్వాలు

కొత్తవలస, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నిపాలెంలో శనివారం ప్రారంభమైన మరిడిమాంబ తీర్థ మహోత్సవంలో భాగంగా ఆదివారం నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు ఆకట్టుకున్నాయి. సీహెచ్. విక్రమ్, నవీన్, సత్యనారాయణకు చెందిన గుర్రాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు గ్రామ పెద్దలు నగదు బహుమతులు అందజేశారు. సర్పంచి ఆర్.పద్మలత, యువత పాల్గొన్నారు.

దౌడు తీస్తున్న గుర్రం

అక్కడ ఆట.. ఇక్కడ ఆనందం

రామతీర్థంలో ఎల్ఈడీ తెరపై మ్యాచ్ తిలకిస్తున్న అభిమానులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను జిల్లా వ్యాప్తంగా అభిమానులు ఆస్వాదించారు. భారత్ గెలుపుతో సంబరాలు చేసుకున్నారు. విజయనగరం జిల్లా కేంద్రంతో పాటు రామతీర్థం దేవస్థానం కల్యాణ మండపం వద్ద ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. ఇండియా బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ కొట్టిన సిక్సర్లు, ఫోర్లకు అభిమానులు కేరింతలు కొట్టారు.

ఇక్కడే ఇలా ఉంటే.. ఊరంతా శుభ్రమెలా?

పాలకొండలో నగర పంచాయతీ కార్యాలయం ఎదుట అపారిశుద్ధ్యం నెలకొంది. దీని ఎదురుగా ప్రధాన మార్కెట్‌లో దుకాణ సముదాయం నిరుపయోగంగా ఉంది. అక్కడే చెత్త వేస్తుండడం, శుభ్రం చేయక ఇలా అధ్వానంగా కనిపిస్తోంది. కమిషనర్ రత్నరాజ్ వద్ద ప్రస్తావించగా పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, పాలకొండ

జాతీయస్థాయిలో సత్తా చాటాలి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: 'ఏఐ టెక్నాలజీతో వ్యవసాయం'పై ప్రాజెక్టు ద్వారా అగస్త్య అంతర్జాతీయ ఫౌండేషన్ నిర్వహించిన జిజ్ఞాస పోటీలకు జాతీయ స్థాయికి అర్హత సాధించిన జడ్పీహెచ్ఎస్ ఫూల్‌బాగ్ విద్యార్థులు సి.హెచ్.వెంకటేష్, ఆర్.గగన్‌దీప్‌ను ఆదివారం డీఈవో యు.మాణిక్యం నాయుడు అభినందించారు. జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ నెల 18, 19 తేదీల్లో పుణెలో జరగనున్న పోటీలకు వీరంతా ఆదివారం పయనమయ్యారు. డిసెంబరులో వర్చువల్ విధానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయ స్థాయికి అర్హత పొందారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ కె.శైలజ, ప్రధానోపాధ్యాయుడు వి.రఘురామరాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

అభినందిస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

రైల్వే గేటు తెరిచారు

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండలం చినభోగిల కూడలిలోని రైల్వేగేటు మూసి వేయడంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు ఈనెల 14న నిరసన చేపట్టారు. దీంతో స్పందించిన అధికారులు ఈనెల 24 వరకు గేటును తెరిచేందుకు అంగీకరించారు. అండర్ పాస్ పనులు పూర్తి చేసేందుకు కొంత సమయం అవసరం కావడంతో తాత్కాలికంగా ఆదివారం నుంచి తెరుస్తున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED

Do you Need a Staff for Business Hire with ease www.mrvijay.in HR solutions ✆ 8309661801.

FINANCIAL SERVICES

ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో మార్టగేజ్/ టేకోవర్ లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. * నో సిబిల్/ నో బ్రోకర్స్. *MSR గ్రూప్, వైజాగ్. Ph: 9121314141

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

TO LET

VZM టౌన్, K.Lపురంలో కలెక్టర్ ఆఫీస్‌కు దగ్గరలో హైవేకు వాక్‌బుల్ డిస్టెన్స్‌లో ఇండివిడ్యువల్ ఇల్లు 2BHK ఫస్ట్‌ఫ్లోర్ అద్దెకు కలదు ✆ 8985914456.

JOBS

రాఘవ ఆటోఫైనాన్స్‌లో పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. అనుభవం కలిగి విజయనగరం, గజపతినగరం లోకల్ వారికి ప్రాధాన్యత. మంచి జీతం + TA + ఇన్‌సెంటివ్ సంప్ర|| రాఘవ ఆటోఫైనాన్స్, 100 ఫీట్ రోడ్, ఐస్‌ఫ్యాక్టరీ జం|| కెనరాబ్యాంక్ పైన, విజయనగరం. ✆ 7680880206, 9154020715.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

SECURITY GUARDS

జై గణేష్ సెక్యూరిటీ సంస్థలో విశాఖ స్టీల్ ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డులు 16 మంది, డ్యూటీ 8 గం|| W/H, జీతం నెలకు ₹16,500/, PF & ESI, సెక్యూరిటీ సూపర్‌వైజర్ (Ex-Service or Civil) 9 మంది, జీతం ₹20,000/, ఉచిత నివాసం, సబ్సిడీ భోజనం, యూనిఫాం ఉచితం ✆ 93460 01964

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి

జామి, న్యూస్‌టుడే: పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న మహిళను వ్యాన్ ఢీకొట్టడంతో మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై జనార్దనరావు వివరాల మేరకు.. అలమండ గ్రామానికి చెందిన **కె.రాములమ్మ(55)** వ్యవసాయ కూలి. శనివారం ఉదయం గ్రామంలో పొలం పనికి వెళ్లారు. పనులు ముగించుకుని రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా, భీమసింగి నుంచి కొత్తవలస వైపు వెళ్తున్న వ్యాన్ ఆమెను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో స్థానికులు పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆమెకు భర్త చెల్లయ్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: నగరంలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండో పట్టణ ఎస్సై కృష్ణమూర్తి వివరాల ప్రకారం.. మన్యం జిల్లా వీరఘట్టానికి చెందిన ఓ బాలిక(16), తన అక్కతో కలిసి విజయనగరంలోని దాసన్నపేటలో ఉంటూ ఇంటర్ చదువుకుంటోంది. శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అక్క ఒక గదిలో పడుకుని ఉండగా.. బయటకు వెళ్తానని చెప్పి వేరే గదిలో పంకాకు ఉరేసుకుంది. కొంత సేపటి తర్వాత చూసిన సోదరి వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. వారొచ్చి పరిశీలించగా అప్పటికే ఆమె చనిపోయింది. మృతదేహాన్ని మహారాజా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నెలసరి సమయంలో తీవ్ర కడుపు నొప్పి వస్తోందని బాలిక బాధపడుతున్నట్లు సోదరి, కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

టీ తాగేందుకు వచ్చి.. ప్రాణాలు వదిలి

రాజాం, న్యూస్‌టుడే: పరిస్థితి విషమంగా ఉందని బంధువులు ఆసుపత్రిలో చేర్పించిన వ్యక్తి ఎవరికీ చెప్పకుండా టీ తాగేందుకు బయటకు వచ్చి కుప్పకూలి మృతిచెందిన ఘటన రాజాంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రాజాం మండలం ఒమ్మి గ్రామానికి చెందిన ఊడికల పరుశురాం(61) దీర్ఘకాల రోగి. రాజాంలోని ప్రభుత్వాసుపత్రికి మూడు రోజుల క్రితం తీసుకొచ్చారు. అప్పటి నుంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ఎవరూ గమనించని సమయంలో టీ తాగేందుకని బయటకొచ్చిన ఆయన పురపాలిక కార్యాలయం సమీపంలో కుప్పకూలిపోయాడు. మృతదేహాన్ని స్వగ్రామం తరలించేందుకు అంబులెన్స్ కోసం ప్రయత్నించినా అందుబాటులో లేకపోవడంతో బంధువులు ద్విచక్ర వాహనంపై గ్రామానికి తీసుకెళ్లారు.

సాగునీరు విడుదల

పాలకొండ, న్యూస్‌టుడే: తోటపల్లి ఎడమ కాలువ ద్వారా అధికారులు సాగునీటిని విడుదల చేశారు. కోటిపల్లి కొండపై వెలసిన శివాలయంతోపాటు తెట్టంగి అమ్మవార్ల పండగల నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతోపాటు ఆరుతడి పంటలకు సాగునీరు కావాలంటూ సాగునీటి సంఘాల విజ్ఞప్తి మేరకు నీటిని విడుదల చేసినట్లు ఏఈ బీవీ రమణ తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధులు

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణంలోని పురాతన కోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. దీనికోసం ప్రభుత్వాన్ని కోరడంతో రూ.70 లక్షలు నిధులు విడుదల చేసింది. ఈ మేరకు శ్రీరామనవమి తర్వాత పనులు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

ప్రకృతి సాగు.. ఆరోగ్యం బాగు

బీఆర్సీ కేంద్రాల ఏర్పాటుతో ప్రయోజనాలు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం రైతులకు శిక్షణ, సలహాలు ఇచ్చేందుకు ఆయా ప్రాంతాల్లో బయోరీసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా తక్కువ ధరకే కషాయాలను అందిస్తూ ప్రోత్సహిస్తోంది. పురుగుల మందులు, యూరియా తదితర రసాయన ఎరువులు ఎక్కువ మోతాదులో వాడటం వల్ల భూసారం తగ్గుతుంది. వాటితో పండించిన పంటలు తినడం వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వీటి వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కల్పిస్తున్నారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించడమే కాకుండా అధికాదాయం పొందవచ్చు. బీఆర్‌సీ కేంద్రాల్లో జీవామృతం, పంచగవ్యం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, బీజామృతం వంటి కషాయాలు తయారు చేస్తుంటారు. వీటిని రైతులకు తక్కువ ధరకే అందిస్తున్నారు. మండలంలో నాలుగు వరకు కేంద్రాలు ఉన్నాయి. విత్తనాలనూ అందిస్తున్నారు.

బలిజిపేట బీఆర్‌సీలో కషాయాలు

జిల్లాలో ఇలా...

జిల్లాలో 15 మండలాల్లో ఇప్పటికే 209 దుకాణాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో అవసరమైన అన్నిరకాల ఔషధాలు, విత్తనాలను అందుబాటులో ఉంచారు. బలిజిపేట మండలంలోని బీఆర్‌సీ ద్వారా ఇప్పటికే దాదాపు 600 మంది రైతులు 720 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ సంఖ్యను పెంచేందుకు, అన్ని మండలాల్లో ఇదే స్థాయిలో జరిగేలా చూసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

రసాయనాల వాడకం తగ్గించాలి. కషాయాలు వినియోగిస్తూ.. ప్రకృతి వ్యవసాయం చేయాలి. ఇందుకు అవసరమైనవి బీఆర్సీ కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నాం. సద్వినియోగం చేసుకోవాలి.

- శ్రావణ్‌కుమార్, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రబంధకులు

(c) eenadu

బొబ్బిలి

● బొబ్బిలి ● రాజాం ● గజపతినగరం ● చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? పెదమానాపురం సంతలో జాతీయ రహదారికి ఆనుకుని విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. - **కోటిపల్లి, ఇంగిలాపల్లి గ్రామస్థులు** ● మరమ్మతులు చేయిస్తాం. - **సురేష్, ఏఈ, ఎస్‌హెచ్‌ఏపీ** - న్యూస్‌టుడే, దత్తిరాజేరు

? రామభద్రపురం మండలంలోని కొట్టక్కి సంత రహదారిని బాగు చేయాలి. - **స్థానికులు** ● రహదారి బాగుచేయిస్తాం. - **నాయుడు, ఏఈ** - న్యూస్‌టుడే, రామభద్రపురం

? పెదమాకి గ్రామంలోకి వెళ్లే మార్గం మధ్యలో ప్రధాన రహదారి పక్కన చెత్త నిల్వలు ఉన్నాయి. దుర్గంధం వస్తోంది. - **యువత** ● కార్యదర్శితో మాట్లాడి, సమస్య పరిష్కరిస్తాం. - **ఆర్.నీలిమ, డిప్యూటీ ఎంపీడీవో** - న్యూస్‌టుడే, తెర్లాం

? రాజాం పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డు శ్రీవెంకటేశ్వర కళాశాల ఎదురుగా కాలువలో చెత్త నిల్వ ఉంది. దుర్వాసన వస్తోంది. దోమలు ఇబ్బంది పెడుతున్నాయి. - **స్థానికులు** ● కాలువలోని చెత్త తొలగింపజేస్తాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** - రాజాం పట్టణం

తీగలు సరిచేశారు (స్పందనకు స్పందన)

గంట్యాడ (గ్రామీణం), న్యూస్‌టుడే: లక్కిదాం ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు నేలకు తాకుతున్నాయి. దీనిపై ఈనెల 8న వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు సరిచేశారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో).. ● టమాటా: 15 ● వంకాయలు: 30 ● దొండ: 60 ● బీర: 50 ● బెండ: 55 ● కాకర: 50 ● చిక్కుడు: 35 ● ఆనపకాయ (ఒకటి): 26 ● అరటి (జత): 20 ● మునగ: 80 ● ఉల్లి: 25 ● బంగాళదుంపలు: 20 ● అల్లం: 80 ● వెల్లుల్లి: 120 ● పచ్చిమిర్చి: 70 ● క్యాబేజీ: 20 ● క్యారెట్: 42

బొబ్బిలి ప్రజలారా వార్డుల్లో సమస్యలు

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

బొబ్బిలి పురపాలికలో మీ వార్డు పరిధిలో ఇబ్బందులా? తాగునీరు సక్రమంగా రావడం లేదా? వీధి దీపాలు వెలగడం లేదా? కాలువలు, రహదారుల తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారా? మీ సమస్యలను నేరుగా పుర కమిషనర్ ఎల్.రామలక్ష్మి దృష్టికి తీసుకెళ్లే అవకాశం 'ఈనాడు' మీకు కల్పిస్తోంది. పట్టణంలోని 31 వార్డుల్లో ఉన్న ఇబ్బందులను నేరుగా ఆమెకు తెలిపి పరిష్కారం పొందొచ్చు. మీరు చేయాల్సిందల్లా నిర్దేశించిన సమయంలో ఫోన్ చేయడమే. - న్యూస్‌టుడే, బొబ్బిలి

● తేది: 17-02-26 (మంగళవారం) ● సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య ● సంప్రదించాల్సిన నంబరు: 98499 05792

శిరస్త్రాణం.. రక్షణాస్త్రం

తలకెక్కించుకోని వాహన చోదకులు

న్యూస్‌టుడే- గరివిడి, చీపురుపల్లి, గుర్ల, గజపతినగరం, బొబ్బిలి, రాజాం పట్టణం, రేగిడి

నిబంధనలు పాటించకపోవడం.. అతివేగం.. సామర్థ్యానికి మించి వెళ్లడం తదితర కారణాలతో నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. శిరస్త్రాణంతో ప్రాణాలు నిలుస్తాయని తెలిసినా.. చాలామంది ధరించక ప్రాణాలు కోల్పోతున్నారు. 'హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి' అంటూ పోలీసులు పదేపదే చెబుతున్నా.. తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుములు విధిస్తున్నా.. వాహనదారుల తలకెక్కడంలేదు.

రాజాం పట్టణం: అంబేడ్కర్ కూడలి వద్ద హెల్మెట్‌లు లేని ద్విచక్రవాహన చోదకులు

ఈనెల 14న ఉదయం 30 నిమిషాల పాటు 'న్యూస్‌టుడే' బృందం పరిశీలనలో గుర్తించినవి ఇవీ..

ప్రాంతం	ద్విచక్ర వాహనాలు	ఇద్దరికంటే ఎక్కువ మంది ఉన్నవి	శిరస్త్రాణం ధరించినవారు
రాజాం పట్టణం	1,500	33	30
చీపురుపల్లి	1,232	32	76
గరివిడి	264	29	21
గజపతినగరం	184	7	48
గుర్ల	162	18	71

● గుర్ల మండలం గరిడ గ్రామానికి చెందిన దాసరి సురేష్ (26) అయిదు నెలల క్రితం ద్విచక్రవాహనంపై విజయనగరం వెళ్తుండగా.. నెల్లిమర్ల రైల్వే వంతెనపై వ్యాన్ ఢీ కొట్టడంతో తల ఫుట్‌పాత్‌కు తగిలి మృతి చెందాడు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పేది. అండగా ఉంటాడనుకున్న కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లి మనోవేదనతో తల్లడిల్లిపోతోంది.

● గుర్ల మండలం గుజ్జంగివలసకు చెందిన ఎ.రమణ ఈనెల 10న విజయనగరం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. గూడెం కూడలి వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శిరస్త్రాణం ధరించి ఉండడంతో తలకు ఎలాంటి గాయం కాలేదు. ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

అవగాహన కల్పిస్తున్నాం..

● రేగిడి మండలం ఉంగరాడమెట్ట వద్ద 176 వాహనాలు రాగా.. 40 మంది మాత్రమే శిరస్త్రాణాలు ధరించారు.

● బొబ్బిలి పట్టణంలో సుమారు 100 వాహనాలు వచ్చాయి. ఏ ఒక్కరూ శిరస్త్రాణం ధరించలేదు. కేసులు నమోదు చేస్తున్నామని, వారంలో సుమారు 50 మందికి అపరాధ రుసుము విధించామని బొబ్బిలి పట్టణ సీఐ నారాయణరావు తెలిపారు. తనిఖీలు నిర్వహించి, అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని, చర్యలు తీసుకుంటామని గజపతినగరం సీఐ జీఏవీ రమణ చెప్పారు. హెల్మెట్ ధరిస్తే జుట్టు ఊడిపోతుందని.. మెడనొప్పి, ఉక్కపోత.. దగ్గర ప్రయాణమే అనే కారణాలు చెబితే ఊరుకునేది లేదన్నారు. ప్రమాదం చెప్పి రాదని, హెల్మెట్లతో ప్రాణాలు కాపాడుకోండని సూచించారు.

అసెంబ్లీ దృష్టికి రాజాం సమస్యలు

రాజాం, న్యూస్‌టుడే: అసెంబ్లీ సమావేశాల్లో రాజాం సమస్యలను ప్రస్తావించనున్నట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చెప్పారు. ఆదివారం రాజాం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఆయన లబ్ధిదారులకు రూ.5.08 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. చంద్రబాబు విజన్‌కు కేంద్రం సాయం తోడవుతోందని, రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రాజాం నియోజకవర్గంలోని కీలక సమస్యల పరిష్కారానికి ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఇవన్నీ ఏడాదిలో పూర్తి చేయించేలా అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్లు పేర్కొన్నారు. రాజాం పట్టణంలో భూగర్భ డ్రైనేజీ, విజయనగరం- హద్దుబంధ, చిలకపాలెం- రామభద్రపురం, రాజాం- వంగర, రాజాం- సంతకవిటి వయా పొందూరు రహదారులను విస్తరించడంతో పాటు తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాజాంలో డిగ్రీ కళాశాలకు సొంత భవనాల నిర్మాణం, పీజీ సెంటర్ ఏర్పాటు, సాయన్న చానల్ ఆధునికీకరణ వంటి వాటిపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు.

వాహనం ఇలా.. చెత్త తరలేదెలా?

బొబ్బిలి మండలం అలజంగి పంచాయతీకి తెదేపా హయాంలో చెత్త సేకరణ ఆటోను అందజేశారు. దీనితో అప్పట్లో గ్రామంలోని వ్యర్థాలు సేకరించేవారు. కాలక్రమంలో వినియోగించకుండా వదిలేయడంతో తుప్పు పట్టి మూలకు చేరింది. దీంతో మూడు చక్రాల వాహనాలపై వ్యర్థాలు తరలించాల్సి వస్తోంది. పూర్తిస్థాయిలో చెత్త తరలించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం డిప్యూటీ ఎంపీడీవో బాస్కరరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి మరమ్మతులు చేస్తామని, వాహనం వినియోగించేలా చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

తీగలు తెగకముందే పట్టించుకోండి

గంట్యాడ మండలం చంద్రంపేట మీదుగా వసంత వెళ్లే రహదారిలో పవర్ గ్రిడ్ విద్యుత్తు స్తంభాలకు ఉన్న తీగలు చెట్లకు తాకుతున్నాయి. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలం పనులు చేసే సమయంలో తీగలు చెట్లకు తగిలి తెగిపడే ప్రమాదముందని భయపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. ఆ శాఖాధికారులకు తెలియజేసి చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

శిథిల భవనాలతో చింత

రాజాం పట్టణం బొబ్బిలి రోడ్డులో మడ్డువలస రిజర్వాయర్ ప్రాజెక్టు పనుల నిమిత్తం నిర్మించిన భవనాలు శిథిలమయ్యాయి. ఈ కాలనీ నుంచి కొత్తవలస, గోపాలపురం గ్రామాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో ప్రయాణించడానికి భయాందోళన చెందుతున్నారు. సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణం ఉన్న భవనాలకు ప్రహరీ నిర్మించకపోవడంతో స్థలం ఆక్రమణకు గురయ్యే అవకాశముందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. విషయం ప్రాజెక్టు డీఈ రవికుమార్ వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

తొట్టెలో నీరు పొయ్యండి సారూ

రామభద్రపురం మండలం మామిడివలస, కొట్టక్కి, రామభద్రపురం తదితర గ్రామాల్లో వేసవిలో పశువులకు నీరు అందించేందుకు అధికారులు నీటి తొట్టెలు నిర్మించారు. నీటి వసతి లేకపోవడంతో అవి నిరుపయోగంగా మిగిలిపోయాయి. వేసవి వస్తున్న తరుణంలో మూగజీవాలు ఇబ్బంది పడకుండా తొట్టెల్లో నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. విషయం మండల పశువైద్యాధికారి అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా.. సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. - న్యూస్‌టుడే, రామభద్రపురం

ఆసుపత్రికి రక్షణ కరవు

గంట్యాడ మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేదు. దీనికితోడు చుట్టు పక్కల పరిసరాల్లో తుప్పలు పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయి. పశువులు, కుక్కల బెడద అధికంగా ఉందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రక్షణగోడ నిర్మించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని, సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని గంట్యాడ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హేమలత తెలిపారు. - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

హరహర మహాదేవా

గరివిడి: మహాలింగ ప్రతిష్ఠాపన పూజల్లో మహిళలు

గంట్యాడ: ఎల్లమ్మతల్లి

బాడంగి: పాల్తేరులో ఆలయంలో భక్తులు

చీపురుపల్లి: కర్లాంలో ఉమామల్లికార్జున స్వామి కల్యాణం

మహా శివరాత్రి సందర్భంగా వాడవాడలా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజాము నుంచి శివయ్యను దర్శించుకున్నారు. ప్రాంగణాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయ కమిటీల సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు అన్నిచోట్లా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గరివిడిలో విశ్వభారత్ సేవా సొసైటీ, గరివిడి రీ యూనియన్ ఆధ్వర్యంలో వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పార్వతీపరమేశ్వర కల్యాణం, మహా లింగార్చన, మహా రుద్రాభిషేకం, సహస్ర జ్యోతిర్లింగార్చన, కోటి పత్తి దీపారాధన జరిగాయి. సినీ నటి జయలలిత పాల్గొన్నారు. ● బాడంగి మండలం కోటిపల్లి గ్రామంలో సింహాద్రి అప్పన్న యాత్ర ఘనంగా నిర్వహించారు. ● వంగర సంగమేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. జాతర మొదటి రోజు సుమారు 10 వేల మంది దర్శించుకున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ● గంట్యాడలో ఈనెల 24న నిర్వహించనున్న బుడతనాపల్లి ఎల్లమ్మతల్లి జాతరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. నేటి నుంచి తొమ్మిది రోజులపాటు ఊరేగిస్తారు. - న్యూస్‌టుడే బృందం

సంతకవిటి: ఎస్.రంగరాయపురంలో పూజలు

పైడితల్లి ఉత్సవం ఘనంగా నిర్వహిస్తాం

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరను రాష్ట్ర పండగగా గుర్తించాలని సీఎం చంద్రబాబును కోరినట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. వందేళ్ల ఉత్సవం కావడంతో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.కోటి నిధులు ఉత్సవ నిర్వహణకు సమకూర్చాలని వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. తెదేపా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గురవాన నారాయణరావు, రేగిడి, సంతకవిటి మండలాల అధ్యక్షులు కిమిడి అశోక్‌కుమార్, భాను, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు దూబ ధర్మారావు, పాలవలస రామచంద్రినాయుడు పాల్గొన్నారు.

సంగమేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి

వంగర, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సంగమేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. తెదేపా పార్లమెంటు ఉపాధ్యక్షుడు బొత్స వాసు దేవరావునాయుడు తదితరులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్యామలరావు, వంగర మండలాధ్యక్షుడు పి.మోహన్‌రావు, నాయకులు గణపతిరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

అనాథను ఆదుకున్నారు

బొబ్బిలి, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రానికి చెందిన అనాథ చక్రపాణి 20 ఏళ్ల కిందట బొబ్బిలి ప్రాంతానికి వచ్చారు. భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అనుకోని ప్రమాదంలో కాలు విరిగిపోయింది. కదల్లేని స్థితిలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కొన్ని రోజులుగా పడి ఉన్నాడు. బొబ్బిలికి చెందిన పలువురు కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేసీ రాజుకు సమాచారం అందించారు. ఆయన స్పందించి సపర్యలు చేశారు. ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి, వైద్యం అందిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులను సహాయకులుగా పెట్టారు. కొంతవరకు కోలుకున్నాడు. కాలుకు శస్త్రచికిత్స చేయిస్తే నయమవుతుందని వైద్యులు చెప్పారు. దాతల సాయంతో శస్త్రచికిత్సకు సరిపడా డబ్బులు పోగు చేశారు. ఆదివారం సత్యసాయిబాబా భక్త బృందం రూ.20 వేలు అందించింది.

ఉరిటికి సాహితీ శిరోమణి పురస్కారం

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, సాహితీవేత్త ఉరిటి లక్ష్మణరావుకు శ్రీకాకుళం సాహితీ కళావేదిక సాహితీ శిరోమణి ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహించిన సాహితీ సంబరాల్లో ఈ పురస్కారాన్ని అందజేసి, సత్కరించారు.

కరాటే క్రీడాకారులకు అభినందన

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో శిక్షణ పొందుతున్న 29 మంది కరాటే క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. కరాటే మాస్టర్ కె.రవికాంత్ 29 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఒకరికి బ్రౌన్, నలుగురికి మెరూన్, అయిదుగురికి గ్రీన్, ఆరుగురికి ఆరెంజ్, 13 మందికి పసుపు బెల్ట్‌లు దక్కాయి. వీరిని శిక్షకుడు డి.రమేష్ అభినందించారు.

స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

చీపురుపల్లి పట్టణంలో విజయనగరం- పాలకొండ ప్రధాన రహదారికి ఆనుకుని మండల పరిషత్తు కార్యాలయం ఎదురుగా ఉన్న డీసీఎంఎస్‌కు చెందిన అతి విలువైన స్థలం ఆక్రమణకు గురికాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ఈ స్థలంలో గతంలో డీసీఎంఎస్‌కు సంబంధించిన కార్యకలాపాలు జరిగేవి. దశాబ్దాలుగా ప్రాంగణం నిరుపయోగంగా ఉండడంతో షెడ్లు శిథిలావస్థకు చేరాయి. వ్యర్థాలతో పరిసరాలు అధ్వానంగా మారాయి. కొన్ని రోజుల కిందట దుకాణాల ఏర్పాటుకు కొందరు ప్రయత్నించగా తహసీల్దార్ ధర్మరాజు, రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ఎట్టకేలకు డీసీఎంఎస్ అధికారులు స్పందించి స్థలాన్ని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. - న్యూస్‌టుడే, చీపురుపల్లి

ఆవాసం.. మురుగునీటితో సావాసం

న్యూస్‌టుడే- రాజాం పట్టణం

రాజాం పట్టణంలోని కొండంపేట వీజేఆర్ నగర్ వద్ద కాలువలు లేకపోవడంతో మురుగు నిల్వ ఉంటోంది. రాజాం- రామభద్రపురం ప్రధాన రహదారి నుంచి పాఠశాల వీధి వరకు మురుగు నిల్వలతో అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వ్యాధులు ప్రబలే అవకాశముందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ఈ ప్రాంతాల్లో ప్రధాన సమస్య..

● పాత బస్టాండ్ వెనుక సత్యనారాయణపురం, శ్రీకాకుళం రోడ్డుకు దక్షిణ దిక్కులో ఉన్న కాలనీల్లో కాలువలు లేక మురుగు నిలిచి రోగాల బారిన పడుతున్నారు. ● మెంతిపేట ఎస్సీ వీధి చివర ఆదర్శనగర్ రెండో లైన్‌లో కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్ల ముందు మురుగు ఉంటోంది. ● శ్రీకాకుళం, బొబ్బిలి రోడ్డులలో ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు నీరు ఉంటోంది. రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ● వినాయక నగర్, వాసవీనగర్, క్రిష్ణానగర్, వంటి ప్రాంతాల్లో మురుగునీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. విషయం పురపాలిక కమిషనర్ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తామన్నారు.

కొండంపేట వీజేఆర్ నగర్ వద్ద మురుగు

కలగానే కంచరగెడ్డ జలాశయం

కంచరగెడ్డ రిజర్వాయర్

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: నారాయణప్పవలస సమీపంలో ఎప్పుడో మంజూరు చేసిన కంచరగెడ్డ జలాశయం ఇంకా పూర్తికాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు రెండు దశాబ్దాల కిందట అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞంలో భాగంగా దీన్ని మంజూరు చేశారు. అప్పట్లో రూ.90 లక్షలతో నిర్మాణం చేపట్టారు. గుత్తేదారుడు మృతి చెందడంతో పనులు సగంలో ఆగిపోయాయి. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దీన్ని పట్టించుకోలేదు.

నారాయణప్పవలస, కాశిందొరవలస, అప్పలరాజుపేట, గొర్లెసీతారాంపురం గ్రామాల పరిధిలోని సుమారు 398 ఎకరాలకు సాగునీరు అందించేందుకు పెద్ద చెరువును జలాశయంగా మార్చాలని అప్పట్లో నిధులు కేటాయించారు. సకాలంలో పూర్తికాకపోవడంతో రూ.2.53 కోట్లకు అంచనా వ్యయం పెంచి 2022 జూన్‌లో మరోసారి అప్పటి ఎమ్మెల్యే చినఅప్పలనాయుడు, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. దీంతో రైతులు ఎంతో ఆశపడ్డారు. బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మధ్యలో నిలిచాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 25 శాతంలోపు పనులన్నీ నిలిపేయాలని నిర్ణయించడంతో ఇది కూడా అందులో చేరింది. ఇరిగేషన్ అధికారులు దీనికి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపించారు. కాలువ పనులు, భూసేకరణ పనులు పూర్తిగా జరగలేదని, మరి కొంత భూమి అవసరముందని, ప్రభుత్వ ఆదేశాల తర్వాత ప్రతిపాదనలు పంపిస్తామని ఏఈ సుధీర్ తెలిపారు.

సమన్వయకర్తగా నియామకం



రేగిడి, న్యూస్‌టుడే: అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సమన్వయకర్తగా రేగిడి మండలం ఏవీపురానికి చెందిన **గోగుల తమ్మి నాయుడు** నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఎ.వరప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విజయలక్ష్మి నియామక పత్రాన్ని అందించారన్నారు.

రహదారి కష్టాలు తీర్చినందుకు సత్కారం

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని 25వ వార్డు మారుతీనగర్‌లో రూ.5 లక్షలతో ఇటీవల సీసీ రహదారిని వేశారు. దీంతో ఆదివారం స్థానికులు వార్డు కౌన్సిలర్ కల్యంపూడి లక్ష్మి, సత్యనారాయణ దంపతులను సత్కరించారు. గత ప్రభుత్వంలో రోడ్డు కోసం ఎన్ని వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వంలో రహదారి వేసినందుకు ఎమ్మెల్యే బేబినాయన, పురపాలిక అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి పీఏసీఎస్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

గుర్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పీఏసీఎస్ ఉద్యోగులంతా సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఆ ఉద్యోగుల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి రామునాయుడు ఆదివారం తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గత 18 నెలలుగా ఆప్కాబ్, సహకార శాఖ కమిషనర్‌ను కోరినప్పటికీ ఫలితం లేక రెండు నెలల పాటు ఆందోళనలు చేశామన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ● **గజపతి నగరం:** రెండు నెలలుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పీఏసీఎస్ ఉద్యోగులంతా సమ్మె చేస్తున్నట్లు రాష్ట్ర సహకార ఉద్యోగుల సంఘ జేఏసీ ఉపాధ్యక్షుడు డి.నారాయణరావు తెలిపారు. జీవో 36 అమలు, 2019, 2024 పీఆర్సీలు అమలు చేయాలని డిమాండు చేస్తామన్నారు.

కర్లాం.. సంపద సృష్టిలో ఆదర్శం

న్యూస్‌టుడే- చీపురుపల్లి గ్రామీణం

పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో 2014-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. చాలాచోట్ల ఆశయం నీరుగారిపోయింది. కానీ కొన్నిచోట్ల ఆశయానికి తగ్గట్లు కష్టపడి ఆదాయం సృష్టిస్తున్నారు. చీపురుపల్లి మండలం కర్లాంలో కేంద్రం విజయవంతంగా కొనసాగుతోంది. ఎరువు తయారుచేసి ఆదాయం సృష్టిస్తున్నారు. ఏడాదికి సుమారు రూ.లక్షకు పైగా ఆదాయాన్ని పొందుతోంది.

తయారైన సేంద్రియ ఎరువు నుంచి వానపాములు వేరు చేస్తున్న సిబ్బంది

తయారీ ఇలా..

ఇక్కడ పంచాయతీలో హరిత రాయబారులు రోజూ తమ వాహనాల్లో ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను సేకరిస్తారు. తీసుకొచ్చిన చెత్తను కేంద్రం ఎదురుగా ఏర్పాటు చేసిన పిట్స్‌లో వేసి, దానిపై పేడను వేస్తారు. 60 రోజులకు కుళ్లిపోతుంది. ఇలా వచ్చిన దానిని కేంద్రం లోపల ఉన్న ప్రత్యేక పిట్స్‌లో వేసి దానిలో వానపాములను విడిచిపెడతారు. 40 రోజులకు ఎరువు సిద్ధమవుతుంది. మొత్తం పొడిగా మారాక వానపాములు వేరు చేస్తూ.. జల్లెడ పడతారు. అలా వచ్చిన సేంద్రియ ఎరువును కవర్లలో నింపి విక్రయానికి సిద్ధం చేస్తారు.

ఇవీ లాభాలు..

పొలాల్లో భూసారం పెరుగుతుంది. ● రసాయనాల వినియోగం తగ్గుతుంది. ● మేలైన దిగుబడి వస్తుంది. ● నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయి. ● కావాల్సినవారు కేంద్రాన్ని సంప్రదించాలని కార్యదర్శి స్వర్ణలత తెలిపారు.

ఎరువు ధర..

● ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎరువు : **2 టన్నులు** ● స్థానిక రైతులకు కిలో : **రూ.7** ● బయటివారికి కిలో: **రూ.8**

విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల •ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	8008574326
భోగాపురం	70959 54646

?: విజయనగరంలోని ఎత్తుబ్రిడ్జి నుంచి విశాఖ వెళ్లే దారిలో అయిదు రోజులుగా దీపాలు వెలగడం లేదు. - **శ్రీనివాస్, స్థానికుడు** ● అక్కడ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - **ప్రవంతి, ఏఈ, నగర పాలక సంస్థ**

?: ఐస్‌ఫ్యాక్టరీ కూడలిలో రహదారి మరమ్మతులకు గురైంది. - **స్థానికులు** ● రహదారుల తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.1.98 కోట్లతో అంచనాలు రూపొందించాం. మరమ్మతులు చేయిస్తాం. - **నందకుమార్, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, విజయనగరం సర్కిల్**

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

?: రాకోడు, పినవేమలిలో పాడైన బోర్లకు మరమ్మతులు చేయాలి. - **స్థానికులు** ● సిబ్బందిని పంపించి చేయిస్తాం.- **వెంకటరావు, ఎంపీడీవో, విజయనగరం**

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

?: కందివలసలో తాగునీటి పైపులు వేసి కుళాయిలు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. - **స్థానికులు** ● సమస్యను పరిష్కరిస్తాం. - **రాధిక, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, పూసపాటిరేగ

?: చోడమ్మ అగ్రహారంలో యూరియా కొరత వేధిస్తోంది. - **ఎ.రమేష్, వైస్ ఎంపీపీ** ● రైతులకు పూర్తి స్థాయిలో యూరియా అందిస్తాం. - **భాను, ఏఈవో**

– న్యూస్‌టుడే, పూసపాటిరేగ

వ్యర్థాలను తొలగించారు

స్పందనకు వందనం

నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పీఎస్ఎన్ రెసిడెన్సీ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. ఇక్కడి సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా'కు స్థానికులు తెలియజేశారు. సహాయ కమిషనరు కె.అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

అందుబాటులో ఎన్టీఆర్ వైద్య సేవలు

కొత్తవలస: మంగళపాలెంలోని శ్రీగురుదేవ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ట్రస్ట్ ఛైర్మన్ జగదీష్ కుమార్ ఆదివారం తెలిపారు. ఎముకల(ఆర్థోపెడిక్స్), రహదారి ప్రమాదాలు, తదితరాలకు సంబంధించిన సేవలు ఉచితంగా పొందొచ్చన్నారు. సదుపాయాలను వినియోగించుకోవాలన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

కొత్తవలస, న్యూస్‌టుడే: భారతీయ విద్యా కేంద్రం(బీవీకే)కి చెందిన విజ్ఞాన భారతి పాఠశాల పూర్వ విద్యార్థులు ఏ వృత్తిలో ఉన్నా అంకితభావంతో పని చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని సంస్థ ఎస్టేట్ అధికారి డీవీ రమణమూర్తి అన్నారు. ఈ కేంద్రానికి చెందిన పూర్వ విద్యార్థులు స్థానిక పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. జ్ఞాపకాలను పంచుకున్నారు. బీవీకే అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

మీరు కళ్లు మూసుకోండి.. మేం తవ్వేస్తాం..!

విజయనగరం మండలం కొండకరకాం పంచాయతీ పరిధిలోని కొండ ప్రాంతంలో నివాస స్థలాల పరిసరాల్లో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి తరలించుకుపోతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడంతో రాత్రి పగలు తేడా లేకుండా తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరపాలక సంస్థలోని పేద, మధ్యతరగతి ప్రజలకు గత ప్రభుత్వం ఇక్కడ ఇళ్లను కేటాయించింది. శివారు ప్రాంతం కావడం, మౌలిక సదుపాయాలలేక గృహనిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావట్లేదు. అప్పటి అధికారుల ఒత్తిడి మేరకు కొందరు పునాదుల వరకు తవ్వి వదిలేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో జనసంచారం లేకపోవడంతో ఇక్కడ నిర్మించడానికి తీసిన పునాదులు, ప్లింత్‌బీమ్ వద్ద అక్రమార్కులు మట్టి తవ్వేస్తున్నారు. ఉదయం కాస్తా జనసంచారం ఉండడంతో తవ్వకాలు జరగట్లేదు. కాస్త చీకటి పడితే ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా తరలించి, జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని గృహనిర్మాణ శాఖ ఏఈ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు చేపడతామని చెప్పారు.

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

లయకారుని దయకోరి..

అయోధ్య మైదానంలో ఏర్పాటు చేసిన స్ఫటిక లింగం

ఉడాకాలనీ: ఫేజ్-2లో ఉమామహేశ్వరుడికి అభిషేకం

బాబామెట్ట: రుద్రాక్షల శివలింగాన్ని ఆరాధిస్తున్న భక్తులు

శంభో శంకర.. హరహర మహాదేవ... అంటూ జిల్లాలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం కావడంతో రామతీర్థం, పుణ్యగిరి, నగరంలోని రింగురోడ్డు పశుపతినాథేశ్వరస్వామి, బాబామెట్ట ఏడుకోవెళ్లలో స్వామి, పలు ఆలయాలు జనసంద్రంగా మారాయి. వేకువజాము నుంచి భక్తులు శివాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– న్యూస్‌టుడే, బృందం

నెల్లిమర్ల: రామతీర్థం వద్ద రాత్రి అశేష భక్తుల జాగారం

కొత్తవలస: తుమ్మికాపల్లి ఓంశివనంలో 108 శివలింగాలను పూజిస్తున్న భక్తులు

ఉడాకాలనీ: శిర్డీసాయి ఆలయంలో సామూహిక రుద్రాభిషేకాలు

డెంకాడ: చింతలవలసలోని ఉమా రామలింగేశ్వర ఆలయంలో..

ఎల్.కోట: పూజలందుకుంటున్న వీరభద్రస్వామి

రింగురోడ్డు: అలంకరణలో పశుపతినాథేశ్వర ఆలయంలోని స్ఫటిక లింగం

ఎస్.కోట: సన్యాసేశ్వరస్వామిని పూజిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

విజయనగరం రామనారాయణంలో..

తాటి దుంగే కల్వర్టు!

నెల్లిమర్లలోని వేణుగోపాలపురం డైట్ కాలనీలో కాలువపై తాటి దుంగనే కల్వర్టుగా చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. కాలువపై సిమెంటు పలకలు లేకపోవడంతో గత అయిదేళ్లుగా ఇదే దుస్థితి అని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. నగర పంచాయతీ ఏఈ శివకుమార్ వద్ద వివరణ కోరగా పలకలు వేసి కాలువను గుర్తిస్తున్నామని, త్వరలో బిందువు వేసి పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

పట్టని తాగునీటి వృథా

జరజాపుపేటలో తాగునీరు వృథా అవుతోంది. ప్రస్తుతం లక్ష్మీదేవిపేట తాగునీటి పైపులైను నుంచి దేవి గుడి ప్రాంతానికి నీరు సరఫరా చేస్తున్నారు. పైపులైను మరమ్మతులకు గురవ్వడంతో నీరు వృథాగా పోతోంది. లీకులు అరికట్టకుంటే కలుషితమయ్యే ప్రమాదముందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే సంబంధిత శాఖాధికారులు స్పందించాలని కోరుతున్నారు. సమస్యను వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజా వద్ద ప్రస్తావించగా మరమ్మతులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, జరజాపుపేట(నెల్లిమర్ల)

రహదారి దాటేదెలా?

శృంగవరపుకోట పట్టణంలోని సీతంపేటలో ఎరుకల పేటకు వెళ్లే మార్గంలో కల్వర్టు ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ గ్రామంలోకి వెళ్లాలంటే దీని మీదుగానే రాకపోకలు సాగించాలి. దీని మీద పలకలు విరిగిపోవడంతో తాత్కాలికంగా తాటి దుంగ వేశారు. పలకల మధ్య ఖాళీ ఉండడంతో ఇటీవల ఓ వాహనదారు ప్రమాదానికి గురయ్యాడు. సమస్యను ఈవో చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

చెత్త తరలేదెప్పుడో..

నగరంలో చెత్త ఎక్కడికక్కడే గుట్టలుగా పేరుకుపోయి ఉంటోంది. కాలువల్లో మురుగు వ్యర్థాలు పేరుకుపోయాయని స్థానికులు వాపోతున్నారు. డంపర్‌బిన్లు ఉన్న చోట్ల మట్టి చెత్త వేస్తుండడంతో ఈ సమస్య ఎక్కువైంది. కొన్ని డంపర్‌బిన్లు మరమ్మతులకు గురవ్వడంతో వాటి నుంచి కాంపాక్టర్లల్లోకి చెత్తను అన్‌లోడింగ్ చేయడం కష్టతరమవుతుందని సిబ్బంది వాపోతున్నారు. దాసన్నపేట న్యూడాల్ఫిన్ హైట్స్ మార్గంలో ఈ పరిస్థితి ఉంది. చెత్త తొలగించే చర్యలు తీసుకుంటామని సహాయ కమిషనరు కె.అప్పలరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

మట్టిదారులే గతి

నగరపాలక సంస్థలో పలు చోట్ల మట్టి దారులే దర్శనమిస్తున్నాయి. శివారు ప్రాంతాలు, కాలనీల్లో ఈ పరిస్థితి ఉంది. వర్షాలు పడితే బురదమయంగా మారి, అడుగుతీసి అడుగేయలేని దుస్థితి. దాసన్నపేట సింగపూర్‌సిటీకి వెళ్లే మార్గానిది ఇదే పరిస్థితి. వర్షాలు పడితే ఇక్కడి ఎర్రచెరువు నుంచి నీరు రోడ్డుపై పారడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. జగన్నాథ ఎన్‌క్లేవ్ నుంచి సింగపూర్ సిటీకి వెళ్లే రోడ్డు రాళ్లు తేలి ఉంది. పరిశీలించి, నిధుల లభ్యత మేరకు రోడ్లు నిర్మిస్తామని కమిషనరు కె.బాలస్వామి తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

అనాలోచిత నిర్ణయాలతో అవస్థలు

గిరిజనులతో పాటు నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వేపాడ, న్యూస్‌టుడే: ఇంజినీరింగు అధికారుల అనాలోచిత నిర్ణయాలే మారిక రోడ్డుకు అవస్థలు తెచ్చాయని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. గ్రామంలో సమస్యల అధ్యయనంలో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న రోడ్డును ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. అంచనాల రూపకల్పనలో తప్పులు దొర్లాయన్నారు. సీపీఎం నాయకులు చలుమూరి శ్యాం తదితరులు ఉన్నారు.

నిత్యావసరాల అందజేత

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: నగరంలోని కణపాక నవజీవన్ సంస్థ ఆధ్వర్యంలో దాతలు ఎ.ఎస్.ప్రకాశరావు, చంద్రశేఖరరావు, రామానాయుడు 35 మంది వితంతు మహిళలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. బియ్యం, పప్పులు, నూనె, పంచదార, ఉల్లిపాయలు, కూరగాయలు తదితరాలు సుమారు రూ.1000 విలువజేసే సరకులు 35 మందికి అందజేశారు. పంపిణీ వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎ.తిరుపతిరావు, సాయికృష్ణ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వల్లూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు.

నిర్వహణలో నిర్లక్ష్యం.. ఉత్తమానికదే ఆటంకం

- వ్యర్థాలు తొలగించక స్వచ్ఛ ర్యాంకులో వెనుకంజ
- నగర సుందరీకరణకు ప్రణాళిక..

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నగరంలో చెత్త, వ్యర్థాల నిర్వహణలో యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఫలితంగా రహదారుల పక్కన, ఖాళీ స్థలాలు వ్యర్థాల కుప్పలతో నిండి ప్రజలకు అవస్థలకు గురిచేస్తోంది. సీఅండ్‌డీ వేస్ట్ నిర్వహణ యూనిట్ లేకపోవడంతో ఏటా నిర్వహించే స్వచ్ఛసర్వేక్షణ్ సర్వేలో ఉత్తమ ర్యాంకు సాధనకు కావాల్సిన మార్కులను నగర పాలక సంస్థ కోల్పోతుంది. ఇప్పటికే చేపట్టిన మురుగుశుద్ధి కర్మాగార నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో మెరుగైన ర్యాంకు సాధించని పరిస్థితి. మరోవైపు శిథిల భవనాలు కూల్చగా వచ్చే వ్యర్థాలను ఇష్టానుసారంగా రోడ్లకిరువైపులా పారబోస్తున్నారు. రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. నగరంలోని ధర్మపురి రహదారి దుస్థితే ఇందుకు నిదర్శనం. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రణాళిక వేస్తున్నారు.

ధర్మపురిదారిలో ఓ రహదారిపక్కన పారవేసిన భవన నిర్మాణ వ్యర్థాల గుట్టలు

ముమ్మరంగా పనులు..

పర్యావరణ పరిరక్షణ, ఆదాయార్జన లక్ష్యంగా నగరంలో వ్యర్థాల నిర్వహణకు సీఅండ్‌డీ(కన్‌స్ట్రక్షన్ అండ్ డెమొలిషన్) వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు నగర పాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనరు కె.బాలస్వామి ఆ మేరకు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగం, ప్రజారోగ్య అధికారులతో సమావేశమయ్యారు. కేంద్రం ఏర్పాటు చేసి, 24 గంటలూ పనిచేసేలా ఓ కాల్‌సెంటర్ ఏర్పాటుకూ నిర్ణయించారు. భవన నిర్మాణాల కూల్చివేతల వల్ల వచ్చే వ్యర్థాలను సేకరించి ఈ కేంద్రంలో రీసైక్లింగ్ చేసి, పునర్వినియోగ వస్తువులు తయారుచేసి, వాటి అమ్మకంతో ఆదాయం సమకూర్చుకోవచ్చని యోచిస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..



భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడికక్కడే పారబోయకుండా, ఎంపిక చేసిన స్థలాల్లో వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఅండ్‌డీ వేస్ట్ యూనిట్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ధర్మపురి, గాజులరేగలో ఏర్పాటుకు ప్రతిపాదించాం. అక్కడికి వ్యర్థాలు తరలించాలి. కౌన్సిల్ ఆమోదం మేరకు విలువ నిర్ణయిస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

– కె.బాలస్వామి, కమిషనరు, నగర పాలక సంస్థ

రోజుకు 5 టన్నుల ఉత్పత్తి

నగరంలోని 61 సచివాలయాల పరిధిలో రోజుకు నాలుగైదు మెట్రిక్ టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిని నిర్దేశించిన ప్రాంతాలకు తరలించినట్లయితే నగర సుందరీకరణకు విఘాతం కలగదు. ధర్మపురి దారి, గాజులరేగలో సీతం కళాశాల రోడ్డు వద్ద కేంద్రాల ఏర్పాట్లు చర్యలు చేపట్టారు. కేంద్రాల్లో వ్యర్థాలు డంప్‌చేస్తే లోడుకు రూ.450 చొప్పున ఇచ్చేందుకు ప్రతిపాదించారు. తొలిసారి నిబంధనలు ఉల్లంఘించి వ్యర్థాలు రోడ్డుపై పడేస్తే రూ.25 వేలు, రెండో సారి చేస్తే రూ.50 వేలు అపరాధ రుసుము వసూలు చేయనున్నారు. మూడోసారి ఉల్లంఘిస్తే వాహనం సీజ్ చేయనున్నారు.

పేదలకు సరకుల పంపిణీ

వేపాడ: బొద్దాం గ్రామంలో మోసెస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 300 మంది పేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. బియ్యం, బెల్లం, శెనగపప్పు, శనగపిండితో కూడిన కిట్లు అందజేశారు. ఎంఎస్ ఖాన్, మత పెద్దలు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

డెంకాడ: ఎమ్మెల్యే నాగమాధవి జన్మదినం సందర్భంగా జనసేన నాయకులు డెంకాడలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. వారిని కూటమి నాయకులు అభినందించారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు.

బడ్జెట్‌పై హర్షం

భోగాపురం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కె.బంగార్రాజు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పోలిపల్లిలో ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

జాతరను జయప్రదం చేయాలి

జామి: యల్లారమ్మ జాతరను జయప్రదం చేయాలని ఆలయ సేవాకమిటీ అధ్యక్షుడు అల్లాడ ఎర్నిబాబు(పెద్ద), తెదేపా మండల అధ్యక్షుడు రమణ అన్నారు. ఈనెల 23, 24, 25 తేదీలలో నిర్వహించే కార్యక్రమాలను తెలియపరిచే కరపత్రాలను ఆదివారం ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

జరజాపుపేట(నెల్లిమర్ల): జరజాపుపేట ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. జరజాపుపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వైస్ ఛైర్మన్ రామారావు, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 8న హోమియో వైద్య శిబిరం

అయ్యన్నపేట: వచ్చే నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీల ఆరోగ్య సమస్యల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియో పతిక్ ఫిజిషియన్స్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

పోరు జోరు.. విజయ హోరు

భారత్, పాకిస్థాన్ టీ-20 క్రికెట్ మ్యాచ్ సందర్భంగా నగరంలోని తోటపాలెం గాయత్రి కళాశాల సమీపంలో భారీ స్క్రీన్‌పై ప్రదర్శన ఏర్పాటు చేశారు. క్రీడాభిమానులు, స్థానికులు తరలివచ్చి మ్యాచ్‌ను ఆద్యంతం ఉత్సాహంగా తిలకించారు. భారత్ విజయం సాధించడంతో సంబరాలు జరిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

భక్తులకు విశేష సేవలు

ఎస్.కోట: పుణ్యగిరి, సన్యాసయ్యపాలెంలో మహాశివరాత్రి జాతరలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవాదళ్ సభ్యులు భక్తులకు విశేష సేవలందించారు. ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు స్థానిక యువత, ఎన్‌సీసీ విద్యార్థులు పోలీసులు సమన్వయంతో ఆలయాల వద్ద వృద్ధులు, మహిళలు, పిల్లలకు సాయం అందించినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే నాగమాధవికి సన్మానిస్తున్న కె.రామారావు, కె.చంద్రశేఖర్

భోగాపురం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే లోకం నాగమాధవి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యకర్తలు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి ముంజేరులోని పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజుతో పాటు నాలుగు మండలాల కూటమి నాయకులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన మండల అధ్యక్షుడు వి.రమణ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ● డెంకాడ మండల కూటమి నాయకులు కనకల రామారావు, కంది చంద్రశేఖర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ ప్రతిష్ఠ

డెంకాడ: పినతాడివాడ పంచాయతీ ఒమ్మిపేటలో కొత్తగా నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, తెదేపా మండలాధ్యక్షుడు భాస్కరరావు, పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆదిబాబు, పైడి అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు.

మండల సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న తహసీల్దారు కృష్ణంరాజు

జామి, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన ఆదివారం మండల పరిషత్తు సమావేశ మందిరంలో జరిగింది. సమాచార హక్కుచట్టం ప్రకారం తాను అడిగిన వివరాలకు సరైన సమాచారం ఇవ్వడంలేదని జామి ఎంపీటీసీ సభ్యురాలు వరలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేయగా, తహసీల్దారు వి.కృష్ణంరాజు స్పందించి సమాధానం చెప్పారు. జామి అన్నమరాజుపేట కాలువ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తామని నీటి పారుదలశాఖ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. జడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీడీవో నీలం అప్పలనాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని తిమిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, రోజంతా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అప్పట్లో తమకు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న విద్యుత్తుశాఖ అధికారి దేముడు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయా శాఖల అధికారులు స్థానిక నాయకుల సమన్వయంతో పరిష్కరించాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. ఆదివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తాగునీరు, విద్యుత్తు అంతరాయాలు, యూరియా సరఫరా తదితర అంశాలను సభ్యులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. యూరియా కొరతపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేయగా సరఫరా పెంచేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, చంటిరాజు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

'ప్రకటనలు ఇవ్వడం అభ్యంతరకరం'

శంగవరపుకోట, న్యూస్‌టుడే: స్థానికంగా గ్రామసభలు నిర్వహించకుండా జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కుకు పర్యావరణ అనుమతులు ఎలా ఇచ్చారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రశ్నించారు. ఆదివారం బొడ్డవరలో విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది పర్యావరణ అనుమతులు ఇచ్చినట్లు జిందాల్ యాజమాన్యం ఇటీవల పత్రికల్లో ప్రకటన ఇవ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ముషిడిపల్లి రెవెన్యూలో ఎ-1 నోటీసులు ఇవ్వకుండా భూములను ఆక్రమించారన్నారు. స్థానిక పంచాయతీ తీర్మానం లేకుండా 23 ఎకరాల ఉద్యానశాఖ భూములను జిందాల్‌కు కట్టబెట్టారన్నారు.

పత్రాలు చూపుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

కల్యాణం కమనీయం

ఊరేగింపులో స్వర్ణకార సంఘ ప్రతినిధులు

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: శ్రీమాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం విశ్వబ్రాహ్మణ వేదపండితులు లక్కోజు, ఓంకార్ ఆచార్య సిద్ధాంతితో వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి, వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. విజయనగరం స్వర్ణకార సంఘం గౌరవాధ్యక్షుడు శివప్రసాద్, అధ్యక్షుడు దేవుళ్ల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు.

(c) eenadu

గోవిందా.. గోవిందా..

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మహా శివరాత్రి, ఆదివారం కలిసి రావడంతో గోవిందా..గోవిందా.. అంటూ వేలాది మంది భక్తులు ద్వారకాతిరుమల క్షేత్రానికి పాదయాత్రగా వచ్చారు. ఏలూరు తూర్పు వీధి శిర్డీ సాయి మందిరం నుంచి సుమారు 10 వేల మంది రథంతో పాదయాత్రగా వచ్చి చిన వేంకన్న ఆలయాన్ని దర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏలూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా వస్తూనే ఉన్నారు. వేలాది మంది రాకతో శ్రీవారి దర్శన క్యూలు, ఆలయ పరిసరాలు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం క్యూలు కిటకిటలాడాయి.

వైభవం.. ధన్వంతరి మహాయజ్ఞం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మహా శివ రాత్రి సందర్భంగా ఐఎస్. జగన్నాథపురంలో లక్ష్మీనరసింహస్వామి కొలువైన సుందరగిరిపై అతిరుద్ర సహిత సుదర్శన నృసింహ ధన్వంతరి మహా యజ్ఞం ఆదివారం రాత్రి వైభవంగా కొనసాగింది. హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట నరసింహ గురూజీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ క్రతువు నిర్వహించారు. ఉదయం సాల గ్రామాలకు అభిషేకం, లక్ష తులసిపూజ, సూర్యనమస్కారాలు, అతి రుద్ర సహిత సుదర్శన నృసింహ ధన్వంతరి మహాయజ్ఞం నిర్వహించారు. ఈ క్రతువులో భాగంగా అభిషేకం కోసం 1,116 కలశాలు వినియోగించారు. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఈ వేడుకను వేద పండితులు, రుత్వికులు తెల్లవార్లూ జరిపించారు.

యాగశాలలో ఉంచిన శంఖాలు, సాలగ్రామాలు, కలశాలు

భక్తజన గోదారి

పట్టిసంలో పంటుపై రాకపోకలు

సోమేశ్వరునికి అభిషేకాలు

క్షీరారామలింగేశ్వరస్వామికి..

నరసాపురం: అలంకరణలో ఏకాంబరేశ్వరుడు

ఆచంటలో రథోత్సవం

న్యూస్‌టుడే బృందం: మహా శివరాత్రి పర్వదినాన ఉమ్మడి పశ్చిమలోని ప్రముఖ శైవక్షేత్రాలన్ని శివనామ స్మరణతో మార్మోగింది. అఖండ గోదావరి మధ్యలోని పట్టిసం క్షేత్రం భక్తజన గోదారిగా మారింది. లక్ష్మణేశ్వరం, పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు, భీమవరం గునుపూడిలో స్వామివార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆచంటలో రథోత్సవం కనులపండువగా సాగింది.

క్షేత్రస్థాయిలో పనులు పరిశీలిస్తున్న మంత్రి

కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు: నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రం యలమంచిలిలో పుష్కర ఘాట్‌ను, శ్మశానవాటికను ఆయన ఆదివారం పరిశీలించారు. శ్మశాన వాటికలో శిథిలావస్థకు చేరిన షెడ్డుపై రేకులు తొలగించి శ్లాబ్ నిర్మించేందుకు రూ. 15 లక్షలు మంజూరయ్యాయన్నారు. పుష్కర, ఇతర అభివృద్ధి పనులకు దాతలు సహకరించాలని మంత్రి కోరారు. లంక భూములు కోతకు గురవుతున్న నేపథ్యంలో గ్రోయన్లు నిర్మించాలని అన్నదాతలు కోరగా త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తామన్నారు. పుష్కర పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సొసైటీ అధ్యక్షుడు బొప్పన హరికిశోర్, కూటమి నాయకులు వైజాగ్ బుజ్జి, చిలుకూరి శ్రీనివాస్, బర్రే ప్రసాద్ పాల్గొన్నారు.

పట్టణాల్లో ముందుకు.. పల్లెల్లో వెనక్కు!

- ఏకీకృత కుటుంబ సర్వేలో వ్యత్యాసం
- 20 వరకు గడువు పెంపు

తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఏకీకృత కుటుంబ (యూనిఫైడ్ ఫ్యామిలీ) సర్వే నత్తతో పోటీపడుతోంది. రెండోసారి పెంచిన గడువు పూర్తయినా.. ప్రక్రియ మాత్రం కొలిక్కి రాలేదు. గతేడాది డిసెంబరు 15 నుంచి సర్వే ప్రారంభం కావాల్సి ఉండగా.. అనివార్య కారణాలతో ఆలస్యంగా మొదలైంది. జనవరి 12తో గడువు ముగియగా.. ఆశించిన మేర సర్వే జరగకపోవడంతో.. ఈ నెల 10 వరకు గడువు పెంచారు. అయినప్పటికీ జిల్లాలో 54.26 శాతం మాత్రమే పూర్తవడంతో.. తాజాగా 20 వరకు గడువు పొడిగించారు.

కొండ్రుప్రోలులో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరం

ప్రత్యేక యాప్ రూపకల్పన

సర్వే నిర్వహణకు యూఎఫ్ఎస్ పేరిట ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు క్లస్టర్ల వారీగా ఇళ్లకెళ్లి కుటుంబ, వ్యక్తిగత సమాచారాన్ని యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆధార్, పేరు, ఫోన్ నంబరు, జనన తేదీ, కులం, మతం, ఆదాయం, ఉపాధి, విద్యుత్తు, ఎల్‌పీజీ కనెక్షన్లు, వాహనాలు, ఇతరత్రా 20 రకాల వివరాలు, ధ్రువపత్రాలు యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఒక్కో కుటుంబానికి సుమారు 30 నిమిషాలు సమయం పడుతుండటంతో ప్రక్రియ ఆలస్యమవుతోంది.

సాంకేతిక సమస్యలు

యూఎఫ్ఎస్ యాప్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో.. 1.0 నుంచి 1.11 వరకు వెర్షన్ నవీకరించారు. అయినా ప్రక్రియ ఊపందుకోలేదు. ఇంజినీరింగ్, డిజిటల్, సంక్షేమ శాఖ సహాయకులు తమ క్లస్టర్ల పరిధిలో సర్వే దాదాపు పూర్తి చేశారు. వీఆర్వోలు, సర్వేయర్లు వీపీఏలు సర్వేకు దూరంగా ఉండటంతో.. వారి క్లస్టర్ల పరిధిలోనూ ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఇంజినీరింగ్, డిజిటల్, సంక్షేమ శాఖ సహాయకులపై ఒత్తిడి చేస్తున్నారు.

అత్యధికంగా 97.29 శాతం పూర్తి

జిల్లాలోని పురపాలక సంఘాల్లో సర్వే వేగంగా సాగుతోంది. అత్యధికంగా తణుకులో 97.29, తాడేపల్లిగూడెంలో 95.20 శాతం పూర్తయింది. ఆకివీడు, ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాల్లో కనీసం 40 శాతం కూడా సర్వే దాటలేదు.

జిల్లా వివరాలిలా..	
మొత్తం ఇళ్లు:	6,30,955
సర్వే పూర్తయినవి:	3,42,326

డ్రమ్ముంది.. చూసి పొమ్మంది

భీమడోలు, న్యూస్‌టుడే: ఉంగుటూరు నియోజకవర్గం మీదుగా వెళ్తున్న 216ఏ జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయి. గ్రామాల కూడళ్లు, విభాజకాల ఖాళీల వద్ద ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. భీమడోలు మండలం కురెళ్లగూడెం, భీమడోలు, పూళ్ల; ఉంగుటూరు మండలం నారాయణపురం, చేబ్రోలు, కైకరం కూడళ్ల వద్ద సంభవించిన ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు.

భీమడోలు వద్ద జాతీయ రహదారిపై ఇలా..

అపసవ్య దిశలో.. జాతీయ రహదారిపై ఆయా కూడళ్లలో కారులు, భారీ వాహనాల వేగ నియంత్రణకు పోలీసులు ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేశారు. వీటి కారణంగా ప్రమాదాలు తగ్గడం అటుంచితే.. డ్రమ్ములు ఢీకొని పలువురు గాయపడిన ఘటనలు ఎక్కువవుతున్నాయి. 'గ్రామాల కూడళ్లలో రహదారి విభాజకాలకు ఖాళీలు ఇవ్వకపోవడంతో కొందరు అపసవ్య దిశలో వాహనాలు నడుపుతున్నారు. ఈ కారణంగానే ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. వీటి నివారణకు వేగ నిరోధకాలు ఏర్పాటు చేస్తున్నాం. ఎన్‌హెచ్ అధికారులతోనూ మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని భీమడోలు సీఐ యు.జె.విల్సన్ తెలిపారు.

నడిస్తే రూ.40.. లాంచీకి రూ.30

పట్టిసం క్షేత్రంలో అడ్డగోలు దోపిడీ

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినాన శివయ్య దర్శనానికి వచ్చిన భక్తులకు గడ్డు పరిస్థితి ఎదురైంది. సాధారణ రోజుల్లో పట్టిసీమ రేవు నుంచి లాంచీపై నది దాటేందుకు గుత్తేదారుడు ఒకరికి రూ.30 చొప్పున వసూలు చేయాలని పంచాయతీ అధికారులు నిర్ణయించారు. శివరాత్రి పర్వదినాన ఏర్పాట్ల పేరుతో భక్తులు నదిని దాటేందుకు పంటులను ఏర్పాటు చేసి, ఆ బాటలో నడిచి వెళ్లేందుకు ఒక్కొక్కరికి రూ.40 చొప్పున వసూలు చేయడం భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. కౌంటర్ల వద్ద, మైకుల ప్రకటనల్లో కూడా టికెట్ల ధరలు ప్రదర్శించకపోవడం గమనార్హం. లాంచీపై నదిని దాటాలంటే దూరం సుమారు ఒక కిలోమీటరు మాత్రమే ఉండటం, పంటుపై కాలినడకన చేరడానికి రానుపోను సుమారు 5 కి.మీ.లు దూరం ఉండటం గమనార్హం. బస్సులు దిగి ఆలయానికి వెళ్లి తిరిగి బస్సు వద్దకు చేరేటప్పటికి నడిచి రావడానికి అవస్థలు పడ్డామని, టికెట్ ధర పెంచడంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

టికెట్ కౌంటర్ల వద్ద కానరాని ధరల పట్టికలు

మెరక.. ఎవరికెరుక!

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- గణపవరం మండలం జల్లికొమ్మరలో సుమారు ఎనిమిదెకరాల విస్తీర్ణంలోని పొలంలో వారం రోజులుగా మూణ్నాలుగు అడుగుల మేర మట్టి తవ్వేశారు. భీమవరం, పెంటపాడు, వీరవాసరం, ఉండి, గణపవరం మండలాల్లోని లేఅవుట్లకు లారీల్లో తరలిస్తున్నారు. పరిమితికి మించి లోడు తరలిస్తుండటంతో.. రోడ్డుపై మట్టి పెళ్లలు పడిపోతున్నాయి. దీన్ని ప్రశ్నించిన ఓ వ్యక్తిపై లారీ డ్రైవర్ దురుసుగా ప్రవర్తించడం వివాదాస్పదమైంది.
- వల్లూరులో కాలువకు అడ్డుకట్ట వేసిన చెరువు మట్టిని వారం రోజులు అత్తిలి మండలానికి అక్రమంగా రవాణా చేశారు. దీన్ని ప్రశ్నించిన ఆయకట్టు రైతును అక్రమార్కులు దూషించారు. ఆయన మిగతా అన్నదాతలను వెంటపెట్టుకెళ్లి లారీలను అడ్డుకున్నారు.

గణపవరం, న్యూస్‌టుడే: గణపవరం మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. పొలాలు, కాలువ గట్లలోని మట్టి తవ్వేసి.. తరలిస్తోంది. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు దిగుతోంది. వీరికి రాజకీయ నాయకులు వత్తాసు పలుకుతుండటంతో.. రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. గ్రామాల మీదుగా మట్టి లారీలు దూసుకెళ్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

రాత్రింబవళ్లు .. జల్లికొమ్మరలో రెండు పొక్లెయిన్లు ఏర్పాటు చేసి సుమారు 50 లారీల్లో రాత్రింబవళ్లు మట్టి తరలిస్తున్నారు. పొలాల్లో మెరక తీసేందుకు రైతులు ముందుకు రావడంతో.. వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. నిత్యం వందకు పైగా ట్రిప్పుల్లో మట్టి తరలిస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. 'రెవెన్యూ, మైనింగ్ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. మట్టి అక్రమ తరలింపును అడ్డుకుంటాం.' అని భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరిగే పీజీఆర్ఎస్ సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లోను ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గతంలో ఇచ్చిన అర్జీల స్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు 1100కి ఫోన్ చేయొచ్చన్నారు.

ఉమ్మడి పశ్చిమకు జలసత్వాలు

ప్రధాన నీటి వనరులకు బడ్జెట్‌లో పెద్దపీట

జంగారెడ్డిగూడెం (కుక్కునూరు), న్యూస్‌టుడే రాష్ట్ర బడ్జెట్ ఉమ్మడి పశ్చిమకు ఆశాజనకంగా ఉంది. ప్రధానంగా వ్యవసాయ ఆధారమైన ఉభయ 'జల' సత్వాలు సమకూరేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. దీంతో జిల్లాలోని డెల్టాతోపాటు మెట్టప్రాంత రైతులకు కూడా సాగునీటి వసతులు ఏర్పడబోతున్నాయి. గోదావరి డెల్టా ఆధునికీకరణ, చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జిల్లాలోని అన్నదాతల్లో ఆనందం నింపింది.

గోదావరి డెల్టా.... పశ్చిమలో 2.10 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించే అతిపెద్ద సాగునీటి వ్యవస్థ. శిథిల లాకులు, అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు, ఇతర వ్యవస్థలు సరిగా పనిచేయక కర్షకులు కష్ట పడుతున్నారు. వీటి మరమ్మతులు, అదనంగా చేపట్టాల్సిన పనుల కోసం బడ్జెట్‌లో గోదావరి డెల్టాకు రూ.200 కోట్లు కేటాయించారు. గత ఆరేళ్లలో ఈ స్థాయిలో నిధులు కేటాయించటం ఇదే ప్రథమం. ఇందులో తూర్పుగోదావరి జిల్లాలోని పనులు, జలాశయాలకు కొంత కేటాయింపులు జరిగినా, జిల్లాకు రూ.70-80 కోట్లు వరకూ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నిధులతో కాలువలు, స్లూయిస్‌లు, లాకులకు మరమ్మతులు జరిగితే సాగునీటి సరఫరా సానుకూలంగా సాగుతుంది.

చింతలపూడి ఎత్తిపోతలకు... ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు ఇదో వరదాయిని. అయితే గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ పథకం మూలనపడింది. తాజాగా కూటమి ప్రభుత్వం పనులను పట్టాలెక్కించేందుకు బడ్జెట్‌లో రూ.430 కోట్లు కేటాయించింది. వైకాపా హయాంలో ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. అయిదేళ్లలో కేవలం రూ. 88.49 కోట్లు మాత్రమే కేటాయించారు. తాజా కేటాయింపులతో పనులు పూర్తయితే ఏలూరు, తూర్పుగోదావరి, ఎన్టీఆర్ జిల్లాలకు సాగు నీరు, 281 గ్రామాలకు తాగునీరు అందించే అవకాశం ఉంది. పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, చింతలపూడి, లింగపాలెం, చాట్రాయి మండలాలకు సాగునీరు అందుతుంది.

కొమ్ముగూడెం వద్ద చింతలపూడి ఎత్తిపోతల కాలువ ఇలా..

→ జిల్లాలోని మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించే మరో ఎత్తిపోతల తాడిపూడి అయిదో లిఫ్టు పనులకు రూ. 15 కోట్లు కేటాయించారు. ఈ ఎత్తిపోతల ద్వారా కొయ్యలగూడెం మండలంలో అధికంగా, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం మండలాల్లో పాక్షికంగా సాగునీరు అందుతుంది. దాదాపు 8 వేల ఎకరాల్లో సాగునీటి సవ్వడులు వినిపించనున్నాయి.

కాశీ విశ్వనాథుని సేవలో కేంద్ర మంత్రి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వారణాసిలోని కాశీ విశ్వనాథుని ఆలయాన్ని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇ-నారీ.. సంస్కరణల దారి!

పారదర్శకంగా పొదుపు సంఘాల నిర్వహణ

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉంది. ఆర్థిక క్రమశిక్షణ, మహిళాశక్తికి ఉత్తమ నమూనాగా నిలిచాయి. నగదు పొదుపు, రుణ వాయిదాల చెల్లింపులు సక్రమంగా ఉంటున్నాయి. మరోపక్క కొన్ని చోట్ల గ్రూపు లీడర్లు, వీవోఏలు అక్రమాలకు పాల్పడి బృందాల భవితవ్యాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు. ఇలాంటి వాటిని అరికట్టేలా ప్రభుత్వం ఇ-నారీ వ్యవస్థను ప్రవేశపెట్టింది.

ప్రాథమిక శిక్షణ పూర్తి

జిల్లాలో సుమారు 2,850 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఆయా గ్రూపుల్లో మూడు లక్షల మంది వరకు సభ్యులు ఉన్నారు. సంఘాలకు సంబంధించిన దస్త్రాల డిజిటలీకరణ, ఆధునిక విధానాల కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే 'మన డబ్బులు.. మన లెక్కలు' పేరిట యాప్‌ను వినియోగంలోకి తీసుకొచ్చింది. రుణాల మంజూరు, చెల్లింపులు తదితర వివరాలను పుస్తకాలతోపాటు ఆన్‌లైన్లో నమోదు చేసేందుకు వీలుగా పది గ్రూపులకు ఒకరు చొప్పున ఇ- నారీలను నియమించారు. పదో తరగతి ఆపై విద్యార్హత ఉన్న వారిని ఎంపిక చేసి ఇప్పటికే ప్రాథమిక శిక్షణ ఇచ్చారు. కేటాయించిన గ్రూపుల సమాచారం, దస్త్రాల నవీకరణ, ఇతర సమాచారాన్ని వీరు అంతర్జాలంలో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతి నెల 8 రోజులు పని చేయాల్సి ఉంటుంది. దీనికి రోజుకు రూ.300 చొప్పున చెల్లించనున్నారు. వీరితో పాటు మండలానికి పది మంది చొప్పున సీఆర్పీలను నియమించారు.

ప్రభుత్వ లక్ష్యాల మేరకు సభ్యుల జీవనోపాధి మెరుగుకు, నూతన వ్యాపారాలు, ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పడానికి సీఆర్పీలు పనిచేయాల్సి ఉంది. స్వయం సహాయక సంఘాల నిర్వహణ, సభ్యులకు మెరుగైన జీవన విధానాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టిందని డీఆర్‌డీఏ పీడీ ఎన్ఎస్ఎస్ వేణుగోపాల్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

పాలకొల్లు, న్యూస్‌టుడే

పాలకొల్లు, న్యూస్‌టుడే: పశ్చిమలో 60 కి.మీ. మేర విస్తరించిన సుందర గోదావరి తీరం, 17 కి.మీ. పరిధిలో ఉన్న సాగర తీరంలో పలు పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. గోదావరి వెంబడి సిద్ధాంతం, చించినాడ, నరసాపురం, సాగర తీరంలో పేరుపాలెం, తూర్పుతాళ్లు, బియ్యపుతిప్ప గ్రామాలు జాతీయ రహదారికి చేరువలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఇప్పటి వరకు పర్యాటక ఉత్సవాలు నిర్వహించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పర్యాటక పరంగా ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా ప్రోత్సాహం అందిస్తోంది. జిల్లాల వారీగా ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వారం కిందట పల్నాడు జిల్లాలో కొండవీడు ఉత్సవాలు, ఈ నెల 14న ప్రకాశం జిల్లా సింగరాయకొండ సమీపాన బీచ్ ఫెస్టివల్ నిర్వహించారు. విశాఖలోనూ బీచ్ ఫెస్ట్ జరిగింది. పశ్చిమలో ఉత్సవాల ఊసే లేదు.

పర్యాటక వేడుక.. ప్రగతి వేదిక!

యలమంచిలి వద్ద గోదావరి తీరం

వనరుల సద్వినియోగంతో పురోగతి

ప్రాంతానిదో వైవిధ్యం.. జిల్లాలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. భీమవరం అంటే విభిన్న వంటకాలకు ప్రసిద్ధి. పాలకొల్లు కళాకారులకు పుట్టినిల్లు. ఆయా రంగాలను పరిగణనలోకి తీసుకుని భిన్నమైన వేడుకలు నిర్వహించే అవకాశాలున్నాయి. పేరుపాలెంలో బీచ్ ఉత్సవాలు ఏర్పాటు చేయవచ్చు. ఏలూరు జిల్లా కొల్లేరు ప్రాంతంలో పడవల్లో షికారు పెట్టవచ్చు. ద్వారకాతిరుమల, మద్ది, పారిజాతగిరి, గుబ్బల మంగమ్మ క్షేత్రాలు, గుంటుపల్లి గుహలను కలుపుతూ ఆధ్యాత్మిక యాత్రలను ఏర్పాటు చేయవచ్చు.

వసతులకు అవకాశం.. పర్యాటక ఉత్సవాలను నిర్వహిస్తే ఆయా ప్రాంతాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉంటుంది. పర్యాటకుల తాకిడి పెరిగితే స్థానికులకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. ఈ అంశంపై జిల్లా పర్యాటక అధికారి ఏవీ అప్పారావు స్పందిస్తూ రాబోయే కార్తికమాసంలో బీచ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

పారదర్శకంగా.. పకడ్బందీగా..

'పది' పరీక్షల్లో డిజిటల్ విధానంలో నియామకాలు

భీమవరం టౌన్, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు(సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారుల(డీవో)ను డిజిటల్ విధానంలో నియమించనున్నారు. గతేడాది వరకు జిల్లా స్థాయిలోనే డీఈవోలు, డీవైఈవోలు ప్రక్రియ చేపట్టారు. ఈ ఏడాది రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇన్విజిలేటర్లను నియమించనున్నారు. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టిస్)లో నమోదు చేసిన ఉపాధ్యాయుల వివరాల ప్రకారం ఇన్విజిలేషన్ విధులు కేటాయించనున్నారు.

కైకరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు

సాకులు కుదరవు.. గతంలో ఇన్విజిలేటర్లగా నియమితులైన ఉపాధ్యాయుల్లో కొందరు సాకులు చెబుతూ విధుల నుంచి తప్పించుకునేవారు. కొత్త విధానంలో సాకులు కుదరవు. పదో తరగతి పరీక్ష ఫీజు రూ.125 ఉండగా. . కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి రూ.500-1000 వసూలు చేసేవి. తమ విద్యార్థులు పరీక్షలు రాసే కేంద్రాల్లోని ఇన్విజిలేటర్లకు రోజూ అల్పాహారాలు, శీతల పానీయాలు సరఫరా చేసేవారు. వారు పిల్లలను చూసీచూడనట్లు వదిలేసేవారు.

వీరికి మాత్రమే మినహాయింపు 60 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులు, గర్భిణులు, బాలింతలు(పాలిచ్చే తల్లులు), దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మాత్రమే పదో తరగతి పరీక్షల విధుల నుంచి మినహాయింపు ఇచ్చారు. గతంలో మాల్‌ప్రాక్టీస్‌లకు పాల్పడినవారు, సస్పెన్షన్‌లో ఉన్నవారికి విధులు అప్పగించలేదు. పరీక్ష సబ్జెక్టులకు అనుగుణంగా జంబ్లింగ్ విధానంలో విధులు కేటాయిస్తారు.

ప్రైవేటు గురువులకూ.. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షల విధులకు వెళ్లడంతో.. నిర్వహణ కష్టంగా ఉండేది. దాంతో ఎస్జీటీలకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. పాఠశాల సహాయకులు, వ్యాయామోపాధ్యాయులను మాత్రమే ఇన్విజిలేటర్లగా నియమించనున్నారు. తొలిసారిగా ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకూ అవకాశం కల్పించనున్నారు.

పరీక్షలు:	మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు
పరీక్ష కేంద్రాలు	132
విద్యార్థులు	24,123
ఇన్విజిలేటర్లు	1190

(c) eenadu

శైవక్షేత్రాలను దర్శించుకున్న 3.50 లక్షల మంది

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా జిల్లాలోని అన్ని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయని కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3.50 లక్షల మంది భక్తులు ఆలయాలను దర్శించుకున్నారని వెల్లడించారు. భీమవరంలోని సోమేశ్వరాలయం, పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరాలయంతో పాటు ఆచంట, నత్తారామేశ్వరం, శివదేవునిచిక్కాల, జుత్తిగ, వీరంపాలెం, యనమదుర్రు శక్తీశ్వరాలయం వద్ద బాగా రద్దీ నెలకొందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించారన్నారు. క్యూలో నిల్చున్న పిల్లలకు పాలు, పెద్దలకు అల్పాహారం, తాగునీటిని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

సోమేశ్వరుడి ఆదాయం రూ. 6.41 లక్షలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు దర్శనం, అభిషేకాలు, ప్రసాదం విక్రయం నిమిత్తం సుమారు రూ. 6,41,443 ఆదాయం వచ్చినట్లు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు.

స్వామి సేవలో హాస్యనటుడు గౌతమ్‌రాజు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయాన్ని సినీ హాస్య నటుడు గౌతమ్‌రాజు దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు చేయించుకున్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆయనను పలకరించి స్వీయ చిత్రాలు తీసుకోవడంతో కొద్ది సేపు సందడి నెలకొంది.

శనివారం అర్ధరాత్రి ధర్మకర్త కుటుంబ సభ్యుల తొలి పూజలు

పట్టిసం.. భక్తజన సంద్రం

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినాన పోలవరం మండలం పట్టిసీమ వద్ద అఖండ గోదావరి మధ్య గల భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి క్షేత్రం భక్తజనసంద్రమైంది. తెల్లవారుజామున ఒంటి గంట సమయాన నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన ఆలయ ధర్మకర్త కొచ్చెర్లకోట కుటుంబ సభ్యులు తీర్థం బిందెతో గోదావరి జలాలను తెచ్చి స్వామికి తొలిపూజ చేశారు. సుమారు 3 గంటల సమయంలో అప్పటికే క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. ఏలూరుతోపాటు పోలవరం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల భక్తుల రాకతో క్యూలైన్లు పోటెత్తాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వామి దర్శనానికి గంటల కొద్దీ సమయం పట్టింది. సాయంత్రం 6 గంటలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు రేవును దాటినట్లు అధికారుల అంచనా. పోలవరం, కొవ్వూరు శాసనసభ్యులు చిర్రి బాలరాజు, ముప్పిడి వెంకటరావు కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఎండ తాకిడికి విలవిల.. ఫెర్రీ పాయింట్లో క్యూలైన్లలో భక్తులు ఎండ తాకిడికి విలవిల్లాడారు. టికెట్ కౌంటరు దాటి పంటులకు వెళ్లే మార్గంలో నీడ కోసం అధికారులు ఈ ఏడాది ఏర్పాట్లు చేయలేదు. రద్దీని నియంత్రించే క్రమంలో క్యూలైన్లను పంటుల మీదకు వెళ్లకుండా ఒకవైపు నిలిపివేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల కొద్దీ వేచి ఉండలేక, ఎండ వేడిమికి తాళలేక అసహనం వ్యక్తం చేశారు.

గోదావరి దాటే మార్గంలో భక్తుల రద్దీ

దర్శన వరుసల్లో తోపులాట

స్వయంగా రంగంలోకి దిగిన ఐజీ

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినాన పట్టిసం క్షేత్రం ఆదివారం భక్తజన గోదారిగా మారింది. ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు స్వామి దర్శనానికి గంటల తరబడి ఆలస్యం, పలు ప్రాంతాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చే భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తుల రద్దీని నియంత్రించడం ఒక దశలో పోలీసులకు సవాల్‌గా మారింది. ఎండ వేడిమికి తాళలేని భక్తులు కొండ దిగువన క్యూలైన్లలో ముందుకెళ్లే క్రమంలో తోపులాటలు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో దర్శనానికి వచ్చిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. భక్తులను సంయమనం పాటించాలని కోరుతూ తోపులాటలు అదుపు చేశారు. అదే ప్రాంతంలో కంపార్ట్‌మెంట్లు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో తోపులాటలకు ఆస్కారం ఉందని పేర్కొంటూ 'గతానికి భిన్నంగా..' శీర్షికన 'ఈనాడు'లో శనివారం కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. డీఐజీ వెంట అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు.

పంచారామ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయం భక్తజన సంద్రమైంది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు స్వామివారికి అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి వరకు ఆలయం శివనామ స్మరణతో మార్మోగింది. స్వామి దర్శనానికి భక్తులు క్యూలో బారులుదీరారు. గత ఏడాది కంటే ఎక్కువగా సుమారు 30 నుంచి 35 వేల మంది దర్శించుకుని ఉంటారని అధికారుల అంచనా. ప్రత్యేక దర్శనం, అభిషేకం, ఉచిత దర్శనంతో పాటు అన్నపూర్ణమ్మ దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు.

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రాత్రి జగజ్యోతి వెలిగించి లింగోద్భవ సమయంలో గోపుర శిఖరం నుంచి గాలి గోపురం వరకు పాగా కట్టారు. జాగారం చేసే భక్తుల కోసం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొత్తపేటలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో ఆన సంబరం జరిగింది. అనంతరం మహిళలు కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. రాత్రి భక్తులు నిప్పుల గుండం తొక్కారు. మంత్రి నిమ్మల రామానాయుడు స్వామిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

ఆలయం వద్ద మంత్రి నిమ్మలకు స్వాగతం పలుకుతున్న సభ్యులు

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని మన్నా చర్చి పాస్టర్ ఎం.జ్యోతిరాజు అన్నారు. స్థానిక సెయింట్ జేవియర్ పాఠశాల ఆవరణలో ఆదివారం స్తుతి వైభవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత విభావరి రమణీయంగా సాగింది. సుమారు 80 మంది క్రైస్తవ సంగీత దర్శకులు, గాయకులు, వాయిద్య కళాకారులు పాల్గొని స్తుతి గీతాలు ఆలపించారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొని క్రీస్తును ఆరాధించారు.

ప్రసంగిస్తున్న జ్యోతిరాజు

జగన్ ముఠాది గోబెల్స్ ప్రచారం: మంత్రి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ఓర్వలేని జగన్ ముఠా చేస్తున్న గోబెల్స్ ప్రచారం మానుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. [illegible]

పోలవరం పూర్తయితే రైతుల అభ్యున్నతి.. [illegible] మామిడి రైతులకు అవసరమైన సలహాలను సూచనలను ఉద్యానాధికారులతో ఇప్పించే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బైపాస్ రహదారి నిర్మాణంలో భూసేకరణ సంబంధించి రూ.6.5 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. నూజివీడులోని మొఘల్ చెరువు కట్ట వెంట ఉన్న ఆక్రమణలు తొలగించి షాపింగ్ కాంప్లెక్స్, పైన గృహాలు ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. సమావేశంలో నాయకులు చెరుకూరి దుర్గాప్రసాద్, పగడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేగమే శ్వాసగా సాగిపో

చిట్టి పాదాలు ప్రపంచాన్ని చుట్టేయనున్నాయి

తణుకు, న్యూస్‌టుడే

ఆ చిట్టి పాదాలకు చక్రాలు కడితే వాటి వేగానికి అదుపు ఉండదు. సునాయసంగా ప్రత్యర్థిని [illegible]

ఉపాధ్యాయిని అవ్వాలని

మూడో తరగతి [illegible]

-కాకిలేటి గేయదీపిక

దేశం తరఫున ఆడాలని

ఎల్‌కేజీ చదువుతున్న నిహస్వికి తల్లిదండ్రులు కృష్ణకుమార్, లావణ్య గత 6 నెలలుగా స్కేటింగ్ శిక్షణ [illegible]

-మండల నిహస్విక

అంతర్జాతీయ స్థాయిలో..

[illegible]

-ఖండవల్లి మయాంక్

18న కలెక్టర్‌కు వీఆర్‌ఏల రాయబారం

ఉండి, న్యూస్‌టుడే: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న జిల్లా కలెక్టర్‌కు రాయబారం చేయనున్నామని వీఆర్‌ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు తెలిపారు. ఉండి మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆదివారం సమావేశమై మాట్లాడారు. తెలంగాణ మాదిరిగా పేస్కేలు వర్తింపజేయాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.ఆంజనేయులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

చలో విజయవాడ రేపు: యూటీఎఫ్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సుభాషిణి, ఆర్.రవికుమార్ తెలిపారు. 2023 జులై 1 నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ 30 నెలలు గడిచినా ఎలాంటి పురోగతి లేకపోవడం, డీఏ బకాయిలు చెల్లించకపోవడం తదితర డిమాండ్ల సాధనకు రణభేరి 2.0 పేరిట నిర్వహించే చలో విజయవాడలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని వారు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

శివ.. శివా..! శివరాత్రి సందర్భంగా పోలవరం మండలం పట్టిసంలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించేందుకు భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి దుస్తులు అక్కడే విడిచిపెట్టారు. [illegible] - ఈనాడు, పోలవరం

కోతకు గురైన చోట మట్టి పోస్తూ..!

పోలవరంలోని మహానందీశ్వరస్వామి దేవాలయం చెంత గోదావరి వరద తీవ్రతకు కోతకు గురైన విషయం తెలిసిందే. శివరాత్రి వేళ భక్తుల తాకిడి నేపథ్యంలో హడావుడిగా లారీలతో రాళ్లు, మట్టిని తెచ్చి పోశారు. కోతకు గురైన చోట గోదావరిలో దిగొద్దంటూ పోలీసులు హెచ్చరిక బ్యానర్లను ఏర్పాటు చేశారు. -ఈనాడు, పోలవరం

ఫ్రీజరులో మృతదేహం భద్రపరచాలంటూ నిరసన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: శవాన్ని శీతల పెట్టెలో భద్రపరచకుండా బయట ఉంచడం పట్ల మృతుని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటనమిది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. అత్తిలి మండలం వరిఘేడుకు చెందిన కె.రాంబాబు ఆదివారం భీమవరం రెండో పట్టణంలో ఆటోలో వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో స్నేహితులు భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఫిట్స్ కారణంతో మృతి చెందాడని ధ్రువీకరించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. శవాన్ని పోస్టుమార్టం అనంతరం అప్పగిస్తామని పోలీసులు చెప్పారు. దాంతో మృతదేహాన్ని ఆసుపత్రి ఆవరణలోని మార్చురీ గదిలో బల్లమీద పొద్దుపోయే వరకు ఉంచారు. ఫ్రీజర్‌లోనైనా పెట్టండి, లేకపోతే శవాన్ని ఇస్తే తీసుకెళ్లిపోతామంటూ మృతుని బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్నారు. శవం పాడైపోతుందని వేడుకున్నా కనికరం చూపడం లేదన్నారు. ప్రైవేటుగా ఏర్పాటు చేసుకోండని చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి పర్యవేక్షకుడు లక్ష్మణ్ జితానంద్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఫ్రీజరులో పెట్టాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. గత నాలుగు రోజులుగా విద్యుత్తు సౌకర్యం లేని మార్చురీ గదిలో శీతలపెట్టె ఎలా పనిచేస్తుందంటూ బాధితులు ఆందోళన చేపట్టారు.

గల్ఫ్ ఏజెంట్ నివాసం ఎదుట ఆందోళన

ఉండి, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గల్ఫ్ ఏజెంట్ నివాసం వద్ద మృతదేహం ఉన్న శవపేటికతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన ఘటన ఆదివారం ఎన్నార్పీ అగ్రహారంలో చోటుచేసుకొంది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురం మండలం చిట్టవరానికి చెందిన మురాల రాజమణి (48)ని ఎన్నార్పీఅగ్రహారానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ విమల నాలుగు నెలల కిందట మస్కట్‌కు ఉపాధి కోసం పంపారు. అక్కడ అనారోగ్యం బారిన పడిన రాజమణి తిరిగి స్వదేశానికి వచ్చేందుకు ప్రయత్నించగా ఏజెంట్ సహకరించలేదు. గతేడాది డిసెంబర్ 4న అక్కడే ఆమె మృతి చెందారని, మృతదేహాన్ని రప్పించాలని కుటుంబసభ్యులు కోరినా ఏజెంట్ పట్టించుకోలేదని నరసాపురం నియోజకవర్గ మాలల ఐక్యవేదిక కన్వీనర్ కాకిలేటి అనంత్ కుమార్ తెలిపారు. దీంతో మంత్రి నారా లోకేశ్‌కు రాజమణి కుమార్తె ఫిర్యాదు చేయడంతో ఆయనిచ్చిన ఆర్థిక సహకారం, మస్కట్, విజయవాడల్లోని ఎన్ఆర్ఐలిచ్చిన ప్రోత్సాహంతో మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో బంధువులు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో ఏజెంట్ ఇంటికి తాళం వేసి ఉంది. కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సంఘటనాస్థలికి ఎస్సై నసీరుల్లా, సిబ్బంది చేరుకొని ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. దీంతో వారు ఆందోళన విరమించి అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామం చిట్టవరం తీసుకెళ్లారు.

శవపేటికను ఇంటి ముందు ఉంచిన బంధువులు

అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ మీట్‌లో 5 పతకాలు సాధించినట్లు భీమవరానికి చెందిన యాతం నాగబాబు తెలిపారు. ఆయన భీమవరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయంలో జిల్లా మలేరియా విభాగంలో ఉప మలేరియా అధికారిగా పనిచేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో పోటీలు ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగాయన్నారు. 800, 1500 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలతో పాటు రిలే పరుగు పందేల్లో రజత పతకాలు అందుకున్నానని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభతో థాయ్‌లాండ్‌లో ఈ ఏడాది మార్చిలో జరిగే అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యానన్నారు.



పతకాలతో నాగబాబు

మోక్షిత్ ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: శ్రీహరిపురం బీసీ కాలనీకి చెందిన రెండున్నరేళ్ల బాలుడు ఆకేటి మోక్షిత్ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. గత నెల 20న ఇంటి వద్ద ఆడుకుంటూ మోక్షిత్ అదృశ్యమైన విషయం విదితమే. దీనిపై క్యాంప్‌బెల్ కాలువల్లోను, బస్సు స్టాండ్, రైల్వే స్టేషన్లను సైతం గాలించారు. ఆదివారం ఎస్సై వీరభద్రరావు, సిబ్బందితో కలిసి పలు మండలాల్లో నిర్వహించిన శివరాత్రి వేడుకల్లో గాలించారు. యాచకుల వద్ద ఉన్న బాలుడిని పరిశీలించారు. యాచకులు ఎవరైనా కొత్త బాలుడిని తీసుకువస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ముసునూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన ముసునూరు మండలం లోపూడిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జోనుబోయిన ఏసు (50) ఆదివారం పశువులకు గడ్డి కోసేందుకు పొలానికి వెళ్లాడు. అక్కడ బోరు సమీపం వద్ద గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు సర్వీసు వైరు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. రైతులు గమనించి వైద్యం నిమిత్తం నూజివీడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఏసుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రేమ పేరిట వంచన

నిందితుడిపై పోక్సో కేసు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: బాలికను ప్రేమ పేరిట మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. నరసాపురం పట్టణ ఎస్సై జయలక్ష్మి కథనం ప్రకారం.. రుస్తుంబాదకు చెందిన వివాహితుడు కొవ్వెల కల్యాణ్‌కు పట్టణానికి చెందిన బాలికతో రెండేళ్ల కిందట పరిచయం ఏర్పడింది. అతడికి వివాహం జరిగిన విషయాన్ని ఆ బాలికకు చెప్పకుండా ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. ఇటీవల అతడి మోసం బయటపడటంతో బాధిత బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

Roc No. 2422/E1/2023-24 Dated: 12-02-2026

S. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs. In Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1.	Civil & Water Supply Works - 11	General Funds	95.27	16-02-2026	02-03-2026

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender.apeprocurement.gov.in.

Sd/- Commissioner, Tadepalligudem Municipality

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

భీమడోలు, ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యులతో చిన్నపాటి వాగ్వాదంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ద్వారకాతిరుమలకు చెందిన శీమకుర్తి జ్యోతికృష్ణ గణపతి(50) శనివారం సాయంత్రం కుటుంబీకులతో ఓ విషయమై గొడవ పడ్డారు. వారిపై కోపంతో బయటకెళ్లిన అతడు తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆదివారం ఉదయం భీమడోలు రైల్వే గేటు సమీపంలో గణపతి మృతదేహం కనిపించారు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గణపతి (పాత చిత్రం)

కూలి పనికి వెళ్లి కానరాని లోకాలకు

గోపాలపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: అతడిది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. భార్య, ఇద్దరు కుమార్తెలతో ఉన్నంతలోనే సంతోషంగా జీవిస్తున్నారు. పండగ పూట ఆ కుటుంబ పెద్దని విద్యుదాఘాతం రూపంలో మృత్యువు కబళించింది. చిరుప్రాయంలోనే ఆ చిన్నారులకు తండ్రిని శాశ్వతంగా దూరం చేసింది. ఈ విషాదకర ఘటన రామచంద్రపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గోపాలపురానికి చెందిన మారుబోయిన సుబ్బారావు(38) కూలి పనులకెళ్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆదివారం నల్లమాడు పంచాయతీ రామచంద్రపురంలో ఆయిల్‌పామ్ గెలలు నరికే పనికెళ్లారు. అక్కడ గెలలు కత్తితో తొలగిస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యారు. సహచర కూలీలు తాడేపల్లిగూడెంలోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సుబ్బారావును పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు భార్య నాగభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు.

సుబ్బారావు (పాత చిత్రం)

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

మహిళను మోసం చేసిన పంచాయతీరాజ్ ఈఈపై కేసు

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌పై గుంటూరులోని పట్టాభిపురం ఠాణాలో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరులోని దేవాపురానికి చెందిన ఓ మహిళ భర్త కొన్నాళ్ల కిందట మృతి చెందారు. ఆమెకు అనిల్ ద్వారా పంచాయతీరాజ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న బాపిరెడ్డి పరిచయమయ్యారు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెకు దగ్గరయ్యాడు. అవసరం తీరాక మాట మార్చాడు. రూ. 1.5 కోట్ల వరకు ఆమె వద్ద డబ్బు కూడా తీసుకున్నాడు. ఆ నగదు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ బెదిరిస్తున్నాడు. మోసపోయానని తెలుసుకున్న ఆమె పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాపిరెడ్డి ప్రస్తుతం నూజివీడు పంచాయతీరాజ్ విభాగంలో ఈఈగా పని చేస్తున్నారు.

తలనీలాలకు తప్పని తిప్పలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి కేశఖండనశాల వద్ద భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. వీరు కుటుంబ సమేతంగా వస్తుంటారు. కొందరు తలనీలాలు సమర్పిస్తే మిగతా కుటుంబ సభ్యులు వారి కోసం అక్కడే వేచి ఉంటారు. రద్దీ సమయంలో కేశఖండన టికెట్లు తీసుకోవడం దగ్గర నుంచి స్వామికి తలనీలాలు సమర్పించి స్నానం చేసి వచ్చేసరికి సుమారు గంటన్నరకు పైగా సమయం పడుతోంది. ఈ లోపు మిగతా వారు అక్కడే నిలబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి.

నేలపై కూర్చొని ఇబ్బంది పడుతున్న భక్తులు

ఖాళీ లేక.. కేశఖండనశాల వద్ద భక్తులు కూర్చోవడానికి కుర్చీలు, బెంచీలు లేకపోవడంతో భక్తులు నేలపై కూర్చొని ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడా ఖాళీ లేకపోవడంతో మెట్లపైన, హాల్లో, దిమ్మలపైన కూర్చుంటున్నారు. పిల్లలతో వచ్చిన వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. గంటల తరబడి నిలబడలేక అవస్థలు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం.. విషయం నా దృష్టికి వచ్చింది. భక్తులు కూర్చోవడానికి సౌకర్యాలు కల్పించి సమస్యను పరిష్కరిస్తాం. - వై.భద్రాజీ, ఈవో, ద్వారకాతిరుమల దేవస్థానం

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). Ph.81422 92071.

FINANCIAL SERVICES
ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో మార్టగేజ్/ టేకోవర్ లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. * నో సిబిల్/ నో బ్రోకర్స్. *MSR గ్రూప్, వైజగ్. Ph: 9121314141

REAL ESTATE
PLOT FOR SALE
నర్సాపురం గాంధీనగర్-1లో అన్ని వసతులు కల్గిన 7 సెంట్లు (331 గజాలు) ఈస్ట్ ఫేస్ స్థలము అమ్మబడును. సంప్రదించవలసిన నెం: 99480 17232.

JOBS
Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives. ✆ 9849394835, 7075345527.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ:18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

FACULTY/ TEACHERS
Wanted faculty Urgently Required Maths Faculty for IPE & JEE Mains. Contact: 86390 45758.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.15 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

భీమవరం

● భీమవరం ● ఉండి

వెంకటరామరాజు సేవలు అభినందనీయం

పేదలకు నిత్యావసర సరకులు అందిస్తున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, దాత

కాళ్లకూరు(కాళ్ల), న్యూస్‌టుడే: గ్రామంలో శ్రీదేవి ట్రస్టు ద్వారా దాట్ల వెంకటరామరాజు చేస్తున్న సేవలు అభినందనీయమని ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. గ్రామంలోని భీమేశ్వరస్వామి ఆలయంలో రూ.5 లక్షలతో నిర్మించిన యాగశాల, షెడ్డును ఆయన ఆదివారం ప్రారంభించారు. శివరాత్రిని పురస్కరించుకుని శ్రీదేవి ట్రస్టు సహకారంతో పేదలకు నిత్యావసర సరకులు అందించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి సాదు శ్రీదేవి, మాజీ ఎంపీపీ వేగేశ్న గోపాలకృష్ణంరాజు, వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ అడ్డాల శివరామరాజు, సొసైటీ ఛైర్మన్ దండు ప్రణవ మూర్తిరాజు పాల్గొన్నారు.

మంచినీటి చెరువు ప్రక్షాళన

పొక్లెయిన్‌తో మంచినీటి చెరువు తవ్వకం పనులు

వాండ్రం (ఉండి), న్యూస్‌టుడే: వాండ్రం గ్రామంలో మంచినీటి చెరువు ప్రక్షాళన పనులకు శ్రీకారం చుట్టారు. మూడు దశాబ్దాల తరువాత గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ, మరికొందరు దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి సమీపంలో మంచినీటి చెరువు, పశువుల చెరువు సుమారు ఏడెకరాల విస్తీర్ణంలో పక్కపక్కనే ఉంటాయి. ఇక్కడి ప్రజలకు ప్రధానంగా వేసవిలో ప్రస్తుత చెరువు నుంచి పూర్తిస్థాయిలో నీరందడంలేదని పంచాయతీ పాలకవర్గ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రోత్సాహం, ప్రజా సహకారంతో రెండు చెరువులను ఒక్కటిగా చేసి మట్టి పూడికతీత, గట్ల సంరక్షణ పనులు చేపడతామని తెలిపారు. మార్చి నెలాఖరుకి ఏక చెరువులో కొత్తగా నీరు నింపే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పశువులకు ఇబ్బంది కలగకుండా అదే ప్రాంతంలో మరో చెరువు తవ్వుతున్నామని సర్పంచి తెలిపారు.

బడ్జెట్‌లో కౌలు రైతులకు అన్యాయం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్‌లో కౌలు రైతుల సంక్షేమానికి కేటాయింపులు చేయకపోవడం దారుణమని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆదివారం ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల్లో కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' పథకం వర్తింపజేస్తామని చెప్పి నేడు బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపించడం అన్యాయమన్నారు.

కనులపండువగా ఉమామహేశ్వరస్వామి కల్యాణం

ఉండి, న్యూస్‌టుడే: వెలివర్రులోని ఉమామహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎదుట అశ్వద్ధ మహావృక్షం వద్ద ఉన్న లక్ష్మీనారాయణ సహిత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో తొలుత వీరపేరంటాలమ్మ దేవస్థానం మాజీ ఛైర్మన్ మంతెన రంగరాజు- త్రివేణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉమామహేశ్వరస్వామి వార్ల విగ్రహాలు ఉంచి వేద పండితుల ఆధ్వర్యంలో వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. కలిదిండి నారాయణరాజు- మహలక్ష్మి దంపతులు స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు.

సొంతింటి కల నెరవేరేనా?

అధ్వానంగా పేదల కాలనీలు

భీమవరం అర్బన్, ఉండి, న్యూస్‌టుడే: అర్హత ఉన్న ప్రతి వాడికీ సొంతింటి కల నెరవేరుస్తామన్న వైకాపా పాలకులు ఆచరణలో చతికిల పడ్డారు. భూసేకరణ కోసం రూ.కోట్లు వెచ్చించి ఎంతో హడావుడిగా ఇళ్ల పట్టాలిచ్చి చేతులు దులుపుకొన్నారు. మౌలిక వసతుల ఊసే పట్టించుకోలేదు. పాలకుల మాటలు నమ్మి ఇళ్లు నిర్మించుకున్న వారు నడిచే దారి లేక, డ్రైనేజీ సౌకర్యం కల్పించక, తాగునీరు పూర్తిస్థాయిలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి పాలకులు పరిస్థితిని చక్కదిద్దేందుకు కొన్ని చర్యలు చేపట్టినా ఇంకా ఎన్నో సమస్యలు కాలనీవాసులను వెంటాడుతున్నాయి. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనుకుంటున్న పాలకులు మౌలిక వసతులపైనా శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

గొల్లవానితిప్ప కాలనీలో మార్గం ఇలా..

రహదారి ఇలా.. భీమవరం మండలం గొల్లవానితిప్పలో పేదల కాలనీ ఇది. 146 మందికి పట్టాలివ్వగా 52 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. కనీస వసతులు లేవు. ప్రధాన మార్గం తప్ప అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షాకాలం అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అందుకే చాలామంది ఇక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు.

✦ భీమవరం మండలంలో మొత్తం 17 పేదల కాలనీల్లో 626 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో ఇళ్ల నిర్మాణం పూర్తయినవి, వివిధ దశల్లో ఉన్నవి 270. పూర్తిగా రద్దయినవి 362. వాటి విషయంలో ఏమి చేస్తారనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

✦ ఉండి మండలంలో 60 లేఅవుట్లకు ఇంకా 20 చోట్ల పూడిక చేయాల్సి ఉంది. నిర్మాణాలు జరిగిన చోట ఇప్పుడు నామమాత్రంగా సౌకర్యాలున్నాయి. పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పిస్తే తప్ప ఇక్కడ ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. మౌలిక వసతుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొత్త నిబంధనల ప్రకారం ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ దిశగా కృషి చేస్తున్నాం.

-శశికుమార్, ఏఈ, గృహనిర్మాణ సంస్థ, భీమవరం

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం:	80085 74471	గునుపూడి:	80085 74474
భీమవరం మండలం:	80085 74533	వీరవాసరం:	80085 74475
పాలకోడేరు:	80085 74467	ఉండి:	80085 74526
ఆకివీడు:	80085 74525	కాళ్ల:	94401 04042

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? పాలకోడేరు చినపేట చర్చి సమీపంలో డ్రైనేజీ పూడిపోయి మురుగు నీరంతా రోడ్డుపై నిలిచిపోతోంది. దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. -ఎం.నాగేశ్వరరావు, పాలకోడేరు

✔ చర్యలు తీసుకుంటాం. **-జి.గోపి, కార్యదర్శి, పాలకోడేరు**

ఉండి, న్యూస్‌టుడే: ? కృష్ణమ్మ మంచినీటి చెరువు గట్టుపై చెత్త వేస్తున్నారు. వ్యర్థాలను తొలగించి చెరువు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాం. **-శివకృష్ణ, ఉండి**

✔ ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. మరోసారి పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **-అనిల్ కుమార్, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి, ఉండి**

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ? లోసరి పంట కాలువ అధ్వానంగా తయారైంది. కొన్ని గ్రామాల పరిధిలో ఇష్టారాజ్యంగా చెత్తను దానిలో వేయడం వల్ల నీరు కలుషితం అవుతోంది. -త్రినాథ్

✔ చర్యలు చేపడతాం. **-ప్రసాదరాజు, ఏఈ, జలవనరులశాఖ, భీమవరం**

హర హర మహాదేవ శంభో

భీమేశ్వరునికి క్షీరాభిషేకం..

ప్రత్యేకాలంకరణలో బ్రహ్మ సూత్ర సోమేశ్వరస్వామి

శక్తీశ్వర ఆలయంలో..

రథయాత్రలో ఉత్సవమూర్తులు

మోగల్లులో భీమేశ్వరస్వామికి పుష్పాలంకరణ

శివ దర్శనం చేసుకుంటున్న చిన్నారి

ఆకివీడు: రుద్రాక్షలతో రూపొందించిన శివలింగానికి అభిషేకం

భీమవరం ఆధ్యాత్మికం, సాంస్కృతికం, గ్రామీణ, వీరవాసరం, ఉండి, కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు, న్యూస్‌టుడే: మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. విశేషాభిషేకాలు, సహస్ర నామ పూజలు నిర్వహించారు. భీమవరం పట్టణంలో భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. ✦ సీతా రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి రాత్రి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ✦ పార్వతీ సమేత బ్రహ్మసూత్ర సోమేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాలతో క్షీరాభిషేకాలు నిర్వహించారు. ✦ ప్రజాపిత బ్రహ్మకుమారీ విశ్వవిద్యాలయం పట్టణశాఖ కార్యాలయంలో సోమనాథ శివలింగం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ✦ పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామిని ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు దంపతులు, శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్సీ గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ✦ పంచారామక్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు కేశవరావు హైస్కూల్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పులిహోర, దద్దోజనం, మజ్జిగ, తాగునీరు ప్యాకెట్లు, ✦ భీమవరం మండలం యనమదుర్రులోని శక్తీశ్వరాలయం వద్ద శీర్షాసనంలో ఉండే శివుడ్ని భక్తులు దర్శించుకున్నారు. ✦ మత్స్యపురి ఉమా అగస్త్యేశ్వర స్వామివారి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ✦ కాళ్ల మండలంలోని పలు శివాలయాలను ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ✦ ఆకివీడులోని రాజరాజేశ్వరి సహిత మార్కండేశ్వర స్వామి ఆలయ మండపంలో లక్ష రుద్రాక్షలతో తయారు చేసిన శివలింగానికి సహస్ర ఘటాభిషేకం, పంచామృతాలతో 1008 మంది మహిళలు, సువాసినులతో ఘటాభిషేకం, శ్రీ సూక్త హోమం, లక్ష బిల్వార్చన, లక్ష దీపార్చన చేశారు. సాలిపేటలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లపై మేళతాళాలు, డప్పువాయిద్యాలతో పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు.

ఇంటా బయటా మురుగే

✦ భీమవరం- పాలకొల్లు రోడ్డు పక్కన ఆరో వార్డు బొక్కావారి పాలెం పరిధిలోని ప్రధాన డ్రెయిన్ ఇది. చెత్త, గడ్డితో నిండిపోయింది. మురుగు కదలకపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు.

✦ ఆరో వార్డులోని అంతర్గత డ్రెయిన్ ఇది. పచ్చగడ్డి కప్పేసి, సిల్టుతో నిండి పోయింది

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పక్కన ఉన్న ఆరో వార్డులో డ్రెయిన్ల శుభ్రతను పారిశుద్ధ్య సిబ్బంది మరిచిపోయారు. కొన్నేళ్లుగా డ్రెయిన్లను శుభ్రం చేయడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏడాది పొడవునా దోమల ఉద్ధృతికి డ్రెయిన్లలోని మురుగే ప్రధాన కారణమంటున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా రారని, అడిగినా పని చేయరని చెబుతున్నారు. ప్రధాన డ్రెయిన్‌లోని సిల్టు నడిచి వెళ్లేంత దట్టంగా పేరుకుపోయిందంటే పారిశుద్ధ్య నిర్వహణ ఎలా ఉందో అర్థమవుతుంది. అంతర్గత డ్రెయిన్లలో పచ్చగడ్డి, పిచ్చి మొక్కలు ఉన్నా శుభ్రం చేయరు. పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయిన్లను శుభ్రం చేయిస్తానని భీమవరం సహాయ కమిషనర్ ఎ.రాంబాబు తెలిపారు. ఫాగింగ్‌తో పాటు స్ప్రేయింగ్ చేయిస్తానన్నారు.

ఎమ్మెల్యే నాయకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆక్వా రైతులు

మేతల ధరలపై నియంత్రణ అవసరం

నరసాపురం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు ఆదివారం ఆక్వా సాగుదారులు ఆదివారం వినతి పత్రం అందించారు. ఆక్వా సాగుదారులందరికీ రాయితీ విద్యుత్తు అమలు చేయాలని, మేతల ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్వా రైతుల సంఘ ప్రతినిధులు ఎస్‌వీవీ సత్యనారాయణ, కేవీ శ్రీనివాస్, ఎస్‌ఏ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్‌లలోని బీచ్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ఇసుక తిన్నెలపై ఆటపాటలతో గడిపారు. పలువురు సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ సేదతీరారు.

వ్యర్థాలు ఇలా.. కాలువలోకి జారితే ఎలా

జువ్వలపాలెం(కాళ్ల), న్యూస్‌టుడే: ఒక పక్క కాలువలు ప్రక్షాళన చేపడుతుంటే మరోపక్క వాటి పంచనే చెత్త కుప్పలుగా పోస్తున్నారు. కాళ్ల మండలం జువ్వలపాలెం నుంచి కలవపూడి వెళ్లే రహదారి మార్గం పొడవునా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇలాగే వదిలేస్తే కాలువలోకి చేరి సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే తొలగించాలని కోరుతున్నారు.

మౌలిక వసతులేవీ?

మత్స్యపురిపాలెం (వీరవాసరం), న్యూస్‌టుడే: మత్స్యపురి పాలెం ప్రభుత్వ లేఅవుట్‌లో రహదారులు, డ్రెయినేజీల సౌకర్యం లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వాపోతున్నారు. వేసవికి ముందే కనీసం రహదారుల నిర్మాణం చేయాలని కోరుతున్నారు. ఎంపీడీవో కేఎం.వైభవతి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశిస్తానన్నారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు



వీరవాసరం, న్యూస్‌టుడే: గొంతేరు డ్రెయినుపై నడపనవారిపాలెంలో ఉన్న ఇరుకు వంతెనపై స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వంతెన వెడల్పు తక్కువగా ఉండటంతో భారీ వాహనాలు కూతవేటు దూరంలో ఉన్న జాతీయ రహదారిపైకి చేరుకోవడానికి 7 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది. మురుగునీటిపారుదల శాఖ ఏఈ వి.వెంకటరమణ మాట్లాడుతూ ఇక్కడ నూతన వంతెన నిర్మాణానికి గతంలో అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

దెబ్బతిన్న పైపుకల్వర్టు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి ప్రధాన పంట కాలువపై ఎన్నార్పీఅగ్రహారం- ఉండి మధ్య పైపు కల్వర్టు దెబ్బతింది. సుమారు నాలుగేళ్ల నుంచి ఈ పరిస్థితి వెంటాడుతుండటంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉండి నుంచి వెలివర్రు శివారు ఆయకట్టుకు సాగు, తాగునీరందించే పైపు కల్వర్టు దెబ్బతినడంతో ప్రధానంగా వర్షాకాలంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేసవిలో ఈప్రాంతంలో అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ అంశంపై జలవనరుల శాఖ ఏఈ ఫణిశంకర్ స్పందిస్తూ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

ఒరిగిన స్తంభాలు.. వేలాడుతున్న తీగలు

20 వార్డు నివేదన

జనాభా : 2,800

ప్రాంతాలు: మాదివాడ, బొలం వారి, మోటుపల్లి వారి, పల్లపు, రజకుల, కేశిరెడ్డివారి వీధులు, ఎస్సీ కాలనీ, గంగానమ్మకోడు.

మాదివాడ ప్రాంతంలో అభివృద్ధి చేయాల్సిన మట్టిరోడ్డు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నగర పంచాయతీలోని 20వ వార్డులో తాగునీరు, మురుగునీరు, అంతర్గత రహదారులు, అల్పవిద్యుత్తు తదితర సమస్యలతో పాటు దోమలు, వీధి కుక్కల స్వైరవిహారంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధాన సమస్యలు ఇవీ..

● మాదివాడ, గంగానమ్మకోడు వెంబడి ఉన్న నివాసిత ప్రాంతంలోని మట్టి మార్గాన్ని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలి. ● ఎస్సీ కాలనీ పరిధిలో మురుగు సమస్య పరిష్కారానికి డ్రెయినేజీని ఎత్తు పెంచి నిర్మించాలి. ● పలు వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను మరమ్మతులు చేసి అభివృద్ధి చేయాలి. అల్పవిద్యుత్తు సమస్యను పరిష్కరించాలి. ఒకవైపునకు ఒరిగిపోతున్న పలు విద్యుత్తు స్తంభాలను, దిగువకు వేలాడుతున్న తీగలను సరిచేయాలి. ● కొన్ని ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్ మార్చాలి. ● పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి. ● దోమల నిర్మూలనకు, కుక్కల సంతతి నిరోధానికి చర్యలు తీసుకోవాలి.

పరిష్కారానికి చర్యలు.. పలు రహదారులు, డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. మిగిలిన సమస్యల పరిష్కారానికి దశలవారీగా కృషి చేస్తాం. తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేయిస్తాం. స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయిస్తాం. దోమలు నిర్మూలనకు, కుక్కల సంతతి నిరోధానికి శస్త్రచికిత్సలు చేయిస్తాం

-కృష్ణమోహన్, కమిషనర్, ఆకివీడు నగర పంచాయతీ

సారూ.. ఓసారి టిడ్కో వైపు చూడండి..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నివాసాల మధ్య చెత్త, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పైపులైన్ల లీకులు, పెరిగిన పిచ్చి మొక్కలు, తుప్పలతో దోమల బెడద, విష కీటకాల సంచారం, కుక్కల స్వైర విహారంతో ప్రజలు సతమతమవుతున్నారు.

దుర్వాసన, దోమల మధ్య జీవనం.. కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి గుంతలు, రాళ్లతో ప్రమాదకరంగా ఉంది. వీధి దీపాలు సరిగ్గా వెలగవు. మొదటి విడతగా గృహాలు కేటాయించి కొన్నేళ్లు గడిచినా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించలేదు. వేసవి సమీపిస్తే నీటి ఎద్దడి తప్పదని స్థానికులు తెలిపారు. విద్యుత్తు సక్రమంగా ఉండకపోవడంతో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. గది నుంచి బయటకు వస్తే దోమల బెడదతో నరకం చూస్తున్నామని లక్ష్మి, నాగవేణి తదితర నివాసితులు వాపోయారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నివాసాల మధ్యనే వ్యర్థాలు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో సముదాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు వేసవికి నీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

భీమవరంలోని గృహ సముదాయం

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామివారి రథోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు, మంగళవారం ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. గరువు పేట, నల్లంవారి తోట, నాచువారి కూడలి, బేతని పేట, రైతు బజార్ రోడ్డు, గునుపూడి నల్లంవారి వీధి, అయ్యంగారి, యామిజాలవారి, బంగ్రోతుల వారి వీధుల్లో సరఫరా ఉండదన్నారు. ✦ భీమేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు భీమేశ్వరాలయం రోడ్డు, ఆకుల వారి వీధి, మారెళ్లవారి వీధి, వీరమ్మ పార్కు రోడ్డు, బ్యాంకు కాలనీ, రెస్టుహౌస్ రోడ్డు, ఆదివారం బజార్ కూడలి ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: లోసరిలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు ఉపకేంద్రానికి లైన్ల ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు ఈఈ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు లోసరి ఇండస్ట్రియల్ ఫీడర్‌కు, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోసరి, దెయ్యాలతిప్ప, నాగేంద్రపురం, తోకతిప్ప, బర్రెవానిపేట, గరవల్లదిబ్బ గ్రామాలతో పాటు ఆక్వాచెరువులకు సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

హామీలు అమలు చేయాలి

ఆకివీడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేయాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆకివీడులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బడ్జెట్‌లో వివిధ రంగాలకు నిధుల కేటాయింపులో అంకెల్లో ఘనంగా కనిపిస్తున్నప్పటికీ మొత్తం బడ్జెట్‌లో వాటి వాటాలు తగ్గాయని విమర్శించారు. సమావేశంలో కె.తవిటినాయుడు, దోకల లక్ష్మి, సందక ఉదయ్‌కుమారి, దోకల రవితేజ, బీవీ వర్మ, బొడ్డుపల్లి రాంబాబు పాల్గొన్నారు.

రూ.20 వేలు అందజేత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని ఓ కళాశాలలో బీడీఎస్ చదువుతున్న పేద విద్యార్థి ఎ.పవన్ కల్యాణ్‌కు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.20 వేలు సహకారం అందించింది. ఆ నగదును శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు.

గాయపరిచిన యువకులపై కేసు

ఆకివీడు, న్యూస్‌టుడే: ముగ్గురు యువకులపై ఇద్దరు దాడిచేసి గాయపరిచిన సంఘటన ఆకివీడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్థానిక సాలిపేట ప్రాంతానికి చెందిన చుండూరు సాయిబాబు, అతని స్నేహితులు గోపిశెట్టి ప్రసన్నకుమార్, పోలిశెట్టి చక్రధరరావు కలిసి ఆదివారం సాయంత్రం సంత మార్కెట్ వద్ద ఉన్న రామాలయం వద్ద కూర్చుని ఉన్నారు. పాతగొడవల నేపథ్యంలో అదేప్రాంతానికి చెందిన బొట్టా చైతన్య, మోహన్ అక్కడికి వచ్చి చక్రధరరావును దుర్భాషలాడారు. చైతన్య పక్కనే ఉన్న ఇటుకరాయితో కొట్టాడు. మోహన్ బీరు సీసా తీసుకొని ప్రసన్నకుమార్‌నీ, సాయిబాబును కొట్టాడు. గాయపడ్డ ముగ్గురు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. సాయిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

జూద శిబిరంపై దాడి

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని సంతమార్కెట్ ప్రాంతంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దర్ని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఒకటో పట్టణం మెంటేవారితోటలోని విజయగణపతి, పాండురంగ ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకెళ్లాడు. ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీకి పాల్పడినట్టు సీసీ కెమెరా ఫుటేజీలో నమోదైంది. ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

తూడు.. అన్నదాతల గోడు

ఉండి, న్యూస్‌టుడే: కాలువల్లో నీటి పారుదల వ్యవస్థకు తూడు, గుర్రపుడెక్క వంటి అవరోధాలు పలు చోట్ల ఎదురవుతున్నాయి. వెంకయ్య వయ్యేరు పంట కాలువ శివారు, మెరక భూములకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. రబీ సాగుకు ఈనెల ఒకటో తేదీ నుంచి వంతుల వారీ విధానంలో నీరొదులుతున్నారు. ఆర్రోజులకు ఒకసారి చొప్పున ప్రధాన కాలువలకు వంతు ఇస్తున్నారు. ఆ సమయంలో కాలువ పరిధిలోని శివారు ప్రాంతాల్లో ఆఖరి ఎకరం చేను తడవడం లేదు. తూడు, గుర్రపుడెక్క వంటి వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగిస్తే ఎక్కడా ఇబ్బందులు ఉండదు. ఈ అంశంపై జలవనరులశాఖ అధికారులు స్పందిస్తూ ఎప్పటికప్పుడు కాలువల ప్రక్షాళన పనులు జరుగుతున్నాయన్నారు. మరోసారి పరిశీలించి ఏవిధమైన ఆటంకాల్లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కలిగొట్ల వద్ద వెంకయ్య వయ్యేరులో..

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

వైభవంగా ప్రభల సంబరం

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా సిద్ధాంతం పరిధి సాలిపేటలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ప్రభల సంబరాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ శూలాల ప్రదర్శన, జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

శివయ్య సేవలో ఎమ్మెల్యే

స్వామి సన్నిధిలో పితాని దంపతులు

వాసవీ పెనుగొండ, ఆచంట, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా స్థానిక నగరేశ్వరస్వామి, చెరుకువాడలో ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ★ ఆచంటలో ఉమారామలింగేశ్వర స్వామిని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, పలువురు భాజపా నాయకులు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దర్శించుకున్నారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: లక్ష్మణేశ్వరంలోని దుర్గా లక్ష్మణేశ్వరస్వామిని ఎమ్మెల్యే నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు దర్శించుకున్నారు.

నరసాపురం: ప్రసాదం పంపిణీలో డీఎస్పీ శ్రీవేద

భక్తులకు ప్రసాద వితరణ

పోడూరు, నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పెనుమదం, జగన్నాథపురం, పోడూరు, జిన్నూరు శివాలయాలకు తరలివచ్చిన భక్తులకు దాతల సహకారంతో ప్రసాద వితరణ చేశారు. జిన్నూరులో సుమారు 10 వేల మందికి అన్నసమారాధన చేశారు. నరసాపురం పట్టణంలోని కొలను మూల కేదారేశ్వర స్వామిని డీఎస్పీ శ్రీవేద దర్శించుకున్నారు. అనంతరం గాంధీ బొమ్మ కూడలి వద్ద కొత్తపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన అల్పాహార కేంద్రాన్ని డీఎస్పీ ప్రారంభించారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: పెదమైనవానిలంకలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో తూర్పుతాళ్ళ వాసవీక్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర వితరణ చేశారు.

శివనామ సంకీర్తనల ఆలాపన

యలమంచిలి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా యలమంచిలి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వేకువజాము నుంచి గాయకులు, భక్తులు శివనామ సంకీర్తనలు ఆలపించారు. దేవస్థానం ఛైర్మన్ ఉడాల శ్రీమన్నారాయణ గానం చేసిన సదాశివం ఆల్బమ్‌ను ప్రధానార్చకుడు యలమంచిలి నరేంద్ర శర్మ, పురోహితుడు భాగవతుల శర్మ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు యలమంచిలి సత్యనారాయణమూర్తి, కొడవటి నాగేశ్వరరావు తదితరులు గాయకులను సత్కరించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి పల్లకీ సేవ

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని రూపారామ్ వీధిలో ఉన్న ఆలయంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ చేశారు.

హామీలు అమలు చేయాలి

ఆకివీడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేయాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆకివీడులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

హరోంహర.. శంభో శంకర!

పాలకొల్లు ఆధ్యాత్మికం, గ్రామీణ, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారుజామునే లింగోద్భవ సమయంలో శివయ్యకు అభిషేకాలు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. పాలకొల్లులో క్షీరారామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలలో పార్వతీ సమేత శివదేవస్వామి ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు దీపారాధనలు చేశారు. సంతానం లేని దంపతులు ఆలయ ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటారు.

శివదేవుని చిక్కాలలో ఆలయం వద్ద కొబ్బరి మొక్కలు నాటుతున్న దంపతులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని అమరేశ్వర, పార్వతీ బసవేశ్వర, ఆంజనేశ్వర, బైల మల్లేశ్వర, విశ్వేశ్వర, చంద్రమౌళేశ్వర స్వామి ఆలయాల్లో రుద్రాభిషేకాలు, సహస్ర నామార్చనలు చేశారు. సాయంత్రం అమరేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది.

నరసాపురం: అలంకరణలో బసవేశ్వరుడు

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతంలోని వశిష్ఠ గోదావరిలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కేదారేశ్వరస్వామిని, పార్వతీ సమేత నందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

నేత్రపర్వం.. రథోత్సవం

ఆచంట: రామలింగేశ్వరుడి నిజరూప దర్శనం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట క్షేత్రంలో ఉమా రామలింగేశ్వర స్వామి రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. పుష్పాలతో అలంకరించిన రథంపై పార్వతీసమేత రామేశ్వరస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తుల శివనామస్మరణ మధ్య గ్రామ వీధుల్లో రథోత్సవం జరిగింది.

పెనుమంట్ర, న్యూస్‌టుడే: నత్తారామేశ్వరంలోని రామేశ్వర స్వామి, జుత్తిగలోని సోమేశ్వరస్వామి రథోత్సవాలు ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగాయి. రాత్రి గ్రామ పొలిమేరల్లో ఎదురోళ్ల ఉత్సవాలు నిర్వహించారు.

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: వాసవీ పెనుగొండలో నగరేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలతో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

సరిచేస్తే.. మళ్లీ పుష్కర శోభ!

నిరుపయోగంగా నాటి నిర్మాణాలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: గోదావరి పుష్కరాలు సమీపిస్తున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఎక్కడ ఏ పనులు చేయాలనే దానిపై నియోజకవర్గాల వారీగా ఇప్పటికే అధికారులు ప్రతిపాదనలు చేశారు. కానీ గత పుష్కరాల్లో నిర్మించి వదిలేసిన పనులపై స్పష్టత కరవైంది. వాటిలో మరికొన్ని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువస్తే ప్రజాధనం ఆదా అవుతుంది. ఆదిశగా అధికారులు ఆలోచన చేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రతి మండలంలోనూ.. వాసవీ పెనుగొండ, ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల్లో సుమారు 10 వరకు పుష్కర రేవులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన వసతుల్లో చాలా వరకు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరాయి. అప్పట్లో వేసిన సీసీ రహదారులు సైతం పలు చోట్ల దెబ్బతినడంతో మరమ్మతులు చేయనున్నారు. యలమంచిలి మండలంలో కొన్ని సీసీ రహదారులను వచ్చే పుష్కరాల నాటికి విస్తరించేలా సర్వే చేస్తున్నారు.

రాజుల్లంకలో శిథిలమైన శౌచాలయాలు

☛ యలమంచిలితో పాటు నరసాపురం మండలం రాజుల్లంక, దర్బరేవు ప్రాంతాల్లో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల దుస్తులు మార్చుకునే గదులు శిథిలమయ్యాయి.

ఆలయాల అభివృద్ధికి.. పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల్లో పుష్కర రేవులు ఉన్న గ్రామాలతో పాటు సమీప ప్రాంతాల్లో మరి కొన్ని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేస్తున్నారు. ఆయా ఆలయాల్లో శిథిలమవుతున్న మండపాలు, శ్లాబ్‌లకు మరమ్మతులు చేయడంతో పాటు రంగులు వేసి సుందరంగా ముస్తాబు చేయనున్నారు. దీనిపై పుష్కర పనుల పర్యవేక్షకుడు పవన్ స్పందిస్తూ ప్రతిపాదనలకు అనుగుణంగా త్వరలోనే పనులన్నీ ప్రారంభిస్తామన్నారు.

వాసవీ పెనుగొండ మండలం సిద్ధాంతంలో గోదావరి తీరాన 2015 పుష్కరాలలో ఏర్పాటు చేసిన జల్లు స్నాన ఘట్టం ఇది. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన దీనిని తరువాత పట్టించుకోకపోవడంతో పైపులు తుప్పు పట్టి దెబ్బతింది. ఇదే రేవులో తాగునీటి కోసం నిర్మించిన ట్యాంకు నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	: 80085 74504	ఆచంట:	90631 44737
పాలకొల్లు	: 80085 74510	వాసవీ పెనుగొండ:	80085 74469
పోడూరు	: 90631 44741	పెనుమంట్ర:	91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? వస్తాదు వారి వీధిలో మూడు రోజులుగా చెత్త తొలగించడం లేదు. పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. - బి. శ్రీనివాస్, నరసాపురం
✔ చర్యలు తీసుకుంటాం. - పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: ? చెరుకువాడ పరిధి చిట్టూరి వారి వీధిలో మూడు వీధి దీపాలు వెలగడం లేదు. - ఆర్.సత్యనారాయణ, స్థానికుడు
✔ మరమ్మతులు చేయిస్తాం. - టి.కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? చింతరేవు వద్ద విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. - సత్యప్రసాద్, ముత్యాలపల్లి
✔ పాదులు తొలగిస్తాం. - ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి ఏఈ

ఎమ్మెల్యే నాయకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆక్వా రైతులు

మేతల ధరలపై నియంత్రణ అవసరం

నరసాపురం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు ఆదివారం ఆక్వా సాగుదారులు ఆదివారం వినతి పత్రం అందించారు. ఆక్వా సాగుదారులందరికీ రాయితీ విద్యుత్తు అమలు చేయాలని, మేతల ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్వా రైతుల సంఘ ప్రతినిధులు ఎస్‌వీవీ సత్యనారాయణ, కేవీ శ్రీనివాస్, ఎస్‌ఏ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమిస్తేనే విజయం సాధ్యం

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఇటీవల వెలువడిన గ్రూపు-2 ఫలితాల్లో కొలువులు సాధించిన కనబరిచిన విజేతలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆరోగ్యవర్షిణి ట్రస్టు ఛైర్మన్ నాగిడి రాంబాబు యువతకు సూచించారు. పేరుపాలెంనార్తుకు చెందిన పాలెపు సత్యనారాయణ సబ్ రిజిస్ట్రార్‌గా, శేరు తాతయ్య రెవెన్యూశాఖలో డిప్యూటీ తహసీల్దారుగా ఎంపికయ్యారు. వారికి ఆదివారం ముత్యాలపల్లిలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. పల్లవ వసేన రాష్ట్ర అధ్యక్షుడు కొల్లాటి బాబూరావు, బొడ్డు కృష్ణభగవాన్, కొప్పాడ వెంకటదుర్గానాగరాజు, కర్రి వీరస్వామి, కొల్లాటి పెంటయ్య, బాలకృష్ణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలను సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: గ్రామీణులకు నాణ్యమైన వైద్యసేవలను చేరువ చేసేందుకు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని మొగల్తూరులోని మిషనరీ ఆసుపత్రి నిర్వాహకురాలు వందన తెలిపారు. మిషనరీ(అమెరికా) ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం అబ్రహంపేట, నక్కావారిపాలెంలలో వేర్వేరుగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో గుడివాడకు చెందిన అమెరికా ఆసుపత్రి వైద్యులు శివప్రసాద్, బెట్టి ప్రజలకు వైద్యసేవలు అందించారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

స్తంభాలు ఒరిగి.. తీగలు సాగి!

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరు మండలం జగన్నాథపురంలో రామేశ్వరస్వామి ఆలయ సమీపాన విద్యుత్తు స్తంభం ఒరిగిపోవడంతో తీగలు కిందకు వేలాడుతున్నాయి. గ్రామస్థులతో పాటు ఆలయానికి వెళ్లే భక్తులు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. మార్టేరు నుంచి పదుల సంఖ్యలో లోడు వాహనాలు ప్రయాణిస్తుంటాయి. తీగలు చేతిక అందే ఎత్తులో వేలాడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను విద్యుత్తు ఏఈ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా ఒరిగిన స్తంభాలను సరిచేసేందుకు మార్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

మార్గంలో ముప్పు!

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణ పరిధి కారుమూరివారి వీధి నుంచి పిన్నివారి వీధికి వెళ్లే రహదారి ప్రారంభంలో కల్వర్టు శిథిలమై గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళ వీటిని గుర్తించలేక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

గట్టు జారి.. దారి కుంగి!

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధి 25వ వార్డులోని వేములదీవి కాలువ గట్టు రహదారి ఇలా కుంగిపోయి భారీ గొయ్యి ఏర్పడింది. ఈ మార్గంలో పాఠశాల బస్సులు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రివేళ వాహనదారులు అదుపుతప్పి గాయాల పాలవుతున్నారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి రహదారికి మరమ్మతులు చేయిస్తామని పురపాలక డీఈ ఆర్.గంగా వరప్రసాద్ తెలిపారు.

ఖాళీ చేసి.. గాలికి వదిలేసి!

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: సీతారాంపురం సౌత్‌లోని పంచాయతీ రాజ్ కార్యాలయం ఇది. 2015లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఇక్కడ పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. 2019 తర్వాత వైకాపా సర్కారు హయాంలో దీనిలో డీఎల్పీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. గత నెలలో ఈ భవనాన్ని ఖాళీ చేసి డీఎల్పీవో కార్యాయాలన్ని గ్రామంలో మరో చోటకు మార్చారు. అప్పటి నుంచి ఈ భవనం నిరుపయోగంగా మారింది. ఈ అంశంపై ఈవోపీఆర్డీ కె.నాగేంద్రకుమార్ స్పందిస్తూ ఆ భవనాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆక్రమణల చెరలో పుంత మార్గాలు

అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

ఆచంట, న్యూస్‌టుడే: రైతులకు ఉపయోగపడే పుంత మార్గాలు, కాలువ గట్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. రైతులు పొలాలకు వెళ్లేందుకు, ట్రాక్టర్లు, కోత యంత్రాల రాకపోకలకు, పంట ఉత్పత్తుల రవాణాలు పుంత మార్గాల ఆధారం. వీటితో పాటు కాలువలు, పంటబోదెల పక్కన స్థలాలను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేస్తుండటంతో పూడిక తీత పనులకు అవకాశం లేకుండా పోతోంది.

ఎ.వేమవరంలో నిలుపుదల చేసిన నిర్మాణం

ఇదీ పరిస్థితి.. ఆచంట వేమవరం గ్రామంలో నెహ్రూనగర్ సమీపాన పుంతదారిలో పంటబోదె వెంబడి కొందరు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీనిపై స్థానికులు మండల అధికారులతో పాటు కలెక్టరేట్‌లోనూ ఫిర్యాదు చేశారు. ఆక్రమిత స్థలాలకు కొందరు అనధికారికంగా సరిహద్దులు నిర్ణయించి క్రయవిక్రయాలు కూడా చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రెండు మూడు సెంట్ల భూమికి పట్టాలు సంపాదించి.. వాటికి ఆనుకొని ఉన్న రోడ్డు అంచులు ఆక్రమించుకుని దారులు లేకుండా చేస్తున్నారు.

అన్ని చోట్లా ఇదే దుస్థితి పలు గ్రామాల్లో ఆక్రమణల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెనుమంచిలిలో కంచివారిపాలెం, వర్ధనపుగరువు, ప్రధాన గ్రామ పరిధిలో పంట బోదెలను వాటి పక్కనే ఉంటున్న నివాసితులు ఆక్రమించుకుని అడ్డగోలుగా వంతెనలు నిర్మించుకున్నారు. ఇష్టానుసారం కొబ్బరి చెట్లు పెంచి.. పొలాలకు ట్రాక్టర్లు వెళ్లే దారి కూడా లేకుండా చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి ఆచంట, కొడమంచిలి, వల్లూరు గ్రామాల్లోనూ నెలకొంది. ఈ అంశంపై ఇన్‌ఛార్జి తహసీల్దారు సోమేశ్వరరావు స్పందిస్తూ ఎ.వేమవరంలో ఇళ్ల నిర్మాణాలను ఇప్పటికే నిలుపుదల చేయించామన్నారు. ఇతర ప్రాంతాల్లో ఆక్రమణలను తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పొదుపు కాంతుల సౌరభం!

జిల్లాలో ప్రథమ స్థానంలో పాలకొల్లు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: అధిక స్థాయిలో విద్యుత్తు వినియోగించే వారు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై మక్కువ చూపుతున్నారు. సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే గృహ యజమానులకు ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన కింద రాయితీ వర్తిస్తుంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ యూనిట్ల ఏర్పాట్లలో పాలకొల్లు నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచింది. దీనికి గుర్తింపుగా నియోజకవర్గ అధికారులు ఇటీవల విశాఖపట్నంలో ఏపీఈపీడీసీఎల్ సంస్థ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పురస్కారాలు అందుకున్నారు.

ప్రయోజనాలు ఇవీ.. నెలవారీ విద్యుత్తు బిల్లు రూ.వెయ్యికి పైగా వచ్చే వారు సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో వీటిని అమర్చుకున్న సుమారు 100 మందికి నెలవారీ బిల్లు పూర్తి మినహాయింపు స్థాయికి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పథకం కింద యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి రాయితీతో పాటు బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నాయి.

నరసాపురం డివిజన్ పరిధిలో ఇలా..

సబ్‌డివిజన్	దరఖాస్తులు	పూర్తయినవి
పాలకొల్లు	2,749	862
నరసాపురం	2,733	325
ఆచంట	1,783	636

సోలార్ ప్యానెళ్లు బిగిస్తున్న సిబ్బంది

ఎంతో ఆదా గతంలో ప్రతి నెలా సుమారు రూ.5 వేల వరకు విద్యుత్తు బిల్లు వచ్చేది. అధికారుల సూచనల మేరకు సౌర విద్యుత్తు యూనిట్ ఏర్పాటు చేసుకున్నా. దీంతో నెల వారీ బిల్లు రూ.700కు తగ్గింది. ఒక్కో నెలా అసలు బిల్లు కూడా రావడం లేదు. - వీరాంజనేయులు, పాలకొల్లు రూరల్

జూదాల నిర్వాహకులపై కేసు

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరులో శివరాత్రి ఉత్సవాల్లో జూద క్రీడల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఇద్దరు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి.వాసు తెలిపారు.

వేడుకలో అపశృతి.. పెనుమంట్ర, న్యూస్‌టుడే: నత్తారామేశ్వరంలో రామేశ్వరస్వామి వారి రథోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. తణుకు పట్టణానికి చెందిన ఎం.జయభరత్‌రెడ్డి రహదారి పక్కన ఉండి రథోత్సవాన్ని తిలకిస్తుండగా వెనుక నుంచి కొందరు ముందుకు తోయడంతో ఆయన ఎడమ కాలు రథ చక్రం కింద పడి తీవ్ర గాయమైంది. స్థానిక యువత, ఇతర పెద్దలు అతడిని 108లో తణుకులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో కొద్దిసేపు రథయాత్ర నిలిచిపోయింది.

బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్‌లలోని బీచ్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ఇసుక తిన్నెలపై ఆటపాటలతో గడిపారు. పలువురు సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ సేదతీరారు.

బడ్జెట్‌లో కౌలు రైతులకు అన్యాయం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్‌లో కౌలు రైతుల సంక్షేమానికి కేటాయింపులు చేయకపోవడం దారుణమని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఆదివారం విమర్శించారు. ఎన్నికల్లో కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' పథకం వర్తింపజేస్తామని చెప్పి నేడు బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపించడం అన్యాయమన్నారు.

రాయితీ పరికరాల ఊసే లేదు! అన్నదాతల ఎదురుచూపులు

ఆచంట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో అన్ని పనుల్లోనూ యంత్రాల వినియోగం బాగా పెరిగింది. నాట్లు దశ నుంచి కోత, మాసూళ్ల వరకు.. క్రిమి సంహారక మందుల పిచికారీకి అధునాతన స్ప్రేయర్లు, డ్రోన్లను వినియోగిస్తున్నారు. దుక్కి, దమ్ములకు పవర్ ట్రిల్లర్లు, ట్రాక్టర్ల వినియోగం తప్పనిసరయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీలు ఇచ్చి వాటి కొనుగోలును ప్రోత్సహిస్తున్నాయి. ఈ ఏడాది రబీ నాట్లు పూర్తయినా ఇప్పటికీ వాటి కోసం దరఖాస్తులు కోరలేదు. పశ్చిమ రైతులు రాయితీలపై లభించే పరికరాల కోసం ఎదురుస్తున్నారు.

రైతులు వినియోగిస్తున్న అద్దె స్ప్రేయర్లు

☛ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు దరఖాస్తు చేస్తేనే ఈ ఏడాది కోటాలో పరికరాలు వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల పరిధిలో గతంలో రోటవేటర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, బ్రష్‌కట్టర్లు, పవర్ ట్రిల్లర్లు, ట్రాక్టర్లతో నడిచే యంత్ర పరికరాలు అందించారు. వైకాపా ప్రభుత్వంలో అత్యధిక రాయితీ లభించిన కోత యంత్రాలు వంటివి పలుకుబడి ఉన్న నాయకులు తన్నుకుపోయారనే విమర్శలు ఉన్నాయి.

40 నుంచి 60 శాతం వరకు ● కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా జమ చేసి ఏటా కోట్ల రాయితీలతో వివిధ పరికరాలను రైతుకు అందజేస్తున్నారు. 40 నుంచి 60 శాతం వరకు రాయితీ లభించడంతో రైతులకు ప్రయోజనం లభిస్తోంది. ఏటా ఖరీఫ్ సమయంలో దరఖాస్తు చేస్తే.. వీటిని రబీకి ముందే అందించేవారు. గతంలో ఒక్కో వ్యవసాయ డివిజన్‌కు రూ.50 లక్షల వరకు రాయితీ లభించింది. రబీ నాట్లు పూర్తయినా ఈ ఏడాది వీటి ఊసే లేదు.

సొంతంగా కొనలేం.. రాయితీలు లేకుండా సొంతంగా పరికరాలు కొనే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అద్దె పరికరాలపై ఆధార పడాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాజకీయ ప్రమేయం లేకుండా ఎక్కువ మందికి చిన్న పరికరాలైనా అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ అంశంపై ఏడీఏ మురళీకృష్ణను సంప్రదించగా దరఖాస్తుల స్వీకరణ గురించి ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు రాలేదన్నారు.

ఖాళీ స్థలాలతో కలవరం!

28వ వార్డు నివేదన జనాభా: 2,600

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణంలోని 28వ వార్డు పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు సమస్యలతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పొదలు పెరిగి, వ్యర్థాలు పేరుకుపోయి విష కీటకాలకు ఆవాసంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎంప్లాయీస్ కాలనీ, హనుమాన్‌కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు సరిగ్గా లేక మురుగు నిలిచిపోతోంది. దోమల బెడదతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులో కుక్కల బెడద కూడా ఎక్కువగా ఉంది.

ప్రాంతాలు: వీవర్స్ కాలనీ, గుత్తులవాని పేట, హనుమాన్ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, సూర్యారావు కాలనీ, శ్రీకృష్ణనగర్, ఎంప్లాయీస్ కాలనీ.

నిర్వహణ లేక.. ఈ వార్డులో బీఆర్‌ఎంబీఎం ఉన్నత పాఠశాల సమీపాన హనుమాన్ కాలనీలో పార్కు నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిలా మారింది. ఏళ్ల తరబడి దీనిని పట్టించుకోకుండా వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. శ్రీకృష్ణకాలనీ, చంద్రాజీ నగర్‌లలో వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రివేళ రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు.

నిరుపయోగంగా పార్కు

పరిశీలించి చర్యలు: వార్డులోని ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. క్షేత్ర పరిశీలన చేసి అన్ని సమస్యలను పరిష్కరించే చర్యలు తీసుకుంటాం. - బి.విజయసారథి, పురపాలక కమిషనర్

(c) eenadu

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

ఇంటింటికీ ఉచిత వైద్యం

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచారశకటం ద్వారా ఇంటింటికీ వైద్య కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డా హర్సిన్ అఫ్రిడ్, ఎముకల వైద్య నిపుణుల డా నిమ్మగడ్డ అచ్యుత రామయ్య తణుకు పట్టణంలోని వివిధ ప్రాంతాలు పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. కారకుర్తి అనంత వీరవెంకట సత్యవతి ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ ఉచిత వైద్య సేవలు కావాల్సిన వారు సెల్: 998 534 3530, 905 929 0717 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అపర్ణ సమేత అనంతేశ్వర స్వామికి విరాళం

దండగర్ర (తాడేపల్లిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: దండగర్రలోని అపర్ణ సమేత అనంతేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన బందెల సూరిబాబు కుమారుడు దుర్గాప్రసాద్ ఆదివారం రూ.లక్ష విరాళం అందించారు. అదే గ్రామానికి చెందిన గిద్దా మహేశ్వరుడు రూ.50 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్ది సోమేశ్వరరావు, సజ్జ హనుమాన్, బందెల వీరాంజనేయులు, ప్రత్తి వెంకటేశ్వరరావు, పరేటి రమణయ్య, బందెల రాంబాబు అన్నంరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న దాతలు

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	95550 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ? విశ్వేశ్వరస్వామి పేట శివారులో మురుగు బోదె పేరుకుపోయి నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. - జగదీశ్
✔ నీరు సాఫీగా ముందుకు సాగేలా చేసి దోమల నివారణ చర్యలు చేపడతాం. - ఎం.ఏసుబాబు, కమిషనర్
? తాడేపల్లిగూడెం పట్టణం మసీదు రోడ్డులో చెత్త పేరుకు పోయి దుర్గంధం వెదజల్లుతోంది. - ప్రసాద్, స్థానికుడు
✔ చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
? తాళ్లముదునూరుపాడు శివారు ప్రాంతాల కుళాయి నీరు అందక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. - రాజా
✔ నీరు సమృద్ధిగా అందేలా చర్యలు చేపడతాం - ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్.
? రామారావుపేటలోని జాతీయ రహదారిపై ప్రధాన మురుగుబోదె నిండిపోయి దుర్వాసన వస్తోంది. - వీరేంద్ర
✔ పూడిక తొలగించి మురుగునీరు సాఫీగా సాగేలా చర్యలు చేపడతాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
తణుకు, న్యూస్‌టుడే: ? రాపాకలో కాలువ గట్టున వ్యర్థాలు పడేస్తుండటంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో పాటు కలుషితమవుతున్నాయి. - తణుకు
✔ వ్యర్థాలను కాలువ గట్టుల్లో వేయకుండా చర్యలు తీసుకుంటాం. - నరసింహమూర్తి, ఈవోపీఆర్‌డీ
? తేతలిలో ఇళ్ల సమీపంలో వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పొగ వ్యాపించి ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు
✔ చర్యలు తీసుకుంటాం. - మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో

మా రేడు నీవే.. మా సేవ నీకే

వాడవాడలా శివరాత్రి వేడుకలు

మహాశివరాత్రి సందర్భంగా తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో శివరాత్రి సంబరాలు అంబరాన్నంటాయి. భక్తులు ఉదయాన్నే శివ పవిత్ర స్నానం ఆచరించి, సంప్రదాయ దుస్తులు ధరించి స్వామిని కొలిచారు. పగలంతా ఉపవాసం, రాత్రంతా జాగరణ చేసి నీలకంఠుడిని ప్రసన్నం చేసుకున్నారు. శంకర నామస్మరణతో శివాలయాలు మారుమోగాయి. కల్యాణాలు, అభిషేకాలు, సహస్ర నామార్చనలు, పారాయణాలతో రుద్రుడిని పూజించి తరించిపోయారు. భక్తులు పెద్దఎత్తున క్యూలైన్లలో నిల్చొని గంగాధరుని దర్శనం కోసం బారులు తీరారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

తాడేపల్లిగూడెం శంకరమఠంలో...

తాడేపల్లిగూడెం పట్టణం, అర్బన్, న్యూస్‌టుడే: వీరంపాలెం శ్రీబాల త్రిపురసుందరి పీఠంలో ఆదివారం మహా శివరాత్రి మహోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లక్ష్మణరావు దంపతులు, హైకోర్టు న్యాయమూర్తులు మానవేంద్రరాయ్, మల్లికార్జునరావు దంపతులు, స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, పాల్గొన్నారు. ★ శంకరమఠంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో, అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన స్ఫటికలింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు తరలించారు. పెంటపాడు మండలంలోని ఆలయాల వద్ద భక్తులు బారులు తీరి స్వామివార్లను దర్శించుకున్నారు.

తణుకు: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వేల్పూరు నందిరాజు పుంతలో శివాలయంలో అభిషేకాలు చేశారు. అత్తిలి మండలంలోని కొమ్మర, ఉనికిలి, ఉరదాళ్లపాలెం, ఈడూరు, పాలి, బల్లిపాడు, తిరుపతిపురం గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివాలయాల వద్ద ఆలయాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధనలు నిర్వహించారు. ఇరగవరం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వీరంపాలెంలో స్ఫటిక లింగ దర్శనం

రామన్నగూడెం: ఉమారామలింగేశ్వరస్వామి

వీరంపాలెం: హారతి ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్
★ దర్శనానికి బారులుదీరిన భక్తులు

పెద్ద శివాలయంలో...

స్వామివారికి నమస్కరిస్తున్న ఆరిమిల్లి

ఇల్లిందలపర్రులో...

తేతలి రాజేశ్వరస్వామి

రాష్ట్రాన్ని పునర్నిర్మించే దిశగా అడుగులు

తణుకు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో అస్తవ్యస్తమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రాష్ట్ర దిశ, దశ మార్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కూటమి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, పారిశ్రామిక, సాగునీటి, వైద్యం, టూరిజం, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమం వంటి రంగాలకు బలోపేతం చేసేందుకు ప్రణాళికలు చేయడం అభినందనీయమన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

ముక్కంటికి నాట్య నీరాజనం

ఏలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక వైఎంహెచ్ఏ హాలులో హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. పాద్రి జ్యోతి నేతృత్వంలో హరే శ్రీనివాస బృందం శివ కీర్తనలు గానం చేశారు. పార్వతీ రామచంద్రన్, హేమసుందర్ శిష్య బృందం నాట్య నీరాజనం సమర్పించారు.

నమ్మకం ఉంచండి.. అమ్మలా చూసుకుంటాం!

ఇంటింటా ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రచారం

రేలంగి(ఇరగవరం), న్యూస్‌టుడే: వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ముందుగానే కార్యాచరణ చేపట్టారు. దీనికి అనుగుణంగా ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే ప్రచారం చేస్తున్నారు. గతంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా వేసవి సెలవుల్లో ఊరూరా తిరిగి, ప్రచారం చేసి కుంటు విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దానికి విస్తృతంగా ఈ ఏడాది చివరి పరీక్షలు పూర్తి కాకముందే ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకి వెళ్లడం సత్ఫలితాలనిస్తోంది.

కుటుంబ సమాచారం తెలుసుకుంటూ..

మీ పిల్లలు ఏ పాఠశాలలో చదువుతున్నారు.. ఏటా ఎంత మొత్తం ఫీజులు కడుతున్నారు, పుస్తకాలు, బస్ ఛార్జీల కింద ఎంత ఖర్చు చేస్తున్నారు. అని ఆరాలు తీస్తూనే ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉన్నాయని, అర్హత కలిగిన ఉపాధ్యాయులు అన్ని తరగతులకు ఉన్నారని చెబుతున్నారు. పాఠశాల ప్రగతి, గతేడాది పదోతరగతి విద్యార్థుల ఉత్తీర్ణతను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు.

ఉపయోగాలు వివరిస్తూ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. డిజిటల్ తరగతుల నిర్వహణ, ఐఎఫ్‌పీ, లెక్కలు చక్కగా బోధిస్తున్నారు. సైన్స్ ప్రయోగశాలలున్నాయి. చదువులో ముందుంటే 9వ తరగతి నుంచి ఎన్ఎంఎంఎస్ జాతీయ ఉపకారవేతనం పొందవచ్చు. పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మంచి మార్కులు సాధిస్తే ప్రతిభా పురస్కారం కింద రూ.10వేలు, బాలికలైతే ముగ్గురికి రూ.7,500 చొప్పున ఐసీడీఎస్ నుంచి ప్రోత్సాహకాలు అందుకోవచ్చు. పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నమోదు చేస్తున్నారు.

పాఠశాల ప్రగతిని వివరిస్తున్న టీచర్లు

ప్రత్యేక తరగతులు

ఈ ఏడాది 9 నుంచి 10వ తరగతిలోకి వర్గోన్నతి చెందే విద్యార్థులకు ముందుగానే మార్చి 13వ తేదీ నుంచి బ్రిడ్జి కోర్సు పేరిట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయిని ఆర్ మణిభారతి చెప్పారు.

ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అమ్మవార్లకు బోనాల సమర్పణ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: స్త్రీ శక్తి మహిళా కమ్యూ అత్తిలి పీఠం గాలి మంగమణి ఆధ్వర్యంలో అత్తిలిలో అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఆదివారం మహాశివరాత్రి పురస్కరించుకుని విజయ వామండి శక్తి అమ్మవారికి, పోలేరమ్మవారికి మేళతాళాలు, మంగళవాద్యాలతో, గరగలు పెట్టుకొని బోనాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అత్రి మహామునికి పూజలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి బస్టాండు కూడలిలోని అత్రి మహాముని విగ్రహానికి ఆదివారం పూలమాలలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పెంటపాడు మండలం రాచర్ల గ్రామంలోని సాయిబాబా మందిరం 7వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి బాబావారికి కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకాలు చేశారు. అనంతరం 70 జంటలు సామూహిక సాయివ్రతాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏర్పాట్లను మందిర సభ్యులు జేతిన సాయిగిరిధర్, మల్లిన కృష్ణారావు తదితరులు పర్యవేక్షించారు.

అన్నప్రసాద వితరణ

తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఆదివారం తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. పీఎంజేఎఫ్ పదంకుమార్ గుప్త ఆర్థిక సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్నం మణీంద్ర, ఎల్ఐఈ త్రిమూర్తులు పర్యవేక్షణలో సుమారు వెయ్యి మందికి అన్న ప్రసాదాలు అందించారు.

ప్రమాదం పిలుస్తోంది

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి నుంచి పాలి వెళ్లే మార్గంలో నార్కెట్ మలుపు వద్ద వేగ నిరోధకాలు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో రహదారి ఇరుగ్గా ఉంటుంది. అత్తిలి మండలం పాలి నుంచి రేలంగి మీదుగా తణుకు వెళ్లేవారికి ఇది ప్రధాన మార్గం. గవర్లపాలెం వద్ద రైల్వేగేటు మరమ్మతుల సమయంలో గేటు మూసివేస్తే వాహనాల రాకపోకలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ స్పందిస్తూ వేగ నిరోధకాలు ఏర్పాటు చేస్తామని వివరించారు.

నిర్లక్ష్యం అలవాటైంది

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాదాలకు తావుందని తెలిసి కూడా అత్తిలి బస్టాండు కూడలిలో ఓ ఆటో డ్రైవర్ ఆటోలో చిన్నారులను ఆటో వెనుక కూర్చోబెట్టి తీసుకెళ్తున్నారు. ఆటోలో ఇంచుమించు పదిమందిని లోపల ఎక్కించి వెనుక చిన్నారులను ఈ విధంగా కూర్చోబెట్టారు. ఎటు నుంచి ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలీదు. ఇటువంటి ప్రయాణాలపై అధికారుల దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రక్షణ గోడ ధ్వంసమైంది

తణుకు గ్రామీణం,న్యూస్‌టుడే: మండలంలోని మండపాక నుంచి వేల్పూర్, గుమ్మంపాడు వెళ్లే రహదారిలో మడుగు కాలువ పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు వంతెనకు ఉన్న రక్షణగోడ ధ్వంసమై అధ్వానంగా తయారైంది. నిత్యం ఉద్యోగులు, రైతులు వందల సంఖ్యలో ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్ దీపాలు లేక రాత్రి సమయాల్లో చోదకులు అవస్థలు పడుతున్నారు. పంచాయతీరాజ్ ఏఈ సత్యరుషి స్పందిస్తూ వంతెన నిర్మాణానికి రూ.80 లక్షలు అంచనా వ్యయంగా ప్రతిపాదనలు పంపించామన్నారు.

అద్దె భవనమే శరణ్యమైంది

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏళ్ల తరబడి అద్దె భవనంలో నడుస్తోంది. ఏటా రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తున్నప్పటికీ కక్షిదారులకు మెరుగైన సదుపాయాలు లేవు. సొంత శిథిలావస్థకు చేరడంతో గత కొన్నేళ్లుగా అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. భవనం ఇరుకుగా ఉండటంతో కనీసం కక్షిదారులు కూర్చోడానికి గానీ, వాహనాలు నిలుపుదలకు గానీ అవకాశం ఉండటంలేదని కక్షిదారులు వాపోతున్నారు. సొంత భవనం నిర్మాణానికి అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దారి.. బీటలు వారింది

తణుకు, న్యూస్‌టుడే: పాతవూరులో పశువుల ఆసుపత్రి సమీపంలో పంట కాలువను అనుకుని కొమరవరం వెళ్లే మలుపులో రహదారి శిథిలమై ప్రమాదకరంగా మారింది. నిత్యం ఇటుగా ఆ కాలనీ వాసులు రాకపోకలు సాగిస్తుంటారు. పలు సందర్భాల్లో ప్రయాణికులు, చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఈ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.

పశువులకు బీమా... మూడేళ్ల ధీమా

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో ప్రధానమైనది బీమా పథకం. మూగజీవాలకు ఒకసారి బీమా చెల్లిస్తే మూడేళ్లలో ఎటువంటి నష్టం సంభవించినా పరిహారం మంజూరవుతుంది. గ్రామాల్లోని సచివాలయం, పశు వైద్యశాలలను సంప్రదించి రైతులు నమోదు చేయించుకోవచ్చు.

ఏయే సందర్భాల్లో అంటే.. పిడుగు పాటు, విద్యుదాఘాతం, ఊబిలో చిక్కుకుపోవడం, వేరే ఇతర కారణాల చేతనైనా మృత్యువాత పడితే దాని నుంచి రైతులకు అందుకునేందుకు ఈ బీమా ఉపయోగపడుతోంది. ఒక కుటుంబానికి గరిష్ఠంగా పది మూగజీవాల వరకు ఈ పథకం వర్తిస్తుంది. పశువులకు చెవి పోగులు వేయించి బీమా చెల్లించాలి. ప్రభుత్వం రాయితీగా నాటు పశువులకు రూ.816, మేలు జాతి పశువులకు రూ.1632 చెల్లిస్తోంది. రూ.లక్ష బీమా చేయించాలంటే రూ.6400 ప్రీమియం చెల్లించాలి. ఇందులో రైతు వాటాగా రూ.4937 చెల్లిస్తే చాలు. మిగిలింది ప్రభుత్వమే చెల్లిస్తుంది. గొర్రె, మేకలకు రైతు రూ.27 చెల్లిస్తే ప్రభుత్వం రూ.6వేలు నష్టపరిహారంగా అందజేస్తుంది.

రైతులు వినియోగించుకోవాలి

పశు బీమా విధానంలో రైతులకు మేలు జరుగుతుంది. మండలానికి కొంత మేర మాత్రమే ప్రీమియం రాయితీ అవకాశం ఉంది. పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. - రామాంజనేయులు, ఆర్జేడీ, అత్తిలి

ప్రజా ధనం పోసి.. నిర్లక్ష్యంగా వదిలేసి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన వ్యవసాయ కియోస్క్‌లు నిరుపయోగంగా మారాయి. దీంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అయింది. అప్పట్లో రైతులకు సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సాగుదారులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయించేందుకు కియోస్క్‌లు ఏర్పాటు చేయగా సాంకేతిక కారణాలతో ఇవన్నీ మూలకు చేరాయి..

అదనపు వ్యయం కారణం.. వైకాపా పాలనలో తగినన్ని ఎరువుల సమస్యను అధిగమించేందుకు కియోస్క్‌ల వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు నాటి పాలకులు ప్రకటించారు. ఆచరణలోకి వచ్చే సరికి ఆర్డర్ పెట్టిన ఎరువులు వచ్చాక దిగుమతి, రవాణాకు పెద్ద ఎత్తున ఖర్చయ్యేది. ఈ ప్రక్రియ కోసం అదనపు వ్యయం చేయాల్సి వచ్చేది.

రామన్నపేటలో మూలకు చేరిన కియోస్క్‌లు

ఎందుకిలా.. కియోస్క్‌లు పనిచేయాలంటే అంతర్జాల సౌకర్యం ఉండాలి. గత ప్రభుత్వం ఈ సదుపాయం కల్పించలేదు. దీంతో సిబ్బంది చరవాణి ద్వారా అంతర్జాలాన్ని ఉపయోగించుకొని కొద్ది రోజులు నెట్టుకొచ్చారు. క్రమేపీ రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందుల విక్రయాలు తగ్గడంతో 2023 నుంచి ఈ యంత్రాలు అటకెక్కించారు. అత్తిలి మండలంలో 20 రైతు సేవా కేంద్రాల్లో 20 కియోస్క్‌లు ఉండగా అన్నిచోట్లా మూలకు చేరాయి.

ఉపయోగించడం లేదు.. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తగినన్ని ఎరువులు, పురుగు మందులు నిల్వ అందుబాటులో ఉండటంతో దీంతో యంత్రాల ద్వారా ఆర్డర్ పెట్టే అవకాశం లేకపోవడంతో కియోస్క్‌లు ఉపయోగించడం లేదని అత్తిలి వ్యవసాయాధికారి రాజేష్ తెలిపారు.

తీరంలో సందడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్‌లలోని బీచ్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ఇసుక తిన్నెలపై ఆటపాటలతో గడిపారు.

పొగలో బతుకుతున్నాం.. పాట్లు పడుతున్నాం

తణుకు, న్యూస్‌టుడే: మండలంలోని తేతలిలో కుమ్మర్ల దిబ్బ కాలనీ వాసుల సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కాలనీను ఆనుకొని ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. నిత్యం వ్యర్థాల నుంచి వెలువడే పొగ ఆ ప్రాంతవాసులను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనిచేయకపోవడంతో వ్యర్థాలను ఇళ్ల సమీపంలో వేసి తగలబెడుతున్నారు.

ఆచరణ కరవు.. వ్యర్థాలను పూర్తి స్థాయిలో సంపదగా మారుస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటోంది. రోజూ సేకరించిన వ్యర్థాలు చెరువుల్లో పడేస్తున్నారు. దీనికి తోడు స్థానికంగా ఉండే పలు పరిశ్రమల ప్లాస్టిక్ వ్యర్థాలను తగలబెడుతుండటంతో కాలనీ వాసులు ఊపిరాడక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వ్యర్థాలను నుంచి వెలువడుతోంది ఇలా..

అధికారులు స్పందించాలి..

వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో నిత్యం పొగతో కాలనీ కమ్ముకుపోతోంది. కొన్ని సార్లు ఊపిరి అందని పరిస్థితులు కూడా ఉన్నాయి. అనేక సార్లు అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదు. పందులు బెడద ఎక్కువగా ఉండటంతో వ్యాధుల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి డంపింగ్‌యార్డును ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలి. - డి.సత్యనారాయణ

తలుపులు మూసుకుని..

డంపింగ్ యార్డు ఇళ్లకు సమీపంలో ఉండటంతో పొగతో పాటు, దుర్గంధం వెదజల్లుతోంది. నిత్యం తలుపులు మూసుకుని ఉండాల్సిన పరిస్థితి. మురుగు నీరు వెళ్లేందుకు దారి లేకపోవడంతో నిలిచిపోతోంది. దోమలు వ్యాప్తి చెంది కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. - నాగమణి

కార్యదర్శులను ఆదేశిస్తాం.. వ్యర్థాలకు నిప్పు పెట్టకూడదని కార్యదర్శులకు చెబుతున్నాం. అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. - మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో

అపరిశుభ్రతే అసలు సమస్య

14వ వార్డు నివేదన
జనాభా: 2368

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పురపాలక సంఘ పరిధిలోని 14వ వార్డులో పారిశుద్ధ్య సమస్య వేధిస్తోంది. పశువుల ఆసుపత్రి వీధిలో నిర్మించిన ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో అధ్వానంగా తయారయ్యాయి. సమీపంలో నివాసం ఉంటున్న వారు పలు అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. మురుగు నీరు, అంతర్గత రహదారులు, దోమల సమస్య, కుక్కల స్వైరవిహారంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యంగా వార్డులో పూడిక తీత సక్రమంగా జరగకపోవడంతో మురుగు ముందుకు సాగక దుర్వాసన వెదజల్లుతోంది. ★ మురుగు నీరు రోజుల తరబడి నివాసాల మధ్య నిల్వ ఉంటోంది. ★ దోమలు విజృంభించి తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. ★ దోమల నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ★ డ్రెయినేజీల్లో బ్లీచింగ్ చల్లిన దాఖలాలు కనిపించడం లేదు. ఫాగింగ్ కూడా అంతంత మాత్రంగా చేస్తున్నారు. ★ కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రాంతాలు: కొమ్మాయి చెరువు గట్లు, చిన్న వంతెన పక్క వీధి, గోస్తాని కాలువ వీధి, పల్లాలమ్మ గుడి వీధి, మసీదు రోడ్డు, పశువుల ఆసుపత్రి వీధి, రామాలయం వీధి, అంబటి వారి వీధి, తోటవారి వీధి.

చర్యలు చేపడతాం.. ఆయా ప్రాంతాలను పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపడతాం - సాయి, ఇన్‌ఛార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

డ్రెయిన్‌ల నిలిచిపోయిన మురుగునీరు



(c) eenadu

పోరుమామిళ్ల చెరువు
శాసనం ఇదే

పోరుమామిళ్ల చెరువు విశేషాల నెలవు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: పోరుమామిళ్ల చెరువుకు చరిత్రలో అనంతరాజు సాగరం అనే పేరు ఉంది. చెరువు కొండపై శాసనం ప్రత్యేకమైంది. చెరువుకు సంబంధించిన అనేక అంశాలు ఇందులో ఉన్నాయి. క్రీ.శ.1369లో విజయనగర ప్రభువైన మొదటి బుక్కరాయుల కుమారుడు భాస్కరుడు (భదూరుడు) ఉదయగిరి రాజ్యానికి అధిపతిగా ఉన్నారు. ఆయన పాలనలోనే ఈ చెరువు నిర్మాణం చేపట్టారని శాసనాల ద్వారా తెలుస్తోంది. అప్పుడు వేయించిన శాసనం కొండపై ఇప్పటికీ కనిపిస్తుంది. కొంతమంది చరిత్రకారులు 1903లో ఈ శాసనాన్ని విశ్లేషించారు. గ్రామానికి తూర్పుగా 4 కిలోమీటర్లు దూరాన ఉన్న ఈ చెరువు కట్ట రెండు కొండలతో కలుపుకొని 11 కి.మీ పొడవు, 12 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ చెరువు ఒక్కసారి నిండితే రెండు దఫాలుగా రైతులు పంటలను సాగు చేసుకోవచ్చు.

జనం.. జగం.. జంగమం
కిక్కిరిసిన శైవ క్షేత్రాలు

ప్రత్యేక అలంకరణలో శివయ్య

నిత్యపూజకోనలో బారులు తీరిన భక్తులు

మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలు ఆదివారం శివనామస్మరణతో మారుమోగాయి. ప్రధానంగా పొలతల క్షేత్రం, నిత్యపూజకోన భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొలతలలో మల్లేశ్వరస్వామి, పార్వతీదేవి, అక్కదేవతలను దర్శించుకున్నారు. కోనేర్ల వద్ద స్నానాలాచరించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి కల్యాణానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సిద్దవటం మండలం నిత్యపూజ కోనలో శివపార్వతుల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. - న్యూస్‌టుడే, పెండ్లిమర్రి, సిద్దవటం

స్నానమాచరిస్తున్న భక్తులు

పాలతలలో భక్తులు

పొలతల విహంగ వీక్షణం

నృత్య రూపకం.. నయనానందకరం

మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో సంప్రదాయ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ కళా నైపుణ్యాలతో నృత్యం చేస్తూ రక్తి కట్టించి భళా అనిపించారు. ప్రొద్దుటూరులోని శివాలయం వద్దనున్న నటరాజ కళాక్షేత్రంలో శివపార్వతుల కల్యాణోత్సవంలోని ఓ సన్నివేశానికి ప్రదర్శించిన నృత్య రూపకం ఆహూతులను ఆకట్టుకుంది. ఆ చిత్రమే ఇది.
- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

రోగ నిర్ధారణ పరీక్షా.. ఓ శిక్షే!

◆ రిమ్స్‌లో కొందరి వైద్యుల దందా

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: కడప సర్వజన ఆసుపత్రిలో రోగ నిర్ధారణ పరీక్షలు అంటే రోగులు హడలిపోతున్నారు. అదేంటి అక్కడ ఉచితంగానే రక్త పరీక్షలు చేస్తారు కదా అని అనుకుంటున్నారా. అయితే మీరు పొరబడినట్లే. రిమ్స్‌లో అన్ని రకాల రక్త పరీక్షలు చేసేందుకు ఆవశ్యకమైన సౌకర్యాలతో అన్ని రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నా కొందరు వైద్యులు ప్రైవేట్ ల్యాబ్‌లలో చేయించుకోవాలంటూ సూచిస్తుండటం.. దీనికి తోడు కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఓపీ వద్దకు వచ్చి మరీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేసి రక్తం తీసుకెళుతుండటం గమనార్హం.

● రిమ్స్‌లో అన్ని పరీక్షలు చేయించినా.. క్యాజువాలిటీలోని ఓ వైద్యుడు ఇక్కడ చేసే పరీక్షలు కచ్చితత్వంతో ఉండవని ప్రైవేట్ ల్యాబ్ వారిని పిలిపిస్తూ వారి దగ్గర చేయించుకోవాలని చెప్పారని రోగి బంధువు రామకృష్ణ చెప్పారు. ఓ వ్యక్తి ల్యాబ్ నుంచి వచ్చానంటూ కొన్ని రక్త పరీక్షలకు రూ.1000 తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ● రూ.150 విలువ చేసే పరీక్షకు రూ.600 వరకు వసూలు చేస్తున్నారని ఓ రోగి బంధువు సరోజమ్మ తెలిపారు.

● రిమ్స్‌లో రోజుకు వందల్లో ఓపీ సైతం నమోదవుతోంది. ఇంత వరకు బాగానే ఉన్నా కొందరు సిబ్బంది వైఖరి కారణంగా రోగులకు ఆర్థిక భారం తప్పడం లేదు. రిమ్స్‌లో కొన్ని విభాగాల్లోని వైద్యులు చీటీలు రాసిస్తూ రోగులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారు.

● ప్రధానంగా క్యాజువాలిటీ, కార్డియాలజీ విభాగం, జనరల్ మెడిసిన్, చిన్నపిల్లల విభాగం, శస్త్రచికిత్సల విభాగాల్లో కొందరు వైద్యులు ప్రైవేట్ ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయిస్తున్నారని రోగులు చెబుతున్నారు. రిమ్స్ ఆసుపత్రిలో చేసే రక్త పరీక్షల్లో తమకు నమ్మకం లేదని తప్పకుండా ప్రైవేట్ ల్యాబ్‌లలో చేయించాల్సిందేనని పట్టుబడుతున్నారని రోగుల బంధువులు వాపోతున్నారు.

● ప్రభుత్వ ఆసుపత్రిలోకి ప్రైవేట్ ల్యాబ్ సిబ్బంది ప్రవేశించాలంటే ఆసుపత్రి అధికారుల అనుమతి తప్పకుండా తీసుకోవాలి. అందుకు భిన్నంగా ఏసీయూతో పాటు చిన్న పిల్లల అత్యవసర చికిత్స విభాగం, ప్రసవాల వార్డుల్లోకి స్వేచ్ఛగా ప్రైవేట్ సిబ్బంది ప్రవేశిస్తున్నారు. రక్త నమూనాలు తీసుకుని రోగుల వద్ద ల్యాబ్ నుంచి రాకపోకలకు పెట్రోలు ఖర్చులతో పాటు రిపోర్ట్‌లకు రెండింతలు డబ్బులు వసూలు చేస్తున్నారని రోగులు వాపోతున్నారు.

● ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సంబంధిత విభాగాధిపతులతో చర్చిస్తామన్నారు. వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

చురుగ్గా గ్రీన్‌ఫీల్డ్ హైవే సొరంగం పనులు

బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ఆరు లైన్ల రహదారిలో భాగంగా మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లి సమీప నల్లమల అటవీ ప్రాంతంలో సొరంగం పనులు చురుగ్గా సాగుతున్నాయి. 179.290 కి.మీ నుంచి 179.790 మధ్య 500 మీటర్లు సొరంగం తవ్వాల్సి ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం 60 మీటర్ల మేర తవ్వారు. ఎడమ, కుడి వైపులకు వెళ్లే వాహనాల కోసం విడివిడిగా సొరంగాలు తవ్వుతున్నారు. గతేడాది నవంబరులో పనులు మొదలైనట్లు సిబ్బంది తెలిపారు. సొరంగం దాటిన తర్వాత 900 మీటర్లు ఫ్లైఓవర్ పనులు సాగుతున్నాయి.
- న్యూస్‌టుడే, మైదుకూరు

చంద్రన్న సంకేతం.. జిల్లాకు అభయం
కూటమి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలకు హామీ

ఈనాడు, కడప : జిల్లాకు సీఎం చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆయన ఆమోదముద్ర వేశారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిన పనుల పూర్తికి నిధుల కేటాయింపుకు అంగీకారం తెలిపారు. కూటమి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో ఉండవల్లిలో శనివారం రాత్రి సీఎం ప్రత్యేకంగా సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ పలు ప్రతిపాదనలు అందించగా సీఎం ఆమోదించారు.

చెన్నూరు సమీపంలో అసంపూర్తిగా హజ్‌హౌస్

ప్రతిపాదించిన అంశాలివి

● కడప నియోజకవర్గంలో బుగ్గవంక రోడ్డు అభివృద్ధికి రూ.16.50 కోట్లు, విశ్వనాథపురం ఆర్‌యూబీకి రూ.4 కోట్లు మంజూరు చేయాలని ప్రధాన రహదారుల కోసం రూ.276 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.300 కోట్ల నిధులు. ● వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె ఎత్తిపోతల పథకం పూర్తికి రూ.2.17 కోట్లు వెచ్చిస్తే ఆరు నెలల్లో పూర్తయ్యేలా కార్యాచరణ. ● అలిరెడ్డి పథకాన్ని రూ.2 కోట్లతో చేపట్టి 120 ఎకరాలకు సాగునీటితో పాటు 1,800 మందికి తాగునీరందించేలా ప్రతిపాదన ● కమలాపురం నగర పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.58.21 కోట్లు ● కమలాపురం నియోజకవర్గ పరిధిలోని కడప నగర డివిజన్లలో రహదారులు, కాలువలు, తాగునీటి కోసం రూ.5 కోట్లు మంజూరు. ● రాజంపేట నియోజకవర్గంలో తాగునీటి పథకాలు రూ.1.50 కోట్ల నిధుల మంజూరు. ఒంటిమిట్ట నీటి ట్యాంకుల పనులు రూ.2 కోట్లతో పూర్తి చేస్తారు. ● ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కొర్రపాడు రహదారి విస్తరణకు రూ.7.8 కోట్లు, పురపాలక మార్కెట్ అభివృద్ధికి రూ.13.96 కోట్లు కేటాయించాలని ఆమోదముద్ర పడింది. ● బద్వేలులో రెండు 33/11 కేవీ సబ్ స్టేషన్లకు రూ.8 కోట్లు, ఎస్టీపీ తల పథకానికి రూ.3 కోట్ల వంతున కేటాయించగా సోమశిల బ్యాక్ వాటర్ ఎత్తిపోతల పథకానికి రూ.200 కోట్లు ప్రతిపాదించారు. నిధుల కేటాయింపుకు పనులు పూర్తికి నిర్ణీత సమయాన్ని నిర్దేశించారు.

చెన్నూరులోని హజ్‌హౌస్‌కు రూ.10 కోట్లతో అసంపూర్తి పనులు పూర్తి చేసి దాన్ని మైనార్టీ మహిళల నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా మార్చనున్నారు.

● మైదుకూరు నియోజకవర్గంలో ముదిరెడ్డిపల్లి, తిప్పిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకానికి రూ.8.90 కోట్లు, రేకులకుంట పథకానికి రూ.6.60 కోట్లు, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు రూ.36.26 కోట్లు మంజూరు చేశారు. ● పులివెందుల నియోజకవర్గంలో అరటి ప్యాక్‌హౌస్ పీపీపీ విధానం కింద నిర్వహణ, తొండూరు బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల పనులు పూర్తికి రూ.19.62 కోట్లు, సమగ్ర తాగునీటి పథకానికి రూ.34.23 కోట్లు, దాగంపల్లి-వేంపల్లె రోడ్డుకు రూ.13 కోట్లు, జేజేఎం తాగునీటి పథకానికి రూ.23.70 కోట్లు, పులివెందుల పురపాలక రోడ్లకు రూ.10 కోట్లు కేటాయించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సభాభవనంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతున్న నేపథ్యంలో అర్జీదారులు తమ అర్జీలను సమర్పించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఉంటుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి రాలేని అర్జీదారులు 08562 244437 ఈ నంబరుకు ఫోన్ చేసి సమస్యకు పరిష్కారం తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు.

విద్యుత్తు వ్యవస్థ.. వేసవి సన్నద్ధత!
అధిగమించేందుకు అధికారుల సమాయత్తం

ఏటా వేసవిలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఫిబ్రవరి నెలలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. రానున్న మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గడిచిన రోజులను అంచనా వేస్తూ విద్యుత్తు శాఖ అధికారులు తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, కడప గ్రామీణ

ఇటీవల ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

డివిజన్	కడప	ప్రొద్దుటూరు	మైదుకూరు	పులివెందుల
100 కేవీ	16	10	05	05
160 కేవీ	40	14	30	11

కొత్త ఉప కేంద్రాలకు ప్రతిపాదనలు

జిల్లాలో ప్రస్తుతం 220 కేవీ సబ్‌స్టేషన్లు 7, 132 కేవీ సబ్‌స్టేషన్లు 15, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 241 ఉన్నాయి. వాటి ద్వారా జిల్లాలోని వ్యవసాయ, గృహ, పరిశ్రమలు, ఇతర సర్వీసులకు విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. వీటికి కూడా అదనపు లోడ్ సమస్య ఏర్పడుతోంది. అలాంటి కేంద్రాల్లో ఒక పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంటే సామర్థ్యాన్ని బట్టి మరొకటి ఏర్పాటు చేయడమా లేదా అది మార్చి సామర్థ్యం పెంపు చేయడం లాంటి చర్యలు చేపడుతున్నారు. మరో 8 కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు.

నెలకు 13 మిలియన్ యూనిట్ల వినియోగం

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, గృహ, వాణిజ్య, పరిశ్రమలు, నీటి పథకాలు, ప్రార్థనా మందిరాలు తదితరాలు కలిపి 9,72,067 సర్వీసులు ఉన్నాయి. వీటికి సరఫరా చేసేందుకు జిల్లాకు సుమారు 13 మిలియన్ యూనిట్ల కోటా ఇస్తున్నారు.

నష్ట నివారణ చర్యలు

గతేడాది జిల్లాలో చోటు చేసుకున్న విద్యుత్తు సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది విద్యుత్తు వినియోగం పెరిగి ఇబ్బందికరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించారు. వాటి స్థానంలో సామర్థ్యం పెంచి ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అలాంటివి సుమారు 200 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండొచ్చని అధికారుల అంచనా. ● ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ మాట్లాడుతూ.. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు దృష్టిలో ఉంచుకుని అధిక లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తిస్తున్నామన్నారు. ఓ వైపు ఆర్డీఎస్ఎస్ పథకం పనులు జరుగుతున్నాయన్నారు. మార్చి ఆఖరు నాటికి ఎలాంటి సమస్య లేకుండా పనులు పూర్తి చేస్తాం.

లంకమల.. జీవ వైవిధ్యం భళా

జిల్లాలో లంకమల అభయారణ్యం జీవ వైవిధ్యానికి ప్రతీక. ప్రకృతి ఒడిలో ఎన్నో రకాల వన్యప్రాణులు హాయిగా జీవనం సాగిస్తున్నాయి. ఈ ప్రాంతం జిల్లాకే తలమానికంగా నిలుస్తోందని విశ్రాంత అటవీ క్షేత్రాధికారి మహమ్మద్ హయాత్ తెలిపారు. చుక్కలు, చారలు, కృష్ణ జింకలు, దుప్పులు, కణితులు, చిరుతపులి, అడవి కుక్కలు, కొండ గొర్రెలు, మానుపిల్లి, దేవాంగపిల్లి, అలువ, ఎలుగుబంట్లు, రేచుకుక్కలు, గుంట నక్కలు, మనుబోతు, హైనా, తోడేళ్లు, కొండ ముచ్చులతో పాటు మరికొన్ని రకాలు ఇక్కడ జీవనం సాగిస్తున్నాయి. జీవ వైవిధ్య పరిరక్షణే శ్రీరామరక్ష కావాలని ప్రకృతి, జంతు ప్రేమికులు అంటున్నారు.
- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, సిద్దవటం

నేడు డయల్ యువర్ సీఎండీ

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : డయల్ యువర్ సీఎండీ, ఎస్ఈ కార్యక్రమాన్ని ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్, ఎస్ఈ రమణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. వినియోగదారులు విద్యుత్తు సమస్యలను సీఎండీ కార్యాలయ సెల్ నం:89777 16661కు, లేదా ఎస్ఈ కార్యాలయ నంబర్ 08562 242457కు ఫోన్ చేసి తెలిపి పరిష్కారం పొందాలని సూచించారు.

పంచాయతీకి పది పనులు
ఉపాధి హామీ పథకంలో మార్పులు

కమలాపురం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఉపాధి హామీ పథకంలో మార్పులు చోటుచేసుకున్నాయి. గ్రామాల్లో చేపట్టిన పనులు పెండింగ్‌లో లేకుండా పూర్తయ్యేలా.. వేతనదారులకు ఎక్కువ పని దినాలతో ఉపాధి లభించేలా రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29న స్టాండర్డ్ ఆపరేషన్ గైడ్‌లెన్స్ జారీ చేసింది. ఆ వివరాలు ఇవీ..

● ఒక్కో పంచాయతీకి తొలుత పది పనుల వంతున మంజూరు చేస్తారు. ఒకటి పూర్తయిన తరువాత మరొకటి చేపట్టాలి. 2014 నుంచి ఇప్పటి వరకు మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులను ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేయాలని నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.
● ఇకపై చేపట్టిన పనుల్ని అదే ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పూర్తి చేయాల్సి ఉంది.
● ప్రతి పంచాయతీలో గ్రామసభల ద్వారా 20 నుంచి 25 పనులకు అనుమతులు తీసుకోవడం.. వాటిలో సగమే చేపట్టడం, నిధులు మురిగిపోవడం ఇప్పటి వరకు పథకంలో జరుగుతోంది.
● అత్యవసరంగా ఎక్కడైనా కొత్త పనులు చేపట్టాలంటే జిల్లా ప్రోగ్రాం అధికారి (డీపీసీ)గా ఉండే కలెక్టర్ మంజూరు చేసేవారు.

మార్చి 31లోగా పూర్తి

కాలనీల నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరైతే 90 రోజుల్లో ఖర్చు చేయాలి. పండ్ల తోటల పెంపకంలో మూడేళ్ల నిర్వహణకు అనుమతి ఉంది. రహదారులు, భవనాల నిర్మాణాలకు కాలపరిమితి ఉంటుంది. పథకంలో ఇప్పటి వరకు ఉన్న నిబంధనల మేరకు ఒక ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు వచ్చే ఏడాదిలోనూ కొనసాగించే అవకాశం ఉండటంతో జిల్లాలో వందల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటిని ఈ ఏడాది మార్చి 31 లోగా పూర్తి చేయాలని నిర్దేశించారు.

నాలుగవ వర్ధంతి

జననం : 01-08-1944
మరణం : 16-02-2022

కీ॥శే॥ Lion మారెడ్డి ఆనందరెడ్డి
ప్రొ॥ ఈగల్ డిస్టలరీస్

మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి, చెరిగిపోనిది
మీ ఘనత, మరపురానిది మీ మమత, మీ దృఢసంకల్పం, కార్యదీక్షత మాకు ఆదర్శనీయం.
మీ ఆలోచనా దృక్పథం మాకు స్ఫూర్తిదాయకం. ఉన్నతమైన వ్యక్తిత్వంతో,
సేవాగుణ సంపన్నులుగా కీర్తింపబడి అందరి మేలుకోరే మంచి మనిషి
Lion కీ॥శే॥ మారెడ్డి ఆనందరెడ్డి గారు మా నుండి దూరమై నేటికి నాలుగు సంవత్సరాలు
గడిచిననూ మిమ్మల్ని మరువలేకున్నాము... మీ జ్ఞాపకాలు మా మదిలో పదిలం.
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

భార్య : కీ॥శే॥ ప్రమీల రెడ్డి

కుమార్తెలు: శ్రీమతి విజయ, శ్రీమతి సౌభాగ్యరాణి, శ్రీమతి అనిత, శ్రీమతి శీలా
అల్లుళ్లు : కీ॥శే॥ సీతారామిరెడ్డి, IPS, సురేష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, డా॥ ప్రవీణ్‌రెడ్డి
కుమారుడు : మారెడ్డి సతీష్‌రెడ్డి
కోడలు : శ్రీమతి వీణారెడ్డి
మనుమరాలు : మారెడ్డి అదితిరెడ్డి
మరియు మనుమలు, మనుమరాండ్రు, కుటుంబసభ్యులు

సాగుతున్న.. ఏకీకృత కుటుంబ సర్వే

జిల్లాలో చేయాల్సింది నలభై శాతంపైనే

పెద్దకారంపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

● జిల్లాలో పురపాలక, అర్బన్, మండలాలు: 48
● గ్రామ, వార్డు సచివాలయాలు: 714
● సర్వేలో పాల్గొన్న ఉద్యోగుల సంఖ్య: 5,709
● మొత్తం సర్వే చేయాల్సిన కుటుంబాలు: 7,21,696
● ఇప్పటి వరకు పూర్తి చేసినవి: 3,98,995
● సర్వే పూర్తి కాని కుటుంబాలు 3,22,701

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో గతేడాది ప్రభుత్వం ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభించింది. దీన్ని పూర్తి చేయడానికి ఈ ఏడాది జనవరి నెలలోపే గడువు విధించింది. కానీ సర్వేలో ఎదురయ్యే పలు సమస్యల కారణంగా ఇప్పటికే రెండు సార్లు గడువు పెంచారు. ప్రస్తుతం ఫిబ్రవరి నెలాఖరుకు అవకాశం ఇచ్చినా అనుకున్న స్థాయిలో జరగలేదు. ఇప్పటికి 61 శాతం మాత్రమే సర్వే జరిగింది.

నాటి తప్పిదాలు సవరిస్తూ..

గత ప్రభుత్వ హయాంలో కుటుంబ సర్వే (హౌస్ హోల్డ్ సర్వే) చేసి ఇంటింటికీ మ్యాపింగ్ చేశారు. గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బందితో పాటు వాలంటీర్లను ఉపయోగించుకోవడం వల్ల కుటుంబ వివరాలు తప్పుగా నమోదు చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎలాంటి తప్పులు లేకుండా ఏకీకృత సర్వే చేయిస్తోంది.

జాప్యానికి కారణాలివి..

● ఒక కుటుంబంలో వివరాలు నమోదు చేయాలంటే వ్యక్తిగత వివరాలు, సెల్ ఫోన్‌కు ఓటీపీలు, ఆన్‌లైన్ సక్రమంగా పని చేయకపోవడం వంటి సమస్యలు వస్తున్నాయి. ● ఒకే కుటుంబంలోని సభ్యుల వివరాలు నమోదు చేయడానికి అరగంట సమయం పట్టడం.. కుటుంబంలో ఒకే వ్యక్తి ఉంటే వారికి వ్యక్తిగత సెల్ ఫోన్ లేకపోయిన సర్వే చేయడానికి అవకాశం లేకుండా ఉండడం. ● క్షేత్ర స్థాయిలో అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో చాలా వరకు సిబ్బంది లేకపోవడం.. ఉన్న సర్వే పూర్తి స్థాయిలో చేయకపోవడం.

వైభవంగా గంగమ్మ జాతర నిర్వహణ

అన్నమయ్య జిల్లాలో అనంతపురం గంగమ్మ తల్లి జాతర ఈ నెల 17వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. లక్కిరెడ్డిపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చాగలగుట్టపల్లెలోని గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని మంగళవారం బయటకు తీయగానే ఈ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు అర్ధరాత్రి బోనం సమర్పించి దేవర ఇంట్లో ఉన్న అమ్మవారిని బయటకు తెచ్చి మేళతాళాలతో అనంతపురంలోని ఆలయానికి తీసుకొస్తారు. 18న నిండు తిరునాల, అమ్మవారికి సిద్దల పూజ, సిరిమాను తిరగడం, సర్వదర్శనం, బోనాలు పట్టడం, చాందినీబండ్ల ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19న మైలు తిరునాల అమ్మవారి ఊరేగింపు, గంగస్నానాలు, అభిషేకాలతో ముగుస్తుందని ఆయన వివరించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వసతులు కల్పిస్తున్నామని వివరించారు. - న్యూస్‌టుడే, లక్కిరెడ్డిపల్లె

పశు పోషణకూ రుణం

రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు

కమలాపురం, న్యూస్‌టుడే : పశు పోషణ రోజురోజుకూ ఖరీదుగా మారుతోంది. దాణా, మేత, మందుల కొనుగోలు తప్పనిసరి కావడంతో చాలా మంది రైతులు చేతిలో డబ్బుల్లేక సకాలంలో కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. ఈ పరిస్థితుల నుంచి రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. వీటిని వినియోగించుకుంటే బహుళ ప్రయోజనాలు పొందొచ్చని కమలాపురం పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ఉత్తయ్య తెలిపారు.

జిల్లాలో వివరాలిలా..	
ఆవులు	44,650
గేదెలు	3,99,910
గొర్రెలు	9,83,684
మేకలు	3,62,582
కోళ్లు	10,95,152
పందులు	2,777

బ్యాంకుల్లో దరఖాస్తులు

పశు సంవర్ధక శాఖ గ్రామ సహాయకులు ఆయా బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అర్హులకు పీకేసీ కార్డులు అందిస్తారు. ఇందుకుగాను దరఖాస్తులను సమీప ప్రభుత్వ బ్యాంకుల్లో అందజేయాలి. తద్వారా అర్హులకు కిసాన్ క్రెడిట్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డుల నకళ్లు పొందుపరచాలి.

గరిష్ఠంగా రూ.3 లక్షలు

కార్డు ద్వారా గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు రుణం అందిస్తారు. రూ.1.60 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు అవసరం లేదు. తీసుకున్న సొమ్మును 40 రోజుల్లోగా తిరిగి చెల్లిస్తే వడ్డీ ఉండదు. అనంతరం 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోగా క్రమం తప్పకుండా తిరిగి చెల్లిస్తే ఆర్‌బీఐ, నాబార్డ్ 3 శాతం, బ్యాంకు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ) 3 శాతం వడ్డీ మినహాయింపు ఇస్తారు. సాధారణ క్రెడిట్ కార్డు మాదిరిగానూ వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు.

భూచోరుల చేతిలో 7,855 ఎకరాలు

● ముఖ్యమంత్రి వద్దకు వ్యవహారం

ఈనాడు-కడప

బ్రహ్మంగారిమఠం మండలంలో భూఆక్రమణ వ్యవహారం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తీసుకెళ్లారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎంను వారు కలిసి వివరించారు. ఈ వ్యవహారంలో వైకాపా నేతలు 7,855 ఎకరాల ప్రభుత్వ భూములు కాజేసినట్లు విచారణలో తేల్చారు. ఒక్క మండలంలోనే భారీగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడంపై ముఖ్యమంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

చర్చకు వచ్చిన అంశాలివి...

మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ఇనాం, అటవీ భూములతో పాటు అసైన్‌మెంట్ పట్టాలు, ఆక్రమణలు, అభ్యంతరకర, అభ్యంతర రహితమైన వాటిని రెవెన్యూ బృందాలు రెండు నెలల పాటు క్షుణ్నంగా విచారించారు. మండలంలోని 20 రెవెన్యూ గ్రామాల్లో ఆర్‌ఎస్‌ఆర్ ప్రకారం 11,512 సర్వే నంబర్ల కింద 97,706.76 ఎకరాల భూముల్ని క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. అయిదెకరాలకు పైబడి వివిధ అక్రమ మార్గాల్లో స్వాహా చేసిన వ్యక్తుల్ని, వారి ఆధీనంలో ఉన్న భూముల్ని గుర్తించారు. కొన్ని గ్రామాల్లో ఒక్కొక్కరు 50 ఎకరాలకు పైబడి భూములు ఆక్రమించుకున్నట్లు తేల్చారు. ఇలాంటి వ్యక్తులు 92 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరి పేర్లను సైతం నివేదికలో పొందుపర్చారు.

పేదలకు ఆక్రమిత భూముల పంపిణీ

మండలంలో గుర్తించిన ఆక్రమిత భూముల్ని పేదలకు పంచిపెట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎలాంటి చర్యలు తీసుకోని పక్షంలో తిరిగి ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉంటుందని.. వీటిని పంపిణీ చేయడానికి లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. పంపిణీకి పారదర్శకంగా ఏర్పాట్లు చేయాలని.. ఈ కార్యక్రమానికి తానూ హాజరవుతానని చెప్పినట్లు తెలిసింది.

వెంటాడిన ప్రమాదం

● మొదటి సారి తల్లికి తీవ్రగాయాలు
● రెండోసారి కుమారుడి దుర్మరణం

సురేష్‌బాబు (పాత చిత్రం)

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒకే రోజు.. ఒకే కుటుంబాన్ని ప్రమాదం రెండు సార్లు వెంటాడింది. మెదటి సారి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలతో బయటపడ్డారు. గంటల వ్యవధిలోనే రెండో సారి జరిగిన ప్రమాదం ఒకరిని బలితీసుకుంది. కుమారుడి రాక కోసం గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లికి అతని మరణవార్త శోకాన్ని కల్గించింది. పోలీసుల కథనం మేరకు.. ఒంటిమిట్ట మండలం మంటపంపల్లెకు చెందిన ముక్కర సురేష్(50) కమలాపురంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆదివారం ఆయన తన తల్లి రెడ్డెమ్మతో కలిసి ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనులమీద కడపకు బయలుదేరారు. సిద్దవటం మండలం కనుమలోపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి తీవ్రంగా గాయపడ్డారు. మాతృమూర్తిని చికిత్స నిమిత్తం కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రెడ్డెమ్మకు అవసరమైన సామగ్రిని తీసుకొచ్చేందుకు ద్విచక్రవాహనంపై స్వగృహానికి వచ్చారు. తల్లి ఆరోగ్య విషయమై ఆందోళన చెందుతూ తిరిగి ఆసుపత్రికి వెళ్తున్న సురేష్ వాహనాన్ని చెన్నై నుంచి పులివెందులకు వెళ్తున్న లారీ వెనుక వైపు నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ అక్కడికక్కడే మృతి చెందారు. తన బిడ్డ వస్తాడని ఎదురు చూస్తున్న రెడ్డెమ్మ కుమారుడి మరణ వార్త విని కన్నీరుమున్నీరయ్యారు.

జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు ఎంపిక

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న మునేశ్వర్‌రెడ్డి

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు సింహాద్రిపురం వివేకానంద పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ శాదరెడ్డి తెలిపారు. విజయవాడలో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నాలుగో తరగతి చదువుతున్న మునేశ్వర్‌రెడ్డి ప్రతిభ చూపినట్లు తెలిపారు. మరో విద్యార్థి జితేందర్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచినట్లు వివరించారు. త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

హేమంత్‌కుమార్ (పాతచిత్రం)

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు ఎర్రగుంట్ల మండలం కదిరివారిపల్లె గ్రామానికి చెందిన హేమంత్‌కుమార్(25) టిప్పర్లకు క్లీనర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎర్రగుంట్ల నుంచి కదిరివారిపల్లెకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. అదే సమయంలో సీకేదిన్నె మండలం ఊటుకూరుకు చెందిన సత్యనారాయణ మరో బైకుపై వస్తున్నాడు. ఈ క్రమంలో వీరి ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో హేమంత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. సత్యనారాయణ తీవ్రంగా గాయపడటంతో ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. సంఘటన స్థలాన్ని ఎర్రగుంట్ల పోలీసులు పరిశీలించారు. మృతి చెందిన యువకుడికి భార్య, నెలల వయసు గల కుమార్తె ఉంది.

ఉత్సవానికి వచ్చి ప్రాణాలొదిలిన భక్తుడు

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: ఉత్సవాలకు వచ్చిన భక్తుడు ప్రాణాలొదిలిన ఘటన ఆదివారం బి.మఠం మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని బ్రహ్మంగారిమఠం వద్ద శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవాలను చూసేందుకు పోరుమామిళ్ల గ్రామానికి చెందిన కాకర్లబాబు (62) వచ్చాడు. అనంతరం సమీపంలోని పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లాడు. అక్కడ ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించి కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు.

ఆదిత్య బింబం.. నయన మనోహరం

ప్రపంచానికి ప్రకాశం అందిస్తున్న ప్రభాకరుడు లేలేత కిరణ ప్రభలతో తేజోవంతంగా వెలుగులు పంచాడు. ఆదిత్యుడి బింబం కనులారా వీక్షించిన మది నయన మనోహరమే. సమస్త జగత్తుకు కాంతులు పంచుతున్న ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడు విశేషంగా ఆకర్షించారు. ఒంటిమిట్ట మండలం మలకాటిపల్లెకు చెందిన ఓ యువ రైతు తన భూమిలో దోస పంటను సాగు చేశాడు. ప్రధాన రహదారి పక్కనే ఈ పొలం ఉంది. ఈ మార్గంలో తిరిగే ప్రయాణికుల కళ్లు పంటపై పడి దిష్టి తగలకుండా పెద్ద మట్టి కుండను తీసుకొచ్చి పెట్టారు. తెల్లగా సున్నం కొట్టి మధ్యలో నల్లని చుక్కలు పెట్టి ఊత కర్రకు తగిలించారు. ఈ చేలో ఆదివారం ఉదయం దివాకరుడు తేజస్సుతో దర్శనమిచ్చారు. ఈ అపురూప సౌందర్య సన్నివేశాన్ని 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది. అరుణ ప్రభాత కిరణాలను కనులారా వీక్షించిన నేత్రాలు కనువిందు చెందాయి. ఈ ప్రాంత ప్రజలు నమో సూర్యదేవ.. ఆరోగ్య ప్రదాత.. దివాకరా.. శుభకర అంటూ చైతన్యమూర్తికి నమస్కరించారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

హత్య కేసులో నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ కొండారెడ్డి, చిత్రంలో ఎస్.ఐ సంజీవరెడ్డి, సిబ్బంది

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు నెహ్రూరోడ్డులోని నాగులకట్ట వీధిలో ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు వివరాలను ఆదివారం మూడో పట్టణ ఠాణాలో సీఐ కొండారెడ్డి వెల్లడించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ఎన్జీవో కాలనీకి చెందిన గువ్వల సుబ్రహ్మణ్యం(33) కొన్నేళ్ల కిందట రాజుపాళెం మండలం కొర్రపాడుకు చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు సంతానం. సుబ్రహ్మణ్యం కార్పెంటర్, డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ నేపథ్యంలో అతను కొన్నిరోజులుగా ప్రొద్దుటూరులోనే ఉంటూ పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యానికి వినయ్‌తో మద్యం దుకాణం వద్ద పరిచయం ఏర్పడింది. ఇటీవల ఇద్దరు మద్యం తాగుతూ గొడవ పడ్డారు. సుబ్రహ్మణ్యం వినయ్‌న్ను కొట్టాడు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకున్న వినయ్.. ఈ నెల 13న రాత్రి మద్యం తాగేందుకు సుబ్రహ్మణ్యాన్ని తన ఇంటికి తీసుకెళ్లి కత్తితో పొడిచి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఎస్.ఐ సంజీవరెడ్డి, ఏఎస్ఐ సుబ్బన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: కడప నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న అభియోగాలపై హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారించిన కోర్టు 26 మంది ఆర్డీవోలు, 11 మంది డీఎస్పీల స్థాయిని తగ్గించిందని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో 2018లో నియామకమైన కమిషనర్ మనోజ్‌కుమార్‌ని ఆ స్థానం నుంచి తప్పించాలని కోరారు. ఆయన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నగరపాలక సంస్థ పరిధిలో పన్నులు ఎగ్గొట్టి, అనుమతి లేని నిర్మాణాలు వెలిశాయని, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆయనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుని నగరపాలక సంస్థకు ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరారు.

లంకమల్లేశ్వరుడి సేవలో కలెక్టర్

పూజల్లో పాల్గొన్న చెరుకూరి శ్రీధర్, ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు సమీపంలోని దట్టమైన అడవి ప్రాంతంలో వెలసిన లంకమల్లేశ్వర స్వామిని ఆదివారం జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలను చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఆలయ కమిటీ ఛైర్మన్ బీరం చంద్రశేఖర్‌రెడ్డి తెదేపా సీనియర్ నాయకులు బిజివేముల రామచంద్రారెడ్డి ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం శివరాత్రి సందర్భంగా అక్కడ చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణం

పార్వతీపరమేశ్వరుల కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని సోమశిల ముంపు గ్రామం పాత కుడమలూరులో మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. తొలుత ముక్కంటి సన్నిధిలో ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరులను పట్టువస్త్రాలు, పుష్ప మాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. స్వామి వారి పరిణయ వేడుకలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలించారు. ఇష్ట దైవం సన్నిధిలో మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు గుడి శ్రీనివాసులు, గుడి వెంకటరమణ, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు ఎస్వీ రమణ, ఒంటిమిట్ట చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు పాటూరు గంగిరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన నవధాన్యాలు, మంచు శివలింగం

రాజంపేట, న్యూస్‌టుడే: మహాశివరాత్రిని పురస్కరించుకుని రాజంపేట పట్టణం సాయినగర్‌లో వెలసిన ఓంశాంతి నిలయంలో నవధాన్యాలతో 9 అడుగుల భారీ శివలింగాన్ని ఏర్పాటు చేశారు. ఈ శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నవధాన్యాల శివలింగాన్ని దర్శించుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఏటా రుద్రాక్షలతో శివలింగం, జ్యోతిర్లింగాల నమూనాలతో శివదర్శనంవంటివి ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది వినూత్నంగా 9 రకాల ధాన్యాలతో 9 అడుగుల శివలింగాన్ని ఏర్పాటు చేసినట్లు ఓంశాంతి నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని ఈడిగపాళెంలోని గణపతిస్వామి, బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంచుతో ఏర్పాటు చేసిన శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రాజంపేట పట్టణం సాయినగర్‌లోని ఓంశాంతి నిలయంలో నవధాన్యాలతో ఏర్పాటు చేసిన 9 అడుగుల శివలింగం

ఈడిగపాళెంలోని గణపతిస్వామి, బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంచుతో ఏర్పాటు చేసిన శివలింగం

అతుకులతో సరి!

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని యర్రగుంట్ల - వేంపల్లె ప్రధాన రహదారి నుంచి సంగాలపల్లె మీదుగా ఉప్పలూరు ముద్దనూరు వెళ్లే ర.భ.శాఖ రోడ్డును 2008లో అప్పటి ప్రభుత్వం వేయించింది. దాదాపు ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. 2024-25లో రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం ఈ రోడ్డు మంజూరైనట్లు తెలిసింది. అయితే కొంత రోడ్డును తవ్వి రెండు వరుసల కంకర వేసి తారు రోడ్డు వేస్తుండగా సంగాలపల్లె నుంచి కొమ్మద్ది రోడ్డులో కలిసే ప్రాంతం వరకు కొత్త రోడ్డు వేయకుండా పాత రోడ్డుకే మెరుగులు దిద్దుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రొద్దుటూరు డివిజన్ ర.భ.శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు.

సంగాలపల్లె - కొమ్మద్ది ర.భ. శాఖ రోడ్డును ప్యాచింగులతో పూర్తిచేస్తున్న గుత్తేదారు

ప్యాచింగ్ వేసిన రోడ్డు దుస్థితి

బడ్జెట్‌లో సీమకు అధిక ప్రాధాన్యం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి బ్లూ ప్రింట్‌లా ఉందని తెదేపా కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం జమ్మలమడుగు తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యంగా రాయలసీమకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సీమ ముఖచిత్రమే మార్చేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని స్పష్టం చేశారు. ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దేలా రూ.30 వేల కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా అన్ని రంగాలను బలోపేతం చేసేలా బడ్జెట్ ఉందన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరెడ్డి, సునీల్, శ్రీనివాసులు రెడ్డి, ధనుంజయ, పుల్లారెడ్డి, కుమార్, వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి

17న బకాయిల సాధనకు చలో విజయవాడ

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప విద్య, న్యూస్‌టుడే : 12వ పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల విడుదల, ఆర్థిక బకాయిల సాధన కోసం ఈ నెల 17వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా తెలిపారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 మాసాలు పూర్తవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. నాలుగు డీఏలు చెల్లించాల్సి ఉండగా ఒక్క డీఏ మాత్రమే చెల్లించి చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. సరెండర్ లీవ్ బకాయిలను నాలుగేళ్లుగా చెల్లించడం లేదన్నారు. తక్షణం నూతన పీఆర్సీని ఏర్పాటు చేసి అది అమలయ్యే వరకూ 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17వ తేదీ చేపట్టబోయే చలోవిజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఏజాస్‌అహ్మద్, దేవదత్తం, సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుల మృతిపై విచారణకు డిమాండ్

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: బి.మఠం మండల పరిధిలోని ముడుమాల, గుండాపురం గ్రామాలకు చెందిన దళిత యువకుల మృతిపై అనుమాలున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత బ్రహ్మంసాగర్ కాలువ వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దళిత యువకుల మృతిపై అనుమానాలున్నాయని, మృతులకు మండలంలో ఓ యువతికి ప్రేమ వ్యవహారాలు ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. యువతి కుటుంబ సభ్యులు హత్య చేసి కాలువలో పడేశారని ఆరోపించారు. పోలీసులు దర్యాప్తు సక్రమంగా చేయలేదన్నారు. దీనిపై జిల్లా ఎస్పీని కలిసి సిట్‌తో విచారణ చేయించాలని కోరుతామన్నారు. వీరి వెంట ఎమ్మార్పీఎస్ నాయకుడు జ్ఞానేశ్వర్, తదితరులున్నారు.

మట్లాడుతున్న మందకృష్ణ మాదిగ, చిత్రంలో నాయకులు

ఈ-పంట నమోదుకు 5 రోజులే గడువు..!

కమలాపురం, న్యూస్‌టుడే : వ్యవసాయానికి ప్రోత్సాహం, అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం వివిధ రకాల పథకాలు అమలు చేస్తోంది. రైతులకు పారదర్శకంగా పథకాలు, రాయితీలు అందించేందుకు ఈ-పంట విధానం ప్రవేశపెట్టింది. ప్రస్తుతం రబీలో సాగు చేసిన పంటల నమోదు ఈ నెల 20లోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నేటితో కలిపి 5 రోజులే గడువు ఉంది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సాగు చేసిన, చేయని భూములన్నింటినీ యాప్‌లో నమోదు చేయాలని అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో వ్యవసాయ అధికారుల పొలం బాట పట్టారు.

సాగు చేయని భూములు సైతం నమోదు.. :

ఈ-పంట నమోదుకు వ్యవసాయ శాఖ, పంట రకం, సర్వే నంబరు, సాగు విస్తీర్ణం, నీటి వనరులు వంటి వివరాలు ఏటా ఈ-పంట నమోదులో చేస్తారు. కాగా ఈసారి పంట సాగుచేయని భూములను సైతం నమోదు చేయాల్సి ఉంది. ఎంపిక చేసిన సర్వే నంబరులోని పొలానికి వెళ్లి రైతుతో పాటు పంట చిత్రం, అలాగే సాగు చేయకున్నా చిత్రం తీసుకోవాలి. పూర్తి వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది.

సమస్యలతో నమోదు ఆలస్యం

ఆధార్ నంబరు చరవాణి నంబరుకు అనుసంధానం అయి ఉండాలి. కొంత మంది రైతులు ఇంకా చేసుకోలేదు. దీంతో నమోదు ఆలస్యమవుతోందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఈ నెల 20లోపు పూర్తి చేయాలని చెబుతున్నా ఆ సమయానికి పూర్తి చేసే పరిస్థితి కనిపించడం లేదు.

ఆలయానికి అనుమతులిప్పించండి

మంత్రి సవితకు చిత్రపటాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుట్టా, కాశినాయన భక్తులు

కాశినాయన, న్యూస్‌టుడే: జ్యోతి క్షేత్రంలో వెలసిన మహిమాన్వితుడు, అన్నదాన ప్రభువు అయిన కాశిరెడ్డినాయన ఆలయ నిర్మాణానికి కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతులు ఇప్పించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు జిల్లాలోని ఎమ్మెల్యేల బృందంతో కలిసి మంగళగిరిలో కాశినాయన భక్తులు వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జ్యోతి క్షేత్రంలో జరిగిన సంఘటనలు, క్షేత్ర నిర్మాణంపై మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ, తదితర అంశాలన్నింటిని ఆమెకు వివరించారు. త్వరగా అనుమతులు ఇప్పిస్తే ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న కాశిరెడ్డి నాయన ఆలయం త్వరగా పూర్తి చేసేందుకు ఐదు జిల్లాలో ఉన్న కాశి నాయన భక్తులు సిద్ధంగా ఉన్నారని, లక్షలాది భక్తుల ఏళ్ల నాటి కల సాకారమవుతుందని వారు విన్నవించారు. తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, ఆదినారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి తమ్ముడు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో కాశినాయన భక్తులు బయపురెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటరెడ్డి మంత్రిని కలిశారు. అనంతరం ఆమెకు కాశి నాయన చిత్రపటాన్ని అందించారు.

యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : మహా శివరాత్రి కేవలం పండగ మాత్రమే కాదు. శివ పరమాత్మ భూమిపై అవతరించిన అద్భుతమైన సమయమని బ్రహ్మ కుమారీ రాజయోగిని గీతా దీదీ అన్నారు. మహా శివరాత్రి పండగ సందర్భంగా ఆదివారం కడప ఓంశాంతి నగర్‌లోని బ్రహ్మకుమారీల కార్యాలయంలో శివజయంతి వేడుకలు నిర్వహించి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగా ద్వారా శాంతి కలుగుతుందన్నారు. అంతర్గత శాంతిని పెంపొందించడంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అజ్ఞాన అంధకారం తొలగిపోయే దివ్యరాత్రి అని తెలిపారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, ఓబులేశు, బ్రహ్మకుమారీ ప్రదీప్ అక్కయ్య, ఈశ్వరి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

జెండా ఎగురవేసిన బ్రహ్మకుమారీలు

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్‌డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం. ✆ 7382114647.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి పెట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K to 20K. ✆ 96404 00073, 98485 71888.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. శ్రీ విజయ రాఘవేంద్ర ఎంటర్‌ప్రైజస్ (Microtech Solar Distributor) కడప మరియు ప్రొద్దుటూరు. సెల్: 90327 22205, 91211 96955.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 330/- మాత్రమే

Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

రాజంపేట

•రాజంపేట • బద్వేలు

చెత్తశుద్ధి ఏదీ?

పోరుమామిళ్ల మండలంలోని టేకూరుపేటలో ప్రధాన రహదారి పక్కనే చెత్త పోస్తున్నారు. దుకాణ నిర్వాహకులు అధికంగా వ్యర్థాలను రహదారి పక్కనే ఉన్న బావిలో పోస్తున్నారు. రహదారిపై ఉన్న చెత్త గాలివీచినప్పుడు చెల్లాచెదురుగా పడుతోంది. ఈ మార్గంలో అధికంగా వాహన రాకపోకలు సాగిస్తున్నారు. వ్యర్థాలను బావిలో వేయడం వలన దుర్వాసన వస్తోంది. పంచాయతీ అధికారులు స్పందించి చెత్త ఇక్కడ పోయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పోరుమామిళ్ల

అధ్వానం.. సూచిక ఫలకం

సిద్దవటం మండలం మూలపల్లెలో గ్రామం పేరు సూచించే ఫలకం అధ్వానంగా మారింది. గ్రామ సమీపంలోని మలుపులో ఈ సూచిక ఫలకాన్ని కొన్నేళ్ల కిందట ఆర్‌అండ్‌బి అధికారులు ఏర్పాటు చేశారు. క్రమంగా దెబ్బతిని శిథిలమైంది. కొంతకాలం కిందట ఈ ఫలకాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఫలకం అంతా రంగు, గ్రామ పేరు తొలగిపోయి దారుణంగా దర్శనమిస్తోంది. ఈ రహదారి మీదుగా సిద్దవటం, అట్లూరు, బద్వేలుకు చెందిన వాహన రాకపోకలు సాగిస్తున్నారు. సూచిక ఫలకం శిథిలమై ఉండడంతో పలువురు చోదకులు పెదవివిరుస్తున్నారు. వెంటనే కొత్త ఫలకం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, సిద్దవటం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
బద్వేలు గ్రామీణ : 8008573493

?: వీరబల్లి మండలం సానిపాయి కొత్తపేటలో పేరుకున్న చెత్తను తొలగించాలి. పారిశుద్ధ్య చర్యలపై పంచాయతీ సిబ్బంది దృష్టిపెట్టలేదు. అధికారులు దృష్టిసారించి శుభ్రం చేయించాలి. -నలిరామ్మోహన్, సానిపాయి

✓: పంచాయతీ క్లాప్ మిత్రులను క్షేత్రస్థాయిలోకి పంపి సమస్య లేకుండా శుభ్రం చేయిస్తాం. -జవహర్‌బాబు, వీరబల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, -న్యూస్‌టుడే, వీరబల్లి

నేడు దిగవపల్లిలో తెప్పోత్సవం

సుండుపల్లి: వీరబయ్యగారిపల్లి (దిగవపల్లి) సమీపంలోని ప్రసన్న సిద్దేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు త్రిశూల స్నానం, 5 గంటల నుంచి పుష్కరిణిలో ప్రసన్న సిద్దేశ్వరస్వామి తెప్పోత్సవం వేడుకగా జరుగుతుంది. ఈమేరకు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

చెన్నకేశవస్వామి తిరునాల.: సుండుపల్లి-సానిపాయి మార్గం ఉప్పరపల్లి సమీపంలోని చెన్నకేశవస్వామి తిరునాల సోమవారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వాములకు అభిషేకం, పూజలు, రాత్రి చాందినీబండ్ల తిరునాల ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం అలంకృత భక్తుల బోనాలు సమర్పిస్తారని ప్రజలు పాల్గొనాలని కోరారు.

చేనేతలను ఆదుకోవాలని వినతి

ప్రొద్దుటూరు: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు తీవ్ర అన్యాయం జరిగిందని స్వర్ణ భారత్ ప్రజా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. దశరథరామయ్య పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు గతేడాది చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు రూ.25 వేలు ఇవ్వలేదన్నారు.

కాశినాయన: గంగాపల్లెలో శివపార్వతుల కల్యాణం

అట్లూరు: భీమేశ్వరాలయంలో ప్రత్యేకాలంకరణ..

సుండుపల్లి: విరూపాక్షాలయంలో కల్యాణానికి హాజరైన భక్తులు

రాజంపేట: వెంకటరాజంపేటలో శివ పార్వతుల కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

శంభో శంకర హరోంహర

కలసపాడు: తెల్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

సిద్దవటం: నిత్యపూజాస్వామికోనలో కాలు విరిగిన భక్తుడిని మోసుకొస్తున్న అటవీ సిబ్బంది

మహాశివరాత్రి సందర్భంగా బద్వేలు, రాజంపేటలోని పట్టణాలు, గ్రామాల్లోని శివాలయాలు ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా శివ నామస్మరణతో మార్మోగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు, అభిషేకాలు, అర్చనలు, అమ్మవారి దర్శనాలు చేసుకున్నారు. లంకమల అభయారణ్యంలోని నిత్యపూజాస్వామికోనకు భారీగా భక్త జనం తరలిరావడంతో లంకమల పోటెత్తింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన భక్తులు సైతం తరలిరావడం విశేషం. రాజంపేట ఏఎస్పీ రామనాథ్ హెగ్డే, సబ్ కలెక్టర్ భావన పర్యవేక్షించారు. దారిపొడవునా దాతలు అన్నదానాలు, నీటి, మజ్జిగ, శీతల పానీయాలు, మరికొన్ని ఆహార పదార్థాల వసతి కల్పించారు. కొందరు ముస్లిమ్ భక్తులు కూడ నిత్యపూజస్వామి కోవెలకు విచ్చేయడం విశేషం. హత్యరాల త్రేతేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు నంది వాహనంపై దర్శనమిచ్చారు. -న్యూస్‌టుడే, క్లస్టర్ బృందం

రాజంపేట: భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి

బద్వేలు: లంకమల్లేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న తెదేపా ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి దంపతులు

కమనీయం.. వీరబ్రహ్మేంద్రుని కల్యాణోత్సవం

● తరలివచ్చిన భక్తజనం, ఆకట్టుకున్న కోలాటం

కొలువైన వీరబ్రహ్మేంద్రస్వామి స్వామి, అమ్మవారు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణంలోని పాతబస్టాండు కూడలిలో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణ క్రతువు వేడుకగా జరిగింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణం, ఎదురుకోళ్ల నృత్యం, ముత్యాల తలంబ్రాల వేడుకను కనులారా తిలకించారు. తొలుత ధ్వజస్తంభ పూజ, గణపతి పూజలు జరిగాయి. హోమాలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు తీర్థ, అన్నప్రసాదాలను ఉత్సవ నిర్వాహకులు అందజేశారు. స్వామివారి కల్యాణోత్సవ సందర్భంగా బాలికలు, మహిళలు వేసిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పోరుమామిళ్లలో శస్త్రచికిత్సలు ప్రారంభం

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: పోరుమామిళ్ల వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించడం లేదని గత నెల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు ఏర్పడిన సమస్యలపై కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఆసుపత్రి పర్యవేక్షకుడు శివకృష్ణ స్పందించారు. శస్త్రచికిత్సల గదిని వినియోగంలోకి తీసుకువచ్చారు. స్త్రీవ్యాధి నిపుణులతో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలను ప్రారంభించారు. అవసరమైన మహిళలు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు అవసరమైన వారు ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు.

భాజపా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలి నియామకం

ఖాజీపేట: భాజపా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మండలంలోని జీసీ కాలనీకి చెందిన **లక్ష్మీదేవి** ఆదివారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారానికి పోరాటతానని స్పష్టం చేశారు.

గ్రంథాలయాలకు నిధులు కేటాయించాలి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: గ్రంథాలయాలకు సరిపడే నిధులను ప్రభుత్వం కేటాయించాలని రాష్ట్ర గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జి ఆదివారం తెలిపారు. 2026-27 ఆర్థిక ఏడాదికి సంబంధించి గ్రంథాలయాల శాఖకు కేటాయించిన నిధులలో ఉద్యోగులకు సంబంధించిన జీతాలు, ఉద్యోగుల పదవీ విరమణకు చెల్లించాల్సిన ప్రయోజనాలకు రూ.150 కోట్ల అవసరం కాగా కేవలం రూ.36.30 కోట్లు మాత్రమే కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

సేవా కార్యక్రమాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

చక్రాయపేట,(వేంపల్లె): మహా శివరాత్రి పండగ పురస్కరించుకుని ఆదివారం 11, 15 ఎన్ఎస్ఎస్ యూనిట్ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారని యూనిట్ అధికారి గోవర్ధన్ తెలిపారు. విద్యార్థులు గండిక్షేత్రం, వెంకటేశ్వర, రాచరాయస్వామి ఆలయంలో సేవలు అందించినట్లు వివరించారు. సుబ్బరాయుడు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయించక పోవడం సిగ్గుచేటు

చక్రాయపేట,(వేంపల్లె), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమకు ఎటువంటి బడ్జెట్ కేటాయించక పోవడం సిగ్గుచేటని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అమరావతిపై ఉన్న శ్రద్ధ రాయలసీమపై లేదని ఆరోపించారు. ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఉక్కు పరిశ్రమపై బడ్జెట్ సమావేశంలో మాట్లాడక పోవడం దారుణమని విమర్శించారు.

వ్యసనాలకు బానిసై.. చోరీ కేసులో ఇద్దరి మైనర్ల అరెస్ట్

సుండుపల్లి, న్యూస్‌టుడే: విద్యా నిలయాలకు వెళ్లకుండా మద్యం, పొగ తాగేందుకు బానిసలై ఇద్దరు మైనర్లు దొంగతనాల బాటపట్టి పోలీసులకు చిక్కి కటకటాల పాలైన వైనం సుండుపల్లి మండలంలో చోటు చేసుకొంది. ముడుంపాడు గ్రామం రెడ్డివారిపల్లిలో గత నెలలో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి కుక్కలు పసిగట్టకుండా జాగ్రత్తపడ్డారు. ఇంట్లోని ఇనుపపెట్టెను గడ్డపారతో పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు తమ విచారణలో నేరస్థులు బాలలే అని తెలిసి నిర్ఘాంతపోయారు. పెద్దినేనికాలువ, ముడుంపాడు గ్రామాల్లో కూడా పలు చోరీలు వెలుగు చూశాయి. గత ఆగస్టు నుంచి పాఠశాలకు వెళ్లడంలేదని మూడు రోజుల కిందట గుర్తించి బాలల పరిశీలన గృహానికి తరలించారు.

CHANGE OF NAME
I, ASIM KUMAR RAY, S/o HEMCHANDRA ROY (Old Name), resident of D.No.215, Arogyapuram, Gopavaram Mandal, Badvel, Y.S.R. Kadapa District, A.P., Pin-516227. hereby declare that I have change my name as ASIM KUMAR ROY, S/o ASIM HEM CHANDRA ROY (New Name).

II వేల ఎకరాలకు ఆయకట్టు..
దిగువ సగిలేరు ప్రాజెక్టు

● రెండు నియోజకవర్గాల్లోని 36 చెరువులకు నీరు

-న్యూస్‌టుడే, బద్వేలు

కాశినాయన మండలం వంకమర్రిలోని సగిలేరు నదిపై నిర్మించిన వడ్డమాని చిదానందం దిగువ సగిలేరు ప్రాజెక్టుకు 71 ఏళ్లు పూర్తయ్యాయి. అప్పటి మదరాసు రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ ఉన్న కాలంలో 1954 మార్చి 9న ప్రస్తుత బద్వేలు మాజీ ఎమ్మెల్యే వడ్డమాని డాక్టర్ శివరామకృష్ణారావు తండ్రి అప్పటి ఎమ్మెల్యే వడ్డమాని చిదానందం ఈ నియోజకవర్గ క్షామ పీడిత రైతుల కోసం రూ.51 లక్షల వ్యయంతో నిర్మించారు. అప్పటి మదరాసు ముఖ్యమంత్రి కామరాజ్ చేతుల మీదుగా ఈ జలాశయాన్ని ప్రారంభించారు. ఒక టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యంతో సుమారు 11 వేలు ఎకరాల ఆయకట్టుకు ఈ జలాశయం సాగునీటిని అందిస్తోంది. మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని 36 లింకు చెరువులకు నీరు చేరుతోంది. 2009లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఈ జలాశయం నిర్మాణానికి కృషిచేసిన అప్పటి ఎమ్మెల్యే వడ్డమాని చిదానందం పేరును పెట్టారు.



కాశినాయన మండలం వంకమర్రి సగలేరు నదిపై నిర్మించిన ప్రాజెక్టు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

కలసపాడు, న్యూస్‌టుడే: అడవికి నిప్పు పెట్టవద్దని అడవులను కాపాడుకొనే బాధ్యత ప్రతిఒక్కరిదని ప్రజలందరూ సహకరించాలని అటవీ సెక్షన్ అధికారి రమణయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని ఎగువరామాపురంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెక్షన్ అధికారి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యంలో భాగంగా వృక్ష సముదాయాంతోపాటుగా వన్యప్రాణులు నిర్దేశిత సంఖ్యలో తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏదేని కారణాల వల్ల ఇవి అడవి ప్రాంతాలను వదిలి సమీప గ్రామ జనావాసాల్లోకి వచ్చినా వాటిని గుర్తించిన వెంటనే సంబంధిత పరిధికి చెందిన అటవీ, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కొందరు అక్రమార్కులు ప్రభుత్వం కళ్లుకప్పి అడవి ప్రాంతాల్లో నిప్పు పెడితే ఆ సమాచారం అందుకున్న ప్రజానీకం తమకు తెలియజేయాలని కోరారు. అరుదైన వక్ష సంపదను కాల్చి వేయడం వల్ల ఆ మంటలు అంతటా ఆవిరిస్తాయని ఫలితంగా వన్యప్రాణులు సజీవ దహనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. గొర్రెలు, పశువుల కాపరులు నిత్యం అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని అన్నారు. ఎఫ్‌బీవో హసాన్‌బాషా, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారి రమణయ్య

ఉపాధి శిక్షణ..
భవితకు నిచ్చెన

శిక్షణ పొందుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: బాలికలకు పాఠశాల స్థాయి నుంచే ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వారి ఉపాధికి ఉపయోగపడేలా ఉచితంగా కుట్టుతోపాటు పలు అంశాలపై శిక్షణ ఇచ్చి.. ధ్రువీకరణ పత్రాలు అందిస్తోంది. అవి వారికి ఎంతో ఉపయోగకరం కానున్నాయి. జిల్లాలో 17 కేజీబీవీలు ఉండగా.. ప్రస్తుతం 8 పాఠశాలలో తొమ్మిది, పది, ఇంటర్ చదివే బాలికలకు శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో పాఠశాలలో ఏటా సుమారు 150 మంది శిక్షణను పూర్తి చేసుకుంటున్నారు. టైలరింగ్ మిషన్ పార్ట్, కుట్టు శిక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం ప్రాక్టికల్స్ నిర్వహించి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

పెయింటింగ్ నేర్చుకున్నా

బద్వేలు నుంచి పోరుమామిళ్ల కేజీబీవీలో చేరాను. ఇక్కడ తొమ్మిదో తరగతి నుంచి కుట్టుమిషన్, చీరలపై రంగులు వేయడం నేర్పించారు. నెల రోజుల్లో నేర్చుకున్నా. ఒకే రోజులో చీరకు పెయింటింగ్ వేసేస్తున్నా. శిక్షణ తీసుకోవడం సంతోషంగా ఉంది. పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. మాకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. - లక్ష్మీప్రసన్న, పదో తరగతి, బద్వేలు

బాలికలకు మంచి అవకాశం

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో బాలికల అభివృద్ధి కోసం కుట్టుమిషన్ నేర్పిస్తున్నారు. రెండు ఏళ్ల శిక్షణ తీసుకుంటే స్వయం ఉపాధిని పొందవచ్చు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం ఇస్తున్నారు. - గురుప్రసన్న, పదోతరగతి, గురప్పగారిపల్లి

శిక్షణ ఎంతో ఉపయోగం

మా పాఠశాలలోనే రోజూ కొంత సమయం కుట్టు మిషన్ నేర్చుకునేందుకు కేటాయిస్తున్నా. క్రమం తప్పకుండా శిక్షణకు హాజరవుతున్నా. మా దుస్తులు మేమే కుట్టుకుంటున్నాం. ఇటీవల బేబీ ఫ్రాక్ కుట్టాను. భవిషత్తులో స్వయం ఉపాధి పొందవచ్చు. - రాజ్యలక్ష్మి, గురప్పగారిపల్లి, పదో తరగతి

డయాలసిస్ కేంద్రంలో జనరేటర్ ఏర్పాటు

డయాలసిస్ కేంద్రంలో ఏర్పాటైన జనరేటర్

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు డయాలసిస్ కేంద్రానికి ప్రత్యేకంగా జనరేటర్ ఏర్పాటైంది. గతంలో విద్యుత్తు సరఫరా అంతరాయం కల్గిన సమయంలో ప్రభుత్వ ఆసుపత్రి జనరేటర్ బోరు మోటారు వినియోగించుకునేవారు. గత ఏడాది 2025 నవంబరు 15వ తేదీన 'మూత్రగండం గట్టెక్కని జనం' అన్న శీర్షికన 'ఈనాడు'లో కథనం వచ్చింది. బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా స్పందించారు. బెల్ కంపెనీ నుంచి రూ.6 లక్షల విలువైన జనరేటర్ ఏర్పాటు చేశారు. ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. బోరు మోటారు కూడా ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. గతంలో ఈ కేంద్రంలో ఈ సదుపాయలు లేవని బద్వేలు ప్రభుత్వాసుపత్రిపై ఆధార పడాల్సి వస్తోందని ఇక్కడి ఇబ్బందులను విశ్లేషిస్తూ కథనం వచ్చింది. ఎమ్మెల్యే డాక్టర్ సుధా చొరవ తీసుకొని సౌకర్యాల మెరుగుకు కృషి చేశారు.

తైక్వాండో పోటీల్లో సత్తా

జమ్మలమడుగు: నంద్యాలలో జరిగిన రాయలసీమ స్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో జమ్మలమడుగు క్రీడాకారులు సత్తా చాటారు. శని, ఆదివారాలు రెండు రోజులపాటు ఈ పోటీలు జరిగినట్లు మాస్టర్ రంగస్వామి తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు నాలుగు బంగారు, నాలుగు వెండి, ఒక కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు.

పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

హత్యరాల భక్తులకు వైద్య సేవలు

రాజంపేట గ్రామీణ: మహా శివ రాత్రి సందర్భంగా ఆదివారం భక్తులు హత్యరాలలో కిక్కిరిశారు. స్వామి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న మహిళలు కింద పడిపోవడంతో డాక్టర్ బ్రహ్మేంద్ర, సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఉదయం నుంచి క్యూలైన్‌లో ఇబ్బందులు పడిన నలుగురికి వైద్యం అందించినట్లు తెలిపారు.

జాతీయ కవి సమ్మేళనం నేడు

బ్రహ్మంగారిమఠం: జాతీయ మహాకవి సమ్మేళనం సోమవారం మండల పరిదిలోని తోట్లపల్లె అచలానంద ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు బొల్లు రామమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి, ఎమ్మెల్యేలు, ఈశ్వరీదేవి మఠాధిపతి వీర శివకుమార స్వామి హాజరు కానున్నారని వివరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

నిత్యపూజకోనలో స్తంభించిన రాకపోకలు

నీటి గుండం సమీపంలో ముందుకు వెళ్లలేక ప్రజల ఇబ్బందులు

-న్యూస్‌టుడే, సిద్దవటం

కొండతాపలపై భక్తులకు తీవ్ర ఇక్కట్లు

జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన సిద్దవటం మండలంలోని నిత్యపూజస్వామికోనలో ఈ దఫా కూడా భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. నీటి గుండం సమీపంలోని కొండ తాపలపై భక్తుల రద్దీ విపరీతంగా పెరిగి సుమారు గంటన్నర పాటు భక్తుల రాకపోకలు స్తంభించాయి. ప్రతి ఏడాది నిత్యపూజస్వామి శివరాత్రి ఉత్సవాలకు లక్ష మందికి పైగా భక్తులు రావడం విధితమే. ఈ దఫా ఊహించని విధంగా అంతకు మించి భక్తులు రావడంతో లంకమల అభయారణ్యం కిక్కిరిసింది. గత ఏడాది ఉత్సవాల్లో కొండలోయలో దారిపై పెద్ద గుండరాళ్లు అడ్డంగా ఉండడం వల్ల భక్తుల రద్దీ పెరిగి సుమారు మూడు నుంచి నాలుగు గంటల వరకు భక్తుల రాకపోకలు స్తంభించడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఈ ఏడాది ఉత్సవాలకు భక్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని అందరు భావించారు. అయితే దేవదాయశాఖ అధికారులు మేల్కొని గత ఏడాది సమస్యలు పునరావృతం గాకుండా మందస్తుగా కొండలోయలో పెద్దబండరాళ్లను నివారించే పనులు చేపట్టారు. గత ఏడాది కంటే ఈ ఏటా ఎక్కువ మంది భక్తులు రావడంతో లంకమల హోరెత్తింది. ప్రతి ఏడాది ఏదో ఒక ప్రదేశంలో భక్తుల రాకపోకలు నిలిచిపోయి గంటల తరబడి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఎదురవుతూనే ఉన్నాయి. ఈ ఏడాది నీటి గుండం సమీపంలో కొండ తాపలు మలుపు తిరిగి ఇరుకుమయంగా ఉండడం వల్ల ఈ ప్రదేశంలో పాదరక్షల బాడుగ కోసం కూలీలు తాపలపై కూర్చొని ఉండడం. పక్కనే తలనీలాలు, పోగుల పనులు చేపట్టడం వల్ల ఇక్కడ భక్తుల రద్దీ విపరీతంగా పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు గంటన్నర పాటు ఎక్కడి భక్తులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో పిల్లలు, వృద్ధులు పడ్డ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. తదనంతరం పోలీసులు నివారణ చర్యలు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ దఫా ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం అయిదున్నర గంటల వరకు దైవ దర్శనం కోసం భక్తులు భారీగా బారులు తీరి నిరీక్షించారు.

ENDOWMENTS DEPARTMENT
Sri Yellamma Devatha Temple
Diguvarajupalli (V), Veeraballi (M), Annamayya District.
e-Procurement Tender
NIT.No.P/1112/2023-51, Dt : 16.10.2023
E-Tenders are invited through the e-Procurement portal for **Construction of Compound Wall around the Temple.** Interested bidders may visit the official website **www.apeprocurement.gov.in** for detailed information, eligibility criteria and submission guidelines.
Trustee

శిథిలం.. పశువైద్య భవనం

-న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

అధికారులకు రైతులు సమస్యలపై ఏకరవు

నరసన్నగారిపల్లెలో దెబ్బతిన్న గ్రామీణ పశువైద్యశాల

ఒంటిమిట్ట మండలంలోని పెన్నపేరూరు, గొల్లపల్లి పంచాయతీలోని పాడి రైతులు, జీవాల పోషకులకు సేవలు అందించడానికి నరసన్నగారిపల్లెలో మూడున్నర దశాబ్దాల కిందట గ్రామీణ పశువైద్యశాలను ఏర్పాటు చేశారు. ఈ భవనాన్ని 1988 ఫిబ్రవరి 15న ప్రారంభించారు. కొన్నేళ్లపాటు పశు పోషకులకు ఆసరాగా నిలిచి సేవలందించింది. ప్రస్తుతం ఈ భవనం కూలిపోయే దశకు చేరింది. బాగు చేయడానికి ఎవరు చొరవ తీసుకోవడం లేదు. గోడలు నెర్రెలిచ్చాయి. పైకప్పు దెబ్బతింది. కిటికీలు, తలుపులు విరిగిపోయాయి. ఇక్కడ విధులు నిర్వర్తించాలంటే పనిచేస్తున్న సిబ్బంది భయపడి ఇటువైపు రావడం లేదు. కొన్నేళ్లుగా ఆలనపాలనా లేదు. గోడలపై మొక్కలు మొలకెత్తాయి. ప్రమాదకరంగా మారి కూలిపోయే దశకు చేరింది. అయినా మరమ్మతులు చేయలేదు. ప్రత్యామ్నాయంగా కొత్త భవనాన్ని నిర్మించలేదు. వ్యాధులు సోకిన ఆవులు, ఎద్దులు, గేదెలకు వైద్యం అందించడానికి ఒక బోను కూడా అమర్చారు. ఇది వాడకంలో లేదు. నిరుపయోగంగా దర్శనమిస్తుంది. నూతన భవనాన్ని నిర్మించాలని ఎన్నిసార్లు పశువైద్యశాఖ అధికారులకు ఏకరవు పెట్టినా ఎలాంటి ఫలితం లేదని ఈ ప్రాంత పోషకులు వాపోతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనంపై ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ఉమా తెలిపారు.

17న డిమాండ్ల సాధనకు చలో విజయవాడ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ), బకాయిపడిన కరవు భత్యం, డిమాండ్ల సాధనకు ఈ నెల 17న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రణభేరి 2.0 సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. పాత పీఆర్సీ గడువు పూర్తయి రెండేళ్లు దాటినా కొత్త కమిషన్‌ను నియమించకపోవడం బాధాకరమన్నారు. ఈ జాప్యం జీత భత్యాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నాలుగు విడతల కరవు భత్యం చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఓబులేసు, మల్లికార్జున, మహమ్మద్ రఫీ, శివశంకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు



ఉపాధ్యాయ వృత్తిలో ఎందరికో బంగారు భవిష్యత్తును అందించి, కుటుంబ ఉన్నతికై నిరంతరం శ్రమించి అందరికీ ఆదర్శంగా నిలిచిన శ్రీ కూండ్ల ఓబుల్‌రెడ్డి గారు 15.2.2026 మహాశివరాత్రి రోజున స్వర్గస్థులైనారు.

శ్రీ కూండ్ల ఓబుల్‌రెడ్డి గారు
రిటైర్డ్ హెడ్ మాస్టర్
నలంద స్కూల్ దగ్గర, మెహర్‌బాబా నగర్, రాజంపేట.
జననం: 1.7.1944 మరణం: 15.2.2026

వారి అంత్యక్రియలు
16.2.2026వ తేదీ సోమవారం ఉ॥ 9:15 ని॥లకు రాజంపేట టౌన్, మెహర్‌బాబా నగర్‌లోని మా స్వగృహము నుండి జరుపబడును. కావున అందరికీ తెలపడమైనది.

ఇట్లు:
భార్య: కూండ్ల వెంకటసుబ్బమ్మ, మునిసిపల్ మాజీ కౌన్సిలర్
కుమారుడు: కూండ్ల వెంకటరమణారెడ్డి, మునిసిపల్ కౌన్సిలర్
కోడలు: శ్రీమతి కూండ్ల మాధవి
మనుమరాళ్ళు: కూండ్ల నివేదిత, కూండ్ల చిద్విత.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • మైదుకూరు

ప్రమాద రహితం.. వారి అభిమతం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: రహదారిపై మనం సక్రమంగా వెళ్తున్నా ఎదుటి వారు అడ్డదిడ్డంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతుంటారు. అయితే ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోనకు చెందిన 5 మంది చోదకులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ ప్రయాణికులను గమ్య స్థానాలను సురక్షితంగా చేరుస్తున్నారు. ఇటీవల రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లుగా అవార్డులు అందుకున్నారు. వీరిపై 'న్యూస్‌టుడే' కథనం.

రాష్ట్రస్థాయిలో అవార్డు తీసుకున్నా..

వ్యక్తిగత దీర్ఘమైన ఆలోచనలు పక్కన పెట్టాలి. వాటితో పరధ్యానంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. విధుల్లో హాజరు కాగానే అన్ని సమస్యలు మరిచిపోతా. విధి నిర్వహణ పైనే దృష్టి సారించి 35 ఏళ్లుగా బస్సు నడుపుతున్నాను. రాష్ట్ర స్థాయిలో అవార్డు తీసుకున్నాను. **-వి.ప్రసాద్**

ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లుగా గుర్తింపు

చరవాణికి దూరంగా ఉంటా

విధి నిర్వహణలో ఉన్నప్పుడు చరవాణికి దూరంగా ఉంటాను. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడానికి కృషి చేస్తాను. 32 ఏళ్ల అనుభవం ఉంది. డిపో స్థాయిలో అవార్డు అందుకున్నాను. **- శ్రీనివాస్‌కుమార్**

ప్రయాణికుల భద్రత బాధ్యత

ఆర్టీసీ ప్రయాణికుల భద్రత చోదకుల బాధ్యతగా భావిస్తా. వారు సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడమే నా లక్ష్యం. 32 ఏళ్ల సర్వీసులో సమస్యలకు తావులేకుండా సేవలందిస్తున్నా. డిపో స్థాయిలో అవార్డు తీసుకున్నా. **- అయ్యవారప్ప**

అతివేగమే కారణం

అతివేగమే ఎక్కువ శాతం ప్రమాదాలకు కారణం. నిర్ణీత వేగంతో బస్సు నడుపుతాను. ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా అదుపు చేసుకోవచ్చు. నా 31 ఏళ్ల సర్వీసులో ఎలాంటి ప్రమాదం జరగలేదు. డిపో స్థాయిలో అవార్డు తీసుకున్నా. **- వెంకటసాయినాథ్‌రెడ్డి**

ముఖ్యమైన భాగాలు సరిచూసుకుంటా : విధుల్లోకి రాగానే బస్సు ముఖ్యమైన భాగాలు సరిచూసుకుంటాను. బ్రేక్, క్లచ్, హారన్, స్టీరింగ్, చక్రాలు తదితర భాగాలను పరిశీలించాక నడపడం ప్రారంభిస్తాను. 33 ఏళ్ల సర్వీసులో ఎలాంటి ప్రమాదం చేయలేదు. జోనల్ స్థాయిలో అవార్డు తీసుకున్నాను. **- చంద్ర ఓబుల్‌రెడ్డి**

కూలీలు.. ప్రాణాలంటే లెక్కలేదా!

చేతికొచ్చిన పంటను మార్కెట్‌కు తరలించే క్రమంలో అదే వాహనంలో బస్తా సంచులపై కూర్చుని కూలీలు ప్రమాదకరంగా వెళ్తున్నారు. వాహన చోదకుడు అప్రమత్తంగా లేకుంటే వీరి ప్రాణాలకే ముప్పు పొంచి ఉంది. కొండాపురంలోని జాతీయ రహదారిపై ఒక్కి పంట తీసుకెళ్తున్న వాహనంపై మహిళా కూలీలు ప్రమాదకరంగా వెళ్తున్న దృశ్యం 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది. **- న్యూస్‌టుడే, కొండాపురం**

హరహర మహాదేవ.. శంభో శంకర

మైలవరం: గండికోట రాజరాజేశ్వరి అమ్మవారు

రాజుపాళెం: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జమ్మలమడుగు: స్వర్ణ శివలింగాలు

ఖాజీపేట: నాగ నాథేశ్వర స్వామి

అల్లాడుపల్లెలో నంది వాహనంపై వీరభద్రస్వామి

మహాశివరాత్రి సందర్భంగా ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. శివపార్వతులకు కల్యాణం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. బండలాగుడు ప్రదర్శన నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. **- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు క్లస్టర్ బృందం**

బి.మఠం: వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు

మైదుకూరు: భీమేశ్వరస్వామి

కన్యతీర్థంలో శివపార్వతుల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరులో కల్యాణానికి హాజరైన భక్తులు

మైదుకూరు : భీమేశ్వరస్వామి కల్యాణానికి హాజరైన భక్తులు

నూతన మసీదు ప్రారంభం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మసీదును షేక్ సంక్షేమ, అభివృద్ధి సొసైటీ ఛైర్మన్ ముక్తియార్ అధ్యక్షతన ఆదివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఏపీసీ విభుకృష్ణ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌నాయుడు హాజరయ్యారు. వారిని ముక్తియార్ సత్కరించారు.

ఏపీసీ విభుకృష్ణను సత్కరిస్తున్న ముక్తియార్, కమిటీ నాయకులు

పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

తైక్వాండో పోటీల్లో సత్తా

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: నంద్యాలలో జరిగిన రాయలసీమ స్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో జమ్మలమడుగు క్రీడాకారులు సత్తా చాటారు. శని, ఆదివారాలు రెండు రోజులపాటు ఈ పోటీలు జరిగినట్లు మాస్టర్ రంగస్వామి తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు నాలుగు బంగారు, నాలుగు వెండి, ఒక కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు.

జాతీయ కవి సమ్మేళనం నేడు

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: జాతీయ మహాకవి సమ్మేళనం సోమవారం మండల పరిధిలోని తోట్లపల్లె అలకనంద ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు బొల్లు రామమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అలకనంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి, ఎమ్మెల్యేలు సుధాకర్‌యాదవ్, దాసరిసుధ, మాజీ ఎంపీ తులసి రెడ్డి, ఈశ్వరీదేవి మఠాధిపతి వీర శివకుమారస్వామి హాజరు కానున్నారని వివరించారు.

విద్యార్థినులు.. క్రీడల్లో చిచ్చర పిడుగులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం పాత మార్కెట్ వీధిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు బేస్‌బాల్‌లో సత్తా చాటుతున్నారు. ఏడో తరగతి చదువుతన్న షఫియా, మౌనికలు చదువుతో పాటు క్రీడల్లో శిక్షణ తీసుకుంటూ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ చాటి పతకాలు సాధించారు

• పట్టణంలోని అమృత్ నగర్‌కు చెందిన **షఫియా** తండ్రి నాయబ్‌రసూల్ బేల్దారి, తల్లి జబీనా గృహిణి. రాయచోటిలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించింది. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని షఫియా చెబుతోంది.

• పెన్నానగర్‌కు చెందిన **మౌనిక** తండ్రి రమేష్ సిమెంటు ఇటుకల తయారీదారుడు. అమ్మ దేవి టైలర్. పాఠశాలలో బేస్ బాల్ ఆటను నేర్చుకుంది. రాయచోటిలో జరిగిన అండర్-14 జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని సాధించింది. దేశస్థాయిలో సత్తా చాటడమే తన లక్ష్యమని మౌనిక చెబుతోంది.

చేనేతలను ఆదుకోవాలని వినతి

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు తీవ్ర అన్యాయం జరిగిందని స్వర్ణ భారత్ ప్రజా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. దశరథరామయ్య పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు గతేడాది చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు రూ.25 వేలు ఇస్తామని చెప్పినా ఇంతవరకు హామీ అమలు కాలేదన్నారు. చేనేతలను ఆదుకోవాలని కోరారు.

సారూ.. బస్సు షెల్టర్ నిర్మించండి

కొండాపురంలోని ఎస్‌బీఐ సర్కిల్ వద్ద బస్సు షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో ఎండుతూ వానలో తడుస్తూ బస్సుల కోసం ఎదురుచూపులు చూడక తప్పడం లేదు. వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం ఈ కూడలి నుంచి అధిక మంది ప్రయాణాలు చేస్తుంటారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో రోడ్డు పైనే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కొండాపురం**

చేతిపంపు.. మరమ్మతులకు ఎదురుచూపు

పెద్దముడియం మండల పరిధిలోని చిన్నముడియం అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురైంది. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు బోరును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో శంషాద్‌భాను మాట్లాడుతూ చేతిపంపునకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, పెద్దముడియం**

గుంత.. వాహనదారులకు చింత

జమ్మలమడుగు పట్టణంలోని డొంకా వీధిలో ప్రధాన రహదారిపై గుంత ప్రమాదకరంగా మారింది. ఈ దారిలోనే నిత్యం పాఠశాల విద్యార్థులు, వృద్ధులు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతను గమనించకుంటే ప్రమాదాల బారిన పడే అవకాశముంది. ఇప్పటికే చాలా మంది సైకిల్, ద్విచక్ర వాహనాల్లో వెళ్తూ ఇందులో పడి గాయాలపాలయ్యారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

చలికి జాగ్రత్త సరే.. తలకేదీ రక్షణ

చలిలో ప్రయాణం కష్టం. కొందరు స్వెట్టర్ ధరిస్తుంటారు. మరికొందరు చెవులు, ముక్కు, తలకు రుమాలు చుట్టుకుని ప్రయాణిస్తుంటారు. కానీ ప్రమాదాలు జరగకుండా శిరస్త్రాణం ధరించాలనే ఆలోచన చోదకుల్లో రావడం లేదు. ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యంగా ప్రయాణిస్తున్నారు. మైదుకూరు జాతీయ రహదారిపై శిరస్త్రాణం లేకుండా స్వెట్టర్ ధరించి ప్రయాణిస్తున్న చోదకుడి చిత్రాన్ని న్యూస్‌టుడే క్లిక్‌మనిపించింది. **- న్యూస్‌టుడే, మైదుకూరు**

మరుగుదొడ్డి నిరుపయోగం

నంగనూరుపల్లెలో రూ.3 లక్షలు వెచ్చించి సామాజిక పారిశుద్ధ్య సముదాయ భవనాన్ని నిర్మించారు. ఒకే గది లోనే స్నానం, మల, మూత్ర విసర్జనకు మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. అయితే వాటికి నీటి సౌకర్యం కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారింది. అత్యవసరమైతే వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని పశు వైద్య, రైతు సేవా, గ్రామీణ వైద్యశాల కార్యాలయాల సిబ్బంది కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు**

గ్రంథాలయాలకు నిధులు కేటాయించాలి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: గ్రంథాలయాలకు సరిపడే నిధులను ప్రభుత్వం కేటాయించాలని రాష్ట్ర గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జి ఆదివారం తెలిపారు. 202627 ఆర్థిక ఏడాదికి సంబంధించి గ్రంథాలయాల శాఖకు కేటాయించిన నిధులలో ఉద్యోగులకు సంబంధించిన జీతాలు, ఉద్యోగుల పదవీ విరమణకు చెల్లించాల్సిన ప్రయోజనాలకు రూ.150 కోట్ల అవసరం కాగా కేవలం రూ.36.30 కోట్లు మాత్రమే కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

వాలిన స్తంభాలు.. వణికిస్తున్నాయ్..!

ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం, కామనూరు, నక్కలదిన్నె, చౌడూరు, కాకిరేనిపల్లె, అమృతానగర్, తదితర గ్రామాల పరిధిలో పంటపొలాలు, రోడ్ల పక్కన విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోవడంతో కూలిపోయే అవకాశం ఉంది. ప్రమాదం జరగకముందే స్తంభాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఈ విషయమై ఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు, రోడ్ల పక్కన ఒరిగిపోతున్న స్తంభాలను సిబ్బంది ద్వారా గుర్తించి మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

డిమాండ్ల సాధనకు చలో విజయవాడ 17న

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ), బకాయిపడిన కరవు భత్యం, డిమాండ్ల సాధనకు ఈ నెల 17న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రణభేరి 2.0 సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. పాత పీఆర్సీ గడువు పూర్తయి రెండేళ్లు దాటినా కొత్త కమిషన్‌ను నియమించకపోవడం బాధాకరమన్నారు. ఈ జాప్యం జీతభత్యాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నాలుగు విడతల కరవు భత్యం చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఓబులేసు, మల్లికార్జున, మహమ్మద్ రఫీ, శివశంకర్ రెడ్డి, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ

మహిళల సమస్యలపై పోరాటం

ఖాజీపేట, న్యూస్‌టుడే: భాజపా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మండలంలోని జీసీ కాలనీకి చెందిన లక్ష్మీదేవి ఆదివారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారానికి పోరాటతానని స్పష్టం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)

ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447

?: ముద్దనూరు మండలం వేల్పుచర్ల సమీపంలోని రహదారికి ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. **- శివ, వేల్పుచర్ల**

✓: రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- ఇంద్రకేశవరెడ్డి, పంచాయితీ కార్యదర్శి**

?: ముద్దనూరు మండలం వేల్పుచర్లలోని పలు కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. **- గంగరాజు, స్థానికుడు**

✓: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- ఇంద్రకేశవరెడ్డి, పంచాయితీ కార్యదర్శి - న్యూస్‌టుడే, ముద్దనూరు

?: గాంధీనగర్‌లో మురుగు కాలువల్లో చేరిన పూడికను తొలగించేలా చర్యలు తీసుకోవాలి. **- షరీఫ్, మైదుకూరు**

✓: పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించేలా చర్యలు తీసుకుంటాం. **- పద్మావతి, పారిశుద్ధ్య విభాగ అధికారి - న్యూస్‌టుడే, మైదుకూరు**

కన్నెలూరులో మురుగు కాలువ నిర్మాణం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు మోటు ప్రాంతంలో చిన్న కాలువల కారణంగా మురుగు నిలిచిపోయేది. గతంలో కాలువలో మునిగి ఓ ఉపాధ్యాయుడు సైతం మృత్యువాత పడిన ఘటన చోటుచేసుకుంది. దీనిపై ఈనాడులో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.20 లక్షలతో కన్నెలూరులోని కోతి సమాధి నుంచి కాలువ నిర్మాణ పనులు చేపట్టినట్లు మున్సిపల్ డీఈ సురేంద్రబాబు తెలిపారు.

ఇనుప గొట్టాలతో ముప్పు

చాపాడు మండలం విశ్వనాథపురం వద్ద హుబ్లీ-కృష్ణపట్నం జాతీయ రహదారి సర్వీసు రోడ్డు పక్కన ఇనుప గొట్టాలు ప్రమాదకరంగా మారాయి. పశువులు, జంతువులు రహదారిపైకి రాకుండా గ్రిల్స్‌ను అమర్చారు. ఇటీవల ఓ లారీ ఢీకొనడంతో గ్రిల్స్ ఒరిగాయి. దీంతో వాహనదారులు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉంది.

- న్యూస్‌టుడే, మైదుకూరు, చాపాడు

దయచేసి వినండి.. సమస్యలు పరిష్కరించండి

జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో అరకొర వసతులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో సమస్యలుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ ప్యాసింజర్, ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్ చప్పట చాలా చోట్ల దెబ్బతింది. ప్రయాణికులు రైలు ఎక్కే హడావుడిలో అదుపు తప్పి కింద పడుతున్నారు. తాగునీటి కుళాయిల కోసం ఏర్పాటు చేసిన నిర్మాణం ధ్వంసమైంది. ఇలా పలు రకాల సమస్యలు స్టేషన్‌లో ఉన్నాయి.

• నంద్యాల-రేణిగుంట, ధర్మవరం-మచిలీపట్నం, గుంటూరు-తిరుపతి ప్యాసింజర్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. పర్వదినాల సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయి. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఇంటర్, బీటెక్ చదువుల కోసం గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు ఇక్కడి నుంచే వెళ్తారు. ఉద్యోగులు, ప్రజలు, రాజకీయ నాయకులు తమ అవసరాల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. మచిలీపట్నంలో వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాల కోసం స్థానికులు ప్రత్యేకంగా ధర్మవరం-మచిలీపట్నం రైలుపై ఆధారపడి ఉన్నారు. అయితే స్టేషన్‌లో మెరుగైన సౌకర్యాలు లేకపోవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

• జమ్మలమడుగు స్టేషన్‌లో కోచ్ డిస్‌ప్లే బోర్డులు, రైలు అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేయాల్సి ఉంది. దెబ్బతిన్న ప్లాట్‌ఫామ్‌కు మరమ్మతులు చేయడంతో పాటు అక్కడక్కడ నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రస్తుతం టిక్కెట్ కౌంటర్ వద్ద మాత్రమే నీటి ట్యాంకు ఉంది. ప్లాట్‌ఫామ్ చివర్లో ఉన్న ప్రయాణికులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో దెబ్బతిన్న ప్లాట్‌ఫామ్

అధ్వానంగా తాగునీటి కుళాయిలు

భక్తులతో కిక్కిరిసిన కడప బస్టాండు ప్రాంగణం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులతో ఆదివారం కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం కిటికిటలాడింది. బస్టాండు మొత్తం శివభక్తులతో రద్దీగా మారింది. కడప డిపో నుంచి పొలతల, నిత్యపూజకోనకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు. జిల్లాలోని శైవక్షేత్రాలన్నింటికీ ఏడు డిపోల పరిధిలో 347 బస్సులు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి బస్సు సర్వీసులను ప్రారంభించారు. బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికులు పరుగులు తీశారు.

పూజారికి గాయాలు

మైదుకూరు : పురపాలక పరిధి చిన్నయ్యగారిపల్లె సమీప ముక్కొండపై వెలసిన ముక్కంటేశ్వరుడికి పూజలు నిర్వహించి దిగివస్తున్న పూజారి వీరాచారి మెట్లపై కిందపడి గాయపడ్డారు. చికిత్స కోసం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

కడప
• కడప • పులివెందుల • కమలాపురం

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

గంగమ్మ దేవత

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు తరలివచ్చి కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలోని వినాయకస్వామి వీరభద్రస్వామి వైద్యనాథీశ్వరుడు ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ పూజలు జరిగాయి.

తైక్వాండో పోటీల్లో సత్తా

జమ్మలమడుగు: నంద్యాలలో జరిగిన రాయలసీమ స్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో జమ్మలమడుగు క్రీడాకారులు సత్తా చాటారు. శని, ఆదివారాలు రెండు రోజులపాటు ఈ పోటీలు జరిగినట్లు మాస్టర్ రంగస్వామి తెలిపారు.

బడ్జెట్ కేటాయించక పోవడం సిగ్గుచేటు

చక్రాయపేట,(వేంపల్లె), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమకు ఎటువంటి బడ్జెట్ కేటాయించక పోవడం సిగ్గుచేటని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అమరావతిపై ఉన్న శ్రద్ధ రాయలసీమపై లేదని ఆరోపించారు. ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఉక్కు పరిశ్రమపై బడ్జెట్ సమావేశంలో మాట్లాడక పోవడం దారుణమని విమర్శించారు.

సేవా కార్యక్రమాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

చక్రాయపేట,(వేంపల్లె), న్యూస్‌టుడే: మహాశివరాత్రి పండగ పురస్కరించుకుని ఆదివారం 11, 15 ఎన్ఎస్ఎస్ యూనిట్ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వివిధ సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నారని యూనిట్ అధికారి గోవర్ధన్ తెలిపారు. విద్యార్థులు గండి క్షేత్రం, వెంకటేశ్వర, రాచరాయస్వామి ఆలయంలో సేవలు అందించినట్లు వివరించారు. సుబ్బరాయుడు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన బస్టాండు ప్రాంగణం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులతో ఆదివారం కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం కిటికిటలాడింది. బస్టాండు మొత్తం శివభక్తులతో రద్దీగా మారింది. కడప డిపో నుంచి పొలతల, నిత్యపూజకోనకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు. జిల్లాలోని శైవక్షేత్రాలన్నింటినీ ఏడు డిపోల పరిధిలో 347 బస్సులు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి బస్సు సర్వీసులను ప్రారంభించారు. బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికులు పరుగులు తీశారు. జిల్లా ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, డిపో మేనేజరు కన్యాకుమారితో పాటు సిబ్బంది, విజిలెన్స్ అధికారులు కూడా విధులు నిర్వహించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బస్సు సర్వీసులు నడిపారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా భక్తులు పెద్ద ఎత్తున శైవక్షేత్రాలకు బయలుదేరారు. సకాలంలో బస్సు సర్వీసులు నడిపారు.

• స్త్రీశక్తి పథకం అమల్లో ఉండటంతో ఎక్కువ మంది మహిళా భక్తులు శైవక్షేత్రాలకు వెళ్లారు. గతం కంటే ఈ ఏడాది అత్యధికంగా మహిళా భక్తులు శైవక్షేత్రాలకు వెళ్లినట్లు అధికారులు చెప్పారు. కడప బస్టాండు ప్రాంగణంలో మొత్తం రద్దీగా మారింది.

బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు

శరణు శరణు శంకర.. శివశంకర

పొలతలలో శివుడి ప్రతిమ వద్ద టెంకాయలు సమర్పిస్తున్న భక్తులు

కమలాపురం: అలంకరణలో పరమశివుడు

మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం కడప, పులివెందుల, కమలాపురంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా నగరంలోని దేవుని కడప సోమేశ్వర ఆలయం, మృత్యుంజయకుంట, పెండ్లిమర్రిలోని పొలతల, పులివెందులలోని పంచాలింగాల కోన, చదిపిరాళ్లలోని అగస్త్యేశ్వర, పుష్పగిరి వైద్యనాథేశ్వర ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు దేవస్థానాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ● సీకేదిన్నె మండలం బయనపల్లె సమీపంలోని బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ క్రతువు వేదపండితుల మధ్య వైభవంగా జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. దాత మహేష్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. **- న్యూస్‌టుడే, కడప క్లస్టర్ బృందం**

పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కుటుంబ సభ్యులు

అమ్మవారిశాలలో శివపార్వతులు

సీకేదిన్నె: బయనపల్లె బుగ్గమల్లేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం

పులివెందుల: వేపనాగమల్లేశ్వరాలయంలో కల్యాణానికి హాజరైన భక్తులు

దేవుని కడప సోమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

సీకేదిన్నె: పండితుల ఆధ్వర్యంలో హోమం

పొలతలలో స్వామి, అమ్మవార్లు

అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తుడు

వల్లూరు: పుష్పగిరి వైద్యనాథేశ్వరస్వామి

జాతీయ కవి సమ్మేళనం నేడు

బ్రహ్మంగారిమఠం: జాతీయ మహాకవి సమ్మేళనం సోమవారం మండల పరిధిలోని తోట్లపల్లె అచలానంద ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి బొల్లు రామమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి, ఎమ్మెల్సీ సుధాకర్ యాదవ్, దాసరయ్య, మాజీ ఎంపీ తులసిరెడ్డి, ఈశ్వరీదేవి మఠాధిపతి వీర శివకుమారస్వామి హాజరు కానున్నారని వివరించారు.

ఉత్సాహంగా బండలాగుడు ప్రదర్శన

వీరపునాయునిపల్లె, చక్రాయపేట, పులివెందుల, న్యూస్‌టుడే: శివరాత్రి పురస్కరించుకుని ఆదివారం వీఎన్‌పల్లె, చక్రాయపేట, పులివెందులలో వృషభరాజముల బండలాగుడు ప్రదర్శన నిర్వహించారు. వీఎన్‌పల్లెలో జరిగిన ప్రదర్శనను మాజీ ఎంపీ తులసిరెడ్డి ప్రారంభించారు. ఇందులో చెన్నూరు మండలం ఓబులంపల్లెకు చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి ఎడ్లు ప్రథమ, పెండ్లిమర్రికి చెందిన విశ్వవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిల వృషభాలు ద్వితీయ, అట్లూరు మండలం కొండ్రాజుపల్లెకు చెందిన వీరారెడ్డి ఎడ్లు తృతీయ స్థానాల్లో నిలిచి నగదు బహుమతులు అందుకున్నాయి. చక్రాయపేట మండలంలో జరిగిన ప్రదర్శనల్లో పల్నాడు జిల్లా అమరావతి మండలానికి చెందిన శ్రీనివాసరావు ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.70 వేలు, దువ్వూరు మండలం గొల్లపల్లెకు చెందిన చంద్ర ఓబుల్‌రెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.50 వేలు, పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి వృషభాలు తృతీయ స్థానంలో నిలిచి రూ.40 వేలు నగదు బహుమతిని అందుకున్నాయి.

● పులివెందుల మండలంలోని మోట్నూతలపల్లె కోనగవేశ్వరస్వామి ఆలయంలోని ప్రదర్శనను మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ప్రారంభించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఆలయ ఛైర్మన్ ఓబులరెడ్డి, జగన్‌రెడ్డి, నాయకులు కులశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.

బండలాగుడు ప్రదర్శనను ప్రారంభిస్తున్న బీటెక్ రవి

బస్టాండ్‌లో అన్నదానం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : శివరాత్రి పండగను పురస్కరించుకుని కడప ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్షుడు రఘురామ్‌గౌడ్ కుటుంబం ఆధ్వర్యంలో కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో భక్తులకు అన్న వితరణ చేశారు. ఉదయం 250 మంది ఆర్టీసీ ఉద్యోగులకు అల్పాహారం, మధ్యాహ్నం 700 మంది శివభక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అంజి, సునీత, హరీశ్, సుజాత, మహేశ్వరి, నాగేశ్వర్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శివరాత్రి సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు అన్నదానం చేస్తున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

హత్యరాల భక్తులకు వైద్య సేవలు

రాజంపేట గ్రామీణ: మహా శివ రాత్రి సందర్భంగా ఆదివారం భక్తులు హత్యరాలలో కిక్కిరిశారు. స్వామి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న మహిళలు కింద పడిపోవడంతో డాక్టర్ బ్రహ్మేంద్ర, సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఉదయం నుంచి క్యూలైన్‌లో ఇబ్బందులు పడిన నలుగురికి వైద్యం అందించినట్లు తెలిపారు.

నేడు దిగవపల్లిలో తెప్పోత్సవం

సుండుపల్లి: చింతలయ్యగారిపల్లి (దిగవపల్లి) సమీపంలోని ప్రసన్న సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు త్రికాల స్నానం, 5 గంటల నుంచి పుష్కరిణిలో ప్రసన్న సిద్ధేశ్వరస్వామి తెప్పోత్సవం వేడుకగా జరుగుతుంది. ఈమేరకు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రహదారి పనులతో ట్రాఫిక్ చిక్కులు

వేంపల్లె ఎన్టీఆర్ సర్కిల్ నాలుగు రోడ్ల కూడలిలో రహదారి పనులు జరుగుతున్నాయి. ఆ ప్రాంతంలో రాకపోకలకు సరిపడా స్థలం వదలకపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో వాహనాలు ముందుకు కదలని పరిస్థితి ఉంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, చక్రాయపేట (వేంపల్లె)**

కడపలో అంబేడ్కర్ రాజ్యాంగం కావాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే : నగరంలో రెడ్‌బుక్ రాజ్యాంగం కాకుండా అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావాలని నగర మేయర్ సురేష్ అన్నారు. స్థానిక యర్రముక్కపల్లె కూడలిలో అర్ధరాత్రి అక్రమంగా కూల్చిన ఇంటిని ఆయన ఆదివారం పరిశీలించి గత 9 రోజులుగా బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా మేయర్‌తో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు, దళిత సంఘం నాయకులు, అఖిలపక్ష నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మనోహర్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఎస్సీ, ఎస్టీ మానవహక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర నాయకులు రమణ, శాప్ మాజీ డైరెక్టర్ జయచంద్ర, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర నాయకులు నారాయణ, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలను విరమింప జేస్తున్న నగర మేయర్ పాకా సురేష్

రోడ్డు అధ్వానం.. రాకపోకలకు సతమతం

పులివెందుల- ముద్దనూరు మార్గం గుంతలతో దయనీయంగా ఉంది. రాకపోకలు సాగించాలంటే వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అటుగా రహదారి నిర్మాణ పనులకు భారీ వాహనాలు వెళ్తుండటంతో సమస్య నెలకొందని పలువురు చెబుతున్నారు. సుమారు 18 కి.మీ మేర ఇదే దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, తొండూరు

17న డిమాండ్ల సాధనకు చలో విజయవాడ

జమ్మలమడుగు: వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ), బకాయిపడిన కరవు భత్యం, డిమాండ్ల సాధనకు ఈ నెల 17న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రణభేరి 2.0 సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. పాత పీఆర్సీ గడువు పూర్తయి రెండేళ్లు దాటినా కొత్త కమిషన్‌ను నియమించకపోవడం బాధాకరమన్నారు. యూటీఎఫ్ నాయకులు ఓబులేసు, మల్లికార్జున, రఫీ, శివశంకర్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

నగరంలో పోకిరీలు

• వీధులు, కూడళ్ల వద్ద మకాం
• పట్టించుకోని పోలీసులు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: నగర పరిధిలోని అల్లరి మూకలు కొన్ని ప్రాంతాలను అడ్డాగా చేసుకుని చరవాణుల్లో అసభ్యకర దృశ్యాలు చూస్తూ వచ్చిపోయే మహిళలను, యువతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీరిలో చాలామంది మత్తులో ఊగిపోతుంటారు. దీంతో స్థానికంగా ఉన్న మహిళలు బయటికి రావాలంటే భయపడుతున్నారు. శక్తి బృందాలు, మహిళా పోలీసుల జాడ కనిపించడం లేదు.

• అల్లరిమూకల అడ్డాలివే

• వీధుల్లో సంచరిస్తున్న అల్లరి మూకలు, పోకిరీలు మహిళలను ఇబ్బంది పెట్టడమే కాదు. అర్ధరాత్రి వేళల్లో వీధుల్లో తిరుగుతూ దొంగతనాలను పాల్పడుతున్నారు. ● మురళీథియేటర్ వద్ద ఉన్న టీ దుకాణాల వద్ద పోకిరీలు రోడ్లపై నిలబడి మహిళలు, యువతులపై కామెంట్లు చేస్తున్నారని ఇటీవల పలు ఫిర్యాదులొచ్చాయి. ● రవీంద్రనగర్‌లోని బుగ్గయేరు గంగమ్మ గుడికి వెళ్లే దారి నాలుగు రోడ్ల కూడలి వద్ద వీరు ఉండటంతో రాకపోకలకు మహిళలు భయాందోళన చెందుతున్నారు. అల్లరి మూకలు అర్ధరాత్రివేళల్లో వాహనాల్లో నుంచి పెట్రోలును దొంగలిస్తున్నారు. బుగ్గయేరు గంగమ్మ గుడి వద్ద ఇటీవల రెండు వాహనాల్లో నుంచి పెట్రోలు దొంగలించారు.

కడప నగరం

● అల్మాస్‌పేట, ప్రకాష్‌నగర్, రిమ్స్ రోడ్డు, ఎర్రముక్కపల్లె, ఎస్వీ డిగ్రీ కళాశాల, తారకరామ నగర్, నకాష్‌వీధి, కృష్ణా కూడలి, దేవునికడప రోడ్డు, పాతమార్కెట్, రవీంద్రనగర్, అప్సర కూడలి, చిన్నచౌకు, ఎన్జీవో కాలనీ, కో-ఆపరేటివ్ కాలనీ, నబీకోట, అక్కాయపల్లె పలు ప్రాంతాల్లో అల్లరి మూకలు అర్ధరాత్రి వేళల్లో యథేచ్ఛగా తిరుగుతున్నారు.

• కొరవడిన నిఘా

అల్లరిమూకలు తిరిగే ప్రాంతాల్లో పోలీసుల సంచారం లేదు. వీధుల్లో పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది రావడం లేదని పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు. నగరంలో అయిదు ఠాణాలున్నాయి. ఒక్కో ఠాణాకు రెండేసి బ్లూకోల్ట్స్ మాత్రమే ఉన్నాయి. ఒక రక్షక్ వాహనం తిరుగుతోంది. ఇవి ఏమాత్రం సరిపోవడం లేదు. ఉన్న రెండు బ్లూకోల్ట్స్ కూడా సక్రమంగా తిరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో రాత్రివేళల్లో పోలీసులు తిరిగితే ఎలాంటి సమస్య ఉండదు. పోలీసు ఉన్నతాధికారులు దృష్టిసారించి నగరంలోని అల్లరిమూకల అడ్డాలపై నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నగరంలో అన్ని ఠాణాల పరిధిలో రక్షక్, బ్లూకోల్ట్స్ సిబ్బందితో నిఘా పెంచుతాం. ఎక్కడైన ఆకతాయిలు, పోకిరీలు ఇబ్బంది పెడుతుంటే 112కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరు భయపడాల్సిన అవసరం లేదు. అవసరమయితే శక్తి బృందాలను కూడా పంపిస్తాం. **- వెంకటేశ్వర్లు, డీఎస్పీ, కడప**

ఫాతిమా వైద్య కళాశాలలో స్నాతకోత్సవం

మారుతీనగర్, న్యూస్‌టుడే : ఫాతిమా వైద్య కళాశాలలో 2022 బ్యాచ్ పీజీ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం ఆదివారం ఆ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు కళాశాల కార్యదర్శి జవ్వాద్ అహమ్మద్ ఖురేషి, మదనపల్లె ఎంఎల్‌ఏ షాజహాన్‌బాషా ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఫాతిమా వైద్య కళాశాల రాయలసీమకే మణిహారమని, ఇక్కడ వైద్య విద్యను అభ్యశించే ప్రతి విద్యార్థి ఒక రత్నం లాంటి వారని వారు పేర్కొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కళాశాల స్థాపించినప్పటి నుంచి నేటి వరకు అంచెలంచెలుగా ఎదుగుతోందని, ఇకపైన కూడా మరిన్ని విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు జనరల్ మేనేజరు శ్రీనివాసకుమార్, రీజినల్ హెడ్ లక్ష్మి తులసి, ప్రముఖ వైద్యులు బాలిరెడ్డి, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్‌ముర్తుజ, ప్రిన్సిపల్ శైలరేఖ, నరేష్ పాల్గొన్నారు.

హాజరైన కళాశాల కార్యదర్శి జవ్వాద్ అహమ్మద్ ఖురేషి, మదనపల్లె ఎంఎల్‌ఏ షాజహాన్‌బాషా

భాజపా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలి నియామకం

ఖాజీపేట: భాజపా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మండలంలోని జీసీ కాలనీకి చెందిన లక్ష్మీదేవి ఆదివారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారానికి పోరాటతానని స్పష్టం చేశారు.

మ్యాన్‌హోల్ ధ్వంసం.. జరభద్రం

నగరంలోని అంబేడ్కర్ కూడలి నుంచి కోటిరెడ్డి కూడలికి వెళ్లే మార్గంలో మ్యాన్‌హోల్ ధ్వంసమై ప్రమాదకరంగా ఉంది. ఇనుప చువ్వ ధ్వంసం కావడంతో పలువురు రక్షణగా కర్ర ఏర్పాటు చేశారు. ఏ మాత్రం ఆదమరిచినా వాహనదారులు అదుపుతప్పే అవకాశం ఉంది.
- న్యూస్‌టుడే, బిల్టప్, కడప

బస్టాండ్ ప్రాంగణం.. వ్యర్థాలమయం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణం అధ్వానంగా దర్శనమిస్తోంది.

చెత్త డబ్బాలు శుభ్రం చేయకపోవడంతో.. వ్యర్థాల మధ్య ప్రయాణికులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అరకొర వసతులతో బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

? : మండలంలోని యర్రబల్లెలో రోడ్డుపై మురుగు పారుతోంది. దీంతో దుర్వాసన వస్తోంది. **- రామకృష్ణ, యర్రబల్లె**

☑ : వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపి, సమస్యను పరిష్కరిస్తాం. **- కృష్ణమూర్తి, ఎంపీడీవో,** **- న్యూస్‌టుడే, పులివెందుల**

అరటితోట దగ్ధం

లింగాల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని లోపట్నూతలలో ఆదివారం ప్రమాదవశాత్తు అరటితోట దగ్ధమయ్యింది. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసరెడ్డి అడవి పక్కనే రెండు ఎకరాల అరటితోట సాగు చేశారు. ఆకతాయిలు అడవికి నిప్పు పెట్టడంతో అవి కాస్త తోటకు పాకాయి. రెండు ఎకరాలలో ఉన్న పంట, బిందుసేద్యం పైపులు కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు.

ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోండి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని రెహమాన్ ఎడ్యుకేషన్-హెల్త్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు కుతుబుద్దీన్, జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు ఖాదర్‌బాషా కోరారు. నగరంలో సాలె నాగయ్య వీధిలోని నగరపాలక ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కడప ఇస్లామిక్ సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో అల్మాస్‌పేటలోని వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు మధుసూదన్‌రెడ్డి, సుహేల్ అహ్మద్ తదితరులు పాల్గొని ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అల్మాస్ పేటలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా.. బంగాళదుంప-40, క్యాబేజి-30, క్యారెట్-40, బీన్స్-50, బీట్‌రూట్-35, కీర-40, దోస-40, దొండకాయలు-45, ముల్లంగి-30, అల్లం-90, కాలీఫ్లవర్-25, క్యాప్సికం-60, టమాట-15, మిరపకాయలు 35, వంకాయలు-20, బెండకాయలు-30, బీర-40, కాకర-35, మటిక్కాయ-40, చిక్కుడు-30, అలసందకాయలు-30, అనపకాయలు-40, ఉల్లిపాయలు-25.

కాలువలు ఇలా.. మురుగు పారేదెలా

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: నగర శివార్లలోని మోడమీదపల్లె దళితవాడలో మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. కాలువలో చెత్త పేరుకుపోయి, మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో మురుగు ముందుకు పారడం లేదు. స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. విషపురుగులు కూడా సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక అధికారులు స్పందించి మురుగు కాలువలు శుభ్రం చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చేనేతలను ఆదుకోవాలని వినతి

ప్రొద్దుటూరు: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు తీవ్ర అన్యాయం జరిగిందని స్వర్ణ భారత్ ప్రజా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.దశరథ రామయ్య పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు గతేడాది చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు రూ.25 వేలు ఇస్తామని చెప్పినా ఇంతవరకు హామీ అమలు కాలేదన్నారు. చేనేతలను ఆదుకోవాలని కోరారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu